# మార్క్స్
# 'కాపిటల్'
# పరిచయం

[ మొత్తం 2 సంపుటాలలో ]

ఇది రెండవ సంపుటం

## రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

'కాపిటల్' పరిచయం
[ మొత్తం 2 సంపుటాలలో ]
ఇది రెండవ సంపుటం

**పేజీలు : 552**
**[**రాయల్ సైజులో,
హార్డ్ బౌండ్‌తో**]**
**ధర : 150** రూ.లు

ఈ సంపుటానికి,
**2006 డిసెంబరు** నించీ
**2016 జూన్** వరకు **4** ముద్రణలు వచ్చాయి.
**5**వ ముద్రణ : **2018 సెప్టెంబరు**

కంపోజింగ్ & పేజ్ మేకప్:
మొదటి భాగంలో,
మొదటి చాప్టర్ : **ఎమ్. శారద**

మిగిలినదంతా:
**ఎన్. ధనలక్ష్మి, ఎన్. రఘురామయ్య**

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్,**
1-19-1126/బి, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020.
(ఫోన్ : 040-27678411)

బైండింగ్ :
**వై.వి. రెడ్డి బైండింగ్ వర్క్స్**
మూసారాంబాగ్, హైదరాబాదు - 36.
ఫోన్ : (939105317)

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు
**విజయవాడ - 520 002.**
(ఫోన్: 0866 - 2431181, 9440630378)

**రంగనాయకమ్మ అడ్రసు:**
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# విషయ సూచిక

ముందు మాట

## 1వ భాగం

## పెట్టుబడిదారీ చలామణీ క్రమం

**1. చలామణీ ఖర్చులు ........................................................ 1**

1) సార్టింగూ, పేకింగూ ఖర్చులు - 2
2) బుక్ కీపింగ్ ఖర్చులు - 4
3) స్టోరు ఖర్చులు - 5
4) రవాణా ఖర్చులు - 11
5) అడ్వర్టయిజ్‌మెంట్ ఖర్చులు - 13
6) 'డబ్బు' ఖర్చు - 25
7) మారకం ఖర్చులు - 27
● ప్రశ్నలూ - జవాబులూ - 34

**2. పెట్టుబడిదారీ ధర! ........................................................ 39**

1) పెట్టుబడి కాంపోజిషన్ - 42
2) జనరల్ లాభం రేటు - 50
3) 'పెట్టుబడిదారీ ధర'కూ,
కార్మికులకూ సంబంధం - 54
4) వెనకటి సమాజాలలో ధర - 55
5) కాస్ట్ ప్రైస్ (ఖర్చు ధర)
ప్రొడక్షన్ ప్రైస్ (ఉత్పత్తి ధర)
మార్కెట్ ప్రైస్ (మార్కెట్ ధర) - 57
6) శ్రమ కాలం, లేదా ఉత్పత్తి కాలం (వర్కింగ్ పిరియడ్) - 60
7) చలామణీ కాలం (సర్క్యులేషన్ పిరియడ్) - 61
8) టర్నోవరు కాలం - 62

9) విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం - 67
10) ఉత్పత్తి ధరలు, మార్కెట్ ధరలుగా మారడం - 73
★ సప్లై - డిమాండ్లు - 74
★ ధర ని నిర్ణయించడంలో, సప్లై - డిమాండ్ల పాత్ర - 81
★ ఈ s, d లు నిజమైన s, d లు కావు - 82
11) వేరు వేరు శాఖల వేరు వేరు లాభం రేట్లు - 87
12) ఒకే శాఖలో, వేరు వేరు పెట్టుబడుల
వేరు వేరు లాభం రేట్లు - 90
13) పెట్టుబడిదారుడి విషాద ఘట్టం! - 96
14) పెట్టుబడిదారుడు ఏ లాభం రేటు వేసుకుంటాడు? - 99
★ ఒక పెట్టుబడీ, ఒక శాఖా, మొత్తం సమాజమూ - 100
15) పెట్టుబడిదారీ సరుకుల మారకాలు - 100
16) 'విలువ' లేకుండానే 'ధర!' - 103
17) 'పెట్టుబడిదారీ సమాజం'లో
స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులు - 108
● ప్రశ్నలూ - జవాబులూ - 110

**3. 'జీతాల' గురించి ........................................ 114**

1) 'జీతాల' విషయంలో సప్లై - డిమాండ్లు - 114
★ కార్మికుల మధ్య పోటీ - 117
2) 'జీతం' గురించి, పెట్టుబడిదారీ అర్థికవేత్త ఏమంటాడు? - 117
3) జీతాలు పెరిగితే, సరుకుల విలువలు మారతాయా? - 120
4) జీతాలలో మార్పులు ఎందుకు జరుగుతాయి? - 121
★ జీతాల మీద, 'ఉత్పాదక శక్తి' ప్రభావం - 122
★ జీతాల మీద, 'డబ్బు విలువ' ప్రభావం - 123
★ జీతాల మీద, 'డబ్బు పరిమాణం' ప్రభావం - 128
5) ద్రవ్యోల్బణం (ఇన్ఫ్లేషన్) - 136
6) 'జీతం' విషయం లో మూఢ నమ్మకాలు - 138
7) ధరలు పెరిగితే జీతాలు పెరుగుతాయా,
జీతాలు పెరిగితే ధరలు పెరుగుతాయా? - 140

8) జీతాలు పెరిగితే,
సరకుల సప్లై డిమాండ్లు మారతాయా? - 148

9) 'ధరల పెరుగుదల' గురించి మళ్ళీ - 149

● ప్రశ్నలూ - జవాబులూ - 151

**4. వేరు వేరు దేశాల 'డబ్బులు' ....................................... 152**

1) కరెన్సీల మారకం అంటే ఏమిటి? - 159

2) అన్ని దేశాలకూ ఒకే కరెన్సీ నోటు వుండకూడదా? - 163

● ప్రశ్నలూ - జవాబులూ - 165

**5. 'జనరల్ లాభం రేటు' తగ్గుతూ పోయే ధోరణి ........... 167**

★ సోషలిస్టు విధానంలో అయితే? - 174

★ లాభం రేటులో తగ్గుదలని తగ్గించే ధోరణి - 175

★ పెట్టుబడి పెరుగుదల తగ్గడం - 175

★ పెట్టుబడి ఉత్పత్తి చేసే S సంగతి - 176

★ మార్క్సుని విమర్శించిన లోరియాకి ఏంగెల్స్ జవాబు - 178

● ప్రశ్నలూ - జవాబులూ - 179

# 2వ భాగం

# పెట్టుబడిదారీ పంపిణీ సంబంధాలు

**1. వర్తక పెట్టుబడి ....................................................... 180**

1) వర్తకం పనులు, 2 విధాలుగా జరగవచ్చు - 181

2) 'వర్తకుడి' ప్రవేశం - 188

3) 'వర్తక పెట్టుబడి' అంటే ఏమిటి? - 193

★ చవకా, ప్రియమూ, వర్తకుడికి వర్తించవు - 194

★ ధర మారితే? - 194

4) వర్తకుల్లో, చిన్నా, పెద్దా - 195
★ పెద్ద వర్తక పెట్టుబడిదారులు - 195
★ చిన్న వర్తక పెట్టుబడిదారులు - 195
★ స్వతంత్ర వర్తకులు - 195 ★ వర్తకుల వరస - 196
5) వర్తక కార్మికులు - 197
6) వర్తక పెట్టుబడి టర్నోవరూ, దాని ప్రత్యేకతా - 201
7) ఉత్పత్తి శక్తికీ, వర్తక ధరకీ, సంబంధం - 203
8) 'శ్రమ విభజన'లో వర్తక కార్మికులు - 205
9) 'స్పెక్యులేషన్' వ్యాపారం - 206
10) విదేశీ వర్తకం - 207
★ దొంగ వర్తకం (స్మగులింగ్) - 211
● ప్రశ్నలూ - జవాబులూ - 211

## 2. వడ్డీ పెట్టుబడి ........................................ 215

1) డబ్బు అప్పు - 216
2) 'వడ్డీ రేటు' కి సహజ కారణం వుంటుందా? - 218
3) 'వడ్డీ రేటు' లో రకాలు - 219
★ కార్మికులే అప్పులు ఇస్తే - 221
4) వడ్డీ పెట్టుబడి చలనం - 221
5) సరుకు అప్పు - 222
6) 'అప్పు విధానం' అభివృద్ధి - 223
7) 'డబ్బు అప్పు'కి మారుపేరు 'బ్యాంకు!' - 224
★ మనీ డీలింగు - 225 ★ వడ్డీ వ్యాపారం - 226
8) 'అప్పులు' ఎందు కోసం? - 229
9) బ్యాంకులే గాక ఇతర 'డబ్బు' సంస్థలు - 232
10) ఉసురీ - 233
11) విదేశీ అప్పు - 234
12) విదేశీ పెట్టుబడి - 235
● ప్రశ్నలూ - జవాబులూ - 235

## 3. వాటాలు (షేర్లు) ........................................238

1) జాయింట్ స్టాక్ కంపెనీ - 238
★ ఇది, కంపెనీ 'రూపం'లోనే మార్పు;
'స్వభావం'లో కాదు - 239
2) వాటా కి, 'లాభం' ఎలా వస్తుంది? - 240
★ 'లాభం' అనేది, మేనేజిమెంటు శ్రమ ఫలితమా? - 241
★ 'వాటాల' విడుదల - 242 ★ వాటా 'ధర' - 243
★ ఆ 'ఎక్కువ' ఎక్కడిది? - 244
★ 'వాటా పెట్టుబడి' ఎక్కడిది? వాటాని అమ్మగా వచ్చే
'లాభం' ఎక్కడిది? వాటా 'డివిడెంటు' ఎక్కడిది? - 246
3) 'నిజమైన' పెట్టుబడీ, 'కల్పిత' పెట్టుబడీ - 246
★ 'డివిడెండ్' అంటే, 'వడ్డీ' కాదు - 247
4) వాటా 'ధర' ఎంత పెరిగితే,
'వడ్డీ పెట్టుబడి'కి అంత లాభం! - 247
5) కంపెనీల 'ప్రమోటర్ లాభం' - 248
★ 'ప్రమోటర్ లాభానికి' ఇంకో మార్గం - 249
6) స్టాక్ ఎక్స్ఛేంజీ, స్టాక్ బ్రోకరు కంపెనీలూ - 249
7) వాటా 'లాభాల' ఉన్మాదం! - 253
8) స్టాక్ ఎక్స్ఛేంజి ఒక జూద శాల! - 255
9) వాటాల వ్యాపారంలో మోసాలు - 257
★ 'ప్రైస్ రిగ్గింగ్' కి ఇంకో ఉదాహరణ - 258
★ ఇన్‌సైడ్ ట్రేడింగ్ - 259
10) ఇంకా ఇతర విషయాలు కొన్ని - 260
★ మ్యూచువల్ ఫండ్ కంపెనీలు - 261
11) బాండ్లూ, డిబెంచర్లూ - 262
★ ప్రభుత్వ బాండ్లు - 262 ★ సెక్యూరిటీ పత్రాలు - 264
12) స్టాక్ బ్రోకర్లతో బ్యాంకుల కుమ్మక్కు - 265
13) పాత, కొత్త 'అదనపు విలువల' కొత్త పంపకాలు - 267
14) వాటా ధర, డబ్బు పెట్టుబడి 'సప్లై - డిమాండ్ల'ని
ఎలా ప్రభావితం చేస్తుంది? - 269

15) కార్మికులు కూడా వాటాలు కొంటే? - 270
★ కార్మికులు, బ్యాంకుల్లో డబ్బు పెడితే? - 272
● ప్రశ్నలూ - జవాబులూ - 272

## 4. 'సహజ' ఆర్థిక విధానమూ (నేచురల్ ఎకానమీ) 'డబ్బు' ఆర్థిక విధానమూ (మనీ ఎకానమీ) 'అప్పు' ఆర్థిక విధానమూ (క్రెడిట్ ఎకానమీ) ............274

1) అప్పు డబ్బు (క్రెడిట్ మనీ) - 275
2) కేంద్ర బ్యాంకు - 275
3) 'పెట్టుబడి' మీద, 'అధికార' కేంద్రీకరణ - 282
4) 'గుత్త' కంపెనీ - 286
★ గుత్త కంపెనీకి 'గుత్త లాభాలు' - 287
5) పెట్టుబడి కి బ్యాంకుల 'సేవ'! - 289
● ప్రశ్నలూ - జవాబులూ - 292

## 5. భూమి కౌలు ........................................................293

1) 'భూగోళానికి' ఎవరూ యజమానులు కారు! - 293
2) పెట్టుబడిదారీ కౌలు రైతు ప్రవేశం - 296
3) వ్యవసాయ పెట్టుబడి, తన 'కౌలు'ని ఎలా చెల్లిస్తుంది? - 300
★ ఆ 'ఎక్కువ కౌలు' ఎక్కడిది? - 306
4) వ్యవసాయ కౌలులో తేడాలు - 308
★ అదనపు విలువలో కౌలు భాగం ఎంత? - 313
★ సగటు కౌలూ, కౌలు రేటూ - 314
★ భూమి ధర - 314 ★ బానిస ధర - 317
★ 'ఇంటి అద్దె'లో భూమి అద్దె - 317
5) ఎవరి శ్రమ ఫలితం వారిదే; కానీ ... 318
6) 'కౌలు'ని తీసివేస్తే? - 318
7) 'వ్యవసాయ' శ్రమా, 'పారిశ్రామిక' శ్రమా - 318
8) 'హేతుబద్ధత' గల వ్యవసాయం - 320
● ప్రశ్నలూ - జవాబులూ - 321

**6. సామ్రాజ్య వాదం ........................................ 325**

1) పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదం - 325
★ 'వలస దేశం'తో వర్తకం - 326
★ దేశాల మధ్య శ్రమ విభజన - 331
2) పెట్టుబడుల ఎగుమతి - 331
★ కార్మికుల వలసలు - 334
3) సామ్రాజ్య వాదం, ఉన్నత మేధా శ్రమల్ని ఎలా లోబరుచుకుంటుంది? - 334
4) సామ్రాజ్య వాదానికి, పాత, కొత్త, సరికొత్త రూపాలు! - 335
5) వలసల అభివృద్ధి - 338
6) ప్రపంచ విభజనా, పునర్ విభజనా - 339
7) ఎంత ఆలశ్యమో! - 340
8) 'సామ్రాజ్య వాద' సమర్థకులు - 342
● ప్రశ్నలూ - జవాబులూ - 346

అనుబంధం : **ప్రపంచ యుద్ధాలు!** - 348
★ మొదటి ప్రపంచ యుద్ధం - 348.
★ 2 వ ప్రపంచ యుద్ధం - 352

**7. సంక్షోభాలు ........................................ 356**

★ 'సమిష్టి ప్లాను'కి అవకాశం లేకపోవడం - 357
★ 'ఎక్కువ లాభం' కోసం పోటీ - 358
★ V ఉత్పత్తుల్ని కార్మికులు కొనలేకపోవడం - 359
★ అదనపు విలువని పెట్టుబడిదారీ వర్గమే వాడవలసి ఉండడం - 360
★ వెనకటి సమాజాలలో సంక్షోభాలు వుండవు - 363
★ టర్నోవర్ల లంకెలు - 363
1) డబ్బు - సంక్షోభం; లేదా, ఆర్థిక మాంద్యం - 364
★ వాటాల సంక్షోభం - 367

2) సంక్షోభ కాలంలో సరుకుల పరిస్తితి - 370
3) 'సంక్షోభం' నించి 'సంక్షోభానికి!' - 371
4) పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల చిట్కాలు! - 373
★ వాయిదాల పద్ధతి మీద సరుకులు అమ్మడం - 373
★ నిరుద్యోగ బీమా - 374
★ బ్యాంకులు ఇచ్చే అప్పుల్ని అదుపులో ఉంచడం - 374
★ పెట్టుబడిదారుల 'అమితోత్పత్తినంతా ప్రభుత్వమే కొని, దానితో 'అనుత్పాదక' కార్యక్రమాలు చేపట్టాలనేది - 375
● ప్రశ్నలూ - జవాబులూ - 378

అనుబంధం - 1
**1929 సంక్షోభం - 380**

అనుబంధం - 2
**బ్రిటన్ లో 31 గనుల మూసివేత - 385**

**8. వర్గాలు ........................................ 387**

1) చరిత్ర లో వర్గాలు - 389
2) బానిస సమాజంలో వర్గాలు - 389
3) 'భూస్వామ్య సమాజం' లో వర్గాలు - 391
4) 'పెట్టుబడిదారీ సమాజం'లో వర్గాలు - 392
5) ఉత్పత్తి సంబంధాల ఫలితమే పంపిణీ సంబంధాలు - 403
6) శ్రమ సంబంధాలూ - ఆదాయాలూ - 409
7) ప్రపంచ కార్మికులారా! ఏకం కండి! - 410
● ప్రశ్నలూ - జవాబులూ - 417

అనుబంధం - 1
**అమెరికా వేపు ఒక చూపు - 421**
అనుబంధం - 2
**అంబానీలకు మన్మోహన్ కానుక - 424**

**9.** కార్మికులకు మార్క్స్ ప్రశ్నలు ..................................425

# 3వ భాగం
# వర్గ రహిత సమాజం దిశగా

**1.** యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం ............432

**2.** నూతన సమాజం లో రద్దులు ..................................438

1) ఉత్పత్తి సాధనాలపై 'యజమానుల ఆస్తి హక్కు' రద్దు - 440
2) 'కౌలు' రద్దు - 441
3) 'వడ్డీ' రద్దు - 442
4) 'లాభం' రద్దు - 444
5) 'యజమానితనం' రద్దు - 445
6) 'పెట్టుబడిదారీ శ్రమ విభజన' రద్దు - 445
7) 'గ్రామానికీ పట్టణానికీ వైరుధ్యం' రద్దు - 448
8) 'స్త్రీ పురుషుల మధ్య అసమానత్వం' రద్దు - 449
9) 'రాత్రి పని' రద్దు - 452
10) 'కుల మతాలు' రద్దు - 452
★ 'కులం' విషయం - 453
11) 'దోపిడీ సంస్కృతి' రద్దు - 453
12) 'వర్తకం' రద్దు - 454
13) 'వేతన బానిసత్వం' రద్దు; 'జీతాల పద్ధతి' రద్దు - 455
14) 'విలువ' రద్దు; 'డబ్బు' రద్దు - 457
15) 'రాజ్యాంగ యంత్రం' రద్దు!
'వర్గాలు' రద్దు! - 458
★ వర్గాల రద్దు తర్వాత ఏమిటి? - 459
★ నిజంగా సాధ్యమా! - 461

**3.** **నూతన సమాజపు ధర ..........................................462**

★ విలువ లేనప్పుడు ప్లానింగ్ - 468

**4.** **మార్క్సిజం 'ఆర్థిక శాస్త్రమే' కాదు, 'తత్వ శాస్త్రం' కూడా! ............................478**

★ భౌతిక వాదం - 478

★ భావ వాదం - 479

★ 'ప్రకృతి'ని, గతి తార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవాలంటే - 480

★ 'సమాజం' గురించి మార్క్సిజం అవగాహన - 482

★ పరస్పర విరుద్ధ తత్వ శాస్త్రాలు - 489

# 4వ భాగం
# కొన్ని విషయాలు

1. మార్క్సిజం మీద కొన్ని విమర్శలు .................................................... 494
2. రష్యా చైనాల మాటేమిటి ? ..................................................497
3. మార్క్సిజం అంటే చాలదా? ..................................................499
4. కార్మిక జనాభా 'కాపిటల్' ని ఎలా నేర్చుకోవాలి?
తరగతి గదిలో మార్క్సిజం ..................................................500
5. 'కాపిటల్' చదవడం గురించి ..................................................508
6. మార్క్స్ 'కాపిటల్'లో చాప్టర్లు .................................................. 510
7. మార్క్స్ పూర్వపు ఆర్థిక శాస్త్రం .................................................. 513
8. ఊహా చిత్రం! .................................................. 518
9. మీరు మార్క్సిస్టు అయ్యారా? ..................................................526

**★ పద సూచిక (ఇండెక్స్) .................................................. 527**

★

# ముందు మాట

**మార్క్స్ 'కాపిటల్'** కి పరిచయం, మొదట్లో **5** పుస్తకాలుగా వుండేది. వాటిని 2 సంపుటాలుగా మార్చాలనే అభిప్రాయంతో 2004 మార్చిలో, మొదటి 3 పుస్త కాల్నీ కలిపి, 'మొదటి సంపుటం' గా తెచ్చాము. ఈ విషయం పాఠకులకు తెలుసు.

**ఇ**ప్పుడు ఇది, 2వ సంపుటం. ఇది, గతంలో వచ్చిన 4వ, 5వ పుస్తకాలు రెండూ కలిసినది. దీనితో, కాపిటల్ పరిచయాన్ని, 2 సంపుటాలుగా మార్చే పని పూర్తి అయింది.

పుస్తకాలు ఎప్పుడూ చిన్న సైజులో, తక్కువ పేజీలతో, చేతికి అనువుగా వుండడమే మంచిది. చదువుకోవడానికి అది చాలా సౌఖ్యంగా వుంటుంది. కానీ, ఇలాంటి పెద్ద సంపుటాలతో 'బరువు' సమస్య ప్రారంభమై, ఆ సౌఖ్యం పోతుంది. మొదటి నించీ ఇది నాకు చాలా అసంతృప్తిగా వున్న విషయం.

కానీ, ఈ 'పరిచయం' 5 పుస్తకాలుగా వున్న రోజుల్లో, వాటితో ఇంకో రకం సమస్య వున్నట్టుగా కొందరు పాఠకులు చెప్పేవారు. ఎంతో శ్రద్ధగా అన్ని భాగాలూ కొనుక్కున్న వాళ్ళ దగ్గిర్నించీ అందులో ఏదో ఒక భాగం ఎవరో ఒకరు తీసుకు వెళ్తారు. ఇతరులు చదవడం మంచిదే కదా అని, ఎవరు ఏ భాగం అడిగినా సంతోషంగా ఇచ్చేస్తారు. తీరా అసలు వాళ్ళకి ఫలానా భాగం కావలసినప్పుడు అది దొరకదు. అది వచ్చాకే ఒక వరసలో చదువుదాము లెమ్మని, చదవడం అప్పటికి ఆపేస్తే, ఇక అది కొన్ని నెలల దాకా వెనకబడి పోతుంది.

ఇక, లైబ్రరీల మీద ఆధారపడే పాఠకులకైతే, మరీ సమస్య. కావలసినప్పుడు, కావలసిన భాగం దొరకదు. మొదటి భాగం తర్వాత రెండోదీ మూడోదీ దొరక్క, ఐదో భాగమో, నాలుగో భాగమో చదివి, ఆ తర్వాత మూడోది చదివి, ... అలా చెప్పిన పాఠకులు వున్నారు. 5 భాగాలూ వరసగా చదివిన పాఠకులు లేనే లేరని కాదు. ఆ అవకాశం లేని పాఠకుల సమస్యలు విన్న తర్వాతే, పుస్తకాల సంఖ్యని తగ్గించాలా - అనే ఆలోచన ప్రారంభమైంది.

ఈ విషయం మీద కూడా మొదట్లో నాకు తెలిసిన పాఠకుల అభిప్రాయాలు అడిగాను - "ఈ 'పరిచయం' ఇప్పటి లాగే 5 పుస్తకాలుగా వుంటేనే బాగుంటుందా, లేకపోతే పుస్తకాల సంఖ్య తగ్గితే బాగుంటుందా? అప్పుడు పుస్త కాలు బరువుగా తయారవుతాయి కదా? మీరైతే దేన్ని ఇష్టపడతారు?" అని ఒక్కొక్కర్నీ అడి గాను.

దాదాపు అందరూ ఒకే రకంగా చెప్పారు - "పుస్తకాలు చిన్నగా వుంటేనే బాగుంటాయి. కానీ, మరీ 5, 6 భాగాలుగా వుంటే, వాటితో చాలా ఇబ్బందులు వస్తున్నాయి. ఏదో ఒక భాగం ఎటో పోతుంది. మళ్ళీ చదవాలన్నా, ఏదో భాగంలో ఏదో ఒక చాప్టరుతో పని పడి దాన్ని మళ్ళీ చూడాలన్నా, సమయానికి ఆ భాగం దొరకదు. అలాంటి ఇబ్బందుల కన్నా, పుస్తకాలు కాస్త లావుగా అయినా, ఒకటి రెండు భాగాల కన్నా ఎక్కువగా లేకుండా వుంటేనే బాగుంటుంది" అనే రకంగా చెప్పారు.

ఈ 'పరిచయం' అంతా ఒకే సంపుటంగా వుంటే, అందులో ఏదో ఒక భాగం అందకుండా పోయే సమస్య వుండదు. కానీ, అది ఎలాగూ సాధ్యం కాదు కాబట్టి, '2 సంపుటాల' ఆలోచన

తప్పనిసరైంది, నాకు అసంతృప్తి గానే వున్నా.

చాలా మంది పాఠకులకు 'పుస్తకం బరువు' సమస్య అంత ప్రధాన సమస్యగా తోచలేదు. 'ఇలాంటి పుస్తకం తక్కువ భాగాల్లో వుంటేనే మంచిది. అంతా ఒకే చోట దొరుకుతుంది' అనే రకం గానే అభిప్రాయపడ్డారు. చివరికి అలాగే చెయ్యవలసి వచ్చింది.

ఈ 2వ సంపుటం - గతంలో వున్న 4 వ, 5 వ పుస్తకాలు కలిసినదే అయినా, ఇందులో కొన్ని మార్పులు జరిగాయి.

**1)** గతంలో వున్న చాప్టర్ల విభజన ఇప్పుడు కొన్ని చోట్ల మారింది. గతంలో ఒకే చాప్టరుగా వున్న 'పెట్టుబడిదారీ ధర', ఇప్పుడు 4 చాప్టర్లు అయింది. ఈ చాప్టర్లలో 'జనరల్ లాభం రేటు తగ్గుతూ పోయే ధోరణి' అనే చాప్టరు, పూర్తిగా కొత్తది. ఇది గత ముద్రణల్లో లేనిది.

**2)** గతంలో ఒకే చాప్టరుగా వున్న 'వడ్డీ పెట్టుబడి', ఇప్పుడు 3 చాప్టర్లు అయింది.

**3)** గతంలో, 'నూతన సమాజపు ధర' అనేది, 'పెట్టుబడిదారీ ధర' చాప్టరు లోనే వుండేది. అది ఇప్పుడు, ఈ సంపుటంలో 3 వ భాగం లోకి మారింది.

**4)** 4 వ భాగంలో, 'మార్క్సు పూర్వపు ఆర్థిక శాస్త్రం' అనే చిన్న భాగం పూర్తిగా కొత్తది. గతంలో లేనిది. దీని వివరాలన్నీ అక్కడ చూస్తే తెలుస్తాయి.

**5)** ఈ సంపుటానికి చిట్టచివర్లో 'అను బంధం'గా వున్న 'మొదటి సంపుటంలో ఆగిన డబ్బు రాసి సమస్య' అనే భాగం కూడా పూర్తిగా కొత్తది. గతంలో లేనిది. దీన్ని, అంత చిట్టచివర్లో ఎందుకు ఇవ్వవలసి వచ్చిందో ఆ వివరాలన్నీ ఆ భాగం దగ్గిరే తెలుస్తాయి.

**6)** ఆ పెద్ద మార్పులే గాక, దాదాపు అన్ని చాప్టర్ల లోనూ, ఎక్కడో అక్కడ ఏదో ఒక మార్పు జరిగింది. ఆ వివరాలు చెప్పడం సాధ్యం కాదు.

**7)** ఇప్పుడు, చాప్టర్ల చివర ప్రశ్నలకు, జవాబులు కూడా వున్నాయి.

కొంచెం శ్రద్ధ వున్న పాఠకులకు, ఈ 2 సంపుటాలూ పూర్తి చెయ్యడానికి 1, 2 నెలల కన్నా ఎక్కువ రోజులు పట్టదు. మొదటే మార్క్సు ఒరిజినల్‌తో ప్రారంభించడం కష్టంగా వుంటుంది కాబట్టి, ప్రారంభంలో, 'కాపిటల్ - ని పరిచయం చేసే' పుస్తకాలు చదువుకోవడమే తప్పనిసరి.

కానీ, ఈ 'పరిచయం' తోనే సంతృప్తి పడ కూడదు. ఇప్పుడు, మార్క్సు ఒరిజినల్ కి తెలుగులో 'అనువాదా'లు వున్నాయి. (అనువాదాల వివరాలన్నీ మొదటి సంపుటం తాలూకు 'ముందు మాట'లో ఉన్నాయి.) 'పరిచయం' తెలిసిన తర్వాత ఒరిజినల్‌ని చూస్తే, అది అంత కష్టం అనిపించదు. అక్కడక్కడా కొన్ని చాప్టర్ల యినా చూడాలి. మార్క్సు ఒరిజినల్ శైలిని చూడకుండా వుండకూడదు.

'కాపిటల్'ని పూర్తి చేసేటప్పటికి, 'సమాజం' గురించీ, 'మానవ సంబంధాల' గురించీ, మార్క్సిజం చెప్పేదేమిటో స్పష్టంగా తెలుస్తుంది.

మార్క్సిజం, దోపిడీ వర్గానికి పూర్తిగా వ్యతిరేకం కాబట్టి, ఆ దోపిడీ వర్గం కూడా మార్క్సిజానికి పూర్తిగా వ్యతిరేకం. ఆ వర్గం, మార్క్సిజం పట్ల వ్యతిరేక ప్రచారాలు చెయ్యడంలో ఆశ్చర్యం ఏమీ వుండదు. అది ఎందుకలా చేస్తుందో అర్థం చేసుకోవడం చాలా తేలిక. సమస్య అది కాదు.

అసలు సమస్య, 'మార్క్సిస్టుల' తోటే. వీరు, మార్క్సిజాన్ని రక రకాలుగా ఎవరికి తోచినట్టు వారు అర్థం చేసుకుంటారు. అసలు ఆ సిద్ధాంతంలో ఎలాంటి తర్కం వుందో, దాని నడక

ఎటు సాగుతుందో అర్థం చేసుకునే ప్రయత్నాలు చాలా తక్కువ.

'కార్మిక వర్గం - అంటే ఎవరు? ఏ యే సెక్షన్లు కలిసి కార్మిక వర్గం అవుతుంది?' అనే దాని మీద మార్క్సిస్టుల లోనే చాలా మందికి స్పష్టత వుండదు.

అలాగే, 'దోపిడీ సమాజాల శ్రమ విభజనని, సోషలిస్టు శ్రమ విభజనగా మార్చడం' గురించి, అసలే గ్రహింపు వుండదు.

'నైట్ షిఫ్టులు తీసెయ్యాల'ని మార్క్సిజం చెపుతోందనే సంగతి దాదాపు ఎరగరు. 'తీసేస్తే ఎలాగ?' అంటారు. అందులో వున్న తార్కిక అంశం వేపు చూడరు.

ఈ సమాజం దోపిడీ సమాజమనీ, దీన్ని మార్చాలనీ - అంటారే గానీ, ఇది దోపిడీ సమాజం ఎలా అయిందో, దోపిడీ అనేది ఏ యే మార్గాల్లో జరుగుతోందో చెప్పలేరు.

ఈ దోపిడీ సమాజాన్ని రేపు సోషలిస్టు సమాజంగా మార్చడం ప్రారంభించాలంటే, 'భూముల్ని పంచడం' వరకే మాట్లాడతారు.

అక్కడితో కొత్త సమాజం ఏర్పడి పోయినట్టే - అనుకుంటారు. చట్టాలు మారడమే, సంబంధాలు మారడం - అనుకుంటారు. 'అందరూ శ్రమ చెయ్యడం' అనేది గానీ, ఆ అందరూ 'మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ కూడా చెయ్యడం' అనేది గానీ, ఏ కమ్యూనిస్టు పార్టీ పత్రికల్లోనూ, ఏ మార్క్సిస్టుల ఉపన్యాసాల్లోనూ, ఏ సందర్భం లోనూ, కనపడవూ, వినపడవూ. ఈ సమస్త అంశాల్నీ, వాటి కారణాల్నీ 'కాపి టల్' వివరించిందనే సంగతి చాలా మంది మార్క్సిస్టులకు పట్టదు.

శ్రమ దోపిడీని తీసివెయ్యడం అంటే, దానికి ఎలాంటి మార్పులు అవసరమవుతాయో తెలిసి వుండకపోతే, ఆ ప్రయాణం, గమ్యం తెలియని ప్రయాణంగా సాగుతుంది. ఒకటి రెండు మార్పుల తోటే అది ఆగిపోయి, ఆ అర కొర మార్పులు కూడా వెనకడుగులు ప్రారంభిస్తాయి.

పెట్టుబడిదారీ సమాజం గానీ, దాని వెనక బానిస, భూస్వామ్య సమాజాలు గానీ, దోపిడీ సమాజాలుగా ఎందుకు అవుతాయో, దోపిడీని తీసి వెయ్యాలంటే ఎన్ని రకాల మార్పులు జరగాలో, 'కాపిటల్' పుస్తకం, కావలసిన వివరాలన్నీ ఇచ్చింది. ఇంకా మరిన్ని వివరాలు కావాలంటే, 'దోపిడీ వ్యతిరేకత'ని మార్గదర్శకంగా చేసుకుంటే, ఏ సమస్యనైనా పరిష్కరించుకోగలం.

ఒక సిద్ధాంతం అనేది, మొదట ప్రతీ అంశాన్నీ 'స్వచ్ఛ రూపం'లో (ప్యూర్ ఫామ్‌లో) వివరిస్తుంది. అది, సాధారణంగా వర్తించే జనరల్ సూత్రాన్ని ఇస్తూ, దానితో పాటే, ఏ ప్రత్యేక పరిస్తితులు ఏ ప్రత్యేక ఫలితాల్ని ఇస్తాయో కూడా చెపుతుంది. దాన్ని నేర్చుకోవడమూ, దాన్ని మన పరిస్తితులకు అన్వయించుకోవడమూ - మనం చేసుకోవలసిన పనులు.

"పెట్టుబడికి - లాభమూ (వడ్డీ + లాభమూ),
భూమికి - కౌలూ,
శ్రమకు - వేతనాలూ!'

ఈ సూత్ర త్రయం '(ట్రినిటీ ఫార్ములా), సామాజిక ఉత్పత్తి క్రమానికి సంబంధించిన సమస్త రహస్యాల్నీ కలిగి వుంది' - మార్క్స్

[కాపిటల్ - 3, పేజీ. 814]

మార్క్సిజానికి సారాంశం అంతా ఇదే. ఉత్పత్తి సంబంధాల్లో అనేక రహస్యాలున్నాయి. ఆ రహస్యాలేమిటో తెలుసుకుంటేనే, సమాజ సంబంధాలు అర్థమవుతాయి. కార్మిక వర్గం తనకు జరుగుతోన్న అక్రమాల్నీ, తన విముక్తి

మార్గాన్నీ గ్రహించగలుగుతుంది. ఇదంతా 'కాపిటల్' ద్వారానే సాధ్యమవుతుంది.

'కాపిటల్'లో పాఠాలు, 'వస్తువూ- సరుకూ' దగ్గిర్నించీ ప్రారంభమై, 'విలువ లెక్కలు లేకుండానే ఉత్పత్తి సంబంధాల నిర్వహణ ఎలా జరగ గలదో' వివరించే వరకూ అనేక భాగాలుగా సాగుతాయి.

మార్క్సు ఇదంతా రాసింది కేవలం మేధావుల కోసమే కాదు, సాధారణ కార్మిక ప్రజలందరూ నేర్చుకోవడం కోసమే. కానీ, దీన్ని కార్మిక ప్రజలకు అందించవలసిన బాధ్యత, మేధావి కార్మికుల మీదా, కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తల మీదా వుంటుంది.

కార్మిక ప్రజలు తెలుసుకోవలసిన రహస్యాలన్నీ, 'కాపిటల్'లో వున్నాయి కాబట్టే, ఆ పుస్తకాన్ని అన్ని భాషల లోకీ అనువాదాలు చేసి ప్రజలకు అందించాలని గతం లోనే అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ అతి ముఖ్యమైన తీర్మానం చేసింది. 1868 సెప్టెంబరులో, బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో జరిగిన అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ సమావేశం, జర్మన్ ప్రతినిధులు చేసిన ఒక సూచనతో, ఈ తీర్మానం ఆమోదించింది.

**"అన్ని** దేశాల కార్మికులూ, 'కాపిటల్' పుస్తకం చదవాలి. దాన్ని వివిధ భాషల్లోకి అనువదించడానికి ప్రయత్నాలు చెయ్యాలి."
['కార్ల్ మార్క్సు జీవిత చరిత్ర'; పేజీ 370;
ప్రోగ్రెస్ పబ్లిషర్స్ - మాస్కో, 1973]

ఈ తీర్మానం జరిగిన వెంటనే, ఒక్క నెల లోపల మొట్టమొదట రష్యా లోనే 'కాపిటల్'కి అనువాదం ప్రారంభమైంది. ఇతర దేశాల్లో కన్నా రష్యాలో అనువాదమే మొదటే పూర్తి అయింది.

'కాపిటల్'లో వున్న సిద్ధాంత జ్ఞానం తెలియని కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమాలు చీకట్లో తడుములాటలే. వాటికి ఎదుగూ బొదుగూ వుండదు.

**"ఆ**కస్మిక దాడుల కాలమూ, చైతన్యం లేని జనాలను చైతన్యం గల అతి కొద్ది మంది నడిపే విప్లవాల కాలమూ, గతించిన కాలం అయింది. సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా పరివర్తన చెందించడం - అనేదే ప్రశ్న అయినప్పుడు, జనాలు (మాసెస్) తమంతట తాము దానిలో (వర్గ పోరాటంలో) వుండి తీరాలి. ఏది సమస్యో, తాము దేని కోసం పోరాడుతున్నారో అప్పటికే గ్రహించి వుండి తీరాలి. ఏమి చెయ్యాలీ - అనే దానిని జనాలు అర్థం చేసుకోవాలీ - అంటే సుదీర్ఘమైన, నిరంతరమైన పని అవసరం" - ఎంగెల్స్ [మార్క్సు 'ఫ్రాన్సులో వర్గ పోరాటాలు' కి ఎంగెల్స్ రాసిన ముందు మాట. సెలెక్టడ్ వర్క్సు - 1, పేజీలు 199-200]

**"సి**ద్ధాంతం అనేది, జనాల (మాసెస్) మీద పట్టు సాధించినప్పుడే అది ఒక భౌతిక శక్తి అవుతుంది. సిద్ధాంతం, జనాలపై ఎప్పుడు పట్టు సాధిస్తుందంటే, అది వారి ప్రయోజనాలను (ఎడ్ హామినమ్) ప్రదర్శించినప్పుడు. అది, జనాల ప్రయోజనాలను ఎప్పుడు ప్రదర్శిస్తుందంటే, అది 'రాడికల్' (సమూలమైన మార్పుని కలిగించేది) అయినప్పుడు. అది, 'రాడికల్' కావాలీ అంటే, 'విషయం లోని మూలాన్ని' గ్రహించాలి"
- మార్క్సు
['ఆన్ రెలిజియన్, పే. 46, మాస్కో, 1975]

ప్రజలకు, ఏ జ్ఞానం అందాలో అది అందితే, దాని పని అది చేస్తుంది. దాని శక్తి దానికి వుంటుంది.

రంగనాయకమ్మ
23-11-2006

# 1వ భాగం
# పెట్టుబడిదారీ చలామణీ క్రమం
## [ఈ భాగంలో, 5 చాప్టర్లు ఉన్నాయి]
# 1. చలామణీ ఖర్చులు

తయారైన కొత్త ఉత్పత్తిని అమ్మే పని దగ్గిరికి ఇప్పుడు వస్తున్నాం. ఒక ఉత్పత్తి స్థలంలో తయారైన సరుకు, ఇంకా కొన్ని దశల మీదుగా నడిచిన తర్వాతే వాడకందార్లకు అందుతుంది.

'వాడకందారు' అంటే, ఆ సరుకుని వాడే వ్యక్తి. ఆ వాడడం - ఉత్పాదకంగా గానీ, అనుత్పాదకంగా గానీ, ఎలాగైనా కావచ్చు. పెట్టుబడిదారులూ, కార్మికులూ, స్వతంత్ర వుత్పత్తిదారులూ అందరూ, సరుకుల్ని కొని వాడతారు.

సరుకుల్ని కొన్న తర్వాత, వాటిని ఏ రకం గానూ వాడకుండా వాటిని మళ్ళీ అమ్మివేసే వ్యక్తి, (అమ్మడం కోసమే సరుకుల్ని కొనే వ్యక్తి), ఆ సరుకుకి వాడకందారుడు అవడు. ఆ వ్యక్తి, 'వర్తకుడు' అవుతాడు. సరుకుని వాడే వ్యక్తులే వాడకందారులు.

సరుకు తయారయ్యే క్రమాన్ని 'ఉత్పత్తి క్రమం' అనుకుంటే, ఆ క్రమం తర్వాత, ఆ సరుకు, వాడకందార్లకు అందే లోగా జరిగే దశలు, ఇలా ఉంటాయి: తయారైన సరుకుని పేక్ చెయ్యడం, దాన్ని స్టోరులో భద్రపరచడం, దానికి సంబంధించిన లెక్కలు రాయడం, దాన్ని గురించి ప్రకటనలు (ఎడ్వర్టయిజ్మెంట్లు) ఇవ్వడం, కొనే వాళ్ళతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం, సరుకుని రవాణాలో పంపడం, చివరికి దాన్ని అమ్మడం — వగైరా దశలు ఇవి.

సరుకు తయారైన తర్వాత నించీ దాన్ని అమ్మే వరకూ వుండే క్రమం — 'చలామణీ క్రమం'. ఈ క్రమంలో జరిగే దశలన్నీ - చలామణీ దశలు.

'చలామణీ క్రమం' అనేది, సరుకు తయారైన తర్వాతే కాదు; సరుకు ఇంకా తయారవక ముందు కూడా వుంటుంది. ఎలాగంటే, ఒక సరుకుని ఉత్పత్తి చేసే పని ఇంకా ప్రారంభించక ముందు, దానికి కావలసిన ముడి పదార్థాలూ వగైరా ఉత్పత్తి సాధనాల్ని, వేరే చోట్ల నించి కొని, ఉత్పత్తి స్థలం లోకి తేవాలి. ఇది మొదటి చలామణీ దశ. ఈ దశలో, ఉత్పత్తి సాధనాలన్నీ ఉత్పత్తి స్థలంలోకి వస్తాయి. తర్వాత, అక్కడ కొత్త సరుకు తయారవు తుంది. తయారైన ఆ కొత్త సరుకుని అక్కడి నించి బయటికి తీసుకుపోయి అమ్మాలి. తయారై వున్న సరుకుని అమ్మే వరకూ సాగేది, రెండో చలామణీ దశ. దీనితో మొత్తం కార్యక్రమం పూర్తి అవుతుంది. ఈ రకంగా, ఒక సరుకుకి సంబంధించి ఉత్పత్తి క్రమానికి ముందూ వెనకా కూడా చలామణీ దశలు జరుగుతాయి. ఈ 2 దశ ల్లోనూ కూడా కొన్ని కొన్ని ఖర్చులు అవుతాయి. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఒక సరుకుకి సంబంధించిన 2 చలామణీ దశల్నీ కలిపేసి, 'చలామణీ దశ' అనీ, లేదా 'చలామణీ క్రమం' అనీ (సర్క్యులేషన్ పీరియడ్ — అని) ఒకే పేరుతో చెప్పుకోవచ్చు. ఈ చలామణీ పనుల కోసం అయ్యే ఖర్చులన్నీ - చలామణీ ఖర్చులు.

అయితే, ఒక ఉత్పత్తి తయారైన తర్వాత అది

వాడకం లోకి వెళ్ళడానికి, ఈ చలామణీ పనులన్నీ తప్పనిసరిగా అవసరమైనవి కావు. వాటిలో కొన్ని పనులు మాత్రమే సహజంగా అవసరం. కొన్ని పనులు సహజంగా అనవసరం. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, ఈ పనులన్నీ కూడా తప్పని సరిగా అవసరమైనవి గానే వుంటాయి.

అయితే, చలామణీ దశల్లో సహజంగా అవసరమైన ఖర్చులు మాత్రమే, సరుకు విలువని పెంచుతాయి. అసహజమైన ఖర్చులు, ఆ విలువకి చేరవు. విలువని పెంచవు. వాటిని, ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ'లోనించి తీసి ఖర్చు పెట్టవలిసిందే.

'ఉత్పత్తి స్థలం'లో తయారై వున్నప్పుడు, 100 మీటర్ల బట్ట విలువ, 120 అనుకుందాం. దాన్ని అక్కడే, ఆ క్షణం లోనే అమ్మితే, ఆ 120కే అమ్మవచ్చు. కానీ, దాన్ని కొన్ని రోజులో నెలలో స్టోరులో నిలవ చేస్తే, దానికి కొన్ని 'స్టోరు ఖర్చులు' కలుస్తాయి. దాని వల్ల బట్ట విలువ, 120కన్నా కొంత పెరుగుతుంది. బట్టని అప్పుడు అమ్మితే, ఆ పెరి గిన విలువకే అమ్మవలసి వుంటుంది. ఆ బట్టని, ఒక చోటు నించి ఇంకో చోటుకి పంపితే, దానికి కొన్ని 'రవాణా ఖర్చులు' కూడా కలుస్తాయి. అప్పుడు దాని విలువ, ఇంకా కొంత పెరుగుతుంది. దాన్ని అప్పుడు అమ్మితే, ఆ ఇంకా పెరిగిన విలువకే అమ్మాలి.

ఒక సరుకు, వాడకందారు చేతికి అందేటప్పటికి, దానికి వుండే మొత్తం విలువ ఏమిటంటే, (1) దాని 'ఉత్పత్తి దశ'లో జరిగిన సహజమైన ఖర్చులూ, (2) 'చలామణీ దశ'లో జరిగిన సహజమైన ఖర్చులూ - ఈ రెండూ కలిసిన మొత్తం. ఈ 'మొత్తం విలువ'నే ఆ సరుకుని కొనే వాడకందారులు చెల్లించవలసి వుంటుంది.

వాడకందారుడు — కార్మికుడా, పెట్టుబడిదారుడా; ఆ వ్యక్తి, ఆ సరుకుని, 'వ్యక్తిగత' అవసరానికి వాడతాడా, 'ఉత్పాదక' అవసరానికి వాడతాడా — అనే విషయాలతో సరుకు విలువకు సంబంధం వుండదు. ఒక సరుకుని ఎవరు కొన్నా, ఏ అవసరానికి కొన్నా, దాని విలువనంతా చెల్లించాలి.

'చలామణీ దశ'లో జరిగే ఖర్చుల్లో ఏ ఖర్చులు సహజమైనవో, ఏ ఖర్చులు అసహజమైనవో, ఇప్పుడు వరసగా చూస్తాం.

# 1. సార్టింగూ, పేకింగూ ఖర్చులు

**సా**ర్టింగు — అంటే, తయారైన ఉత్పత్తినంతా తనిఖీ చేసి, మంచి వస్తువుల్నీ, పాడైన వస్తువుల్నీ వేరు చెయ్యడం. పేకింగు — అంటే, తయారైన ఉత్పత్తిని బైటికి పంపడానికి వీలుగా 'పేక్' చెయ్యడం.

'ఉత్పత్తి క్రమం'లోంచి బయటపడ్డ ఉత్పత్తి అంతా, పూర్తిగా సరైన విధం గానే వుండదు. కొంత భాగం, పూర్తిగా బాగుంటుంది. కొంత భాగం, కొంత పాడై వుంటుంది. కొంత భాగం, పూర్తిగా పాడై వుంటుంది. బట్ట అయితే, అక్కడక్కడా కన్నాలు పడి వుండవచ్చు. దాని మీద ప్రింటు కొన్ని చోట్ల సరిగా పడకుండా వుండవచ్చు. కుట్టిన బట్టలైతే, కొన్నిటికి కుట్లు తెగి వుండవచ్చు. గాజు సామానైతే, కొంత సామాను పగిలిపోయి వుండవచ్చు. ఈ రకంగా, ఆ ఉత్పత్తుల రకాల్ని బట్టి అవి పాడవటాలు రక రకాలుగా వుంటాయి. కొత్త ఉత్పత్తిలో నించి మంచి దాన్ని ఒక పక్కకీ, పాడైన దాన్ని ఇంకో పక్కకీ, విడదియ్యాలి. మంచి ఉత్పత్తిని, దానికి తగిన పద్ధతిలో పేక్ చెయ్యాలి. చెడిపోయిన ఉత్ప త్తిని మళ్ళీ ముడి పదార్థాల స్థలానికో, రిపేర్ల స్థలా నికో, పంపించాలి.

ఈ సార్టింగూ పేకింగూ పనులు జరగక పోతే, ఉత్పత్తిని, ఉత్పత్తి స్థలం నించి బైటికి పంపడం సాధ్యం కాదు. ఈ పనులు, వస్తువుల కోసం సహజంగా అవసరమైన పనులే. ఈ పనుల కోసం అయ్యే ఖర్చులు, సరుకు విలువకి చేరతాయి. విలువని పెంచుతాయి. కాబట్టి, ఈ సార్టింగూ పేకింగూ దశలు — ఉత్పాదక దశలే. ఈ పనులు చేసే కార్మికులు — ఉత్పాదక కార్మికులే. అయితే, ఈ దశలు, చలామణీ క్రమంలో జరిగే ఉత్పాదక దశలు.

ఈ పనులు ఒక ఉత్పత్తి మీద జరిగినప్పుడు, ఈ పనుల వల్ల, ఆ ఉత్పత్తిలో ఏ మార్పులూ జర గవు. అయినా ఆ ఉత్పత్తి కోసం ఈ పనులు తప్పని సరిగా

అవసరమే. ఈ పనులు జరిగే కాలమే, ఈ ఉత్పత్తి క్రమాలు జరిగే కాలం.

వస్తువుని తయారు చేసే ఉత్పాదక దశలకూ, 'చలామణీ క్రమం'లో జరిగే ఉత్పాదక దశలకూ, తేడా ఏమిటో గ్రహించడానికి, కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ముడి పదార్థాన్ని- కొత్త వస్తువుగా మార్చే క్రమం, అసలైన ఉత్పత్తి క్రమం. పత్తి ని దారంగా మార్చి నప్పుడు, పత్తి ఆకారం మారిపోయి అది ఇంకో వస్తు వుగా (దారం గా) తయారవుతుంది. అలాగే, దారాన్ని బట్టగా, బట్టని చొక్కాగా మార్చే క్రమాల్లో, కొత్త వస్తు వులు తయారవుతాయి. కానీ, తయారై వున్న పత్తి మీద సార్టింగూ పేకింగూ పనులు జరిగితే, ఆ పనుల వల్ల పత్తి కి రూపం మారదు. అది కొత్త వస్తువుగా మారదు. కానీ, పత్తిని వాడుకోవాలంటే, ఆ పనులు కూడా అవసరమే. ఒక వస్తువుని, కొత్త వస్తువుగా మార్చకుండా అదే వస్తువు కోసం జరిగే పనులు, చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి దశలు.

**'పత్తి' నించి 'చొక్కా' వరకూ తీసుకుంటే :**

(1) 'పత్తి'ని పండించే క్రమం, ఒక విడి ఉత్పత్తి క్రమం. ఇది, అంతకు ముందు వున్న విత్తనాలూ భూసారమూ వంటి అంశాల్ని పత్తిగా మారుస్తుంది. పత్తి పంట పండి, కొత్త పత్తి తయారైన తర్వాత, దాని మీద జరిగే సార్టింగూ పేకింగూ క్రమాలు, పత్తి శరీ రంలో మార్పులు తీసుకు రావు. పత్తి, పత్తి లాగే వుంటుంది. దానికోసం జరిగే పనులు, పత్తి తాలూకు చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి క్రమాలు.

(2) పత్తితో 'దారాన్ని' తయారు చేసే క్రమం, ఒక విడి ఉత్పత్తి క్రమం. ఇది, పత్తిని, దారంగా మారు స్తుంది. దారం తయారైన తర్వాత, దాని మీద జరిగే సార్టింగూ పేకింగులు, దారం శరీరంలో మార్పులు తీసుకురావు. దారం దారం లాగే వుంటుంది. దాని మీద జరిగే పనులు, దారం తాలూకు చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి క్రమాలు.

(3) దారంతో బట్టని తయారు చేసే క్రమం, ఒక విడి ఉత్పత్తి క్రమం. తయారైన బట్ట మీద జరిగే సార్టింగూ పేకింగులు, బట్ట శరీరంలో మార్పులు తీసుకు రావు. బట్ట, బట్ట లాగే వుంటుంది. దాని మీద జరిగే పనులు, బట్ట తాలూకు చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి క్రమాలు.

(4) బట్టతో చొక్కాని కుట్టే క్రమం, ఒక విడి ఉత్పత్తి క్రమం. తయారైన చొక్కా మీద జరిగే సార్టింగూ పేకింగులు, చొక్కా తాలూకు చలామణీ క్రమంలోని ఉత్పత్తి క్రమాలు.

ఈ రకంగా, విడి ఉత్పత్తి క్రమం, ఒక రకం వస్తువుని ఇంకో రకం వస్తువుగా మారిస్తే, చలామణీ క్రమం లోని ఉత్పత్తి క్రమం, వస్తువుని మార్చ కుండా దానికి కావలసిన ఇతర పనులు చేస్తుంది.

ఏ ఉత్పత్తి క్రమంలో అయినా (అది, విడి ఉత్పత్తి క్రమం అయినా, చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి క్రమం అయినా), అక్కడ ఏ పనులు కావాలో ఆ పనులు జరగడానికి, కొన్ని సాధనాల ఖర్చూ (C), జీతాల ఖర్చూ (V), కార్మికుల నించి అదనపు విలువ (S) రావడమూ — అన్నీ వుంటాయి. అంటే, ఈ చలామణీ పనుల కోసం కూడా కొంత పెట్టుబడి ఖర్చవడమూ, దాని వల్ల కొంత అదనపు విలువ రావడమూ — అన్నీ జరుగు తాయి. ఆ అద నపు విలువ, ఆ పనులు చేసిన కార్మికుల వల్ల వచ్చేదే.

ఏ ఉత్పత్తి క్రమంలో అయినా, అక్కడ జరిగే ఖర్చులు, సగటు స్థాయి లోనే వుండాలి. అలాగే, ఈ చలామణీ క్రమంలో జరిగే ఖర్చుల సంగతి కూడా.

అమ్మకాలు లేకుండానే వస్తువుల్ని వాడుకోవా లంటే, అప్పుడు కూడా ఈ సార్టింగూ పేకింగూ పనులు, తప్పని సరిగా అవసరమైన పనులే. ఇవి, నూతన సమాజంలో కూడా జరగవలసిన పనులే.

అయితే, పెట్టుబడిదారీ విధానంలో జరిగే పేకింగ్ గురించి ఒక విషయం చెప్పుకోవాలి. ఈ విధానంలో, పేకింగ్ అంతా, కొనే వాళ్ళని ఆకర్షించా లనే దృష్టి తోటే సాగుతుంది. సరుకు రక్షణ కోసం సింపుల్ ప్యాకింగ్ సరిపోయే సందర్భాల్లో కూడా, పెట్టుబడిదారీ పేకింగ్, అలా వుండదు. సరుకు మీద పేకింగ్ తళ తళ్ళాడిపోతూ ఆర్భాటంగా వుంటే, కొనే వాళ్ళు దాన్ని చూసి ఆ సరుకుల్ని తప్పకుండా కొంటా రని అమ్మే వాళ్ళు భావిస్తారు. అలాంటి దృష్టితో జరిగే పేకింగ్ కోసం చాలా ఖర్చు అవుతుంది. నిజానికి అలాంటి పేకింగు అవసరం కాదు. అయినా అలాంటి పేకింగు చెయ్యడం అంటే, ఆ ఖర్చులో

చాలా భాగం అనవసరంగానే జరుగుతుంది. పేకింగ్ అనేది అవసరమైన విషయమే అయినా, దాని కోసం నిజంగా అవసరమైన పరిమితిని దాటి ఖర్చుపెడితే, అదంతా నిజంగా అవసరమని అర్థం కాదు. ఆ ఖర్చు, సరుకు విలువని అనవసరంగా పెంచు తుంది.

ఒక ఉత్పత్తి స్థలంలో జరిగే సార్టింగ్—పేకింగ్‌ల విషయంలో చూసినదే, అన్ని ఉత్పత్తి స్థలాల లోనూ జరుగుతుంది. అన్ని ఉత్పత్తి స్థలాల లోనూ జరిగే సార్టింగ్, పేకింగ్ ఖర్చులన్నిటినీ కలిపితే, అవి, మొత్తం సమాజాని కంతటికీ ఆ పనుల కోసం అయ్యే ఖర్చులు.

# 2. బుక్ కీపింగ్ ఖర్చులు

**బు**క్ కీపింగ్—అంటే, ఉత్పత్తి తయారీకీ, మార కానికీ సంబంధించిన లెక్కలు రాయడం. ఈ లెక్కలు, 'విలువ' అంశాలకు సంబంధించీ, 'ఉప యోగపు విలువ' అంశాలకు (ఉత్పత్తుల పరిమాణా లకు) సంబంధించీ కూడా వుంటాయి. 'ఉపయోగపు విలువ' అంశాలకు సంబంధించిన బుక్ కీపింగ్ అంతా సహజంగా అవసరమైన విషయమే. కానీ, 'విలువ' అంశాలకు సంబంధించిన బుక్ కీపింగ్ అంతా సహజంగా అవసరం కాని విషయం. పెట్టు బడిదారీ బుక్ కీపింగ్‌లో, ఈ **2** రకాల అంశాలూ కలిసి పోయి వుంటాయి.

'నూతన సమాజం'లో కూడా, విలువ—లెక్కలు వున్నంత కాలమూ, ఈ **2** అంశాలూ కలిసి పోయే వుంటాయి.

పెట్టుబడిదారుడు ఎప్పుడూ ఉత్పత్తి సాధనాల్ని కొంటూ వుంటాడు. సరుకుల్ని తయారు చేయిస్తూ వుంటాడు. తయారైన ఉత్పత్తిని అమ్ముతూ వుంటాడు. కార్మికులకు జీతాలు ఇస్తూ వుంటాడు. వర్తక కమిషన్‌లూ, వడ్డీలూ, కౌళ్ళూ, పన్నులూ చెల్లిస్తూ వుంటాడు. ఈ లెక్కలన్నీ ఎప్పటికప్పుడు కాగితాల మీద వుండాలి.

మొదట - ఉత్పత్తి క్రమానికి అవసరమైన ఉత్పత్తి సాధనాల పరిమాణాల్నీ, తర్వాత - తయారైన కొత్త ఉత్పత్తి పరిమాణాల్నీ రాయడమూ, ఉత్పత్తుల విలువల్ని లెక్కగట్టడమూ, ఉత్పత్తుల్ని కొనే వాళ్ళతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడమూ, ఉత్పత్తుల్ని కొన్న వాళ్ళ కోసం బిల్లులు రాయడమూ, బ్యాంకుల నించి వచ్చే పోయే డబ్బు లెక్కలు చూడడమూ — వగైరా పనులన్నీ బుక్ కీపింగ్ కిందకు వస్తాయి.

ఈ లెక్కలు రాసే పని జరగడానికి - ఒక గదీ, అందులో బల్లలూ, కుర్చీలూ, కాయితాలూ, కలాలూ, ఇంకులూ — వంటి సామాగ్రీ; ఆ లెక్కలు రాసే ఉద్యోగులూ, వుండాలి. ఆ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి. ఈ ఖర్చులన్నీ 'బుక్ కీపింగ్ ఖర్చులు'. ఈ ఖర్చుల్లో కొంత భాగం - 'ఉత్పాదక మైన' ఖర్చు గానూ, కొంత భాగం- 'అనుత్పాదకమైన' ఖర్చు గానూ వుంటాయి. ఉత్పాదకమైన బుక్ కీపింగ్ ఖర్చు, సరుకు విలువకి చేరి విలువని పెంచుతుంది. అనుత్పాదకమైన బుక్ కీపింగ్ ఖర్చు, ఆ సరుకులో వున్న 'అదనపు విలువ'కు సంబంధించినదిగా వుంటుంది.

ఒక ఉత్పత్తి స్థలంలో బుక్ కీపింగ్ పనులు చేసే ఉద్యోగి శ్రమ, ఉత్పాదక—అనుత్పాదక లక్షణాలతో కలిసి పోయి వుంటుంది.

'ఉత్పత్తి' కోసం తప్పనిసరిగా అవసరమయ్యే 'బుక్ కీపింగ్'నే తీసుకుంటే, ఆ పని వల్ల కూడా ఉత్పత్తిలో ఏ మార్పూ జరగదు. కాబట్టి, బుక్ కీపింగ్ దశ, 'చలామణీ క్రమం లోని ఉత్పాదక దశ' కిందకే వస్తుంది.

ఒక 'పని స్థలం'లో ఉండే బుక్ కీపింగ్ లాంటిదే అన్ని పని స్థలాల లోనూ వుంటుంది. అన్ని పని స్థలాల లోనూ వున్న బుక్ కీపింగ్ ఖర్చు నంతటినీ కలిపితే, అది, మొత్తం సమాజానికి అయ్యే బుక్ కీపింగ్ ఖర్చు. సమాజ స్వభావాన్ని బట్టే, బుక్ కీపింగ్ పద్ధతులు వుంటాయి.

పెట్టుబడిదారీ విధానానికి పూర్వం, బుక్ కీపింగ్ అనేది, దాదాపు లేదు. పాత కాలపు రైతు, తన లెక్క లన్నీ కేవలం 'జ్ఞాపకంలోనే' వుంచుకునే వాడు.

పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి స్థాయి చాలా ఎక్కువగా వుంటుంది కాబట్టి, లెక్కలన్నీ 'జ్ఞాప కంలో' వుంచుకోవడం సాధ్యం కాదు. అవన్నీ కాయి తాల మీద వుండవలిసిందే. గత సమాజాలలో లేని బుక్ కీపింగు, పెట్టుబడిదారీ విధానం నించే అవసర మైంది.

ఉత్పత్తి స్థాయీ, అమ్మకాల స్థాయీ, కేంద్రీకృత మైన కొద్దీ బుక్ కీపింగ్ ఖర్చులు తగ్గుతాయి. ఒకే రకం సరుకు కోసం, చిన్న చిన్న స్థాయిల్లో 10 చోట్ల విడి విడిగా జరిగే పనులు అన్నీ, ఒకే చోట ఒకే ఉత్పత్తి క్రమంలో జరిగేటట్టయితే, దాదాపు 9 చోట్ల ఖర్చుల్లో చాలా భాగం తగ్గిపోతుంది. తక్కువ స్థాయి వ్యవహారాల మీద 10 ఉత్తరాలు వేరు వేరుగా రాసే కన్నా, ఒకే పెద్ద వ్యవహారం మీద ఒకే ఉత్తరం రాస్తే, కాయితాల ఖర్చూ, పోస్టు ఛార్జీలూ, రాత శ్రమా, తగ్గిపోతాయి.

కానీ, ఈ కేంద్రీకరణ, అన్నిటికీ వర్తించదు. కొన్ని రకాల ఉత్పత్తి క్రమాల్ని ఎప్పుడూ చిన్న స్థాయిల్లోనే వుంచాలి. ఉదా: భోజన శాలలు - వంటి వాటిని. వీటిని చిన్న స్థాయిలో వుంచినప్పుడే, పరిశుభ్రంగా వుంచడమూ, సభ్యులందర్నీ సన్నిహిత సంబంధాల్లో వుంచడమూ, సాధ్యమవుతుంది. ఇంకా కొన్ని రకాల ఉత్పత్తి క్రమాలు కూడా ఇలాంటివే వుండవచ్చు. పెద్ద స్థాయిలో కేంద్రీకృతం చెయ్యడం అనేది, అన్ని విషయాలకూ ఒకే రకంగా పనికి రాదు.

నూతన సమాజంలో, ఉత్పత్తి క్రమాలు 'సమిష్టి ఉత్పత్తి క్రమాలు'గా మారే కొద్దీ, బుక్ కీపింగ్ ఖర్చుల్లో 2 రకాల మార్పులు వస్తాయి. (1) పెట్టు బడిదారీ విధానంలో ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా విడి విడిగా జరిగే విడి విడి బుక్ కీపింగ్‌లకు బదులు, నూతన విధానంలో సమిష్టి బుక్ కీపింగ్‌లు జరగడం వల్ల, సమాజంలో బుక్ కీపింగ్ ఖర్చులు గతం కన్నా చాలా తగ్గుతాయి. (2) ఉత్ప త్తుల్ని తయారు చెయ్యడం లోనూ, ఉపయో గించడం లోనూ, పెట్టుబడిదారీ విధానంలో లేని ఉపయోగపు విలువ దృష్టి, నూతన విధానంలో వుంటుంది కాబట్టి, అప్పుడు ప్రతీ చోటా, ప్రతీ అంశాన్నీ వివరంగా రాస్తూ ఖచ్చితమైన లెక్కలు ఉంచవలసి వుంటుంది. ఈ కారణం వల్ల, నూతన విధానంలో బుక్ కీపింగ్ ఖర్చులు, గతం కన్నా అనేక రెట్లు పెరుగుతాయి. — ఈ రకంగా, నూతన సమాజంలో, బుక్ కీపింగు, కొన్ని అంశాల్లో తగ్గడమూ, కొన్ని అంశాల్లో పెరగ డమూ జరిగి, కొత్త పద్ధతిలో కొత్త స్వభావంతో ఏర్పడుతుంది.

# 3. స్టోరు ఖర్చులు

**ఉ**త్పత్తుల్ని జాగ్రత్తగా వుంచడానికి అయ్యే ఖర్చులే — స్టోరు ఖర్చులు. ఉత్పత్తుల్ని స్టోరు చేసే శ్రమ, సహజంగా అవసరమయ్యే శ్రమే. ఈ శ్రమ, ఉత్పత్తి విలువకు చేరుతుంది. విలువని పెంచు తుంది. కానీ, పెట్టుబడిదారీ విధానంలో జరిగే స్టోరు ఖర్చులన్నీ సహజంగా అవసరమైనవి కావు. వాటిలో కొన్ని మాత్రమే సహజంగా అవసరం. కొన్ని పూర్తిగా అనవసరం.

ప్రతీ ఉత్పత్తికీ ఒక సహజమైన నిలవ కాలం వుంటుంది. సంవత్సరానికి ఒక్కసారే ఉత్పత్తి అయ్యే ధాన్యాన్ని, సంవత్సరం పాటు నిలవ చెయ్యాలి. అప్ప టికి కొత్త ధాన్యం వస్తుంది. 6 నెలలకోసారి ఉత్పత్తి అయ్యే ధాన్యాన్ని, 6 నెలల పాటు నిలవ చేస్తే చాలు. పాలని, ఒక్క పూట నిలవ చేస్తే చాలు, ప్రతి పూటా కొత్త పాలు ఉత్పత్తి అవుతాయి కాబట్టి. కూరగాయల్ని 2, 3 రోజులు నిలవ చెయ్యాలి. ఈ రకంగా, ఒక ఉత్పత్తిని, అది ఎంత కాలానికోసారి పునరుత్పత్తి అవుతుందో అంత కాలం వరకూ నిలవ చేసుకోవాలి. ఆ కాలమే ఉత్పత్తిని నిలవ చెయ్యడా నికి అవసరమయ్యే సహజమైన కాలం.

ఉత్పత్తుల్ని నిలవ చేసేటప్పుడు, ఆ ఉత్పత్తుల శరీర లక్షణాల్ని బట్టే నిలవ ఏర్పాట్లు వుంటాయి. ఈ నిలవ పనుల కోసం — (1) ఒక గదీ, కొన్ని బీరు వాలూ, సంచులూ, నిచ్చెనలూ, పాత్రలూ, ఉత్పత్తు లకు క్రిమి కీటకాలు పట్టకుండా చేసే మందులూ — వగైరా సాధనాలూ, (2) ఆ నిలవ పనులు చేసే

మనుషులూ – కావాలి. ఈ మనుషులు, ఉత్పత్తుల్ని ఇటూ అటూ మోస్తూ, నిచ్చెనలు ఎక్కి దిగుతూ, స్టోరులు శుభ్రం చేస్తూ, ఉత్పత్తుల రక్షణ కోసం అవసరమైన మందులు చల్లుతూ, ఇతర తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, ఉత్పత్తులు చెడిపోకుండా వుండడానికి కావలసిన పనులన్నీ చేస్తారు.

ఈ పనుల వల్ల ఉత్పత్తుల్లో మార్పులు జరగవు. కానీ, ఉత్పత్తుల్ని వాడుకోవాలంటే, ఆ వాడుకునే సమయం వరకూ, వాటిని చెడిపోనివ్వ కుండా సంరక్షిస్తూ వుంచుకోవడం చాలా అవసరం. అందుకే, ఈ ఖర్చులన్నీ సహజమైన ఖర్చులు. ఇవి ఉత్పత్తుల విలువని పెంచుతాయి.

పెట్టుబడిదారుడి దగ్గిర, ముడి పదార్థాలూ వగైరాలు కొన్ని, ఎప్పుడూ స్టోరులో సిద్ధంగా వుండాలి. తయారైన కొత్త ఉత్పత్తులు కూడా 'ఉత్పత్తి స్థలం'లో నించి వచ్చి ఇంకో స్టోరులో వుండాలి. ఈ స్టోరు కార్యక్రమాల శ్రమ అంతా, ఉత్పాదక శ్రమే. ఈ కార్మికులు, ఉత్పాదక కార్మికులే.

స్టోరు ఖర్చులు కూడా సరుకు విలువకి చేరటం వల్ల సరుకు విలువ, ఒక నెల కన్నా ఇంకో నెల పెరుగుతూ వుంటుంది. జనవరిలో పండిన కొత్త ధాన్యాన్ని డిసెంబరు వరకూ, అంటే 12 నెలలు, నిలవ చెయ్యవలసి వుంటుందనుకుందాం. జనవరిలో వాడకం అయ్యే ధాన్యం విలువ కన్నా, ఫిబ్రవరిలో వాడకం అయ్యే ధాన్యం విలువ, కొంత ఎక్కువగా వుంటుంది. మార్చిలో వాడకం అయ్యే ధాన్యం విలువ ఇంకా కొంత ఎక్కువగా. ఈ రకంగా, ప్రతీ నెలకీ కొంత స్టోరు ఖర్చు చేరుతూ 12 వ నెలలో ధాన్యం విలువ, గత నెలల విలువల కన్నా కూడా ఎక్కువగా వుంటుంది.

ఈ ఉత్పత్తుల్ని స్టోరు చెయ్యడం, వాటిని అమ్మే వాళ్ళ దగ్గిరైనా జరగవచ్చు; లేదా, వాటిని వాడే వాళ్ళే, వాటిని ఎక్కువ మొత్తంలో కొని తమ దగ్గిరే స్టోరు చేసుకోవడం అయినా జరగవచ్చు.

ఒక కుటుంబం, ఒక సంవత్సరాని కంతటికీ కావలసిన కొత్త ధాన్యాన్ని జనవరిలో కొంటుందనుకుందాం. దాని విలువ 200. దాన్ని డిసెంబరు వరకూ స్టోరు చేసి వుంచుకోవాలి. (ఆ ధాన్యంలో కొంచెం కొంచెం, ప్రతీ నెలా ఖర్చయిపోతూ వుంటుంది.) ఆ ధాన్యాన్ని ఇంట్లోనే ఒక మూల పెట్టుకోవాలంటే, దానికి కొంత స్థలమూ, బల్లలూ, సంచులూ, ఆ నిలవకు సంబంధించిన పనులూ వగైరాల ఖర్చంతా కలిసి, 50 అనుకుందాం. ఆ కుటుంబం, ఆ ధాన్యాన్ని తన ఇంట్లోనే స్టోరు చేసుకుంటే, దాని కోసం కొంత ఖర్చు పెట్టి, ఆ శ్రమ కూడా చేసుకోవాలి. లేదా, ఏ నెల కావలసిన ధాన్యాన్ని ఆ నెలే బయటి నించి కొనుక్కుంటే, సంవత్సరం మొత్తం మీద ఆ ధాన్యం కోసం, 200 మాత్రమే గాక, ఇంకో 50 ని కూడా ఎక్కువగా చెల్లించాలి. ఎందుకంటే, ధాన్యాన్ని అమ్మే పెట్టుబడిదారుడు, దాన్ని అప్పటి దాకా తన దగ్గిర నిలవ చేసి వుంచాడు గనక. ఎలా చూసినా, ఆ కుటుంబానికి, ధాన్యం కోసం 250 ఖర్చవడం తప్పదు. ఏ ఉత్పత్తి విషయం అయినా ఇంతే. ఉత్పత్తిని నిలవ చేసే పని, ఒక చోట కాకపోతే ఇంకో చోటైనా జరగాలి. ఎక్కడ జరిగినా దాని మీద కొంత ఖర్చు తప్పదు. అందుకే దాని విలువ పెరుగుతుంది.

సమాజంలో ఈ నిల్వ పనులు, అనేక చోట్ల చిన్న చిన్న స్థాయిల్లో విడి విడిగా జరిగితే, వాటి కోసం అయ్యే ఖర్చులు ఎక్కువ గానూ, ఆ పనులు పెద్ద స్థాయిలో తక్కువ చోట్ల జరిగితే, ఆ ఖర్చులు తక్కువ గానూ వుంటాయి. కానీ, తినే పదార్థాల్ని ఎప్పుడూ తక్కువ స్థాయిల్లోనే నిల్వ చెయ్యవలసి వుంటుంది.

ఒక శాఖలో వుండే పెట్టుబడిదారులందరి స్టోరు ఖర్చులూ ఒకే రకంగా వుండవు. ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చేసే వాడి స్టోరు ఖర్చులు తక్కువగానూ, తక్కువ స్థాయిలో చేసే వాడి స్టోరు ఖర్చులు ఎక్కువ గానూ, వుంటాయి. ఒక స్టోరులో 100 బస్తాల్ని నిలవ చెయ్యడానికీ, 110 బస్తాల్ని నిలవ చెయ్యడానికీ ఖర్చులో తేడా వుండదు. కానీ, ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చేసే వాడికి, స్టోరు ఖర్చులూ, ఇతర ఖర్చులూ కూడా కలిసి వస్తాయి. అంటే, ఖర్చులు తగ్గుతాయి. ఖర్చులు తగ్గడం వల్ల, చివరికి మిగిలే లాభం పెరుగుతుంది. కానీ <u>ఒక పని ఎక్కువ స్థాయిలో జరగడం అంటే, అది, కార్మికుల 'సహకారం' స్థాయి పెరగడమే.</u> కార్మికుల సంఖ్య పెరిగి,

సహకారం స్థాయి పెరగడం వల్ల వచ్చే ఫలితం, తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరగడం. ఆ ఫలితం, ఆ కార్మికులకు చెందకుండా, 'ఎక్కువ లాభం మిగిలే' రూపంలో, పెట్టుబడిదారుడికే పోతుంది.

పెట్టుబడిదారీ విధానంలో, 'అమ్మకం' అనేది తప్పనిసరి విషయంగా వుంటుంది కాబట్టి, ఉత్పత్తుల్ని స్టోరు చేసే విషయంలో ఊహాతీత మైనంత ఖర్చు వ్యర్థంగా జరుగుతుంది. ఎలాగంటే: 'ఉత్పత్తి స్థలం' నించి బయటపడ్డ సరుకు, మొదట 'స్టోరు' లోకి వచ్చి, అక్కడి నించి 'షాపు'లోకి వస్తుంది. ఒక బట్టల షాపులో, కొన్ని రకాల బట్ట వుందనుకుందాం. ఆ బట్టంతా కలిసి వెయ్యి మీటర్లూ, ఆ షాపుకి బట్టని అందించే స్టోరులో 2 వేల మీటర్లూ, వున్నాయను కుందాం. షాపులో వున్న బట్టలో నించి కొన్ని తానులు అమ్మకం అయిపోయేటప్పటికి, స్టోరులో బట్ట, షాపు లోకి వచ్చేస్తుంది. ఉత్పత్తి స్థలంలో బట్ట, స్టోరు లోకి వస్తుంది. స్టోరు లోనూ, షాపు లోనూ కూడా ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ అయిపోతూ వుంటాయి. షాపులో బట్ట అంతా ఎప్పటికప్పుడు కదులుతూనే వున్నా, ఏ క్షణంలో చూసినా, షాపు నిండా వెయ్యి మీటర్ల బట్టా, దాని వెనక స్టోరు నిండా 2 వేల మీటర్ల బట్టా, సిద్ధంగా వుంటాయి. ఈ రకంగా, షాపు లోనూ, స్టోరు లోనూ కలిసి ఎప్పుడూ 3 వేల మీటర్ల బట్ట వుండడం అంటే, (అది అంత కన్నా ఎక్కువో తక్కువో కావచ్చు), ఆ బట్ట అంతా వాడకం లోకి వెళ్ళకుండా ఎప్పుడూ బీరువాల లోనే పడి వుంటున్నట్టు అర్థం!

'ఉత్పత్తి' కావాలంటే, 'ఉత్పత్తి స్థలం' అవసరమే. 'ఉత్పత్తి'ని నిలవ చెయ్యడానికి 'స్టోరు' కూడా అవసరమే. కానీ, 'షాపు' అనేది పూర్తిగా అనవసరం. ఈ విషయమే సరిగా అర్థం చేసుకోవాలి.

'అమ్మకాల' విధానం వుండడం వల్లనే ఆ పని కోసం 'షాపు' అవసరమవుతుంది. అమ్మకాలే లేనట్టుగా ఊహిస్తే, ఉత్పత్తుల్ని 'పంపిణీ చేసే' విధానాలు మాత్రమే చాలు. ఉత్పత్తి స్థలాల్లో తయారయ్యే కొత్త వస్తువులు, మొదట ఒక పంపిణీ స్థలానికి వచ్చి, అక్కడి నించి వాడకందార్లకు చేరవచ్చు. తర్వాత ఆ స్థలం ఖాళీ అయిపోతుంది. మళ్ళీ పంపిణీ సమయం వచ్చినప్పుడే కొత్త ఉత్పత్తులు అక్కడికి వచ్చి, మళ్ళీ త్వర త్వరగా పంపిణీ అయిపోతాయి. ఈ విధానం వల్ల, పంపిణీ స్థలాల్లో, ఉత్పత్తులు ఎప్పుడూ నిలిచి వుండడం జరగదు. కానీ, అమ్మకాలు జరిగే 'షాపు' విషయం అలా కాదు.

ఒక బట్టల షాపుని తీసుకుంటే, ఆ షాపులో బీరువాలన్నీ రక రకాల బట్టలతో నిండి వుంటాయి. కొనే వ్యక్తి వచ్చి ఒక రకం బట్ట అడగగానే, అది ఆ షాపులో లేకపోతే, ఆ వ్యక్తి ఇంకో షాపు దగ్గిరికి వెళ్ళిపోయే 'ప్రమాదం' వుంటుంది కాబట్టి, ప్రతీ బట్ట పెట్టుబడిదారుడూ ఎప్పుడూ తన షాపు నిండా రక రకాల సరుకుని వుంచుతాడు. 'షాపు'లో నించి ఒక బట్టల తాను, వాడకందారుల చేతుల్లోకి వెళ్ళిపోగానే, తక్షణం అక్కడ కొత్త తాను ప్రత్యక్ష మవుతుంది. అది, 'స్టోరు'లో నించి వచ్చి అక్కడ నించుంటుంది. అంటే, ఇది దేనితో సమానం అంటే, షాపులో వున్న పాత తాను అసలు కదలకుండా అక్కడే వుండిపోయి, స్టోరులో నించి వచ్చిన కొత్త తానే కొనే వ్యక్తి చేతి లోకి వెళ్ళడంతో సమానం. షాపులో బట్ట అంతా వెళ్ళి పోయి, బీరువాలన్నీ ఖాళీ అయిపోయే పరిస్థితి ఎప్పుడూ వుండదు. పైగా, షాపు అంతా ఎప్పుడూ ఒకే రకంగా పూర్తిగా సరుకుతో నిండి వుంటుంది. అంటే, ఇది, షాపులో సరుకు స్తంభించి పోయిన దానితో సమానం. ఒక బట్టల షాపుని ఫోటో తీస్తే, ఆ ఫోటోలో వస్తువులు ఎలాగైతే కదలవో, అలాగే ఆ షాపులో వస్తువులన్నీ కదలని వాటితో సమానంగా వుండి పోతాయి. షాపు ఎప్పుడూ సరుకుతో నిండి, 'ఫోటోలో షాపులాగా' వుండి పోతుంది. షాపులో వుండే ఉత్పత్తి అంతా 'లేని దాని తోనే' సమానం. అంటే, అది ఉన్నా లేనట్టే. అది 'వాడకం' లోకి రాదు. దాని పని, బీరువాల్లో నిలబడడమే! దీనికి 'స్టాకు' అని పేరు పెడితే, షాపులో ఎప్పుడూ ఈ స్టాకు వుండవలిసిందే!

ఇది ఒక్క షాపు పరిస్థితి! ఒక ఊళ్ళో వుండే అన్ని బట్టల షాపుల్నీ కలిపితే, ఆ షాపుల్లో వుండే మొత్తం బట్ట అంతా ఎప్పుడూ అలా వుండి పోవలిసిందే.

ఒక చిన్నపాటి టౌన్‌లో కనీసం 20 బట్టల షాపులు వుంటాయి. చిన్నపాటి నగరంలో కనీసం

200 బట్టల షాపులు వుంటాయి. ఈ రకంగా ఒక దేశం మొత్తాన్ని తీసుకుంటే, మొత్తం బట్టల షాపు లన్నింటి లోనూ ఎప్పుడూ ఫోటోల్లో లాగా నిశ్చలంగా వుండి పోయే బట్టనంతటినీ కలిపితే, అది కొన్ని కోట్ల కోట్ల మీటర్లు వుంటుంది. అంటే, షాపుల్లో అలా పడి వుండడానికే కొన్ని కోట్ల మీటర్ల బట్ట కావాలన్న మాట! అది ఎప్పటికీ ఉపయోగం లోకి రాదు. అది అలా పడివుంటూ వుండగా, ఆ పైన వచ్చిన సరుకు మాత్రమే వాడకం అవుతూ వుంటుంది.

ఈ పరిస్తితి ఒక్క బట్ట విషయం లోనే కాదు. పెట్టుబడిదారీ విధానంలో ప్రతీ ఒక్క సరుకు పరిస్తితీ ఇదే. సూది దగ్గిర్నించీ, విమానం దాకా, ప్రతీ సరుకూ అమ్మకాల ముందు నిలబడే 'స్టాకు' రూపంలో పడి వుండవలిసిందే. వేల వేల బట్టల షాపుల నిండా బట్టలూ, వేల వేల చెప్పుల షాపుల నిండా చెప్పులూ, పాత్రల షాపుల నిండా పాత్రలూ, రేడియోల షాపుల నిండా రేడియోలూ, ఇదీ అదీ అని కాదు; ప్రతీ ఒక్క ఉత్పత్తీ ఎప్పుడూ షాపుల నిండా ఉపయోగం లోకి రాకుండా వుండవలిసిందే. ఇది, 'అమితోత్పత్తికి' గానీ, 'అమ్మకాలు లేని సందర్భాలకు' గానీ, సంబంధించిన పరిస్థితి కాదు. అమ్మకాలు చురుగ్గా వున్నాయా, మందగొడిగా వున్నాయా అనే దానితో సంబంధం లేకుండా, ఇది ఎప్పుడూ వుండే పరిస్తితే. 'అమ్మకం' అనే కారణం వల్ల తప్పనిసరి అయ్యే పరిస్తితి ఇది.

'అమ్మకాలు లేని' సమాజంలో అయితే ఇదంతా ఎలా వుండ వచ్చో కొంచెం ఊహిద్దామా? బట్ట విషయమే తీసుకుంటే, సమాజంలో వున్న మొత్తం జనాభాకి ప్రతీ యేటా కొన్ని రకాల బట్టలు కావాలి. కట్టుకునే బట్టలూ (ఇందులో, లోపల ధరించే రకాలూ, పైన ధరించే రకాలూ); పక్క బట్టలూ (ఇందులో పక్క దుప్పట్లూ, కప్పుకునే దుప్పట్లూ, పరుపు సంచులూ, తలగడ సంచులూ - వగైరాలు), తువ్వాళ్ళూ, జేబు రుమాళ్ళూ, స్వెట్టర్లూ, కిటికీల తెరలూ —ఇలా, ఒక ఇంటికి ప్రతీ యేటా 20 రకాల బట్టలు కావాలనుకుందాం. దుప్పట్లూ, తెరలూ, స్వెట్టర్లూ లాంటివి ప్రతీ యేటా చిరగవు. రోజూ కట్టుకునే బట్టలూ, తువ్వాళ్ళూ, రుమాళ్ళూ లాంటివే ప్రతీ యేటా చిరుగుతాయి.

ఈ రకాలన్నీ, సమాజంలో అనేక వేరు వేరు స్తలాలలో ఉత్పత్తి అవుతూ వుంటాయి. అవి జనాభా కందరికీ పంపకం అవ్వాలి.

ఒక ప్రాంతంలో (ఒక ఊళ్ళో), 5 వేల మంది జనాభా వున్నారనుకుందాం. ఆ జనాభాకి కావలసిన బట్టలు సంవత్సరంలో ఐదారు సార్లు ఆ ప్రాంతానికి వచ్చి పంపకం అవవచ్చు. ఒక సారి కట్టుకునే బట్టలూ, ఒక సారి తువ్వాళ్ళూ, ఒక సారి రుమాళ్ళూ, ఒక సారి దుప్పట్లూ, ఒక సారి స్వెట్టర్లూ — ఇలా. బట్టలు ఊళ్ళోకి వచ్చాక అవి అందరికీ అందడానికి మహా అయితే ఒకటి రెండు రోజులు పడుతుంది.

ఊళ్ళోకి తువ్వాళ్ళ వాన్ వచ్చిందనుకుందాం. ఒక్కొక్కరికీ సంవత్సరానికి 3 తువ్వాళ్ళు కావాలనుకుందాం. కిందటి సారి తీసుకున్న తువ్వాళ్ళు ఇంకా చిరగకుండా వున్న వాళ్ళు, ఈ సారి తమ వాటా తువ్వాళ్ళు తీసుకోరు. లేదా, 3 తీసుకోవటానికి బదులు ఒకటో రెండో తీసుకుంటారు. తీసుకునే వస్తువుల్ని తిరిగి అమ్ముకుని డబ్బు చేసుకునే పద్ధతి ఇక్కడ లేదని మొట్ట మొదట గుర్తుపెట్టుకోవాలి. కాబట్టి, అవసరం లేనన్ని వస్తువులు తీసుకుంటే వాటిని ఏమీ చేసుకోలేరు.

అమ్మకాలూ, కొనడాలూ లేని కాలాన్నే ఇక్కడ ఊహిస్తున్నాము. సమాజంలో ఇంకా అమ్మకాలు వున్నప్పుడు, ఇప్పుడు ఊహించే రకం 'పంపకాలు' సాధ్యం కావు. అప్పుడు ఎవరికి కావలసిన వస్తువుల్ని వాళ్ళు 'కొనుక్కోవడం' గానే వుంటుంది పరిస్తితి.

నూతన సమాజపు మొదటి దశల్లో అమ్మకాల పరిస్తితే వుంటుంది. మొదట్లోనే అమ్మకాలు లేని పరిస్తితి ఏర్పడదు. అయినప్పటికీ, అమ్మకాలు వున్న కాలాల్లో కూడా, పెట్టుబడిదారీ మార్కెట్ల లాగ నిత్యం 'స్టాకుతో నిండి వుండే' వేల వేల షాపుల్ని వుంచనక్కర లేదు. ఆ కాలంలో కూడా కూరగాయలూ, ఆహార పదార్థాలూ — వంటి నిత్యమూ కొని వాడే ఉత్పత్తుల విషయంలో తప్ప, బట్టలూ చెప్పులూ — వంటి, ఒక సారి కొని ఎక్కువ కాలం వరకూ వాడే ఉత్పత్తుల విషయంలో, స్టాకుతో కిక్కిరిసిన అనేక వందల వేల షాపులు నిత్యమూ పని

చేస్తూ వుండనక్కర లేదు. బట్టలూ, చెప్పులూ వంటి వాటి అమ్మకాల్ని ఒక ప్రాంతంలో ప్రతీ నెలా ఒక్క సారి నిర్వహిస్తే చాలదూ? (ఇప్పటి ప్రభుత్వ 'రేషన్ షాపుల్లో' సరుకుల్ని నెలకో సారి అమ్మినట్టు.) చాలా రకాల ఉత్పత్తుల అమ్మకాలు ఈ పద్ధతి గానే వుంటే, ఎప్పుడూ తెరిచి వుండే వేల వేల షాపులూ, షాపుల నిండా కదలని స్టాకులూ, వుండనక్కర లేదు. సరుకుల అమ్మకం అనేది, ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో లేకుండా వుంటే, అమ్మకాలలో ఎలాంటి మార్పులైనా ప్రారంభించవచ్చు.

సమాజంలో అమ్మకాలూ, డబ్బూ పూర్తిగా లేవని అనుకుంటే, తీసుకున్న వస్తువుల్ని తిరిగి అమ్మేసి డబ్బుగా మార్చుకునే అవకాశమే వుండదు కాబట్టి, ఏ వ్యక్తీ కూడా తన 'అవసరానికి మించిన' వస్తువుల్ని తీసుకుని వాడుకో లేరు. ఆ 'అవసరానికి కావలసింది' ఒక సంవత్సరంలో వున్నట్టు, ఇంకో సంవత్సరంలో వుండక పోవచ్చు. కొంచెం ఇటూ అటూగా (కొంత తేడాగా) వుండవచ్చు.

పెట్టుబడిదారీ సమాజంలో, ప్రభుత్వ అధికారులు, జనాలకు అందించవలసిన రేషన్లలో నించి పెద్ద పెద్ద భాగాల్ని మోసంగా ఎందుకు లాగెయ్యగలుగుతారంటే, ఆ ఉత్పత్తుల్ని వెంటనే ప్రైవేటు వర్తకులకు చవకగా అమ్మేసి వాటిని డబ్బుగా మార్చుకోగలరు కాబట్టి. ఇలాంటి సమాజంలో, ఒక ప్రభుత్వ అధికారి, పంచదార రేషన్‌లో నించి సంవత్సరానికి 100 బస్తాల పంచదారని సునా యాసంగా కొట్టెయ్య గలడు. ఒక ప్రభుత్వ ఇంజనీరు, ప్రభుత్వ కట్టడాల పనికి విడుదలైన సిమ్మెంటులో నించి సంవత్సరానికి వెయ్యి బస్తాల సిమ్మెంటుని జేబులో వేసుకోగలడు. పెట్టుబడిదారీ విధానంలో ఈ రకం మోసాలు ప్రతి నిత్యమూ కోట్ల కోట్ల రూపాయల స్థాయిలో జరిగి పోతూ వుంటాయి. ఈ సమాజ నిర్మాణంలో, ప్రతి ఉత్పత్తినీ అమ్మేసి డబ్బుగా మార్చడం సాధ్య మవుతుంది కాబట్టి, ఇక్కడ ఇలాంటి మోసాలు ఎన్నయినా సాధ్యమవుతాయి.

కానీ, ఒక 'సమిష్టి ప్లానూ', ప్రతీ ప్రాంతం లోనూ ప్రతీ ఒక్క విషయం లోనూ 'ప్రజా సంఘాల తణిఖీలూ' వుండే సమాజంలో, ఈ రకం మోసాలు సాధ్యం కావు. అమ్మకాలే లేని సమాజంలో, ఎవ్వరూ ఏ రకం ఉత్పత్తినీ మితి మీరి నంతగా, మోసంగా స్వాధీనం చేసుకోవడమూ, దాన్ని అమ్మడమూ, లేదా స్వంతానికి వాడడమూ, సాధ్యం కావు. ఆ కొత్త సమాజంలో, ఏ ఒక్క పంపకం అయినా, అధికారుల నిరంకుశ పెత్తనాల కింద సాగే రహస్య వ్యవహారంగా గాక, ఆ ప్రాంత జనాలకు స్పష్టంగా తెలిసే బహిరంగ విషయంగా వుంటుంది. పంపకం అయ్యే ఉత్పత్తి, ఒక ప్రాంతానికి, ఆ ప్రాంతంలో వున్న జనాభా సంఖ్యని బట్టే వస్తుంది. అందులో కొంత భాగం మిగిలి పోతే (తీసుకోవలసిన వాళ్ళు తీసుకోకపోతే), అది ఇంకో ప్రాంతానికి వెళ్ళిపోతుంది. పంపకం పని పూర్తి అయ్యాక, దానికి సంబంధించిన రిపోర్టు అంతా, జనాల ముందు ప్రకటించే పని జరుగుతుంది. ఈ వివరాలకు సంబంధించిన 'బుక్ కీపింగ్' అంతా ఖచ్చితంగా వుంటుంది.

అమ్మకాలు లేని సమాజంలో, ఒక సంవత్సరానికి కావలసిన బట్టల రకాలన్నీ ఏడెనిమిది సార్లు పంపకం అయ్యాక, ఇక ఆ సంవత్సరానికి బట్టల ప్రసక్తి వుండదు. ఈ రకం వస్తువుల సంగతంతా ఇంతే. బియ్యం అయితే, ప్రతీ నెలా గానీ, 2 నెలలకోసారి గానీ, సమిష్టి వంట శాలలకూ, ఇళ్ళకూ, పంపకం అవుతూ వుండవచ్చు. పళ్ళు అయితే, ఇళ్ళకూ, సమిష్టి వంట శాలలకూ, ఆస్పత్రులకూ, పంపకం అవుతాయి. మామిడి పళ్ళ కాలం అనుకుందాం. పండిన పంటని బట్టీ, జనాభా సంఖ్యని బట్టీ, వారానికి 2 సార్లో, 3 సార్లో పంపకం అవవచ్చు. చెప్పులు అయితే, సంవత్స రానికి 2, 3 సార్లు. సబ్బులు అయితే, నెలకో సారో, 2 నెలలకో సారో.

కొన్ని ఉత్పత్తులు, ఇంటింటికీ చేరతాయి. కొన్ని ఉత్పత్తులు, సమిష్టి సంస్థలకు చేరతాయి. స్కూళ్ళకూ, ఆస్పత్రులకూ, ఫ్యాక్టరీలకూ, వ్యవసాయ క్షేత్రాలకూ, దేనికి ఏది అవసరమో దానికి అది చేరుతుంది.

ఒక వస్తువు, ఒక చోట ఉత్పత్తి అవడమూ, అది ఎక్కడికి చేరాలో అక్కడికే తిన్నగా వెళ్ళి పోవడమూ జరిగితే, ఆ మధ్యలో అది, మార్కెట్ల లోకీ, షాపుల్లోకీ వెళ్ళే అవసరం వుండదు. ఉత్ప త్తుల్ని నిలవ చేసే స్థలాలూ, వాటిని పంపకం చేసే స్థలాలూ తప్ప, మార్కెట్లూ షాపులూ అక్కర లేదు. తయారైన ప్రతి

వస్తువూ 'అమ్మకాల' కోసం ఎదురు చూస్తూ, ఈ మూలా ఆ మూలా పడి వుండడమూ, అది ఒక వ్యాపారి నించి ఒక వ్యాపారి దగ్గిరికి అంచెలంచెలుగా కదులుతూ వుండడమూ; ఆ లోపల చాలా ఉత్పత్తులు చెడి పోవడమూ, విరిగి పోవడమూ, కుళ్ళి పోవడమూ వగైరా వ్యవహారాలేవీ జరగనక్కర లేదు.

సమాజంలో అమ్మకం పనులూ, షాపులూ, లేనట్టుగా ఊహిస్తే, అమ్మకాల స్తలాలుగా అవసరమయ్యే వేల వేల బిల్డింగులూ, ఇతర అమ్మకాల సాధనాలూ, వేరే పనుల కోసం ఉపయోగ పడవచ్చు. అమ్మకాల పనుల్లో వుండే మనుషులంతా, సహజమైన పనుల్లోకి రావచ్చు.

అమ్మకాలు లేని సమాజంలో — రోడ్లకి ఇరువైపులా డబ్బు గలగలల అంగళ్ళూ, జిత్తుల మారి బేరసారాలూ మాయమై, ఆ ప్రదేశాలన్నీ పచ్చని చల్లని చెట్లతో నిండి వుంటాయి. ఊరు మధ్య అల్లుకున్న మార్గాలన్నీ చెట్లతో నిండి ప్రతీ ఊరూ వనాల సముదాయంగా వుంటుంది. ఇదంతా అమ్మకాల్ని తీసి వెయ్యగలిగిన లోకపు దృశ్యం!

కానీ, ఈ నాడు వున్నదంతా పెట్టుబడిదారీ మార్కెట్ల దృశ్యాలే. ఈ సమాజంలో, మొత్తం ఉత్పత్తి, **3** దశల్లో వుంటుంది.

**(1) 'ఉత్పాదక పెట్టుబడి' దశలో :**

పెట్టుబడిదారుడు కొని నిలవ వుంచిన ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ, పని స్తలంలో వున్న శ్రమ పరికరాలూ వగైరాలు ఇవి.

**(2) 'సరుకు పెట్టుబడి' దశలో :**

పెట్టుబడిదారుడి దగ్గిర తయారై అమ్మకానికి సిద్ధంగా వున్న కొత్త సరుకు ఇది. ఇది పెట్టుబడిదారుడి దగ్గిర వున్నా, వర్తకుడి దగ్గిర వున్నా, ఆ రెండూ ఒకటే. ఎవరి దగ్గిర వున్నా, ఇది ఇంకా అమ్మకం కాని సరుకు రూపంలో వున్న పెట్టుబడే.

**(3) 'వ్యక్తిగత వాడకం నిధి' దశలో :**

పెట్టుబడిదారులూ, కార్మికులూ కూడా (అంటే, మొత్తం జనాభా అంతా) తమ స్వంత వాడకం కోసం కొని ఇళ్ళల్లో పెట్టుకున్న ఉత్పత్తి ఇది.

ఈ రకంగా, పెట్టుబడిదారీ సమాజంలో వుండే మొత్తం ఉత్పత్తి అంతా ఈ 3 దశల్లోనూ వుంటుంది.

అమ్మకాలు లేని నూతన సమాజంలో అయితే, ఉత్పత్తి, మొదటి దశ లోనూ, 3వ దశ లోనూ మాత్రమే వుంటే చాలు. ఇక్కడ 2వ దశ ('సరుకు పెట్టుబడి' దశ) వుండనక్కర లేదు. ఉత్పత్తి స్తలాలలో తయారైన కొత్త ఉత్పత్తి, 'ఉత్పత్తి సాధనాలు'గా ఉపయోగపడేది అయితే, అది ఉత్పత్తి స్తలాలకు వెళ్తుంది. పోషణ వస్తువులుగా ఉపయోగపడేది అయితే, అది ఇళ్ళకూ, సమిష్టి వంట శాలలకూ, ఆస్పత్రులకూ, స్కూళ్ళకూ, అలా ఆ రకం స్తలాలకు వెళ్తుంది. అంటే, తయారైన కొత్త ఉత్పత్తి, 'ఉత్పత్తి సాధనాల' దశలో నైనా వుండాలి; 'వాడకం నిధి'గా నైనా వుండాలి. ఆ రెంటికీ మధ్య అసహజమైన 'సరుకు పెట్టుబడి' దశ లేకపోతే, సమాజానికి కావలసిన ఉత్పత్తి, చాలా తక్కువ పరిమాణం లోనే వుంటుంది.

పెట్టుబడిదారీ విధానం కన్నా వెనకటి సమాజాలలో, స్వంత అవసరాల కోసం ఎక్కువ గానూ, 'అమ్మకానికి' తక్కువ గానూ ఉత్పత్తి జరిగేది. ఆ సమాజాలలో కూడా, 2వ దశలో వుండే ఉత్పత్తి, చాలా తక్కువగా వుంటుంది. భూస్వామ్య సమాజంలో, పొలాలలో (ఉత్పత్తి స్తలాలలో) ఉత్పత్తి అయ్యే పంట, తిన్నగా భూస్వాముల గాదెల లోకీ, కౌలు రైతుల ఇళ్ళల్లోకీ వస్తుంది. అంటే, 'ఉత్పత్తి దశ'ని దాటిన తర్వాత, 'వాడకం దశలోకే' వచ్చేస్తుంది. అక్కడ 'అమ్మకం దశ'లో వుండే ఉత్పత్తి అంటూ ప్రత్యేకంగా వుండదు. అమ్మ వలిసిన సరుకుని ఒక రోజు 'సంత'కు తీసుకు పోయి అమ్మడమే గానీ, దానిని ఎప్పుడూ షాపుల్లో పెట్టి వుంచే పరిస్తితి అక్కడ వుండదు. ఇంకా వెనకటి సమాజాలలో కూడా, ఉత్పత్తిలో కొంత భాగం ఎప్పుడూ షాపుల్లో వుండే పరిస్తితి వుండదు. ఉత్పత్తి, 'సరుకు పెట్టుబడి దశ'లో వుండడం, పెట్టుబడిదారీ విధానానికి మాత్రమే ప్రత్యేకమైన లక్షణం.

'ఉత్పత్తుల నిలవ' అనేది, ఏ సమాజానికైనా అవసరమే. ఆ నిలవ, ఏ సమాజానికైనా వుండి తీరాలి. కానీ ఆ నిలవ పద్ధతులు, ఆ సమాజ స్వభావాన్ని బట్టే, ఆ స్వభావానికి తగ్గ రూపంలోనే, వుంటాయి.

# 4. రవాణా ఖర్చులు

**భూ**మి మీద మనుషులంతా ఒకే ప్రాంతంలో వుండరు. ఉత్పత్తి అంతా ఒకే స్థలంలో జరగదు. మనుషులు, భూమి నిండా పరచుకుని వుంటారు. ఎక్కడ ఏ ఉత్పత్తి చెయ్యడానికి పరిస్థితి వీలుగా వుంటే, అక్కడ ఆ ఉత్పత్తి చేస్తూ వుంటారు. నీరు వున్న చోటే చేపలు పడతారు. గనులు వున్న చోటే బొగ్గు తవ్వుతారు. అనుకూలమైన భూములు వున్న చోటే వ్యవసాయం చేస్తారు. అడవులు వున్న చోటే కలపని సేకరిస్తారు. ఇలా, ఉత్పత్తి క్రమాలు, భూమి నిండా రక రకాల స్థలాలలో జరుగుతూ వుంటాయి.

ఒక ప్రాంతపు ఉత్పత్తులు ఇంకో ప్రాంతానికి అందాలి. ఒక ప్రాంతపు మనుషులు ఇంకో ప్రాంతానికి పోయి వస్తూ వుండాలి. ఈ పనులన్నీ 'రవాణా' ద్వారానే జరుగుతాయి.

రవాణా వల్ల వస్తువు పరిమాణం పెరగదు. వస్తువు శరీరంలో ఏ మార్పూ జరగదు. కానీ వస్తువులు ఒక చోట నించి ఇంకో చోటకి అందాలంటే, దానికి రవాణాయే జరగాలి. రవాణా అనేది, వస్తువులో ఏ మార్పూ చెయ్యకుండా వస్తువు కోసం అవసరమైన పని కాబట్టి, రవాణా కూడా చలామణీ క్రమంలో జరిగే ఉత్పత్తి క్రమమే. రవాణా జరిగే కాలమే, ఆ ఉత్పత్తి క్రమం జరిగే కాలం.

రవాణా లేకపోతే జీవితమే సాగదు. కాబట్టి, రవాణా అనేది సహజ అవసరం. రవాణా కార్మికులు ఉత్పాదక కార్మికులే. రవాణా ఖర్చు ఉత్పత్తి విలువకి చేరుతుంది. ఆ విలువని పెంచుతుంది.

ఉత్పత్తి స్థలంలో 100 మీ. బట్ట తయారై వుంది. దాని విలువ 120. అది 80c + 20v + 20sగా వుంది. ఆ బట్టని అక్కడి నించి ఇంకో చోటుకి పంపడానికి రవాణా విలువ 8 అనుకుందాం. అది 4c + 2v + 2s అనుకుందాం. అంటే, ఆ రవాణా క్రమంలో, పెట్టుబడి 6. అదనపు విలువ 2. ఈ అదనపు విలువ, రవాణా శ్రమలు చేసిన కార్మికులది.

బట్ట పెట్టుబడిదారుడి దగ్గర స్వంత రవాణా ఏర్పాట్లు వున్నా, లేకపోయినా, 'రవాణా అంశాలు' ఒక్కలాగే వుంటాయి. అంటే, రవాణా కోసం అయ్యే ఖర్చు గానీ, దాని అంతర్గత భాగాలు గానీ, ఒకే రకంగా వుంటాయి.

**'బట్ట' వాడికే, స్వంత రవాణా ఏర్పాట్లు వుంటే :** అప్పుడు, బట్ట పెట్టుబడిదారుడు, రవాణా పెట్టుబడిదారుడు కూడా అవుతాడు. అప్పుడు, బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర, రవాణా కార్మికులు కూడా వుంటారు. బట్ట వాడు, రవాణా పెట్టుబడి కూడా తనే పెట్టి, రవాణా ద్వారా వచ్చే అదనపు విలువని తనే తీసుకుంటాడు.

| | |
|---|---|
| బట్ట విలువ,<br>కొత్తగా తయారైన<br>వెంటనే, | 80c + 20v + 20s = 120 |
| రవాణా విలువ, | 4c + 2v + 2s = 8 |
| రవాణా తర్వాత, | 84c + 22v + 22s = 128 |

బట్ట వాడికి, రవాణా పెట్టుబడి కూడా పెట్టినందువల్ల, ఆ వేరు వేరు పెట్టుబడుల ద్వారా మొత్తం 22s వస్తుంది.

**'బట్ట' వాడికి, స్వంత రవాణా ఏర్పాట్లు లేకపోతే :** అప్పుడు, బట్ట పెట్టుబడిదారుడు వేరూ, రవాణా పెట్టుబడిదారుడు వేరూ అవుతారు. రవాణా పెట్టుబడిని ఇంకో పెట్టుబడిదారుడు పెడతాడు. అప్పుడు రవాణా కార్యక్రమం, ఆ రెండో పెట్టుబడిదారుడి కార్మికుల ద్వారా జరుగుతుంది. బట్ట వాడు, తన బట్టని, రవాణా పెట్టుబడిదారుడి ద్వారా రవాణాలో పంపిస్తాడు. అంటే, రవాణా పెట్టుబడి దారుడి నించి 'రవాణా సౌకర్యం' అనే సరుకుని కొంటాడని అర్థం. దాని కోసం, 8 విలువని (8 డబ్బుని), రవాణా పెట్టుబడిదారుడికి చెల్లిస్తాడు. రవాణా పెట్టుబడిదారుడికి, ఆ 8 లో నించి, 6 పెట్టుబడి వెనక్కి వచ్చి, 2s మిగులుతుంది. అప్పుడు కూడా బట్ట విలువ, 120 + 8 = 128 గానే వుంటుంది. అంటే, రవాణా కార్యక్రమం, ఎవరి ద్వారా జరిగినా, దాని విలువ అంశాలు మారవు.

బట్ట పెట్టుబడిదారుడు, బట్టని తయారు చేసే మొదటి ఉత్పత్తి క్రమంలో మాత్రమే పెట్టుబడి పెడితే, వాడికి వచ్చే అదనపు విలువ, ఆ ఒక్క ఉత్పత్తి క్రమంలో నించి మాత్రమే వస్తుంది. అంటే,

బట్టకి మొట్ట మొదట వున్న 120లో నించే.

బట్ట పెట్టుబడిదారుడు, 120 విలువతో తయారైన తన బట్టని, ఇంకో పెట్టుబడిదారుడి ద్వారా రవాణాలో, గతంలో కన్నా ఇంకా ఎక్కువ దూరం పంపుతాడనుకుందాం. అప్పుడు రవాణా కోసం 40 అవుతుందనుకుందాం. ఆ రవాణా కాలం పూర్తి అయిన తర్వాత బట్ట విలువ 120 + 40 = 160 అవుతుంది. అక్కడ ఆ బట్టని 160కి అమ్మితే, అందులో రవాణా మీద పెట్టిన 40లో నించి, బట్ట పెట్టుబడిదారుడికి వచ్చేదేమీ వుండదు. వాడికి స్వంత రవాణా లేదు కాబట్టి, ఆ ఖర్చులో నించి వాడికి అదనపు విలువ రాదు. వాడికి వచ్చే అదనపు విలువ, వాడి ఉత్పత్తి క్రమంలో ఏర్పడిన 120లోనే వుంటుంది. అంటే, ఆ బట్టని, ఇంకో పెట్టుబడిదారుడి ద్వారా, తక్కువ దూరం రవాణా తర్వాత 128కి అమ్మినా, చాలా దూరం రవాణా తర్వాత 160కి అమ్మినా, బట్ట వాడి కి వచ్చే అదనపు విలువ ఒక్క లాగే వుంటుంది. అది 20S మాత్రమే.

ప్రతీ పెట్టుబడిదారుడూ, 'పరిశ్రమ'ని ప్రారంభించినప్పుడే గానీ, తర్వాత గానీ, తప్పకుండా కొన్ని 'రవాణా సాధనాల్ని' కూడా ఏర్పాటు చేసుకుంటాడు. వాడికి ప్రతీ నిత్యం ముడి పదార్థాలూ అవీ ఇతర స్థలాల నించి వస్తూ వుండాలి. తన దగ్గిర తయారైన కొత్త సరుకు ఇతర ప్రాంతాలకు పోతూ వుండాలి. ఈ పనులన్నిటికీ ఎప్పుడూ రవాణా అవసరం. తనకే స్వంత రవాణా ఏర్పాట్లు వుంటే, దాని ద్వారా కూడా లాభం సంపాదించవచ్చునని పెట్టుబడిదారుడికి తెలుసు.

బట్ట పెట్టుబడిదారుడు, తన సరుకు రవాణా కోసం, తన దగ్గిరే కొన్ని లారీలు పెట్టుకున్నాడను కుందాం. ఆ లారీల్ని నడపడానికి డ్రైవర్లూ, మెకానిక్కులూ, క్లీనర్లూ, ఆ లారీల కోసం షెడ్డూ — అవన్నీ వుండాలి. ఆ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి. ఆ స్థిరా, అస్థిరా ఖర్చులతో, ఆ సరుకు రవాణా అవుతూ, దాని ద్వారా 'రవాణా - అదనపు విలువ' వస్తూ వుంటుంది. అంటే, ఇక్కడ బట్ట పెట్టుబడిదారుడు, పెట్టుబడి పెట్టింది, బట్టని 'ఉత్పత్తి చేసే' క్రమం లోనే గాక, బట్టని 'రవాణా చేసే' క్రమంలో కూడా కాబట్టి, (వేరు వేరు ఉత్పత్తి క్రమాలలో పెట్టుబడులు పెట్టాడు కాబట్టి,) ఆ 2 రకాల పెట్టుబడుల నించీ వేరు వేరు అదనపు విలువలు వస్తాయి.

ఇప్పుడు, రవాణా కార్మికుల విషయం చూద్దాం. రవాణా పరిశ్రమలో పని చేసే డ్రైవర్లూ, మెకానిక్కులూ, క్లీనర్లూ, ఇంజనీర్లూ వంటి వారంతా ఉత్పాదక కార్మికులే. సరుకుల్ని వాహనాల మీదకి ఎక్కించే, దించే కార్మికులంతా కూడా ఉత్పాదక కార్మికులే. కానీ, ప్రయాణాలు చేసే వారికి టిక్కెట్లు అమ్మే క్లర్కులూ, కండక్టర్లూ, టిక్కట్లు చెకింగు చేసే ఇతర ఉద్యోగులూ — అనుత్పాదక కార్మికులు. ఈ కార్మికుల శ్రమలు, రవాణాకి, 'సహజంగా అవసరం గల' శ్రమలు కావు.

ప్రతీ 'ఉత్పత్తి స్థలం' లోనూ, ముడి పదార్థాల్నీ, సగం తయారైన వస్తువుల్నీ, పూర్తిగా తయారైన వస్తువుల్నీ, ఆ స్థలం లోనే ఒక సెక్షన్ నించి ఇంకో సెక్షన్‌కి మార్చే పనులు కొన్ని వుంటాయి. ఇవి, ఉత్పత్తి స్థలం లోనే వుండే రవాణా శ్రమలు. ఇవి, 'ఉత్పత్తి క్రమం'తో కలిసి పోయి వుంటాయి.

పెట్టుబడిదారుల మధ్య ప్రతీ శాఖ లోనూ పోటీ వున్నట్టే, రవాణా శాఖలో కూడా పోటీ వుంటుంది. ప్రతీ రవాణా పెట్టుబడిదారుడూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ బరువుల్ని రవాణా చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఒక లారీ మీద 5 టన్నుల బరువుని మాత్రమే పంపడం మంచిదైతే, రవాణా పెట్టుబడిదారుడు ఆ నిబంధనని పట్టించు కోకుండా, ఎక్కువ టన్నుల బరువుని కూడా పంపి స్తాడు. దాని వల్ల ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే, అవన్నీ డ్రైవర్లకీ, ఇతర కార్మికులకీ!

రవాణా అవవలసిన వస్తువులు — గాజు సామాను లాగా, కోడి గుడ్ల లాగా, చాలా సున్నితమైనవీ, త్వరగా పాడై పోయేవీ, ఒత్తిడిలో పెడితే పగిలేవీ అయితే, అటువంటి వాటి రవాణాకి ఎక్కువ స్థలమూ, ఎక్కువ జాగ్రత్తలూ అవసర మవుతాయి. అంటే, వాటి కోసం ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. కాబట్టి, అలాంటి సరుకుల రవాణా ఛార్జీలు ఎక్కువగా వుంటాయి.

'రవాణా క్రమం' అనేది ఉత్పాదక క్రమమే కాబట్టి, ఏ అవసరం కోసం రవాణా పని జరిగినా అది ఉత్పాదక క్రమమే - అనీ, ఆ ఖర్చు సహజ మైన ఖర్చే - అనీ, అర్థం కాదు. అమ్మే, కొనే పనులు చేసే ఒక వర్తక వుద్యోగి, సరుకుకి ఆర్డర్లు సంపాదించే పని మీద ఒక ప్రయాణం చేశాడను కుందాం. ఆ

ప్రయాణం ఖర్చు అంతా, పూర్తిగా 'అనుత్పాదకమైన' ఖర్చే. అమ్మకం అనేది లేకపోతే, అలాంటి ప్రయాణాలే అక్కర లేదు. మెడికల్ రిప్రెజెంటివ్‌ల లాంటి సేల్స్ మనుషుల ప్రయాణాల ఖర్చులూ, వారి జీతాలూ – అనుత్పాదకమైన ఖర్చులే. పోలీసులూ, సైనికులూ, వారి ఆయుధాలూ, రవాణా అయ్యే ఖర్చులన్నీ అనుత్పాదకమైన ఖర్చులే. రాజులూ, మంత్రులూ, గవర్నర్లూ – వంటి అధికారుల ప్రయాణాలూ, వారి చుట్టూ రక్షక భట వర్గాల కాపలాలూ ప్రయాణాలూ అన్నీ, అనుత్పాదకమైన ఖర్చులే. ఈ రకంగా, ఈ అనుత్పాదకమైన ఖర్చులన్నీ 'సామాజిక అదనపు విలువ'లో భాగాలే. అనుత్పాదకమైన ప్రతీ ఖర్చునీ, 'అదనపు విలువ'కి సంబంధించిన భాగం గానే అర్థం చేసుకోవాలి.

పెట్టుబడిదారీ విధానం, 'సరుకు ఉత్పత్తి విధానం' కాబట్టి, ఈ విధానంలో, ఉత్పత్తుల రాసుల్లో ఎక్కువ భాగం, 'సరుకులు'గా, అనేక ప్రాంతాలకు రవాణా అవవలసి వుంటుంది. ఈ పరిస్తితి వల్ల, పెట్టుబడిదారీ విధానంలో, రవాణా పరిశ్రమ చాలా అభివృద్ధి చెందుతుంది. రవాణా సాధనాలూ, రవాణా పద్ధతులూ, అభివృద్ధి చెందుతాయి. అన్ని శాఖల లాగానే రవాణా పరిశ్రమ కూడా, ఒక వేపు పెట్టుబడుల్నీ, ఇంకో వేపు కార్మికుల్నీ పెంచుతూ వుంటుంది.

# 5. అడ్వర్టయిజ్‌మెంట్ ఖర్చులు

**అ**డ్వర్టయిజ్‌మెంట్ అంటే – వ్యాపార ప్రకటన. పెట్టుబడిదారుడి దగ్గిర సరుకు తయారై వుంది. దాన్ని అమ్మాలి. దాన్ని గురించి అందరికీ తెలిసేలాగ పెట్టుబడిదారుడు ప్రకటనలు చేస్తాడు. ఇవి, రక రకాల పద్ధతుల్లో వుంటాయి. సరుకు గురించి పేపర్లలో రాస్తూ వుంటారు. రోడ్ల వార పెద్ద పెద్ద బోర్డుల మీద రాస్తూ వుంటారు. రేడియోలలో వినిపిస్తూ వుంటారు. సినిమాల్లోనూ, టీ.వీ.ల్లోనూ చూపిస్తూ వుంటారు. ఇళ్ళ చుట్టూ, ఉత్పత్తి స్తలాల చుట్టూ, మనుషులు తిరిగి ప్రచారం చేస్తూ వుంటారు. ఇలా, ప్రకటనలు చెయ్యడం అనేది, అనేక పద్ధతుల్లో వుంటుంది.

అన్ని పనులకు లాగానే ఈ ప్రకటనల పనులకు కూడా కొన్ని రకాల శ్రమ సాధనాలూ, కొన్ని రకాల సజీవ శ్రమలూ ఖర్చవుతాయి. ప్రకటన జరిగే పద్ధతిని బట్టి, ఆ సాధనాలూ, ఆ శ్రమలూ మారతాయి.

బట్ట పెట్టుబడిదారుడు, తన సరుకు గురించి ఒక ప్రకటన ఇవ్వాలంటే, మొదట ఆ ప్రకటనని తయారు చేయించాలి. ఆ పని ఇంకో పెట్టుబడిదారుడు చేయిస్తాడు. వాడి దగ్గిర, 'ప్రకటనలు తయారుచేసే' కార్మికులు వుంటారు. బట్ట వాడు, ఆ ప్రకటనని, కొంటాడు. తర్వాత దాన్ని తెచ్చి పత్రికల్లోనూ, రేడియో లోనూ, ఇంకా కొన్ని చోట్లా ప్రచారం కోసం ఇచ్చి, దాని కోసం చార్జీలు చెల్లిస్తాడు. అదంతా కలిసి 'ప్రకటనల ఖర్చు' అవుతుంది.

'బట్ట' సంగతి తీసుకుంటే, దాని ప్రకటనల ఖర్చు, ఆ బట్టని తయారు చెయ్యడానికి కాదు. దాన్ని స్టోరులో వుంచి సంరక్షించడానికీ కాదు. దాన్ని ఒక చోటు నించి ఇంకో చోటుకి పంపడానికీ కాదు. ఆ రకంగా, ఆ ఖర్చు, బట్ట శరీరానికి సంబంధించిన ఏ అవసరానికీ కాదు. ఆ ఖర్చు, కేవలం ఆ ఉత్పత్తిని 'అమ్మడానికి' సంబంధించిన ఖర్చు. ఉత్పత్తిని అమ్మడానికి అయ్యే చాలా ఖర్చుల్లో ఇది కూడా ఒక భాగం. అంటే, ప్రకటనల ఖర్చు, అసహజమైన ఖర్చు. అనుత్పాదకమైన ఖర్చు. కాబట్టి ఈ ఖర్చు, సరుకు విలువకు చేరదు. విలువని పెంచదు.

ఒక బట్టల ప్రకటన, ఒక పేపర్లో వచ్చిందనుకుందాం. ఆ ప్రకటన కోసం పేపరులో కొంత కాయితమూ, కొంత ఇంకూ, అచ్చు మిషనులో కొంత అరుగుదలా వగైరా ఉత్పత్తి సాధనాలన్నీ ఖర్చవుతాయి. ఆ ప్రకటనని అచ్చువేసే పనిలో, పేపరు కార్మికుల శ్రమ కొంత ఖర్చవుతుంది. ఆ రకంగా, ఆ ప్రకటన కోసం, మొత్తం కొంత శ్రమ, ఖర్చవుతుంది. ప్రకటన విలువని, బట్ట పెట్టుబడి దారుడు, పేపరు పెట్టుబడిదారుడికి, చెల్లించేస్తాడు. అంటే, బట్టవాడు, పత్రిక వాడి నించి 'ప్రకటన సౌకర్యం' అనే సరుకుని కొని, దాని ఛార్జీల్ని చెల్లిస్తాడు. అయితే బట్టవాడు, ఆ ప్రకటన ఖర్చుని, ఎక్కణ్ణించి తెచ్చి చెల్లిస్తాడు? బట్టని అమ్మగా వచ్చే విలువలో నించే. అయితే, బట్ట విలువలో ఈ ప్రకటన ఖర్చు కూడా

వుంటుందా? — ఉండదు. బట్ట విలువలో 'అదనపు విలువ' భాగం ఒకటి వుంటుంది కాబట్టి, అందులో నించే కొంత తీసి, బట్ట వాడు, ప్రకటనల కోసం ఖర్చు చేస్తాడు. అంటే, ఒక ప్రకటన, ఏ సరుకుకి సంబంధించి వుంటుందో ఆ ఖర్చు అంతా, ఆ సరుకు తాలూకు అదనపు విలువలోదే అన్నమాట!

ఇప్పుడు, ప్రకటనల్ని ప్రింటు చేసే పేపరు పెట్టుబడిదారుణ్ణి చూద్దాం. వాడు, పేపరులో కొంత కొంత స్థలాల్ని అనేక ప్రకటనల కోసం అమ్ముతాడు. ఏ ప్రకటన విలువని, ఆ ప్రకటన ఇచ్చిన వాళ్ళ నించి వసూలు చేస్తాడు. పేపరు తయారైన తర్వాత, దాన్ని పాఠకులకు అమ్మి వారి నించి కూడా కొంత విలువని తీసుకుంటాడు. అంటే పేపరు పెట్టుబడి దారుడికి, పేపరు ద్వారా వచ్చే విలువ, 2 మార్గాల్లో వుంటుంది. (1) పేపరుని కొన్న పాఠకుల నించి కొంత విలువా, (2) ప్రకటనలు ఇచ్చిన వాళ్ళ నించి కొంత విలువా. — ఈ 2 రకాల్నీ కలిపెయ్యాలి. ఈ 2 రకాలూ కలిసిందే పేపరు ద్వారా వచ్చే మొత్తం. అదే పేపరు విలువ. ఈ మొత్తం రావడానికి కారణం, 'పేపరు' అనే 'సరుకు'. పేపరు ద్వారా వచ్చిన ఈ మొత్తంలో నించి, పేపరు కోసం ఖర్చయిన స్థిర, అస్థిరల్ని తీసివెయ్యాలి. మిగిలినది పేపరు కార్మికుల అదనపు విలువ!

ఈ విషయాలు, ఇంకా వివరంగా అర్థం చేసుకోవాలి. బట్ట పెట్టుబడిదారుడు, ఒక పేపరుకి, తన సరుకు ప్రకటన ఇచ్చాడనుకుందాం. ఆ ప్రకటన విలువ 10. ఆ 10 ని, బట్ట వాడు, బట్ట తాలూకు అదనపు విలువలో నించి తెచ్చి పేపరు వాడికి చెల్లిస్తాడు.

ఏ 'విలువ' అయినా, 'స్థిరా-అస్థిరా-అదనపు విలువా' అనే 3 భాగాలుగా వుంటుంది కదా? ఈ 10 విలువ, 4c + 3v + 3s లుగా వుందనుకుందాం. అంటే, ఆ ప్రకటనని పేపరులో అచ్చు వెయ్యడానికి, పేపరు పెట్టుబడిదారుడికి 4 స్థిరా + 3 అస్థిరా = 7 పెట్టుబడి, ఖర్చవుతుంది. ఇంకా అదనంగా వున్న 3 s ఎవరిది? - పేపరులో, ఆ ప్రకటన రావడానికి ఏ యే శ్రమలు అవసర మవుతాయో ఆ శ్రమలన్నీ చేసిన కార్మికులది. పేపరు కార్మికులు, మొత్తం పేపరుని తయారు చెయ్యడంలో ఇంకా అనేక శ్రమలు చేస్తారు. కానీ, ఇక్కడ ఒక్క ప్రకటన విషయం మాత్రమే చూస్తున్నాము. ఆ ప్రకటన, పేపర్లో రావడం కోసం కార్మికులు చేసిన శ్రమలో భాగమే 3 s. ఇది ఫలానా ఒక ప్రకటనకు మాత్రమే సంబంధించిన విషయం. ఈ 3 s అనేది, పేపరులో అన్ని పేజీలకూ సంబంధించింది - అని కాదు. పేపరు పెట్టుబడిదారుడికి, పేపరు వల్ల వచ్చిన మొత్తం అదనపు విలువ 3 s మాత్రమే కాదు. ఈ ఉదాహరణలో వున్న ఒక్క ప్రకటన విషయం తీసుకుంటే, దాన్ని పేపరులో ఇవ్వడానికి పెట్టుబడి ఖర్చు 7 + కార్మికుల అదనపు విలువ 3 కాబట్టి, ఆ ప్రకటన విలువ 10 అయింది.

ఆ 10 విలువని పేపరు వాడు, బట్ట వాడి నించి వసూలు చేస్తాడు. ఆ 10 లో నించి 7 పెట్టు బడిని వెనక్కి తీసుకోగా, ఇంకా మిగిలిన 3, పేపరు వాడికే.

ఒక పేపరులో 10 ప్రకటనలు వుంటే, అన్నిటికీ ఇదే జరుగుతుంది. ఆ ప్రకటనలన్నీ పేపర్లో రావడానికి కార్మికులు రక రకాల శ్రమలు చేస్తారు. ఆ ప్రకటనలు ఇచ్చిన వాళ్ళు, వాటి చార్జీల్ని, పేపరు వాడికి చెల్లిస్తారు. ప్రతీ ఒక్క ప్రకటన నించీ పేపరు వాడికి ఒక అదనపు విలువ వస్తుంది. 10 ప్రకటనల నించీ 10 అదనపు విలువలు.

పేపరుని, 'ప్రకటనల' భాగమూ, 'వార్తల' భాగమూ — అనే 2 భాగాలుగా విభజించాలి.

'ప్రకటనల' భాగం ద్వారా వచ్చే అదనపు విలువ, పేపరు కార్మికులదే — అని చూశాం.

'వార్తల' భాగాన్ని వేరుగా చూద్దాం. 10 పేజీల పేపరులో - వార్తలు 6 పేజీలూ, ప్రకటనలు 4 పేజీలూ — అనుకుందాం. ప్రతీ పేజీ విలువా 10 పైసలు అనుకుందాం. మొత్తం పేపరు విలువ 100 పైసలు. 1 రూపాయి. ప్రకటనలు వున్న 4 పేజీల విలువని ప్రకటనదారులు చెల్లిస్తారు. వార్తలు వున్న 6 పేజీల విలువని పేపరుని కొనే పాఠకులు చెల్లించాలి. (ఆ పాఠకుల్లో, పెట్టుబడిదారులూ, కార్మికులూ కూడా వుంటారు.)

పాఠకులు చెల్లించే విలువా, ప్రకటనదారులు చెల్లించే విలువా కలిసే, పేపరుకి మొత్తం విలువ అవుతుంది. అది 1 రూపాయి. పేపరు విలువ 1 రూపాయి అయినా, ఆ పేపరు కోసం పాఠకులు చెల్లించవలిసింది 60 పైసలే. కాబట్టి, పేపరు మీద, దాని విలువగా, 60 పైసలే వేసి వుంటుంది. ప్రక

టనదారులు చెల్లించే 40 పైసల విలువ, పేపరు మీద వుండదు.

పేపరుకి వుండే మొత్తం విలువ అంతా పేపరు మీద వుంటే, పాఠకులు ఆ విలువనంతా చెల్లించ వలసి వస్తుంది. కాబట్టి, అలా వుండదు. పాఠకులు ఎంత చెల్లించాలో అదే పేపరు మీద వుంటుంది. కానీ నిజానికి, పేపరుకి నిజంగా వుండే విలువ అదే కాదు. మన ఉదాహరణలో వున్న పేపరు మీద 60 పైసలే వుంటుంది. ఆ పేపరుని కొనే పాఠకులు, 60 పైసలే చెల్లించి కొంటారు. ఆ 60 పైసలు కూడా C + V + S లుగా వుంటుంది.

అంటే, ప్రకటనదారులు చెల్లించే 40 పైసల్లో వుండే S భాగమూ, పాఠకులు చెల్లించే 60 పైసల్లో వుండే S భాగమూ కూడా - పేపరు కార్మికులదే. అది అంతా పేపరు పెట్టుబడిదారుడికి అందు తుంది.

### పాఠకుల వేపు నించి చూస్తే :

రూపాయి విలువ గల 10 పేజీల పేపరుని, పాఠకులు 60 పైసల తోనే కొంటారు కదా? పాఠ కులు, 6 పేజీల విలువని మాత్రమే చెల్లించి, 10 పేజీల్ని ఎలా తీసుకోగలుగుతారు? — ఎలా గంటే, ప్రకటనలు వున్న 4 పేజీల విలువనీ ప్రకటన దారులే చెల్లించి, వాళ్ళు ఆ పేజీల్ని పాఠకులకు 'ఉచి తంగా' అందే లాగ చేస్తారు కాబట్టి. వాళ్ళు అలా ఎందుకు చేస్తారంటే, తమ సరుకుల ప్రకటనల్ని పాఠకులకు చూపిస్తే, వారు ఆ సరుకుల్ని కొంటారనే దృష్టితో. కాబట్టి, పాఠకులకు 6 పేజీల విలువతోనే 10 పేజీల పేపరు దొరుకుతుంది. అంటే, పాఠ కులు, ప్రకట నలు వున్న ఒక పత్రికని కొనేటప్పుడు చెల్లించే డబ్బు, దాని పూర్తి విలువ కాదని అర్థం.

10 పేజీల పేపరు ఉదాహరణలో, పాఠకులు 6 పేజీలకూ, ప్రకటనదారులు 4 పేజీలకూ చెల్లిం చడం అనే దాన్ని, రోజూ జరిగే విషయంగానే అను కుందాం. ఆ పేపరు - పెట్టుబడిదారుడు, ఒక్కోసారి ఆ 10 పేజీల పేపరులోనే పేజీల్ని పెంచకుండా, 4 పేజీల కన్నా ఎక్కువ ప్రకటనలు వెయ్యవచ్చు. ఒక రోజు పేపరులో 6 పేజీల ప్రకటనలు వేశాడను కుందాం. 6 పేజీల్ని ప్రకటనల కోసం ఇచ్చాడు కాబట్టి, ప్రకటనదారుల నించి 6 పేజీలకు రావలసిన డబ్బు తీసుకుంటాడు. అంటే ఆ రోజు, పాఠకులకు, వారి డబ్బుకి తగ్గ 6 పేజీల వార్తలు వుండవు. ఆ రకంగా, పేపరులో ఎక్కువ ప్రకటనలు వున్నప్పుడల్లా పాఠకులు నష్టపోతారు.

అయితే, ఆ ఎక్కువ ప్రకటనల్లో, ఒక 'నిరు ద్యోగి'కి ఒక ఉద్యోగ ప్రకటన దొరికిందను కుందాం. లేదా, ఒక 'రోగి'కి ఒక మందుల ప్రకటన దొరికిం దనుకుందాం. ఆ రోజు, వార్తలు తగ్గిపోయి ఎక్కువ ప్రకటనలు రావటం వల్లనే కొందరు వ్యక్తులకు ప్రత్యేక ప్రయోజనం జరిగిందను కుందాం. ఒక ప్రకటన, ఒక పాఠకుడికి ఉపయోగ పడిందా లేదా అన్నది, 'ఉపయోగపు విలువ' కోణం. ఇక్కడ చూస్తు న్నది ఆ కోణం కాదు. ఇక్కడ, 'విలువ'కి సంబంధిం చిన విషయాలు చూస్తు న్నాము. రోజూ 4 పేజీల ప్రకటనలు రావడం మాత్రమే సాధారణ పరిస్థితి అనుకుంటే, అంత కన్నా ఎక్కువ ప్రకటనలు వచ్చిన రోజున వార్తలు తగ్గిపోయి తీరతాయి. కాబట్టి, పాఠ కులు ఆ రోజు తాము ఇచ్చిన విలువకి తగ్గ వార్తలు తీసుకోలేదని అర్థం. ఏ విషయంలో నైనా, 'విలువ' కోణాన్నీ, 'ఉపయోగపు విలువ' కోణాన్నీ వేరు వేరు గానే చూడాలి. రెంటినీ కలిపేసి, గందరగోళ పరచ కూడదు.

బట్ట పెట్టుబడిదారుడు, తన సరుకు గురించి, ఒక రోజున, 5 పేపర్లలో 5 ప్రకటనలూ, రేడియోలో 1 ప్రకటనా, అనేక పట్టణాలలో 100 సినిమా హాళ్ళల్లో 100 ప్రకటనలూ, ఇతర పద్ధతుల్లో కూడా కొన్ని ప్రకటనలూ, ఇస్తాడనుకుందాం. మొత్తం ఈ ప్రకటనలన్నీ 1 రోజుకి సంబంధించినవి. ఇవి గాక, కొన్ని వార పత్రికల్లో కూడా ప్రతి వారమూ కొన్ని ప్రకటనలూ, కొన్ని మాస పత్రికల్లో కూడా ప్రతి నెలా కొన్ని ప్రకటనలూ, ఇస్తాడనుకుందాం. ఒక నెలకి సంబంధించిన మొత్తం లెక్కలు తీసుకుంటే, ఆ నెలలో మొత్తం ప్రకటనలన్నిటి మీదా కలిసి ఎంత ఖర్చు అయిందో ఆ ఖర్చు అంతా, ఆ నెలలో ఉత్పత్తి అయిన బట్ట తాలూకు 'అదనపు విలువ' లోదే.

**ఇప్పుడు, 'ప్రకటనలు తయారు చేయించే' పెట్టుబడిదారుణ్ణి చూద్దాం :** పేపరు లోనో, సినిమా లోనో, రేడియో లోనో, టీవీ లోనో, ప్రకటనలు ఇవ్వా లంటే, ముందు వాటిని తయారు చెయ్యాలి. తర్వాత, వాటిని అచ్చు వెయ్యడమో, వినిపించ డమో, చూపించడమో, చెయ్యాలి. ప్రకటనల పెట్టు బడిదారుడి పని, ప్రకటనలు తయారు చేయించి

ఇవ్వడం. బట్టల వాడికైనా, సబ్బుల వాడికైనా, మందుల వాడికైనా, వీడు ప్రకటనలు తయారు చేయించి ఇస్తాడు. అంటే, వీడు, 'ప్రకటనలు అనే సరుకుని' అమ్ముతాడన్న మాట. వీడి దగ్గిర, ఈ 'సరుకు'ని ఉత్పత్తి చేసే 'ఉత్పత్తి క్రమం' జరుగుతుంది. ఏ ఉత్పత్తుల గురించైతే ప్రకటనలు తయారు చెయ్యాలో ఆ ఉత్పత్తుల ఫోటోలు తీసే వాళ్ళూ, ఆ ప్రకటనలు రాసే వాళ్ళూ, డ్రాయింగులు గీసే వాళ్ళూ, సెట్టింగులు వేసే వాళ్ళూ, మోడల్స్‌గా నిలబడే వాళ్ళూ, ఇంకా ఆ రకం పనులకు కావలసిన ఉద్యోగులంతా, అక్కడ వుంటారు.

బట్ట పెట్టుబడిదారుడు, ఈ ప్రకటనల పెట్టుబడిదారుడి దగ్గిరికి వచ్చి, తన సరుకు వివరాలు ఇచ్చి, తన కోసం ప్రకటనలు తయారు చెయ్యమంటాడు. ప్రకటనల వాడు, బట్ట వాడి కోసం తన కార్మికుల ద్వారా ఆ ప్రకటనలు తయారు చేయించి, బట్ట వాడితో వున్న ఒప్పందం ప్రకారం, వాటిని పేపర్లకీ, సినిమా థియేటర్లకీ, రేడియోకీ, టీవీకీ, అన్నిటికీ, ఇస్తాడు. బట్ట వాడు, ఆ ప్రకటనలు ఇచ్చిన వాళ్ళకి ఛార్జీలు చెల్లిస్తాడు. లేదా, మొత్తం ఛార్జీలన్నీ ప్రకటనల వాడికే చెల్లిస్తే, వాడు ఎవరెవరికి ఇవ్వాలో వాళ్ళకి ఇచ్చేసి, తన లాభం తను మిగుల్చుకుంటాడు.

జరగవలసిన పనిని 2 భాగాలుగా వేరు వేరు పెట్టుబడిదారుల ద్వారా చేయించి, వాళ్ళకి వేరు వేరుగా ఛార్జీలు చెల్లించినా; లేదా, ఆ పనులన్నిటినీ ఒకే పెట్టుబడిదారుడి ద్వారా చేయించి, ఆ ఖర్చంతా ఒకడికే చెల్లించినా — రెండూ ఒకటే.

ప్రకటనలు తయారు చేయించే పెట్టుబడిదారుడు, తన దగ్గిర ఒక 'సరుకు'ని (ప్రకటనల్ని) ఉత్పత్తి చేయించి అమ్ముతున్నాడు గనక, వాడు కూడా ఒక 'ఉత్పాదక' పెట్టుబడిదారుడే. ఆ సరుకు ఎంత 'అసహజమైన' సరుకు అయినా, ఆ సరుకు కోసం పని చేసే కార్మికులు — 'ఉత్పాదక' కార్మికులే. కత్తులూ, విషాలూ, ఆయుధాలూ ఉత్పత్తి చేసే కార్మికులంతా ఉత్పాదక కార్మికులైనట్టే, ఇది కూడా! ఈ కార్మికులలో - డ్రాయింగులు గీసే వాళ్ళూ, ఫోటోలు తీసే వాళ్ళూ, ప్రకటనలు రాసే వాళ్ళూ, వీరంతా ఏదో ఒక 'శ్రమ' చేస్తారు. కానీ, 'మోడల్స్'గా నిలబడే వాళ్ళు మాత్రం ఏ శ్రమా చెయ్యరు. వీళ్ళు చేసే పని, తమకు ప్రకృతి సహజంగా ఏర్పడిన దేహ లక్షణాల్ని ప్రదర్శించడం. ఈ పని, శ్రమకు సంబంధించింది కాదు. ఇది 'శ్రమ' కాదు. మోడల్స్‌గా నిలబడే స్త్రీ పురుషులు, తమ శరీరాల్ని పెట్టుబడిదారుడి అవసరానికి ఇచ్చి, దానికి బదులుగా కొంత 'విలువ'ని తీసుకుంటారు. ఈ విలువ ఎంత వుండాలో నిర్ణయించాలంటే, ఇక్కడ 'ఫలానా ఇంత శ్రమ పడుతుంది' అని నిర్ణయించడానికి వీలు లేదు. ఎందుకంటే, ఇక్కడ అసలు ఏ శ్రమా వుండదు. ఇక్కడ జరిగేదేమిటంటే, మోడల్‌గా వున్న మనిషి ఏదో ఒక భంగిమలో తన శరీరాన్ని చూపించడమే. అక్కడ శ్రమే లేనప్పుడు, విలువని ఏ లెక్కతో చెల్లించాలి? శ్రమ లెక్కతో కాదు, ఆ మనిషికి వున్న డిమాండ్ లెక్క తోటే. మోడల్‌గా వుండే మనిషి ఆకారానికి వున్న 'డిమాండ్'ని బట్టి (సినిమా తారల ఆకారాలకు వుండే డిమాండ్ల లాగా), ఆ మనిషి విలువ వుంటుంది. అంటే, 'మోడల్స్'గా వుండే మనుషులు ఏ శ్రమా చెయ్యకుండా, తమ శరీర ఆకారాల్ని ప్రదర్శించి, వాటి ద్వారా ఆదాయం సంపాదిస్తూ, స్వంత శ్రమ లేకుండా, ఇతరుల శ్రమతో జీవిస్తూ వుంటారని అర్థం. ఇక్కడ శ్రమే వుండదు కాబట్టి, ఈ ఉద్యోగులు 'ఉత్పాదక' కోవ లోకి గానీ, 'అనుత్పాదక' కోవ లోకి గానీ, రారు. పెట్టుబడిదారీ విధానం సృష్టించిన, శ్రమతో సంబంధంలేని, 'వింత రకం ఉద్యోగం' ఇది.

ఈ ప్రకటనల విషయాన్ని, వాటిని తయారు చేయించి అమ్మేవాడి వేపు నించి చూస్తే, అది వాడికి ఉత్పాదక క్రమమే. ఆ సరుకుని అమ్మగా వచ్చే విలువలో నించి వాడికి అదనపు విలువ వస్తుంది. ఆ సరుకుని కొనే వాడి వేపు నించి చూస్తే, వాడికి ఆ ఖర్చు, అనుత్పాదకమైన ఖర్చు. ఆ ఖర్చుని, S లో నించి తీసి చెల్లించాలి. ఈ రకంగా, ఈ వేరు వేరు సందర్భాల్ని సరిగా అర్థం చేసుకోవాలి.

'ప్రకటన ఖర్చుల్ని గురించి' ఏమీ గందరగోళం లేకుండా అర్థం చేసుకోవడానికి ఒకటే మార్గం — ఒక పేపర్లో గానీ, ఒక సినిమాలో గానీ, ఇంకెక్కడైనా గానీ, ఒక సరుకుకి సంబంధించిన ప్రకటనని చూస్తే, ఆ ప్రకటన ఖర్చు, ఆ సరుకులో వున్న S లోదే. అంటే, ఆ సరుకుని ఉత్పత్తి చేసిన కార్మికుల అదనపు విలువలోదే. సబ్బు ప్రకటనల ఖర్చంతా, సబ్బు కార్మికుల అదనపు విలువ. మందుల ప్రకటనల

ఖర్చంతా మందుల కార్మికుల అదనపు విలువ. బట్టల ప్రకటనల ఖర్చంతా. బట్టల కార్మికుల అద నపు విలువ. ఇలాగే ప్రతీదీ.

సినిమా ఎడ్వర్టయిజ్‌మెంట్ల ఖర్చు విషయంలో కొంత తేడా వుంటుంది. సినిమా ద్వారా సంపాదించే అదనపు విలువ అంతా, సినిమా కార్మికులదే కాదని గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో, 'ఉత్పా దక శ్రమా, అనుత్పాదక శ్రమా' చాప్టర్‌లో.) ఒక సినిమా ఎడ్వర్టయిజ్‌మెంటు ఖర్చు ఆ సినిమా పెట్టు బడిదారుడికి 2 మార్గాల్లో వస్తుంది. (1) ఆ సినిమా కార్మికుల అదనపు విలువ నించీ; (2) ఆ సినిమాని చూసే జనాల నించీ.

అతి ముఖ్యమైన నిత్యజీవితావసర వస్తువుల గురించి గానీ, శారీరక శ్రమల కార్మికులు వాడే నిరుపేద ఉత్పత్తుల గురించి గానీ, ఏ ప్రకటనలూ వుండవు. 'కుండ కొనండి, నూకలు కొనండి, సైను బట్ట కొనండి' అనే ప్రకటనలు వుండవు. 'నిరుపేద' స్థాయిని దాటిన వస్తువుల విషయం లోనే ప్రకటనల అవసరం ప్రారంభమవుతుంది.

ఈ ప్రకటనల విషయంలో, 'ఈ ఖర్చు అను త్పాదకమైన ఖర్చు' అని తెలుసుకోవడంతో సరి పోదు. ఈ విషయాన్ని 'విలువ - కోణం లోనే' గాక, 'ఉపయోగపు విలువ - కోణంలో' కూడా అర్థం చేసు కోవాలి. పెట్టుబడిదారీ సమాజంలో, ప్రకటనల్ని చూసీ, ప్రకటనల్ని నమ్మీ, ఉత్పత్తుల్ని వాడడం ఒక నిత్య కృత్యం అయిపోతుంది.

ప్రతీ ప్రకటనా — "మా సరుకునే వాడండి. మా సరుకులు చాలా గొప్పవి. ఇతరుల సరుకులన్నీ పనికిమాలినవి. ఎవ్వరి సరుకులూ కొనకండి. మా సరుకులు మహత్తరమైనవి!" అని చెపుతుంది.

10 మంది విడి విడి సబ్బు పెట్టుబడిదారులు వుంటే, ఆ 10 మందీ ఎవడికి వాడు "నా సబ్బే గొప్పది! వాడి సబ్బా? ఏడిసింది!" అంటాడు. నిజా నికి, వాడి సబ్బూ ఏడిసిందే, వీడి సబ్బూ ఏడిసిందే! ఒంటి శుభ్రానికీ, ఆరోగ్యానికీ కావలసిన నిజమైన లక్షణాలు ఎవడి సబ్బు లోనూ వుండవు. 'పెట్టుబడి దారీ సరుకు' అనగానే అది నిస్సందేహంగా 'కల్తీ సరుకే'! అది బట్టలైనా, బియ్యం అయినా, మందు లైనా, సబ్బులైనా, ఇంకేదైనా కూడా. సబ్బుల సంగతి చూస్తే, ఎవడి సబ్బుని చూసినా, దాని నురగలో ఏదో ఒక మోసం, దాని వాసనలో ఏదో దగా, దాని రంగులో ఏదో టక్కరితనం — అటువంటివన్నీ వుండవలిసిందే. కానీ, సబ్బుల వాడి ఎడ్వర్టయిజ్ మెంటు, ఆ సబ్బుని ఎలా వర్ణిస్తుందంటే, అది, మానవ స్పర్శ లేకుండా ఆకాశం మీద నించి వూడి పడ్డ మహత్తర దివ్య పదార్థం అన్నట్టుగా వర్ణిస్తుంది. ఆ సబ్బు-బొమ్మ చుట్టూ, చెట్లూ పిట్టలూ, కొండలూ కోనలూ, మేఘాలూ పువ్వులూ సముద్ర తీరాలూ — వగైరా సరంజామా అంతా పోగేసి చూపిస్తుంది. 'ఇంత దివ్యమైన సబ్బుని వాడక పోతే మీ బతుకు లెందుకు? పది మందిలో మీరెలా తల లెత్తుకు తిరుగుతారు?' అని, ఆ సబ్బుని కొనడమే సమా జంలో 'గొప్ప విలువ' అయినట్టు, చిత్రిస్తుంది. 10 కల్తీ సబ్బుల గురించి 10 ఎడ్వర్టయిజ్‌మెంట్లు 10 వేపుల నించీ ఊదరగొట్టేస్తోంటే, సబ్బుతో స్నానం చెయ్యదల్చుకున్న వాడి తలకాయ గిర గిరా తిరిగి తిరిగి ఎక్కడో అక్కడ ఆగుతుంది. ఎక్కడ ఆగు తుందంటే — ఏ పేపరు తెరిస్తే ఆ పేపర్లోనూ, ఏ రోడ్డు మీద నడిస్తే ఆ రోడ్డు మీదా, ఏ సినిమాలో కూర్చుంచే ఆ సినిమా లోనూ, ఎక్కడికి పోతే అక్కడి కల్లా వదలకుండా వెంటాడే 'చలాకీ సబ్బు' దగ్గిర ఆగుతుంది. అలాంటి చలాకీ సబ్బే ఎక్కువ మంది 'హృదయాల్ని' దోచుకోగలుగుతుంది. ఎడ్వర్టయిజ్ మెంట్లు చూసి సరుకుల్ని కొనే వాళ్ళు, సరుకుల మంచి చెడ్డల మీద విశ్వాసంతో గాక, వాటి 'గొప్ప దనాల మీద మోజు'తోనే కొంటారు. అదే కావాలి పెట్టుబడిదారుడికి. తన సరుకుని కొనే వాడు, దాన్ని తెలివిలో వుండి కొన్నాడా, మూర్ఛలో వుండి కొన్నాడా; కొన్నాక దాన్ని వాడతాడా, పారేసుకుంటాడా — వగైరా ప్రశ్నలతో, పెట్టుబడి దారుడికి సంబంధం వుండదు. తన సరుకు, డబ్బుగా మారిపోవడం కావాలి, వాడికి. అది, గబ గబా అమ్ముడుపోవడం కావాలి, వాడికి.

ఏ పెట్టుబడిదారుడూ తన సరుకు గురించి నిజాయితీగా "దీన్ని ఫలానా పదార్థాలతో తయారు చేశాం, మీకు నచ్చుతుందేమో చూడండి" అని, దాని మంచి చెడ్డల్ని వివరించే పద్ధతిలో చెప్పడు. అలా చెప్తే, వాడి సరుకు వాడి స్టోరులో పడి వుండవలి సిందే. ఎందుకంటే, కొనే వాళ్ళు, తమకు నచ్చు తుందో లేదో 'ఆలోచించి' సరుకుల్ని కొనే పద్ధతే వుంటే, ఏ పెట్టుబడిదారుడి సరుకూ బయటికి రాదు. సరుకుల ఎడ్వర్టయిజ్‌మెంట్ల బ్యాండు మేళాల మోతల ముందు, కొనే వాళ్ళకు నచ్చడాలూ

నచ్చక పోడాలూ, సరుకుల మంచి చెడ్డలూ అన్నీ, బలాదూరై పోతాయి. కొనే వాళ్ళు, ఎడ్వర్టయిజ్‌మెంట్లకి లొంగిపోయే బలహీనతల్లోనే కొనడాలు జరుగుతాయి.

సబ్బులూ, బట్టలూ, చెప్పులూ — వంటి సరుకుల సంగతి ఎలా ఏడ్చినా, ప్రాణావసరమైన మందుల సంగతి కూడా అంతే. పెట్టుబడిదారీ విధానంలో, ఏ పెట్టుబడిదారుడైనా, ఏ రకం మందైనా, ఏ పద్ధతిలో నైనా, తయారు చేయించేసి, దాని మీద కల్తీ కవిత్వాలు రాయించేసి, ప్రకటనలు గుప్పించెయ్యవచ్చు. ఒక రోగి, ఒక మందుల ప్రకటనని చూస్తే, అందులో వున్న కవిత్వం చదివి, ఆ మందుతో తనకు 'చిరంజీవత్వం' సిద్ధించి తీరుతుందని నమ్మేస్తాడు. వెంటనే ఒక మాత్ర కొని నోట్లో పడేసుకుంటాడు. రోగి నోట్లో మాత్ర పడగానే, మందుల పెట్టుబడిదారుడికి, వాడి 'పెట్టుబడి' తిరిగి రావడం ప్రారంభమై, వాడికి స్వస్థత చిక్కడం ప్రారంభమవుతుంది. మన రోగి ఇంకా నాలుగు మాత్రలు మింగితే, పెట్టుబడిదారుడి సరుకు ఇంకా కాస్త కదిలి, పెట్టుబడిదారుడి ఆర్థిక ఆరోగ్యం ఇంకా కాస్త కుదుటపడుతుంది. కానీ మన రోగి మాత్రం ఎన్ని మాత్రలు మింగినా మూలుగు ఆపడు. ఆ లోగా అతను ఇంకో ప్రకటన చూసి ఇంకో మందు లోకి మారతాడు. రెండో పెట్టుబడిదారుడి కల్తీ మందులతో సాగే పనికి మాలిన వైద్య క్రమం, ఎప్పటి లాగే మళ్ళీ ఒక కొత్త చుట్టు తిరుగుతుంది. తర్వాత మన రోగి, మూడో మందులోకి మారతాడు. చివరకి, కొంత కాలానికి మందుల అవసరాన్నే దాటి పోతాడు.

ప్రకటనల ఏకైక లక్ష్యం — 'అమ్మకం'! తయారైన ఉత్పత్తిని అమ్మకాలు లేకుండా స్వంతానికే వాడుకునే గత సమాజాలలో, ఈ ప్రకటనల వ్యవహారం లేదు. బానిస యజమాని, తన పొలంలో పండిన పంటల గురించి ప్రకటనలు ఇవ్వనక్కర లేదు. ఒక కౌలు రైతు, తను చెల్లించే కౌలు గురించీ, కౌలుని తీసి వెయ్యగా తనకు మిగిలే ఉత్పత్తుల గురించీ, ప్రకటనలు ఇవ్వనక్కర లేదు. కానీ, పెట్టుబడిదారుడి సరుకు విషయం అలాంటిది కాదు. ఇది అంతా 'అమ్మకానికే' తయారవుతుంది. సమాజానికి ఏ సరుకు ఎంత కావాలీ - అనే ప్లాను లేకుండా, అనేక మంది పెట్టుబడిదారులు ఒకే రకం సరుకుని తయారు చేయిస్తారు కాబట్టి, ప్రతీ పెట్టుబడిదారుడూ, 'పోటీ' అనే అగ్ని గుండం లోంచి నడుస్తూ సరుకుల్ని అమ్ముకోవాలి. 'అమ్మకం' అనే కారణం వల్లే, సరుకుల గురించి ప్రకటనలు చెయ్యవలసిన అవసరం పుట్టుకొస్తుంది.

ఎడ్వర్టయిజ్‌మెంట్ అనేది, సరుకు గురించి వివరాలు చెప్పే పాత్రని నిర్వహిస్తే చాలదు. ముఖ్యంగా అది ఎలాంటి పాత్రని నిర్వహించాలంటే, కొనే వాళ్ళని మత్తులోకి లాగెయ్యాలి. వాళ్ళని ఆశపెట్టో, మొహమాట పెట్టో, ప్రలోభ పెట్టో, బలవంతం పెట్టో, ఏదో ఒకటి పెట్టి, వాళ్ళకి సరుకుల్ని అంటగట్టెయ్యాలి. ఎడ్వర్టయిజ్‌మెంట్ అనే మాటకి సరైన అర్థం, సరుకుల్ని అంట గట్టెయ్యడం!

ఒక సారి 'దగా' చేసి సరుకుని అంటగడితే, ఆ వ్యక్తి ఆ సరుకుని మళ్ళీ కొనడు కదా; దాని వల్ల ఆ సరుకుని కొనే వాళ్ళు తగ్గిపోతారు కదా - అనే రకం తెలివి తక్కువ సందేహాలు అక్కర లేదు. 'దగా' లలో కొత్త పద్ధతులు లేవా? దగా పద్ధతుల్ని కొంత కాలానికోసారి మార్చాలి, అంతే. పాత ప్రకటనని తీసేసి, కొత్త కవిత్వాలతో, కొత్త మనుషులతో కొత్త రకంగా, కొత్త ప్రకటన తయారు చేస్తే, అది మళ్ళీ కొంత కాలం వరకూ నడుస్తుంది. కొనే వాళ్ళ మనసుల మీదా, ఆలోచనల మీదా ఒత్తిడి కలిగించే దగా పద్ధతులతో సరుకుల్ని అమ్ముకోవడం అమ్మే వాళ్ళకి తప్పనిసరి అయిపోయినప్పుడు, ఆ దగా పద్ధతులకు లొంగిపోతూ సరుకుల్ని కొనడం కొనే వాళ్ళకి కూడా తప్పనిసరి అయిపోతుంది. అంటే, 'సబ్బు' అనే ఒక ఉత్పత్తిని వాడే వ్యక్తులు, ఏ ప్రకటనల్నీ లక్ష్యపెట్టకుండా, తమకు అందు బాటులో వున్న, తాము కొనగలిగిన సబ్బులన్నిటినీ కొని, వాడి చూసి, వాటి మంచి చెడ్డల్ని అర్థం చేసుకుని, ఏది ఎక్కువ మంచిగా అనిపిస్తే దాన్నే స్థిరం చేసుకునే స్వతంత్ర ప్రయత్నం చెయ్యలేరు. ఎడ్వర్టయిజ్‌మెంటు, పెద్ద మోతతో చెప్తే గానీ, ఏ సరుకుని కొనాలో నిర్ణయించుకోలేని బలహీనతలో పడిపోతారు. పెట్టుబడిదారుల నించి సరుకుల్ని కొనే పెట్టుబడిదారులందరికీ ఇది సహజమే కావచ్చు. వాళ్ళ దృష్టిలో ఎడ్వర్టయిజ్ మెంట్ల తళుకు బెళుకులు తప్ప ఇతర విలువలేవీ వుండవు కాబట్టి. కానీ, కార్మికులు కూడా ఇదే బలహీనతలో పడివుంటారు. వారు, ఎడ్వర్టయిజ్ మెంట్ల వలలో మహా తేలికగా పడిపోతారు. ఎడ్వర్టయిజ్‌మెంట్ల టక్కుల ముందు, వాళ్ళూ వీళ్ళూ అనే తేడా

వుండదు. కొనే వాళ్ళు, ఈ స్థితికి చేరిపోయినప్పుడు, ఎడ్వర్టయిజ్‌మెంట్లతో అవసరం అనేది, అమ్మే వాళ్ళకే కాదు, కొనే వాళ్ళకి కూడా వున్నట్టే. ఎడ్వర్ట యిజ్‌మెంట్ల బలంతోనే సరుకుల్ని అమ్మే వాళ్ళు వున్నారంటే, ఎడ్వర్టయిజ్‌మెంట్లని నమ్మే బలహీనత తోనే సరుకుల్ని కొనే వాళ్ళూ వున్నారని అర్థం.

అవసరాల కోసమే ఉత్పత్తి జరిగే, అమ్మకాలు లేని, 'నూతన సమాజం'లో, ఈ రకమైన ప్రకటనల అవసరం వుండదు. (ఉండకూడదు.) సబ్బుల ఉత్ప త్తిని తీసుకుంటే, వందల రకాల సబ్బులు అక్కర లేదు. నాణ్యమైన ఏడెనిమిది రకాల సబ్బులు చాలు. చిన్న పిల్లలకు ప్రత్యేక రకాలూ, రోగులకు ప్రత్యేక రకాలూ, శరీరాలలో వుండే సహజమైన తేడాల్ని బట్టీ, రుతువుల్ని బట్టీ, వేరు వేరు రకాలూ అవసరమవుతాయి. ఈ రకాలన్నీ ఉత్పత్తి అవడమూ, సరఫరా అవడమూ, ఎప్పుడూ జరుగుతూనే వుంటే, వాటి మీద ప్రత్యేకమైన ప్రకటనలు అక్కర లేదు. జనాభాకి ఆరోగ్య సూత్రాలు నేర్పవలసి వుంటే, ఆరో గ్యాన్నిచ్చే వస్తువులు ఉత్పత్తిచేస్తే చాలు. ఆరోగ్యా న్నిచ్చే వస్తువే ఆరోగ్య సూత్రాలన్నీ నేర్పుతుంది.

కానీ, పెట్టుబడిదారీ సమాజంలో, ఒకే రకం సరుకుని వేరు వేరు పెట్టుబడిదారులు ఉత్పత్తి చేయిస్తారు. ఎవడి సరుకుని వాడు అమ్ముకోవాలి. కాబట్టి, ప్రతీ ఒక్కడూ తన అదనపు విలువలో కొంత భాగాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ల మీద ఖర్చు చేస్తాడు.

ఒక బట్టల పెట్టుబడిదారుణ్ణి తీసుకుంటే, వాడు పరిశ్రమ ప్రారంభించి 20 సంవత్సరాలైనా, 50 సంవ త్సరాలైనా,ఎన్ని సంవత్సరాలైనా; వాడి సరుకు ఎంతో కాలం నించీ అందరికీ తెలిసిన, 'కీర్తి' పొందిన సరుకే అయినా ; వాడు ఒక్క రోజు కూడా ఎడ్వర్టయిజ్ మెంటు ఇవ్వడం మానడు. వాడు కూడా ప్రతీ నెలా, ప్రతీ వారం, ప్రతీ రోజూ సమస్త మార్గాలలోనూ ప్రకటనలు ఇస్తూనే వుంటాడు. ఎందుకంటే, మార్కె ట్లోకి, ఎప్పటికప్పుడు అదే రకం కొత్త సరుకులు వచ్చి పడుతూ వుంటాయి కాబట్టి, కొనే వాళ్ళు తన సరు కుని మరిచిపోకుండా, పక్క సరుకుల వేపు మొహాలు తిప్పకుండా వుండాలని, వాడి ఆశ. అందుకే వాడు, ఎప్పుడూ కొత్త కొత్త పద్ధతులతో, కొత్త కొత్త ఎడ్వర్టయిజ్‌మెంట్ల కోసం, కొత్త కొత్త పుంతలు తొక్కుతూ వుంటాడు. ఈ కొత్త పుంతలన్నీ గతంలో కన్నా అనేక రెట్ల ఎక్కువ ఖర్చుని తినేసే పుంతలే.

రోడ్డు పక్కన వున్న 'ప్రకటన బోర్డు', ఒక్క 'చదరపు గజం వైశాల్యం' గలది మాత్రమే అయితే, దాన్ని జనం చూడనూ వచ్చూ, చూడక పోనూ వచ్చూ. కానీ, ఆ బోర్డే 5 గజాల వెడల్పూ, 10 గజాల పొడవూ వుంటే (5 × 10 = 50 చదరపు గజాల వైశాల్యంతో వుంటే), ఆ ప్రకటనని చూడకుండా దాటిపోవడం ఎవడి తరం? కాబట్టి, మిగతా పెట్టుబడిదారులంతా చిన్న చిన్న ప్రకటనలు ఇస్తూ వున్న కాలంలో, ఒక తెలివైన పెట్టుబడిదారుడు, తన ప్రకటనల స్థలాన్ని కొన్ని రెట్లు పెంచివేస్తాడు. దాని ఫలితం, తక్షణం వాడి అమ్మకాలలో కనపడుతుంది కూడా! కానీ వెంటనే మిగతా పెట్టుబడిదారులంతా కూడా అదే మార్గం పట్టి, అందరూ పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం మొదలుపెడతారు. అప్పుడేం జరుగు తుంది? అందరూ చిన్న చిన్న ప్రకటనలు ఇవ్వడం ఎలాంటిదో, అందరూ పెద్ద పెద్ద ప్రకటనలు ఇవ్వడం కూడా అలాంటిదే కదా? వ్యవహారం మళ్ళీ మొదటికొస్తుంది. అమ్మకాల సమస్య ఎప్పటిలాగే వుండి పోయి, ప్రకటనల పద్ధతి మాత్రం తక్కువ ఖర్చు లోంచి ఎక్కువ ఖర్చు లోకి మారుతుంది. పత్రికల్లో గానీ, బైట గానీ, అందరూ పెద్ద పెద్ద ప్రకటనలు ఇస్తూ వుండగా, ఏ పెట్టుబడిదారుడూ మళ్ళీ చిన్న ప్రకటనల జోలికి పోలేడు.

ఈ ప్రకటనల్లో ఇంకో పద్ధతి — ప్రతి సరుకు తోనూ 'ఉచితంగా' ఇంకేదో చిన్న సరుకు ఇవ్వడం! ఒక సబ్బు కొంటే, ఒక బ్లేడు ఉచితం! కాఫీ పొడి కొంటే, చెంచా ఉచితం! ఒక పుస్తకం కొంటే, ఒక పెన్సిలు ఉచితం! ఒక కారు కొంటే, ఒక చీర ఉచితం! ఒక విమానం కొంటే, ఒక కారు ఉచితం! ఒక షిప్పు కొంటే, ఒక హెలీకాప్టరు ఉచితం! — ఇలా, అమ్మే సరుకు స్థాయిని బట్టి, దానితో వచ్చే ఉచిత వస్తువు స్థాయి వుంటుంది.

'ఒక సబ్బు కొంటే ఒక బ్లేడు ఉచితం' అన్న ప్పుడు, నిజానికి అందులో ఏదీ ఉచితంకాదు. సబ్బు విలువ 1 రూపాయీ, బ్లేడు విలువ 10 పైసలూ అనుకుందాం. సబ్బు పెట్టుబడి దారుడు, సబ్బుకీ బ్లేడుకీ వున్న మొత్తం 110 పైసల విలువని, సబ్బుకే వసూలుచేసి, దానితో బ్లేడు కూడా ఇస్తాడు. సబ్బుని కొనే మనిషి, బ్లేడుని ఉచితంగా తీసుకుంటున్నానని భ్రమపడతాడు.

లేదా, ఒకవేళ, సబ్బు పెట్టుబడిదారుడు, సబ్బు

విలువని ఏమీ పెంచకుండా సబ్బుని 1 రూపాయికే ఇచ్చి, దానితో బ్లేడుని నిజంగానే ఉచితంగా ఇచ్చాడనుకుందాం. కొనే మనిషికి, 110 పైసల విలువగల 2 సరుకుల్ని 1 రూపాయికే ఇచ్చినట్టు అర్థం. సబ్బు పెట్టుబడిదారుడు, సబ్బు ద్వారా తనకు వచ్చే అదనపు విలువలో నించి 10 పైసల భాగాన్ని, కొనే మనిషి కోసం వదిలేస్తున్నాడన్న మాట. అయితే, ఈ పనిని సబ్బు వాడు, బ్లేడుతో సంబంధం లేకుండా కూడా చెయ్యవచ్చు. రూపాయి విలువ గల సబ్బుని 90 పైసలకే ఇవ్వ వచ్చు. 110 పైసల సరుకుల్ని రూపాయికే ఇచ్చినా, రూపాయి సరుకుని 90 పైసలకే ఇచ్చినా, రెంటి సారాంశమూ ఒకటే. ఏ పద్ధతిలో అయినా, కొనే మనిషికి 10 పైసల విలువ ఉచితంగా వస్తుంది. అయితే, బ్లేడు లేకుండా, సబ్బుకే విలువని తగ్గించి ఇచ్చే పద్ధతిలో, సరుకుని కొనే మనిషికి, ఆ సరుకుతో పాటు ఇంకో సరుకుని ఉచితంగా తీసుకుంటున్నాననే 'ఆనందం' రాదు. కొనే వాళ్ళని 'భ్రమల్లో పెడుతూ' సరుకుని అమ్మే మార్గాలే పెట్టుబడిదారులు ఎంచుకుంటారు. అదే పెట్టుబడిదారీ ప్రకటనల మార్గం.

అంత కన్నా అసహ్యకరమైన మార్గం, 'లాటరీల' పద్ధతిలో సరుకుల్ని అమ్మడం. కొనే వాళ్ళందరి బిల్లుల నంబర్ల మీదా కొంత కాలాని కోసారి లాటరీ తీసి, అందులో కొంత మందికి కొన్ని బహుమతులు ఇస్తారు. పెట్టుబడిదారుడు, ఈ బహుమతుల ఖర్చంతటినీ ఎక్కడి నించి తెస్తాడు? - ఇంకెక్కడి నించి? — తన సరుకు ద్వారా వచ్చిన S లో నించి.

సబ్బుల వాడు లాటరీ పథకం పెట్టాడనుకుందాం. జనాలు, లాటరీల పిచ్చి వల్ల, ఆ బహుమతి తమకే రావచ్చుననే ఆశతో, ఆ సబ్బులనే ఎగబడి కొంటారు. అంత కాలం వరకూ ఇతర సబ్బుల్ని కొంటూ వున్న వాళ్ళు కూడా, వాటిని మానేసి దీన్నే కొంటారు. ఆ రకంగా, ఈ సబ్బుల వాడికి ఎక్కువ సరుకు అమ్ముడు పోయి, ఆ ఎక్కువ సరుకు నించి ఎక్కువ అదనపు విలువ వస్తుంది. అందులో నించి కొంత భాగాన్ని లాటరీలో నెగ్గిన వాళ్ళ కోసం ఖర్చు చేస్తాడు. ఆ విధంగా వాడి S లో నించి కొంత భాగం బైటికి పోయినా, అప్పటికీ వాడికి మిగిలే S, ఎక్కువ గానే వుంటుంది.

ఈ పద్ధతులన్నిటి కన్నా నీతిమాలిన, పతన మైన, అసలైన మొట్టమొదటి పద్ధతి ఒకటి వుంది. అది, అడ్వర్టయిజ్‌మెంట్లలో స్త్రీలని ఉపయో గించడం. ఒక ఉత్పత్తి, స్త్రీలు ఉపయోగించేది కాకపోయినా, దాని ప్రకటనలో కూడా స్త్రీలు వుండి తీరాలి! ఒక 'బనీనుల' ప్రకటనని తీసుకుంటే, ఆ బనీను ధరించిన పురుషుణ్ణి, 'కాంక్ష'తో చూస్తూ, ఆ బనీనుధారి సరసనే 'యవ్వనవతి' అయిన స్త్రీ వుండి తీరాలి! స్త్రీల అవయవ ప్రదర్శన లేని ప్రకటనలు నూటికో, కోటికో ఒక్కటి వుంటే వుండవచ్చు.

సరుకుల్ని అమ్ముకోవడంలో ఇప్పుడిప్పుడే 'నాగరీకమైన మార్గంగా' స్థిరపడుతూ వున్న ఇంకో కొత్త మార్గం వుంది. అదేమిటంటే — పత్రికల్లోనూ, రేడియో లోనూ, టీవీ లోనూ వచ్చే ప్రతీ కార్యక్రమాన్నీ పెట్టుబడిదారులు తమ ఎడ్వర్టయిజ్‌మెంట్లుగా కొనెయ్యడం! దీనికే 'స్పాన్సర్ చెయ్యడం' అని నాగరీకమైన పేరు! సరైన పద్ధతిలో అయితే, రేడియో — టీవీలు నడపడానికి అయ్యే ఖర్చుని ప్రభుత్వమే పన్నుల ద్వారా భరించడం గానీ; లేదా, రేడియో — టీవీల్ని ఉపయోగించే వాళ్ళే బిల్లులు చెల్లించడం గానీ, జరగాలి. కానీ, పెట్టుబడిదారీ ప్రభుత్వం, రేడియో ద్వారా, టీవీ ద్వారా కూడా వ్యాపారం చేసి డబ్బు సంపాదించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంటుంది. డబ్బు సంపాదన కోసం ప్రభుత్వం ఏం చేస్తుందంటే, ప్రతీ కార్యక్రమం నడిచే సమయాన్నీ ప్రైవేటు పెట్టుబడిదార్లకు అమ్మేస్తుంది. అంటే, ఆ కార్యక్రమాన్ని నిర్మించడానికి అయ్యే ఖర్చుని, ఆ సమయాన్ని కొన్న పెట్టుబడిదారుడే చెల్లిస్తాడు. ఆ కార్యక్రమం ఖర్చంతా ఒక పెట్టుబడిదారుడు చెల్లిస్తాడు కాబట్టి, ఆ కార్యక్రమాన్ని ఆ పెట్టుబడి దారుడే ఇస్తున్నట్టుగా ఆ కార్యక్రమంలో ప్రకటిస్తారు. దానితో పాటు, ఆ పెట్టుబడిదారుడు ఉత్పత్తి చేసే సరుకుల ప్రకటనల్ని ఆ కార్యక్రమంలో పదే పదే చూపిస్తారు. ఆ కార్యక్రమం అనేది, — ఒక 'ఆట' అయినా, 'పాట' అయినా, 'నాటకం' అయినా, 'నాట్యం' అయినా, 'సంగీతం' అయినా, ఇంకే రకం అయినా, అది ఆ పెట్టుబడిదారుడి సరుకుకి ఎడ్వర్టయిజ్ మెంటుగా ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిలో, సమస్తమైన కార్యక్రమాలూ, సమస్తమైన కళలూ, పెట్టుబడిదార్ల సరుకులకు ఎడ్వర్టయిజ్ మెంట్లుగా దాస్యం చేసే పాత్రని నిర్వహించ వలిసిందే.

ఈ రకంగా ఎడ్వర్టయిజ్‌మెంట్ విధానంలో

ఎప్పటికప్పుడు విచిత్రమైన, అసహ్యకరమైన, కొత్త కొత్త పద్ధతులు ఒక దాన్ని మించి ఒకటి పుట్టుకొస్తూ వుంటాయి. దీనంతటికీ అర్థం ఏమిటంటే, సరుకుల అమ్మకంలో 'పోటీ' అనేది తీవ్ర స్థాయికి పెరిగిపో తోందని. సమాజంలో ప్రతీ సరుకు అమ్మకమూ గతంలో కన్నా రాను రానూ కష్టతరం అయిపో తోందన్న మాట! ఈ నాడు, ఏ టెక్నిక్కులూ లేని సింపుల్ ప్రకటనలతో ఏ పెట్టుబడిదారుడూ సరు కుల్ని అమ్మలేకపోతున్నాడు. ప్రతీ ఒక్క పెట్టుబడి దారుడూ ఎడ్వర్టయిజ్‌మెంట్ల మీద ఊహాతీతమై నంత మొత్తం ఖర్చు చేస్తున్నాడు.

10 పేజీల దిన పత్రికలో కనీసం 4 పేజీల నిండా ప్రకటనలు వుంటాయి అనుకుందాం. అంటే, మొత్తం పేపరులో 40% భాగం, కేవలం సరుకుల ప్రకటనల కోసం ఖర్చవుతుంది. వార పత్రికల్లోనూ, మాస పత్రికల్లోనూ కూడా ప్రకటనలు ఇదే శాతంలో వుంటాయి. మొత్తం సమాజంలో వెయ్యి పేపర్లు వున్నాయి అనుకుంటే, అన్నిటి లోనూ ప్రతీ నిత్యం 40% స్థలం! అంటే, వెయ్యి పేపర్లలోనూ 400 పేపర్లు, ప్రకటనల కోసమే ఖర్చు!

సమాజంలో ఉత్పత్తి అవుతోన్న మొత్తం కాయి తంలో 40% కాయితమూ, దానికి తగ్గ ఇంకూ, ఫోటోలు తీసే ఫిల్ములూ, కెమేరాలూ, సెట్టింగుల్ని నిర్మించే సామగ్రీ, ఆ సామాగ్రి నంతటినీ రవాణా చేసే రవాణా సాధనాలూ — వగైరాలన్నీ ఈ ప్రకట నల కోసమే ఖర్చవ్వాలి!

ఇంకా మిగతా రకాల ప్రకటన లన్నిటినీ ఇలాగే విడి విడిగా చూడాలి. సమాజంలో వుండే మొత్తం అన్ని రకాల సరుకుల ప్రకటనల ఖర్చునీ కలిపితే, ఆ మొత్తం ఖర్చు, ఊహాతీతమైనంత పెద్ద మొత్తంగా వుంటుంది. ఈ మొత్తాన్ని పెట్టుబడిదారీ వర్గం ఎక్క ణ్ణించి తెస్తుంది? — సమాజంలో ఉత్పత్తి అయ్యే 'ఉత్పత్తుల రాసి'లో నించే. అంటే, 'సమాజంలో వున్న అదనపు విలువ'లో నించే. మొత్తం ఉత్పత్తుల రాసిలో నించి కనీసం సగం ఉత్పత్తి (50%), ఎడ్వ ర్టయిజ్‌మెంట్ల కోసం ఖర్చవుతుందంటే అందులో అతిశయోక్తి ఏమీ వుండదు. సరైన లెక్కలు తియ్య గలిగితే, ఆ ఖర్చు, అంత కన్నా కూడా ఎక్కువగా వుండవచ్చు.

సమాజంలో, అట్టడుగు శారీరక శ్రమల కార్మికు లంతా గొడుగు లంతంత గుడిసెలైనా లేక, రోజు కో పూట కూడా కడుపు నిండా తిండి లేక, నూతుల నీళ్ళో గోతుల నీళ్ళో తప్ప పరిశుభ్రమైన నీళ్ళు లేక, బట్టలు లేక, మందులు లేక, చదువులు లేక, రవాణా సౌకర్యాలు లేక, జీవితం పొడుగునా ఏ ఒక్క వస్తువూ లేక, భయంకరమైన దరిద్రంతో మగ్గిపోతూ వుంటే, వారి శ్రమతో తయారైన ఉత్పత్తుల్లో నించి లక్షల లక్షల టన్నుల చెక్కలూ, అట్టలూ, బట్టలూ, ఇనుమూ, బొగ్గూ, కాయితమూ, రంగులూ — వగైరా ఉత్పత్తులెన్నో ప్రతీ ఏటా ఎడ్వర్టయిజ్‌మెంట్ల పనుల మీద వ్యర్థంగా ఖర్చయిపోతూ వుంటాయి.

పెట్టుబడిదారీ విధానంలో, ఈ భయంకరమైన ఖర్చు తప్పదు. ప్రకటనలు లేకుండా పెట్టుబడిదారీ సరుకు అమ్మకాల్ని ఊహించడమే సాధ్యం కాదు. అంటే, పెట్టుబడిదారీ విధానంలో, సమాజం, తన ఉత్పత్తుల రాసిలో నించి ఎంతో భాగాన్ని ప్రతీ యేటా తప్పనిసరిగా 'వృధాగా' ఖర్చుచేసి తీరాలన్న మాట! ఆ వృధా ఖర్చు కోసం కార్మిక జనాభా నించి అదనపు విలువని ఊహాతీతమైనంత ఎక్కువ స్థాయిలో లాగి తీరాలన్న మాట!

సమాజంలో ఈ ఖర్చు ఒకప్పటి కన్నా ఒకప్పుడు పెరిగిపోతూ వుంటుంది. ఈ పెరిగిపోయే ఖర్చుని సమాజం ఎలా భరించ గలుగుతుందంటే, సామాజిక ఉత్పాదక శక్తి ఒకప్పటి కన్నా ఒకప్పటికి పెరుగుతూ వుంటుంది కాబట్టి, దాని వల్ల 'ఉత్పత్తుల రాసి' కూడా పెరుగుతూ వుంటుంది. ఆ ఉత్పత్తుల రాసిలో నించీ గతంలో కన్నా ఎక్కువ ఉత్పత్తుల్ని ఎడ్వర్ట యిజ్ మెంట్ల మీద ఖర్చు చెయ్యడం సాధ్యమవుతూ వుంటుంది.

పెట్టుబడి విస్తరణా, పోటీ, పెరిగిపోతున్నకొద్దీ, అందులో నిలదొక్కుకుంటూ సరుకుల్ని అమ్మా లంటే, ప్రతీ పెట్టుబడిదారుడికీ, ఎడ్వర్టయిజ్ మెంట్లని పెంచడమే మార్గంగా కనపడుతుంది. పెట్టుబడిదారీ విధానానికి అంత కన్నా ఇంకో మార్గం వుండదు. దీని వల్ల, కార్మిక జనాభా ఆర్థికంగా ఘోర మైన దోపిడీకి గురి అవడమే కాకుండా, సాంస్కృతి కంగా కూడా 'ఎడ్వర్టయిజ్‌మెంట్ల సంస్కృతి'కి బానిసై పోతుంది.

కొన్ని వ్యాపార ప్రకటనలు కేవలం సాంస్కృతిక మైన ఆచారాల మీదా, అభిప్రాయాల మీదా ఆధార పడుతూ తయారవుతాయి, ఈ విధంగా:

★ ఇది పురుషుల సబ్బు! మేల్ సోప్!

★ ఇది అసలైన పురుషులు మాత్రమే వాడే మోపెడ్! మేల్ మోపెడ్!
★ ఇది మగతనం పుట్టిపడే పత్రిక! పురుషత్వం నిండిన పత్రిక! అన్ని పత్రికల్లాగా ఇది ఆడంగి పత్రిక కాదు!
★ ఇవి స్త్రీల నాజూకుతనానికి తగిన దుస్తులు! మీ దేహాలను చిగురుటాకులుగా కనిపింపజేసే దుస్తులు!
★ మగువల ముఖ కమలాన్ని వికసింపజేసే కాటుకలు! కుంకుమలు!
★ ఇవి దీపావళికి సొగసు చేకూర్చే ఆభరణాలు!
★ ఇవి ఉగాదికి వెలుగునిచ్చే ముస్తాబులు!

ఇలా, అవాకులూ చవాకులూ!

సమాజంలో సాంస్కృతికంగా ఏ యే తప్పుడు అభిప్రాయాలైతే వున్నాయో వాటి మీద ఆధారపడిన ప్రకటనలు ఇవి. పురుషుడి శరీరం దృఢమైనదనీ, స్త్రీ శరీరం నాజూకు అనీ, అంచేత వారికి వేరు వేరు సబ్బులు వుండాలనీ చెపుతుంది ఒక ప్రకటన! చాలా మంది స్త్రీలూ, పురుషులూ దీన్ని నమ్ముతారు. కుక్కలకైతే ప్రత్యేక సబ్బులు వుండాలి గానీ, మనుషుల్లో మనుషులైన పురుషులకు ప్రత్యేక సబ్బులు ఎందుకూ — అనే ప్రశ్న వాళ్ళకు వుండదు. మళ్ళీ ఈ పురుషుల్లో కూడా, 'అసలు సిసలైన పురుషులు' వేరేగా వుంటారు! వాళ్ళు ఫలానా దుస్తులూ, ఫలానా మోపెడ్‌లూ, వాడుతూ వుంటారు. అవి వాడని వాళ్ళంతా 'సన్నాసి రకం' పురుషులే! ప్రతీ ఒక్క సరుకు ప్రకటన లోనూ ఇంతే. సరుకుల అమ్మకం గాళ్ళు, అమ్మకాల రంధితో, ఏదో ఒకటి పేలుతూనే వుంటారు. ఇదంతా దోపిడీ సమాజాల ద్వారా సంక్రమించిన సాంస్కృతికమైన రొచ్చు!

ఇప్పటి వరకూ మనం, సరుకుల అమ్మకానికి సంబంధించిన 'వ్యాపార ప్రకటనల' గురించి చూశాం. కానీ, ప్రకటనలు అన్నీ, వ్యాపార ప్రకటనలు గానే వుండవు. వ్యాపారానికి సంబంధం లేకుండా, పెట్టుబడిదారుల వ్యక్తిగత అవసరాలకూ, కార్మికుల వ్యక్తిగత అవసరాలకూ సంబంధించిన ప్రకటనలు కూడా కొన్ని వుంటాయి.

ఒక ప్రకటన ఇలా వుంటుంది: 'నేను నిన్న ఫలానా నంబరు బస్సులో ఫలానా చోటు నించీ ఫలానా చోటు వరకూ ప్రయాణం చేశాను. ఫలానా నంబరు సీటులో నా సంచిని మరిచిపోయి దిగిపోయాను. నా సంచి ఎవరికైనా దొరికి వుంటే, దయ చేసి నాకు అప్పగించవలసిందిగా కోరు తున్నాను. తగిన పారితోషికం ఇవ్వగలను.'

ఈ 'ప్రకటన'ని, పెట్టుబడిదారుడు ఇచ్చివుంటే, దాని ఛార్జీల్ని ఆ వ్యక్తి తన 'ఆదాయం'లో నించి చెల్లిస్తాడు. వాడికి ఆ 'ఆదాయం' ఎక్కడిదీ? వాడు ఉత్పత్తి చేయించే సరుకు తాలూకు 'అదనపు విలువ'లోది. అంటే, పెట్టుబడిదారుడు తన సరుకు అమ్మకాల కోసం ఇచ్చే వ్యాపార ప్రకటనల ఛార్జీలు అయినా, వ్యక్తిగత ప్రకటనల ఛార్జీలు అయినా, వాడి సరుకు తాలూకు అదనపు విలువకి చెందేవే.

ఈ 'సంచి ప్రకటన'ని ఒక కార్మికుడే ఇచ్చి వుంటే, కార్మికుడు, ఈ ప్రకటన ఖర్చుని, తన 'జీతం'లో నించి భరిస్తాడు.

ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. 'నూతన సమాజాన్ని' దృష్టిలో పెట్టుకుందాం. మనుషుల 'మరుపు' వల్ల సమాజానికి తప్పనిసరిగా కొన్ని ఖర్చులు ఎక్కువగా అవుతాయి. ఎలాగంటే: ఒక మనిషి, ఒక స్థలం నించి సైకిల్ మీద ఇంకో స్థలానికి వెళ్ళి 2 సామాన్లు తీసుకు రావాలను కుందాం. ఆ మనిషి రెండో స్థలానికి వెళ్ళి, ఒక సామాను గల సంచిని సైకిల్‌కి కట్టుకుని, రెండో సామాను సంగతి మరిచిపోయి వచ్చేశాడను కుందాం. తీరా ఇక్కడికి వచ్చాక, రెండో సంచి సంగతి గుర్తు వచ్చింది. అప్పుడేం చెయ్యాలి? ఆ మనిషి, ఆ సైకిల్ మీద మళ్ళీ ఇంకో సారి ప్రయాణం చెయ్యాలి. ఈ రెండో ప్రయాణానికి కూడా మళ్ళీ కొంత సమయం పడుతుంది. మళ్ళీ సైకిల్ అరుగుదల ఖర్చు జరుగుతుంది. ఆ మనిషికి ఆ 'మరుపు' లేకుండా వుంటే, మొదటి ప్రయాణం తోనే మొత్తం పని పూర్తి అయ్యేది. కానీ, ఆ 'మరుపు' వల్ల, ఆ పని కోసం ఎక్కువ ఖర్చు తప్పనిసరి అవుతుంది.

ఒక సమిష్టి వంట ఇంట్లో, పాలు కాగబెట్టే పనిలో, ఒక మనిషి 10 లీటర్ల పాలు కాగపెడుతున్నాడనుకుందాం. చిన్న 'మరుపు' వల్ల ('అశ్రద్ధ' వల్ల కాదు. 'మరుపు'కీ, 'అశ్రద్ధ'కీ తేడా వుంది. మరుపు సహజ లక్షణం. అశ్రద్ధ సహజ లక్షణం కాదు), ఆ వ్యక్తి, అక్కడే ఇంకో పనిలోవుండి, పాల సంగతి ఒక్క క్షణం మరిచి పోవడం వల్ల, 1 లీటరు పాలు పొంగి పోయాయి — అనుకుందాం. ఆ 'మరిచిపోవడం' అనేది జరగ కుండా వుంటే, ఆ పాలు వృధా అయ్యేవి

కావు. ఇప్పుడు పాల వృధాయే కాదు, ఆ పాలు పొంగిన స్థలాన్ని శుభ్రం చెయ్యడానికి కొన్ని నీళ్ళూ, కొంత సబ్బుపొడీ లాంటి పదార్థాలూ, చీపురులో కొంత అరుగుదలా, ఆ కడిగే పని చెయ్యడానికి పట్టే సమయమూ — ఇవన్నీ కూడా అదనంగా ఖర్చవు తాయి. 'మరుపు' అనేది సహజ లక్షణం కాబట్టి, దాని వల్ల జరిగిన నష్టాల ఖర్చునంతటినీ కూడా, మనం వాడే ఉత్పత్తులకే, ఈ ఉదాహరణలో 9 లీటర్ల పాలకే, కలపవలసి వుంటుంది. అంటే, 9 లీటర్ల పాలకే అంత ఖర్చు అయినట్టు అర్థం. వస్తువుల్ని ఉత్పత్తి చేసేటప్పుడు, 'రద్దు'కి సంబంధించిన ఖర్చుల్ని కూడా వస్తువుకి సంబంధించిన ఖర్చులు గానే చూస్తాం. అలాగే, మొత్తం మరుపు సంఘటనల ఖర్చులన్నిటినీ, సమాజం, తప్పని సరిగా జరిగే సహజమైన ఖర్చులు గానే భరించాలి. అయితే నిత్య జీవితంలో, 'బాధ్యతా, క్రమ శిక్షణా' ఇంకా ఇంకా ఎక్కువగా అలవడుతోన్న కొద్దీ ఈ 'మరుపు ఖర్చులు' తగ్గిపోతాయి. ఎంత తగ్గినా, ఇవి అసలు జరగకుండా మాత్రం వుండవు. 'మరుపు' గురించి ఈ విషయాలు అర్థం చేసుకున్న తర్వాత, 'బస్సులో సంచిని మరిచేపోయే' సంఘటన గురించి ఇప్పుడు చూద్దాం.

నూతన సమాజంలో, ఒక వ్యక్తి, బస్సులో ప్రయాణం చేస్తూ 'సంచి'ని మరిచిపోయి దిగిపోయాడు — అనుకుందాం. అప్పుడేం జరుగు తుంది? బస్సులో వున్న ఇతర ప్రయాణీకులు ఆ సంచిని బస్సు కార్మికులకు అప్పగిస్తారు. లేదా, ఇతర ప్రయాణీకు లెవ్వరూ ఆ సంచిని చూడలేదనుకుంటే, తర్వాత బస్సుని శుభ్రంచేసే కార్మికులైనా ఆ సంచిని చూసి దాన్ని ఎక్కడ జాగ్రత్త చెయ్యాలో అక్కడ చేస్తారు. ఆ లోగా, సంచిని మరిచిపోయిన మనిషి, బస్సుస్టేషన్‌కి వచ్చి తన సంచి తను తీసుకుంటాడు. విషయం అంతా ఈ పద్ధతిలో జరిగినప్పుడు కూడా, ఈ 'మరిచిపోవడం' అనే సంఘటన వల్ల కొన్ని ఖర్చులు అదనంగా జరుగుతాయి. ప్రయాణీకులు మరిచిపోయిన వస్తువుల్ని జాగ్రత్త చెయ్యడానికి కొంత స్థలమూ, కొన్ని ఏర్పాట్లూ, ప్రయాణీకులు ఆ స్థలానికి తిరిగి రావడమూ, వగైరా విషయాలన్నీ అదనంగా జరిగే ఖర్చులే. కానీ, ఇవి తప్పవు.

ఒక ప్రయాణీకుడు తన వస్తువుని ఎక్కడ మరిచిపోయాడో గ్రహించ లేదనుకుందాం. అతను ఐదారు స్థలాలలో తిరిగి వుంటాడు. వస్తువు ఎక్కడ పోయిందో గ్రహించలేకపోతే, అతను దాని కోసం ఎక్కడికీ వెళ్ళలేడు. కానీ ఆ వస్తువు ఎక్కడ పడిపోయిందో అక్కడ అది ఎవరికో ఒకరికి దొరుకుతుంది. దాన్ని, వాళ్ళు, ఆ రకం వస్తువుల గురించి బాధ్యత తీసుకునే సంస్థకి అప్పచెపుతారు. ఆ సంస్థ వాళ్ళు, ఆ వస్తువులో వున్న వివరాల్ని బట్టి దాని స్వంతదారుని కనిపెట్టగలిగితే, ఆ వస్తువుని ఆ వ్యక్తికి చేరుస్తారు. కానీ, ఆ వస్తువు ద్వారా దాని స్వంతదారు వివరాలేవీ దొరకవనుకుందాం. వస్తువు కోసం ఎక్కడికి వెళ్ళాలో స్వంతదారుకీ తెలీదు; స్వంతదారు ఎక్కడ వున్నాడో వస్తువుని భద్రపరిచిన వాళ్ళకీ తెలీదు. ఇలాంటి ప్రత్యేక సందర్భాలలో అయితే, ఈ సమాచారాన్ని ఏదో ఒక పద్ధతిలో 'ప్రకటించడం' తప్పనిసరిగా అవసరమవుతుంది. 'ఫలానా చోట ఫలానా వస్తువు దొరికింది. దాని వివరాలు ఇలా ఇలా వున్నాయి. ఈ వస్తువు ఎవరిదైతే వారు వచ్చి పట్టుకెళ్ళండి' అని ఆ ప్రకటన చెపుతుంది. ఆ రకంగా, ఆ వస్తువు, దాని స్వంతదారుకి చేరుతుంది. కానీ, ఈ ప్రకటన, 'ఎడ్వర్టయిజ్‌మెంటు' అవదు. ఈ ప్రకటన ఖర్చుని దాని స్వంతదారే భరించనక్కరలేదు. ఒకవేళ, ఆ ప్రకటనతో అవసరం లేకుండానే, ఆ వస్తువు దొరికిన వ్యక్తే దాన్ని స్వంతదారుకి చేర్చినప్పుడు కూడా ఆ వ్యక్తికి, వస్తువు స్వంతదారు, 'బహుమానాలు' ఇవ్వనక్కరలేదు. దొరికిన వస్తువుని స్వంతదారుకి చేర్చడం అనేది, ప్రతీ మనిషికీ సహజమైన బాధ్యత. 'నూతన మానవ సంబంధాల స్వభావం'లో ఆ బాధ్యత కూడా ఒక భాగం.

పెట్టుబడిదారీ సమాజంలో, ఇంకో రకపు 'వ్యక్తిగత ప్రకటన' ఇలా వుంటుంది: 'మా పిల్లని ఎవరో ఎత్తుకుపోయారు. పిల్ల వివరాలు ఫలానా. పిల్ల, ఫలానా రకం బట్టలు వేసుకుంది. దొంగతనం ఫలానా చోట జరిగింది. పిల్ల ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును'.

ఇలా, పిల్లల్నీ, స్త్రీలనీ ఎత్తుకుపోయి వ్యభిచార గృహాలకూ, కూలి ఇవ్వకుండా పని చేయించుకునే చోట్లకూ, అమ్మేస్తారు. పసి పిల్లల్ని అయితే, పిల్లలు లేని వాళ్ళకి అమ్మెయ్యడానికి కూడా. పెట్టుబడిదారీ సమాజంలో, ఇటువంటి అనేక భయంకరమైన, ఊహాతీతమైన, నీచాతి నీచమైన సంఘటనలు నిత్యం జరిగిపోతూ వుంటాయి. ఈ నేరాలన్నీ కూడా

మితి మీరిన 'డబ్బు దృష్టి'తో జరిగే నేరాలే. ఈ నేరాల వల్లనే ఈ రకం ప్రకటనల అవసరం కలుగుతుంది.

పెట్టుబడిదారీ అరాచకపు సమాజంలో, పిల్లలే ఇళ్ళ నించి పారిపోవడం కూడా జరుగుతూ వుంటుంది. అనేక కుటుంబాలలో తండ్రులు చండ శాసనులు గానూ, తల్లులు అస్వతంత్రులు గానూ వుంటారు. పిల్లలకు తగిన ఆదరణా, రక్షణా, క్రమ శిక్షణా, దొరకవు. సమాజ వాతావరణం అంతా వ్యస నాల తోటీ, తప్పుడు సినిమాల తోటీ కలుషితమై పోయి వుంటుంది. ఈ రకపు కారణాల వల్ల, ప్రతి నిత్యం అనేక మంది పిల్లలు వ్యసనాలకు లొంగి పోయి అశాంతి తోటీ, అజ్ఞానం తోటీ, బాధల నించి తప్పించుకోగలమనే ఆశ తోటీ, ఇళ్ళ నించి పారి పోతూ వుంటారు. 'కనిపించుట లేదు' అనే పేరుతో వచ్చే చాలా ప్రకటనలు ఈ రకానికే చెంది వుంటాయి. మనుషుల్ని ఇతర మనుషులు ఎత్తుకు పోయినా, ఎత్తుకు పోకుండానే వాళ్ళే ఇళ్ళు వదిలేసి వెళ్ళి పోయినా, ఎలా జరిగినా, ఈ పరిస్థితులన్నీ దోపిడీ సమాజాల సృష్టే! పెట్టుబడిదారీ సమాజంలో ఇవి రక రకాల రూపా లలో, అధిక సంఖ్యలో, జరిగి పోతూ వుంటాయి.

చచ్చిపోయిన వారిని 'తలుచుకుంటూ దుఃఖించే' వ్యక్తిగత ప్రకటనలు కూడా కొన్ని వుంటాయి. పిల్లలు చచ్చిపోతే తల్లిదండ్రులూ, భార్యలు చచ్చిపోతే భర్తలూ, తల్లితండ్రులు చచ్చి పోతే పిల్లలూ — ఇలా, వీరంతా తమ 'దుఃఖాన్ని' పేపర్లలో అచ్చు వేస్తూ వుంటారు. ఒక భర్త (ఈ భర్త కార్మికుడా, పెట్టుబడి దారుడా అనేది అనవసరం), తన మరణించిన భార్య కోసం, రెండు మూడేళ్ళ వరకూ ఏడాది కోసారి పేపర్లలో ఇలా విలపిస్తూ వుంటాడు: "నీవు పోయి నప్పటి నుండీ నాకు కంటి మీద కునుకు లేదు. నీ దివ్య రూపమును మరువ లేకున్నాను. నీవు ఈశ్వర సమక్షంలో చేరి అమరు రాలివైనావు. నన్ను విడిచి పోయినావు. నిన్ను ఎన్నటికీ మరువలేని వాడను. ఇట్లు — నీ భర్త" — ఇలా! ఈ ప్రకటనలో మాటల్ని ఈ భర్తే రాశాడని భ్రమపడ కూడదు. ఎవరికో కిరాయి రచయితకి డబ్బు ఇచ్చి రాయిస్తాడు. ఈయన భార్య పోయినందుకు, ఆ కిరాయి రచయిత బాధపడి పోతాడన్న మాట! లేకపోతే, ఈ భర్త, ఒక ఎడ్వర్టయిజ్ మెంటు కంపెనీకి వెళ్ళి, అక్కడ రెడీగా వున్న ఈ రకం 'విచారాల ప్రకటనల నమూనాలు' కొన్ని చూస్తాడు. వాటిల్లో మాటలు ఆ భర్తకి కూడా కొత్తే. అందులో ఒక దాన్ని ఎంపిక చేసుకుని, డబ్బు చెల్లించి వస్తాడు. తర్వాత ఆ ప్రకటన, పేపర్లలో వస్తుంది. పోయిన భార్య మీద తన ప్రేమని ఆ ప్రకటనలో చదువుకుని, ఆ ప్రకటనని తన బంధు మిత్రులందరూ చూశారా లేదా అనే ఎంక్వయిరీ కార్యక్రమం మొదలు పెడ తాడు. భార్య పోయినప్పటి నించీ ఈయనకి కంటి మీద కునుకు లేదట! ఆమె దివ్య రూపమును మరవ లేకున్నాడట! ఆమెని మరిచిపోయి కును కులు తీద్దామని ప్రయత్నాలు చేస్తూనే వుంటే అది వీలు కావడం లేదన్న మాట! కునుకులు పడితే సమస్య తీరిపోను! ఇప్పుడు సమస్యంతా కునుకులు పట్టని సమస్యే! 'నువ్వు నన్ను విడిచిపోయినావు, ఈశ్వర సమక్షంలో చేరినావు' అని ఒకటే సాధింపు! 'పోయి అక్కడ కూర్చున్నావా' అన్నట్టు! ఈ భర్త ఈ ప్రకటనలో ఈ మాటలన్నీ ఎవరికి చెప్పినట్టు? చచ్చిపోయిన తన భార్య చదువుతుందనే నమ్మకం తోనే చెపుతున్నా డని అందామా? — అలా ఎవరూ అనలేరు. మరి ఈ ప్రకటనని ఎవరు చదవాలని? అతనికి తెలిసిన వాళ్ళంతా చదవాలని. వాళ్ళంతా ఈ ప్రకటన చూసి, 'ఆహా, ఈయనకి భార్య మీద ఎంత ప్రేమో!' అనుకోవాలని. తెలియని వాళ్ళు కూడా ఈ ప్రకటన చూసి, 'ఎవరో ఒకాయన, భార్య కోసం ఎంత బాధపడుతున్నాడో! ఎంత వుత్తముడో' అను కోవాలని! తన ప్రకటనని చూసి అందరూ అలా అనుకుంటారనీ, తన కెంతో కీర్తి వస్తుందనీ, ఆ భర్త గారి పేపరు శోకం! కానీ పాపం ఆ 'కీర్తి' వల్ల, ఆ భర్త కేమీ 'లాభం' వుండదు. అంటే, ఆయనకి రెండో భార్య దొరికే అవకాశాలన్నీ పోతాయి. ఎందుకంటే, పోయిన భార్యని ఇంత 'ఇదిగా' ప్రేమిస్తూ వుండే ఇంత ఉత్తముడు, మళ్ళీ ఇంకో స్త్రీని కన్నెత్తి చూస్తా డని ఎవ్వరూ అనుకోలేరు. ఆయన ప్రతి యేటా ఈ పాత రకం ప్రకటననే ఇస్తూ వుంటే మాత్రం, కొత్త భార్య ఆశ ఎప్పటికీ తీరదు. ఆ భర్త, రోజు రోజూ కీర్తి భారం మోసు కుంటూ తిరగడం తప్ప ఇంకేమీ చెయ్యలేడు. కాబట్టి, ఆ భర్త కాస్త తెలివైన వాడైతే ఆ ప్రకటనలో ఏం రాసి వుండవలసిందంటే — 'నువ్వు చచ్చి పోయాక ఇప్పటి దాకా నాకు సరైన వంట మనిషీ, పని మనిషీ, పక్కలో మనిషీ, కుదరనే లేదు. ఈ సమస్యల తోటే చికాకులు పడు తున్నాను' అని రాసి వుండాలి. పెట్టుబడిదారులు, సరుకుల

బేరాలూ, వ్యాపారాల షరతులూ నిర్మొహమాటం గానే మాట్లాడేసుకుంటారు. అలాగే, ఈయనకి భార్య పోవడం వల్ల వచ్చిన అసలు ఇబ్బంది లేమిటో సుబ్బరంగా చెప్పేస్తే, చెప్పే వాళ్ళకీ, వినే వాళ్ళకీ కూడా హాయి! తిక మక వుండదు. అలాంటి ప్రకటన వల్ల 'మళ్ళీ—పెళ్ళి సంబంధాలైనా' వస్తాయి. కొత్త 'సంబంధాల్ని' రానివ్వకుండా చేసే ఉత్త కీర్తితో ఏ భర్త అయినా ఏం చేసుకుంటాడు, కీర్తిని నెత్తి కేసి కొట్టు కోడం తప్ప? అందుకే, చాలా మంది భర్తలు, 'అను రాగ ప్రకటనల్ని', 2, 3 సంవత్సరాలు మాత్రమే ఇచ్చి వూరుకుంటారు.

ఈ రకం ప్రకటనల్ని చచ్చిపోయిన పిల్లల గురించి తల్లిదండ్రులు ఇచ్చినా, స్నేహితుల గురించి స్నేహితులు ఇచ్చినా, ఎవరి గురించి ఎవరు ఇచ్చినా, ఇదంతా పెద్ద 'ప్రదర్శన' కోసం చేసే తతంగం తప్ప ఇంకేమీ కాదు. పోయిన పిల్లల కోసం తల్లిదండ్రులు పేపర్లలో ఏడవాలా? 'వాళ్ళ పిల్లలంటే వాళ్ళకి ఎంత ప్రేమో' అని ఇతరులు అనుకోవాలని గాకపోతే, ఈ 'ప్రదర్శన'కి అర్థ మేమిటి? పిల్లలు పోయినప్పుడు తల్లిదండ్రులు తప్పకుండా బాధపడతారు. విరక్తితో కుంగిపోతారు. ఆ కష్ట కాలంలో మంచి బంధు మిత్రులు ఓదార్పుగా కొంత కాలం పాటు వారితో కలిసి వుంటూ వారి విచారంలో పాలు పంచుకుం టారు. క్రమంగా, కాలం గడుస్తున్న కొద్దీ, తల్లి దండ్రులు ఆ ఉధృతమైన దుఃఖం నించి తేరు కుంటారు. అంతమాత్రాన పిల్లల్ని పూర్తిగా మరిచి పోరు. తమ బాధని అర్థంచేసుకుంటారనీ, తమ కష్ట సుఖాల్ని పంచుకుంటారనీ నమ్మకం కలిగిన బంధు మిత్రులు కలిసినప్పుడల్లా, ఆ తల్లిదండ్రులు, తమ పిల్లల్ని గురించి ప్రస్తావించుకుంటూనే వుంటారు. జీవితమంతా ఆ రకం గానే పిల్లల్ని తమ మనసుల్లో వుంచుకుంటారు. ఈ సహజమైన ప్రవర్తనలో, ప్రక టనలకు ఎక్కడా స్థానం వుండదు. కానీ పెట్టుబడి దారీ సమాజంలో, ప్రతీ సహజమైన అనుభూతీ నశించి పోయి, దానికి బదులు నటనా, కపట త్వమూ, ఇతరుల ముందు ఉత్తములుగా కనపడా లనే కీర్తి రంధీ, అల్లుకుపోతాయి.

పెట్టుబడిదారీ సమాజంలో, ఎడ్వర్టయిజ్‌మెంట్ల కంపెనీలు తల ఎత్తిన దగ్గిర నించీ వాటికి అనేక రకాల ప్రకటనలు తయారు చేసే అవకాశాలు కావాలి. కేవలం 'సరుకుల ప్రకటనల' తోనే అవి వ్యాపారం చెయ్యలేవు. కాబట్టి, అవి రక రకాల ప్రకటన పద్ధతుల్ని సృష్టిస్తాయి. చచ్చిపోయిన వాళ్ళ గురించి పేపర్లలో ఏడ్చే కొత్త పద్ధతుల్ని సృష్టిస్తే, పేపర్లకీ, ఎడ్వర్టయిజ్‌మెంట్ సంస్థలకీ కూడా కావ లసినన్ని ప్రకటనల ఆర్డర్లు దొరుకుతాయి. ప్రకట నలు ఇచ్చే వాళ్ళకేమో కావలసినంత 'కీర్తి'! మనుషు లందరూ తప్పుడు ఆలోచనల్లోనూ, తప్పుడు విలువ ల్లోనూ పడి వున్నప్పుడు, అలాంటి మనుష్యుల మధ్య పేపర్లలో ఏడ్చే వాళ్ళకి నిజం గానే 'కీర్తి' దొరుకుతుంది కూడా!

ఈ రకంగా, ప్రకటనల్ని, 'వ్యాపార ప్రకటనలు' గానూ, 'వ్యక్తిగత ప్రకటనలు' గానూ విభజించి, ఏ ప్రకటన ఏ పద్ధతిలో ఎంత అసహజత్వంతో వుందో అర్థం చేసుకోవాలి.

ప్రభుత్వం ఇచ్చే కొన్ని ప్రకటనలు, ఈ 2 రకాలూ కాకుండా కూడా వుంటాయి. అవి కేవలం ప్రభుత్వ ప్రచారానికి సంబంధించినవి. 'ఫలానా ప్రణాళికలో ఈ పనులు చేశాం, ఆ పనులు చేశాం; ఇంత ప్రగతి సాధించాం, అంత ప్రగతి సాధించాం' అని చెప్పే ప్రకటనలు అవి. వాటి ఖర్చు అంతా ప్రభుత్వ ఆదాయంలో నించి పెట్టవలసి వుంటుంది.

# 6. 'డబ్బు' ఖర్చు

**అ**మ్మకాలూ కొనుగోళ్ళూ వున్న సమాజంలో, ఆ పనులు తేలిగ్గా జరగాలంటే, 'డబ్బు' వుండాలి. 'డబ్బు' వుండాలంటే, డబ్బుగా పని చేసే సరుకు వుండాలి. సమాజం, పూర్వం నించీ వెండి— బంగా రాల్ని, డబ్బు సరుకులుగా పెట్టుకుంది. ఈ 2 లోహాల్నీ కలిపి 'బంగారం' అని ఒకే పేరుతో మాట్లాడదాం. బంగారం నాణాలే చలామణీలో వుండే కాలాన్ని తీసుకుంటే, సమాజం, ఏటా ఉత్పత్తి చేసే బంగారంలో కొంత భాగాన్ని, డబ్బు నాణాలు చెయ్యడానికి ఉపయోగించాలి. ఆ నాణాలు లేక పోతే, సరుకుల్ని డబ్బుతో మార్చు కోవడం సాధ్యం కాదు. ఆ నాణాలు, 'చలామణీ పని'లో తిరుగుతూ

అరిగి పోతూ వుంటాయి. అరిగిన నాణాల్ని కరిగిం చేసి, మళ్ళీ కొత్త నాణాల్ని విడుదల చెయ్యాలి. అంటే, 'మారకాలు' వుండడం వల్ల సమాజంలో ఏటా కొంత బంగారం, 'డబ్బుగా తిరిగే పని'లో ఖర్చయి పోతూ వుంటుంది.

ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా బంగారం నాణాలు చలామణీలో లేవు. కానీ, ప్రతీ దేశమూ కొంత బంగారాన్ని తన 'సెంట్రల్ బ్యాంకు'లో రిజర్వ్ చేసి వుంచాలి. బంగారాన్ని బ్యాంకులో వుంచి, దాని విలువకు తగ్గట్టుగా (లేదా, ఏదో ఒక నిబంధన ప్రకారం), కాయితం నోట్లని చలామణీలో వుంచాలి. బంగారం, అరిగి పోకుండా బ్యాంకులో వుంటే, దానికి బదులుగా కాయితం నోట్లు బయట తిరుగు తాయి. బంగారాన్ని రిజర్వ్‌లో వుంచకపోతే, కాయితం నోట్లని ఎంత పరిమాణంతో విడుదల చెయ్యాలీ — అనే దానికి ఒక ఆధారం వుండదు.

ఒక దేశం, ఇతర దేశాల నించి సరుకుల్ని కొని డబ్బు చెల్లించవలసి వచ్చినప్పుడు, కాయితం నోట్లని గాక బంగారమే ఇవ్వాలి. దీని కోసం ప్రతీ ప్రభుత్వా నికీ తప్పనిసరిగా ఎంతో కొంత బంగారం నిల్వలు వుండాలి. ఈ రకంగా, సమాజంలో 'మారకాల' పద్ధతి వుండడం వల్ల, సమాజంలో ఉత్పత్తి అయ్యే బంగా రంలో (ఆ లోహంలో) కొంత భాగం, ఎప్పుడూ బ్యాంకు మూలల్లో పడి వుండాలి. దాన్ని ఏ అవస రానికీ వాడడానికి వీలు వుండదు. దాన్ని అలా ఒక మూల వుంచడమే దానితో ఒక అవసరంగా వుంటుంది. విచిత్రమైన అవసరం ఇది.

ఇక బయట తిరిగే 'కాయితం నోట్ల' సంగతి చూస్తే (చిల్లర నాణాల సంగతి కూడా), మొత్తం సమాజానికి డబ్బుగా పని చెయ్యడానికి కోట్ల కోట్ల నోట్లూ, చిల్లర నాణాలూ కావాలి. వాటి కోసం టన్నుల కొద్దీ కాయితమూ, లోహమూ, ఇంకులూ, ప్రెస్సులూ, బిల్డింగులూ, వాటి సరఫరాకు రవాణా సాధనాలూ — ఇలా ఎన్నో శ్రమ సాధనాలు ఖర్చవు తాయి. ఈ నోట్లని ప్రింటు చెయ్యడానికీ, వాటి లెక్కలు సరిచూడడానికీ, వాటిని సరఫరా చేసే వాహనాల్ని నడపడానికీ, డబ్బు సంచుల చుట్టూ కాపలాలు కాయడానికీ — ఈ రకమైన పనులన్ని టికీ, వేల కొద్దీ లక్షల కొద్దీ ఉద్యోగులు కావాలి.

'సమాజ పెట్టుబడి' విస్తరిస్తోన్న కొద్దీ, చలామణీ అయ్యే సరుకుల పరిమాణం పెరుగుతూ వుంటుంది కాబట్టి, డబ్బు పరిమాణం కూడా పెరగ వలసి వుంటుంది. రిజర్వ్‌లో వుండే బంగారం నిల్వలూ, బయట కాయితం నోట్లూ కూడా పెరగ వలసి వుంటుంది.

గత సమాజాలలో కూడా 'మారకాలు' వున్నప్ప టికీ, అక్కడ ఉత్పత్తుల్లో ఎక్కువ భాగం, మారకాల లోకి వెళ్ళదు కాబట్టి, ఆ సమాజాలలో డబ్బు నాణాలు ఎక్కువ పరిమాణంలో వుండనక్కర లేదు. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, మొత్తం ఉత్పత్తి అంతా మారకాలలో నించే నడవాలి కాబట్టి, ఈ సమాజానికి డబ్బు రాసి చాలా ఎక్కువ పరిమా ణంలో వుండాలి.

'డబ్బు' పేరుతో జరిగే ఈ ఖర్చంతా, ఉత్పత్తి తయారీకి గానీ, దాని వాడకానికి గానీ, సహజంగా అవసరమయ్యే ఖర్చు కాదు. ఇది, సమాజంలో అమ్మకాలు వుండడం వల్ల మాత్రమే అవసర మయ్యే ఖర్చు. ఈ ఖర్చు, ఉత్పత్తి 'విలువ'కి చేరదు. సమాజంలో ఉత్పత్తి అయ్యే 'మొత్తం ఉత్పత్తి రాసి'లో నించి ప్రతి ఏటా కొన్ని శ్రమ సాధనాలూ, కొంత సజీవ శ్రమా, ఈ 'డబ్బు - అవసరం' కోసం, ఖర్చయి పోతూ వుంటాయి. ఈ ఖర్చంతా 'ప్రభుత్వ ఆదాయం' ద్వారా జరుగుతూ వుంటుంది. అంటే, ప్రభుత్వానికి వచ్చే 'పన్నుల'లో నించీ.

**ఒక 'సరుకు విలువ'కీ, 'డబ్బు ఖర్చు'కీ సంబంధం ఏమిటి? —** 'సరుకు విలువ'లో నించే కొంత భాగం పన్నులుగా వెళ్తుంది. ఆ పన్నులలో నించే కొంత భాగంతో ఈ డబ్బు ఖర్చు జరుగు తుంది. అంటే, ప్రతీ విడి సరుకులో నించీ కొంత భాగం (లేదా ఇంకో రకంగా చూస్తే, మొత్తం సమాజ ఉత్పత్తిలో నించి కొంత భాగం), ఈ 'డబ్బు అవ సరం' కోసం ఖర్చవుతుంది. ఇదే, సరుకు విలువకీ, డబ్బు ఖర్చుకీ సంబంధం.

మారకాలు లేని సమాజాన్ని ఊహిస్తే, అక్కడ 'డబ్బు'తో అవసరం వుండదు కాబట్టి, 'బంగారం ముద్దల్ని' బ్యాంకులో పెట్టవలసిన అవసరం కూడా వుండదు. (అసలు బ్యాంకే వుండదు.) కాయితం నోట్లని ముద్రించవలసిన అవసరమూ వుండదు. అంటే, 'డబ్బు' పేరుతో, సమాజ ఉత్పత్తిలో ఒక పెద్ద భాగాన్ని వృధాగా ఖర్చు పెట్టవలసిన అవసరం వుండదు.

# 7. మారకం ఖర్చులు

తయారైన సరుకు, చలామణీ క్రమం లోని ఇతర దశలన్నీ గడిచాక, ఇక చిట్ట చివరికి అమ్మకం దశ లోకి చేరుతుంది. అమ్మకం పని కూడా జరిగి పోతే, చలామణీ క్రమం ముగిసి పోయినట్టే.

ఒక సరుకుని తయారు చెయ్యాలంటే, దాని తయారీకి ముందూ వెనకా కూడా కొన్ని 'మారకం ఖర్చులు' వుంటాయి. ఆ ఖర్చులు, సరుకు విలువకి చేరతాయా లేదా అనేది ఇప్పుడు చూడాలి.

బట్ట పెట్టుబడిదారుడు, బట్టని ఎప్పుడూ ఉత్పత్తి చేయిస్తూనే వుంటాడు. దాని కోసం ఒక వేపున ఉత్పత్తి సాధనాల్ని 'కొనే' పనీ, ఇంకో వేపున తయారైన బట్టని 'అమ్మే' పనీ, చేయిస్తూనే వుంటాడు. ఈ 'కొనే—అమ్మే' పనులు జరగడానికి కూడా కొన్ని ఖర్చులు అవుతాయి.

**'అమ్మకం' ఖర్చులు :**

మొదట 'అమ్మకం' పనిని తీసుకుంటే, ఆ పని జరగడానికి 'అమ్మకం స్థలం'గా ఉపయోగపడే షాపు ఒకటి వుండాలి. అందులో — కొన్ని బల్లలూ, బీరువాలూ, కుర్చీలూ, కాయితాలూ, సంచులూ, మీటరు బద్దలూ, బిల్లు పుస్తకాలూ — వగైరా సాధనాలు వుండాలి. అంతే గాక, అమ్మకం పనులు చెయ్యడానికి కొందరు మనుషులు వుండాలి. ఆ మనుషులకు పోషణ వస్తువులు వుండాలి. (ఈ మనుషులు అమ్మకం పనిలో లేకపోయినా, ఈ మనుషులకు పోషణ వస్తువులు వుండవలిసిందే. అయితే, ఈ మనుషులు, 'అమ్మకం పని'లో వుంటే, వారి పోషణ వస్తువుల ఖర్చు, 'అమ్మకం ఖర్చు' లోకి వస్తుంది. ఈ మనుషులే ఇంకో పనిలో వుంటే, ఆ పోషణ వస్తువుల ఖర్చు, ఆ ఇంకో పని కోసం అయ్యే ఖర్చులోకి వెళ్తుంది.)

షాపు గదికి అద్దే, అందులో సాధనాల అరుగుదల ఖర్చులూ, ఉద్యోగులు చేసే సజీవ శ్రమా (వారి జీతాల భాగం మాత్రమే కాదు. వారు చేసే 'మొత్తం శ్రమ' అంతా) కలిసి అమ్మకం పని జరగడానికి అయ్యే మొత్తం ఖర్చులుగా వుంటాయి. ఈ ఖర్చులతో, 'అమ్మకం పని' జరుగుతుంది.

**'కొనడం' ఖర్చులు :**

సరుకు తయారీకి ముందు 'ఉత్పత్తి సాధనాల్ని కొనే పని' కోసం కూడా కొంత ఖర్చు అవుతుంది. బట్ట తయారీ కోసం, దారం—మగ్గం వంటి సాధనాల్ని కొనాలంటే, వాటి విలువ 10 అనుకుందాం. ఆ 10 సంగతి కాదు ఇది. ఆ 10, సాధనాల కోసం అయ్యే ఖర్చు. ఆ సాధనాల్ని, వేరు వేరు స్థలాల నించి రవాణాలో తేవడానికి 2 అవుతుందనుకుందాం. ఆ 2 సంగతి కూడా కాదు ఇది. ఆ 2, సాధనాల్ని—రవాణా చేసే ఖర్చు. ఆ సాధనాల్ని తేవడానికి ఇక్కడి నించి ఒక మనిషి వెళ్ళి రావాలి. లేదా, అక్కడి నించే ఒక మనిషి వచ్చి, సాధనాల్ని ఇచ్చి వెళ్ళాలి. ఆ మనిషి రవాణాకి 3 ఖర్చు అయితే, ఆ 3 సంగతి కూడా కాదు ఇది. వస్తువుల్ని, 'కొనకుండా తెచ్చుకునే పద్ధతి' వున్నా, వాటిని తేవడం కోసం మనుషుల రవాణా ఖర్చు తప్పదు. కాబట్టి, 'కొనే పని కోసం అయ్యే ఖర్చు' అంటే, ఈ ఖర్చుల్లో ఏదీ కాదు.

వస్తువుల్ని కొనకుండా తెచ్చుకునే విధానం వుంటే, వాటి కోసం బేర సారాలు చేసే అవసరం వుండదు. 'కొనడం' అనేది వుంటే, దానితో పాటే బేర సారాలూ, దాని కోసం కొంత సమయం ఖర్చూ, వుంటాయి. ఈ సమయం ఖర్చే, కొనే పని కోసం అయ్యే ఖర్చు. కానీ, 'అమ్మకం కోసం' జరిగే ఖర్చులతో పోలిస్తే, కొనడం కోసం అయ్యే ఖర్చు, అసలు లెక్కలోది కాదు. అది, అసలు లేని దానితో సమానం. కాబట్టి, 'మారకం ఖర్చు' అన్నప్పుడు, అమ్మకం ఖర్చుని మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలి.

100 మీ. కొత్త బట్ట, అన్ని దశలూ ముగించుకుని, చివరికి అమ్మకం కోసం షాపు లోకి వచ్చిందనుకుందాం. అప్పటికి దాని విలువ 120. షాపు ద్వారా జరిగిన అమ్మకం ఖర్చు 2 అనుకుందాం. ఇప్పుడు, ఈ 2 అమ్మకం ఖర్చు కూడా మొదటి 120 కి కలిసి, బట్ట విలువ, 122 అవుతుందా? లేకపోతే, అమ్మకం ఖర్చు కూడా, ఆ బట్ట విలువగా వున్న 120 లోనే వుందా? అసలు అమ్మకం ఖర్చు అనేది, సరుకు విలువకి చేరి ఆ విలువని పెంచు

తుందా? అలా పెంచకపోతే, అమ్మకం ఖర్చుని సరుకు యజమాని, ఎలా భరిస్తాడు?

ఇక్కడ, 'శ్రమ సిద్ధాంతం' ప్రకారం సరైన జవాబు ఏమిటంటే, మారకం ఖర్చు, సరుకు విలువకి చేరదు. అది సరుకు విలువని పెంచదు. ఎందుకంటే, 'అమ్మకం' అనేది, వస్తువుని తయారు చెయ్యడానికి గానీ, వాడడానికి గానీ, సహజ అవసరం కాదు. ఏ పనులు లేకపోతే వస్తువుల తయారీ గానీ, వాడకం గానీ అసాధ్యమో, ఆ పనులు మాత్రమే సహజ అవసరాలు. వస్తువుల్ని ఒక చోటు నించి ఇంకో చోటుకి కదపకుండా (రవాణా లేకుండా) వస్తువుల్ని వాడడం సాధ్యం కాదు. కాబట్టి, రవాణా అనేది, సహజ అవసరం. కానీ, అమ్మకం అనేది, అలాంటి సహజ అవసరం కాదు. అమ్మకాలు లేకుండా కూడా వస్తువుల తయారీలూ వాడకాలూ సాధ్యమే. అమ్మకం జరిగిన వస్తువు ఎలా ఉపయోగపడుతుందో, ఆ పని జరగని వస్తువు కూడా అలాగే ఉపయోగ పడుతుంది. అమ్మే — కొనే పనులు జరిగినా జరగక పోయినా, ఆ వస్తువులు ఒక్కలాగే ఉపయోగ పడతాయి. అంటే, వస్తువుని వాడుకోవాలంటే, దాని మీద అమ్మకం జరగవలసిన అవసరం లేదన్న మాట! మారకం లేకుండానే వస్తువుల్ని వాడు కోవడం సాధ్యమైనప్పుడు, మారకం పనుల కోసం కొంత శ్రమని ఖర్చు పెట్టడం అంటే, ఆ శ్రమ అంతా ఆ సమాజంలో అనవసరంగా, వృధాగా, జరుగుతున్నట్టే అర్థం.

'మారకం' అనేది, వస్తువుతో సహజ సంబంధం లేకుండా జరిగే విషయం. అది కేవలం సామాజిక విషయం. అంటే, సమాజం ఏ పద్ధతిలో నిర్మాణమై వుందో, (మనుషులు ఎలాంటి శ్రమ సంబంధాల్లో వున్నారో), ఆ పద్ధతి వల్లనే, ఆ సమాజంలో ఉత్పత్తులకు మారకాలు వుండడం గానీ, లేక పోవడం గానీ, జరుగుతుంది.

'ప్రాచీన ఆదిమ సమాజాల'లో, ఒకే తెగలో మనుషులు ఉత్పత్తి చేసుకున్న వస్తువుల మధ్య, 'మారకాలు' వుండవు. ఎందుకంటే, అందరూ ఒకే తెగలో సమిష్టి సంబంధాల్లో వున్నారు కాబట్టి. ఆ ఉత్పత్తిదారులు, మారకాలు లేకుండానే వస్తువుల్ని వాడుకోవడం వుంటుంది.

రెండు వేరు వేరు తెగల ఉత్పత్తుల మధ్య మారకాలు జరుగుతాయి. దానికి కారణం, ఆ రెండు తెగలూ ఒకే తెగ కాకపోవడమే. ఆ మనుషులు సమిష్టి సంబంధాల్లో వుండరు కాబట్టి.

మనుషులు సమిష్టిగా ఉత్పత్తి చేసుకోవడమూ, ఆ ఉత్పత్తుల్ని సమిష్టిగా వాడుకోవడమూ జరగడానికి, 'వ్యక్తి ఆస్తి విధానం'లో అవకాశం వుండదు. అలాంటి పరిస్థితుల్లో, ఒకరు ఉత్పత్తి చేసిన వస్తువుల్ని ఇంకొకరు తీసుకోవాలంటే, ఆ పనులన్నీ 'మారకాల పద్ధతి' ద్వారా జరగవలసిందే.

ఉత్పత్తి సంబంధాలు, సమిష్టిగా లేని ఏ సమాజంలోనైనా, ఉత్పత్తుల్ని 'పంపకం' చేసుకోవ డానికి, 'మారకాల' మార్గం తప్ప ఇంకో మార్గం (అమ్మకాలూ కొనడాలూ లేకుండా ఉత్పత్తుల్ని వాడుకునే మార్గం) వుండదు.

'మారకాలు' తప్పనిసరి అయిన సమాజాలకు, 'మారకాల ఖర్చు' కూడా తప్పనిసరే. ఆ సమాజాలు, ఆ ఖర్చుని, తప్పని సరిగా భరించాలి. అంటే, ఆ సమాజాలలో తయారయ్యే మొత్తం ఉత్పత్తుల్లో కొంత భాగం, మారకాల పని కోసం ఖర్చయి పోతూ వుండాలి. ఆ ఖర్చు పోగా మిగిలిన ఉత్పత్తులనే ఆ సమాజం వాడుకోగలుగుతుంది.

ఒక సరుకు యజమానిని తీసుకుంటే (ఆ యజమాని పెట్టుబడిదారుడైనా, లేదా స్వతంత్ర ఉత్పత్తిదారుడైనా కావచ్చు. ఇక్కడ, పెట్టుబడి దారుణ్ణే తీసుకుందాం), ఆ వ్యక్తి, తన సరుకుకి సంబంధించిన మారకం ఖర్చుల్ని, ఆ సరుకులో నించే భరించాలి. అంటే, ఆ సరుకులో వున్న S లో నించి.

ఉదా: 100 మీటర్ల బట్ట విలువ 120. అందులో 20 అదనపు విలువ వుంది. ఆ బట్ట కోసం మారకం ఖర్చు 2 అనుకుందాం. మారకం ఖర్చు కూడా, 'దారం ఖర్చులాగా' సహజమైన ఖర్చే అయితే, ఆ ఖర్చు కూడా బట్ట విలువకి చేరి, ఆ విలువ 120 + 2 = 122 అవవలసిందే. కానీ, మారకం ఖర్చు సహజమైన ఖర్చు కాదు గనక, అది బట్ట విలువకి చేరదు. ఆ విలువని పెంచదు. ఈ ఉదాహరణలో, మారకం ఖర్చు 2 అయినా, 10 అయినా, ఆ ఖర్చుతో సంబంధం లేకుండా బట్ట విలువ 120 గా మాత్రమే వుంటుంది. ఆ 120 లో, 20 అదనపు విలువ వుంది కాబట్టి, మారకం ఖర్చుని ఆ అదనపు విలువలోనించి భరించవలిసిందే. ఏ

సరుకు మారకం ఖర్చుల్ని ఆ సరుకు 'అదనపు విలువ'లో నించే.

ఈ విషయాలు ఏ సరుకు యజమానికీ తెలియవు. మారకం ఖర్చు సహజమైన ఖర్చా, కాదా; ఆ సరుకు ఖర్చు సరుకు విలువ లోకి చేరుతుందా, లేదా — అని, ఈ రకం ప్రశ్నలు, ఆ మనిషికి వుండవు. పెట్టుబడిదారుడి దృష్టిలో, కొనడాలూ అమ్మడాలూ తప్పనిసరిగా జరగవలసిన విషయాలే కాబట్టి, ఆ పనుల కోసం అయ్యే ఖర్చులు కూడా, తప్పనిసరిగా అవవలసిన ఖర్చులే. ఏ సరుకు మారకం ఖర్చులు, ఆ సరుకు విలువకి చేరతాయి - అని పెట్టుబడిదారుడు అను కుంటాడు. బట్ట కోసం, దారం ఖర్చు, ఎంత తప్పనిసరి విషయంగా కనపడు తుందో, మారకం ఖర్చు కూడా అంత తప్పనిసరి విషయంగానే కనపడుతుంది. పెట్టుబడిదారుడు, సరుకు తయారైన తర్వాత, దాని ఖర్చు లన్నిటినీ లెక్కగట్టి దాని 'విలువ'ని నిర్ణయించేటప్పుడు, దాని మారకం ఖర్చుల్ని కూడా, ఒక సగటు లెక్కన, ఆ విలువకి చేర్చి, లెక్క కడతాడు.

అంటే, ఈ బట్ట వుదాహరణలో, పెట్టుబడి దారుడు, బట్ట విలువని నిర్ణయించేటప్పుడు, దాని 120 విలువకి, మారకం ఖర్చులైన 2ని కూడా కలిపి, బట్ట విలువని 122గా నిర్ణయిస్తాడా? - అలా కాదు.

పెట్టుబడిదారుడు, 100 మీటర్ల బట్ట విలువని ఎలా లెక్క కడతాడో 'మొదటి సంపుటం'లో, 'లాభం' చాప్టరులో, చూశాం. ఆ బట్ట విలువకి సంబంధించిన అంశాలలో 'వర్తక కమిషన్-5' అని ఒక అంశం వుంది. అందులోనే మారకం ఖర్చులు కూడా వుంటాయి. పెట్టుబడిదారుడి లెక్కల ప్రకారం — ఉత్పత్తి సాధనాలూ, జీతాలూ — అనే ఖర్చులతో పాటు, వడ్డీ - భూమి అద్దె - ఉత్పాదక లాభమూ - వర్తక కమిషనూ - పన్నులూ — వగైరా లన్నీ కలిసిన తర్వాతే, బట్ట విలువ 120 అయింది.

ఇక్కడ మనం 'వర్తక కమిషన్' పేరుతో వున్న **5 విలువ** గురించే చూడాలి. అమ్మకం ఖర్చు అందులోనే వుంటుంది. బట్ట పెట్టుబడిదారుడు, బట్ట మారకం పనుల్ని, తన దగ్గిరే వేరే ఉద్యోగుల ద్వారా చేయించడం గానీ, లేదా ఆ పనుల్ని ఒక వర్త కుడికి అప్పజెప్పడం గానీ, ఎలా చేసినా, సారాంశం ఒకటే. (అమ్మకానికి సంబంధించిన విషయాలన్నీ ఈ సంపుటం లోనే ఇంకా తర్వాత 'వర్తక పెట్టుబడి' చాప్టరులో వివరంగా చూస్తాం. ప్రస్తుతానికి ఇక్కడ క్లుప్తంగానే చెప్పుకుంటాం.)

మారకం పనులు వర్తకుడి ద్వారా జరగడం అంటే, ఆ పనులన్నీ వర్తకుడే చేయించాలి. అలాం టప్పుడు బట్ట పెట్టుబడిదారుడు, 120 విలువ గల బట్టని, వర్తకుడికి ఇచ్చేటప్పుడు, 115కే ఇస్తాడను కుందాం. కానీ తర్వాత వర్తకుడు దాన్ని 120కి అమ్మి, అందులో నించి '5 విలువ'ని తన కమి షన్‌గా తీసుకుంటాడు. ఆ 'కమిషన్'లో నించే వర్త కుడు 'మారకం ఖర్చులు' పెట్టాలి. ఇక్కడ మారకం ఖర్చుల్ని 2గా అనుకున్నాం కాబట్టి, దాని కోసం, ఆ 5 కమిషన్‌లో నించి 2 పోతుంది. ఆ ఖర్చు జరగ కుండా వర్తకుడు చెయ్యలేడు. 5 కమిషన్‌లో నించి 2 పోగా, ఇంకా 3 మిగులు తుంది. అది వర్తకుడికి 'లాభం'గా (వర్తకుడి ఆదాయంగా), వుంటుంది. అది, 100 మీటర్ల బట్ట ద్వారా వచ్చే 'వర్తక లాభం'.

బట్ట పెట్టుబడిదారుడు మారకం పనులన్నిటినీ తన దగ్గిరే, తన ఉద్యోగుల ద్వారానే చేయించు కుంటే, అప్పుడు కూడా ఆ బట్టకు మారకం ఖర్చు లుగా 2 అవుతుంది. ఆ ఖర్చు జరగకుండా పెట్టు బడిదారుడు కూడా చెయ్యలేడు. ఆ సరుకుకి అమ్మకం జరగాలంటే, ఆ 2 ఖర్చు జరగవలసిందే. ఆ ఖర్చు పోగా, 'వర్తక లాభం'గా మిగిలే 3, బట్ట పెట్టుబడిదారుడికే వుంటుంది. ఎలా చూసినా విషయం ఒకటే. మారకం పనులు ఎవరి ద్వారా జరిగినా, ఆ పనుల కోసం కొన్ని ఖర్చులు జరగక తప్పదు. ఆ ఖర్చులు, సరుకు విలువ లోకి చేరవు కాబట్టి, ఆ ఖర్చుల్ని సరుకు తాలూకు అదనపు విలువలో నించి తీసి ఖర్చు పెట్టవలసిందే.

బట్టని అమ్మించే వాళ్ళు, (అంటే — బట్ట పెట్టు బడిదారుడు గానీ, బట్టని అమ్మించడానికి తీసుకున్న వర్తకుడు గానీ), రోజూ ఎన్ని మీటర్ల బట్టని అమ్మి స్తారో దాన్ని బట్టే ఆ పనుల కోసం అయ్యే మారకం ఖర్చులూ, చివరికి మిగిలే వర్తక లాభమూ వుంటాయి.

'వర్తక కమిషన్' అనేది కూడా, వడ్డీ - లాభాల లాగ, అదనపు విలువలో భాగమే. అయితే, అదనపు విలువలో నించి వచ్చే వడ్డీ లాభాల వంటి ఇతర విషయాలకూ, 'మారకం' ఖర్చులకూ, ఒక తేడా వుంది. ఆ ఇతర విషయాల కోసం నిజంగా ఏ

ఖర్చులూ అవవు. 'వడ్డీ' అనే దాన్ని ఎవరు తీసుకుంటారో వాళ్ళు, దాని కోసం అంతకు ముందు ఏ ఖర్చూ పెట్టి వుండరు. వడ్డీని తీసుకోవడం అంటే, దాని కోసం ఒక ఖర్చుపెట్టి, ఆ ఖర్చుని వెనక్కి తీసుకోవడం కాదు. ఏ ఖర్చూ పెట్టకుండానే వడ్డీని తీసుకుని దాన్ని స్వంతానికి వాడుకుంటారు. లాభం సంగతీ, భూమి అద్దె సంగతీ కూడా అంతే. కానీ, 'మారకం ఖర్చు' విషయం అలా కాదు. మారకం పనులు చేయించే వాడు, దాని కోసం తప్పని సరిగా కొంత ఖర్చు పెట్టాలి. ఆ ఖర్చు పెట్టకపోతే ఆ పనులు జరగవు. ఈ వుదాహరణలో, వర్తకుడు, ఆ బట్టని అమ్మినప్పుడు, దాని అసలు విలువలో నించే 5 ని, తన కమిషన్‌గా తీసుకుంటాడు. ఆ 5 లో నించి 2 ని, మారకం పనుల కోసం ఖర్చుపెట్టవలిసిందే. మిగిలిన 3 నే లాభం గా తీసుకోగలడు. ఆ లాభం అయితే, ఏ ఖర్చూ పెట్టకుండా వచ్చిందే. దాన్నే వర్తకుడు తన స్వంతానికి వాడుకుంటాడు. కానీ, మారకం ఖర్చు అయిన 2 ని, వర్తకుడు, తన స్వంతానికి వాడుకోలేడు. అది, మారకం పని కోసం ఖర్చయి పోవలిసిందే.

ఇక్కడ గ్రహించవలసింది ఏమిటంటే — అదనపు విలువలో నించి అందే వడ్డీ లాభాల్ని స్వంతానికి వాడుకున్నట్టుగా, మారకం ఖర్చుల కోసం అందే దాన్ని స్వంతానికి వాడుకోవడం సాధ్యం కాదు. ఆ ఖర్చుతో మారకం పనులే జరగాలి. ఆ భాగం, ఆ పనుల కోసం ఖర్చయి పోతుందే గానీ ఎవరి జేబులోనూ పడదు.

బట్టలో 20 s వుందనీ, బట్ట మారకం ఖర్చు 2 అనీ అనుకుంటే, ఆ సరుకు ద్వారా మిగిలేది 18 s మాత్రమే. ఎవరు పంచుకున్నా, ఆ 18 నే పంచుకోవాలి.

బట్ట విలువలో నించి దాని మారకం కోసం 2 ఖర్చవడం అంటే, ఆ బట్టలో నించి కొంత ముక్క (2 విలువగల ముక్క) మారకం పనుల కోసం ఖర్చవుతుందని అర్థం. 'మారకం ఖర్చు' అన్నప్పుడల్లా, కొన్ని సాధనాలూ, కొంత సజీవ శ్రమా వృధాగా ఖర్చవడం — అని అర్థం. కానీ, మారకాలు తప్పని సరి అయ్యే సంబంధాల్లోనూ, ఆ పరిస్తితుల్లోనూ వున్న సమాజానికి ఈ వృధా ఖర్చు తప్పదు. 'నూతన సమాజం'లో కూడా, అది సమానత్వ సంబంధాల్లోకి వచ్చేదాకా ఈ వృధా ఖర్చు తప్పదు.

'మారకం' ఖర్చుల్లో కొన్ని సార్లు ఇంకో రకం ఖర్చు కూడా వుంటుంది. అది రిజిస్ట్రేషన్ ఖర్చు. ఒక ఇంటినో, భూమినో, ఇంకో రకం ఆస్తినో అమ్మినప్పుడు, వాటి మీద 'చట్టపరమైన హక్కులు' కూడా మారవలసి వుంటుంది. మొత్తం సమాజంలో 'రిజిస్ట్రేషన్ పనులు' జరగడానికి కొన్ని బిల్డింగులూ, కొన్ని ఇతర సాధనాలూ, కొందరు ఉద్యోగుల శ్రమా, ఖర్చు అవుతూ వుండాలి. చట్టపరమైన హక్కుల్ని మార్చడం కోసం అయ్యే ఈ ఖర్చు అంతా, అసహజమైన ఖర్చే.

ఒక ఉత్పత్తి విషయంలో జరిగేదే, సమాజంలో వున్న మొత్తం అన్ని శాఖల 'ఉత్పత్తుల రాసి' విషయాని కంతటికీ వర్తిస్తుంది.

సమాజంలో, ఒక సంవత్సరంలో తయారైన 'ఉత్పత్తుల రాసి', అనేక మంది విడి విడి పెట్టుబడిదారులకు చెంది వుంటుంది. ఆ 'రాసి'లో వున్న రకరకాల ఉత్పత్తులన్నీ, ఒకరి దగ్గిరి నించీ ఒకరి దగ్గిరికి మారాలి. అలా మారే పనులన్నీ కోటాను కోట్ల అమ్మకాల ద్వారా జరగాలి. ఆ మారకాల పనులు చెయ్యడానికి ఆ పెట్టుబడిదారు లందరి దగ్గిరా కలిసి మొత్తం 500 మంది ఉద్యోగులు (కార్మికులు) పని చేస్తున్నారను కుందాం. ఆ పనులు 100 షాపుల్లో జరుగుతున్నా యనుకుందాం. ఆ 500 మంది ఉద్యోగులూ చేసే పని ఏమిటి? — కొత్త ఉత్పత్తులు తయారు చెయ్యడమా? — కాదు. ఉన్న ఉత్పత్తులు వాడకానికి అందే వరకూ అవసరమయ్యే పనులు చెయ్యడమా? — అదీ కాదు. ఆ కార్మికులందరూ చేసే పని, ఆ ఉత్పత్తుల్ని అమ్మడమే.

సమాజానికి మారకాల విధానం తప్పనిసరి అయినప్పుడు, సమాజంలో కొంత జనాభా, కొన్ని సాధనాలూ, మారకాల పనుల్లో వుండి పోవాలి. సమాజంలో మారకాల పనే లేకపోతే, ఆ వృధా జరగదు.

మారకం ఖర్చుల్ని, 'అసలైన చలామణీ ఖర్చులు' (ప్యూర్ చలామణీ ఖర్చులు) అని కూడా అనవచ్చు. మారకం ఖర్చులు, పెట్టుబడిదారుడి చేతిలోకి వచ్చే ఆదాయాన్ని ('అదనపు విలువ'ని) తగ్గించేవిగా వుంటాయి కాబట్టి, అవి 'అనుత్పాదక మైన' ఖర్చులు. మారకం పనులు చేసే ఉద్యోగు లంతా — అనుత్పాదక కార్మికులు.

(అమ్మకానికి సంబంధించి, ఇంత వరకూ

చూసిన విషయాలే గాక, 'వర్తక పెట్టుబడి' చాప్టరులో ఇంకా కొన్ని వివరాలు చూస్తాం.)

ఇప్పటి వరకూ, 'చలామణీ ఖర్చులు'గా 7 రకాల ఖర్చుల గురించి చూశాం. 'ఉత్పత్తి క్రమం'లో గాక, దానికన్నా ముందూ వెనకా వుండే 'చలామణీ దశల్లో' జరిగే ఖర్చులు ఇవి. ఈ ఖర్చుల్లో కొన్ని ఖర్చులు ఉత్పత్తికి విలువగా చేరితే, కొన్ని ఖర్చులు అలా చేరవు.

ఒక వస్తువు, 'ఉత్పత్తి క్రమం'లో తయారై బయటపడేటప్పటికి దానికి 'కొంత విలువ' వుంటుంది. తర్వాత, సార్టింగూ - పేకింగూ - రవాణా — లాంటి అవసరమైన పనులన్నీ జరుగుతూ, ఆ ఖర్చులన్నీ కూడా మొదటి విలువకి క్రమ క్రమంగా చేరుతూ, ఆ విలువ పెరుగుతూ వుంటుంది. ఈ చలామణీ ఖర్చులు చేరకుండా ఏ వస్తువూ మార్కెట్లోకి రాదు. వాడకానికి అందదు.

ఒక వ్యక్తి, మార్కెట్‌లో ఒక వస్తువుని కొన్నప్పుడు, ఆ వస్తువు కోసం జరిగిన 'ఉత్పత్తి ఖర్చు'నీ, 'చలామణీ ఖర్చుల్నీ' కూడా చెల్లిస్తున్నాడని అర్థం. 1 మీటరు బట్టని 2 రూ.లు చెల్లించి కొంటే, ఆ 2 రూపాయల విలువలో, ఆ అన్ని ఖర్చులూ కలిసి వున్నాయని అర్థం.

బట్టకి సంబంధించిన తయారీ, స్టోరూ, రవాణాల వంటి వాటిలో ఒక్కొక్కటీ ఒక్కో 'ఉత్పత్తి క్రమం'. ప్రతీ క్రమంలోనూ కొన్ని సాధనాలూ, కొంత సజీవ శ్రమా ఖర్చువుతాయి. ప్రతీ క్రమమూ కొంత విలువని చేరుస్తుంది. ఆ పనులన్నీ ఒకే పెట్టుబడిదారుడి ద్వారా జరిగితే, వాటి అదనపు విలువలన్నీ ఆ ఒక్క పెట్టుబడిదారుడికే అందుతాయి. లేదా, ఆ దశలు వేరు వేరు పెట్టుబడిదారుల ద్వారా జరిగితే, ఏ దశలో అదనపు విలువ, ఆ దశకు చెందిన పెట్టుబడిదారుడికి అందుతుంది.

సరుకు కోసం అయ్యే ఖర్చులన్నీ సగటు కన్నా తక్కువగా గానీ, సగటు స్థాయిలోనే గానీ జరిగితే, ఆ సరుకు ద్వారా మిగిలే అదనపు విలువ, ఎక్కువగా వుంటుంది. సరుకు అమ్మకాలు చక చకా జరగక, సరుకుని స్టోరులో ఎక్కువ కాలం వుంచడమూ, దాని కోసం ఎక్కువ ఎడ్వర్టయిజ్ మెంట్లు ఇవ్వడమూ — అలా, సరుకుని అమ్మే లోగా జరిగే ఖర్చులు సగటు కన్నా ఎక్కువై పోతే, ఆ సరుకు ద్వారా మిగిలే అదనపు విలువ తక్కువగా వుంటుంది.

సరుకుని అమ్మగా వచ్చిన దాంట్లో నించి ఖర్చులన్నిటినీ తీసివెయ్యగా మిగిలేదే లాభం, అని మనకు తెలుసు. ఈ లాభం, ఉత్పత్తి అయ్యేది ఉత్పత్తి క్రమాల్లోనే. లాభానికి జన్మస్థానం ఉత్పత్తి క్రమాలే. ఆ లాభం, చేతికి అందేది అమ్మకం ద్వారా. కానీ, ఇదంతా పెట్టుబడిదారుడికి పట్టదు. అమ్మినప్పుడే లాభం వస్తుంది కాబట్టి, లాభాన్ని, అమ్మకమే ఇస్తుంది — అనుకుంటాడు. ఉత్పత్తి క్రమమూ, శ్రమా, అదనపు శ్రమా — ఇవేవీ వాడి అవగాహనలో వుండవు. 'విలువ'కి సంబంధించిన అంశాల్ని పెట్టుబడిదారుడు 'గ్రహించే' పద్ధతీ, నిజంగా గ్రహించవలసిన పద్ధతీ; సరుకు విలువని పెట్టుబడిదారుడు లెక్కకట్టే పద్ధతీ, నిజంగా లెక్క కట్టవలసిన పద్ధతీ — పూర్తిగా తేడాగా వుంటాయి.

ఇంత వరకూ చలామణీ ఖర్చుల గురించి చూశాం. ఈ జ్ఞానాన్ని కూడా కలుపుకుని ఇప్పుడు మళ్ళీ ఒక సారి 'సరుకు విలువ'ని చూడాలి. ఒక సరుకు గురించి పెట్టుబడిదారుడు ఏ యే ఖర్చులయితే చూపిస్తాడో, వాటినే మన ముందు పెట్టుకోవాలి. వాటి ఆధారం తోనే విలువ విషయాన్ని పరిశీలించాలి. వాటిలో నించి ఏ ఖర్చు ఏ కోవకు చెందుతుందో మన అవగాహన ప్రకారం విభజించాలి. అలా విభజించిన తర్వాతే, ఆ సరుకు కోసం ఖర్చయిన స్థిర - అస్థిరలూ, ఆ పైన వున్న అదనపు విలువా, తేలతాయి.

ఇప్పుడు చూడబోయే సరుకు 'సైను బట్ట' కాదు. సైను బట్టకి ఎడ్వర్టయిజ్‌మెంట్ల ఖర్చు వుండదు. ఈ సరుకుని 'పట్టు బట్ట' అనుకుందాం. దీనికి సంబంధించిన అన్ని ఉత్పత్తి క్రమాలూ ఒకే పెట్టుబడిదారుడి ద్వారా జరుగుతాయి అనుకుందాం. ఈ సరుకుని మార్కెట్లో అమ్మే వరకూ వుండే ఖర్చులన్నిటినీ చూద్దాం. ఈ లెక్కలన్నీ పెట్టుబడిదారుడు చూపించిన లెక్కలే.

**10** మీటర్ల పట్టు బట్ట విలువ 200 రూ.లు.

1. ఉత్పత్తి సాధనాలు .................. 40
2. 'ఉత్పత్తి క్రమం'లో జీతాలు .... 20
3. పేకింగూ, స్టోరూ సాధనాలు ...... 2
4. పేకింగూ, స్టోరూ జీతాలు .......... 3

5. రవాణా సాధనాలు .................... 4
6. రవాణా జీతాలు ........................ 5
7. వడ్డీ ........................................ 10
8. భూమి అద్దె .............................. 8
9. పన్నులు .................................. 7
10. వర్తక కమిషన్ ......................... 20
11. ఎడ్వర్టయిజ్‌మెంటు ................ 50
12. ఓవర్‌హెడ్ ఛార్జీలు .................. 3
(లంచాల వంటి వాటి కోసం)
13. ఉత్పాదక లాభం .................... 28

సరుకు విలువ .................... 200

పెట్టుబడిదారుడు చూపించిన ఈ లెక్కల్లో, ఈ సరుకు కోసం నిజంగా అయిన ఖర్చులు ఏవి? ఈ సరుకుకి సంబంధం లేని ఖర్చులు ఏవి? ఈ సరుకు ద్వారా వచ్చిన 'అదనపు విలువ' ఎంత? ఆ అదనపు విలువని ఎవరెవరు ఉత్పత్తి చేశారు? — ఈ విషయాలు చూడాలి. ఇది పెద్ద లెక్క లాగ కనపడినా, ఈ విషయాలు చూడడం చాలా తేలిక.

ఉత్పత్తి సాధనాలన్నీ C. జీతాలన్నీ V. C + V ల్ని తీసివేస్తే, మిగిలినవి అన్నీ S లోకి చేరవలసిందే.

ఈ బట్ట కోసం ఖర్చయిన మొత్తం ఉత్పత్తి సాధనాలు = బట్ట తయారీ క్రమంలోవి 40+ పేకింగూ, స్టోరూ పనుల కోసం 2 + రవాణా పనిలో 4= 46. ఇది, మొత్తం 3 ఉత్పత్తి క్రమాల లోనూ కలిసి ఖర్చయిన సాధనాల విలువ. ఇది, ఈ సరుకుకి, మొత్తం C.

అలాగే, 3 ఉత్పత్తి క్రమాలలోనూ ఖర్చయిన మొత్తం జీతాలు=20+3+5=28. ఇది, మొత్తం V.

C , V లు రెండూ కలిసి = 46 + 28=74.

బట్ట విలువ 200. అంటే, ఆ సరుకుని ఆ విలువకు అమ్మారనీ, ఆ సరుకు వల్ల 200 వచ్చిందనీ అర్థం.

బట్టని అమ్మగా వచ్చిన 200 లో నించీ, ఈ 74 ని తీసివెయ్యగా మిగిలినదంతా అదనపు విలువే. అది, 200 — 74 = 126. ఇది కూడా ఆ బట్ట కోసం కార్మికులు చేసిన శ్రమే.

ఈ 'అదనపు విలువ'కి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి:

వడ్డీ 10 + కౌలు 8 + పన్నులు 7+ వర్తక కమిషన్ 20 + ఎడ్వర్టయిజ్‌మెంటు 50 + ఓవర్ హెడ్ ఖర్చులు 3+ ఉత్పాదక లాభం 28= 126.

ఇక్కడ, అదనపు విలువ ఎంత రేటుతో (ఎంత శాతంతో) వుందో చూడాలంటే:

28 v —— 12 s ని ఉత్పత్తి చేస్తే,
100 v —— ఎంత s ని ఉత్పత్తి చేస్తుంది?

—— × 100 = 450%. ఇదీ, అదనపు విలువ రేటు.

అంటే 100 జీతాలు —— 450 అదనపు విలువని ఇచ్చినట్టు! ఈ 'బట్ట'కి సంబంధించిన 3 ఉత్పత్తి క్రమాలలోనూ పని చేసిన ఉత్పాదక కార్మికు లందరూ కలిసి, 28 జీతాలతో, 126 అదనపు విలువని ఇచ్చారు. అయితే ఇందులో, ఎవరు ఎంత అదనపు విలువని ఇచ్చారో ఎలా తెలుసుకోగలం? — మొత్తం 126 అదనపు విలువని, జీతాల పాళ్ళని బట్టి విభజించాలి.

ఆ 3 చోట్ల జీతాలు: 20+ 3+ 5 = 28.

**(1)** మొదటి ఉత్పత్తి క్రమంలో s ఎంత?
28 v —— 126 s ని ఇస్తే,
20 v —— ఎంత s ని ఇస్తుంది?

—— × 20 = 90s.

**(2)** స్టోరు క్రమంలో, s ఎంత?
28 v —— 126 s ని ఇస్తే,
3 v —— ఎంత s ని ఇస్తుంది?

—— × 3 = 13 s

**(3)** రవాణా క్రమంలో, s ఎంత?
28v —— 126 s ని ఇస్తే,
5v —— ఎంత s ని ఇస్తుంది?

—— × 5 = 22 s.

ఈ 3 క్రమాలలో వచ్చిన S లనూ కలిపితే,

90+ 13 + 22 = 126.

ఇక్కడ మళ్ళీ 'ప్రతి ఉత్పత్తి క్రమం'లోనూ, జీతాల్నీ, దాని అదనపు విలువనీ తీసుకుని, ఏ కార్మికుడు ఎంత అదనపు విలువని ఇచ్చాడో కూడా చూడవచ్చు.

మొదటి ఉత్పత్తి క్రమంలో 20 జీతాలతో, 90 అదనపు విలువ ఉత్పత్తి అయిందని తేలింది. ఈ 20 జీతాలతో ఎంత మంది కార్మికులు పని చేశారు? 4 గురు కార్మికులు పనిచేశారు అను కుందాం. ఆ కార్మికులు చేసే వేరు వేరు శ్రమల్ని బట్టి, వారి జీతాలు తేడాగా వుంటాయి. ఇక్కడ, జీతాల వివ రాలు ఇలా వున్నాయి అను కుందాం. ఒక కార్మికుడి జీతం 6. ఒక కార్మికుడి జీతం 4. ఇద్దరు కార్మికుల జీతాలు 5 చొప్పున. ఆ జీతాలన్నీ కలిసి 6+ 4+ 5+ 5= 20. ఈ 20 జీతాలతో, 90s ఉత్పత్తి అయితే, అదే లెక్కన, ఏ జీతం, ఎంత s ని ఇచ్చిందో చూడవచ్చు.

**(1)** 90s లో, 6 జీతం గల కార్మికుడి భాగం:

మొత్తం 20 v —— 90 s ని ఇస్తే,

6 v —— ఎంత s ని ఇచ్చినట్టు?

—— × 6v = 27s.

6 జీతం గల కార్మికుడు, 27 అదనపు విలువని ఇచ్చినట్టు అర్థం. దీన్ని రేటుగా చూస్తే, అదనపు విలువ రేటు 450%.

ఇలాగే, మిగిలిన ఉదాహరణలు కూడా.

**(2)** 90s లో, 4 జీతం గల కార్మికుడి భాగం:

—— × 4v = 18s.

**(3)** 90s లో, 5 జీతం గల కార్మికుడి భాగం:

—— × 5v = 22 s.

5v, 22 s ని ఇచ్చింది. s రేటు 450%.

**(4)** ఈ కార్మికుడి జీతం కూడా 5 కాబట్టి, ఇది 3వ ఉదాహరణలోలాగే వుంటుంది.

ఇదంతా, బట్టని తయారుచేసిన మొదటి ఉత్పత్తి క్రమం సంగతి.

ఇక్కడ, 4 గురు కార్మికుల జీతాలు =
6+ 4+ 5+ 5 = 20.

వారి అదనపు విలువలు =
27+ 18+ 22 + 22 = 90.

ఈ రకంగా, స్టోరూ - రవాణా - వగైరా ప్రతీ ఉత్పత్తి క్రమానికీ సంబంధించిన లెక్కలు చూడ వచ్చు.

మొదట, ఒక 'సరుకు'కి సంబంధించిన C + V లు తెలియాలి. సరుకుని ఎంతకు అమ్మారో తెలియాలి. ఏ 'ఉత్పత్తి క్రమం'లో ఎందరు కార్మి కులు వున్నారో, వాళ్ళ జీతాలు ఎంతెంత వున్నాయో, తెలియాలి. ఈ వివరాలు వుంటే, సరుకు ద్వారా వచ్చిన మొత్తం అదనపు విలువ ఎంత; ఏ దశలో వచ్చింది ఎంత; ఏ కార్మికుడు ఇచ్చింది ఎంత —— వగైరా వివరాలన్నీ చూడగలం.

పెట్టుబడిదారుడు, తన ఖర్చుల్ని, ఎన్ని పేర్లతో ఎన్ని రకాలుగా అయినా చూపించవచ్చు. కానీ, వాటిలో కొన్ని ఖర్చులు C లోకీ, కొన్ని ఖర్చులు V లోకీ పోగా, ఆ 2 రకాల్నీ తీసివేస్తే, మిగిలిన దంతా S. పెట్టుబడిదారుడు చూపించే లెక్కల్ని ఈ రకంగా అర్థం చేసుకోవాలి.

ఈ బట్ట ఉదాహరణలో మొత్తం S — 126. ఇదంతా ఒక్క పెట్టుబడిదారుడికే అందిందా, వేరు వేరు పెట్టుబడిదారులకు అందిందా — అనేది ప్రధాన విషయం కాదు. ఈ సరుకు కోసం వేరు వేరు ఉత్పత్తి క్రమాల్లో పని చేసిన కార్మికులందరూ కలిసి 126 విలువని పోగొట్టుకున్నారు. వారి శ్రమలో నించి అంత భాగం వారికి అందకుండా యజమానులకు పోయింది. ఇదీ ఇక్కడ ప్రధాన విషయం.

**ఇ**ప్పుడు, 'చలామణీ ఖర్చుల' గురించి **మార్క్సు** మాటలు కొన్ని చూద్దాం. ముఖ్యంగా, చలామణీ సాధనాలుగా పని చేసేవి — వెండి, బంగారం నాణాలు అయినా, కాయితం నోట్లు అయినా, వాటి కోసం, సామాజిక శ్రమలో ఎంతో భాగం

వృధాగా ఖర్చయిపోతూ వుంటుంది — అనే విషయం ఈ మాటల్లో తెలుస్తుంది.
[ఈ కొటేషన్లు, 'కాపిటల్-2' నించీ. మాస్కో ఎడిషన్, 1974.]

**1. "కొ**నుగోలు సమయం గానీ, అమ్మకం సమయం గానీ, ఎటువంటి విలువనూ సృష్టించవు" [పేజీ-134]

**2. "వెం**డి బంగారాల వంటి సరుకులు - డబ్బుగా పని చేయడమూ, ఆ రకంగా అవి కేవలం చలామణీ క్రమం లోనే వుండడమూ (నిల్వల రూపంలోనూ, రిజర్వ్ నిధుల రూపం లోనూ వున్నప్పటికీ, ఆ రకంగా చలామణీ పరిధిలో వుండడం) — అనే వాస్తవం, ఉత్పత్తి క్రమానికి సంబంధించిన, అంటే సరుకుల వుత్పత్తి క్రమంలో ప్రత్యేక సామాజిక రూపానికి సంబంధించిన ఫలితం. పెట్టుబడిదారీ వుత్పత్తి విధానంలో, ఉత్ప త్తులు, జనరల్‌గా సరుకుల రూపాన్ని పొందుతాయి కాబట్టీ ; ఆ విధానంలో, అత్యధికమైన ఉత్పత్తుల రాసి, సరుకులు గానే తయారవుతుంది కాబట్టీ ; ఆ కారణంగా, ఆ వుత్పత్తులు తప్పని సరిగా డబ్బు రూపాన్ని పొందుతాయి కాబట్టీ ; అలాగే, సామాజిక సంపదలో, సరుకులుగా మారే అత్యధిక భాగం నిరంతరం పెరుగుతూ వుంటుంది కాబట్టీ ; ఈ కారణాల వల్ల ఏం జరుగు తుందంటే — చలా మణీ సాధనాలుగా పనిచేసే వెండి బంగారాల పరి మాణాలూ ; చెల్లింపు సాధనమూ, రిజర్వ్ నిధీ, మొదలైన వాటి పరిమాణాలూ, అన్నీ పెరుగు తాయి. డబ్బుగా పనిచేసే ఈ వెండి బంగారాలు, వ్యక్తి గత వినియోగం లోకి గానీ, ఉత్పాదక విని యోగంలోకి గానీ, ప్రవేశించవు. ఇవి, కేవలం చలా మణీ యంత్రంగా పని చేసే రూపంలో బందీ అయిన సామాజిక శ్రమకు ప్రాతినిధ్యం వహించే విగా వుంటాయి. ఈ విధంగా, అనుత్పాదక రూపాన్ని ధరించే సామాజిక సంపదలోని ఈ భాగం, ఎప్పుడూ అదే స్థితిలో పడి వుండవలసిన భాగంగా వుంటుంది. ఈ వాస్తవానికి తోడు, డబ్బు అరుగు దల అనేది ఆ డబ్బుని మళ్ళీ భర్తీ చేస్తూ వుండ వలసిన అవసరాన్ని కూడా కల్పిస్తుంది. ఆ రకంగా అది, మరింత సామాజిక శ్రమ, మరింత వెండి బంగారాలుగా మారవలసిన అవసరాన్ని కల్పిస్తూ వుంటుంది.

డబ్బు సరుకులుగా వెండి బంగారాలు వుండడమంటే అర్థం, ఉత్పత్తి విధానానికి చెందిన సామాజిక రూపం నించి తలఎత్తే సమాజంలో అవ సరమయ్యే చలామణీ ఖర్చులు — అని! ఈ ఖర్చులు, సరుకుల వుత్పత్తి అనే దాని వల్ల పుట్టు కొచ్చే తప్పుడు ఖర్చులు (ప్రా ఫ్రీ. ఇది ఫ్రెంచి మాట) ఈ తప్పుడు ఖర్చులు, ఈ సరుకు విధానం అభి వృద్ధితో పాటు, మరీ ప్రత్యేకంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధితో పాటు, పెరుగుతాయి. చలా మణీ క్రమం కోసం బలిపెట్టవలసిన సామాజిక సంపదలోని ఒక భాగానికి ఇవి (ఈ ఖర్చులు) ప్రాతి నిధ్యం వహిస్తాయి."

[పేజీ 138, 139]

# ప్రశ్నలూ — జవాబులూ

**1. పత్తి, దారం, బట్ట, చొక్కా - వీటిలో, 'తయారైన ఉత్పత్తి' ఏది?**

**జ:** దేన్ని తీసుకున్నా అది, 'తయారైన ఉత్పత్తే'. పత్తి ని తీసుకుంటే, అప్పటికి అదే 'తయారైన ఉత్పత్తి'. అలాగే, ఏ ఉత్పత్తి అయినా.

**2. 'చలామణీ దశ' అంటే ఏమిటి? ఈ దశలో జరిగే పనులు ఏవి?**

**జ:** సరుకు తయారైనప్పటి నించీ, దాని అమ్మకం జరిగే వరకూ వుండే దశ, చలామణీ దశ. ఈ దశలో జరిగే పనులు - సార్టింగూ, పేకింగూ, స్టోరూ, రవాణా, చివరికి అమ్మకమూ.

**3. కుట్టు పని - 'చలామణీ దశ' లో జరిగే ఉత్పత్తి క్రమమేనా, కాదా? ఎందుచేత?**

**జ:** కాదు. అది, విడి ఉత్పత్తి క్రమం. ఎందుకంటే, కుట్టు పని లో ఏదో ఒక ముడి పదార్థం, కొత్త వస్తువుగా మారుతుంది. చలామణీ దశలో అయితే, అక్కడ జరిగే ఏ పని లోనూ వస్తువు రూపం మారదు.

**4. మీరు ఒక షాపులో 10 రూ.లతో 1 కుర్చీ కొన్నారు. దాన్ని ఒక బండి మీద వేసి మీ ఇంటికి తెచ్చారు. బండికి 2 రూ.లు ఇచ్చారు. ఇంటికి చేరిన కుర్చీ విలువ 10 రూపాయలా, 12 రూపాయలా?**

**జ:** 12. రూ.లు. రవాణా విలువ కూడా చేరి, ఆ విలువ పెరుగుతుంది.

**5. 'వాడకందారు' అంటే ఎవరు?**

**జ:** వస్తువుల్ని, ఉత్పాదకంగా గానీ, వ్యక్తిగతంగా గానీ వాడే వ్యక్తి - వాడకందారు.

**6. 'ఉత్పాదక వాడకం' అంటే ఏమిటి? 'వ్యక్తిగత వాడకం' అంటే ఏమిటి?**

**జ:** ఒక ఉత్పత్తిని (ఉదా : బియ్యాన్ని), తర్వాత అమ్మబోయే సరుకు తయారీ కోసం వాడితే, అది ఉత్పాదక వాడకం. అదే ఉత్పత్తిని, సరుకు తయారీ కోసం గాక, కుటుంబ అవసరాల కోసం వాడితే, అది వ్యక్తిగత వాడకం.

**7. 'అమ్మే, కొనే' పనులు జరగాలంటే, ఏ యే అంశాల కోసం ఖర్చులు అవుతాయి?**

**జ:** 'కొనే' పనిలో, బేరసారాల కోసం, కొంత కాలం ఖర్చు అవుతుంది. 'అమ్మే' పనిలో, షాపులో జరిగే పనుల కోసం అనేక ఖర్చులు అవుతాయి.

**8. 'అమ్మే, కొనే' పనులు చేసే ఉద్యోగుల జీతాలు ఏ ఖర్చు కిందకి వస్తాయి?**

**జ:** అనుత్పాదక పెట్టుబడిలో వుండే అస్థిర (V) భాగం కిందకి వస్తాయి.

**9. ఒక చొక్కాకి కేవలం 'ఉత్పత్తి క్రమం'లో చేరిన విలువ 10 రూ. లు. దాని మారకం ఖర్చు 4 రూ. లు. చొక్కా విలువ 10 + 4 = 14 అవుతుందా? లేక, 10 — 4 = 6 అవుతుందా? లేక, 10 గానే వుంటుందా?**

**జ:** 10 గానే వుంటుంది. ఆ 10 లో నించే 4, మారకం కోసం ఖర్చవుతుంది. అయినా, సరుకు విలువ 14 కాదు, 6 కాదు.

**10. మారకం పనులు అసహజమైన పనులు - అని, మనం ఎలా నిరూపించవచ్చు?**

**జ:** ఉత్పత్తి తయారైన తర్వాత, దాన్ని అమ్మే పని జరగకపోయినా, దాన్ని వాడుకోవడం సాధ్యమే-అనేది సహజమైన అవసరం కాదు అని నిరూపించవచ్చు.

**11. మారకం ఖర్చు - సరుకు విలువలోకి చేరదు. కానీ, సరుకు యజమాని దాన్ని సరుకు విలువలో నించే తీసి ఖర్చు చేస్తాడు. ఇది ఎలా సాధ్యం?**

**జ:** సరుకు విలువలో, 'అదనపు విలువ' భాగం ఒకటి వుంటుంది కాబట్టి విలువ లోకి చేరని ఏ ఖర్చుని అయినా, ఆ అదనపు విలువ భాగంలో నించి తీసి ఖర్చు పెట్టడం సాధ్యమే.

**12. 'కేవల చలామణీ ఖర్చులు' అంటే ఏమిటి? అవి, విలువకి చేరతాయా లేదా? ఈ విషయాల్ని, మీకు తెలిసిన ఆర్థిక శాస్త్ర ఉపాధ్యాయుల్ని అడగండి.**

**జ:** 'చలామణీ దశ'లో జరిగే స్టోరూ రవాణా వంటి ఉత్పత్తి దశల్ని వదిలివేసి, కేవలం అమ్మకం దశనే తీసుకుంటే, అది, 'కేవల చలామణీ దశ.' చలామణీకి అసలైన అర్థం అదే. ఆ ఖర్చు, సరుకు విలువలోకి చేరదు. కానీ పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులకు, 'విలువ' గురించి సరైన అర్థం తెలియక పోవడంవల్ల, మిగిలిన విషయాలు కూడా తెలియవు.

**13. ఒక సరుకులో, 2 అదనపు విలువ వుంది. ఆ సరుకు తాలూకు మారకం పనుల కోసం 4 ఖర్చయింది. అప్పుడేమవుతుంది?**

**జ:** ఆ సరుకు యజమాని నష్టపోతాడు. సాధారణంగా, మారకం ఖర్చు, సరుకులో వున్న S కన్నా ఎక్కువగా వుండడం ఎప్పుడూ జరగదు.

**14. 100 పెన్సిళ్ళ విలువ 50 రూ.లు. వాటి మారకం ఖర్చు 3 రూ.లు. ఒక్కొక్క పెన్సిల్ కి మారకం ఖర్చు ఎంత? మొత్తం 100 పెన్సిళ్ళ లోనూ 'మారకం ఖర్చు'గా ఎన్ని పెన్సిళ్ళు ఖర్చవుతాయి?**

**జ:** 1 పెన్సిల్ విలువ అర్థ రూపాయి. దాని

మారకం ఖర్చు 3 పైసలు. 100 పెన్సిళ్ళ మారకం ఖర్చుగా, 6 పెన్సిళ్ళు ఖర్చవుతాయి. ఆ ఉత్పత్తి వృధాగా పోయినట్టు అర్థం. 100 పెన్సిళ్ళనీ వాడుకోవచ్చు.

**15. ఒక వ్యక్తి కొన్ని బియ్యం కొన్నాడు. ఆ సరుకు మారకం ఖర్చుల్ని కూడా ఆ వ్యక్తి చెల్లించాడా?**

**జ:** అతను చెల్లించింది బియ్యం విలువని. ఆ విలువలో వున్న C + V + S ల కోసం. మారకం ఖర్చుల కోసం కాదు. కానీ, సరుకు యజమాని, మారకం పనుల కోసం ఖర్చు పెట్టేది, S లో భాగమే అవుతుంది.

**16. మారకం వల్ల వస్తువు విలువ పెరగదు - అనే విషయం ఏదైనా ఉదాహరణ ద్వారా చెప్పండి.**

**జ:** 5 రూ. ల నోటు ఇచ్చి, 5 రూ.ల చిల్లర తీసుకుంటే ('నోటు'కీ, 'చిల్లర'కీ 'మారకం' జరిగితే), ఆ పని వల్ల, అందులో ఏ వైపు అంశానికీ కొత్త విలువ చేరదు. ఆ మారకం తర్వాత కూడా 2 వేపులా ఎప్పటి విలువలే వుంటాయి. మారకం చేసుకున్న వ్యక్తుల శ్రమలు, మారకంలో వున్న వస్తువులకు చేరే టట్టయితే, అక్కడ ఏం జరగాలంటే, 'మారకం' పూర్తయ్యేటప్పటికి, రెండు వేపులా 5 విలువ, 5 కన్నా ఎంతో కొంత పెరిగి వుండాలి. నోటు విలువ 5 కన్నా పెరిగి, చిల్లర విలువ కూడా అలాగే పెరిగి వుండాలి. కానీ అలా జరగదు. మారకానికి ముందు వున్న విలువలే, మారకం తర్వాత కూడా వుంటాయి. అంటే, 'మారకం' కోసం జరిగిన 'ఖర్చు', ఆ అంశాలకు చేరలేదన్న మాట.

**2** వస్తువులకు బార్టరు పద్ధతిలో మారకం జరిగి నప్పుడూ, 'వస్తువు'కీ 'డబ్బు'కీ మారకం జరిగి నప్పుడూ కూడా అంతే. 1 మీ. బట్ట ధర 2 రూ.లు. 'బట్ట'కీ, 'డబ్బు'కీ మారకం జరిగితే, (బట్టని ఇచ్చి డబ్బుని తీసుకుంటే, లేదా, డబ్బుని ఇచ్చి బట్టని తీసుకుంటే), 'మారకం' ముగిసేటప్పటికి, బట్ట విలువా, డబ్బు విలువా పెరగవు. మారకం జరగక ముందు వున్న విలువలే మారకం తర్వాత కూడా వుంటాయి. అంటే, మారకం పని కోసం, బట్టని అమ్మే వేపూ, కొనే వేపూ కూడా కొన్ని 'ఖర్చులు' అయి నప్పటికీ, ఆ ఖర్చులేవీ ఆ మారకంలో అంశాలకు చేరలేదనీ, చేరవనీ అర్థం.

**17. ఉత్తరాల రిజిస్ట్రేషన్ ఖర్చు సహజమైన ఖర్చా, కాదా?**

**జ:** ఉత్తరాల విషయంలోనే కాదు, 'రిజిస్ట్రేషన్' అనేది, ఏ సందర్భంలో జరిగినా, ఆ ఖర్చు సహజంగా అవసరమైనది కాదు. ఉత్తరాలు సవ్యంగా అందే పరిస్థితులు సమాజంలో వుండి, ఉత్తరాలు అందినట్టుగా రుజువులు చూపించవలసిన అవసరాలు సమాజంలో లేకపోతే, వాటికి ఏ రిజిస్ట్రేషన్లూ అక్కరలేదు. అలాంటి పరిస్థితులు లేకపోవడంవల్లనే ఆ పని అవసరమవుతుంది.

**18. స్టోరు కాపలా మనిషి శ్రమ, ఏ కోవకు చెందుతుంది?**

**జ:** కాపలా పని, ఎక్కడ జరిగినా అది అనుత్పాదక శ్రమే.

**19. 'బొగ్గు'కి సంబంధించిన 2 ఉత్పత్తి క్రమాల వివరాలు ఇలా వున్నాయి.**

(1) బొగ్గుని తవ్విన క్రమంలో,

$$6_C+4_V+8_S = 18.$$

(2) రవాణాలో - $8_C+5_V+10_S = 23.$

బొగ్గు పెట్టుబడిదారుడికి స్వంత రవాణా ఏర్పాట్లు వుంటే, ఈ బొగ్గు లెక్కలు ఎలా వుంటాయి? అప్పుడు సరుకులో వున్న అదనపు విలువ ఎంత?

**జ:** అప్పుడు కూడా, బొగ్గు విలువ లెక్కలన్నీ ఇప్పుడు వున్నట్టే వుంటాయి. అప్పుడు కూడా అదనపు విలువ, ఇప్పుడు వున్నట్టే వుంటుంది. బొగ్గు వాడికి, స్వంత రవాణా ఏర్పాట్లు వుంటే, రవాణా S కూడా వాడికే అందడం అనే మార్పు ఒక్కటే జరుగుతుంది.

**20. మీ ఊళ్ళో ఎన్ని బట్టల షాపులు వున్నాయి? అందులో సుమారుగా ఎన్ని వేల మీటర్ల బట్ట వుండి వుండవచ్చు?**

**జ:** మా ఊరు హైదరాబాదు. ఈ ఊళ్ళో వెయ్యికి

పైగా బట్టల దుకాణాలు వుండవచ్చు. వాటిల్లో కొన్ని లక్షల మీటర్ల బట్ట వుండవచ్చు.

**21. మీరు ఒక పత్రికలో, ఆ పత్రిక గురించే ప్రకటన చూశారు. ఆ ప్రకటన ఖర్చు ఎక్కడిది?**

**జ:** ఆ పత్రిక కార్మికుల S లోది.

**22. ప్రకటనల పని ఉత్పాదకమా, అనుత్పాదకమా?**

**జ:** ప్రకటనల కంపెనీలో వుండే సంబంధాల్ని చూస్తే, అక్కడ అది ఉత్పాదకమే. ఆ కార్మికులు, 'ప్రకటన' అనే ఒక సరుకు ని తయారు చేస్తారు. అది అమ్మకం అవుతుంది. ఆ సరుకు ద్వారా ఆ కంపెనీ వాడికి S కూడా వస్తుంది. కాబట్టి, అక్కడ అది ఉత్పాదక శ్రమ. కానీ, ఆ ప్రకటన ఏ సరుకు గురించి తయారవుతుందో, ఆ సరుకు విషయంలో, అది అనుత్పాదకం. ఆ ఖర్చు, ఆ సరుకు విలువ లోకి చేరదు.

**23. బట్ట వాడు, ఒక పత్రికలో తన సరుకు ప్రకటన కోసం, బట్ట తాలూకు S లో నించి 10 తెచ్చి చెల్లించాడు. అంటే, పత్రిక వాడు కూడా బట్ట కార్మికుల S ని తిన్నాడని అర్థమా?**

**జ:** కాదు. ఆ 10 S ని, బట్ట వాడూ తినడు. పత్రిక వాడూ తినడు. దాన్ని ప్రకటన కోసం ఖర్చు పెట్టవలిసిందే. ఆ ఖర్చు తిరిగి రాదు. ఆ ఖర్చు వల్ల, బట్ట వాడి సరుకు గురించి జనాలకు తెలియడమే జరుగుతుంది. పత్రిక వాడి సంగతి చూస్తే, వాడు, 'ప్రకటన సౌకర్యం' అనే సరుకుని ఇచ్చాడు కాబట్టి, దాని కోసం 10 విలువని తీసుకున్నాడు. ఆ విలువ, $6_C + 2_V + 2_S$ గా వుందనుకుందాం. అందులో నించి పత్రిక వాడు, తను పెట్టిన $6_C + 2_V$ ల్ని వెనక్కి తీసుకుని, ఆ పైన S ని తీసుకుంటాడు. అది, పత్రిక కార్మికులదే. బట్ట కార్మికులది కాదు.

**24. మీరు ప్రకటనల్ని చూసి సరుకులు కొంటారా? లేక, అసలు ప్రకటనల్ని నమ్మరా?- ఏం చేస్తారో, ఎందుకు చేస్తారో వివరించండి.**

**జ:** ప్రకటనల్ని నమ్మవద్దు - అనుకుంటూనే, ఒక కొత్త ప్రకటన చూడగానే, "ఏమో, ఈ సరుకు కాస్త మంచిదేమో" అని దాని బుట్టలో పడుతూనే వుంటాం. అన్ని సార్లూ కాదు గానీ, కొన్ని సార్లయినా.

**25. మీ బంధువుకో, స్నేహితుడికో ఏదో ప్రమాదం జరుగుతుంది. వెంటనే మీరు మీ 'బాధ'ని, 'మర్యాద'గా టెలిగ్రామ్ ద్వారా పంపెయ్యడానికి సిద్ధపడతారు. టెలిగ్రాముల ఆఫీసుకు వెళ్ళి 'విచారాల నమూనా పట్టిక' కావాలంటారు. అందులో, 'విచారాలు పడే' పద్ధతులు చాలా వుంటాయి. "నేను గుండెల్లోంచి బాధపడు తున్నాను" అనీ, "ఆత్మ లోంచి దుఃఖిస్తున్నాను" అనీ, "మనసారా శోకిస్తున్నాను" అనీ, "రాత్రింబవళ్ళూ రోదిస్తున్నాను" అనీ - ఇలా! మీరు చక చకా ఏదో ఒకటి సెలెక్ట్ చేసేసి, డబ్బు కట్టేసి, అక్కడికా 'బాధపడే వ్యవహారం' పూర్తి చేసేసి, వెళ్ళిపోతారు. మీ బంధు మిత్రులకు ఏదో ఒక 'శుభం' జరిగినప్పుడు, మీరిచ్చే సంతోష ప్రకటనలు కూడా ఇదే ఫక్కీలో వుంటాయి. ఇదంతా 'సరైనదే' అని మీరు అనుకుంటున్నారా? లేక ఇదంతా 'పెట్టుబడిదారీ మానవ సంబంధాల కపటత్వం' అనుకుంటున్నారా? టెలిగ్రాముల ఆఫీసుల్లో వుండే రెడీ మేడ్ విచారాల, సంతోషాల పట్టికల్ని సేకరించి, వాటి గురించి చర్చించండి!**

**జ:** ఆ పట్టికల్ని సేకరించే పని ఇప్పటిదాకా చెయ్యలేదు గానీ, సేకరించాలనే వుంది. ఆ పట్టికలు తయారుచేసి వుండడం చాలా తప్పు. ఒక మనిషి తన బాధనీ, తన సంతోషాన్నీ, తన స్వంత స్పందనతో ఎలా చెప్పాలనిపిస్తే అలా చెప్పాలి. దాని కోసం ఎవరో రాసిపెట్టి వుంచిన కవిత్వాలు అక్కరలేదు.

**26. మీకు ఏదో కష్టం వచ్చింది. మీ బంధుమిత్రులెవ్వరూ రాలేదు. ఒకరో ఇద్దరో తప్ప మిగతా వాళ్ళు ఉత్తరాలు కూడా రాయలేదు. కానీ, అందరి దగ్గిర నించీ దాదాపు 100 టెలిగ్రామ్‌లు వచ్చిపడ్డాయి. ఒకరిద్దరు మీ కోసం పేపర్ల ప్రకటనల ద్వారా కూడా సానుభూతులు కురిపించారు. మీ మనసులో బాధని చెప్పుకోవాలంటే మీతో నాలుగు రోజులు గడిపే ఒక్క మనిషి కూడా లేక పోతేనేం? మీ ముందు వంద టెలిగ్రాములూ, పత్రికా ప్రకటనలూ! ఏమంటారు?**

**జ:** ఏ మంటాను? ఆ నటనల్ని నమ్మడం మానేస్తాను.

**27.** **చచ్చిపోయిన యజమాని కోసం కార్మికులు విచారిస్తూ ఇచ్చే ప్రకటనలు చూశారా? ఆ కార్మికులకు నిజంగా అంత బాధ కలిగి వుంటుందా?**

**జ:** ఆ ప్రకటనలు కార్మికులు ఇచ్చేవి కావు. యజమాని కుటుంబం వాళ్ళే వాటిని తయారు చేస్తారు.

**28.** **ఇక్కడ ఒక ప్రకటన వుంది. దాని కింద వున్న విమర్శ చూడండి.**

**ఇది ఒక 'దోమల మందు' ప్రకటన :**

"నమ్మండి - నమ్మకపోండీ, జపాన్‌లో కూడా వున్నాయి దోమలు! మా దోమల మందు వాడండి!"

**విమర్శ** : ఒక దేశం 'పెట్టుబడిదారీ దేశం' అయితే, అది ఎంత 'గొప్పదైనా', అక్కడ దోమలూ ఈగలూ తప్పవన్నమాట! దోమల కోసం పొగ చుట్టలు వాడవలిసిందే గానీ, దోమల్ని నిర్మూలించే ప్రయత్నాలు అక్కడ జరగవన్నమాట! దోమల మందులు అమ్ముకుని లాభాలు సంపాదించే పెట్టుబడిదారులు, భూమి మీద, ప్రతీ చోటా దోమలు వుండాలనే కోరతారన్నమాట. దోమల్నీ ఈగల్నీ సమూలంగా నిర్మూలించడం సాధ్యం కాదా? - ఎందుకు సాధ్యం కాదూ? అన్నిటి కన్నా ముందు 'పెట్టుబడిదారుల్ని' నిర్మూలిస్తే, తర్వాత దోమల్ని నిర్మూలించడం ఎంతసేపు? దోమలు, పందుల్ని ఆశ్రయించి బతుకుతాయి అంటారు సైంటిస్టులు. ఆ మాటల్ని కొంచెం సవరించాలి. దోమలు, 'పెట్టుబడిదారీ పందుల్ని' ఆశ్రయించి బతుకుతాయి. దోమలే కాదు, సమస్త క్రిమి కీటకాలూ, సమస్త మానవ పీడక రోగాలూ, పెట్టుబడిదారీ పోషకుల్ని ఆశ్రయించి బతుకుతాయి'.

దీని తర్వాత వున్న ప్రకటనలు చూసి వాటి మీద చిన్న చిన్న 'విమర్శలు' రాయండి - కనీసం 1, 2 వాక్యాల్లో.

**1)** ఒక ప్రకటనలో ఒక యువతి, ఒక యువకుడి వేపు వారచూపులు చూస్తూ ఇలా అంటుంది - "అతనికి ఫలానా అరిస్టోక్రాట్ దుస్తులు ఇష్టం. అందుకే అతనంటే నాకు ఇష్టం."

**జ:** నీ ఇష్టం అతనంటే కాదులే. ఖరీదైన బట్టలంటే!

**2)** "లక్షల సంగతి మరిచిపొండి. ఇప్పుడు కోట్ల గురించి ఆలోచించండి. నేడే మా లాటరీ టిక్కెట్లు కొనండి. టిక్కెట్టు 10 రూ.లు మాత్రమే. కనీసం 100 టిక్కట్లు కొనండి. కోటీశ్వరులై తీరుతారు."

**జ:** ఒకడు కోటీశ్వరుడైతే, కోట్ల మంది బికారులై తీరుతారు.

**3)** "మీ ఇంటికి ఈ రంగులు వెయ్యండి. హోదాగా, దర్జాగా వుంటారు."

**4)** "హోదా వుట్టిపడే మా బట్టలు మీకు దర్జాని ఇస్తాయి."

**జ:** ఆ మాట నిజమే. ఆ రంగులూ ఆ బట్టలూ అతి ఖరీదైనవి. హోదాలూ దర్జాలూ డబ్బు వున్నచోటే వుంటాయి కదా?

**5)** "మా స్టవ్, నిముషాలలో భోజనం తయారు చేస్తుంది. ఇప్పుడు వంట వండే శ్రమ గృహిణికి తప్పింది. మా స్టవ్‌ని ఉపయోగించండి."

**జ:** ఇక గృహిణి ఎందుకూ? ఆ స్టవ్వునే పెళ్ళాడండి!

**6)** "చూడండీ. అన్ని రంగాలలోనూ ధరలు పెరిగిపోతోన్న ఈ కాలంలో మా రవాణా సంస్థ, ధరల్ని పెంచకుండా వుంచింది. మా సంస్థ, రవాణా వ్యాపారంలో అతి పెద్దది. అత్యధిక సంఖ్యలో ట్రక్కుల సముదాయం, వందలాది కార్యాలయాలూ, వేలాది ఆఫీసర్లూ, పని వారూ. వీటి చలవే, మా తక్కువ బాడుగలు."

**జ:** వాటి చలవ అంతే కాదు. కాస్ట్ ప్రైస్‌ని తగ్గించి, రవాణా బాడుగలు తగ్గించి, ఇతర కంపెనీల కన్నా ఎక్కువ వ్యాపారం చేస్తూ, లాభాలు కుప్పతెప్పలుగా సంపాదించే అసలైన చలవ ఎవరి వల్లో తెలసిందా?

**7.** "మా సబ్బు ఫలానా సినిమా తార వాడుతుంది, మీకు తెలుసా?"

**జ:** ఆఁ, తెలుసు. మీ సబ్బువల్ల, ఆ సినిమా తారకి వచ్చిన జబ్బుల సంగతి కూడా తెలుసు. ★

# 2. పెట్టుబడిదారీ 'ధర'

పెట్టుబడిదారీ సరుకు, 'ఉత్పత్తి క్రమం'లో నించి బయటపడి, 'చలామణీ క్రమం'లో నించి నడుస్తూ మార్కెట్ కి చేరింది. ఇప్పుడు దానికి అమ్మకం జరగాలి. అది, ఇతర పెట్టుబడిదారుల చేతుల్లోకి గానీ, కార్మికుల చేతుల్లోకి గానీ పోయి, దానికి బదులుగా దాని స్వంతదారు చేతుల్లోకి డబ్బు రావాలి. ఆ డబ్బులో నించి 'పెట్టుబడి ఖర్చు'ని తీసివేస్తే 'అదనపు విలువ' మిగులుతుంది. సరుకు, అమ్ముడు పోయే వరకూ, అది ఇంకా 'చలామణీ క్రమం'లో వున్నట్టే అర్థం. అది ఇంకా స్టోరులో వుంటుంది కాబట్టి, దాని మీద ఇంకా స్టోరు ఖర్చులు అవుతూనే వుంటాయి.

మార్కెట్లో వున్న ఒక సరుకు విలువ 14 అనుకుందాం. ఆ సరుకుకి, 'ఉత్పత్తి క్రమం' లోనూ, 'చలామణీ క్రమం'లోనూ కలిసి ఏర్పడిన మొత్తం విలువ అది. ఆ విలువలో, 'ఏ క్రమం నించి చేరినది ఎంత' అనే వివరాలు ఇక్కడ అనవసరం. మొత్తం విలువ మాత్రం 14. అందులో, స్థిర 6, అస్థిర 4, అదనపు విలువ 4 — అనుకుందాం. ఈ సరుకు ఇప్పుడు 'డబ్బు గా' మారాలి.

"డబ్బు గా మారే విలువే — ధర" అని మొదటి సంపుటంలో, 'డబ్బు రూపం' చాప్టర్‌లో చెప్పుకున్నాం. 'విలువే ధర' అని మొదటి నించీ అనేక చోట్ల చెప్పుకుంటున్నాం. అంటే, ఆ సూత్రం ప్రకారం, ఈ ఉదాహరణలో, ఈ సరుకు విలువ 14 కాబట్టి, దీని 'ధర' కూడా 14 అవ్వాలి. ఈ సరుకుని అమ్మితే, దానికి బదులు 14 డబ్బు రావాలి. అంతే కదా? — కానీ, ఇక్కడ మనం, 'కాదు' అనే జవాబుతో నెమ్మదిగా ప్రారంభించాలి. ఎందుకంటే, గతం నించీ చెప్పుకుంటూ వున్న 'విలువే ధర' సూత్రం, గత సమాజాల సరుకుల విషయంలో మాత్రమే యధాతథంగా వుంటుంది గానీ, పెట్టుబడిదారీ సరుకుల విషయంలో అలా వుండదు. ఇక్కడ, విలువే ధర గా వుండడంలో, 'కొంత మార్పు' జరుగుతుంది. అందుకే, ఇక్కడ **'పెట్టుబడిదారీ ధర'** అనే ప్రత్యేకమైన మాట ఏర్పడుతుంది.

పెట్టుబడిదారీ సరుకు విషయంలో కూడా, 'విలువే ధర' అయితే, ఇక్కడితో మన పరిశీలన అంతా చాలా హాయిగా, మృదువుగా, ముగిసి పోయినట్టే. 'అర్థిక శాస్త్రాన్ని' నేర్చుకోవడంలో మనం ఇక చిట్ట చివరి అంశానికి చేరిపోయినట్టే. కానీ, ఇంకా మనం అంత చివరికి రాలేదు. పెట్టుబడిదారీ సరుకు విషయంలో, విలువా ధరా ఒకటిగా వుండవు. 'కొంత తేడాగా' వుంటాయి. అంటే, విలువ కన్నా ధర, కొంత ఎక్కువ గానో, తక్కువ గానో వుంటుంది. అది అలా ఎందుకు వుంటుందో గ్రహించడానికి మనం ఇంకా చాలా దూరం ప్రయాణం చెయ్యాలి. ఇక్కడ, 'విలువ' దగ్గిర నించి 'ధర' దగ్గిరికి చేరే పని, గత సమాజాలలో జరిగినంత సూటిగానూ, సరళంగానూ జరగదు.

ఇక్కడి నించి మన ప్రయాణం ఊహాతీత మైనన్ని కష్టాలలో పడిపోతుంది. 'విలువ దగ్గిరి నించీ ధర దగ్గిరికి' చేరేలోగా మనం — పెట్టుబడుల పరిమాణాలూ, వాటి విలువ కాంపోజిషన్లూ, వాటి టర్నోవర్లూ, కాస్ట్ ప్రైసులూ, జనరల్ లాభం రేటూ, ప్రత్యేక లాభం రేట్లూ, ఉత్పత్తి ధరలూ, సప్లయి డిమాండ్లూ, మార్కెట్ ధరలూ — వగైరా అనేకానేక ముళ్ళ కంచెల్లోంచీ, మిట్ట పల్లాల్లోంచీ దారులు చేసుకుంటూ, పడుతూ లేస్తూ నడవాలి. దారిలో, అప్పుడప్పుడూ అక్కడక్కడా కూలబడి, కాళ్ళల్లో ముళ్ళు తీసుకుంటూ, మోకాళ్ళు ఊదుకుంటూ, కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ, నడిచీ నడిచీ నడిచీ నడిచీ ఎప్పటికో చేరతాం 'పెట్టుబడిదారీ ధర'కి! తీరా అక్కడికి చేరి చూస్తే, అది 'విలువతో సమానంగా' వుండదు! విలువ కన్నా కొంత ఎక్కువ గానో తక్కువ గానో వుంటుంది! అది ఎందుకలా వుందో మన ప్రయాణానుభవాలన్నీ మనకు చక్కగానే వివరిస్తాయి. మోకాళ్ళు పగిలితే పగులుతాయి గానీ, అప్పటికి మనకు అసలు విషయం బోధ పడుతుంది. దానితో, మన కష్టాలన్నీ గట్టెక్కుతాయి.

కానీ, ఆ లోపల మన ఇబ్బందులు వర్ణనాతీతం. 'పెట్టుబడిదారీ సరుకుల విషయంలో, విలువా ధరా కొంత తేడాగా వుంటాయి' అనే మాటలు చెవిన బడ్డ మొదటి క్షణాల్లో, మనం, చాలా నిర్ఘాంతపోతాం. "విలువా ధరా ఒకటి కాదా? తేడాగా వుంటాయా? అయితే అది వైరుధ్యం కాదా? అప్పుడు, 'విలువ సూత్రం' ఏమైనట్టు?" అని గబ గబా ప్రశ్నలు కురి పిస్తాం.

ఆ ప్రశ్నలన్నిటికీ, మన సిద్ధాంతం నించి, ఒక ఆశ్చర్యకరమైన జవాబు వస్తుంది. "అవును, అది వైరుధ్యమే. వైరుధ్యాలతో నిండి వున్న పెట్టుబడిదారీ పునాది మీద ఇలాంటి వైరుధ్యాలు చాలా ఏర్పడ తాయి. అంత మాత్రాన ఇక్కడ 'విలువ సూత్రం' పనిచెయ్యదని అర్థం కాదు. అందులో ఇక్కడ కొంత మార్పు మాత్రమే జరుగుతుంది. దాన్ని గురించే మనం ఇక్కడ చూడబోతున్నాం" అనే జవాబు వస్తుంది.

ఈ జవాబు మనకు మొదట అర్థమే కాదు. "విలువే ధరగా వుండాలి కదా? ధర విషయంలో, గత సమాజాల్లో లేని మార్పు, పెట్టుబడిదారీ సమాజంలో మాత్రం ఎందుకు జరగాలి? గత సమాజాలు కూడా దోపిడీ సమాజాలే కదా? వాటి పునాదులు కూడా వైరుధ్యాలు గల పునాదులే కదా?" అని మనం మధ్యలోనే అసహనంగా ప్రశ్నిస్తాం.

మన సిద్ధాంతం మళ్ళీ శాంతంగా ఇలా ప్రారంభి స్తుంది: "గత సమాజాలలో లేని ఈ మార్పు పెట్టుబడి దారీ సమాజంలో ఎందుకు జరుగుతుందంటే, గత సమాజాలలో లేని 'సరుకు ఉత్పత్తి' అనే ప్రత్యేక పరిస్థితి పెట్టుబడిదారీ సమాజంలో వుంటుంది గనక. ఆ ప్రత్యేకతే, ఇక్కడ ధర విషయాన్ని కొంత మారు స్తుంది. పెట్టుబడుల మధ్య పోటీలూ, లాభం రేట్లూ - వంటి ఎన్నో విషయాల్ని చూసినప్పుడే అది అర్థమవు తుంది. కానీ, ఇక్కడ, 'విలువే ధరగా వుండక పోవడం' అనేది, వేరు వేరు శాఖల - సరుకుల విష యంలోనే జరుగుతుంది గానీ, 'మొత్తం సరుకుల రాసి' విషయంలో కాదు. మొత్తం రాసి కి, విలువా ధరా ఒకటే. అంటే, పెట్టుబడిదారీ విధానంలో కూడా విలువ-సూత్రం, 'మొత్తం రాసి' విషయానికి యధా తథంగానే వర్తిస్తుంది. ప్రతీ శాఖ విషయానికీ మాత్రం యధాతథంగా వర్తించదు. అంత మాత్రాన, ఇక్కడ 'విలువ సూత్రం పనిచెయ్యదని' అర్థం కాదు. అది ఇక్కడ, ఈ పునాదికి తగ్గ రూపంలోకి మారి పని చేస్తుంది. ఈ పునాదికి వున్న ప్రత్యేక పరిస్థితుల వల్ల అలా జరుగుతుంది" — ఈ విధంగా, మన సిద్ధాంతం, అసలు విషయాన్ని వివరించడానికి మొదట క్లుప్తంగా ప్రయత్నిస్తుంది.

కానీ, ఈ జవాబు కూడా మనకు వెంటనే నచ్చదు. ఇది కూడా మనకు మొదట అర్థం కాదు. ఎందుకంటే, మనం ఇంకా చూడవలసిన విషయా లేవీ చూడలేదు కాబట్టి. అందుకే మొదట ఇది హేతుబద్ధంగా కనపడదు. మన సిద్ధాంతంలో ఎక్కడో, ఎలాగో, ఏదో పొరపాటు జరిగిపోయి వుంటుందనే ఆందోళన ప్రారంభమవుతుంది. ఇంత కాలమూ సమస్యల్ని ఎంతో శాస్త్రీయంగా వివరిస్తుందనే విశ్వాసం కలిగించిన మన సిద్ధాంతం గురించి, మన హృదయాల్లో, హఠాత్తుగా సందేహపు తెరలు రెప రెప లాడతాయి. వాస్తవాల్ని గ్రహించడంలో మన సిద్ధాంతం కొంచెం దారి తప్పి పోయినట్టూ, దాని శాస్త్రీ యత కొంత దెబ్బతిని పోయినట్టూ, అది గతంలో చెప్పిన తన మాటల్ని తనే రద్దు చేసుకునే వైరుధ్యంలో పడిపోయినట్టూ, మన శత్రువుల ముందు మనం ఓడి పోతున్నట్టూ — ఇదంతా అనిపించి విలవిల్లాడతాం.

'విలువే ధర కాదు' అనే మాటలు విన్న క్షణంలో మనకు ఎందుకంత భయం కలుగు తుందంటే, అది విలువ సూత్రానికి కొంత విరుద్ధంగా వుంది గనక. 'విలువే ధర'గా వుండాలనీ, వుంటుందనీ, మనం మొదటి నించీ చెప్పు కుంటున్నాం. సరుకు అనేది, 'పాత సమాజాల సరుకు' అయినా, 'పెట్టుబడిదారీ సరుకు' అయినా, ప్రతీ విడి సరుకు విషయంలోనూ విలువే ధరగా వుండాలని మన గాఢాభిప్రాయం. పెట్టుబడిదారీ సరుకు విషయంలో అలా జరగదని విన్నప్పుడు, 'మన సిద్ధాంతం తప్పా?' అని సందే హమూ, భయమూ!

కానీ, ఈ సందేహాలూ, భయాలూ ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానంలో వున్న ప్రత్యేకత మనకు ఇంకా తెలియక పోవడం వల్లే. వెనకటి ఉత్పత్తి విధా నాల్లో ధర ఏర్పడే పద్ధతీ, పెట్టుబడిదారీ విధానంలో ధర ఏర్పడే పద్ధతీ, ఒకటి కావు. 'ధర' విషయమే కాదు, ఏ విషయం అయినా, ఆ సమాజ ప్రత్యేకతను బట్టి, దానికి తగ్గట్టే ఏర్పడుతుంది. ఇది అర్థం చేసు కోకుండా, ఒక విషయం ఏ సమాజంలో అయినా ఒకే రకంగా వుండాలని భావిస్తే, మనం ఏం చేస్తున్నా

మంటే, ప్రత్యేక పరిస్థితులతో సంబంధం లేకుండా, అన్ని చోట్లా ఒకే రకంగా, యాంత్రికంగా, ఆలో చిస్తున్నామని అర్థం. పెట్టుబడి దారీ విధానానికి వున్న ప్రత్యేక లక్షణాలేమిటో అర్థం చేసుకుంటే, ఇక్కడ వేరు వేరు శాఖల సరుకుల విషయంలో, విలువా ధరా కొంత తేడాగా ఎందుకు వుంటాయో సరిగానే అర్థం చేసుకోగలం.

'ధర'కు సంబంధించిన విషయాలన్నీ క్రమ క్రమంగా అర్థమవుతూ వున్నకొద్దీ, మన సిద్ధాంతం ఎప్పటిలాగే ఎంత వాస్తవమైనదో, ఎంత జ్ఞానవంత మైనదో, ఎంత అద్భుతమైనదో అర్థమై, దాని మీద మన విశ్వాసమూ ప్రేమా, గతంలో కన్నా గాఢంగా స్థిరపడతాయి. మొదట జరగవలసింది, విషయా లన్నీ సరిగా అర్థం చేసుకోవడం.

సరుకులకు 'విలువ' ఏర్పడే విధానం, ఏ సమా జంలో అయినా ఒకటే. కానీ 'ధర' ఏర్పడే విధానం ఏ సమాజంలో అయినా ఒకటి కాదు. అదే ఇప్పుడు చూడాలి.

'సరుకు' విషయంలో, గత సమాజాలకూ, పెట్టు బడిదారీ సమాజానికీ, తేడా ఏమిటి? — ఏమిటంటే, గత సమాజాలలో, మొత్తం ఉత్పత్తి నంతా అమ్మకాల కోసమే చేయించే పరిస్థితి వుండదు. అక్కడ, మొత్తం ఉత్పత్తుల రాసిలో అత్యధిక భాగం 'అమ్మకాలు లేకుండానే' వాడకం అవుతుంది. అక్కడ, అమ్మకాల లోకి వెళ్ళేది అతి తక్కువ భాగమే. ఆ తక్కువ భాగానికి కూడా, 'అవసరాల దృష్టి తోనే' అమ్మకాలు జరుగుతాయి.

'అవసరాల దృష్టితో అమ్మకాలు' అంటే, ఒక సరుకుని అమ్మి, ఆ డబ్బుతో, అవసరమైన ఇంకో సరుకుని కొని దాన్ని వాడేసుకుంటే, మొదటి సరు కుని అవసరం కోసమే అమ్మినట్టు అవుతుంది. అలా జరిగితే, ఆ సరుకుని ఉత్పత్తి చేయించడమూ అమ్మ డమూ, డబ్బుని కూడబెట్టడం కోసం అవదు. గత సమాజాలు కూడా దోపిడీ సమాజాలే అయినా, అక్కడ కూడా డబ్బుని కూడబెట్టడం వున్నా, ఆ ఉత్పత్తి విధానాలు, మొత్తం ఉత్పత్తినంతా అమ్మకాల కోసమే, డబ్బుతో డబ్బుని పెంచడం కోసమే, జరిగిన ఉత్పత్తి విధానాలు కావు. దాని వల్ల అక్కడ 'పోటీ' గానీ, పోటీ వల్ల తలెత్తే సమస్యలు గానీ, వుండవు. కానీ, పెట్టుబడిదారీ విధానాన్ని తీసుకుంటే, అది పూర్తిగా అమ్మకాల కోసమే సరుకుల్ని ఉత్పత్తిచేసే విధానం. ఈ విధానంలో మొత్తం సరుకు అంతా 'అమ్మకాలలో నించే' నడవాలి. పెట్టుబడిదారుడు అనే వాడు, 'లాభం' సంపాదించడానికే, పెట్టుబడి ని పెంచడానికే, సరుకుని ఉత్పత్తి చేయిస్తాడు. అంటే, ఈ విధానంలో, గత సమాజాలలో లేని 'పెట్టుబడీ, లాభమూ, డబ్బుని పెంచడమూ' అనే విషయాలు, ప్రత్యేక రూపాలతో ప్రవేశిస్తాయి.

'పెట్టుబడి పెట్టడం' అనేది జరిగిందంటే, పెట్టు బడి కి 'లాభం' రావాలి. ఆ లాభం, ఎంతో కొంత రావడం కాదు. ఇతర పెట్టుబడిదారులకు ఎంత శాతం లాభం వస్తుందో దాదాపు దానితో సమానంగా రావాలి. అంతకన్నా ఎక్కువగా వస్తే కూడా మంచిదే. కానీ, అంతకన్నా తక్కువగా మాత్రం రాకూడదు. కానీ, అది సాధ్యమా? అన్ని శాఖల పెట్టుబడులూ, లాభాల్ని ఒకే స్థాయిలో ఉత్పత్తి చేస్తాయా? తేడాలు ఉండవా?

లాభాల్ని ఉత్పత్తి చెయ్యడంలో తేడాలు ఉండి, ఎవరి లాభమే వాళ్ళకి అందితే, లాభాల్ని ఒకే రకంగా తీసుకోవడం ఎలా సాధ్యం? — ఎలా సాధ్యమో తర్వాత చూస్తాం. కానీ, అది సాధ్యమై తీరాలి! ఏ శాఖలోనైనా '100 పెట్టుబడి'కి వచ్చే లాభం ఒకే రకంగా వుండితీరాలి! ఈ నిబంధనే, సరుకుల ధరలు, విలువల నించీ పైకో, కిందకో తప్పిపోయే పరిస్థితులు కల్పిస్తుంది. ఇది పెట్టుబడిదారీ విధానంలో తప్పనిసరి అవుతుంది.

మరి మనం, పెట్టుబడిదారీ సరుకుల విష యంలో కూడా మొదటి నించీ, 'విలువా ధరా ఒకటే' అన్నట్టు ఎందుకు చెప్పుకుంటూ వచ్చాం? — ఎందు కంటే, జవాబు చాలా చిన్నదే. ఒక సిద్ధాంతాన్ని నేర్చు కునేటప్పుడు, దాన్ని దశల వారీగా నేర్చుకోవాలి. మొదటి దశలో నేర్చుకున్నదాన్ని, తర్వాత దశల్ని నేర్చు కునేటప్పుడు, ఆ దశలకు తగ్గట్టుగా సవరించు కుంటూ వుండాలి. అలాంటి సవరణలన్నీ అయ్యాక, చివరకి కనపడేదే అసలు సిద్ధాంతం. పెట్టుబడిదారీ సరుకు విషయంలో కూడా, 'విలువే ధర' అనే జనరల్ సూత్రాన్ని మొదటి నించీ తీసుకోకపోతే, 'విలువ సూత్రాన్ని' అర్థం చేసుకోవడమే సాధ్యం కాదు. గతంలో ఉదాహరణలన్నిటినీ అలా తీసుకున్నందు వల్ల, ఆ సందర్భాలలో జరిగిన తప్పేమీ లేదు. పెట్టు బడిదారీ ధర దగ్గిరికి ఇప్పుడే వచ్చాం గనక, అసలు విషయాన్ని ఇప్పుడు సరైన పద్ధతిలో చూస్తాం.

ఇప్పుడు మొట్ట మొదట చూడవలసిన ప్రశ్న —

వేరు వేరు శాఖల పెట్టుబడులు, అదనపు విలువల్ని, సమానమైన సైజుల తోటే ఉత్పత్తి చేస్తాయా, ఎక్కువ తక్కువలుగా ఉత్పత్తి చేస్తాయా — అనేది. సైను బట్ట శాఖ నీ, పంచదార శాఖ నీ, తీసుకుందాం. (లేదా, ఏ 2 వేరు వేరు శాఖల్ని అయినా.) 'బట్ట శాఖ' నించి 100 పెట్టుబడి నీ, 'పంచదార శాఖ'నించి 100 పెట్టుబడి నీ, ఇలా ఆ వేరు వేరు శాఖల నించి సమాన పెట్టుబడుల్ని తీసుకుందాం. అలాగే, ఆ పెట్టుబడులు పనిచేసే కాలాల్ని కూడా సమానంగానే తీసుకోవాలి. ఒక రోజు ని గానీ, ఒక వారాన్ని గానీ, ఒక నెల ని గానీ. వేరు వేరు శాఖల్లో, సమాన పెట్టు బడులు, సమాన కాలాల్లో, సమాన అదనపు విలువ లనే ఉత్పత్తి చేస్తాయా? — ఇదీ ప్రశ్న!

అలా జరగదు. సమాన పెట్టుబడులు, సమాన కాలాల్లో కూడా, అదనపు విలువల్ని సమానంగా ఉత్పత్తి చెయ్యవు. అసమానంగానే ఉత్పత్తి చేస్తాయి. అంటే, ఎక్కువ తక్కువలుగా. ఒక చోట ఎక్కువా, ఇంకో చోట తక్కువా. ఎందుకంటే, ఉత్పత్తి క్రమాలకు సంబంధించిన పరిస్తితులు అన్ని శాఖల్లోనూ ఒకే రకంగా వుండవు. అనేక తేడాలతో వుంటాయి. దాని వల్లనే, వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ పరిమాణాలు, ఒకే రకంగా గాక, తేడాలుగా వుంటాయి. ఒక శాఖలో 100 పెట్టుబడి, ఒక రోజులో, 20% అదనపు విలువని ఉత్పత్తి చేస్తే, ఇంకో శాఖలో 100 పెట్టుబడి, అదే కాలంలో, 30% అదనపు విలువని ఉత్పత్తి చెయ్యవచ్చు. లేదా 20% కన్నా కూడా తక్కువగా చెయ్యవచ్చు. ఈ రకంగా, అనేక తేడాలు వుంటాయి.

ఇది ఇలా వుండగా, దీనితోపాటు ఇంకో పరిస్తితి వుంటుంది. పెట్టుబడులకు లాభాలు రావలసింది, ఏ పెట్టుబడి ఎంత అదనపు విలువని ఉత్పత్తి చేసిందీ — అనే దాన్ని బట్టి కాదు; ఏ పెట్టుబడి ఎంత సైజుతో వుందీ — అనే దాన్ని బట్టి!

అంటే, ఇక్కడ ప్రధానంగా 2 విషయాలు వున్నాయి. **(1)** వేరు వేరు శాఖల్లో పెట్టుబడులు, అదనపు విలువల్ని ఒకే పరిమాణాల్లో గాక, ఎక్కువ తక్కువలుగా ఉత్పత్తి చేస్తాయి. **(2)** ఆ పెట్టుబడులకు, లాభాలు రావలసింది, అవి ఉత్పత్తి చేసే అదనపు విలువల్ని బట్టి కాదు, ఆ పెట్టుబడుల సైజుల్ని బట్టి. — ఈ 2 పరిస్తితులూ కలిసి, పెట్టుబడిదారీ ధరల్ని విలువల నించి కొంత ఇటో అటో తప్పిపోయేలాగ చేస్తాయి. ఇది ఎలా జరుగుతుందో చూడాలంటే, పెట్టుబడిలో విలువ కాంపోజిషనూ, పెట్టుబడి పరిమాణమూ — అనే అంశాలతో ప్రారంభించాలి. 'విలువ కాంపోజిషన్' అంటే, పెట్టుబడిలో వుండే స్తిర-అస్తిరల పాళ్ళు. పెట్టుబడి లో ఈ 'విలువ పాళ్ళ' గురించి ఇంతకు ముందు కూడా కొన్ని సార్లు చూశాం.

ఇక్కడి నించీ మన కష్టాలు ప్రారంభం!

# పెట్టుబడి కాంపోజిషన్

'సైను బట్ట'ని ఉత్పత్తిచేసే పరిశ్రమలో, అప్పటి సాధారణ ఉత్పాదక శక్తిని బట్టి, ఒక 100 పెట్టుబడిలో, స్తిర మీద 10, అస్తిర మీద 90, వుండాలను కుందాం. అంటే, 10 విలువగల ఉత్పత్తి సాధనాల మీద పనిచెయ్యడానికి, 90 జీతాల్ని తీసుకునే 'శ్రమ శక్తి' కావాలి — అని అర్థం. ఆ శ్రమ శక్తి ద్వారా జరిగిన అవసర శ్రమా అదనపు శ్రమా కలిసి (V + S లు కలిసి) 10 విలువ గల ఉత్పత్తి సాధనాల మీద పని చేస్తాయి. ఆ 90 జీతాలతో ఎంత మంది కార్మికులు పనిచేస్తారో (కార్మికుల సంఖ్య) ఇక్కడ అవసరం లేదు. ఆ బట్టని ఉత్పత్తి చేసే పనిలో మొత్తం పెట్టు బడి ఎంత వుంది; 2 వేలు వుందా, 5 వేలు వుందా — అనే వివరాలు కూడా అవసరం లేదు. పెట్టుబడి ఎంత వుంటే అంతలోనే, దాని స్థిర అస్తిరల పాళ్ళు, 10: 90 గా (1: 9 గా) వున్నాయనీ, ఆ పనికి సంబం ధించిన సాధారణ ఉత్పాదక శక్తిని బట్టి ఆ పాళ్ళు అలా ఏర్పడ్డాయనీ అర్థం. ఇది 'నేత పని'లో వున్న పెట్టుబడి కాంపోజిషన్.

నేత పనిలో పెట్టుబడి కాంపోజిషను 10: 90 గా వుంది కాబట్టి, యంత్రాల్ని ఉత్పత్తిచేసే పనిలో కూడా (యంత్రాల శాఖ లో కూడా) పెట్టుబడి కాంపోజిషను, 10: 90 గానే వుంటుందా? ఇక్కడ కూడా 10 విలువ గల స్తిర మీద, 90 విలువ గల అస్తిర పని చెయ్యాలా? ఇతర అన్ని శాఖల్లోనూ కూడా స్తిర, అస్తిరల పాళ్ళు 10: 90 గానే వుండాలా? అంటే, అన్ని శాఖల లోనూ పెట్టుబడుల కాంపోజిషన్లు ఒకే రకంగా

వుంటాయా? — అలా వుండవు. పెట్టుబడి కాంపొజిషన్ అనేది, ఆ పెట్టుబడితో తయారయ్యే వస్తువు రకాన్ని బట్టి వుంటుంది. అంటే, ఆ వస్తువు నిర్మాణానికి కావలసిన సాంకేతిక అవసరాల్ని బట్టి. అన్ని వస్తువుల సాంకేతిక అవసరాలూ ఒకే రకంగా వుండవు. కాబట్టి, ఆ వస్తువుల కోసం పనిచేసే పెట్టుబడుల్లో స్థిర - అస్థిర ల పాళ్ళు కూడా ఒకే రకంగా వుండవు. ఒక రకం వస్తువు విషయంలో స్థిర ఎక్కువగా వుండి అస్థిర తక్కువగా వుంటే, ఇంకో రకం వస్తువు విషయంలో స్థిర తక్కువగావుండి అస్థిర ఎక్కువగా వుండవచ్చు.

కుట్టు పని ని తీసుకుంటే, సైను బట్టతో చొక్కాని కుట్టేటప్పుడు ముడి పదార్థానికి (బట్ట కి) వుండే విలువ కన్నా, పట్టు బట్టతో చొక్కాని (అదే సైజు చొక్కాని) కుట్టేటప్పుడు, ముడి పదార్థానికి వుండే విలువ ఎక్కువగా వుంటుంది. 2 చోట్లా కుట్టు పని దాదాపు ఒకే రకంగా వుంటుంది. లేదా, కుట్టు పనుల్లో కొన్ని తేడాలు వున్నా, ఆ తేడాలు మరీ ఎక్కువగా వుండవు. ముడి పదార్థం విలువ తక్కువగా వున్న చోట స్థిర తక్కువగానూ, ఆ విలువ ఎక్కువగా వున్న చోట స్థిర ఎక్కువగానూ వుంటాయి. అంటే, అస్థిరలు దాదాపు ఒకే రకంగా వున్నా, స్థిరలు చాలా తేడాగా వుంటాయి.

ఒకే రకం ఆభరణాల్ని వెండితో చేసే పనిలో కన్నా బంగారంతో చేసే పనిలో స్థిర ఎక్కువగా వుంటుంది. అస్థిరల్లో కూడా కొంత తేడా వున్నా, ఆ తేడా మరీ ఎక్కువగా వుండదు.

బొగ్గుని తవ్వే పనిలో కన్నా, లోహాల్ని తవ్వే పనిలో, స్థిర ఎక్కువగా ఉంటుంది.

యంత్రాల్ని ఉత్పత్తిచేసే పనిలో స్థిర మీద చాలా ఎక్కువ విలువ అవసరమైతే, కుట్టు — లాంటి పనిలో స్థిర మీద చాలా తక్కువ విలువే సరిపోతుంది. — ఈ విధంగా, ఏ వేరు వేరు రకాల వస్తువుల్ని తీసుకున్నా, వాటి ఉత్పత్తి క్రమాల్లో పాల్గొనే స్థిర — అస్థిరలు, ఒకే పాళ్ళల్లో వుండవు. అలా వుండడం సాధ్యం కాదు. వేరు వేరు రకాల వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యడంలో, స్థిర - అస్థిరల పాళ్ళు, వేరు వేరుగానే వుంటాయి. ఇది మొదట గ్రహించవలసిన విషయం.

వేరు వేరు శాఖల్లో పెట్టుబడుల కాంపొజిషన్లు తేడాగా వుండడం వల్ల ఏం జరుగుతుంది? — ఏం జరుగుతుందంటే, ఆ పెట్టుబడులు ఉత్పత్తి చెయ్యగలిగే 'అదనపు విలువల రాసులు' తేడాగా అవుతాయి.

2 రకాల సరుకుల్ని చూద్దాం.

ఫలానా రకం 'యంత్రాల్ని' ఉత్పత్తి చెయ్యడానికి, ఆ పనిలో అప్పుడు వున్న సాధారణ ఉత్పాదక శక్తి ని బట్టి, కనీసం 10 వేల పెట్టుబడి కావాలనుకుందాం. ఆ పెట్టుబడిలో స్థిర, అస్థిర ల పాళ్ళు, 9,000 : 1,000 = 9 : 1.

'చొక్కాల్ని' ఉత్పత్తి చెయ్యడానికి, ఆ పనిలో అప్పటి సాధారణ ఉత్పాదక శక్తి ని బట్టి, కనీసం 2 వేల పెట్టుబడి కావాలనుకుందాం. ఈ పెట్టుబడిలో స్థిర, అస్థిరల పాళ్ళు, 200 : 1800 = 1 : 9.

(ఈ ఉదాహరణల్లో తీసుకున్న సంఖ్యలు ముఖ్యం కాదు. విషయాలే ముఖ్యం. వేరు వేరు వస్తువుల కోసం అవసరమయ్యే స్థిర-అస్థిరలు ఒకే రకంగా వుండవనీ, తేడాగా వుంటాయనీ, చెప్పుకోవడానికే ఈ ఉదాహరణలు. ఆ విషయాన్నే తీసుకోవాలి. ఉదాహరణల్లో చెప్పే సంఖ్యలు కొంచెం సహాయానికి మాత్రమే.)

వేరు వేరు శాఖల్లో పనిచేసే ఈ 2 పెట్టు బడులూ వేరు వేరు 'విలువ పాళ్ళ'తో (వేరు వేరు కాంపొజిషన్లతో), వున్నాయి కదా? ఈ పెట్టుబడులు ఉత్పత్తి చేసే 'అదనపు విలువ రాసులు' ఎలా వుంటాయి? — ఈ విషయం చూడటానికి, ఇక్కడ మొత్తం పెట్టుబడులూ, మొత్తం స్థిరలూ, మొత్తం అస్థిరలూ, అక్కర లేదు. ఈ వేరు వేరు శాఖల పెట్టుబడుల నించి చిన్న చిన్న 'శాంపిల్' ముక్కలు తీసుకుంటే చాలు. మొదటి పెట్టుబడి నించి ఒక 100 నీ, రెండో పెట్టుబడి నించి కూడా ఒక 100 నీ. ఆ శాంపిల్ ముక్కల్లో కూడా పెద్ద పెట్టుబడుల లక్షణాలే వుంటాయి.

'యంత్రాల' పెట్టుబడిలో — $9_C : 1_V$

'చొక్కాల' పెట్టుబడిలో — $1_C : 9_V$

ఇలా, వేరు వేరు కాంపొజిషన్లు గల ఈ పెట్టుబడుల ద్వారా ఉత్పత్తి అయ్యే సరుకుల విలువలూ, వాటిలో అదనపు విలువలూ, ఎలా వుంటాయో ఇప్పుడు చూడాలి.

పెట్టుబడుల విలువ పాళ్ళల్లో తేడాల వల్ల వచ్చే ఫలితాల్ని చూడాలంటే, ఆ ఒక్క విషయాన్నే తేడాగా వుంచి, మిగిలిన విషయాలన్నిటినీ సమానంగా వుంచాలి. అంటే, పెట్టుబడుల సైజుల్నీ, అవి పనిచేసే

కాలాల్నీ, వాటి అదనపు విలువ రేట్లనీ, అలాంటి ఇతర అంశాలన్నిటినీ సమానంగా వుంచాలి.

ఇక్కడ మనం తీసుకున్న 2 పెట్టుబడులూ వంద, వందే. అంటే 2 పెట్టుబడులూ ఒకటే సైజు. అవి పనిచేసే కాలాలు కూడా ఒకటే అనుకుంటాం. 2 చోట్లా ఒక్కొక్క రోజు చొప్పునో, ఒక్కొక్క వారం చొప్పునో, రెంటికీ ఏదో ఒకే కాలాన్ని తీసుకుంటాం. వాటి 'అదనపు విలువ రేట్ల'ని (శాతాల్ని) కూడా 2 చోట్లా 100% గానే తీసుకుందాం. అన్ని పరిస్తితులూ ఒక్కలాగే వుండి, కాంపోజిషన్లు మాత్రమే తేడాగా వుంటే ఏం జరుగుతుందో చూడాలి.

మొదటి పెట్టుబడిలో అస్థిర 10 కాబట్టి, అది, 100% అదనపు విలువ రేటుతో, 10 అదనపు విలువని ఇస్తుంది. రెండో పెట్టుబడిలో అస్థిర 90 కాబట్టి, అది, 100% అదనపు విలువ రేటుతో, 90 అదనపు విలువని ఇస్తుంది. — ఈ రకంగా, వేరు వేరు శాఖల్లో, విలువ కాంపోజిషన్లు తప్పని సరిగా తేడాగా వుంటాయి కాబట్టి, అవి ఇచ్చే అదనపు విలువలు కూడా తేడాగానే వుంటాయి.

నిజానికి, వేరు వేరు శాఖల పెట్టుబడుల మధ్య, తేడాగా వుండేవి, విలువ కాంపోజిషన్లే కాదు, అన్ని విషయాలూ తేడాగానే వుంటాయి. పెట్టుబడుల పరిమాణాలూ, అవి పనిచేసే కాలాలూ, వాటి అదనపు విలువ రేట్లూ — ఇలా అన్ని విషయాలూ తేడాగానే వుంటాయి. అయితే, ఆ తేడాల్లో కొన్ని అంశాలు, ఒక దానితో ఒకటి కొంత వరకూ సరిపుచ్చుకుంటూ కూడా వుంటాయి. ఒక శాఖలో, ఉత్పాదక శక్తి తక్కువగా వున్నా, పని దినం ఎక్కువగా వుండవచ్చు. ఇంకో శాఖలో, మొదటిదే ఎక్కువగా వుండి, రెండోది తక్కువగా వుండవచ్చు. దాని వల్ల, ఆ 2 శాఖల్లోనూ తేడాలు కొంత తగ్గే పరిస్తితి ఏర్పడవచ్చు. ఈ రకంగా కొన్ని రకాల తేడాలు, ఒక దాన్ని ఒకటి తీసివెయ్యగలుగుతాయి. కానీ, ఆ రకంగా తేడాలు తగ్గిపోయే పరిస్తితులు ఎంత వున్నా, వేరు వేరు శాఖల మధ్య అసలు తేడాలే లేని పరిస్తితి మాత్రం ఎప్పుడూ వుండదు. తేడాలు ఏదో ఒక స్థాయిలో తప్పనిసరే కాబట్టి, ఆ శాఖల్లో అదనపు విలువల పరిమాణాలు కూడా తేడాగానే అవుతాయి.

అదనపు విలువల్ని ఎక్కువ తక్కువలుగా వుత్పత్తి చెయ్యడంలో, అనేక అంశాల పాత్ర వున్నా, వాటిలో ప్రధానమైనది పెట్టుబడుల కాంపోజిషన్ల పాత్రే. ఏ పెట్టుబడి లోనైనా, అదనపు విలువ ఉత్పత్తి అయ్యేది, అస్థిర ద్వారానే గానీ స్థిర ద్వారా కాదు. మిగతా అంశాలు సమానంగా వుండి, అస్థిర ఎక్కువగా వున్న చోట ఎక్కువ అదనపు విలువా, తక్కువగా వున్న చోట తక్కువ అదనపు విలువా ఉత్పత్తి అవుతాయి.

వేరు వేరు శాఖల్లో వుండే అదనపు విలువల్ని, వాటి అస్థిరలతో పోల్చి శాతాలుగా చూస్తే, 2 చోట్లా ఒకే శాతం (ఒకే అదనపు విలువ రేటు) కనపడితే కనపడవచ్చు. కానీ, వాటి 'రాసుల్ని' చూస్తే, అవి, అస్థిరల్లో తేడాలకు తగ్గట్టుగా, తేడాగానే వుంటాయి. ఈ రకంగా, అదనపు విలువల విషయంలో, పెట్టుబడుల కాంపోజిషన్ల పాత్రే ప్రధానమైనదిగా వుంటుంది.

ఇక్కడ సారాంశం ఏమిటంటే — <u>ఒకే సైజు గల పెట్టుబడులు, ఒకే సైజు గల అదనపు విలువల్ని వుత్పత్తి చెయ్యవు</u> — అనేది.

అలాంటి పెట్టుబడుల ద్వారా తయారయ్యే సరుకుల విలువలు ఎలా వుంటాయో కూడా ఇప్పుడు చూడాలి.

A, B శాఖలనే మొత్తం సమాజంగా అనుకుందాం.

2 శాఖల్లోనూ పెట్టుబడులు వంద, వందే.

A పెట్టుబడి కాంపోజిషన్ — 9 : 1

B పెట్టుబడి కాంపోజిషన్ — 1 : 9

రెండు చోట్లా అదనపు విలువ రేటు 100%

A సరుకు = $90_c + 10_v + 10_s = 110$

B సరుకు = $10_c + 90_v + 90_s = 190$

ఇప్పుడు, ఈ 2 సరుకుల్నీ వాటి విలువల ప్రకారమే అమ్మడం జరిగితే, అంటే <u>వాటి విలువలే వాటికి ధరలుగా వుంటే</u>, మొదటి సరుకుని 110 కీ, రెండో సరుకుని 190కీ అమ్మాలి. అప్పుడు మొదటి పెట్టుబడిదారుడికి, 100 పెట్టుబడి తిరిగివచ్చి, దాని ద్వారా 10 అదనపు విలువ వస్తే, రెండో పెట్టుబడిదారుడికి, 100 పెట్టుబడి తిరిగి వచ్చి, దాని ద్వారా 90 అదనపు విలువ వస్తుంది. ఇక్కడే అసలు సమస్య ప్రారంభమవుతుంది. ఒక రకం సరుకుని ఉత్పత్తి చేయిస్తే, 10% లాభం. ఇంకో రకం సరుకుని ఉత్పత్తి చేయిస్తే, 90% లాభం!

ఇలాగే జరుగుతూ వుంటే, ఒక శాఖలో 10% లాభం సంపాదించే పెట్టుబడి, ఇంకో శాఖలో 90%

లాభం సంపాదించే పెట్టుబడిని చూస్తూ, ఎప్పటిలాగే తన పాత రకం సరుకుల్నే ఉత్పత్తి చేసుకుంటూ, తన పాత శాఖలోనే కదలకుండా వుండిపోతుందా? ఏ పెట్టుబడి అయినా, 'పెట్టుబడి—పుటక' పుట్టాక, దాని అసలు లక్ష్యం, ఎక్కువ లాభాలు సంపాదించడమే. ఇంకో రకం వస్తువుల్ని తయారుచేయించి అమ్మితే 90% లాభం సంపాదించే అవకాశం అవతల కనపడుతూ వుంటే, ఎంత వెర్రిబాగుల పెట్టుబడి అయినా, 10% లాభాన్ని ఇచ్చే శాఖలోనే కదలకుండా కూర్చోదు. కాబట్టి, అప్పుడేం జరుగుతుంది? — తక్కువ లాభాల్ని ఇచ్చే శాఖల పెట్టుబడుల్లో నించి కొంత భాగం గానీ, లేదా ఆ శాఖల్లో లాభాలు కొత్త పెట్టుబడులుగా మారవలసినప్పుడు ఆ కొత్త పెట్టుబడి గానీ, ఎక్కువ లాభాల్ని ఇచ్చే శాఖల్లోకే వెళ్తాయి. అంటే, ఆ ఎక్కువ లాభాల్ని ఇచ్చే సరుకులనే ఉత్పత్తి చెయ్యడం ప్రారంభిస్తాయి. ఇది ఇలా వుండగా, ఎక్కువ లాభాల్ని ఇచ్చే శాఖల్లో లాభాలు కూడా, కొత్త పెట్టుబడులుగా మారే టప్పుడు, తక్కువ లాభాల శాఖల వేపు పోకుండా తమ మాతృ శాఖలలోనే పెట్టుబడులుగా మార తాయి. అంటే, ఈ రకంగా, చాలా పెట్టుబడులు, ఎక్కువ లాభాల్ని ఇచ్చే శాఖల వేపే పరిగెత్తుతాయి. దీని వల్ల, ఎక్కువ లాభాల శాఖల్లో పనిచేసే పెట్టుబడులు సమాజ అవసరాలకు కావలసిన దాని కన్నా ఎక్కువైపోయి, ఆ శాఖల్లో తయారయ్యే ఉత్పత్తులు కూడా ఎక్కువైపోతాయి.

ఈ రకంగా, ఒక శాఖలో ఎక్కువ ఉత్పత్తి తయారైందంటే, అక్కడ ఉత్పత్తి శక్తి పెరిగిందని అర్థం కాదు. ఉత్పత్తి శక్తి ఎప్పటి లాగే వున్నా, అక్కడ ఎక్కువ పెట్టుబడి పనిచేసి ఎక్కువ సరుకుల్ని ఉత్పత్తి చేస్తుంది. ఉత్పత్తి శక్తి గతంలో లాగే వుండడం వల్ల, ఒక సరుకుకి పట్టే శ్రమ కాలం ఎప్పటిలాగే వుండి, సరుకు విలువ గతంలో లాగే వుంటుంది. కానీ, అక్కడ సరుకుల పరిమాణం, సమాజ అవసరాల్ని మించి ఉత్పత్తి అవుతుంది కాబట్టి, ఆ సరుకు 'ధర' తగ్గుతుంది. అంటే, సరుకుకి విలువ తగ్గకుండానే, ధర తగ్గుతుంది. విలువ కన్నా తక్కువగావున్న ధర తో సరుకుని అమ్మినప్పుడు, దాని ద్వారా వచ్చే లాభం, గతంలో లాగ వుండక కొంత తగ్గుతుంది. అంటే, ఆ సరుకులో వున్న 'విలువ' అంతా దాని పెట్టుబడిదారుడికే అందదనీ, అది ఇంకెక్కడికో పోతుందనీ, అర్థం. (ఈ విషయాలు, తర్వాత వివరంగా చూస్తాము.)

ఇంకో వేపు, ఏ శాఖల నించైతే పెట్టుబడుల్లో కొంత భాగం బైటికి వెళ్ళిపోతుందో, అంతే గాక అక్కడికి ఏ కొత్త పెట్టుబడులూ రావో, ఆ శాఖల్లో, తక్కువ పెట్టుబడే మిగులుతుంది. అది తక్కువ సరుకుల్నే ఉత్పత్తి చేస్తుంది. అక్కడ ఉత్పత్తి తగ్గడం అంటే, అక్కడ ఉత్పత్తి శక్తి తగ్గిందని అర్థం కాదు. అక్కడ పెట్టుబడి తగ్గడం వల్లే ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి శక్తి గతంలో లాగే వుండడం వల్ల, ఒక సరుకుకి పట్టే శ్రమ కాలం ఎప్పటిలాగే వుండి, సరుకు విలువ, ఎప్పటిలాగే వుంటుంది. కానీ, అక్కడ సరుకుల పరిమాణం, సమాజ అవసరాలకన్నా తక్కువగా వుంటుంది కాబట్టి, ఆ సరుకుకి గతం కన్నా ఎక్కువ ధర ఏర్పడుతుంది. అంటే, అక్కడ సరుకుకి విలువ పెరగకుండానే ధర పెరుగుతుంది. విలువ కన్నా ఎక్కువగావున్న ధరతో సరుకుని అమ్మినప్పుడు, దాని ద్వారా వచ్చే లాభం గతంలోలాగ గాక, కొంత పెరుగుతుంది. అంటే, ఆ సరుకులో వున్న విలువే కాకుండా, ఇంకా కొంత ఎక్కువ విలువ కూడా ఆ పెట్టుబడిదారుడికి అందుతుంది.

దీని సారాంశం ఏమిటంటే — 'విలువే ధరగా వుండడం' అనే పరిస్థితితో ప్రారంభించి చూస్తే, ఆ పరిస్థితి క్రమంగా ఎలా మారుతుందంటే, కొన్ని శాఖల్లో ధరలు — విలువల కన్నా తక్కువగానూ, కొన్ని శాఖల్లో ధరలు — విలువల కన్నా ఎక్కువగానూ — ఏర్పడే విధంగా మారుతుంది.

ధరలు, విలువల కన్నా ఎక్కువో తక్కువో అవడం వల్ల ఏం జరుగుతుంది? — ఏం జరుగుతుందంటే, అన్ని శాఖల మధ్యా 'లాభాల సమాన పంపకాల కోసం పోరాటం' జరుగుతుంది. ఈ విషయాలే ఇప్పుడు క్రమంగా చూడాలి.

లాభాల్ని సమానంగా పంచుకునే ఉదాహరణ కోసం, 2 సరుకుల ఉదాహరణనే మళ్ళీ తీసుకుందాం.

A శాఖలో, 100 పెట్టుబడి ద్వారా, ఉత్పత్తి విలువ $= 90_C + 10_V + 10_S = 110$. ఇక్కడ అదనపు విలువ 10.

B శాఖలో 100 పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన సరుకు విలువ $= 10_C + 90_V + 90_S = 190$. ఇక్కడ అదనపు విలువ — 90.

ఈ 2 సరుకుల్నీ కలిపేసి, '2 సరుకుల రాసి'గా

చూస్తే, ఆ సరుకుల రాసి విలువ =110+190= 300. ఈ రాసి కోసం ఖర్చయిన మొత్తం పెట్టుబడి =100+100= 200. ఈ రాసిలో వున్న మొత్తం అదనపు విలువ=10+90= 100. అంటే, మొత్తం 200 పెట్టుబడి, మొత్తం 100 అదనపు విలువని ఉత్పత్తి చేసింది.

ఈ 2 సరుకులకూ, 'విలువే ధర'గా వుంటే, మొదటి సరుకు ధర 110. అక్కడ 100 పెట్టుబడికి, లాభం 10. రెండో సరుకు ధర 190. ఇక్కడ, 100 పెట్టుబడికి, లాభం 90. విలువలే ధరలుగా వుంటే, సమాన పెట్టుబడులకు వచ్చే లాభాలు సమానంగా వుండవు. అసమానంగా వుంటాయి.

లాభాల్లో ఇలా తేడా లేకుండా వుండాలంటే, ధరలు, ఇంకో రకంగా ఏర్పడాలి. మొదటి సరుకు ధర — దాని అసలు విలువ కన్నా ఎక్కువగానూ, రెండో సరుకు ధర — దాని అసలు విలువకన్నా తక్కువ గానూ!

ఇక్కడ, విషయాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవడం కోసం, 'ధరల' గురించి ఒక ఊహ ని ఆశ్రయిద్దాం. 2 సరుకులకూ సంబంధించి, మొత్తం 200 పెట్టుబడి, మొత్తం 100 లాభాన్ని ఉత్పత్తి చేసింది కదా? ఆ 100 లాభాన్ని, ఆ 200 పెట్టుబడి, సమానంగా పంచు కుంటే? అప్పుడు 100 పెట్టుబడికి 50 లాభం వస్తుంది. అంటే, 2 చోట్లా ఒకే రకంగా 50% లాభం. సమస్య తీరిపోతుంది.

కానీ, ఇది ఇలా జరగడానికి, తక్కువ లాభాన్ని ఉత్పత్తిచేసే సరుకు పెట్టుబడిదారుడు ఒప్పు కోవచ్చు గానీ, ఎక్కువ లాభాన్ని ఉత్పత్తిచేసే సరుకువాడు ఒప్పుకుంటాడా? ఎందుకు ఒప్పు కుంటాడు? — ఆ ప్రశ్నలన్నీ తర్వాత. వాటిని తర్వాత చూస్తాం. ప్రస్తుతం ఇక్కడ చూడవలసింది — వేరు వేరు పెట్టుబడులకు లాభాలు ఒకే రకంగా రావాలంటే, దాని కోసం ఏం జరగాలీ — అనేది. ఏం జరగాలంటే, విలువలే ధరలుగా వుండడం గాక, ధరలు విలువల నించీ తేడాగా ఏర్పడాలి. దాని వల్ల, వేరు వేరు శాఖలకు వచ్చే లాభాలు ఎక్కువ తేడాలు లేకుండా వుంటాయి.

110 విలువగల సరుకు ధర, 110 కన్నా 40 ఎక్కువగానూ (150గా); 190 విలువగల సరుకు ధర, 190 కన్నా 40 తక్కువగానూ (150గా), ఏర్పడతాయి — అనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? — మొదటి పెట్టుబడిదారుడు, 100 పెట్టుబడితో ఉత్పత్తి చేయించిన సరుకుని 150కి అమ్మితే, వాడి 100 పెట్టుబడి తిరిగివచ్చి, దాని మీద 50 లాభం వస్తుంది. ఈ పెట్టుబడికి లాభం రేటు 50%. రెండో పెట్టుబడిదారుడు కూడా, 100 పెట్టుబడితో ఉత్పత్తి చేయించిన తన సరుకుని 150కి అమ్మితే, వాడికి కూడా 100 పెట్టుబడి తిరిగివచ్చి, దాని మీద 50 లాభం వస్తుంది. ఈ పెట్టుబడికి కూడా లాభం 50%.

ఇప్పుడు ఇద్దరికీ, 100 పెట్టుబడి మీద లాభం ఒక్కలాగే వుంది.

ఇలా 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు' రాకపోతే, పెట్టుబడులు వేరు వేరు శాఖల్లో నిలబడి పని చెయ్యవు. కొంత కాలం పాటు ఒక శాఖలో చాలా ఎక్కువ లాభం రేటూ, ఇంకో శాఖలో చాలా తక్కువ లాభం రేటూ వుంటే, తక్కువ లాభం రేటు గల శాఖల్లో పెట్టుబడులు, ఎక్కువ లాభం రేటు గల శాఖల్లోకి మారిపోవడం ప్రారంభమవుతుంది. ఆ క్రమం ఎప్పటి దాకా జరుగుతుందంటే, అన్ని శాఖల లాభం రేట్లూ దాదాపు ఒకే రకంగా అయ్యే దాకా! గాలి, ఎప్పుడూ ఎక్కువ పీడనం నించి తక్కువ పీడనం వేపు దూసుకుపోయే విధంగా, పెట్టుబడులు ఎప్పుడూ తక్కువ లాభం వేపు నించి ఎక్కువ లాభం వేపు దూసుకుపోతూ వుంటాయి. లాభాల కోసం జరిగిన ఈ 'పోటీ'లో, లాభానికి సంబంధించి ఒక 'జనరల్ సూత్రం' ఏర్పడుతుంది. అదేమిటంటే, <u>పెట్టుబడికి లాభం రావలసింది, అది ఉత్పత్తి చేసే సరుకు రకాన్ని బట్టి గానీ, అది ఉత్పత్తి చేసే అదనపు విలువ పరిమాణాన్ని బట్టి గానీ కాదు ; ఆ పెట్టుబడి పరిమాణాన్ని బట్టి మాత్రమే.</u> — ఇదీ సూత్రం. అంటే, ఒక 100 పెట్టుబడి, ఏ శాఖలో వున్నా (ఏ రకం సరుకుని ఉత్పత్తి చేస్తూ వున్నా), దానికి లాభం రావలసింది, ఇతర శాఖల్లోలాగే. బొగ్గు శాఖలో 100 పెట్టుబడికి ఎంత లాభం వస్తుందో, బట్టల శాఖలో 100 పెట్టుబడికి కూడా దాదాపు అంత లాభమూ రావాలి. అంటే, ఏ శాఖలో అయినా లాభం రేటు ఒక్కలాగే వుండాలి. అలా వుండే పరిస్థితిని, పెట్టుబడుల మధ్య పోటీ యే ఏర్పరుస్తుంది. అన్ని శాఖల పెట్టుబడు లకూ ఒకే రకంగా వుండే లాభం రేటుని, **'జనరల్ లాభం రేటు'** అంటాం. ఈ జనరల్ లాభం రేటే, 'పెట్టుబడిదారీ ధరల్ని' ఏర్పరిచే ప్రధాన సూత్రంగా వుంటుంది.

ఈ 'ధరల - సమస్య'లో, రెండు పరస్పర విరుద్ధమైన విషయాలు వున్నాయి. (1) విలువలే ధరలుగా వుండడం, (2) సమాన పెట్టుబడులకు సమాన లాభాలు రావడం. — ఈ 2 విషయాలూ ఒక దాని కొకటి పొసగవు. మొదటి షరతు ప్రకారం, 'విలువలే ధరలుగా' వుండాలంటే, సమాన పెట్టుబడులకు సమాన లాభాలు రావు. రెండో షరతు ప్రకారం, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు' రావాలంటే, విలువలే ధరలుగా వుండవు. ఒకటి జరిగితే ఒకటి జరగదు. ఈ 2 విషయాల్లోనూ ఏదో ఒకటే జరగాలి. రెండూ జరగడానికి అవకాశం వుండదు. పెట్టుబడిదారుడు, తను అమ్మవలసిన సరుకుని, ఒక సారి — విలువకి సమానమైన ధర తోటీ, ఇంకో సారి — విలువ నించి తేడా అయిన ధర తోటీ, అలా 2 రకాలుగా అమ్మలేడు. తయారైన సరుకుకి 'ధర'ని నిర్ణయించేటప్పుడు, ఏదో ఒక్క ధరే వుండాలి. ఒక్క విషయమే జరగాలి.

పెట్టుబడిదారీ విధానంలో, మొదటి విషయమే రెండో విషయానికి తగ్గట్టుగా మారిపోతుంది. అంటే, 'విలువే ధరగా వుండాలనే' సూత్రం, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు రావాలనే' సూత్రానికి తగ్గట్టుగా.

పెట్టుబడిదారుడు, సరుకుల్ని అమ్మేటప్పుడు 2 విషయాలు జరగాలి. (1) పెట్టిన పెట్టుబడి అంతా వెనక్కి రావాలి. అది తగ్గకూడదు. (2) లాభం కూడా రావాలి. ఆ లాభం, ఇతర శాఖల్లో వచ్చినట్టే, దాదాపు అదే శాతంలో రావాలి. — ఈ 2 విషయాలూ సరుకుల్ని అమ్మడం ద్వారానే జరగాలి. అంటే, <u>ఈ విషయాలు జరగడానికి వీలయ్యే విధంగానే ఆ సరుకుల ధరలు ఏర్పడాలి.</u>

ఈ పద్ధతిలో చూస్తే, ఈ ఉదాహరణలో వున్న 2 సరుకుల ధరలూ ఇలా ఏర్పడతాయి :

A కి = 100 పెట్టుబడీ + 50 లాభం = 150.

B కి = 100 పెట్టుబడీ + 50 లాభం = 150.

ఈ సరుకుల ధరలు ఇలా వుంటే, పెట్టిన పెట్టుబడులు వెనక్కి వచ్చి, వాటి మీద లాభాలు సమానంగా వస్తాయి. అయితే, ధరలు ఇలా ఏర్పడితే, ఆ ధరలు, విలువల నించి తప్పిపోతాయి!

నిజానికి, A సరుకు విలువ, 110 మాత్రమే. దాన్ని 150 కి అమ్మడం అంటే, ఇక్కడ ధర, విలువ కన్నా ఎక్కువ. B సరుకు విలువ, 190. దీన్ని 150 కి అమ్మడం అంటే, ఇక్కడ ధర, విలువ కన్నా తక్కువ.

ఒక సరుకు ధర, దాని విలువ కన్నా 40 ఎక్కువగానూ, ఇంకో సరుకు ధర, దాని విలువ కన్నా 40 తక్కువగానూ వుండడం అంటే, ఇక్కడ ఏం జరిగింది? — ఏం జరిగిందంటే, ఒక చోట నించి 40 అదనపు విలువ, ఇంకో చోటకి వెళ్ళింది. ఇది ఎలా జరిగిందంటే — 100 పెట్టుబడితో 190 విలువ గల సరుకుని ఉత్పత్తిచేసిన B పెట్టుబడిదారుడికి, ఆ సరుకు ధర 150 అవడం వల్ల, దాన్ని అమ్మగా 150 డబ్బు మాత్రమే వచ్చింది. అయినా, పెట్టిన పెట్టుబడి కేమీ నష్టం జరగలేదు. 100 పెట్టుబడి తిరిగి వచ్చే సింది. దాని మీద 90 అదనపు విలువ రావలసి వుండగా, 50 మాత్రమే వచ్చింది. ఇంకా 40 అదనపు విలువ, ఈ పెట్టుబడిదారుడి చేతికి రాలేదు. రెండో వేపు — 100 పెట్టుబడితో 110 విలువ గల సరుకుని ఉత్పత్తిచేసిన A పెట్టుబడిదారుడికి, ఆ సరుకు ధర 150 అవడం వల్ల దాన్ని అమ్మగా 150 డబ్బు వచ్చింది. అందులో 100 పెట్టుబడిని తీసివెయ్యగా, 50 అదనపు విలువ వుంది. అందులో 10 అదనపు విలువ వరకూ ఆ సరుకుకి సంబంధించిందే. ఇంకా ఎక్కువగా వున్న 40 అదనపు విలువ, ఆ సరుకుది కాదు. అది, B సరుకుకి సంబంధించింది. అంటే, ధరలు ఇలా ఏర్పడడం వల్ల ఏం జరిగిందంటే, మొత్తం 200 పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన 100 అదనపు విలువని, 2 పెట్టుబడులూ సమా నంగా పంచు కోవడం జరిగింది.

(ఇక్కడ ఎన్ని సందేహాలు వచ్చినా ప్రస్తుతానికి ఆ సందేహాలన్నిటినీ అలా వుంచండి! ఈ చాప్టరులో వున్న విషయాలు పూర్తిగా చూసేటప్పటికి, సందేహాలన్నిటికీ జవాబులు దొరుకుతాయి. ప్రస్తుతం చెయ్యవలసిన పని, ఈ చాప్టరు ఏం చెపుతోందో అది చూస్తూ వెళ్ళడమే.)

ఈ 2 సరుకుల్నీ విడి విడిగా చూస్తే, వాటి ధరలు, వాటి విలువల నించి తప్పిపోయాయి. ఈ ధరలు, విలువలతో సమానంగా లేవు. కానీ, ఈ 2 సరుకుల్నీ కలిపేసి చూస్తే, వాటి విలువల మొత్తం, వాటి ధరల మొత్తంతో సమానంగానే వుంటుంది.

2 విలువలూ = 110 + 190 = 300.

2 ధరలూ = 150 + 150 = 300.

2 సరుకుల్నీ కలిపేసి, ఒకే 'సరుకుల రాసి'గా చూస్తే, ఆ రాసికి విలువా, ధరా ఒకటే. దాని విలువ

కన్నా, దాని ధర అణువంతైనా తేడాగా వుండదు. కానీ, ఆ సరుకుల్ని విడి విడిగా చూస్తే, వాటి విలువల నించి, ధరలు తేడాగానే వుంటాయి. అయితే, ఆ తేడాలు కూడా ఎలా పడితే అలా ఏర్పడవు. ఒక సరుకు ధర, దాని విలువ నించి ఎంత తగ్గుతుందో, ఇంకో సరుకు ధర, దాని విలువ నించి అంతే పెరుగు తుంది. అంతకన్నా ఎక్కువగా పెరగడానికి అవకాశం వుండదు. ఈ ఉదా హరణలో, B సరుకు ధర, దాని విలువ కన్నా 40 తగ్గితే, A సరుకు ధర దాని విలువ కన్నా 40 మాత్రమే పెరిగింది. ఒక చోట తగ్గిన భాగమే, ఇంకో చోట పెరిగింది. ఒక పెట్టుబడిదారుడి చేతి లోకి రాకుండా పోయిన భాగమే, ఇంకో పెట్టు బడిదారుడికి అందింది.

అయితే, ఇప్పుడు అసలు ప్రశ్న — ఇలా జరగ డానికి, తన సరుకులో వున్న S లో నించి కొంత భాగాన్ని పోగొట్టుకునే B పెట్టుబడిదారుడు, ఎందుకు ఒప్పుకుంటాడు —అనేది. దీనికి జవాబు ఏమిటంటే — ఇది పెట్టుబడిదారులు అంగీకరించ డాల మీదా, అంగీకరించక పోవడాల మీదా ఆధారపడి వుండదు. ఇది అసలు ఇలా జరుగుతుందని వాళ్ళకు తెలీనే తెలీదు. వాళ్ళకు తెలియకుండానే, వాళ్ళు ఈ ధరల పద్ధతినే అనుసరిస్తారు. మనం తర్వాత చూసే విష యాల ద్వారా ఇదంతా క్రమంగా అర్థమవుతుంది.

ఇక్కడ మొట్టమొదట అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే, సమాన లాభం రేటు కోసం, ధరలు విలువల నించి తప్పిపోవడం — అనేది జరగా లంటే, వేరు వేరు శాఖల పెట్టుబడిదారుల్లో కొంద రైనా, ఒకరితో ఒకరు పోటీలు పడగల స్థాయిల్లో వుండాలి. B శాఖని - పెద్ద పెట్టుబడులతో పనిచేసే శాఖ అనీ, A శాఖని - చిన్న పెట్టుబడుల శాఖ అనీ, అనుకుందాం. B శాఖలో, ఎక్కువ లాభం రేటు వుంటున్నదని కూడా అనుకుందాం. B శాఖలో, ఎక్కువ లాభం రేటు వున్నట్టు ఇతర శాఖలకు తెలి సినా, ఆ ఇతర శాఖల పెట్టుబడిదారులు, తమ శాఖల్ని వదిలేసి, B శాఖ లోకి మారిపోవడం వెంటనే జరగదు. కానీ ఆ మార్పు అసలే జరగకుండా కూడా వుండదు. ఆలస్యంగా అయినా జరుగుతుంది. పెట్టు బడులకు వుండే అసలు స్వభావం, ఎక్కువ లాభాల్ని వెతుక్కుంటూ తిరగడమే. లాభాల కోసం అన్వేషణే, రక రకాల పోటీలకు దారితీస్తుంది. కానీ, పోటీ — అన్నప్పుడు, అది అందరి మధ్యా సాధ్యం కాదు. సమాన స్థాయి పెట్టుబడిదారుల మధ్యనే సాధ్యం. చిన్న స్థాయి వాడు, పెద్ద స్థాయి వాడితో పోటీ పడ లేడు. ఒకే శాఖలో గానీ, వేరు వేరు శాఖల్లో గానీ, ఒకే స్థాయి పెట్టుబడిదారుల మధ్యనే పోటీలు సాగు తాయి. ఆ పోటీలే, ధరలు — విలువల నించి తప్పి పోయే పరిస్తితులకు దారి తీస్తాయి.

A, B శాఖల్లో, పెద్ద స్థాయి పెట్టుబడిదారుల ద్వారా, ఆ శాఖల్లో, విలువల నించి తప్పిపోయే ధరలు ఏర్పడ్డాయి — అనుకుందాం. A శాఖలో ఏర్పడ్డ ధర, ఆ శాఖలో వుండే పెద్ద స్థాయి పెట్టుబడి దారుల సరుకులకే గాక, చిన్న స్థాయి పెట్టుబడి దారుల సరుకులకు కూడా వర్తిస్తుంది. ఒకే శాఖలో, పెద్ద వాడి సరుకుకి ఒక ధరా, చిన్న వాడి సరుకుకి ఇంకో ధరా వుండవు. ఆ ధర, విలువ నించి తక్కువ అయినదైనా, ఎక్కువ అయినదైనా, ఆ ధరే ఆ శాఖలో అందరి సరుకులకూ వుంటుంది. కానీ, ఆ ధర ద్వారా ఆ సరుకు వాడికి మిగిలే లాభం, వాడి దగ్గిర జరిగిన ఖర్చుల్ని బట్టి వుంటుంది.

ఒక సరుకు కోసం ఎక్కువ ఖర్చు అయిన చోట, ఆ సరుకు ద్వారా మిగిలే లాభం తక్కువ గానూ, తక్కువ ఖర్చు అయిన చోట మిగిలే లాభం ఎక్కువ గానూ వుంటుంది. సాధారణంగా, చిన్న స్థాయి వాడి దగ్గిర ఖర్చుల్ని తగ్గించే మార్గాలు వుండవు కాబట్టి, అలాంటి చోటే ఖర్చు ఎక్కువగా వుండి, లాభం తక్కువగా వుంటుంది. ఒకే శాఖలో, చిన్నా పెద్దా స్థాయిల వాళ్ళ లాభాల్లో తప్పనిసరిగా తేడాలు వుంటాయి. కానీ, ఆ శాఖలోనే ఇద్దరు పెద్ద స్థాయి వాళ్ళనే తీసుకుంటే, వాళ్ళ దగ్గిర అన్ని పరిస్తితులూ సమానంగానే వుంటాయి కాబట్టి, వాళ్ళ లాభాలు దాదాపు సమానంగా వుంటాయి. అంటే, లాభాలు సమానంగా వుండడం — అనేది, ఒకే శాఖలో గానీ, వేరు వేరు శాఖల్లో గానీ, పెద్ద స్థాయి వాళ్ళ మధ్యనే జరుగుతుంది గానీ, పెద్ద స్థాయి వాళ్ళకీ, చిన్న స్థాయి వాళ్ళకీ మధ్య కాదు. పోటీలు పడడం పెద్ద స్థాయి వాళ్ళకే సాధ్యం.

'విలువా-ధరా' అనే 2 విషయాల్నీ కలిపి చూసే టప్పుడు, 'ధర' గురించి గతంలో చూసిన విషయా లకు, ఇప్పుడు ఇంకా కొన్ని విషయాల్ని కలిపి అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారుడు, తన సరుకు కి ధర ని ఎలా నిర్ణయిస్తాడో గతంలోనే చూశాం. సరుకు కోసం అయిన ఖర్చుల మీద (పెట్టుబడి మీద), 'కొంత

లాభం వేసుకుని' ఆ మొత్తాన్నే ధరగా నిర్ణయిస్తాడు — అని. ఇప్పుడు చూడవలసింది ఏమిటంటే, పెట్టుబడి మీద వేసుకునే ఆ 'కొంత లాభం' సంగతి. దానికి సంబంధించిన వివరాలే ఇప్పుడు చూస్తాం.

సరుకు తయారయ్యేటప్పటికి, దాని కోసం అయిన ఖర్చు అంతా తెలుస్తూనే వుంటుంది. కానీ, ఆ ఖర్చే, సరుకు విలువ కాదు. సరుకు కోసం, పెట్టుబడిదారుడు ఖర్చు పెట్టకుండానే కొంత అదనపు విలువ కూడా చేరి వుంటుంది. దానితో కూడా కలిసినదే సరుకు విలువ. కానీ ఈ అదనపు విలువ సంగతి సరుకు మనిషి కి తెలియదు.

సరుకులో వున్న S భాగం సంగతి సరుకు మనిషికి తెలియక పోవడం అంటే, సరుకుకి వున్న విలువ సంగతి కూడా తెలియదని అర్థం. సరుకు విలువ ని కొలవడం ఎందుకు సాధ్యం కాదో మొట్ట మొదటి చాప్టర్లలోనే చెప్పుకున్నాం. 'విలువ' అనేది సరుకు శరీరంలో వుండే లక్షణం కాదు కాబట్టి, బరువూ - పొడుగూ వంటి శరీర లక్షణాల్ని కొలిచినట్టుగా విలువని కొలవడం సాధ్యం కాదు — అని.

ఏ పెట్టుబడిదారుడికీ, తన సరుకుకి వున్న అసలు విలువ తెలియదు. వాడికి తెలిసేదంతా 'ధర' సంగతే. అంటే, ధర ని నిర్ణయించే సంగతే. మొదట తన ఖర్చులన్నిటినీ లెక్కకట్టి, దాని మీద లాభం పేరుతో ఇంకా కొంత విలువని కూడా కలిపితే అదే ధర! సరుకుని అమ్మినప్పుడు, ఆ ధర వస్తే, ఖర్చులన్నీ తిరిగివస్తాయి. ఆ పైన, ఆ 'కొంత లాభం' కూడా వస్తుంది. అలా జరిగితే, తన సరుకు వల్ల రావలసినదంతా వచ్చినట్టే పెట్టుబడిదారుడు భావిస్తాడు.

పెట్టుబడిదారుడు వేసుకునే 'కొంత లాభం' అంటే, ఎంత లాభం? సాధారణంగా ఇతర శాఖల్లో, నూరు పెట్టుబడి కి ఎంత లాభం వస్తుందో అంత లాభం. ఇతర శాఖల్లో 50% లాభం వస్తూ వుంటే, అదే స్థాయిలో వున్న వేరే శాఖల వాళ్ళు కూడా, అదే లాభాన్ని ఆశిస్తారు. అప్పటికే వున్న మార్కెట్ అనుభవాల్ని బట్టి, ప్రతీ పెట్టుబడిదారుడి దృష్టి లోనూ, ఏదో ఒక లాభం రేటు వుంటుంది.

అసలు, సమాజంలో వుండే చాలా రకాల సరుకులు, వెనకటి కాలం నించీ మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి అవుతూ వుండేవే. వాటికి ప్రతి సారీ ఏదో ఒక ధర వుంటూనే వుంటుంది. సైను బట్ట పెట్టుబడిదారుడు, కొత్తగా తయారైన బట్టకి, ఏ ధర పెట్టాలో కొత్తగా ఆలోచించడు. అప్పటికే మార్కెట్‌లో వున్న సైను బట్టకి ఒక ధర వుంటుంది కాబట్టి, ఆ ధరనే దృష్టిలో పెట్టుకుంటాడు. ఖర్చుల్లో ఏమైనా మార్పులు జరిగి వుంటే, వాటి ప్రకారమే లెక్కలు కడతాడు. అలా తయారైన కొత్త ధర, పాత ధర లాగే వుండడం గానీ, కొంచెం మారడం గానీ జరగవచ్చు. ధర విషయంలో, సరుకు వాళ్ళకు ఇంత కన్నా తెలిసేదేమీ వుండదు. ధర వెనకాల 'విలువ' అనేది ఒకటి వుంటుందనీ, అది ఆ సరుకు కోసం ఖర్చయిన శ్రమ మొత్తాన్ని బట్టి వుంటుందనీ — ఈ సంగతులేవీ ఏ సరుకు మనిషికీ తెలియవు. సరుకుల మనుషులు కూడా — **విలువా, ధరా, వెలా, ఖరీదూ** — అనే మాటలన్నీ మాట్లాడతారు. కానీ, వాళ్ళ దృష్టిలో ఆ మాట లన్నిటికీ అర్థం ఒకటే. విలువ కీ, ధర కీ మనం ఏ తేడాని చూస్తున్నామో ఆ తేడా, సరుకు మనిషి దృష్టిలో వుండదు. ఆ మనిషికి, విలువా ధరా, ఒకే విషయానికి వేరు వేరు పేర్లు మాత్రమే.

పెట్టుబడిదారుడు, తన సరుకు ధరని 'ఖర్చులూ + కొంత లాభమూ' అనే పద్ధతిలో నిర్ణయిస్తున్నాడంటే, దాని అర్థం ఏమిటి? అలా నిర్ణయించే ధర, ఆ సరుకుకి వున్న 'అసలు విలువ'తో సమానంగానే వుంటుందా? పెట్టుబడిదారుడు వేసుకునే 'లాభం', ఆ సరుకులో నిజంగా వున్న 'అదనపు విలువ'తో సమానంగా వుంటుందా? — అలా జరగదు. సరుకులో నిజంగా ఎంత అదనపు విలువ వుందో ఆ సరుకు వాడికి తెలియదు కాబట్టి, ఖర్చుల మీద వేసుకున్న లాభం, సరుకులో వున్న అదనపు విలువతో సమానంగా గాక, దాని కన్నా కొంత ఎక్కువగానో, తక్కువగానో వుంటుంది. అంటే, ఆ ధర, విలువ కన్నా తక్కువగా వున్నప్పుడు, ఆ విలువలో నించి కొంత భాగం, ఆ సరుకు వాడికి అందడం లేదనీ, అది వేరే శాఖల వాళ్ళకు పోతోందనీ అర్థం. అలాగే, ఆ ధర, విలువ కన్నా ఎక్కువగా వున్నప్పుడు, ఆ సరుకులో లేని విలువ కూడా కొంత, ఇతర శాఖల నించి వచ్చి ఈ పెట్టుబడిదారుడుకి అందుతోందని అర్థం.

ఇది ఇలా జరగడం అంటే, వేరు వేరు రకాల సరుకుల్ని ఉత్పత్తి చేయించే పెద్ద స్థాయి పెట్టుబడిదారులు, ఎవరి అదనపు విలువని వాళ్ళు తీసుకోవడం కాకుండా, అన్ని సరుకుల్లోనూ వున్న మొత్తం అదనపు విలువల్ని కలిపేసి, ఆ మొత్తాన్ని, ఏదో ఒక

లెక్కన పంపకాలు చేసుకుంటున్నారని అర్థం. ఇదంతా వాళ్ళు తెలిసి చేసే పని కాదు. 'ఖర్చులూ + లాభమూ' అనే పద్ధతిలో ధరల్ని నిర్ణయించడంలోనే అదనపు విలువని పంపకాలు చేసుకునే ఏర్పాటు ఇమిడిపోయి వుంటుంది. కాకపోతే, వాళ్ళు చెయ్యగలిగేది, 'అదనపు విలువ రాసి'లో నించి, వీలైనంత ఎక్కువ భాగాన్ని లాక్కోవడానికి ప్రయత్నించడమే.

ఒక సరుకు ధర, దాని అసలు విలువ కన్నా తక్కువగా ఏర్పడితే, అలా జరగడానికి ఆ సరుకు వాడు ఎలా ఒప్పుకుంటాడు — అనే ప్రశ్నకి ఆస్కారమే లేదు. ఇది, సరుకుల వాళ్ళకు తెలిసి జరిగే వ్యవహారం కాదు.

'పెట్టుబడీ + దానికి లాభమూ' పద్ధతిలో ధరలు ఏర్పడడం అంటే, పెట్టుబడిదారులు, తమ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాల' సూత్రానికి లోబడి ప్రవర్తిస్తారని అర్థం. ధరల విధానం ద్వారా జరిగేది అదే. 100 పెట్టుబడికి 10 లాభం అయితే, 200 పెట్టుబడికి 20 లాభం. 50 పెట్టుబడికి 5 లాభం. పెట్టుబడి సైజుని బట్టే లాభం సైజు. అంతే గానీ, ఆ పెట్టుబడి నిజంగా ఎంత లాభాన్ని ఉత్పత్తి చేసిందీ — అనే దాన్ని బట్టి కాదు.

పెట్టుబడిదారీ విధానంలో, పెట్టుబడి సైజుని బట్టి లాభం రావడం తప్పనిసరి. అది జరగడం కోసం ధరలు, విలువల నించీ తప్పుకుని తీరతాయి. ఈ విషయం గ్రహించింది మార్క్సే. అప్పటి వరకూ 'ఆర్థిక శాస్త్రం'లో అర్థం కాకుండా వుండిన విషయాల్లో ఇది కూడా ఒకటి.

ఒకే స్థాయి పెట్టుబడిదారుల మధ్య వుండే లాభం రేటు ని, 'జనరల్ లాభం రేటు' అనీ, లేదా 'శాఖల సగటు లాభం రేటు' అనీ అందాం. నిజానికి, వేరు వేరు శాఖల్లో, ఒకే స్థాయి పెట్టుబడి దారుల మధ్య కూడా ఖచ్చితంగా 'ఒకే లాభం రేటు' వుండదు. వేరు వేరు శాఖల లాభం రేట్లు తప్పనిసరిగా కొంత కొంత తేడాలతోనే వుంటాయి. కానీ, ఆ తేడాలు మరీ ఎక్కువగా అయినప్పుడల్లా, ఆ తేడాల్ని తగ్గించి వేసే పోటీ ఎప్పుడూ నడుస్తూనే వుంటుంది. కాబట్టి, శాఖల లాభం రేట్ల మధ్య తేడాలు చాలా ఎక్కువగా వుండడం, ఎక్కువ కాలం పాటు సాధ్యం కాదు. చిన్న చిన్న తేడాలు మాత్రం ఎప్పుడూ వుంటూనే వుంటాయి. కానీ, ఆ చిన్న తేడాల్ని లెక్కలోకి తీసుకోనక్కర లేదు. ఇక్కడ సారాంశం ఏమిటంటే — శాఖల మధ్య, పోటీలనేవి సాగుతూవుంటే, దాని ఫలితం, అన్ని శాఖలకూ 'దాదాపు ఒకే లాభం రేటు'గా వుంటుంది. అందుకే మనం మొదట ఒక 'జనరల్ లాభం రేటు'ని ఉదాహరణగా తీసుకుని, దాని ద్వారానే విషయాల్ని చర్చిస్తాము. తర్వాత, వేరు వేరు శాఖలకు ప్రత్యేకంగా వుండే వేరు వేరు లాభం రేట్ల గురించి కూడా చూస్తాము.

# జనరల్ లాభం రేటు

2 సరుకుల ఉదాహరణలో, మొత్తం పెట్టుబడి 200. దాని ద్వారా ఉత్పత్తి అయిన మొత్తం అదనపు విలువ 100. 200 పెట్టుబడి, 100 అదనపు విలువని ప్రతి సారీ ఉత్పత్తిచేస్తూ వుంటుంది. కాబట్టి, ప్రతీ 100 పెట్టుబడీ, 50 లాభాన్ని తీసుకోవడం ప్రతి సారీ సాధ్యమవుతూ వుంటుంది. అంటే, 2 శాఖల పెట్టుబడిదారుల దృష్టిలోనూ 50% జనరల్ లాభం రేటు వుంటుంది. ఆ రేటు, వాళ్ళ ఇష్టాయిష్టాల్ని బట్టి గాక, సరుకుల వెనకవున్న అంశాల్ని బట్టి (సమాజంలో వున్న పెట్టుబడుల మొత్తమూ, అవి ఉత్పత్తిచేసిన అదనపు విలువల మొత్తమూ — అనే అంశాల్ని బట్టి) వుంటుంది.

ఈ 2 సరుకుల ఉదాహరణలో, 'జనరల్ లాభం రేటు'ని 50% గా తీసుకుంటున్నాం. ఈ ఉదాహరణలో, ఒక సరుకు విలువ 190. కానీ, ఈ సరుకు పెట్టుబడిదారుడికి, తన సరుకులో 190 విలువ వున్నట్టు తెలీదు. "నా సరుకు విలువ 190" అని వాడు చెప్పలేడు. కాబట్టి, దానికి 190 ధర ని నిర్ణయించలేడు. ఆ సరుకు కోసం, తను, 100 పెట్టుబడిని ఖర్చుచేశాడు కాబట్టి, దాని మీద, తన దృష్టిలో వున్న 50% లాభాన్ని కలిపి, సరుకు ధర ని 150గా నిర్ణయిస్తాడు. అలా నిర్ణయించుకున్న ధరని చూసి, అదే దాని 'విలువ' అనుకుంటాడు. పెట్టుబడిదారుడి దృష్టిలో 'విలువ' అయినా, 'ధర' అయినా, ఒకటే. అది వస్తే తనకు రావలసింది వచ్చినట్టే.

రెండో పెట్టుబడిదారుడి విషయం కూడా అంతే.

వాడి సరుకుకి వున్న అసలు విలువ 110. ఆ సంగతి వాడికీ తెలీదు. వాడి దృష్టిలో కూడా 50% జనరల్ లాభం రేటు వుంటుంది. తన సరుకు కోసం 100 పెట్టుబడి ఖర్చుచేశాడు కాబట్టి, దాని మీద 50 లాభం కలిపి, తన సరుకు ధరని 150గా నిర్ణయిస్తాడు. అంటే, తన సరుకుకి 150 విలువ వున్నట్టే వాడు అనుకుంటాడు. అది వస్తే, తన సరుకు కోసం రావల సింది వచ్చినట్టే.

ఈ ఉదాహరణల్లో, ఒక శాఖ పెట్టుబడి దారుడు, తన సరుకుకి, అసలు విలువ కన్నా ఎక్కువ ధరని నిర్ణయిస్తే; ఇంకో శాఖ పెట్టుబడి దారుడు, తన సరుకుకి అసలు విలువ కన్నా తక్కువ ధరని నిర్ణయిస్తాడు. ఇదంతా వాళ్ళకి తెలియకుండానే చేస్తారు. వాళ్ళ అవగాహన ప్రకారం, ధరని నిర్ణయించే పద్ధతి ఇదే.

ఏ పెట్టుబడిదారుడైనా, పెట్టుబడి ఖర్చు మీద, కొంత లాభం కలపడం ద్వారా 'ధర'ని నిర్ణ యిస్తున్నాడంటే, ఆ సరుకులో వున్న 'అసలు విలువ' అనేది పెట్టుబడిదారుడి దృష్టిలో లేదన్న మాట! 'ఇంత పెట్టుబడికి ఇంత లాభం' అనే విషయం మాత్రమే వాడి దృష్టిలో వుందన్నమాట! పెట్టిన పెట్టుబడి పరిమాణమూ, దానికి రావలసిన లాభం పరిమాణమూ — అనే విషయాలతో మాత్రమే పెట్టుబడిదారులు వ్యవహరించడం అంటే, వాళ్ళు, తమకు తెలియకుండానే, తమ సరుకుల్లోవున్న అదనపు విలువల్ని సమానంగా పంచుకునే సూత్రానికి లోబడి పని చేస్తున్నా రన్నమాట!

తన పెట్టుబడి ద్వారా, నిజంగా ఎక్కువ అదనపు విలువని ఉత్పత్తిచేసిన పెట్టుబడిదారుడి దృష్టిలో, ఆ ఎక్కువ విలువ - అనేది వుండదు కాబట్టి వాడు, 'నా లాభంలో కొంత భాగాన్ని ఎవరికో వదిలేస్తున్నాను' అనుకోడు. నిజంగా 190 విలువ గల సరుకు పెట్టుబడిదారుడు, తన సరుకు విలువని 150గానే అనుకుంటాడు కాబట్టి, దాన్ని అమ్మి 150 డబ్బు తీసుకోవడానికి, వాడికి అభ్యంతరం వుండదు. అలాగే, 110 విలువ గల సరుకు వాడు, తన సరుకు విలువని 150గా అనుకుంటాడు. "నా సరుకు ద్వారా 110యే రావాలి. కానీ 150 వచ్చింది. నాకు 40 ఎక్కువగా వచ్చింది" అనుకోడు. ఈ రకంగా, వాళ్ళు నిర్ణయించుకున్న ధరల్నే వాళ్ళ సరుకుల విలువలుగా అనుకుని, ఎవరి విలువని వాళ్ళే తీసుకుంటున్నట్టుగా అనుకుంటారు. ఇద్దరికీ ఏమీ ఇబ్బంది లేకుండా, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు' వచ్చి సమస్య తీరిపోతుంది.

ఇప్పటి వరకూ చూసిన ఉదాహరణలో, 2 సరుకుల ధరలూ ఒక్కరకం గానే (150, 150గానే) వున్నాయి. అలా ఎందుకు వున్నాయంటే, 2 సరుకుల విషయం లోనూ పెట్టుబడుల్ని ఒకే సైజులో, వంద, వంద గానే తీసుకున్నాం కాబట్టి.

2 పెట్టుబడులూ ఒకే సైజు అవడం వల్ల, వాటి మీద కలిసే లాభాలు కూడా ఒకే సైజు అయ్యి, చివరికి ధరలు కూడా ఒకే సైజు అయ్యాయి. కానీ, 2 పెట్టుబడుల్ని తీసుకోవడం గాక, 2 వేరు వేరు సరుకుల్ని తీసుకుంటే, వాటి కోసం ఖర్చయ్యే పెట్టుబడులూ, ఆ పెట్టుబడులకు రావలసిన లాభాలూ, చివరికి వాటి ధరలూ, అన్నీ తేడాగానే వుంటాయి. 2 చోట్లా ఒకే రకంగా వుండేవి — లాభం రేట్లే. అవి మాత్రమే ఒకే రకంగా వుంటాయి.

ఒక చొక్కానీ, ఒక చెప్పుల జతనీ, తీసుకుందాం. ఇదే, 'మొత్తం సరుకుల రాసి' అనుకుందాం. చొక్కా కి అసలు విలువ 11. అందులో పెట్టుబడి 6. నిజంగా వున్న అదనపు విలువ 5. చెప్పుల జత కి అసలు విలువ 10. అందులో పెట్టుబడి 8. నిజంగా వున్న అదనపు విలువ 2. ఈ 2 పెట్టుబడులూ పనిచేసిన కాలాలు సమానమే — అనుకుందాం. ఇక్కడ 'జనరల్ లాభం రేటు' ఎంత ఏర్పడవచ్చు? ఈ 2 సరుకులకూ ధరలు ఎలా ఏర్పడవచ్చు?

2 సరుకులలోనూ వున్న మొత్తం అదనపు విలువ 5 + 2 = 7. ఈ అదనపు విలువ, ఈ 2 సరుకులకూ పంపకం అవ్వాలంటే, ఒక్కో సరుకులోకీ 3 చొప్పున చేరాలని అర్థమా? — కాదు. అదనపు విలువ చేరవలసింది, పెట్టుబడుల సైజుల్ని బట్టే! అంతే గానీ, అది, '2 సమాన వాటాలు అవడం ద్వారా' కాదు.

ఈ ఉదాహరణలో, 'జనరల్ లాభం రేటు' ఎంత ఏర్పడగలదో మొదట చూడాలి. ఆ రేటు ప్రకారం, ఏ పెట్టుబడి మీద ఎంత లాభం కలుస్తుందో తర్వాత చూడాలి. అప్పుడు, ఆ ధరలు తెలుస్తాయి.

2 సరుకుల్లోనూ మొత్తం పెట్టుబడి, 6 + 8 = 14
అది ఉత్పత్తి చేసిన మొత్తం S, 5 + 2 = 7

14 పెట్టుబడికి —— 7 S అయితే,

లాభం రేటు = — × 100 = 50%.

ఈ ఉదాహరణలో, 50% కన్నా ఎక్కువ లాభం రేటు సాధ్యం కాదు. ఎందుకంటే, అదనపు విలువ 7గానూ, పెట్టుబడి 14గానూ వున్నాయి గనక. 14 పెట్టుబడి, 7 అదనపు విలువనే ఉత్పత్తి చేసింది గనక. ఆ పెట్టుబడి, ఆ S నే పంచుకుంటే, లాభం రేటు 50% యే అవుతుంది. ఎక్కువో తక్కువో అవదు.

ఈ ఉదాహరణ ప్రకారం, 2 సరుకుల పెట్టుబడిదారుల దృష్టిలోనూ 50% లాభం రేటే వుంటుంది. పెట్టుబడి నీ, దాని జనరల్ లాభాన్నీ కలిపితే, అదే సరుకుకి — ధర.

చొక్కాకి పెట్టుబడి 6. ఈ 6 పెట్టుబడికి 50% లాభం రేటు లెక్కన, రావలసిన లాభం 3. అలాగే, చెప్పులకు పెట్టుబడి 8. 50% లాభం రేటు లెక్కన, ఆ 8 పెట్టుబడికి రావలసిన లాభం 4. కాబట్టి, ఆ 2 సరుకుల ధరలూ ఇలా ఏర్పడతాయి:

చొక్కా, 6 పెట్టుబడీ + 3 లాభమూ = 9
చెప్పులు, 8 పెట్టుబడీ + 4 లాభమూ = 12

చొక్కా పెట్టుబడిదారుడు, దాన్ని అమ్మగా వచ్చిన 9లో నించి, తన 6 పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దాని మీద 3 లాభం తీసుకుంటాడు. లాభం రేటు 50%. అలాగే, చెప్పుల పెట్టుబడి దారుడు కూడా, తన సరుకుని అమ్మగా వచ్చిన 12లో నించి, తన 8 పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దాని మీద 4 లాభం తీసుకుంటాడు. ఇక్కడ కూడా లాభం రేటు 50%. సరుకుల్ని అమ్మితే, ఇద్దరికీ పెట్టుబడులు వెనక్కి వచ్చి, ఇద్దరికీ లాభాలు ఒకే రేటు ప్రకారం వస్తాయి.

ఈ రకంగా, ఏ వేరు వేరు సరుకుల్ని తీసుకున్నా, వాటి పెట్టుబడుల సైజులు తేడాగానే వుండి, వాటి ధరలూ తేడాగానే వుంటాయి.

ఇక్కడ మళ్ళీ గ్రహించవలసిన విషయం, ధరల మొత్తమే, విలువల మొత్తం — అనేది.

విలువలు :

చొక్కా, 6 పెట్టుబడి + 5 అ. వి = 11
చెప్పులు, 8 పెట్టుబడి + 2 అ. వి = 10
విలువల మొత్తం = 21

ధరలు :

చొక్కా, 6 పెట్టుబడి + 3 లాభం = 9
చెప్పులు, 8 పెట్టుబడి + 4 లాభం = 12
ధరల మొత్తం = 21

2 సరుకుల్లో వున్న Sల మొత్తం 7
2 పెట్టుబడులకూ లాభాల మొత్తం 7
లాభాల మొత్తమే, అదనపు విలువల మొత్తం.
ధరల మొత్తమే, సరుకులవిలువల మొత్తం.

అయితే ఈ ఉదాహరణలో, విలువలు ధరలుగా మారినప్పుడు, ఆ విలువల్లో వున్న ఏ అంశాలు మారాయి? ఏ అంశాలు మారకుండా వున్నాయి?

విలువ, ధరగా మారినప్పుడు, పెట్టుబడి సైజు ఏమీ మారదు. ఖర్చయిన పెట్టుబడి అంతా వెనక్కి రావలసిందే కాబట్టి, విలువ లో వున్న పెట్టుబడే, ధరలో కూడా వుంటుంది. దాని పైన చేరే అదనపు విలువ విషయంలోనే మార్పు జరుగుతుంది. విలువల్లో — అదనపు విలువలు, 5+2గా వుంటే, ధరల్లో — అదనపు విలువలు, 3+4గా వున్నాయి. అంటే, విలువలు, ధరలుగా మారేటప్పుడు, అదనపు విలువలు చేరడంలోనే మార్పులు జరిగాయి.

ఈ 2 సరుకుల ఉదాహరణలో, 'ధరల్ని' నిర్ణయించేటప్పుడు ఇద్దరు పెట్టుబడిదారుల దృష్టి లోనూ '50% జనరల్ లాభం రేటు' వున్నట్టు చూశాం. పెట్టుబడిదారులు ఇంకా సరుకుల్ని అమ్మక ముందే వాళ్ళ దృష్టిలో ఈ రేటు ఎలా వుంటుంది? — ఎలా వుంటుందంటే, ధరల అనుభవాల ద్వారా. వాళ్ళు, అదే రకం సరుకుల్ని నిత్యం మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి చేయిస్తూనే అమ్ముతూనే వుంటారు. వాళ్ళ సరుకుల ఉత్పాదక శక్తులు, రోజుకోసారో, వారానికోసారో మారి పోతూ వుండవు. కాబట్టి, వరసగా వచ్చే అనుభవాల్ని బట్టే, పెట్టుబడిదారుల దృష్టిలో, ఏదో ఒక జనరల్ లాభం రేటు వుంటుంది.

'లాభం రేటు' అనేది, పెట్టుబడిదారుల ఇష్టాయిష్టాల ప్రకారమో, ఊహల ప్రకారమో, ఏర్పడే విషయం కాదు. సమాజంలో వున్న మొత్తం పెట్టుబడికీ, మొత్తం అదనపు విలువకీ వున్న సంబంధాన్ని బట్టి అది ఏర్పడుతుంది. అంటే అది, సమాజంలో వున్న ఒక 'వాస్తవం మీద' ఆధారపడి వుంటుంది. సమాజంలో వున్న పెట్టుబడిదారు లందరూ కలిసి, సమాజంలో వున్న అదనపు విలువనే పంచుకోవాలి. ఉన్న దాన్నే పంచుకోగలరు గానీ, లేని దాన్ని పంచుకోలేరు. కాబట్టి, 'లాభం రేటు'కీ తప్పనిసరిగా ఏదో ఒక హద్దు వుంటుంది. ఆ హద్దు ఏమిటో పెట్టుబడి దారులకు 'మార్కెట్ అనుభవాల' ద్వారా తెలుస్తుంది. ఒకవేళ, ఏ పెట్టుబడిదారుడైనా, అనుభవం లేక గానీ,

మితి మీరిన దురాశ వల్ల గానీ, తన పెట్టుబడి మీద చాలా ఎక్కువ లాభం వేసుకుని, తన సరుకు ధరని చాలా ఎక్కువగా నిర్ణయిస్తే, ఆ తప్పుని మార్కెట్టే సవరిస్తుంది. అంటే, ఆ సరుకు ఆ ఎక్కువ ధరతో అమ్ముడుపోదు. కాబట్టి ఆ సరుకుని కూడా, ఆ శాఖలో ఇతర పెట్టుబడిదారులు అమ్మే ధరలే ఇవ్వ వలసి వస్తుంది. అంటే, ఏ పెట్టుబడిదారుడూ, తన సరుకు ధరని, తన ఇష్ట ప్రకారమే నిర్ణయించడమూ, తన లాభాన్ని తన ఇష్ట ప్రకారమే ఎక్కువగా వేసుకోవడమూ చెయ్యలేడు. ఇక్కడ సారాంశం ఏమిటంటే, లాభం సంపాదించడంలో, ఎవరి ఇష్టం వాళ్ళదిగా వుండదు. అది, కొన్ని వాస్తవాల మీద ఆధారపడి వుంటుంది.

## లాభం రేటు ఏ పెట్టుబడి మీద?

లాభం రేటుని — మొత్తం పెట్టుబడి మీద చూస్తారా, చలామణీ పెట్టుబడి మీద చూస్తారా? — ఎలా చూసినా సారాంశం ఒకటే. పని స్థలంలో, అరగని ఫిక్సెడ్ సాధనాలన్నిటి తోటీ కలిసి వున్నది — మొత్తం పెట్టుబడి. అందులో నించి, తయారైన సరుకు కోసం ఖర్చయ్యేది — చలామణీ పెట్టుబడి. ఇప్పుడు ప్రశ్న, సరుకు ద్వారా వచ్చే లాభం, పని స్థలంలో వుండే మొత్తం పెట్టుబడి మీద రావాలా, సరుకు కోసం ఖర్చయిన చలామణీ పెట్టుబడి మీద మాత్రమే రావాలా అనేది. — మొత్తం పెట్టుబడి మీదే రావాలి. పని స్థలంలో వుండే యంత్రాలూ ఇతర ఉత్పత్తి సాధనాలూ వగైరాలన్నిటి కోసమూ కూడా పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడతాడు కాబట్టి, ఆ పెట్టుబడి అంతటి మీదా లాభం రావాలి. ఆ లాభం, ఎలా రావాలంటే, చలామణీ పెట్టుబడి ద్వారా తయారై అమ్మకానికి వెళ్ళే సరుకు ద్వారానే రావాలి. సరుకు అమ్ముడైపోయి లాభం వచ్చినప్పుడు, అది, మొత్తం పెట్టుబడి కోసం వచ్చే లాభమే అవుతుంది.

అయితే, లాభాన్ని లెక్క కట్టే పని, 'మొత్తం పెట్టుబడి' మీదైనా జరగవచ్చు; 'చలామణీ పెట్టుబడి' మీదైనా జరగవచ్చు. లాభాన్ని — మొత్తం పెట్టుబడి మీద చూస్తే, అది కొంత తక్కువ రేటు గానూ, చలామణీ పెట్టుబడి మీదే చూస్తే, కొంత ఎక్కువ రేటు గానూ వుంటుంది.

సమాజంలో, అన్ని శాఖల్లోనూ వున్న మొత్తం పెట్టుబడి (ఫిక్సెడ్ సాధనాలన్నింటితోటీ కలిసివున్న పెట్టుబడి) 1,000 అనుకుందాం. అందులో నించి 800 ఖర్చుతో ఒక 'ఉత్పత్తి రాసి' తయారైంది. ఆ 800 పెట్టుబడి, చలామణీ పెట్టుబడి అవుతుంది. ఇంకా 200 పెట్టుబడి, అరగకుండా ఫిక్సెడ్ సాధనాలలో వెనక్కి వుండిపోతుంది. ఖర్చయిన 800 పెట్టుబడిలో — 300 స్థిరా, 500 అస్థిరా — అనుకుందాం. అదనపు విలువ రేటు 100%.

తయారైన ఉత్పత్తి రాసి విలువ, $300_c + 500_v + 500_s = 1300$. ఇందులో అదనపు విలువ — 500. ఇక్కడ 'జనరల్ లాభం రేటు' ఎంత వుందో చూడాలంటే, 500 అదనపు విలువని, ఖర్చయిన 800 పెట్టుబడితో చూడాలా, మొత్తం 1,000 పెట్టుబడితో చూడాలా? — ఇదీ ప్రశ్న. ఎలాగైనా చూడవచ్చు. ఎలా చూసినా 'సారాంశం' ఒకటే అవుతుంది. ఎలా చూసినా అదనపు విలువ మొత్తం మారేదేమీ వుండదు. అది 500 లే.

500 అదనపు విలువని, 1000 పెట్టుబడి ద్వారా వచ్చినట్టు చూస్తే, లాభం రేటు 50%. లేదా, ఆ అదనపు విలువనే, 800 పెట్టుబడి ద్వారా వచ్చినట్టు చూస్తే, లాభం రేటు 62 %.

ఈ మొత్తం 1000 పెట్టుబడీ, 800 చలామణీ పెట్టుబడీ, ఒక విడి పెట్టుబడిదారుడి ఉదాహరణ అనుకుందాం. ఈ పెట్టుబడిదారుడు, తన లాభాన్ని ఏ పెట్టుబడి మీద లెక్క కట్టుకోవాలి? లాభాన్ని, మొత్తం పెట్టుబడి మీద అయితే తక్కువ రేటు తోటీ, చలామణీ పెట్టుబడి మీద అయితే ఎక్కువ రేటు తోటీ చూసుకుంటాడు.

1000 పెట్టుబడి మీద, 50% రేటుతో చూస్తే, లాభం రాసి 500. 800 పెట్టుబడి మీద 62 రేటుతో చూస్తే, లాభం రాసి అప్పుడు కూడా 500. రెండూ ఒకటే. ఆ లాభం, చలామణీ పెట్టుబడి మీద కలిసి, 'ధర' అవుతుంది. ఆ ధరకి ఆ సరుకు అమ్ముడు పోతే, ఖర్చయిన చలామణీ పెట్టుబడి అంతా వెనక్కి వచ్చి, దాని మీద జనరల్ లాభం వస్తుంది. ఆ లాభాన్ని, మొత్తం పెట్టుబడి మీద చూస్తే కొంత తక్కువ రేటు గానూ, చలామణీ పెట్టుబడి మీద చూస్తే ఎక్కువ రేటు గానూ వుంటుంది. ఎలా జరిగినా 'లాభం రాసి' ఒకే రకంగా వుంటుంది.

కాబట్టి, లాభం రేటుని, మొత్తం పెట్టుబడి మీద చూస్తారా, చలామణీ పెట్టుబడి మీద చూస్తారా — అనే ప్రశ్న అనవసరం. ఏ రకంగా చూసినా లాభం సైజు ఒకటే. దాన్ని లెక్కకట్టుకునే పద్ధతులు ఎన్ని రకాలుగా అయినా వుండవచ్చు.

పెట్టుబడి మీద కొంత లాభం వేసుకుని ధరని నిర్ణయించే విధానం, 'మొత్తం సామాజిక అదనపు విలువ రాసి'ని, దోపిడీదారుల్లో పై స్థాయి వాళ్ళందరికీ దాదాపు సమానంగా పంచుతుంది. బందిపోటు దొంగలంతా వేరు వేరు స్థలాలలో లూటీలు చేసి తెచ్చిన వస్తువులన్నిటినీ ఒక చోట కుప్ప పోసి, వాటిని సమానంగా పంచుకోవడం ఎలాంటిదో, అలాంటిదే ఇది. ప్రతీ పెట్టుబడి దారుడూ, తన పెట్టుబడి సైజుని బట్టి, మొత్తం సమాజ అదనపు విలువలో ఒక వాటాని (లూటీలో ఒక వాటాని) స్వాధీనం చేసుకుంటాడన్న మాట! ఈ పని, వాళ్ళ పోటీల వల్ల ఏర్పడే ధరల ద్వారానే జరుగుతూ వుంటుంది.

# 'పెట్టుబడిదారీ ధర'కూ, కార్మికులకూ సంబంధం

A, B సరుకులనే మొత్తం సరుకుల రాసిగా అనుకుందాం.

A సరుకు = $90_c + 10_v + 10_s = 110$.

B సరుకు = $10_c + 90_v + 90_s = 190$.

2 సరుకుల కార్మికులూ ఇచ్చిన అదనపు విలువల మొత్తం = $90 + 10 = 100$.

ఈ సరుకులకు, విలువలే ధరలుగావున్నా, లేక విలువల నించి ధరలు తేడాగా వున్నా, ఎలా వున్నా, కార్మికులు ఇచ్చిన 'అదనపు విలువల మొత్తం' మారదు. ఈ అర్థంలో, ధరలు ఎలా ఏర్పడినా కార్మికులకు ఒకటే. అయితే, వారు పోగొట్టుకునే అదనపు విలువని యజమానులు లాక్కునే పద్ధతి ఎలా వుంటుందో తెలుసుకోవడం కార్మికులకు అత్యవసరం. ఎందుకంటే, దాని వల్ల, యజమానులతో తమ సంబంధాలు ఏ రకంగా వున్నాయో కార్మికులకు తెలుస్తుంది.

**విలువలే ధరలుగా వుంటే:**

A, B సరుకుల విలువలు, 110 + 190.

ఈ సరుకుల ధరలు కూడా ఇవే.

ఏ సరుకులోవున్న అదనపు విలువ, ఆ సరుకు పెట్టుబడిదారుడికే అందుతుంది. అంటే, ఒక చోట పనిచేసే కార్మికుల అదనపు విలువ, ఆ కార్మికుల స్వంత పెట్టుబడిదారుడికే. A సరుకులోవున్న 10 అదనపు విలువ, A పెట్టుబడిదారుడికీ; B సరుకులో వున్న 90 అదనపు విలువ, B పెట్టుబడిదారుడికీ. ఇలా జరిగితే, A కార్మికులకు, A పెట్టుబడిదారుడి తోటే గానీ, B తో సంబంధం వుండదు. అలాగే, B కార్మికులకు B పెట్టుబడిదారుడి తోటే గానీ, A తో సంబంధం వుండదు.

**విలువల నించి ధరలు తేడాగా వుంటే:**

A, B సరుకుల విలువలు, 110 + 190

A, B సరుకుల ధరలు, 150 + 150

ఇక్కడ ఏం జరిగింది? B సరుకులో నించి 40 అదనపు విలువ, A కి పోయింది.

B సరుకు కార్మికులు ఇచ్చింది, 90 అదనపు విలువ. అందులో నించి 50 ని, ఆ కార్మికుల స్వంత పెట్టుబడిదారుడూ, మిగిలిన 40 ని, బయటి పెట్టుబడిదారుడూ తీసుకుంటారు.

A సరుకు కార్మికులు ఇచ్చింది, 10 అదనపు విలువ. దాన్నంతా ఆ కార్మికుల స్వంత పెట్టుబడిదారుడే తీసుకుంటాడు. వీడు, బయటి కార్మికుల 40 అదనపు విలువని కూడా తీసుకుంటాడు.

ఈ 2 సరుకుల కార్మికులకూ, 2 సరుకుల పెట్టుబడిదారుల తోటీ కూడా సంబంధాలు ఏర్పడతాయి.

ఈ 2 సరుకుల ఉదాహరణలో జరిగినదే మొత్తం సమాజంలో అంతా జరుగుతుంది. మొత్తం శాఖల్ని A శాఖలూ, B శాఖలూ అని విభజిద్దాం. A శాఖలు — అదనపు విలువని తక్కువగా ఇచ్చే శాఖలు అనీ, B శాఖలు — ఎక్కువగా ఇచ్చే శాఖలు అనీ — అనుకుందాం. B శాఖల నించీ కొంత S ని, A శాఖలు తీసుకోగలిగే విధంగా, A, B శాఖల్లో ధరలు ఏర్పడతాయి. A శాఖల్లో ధరలు, విలువల కన్నా ఎక్కువగానూ, B శాఖల్లో ధరలు, విలువల కన్నా తక్కువగానూ. అలా జరిగితేనే A శాఖలకు కూడా 'జనరల్ లాభం రేటు' వుంటుంది. దీని సారాంశం, అన్ని శాఖల కార్మికులూ కలిసి ఇచ్చిన అదనపు విలువ రాసిని, అన్ని శాఖల పెట్టుబడిదారులూ కలిసి తినడం! వేరే మాటల్లో — 'కార్మిక వర్గం' ఇచ్చే మొత్తం

అదనపు విలువ రాసిని, 'పెట్టుబడిదారీ వర్గం' అంతా, ఒక పద్ధతి ప్రకారం పంచుకోవడం. ఇది ఇలా జరిగే విధంగా, 'ధరలు ఏర్పడే విధానమే' సాధ్యం చేస్తుంది. యజమాని వర్గం, శ్రామిక వర్గపు అదనపు శ్రమని తినడం, వెనకటి దోపిడీ సమాజాల్లో కూడా వున్నదే. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, అదనపు విలువ పంపకం, గత సమాజాలతో పోలిస్తే, 'రూపంలో కొంత తేడాగా' వుంటుంది. ఈ విధానంలో, ఒక పెట్టుబడిదారుడు, తన కార్మికులతో మాత్రమే సంబంధంలో వుండడం గానీ, కార్మికులు తమ స్వంత యజమానితో మాత్రమే సంబంధంలో వుండడం గానీ, జరగదు. ఇక్కడ ('పెట్టుబడిదారీ విధానం'లో) దోపిడీ సంబంధాలు, గత సమాజాలలో కన్నా లోతుగానూ, సమిష్టిగానూ అల్లుకుపోయిన రూపంలో ఏర్పడతాయి. అందుకే ఇక్కడ "**ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!**" అనే నినాదం అవసరమవుతుంది. (ఈ విషయం ఈ సంపుటం లోనే చివరికి మళ్ళీ వివరంగా చూస్తాం.)

# వెనకటి సమాజాలలో ధర

పెట్టుబడీ, లాభమూ — అనే విషయాలు లేని వెనకటి సమాజాల్ని తీసుకుందాం. అక్కడ, బానిసలనో, కౌలు రైతులనో, ఇంకా వెనకటి కాలపు 'ఆదిమ తెగల' ఉత్పత్తిదారులనో తీసుకుంటే, ఆ సమాజాల్లో కూడా అప్పుడప్పుడూ కొన్ని వస్తువుల్ని 'మారకాలు' చేసుకునేవారే. అయితే, ఆ మారకాలలో సరుకుల విలువలూ, ధరలూ తేడాగా ఏర్పడవు. ఎందుకంటే అక్కడ, పెట్టుబడీ, సమాన లాభమూ, పోటీ — అనే విషయాలు వుండవు గనక. ఈ ఉదాహరణల్ని కొంచెం వివరంగా చూడాలి.

ప్రాచీన కాలపు సరుకుల్ని తీసుకుందాం. నేత మనిషి నేసిన కొంత బట్ట విలువ 10. చెప్పుల మనిషి చేసిన ఒక చెప్పుల జత విలువ కూడా 10. ఈ 2 సరుకుల్నీ వాళ్ళు ఒకరితో ఒకరు మారకం చేసుకుంటారు. ఆ మనుషులిద్దరూ ఆ వస్తువుల్ని 'స్వయంగా' ఉత్పత్తి చేశారు. ఇక్కడ, విషయం తేలిగ్గా అర్థం కావడం కోసం, ఆ సరుకుల విలువల్ని 'పెట్టుబడిదారీ పద్ధతి' లోనే విభజించి చూద్దాం.

| | | | | | |
|---|---|---|---|---|---|
| బట్ట విలువ | = 4 స్థిర | + 3 అస్థిర | + 3s | = | 10 |
| చెప్పుల విలువ | = 2 | + 4 | + 4s | = | 10 |

ఇక్కడ 'అస్థిర' అంటే, ఉత్పత్తిదారుడికి ఎవరో ఇచ్చే జీతం కాదు. అది ఉత్పత్తిదారుడి పోషణకు కనీసంగా కావలసిన వస్తువుల విలువ — అని అర్థం. ఇక్కడ 'అదనపు విలువ' అంటే, ఉత్పత్తి దారుడు చేసిన 'సజీవ శ్రమ' విలువలో నించి అస్థిరను తీసివెయ్యగా మిగిలే భాగం.

బట్ట పెట్టుబడి = 4 స్థిర + 3 అస్థిర = 7. (నిజానికి వెనకటి సమాజాల విషయంలో, స్థిరా, అస్థిరా, పెట్టుబడీ — అని, ఈ మాటలు వాడ కూడదు. 'ఉత్పత్తి సాధనాలు' అనే మాటలనే వాడాలి. కానీ, విషయం తేలిగ్గా అర్థం కావడానికే, ఇలా చెప్పుకోవాలి.)

'చెప్పుల' పెట్టుబడి = 2 స్థిర + 4 అస్థిర = 6.

మొదటి సరుకులో, 7 పెట్టుబడి, 3 అదనపు విలువని ఉత్పత్తిచేస్తే; రెండో సరుకులో, 6 పెట్టుబడి, 4 అదనపు విలువని ఉత్పత్తి చేసింది. అంటే, ఎక్కువ పెట్టుబడితో తక్కువ అదనపు విలువా, తక్కువ పెట్టుబడితో ఎక్కువ అదనపు విలువా. అయినప్పటికీ, ఇక్కడ, అదనపు విలువలు సమానం అవవలసిన అవసరం వుండదు. అంటే, అదనపు విలువల మొత్తాన్ని, పెట్టుబడుల మొత్తానికి పంచే విధంగా ధరలు ఏర్పడవలసిన అవసరం వుండదు. ఎందుకంటే, ఇక్కడ సరుకుల్ని మారకాలు చేసుకునే వాళ్ళు, వాటిని స్వయంగా ఉత్పత్తి చేసేవాళ్ళే. ఎవరు అమ్మే సరుకు, వాళ్ళ శ్రమ ఫలితమే. కాబట్టి, ఎవరి సరుకులోవున్న అదనపు విలువ వాళ్ళకే అందాలి. అది ఎక్కువగా వున్నా, తక్కువగా వున్నా. కాబట్టి, ఇక్కడ, సరుకుకి 'ధర'ని నిర్ణయించే పని, పెట్టుబడిదారీ పద్ధతిలో జరగదు. 'ఇంత పెట్టుబడి' పెట్టామనీ, దానికి 'ఇంత లాభం' రావాలనీ, ఆ రకపు దృష్టే ఇక్కడ ప్రారంభం కాదు.

మరి ఇక్కడ, 'ధర' ఎలా ఏర్పడుతుందంటే — మారకం చేసుకునే వస్తువుకి, ఎంతో కొంత విలువని, సూటిగా నిర్ణయించడం — అనే పద్ధతి లోనే. 'మారకాలు' ప్రారంభమైన మొదటి కాలంలో, ఆ మారకాల పాళ్ళు చాలా అస్తవ్యస్తంగా, 'ఎలా బడితే అలా' (అర్బి

(టరీ గా) వుంటాయి. అలాంటి పరిస్థితుల్లో 2 సరుకులకు మారకం జరగడం అంటే, ఆ మారకాలు ప్రతీ సారీ సమాన విలువలు గలవిగా వుండకపోవచ్చు. తక్కువ శ్రమతో తయారైన సరుకు మనిషికి, ఎక్కువ శ్రమతో తయారైన సరుకూ; ఎక్కువ శ్రమతో తయారైన సరుకు మనిషికి, తక్కువ శ్రమగల సరుకూ అందవచ్చు. అలా జరిగితే, అది సమాన విలువల మారకం కాదు. కానీ, అలాంటి సమాజంలో, మారకాలన్నీ, ఎప్పుడూ ఒకే పక్షానికి లాభమో, నష్టమో కలిగించేవిగా జరగవు. ఒక మనిషికి, ఒక మారకంలో ఎక్కువ విలువ గల సరుకు దొరికితే, ఇంకో మారకంలో దానికి వ్యతిరేకంగా జరగవచ్చు. అప్పుడప్పుడూ సమాన విలువ కూడా రావచ్చు. ఈ రకం మారకాల్లో, ఒక మనిషి ఎప్పుడూ నష్టపోతూనే, లేదా ఎప్పుడూ లాభపడుతూనే వుండడు. కొన్ని సార్లు ఇటూ, కొన్ని సార్లు అటూ కూడా జరగవచ్చు. మారకాల ప్రారంభ కాలంలో విలువల గురించి అంత కన్నా తెలియదు కాబట్టి, మారకాల పాళ్ళు అస్తవ్యస్తంగానే, ఎగుడు దిగుళ్ళుగానే, వుంటాయి.

రాను రానూ ఏం జరుగు తుందంటే, వేరు వేరు శ్రమలు చెయ్యడంలో అనేక రకాల అనుభవాలు వస్తాయి. ఏ రకం వస్తువుకి ఎక్కువ కష్టం అవుతుందో (ఎక్కువ కాలం పడుతుందో), ఏ రకానికి తేలిక అవుతుందో (తక్కువ కాలం పడుతుందో), కొంచెం కొంచెం తెలియడం ప్రారంభమవుతుంది. క్రమ క్రమంగా మారకాల పాళ్ళు, సమాన శ్రమ కాలాల మధ్య జరగడం ప్రారంభ మవుతుంది. సరుకుకి ఎంతో కొంత విలువ వుంటుందనే స్పృహ కలుగుతుంది. దీని అర్థం, విలువ అంటే శ్రమ కాలమే — అనే సంగతి ఆ నాడే తెలిసిందని కాదు. కానీ, ప్రతీ సరుకుకీ ఎంతో కొంత విలువ వుంటుందనీ, కొన్ని సరుకులకు ఎక్కువ విలువా, కొన్నిటికి తక్కువ విలువా వుంటుందనీ — అంత వరకూ తెలుస్తుంది. క్రమంగా మారకాలు, ఎక్కువ తక్కువ విలువల మధ్య గాక, సమాన విలువల మధ్యనే జరగడం ప్రారంభమవుతుంది. ఈ మారకాలు బార్టరు పద్ధతిలో గాక, 'డబ్బు' ద్వారా జరగడం పెరిగి నప్పుడు, ఆ డబ్బే ఆ సరుకుకి 'ధర' అవుతుంది. అంటే, విలువే, ధర అవుతుంది. ఆ ధర, విలువ నించి ఎక్కువో తక్కువో అవదు. అంటే, అక్కడ విలువా ధరా ఒకటే. ఆ పరిస్తితి ఎప్పటిదాకా సాగుతుందంటే, — పెట్టుబడులూ, వాటి మధ్య పోటీలూ, లాభాల సమాన పంపకాలూ — వగైరాలన్నీ పుట్టుకొచ్చే దాకా.

వెనకటి సమాజాలలో, ఒక సరుకు ధర 2 రూ.లు అయితే, ఆ ధరే, ఆ సరుకుకి విలువ — అనుకోవచ్చు. అక్కడ 'విలువ' అయినా అదే, 'ధర' అయినా అదే. ఆ ధర (లేదా, విలువ), ఆ వస్తువు కోసం పట్టిన ఉత్పత్తి సాధనాల ఖర్చునంతటినీ వెనక్కి తెచ్చి, ఆ పైన ఉత్పత్తిదారుల సజీవ శ్రమ విలువ నంతటినీ కూడా తెస్తుంది.

**ఆదిమ కాలపు సరుకులు :**

స్వయంగా శ్రమచేసే ఇద్దరు ఉత్పత్తిదారుల సరుకుల్లో, ఒకటి, 10 విలువ గల బట్ట. రెండోది, 10 విలువ గల చెప్పులు. వాటి విలువలే వాటి ధరలు. ఆ ఉత్పత్తిదారులు, ఆ సరుకుల్ని మారకం చేసుకుంటే, ఆ మారకం వల్ల ఎవరికీ ఎక్కువగానో, తక్కువగానో, వచ్చేదేమీ వుండదు. ఎవరి శ్రమ ఫలితం వాళ్ళకు అందుతుంది.

**బానిసలు ఉత్పత్తి చేసిన సరుకులు :**

ఆ సరుకుల మారకాలు బానిసల ద్వారా జరగవు. వాళ్ళ యజమానుల ద్వారా జరుగుతాయి. 10 బట్టకీ, 10 చెప్పుల జతకీ మారకం జరిగినప్పుడు, ఆ మారకం వల్ల ఎవరికీ ఎక్కువో తక్కువో రాదు. బట్టని ఉత్పత్తిచేసిన బానిసల అదనపు విలువ, ఆ బానిసల యజమానికీ; చెప్పుల అదనపు విలువ, ఈ బానిసల యజమానికీ, అందుతాయి. ఇక్కడ, ఆ సరుకుల విలువలు సమానంగా గాక, ఎక్కువ తక్కువలుగా వున్నట్టయితే, అప్పుడు కూడా ప్రతీ మారకమూ, ఒక్క యజమానికే ఎప్పుడూ ఎక్కువ విలువని ఇచ్చేదిగా వుండదు. కొన్ని సార్లు ఇటూ, కొన్ని సార్లు అటూ కూడా జరుగుతుంది. ఆ రకంగా, ఆ తేడాలు సర్దుకుంటాయి. అక్కడ అదనపు విలువల్ని సమానంగా పంచుకునే పెట్టుబడిదారీ ధరల ఏర్పాటు వంటిది వుండదు. అది బానిస సమాజం కాబట్టి, అక్కడ శ్రమ దోపిడీ వున్నా, అక్కడ ధరలు, విలువలతో సమానంగా వున్నట్టే అవుతుంది.

**కౌలు రైతులు ఉత్పత్తిచేసిన సరుకులు :**

ఈ రైతులు, భూస్వామికి కౌళ్ళు చెల్లిస్తారు. ఈ సరుకులు కౌళ్ళలో భాగంగా, భూస్వామికి అందితే, వాడు ఆ సరుకుల్ని అమ్మవచ్చు. లేదా, కౌలు రైతులు, కౌళ్ళు చెల్లించగా కూడా కొంత ఉత్పత్తి వారి

పోషణ కోసం మిగులుతుంది కాబట్టి, అందులో నించి కొన్ని సరుకుల్ని, ఆ రైతులు, తమ ఇతర అవస రాల కోసం అమ్మవచ్చు. ఈ మారకాలు, భూస్వామి ద్వారా గానీ, కౌలు రైతుల ద్వారా గానీ, ఎలా జరిగినా, ఆ మారకాల్లో ఎప్పుడూ ఒకే పక్షానికి తక్కువో ఎక్కువో అందుతూ వుండడం జరగదు. ఇటూ అటూ కూడా జరుగుతుంది. కాబట్టి, ఈ సరుకులకు కూడా విలువలే ధరలు. ఇక్కడ శ్రమ దోపిడీ వున్నా, అదనపు విలువని సమానంగా పంచుకునే ధరల ఏర్పాటు ఇక్కడ కూడా వుండదు. ఈ రకంగా, శ్రమ దోపిడీ ప్రారంభంకాని ఆదిమ సమాజంలో గానీ, అది ప్రారంభమైన బానిస — భూస్వామ్య సమాజాల్లో గానీ, ధరలు ఎలా వున్నా, అవి విలువలతో సమానంగా వున్నట్టుగానే అవు తాయి.

ఈ విధానం ఎప్పటికి చెదిరిపోతుందంటే, బానిస విధానమూ, కౌలు రైతు విధానమూ అంతరిస్తూ, పెట్టుబడిదారీ విధానం ప్రవేశిస్తూ, అందులో పోటీలు అభివృద్ధి చెందుతూ వున్నప్పటికి!

ధరలు, విలువలతో సమానంగా వున్నంత కాలమూ ఆ సమాజాల సరుకుల్ని, 'సింపుల్ సరుకులు' అనవచ్చు. పెట్టుబడిదారీ సరుకులు, ఆ రకపు సింపుల్ సరుకులు కావు. పెట్టుబడిదారీ సరుకులు, పెట్టుబడుల సైజుల్నిబట్టి లాభాలు తెచ్చిపెట్టవలసిన ఒక 'ప్రత్యేక సంబంధం'లో వుండే సరుకులు.

సరుకుల ఉత్పత్తికి సంబంధించిన సాంకేతిక కారణాల వల్ల, 'అదనపు విలువ' భాగాలు, ఒక శాఖ సరుకులో ఎక్కువ గానూ, ఒక శాఖ సరుకులో తక్కువ గానూ ఉత్పత్తి అవుతాయి — అని చూశాం. ఈ పరిస్థితిని పెట్టుబడిదారులు మార్చలేరు. అది, తప్పనిసరి పరిస్థితి. కాబట్టి, ఇక వాళ్ళు చెయ్యగలిగే దేమిటంటే, ఆ ఎక్కువ తక్కువ అదనపు విలువల రాసులన్నిటినీ కలిపేసి, ఆ మొత్తాన్ని పంచుకోవడమే! అది మాత్రమే వాళ్ళు చెయ్యగలరు. కానీ ఇదంతా వాళ్ళు తెలిసి చేసే పని కాదు.

'పెట్టుబడిదారీ ధర' అన్నప్పుడు, 'విలువ నించి తక్కువో ఎక్కువో అయ్యే ధర' అని అర్థం. ధరని ఈ పద్ధతిలో నిర్ణయించడం, పెట్టుబడిదారీ విధానానికే ప్రత్యేకం. ఈ లక్షణం, వెనకటి సమాజాలలో వుండదు. అక్కడ విలువలే, ధరలు.

ఏ సమాజంలోనైనా విలువలే ధరలుగా వుంటే, అది 'విలువ సూత్రానికి' తగిన విషయం. విలువలే ధరలుగా లేకపోతే, అది విలువ సూత్రానికి వ్యతిరేకం. అయితే, పెట్టుబడిదారీ విధానంలో కూడా, 'సరుకుల రాసి'కి, విలువా ధరా ఒకటే. విడి సరుకుల విష యంలో అయితే ఆ సూత్రం, యధాతధంగా గాక, 'కొంత మార్పు'తో పని చేస్తుంది. ఆ మార్పు, ఆ పునాది మీద తప్పనిసరి. 'ధర' గురించి, ఇంకా కూడా చాలా విషయాలు చూడాలి.

## కాస్ట్ ప్రైస్ (ఖర్చు ధర)<br>ప్రొడక్షన్ ప్రైస్ (ఉత్పత్తి ధర)<br>మార్కెట్ ప్రైస్ (మార్కెట్ ధర)

'ధర' కి ఇన్ని విశేషణాలు వుండడం మొదటి ఆలోచనకు చాలా గందరగోళంగా వుంటుంది. కానీ, విషయాల్ని అర్థం చేసుకుంటున్నకొద్దీ గందరగోళం పోయి, అంతా స్పష్టం అవుతుంది.

సరుకుని, ఏ దశలో తీసుకుంటామో అప్పటికి దాని కోసం ఖర్చయిన శ్రమ మొత్తాన్ని బట్టి ఏర్పడేది 'విలువ'. సరుకుని మార్కెట్లో కొనే వ్యక్తి, సరుకు కోసం చెల్లించేది, 'మార్కెట్ ధర'. వీటి మధ్య, ఖర్చు ధరా, ఉత్పత్తి ధరా — అనేవి కూడా వుంటాయి. విలువ, మార్కెట్ ధర గా మారే క్రమం అంతా ఎలా సాగుతుందో ఇప్పుడు చూస్తాం.

ఒక శాఖలో పెట్టుబడిదారులందరూ ఒకే రకం సరుకుని ఉత్పత్తి చేయించినా, సరుకు కోసం అయ్యే ఖర్చు, అందరి దగ్గిరా ఖచ్చితంగా ఒకే రకంగా వుండదు. కొంత కొంత తేడాలతో వుంటుంది. ఒక పెట్టుబడిదారుడి దగ్గిర అయిన ఖర్చు, ఆ సరుకుకి,

వ్యక్తిగత విలువ. అలాంటి వేరు వేరు వ్యక్తిగత విలువలలో నించే, ఒక సగటు విలువ ఏర్పడవలసి వుంటుంది. 'విలువ' అన్నప్పుడల్లా, ఈ 'సగటు విలువ' గురించే మాట్లాడుతున్నామని అర్థం. 'సగటు విలువ' అన్నా, 'సామాజిక విలువ' అన్నా, 'మార్కెట్ విలువ' అన్నా, ('మార్కెట్ ధర' కాదు), ఈ అన్నిటికీ అర్థం ఒకటే.

సరుకుని తయారుచెయ్యడానికి C + V + S అనే 3 భాగాలు కావలసి వున్నా, పెట్టుబడిదారుడి చేతి నించీ ఖర్చయ్యేది 2 భాగాలే. స్థిర, అస్థిరలే. (C + V లే). ఈ 2 భాగాలూ కలిసినదాన్ని 'చలా మణీ పెట్టుబడి' అంటాం. ఈ చలామణీ పెట్టుబడే — 'కాస్ట్ ప్రైస్ (ఖర్చు ధర)'. స్థిరా, అస్థిరల మొత్తమే — 'కాస్ట్ ప్రైస్'.

'కాస్ట్ ప్రైస్'కి గుర్తు K. అంటే, C + V లను కలిపేసి ఒకే మాటతో K గా అంటున్నాము.

'ఖర్చయిన పెట్టుబడి' అన్నా, 'చలామణీ పెట్టుబడి' అన్నా, 'కాస్ట్ ప్రైస్' అన్నా — ఈ మూడూ ఒకటే.

కాస్ట్ ప్రైస్ కి, 'అదనపు విలువ' కూడా కలిస్తే, అది, సరుకు 'విలువ'.

విలువ = కాస్ట్ ప్రైస్ +అసలు అదనపు విలువ

$C^1 = K + S$

ఇది, సరుకు ఉత్పత్తి అవడానికి నిజంగా కావలసిన విలువ.

కానీ, పెట్టుబడిదారుడి దృష్టిలో, K + S వుండదు. K + P వుంటుంది.

P అంటే 'ప్రాఫిట్'. లాభం. ఇది, 'జనరల్ లాభం రేటు' లెక్కతో వేసుకునే లాభం. పెట్టుబడి దారుడు, తన ఖర్చుల మీద, కొంత లాభాన్ని కలిపి, ధరని నిర్ణయిస్తాడు కదా? అంటే, K కి, P ని కలిపి ధరని నిర్ణయిస్తాడు. ఇలా ఏర్పడే ధరకి, **'ఉత్పత్తి ధర'** అని పేరు. ఇది, పెట్టుబడిదారుడు నిర్ణయించే ధర. దీనికి 'ఉత్పత్తి ధర' అనే పేరు ఎందుకు వుంటుందంటే, సరుకుని మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి చెయ్యాలంటే, ఈ ధర (జనరల్ లాభాన్ని ఇచ్చే ధర) వుండాలి కాబట్టి. అందుకే ఈ ధర కి, ఈ పేరు.

K + P లలో, K అయితే, నిజంగా ఖర్చయిన దానికన్నా ఎక్కువో తక్కువో కాకుండా యధాతథం గానే వుంటుంది. P మాత్రం, S తో సమానంగా గాక, ఎక్కువో తక్కువో అయి వుంటుంది. కొన్ని సందర్భాల్లో P, S తో సమానంగా వుంటే కూడా వుండవచ్చు.

ఈ రకంగా, పెట్టుబడిదారుడు, సరుకు కి 'ఉత్పత్తి ధర' ని నిర్ణయించి, సరుకు ని మార్కెట్‌లో పెడతాడు. ఆ తర్వాత, ఆ సరుకు, ఆ ధరతో అమ్ముడు పోతుంది. అంతే కదా? — కాదు. ఇంకా అప్పుడే కాదు. ఇప్పుడు, సరుకు తాలూకు **సప్లై — డిమాండ్లు** రంగం లోకి వస్తాయి.

సైను బట్టని తీసుకుందాం. ఈ సరుకుని ఉత్పత్తి చేయించేది ఒక్క పెట్టుబడిదారుడే కాదు. ఇంకా అనేక మంది పెట్టుబడిదారులు కూడా అదే రకం సరుకుని ఉత్పత్తి చేయిస్తారు కదా? ఆ పెట్టుబడి దారులందరూ కూడా ఎవరి సరుకుని వాళ్ళు మార్కెట్లో అమ్మకానికి పెడతారు. మొత్తం ఎంత సైను బట్ట అమ్మకానికి సిద్ధంగా వుందో, అది ఆ సరుకు — 'సప్లై'. ఆ సమయంలో, అంత సైను బట్ట అమ్ముడుపోయే లాగ వుందా, లేదా? అమ్మకం అవసరాల కోసం ఎంత సైను బట్ట కావాలి? — అది ఆ సరుకు కోసం — 'డిమాండ్'.

కొన్ని రకాల సరుకుల్ని, పెట్టుబడిదారులు మాత్రమే కొంటే, కొన్ని రకాల సరుకుల్ని, పెట్టుబడి దారులూ కార్మికులూ కూడా కొంటారు. పెట్టుబడి దారులు కొనే సరుకుల్లో కొన్ని రకాల్ని 'ఉత్పాదక' అవసరాల కోసమూ, కొన్ని రకాల్ని 'కుటుంబ' అవసరాల కోసమూ కొంటారు. కార్మికులైతే, 'ఉత్పాదక' అవసరాల కోసం కొనేదేమీ వుండదు. ఏది కొన్నా, కుటుంబ అవసరాల కోసమే కొంటారు. వ్యక్తిగత అవసరాలు అనేవి కూడా కుటుంబ అవసరాల కోవ లోకే వస్తాయి.

ఒక సరుకు కి ఒక ఉత్పత్తి ధర ని నిర్ణయించి మార్కెట్లో పెట్టిన తర్వాత, అక్కడ ఆ సరుకు 'సప్లై' ఎక్కువగా వుంటే, సరుకుకి నిర్ణయించిన ఉత్పత్తి ధర కొంత తగ్గుతుంది. లేదా, సరుకు కోసం డిమాండ్ ఎక్కువగా వుంటే, ఉత్పత్తి ధర ఇంకా కొంత పెరుగుతుంది. అంటే, పెట్టుబడిదారుడు తన సరుకుకి 'ఉత్పత్తి ధర'ని నిర్ణయించిన తర్వాత, ఆ సరుకు, ఆ ధరకే అమ్ముడుపోతుందనే గ్యారంటీ వుండదు. సరుకు తాలూకు సప్లై డిమాండ్ల పరిస్థితుల్ని బట్టి, ఆ ధర, కొంత తక్కువగా గానీ, ఎక్కువగా గానీ, మారవచ్చు. లేదా, కొన్ని సందర్భాల్లో ఆ ధర, మారకుండా కూడా వుండవచ్చు.

చివరికి, సరుకు, ఏ ధరకి అమ్ముడుపోతుందో అది — **'మార్కెట్ ధర'**. ఒక వ్యక్తి, ఒక సరుకుని

కొనేటప్పుడు చెల్లించేది — 'మార్కెట్ ధర'నే. సరుకు ద్వారా, పెట్టుబడిదారుడి చేతికి అందేది ఈ మార్కెట్ ధరే. ఈ ధరలో నించే, పెట్టుబడిదారుడు, తన 'కాస్ట్ ప్రైస్'ని, వెనక్కి తీసుకోవడమూ, దాని మీద 'లాభం' తీసుకోవడమూ, జరగాలి.

'మార్కెట్ ధర'లో నించి కాస్ట్ ప్రైస్ ని పూర్తిగా వెనక్కి తీసుకోవడం సాధ్యమే. ఆ పైన రావలసిన 'లాభం' విషయంలోనే కొంత మార్పు జరుగు తుంది. పెట్టుబడిదారుడు నిర్ణయించిన 'ఉత్పత్తి ధర', మార్కెట్లో కొంత మారవచ్చు కాబట్టి, సరుకు ద్వారా వచ్చే లాభం, మార్కెట్ ధర ని బట్టే వుంటుంది. ఉత్పత్తి ధర కన్నా మార్కెట్ ధర ఎక్కువగావుంటే, పెట్టుబడిదారుడికి వచ్చే లాభం ఎక్కువ గానూ, మార్కెట్ ధర తక్కువగా వుంటే, లాభం తక్కువ గానూ వుంటుంది.

సరుకుకి వుండే అసలు విలువ, మార్కెట్ ధరగా మారే క్రమం క్లుప్తంగా ఇదీ:

విలువ = కాస్ట్ ప్రైస్ + అసలు అదనపు విలువ
K + S

ఉత్పత్తి ధర = కాస్ట్ ప్రైస్ + జనరల్ లాభం
K + P

మార్కెట్ధర = కాస్ట్ ప్రైస్ + జనరల్ లాభం నించి కూడా తేడాగా వున్న లాభం
K + P

ధర కి సంబంధించి, నిజంగా వుండే దశలు 3. విలువా, ఉత్పత్తి ధరా, మార్కెట్ ధరా. కానీ, పెట్టుబడిదారుడి దృష్టిలో 'విలువ' వుండదు కాబట్టి, ఉత్పత్తి ధరా, మార్కెట్ ధరా — మాత్రమే వుంటాయి. సరుకు కి మొదట నిర్ణయించే ధర ని 'ఉత్పత్తి ధర' గానూ, చివరికి మార్కెట్లో అమ్మే ధరని 'మార్కెట్ ధర' గానూ — ఈ 2 అంశాల్ని మాత్రమే పెట్టుబడిదారుడు చూస్తాడు. 'విలువ' అనే మాటని కూడా పెట్టుబడిదారుడు వాడినా, దాన్ని 'ధర'కి ఇంకో పేరుగా మాత్రమే వాడతాడు.

పైను బట్ట విషయంలో చూసిన ఈ విషయాలు, ప్రతీ సరుకుకీ వర్తిస్తాయి. అన్ని శాఖల లోనూ పెట్టుబడిదారులు, తమ సరుకులకు 'ఉత్పత్తి ధరల్ని' నిర్ణయించి మార్కెట్లోకి పంపుతారు. ఆ వుత్పత్తి ధరలు అక్కడి పరిస్తితుల్ని బట్టి, 'మార్కెట్ ధరలు'గా మారతాయి.

'మార్కెట్' అంటే, సరుకుల్ని అమ్మే స్తలం. అది షాపు అయినా, ఇంట్లోనే ఒక స్తలం అయినా. సరుకుల్ని ఎక్కడ అమ్ముతారో అదే, మార్కెట్టు.

స్వతంత్ర ఉత్పత్తిదారుడు అయితే, తన సరుకుల్ని తన ఇంటి దగ్గిరే ఉత్పత్తి చేసి, ఇంటి దగ్గిరే అమ్మవచ్చు. ఎందుకంటే, ఆ సరుకుల రాసి చాలా చిన్నదిగా వుంటుంది. ఆ కుటుంబంలో ఒకరో ఇద్దరో వ్యక్తుల శ్రమ ద్వారా మాత్రమే ఆ సరుకులు ఉత్పత్తి అవుతాయి కాబట్టి, అవి చాలా తక్కువగానే వుంటాయి. కానీ, పెట్టుబడిదారుడి విషయంలో అలా కాదు. ఇక్కడ అనేక మంది కార్మికులు పనిచేస్తారు. ఈ సరుకుల రాసి చాలా పెద్ద పరిమాణంలో వుంటుంది. ఆ రాసిని ఉత్పత్తి చెయ్యడానికీ, అమ్మడానికీ కూడా, ప్రత్యేక స్తలాలు వుంటాయి. కాబట్టి, పెట్టుబడిదారీ మార్కెట్టు అన్నప్పుడు, 'షాపుల్నే' దృష్టిలో పెట్టుకోవాలి. అక్కడే సరుకుల అమ్మకాలు జరుగుతాయి.

ఒక సరుకుకి వుండే మార్కెట్టు ధరే, ఆ సరుకు కోసం పని చేసే పెట్టుబడికి, 'భవిష్యత్తు'ని నిర్ణయిస్తుంది. అంటే, ఆ పెట్టుబడి మళ్ళీ ఆ రకం సరుకునే ఉత్పత్తి చెయ్యాలా, లేకపోతే ఆ సరుకుని వదిలేసి ఇంకో రకం సరుకు ఉత్పత్తిని చేపట్టాలా — అనే భవిష్యత్తుని. సరుకుని అమ్మినప్పుడు, 'మార్కెట్ ధర'లో నించి, కాస్టు ప్రైస్ పోగా మిగిలే లాభం చాలా తక్కువగా వుంటే, పెట్టుబడి ఇక ఆ సరుకుని ఉత్పత్తి చెయ్యడానికి ఇష్టపడదు. లేదా, ఆ లాభం ఎక్కువగా వుంటే, ఆ పెట్టుబడి, ఆ సరుకు ఉత్పత్తిని మానుకోదు. అప్పుడు, ఇతర పెట్టుబడులు కూడా ఆ సరుకునే ఉత్పత్తి చెయ్యడానికి ఇటు పరిగెత్తుకొస్తాయి. ఈ రకంగా, వేరు వేరు శాఖల సరుకులకు ఏర్పడే మార్కెట్ ధరలే పెట్టుబడుల చలనాల్ని నిర్దేశిస్తాయి. అంటే, మార్కెట్ ధరల్ని బట్టే (వాటి ద్వారా వచ్చే లాభాల్ని బట్టే), పెట్టుబడులు శాఖల మధ్య ఎప్పటికప్పుడు కొత్తగా సర్దుకోవడాలు జరుగుతూ వుంటాయి.

ఈ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఇంకా ఎన్నో విషయాలు చూడాలి.

'ఉత్పత్తి ధర'ని నిర్ణయించడానికి సంబంధించిన అంశాలు కొన్నిటిని మొదట చూడాలి. 'ఉత్పత్తి ధర'ని చూడాలంటే — పెట్టుబడి పరిమాణం, ఉత్పత్తి కాలం, చలామణీ కాలం, టర్నోవరు కాలం— లాంటి అంశాల్ని చూడాలి.

### పెట్టుబడి 'పరిమాణం' :

ఏ పెట్టుబడిదారుడికైనా, పెట్టిన పెట్టుబడి పరిమాణాన్ని బట్టే లాభం వస్తుందని చెప్పుకున్నాం. చిన్న చిన్న భాగాలుగా విభజించడానికి వీలైన బట్టా, పంచదారా — లాంటి వస్తువుల విషయంలో అయితే తయారైన వస్తువుల్ని రోజుకోసారో, వారానికోసారో, అమ్మేసి, ఆ పెట్టుబడినే మళ్ళీ మళ్ళీ పనిలో పెడుతూ వుండవచ్చు. కానీ, భవనాలూ, యంత్రాలూ — లాంటి, విభజించ డానికి వీలుకాని వస్తువుల విష యంలో అయితే, ఖర్చయ్యే పెట్టుబడి, ప్రతీ రోజూ గానీ, ప్రతీ వారం గానీ, వెనక్కి వస్తూ వుండదు. ఆ భారీ వస్తువు పూర్తిగా తయారయ్యే వరకూ చాలా పెట్టుబడి ఖర్చయ్యి, ఆ వస్తువు అమ్ముడైనప్పుడే, ఆ పెట్టుబడి అంతా పెద్ద మొత్తంలో ఒకే సారి వెనక్కి వస్తుంది.

ఈ రకంగా, వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి అయ్యే వస్తువులు, వేరు వేరు ప్రత్యేకతలతో వుంటాయి. వాటి కోసం ఖర్చయ్యే పెట్టుబడులు, వేరు వేరు పరిమాణాల్లో వుంటాయి. అవి వేరు వేరు కాలాల్లో తిరిగి వస్తూ వుంటాయి. పెట్టుబడుల పరిస్థితులు ఇంత తేడాగా వున్నప్పుడు, ఏ పెట్టుబడిదారుడు ఎంత పెట్టుబడి పెట్టాడూ, ఏ శాఖలో ఎంత పెట్టుబడి వుందీ — అనే విషయాలు, ఏ పద్ధతిలో నిర్ణయమవు తాయి? — ఈ విషయాలు అర్థం చేసుకోవడానికే, ఉత్పత్తి కాలాన్నీ, చలామణీ కాలాన్నీ, టర్నోవర్ కాలాన్నీ, చూడాలి.

# శ్రమ కాలం, లేదా ఉత్పత్తి కాలం (వర్కింగ్ పిరియడ్)

శ్రమ జరిగిన కాలమే 'శ్రమ కాలం'. మొదటి సంపుటంలో, 'శ్రమ క్రమం' చాప్టరులో, 'శ్రమ క్రమం' గురించీ, 'ఉత్పత్తి క్రమం' గురించీ చూశాం. ఈ 2 విషయాలకూ తేడా వుంటుందనీ, ఆ తేడా ఏమిటో కూడా చూశాం. వ్యవసాయ ఉత్పత్తుల విషయంలోనే 'ఉత్పత్తి కాలం' కన్నా 'శ్రమ కాలం' చిన్నదిగా వుంటుంది. వ్యవసాయేతర ఉత్పత్తుల విషయంలో, ఉత్పత్తి కాలమూ, శ్రమ కాలమూ, సాధారణంగా ఒకే పొడవుతో వుంటాయి. శ్రమ కాలానికీ, ఉత్పత్తి కాలా నికీ వుండే తేడా సంగతి వదిలేసి ఇక్కడ, ఆ రెంటినీ ఒకే అర్థంతో వాడదాం. 'శ్రమ కాలం' అన్నా, 'ఉత్పత్తి కాలం' అన్నా, ఒకటే — అనే అర్థంతో.

వస్తువు ప్రత్యేకతని బట్టి, అది 'తయారవడానికి పట్టే కాలం' వుంటుంది. ఆ ప్రత్యేకతని బట్టే, దానికి అవసరమయ్యే 'పెట్టుబడి పరిమాణం' వుంటుంది.

'వస్తువు తయారవడానికి పట్టే కాలం' అంటే అర్థం, ఉత్పత్తి సాధనాల మీద సజీవ శ్రమ జరిగే కాలం. అదే, ఆ వస్తువుకి సంబంధించిన 'ఉత్పత్తి కాలం'; లేదా, 'శ్రమ కాలం'. ఒక రకం చొక్కాని 'కుట్టడానికి' అప్పటి సాధారణ ఉత్పాదక శక్తి ని బట్టి, సగటున, '1 గంట కాలం' పడుతుందను కుందాం. ఆ గంటే చొక్కాకి 'ఉత్పత్తి కాలం'. ఇది, 'బట్ట' అనే ముడి పదార్థం, 'చొక్కా'గా మారే దశలో సజీవ శ్రమ జరిగే కాలం సంగతి మాత్రమే. ఇది, ఆ దశలో ఖర్చయ్యే 'ఉత్పత్తి సాధనాల' సంగతి కాదు. చొక్కాకి పట్టే 'మొత్తం శ్రమ కాలాన్ని' చూడాలంటే, అప్పుడు ఉత్పత్తి సాధనాల్ని కూడా కలపాలి. కానీ, 'చొక్కా ఉత్పత్తి కాలం' అన్నప్పుడు, బట్ట, చొక్కాగా మార డానికి కావలసిన 'కుట్టు పని కాలం' మాత్రమే. అదే, 'ఉత్పత్తి కాలం' (వర్కింగ్ పిరియడ్).

100 మీటర్ల బట్ట ని నెయ్యడానికి 4 గురు కార్మికులు, రోజుకి 8 గంటల చొప్పున, 2 రోజులు పని చేస్తారనుకుందాం. ఈ వస్తువు తయారవడానికి పట్టిన సజీవ శ్రమ కాలం మొత్తం ఎన్ని గంటలు? $4 \times 8 \times 2 = 64$ గంటలు. ఇదే ఈ వస్తువుకి 'ఉత్పత్తి కాలం'. అయితే, ఈ వస్తువుని ఉత్పత్తి చెయ్యడానికి 4 గురు కార్మికులు గాక, ఒక్క కార్మి కుడే రోజుకి 8 గంటల చొప్పున పనిచేస్తూ, 8 రోజుల్లో ఆ పని చెయ్యగలడా? ఈ రకంగా కూడా మొత్తం '64 గంటలు' అవుతుంది కాబట్టి, ఆ కాలంలో ఒక్క కార్మికుడి ద్వారానే ఆ పని జరుగుతుందా? — అలా జరగదు. ఉత్పత్తి క్రమానికి కొన్ని సాంకేతిక పరి స్తితులు వుంటాయి. ఉత్పత్తి క్రమంలో పాల్గొనే కార్మికులు, ఉత్పత్తి స్థలంలో వివిధ స్థానాలలో, ప్రతీ

స్థానంలోనూ ఫలానా సంఖ్యలో, హాజరై వుండాలి. ఆ సంఖ్య అప్పటి ఉత్పత్తి శక్తిని బట్టి వుంటుంది. ఆ సంఖ్యని, ఎలా పడితే అలా మార్చడానికి వీలు వుండదు. కాబట్టి, 'ఉత్పత్తి కాలం' అనే దాన్ని, కేవలం 'కొన్ని గంటలు'గానో, 'కొన్ని రోజులు'గానో మాత్రమే అర్థం చేసుకోకూడదు. ఆ 'సజీవ శ్రమ' జరగడానికి, ఫలానా ఇంత మంది కార్మికులు, ఫలానా ఫలానా స్థానాలలో వుండడం — అనే సాంకేతిక వివరాలతో కూడిన విషయంగా కూడా దాన్ని అర్థం చేసుకోవాలి. ఆ శ్రమ కి సంబంధించిన ఉత్పత్తి శక్తి మారితే, కార్మికుల సంఖ్య మారి, ఉత్పత్తి కాలం కూడా మారుతుంది. వేరు వేరు వస్తువుల వర్కింగ్ పిరియడ్లు, వేరు వేరు పరిమాణాలలో వుంటాయి. చిన్న వర్కింగ్ పిరియడ్లతో త్వర త్వరగా తయారయ్యే సరుకుల కోసం చిన్న పెట్టుబడులు సరిపోతే, భారీ వర్కింగ్ పిరియడ్లు గల సరుకుల కోసం భారీ పెట్టుబడులు అవసరమవుతాయి.

ఒక సరుకుని తయారుచేయించే పెట్టుబడిదారుడు, అదే శాఖలో వున్న (అదే రకం సరుకుని తయారుచేయించే) ఇతర పెట్టుబడిదారులతో పోటీ కోసం (ఇతర పెట్టుబడిదారుల కన్నా తన సరుకుని తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యడం కోసం), తన దగ్గిర ఉత్పత్తి శక్తి ని పెంచి, తన సరుకు వర్కింగ్ పిరియడ్ ని తగ్గించడానికే చూస్తాడు. అదే పని ని ఇతర పెట్టుబడిదారులు కూడా చేస్తారు కాబట్టి, ఈ పోటీ, క్రమ క్రమంగా సరుకుల వర్కింగ్ పిరియడ్ల ని తగ్గించివేస్తూ వుంటుంది.

పెట్టుబడిదారీ విధానం, పంటల ఉత్పత్తి కాలాల్నీ, జంతువుల ఉత్పత్తి కాలాల్నీ కూడా, తగ్గించి వెయ్యడానికే ఆరాటపడుతుంది. దీర్ఘమైన ఉత్పత్తి కాలాలు గల అడవుల పెంపకం వంటి పనుల మీద, ఈ విధానం, ఏ మాత్రమూ ఆసక్తి చూపదు. ఎందుకంటే, ఆ ఉత్పత్తి క్రమాల్లో పెట్టే పెట్టుబడులు వెనక్కి రావడానికి చాలా కాలం పడుతుంది గనక.

'ఉత్పత్తి శక్తుల' పెరుగుదల అనేది, ఒక్క శాఖ లోనే జరిగి, ఇతర శాఖల్లో జరగకుండా వుండదు. ఆ పెరుగుదల, అన్ని శాఖల లోనూ ఒకే స్థాయిలో వుండకపోయినా, ఉత్పత్తి శక్తి, అన్ని శాఖల్లోనూ పెరుగుతూనే వుంటుంది. కొన్ని సంవత్సరాలు జరిగే టప్పటికి, అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి శక్తులు రెట్టింపు అయ్యాయి — అనుకుంటే (చిన్న చిన్న తేడాల్ని వదిలేసి), అన్ని శాఖలలోనూ వర్కింగ్ పిరియడ్లు సగానికి తగ్గి పోతాయి. కానీ, అప్పుడు కూడా వేరు వేరు సరుకుల వర్కింగ్ పిరియడ్ల మధ్య తేడాలు ఎప్పటిలాగే వుంటాయి. అంటే, వేరు వేరు సరుకుల ఉత్పత్తికి కావలసిన పెట్టుబడుల మధ్య తేడాలు కూడా ఎప్పటిలాగే వుంటాయి.

'వర్కింగ్ పిరియడ్' చాప్టర్ చివర్లో **మార్క్సు**, 'మను ధర్మ శాస్త్రం' నించి కొన్ని మాటలు ఉదాహరించాడు. దానితోపాటే ఒక ఇంగ్లీషు రిపోర్టులో మాటల్నీ కూడా. 1867 లో మద్రాసూ, ఒరిస్సాల కరువుల గురించి వచ్చిన ఒక ఇంగ్లీషు రిపోర్టులో ఒక వాక్యం ఇలా వుంది. "భారత దేశంలో ఒక ఎద్దు పోతే ఇంకో ఎద్దుని తేవడం (టు రీప్లేస్) కన్నా, ఒక మనిషి పోతే ఇంకో మనిషిని తేవడం చాలా తేలిక." ఈ వాక్యాన్ని చూపిస్తూ మార్క్సు — "ఈ వాక్యంతో మను ధర్మ శాస్త్రంలోని ఈ మాటల్ని పోల్చిచూడండి" అంటూ, ఆ శాస్త్రం నించి (అందులో చాప్టరు 10 : 62) కొన్ని మాటల్ని ఇలా ఉదహరిస్తాడు—

"బ్రాహ్మణుడి (ప్రీస్ట్) మనుగడ కోసమూ, గోవు మనుగడ కోసమూ, ప్రతి ఫలాపేక్ష లేకుండా ప్రాణ త్యాగం చెయ్యడం, అధమ జాతుల వారికి (బేస్ బోర్న్ ట్రైబ్స్-కి) బ్రహ్మానందం కాగలదు (బేటట్యూడ్)"

[కాపిటల్-2, మాస్కో ఎడిషన్, 1974. పేజి-241]

# చలామణీ కాలం (సర్క్యులేషన్ పిరియడ్)

**ఒ**క సరుకు తయారైనప్పటి నించీ, దాన్ని అమ్మే వరకూ పట్టే కాలమే 'చలామణీ కాలం'. ఉత్పత్తి కాలం అన్ని శాఖలల్లోనూ ఒకే రకంగా వుండనట్టే, చలామణీ కాలం కూడా అన్ని శాఖ ల్లోనూ ఒకే రకంగా వుండదు.

చలామణీ కాలంలో తేడాలు, ఉత్పత్తుల స్వభావాల్ని బట్టి కొంతా, ఉత్పత్తి స్థలాలకూ అమ్మకం స్థలాలకూ వుండే దూరాల్ని బట్టి కొంతా, వుంటాయి. పాలూ, గుడ్లూ, కూరగాయలూ — వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తుల చలామణీ కాలాలు, చాలా

తక్కువగానూ; బట్టలూ, ధాన్యమూ — వంటి నిలవ వుండే ఉత్పత్తుల చలామణీ కాలాలు, కొంత ఎక్కువ గానూ వుంటాయి. రవాణా సౌకర్యాలు ఎక్కువగా వున్నాయా, తక్కువగా వున్నాయా — అనే దాన్ని బట్టి కూడా, వేరు వేరు ప్రాంతాల్లో చలామణీ కాలాలు తేడాగా వుంటాయి.

సరుకు తయారైపోయిన తర్వాత, దాని మీద ఇంకా స్టోరూ రవాణా వంటి దశలు కొన్ని జరుగుతా యనీ, అవన్నీ చలామణీ క్రమంలోకి వస్తాయనీ, ఇంతకు ముందే చూశాం. అవన్నీ చలామణీ క్రమంలో జరిగిన దశలే అయినా, అవి కూడా ఉత్పత్తి క్రమాలే. కాబట్టి, 'చలామణీ క్రమం' అన్నప్పుడు, అమ్మకం జరిగే చివరి దశే అసలైన చలామణీ క్రమం (ప్యూర్ చలామణీ క్రమం).

ఉత్పత్తి దశల్లో ఏ దశని తీసుకున్నా (అది, స్టోరూ—రవాణా లాంటి ఏ దశ అయినా), దానికి ఎంతో కొంత సమయం అవసరమవుతుంది. కానీ, 'అమ్మకం జరగడం' అనే చలామణీ దశ కి, కొంత సమయం పట్టడం, తప్పనిసరి అవసరం కాదు. ఒక సరుకు, తన ఉత్పత్తి దశలన్నీ ముగించుకుని అమ్మకం కోసం షాపులోకి వచ్చిందంటే, అమ్మకానికి ఏ సమయమూ పట్టకుండా వెంటనే అమ్మకం జర గడం అసాధ్యం కాదు. కొనే మనిషి ఎవరైనా డబ్బు ఇచ్చి సరుకుని తీసుకుంటే, అమ్మకం జరిగిపోయి నట్టే. కుట్టు పని కీ, నేత పని కీ, తప్పనిసరిగా కొంత సమయం అవసరమైనట్టుగా, అమ్మకం జరగడానికి ఆ రకంగా సమయం అవసరం అవదు. 'అమ్మకం' అనే పని, ఉత్పత్తి దశ లాంటిది కాదు కాబట్టి, దాని కోసం కొంత సమయం పట్టకుండా ఆ పని వెంటనే జరిగిపోవడం సాధ్యమే. షాపు లోకి వచ్చిన సరుకు, అమ్మకం జరగకుండా కొంత కాలం పాటు షాపులోనే పడివుందంటే, దానికి వేరే కారణం వుందని అర్థం. అంతే గానీ, అమ్మకం - పని కోసమే ఆ సమయం పడుతుందని అర్థం కాదు.

తయారైన సరుకు, వెంటనే అమ్ముడైపోతే, చలామణీ కాలం అసలు లేని దానితో సమానం. అలా జరిగితే, అది, ఆదర్శవంతమైన చలామణీ కాలం. ఆదర్శవంతమైన చలామణీ కాలం — అంటే, అది అసలు లేకపోవడమే. దాని కోసం సమయం పట్టకపోవడమే.

# టర్నోవరు కాలం

**స**రుకు ఉత్పత్తి కీ, దాని చలామణీ కీ పట్టే మొత్తం కాలమే — 'టర్నోవరు కాలం'. ఉత్పత్తి కాలమూ + చలామణీ కాలమూ=టర్నోవరు కాలం.

పెట్టుబడిదారుడు, మొదట తన 'డబ్బు- పెట్టు బడి'తో ముడి పదార్థాలూ వగైరాల్ని కొనే దశ 'చలా మణీ కాలం'లోని మొదటి దశ. ఈ దశ తోనే 'టర్నో వరు కాలం' ప్రారంభమవుతుంది. ఈ దశలో M—C జరుగుతుంది. తర్వాత 'ఉత్పత్తి క్రమం' (p) జరుగు తుంది. తయారైన సరుకుని అమ్మే దశ చలామణీ క్రమంలోని 2 వ దశ. ఈ దశలో $C^1$ — $M^1$ జరుగు తుంది. ఈ దశతో టర్నోవరు కాలం ముగుస్తుంది. మొదట పెట్టిన M, $M^1$గా మారే వరకూ వుండే మొత్తం కాలమే టర్నోవరు కాలం. ఇది ఒక్కో రకం సరుకు విషయంలో (అంటే, ఒక్కో శాఖలో) ఒక్కో రకంగా వుంటుంది.

'పాల' ఉత్పత్తి శాఖలో పూటకో టర్నోవరు జరు గుతుంది. బట్టల శాఖలో వారానికో టర్నోవరు జరగ వచ్చు. ధాన్యం శాఖలో సంవత్సరానికో టర్నోవరు.

టర్నోవరు కాలం తక్కువగా వుంటే తక్కువ పెట్టుబడీ, ఎక్కువగా వుంటే ఎక్కువ పెట్టుబడీ, అవ సరమవుతాయి. అదే టర్నోవరు కాలానికీ, పెట్టుబడి పరిమాణానికీ వుండే సంబంధం.

ఒక శాఖలో టర్నోవరు కాలం 1 వారం — అన్న ప్పుడు, ఆ శాఖలో ప్రతీ ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరా, టర్నోవరు కాలం ఖచ్చితంగా అలాగే వుంటుందని అర్థం కాదు. కొందరి టర్నోవరు, వారం కన్నా కొంత ఎక్కువగా వుంటే, కొందరి టర్నోవరు వారం కన్నా కొంత తక్కువగా వుండవచ్చు. ఒకే శాఖలో వుండే ఈ తేడాల్ని లెక్కలోకి తీసుకోకుండా, ఆ సరుకు ఉత్ప త్తికీ, అమ్మకానికీ, సాధారణంగా పట్టే ఒక 'సగటు కాలాన్నే' ఆ శాఖకు సంబంధించిన టర్నోవరు కాలంగా అనుకుంటాము. ఇంకో శాఖలో టర్నోవరు కాలం 10 వారాలు — అన్నప్పుడు, అది ఆ సరుకుకి సంబంధించిన సగటు టర్నోవరు కాలమే.

ఒక శాఖలో వుండే విడి విడి పెట్టుబడిదారు లందర్నీ కలిపి ఒకే పెట్టుబడిదారుడిగా అనుకుందాం. ఆ ఒకే పెట్టుబడిదారుడు, ఒక పెద్ద పెట్టుబడితో, ఒక 'సరుకుల రాసి'ని ఉత్పత్తి చేయిస్తూ, దాన్ని అమ్మిస్తూ, అదనపు విలువని సంపాదిస్తూ వుంటాడన్న మాట. ఆ 'సరుకుల రాసి'కి ఒక 'సగటు టర్నోవరు కాలం' వుంటుంది.

అన్ని శాఖల గురించీ ఇలాగే అనుకుందాం. ఒక్కొక్క శాఖలో ఒక్కొక్క పెట్టుబడిదారుడే వున్నట్టు. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 'పెట్టుబడి' అంటే, సరుకు కోసం ఖర్చయిన చలామణీ పెట్టుబడినే (కాస్టు ప్రైసు - నే) తీసుకుంటాము. ఫిక్సెడ్ పెట్టుబడిలో అరగని భాగం సంగతి అనవసరం.

అలాగే, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఏ శాఖలోనూ కూడా 'చలామణీ కాలం' లేనట్టుగా అనుకుందాం. అంటే, అన్ని శాఖల సరుకులూ, ఉత్పత్తి అయిన తక్షణమే, అమ్ముడైపోతూ వున్నట్టుగా.

బట్ట శాఖ, మొత్తం 100 చలామణీ పెట్టుబడితో పనిచేస్తోందనుకుందాం. ఇక్కడ ఉత్పత్తి కాలం, 1 వారం. ప్రతీ వారం చివరికీ కొంత సరుకు తయారై అమ్మకం దశకి చేరుతూ వుంటుంది. చలామణీ కాలం లేదనుకున్నాం కాబట్టి, సరుకు, తక్షణమే అమ్ముడైపోతూ వుంటుంది. ఉత్పత్తి కాలమే టర్నోవరు కాలం. 1 వారంలో పని చేసిన 100 పెట్టుబడే, వెంటనే తిరిగివచ్చి రెండో వారానికి కొత్త పెట్టుబడిగా అందుతూ వుంటుంది. పెట్టుబడి తిరిగిరావడం అంటే, ఖర్చయిపోయిన ఉత్పత్తి సాధనాలూ, కార్మికుల పోషణ వస్తువులూ మళ్ళీ ఉత్పత్తి అయ్యి అందడమే. ఇక్కడ 'బట్ట' తయారవుతూ వున్నట్టే, అవన్నీ కూడా ఇతర శాఖల్లో తయారవుతూ వుంటాయి. బట్ట శాఖలో సరుకంతా తక్షణం వెళ్ళిపోతూ వున్నట్టూ, ఈ శాఖకి కావలసిన ఉత్పత్తి సాధనాలన్నీ ఇతర శాఖల నించి తక్షణం అందుతూ వున్నట్టూ, అనుకుందాం. బట్ట శాఖలో ప్రతి వారమూ కొత్తగా పని చేసే 100 పెట్టుబడి, ప్రతి వారమూ కొత్త అదనపు విలువని తెస్తూ వుంటుందని వేరే చెప్పనక్కరలేదు.

యంత్రాల శాఖ లో ఉత్పత్తి కాలం, 5 వారాలు. ప్రతి వారానికీ 200 పెట్టుబడి చొప్పున, 5 వారాలకూ మొత్తం 1,000 పెట్టుబడి ఖర్చవు తుందనుకుందాం. 5 వారాలు పూర్తి అయిన తర్వాత కొత్త ఉత్పత్తి బయటికి వస్తుంది. ఇక్కడ కూడా చలామణీ కాలం లేదు. అంటే, ఇక్కడ 5 వారాలకు 1 టర్నోవరు జరుగుతుంది. అప్పుడు, 'వెయ్యి' పెట్టుబడి వెనక్కి వచ్చేస్తుంది.

ఒక శాఖలో 100 పెట్టుబడి, వారానికి 1 టర్నోవరు చేస్తోంటే, ఇంకో శాఖలో వెయ్యి పెట్టుబడి, 5 వారాలకు 1 టర్నోవరూ; మూడో శాఖలో పెట్టుబడి, 12 వారాలకు 1 టర్నోవరూ. నాలుగో శాఖలో, ఇంకో రకంగా. ఇలా, అనేక శాఖల్లో పెట్టుబడుల సైజులూ, అవి పనిచేసే కాలాలూ, రక రకాల తేడాలతో వుంటాయి. ఇన్ని తేడాల మధ్య ఏ శాఖ ఎంత పెట్టుబడితో పనిచేస్తోందీ —అనే విషయం కావాలి. ఎందుకంటే, ఒక శాఖ, తన పెట్టుబడి పరిమాణాన్ని బట్టే, 'మొత్తం అదనపు విలువ రాసి' నించీ తన వాటాని తీసుకోగలుగుతుంది కాబట్టి.

ఏ శాఖలో ఎంత పెట్టుబడి పనిచేస్తోందో గ్రహించాలంటే, అన్ని శాఖలకూ ఏదో ఒకే కాలాన్ని కొలత బద్దగా తీసుకోవాలి. 'సంవత్సరం' అనేదే, ఆ కొలత బద్ద. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, సంవత్సరానికి 52 వారాలు గాక, 50 వారాలే అనుకుందాం. అన్ని శాఖలకూ అదే వర్తిస్తుంది కాబట్టి, అలా అనుకోవడం వల్ల సమస్యేమీ రాదు.

ఒక శాఖలో పెట్టుబడి 100. దీని ఉత్పత్తి కాలం 1 వారం. చలామణీ కాలం లేదు. అంటే, టర్నోవరు కాలం 1 వారం. ఈ శాఖలో సంవత్స రానికి ఎంత పెట్టుబడి పనిచేసినట్టు?

1 సంవత్సరానికి గుర్తు — పెద్ద T (పెద్ద టైమ్).
ఒక టర్నోవరు కాలానికి గుర్తు — చిన్న t (చిన్న టైమ్).
టర్నోవర్ల సంఖ్యకు గుర్తు — N (నంబరు).
టర్నోవర్ల సంఖ్య = సంవత్సరం ÷ 1టర్నో. కాలం
$N = T \div t$
N = 50 వారాలు ÷ 1వారం = 50 టర్నోవర్లు
1 టర్నోవరులో పెట్టుబడి 100.
50 టర్నోవర్లలో —— 50 × 100 = 5,000.

ఈ శాఖ, 1 సంవత్సరంలో, 5,000 పెట్టుబడితో పనిచేసిందని అర్థం. ఇది, సంవత్సర చలామణీ పెట్టుబడి. లేదా, సంవత్సర కాస్ట్ ప్రైస్. ఈ శాఖకి ఒక సంవత్సరంలో ఎంత లాభం రావాలీ — అన్నప్పుడు, దాన్ని 2 రకాలుగా చూడవచ్చు. పెట్టుబడిని 100 గా తీసుకుంటే, దానికి 50 వారాలకు (1 సంవత్సరానికి) సంబంధించిన లాభం రావాలి. లేదా, పెట్టుబడిని 5 వేలుగా తీసుకుంటే, దానికి, 1 వారానికి సంబంధం

చిన లాభం రావాలి. ఏ రకంగా చూసిన 'లాభం రాసి' ఒకే రకంగా వుంటుంది.

లాభాన్ని, మొత్తం సంవత్సరానికి అయినా చూడ వచ్చు. లేదా, ఒక్క టర్నోవరు కాలానికి అయినా చూడవచ్చు. ఎలా చూసినా 1 సరుకు ఉత్పత్తి ధర ఒకే రకంగా వుంటుంది.

ఇక్కడ, జనరల్ లాభం రేటు కూడా కావాలి. దాన్ని ఏదో ఒక రకంగా తీసుకోవాలి. 'జనరల్ లాభం రేటు' ని, 100 పెట్టుబడికి, సంవత్సరానికి (50 వారాలకు) 50% అనుకుందాం. ఆ సంవత్సర కాలంలో ఏ పరిస్థితులూ మారలేదని కూడా అనుకుందాం.

ఏ శాఖలో పెట్టుబడికి అయినా (1) దాని పరిమాణాన్ని బట్టీ (2) అది పనిచేసిన కాలాన్ని బట్టీ లాభం రావలసి వుంటుంది. ఆ పెట్టుబడీ, ఆ లాభమూ కలిసి, ఆ సరుకుకి 'ఉత్పత్తి ధర'.

**సైను బట్ట ఉదాహరణ :**

బట్ట శాఖలో, 100 పెట్టుబడి, వారానికి 1 టర్నోవరు చేస్తుంది - అనుకున్నాం. 50% జనరల్ లాభం రేటు లెక్కన, (100 పెట్టుబడికి, 50 వారాలకు, 50 లాభం అయితే), 100 పెట్టుబడికి, 1 వారానికి, రావలసిన లాభం 1. 1 వారంలో తయారైన బట్టకి ఉత్పత్తి ధర = 100 పెట్టుబడీ +1 లాభం = 101.

లేదా, మొత్తం సంవత్సర సరుకుని చూడాలంటే, 50 టర్నోవర్లనీ కలపడమే.

50 టర్నోవర్లలో పెట్టుబడి ..... 5,000
50 టర్నోవర్లలో లాభం .............. 50
50 టర్నోవర్ల ఉత్పత్తి ధర ...... 5,050
1 టర్నోవరు సరుకు ధర ...... 1011

టర్నోవర్‌కి చూసినా, మొత్తం సంవత్సరానికి చూసినా, బట్ట కి ఉత్పత్తి ధర ఒకే రకంగా వుంటుంది.

**యంత్రాల శాఖ ఉదాహరణ :**

ఉత్పత్తి కాలం 5 వారాలు. చలామణీ కాలం లేదు. టర్నోవరు కాలం 5 వారాలే. పెట్టుబడి — వెయ్యి. ఈ వెయ్యి పెట్టుబడి, మొదటి వారంలోనే పనిలోకి దిగి, 5 వారాలు పనిలో వుంటుంది. జనరల్ లాభం రేటు ని, బట్ట ఉదాహరణలోలాగే తీసుకోవాలి. — ఈ సరుకు ఉత్పత్తి ధర ఎలా వుంటుంది?

ఈ ఉదాహరణలో, 5 వారాలకు 1 టర్నోవరు చొప్పున, సంవత్సరానికి 10 టర్నోవర్లు జరుగుతాయి. మొదట, 1 టర్నోవరుకి సంబంధించిన విషయాలే చూద్దాం.

100 పెట్టుబడికి, 1 వారానికి లాభం 1
1000 పెట్టుబడికి 1 వారానికి లాభం 10
1000 పెట్టుబడికి 5 వారాలకు లాభం 50

ఒక టర్నోవరు ముగిసి, కొత్త సరుకు బైటికి వచ్చినప్పుడు దాని ఉత్పత్తి ధర = 1000 పెట్టుబడీ + 50 లాభం = 1050. ఇది, 1 టర్నోవరు విషయం. ప్రతీ టర్నోవరుకీ ఇదే జరుగుతుంది.

ఒక శాఖలో పెట్టుబడి 5 వేలు. ఉత్పత్తి కాలం 10 వారాలు. చలామణీ కాలం లేదు. ఆ పెట్టుబడి సంవత్సరానికి 5 టర్నోవర్లు చేస్తుంది. ప్రతీ టర్నోవరులోనూ ఆ పెట్టుబడి కొంత 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేస్తుంది.

ఇంకో శాఖలో పెట్టుబడి 10 వేలు. అది వంతెనలు కట్టే పనిలో వుంటుంది. ఉత్పత్తి కాలం 2 సం॥లు. అంటే, 1 టర్నోవరు జరగడానికి 2 సం॥లు పడుతుంది. 1 సంవత్సరానికి అర్ధ టర్నోవరే జరుగుతుంది. టర్నోవరు పూర్తి అయి నప్పుడే ఆ పెట్టుబడి, లాభంతోసహా వెనక్కి వస్తుంది.

ఈ రకంగా, పెట్టుబడులూ, వాటి టర్నోవర్లూ ఎన్నో తేడాలతో వుంటాయి. ఏ శాఖ లో అయినా, పెట్టుబడి పరిమాణమూ, అది పనిచేసిన కాలమూ — అనే 2 అంశాల్ని బట్టే, అదనపు విలువ ఉత్పత్తి ఉంటుంది. పెట్టుబడి కి రావలసిన లాభం కూడా, ఆ 2 అంశాల మీదే ఆధార పడి వుంటుంది.

తక్కువ పెట్టుబడి కి, తక్కువ లాభం,
ఎక్కువ పెట్టుబడి కి, ఎక్కువ లాభం.
తక్కువ కాలానికి, తక్కువ లాభం,
ఎక్కువ కాలానికి, ఎక్కువ లాభం.
చిన్న టర్నోవరుకి చిన్న లాభం అయితే,
పెద్ద టర్నోవరుకి పెద్ద లాభం.

చిన్న టర్నోవర్లు చేసే పెట్టుబడి, సంవత్సరంలో ఎక్కువ టర్నోవర్లు చేస్తే; పెద్ద టర్నోవర్లు చేసే పెట్టుబడి, సంవత్సరంలో, తక్కువ టర్నోవర్లు చేస్తుంది. చిన్న టర్నోవర్లు చేసే పెట్టుబడి, ప్రతీ టర్నోవరు ద్వారా తక్కువ లాభమే తీసుకున్నా, అలాంటి తక్కువ లాభాల్ని ఎక్కువ సార్లు తీసు కుంటుంది. పెద్ద టర్నోవర్లు చేసే పెట్టుబడి, ప్రతీ టర్నోవరు ద్వారా ఎక్కువ లాభం తీసుకున్నా, అలాంటి ఎక్కువ లాభాల్ని,

తక్కువ సార్లు తీసుకుంటుంది. ఒక పెట్టుబడి — చిన్న చిన్న టర్నోవర్లు చేస్తుందా, పెద్ద పెద్ద టర్నోవర్లు చేస్తుందా — అనేది, పూర్తిగా అనవసరం. ఏ శాఖలో టర్నోవరు కాలం ఎలా వున్నా, అన్ని శాఖలకూ లాభం రేటు దాదాపు ఒకే రకంగా వుండవలసిందే. కాబట్టి, వేరు వేరు శాఖల టర్నోవర్లు ఎన్ని తేడాలతోవున్నా, ఆ తేడాల ప్రభావం, 'లాభం రేటు' మీద ఏమీ వుండదు. అంటే, చిన్న టర్నోవర్లు వున్న చోట లాభం రేటు తక్కువగా వుండడం గానీ, పెద్ద టర్నోవర్లు వున్న చోట లాభం రేటు ఎక్కువగా వుండడం గానీ, జరగదు.

టర్నోవర్లలో తేడాల వల్ల లాభం రేటు హెచ్చు తగ్గులవడం — ఎక్కడ జరుగుతుందంటే, ఒకే శాఖలో వుండే వేరు వేరు పెట్టుబడిదారుల మధ్య. ఒకే శాఖలో పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని 'ఒకే ధర'తో అమ్ముతారు కాబట్టి, టర్నోవరు కాలం సగటు కన్నా తక్కువగా వున్న వాడికి (అంటే సరుకుల్ని తొందరగా అమ్మగలిగిన పెట్టుబడి దారుడికి) ఖర్చులు తగ్గి, లాభం ఎక్కువగా వుంటుంది. టర్నోవరు కాలం ఎక్కువగా వున్న చోట, (సరుకుల్ని తొందరగా అమ్మలేని చోట) ఖర్చులు పెరిగి, లాభం తగ్గుతుంది. ఈ రకంగా టర్నోవరు కాలంలో తేడాలు, ఒకే శాఖ లోని పెట్టుబడిదార్ల లాభం రేట్లని ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్తితి వేరు వేరు శాఖలకు వర్తించదు.

ఇంత వరకూ, 'టర్నోవరు కాలం' అంటే, చలామణీ కాలం లేకుండా, ఉత్పత్తి కాలాన్ని మాత్రమే టర్నోవరు కాలంగా చూశాం. అంటే, ఒక 'ఉత్పత్తి కాలం'లో పనిచేసిన పెట్టుబడే, తక్షణం తిరిగివచ్చి 'ఇంకో ఉత్పత్తి కాలానికి' అందుతూ వుంటుంది అన్నట్టు! ఉదాహరణలు తేలిగ్గా వుండడానికే మొదట అలా చూశాం. కానీ, సరుకుల్ని 'అమ్మవలసివున్న' పెట్టుబడిదారీ విధానంలో, ఆ అమ్మే పని తక్షణమే జరిగి పోవడమూ, ఖర్చయిన పెట్టుబడి తక్షణమే తిరిగి రావడమూ, ఎన్నడూ జరగదు. ప్రతీ శాఖలోనూ, తయారైన కొత్త సరుకు అమ్ముడుపోయి ఆ డబ్బు చేతికి రావడానికి ఎంతో కొంత కాలం తప్పనిసరిగా పడుతుంది. అంటే, ప్రతీ శాఖకీ ఎంతో కొంత 'చలామణీ కాలం' వుండితీరుతుంది. కాబట్టి ఇప్పుడు చలామణీ కాలాన్ని కూడా (దాని కోసం కూడా కొంత కాలాన్ని) దృష్టి లోకి తీసుకోవాలి.

బట్ట కి ఉత్పత్తి కాలం 1 వారం. పెట్టుబడి 100. చలామణీ కాలం 1 వారం. అంటే, బట్ట తయారవడానికి 1 వారమూ, తయారైవున్న బట్టని 'అమ్మడానికి' ఇంకో వారమూ, పడతాయి — అని అర్థం.

అయితే, బట్ట తయారైన తర్వాత, ఆ బట్టకి అమ్మకం జరిగి ఆ పెట్టుబడి వెనక్కి వచ్చే వరకూ, అంటే 1 వారం రోజుల వరకూ, 'ఉత్పత్తి క్రమం' ఆగిపోయి వుంటుందా? బిల్డింగూ, ఇతర శ్రమ పరికరాలూ, ఆ వారం రోజులూ ఖాళీగా పడి వుంటాయా? — అలా జరగదు. ఒక ఉత్పత్తి క్రమం తర్వాత ఇంకో ఉత్పత్తి క్రమం వరసగా జరిగిపోతూనే వుంటాయి. కార్మికులు ప్రతి రోజూ పని చేస్తూనే వుంటారు. ఉత్పత్తి సాధనాలు ప్రతి వారమూ ఖర్చవుతూనే వుంటాయి.

మొదటి పెట్టుబడి వెనక్కి రాకుండానే, ఇంకో 'ఉత్పత్తి క్రమం' జరగడం ఎలా సాధ్యం? — ఎలాగంటే, 'ఇంకో పెట్టుబడి'తో! దాన్ని 'రెండో పెట్టుబడి' అనాలి. మొదటి పెట్టుబడి ఎంత వుంటే, రెండో పెట్టుబడి కూడా అంత వుండాలి. రెండు పెట్టుబడులూ 'ఒకే సరుకు కోసం' కాదు. మొదటి పెట్టుబడి — ఒక 100 మీ. బట్ట కోసం అయితే, రెండో పెట్టుబడి, ఇంకో 100 మీ. బట్ట కోసం. ఏ సరుకు విలువ, ఆ సరుకుదే! ఏ సరుకు 'అదనపు విలువ' ఆ సరుకుదే! దేని విలువ అంశాలన్నీ దానికి వేరుగా వుంటాయి.

1 వ పెట్టుబడి, చలామణీ క్రమంలో నించి వెనక్కి వచ్చేదాకా, 2 వ పెట్టుబడి ఉత్పత్తి క్రమంలో వుంటుంది. 1 వ సరుకు అమ్ముడుపోయే టప్పటికి, 2 వ సరుకు తయారై సిద్ధంగా వుంటుంది. 1 వ పెట్టుబడి వెనక్కి (ఉత్పత్తి క్రమం లోకి) రాగానే, రెండో పెట్టుబడి చలామణీలోకి వెళ్తుంది. — ఈ రకంగా, 2 పెట్టుబడులూ కలిసి, ఒక దాని తర్వాత ఒకటి పనిచేస్తూ, ఉత్పత్తి క్రమం ఆగిపోకుండా ఎప్పుడూ సాగేలాగ చేస్తూ వుంటాయి.

ఒక పెట్టుబడి 200. ఉత్పత్తి కాలం 2 వారాలు. చలామణీ కాలం 2 వారాలు. ఈ పెట్టుబడితో, కొత్త ఉత్పత్తి తయారైన తర్వాత, దాని అమ్మకం జరిగే వరకూ ఉత్పత్తి క్రమం ఆగి పోకుండా వుండాలంటే, ఇంకో 200 పెట్టుబడి కూడా కావాలి. అది, 2 వ పెట్టుబడి. ఈ ఉదాహరణలో, మొత్తం 400 పెట్టుబడి కావాలి. కానీ, అది అంతా ఒకే ఉత్పత్తి క్రమం

కోసం కాదు. అది, 2 భాగాలుగా చీలి, 2 ఉత్పత్తి క్రమాల్లో పనిచేస్తుంది.

'ఉత్పత్తి క్రమం'లో వుండే పెట్టుబడే — 'పని చేసే పెట్టుబడి' (యాక్టివ్ కాపిటల్). అదే, 'విలువ'ని ఉత్పత్తి చేస్తుంది. 'ఉత్పత్తి క్రమం' ముగిసి, ఆ సరుకు, 'అమ్మకానికి' వెళ్ళినప్పుడు, ఆ పెట్టుబడి, చలామణీ క్రమంలో వుందని అర్థం. అది, అలా వున్నంత కాలమూ విలువని ఉత్పత్తి చెయ్యదు. (చలామణీ క్రమంలో జరిగే స్టోరూ, రవాణా - వంటి ఉత్పత్తి క్రమాల్ని ఇక్కడ కలపడం లేదు.) 1వ పెట్టుబడి అయినా, 2వ పెట్టుబడి అయినా, 'ఉత్పత్తి క్రమం'లో వున్న కాలం లోనే విలువని ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి, 'విలువ'ని, ఎంత పెట్టుబడి, ఎంత కాలంలో ఉత్పత్తి చేసిందీ — అనే విషయాలు తెలుసుకోవాలంటే, 'ఉత్పత్తి క్రమం'లో వున్న పెట్టుబడిని మాత్రమే, అది 'ఉత్పత్తి క్రమం'లో వున్న కాలాన్ని మాత్రమే, లెక్క లోకి తీసుకోవాలి.

ఒక 100 పెట్టుబడి, 1 వారం పాటు ఉత్పత్తి క్రమంలో వుందనుకుందాం. ఆ పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకు ద్వారా దానికి ఎంత లాభం రావాలంటే, 100 పెట్టుబడికి, 1 వారానికి వచ్చే లాభం, రావాలి.

ఒక శాఖలో ఉత్పత్తి కాలం 1 వారం. చలామణీ కాలం 1 వారం. 1వ పెట్టుబడి 100. 2వ పెట్టుబడి కూడా 100. సంవత్సరానికి 50 వారాలు. ఈ ఉదాహరణలో, 1 సంవత్సరంలో పనిచేసిన మొత్తం పెట్టుబడి ఎంత? ఉత్పత్తి క్రమంలో, 1వ పెట్టుబడి ఎంత మొత్తంగా పనిచేసింది? 2వ పెట్టుబడి ఎంత మొత్తంగా పనిచేసింది?

'ఉత్పత్తి క్రమం'లో, 1 వారానికి —— 100 పెట్టుబడి. 50 వారాలకు, 50 × 100 = 5,000.

1 సంవత్సరంలో 2 పెట్టుబడులూ కలిసి మొత్తం 5 వేల పెట్టుబడిగా పనిచేస్తాయి. 1వ పెట్టుబడి 2,500 గానూ; 2వ పెట్టుబడి, ఇంకో 2,500 గానూ అన్నమాట.

1 వారంలో ఉత్పత్తి అయిన సరుకుని, ఒక యూనిట్ — అనుకుందాం. 50 వారాల్లో 50 యూనిట్లు. 1వ పెట్టుబడి ద్వారా 25 యూనిట్లూ, 2వ పెట్టుబడి ద్వారా ఇంకో 25 యూనిట్లూ. మొత్తం 5 వేల పెట్టుబడి, 50 యూనిట్ల సరుకు ద్వారా, 1 వారపు లాభాన్ని, సంపాదిస్తుంది. లేదా, దీన్నే ఇంకో రకంగా చెప్పుకుంటే, ఒక 100 పెట్టుబడి, 50 యూనిట్ల ద్వారా, 50 వారాల లాభాన్ని సంపాదిస్తుంది.

ఇంకో శాఖలో ఉత్పత్తి కాలం, 1 నెల. చలామణీ కాలం, 1 నెల. 1వ పెట్టుబడి నెలకి 500. 2వ పెట్టుబడి కూడా 500. సంవత్సరానికి 12 నెలలు. ఈ శాఖలో, సంవత్సరంలో, మొత్తం ఎంత పెట్టుబడి పనిచేస్తుంది?

ఉత్పత్తి క్రమం లో, ప్రతి నెలా 500 పెట్టుబడి వుంటుంది. ఆ రకంగా 12 నెలలకు = 12 × 500 = 6,000. అంటే, 1వ పెట్టుబడి 3,000, 2వ పెట్టుబడి ఇంకో 3,000. సంవత్సరానికి ఉత్పత్తి అయిన మొత్తం సరుకులో, 1వ పెట్టుబడి ద్వారా సగం సరుకూ, 2వ పెట్టుబడి ద్వారా ఇంకో సగం సరుకూ తయారవుతాయి. ఆ సరుకుల ద్వారా, ఆ పెట్టుబడులకు లాభాలు రావాలి. పెట్టుబడిని 500 గా చూస్తే, దానికి 12 నెలల లాభం రావాలి. లేదా, పెట్టుబడిని 6,000 గా చూస్తే, దానికి, 1 నెల లాభం రావాలి. ఎలా చూసినా 'లాభం రాసి' ఒకటే.

పెట్టుబడి అన్నప్పుడు, అది అంతా ఎప్పుడూ ఒకే దశలో వుండదు. ఒక పెట్టుబడిదారుడి దగ్గిర మొత్తం 200 పెట్టుబడి వుందనుకుందాం. 1వ పెట్టుబడీ, 2వ పెట్టుబడీ కలిసిన మొత్తం అది. అది ఎప్పుడూ 3 దశల్లో వుంటుంది. కొంత భాగం 'డబ్బు'గానూ, కొంత భాగం 'ఉత్పత్తి సాధనాలు' గానూ, కొంత భాగం తయారై సిద్ధంగా వున్న 'కొత్త సరుకు'గానూ. ఈ 3 దశల్లోనూ వున్న విలువల మొత్తం 200.

డబ్బు అంటే — — డబ్బు పెట్టుబడి (M).
ఉత్పత్తి సాధనాలు — ఉత్పాదక పెట్టుబడి (P).
తయారైన కొత్త సరుకు, సరుకు- పెట్టుబడి ($C^1$).

ఆ 200 పెట్టుబడి, ఒక సమయంలో ఇలా వుందనుకుందాం :

| | |
|---|---|
| డబ్బు పెట్టుబడి — — — | 40 |
| ఉత్పాదక పెట్టుబడి — — | 100 |
| తయారైన సరుకు పెట్టుబడి | 60 |
| మొత్తం విలువ | 200 |

తయారైన కొత్త సరుకు, అమ్ముడై డబ్బుగా మారుతుంది. డబ్బు, ఉత్పత్తి సాధనాలుగా, ఉత్పత్తి సాధనాలు కొత్త సరుకుగా. ఇలా ప్రతీ దశా, తర్వాత దశ లోకి మారుతూ వుంటుంది.

నూతన సమాజం లో 'సమిష్టి ఉత్పత్తి విధానం' ప్రారంభమై, సరైన విధంగా సాగుతూ వుంటే, 'డబ్బు

పెట్టుబడి' దశతో అవసరం తగ్గిపోతూ వుంటుంది. అంతే గాక, 'సరుకు పెట్టుబడి' దశ కూడా తగ్గి పోతూ వుంటుంది. తయారైన ఉత్పత్తిని, వాడకం కోసం నిల్వ చేసి వుంచుకోవడం తప్పనిసరిగా అవసరమే. కానీ, అది అమ్మకం కోసం కాదు కాబట్టి, అది 'సరుకు పెట్టుబడి' అవదు.

ఇంత వరకూ 'పెట్టుబడి టర్నో వరు'కి సంబంధించిన వివరాలు కొన్ని చూశాం. ఇప్పుడు విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడానికీ; ఉత్పత్తి ధరలు, మార్కెట్ ధరలుగా మారడానికీ సంబంధించిన విషయాలు చూస్తాం.

పెట్టుబడిదారీ విధానంలో, 'అదనపు విలువ రాసి'ని పెట్టుబడులకు సమానంగా పంచే 'మెకానిజం' పనిచేస్తూ వుంటుందనీ; దాని కోసమే విలువలు ఉత్పత్తి ధరలుగా మారతాయనీ, రుజువు చెయ్యడానికి, ఈ చర్చ అంతా చేస్తున్నాం. పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు గ్రహించని విషయాల్లో ఇది కూడా ఒకటి.

# విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం

**ఉ**త్పత్తి ధర అంటే, విలువ కన్నా కొంత ఎక్కువో తక్కువో అయ్యే ధర.

ఒక పెట్టుబడిదారీ దేశంలో, మొత్తం 5 ఉత్పత్తి శాఖలు వున్నాయి అనుకుందాం. ఆ 5 శాఖల్లోనూ తయారైన ఉత్పత్తే, ఆ దేశపు మొత్తం ఉత్పత్తి అనుకుందాం.

ఒక శాఖలో ఉత్పత్తి అయ్యే సరుకు విలువ నీ, దానిలో వున్న అదనపు విలువ నీ చూడాలంటే, ఆ శాఖకి ఏదో ఒక విలువ కాంపోజిషన్ వున్నట్టుగా (దాని స్థిర, అస్థిరలు ఫలానా పాళ్ళలో వున్నట్టుగా) తీసుకోవాలి. నిజానికి, ఒకే శాఖలో వుండే వేరు వేరు పెట్టుబడుల ఉత్పాదక శక్తులన్నీ (పెట్టుబడుల విలువ కాంపోజిషన్లన్నీ) ఖచ్చితంగా ఒకే రకంగా వుండవు. అయినప్పటికీ, ఆ తేడాల లోనే ఒక 'సగటు పరిస్థితి' వుంటుంది. ఒక శాఖలో ఉత్పాదక శక్తి - అంటే, అది - సగటు ఉత్పాదక శక్తే. అలాగే, 'కాంపోజిషన్' అంటే అది కూడా - సగటు కాంపోజిషనే.

ప్రతీ శాఖ విషయమూ ఇలాగే.

ఒక విడి శాఖకి, సగటు ఉత్పాదక శక్తీ, సగటు కాంపోజిషనూ వున్నట్టు గానే, మొత్తం శాఖలన్నిటినీ కలిపి మొత్తం సమాజాన్ని చూస్తే, దానికి కూడా ఒక సగటు ఉత్పాదక శక్తీ, సగటు కాంపోజిషనూ వుంటాయి.

ప్రతి శాఖ కీ ఒక సగటు కాంపోజిషన్ నీ,

ప్రతీ శాఖ నించీ 100 శాంపిల్ పెట్టుబడి నీ, తీసుకుంటాం. 5 శాఖల్లో కాంపోజిషన్లు, ఇలా వున్నాయి - అనుకుందాం.

1) $80_C + 20_V$
2) $70_C + 30_V$
3) $60_C + 40_V$
4) $15_C + 85_V$
5) $95_C + 5_V$

ఈ 5 శాఖల పెట్టుబడుల్నీ కలిపితే అది 500. ఇది శాంపిల్ పెట్టుబడుల మొత్తం. ఈ మొత్తం నించి ఒక 100 ని తీస్తే, అది, సామాజిక పెట్టుబడికి శాంపిల్. దాని కాంపోజిషన్ ఏమిటి? - 5 శాఖల స్థిరల్నీ కలిపి సగటు చేస్తే - అది సామాజిక స్థిర. 5 శాఖల అస్థిరల్నీ కలిపి, సగటు చేస్తే - అది సామాజిక అస్థిర. ఆ స్థిరా, అస్థిరా కలిసి, అది సామాజిక పెట్టుబడి కి - సగటు కాంపోజిషన్.

ఈ సామాజిక పెట్టుబడి కాంపోజిషను సంగతి ఎందుకు? ఎందుకంటే: సామాజిక పెట్టుబడి, ఫలానా కాంపోజిషన్‌తో పని చేస్తూ, ఫలానా సైజు గల అదనపు విలువని ఉత్పత్తి చేస్తుంది - అనుకుందాం. ఆ కాంపోజిషన్ కన్నా ఎక్కువో తక్కువో కాంపోజిషన్ గల శాఖలు, ఆ అదనపు విలువ కన్నా ఎక్కువో తక్కువో అదనపు విలువల్ని ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి, ఉత్పత్తి ధరలు, విలువల కన్నా ఎక్కువగా వుండడం ఎలాంటి శాఖల్లో జరుగుతుందో, తక్కువగా వుండడం ఎలాంటి శాఖల్లో జరుగుతుందో గ్రహించాలంటే, సామాజిక పెట్టుబడి శాంపిలూ, దాని కాంపోజిషనూ, అవసరం.

ఇప్పుడు, 5 శాఖల స్థిరల్లో సగటు నీ, అస్థిరల్లో సగటు నీ, చూద్దాం.

5 శాఖల స్థిరల మొత్తం:

80 + 70 + 60 + 15 + 95 = 320

స్థిరల సగటు = 320 ÷ 5 = 64 C

5 శాఖల అస్థిరల మొత్తం:

20 + 30 + 40 + 85 + 5 = 180

అస్థిరల సగటు = 180 ÷ 5 = 36 V

ఈ సగటు స్థిరా - అస్థిరలు, 'సామాజిక పెట్టుబడి' నించి తీసిన ఒక 100 శాంపిల్ పెట్టుబడి కి, సగటు కాంపోజిషను అవుతాయి.

అవి 64 C + 36 V.

సామాజిక కాంపోజిషన్‌లో వుండే స్థిర కన్నా ఎక్కువ స్థిరా, ఆ అస్థిర కన్నా తక్కువ అస్థిరా గల శాఖలు — 'ఎక్కువ కాంపొజిషన్ (హయ్యర్ కాంపోజిషన్)' గల శాఖలు. ఇంకో వేపు - సామాజిక స్థిర కన్నా తక్కువ స్థిరా, ఆ అస్థిర కన్నా ఎక్కువ అస్థిరా గల శాఖలు, 'తక్కువ కాంపోజిషన్ (లోయర్ కాంపోజిషన్)' గల శాఖలు.

సామాజిక కాంపోజిషన్ తో సమానమైన కాంపోజిషన్ గల శాఖలు, సగటు కాంపోజిషన్ - శాఖలు. ఈ శాఖల స్థిర - అస్థిరలు, సామాజిక స్థిర - అస్థిరల లాగే వుంటాయి.

ఈ రకంగా, సమాజంలో వున్న మొత్తం శాఖల్ని 3 రకాలుగా విభజించవచ్చు. **(1)** సగటు కాంపోజిషన్ శాఖలు, **(2)** సగటు కన్నా ఎక్కువ కాంపోజిషన్ శాఖలు. **(3)** సగటు కన్నా తక్కువ కాంపోజిషన్ శాఖలు. - ఈ 3 రకాలుగా.

ఈ ఉదాహరణలో, సామాజిక కాంపోజిషన్, 64C+36V. ఈ ఉదాహరణలో వున్న 5 శాఖలకూ 5 రకాల కాంపోజిషన్లు వున్నాయి. ప్రతీ శాఖ కాంపోజిషన్‌నీ, సామాజిక కాంపోజిషన్‌తో పోల్చి చూస్తే, ఆ శాఖ, ఎక్కువ కాంపోజిషన్ శాఖగా వుందో, తక్కువ కాంపోజిషన్ శాఖగా వుందో, తెలుస్తుంది. ఈ 5 శాఖల్నీ అలా చూస్తే 1 వ, 2 వ, 5 వ శాఖలు, ఎక్కువ కాంపోజిషన్ శాఖలు. 3 వ, 4 వ శాఖలు, తక్కువ కాంపోజిషన్ శాఖలు. ఇక్కడ, సగటు కాంపోజిషన్ శాఖలు లేవు.

ఎక్కువ కాంపోజిషన్ అన్నప్పుడూ, తక్కువ కాంపోజిషన్ అన్నప్పుడూ, అందులో కూడా మళ్ళీ తేడాలు వున్నాయి. ఎక్కువ కాంపోజిషన్ గల 3 శాఖల లోనూ 5 వది మిగిలిన వాటి కన్నా ఎక్కువ కాంపోజిషన్ గల శాఖ. అలాగే, తక్కువ కాంపోజిషన్ శాఖల్లో 4 వ ది, మరీ తక్కువ కాంపోజిషన్ శాఖ.

ఈ 5 శాఖల విషయంలోనూ 'అదనపు విలువ రేటు' ని 100% గానే అనుకుందాం. అలా అనుకుంటే, ఈ శాఖలు ఉత్పత్తి చేసే సరుకుల విలువలూ, వాటిలో అదనపు విలువలూ ఇలా వుంటాయి:

1 లో, $80_C + 20_V + 20_S = 120$.

2 లో, $70_C + 30_V + 30_S = 130$.

3 లో, $60_C + 40_V + 40_S = 140$.

4 లో, $15_C + 85_V + 85_S = 185$.

5 లో, $95_C + 5_V + 5_S = 105$.

ఈ 5 శాఖల్లోనూ, పెట్టుబడి ని ఒకే సైజుతో (100 చొప్పున) తీసుకున్నప్పటికీ, ఆ ఒకే సైజు పెట్టుబడులు ఉత్పత్తి చేసే సరుకుల విలువలూ, అదనపు విలువలూ, చాలా తేడాగా వున్నాయి. ఎందుకంటే, వాటి కంపోజిషన్లు తేడాగా వున్నాయి గనక. వీటిలో ఎక్కువ కాంపోజిషన్ గల 5 వ శాఖ, తక్కువ అదనపు విలువనీ, తక్కువ కాంపోజిషన్ గల 4 వ శాఖ, ఎక్కువ అదనపు విలువనీ, ఉత్పత్తి చేశాయి.

ఈ శాఖల్లో సరుకులకు, 'విలువలే ధరలు గా' వుంటే, ఈ శాఖల 'లాభం రేట్లు' ఎలా వుంటాయి? - ఒక శాఖలో 'లాభం రేటు'ని కనుక్కోవడానికి, అక్కడ పెట్టుబడీ, ఆ పెట్టుబడి కి వచ్చిన అదనపు విలువా, తెలిస్తే చాలు. 1 వ శాఖ, 100 పెట్టుబడితో, 20 S ని ఉత్పత్తి చేసింది. అక్కడ విలువ 120. ధర కూడా 120 యే. అప్పుడు, ఇక్కడ ఉత్పత్తి అయిన 20 S, ఈ శాఖ లోనే వుండి పోతుంది. అప్పుడు దాని లాభం రేటు 20%. ఇలాగే మిగతా శాఖల విషయంలో కూడా జరిగితే, వాటి లాభం రేట్లు, వరుసగా, 30%, 40%, 85%, 5% గా వుంటాయి. అంటే విలువలే ధరలు గా వుండడం వల్ల, ఈ ఉదాహరణలో, ఒక శాఖలో లాభం 5% అయితే, ఇంకో శాఖలో లాభం 85%.

ఇక్కడ మనం శాంపిల్ పెట్టుబడుల్ని గాక మొత్తం పెట్టుబడుల్నే తీసుకుని చూసినా, విలువలే ధరలుగా వున్నట్టయితే, శాఖల లాభం రేట్లు ఇప్పుడు చూసినట్టే, తప్పనిసరిగా చాలా తేడాల తోటే వుంటాయి. అన్ని శాఖల లోనూ అదనపు విలువ రేటుని ఒకే రకంగా (100% గా) తీసుకున్నాం. అయినా, అదనపు విలువ రాసులు తేడా గానే వున్నాయి. నిజానికి, వేరు వేరు శాఖల్లో, అదనపు విలువ రేటు ఒకే రకంగా వుండడం ఎప్పుడూ జరగదు. అది, అనేక తేడాల తోటే వుంటుంది. అలాంటప్పుడు, వేరు వేరు శాఖల్లో అదనపు విలువ రాసులు, మరింత తేడాలతో వుంటాయని అర్థమే కదా?

కాబట్టి, ఇక్కడ చాలా స్పష్టంగా అర్థం చేసుకో వలసిన విషయాలు ఏమిటంటే: వేరు వేరు శాఖల్లో, వేరు వేరు రకాల వస్తువులు తయారవుతాయి కాబట్టి, దాని వల్ల, ఆ పెట్టుబడుల విలువ కాంపొజిషన్లు తప్పనిసరిగా తేడాలుగా వుంటాయి. ఆ పెట్టుబడుల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విలువలు కూడా తప్పనిసరిగా తేడాలుగా వుంటాయి. అలాంటప్పుడు, విలువలే ధరలుగా వుంటే, ఏ శాఖలో అదనపు విలువ ఆ శాఖకే అంది, వేరు వేరు శాఖల లాభం రేట్లు విపరీతమైన తేడాలతో అయిపోతాయి. 'లాభం రేట్ల'లో అంతంత తేడాలు వుండడానికి వీలు లేదు కాబట్టి, అదనపు విలువల మొత్తం, అన్ని శాఖలకూ ఒక సమాన సూత్రంతో పంపకం అవవలసి వుంటుంది. విషయం అంతా ఇలా జరుగుతుందన డానికి రుజువు, ప్రతీ పెట్టుబడి దారుడూ (వాడు ఏ శాఖ వాడైనా), తన 'కాస్టు ప్రైస్' మీద, 'ఒక లాభం రేటు'ని వేసుకోవడం ద్వారా తన సరుకు ధరని నిర్ణయించడమే. ధర ని ఇలా నిర్ణయించడం అంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ తన పెట్టుబడి సైజుని బట్టీ, అది పని చేసే కాలాన్ని బట్టీ, లాభాన్ని ఆశిస్తాడని అర్థం. - ఇదీ, ఇక్కడ గ్రహించ వలసిన మొదటి విషయం.

ఈ ఉదాహరణలో, 5 శాఖల లోనూ కలిసి మొత్తం ఎంత అదనపు విలువ ఉత్పత్తి అయింది? అది 5 శాఖలకూ ఎలా పంపకం అవుతుంది? - ఈ విషయాలు ఎలా జరుగుతాయో చూడాలి.

ప్రతీ శాఖ లోనూ 100 శాంపిల్ పెట్టుబడి చొప్పున 5 శాఖల లోనూ వున్న మొత్తం పెట్టుబడి 500. ఇది, సామాజిక పెట్టుబడి. ఈ పెట్టుబడి ద్వారా వచ్చే 5 శాఖల అదనపు విలువలూ కలిసి,

20 + 30 + 40 + 85 + 5 = 180.

500 పెట్టుబడి, 180 అదనపు విలువని ఉత్పత్తి చేస్తే, ఒక 100 పెట్టుబడి కి రావలసిన అదనపు విలువ = 180 ÷ 5 = 36. ఏ శాఖలో వున్న 100 పెట్టుబడికైనా 36 లాభం రావాలి. ఈ ఉదాహర ణలో జనరల్ లాభం రేటు, 36% అవుతుంది.

సామాజిక పెట్టుబడి కి ఒక హద్దు వుంటుంది. ఈ ఉదాహరణలో అది 500. సామాజిక అదనపు విలువ కి కూడా ఒక హద్దు వుంటుంది. అది 180. ఆ అదనపు విలువనే మొత్తం పెట్టుబడి పంచు కోవాలి. కాబట్టి, జనరల్ లాభం రేటు కి కూడా ఒక హద్దు ఏర్పడుతుంది. ఈ ఉదాహరణలో అది 36% మాత్రమే. ఏ శాఖ పెట్టుబడిదారుడైనా ఒక 100 పెట్టుబడి మీద 36 లాభాన్ని మాత్రమే వేసుకోగలడు.

ఒక వేళ ఎక్కువ లాభం వేసుకుంటే ఏమవు తుంది? - ఎక్కువ లాభం వేసుకోవడం - అనే దాన్ని, 2 రకాలుగా చూడాలి. ఆ పని ఒక్క పెట్టుబడిదారుడే చేస్తాడా, పెట్టుబడి దారులందరూ చేస్తారా?

**ఎక్కువ లాభం వేసుకోవడం, అన్ని శాఖల్లోనూ, పెట్టుబడిదారులందరూ చేస్తే:**

ఆ పని అందరూ చేస్తే, అది అసలు చెయ్యని దానితో సమానం అవుతుంది. మనం గతంలో చూసిన విషయాల ద్వారానే దీన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. 100 పెట్టుబడి మీద 36% లాభం వేసుకోవడానికి సరిపోయే S రాసి మాత్రమే సమాజంలో వుందను కుందాం. పెట్టుబడిదారులందరూ లాభం రేటుని రెట్టింపు చేసి, 36 + 36 = 72% తో, లాభాలు వేసుకుంటారు అనుకుందాం. దానివల్ల, సమాజంలో వున్న S రాసి రెట్టింపు అవదు. అది ఎప్పటి లాగే వుంటుంది. దాన్ని లెక్క కట్టే సంఖ్యలు మాత్రమే రెట్టింపు అవుతాయి. ప్రతీ పెట్టుబడిదారుడూ 'అమ్మే వాడి' గానే గాక 'కొనే వాడి'గా కూడా వుంటాడని మొదటి నించీ చెప్పుకుంటున్నాం. ఈ విషయం మరిచిపోకుండా వుంటే, లాభం రేటు సంగతి అర్థం చేసుకోవడం చాలా తేలిక.

ఒక పెట్టుబడిదారుడు, తను అమ్మేటప్పుడు రెట్టింపు లాభం వేసుకుని అమ్మితే, ఇతరుల నించి తను కొనేటప్పుడు కూడా రెట్టింపు లాభంతో వున్న సరుకుల్నే కొనవలసి వస్తుంది. ప్రతీ పెట్టుబడి దారుడూ ఉత్పత్తి సాధనాలు కొనాలి. వాటిని పెరిగిన ధరల తోటే కొనాలంటే, C పెరుగుతుంది. అంతేగాక, ప్రతీ పెట్టుబడిదారుడూ జీతాలు ఇవ్వాలి. వాటిని కూడా పెరిగిన ధరలకు తగిన విధంగా ఇవ్వాలంటే, V కూడా పెరుగుతుంది. అంటే, పెట్టుబడిదారు లందరూ, 'జనరల్ లాభం రేటు'ని పెంచినప్పుడు, సరుకుల్లో వుండే S భాగం మాత్రమే పెరుగుతుందని కాదు. దానికి తగినట్టుగా C + V భాగాలు కూడా పెరుగుతాయి.

పెట్టుబడిదారులందరూ 10% లాభం వేసు కోవడం ఎలాంటిదో, అందరూ 20% లాభం వేసు కోవడం కూడా అలాంటిదే. లాభాన్ని అందరూ 'ఒకే లెక్కన' పెంచినప్పుడు అందరి ధరలూ ఒకే లెక్కన పెరుగుతాయి. అందరి ధరలూ ఒకే లెక్కన పెరిగి

నప్పుడు, ఆ మార్పు అసలు జరగని దానితో సమానం. అప్పుడు, అందరూ తమ సరుకుల్ని ఎంత ధరకి అమ్మాలో అంత ధరకే అమ్మినట్టూ, ఎంత లాభం తీసుకోవాలో అంత లాభమే తీసుకున్నట్టూ, అవుతుంది. అంటే, ధరలు మారినా సారాంశం మారదు.

**ఎక్కువ లాభం వేసుకోవడం, ఏ శాఖలో నైనా ఒక్క పెట్టుబడిదారుడే చేస్తే:**

ఏ పెట్టుబడిదారుడూ అలా చెయ్యలేడు. అలా చేసి, తన సరుకు ధరని ఎక్కువగా పెడితే, ఆ సరుకు అమ్ముడు పోదు. కాబట్టి, ఎవ్వడూ ఆ పని చెయ్యలేడు. ఒక్కడే ఆ పని చేసి ఎక్కువ లాభం సంపాదించడం సాధ్యమైతే, ఆ పని అందరూ చెయ్యగలరు. అందరూ అదే పని చేసి, అందరూ ఎక్కువ లాభాలు సంపాదిస్తే, అప్పుడు ఒక్కడి లాభమే పెరిగినట్టు అవదు. అంటే, ఏ పెట్టుబడి దారుడూ తన సరుకు ధరని తన ఇష్ట ప్రకారం నిర్ణయించి, తన లాభాన్ని తన ఇష్ట ప్రకారం పెంచుకోలేడని అర్థం. లాభం రేటు - అనేది, ఒక్క పెట్టుబడిదారుడి ఇష్టాయిష్టాల్ని బట్టి వుండే విషయం కాదు.

ఒక్కడి లాభం కూడా ఇతర పెట్టుబడిదారులందరి చర్యలకూ సంబంధించి వుండే విషయమే. కాబట్టి, ఎవడి లాభం వాడి ఇష్టం కాదు.

చివరికి సారాంశం ఏమిటంటే, లాభం రేటు - అనేది, పెట్టుబడిదారులు విడి విడిగా నిర్ణయించుకునే విషయమూ కాదు. అందరూ కలిసి ఉమ్మడిగా, ఒక ఒప్పందంతో నిర్ణయించుకునే విషయమూ కాదు.

అందులో ఏది సాధ్యమైనా, లాభం రేటు కి ఒక హద్దు వుండదు. పెట్టుబడిదారులు ఉమ్మడిగా గానీ, విడి విడిగా గానీ, లాభాన్ని తమ ఇష్ట ప్రకారం పెంచుకోవడమే సాధ్యమైతే, లాభం రేటు కి 'ఆద్యంతాలు' వుండవు. అప్పుడు అది 36%గా కాదు, 360000000000...% - ఇలా ఎన్ని సున్నాలు కావాలో అన్ని సున్నాలు పెట్టేసి అంత లాభాన్ని కలుపుకోవచ్చు. కానీ, పాపం, పెట్టుబడిదార్ల కి ఈ సున్నాల వ్యవహారం సాధ్యం కాదు. కాబట్టి, ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమిటంటే - జనరల్ లాభం రేటు - అనే దానికి ఏదో ఒక హద్దు వుండి తీరుతుంది - అని.

ఆ హద్దు ఎలా ఏర్పడుతుందంటే, (1) సమాజంలో వున్న మొత్తం పెట్టుబడీ, (2) అది లాగ గలిగే మొత్తం అదనపు విలువా - ఈ 2 అంశాల్ని బట్టే, ఏర్పడుతుంది. అంతే గానీ, అందరూ కలిసి అన్ని శాఖల్లోనూ ధరల్ని పెంచడం వల్ల లాభాలు పెరిగేదేమీ వుండదు.

అయితే, పెట్టుబడిదారులందరికీ లాభాలు పెరిగే మార్గం అసలే లేదని అర్థంకాదు. ఒక మార్గంలో అయితే, అది కూడా సాధ్యమే. అదనపు విలువ రాసిని ఇంకా ఎక్కువగా లాగ గలిగే మార్గంలో. ధరల్ని పెంచి, జీతాల్ని పెంచక పోతే ఏమవుతుంది? ధరల్నీ జీతాల్నీ కూడా పెంచినా, ధరల్ని ఏ శాతంలో పెంచారో, జీతాల్ని ఆ శాతంలో పెంచక పోతే ఏమవుతుంది? - అలాంటి పని ఏది జరిగినా, అదనపు విలువ రాసి పెరుగుతుంది. అందరూ ఏ రాసిని పంచుకోవాలో ఆ రాసి పెరిగితే, దాన్ని పంచుకునే వాళ్ళ వాటాలు కూడా పెరుగు తాయి. అదంతా వేరే సందర్భంలో చూడవలసిన విషయం.

ప్రస్తుతం ఇక్కడ చూడవలిసింది, జనరల్ లాభం రేటు గురించీ, విలువలు ఉత్పత్తి ధరలుగా మారడం గురించీ.

ఒక శాఖ సరుకు విలువ:

కాస్టుప్రైసు + ఆ శాఖలో S

దాని ఉత్పత్తి ధర:

కాస్టుప్రైసు + మారిన S (జనరల్ లాభం)

ఒక విలువ = 50C + 20V + 20S = 90.

కాస్టు ప్రైసు = 50C + 20V .............. = 70K.

పని స్థలంలో వుండిపోయిన అరగని ఫిక్సెడ్ సాధనాలు = 30C అనుకుందాం.

మొత్తం పెట్టుబడి, 30C + 70K = 100.

లాభం రావలసింది, 70K మీదే కాదు, మొత్తం 100 పెట్టుబడి మీద.

జనరల్ లాభం రేటుని 36% అనుకుందాం.

100 పెట్టుబడికి లాభం, 36.

ఆ లాభం, 70K మీద కలిస్తే, అదే ఉత్పత్తి ధర.

విలువ = 70K + 20S = 90.

ఉత్పత్తి ధర = 70K + 36P = 106.

ఇక్కడ, విలువ కన్నా ఉత్పత్తి ధర 16 ఎక్కువ.

ఈ సరుకుని అమ్మినప్పుడు, 106 వస్తే, కాస్టు ప్రైసు వెనక్కి వచ్చి, ఆపైన, అన్ని శాఖల్లోనూ వచ్చే రకం గానే జనరల్ రేటు చొప్పున లాభం వస్తుంది.

ఇప్పుడు, 5 శాఖల్లోనూ చూద్దాం.

# సమాజంలో వున్న మొత్తం శాఖలు - 5

| శాఖలో మొత్తం పెట్టుబడి (ఖర్చయిన స్థిర ని కూడా చూడవచ్చు) | అదనపు విలువ రేటు | అదనపు విలువ రాసి-S | విలువే ధరగా వుంటే, వచ్చే లాభం రేటు | జనరల్ లాభం రేటు-P | కాస్ట్ ప్రైస్-K | సరుకు విలువ K + S | సరుకు ఉత్పత్తి ధర K + P |
|---|---|---|---|---|---|---|---|
| 80 C + 20 V (50 C + 20 V) | 100% | 20 | 20% | 36% | 50 C + 20 V = 70 K | 70 + 20 = 90 | 70 + 36 = 106 |
| 70 C + 30 V (51 C + 30 V) | 100% | 30 | 30% | 36% | 51 C + 30 V = 81 K | 81 + 30 = 111 | 81 + 36 = 117 |
| 60 C + 40 V (51 C + 40 V) | 100% | 40 | 40% | 36% | 51 C + 40 V = 91 K | 91 + 40 = 131 | 91 + 36 = 127 |
| 15 C + 85 V (5 C + 85 V) | 100% | 85 | 85% | 36% | 5 C + 85 V = 90 K | 90 + 85 = 175 | 90 + 36 = 126 |
| 95 C + 5 V (10 C + 5 V) | 100% | 5<br>180 | 5% | 36% | 10 C + 5 V = 15 K | 15 + 5 = 20 | 15 + 36 = 51 |

ఈ 5 శాఖల ఉదాహరణలో, ఏ శాఖలో సరుకు కి ఎంత విలువ? అది ఎంత 'ఉత్పత్తి ధర'గా మారింది? ఆ ఉత్పత్తి ధర, విలువ కన్నా ఎక్కువ గా వుందా, తక్కువ గా వుందా? - ఈ విషయాలన్నీ, ఈ పట్టికలో చూడాలి. 3 శాఖల్లో, విలువల కన్నా ఉత్పత్తి ధరలు ఎక్కువ గానూ; 2 శాఖల్లో, తక్కువ గానూ వున్నాయి. అయితే, ఆ ఎక్కువ తక్కువలకు ఏమైనా సంబంధం వుందా? — ఇది తర్వాత పట్టికలో చూడాలి.

# విలువలకూ, ఉత్పత్తి ధరలకూ సంబంధం

| 5 శాఖల్లో సరుకుల విలువలు | ఉత్పత్తి ధరలు | విలువకీ ధరకీ తేడా |
|---|---|---|
| 90<br>111<br>131<br>175<br>20 | 106<br>117<br>127<br>126<br>51 | + 16<br>+ 6<br>– 4<br>– 49<br>+ 31 |
| మొత్తం-527 | మొత్తం 527 | ప్లస్‌ల మొత్తం 53<br>మైనస్‌ల మొత్తం 53 |

ఈ పట్టికని చూసి మొదట వెంటనే గ్రహించ వలసింది - 3 వ, 4 వ శాఖలు, 53 అదనపు

విలువని (4 + 49) వదులుకున్నాయి. 1 వ, 2 వ, 5 వ శాఖలు - 53 అదనపు విలువని (16 + 6 + 31) కలుపుకున్నాయి. అంటే, కొన్ని శాఖల అదనపు విలువల్లో భాగాలే, ఇతర శాఖల్లోకి వెళ్ళాయి. ఒక వేపు తగ్గినదే, ఇంకో వేపు పెరిగింది.

విలువ కన్నా ఎక్కువ ఉత్పత్తి ధర ఏర్పడ్డ సరుకులు, ప్లస్ సరుకులు. విలువ కన్నా తక్కువ ఉత్పత్తి ధర ఏర్పడ్డ సరుకులు, మైనస్ సరుకులు. ఈ ఉదాహరణలో, 1 వ, 2 వ, 5 వ శాఖల సరుకులు, ప్లస్ సరుకులు. 3 వ, 4 వ శాఖల సరుకులు, మైనస్ సరుకులు. మైనస్ సరుకులలో నించి కొంత కొంత అదనపు విలువలు, ప్లస్ సరుకులలోకి పోయాయి.

సామాజిక సగటు కాంపోజిషన్ కన్నా తక్కువ కాంపోజిషన్ గల శాఖల్లో ఎక్కువ అదనపు విలువా, ఎక్కువ కాంపోజిషన్ గల శాఖల్లో తక్కువ అదనపు విలువా, ఉత్పత్తి అవుతాయని చూశాం. ఎక్కువ అదనపు విలువ గల శాఖల్లో నించి కొంత భాగం, తక్కువ అదనపు విలువ గల శాఖల్లోకి పోయే విధంగా ధరలు ఏర్పడతాయి. అంటే, ఎక్కువ అదనపు విలువ ఉత్పత్తి అయ్యే శాఖల్లో ధర, విలువ కన్నా తక్కువ గానూ, తక్కువ అదనపు విలువ గల శాఖల్లో ధర, విలువ కన్నా ఎక్కువ గానూ - అన్న మాట.

ఈ 5 శాఖల ఉదాహరణలో, సగటు కాంపోజిషన్ గల శాఖ (64c+36v గల శాఖ) ఒక్కటి కూడా లేదు. కానీ సమాజంలో, సగటు కాంపోజిషన్ శాఖలు కూడా వుండవచ్చు. అలాంటి శాఖల్లో 'విలువ'కీ 'ఉత్పత్తి ధర'కీ తేడా ఏర్పడదు. అక్కడ విలువే ఉత్పత్తి ధర గా వుంటుంది. అంటే, అక్కడ ఉత్పత్తి అయిన అదనపు విలువ, 'జనరల్ లాభం' తో సమానంగా వుంటుంది. అలాంటి శాఖల నించి అదనపు విలువ, ఇతర శాఖల్లోకి పోవడం గానీ, ఇతర శాఖల నించి అదనపు విలువ, ఆ శాఖల్లోకి రావడం గానీ, జరగదు. అలాంటి శాఖల సరుకులు, ప్లస్ సరుకులూ కావు, మైనస్ సరుకులూ కావు. కానీ సమాజం మొత్తం మీద అలాంటి శాఖలు ఎక్కువగా వుండవు.

ఉత్పత్తి ధర గురించి గ్రహించవలసిన మొట్ట మొదటి విషయం - ఒక శాఖలో సరుకుకి ఉత్పత్తి ధర ఏర్పడుతుంది - అన్నప్పుడు, ఆ శాఖలో వున్న పెట్టుబడిదారులందరూ ఒక చోట కలిసి కూడ బలుక్కుని, ఆ ధర ని నిర్ణయిస్తారని అర్థం కాదు. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండానే ఎవరి ధరని వాళ్ళే నిర్ణయిస్తారు. అయినా అందరి ధరలూ ఒక్క లాగే వుంటాయి. ఎందుకంటే, ధరని నిర్ణయించే పద్ధతి అందరి దగ్గిరా ఒకటే కాబట్టి. ఖర్చులూ + లాభమూ (K+P) అనేదే ఆ పద్ధతి. అందరి దగ్గిరా ఆ ఖర్చులూ ఒక్క లాగే వుంటాయి; ఆ లాభమూ ఒక్క లాగే వుంటుంది. కాబట్టి ఆ రెండూ కలిసిన ధర కూడా ఒక్కలాగే వుంటుంది. ఆ సరుకుని సైనుబట్ట అనుకుంటే, 1 మీటరు బట్ట ధర చిన్న చిన్న తేడాలతో అందరి దగ్గిరా ఒక్క లాగే వుంటుంది. ఏ శాఖలో ఉత్పత్తి ధర సంగతి అయినా ఇలాగే. అక్కడి కాస్ట్ ప్రైసూ + జనరల్ లాభమూ కలిసి, అక్కడి ధర. ఇలా ఏర్పడ్డ ధరల్లో నించే, కొన్ని ధరలు ప్లస్ ధరలు గానూ, కొన్ని ధరలు మైనస్ ధరలు గానూ అవుతాయి.

అన్ని శాఖల్లోనూ సరుకులు, ఉత్పత్తి ధరలకే అమ్ముడు పోతే ఏం జరుగుతుంది? - ప్రతీ శాఖకీ, దాని కాస్ట్ ప్రైస్ దానికి తిరిగి వచ్చి, దాని మీద జనరల్ లాభం కూడా వస్తుంది. విలువ, ఉత్పత్తి ధరగా మారడం వల్ల, లాభం రాకుండా పోయే సమస్యేమీ వుండదు. విలువలో నించి లాభం వచ్చినట్టే, ఉత్పత్తి ధరలో నించి కూడా లాభం వస్తుంది. కాకపోతే కొంచెం ఎక్కువో తక్కువో అయిన లాభం.

ఈ ఎక్కువో తక్కువో అయ్యే ధరల గురించి, గతంలో చూసిన ఒక విషయాన్ని ఇక్కడ ఒకసారి గుర్తు చేసుకోవాలి. లాభం - అనేది కూడా సరుకుకి సంబంధించిన అంశమేననీ, అది సరుకులో భాగమేననీ, గతం నించీ చెప్పుకుంటున్నాం. కానీ, ఒక విడి సరుకుని తీసుకుంటే దాని వల్ల వచ్చే లాభం, దాని విలువలో భాగమే అవుతుందా?

A, B సరుకులనే తీసుకుందాం.

A విలువ 110. దాని ఉత్పత్తి ధర 150. ఈ సరుకుని అమ్మినప్పుడు, 150 డబ్బు వస్తే, అందులో 40 డబ్బు, ఆ సరుకుకి సంబంధించింది కాదు. ఆ 40 విలువ ఆ సరుకులోది కాదు.

B విలువ 190. ఉత్పత్తి ధర 150. ఈ సరుకుని అమ్మినప్పుడు, 150 డబ్బు వస్తే, దాని విలువ అంతా దానికి వచ్చినట్టు కాదు.

ఈ 2 సరుకుల్నీ విడి విడిగా చూస్తే, లాభం అనేది అంతా సరుకు విలువ లోదే - అనే సూత్రం, ఏ

సరుకు విషయానికీ వర్తించదు. కానీ, ఆ 2 సరుకుల్నీ కలిపి చూస్తే, వాటి ఉత్పత్తి ధరల మొత్తమే, వాటి విలువల మొత్తం. ఆ విలువల మొత్తం 300. ఆ సరుకుల రాసిని అమ్మినప్పుడు, 300 డబ్బు వస్తే, అందులో వున్న 100 లాభం, ఆ సరుకుల రాసికి సంబంధించినదే. ఆ లాభం, ఆ విలువలో భాగమే. అంటే, సమాజంలో అన్ని శాఖల లోనూ వున్న సరుకుల రాసిని మొత్తంగా తీసుకున్నప్పుడు, వాటి ఉత్పత్తి ధరల మొత్తం, వాటి విలువల మొత్తమే అవుతుంది. వాటి వల్ల వచ్చే లాభాలు, వాటి విలువల లోవే అవుతాయి. 'లాభం కూడా సరుకు లోదే' అనడం అప్పుడు పూర్తిగా సరిపోతుంది.

ఒక సరుకుని కొలిచి దాని బరువునో, దాని పొడుగునో తెలుసుకోగలిగినట్టుగా, దాని 'విలువ'ని తెలుసుకోవడం సాధ్యం కాదని మొదటి నించీ చెప్పుకుంటున్నాం. పొడుగుని కొలవడానికి పొడుగు బద్దా, బరువుని కొలవడానికి, బరువు రాయీ - వంటి ఆధారాల్ని తీసుకున్నట్టే, విలువని కొలవడానికి ఇంకో సరుకు గానీ, డబ్బు గానీ ఆధారంగా వుంటాయి. కానీ విడి సరుకుల విషయంలో, డబ్బుతో కొలిచినప్పుడు, ఒక సరుకు తాలూకు మొత్తం విలువలో కొంత భాగమే కనపడుతుంది గానీ, మొత్తం విలువ కనపడదు. మొత్తం సరుకుల రాసి విషయంలో అది సాధ్యమే. A, B సరుకుల్ని కలిపి చూసి, "వీటి మొత్తం విలువ 300" అని తెలుసుకోవడం సాధ్యమే. అంటే, సమాజంలో వున్న మొత్తం సరుకుల రాసిని చూసినప్పుడు, ఆ రాసి విలువని తెలుసుకోవడం సాధ్యమే.

అయితే, విడి సరుకు విషయంలో కూడా ఒక మార్గం వుంది. A సరుకు ఉత్పత్తి ధర 150. ఆ ధరని చూసి, "ఇదే ఈ సరుకు విలువ" అంటే అది తప్పే. అలాగే, B సరుకు విషయం కూడా. వాటి ధరలే వాటి విలువలు కావు. అయినప్పటికీ, లాభం - అనేది కూడా విలువే కాబట్టీ, అది ఏదో ఒక సరుకుకి సంబంధించిందే కాబట్టీ, అది సరుకులతో సంబంధం లేకుండా బైట వుండే విషయం కాదు కాబట్టీ, ఈ కారణాల వల్ల, ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, A వల్ల వచ్చే లాభం A లోదీ, B వల్ల వచ్చే లాభం B లోదీ అనవచ్చు. విడి సరుకు విలువని ఎలా అర్థం చేసుకోవాలో, సరుకుల రాసి విలువని ఎలా అర్థం చేసుకోవాలో చెప్పుకుంటూనే వున్నాం కాబట్టి, ఆ గ్రహింపుని అలా వుంచుకుంటూనే, "లాభం కూడా సరుకు లోదే" అని ప్రతీ సరుకు విషయంలోనూ అనవచ్చు.

ఒక విడి సరుకుని తీసుకున్నా, మొత్తం సరుకుల రాసిని తీసుకున్నా, దాని ద్వారా అసలు గ్రహించవలిసిన విషయం - సరుకు విలువలో అదనపు విలువ గా వుండే భాగం అంతా, లాభం పేరుతో, పెట్టుబడిదారీ వర్గానికే పోతుంది - అనేది.

'లాభం' అనే మాట, విలువని మరుగు పరుస్తుంది. ఈ విషయం గతం లోనే చెప్పుకున్నాం. దాన్నే ఇక్కడ ఒక సారి గుర్తు చేసుకోవాలి. వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యాలంటే, ఉత్పత్తి సాధనాలూ, మనుషుల సజీవ శ్రమలూ కావాలి. ఈ 2 రకాల ఖర్చుల్నీ అదే పేర్లతో చూస్తే, అందులో 'లాభం' అనే దాని ప్రసక్తే వుండదు. వస్తువు కోసం సహజంగా జరిగే ఖర్చుల మొత్తమే వస్తువు విలువ - అనే సంగతి, అప్పుడు స్పష్టంగా కనపడుతుంది. కానీ, ఖర్చుల మీద లాభాన్ని కలిపి 'ధర'ని నిర్ణయించే విధానంలో, విలువకి సంబంధించిన వాస్తవం అంతా మరుగున పడిపోతుంది. విలువని గ్రహించే ప్రయత్నాలన్నీ దారి తప్పిపోతాయి. కాస్టు ప్రైసూ, లాభమూ - అనే అంశాల్లో, కాస్టు ప్రైసు మాత్రమే నిజమైన ఖర్చు అయినట్టూ, లాభం అనేది సరుకుతో సంబంధం లేని బైటి విషయం అయినట్టూ కనిపిస్తుంది. లాభాన్ని కలిపి ధరని నిర్ణయించడం అనేది, సరుకు విలువ ని ఒకే మొత్తంగా కనపడ నివ్వకుండానూ, ఆ మొత్తాన్ని సరుకు కోసం అయిన ఖర్చుగా గ్రహించనివ్వకుండానూ చేస్తుంది.

# ఉత్పత్తి ధరలు, మార్కెట్ ధరలుగా మారడం

**ఒ**క శాఖలో, వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర వున్న సరుకు అంతా కలిసి ఒక సరుకు. సైను బట్ట శాఖలో వున్న బట్ట అంతా - ఒక సరుకు. పంచదార శాఖలో వున్న పంచదార అంతా - ఒక సరుకు. అలాగే ఇతర శాఖల్లో కూడా.

వేరు వేరు శాఖల సరుకులు, దేని 'ఉత్పత్తి ధర'తో అది, మార్కెట్లోకి వస్తాయి. అక్కడ, ఏం జరుగుతుంది? ఆ సరుకులన్నీ ఆ ఉత్పత్తి ధరల తోటే

అమ్ముడవుతాయా? - ఇంకా అప్పుడే కాదు. అక్కడ, ప్రతీ శాఖ సరుకుకీ సప్లై - **డిమాండ్ల** పరిస్తితి ఎదురవు తుందని చెప్పుకున్నాం.

ఒక సరుకు, ఏ ధరతో అమ్ముడవుతుందో, ఆ ధరే, దాని మార్కెట్ ధర. సప్లై - డిమాండ్లు సరి పోయిన శాఖల్లో సరుకులు, ఉత్పత్తి ధరలకే అమ్ము డవుతాయి. అక్కడ ఉత్పత్తి ధరలే మార్కెట్ ధరలు అవుతాయి. అలాంటి శాఖల లాభం రేట్లు, జనరల్ లాభం రేటుతో సమానంగా వుంటాయి. సప్లై - డిమాండ్లు సరిపోని సరుకుల విషయంలో, ఉత్పత్తి ధరలు మళ్ళీ మారి అవి కొంత పైకో కిందకో అవు తాయి. ఆ రకంగా ఆ సరుకులకు, ఉత్పత్తి ధరల నించి మార్కెట్ ధరలు తేడా అవుతాయి. అయినా, అలాంటి సందర్భాల్లో కూడా ఆ సరుకుల ద్వారా లాభాలు వస్తాయా - అనే సమస్య వుండదు. మార్కెట్ ధరలు ఎలా మారినా, ఆ ధరలలో నించి కూడా లాభాలు వస్తాయి. అయితే, ఆ లాభాలు, ఉత్పత్తి ధరల నించీ వచ్చే లాభాల కన్నా ఇంకా కొంత ఎక్కువో తక్కువో అవుతాయి. ఈ విషయాలన్నీ చూసే పని, మొదట 'సప్లై - డిమాండ్ల'ని చూడడం తోటే ప్రారంభించాలి.

## సప్లై - డిమాండ్లు:

ఈ 2 మాటల గురించీ ఇంతకు ముందు క్లుప్తంగా చూశాం. ఇప్పుడు కొంచెం వివరంగా చూస్తాం. సప్లై - అంటే, ఒక శాఖలో అమ్మకానికి సిద్ధంగా వున్న మొత్తం సరుకు పరిమాణం. (కొలతగా గానీ, సంఖ్యగా గానీ.) **డిమాండ్** - అంటే, ఆ సరుకు కోసం, మార్కెట్‌కి (కొనే వాళ్ళకి) వున్న అవసరాల పరిమాణం.

సప్లై - ఎప్పుడూ సరుకుని అమ్మే వాళ్ళ వేపు నించి వుంటే, డిమాండ్ ఎప్పుడూ సరుకుని కొనే వాళ్ళ వేపు నించి వుంటుంది.

సప్లై - డిమాండ్లని కొలవడానికి ఒక్కొక్క రకం సరుకు విషయంలో ఒక్కో రకం కాలం వుంటుంది. సంవత్సరానికి ఒక్కసారే పండే పంటల విషయంలో, సప్లై - డిమాండ్లు సంవత్సరానికి సంబంధించిన విష యాలుగా వుంటాయి. అంటే, సంవత్సర సప్లయ్యీ, సంవత్సర డిమాండూ - అనే పద్ధతిలో. ప్రతీ పూటా ఉత్పత్తి అయ్యే 'పాల' వంటి ఉత్పత్తుల విషయంలో, సప్లై డిమాండ్లు పూటకో, రోజుకో మాత్రమే సంబం ధించి వుంటాయి. అయితే, ఇలాంటి ఉత్పత్తుల విష యంలో కూడా ఉత్పాదక శక్తులు పూటకో సారో, రోజుకో సారో మారవు. కాబట్టి, ఈ ఉత్పత్తుల సప్లై డిమాండ్లు కూడా రోజు రోజూ మారవు.

సప్లై - అన్నప్పుడు, కొత్తగా తయారైన ఉత్పత్తితో, అప్పటికి మిగిలి వున్న పాత ఉత్పత్తి కూడా కలిసి, ఆ మొత్తమే, సప్లై అవుతుంది. కొత్త పంటలు పండి కొత్త ధాన్యం వచ్చే నాటికి, కిందటి సంవత్సరపు ధాన్యం కూడా కొంత మిగిలి వుంటుంది. ఆ మిగిలి వున్న పాత ఉత్పత్తీ కొత్త ఉత్పత్తీ కలిసే కొత్త సంవత్సరపు సప్లై. అయితే, ఒక సంవత్సరపు ఉత్పత్తిలో ఎంతో కొంత భాగం, తర్వాత సంవత్సరానికి మిగలడం అనేది, ప్రతీ సంవత్సరమూ జరుగుతూనే వుంటుంది. అది ఏదో ఒక్క సంవత్సరం లోనే జరిగే పని కాదు. కాబట్టి, వెనకటి ఉత్పత్తి విషయాన్ని లెక్క లోకి తీసు కోకుండా, ఏ సంవత్సరపు ఉత్పత్తినే ఆ సంవత్సరపు సప్లైగా తీసుకోవచ్చు. అంటే, 'సప్లై' అనే విషయాన్ని తీసుకున్నప్పుడల్లా, అందులో కొత్త సంవత్సరానిది ఎంతా, పాత సంవత్సరానిది ఎంతా - అనే వివరాలు అక్కరలేదు. సప్లై అంటే, ఒక సంవత్సరపు ఉత్పత్తి రాసి. ఇదే జనరల్ అర్థం. కొన్ని సరుకుల విషయంలో సప్లై డిమాండ్లు సంవత్సరం లోనే అనేక సార్లు మార తాయి.

సాధారణంగా, రోజు వారీగా వుండే సప్లై - కస్టమరీ సప్లై. రోజు వారీగా వుండే డిమాండ్ - కస్టమరీ డిమాండ్. వీటిలో మార్పులు ఎందుకు జరుగు తాయో ఇప్పుడు చూస్తాం.

సాధారణ సప్లై - లో మార్పులు, 3 కారణాల వల్ల జరుగుతాయి.

1. ఒక శాఖలో పని చేసే పెట్టుబడి పరిమాణం మారకపోయినా, ఉత్పత్తి శక్తి తాత్కాలికంగా మారడం వల్ల గానీ,
2. ఉత్పత్తి శక్తి మారక పోయినా, ఒక శాఖలో పని చేసే పెట్టుబడి పరిమాణం మారడం వల్ల గానీ,
3. ఆ 2 మార్పులూ కొంత జరగడం వల్ల గానీ.

ఈ కారణాల వల్ల, ఆ సరుకు సప్లై పెరగడం గానీ, తరగడం గానీ జరుగుతుంది.

సాధారణ డిమాండ్ లో మార్పులు కూడా 3 కార ణాల వల్ల జరుగుతాయి.

1. ఒక రకం సరుకుని వాడే జనం, ఆ సరుకు వాడకాన్ని ఇంకా కొంత ఎక్కువో, తక్కువో

చెయ్యడం వల్ల గానీ,

**2.** ఆ రకం సరుకుని అంత వరకూ ఎప్పుడూ వాడని జనంలో కొందరో, అందరో, ఆ సరుకుని వాడడం కొత్తగా ప్రారంభించడం వల్ల గానీ,

**3.** ఆ 2 మార్పులూ కొంత జరగడం వల్ల గానీ.

ఈ కారణాల వల్ల, ఆ సరుకు కి డిమాండు పెరగడమో, తరగడమో జరుగుతుంది.

సప్లై మారినప్పుడు గానీ, డిమాండ్ మారినప్పుడు గానీ, ధర మాత్రమే మారుతుందా, విలువ కూడా మారుతుందా? - సప్లై డిమాండ్లలో ఏది మారినా, ధరలో మార్పు తప్పని సరే. కానీ విలువలో మార్పు, ఆ కారణాల వల్ల కాదు. సరుకుకి పట్టే శ్రమ పరిమాణం మారితేనే, అది జరిగితేనే, విలువలో మార్పు జరుగుతుంది.

వ్యవసాయ రంగంలో వాతావరణం చాలా అనుకూలంగా వుంటే, ఎప్పటి పెట్టుబడి తోటే ఎక్కువ సప్లై రావచ్చు. దాని వల్ల ఒక యూనిట్ సరుకుకి అవసరమయ్యే శ్రమ కాలం తగ్గి, విలువ తగ్గుతుంది. లేదా, వాతావరణ పరిస్థితులు వ్యతిరేకంగా వుంటే, ఎప్పటి పెట్టుబడితో, ఎప్పటి సప్లై రాకపోవచ్చు. దాని వల్ల, ఒక యూనిట్ సరుకు కి శ్రమ కాలం పెరిగి, విలువ పెరుగుతుంది. పరిశ్రమలన్నిటికీ వ్యవసాయ ఉత్పత్తులే ముడి పదార్థాలుగా వుంటాయి కాబట్టి, ఆ ముడి పదార్థాల విలువలు మారితే, పారిశ్రామిక సరుకుల విలువలు కూడా మారతాయి. విలువలు మారితే ధరలూ మారతాయి.

ఒక శాఖలో సరుకు కోసం వున్న డిమాండ్ ని బట్టి, అక్కడ ఎంత పెట్టుబడి పని చెయ్యాలో అంత పెట్టుబడి కాకుండా ఎక్కువ పెట్టుబడి పని చేస్తే, సప్లై పెరుగుతుంది. ఎక్కువ పెట్టుబడి వల్లే ఎక్కువ సప్లై కాబట్టి, ఒక యూనిట్‌కి అవసరమయ్యే శ్రమ కాలం మారదు. యూనిట్ విలువ మారదు. విలువ మారకపోయినా, డిమాండ్ పెరగకుండానే సప్లై పెరిగింది కాబట్టి, మార్కెట్ ధర తగ్గుతుంది. లేదా, దీనికి వ్యతిరేకంగా జరిగితే, అంటే - డిమాండ్ కి తగ్గ పెట్టుబడి కన్నా తక్కువ పెట్టుబడి పని చేస్తే, సప్లై తగ్గుతుంది. తక్కువ పెట్టుబడి వల్ల తక్కువ సప్లై. యూనిట్ విలువ మారదు. విలువ మారకపోయినా, సప్లై కన్నా డిమాండ్ ఎక్కువైంది కాబట్టి మార్కెట్ ధర పెరుగుతుంది.

ఈ రకంగా, సప్లై - డిమాండ్లలో ఒక దానికొకటి సరిపడని పరిస్థితుల్ని తీసుకుంటే, అలాంటి సందర్భాల్లో కొన్ని చోట్ల విలువ మారడం గానీ, కొన్ని చోట్ల మారక పోవడం గానీ, ఏ రకంగా నైనా జరగవచ్చు.

ఇక్కడ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం 2 శాఖల్నే తీసుకుందాం. ఒక ఎక్కువ కాంపోజిషన్ శాఖనీ, ఒక తక్కువ కాంపోజిషన్ శాఖనీ. ఇవే సమాజంలో వున్న మొత్తం శాఖలు అనుకుందాం.

మొదటి శాఖ - పాల శాఖ. ఈ శాఖలో మొత్తం పెట్టుబడి 100. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, దీన్నే మొత్తం పెట్టుబడి గానూ, దీన్నే కాస్టు ప్రైస్ గానూ కూడా అనుకుందాం. అంటే, ఆ సరుకు కోసం, మొత్తం పెట్టుబడి అంతా ఖర్చయి పోతుంది అన్నట్టు. ఈ 100లో స్థిర 10, అస్థిర 90. అదనపు విలువ రేటు 100%. సరుకు విలువ = $10_C + 90_V + 90_S$ = 190. ఈ 190 విలువతో ఉత్పత్తి అయిన పాల పరిమాణం 100 లీటర్లు అనుకుందాం.

రెండో శాఖ - పంచదార శాఖ. ఇక్కడ పెట్టుబడి 100. అందులో స్థిర 90. అస్థిర 10. అదనపు విలువ రేటు 100%. సరుకు విలువ = $90_C + 10_V + 10_S$ = 110. ఈ సరుకు, 50 కిలోల పంచదార.

మొదటి సరుకు విలువ = 190

రెండో సరుకు విలువ = 110

ఈ సరుకుల ఉత్పత్తి ధరలు :

ఈ 2 సరుకుల లోనూ వున్న మొత్తం అదనపు విలువ 90 + 10 = 100. ఇది, 2 శాఖల లోనూ వున్న 200 పెట్టుబడి కి, సమానంగా పంపకం అయితే, ప్రతీ 100 పెట్టుబడి కీ, 50 అదనపు విలువ రావాలి. అంటే, ఇక్కడ, జనరల్ లాభం రేటు - 50%.

1వ సరుకు ఉత్పత్తి ధర : 100K + 50P = 150.

2వ సరుకు ఉత్పత్తి ధర : 100K + 50P = 150.

ఈ సరుకుల మార్కెట్ ధరలు:

సప్లై డిమాండ్లు సమానంగా వున్నాయా లేవా అనే దాన్ని బట్టే మార్కెట్ ధరలు ఏర్పడతాయి కాబట్టి, ఇక్కడ సప్లై డిమాండ్ల గురించి ఏదో ఒక వుదాహరణ తీసుకోవాలి. అవి సమానం గానే వున్నాయి అనుకుందాం.

పాల శాఖలో: సప్లై 100 లీటర్లు. డిమాండ్ కూడా 100 లీటర్లకే. సప్లై - డిమాండ్లు సరిపోతున్నాయి కాబట్టి, ఈ పెట్టుబడిదారులు నిర్ణయించిన ఉత్పత్తి ధరకే సరుకు అమ్ముడు పోతుంది. ఆ ధర తగ్గడమో హెచ్చడమో జరగదు.

సప్లై డిమాండ్లు సమానంగా వుంటే, ఉత్పత్తి ధరే మార్కెట్ ధర.

100 లీటర్ల మార్కెట్ ధర - 150 అయితే,

1 లీటరు మార్కెట్ ధర - 1.50. ఇందులో, కాస్టు ప్రైసు 1 రూపాయీ, లాభం 50 పైసలూ.

ఈ శాఖలో మొత్తం 100 లీటర్లనీ ఒకే పెట్టుబడి దారుడు ఉత్పత్తి చేయించడు. 10 లీటర్లు ఒకడూ, 18 లీటర్లు ఒకడూ, 22 లీటర్లు ఒకడూ, 7 లీటర్లు ఒకడూ, 11 లీటర్లు ఒకడూ - ఇలా, మొత్తం సరుకు ని అనేక మంది పెట్టుబడిదారులు ఉత్పత్తి చేయి స్తారు. ఎవరి సరుకు ని వాళ్ళు ఒకే మార్కెట్ ధరలతో (లీటరుకి 1.50 చొప్పున) అమ్ముకోవాలి. ఆ ధరలో నించి కాస్ట్ ప్రైస్‌ని తీసివేస్తే మిగిలేది లాభం. (సైజు మారిన అదనపు విలువ).

పంచదార శాఖలో : సప్లై 50 కిలోలు. డిమాండ్ కూడా 50 కిలోలకే. సప్లై డిమాండ్లు సరిపోతున్నాయి. ఇక్కడ కూడా ఉత్పత్తి ధరే మార్కెట్టు ధర.

50 కిలోల మార్కెట్ ధర 150 అయితే, 1 కిలో ధర 3. ఇందులో, కాస్టు ప్రైసు 2 రూపాయలు. లాభం 1 రూపాయి.

ఈ 50 కిలోల్నీ ఒకే పెట్టుబడిదారుడు ఉత్పత్తి చేయించడు. 10 కిలోలు ఒకడూ, 5 కిలోలు ఒకడూ, 6 కిలోలు ఒకడూ - ఇలా.

ఈ సరుకుని కూడా మార్కెట్ ధరకి అమ్మగా వచ్చిన దాంట్లోంచి, కాస్టు ప్రైసుని తీసివేస్తే, మిగిలేది లాభం (సైజు మారిన అదనపు విలువ).

ఈ శాఖల్లో సప్లై - డిమాండ్లు సరిపోయే విధంగా ఎందుకు వున్నాయి? - అది చెప్పలేము. ఆ శాఖలకు సంబంధించి గతం నించీ వున్న అనేక లెక్కలు తెలిస్తేనే అది సాధ్యం. ఈ ఉదాహరణలో, అలాంటి ఆధారాలేవీ లేవు. సప్లై వేపు నించి గానీ, డిమాండ్ వేపు నించి గానీ, ఏ మార్పులూ జరగలేదని చెప్ప లేము. ఎన్నో మార్పులు జరిగినా, ఆ మార్పులు ఒక దాని కొకటి తగిన విధంగా జరిగి వుండవచ్చు. రెండూ పెరిగినా, ఒకే రకంగా పెరిగి వుండవచ్చు. లేదా, రెండూ తగ్గినా ఒకే రకంగా తగ్గి వుండవచ్చు. ఆ వివరా లేవీ ఉదాహరణలో లేనప్పుడు, ఎలాంటి పరిస్థితుల వల్ల అవి సమానంగా వున్నాయో చెప్పలేము.

సప్లై డిమాండ్లు సరిపోకపోవడం అనేది కూడా అనేక రకాలుగా వుంటుంది. సప్లై ఎప్పటిలాగే వుండి, డిమాండు పెరగడం గానీ, తరగడం గానీ జరగవచ్చు. లేదా, డిమాండ్ ఎప్పటి లాగే వుండి, సప్లై పెరగడం గానీ తరగడం గానీ. లేదా, సప్లై కొంచెం పెరిగి, డిమాండ్ అంత కన్నా పెరగవచ్చు. లేదా, డిమాండు కొంచెం తగ్గి, సప్లై ఇంకా తగ్గవచ్చు. లేదా, సప్లై పెరిగి, డిమాండ్ తగ్గవచ్చు. డిమాండ్ పెరిగి, సప్లై తగ్గవచ్చు. - ఇలా ఈ మార్పులు రెండు వేపుల నించీ ఎన్ని రకా లుగా నైనా జరగవచ్చు. ఇందులో ఏ రకం మార్పు జరిగినా, సప్లై డిమాండ్లు తేడా అయిపోతాయి.

ఈ మార్పులు ఎన్ని జరిగినా, మార్పులు జరగని దానితో సమానంగా ఎప్పుడు వుంటుందంటే - ఆ మార్పులు ఒకే దిక్కులో, ఒకే పరిమాణంతో జరిగి నప్పుడు. సప్లై డిమాండ్లు రెండూ పెరుగుతాయి. కానీ రెండూ 10% చొప్పునే పెరిగితే, రెండూ మారినా, రెండూ మారని దానితో సమానం అవుతుంది. సప్లై డిమాండ్లు రెండూ ఒకే రకంగా తగ్గితే, అప్పుడు కూడా పరిస్థితి ఏమీ మారని దాని తోనే సమానం. ఈ రకంగా, సప్లై డిమాండ్లలో మార్పులు ఒకే దిక్కులో ఒకే స్థాయిలో జరిగితే, ఆ సరుకుకి మార్కెట్ ధరలో మార్పు జరగదు. ఇక్కడి నించీ, సప్లై-డిమాండ్లని తేలిగ్గా పలకడం కోసం సప్లై ని S - అనీ, డిమాండ్ ని d అనీ, క్లుప్తంగా చెప్పుకోవచ్చు.

S, d లు సరిపోని విధంగా మారితే, సరుకు మార్కెట్ ధరలో ఎలాంటి మార్పులు జరుగుతాయో ఇప్పుడు చూద్దాం.

పాల ఉదాహరణలో సప్లై ఎప్పటి లాగే వుండి, డిమాండ్ కొంత పెరిగినట్టు చూద్దాం. పాల సప్లై, 100 లీటర్లు. దాని ఉత్పత్తి ధర 150. డిమాండు, 100 లీటర్లకి గాక 10% పెరిగిందనుకుందాం. ఇప్పుడు మొత్తం ఎన్ని లీటర్ల పాలు కావాలి? 100+ 10= 110 లీటర్లు కావాలి. అన్ని పాలకి డిమాండ్ వుంది. ఇక్కడ తక్షణం 110 లీటర్ల పాలు వుంటే, S, d లు ఒక దాని కొకటి సరిపోయి, లీటరుకి మార్కెట్ ధర ఎప్పటిలాగే, 1.50 గానే వుంటుంది. కానీ, ఇప్పుడు S పెరగ కుండా d పెరిగింది. డిమాండ్ పెరిగిందని, పాలు హఠాత్తుగా పెరగవు. ఉన్న తక్కువ సప్లయ్యే ఎక్కువ అవసరాల కోసం అందాలి. ఇప్పుడు సరుకు త్వర త్వరగా కదిలే పరిస్థితి కనపడుతూ వుంటుంది. కొనే వాళ్ళు ఆ సరుకు కోసం ఆతృత పడుతూ వుంటారు. ఈ పరిస్థితి, సరుకు కి డిమాండ్ పెరిగి నట్టుగా అమ్మకందార్లకు సూచిస్తుంది. ఆ పరిస్థితిలో అమ్మకం దార్లు, సరుకు ధరని గతంలో కన్నా కొంత పెంచు

తారు. కొనే వాళ్ళు, పెరిగిన ధరతో కూడా ఆ సరుకుని కొనేస్తారు.

110 లీటర్ల పాలు కావలసి వుండగా, 100 లీటర్లకే ఎక్కువ ధర ఇచ్చినంత మాత్రాన, 110 లీటర్లతో తీరే అవసరాలన్నీ తీరతాయా? తీరవు. ఎంత ఎక్కువ ధర ఇచ్చినా అక్కడ 110 లీటర్లు లేవు. అప్పుడేం జరుగుతుంది? - ఎక్కువ అవసరాల్ని తక్కువ పాలతో సరిపెట్టుకోవడమే జరుగుతుంది.

ఇప్పుడు పాల వాడకంలో డిమాండు ఎప్పటి లాగే వుండి, సప్లై పెరిగిందనుకుందాం. అప్పుడు ఆ సరుకు అంతా అమ్ముడు పోయే లక్షణాలు కనపడవు. అమ్మకాలు మందకొడిగా వుంటాయి. ఆ పరిస్థితి, డిమాండ్ కన్నా సప్లై ఎక్కువగా వుండడాన్ని సూచిస్తుంది. సరుకుని అమ్మే వాళ్ళు, ఎవరి సరుకుని వాళ్ళు పూర్తిగా అమ్ముకోవాలని ఆతృత పడతారు. ఆ పరిస్థితిని బట్టి, వాళ్ళు, సరుకు ధరని కొంత తగ్గిస్తారు. ధర తగ్గడం వల్ల, తగ్గిన ధరతో ఎక్కువ సరుకు అమ్ముడు పోతుంది. ఇప్పుడు కూడా సరుకు ని వాడడంలో కొన్ని మార్పులు జరుగుతాయి. ఆ సరుకు ని ఎప్పుడూ వాడే వాళ్ళు, ఇప్పుడు, ఎప్పటి కన్నా కొంత ఎక్కువ సరుకు ని వాడవచ్చు, లేదా, ఆ సరుకు ని ఎప్పుడూ వాడని వాళ్ళు కూడా ఇప్పుడు కొంత సరుకుని వాడవచ్చు. సరుకు, తక్కువ ధరతో దొరకడం వల్లనే ఈ మార్పులు జరుగుతాయి.

సరుకుకి సప్లై పెరిగి, ధర తగ్గినప్పుడు, ఒక పెట్టుబడిదారుడు, తన సరుకునంతా అమ్మగలిగినా, తక్కువ ధరతో అమ్మడం వల్ల, ఆ లాభం, జనరల్ లాభం కన్నా తగ్గుతుంది.

ఈ రకంగా, సప్లై ఎక్కువో తక్కువో అయినప్పుడు, దానికి తగ్గట్టు గానే, దాని ధరలో మార్పులూ, దాని వాడకంలో మార్పులూ, దాని వల్ల రావలసిన లాభంలో మార్పులూ అన్నీ జరుగుతాయి.

s కన్నా d ఎక్కువగా వుంటే, మార్కెట్ ధర పెరుగుతుందనీ; d కన్నా s ఎక్కువగా వుంటే మార్కెట్ ధర తగ్గుతుందనీ చెప్పుకుంటున్నాం. అయితే, ధర పెరిగినప్పుడు గానీ, తగ్గినప్పుడు గానీ, ఆ మార్పు ఏ లెక్కతో వుంటుంది? దానికి ఏదైనా కొలత వుంటుందా? - డిమాండ్ మార్పు వల్ల ధరలో మార్పు జరిగినప్పుడు, ఆ మార్పు, ఏ కొలత మీదా ఆధారపడదు. ఎందుకంటే, డిమాండ్ మారడం అంటే, సరుకుకి పట్టే శ్రమ పరిమాణం మారడం కాదు. డిమాండ్ పెరగడం అంటే - సరుకులో శ్రమ పెరగడం గానీ, డిమాండ్ తగ్గడం అంటే - సరుకులో శ్రమ తగ్గడం గానీ, కాదు. కాబట్టి, నిజానికి, డిమాండ్ ఎలా మారినా, సరుకు ధర మారనక్కర లేదు. కానీ పెట్టుబడిదారీ విధానంలో, ధర, మార్కెట్ శక్తుల మీదే ఆధారపడి వుంటుంది. ఈ సందర్భంలో మార్కెట్ శక్తులు అంటే, కొనే - అమ్మే వాళ్ళ సంబంధం. ఈ ఇరు పక్షాలలో ఏ పక్షం శక్తి ఎక్కువగా వుందో దాన్ని బట్టి ధర ఎక్కడో అక్కడ సెటిలవుతుంది. ఈ మార్పు సరుకుకి సంబంధించిన శ్రమ మీద ఆధారపడి జరిగేది గాక, అమ్మే - కొనే పక్షాల అవసరాల మీద ఆధారపడి జరిగేదిగా వుంటుంది. సప్లైలో మార్పు జరిగినప్పుడైతే, సరుకులో శ్రమ పరిమాణం మారుతుంది. ఇలాంటి సందర్భాల్లో ధర మారితే, ఆ మార్పు, ఒక కొలత మీద ఆధారపడి వుండాలి. శ్రమలో మార్పు ఏ లెక్కన జరిగిందో, ధరలో మార్పు కూడా ఆ లెక్కన వుండవచ్చు. కానీ ఇలాంటి సందర్భాల్లో కూడా అది ఖచ్చితంగా జరగదు. కొన్ని సందర్భాల్లో, సప్లైలో మార్పు జరిగినప్పుడు కూడా, సరుకులో శ్రమ పరిమాణం మారదు. (ఇలాంటి వుదాహరణని ఇంతకు ముందే చూశాం.)

చివరికి సారాంశం ఏమిటంటే, సప్లై డిమాండ్లు తేడా అయినప్పుడు, ధర ఎలా మారుతుందో ఖచ్చితంగా నిర్ణయించడం సాధ్యం కాదు.

అయితే, సప్లై డిమాండ్ల ఎగుడు దిగుడుల వల్ల, ఒక శాఖలో ధర ఎంత మారినా, ఆ ధర కనీసం ఎలా వుంటుందంటే, **(1)** పెట్టుబడి ని వెనక్కి తీసుకోవడానికీ, **(2)** దాని మీద కనీసమైన లాభం తీసుకోవడానికీ - ఈ 2 అంశాలకూ సరిపోయేదిగా ఉంటుంది.

సప్లై డిమాండ్ల ఎగుడు దిగుడుల వల్ల ఒక శాఖలో ధర ఎంత పెరిగినా, అన్ని శాఖల అదనపు విలువనీ తనే లాగేసుకునే స్థాయికి మాత్రం పెరగదు, అలా జరిగితే, ఇతర శాఖలకు కనీస లాభాలు కూడా దక్కవు. కాబట్టి s d ల ఎగుడు దిగుళ్ళ వల్ల ధరల్లో మార్పులు ఎలా జరిగినా, ఆ మార్పులు, ఏ నియమాలూ ఏ హద్దులూ లేనివిగా వుండవు.

ఒక సరుకుకి, పాత విలువకు బదులు కొత్త విలువ ఏర్పడినప్పుడు, దానికి తగ్గట్టు గానే, పాత ఉత్పత్తి ధరకు బదులు కొత్త ఉత్పత్తి ధర ఏర్పడుతుంది. అప్పుడు ఆ సరుకుకి వున్న సప్లై - డిమాండ్లని బట్టి, కొత్త మార్కెట్ ధర ఏర్పడుతుంది.

'విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా' అనే 3 అంశాల సంబంధాల్నీ ఇప్పుడు కలిపి చూద్దాం. A, B సరుకులే సమాజంలో వున్న మొత్తం సరుకుల రాసిగా అనుకుందాం.

విలువలు :

A: 90 C +10 V + 10 S = 110

B: 10 C + 90V + 90 S = 190

విలువల మొత్తం = 300

ఈ 2 శాఖలకూ సమాన లాభం రేటు రావడం కోసం ఈ విలువలు ఉత్పత్తి ధరలుగా మారతాయి.

ఉత్పత్తి ధరలు :

A: 90C + 10 V + 50 P = 150

B: 10C + 90 V + 90 P = 150

ఉత్పత్తి ధరల మొత్తం = 300

A, B శాఖలు రెంటిలోనూ సప్లై డిమాండ్లు సమానంగా లేవు అనుకుందాం. A శాఖలో డిమాండ్ పెరిగి ధర పెరిగిందనీ, B శాఖలో సప్లై పెరిగి ధర తగ్గిందనీ అనుకుందాం.

మార్కెట్ ధరలు :

A: 90 C +10 V+ 70 P = 170

B: 10 C +90 V+ 30 P = 130

మార్కెట్ ధరల మొత్తం = 300

ఉత్పత్తి ధరలు, మార్కెట్ ధరలుగా పైకో కిందకో మారినప్పుడు, లాభం సైజులు ఒక చోట తగ్గి, ఇంకో చోట పెరుగుతాయి. సప్లై పెరిగిన శాఖలో లాభం కొంత తగ్గి, డిమాండ్ పెరిగిన శాఖలోకి పోతుంది.

డిమాండ్ కన్నా సప్లై ఎక్కువగా వున్నప్పుడు, ఆ సరుకంతా ఆ తక్కువ ధరతో కదిలి పోతుంది అనేది సాధారణంగా జరిగే పరిస్థితి. కానీ, ఒక్కోసారి, సప్లై చాలా ఎక్కువగా వుంటే, సరుకులో కొంత భాగం తక్కువ ధరతో కూడా కదలక పోవచ్చు. కొంత సరుకు అమ్ముడు కాకుండా కూడా ఆగిపోవచ్చు. ఏ మాత్రం నిలవ వున్నా పాడయ్యే సరుకు అయితే, పాడై పోతుంది. పాడవని సరుకు అయితే, తర్వాత రోజుల్లో అమ్ముడవుతుంది. అయితే, తర్వాత రోజుల్లో వచ్చే కొత్త సప్లై తగ్గవలసి వుంటుంది. సప్లై తగ్గకుండానూ, డిమాండు మళ్ళీ పెరగకుండానూ వుంటే, సరుకు ఎక్కువగా నిలిచిపోవడం ప్రారంభమవుతుంది. కానీ, ఇక్కడ మనం సాధారణ పరిస్థితినే తీసుకుంటాం. అంటే, ధర తగ్గగానే, ఆ తక్కువ ధరతో, ఆ సరుకు అంతా అమ్ముడై పోతుంది - అనే పరిస్థితిని.

1 మీటరు సైను బట్టకి - మార్కెట్ ధర 2 రూపాయలు అనుకుందాం. ఒక పెట్టుబడి దారుడికి 100 మీటర్లు అమ్మగా 200 వచ్చింది. అంటే ఆ పెట్టుబడి దారుడు, ప్రతీ ఒక్క మీటరునీ ఖచ్చితంగా 2 రూపాయల చొప్పున అమ్మాడని అర్థమా? - కాదు. సరుకుని అమ్మేటప్పుడు రక రకాల బేరసారాలు వుంటాయి. ఒకే తానులో నించి 1 మీటరు బట్టని 5 పైసలు ఎక్కువ గానూ, ఇంకో మీటరు బట్టని 5 పైసలు తక్కువ గానూ, అమ్మవచ్చు. ఈ బేరసారాల్ని కూడా దృష్టిలోకి తీసుకుంటే, మార్కెట్టు ధరలు కూడా గిరిగీసినట్టు ఒకే రకంగా వుండక పోవచ్చు. చిన్న చిన్న తేడాలతో మొత్తం 100 మీటర్ల నీ అమ్మగా 200 వచ్చిం దనుకుందాం. ఆ రకం గానే 1 మీటరు ధర 2 అయిందని అర్థం. అంతే గానీ, ప్రతీ మీటరునీ ఖచ్చితంగా 2 చొప్పున అమ్మినట్టు కాదు.

ఒక శాఖలో పెట్టుబడిదారులంతా తమ సరుకుల్ని ఒకే మార్కెట్ ధరతో అమ్ముతారు - అన్నప్పుడు కూడా అదే అర్థం. ఒకే రకం సరుకుని అమ్మే వేరు వేరు పెట్టుబడిదారుల మార్కెట్ ధరల మధ్య కూడా చిన్న చిన్న తేడాలు వుంటాయి. ఆ చిన్న చిన్న తేడాల మార్కెట్ ధరలన్నిటినీ కలిపి సగటు చేస్తే (ఆ పని ఎవరో చేస్తారని కాదు), ఆ సగటే 1 మీటరుకి 2 గా వుందని అర్థం. 'మార్కెట్ ధర' అన్నప్పుడు, అది 'సగటు మార్కెట్ ధరే.'

ఒక శాఖలో, S d లు సమానంగా వుంటే, ఉత్పత్తి ధరే మార్కెట్టు ధర. అప్పుడు జనరల్ లాభం రేటే, ఆ శాఖ లాభం రేటు. S కన్నా d ఎక్కువగా వుంటే, ఉత్పత్తి ధర కన్నా మార్కెట్టు ధర పెరిగి, ఆ శాఖ లాభం రేటు జనరల్ రేటు కన్నా పెరుగుతుంది. d కన్నా S ఎక్కువగా వుంటే, ఉత్పత్తి ధర కన్నా మార్కెట్టు ధర తగ్గి, ఆ శాఖ లాభం రేటు, జనరల్ రేటు కన్నా తగ్గుతుంది.

వేరు వేరు శాఖల్లో S d లలో వచ్చే రక రకాల ఎగుడు దిగుళ్ళ వల్ల, శాఖల్లో లాభం రేట్లు ఒకే రకంగా వుండడం చెదిరిపోతుంది. S d లలో తేడాలు చాలా ఎక్కువగా వుంటే, మార్కెట్టు ధర ఉత్పత్తి ధర నించి చాలా తీవ్రంగా పక్కకి పోతుంది. d ఎక్కువగా వున్న కాలంలో, ఆ శాఖ పెట్టుబడిదారులు, ధరల్ని పెంచడానికి తమకు 'గుత్తాధికారం' సంక్రమించి నట్టు, తమ సరుకుల ధరల్ని కొంత వరకూ ఇష్టాను

సారంగా కూడా పెంచగలుగుతారు. ఆ ధరల ద్వారా వాళ్ళు కొంత కాలం పాటు ఎక్కువ లాభాలు సంపాదించగలుగుతారు.

ఒక శాఖలో s తగ్గి d పెరిగితే, వెంటనే s ని పెంచే ప్రయత్నాలు జరుగుతాయి. s పెరిగి, d తగ్గితే, వెంటనే s ని తగ్గించే ప్రయత్నాలు గానీ, d ని పెంచే ప్రయత్నాలు గానీ జరుగుతాయి. ఇలా, పెట్టుబడుల పోటీ వల్ల, s d ల ఎగుడు దిగుళ్ళు నిత్యం ఒక దాన్ని ఒకటి ప్రభావితం చేసుకుంటూనే వుంటాయి.

ఒక సంవత్సర కాలాన్ని తీసుకుందాం. ఆ కాలంలో అన్ని శాఖల్నీ (మొత్తం సమాజాన్ని) తీసుకుందాం. ఆ శాఖల్లో ధరల పరిస్థితుల్ని 3 రకాలుగా ఊహించవచ్చు.

**1.** అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి ధరలే మార్కెట్ ధరలుగా వుండడం . లేదా,

**2.** కొన్ని శాఖల్లో మాత్రమే ఆ పరిస్థితులు వుండి, మిగిలిన శాఖల్లో, ఉత్పత్తి ధరల నించీ మార్కెట్ ధరలు తేడాగా వుండడం . లేదా,

**3.** అన్ని శాఖల్లోనూ, ఉత్పత్తి ధరల నించి మార్కెట్ ధరలు తేడాగా వుండడం.

ఈ రక రకాల పరిస్థితుల్లో నించి ఏ పరిస్థితిని తీసుకున్నా 'ధరల మొత్తమే విలువల మొత్తం' అనే విషయం ఏమీ మారదు.

మొత్తం సరుకుల రాసి విలువని తెలుసుకోవాలంటే, ఆ రాసి - మార్కెట్ ధరల మొత్తాన్ని చూడడమే. విలువ కీ, ధర కీ వుండే సంబంధం ఏమిటో చూడాలంటే, మొత్తం సమాజాన్ని తీసు కోవాలి. ఏ శాఖలో మార్కెట్ ధర ఎలా వుందీ, అది ఉత్పత్తి ధరతో సమానంగా వుందా లేదా అనేది అనవసరం. ఏది ఎలాగైనా వుండవచ్చు. ఎక్కడ ఎలా వున్నా, అన్ని శాఖల మార్కెట్ ధరల్నీ కలిపితే, ఆ మొత్తమే - విలువల మొత్తం.

2 శాఖల్లోనూ, ఉత్పత్తి ధరలే మార్కెట్ ధరలుగా వున్నప్పుడు:

| విలువ | ఉత్పత్తి ధర | మార్కెట్ ధర | 'విలువ' నించి మార్కెట్ ధరకి తేడా | లాభం రేటు |
|---|---|---|---|---|
| A) 190 | 150 | 150 | – 40 | 50% |
| B) 110 | 150 | 150 | + 40 | 50% |
| మొత్తం 300 | 300 | 300 | | |

2 శాఖల్లోనూ, ఉత్పత్తి ధరల నించి, మార్కెట్ ధరలు తేడా అయినప్పుడు:

| విలువ | ఉత్పత్తి ధర | మార్కెట్ ధర | 'విలువ' నించి మార్కెట్ ధరకి తేడా | లాభం రేటు |
|---|---|---|---|---|
| A) 190 | 150 | 170 | – 20 | 70% |
| B) 110 | 150 | 130 | + 20 | 30% |
| మొత్తం 300 | 300 | 300 | | |

ధరల పరిస్థితి ఎలా వున్నా, దాని వెనక వున్న విలువల మొత్తం ఒకటే.

విలువలు - ఉత్పత్తి ధరలుగా మారినప్పుడు గానీ, ఉత్పత్తి ధరలు - మార్కెట్ ధరలుగా మారినప్పుడు గానీ, జరిగేది, ఒక చోట తగ్గిన భాగం, ఇంకో చోట కలవడమే. అదనపు విలువని లాక్కోవడంలో మార్పులు జరగడమే.

ఈ A, B సరుకుల ఉదాహరణల్లో, ఈ 2 సరుకులకూ, వాటి మార్కెట్ ధరలనే గాక, వాటి ఉత్పత్తి ధరల్నీ, వాటి విలువల్నీ కూడా చూస్తున్నాం. కానీ, నిజ జీవితంలో ఇలా జరగదు. అంటే, షాపులో వున్న ఏ సరుకుని తీసుకున్నా, దాన్ని కొనే వాళ్ళకి, దాని మార్కెట్ ధరే తెలుస్తుంది గానీ దాని ఉత్పత్తి ధర గానీ, దాని విలువ గానీ కనపడవు.

కానీ, ఆ సరుకుల మార్కెట్ ధరల్ని కలిపితే దాన్నే ఉత్పత్తి ధరల మొత్తం గానూ, దాన్నే విలువల మొత్తం గానూ కూడా అర్థం చేసుకోవచ్చు. అంటే, మొత్తం సరుకుల రాసి విషయంలో అయితే మార్కెటు ధరనే గాక, దాని ఉత్పత్తి ధర నీ, విలువ నీ కూడా తెలుసుకోగలం. ఈ పని, విడి విడి సరుకుల విషయంలో సాధ్యం కాదు.

[అయితే, విడి సరుకుల విలువల్ని లెక్క కట్టడం, పెట్టుబడిదారీ సమాజంలో గాక, 'నూతన సమాజం'లో అయితే, సాధ్యమే. ఈ వివరాలు ఈ సంపుటంలోనే ఇంకో సందర్భంలో చూస్తాం.]

గతంలో, విలువలు ఉత్పత్తి ధరలుగా మారతాయి - అని చెప్పుకున్నప్పుడు, అది ఆశ్చర్యంగా కనపడి, 'విలువ సూత్రం - అనేది సరైన సూత్రమేనా?' అనే సందేహం కలిగింది. దానికి జవాబు చెప్పుకున్నాం - పెట్టుబడిదారీ పునాది మీద విలువ సూత్రం అలాగే పని చేస్తుంది - అని.

ఇప్పుడు, ఉత్పత్తి ధర కూడా మార్కెట్ ధరగా మారవచ్చు - అని చూసినప్పుడు కూడా, మళ్ళీ విలువ సూత్రం మీదే సందేహం కలుగుతుంది. ధరలో ఇన్ని రకాల మార్పులు జరిగి, అది, అసలు విలువ కన్నా పైకో కిందకో పోతే, ఇక, 'విలువ' అనే దానికి ఏం విలువ వుంది - అనే సందేహం.

మార్కెట్ ధర, విలువ నించీ పైకో, కిందకో తప్పి పోకుండా వుండాలంటే, పెట్టుబడీ, దానికి సమాన లాభమూ సమస్యే లేకుండా వుండాలి. దానితోపాటు S d ల మధ్య తేడాల సమస్య కూడా లేకుండా వుండాలి. శాఖలన్నీ అలా వుండాలంటే, మొత్తం సమాజాని కంతటికీ ఒక ప్లాను వుండాలి. అది పెట్టుబడిదారీ విధానంలో సాధ్యం కాని విషయం. కాబట్టి ఇక్కడ, ప్లాను లేనితనం తప్పదు. దాని వల్ల, సప్లై డిమాండ్ల తేడాలవడం తప్పదు. చివరికి, విలువల నించి మార్కెట్ ధరలు తేడాలైపోవడం తప్పదు. ఇదంతా, 'విలువ సూత్రం సరైనదా కాదా; అది పని చేస్తోందా లేదా?' అనే సమస్య కాదు. అసలు సమస్య - పెట్టుబడిదారీ విధానంలో వుండే ప్రత్యేకతే. ఈ ప్రత్యేక పరిస్థితుల మీద, విలువ సూత్రం ఇలాగే పని చేస్తుంది.

విలువ సూత్రం - అంటే, అది చెప్పే ప్రధాన విషయం, 'విలువ అంటే శ్రమే' అనేది. ఈ విషయం అర్థం చేసుకుంటే, దాన్ని బట్టి, ధరల్లో వచ్చే ఏ మార్పుల్ని అయినా అర్థం చేసుకోవచ్చు. విలువల నించీ ధరలు పైకీ కిందకీ ఎలా మారినా, ఆ ధరల మొత్తం విలువల మొత్తమే అవుతుంది. ఆ మొత్తం అంతా శ్రమ వల్ల ఏర్పడేదే అవుతుంది. కాబట్టి, 'విలువ అంటే శ్రమే' అనేది సరైన విషయం కాకపోవడం ఏ సందర్భం లోనూ వుండదు.

ఒక శాఖలో S చాలా ఎక్కువగా వుండి, మార్కెట్ ధర చాలా తగ్గిపోతే, ఆ శాఖలో వున్న పెట్టుబడి దారుల్లో కొందరికి లాభం రాకపోవడమే గాక, పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోవచ్చు. అయితే ఈ పరిస్థితి కొందరు చిన్న స్థాయి పెట్టుబడిదారుల విషయం లోనే వుంటుంది గానీ, మొత్తం ఆ శాఖ కంతటికీ వుండదు. శాఖలో వున్న పెట్టుబడిదారు లందరికీ, పెట్టుబడి తిరిగి రాని పరిస్థితి ఏర్పడితే, ఆ శాఖలో పునరుత్పత్తే సాధ్యం కాదు. కాబట్టి, ఒక శాఖలో మార్కెట్ ధర ఎంత తగ్గినా, పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడం అనేది, కొందరి విషయం లోనే గానీ, మొత్తం శాఖ విషయంలో జరగదు.

విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం దేని కోసం? - సమాన లాభం రేటు కోసం. అయితే, ఆ ఉత్పత్తి ధరలు, మార్కెట్ ధరలుగా మారిపోతే, లాభం రేట్లు తేడా అయిపోయి, సమాన లాభం రేటు పరిస్థితి చెదిరిపోతుంది. కానీ, ఆ పరిస్థితి అలాగే వుండిపోదు. పెట్టుబడుల మధ్య పోటీ, ఆ పరిస్థితిని మళ్ళీ సమాన లాభం రేటుకి దగ్గరగా తేవడానికే ప్రయత్నిస్తూ వుంటుంది.

అంటే, సమాన లాభం రేటు పరిస్థితి కనీసంగా అయినా వుండాలంటే, పెట్టుబడుల మధ్య పోటీ వుండి తీరాలన్న మాట. పెట్టుబడులు పోటీ పడుతూ వుంటేనే అది సాధ్యం. పెట్టుబడులు పోటీలు పడుతూ వుండాలంటే దానికి ప్రధానమైన షరతు, పెట్టుబడిదారీ విధానం కొంత అభివృద్ధి చెంది వుండాలి. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం అంటే - పెట్టుబడులు శాఖల్ని త్వర త్వరగా మార్చ గలిగే పరిస్థితులు వుండాలి. కార్మికులు వేరు వేరు శాఖల్లోకి మారడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానంతో వుండాలి. పెట్టుబడిదారులకు, పెట్టుబడుల్ని సమకూర్చే బ్యాంకింగ్ విధానం స్థిరపడి కొనసాగుతూ వుండాలి. ఈ రకమైన పరిస్థితులన్నీ వుంటేనే పెట్టుబడులు త్వర త్వరగా శాఖల్ని మారుస్తూ, ఎక్కువ లాభాన్ని ఇచ్చే సరుకులనే ఉత్పత్తి చెయ్యడానికి ప్రయత్నిస్తూ వుంటాయి. ఆ పరిస్థితే, సమాన లాభం రేటుని సాధ్యం చెయ్యగలుగుతుంది. పెట్టుబడులు ఇలా పోటీలు పడడానికి అనుకూలమైన పరిస్థితులు లేనట్టయితే, సమాన లాభం రేటుని ఇవ్వగలిగే పరిస్థితులు కూడా వుండవు. అప్పుడు వేరు వేరు శాఖల లాభం రేట్లు ఎక్కువ తేడాల తోటే సాగుతూ వుంటాయి.

కానీ, పెట్టుబడిదారీ విధానం అనేది తలయెత్తిన తర్వాత, అది తప్పనిసరిగా పోటీల బరిలోకి దిగి తీరుతుంది. ఎక్కువ లాభాన్ని లాక్కోవడానికి కావలసిన రంగాలన్నిటినీ అదే నిర్మించుకుంటుంది.

ఇప్పుడు 5 శాఖల వుదాహరణని చూద్దాం. ఇంత వరకూ 2 శాఖల ద్వారా కనపడే విషయాలే ఇప్పుడు 5 శాఖల ద్వారా కనపడతాయి.

## సమాజంలో వున్న మొత్తం 5 శాఖల సరుకులు

| శాఖ | విలువ | ఉత్పత్తి ధర | మార్కెట్ ధర | ఉత్పత్తి ధరకీ మార్కెట్ ధర కీ తేడా | విలువకీ మార్కెట్ ధర కీ తేడా |
|---|---|---|---|---|---|
| 1. | 90 | 106 | 104 | – 2 | + 14 |
| 2. | 111 | 117 | 123 | + 6 | + 12 |
| 3. | 131 | 127 | 127 | 0 | – 4 |
| 4. | 175 | 126 | 125 | – 1 | – 50 |
| 5. | 20 | 51 | 48 | – 3 | + 28 |
| మొత్తం | 527 | 527 | 527 | + ల మొత్తం 6<br>– ల మొత్తం 6 | + ల మొత్తం 54<br>– ల మొత్తం 54 |

ఈ పట్టికలో చాలా విషయాలు చూడవచ్చు.

విలువల మొత్తమే ఉత్పత్తి ధరల మొత్తం. అదే, మార్కెట్ ధరల మొత్తం.

1 వ శాఖలో 106 ఉత్పత్తి ధర, 104 మార్కెట్ ధరగా మారిందంటే, ఈ శాఖలో d కన్నా S ఎక్కువగా వుండడం వల్ల అలా జరిగిందని తెలుసుకోవచ్చు. 3 వ శాఖలో ఉత్పత్తి ధరా, మార్కెట్ ధరా ఒక్కలాగే వున్నాయి. ఇక్కడ S, d లు సమానంగా వున్నాయని తెలుసుకోవచ్చు.

2 వ శాఖలో ఉత్పత్తి ధర కన్నా మార్కెట్ ధర 6 పెరిగింది. ఈ 6 ఎక్కడిది? 1 వ శాఖ నించి 2, 4 వ శాఖ నించి 1, 5 వ శాఖ నించి 3, మొత్తం 6 విలువ, 2 వ శాఖ లోకి వెళ్ళింది.

ఇలాంటివే ఇంకా కొన్ని విషయాలు చూడవచ్చు.

మార్కెట్ ధరలో మార్పులు - **3** వేపుల నించీ జరగవచ్చు. **(1)** విలువ వేపు నించీ, **(2)** సప్లై వేపు నించీ, **(3)** డిమాండ్ వేపు నించీ.

విలువ మారితే, ధర మారవచ్చు. సప్లై మారితే, ధర మారవచ్చు. డిమాండ్ మారితే, ధర మారవచ్చు. ఈ 3 కోణాల నించీ ఒక్కో పరిస్థితి కలిసి రక రకాల కాంబినేషన్స్ (కలయికలు) ఏర్పడవచ్చు, కొత్త కాంబినేషన్ని బట్టి పాత ధర, కొంత పెరగడమో, తరగడమో, నిశ్చలంగా వుండడమో, జరుగుతుంది.

కొన్ని ఉదాహరణలు:

**1.** సప్లై గతంలో లాగే వుంది. డిమాండ్, 10% తగ్గింది. సరుకు విలువ, 10% పెరిగింది. కొత్త ధర ఎలా వుండవచ్చు? - S మారకుండా, d 10% తగ్గింది కాబట్టి, ధర 10% తగ్గాలి. సరుకు విలువ 10% పెరిగింది కాబట్టి ధర 10% పెరగాలి. ఇక్కడ ఒక వేపు ధర ని తగ్గించే పరిస్తితీ, ఇంకో వేపు ధర ని పెంచే పరిస్తితీ సమానంగా వున్నాయి కాబట్టి, ధర నిశ్చలంగా వుండవచ్చు.

**2.** విలువ 5% తగ్గింది, S, 10% పెరిగింది. d, 15% తగ్గింది. కొత్త ధర ఎలా వుండవచ్చు? - విలువ తగ్గింది కాబట్టి ధర తగ్గాలి. S పెరిగింది కాబట్టి కూడా ధర తగ్గాలి. d తగ్గింది కాబట్టి కూడా ధర తగ్గాలి. మొత్తం పరిస్తితులన్నీ, ధరని గతంలో కన్నా తగ్గించి వేస్తాయి.

ఈ రకంగా, మార్కెట్ ధర, విలువలో మార్పులూ, S, d లలో మార్పులూ కలిసిన ప్రభావంతో ఏర్పడుతూ వుంటుంది. ఈ విషయాలన్నీ పరస్పర సంబంధాలు గల విషయాలే.

### ధరని నిర్ణయించడంలో, సప్లై డిమాండ్ల పాత్ర ఏమిటి?

ఒక సరుకు విలువ 10. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం ఉత్పత్తి ధర సంగతి తీసుకోవద్దు. విలువ మీదే S, d లు పని చేస్తాయి అనుకుందాం. ఈ ఉదాహరణలో, d ఎక్కువగా వుండి, ఈ సరుకుకి మార్కెట్ ధర 11 అయిందనుకుందాం.

ఈ సరుకు కి 11 ధర ఎలా ఏర్పడింది - అని చూసినప్పుడు, 'S, d లే ఈ 11 ధరని ఏర్పరిచాయి' అనవచ్చునా? - అలా అంటే అది చాలా తప్పు.

ఒక సరుకు 10 విలువతో మార్కెట్లోకి బైల్దేరిందంటే, దానికి మార్కెట్లోకి రాక ముందే ఆ విలువ వుంది. అది మార్కెట్లోకి వచ్చిన తర్వాత - అక్కడ ఆ

సమయంలో వున్న s, d ల్ని బట్టి, ఆ 10 విలువ, 11 ధరగా మారింది. ఇక్కడ s, d లు చేసిన పని, ఆ సరుకుకి 10 విలువని ఏర్పర్చడం కాదు; 10 ని 11 గా మార్చడం మాత్రమే.

'ధర' సమస్యలో, విలువ అనేది - 'పునాది.' లేదా 'కేంద్రం'. ఆ కేంద్రం మీద, s, d లు, తమ ప్రభావాలు చూపిస్తాయి. అప్పుడు ఆ ధర, ఆ కేంద్రానికి ఇటో అటో మారవచ్చు. లేదా s, d లు కేంద్రం మీద ఏ ప్రభావమూ చూపలేకపోతే, (s, d లు సమానంగా వుంటే), విలువే ధరగా వుండి పోతుంది.

మొదట '10 విలువ' అనేది వుంటేనే, దాన్ని s, d లు 10 కన్నా ఎక్కువో, తక్కువో చెయ్యగలవు. మొదట 10 అనే కేంద్రం లేకపోతే, s, d లు, 11 ధరని ఎలా తెస్తాయి? కాబట్టి, s, d ల పాత్ర ఏమిటంటే - విలువ నించీ ధరని కొంచెం తక్కువో ఎక్కువో చెయ్యడం మాత్రమే. అంతేగానీ అవే స్వతంత్రంగా విలువని (లేదా ధర ని) నిర్ణయించడం కాదు.

ధర ఏర్పడడంలో, s, d ల పాత్ర సెకండరీ పాత్రే. ప్రధాన పాత్ర విలువదే. అంటే, ధర ఏర్పడడానికి - **(1)** విలువ అనే పునాదీ, **(2)** s, d ల ప్రభావమూ - అనే 2 అంశాలూ కారణాలుగా వుంటాయి.

ఈ విషయాలు ఇంత వివరంగా ఎందుకు చూడాలంటే, పెట్టుబడిదారీ అవగాహనలో ఈ విషయాలు అనేక తప్పులతో వుంటాయి. అందుకే ఈ విషయాలు సరిగా అర్థం చేసుకోవాలి.

పెట్టుబడిదారీ దృష్టికి మార్కెట్లో కనపడేదే అసలు సత్యం. మార్కెట్లో s పెరిగితే ధర తగ్గడమూ, d పెరిగితే ధర పెరగడమూ కనపడుతూ వుంటాయి. దాన్ని అంత వరకే చూసే వాళ్ళకి, s, d లే ధరల్ని నిర్ణయించే అంశాలుగా కనపడతాయి. వాళ్ళ దృష్టిలో, ఆ ధర వెనక విలువ అనేది (శ్రమ పరిమాణం అనేది) వుండదు. s, d ల తేడాల ప్రభావాలే ధరల్ని నిర్ణయిస్తాయి - అనేది పెట్టుబడిదారీ అవగాహన.

s, d లు తేడాగా లేకుండా, రెండూ సమానంగానే వున్నాయి - అనుకుందాం. సరుకు మీద s ప్రభావం గానీ, d ప్రభావం గానీ లేదనుకుందాం. అయినా అప్పుడు కూడా సరుకు కి ఒక ధర వుంటుంది కదా? ఆ ధర దేన్ని బట్టి ఏర్పడుతుంది? ఆ ధర కి కారణం ఏమిటి? ఆ ధర, s, d ల ప్రభావాలతో సంబంధం లేకుండా 'ఇంకేదో కారణం వల్ల' ఏర్పడినదై వుండాలి. ఆ కారణం ఏమిటి? - ఆ కారణమే - విలువ. అంటే, సరుకు కోసం ఖర్చయిన 'మొత్తం శ్రమ'. అది, ధర లాగా, పైకి కనపడే విషయం కాదు. పైకి ఏది కనపడితే దాన్నే, ఎలా కనపడితే అలాగే, గొప్ప సిద్ధాంతంగా తీసుకోవడం, పెట్టుబడిదారీ మేధావికి, చాలా తేలిక. అందుకే ఆ మేధావి, 's, d లే ధరని నిర్ణయిస్తాయి' అని తేలిగ్గా ప్రకటించేస్తాడు. ఆ మేధావికి, s, d ల్నీ, మార్కెట్ ధరనీ మించిన జ్ఞానం వుండదు.

'ధర' వెనక 'విలువ' అనేది ఒకటి వుందని అర్థం చేసుకున్నప్పుడే 'లాభానికి' వుండే నిజమైన పునాదిని ('అదనపు విలువ' అనే పునాదిని) అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. కానీ, 'మార్కెట్ ధర' ని మాత్రమే చూసినప్పుడు, అది, అసలు నిజాన్ని (లాభం - ఎలా వస్తుందీ అనే నిజాన్ని) మరుగుపరుస్తుంది.

ఎలాగంటే: మార్కెట్ ధర ఎక్కువైతే లాభం ఎక్కువ గానూ, మార్కెట్ ధర తక్కువైతే లాభం తక్కువ గానూ వుంటుంది. ఈ మార్కెట్ ధరలో మార్పులు, ప్రధానంగా సప్లై డిమాండ్ల వల్లే కలుగుతాయి. కాబట్టి, ధర ఏర్పడడానికీ, అందులో మార్పులకూ, ఆ ధరలో నించి లాభం రావడానికీ, అది ఎక్కువ తక్కువలవడానికీ, ఈ అన్నిటికీ s, d లే కారణంగా కనపడతాయి. ఈ రకంగా, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్ర జ్ఞానం అంతా s d ల చుట్టూనే తిరుగుతుంది.

## ఈ s d లు, నిజమైన s d లు కావు :

'సప్లై డిమాండ్లు' అనే మాటల్ని ఎత్తుకున్న మొట్ట మొదటి క్షణంలోనే అర్థం చేసుకోవలసిన విషయం ఒకటి వుంది. 'పాల' విషయంలో, రోజూ సప్లై 100 లీటర్లు — అనుకుందాం. డిమాండు కూడా సప్లైతో సమానంగా 100 లీటర్లకే వుంది. ఇలా అన్నప్పుడు, 100 లీటర్ల కన్నా ఎక్కువ పాలని వాడే పరిస్తితి సమాజంలో లేదని అర్థమా? కాదు. ఈ 'డిమాండు' అనేది, కేవలం మార్కెట్ కి సంబంధించిన డిమాండు. అంటే ఇది, ఎన్ని పాలు అమ్ముడు పోతాయి — అనే లెక్క. అంతేగానీ, ఇది, సమాజానికి కావలసిన నిజమైన అవసరాల లెక్క కాదు.

ఏ దోపిడీ సమాజాన్ని తీసుకున్నా, ఆ సమాజంలో వున్న మొత్తం జనాభాలో నూటికి 70, 80 మంది జనాభాకి, పాలని నిత్య జీవితావసర వస్తువు గా వాడ

గలిగే పరిస్తితి వుండదు. మిగిలిన 20, 30 శాతం మంది మాత్రమే పాలని కొనడమూ, వాడడమూ, చెయ్యగలుగుతారు. జనాభాలో ఎంతో మంది పాల మొహం చూడకుండానే జీవిస్తూ వుండగా, ఈ ఉదాహరణలో, 100 లీటర్ల కన్నా ఎక్కువ పాలు ఉత్పత్తి అయినప్పుడు, 'సప్లై ఎక్కువై పోయింది' అనడంలో అర్థం ఏమిటి? అన్ని పాలకు డిమాండు లేదని ఎందుకు అంటాం? ఈ భాష అంతా 'మార్కెట్ భాష'. కేవలం అమ్మకాలకూ, కొనుగోళ్ళకూ సంబం ధించిన భాష. ఈ సప్లై డిమాండ్లు మొత్తం జనాభా అవసరాలకు సంబం ధించినవి కావు. ఇవి సమాజాని కంతటికీ నిజంగా కావలసిన అంశాల్ని చెప్పవు.

ఒక దేశంలో, మొత్తం 1 కోటి (100 లక్షల) జనాభా వున్నారనుకుందాం. ఆరోగ్య సూత్రాల ప్రకారం ఒక్కొక్కరికీ రోజుకి అర్థ లీటరు పాలు కావాలి అనుకుందాం. మొత్తం కోటి మంది జనాభాకీ కలిసి, 1 రోజుకి, 50 లక్షల లీటర్ల పాలు కావాలి. ఇదే నిజమైన డిమాండు. కానీ, ఏ దోపిడీ సమాజంలో అయినా, 70% మంది జనం శారీరక శ్రమల కార్మికులనీ, 30% మంది మాత్రమే పాలని వాడగలిగే స్తితిలో వున్నారనీ, అనుకుందాం. అంటే, మొత్తం జనాభాలో 30 లక్షల మంది మాత్రమే పాలు కొన గలరు. వాళ్ళ కోసం 15 లక్షల లీటర్ల పాలు చాలు. మిగిలిన 70% జనాభాలో కూడా కాఫీ - టీల ద్వారానూ, వాళ్ళ చంటి పిల్లల కోసమూ, వాళ్ళ రోగుల కోసమూ, ఒక లక్ష లీటర్లు వాడతారను కుందాం. అంటే, దేశంలో రోజూ మొత్తం 16 లక్షల లీటర్లు అమ్ముడుబోతాయి. పాల కోసం నిజమైన డిమాండు, 50 లక్షల లీటర్లకు వుండగా, మార్కెట్ డిమాండ్ మాత్రం 16 లక్షలకే. పాల శాఖలో, పెట్టు బడిదారులందరూ కలిసి 16 లక్షల లీటర్లని ఉత్పత్తి చేయిస్తేనే ఎవరి సరుకుని వాళ్ళు ఉత్పత్తి ధరకు అమ్ముకోగలుగుతారు. సరుకు ఏ మాత్రం ఎక్కువైనా ధర తగ్గుతుంది; ఏ మాత్రం తక్కువైనా ధర పెరుగు తుంది.

మార్కెట్ పరిస్తితుల మీద ఆధారపడే సప్లై డిమాండ్లు, ఎప్పుడూ 'ఎలాస్టిక్'. అంటే, సమయాను కూలంగా 'సాగే —ముడుచుకునే' గుణం కలవి. 'మారకం విలువ' మీద గాక, 'ఉపయోగపు విలువ' మీద ఆధారపడి వుండే సప్లై డిమాండ్లు, ఎలాస్టిక్ కాదు. అవి ధర లో తేడాల్ని బట్టి గానీ, ఇంకే బయటి తేడాల్ని బట్టి గానీ, మారవు. అవి సహజ అవసరాల్ని బట్టి, ఎప్పుడూ స్తిరంగా వుంటాయి. ఒక దానితో ఒకటి సమానంగా వుంటాయి. కాబట్టి, నిజమైన డిమాండ్ అనేది, మొత్తం జనాభా అవసరాల పరిమాణం. సప్లై - అనేది, ఆ అవసరాలను బట్టి ఉత్పత్తి అవవలసిన వస్తువుల పరిమాణం.

పెట్టుబడిదారీ డిమాండు, నిజమైన అవసరాల్ని బట్టి వుండదు. ఈ డిమాండు, సామాజిక కొనుగోలు శక్తి మాత్రమే. పెట్టుబడిదారీ సప్లై అనేది, ఆ కొను గోలు శక్తిని బట్టి, ఉత్పత్తి అవవలసిన సరుకుల పరి మాణం. కాబట్టి, ఇక్కడ సప్లై డిమాండ్లు అన్నప్పు డల్లా, సమాజానికి సహజంగా కావలసిన పరిమాణాల గురించి గాక, మార్కెట్ పరిమాణాల గురించే మాట్లాడుతున్నామని అర్థం.

పెట్టుబడిదారీ దృష్టిలో, మార్కెట్ అవసరాలకూ, నిజమైన అవసరాలకూ తేడా వుండదు. పాల విష యమే తీసుకుంటే, సమాజంలో కొంత జనాభా పాలు వాడరని పెట్టుబడిదార్లకు కూడా తెలుసు. కానీ, అది వాళ్ళ దృష్టి కి చాలా సహజమైన విషయం. పాలు వాడని వాళ్ళు ఎవరు? పేద కార్మికులూ, నిరుద్యోగ కార్మికులూ. వాళ్ళంతా పేదలు కదా? పేదలు పాలు వాడరు కదా? — ఇదే పెట్టుబడిదార్లు చూడగలిగేది. 'పేదలు పాలు వాడరు' అనే విషయం, పెట్టుబడి దారీ దృష్టికి — ఒక ప్రకృతి సత్యం! ఆవు శాకాహార జంతువు. అది మాంసం తినదు, గడ్డే తింటుంది. అలాగే, పేదలు పాలు తాగరు, గంజే తాగుతారు. కాబట్టి, పాల ని ఎవరు తాగుతారో, ఎవరు కొంటారో, వాళ్ళ ద్వారా ఏర్పడే డిమాండే సమాజపు డిమాండు. వాళ్ళ అవసరమే సమాజపు అవసరం. ఈ రకంగా, పెట్టుబడిదారీ దృష్టి, మార్కెట్ అవసరాన్నే సమాజ అవసరంగా చూస్తుంది.

మంచి ఆహారమూ, మంచి బట్టలూ, మంచి ఇళ్ళూ, మందులూ, విద్యా సౌకర్యాలూ, ప్రయాణ సౌకర్యాలూ — వగైరా సమస్త ఉత్పత్తుల విషయం లోనూ ఇంతే. వాటిని కొనగలిగే వాళ్ళ అవసరాలే సమాజ అవసరాలు! సరుకుల్ని కొనలేని వాళ్ళ అవస రాలు సమాజానికి అసలు లేనట్టే! కాబట్టి పెట్టుబడి దారీ విధానానికీ, దాన్ని కీర్తించే ఆర్థిక వేత్తలకూ, దాని మేధావి బంట్లకూ, 'మార్కెట్టు'ని మించిన ప్రపంచం వుండదు. వాళ్ళ సమస్త ప్రపంచమూ మార్కెట్టే. వాళ్ళ భాష అంతా మార్కెట్టు భాషే! వాళ్ళ సమస్త జ్ఞానమూ

మార్కెట్టు జ్ఞానమే. అమ్మడాల్నీ, కొనడాల్నీ మించిన సహజ ప్రకృతి వుండదు వాళ్ళకి.

ఈ మార్కెట్ సప్లై డిమాండ్ల గురించి ఇంకా కొన్ని విషయాలు చూడాలి.

సప్లై డిమాండ్లలో ఎగుడు దిగుళ్ళు, ఉత్పత్తి ధరల్నీ మార్కెట్ ధరల్నీ తేడాగా చేస్తాయి కదా? మరి, సప్లై డిమాండ్లని ఏది తేడాగా చేస్తుంది? — జవాబు, మనకు తెలిసిందే. ఏ శాఖలో ఎంత పెట్టుబడి పని చెయ్యాలీ — అనే 'సమిష్టి ప్లాను' లేని పరిస్తితే, సప్లై డిమాండ్లని తేడాగా, ఒకదాని కొకటి పొసగకుండా చేస్తుంది.

ఒక శాఖలో వున్న ఒక విడి పెట్టుబడిదారుడికి, ఆ శాఖలో మొత్తం ఎంత సరుకు కోసం డిమాండ్ వుందీ — అనే విషయం గానీ, ఆ శాఖలో ఇతర పెట్టుబడిదారులూ తనూ కలిసి మొత్తం ఎంత సరుకుని సప్లై చేస్తున్నామూ — అనే విషయం గానీ, తెలియవు.

ఏ శాఖలో అయినా, ప్రతీ పెట్టుబడిదారుడూ, 'నేను ఇంత సరుకు ని మాత్రమే అమ్మగలను' అని గ్రహించి, అంత సరుకు ని మాత్రమే ఉత్పత్తి చేస్తాడనుకుందాం. ఎవరు అమ్మగలిగినంత సరుకు ని మాత్రమే వాళ్ళు ఉత్పత్తి చేస్తే, అప్పుడు ఆ శాఖలో వున్న సరుకు అంతా కలిసి, డిమాండ్ తో సమానం గానే వుంటుంది. కానీ, ఏ పెట్టుబడి దారుడూ కూడా, అమ్మగలిగేటంత సరుకు ని మాత్రమే ఉత్పత్తి చెయ్యాలని చూడడు. సరిగ్గా దానికి వ్యతిరేకంగా, ఉత్పత్తి చెయ్యగలిగేటంత సరుకుని అమ్మాలని చూస్తాడు.

ప్రతీ పెట్టుబడిదారుడూ, ఇతర పెట్టుబడిదారులతో 'పోటీ పడుతూ' సరుకు ని అమ్ముకోవలసిన పరిస్తితుల్లో వుంటాడు కాబట్టి, సరుకు కోసం అయ్యే ఖర్చుల్ని తగ్గించి, సరుకు ని కొంత చవకగా ఇవ్వగలగడం కోసం ఉత్పత్తి స్థాయి ని పెంచాలని చూస్తాడు. 'అమ్మగలనా, లేదా' అనే దానితో సంబంధం లేకుండా, తనకు వీలైనంత ఎక్కువ సరుకు ని ఉత్పత్తి చేసి, ఆ సరుకునంతా ఎలాగో తంటాలుపడి అమ్ముతాడు. ఒక్కోసారి సరుకు నంతా అమ్మలేని పరిస్తితిలో కూడా చిక్కు కుంటాడు. ప్రతీ పెట్టుబడి దారుడూ ఇదే పద్ధతిలో ప్రవర్తిస్తాడు. అంటే, పెట్టుబడి దారీ విధానానికి సహజ లక్షణం, అమ్మగలిగేటంత సరుకుని, ఉత్పత్తి చెయ్యడం — కాదు, ఉత్పత్తి చెయ్యగలిగినంత సరుకుని అమ్మడం! ఇక్కడ, డిమాండ్ ని బట్టి సప్లై కాదు; సప్లై ని బట్టి డిమాండ్!

ఇక్కడ, లాభమూ, పోటీ — అనే లక్షణాల వల్ల, ఒక శాఖ సప్లై, దాని డిమాండ్ తో సమానంగా వుండడం కన్నా, వుండకపోవడమే ఎక్కువ సార్లు జరుగుతూ వుంటుంది. ఎప్పుడైనా S, d లు సమానంగా వుంటే, అది 'కోయిన్సిడెంటల్.' అంటే, ఆ రెండూ అప్పటికి అలా ఎదురయ్యాయని అర్థం. ఆ విషయాన్ని ఎప్పుడూ జరిగే విషయంగా తీసుకోకూడదు.

కానీ, 'పెట్టుబడిదారీ విధానంలో సరైన ప్లాను వుండదు' అన్నప్పుడు, 'అసలు ప్లానే వుండదు' అని అర్థం కాదు. దాని స్వభావానికి తగ్గ ప్లాను దానికీ వుంటుంది. పెట్టుబడిదారీ ప్లాను, ఎప్పటికప్పుడు గడిచిపోయిన మార్కెట్ పరిస్తితుల మీద ఆధార పడుతూ వుంటుంది. అంటే, అప్పటికి వున్న 'మార్కెట్ ధరల' మీదా, 'లాభం రేట్ల' మీదా.

ఒక శాఖలో చాలా ఎక్కువ లాభాలు వస్తూ వుంటే, అక్కడ డిమాండ్ ఎక్కువగా వుందనీ, ఒక శాఖలో లాభం తగ్గిపోతూ వుంటే అక్కడ డిమాండ్ తగ్గిపోతోందనీ, ఆ రకంగా పెట్టుబడిదారులు, 'లాభం రేట్ల' ద్వారానే సప్లై డిమాండ్ల పరిస్తితుల్ని గ్రహిస్తూ వుంటారు.

అయితే, ఒక శాఖ పెట్టుబడిదారుడికి ఇతర శాఖల లాభం రేట్లు కూడా ఎలా తెలుస్తాయి? ఎలా తెలుస్తాయంటే, ఏ శాఖలో సరుకుకి అయినా, మార్కెట్ ధర ఎంత వుందో బహిరంగంగా కనపడే విషయమే. ఆ సరుకుని ఉత్పత్తి చెయ్యా లంటే ఎంత కాస్టు ప్రైసు అవసరమో లెక్క వెయ్యడం కూడా సాధ్యమయ్యే విషయమే. మార్కెట్ ధరలో నించి కాస్టు ప్రైసుని తీసివేస్తే, ఆ సరుకు ద్వారా ఎంత లాభం రేటు వుంటుందో తెలిసిపోతుంది. ఆ రకంగా, ఒక శాఖలో పెట్టుబడి దారులు, ఇతర శాఖల లాభం రేట్ల ని కూడా లెక్కలు వేసుకోగలరు.

పెట్టుబడిదారుడన్నవాడు రాత్రింబవళ్ళూ చేసే పని, తన శాఖ లాభాల్నీ, ఇతర శాఖల లాభాల్నీ లెక్కలు వెయ్యడమే. తన కొత్త పెట్టుబడిని ఏ శాఖలోకి దించాలో నిర్ణయించుకోవాలంటే, బయటి శాఖల లాభాల గురించి కూడా తెలిసి వుండాలి.

'లాభం రేట్లని సమానం చేసుకునే పోరాటం'లో, పెట్టుబడిదారులు, శాఖల్లో పెట్టుబడుల పరిమా

ణాల్ని మారుస్తూ, ఆ రకంగా తమకు తెలియకుం డానే శాఖల సప్లై డిమాండ్ల ని మారుస్తూ వుంటారు.

పెట్టుబడిదారుడి దృష్టి ఎప్పుడూ లాభం మీదే. లాభంలో హెచ్చు తగ్గులు మార్కెట్ ధరల్ని బట్టీ, మార్కెట్ ధరల్లో హెచ్చు తగ్గులు సప్లై డిమాండ్లని బట్టీ వుంటాయి. విషయాల్ని పెట్టుబడిదారీ మేధస్సుతో చూసే ఆర్థిక వేత్తకి, సప్లై డిమాండ్లే గొప్ప 'ఆర్థిక సూత్రాలు'గా కనపడతాయి. లోకం అంతా సప్లై డిమాండ్ల సత్యం మీదే ఆధారపడి వున్నట్టు కనపడుతుంది. సప్లై డిమాండ్ల గురించి ఇతర ప్రశ్నలేవీ ఆ మేధావికి వుండవు.

సప్లై డిమాండ్లు దేన్ని బట్టి వుంటాయి? సప్లై డిమాండ్ల ని సమానంగా వుంచడం సాధ్యం కాదా? సప్లై డిమాండ్లు సమానంగా వుంటే దాని ప్రభావం 'ధర' మీద ఎలా వుంటుంది? — ఈ రకం ప్రశ్నలే, అసలు రావలసిన ప్రశ్నలు.

పెట్టుబడిదారీ మార్కెట్ల లోకంలో, సప్లై డిమాండ్లు 'గొప్ప ఆర్థిక సూత్రాలు'గా పనిచేసే మాట నిజమే. అందుకే వాటి ప్రత్యేకతని ఎంత సాధారణ ఆర్థికవేత్త అయినా చూడగలుగుతాడు. కానీ, అవి కేవలం పై పై ఆర్థిక సూత్రాలు మాత్రమే — అనే విషయం, ఆ ఆర్థికవేత్త గ్రహించడు. సప్లై డిమాండ్లు అనేవి, వాటి వెనక వున్న ఇంకో కారణం మీద (శాఖల్లో పెట్టుబడులు అస్తవ్యస్తంగా వుండడం — అనే కారణం మీద) ఆధారపడి వుంటాయి — అనే విషయం, ఆ ఆర్థికవేత్త పట్టించుకోడు.

ధర ఏర్పడడం — అనే విషయం మీద s, d ల ప్రభావాలు అనేక రకాలుగా వుంటాయి. దేని ప్రభావం అధికంగా వుంటే, దాన్ని బట్టే ధర ఏర్పడుతుంది. అనేక దిక్కుల నించీ వచ్చే, ఒక దాన్ని ఒకటి ఖండించుకునే, అనేక ప్రభావాలతో తిరిగే, ఈ గందరగోళంలో, 'ధర కి మూలం అయిన పునాది' ని పట్టుకుంటేనే గందరగోళం అంతు పడుతుంది. 'పునాది' ని పట్టుకోవడం అంటే, ధర వెనక వుండే విలువ ని పట్టుకోవడమే.

'ధర' మీద ఏ ప్రభావమూ లేకుండా వుండాలంటే, s, d ల శక్తులు పనిచెయ్యడం ఆగాలి. అంటే, s, d లు సమానంగా వుండాలి. s, d ల ప్రభావాలు వున్నప్పుడు, 'ధర' ఏర్పడడానికి సంబంధించిన అసలు నిజాలు బయటపడవు.

s, d లు తేడాగా వుంటే, ఆ తేడాని బట్టి ధర మారుతుంది — అనే విషయం గ్రహించడం చాలా తేలికే. అది పైకి కనపడే విషయమే కాబట్టి. కానీ, s, d లు తేడాగా లేకుండా, సమానంగా వుంటే ఏం జరుగుతుంది? అసలు s, d లు సమానంగా వుండడం అంటే ఏమిటి? — ఈ విషయాలు అర్థం చేసుకోవడానికి ఉత్పత్తి విధానానికి సంబంధించిన లోపలి విషయాలు కావాలి.

పెట్టుబడిదారీ అర్థంలో కాకుండా, 'విలువ సూత్రానికి' సంబంధించిన అసలైన అర్థంలో చూస్తే, s, d లు సమానంగా వున్నప్పుడు, విలువే మార్కెట్ ధర గా వుండాలి. అంటే, 'విలువ' కీ, మార్కెట్ ధర కీ తేడా వుండకూడదు. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, s, d లు సమానంగా వున్నప్పుడు కూడా అలా జరగదు. అంటే, విలువే మార్కెట్ ధర గా వుండదు. అది ఉత్పత్తి ధర గా వుంటుంది. అప్పుడు కూడా ఆ ధర, విలువ నించి తేడా గా వున్న ధరే.

s, d లు, 'మార్కెట్ ధర' నే చూపిస్తాయి గానీ, 'విలువ' ని గానీ, ఉత్పత్తి ధర ని గానీ చూపించవు. కానీ, ఆ మార్కెట్ ధర, ఉత్పత్తి ధర తో సమానంగా వున్నట్టయితే, s, d లు, ఉత్పత్తి ధర ని కూడా చూపించినట్టే అవుతుంది. కానీ అది 'విలువ' కాదు కాబట్టి, s, d లు, 'విలువ' ని మాత్రం ఎప్పుడూ చూపించవు. అంటే, సరుకు కి అసలు 'విలువ' అనేది ఒకటి వుంటుందనీ, అది C + V + S అనే అంశాలతో ఏర్పడుతుందనీ, s, d లు వివరించవు. అలాంటి s, d ల ద్వారా ఆర్థిక శాస్త్ర విషయాలన్నీ చూడాలని ప్రయత్నించే ఆర్థిక వేత్త, s, d ల ద్వారా మార్కెట్ ధర ని తప్ప, దాన్ని దాటి 'విలువ'కి సంబంధించిన ఏ అంతర్గత విషయాలూ చూడలేడు.

'ఆర్థిక శాస్త్రం'లో ఏ అంశాన్ని హేతు బద్ధంగా అర్థం చేసుకోవాలన్నా, పరిశీలన అంతా 'విలువ — అనే పునాది కోసమే' సాగాలి. ప్రతీ అంశాన్నీ ఆ పునాదితో సంబంధంలో పెట్టి చూడాలి. మార్కెట్ ధర ని మాత్రమే చూస్తే దాని వల్ల కేవలం సరుకుల్ని 'అమ్మే-కొనే' పై పై విషయాలు మాత్రమే తెలుస్తాయి.

'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం' అంటే, కేవలం సరుకుల్ని అమ్మడమూ, కొనడమూ మాత్రమే కాదు. సరుకులు - డబ్బు గానూ, డబ్బు - సరుకులు గానూ మారడం మాత్రమే కాదు. పెట్టుబడిదారీ సరుకు 'సింపుల్ సరుకు' కాదు. సింపుల్ సరుకుల విష

యంలో అయితే, లాభాల సమాన పంపకాల సమస్య వుండదు. కానీ, ఇక్కడ, సరుకుల అమ్మకాలలో నించి, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు' వచ్చే పని కూడా జరగాలి. ఈ షరతు కోసమే ఇక్కడ, ధర, 'విలువ' నించి తప్పుకుని తీరాలి. అలా జరిగే విధంగా పెట్టుబడుల పోటీ చేస్తుంది.

శాఖల మధ్య పోటీ అనేది, s, d ల రూపంలోనే (వాటి ద్వారా ఏర్పడే మార్కెట్ ధరల రూపంలో), జరుగుతుంది. పెట్టుబడిదారుడికి ఏ శాఖ అయినా ఇతర శాఖలంత మంచిదే, తన పెట్టుబడికి ఎక్కడ వున్నా ఒకే రకంగా లాభం వస్తే. పెట్టుబడులు — శాఖల్ని మార్చడం అనేదే, s, d ల సంబంధాల్ని సృష్టి స్తుంది. 's, d ల సంబంధం' అంటే, ఆ 2 అంశాలూ ఒక దానితో ఒకటి, 'సమానంగా' వుండడం గానీ, లేకపోవడం గానీ. s, d లు తరుచుగా సమానంగా వుండడం గానీ, తరుచుగా సమానంగా లేక పోవడం గానీ, ఉత్పత్తి విధానానికి వున్న స్వభావాన్ని బట్టే వుంటుంది. దీన్నే క్లుప్తంగా చెప్తే — s, d ల సంబంధం, ఉత్పత్తి విధానాన్ని బట్టే వుంటుందని అర్థం.

పెట్టుబడిదారీ విధానంలో, s, d లు, సాధార ణంగా ఒక దాని కొకటి వైరుధ్యం లోనే వుంటాయి. అంటే, 'అసమానంగానే' వుంటాయి. అవి 'సమానం' కావడం అనేది, కొంత దీర్ఘ కాలంలో వాటి ఎగుడు దిగుడు చలనాల సగటుగా మాత్రమే వుంటుంది. ఒక కాలంలో s, d ల మధ్య 'సమానత' ఏర్పడినా, అది అలాగే స్థిరంగా వుండిపోదు. సమానతలు — అస మానతలవుతూ; అసమానతలు — సమానతలవుతూ వుంటాయి.

వెనకటి బానిస, భూస్వామ్య సమాజాల్ని తీసు కుంటే, అక్కడ ఉత్పత్తి అంతా అమ్మకాల కోసం తయారయ్యేదిగా వుండదని గతంలోనే చూశాం. ఆ సమాజాలలో కూడా మారకాలు వున్నా, అవి చాలా తక్కువ సంఖ్య లోనే వుంటాయి.

అక్కడ కూడా యజమానుల వర్గం 'డబ్బుని కూడబెట్టడం' వున్నా, అక్కడ సరుకుల అమ్మకాలే తక్కువ కాబట్టి, డబ్బుని కూడబెట్టే పని కూడా తక్కువ స్థాయిలోనే వుంటుంది. అక్కడ కూడా దోపిడీ వున్నా అది, పెట్టుబడులు పెట్టడమూ, సమాన పెట్టుబడు లకు సమాన లాభాలు సంపాదించడమూ — అనే రూపంలో వుండదు. అలాగే, అక్కడ, మొదట సరు కుని పోటీలు పడుతూ పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి, తర్వాత అమ్మకాల కోసం మార్కెట్లని వెతుక్కునే పరిస్థితి వుండదు. అంటే, s, d లు ఎగుడు దిగు ళ్ళయ్యే పరిస్థితి వుండదు.

కాబట్టి ఈ కారణాల వల్ల, గత సమాజాలలో 'ధర' ని ఇలా చూడవచ్చు.

**1.** గత సమాజాలలో, విలువ, ఉత్పత్తి ధర గా మారదు. ఎందుకంటే అక్కడ 'సమాన పెట్టుబడు లకు సమాన లాభం రేటు' పరిస్థితి వుండదు కాబట్టి.

**2.** గత సమాజాలలో, విలువ నించి మార్కెట్ ధర తేడాగా మారదు. ఎందుకంటే, అక్కడ s, d లు ఎగుడు దిగుళ్ళయ్యే పరిస్థితి కూడా వుండదు కాబట్టి.

దీని అర్థం, గత సమాజాలలో, 'విలువే ధర గా' వుండడమే.

అయితే, ధరలు, విలువలతో పూర్తిగా తగ్గట్టుగా వుండాలంటే, సరుకుల మారకాలు, ఆర్నెల్లకో సంవ త్సరానికో జరిగేవిగా గాక, తరుచుగా జరిగేవిగా వుండాలి. అంతే గాక, సరుకులు, ఇరు పక్షాల అవస రాలకూ కావలసిన పరిమాణాల్లో ఉత్పత్తి అవుతూ వుండాలి. మారకాలు తరుచుగా జరుగుతూ వుంటే, ఆ 'అనుభవాల' వల్లనే, ఒక మారకంలో వుండే 2 సరుకులూ ఎంతెంత కొలతల్లో వుండాలో తెలుస్తూ వుంటుంది. ఆ అనుభవాల వల్లనే, s, d ల మధ్య తేడా రాని విధంగా కూడా సరుకుల పరిమాణాల్ని తెలుసుకోవడం సాధ్యమవుతూ వుంటుంది.

అయినప్పటికీ, గత సమాజాలలో, అవసరాల పరిమాణాలు ఎంత స్పష్టంగా తెలుస్తూ వున్నా, కొన్ని సందర్భాల్లో s, d లలో తేడాలు ఏర్పడితే ఏర్పడవచ్చు, దాని వల్ల, 'ధర' అనేది, 'విలువ' నించీ పైకో కిందకో తప్పుకుంటే తప్పుకోవచ్చు కూడా. కానీ, అది అరు దుగా జరిగే విషయమే గానీ, ఎప్పుడూ జరిగే విష యంగా వుండదు. అంటే, అక్కడ s, d లు, సమా నంగా వుండడమే ఎప్పుడూ జరిగే విషయం. కాబట్టి, అక్కడ విలువే ధరగా వుండడమే ఎప్పుడూ జరిగే విషయం.

పెట్టుబడులు పెట్టడమూ, ఉత్పత్తి నంతా అమ్మ డమూ, లాభాల కోసం పోటీ — ఇదంతా పెట్టుబడి దారీ విధానపు ప్రత్యేకత. కాబట్టి, విలువ — ఉత్పత్తి ధర గా మారడమూ; ఉత్పత్తి ధర — మార్కెట్ ధరగా మారడమూ — అనేవి, ఆ విధానపు ప్రత్యేకతలే. ఈ లక్షణాలు వెనకటి సమాజాలలో లేనివి.

# వేరు వేరు శాఖల వేరు వేరు లాభం రేట్లు

వేరు వేరు శాఖలు, వేరు వేరు రకాల సరుకుల్ని ఉత్పత్తి చేస్తాయి కాబట్టి, వాటి పెట్టుబడుల కాంపోజిషన్లు (వాటి స్థిర, అస్థిర ల పాళ్ళు) తేడాగా వుంటాయి — అని గతంలోనే చూశాం. వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి పరిస్థితులకు సంబంధించిన ప్రతి అంశమూ తేడా గానే వుంటుంది. కొన్ని శాఖల్లో మేధా శ్రమలు ఎక్కువగా అవసరమైతే, కొన్ని శాఖల్లో శారీరక శ్రమలు ఎక్కువగా అవసరమవుతాయి. ఆ కావలసిన శ్రమల్లో కూడా కొన్ని శాఖల్లో స్కిల్డ్ శ్రమలూ, కొన్ని శాఖల్లో అన్ స్కిల్డ్ శ్రమలూ. ఇవన్నీ శాఖల ప్రత్యేక పరిస్థితులు. ఆ తేడాల వల్లే వేరు వేరు శాఖలు, వేరు వేరు మొత్తాల అదనపు విలువల్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ సమస్యని, పెట్టుబడుల మధ్య పోటీ, దాని పద్ధతిలో అది పరిష్కరిస్తుంది. సమాన పెట్టుబడులకు సమాన లాభాలు అందే పద్ధతిలో. ఈ అవసరం కోసమే, విలువలు, ఉత్పత్తి ధరలుగా మారతాయని ఇంతకు ముందే చూశాం.

అన్ని శాఖలలోనూ ఉత్పత్తి ధరలే మార్కెట్టు ధరలుగా వుంటే, అన్ని శాఖల లాభం రేట్లూ ఒకే రకంగా వుంటాయి. ఆ లాభం రేట్లన్నీ 'జనరల్ లాభం రేటు'తో సమానంగా వుంటాయి. ఈ సంగతి కూడా ఇంతకు ముందే చెప్పుకున్నాం.

అసలు మొట్టమొదట, 'జనరల్ లాభం రేటు' అనే దాన్ని ఒక ఖచ్చితమైన సంఖ్యగా గాక, ఒక 'సగటు పరిస్థితి'గా అర్థం చేసుకోవాలి. అది, సమాజంలో వున్న మొత్తం అదనపు విలువ ని, అన్ని శాఖలకూ ఒక సమాన సూత్రంతో అందించే ధోరణి (టెండెన్సీ). అంటే, 'జనరల్ లాభం రేటు'ని, లాభం రేట్లన్నిటికీ ఒక 'కేంద్రం'గా ('సెంటర్'గా) ఊహిద్దాం. వేరు వేరు శాఖల లాభం రేట్లు, ఆ 'కేంద్రం' నించి ఇటు గానీ, అటు గానీ, (హెచ్చినా గానీ, తగ్గినా గానీ), మరీ దూరంగా పోకుండా వుంటే, అది, లాభం రేట్లన్నీ 'సమానంగా' వుండడమే.

సమాజంలో వుండే 'మొత్తం అదనపు విలువ' ని, 'మొత్తం పెట్టుబడి'కి పంచితే, ఒక 100 పెట్టుబడికి వచ్చే అదనపు విలువే 'జనరల్ లాభం రేటు' (శాఖల సగటు లాభం రేటు). ఈ రకంగా చూస్తే, 'జనరల్ లాభం రేటు' అనేది, తప్పకుండా ఒక ఖచ్చితమైన సంఖ్య గానే వుంటుంది. కానీ, శాఖల ప్రత్యేక లాభం రేట్లు, ఆ సంఖ్యతో (జనరల్ లాభం రేటుతో) సమానంగా వుండడం గురించే సరిగా అర్థం చేసుకోవాలి.

జనరల్ లాభం రేటు 50% అనుకుందాం. ఒక విడి శాఖలో లాభం రేటు, జనరల్ రేటు నించి 5% తేడాగా వున్నా, అది జనరల్ రేటుతో సమానంగా వున్నట్టే అని (అంటే, ఆ తేడా లెక్కలోకి తీసుకోదగ్గ తేడా కాదని), అనుకుందాం.

అన్ని శాఖలలోనూ లాభం రేట్లు జనరల్ రేటుతో సమానంగా వున్నాయి — అన్నప్పుడు కూడా, ప్రతీ శాఖలో రేటూ ఖచ్చితంగా 50%గా వుంటుందని అర్థం కాదు. కొన్ని శాఖల్లో మాత్రమే అలా వుండవచ్చు. కొన్ని శాఖల రేట్లు 45%గా వుంటే, కొన్ని శాఖల్లో 55%గా వుండవచ్చు. కొన్ని శాఖల్లో 49%గా వుంటే, కొన్ని శాఖల్లో 51%గా. కొన్ని శాఖల్లో 47%గా వుంటే, కొన్ని శాఖలకు 53%గా. ఇలా, శాఖల రేట్లు రక రకాల తేడాలతో వుండవచ్చు. ఏ శాఖలో రేటు, ఆ శాఖకి సంబంధించిన 'ప్రత్యేక రేటు'.

ఈ ప్రత్యేక రేట్లలో కొన్ని రేట్లు, 'జనరల్ రేటు' కన్నా కొంత ఎక్కువగా వుంటే, కొన్ని రేట్లు కొంత తక్కువగా వున్నాయి. కానీ, ఈ రేట్లలో ఏదీ కూడా, జనరల్ రేటు నించి 5% కన్నా ఎక్కువ తేడాగా లేదు. ఈ రేట్లలో మరీ తక్కువగా వున్న రేటు 45%. మరీ ఎక్కువగా వున్న రేటు 55%. ఈ రెంటికీ తేడా 10%. మన షరతు ప్రకారం, 2 శాఖల మధ్య ఈ తేడా కూడా తేడా కానట్టే అర్థం. (ఉదాహరణలో వున్న సంఖ్యల్ని గాక, 'విషయాన్ని' మాత్రమే తీసుకోవాలి.) ఇక్కడ, 45% రేటు నీ, 55% రేటు నీ కూడా జనరల్ రేటుతో సమానంగా వున్నట్టే భావిస్తాము. అంటే, 'జనరల్ రేటు' అనే దాన్ని 50% గా వుండే ఒక ఖచ్చితమైన సంఖ్యగా గాక, 45% నించీ 55% వరకూ వుండే కొంత విశాలమైన పరిధిగా అనుకుంటున్నామన్న మాట. ఈ పరిధికి 'కేంద్రం' మాత్రం 50% అనేదే. ప్రత్యేక రేట్లన్నిటినీ కలిపి సగటు చేస్తే, ఈ కేంద్రం వస్తుంది. ప్రత్యేక రేట్లు ఈ కేంద్రం నించి కొంత దూరంగా పోయినా, అవి 45% కన్నా తగ్గకుండానూ, 55% కన్నా పెరగకుండానూ, ఆ 2 హద్దుల లోపల ఎక్కడ వున్నా, అవి సమానంగా వున్నట్టే అర్థం. అంటే,

ప్రత్యేక రేట్ల మధ్య వుండే చిన్న చిన్న తేడాల్ని వది లేస్తున్నామన్నమాట.

శాఖల ప్రత్యేక రేట్లకు కేంద్రంగా వుండే 'జనరల్ లాభం రేటు' అనేది, ఎప్పుడూ బహిరంగంగా కన పడదు. అది, కనపడే విషయం కాదు. అది, శాఖల రేట్లన్నిటినీ తన కేంద్రం వేపు లాగే ఒక కనపడని శక్తి. శాఖల ప్రత్యేక రేట్ల మధ్య ఎక్కువ దూరాలు (తేడాలు) లేకుండాచేసే కేంద్ర శక్తి గా దాన్ని ఊహి స్తాము. అంటే, ఆ నిజాన్ని ఊహతో అర్థం చేసు కుంటాము.

ఇంత వరకూ చూసింది ఏమిటంటే — 'శాఖల లాభం రేట్లు సమానంగా వున్నాయి' అన్నప్పుడు కూడా అవి ఖచ్చితంగా ఒకే రకంగా వుండవు అని. చిన్న చిన్న తేడాలు వున్నా, ఆ తేడాలు లెక్కలోకి రావు అని.

ఇంకో ఉదాహరణ : జనరల్ లాభం రేటు 50%. దాని నించి 5% పైకో కిందకో వున్నా అది తేడా కానట్టే అనుకుందాం. ఇప్పుడు, S తక్కువగా వున్న ఒక శాఖలో లాభం రేటు 35% గానూ, S ఎక్కువగా వున్న ఇంకో శాఖలో రేటు 65% గానూ వున్నాయి అను కుందాం. ఈ 2 శాఖల రేట్లకీ మధ్య తేడా 30%. మన షరతు ప్రకారం, ఇది చాలా ఎక్కువ తేడా! లాభం రేట్ల మధ్య ఈ రకమైన పెద్ద తేడాల్ని పెట్టుబడులు సహించవు. కాబట్టి పెట్టుబడులు, శాఖల్ని మార్చివేసే పోటీ పద్ధతి పనిచేస్తుంది.

అయితే, పెట్టుబడుల మధ్య పోటీ అనేది, ఒక వేపు — లాభం రేట్లని 'సమానం చేసే' పనీ, ఇంకో వేపు — వాటిని 'అసమానం చేసే' పనీ కూడా చేస్తూ వుంటుంది. 'పోటీ' అనేది, లాభం రేట్లని సమానం చేసే పని ఎలా చేస్తుందంటే, పెట్టుబడుల్ని శాఖల మధ్య మార్చడం ద్వారా. లాభం రేట్లని అసమానం చేసే పని ఎలా చేస్తుందంటే, ఉత్పాదక శక్తుల్ని పెంచ డానికీ, కాస్టు ప్రైసుల్ని తగ్గించడానికీ చేసే ప్రయత్నాల ద్వారా. అంటే, ఒక వేపు — శాఖల లాభం రేట్ల మధ్య పెద్ద తేడాల్ని తగ్గించే పరిస్థితులూ; ఇంకో వేపు — ఆ తేడాల్ని ఎక్కువ చేసే పరిస్థితులూ కూడా దేని దారిన అవి పనిచేస్తూ వుంటాయి. పోటీ అనేది, ఈ 2 రకాల పరిస్థితులకూ కూడా దారితీస్తూ వుంటుంది. ఈ రకంగా, పోటీ అనేది, ఎప్పుడూ విరుద్ధ లక్షణాలతో వుంటుంది.

'లాభం రేటే' పెట్టుబడులకు 'దిక్సూచి'. పెట్టు బడులు ఏ దిక్కు వేపు ప్రయాణం చెయ్యాలో, లాభం రేటే దారి చూపిస్తూ వుంటుంది. పెట్టుబడులు, ఎక్కువ లాభం రేటుని ఆశిస్తూ, శాఖల్లో పెరుగుతూ — తరుగుతూ వుంటాయి.

ప్రతీ శాఖలోనూ పెట్టుబడి పెరుగుతూ తరు గుతూ, ఆ శాఖల్లో s, d లు కొంత కాలానికోసారి గత పరిస్థితుల నించి మారిపోతూ వుండడం అనేదే, జనరల్ పరిస్థితి.

ఇక్కడ ఒక ప్రశ్న : శాఖల్లో s, d లు ఎగుడు దిగుడులవుతూ, దాని వల్ల శాఖల్లో లాభం రేట్లు కూడా ఎగుడు దిగుడులవుతూ వుండడమే జనరల్ పరిస్థితి అయితే (ఈ పరిస్థితే ఎప్పుడూ జరుగుతూ వుంటే), శాఖలన్నీ ఎప్పుడూ 'సమానమైన లాభాలనే తీసుకుంటాయ'నీ, శాఖల లాభం రేట్లు ఎప్పుడూ జనరల్ రేటుతో సమానంగా వుంటాయనీ, సూత్రీక రించడం ఎలా సాధ్యం? — ఎలాగంటే : ఒక శాఖ ని తీసుకుంటే, ఆ శాఖలో s, d లు ఎగుడు దిగుళ్ళవుతూ వుండడం వాస్తవం. దాని వల్ల, ఆ శాఖలో మార్కెట్ ధర కూడా ఎగుడు దిగుళ్ళవుతూ వుండడం వాస్తవం. అంటే, ఆ శాఖలో 'లాభం రేటు' కూడా ఎగుడు దిగుళ్ళవుతూ వుండడం వాస్తవం. అయినప్పటికీ, ఆ పరిస్థితుల నించే, ఆ శాఖ, 'సమాన లాభం రేటు'ని తీసుకోగలగాలి. అంటే, సమాన లాభం రేటుని తీసుకోవడం, ప్రతీ విడి సందర్భంలోనూ గాక, వరసగా కొన్ని సందర్భాలు కలవడం ద్వారానే జరుగుతుంది. కొన్ని సార్లు లాభం రేట్లు ఎక్కువా, కొన్ని సార్లు తక్కువా వుండే సందర్భాలు కలవడం ద్వారా. అంటే, ఒక శాఖలో, కొంత దీర్ఘ కాలాన్ని (ఉదా : ఒక సంవ త్సర కాలాన్ని) తీసుకుంటే, ఆ కాలంలో వుండే ఎక్కువ తక్కువ లాభం రేట్ల సగటు, 'జనరల్ లాభం రేటు'కి దగ్గరగా వుండగలుగుతుంది.

అంటే, శాఖలు సమాన లాభం రేటుని తీసు కోవడం అనేది, ప్రతీ విడి సందర్భంలోనూ గాక, కొంత దీర్ఘ కాలంలోనే జరుగుతుంది. అయినప్పటికీ, దాని సారాంశం, ఆ శాఖ, ప్రతీ విడి సందర్భంలోనూ సమాన లాభం రేటు ని తీసు కోవడమే. కాబట్టి, పోటీ అనేది, శాఖల మధ్య సమాన లాభం రేటు ని ఏర్పరు స్తుంది — అనే అర్థానికి వస్తాము.

ఒక శాఖలో ఒక సంవత్సర కాలాన్ని తీసు కుందాం. ఆ కాలంలో, ఆ శాఖలో సరుకుని, 10 సార్లు ఉత్పత్తి చేసి, అమ్మారు — అనుకుందాం. ఆ కాలంలో, మార్కెట్ ధర, కొన్ని సార్లు ఎక్కువ

గానూ, కొన్ని సార్లు తక్కువగానూ వుందనుకుందాం. లేదా, చెప్పుకోదగ్గ తేడాలు లేకుండా ధర ప్రతీ సారీ దాదాపు ఒకే రకంగా వుందనుకుందాం. ధర ఎలా వున్నా, ఆ కాలంలో, ఆ శాఖలో 10 సార్లు వున్న మార్కెట్ ధరల మొత్తం, ఆ శాఖలోని 'విలువల మొత్తం'తో సమానంగా వుంటుందా? — అలా వుండదు. అలా వుంటే, ఆ శాఖలో విలువ, ఆ శాఖకే యధాతథంగా అందినట్టు అవుతుంది. ప్రతీ శాఖ లోనూ అలాగే జరిగితే, అంటే ఏ శాఖ విలువ ఆ శాఖకే అందితే, 'సమాన పెట్టుబడులకు సమాన లాభాలు రావడం' అనే విషయమే వుండదు. కాబట్టి ఒక శాఖలో, కొంత దీర్ఘ కాలంలో వున్న మార్కెట్ ధరల మొత్తం, ఆ శాఖలోని విలువల మొత్తం కన్నా ఎక్కువో తక్కువో అయి ఉండాలి. 'విలువల మొత్తం' కన్నా, ఎక్కువో తక్కువో వుండే మొత్తం, 'ఉత్పత్తి ధరల మొత్తమే'. అంటే, ఒక శాఖలో కొంత దీర్ఘ కాలంలో వుండే మార్కెట్ ధరల మొత్తం, 'విలువల మొత్తం'గా గాక, 'ఉత్పత్తి ధరల మొత్తం'గానే వుంటుందని అర్థం.

ప్రతీ శాఖలోనూ అలా జరిగినప్పుడు, ఏ శాఖలో విలువ ఆ శాఖకే యధాతథంగా అందడం గాక, ఎక్కువ అదనపు విలువ గల శాఖల నించీ కొంత భాగం, తక్కువ అదనపు విలువ గల శాఖలకు అందుతుంది. సారాంశం ఏమిటంటే — ఒక్క శాఖని మాత్రమే విడిగా చూస్తే, ఎంత దీర్ఘ కాలంలో అయినా, ఆ శాఖలోని మార్కెట్ ధరల మొత్తం, ఆ శాఖలోని 'విలువల మొత్తం'తో సమానంగా వుండదు.

కానీ, అన్ని శాఖల్నీ కలిపి చూస్తే, అది ఎంత తక్కువ కాలం అయినా, ఆ కాలం లో, అన్ని శాఖల మార్కెట్ ధరల మొత్తం, అన్ని శాఖల విలువల మొత్తంతో సమానం. కాబట్టి, 'మార్కెట్టు ధరల మొత్తమే విలువల మొత్తం' అన్నప్పుడు, అది ఒక్క శాఖ విషయంలో గాక, అన్ని శాఖల్నీ కలిపి చూసి నప్పుడే జరుగుతుంది.

శాఖలు, సగటు లాభాలనే తీసుకోవడం అనేది (విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం అనేది), లాభాల కోసం పోటీపడే మెకానిజం పనిచేసే పెట్టు బడిదారీ విధానంలో మాత్రమే జరుగుతుందని గతం లోనే చెప్పుకున్నాం. పెట్టుబడిదారీ విధానంలో — అంటే, ఆ విధానపు 'ప్రారంభ దశ'లో కాదు. ఆ విధానం, అభివృద్ధి చెందే క్రమంలోనే 'సగటు లాభాల' నియమం ప్రారంభమవుతుంది. 'అదనపు విలువ'ని సమానంగా లాక్కోగలిగే పరిస్తితి వుండా లంటే, పెట్టుబడుల మధ్య తీవ్రమైన పోటీ వుండాలి. పెట్టుబడులూ, శ్రమ శక్తులూ, త్వర త్వరగా శాఖల్ని మార్చివెయ్యగలిగే పరిస్తితులు వుండాలి. ఇదంతా, పెట్టుబడిదారీ విధానం ఇంకా 'చేతి వృత్తుల' రకపు సాంకేతిక పునాది మీద వున్నప్పుడే సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం అంటే — సమాజంలో జరిగిన మొత్తం ఉత్పత్తిలో అత్యధిక భాగాన్ని 'సరుకులు'గా ఉత్పత్తి చెయ్య డమూ, ఉత్పత్తి యంత్రాల మీద జరగడమూ, అన్ని శాఖలూ యంత్ర విధానం లోకి మారడమూ, శ్రమ శక్తి ఏ శాఖలోకి మారడానికైనా సిద్ధంగా వుండడమూ, 'అప్పు - విధానం' అభివృద్ధి చెందడమూ (దీన్ని ఇంకా మనం చూడలేదు) — వగైరా లక్షణాలు, స్తిరంగా ఏర్పడడం.

పెట్టుబడుల మధ్య పోటీ — అన్నప్పుడల్లా, ఒక శాఖలో వున్న సమస్తమైన చిన్నా పెద్దా పెట్టుబడులన్నీ ఇతర శాఖలతో పోటీలోకి దిగుతాయని అర్థం కాదు. పోటీలు పడగల బలిసిన పెట్టుబడులు మాత్రమే పోటీలు పడుతూ వుంటాయి. ఆ పోటీల ద్వారా ఏర్పడే 'ధరల'కే, ఆ శాఖల్లో పోటీ పడలేని పెట్టు బడులు కూడా తమ సరుకుల్ని అమ్మవలసి వుంటుంది.

పెట్టుబడులు, ఒక శాఖలో నించి ఇంకో శాఖ లోకి మారడానికి ఫిక్స్‌డ్ సాధనాల సమస్య ఒక ముఖ్యమైన అడ్డంకిగా వుంటుంది. ఒక శాఖలో లాభం రేటు తగ్గడం ప్రారంభించిన వెంటనే ఆ శాఖలో వుండే ప్రతీ పెట్టుబడిదారుడూ, తన పెట్టు బడిని ఆ శాఖలో నించి మార్చెయ్యలేడు. పెద్ద పెట్టు బడులే త్వర త్వరగా ఉత్పాదక శక్తుల్ని పెంచుకోవడం గానీ, తమ ఫిక్స్‌డ్ సాధనాల్ని తక్కువ ధరలకైనా అమ్మేసి శాఖల్ని మార్చెయ్యడం గానీ, చెయ్యగలుగు తాయి. ఆ ఫిక్స్‌డ్ సాధనాల్ని కొన్న చిన్న పెట్టుబడి దారులు, ఆ శాఖలోనే వుండి తక్కువ లాభం రేటు తోనే సంతృప్తి పడతారు. అయినప్పటికీ, ఆ పరిస్తితి, పోటీ ధోరణిని లేకుండా చెయ్యదు. చిన్న పెట్టుబడి దారులు కూడా తమ స్థాయికి తగ్గ పెట్టుబడిదారు లతో పోటీలో వుంటారు.

'పోటీ' గురించి గ్రహించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే — పోటీ యే లాభాన్ని ఉత్పత్తి

చెయ్యదు. ఉత్పత్తి అయి వున్న లాభాల రాసి ని అన్ని శాఖలూ దాదాపు సమానంగా పంచుకోవడానికి కావల సిన పరిస్థితుల్ని కల్పించడం మాత్రమే అది చేస్తుంది.

'జనరల్ లాభం రేటు' అనేది అస్తవ్యస్తపు ఊహ కాదు. పెట్టుబడిదారీ పోటీ వల్ల పుట్టుకువచ్చే వాస్త వాన్ని, హేతు బద్ధంగా సూత్రీకరించే ఊహ అది!

# ఒకే శాఖలో, వేరు వేరు పెట్టుబడుల వేరు వేరు లాభం రేట్లు

సమాజంలో, అనేక శాఖలు వుంటాయి. ప్రతీ శాఖలోనూ, అనేక పెట్టుబడులు వుంటాయి. ఆ వేరు వేరు పెట్టుబడులు ఉత్పత్తి చెయ్యగలిగే అదనపు విలువల్ని బట్టే, అన్ని శాఖలకూ సంబంధించిన జన రల్ లాభం రేటు ఏర్పడుతుంది. ఆ రకంగా, ఒక విడి పెట్టుబడికీ, జనరల్ లాభం రేటుకీ సంబంధం వుంటుంది.

సమాజంలో మొత్తం 5 శాఖలు వున్నాయి. వాటి లాభం రేట్లు, కొంత కాలం పాటు — 50%, 65%, 35%, 45%, 55% గా వున్నాయి అనుకుందాం. ఈ 5 ప్రత్యేక రేట్లనీ కలిపి సగటు చేస్తే, అది 50%. ఈ ఉదాహరణలో ఇది జనరల్ రేటు. అంటే, 'జనరల్ రేటు' అనేది, వేరు వేరు శాఖల్లో వున్న లాభం రేట్ల సగటే గానీ, ఇంకేమీ కాదు.

ఈ ఉదాహరణ ప్రకారం, ఒక్క శాఖలో మాత్రమే 'జనరల్ రేటు'తో సమానమైన రేటు వుంది. 2 శాఖల్లో 'జనరల్ రేటు' కన్నా ఎక్కువ రేట్లూ, 2 శాఖల్లో తక్కువ రేట్లూ వున్నాయి.

'జనరల్ రేటు' 50% గా వుంటూ వుండగానే, ఆ సగటు మారకుండానే, శాఖల ప్రత్యేక రేట్లు, కొంత ఇటూ అటూగా మారుతూ వుండవచ్చు.

ఒక శాఖలో కొంత కాలం పాటు 55% లాభం రేటు వుందనుకుందాం. ఆ శాఖలో 10 మంది పెట్టు బడిదారులు వున్నారనుకుందాం. ప్రతీ పెట్టుబడి దారుడి లాభం రేటూ 55% గానే వుంటుందా? — అలా వుండదు. కొందరి దగ్గిర 55% కన్నా కొంత ఎక్కువ రేటూ, కొందరి దగ్గిర కొంత తక్కువ రేటూ వుంటాయి. 10 మంది రేట్లూ, చిన్న చిన్న తేడాలతో 10 రకాలుగా వుంటాయి.

ఎవడి లాభం రేటు, వాడి 'వ్యక్తిగత లాభం రేటు'. లేదా వాడి 'ప్రత్యేక లాభం రేటు.' అలాంటి వ్యక్తిగత లాభం రేట్ల సగటే, ఆ శాఖలో 'సగటు రేటు'! అది, ఈ ఉదాహరణ ప్రకారం 55%. అలాగే ఇతర శాఖల సంగతి కూడా.

వేరు వేరు పెట్టుబడులతో వుండే ఒక శాఖనీ, అలాంటి వేరు వేరు శాఖలతో వుండే సమాజాన్నీ, ఈ సంబంధాలన్నిటినీ అర్థం చేసుకోవాలి.

ఒక్క శాఖనే తీసుకుందాం. ఆ శాఖలో పెట్టు బడిదారులందరూ ఒకే రకం సరుకుని ఉత్పత్తి చేస్తారు. ఆ సరుకుల్ని అందరూ దాదాపు ఒకే 'మార్కెట్ ధర'కి అమ్ముతారు. అయినా, వాళ్ళ లాభం రేట్లు ఒకే రకంగా వుండవు. ఎందుకంటే, అందరి ఖర్చులూ ఒకే రకంగా వుండవు గనక. ఖర్చులు తేడాగా వుంటాయి కాబట్టి, ఆ సరుకుల ద్వారా మిగిలే లాభాలు కూడా తేడాగా వుంటాయి.

కాస్టు ప్రైసులు తేడాగా ఎందుకు వుంటాయో ఇక్కడ కొన్ని కారణాలు చూద్దాం.

'బట్ట' అనే సరుకు ని తీసుకుందాం. దాని ఉత్పత్తి కి ఎంత పెట్టుబడి కావాలి? ఆ శాఖలో సాధా రణంగా వున్న ఉత్పాదక శక్తిని బట్టి, ఆ పెట్టుబడి కి, ఒక కనీస స్థాయీ, ఒక గరిష్ట స్థాయీ (నార్మల్ మినిమమ్ అండ్ నార్మల్ మాగ్జిమమ్) వుంటాయి. 'కనీస స్థాయి' అంటే, ఆ స్థాయి కన్నా తక్కువ పెట్టుబడితో ఆ సరుకుని ఉత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. 'గరిష్ట స్థాయి' అంటే, ఆ స్థాయి కన్నా ఎక్కువ పెట్టుబడి ఆ సరుకు ఉత్పత్తి కి అవసరం వుండదు. అయితే, ఆ గరిష్ట స్థాయి లోనూ, కనీస స్థాయి లోనూ కూడా, ఇంకా ఎక్కువ పెట్టుబడితో కూడా పని చెయ్యవచ్చు. ఎలాగంటే, ఒక్క మగ్గంతో మాత్రమే ఉత్పత్తి చేయించడాన్ని కనీస స్థాయిగా అనుకుంటే, 2 మగ్గాల తోనూ, 10 మగ్గాల తోనూ కూడా పని చేయించవచ్చు; ఇంకా ఎన్ని మగ్గాలతో అయినా చేయించవచ్చు. 1 మగ్గంతో పని జరిగే చోట కన్నా 2 మగ్గాలతో పని జరిగే చోట కొన్ని ఖర్చులు కలిసి

వస్తాయి. 10 మగ్గాలతో పని జరిగే చోట, అనేక ఖర్చులు కలిసి వస్తాయి. ఎక్కువ స్థాయిలో పని జరిగి నప్పుడు, చాలా ఖర్చులు తగ్గి, ప్రతి యూనిట్ కీ కాస్టు ప్రైసు తగ్గుతుంది.

అలాగే ప్రింటింగు శాఖలో, ఒక పెట్టుబడి దారుడు ఒక్క అచ్చు మిషనుతోనే పని చేయిస్తూ వుండగా, ఇంకో పెట్టుబడిదారుడు 2 మిషన్లతో పని చేయిస్తూ వుండవచ్చు.

పాల శాఖలో 10 మంది పెట్టుబడిదారులు వుంటే, వాళ్ళ పెట్టుబడుల పరిమాణాలు ఒకే రకంగా వుండవు. ఎక్కువ పెట్టుబడితో పని చేయించే వాడికి చాలా ఖర్చులు కలిసివస్తాయి.

వేరు వేరు పెట్టుబడిదారుల దగ్గిర, ఉత్పత్తి పరిస్థితులన్నీ ఒకే రకంగా వుండవు. ఒకడు ముడి పదార్థాల్ని కొంత చవకగా సంపాదించగలిగితే, ఇంకోడు, ఆ ముడి పదార్థాల మీదే కొంత ఎక్కువ ఖర్చు పెట్టవలసి రావచ్చు. ఒక పెట్టుబడిదారుడి పని స్థలంలో కనీస సౌకర్యాలు వుంటే, ఇంకోడి దగ్గిర ఆ మాత్రం కూడా వుండవు. ఈ రెండోవాడు కనీసంగా పెట్టవలసిన ఖర్చుల్లో కూడా చాలా భాగం తప్పించు కుంటాడు. ఒకడి దగ్గిర 'రద్దు' ని తిరిగి వాడడానికీ, వృధా ని నివారించడానికీ తగిన ఏర్పాట్లు వుండవచ్చు. అలాంటి వాడి దగ్గిర ఉత్పత్తి సాధనాలు పొదుపుగా ఖర్చవుతాయి. ఇంకోడి దగ్గిర ఆ ఏర్పాట్లు వుండక పోవచ్చు. ఉన్నా అంత సరిగా వుండకపోవచ్చు.

ఒకడి దగ్గిర 'శ్రమ పరికరాలు' ఎక్కువ అను కూలంగా వుండడం వల్ల, రిపేర్లు తక్కువగా వుంటాయి. ఒకడికి రిపేర్లు ఎక్కువగా వుంటాయి.

ఒకడి దగ్గిర జీతాలు ఎక్కువగా వుంటే, ఒకడి దగ్గిర తక్కువగా వుంటాయి. ఎక్కువ తక్కువ జీతాలు కూడా ఒకే సైజు గల శ్రమని ఇవ్వవచ్చు. లేదా, తేడాలు వుండవచ్చు. ఇద్దరి దగ్గిరా, జీతాలు ఖచ్చి తంగా ఒకే రకంగా వున్నా, ఒకే రకం జీతాలు కూడా ఎక్కువ తక్కువ శ్రమల్ని ఇవ్వవచ్చు.

ఇలాంటి అనేక కారణాల వల్ల, వేరు వేరు పెట్టు బడిదారుల 'ఉత్పత్తి కాలాలు' (వర్కింగ్ పిరియడ్లు) కొంత కొంత తేడాలుగా వుంటాయి.

మొదటే ఆర్డర్లు సంపాదించి సరుకు ని ఉత్పత్తి చేయించేవాడు, సరుకు ని త్వరగా అమ్ముకో గలుగు తాడు. ఆర్డర్లు లేకుండా సరుకుని ఉత్పత్తి చేయించే వాడు, సరుకుని ఆలశ్యంగా అమ్ము కుంటాడు. ఈ రకంగా, వాళ్ళ 'చలామణీ కాలాలు' కూడా కొంత తేడాగా వుంటాయి. మొత్తం మీద వాళ్ళ 'టర్నోవరు కాలాలు' కొంత కొంత తేడాగా వుంటాయి.

వేరు వేరు శాఖల విషయంలో అయితే, టర్నోవర్ల తేడాల ప్రభావం లాభం రేట్ల మీద వుండదు. కానీ, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడి దారులు, సరుకుని ఒకే ధరతో అమ్ముతారు కాబట్టి, వాళ్ళల్లో ఎవడైతే తన సరుకుని తక్కువ కాలంలో ఉత్పత్తి చెయ్యడమూ, తక్కువ కాలంలో అమ్మడమూ చెయ్యగలుగుతాడో, అంటే ఎవడి టర్నోవరు కాలం అయితే చిన్నదిగా వుంటుందో, వాడికి, ఆ సరుకు కోసం అయ్యే ఖర్చులు తక్కువగా వుంటాయి. ఆ కాలం ఎక్కువగా వున్న వాడికి ఎక్కువ ఖర్చులు అవుతాయి. (ఇక్కడ మనం, ఒకే శాఖలో ఉత్పత్తి పరిస్తితుల్లోనూ, చలా మణీ పరిస్తితుల్లోనూ వుండే రక రకాల తేడాల్ని దృష్టిలోకి తీసుకోవాలి. ఇక్కడ చర్చించని ఇంకా అనేక రకాల తేడాల్ని కూడా. ఎన్ని తేడాలు వుండడానికి వీలవుతుందో అన్ని తేడాల్నీ.)

ఈ రకంగా, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడుల మధ్య ఉత్పాదక శక్తుల లోనూ, ఉత్పత్తి స్థాయిల లోనూ, శ్రమ తీవ్రతల లోనూ, జీతాల లోనూ, టర్నోవర్ల లోనూ, రక రకాల తేడాలు వుంటాయి. అయితే, ఆ తేడాల్లో కొన్ని ఒక దాన్ని ఒకటి చాలా వరకూ బ్యాలెన్స్ చేసుకుంటాయి కూడా. అయి నప్పటికీ, ఇంకా కొన్ని తేడాలు వుండిపోతాయి. అంటే, ఒకే రకం సరుకుల్ని, వేరు వేరు పెట్టుబడులు, వేరు వేరు పరిస్థితుల్లో ఉత్పత్తి చేస్తాయి కాబట్టి, ఆ సరు కుల కోసం అయ్యే ఖర్చులు (వాటి కాస్టు ప్రైసులు) తప్పనిసరిగా కొంత కొంత తేడాలతోటే వుంటాయి.

ఎవడి కాస్టు ప్రైసు, వాడి వ్యక్తిగత కాస్టు ప్రైసు. వ్యక్తిగత కాస్టు ప్రైసుల సగటే, ఆ శాఖకి సంబంధిం చిన 'సగటు కాస్టు ప్రైసు'. ఆ 'సగటు' కన్నా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యగలిగిన వాడికి 'సగటు లాభం' కన్నా ఎక్కువ లాభమూ; లేదా, దానికి వ్యతి రేకంగా జరిగితే, సగటు కన్నా తక్కువ లాభమూ మిగులుతాయి.

పాల శాఖలో, 1 లీటరు పాల ఉత్పత్తి ధర 1 రూ. 50 పైసలు — అనుకుందాం. ఉత్పత్తి ధర — అన్న ప్పుడు, అందులో (1) ఆ శాఖకి సంబంధించిన సగటు కాస్టు ప్రైసూ, (2) జనరల్ లాభమూ — వుంటాయి. ఈ ఉదాహరణలో, సగటు కాస్టు

ప్రైసు — 1 రూపాయీ, జనరల్ లాభం — 50 పైసలూ — అనుకుందాం. ఇక్కడ, ఉత్పత్తి ధరే, మార్కెట్ ధర గా వుందనుకుందాం.

ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా మార్కెట్ ధర 1.50 గానే వుంటుంది. కానీ, కాస్టు ప్రైసు ప్రతీ వాడి దగ్గిరా 1 రూపాయి గానే వుండదు. అది, కొందరి దగ్గిర రూపాయి కన్నా ఎక్కువగా వుంటే, కొందరి దగ్గిర రూపాయి కన్నా తక్కువగా వుంటుంది. కాస్టు ప్రైసు ఎక్కువగా వున్న చోట తక్కువ లాభమూ, తక్కువగా వున్న చోట ఎక్కువ లాభమూ వుంటాయి.

ఒక పెట్టుబడిదారుడు, లీటరు ని, 'సగటు కాస్టుప్రైసు' కన్నా (1 రూపాయి కన్నా) కొంత తక్కువ ఖర్చుతోటే, అంటే 95 పైసలతోటే, ఉత్పత్తి చేయించ గలిగా డనుకుందాం. అది వాడి 'వ్యక్తిగత కాస్టు ప్రైసు'. కానీ వాడు కూడా 1 లీటరుని 1.50కే అమ్ము తాడు. కాబట్టి, వాడికి 1 లీటరు ద్వారా వచ్చే లాభం, 50 పైసలు గాక, 55 పైసలు అవుతుంది. 95 పైసలు కాస్టుప్రైసుకి 55 పైసలు లాభం అంటే, దీన్ని రేటు గా చూస్తే,

—— × 100 = 57%.

ఇది, ఈ పెట్టుబడిదారుడి 'వ్యక్తిగత లాభం రేటు', లేదా, 'ప్రత్యేక (స్పెసిఫిక్) లాభం రేటు'. ఇది ఆ శాఖలో వున్న సగటు లాభం రేటు కన్నా ఎక్కువ.

ఇంకో పెట్టుబడిదారుడు, లీటరుని, సగటు కాస్టుప్రైసు కన్నా (1 రూపాయి కన్నా) కొంత ఎక్కు వతో, అంటే 105 పైసల ఖర్చుతో, ఉత్పత్తి చేయిస్తే (ఇది వీడి వ్యక్తిగత కాస్టు ప్రైసు), వీడికి 1 లీటరు ద్వారా వచ్చే లాభం 45 పైసలు అవుతుంది. మొదటి వాడి కాస్టు ప్రైసు 1 లీటరుకి 95 పైసలైతే, వీడి కాస్టు ప్రైసు 105 పైసలు. అంటే 10 పైసలు ఎక్కువ. కాబట్టి మొదటి వాడి లాభం కన్నా వీడి లాభం 10 పైసలు తగ్గుతుంది. వీడికి 105 పైసల కాస్టు ప్రైసుకి 45 పైసల లాభం. అంటే, దీన్ని రేటుగా చూస్తే,

—— × 100 = 43%.

ఇది, ఈ పెట్టుబడిదారుడి వ్యక్తిగత లాభం రేటు. ఇది, ఆ శాఖలో వున్న 'సగటు లాభం రేటు' కన్నా తక్కువ.

ఆ శాఖలో సగటు లాభం రేటు 50% గా వుండగా, ఒక పెట్టుబడిదారుడి లాభం రేటు 57% గానూ, ఇంకోడి రేటు 43% గానూ వున్నాయి.

ఈ రకంగా, ఏ శాఖలో అయినా, వ్యక్తిగత కాస్టు ప్రైసుల్లో తేడాల వల్లనే, పెట్టుబడిదారుల వ్యక్తిగత లాభం రేట్లు తేడాగా వుంటాయి.

ఒక శాఖలో, వేరు వేరు పెట్టుబడులకు వుండే వేరు వేరు లాభం రేట్లకి, ఆ శాఖలో వుండే సగటు లాభం రేటే 'కేంద్రం'. ఆ కేంద్రం నించి, ప్రత్యేక రేట్లు మరీ దూరం పోకూడదు. ఆ శాఖలో పెట్టుబడుల మధ్య వుండే పోటీ, అందరి లాభం రేట్ల మధ్యా మితిమీరిన తేడాలు లేకుండా చేస్తూ వుంటుంది. అందరి లాభం రేట్లు — అంటే, 'ప్రధానంగా పోటీ పడే వాళ్ళ లాభం రేట్లు' అని అర్థం. పోటీ పడలేని వాళ్ళు తక్కువ రేట్లతోటే సరిపెట్టుకోక తప్పదు.

ఒక శాఖలో 55% సగటు లాభం రేటు వుందంటే, దానికి కారణం, ఆ శాఖలో వున్న వ్యక్తిగత లాభం రేట్లే. ఆ శాఖలో ప్రతీ పెట్టుబడిదారుడి దగ్గిరా లాభం రేటు 55% కన్నా చాలా తక్కువ స్థాయిలో వుండి వుంటే (అందరి దగ్గిరా లాభం రేటు ఏ 20% గానో, 30% గానో వుండి వుంటే; లేదా, అందరి దగ్గిరా 50% ని దాటకుండా వుండి వుంటే), ఆ శాఖలో సగటు రేటు, 55% గా ఏర్పడడం జరగదు.

అలాగే, ప్రతీ శాఖలోనూ సగటు రేటు 50% కన్నా తక్కువగా వుండి వుంటే, మొత్తం సమాజంలో, జనరల్ లాభం రేటు, 50% గా ఏర్పడడం కూడా జరగదు.

అంటే, ఒక శాఖలో వుండే వేరు వేరు లాభం రేట్ల ని బట్టే, ఆ శాఖలో సగటు రేటు. అలాగే, వేరు వేరు శాఖల సగటు రేట్ల ని బట్టే, మొత్తం సమాజపు జనరల్ రేటు. సారాంశం — జనరల్ రేటు కి మూలం, శాఖల్లో వుండే వేరు వేరు పెట్టుబడి దారుల వ్యక్తిగత లాభం రేట్లే! ఆ వ్యక్తిగత రేట్లు ఎక్కువగా వుంటే, జనరల్ రేటు ఎక్కువగానూ; ఆ వ్యక్తిగత రేట్లు తక్కువగా వుంటే, జనరల్ రేటు తక్కువగానూ ఏర్పడుతుంది. కాబట్టి, పెట్టుబడి దారుల వ్యక్తిగత లాభం రేట్లనే సరిగా అర్థం చేసుకోవాలి.

వేరు వేరు శాఖలు సమాన లాభాల్ని పొందే పద్ధతీ, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడులు సమాన లాభాల్ని పొందే పద్ధతీ, పరస్పర సంబంధాలతో వుంటాయి.

లాభాల్ని ఉత్పత్తి చేసే అసలు స్థలాలు, అన్ని

శాఖలలోనూ వున్న 'ఉత్పత్తి స్థలాలే'. ఆ ఉత్పత్తి స్థలాల్లో జరిగిన మార్పులే, లాభాల పంపకాల్ని వాటి సమానత్వం వేపు లాగుతూ వుంటాయి.

ఒక శాఖలో, వేరు వేరు పెట్టుబడులు 'సమాన లాభాల్ని పొందడం' అనేది, ఆ శాఖలో సగటు కన్నా ఎక్కువ లాభాల్ని (రెలిటివ్ లాభాల్ని) పొందే వాళ్ళ మార్గాన్నే మిగతా వాళ్ళు కూడా అనుసరించడం ద్వారా జరుగుతుంది. ఆ రకంగా, ఒక శాఖలో వేరు వేరు పెట్టుబడుల మధ్య పోటీ, కొంత కాలానికో సారి, ఆ శాఖలోని 'ఉత్పాదక శక్తి'ని పెంచుతూ వుంటుంది.

వేరు వేరు శాఖల్లో పెట్టుబడులు 'సమాన లాభాల్ని పొందడం' అనేది, శాఖల్లో పెట్టుబడులు ఇటూ అటూ మారడాల ద్వారా జరుగుతుంది. ఆ రకంగా శాఖల మధ్య పోటీ, శాఖల్లో s, d లను సమానంగా వుంచడానికి ప్రయత్నిస్తుంది.

ఒక శాఖలో వుండే ఒక పెద్ద పెట్టుబడి దారుడు, తన శాఖలో పోటీ పడుతూనే, ఇతర శాఖలతో కూడా పోటీ పడుతూ వుంటాడు. ఈ రకంగా ఒక శాఖలో వుండే పోటీకీ; ఆ శాఖకి, ఇతర శాఖలతో వుండే పోటీకీ, పరస్పర సంబంధాలు వుంటాయి.

ఇప్పుడు మళ్ళీ ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడుల గురించి ఇంకా కొన్ని విషయాలు చూడాలి. ఇంతకుముందు చూసిన పాల ఉదాహరణలో, 1 లీటరుకి, సగటు కాస్టు ప్రైసు 1 రూపాయీ, సగటు లాభం 50 పైసలూ — అని చూశాం. అయితే, ఆ శాఖలో, సగటు కాస్టు ప్రైసు మారకుండానే, మార్కెట్ ధర 50 పైసలు పెరిగిందనుకుందాం. అప్పుడు లీటరు కి మార్కెట్టు ధర 1.50 కాదు; 2 రూ.లు. ఈ ధరలో సగటు కాస్టు ప్రైసు 1 రూపాయీ, సగటు లాభం 1 రూపాయీ. మార్కెట్ ధర 50 పైసలు పెరగడం వల్ల, ఆ శాఖలో పెట్టుబడిదారుల లాభాలు ఎలా వుంటాయి? ప్రతీ పెట్టుబడిదారుడి కీ గతంలో వచ్చే లాభం ఎప్పటిలాగా వుంటూనే, ఇంకా 50 పైసల లాభం పెరుగుతుంది. ఇద్దరు పెట్టుబడి దారుల 'వ్యక్తిగత లాభాల' మధ్య తేడా గతంలో 10 పైసలు అయితే, ఇప్పుడు కూడా ఆ తేడా అలాగే వుంటుంది.

'సగటు కాస్టు ప్రైసు' మారకుండానే మార్కెట్ ధర 20 పైసలు తగ్గిందనుకుందాం. అప్పుడు, ప్రతీ పెట్టుబడిదారుడికీ, గతంలో వచ్చే లాభంలో నించి 20 పైసలు తగ్గుతుంది. అప్పుడు కూడా ఇద్దరు పెట్టుబడిదారుల వ్యక్తిగత లాభాల మధ్య తేడా గతంలో లాగే వుంటుంది.

సరుకు ధర పెరిగినా, తగ్గినా, ఆ కొత్త ధర, పెట్టుబడిదారు లందరికీ ఒక్కలాగే వర్తిస్తుంది కాబట్టి, ఆ మార్పుల వల్ల అందరి లాభాల మీదా, ఒకే ప్రభావం వుంటుంది. ధర పెరిగితే, అందరి లాభాలూ ఒకే లెక్కన పెరుగుతాయి; ధర తగ్గితే, అందరి లాభాలూ ఒకే లెక్కన తగ్గుతాయి.

ఒక శాఖ సరుకు కి ఫలానా మార్కెట్టు ధరా, ఆ శాఖలో ఫలానా సగటు లాభం రేటూ వున్నాయి — అనుకుంటే, ఎవడైతే కాస్టు ప్రైసు ని బాగా తగ్గించ గలుగుతాడో వాడికి అందరి కన్నా ఎక్కువ లాభం రేటు వుంటుంది.

పెట్టుబడిదారులు పడే పాట్లన్నీ కాస్టు ప్రైసు ని తగ్గించడానికే. సరుకు ని 'అమ్మడం' అనే విషయమే ఈ అవసరం కలిగిస్తుంది. ప్రతీ పెట్టుబడిదారుడూ తన సరుకు నంతా అమ్ముకోవాలి. అదే రకం సరుకు ని అమ్మే వాళ్ళు ఇంకా బోలెడు మంది వుంటారు. కాబట్టి ప్రతీ వాడూ తన సరుకు నంతా గ్యారంటీగా అమ్ముకోవాలంటే, తన సరుకు ని అవ సరమైతే ఇతరుల కన్నా 'కొంత చవకగా' కూడా ఇవ్వ గలగాలి. చవకగా ఇవ్వాలంటే, మొదట దాన్ని ఇత రుల కన్నా చవకగా ఉత్పత్తి చెయ్యగలగాలి. 'అమ్మడం' అనే అవసరమే పెట్టుబడిదారుల్ని నిత్యమూ కాస్టుప్రైసు ని తగ్గించే విధంగా వత్తిడి చేస్తుంది.

కాస్టు ప్రైసుని తగ్గించే ప్రయత్నాల్లో ఎక్కువ పెట్టుబడితో వుండే ఒకరిద్దరు పెద్ద పెట్టుబడి దారులే మొదట విజయం సాధిస్తారు. ఇక తర్వాత జరిగిన కథ అంతా మనకు అనేక సార్లు తెలిసిందే. కాస్టు ప్రైసు ని తగ్గించే ప్రయత్నాలు, మొదట ఒకరిద్దరి దగ్గిరే ప్రారంభమై, క్రమంగా కొంత కాలానికి ఆ శాఖలో సగటు ఉత్పాదక శక్తి పెరిగి, శాఖలో అందరి దగ్గిరా కాస్టుప్రైసు తగ్గిపోతుంది.

కాస్టుప్రైసుని తగ్గించడానికి పెట్టుబడిదారులు ఎన్ని మార్గాలు అనుసరించినా, అవన్నీ 2 రకాలుగా మాత్రమే వుంటాయి. **(1)** పెట్టుబడి ని పెంచి, ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చెయ్యడం. దీని వల్ల, మొత్తం సరుకులో ప్రతీ చిన్న భాగానికీ (1 యూనిట్ కి) ఖర్చు తగ్గుతుంది. **(2)** పని పరిస్థితులకు సంబంధించి చెయ్యవలసిన చాలా ఏర్పాట్లు చెయ్యక

పోవడం. దీని వల్ల, చాలా ఖర్చులు లేకుండా పోతాయి.

ప్రతీ పెట్టుబడిదారుడూ ఖర్చుల్ని తగ్గించడానికి ఈ 2 పద్ధతుల్లోనూ ప్రయత్నిస్తూనే వుంటాడు. కానీ, ఫలితాలు అందరి దగ్గిరా ఒకే రకంగా వుండవు. ఈ విషయంలో, ఎక్కువ 'సమర్ధతలూ, చాకచక్యాలూ' గలవాళ్ళే ఎక్కువ ఫలితాలు సాధిస్తారు.

ఒక పెట్టుబడిదారుడు, ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చేయించడం ద్వారా ఖర్చు తగ్గించడం అంటే, నిజానికి అక్కడ జరిగే అసలు విషయం ఏమిటి? — కార్మికుల సంఖ్యా, సహకారమూ పెరగడం ద్వారా ఖర్చు తగ్గడం మాత్రమే. అలాగే, 'పని స్థలం'లో చెయ్యవలసిన ఏర్పాట్లు చెయ్యక పోవడం ద్వారా ఖర్చు తగ్గించడం అంటే? శ్రమ చేసే మనుషుల సౌకర్యాలకూ, రక్షణలకూ సంబంధించిన ఏర్పాట్లు చెయ్యకపోవడం ద్వారా ఖర్చు తగ్గించడమే. పని పరిస్తితులే కార్మికుల జీవన పరిస్తితులు. పని పరిస్తితుల్ని సౌకర్యంగా వుంచక పోవడం అంటే, అది కార్మికుల జీవన సౌకర్యాలలోనూ, రక్షణలలోనూ కోత అన్న మాట! పెట్టుబడిదారుడు, కార్మికుల పని పరిస్తితుల్ని ఎంత దుర్భరంగా వుంచితే అంత ఖర్చులు తగ్గించ గలుగుతాడు. ఉత్పత్తి స్థాయిని పెంచి గానీ, సౌకర్యాలూ రక్షణలూ కల్పించక గానీ, రెండు రకాలు గానూ గానీ, ఖర్చుల్ని ఏ పద్ధతిలో తగ్గించినా, అది కార్మికుల్ని మరింత ఎక్కువ స్థాయిలో దోచడమే. అది, ఏ పెట్టుబడిదారుడి దగ్గిర ఎక్కువ స్థాయిలో జరుగుతుందో, వాడి లాభం రేటు ఇతరుల రేట్ల కన్నా ఎక్కువగా వుంటుంది.

పెట్టుబడిదారుడు అనే వాడు పని పరిస్తితులకు సంబంధించిన ఏర్పాట్ల గురించి, పైస పైస నీ లెక్కలు కట్టే దృష్టితో ఎంత నీచంగా వుంటాడో చెప్పే విచిత్రమయిన పాత సంఘటన ఒకటి వుంది. యంత్రాల దగ్గిర కార్మికులకు యాక్సిడెంట్లు ఎక్కువై పోతూ వుండడం వల్ల, యంత్రాలకు సేఫ్టీ గార్డులు ఏర్పాటు చెయ్యమని పెట్టుబడిదారుల్ని ఆదేశిస్తూ, ఇంగ్లాండులో, 1844లో, ఒక చట్టం వచ్చింది. దాన్ని పెట్టుబడిదారులెవ్వరూ లక్ష్యపెట్ట లేదు. ఫ్యాక్టరీలలో నిత్యం యాక్సిడెంట్లూ కార్మికుల మరణాలూ యధా విధిగా జరిగిపోతూనే వున్నాయి. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, ఆ చట్టం వచ్చాక పదేళ్ళపాటు 'సహనం' వహించి, చివరికి 1854లో పెట్టుబడిదారుల మీద కొన్ని కేసులు పెట్టారు. పెట్టుబడి దారులంతా ఆ కేసుల్ని నడపడానికి ఒక 'సంఘం' పెట్టుకున్నారు. ఆ సంఘం ఎందుకంటే, కార్మికులు యాక్సిడెంట్లలో చచ్చిపోతే అది పెట్టుబడిదార్ల తప్పుల వల్ల కాదని వాదించి, ఆ కేసుల్లో పెట్టుబడి దార్లని గెలిపించే విధంగా 'కృషి' చెయ్యడానికి. ఆ సంఘ కార్యకలాపాలకూ, కోర్టు ఖర్చులకూ కొంత డబ్బు కావాలి కాబట్టి, ప్రతీ పెట్టు బడిదారుడూ తన దగ్గిర వున్న యంత్రాల పవర్ ని బట్టి, 1 హార్స్ పవర్ కి 2 షిల్లింగుల చొప్పున, ఆ సంఘానికి డబ్బు కట్టాలి.

ఆ షరతు ప్రకారం పెట్టుబడిదారులందరూ సంఘానికి డబ్బు కడుతూ వుండగా, ఒక ఫ్యాక్టరీ యజమాని, తన యంత్రాల హార్స్ పవర్ నీ, సంఘా నికి కట్టవలసిన మొత్తాన్నీ లెక్కలు వేసు కున్నాడు. వెంటనే తన యంత్రాలకు సేఫ్టీ గార్డులు పెట్టిం చేశాడు. వాడు, సంఘానికి డబ్బు కట్టాలంటే 11 పౌండ్లు కట్టాలి. యంత్రాలకు సేఫ్టీగార్డులు పెట్టిస్తే 9 పౌండ్లే అవుతాయి. అదీ కారణం, సేఫ్టీ గార్డులు పెట్టించెయ్యడానికి! ఆ రకంగా, వాడు 2 పౌండ్ల ఖర్చుని తప్పించుకున్నాడు! ఆ 9 పౌండ్ల ఖర్చుని తప్పించుకోవడానికే వాడు అప్పటిదాకా యంత్రాలకు సేఫ్టీ గార్డులు పెట్టించకుండా వూరుకు న్నాడు. వాడికి, కార్మికుల క్షేమం అక్కర లేదు. పెట్టుబడిదారుడనే వాడు, పైస పైస దగ్గిరా ఇంత లెక్కలతో ప్రవర్తిస్తాడన్నమాట! మిగతా పెట్టుబడిదారు లకు కూడా, యంత్రాలకు సేఫ్టీ గార్డులు పెట్టించే దాని కన్నా, సంఘానికి కట్టడానికే ఎక్కువ డబ్బు అవుతుంది. అయినా వాళ్ళు సంఘం వేపే మొగ్గారు. ఎందుకంటే, వాళ్ళంతా మొదటి వాడి కన్నా ఘనులు. వాళ్ళు మొదటి వాడి కన్నా 'దూర దృష్టి' గలవాళ్ళు. కార్మికుల రక్షణ కోసం భవిష్యత్తులో కూడా ఎన్నడూ ఏమీ ఖర్చు పెట్టకుండా చేసుకోవటానికే వాళ్ళు సంఘానికి డబ్బు కట్టారు.

ఈ రకంగా, పెట్టుబడిదారులంతా యంత్రా లకు సేఫ్టీ గార్డులు పెట్టించడానికి విముఖంగా వున్నారని తెలిసి, 1855 ఏప్రిల్‌లో, ఒక ఇంగ్లీషు మంత్రి పెట్టు బడిదారులతో లోపాయికారీగా, "ఏదో నామ మాత్రంగా పెట్టండయ్యా! గవర్నమెంటు సంతృప్తిపడు తుంది" అని, 'ఏదో మోసంగా చేసెయ్యండి, గవర్న మెంటు పట్టించుకోదు లెండి' అనే పద్ధతిలో అమూ ల్యమైన సలహా ఒకటి ఇచ్చాడు. కానీ, యంత్రాల

యజమానులు, ఆ మాత్రపు పై పై ఏర్పాట్లు చెయ్యడానికి కూడా ఒప్పుకోలేదు. వాళ్ళకి 'కోర్టుల మీద' గాఢ నమ్మకం! ఎందుకంటే, ఆ కోర్టుల్లో జడ్జీలు ఎవరో కాదు; వాళ్ళూ ఫ్యాక్టరీల యజమానులే. వాళ్ళంతా పెద్ద పెద్ద ఆస్తిపరులూ, పెట్టుబడిదార్ల సంఘంలో సభ్యులూ కూడా. అంటే, పెట్టుబడిదారులే కోర్టుల్లో కొచ్చి, జడ్జీలుగా కూర్చుని, వాళ్ళ నేరాల మీద వాళ్ళే తీర్పులు చెప్పుకుంటారన్నమాట! దానికి తోడు, ఫ్యాక్టరీల ఇంజనీర్లు, పెట్టుబడిదార్ల పక్షాన నిలబడి, ఫలానా యంత్రాల విషయంలో ఫలానా రక్షణ ఏర్పాట్లు అక్కర లేదని సాక్ష్యాలు ఇచ్చారు.

1856 లో ఇంకో చట్టం వచ్చింది. అది, యంత్రాలకు ఫలానా ఫలానా రక్షణ ఏర్పాట్లు అవసరం లేదనీ, యంత్రాల ద్వారా కాళ్ళూ చేతులూ తెగిపోయిన కార్మికులు, కోర్టులకు పోయి 'నష్ట పరిహారాలు' తీసుకోవచ్చునీ, చెప్పింది. ఆ చట్టంలో ఒక మెలిక ఏమిటంటే — కార్మికుడికి జరిగిన యాక్సిడెంటు కార్మికుడి అశ్రద్ధ వల్లనే జరిగిందని రుజువైతే, 'నష్ట పరిహారం' ఇవ్వనక్కర లేదు! యాక్సిడెంటు 'న్యాయమైందా, కాదా' అనే విషయాన్ని 'ఎక్స్‌పర్టులు' (నిపుణులు) నిర్ణయిస్తారు!

ఆ నిబంధనలన్నింటినీ దాటి కార్మికులు కేసుల్లో గెలవడం అసాధ్యమై పోయింది. ఆ చట్టం తర్వాత యాక్సిడెంట్ల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. ఎందుకంటే, యంత్రాల యజ మానులు, యంత్రాల వల్ల ప్రమాదాలు జరగ కుండా చేసే ఏర్పాట్లన్నిటినీ వదిలేశారు. 1858 లో మే నించీ అక్టోబరు వరకూ (6 నెలల్లో), అంతకు పూర్వపు 6 నెలల్లో కంటే యాక్సిడెంట్లు 21% పెరిగాయి. జరిగిన యాక్సిడెంట్లలో 36% ని అతి చిన్న రక్షణ ఏర్పాట్లతోటే జరగకుండా చెయ్యవచ్చుననీ, అంత చిన్న ఏర్పాట్లు కూడా ఫ్యాక్టరీలలో లేవనీ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు రిపోర్టుల్లో రాశారు.

కాళ్ళూ చేతులూ పోగొట్టుకున్న కార్మికులు చాలా సందర్భాల్లో కేసుల్లో ఓడిపోయినా, కొన్ని సందర్భాల్లో అయినా చిన్న చిన్న 'నష్ట పరిహారాలు' తీసుకోగలిగారు. అంటే, తమ అవయవాలు పోయిన 'నష్టానికి' బదులుగా కొంచెం 'డబ్బు' తీసుకోగలిగారు. ఇది క్రమంగా పెట్టుబడిదారులకు 'అనవసరపు' ఖర్చుగా కనపడింది. రక్షణ ఏర్పాట్లకు అయ్యే ఖర్చు కన్నా, నష్ట పరిహారాలకు అయ్యే ఖర్చే ఎక్కువ అయింది. అప్పటి నించి కొన్ని రకాల యంత్రాలు, సేఫ్టీ గార్డుల తోటే తయారవడం ప్రారంభమయ్యింది.

యంత్రాల దగ్గిర నిలబడి శ్రమ చేసే మనుషులకు యంత్రాల ద్వారా హాని జరగకుండా వుండాలనే విషయం, పెట్టుబడిదార్లకు, ఏ నాడూ అర్థం కాలేదు. 'నష్ట పరిహారాల' బెడదని తప్పించుకోవడానికి మాత్రమే వాళ్ళు చివరికి కొన్ని రక్షణ ఏర్పాట్ల మీద కొంత ఖర్చు పెట్టడానికి సిద్ధపడ్డారు. ఆ రక్షణ ఏర్పాట్లు, పెట్టుబడిదార్ల రక్షణ ఏర్పాట్లే. అంటే, వాళ్ళ డబ్బు ఖర్చుని తగ్గించుకునే ఏర్పాట్లే.

1860 ప్రాంతాల్లో, ఇంగ్లాండు గనుల్లో, రక్షణ ఏర్పాట్లు దాదాపు లేని వాటితో సమానంగా వుండేవి. డ్రైనేజీ, వెంటిలేషనూ చెత్తాకారీగా వుండేవి. షాఫ్టులు సరిగా వుండవు. గేరింగ్ బాగుండదు. చెత్తగా వేసిన రోడ్లూ, అసమర్థులైన ఇంజనీర్లూ. రోజూ యాక్సిడెంట్లే. వారానికి సగటున 15 మంది కార్మికులు చచ్చిపోతూ వుండేవారు. వారిలో బాల కార్మికులు కూడా వుండేవారు. 1851 కీ 62 కీ మధ్య (11 సంవత్సరాల్లో), 8,466 మంది కార్మికులు యాక్సిడెంట్లలో మరణించారు. 'ఇది చాలా స్వల్ప సంఖ్యే' అంటుంది ఒక రిపోర్టు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల సంఖ్య చాలా తక్కువ. వాళ్ళు పని చెయ్యవలసిన ప్రాంతాలు చాలా పెద్దవి. చాలా ఫ్యాక్టరీల గురించి రిపోర్టులే లేవు. గనుల్లో నిత్యమూ కార్మికుల మరణాల్ని చూసిన కొందరు ఇన్‌స్పెక్టర్లు చాలా నిజాయితీగా రిపోర్టులు రాశారు. "ఈ మానవ బలులన్నీ బొగ్గు గనుల యజమానుల నీచమైన పేరాశ వల్లనే జరుగుతున్నాయి" అనీ, "చిన్న పిల్లల జీవితాల్ని ఈ రకంగా బలిపెట్టడాన్ని ఎలా నివారించాలి?" అనీ, "పని స్థలాలలో కార్మికులు కిక్కిరిసి వుంటే యజమానులకు లాభాలు పెరుగుతాయి. కానీ, కార్మికుల జీవితాలు ధ్వంసమైపోతాయి" అనీ, ఈ రకంగా వాపోయాయి ఆ రిపోర్టులు.

గనుల లోనే కాదు, అన్ని రకాల పరిశ్రమ ల్లోనూ, పని పరిస్థితులు సౌకర్యంగా లేకపోవడం వల్ల, కార్మికులు పని లోకి దిగిన చాలా తక్కువ కాలంలోనే రక రకాల జబ్బులకు గురి అవుతూ వుండేవారు. పని స్థలాలలో వుండే ప్రత్యేక పరిస్థితుల్ని బట్టి, కొన్ని చోట్ల కళ్ళ జబ్బులూ, కొన్ని చోట్ల చెవుల జబ్బులూ, నరాల జబ్బులూ, కడుపులో జబ్బులూ, ఊపిరి తిత్తుల జబ్బులూ, మూత్ర పిండాల జబ్బులూ — శరీరాల నిండా జబ్బులే. గృహ వసతి లేదు, శానిటరీ ఏర్పాట్లు లేవు. ఒక రిపోర్టు ప్రకారం, ఆ నాటి ఇంగ్లీషు కార్మి

కుల సగటు జీవిత కాలం 17 సం॥లు మాత్రమే.

'సామాజిక పెట్టుబడి'కి ఎప్పటి కప్పుడు కార్మికులు 'సమృద్ధిగా' దొరకాలంటే, ఆ అవసరం, కార్మికులు త్వర త్వరగా పిల్లల్ని కనడం ద్వారానే తీరాలి. అందుకే కార్మికులకు చిన్నతనం లోనే పెళ్ళిళ్ళు! కార్మికులు చిన్నతనం లోనే పిల్లల్ని కని, పెట్టుబడికి అప్పగించి, తాము దాటిపోతూ వుండాలి. కార్మిక వర్గం, 'పెట్టుబడి'కి ఎప్పటి కప్పుడు ఈ 'బలులు' సమర్పిస్తూ వుండాలి!

కార్మికుల రక్షణ విషయంలో ఆ నాటికీ ఈ నాటికీ ఏమీ మార్పు లేదు. యాక్సిడెంట్లు జరగని గనులూ, ఇతర పరిశ్రమలూ, ఈ నాటికి కూడా లేవు. తీవ్రమైన వెలుతురులో కార్మికుల కళ్ళు పాడు కాకుండానూ, శబ్దాల హోరుతో చెవులు పాడు కాకుండానూ, సిమెంటు లాంటి ధూళితో ఊపిరి తిత్తులు పాడు కాకుండానూ — ఈ రకంగా కార్మికులకు హాని కలగ నివ్వని ఏర్పాట్లు పని స్థలాలలో ఈ నాటికి కూడా మచ్చుకైనా లేవు. కనీసం 'పరిశుభ్రమైన మంచి నీళ్ళ' ఏర్పాటు కూడా ఏ పని స్థలం లోనూ వుండదు. — ఈ రకంగా, పెట్టుబడిదారుడు, కార్మికుల పని పరిస్థితుల్ని పరమ దుర్భరంగా వుంచి, వారి రక్త మాంసాల్నీ ప్రాణాల్నీ పణం పెట్టి, ఆ రకంగా ఖర్చులు తగ్గించి సంపాదించే లాభాలకు తన తెలివి తేటలే కారణం అనుకుంటాడు. తను చాలా జాగ్రత్తగా ఖర్చుల్ని 'పొదుపు' చేస్తూ పరిశ్రమని 'సమర్థవంతంగా' నిర్వహించుకోగలుగుతున్నాననీ, తన 'సమర్థత' వల్లనే ఎక్కువ లాభాలు సంపాదించగలుగుతున్నాననీ, 'లాభం' అనేది నిర్వహణ కర్తల శక్తి సామర్థ్యాల నించే వస్తుందనీ, అనుకుంటాడు.

కాస్టు ప్రైసు ని తగ్గించడానికి చేసే పొదుపు, ఉత్పత్తి విధానానికి వున్న స్వభావాన్ని బట్టే వుంటుంది. పెట్టుబడిదారీ విధానంలో కాస్టు ప్రైసు ని తగ్గించే పని అంతా, కార్మికుల్ని మరింత పీడించడం ద్వారానూ, మరింత దోచడం ద్వారానూ మాత్రమే జరుగుతుంది.

ఒక శాఖలో లాభం రేటు ఎంత వుందీ — అనే దాని మీదే ఒక సరుకుని ఉత్పత్తిచేసే పెట్టుబడి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఒక శాఖలో, సగటు కన్నా తక్కువ లాభాన్ని పొందే పెట్టుబడి, ఆ శాఖలోనే వుంటూ, 'ఉత్పాదక శక్తి' ని పెంచుకుని, ఆ శాఖలోనే ఎక్కువ లాభాన్ని పొందడానికి ప్రయత్నించడమైనా చేస్తుంది; లేదా, ఇంకో శాఖ లోకి మారడమైనా చేస్తుంది. ఒక శాఖలో సగటు కన్నా ఎక్కువ రేటు ని తీసుకునే పెట్టుబడి కూడా, ఆ రేటు కన్నా ఇంకో శాఖలో ఎక్కువ రేటు వుంటే, ఆ ఇంకో శాఖ లోకి మారవచ్చు. కొత్తగా రంగంలోకి దిగే కొత్త పెట్టుబడి కూడా వీలైనంత వరకూ ఎక్కువ రేటు గల శాఖలనే వెతుక్కుంటూ వుంటుంది. - ఈ రకంగా, ఒక శాఖలో పెట్టుబడులు, ఉత్పాదక శక్తుల్ని పెంచడంద్వారానూ; వేరు వేరు శాఖల పెట్టుబడులు, శాఖల్ని మార్చడాల ద్వారానూ, సమాన లాభాల కోసం ప్రయత్నాలు సాగిస్తాయి. ఈ రెండు రకాల ధోరణులూ, పరస్పర సంబంధాలతోటే సాగుతాయి.

అయితే, పెట్టుబడులు — 'ఉత్పాదక శక్తుల్ని పెంచుతాయి' అన్నప్పుడు గానీ, 'శాఖల్ని మార్చేస్తాయి' అన్నప్పుడు గానీ, ఆ మార్పులు చాలా తేలిగ్గా జరిగిపోయే విషయాల్లాగా తీసుకోకూడదు. ఆ మార్పుల్లో పెట్టుబడిదారులు, చాలా 'హృదయ క్షోభ' అనుభవిస్తారు.

# పెట్టుబడిదారుడి విషాద ఘట్టం!

మార్కెట్టు ధర తగ్గి, లాభం రేటు తగ్గడం అనేది, పెట్టుబడిదారుల్ని గొప్ప విషాదంలో పడేస్తుంది. ఒక పెట్టుబడిదారుడి విషయంలో, కొంత కాలం పాటు 20% గా వున్న ప్రత్యేక లాభం రేటు (ఇది ఆ శాఖ సగటు కన్నా ఎక్కువే అనుకుందాం), ఏమీ తగ్గకుండా వుంటూ వుంటే, వాడి హృదయం 'శాంతం' గానే వుంటుంది. అది 21% గానో, 22% గానో, ఇంకానో, పెరుగుతూ వుంటే, వాడు ముసి ముసి నవ్వులతో కులుకు దాచుకోవడానికి చాలా తంటాలు పడవలసి వస్తూ వుంటుంది. కానీ, వాడి లాభం రేటు 19% గానో, 17% గానో అయిపోతూ వుంటే, అప్పుడు చూడాలి వాడి రుస రుసలూ, విస విసలూ. కార్మికులకు గబ గబా చార్జి షీట్లూ, పనిష్మెంట్లూ వగైరాలన్నీ సాగుతాయి. బయట అవన్నీ జరుగుతూ వుండగా, లోపల వాడి 'హృదయం' ఆందోళనా తరంగాలతో అల్లకల్లోల సముద్రం అయిపోతుంది. పెట్టు

బడిదారుడు కూడా 'హృదయం లేనివాడు' కాదు కదా మరి?

ఆ 'ఆపద'లో వాడి 'ఆత్మ' అశాంతి మయమై, పరి పరి విధాల కొట్టుకుంటుంది. "ఈ జగత్తుకి అద్యంతా లేమిటి? ఏమిటి?" అని కొట్టుకునే 'తత్వ వేత్త'లాగా మన వాడు, "లాభం రేటు ఎందుకు తగ్గింది? అసలు ఎందుకు తగ్గుతుంది? ఎందుకు తగ్గిందీ? ఎందుకు? ఎందుకు?" అని కొట్టుకుంటాడు. తక్షణం తన ఆర్థిక వేత్తని పిలుస్తాడు. గాంభీర్యం తెచ్చుకున్న గద్గద కంఠంతో, "...లాభం రేటు... మళ్ళీ తగ్గింది!...." అనేసి, నిరాశగా తల వాల్చేసి, మౌనం వహిస్తాడు. ఇక ఆ తర్వాతదంతా ఆర్థిక వేత్త చూసుకుంటాడు. జీవన్మరణ సంధిలో పడిపోయిన రోగిని కాపాడ డానికి పూనుకున్న వైద్యుడి లాగా, మన పెట్టుబడి దారీ ఆర్థిక వేత్త, తగ్గిన లాభం రేటుని పెంచగల మార్గాల అన్వేషణలో నిమగ్నుడై పోతాడు.

ఆ లోగా మన వాడు, అశాంతితో వేగిపోతూ 'ఈ లైనులో నించి పోదామా?' అనే ఊహల దాకా మనుసు ని పోనిస్తాడు. ప్రతీ పెట్టుబడిదారుడి లాగానే మన వాడు కూడా ఎప్పుడూ ఇతర లైన్ల గురించి వాకబులు చేస్తూనే వుంటాడు. వాడికి ఎప్పుడైనా ఏ విందుల్లోనో, ఏ మీటింగుల్లోనో ఇతర లైన్ల వాళ్ళు తటస్థ పడ్డప్పుడు, "మీ లైను ఎలా వుంది?" అనే మాట ఒకటి పడెయ్యకుండా వుండలేడు.

"మీ లైను ఎలా వుంది?" అని ఒక పెట్టుబడి దారుడు ఇంకోణ్ణి అడిగినప్పుడు, ఆ ఇంకోడు, మొహం చిట్లించి, "మా సంగతే అడిగారూ? సరే, దిగి చూడండి. మీకే తెలుస్తుంది. మళ్ళీ తర్వాత నన్నన కండి" అని మేలమాడి, వెంటనే మౌనం దాలుస్తాడు. వాడికి నిజంగానే తన లైనులో 'తగినంత లాభం' లేక పోతే, వాడు కూడా భోరు భోరున ఏడుస్తూ వాడి కష్టాలన్నీ వీడికి చెప్పుకోవాలి కదా? అలా చెయ్యకుండా వాడు మొహం చిట్లింపులతో సరిపెట్టేసరికి అసలు విషయం ఏమిటో మన వాడికి తెలిసిపోతుంది. అంటే, వాడి లైను చాలా బాగుందని! ఆ టక్కులన్నీ వీడికి కూడా తెలిసినవే కదా? ఒకడి భాష ఒకడికి కొట్టిన పిండే. కాబట్టి, వీడి పెట్టుబడి సరిగ్గా ఆ లైనులోకే దిగుతుంది.

ఇద్దరు పెట్టుబడిదారుల మధ్య ఈ రకం సంభాషణలు జరిగినా జరక్కపోయినా, వాళ్ళు అసలు ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నా లేకపోయినా, సారాంశం మాత్రం ఇదే. ప్రతీ వాడూ ఇతర లైన్ల గురించి వాకబులు చేస్తూనే, వాటి లాభాల గురించి చెవిన పడేసుకుంటూనే వుంటాడు. ప్రతీ వాడి దృష్టి లోనూ కొన్ని వేరు వేరు లైన్లు వుంటూనే వుంటాయి — తన 'అదనపు విలువ'ని దించడానికి.

ఇప్పుడు మనం మళ్ళీ, అశాంతి సాగరంలో మునిగిపోయిన మన వాడి సంగతి చూడాలి. వాణ్ణి, కారు డ్రైవరు, 'బ్రహ్మజ్ఞాన బాబా' ఆశ్రమానికి తీసుకు పోయాడు. ఈ డ్రైవరుకి, తన యజమాని కళా కళలన్నీ తెలుసు. అతను, కారు నడిపే ఉద్యోగమే గాక, యజమాని మానసిక వికారాల్ని ఓ కంట కనిపెట్టి వుండే ఉద్యోగం కూడా చేస్తాడు. మొదటి ఉద్యోగానికి ఏదో కాస్త జీతం వుంటుంది గానీ, ఈ రెండో వుద్యోగానికి జీతం బత్తెం వుండవు.

మన పెట్టుబడిదారుడు, విషాదం కాస్త తక్కువ స్థాయిలో వున్నప్పుడైతే, విదేశీ భాషలు మాట్లాడే 'ఆధునిక' యోగుల దగ్గిరికి పోయి, 'తత్వశాస్త్ర చర్చలు' జరుపుతాడు. విషాదం ఉన్నత స్థాయికి చేరినప్పుడు మాత్రం అచ్చమైన మాతృ భాషలో 'మోక్షం' గురించి బోధించే సన్యాసుల దగ్గిరికి పోతాడు.

ఇప్పుడు మన వాడు 'గోచీ బాబా' ముందు మోకరిల్లి వాడి కాళ్ళు కళ్ళకి అద్దుకుని అక్కడే తల వాల్చుకుని కూర్చుని వున్నాడు. ఈ బాబా గాడి సేవ మన వాడు కొత్తగా మొదలుపెట్టాడు. అక్కడ బాబా కాళ్ళ దగ్గిర చేరిన వాళ్ళల్లో ఇంకా చాలా బాపతుల వాళ్ళు వున్నారు. పెద్ద పెద్ద వర్తక పెట్టుబడి దారులూ, బ్యాంకర్లూ, మంత్రులూ, కాంట్రాక్టర్లూ, ఇంజనీర్లూ, డాక్టర్లూ, గవర్నమెంటు ఆఫీసర్లూ, పోలీసు అధికారులూ, సినిమాల వాళ్ళూ — వగైరా బాపతుల గాళ్ళు చాలా మంది! వాళ్ళందరికీ అప్పుడప్పుడూ 'ఆధ్యాత్మిక చర్చలు' కావలసి వస్తూ వుంటాయి. ప్రతీ ఒక్కడికీ ఎవడి 'ఇహలోక బాధలు' వాడికి వుంటాయి కదా పాపం? — అలా చేరిన ఆ ధనికుల మంద ముందు, పట్టు పరుపుల సోఫా మీద కాళ్ళు ఇటూ అటూ పారేసి కూర్చున్న నిరాడంబర గోచీ బాబా, బర బరలాడే కంఠంతో, వాగడం మొదలుపెట్టాడు. 'ఈ జగత్తులో మానవుడు ఏ యే ధర్మాలు నిర్వర్తించు కోవాలో' దగ్గిర్నించీ, 'మోక్షం వెయ్యి సూర్యుల ప్రభతో ఎలా వెలిగిపోతూ వుంటుందో' వరకూ

వాగాడు. ఆ వాగుడంతా మన గుంపు అతి విన యంతో తహతహలాడుతూ విన్నట్టే విన్నారు.

అంతా విని, చివరికి మన పెట్టుబడిదారుడు గొప్ప 'జ్ఞాన పిపాస'తో, "స్వామీ! లాభం రేటు ఎందుకు తగ్గుతూ వుంటుంది స్వామీ?" అని అడిగాడు. ఎవర్ని ఏది అడగాలో, ఎవరు ఏది చెప్పగలరో — అన్న ఇంగితం పోయింది వాడికి. ఏ పుట్టలో ఏ పాముందో, ఎవరి నోట ఏ ముత్యాలు రాలతాయో — అనే ఆరాటం వాడిది. లాభం రేటు తగ్గిన ఆ ఆపద కాలం అలాంటిది మరి!

పెట్టుబడిదారుడి ప్రశ్న విన్న గోచీ బాబా, సన్నాసి నవ్వొకటి నవ్వి, "పని వాడు ఒళ్ళు వొంచి పని చేస్తున్నాడా నాయనా ఈ కాలంలో? అసలు లేబరు జనం యజమాని మాట వింటున్నారా? కూలీ నాలీ జనం అంతా పని దొంగలయి పోతున్నారు. యజమానికి లాభాలు తగ్గక, పెరుగుతాయా? బాధ పడకు! అంతా సర్దుకుంటుంది!" అని శెలవిచ్చాడు.

ఆ రకంగా, ఒక పని దొంగ, ఇంకో పని దొంగ ని ఓదారుస్తూ వుండగా, ఆర్థిక వేత్త అక్కడికి శిష్య సమేతంగా ఒగుర్చుకుంటూ పరిగెత్తుకొచ్చాడు. "లెక్కలన్నీ వేశాం. వెంటనే మనం 'శ్రమ పరికరాలు' మార్చెయ్యాలి. ఉత్పత్తి రెట్టింపు అవుతుంది. అంటే 100% పెరుగుతుంది. జీతాలు పెంచ కూడదు. పోనీ 5% కన్నా పెంచకూడదు. లాభం 2 రెట్లవుతుంది. అన్నీ లెక్కలు వేశాం" అన్నాడు ఉత్సాహంతో పొంగిపోతూ, కొత్త ఫీజుని తలుచుకుని.

పెట్టుబడిదారుడు చాలా విసుక్కుంటూ చూశాడు — "మొన్నే కదా అన్నీ మార్చాం? ఏడాదన్నా కాలేదు."

"అయ్యో! ఏడాది కాకూడదు. తొమ్మిది నెల్లకే మార్చెయ్యాలి" — పెద్ద ఆర్థిక వేత్త!

"ఆర్నెల్లకే మార్చేస్తే మరీ మంచిది" — పిల్ల ఆర్థిక వేత్త! ఇతగాడు, ఈ మధ్యనే హార్వర్డ్‌లో మేనేజిమెంటు కోర్సులన్నీ పూర్తి చేసుకుని, పెట్టుబడిదారుల సేవ లోకి కొత్తగా దిగాడు. గురువుని మించిన శిష్యుడు!

"ఈ ఏడాది కాలంలో, ఈ లైనులో ఎంత పోటీ పెరిగిపోయిందో మీకు మాత్రం తెలీదా? దాదాపు రెండేళ్ళ కిందట ఈ లైనులో మనమే లీడింగ్‌లో వుండేవాళ్ళం. అంతా మారిపోతోంది. ఎక్కడ రెండు పైసలు ఎక్కువ కనబడితే అక్కడికే అందరూ పరిగెత్తు కొస్తారు. మనం ఎంత కృషిచేసి ఈ ప్రాఫిట్ తీసుకో గల్గుతున్నామో వాళ్ళకి అర్థం కాదు. మనం ఇంట్రడ్యూస్ చేసిన మెషినరీ ఇంకా నాలుగైదు కంపెనీల వాళ్ళు తెప్పించేశారు. మరి ఇలాంటి పరిస్తితుల్లో...." తను తీసుకోబోయే ఫీజుకి తగ్గ 'శ్రమ' చేశానని, తన ఆత్మనీ, పెట్టుబడిదారుడి ఆత్మనీ కూడా సంతృప్తి పరిచే కృషి సాగించాడు ఆర్థిక వేత్త.

పెట్టుబడిదారుడు ఇంకా 'అనుమానంగానే' వున్నాడు — "అలాగైతే, పోనీ ... యంత్రాల్ని మారిస్తే, లాభం రెండు రెట్లు పెరుగుతుందా?"

"రెండేవిటి? అసలు మూడు రెట్లు పెరుగుతుంది. కానీ, అన్నీ సగటు లెక్కలు. రెండు రెట్లే కన పడుతుంది."

పెట్టుబడిదారుడి మొహం మీద చాలా గంటల తర్వాత మళ్ళీ చిన్న చిరు నవ్వు! ఒక నిట్టూర్పు!

త్వరలోనే వాడి పని స్తలం లోకి కొత్త యంత్రాలు దిగుతాయి.

ఈ రకంగా, పెట్టుబడిదారుడి కి లాభం రేటే ప్రోత్సాహక శక్తి! లాభం రేటే జీవన్మరణ శక్తి! లాభం రేటు ని తగ్గకుండా నిలుపుకోడానికీ, దాన్ని ఎప్పుడూ పెంచుకోడానికీ, అహర్నిశలూ ప్రయత్నిస్తూ వుంటాడు. ఆ ప్రయత్నాలే ఆ శాఖలో ఉత్పాదక శక్తుల్ని పెంచుతూ వుంటాయి. ఆ ప్రయత్నాలే పెట్టు బడుల్ని శాఖల మధ్య మారుస్తూ వుంటాయి.

పోటీ అనేది విరుద్ధ లక్షణాలు గల విషయం అని గతంలోనే చూశాం. అన్ని శాఖల మధ్యా, ఒక శాఖ లోని అన్ని పెట్టుబడుల మధ్యా, పోటీ నిరంతరం సాగుతూనే వుంటుంది. లాభాల్ని సమానంచేసే శక్తులు ఒక పక్కా, అసమానం చేసే శక్తులు ఇంకో పక్కా, పనిచేస్తూనే వుంటాయి. ఒక వేపు — లాభం రేట్ల మధ్య తేడాల్ని తగ్గించే పరిస్తితులూ, ఇంకో వేపు — లాభం రేట్ల మధ్య తేడాల్ని పెంచే పరిస్తితులూ, దేని దారిన అవి పనిచేస్తూనే వుంటాయి. ఏ పరిస్తితుల ప్రభావం ఎక్కువగా వుంటే, ఆ ఫలితం, ఆ ప్రత్యేక సందర్భంలో ఏర్పడుతూ వుంటుంది. అయినా, ఆ పరిస్తితులు అలాగే వుండిపోవు. మళ్ళీ మారుతూనే, లాభం రేటుని ఇటో అటో లాగుతూనే, వుంటాయి.

ఇంత వరకూ మనం - శాఖలన్నిటికీ సంబంధించిన 'జనరల్ లాభం రేటు' గురించీ, శాఖల వేరు వేరు లాభం రేట్ల గురించీ, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడుల ప్రత్యేక లాభం రేట్ల గురించీ, చూశాం.

# పెట్టుబడిదారుడు ఏ లాభం రేటు వేసుకుంటాడు?

అన్ని శాఖలకూ సంబంధించి 'జనరల్ లాభం రేటు' అనేది ఒకటి వుండగా, ప్రతీ శాఖకీ ఒక సగటు లాభం రేటు వుంటుందని చూశాం. ఇక్కడ ఒక ప్రశ్నకి జవాబు చెప్పుకోవాలి. ఏ శాఖలో పెట్టుబడిదారుడైనా, తన సరుకుకి ఉత్పత్తి ధరని నిర్ణయించేటప్పుడు, కాస్టుప్రైసు మీద, జనరల్ లాభం రేటుని వేసుకుంటాడా, తన శాఖ తాలూకు సగటు లాభం రేటుని వేసుకుంటాడా? - ఈ విషయం స్పష్టం చేసుకోవాలి.

'పెట్టుబడిదారుడు, తన లాభాన్ని ఏ పెట్టుబడి మీద వేసుకుంటాడు? చలామణీ పెట్టుబడి మీదా, మొత్తం పెట్టుబడి మీదా?' అనే ప్రశ్న గతంలో ఒక చోట చూశాం. దాన్నీ దీన్నీ గందరగోళ పరుచుకోకూడదు. ఆ ప్రశ్న - 'ఏ పెట్టుబడి మీద?' అని. ఈ ప్రశ్న - 'ఏ లాభం రేటు?' అని. ఈ రెండూ ఒకటి కాదు. ఇప్పుడు 'లాభం రేటు' గురించే చూడాలి.

లాభం రేటు సమస్యని చూడడం మొదలు పెట్టిన దగ్గిర్నించీ ఎలా చెప్పుకుంటూ వచ్చాం? ఏ శాఖ పెట్టుబడిదారుడైనా, ఆ శాఖ కాస్టుప్రైస్ మీద, జనరల్ రేటు చొప్పునే లాభాన్ని వేసుకుంటాడని చెప్పుకుంటూ వచ్చాం. ఆ విషయాన్ని ఇప్పుడు ఒక సవరణతో అర్థం చేసుకోవాలి. ఎలాగంటే: జనరల్ లాభం రేటుని 50% అనుకుందాం. ఇది ఏ పెట్టుబడిదారుడికీ తెలిసే, పైకి కనపడే విషయం కాదు. ఏ పెట్టుబడిదారుడికైనా తెలిసే విషయాలు, తన శాఖలోనూ, ఇతర శాఖల్లోనూ వుండే సగటు లాభం రేట్లే. A అనే శాఖని తీసుకుంటే, ఆ శాఖలో వుండే సగటు లాభం రేటు కూడా ఎప్పుడూ ఒకే రకంగా వుండదు. అది జనరల్ రేటు కన్నా కొన్ని సార్లు కొంత ఎక్కువ గానూ, కొన్ని సార్లు కొంత తక్కువ గానూ వుంటుంది. కొంత దీర్ఘకాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో వచ్చిన ఎక్కువ తక్కువ లాభాల సగటు, జనరల్ రేటుతో సమానంగా (దాదాపు సమానంగా) వుంటుందని అర్థం. కాబట్టి, ఆ శాఖలో ప్రతీ సారీ జనరల్ రేటే వుంటుందనే సారాంశానికి రావచ్చు. కానీ, ఏ శాఖలో, ఏ పెట్టుబడిదారుణ్ణి, ఏ విడి సందర్భంలో తీసుకున్నా, కాస్ట్ ప్రైస్ మీద జనరల్ రేటుని వేసుకోవడం చెయ్యడు. తన శాఖలో ఆ కాలంలో సాధ్యమయ్యే రేటునే వేసుకుంటాడు. లాభాన్ని ఆ ప్రకారం గానే ఆశిస్తాడు. ప్రతీ విడి సందర్భం లోనూ జరిగే పని, కాస్ట్ ప్రైస్ మీద ఆ శాఖ సగటు రేటుని తీసుకోవడమే. కానీ ఆ రేటు, ఒక సారి ఎక్కువగా, ఒక సారి తక్కువగా వుంటుంది కాబట్టి, దాని సారాంశం, జనరల్ రేటుని తీసుకోవడమే. అందుకే మొదటి నించీ ఆ సారాంశాన్నే చెప్పుకుంటూ వచ్చాం. జనరల్ రేటుని తీసుకోవడం అంటే, అది ఆ సరుకు విలువని తీసుకోవడం గాక, ఆ విలువ కన్నా ఎక్కువ గానో, తక్కువ గానో వుండే ఉత్పత్తి ధరని తీసుకోవడమే.

పెట్టుబడిదారుడు, ఏ రేటుని వేసుకుంటాడు - అనే ప్రశ్నకి జవాబు, ఏ రేటుని వేసుకున్నా సారాంశం ఒకటే - అనేదే. ఎలాగంటే - 'జనరల్ రేటు'ని వేసుకున్నట్టుగా అనుకుంటే, ఆ రేటు, కొంత దీర్ఘకాలం పాటు మారని రేటుగా వుంటుంది. లేదా, తన శాఖలో వచ్చే సగటు రేటునే వేసుకున్నట్టుగా అనుకుంటే, ఆ రేటు, జనరల్ రేటు కన్నా కొన్ని సార్లు తక్కువ గానూ, కొన్ని సార్లు ఎక్కువ గానూ వుండి, వాటి సగటు, జనరల్ రేటుతో సమానంగా వుంటుంది. కాబట్టి, ఏ రేటుని వేసుకున్నా సారాంశం ఒకటే.

అన్ని శాఖల పెట్టుబడిదారులూ జనరల్ రేటునే వేసుకున్నా; లేదా, అందరూ తమ శాఖల సగటు రేట్లనే వేసుకున్నా; లేదా, కొందరు జనరల్ రేటునీ (దీర్ఘ కాలం పాటు); కొందరు, సగటు రేట్లనీ (తరచుగా మారే రేట్లని) వేసుకున్నా - అన్నిటి సారాంశమూ ఒకటే. 'ఒక పెట్టుబడిదారుడికి వర్తించేదే, పెట్టుబడిదారులందరికీ వర్తిస్తుంది' అనే సూత్రాన్ని మరిచిపోకుండా వుంటే, ప్రతీ సమస్యనీ సరిగా అర్థం చేసుకోగలం.

గత చాప్టర్లలో చూసిన విషయాల్ని తర్వాత చాప్టర్లలో చూసే విషయాలతో కూడా కలిపి, ఎప్పుడే 'సవరణ' అవసరమైతే అది చేసుకుంటూ వుండాలి. దాని వల్ల సారాంశం ఏమీ మారదు.

'కాస్ట్ ప్రైసు' మీద ఒక 'లాభం రేటు'ని వేసుకుని 'ధర'ని నిర్ణయించే పద్ధతి, పెట్టుబడిదారీ విధానానికి మాత్రమే ప్రత్యేకమైనదని గతంలో చెప్పుకున్నాం. ఆ

విషయం ఇప్పటికైనా మారదు. ఆ వేసుకునే రేటు 'జనరల్ రేటు' అయినా, లేదా శాఖ తాలూకు సగటు రేటు అయినా; ఆ నిర్ణయించే ధర, ఉత్పత్తి ధర అయినా, సూటిగా మార్కెట్ ధరే అయినా - ఆ అంశాలన్నీ ఎలా వున్నా - జరిగే కార్యక్రమం, కాస్టుప్రైసు మీద ఒక లాభం రేటుని వేసుకుని ధరని నిర్ణయించడమే. ఇది గత సమాజాలలో లేని పద్ధతి. పెట్టుబడిదారీ విధానంలో మాత్రమే ప్రారంభమైన పద్ధతి.

ఏ శాఖ పెట్టుబడిదారుడైనా ధరని నిర్ణయించేటప్పుడు, తనకు ఇష్టమైనంత ఎక్కువ రేటుని వేసుకోలేడు - అని గతం లోనే చెప్పుకున్నాం. ఆ అంశం, పెట్టుబడిదారుడు వేసుకునే ఏ రేటుకైనా వర్తిస్తుంది. ఏ పెట్టుబడిదారుడైనా ఒక హద్దుని పాటించకుండా తన కిష్టమైనంత రేటుని వేసుకోలేడు. అలా వేసుకోగలిగే అవకాశం ఒకడికి వుంటే, అందరికీ వుంటుంది. దాని అర్థం - ఆ అవకాశం ఎవరికీ వుండదు - అని.

కొన్ని శాఖల సరుకులు ప్లస్ సరుకులుగా వుంటే, కొన్ని శాఖల సరుకులు మైనస్ సరుకులుగా వుంటాయి - అని గతంలో చెప్పుకున్నాం. ఆ విషయం ఇప్పుడు కూడా మారదు. అన్ని శాఖల్లోనూ జనరల్ లాభం రేటే వున్నా లేకపోయినా, ఏ సందర్భంలో అయినా, కొన్ని శాఖల సరుకులు - ప్లస్ సరుకులూ, కొన్ని శాఖల సరుకులు - మైనస్ సరుకులూ. అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి ధరలే మార్కెట్ ధరలుగా వుంటే అన్ని శాఖలకూ జనరల్ లాభం రేటే వుంటుంది. ఉత్పత్తి ధరల నించి మార్కెట్ ధరలు పైకో కిందకో తప్పుకుంటే, ధర పెరిగిన చోట - జనరల్ లాభం కన్నా ఎక్కువ లాభమూ, ధర తగ్గిన చోట - జనరల్ లాభం కన్నా తక్కువ లాభమూ అవుతాయి.

## ఒక పెట్టుబడీ, ఒక శాఖా, మొత్తం సమాజమూ:

ఒక పెట్టుబడికి ఏం జరుగుతుందో, ఒక శాఖలోనూ అదే జరుగుతుంది; మొత్తం సమాజం అంతా అదే జరుగుతుంది.

ఒక శాఖలో 10 మంది పెట్టుబడిదారులు వున్నారనుకుందాం. అందరూ, తమ సరుకుల్ని ఒకే ధరకి, (చిన్న చిన్న తేడాలతో), అమ్ముతారు. ఆ ధరలన్నీ కలిసి, ఆ శాఖలో వున్న మొత్తం సరుకుకి మార్కెట్ ధర. ఆ ధర, ఉత్పత్తి ధరతో సమానంగా వుంటే వుండవచ్చు; లేదా ఉత్పత్తి ధర కన్నా పైకో కిందకో వుండవచ్చు. ఆ ధర ఎలా వున్నా, అది 'విలువ' మాత్రం కాదు.

ఆ సమాజంలో మొత్తం 100 శాఖలు వున్నాయి - అనుకుందాం. అన్ని శాఖల సరుకులూ కలిసి, సామాజిక సరుకుల రాసి. అన్ని శాఖల మార్కెట్ ధరలూ కలిసి, ఆ సరుకుల రాసికి మార్కెట్ ధర. అంతే కాదు. అదే, ఆ రాసికి ఉత్పత్తి ధర. ఇంకా - అంతే కాదు, అదే ఆ రాసికి - విలువ.

ఆ 'విలువల మొత్తం'లో నించి, అన్ని శాఖల కాస్టుప్రైసుల మొత్తాన్నీ తీసివేస్తే, మిగిలేది - అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి అయిన 'అదనపు విలువ.' అదే, 'సామాజిక అదనపు విలువ.'

# పెట్టుబడిదారీ సరుకుల మారకాలు

'విలువ' నించి 'ధర' వేరయ్యే పెట్టుబడిదారీ విధానంలో సరుకుల మారకాలు, 'విలువల సమానత్వం'తో గాక, 'ధరల సమానత్వం'తో జరుగుతాయి. ధరల సమానత్వంతో అంటే, మార్కెట్ ధరల సమానత్వంతో.

A, B సరుకుల వుదాహరణలో, ఒక సరుకు విలువ 110. రెండో సరుకు విలువ 190. ఈ విలువలు, ఉత్పత్తి ధరలుగా మారితే, ఒక సరుకు ఉత్పత్తి ధర 150. రెండో సరుకు ఉత్పత్తి ధర కూడా 150. ఈ 2 శాఖల లోనూ s, d లు సమానంగా వుండి, ఉత్పత్తి ధరలే మార్కెట్ ధరలుగా వుంటే, అప్పుడు ఒక సరుకు మార్కెట్ ధర 150. ఇంకో సరుకు మార్కెట్ ధర కూడా 150. ఈ 2 సరుకుల మార్కెట్ ధరలూ సమానంగా వున్నాయి కాబట్టి, ఈ సరుకులకు మారకం జరగవచ్చు. అలాగే, మారకం జరిగిందనుకుందాం. ఇది, 150 మార్కెట్ ధర గల ఒక సరుకుకీ, 150 మార్కెట్ ధర గల ఇంకో సరుకుకీ, మారకం జరగడమే. కానీ నిజానికి, ఇక్కడ 110 విలువ గల సరుకుకీ, 190 విలువ గల సరుకుకీ మారకం జరిగింది. అంటే, ఎక్కువ విలువ గల సరుకుకీ, తక్కువ విలువ గల సరుకుకీ. ఇది అసమాన విలువల మారకమే.

'సమాన పెట్టుబడులకు సమాన లాభాల' షరతు

నెరవేరాలంటే, దాని కోసం అసమాన విలువల మారకాలే జరగాలి.

'పెట్టుబడిదారీ పునాది' మీద, 'ధరల' ప్రసక్తే గానీ, 'విలువల' ప్రసక్తి వుండదు. ఇక్కడ 2 సరుకులకూ అసలు విలువలు ఎలా వున్నా, వాటి మార్కెట్ ధరలు సమానంగా వుంటే, అది 'సమానమైన' మారకమే.

ఈ A, B సరుకుల వుదాహరణ లోనే, మార్కెట్ ధరలు ఉత్పత్తి ధరల నించి తేడాగా వుండే వుదాహరణ చూద్దాం. ఒక సరుకు మార్కెట్ ధర 140, ఇంకో సరుకు మార్కెట్ ధర 160 అనుకుందాం. ధరలు ఇలా మారితే, ఈ 2 సరుకులకూ మారకం జరగదు.

ఇప్పుడు ఈ సరుకులకు మారకం జరగాలంటే, 140 మార్కెట్ ధర గల సరుకుని ఇస్తే, 160 మార్కెట్ ధర గల సరుకులో నించి 140 భాగమే వస్తుంది. మిగిలిన 20 భాగం రాదు. అంటే, ఇటు నించి 140 మార్కెట్ ధరకీ, అటు నించి 140 మార్కెట్ ధరకీ మాత్రమే మారకం జరుగుతుంది. ఈ రకంగా, ధరల సమానత్వంతో.

గతంలో, ఒక సందర్భంలో ఏం చెప్పుకున్నామంటే, 'ఒక వ్యక్తి ఒక సరుకుని కొన్నప్పుడు దాని విలువ నంతా చెల్లించి కొంటాడు' అని చెప్పుకున్నాం. దాన్ని ఇప్పుడు, 'ఒక వ్యక్తి ఒక సరుకుని కొన్నప్పుడు దాని మార్కెట్ ధర నంతా చెల్లించి కొంటాడు' అని సవరించుకోవాలి. సమాజంలో వుండే ప్రతీ సరుకుకీ 'మార్కెట్ ధరనంతా' చెల్లించి కొనడమే జరుగుతుంది. ఆ ధరల మొత్తం అంతా కలిసి 'విలువల మొత్తం'తో సమానం కాబట్టి, అప్పుడు మొత్తం సరుకుల రాసికి, 'విలువ నంతా చెల్లించడం' జరిగినట్టే అర్థం.

ఉదాహరణలో వున్న 2 సరుకుల్నీ కలిపి చూస్తే, వాటి మార్కెట్ ధరలు 150 + 150 గా వున్నా, లేదా 140 + 160 గా వున్నా, ఆ ధరలు ఎలా వున్నాయో అలాగే వాటికి చెల్లిస్తే, ఆ 2 సరుకులకూ సంబంధించిన అదనపు విలువల మొత్తం, ఆ ధరల మొత్తం లోనే వుంటుంది.

ఒక విడి సరుకుని కొనే మనిషి (ఆ మనిషి కార్మికుడైనా, పెట్టుబడిదారుడైనా), దాని ధరనంతా చెల్లించి కొంటే, ఆ సరుకుని అమ్మే పెట్టుబడిదారుడికి రావలసిన అదనపు విలువ ఆ ధర లోనే వుంటుంది.

'విలువే ధరగా వుండదు' అనే విషయానికి సంబంధించి, ఇక్కడ ఇంకా 1, 2 విషయాలు స్పష్టం చేసుకోవాలి.

ఒక సరుకు విలువ 10. కానీ ధర 9. అంటే, ఆ సరుకుని కొనే వ్యక్తి దాని కోసం 9 నే చెల్లిస్తాడు. అయితే, ఆ సరుకుని అమ్మిన పెట్టుబడిదారుడు, మళ్ళీ కొత్త సరుకుని పునరుత్పత్తి చేయించవలసి వుంటుంది కదా? దాని కోసం 10 విలువ కావాలి కదా? మరి, దాన్ని అమ్మినప్పుడు 9 మాత్రమే వస్తే, దానితో ఆ సరుకుని మళ్ళీ ఉత్పత్తి చేయించడం ఎలా సాధ్యమవుతుంది? - ఈ ప్రశ్నకి సరైన జవాబు వెంటనే చెప్పలేకపోతే, దాని అర్థం ఏమిటంటే - ఇంత వరకూ చదివిన వాటిని సరిగా అర్థం చేసుకోలేదని గానీ; లేదా, ఇలా చదివి అలా మరిచి పోయామని గానీ!

జవాబు చూడండి: ఆ సరుకు విలువ 10. అది, $2_C + 4_V + 4_S$గా వుందనుకుందాం. ఇందులో కాస్టు ప్రైసు 6. అదనపు విలువ 4. ఈ సరుకుని అమ్మినప్పుడు పెట్టుబడిదారుడికి 10 గాక, 9 మాత్రమే వచ్చిందంటే, ఏ అంశం తగ్గింది? కాస్టుప్రైసులో నించి తగ్గిందా, అదనపు విలువలో నించి తగ్గిందా? - కాస్టు ప్రైసులో నించి తగ్గితే, ఆ సరుకుని పునరుత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. కాబట్టి, కాస్టుప్రైసు అంతా యధాతథంగా వెనక్కి రావలసిందే. తగ్గడం కాస్టు ప్రైసులో నించి కాదంటే, 'అదనపు విలువ'లో నించే తగ్గిందని అర్థం.

ఆ సరుకుని అమ్మగా వచ్చిన 9 లో నించి పెట్టుబడిదారుడు, $4_S$ కి బదులుగా $3_S$ నే తీసుకుంటాడు. వెనక్కి వచ్చిన 6 కాస్టుప్రైసుతో, సరుకుని మళ్ళీ ఉత్పత్తి చేయిస్తాడు.

ఆ సరుకు మళ్ళీ తయారవడానికి 10 విలువ కావలసిందే. 10 విలువ అంటే, 6 కాస్టు ప్రైసు + 4 అదనపు విలువ. ఈ 2 భాగాలూ వుంటేనే మళ్ళీ కొత్త సరుకు, అదే పరిమాణంలో తయారవుతుంది. కార్మికులు, గతంలో లాగే 6 Kతో పని చేస్తూ, మళ్ళీ 4Sని ఇస్తారు. 6 కాస్టుప్రైసుకి 4 S కలిసి, మళ్ళీ సరుకు తయారై, దాని విలువ 10 అవుతుంది. దాన్ని మళ్ళీ గతంలో లాగే 9 ధరతో అమ్మినా, దాని పునరుత్పత్తి కేమీ ఆటంకం వుండదు. 2 C + 4 V లకు, 4 S కలుస్తూ, ఆ సరుకు ఎన్ని సార్లయినా పునరుత్పత్తి అవుతూనే వుంటుంది.

కార్మికులు ప్రతీ సారీ 4 S ఇస్తూ వుంటే, అందులో నించి 3 S ఆ పెట్టుబడిదారుడికే అంది. 1 S, ఇతర

శాఖల్లోకి పోతూ వుంటుంది. ఈ రకంగా, ఒక సరుకుకి 'విలువ' కన్నా ధర తగ్గినా, దాని పునరుత్పత్తి కేమీ ఆటంకం వుండదు.

**ఇంకో సందేహం:** ఒక సరుకు విలువ 10. దాని మార్కెట్ ధర 9. అంటే, ఈ సరుకుని కొనే వ్యక్తి, 9 ని ఇచ్చి, 10 విలువ గల సరుకుని తీసుకుంటాడు. అంటే ఆ సరుకుని కొన్న వ్యక్తికి, ఆ సరుకు ద్వారా 1 లాభం అందిందని అర్థమే కదా? ఈ రకంగా, సరుకుల్ని కొనే వ్యక్తులకు కూడా ఆ సరుకుల ద్వారా లాభాలు వస్తూ వుంటాయా?

**జవాబు:** 10 విలువ గల సరుకు ధర 9 అయితే, ఆ సరుకుని కొనే వ్యక్తికి, 1 లాభం వచ్చిన మాట నిజమే. కానీ, అన్ని సరుకులూ ఈ వుదాహరణలో లాగే వుండవు. కొన్ని సరుకులు, విలువ కన్నా తక్కువ ధర గల (మైనస్) సరుకులు అయితే, కొన్ని సరుకులు, విలువ కన్నా ఎక్కువ ధర గల (ప్లస్) సరుకులుగా వుంటాయి. అలాంటి 2 రకాల సరుకులూ సమాజంలో వున్నప్పుడు, ప్రతీ వ్యక్తికీ ఆ 2 రకాల సరుకుల తోటీ అవసరం వుంటుంది. మైనస్ సరుకుల్ని కొన్నప్పుడు కొంత లాభపడితే, ప్లస్ సరుకుల్ని కొన్నప్పుడు కొంత నష్టపోతాడు. ఏ వ్యక్తి అయినా, (పెట్టుబడిదారులైనా, కార్మికులైనా), ఎప్పుడూ ప్లస్ సరుకులనే కొనడం గానీ, ఎప్పుడూ మైనస్ సరుకులనే కొనడం గానీ, చెయ్యడు. 2 రకాల సరుకుల్నీ కొనవలసి వస్తుంది. కొన్ని సరుకులకు విలువ కన్నా ఎక్కువ ధర చెల్లిస్తే, కొన్ని సరుకులకు తక్కువ ధర చెల్లిస్తారు.

ఒక వ్యక్తి - ఒక సందర్భంలో ఒక ప్లస్ సరుకుని మాత్రమే కొనవచ్చు. ఆ ఒక్క సందర్భాన్ని మాత్రమే చూస్తే, ఆ సరుకు కోసం, దాని విలువ కన్నా ఎక్కువ ధర చెల్లించి, నష్టపోయినట్టే అవుతుంది. అలాగే, ఒక మైనస్ సరుకుని కొన్న సందర్భాన్ని మాత్రమే చూస్తే, విలువ కన్నా తక్కువ ధర చెల్లించి, లాభ పడినట్టే అవుతుంది.

ఒక వ్యక్తి, ఒక సందర్భంలో అన్నీ ప్లస్ సరుకులనే తీసుకోవచ్చు. లేదా ఒక సందర్భంలో, ప్లస్ సరుకుల్ని ఎక్కువ గానూ, మైనస్ సరుకుల్ని తక్కువ గానూ; లేదా, ప్లస్ సరుకుల్ని తక్కువ గానూ, మైనస్ సరుకుల్ని ఎక్కువ గానూ, తీసుకోవచ్చు. కాబట్టి, ఏదో ఒక్క సరుకునో, ఒక్క విడి సందర్భాన్నో చూడడం గాక సంవత్సరం మొత్తం మీద కొనే సరుకులన్నిటినీ లెక్క లోకి తీసుకోవాలి. ఒక విడి సందర్భంలో లాభమో, నష్టమో వచ్చినట్టు కనపడినా, రక రకాల సరుకుల్ని కలిపి చూస్తే, ఆ లాభ నష్టాలు మాయమవుతాయి. అంటే, బ్యాలెన్స్ అవుతాయి. ఆ రకంగా మొత్తం మీద, చెల్లించే ధరల మొత్తానికీ, తీసుకునే విలువల మొత్తానికీ, సరిపోతుంది. కొనే వ్యక్తి, సరుకుల్ని కొనడం ద్వారా లాభ పడడం గానీ, నష్టపోవడం గానీ, జరగదు.

**పెట్టుబడిదారుల విషయం:** ప్రతి పెట్టుబడిదారుడూ కొనే వాడిగానూ అమ్మే వాడిగానూ కూడా వుంటాడని గుర్తుంది కదా? మొదట 'అమ్మే' విషయం చూస్తే, కొందరు పెట్టుబడిదారులు 'ప్లస్' సరుకుల్ని అమ్మితే, కొందరు పెట్టుబడిదారులు మైనస్ సరుకుల్ని అమ్ముతారు. ఎవరు ఏ రకం సరుకుని అమ్మినా, అందరికీ ఫలితం ఒకటే. సమాన లాభం రేటు కోసమే ఇది ఇలా జరుగుతుంది కాబట్టి, తమ సరుకుల్ని 'అమ్మే' విషయంలో, పెట్టుబడిదారులందరి పరిస్తితీ ఒకటే.

'కొనే' విషయం చూస్తే, ప్రతీ పెట్టుబడిదారుడూ 'ఉత్పాదక' వాడకానికీ, 'వ్యక్తిగత' వాడకానికీ కూడా సరుకుల్ని కొంటాడు. ఒక్క శాఖ నించే గాక, రక రకాల శాఖల నించి కొన్ని ప్లస్ సరుకుల్నీ, కొన్ని మైనస్ సరుకుల్నీ కూడా కొంటాడు. ఒక పెట్టుబడిదారుడికి 'ఉత్పత్తి సాధనాలు'గా 10 రకాల సరుకులు కావాలంటే, అవి అన్నీ ప్లస్ సరుకులు గానో, లేదా అన్నీ మైనస్ సరుకులు గానో, వుండవు. 2 రకాలూ వుంటాయి. పెట్టుబడిదారుడు 'స్వంత వాడకం' కోసం కొనే సరుకుల విషయంలో కూడా, అలాగే జరుగుతుంది.

**కార్మికుల విషయం:** కార్మికులు కొనే సరుకుల్లో కూడా కొన్ని ప్లస్ సరుకులు వుంటే, కొన్ని మైనస్ సరుకులు వుంటాయి. లేదా, కార్మికులు ఎప్పుడూ ప్లస్ సరుకులనే ఎక్కువగా వాడతారనీ, వాటి కోసం చెల్లించే ధరల మొత్తం కన్నా, దానికి బదులుగా తీసుకునే విలువల మొత్తమే ఎక్కువగా వుంటుందనీ అనుకుందాం. దాని వల్ల కూడా మన సూత్రీకరణ తప్పు అవదు. కార్మిక వర్గానికి ఆ సరుకుల్ని అమ్మడంలో పెట్టుబడిదారీ వర్గం చేసే వ్యాపార మోసాల్ని కూడా లెక్కలోకి తీసుకుంటే, కార్మిక వర్గానికి వచ్చినట్టుగా కనపడిన ఆ ఎక్కువ విలువ కూడా పెట్టుబడిదారీ వర్గానికే పోయినట్టు అవుతుంది,

లేదా, అప్పటికీ కూడా కార్మిక వర్గం, తను చెల్లించిన ధరల కన్నా ఎక్కువ విలువనే తీసుకుంటుంది

- అనుకుందాం. ఆ 'ఎక్కువ' విలువ ఎవరిదో కాదు. అది కూడా ఆ వర్గపు 'శ్రమ'లో భాగమే. ఆ 'ఎక్కువ'ని తీసుకున్న తర్వాత కూడా, ఆ వర్గం, ఇంకా ఎంతో 'అదనపు విలువ'ని పోగొట్టుకుంటూనే వుంటుంది. కాబట్టి కార్మిక వర్గం, తను చెల్లించిన ధరల మొత్తం కన్నా కొంత ఎక్కువ విలువని తీసుకున్నా, అది సమస్య కాదు. లేదా, కార్మిక వర్గం, తను చెల్లించిన ధరల మొత్తం కన్నా తక్కువ విలువనే తీసుకుంటుందని అనుకుంటే, అప్పుడు, అది, అదనపు విలువని మరీ ఎక్కువగా పోగొట్టుకుంటుందని అర్థం.

సారాంశం ఏమిటంటే, 'విలువే ధరగా వుండని' సరుకుల్ని కొనడం వల్ల, పెట్టుబడిదారుల విషయంలో గానీ, కార్మికుల విషయంలో గానీ, ప్రత్యేక సమస్య ఏదీ వుండదు.

# 'విలువ' లేకుండానే 'ధర'!

**దో**పిడీ సమాజాలలో, 'విలువ', కొన్ని సందర్భాలలో 'గుణాత్మక' లక్షణాన్ని కోల్పోతుంది. 'విలువ'కి వుండే 'గుణం' ఏమిటి? - శ్రమ. శ్రమ వున్న చోటే విలువ (ధర) వుండాలి. కానీ, శ్రమతో ఉత్పత్తి అవని 'భూమి'కి, 'ధర' వుంటుంది! శ్రమతో ఉత్పత్తి అవని 'మానవుల'కు ('బానిసల'కు) 'ధర' వుంటుంది! - విలువ సూత్రానికి విరుద్ధమైన ఇలాంటి అసహజత్వాలు ఎందుకు సంభవిస్తాయంటే, ఆ సమాజంలో వున్న 'తప్పుడు ఉత్పత్తి సంబంధాల' వల్ల. (మార్క్సు మాటల్లో - "ఫాల్టీ సోషల్ రెలేషన్స్"). అంటే, సమాజానికి వున్న దోపిడీ స్వభావం వల్ల. 'విలువ' లేకుండానే (శ్రమ లేకుండానే) 'ధర' వుండడం అనేది, తప్పుడు సామాజిక సంబంధాల వల్లనే జరుగుతుంది.

విలువ లేకుండానే ధర ఏర్పడాలంటే, ఆ ధర దేని ఆధారంతో ఏర్పడుతుంది? - కేవలం సప్లై, డిమాండ్ల ఆధారంతో. ఇంకా శ్రమ జరగని ముడి భూమిని తీసుకుంటే, దాని ధర, దాని సప్లై, డిమాండ్లని బట్టి వుంటుంది. శ్రమే లేని చోట, శ్రమ కొలతలతో సంబంధం వుండదు. శ్రమతో సంబంధం లేకుండానే, బయట కారణాల ద్వారా ఆ ధర ఏర్పడుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో, ఈ లక్షణం మరీ ఎక్కువ సందర్భాలలో వుంటుంది. అడ్వర్టయిజ్‌మెంట్లలో 'మోడల్' మనుషుల ధరలూ, వేశ్యల ధరలూ, కొంత వరకూ సినిమా నటుల ధరలూ - ఇలాంటి ధరలన్నీ 'విలువ'తో (శ్రమతో) సంబంధం లేకుండా, కేవలం సప్లై డిమాండ్ల మీద ఆధారపడి ఏర్పడతాయి.

ఇక్కడ ఇంకో విచిత్రమైన విషయం ఏమిటంటే - ఇక్కడ 'అంతరాత్మ'లకూ, 'పరువు ప్రతిష్ట'లకూ కూడా 'ధరలు' వుంటాయి. పెట్టుబడిదారీ సమాజంలో ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తి మీద, తన 'పరువు ప్రతిష్టలకు' నష్టం కలిగించాడనే ఆరోపణలతో కోర్టులో దావా వేసి, నష్ట పరిహారాన్ని డబ్బు రూపంలో సంపాదించగలడు. అలాగే, తన 'అంతరాత్మ'కు క్షోభ కలిగించారనే ఆరోపణలతో కూడా 'నష్ట పరిహారం' సంపాదించగలడు. అంటే, ఇది, పరువు ప్రతిష్టలకూ, అంతరాత్మలకూ కూడా 'ధరలు' వుండడమే. ఇది కూడా 'శ్రమ లేని చోట ధర' వుండడమే. ఈ విధంగా, దోపిడీ సమాజాలలో, విలువ, కొన్ని సందర్భాలలో 'గుణాత్మక' లక్షణాన్ని పోగొట్టుకుంటుంది.

**ఆర్థిక సూత్రాలు, ప్రకృతి సూత్రాలు కావు:** ఇవి సామాజిక సూత్రాలే. ఏ సామాజిక సూత్రం లోనూ, ప్రకృతి సూత్రాల్లో వుండే, ఎగుడు దిగుళ్ళు లేని ఖచ్చితత్వం వుండదు. అయినప్పటికీ, సామాజిక సూత్రానికి కూడా సాధారణంగా వుండే ఒక 'జనరల్ ధోరణి' వుంటుంది. జనరల్ ధోరణే లేకపోతే, దాన్ని ఒక 'సూత్రం'గా చెప్పడమే సాధ్యం కాదు.

విలువే ధరగా వుండాలనే సూత్రం, సామాజిక సూత్రమే. కానీ ఏ సామాజిక సూత్రమైనా, ఆ సమాజ స్వభావానికి అనుగుణంగా మారవలసిందే. పెట్టుబడిదారీ విధానంలో మొట్టమొదట నెరవేరవలసిన షరతు, 'సమాన లాభం రేటు' షరతే. ఇక్కడ, విలువ సూత్రం, ఈ షరతుకి అనుగుణంగా మారవలసిందే. అది ఎలా మారుతుందో అనేక సార్లు చెప్పుకున్నాం.

విలువ సూత్రమూ, సమాన లాభం రేటు సూత్రమూ, ఒక దాని కొకటి విరుద్ధంగా వుండడం చూసి, పెట్టుబడిదారీ విధానంలో 'సమాన లాభం రేటు సూత్రమే పని చేస్తుంది గానీ, విలువ సూత్రం పని చెయ్యదు' అనే అర్థానికి రాకూడదు.

విలువ సూత్రం, 'సమాన లాభం రేటు'

సూత్రంతో విభేదిస్తుందనీ, వాటిలో ఒకటి జరిగితే ఒకటి జరగదనీ - ఈ వైరుధ్యం, రికార్డో నాటికే తెలుసు. కానీ, అవి రెండూ జరగడం ఎలా సాధ్యమో, దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో మాత్రం, వాళ్ళకు తెలీదు.

విలువ అంటే ఏమిటి? ధర అంటే ఏమిటి? విలువ నించి ధర ఎందుకు తప్పుకుంటుంది? - ఈ విషయాల గురించి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలకు సరైన పద్ధతిలో తెలీదు. వాళ్ళు సమస్త విషయాల్నీ చర్చిస్తారు. కానీ, దేనికీ సరైన జవాబులు పట్టుకో కుండానే వదిలేస్తారు. ఎందుకంటే, అది వాళ్ళకి అసాధ్యం గనక. ఎందుకు అసాధ్యం అంటే, మొదట అదనపు విలువని అర్థం చేసుకోకపోతే, శ్రమ దోపిడీని గ్రహించడమే సాధ్యం కాదు. దోపిడీని గ్రహించకపోతే, ఒక వర్గం శ్రమ చెయ్యడం లేదనీ, అది దోపిడీ ఆదాయాలతో జీవిస్తోందనీ గ్రహించడం కూడా సాధ్యం కాదు. 'శ్రమ దోపిడీ' అనే పునాదినే గ్రహించని వాళ్ళు, సామాజికంగా తలెత్తే ఏ సమస్యకీ సరైన జవాబు పట్టుకోలేరు.

'పెట్టుబడిదారీ ధర'కు సంబంధించి ఇప్పటి వరకూ అనేక విషయాలు చూశాం. ఈ విషయాలు సరిగా అర్థం చేసుకుంటేనే 'నూతన సమాజంలో ధర'ని ఎలా ఏర్పర్చుకోవాలో అర్థం చేసుకోగలుగుతాము.

ఈ చాప్టరులో ఇంత వరకూ చూసిన జనరల్ లాభం రేటూ, s d లూ, ఆర్థిక సూత్రాలు ఉజ్జాయింపు ధోరణులుగా వుండడమూ, విలువ లేకుండానే ధర వుండడమూ - వగైరా అంశాలకు సంబంధించి, ఇప్పుడు **మార్క్స్** నించి కొన్ని కొటేషన్లు చూస్తాము. వీటిలో చివరి కొటేషన్ తప్ప, మిగిలినవి అన్నీ 'కాపిటల్-3' లోవి [మాస్కో ఎడిషన్ 1971]. చివరి కొటేషను, 'కాపిటల్-1' లోది [మాస్కో 1974].

**మార్క్స్ నించి కొన్ని కొటేషన్లు:**

1. " **వే**రు వేరు పెట్టుబడుల ఆర్గానిక్ కాంపోజిషన్లు, ఆ పెట్టుబడుల పరిమాణాల్ని బట్టి వుండని స్వతంత్ర విషయాలు. ఎప్పుడూ ప్రశ్న ఏమిటంటే - ఆ వేరు వేరు పెట్టుబడులకు చెందిన ప్రతీ 100 పెట్టుబడి లోనూ స్థిర ఎంతా, అస్థిర ఎంతా - అనేది. ... ఒకే వర్కింగ్ టైమ్‌లో, ఒకే దోపిడీ స్థాయితో పని చేసే ఒకే పరిమాణం గల వేరు వేరు పెట్టుబడులు, చాలా భిన్నమైన లాభ మొత్తాలను ఉత్పత్తి చెయ్య వచ్చును. ఎందుకంటే, వేరు వేరు పెట్టుబడుల కాంపోజిషన్లలో తేడా - వాటి అస్థిర భాగాల్లో తేడానీ, ఆ విధంగా ఆ పెట్టుబడులు చలనంలో పెట్టే సజీవ శ్రమలలో తేడానీ, ఆ విధంగా అవి పొందే అదనపు విలువ రాసుల్లో తేడానీ - సూచిస్తుంది. వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో పని చేసే, మొత్తం పెట్టుబడి లోని సమానమైన భాగాలు, అసమానమైన అదనపు విలువల మూలాలను కలిగి వుంటాయి. అదనపు విలువ కేమో, సజీవ శ్రమే ఏకైక మూలం" [పేజీ - 148]

2. " **వే**రు వేరు ఉత్పత్తి శాఖల్లో, అన్ని సరుకులూ, వాటి విలువలకే అమ్ముడవుతాయని మొదట ఊహిద్దాం. అప్పుడేం జరుగుతుంది? ... వేరు వేరు ఉత్పత్తి శాఖల లాభం రేట్లు చాలా భిన్నంగా వుంటాయని తేలుతుంది. సరుకులు, వాటి విలువలకే అమ్ముడు పోతాయా; లేక, సమాన పెట్టుబడులకు సమాన లాభాలను తెచ్చే ధరలకు అమ్ముడు పోతాయా - అనే విషయాలు, వేరు వేరు విషయాలు. అసమానమైన సజీవ శ్రమలను పనిలో పెట్టే సమాన పెట్టుబడులు, అసమానమైన అదనపు విలువల్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ వాస్తవం ఏర్పడడానికి, అంతకు ముందే ఎలాంటి పరిస్థితి వుండవలసి వుంటుందంటే, ఆ పెట్టుబడులకు అదనపు విలువ రేట్లని, (దోపిడీ స్థాయిని) ఒకే రకంగా చేసే పరిస్థితులు ఏర్పడవలసి వుంటుంది. వాటిలో వుండే తేడాలన్నీ, నిజమైన, లేదా ఊహాత్మకమైన (ఆనవాయితీగా వుండే), ఒక దాని నొకటి సర్దుబాటు చేసుకొనే విషయాల వల్ల, సమానం అవవలసి వుంటుంది ... అన్ని ఆర్థిక సూత్రాల లాగే, సిద్ధాంత పరమైన క్లుప్తత కోసం (థియరిటికల్ సింప్లిఫికేషన్ - కోసం), అలాంటి 'జనరల్ అదనపు విలువ రేటు'ని, ఒక ధోరణిగా (టెండెన్సీగా) ఊహిస్తాం. కానీ, వాస్తవంలో అలాంటి ఒకే అదనపు విలువ రేటు పెట్టుబడిదారీ విధానంలో ప్రారంభ విషయం మాత్రమే. ఎంతో కొంత ఎక్కువ తక్కువలతో స్థానిక తేడాలను కలగజేసే ఆటంకాల వల్ల, ఆ ఒకే అదనపు విలువ రేటుకి, ఎంతో కొంత నిరోధం కలుగుతూనే వుంటుంది. కానీ సిద్ధాంతంలో మనం ఏం ఊహిస్తామంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి నియమాలు వాటి స్వచ్ఛమైన రూపం లోనే ('ప్యూర్ ఫామ్'లో) పని

చేస్తాయి - అని ఊహిస్తాం. వాస్తవంలో అయితే విష యాలు దరిదాపులుగా మాత్రమే (ఎప్రాక్సిమేషన్స్) జరుగుతాయి.

ఆ దరిదాపులుగా వుండడం అనేది కూడా, పెట్టు బడిదారీ ఉత్పత్తి విధానం ఎంత ఎక్కువగా అభివృద్ధి చెంది వుంటే అంత ఎక్కువ గానూ; లేదా గత ఆర్థిక పరిస్థితుల అవశేషాల తోనే సమ్మిశ్రమై (ఎమాల్గమే టెడ్), కల్తీ అయి (ఎడల్టరేటెడ్) వుంటే అంత తక్కువ గానూ వుంటుంది." [పే. 175]

3. " సరుకులు విలువలకే అమ్ముడు పోవడం అనేది, సరుకుల మధ్య వుండే ఈక్విలీబ్రియమ్‌కి సంబంధించిన సహజమైన, హేతుబద్ధమైన సూత్రం. ఈ సూత్రం మీద ఆధారపడి మాత్రమే తేడాల్ని వివరించాలి. అంతే గానీ, తేడాల్ని బట్టి ఈక్విలీబ్రి యమ్ సూత్రాన్ని వివరించడం కాదు." [పే. 188]

4. " సరుకులు వాటి విలువలకే అమ్ముడు పోయి నప్పుడు, మనం చూపినట్టు, భిన్నమైన ఉత్పత్తి శాఖ లలో పెట్టిన పెట్టుబడి రాసుల భిన్న ఆర్గానిక్ కాంపొ జిషన్లను బట్టి, భిన్నమైన శాఖలలో చాలా భిన్నమైన లాభం రేట్లు తలెత్తుతాయి. కానీ, తక్కువ లాభం రేటు వున్న శాఖల నించి పెట్టుబడి, ఎక్కువ లాభం రేటు వున్న శాఖల మీద దాడి చేస్తుంది. ఈ రకంగా, నిరంతరం శాఖల్ని మార్చడం ద్వారా ... పెట్టుబడి ఏం చేస్తుందంటే, వేరు వేరు ఉత్పత్తి శాఖల సగటు లాభం ఒకే రకంగా వుండే విధం గానూ, విలువలు ఉత్పత్తి ధరలుగా మారే విధం గానూ చేసే సప్లయ్ డిమాండ్ల నిష్పత్తుల్ని సృష్టిస్తుంది." [పే. 195]

5. " సగటు లాభం - అనేది ప్రాథమిక అవగాహన. సమానమైన పరిమాణం గల పెట్టుబడులు, సమాన మైన కాలాల్లో, సమానమైన లాభాల్ని ఇచ్చి తీరాలి - అనేదే ఈ అవగాహన. ఈ విషయం ఇంకో విషయం మీద ఆధారపడి వుంది. శ్రామికుల నించి మొత్తం సామాజిక పెట్టుబడి లాగిన మొత్తం అదనపు విలు వలో నించీ, ప్రతీ శాఖ లోని పెట్టుబడీ, తన పరిమా ణానికి తగ్గట్టుగా వాటా తీసుకుని తీరాలి - అనే విషయం మీద. దీనినే ఇంకో రకంగా చెప్తే, ప్రతీ విడి పెట్టుబడినీ మొత్తం సామాజిక పెట్టుబడిలో ఒక ముక్క గానూ, ప్రతీ విడి పెట్టుబడిదారుణ్ణీ సామాజిక సంస్థలో (సమాజంలో) ఒక వాటాదారుడి గానూ పరిగ ణించాలి; ప్రతీ పెట్టుబడిదారుడూ, మొత్తం సామాజిక లాభంలో నించి, తన పెట్టుబడి పరిమాణానికి తగ్గట్టు తన లాభం వాటాని పొందుతాడు - అనే విషయం మీద." [పేజీ. 209]

6. "వేరు వేరు ఉత్పత్తి శాఖల పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని అమ్ముకోవడం ద్వారా ఆ సరుకుల కోసం ఖర్చయిన పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నప్ప టికీ, ఆ సరుకు ఉత్పత్తి ద్వారా తమ స్వంత శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువని యథాతథంగా పొందరు. ఆ అదనపు విలువకి బదులుగా వాళ్ళు పొందే దేమిటంటే, మొత్తం సామాజిక పెట్టుబడిలో ప్రతీ సమాన (ఎలిక్వాట్) భాగానికీ వాటాగా వచ్చే లాభాన్ని. సామాజిక పెట్టుబడి చేత, అన్ని ఉత్పత్తి శాఖల లోనూ ఫలానా కొంత కాలంలో ఉత్పత్తి అయిన సామాజిక అదనపు విలువని (లేదా, లాభాన్ని), సామాజిక పెట్టుబడికి సమానంగా పంపకం చేస్తే వచ్చే దాన్ని. పెట్టిన పెట్టుబడిలో ప్రతీ 100 పెట్టు బడీ, దాని కాంపొజిషన్ ఏదైనప్పటికీ, ఒక సంవత్స రంలో (లేదా, ఇంకో కాల పరిమితిలో), ఎంత లాభాన్ని పొందుతుందంటే, ఆ కాలంలో మొత్తం సామాజిక పెట్టుబడిలో ప్రతీ 100 భాగానికీ ఎంత రావాలో అంతని. లాభాలకు సంబంధించినంత వరకూ వివిధ పెట్టుబడిదారులు ఒక 'స్టాకు కంపెనీ'లో వుండే స్టాకు హోల్డర్ల లాగే వుంటారు. స్టాకు కంపెనీలో, '100 పెట్టుబడికి ఇంత లాభం' అనే పద్ధతిలో విభజన అయ్యే 'లాభం - వాటాల్ని' తీసు కొనే షేర్ హోల్డర్ల లాగ. .. సరుకు ఉత్పత్తిలో వాడకం అయిన పెట్టుబడి అంశాలను తిరిగి తెచ్చే సరుకు ధర లోని భాగం, దేనితో నైతే ఆ వాడకం అయిన అంశాల్ని తిరిగి కొనాలో ఆ భాగం (అంటే సరుకు కాస్టుప్రైసు), ఆ ఉత్పత్తి శాఖలో పెట్టే పెట్టుబడి మీదనే పూర్తిగా ఆధారపడి వుంటుంది. కానీ, సరుకు ధర లోని ఇంకో భాగం మాత్రం, అంటే కాస్టుప్రైసుకి జత అయ్యే లాభం భాగం మాత్రం, ఆ నిర్ణీత శాఖలో - ఆ నిర్ణీత కాలంలో - ఆ నిర్ణీత పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన అదనపు విలువ మీద ఆధారపడి వుండదు. అది, సామాజిక పెట్టుబడి లోని ఒక ఎలిక్వాట్ భాగానికి, ఒక నిర్ణీత కాలంలో, సగటున ఎంత లాభం రావాలో ఆ రాసి మీద ఆధారపడి వుంటుంది." [పే. 158]

7. " .... జీవితావసర వస్తువుల ఉత్పత్తి ధరలు వాటి విలువల నించి వైదొలుగుతాయి. అయితే, అది ఎల్లప్పుడూ ఎలా జరుగుతుందంటే, ఒక సరుకు ఎక్కువ అదనపు విలువనీ, ఇంకో సరుకు తక్కువ అదనపు విలువనీ పొందే లాగ జరుగుతుంది. ఆ విధంగా, ఉత్పత్తి ధరలలో ఇమిడి వున్న 'విలువల నించి తేడాలు', ఒక దాన్నొకటి కాన్సిల్ చేసుకుంటాయి. పెట్టుబడిదారీ విధానంలో, జనరల్ సూత్రం (జనరల్ లా) అనేది, చాలా క్లిష్టం (వెరీ కాంప్లికేటెడ్) గానూ, ఉజ్జాయింపు పద్ధతి లోనూ, ఎప్పుడూ స్థిరంగా వుండని నిరంతర ఎగుడు దిగుళ్ళ సగటుగా మాత్రమేనూ, పని చేస్తుంది." [పే. 161]

8. " కాస్టుప్రైసుకి సంబంధించి మొదట అనుకున్న దానిలో ఇప్పుడు ఒక సవరణ చేసుకోవాలి. మొదట ఏమనుకున్నామంటే - ఒక సరుకు కాస్టు ప్రైసు, దాని కోసం వాడకం అయిన సరుకుల విలువతో సమానం - అని. కానీ, సరుకుల విలువల నించి వాటి ఉత్పత్తి ధరలు తేడాగా వుంటాయి కాబట్టి ... ఒక సరుకు కాస్టు ప్రైసు, దాని కోసం వాడకం అయిన 'ఉత్పత్తి సాధనాల' (C + Vల) విలువల మొత్తం నించి ఎక్కువగా గానీ, తక్కువగా గానీ వుండవచ్చును. కాస్టుప్రైసుకి సంబంధించి ఈ సవరణని, దృష్టిలోకి తీసుకోవాలి. ఒక శాఖలో ఒక సరుకు కాస్టుప్రైసుని, ఆ సరుకు ఉత్పత్తి కోసం వాడకం అయిన సాధనాల (నిర్జీవ, సజీవ సాధనాల) విలువగా భావిస్తే, అతి తప్పు. దీన్ని ఇంకా వివరించనవసరం లేదు. కానీ, సరుకు కాస్టు ప్రైసు, సరుకు విలువ కన్నా తక్కువగా వుంటుందనేది ఇప్పటికీ కరక్టే ... సరుకు కాస్టుప్రైసు అనేది, పెట్టుబడిదారుడి ఉత్పత్తి క్రమానికి ముందు వుండే విషయం (ప్రీ కండిషన్). పెట్టుబడిదారుడి ఉత్పత్తి ఫలితం ఏమిటంటే, 'అదనపు విలువ'తో వుండే సరుకు. అంటే, కాస్టుప్రైసుని మించి వుండే విలువ. కాస్టు ప్రైసు అనేది, సరుకు విలువ కంటే తక్కువ - అనే విషయం, ఇప్పుడు ఆచరణలో ఎలా మారిందంటే, కాస్టు ప్రైసు అనేది, ఉత్పత్తి ధర కన్నా తక్కువ - అనే విషయంగా మారింది ... ఈ విషయం వేరు వేరు ఉత్పత్తి శాఖలకు కొంత కొంత మార్పులతో వున్నప్పటికీ, దీని మౌలికమైన వాస్తవం ఎల్లప్పుడూ ఎలా వుంటుందంటే, మొత్తం సామాజిక పెట్టుబడి విషయంలో, అది ఉత్పత్తి చేసిన సరుకుల రాసి కాస్టు ప్రైసు, ఆ 'విలువ' కన్నా (దాని 'ఉత్పత్తి ధర' కన్నా) తక్కువ గానే వుంటుంది." [పే. 164-5]

9. " సరుకులు వాటి విలువలకే గానీ, దాదాపుగా విలువలకే గానీ, మారకం అవడానికి, అవి వాటి ఉత్పత్తి ధరలకు మారకం అవడానికి అవసరమయ్యే అభివృద్ధి దశ కన్నా తక్కువ అభివృద్ధి దశ అవసరమవుతుంది. వివిధ రకాల సరుకుల ధరలు ఏర్పడడం ఏ రకంగా ఏ పద్ధతిలో జరిగినా, వాటి చలనాలు ఎప్పుడూ 'విలువ సూత్రం' చేతనే నిర్ణయమవుతాయి. ఏ రకంగా నంటే, వాటి ఉత్పత్తికి అవసరమయ్యే శ్రమ కాలం పెరిగితే (మిగతా పరిస్థితులు మారకుండా వుండగా) వాటి ధరలు పెరగడమూ, శ్రమ కాలం తగ్గితే ధరలు తగ్గడమూ జరగడం ద్వారా." [పే. 177]

10. " సమాజంలో (ఉత్పత్తి శాఖలన్నిటినీ కలిపి తీసుకుంటే), అన్ని సరుకుల ఉత్పత్తి ధరల మొత్తం, వాటి విలువల మొత్తానికి సమానంగా వుంటుంది." [పే. 159-160]

11. " మార్కెట్ విలువ గురించి ఇక్కడ ఏం చూశామో అది, 'మార్కెట్ విలువ' స్థానం లోకి 'ఉత్పత్తి ధర' వచ్చిన వెంటనే ఉత్పత్తి ధరకే వర్తిస్తుంది. ప్రతీ శాఖ లోనూ ఉత్పత్తి ధర, దాని ప్రత్యేక పరిస్థితుల వల్ల నిర్ధారణ అవుతుంది. ఈ ఉత్పత్తి ధర, ఒక కేంద్రంగా (సెంటర్‌గా), ఏ కేంద్రం చుట్టూ అయితే రోజు వారీ మార్కెట్ ధరలు ఎగుడు దిగుళ్ళవుతూనూ, కొన్ని నిర్దిష్ట కాలాల్లో ఆ ఎగుడు దిగుళ్ళు సమానం అవ్వాలని చూస్తూనూ వుంటాయో, అలాంటి కేంద్రంగా వుంటుంది." [పే. 179]

12. " సప్లై డిమాండ్లు ఒక దానికొకటి సరిపోతే, సరుకుల మార్కెట్ ధరలు, ఉత్పత్తి ధరల్ని పోలి వుంటాయి. అప్పుడు ఆ ధరలు, సప్లై డిమాండ్ల పోటీ లేకుండా స్వతంత్రంగా ఏర్పడినట్టూ, పెట్టుబడిదారీ విధానపు అంతర్గత సూత్రాల చేత నిర్దేశితమైనట్టూ కనిపిస్తాయి. ఎందుకంటే, సప్లై డిమాండ్ల లోని ఎగుడు దిగుళ్ళు, ఉత్పత్తి ధరల నించి మార్కెట్ ధరలు వైదొలగడాన్ని తప్ప దేనినీ వివరించవు కాబట్టి" [పే. 355]

13. " ఒక శాఖలో పెట్టుబడుల మధ్య - పోటీ అనేది, సరుకుల వివిధ వ్యక్తిగత విలువల నించి

ఏర్పడే మార్కెట్ విలువనీ, ఒకే మార్కెట్ ధరనీ, సాధిస్తుంది. వేరు వేరు శాఖల లోని పెట్టుబడుల మధ్య పోటీయేమో - వేరు వేరు శాఖల లాభం రేట్లను సమానం చేస్తూ ఉత్పత్తి ధరలను తీసుకొస్తుంది. ఈ రెండో క్రమానికి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గతం కన్నా ఎక్కువ అభివృద్ధి చెంది వుండాలి." [పే. 180]

14. " **ఒ**క ఉత్పత్తి శాఖలో వాస్తవంగా (యాక్చువల్‌గా) ఉత్పత్తి అయిన అదనపు విలువ, ఆ సరుకు మార్కెట్ ధరలో వుండే లాభంతో సరిపోతే, అది కేవలం యాక్సిడెంటల్. అలా కానప్పుడు, అదనపు విలువా, లాభమూ, తప్పనిసరిగా, ఒక రూల్‌గా, వేరు వేరు పరిమాణాల్లో వుంటాయి (అదనపు విలువ రేటూ, లాభం రేటూ, వేరు వేరుగా వుండడం మాత్రమే కాకుండా). 'దోపిడీ స్థాయి ఇంత' అని వున్నప్పుడు, ఒక శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ రాసి, 'సామాజిక పెట్టుబడి'కి సంబంధించిన 'సగటు (జనరల్) లాభం రేటు' ఏర్పాటుకి చాలా ముఖ్యం. అది ఒక విడి ఉత్పత్తి శాఖలలోని విడి పెట్టుబడిదారుడి విషయంలో కన్నా, జనరల్‌గా పెట్టుబడిదారీ వర్గానికి చాలా అవసరం. అది, విడి పెట్టుబడిదారుడికి ఎంత వరకూ ముఖ్యమైన విషయమంటే, వాడి సొంత శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ రాసి సైజు, జనరల్ లాభం రేటుని ఏర్పరచడంలో ఎంత వరకూ పాల్గొంటుందో అంత వరకూ. కానీ, ఈ క్రమం అంతా, వాడి వీపు వెనక జరిగేటటువంటిది. దీన్ని వాడు చూడడు. అర్థం చేసుకోడు. ఇది వాడికి ఆసక్తి నివ్వదు. వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో, అదనపు విలువకీ లాభానికీ మధ్య పరిమాణంలో వుండే తేడా, లాభపు నిజమైన స్వభావాన్నీ, దాని మూలాన్నీ, పెట్టుబడిదారుడి దృష్టి నించి (ఎవడికైతే తనని తనే మోసం చేసుకోవలసిన అవసరం వుంటుందో అలాంటి వాడి దృష్టి నించి) మాత్రమే కాకుండా, 'కార్మికుడి' దృష్టి నించి కూడా పూర్తిగా మరుగుపరుస్తుంది. విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం - అనే విషయం, 'విలువ'ని నిర్ధారించే పునాదిని (బేసిస్‌ని) మరుగు పరచడానికే వుపయోగపడుతుంది. అదనపు విలువ, లాభంగా మారడం - అనే విషయం, 'సరుకు విలువ'లో 'లాభం'గా వుండే భాగాన్ని, దాని 'కాస్టుప్రైసు'గా వుండే భాగం నించి వేరు పరుస్తుంది కాబట్టి, 'విలువ' అనే అవగాహన ఈ దశలో పెట్టుబడిదారుడి దృష్టి నించి తప్పిపోతుంది. ఎందుకంటే, వాడు సరుకుకి పట్టిన 'మొత్తం శ్రమకు' కాకుండా, సరుకులో ఏ భాగాని కైతే 'ఉత్పత్తి సాధనాల' రూపంలో (నిర్జీవ, సజీవ ఉత్పత్తి సాధనాల రూపంలో, కాస్టు ప్రైసు కోసం) చెల్లించాడో, ఆ భాగాన్ని మాత్రమే చూస్తాడు కాబట్టి. అలా, వాడికి, తన లాభం, సరుకు అంతర్గత విలువకు బయట వుండే విషయంగా కనిపిస్తుంది. వాడి ప్రత్యేక ఉత్పత్తి శాఖ కోణం నించీ చూస్తే, కాస్టుప్రైసుకి జత చేసే లాభం, వాడి శాఖలో విలువ ఏర్పాటుకి సంబంధించిన హద్దుల చేత కాకుండా పూర్తిగా దాని బయట విషయాల చేత నిర్ధారణ అవుతుందనే భావమే వాడికి పూర్తిగా గట్టి పడుతుంది." [పే. 167-68]

15. " **ఉ**త్పత్తి ధరలో సగటు లాభం వుంటుంది. దాన్ని మనం ఉత్పత్తి ధర (ప్రైస్ ఆఫ్ ప్రొడక్షన్) అంటాం. దేన్నయితే స్మిత్తు 'సహజ ధర' (నాచురల్ ప్రైస్) అనీ, రికార్డో 'ఉత్పత్తి ఖర్చు' (కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్, లేదా కాస్టుప్రైస్) అనీ, ఫిజియోక్రాట్లు 'అవసర ధర', అనీ, అంటారో - అదే ఇది. దీన్ని మనం, 'ఉత్పత్తి ధర' అని ఎందుకు అంటామంటే, దీర్ఘ కాలంలో (లాంగ్ రన్‌లో), అది, సప్లైకి, అంటే ప్రతీ విడి శాఖ లోని సరుకుల ఉత్పత్తికీ, ఒక షరతుగా వుంటుంది కాబట్టి. కానీ, వాళ్ళెవ్వరూ కూడా 'ఉత్పత్తి ధర'కీ, 'విలువ'కీ వున్న తేడాని, చూడలేకపోయారు. 'శ్రమ కాలం' చేత విలువని నిర్ధారించడాన్ని (అంటే సరుకులో వున్న శ్రమ పరిమాణం చేత విలువని నిర్ధారించడాన్ని) వ్యతిరేకించే ఈ ఆర్థిక వేత్తలే, మార్కెట్టు ధరలో వచ్చే ఎగుడు దిగుళ్ళకు ఉత్పత్తి ధరనే కేంద్రంగా ఎందుకు మాట్లాడతారో మనం బాగానే అర్థం చేసుకోవచ్చు, ఎందుకంటే, 'ఉత్పత్తి ధర' అనేది, 'విలువ'కు కేవలం బయట రూపం కాబట్టే. ఇది అర్థ రహిత రూపం. ఈ రూపం, పోటీ లోనే ఇలా కనిపిస్తుంది. అందుకే, వల్గర్ పెట్టుబడిదారుడి మైండ్‌కీ, దాని ఫలితంగా వల్గర్ ఆర్థికవేత్త మైండ్‌కీ కూడా, అలాగే కనిపిస్తుంది." [పే. 198]

16. " **ధ**ర రూపం - అనేది, 'విలువ'కీ 'ధర'కీ మధ్య (అంటే విలువకీ, దాని డబ్బు వ్యక్తీకరణకీ మధ్య) 'పరిమాణాత్మకమైన పొంతన లేనితనాన్ని' మరుగుపరచడమే కాకుండా, విలువకు సంబంధించి

‘గుణాత్మకమైన పొంతన లేని తనాన్ని’ కూడా మరుగు పరుస్తుంది. ‘డబ్బు’ అనేది, విలువకి రూపమే (విలువ రూపమే) అయినప్పటికీ, డబ్బులో వ్యక్తమయ్యే ధర అనేది, కొన్ని సందర్భాలలో విలువని వ్యక్తం చెయ్యడం మానివేస్తుంది. ‘అంతరాత్మా, ప్రతిష్ఠా’ (కాన్షియన్స్, ఆనర్) లాంటి వాటంతటవి సరుకులు కాని విషయాలు, వాటిని కలిగి వున్న వారు వాటిని ‘అమ్మకానికి’ పెట్టగలిగేవి గానూ, ఆ విధంగా వాటి ధరల ద్వారా సరుకుల రూపాల్ని పొందగలిగేవి గానూ అవుతాయి. కాబట్టి, ఒక విషయం, విలువ లేకుండానే ‘ధర’ని కలిగి వుండడం జరుగుతుంది. అలాంటప్పుడు, ధర ఊహాత్మకం (ఇమాజినరీ)గా వుంటుంది - లెక్కల్లో కొన్ని పరిమాణాల లాగా. ఈ వూహాత్మకమైన ధర రూపం, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ, నిజ విలువ సంబంధాన్ని కొన్ని సార్లు మరుగు పర్చవచ్చు. ఉదా: ‘మానవ శ్రమ’ని పెట్టని కారణంగా ‘విలువ’ లేని, సాగు చెయ్యని ‘భూమి’కి, ‘ధర’ వుండడం! [పే. 104-105]

ఇంత వరకూ ‘విలువ’ గురించీ, ‘ధర’ గురించీ, మార్క్సు మాటలు చూశాం.

# ‘పెట్టుబడిదారీ సమాజం’లో స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులు

పెట్టుబడిదారీ సమాజంలో స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా వుంటారని మనకు మొదటి నించీ తెలుసు. ‘ఒక శాఖలో వుండే ఉత్పత్తి’ అన్నప్పుడు, పెట్టుబడి దారుల ఉత్పత్తిని మాత్రమే ఇంత వరకూ దృష్టిలో పెట్టుకున్నాం. కానీ, కొన్ని శాఖల్లో, స్వతంత్ర ఉత్పత్తి దారుల ద్వారా ఉత్పత్తి అయ్యే సరుకు కూడా కొంత వుంటుంది. ప్రతీ శాఖ లోనూ కాదు.

‘పాల’ శాఖలో, పెట్టుబడిదారుల సరుకుతో పాటు, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకు కూడా కొంత ఉంటుందనుకుదాం. అయితే అది, ఆ శాఖలో వుండే మొత్తం సరుకులో చాలా తక్కువ భాగమే అవుతుంది. మొత్తం సమాజానికి 1 రోజుకి, 100 లీటర్ల పాలు అందుతూ వుంటే, అందులో 95 లీటర్లు పెట్టుబడి దారుల ద్వారానూ, 5 లీటర్లు స్వతంత్ర ఉత్పత్తి దారుల ద్వారానూ అందుతున్నాయి అనుకుందాం. పెట్టుబడిదారుల పోటీ ద్వారా ఏర్పడే మార్కెట్టు ధరే స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులకు కూడా వర్తిస్తుంది.

స్వతంత్ర ఉత్పత్తి దారులకు, యజమానులు వుండరు కాబట్టి, వారు దోపిడీకి గురికారనీ, వారి ‘అదనపు విలువ’ అంతా వారికే దక్కుతుందనీ ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఇక్కడ ఆ అభిప్రాయాన్ని కొంత సవరించుకోవాలి. స్వతంత్ర ఉత్పత్తి దారులకు, ఉత్పత్తి స్థలంలో యజమాని వుండక పోయినా, పెట్టుబడిదారీ విధానమే వారి జీవితాల మీద, ‘కనిపించని యజమాని’గా వుంటుంది.

పాల ధర, 1 లీటరుకి 2 రూపాయలు - అనుకుందాం. పెట్టుబడిదారుల దగ్గిర వున్న ఉత్పాదక శక్తి స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర వుండదు. కానీ, పెట్టుబడిదారులు అమ్మే ధరకే స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా అమ్మాలి. ధరలో చిన్న చిన్న తేడాలు వుంటే అవి లెక్కలోవి రావు.

2 రూపాయల ధరలో అంతర్గత భాగాలు, పెట్టుబడిదారుల దగ్గిర, 1C +  V +  S గా వున్నాయి అనుకుందాం.

ఇందులో, ‘ఉత్పత్తి సాధనాల భాగం, 1 రూ.

దానికి V ని కూడా కలిపితే, 1  రూపాయలు.

ఇది కాస్ట్‌ప్రైస్.

1  రూపాయల కాస్ట్‌ప్రైసుతో 1 లీటరుని ఉత్పత్తి చేస్తే, దాని ద్వారా లాభం  రూపాయి.

ఒక పెట్టుబడి దారుడు, రోజుకి వెయ్యి లీటర్లు ఉత్పత్తి చేయిస్తే - లాభం 500.

2 వేల లీటర్లు చేయిస్తే - లాభం 1,000.

కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల పరిస్థితి అలా వుండదు. ఆ పనిస్థలంలో ఆ కుటుంబ సభ్యులు మాత్రమే వుంటారు. ఇద్దరు ముగ్గురు మనుషులు మాత్రమే పని చేసే చోట, భారీ యంత్రాలతో భారీ స్థాయిలో ఉత్పత్తి చెయ్యడం సాధ్యం కాదు. పెట్టుబడి

దారుడి దగ్గిర వున్న ఉత్పత్తి సాయి గానీ, ఉత్పాదక శక్తి గానీ, స్వతంత్ర ఉత్పత్తి దారుల దగ్గిర వుండవు. కాబట్టి వీళ్ళ ఉత్పాదక శక్తి చాలా పనుల్లో చేతి వృత్తుల స్థాయిని మించి వుండదు. కుట్టు పనీ, ప్రింటింగు పనీ - లాంటి పనుల్లో, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా యంత్రాల్ని ఉపయోగిస్తారు. అయితే, పెట్టుబడి దారుడు, అదే రకపు యంత్రాల్ని ఎక్కువ సంఖ్యలో పెట్టి కార్మికులతో పని చేయిస్తూ వుంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల కుటుంబం, ఒకే యంత్రం మీద పని చేస్తుంది. చాలా రకాల పనుల్లో పెట్టుబడిదారులు తీసివేసిన తక్కువ ఉత్పాదక శక్తి గల చిన్న చిన్న యంత్రాలనే స్వతంత్ర ఉత్పత్తి దారులు వాడతారు. పెట్టుబడిదారుడి ఉత్పాదక శక్తినీ, స్వతంత్ర ఉత్పత్తి దారుల ఉత్పాదక శక్తినీ పోల్చినప్పుడు, పెట్టుబడి దారుడు 1 గంటలో ఉత్పత్తి చేయించగలిగే సరుకు కోసం, స్వతంత్ర ఉత్పత్తిదారులు అనేక గంటలూ రోజులూ తీసుకుంటారు. అంటే పెట్టుబడి దారుడు ఏ కాస్టుప్రైసుతో ఉత్పత్తి చేస్తాడో అంత తక్కువ కాస్టు ప్రైసుతో ఉత్పత్తి చెయ్యడం స్వతంత్ర ఉత్పత్తి దారులకు సాధ్యం కాదు.

పాల ఉదాహరణలో, పెట్టుబడిదారుడి దగ్గిర, 1 లీటరుకి, ఉత్పత్తి సాధనాల ఖర్చు 1 రూపాయి కదా? స్వతంత్ర ఉత్పత్తి దారుల దగ్గిర, ఆ ఖర్చుని, 1 రూ. అనుకుందాం. ఆ ఖర్చు మీద స్వతంత్ర ఉత్పత్తిదారుల 'సజీవ శ్రమ' కూడా కలుస్తుంది.

పెట్టుబడిదారుడి ఉదాహరణలో, కార్మికుల సజీవ శ్రమ, 1 రూపాయి. ( V + S) అయినట్టే, స్వతంత్ర ఉత్పత్తిదారుల సజీవ శ్రమని కూడా 1 రూ. గానే అనుకుందాం. అంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల దగ్గిర, మొత్తం ఖర్చు, 1 C + V + S = 2 గా వుంటుంది. అంటే, పెట్టుబడిదారీ సరుకు, తక్కువ శ్రమతో తయారైతే, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకు, ఎక్కువ శ్రమతో తయారైందని అర్థం.

కానీ, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకు ఎక్కువ శ్రమతో తయారైనా, దాన్ని ఎక్కువ ధరతో అమ్మడం సాధ్యం కాదు. వీరు కూడా, పెట్టుబడి దారుల లాగే, 1 లీటరుని 2 ధర లోటే అమ్మి తీరాలి. అలా అమ్మి నప్పుడు ఆ 2 ధర ద్వారా ఏ యే అంశాలు తిరిగి వస్తాయి? - ఆ 2 లో నించి 1 ఉత్పత్తి సాధనాల్ని తీసి వేస్తే, ఇంకా మిగిలిన రూపాయి, వారికి పోషణ భాగం (శ్రమ శక్తి విలువ). అంటే, ఆ 2 ధర ద్వారా C+V లు మాత్రమే తిరిగి వస్తాయి. S ఏమీ రాదు.

లేదా, స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులో అంతర్భాగాల్ని ఇంకో రకంగా చూద్దాం. 1 లీటరు కోసం, 1 రూపాయి సాధనాలూ, 1 రూపాయల సజీవ శ్రమా ఖర్చయ్యాయి - అనుకుందాం. అంటే, $1_C + {}_V + 1_S = 2$ . ఈ ఖర్చుతో 1 లీటరు పాలు ఉత్పత్తి అయ్యాయి.

కానీ, దాన్ని 2 ధరకే అమ్మాలి. అలా అమ్మితే ఏ యే అంశాలు వస్తాయి? $1_C + {}_V + {}_S$ వస్తాయి. ఇంకో $_S$ రాదు. అంటే, రావలసినంత అదనపు విలువ రాదు.

స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులో అంతర్భా గాల్ని 2 రకాలుగా చూశాం. మొదటి ఉదాహరణలో, అసలు అదనపు విలువే మిగల లేదు. 2 వ ఉదా హరణలో, కొంత అదనపు విలువ మిగిలింది, రావలసినంత రాకపోయినా.

కానీ, 2 ఉదాహరణల్లోనూ జరిగింది ఏమిటంటే - ఎక్కువ శ్రమకి బదులుగా తక్కువ ఫలితమే వచ్చింది. 2 కి బదులుగా 2 మాత్రమే వచ్చింది. విలువ గల శ్రమ, ఫలితం లేకుండా పోయింది.

స్వతంత్ర ఉత్పత్తిదారుల శ్రమని, ఒక యజమాని దోచడం అనేది లేకపోయినా, వారి సరుకుల్ని కూడా పెట్టుబడిదారీ ధరలకే అమ్మవలసి వస్తుంది. అంటే, పెట్టుబడిదారీ సరుకులతో పోటీ పడవలసి వస్తుంది. దీని వల్ల, స్వతంత్ర ఉత్పత్తి దారులు ఎంత శ్రమ చేసినా, ఆ శ్రమ అంతా కనీస పోషణకు మాత్రమే ('శ్రమ శక్తి పునరుత్పత్తి'కి మాత్రమే) అవసరమవుతూ వుంటుంది. కొన్ని సందర్భాల్లో ఆ పోషణ కూడా అసాధ్యమవుతూ వుంటుంది. అందుకే, పెట్టుబడిదారీ సమాజంలో, స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా కార్మి కుల లాగానే, కొన్ని సందర్భాల్లో కార్మికుల కన్నా నికృష్టంగా కూడా, పేదరికంలో వుంటారు.

స్వతంత్ర ఉత్పత్తి దారుల్లో, అదనపు విలువని కూడబెట్టుకుంటూ క్రమంగా దాన్ని 'చిన్న పెట్టుబడి'గా పెట్టి, చిన్న పెట్టుబడి దారులుగా మారే ఉదాహర ణలు కూడా వుంటాయి. కానీ పెట్టుబడిదారీ సమా జంలో వుండే స్వతంత్ర ఉత్పత్తి దారులు, ఇలా మారడం చాలా తక్కువ. చిన్న పెట్టుబడి దారులుగా మారిన స్వతంత్ర ఉత్పత్తిదారులు, క్రమంగా పెద్ద

పెట్టుబడి దారులుగా కూడా కావచ్చు. కానీ, ఇలాంటి ఉదాహరణలు మరీ తక్కువే. ఎక్కువగా జరిగేది - స్వతంత్ర ఉత్పత్తిదారులు కూడా క్రమంగా కార్మికులుగా మారడమే. స్వంత ఉత్పత్తి సాధనాలను కలిగి వుండి, స్వయంగా శ్రమ చేస్తూ జీవించే ఉత్పత్తి దారులు, పెట్టుబడిదారులుగా మారితే, క్రమంగా 'శ్రమ'ని వదిలేస్తారు. లేదా, కార్మికులుగా మారితే, 'స్వంత ఉత్పత్తి సాధనాలకు' దూరమవుతారు.

ఇంతవరకూ, పెట్టుబడిదారీ ధరకు సంబంధించిన అనేక విషయాలు చూశాం. ఈ అవగాహనతో 'నూతన సమాజపు ధర'ని అర్థం చేసుకోవచ్చు. దాన్ని ఈ సంపుటం లోనే చిట్ట చివర 'నూతన సమాజం' భాగంలో చూస్తాం.

ఇప్పటికి, ఉత్పత్తి క్రమమూ, ధర నిర్ణయమూ వరకే జరిగాయి. దీని తర్వాత, 'జీతాలకు' సంబంధించిన విషయాలు చూడాలి.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **'సింపుల్ సరుకు' అంటే ఏమిటి? 'పెట్టుబడిదారీ సరుకు' అంటే ఏమిటి?**

**జ:** సింపుల్ సరుకు - అంటే, విలువే ధరగా వుండే సరుకు. ఇందులో కూడా 'అదనపు విలువ' వుంటుంది. ఆ భాగం, అసలు పరిమాణం తోటే వుంటుంది. పెట్టుబడిదారీ సరుకు - అంటే, విలువ, ఉత్పత్తి ధరగా మారే సరుకు. ఇందులో వుండే అదనపు విలువ, అసలు పరిమాణంతో గాక, ఎక్కువో తక్కువో అయిన పరిమాణంతో వుంటుంది.

2. **ఒక సరుకు సింపుల్ సరుకు అయినా, పెట్టుబడిదారీ సరుకు అయినా, దాని 'ధర' కు సంబంధించి ఒక సాధారణ నియమం ఏదైనా వుందా?**

**జ:** తప్పకుండా వుంది. ధర, విలువని బట్టే వుంటుంది. ఆ విలువ, శ్రమ కాలాన్ని బట్టి. ఎక్కువ శ్రమ అయితే ఎక్కువ విలువా, తక్కువ శ్రమ అయితే తక్కువ విలువా. ఒక సరుకుకి శ్రమకాలం మారి, విలువ మారితే, ధర మారుతుంది. ఇది, 'ధర'కు వుండే ప్రధాన నియమం. ఈ నియమం మీద, ఆ సరుకు సింపుల్ సరుకా - పెట్టుబడిదారీ సరుకా అనేదీ, ఆ సమయంలో ఆ సరుకు కోసం వున్న సప్లై, డిమాండ్లూ - వంటి ఇతర పరిస్తి తులు కూడా కలుస్తాయి.

3. **ఒక వస్తువుని కళ్ళతో చూసి, దాని బరువుని గ్రహించలేము. 'బరువు రాయి'తో తూచి బరువుని గ్రహించగలము. అలాగే, ఒక వస్తువుని కళ్ళతో చూసి 'విలువ' ని గ్రహించలేము. కానీ, 'డబ్బు' తో కొలిచి, విలువని గ్రహించగలము. అలాంటప్పుడు, 'వస్తువు విలువని ఏ రకం గానూ గ్రహించలేము' అని ఎందుకు అనాలి?**

**జ:** ఒక వస్తువుని, ఉదా: దుప్పటిని, డబ్బుతో కొలిస్తే (మారకం చేసుకుంటే), 10 రూ.లు వచ్చిందనుకుందాం. అది, దుప్పటికి ధరే గానీ విలువ కాదు. అందుకే, మొత్తం సరుకుల రాసి విలువ తెలుస్తుంది గానీ, విడి సరుకుల విలువలు తెలియవు - అనడం. సింపుల్ సరుకుల విషయంలో అయితే, ధరనే విలువగా అనుకోవచ్చు. కానీ, అక్కడ కూడా ఒక ఉత్పత్తి విషయంలో, ధర, చిన్న చిన్న తేడాల తోనే వుంటుంది. బరువూ, పొడవూ లాంటి శరీర లక్షణాలు అయితే, ఎక్కడ ఎవరు కొలిచినా తేడాలు రావు. కానీ 'ధర'లో ఆ ఖచ్చితత్వం వుండదు. అది, పెట్టుబడిదారీ ధర అయితే, అది విలువే అవదు. అందుకే, 'విడి సరుకు - విలువని గ్రహించలేము' అనడం.

4. **పెట్టుబడిదారుడు, 'లాభాన్ని' బైటి నించి వచ్చే విషయంగా ఎందుకు అనుకుంటాడు?**

**జ:** పెట్టుబడిదారుడు, సరుకు కోసం, C + V లను మాత్రమే ఖర్చు చేస్తాడు. కానీ ఆ ఖర్చుతో తయారైన సరుకు ద్వారా, C + V + S లు వస్తాయి, తను ఖర్చు పెట్టని భాగం కూడా రావడం వల్ల, దాన్ని 'బైటి నించి వచ్చేదే' అనుకుంటాడు.

5. **ఒక సరుకుని 2 తో కొన్నాం. అది, దాని విలువేనా?**

**జ:** ఆ సరుకు, సింపుల్ సరుకా, పెట్టుబడిదారీ సరుకా- అనే దాన్ని బట్టి ఆ విషయం వుంటుంది. కానీ, ఇప్పుడు వున్న సమాజం, పెట్టుబడిదారీ సమాజమే కాబట్టి, ఈ సమాజంలో, సింపుల్ సరుకుల ప్రసక్తి వుండదు. ఇక్కడ ఏ సరుకుని అయినా పెట్టుబడిదారీ సరుకు గానే అనుకో వచ్చు. అలాంటి సరుకుని, 2 తో కొంటే, అది విలువ కాదు. మార్కెట్ ధర. మహా అయితే, అది ఉత్పత్తి ధర కావచ్చు.

6. **"నీ పెట్టుబడి మీద ఎంత శాతం లాభం వేసు కుంటావు?" అని ఒక పెట్టుబడిదారుణ్ణి అడగండి. "10 శాతం వేసుకుంటా" అని చెపుతాడనుకుందాం. "50% ఎందుకు వేసుకోవు? అంత లాభం నీకు ఇష్టం లేదా?" అని మళ్ళీ అడగండి. ఏం చెప్తాడో రాయండి.**

**జ:** ఒక షాపు వర్తకుణ్ణి అలా అడిగితే, "10, 15 శాతం లాభం వుంటుంది" అన్నాడు. "అంత కన్నా ఎక్కు వగా 50 శాతం లాభం ఎందుకు వేసుకోవు?" అని మళ్ళీ అడిగాం. అతను నవ్వాడు. "అంత ధర చెప్తే కొనే వాళ్ళు కొనొద్దూ? ఇంకో షాపు లోకి పోయి తక్కువకే కొనుక్కుంటారు కదా?" అన్నాడు.

7. **ఒక పెట్టుబడి 200. ఉత్పత్తి కాలం 1 నెల. చలామణీ కాలం 1 నెల. 2 వ పెట్టుబడి 200. ఈ 2 పెట్టుబడులూ ఒక్క ఉత్పత్తి క్రమంలో తయా రయ్యే సరుకు కోసమేనా?**

**జ:** కాదు. 2 పెట్టుబడులూ వేరు వేరు పెట్టుబడులు. అవి, వేరు వేరు ఉత్పత్తి క్రమాల్లో పని చేస్తూ, వేరు వేరు యూనిట్ల సరుకుల్ని ఉత్పత్తి చేస్తాయి.

8. **ఒక ఉత్పత్తికి - పంట పాడై ధర పెరగడానికీ, డిమాండ్ పెరిగి ధర పెరగడానికీ తేడా వుందా? ఏమిటి?**

**జ:** తేడా వుంది. పంట పాడవడం వల్ల ధర పెరగడం అంటే - ఉత్పత్తి తగ్గి, 1 యూనిట్‌కి శ్రమ కాలం పెరిగి, విలువ పెరిగి, ఆ రకంగా ధర పెరగడం. కానీ, డిమాండ్ పెరగడం వల్ల ధర పెరగడం అంటే, ఆ ఉత్పత్తికి శ్రమ మొత్తం పెరగకుండానే, విలువ పెరగకుండానే, ధర పెరగడం.

9. **ధాన్యం పంట పాడై ఉత్పత్తి తగ్గింది. ధర పెరిగింది. విలువ పెరగడం వల్ల, ధర పెరిగిందా, ఉత్పత్తి తగ్గడం వల్ల ధర పెరిగిందా?**

**జ:** రెండూ ఒకటే. ఉత్పత్తి తగ్గడం వల్లే విలువ పెరిగింది. విలువ పెరగడం వల్లే ధర పెరిగింది.

10. **మీరు ఒక దుప్పటి 9 కి కొన్నారు. మీ స్నేహితు రాలు అదే రకం దుప్పటి, అదే షాపులో, అదే రోజున, 10 కి కొన్నది. దుప్పటి మార్కెట్ ధర ఏది?**

**జ:** రెండూ మార్కెట్ ధరలే. అవి అలాగే చిన్న చిన్న తేడాలతో వుంటాయి. వాటి సగటునే దృష్టిలో పెట్టుకోవాలి. ఆ 2 దుప్పట్లూ కలిసి 9 + 10 = 19 ధరతో అమ్ముడయ్యాయి. అంటే, 1 దుప్పటి 9 ½ తో. అది, సగటు మార్కెట్ ధర. అసలు ధరలు, ఆ సగటుకి కొంచెం ఇటూ అటూ వుంటాయి.

11. **ఒక సరుకుకి సప్లై 10% పెరిగి, డిమాండ్ 20% తగ్గింది. ధరలో మార్పు ఎలా వుండవచ్చు?**

**జ:** సప్లై పెరగడం వల్ల ధర తగ్గాలి. డిమాండ్ తగ్గడం వల్ల కూడా ధర తగ్గాలి. రెండూ కలిసి ధర బాగా తగ్గుతుంది.

12. **సైను బట్ట శాఖలో, 4 గురు పెట్టుబడిదారులు వున్నారు. వాళ్ళ మార్కెట్ ధరలు 1 మీటరుకి, చిన్న చిన్న తేడాలతో ఇలా వున్నాయి: 1.50, 1.55, 1.43, 1.52. మీటరు బట్టకి సగటు ధర ఎంత?**

**జ:** ఆ 4 మార్కెట్ ధరల్ని కలిపి సగటు చేస్తే, 1.50 వస్తుంది. అదే 1 మీటరుకి సగటు మార్కెట్ ధర. ఆ ధరే వేరు వేరు చోట్ల చిన్న చిన్న తేడాలతో వుంటుంది.

**13.ఒకే సైజు గల పెట్టుబడుల ద్వారా ఉత్పత్తి అయిన సరుకుల విలువలు, ఒకే రకంగా వుంటాయా, వుండవా? ఎందుకు?**

**జ:** విలువలు ఒకే రకంగా వుండవు. ఎందుకంటే, పెట్టుబడులు ఒకే సైజు గలవి అయినా, వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విలువలు ఒకే రకంగా వుండవు గనక.

**14.ఒకే సైజు గల పెట్టుబడులు ఉత్పత్తి చేసే అదనపు విలువలు ఒకే సైజుతో ఎందుకు వుండవు?**

**జ:** ఎందుకంటే, ఆ పెట్టుబడుల అంతర్గత భాగాలు, అంటే కాంపోజిషన్లు, ఒకే రకంగా వుండవు గనక.

**15.(1) విలువలే ధరలుగా వుండడం, (2) సమాన పెట్టుబడులకు సమాన లాభాలు రావడం - ఈ రెంటిలో, ఒకటి జరిగితే ఒకటి జరగదు. ఈ సమస్య, ఆర్థిక శాస్త్రంలో పరిష్కారం దొరకని సమస్యగా వుంటూ వుండగా, దీన్ని మార్క్సు ఎలా పరిష్కరించాడు?**

**జ:** 'జనరల్ లాభం రేటు' సూత్రాన్ని గ్రహించడం ద్వారా పరిష్కరించాడు. పెట్టుబడిదారీ విధానంలో, ప్రతీ పెట్టుబడికీ ఒక సగటు లాభం రావాలి. లేకపోతే, పెట్టుబడులు శాఖల్ని మార్చేస్తాయి. ఈ చర్య సమాన పెట్టుబడులకు సమాన లాభాలు వచ్చే లాగ చేస్తుంది. ఈ విషయం గ్రహించడం ద్వారానే మార్క్సు ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందో చెప్పాడు.

**16.మొత్తం శాఖలు రెండే. ఒక శాఖలో ఉత్పత్తి విలువ 300. రెండో శాఖలో 200. ఆ ఉత్పత్తుల మార్కెట్ ధరలు 305, 210 గా ఏర్పడడం సాధ్యమేనా?**

**జ:** జనరల్ సూత్రాల ప్రకారం చెప్పుకుంటే, 'సాధ్యం కాదు' అని చెప్పుకోవాలి. 2 శాఖల్లో వున్న సరుకుల ఉత్పత్తి ధరలూ కలిసి, 300 + 200 = 500. ఇది, ఆ సరుకుల రాసి విలువ. ఈ విలువని ఒకే సమయంలో చలామణీ చెయ్యడానికి, చలామణీలో 500 డబ్బు మాత్రమే వుండవలసి వుంటుంది. ఒక వేళ, ఆ సరకుల ధరలే 305 + 210 = 515 గా వుంటే, గతంలో 500 గా వున్న విలువే, ఇప్పుడు 515 గా వుందని అర్థం. ధరలు ఎలా పెరిగినా, సరుకుల రాసి పెరిగే దేమీ వుండదు. ధరలు ఎలా వున్నా, అవన్నీ కలిసిన మొత్తమే ఆ సరుకుల విలువ. ఆ ధరలు ఇంకోలా మారితే, మళ్ళీ ఆ మారిన ధరల మొత్తమే ఆ సరుకుల విలువ. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయం ఇదే.

**17.ఒక సరుకు విలువ 5. ఉత్పత్తి ధర 6. మార్కెట్ ధర 5. ఇక్కడ విలువ, ఏ మార్పులకూ గురి కాలేదనీ, విలువే ధరగా అయిందనీ అర్థమా?**

**జ:** కాదు. విలువ - ఉత్పత్తి ధరగా మారడమూ, మళ్ళీ అది మార్కెట్ ధరగా మారడమూ - ఈ 2 మార్పులూ జరిగాయి. చివరికి, విలువా మార్కెట్ ధరా ఒకే రకంగా వున్నా, విలువ ఏ మార్పులకూ గురి కాలేదని అర్థం కాదు.

**18.మొత్తం సమాజ పెట్టుబడి 500. దాని సగటు కాంపోజిషన్, $4_C : 1_V$. అదనపు విలువ రేటు 200%. అదనపు విలువ రాసి ఎంత? విలువ ఎంత?**

**జ:** మొత్తం 500 పెట్టుబడిలో భాగాలు, $400_C$ + $100_V$. అదనపు విలువ రేటు 200% అంటే, $100_V$ కి, $200_S$. సరుకు విలువ = $400_C + 100_V + 200_S = 700$.

**19.ఒక పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి 720. అందులో, కాస్టు ప్రైసు 600. జనరల్ లాభం రేటు 50%. ఉత్పత్తి ధర ఎంత కావచ్చు?**

**జ:** జనరల్ లాభం రేటు ప్రకారం, లాభం రావలసింది కాస్టు ప్రైస్ మీదే కాదు, పని స్థలంలో వున్న మొత్తం పెట్టుబడి మీద. కాబట్టి, 50% లాభం రేటు చొప్పున, 720 మీద రావలసిన లాభం = — × 720 = 360. ఈ లాభాన్ని, కాస్టు ప్రైసుకి కలిపితే, అది ఉత్పత్తి ధర. అది, 600 + 360 = 960.

20. **ఇక్కడ వున్న విషయాలలో ఏది సరైనది? ఏది కాదు?**

**జ:**

1. ధరలు, అన్ని శాఖల లోనూ విలువల కన్నా ఎక్కువగా వుంటాయి. లేదా, అన్ని శాఖల లోనూ విలువలకన్నా తక్కువగా వుంటాయి. ✗
2. ధరలు, కొన్ని శాఖలలో విలువల కన్నా ఎక్కువగా వుండి, కొన్ని శాఖలలో విలువల కన్నా తక్కువగా వుంటాయి. ✔
3. పెట్టుబడిదారుడు, అమ్మగలిగేటంత సరు కునే ఉత్పత్తి చేస్తాడు. ✗
4. 'జనరల్ లాభం రేటు' అంటే - ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడులకు సంబంధించిన సగటు రేటు. ✗
5. s, d లు అసమానంగా వుండడం అంటే, s ఎక్కువై d తక్కువ అవడం. ✗
6. పెట్టుబడికి లాభం రావలసింది, అది ఏ రకం సరుకుని ఉత్పత్తి చేస్తోంది - అనే దాన్ని బట్టి. ✗
7. విలువల నించి ధరలు తేడా అయినప్పుడు, అదనపు విలువల మొత్తం కూడా మారు తుంది. ✗

21. **ఖాళీలను పూరించండి.**

1. జనరల్ లాభం రేటు అంటే, సమాజంలో వున్న మొత్తం .......ని, ........................... కి పంచగా వచ్చే లాభం రేటు.
2. 'విలువ'కి సూత్రం = ....................
   'ఉత్పత్తి ధర'కి సూత్రం = ....................
   'మార్కెట్ ధర'కి సూత్రం = ..................
3. 'కుర్చీ'ని ఉత్పత్తి చేసే కాలంలో, సజీవ శ్రమ పేరు ............................
4. కుర్చీ విలువగా వుండే శ్రమ పేరు .............
5. విలువ, ఉత్పత్తి ధరగా మారడానికి కారణం ..............................
6. ఒకే సైజు గల కాస్టు ప్రైసులతో ఉత్పత్తి అయిన సరుకుల విలువలు, ఒకే రకంగా ఎందుకు వుండవంటే ..........................
7. స్థిరలో మార్పులు సరుకు విలువని ...........
   అస్థిరలో మార్పులు సరుకు విలువని ........

**జ:** (ఈ మాటల్ని ఆ ఖాళీల్లో పెట్టి చదవండి.)

(1) అదనపు విలువ; మొత్తం పెట్టుబడి
(2) C + V + S ; C + V + P ; C + V + P
(3) వజ్రంగం శ్రమ; (4) రూపం లేని శ్రమ
(5) జనరల్ లాభం రేటు సూత్రం
(6) పెట్టుబడుల అంతర్గత భాగాలలో తేడాల వల్ల.
(7) మార్చుతాయి. మార్చవు.

22. **గోచీ బాబాని మన పెట్టుబడిదారుడు, "లాభం రేటు ఎందుకు తగ్గుతూ వుంటుంది స్వామీ?" అని అడిగాడు కదా? అక్కడికి వచ్చిన మిగతా ధనవంతులందరూ కూడా ఆ బాబాని ఏదో ఒకటి అడుగు తారు కదా? వాళ్ళ కోరికలు ఎలా వుండవచ్చు?**

**జ:** అన్నీ ఆస్తికీ, పెద్ద పెద్ద పదవులకూ, అక్రమంగా డబ్బు సంపాదించే మార్గాలకూ సంబంధించినవే వుంటాయి.

"నేను 100 ఎకరాల భూమిని కొనాలనుకుంటున్నాను. బేరం జరుగుతోంది. రేటు చవగ్గా కుదురుతుందా?"

"నేను ఎన్నికల్లో నిలబడాలని ఇప్పటికే కోటి రూపాయలు ఖర్చు పెట్టాను. రేపు ఎన్నికల్లో నెగ్గుతానా స్వామీ?"

"నేను ఒక హత్య కేసులో ఇరుక్కున్నాను. బయట పడతానా స్వామీ?"

"బ్యాంకుల్లో అప్పులు తెచ్చి లక్ష షేర్లు కొన్నాను. వాటి ధర పెరుగుతుందంటారా స్వామీ?"

అన్నీ ఇలాంటి కోరికలే. అన్నీ తప్పకుండా జరుగుతాయనే చెపుతాడు స్వామి. ★

# 3. 'జీతాల' గురించి

'శ్రమ శక్తి' కూడా ఒక 'సరుకు'. 'జీతం' కూడా ఒక 'ధర'. కాబట్టి, సరుకుల ధరల గురించి చూసే చోట, 'శ్రమ శక్తి'కి సంబంధించిన 'ధర'లో మార్పుల్ని కూడా చూడాలి.

## 'జీతాల' విషయంలో సప్లై - డిమాండ్లు

ఏదో ఒక ప్రత్యేక శ్రమ శక్తిని దృష్టిలో పెట్టుకుంటే, దాని ధరలో (దానికి ఇచ్చే జీతంలో) మార్పులు, ఆ శ్రమ చెయ్యగల కార్మికుల సప్లై డిమాండ్లని బట్టి వుంటాయి.

కార్మికుల సప్లై - అంటే, ఒక శ్రమ చెయ్యటానికి సిద్ధంగా వున్న కార్మికుల సంఖ్య. కార్మికుల కోసం డిమాండ్ - అంటే, ఆ శ్రమ కావలసిన శాఖలో మొత్తం పెట్టుబడికి వున్న అవసరాల సంఖ్య. సప్లై - కార్మికుల వేపు నించి వుంటే, డిమాండ్ - పెట్టుబడి దారుల వేపు నుంచి వుంటుంది.

డిమాండ్ కన్నా సప్లై ఎక్కువగా వుంటే, జీతం, శ్రమ శక్తి విలువ కన్నా తగ్గుతుంది. సప్లై కన్నా డిమాండ్ ఎక్కువగా వుంటే, జీతం, శ్రమ శక్తి విలువ కన్నా పెరుగుతుంది. సప్లై డిమాండ్లు సమానంగా వుంటే, జీతం, శ్రమ శక్తి విలువతో సమానంగా వుంటుంది. జీతంలో హెచ్చు తగ్గులకు, శ్రమ శక్తి విలువే కేంద్రంగా వుంటుంది.

కార్మికుల సప్లై డిమాండ్లని 2 రకాలుగా చూడాలి. (1) జనరల్ కోణం నించీ, (2) ప్రత్యేక కోణం నించీ.

జనరల్ కోణం నించి - అంటే: మొత్తం సమాజానికి సంబంధించిన కార్మికుల సప్లై డిమాండ్లు.

ప్రత్యేక కోణం నించి - అంటే: ఒక విడి శాఖకు సంబంధించిన కార్మికుల సప్లై డిమాండ్లు.

'మొత్తం సమాజాన్ని' తీసుకుంటే, శ్రమ చేసే మనుషులు ఎక్కువయ్యారనో తక్కువయ్యారనో అనటానికి వీలు లేదు. ఎందుకంటే, ఉన్న మనుషుల్ని బట్టి పనిని విభజించాలి గానీ, పనిని బట్టి మనుషుల్ని కుదించడం కాదు. కానీ, ఈ సహజ సూత్రం, ఏ దోపిడీ విధానం లోనూ అమలు జరగదు. పెట్టుబడిదారీ విధానంలో అయితే ఈ విషయం, 'కార్మికుల సప్లై డిమాండ్ల సమస్య'గా తల ఎత్తుతుంది.

పెట్టుబడిదారీ విధానం, శ్రామిక జనాభా కందరికీ పనులు కల్పించ లేదని మొదటి సంపుటంలో, 'భారీ పరిశ్రమ', 'పెట్టుబడి విస్తరణా' చాప్టర్లలో చూశాం. ఈ విధానంలో, అన్ని శాఖల లోనూ వున్న మొత్తం సామాజిక పెట్టుబడి ద్వారా కార్మికుల కోసం ఏర్పడే డిమాండు, సమాజంలో వున్న మొత్తం కార్మిక సప్లై కన్నా ఎప్పుడూ తక్కువ గానే వుంటుంది.

'సామాజిక పెట్టుబడి' ప్రతీ సంవత్సరమూ పెరుగుతూ వుంటుంది. కాబట్టి, దాని వల్ల, కార్మికుల కోసం డిమాండ్ కూడా పెరుగుతూ వుంటుంది - అనేది నిజమే. కానీ, ప్రతీ సంవత్సరమూ శ్రమ చెయ్యడానికి అందే కార్మిక జనాభాలో పెరుగుదలని కూడా దృష్టి లోకి తీసుకోవాలి. అంతే గాక, పెట్టుబడుల మధ్య పోటీ ద్వారా ఎప్పుడూ పెరుగుతూ వుండే ఉత్పాదక శక్తుల్ని కూడా దృష్టి లోకి తీసుకోవాలి. శాఖల్లో ఉత్పాదక శక్తులు పెరుగుతూ వున్న కొద్దీ, పాత కార్మిక జనాభాకి కూడా పనులు నిలవడం సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడుతూ వుంటాయని గతం లోనే చూశాం. ఈ రకంగా చూస్తే, సామాజిక పెట్టుబడి ఎంత పెరుగుతూ వున్నా, దాని డిమాండు, కార్మికుల సప్లై కన్నా ఎప్పుడూ తక్కువ గానే వుంటుంది. డిమాండు పెరగడం అంటే, అది పాత స్థాయి కన్నా కొంత పెరుగుతుందని అర్థమే గానీ, అది కార్మిక సప్లైతో సమానం అవడం గానీ, ఆ సప్లై కన్నా ఎక్కువ అవడం గానీ, ఎన్నడూ జరగదు. అలా జరగదు అనడానికి రుజువు - సమాజంలో వుండే 'నిరుద్యోగ' జనాభాయే. కార్మికుల కోసం సామాజిక డిమాండు, సామాజిక సప్లై కన్నా ఎక్కువ గానో, సమానం గానో వుంటే సమాజంలో, ఒక్క నిరుద్యోగి కూడా వుండటం జరగదు. సమాజంలో నిరుద్యోగ జనాభా వుండటం

అంటే, కార్మికుల సామాజిక సప్లై కన్నా సామాజిక డిమాండు తక్కువగా వుండడమే - అని అర్థం.

సమాజంలో నిరుద్యోగ జనాభాయే లేని విధంగా, సప్లై కన్నా డిమాండే ఎక్కువ అవడం ఎన్నడూ జరగదు కాబట్టి, 'డిమాండ్ ఎక్కువై జీతాలు పెరగడం' అనే మార్పు, మొత్తం సమాజానికి ఎన్నడూ వర్తించదు.

'సప్లై డిమాండ్లలో మార్పుల్ని బట్టి జీతాలలో మార్పులు జరగడం' అనేది, విడి విడి శాఖల విషయాల్లో మాత్రమే జరుగుతుంది. ఒక ప్రత్యేక శాఖని తీసుకుంటే, ఆ శాఖలో పని చెయ్యడానికి కావలసిన ప్రత్యేక రకం శ్రమ శక్తి గల కార్మికులు, ఆ శాఖలో డిమాండు కన్నా తక్కువగా వుండడమో ఎక్కువగా వుండడమో, కొన్ని సార్లు జరగవచ్చు. అక్కడ సప్లై ఎక్కువగా వుంటే జీతాలు శ్రమ శక్తి విలువ కన్నా తగ్గడమూ; సప్లై తక్కువగా వుంటే, జీతాలు, శ్రమ శక్తి విలువ కన్నా పెరగడమూ, జరుగుతాయి.

ఒక శాఖలోకి 4 రకాల వేరు వేరు శ్రమ శక్తులు కావలసి వుంటే, అందులో ఏ రకం శ్రమ శక్తి విషయంలో సప్లై డిమాండ్లు సరిపోవో దాని విషయంలోనే జీతాలలో మార్పులు జరుగుతాయి. ఒక శాఖలో, ఒక రకం శ్రమ శక్తి విషయంలో, S ఎక్కువై జీతాలు తగ్గితే, ఇంకో రకం శ్రమ శక్తి విషయంలో S తక్కువై జీతాలు పెరగవచ్చు. S d లు సరిపోయిన శ్రమ శక్తుల విషయంలో జీతాలు ఎప్పటి లాగే వుండవచ్చు.

పెట్టుబడిదారీ విధానంలో, ఏ విషయం లోనూ సరైన సమిష్టి ప్లాను వుండనట్టే, సామాజిక శ్రమ శక్తిని వేరు వేరు శాఖల మధ్య వినియోగించే విషయంలో కూడా, సరైన ప్లాను వుండదు. అంటే, ఏ శాఖ ఎంత సరుకుని ఉత్పత్తి చెయ్యాలీ, ఏ శాఖ లోకి ఎంత శ్రమ శక్తి కావాలీ - అనే విషయాల్లో, సరైన ప్లాను వుండదు. కాబట్టి, వేరు వేరు శాఖల కార్మికుల సప్లై డిమాండ్లలో తేడాలు ఏర్పడడమూ; దాని వల్ల, ఆ శాఖల జీతాలు, ఆ శాఖల సగటు శ్రమ శక్తి విలువల నుంచీ తప్పిపోవడమూ, జరుగుతూనే వుంటాయి.

సమాజం మొత్తం మీద ఒక జనరల్ లాభం రేటు వుండగా, వేరు వేరు శాఖలు, జనరల్ రేటు కన్నా ఎక్కువ - తక్కువ లాభం రేట్లుని తీసుకుంటాయనీ, ఎక్కువ లాభం రేట్లు వున్న శాఖలు ఆ కాలాల్లో ఎక్కువ పెట్టుబడుల్ని ఆకర్షిస్తాయనీ, చూశాం. దాని వల్ల, ఆ శాఖల్లో కార్మికుల కోసం కూడా డిమాండు పెరుగుతుంది. ఆ పరిస్తితి, ఆ శాఖల్లో జీతాల్ని పెంచుతుంది. జీతాల పెరుగుదల ఆ శాఖ లోకి ఎక్కువ కార్మిక జనాభాని ఆకర్షిస్తుంది. అదే సమయంలో జనరల్ లాభం రేటు కన్నా తక్కువ లాభం రేటు వుండే శాఖలు, పెట్టుబడుల్ని పోగొట్టుకుంటాయి కాబట్టి, అక్కడ కార్మికులకు డిమాండ్ తగ్గి, జీతాలు తగ్గి, కార్మిక జనాభాలో కొంత భాగం ఆ శాఖల నించీ తరలిపోతుంది. లేదా ఆ శాఖలు కొత్త కార్మిక జనాభాని ఆకర్షించ లేవు కాబట్టి, అక్కడ కొత్త ఉద్యోగాలు వుండవు. మొత్తం మీద శాఖల మధ్య కార్మికుల సప్లైలు ఎక్కువ తక్కువలు కావడం అనేది, శాఖలలో పెట్టుబడుల ద్వారా ఏర్పడే డిమాండ్లు ఎక్కువ తక్కువలు కావడం మీదే ప్రధానంగా ఆధారపడి వుంటుంది. శాఖల్లో ఉత్పత్తుల S d లు మారడమూ, కార్మికుల S d లు మారడమూ కూడా, శాఖల్లో పెట్టుబడులు అస్తవ్యస్తంగా మారడం వల్లనే జరుగుతాయి.

ఒక శాఖలో డిమాండ్ తగ్గి, అక్కడ నిరుద్యోగ కార్మికులు వుండగా; ఇంకో శాఖలో డిమాండు పెరిగి, అక్కడ కార్మికులు చాలని పరిస్తితి ఏర్పడవచ్చు.

అయితే, మొత్తం కార్మికుల్నీ, మొత్తం పనినీ సర్దే ఏర్పాటు పెట్టుబడిదారీ విధానంలో కూడా జరుగుతుంది. కానీ, అది, ఆ విధానానికి తగిన స్వభావం తోటే, అంటే కేవలం 'మారకం విలువ దృష్టి తోటే' జరుగుతుంది. ఎలాగంటే: జీతాలు ఎక్కువగా వున్న శాఖల లోకి (ఆ ప్రత్యేకమైన శ్రమల లోకి) కార్మికులు ఎక్కువగా రావడం ప్రారంభిస్తారు. ఇంకా పనులు నేర్చుకునే దశలో వున్న కార్మికులు, ఆ రకం శ్రమ శక్తుల్ని నేర్చుకోవడం మొదలు పెడతారు. జీతాలు తగ్గి పోయిన పనుల లోకి కార్మికులు రావడం తక్కువై పోతుంది. ఈ రకంగా, శాఖల మధ్య పెట్టుబడులు మారడమూ, కార్మికులు మారడమూ కూడా, డబ్బు దృష్టి తోటే జరుగుతాయి. ఈ పద్ధతి లోనే వేరు వేరు శాఖల్లో కార్మికుల సప్లైలూ డిమాండ్లూ సమానమైనప్పుడు, జీతాల పెరుగుదలలూ తరుగుదలలూ ఆగుతాయి. కానీ ఇదంతా జరుగుతూ వున్న కాలంలో కూడా, నిరుద్యోగులు వుండి తీరతారు. ఒక శాఖలో ఎక్కువ డిమాండూ, ఇంకో శాఖలో ఎక్కువ సప్లయ్యీ (అందులో కొంత భాగం నిరుద్యోగులూ) తయారైన తర్వాతే, అవి సర్దుకునే పని జరుగుతూ వుంటుంది. ఏ శాఖ లోనూ, ఒక్క నిరుద్యోగి కూడా ఏర్పడకుండానూ, శ్రమ శక్తి కోసం ఏ శాఖ లోనూ ఎక్కువ

డిమాండ్ ఏర్పడకుండానూ, ఈ 2 అంశాల్నీ ఎప్పటి కప్పుడు సమానంగా సర్దే ఏర్పాటు పెట్టుబడిదారీ విధానంలో ఎన్నడూ వుండదు.

అన్ని శాఖల లోనూ యంత్ర విధానం అభివృద్ధి చెందుతూ, ఉత్పాదక శక్తులు పెరుగుతూ వున్న కొద్దీ, అన్ని శాఖల లోనూ కార్మికుల కోసం డిమాండ్లు తగ్గి, సప్లైలే ఎక్కువవుతూ వుంటాయి. ఒక శాఖ లోకి ఒక ప్రత్యేక యంత్రం వచ్చిన కొత్త సమయంలో మాత్రమే, ఆ శాఖలో కొంత కాలం పాటు, ఆ యంత్రానికి సంబంధించిన ఆపరేటర్లకూ మెకానిక్కులకూ కొంత డిమాండ్ ఏర్పడుతుంది. చాలా తొందర లోనే అక్కడ కూడా సప్లై ఎక్కువవుతుంది. ఏ ప్రత్యేక శాఖని తీసుకున్నా, ఆ ఉత్పత్తి స్థలాల బయట ఎంతో నిరుద్యోగ జనాభా వుంటూనే వుండడం వల్ల, ఆ శాఖలో జీతాలు పెరగడం అనే ప్రశ్నే వుండదు. డిమాండ్ పెరిగి, జీతాలు పెరిగే పరిస్థితి కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే, అందులోనూ కొన్ని రకాల కొత్త మేధా శ్రమల విషయంలో మాత్రమే, ఏర్పడుతూ వుంటుంది. 'శారీరక శ్రమల' విషయంలో, సప్లైలే ఎప్పుడూ ఎక్కువ అవుతూ వుంటాయి కాబట్టి, ఆ శ్రమల జీతాలు, 'సగటు శ్రమ శక్తి విలువ' కన్నా ఎప్పుడూ తగ్గిపోయి వుంటాయి.

జీతం - అంటే, జనరల్‌గా - 'సగటు శ్రమ శక్తి విలువ'. ఒక 'సగటు శ్రమ శక్తి విలువ'ని 10 వస్తువులుగా అనుకుందాం. ఆ శాఖలో కార్మికుల సప్లై ఎక్కువైతే, జీతం 8 వస్తువులే కావచ్చు. S తక్కువైతే, జీతం 12 వస్తువులు కావచ్చు. S d లు సరిపోతే జీతం 10 వస్తువులు గానే వుండవచ్చు. జీతం 8 వస్తువులే అయినప్పుడు, శ్రమ శక్తి విలువే తగ్గిందని గానీ, జీతం 12 వస్తువులు అయినప్పుడు శ్రమ శక్తి విలువే పెరిగిందని గానీ, అర్థం కాదు. శ్రమ శక్తి విలువలో మార్పులు జరగకుండానే, ఆ సమయంలో వున్న S d ల్ని బట్టి, జీతంలో మార్పులు జరగవచ్చు.

జీతంలో మార్పులు 3 వేపుల నించి జరగవచ్చు. (1) శ్రమ శక్తి విలువ లోనే మార్పుల వల్లా, (2) కార్మికుల సప్లైలో మార్పుల వల్లా, (3) కార్మికుల కోసం డిమాండ్‌లో మార్పుల వల్లా.

శ్రమ శక్తి విలువ - అనేది 'సగటు పరిస్థితి'. లేదా, 'జనరల్ పరిస్థితి.' లేదా, 'కేంద్రం'. కార్మికుల S d లు, ఆ 'కేంద్రం' మీద ప్రభావం చూపే ప్రత్యేక పరిస్థితులు. ఆ ప్రభావాన్ని బట్టి, జీతం, 'శ్రమ శక్తి విలువ' నించీ పైకో కిందకో తప్పుకోవచ్చు.

జీతాల చలనాల్ని (జీతాలలో మార్పుల్ని) జనరల్ కోణం నించీ, ప్రత్యేక కోణం నించీ కూడా అర్థం చేసుకోవాలి. ఈ 2 కోణాలూ కూడా జీతాన్ని 'తగ్గించే' ధోరణి తోనే వుంటాయి.

**జీతంలో మార్పుల్ని 'జనరల్ కోణం' నించి చూస్తే:** 'శ్రమ శక్తి విలువ' లోనే మార్పు జరగడం వల్ల జరిగే మార్పు ఇది. ప్రతి శాఖ లోనూ ఉత్పాదక శక్తులు పెరుగుతూనే వుంటాయి - అని చూశాం. ఉత్పాదక శక్తులు పెరుగుతూ వుండటం వల్ల కార్మికులకు జీతంగా వచ్చే 'వస్తువుల పరిమాణం' కూడా కొంత పెరుగుతుందని కూడా చూశాం. అయితే, ఉత్పాదక శక్తి పెరిగిన తర్వాత కార్మికులు ఉత్పత్తి చేసే వస్తువుల పరిమాణంతో పోలిస్తే, ఆ పెరిగిన జీతం, గతంలో కన్నా తగ్గడమేనని కూడా చూశాం (మొదటి సంపుటంలో, 'పని దినం' చాప్టరులో). ఉత్పాదక శక్తులు పెరుగుతోన్న కొద్దీ 'పని దినం'లో 'అవసర శ్రమ కాలం' తగ్గి, 'అదనపు శ్రమ కాలం' పెరుగుతూ వుంటుంది. ఈ రకంగా పని దినంలో 'శ్రమ శక్తి పునరుత్పత్తి' కోసం పని చెయ్యవలసిన భాగం జనరల్‌గా తగ్గుతూనే వుంటుంది. దీన్ని, 'శ్రమ శక్తి విలువ రెలెటివ్‌గా తగ్గడం' అంటాం. అంటే, గత పని దినంలోని 'అవసర భాగం'తో పోలిస్తే, కొత్త పని దినంలోని 'అవసర భాగం' తగ్గుతుంది. ఇది, శ్రమ శక్తి విలువే రెలెటివ్‌గా తగ్గడం. (కొత్త శ్రమ శక్తి విలువకి సంబంధించిన వస్తువులు గతం కన్నా ఎక్కువ అయినప్పటికీ.)

**'జీతం'లో మార్పుల్ని ప్రత్యేక కోణం నించి చూస్తే:** ఇది, కార్మికుల S d లలో మార్పుల వల్ల జరిగే మార్పు. ఉత్పాదక శక్తులు పెరుగుతోన్న కొద్దీ, కార్మికుల సప్లై కన్నా డిమాండు ఎప్పుడూ తగ్గుతూనే వుంటుంది కాబట్టి (కొన్ని మేధా శ్రమల్లో తప్ప), జీతం, సగటు శ్రమ శక్తి విలువ కన్నా తగ్గే వుంటుంది.

ఈ రకంగా జీతంలో మార్పుల్ని, జనరల్ కోణంలో చూసినా, ప్రత్యేక కోణంలో చూసినా, ఈ 2 రకాల పరిస్థితులూ కూడా, జీతాల్ని తగ్గించే స్వభావం తోనే వుంటాయి.

పెట్టుబడిదారీ విధానంలో - బట్టా, పంచదారా - వంటి నిర్జీవ సరుకుల విషయంలో 'ధర'కి సంబంధించి - విలువా, ఉత్పత్తి ధరా, మార్కెట్ ధరా - అనే 3 అంశాలు వుంటాయి - అని చూశాం. అలాగే, 'కార్మికులు' అనే సజీవ సరుకు విషయంలో కూడా

- (1) శ్రమ విలువా, (2) శ్రమ శక్తి విలువా, (3) శ్రమ శక్తి విలువ నించీ పైకో కిందకో జరిగే జీతమూ - అనే 3 అంశాలు వుంటాయి.

'శ్రమ విలువే' జీతంగా ఎన్నడూ వుండదు. అలా వుంటే, పెట్టుబడికి లాభం మిగలడం అనే ప్రశ్నే వుండదు కాబట్టి. 'శ్రమ శక్తి విలువే' జీతంగా వుండా లంటే, కార్మికుల s dలు సమానంగా వుండాలి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో అలా కొన్ని శాఖల్లో, కొన్ని కాలాల్లో జరగవచ్చు గానీ ఎల్లప్పుడూ జరగదు. కాబట్టి, 'జీతం' అనేది, శ్రమ శక్తి విలువ నించీ పైకో కిందకో జరిగే రాసిగా మాత్రమే వుంటుంది.

## కార్మికుల మధ్య పోటీ:

ఏ శ్రమని తీసుకున్నా, కార్మికుల కోసం డిమాండ్ కన్నా కార్మికుల సప్లయ్యే ఎక్కువగా వుంటుందని చూశాం. ఈ పరిస్తితి, కార్మికుల మధ్య కూడా 'పోటీ'ని తెస్తుంది. కార్మికులు తక్కువ జీతాలకే సిద్ధపడేలా చేస్తుంది.

అయితే, కార్మికుల మధ్య పోటీకి, కార్మికులు బాధ్యులు కారు. పెట్టుబడిదారీ విధానమే కార్మికులు కూడా పోటీ పడవలసిన పరిస్థితులు కల్పిస్తుంది. కార్మికుల మధ్య పోటీ, 'బతుకు దెరువు' కోసమే గానీ పెట్టుబడిదారుల మధ్య పోటీ లాగ 'లాభాల' కోసం కాదు. రెంటినీ ఒకే రకంగా ఒకే స్వభావంతో జరిగే విషయాల్లాగ చూడ కూడదు.

'రెంటినీ ఒకే రకంగా చూడకూడదు' అంటే, కార్మికుల మధ్య పోటీ మంచిదేననీ, అది తప్పనిసరిగా సాగాలనీ, అర్థం కాదు. కార్మికుల పోటీని, 'స్వార్థం కోసం' జరిగే పోటీ లాగ భావించకూడదని మాత్రమే అర్థం. 'పోటీ' అనేది ఎక్కడ వున్నా అది వైరుధ్యాలతో వుండే విషయమే. అది తప్పనిసరిగా 'స్వార్థ పూరిత మైన' స్వభావాన్ని కలిగిస్తుంది. అది కార్మికుల్లో వుంటే, అది వారి ఐక్యతని నాశనం చేస్తుంది. కార్మికుల మధ్య పోటీ లేకుండా (లేదా, అది చాలా తక్కువగా వుండి), ఐక్యతే ఎక్కువగా వుంటే, జీతం 'సగటు శ్రమ శక్తి విలువ' కన్నా తగ్గడం జరగదు.

# 'జీతం' గురించి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త ఏమంటాడు?

ఈ విషయం గతంలో (మొదటి సంపుటంలో, 'శ్రమ శక్తి విలువ' చాప్టరులో) కొంత చూసిందే. అది గుర్తు చేసుకుని, ఇక్కడ ఇంకా కొన్ని వివరాలు చూడాలి.

మన ప్రకారం, జీతం అంటే 'శ్రమ విలువ' కాదు; 'శ్రమ శక్తి విలవే.' కానీ, పెట్టుబడిదారీ అవగాహన ప్రకారం, 'జీతం' అంటే, 'చేసిన పనికంతటికీ బదు లుగా' అందేది. అంటే, 'శ్రమ విలువే'. 'శ్రమ విలువ' అనే మాటలు, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు వాడక పోయినా, 'జీతం' గురించి వాళ్ళ అర్థం అదే. శ్రమ శక్తి విలువ- అనే విషయం వాళ్ళ అవగాహనలో వుండదు.

వాళ్ళ అవగాహన ఒక ఖచ్చితమైన స్పష్టతతో 'ఫలానా రకంగా' వుంటుందని చెప్పడానికి కూడా వీలు వుండదు. జీతానికి ఒక 'కేంద్రం' వుంటుందనీ, ఆ కేంద్రం మీద కార్మికుల s d లు పని చేస్తాయనీ గ్రహించాలంటే, మొదట 'కేంద్రం' అనే దాన్ని గ్రహిం చాలి. కానీ వాళ్ళ దృష్టిలో 'కేంద్రం' అనే అవగాహనే వుండదు. కేవలం s d లు మాత్రమే వుంటాయి. ఆ s d లు దేని మీద పని చేస్తాయి - అనే ప్రశ్న వాళ్ళకు వుండదు.

కార్మికుల s d లలో, s కన్నా d ఎక్కువగా వుండడం అనేది, విడి శాఖల్లో మాత్రమే జరగవచ్చు. అది కూడా కొన్ని శ్రమల విషయం లోనే. ఆ శ్రమల విషయంలో కూడా కొన్ని సందర్భాల్లోనే. సమాజాన్ని మొత్తంగా చూసినప్పుడైతే, కార్మికుల s కన్నా d ఎక్కు వగా వుండడం ఎన్నడూ జరగదు.

కానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, ఒక శాఖకి సంబంధించిన కార్మికుల s d ల్నీ, సమాజం మొత్తం లోని s d ల్నీ, ఒకే రకంగా చూస్తారు. వాళ్ళ ప్రకారం, ఒక విడి శాఖలో కార్మికుల s dలు ఇటూ అటూ మారినట్టు గానే, సమాజం మొత్తం మీద కూడా s dలు ఇటూ అటూ మారుతూనే వుంటాయి. అంటే, సమాజం మొత్తం మీద కూడా కార్మికుల కోసం డిమాండు ఎక్కువగా వుండే కాలాలు తప్పనిసరిగా

వుంటాయి - అని వాళ్ళ అర్థం. అదే నిజమైతే, సమాజం మొత్తం మీద డిమాండు ఎక్కువగా వున్న కాలాల్లో సమాజంలో 'ఒక్క నిరుద్యోగి' కూడా వుండ కూడదు కదా? కానీ, నిరుద్యోగులు లేని దశ సమాజంలో ఎన్నడూ వుండదు.

కానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, 'సప్లై, డిమాండ్ల' సూత్రాన్ని, 'సరుకుల' విషయంలో వల్లించి నట్టే, 'మనుషుల' (కార్మికుల) విషయంలో కూడా వల్లిస్తారు. సరుకుల విషయంలో సప్లయ్యీ డిమాండూ ఒక దానికి తగ్గట్టుగా ఒకటి మారుతూ ఎలాగైతే సర్దుకుంటూ వుంటాయో, అలాగే కార్మికుల విషయంలో కూడా S dలు సర్దుకుంటూ వుంటాయి - అనే దృష్టి తోటే వాళ్ళు వుంటారు. అంటే, వాళ్ళు, మనుషుల సప్లైని, సరుకుల సప్లై లాగే చూస్తారు. వాళ్ళ దృష్టిలో 'కార్మికులు' అంటే 'సరుకులే' గనక, వాళ్ళు, మనుషుల విషయంలో కూడా సరుకుల - భాషే వుపయోగిస్తారు.

పెట్టుబడిదారీ దృష్టికి 'నిరుద్యోగం' అనేది సమస్యే కాదు. అది వస్తూ పోతూ వుండే 'సహజ విషయం!' వాళ్ళ ప్రకారం, అది ఎలా సాగుతుందంటే - కార్మిక సప్లై పెరిగినప్పుడు క్రమంగా కొంత నిరుద్యోగం ఏర్పడడమూ, జీతాలు తగ్గడమూ జరిగి, కొంత జనాభా నాశనమై పోతుంది. అప్పుడు సప్లై తగ్గి, క్రమంగా జీతాలు పెరిగి, నిరుద్యోగం కూడా పూర్తిగా పోయి, కార్మిక జనాభా మళ్ళీ అభివృద్ధి చెందుతుంది. ఈ రకంగా, కార్మిక S dలలో తేడాలు, వాటికవే సర్దుకుపోతూ, నిరుద్యోగం కూడా తాత్కాలిక సమస్యగా మాత్రమే వుంటూ, అంతా సవ్యంగా జరిగి పోతూ వుంటుంది. అయితే, ఒక వేపున ఇలా సూత్రీకరించే ఆర్థిక వేత్తలే, ఇంకో వేపు - 'కార్మిక జనాభా పెరిగిపోతోంది; కార్మికులు పెరిగి పోవడం కార్మికుల తప్పే కాబట్టి, వాళ్ళ జీతాలు తగ్గటానికీ, వాళ్ళ నిరుద్యోగానికీ, వాళ్ళే బాధ్యులు' అని కూడా సూత్రీకరిస్తూ వుంటారు.

కార్మికుల కందరికీ పనులు దొరకని కాలంలో, కొంత జనాభా నాశనమై పోతారని, పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలే చెపుతారు కదా? ఆ కాలంలో కూడా అందరికీ పనులు దొరకడమే జరిగితే, కొంత కార్మిక జనాభా నాశనమై పోయే పరిస్తితే ఏర్పడదు కదా? కొంత జనాభా చచ్చిపోయి, ఆ రకంగా S dలు సమానం అయితే, అదా సమస్యకి పరిష్కారం? నిరుద్యోగం తగ్గిపోయే కాలంలో అయితే, కార్మిక జనాభా అభివృద్ధి చెందుతారని కూడా వాళ్ళే చెపుతారు. అంటే, నిరుద్యోగమే లేకుండా అందరికీ బతుకుదెరువులు వుంటే, కొంత జనాభా నాశనమవడం ఏ కాలం లోనూ జరగదు కదా? - కార్మిక జనాభా గురించి ఇలాంటి ప్రశ్నలు పెట్టుబడిదారీ మేధావులకు వుండవు.

సరుకుల విషయంలో గానీ, మనుషుల విషయంలో గానీ, సప్లై - డిమాండ్లు వాటినవే సరిపుచ్చుకుంటూ వుంటాయనే అభిప్రాయం పరమ మూఢ నమ్మకం. సరుకుల విషయంలో, సప్లై డిమాండ్లు సరిపుచ్చుకోవడం కొంత దీర్ఘ కాలంలో అనేక ఎగుడు దిగుళ్ళతో, అనేక కష్ట నష్టాలతో, అరకొరగా జరుగుతుంది. కార్మికుల విషయంలో అయితే, సప్లై డిమాండ్లు సరిపుచ్చుకోవడం, ఆ మాత్రంగా కూడా జరగదు. సప్లైకి తగిన డిమాండు ఎన్నడూ వుండదు. కాబట్టి, కార్మిక జనాభాలో కొంత భాగం ఎప్పుడూ అరకొర ఉద్యోగాల్లోనూ, కొంత భాగం ఎప్పుడూ నిరుద్యోగం లోనూ వుంటారు. కొంత భాగం అకాల మరణాల్లోనూ.

సప్లై డిమాండ్లు ఎప్పుడూ అసమానం గానే వుండడం - అనే పరిస్తితి దేనిని సూచిస్తుందంటే, సమాజంలో వర్గాలూ, వర్గాలలో సెక్షన్లూ వున్నాయనే సంగతిని సూచిస్తుంది. వర్గాలు వుంటేనే, ఆ అస్తవ్యస్తత. సరైన సమష్టి ప్లాను లేని సమాజంలో, సమాజం మొత్తానికి S dలు ప్రతీ సందర్భం లోనూ సరిపుచ్చుకోవడం అనేది అసాధ్యమైన విషయం. మొత్తం సమాజానికి కావలసిన 'పని'ని, మొత్తం సమాజ జనాభా అంతా ఒక సమాన సూత్రం ప్రకారం పంచుకుంటేనే, సప్లై డిమాండ్లు ఎప్పుడూ సమానంగా వుండడం సాధ్యం. నిరుద్యోగం, తాత్కాలికంగా కూడా వుండదు. కానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల దృష్టిలో ఈ రకం పరిష్కారం ఏదీ వుండదు. ఎందుకంటే, వాళ్ళ దృష్టిలో అసలు సమస్యే వుండదు గనక.

సరుకుల 'ధరల' విషయంలో గానీ, కార్మికుల 'జీతాల' విషయంలో గానీ, S d ల తేడాల వల్లనే అవి అలా వున్నాయి - అనే పైపై జవాబు తోనే వాటిని పూర్తిగా అర్థం చేసుకోలేము. ఆ S dల సంబంధాలు, ఏ 'పునాది' నించి పుట్టుకొస్తున్నాయో ఆ పునాదిని అర్థం చేసుకోగలిగినప్పుడే, 'ధరల'కూ 'జీతాల'కూ సంబంధించిన విషయాలు సరిగా అర్థం చేసుకోగలం.

కార్మికుల s d ల గురించి, ఇప్పుడు **మార్క్సు** నించి కొన్ని మాటలు:

**1.**"**కా**ర్మికుల ఉత్పాదక శక్తి పెరగడంతో పాటు, పెట్టుబడి, మరింత వేగంగా కూడబెట్ట బడుతుంది. జీతాల రేట్లు కొంత వరకూ పెరిగినా, పెట్టుబడి మరింత వేగంగా పోగుబడడం వల్ల కార్మికులకు డిమాండు పెరుగుతుందనీ, ఆ విధంగా కార్మికులకు అనుకూల పరిస్థితు లేర్పడతాయనీ, కొందరు ఊహిం చవచ్చు. ఆడం స్మిత్ సరిగ్గా ఇలాగే వూహించాడు. ఆయన కాలంలో, ఆధునిక పరిశ్రమలు ఇంకా బాల్యా దశలో వుండేవి. ఆ వూహ నిజమేననుకుంటున్న ఈ నాటి రచయితలు, ఇంగ్లండులో గత 20 ఏళ్ళ లోనూ, జనాభా కన్నా పెట్టుబడులు ఎక్కువ త్వరితంగా పెరిగి నప్పటికీ, జీతాలు పెరగలేదేమిటని ఆశ్చర్యం ప్రక టిస్తున్నారు. కానీ, పెట్టుబడుల సమీకరణ పెరిగే కొద్దీ వాటి విభాగాలు అంతకంతకూ మార్పు చెందుతాయి. స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి కన్నా క్రమంగా పెరుగుతుంది. ఈ సూత్రాన్ని బార్టన్, రికార్డో, సిస్మాండీ, ప్రొఫెసర్ రిచర్డ్ జోన్స్, ప్రొఫెసర్ రామ్సే, చెర్బలిజ్ - మొదలైన వారు, ఇంచుమించు సరిగానే వివరించారు. పెట్టుబడి లోని స్థిర, అస్థిర విభాగాలు 1 : 1 పాళ్ళలో వుంటే, అవి కాలక్రమేణా, పరిశ్రమలు అభివృద్ధి చెందేకొద్దీ, 5 : 1 పాళ్ళుగా మారవచ్చు. ఉదాహరణకు, 600 పౌనుల పెట్టుబడిలో 300 పౌను లను ముడి పదార్థాలూ వగైరా ఉత్పత్తి సాధనాలకూ, మరో 300 పౌనులను జీతాలకూ, కేటాయించారను కుందాం. అప్పుడు 300 జీతాలతో 300 మంది కార్మి కుల కోసం వున్న డిమాండుని, 600 మంది కార్మికుల కోసం పెరిగేటట్టు చేయడానికి, మొత్తం పెట్టుబడి రెట్టింపు అయితే చాలు. కానీ, 600 పెట్టుబడిలో 500 ని ఉత్పత్తి సాధనాలకూ, 100 ని జీతాలకూ కేటాయించే విధంగా (5 : 1) పెట్టుబడి పాళ్ళు వున్నా యనుకుందాం. అప్పుడు, 100 జీతాలతో 100 మంది కార్మికుల చొప్పున వున్న డిమాండుని, 600 మంది కార్మికులకు పెరిగేటట్టు చేయాలంటే, 600 పెట్టుబడి 3600 గా పెరగాలి. అంటే, పరిశ్రమలు అభివృద్ధి చెందే కొద్దీ, కార్మికుల కోసం డిమాండూ పెట్టుబడుల సమీకరణా, సరి సమానంగా నడవవు. పెట్టుబడులు పెరిగే కొద్దీ కార్మికులకు డిమాండు పెరిగే మాట నిజమే. కానీ, పెట్టుబడుల పెరుగుదలతో పోలిస్తే మాత్రం కార్మికుల కోసం డిమాండులో పెరుగుదల తక్కువ స్థాయి లోనే వుంటుంది. ఈ కొద్ది అంశాలను బట్టి బోధపడే దేమంటే, ఆధునిక పరిశ్రమల అభివృద్ధి, అంతకంతకూ, కార్మికుల కన్నా పెట్టుబడిదారులకే ఎక్కువ లాభకరం అవుతుంది". [" జీతాలు, ధర, లాభం; కూలి పని, పెట్టుబడి"లో. పేజీలు : 40-41, మార్క్సిస్టు ప్రచురణలు, విజయవాడ-2]

**2.** " శ్రమకు డిమాండ్ పెరగడమూ, పెట్టుబడి పెర గడమూ, ఒకటి కాదు. అలాగే, శ్రమ సప్లై పెర గడమూ, కార్మిక వర్గం పెరగడమూ కూడా, ఒకటి కాదు. ఇది, 2 స్వతంత్ర శక్తులు ఒక దాని మీద ఒకటి పని చెయ్యడానికి సంబంధించిన విషయం (సందర్భం) కాదు .... పెట్టుబడి ఒకే సమయంలో 2 వైపులా పనిచేస్తుంది. దాని కూడిక, ఒక వేపు శ్రమకు డిమాండ్‌ని పెంచుతూ, ఇంకో వేపు కార్మికుల సప్లైని కూడా పెంచుతుంది, వారిని పని నించీ తొలగించడం ద్వారా. అదే సమయంలో, 'నిరుద్యోగ' కార్మికుల వత్తిడి, ఉద్యోగ కార్మికులు ఎక్కువ శ్రమ ఇచ్చే లాగ చేస్తూ వుండగా (పనుల్లో వున్న కార్మికులు, ఆ ఉద్యో గాల్ని నిలుపుకోవడం కోసం, ఎక్కువ శ్రమ ఇస్తూ వుంటారు) ఆ విధంగా, శ్రమ సప్లై, కొంత వరకూ శ్రామికుల సప్లై నించి వేరైన విషయంగా వుంటుంది. కార్మికులు .... తాము గతం కన్నా ఎక్కువ పని చెయ్య డానికీ, తమకు దక్కకుండా పోయే సంపద భాగాన్ని మరింత ఎక్కువగా ఉత్పత్తి చెయ్యడానికీ, తమ శ్రమ ఉత్పాదకత పెరిగిన కొద్దీ తమ పని పెట్టుబడి విస్తర ణకు సాధనంగా మరింత ప్రమాదకరంగా పరిణమించ డానికీ - గల రహస్యం తెలుసుకున్న వెంటనేనూ; తమ మధ్య వున్న పోటీ తీవ్రస్థాయి, పూర్తిగా రెలెటివ్ అదనపు జనాభా ఒత్తిడి పైనే ఆధారపడి వుందనే విషయం తెలుసుకున్న వెంటనేనూ; తమ వర్గంపై పెట్టుబడిదారీ విధానపు వినాశకర ప్రభావాలను బల హీనపరచడం కోసమూ, నాశనం చెయ్యడం కోసమూ, ట్రేడ్ యూనియన్లూ మొదలైన వాటిని ఏర్పాటు చేసు కోవడం ద్వారా, ఉద్యోగులకూ నిరుద్యోగులకూ మధ్య ఒక రెగ్యులర్ సహకారాన్ని ఆర్గనైజ్ చేసుకు నేందుకు ప్రయత్నించిన వెంటనేనూ - ఏం జరుగు తుందంటే, సప్లై - డిమాండ్లు అనే 'శాశ్వతమైన, పవిత్రమైన' సూత్రానికి ఉల్లంఘన జరుగుతుంది. అది చూసి, పెట్టుబడీ, దాని తొత్తు అయిన రాజకీయ ఆర్థిక శాస్త్రమూ (.... ఇట్స్ సైకోఫాంట్ పొలిటికల్ ఎకా నమీ) గావుకేకలు పెడతాయి. ఉద్యోగులకూ నిరు

ద్యోగులకూ మధ్య జరిగే ప్రతీ ఒక్క కలయికా (కాంబినేషన్ ఆఫ్ ఎంప్లాయ్డ్ అండ్ అనెంప్లాయ్డ్), సప్లై - డిమాండ్ల సూత్రపు సఖ్యతా పూర్వకమైన చర్యను ఆటంకపరిచి తీరుతుంది. కానీ, పారిశ్రామిక రిజర్వ్ సైన్యాన్నీ, దానితో పాటు పెట్టుబడిదారీ వర్గం మీద కార్మిక వర్గం ఎబ్సల్యూట్‌గా అధారపడడాన్నీ నివారించిన వెంటనే, పెట్టుబడి, తన భజనకారుడితో పాటు సప్లై - డిమాండ్ల 'పవిత్ర సూత్రానికి' వ్యతిరేకంగా తిరగబడి, ఆ నియమంలో తనకు సరిపడని వాటిని (ఇనాడిక్వసీస్) బలప్రయోగపు పద్ధతుల ద్వారానూ, ప్రభుత్వ జోక్యం ద్వారానూ సర్దడానికి ప్రయత్నిస్తుంది."-[కాపిటల్-1, పేజీలు 599-600 ]

**3.** " సప్లై - డిమాండ్ల విషయానికి వెనక, ఎటు వంటి పరిస్తితి వుంటుందంటే (సప్లై డిమాండ్లు దేనిని 'ప్రీసపోజ్' చేస్తాయంటే), సమాజపు మొత్తం 'ఆదా యాన్ని' పంచుకుని వాడుకునే వేరు వేరు వర్గాలూ, వర్గాలలో సెక్షన్లూ ఉనికిలో వుండడం - అనే పరిస్తితి." [కాపిటల్ - 3, పేజీలు 194 -195].

సమాజంలో వర్గాలూ, వర్గాల్లో సెక్షన్లూ వుండడం వల్లనే, ఆ పరిస్తితులు, సప్లై - డిమాండ్ల సమస్యని తీసుకొస్తాయి. - అని అర్థం. ఈ సమస్య వుందంటే, దాని వెనకాల ఆ పరిస్తితులు వున్నాయని అర్థం.

# జీతాలు పెరిగితే, సరుకుల విలువలు మారతాయా?

ఒక సరుకు విలువ 14. దాని అంతర్గత భాగాలు, $6_C + 4_V + 4_S = 14$. ఈ సరుకుని మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి చెయ్యడంలో, 'పని స్తలం'లో ఉత్పాదక శక్తి గానీ, 'స్తిర' గానీ మారకుండా, 'అస్తిర' భాగం మాత్రమే 4 గాక, 5 అయిందనుకుందాం. అంటే, జీతాలు పెరి గాయనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? సరుకు విలువ 14 గానే వుంటుందా, 15 అవుతుందా?

జీతాలు పెరగక ముందు, కార్మికుల సజీవ శ్రమ ద్వారా ఉత్పత్తి అయ్యే విలువ $4_V + 4_S = 8$. 8 లో, జీతం 4 గా వుంది కాబట్టే మిగిలిన 4, అదనపు విలువ అయింది. జీతాలు పెరిగాక కూడా కార్మికులు ఇచ్చే సజీవ శ్రమ పరిమాణం ఏమీ మారదు. దాని విలువ అప్పుడు కూడా 8 గానే వుంటుంది. అయితే, అప్పుడు జీతాల భాగం 5 కాబట్టి, అది పోగా మిగిలే అదనపు విలువ భాగం 3 అవుతుంది. 'సరుకు విలువ'ని చూస్తే, అది ఇప్పుడు $6_C + 5_V + 3_S = 14$ గానే, గతంలో లాగే, వుంటుంది. అంటే, జీతాలు పెరిగినా, 'సరుకు విలువ' మారలేదు. 'అదనపు విలువ' తగ్గడం మాత్రమే జరిగింది. జీతాలు ఎంత పెరిగితే, అదనపు విలువ అంత తగ్గింది.

సజీవ శ్రమ విలువ - 'జీతాలు' గానూ, 'అదనపు విలువ' గానూ పంపకం అవ్వాలి కాబట్టి, ఆ 2 భాగాలూ ఒక దాని కొకటి వ్యతిరేక దిక్కుల్లో వుంటాయి. అంటే, ఒకటి పెరిగితే, రెండోది తగ్గుతుంది. ఒకటి తగ్గితే, రెండోది పెరుగుతుంది. V పెరిగితే, S తగ్గుతుంది. V తగ్గితే, S పెరుగుతుంది. ఈ విషయం, జాగ్రత్తగా మాట్లాడాలి. ఎలాగంటే - 'జీతం పెరిగితే అదనపు విలువ తగ్గుతుంది' అనాలి గానీ, 'అదనపు విలువ తగ్గితే జీతం పెరుగుతుంది' అన కూడదు. జీతాన్ని తీసివేశాక మిగిలేది అదనపు విలువ. అంతే గానీ, అదనపు విలువని తీసివేశాక మిగిలేది జీతం కాదు.

జీతం పెరగడం వల్ల అదనపు విలువ తగ్గుతుంది. అంతే గానీ, 'సరుకు విలువ' మారదు. పెరగదు. అదనపు విలువ తగ్గితే, అదనపు విలువ రేటూ, లాభం రేటూ కూడా తగ్గుతాయి.

**'అదనపు విలువ రేటు'లో మార్పు:**

జీతాలు పెరగక ముందు - 4 V తో, 4 S.

అదనపు విలువరేటు = —— × 100 = 100%

జీతాలు పెరిగాక - 5 V తో, 3 S.

అదనపు విలువ రేటు = —— × 100 = 60%

జీతాలు పెరగడం వల్ల, అదనపు విలువ తగ్గి, అదనపు విలువ రేటు కూడా తగ్గింది.

**'లాభం రేటు'లో మార్పు:**

జీతాలు పెరగక ముందు, $k = 6_C + 4_V = 10\ k$

జీతాలు పెరిగాక ......... $= 6_C + 5_V = 11\ k$

(k = కాస్ట్‌ప్రైస్. 'లాభం రేట్ల'ని కాస్టుప్రైసుల మీద గాక 2 సందర్భాలలోనూ సరుకుకి సంబంధిం

చిన మొత్తం పెట్టుబడుల మీదే చూడాలి. కానీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, లాభం రేట్లని కాస్టుప్రైసుల మీదే చూద్దాం. జీతం పెరగక ముందూ, పెరిగిన తర్వాతా, 2 సందర్భాల్లోనూ, ఒకే రకంగా చూడవచ్చు. అంటే 2 సందర్భాల్లోనూ మొత్తం పెట్టుబడుల్ని తీసుకోవడం గానీ, లేదా 2 సందర్భాల్లోనూ కాస్టుప్రైసుల్ని తీసుకోవడం గానీ చేస్తే, సారాంశం ఒక్కలాగే వుంటుంది.)

జీతాలు పెరగక ముందు: 10 k కి, 4 s.

లాభం రేటు = —— × 100 = 40%.

జీతాలు పెరిగాక: 11 kకి, 3 s

లాభం రేటు = —— × 100 = 27%.

జీతాలు పెరిగాక, లాభం తగ్గి, లాభం రేటు కూడా తగ్గింది. (ఈ లాభం రేట్లని కాస్టు ప్రైసుల మీద గాక, 'మొత్తం పెట్టుబడుల' మీదే చూసినా, మొదటి లాభం రేటు కన్నా రెండో లాభం రేటు తక్కువ గానే వుంటుంది. ఎందుకంటే, 2 ఉదాహరణల్లోనూ 'పెట్టుబడి' ఒక్కలాగే వుండి, 2వ వుదాహరణలో 'లాభం రాసి' తగ్గుతుంది కాబట్టి.)

ఇప్పుడు, జీతాలు 'తగ్గినట్టుగా' (మిగతా విషయాలేవీ మారకుండా) చూస్తే, 'అదనపు విలువ' ఎలా వుంటుంది? - పెరుగుతుంది.

జీతాలు 4 గాక, 3 అనుకుందాం. జీతాలు తగ్గినా 'సజీవ శ్రమ' ద్వారా ఉత్పత్తి అయ్యే 'విలువ' ఇప్పుడు కూడా గతంలో లాగే 8 గానే వుంటుంది. అందులో జీతాలు 3 అయితే, అదనపు విలువ 5. ఈ రకంగా, జీతాలు తగ్గితే, అదనపు విలువ పెరుగుతుంది. దానితో పాటే లాభం రేటూ పెరుగుతుంది.

ఇంకో రకం వుదాహరణ:

ఒక బట్ట విలువ, $6_C + 4_V + 4_S = 14$. ఈ బట్ట ఉత్పత్తి అయ్యే పని స్థలంలో ఉత్పాదక శక్తి మారలేదు. కానీ, దీనికి ముడి పదార్థాన్ని ఇచ్చే పని స్థలంలో ఉత్పాదక శక్తి తగ్గింది. అంటే పత్తి పంట పాడై, ఈ బట్టకి పట్టే దారం విలువ 2 పెరిగిందనుకుందాం. ఆ దారానికి, విలువే ధరగా వుందనుకుందాం. (దారాన్ని కొన్న పెట్టుబడిదారుడు, దాన్ని దాని విలువ తోనే కొన్నట్టు అనుకుంటాం.) దారం విలువ 2 పెరగడం వల్ల, బట్టకి సంబంధించిన 'స్థిర' విలువ, గతంలో లాగ 6 గా గాక ఇప్పుడు 8 అవుతుంది. ఈ సమయంలోనే ఈ సరుకుకి సంబంధించిన జీతాల భాగం కూడా గతంలో లాగ 4 గాక, 5 అయిందనుకుందాం. అంటే, ఇప్పుడు స్థిర లోనూ అస్థిర లోనూ కూడా మార్పులు జరిగాయి. ఇలా, స్థిరా అస్థిరా కూడా పెరిగిన తర్వాత, బట్ట విలువ, $8_C + 5_V + 3_S = 16$ అవుతుంది. అంటే బట్ట విలువ గతంలో కన్నా, 2 పెరిగింది. బట్ట విలువ ఇలా పెరగటానికి కారణం ఏమిటి? - కారణం, స్థిరలో పెరుగుదలే గానీ అస్థిరలో పెరుగుదల కాదు. అస్థిరలో 1 పెరిగినా, దాని వల్ల అదనపు విలువలో 1 తగ్గింది కాబట్టి, ఆ విధంగా అస్థిరలో మార్పు, సరుకు విలువని మార్చదు. ఈ ఉదాహరణలో, సరుకు విలువలో మార్పుకి కారణం స్థిరలో మార్పే.

జీతాలు మారితే సరుకు విలువ మారుతుందా - అనే విషయం కోసమే ఇదంతా చూస్తున్నాం. జీతాలు - అంటే, ఒక శాఖలో సరుకుకి సంబంధించినవైనా కావచ్చు. మొత్తం అన్ని శాఖల సరుకుల రాసికి సంబంధించినవైనా కావచ్చు. ఒక్క రోజు జీతాలైనా కావచ్చు. సంవత్సర జీతాలైనా కావచ్చు. ఉదాహరణని ఎలా తీసుకున్నా సారాంశం ఒకటే. ఆ సారాంశం ఏమిటంటే - జీతాలు మారితే, ఆ మార్పుకి తగ్గట్టుగా 'అదనపు విలువ' మారుతుందే గానీ, 'సరుకు విలువ' మారదు.

> " ఏ పరిస్థితుల్లో నైనా, జీతాలలో పెరుగుదల గానీ తరుగుదల గానీ, సరుకు విలువని ఎన్నడూ ప్రభావితం చెయ్యదు; అదనపు విలువ పరిమాణాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది" - మార్క్స్ [కాపిటల్ - 3. పేజీలు: 207-8]

# జీతాలలో మార్పులు ఎందుకు జరుగుతాయి?

**జీ**తానికి సంబంధించిన కొన్ని విషయాలు మొదటి సంపుటంలో 'శ్రమ శక్తి విలువ' చాప్టరులో చూశాం. ఇంకా కొన్ని విషయాలు ఇక్కడ చూస్తున్నాం.

జీతాలు పెరిగినా తగ్గినా, సరుకు విలువలో మార్పు జరగదని చూశాం. అయితే జీతాలు పెరగడం గానీ, తగ్గడం గానీ, ఎందుకు జరుగుతాయి? మన నిత్య జీవితంలో జీతాలు కొంచెం కొంచెం పెరగడమే చూస్తాం గానీ, తగ్గడం సాధారణంగా ఎన్నడూ చూడం.

ఎందుచేత?

పెట్టుబడీదారీ జీతాల చరిత్రలో జీతాల్ని తగ్గించి వేసిన సందర్భాలు కూడా చాలా వున్నాయి. ముఖ్యంగా, సరుకుల గుట్టలు పెరిగి పోయి, వాటి అమ్మకాలు మందగించి పోయిన కాలాల్లో అనేక మంది కార్మికుల్ని పనుల్లో నించి తీసి వెయ్యడమూ, పనుల్లో వున్న కార్మికులకు జీతాలు తగ్గించి వెయ్యడమూ, చరిత్రలో చాలా సందర్భాల్లో జరిగాయి. కానీ సాధారణ కాలాల్లో, జీతాల తగ్గింపు అంత స్పష్టంగా కనపడదు. పైగా జీతాలు ఎప్పుడూ పెరుగుతూ వున్నట్టు గానే కనపడుతుంది. కానీ, పైకి ఏది కనపడితే అదే పూర్తి సత్యం కాదు.

$6_C + 4_V + 4_S$ వుదాహరణలో, ఇతర పరిస్తితులేవీ మారకుండానే జీతాలు పెరిగినట్టు ఒక సారీ, తగ్గినట్టు ఒక సారీ, చూశాం. కానీ, <u>నిజానికి ఇతర పరిస్తితులేవీ మారకపోతే జీతాలు మారడం జరగదు.</u>

'ఇతర పరిస్తితులు' అంటే - ఉత్పాదక శక్తీ, డబ్బు విలువా, డబ్బు పరిమాణమూ - వంటి పరిస్తితులు. ఆ పరిస్తితుల్లో ఏ ఒక్క అంశం మారినా, దాని ప్రభావం జీతాల మీద పడుతుంది.

ఎప్పుడన్నా జీతాల్ని 'పెంచడం' జరిగిందంటే, అప్పటికి అవి 'తగ్గిపోయి' వున్నాయన్న మాట! అలా వుండడం వల్లనే వాటిని పెంచవలసి వచ్చిందని అర్థం. అంతే గానీ, ఏ అవసరమూ లేకుండానే, ఇతర పరిస్తితులేవీ మారకుండానే, పెట్టుబడిదారులకు హఠాత్తుగా దయ ఉబికి, "కార్మికులకు జీతాలు ఇంకా ఎక్కువ ఇద్దాం" అని ఆలోచించి జీతాలు పెంచుతారని అర్థం కాదు.

జీతాలు పెరిగినట్టు పైకి కనపడే సందర్భాల్లో కూడా, నిజానికి సారాంశంలో ఆ పెరిగిన జీతాలు, అప్పటి 'సగటు శ్రమ శక్తి విలువ'ని ఇచ్చేవిగా మాత్రమే వుంటాయి.

ఉత్పాదక శక్తీ, డబ్బు విలువా, డబ్బు పరిమాణమూ - అనే అంశాల ప్రభావం, 'జీతాల' మీద ఎలా వుంటుందో ఇప్పుడు వరసగా చూడాలి.

## జీతాల మీద, 'ఉత్పాదక శక్తి' ప్రభావం:

ఉత్పాదక శక్తి కి సంబంధించిన కొన్ని విషయాలు గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో, 1వ భాగంలో, 'సరుకుని తయారు చేసే శ్రమకు గల 2 లక్షణాలు' చాప్టరు లోనూ; 2వ భాగంలో, 'పని దినం' చాప్టరు లోనూ.) ఆ విషయాలు కొన్ని గుర్తు చేసుకోవడమూ, ఇంకా కొన్ని కొత్త విషయాలు చూడడమూ ఇప్పుడు చేస్తాం.

వేరు వేరు శాఖల్లో గానీ, సమాజం మొత్తం మీద గానీ, ఉత్పాదక శక్తి కొంత కాలానికోసారి పెరుగుతూనే వుంటుంది. అది, ఒక స్థాయి నించీ ఇంకా ఎక్కువ స్థాయికి పెరిగినప్పుడల్లా, 'పని దినం'లో అవసర - అదనపు భాగాలు ఎలా మారతాయో గతంలోనే చూశాం. (మొదటి సంపుటంలో 'పని దినం' చాప్టరులో, 'రెలెటివ్ అదనపు విలువ' గురించి చూసిన చోట.)

ఏదో ఒక శ్రమని (కుట్టు నో నేత నో, ఇంకో శ్రమనో) తీసుకుందాం. ఆ శ్రమలో - ఉత్పాదక శక్తి తక్కువగా వున్న కాలాన్నీ, ఎక్కువగా వున్న కాలాన్నీ కూడా తీసుకోవాలి. 2 ఉదాహరణల్లోనూ 'సజీవ శ్రమ' జరిగే కాలాన్ని ఒకే పొడవుతో తీసుకోవాలి. అంటే, 'పని దినం' పొడవుని. ఇక్కడ చూడవలిసింది ఉత్పాదక శక్తిలో తేడాల వల్ల కలిగే ఫలితాల్ని కాబట్టి, ఉత్పాదక శక్తులనే తేడాగా వుంచి, ఇతర అన్ని అంశాల్నీ సమానంగా వుంచాలి.

2 ఉదాహరణల్లోనూ పని దినం 8 గంటలే అనుకుందాం. అంటే, 2 పని దినాలకూ ఒకే విలువ వుంటుంది. ఉత్పాదక శక్తి తక్కువగా వున్న పని దినంలో, ఒక వ్యక్తి ద్వారా, తక్కువ వస్తువులు ఉత్పత్తి అయితే; ఉత్పాదక శక్తి ఎక్కువగా వున్న రెండో వుదాహరణలో, ఎక్కువ వస్తువులు ఉత్పత్తి అవుతాయి. పాత పని దినం విలువ (8 గంటల శ్రమ విలువ), తక్కువ వస్తువుల మీద పరుచుకుంటే, కొత్త పని దినం విలువ (ఇక్కడ కూడా 8 గంటల శ్రమ విలువ) ఎక్కువ వస్తువుల మీద పరుచుకుంటుంది. ఆ విధంగా, ఉత్పాదక శక్తి తక్కువగా వున్న వుదాహరణలో, 1 విడి సరుకు విలువ ఎక్కువ గానూ, 2 వ వుదాహరణలో విడి సరుకు విలువ తక్కువ గానూ వుంటాయి.

ఉత్పాదక శక్తి తక్కువగా వున్న మొదటి పని దినంలో, ఒక కార్మికుడు, తన శ్రమ భాగంగా 10 వస్తువులు ఉత్పత్తి చేస్తాడనుకుందాం. అందులో జీతం 5. అదనపు విలువ 5. పని దినంలో జీతం భాగం 50%, అదనపు విలువ భాగం 50%.

రెండో వుదాహరణని ఉత్పాదక శక్తి పెరిగినట్టుగా తీసుకోవాలి కాబట్టి, అది రెట్టింపు అయిందను

కుందాం. ఈ పని దినంలో ఒక కార్మికుడు, తన శ్రమ భాగంగా, 20 వస్తువులు ఉత్పత్తి చేస్తాడు. గతంలో, 8 గంటల్లో 10 వస్తువులు అయితే, ఇప్పుడు 8 గంటల్లో 20 వస్తువులు. ఈ రెండో పని దినంలో, జీతం 8 వస్తువులూ, అదనపు విలువ 12 వస్తువులూ అనుకుందాం. ఈ పని దినంలో జీతం భాగం 40%. అదనపు విలువ భాగం 60%.

2 పని దినాలకూ ఒకే విలువ (8 గంటల విలువ) వుంటుంది. కానీ, పాత పని దినంలో జీతం కాలం కన్నా, కొత్త పని దినంలో జీతం కాలం తగ్గింది.

పాత జీతం 5 వస్తువులైతే, కొత్త జీతం 8 వస్తువులు. పైకి కనపడే ఉత్పత్తి రాసుల్ని మాత్రమే చూస్తే, జీతం పెరిగినట్టే కనపడుతుంది. దీన్ని, 'జీతం ఎబ్సల్యూట్‌గా పెరగడం' అంటాం. కానీ, పాత పనిదినం లోని జీతం భాగాన్నీ, కొత్త పనిదినం లోని జీతం భాగాన్నీ పోల్చి చూస్తే, ఇప్పుడు జీతం భాగం తగ్గింది. దీన్ని, 'జీతం రెలెటివ్‌గా తగ్గడం' అంటాం.

ఉత్పాదక శక్తి ప్రభావం జీతాల మీద ఎలా వుంటుందీ - అనే ప్రశ్నకి ఇప్పుడు జవాబు చెప్పుకో వచ్చు. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పాదక శక్తి ఎప్పుడూ పెరుగుతూనే వుంటుంది కాబట్టి, ఆ పెరిగే ఉత్పాదక శక్తి, జీతాల్ని ఎబ్సల్యూట్‌గాపెంచి, రెలెటివ్‌గా తగ్గిస్తూ వుంటుంది. ఈ విషయాలన్నీ గతంలో చూసినవే. వాటిని ఇక్కడ 'గుర్తు చేసుకోవడం' మాత్రమే చేశాం.

ఇప్పుడు, ఉత్పాదక శక్తి ప్రభావాన్ని, డబ్బు విలువా, డబ్బు పరిమాణమూ - అనే అంశాలతో కూడా కలిపి అర్థం చేసుకోవాలి.

## జీతాల మీద, 'డబ్బు విలువ' ప్రభావం:

డబ్బు - విలువలో మార్పుల ప్రభావం, జీతాల మీద ఎలా వుంటుంది? - ఆ ప్రభావం, సరుకుల ధరల మీద ఎలా వుంటుందో, జీతాల మీద కూడా అలాగే వుంటుంది. 'జీతం' కూడా ఒక 'ధరే' కాబట్టి. డబ్బు విలువ తగ్గితే, సరుకుల ధరలు పెరుగుతాయనీ, డబ్బు విలువ పెరిగితే ధరలు తగ్గుతాయనీ, గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో, మొదటి భాగంలో, 'డబ్బు రూపం' చాప్టరులో.) జీతాల విషయంలో కూడా అదే జరగాలి.

డబ్బు విలువకీ జీతానికీ వుండే సంబంధం చూడాలంటే, జీతం కూడా ఒక ధరే కాబట్టి, డబ్బు విలువకీ సరుకుల ధరలకూ వుండే సంబంధాల్ని మొదట గుర్తు చేసుకోవాలి. దాన్ని బట్టి జీతాల విషయం తెలుస్తుంది.

సరుకుల్లో - డబ్బు సరుకూ, మామూలు సరుకులూ - అనే తేడా వుంటుందని మనకు తెలుసు. బంగారం - డబ్బు సరుకు. బంగారం తప్ప, మిగిలిన వన్నీ మామూలు సరుకులు. బంగారం విలువ మారడమే, డబ్బు విలువ మారడం.

ఏ సరుకుకైనా 'విలువ' ఎలా ఏర్పడుతుంది? - దానికి పట్టే 'శ్రమ పరిమాణాన్ని' బట్టి. అది మారితే విలువ మారుతుంది. శ్రమ పరిమాణం ఎందుకు మారుతుంది? ఆ శ్రమలో ఉత్పాదక శక్తి మారడం వల్ల. 'డబ్బు' విషయం అయినా అంతే.

బంగారానికి ఉత్పాదక శక్తి మారితే, ఒక డబ్బు - యూనిట్‌కి విలువ మారుతుంది. దాని వల్ల, సరుకుల ధరలన్నీ మారతాయి.

ఉదాహరణలో, షరతులన్నీ ఇలా వున్నాయి అనుకుందాం: బంగారం శాఖ ఒక పక్కనా, ఇతర శాఖలన్నీ కలిసి ఒకే శాఖగా, 'ధాన్యం శాఖ' పేరుతో ఇంకో పక్కనా, వున్నాయి - అనుకుందాం.

1 గ్రా. బం. = 1 బం. రూ. = 1 కా. రూ.

1 కిలో ధాన్యం = 1 బం. రూ. = 1 కా. రూ.

అంటే, 1 కిలో ధాన్యం ధర, 1 రూపాయి.

ధాన్యానికీ, డబ్బుకీ మారకం పాళ్ళు ఇలా వుండగా, ధాన్యం ఉత్పాదక శక్తి మారకుండా, బంగారం ఉత్పాదక శక్తి రెట్టింపు అయిందనుకుందాం. అంటే, 1 గ్రాము బంగారం శ్రమ కాలం సగానికి తగ్గి, దాని విలువ సగానికి తగ్గింది. అప్పుడు 1 బంగారం రూపాయికి గతంలో వున్నంత విలువ గాక, అందులో సగం విలువే వుంటుంది. ఆ బంగారం రూపాయికి బదులు గానే కాయితం రూపాయి వుంటుంది కాబట్టి, బంగారం రూపాయికి ఏ విలువ వుంటే అదే కాయితం రూపాయి విలువ అవుతుంది. ఇప్పుడు కాయితం రూపాయి విలువ కూడా సగమే అవుతుంది. ఇప్పుడు ధాన్యం విలువలో మార్పు జరగలేదు కాబట్టి, అది గతంలో లాగే వుంటుంది.

ఇప్పుడు ధాన్యం ధర:

1 కిలో. ధాన్యం = 2 గ్రా. బం. = 2 కా. రూ.

చలామణీలో వున్నది బంగారం రూపాయిలైతే,

1 కిలో ధాన్యానికి బదులు 2 బంగారం రూపాయలు రావాలి. కాయితం రూపాయలైతే, 2 కాయితం రూపాయలు రావాలి. ధాన్యం ధర పెరిగిందని అర్థం. ధాన్యానికి విలువ మారకుండానే ధర పెరిగింది. ఇలా పెరగడానికి కారణం, ధాన్యం విలువ పెరగడం కాదు, డబ్బు విలువ తగ్గడం. అలాగే, డబ్బు విలువ పెరిగితే, ధాన్యం ధర తగ్గుతుంది.

అయితే, ధరల్లో ఈ రకంగా జరిగే మార్పు అసలు మార్పుగా లెక్కకు రాదు. ఎందుకంటే, ఈ మార్పు ఏదో ఒక్క సరుకుకే గాక, అన్ని సరుకులకూ ఒకే రకంగా జరుగుతుంది కాబట్టి.

'డబ్బు' అనేది, సరుకుల విలువల్ని కొలిచే 'కొలత పాత్ర'. 'డబ్బు విలువ మారడం' అంటే, ఆ కొలత పాత్ర సైజు మారడమే. కొలత పాత్ర సైజు మారితే ఏం జరుగుతుంది? - పాత్రల సంఖ్య మారడం మాత్రమే జరుగుతుంది. పాత్ర సైజు చిన్నది అయితే, పాత్రల సంఖ్య పెరుగుతుంది. పాత్ర సైజు పెద్దది అయితే, పాత్రల సంఖ్య తగ్గుతుంది. ఈ విషయం, అన్ని సరుకులకూ ఒకే రకంగా వర్తిస్తుంది కాబట్టి, డబ్బు విలువలో జరిగే మార్పు, నిజానికి లెక్కలోకి తీసుకోవలసిన విషయం కాదు. అది అసలు, మార్పు జరగని దానితోనే సమానం.

డబ్బుకి విలువ మారితే సరుకుల ధరలన్నీ మారతాయి - అనేది ఒక రకం ఉదాహరణ. కానీ డబ్బు విలువ మారినా, ధరలు మారకపోవడం కూడా జరగవచ్చు, ఆ సరుకుల విలువలు కూడా మారితే.

డబ్బు విలువ పెరిగినప్పుడు, సరుకుల విలువలు కూడా అదే స్థాయిలో పెరిగితే, అప్పుడు, డబ్బుకీ సరుకులకూ వుండే పాత మారకం పొళ్ళు మారవు. ధరలు మారవు. అలాగే, డబ్బు విలువ తగ్గినప్పుడు, ఇతర సరుకుల విలువలు కూడా అదే స్థాయిలో తగ్గితే, అప్పుడు కూడా వాటి మారకం పొళ్ళు మారవు. ధరలు మారవు.

ఉత్పాదక శక్తి పెరగడం అంటే, అది డబ్బు శాఖలో మాత్రమే జరుగుతుందనీ, ఇతర శాఖల్లో జరగదనీ అర్థం కాదు. ప్రతీ శాఖ లోనూ ఉత్పాదక శక్తి కొంత కాలానికోసారి ఎంతో కొంత పెరుగుతూనే వుంటుంది. అయితే ఆ పెరుగుదలలు, అన్ని శాఖల్లోనూ ఖచ్చితంగా ఒకే స్థాయిలో వుండవు ఎగుడు దిగుళ్ళుగా వుంటాయి.

ఉత్పాదక శక్తి పెరుగుదల, ఇతర శాఖల్లో కన్నా డబ్బు శాఖలో ఎక్కువగా జరిగితే డబ్బు విలువ ఏదో ఒక స్థాయిలో తగ్గడమూ, ఇతర సరుకుల విలువలు ఆ స్థాయిలో తగ్గకపోవడమూ జరిగి, సరుకుల ధరలన్నీ పెరుగుతాయి.

ధాన్యం విలువ 10% తగ్గి, డబ్బు విలువ కూడా 10% తగ్గితే, రెంటికీ విలువలు తగ్గినా, వాటి మారకం పొళ్ళు మారవు. ధాన్యం ధర మారదు. ధాన్యం విలువ 10% తగ్గినప్పుడు, డబ్బు విలువ 10% కన్నా ఎక్కువగా, కనీసం 11% తగ్గితేనే, ధాన్యం ధర పెరుగుతుంది. ఈ వుదాహరణలో, ధాన్యం విలువలో 10% తగ్గుదలనీ, డబ్బు విలువలో 11% తగ్గుదలనీ కలిపి చూస్తే, 2 చోట్లా 10% వరకూ కాన్సిల్ అయిపోయి, ఒక చోట 1% మిగులుతుంది. దాని అర్థం - ధాన్యం విలువ తగ్గలేదనీ, డబ్బు విలువ మాత్రం 1% తగ్గిందనీ, అనవచ్చు. అంటే, 'డబ్బు విలువ తగ్గడం' అన్నప్పుడు, ఆ సమయంలో ఇతర సరుకుల విలువలు మారవనీ, డబ్బు విలువే ఎప్పుడూ మారుతూ వుంటుందనీ, అర్థం కాదు. అన్ని సరుకుల విలువలూ మారుతూనే వుంటాయి. అయితే, మామూలు సరుకుల విలువల్లో తగ్గుదల కన్నా, డబ్బు విలువలో తగ్గుదల ఎక్కువగా జరిగినప్పుడే, అది 'డబ్బు విలువ తగ్గడం'గా వుంటుంది.

'డబ్బు - విలువ' గురించీ, 'ధరల' గురించీ చూసే చోట, 'డబ్బుకి ధర వుండదు' అనే అంశాన్ని గుర్తు చేసుకోవాలి.

**'డబ్బు'కి, 'విలువే' గానీ 'ధర' వుండదు:**

'విలువని, డబ్బు ద్వారా చెప్పడమే ధర' - కాబట్టి, ధర - అనేది మామూలు సరుకులకు వున్నట్టుగా, 'డబ్బు'కి వుండదు. (ఈ విషయం, మొదటి సంపుటంలో, మొదటి భాగంలో, 'డబ్బు రూపం' చాప్టరులో కొంత చూశాం.)

'డబ్బు' అన్నప్పుడు, దాన్ని 'బంగారం డబ్బు' గానూ, 'కాయితం డబ్బు' గానూ కూడా అర్థం చేసుకుంటూ వుండాలి. అంటే, బంగారం నాణాలే చలామణీలో వుంటే, అప్పుడు పరిస్థితి ఎలా వుంటుందో; లేదా, కాయితం డబ్బు చలామణీలో వుంటే అప్పుడు పరిస్థితి ఎలా వుంటుందో - ఈ 2 రకాలు గానూ అర్థం చేసుకోవాలి.

1 గ్రాము బంగారం = 1 బంగారం రూపాయి.
= 1 కాయితం రూపాయి.

బంగారం రూపాయిలే (నాణాలే) చలామణీలో వున్నాయి - అనుకుందాం. 1 బంగారం రూపాయికి,

'ధర' ఏమిటి? అంటే, 1 బంగారం రూపాయిని ఇచ్చి, దానికి బదులుగా మళ్ళీ 'డబ్బు'నే తీసుకోవాలంటే, ఎంత డబ్బు వస్తుంది? - ఇచ్చినంత డబ్బే వస్తుంది. 1 రూపాయికి, 1 రూపాయే వస్తుంది. 'ధర'ని చెప్పాలంటే, డబ్బు ద్వారానే చెప్పాలి కాబట్టి, 1 బంగారం రూపాయి ధర = 1 బంగారం రూపాయే.

లేదా, 'కాయితం డబ్బే' చలామణీలో వుంటే,

1 కాయితం రూపాయికి, 'ధర' ఏమిటి?

అప్పుడు కూడా 1 రూపాయి ధర, 1 రూపాయే.

బంగారం డబ్బుని తీసుకున్నా, కాయితం డబ్బుని తీసుకున్నా, డబ్బు-కి ధరని చూడాలంటే డబ్బుకి డబ్బునే ఈక్వివలెంట్‌గా వుంచాలి.

1 రూపాయి ధర - 1 రూపాయి.

2 రూపాయల ధర - 2 రూపాయలు.

ఇలా, డబ్బుకి ధరని చూడడం అర్థ రహితం. అందుకే, డబ్బుకి ధర వుండదు - అనడం.

1 రూపాయికి బదులుగా 1 కిలో ధాన్యం వస్తే, ఆ ధాన్యం, రూపాయికి 'విలువ' అవుతుంది గానీ, 'ధర' అవదు.

ధాన్యం - వేపు నించి చూస్తే, ధాన్యానికి బదులుగా వచ్చే రూపాయి, ధాన్యానికి ధరే.

డబ్బు వేపు నించి చూస్తే, డబ్బుకి బదులుగా వచ్చే ఏ సరుకు అయినా, డబ్బుకి ధర కాదు.

బంగారాన్ని 'నాణెం'గా గాక, 'ముద్ద'గా చూస్తే, అప్పుడు ఆ ముద్ద బంగారానికి ధర వుంటుందా? 1 గ్రాము బంగారం ముద్దకి, ధర ఏమిటి?

1 గ్రాము బంగారం ముద్ద = 1 గ్రా. బం. రూ.

ఒక వ్యక్తి చేతిలో 1 గ్రాము బంగారం రూపాయి (నాణెం) వుంది. అతనికి 1 గ్రాము బంగారం ముద్ద కావాలి. అతను, తన బంగారం రూపాయిని పట్టుకుని, బంగారం ముద్దని కొనడానికి వెళ్తాడా? అలా చెయ్యడు. తన బంగారం నాణాన్నే ముద్దగా వుపయోగించుకుంటాడు. బంగారాన్ని ఇచ్చి బంగారాన్ని కొనడం అర్థం లేని సంగతి. కాబట్టి, చలామణీలో బంగారం డబ్బే వుంటే, బంగారం ముద్దకి కూడా ధర వుండదు.

కానీ చలామణీలో కాయితం డబ్బు వుంటే, ఆ డబ్బు ఇచ్చి బంగారం ముద్దని కొనవచ్చు. 1 గ్రాము బంగారం ముద్ద = 1 కాయితం రూపాయి అవుతుంది. ఇతర సరుకుల ధరల్ని డబ్బు ద్వారా చూసినట్టే, బంగారం ముద్ద ధరని కూడా డబ్బు ద్వారా చూడగలం.

డబ్బుకి ధర వుండదు - అంటే, బంగారం రూపాయికి గానీ, కాయితం రూపాయికి గానీ, ధర వుండదు - అని.

మన నిత్య జీవితంలో ముద్ద బంగారానికి ధర పెరగడమూ తరగడమూ చూస్తూ వుంటాం. దీని అర్థం ఏమిటి? ఇది ఎలా జరుగుతుంది? బంగారం ఉత్పాదక శక్తి ఎక్కువో తక్కువో అయ్యి, బంగారం విలువ మారితే, ధర మారవచ్చు. లేదా, బంగారానికి సప్లై డిమాండ్లు మారితే కూడా ధర మారవచ్చు.

చలామణీలో వున్నది బంగారం డబ్బే అయితే, బంగారం ముద్దకి విలువ మారడం, బంగారం డబ్బు ద్వారా కనపడదు. ఎందుకంటే, బంగారం ముద్దకి విలువ మారితే, డబ్బుగా (నాణాలుగా) వున్న బంగారానికి కూడా విలువ మారుతుంది. కాబట్టి, బంగారం విలువలో మార్పు, బంగారం డబ్బు ద్వారా కనపడడం జరగదు.

అలాగే, బంగారం ముద్దకి s, dలు మారితే, ఆ విషయం, డబ్బు నాణాలుగా వున్న బంగారానికి కూడా వర్తిస్తుంది. కాబట్టి s, d ల ప్రభావాల వల్ల, బంగారం ధర మారడం కూడా బంగారం డబ్బు ద్వారా కనపడదు.

చలామణీలో వున్నది కాయితం డబ్బు అయితే, బంగారానికి విలువ మారితే, అది కాయితం డబ్బు ద్వారా, (ధర ద్వారా) కనపడడం సాధ్యమే, అలాగే s, dల ప్రభావాల వల్ల ధరలో కలిగే మార్పులు కూడా కనపడతాయి.

డబ్బు కి ధర లేకపోతే, దాని విలువలో మార్పులు ఎలా కనపడతాయి? - ఎలాగంటే, డబ్బుకి బదులుగా వచ్చే మామూలు సరుకుల ద్వారానే. (ఈ విషయం కూడా, గతంలో, 'డబ్బు రూపం' చాప్టరులో చూశాం.) ఆ మామూలు సరుకులు ఒకటో రెండో గాక, అనేక వందల, వేల, రకాలు వుంటాయి. డబ్బు - విలువలో మార్పుని గ్రహించాలంటే, డబ్బుకి బదులుగా వచ్చే సరుకుల్లో నించి ఏదో ఒకే ఒక్క సరుకుని గాక, 'అనేక ముఖ్యమైన సరుకుల్ని' పరిశీలించవలసి వుంటుంది.

1 రూపాయికి బదులుగా వచ్చే సరుకుల పరిమాణాలు, గతం కన్నా తగ్గాయా, పెరిగాయా? ఆ మార్పులు ఏ స్థాయిలో వున్నాయి? - ఈ విషయాలు పరిశీలించాలి.

మామూలు సరుకుల వేపు నించి చూస్తే - సరుకుల ధరలన్నీ పెరిగితే, డబ్బు విలువ తగ్గిందనీ; ధరలన్నీ తగ్గితే, డబ్బు విలువ పెరిగిందనీ, అర్థం.

డబ్బు - వేపు నించి చూస్తే - దానికి బదులుగా వచ్చే సరుకుల పరిమాణాలు తగ్గితే, డబ్బు విలువ తగ్గిందనీ; సరుకుల పరిమాణాలు పెరిగితే, డబ్బు విలువ పెరిగిందనీ, అర్థం.

సరుకుల ధరల మీదా, డబ్బుకి బదులుగా వచ్చే సరుకుల పరిమాణాల మీదా పరిశీలనలు జరుగుతూ వుంటేనే, డబ్బు విలువ మారిందో లేదో, మారితే ఆ మార్పు ఏ స్థాయిలో జరిగిందో, సరిగా గ్రహించడం సాధ్యమవుతూ వుంటుంది.

'డబ్బు విలువ' గురించి ఈ విషయాలన్నీ చూసిన తర్వాత, ఇప్పుడు మనం, మనకు కావలసిన అసలు విషయానికి రావచ్చు. 'డబ్బు విలువ మారితే, దాని ప్రభావం జీతాల మీద ఎలా వుంటుంది' అనేదానికి. ఆ ప్రభావం, 'ధరల' మీద ఎలా వుంటుందో 'జీతాల' మీద కూడా అలాగే వుంటుందని మొదటే చెప్పుకున్నాం. ధరలన్నీ మారినట్టే, జీతాలు కూడా మారాలి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, 'డబ్బు విలువ'లో మార్పు గురించి సరైన పరిశీలనలు జరపడమూ, డబ్బు విలువలో తగ్గుదల ఏ స్థాయిలో జరిగిందో ఆ స్థాయిలో జీతాల్ని పెంచడమూ, జరగవు.

డబ్బు విలువ సగానికి తగ్గి, ధరలన్నీ రెట్టింపు అయినప్పుడు, జీతాలు కూడా రెట్టింపు అవ్వాలి. గతంలో 1 రూపాయి జీతం వచ్చే చోట ఇప్పుడు 2 రూ. ల జీతం రావాలి. అలా వస్తే కార్మికులు, గతంలో 1 రూపాయితో కొన్న సరుకుల్ని ఇప్పుడు 2 రూ. లతో కొనుక్కుంటారు. అలా జరిగితేనే జీతాలు తగ్గనట్టుగా అవుతుంది.

కానీ, ధరలు రెట్టింపు అయినా జీతాలు ఏమీ పెరగకపోతే, అప్పుడు జీతాలన్నీ సగానికి తగ్గిపోయినట్టు అర్థం. గతంలో 1 రూపాయిగా వుండే జీతం, ఇప్పుడు కూడా 1 రూపాయి గానే వుంటే, ఇప్పుడు దానికి వచ్చే సరుకులు సగమే అవుతాయి కాబట్టి, జీతం సగానికి తగ్గిపోయినట్టే. ఒక వేళ, ఆ జీతం పెరిగితే, అది 1.50 గానో, 1.90 గానో మాత్రమే పెరిగితే, ఆ పెరిగిన జీతం కూడా పాత జీతంతో సమానం అవదు. అది పూర్తిగా 2 రూ.లు అయితేనే, అది పాత జీతంతో సమానం.

'జీతం' అంటే అసలైన అర్థం, 'కొన్ని ఉత్పత్తులే'. జీతంగా కొంత డబ్బు వచ్చినప్పుడు, ఆ డబ్బుకి, ఆ కొన్ని ఉత్పత్తులు వచ్చి తీరాలి. డబ్బు విలువ తగ్గినప్పుడు, 'డబ్బు జీతం' కూడా ఆ స్థాయిలో పెరిగి, కార్మికులకు పోషణ వస్తువులన్నీ ఎప్పటి లాగే అందుతూ వుండాలి.

గతంలో, '1 రూపాయి'గా వుండే జీతం, డబ్బు విలువ తగ్గిన తర్వాత కూడా 1 రూపాయి గానే వుంటే, అది 'పేరుకి మాత్రమే' జీతం అవుతుంది. '1 రూపాయి'కి బదులుగా ఎప్పుడు ఎన్ని వస్తువులు వస్తే అన్నిటిని మాత్రమే జీతంగా తీసుకోవడం అంటే, '1 రూపాయి' అనే పేరే జీతంగా వున్నట్టు అవుతుంది గానీ, దాని 'విలువ', జీతంగా వున్నట్టు అవదు.

కానీ, జీతానికి అసలు అర్థం, దానికి రావలసిన విలువే గానీ, దాని 'పేరు' కాదు. కాబట్టి, డబ్బు జీతమూ, అసలు జీతమూ, ఒకటి కాదు. జీతానికి సారాంశం వస్తువులే కాబట్టి, జీతంగా వచ్చే డబ్బుకి ఎన్ని వస్తువులు వస్తున్నాయి - అనేదే అసలు విషయం.

'డబ్బు జీతం' పెరగడం, 2 రకాలుగా జరుగుతుంది. (1) డబ్బు - విలువ తగ్గినప్పుడు, జీతంగా వచ్చే డబ్బు పెరగడం - మొదటి రకం. అలా పెరిగిన జీతా నికి, గతంలో వచ్చే వస్తువులన్నీ రావాలి. అలా జరిగినా, అది పాత జీతం వచ్చినట్టు మాత్రమే. కాబట్టి, డబ్బు జీతం పెరిగినా, నిజానికి అది జీతం పెరిగినట్టు కాదు. (2) జీతం పెరగడంలో రెండో సందర్భం - 'శ్రమ శక్తి విలువ' పెరిగితే జీతం పెరగడం. ఈ కారణం వల్ల జీతం పెరిగినప్పుడు, ఆ జీతం వెనకటి వస్తువులన్నిటినీ ఇస్తూనే, కొత్త శ్రమ శక్తి విలువకు తగ్గట్టుగా ఇంకా కొన్ని ఎక్కువ వస్తువుల్ని కూడా ఇవ్వగలిగేదిగా వుండాలి. ఆ పెరిగిన జీతం ఎక్కువ వస్తువుల్ని ఇచ్చినా, అది, అప్పటి పరిస్థితుల్ని బట్టి రావలసిన కొత్త శ్రమ శక్తి విలువే గానీ, అంతకన్నా ఎక్కువది అవదు - ఈ రకంగా, జీతం పెరగడం అనేది, 2 రకాల అర్థాలతో వుంటుంది.

ఏ సందర్భంలో అయినా, జీతం ఎంత పెరగాలో అంత పెరగకపోతే, అది 'నామ మాత్రపు జీతం' (నామినల్ వేజ్) మాత్రమే అవుతుంది.

'డబ్బు విలువ' అనే అంశాన్ని మాత్రమే తీసుకుంటే, 'డబ్బు విలువ' తగ్గినప్పుడల్లా, అది ఏ శాతంలో తగ్గిందో దానికి తగ్గట్టుగా జీతాలు పెరగవలసి వున్నా, పెట్టుబడిదారీ విధానంలో ఇది అర

కొరగా జరుగుతుందే గానీ, సరైన విధంగా జరగదు. ఎందుకంటే, పెట్టుబడిదారీ విధానంలో, 'విలువ' గురించి సరైన అవగాహన లేకపోవడం వల్లా, అంత కన్నా ముఖ్యంగా అది 'దోపిడీ విధానం' అవడం వల్లా. కాబట్టి, అది, 'డబ్బు విలువ'లో మార్పుల గురించి సరైన పరిశీలనలు జరపడమూ, కార్మికులు అడగ కుండానే జీతాలు పెంచడమూ, చెయ్యదు.

ఇక్కడ మనకు ఒక ప్రశ్న ఎదురవుతుంది. ఏమి టంటే - డబ్బు విలువ తగ్గినప్పుడు జీతాలు పెరగ వలసి వున్నట్టే, డబ్బు విలువ పెరిగినప్పుడు జీతాలు తగ్గవలసి కూడా వుండదా - అనే ప్రశ్న. అవును, అలాంటి పరిస్తితిలో జీతాలు తగ్గవలసి కూడా వుంటుంది. అలాంటి పరిస్తితి ఎప్పుడు వస్తుందంటే, బంగారం ఉత్పత్తికి పట్టే శ్రమ కాలం పెరిగి, డబ్బు విలువ పెరిగినప్పుడు. బంగారం గనుల్లో దొరికే పదార్థం పల్చబడిపోయి, బంగారం తక్కువగా ఉత్పత్తి అయినప్పుడు, 1 యూనిట్ బంగారం విలువ పెరుగు తుంది. ఆ రకంగా డబ్బు విలువ పెరిగితే, జీతాలు తగ్గాలి. కానీ, అలా జీతాలు తగ్గడం వల్ల ఆ జీతానికి వచ్చే వస్తువుల పరిమాణంలో తేడా రాదు. తగ్గిన జీతాలతో కూడా ఎప్పటి సరుకులే వస్తాయి. కాబట్టి, అది, జీతాలు తగ్గడం అవదు. జీతానికి పేరు మారడం మాత్రమే అవుతుంది.

అంటే, డబ్బు విలువ పెరిగినప్పుడు, డబ్బు జీతాలు తగ్గడం కూడా జరగాలన్న మాట. అయితే, ఆ పని జరిగినట్టు, మనకు నిత్యజీవితంలో ఎప్పుడూ కనపడదు. ఎందుకంటే, చలామణీలో వుండవలసిన కాయితం డబ్బు పరిమాణం అవసరాన్ని మించి పెరిగి పోవడం - అనే ఇంకో పరిస్తితి, మొదటి పరిస్తితిని కాన్సిల్ చేస్తూ వుంటుంది. అంటే, కాయితం డబ్బు పరిమాణం సమస్య, 'డబ్బు - జీతాలు' తగ్గవలసిన పరిస్తితి రాకుండా చేస్తుంది. ఈ విషయం 'డబ్బు పరిమాణం' గురించి తర్వాత చూసేటప్పుడు అర్థం అవుతుంది.

ప్రస్తుతానికి ఇక్కడ గ్రహించ వలసిన విషయం - జీతాలు అనేవి, పెరగవలసినప్పుడు పెరగకపోతే దాని వల్ల కార్మిక వర్గానికి హాని జరుగుతుంది గానీ, తగ్గవలసినప్పుడు తగ్గకపోతే, దాని వల్ల పెట్టుబడిదారీ వర్గానికి 'హాని' జరిగేదేమీ వుండదు. అది దోచే 'అద నపు విలువ' కొంత తగ్గడం మాత్రమే జరుగుతుంది. (అది, ఆ వర్గానికి హానే అనుకోండీ.) జీతాలు, తగ్గ వలసినప్పుడు తగ్గకపోతే, కార్మిక వర్గానికి 'సగటు శ్రమ శక్తి విలువ' కన్నా కొంచెం ఎక్కువ ఉత్పత్తులు అందు తాయని అర్థం. అయినా అప్పటికీ కూడా పెట్టుబడి దారీ వర్గానికి, 'అదనపు విలువ' అందుతూనే వుంటుంది. కాబట్టి, డబ్బు విలువ పెరిగినప్పుడు, జీతాలు తగ్గక పోయినా దోపిడీ వర్గానికి జరిగే 'అన్యాయం' ఏమీ వుండదు.

ఇంత వరకూ 'డబ్బు విలువ' గురించి చూశాం. ఈ విషయంలో, **మార్క్సు** నించి కొన్ని మాటలు విందాం:

1. "**అ**న్ని రకాల సరుకుల లోనూ వ్యక్తం అయ్యే 'డబ్బు విలువ పరిమాణాన్ని' తెలుసుకోవా లంటే, మనం 'ధరల పట్టిక'లోని వివరాలను (కొటే షన్స్‌ని) వెనక నించీ చదవడం మాత్రమే చెయ్యాలి. అంతే గానీ, డబ్బుకి ధర వుండదు. ఈ 'ధర' విష యంలో, డబ్బుని కూడా అన్ని సరుకుల తోనూ సమాన స్థాయిలో వుంచాలంటే (డబ్బుకి కూడా ధర వున్నట్టు చూడాలంటే), డబ్బుకి డబ్బునే ఈక్వివ లెంటుగా వుంచాలి." [కాపిటల్-1, మాస్కో ఎడిషన్, 1974. పేజీ - 98]

2. ".... **ఇ**ది వరకటి కన్నా ఎక్కువ ఫలితాల్నిచ్చే గనులను కనిపెట్టడమూ - మొదలైన కారణాల వల్ల ఔన్సు బంగారాన్ని ఉత్పత్తి చెయ్యడానికి అవసర మయ్యే శ్రమతో, ఇప్పుడు 2 ఔన్సుల బంగారాన్ని ఉత్పత్తి చేయవచ్చుననుకుందాం. అప్పుడు బంగారం విలువ సగానికి సగం, అంటే 100కి 50 వంతులు, తగ్గిపోతుంది. ఫలితంగా, మిగతా సరుకులన్నిటి విలు వలూ ఇదివరకటి కన్నా రెట్టింపు ద్రవ్య ప్రమాణా లవుతాయి. అంటే, రెట్టింపు ధరల్లో వ్యక్తమవుతాయి. ఇదే, 'శ్రమ - విలువ'కు కూడా వర్తిస్తుంది. ఇదివరకు 6 షిల్లింగులలో వ్యక్తమయ్యే శ్రమ, ఇప్పుడు 12 షిల్లింగులలో వ్యక్తమవుతుంది. ఈ స్తితిలో కార్మికుని జీతం, 6 షిల్లింగులకు పెరగడానికి బదులు 3 షిల్లిం గులే వున్నట్టయితే, అతని 'శ్రమ శక్తి' తాలూకు ద్రవ్యరూపమైన ధర, దాని విలువలో సగానికే సరిపడు తుంది. జీవన ప్రమాణం ఘోరంగా పడిపోతుంది. ఒక వేళ జీతాలు పెరిగినప్పటికీ, అవి, బంగారం విలువలో తరుగుదలకు తగ్గట్టుగా పెరగకపోతే కూడా, ఈ పరిస్తితే ఏర్పడుతుంది. ఇలా జరగడానికి, ఉత్పాదక శక్తి గానీ, సప్లయ్ డిమాండులు గానీ, సరుకుల విలువలు గానీ, మారనక్కర లేదు. ఆ విలువల్ని

డబ్బు రూపంలో పిలిచే పేర్లు మారతాయే తప్ప ఇతర మార్పులేవీ జరగనక్కర లేదు. అటువంటి పరిస్థితిలో, జీతాలు కూడా తదనుగుణంగానే పెరగాలని కార్మికులు పట్టుపట్టకూడదని అంటే, దాని అర్థం, కార్మికులు తమ శ్రమకు బదులు వస్తువుల్ని కాక 'పేర్లను' మాత్రమే తీసుకుని సంతృప్తి పడాలని చెప్పినట్లవుతుంది. ఈ విధంగా, 'డబ్బు విలువ' పడిపోయినప్పుడల్లా, పెట్టుబడిదారులు దాన్ని అవకాశంగా తీసుకుని కార్మికుల్ని మోసగించడానికి తయారుగా వుంటారని గత చరిత్ర రుజువు చేస్తోంది. బంగారం దొరికే కొత్త ప్రదేశాల్ని కనిపెట్టడమూ, వెండి గనుల్లో పని నైపుణ్యం పెరగడమూ, పాదరసం చౌకగా లభించడమూ - వంటి కారణాల వల్ల, వెండి బంగారాల విలువలు మాటి మాటికీ తగ్గిపోతున్నాయని అనేక మంది ఆర్థిక శాస్త్రజ్ఞులు చెప్పడం మనకు తెలుసు" ["జీతాలూ, ధరా, లాభం; కూలి పనీ, పెట్టుబడీ". మార్క్సిస్టు ప్రచురణలు, 1973. పే. 30-31].

3. "16 వ శతాబ్దంలో వెండి బంగారాలు ఎక్కువగా లభించే గనుల్ని, సులభంగా తవ్వటానికి వీలయ్యే వాటిని, అమెరికాలో కనిపెట్టారు. దాని వల్ల యూరపులో వెండి బంగారాల చలామణీ హెచ్చింది. ఫలితమేమిటంటే, ఇతర సరుకులతో పోలిస్తే, వెండి బంగారాల విలువ తగ్గింది. అయితే, కార్మికుల శ్రమ శక్తికి గతంలో ఎన్ని వెండి నాణాలు లభించేవో తర్వాత కూడా అన్నే లభిస్తూ వున్నాయి. వారి శ్రమకు లభించే ధర డబ్బు రూపంలో యథా ప్రకారం గానే వుంది. అయినప్పటికీ, వారి జీతాలు పడిపోయినట్టే, ఎందుచేతంటే, వారికి ఇచ్చే వెండి నాణాలకు, ఇదివరకు లభించే సరుకుల కన్నా ఇప్పుడు తక్కువ సరుకులు లభిస్తున్నాయి. 16వ శతాబ్దంలో పెట్టుబడిదారీ వర్గం అవతరించడానికీ, పెట్టుబడులు పెరగడానికీ గల కారణాల్లో ఇది ఒకటి. ఇంకో వుదాహరణ తీసుకుందాం: 1847 శీతాకాలంలో పంటలు పాడవడం వల్ల అతి ముఖ్యమైన జీవితావసర వస్తువుల (కాయ ధాన్యాలూ, మాంసం, వెన్న, చీజ్ - మొదలైన వాటి) ధరలు చాలా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో కార్మికులకు ఇదివరకు ఇచ్చే జీతాలే ఇచ్చారనుకుందాం. అప్పుడు, వారి జీతాలు పడిపోలేదా? ముమ్మాటికీ పడిపోయాయి. ఇదివరకటి జీతాలతో ఇప్పుడు రొట్టె, మాంసం, వగైరాలు తక్కువగా లభించాయి. ఇప్పుడు కార్మికుల జీతాలు పడిపోవడానికి కారణం, వెండి విలువ తగ్గడం కాదు. జీవితావసర వస్తువుల విలువ పెరగడం. మరో వుదాహరణ తీసుకుందాం: కొత్త యంత్రాల్ని ప్రవేశ పెట్టడం వల్లా, కాల మాన పరిస్థితులు అనుకూలంగా వుండడం వల్లా, వ్యవసాయ సరుకుల ధరలూ, పారిశ్రామిక సరుకుల ధరలూ తగ్గాయి అనుకుందాం. అయినప్పటికీ డబ్బు రూపంలో జీతం యథా ప్రకారం గానే వుందనుకుందాం. ఇప్పుడు కార్మికులు ఆ డబ్బు తోనే ఎక్కువ సరుకులు కొనుక్కోగలుగుతారు. వారి జీతాలు డబ్బు రూపంలో మారకపోవడం వల్లనే అవి వస్తు రూపంలో పెరిగాయి. కాబట్టి, డబ్బు రూపంలో వుండే శ్రమ ధర, అంటే డబ్బు - జీతమూ; అసలు జీతమూ, ఒకటి కావు. (నామినల్ వేజీ, లేదా మనీ వేజీ - అనేదీ, రియల్ వేజీ - అనేదే, ఈ రెండూ ఒకటి కావు). డబ్బు జీతానికి బదులుగా లభించే సరుకులే అసలు జీతం. అందుచేత మనం వేతనాలు పెరిగాయనీ, లేదా తగ్గాయనీ, అన్నప్పుడు, డబ్బు జీతాల్ని మాత్రమే దృష్టిలో వుంచుకో కూడదు. అన్నిటి కన్నా మించి, జీతాలు అనేవి, అంటే రెలెటివ్ జీతాలు, పెట్టుబడిదారుడి లాభంతో, అంటే 'అదనపు విలువ'తో వుండే సంబంధాన్ని బట్టి, నిర్ధారించబడతాయి." [అదే పుస్తకంలో, పే. 64-65]

ఇప్పటి వరకూ 'డబ్బు విలువ'లో మార్పుల ప్రభావం, ధరల మీదా, జీతాల మీదా, ఎలా వుంటుందో చూశాం. ఇప్పుడు 'డబ్బు పరిమాణం' గురించి చూస్తాం.

## జీతాల మీద, 'డబ్బు పరిమాణం' ప్రభావం:

'డబ్బు' అన్నప్పుడు దాన్ని 'బంగారం డబ్బు' గానూ, 'కాయితం డబ్బు' గానూ కూడా అర్థం చేసుకుంటూ వుండాలని గతం లోనే చెప్పుకున్నాం. ఎప్పుడూ అలాగే చేస్తూ వుండాలి.

చలామణీలో వున్నది బంగారం డబ్బే (బంగారం నాణాలే) అయితే, ఆ 'డబ్బు పరిమాణం' ఎక్కువ అయినా, తక్కువ అయినా, దాని ప్రభావం 'ధరల' మీద వుండదని ఇంతకు ముందు చూశాం. చలామణీలో వున్నది కాయితం డబ్బు అయితే, ఆ డబ్బు, 'ఉండవలసిన దాని కన్నా' ఎక్కువ అయితే, దాని ప్రభావం ధరల్ని పెంచే విధంగా వుంటుంది. అప్పుడు 'జీతాలు' కూడా పెరగకపోతే, ఆ జీతాలు, గతం కన్నా

తగ్గిపోయినట్టు అవుతుంది. - ఇదే జీతాలకూ, డబ్బు పరిమాణానికీ గల సంబంధం. ఈ విషయాలే ఇప్పుడు చూస్తాం.

సమాజంలో ప్రతి రోజూ వెయ్యి రూపాయల విలువ గల సరుకుల అమ్మకాలూ కొనుగోళ్ళూ జరగవలసి వుందనుకుందాం. లెక్కలన్నిటినీ 'ఒక్క రోజుకి' సంబంధించిన వాటినే తీసుకుందాం. అంటే, పెట్టుబడిదారులంతా ఉత్పత్తి సాధనాలు కొనడమూ, తమ కొత్త సరుకుల్ని అమ్మడమూ రోజుకోసారి చేస్తారు. కార్మికులకు రోజుకోసారి జీతాలు ఇస్తారు. ఆ జీతాలతో కార్మికులు, రోజుకోసారి పోషణ వస్తువుల్ని కొనుక్కుంటారు. ఈ రకంగా, ఇవి ఒక రోజుకి సంబంధించిన లెక్కలే. ఇదంతా జరగడానికి, చలామణీలో (అంటే, మొత్తం జనాభా దగ్గిర) వెయ్యి రూపాయలు వుండాలి. ఆ రూపాయలే ప్రతి రోజూ వాళ్ళ మధ్య మళ్ళీ మళ్ళీ తిరుగుతూ వుంటాయి. మధ్య మధ్య బ్యాంకుల్లోకి కూడా పోయి వస్తూ వుంటాయి. ఆ రూపాయలతో, ఒక దినపు అమ్మకాలూ కొనుగోళ్ళూ జరుగుతూ వుంటాయి. అదే డబ్బుతో, మళ్ళీ రెండో రోజు కూడా అలాగే.

**మొదట 'బంగారం డబ్బు పరిమాణం' గురించి:**

ఒక దినపు చలామణీ అవసరాల కోసం అందరి దగ్గిరా కలిసి 'వెయ్యి' బంగారం రూపాయలు వుండాలనుకుందాం. కానీ జనాభాలో 2 వేల బంగారం రూపాయలు వున్నాయనుకుందాం. బంగారం నాణాలు పెరగడం ఎలా జరగవచ్చుంటే - ఒక పెట్టుబడిదారుడి దగ్గిర, ఉత్పత్తి అవసరాల కోసం, 10 బంగారం రూపాయలు వున్నాయి. ఆ డబ్బు తోటే రోజూ వాడి ఉత్పత్తి అవసరాలు తీరుతూ వుంటాయి. ఆ డబ్బే గాక, ఆ పెట్టుబడిదారుడి దగ్గిర కొంత 'బంగారం ముద్ద' కూడా వుంది. ఆ ముద్దని కూడా వాడు ఇంకో 10 రూపాయి బిళ్ళలుగా చేయించి వుంచాడు. ఎక్కువ డబ్బుతో ఎప్పుడైనా అవసరం రావచ్చని. అంటే, వాడి దగ్గిర మొత్తం 20 బంగారం రూపాయలు వున్నాయి. అలాగే ఇతర పెట్టుబడిదారులు కూడా రోజు వారిగా కావలసిన రూపాయల కన్నా ఎక్కువ రూపాయి బిళ్ళల్ని చేయించి వుంచుకున్నారనుకుందాం.

కార్మికుల్లో కూడా కొందరి దగ్గిర, రోజు వారీగా అవసరమైనన్ని నాణాలే గాక, ఇంకో రూపాయో అర్ధో ఎక్కువగా వున్నాయి అనుకుందాం. ఈ రకంగా, మొత్తం జనాభాలో వాడకుండా దాచుకున్న నాణాల్ని కూడా కలిపితే, మొత్తం 2 వేల రూపాయలు వున్నాయనుకోవాలి.

చలామణీ అవసరాల కోసం వెయ్యి నాణాలే అవసరమై వుండగా, జనం దగ్గిర 2 వేల నాణాలు వున్నాయి కాబట్టి, సరుకుల ధరలన్నీ రెట్టింపుగా పెరుగుతాయా?

గతంలో 1 కిలో ధాన్యం ధర 1 బంగారం రూపాయి అయితే, ఇప్పుడు ఆ ధాన్యానికి 2 బంగారం నాణాలు ఇవ్వాలా? - అలా జరగదు. బంగారం నాణానికి స్వంత విలువ వుంటుంది. 1 నాణానికి వుండే విలువ కన్నా 2 నాణాలకు వుండే విలువ రెట్టింపుగా వుంటుంది. ధాన్యానికి విలువ మారకపోతే, కొనే వాళ్ళ దగ్గిర ఎక్కువ బంగారం బిళ్ళలు వున్నా, ధాన్యానికి గతం కన్నా ఎక్కువ బిళ్ళలు ఇవ్వనక్కర లేదు. ధాన్యం ధర పెరగదు.

ఏ ఉత్పత్తి ధర అయినా పెరగాలంటే - (1) ఆ ఉత్పత్తి విలువ పెరగడం గానీ, (2) డబ్బు విలువ తగ్గడం గానీ - ఏదో ఒకటి జరగాలి. ఏదీ జరగక పోతే, ఏ ఉత్పత్తి ధరా మారదు.

జనంలో, బంగారం బిళ్ళలు ఎక్కువో తక్కువో వుంటే, ఆ కారణం వల్ల, సరుకుల ధరలు మారవు.

ఒక పెట్టుబడిదారుడి దగ్గిర, రోజూ 10 బంగారం రూపాయలతో మాత్రమే అవసరం వుండగా 15 బంగారం రూపాయలు వుంటే, వాడు 5 రూపాయల్ని వెనక్కి దాచి వుంచుకుంటాడు. జనాభాలో ఎక్కువ బంగారం డబ్బు వున్నా, అది అంతా చలామణీలో వున్నట్టు అర్థం కాదు. 10 బంగారం బిళ్ళలతో జరిగే పని కోసం, 11 బంగారం బిళ్ళలు చలామణీలోకి రావడం జరగదు.

అంటే, బంగారం డబ్బే చలామణీ సాధనంగా వున్నప్పుడు, చలామణీ లోకి వచ్చే డబ్బు పరిమాణం పెరిగిపోవడం గానీ, ఆ కారణంగా సరుకుల ధరలు పెరగడం గానీ, జరగవు. ఈ రకం సమస్యలు 'కాయితం డబ్బు' ద్వారానే సంక్రమిస్తాయి. అది ఎలా జరుగుతుందో ఇప్పుడు చూద్దాం.

**'కాయితం డబ్బు పరిమాణం' గురించి:**

బంగారం నాణాలు చలామణీలో తిరిగి అరిగి పోకుండా వుండడం కోసమే, బంగారం డబ్బుకి బదులుగా, కాయితం డబ్బు చలామణీ లోకి వచ్చిందని గతం లోనే మనకు తెలుసు. 'డబ్బు' అనేది,

ఏ యే పనులు చేస్తుందో, చెయ్యాలో కూడా గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో మొదటి భాగంలో.)

డబ్బు చెయ్యవలసిన పనుల్లో ఒక పని 'సరుకులతో మారడం'. అంటే, 'చలామణీ సాధనం'గా తిరగడం. బంగారం నాణాలే స్వయంగా తిరగకుండా, ఆ తిరిగే పని చేసి పెట్టడమే (ఆ ఒక్క పనే), కాయితం డబ్బు బాధ్యత.

కాయితం - డబ్బు అనగానే మొట్ట మొదట గ్రహించవలసిన విషయం, దానికి 'స్వంత విలువ' వుండదు - అని. కాయితం రూపాయి, 'చిన్న కాయితం ముక్క' మాత్రమే. ఆ కాయితం ముక్క, 'బంగారం రూపాయి' తరఫున, దాని ప్రతినిధిగా తిరుగుతుంది. కాబట్టి, బంగారం రూపాయి విలువే, కాయితం రూపాయి విలువ. బంగారం రూపాయికి విలువ మారితే, కాయితం రూపాయికి కూడా విలువ మారుతుంది. ఈ విషయాలన్నీ గతంలో చూసినవే.

గతంలో పెట్టుబడిదారుల చేతుల్లోనూ, కార్మికుల చేతుల్లోనూ, బంగారం నాణాలు వుండేవి కదా? వాటి బదులుగా కాయితం రూపాయలు వుండడం అనే మార్పు ఎలా జరిగింది? (ఈ విషయం, మొదటి సంపుటంలో, 'సరుకుల చలామణీ' చాప్టరులో చూశాం.)

వెనకటి కాలంలో, ఒక దేశంలో, బంగారం డబ్బే వుండేదనుకుందాం. ఏ వ్యక్తి అయినా, ఒక సరుకుని కొనాలంటే, బంగారం నాణాలే ఇవ్వాలి. ఒక సరుకుని తయారు చేసి అమ్మితే, బంగారం నాణాలే వస్తాయి. ఒక యజమాని దగ్గిర పని చేస్తే, జీతంగా బంగారం నాణాలే వస్తాయి. ఎవరి దగ్గిరైనా డబ్బు వుండడం అంటే, బంగారం నాణాలు వుండడమే.

అలాంటి పరిస్తితుల్లో, ఆ దేశపు ప్రభుత్వం, చలామణీ సాధనంగా కాయితం డబ్బుని ప్రారంభించాలనుకుంద నుకుందాం. అది, ప్రజల కోసం, ఇలా ప్రకటిస్తుంది - "మీ దగ్గిర వున్న బంగారం బిళ్ళలు తెచ్చి మాకు ఇవ్వండి! వాటిని అరిగిపోకుండా భద్రపరుస్తాము. వాటికి బదులుగా మీకు కాయితం రూపాయలు ఇస్తాము. బంగారం రూపాయలతో మీరేం చేస్తున్నారు? సరుకుల్ని కొనడానికే వాటిని ఉపయోగిస్తున్నారు కదా? కాయితం రూపాయలతో కూడా అలాగే చెయ్యవచ్చు. కాయితం రూపాయలనే డబ్బుగా వాడుకోవచ్చు. మీరు 1 బంగారం రూపాయి తెచ్చి ఇస్తే, దాన్ని మా ఆధీనంలో దాచిపెట్టి, దానికి బదులుగా 1 కాయితం రూపాయి ఇస్తాం. మళ్ళీ మీకు ఎప్పుడైనా, మీ బంగారం రూపాయి కావాలంటే, కాయితం రూపాయి తెచ్చి ఇస్తే, మీ బంగారం రూపాయి మీకు ఇచ్చేస్తాం. కాబట్టి, ప్రభుత్వం మీద నమ్మకం వుంచి, బంగారం రూపాయలు తెచ్చి ఇవ్వండి. వాటితో మీరు చేసే పని, సరుకుల్ని కొనడమే కాబట్టి, ఆ పనిని కాయితం రూపాయల తోటే చేసుకోండి" అని చెపుతుంది.

ఒక పెట్టుబడిదారుడు, 10 బంగారం రూపాయలు ప్రభుత్వానికి అప్పజెప్పి, 10 కాయితం రూపాయలు తీసుకున్నాడనుకుందాం. తర్వాత, ఆ కాయితం రూపాయల తోటే ఉత్పత్తి సాధనాలు కొంటాడు. ఆ కాయితం రూపాయలనే 'జీతాలు'గా ఇస్తాడు. కార్మికులు, ఆ కాయితం రూపాయలనే దుకాణాల్లో ఇచ్చి, పోషణ వస్తువులు కొనుక్కుంటారు.

ప్రతి పెట్టుబడిదారుడూ, బంగారం డబ్బుని ప్రభుత్వానికి అప్పజెప్పి కాయితం డబ్బు తీసుకుంటాడు. ఈ రకంగా, బంగారం డబ్బు అంతా ప్రభుత్వాధీనం లోకి వెళ్ళిపోయి, కాయితం డబ్బు విడుదల అవుతుంది. 1 బంగారం రూపాయికి బదులుగా, 1 కాయితం రూపాయి.

జనాల చేతుల్లోకి వెయ్యి కాయితం రూపాయిలు వచ్చాయంటే, ప్రభుత్వ రిజర్వ్ లోకి, వెయ్యి బంగారం రూపాయలు వెళ్ళాయి - అని అర్థం. ఆ బంగారం ఎంత కాలం అయినా అరిగిపోకుండా అక్కడ వుంటుంది. ఎప్పుడైనా ఒక వ్యక్తి, 1 కాయితం రూపాయిని తీసుకు వెళ్ళి ప్రభుత్వానికి ఇచ్చి, తన బంగారం రూపాయిని ఇచ్చెయ్యమని అడిగితే, అప్పుడు మాత్రమే ఆ బంగారం రూపాయి బైటికి వస్తుంది.

కొన్నాళ్ళకి 'కాయితం డబ్బు పద్ధతి' స్తిరపడిపోయింది. కాయితం రూపాయిని తీసుకు పోయి ప్రభుత్వానికి ఇస్తే, దానికి బంగారం రూపాయిని ఇచ్చే పద్ధతి రద్దయింది.

కానీ, కాయితం డబ్బు వున్న వ్యక్తి, ఆ డబ్బుని బంగారంగా మార్చుకోదలిస్తే, ఆ కాయితం డబ్బుతో, బంగారాన్ని అమ్మే దుకాణాల్లో బంగారాన్ని కొనవచ్చు. 1 కాయితం రూపాయిని ప్రభుత్వానికి ఇచ్చి, దానికి బదులుగా 1 బంగారం రూపాయిని తీసుకున్నట్టే, ఆ కాయితం రూపాయితో, 1 బంగారం రూపాయి అంత బరువు గల బంగారం ముద్దని దుకాణంలో కొన

వచ్చు. కాబట్టి, కాయితం డబ్బుని బంగారంగా మార్చుకునే అవకాశం అప్పటికీ వున్నట్టే అర్థం.

ఇప్పుడు చూడవలసిన విషయం, ‘కాయితం డబ్బు పరిమాణం’ గురించి.

ఇంతకు ముందు చూసిన ‘బంగారం డబ్బు’ వుదాహరణలో, 1 గ్రాము బంగారం, 1 బంగారం రూపాయి - అనుకున్నాం. ఒక దినపు చలామణీ అవసరాల కోసం, వెయ్యి బంగారం రూపాయలు కావాలని కూడా అనుకున్నాం. అదే వుదాహరణలో, బంగారం డబ్బుకి బదులుగా, దాని స్థానంలో ‘కాయితం డబ్బు’ని వూహిద్దాం. అంటే జనాభా చేతుల్లో, వెయ్యి బంగారం రూపాయలకు బదులుగా, వెయ్యి కాయితం రూపాయలు వున్నట్టు. 1 బంగారం రూపాయి వుండవలసిన చోట, 1 కాయితం రూపాయి వున్నట్టు.

1 బంగారం రూపాయికి బదులుగా, 1 కాయితం రూపాయి వుంటే, సరుకుల ధరల్లో ఏమైనా మార్పు జరుగుతుందా?

ధాన్యం ధర - ని చూద్దాం.

1 కిలో ధాన్యం = 1 గ్రాము బంగారం
= 1 బంగారం రూపాయి
= 1 కాయితం రూపాయి

ఈ వుదాహరణలో 1 కాయితం రూపాయి వెనక, 1 గ్రాము బంగారం వుందని అర్థం. ఉదాహరణ ఇలా వున్నప్పుడు, చలామణీలో బంగారం డబ్బు వున్నా, కాయితం డబ్బు వున్నా, కిలో ధాన్యం ధర, 1 రూపాయి గానే వుంటుంది.

అయితే, ఇదే వుదాహరణలో ఇతర పరిస్తితులేవీ మారకుండా, 1 బంగారం రూపాయికి బదులుగా 1 కాయితం రూపాయి గాక, 2 కాయితం రూపాయలు వున్నాయి - అనుకుందాం. దీని అర్థం ఏమిటి?

అర్థం ఏమిటంటే, ఇప్పుడు 1 గ్రాము బంగారానికి వుండే విలువ, 2 కాయితం రూపాయలకు వుంటుంది. 1 కాయితం రూపాయి = అర్థ గ్రాము బంగారం. అంటే ఇప్పుడు కాయితం రూపాయి విలువ తగ్గింది. సగమే అయింది.

ఇప్పుడు ధాన్యం ధర:

1 కిలో ధాన్యం = 1 గ్రాము బంగారం
= 1 బంగారం రూపాయి
= 2 కాయితం రూపాయలు

ధాన్యం ధరని బంగారం డబ్బు ద్వారా చూస్తే ఇప్పుడు కూడా 1 రూపాయే. కాయితం డబ్బు ద్వారా చూస్తే, 2 రూపాయలు. ఎందుకంటే కాయితం డబ్బు విలువ సగానికి తగ్గింది కాబట్టి.

ఇప్పుడు కిలో ధాన్యాన్ని అమ్మితే, 1 కాయితం రూపాయి గాక, 2 కాయితం రూపాయలు వస్తాయి. లేదా, 1 కిలో ధాన్యాన్ని కొంటే, 1 కాయితం రూపాయి గాక, 2 కాయితం రూపాయలు ఇవ్వాలి.

గత ధరతో పోలిస్తే, ఇది, ధర పెరగడమే. ఇలా ఎందుకు జరిగింది? ధాన్యం విలువ పెరగడం వల్లా, లేక బంగారం విలువ తగ్గడం వల్లా? - రెండూ కాదు. ఈ ఉదాహరణలో, ధాన్యం విలువ పెరగడం గానీ, బంగారం విలువ తగ్గడం గానీ, ఏదీ జరగ లేదు. అయినా, ధాన్యం ధర ఎందుకు పెరిగిందంటే, కాయితం డబ్బు విలువ తగ్గడం వల్ల.

కాయితం డబ్బు విలువ ఎందుకు తగ్గింది? - ఇతర పరిస్తితులేవీ మారకుండానే, బంగారం రూపాయికి బదులుగా వుండే కాయితం రూపాయల సంఖ్య పెరగడం వల్ల.

అది ఎందుకు జరిగింది? - ఆ కారణం తర్వాత చూస్తాం. ప్రస్తుతం ఇక్కడ ధాన్యం ధర పెరగడానికి కారణం, కాయితం డబ్బు విలువ తగ్గడమే.

పెద్ద గిన్నితో కొలిచిన పదార్థాల్ని, మళ్ళీ చిన్న గిన్నితో కొలిస్తే, అది ఎక్కువ గిన్నెలు అవుతుంది కదా? అలాగే, విలువ తగ్గిన రూపాయితో పాత ధరని మళ్ళీ కొలిస్తే, అది ఎక్కువ రూపాయలు అవుతుంది.

కిలో ధాన్యం ధర ఇప్పుడు 2 రూ.లు అయిందంటే, దానికి గతం కన్నా ఎక్కువ డబ్బు వచ్చిందని అర్థమా? - కాదు. దానికి రావలసిన డబ్బే వచ్చింది. దాని విలువకి, గతంలో 1 రూపాయి రావడం ఎలాంటిదో, ఇప్పుడు 2 రూ.లు రావడమూ అలాంటిదే. ఈ ధరలో మార్పు కేవలం పేరులో మార్పే.

అయితే ధరలు - ఇలా (పేరులో మాత్రమే మార్పు లాగ) పెరగడం వల్ల సమస్యేముంటుంది? - సమస్యేమిటంటే, ధరలతో పాటు జీతాలు కూడా పెరిగితే, సమస్య లేనట్టే. కానీ, అది జరగదు కాబట్టే - సమస్య. ధరలు పెరిగాక జీతాలు ఎప్పటికో చాలా కాలానికి పెరుగుతాయి. ఆ పెరగడం కూడా ధరల పెరుగుదలతో సమానంగా జరగదు. అందుకే, ఏ కారణం వల్ల ధరలు పెరిగినా, అది కార్మిక వర్గానికి పెద్ద సమస్య.

అసలు, చలామణీలో వుండవలసిన కాయితం డబ్బు రాసి, అవసరాన్ని మించి పెరిగి పోయి, దాని

వల్ల 1 రూపాయి విలువ తగ్గిపోవడం ఎందుకు జరుగుతుంది? - దీనికి మొదట క్లుప్తంగా జవాబు 'పెట్టుబడిదారీ విధానం వల్ల' అని.

పెట్టుబడిదారీ విధానంలో, ఏ ఒక్క విషయానికీ సరైన ప్లాను వుండనట్టే, కాయితం డబ్బుని విడుదల చేసే 'కరెన్సీ ఇష్యూ' విషయంలో కూడా సరైన ప్లాను వుండదు.

సమాజంలో ఉత్పత్తి రాసి పెరుగుతూ, చలామణీ అవవలసిన విలువ మొత్తం పెరుగుతూ వుంటే, ఆ పెరిగే విలువకి తగ్గట్టుగా మాత్రమే 'డబ్బు రాసి'ని పెంచాలి.

చలామణీ అవవలసిన విలువ మొత్తాన్ని ఎప్పటి కప్పుడు అంచనా వెయ్యడమూ, పెంచవలసిన డబ్బుని అంచనా వెయ్యడమూ, కొత్త కాయితం డబ్బుని అచ్చు వేసి విడుదల చెయ్యడమూ - వంటి డబ్బుకి సంబంధించిన పనులన్నీ ప్రభుత్వం ద్వారానే జరుగుతాయి. ఈ పనులు సవ్యంగా జరగాలంటే, సరుకుల విలువలకు సంబంధించి 'కరక్టయిన సమాచారం' ప్రభుత్వానికి అందాలి.

కానీ పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తి సాధనాలూ, ఉత్పత్తి రాసులూ ప్రధానంగా ప్రైవేటు పెట్టుబడిదారుల ఆధీనం లోనే వుంటాయి. ఆ పెట్టుబడిదారుల నించీ ఉత్పత్తుల విలువకు సంబంధించిన అంచనా లేవీ సరైన లెక్కలతో ప్రభుత్వానికి అందవు. ఏ పెట్టుబడిదారీ సంస్థని తీసుకున్నా - అది ప్రైవేటు సంస్థ అయినా, ప్రభుత్వ సంస్థ అయినా, అందులో నిజంగా వుండే లెక్కలన్నీ వేరూ, ప్రభుత్వానికి అందే లెక్కలన్నీ వేరూ.

**ఇక్కడ ఒక ప్రశ్న:** పెట్టుబడిదారులందరూ అసలు చూపించవలసిన దాని కన్నా తక్కువ రాసుల్నే చూపిస్తారు కదా? ఆ ప్రకారం, చలామణీ లోకి తక్కువ డబ్బే వస్తుంది కదా? పెట్టుబడి దారుల దొంగ లెక్కల వల్ల, చలామణీ లోకి ఎక్కువ డబ్బుని విడుదల చెయ్యడం ఎలా జరుగుతుంది?

**జవాబు:** పెట్టుబడిదారులు ప్రతీ విషయం లోనూ తక్కువ రాసినే చూపించరు. 'లాభాల' విషయంలో మాత్రమే, తమకు చాలా తక్కువ లాభాలే మిగులుతున్నట్టు, తక్కువ మొత్తాల్ని చూపిస్తారు. ఖర్చుల్ని చూపించవలసిన చోట అసలు నిజం కన్నా అనేక రెట్లు ఎక్కువ రాసుల్ని చూపిస్తారు. ప్రతీ విషయం లోనూ తమకు అనుకూలమైన దొంగ లెక్కలే చూపిస్తారు.

ప్రభుత్వ యంత్రాంగంలో అతి ముఖ్యులైన ప్రెసిడెంట్లూ, గవర్నర్లూ, ప్రధాన మంత్రులూ, ముఖ్య మంత్రులూ, ముఖ్యం కాని మంత్రులూ, కలెక్టర్లూ - వంటి వాళ్ళందరూ తమ ఆస్తులకు సంబంధించిన ఆదాయ వ్యయాల్లో దొంగ లెక్కలే చూపిస్తారు. సరైన లెక్కలు చూపించడం అనేది, ప్రైవేటు సంస్థల్లో గానీ, ప్రభుత్వ సంస్థల్లో గానీ, వ్యక్తుల్లో గానీ, వుండదు - నూటికో కోటికో ఒకరిలో తప్ప!

'ఆస్తిపరుల' కోసం, ఈ దొంగ లెక్కలు రాయడానికి 'ఆడిటర్ల' పేరుతో ఒక ప్రత్యేక సెక్షను తరిఫీదై వుంటుంది.

ఈ రకంగా, అడుగడుగునా తప్పుడు లెక్కలే సాగే గందర గోళంలో, ప్రభుత్వానికి అందే లెక్కలన్నీ తప్పుడు లెక్కలే. పెట్టుబడిదారులు తప్పుడు లెక్కలు చూపించడానికి ప్రభుత్వం వ్యతిరేకమేమీ కాదు. తప్పుడు లెక్కలు చూపించడానికి సందులు దొరికే విధం గానే, ఆ పని తేలిగ్గా జరగడానికి వీలు నిచ్చే విధం గానే, ప్రభుత్వ చట్టాలన్నీ వుంటాయి.

పెట్టుబడిదారులు చూపించే తప్పుడు లెక్కల వల్ల, ఏటా ఎంత విలువ గల ఉత్పత్తులు పెరుగుతున్నాయో, దాని కోసం ఎంత 'డబ్బు రాసి'ని పెంచాలో సరైన అంచనా ప్రభుత్వానికి దొరకదు.

పెట్టుబడిదారుల దగ్గిర వున్న డబ్బు పరిమాణం కూడా ప్రభుత్వానికి కరెక్టుగా అందదు. ఆ డబ్బులో కొంత భాగం, లెక్కల్లో కనపడని డబ్బుగా (బ్లాక్ మనీ గా) వుంటుంది. అది కూడా సమాజం లోనే వుంటుంది. సరుకుల్ని కొంటూ కూడా వుంటుంది. కానీ, అది వున్నట్టు లెక్కల్లో కనపడదు. ప్రభుత్వం తన అంచనా ప్రకారం, 'డబ్బు రాసి'ని పెంచినప్పుడు, దానితో పాటు బ్లాక్ మనీ కూడా కలిసి, చలామణీలో వున్న డబ్బు రాసి, అవసరమైన దాని కన్నా అధికం అవుతుంది.

ప్రభుత్వ రాబడికి ప్రధాన మూలం - పన్నులు. కానీ, పెట్టుబడిదారుల ద్వారా పన్నుల చెల్లింపులు కూడా ఎన్నడూ సవ్యంగా జరగవు. దాని వల్ల, ప్రభుత్వ రాబడికీ ఖర్చులకూ వ్యత్యాసం ఏర్పడుతుంది. రాబడి కన్నా ఖర్చు ఎక్కువై, ప్రభుత్వ బడ్జెట్టు దాదాపు ప్రతీ సంవత్సరమూ 'లోటు' తోనే వుంటుంది. నిజానికి, అది నిజమైన లోటు కాదు. పెట్టుబడిదారుల దగ్గిర ఆ డబ్బంతా వున్నా, అది ప్రభుత్వం చేతి లోకి రాదు.

ఆ లోటుని పూడ్చాలంటే ప్రభుత్వానికి ఇంకా కొంత డబ్బు కావాలి. కాబట్టి ప్రభుత్వం, మరింత కాయితం డబ్బుని అచ్చు వేసే మార్గాన్ని అవలంబిస్తూ వుంటుంది.

'లోటు'ని పూడ్చడానికి కొత్త పన్నులు విధించే పని కూడా కొంత జరిగినా, ఆ కొత్త పన్నులు కూడా సరిగా వసూలు కావు.

ఏ పన్నుల విషయం తీసుకున్నా, ఒక పెట్టుబడి దారుడు ప్రభుత్వానికి పన్నులుగా 8 కట్టాలను కుందాం. 2 మాత్రమే కట్టి, తప్పుడు లెక్కలు చూపించి, 6 ఎగ్గొడతాడనుకుందాం. ఆ 6 డబ్బు, పెట్టుబడిదారుడి దగ్గరే వుంటుంది. కానీ, ప్రభుత్వానికి రావలసిన దాంట్లో 6 తగ్గుతుంది. అప్పుడు ప్రభుత్వం, తన అవసరాల కోసం 6 కాయితం రూపాయలు అదనంగా ముద్రిస్తుందనుకుందాం. అప్పుడేమవుతుంది? పెట్టుడిదారుడు ఎగ్గొట్టిన 6 డబ్బూ, కొత్తగా చలామణీ లోకి వచ్చిన డబ్బు కూడా కలిసి, సరుకుల రాసి పెరుగుదలకు తగినట్టుగా గాక, ఇంకా ఎక్కువగా కాయితం డబ్బు రాసి పెరుగుతుంది.

'సరుకుల రాసి'లో పెరుగుదలకి తగ్గట్టుగా మాత్రమే డబ్బు రాసి, పెరిగితే, చలామణీ లోకి ఎక్కువ డబ్బు రావడం - అనే పరిస్తితే ఏర్పడదు.

ప్రభుత్వానికి ఎక్కువ డబ్బు కావలసిన సందర్భాల్లో, ముఖ్యంగా 'లోటు' బడ్జెట్లూ, యుద్ధాలూ - వంటి సందర్భాల్లో, 'కాయితం డబ్బు'ని ఎక్కువగా అచ్చు వేసి, విడుదల చెయ్యడం జరుగుతూ వుంటుంది.

అటువంటి ప్రత్యేక సందర్భాల్లోనే గాక, నిత్యావసరాల కోసం కూడా కాయితం డబ్బు విడుదల అవుతూనే వుంటుంది. ప్రభుత్వమే కొత్త పరిశ్రమల్ని ప్రారంభించడం కోసం గానీ, ప్రభుత్వ సంస్థలకు అవసరమైన సరుకుల్ని పెట్టుబడిదారుల నించి కొనడం కోసం గానీ, పెట్టుబడిదారులకు కొత్త అప్పులు ఇవ్వడం కోసం గానీ - అలాంటి అవసరాల కోసం, కొత్త కాయితం డబ్బు చలామణీ లోకి వస్తూ వుంటుంది.

[కాయితం డబ్బుని విడుదల చేసే పని ప్రభుత్వం ద్వారా ఎలా జరుగుతూ వుంటుందో, ఈ సంపుటం లోనే, 'వడ్డీ పెట్టుబడి' చాప్టరులో, 'కేంద్ర బ్యాంకు' దగ్గిర చూస్తాం.]

చలామణీ లోకి కొత్త డబ్బు రావడం అంటే, మొదట అది పెట్టుబడిదారుల చేతుల్లోకే వస్తుంది. ప్రభుత్వం, ఒక ఆనకట్ట కట్టించడం - లాంటి ఏదైనా పని చెయ్యదలిస్తే, ఆ పనిని కొందరు కాంట్రాక్టర్లకు (పెట్టుబడిదారులకు) అప్పగించి, కొంత డబ్బుని కూడా అడ్వాన్సులుగా ఇస్తుంది. లేదా కొందరు పెట్టుబడిదారులకు అప్పులు ఇస్తుంది. ప్రభుత్వం చేయించే పనుల ద్వారా అయినా, ప్రైవేటు పెట్టుబడిదారులు తీసుకునే అప్పుల ద్వారా అయినా, కొత్త డబ్బు మొదట పెట్టుబడిదారుల చేతుల్లోకే వెళ్తుంది.

వాళ్ళు దానితో ఉత్పత్తి సాధనాలు కొంటారు. కార్మికులకు జీతాలు ఇస్తారు. కార్మికులు, ఆ డబ్బుతో పోషణ వస్తువులు కొనుక్కుంటారు. ఆ రకంగా, ఏ వర్గంలో ఎవరు ఏది కొన్నా, అప్పటికి సమాజంలో వున్న సరుకుల రాసిలో నించే కొంటారు.

ఆ సరుకుల రాసి తక్కువ గానూ, ఆ సరుకులతో అవసరాలు వున్న వాళ్ళు ఖర్చు పెట్టగలిగే డబ్బు రాసి ఎక్కువ గానూ వుంటే, ఇక్కడ మళ్ళీ సప్లై - డిమాండ్ల పరిస్తితే ఏర్పడి, ధరలు పెరుగుతాయి.

చలామణీలో వున్నది కాయితం డబ్బే అయితే, అది ఇళ్ళల్లో వున్నా, బ్యాంకుల్లో వున్నా, ఎక్కడ వున్నా, చలామణీలో వున్నట్టే లెక్క.

ఏ పెట్టుబడిదారుడైనా తన చేతిలో వున్న డబ్బులో కొంత భాగాన్ని బ్యాంకులో దాచి పెడితే, బ్యాంకులో నించి కూడా ఆ డబ్బు, 'అప్పు'గా ఇంకో పెట్టుబడిదారుడి చేతికి వెళ్తుంది. ఆ ఇంకో పెట్టుబడిదారుడైనా, ఆ డబ్బుని, 'సరుకుల్ని కొనడానికే' (C + V ల కోసం) ఉపయోగిస్తాడు. డబ్బుని 'బ్యాంకులో దాచడం' అంటే, దాన్ని 'చలామణీ' నించి వెనక్కి తియ్యడం కాదు. అది కూడా చలామణీలో వున్నదే.

లేదా, ఒక పెట్టుబడిదారుడు కొంత డబ్బుని, తన దగ్గిరే పెట్టెలో దాచి పెట్టాడనుకుందాం. అలా దాచిన డబ్బు 'బంగారం డబ్బు' అయితే (బంగారం నాణాలు అయితే), వాటితో అవసరం లేనప్పుడు వాటిని కరిగించేసి, ఆ లోహాన్ని ఇంకేదో అవసరాలకు ఉపయోగించవచ్చు. కానీ, అది 'కాయితం డబ్బు' అయితే, దాన్ని ఉపయోగించాలంటే దానితో ఎప్పటికైనా సరుకుల్ని కొనవలసిందే. దాన్ని ఇంకేదో అవసరానికి ఉపయోగించడం సాధ్యం కాదు. దాన్ని ఎంత కాలం దాచినా, దాన్ని బయటికి తీస్తే, దానితో సరుకుల్ని కొనడం తప్ప, ఇంకే పనీ వుండదు. ఆ దాచిన

డబ్బుని ఎప్పుడు బయటికి తీస్తే అప్పుడైనా, చలా మణీలో డబ్బు పెరుగుతుంది.

సరుకుల రాసి తక్కువ గానూ, కాయితం డబ్బు రాసి ఎక్కువ గానూ వుంటే, సరుకుల కోసం ఎక్కువ డబ్బుని చెల్లించడమే (ఎక్కువ ధరలతో కొనడమే) జరిగిపోతూ వుంటుంది.

ఇక్కడ ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. చలామణీలో (జనాభా చేతుల్లో) ఎక్కువ కాయితం డబ్బు వుంటే, ధరలు పెరుగుతాయని చెప్పుకుంటున్నాం. కానీ, ఒక వ్యక్తి చేతుల్లో ఎంత డబ్బు వున్నా, గతంలో 1 రూపాయితో కొనే సరుకు కోసం, 2 రూ.లు ఇస్తాడా? బంగారం డబ్బే చలామణీలో వుంటే, 1 నాణెం ఇవ్వవలసిన చోట 2 నాణాలు ఇవ్వరనీ, జనం దగ్గిర ఎన్ని నాణాలు వున్నా ధరలు పెరగవనీ, చూశాం కదా? కాయితం డబ్బుతో అయినా, అది ఎంత ఎక్కువగా వున్నా, 1 నోటుతో కొనే సరుకు కోసం ఎక్కువ నోట్లు ఎందుకు ఇవ్వాలి?

ఇలాంటి సందేహం ఎందుకు కలుగుతుందంటే, కాయితం డబ్బుకి విలువ తగ్గడం అనేది గానీ, పాత ధర కొత్త ధరగా మారడం అనేది గానీ, ఒకటి రెండు రోజుల్లోనే జరిగే విషయాల్లాగ అర్థం చేసుకోవడం వల్ల. సరుకుల ధరలన్నీ ఒక్క రోజు లోనే రెట్టింపుగా పెరిగి పోతాయని అర్థం చేసుకుంటేనే అలాంటి సందేహం వస్తుంది. కిలో ధాన్యాన్ని నిన్న ఒక్క రూపాయితో కొన్న వ్యక్తి, ఇవ్వాళ 2 రూ.లు ఎందుకు ఇవ్వాలి; రెండో రూపాయిని తన దగ్గిరే వుంచుకోవచ్చు కదా? - అనే సందేహం.

చలామణీలో ఒక రోజున వెయ్యి కాయితం రూపాయలు వుంటే, అవి రెట్టింపుగా మారేది ఆ మర్నాటికే కాదు. సరుకులన్నిటికీ ఒక రోజున పాత ధరలూ, ఆ మర్నాడే రెట్టింపుగా మారిన కొత్త ధరలూ వుండవు. ఆ మార్పు జరగడానికి ఎంతో కొంత కాలం పడుతుంది.

జనాభా చేతుల్లో ఎక్కువ డబ్బు వుండడం - అంటే, 'గతంతో పోలిస్తే ఎక్కువ డబ్బు' అని అర్థం. చలామణీలో ఒక కాలంలో వెయ్యి రూపాయలు వుండడం ఎలాంటిదో, ఆ తర్వాత కాలంలో 2 వేలు వుండడం కూడా అలాంటిదే.

చలామణీ లోకి వచ్చే సరుకుల రాసి పెరుగుదలతో సంబంధం లేకుండా, కాయితం నోట్లు పెరుగుతూ వుంటే, కాయితం నోటు విలువ తగ్గుతూ వుంటుంది.

ఈ మార్పు వ్యక్తుల ఇష్టాయిష్టాల్ని బట్టి జరిగే విషయం కాదు. వాళ్ళకు తెలిసి జరిగే విషయం కూడా కాదు. సరుకుల్ని అమ్మే - కొనే వాళ్ళందరూ వెనకటి, పాత ధరల నించి కొత్త ధరలకు క్రమంగా ఎప్పటి కప్పుడు అలవాటై పోతూ వుంటారు.

'రూపాయి' అన్నప్పుడు, 'ఎంత బంగారం ఒక రూపాయిగా వుండాలి' అనే దానికి ఒక రూలేమీ వుండదు. మొదట ఎంతో కొంత బంగారాన్ని, ఉదా: 1 తులం బంగారాన్ని లేదా 1 గ్రాము బంగారాన్ని, అలా ఎంతో కొంత బరువుని 1 రూపాయిగా పెట్టుకోవచ్చు.

ఒక దేశంలో, ఒక కాలంలో, 1 తులం బంగారాన్ని ఒక రూపాయి నాణెంగా నిర్ణయించి, 1 బంగారం రూపాయికి బదులుగా 1 కాయితం రూపాయి వుండే విధం గానే కాయితం డబ్బుని విడుదల చేశారనుకుందాం. అప్పుడు, 1 కాయితం రూపాయికి, 1 తులం బంగారం విలువ వుంటుంది.

1 తులం బంగారం = 1 బంగారం రూ.<br>
= 1 కాయితం రూ.<br>
తులం బం. ముద్ద ధర = 1 కాయితం రూ.

1 కాయితం రూపాయితో, 1 తులం బంగారాన్ని కొనవచ్చు. లేదా, 1 తులం బంగారాన్ని అమ్మితే, 1 కాయితం రూపాయి వస్తుంది. ఆ రూపాయితో, 1 తులం బంగారం విలువ గల ఏ ఇతర సరుకు నైనా కొనవచ్చు.

ఒక కాలంలో, 1 తులం బంగారం ధర 1 కాయితం రూపాయిగా వుండగా, కొంత కాలానికి, ఆ ధర 10 కాయితం రూ.లు అయితే, దాని అర్థం ఏమిటి? - ఏమిటంటే, అప్పుడు తులం బంగారానికి బదులుగా, 10 కాయితం రూపాయలు చలామణీలో వున్నాయి - అని. అంటే అప్పుడు, 1 కాయితం రూపాయి విలువ, గతంతో పోలిస్తే, 10 వ వంతు మాత్రమే వుందన్న మాట. అంటే — తులం బంగారం = 1 కాయితం రూపాయి.

ఆ కాలంలో 'సరుకుల రాసి' కూడా పెరుగుతుంది. దానికి తగ్గ విధంగా డబ్బు రాసి కూడా పెరగవలసి వుంటుంది. ఆ డబ్బు రాసి తగిన విధంగా మాత్రమే పెరిగి వుంటే, అప్పుడు కూడా 1 తులం బంగారానికి బదులుగా 1 కాయితం రూపాయి మాత్రమే వుండి, తులం బంగారం ధర అప్పుడు కూడా

1 కాయితం రూపాయి గానే వుండేది. కానీ డబ్బు రాసి పెరుగుదల, అలా జరగలేదన్న మాట. ఎంత పెర గాలో అంత మాత్రమే పెరగడం గాక, 1 తులం బంగా రానికి బదులుగా 10 కాయితం రూపాయలు వుండే విధంగా ఆ రాసి పెరిగిందన్న మాట. అందుకే అప్పుడు, 1 కాయితం రూపాయికి, తులంలో 10 వ వంతు విలువే వుంది.

మళ్ళీ కొన్ని సంవత్సరాలకు ఆ ధర, 100 రూ.లు అయితే, మళ్ళీ దాని అర్థం ఏమిటి? అప్పుడు, 1 తులం బంగారానికి బదులుగా, 100 కాయితం రూ. లు చలామణీలో వున్నాయి - అని అర్థం. ఇప్పుడు, 1 కాయితం రూపాయి విలువని, మొట్ట మొదటి ఉదాహరణతో పోలిస్తే, ఇప్పుడు 1 కాయితం రూపాయికి, తులంలో 100 వ వంతు విలువే వుంటుంది.

మళ్ళీ కొన్ని సంవత్సరాలకు, 1 తులం బంగారం ధర, 2 వేల రూ.లు అయితే, దాని అర్థం - అప్పుడు, 1 తులం బంగారానికి బదులుగా 2 వేల కాయితం రూ.లు వున్నాయి - అని!

ఈ ఉదాహరణల్ని క్లుప్తంగా ఇలా చూడవచ్చు.

(1) 1 తులం బం. ధర = 1 కాయితం రూ. ఇక్కడ, 1 రూపాయి, 1 తులం బంగారానికి బదులుగా వుంది. కాబట్టి, 1 తులం బంగారం విలువే, 1 కాయితం రూపాయి విలువ.

(2) 1 తులం బం. ధర = 10 కాయితం రూ. లు ఇక్కడ, 1 రూపాయి, తులంలో 10వ భాగానికి బదులుగా వుంది. కాబట్టి, తులంలో ఆ భాగం విలువే, 1 రూపాయి విలువ.

(3) 1 తులం బం. ధర = 100 కా. రూ. లు ఇక్కడ, 1 రూపాయి, తులంలో 100 వ భాగానికి బదులుగా వుంది. కాబట్టి, తులంలో ఆ భాగం విలువే, 1 రూపాయి విలువ.

(4) 1 తులం బం. ధర = 2,000 కా. రూ. లు ఇక్కడ, 1 రూపాయి, తులంలో 2000 వ భాగా నికి బదులుగా వుంది. కాబట్టి, తులంలో ఆ భాగం విలువే, 1 రూపాయి విలువ.

ఈ రకంగా, '1 కాయితం రూపాయి, ఎంత బంగారానికి బదులుగా వుందో' దాన్ని బట్టే, రూపాయి విలువ వుంటుంది.

జనాభా చేతుల్లో డబ్బు వుండడం అంటే, ఆ డబ్బు అంతా ఒక్క పెట్టుబడిదారుడి దగ్గిరే వుండదు. అది, పెట్టుబడిదారులందరి దగ్గిరా, కార్మికులందరి దగ్గిరా విస్తరించి వుంటుంది. కానీ సమాజంలో వుండే సరుకుల రాసి గురించి గానీ, డబ్బు రాసి గురించి గానీ, ఎవరికీ వివరంగా తెలీదు. సరుకుల్ని పెట్టుబడి దారులు కొనాలన్నా, కార్మికులు కొనాలన్నా, తమ ఆధీనంలో వున్న డబ్బుని బట్టే చేస్తారు. ఆ డబ్బు, గతం కన్నా విలువ తగ్గిన డబ్బుగా వుంటుంది కాబట్టి, అందరి దగ్గిరా గతం కన్నా ఎక్కువ డబ్బే వుంటుంది. ధరలన్నీ గతం కన్నా ఎక్కువగా వుంటాయి. జనాలు, తమ చేతుల్లో వున్న ఎక్కువ డబ్బుతో, ఎక్కువ ధరలు గల సరుకుల్ని కొంటారు.

చలామణీలో వుండే కాయితం డబ్బు పెరగడం 3 కారణాల వల్ల జరుగుతుంది.

(1) సరుకుల రాసి పెరిగితే, చలామణీ అవవలసిన 'విలువ రాసి' పెరుగుతుంది. కాబట్టి, దానికి తగిన విధంగా 'డబ్బు రాసి' కూడా పెరగాలి. ఈ కారణంగా డబ్బు రాసి పెరిగితే అది ఎక్కువ డబ్బు అవదు. ఎంత అవసరమో అంత డబ్బే అవుతుంది. కాయితం నోటు విలువ తగ్గదు. ధరలు మారవు.

(2) బంగారం విలువ తగ్గితే, ధరలన్నీ పెరిగి, గతంలో వున్నంత సరుకుల రాసితో మారడానికి కూడా కాయితం డబ్బు రాసి పెరగాలి. ఈ కారణంగా డబ్బు రాసి పెరిగితే, కాయితం నోటు విలువ తగ్గుతుంది. అయినా అది తగిన స్థాయి లోనే పెరిగితే, ఎక్కువ డబ్బు అవదు. అవసరమైనంత డబ్బే అవుతుంది.

(3) డబ్బు రాసిని పెంచవలసినప్పుడు, ఆ పెరుగు దల సరుకుల రాసి విలువతో సరిపడే విధంగా వుండడం గానీ; లేదా, దాన్ని మించి పోయి వుండడం గానీ - ఏ రకంగా నైనా జరిగే అవకాశం వుంది. పెట్టు బడిదారీ విధానంలో, రెండో విధం గానే జరుగుతుంది. డబ్బు రాసి, అవసరాన్ని మించి పెరిగితే, డబ్బు విలువ బాగా తగ్గి, ధరలు బాగా పెరుగుతాయి.

ధరలు పెరిగిన స్థాయి లోనే జీతాలు కూడా పెరి గితే, కార్మికులకు, ధరల వల్ల కొత్తగా వచ్చే సమస్యేమీ వుండదు. కానీ అలా జరగదు.

'డబ్బు పరిమాణం' గురించి ఇప్పటి వరకూ చూసింది ఏమిటంటే - చలామణి సాధనంగా బంగారం డబ్బే వుంటే, 'చలామణీలో ఎంత డబ్బుని వుంచాలీ' అనే దాన్ని గురించి ఎలాంటి షరతులూ

పాటించనక్కర లేదు. ఏ షరతులూ లేకపోయినా, బంగారం డబ్బు, చలామణీ లోకి ఒక్క నాణెం కూడా ఎక్కువగా రాదు. ఆ కారణంగా ధరలు పెరగడం జరగదు.

కానీ, కాయితం డబ్బే చలామణీలో వుంటే, దాని పరిమాణానికి సంబంధించి అనేక షరతులు పాటించాలి. అలా పాటించడం పెట్టుబడిదారీ విధానానికి సాధ్యం కాదు. కాబట్టి, అది అరకొరగా పాటించే షరతులన్నీ నిష్ప్రయోజనమై పోయి, 'కాయితం డబ్బు రాసి' పెరిగిపోతూ వుండడమే తప్పనిసరి అవుతుంది. దాని ఫలితంగా, ధరలు పెరిగి పోతూ వుంటాయి.

పెట్టుబడిదారులు, ఏ మాత్రం సాధ్యమైనా, తమ సరుకుల్ని ఎక్కువ ధరలతో అమ్మడానికే ఉత్సాహం చూపుతారు. కానీ, దానితో పాటు వెంటనే తమ కార్మికుల జీతాల్ని పెంచడానికి ఉత్సాహం చూపరు. మార్కెట్లో సరుకులన్నిటికీ ధరలు పెరిగిన సంగతి తమకు తెలియనట్టే వుంటారు.

జీతాలు పెంచమని కార్మికులే అడగాలి.

అడిగినా పెంచరు.

కార్మికులు పనులు ఆపి సమ్మె చేస్తారు.

అయినా పెంచరు.

పనులు ఆగిపోయి, రోజుల గడిచి పోతూ వుంటాయి. కొన్నాళ్ళు అలా జరగనిచ్చి, అప్పటికి "సరే, జీతాలు పెంచుతున్నాం" అంటారు.

తీరా చేస్తే, ఆ పెరిగే జీతాలు, కార్మికులు కొనవలసిన సరుకుల ధరల పెరుగుదలలతో సమానంగా వుండవు. అంటే గతంతో పోలిస్తే, జీతాలు, తగ్గినట్టే అవుతుంది. కార్మికులకు ఇదంతా సరిగా తెలియదు. అసంతృప్తి గానే సంతృప్తి పడతారు. మళ్ళీ పనుల్లోకి దిగుతారు.

జీతాలు పెరగాలంటే, ప్రతీ సారీ ఈ ఘర్షణంతా జరగవలసిందే. ఇంతకన్నా మృదువుగా జీతాలు పెరిగే సందర్భాలు ఎన్నడూ వుండవు.

ఈ రకంగా - డబ్బు విలువా, డబ్బు రాసీ - అనే విషయాలతో; ధరలూ, జీతాలూ - అనే విషయాలకు తప్పనిసరి సంబంధాలు వుంటాయి.

# ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్)

**ద్ర**వ్యోల్బణం - అంటే, ద్రవ్యం ఉబ్బడం. చలామణీలో వుండవలసిన డబ్బు ఎంత వుండాలో అంతే వుంటే, దానికి 'ఉబ్బడం' అనే పేరు రాదు. 'అనవసరంగా పెరగడం' వల్లనే ఆ పేరు వస్తుంది.

చలామణీలో ఎక్కువ కాయితం నోట్లు వుండే పరిస్తితిని, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు 'నోట్ల ముమ్మరం' అనీ, 'ద్రవ్యోల్బణం' అనీ, ముద్దు పేర్లతో పిలుస్తారు. ఈ ఆర్థిక వేత్తలకు ఏ ఆర్థిక విషయం మీదా సరైన అవగాహన లేనట్టే ఈ విషయం మీద కూడా సరైన అవగాహన వుండదు. ఎందుకంటే, వాళ్ళకి 'విలువ' మీదే సరైన అవగాహన వుండదు గనక.

ప్రపంచంలో కొత్త బంగారం గనులు బయట పడి, బంగారం ఉత్పత్తి రెట్టింపై, 1 బంగారం బిళ్ళ విలువ సగానికి తగ్గిందనుకుందాం. అప్పుడు, 1 బిళ్ళ వెళ్ళవలసిన చోట 2 బిళ్ళలు వెళ్తాయి కదా? అంటే, 'ధరలు' రెట్టింపు అవుతాయి కదా? అలా ఎందుకు జరుగుతుందంటే, బంగారం ఉత్పత్తికి శ్రమ కాలం తగ్గి, డబ్బు విలువ తగ్గడం వల్ల. కానీ, ఇక్కడ 'విలువ తగ్గడం' అనే విషయం పైకి కనపడదు. పైకి ఏం కనపడుతుందంటే, బంగారం రాసి పెరగడమూ, తర్వాత ధరలు పెరగడమూ, కనపడతాయి. ఈ పైకి కనపడ్డ విషయాల్ని మాత్రమే చూసే ఆర్థికవేత్త ఏమనుకుంటాడంటే, "బంగారం ఎక్కువగా ఉత్పత్తి అయింది, ధరలు పెరిగాయి. అంటే, బంగారం ఎక్కువగా వుంటే, 1 బిళ్ళకి బదులు ఎక్కువ బిళ్ళలు ఇవ్వాలన్న మాట" అనుకుంటాడు. ఈ ఆర్థిక వేత్త ప్రకారం, 'సరుకుల రాసి' ఒక పక్కనా, 'బంగారం రాసి' ఇంకో పక్కనా, వుంటాయి. ఏ రాసి ఎంత పరిమాణంతో వున్నా సరే, ఆ 2 రాసులూ ఒక దానితో ఒకటి మారవలసిందే.

సరుకుల రాసి తక్కువ గానూ, బంగారం రాసి ఎక్కువ గానూ వుంటే, ఆ ఎక్కువ బంగారం ఆ తక్కువ సరుకులతో మారాలి. కాబట్టి, 1 సరుకుకి బదులుగా వచ్చే బంగారం ఎక్కువగా వుంటుంది. అదే, ధరలు పెరగడం. లేదా పరిస్తితి దానికి వ్యతిరేకంగా వుంటే, 1 సరుకుకి బదులుగా వచ్చే బంగారం తక్కువగా వుంటుంది. అది, ధరలు తగ్గడం. ధరల్ని ఇలా అర్థం చేసుకునే ఆర్థిక వేత్త, దాన్నే ఒక సూత్రంగా చేసి, "బంగారం ఎక్కువగా వుంటే, సరుకులకు

ఎక్కువ బంగారం వెళ్తుంది. ధరలు పెరుగుతాయి. బంగారం తక్కువగా వుంటే సరుకులకు తక్కువ బంగారం వెళ్తుంది. ధరలు తగ్గుతాయి" అని ప్రకటి స్తాడు.

బంగారానికి ఒక విలువ వుంటుందనీ, బంగారం ఉత్పత్తి అయ్యే కాలాన్ని బట్టి ఆ విలువ ఎక్కువో తక్కువో అవుతూ వుంటుందనీ - ఈ విషయాలు ఆర్థిక వేత్త అర్థం చేసుకోలేదంటే, ఆ ఆర్థిక వేత్తకి 'డబ్బు అంటే ఏమిటి?' అనే విషయం మీద సరైన అవగాహన లేదన్న మాట.

డబ్బు, 'కొనుగోలు సాధనం'గా వుంటుందని ఏ ఆర్థిక వేత్త అయినా తేలిగ్గానే అర్థం చేసుకోగలడు. ఎందుకంటే, డబ్బు, సరుకుల్ని కొనే సాధనంగా వుండడం పైకి కనపడుతూనే వుంటుంది కాబట్టి. కానీ, 'డబ్బు'ని గురించి గ్రహించడం అంటే, అంతే కాదు. అది, పై పై విషయాల్ని చూడడం మాత్రమే. పైకి కనపడే విషయాల్ని చూడడానికైతే, ఆర్థిక వేత్తలు అక్కరలేదు. సామాన్యులే చాలు. ఆర్థిక వేత్తలు చెయ్యవలసింది - డబ్బు, 'కొనుగోలు సాధనం'గా పని చేస్తుంది - అన్నంత వరకే గ్రహించడం కాదు. ఆ పనిని అది, ఏ లక్షణం ద్వారా చెయ్యగలదో (తనకు వున్న 'విలువ' అనే లక్షణం ద్వారా చెయ్యగలదని) గ్రహిం చాలి. అదే, 'డబ్బు'ని గురించి అసలు విషయం గ్రహించడం. అక్కడే 'ఆర్థిక వేత్త'తో అవసరం.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా, 'డబ్బు'ని, కొన్ని సందర్భాల్లో 'విలువ కొలత'గా కూడా చెపుతారు. అంటే, డబ్బు ఇతర సరుకుల విలువల్ని కొలుస్తుంది - అని. కానీ, వాళ్ళు ఆ మాటల్ని అలా 'వల్లించడమే' గానీ, 'విలువ అంటే శ్రమ' అని గ్రహించడం గానీ, 'డబ్బు కూడా శ్రమతో తయారైన వస్తువు' కాబట్టే అది ఆ లక్షణం తోనే విలువ కొలతగా పని చేస్తుంది అని గ్రహించడం గానీ - చెయ్యరు. 'శ్రమ' అనే అంశం మీదే నిలబడి, ఆర్థిక విషయాల్ని వివరించడం ఏ సందర్భం లోనూ చెయ్యరు. అంటే, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తకి, డబ్బు గురించి పై పై విషయాలే తప్ప, 'అసలు సారాంశం' తెలియదని అర్థం. డబ్బు గురించి అరకొర అవగాహనతో వుండడం వల్లనే ఈ ఆర్థిక వేత్త, "బంగారానికి విలువ తగ్గితే ధరలు పెరుగుతాయి" అని గాక, "బంగారం పరిమాణం ఎక్కువగా వుంటే ధరలు పెరుగుతాయి" అంటాడు.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తకి, 'డబ్బు' గురించి అరకొరగా వుండే అవగాహనకి తోడు, 'బంగారం డబ్బూ, కాయితం డబ్బూ' అనే తేడాలు కూడా కలిసి, మొత్తం వ్యవహారం అంతా పెద్ద గందర గోళంగా తయారవుతుంది.

'కాయితం డబ్బు' నే తీసుకుంటే, ఆ డబ్బు పరిమాణం పెరిగినప్పుడు, ధరలు పెరగడం చూస్తాం. దాన్ని కూడా పై పైనే చూస్తే డబ్బు పరిమాణం పెర గడం వల్లనే ధరలు పెరిగినట్టుగా కనపడుతుంది. కానీ, అసలు నిజం, 'కాయితం రూపాయికి విలువ తగ్గడం వల్లనే' ధరలు పెరుగుతాయి. అంటే, ఇక్కడ కూడా కాయితం డబ్బు విలువలో జరిగిన మార్పే, అసలు కారణం. కాబట్టి, 'ధరలన్నీ పెరగడం' అనేది జరిగినప్పుడల్లా, దాన్ని 'డబ్బు విలువ'కి సంబంధిం చిన అంశం గానే గ్రహించాలి. ప్రతీ ఆర్థిక విషయాన్నీ 'విలువ' అనే ('శ్రమ' అనే) కారణం తోటే వివరించ గలగాలి.

మనం వెనకటి చాప్టర్లలో, కొన్ని ఉదాహరణల్లో, "1 మీటరు బట్ట ధర 2" అనీ, "1 కుర్చీ ధర 4" అనీ, ఇలా చెప్పుకున్నప్పుడు, అక్కడ ద్రవ్యోల్బణం వుందా లేదా అనే ప్రశ్న చూడలేదు. అది అనవసరం. ఎందుకంటే, అప్పుడు, ఏ పరిస్థితి వుంటే ఆ పరిస్థితే ఆ ఉదాహరణలో వున్న అన్ని ధరలకూ వర్తిస్తుంది కాబట్టి. ఒక ఉదాహరణలో, 2 వేరు వేరు సరుకుల ధరలు, 2 రూ. లూ- 3 రూ. లూ, అనుకుందాం. కొంత కాలానికి ద్రవ్యోల్బణం వల్ల అదే సరుకుల ధరలు రెట్టింపై, 4 రూ. లూ - 6 రూ. లూగా మారాయి అను కుందాం. ఆ మార్పు, ఆ 2 సరుకులకూ ఒకే రకంగా వర్తిస్తుంది కాబట్టి, ఆ వేరు వేరు పరిస్థితుల సారాంశం ఒకటే. ఉదాహరణ లోకి, మొదటి ధరల్ని తీసుకున్నా, రెండో ధరల్ని తీసుకున్నా, వాటి ద్వారా చూసే అంశాలు ఒకటే. ఆ 2 పరిస్థితుల్లోనూ, ఆ ధరల్లో, C+V+S లు వుంటాయి. 2 పరిస్థితుల్లోనూ, 'అదనపు విలువలు' వుంటాయి. కాబట్టి ఒక ఉదాహరణలో, ఒక సరుకు ధరని 'ఇంత' అని చూసినప్పుడు, 'అప్పుడు ద్రవ్యో ల్బణం ఎలా వుంది' అనే ప్రశ్న అక్కర లేదు.

'ద్రవ్యోల్బణం' అనేది, పెట్టుబడిదారీ విధానం వల్ల పుట్టుకొచ్చిన పరిస్థితే. దాని కన్నా వెనకటి సమా జాలలో ఈ పరిస్థితి లేదు. వెనకటి సమాజాలలో కూడా 'డబ్బు' వున్నప్పటికీ, ఆ డబ్బు, కాయితం డబ్బు కాదు. ఆ డబ్బు, మారకాల ప్రారంభంలో ఏదో ఒక రకం వస్తువులు గానూ, తర్వాత వెండి బంగారు

నాణాలు గానూ వుండేది. కాబట్టి, 'డబ్బు రాసి పెరిగి పోవడం' అనే పరిస్థితి ఆ నాడు లేదు.

అయితే, 'కాయితం డబ్బు వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతుంది' అనడానికి కూడా వీలు లేదు. పెట్టుబడిదారీ విధానానికి వుండే చెడుగులు లేకుండా కాయితం డబ్బు వుంటే, అప్పుడు 'ద్రవ్యోల్బణం' పరిస్థితి ఏర్పడ నక్కరలేదు.

కానీ 'పెట్టుబడిదారీ విధానం'లో, (1) సరుకు ఉత్పత్తీ, (2) కాయితం డబ్బూ - కలిసి నడుస్తాయి. కాబట్టి, ఈ విధానం లోనే 'ద్రవ్యోల్బణం' సమస్య ప్రారంభమవుతుంది.

ద్రవ్యోల్బణం అనేది, పెట్టుబడిదారులకు కూడా కొంత 'చికాకు' కలిగించే సమస్య గానే వుంటుంది. ఎలాగంటే: ద్రవ్యోల్బణం వల్ల ధరలన్నీ ఒకే రకంగా పెరుగుతాయి అంటాం కదా? కానీ అది, పరిస్థితిని మొదట తేలిగ్గా అర్థం చేసుకోవడానికి చెప్పే పద్ధతి. ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో కూడా అన్ని సరుకుల ధరలూ, ఒకే రోజు నించీ, ఒకే స్థాయిలో పెరగడం జరగదు.

కొన్ని శాఖల్లో ధరలు తొందర గానూ, కొన్ని శాఖల్లో ఆలస్యం గానూ పెరగవచ్చు. ఒక శాఖ ధరలో పెరుగుదల 10% వుంటే, ఇతర శాఖల ధరల్లో పెరుగుదలలు ఖచ్చితంగా 10% వుండక పోవచ్చు. ద్రవ్యోల్బణం వల్ల ధరలు మారడంలో, కొందరు పెట్టుబడి దారులు ఎక్కువ లాభపడితే, కొందరు తక్కువ లాభపడతారు.

ద్రవ్యోల్బణం వల్ల, కాయితం డబ్బు యూనిట్ విలువ తగ్గుతూ వుంటుంది కాబట్టి, పెట్టుబడిదారులు పోగేసుకున్న డబ్బు విలువ కూడా తగ్గిపోతూ వుంటుంది. ఈ ఇబ్బందులన్నీ ద్రవ్యోల్బణం వల్లనే వస్తాయి కాబట్టి, ఇది పెట్టుబడి దారులకు కూడా తలనొప్పి కలిగించే సమస్యే.

# 'జీతం' విషయంలో మూఢ నమ్మకాలు

**'జీ**తం' విషయంలో మొట్టమొదటి మూఢ నమ్మకం ఏమిటో మొదటి నించీ చూస్తూనే వున్నాం. 'జీతం అంటే శ్రమ విలువే' అనేది, ఆ మొదటి మూఢ నమ్మకం. అంటే, 'శ్రమ చేసే మనిషికి ఆ శ్రమకి బదులుగా అందవలసిందంతా అందించేదే జీతం' అని ఆ నమ్మకం. ఈ అవగాహనలో వున్న మూఢత్వం ఏమిటో మనకు తెలుసు. ఈ మూఢత్వం మీద ఆధారపడి వున్నదే, 'లాభం' మూఢత్వం. లాభానికి జీతంతో సంబంధం లేనట్టూ, లాభం ఎక్కడి నించో వచ్చి 'ధర'లో కలిసే అంశం అయినట్టూ భావించే మూఢత్వం అది.

పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రంలో, 'జీతానికి' సంబంధించి, పునాది లోనే తప్పుడు అవగాహన వుండడం వల్ల, ఆ తప్పు మీదే ఆధారపడుతూ ఇంకా బోలెడు మూఢత్వాలు వున్నాయి.

'జీతాలు పెరిగితే, సరుకుల ధరలు పెరగాలి' అనేది ఒక మూఢత్వం. దీన్ని గురించి ఇంతకు ముందు కొంత చూశాం. 'జీతం' గురించి సరైన అవగాహన వుంటే, మొత్తం ఆర్థిక శాస్త్రంలో, ఏ ఒక్క విషయాన్ని అయినా పూర్తిగా సరిగా అర్థం చేసుకోగలం.

జీతం పెరిగితే, అదనపు విలువ తగ్గుతుంది. జీతం ఎంత పెరిగితే, అదనపు విలువ అంత తగ్గుతుంది. అంత కన్నా ఏమీ జరగదు.

సరుకు కోసం అవసరమయ్యే శ్రమ మొత్తం పెరిగితేనే, విలువ పెరిగి, ధర పెరుగుతుంది. శ్రమ పెరగక పోతే, ధర పెరగనక్కర లేదు.

కానీ, పెట్టుబడిదారుడి లెక్క అలా వుండదు. జీతం పెరగడం అంటే, పెట్టుబడి కొంత పెరగడమే కాబట్టి, వాడి లెక్క అంతా ఆ ధోరణిలో వుంటుంది.

ఒక సరుకు ధర 6c + 4v + 5s = 15.

ఇతర పరిస్థితులేవీ మారకుండా, జీతం 1 పెరిగిందనుకుందాం.

జీతం పెరగక ముందు

పెట్టుబడి: $6_c + 4_v = 10$

జీతం పెరిగాక పెట్టుబడి: $6_c + 5_v = 11$

గతంలో లాభం ------- 5

జీతం పెరిగాక లాభం ----- 4

జీతం పెరగడం వల్ల, పెట్టుబడి, గతం కన్నా పెరిగింది. లాభం గతం కన్నా తగ్గింది.

గతంలో 10 పెట్టుబడికి, 5 లాభం అయితే,
తర్వాత 11 పెట్టుబడికి, 4 లాభం.

గతంలో లాభం రేటు 50%. తర్వాత లాభం రేటుని చూస్తే, అది 36% అవుతుంది.

**సారాంశం:** జీతం పెరిగితే, లాభం తగ్గుతుంది.

లాభం తగ్గుతుంది కాబట్టి, లాభం రేటు కూడా తగ్గుతుంది. పెట్టుబడి దారుడు, జీతాల్ని పెంచాక, లాభం తగ్గినా భరించి, సరుకు ధరని ఎప్పటి లాగే వుంచినట్టయితే, జీతాలు పెరగడం వల్ల వచ్చే ప్రయోజనం కార్మికులకు నిజంగా అందుతుంది. కానీ, అలా జరగదు. పెట్టుబడి దారుడు జీతాల్ని పెంచి, తక్కువ లాభం తోటే సరిపెట్టుకోడు.

పెట్టుబడి దారుడికి మార్గ దర్శకత్వాన్ని ఇచ్చేది - లాభం రేటే. దాన్ని వాడు గతం కన్నా పెంచుకోవాలనే ప్రయత్నిస్తూ వుంటాడు. కనీసం అది, గతం కన్నా తగ్గకుండా అయినా వుండాలని చూస్తాడు. జీతాల్ని పెంచినా, లాభం మాత్రం తగ్గకుండా వుండాలి. అది ఎలా సాధ్యం? - ఎలా సాధ్యమంటే, జీతాల్ని పెంచిన తర్వాత సరుకు ధరని కూడా పెంచితే అది సాధ్యమే. అప్పుడు లాభం రేటు తగ్గకుండా ఎప్పటి లాగే వుంటుంది.

జీతాల్ని పెంచి, సరుకుల ధరల్ని కూడా పెంచితే, దాని వల్ల కార్మికులకేం ప్రయోజనం? - కార్మికుల ప్రయోజనం సంగతి పెట్టుబడి దారుడికి అనవసరం. వాడి ప్రయోజనమే వాడికి కావాలి. వాడి లాభం రేటు, ఎప్పటిలా వుండడమే వాడికి కావాలి.

జీతాలు పెరగడం వల్ల 'పెట్టుబడి' పెరిగినా, అది, సరుకుకి సంబంధించిన ఖర్చు పెరగడం కాదు. కానీ జీతాల్ని పెంచాలంటే పెట్టుబడి దారుడు గతం కన్నా ఎక్కువ పెట్టుబడి పెట్టవలసి వస్తుంది కాబట్టి, సరుకు కోసం ఎక్కువ ఖర్చు జరుగుతున్నట్టు గానే భావిస్తాడు. కాబట్టి. జీతాల్ని పెంచాక సరుకు ధరని పెంచడం వాడికి చాలా సమంజసం గానూ, హక్కు గానూ, కనపడుతుంది. కాబట్టి వాడు సరుకు ధరని పెంచుతాడు.

జీతాలు పెరిగాక ధర ఎలా ఏర్పడుతుందంటే - పెట్టిన 'పెట్టుబడి' అంతా వెనక్కి రావాలి. దాని మీద గతంలో వచ్చే లాభం రేటు రావాలి. ఆ 2 అంశాలూ కలిసే కొత్త ధర అవుతుంది.

జీతం పెరగక ముందు:

పెట్టుబడి = $6_C + 4_V = 10$.

లాభం 5. లాభం రేటు 50%

సరుకు ధర $= 6_C + 4_V + 5_S = 15$.

జీతం పెరిగిన తర్వాత:

పెట్టుబడి $= 6_C + 5_V = 11$.

ఈ పెట్టుబడికి, గతంలో లాగే 50% లాభం రేటు ప్రకారం లాభం రావాలంటే, లాభం 5 గా వుండాలి. అది పెట్టుబడికి కలవాలి.

అప్పుడు సరుకు ధర $= 6_C + 5_V + 5_S = 16$ .

జీతం పెరగకముందు సరుకు ధర 15 అయితే, ఆ తర్వాత ధర 16 . ధరలో పెరుగుదల 1 .

జీతంలో పెరుగుదల 1 మాత్రమే అయితే, ధరలో పెరుగుదల 1 ఎలా అయింది? జీతం ఎంత పెరిగిందో ధర కూడా అంతే పెరగాలి కదా? అది ఇంకా ఎక్కువ ఎందుకు అయింది? - ఎందుకంటే, జీతాన్ని పెంచడం కోసం పెట్టుబడి ఎంత పెరిగిందో అది మాత్రమే ధర లోకి చేరితే చాలదు. ఆ పెరిగిన పెట్టుబడికి 'లాభం' కూడా రావాలి కదా? కాబట్టి, పెరిగిన పెట్టుబడి వెనక్కి వస్తూ దానికి, దాని లాభమూ కలిసి 1 . అది ధర లోకి కొత్తగా చేరి, కొత్త ధర 16 అయింది.

పెట్టుబడి దారుడికి, 'పాత ధర' వల్ల పెట్టుబడి వెనక్కి వచ్చి దాని మీద 50% లాభం వచ్చినట్టే, కొత్త ధర వల్ల కూడా పెట్టుబడి వెనక్కి వచ్చి దాని మీద 50% లాభం వస్తుంది. అంటే జీతాల్ని పెంచాక సరుకు ధరని కూడా పెంచడం వల్ల, పెట్టుబడి దారుడికి, జీతాల్ని పెంచిన నష్టం వుండదు.

కానీ జీతాలు పెరిగిన తర్వాత, సరుకుల ధరలు కూడా పెరిగితే, ఆ పరిస్తితిని కార్మికుల వేపు నించి చూస్తే ఎలా వుంటుంది? - ఇంకెలా వుంటుంది? అంతా పాత రకం గానే వుంటుంది. జీతాలు పెరిగిన తర్వాత ధరలు మారకుండా వుంటే, ఆ పెరిగిన జీతాలకు గతం కన్నా ఎక్కువ సరుకులు వస్తాయి. అలా జరిగితే, జీతాలు పెరగడం వల్ల ప్రయోజనం వుంటుంది. కానీ, జీతాలు పెరిగి, దానితో పాటు ధరలు కూడా పెరిగితే, పెరిగిన జీతాలతో, ధరలు పెరిగిన సరుకులనే కొనాలి. అది, జీతాలు పెరగని దాని తోటే సమానం. ఇక జీతాలు పెరగడం ఎందుకు?

గతంలో 15 ధర గల సరుకుకి, జీతం పెరిగిన తర్వాత 16 ధర అయింది కదా? ఇది ఆ సరుకుకి 'విలువ' పెరగకుండానే, (శ్రమ కాలం పెరగకుండానే) ధర పెరగడం కదా? ఇప్పుడు ఈ సరుకుకి 'విలువ' ఏమిటి? దాన్ని 15 గా అనుకోవాలా, 16 గా అనుకోవాలా? - 16 గానే అనుకోవాలి. జీతాలు పెరగడం వల్ల సరుకు ధర పెరగడం - అనే అంశాన్ని విడిగా చూస్తే, ఆ పెరిగిన జీతం గానీ, ఆ పెరిగిన ధర

గానీ, మళ్ళీ తగ్గేదేమీ వుండదు. ధర అలా పెరిగాక, ఇక పాత ధరని వదిలేసి, కొత్త ధరనే లెక్కలోకి తీసుకోవాలి. ఈ సరుకుకి మొదట 15 ధర వున్నప్పుడు, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం అదే దాని విలువగా అనుకున్నాం. ఆ ధర, 16 గా మారితే, అప్పుడు, ఆ కొత్త ధరే దాని విలువ. ఇక పాత ధర సంగతి అనవసరం.

ధరల మొత్తమే విలువల మొత్తం - అని మనకు తెలుసు. అన్ని శాఖలలోనూ జీతాల్ని పెంచి, ధరల్ని కూడా పెంచితే, ఆ పెరిగిన ధరల మొత్తమే విలువల మొత్తం. ఆ కొత్త పరిస్థితుల్లో కూడా, ఒక సరుకుకి ఏ విలువ వుంటే అది ఉత్పత్తి ధరగా మారడమూ, తర్వాత మార్కెట్ ధరగా మారడమూ - ఆ మార్పులన్నీ ఆ కొత్త విలువ మీదే జరుగుతాయని అర్థం.

విలువ పెరగకుండానే (శ్రమ కాలం పెరగకుండానే) ధర పెరిగితే, దాని అర్థం ఏమిటి? - ధరకి, 'రూపం' మారిందని మాత్రమే. విలువ - అనేది ఎప్పుడూ అదే స్వయంగా కనపడదు. ధర ద్వారానే కనపడుతుంది. మన సరుకు విలువ, గతంలో 15 రూపంతో వుంటే, అదే విలువ ఇప్పుడు 16 రూపంతో వుంది. 'విలువ' సారాంశం మార లేదు. దాని రూపం మాత్రమే మారింది. కాబట్టి, ధరలు మారినప్పుడల్లా కొత్త ధరలనే లెక్కలోకి తీసుకోవాలి. మన పరిశీలన, కొత్త ధర మీదే, దాని అంతర్భాగాల మీదే, వుండాలి. ఆ తర్వాత చూడవలసిన విషయాలన్నీ కొత్త ధర మీదే సాగుతాయి. ఇక పాత ధరని వదిలెయ్యాలి.

ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటంటే, జీతం పెరిగితే, సరుకు ధర పెరగాలా? - అక్కర లేదు. సరుకుకి శ్రమ కాలం పెరగదు కాబట్టి, ధర పెరగనక్కర లేదు. జీతాలు పెరిగితే, లాభం తగ్గుతుంది. అంతే ధర మారనక్కర లేదు. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, జీతాలు పెరిగితే ధరలు కూడా పెరగడమే జరుగుతుంది. ఎందుకంటే, జీతాలు పెరిగాక కూడా లాభం రేటుని గత స్థాయిలో నిలబెట్టుకోవడం కోసం.

అన్ని శాఖల లోనూ జీతాలు 10% పెరిగి, ధరలు కూడా 10% పెరిగితే, అది ఏ మార్పూ జరగని దానితోటే సమానం. అది పాత జీతాలకూ పాత ధరలకూ రూపాలు మారడం మాత్రమే. అయితే, జీతాలూ ధరలూ కూడా పెరిగాయి - అనుకున్నప్పుడు కూడా ఆ పెరుగుదలలన్నీ ఒకే స్థాయిలో జరగవు. జీతాలు పెరగడం, వేరు వేరు శాఖల్లో వేరు వేరు స్థాయిల్లో వుంటుంది. అలాగే, ధరలు పెరగడం కూడా వేరు వేరు స్థాయిల్లోనే వుంటుంది.

ఇదే సందర్భంలో ఇంకో ప్రశ్నకి కూడా జవాబు చూడాలి.

# ధరలు పెరిగితే జీతాలు పెరుగుతాయా, జీతాలు పెరిగితే ధరలు పెరుగుతాయా?

రెండూ నిజమే. రెండూ జరుగుతాయి. కానీ, ఏది మొదట జరుగుతుందో చూడాలి.

సైను బట్టని తీసుకుందాం. దానికి ఏదో ఒక ధర వుండాలి కాబట్టి, ఆ ధరని 15 అనుకుందాం. అది, $6_c + 4_v + 5_s$గా వుంది.

ఒక రోజున బట్ట పెట్టుబడిదారుడు, కార్మికుల్ని పిలిచి, "మీకు జీతాలు పెంచాలని నాకు చాలా కోరికగా వుంది. జీతాలు పెంచేస్తాను" అంటాడా? - అలా జరగదు.

కార్మికులే ఒక రోజున జీతాలు పెంచమని అడుగుతారనుకుందాం.

పెట్టుబడిదారుడు వెంటనే, "అయ్యో! మీరు అడగాలా? నాకు తెలియదా? తప్పకుండా పెంచుతాను" అంటాడా? - అలా అనడు. పైగా, "జీతాలు పెంచాలా? ఎందుకూ?" అంటాడు.

అప్పుడు కార్మికులు, తగిన కారణం చెప్పాలి - "మాకు జీతాలు చాలడం లేదు" అంటారు.

"చాలడం లేదా? ఇన్నాళ్ళూ చాలిన జీతాలు ఇప్పుడు ఎందుకు చాలడం లేదూ?" అని మళ్ళీ అడుగుతాడు పెట్టుబడిదారుడు.

అప్పుడు కార్మికులేం చెపుతారు? - "ఇప్పుడు ధరలన్నీ పెరిగి పోయాయి. జీతాలు పెరగక పోతే మేము బతకడం కష్టం" అంటారు.

"ధరలన్నీ పెరిగాయి" అని కార్మికులు చెప్పా

లంటే, నిజంగా అలా జరిగితే చెపుతారా, జరగక పోయినా చెపుతారా? - అలా జరగక పోయినా, "ధరలన్నీ పెరిగాయి" అని చెపితే, అది నిజమో కాదో పెట్టుబడిదారుడికి తెలీదా? ధరలన్నీ పెరగడం జరిగితేనే కార్మికులు అలా చెప్పగలరు. పెట్టుబడిదారుడు కూడా ఆ కారణాన్ని కాదనలేడు. 'ధరలన్నీ పెరిగాయి' అని పెట్టుబడిదారుడికి కూడా అప్పటికే తెలిసి వుంటుంది. అయినా, ఏమీ ఎరగనట్టు జీతాల సంగతి కార్మికులు అడిగే దాకా వూరుకుంటాడు.

"ధరలన్నీ పెరిగాయి" అని కార్మికులు అన్నప్పుడు, అది ఇతర సరుకుల ధరల సంగతే కాదు. ఆ కార్మికులు ఉత్పత్తి చేసే సైను బట్ట ధర సంగతి కూడా. ఆ 15 ధర కూడా అప్పటికే పెరిగి వున్న ధర అన్న మాట. ఈ ఉదాహరణలో, జీతాలు $4_V$ గా వెనకటి రోజుల్లో ప్రారంభమైనప్పుడు, ఆ సరుకు ధర, ఇప్పటి లాగ 15గా గాక, కొంత తక్కువగా వుండేదన్న మాట. (ఇక్కడ సంఖ్యలు ముఖ్యం కాదు. విషయాలే ముఖ్యం. వాటినే అర్థం చేసుకోవాలి.) గతంలో ప్రారంభమైన ఆ 4 జీతం, ఇప్పటి దాకా అలాగే వుంది. కానీ ఆ లోగా సరుకు ధర కొంత పెరిగి 15 అయింది - అనుకోవాలి. అలాగే, ఇతర శాఖల్లో ధరల సంగతి కూడా. కార్మికులు కొంత కాలం నించీ ఏది కొన్నా పెరిగిన ధరల తోటే కొంటున్నారని అర్థం.

సరుకుల ధరలన్నీ అలా పెరగడానికి కారణం, 'బంగారం విలువ' తగ్గడం గానీ, కాయితం డబ్బు పరిమాణం పెరగడం వల్ల నోటు విలువ తగ్గడం గానీ, రెండూ గానీ, కావచ్చు. అలా ధరలు పెరిగినప్పుడు, కార్మికులకు జీతాలు కూడా పెరగాలి. అలా పెరగకపోతే, పాత జీతాలతో, ధరలు పెరిగిన పోషణ వస్తువుల్ని కొనుక్కోవడం కష్టమై పోతూ వుంటుంది. అయినా వాళ్ళు దాన్ని కొన్నాళ్ళు భరిస్తారు. తర్వాత, నెమ్మదిగా యజమానిని అడగడం మొదలు పెడతారు, 'జీతాలు పెంచమ'ని. వాడు మొదట్లో మొరాయించినా తర్వాత తప్పనిసరై కొంత ఆలోచిస్తాడు.

అలా వున్న దశలో, జీతాల పెంపకం గురించి తర్జన భర్జనలు జరిగి, సైను బట్ట కార్మికులకు $4_V$ గాక, $5_V$ అందడం మొదలవుతుందనుకుందాం. జీతాలు పెరిగాయని అర్థం.

అమలులో వున్న జీతాలు పెరిగాయి - అంటే, ఏ కారణమూ లేకుండా ఆ పని జరగదు. 'జీతాలు' అనేవి, ఏ ఆర్థిక సూత్రాలూ లేకుండా ఏర్పడే విషయాలు కావు. ఇతర విషయాల్లో ఏ మార్పులూ లేకుండా వుంటే, 'అమలులో వున్న జీతాలు' ఎన్నడూ మారవు. మారవలసిన అవసరం వుండదు. అంటే, ఒక సారి జీతాలు పెరిగాయీ అంటే, అవి అప్పటికే తగ్గి వున్నాయి అన్నమాట. లేదా, వేరే మాటల్లో చెప్తే, అప్పటికి సరుకుల ధరలన్నీ పెరిగి వున్నాయి అన్న మాట. అప్పటికి జీతాలు తగ్గి వుండకపోతే, జీతాల్ని పెంచే పని ఏ పెట్టుబడిదారుడూ చెయ్యడు. - దీని సారాంశం ఏమిటంటే సరుకుల ధరలు పెరిగాకే జీతాలు పెరుగుతాయి - అని. ఇది మొదటి విషయం.

సరుకుల ధరలు పెరిగే వ్యవహారం, అక్కడి తోటే ఆగదు. జీతాల్ని పెంచిన తర్వాత, లాభం రేటు తగ్గుతుంది కాబట్టి, ధరలు ఇంకా పెరుగుతాయి. దీన్ని ఇంతకు ముందే చూశాం.

**మొత్తం క్రమం ఇలా వుంటుంది:**

సరుకుల ధరలు పెరగడమే మొదట జరుగుతుంది. జీతాలు తర్వాతే పెరుగుతాయి.

జీతాలు పెరిగాయి కాబట్టి, ఆ కారణంతో ధరలు మళ్ళీ పెరుగుతాయి.

అలా పెరిగిన ధరలు, కొంత కాలం పాటు అలా నిలబడతాయి.

తర్వాత, క్రమంగా, కాయితం డబ్బు విలువ ఎంతో కొంత తగ్గుతుంది.

తర్వాత మళ్ళీ అదే క్రమం!

డబ్బు విలువ తగ్గింది కాబట్టి, మొదట సరుకుల ధరలు పెరగడమూ,

దాని వల్ల జీతాలు పెరగడమూ,

దాని వల్ల మళ్ళీ ధరలు పెరగడమూ!

మళ్ళీ మళ్ళీ ఇలాగే!

ఈ క్రమాన్ని 2 దశలుగా చూడాలి.

**మొదటి దశ:** ధరలు పెరిగి, దాని వల్ల జీతాలు పెరగడం. ధరలు పెరిగాక, జీతాలు కూడా పెరగవలసిందే. ఇది సరైనదే. ఇది జరగవలసిందే. కానీ, జీతాల పెరుగుదల, ధరల పెరుగుదలతో సమానంగా గాక, తక్కువ గానే వుంటుంది. లేదా, జీతాల పెరుగుదల సరిగానే జరిగితే, దాని అర్థం, అప్పటికే తగ్గిపోయి వున్న జీతాలు పెరిగాయనీ, తగ్గకుండా నిలబడ్డాయనీ మాత్రమే. అంతే గానీ, జీతాలు వాటి స్థాయిని మించి పెరిగాయని కాదు.

**రెండో దశ:** జీతాలు పెరిగాక, ధరలు మళ్ళీ పెరగడం. ఇది జరగనక్కర లేదు. జీతాలు పెరిగినా, ధరలు పాతవే వుండాలి. ధరల్ని అలాగే వుంచి జీతాల్ని పెంచాలి. కానీ అలా జరగదని ఇంతకు ముందే చూశాం. జీతాలు పెరిగాక పాత ధరలే వుంటే, 'లాభం రేటు' తగ్గుతుంది కాబట్టి, జీతాలు పెరిగాక కూడా లాభం రేటు తగ్గకుండా వుండాలంటే, ధరలు మళ్ళీ పెరగాలి. అదే జరుగుతుంది.

ఇప్పుడు మొత్తం విషయాన్ని చూస్తే - ధరలూ, జీతాలూ పెరుగుతూ పోయే క్రమంలో 'ప్రారంభం' ఏది? ధరలు పెరిగితే జీతాలు పెరుగుతాయా, జీతాలు పెరిగితే ధరలు పెరుగుతాయా?

రెండూ నిజమే. రెండూ జరుగుతాయి. కానీ, ప్రారంభం మాత్రం - ధరలు పెరగడమే. తర్వాత జీతాలూ, మళ్ళీ ధరలూ! ఇదీ, ధరల పెరుగుదలకీ, జీతాల పెరుగుదలకీ వుండే సంబంధం.

ఇక్కడ ఇంకో ప్రశ్నకి కూడా జవాబు చెప్పుకున్న తర్వాతే ముందుకు సాగాలి. పెట్టుబడిదారులు జీతాల్ని పెంచిన తర్వాత ధరల్ని మళ్ళీ పెంచగలిగితే, మొదట జీతాల్ని పెంచడానికి ఎందుకు మొరాయిస్తారు? కార్మికులు అడిగిన వెంటనే జీతాల్ని పెంచేసి, తర్వాత సరుకుల ధరల్ని కూడా పెంచుకోవచ్చు కదా? జీతాల్ని పెంచే విషయంలో పెట్టుబడిదారుడికీ, కార్మికులకూ ఘర్షణలు ఎందుకు జరగాలి?

జీతాల్ని పెంచాక పెట్టుబడిదారుడు తన సరుకు ధరని కూడా పెంచుతాడు - అనే దానికేమీ సందేహం లేదు. అయితే, సరుకు ధరని పెంచడం అనేది, పెట్టుబడిదారుడికి ఇబ్బంది లేని పని మాత్రం కాదు. వాడికి సరుకుల్ని అమ్ముకోవలసిన సమస్య ఎప్పుడూ వుంటుంది. సరుకుని తక్కువ ధరతో అమ్మడం కన్నా ఎక్కువ ధరతో అమ్మడం ఎక్కువ కష్టం. తక్కువ ధరతో అమ్మడమే ఎక్కువ తేలిక. ఇక్కడ, 'ధరని పెంచడం', పాత లాభం రేటుని నిలబెట్టుకోవడం కోసమే - అని చూస్తున్నాం. ధరని పెంచకుండానే ఆ లాభాన్ని తీసుకోగలిగితే, ఆ పరిస్తితే పెట్టుబడిదారుడికి ఎక్కువ సౌఖ్యం. కాబట్టి, సరుకు ధరని పెంచే ఏ సందర్భంలో అయినా, పెట్టుబడిదారుడు కొంత సంకోచం లోనే వుంటాడు. ధరని పెంచకుండానే లాభం రేటుని నిలబెట్టుకోవడానికి మొదట ప్రయత్నిస్తాడు. జీతాల్ని పెంచితే, సరుకు ధరని కూడా పెంచవలసి వస్తుంది కాబట్టి, జీతాల్ని పెంచకుండా వుండడానికే మొదట చూస్తాడు. కార్మికుల వేపు నించీ ఒత్తిడి ఎక్కువైనప్పుడే ఆ పని చేస్తాడు.

తప్పనిసరై జీతాల్ని పెంచాక, సరుకు ధరని పెంచే పని తక్షణమే జరగనూ వచ్చు; జరగక పోనూ వచ్చు. తక్షణమే జరగక పోయినా, కొంత ఆలశ్యంగా నైనా అది జరిగి తీరుతుంది. ఇక్కడ మనం, పెట్టుబడీ - లాభం రేటూ అనే అంశాల మీదే దృష్టి పెట్టాలి. పెట్టుబడి ఎప్పుడూ ఎక్కువ లాభం రేటుని ఆశిస్తుంది. కనీసం, పాత లాభం రేటుని నిలబెట్టుకోవాలని అయినా చూస్తుంది. దాని ప్రయత్నాలు, పాత లాభం రేటుని కూడా తగ్గించుకుంటూ పోయే విధంగా వుండవు.

మొదటి ధరా, పెరిగిన రెండో ధరా, ఇంకా పెరిగిన మూడో ధరా - ఈ 3 సందర్భాల లోనూ లాభం రేటు ఒకే రకంగా వున్నట్టు చూద్దాం.

ఆ 3 సందర్భాలూ ఇలా వుంటాయి:

1. మొదటి జీతాలూ, మొదటి ధరా, లాభం రేటు 50%
2. మొదటి జీతాలూ, పెరిగిన రెండో ధరా, లాభం రేటు 50%
3. పెరిగిన జీతాలూ, ఇంకా పెరిగిన మూడో ధరా, లాభం రేటు 50%

ఇది ఎలా జరుగుతుందో చూద్దాం. ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, గతంలో చూసిన సంఖ్యల్ని కొంచెం మార్చి తీసుకోవాలి.

1. మొదటి జీతాలూ, మొదటి ధరా:

బట్ట ధర 45. దాని భాగాలు $20_C + 10_V + 15_S$

ఇక్కడ పెట్టుబడి = $20_C + 10_V = 30$

30 పెట్టుబడికి, 15 లాభం అంటే,

లాభం రేటు = — × 100 = 50%

ఇలా వుండగా, కొంత కాలానికి, 'డబ్బు విలువ' తగ్గడం వల్ల, అన్ని శాఖల లోనూ ధరలన్నీ 10% పెరిగాయనీ, జీతాలు మాత్రం మారలేదనీ, అనుకుందాం.

2. పాత జీతాలూ, పెరిగిన ధరా:

బట్ట పెట్టుబడిదారుడు, ఈ ఉదాహరణలో, జీతాల మీద గతం కన్నా ఎక్కువ పెట్టడు. గతంలో లాగ 10 మాత్రమే పెడతాడు. కానీ, ఉత్పత్తి సాధనాల్ని ఇతర పెట్టుబడి దారుల నించి కొనాలి. వాటి ధరలు 10% పెరిగి వున్నాయి. కాబట్టి, వాటి కోసం గతంలో

20 పెడితే, ఇప్పుడు 22 పెడతాడు. కానీ, ఇక్కడ 'స్థిర' మీద ఎక్కువగా పెట్టడం అంటే, ఉత్పత్తి సాధనాల పరిమాణం పెరిగిందని అర్థం కాదు. అది గతంలో లాగే వుంది. వాటి 'ధర' పెరగడం మాత్రమే జరిగింది. ఇప్పుడు పెట్టుబడి, $22_C + 10_V = 32$. ఈ పెరిగిన పెట్టుబడికి లాభం రేటు గతంలో లాగే 50% రావాలంటే, 16 లాభం రావాలి.

గత ఉదాహరణలో లాభం 15 అయితే, ఈ ఉదాహరణలో లాభం 16. కార్మికులు గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువ శ్రమని ఇచ్చారని అర్థమా? - కాదు. ఇప్పుడు, ఉత్పత్తి సాధనాల పరిమాణం గానీ, పని దినం పొడవు గానీ, పెరగ లేదు. కాబట్టి, కార్మికుల సజీవ శ్రమ కాలం పెరగలేదు. అది, గతం లోనూ ఇప్పుడూ కూడా ఒకటే.

ఇప్పుడు సరుకు ధర: $22_C + 10_V + 16_S = 48$. ఈ సరుకుకే గత ధర 45 అయితే, పెరిగిన ధర 48. ధరలో అన్ని భాగాలూ పెరిగాయి - 'జీతాలు' తప్ప.

32 పెట్టుబడికి - 16 లాభం అయితే,

లాభం రేటు — × 100 = 50%.

లాభం రేటు, గతంలో లాగే వుంది.

ఈ ఉదాహరణలో, ఉత్పత్తి సాధనాల ధరలు పెరగడం వల్ల, దాని కోసం, పెట్టుబడిదారుడు ఎక్కువ పెట్టుబడి పెట్టాడు కాబట్టి, తన సరుకు ధరని కూడా పెంచి, పాత లాభం రేటుని తగ్గకుండా నిల బెట్టుకున్నాడు.

ఈ ఉదాహరణలో, కార్మికుల విషయం చూస్తే, సరుకుల ధరలు పెరిగినా, జీతాలు పెరగలేదు. వారు, పాత జీతాల తోటే, ధరలు పెరిగిన సరుకుల్ని కొనాలి. అందుకే, జీతాలు కూడా పెరగవలసి వుంటుంది.

3. పెరిగిన జీతాలూ, పెరిగిన ధరా:

జీతాల్ని కూడా 10% పెంచాలంటే, పెట్టుబడిదారుడు, దాని కోసం ఇంకా కొంత పెట్టుబడి పెట్టాలి. మళ్ళీ ఆ పెట్టుబడికి కూడా లాభం రావాలి. అవన్నీ కలిసి, సరుకు ధర ఇంకా పెరుగుతుంది.

ఇప్పుడు సరుకు ధర:

$22_C + 11_V + 16_S = 49$ .

ఇప్పుడు 33 పెట్టుబడికి - 16 లాభం అయితే,

లాభం రేటు = 16 ÷ 33 × 100 = 50%.

పెట్టుబడిదారుడు, జీతాల కోసం గతంలో కన్నా ఎక్కువ పెట్టుబడి పెట్టాడు కాబట్టి, సరుకు ధరని ఇంకా పెంచి, తన 'లాభం రేటు'ని తగ్గకుండా నిల బెట్టుకున్నాడు.

సరుకుకి మొదటి ధర - 45, రెండో ధర 48, మూడో ధర 49 . లాభం రేటు అన్ని చోట్లా ఒకటే. పాత లాభం రేటుని నిలబెట్టుకోవడానికే ధరని పెంచుకుంటూ పోవలసి వచ్చింది.

నిజ జీవితాల్లో, మొదటి ఉదాహరణనీ, చివరి ఉదాహరణనీ పోల్చి చూస్తే, ధరలో పెరుగుదలా, జీతాల్లో పెరుగుదలా ఒకే స్థాయిలో (ఒకే శాతంగా) వుండక పోవచ్చు. ధరలో పెరుగుదల కన్నా జీతాల్లో పెరుగుదల తక్కువే వుండవచ్చు. ఆ లెక్కలన్నీ కార్మికులకు అందవు. ధర 10% పెరిగి, జీతాలు 8% పెరిగితే, జీతాలు గతం కన్నా తగ్గినట్టు అర్థం. కానీ జీతాలు ఎంతో కొంత పెరిగాయి కాబట్టి, ధరలు పెరిగాక జీతాలు కూడా పెరిగినట్టే కార్మికులకు కనపడుతుంది.

ధరలూ జీతాలూ పెరుగుతూ పోయే ఈ పెట్టుబడిదారీ కార్యక్రమం వల్ల, 'కాయితం డబ్బు రాసి' కుప్పతెప్పలుగా పెరిగి పోవడం తప్ప, సమాజంలో అంత కన్నా సాధించగలిగే కొత్త మార్పేదీ వుండదు. 'డబ్బు రాసి' పెరగడం అంటే, కాయితం ఖర్చూ, దాని మీద ప్రింటింగు ఖర్చూ, ఆ నోట్ల రవాణా ఖర్చూ - వగైరా ఖర్చులన్నీ పెరగడమే. ఒకప్పుడు 1 రూపాయి నోటుతో జరిగే పనిని, 100 రూపాయి నోట్లతో చెయ్యడం అంటే, అది, గతంలో కన్నా ఇంకా 99 రెట్ల ఖర్చుని వ్యర్థంగా చెయ్యడమే.

కానీ పెట్టుబడిదారీ విధానంలో ఇదంతా తప్పదు. ఇదంతా దాని సహజత్వం. పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తకి పెట్టుబడి దారుడు ఏం చేస్తే అదే గొప్ప శాస్త్రం! ధరలూ, జీతాలూ, మళ్ళీ ధరలూ, పెరుగుతూ పోతే, అవే గొప్ప ఆర్థిక సూత్రాలు!

ధరలూ జీతాలూ పెరిగే గందర గోళాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే, 'జీతాలు పెరిగాక సరుకు ధర పెరగడం కూడా తప్పనిసరే' అనే పొరపాటు అభిప్రాయం కార్మికులకు కూడా కలుగుతుంది. దాని వల్ల, 'జీతాల పెరుగుదల కోసం పోరాడడం దండగ' అనే అభిప్రాయం కూడా కలుగుతుంది.

మార్క్సు రోజుల్లోనే వెస్టన్ అనే కార్మిక నాయకుడు, 'జీతాల పెరుగుదల కోసం పోరాడడం దండగ.

తర్వాత మళ్ళీ ధరలు ఎలాగూ పెరుగుతాయి. ధరలు పెరిగితే ఇక జీతాలు పెరిగి ఏం ప్రయోజనం?' అనే రకంగా వాదిస్తాడు.

ఆ వాదననీ, దానికి మార్క్సు ఇచ్చిన జవాబునీ, మార్క్సు మాటల్లో తర్వాత చూస్తాం. దాని కన్నా ముందు, జీతాల పెరుగుదల కోసం చేసే పోరాటాల గురించి కార్మికుల్లో కూడా వుండే పొరపాటు అభిప్రాయాల గురించి చూడాలి.

**ఆ పొరపాటు వాదన ఇలా వుంటుంది:**

"ఒక జీతం 4 రూపాయలు. దానితో పోషణ వస్తువులు వస్తాయి. జీతాలు పెరగాలనే పోరాటం వల్ల, ఆ జీతం 5 రూపాయలు అయింది. కానీ, జీతాలు పెరగాలంటే, పెట్టుబడి పెరగాలి కదా? పెట్టుబడి పెరిగినప్పుడు సరుకు ధర కూడా పెరగవలిసిందే కదా? గతంలో 4 గా వుండే సరుకుల ధర, ఇప్పుడు 5 గా పెరుగుతుందనుకుందాం. కార్మికులు గతంలో 4 జీతంతో కొనే వస్తువులనే ఇప్పుడు 5 జీతంతో కొంటారు. పాత పరిస్తితీ, కొత్త పరిస్తితీ ఒకటే. అలాంటప్పుడు, జీతాలు పెరగాలని పోరాడితే ఏమిటి ప్రయోజనం?' - ఇదీ ఆ వాదం.

జీతం, ధరా, లాభం - వంటి విషయాల మీద సరైన అవగాహన లేకపోవడం వల్లనే, ఇలాంటి పొరపాటు వాదాలు సాగుతాయి.

ఆ అవగాహనలో పొరపాట్లు:

1. 'జీతం అనేది ఫలానా ఇన్ని వస్తువుల మొత్తం మాత్రమే. ఉదాహరణకి, 4 వస్తువులు మాత్రమే. జీతం పెరగడం అంటే, దాని 'డబ్బు రూపం' మారుతుందే గానీ వస్తువుల రాసి పెరగదు. పెరిగిన డబ్బుతో కూడా గతంలో లాగే ఆ వస్తువులే రావాలి. అవే వస్తాయి.

**జవాబు:** నిజమే. పెట్టుబడిదారీ విధానంలో, జనరల్‌గా అదే జరుగుతుంది. జీతం అంటే కొన్ని వస్తువులే. అయినప్పటికీ, ఆ విధానంలో కూడా జీతం అనేది, మారడానికి సాధ్యం కాని 'స్తిర పరిమాణం' కాదు. S లో నించి కొంత భాగం V లోకి వస్తే, జీతం పెరిగి, దాని వల్ల వచ్చే ఉత్పత్తులు కూడా పెరగవచ్చు. సజీవ శ్రమ, V + S లుగా వుంటుందనే సంగతి తెలియక పోతే, పెట్టుబడి దారుడు ఎంత ఇస్తే అంతే, (4 వస్తువులు ఇస్తే అదే), జీతానికి చివరి హద్దుగా కనపడుతుంది. కానీ, జీతానికి 'డబ్బు రూపం' మారినప్పుడు, దాని ద్వారా వచ్చే వస్తువులు, గతం కన్నా తగ్గనూ వచ్చు, పెరగనూ వచ్చు. ఆ 'వస్తువుల రాసి' ఎప్పుడూ స్తిరంగా వుంటుందనీ, అందులో మార్పే జరగదనీ, అనుకోవడం పొరపాటు.

2. జీతం పెరిగితే, పెట్టుబడి పెరగాలి. పెట్టుబడి పెరిగితే, సరుకు ధర కూడా పెరగవలసిందే కదా?

**జవాబు:** పెట్టుబడిదారీ విధానంలో ఏది జరుగుతూ వుంటే దాన్నే సరైనదిగా భావిస్తూ దాన్నే యధాతధంగా తీసుకోవడం అన్న మాట ఇది. జీతాలు పెరిగితే, పెట్టుబడి పెరిగే మాట నిజమే. కానీ, పెట్టుబడి పెరిగినా, సరుకు ధర పెరగ నక్కర లేదు. కానీ, జీతాలు పెరిగితే, లాభం తగ్గుతుంది కాబట్టి, ఆ లాభం కోసమే, జీతాల్ని పెంచాక, సరుకు ధరని కూడా పెంచుతారు. పాత లాభం రేటుని నిలబెట్టుకోవడం అనే కారణమే లేక పోతే, జీతాలు పెరిగినా, దాని వల్ల పెట్టుబడి పెరిగినా, సరుకుల ధరలు పెరగ నక్కర లేదు. ఏ సరుకు కైనా విలువ పెరిగితేనే ధర పెరగాలి. 'జీతాలు పెరిగితే, సరుకు ధర పెరగక తప్పదు కదా?' అని కార్మికులు భావించకూడదు. విలువ గురించి సరిగా తెలియక పోతేనే ఇలాంటి పొరపాటు అభిప్రాయాలు కలుగు తాయి.

3. జీతాలు పెరిగితే ధరలు కూడా పెరుగుతాయి కాబట్టి, ఇక జీతాల పెరుగుదల కోసం పోరాడి ఏం ప్రయోజనం? పాత జీతాల పరిస్తితినే కొనసాగించుకుంటే పోదా?

**జవాబు:** ఇలా వాదించే వాళ్ళు పాత పరిస్తితిని గురించి ఏమనుకుంటున్నారంటే - 'పాత జీతాలూ, పాత ధరలూ అలా నిశ్చలంగా వుంటూ వుండగానే కార్మికులు ఆ జీతాలు పెరగాలని అడుగుతున్నారు' అనుకుంటున్నారు. అంటే, పాత పరిస్తితి, పాత పరిస్తితిగా లేదనీ, అందులో 'ధరలు' అప్పటికే పెరిగి వుండడం వల్లనే జీతాలు కూడా పెరగ వలసిన పరిస్తితి ఏర్పడిందనీ, వారు గ్రహించలేదన్నమాట. పాత జీతాల్నీ పాత ధరల్నీ తీసుకుంటే, వాటిలో ఒక అంశం మారకుండా వుంటే, రెండో అంశం కూడా మారనక్కర లేదు. కానీ, పాత ధర - పాత ధరగా ఆగకుండా ఎంతో కొంత పెరిగి కొత్త ధరగా తయారైతే, అప్పుడు పాత జీతం, ఏం చెయ్యాలి? అది కూడా ఎంతో కొంత పెరిగి, కొత్త జీతంగా మారవలసిందే

కదా? అలా జరగకపోతే కార్మికులు, తగ్గిపోయిన జీతాలతో, ధరలు పెరిగిన సరుకుల్ని కొనవలసి వస్తుంది కదా? ఇలాంటి పరిస్థితుల్లో, 'జీతాలు పెరగాలని అడగడం వల్ల ఏం ప్రయోజనం?' అని ఎవరైనా వాదిస్తున్నారంటే, వాళ్ళు, పాత ధరలు - పాత ధరలుగానే వున్నాయని భావించడం వల్లనే అలా వాదిస్తున్నారన్న మాట.

4. 'ధరలు కొంత పెరిగాయనీ, జీతాలు మాత్రం పాతవే వున్నాయనీ - అనుకుందాం. అప్పుడు కూడా కార్మికులు చెయ్యవలసింది, జీతాల్ని పెంచమని అడగడం కాదు. ధరల్ని తగ్గించమని అడగాలి. ధరలు తగ్గిపోతే, అప్పుడు గతంలో లాగే పాత ధరలే, పాత జీతాలే కలిసి వుంటాయి. అలాగాక, జీతాల్ని పెంచమని అడిగితే, దాని వల్ల ధరలు ఇంకా పెరగడమే జరుగుతుంది. ధరలు మళ్ళీ పెరిగితే, ఇక జీతాల్ని పెంచుకుని ఏం ప్రయోజనం? కాబట్టి, ఎప్పుడైనా ధరలు పెరిగితే కార్మికులు చెయ్యవలసింది, ధరల్ని తగ్గించమనే అడగాలి.

**జవాబు:** కార్మికులు అడగవలసింది, ఏదో ఒక్కటే కాదు, రెండూ అడగవచ్చు. 'జీతాలు పెరగాలి' అనీ అడగవచ్చు; 'ధరలు తగ్గాలి' అనీ అడగవచ్చు. ఇదీ అదీ కూడా అడగవచ్చు. అందులో ఏ మార్గాన్నీ వదిలి పెట్టనక్కర లేదు. 'జీతాల మాట అనవసరం. ధరలు తగ్గాలని డిమాండ్ చేస్తే చాలు' అనే వాదం తప్పు.

ఈ రకంగా, జీతాల పెరుగుదలా, ధరల పెరుగుదలా - వంటి చాలా విషయాల మీద కార్మిక నాయకుల్లో కూడా కొన్ని పొరపాటు అభిప్రాయాలు వుంటాయి. ఎక్కువ జీతాలు రావడాన్ని వారు వ్యతిరేకిస్తారని కాదు. కానీ, ధరలు పెరగడానికి వుండే వేరు వేరు కారణాల్ని అర్థం చేసుకోక పోవడం వల్ల, ఏ సందర్భంలో దేన్ని డిమాండ్ చెయ్యాలో అర్థం చేసుకోలేరు.

బంగారం విలువ తగ్గడం వల్ల ధరలు పెరిగే సందర్భాన్ని తీసుకుంటే, అలాంటి సందర్భంలో, 'ధరలు తగ్గాలి' అని డిమాండ్ చెయ్యడం సాధ్యం కాదు. అప్పుడు, 'జీతాలు పెరగాలి' అని డిమాండ్ చెయ్యడమే మార్గంగా వుంటుంది.

అలాగే, కార్మిక వర్గానికి ప్రధాన పోషణ వస్తువులుగా వుండే వాటికి విలువలు పెరగడం వల్లనే ధరలు పెరిగితే, అలాంటి సందర్భాల్లో కూడా 'ధరలు తగ్గాలి' అని డిమాండ్ చెయ్యడం సాధ్యం కాదు. అప్పుడు కూడా 'జీతాలు పెరగాల'ని అడగవలిసిందే.

'ధలు తగ్గాల'ని అడగడం సరైనదే అయిన సందర్భాల్లో కూడా, ఆ డిమాండ్ కొన్ని సార్లు పని చెయ్యదు. అలాంటప్పుడు, జీతాలు పెరగాలని అడగడమే తప్పనిసరి అవుతుంది.

గతంలో, 3 ఉదాహరణలు చూశాం, ఇలా:
పాత జీతాలూ, పాత ధరలూ - లాభం రేటు 50%
పాత జీతాలూ, పెరిగిన ధరలూ - లాభం రేటు 50%
పెరిగిన జీతాలూ, ఇంకా పెరిగిన ధరలూ - లాభం రేటు 50%

ఈ ఉదాహరణల్లో, మనం, 2 వ ఉదాహరణ దగ్గిర నిలబడి చర్చిస్తున్నాము. ఇక్కడి నించీ పెట్టుబడిదారుడు వెనక్కి వెళ్ళినా అదే లాభం రేటు, ముందుకు వచ్చినా అదే లాభం రేటు. కాబట్టి, వెనక్కి వెళ్ళినా పెట్టుబడిదారుడికి లాభం రేటు తగ్గే సమస్యేమీ వుండదు. కానీ, వెనక ఉదాహరణలో కన్నా, తర్వాత ఉదాహరణలో లాభం రాసి ఎక్కువ. ఒక సరుకు ద్వారా 15 లాభం కన్నా 16 లాభం వచ్చే మార్గాన్నే పెట్టుబడి దారుడు అనుసరిస్తాడు.

జీతాలూ ధరలూ పెరిగి వున్న 3వ ఉదాహరణలో కన్నా, అవి రెండూ తగ్గి వున్న మొదటి ఉదాహరణలో, చలామణీలో తిరగడానికి తక్కువ డబ్బు రాసి తోటే సరిపోతుంది. ఆ కారణంతో, మొదటి ఉదాహరణే మంచిది. కాబట్టి, 'ధరలు తగ్గాలి' అనే పోరాటానికి కూడా విలువ వుంటుంది. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, ధరల్ని తగ్గించే పోరాటాల మీద ఆశలు పెట్టుకో కూడదు.

అయినప్పటికీ, 'ధరల్ని తగ్గించాలి' అనే డిమాండునీ వదలనక్కర లేదు. 'జీతాల్ని పెంచాలి' అనే డిమాండునీ వదలనక్కర లేదు. ఎప్పుడు ఏది సాధ్యమైతే దాన్ని అనుసరించాలి. మొత్తం మీద, ఎప్పుడూ జీతాలు తగ్గిపోకుండా చూసుకోవాలి.

జీతాల కోసం పోరాటం అనేది, జీతంగా వచ్చే '4 వస్తువుల్ని' తగ్గిపోకుండా నిలబెట్టుకోవడానికీ కావచ్చు; లేదా, వస్తువుల్ని ఇంకా కొంత పెంచుకోవడానికీ కావచ్చు. అది, ఆ ప్రత్యేక సందర్భాన్ని బట్టి వుంటుంది.

'జీతాల పెరుగుదల' గురించి అనేక పొరపాటు అభిప్రాయాలతో వున్న కార్మిక నాయకుల్ని వుద్దేశిస్తూ మార్క్సు 1865లో, "వేతనం, ధర, లాభం" అనే

వ్యాసం రాశాడు. వెస్టన్‌కి ఇచ్చిన జవాబు ఆ వ్యాసం లోదే. ఎప్పుడైనా జీతాలు పెరగడం జరిగిందంటే సరుకుల ధరలు అప్పటికే పెరిగి వుంటాయనీ, అందుకే జీతాలు పెరుగుతాయనీ - చెప్పే వాదం ఈ వ్యాసంలో కనపడుతుంది. [మార్క్స్ - ఎంగెల్స్ సంకలిత రచనలు- 2 లో, ఈ వ్యాసం వుంది.]

**మార్క్స్ మాటలు:**

1. " యూరప్ ఖండ దేశాల్లో ఈ నాడు ప్రబలమైన 'అంటు జాడ్యం' లాగ సమ్మెలు సాగుతున్నాయి. వేతనాలు పెరగాలన్నది సార్వత్రిక డిమాండ్ అయింది. ఈ సమస్య, మన 'మహాసభ'లో చర్చకు వస్తుంది. అంతర్జాతీయ సంఘ నాయకులుగా మీరు అత్యంత ప్రధానమైన ఈ సమస్యపై దృఢాభిప్రాయాలు కలిగి వుండాలి. అందుచేత, మీ ఓపికను తీవ్ర పరీక్షకు గురి చెయ్యాల్సిన ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వచ్చినా, ఈ విషయాన్ని కూలంకషంగా పరిశీలించాల్సిన అవసర ముందని నేను భావిస్తున్నాను.

సిటిజెన్ వెస్టన్‌ని గురించి కూడా నేను ముందుగా ఒక మాట చెప్పాల్సి వుంది. కార్మిక వర్గానికి అత్యంత అయిష్టమైనవని తెలిసి వున్నా, తన దృష్టిలో, కార్మిక వర్గ శ్రేయస్సుకు ఉపయోగపడతాయన్న నమ్మకంతో ఆయన తన అభిప్రాయాలను ప్రతిపాదించడమే గాకుండా వాటిని బహిరంగంగా సమర్థించాడు. అటువంటి నైతిక ధైర్య ప్రదర్శనను మన మందరం ఘనంగా గౌరవించి తీరాల్సిందే. నా ఈ నివేదికను సొంతంగా విన్న మీదట, తన ప్రధాన అంశాల మూలంలో వున్నట్టు కనిపించే అసలు భావాన్ని నేను ఆమోదిస్తున్నట్టు ఆయన గుర్తిస్తాడని ఆశిస్తున్నాను. కానీ, అవి, ఇప్పుడు వున్న రూపంలో సిద్ధాంత రీత్యా తప్పనీ, ఆచరణ రీత్యా ప్రమాదకరమైనవనీ, నేను పరిగణించకుండా వుండలేను."

[పే. 15.]

2. "అతని వాదన సారాంశమంతా ఇలా వుంటుంది: కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గం చేత డబ్బు వేతనాల రూపంలో 4 షిల్లింగులకు బదులు 5 షిల్లింగులను కక్కిస్తే, పెట్టుబడి దారుడు సరుకుల రూపంలో 5 షిల్లింగుల విలువకు బదులు 4 షిల్లింగుల విలు వనే ఇచ్చి బదులు తీర్చుకుంటాడు. కార్మిక వర్గం, వేతనాల పెరుగుదలకు ముందు, తాము ఏ సరుకుల నైతే 4 షిల్లింగులకు కొన్నారో, వాటికే ఇప్పుడు 5 షిల్లిం గులు చెల్లించాల్సి వుంటుంది. ఇదీ వెస్టన్ వాదం. అయితే, ఇలాగే ఎందుకు జరుగుతుంది? పెట్టుబడిదారుడు, 5 షిల్లింగులకు బదులు, 4 షిల్లింగుల విలువైన సరుకులనే ఎందుకిస్తాడు? వేతనాల మొత్తం స్థిరమైనది కనక. కానీ, అది 4 షిల్లింగుల విలువ గల సరుకుల వద్దనే ఎందుకు స్థిరపరచబడింది? 3 దగ్గరో, 2 దగ్గరో, మరే ఇతర మొత్తం దగ్గరో, ఎందుకు స్థిరపరచబడ లేదు? వేతనాల మొత్తపు పరిమితి ఏదైనా ఒక ఆర్థిక నియమం చేత - పెట్టుబడిదారుని అభీష్టానికీ, కార్మికుని అభీష్టానికీ కూడా అతీతమైన నియమం చేత - నిర్ణయింపబడే మాటైతే, సిటిజెన్ వెస్టన్ చేసి వుండాల్సిన మొట్ట మొదటి పని, ఆ నియ మమేమిటో పేర్కొనడమూ, దాన్ని రుజువు చెయ్యడ మూనూ." [పే. 18.]

3. " నేను ఇంత వరకూ నిరూపించిన సందర్భాలన్నిటి లోనూ, 100 కి, 99 సందర్భాల్లో, <u>వేతనాల పెంపు కోసం జరిగే ప్రతీ పోరాటమూ, అంతకు ముందే సంభవించిన మార్పులను అనుసరించి మాత్రమే జరిగినట్టు</u> మీరు గమనించారు. 'ఉత్పత్తి మొత్తం'లో, 'శ్రమ ఉత్పాదక శక్తి'లో, 'శ్రమ విలువ'లో, 'డబ్బు విలువ'లో, 'గుంజుకోబడిన శ్రమ పరిమితి'లో, 'శ్రమ తీవ్రత'లో, 'సరఫరా గిరాకీల'లో - వగైరాలలో వచ్చే ఎగుడు దిగుళ్ళపై ఆధారపడి, పారిశ్రామిక వలయావర్తపు విభిన్న దశలకు అనుగుణంగా మార్కెట్ ధరల్లో వచ్చిన హెచ్చు తగ్గులలో, అంతకు ముందే వచ్చిన మార్పుల అనివార్య పర్యవసానాలుగా మాత్రమే, అవి (వేతనాల పెంపు కోసం పోరాటాలు), జరిగినట్టు మీరు గమనించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, అది 'పెట్టుబడి' చేసిన పూర్వ చర్యకు, 'శ్రమ' చేసిన ప్రతి చర్య. వేతనాల పెంపుదల కోసం జరిగే పోరాటాన్ని ఈ పరిస్థితులన్నింటి నించీ వేరు చేసి పరిశీలించడం అంటే, అనగా వేతనాల మార్పుని మాత్రమే పరిగణనలోకి తీసుకుని, వేటి మూలంగా నైతే వేతనాలలో మార్పు వచ్చిందో ఆ ఇతర మార్పులన్నింటినీ ఉపేక్షించడమంటే, మీరు తప్పుడు పూర్వ సిద్ధాంతాల నుంచి బయల్దేరి, తప్పుడు నిర్ధారణలకు చేరుకోవడమే అవుతుంది."

[పే. 65 - 66.]

4. "ఆధునిక పరిశ్రమాభివృద్ధి - కార్మికులకు వ్యతిరేకం గానూ, అంతకంతకూ అధికాధికంగా పెట్టుబడి దారులకు అనుకూలం గానూ త్రాసు మొగ్గేలా విధిగా చేసి తీరుతుందనీ; తత్పర్యవసానంగా పెట్టు

బడిదారీ ఉత్పత్తి విధానపు సాధారణ ధోరణి, సగటు వేతన ప్రమాణాన్ని కుదించడమే గానీ, పెంపొందించడం కాదనీ; వేరే మాటల్లో చెప్పాలంటే, 'శ్రమ శక్తి విలువ'ను ఇంచుమించుగా దాని కనీస పరిమితికి నెట్టడమేననీ - ఈ విషయాల్ని నిరూపించేందుకు, ఈ కొద్దిపాటి అంశాలు చాలు. ఈ వ్యవస్థలో స్థితిగతుల ధోరణి ఇలా వున్నప్పుడు, పెట్టుబడి యొక్క అతిక్రమణలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం తన ప్రతిఘటనకు స్వస్తి చెప్పాలనీ, తన పరిస్తితిని తాత్కాలికం గానే అయినా మెరుగుపరుచుకోవడానికి అడపా దడపా లభించే యాదృచ్ఛికావకాశాల నుంచి సాధ్యమైనంత అధిక ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నాలు చెయ్యకుండా వదులుకోవాలనీ, అర్థమా? కార్మికులు ఆ విధంగా చేసినట్టయితే, అత్యంత హీనస్తితికి దిగజారతారు." [పే. 71.]

5. ".... ఈ కింది నిర్ధారణలను ప్రతిపాదిస్తూ, ఇక నా నివేదికను ముగిస్తాను.

**మొదటిది:** వేతనాల రేటులో సాధారణమైన పెరుగుదల కారణంగా లాభపు సాధారణ రేటు పడిపోతుంది. కాని మొత్తం మీద, సరుకుల ధరపై దాని ప్రభావమేమీ ఉండదు.

**రెండవది:** పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క సాధారణ ప్రవృత్తి, సగటు వేతన ప్రమాణాన్ని దిగజార్చడమే గానీ పెంచడం కాదు.

**మూడవది:** ట్రేడ్ యూనియన్లు, పెట్టుబడి యొక్క అతిక్రమణలను ప్రతిఘటించే కేంద్రాలుగా చక్కగా పని చేస్తాయి. తమ శక్తిని అవివేకంగా ప్రయోగించినట్టయితే, ఆ కారణంగా అవి, పాక్షికంగా వైఫల్యం పొందుతాయి. ఏక కాలంలో, అమలులో వున్న వ్యవస్థను మార్చ ప్రయత్నించేందుకు బదులు, కార్మిక వర్గపు అంతిమ విముక్తిని సాధించేందుకు బదులు, అంటే 'వేతన వ్యవస్థ'ను సమూలంగా రద్దు చేసేందుకు తమ సంఘటిత శక్తిని ఒక సాధనంగా వినియోగించేందుకు బదులు, ప్రస్తుత వ్యవస్థ యొక్క దుష్ఫలితాలకు వ్యతిరేకంగా అసంఘటిత పోరాటానికి తమను తాము పరిమితం చేసుకోవడమే, వాటి సాధారణ వైఫల్యానికి కారణం." [ పే. 72.]

6. "అదే సమయంలో, వేతన వ్యవస్థతో ముడి పడి వున్న సాధారణ బానిసత్వం సంగతిని అటుంచి, కార్మిక వర్గం ఈ రోజువారీ పోరాటాల అంతిమ పరిణామాన్ని అతిగా అంచనా వేసుకోకూడదు. తాము ఫలితాల తోనే గానీ ఆ ఫలితాల కారణాలతో పోరాడటం లేదన్న సంగతినీ; వ్యాధిని కొంత తగ్గించే ఔషధాలను వాడుతున్నామే గాని వ్యాధిని రూపు మాపడం లేదన్న సంగతినీ; వారు మరిచిపోరాదు. అందుచేత కార్మికులు, పెట్టుబడి యొక్క నిరంతరాతిక్రమణల నుండి, లేక మార్కెట్‌లో వచ్చే మార్పుల నుండి, నిరంతరం ఉత్పన్నమయ్యే అనివార్యమైన అసంఘటిత పోరాటాలకే పరిమితమై పోకూడదు. ప్రస్తుత వ్యవస్థ, తమపై రుద్దే కష్టాలు ఎన్ని వున్నప్పటికీ, దానితో బాటే, అది, సమాజపు ఆర్థిక పునర్నిర్మాణానికి అవసరమైన భౌతిక పరిస్థితులనూ, సామాజిక రూపాలనూ ఉత్పన్నం చేస్తుందన్న సంగతిని వారు తెలుసుకోవడం అవసరం. సరసమైన రోజువారీ పనికి సరసమైన దినసరి వేతనం - అన్న యధాతథవాద నినాదం స్థానంలో, వేతన వ్యవస్థే రద్దు కావాలి - అన్న విప్లవాత్మక నినాదాన్నే వారు పతాకంపై లిఖించుకోవాలి." [ పేజీ 71]

మార్క్సు మాటల సారాంశం, 'జీతాల పెరుగుదల కోసం పోరాడక పోతే జీతాలు తగ్గిపోయే ప్రమాదం వుంటుంది' అని. అంత మాత్రమే కాదు. జీతాల్ని పెంచుకోవడమే కార్మికులకు అసలైన లక్ష్యం కాదని కూడా చెపుతున్నాడు. ట్రేడు యూనియన్లు ఎంత సేపూ జీతాల్ని పెంచుకునే పోరాటాల మీదే దృష్టి పెట్టడం గాక, ఆ పని చేస్తూనే, అదే కాలంలో ఆ పోరాటాలతో పాటు, జీతాల వ్యవస్థనే కూలదోసే వర్గ చైతన్యం కార్మికులకు కలిగించే ప్రయత్నాలన్నీ తప్పని సరిగా చెయ్యాలి - అని కూడా. దోపిడీ నించి విముక్తి చెందడమే కార్మిక పోరాటాలకు అసలైన లక్ష్యంగా వుండాలి - అని చెపుతున్నాడు.

'జీతాల పెరుగుదల'కి సంబంధించి, ఇప్పుడు ఇంకా 2, 3 విషయాలు పరిశీలించాలి. జీతాల గురించీ, ధరల గురించీ చూసిన ఈ అన్ని సందర్భాల లోనూ 'ఉత్పత్తి ధర' అనే విషయాన్ని వదిలేశాం. కానీ, దాన్ని కూడా కలుపుకునే విషయాలు అర్థం చేసుకోవాలి. ధరలు పెరిగినప్పుడు గానీ, పెరగనప్పుడు గానీ, ధరలు ఎలా వున్నప్పుడైనా, ఆ 'ధరల మొత్తంలో వున్న అదనపు విలువ రాసి'ని, పెట్టుబడి అంతా సమానంగా పంచుకోవాలి. ఆ సమానంగా పంచుకోవడం, 'పెట్టుబడులు పోటీ పడ గల పరిస్తితుల్లోనే' అనే నిబంధనని మరిచిపోకూడదు.

'జీతాల పెరుగుదల' అనే విషయం లోకి 'ఉత్పత్తి ధర'ని కూడా తీసుకుంటే, లెక్కలు కొంచెం

మారతాయి.

అన్ని శాఖల లోనూ జీతాలు ఒకే శాతంలో పెరిగాయి - అనుకుందాం. అప్పుడు, అన్ని శాఖల పెట్టుబడులూ, ఒకే శాతంలో పెరుగుతాయా? - అలా జరగదు. జీతాలు ఒకే రకంగా పెరగడానికి, పెట్టుబడులు ఒకే రకంగా పెరగనక్కర లేదు. ఎందుకంటే, అన్ని పెట్టుబడుల లోనూ జీతాల మీద పెట్టే భాగం, ఒకే శాతంలో వుండదు. తక్కువ అస్థిర గల శాఖల్లో జీతాల్ని పెంచడానికి కావలసిన పెట్టుబడి కన్నా, ఎక్కువ అస్థిర గల శాఖలో జీతాల్ని పెంచడానికి కావలసిన పెట్టుబడి ఎక్కువగా వుండాలి. కాబట్టి, జీతాల్ని ఒకే శాతంలో పెంచడానికి, పెట్టుబడులు ఒకే శాతంలో పెరగనక్కర లేదు. ఈ కారణం వల్లనే, జీతాలు ఒకే రకంగా పెరిగినా, వాటి ఫలితంగా ఉత్పత్తి ధరలు కొన్ని శాఖల్లో పెరిగి, కొన్ని శాఖల్లో తగ్గుతాయి.

ఉత్పత్తి ధరలు ఒక చోట పెరిగి, ఒక చోట తగ్గిన తర్వాత కూడా 2 చోట్లా ఒకే లాభం రేటు వుంటుంది.

జీతాలకు సంబంధించే మరో విషయం:

'జీతాలు' పెరిగితే, దాన్ని చలామణీ చేసే 'డబ్బు రాసి' పెరగాలా? - ఇది ఇంకో తప్పు అభిప్రాయం. 'జీతాలు పెరిగితే ధర పెరగాలి' అనే మొదటి తప్పు మీద ఆధారపడి వున్నదే ఈ రెండో తప్పు.

జీతాలు పెరిగితే, సరుకు ధర పెరగనక్కర లేదు. కానీ, పెరుగుతుంది.

అలాగే, జీతాలు పెరిగితే, ఆ సరుకుని చలామణీ చేసే డబ్బు పరిమాణం పెరగనక్కర లేదు. కానీ, ధర పెరగడం వల్ల, డబ్బు పరిమాణం కూడా పెరగవలసి వుంటుంది.

జీతాలు పెరగక ముందు:

సరుకు విలువ: $6_c + 4_v + 5_s = 15$.

ఈ సరుకుతో మారడానికి 15 డబ్బు వుండాలి.

జీతాలు పెరిగాక:

సరుకు విలువ: $6_c + 5_v + 4_s = 15$.

'విలువ' మారలేదు. జీతాలు 1 పెరిగినా, అదనపు విలువ 1 తగ్గింది కాబట్టి, ఈ సరుకుతో మారడానికి కూడా 15 డబ్బే సరిపోతుంది.

అయితే, జీతాలు పెరిగాక, ధర 16 అయిందనుకుందాం. అలా జరిగితే ఆ సరుకుతో మారడానికి 15 డబ్బు చాలదు. 16 కావాలి. అంటే, డబ్బు రాసి పెరగాలి.

ఇక్కడ చలామణీలోకి ఎక్కువ డబ్బు అవసరమైంది, ఏ కారణం వల్ల? - 'జీతాలు' పెరగడం వల్ల కాదు. 'ధర' పెరగడం వల్ల. ధర పెరగకపోతే, జీతాలు పెరిగినా చలామణీలోకి ఎక్కువ డబ్బు అవసరం అవదు. కాబట్టి, జీతాలు పెరిగితే ఎక్కువ డబ్బు కావాలి - కాదు.

ధరలు పెరిగితే, ఎక్కువ డబ్బు కావాలి.

# జీతాలు పెరిగితే, సరుకుల సప్లై - డిమాండ్లు మారతాయా?

**జీ**తాలూ ధరలూ కూడా ఒకే స్థాయిలో పెరిగితే, సరుకుల s d లు, గతంలో ఎలా వున్నాయో అలాగే వుంటాయి.

లేదా. ఆ పెరుగుదలలు ఒకే స్థాయిలో లేకపోతే గానీ; లేదా, జీతాలు పెరిగి, ధరలు పెరగకపోతే గానీ; సరుకుల s d లు, ఆ పరిస్థితుల్ని బట్టి మారతాయి.

పెట్టుబడిదారీ వర్గం - 'ఉత్పాదక' అవసరాల కోసమూ, 'కుటుంబ' అవసరాల కోసమూ కూడా సరుకుల్ని కొంటుంది. కుటుంబ అవసరాలలో పోషణ వస్తువులూ, 'విలాస' వస్తువులూ కూడా వుంటాయి.

కార్మిక వర్గం - 'కుటుంబ' అవసరాల కోసం మాత్రమే కొంటుంది. ఈ వర్గంలో మేధా శ్రమల సెక్షన్లు మాత్రమే 'విలాస' వస్తువుల్ని కొంటాయి.

జీతాలు పెరిగి, ధరలు పెరగకపోతే, అదనపు విలువలో నించి కొంత భాగం జీతాల లోకి మారుతుంది. దాని వల్ల సరుకులకు, పెట్టుబడిదారీ వర్గం వేపు నించీ డిమండ్ తగ్గి, కార్మిక వర్గం వేపు నించీ డిమాండ్ పెరుగుతుంది. పెట్టుబడిదారీ వర్గం వ్యక్తిగతంగా వాడే విలాస వస్తువులకు డిమాండ్ తగ్గి, కార్మిక వర్గం వాడే పోషణ వస్తువులకు డిమాండ్ పెరగవచ్చు. ఈ మార్పులు ఎలా జరుగుతాయీ - అనే దాన్ని బట్టి, సరుకుల s d లు మారతాయి. s d లు

మారడం వల్ల, సరుకుల మార్కెట్ ధరలు మారవచ్చు.

**జీతాల పెరుగుదల ప్రభావం, 'కార్మిక వర్గం'లో వేరు వేరు సెక్షన్ల మీద ఎలా వుంటుంది?**

ఒక ఉత్పత్తి స్థలంలో, ఇంజనీర్ల వంటి ఉన్నత మేధా(శ్రమల కార్మికులూ, అట్టడుగు శారీరక శ్రమల కార్మికులూ, వున్నారనుకుందాం. ఒక ఇంజనీరు జీతం, రోజుకి 100. బాయిలర్‌లో ఊక పోసే ఒక కార్మికుడి జీతం, రోజుకి 5. ఇద్దరి జీతాలకూ తేడా 20 రెట్లు. అప్పుడు జీతాలు, 10% పెరిగాయి అనుకుందాం. ఇంజనీరుకి రోజుకి 10 రూపాయలు (నెలకి 300) పెరుగుతుంది.

బాయిలర్ కార్మికుడికి, రోజుకి అర్ధ రూపాయి (నెలకి 15 రూపాయలు) పెరుగుతుంది. కానీ, జీతాలు 10% పెరిగాయి కాబట్టి, జీతాలు అంద రికీ ఒకే రకంగా, 'సమానంగా' పెరిగినట్టే కనిపిస్తుంది. నిజానికి, అందరికీ 'సమానం గానే' పెరిగాయి కూడా. కానీ ఉన్నత మేధా(శ్రమ కార్మికుడికీ, శారీరక శ్రమ కార్మికుడికీ వుండే మొదటి జీతాలే 20 రెట్ల తేడాతో వుండడం వల్ల, పెరిగిన జీతాలు కూడా అంత తేడా తోనూ వుంటాయి.

ఉత్పత్తి సంస్థల్లో - ప్రభుత్వ సంస్థలూ, ప్రైవేటు సంస్థలూ వుంటాయి. జీతాలు 10% పెరిగాయి - అన్న ప్పుడు, ఈ రూలు ప్రభుత్వ సంస్థల్లో ప్రతీ సెక్షను కార్మికుల విషయం లోనూ ఒకే రకంగా వర్తిస్తుంది. అందరి జీతాలూ 10% పెరుగుతాయి. కానీ, ప్రైవేటు సంస్థల్లో ఇది యధాతథంగా అమలు జరగదు. ఈ సంస్థల్లో, అందరి జీతాలూ ఒకే స్థాయిలో పెరగవు. ఇంజనీరు జీతం 10% పెరిగినప్పుడు, శారీరక శ్రమల జీతాలు కూడా అదే లెక్కలో పెరగవు. అలా పెరిగి నప్పుడు కూడా శారీరక శ్రమల కార్మికులకు జరిగే ప్రయోజనం ఏమీ లేకపోయినా, వారి జీతాలు కనీసం ఆ స్థాయిలో కూడా పెరగవు.

జీతాల పెరుగుదలకు సంబంధించి, ఈ విష యాలన్నీ మన దృష్టిలో తప్పనిసరిగా వుండాలి.

# 'ధరల పెరుగుదల' గురించి మళ్ళీ

ఉత్పాదక శక్తులు పెరుగుతూ వున్న కొద్దీ సరుకు లకు పట్టే 'శ్రమ కాలం' తగ్గి, సరుకుల విలువలు తగ్గుతూ వుంటాయని మొదటి నించీ చెప్పుకుం టున్నాం. ఉత్పాదక శక్తులు ఎప్పుడూ పెరుగుతూనే వుంటాయని కూడా చెప్పుకుంటున్నాం. అలాం టప్పుడు, సరుకుల విలువలు గతం కన్నా తగ్గిపోతూ, ధరలు కూడా గతం కన్నా తగ్గిపోతూ వుండాలి. ఒక వేళ, కొంత కాలం పాటు, ఉత్పాదక శక్తులు పెరగ కుండా ఆగిపోయి వుంటే, ధరలు తగ్గక పోయినా పాత ధరలే నిలబడి వుండాలి. కానీ నిత్య జీవితంలో కనపడేదంతా దీనికి విరుద్ధంగా వుంది. ధరలు తగ్గడం గానీ, పాత ధరలే నిలబడడం గానీ, జరగడం లేదు. ఇంకా పెరుగుతున్నాయి కూడా.

వెనకటి కాలపు ధరల గురించి మన పెద్ద వాళ్ళు చెప్పేది వింటే, చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఈ నాడు 70, 80 సంవత్సరాల వయస్సు వున్న పెద్ద వాళ్ళు తమ చిన్న నాటి ధరల గురించి చెప్తే, అది నమ్మలేని విషయంగా వుంటుంది. "ఆ నాడు చొక్కా బట్ట రూపాయిన్నరే. కొబ్బరి కాయ రెండణాలు. కోడి గుడ్డు రెండు కాసులు వుండేది. మా రోజుల్లో నెలకి 8 రూపాయల జీతంతో కాలక్షేపం చేసే వాళ్ళం" అంటూ చెప్పుకొస్తారు వాళ్ళు. వెనకటి రోజుల్లో ధరలూ, జీతాలూ కూడా చాలా తక్కువ గానే వున్నట్టు వింటూ వుంటాం. వెనకటి కాలపు పుస్తకాల్లో కూడా నమ్మలేని ధరలే కనపడతాయి. ఆ నాటి నించి ఈ నాటికి, అంటే 70, 80 ఏళ్ళు గడిచే నాటికి, కొన్ని సరుకుల ధరలు 10, 15 రెట్లూ, కొన్ని సరుకుల ధరలు 20, 30 రెట్లూ కూడా పెరిగిపోయి వుండడం కనపడుతుంది. ఈ నాటి మన అనుభవంలో కూడా, బట్టల ధరలూ, చెప్పుల ధరలూ, ఇళ్ళ అద్దెలూ, ఇతర సరుకుల ధరలూ, త్వర త్వరగా పెరిగి పోతూ వుండడమే చూస్తాం. ఉత్పాదక శక్తులు పెరుగుతోన్న కొద్దీ విలువలు తగ్గి, ధరలు తగ్గ వలసి వుండగా, ధరలు ఇలా పెరుగుతూ వుండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

'ధరలు పెరగడం' అనేది - ఒక 'ఫలితం.' ఆ ఫలితం, ఏదో ఒక్క కారణం వల్లే గాక వేరు వేరు కార

ణాల వల్ల కూడా కలుగుతుంది. కాబట్టి, ఆ ఫలితాన్ని చూడగానే, దాని వెనక వున్న అసలు కారణాన్ని గ్రహించలేము. ఒకే ఫలితాన్ని ఇచ్చే కారణాలన్నిటినీ చూసి, అసలు విషయాన్ని పట్టుకోవాలి. వెనకటి ధరలతో పోలిస్తే, ఈ నాటి ధరలు ఇంతింతగా ఎందుకు పెరిగి వున్నాయో తెలుసుకోవాలంటే, 'ధరల' గురించి మళ్ళీ క్లుప్తంగా అన్ని కారణాలూ చూడాలి. ధరలు పెరగడానికి ప్రధానమైన కారణాలు మూడే. వీటిని ఇంతకు ముందే చూశాం. ధరల్ని తాత్కాలికంగా పెంచే కారణాలు ఇంకో 2 కూడా వున్నాయి. అన్నిటినీ క్లుప్తంగా మళ్ళీ చూద్దాం. ధరలు పెరగడం, నాలుగైదు కారణాల్లో ఏ కారణం వల్ల జరుగుతోందో తెలుసుకోవచ్చు.

1. **ఉత్పాదక శక్తి తగ్గి, సరుకుకి 'విలువ' పెరిగితే, 'ధర' పెరుగుతుంది:**

అయితే, ఉత్పాదక శక్తి కొంత కాలానికోసారి తప్పనిసరిగా పెరుగుతూనే వుంటుంది కాబట్టి, ఒక విడి సరుకుకి విలువ తగ్గడమే జరగాలి గానీ, పెరగడం జరగకూడదు. ఉత్పాదక శక్తుల పెరుగుదలలు, అన్ని శాఖల లోనూ జరుగుతాయి కాబట్టి, అన్ని చోట్లా విలువలు తగ్గడమే జరగాలి. కాబట్టి ఈ నాటి ధరలు ఇలా వుండడానికి కారణం, ఈ మొదటి విషయం కాదు.

2. **డబ్బు సరుకైన బంగారానికి విలువ తగ్గడం వల్ల ధరలు పెరుగుతాయి:**

ఉత్పాదక శక్తి పెరుగుదల బంగారం శాఖలో కూడా జరుగుతుంది కాబట్టి, '1 యూనిట్ బంగారం విలువ' తగ్గుతుంది. ఉత్పాదక శక్తులు అన్ని శాఖల్లోనూ పెరుగుతూనే వుంటాయి. సరుకుల విలువలు తగ్గినట్టే, డబ్బు విలువ కూడా అదే స్థాయిలో తగ్గితే, సరుకులకూ డబ్బుకీ వుండే మారకం పాళ్ళు మారవు. అంటే అన్ని శాఖల లోనూ విలువలు తగ్గినా, ధరలు మారవు. కానీ బంగారం శాఖలో గానీ, ఇతర శాఖల్లో గానీ, విలువ తగ్గడం అనేది, ఒకే స్థాయిలో జరగదు. రక రకాల స్థాయిల్లో జరుగుతుంది. విలువల్లో మార్పులు ఎలాంటి తేడాలతో వున్నా, అన్ని శాఖల సరుకులకూ విలువలు వెనకటి కాలం కన్నా తగ్గడమే జరగాలి గానీ పెరగడం కాదు. కానీ, ఈ నాటి ధరలన్నీ పెరిగే వున్నాయి. కాబట్టి, ఈ ధరలకు కారణం, ఈ రెండో అంశం కూడా అవదు.

3. **సరుకుకి సప్లై కన్నా డిమాండ్ పెరగడం వల్ల ధర పెరుగుతుంది:**

సప్లై డిమాండ్లు అనేవి తాత్కాలికంగా వచ్చి పోయే విషయాలు. డిమాండ్ పెరగడం అనేది ఎప్పుడూ అలాగే వుండిపోదు. కొన్ని కాలాల్లో డిమాండ్ తగ్గిపోతూ కూడా వుంటుంది. అప్పుడు ధర తగ్గి పోవాలి. కానీ ఇక్కడ ధరలు పెరగడమే గానీ, తగ్గడం కనపడడం లేదు. అంతే గాక, డిమాండ్ పెరగడం అనేది, అన్ని సరుకుల మీదా ఒకే కాలంలో, ఒకే రకంగా జరగదు. కానీ, ధరలు అన్ని సరుకులకూ పెరుగుతున్నాయి. కాబట్టి ఈ నాటి ధరలకు, ఈ అంశం కూడా కారణం కాదు.

4. **వర్తక మోసం వల్ల ధర పెరగవచ్చు:**

ఒక మీటరు బట్ట ధర అందరి దగ్గిరా 2 రూపాయలు అయితే ఒక వర్తకుడు, మోసంగా దాన్ని ఒక వాడకందారుడికి రెండున్నరతో ఇచ్చాడనుకుందాం. ఇది, ఆ బట్టకి ధర పెరగడమే. కానీ, ఇది, మొత్తం బట్టకంతటికీ ధర పెరగడం కాదు. ఆ వర్తకుడే, మోసం చెయ్యడానికి వీలు కాని సందర్భాల్లో, ఆ బట్టని అసలు ధర తోటే ఇస్తాడు. అంటే, అప్పుడు ధర పెరగ లేదని అర్థం. ఆ సరుకుని అమ్మే ప్రతి చోటా ధర పెరిగితేనే అది ధర పెరగడం. కానీ, వర్తక మోసాల వల్ల, అన్ని చోట్లా అదే జరగదు. కాబట్టి, అన్ని సరుకులకూ 'ధరలు పెరగడం' అనే దానికి, ఈ అంశం కూడా కారణం అవదు.

5. **కాయితం డబ్బు యూనిట్‌కి విలువ తగ్గితే ధరలు పెరుగుతాయి:**

ధరలు పెరిగి పోతూ వుండడానికి ఇదే అసలైన కారణం. వెనకటి కాయితం రూపాయి విలువనీ, ఇప్పటి కాయితం రూపాయి విలువనీ పోలిస్తే, ఇప్పటి రూపాయికి విలువ తగ్గిపోవడం ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. వెనకటి కాలంలో, ధాన్యం బస్తా విలువ 5 రూపాయలనీ, ఇప్పుడు అదే రకం ధాన్యం బస్తా విలువ 200 రూపాయలనీ - అనుకుందాం. అంటే, వెనకటి ఒక్క రూపాయి, ఈ నాటి 40 రూపాయలతో సమానం. ఈ నాడు రూపాయి విలువ తగ్గిపోవడం స్పష్టంగా కనపడే విషయమే. కాయితం డబ్బు విలువ తగ్గిపోతూ వుండడం వల్లనే, ధరలన్నీ పెరిగి పోతూ

వుండడం.

కాయితం రూపాయి విలువని, ఇప్పుడు కూడా వెనకటి కాలంలో లాగే వుంచడం జరిగితే, ఈ నాటి ధరలన్నీ కూడా దాదాపు వెనకటి కాలంలో లాగే వుంటాయి - చిన్న చిన్న తేడాలతో.

మొదటి సంపుటంలో, 'భారీ పరిశ్రమ' చాప్టరులో, ఆ కాలంలో వెనకటి కాలపు ధరలు ఎంతో తగ్గిపోయిన కొన్ని ఉదాహరణలు చూశాం. అక్కడ, ధరలు పెరగడం గాక తగ్గడం ఎలా జరిగింది? - ఎలాగంటే, అప్పుడు 'కాయితం డబ్బు' ఇంకా లేకపోవడం గానీ, లేదా అది వున్నా కాయితం యూనిట్ విలువ, బంగారం యూనిట్ విలువతో సమానంగా వుండడం గానీ, జరిగి వుండాలి. 'భారీ పరిశ్రమ' అంటే, ఉత్పాదక శక్తి అనేక రెట్లు పెరగడం. దాని వల్ల, సరుకు విలువ తగ్గుతుంది. అది 'ధర తగ్గడం' గానే వుంటుంది. ద్రవ్యోల్బణం సమస్య లేకపోతే, భారీ పరిశ్రమల వల్ల, ధరలు తగ్గడం సహజం గానే జరుగుతుంది.

కానీ, ఈ నాడు ఉత్పాదక శక్తులు ఎన్ని రెట్లు పెరుగుతూ వున్నా, ధరలు తగ్గడం లేదు. పైగా గతం కన్నా అనేక రెట్లు పెరుగుతున్నాయి. ఈ ధరల పెరుగుదలకి వెనక ఏ కారణాలైతే పని చేస్తున్నాయో ఆ కారణాలు అలాగే వున్నంత కాలమూ, ధరలు పెరుగుతూనే వుంటాయి. పెట్టుబడిదారీ విధానంలో, ఈ ధరల - పెరుగుదలకి హద్దు వుండదు. ఇంకా రాబోయే కాలంలో, 1 కోడి గుడ్డుని కొనడానికి, బస్తాతో కాయితం రూపాయల్ని మోసుకు పోయే పరిస్థితి వొస్తే దానికేమీ ఆశ్చర్యపడనక్కర లేదు.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **ఒక జీతం - 12. ఆ 12 ని చూసి, అది, శ్రమ శక్తి విలువతో సమానంగా వుందో లేదో గ్రహించ గలమా?**

**జ:** గ్రహించలేము. అది, 3 కారణాల వల్ల అలా వుండి వుండవచ్చు.

(1) శ్రమ శక్తి విలువ 12. ఆ కార్మికుల s, d లు సమానంగా వుండి, జీతం 12 గా వుంది.

(2) శ్రమ శక్తి విలువ 13. కానీ, ఆ కార్మికుల s పెరిగి, జీతం 12 అయింది.

(3) శ్రమ శక్తి విలువ - 11. కానీ, కార్మికుల d పెరిగి జీతం 12 అయింది - ఈ రకంగా, ఆ జీతం 12 గా వుండ డానికి, వీటిలో ఏది కారణమో చెప్పలేము. ఆ శాఖలో ఆ ప్రత్యేక శ్రమకి సంబంధించిన ఇతర పరిస్థితులు తెలిస్తే, దాన్ని అర్థం చేసుకోవచ్చు.

2. **ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు - అనే ఉద్యోగుల్ని మీరు (కార్మికులు) ఎప్పుడైనా చూశారా? కార్మికుల క్షేమం కోసం ఆ ఇన్‌స్పెక్టర్లు పెట్టుబడిదారుల్ని ప్రశ్నించడం ఎప్పుడైనా జరిగినట్టు మీకు తెలుసా?**

**జ:** ఈ ప్రశ్నలు కొందరు ఫ్యాక్టరీ కార్మికుల్ని అడిగితే, అలాంటి పేరే తాము వినలేదన్నారు. తమ పని స్థలాల లోకి అలాంటి ఇన్‌స్పెక్టర్లు రావడం ఎప్పుడూ చూడలేదన్నారు.

3. **"రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అన్ని దేశాల లోనూ ధరలు పెరిగి పోయాయి", "1946లో వుండే ధరలతో 1958 లో వుండే ధరల్ని పోలిస్తే బ్రెజిల్‌లో ధరలన్నీ 25 రెట్లు పెరిగాయి", "ఫలానా దేశంలో ఫలానా సమయంలో బస్తాడు రూపాయలు ఇచ్చి కాస్త ఉప్పు తెచ్చుకునే వారు" ఇలా - చదువుతూ వుంటాం. ఇలాంటి ఉదాహరణలు కొన్ని సేకరించండి!**

**జ:** యుద్ధాల కాలాల్లో వున్న ధరల గురించి, అక్కడక్కడా కొన్ని వ్యాసాల్లో చదివి వదిలెయ్యడం తప్ప, వాటిని సేకరించడం చెయ్యలేదు. నిత్య జీవితంలో వుండే ధరల సంగతైతే పెద్ద వాళ్ళందరికీ తెలుస్తుంది. 50 ఏళ్ళ నాటి ధరల్నీ, ఈ నాటి ధరల్నీ పోలిస్తే, 30 రెట్ల కన్నా కూడా ఎక్కువ తేడా కనపడుతుంది. ★

# 4. వేరు వేరు దేశాల 'డబ్బులు'

ఇప్పుడు వేరు వేరు దేశాల డబ్బుల్ని చూద్దాం. అన్ని దేశాల డబ్బుకీ ఒకే పేరు వుండదు, అన్ని దేశాల మనుషులకూ ఒకే పేర్లు వుండనట్టే. 'పేర్లు' అనేవి, 'భాషల్ని' బట్టి వుంటాయి. కాబట్టి, వేరు వేరు భాషలు గల దేశాల డబ్బులకు, వేరు వేరు పేర్లు వుంటాయి. ఒక దేశపు డబ్బు యూనిట్‌కి 'రూపాయి' అనే పేరు వుంటే, రెండో దేశపు డబ్బుకి 'డాలర్' అనే పేరూ, మూడో దేశపు డబ్బుకి 'పౌండ్' అనే పేరూ, ఇలా - ఒక్కో దేశపు డబ్బుకి ఒక్కో పేరు వుంటుంది.

అన్ని దేశాల లోనూ 'బంగారం డబ్బే' చలామణీలో వుంది - అనుకుందాం. ఆ వేరు వేరు బంగారం యూనిట్లకు పేర్లు తేడాగా వుండడమే కాదు, ఆ నాణాల 'బరువులు' కూడా తేడాగా వుంటాయి. అన్ని దేశాల డబ్బు యూనిట్లూ ఒకే బరువుతో వుండవు. ఒక దేశపు డబ్బు యూనిట్టు 1 గ్రాము బంగారంతో వుంటే, ఇంకో దేశపు యూనిట్టు 2 గ్రాముల బంగారం తోటీ, మూడో దేశపు యూనిట్టు గ్రాము బంగారం తోటీ - ఇలా రక రకాల బరువులతో వుంటాయి.

వేరు వేరు దేశాల మధ్య, సరుకుల అమ్మకాలూ, కొనుగోళ్ళూ జరుగుతూ వుంటాయి. అంటే, సరుకుల ఎగుమతులూ, దిగుమతులూ.

వేరు వేరు దేశాల మధ్య - అంటే, వేరు వేరు దేశాల పెట్టుబడి దారుల మధ్యా, ఆ దేశాల ప్రభుత్వ సంస్థల మధ్యా - అని అర్థం. వేరు వేరు దేశాల కార్మికుల మధ్య, సరుకుల అమ్మకాలూ, కొనుగోళ్ళూ వుండవు.

ఒక దేశపు కార్మికులు, ఆ దేశపు పెట్టుబడి దారుల సరుకుల్ని కొన్నట్టే, విదేశాల సరుకులు కూడా దొరికినప్పుడు, వాటిని కూడా కొంటారు.

ఒక దేశపు సరుకులు, ఆ దేశం లోనే గాక, ఇతర దేశాలలో కూడా అమ్ముడవుతూ వుంటాయి.

రూపాయి దేశం - డాలరు దేశం నించీ, పౌండ్ దేశం నించీ, ఇంకా ఇతర దేశాల నించీ కూడా సరుకుల్ని కొంటుందీ, అమ్ముతుందీ. డాలరు దేశం - రూపాయి దేశం నించీ, పౌండ్ దేశం నించీ, ఇంకా ఇతర దేశాల నించీ కూడా. పౌండ్ దేశం - రూపాయి దేశం నించీ, డాలరు దేశం నించీ, ఇంకా ఇతర దేశాల నించీ కూడా. ఇలా, ఏ దేశం, ఏ దేశం నించైనా కొనడాలూ, అమ్మడాలూ, చేస్తుంది.

ఏ దేశపు సరుకుల ధరలు, ఆ దేశపు డబ్బు యూనిట్ల లెక్కల తోటే వుంటాయి. అంటే, రూపాయి దేశపు ధరలన్నీ - రూపాయిల్లోనూ, డాలరు దేశపు ధరలన్నీ - డాలర్ల లోనూ, ఇలా.

ప్రతీ దేశమూ, తన ఎగుమతుల ద్వారా వచ్చే డబ్బునీ, దిగుమతుల ద్వారా పోయే డబ్బునీ, లెక్కలు చూసుకోవాలి.

రూపాయి దేశం, డాలరు దేశానికి 12 రూపాయల విలువ గల సరుకులు అమ్మి, డాలరు దేశం నించీ 2 డాలర్ల విలువ గల సరుకులు కొన్నది - అనుకుందాం. (ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, విలువలే ధరలు అనుకుందాం.) లెక్కలు చూసుకుంటే, చివరికి ఎవరు, ఎవరికి ఎంత ఇవ్వాలి? - ఈ విషయం తేలాలంటే, రూపాయి విలువ ఎంతా, డాలరు విలువ ఎంతా, ఆ రెంటికీ వున్న సంబంధం ఏమిటీ - అనే విషయాలు మొదట నిర్ణయం అవ్వాలి.

2 దేశాల్లోనూ 'బంగారం డబ్బే' వుందనుకుందాం. రూపాయి - 1 గ్రాము బంగారం తోటీ, డాలరు - 4 గ్రాముల బంగారం తోటీ వున్నాయి - అను కుందాం. అప్పుడు, రూపాయికీ డాలర్‌కీ సంబంధం ఎలా వుంటుంది? అంటే, ఎన్ని రూపాయలు, 1 డాలరు అవుతాయి? లేదా, ఎన్ని డాలర్లు, 1 రూపాయి అవుతాయి?

రూపాయి = 1 గ్రాము బంగారం.
డాలరు = 4 గ్రాముల బంగారం.
కాబట్టి,
4 రూ.లు = 1 డాలరు
(4 గ్రా. బం. = 4 గ్రా. బం.)
4 రూ. లు, 1 డాలరుతో సమానం.
1 డాలరు, 4 రూ. లతో సమానం.
1 రూపాయి = డాలరు
(1 గ్రా. బం. = 1 గ్రా. బం.)
అంటే, 1 రూపాయి, పావు డాలరుతో సమానం.

రూపాయి దేశం, డాలరు దేశానికి అమ్మినది 12 రూపాయల సరుకులు. ఆ విలువని డాలర్లలో చూస్తే, 3 డాలర్లు అవుతుంది.

రూపాయి దేశం, డాలరు దేశం నించి కొన్నది, 2 డాలర్ల సరుకులు. దీన్ని రూపాయల్లో చూస్తే, 8 రూపాయలు.

2 దేశాలూ, తమకు రావలసిన దాన్నీ, పోవలసిన దాన్నీ లెక్కలు చూసుకుంటే, చివరికి రూపాయి దేశానికి, 4 రూపాయలు (లేదా, 1 డాలరు), రావాలి.

4 రూపాయలు = 1 డాలరు - అనేది, రూపాయికీ డాలరుకీ వుండే 'విలువ' సంబంధం. లేదా, 'మారక' సంబంధం. లేదా, 'మారకం రేటు'. ఈ సంబంధం, ఎలా ఏర్పడిందంటే, ఆ డబ్బు యూనిట్ల విలువల్ని బట్టి. అంటే, ఆ బంగారాల బరువుల్ని బట్టి,

రూపాయికీ డాలరుకీ విలువ సంబంధం వున్నట్టే,
రూపాయికీ - పౌండుకీ,
డాలరుకీ - పౌండుకీ,
ఇంకా అన్ని దేశాల 'డబ్బులకూ' విలువ సంబంధాలు వుంటాయి.

1 పౌండు, 2 గ్రాముల బంగారంతో వుందనుకుందాం.

| | | | |
|---|---|---|---|
| అప్పుడు, | 2 రూపాయలు | = | 1 పౌండు |
| | (2 గ్రాముల బం. | = | 2 గ్రా. బం.) |
| | 1 రూపాయి | = | పౌండు |
| | (1 గ్రా. బంగారం | = | 1 గ్రా. బం.) |
| | 1 డాలరు | = | 2 పౌండ్లు |
| | (4 గ్రా. బంగారం | = | 4 గ్రా. బం.) |

ఈ రకంగా, ప్రపంచంలో వున్న అన్ని దేశాల డబ్బు యూనిట్లకీ మధ్య, వాటి బంగారం బరువుల్ని బట్టి, మారకం పాళ్ళు వుంటాయి.

'బంగారం' అన్నప్పుడు, అది అన్ని దేశాల లోనూ 'ఒకే విలువ'తో వుంటుందా? - ఈ ప్రశ్నని మొదట చూడాలి. - 'బంగారం' కూడా ఇతర ఉత్పత్తుల లాంటిదే. దాని తయారీకి అవసరమయ్యే శ్రమే - దాని విలువ. అయితే, 1 గ్రాము బంగారానికి అవసరమయ్యే శ్రమ అన్ని దేశాల్లోనూ ఒకే రకంగా వుండదు. ఎందుకంటే, బంగారం శాఖలో 'ఉత్పాదక శక్తి' అన్ని దేశాల్లోనూ ఒకే రకంగా వుండదు కాబట్టి. ఒక చోట బంగారం గనులు ఎక్కువగా వుంటే, ఇంకో చోట తక్కువగా వుండవచ్చు. గనుల్లో దొరికే పదార్థం కూడా ఒక చోట సమృద్ధిగా వుంటే, ఇంకో చోట అల్పంగా వుండవచ్చు. శ్రమ పరికరాలూ, శ్రమ పద్ధతులూ ఒక చోట మెరుగ్గా వుంటే, ఇంకో చోట అలా వుండక పోవచ్చు. ఈ రకంగా, 1 గ్రాము బంగారానికి పట్టే శ్రమ కాలం, వేరు వేరు దేశాల్లో కొంత కొంత తేడాలతోటే వుంటుంది. అంటే, ఏ దేశపు బంగారం ఆ దేశంలో, ఒక 'వ్యక్తిగత విలువ'తో తయారవుతుంది.

అయితే, ఏ ఉత్పత్తి అయినా, మార్కెట్లో 'ఒకే విలువ'తో వుండవలసిందే. బంగారం విషయం కూడా అంతే. అన్ని దేశాలకూ సంబంధించిన 'ప్రపంచ మార్కెట్'లో, బంగారం 'ఒకే విలువ'తో వుంటుంది. వేరు వేరు దేశాల వ్యక్తిగత విలువల నించి ఏర్పడే 'సగటు విలువ' అది.

బంగారాన్ని 'సగటు కాస్టుప్రైసు'తో కన్నా కొంత తక్కువతో ఉత్పత్తి చెయ్యగలిగే పెట్టుబడిదారులకు కొంత ఎక్కువ లాభమూ, 'సగటు కాస్టుప్రైసు' కన్నా ఎక్కువతో ఉత్పత్తి చేసే వాళ్ళకి తక్కువ లాభమూ వస్తాయి. ఇతర సరుకుల విషయంలో లాగే బంగారం విషయంలో కూడా.

బంగారం విలువ, వేరు వేరు దేశాల్లో, కొంత కొంత తేడాలతో వుంటుంది కాబట్టి, బంగారాన్ని ఒక దేశం నించీ ఇంకో దేశానికి రవాణా చేసే విషయంలో, ప్రతీ దేశానికీ కొన్ని నిబంధనలు వుంటాయి. బంగారాన్ని, తక్కువ విలువతో దొరికే దేశంలో కొని, ఎక్కువ విలువతో దొరికే దేశంలో అమ్మితే, దాని వల్ల ఎక్కువ లాభం వస్తుంది. కానీ, ఆ వ్యాపారంలో, కొన్ని రకాల టాక్సులూ అవీ చెల్లించవలసి వుంటుంది. చట్టపరమైన నిబంధనల్ని పాటించకుండానూ, టాక్సులు చెల్లించకుండానూ, తక్కువ విలువతో దొరికే దేశం నించి బంగారాన్ని దొంగ రవాణా చెయ్యగలిగితే, తర్వాత దాని అమ్మకం నించి ఎక్కువ లాభం మిగల్చడం సాధ్యమవుతుంది. అందుకే బంగారం దొంగ రవాణాలు జరుగుతూ వుంటాయి.

బంగారానికి వేరు వేరు దేశాలలో వేరు వేరు వ్యక్తిగత విలువలు వున్నప్పటికీ, వేరు వేరు దేశాల 'డబ్బు యూనిట్ల' సంబంధాల్ని చూసే చోట ఆ తేడాల సంగతి అనవసరం. ఆ విషయంలో, బంగారానికి 'ఒకే విలువ' వుంటుంది.

రూపాయిగా వున్నదీ బంగారమే. డాలరుగా వున్నదీ బంగారమే. ఈ బంగారానికీ, ఆ బంగారానికీ సంబంధాన్ని చూడడం అంటే, 'రూపాయి బిళ్ళ'కీ, డాలరు బిళ్ళ'కీ వున్న 'బరువుల' సంబంధాన్ని చూడడమే. అదే వాటి 'విలువ సంబంధం'గా కూడా వుంటుంది.

ఒక దేశపు గ్రాము బంగారంతో సమానమైనది,

ఇంకో దేశపు గ్రాము బంగారమే. 4 గ్రాముల బరువు గల 1 డాలరు బిళ్ళతో సమానమైనవి, 4 గ్రాముల బరువు గల 4 రూపాయి బిళ్ళలు. లేదా, 4 గ్రాముల బరువు గల 2 పౌండు బిళ్ళలు. ఈ రకంగా, 2 వేపులా వున్నది బంగారమే గనక, ఆ బంగారాల మారక సంబంధం, వాటి 'బరువుల సమానత్వం' ద్వారానే ఏర్పడుతుంది.

4 రూపాయలు = 1 డాలరు. ఇది ఇలా వుండగా ప్రపంచ మార్కెట్లో బంగారానికి విలువ తగ్గితే, ఈ 'మారకం రేటు' మారుతుందా? - మారదు. ఎందు కంటే, బంగారం విలువలో మార్పు, 2 వేపులా ఒకే రకంగా వర్తిస్తుంది కాబట్టి. రూపాయి బిళ్ళగా వున్న బంగారానికి 10% విలువ తగ్గితే, డాలరు బిళ్ళగా వున్న బంగారానికి కూడా అదే జరుగుతుంది. 2 వేపులా 10% విలువ తగ్గితే, అప్పుడు కూడా ఆ మారక సంబంధం, 4 రూపాయలు = 1 డాలరు గానే వుంటుంది. అలాగే బంగారం విలువ పెరిగినా అంతే. ఆ మార్పు 2 వేపులా ఒకే రకంగా వర్తిస్తుంది కాబట్టి.

అన్ని దేశాల లోనూ బంగారం డబ్బే వుంటే, 'మారకం రేట్లు' మారుతూ వుండడం గానీ, చలామణీ లోకి 'ఎక్కువ డబ్బు' రావడం గానీ జరగదు. కానీ, 'కాయితం డబ్బు' వున్నప్పుడు, పరిస్తితి అంతా వేరుగా వుంటుంది.

ఏ దేశంలో అయినా 1 కాయితం నోటుకి విలువ ఏర్పడేది, దాని వెనక వున్న బంగారాన్ని బట్టే.

3 దేశాల డబ్బు యూనిట్లు ఇలా వున్నాయి అనుకుందాం:

1 గ్రా. బం. = 1 బం. రూ. = 1 కా. రూ.
2 గ్రా. బం. = 1 బం. పౌండు = 1 కా. పౌం.
4 గ్రా. బం. = 1 బం. డాలరు = 1 కా. డా.

ఈ 3 దేశాల లోనూ, 1 బంగారం యూనిట్‌కి బదులుగా 1 కాయితం యూనిట్ వుంది. ప్రతి దేశం లోనూ ఇలా వున్నప్పుడు, మారకం రేట్లు, బంగారం యూనిట్ల మధ్య ఎలా వుంటాయో కాయితం యూనిట్ల మధ్య కూడా అలాగే వుంటాయి. అంటే,

1 బంగారం డాలరు = 4 బం. రూ.
1 కాయితం డాలరు = 4 కా. రూ.
1 కాయితం డాలరు = 2 కా. పౌండ్లు
1 కాయితం పౌండు = 2 కా. రూ. - ఇలా.

అయితే, 1 బంగారం డాలరుకి బదులుగా 1 కాయితం డాలరు గాక 2 కాయితం డాలర్లు వున్నాయనీ, మిగతా విషయాలేవీ మారలేదనీ - అనుకుంటే, డాలరుకీ రూపాయికీ 'మారకం రేటు' ఎలా వుంటుంది?

ఇప్పుడు, 1 బంగారం డాలరుకి బదులుగా (4 గ్రాముల బంగారానికి బదులుగా) 2 కాయితం డాలర్లు వున్నాయి కాబట్టి, ఇప్పుడు 1 కాయితం డాలరు = ½ బంగారం డాలరు. అంటే, 2 గ్రాముల బంగారం. ఈ రకంగా, ఇప్పుడు కాయితం డాలరు విలువ గతంతో పోలిస్తే, సగమే అవుతుంది. కానీ, రూపాయి విషయంలో ఏ మార్పూ జరగలేదు కాబట్టి, కాయితం రూపాయి గతంలో లాగే, 1 బంగారం రూపాయితో (1 గ్రాము బంగారంతో) సమానం గానే వుంది.

ఇప్పుడు, కాయితం డాలరుకీ, కాయితం రూపాయికీ మారకం రేటు:

1 కాయితం డాలరు = 2 కా. రూ. లు.
(2 గ్రా. బంగారం = 2 గ్రా. బంగారం)

కాయితం డాలరు విలువ సగం అయినట్టే, కాయితం రూపాయి విలువ కూడా సగం అయితే? మార్పులు 2 వేపులా ఒకే స్థాయిలో జరిగితే, అది అసలు మార్పులు జరగని దానితో సమానం. అప్పుడు, మారకం రేటు గతంలో లాగే, 1 డాలరు = 4 రూపాయలు గానే వుంటుంది.

ఏ దేశంలో అయినా, 1 బంగారం నాణానికి బదులుగా ఒక్క కాయితం నోటే గాక 2 నోట్లు వుంటే, అప్పుడు నోటు విలువ సగమే అవుతుంది. లేదా, 4 నోట్లు వుంటే, అప్పుడు నోటు విలువ పావు భాగమే అవుతుంది. ఈ రకంగా, 1 బంగారం నాణానికి బదులుగా వుండే కాయితం నోట్ల సంఖ్య పెరిగే కొద్దీ (నోట్ల సంఖ్య ఎందుకు పెరుగుతుందనేది వేరే విషయం. అలా జరిగే కొద్దీ), నోటు విలువ తగ్గిపోతూ వుంటుంది.

కాయితం నోట్ల సంఖ్య పెరగడం, ఏదో ఒక దేశం లోనే కాదు అన్ని దేశాల్లోనూ జరుగుతూనే వుంటుంది. ఆ నోట్ల పెరుగుదలలు అన్ని చోట్లా ఒకే స్థాయిలో వుంటే, అది మార్పే అవదు. కానీ, ఆ పెరుగుదలలు అన్ని దేశాల్లోనూ ఒకే స్థాయిలో వుండవు.

వేరే మాటల్లో చూస్తే, 1 డబ్బు యూనిట్ విలువలో తగ్గుదల అన్ని దేశాల్లోనూ ఒకే స్థాయిలో జరగదు. కొంత కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో, కాయితం రూపాయి విలువలో తగ్గుదల ఒక శాతంలో జరిగితే, కాయితం డాలరు విలువలో తగ్గుదల ఇంకో శాతంలో జరగవచ్చు. ఇలాంటి పరిస్తితుల వల్ల, ఆ

డబ్బు యూనిట్ల మధ్య 'మారకం రేటు'లో, కొంత మార్పు జరుగుతుంది.

ఉదాహరణ: ఒక కాలంలో, డాలరుకీ, రూపాయికీ మారకం రేటు 1 డాలరు = 4 రూపాయలుగా వుంది. తర్వాత కొన్ని సంవత్సరాల్లో 2 దేశాల్లోనూ కాయితం డబ్బు పెరిగింది. అప్పుడు, 1 కాయితం డాలరు విలువ, గతంతో పోలిస్తే 50% తగ్గింది. 1 కాయితం రూపాయి విలువ, గతంతో పోలిస్తే 75% తగ్గింది. అప్పుడు కొత్త మారకం రేటు ఎలా వుండ వచ్చు?

గతంలో, 1 కా. డాలరు= 4 గ్రా. బంగారం
ఆ విలువ, 50% తగ్గడం అంటే,
అప్పుడు, 1 కా. డాలరు= 2 గ్రా. బంగారం.
గతంలో, 1 కా. రూ. = 1 గ్రా. బంగారం.
ఆ విలువ 75% తగ్గడం అంటే,
అప్పుడు, 1 కాయితం రూపాయి =¼ గ్రా. బంగారం.
కొత్త మారకం రేటు:
1 కాయితం డాలరు = 8 కాయితం రూపాయలు
(2 గ్రాముల బంగారం = 2 గ్రా. బంగారం)

2 చోట్లా కాయితం డబ్బు రాసి పెరిగి, డబ్బు యూనిట్ల విలువలు తగ్గుతూ వుంటే, వాటి కొత్త విలువల్ని బట్టే, కొత్త మారకం రేటు వుంటుంది.

"వేరు వేరు డబ్బు యూనిట్ల మధ్య మారకం రేటు ఎలా ఏర్పడుతుంది?" అనే ప్రశ్నకి, వేరే మాటల్లో చెప్పాలంటే, "డబ్బు యూనిట్ల కొనుగోలు శక్తుల్ని బట్టి ఏర్పడుతుంది" అని కూడా చెప్పవచ్చు.

1 బస్తా ధాన్యం ధర, రూపాయి దేశంలో, 12 రూపాయలు. అదే ధాన్యం ధర, డాలరు దేశంలో, 3 డాలర్లు. అంటే, 12 రూపాయలతో కొనే సరుకుని, 3 డాలర్లతో కొనవచ్చు.

కాబట్టి, 12 రూపాయలు = 3 డాలర్లు
4 రూపాయలు = 1 డాలరు

అంటే, 4 రూపాయల కొనుగోలు శక్తీ, 1 డాలరు కొనుగోలు శక్తీ, సమానం. కాబట్టి, 4 రూపాయలు = 1 డాలరు అవుతుంది.

అయితే, ఈ కాయితం రూపాయలకు గానీ, కాయితం డాలర్లకు గానీ, ఆ కొనుగోలు శక్తులు దేన్ని బట్టి ఏర్పడతాయి? ఏ కారణం వల్ల? - ఆ డబ్బు యూనిట్ల వెనక వున్న బంగారం పరిమాణాల్ని బట్టే. 'బంగారం' అనే ఆధారం లేకుండా కాయితం డబ్బుకి, 'కొంత విలువ' గానీ, 'కొంత కొనుగోలు శక్తి' గానీ, ఏర్పడవు. కాబట్టి, 'మారకం రేటు' అన్నప్పుడు, దాన్ని ఏ మాటలతో చూసినా, అది, ఆ డబ్బు యూనిట్ల వెనక వున్న బంగారం పరిమాణాల సమానత్వాన్ని బట్టి ఏర్పడవలసిందే.

2 దేశాల కాయితం డబ్బు యూనిట్ల మధ్య మారకం రేటు ఎప్పుడూ మారకుండా వుండాలంటే, ఏం జరగాలి? - 2 దేశాల లోనూ, డబ్బు యూనిట్ల విలువలు తగ్గకుండా, గత విలువలే నిలబడుతూ వుండాలి. కాయితం రూపాయికీ, కాయితం డాలరుకీ కూడా విలువ మారకపోతే, వాటి 'మారకం రేటు' కూడా మారదు. కానీ, 2 దేశాల లోనూ, 1 బంగారం యూనిట్‌కి బదులుగా వుండే, కాయితం నోట్ల సంఖ్య పెరుగుతూనే వుంటుంది కాబట్టి, 2 చోట్లా కాయితం - యూనిట్ విలువ తగ్గుతూనే వుంటుంది. ఆ తగ్గుదల, 2 చోట్లా ఒకే స్థాయిలో వుండదు కాబట్టి, 'మారకం రేటు' కూడా మారుతూనే వుంటుంది.

గతంలో, 1 డా. = 4 రూ. లుగా వుండే మారకం రేటు, తర్వాత 1 డాలరు = 8 రూపాయలుగా మారినట్టు చూశాం. అప్పుడు, రూపాయి దేశం నించీ డాలరు దేశానికి ఎక్కువ విలువ వెళ్ళి పోతున్నట్టు అర్థమా? - కాదు. గతంలో రేటుకీ, ఈ మారిన రేటుకీ, సారాంశంలో తేడా ఏమీ లేదు. గత రేటులో, 2 వేపులా వున్న విలువలు సమానం. ఇప్పుడు కూడా, 2 వేపులా వున్న విలువలు సమానం.

ఒక మారకం రేటు ఎలా మారినా, ఆ 'రేటు' 2 దేశాలకూ ఒకే రకంగా వర్తిస్తుంది. ఒక దేశం, రెండో దేశం నించి తను కొన్నప్పుడూ, తను అమ్మినప్పుడూ కూడా ఆ రేటునే పాటించాలి. అలాగే, రెండో దేశం కూడా. కాబట్టి, 'మారకం రేటు' ఎలా మారినా, దాని వల్ల, ఒక దేశానికి ప్రత్యేకంగా జరిగే ప్రయోజనం గానీ, ప్రమాదం గానీ, ఏమీ వుండదు.

వేరు వేరు దేశాల మధ్య అమ్మకాలూ, కొనుగోళ్ళూ జరిగినప్పుడు, ప్రతీ దేశమూ రెండో దేశానికి తన చెల్లింపులు 'బంగారం లోనే' చెయ్యాలి. కానీ, ప్రతీ ఒక్క మారకానికీ వెంట వెంటనే బంగారాన్ని ఇవ్వడమో, తీసుకోవడమో జరగదు. కొంత కాలానికి ఒక సారి (ఉదా: సంవత్సరానికి ఒకసారి), ఎగుమతులకు రావలసిన దాన్నీ, దిగుమతులకు పోవలసిన దాన్నీ, లెక్కలు చూసి, మిగిలిన బ్యాలెన్స్ కోసం మాత్రమే బంగారం ఇవ్వాలి. లేదా బంగారం ఇవ్వక పోతే ఆ బ్యాలెన్సు, 'అప్పు'గా వుంటుంది. దాని మీద వడ్డీ చెల్లిస్తూ వుండాలి. అప్పుని తర్వాత తీర్చాలి.

రూపాయి దేశాన్నీ డాలరు దేశాన్నీ తీసుకుందాం.

ఆ దేశాల మధ్య ఎగుమతులూ, దిగుమతులూ జరుగుతూ వుంటాయి. ఒక దేశపు ఎగుమతులే, ఇంకో దేశపు దిగుమతులు. ఒక దేశపు దిగుమతులే, ఇంకో దేశపు ఎగు మతులు.

రూపాయి దేశం నించే ఎగుమతులు జరిగాయి అనుకుందాం. ఆ సరుకుల్ని అమ్మిన పెట్టుబడిదారుడి చేతుల్లోకి రూపాయలే రావాలి. కానీ, ఆ సరుకుల్ని కొన్న డాలరు దేశపు పెట్టుబడిదారుడు, డాలర్లు ఇవ్వగలడు గానీ రూపాయలు ఎలా ఇవ్వగలడు? - ఎలా ఇవ్వగలడో తర్వాత చూద్దాం.

రూపాయి దేశానికి, డాలరు దేశం నించి దిగుమతులు జరిగాయి - అనుకుందాం. ఆ సరుకుల్ని అమ్మిన డాలరు దేశపు పెట్టుబడిదారుడి చేతుల్లోకి డాలర్లే రావాలి. కానీ, ఆ సరుకుల్ని కొన్న రూపాయి దేశపు పెట్టుబడిదారుడు రూపాయలే ఇవ్వగలడు గానీ డాలర్లు ఎలా ఇవ్వగలడు? - డాలర్ల వాడు రూపాయలు ఎలా ఇవ్వగలడో, రూపాయల వాడు డాలర్లూ అలాగే ఇవ్వగలడు.

ఎగుమతులూ, దిగుమతులూ 'సమానంగా' వుంటే, వేరు వేరు దేశాల 'డబ్బు మారకాల' సమస్య, కేవలం ఎక్కౌంట్లు చూసుకునే సాంకేతిక సమస్యగా మాత్రమే వుంటుంది. ఒక సంవత్సర కాలాన్ని తీసుకుంటే, ఎగుమతుల మొత్తానికీ, దిగుమతుల మొత్తానికీ సరిపోతే, చివరికి ఎవరూ ఎవరికీ డబ్బు ఇవ్వనక్కర లేకుండానే ఎక్కౌంట్లు కాన్సిల్ అయిపోతాయి.

అయితే, ఒక ఎగుమతి గానీ, దిగుమతి గానీ, విడి విడి పెట్టబడిదారులకు సంబంధించిన వ్యవహారంగా వుంటుంది కాబట్టి, ఆ పెట్టుబడిదారుల మధ్య డబ్బు చెల్లింపులు, వెంట వెంటనే జరగవలసి వుంటుంది. ఆ విడి విడి చెల్లింపులు ఎలా జరుగుతాయో చూడాలి. అవి, రక రకాల పద్ధతుల్లో జరగవచ్చు. ఎలా జరిగినా, సారాంశం ఒకటే.

ఈ మారకాల్ని కొన్ని ఉదాహరణల ద్వారా చూద్దాం. రూపాయి దేశం నించి A అనే వాడు, 100 రూపాయల విలువ గల సరుకుని, డాలర్ దేశంలో వున్న B అనే వాడికి ఎగుమతి చేశాడు. అంతే గాక, B నించి 25 డాలర్ల విలువ గల ఇంకో సరుకుని తను దిగుమతి చేసుకున్నాడు.

రూపాయి - డాలరు మారకం రేటు:
4 రూపాయలు = 1 డాలరు.
100 రూపాయలు = 25 డాలర్లు.

A, 100 రూపాయల సరుకుని అమ్మి, 25 డాలర్ల సరుకుని కొన్నాడన్న మాట. రెంటికీ సరిపోతుంది. రూపాయి దేశం నించి ఎగుమతి చేసిన వాడూ, దిగుమతి చేసుకున్న వాడూ, A అనే ఒకే వ్యక్తి.

B, 25 డాలర్ల సరుకుని అమ్మి, 100 రూపాయల సరుకుని కొన్నాడు. రెంటికీ సరిపోతుంది. డాలరు దేశం నించి ఎగుమతి చేసిన వాడూ, దిగుమతి చేసుకున్న వాడూ, B అనే ఒకే వ్యక్తి.

A, B ల మధ్య లావాదేవీలలో ఇద్దరూ ఎక్కౌంట్లు చూసుకుంటే సరిపోతుంది. ఎవరూ ఎవరికీ ఏమీ పంపనక్కర లేదు.

కానీ, 2 దేశాల మధ్య వర్తకంలో అన్ని సందర్భాలూ ఇలాగే వుండవు. ఒక దేశం నించి అమ్మే వ్యక్తీ, కొనే వ్యక్తీ ఒక్కడే అయి వుండడం, అన్ని సందర్భాలలోనూ జరగదు. వాళ్ళు వేరు వేరు వ్యక్తులై వుంటారు.

అంతే గాక, కొంత కాలాన్ని (ఉదా: ఒక సంవత్సరాన్ని) తీసుకుంటే, ఆ కాలంలో, 2 దేశాల మధ్య జరిగే ఎగుమతుల మొత్తమూ దిగుమతుల మొత్తమూ సమానంగా వుండడం జరగదు. అవి ఎంతో కొంత తేడాగా వుండవచ్చు. అలాంటప్పుడు, ఏదో ఒక దేశం, ఇంకో దేశానికి, కొంత డబ్బు చెల్లించవలసి వస్తుంది. ఈ రకంగా, దేశాల మధ్య చెల్లింపుల సమస్య ఒకటి వుంటుంది.

ఇప్పుడు, 2 దేశాల మధ్య A, B అనే ఇద్దరు పెట్టుబడి దారుల ఉదాహరణ గాక, A, B, C, D అనే 4 గురు పెట్టుబడి దారుల ఉదాహరణ చూద్దాం. ఈ ఉదాహరణలో, రూపాయి దేశం నించి డాలరు దేశానికి జరిగిన ఒక ఎగుమతినీ (ఇది ఒక సరుకు), డాలరు దేశం నించి రూపాయి దేశానికి జరిగిన ఒక దిగుమతినీ (ఇది ఇంకో సరుకు), తీసుకుందాం.

మొదటి సరుకు సంగతి:
రూపాయి దేశపు ఎగుమతి దారుడు - A.
డాలరు దేశపు దిగుమతి దారుడు - B.
రూపాయి దేశపు ఈ ఎగుమతి విలువ 100 రూ.లు

ఇది రూపాయి దేశపు సరుకు కాబట్టి, దీన్ని కొన్న విదేశీ వ్యక్తి, దీని కోసం రూపాయలే చెల్లించాలి. అంటే A కి, B, 100 రూపాయలు పంపాలి. దీని కోసం B కి, 'విదేశీ డబ్బు' కావాలి.

డాలరు దేశానికి, రూపాయలు - విదేశీ డబ్బు.
రూపాయి దేశానికి, డాలర్లు - విదేశీ డబ్బు.
డాలరు దేశపు B దగ్గిర, డాలర్లే వుంటాయి గానీ,

రూపాయలు వుండవు. ఈ B, రూపాయలు ఎలా చెల్లించగలడు?

రెండో సరుకు సంగతి:
రూపాయి దేశపు దిగుమతి దారుడు - C.
డాలరు దేశపు ఎగుమతి దారుడు - D.
రూపాయి దేశపు ఈ దిగుమతి విలువ 25 డా.

D కి, C, 25 డాలర్లు పంపాలి. అయితే, రూపాయి దేశపు C దగ్గిర రూపాయిలే వుంటాయి గానీ, డాలర్లు వుండవు. ఈ C, డాలర్లు ఎలా చెల్లించ గలడు?

రూపాయి దేశపు దిగుమతి దారుడి నించి మొదలుపెడదాం. ఈ దిగుమతి దారుడు C, డాలరు దేశపు ఎగుమతి దారుడైన D కి, 25 డాలర్లు పంపాలి.

ఈ పని ని, C, 3 రకాలుగా చెయ్యవచ్చు.

1. C, ఒక 100 రూపాయలు D కి పంపి, "ఈ రూపాయల్ని నువ్వే డాలర్లుగా మార్చుకో" అని చెప్పడం. ఇలా చేస్తే, ఈ 100 రూపాయల్ని D, ఎలా ఎక్కడ డాలర్లుగా మార్చుకుంటాడు?
2. C, ఒక 100 రూపాయల్ని, తనే డాలర్లుగా మార్చి వాటిని D కి పంపడం. ఇలా చెయ్యాలంటే, C, 100 రూపాయల్ని డాలర్లుగా ఎక్కడ మారుస్తాడు?
3. C, ఒక 100 రూపాయల్ని, రూపాయి దేశపు బ్యాంకులో ఇచ్చి, "ఈ రూపాయలకు బదులుగా 25 డాలర్లని డాలరు దేశంలో ఫలానా D కి పంపండి" అని, ఆ పనిని ఒక బ్యాంకుకి అప్పజెప్పడం. (ఈ పని చేసి పెట్టడం కోసం, బ్యాంకుకి C, కొంత ఛార్జీ చెల్లించాలని వేరే చెప్పనక్కర లేదు.) ఆ బ్యాంకు, D కి, 25 డాలర్లు పంపాలంటే, బ్యాంకుకి డాలర్లు ఎక్కణ్ణించి వస్తాయి?

C నించి D కి 25 డాలర్లు అందాలంటే, దాని కోసం 3 మార్గాలు చూశాం. ఆ పని ఏ మార్గంలో జరగాలన్నా, 100 రూపాయలు, 25 డాలర్లుగా మారాలి. ఇది ఎలా జరుగుతుంది?

ఈ ఉదాహరణలో, ఈ పని ని, C, 3వ పద్ధతిలో, అంటే రూపాయి దేశపు బ్యాంకుకే అప్పజెపుతూ బ్యాంకుకి 100 రూపాయలు కట్టాడనుకుందాం. (బ్యాంకు ఛార్జీలు కూడా.)

ఇప్పుడు, డాలరు దేశపు దిగమతి దారుడి సంగతి చూద్దాం. ఈ దిగుమతి దారుడైన B, రూపాయి దేశపు ఎగుమతి దారుడైన A కి, 100 రూపాయలు పంపాలి.

ఈ పని ని, B, 3 రకాలుగా చెయ్యవచ్చు.

1. B, 25 డాలర్లని A కి పంపి, "ఈ డాలర్లని నువ్వే రూపాయలుగా మార్చుకో" అని చెప్పడం.
2. B యే, 25 డాలర్లని, రూపాయలుగా మార్చి A కి పంపడం.
3. B, 25 డాలర్లు, డాలరు దేశపు బ్యాంకులో కట్టి, "రూపాయి దేశంలో ఫలానా A కి, 100 రూపాయలు పంపండి" అని, ఆ పని, బ్యాంకుకి అప్పజెప్పడం.

B నించి A కి 100 రూపాయలు అందాలంటే, ఆ పని ఎవరి ద్వారా జరగాలన్నా 25 డాలర్లు 100 రూపాయలుగా మారాలి. ఈ పనిని, B, డాలరు దేశపు బ్యాంకుకి అప్ప చెపుతూ, బ్యాంకుకి, 25 డాలర్లు కట్టాడనుకుందాం. (బ్యాంకు ఛార్జీలు కూడా.)

ఈ 2 సరుకుల వ్యవహారాలూ ఇలా వున్నాయి:

రూపాయి దేశపు దిగుమతి దారుడైన C చెల్లించిన 100 రూపాయలు, రూపాయి దేశపు బ్యాంకులో వున్నాయి. వాటికి బదులుగా, 25 డాలర్లు D కి అందాలి.

అలాగే డాలరు దేశపు దిగుమతి దారుడైన B చెల్లించిన 25 డాలర్లు, డాలరు దేశపు బ్యాంకులో వున్నాయి. వాటికి బదులుగా 100 రూపాయలు A కి అందాలి.

ఇప్పుడేం జరుగుతుంది?

రూపాయి దేశపు బ్యాంకులో, C కట్టిన 100 రూపాయలు, రూపాయి దేశం లోనే A కి అందవచ్చు. అలాగే, డాలరు దేశపు బ్యాంకులో B కట్టిన 25 డాలర్లు, డాలరు దేశంలోనే D కి అందవచ్చు. రెండు వేపులా సమస్యలు తీరిపోతాయి. అయితే, ఈ చెల్లింపుల్లో, రూపాయి దేశపు ఎగుమతి దారుడైన A కి అందిన డబ్బు, డాలరు దేశపు B ఇచ్చింది కాదు. రూపాయి దేశపు దిగుమతి దారుడైన C ఇచ్చింది. అలాగే, డాలరు దేశపు ఎగుమతి దారుడైన D కి అందిన డబ్బు, రూపాయి దేశపు C ఇచ్చింది కాదు. డాలరు దేశపు దిగుమతి దారుడైన B ఇచ్చింది.

ఈ చెల్లింపుల సారాంశం ఏమిటి? - రూపాయి దేశపు దిగుమతి దారుడు, రూపాయలే చెల్లించినా, వాటికి బదులుగా, డాలరు దేశపు ఎగుమతి దారుడికి డాలర్లే అందాయి. అలాగే, డాలరు దేశపు దిగుమతి దారుడు డాలర్లే చెల్లించినా, రూపాయి దేశపు ఎగుమతిదారుడికి రూపాయలే అందాయి. అంటే, 2 దేశాల దిగుమతి దారులూ, తమ స్వదేశీ డబ్బునే

చెల్లించారు. 2 దేశాల ఎగుమతి దారులకూ స్వదేశీ డబ్బే అందింది.

2 చోట్లా చెల్లింపులు సెటిలై పోయాయి. ఈ చెల్లింపులు ఇలా జరిగే విధంగా 2 దేశాల బ్యాంకులూ, ఎక్కౌంట్లు సెటిల్ చేసుకుంటాయి. (ఈ వ్యవహారంలో, 2 దేశాల బ్యాంకులూ, ఛార్జీలు వసూలు చేస్తాయి. ఆ ఛార్జీల లోనే వాటికి 'లాభం' వుంటుంది.)

అయితే ఇక్కడ మనం ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. ఒక దేశం, తన సరుకుల్ని ఎగుమతి చేసినప్పుడు ఆ దేశానికి విదేశీ డబ్బు రావడమూ, దిగుమతి చేసుకున్నప్పుడు ఆ దేశం నించి విదేశీ డబ్బు వెళ్ళి పోవడమూ జరగాలి. మన A, B, C, D ల ఉదాహరణలో కూడా, 2 దేశాలకూ అలాగే జరిగిందా? ఈ విషయం ఇప్పుడు చూడాలి.

A, B, C, Dల ఉదాహరణని ఇంకా వివరంగా చూస్తే, 2 దేశాలకూ విదేశీ డబ్బు రావడమూ పోవడమూ కూడా కనపడతాయి. ఇప్పుడు ఆ ఉదాహరణనే మళ్ళీ చూద్దాం.

రూపాయి దేశం, ఎగుమతి చేసినప్పుడు:

ఎగుమతి దారుడు A. దిగుమతి దారుడు B.

ఎగుమతి విలువ 100 రూపాయలు.

A కి B, 100 రూపాయలు పంపాలి. కానీ, B, 25 డాలర్లు పంపి, "ఈ డాలర్లని నువ్వే రూపాయలుగా మార్చుకో" అన్నాడనుకుందాం. A కి, డాలర్లు రావడం అంటే, A చేసిన ఎగుమతి వల్ల, 'విదేశీ డబ్బు' వచ్చిందని అర్థం. ఆ 25 డాలర్లని A, తన దేశపు బ్యాంకులో ఇచ్చి, దానికి బదులుగా 100 రూపాయలు తీసుకోవాలి. అయితే, బ్యాంకు, A కి, 100 రూపాయలు ఎక్కణ్ణించి తెచ్చి ఇస్తుంది?

రూపాయి దేశం చేసుకున్న దిగుమతిని కూడా దీనితో కలిపి చూడాలి.

రూపాయి దేశం, దిగుమతి చేసుకున్నప్పుడు:

దిగుమతి దారుడు C. ఎగుమతి దారుడు D.

దిగుమతి విలువ 25 డాలర్లు.

D కి C, 25 డాలర్లు పంపాలి. కానీ C, 100 రూపాయలు పంపి, "ఈ రూపాయల్ని నువ్వే డాలర్లుగా మార్చుకో" అన్నాడనుకుందాం. D కి రూపాయలు రావడం అంటే, D చేసిన ఎగుమతి వల్ల, 'విదేశీ డబ్బు' వచ్చినట్టే అర్థం. D, ఆ 100 రూపాయల్ని తన దేశపు బ్యాంకులో ఇచ్చి, దానికి బదులుగా 25 డాలర్లు తీసుకోవాలి. అయితే బ్యాంకు, D కి, ఆ 25 డాలర్లు ఎక్కణ్ణించి తెచ్చి ఇస్తుంది? - ఇప్పుడు, డాలరు దేశం చేసుకున్న దిగుమతిని కూడా దీనితో కలిపి చూడాలి. అంటే, B చేసుకున్న దిగుమతిని. దీన్ని ఇంతకు ముందే చూశాం.

రూపాయి దేశం నించి A చేసిన ఎగుమతి వల్ల, ఆ దేశానికి 25 డాలర్ల విదేశీ డబ్బు వచ్చింది. అది, రూపాయి దేశపు బ్యాంకులో వుంది. ఆ బ్యాంకు, A కి, 100 రూ.లు ఇవ్వాలి. డాలరు దేశం నించి D చేసిన ఎగుమతి వల్ల ఆ దేశానికి 100 రూ. ల విదేశీ డబ్బు వచ్చింది. అది డాలరు దేశపు బ్యాంకులో వుంది. ఆ బ్యాంకు D కి, 25 డాలర్లు ఇవ్వాలి.

రూపాయి దేశపు బ్యాంకులో వున్న 25 డాలర్లు, డాలరు దేశపు బ్యాంకు లోకీ; డాలరు బ్యాంకులో వున్న 100 రూపాయలు, రూపాయి బ్యాంకు లోకీ మారిపోతే, సమస్య తీరిపోతుంది. చివరికి, అదే జరుగుతుంది.

రూపాయి దేశం వేపు నించి చూస్తే:

ఈ దేశం నించి A చేసిన ఎగుమతి వల్ల, విదేశీ డబ్బు వచ్చింది. ఈ దేశానికి C చేసుకున్న దిగుమతి వల్ల, ఆ విదేశీ డబ్బు వెళ్ళిపోయింది. ఆ ఎగుమతీ దిగుమతీ సమాన విలువలతో వుండడం వల్ల బ్యాలెన్స్ సమస్య రాలేదు.

డాలరు దేశం వేపు నించి చూస్తే:

ఈ దేశం నించి D చేసిన ఎగుమతి వల్ల, విదేశీ డబ్బు వచ్చింది. ఈ దేశానికి B చేసుకున్న దిగుమతి వల్ల, ఆ విదేశీ డబ్బు వెళ్ళిపోయింది. ఇక్కడ కూడా బ్యాలెన్స్ సమస్య రాలేదు.

ఈ రకంగా, 2 దేశాల మధ్య, ఒక ఎగుమతినీ, ఒక దిగుమతినీ తీసుకుని చూస్తే, ఎగుమతి వల్ల విదేశీ డబ్బు రావడమూ, దిగుమతి వల్ల అది వెళ్ళి పోవడమూ, 2 దేశాల విషయం లోనూ కనపడుతుంది.

ఇంత వరకూ చూసిన వుదాహరణలో ఎగుమతి దారులే, తమ చేతుల్లోకి వచ్చిన విదేశీ డబ్బుని స్వదేశీ డబ్బుగా మార్చుకున్నట్టు చూశాం. కానీ, ఈ పని ఇంకా వేరే రకాలుగా కూడా జరగవచ్చు. దిగుమతి దారులే, తమ డబ్బుని మార్చి పంపడం గానీ, లేదా ఆ పనిని ఏదో ఒక బ్యాంకుకు అప్పజెప్పడం గానీ, ఇంకేదైనా పద్ధతిలో గానీ, ఏ పద్ధతిలో చూసినా సారాంశం ఒకటే. ఒక దేశపు డబ్బుకీ, ఇంకో దేశపు డబ్బుకీ, మారకం జరగాలి. చివరికి, రూపాయి దేశపు ఎగుమతి దారుడికి

రూపాయలూ, డాలరు దేశపు ఎగుమతి దారుడికి డాలర్లూ అందాలి. ఏ పద్ధతిలో చూసినా, విదేశీ డబ్బు రావడమూ పోవడమూ, 2 దేశాల విషయం లోనూ కనపడతాయి.

A B C D ల ఉదాహరణలో, 2 దేశాల మధ్య, ఒక ఎగుమతినీ ఒక దిగుమతినీ మాత్రమే చూశాం. కానీ, దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ నిత్యం అనేకం జరుగుతూ వుంటాయి. అవి - 2 దేశాలకూ సంబంధించిన ప్రభుత్వ సంస్థల మధ్యా, ప్రైవేటు పెట్టుబడిదారుల మధ్యా, ఒక దేశపు ప్రభుత్వ సంస్థకూ, ఇంకో దేశపు ప్రైవేటు పెట్టుబడి దారులకూ మధ్యా - ఇలా, రక రకాల సంబంధాలతో జరుగుతూ వుంటాయి.

కొన్ని సందర్భాల్లో, ఎగుమతి దారులే దిగుమతి దారులుగా కూడా వుండవచ్చు. లేదా, ఎగుమతి దారులు వేరు గానూ, దిగుమతి దారులు వేరు గానూ వుండవచ్చు.

మన ఉదాహరణలో, ఎగుమతి విలువనీ, దిగుమతి విలువనీ, సమానంగా తీసుకున్నాం. కానీ, 2 దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుండడం ఎప్పుడో గానీ జరగదు.

రూపాయి దేశం నించి ఒక ఎగుమతినీ ఒక దిగుమతినీ తీసుకుంటే. అదే, డాలరు దేశానికి ఒక దిగుమతీ, ఒక ఎగుమతీ. కానీ, రూపాయి దేశం నించి ఎగుమతి మాత్రమే జరిగి, అక్కడికి దిగుమతి జరగక పోతే, డబ్బు చెల్లింపుల విషయంలో ఏం జరుగుతుంది? ఎగుమతి చెయ్యడం వల్ల, A చేతి లోకి 25 డాలర్లు వస్తాయి. కానీ ఈ దేశానికి దిగుమతి జరగక పోతే, ఆ 25 డాలర్లు, రూపాయలుగా మారే మార్గం వుండదు. రూపాయి బ్యాంకు, తన 25 డాలర్లని డాలరు దేశానికి ఇచ్చి, అటు నుంచి 100 రూపాయలు తీసుకుని, వాటినే A కి ఇవ్వాలి కదా? కానీ, రూపాయి దేశానికి దిగుమతే జరగనప్పుడు, రూపాయి దేశం నించి డాలరు దేశానికి రూపాయలు వెళ్ళడం కూడా జరగదు. డాలరు దేశంలో రూపాయలు లేనప్పుడు, రూపాయి దేశం, తన చేతిలో వున్న డాలర్లని రూపాయలుగా మార్చుకోడానికి అవకాశం వుండదు. కాబట్టి, రూపాయి దేశపు ఎగుమతి దారుడైన A, తన డాలర్లని, రూపాయి బ్యాంకులో ఇచ్చినంత మాత్రాన్నే, A కి రూపాయలు అందవు. రూపాయి దేశం నించి ఎగుమతితో పాటు ఆ దేశానికి దిగుమతి కూడా జరిగితేనే, A డాలర్లు, రూపాయలుగా మారతాయి.

అలాగే, రూపాయి దేశానికి దిగుమతి మాత్రమే జరిగి ఎగుమతి జరగక పోతే, ఇంతకు ముందు చూసిందే, ఇంకో రకంగా జరుగుతుంది. రూపాయి దేశపు దిగుమతి దారుడైన C, డాలరు దేశపు D కి, 100 రూపాయలు పంపిస్తాడు. కానీ, ఆ రూపాయల్ని D, డాలర్లుగా మార్చుకోలేడు. ఎందుకంటే, రూపాయి దేశం నించి ఎగుమతి జరగ లేదు కాబట్టి రూపాయి బ్యాంకుకి డాలర్లు వెళ్ళవు. D చేతిలో వున్న రూపాయలు, డాలర్లుగా మారవు.

ఒక దేశం నించి ఎగుమతులు లేకుండా దిగుమతులే జరగడం గానీ, దిగుమతులు లేకుండా ఎగుమతులే జరగడం గానీ, ఎప్పుడూ వుండవు. 2 దేశాల మధ్య సత్సంబంధాలు వుంటే, రెండు వేపుల నించీ ఎగుమతులూ, దిగుమతులూ జరుగుతూనే వుంటాయి. కానీ అవి సమానంగా లేకపోతే, ఆ దేశాల మధ్య డబ్బు చెల్లింపుల సమస్యలు వస్తూ వుంటాయి.

# కరెన్సీల మారకం అంటే ఏమిటి?

**క**రెన్సీ - అంటే చలామణీలో తిరిగే డబ్బు. వేరు వేరు దేశాల డబ్బుల మారకమే కరెన్సీల మారకం. రూపాయి దేశపు ఎగుమతి దారుడైన A, తన ఎగుమతి వల్ల వచ్చిన 25 డాలర్లని, రూపాయి దేశపు బ్యాంకులో ఇచ్చి, ఆ విదేశీ డబ్బుకి బదులుగా స్వదేశీ డబ్బుని తీసుకోవడం అంటే, డాలర్లని 'అమ్మి', రూపాయల్ని 'కొనడం.' ఒక దేశపు డబ్బుని ఇంకో దేశపు డబ్బుగా మార్చడమే - కరెన్సీల మారకం.

ఈ పని చేసి పెట్టే బ్యాంకుకి, ఈ మారకాల ద్వారా కమిషన్లు వస్తాయి.

కరెన్సీల మారకాలు, ప్రభుత్వ బ్యాంకుల ద్వారానే జరుగుతాయా, ప్రైవేటు పెట్టుబడిదారుల ద్వారా కూడా జరుగుతాయా? - ఈ విషయం, ఒక దేశం పెట్టుకున్న నిబంధనల్ని బట్టి వుంటుంది. ఈ నిబంధనలు రక రకాలుగా వుండవచ్చు. ఎగుమతి దారులు, తమ చేతిలోకి వచ్చే విదేశీ డబ్బుని పూర్తిగా ప్రభుత్వానికే అప్పగించి స్వదేశీ డబ్బుని తీసుకోవాలి - అని గానీ; కొంత వరకూ అప్పగించాలి - అని గానీ; ఇలా,

ఆ నిబంధనలు ఎలాగైనా వుండవచ్చు. పెట్టుబడిదారీ విధానంలో, ఈ కరెన్సీల మారకాలు, ప్రభుత్వ బ్యాంకుల ద్వారానే గాక, ప్రైవేటు బ్యాంకుల ద్వారానూ, ప్రైవేటు వ్యక్తుల ద్వారానూ కూడా జరుగుతాయి.

రూపాయి దేశపు ఎగుమతి దారుడైన A, తన చేతిలో వున్న డాలర్లని, ప్రభుత్వ బ్యాంకులో ఇవ్వకుండా ఒక ప్రైవేటు పెట్టుబడి దారుడి దగ్గిరే రూపాయలుగా మార్చుకోగలడు. అప్పుడు, ఆ మారకం ద్వారా వచ్చే కమిషను, ప్రైవేటు పెట్టుబడి దారుడికే వెళ్తుంది.

కరెన్సీల మారకాలనే ఒక 'వర్తకం'గా చేసే ప్రైవేటు పెట్టుబడిదారులు, ప్రతీ దేశం లోనూ వుంటారు. ఈ మారకాలు ప్రభుత్వ బ్యాంకు ద్వారా జరిగినా, ప్రైవేటు వ్యక్తుల ద్వారా జరిగినా, సారాంశం ఒకటే. విదేశీ డబ్బు కావలసిన వాళ్ళకి, వాళ్ళ నించి స్వదేశీ డబ్బు తీసుకుని విదేశీ డబ్బు ఇవ్వడమూ; స్వదేశీ డబ్బు కావలసిన వాళ్ళకి, వాళ్ళ నించి విదేశీ డబ్బు తీసుకుని స్వదేశీ డబ్బు ఇవ్వడమూ - అనేదే ఆ సారాంశం. ఈ వర్తకంలో వేరు వేరు కరెన్సీలే - 'సరుకులు.'

2 దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుంటే, 'డబ్బు మారకాలు' అనేవి, బ్యాంకుల ద్వారా జరిగే సాంకేతిక విషయాలు మాత్రమే. అప్పుడు ఏ దేశానికీ విదేశీ డబ్బు సమస్య వుండదు. కానీ, ఎగుమతులూ దిగుమతులూ సమానంగా లేకపోతే, 'డబ్బు మారకాలు' కేవలం సాంకేతిక విషయాలుగా మాత్రమే గాక, అంత కన్నా కష్టమైన సమస్యలుగా తయారవుతాయి.

ఒక సంవత్సరంలో, రూపాయి దేశం (ఆ ప్రభుత్వం గానీ, ప్రైవేటు పెట్టుబడి దారులు గానీ), డాలరు దేశానికి (ఆ ప్రభుత్వానికి గానీ, అక్కడి ప్రైవేటు వాళ్ళకి గానీ) 100 రూపాయల సరుకులు అమ్మి, ఆ దేశం నించి 50 డాలర్ల సరుకుల్ని కొన్నదనుకుందాం. మారకం రేటు 1 డా. = 4 రూ. ఆ లెక్కతో చూస్తే, రూపాయి దేశం, డాలరు దేశానికి 25 డాలర్ల (100 రూపాయల) సరుకుల్ని అమ్మి, ఆ దేశం నించి 50 డాలర్ల (200 రూపాయల) సరుకుల్ని కొన్నదని అర్థం. అంటే, రూపాయి దేశానికి, డాలరు దేశంతో ఎగుమతులు తక్కువ గానూ, దిగుమతులు ఎక్కువ గానూ వున్నాయన్న మాట. సంవత్సరం చివరికి లెక్కలు చూసుకుంటే, రూపాయి దేశం చెల్లించవలసిన 50 డాల ర్లలో 25 డాలర్ల వరకూ లెక్కల్లోనే తీరిపోతుంది. కానీ, రూపాయి దేశం ఇంకా 25 డాలర్లు చెల్లించాలి. ఈ డాలర్లు ఎవరు చెల్లించాలి? - ఆ దిగుమతుల్ని రూపాయి దేశంలో ఏ పెట్టుబడి దారులు చేసు కున్నారో వాళ్ళు చెల్లించాలి.

ఇప్పుడు, వాళ్ళు ఏం చేస్తారు?

వాళ్ళు ఎప్పుడు చేసేది అయినా, స్వదేశం లోనే ఏదో ఒక బ్యాంకుని డాలర్ల కోసం అడగడమే. వాళ్ళు ఒక బ్యాంకుకి 100 రూపాయలు కట్టి, దానికి బదులుగా 25 డాలర్లని, డాలరు దేశపు పెట్టుబడిదారులకు పంపించమని చెపుతారు. అప్పుడు, ఆ బ్యాంకు, "ప్రస్తుతం మన దేశంలో డాలర్లు లేవు" అని చెపుతుంది. అంటే, రూపాయి దేశంలో డాలర్లకు 'కొరత' వుందన్న మాట.

ఇప్పుడు, రూపాయి దేశానికి 25 డాలర్లు కావాలి. అంటే, 'విదేశీ డబ్బు' కావాలి. డాలరు దేశం, రూపాయి దేశం నించి, ఇంకో 100 రూపాయల (25 డాలర్ల) సరుకుల్ని కొనుక్కుంటే, రూపాయి దేశానికి డాలర్ల కొరత తీరిపోతుంది. కానీ, 2 దేశాల మధ్యా ఎగుమతులూ దిగుమతులూ సమానంగా లేవు కాబట్టి, దిగుమతులు ఎక్కువగా చేసుకున్న రూపాయి దేశానికి ఇప్పుడు విదేశీ డబ్బు కొరత వచ్చింది.

డాలరు దేశం, తనకు ఇవ్వవలసిన 25 డాలర్లని వెంటనే ఇవ్వమని రూపాయి దేశాన్ని అడుగుతుందనుకుందాం. అలాంటి పరిస్తితి వచ్చినప్పుడు, రూపాయి దేశం ఏం చెయ్యాలి? ఆ డాలర్లని ఎలా ఇవ్వాలి? - డాలర్లు లేకపోతే, వాటికి బదులుగా అంత విలువ గల బంగారమే ఇవ్వాలి.

బంగారం - ప్రపంచ ధనం. దాన్ని ఏ దేశమైనా తీసుకుంటుంది.

1 డాలరు = 4 గ్రాముల బంగారం లెక్కన, రూపాయి దేశం, డాలరు దేశానికి, $25 \times 4 = 100$ గ్రాముల బంగారం ఇవ్వాలి.

ప్రతీ దేశం లోనూ, ప్రభుత్వం దగ్గిర కొంత 'బంగారం - రిజర్వ్' వుంటుంది. ఎందుకంటే (1) కాయితం డబ్బుని విడుదల చేసినప్పుడు, జనాల నించి తీసుకుని భద్ర పరిచిన బంగారం అది. దానికి ఇంకా కొంత కొంత బంగారం చేరుతూ, కాయితం డబ్బు రాసి పెరుగుతూ వుంటుంది. చలామణీలో తిరిగే కాయితం డబ్బుకి, ఈ బంగారమే దన్నుగా వుంటుంది.

(2) ఆ దేశం, విదేశాలతో ఎగుమతులూ దిగు

మతులూ చేసుకోవాలంటే, ఆ దేశం మీద విదేశాలకు నమ్మకం వుండడానికి ఈ బంగారం రిజర్వ్ అవసరం.

A దేశం, B దేశానికి కొంత డబ్బు ఇవ్వాలను కుందాం. కానీ, A దేశం దగ్గిర, B దేశం డబ్బు లేదు. అలాంటప్పుడు, A దేశం, తన బంగారం రిజర్వ్‌లో నించి కొంత బంగారాన్ని B దేశానికి పంపించెయ్యాలి. A దేశం దగ్గిర బంగారం రిజర్వే లేకపోతే, ఆ దేశంతో వర్తకం చెయ్యడానికి (దానికి సరుకుల్ని అమ్మడానికి) ఇతర దేశాలకు నమ్మకం వుండదు. "ఈ దేశానికి ఎప్పుడైనా డబ్బు లోటు ఏర్పడితే బంగారాన్ని అయినా చెల్లించగలదు" అని ఒక దేశం మీద విదేశాలకు నమ్మకం కలగాలంటే, ప్రతీ దేశం దగ్గిరా బంగారం రిజర్వ్ వుండాలి. అప్పుడు వేరు వేరు దేశాల మధ్య విదేశీ వర్తకాలు (ఎగుమతులూ దిగుమతులూ) నడుస్తాయి.

డాలరు దేశానికి 25 డాలర్లు చెల్లించవలసిన రూపాయి దేశపు పెట్టుబడి దారులు, 100 రూ. ల్ని, ప్రభుత్వ బ్యాంకుకి చెల్లిస్తారు. బ్యాంకు దగ్గిర డాలర్లు లేవు కాబట్టి, అదేం చేస్తుందంటే, 'విదేశీ వర్తకం'లో అవసరమైనప్పుడు చెల్లించడం కోసం, రిజర్వ్‌లో వుంచిన బంగారంలో నించి, 100 గ్రాముల్ని తీసి, డాలరు దేశానికి పంపిస్తుంది. అప్పుడు, డాలరు దేశపు బ్యాంకు, ఆ బంగారాన్ని తీసుకుని, దానికి బదులుగా 25 డాలర్లని, డాలరు దేశపు ఎగుమతి దారులకు ఇచ్చేస్తుంది.

అయితే, ఒక వేళ, రూపాయి దేశపు ప్రభుత్వ బ్యాంకులో అంత బంగారం లేకపోతే, అది, ఆ బంగారాన్ని ఇంకే దేశం నించైనా కొని, డాలరు దేశానికి ఇవ్వవచ్చు. ఇంకో దేశం నించి బంగారాన్ని కొంటే, ఆ దేశానికి ఏం ఇవ్వాలి? తన ఉత్పత్తులేవో ఇవ్వాలి. ఇంకో దేశానికి కావలసిన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసి, వాళ్ళ నించి బంగారం తీసుకుని, దాన్ని డాలరు దేశానికి ఇవ్వాలి.

ఆ ఇంకో దేశం, రూపాయి దేశం నించి ఏ ఉత్పత్తులూ కొనకపోతే, రూపాయి దేశం అప్పుడేం చెయ్యాలి? అప్పుడు రూపాయి దేశం, బంగారాన్ని సంపాదించే ప్రయత్నాలు కట్టిపెట్టి, 'డాలర్లు' సంపాదించే ప్రయత్నాలు చెయ్యవచ్చు. ఏ దేశపు ఎకౌంటులో అయితే డాలర్లు ఎక్కువగా వున్నాయో ఆ దేశాన్ని పట్టుకుని, '25 డాలర్లని' అప్పు తీసుకోవచ్చు. వాటిని తెచ్చి డాలరు దేశానికి ఇచ్చెయ్య వచ్చు. లేదా, ఆ 'అప్పు' ఒప్పందాన్ని డాలరు దేశం తోనే చేసుకోవచ్చు. ఆ అప్పుకి వడ్డీ కడుతూ వుండాలి.

రూపాయి దేశం ప్రస్తుతానికి ఎలా చేసినా, చివరికి ఆ 'అప్పు'ని ఎలా తీర్చాలి? - తర్వాత కాలంలోనైనా తన ఎగుమతుల ద్వారానే తీర్చాలి. తన ఉత్పత్తుల్ని ఇవ్వడం ద్వారానే.

రూపాయి దేశం, ఆ 25 డాలర్లని ఇంకో దేశం నించి కొనాలంటే, రూపాయి దేశంలో 'డాలర్ల కొరత' వుంది కాబట్టి, డాలర్లని అమ్మే ఇంకో దేశం, 'డాలరు - రేటు'ని పెంచుతుంది. అంటే, అప్పటి వరకూ 1 డాలరు = 4 రూపాయలుగా వుండగా, అప్పుడు 1 డాలరుని, 4 రూపాయల కన్నా ఎక్కువతో కొనవలసి వస్తుంది. రూపాయి దేశం, 1 డాలరుని 5 రూపాయల చొప్పున, 25 డాలర్లని కొని, డాలరు దేశానికి పంపిందనుకుందాం. దీని అర్థం, రూపాయి విలువ తగ్గడమే.

ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? - రూపాయి దేశంలో డాలర్లకు డిమాండ్ పెరిగింది కాబట్టి. డాలర్లకు డిమాండ్ పెరిగే పరిస్థితి ఎందుకు ఏర్పడింది? రూపాయి దేశానికీ, డాలరు దేశానికీ మధ్య, ఎగుమతులూ దిగుమతులూ సమానంగా లేవు కాబట్టి.

అంటే, 'రూపాయి - డాలరు' మారకం రేటు స్థిరంగా వుండాలంటే ఆ దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుండాలన్న మాట! అవి అసమానం అయితే, ఎగుమతులు తక్కువగా చేసిన దేశంలో విదేశీ డబ్బుకి డిమాండ్ పెరిగి, ఆ దేశపు డబ్బు ధర తగ్గే విధంగా 'మారకం రేటు' మారుతుంది.

స్వదేశీ డబ్బుకో, విదేశీ డబ్బుకో డిమాండ్ ఏర్పడినప్పుడు, ఆ పరిస్థితి, ప్రైవేటు కరెన్సీ వర్తకానికి దారి తీస్తుంది.

మన ఉదాహరణలో, ఒక ఎగుమతినీ ఒక దిగుమతినీ మాత్రమే చూశాం. కానీ, వాస్తవంలో ప్రతీ దేశం లోనూ వందల వేల ఎగుమతులూ, దిగుమతులూ జరుగుతూ వుంటాయి. ఎగుమతిదారులకూ దిగుమతి దారులకూ మధ్య ఒప్పందాలు రకరకాలుగా వుంటాయి. ఎగుమతి దారులు, "మా స్వదేశీ డబ్బునే చెల్లించాలి" అని షరతు పెట్టవచ్చు. లేదా, దిగుమతి దారులే, "మా స్వదేశీ డబ్బునే చెల్లిస్తాను. దాన్ని నువ్వే నీ డబ్బుగా మార్చుకోవాలి" అని షరతు పెట్టవచ్చు. ఒప్పందాన్ని బట్టి ఏ రకంగానైనా జరగవచ్చు.

ప్రతీ దేశం లోనూ, స్వదేశీ డబ్బుని అమ్మి విదేశీ డబ్బుని కొనడమూ, విదేశీ డబ్బుని అమ్మి స్వదేశీ

డబ్బుని కొనడమూ - ఈ కరెన్సీల మారకాలు, నిత్యం సాగుతూనే వుంటాయి. 'డబ్బు మార్పిడి' వ్యవహారాన్నంతా ప్రభుత్వ బ్యాంకే నిర్వహిస్తుందా, లేక ఆ విషయంలో ప్రైవేటు కరెన్సీ వర్తకం కూడా వుంటుందా - అనేది, ఆ దేశపు ప్రభుత్వ నిబంధనల్ని బట్టి వుంటుందని ఇంతకు ముందే చూశాం.

"ప్రతీ ఎగుమతి దారుడూ, తన చేతికి వచ్చే విదేశీ డబ్బుని ప్రభుత్వానికే అప్పజెప్పి, దానికి బదులుగా ప్రభుత్వం నించి స్వదేశీ డబ్బుని తీసుకోవాలి" అనే నిబంధన గనక ఒక దేశంలో వుంటే, ఆ దేశంలో ప్రైవేటు కరెన్సీ వర్తకమే వుండదు.

కానీ, రూపాయి దేశంలో, "ఎగుమతి దారులు, విదేశీ డబ్బులో సగాన్ని మాత్రమే ప్రభుత్వానికి అప్పగిస్తే చాలు" అనే నిబంధన వుందనుకుందాం. అప్పుడు, ఒక ఎగుమతి దారుడు, తన దగ్గిర వున్న డాలర్లలో సగాన్ని ప్రభుత్వ బ్యాంకు లోనూ, మిగిలిన సగాన్ని ఒక ప్రైవేటు పెట్టుబడిదారుడి దగ్గిరా మార్చుకోవచ్చు. అంటే, ఆ పరిస్తితుల్లో, విదేశీ డబ్బు, ప్రభుత్వం దగ్గిరా, ప్రైవేటు కరెన్సీ వర్తకుల దగ్గిరా కూడా దొరికే పరిస్తితి వుంటుంది.

ఈ సమయం లోనే, రూపాయి దేశంలో 'డాలర్ల కొరత' వుందనుకుందాం. దిగుమతి దారులు, ప్రభుత్వ బ్యాంకు దగ్గిర డాలర్లని కొనాలంటే కావలసినన్ని డాలర్లు దొరకవు. అప్పుడు దిగుమతి దారులు, కొన్ని డాలర్లని మాత్రమే ప్రభుత్వం దగ్గిర ప్రభుత్వ రేటుతో కొని, మిగిలిన వాటిని ప్రైవేటు కరెన్సీ వర్తకుల దగ్గిర ఎక్కువ రేటుతో కొనవలసి వస్తుంది.

ఎగుమతుల ద్వారా డాలర్లని సంపాదించే పెట్టుబడిదారులు, సగం డాలర్లని ప్రభుత్వానికి ప్రభుత్వ రేటు తోనే అప్పగించి, మిగిలిన డాలర్లని కొంత ఎక్కువ రేటుతో డాలర్లు కావలసిన దిగుమతి దారులకు గానీ, కరెన్సీ వర్తకులకు గానీ, అమ్మగలుగుతారు.

సాధారణంగా, పెట్టుబడి దారులు, ఎగుమతుల ద్వారా వచ్చే విదేశీ డబ్బుని తమ ఇష్టాను సారమే అమ్ముకోగలిగే పరిస్తితి వుండాలనీ, దాన్ని ప్రభుత్వం దగ్గిరే అమ్మాలనే నిబంధన వుండకూడదనీ, ఆశిస్తారు.

ప్రభుత్వ మారకం రేటు 4 రూ. = 1 డా. గా వుండగా, ప్రైవేటు మారకం రేటు 5 రూ. = 1 డాలరుగా వుందనుకుందాం. అంటే, వేరు వేరు కరెన్సీల మధ్య ప్రభుత్వాలు నిర్ణయించిన రేటే గాక, ప్రైవేటు కరెన్సీ వర్తకంలో చలామణీ అయ్యే రేటు కూడా ఒకటి వుంటుందన్న మాట. అది, ఆ 'కరెన్సీ'ల s dల్ని బట్టి మారుతూ వుంటుంది.

ప్రభుత్వాలు నిర్ణయించిన మారకం రేటు, 1 డాలరు = 4 రూపాయలు అయితే, అది ఆ డబ్బు యూనిట్ల 'విలువ.'

1 డాలరు విలువ = 4 రూపాయలు.

4 రూపాయల విలువ = 1 డాలరు.

కానీ, ప్రైవేటు కరెన్సీ వర్తకంలో, 1 డా. = 5 రూ. అయితే, అది, ఆ డబ్బు యూనిట్ల మార్కెట్ ధర.

1 డాలరు ధర = 5 రూపాయలు

5 రూపాయల ధర = 1 డాలరు.

ఇలా ఎందుకు జరిగిదంటే, రూపాయి దేశంలో 'డాలర్ల కొరత' ఏర్పడడం వల్ల.

డాలర్ల - కొరత వున్నప్పుడు, రూపాయి దేశపు ప్రభుత్వం, పెట్టుబడిదారుల కోసం, "మీరు డాలర్లని ఎలాగైనా సంపాదించుకోవచ్చు" అని ప్రకటించిందనుకుందాం. అప్పుడు, డాలరు దేశపు పెట్టుబడి దారులు. తమ డాలర్లతో, రూపాయి దేశంలో 'కరెన్సీ వర్తకం' ప్రారంభించవచ్చు. రూపాయి దేశపు దిగుమతి దారులు, డాలర్లని ఎక్కువ ధరతో కొని, ఎగుమతి దారులకు పంపుతారు.

రూపాయి దేశం, డాలరు దేశం తోనే గాక, ఇంకా అనేక దేశాలతో ఎగుమతులూ దిగుమతుల సంబంధాలతో వుంటుంది. పరిస్తితుల్ని బట్టి, ఆ కరెన్సీ లన్నిటికీ కూడా ప్రైవేటు మారకం రేట్లు వుండవచ్చు. ఒక కరెన్సీ ధరలో మార్పు, ఇంకో కరెన్సీ ధరని ప్రభావితం చెయ్యవచ్చు.

కరెన్సీల వర్తకులు, ఏ దేశంలో ఏ కరెన్సీకి డిమాండ్ వుందో గమనిస్తూ, ఆ కరెన్సీని దొరికిన చోట కొని, కావలసిన చోట అమ్ముతూ, ఆ వర్తకం ద్వారా 'లాభం' సంపాదిస్తూ వుంటారు.

అయితే, ఒక దేశంలో, ఒక 'విదేశీ కరెన్సీ కొరత' ఎంత వున్నప్పటికీ, ఆ 'కరెన్సీ ధర' మరీ ఎక్కువగా పెరగడం సాధ్యం కాదు. ఎందుకంటే, అలా పెరిగితే, ఆ కరెన్సీ కోసం ఎక్కువ స్వదేశీ డబ్బుని చెల్లించవలసి వస్తుంది. ఆ రకంగా విదేశీ సరుకుని దిగుమతి చేసుకున్న పెట్టుబడి దారుడికి, తర్వాత ఆ సరుకుని మళ్ళీ అమ్మినప్పుడు గానీ, దాన్ని 'ఉత్పాదక' అవసరానికి వాడినప్పుడు గానీ, దాని ద్వారా మిగిలే లాభం చాలా తగ్గిపోతుంది. కాబట్టి, డబ్బు మార్పిడి సమస్యలో ఒక కరెన్సీ ధర ఎంత పెరిగినా దానికి కూడా ఒక హద్దు వుంటుంది. ఇంత వరకూ చూసిన దాన్ని బట్టి గ్రహించ

వలసింది ఏమిటంటే - ప్రతి దేశమూ, ఇంకో దేశానికి ఎన్ని ఎగుమతులు చేస్తుందో అన్ని దిగుమతులు కూడా చేసుకుని తీరాలి. ఈ షరతు లేకపోతే, విదేశీ వర్తకంలో, ఒక దేశం 'ప్లస్' లోనూ, ఇంకో దేశం 'మైనస్' లోనూ వుండి తీరతాయి. 'మైనస్'లో వున్న దేశానికి 'విదేశీ డబ్బు కొరత' సమస్య పట్టుకుంటుంది. ఆ దేశపు డబ్బు విలువ తగ్గిపోయే విధంగా 'మారకం రేటు' మారుతుంది. విదేశానికి అప్పు పడి, వడ్డీలు చెల్లించవలసి వస్తుంది. ఈ సమస్యలన్నీ పట్టుకుంటాయి కాబట్టి ఈ సమస్యలకు పరిష్కారం, దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా వుండడమే.

కానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, ఆ రకంగా చెప్పరు. పైగా - "ఎప్పుడూ దిగుమతుల కన్నా ఎగుమతులే ఎక్కువగా వుండాలి. విదేశాలే మనకు చెల్లించవలసిన స్థితిలో వుండాలి గానీ, మనం విదేశాలకు చెల్లించవలసిన స్థితిలో వుండకూడదు" అని చెబు తారు. ఎప్పుడూ దిగుమతుల్ని తగ్గించేసి, ఎగుమతుల్ని పెంచెయ్యమంటారు. ఈ సలహా, ఏదో ఒక్క దేశానికే కాదు. ఏ దేశపు ఆర్థిక వేత్తలు ఆ దేశానికి ఇదే సలహా ఇస్తారు. అన్ని దేశాలకూ ఇదే సలహా! అన్ని దేశాలూ, దిగుతుల్ని తగ్గించేసి ఎగుమతుల్ని పెంచెయ్యాలి! ఈ తెలివి మాలిన సలహాలు, పనికి మాలిన సలహా లవుతూ వుంటాయని వేరే చెప్పనక్కర లేదు.

# అన్ని దేశాలకూ ఒకే కరెన్సీ నోటు వుండకూడదా?

**వే**రు వేరు కరెన్సీల మారకం రేట్ల సమస్యని పరిష్కరించడానికి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, 'అన్ని దేశాలకూ ఒకే కాయితం డబ్బు యూనిట్'ని ఏర్పరచాలని కలలు కంటూ వుంటారు.

ఒక దేశంలో వుండే కాయితం డబ్బు, ఆ దేశంలో అన్ని ప్రాంతాల లోనూ నడుస్తుంది కదా? అలాగే, మొత్తం ప్రపంచంలో అన్ని దేశాల లోనూ నడిచే విధంగా ఒకే రకం కాయితం డబ్బు ఎందుకు వుండకూడదు? - ఇదీ ఈ ఆలోచన.

అన్ని దేశాల డబ్బుకీ 'రూపాయి' అనో, 'డాలరు' అనో ఒకే పేరు పెట్టి, ఆ కాయితం డబ్బు యూనిట్ ని అన్ని దేశాల లోనూ ఒకే ఆకారంతో ప్రింటు చేస్తారనుకుందాం. ఆ కాయితం యూనిట్ వెనక అన్ని దేశాల లోనూ ఒకే బరువు గల బంగారం (1 గ్రామో, 2 గ్రాములో, అన్ని చోట్లా ఒకే రకంగా) వుంటుందనుకుందాం. అప్పుడు ప్రపంచం అంతా ఒకే కాయితం డబ్బు వుంటుంది. ఆ కాయితం నోట్లు, ఏ దేశంలోనైనా నడుస్తాయి. ఒక దేశం, ఇంకో దేశానికి 100 రూపాయలు ఇవ్వవలసి వస్తే, తన కాయితం డబ్బునే ఇచ్చెయ్యవచ్చు. అలాగే, ఇతర దేశాల నించి కాయితం డబ్బునే తీసుకోవచ్చు. ఈ విధంగా అన్ని దేశాలూ ఒకే కాయితం యూనిట్ని పెట్టుకుంటే, వేరు వేరు డబ్బు యూనిట్లు వుండవు కదా? దాని వల్ల మారకం రేట్ల - సమస్య వుండదు కదా? ఇలా ఒకే కాయితం నోటుని ఒకే పేరుతో, ఒకే ఆకారంతో, పెట్టుకోవడం ఎందుకు సాధ్యం కాదు? - ఇదీ పెట్టుబడిదారీ కల!

ఇక్కడ సమస్య, ఆ 'నోటు'కి పెట్టవలసిన పేరుదీ, ఆకారానిదీ కాదు. అసలు సమస్య, దాని 'విలువ'ది. అన్ని దేశాలకూ ఒకే 'కాయితం నోటు' సాధ్యమవ్వాలంటే, దాని కోసం అన్ని దేశాలూ ఒక షరతు పాటించి తీరాలి. అదేమిటంటే, ఏ దేశం లోనూ 'ద్రవ్యోల్బణం' వుండకూడదు. ఒక వేళ వుంటే, అది, అన్ని చోట్లా ఒకే స్థాయిలో వుండాలి.

ప్రతీ దేశమూ కాయితం యూనిట్ విలువని, బంగారం యూనిట్ విలువతో సమానంగా వుంచగలగాలి. దేశంలో చలామణీ అయ్యే 'సరుకుల రాసి' విలువతో సమానమైన కాయితం డబ్బుని మాత్రమే చలామణీలో వుంచే లాగ కరెన్సీ ఇష్యూ మీద ఖచ్చితమైన నిబంధనని పాటించాలి. అప్పుడు మాత్రమే ఏ దేశం లోనూ కాయితం నోటు విలువ మారదు. ఈ రకంగా అయితే, అన్ని దేశాలకూ. 'ఒకే డబ్బు యూనిట్' వుండడం సాధ్యమే.

కానీ, ఈ 'కల' ఎప్పటికీ నిజం అవదు. ఎందు

కంటే, పెట్టుబడిదారీ విధానం వుంటూ వుండగా, ఏ దేశం లోనూ 'ద్రవ్యోల్బణం' లేకుండా చెయ్యడం గానీ, ద్రవ్యోల్బణంలో పెరుగుదలని అన్ని దేశాల్లోనూ ఒకే స్థాయిలో వుండే లాగ చెయ్యడం గానీ, ఏదీ సాధ్యం కాదు గనక.

జనవరి 1వ తేదీన అన్ని దేశాలూ ఒకే రకంగా 1 కాయితం నోటుని 1 గ్రాము బంగారం విలువతో పెట్టుకున్నాయి - అనుకుంటే, మళ్ళీ జనవరి 1 వచ్చే నాటికి ఒక్కో దేశపు నోటు ఒక్కో విలువతో తయారై వుంటుంది.

ఆ నోటు పేరు 'రూపాయి' అనుకుందాం. వేరు వేరు దేశాలలో వున్న ద్రవ్యోల్బణాల వల్ల, 1వ దేశంలో రూపాయి విలువ 5% తగ్గి వుంటే, 2వ దేశంలో రూపాయి విలువ 10% తగ్గి వుండవచ్చు. 3వ దేశంలో ఇంకో రకంగా. అప్పుడు 1 కాయితం యూనిట్‌కి వేరు వేరు దేశాలలో వేరు వేరు విలువలు వుంటాయి. అన్ని దేశాలకూ 'ఒకే డబ్బు యూనిట్' వుండి, దాని విలువ ఒక్కో దేశంలో ఒక్కో రకంగా వుంటే, అలాంటి డబ్బుతో వ్యవహరించడం అసాధ్యమైన విషయంగా వుంటుంది. ఆ రూపాయికి ఏ దేశంలో ఎంత విలువ వుందో, ఆ లెక్క తోనే వ్యవహారాలు నడపవలసి వుంటుంది. అప్పుడు ఆ రూపాయికి, వేరు వేరు పేర్లు ఏర్పడతాయి. 1వ దేశపు రూపాయీ, 2వ దేశపు రూపాయీ, 3వ దేశపు రూపాయీ - అనే రకంగా. అప్పుడు ఆ రూపాయిల మధ్య 'మారకం రేట్లు' కూడా ఏర్పడతాయి. అంటే, అంతా మళ్ళీ పాత రకం గానే. కాబట్టి, పెట్టుబడిదారీ విధానంలో అంతర్జాతీయంగా ఒకే డబ్బు యూనిట్‌ని స్థాపించడం గానీ, దానితో వ్యవహరించడం గానీ, ఊహాతీతమైన విషయాలు.

ఈ సమస్యని పరిష్కరించాలంటే, అంటే - 'కరెన్సీ ఇష్యూ' అనేది ఖచ్చితమైన అదుపులో వుండాలంటే, మొట్టమొదట సమాజంలో వున్న మొత్తం ఉత్పత్తి క్రమాలన్నిటికీ ఒక ఖచ్చితమైన 'సమిష్టి ప్లాను' ఉండాలి. ఉత్పత్తులన్నిటికీ ఖచ్చితమైన విలువ లెక్కలు వుండాలి. ఏ శాఖలోనూ s dల్లో తేడాలు రాని పరిస్తితి వుండాలి. ఒక వేళ ఒక సరుకుకి d పెరిగినా ధర పెరగకుండానూ, d తగ్గినా ధర తగ్గకుండానూ వుండాలి. s తక్కువగా వుంటే, ఆ తక్కువ సప్లయినే రేషన్ పద్ధతిలో, ప్రతీ వ్యక్తీ కొంత కొంత తగ్గించి వాడుకునే పరిస్తితి, వుండాలి. దొంగ వ్యాపారాలూ, బ్లాక్ మనీ, డబ్బుని బ్యాంకులకు ఇవ్వకుండా వ్యక్తిగతంగా దాచడమూ - లాంటి వ్యవహారాలు వుండ కూడదు. అన్నిటి కన్నా మొట్టమొదట, పాత డబ్బుని పూర్తిగా రద్దు చేసి సమాజంలో వున్న సరుకుల రాసి విలువకు తగిన లెక్కల తోటే కొత్త డబ్బుని ప్రవేశ పెట్టాలి. ఈ రకంగా, అనేక మార్పులతో, అంటే పెట్టుబడిదారీ విధానానికి ఏ మార్పులైతే దుర్భరమో, కంటకమో, అసాధ్యమో, ఆ రకం మార్పులతో, ఈ సమస్యని పరిష్కరించడం ప్రారంభించాలి. ఇది, పెట్టుబడిదారీ విధానంలో ఊహాతీతమైన విషయం. కాబట్టీ, ఈ సమాజంలో అది పరిష్కారమయ్యే సమస్య కాదు - ఆ సమస్యకే 'రూపాలు' మారడం తప్ప.

ఈ 'రూపాలు మారే' పద్ధతులు ఏదో ఒకటి వస్తూ పోతూనే వుంటాయి. దాని ఫలితం కొంత కాలానికి కనపడుతూ వుంటుంది.

కొన్ని దేశాలు కలిసి ఒకే పేరు గల డబ్బుని పెట్టుకున్నాయంటే, అవి ఖచ్చితంగా కొన్ని షరతులు పాటించడానికి అంగీకరించాయని అర్థం. వ్యాపార ఒప్పందాల లాంటిదే అది. ఆ దేశాలు ఆ ఒప్పందాల్ని పాటించినంత కాలం అది సవ్యంగానే సాగవచ్చు.

పెట్టుబడిదారీ విదేశీ వర్తకాన్ని కేవలం 'సింపుల్ వర్తకం'గా చూడకూడదు. ఈ వర్తకంలో 2 దేశాల సంబంధం, 'ఈ దేశం - ఆ దేశానికి అమ్మితే, ఆ దేశం - ఈ దేశానికి అమ్మడం' లాంటి సింపుల్ సంబంధం కాదు. ఇది కేవలం, 'మారకం రేట్ల సమస్య' కూడా కాదు. ఇది మొదట్లో సింపుల్ వర్తకం లాగే ప్రారంభమైనా, క్రమక్రమంగా, 'యజమాని దేశాలు, వలస దేశాలతో చేసే దౌర్జన్య పూరిత వర్తకం'గా మారి పోతుంది. (ఈ విషయాలు మొదటి సంపుటంలో, 'భారీ పరిశ్రమ' చాప్టరులో, 'యంత్రాల వాడకమూ, దాని ఫలితాలూ' సెక్షన్‌లో కొంచెంగా చూశాం.)

'ధరలకు' సంబంధించీ, 'ద్రవ్యోల్బణానికి' సంబంధించీ, 'మారకం రేట్ల'కు సంబంధించీ, ఈ విషయాలన్నీ మొదటి ఆలోచనకు చాలా గందరగోళంగా కనపడతాయి. కానీ, విషయాల్ని క్రమంగా సరిగా నేర్చుకుంటూ వుంటే, గందరగోళాలన్నీ విచ్చిపోతాయి.

ఒక దేశంలో, ఒక కాలాన్ని తీసుకుంటే, ఆ కాలంలో సరుకుల అమ్మకాల లోనూ, కరెన్సీల అమ్మకాల లోనూ, ఎంతెంత దొంగ వ్యాపారాలైనా వుండవచ్చు. ద్రవ్యోల్బణం ఏ స్థాయిలో నైనా వుండవచ్చు. ధరలూ జీతాలూ ఏ శాఖలో ఏ రకంగా నైనా వుండవచ్చు. ఏ విషయాలు ఎలా వున్నా, 'అదనపు విలువ'

సూత్రం మారదు. మొత్తం అన్ని శాఖల ధరల మొత్తంలో నించి, అన్ని శాఖల స్థిర, అస్థిరల్నీ తీసివేస్తే, మిగిలినది - అన్ని శాఖలూ ఇచ్చిన 'అదనపు విలువ'. ఏ విషయాలు ఎలా వున్నా ఈ సూత్రం మారదు.

ఆర్థిక విషయాల్లో తల ఎత్తే సమస్యల పరిష్కారాల కోసం, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా ప్రయత్నిస్తూనే వుంటారు. కానీ శ్రమ దోపిడీని హక్కుగా బోధించే ఆర్థిక శాస్త్రానికి, ఆ దోపిడీ వల్లనే పుట్టుకు వచ్చే సమస్యల్ని పరిష్కరించే శక్తీ అర్హతా వుండవు. ఆ ఆర్థిక శాస్త్రానికి, సమస్యల్ని సృష్టించడమే గానీ పరిష్కరించడం తెలీదు.

పెట్టుబడిదారీ విధానం సృష్టించగలిగే సమస్యలు ఇంకా కొన్ని వున్నాయి. విదేశాలకు సరుకుల్ని ఎగుమతులు చెయ్యడంతో పాటు, పెట్టుబడుల్ని ఎగుమతి చెయ్యడమూ, ఆ ఎగుమతుల కోసం మార్కెట్లని వెతుక్కోవడమూ, ప్రపంచ పెట్టుబడి దారులంతా ప్రపంచాన్ని తమ భారీ సంస్థల మధ్య పంచుకోవడమూ - వంటి 'అత్యాధునిక' కార్యక్రమాలు, దానికి ఇంకా కొన్ని వున్నాయి. ఆ కార్యక్రమాలకు అనుగుణంగా, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం, ఇంకా కొన్ని 'బోధనలు' చెయ్యవలసి వుంది.

కానీ, కొత్త బోధనల సారాశం కూడా పాతదే. 'ప్రపంచ కార్మిక వర్గాన్ని దోచడం' అనే ఘనతర కార్యక్రమమే, కొత్త రూపాలతో సాగుతూ వుంటుంది. పాత దానికే మార్పులూ చేర్పులూ సవరణలూ జరుగుతూ వుంటాయి. దోపిడీనే పునరుత్పత్తి చేస్తూ బతకమని బోధించడం తప్ప అంత కన్నా ఈ ఆర్థిక శాస్త్రం చూపించగలిగే వున్నత మార్గాలేమీ వుండవు. ప్రతీ మనిషీ శ్రమ చేసి తీరాలనే ఊహ, ఈ ఆర్థిక శాస్త్రానికి కలల్లో కూడా భీతి కలిగిస్తుంది. ధనిక - పేద తేడాల్నీ, యజమానీ - సేవక తేడాల్నీ నిర్మూలించడమూ; సమానత్వమూ; డబ్బు దృష్టి లేని జీవిత విధానమూ - వంటి ఆలోచన లేవీ దీని నిఘంటువులో వుండవు. దీనికి వున్నదంతా, తెలిసినదంతా - నిత్యం ప్రపంచ కార్మిక వర్గాన్ని దోస్తూ, వారిని దుర్భరమైన సమస్యల లోకి నెట్టుతూ, దోపిడీ లాటుని ప్రపంచ వ్యాప్తంగా పంచుకుంటూ జీవించమని - దోపిడీ సెక్షన్లకు బోధించడమే. అదే ఈ ఆర్థిక శాస్త్రానికి తెలుసు. అది మాత్రమే ఈ ఆర్థిక శాస్త్రం నిర్వహించే చెక్కు చెదరని, మార్పు లేని, నిత్యనూతన కార్యక్రమం. దాని గతమూ, వర్తమానమూ, భవిష్యత్తూ అన్నీ అదే.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. ఒక దేశపు ప్రభుత్వం ఎంత డబ్బు కావాలంటే అంత డబ్బుని అచ్చు వేసుకోగలదు కదా? ఇతర దేశాల నించి వాళ్ళ డబ్బుని అప్పులు ఎందుకు తీసు కుంటుంది?**

**జ:** ఇతర దేశాల నించి డబ్బు అప్పులు తీసుకోవడం, ఇతర దేశాల సరుకుల కోసమే. ఇతర దేశాల సరుకులు కావాలంటే, వాళ్ళ డబ్బునే ఇవ్వాలి కాబట్టి, మొదట వాళ్ళ డబ్బుని అప్పు తీసుకుని, ఆ డబ్బుని వాళ్ళ సరుకుల కోసం చెల్లిస్తారు. ఒక దేశం, తన కాయితం డబ్బునే విదేశాలకు ఇవ్వడానికి వీలవదు కాబట్టి, విదేశీ సరుకులతో అవసరం వచ్చినప్పుడు, తన దగ్గిర ఎంత డబ్బుని ప్రింటు చేసుకున్నా ఆ అవసరం తీరదు.

**2. "వస్తువుల్ని విదేశాల నించి కొంటే మన డబ్బు వెళ్ళిపోయి, వస్తువులు మాత్రమే మనకు అందుతాయి. కానీ, స్వదేశంలో వస్తువులనే కొంటే, వస్తువులూ డబ్బూ కూడా మనకే వుంటాయి" అంటాడు, ఇంగర్ సాల్ అనే ఆర్థిక వేత్త. ఇది తప్పా, రైటా? ఏ విధంగా?**

**జ:** ఆ అభిప్రాయం తప్పే. ఆ తప్పేమిటో తెలియాలంటే కొంచెం వివరంగా చూడాలి.

1) విదేశం నించి ధాన్యం తీసుకుని బంగారం నాణాలు ఇచ్చామనుకుందాం. అంటే, వాళ్ళ వస్తువుని తీసుకుని, మన వస్తువుని ఇచ్చినట్టు అర్థం. అందులో ఒకరికి లాభం, ఒకరికి నష్టం వుండవు.

2) విదేశం నించి ధాన్యం తీసుకుని, మన కాయితం డబ్బుని ఇవ్వడానికి వీలు వుండదు కాబట్టి, మన వస్తువులేవో ఇవ్వాలి. అప్పుడు కూడా ఒక వస్తు వుని తీసుకుని, ఇంకో వస్తువుని ఇచ్చినట్టే కాబట్టి, దానివల్ల కూడా ఒకరికి నష్టం, ఒకరికి లాభం వుండవు.

3) వస్తువుల్ని స్వదేశం లోనే కొంటే, ఏం జరుగుతుందో చూడాలంటే, చలామణీలో ఫలానా కొంత డబ్బు వున్నట్టు మొదట ఒక ఉదాహరణ తీసు

కోవాలి. చలామణీలో 100 కాయితం రూ. లు (లేదా, బంగారం రూ. లు) వున్నాయి అనుకుందాం. అవి ఎప్పుడూ, పెట్టుబడిదారుల చేతుల్లోకీ, కార్మికుల చేతుల్లోకీ వస్తూ పోతూ వుంటాయి. ఆ డబ్బుని ఎప్పుడు చూసినా అవి 100 గానే వుంటాయి.

వస్తువుల్ని స్వదేశం లోనే కొనడం - అంటే, ఒక పెట్టుబడిదారుడు, దేశం లోనే ఇతర పెట్టు బడి దారుల నించి ఉత్పత్తి సాధనాలు కొంటాడు. కార్మికు లకు జీతాలు ఇస్తాడు. వారు, ఆ డబ్బుతో పోషణ వస్తువులు దేశం లోనే కొంటారు. పెట్టుబడిదారుడు, తన కొత్త సరుకుని అమ్మినప్పుడు, తను పెట్టిన డబ్బంతా వెనక్కి వస్తుంది. ఒక ఉత్పత్తి క్రమాన్నీ, ఒక చలామణీ క్రమాన్నీ తీసు కుంటే, చలామణీలో వున్న 100 రూ. లు, అందరి చేతుల్లోనూ ఒక చుట్టు తిరుగు తాయి. ఇంకోసారి, అవే క్రమాలు జరిగితే, పాత 100 రూ. లే మళ్ళీ తిరుగుతాయి. అప్పటి పాత ఉత్పత్తు లన్నీ ఖర్చయి పోతాయి. కానీ ఆ 100 డబ్బు మాత్రం ఖర్చవనట్టూ, అది ఎప్పటి లాగే వుండి పోయి నట్టూ కనపడుతుంది. కానీ, ఒక వస్తువు ఖర్చయి పోయిందంటే (వాడకం అయి పోయిందంటే) దాని విలువ కూడా ఖర్చయి పోయినట్టే అర్థం.

వస్తువులు ఖర్చయినా, డబ్బు ఖర్చవకుండా వున్నట్టయితే, అది ఎలా కనపడాలంటే, చలా మణీలో తిరిగే డబ్బుకి ప్రతీ సారీ పాత డబ్బుకి కొత్త డబ్బు చేరుతూ, అది పెరుగుతూ కనపడాలి.

1వ సారి - 100 ఉత్పత్తులూ, 100 డబ్బూ. ఉత్ప త్తులు ఖర్చయి పోయినా, డబ్బు అలాగే వుండాలి.

2 వ సారి మళ్ళీ 100 ఉత్పత్తులూ, 100 డబ్బూ. ఈ ఉత్పత్తులు కూడా ఖర్చయిపోయి, ఈ డబ్బు అలాగే వుండి, పాత డబ్బూ, ఈ డబ్బూ కలిసి, 200 డబ్బు కనడపాలి.

3 వ క్రమం పూర్తయ్యే సరికి, చలామణీలో 300 డబ్బు వుండాలి. - ఈ రకంగా, ఉత్పత్తులు ఖర్చయి పోయినా, డబ్బు మాత్రం ఖర్చయి పోకుండా, పాత డబ్బుకి కొత్త డబ్బు కలుస్తూ, అన్ని క్రమాల డబ్బూ కనపడుతూ వుండాలి. కానీ అలా జరగదు. చలా మణీలో 100 డబ్బు వుందనుకుంటే, అది ఎప్పుడూ ఆ సైజు తోనే వుంటుంది. 100 ఉత్పత్తులు ఖర్చయి పోయి నప్పుడు, వాటి విలువ కూడా ఖర్చయి పోయిం దనీ, ఆ 100 డబ్బు కూడా ఖర్చయి పోయిందని అర్థం. మళ్ళీ కొత్త 100 ఉత్పత్తులు చలామణీ లోకి వస్తే, అప్పుడు చలామణీలో వున్న 100 డబ్బు, కొత్త ఉత్పత్తుల విలువకు ప్రతినిధి. అది పాత విలువ కాదు. పాత డబ్బు కాదు. అది 2 వ సారి వచ్చిన ఉత్పత్తుల విలువ. ఆ ఉత్పత్తులు ఖర్చయి పోతే, ఆ 2 వ విలువ కూడా, ఆ 2 వ డబ్బు కూడా ఖర్చయి పోయినట్టే. మూడోసారి కొత్త ఉత్పత్తులు చలామణీ లోకి వస్తే, అప్పుడు చలామణీలో వున్న 100 డబ్బు, ఈ 3 వ కొత్త ఉత్పత్తుల విలువకు ప్రతినిధే. గతం వాటికి ప్రతినిధి కాదు. చలామణీ లోకి కొత్త ఉత్ప త్తులు వచ్చిన ప్రతిసారీ పాత 100 డబ్బు ఖర్చయి పోయి, కొత్త 100 డబ్బు పుట్టు కొచ్చినట్టుగా వుంటుంది. ఆ 100 డబ్బు, కొత్త ఉత్పత్తులతో మారేదిగా వుంటుంది.

ఆ డబ్బుని బంగారం నాణాలుగా చూసినా, ఒక ఉత్పత్తుల రాసి ఖర్చయి పోయినప్పుడల్లా, ఆ నాణాలు కూడా ఖర్చయి పోయినట్టే అర్థం. ఆ నాణాలు, పాత ఉత్పత్తులతో గాక, తర్వాత కొత్త ఉత్పత్తులతో మారేవిగా వుంటాయి.

వస్తువుల్ని విదేశాల నించి కొన్నా, స్వదేశం లోనే కొన్నా, ఆ వస్తువులు ఖర్చయి పోవలసిందే. ఆ విషయంలో తేడా యేమీ వుండదు. వస్తు వులు ఖర్చయి పోతే, వాటి విలువలు కూడా ఖర్చయి పోయి నట్టే అవుతుంది. అంటే, డబ్బు కూడా ఖర్చయి పోయినట్టే.

4) ఒక కార్మికుడు, తన జీతంతో, పోషణ వస్తువుల్ని కొనుక్కుంటే, డబ్బు ఖర్చయిపోయి, వస్తువులు వచ్చి, తర్వాత అవి కూడా ఖర్చయి పోతాయి. వస్తు వుల్ని స్వదేశం లోనే కొన్నా, అతని డబ్బు అతనికి వుండదు.

అలాగే, ఒక పెట్టుబడిదారుడు ఇంకో పెట్టు బడిదారుడి నించి స్వదేశం లోనే కొన్నా, అతని డబ్బు అతనికే వుండిపోదు. ఇంకో వ్యక్తి చేతికి వెళ్ళిపోవడం అంటే, అది ఖర్చయి పోవడమే.

వస్తువుల్ని స్వదేశం లోనే కొంటే, ఆ డబ్బు బైటికి వెళ్ళకుండా మనకే వుండి పోతుంది- వంటి పొరపాటు అభిప్రాయాలు ఎందుకు కలుగుతా యంటే, 'విలువ' గురించీ, 'డబ్బు' గురించీ సరిగా తెలియకపోవడం వల్ల అది సరిగా తెలిస్తే, ఏ సమస్యని అయినా అర్థం చేసుకోగలం.

# 5. 'జనరల్ లాభం రేటు' తగ్గుతూపోయే ధోరణి

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అసలు లక్ష్యం లాభమే. 'లాభం' కూడా కాదు. లాభం రేటు. లాభం రేటే ఆ విధానాన్ని నడిపే శక్తి.

ప్రతీ శాఖ లోనూ పై స్థాయి పెట్టుబడిదారులకు కావలసింది సాధారణ లాభం రేటు కాదు, అత్యధిక లాభం రేటు. తన సరుకుని, ఇతర పెట్టుబడిదారుల కన్నా తక్కువ ఖర్చుతో తయారు చేసి, ఎప్పటి ధరకే అమ్మితే, కావలసినంత లాభం. ఆ దృష్టి తోటే ప్రతీ శాఖ లోనూ ఒక రిద్దరు పెద్ద పెట్టుబడిదారులు తమ కాస్టు ప్రైసుల్ని తగ్గించడం కోసం, తమ దగ్గిర అప్పటి వరకూ వున్న శ్రమ పరికరాలకు బదులు, వాటి కన్నా మెరుగైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన శ్రమ పరికరాల్ని ప్రవేశ పెట్టుకుంటారు. అంటే, 'ఉత్పత్తి శక్తి' ని పెంచే మార్గాలు చేపడతారు. పెరిగిన ఉత్పత్తి శక్తి వల్ల కొత్త సరుకు, గతం కన్నా తక్కువ శ్రమతో తయారవుతుంది. కానీ, అటువంటి సరుకుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. ప్రతీ విడి సరుకుకీ కాస్ట్ ప్రైస్ తగ్గుతుంది. ఆ సరుకుని ఎప్పటి ధరకే అమ్మితే, గతం కన్నా ఎక్కువ లాభం వస్తుంది. ఆ రకంగా, ఆ పెద్ద పెట్టుబడిదారుల లాభం రేటు పెరుగుతుంది.

అలా కొంత కాలం జరిగేటప్పటికి, ఆ శాఖలో, మధ్య స్థాయి పెట్టుబడిదారులు కూడా అదే దారి పట్టి, తమ ఉత్పత్తి శక్తుల్ని కూడా అభివృద్ధి పరుచుకుంటారు. క్రమంగా ఆ కొత్త ఉత్పత్తి శక్తే, ఆ శాఖలో సగటు శక్తి అయిపోతుంది. తగ్గిన కాస్ట్ ప్రైసే, సగటు కాస్ట్ ప్రైస్ అయిపోతుంది. అందరి దగ్గిరా సరుకుకి విలువ తగ్గి, ధర తగ్గి, లాభం రేటు కూడా తగ్గి, అది అందరి దగ్గరా ఒకే స్థాయికి దిగిపోతుంది. అప్పుడు మళ్ళీ పై స్థాయి పెట్టుబడిదారులు, తమ ఉత్పత్తి శక్తుల్ని మరింత పెంచుకునే ప్రయత్నాలతో కొంత కాలానికి దాన్ని మళ్ళీ సాధిస్తారు.

ప్రతీ శాఖ లోనూ ఇది జరుగుతూనే వుంటుంది. అన్ని శాఖల లోనూ జరిగే ఈ ప్రయత్నాలన్నీ కలిసి, పెట్టుబడిదారీ విధానానికి, 'ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూ పోయే ధోరణి' ఏర్పడుతుంది. దాని ఫలితం, జనరల్ లాభం రేటు తగ్గుతూ పోయే ధోరణిగా తేలుతుంది.

ప్రకృతి శాస్త్రాల ద్వారా దొరికే నూతన జ్ఞానాలూ, శ్రమ క్రమాల ద్వారా దొరికే నూతనానుభవాలూ కలిసి, ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దారి తీస్తూనే వుంటాయి.

ఉత్పత్తి శక్తుల్ని పెంచడం - అన్నప్పుడు, అది ఏ క్రమలో ఎంత వరకూ జరగాలీ, ఎక్కడ ఆగాలీ; యంత్రాల నిరంతరాభివృద్ధి వల్ల మానవ దేహాలకూ మానవ సంబంధాలకూ ఏది క్షేమం, ఏది హాని - అనే దృష్టి తోటే ఆ పని జరగాలి. అంటే, నిజమైన అవసరాల దృష్టితో. ఉపయోగపు విలువ దృష్టితో. కానీ పెట్టుబడిదారీ విధానంలో వుండే దృష్టి అలాంటిది కాదు. అది, కేవలం లాభ దృష్టి. డబ్బు దృష్టి. మారకం విలువ దృష్టి. ఉత్పత్తి శక్తుల్ని లాభం రేటు దృష్టితో పెంచడం అనేది, క్రమంగా, లాభం రేటుని తగ్గించి వేసే ఫలితాన్నే చూపిస్తుంది.

అంతే కాదు, లాభం రేటులో తగ్గుదలని మందగింపజేసే (లాభం రేటుని మరీ తగ్గకుండా చేసే) ఫలితాన్ని కూడా ఇస్తుంది.

మొదట మనం, లాభం రేటు తగ్గే ధోరణి గురించే చూస్తాము

పెట్టుబడిదారీ విధానం, ఒక వేపు - లాభం రేటు పతనానికి దారి తీస్తూనే, ఇంకో వేపు - గత లాభం రేటుని నిలుపుకోవడానికీ, మరింత పెంచుకోవడానికీ అవసరమయ్యే ప్రయత్నాలన్నీ చేస్తూనే వుంటుంది. పరస్పర విరుద్ధమైన ఈ రెండు రకాల శక్తులూ దేని దారిన అది పని చేస్తూ వుంటే, ఏ సందర్భంలో ఏ శక్తి అధికంగా వుంటే, దాని ప్రభావమే అధికంగా వుంటుంది. కొన్ని సందర్భాల్లో లాభం రేటు తగ్గడమూ, కొన్ని సందర్భాల్లో పెరగడమూ, రెండూ జరగవచ్చు. కానీ, కొంత దీర్ఘ కాలాన్ని తీసుకుంటే, పెట్టుబడిదారీ విధానంలో, లాభం రేటు తగ్గుతూ పోవడమే అసలు ధోరణిగా తేలుతుంది.

జనరల్ లాభం రేటు - అనేది, సమాజంలో వున్న మొత్తం పెట్టుబడికి సంబంధించిన లాభం రేటు. సామాజిక పెట్టుబడి కి ఒక సగటు కాంపోజిషన్ వుంటుంది. వేరు వేరు శాఖల కాంపోజిషన్లే, సామాజిక పెట్టుబడికి ఆ కాంపోజిషన్ ని ఇస్తాయి. వేరు వేరు శాఖల్లో జరిగే ఉత్పత్తి శక్తుల పెరుగుదలలన్నీ కలిసి, కొంత కాలాని కొకసారి సామాజిక కాంపోజిషన్‌ని మారుస్తూ వుంటాయి.

సామాజిక పెట్టుబడి కాంపోజిషన్ మారిందంటే,

శాఖల కాంపోజిషన్లు మారాయని అర్థం. జనరల్ లాభం రేటు మారిందంటే, శాఖల్లో లాభం రేట్లు మారాయని అర్థం. కాబట్టి, జనరల్ లాభం రేటు తగ్గడం - సమస్యలో, వేరు వేరు శాఖల్లో ఏం జరుగుతుందో ఆ పరిస్థితులనే చూడాలి.

శాఖల్లో ఉత్పత్తి శక్తులు పెరిగినప్పుడు ఏం జరుగుతుందో గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో, "పని దినం" చాప్టరులో, 'రెలెటివ్ అదనపు విలువ' గురించి చూసిన చోట.) ఆ విషయాలే ఇక్కడ గుర్తు చేసుకుని, ఇక్కడ కొన్ని కొత్త విషయాలు కూడా చూడాలి.

పెట్టుబడి కాంపోజిషన్ అంటే - C, V ల పాళ్ళే. ఒక శాఖలో ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, ఆ పెట్టుబడిలో C పెరిగి V తగ్గే విధంగా కాంపోజిషన్ మారుతుంది. దాని వల్ల ఆ శాఖలో శ్రమ క్రమాలు జరగడానికి, కనీసంగా వుండవలసిన పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది. ఎందుకంటే, పెట్టుబడి ఎప్పటి పరిమాణం తోటే వుంటే, దాని ఉత్పత్తి శక్తి పెరగడం జరగదు. ఉత్పత్తి శక్తి పెరగాలంటే, పని స్థలం లోకి గతం కన్నా మెరుగైన శ్రమ పరికరాలు ప్రవేశించాలి. అవి తప్పని సరిగా ఎక్కువ సాంకేతికతలతో తయారైనవిగా వుంటాయి. కాబట్టి, అవి ఎక్కువ విలువలతో వుంటాయి. అందుకే గతం కన్నా ఎక్కువ పెట్టుబడి కావాలి. అంతే గాక, ఆ కొత్త రకం శ్రమ పరికరాలతో పని చెయ్యడానికి కొత్త సాంకేతిక జ్ఞానం గల కార్మికులు కావాలి. గత కార్మికులే కొత్త ట్రయినింగులు పొందడం గానీ, కొత్త కార్మికులే పని లోకి రావడం గానీ, రెండూ గానీ, జరుగుతాయి. వారి శ్రమ శక్తి విలువలు కూడా (జీతాలు), గతం కన్నా కొంత ఎక్కువగా వుంటాయి. ఆ రకంగా, ఆ పని లోకి కావలసిన కార్మికుల స్థాయి పెరిగి, సంఖ్య తగ్గుతుంది.

ఉత్పత్తి శక్తి ఒక్క శాఖలో మాత్రమే పెరిగి, ఇతర శాఖల్లో పెరగకుండా వుండదు. అన్ని శాఖల్లోనూ పెరుగుతూనే వుంటుంది. అయితే ఆ పెరుగుదలలు సమాన స్థాయిల్లో వుండక పోవచ్చు. ప్రధాన శాఖలన్నిటి లోనూ మార్పులు జరిగితే, వాటి ప్రభావం సామాజిక పెట్టుబడి మీద వుంటుంది. సామాజిక పెట్టుబడికి కాంపోజిషన్ మారడం - అనేది, రోజు రోజూ జరగదు. కాబట్టి, మిగిలిన పరిస్థితులు మారడం కూడా రోజు రోజూ జరగవు.

ఒక శాఖలో ఉత్పత్తి శక్తులు ఒక దశ నించి ఒక దశకి పెరుగుతూన్న కొద్దీ, దాని వల్ల పెట్టుబడి పరిమాణం కూడా పెరుగుతూ, దాని కంపోజిషన్ మరింత పై స్థాయికి పెరుగుతూ (C పెరుగుదలా, V తగ్గుదలా మరింత జరుగుతూ వున్న కొద్దీ) అదనపు విలువ రేటూ, అదనపు విలువ రాసీ, పెరుగుతూనే వుంటాయి. కానీ S పెరిగినా ఆ పెరుగుదల, గత లాభం రేటుని ఇవ్వగలిగేటంతగా వుండదు. అందుకే S రాసి పెరిగినా, లాభం రేటు తగ్గుతుంది. ఆ రకంగా, వేరు వేరు శాఖల్లో జరిగేదే సామాజిక పెట్టుబడికి కూడా జరుగుతుంది.

ఈ పరిశీలనని పై పైన చూసినప్పుడు, చాలా అర్థ రహితంగా కనపడుతుంది. కానీ, ఇందులో వున్న తర్కాన్ని అర్థం చేసుకోవాలంటే, పెట్టుబడిదారీ పని దినానికీ, సరుకు విలువకీ సంబంధించిన విషయాలన్నీ తెలిసి వుండాలి.

ప్రతీ శాఖ లోనూ 'పని దినం', (కార్మికులు పని చేసే కాలం), అవసర శ్రమా, అదనపు శ్రమా - అనే 2 భాగాలుగా (V + S లుగా) ఉంటుందనీ, ఆ భాగాల్ని బట్టే అదనపు విలువ రేటూ, దాని రాసీ వుంటాయనీ; V భాగం తగ్గితే, S భాగం పెరిగి, దాని రేటూ రాసీ పెరుగుతాయనీ - ఈ విషయాలన్నీ మనకు గతం నించీ తెలిసినవే. ఉత్పత్తి శక్తుల్లో మార్పులకూ, పని దినంలో భాగాలకూ, ఎలాంటి సంబంధాలు వుంటాయో కూడా గతంలో చూసినవే. కొత్తగా చూడవలసింది - జనరల్ లాభం రేటు తగ్గుతూ పోయే ధోరణి గురించి.

ఉత్పత్తి శక్తి పెరుగుతూ పోతే ఏం జరుగుతుందో చూసే ముందు, పెరగకుండా వుంటే ఏం జరుగుతుందో మొదటి గుర్తు చేసుకోవాలి.

మొదటి వుదాహరణ:

సామాజిక పెట్టుబడి 100. ఇది శాంపిల్ ముక్క. కాంపోజిషన్ $50_C + 50_V$. (అంటే $1_C + 1_V$) కార్మికుల సంఖ్య 10. ఒక్కొక్కరి జీతం 5. పని దినం 8 గం.లు. అందులో, అవసర కాలం సగం. అదనపు కాలం సగం. అదనపు విలువ రేటు 100%. సరుకు విలువ $50_C + 50_V + 50_S = 150$. 100 పెట్టుబడికి 50 లాభం (S) కాబట్టి, లాభం రేటు 50%.

ఈ ఉదాహరణలో, ఉత్పత్తి శక్తి ఎప్పటి లాగే వుండి, పెట్టుబడి రెట్టింపు అయితే, పెట్టుబడి కాంపోజిషను ఎప్పటి లాగే వుంటుంది. అదనపు విలువ రేటూ, లాభం రేటూ కూడా ఎప్పటి లాగే వుంటాయి, కార్మికుల సంఖ్యా, అదనపు విలువ రాసీ పెరుగు

తాయి. 100 పెట్టుబడితో పనిలో వుండే కార్మికులు 10 మంది అయితే, 200 పెట్టుబడితో, 20 మంది అవుతారు. 100 పెట్టుబడి ద్వారా 50 S అయితే, 200 పెట్టుబడి ద్వారా 100 S అవుతుంది. లాభం రేటు మాత్రం 2 సందర్భాల లోనూ ఒకటే. అది 50%. అది తగ్గదు. ఉత్పత్తి శక్తి పెరగకుండా పెట్టుబడి పెరిగితే, కొన్ని ఖర్చులు కలిసి వచ్చి, లాభం రేటు గతం కన్నా కొంత పెరగవచ్చు కూడా. తగ్గడం మాత్రం జరగదు. ఉత్పత్తి శక్తిలో మార్పు లేకపోతే, అన్ని అంశాలూ పెట్టుబడి సైజుని బట్టే ఉంటాయి. ఇలాంటి వుదాహరణల్ని అర్థం చేసుకోవడం చాలా తేలిక.

కానీ, ఉత్పత్తి శక్తి పెరుగుతూ వుంటే, మిగిలిన అంశాలన్నీ రక రకాలుగా మారిపోతాయి. ఉత్పత్తి శక్తి పెరగడం అంటే, గతంలో పని చేసినంత శ్రమే గానీ, దాని కన్నా తక్కువ శ్రమ గానీ, గతం కన్నా ఎక్కువ ముడి పదార్థం మీద పని చేస్తుంది. దాని వల్ల గతంలో వచ్చే సరుకుల సంఖ్య కన్నా ఇప్పుడు వచ్చే సంఖ్య (లేదా పరిమాణం) ఎక్కువగా వుంటుంది. ఈ విషయం, నిత్య జీవితంలో సాధారణ దృష్టికి కూడా కనపడుతుంది. దూదిని దారంగా వడికే శ్రమలో, ఒక మనిషి, ఒక పని దినంలో, అప్పుడు వున్న ఉత్పత్తి శక్తితో, 2 కిలోల దూదిని వడక గలిగితే, మెరుగైన కొత్త రకం శ్రమ పరికరాలు వచ్చినప్పుడు, ఆ మనిషే కొత్త ట్రైనింగ్ పొంది, అదే కాలంలో, 10 కిలోల దూదిని వడకగలడనుకుందాం. అది, ఆ శ్రమలో ఉత్పత్తి శక్తి కొన్ని రెట్లు పెరగడమే.

సామాజిక పెట్టుబడికి ఉత్పత్తి శక్తి పెరగడం అంటే, వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి శక్తులు పెరగడమే. ఆ శక్తులు - సమస్త శాఖల్లోనూ ఒకే సమయంలో పెరుగుతాయని గానీ, పెరిగిన శాఖల్లో కూడా ఒకే స్థాయిలో పెరుగుతాయని గానీ, అర్థం కాదు. మొత్తం సమాజంలో 'ఉత్పత్తి సాధనాల' శాఖలు (C ఉత్పత్తులుగా వుండే శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ ఉత్పత్తి అయ్యే శాఖలు) అనేకం వుంటాయి. అలాగే, కార్మికుల పోషణ ఉత్పత్తుల శాఖలు (V ఉత్పత్తుల శాఖలు) కూడా అనేకం వుంటాయి. ఈ C, V శాఖల్లో ఉత్పత్తి శక్తుల పెరుగుదలలు ఒకే స్థాయిలో గాక, ఎక్కువ తక్కువ స్థాయిల్లో వుంటాయి. ఒక దశలో వున్న ఉత్పత్తి శక్తిని మొదటి వుదాహరణగా తీసుకుని, తర్వాత దశలో పెరిగిన ఉత్పత్తి శక్తిని రెండో వుదాహరణగా తీసుకుంటే, ఆ రెండో దశ నాటికి కొన్ని శాఖల్లో, వెనకటి ఉత్పత్తి శక్తులు ఇంకా పెరిగి వుండకపోవచ్చు కూడా. ఈ రకంగా, వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి శక్తుల పెరుగుదలలు రక రకాలుగా వుంటాయి.

మొదటి వుదాహరణలో - C, V లుగా ఖర్చయ్యే ఉత్పత్తుల్ని ఒక 100 ఉత్పత్తులుగా అనుకుందాం. తర్వాత రెండో వుదాహరణ తీసుకోవాలంటే, ఆ 100 ఉత్పత్తుల పరిస్థితులూ ఎలా మారాయో వివరాలు కావాలి. ఉత్పత్తి శక్తులు ఏ యే శాఖల్లో పెరిగాయో, ఏ యే శాఖల్లో పెరగలేదో, పెరిగిన చోట్ల కూడా ఎంతెంత స్థాయిల్లో పెరిగాయో, ఆ వివరాలన్నీ కావాలి. C ఉత్పత్తుల్లో, శ్రమ పరికరాల విషయం లోనే మార్పులు జరిగి, మిగిలిన C లలో మార్పులు లేకపోవచ్చు. అలాగే V ఉత్పత్తుల సంగతి కూడా. ఈ రకంగా, C, V లకు సంబంధించిన 100 ఉత్పత్తుల పాత పరిస్థితులూ, కొత్త పరిస్థితులూ; వాటిలో పెరిగిన స్థాయిలూ, పెరగని స్థాయిలూ; ఆ ఉత్పత్తుల పాత విలువలూ, కొత్త విలువలూ - ఇలా అనేక వందల వివరాలు కావాలి. ఇది, ఒక విడి శాఖలో వుండే పెట్టుబడి వుదాహరణ అయినా కాదు. మొత్తం సమాజ పెట్టుబడి వుదాహరణ. అందులో ఉత్పత్తి శక్తి పెరిగినట్టు చూడాలంటే, అన్ని శాఖల్లోనూ జరిగిన మార్పులు కావాలి. ఈ రెండో వుదాహరణ, ఇన్ని పరిస్తితుల మీద ఆధారపడి వుంటుంది. కానీ, ఇన్ని వివరాలతో ఉదాహరణని తీసుకోవడం పూర్తిగా అసాధ్యం. కాబట్టి, ఏ వివరాల జోలికీ పోకుండా ఈ రెండో వుదాహరణ లోకి దేన్ని మాత్రమే తీసుకుంటామంటే, ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు దాని ఫలితాలు ఎలా వుంటాయో ఆ ఫలితాన్ని మాత్రమే తీసుకుంటాం.

ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు (అది ఒక శాఖలో అయినా, మొత్తం సమాజంలో అయినా), గతంలో వున్నంత పని దినం లోనే జరిగే మార్పులు ఈ విధంగా వుంటాయి:

1. శ్రమ క్రమం జరగడానికి అవసరమయ్యే కనీస పెట్టుబడి పెరుగుతుంది.
2. పెట్టుబడిలో, C పెరిగి, V తగ్గుతుంది.
3. కార్మికుల సంఖ్య తగ్గి, వారి శ్రమ శక్తి విలువ పెరుగుతుంది.
4. అదనపు విలువ రేటు (దోపిడీ స్థాయి) పెరుగుతుంది.

5. ఉత్పత్తి అయ్యే సరుకుల పరిమాణం పెరుగుతుంది.
6. విడి సరుకుకి పట్టే శ్రమ కాలం తగ్గి, దాని విలువ గతం కన్నా తగ్గుతుంది. ఆ విలువలో ఒక భాగమైన అదనపు విలువ కూడా తగ్గుతుంది.
7. ఒక సరుకు విలువ తగ్గినా, అక్కడ ఉత్పత్తి అయ్యే సరుకుల సంఖ్య ఎక్కువగా వుంటుంది కాబట్టి, అదనపు విలువ రాసి గతం కన్నా పెరుగుతుంది.
8. పెరిగిన అదనపు విలువ, పెరిగిన పెట్టుబడికి, గత లాభం రేటు ని ఇవ్వగలిగేటంతగా వుండదు. ఫలితంగా, లాభం రేటు తగ్గుతుంది.

ఉత్పత్తి శక్తి పెరిగినట్టుగా ఇప్పుడు చూడబోయే రెండో వుదాహరణలో, ఈ మార్పులన్నీ కనపడాలి.

రెండో వుదాహరణ:

పెట్టుబడి 200. కాంపోజిషన్ $160_C + 40_V$. (కాంపోజిషన్‌ని 100 పెట్టుబడి మీదే చూస్తే, అది $80_C + 20_V$గా వుంటుంది. అంటే $4_C + 1_V$)

అదనపు విలువ రేటు 150%. అదనపు విలువ రాసి 60. (200 పెట్టుబడికి అయితే $60_S$. 100 కి అయితే $30_S$.) లాభం రేటు 30%.

ఇంత వరకూ చూస్తే, కొన్ని మార్పులు కనపడతాయి. పెట్టుబడి పెరిగింది. కాంపోజిషన్, పై స్థాయికి మారింది. అదనపు విలువ రేటూ, రాసీ పెరిగాయి. గతంలో 100 పెట్టుబడికి $50_S$ అయితే, ఇప్పుడు 200 పెట్టుబడికి $60_S$ వచ్చింది. ఇది, S రాసి పెరగడమే. పెట్టుబడి గతం కన్నా ఎక్కువగా అయింది కాబట్టే, S రాసి కూడా గతం కన్నా ఎక్కువగా అయింది. గతంలో ఉన్నంత పెట్టుబడే వుంటే, S రాసి పెరిగి వుండేది కాదు. కానీ, S పెరిగినా, ఇది లాభం రేటు తగ్గడమే. గతంలో 100 పెట్టుబడికి 50 లాభం కాబట్టి, ఇప్పుడు 200 పెట్టు బడికి 100 లాభం వచ్చి వుంటే, అది గత లాభం రేటే అయ్యేది. కానీ, ఇప్పుడు $60_S$ మాత్రమే వచ్చింది కాబట్టి, S రాసి గతం కన్నా పెరిగినదే అయినా, ఇది గత లాభం రేటుని ఇవ్వదు. 'తగ్గడం' అనేది మొదట S రాసికే జరుగుతుంది. S రాసి తగ్గడం వల్లనే లాభం రేటు తగ్గుతుంది. పెట్టుబడికీ, S రాసికీ వుండే సంబం ధమే లాభం రేటు అవుతుంది గనక, పెట్టుబడిలో పెరుగుదలకి తగ్గట్టుగా S పెరగకపోవడం వల్ల, లాభం రేటు తగ్గింది.

మొదటి వుదాహరణలో కాంపోజిషన్ $1_C + 1_V$ అయితే, రెండో వుదాహరణలో $4_C + 1_V$ అయింది. గతంలో వున్నంత V, ఇప్పుడు 4 రెట్ల C ని చలనంలో పెడుతుంది. అంటే, ఇది V తగ్గడమే.

మొదటి వుదాహరణలో, శాంపిల్ పెట్టుబడిగా 100 ని తీసుకున్నట్టు, రెండో వుదాహరణలో కూడా 100 పెట్టుబడినే తీసుకుని, అందులోనే కాంపోజిషన్ మారినట్టుగా చూడవచ్చు. కానీ, రెండో వుదాహరణలో కూడా 100 నే తీసుకుంటే, అన్ని అంశాలూ ఇప్పటిలాగే కనపడినా, అదనపు విలువ రాసి కొంత పెరగడం కనపడదు.

100 నే తీసుకుందాం. అది $80_C + 20_V$. అదనపు విలువ రేటు 150% కాబట్టి, దాని రాసి 30. లాభం రేటు 30%. 100 పెట్టుబడినే తీసుకుంటే, దానికి వచ్చే $30_S$ మాత్రమే కనపడుతుంది. ఎక్కువ పెట్టుబడి వల్ల, గతంలో వచ్చిన, $50_S$ కన్నా ఎక్కువ వస్తుందనే సంగతి అంటే 200 ద్వారా $60_S$ వస్తుందని కన పడదు. ఎక్కువ పెట్టుబడి ద్వారా ఎక్కువ S కనపడా లంటే, 100 కన్నా ఎక్కువ పెట్టుబడినే తీసుకోవాలి. 200 పెట్టుబడికి $60_S$ రావడం అంటే, గతంలో వచ్చిన $50_S$ కన్నా ఎక్కువే. కొంత ఎక్కువ S కనపడాలంటే, ఎక్కువ పెట్టుబడినే శాంపిల్‌గా తీసుకోవాలి కాబట్టి, 200 పెట్టుబడిని తీసుకున్నాం.

ఉత్పత్తి శక్తి పెరిగిన ఈ రెండో వుదాహరణలో ఏం జరిగిందంటే, లాభం రేటు గతం కన్నా తగ్గింది.

ఇక్కడ వెంటనే వచ్చే ప్రశ్న: వెనకటి లాభం రేటు 50% అయితే, దాన్ని వదులుకుని, ఈ 30% లాభం రేటు వచ్చే విధంగా పెట్టుబడిదారుడు ఎందుకు చేసుకుంటాడు? - ఈ ప్రశ్న వచ్చిందంటే, వెనకటి సంగతులన్నీ మర్చిపోయామని అర్థం. - ఏ శాఖలో అయినా, పై స్థాయి పెట్టుబడిదారులు, ఉత్పత్తి శక్తుల్ని ఎందుకు పెంచుతారు? తమ సరుకుల్ని తక్కువ విలువలతో ఉత్పత్తి చేసినా, ఎప్పటి విలువలతో అమ్మడానికే. ఆ దృష్టి తోటే ఉత్పతి శక్తుల్ని పెంచుతారు. అలాంటి పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని, గతంలో ధరలకే అమ్మితే, (లేదా, పోటీ కోసం కొంత ధరని తగ్గించినా), ఆ సరుకుల వల్ల గతంలో కన్నా ఎక్కువ లాభం రేటే వుంటుంది. ఆ విధంగా కొంత కాలం వరకూ జరిగిన తర్వాతే, అప్పటికి ఇతర పెట్టుబడిదారులు కూడా తమ ఉత్పత్తి శక్తుల్ని పెంచుకుంటారు కాబట్టి, అందరి దగ్గిరా సరుకు విలువ తగ్గి, అప్పటి నించీ ఆ తగ్గిన విలువే ఆ సరుకుకి సామాజిక విలువ అవుతుంది. అలా జరిగే వరకూ ఉత్పత్తి శక్తిని మొదట

పెంచుకున్న ఒకరిద్దరికి ఎక్కువ లాభం రేటే వుంటుంది. దాని కోసమే వాళ్ళు ఆ పని చేస్తారు. లాభం రేటు తగ్గడం అనేది, చివరికే జరుగుతుంది. అందరి దగ్గిరా లాభం రేటు తగ్గి, ఆ తగ్గిన లాభం రేటే సామాజిక లాభం రేటు అవుతుంది. ఈ చివరి ఫలితం గురించే 'ఉత్పత్తి శక్తి పెరిగితే లాభం రేటు తగ్గు తుంది' అని చెప్పుకుంటున్నాం. అలా తగ్గిన లాభం రేటుని మళ్ళీ పెంచుకోవడం కోసం పెద్ద పెట్టుబడి దారులు మళ్ళీ కొత్త ప్రయత్నాలు చేస్తారు. కొంత కాలానికి మళ్ళీ పాత కథే.

ఒక శాఖలో అందరి దగ్గిరా 50% గా వున్న లాభం రేటు, కొంత కాలానికి 30% గా తగ్గిపోయిందను కుందాం. పెట్టుబడిదారులందరూ ఒకే మాటగా, సగటు కాస్టు ప్రైసు మీద 50% లాభం రేటునే వేసు కుంటే, ఆ రేటే వుండదా? - ఇలాంటి సందేహం వచ్చిందంటే, మళ్ళీ వెనకటి సంగతులు మరిచి పోయామని అర్థం.

అందరూ 50% లాభం రేటు వేసుకున్నా, చివరికి దాని సారాంశం, తక్కువ రేటే అవుతుంది. ఎందు కంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ, 'అమ్మే' వాడి గానే గాక, 'కొనే' వాడిగా కూడా వుంటాడు కదా? తన 30% లాభం రేటు గల సరుకుల్ని 50% లాభం రేటుతో అమ్మితే, తను కొనే ఉత్పత్తి సాధనాన్ని కూడా 50% లాభం రేటు గల ధరల తోనే కొనాలి. అంతే గాక, కార్మికులు తమ పోషణ వస్తువులన్నిటినీ 50% లాభం రేటు తోటే కొనాలి కాబట్టి, వారికి జీతాల్ని ఆ లెక్క తోటే ఇవ్వాలి. ఈ రకంగా చివరి ఫలితం, అన్నిటి ధరలూ పెరిగి, అవి అసలు విలువలకే సమానం అవు తాయి. కాబట్టి, లాభం రేటుని ఇష్టమొచ్చినట్టు పెంచే పని, ఒక్క పెట్టుబడిదారుడే చేసినా, అందరూ కలిసి చేసినా, ఎలా జరిగినా, ఆ రేటు పెరిగేదేమీ వుండదు. సరుకుల రాసిలో ఎక్కువ S లేకపోతే, లాభం రేటు పెరగదు.

ఉత్పత్తి శక్తి పెరిగిన రెండో వుదాహరణలో ఎలాంటి మార్పులు జరుగుతాయో కొన్నిటిని చూశాం. అవే గాక, ఈ ఉదాహరణలో, సరుకుల పరిమాణం పెరగడమూ, విడి సరుకు విలువ తగ్గడమూ కూడా కనపడాలి.

మొదటి వుదాహరణలో, 100 పెట్టుబడి ద్వారా వచ్చే సరుకుని 'ఒక యూనిట్' అనుకుందాం. దాని విలువ 150.

రెండో వుదాహరణలో, 200 పెట్టుబడి ద్వారా వచ్చే సరుకుల్ని 2 యూనిట్లు అనుకుందాం. వాటి విలువ = 200 పెట్టుబడీ + $60_S$ = 260. 1 యూనిట్ విలువ 130. మొదటి వుదాహరణలో యూనిట్ విలువ 150 అయితే, రెండో వుదాహరణలో యూనిట్ విలువ 130. శ్రమ కాలం తగ్గి, విలువ తగ్గింది. ఇది ఉత్పత్తి శక్తి పెరగడమే. కానీ, పెట్టుబడిదారుడు, ఈ మాత్రపు పెరుగుదలని ఒప్పుకోడు. ఎందుకంటే, 200 పెట్టుబడిని మొదటి వుదాహరణ లోనే (పాత ఉత్పత్తి శక్తి లోనే) పెడితే, దాని తోనే 2 యూనిట్లు వస్తాయి. వాటి వల్ల ఎక్కువ లాభం రేటు కూడా (50% రేటు) వుంటుంది. దాని కన్నా ఇంకా ఎక్కువ లాభం రేటు కోసం ఉత్పత్తి శక్తిని పెంచి, దాని వల్ల 2 యూనిట్లే ఉత్పత్తి చేస్తే, వాటిని పాత ధరకి అమ్మ గలిగితేనే 50% రేటు వుంటుంది. ఆ ధర ఏ మాత్రం తగ్గినా, ఆ 2 యూనిట్ల ద్వారా వచ్చే లాభం, మొదటి వుదాహరణలో కన్నా కూడా తగ్గిపోతుంది. గత లాభం రేటుని అయినా ఇవ్వలేని, దాన్ని ఇంకా తగ్గించి వేసే ఈ కొత్త ఉత్పత్తి శక్తి పెట్టుబడిదారుడికి ఎందుకు? 200 పెట్టుబడితో 2 యూనిట్లని మాత్రమే ఉత్పత్తి చేస్తే, ఈ కొత్త ఉత్పత్తి శక్తి, పెట్టుబడిదారుడికి సరిపోదు.

కాబట్టి, రెండో వుదాహరణలో సరుకుని రెట్టిం పుగా మాత్రమే గాక, ఇంకా కొంత ఎక్కువగా తీసు కోవాలి. దాన్ని 3 యూనిట్లు అనుకుందాం. అప్పుడు, రెండో వుదాహరణలో ఇంతకు ముందు చూసిన కాంపోజిషనూ, అదనపు విలువ రేటూ, కొంత మార తాయి. 200 పెట్టుబడితో 3 యూనిట్లు రావడం అంటే, 1 యూనిట్‌కి కాస్ట్ ప్రైసు దాదాపు 68 అవు తుంది. అది C + V లుగా విడిపోవాలి. C కన్నా V తక్కువగా వుండాలి. ఆ V మళ్ళీ V + S లుగా విడిపోవాలి. V కన్నా S ఎక్కువగా వుండాలి. ఈ లెక్క లన్నీ కష్టపడి చేస్తే, యూనిట్ విలువ 150 కన్నా కూడా తగ్గడం తప్పకుండా కనపడుతుంది. కానీ, ఆ అంకెల మీద ఆధార పడడం కన్నా ఇక్కడ వుండే 'తర్కం' మీద ఆధారపడితే, అసలు విషయం తేలిగ్గా వుంటుంది.

ఆ తర్కం ఏమిటంటే, ఇంతకు ముందు చూసింది కొంతా, ఇంకా తర్వాత చూడబోయేది కొంతా. ఉత్పత్తి శక్తుల పెరుగుదలలూ, C పెరిగి V తగ్గడాలూ, దాని వెంట వచ్చే ఇంకా అనేక మార్పులూ - అన్నీ కలిసినదే ఆ తర్కం.

వేరు వేరు శాఖల్లో వుండే లాభం రేట్లని బట్టే

జనరల్ లాభం రేటు వుంటుంది కాబట్టీ; ఆ వేరు వేరు శాఖల్లో లాభం రేట్లు, తగ్గే ధోరణిలో వుంటాయి కాబట్టీ; జనరల్ లాభం రేటు కూడా తగ్గే ధోరణిలో వుంటుంది.

లాభం రేటు తగ్గడం - అనేది మార్క్సు కొత్తగా కనిపెట్టింది కాదు. ఇది వెనకటి ఆర్థిక వేత్తల్లో కూడా కొందరు, రికార్డో తో సహా, చర్చించిన సమస్యే. అయితే వారు, 'జనరల్ లాభం రేటు' అనే మాట వాడరు. 'లాభం రేటు' అని మాత్రమే అంటారు. శాఖల్లో లాభం రేట్లు తగ్గే సమస్య వుందని పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తలు కూడా గ్రహించారు. కానీ, దానికి కారణం గ్రహించలేక పోయారు. జీతాలు బాగా పెరిగితే లాభం రేటు తగ్గుతుందనీ, శ్రామికులు సరిగ్గా పని చెయ్యక పోతే లాభం రేటు తగ్గుతుందనీ, ప్రకృతి పరిస్తితులు అనుకూలంగా లేకపోతే లాభం రేటు తగ్గుతుందనీ, పెట్టుబడిదారుల్లో మానవత్వం పెరిగి వారే లాభం రేటుని తగ్గించుకుంటారనీ - ఇలా రక రకాల కారణాలు చెప్పుకొచ్చారు. చివరికి, లాభం రేటు తగ్గినా లాభం రాసి ఎంతో కొంత పెరుగుతుంది కాబట్టి, దానితో సంతృప్తి పడాలని పెట్టుబడిదారుల్ని ఊరడించారు..

పెట్టుబడికి లాభం వస్తుందని నిత్య జీవితంలో వుండే అనుభవాన్ని బట్టి అందరికీ తెలుసు. కానీ, లాభం ఎందుకు వస్తుందో, ఎక్కడి నించి వస్తుందో తెలీదు. అలాగే, ప్రతీ సమస్య లోనూ, సమస్యేమిటో, చివరికి కనపడే ఫలితాలేమిటో, అందరికీ తెలుస్తాయి. కానీ 'కారణాలు' తెలీవు. ఎందుకంటే, సమాజాన్ని పెట్టుబడిదారీ దృష్టి తోటే చూడడం వల్ల. 'పెట్టుబడికి లాభం రావలసిందే' అనే దృష్టినే నిలబెట్టుకుంటూ వుంటే, సమస్యలకు కారణాలూ పరిష్కారాలూ తెలుసుకోవడం సాధ్యం కాదు.

లాభం రేటు సమస్యలో మార్క్సు చేసింది ఏమి టంటే - పెట్టుబడిదారీ విధానంలో, జనరల్ లాభం రేటు తగ్గే ధోరణి ఎందుకు వుంటుందో వివరించడం.

ఆ వివరణ ఇలా వుంటుంది:

ఏ పెట్టుబడి అయినా, C, V భాగాలుగా వుంటుంది. లాభాన్ని (S ని) ఉత్పత్తి చేసేది C కాదు, V యే. కార్మికుల సజీవ శ్రమని, L (లేబర్) అందాం. ఆ L, V + S భాగాలుగా చీలుతుంది. S ఎక్కువగా రావాలంటే, సరుకు లోకి చేరే L ఎక్కువగా వుండాలి. ఆ శ్రమని ఇచ్చే కార్మికుల సంఖ్య ఎక్కువగా వుండాలి.

కానీ, పెట్టుబడిదారీ విధానం ఏం చేస్తుందంటే, లాభం రేటుని పెంచుకునే 'పోటీ' తో, ఉత్పత్తి శక్తుల్ని పెంచి వేస్తూ వుంటుంది. ఒక పని స్తలంలో కొత్త ఉత్పత్తి శక్తి ప్రారంభమైనప్పుడు, తక్కువ సజీవ శ్రమే (తక్కువ L), ఎక్కువ ఉత్పత్తి సాధనాల మీద (ఎక్కువ C మీద) పని చెయ్యగలుగుతుంది. పెట్టుబడి పెరిగినా, కార్మికుల సంఖ్య గతం కన్నా పెరగక పోవడం గానీ, ఇంకా తగ్గడం గానీ, జరుగుతుంది. లేదా, పెరిగిన పెట్టుబడి కోసం కార్మికుల సంఖ్య కూడా కొంత పెరిగితే, ఆ పెరుగుదల రేటు, గత ఉత్పత్తి శక్తిలో కన్నా తక్కువ స్థాయిలో వుంటుంది. అంటే, వెనకటి ఉత్పత్తి శక్తిలోనే పెట్టుబడి రెట్టింపుగా పెరిగితే, కార్మికుల సంఖ్య కూడా రెట్టింపు అవుతుంది. కానీ, రెండో ఉత్పత్తి శక్తి దశలో, పెట్టుబడి గతం కన్నా రెట్టింపుగా పెరిగినా, కార్మికుల సంఖ్య రెట్టింపు అవదు. పెరిగిన పెట్టుబడికి, రెట్టింపు L తో అవసరం వుండదు. కానీ, ఇప్పుడు పెట్టుబడి పెరిగింది కాబట్టి, దానికి గతం కన్నా ఎక్కువ S రావాలి. అంటే, పనిలో వున్న తక్కువ కార్మికుల నించే ఎక్కువ S రావాలి. అది ఎలా జరగాలి? ప్రతీ కార్మికుడి L లో నించీ, V - గతం కన్నా తగ్గి, S - గతం కన్నా పెరగాలి. అంటే అదనపు విలువ రేటు పెరగాలి. అలా పెరుగుతుంది కూడా. అది గతం కన్నా ఎక్కువ S రాసిని ఇస్తుంది. కానీ ఆ రాసి కూడా, వెనకటి లాభం రేటుని ఇచ్చే టంతగా వుండదు.

ఉత్పత్తి శక్తి పెరుగుదల అక్కడే ఆగదు. తర్వాత ఇంకా పై స్థాయికి చేరుతుంది. శ్రమ పరికరాలుగా వుండే యంత్రాలు మరింత మెరుగవుతాయి. దీన్ని మూడో వుదాహరణగా అనుకుంటే, ఈ దశలో, పని స్తలంలో వుండే కనీస పెట్టుబడి, గతంలో కన్నా (రెండో వుదాహరణలో కన్నా) పెరుగుతుంది. దాని కాంపోజిషన్ మళ్ళీ మారుతుంది. గతంలో కన్నా C పెరిగి, V తగ్గుతుంది. V తగ్గడం అంటే, సజీవ శ్రమ తగ్గడమే. C పెరిగి, V తగ్గడం జరిగినప్పుడల్లా, C లో పెరుగుదల కన్నా V లో తగ్గుదల ఎక్కువగా వుంటుంది. గతంలో, C, V ల పాళ్ళు, 1 : 1 అయితే, తర్వాత C, V ల పాళ్ళు 2 : 1 అనుకుందాం. C, రెట్టింపుగా 100% పెరిగింది. V పెరగ లేదు. V గతంలో లాగే వుండి, C పెరిగితే, అది C పెరిగి V తగ్గడమే.

C - 400% పెరిగి, V - 300% పెరిగితే, అది, C పెరిగి V తగ్గడమే. ఆ V లో, కార్మికుల సంఖ్యా, శ్రమ శక్తి విలువలూ పెరిగినా, V తగ్గిందనే అర్థం.

ఈ రకంగా ఒక శాఖలో, ఉత్పత్తి శక్తి పెరుగుదలలో 10 దశల వరకూ చూస్తే, C కి, సజీవ శ్రమతో అవసరం తగ్గిపోతూ వుండడం కనపడుతుంది. ఒక యూనిట్ సరుకు కోసం పట్టే మొత్తం శ్రమ, తగ్గిపోతూ వుండడం కూడా కనపడుతుంది. అన్ని శాఖల్నీ కలిపి చూస్తే, ఆ శాఖల్లో వుండే సజీవ శ్రమల మొత్తమే, సమాజపు L. సమాజానికి S రావాలంటే, ఆ L లో నించే రావాలి. కానీ, ఆ L తగ్గిపోతూ వుంటుంది. కానీ ఆ L లో నించి వచ్చే S భాగం, గతం కన్నా కూడా ఎక్కువ రేటుతో వుండాలి. అంటే, తమాషా ఏమిటంటే - తగ్గిపోతూ వుండే L లో నించి, పెరిగిపోతూ వుండే S రావాలన్న మాట! ఇది కొన్ని దశల వరకూ ఎంతో కొంత జరుగుతూనే వుంటుంది. ఇక జరగడం సాధ్యం కాని దశ కూడా ఏర్పడుతుంది.

ఉత్పత్తి శక్తి మొదటి వుదాహరణలో వున్నప్పుడు, ఒక పని స్థలంలో, 10 మంది కార్మికులు, రోజుకి 12 గంటల చొప్పున పని చేస్తూ ప్రతీ ఒక్కరూ సగం కాలాన్ని (6 గంటల కాలాన్ని) అదనపు శ్రమగా ఇస్తారనుకుందాం. అదనపు విలువ రేటు 100%. ఈ లెక్కన, ఈ 10 మంది కార్మికుల ద్వారా వచ్చే అదనపు శ్రమ 60 గంటలు అవుతుంది.

అదే శ్రమలో, కొంత కాలం తర్వాత, ఉత్పత్తి శక్తి అపారంగా పెరిగి వున్నప్పుడు, గతంలో 10 మంది చేసే పనిని ఇద్దరు కార్మికులే రోజుకి 12 గంటల చొప్పున చేస్తూ ప్రతీ కార్మికుడూ 10 గంటల అదనపు శ్రమని ఇస్తారనుకుందాం. అంటే అదనపు విలువ రేటు ఇప్పుడు 500%. పని దినంలో అవసర శ్రమ ఒక భాగమూ, అదనపు శ్రమ 5 భాగాలూ అవుతాయి. దోపిడీ స్థాయి అంత ఎక్కువగా పెరిగినా, ఇద్దరు కార్మికుల నించి వచ్చే S, 20 గంటలు మాత్రమే అవుతుంది. గతంలో 10 మంది ద్వారా వచ్చిన 60 గంటల అదనపు శ్రమ, ఇప్పుడు ఇద్దరి ద్వారా రావాలంటే, అది అసాధ్యం. ఇప్పుడు ఒక్కొక్కరూ రోజుకి 30 గంటలు పని చేస్తూ, తమ కోసం ఏమీ తీసుకోకుండా గాలి మీదే బతుకుతూ, ఆ శ్రమ కాలాన్నంతా S గా వది లేస్తేనే అది సాధ్యం. అలా జరగదు కాబట్టే ఇక్కడ సమస్యంతా.

ఉత్పత్తి శక్తి ఇంకా పెరిగితే, ఇద్దరు కార్మికులు కూడా అక్కర లేదు. ఒక్క కార్మికుడే సరిపోతాడు. అతని నించి వచ్చే S, 10 గంటలు కాదు, 2 గంటల స్థాయికి దిగిపోవచ్చు.

ఆ ఒక్క కార్మికుణ్ణి కూడా తీసి వేసే పరిస్థితి రావచ్చు. అంటే, ఒక్క కార్మికుడు, మొత్తం పని దినం అంతా పని చెయ్యక్కర లేకుండా 2 గంటలే పని చేసి, దానికే జీతం తీసుకోవాలి. ఆ 2 గంటల్లో నించే గతం కన్నా ఎక్కువ S రావాలి! అదన్న మాట పెట్టుబడిదారీ విధానం చివరికి సాధించేది.

ఇంత వరకూ చూసిన విషయాలనే, మార్పుల్ని చూపించే గీతల ద్వారా, 3 వుదాహర ణలు చూద్దాం. ఏదో ఒక శ్రమలో, ఉత్పత్తి శక్తి 3 దశల్లో వున్న ఉదాహరణలు ఇవి.

ఇక్కడ పెట్టుబడీ, దానికి కావలసిన L (సజీవ శ్రమ) కనపడతాయి.

1) 100 C = L 8 గం. లు

V 4 గం. | S 4 గం.

ఈ L గీత, పని దినం పొడవు కాదు. ఇది, ఒక యూనిట్ సరుకు కోసం అవసరమయ్యే మొత్తం సజీవ శ్రమ. ఇక్కడ, 100 విలువ గల C మీద, 8 గంటల సజీవ శ్రమ పని చేస్తుంది. ఆ శ్రమని ఇచ్చిన కార్మికుల సంఖ్యా, వారి జీతాలూ, ఇక్కడ అనవసరం. ఆ వివరాలు తీసుకోవడం లేదు. ఈ వుదాహరణల్లో, ప్రధానంగా C పెరగడమూ, L తగ్గడమూ; ఆ L లో, V తగ్గి S పెరగడమూ; చూడాలి. ఈ మొదటి వుదా హరణలో, V - 4 గంటలూ, S - 4 గంటలూ కాబట్టి, అదనపు విలువ రేటు (దోపిడీ స్థాయి) 100%.

2) 200 C = L 6 గం. లు

V 2 గం. | S 4 గం.

ఈ గీతని, 1 కన్నా ఎక్కువ యూనిట్లని, కనీసం 3 యూనిట్లని చూపించే ఉదాహరణగా అనుకోవాలి.

ఇక్కడ 200 విలువ గల C మీద, 6 గంటల L పని చేస్తుంది. అంటే, C పెరిగి, సజీవ శ్రమ తగ్గింది. L లో, అదనపు విలువ రేటు పెరిగింది. 2 V కి, 4 S అంటే, S రేటు 200%.

మొదటి వుదాహరణలో ఉత్పత్తి అయిన సరుకు పరిమాణం కన్నా, ఈ రెండో వుదాహరణలో సరుకుల

సంఖ్య పెరుగుతుంది. ఒక యూనిట్ విలువ తగ్గుతుంది. ఆ తగ్గిన విలువ లోనే C పెరిగి, L తగ్గుతుంది. ఆ L లో, V కన్నా S పెరుగుతుంది.

3) 400 C = L 4 గం. లు
V 1 గం. | S 3 గం.

ఇక్కడ 400 C మీద, గతం కన్నా తక్కువ L పని చేస్తుంది. ఆ తగ్గిన L లోనే, V - గతం కన్నా తగ్గి, S - గతం కన్నా పెరుగుతుంది. ఇక్కడ అదనపు విలువ రేటు 300%. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సరుకుల సంఖ్య రెండో వుదాహరణలో కన్నా పెరుగుతుంది. విడి సరుకు విలువ గతం కన్నా తగ్గుతుంది.

ఈ రకంగా, ఈ గీతల ద్వారా Lలో, V తగ్గి, S పెరగడం కనపడుతుంది.

ప్రధాన శాఖలన్నిటి లోనూ లాభం రేట్లు తగ్గుతూ పోతే, దాని ఫలితం, జనరల్ లాభం రేటు తగ్గడంగానే వుంటుంది.

లాభం దృష్టితోనే సాగే ఈ వుత్పత్తి విధానంలో, ప్రతీ దశ లోనూ నిరుద్యోగ జనాభా పెరిగిపోతూ వుంటుంది. పెట్టుబడులు కూడా తగినంత లాభాన్ని సంపాదించలేక, కొంత పెట్టుబడి, ఉత్పాదక రంగాల్లో పని చెయ్యడం మానుకుని, వడ్డీ పెట్టుబడిగా మారి, వడ్డీలు సంపాదించడంతో సరిపెట్టుకునే స్థితిలో పడుతుంది. సమాజంలో ఉత్పత్తి సాధనాలు కుప్పతెప్పలుగా వున్నా, దాని పక్కన నిరుద్యోగ అదనపు జనాభా పెరిగిపోతూ వుంటుంది.

(ఇదంతా ఈ సంపుటం లోనే '**సంక్షోభాలు**' చాప్టరులో చూస్తాం.)

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలకు, 'లాభం - అనేది శ్రామికుల అదనపు విలువే' అనే సంగతే తెలియదు. S గురించి తెలియక పోవడం వల్ల, S లో ఎక్కువ తక్కువలు ఎందుకు జరుగుతాయో, లాభం రేటుకీ S కీ సంబంధం ఏమిటో తెలీదు. సరుకు కోసం అవసరమయ్యే మొత్తం శ్రమలో, గత శ్రమా, సజీవ శ్రమా అనే తేడాలు వుంటాయనీ, లాభం అనేది సజీవ శ్రమలో నించే వస్తుందనీ - ఈ విషయాలేవీ తెలియక పోవడం వల్ల, లాభం రేటులో తగ్గుదల గురించి ఆ ఆర్థిక వేత్తలు రక రకాల ఇతర కారణాలు ఊహిస్తారు. జీతాలు పెరిగి పోతే లాభాలు తగ్గుతాయి - అనే రకం కారణాలు. అలాంటి వాదనలన్నిటికీ జవాబులు చెపుతూ మార్క్సు - పెట్టుబడిదారీ విధానానికి వుండే లాభ దృష్టి వల్ల, ఉత్పత్తి శక్తులు పెరుగుతోన్న కొద్దీ, పెరిగే C కి Vతో అవసరం తగ్గిపోతూ వుంటుందనీ, లాభం రేటు తగ్గడానికి అదే అసలు కారణమనీ, చాలా ఉదాహరణలతో రుజువు చేస్తాడు.

**సోషలిస్టు విధానంలో అయితే?**

ఉత్పత్తి శక్తులు పెరిగే ఈ సమస్య, నూతన సమాజంలో అయితే, (సోషలిస్టు ఉత్పత్తి విధానంలో అయితే), ఎలా పరిష్కారమవుతుంది? - ఈ ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది. దీనికి వెంటనే జవాబు చెప్పకోలేకపోతే, గతంలో చదివిన భాగాల్ని సరిగా అర్థం చేసుకోలేదనే అర్థానికే రావాలి.

నూతన సమాజంలో కూడా ఉత్పత్తి శక్తుల పెరుగుదల వుంటుంది. అక్కడ కూడా గతం కన్నా తక్కువ L, గతం కన్నా ఎక్కువ C మీద పని చేసే మార్పులు జరుగుతాయి. అయితే అక్కడ, ఉత్పత్తి శక్తుల పెరుగుదల గురించి, లాభ దృష్టితో గాక, సమాజ అవసరాల దృష్టితో, హేతుబద్ధ క్రమాన్ని పాటించడం వుంటుంది.

ఉత్పత్తి శక్తులు పెరగడం మానవ జీవితానికి చాలా అవసరం. చాలా ఉపయోగం. ఒక వస్తువుని 10 గంటల శ్రమతో తయారు చెయ్యడం కన్నా వీలైనంత తక్కువ శ్రమతో తయారు చెయ్యడం సమాజానికి చాలా మంచిదే. అందరూ శ్రమ చేసే సమాజంలో, ఉత్పత్తి శక్తులు పెరగడం, అందరికీ మేలే గానీ, అందులో కొందరికి హాని అవదు.

ఆ మేలు, 'అందరికీ శ్రమ కాలం తగ్గి పోయే' రూపంలో వుంటుంది. ఉత్పత్తి శక్తులు పెరగడం వల్ల, చాలా జనాభాకి పనులు పోవడం కాదు, అందరూ పని లోనే వుంటారు. కానీ, అందరి శ్రమ కాలమూ తగ్గిపోతుంది. శ్రమ కాలం తగ్గిపోయే ఈ మార్పు నూతన సమాజపు ప్రారంభ దశ లోనే జరగదు. తగినంత కాలం అవసరమవుతుంది.

లాభ దృష్టి గల ఉత్పత్తి విధానంలో, 10 మంది చేసే పని ఇద్దరే చెయ్యగలిగే లాగ ఉత్పత్తి శక్తి పెరిగితే, 8 మందికి పని పోతుంది. పనిలో వున్న ఇద్దరికీ పని కాలం ఎప్పటి లాగే దీర్ఘం గానే వుంటుంది. పైగా, వారి శ్రమలో దోపిడీ స్థాయి పెరుగుతుంది.

పెట్టుబడిదారీ విధానానికి కావలసింది, శ్రామికుల శ్రమ కాలాన్ని తగ్గించడం కాదు. వస్తువుకి పట్టే శ్రమ కాలాన్ని తగ్గించాలని ప్రయత్నించినా, అది, ఆ వస్తువుని ఎప్పటి ధరకే అమ్మి ఎక్కువ లాభం సంపాదించాలనే లాభ దృష్టి తోనే గానీ, శ్రామికుల శ్రమ

కాలాన్ని తగ్గించాలనే దృష్టితో కాదు.

10 మంది చేసే పని ఇద్దరే చేసే విధంగా ఉత్పత్తి స్థాయి పెరిగినప్పుడు, పెట్టుబడిదారుడు, ఆ 10 మందినీ ఎప్పటి లాగే పనిలో వుంచి, అందరికీ శ్రమ కాలాన్ని తగ్గించడం చెయ్యడు. అలా చేస్తే వాడికి ఒక్క పైసా కూడా లాభం రాదు. వాడు బతికేదే లాభం మీద. లాభం రాని పని ఏదీ వాడు చెయ్యడు. అందుకే ఉత్పత్తి శక్తులు పెరగడం, పెట్టుబడిదారీ విధానంలో, అనేక గడ్డు సమస్యల్ని తెస్తుంది. నూతన సమాజం, దోపిడీ సమాజం కాదు కాబట్టి, అక్కడ ఉత్పత్తి శక్తుల వల్ల జనాలకు పనులు పోయే రకం సమస్యలు తలెత్తవు.

ఇప్పటి వరకూ, లాభం రేటు తగ్గే ధోరణి గురించి స్వచ్ఛ రూపంలో (ప్యూర్ ఫామ్ లో) చూశాం. అంటే, ఉత్పత్తి శక్తులు పెరిగినప్పుడు జరిగే మార్పుల్లో నించి, ‘C పెరిగి, V తగ్గడం’ అనే ప్రధానమైన మార్పుని మాత్రమే తీసుకుని, దానికి ఇతర మార్పుల్ని కలుపుకోకుండా చూశాం. ఆ ఇతర మార్పుల్ని కూడా కలుపుకుంటే, లాభం రేటు తగ్గుదలని ‘కొంత అరికట్టే ధోరణి కూడా ఒకటి వుండడం’ కనపడుతుంది. కానీ, చివరి ఫలితం అయితే, లాభం రేటు తగ్గడమే. అయినప్పటికీ, ఆ తగ్గుదలని తగ్గించే ధోరణి ఏమిటో ఇప్పుడు చూడాలి.

**లాభం రేటులో తగ్గుదలని తగ్గించే ధోరణి:** ఉత్పత్తి శక్తులు పెరగడం - అనేది, అన్ని శాఖలలోనూ ఒకే స్థాయిలో జరగదు. ప్రధాన శాఖల్లో కూడా ఆ పెరుగు దలలు అసమానం గానే వుంటాయి. కానీ, ఆ ఎక్కువ తక్కువలతో వుదాహరణలు చూడడం అసాధ్యం. కాబట్టి, మొత్తం సామాజిక పెట్టుబడి కంపొజిషన్‌నే తీసుకుంటాం.

సామాజిక పెట్టుబడి 100. ఒక దశలో, దాని కంపొజిషన్ $50_C + 50_V$. అదనపు విలువ రేటు 200%. అదనపు విలువ రాసి 100. 100 పెట్టుబడికి 100 లాభం కాబట్టి, లాభం రేటు 100%.

ఈ లాభం రేటు పెరగాలంటే, పెట్టుబడి కన్నా S పెరగడం గానీ, S కన్నా పెట్టుబడి తగ్గడం గానీ, ఏదో ఒకటి జరగాలి. అలాగే, లాభం రేటు తగ్గాలంటే, పెట్టుబడి కన్నా S తగ్గడం గానీ, S కన్నా పెట్టుబడి పెరగడం గానీ, జరగాలి. మొత్తం మీద పెట్టుబడి పరిమాణానికీ, అది ఉత్పత్తి చేసే S పరిమాణానికీ వుండే సంబంధమే లాభం రేటు.

ఉత్పత్తి శక్తుల పెరుగుదలలో, లాభం రేటు తగ్గుదలని తగ్గించే ధోరణి కూడా ఒకటి వుందంటే, ఆ ధోరణి పెట్టుబడి పెరుగుదలని తగ్గించేది గానీ; లేదా S పెరుగుదలని పెంచేది గానీ; ఈ రెంటినీ కొంత కొంత ఇచ్చేది గానీ, అయి వుండాలి. అలా జరిగితేనే, లాభం రేటు తగ్గుదల కొంత మందగించడం సాధ్యం. కాబట్టి, పెట్టుబడి వేపు నించి ఒక సారీ, S వేపు నించి ఒక సారీ చూడాలి.

**పెట్టుబడి పెరుగుదల తగ్గడం:** ఉత్పత్తి శక్తి పెరగడం అంటే, మెరుగైన శ్రమ పరికరాలు కావాలి కాబట్టి, దాని వల్ల C లో, శ్రమ పరికరాల నించి సరుకుకి చేరే అరుగుదల భాగం పెరుగుతుంది. అందుకే పెట్టుబడి పెరుగుతుంది.

$50_C + 50_V$ కాంపోజిషన్ గల పని స్థలం లోకి, 10 రెట్ల ఉత్పత్తి శక్తి గల నూతన శ్రమ పరికరాలు ప్రవేశించాయి - అనుకుందాం. అప్పుడు ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ 10 రెట్లు పెరుగుతాయి. ఆ రకంగా పెరిగిన కొత్త C ని, 500 అనుకుందాం. కానీ, ఆ $500_C$ మీద, గతంలో లాగ $50_V$యే గానీ, కొంత ఎక్కువ V గానీ పని చేస్తుంది - అనుకుందాం. ( గతం $50_V$ యే పని చెయ్యడం అంటే, అందులో మార్పులేమీ జరగవని అర్థం కాదు. కార్మికుల సంఖ్య తగ్గి, పనిలో వున్న తక్కువ కార్మికులకే శ్రమ శక్తి విలువ పెరిగి, ఆ రకంగా కొత్త V, గత $50_V$ లాగ వుంది - అనుకోవాలి).

ఇప్పుడు మొత్తం పెట్టుబడి, $500_C+50_V= 550$. ఇప్పుడు అదనపు విలువ రేటుని 500% అనుకుందాం. అంటే, అదనపు విలువ రాసి 250. 550 పెట్టుబడికి, $250_S$ అయితే, లాభం రేటు =

___ × 100 = 45%.

ఉత్పత్తి శక్తి పెరగక ముందు వున్న ఉదాహరణలో, లాభం రేటు 100%. ఇప్పుడు 45%. ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల లాభం రేటు గతం కన్నా తగ్గడం కనపడింది.

అయితే, ఈ తగ్గుదల కొంత మందగించాలంటే, లాభం రేటు 45%గా గాక, కొంత ఎక్కువగా, 50% గానో, 60% గానో వుండాలి. అయినా అది కూడా గత లాభం రేటు కన్నా (100% కన్నా) తక్కువ రేటే అవుతుంది. కానీ అది 45% కాకుండా కొంత ఎక్కువగా వుంటుంది కాబట్టి, లాభం రేటులో తగ్గుదల కొంత మందగించినట్టే అవుతుంది.

లాభం రేటు, 45% కన్నా కొంత పెరగాలంటే,

పెట్టుబడి పరిమాణం 550 గా గాక, కొంత తగ్గాలి. పెట్టుబడి తగ్గాలంటే, C అంశాల్లో కొన్నిటి విలువలైనా తగ్గాలి. C లో, శ్రమ పరికరాలూ ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ వుంటాయి కదా? శ్రమ పరికరాలు ఫిక్సెడ్ పెట్టుబడి భాగం లోకీ, మిగిలినవి చలామణీ పెట్టుబడి భాగం లోకీ వస్తాయి.

ఇది ఉత్పత్తి శక్తి పెరిగిన వుదాహరణ కాబట్టి, శ్రమ పరికరాలన్నీ గతం కన్నా ఎక్కువ విలువలతో వుంటాయి. వాటి నించి సరుకుకి చేరే అరుగుదల భాగం, గతం కన్నా ఎక్కువగా వుంటుంది. (ఈ భాగం ఎక్కువగా వుంటుంది కాబట్టే పెట్టుబడి గతం కన్నా పెరుగుతుంది.) అయితే, ఉత్పత్తి శక్తి పదింతలు పెరిగినప్పుడు, శ్రమ పరికరాల అరుగుదల భాగం, చాలా పెరిగినా, పదింతలు పెరగదు. Cలో ఫిక్సెడ్ భాగం పదింతలు పెరగక పోవడం వల్ల, పెట్టుబడి పదింతలు పెరగదు.

తర్వాత, ముడి పదార్థాల్నీ, ఆగ్జిలరీ పదార్థాల్నీ చూస్తే, ఉత్పత్తి శక్తి పదింతలు పెరగడం అంటే, పదింతల ముడి పదార్థాలూ, పదింతల ఆగ్జిలరీ పదార్థాలూ ఖర్చవ వలసిందే. అయితే వాటి విలువల్ని బట్టే, వాటి కోసం అవసరమయ్యే పెట్టుబడి వుంటుంది. అవి తయారయ్యే చోట్ల (అవి ఉత్పత్తి అయ్యే శాఖల్లో) ఉత్పత్తి శక్తులు ఏమీ పెరగకపోతే, ఆ ఉత్పత్తులన్నీ గత విలువల తోటే వుంటాయి. లేదా, వాటి తయారీ చోట్ల ఉత్పత్తి శక్తులు పెరిగితే, వాటి విలువలు గతం కన్నా కొంత తగ్గుతాయి.

ముడి పదార్థాల శాఖల్లోనూ, ఆగ్జిలరీ పదార్థాల శాఖల్లోనూ కూడా ఉత్పత్తి శక్తులు ఎగుడు దిగుళ్ళుగా అయినా పెరుగుతూనే వుంటాయి. కాబట్టి, ఆ శాఖల్లో యూనిట్ల విలువలు గతం కన్నా ఎంతో కొంత స్థాయిల్లో తగ్గుతూ వుంటాయి.

కార్మికుల పని జరిగేది, ముడి పదార్థాల పరిమాణాన్ని బట్టే గానీ, వాటి విలువల్ని బట్టి కాదు. వాటి విలువలు తగ్గాయో పెరిగాయో, V కి అనవసరం. వాటి పరిమాణాల తోటే V కి సంబంధం. ఆ యూనిట్ల విలువలు ఎక్కువగా వుంటే, చలామణీ పెట్టుబడి పెరుగుతుంది. లేదా, తగ్గుతుంది.

ముడి పదార్థాల విలువలూ ఆగ్జిలరీ పదార్థాల విలువలూ కూడా కొంత కొంత తగ్గే దశల్లో, పదింతల పదార్థాల కోసం అవసరమయ్యే పెట్టుబడి, గతంలో కన్నా కొంత తగ్గుతుంది. ఆ రకంగా పెట్టుబడి పెరుగుదల తగ్గుతుంది.

**పెట్టుబడి ఉత్పత్తి చేసే S సంగతి:** S రాసి, V లో మార్పుల్ని బట్టి వుంటుంది గానీ, C లో మార్పుల్ని బట్టి కాదు. C అంశాల్లో దేని విలువ పెరిగిందో, దేని విలువ తగ్గిందో, ఆ అంశాల్ని బట్టి కాదు.

ఉత్పత్తి శక్తి పదింతలు పెరిగినట్టుగా చూసిన వుదాహరణలో పెట్టుబడి 550. అది ఉత్పత్తి చేసిన S, 250. కానీ ముడి పదార్థాల వంటి వాటి విలువలు తగ్గడం వల్ల, పెట్టుబడి పెరుగుదల కూడా కొంత తగ్గి, అది 450 గా అయిందనుకుందాం. ఈ వుదాహరణలో, పెట్టుబడి తగ్గినా, అది ఉత్పత్తి చేసే S రాసిలో మార్పు వుండదు. ఆ 250 S ని, 450 పెట్టు బడికి పంచితే, లాభం రేటు = —— × 100 = 56%.

ఈ 56% లాభం రేటు కూడా గతంలో వచ్చిన 100% రేటు కన్నా తక్కువే. కానీ, ఇది 45% కన్నా ఎక్కువ. అంటే, లాభం రేటులో తగ్గుదల తగ్గింది. ఇది ఎందుకు జరిగిందంటే, ఉత్పత్తి శక్తులు, ముడి పదార్థాల శాఖల్లో కూడా పెరిగి, వాటి విలువలు తగ్గడం వల్ల.

ఒక పని స్థలంలోకి, మెరుగైన శ్రమ పరికరాలు వచ్చినప్పుడు, ఆ శ్రమ పరికరాల కోసం అక్కడ పెట్టుబడి పెరగడం మొదటి మార్పు. కానీ అదే సమయంలో, అక్కడ ముడి పదార్థాల విలువలు తగ్గడం జరగదు. అవి గతంలో లాగే వుంటాయి. క్రమ క్రమంగా ముడి పదార్థాల విలువలు కూడా కొంత కొంత తగ్గుతాయి. అప్పుడు, వాటి కోసం ఖర్చు తగ్గుతుంది కాబట్టి, పెట్టుబడి పెరుగుదల కొంత తగ్గుతుంది. అందుకే లాభం రేటు తగ్గడం, కొంత ఆగుతుంది. ఉత్పత్తి శక్తులు అనేక శాఖల్లో పెరగడం అనేది, పెట్టుబడి పెరుగుదలని తగ్గించి, లాభం రేటు తగ్గడాన్ని అడ్డుకుంటుంది.

జీతాల పెరుగుదల సవ్యంగా లేకపోవడమూ, విదేశీ వర్తకాల్లో అసమాన మారకాల ద్వారా ఎక్కువ S ని లాగడమూ - ఇటువంటి పద్ధతుల ద్వారా కూడా ప్రధాన శాఖలన్నీ S రాసి ని పెంచుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాయి. ఇలాంటి ప్రయత్నాలన్నీ S రాసిని పెంచడానికే ఉపయోగపడతాయి. ఈ ప్రయత్నాలే లేకపోతే, ఉత్పత్తి శక్తులు పెరుగుతోన్న కొద్దీ శాఖల్లో S రాసులు తగ్గిపోతూ, జనరల్ లాభం రేటు మరింత తగ్గిపోతూ వుండేదే.

లాభం రేటులో తగ్గుదలని అరికట్టే మెకానిజం ఏదో వుండి వుండకపోతే, క్రమ క్రమంగా పెరుగుతూ పోయే ఉత్పత్తి శక్తుల వల్ల, పెట్టుబడులకు లాభాలే రాని పరిస్తితులు ఏర్పడి వుండేవి.

మార్క్సు ఏమంటాడంటే, 'లాభం రేటులో తగ్గుదల గురించి ఆశ్చర్యపోవడం కాదు, ఆ రేటు ఇంకా తొందరగా తగ్గనందుకు ఆశ్చర్య పోవాలి' అంటాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, S ని ఉత్పత్తి చెయ్యడం మొదటి చర్య అయితే, తర్వాత ఇంకా బోలెడు చర్యలు వున్నాయి. సరుకు అమ్మకాల ద్వారా S రాసిని డబ్బుగా స్వాధీన పర్చుకోవడం, పెట్టుబడి పెరగడం, ఉత్పత్తి శక్తులు అర్ధ రహితంగా పెరగడం, అమ్మలేనంత సరుకు రాసుల ఉత్పత్తీ, నిరుద్యోగ జనాభా పెరగడం, సంక్షోభాలూ, యుద్ధాలూ - ఇవి అన్నీ కూడా క్రమ క్రమంగా సంభ విస్తాయి.

కానీ ఎన్ని జరుగుతోన్నా, పెట్టుబడిదారీ విధానానికి లాభం రాకుండా ఆగి పోయే పరిస్తితి ఎప్పటికీ వుండదు. కాబట్టి ఇది పెట్టుబడిదారుల సమస్య కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తుల పెరుగుదల వల్ల, నిరుద్యోగ సమస్య పెరిగిపోతూ వుంటుంది కాబట్టి, ఇది కార్మికుల సమస్యే. లాభం రేటులో తగ్గుదల ఎంత వున్నా, లాభం అనేది అందుతూ వున్నంత కాలమూ, అది పెట్టుబడిదారీ వర్గానికి సమస్యే కాదు.

**'లాభం రేటు' సమస్య గురించి మార్క్సు నించి కొన్ని కొటేషన్లు** [కాపిటల్-3, 'లాభం రేటు పడిపోయే ధోరణి నియమం' అనే భాగం నించి. పేజీ నంబర్లు కొటేషన్ల దగ్గిర.]

1. " రోజుకి 12 గంటల చొప్పున పని చేసే ఇద్దరు కార్మికులు, కేవలం గాలి మీదే బతికినా, రోజుకి 2 గంటల చొప్పునే పని చేసే 24 మంది కార్మికులు ఇచ్చే అదనపు విలువని ఇవ్వలేరు." [ పేజీ. 247]

2. "సామాజిక పెట్టుబడిలో ఒక భాగం, ఉదాహరణకి ఒక 100 పెట్టుబడి, రాను రానూ మరింత ఎక్కువ ఉత్పత్తి సాధనాలనూ, మరింత తక్కువ సజీవ శ్రమనూ కలిగి వుంటుంది. ... క్రమ క్రమంగా మొత్తం పెట్టుబడి, తగ్గుతూ పోయే సజీవ శ్రమ పరిమాణానికి అనుగుణంగా మరింత తక్కువ అదనపు శ్రమను ఇముడ్చుకొంటుంది" [ పేజీ. 216]

3. " పెట్టిన పెట్టుబడి పెరిగే కొద్దీ లాభం రాసి పెరుగుతుంది, లాభం రేటు తగ్గినా." [ పేజీ. 246]

4. " పెట్టుబడిదారీ విధానానికి నిజమైన అడ్డంకి పెట్టుబడే. పెట్టుబడీ, దాని విస్తరణా, ఉత్పత్తి విధానానికి ప్రారంభం గానూ, ముగింపు గానూ, ఉద్దేశ్యం గానూ, లక్ష్యం గానూ వుండడమే ఆ అడ్డంకి. ఉత్పత్తి అనేది, పెట్టుబడి కోసమే ఉత్పత్తిగా వుండడమే తప్ప, ఉత్పత్తి కోసం పెట్టుబడి కాదు. అదే దాని అడ్డంకి. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తిదారుల సమాజపు సజీవ క్రమం నిరంతరం విస్తరించడానికి సాధనాలు కాదు." [ పేజీ. 250]

(నూతన సమాజంలో ఉత్పత్తి సాధనాల్ని, పెట్టుబడిదారీ దృష్టితో ఉపయోగించకూడదు - అని చెపుతున్నాడు.)

5. "పెట్టుబడి - ఉత్పత్తిని అపరిమితంగా విస్తరించేందుకై, ఉత్పత్తి లక్ష్యం ఉత్పత్తి గానే వుండే వేపు ఉత్పత్తి శక్తులు ఆంక్షలు లేని అభివృద్ధి చెందే లాగ, తన నడకను ఉంచుకొంటుంది." [ పేజీ. 250]

(ఉత్పత్తి శక్తుల్ని పెంచడంలో ఆంక్షలు లేని అభివృద్ధి వుండకూడదనీ 'ఆంక్షలు' వుండాలని చెపుతున్నాడు. పెట్టుబడిదారీ విధానానికి అటువంటి లక్షణం వుండదని చెపుతున్నాడు.)

6. " పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఉత్తేజాన్నిచ్చేటటు వంటిదీ, పెట్టుబడి కూడికకు షరతు గానూ, చోదక శక్తి గానూ ఉండేటటు వంటిదీ అయిన లాభం రేటు, ఉత్పత్తి అభివృద్ధి వల్లనే ప్రమాదానికి లోనవ్వడం రికార్డోని కలచి వేసింది." [ పేజీ. 259]

7. "ఈ ధోరణిని అర్థిక వేత్తలు గమనించారు. దాన్ని వివరించడానికి నానా యాతనలు పడ్డారు. బుర్రలు పగలగొట్టుకున్నారు. (కడ్‌జెల్డ్ దెయిర్ బ్రెయిన్) పెట్టుబడిదారీ విధానం దృష్ట్యా, ఈ నియమానికి ప్రాధాన్యత వుంది. ఆడం స్మిత్ మొదలుకొని, ఈ కారణం కనిపెట్టడమే రాజకీయ అర్థశాస్త్రం లక్ష్యం అయింది." [ పేజీ. 213]

8. " మొదటి విషయం: జనాభాలో ఒక పెద్ద భాగం శ్రమ చెయ్యడం లేదు. ఇతరుల శ్రమను దోచుకోవడం పైన ఆధారపడి జీవిస్తోంది. లేదా, ఒక కుత్రిమ ఉత్పత్తి విధానంలో మాత్రమే శ్రమగా లెక్కకు వచ్చే దానిపైన ఆధారపడి వుంది. రెండవ విషయం: మొత్తం పని చెయ్యగల్గిన జనాభా పని చెయ్యడానికి చాలినన్ని ఉత్పత్తి సాధనాలు తయారు కావడం లేదు. ఆ విధంగా జరిగినప్పుడు, (జనాభా అంతా శ్రమ

చెయ్యడమూ, తగినన్ని ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి అవడమూ జరిగినప్పుడు), అందరికీ శ్రమ కాలం తగ్గుతుంది." [ పేజీ. 258]

9. " పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధిని బట్టి, శ్రామిక జనాభాని గతంతో పోలిస్తే ఎక్కువ నిరుద్యోగు లవడం జరుగుతుంది. ఇది, సామాజిక ఉత్పాదకత తగ్గడం వల్ల కాదు, పెరగడం వల్ల!" [ పేజీ. 222]

10. "శ్రమ ఉత్పాదకత పెరిగే కొద్దీ అదనపు విలువ రేటు ఎంత పెరిగినప్పటికీ, విడి సరుకు మీద వచ్చే లాభం తగ్గుతుంది. కానీ ఈ తగ్గుదల, లాభం రేటులో తగ్గుదల లాగే, స్థిర పెట్టుబడి అంశాలకు విలువ తగ్గడం చేత మందగిస్తుంది. (స్లో డౌన్ అవుతుంది)." [ పేజీ. 226]

11. " వెనకటి కాలంతో పోల్చుకుంటే గత 30 సంవత్సరాలలో సామాజిక ఉత్పత్తి శక్తులు అపారంగా అభివృద్ధి చెందాయి. సామాజిక ఉత్పత్తి క్రియలో, యంత్రాల ద్వారా ఫిక్సెడ్ కాపిటల్ అపారమైన స్థాయిలో ప్రవేసించింది. లాభం రేటు తగ్గడానికి కారణం ఏమిటని, ఇప్పటి వరకూ ఆర్థిక వేత్తల్ని ఇబ్బంది పెట్టిన సమస్యకు బదులు, ఇప్పుడు 'లాభం రేటు మరింత ఎక్కువ గానూ, మరింత త్వర గానూ ఎందుకు తగ్గడం లేదు' అన్న కొత్త సమస్య తలెత్తు తోంది. లాభం రేటు తగ్గుదలని అడ్డుకునే వ్యతిరేక అంశాలు కొన్ని వుండి వుండాలి. అవి, లాభం రేటు తగ్గుదల నియమాన్ని కేవలం ఒక ధోరణిగా చేస్తూ వుండి వుండాలి. అందుకే జనరల్ లాభం రేటు తగ్గుదలని, ఒక ధోరణిగా పేర్కొన్నాము."

[ పేజీ. 232]

# మార్క్సుని విమర్శించిన లోరియాకి ఏంగెల్స్ జవాబు

'కాపిటల్ - 1' లో, 'విలువలే ధరలు గా వుంటాయి' - అని చర్చించిన మార్క్సు, 'కాపిటల్ - 3' కి వచ్చే సరికి 'పెట్టుబడిదారీ విధానంలో విలువల నించి ధరలు పైకో కిందకో తప్పుకుంటాయి' అని తేల్చడం చూసి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, మార్క్సు సిద్ధాంతం అంతా 'వైరుధ్యాల పుట్ట' అయి పోయిందని చాలా సంబరపడ్డారు. మార్క్సులో ఏదో ఒక తప్పు కోసం ఆశతో ఎదురు చూస్తోన్న మేధావు లందరికీ చివరికి ఈ 'బ్రహ్మాండమైన తప్పు' కన పడింది. విలువల నించి ధరలు ఏ కారణం వల్ల తప్పు కుంటాయని మార్క్సు విచారించాడో ఆ కారణాన్నీ, ఆ వివరాల్నీ వదిలేసి, 'విలువల నించి ధరలు తప్పు కుంటాయి' అనే సూత్రీకరణని పరమ అస్తవ్యస్తమైన సూత్రీకరణగా తేల్చేశారు. అది అస్తవ్యస్తతే అయితే, ఆ అస్తవ్యస్తత అంతా పెట్టుబడిదారీ విధానం నించే పుడుతుందనే వాదానికి పెడ చెవి పెట్టారు. విలువల నించి ధరలు తప్పుకోకపోతే సమాన పెట్టుబడులకు సమాన లాభాలు ఎలా వస్తాయో మాత్రం వాళ్ళు చెప్ప లేదు. మార్క్సు సూత్రీకరణలన్నీ పిచ్చి పిచ్చి రాత లైనట్టు, మార్క్సు వాదనలన్నిటినీ వెక్కిరింతల తోటీ, వెటకారాల తోటీ తీసివెయ్యడానికి చూశారు.

లోరియా అనే ఇటలీ ఆర్థిక వేత్త, మార్క్సుని వెటకారాలతో ఇలా విమర్శిస్తాడు - "... విడి విడి సరుకుల ధరలు విలువల నించి వేరుపడినప్పటికీ అన్ని సరుకుల ధరల మొత్తమూ ఎల్లప్పుడూ వాటి విలువల మొత్తంతో గానీ, సరుకుల మొత్తంలో ఇమిడి వున్న శ్రమ మొత్తంతో గానీ సమానమే అవుతుందని చెప్పే మార్క్సు మాటల వల్ల, వ్యవహారా లేమీ చక్కబడవు. ఎందుకంటే, 'విలువ' అనేది ఒక సరుకుకూ మరో సరుకుకూ మధ్య మారకపు నిష్పత్తి తప్ప మరేమీ కాదు. కాబట్టి, 'సరుకుల మొత్తం విలువ' అనే భావమే అసంగతమూ, అర్థ రహితమూ అవుతుంది. ఇలాంటి పూర్తి అసంబద్ధ సూత్రీకరణా, ఇలాంటి పూర్తి సైద్ధాంతిక దివాళాకోరుతనమూ, ఎక్కడైనా వుంటాయా? పరమ ఆడంబరం గానూ, గాంభీర్యం గానూ జరిగిన ఇలాంటి శాస్త్ర విషయకమైన ఆత్మహత్య ఎక్కడైనా వుంటుందా?"

ఆ రకంగా, మార్క్సుని విమర్శించిన ఈ లోరియా, మార్క్సు తదనంతరం 'కాపిటల్' 2 వ, 3 వ భాగాల్ని అచ్చుకి సిద్ధం చేసి ప్రచురించిన ఏంగెల్స్‌ని మాత్రం చాలా విస్తుపోతూ మెచ్చుకున్నాడు. మార్క్సు పట్ల 'పవిత్రమైన స్నేహ భావం తోనే' ఏంగెల్స్ ఇదంతా చేశాడు గానీ, లేకపోతే మార్క్సు రాసిన పిచ్చి పిచ్చి

అస్తవ్యస్తపు రాతల్ని అసలు అచ్చులోకి తేవడం ఏమిటీ, మార్క్సు నిజంగా ఇదంతా మతి వుండే రాశాడా - అనే పద్ధతిలో, అతగాడు, మాట మాటకీ నిర్ఘాంతాలు పోతూ తన 'మతి పోయిన తనాన్ని' ఇలా ప్రదర్శించాడు - "ఏంగెల్స్, పవిత్రమైన స్నేహభావంతో ఏర్చికూర్చిన, ఈ పరస్పర పొంతన లేని కలగా పుల గపు సమాచారాన్ని, మార్క్సు నిజంగా ప్రచురించాలనే ఉద్దేశం తోనే రాశాడా? తన గ్రంధానికీ, తన సిద్ధాం తానికీ, ఈ పుటలచే పట్టాభిషేకం జరుగుతుందని మార్క్సు నిజంగా భావించాడని నమ్మగలమా? ఎన్నో సంవత్సరాల నించీ ఎదురు చూసిన పరిష్కారం, 'సగటు లాభం రేటు' అనే ఏ అంశంలో అయితే పరమ ఘోరమైన గారడీగా, పద జాలంతో అసభ్యంగా ఆటలాడడంగా తయారయిందో ఆ 'సగటు లాభం రేటు' గురించిన అధ్యాయాన్ని, మార్క్సు అయితే నిజంగా ప్రచురించి వుండే వాడేనా?" - ఇలా ఈ ధోరణిలో, లోరియా చాలా ప్రశ్నలు కురిపించాడు.

మార్క్సు సూత్రీకరణల మీద - ఈ రకమైన విమ ర్శలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఏంగెల్స్, (అప్పటికి మార్క్సు లేడు), ఒక వ్యాసంలో ఇలా రాశాడు: "విలువ నియమమూ, సగటు లాభం రేటూ - అనే రెండు అంశాల మధ్య కనపడుతోన్న వైరుధ్యాన్ని పరిష్కరించే విషయంలో, కొంత మంది, ఒక నిజమైన 'ఇంద్రజాలం' జరిగిపోతుందని అనుకున్నారు, కానీ, ఆశా భంగం చెందారు. ఎందుచేతనంటే, వారు ఆశిం చిన ఇంద్ర జాలానికి బదులు, ఈ వైరుధ్యానికి, సరళ మైన - హేతుబద్ధమైన - సాదా అయిన పరిష్కారం కనిపించింది. పరమ సంతోషంతో ఆశా భంగం చెందిన వాడు, సుప్రసిద్ధుడైన, ఘనత వహించిన లోరియా."

ఈ లోరియా లాంటి వ్యక్తి పొగడ్తలకు తను గురైనందుకు ఏంగెల్స్, "దురదృష్ట వంతుడినైన నా మీద ప్రశంసల వర్షం కురిసింది" అని చాలా చింతిస్తాడు.

ఏంగెల్స్, లోరియా 'బడాయితనం' గురించీ, 'బుద్ధి హీనత' గురించీ, 'గ్రంధ చౌర్యం' గురించీ, తన వ్యాసంలో ఘాటుగా విమర్శించాడు. "తన కీర్తి ప్రతిష్టల ద్వారా ప్రసిద్ధుడైన బాపతు" అయిన లోరియా గురించి, "... తను చేసినట్టే మార్క్సు కూడా అరువు తెచ్చుకున్న తురాయిలతో తన్ను తాను అలంకరించు కున్నాడని ధైర్యంగా వాదిస్తున్నాడు ఈ లోరియా" అంటూ లోరియా వాగుడు కంతటికీ తగిన జవాబులు చెప్పాడు ఏంగెల్స్. ["మార్క్సు పెట్టుబడి గురించి" పుస్తకంలో, పేజీ - 124,
మాస్కో ఎడిషన్, 1979.]

# ప్రశ్నలూ - జవాబులూ

1. **సమాజపు మొత్తం పెట్టుబడి 360. జనరల్ లాభం రేటు 40%. సామాజిక అదనపు విలువ రాసి ఎంత? ఉత్పాదక శక్తి పెరిగింది. పెట్టుబడి పెరిగింది. అప్పుడు, అదనపు విలువ పెరుగుతుందా? లాభం రేటు పెరుగుతుందా?**

**జ:** 100 పెట్టుబడికి 40 జనరల్ లాభం అయితే, 360 పెట్టుబడికి, — × 360 = 144 లాభం. ఉత్పాదక శక్తి పెరగకుండా, పెట్టుబడి పెరిగితే, ఎక్కువ పెట్టుబడికి ఎక్కువ అదనపు విలువే వస్తుంది. లాభం రేటు గతంలో లాగే వుంటుంది. కానీ, పెట్టుబడి పెరిగి, ఉత్పాదక శక్తి కూడా పెరిగితే, అదనపు విలువ రేటూ, అదనపు విలువ రాసీ, పెరుగుతాయి. కానీ, లాభం రేటులో పెరుగుదల ఎలా వుంటుందంటే, గతంలో జరిగిన పెరుగుదలతో పోలిస్తే తగ్గిపోతూ వుంటుంది.

2. **జనరల్ లాభం రేటు తగ్గడం అనేది ఒక 'ధోరణి'గా వుంటుంది. అంటే, అర్థం ఏమిటి?**

**జ:** వరసగా 2 సంవత్సరాల్లో వున్న లాభం రేట్లని తీసుకుంటే, మొదటి రేటు కన్నా రెండో రేటు తగ్గి వుండడం కనపడక పోవచ్చు. కానీ, కొన్ని సంవత్సరాల దీర్ఘకాలాన్ని తీసుకుంటే, లాభం రేటులో తగ్గుదల కనపడవచ్చు. ఈ లెక్కలు, అనేక పరిస్థితుల మీద ఆధారపడి వుంటాయి. ఒక యూనిట్ కోసం అవసరమయ్యే సజీవ శ్రమ కాలం తగ్గుతూ పోవడం, లాభం రేటు తగ్గడానికి దారి తీస్తుంది కాబట్టి, దాన్నే ఒక 'ధోరణి' గా అర్థం చేసుకోవలసి వుంటుంది. ★

# 2 వ భాగం
# పెట్టుబడిదారీ పంపిణీ సంబంధాలు
## [ఈ భాగంలో, 8 చాప్టర్లు ఉన్నాయి]
# 1. వర్తక పెట్టుబడి

ఒక 'సరుకు'ని అమ్మగా వచ్చే 'అదనపు విలువ' అంతా ఆ సరుకుని ఉత్పత్తి చేయించే ఉత్పాదక పెట్టుబడి దారుడికే రాదనీ, అది - వర్తక కమిషనూ, వడ్డీ, భూమి కౌలూ - వంటి ఇంకా కొన్ని భాగాలుగా పంపకం అవుతుందనీ, ఇంతకు ముందే క్లుప్తంగా చూశాం. (మొదటి సంపుటంలో, 'లాభం' చాప్టరులో.) ఇప్పుడు వాటిలో ఒక్కొక్క భాగం గురించీ కొంత వివ రంగా చూస్తాం.

ఏ శాఖ సరుకు విషయంలో అయినా, దాన్ని అమ్మగా వచ్చే అదనపు విలువ, ఆ సరుకులో నిజంగా వున్న అదనపు విలువతో సమానంగా వుండదు. అది 'అసలు అదనపు విలువ' కన్నా, కొంత తక్కువ గానో, ఎక్కువ గానో వుంటుంది. 'జనరల్ లాభం రేటు' సూత్రం వల్లనే అలా జరుగుతుంది. ఇది కూడా గతంలో చూశాం.

'అమ్మగా వచ్చే అదనపు విలువ' అంటే, ఆ సరు కుకి వచ్చే 'జనరల్ లాభం'. (లేదా, 'సామాజిక సగటు లాభం'.) - ఆ 'జనరల్ లాభమే', ఆ వేరు వేరు భాగా లుగా చీలుతుంది. ప్రతీ శాఖ లోనూ ఇలాగే జరుగు తుంది కాబట్టి, అన్ని శాఖల జనరల్ లాభాల మొత్తమే, సమాజంలో ఉత్పత్తి అయిన 'అదనపు విలువ మొత్తం.'

మొదట, ఈ చాప్టరులో, 'అదనపు విలువ'లో ఒక భాగంగా వుండే 'వర్తక కమిషన్' గురించి చూస్తాం. (దీనికి సంబంధించి మొదటి సంపుటంలో 'లాభం' చాప్టరు లోనూ, ఈ రెండో సంపుటం లోనే 'చలామణీ ఖర్చులు' చాప్టరు లోనూ కొన్ని వివరాలు చూశాం. ఇంకా మిగిలిన విషయాలు ఇక్కడ చూస్తాం.)

ఒక సరుకుని ఉత్పత్తి చెయ్యాలంటే, మొట్ట మొదట 'డబ్బు'తో 'ఉత్పత్తి సాధనాల్ని కొనడం' అనే పని చెయ్యాలి. (M ని, C గా మార్చే పని.) ఆ 'కొనే' పని జరగడానికి కూడా కొంత 'ఖర్చు' అవుతుంది. ('ఉత్పత్తి సాధనాల' ధరల సంగతి కాదు ఇది. వాటిని 'కొనే పని' కోసం అవసరమయ్యే ఖర్చు సంగతి ఇది.) ఉత్పత్తి సాధనాల్ని 'కొనే పని' చేసినట్టు గానే, తర్వాత ఆ ఉత్పత్తి సాధనాలతో తయారైన 'కొత్త సరుకు'ని 'అమ్మే పని' కూడా చెయ్యాలి. (C ని M గా మార్చే పని.) ఈ 'అమ్మే' పని కోసం కూడా కొంత ఖర్చు అవు తుంది. 100 మీటర్ల బట్ట - అనే ఒక సరుకుని తీసుకుందాం. మొదట, దాని ఉత్పత్తి సాధనాల్ని 'కొనే పని' కోసం అయ్యే ఖర్చూ, తర్వాత 100 మీటర్ల బట్టని 'అమ్మే పని' కోసం అయ్యే ఖర్చూ కలిసి, ఆ సరుకు తాలూకు 'వర్తక సంబంధమైన ఖర్చు' అవుతుంది. కేవలం 'కొనడం - అమ్మడం' అనే పనులు, వర్తక సంబంధమైన పనులు. ఈ పనుల కోసం అయ్యే ఖర్చుల్ని 'కేవల చలామణీ ఖర్చులు (ప్యూర్ చలామణీ ఖర్చులు)' అనీ, 'మారకం ఖర్చులు' అనీ కూడా అనవచ్చు.

# వర్తకం పనులు, 2 విధాలుగా జరగవచ్చు

1. సరుకుని ఉత్పత్తి చేయించే ఉత్పాదక పెట్టుబడి దారుడే 'వర్తకం పనులు' కూడా చేయించడం.
2. ఉత్పాదక పెట్టుబడి దారుడు, తన వర్తకం పనులన్నిటినీ ఒక 'వర్తకుడి'కి అప్పజెప్పడం.

ఇలా, ఈ పనులు ఏ రకంగా నైనా జరగవచ్చు. లేదా, 2 రకాలు గానూ జరగవచ్చు. ఎలా జరిగినా సారాంశం ఒకటే. దీన్ని కొంచెం వివరంగా చూడాలి.

1. సరుకుని ఉత్పత్తి చేయించే ఉత్పాదక పెట్ట బడిదారుడు, తన వర్తకం పనుల కోసం కూడా కొందరు ఉద్యోగుల్ని వేరుగా పెడతాడనుకుందాం. ఈ ఉద్యోగులకు, సరుకుని 'ఉత్పత్తి చేసే పని'తో సంబంధం వుండదు. వీరు, కేవలం ఉత్పత్తి సాధనాల్ని 'కొనే పనీ', తయారైన సరుకుని 'అమ్మే పనీ' మాత్రమే చేస్తారు. ఈ 'వర్తక శ్రమలు' చేసే ఉద్యోగులు - వర్తక కార్మికులు (కమర్షియల్ వర్కర్స్). షాపులో నిలబడి అమ్మకం పని చేసే ఉద్యోగులే గాక, ఆ షాపుని వూడ్చి శుభ్రం చేసే ఉద్యోగుల వరకూ, అందరూ వర్తక కార్మి కులే. వీరిని నియమించే ఉత్పాదక పెట్టుబడి దారుడు, వీరికి కూడా జీతాలు ఇవ్వాలి. వర్తక శ్రమలు జరగడానికి - ఒక ఆఫీసునీ, సరుకుని అమ్మే షాపుల్నీ, అందులో వుండవలసిన పరికరాల్నీ ఏర్పాటు చెయ్యాలి. ('వర్తక శ్రమలు' జరగడానికి కూడా కొన్ని ఉత్పత్తి సాధనాలూ, కార్మికులు చేసే కొంత శ్రమా, ఖర్చవుతాయి. ఆ ఉత్పత్తి సాధనాలన్నీ - నిర్జీవ శ్రమ. కార్మికులు ఇచ్చే శ్రమ - సజీవ శ్రమ. ఈ నిర్జీవ, సజీవ శ్రమలు కలిసి, 'కమర్షియల్ పనులు' జరగడానికి కావలసిన మొత్తం శ్రమ అవుతుంది.)

'విలువ'గా చూస్తే, వర్తక శ్రమలు జరగడానికి కూడా కొంత స్థిర - పెట్టుబడీ, కొంత అస్థిర - పెట్టు బడీ, అవసరమవుతాయి. (అంటే, C + V లు). ఈ రెండూ కలిసి, 'వర్తక పెట్టుబడి. ఈ పెట్టుబడి ఖర్చుతో 'వర్తక శ్రమలు' జరుగుతాయి.

ఉత్పాదక పెట్టుబడి దారుడికి, ఈ 'వర్తక పెట్టు బడి' కూడా పెట్టినందు వల్ల వచ్చే ఫలితం ఏమిటి? - వర్తక పెట్టుబడికి కూడా 'లాభం' వస్తుంది. ఏ పని కోసమైనా కొంత పెట్టుబడి పెడితే, దాని లాభం దానికి వేరుగా రావలసిందే. కాబట్టి, ఉత్పాదక పెట్టుబడి దారుడే 'వర్తక పెట్టుబడి' కూడా పెడితే, దాని ద్వారా వచ్చే 'వర్తక లాభం' ఎవరికీ పోకుండా, అది కూడా ఆ పెట్టుబడి దారుడికే అందుతుంది. (దీని వివరాలు తర్వాత చూస్తాం.)

2. ఉత్పాదక పెట్టుబడి దారుడు, తన వర్తకం పనులన్నీ ఒక 'వర్తకుడి'కి అప్పజెప్పేస్తాడనుకుందాం. అప్పుడేం జరుగుతుంది? - ఆ విషయాలన్నీ వర్తకుడికి 'బదిలీ' అయి, వర్తకుడి ద్వారా జరుగుతాయి. అంతే తేడా. అప్పుడు వర్తక శ్రామికులంతా, వర్తకుడి దగ్గిర వుంటారు. 'వర్తక పెట్టుబడి'ని వర్తకుడే పెట్టి, దాని లాభం వర్తకుడే తీసుకుంటాడు. ఈ రకంగా వర్తకం పనులు ఎవరి ద్వారా జరిగినా, సారాంశం ఒకటే. ఆ పెట్టుబడిని ఎవడు పెడితే వాడికే దాని లాభం అందు తుంది.

ఇప్పుడు మొదట 'వర్తకుణ్ణి' తీసుకోవద్దు. 'వర్తకం - పనులు' కూడా ఉత్పాదక పెట్టుబడిదారుడి ద్వారానే జరుగుతున్నట్టుగా చూద్దాం. మొదట ఈ పద్ధతిలో అర్థం చేసుకున్న తర్వాత అప్పుడు 'వర్తకుణ్ణి' తీసుకో వచ్చు.

ఇప్పటి వరకూ చూసిన వెనక భాగాల్లో, "ఒక సరుకు కోసం ఇంత పెట్టుబడి ఖర్చయింది" అన్నప్పు డల్లా, 'ఉత్పాదక పెట్టుబడి' గురించి మాత్రమే మాట్లా డామని అర్థం. 'వర్తక పెట్టుబడి' విషయం ఇంత వరకూ చూడలేదు. ఈ విషయం ఇప్పుడే ప్రారంభిస్తు న్నాము.

### 'ఉత్పాదక పెట్టుబడి' ద్వారా:

1. 'పెట్టుబడి విలువ' సరుకుకి చేరడమూ,
2. కొంత 'అదనపు విలువ' కూడా సరుకుకి చేరడమూ,

ఈ 2 విషయాలూ జరుగుతాయి.

### 'వర్తక పెట్టుబడి' ద్వారా:

ఆ రెంటిలో ఏదీ జరగదు. ఎందుకంటే, వర్తక పెట్టుబడి ద్వారా జరిగే పనులన్నీ 'మారకం పనులే.' (మారకం పనులు అన్నా, వర్తకం పనులు అన్నా ఒకటే.)

మారకం పనులు - 'వస్తువు'ని ఉత్పత్తి చెయ్యడానికి గానీ, దాన్ని వాడడానికి గానీ, సహజంగా అవసరమయ్యే పనులు కావు. ఈ సంగతి గతం లోనే చూశాం.

మారకం ఖర్చులన్నీ 'అనుత్పాదక' ఖర్చులు. వర్తక పెట్టుబడి, అనుత్పాదక పెట్టుబడి.

(ఉత్పాదక - అనుత్పాదక విషయాలకు వున్న తేడా యేమిటో, మొదటి సంపుటంలో, 'ఉత్పాదక - అనుత్పాదక శ్రమలు' చాప్టరులో చూశాం.)

ఉత్పాదక పెట్టుబడి, తను ఖర్చయి పోతూ ఆ విలువని తిరిగి ఇస్తుంది. కొంత అదనపు విలువని కూడా (అదనపు డబ్బుని) ఇస్తుంది. కానీ అనుత్పాదక పెట్టుబడి, తను ఖర్చయి పోతూ ఆ విలువని తిరిగి ఇవ్వదు. ఆ ఖర్చుతో ఏదో ఒక పని చేసి పెడుతుంది. దానితో పాటే 'అదనపు శ్రమ'ని ('అదనపు డబ్బు'ని కాదు) ఇస్తుంది.

'విలువ'ని ఇవ్వని ఏ సందర్భంలో అయినా, ఆ ఖర్చు, ఏదో ఒక ఉపయోగపు విలువని ఇస్తుంది. విలువని ఇవ్వని వర్తక పెట్టుబడి, 'సరుకుల్ని కొనడం - అమ్మడం' అనే ఉపయోగపు విలువని ఇస్తుంది. 'ఉపయోగపు విలువ' అనగానే, ఆ పేరుతో వున్న ప్రతిదీ సహజమైనదే అనే అర్థానికి రాకూడదు. దోపిడీ సమాజాల్లో వుండే వస్తువుల్లోనూ శ్రమల్లోనూ అనేకం - తప్పుడువే. అసహజమైనవే. అవి, ఆ తప్పుడు సంబంధాల వల్ల కొనసాగుతూ వున్నవే. వర్తక శ్రమలన్నీ కూడా అలాంటివే.

వర్తక పెట్టుబడి, మారకం పనులు చేస్తూ ప్రతీ సారీ ఖర్చయి పోతూ వుంటుందే గానీ, సరుకు విలువ లోకి చేరదు - అయితే, వర్తక పెట్టుబడి సరుకు విలువ లోకి చేరక పోతే ఆ ఖర్చుని పెట్టుబడి దారుడు వెనక్కి ఎలా తీసుకో గలుగుతాడు? పెట్టిన ఖర్చుని వెనక్కి తీసుకోకుండా ప్రతీ సారీ దాన్ని వదిలేస్తూ, మళ్ళీ కొత్త పెట్టుబడి పెడుతూ వుంటాడా? - అలా కాదు. పెట్టుబడి దారుడు ఏ 'పని' కోసమైనా కొంత 'పెట్టుబడి' పెడితే, ఆ పని సహజమైందా, కాదా; ఆ ఖర్చు సరుకు విలువ లోకి చేరుతుందా, లేదా - అనే విషయాలు పెట్టుబడిదారుడికి అవసరం లేదు. పెట్టిన పెట్టుబడి తప్పని సరిగా సరుకు ద్వారా వెనక్కి రావలసిందే. అది ఉత్త చేతుల్తో రావడం కూడా కాదు, కొంత 'లాభాన్ని' మోసుకుంటూ కూడా వెనక్కి రావాలి! అదంతా ఎలా జరుగుతుందో 'పెట్టుబడి' పెట్టిన వాడికి అనవసరం. కానీ అది జరగాలి.

పెట్టుబడి, వెనక్కి రావడం ('లాభం'తో సహా) అనేది, ఉత్పాదక పెట్టుబడి విషయంలో మాత్రమే జరిగి, వర్తక పెట్టుబడి విషయంలో జరక్కపోతే, వర్తక పెట్టుబడిగా పని చెయ్యడానికి ఏ పెట్టుబడి అంగీకరిస్తుంది? ('వర్తక పెట్టుబడి' పెట్టి దాన్ని వదిలేసుకుంటూ వుండడానికి ఏ పెట్టుబడి దారుడు అంగీకరిస్తాడు?) కాబట్టి, కొంత పెట్టుబడి, 'వర్తక పెట్టుబడి'గా పని చెయ్యాలీ - అంటే, దానికి కూడా ఉత్పాదక పెట్టుబడికి ఉండే 'హక్కులన్నీ' వుండాలి. అంటే, వర్తక పెట్టుబడి కూడా 'సరుకు విలువ'లో నించే వెనక్కి రావడమూ, దానికి కూడా 'జనరల్ లాభం' రావడమూ అంతా, ఉత్పాదక పెట్టుబడికి జరిగినట్టే జరగాలి. అలా జరిగితేనే, కొంత పెట్టుబడి, వర్తక పెట్టుబడిగా పని చెయ్యగలుగుతుంది.

అంటే, వర్తక పెట్టుబడికి సంబంధించిన సమస్య ఏమిటంటే, అది సరుకు విలువ లోకి చేరకుండానే, సరుకు విలువలో నించే బయటికి రావాలి! అంతే కాదు, అది లాభాన్ని ఉత్పత్తి చెయ్యకుండానే లాభాన్ని తీసుకు రావాలి! ఈ రెండు పనులూ, 'సరుకు విలువ' ద్వారానే జరిగి తీరాలి! ఇదీ వర్తక పెట్టుబడి సమస్య.

ఇలాంటి సమస్య లన్నిటికీ జవాబేమిటో మొట్టమొదటి నించీ చూస్తూనే వున్నాం. సరుకులో వుండే 'అదనపు విలువే' ఆ జవాబు! ప్రతీ 'అనుత్పాదక' ఖర్చుకీ, అదే జవాబు! సరుకు విలువ లోకి చేరని, అనుత్పాదక ఖర్చులన్నీ 'అదనపు విలువ'లో నించి రాకపోతే, ఇక ఆ 'వింత' జరగడం ఏ రకం గానూ సాధ్యం కాదు.

అంటే, ఒక సరుకు కోసం ప్రతీ సారీ ఖర్చయ్యే వర్తక పెట్టుబడీ, దాని లాభమూ, ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ'లో భాగాలే అన్నమాట!

'వర్తక పెట్టుబడి'గా పని చేసే కొన్ని ఉత్పత్తులూ, కొంత శ్రమా, (ఆ నిర్జీవ, సజీవ శ్రమలు), వర్తకం పనులు చేస్తూ, సరుకు విలువ లోకి చేరకుండానే ఖర్చయి పోతూ వుంటాయి. కానీ ఆ ఖర్చంతా పెట్టుబడిదారుడికి, సరుకు ద్వారానే మళ్ళీ అందుతూ వుంటుంది. అది తిరిగి రావడమే వాడికి కావాలి గానీ, అది ఏ పద్ధతిలో తిరిగి వస్తుందీ - అనేది వాడికి అనవసరం.

ఏ సరుకుకి సంబంధించిన వర్తకం ఖర్చులు, ఆ

సరుకు తాలూకు అదనపు విలువలో భాగం. ఒక విడి సరుకు విషయంలో అయినా అంతే, 'మొత్తం సామాజిక సరుకుల రాసి' విషయంలో అయినా అంతే. 'సమాజం'లో జరిగే మొత్తం వర్తకం ఖర్చులన్నిటినీ కలిపితే ఆ మొత్తం ఖర్చూ, దాని లాభమూ అంతా - 'సామాజిక అదనపు విలువ'లో భాగమే.

అయితే, పెట్టిన పెట్టుబడులూ, వాటి లాభాలూ అన్నీ, సరుకు ద్వారానే వస్తాయి కాబట్టి, ఆ 'పైకి కనపడే' విషయాల్ని మాత్రమే చూస్తే ('అంతర్గత' విషయాల్ని తార్కికంగా అర్థం చేసుకోక పోతే), 'ఏ పెట్టుబడి అయినా ఒకే రకంగా సరుకు విలువ లోకి చేరుతుంది' అనే తప్పు అవగాహన ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ లెక్కలన్నీ ఈ పై పై అవగాహన తోటే వుంటాయి.

ఉత్పాదక పెట్టుబడికీ, వర్తక పెట్టుబడికీ, వాటి జనరల్ లాభాలకూ సంబంధించి, పెట్టుబడిదారీ అవగాహన ఎలా వుంటుందో, సరైన అవగాహన ఎలా వుండాలో - ఈ రెంటినీ జాగ్రత్తగా అర్థం చేసుకుంటూ వుండాలి.

ఒక ఉదాహరణ చూద్దాం. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, సంవత్సరానికి ఒక్కటే 'ఉత్పత్తి క్రమం' అనుకుందాం. ఆ ఉత్పత్తి క్రమంలో పని చేసే మొత్తం ఉత్పాదక పెట్టుబడి 500. వర్తక పెట్టుబడి 25. జనరల్ లాభం రేటు 20%. ఈ వివరాలతో చూస్తే, సరుకుల రాసికి, 'విలువ' ఎంత? అందులో, 'అదనపు విలువ' ఎంత?

అదనపు విలువని తెలుసుకోవాలంటే:

2 పెట్టుబడులకూ వున్న జనరల్ లాభాల్ని కలిపితే చాలదు. 'వర్తక పెట్టుబడి' కూడా అదనపు విలువలో భాగమే కాబట్టి, దాన్ని కూడా కలిపితేనే, అది మొత్తం అదనపు విలువ అవుతుంది. అంటే, (1) ఉత్పాదక పెట్టుబడి తాలూకు జనరల్ లాభమూ, (2) వర్తక పెట్టుబడీ, (3) వర్తక పెట్టుబడి తాలూకు జన రల్ లాభమూ - ఈ 3 అంశాల్నీ కలిపితే, అది, మొత్తం అదనపు విలువ.

వర్తక పెట్టుబడీ, దాని జనరల్ లాభమూ - ఈ 2 అంశాలూ కలిస్తే, అది 'వర్తక కమిషన్' అవుతుంది. ఈ వర్తక కమిషను, ఉత్పాదక పెట్టుబడి ద్వారా వచ్చే జనరల్ లాభం లోనే వుంటుంది. కానీ, వర్తక కమిషన్‌ని తీసివేశాక మిగిలేది, ఉత్పాదక పెట్టుబడికి మిగిలే భాగం. అందులో నించి ఉత్పాదక పెట్టుబడి చెల్లించవలసిన వడ్డీలూ, కౌళ్ళూ పోతాయి.

జనరల్ లాభం - అనే దాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. ఉత్పాదక పెట్టుబడి ద్వారా వచ్చే మొత్తం అదనపు విలువనీ, జనరల్ లాభం అంటాము; అందులో నించి, వర్తక కమిషన్‌ని తీసివెయ్యగా, మిగిలే భాగాన్నీ జనరల్ లాభం అంటాము. ఈ మాటని, సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి.

సరుకు విలువని తెలుసుకోవాలంటే:

(1) ఉత్పాదక పెట్టుబడి, (2) మొత్తం అదనపు విలువా - ఈ 2 అంశాల్నీ కలిపితే, అది సరుకు విలువ.

లేదా, ఉత్పాదక - వర్తక పెట్టుబడుల్నీ, వాటి జనరల్ లాభాల్నీ - ఈ 4 అంశాల్నీ కలిపితే, అది - సరుకు విలువ.

అసలు, ఈ అంశాలన్నీ పెట్టుబడిదారీ లెక్క ప్రకారం ఎలా వుంటాయో, సరైన లెక్క ప్రకారం ఎలా వుంటాయో, 2 రకాలు గానూ చూడాలి.

(ఇది, 'మొత్తం సరుకుల రాసి' విషయం కాబట్టి, ఇక్కడ 'విలువ' అన్నా, 'ధర' అన్నా ఒకటే. ఒక పెట్టుబడి చెల్లించే వడ్డీ, కౌలూ వంటివన్నీ దాని జనరల్ లాభం లోనే వుంటాయి. కాబట్టి, వాటి వివరాలు ఇక్కడ అక్కర లేదు. జనరల్ లాభాన్ని తీసుకుంటే చాలు.)

### పెట్టుబడిదారీ లెక్క ప్రకారం:

| | | |
|---|---|---|
| 500 | ఉత్పాదక పెట్టుబడికి, లాభం | 100 |
| 25 | వర్తక పెట్టుబడికి, లాభం | 5 |
| 525 | పెట్టుబడికి, లాభం | 105 |

| | | |
|---|---|---|
| పెట్టుబడీ + | జనరల్ లాభమూ | = సరుకు విలువ |
| 525 + | 105 | = 630 |

ఈ లెక్క ప్రకారం చూస్తే, సరుకుల రాసి కోసం మొత్తం 525 పెట్టుబడి ఖర్చయినట్టూ, అందులో ఉత్పాదక, వర్తక పెట్టుబడులు రెండూ దేని లాభాన్ని అదే ఉత్పత్తి చేసుకున్నట్టూ, రెండిటి లాభమూ కలిసి 105 అయినట్టూ, కనపడుతుంది. ఈ ప్రకారం చూస్తే, జనరల్ లాభం రేటు 20%. కానీ, అసలు నిజం ఇది కాదు. పెట్టుబడిదారీ లెక్కల్లో కనపడే సమాచారాన్నే తీసుకుని, దాన్ని సరైన అవగాహనతో చూసి అసలు విషయం గ్రహించాలి.

### సరైన అవగాహన ప్రకారం:

ఉత్పాదక పెట్టుబడీ, అది ఉత్పత్తి చేసిన అద

నపు విలువా, ఈ 2 అంశాల మొత్తమే - సరుకు విలువ.

'సరుకుల రాసి' కోసం ఖర్చయిన పెట్టుబడి 525 కాదు, 500. అది ఉత్పాదక పెట్టుబడి మాత్రమే. ఈ 500 ఉత్పాదక పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన జనరల్ లాభం, 100 మాత్రమే కాదు. వర్తక పెట్టుబడీ, దాని జనరల్ లాభమూ కూడా, ఉత్పాదక పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన అదనపు విలువలో భాగాలే. కాబట్టి, అవి కూడా కలిసినదే - మొత్తం అదనపు విలువ.

మొత్తం 'అదనపు విలువ' ఇలా వుంటుంది:

1. 500 ఉత్పాదక పెట్టుబడి లాభం ... 100
2. వర్తక పెట్టుబడి ................ .......... 25
3. వర్తక పెట్టుబడి లాభం ....... .............. 5

మొత్తం అదనపు విలువ 130

500 ఉత్పాదక పెట్టుబడి, 130 అదనపు విలువని ఉత్పత్తి చేసింది. 100ని మాత్రమే కాదు. ఉత్పాదక పెట్టుబడినీ, అది ఉత్పత్తి చేసిన మొత్తం అదనపు విలువనీ కలిపితే, అదే - సరుకు విలువ.

ఉత్పాదక పెట్టుబడీ + మొత్తం S = సరుకు విలువ
500 + 130 = 630

అంటే, సరైన లెక్క ప్రకారం కూడా సరుకు విలువ 630 య్యే.

పెట్టుబడిదారీ లెక్క ప్రకారమూ, సరైన లెక్క ప్రకారమూ కూడా సరుకు విలువ పరిమాణం ఒకే రకంగా వుంటుంది, వుండాలి.

సరుకు 'శరీర పరిమాణాన్ని' ఎవరు ఏ పద్ధతిలో లెక్క కట్టినా, అది ఎలాగైతే ఒకే రకంగా వుంటుందో, అలాగే 'విలువ పరిమాణాన్ని' కూడా ఎవరు ఏ పద్ధతిలో లెక్క కట్టినా, ఒకే రకంగా వుండాలి. తేడా ఎక్కడంటే - ఆ 'విలువ ఎలా ఏర్పడిందో' వివరించే దగ్గరే. 'విలువ'ని కలిగించే 'అంతర్గత విషయాల' గురించే, పెట్టుబడిదారీ అవగాహనా, సరైన అవగాహనా, తేడా అవుతాయి.

ఈ ఉదాహరణలో, సరుకు విలువ ఏ అవగాహన ప్రకారం చూసినా 630 య్యే. అయితే, పెట్టుబడిదారీ అవగాహన ప్రకారం, 525 పెట్టుబడి, 105 జనరల్ లాభాన్ని ఇచ్చినట్టు కనపడుతుంది. కానీ, సరైన అవగాహన ప్రకారం, 500 పెట్టుబడి, 130 జనరల్ లాభాన్ని ఇచ్చింది. అంటే అసలు వాస్తవంలో - తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తోంటే, అది పెట్టుబడిదారీ లెక్కల్లో - ఎక్కువ పెట్టుబడి, తక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తోన్నట్టుగా కనబడుతోంది.

అలాగే, 'జనరల్ లాభం రేటు' అనేది, పెట్టుబడిదారీ లెక్కల్లో కనపడేది చాలా తక్కువ. సరైన లెక్కల ప్రకారం అయితే, అది ఇంకా ఎక్కువ రేటు. ఎలాగంటే:

మొత్తం 525 పెట్టుబడి, 105 జనరల్ లాభాన్ని ఉత్పత్తి చేసినట్టుగా చూస్తే, (ఇది నిజం కాదు),

అప్పుడు, లాభం రేటు = —— × 100 = 20%

అలా గాక - 500 ఉత్పాదక పెట్టుబడి, 130 లాభాన్ని ఉత్పత్తి చేసినట్టుగా చూస్తే (ఇదే అసలు నిజం), అప్పుడు, లాభం రేటు= ——×100 = 26%

ఈ రకంగా, అసలు వాస్తవంలో ఎక్కువ జనరల్ లాభం రేటు వుండగా, పెట్టుబడిదారీ లెక్కల్లో అది తక్కువ రేటుగా కనపడుతుంది. అంటే, నిత్య జీవితంలో, పెట్టుబడిదారీ లెక్కల్లో కనపడే జనరల్ లాభం రేటు నిజమైన రేటు కాదన్న మాట! నిజమైన లాభం రేటు, ఆ కనపడే దాని కన్నా ఇంకా ఎక్కువగా వుంటుందన్న మాట!

ఉత్పాదక పెట్టుబడి మాత్రమే అదనపు విలువని ఉత్పత్తి చేస్తుంది - అన్నప్పుడు, ఇక్కడ గతంలో చూసిన ఒక విషయం గుర్తు చేసుకోవాలి. ఉత్పాదక పెట్టుబడిలో కూడా అన్ని భాగాలూ అదనపు విలువని ఉత్పత్తి చెయ్యవు. అందులో వున్న 'అస్థిర పెట్టుబడి' భాగం మాత్రమే (C + V లలో, V భాగం మాత్రమే), అదనపు విలువని ఇస్తుంది. ఇది ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

ఉత్పాదక పెట్టుబడిలో వున్న 'అస్థిర పెట్టుబడి'నీ, అది ఉత్పత్తి చేసిన 'మొత్తం అదనపు విలువ'నీ తీసుకుని 'శాతం'గా చూస్తే - అది అదనపు విలువ రేటు. 'ఉత్పాదక పెట్టుబడి' మొత్తాన్నీ, 'అదనపు విలువ'నీ, తీసుకుని 'శాతం'గా చూస్తే - అది 'నిజమైన జనరల్ లాభం రేటు.'

అయితే, ఈ 'అదనపు విలువ రేటు' గానీ, 'నిజమైన లాభం రేటు' గానీ, పెట్టుబడిదారీ లెక్కల్లో కనపడవు. అయినప్పటికీ, పెట్టుబడిదారీ లెక్కల్లో కనపడే అంశాల ఆధారం తోటే, పైకి కనపడని అంశాలన్నిటినీ ఎంతో తేలిగ్గా లెక్క కట్టవచ్చు.

630 విలువ గల సరుకు రాసి ఉదాహరణలో - ఉత్పాదక, వర్తక పెట్టుబడులు, వాటి లాభాలతో సహా ఎలా వెనక్కి వస్తాయో ఇప్పుడు చూద్దాం:

ఇది మొత్తం రాసి విషయం కాబట్టి, దీనికి విలువ అయినా, ధర అయినా ఒకటే.

ఉత్పాదక పెట్టుబడి 500. వర్తక పెట్టుబడి 25. సరుకు రాసికి అమ్మకాలు జరిగి, దాని వల్ల 630 వచ్చిందనుకుందాం. ఆ 'విలువ'లో నించి 500 ఉత్పాదక పెట్టుబడి వెనక్కి వచ్చి, దానికి 100 జనరల్ లాభం వస్తుంది. ఈ పెట్టుబడికి లాభం రేటు 20%. అలాగే, సరుకు విలువలో నించే 25 వర్తక పెట్టుబడి కూడా వెనక్కి వచ్చి, దాని భాగానికి 5 జనరల్ లాభం వస్తుంది. ఇది కూడా 20% లాభం రేటు. ఈ రకంగా, సరుకుల రాసి విలువలో నించే, మొదట ఖర్చు పెట్టిన ఉత్పాదక, వర్తక పెట్టుబడులు రెండూ వెనక్కి వచ్చి, వాటికి ఒకే రేటున లాభాలు వస్తాయి.

సరుకుని అమ్మగా వచ్చిన 'విలువ'లో నించి (లేదా 'ధర'లో నించి) ఉత్పాదక పెట్టుబడిని వెనక్కి తీసుకున్నట్టే, వర్తక పెట్టుబడిని కూడా వెనక్కి తీసుకోవడం వల్ల, పెట్టుబడి దారుడికి ఇది ఎలా కనపడుతుందంటే - ఉత్పాదక పెట్టుబడి లాగే వర్తక పెట్టుబడి కూడా సరుకు విలువ లోకి చేరినట్టూ, అందుకే అది సరుకు విలువలో నించి వెనక్కి వచ్చినట్టూ, కనపడుతుంది.

ఈ విషయాన్ని, 'విలువ' రూపం లోనే గాక, 'ఉత్పత్తుల' రూపంలో కూడా అర్థం చేసుకోవడం చాలా అవసరం. '1 విలువ' అంటే 1 వస్తువు (1 యూనిట్) - అనుకుందాం.

ఇప్పుడు, విషయం ఇలా వుంటుంది:

| | |
|---|---|
| ఉత్పాదక పెట్టుబడి | 500 వస్తువులు. |
| వర్తక పెట్టుబడి | 25 వస్తువులు. |
| తయారైన సరుకుల రాసి | 630 వస్తువులు. |

ఈ 'రాసి' ఉత్పత్తి అవడానికి, 500 వస్తువుల ఉత్పాదక పెట్టుబడి ఖర్చయింది. ఆ ఖర్చుతో, ఆ 500 వస్తువులూ మళ్ళీ తయారై, వాటితో పాటు ఇంకో 130 వస్తువులు కూడా (ఇది, 'అదనపు ఉత్పత్తి') తయారయ్యాయి. అంటే, 500 వస్తువుల ఖర్చుతో, 630 వస్తువులు తయారయ్యాయి.

ఈ రాసికి సంబంధించిన మారకాల పని కోసం, వర్తక పెట్టుబడిగా, 25 వస్తువులు కూడా ఖర్చయ్యాయి. అయితే, ఆ వస్తువులన్నీ ఖర్చయి పోతూ, వర్తకం పనులు జరిగాయే గానీ, ఆ ఖర్చుతో మళ్ళీ ఆ వస్తువులు ఉత్పత్తి అవలేదు. ఆ ఖర్చుతో, 'అదనపు ఉత్పత్తి' కూడా ఏమీ జరగలేదు.

ఇప్పుడు, కొత్తగా తయారై వున్న ఈ 630 వస్తువుల రాసి ఎలా ఖర్చవుతుంది?

అందులో 500 వస్తువులు, ఆ 'రాసి' కోసం ఖర్చయిన 'ఉత్పాదక పెట్టుబడి' గా వెళ్తాయి. ఇది, ఖర్చయిన ఉత్పాదక పెట్టుబడి- వెనక్కి రావడం. ఆ పెట్టుబడికి జనరల్ లాభంగా, ఆ రాసిలో నించి 100 వస్తువులు వెళ్తాయి.

రాసిలో ఇంకా 30 వస్తువులు వుంటాయి. అందులో నించి 25 వస్తువులు, అప్పటికే ఖర్చయిన 'వర్తక పెట్టుబడి'గా వెళ్ళాయి. ఇది, వర్తక పెట్టుబడి - వెనక్కి రావడం. ఇంకా మిగిలిన 5 వస్తువులు, వర్తక పెట్టుబడికి జనరల్ లాభంగా వెళ్తాయి.

ఈ రకంగా, ఒక సరుకుల రాసి అంతా - ఉత్పాదక, వర్తక పెట్టుబడులు వెనక్కి రావడానికీ, వాటికి జనరల్ లాభాలు రావడానికీ, ఖర్చవుతుంది. ఆ రాసి, ఆ భాగాలుగా 'పంపకాలు' అవుతుంది.

ఒక సంవత్సరపు సరుకుల రాసిని, 500 అనుకుందాం. ఇది 1 వ నంబరు రాసి.

తర్వాత సంవత్సరపు రాసిని 630 అనుకుందాం. ఇది 2 వ నంబరు రాసి.

తర్వాత రాసి 750. ఇది 3 వ నంబరు రాసి.

ఈ 3 రాసులకూ సంబంధించిన వర్తకం ఖర్చులు ఎలా వుంటాయో చూద్దాం.

1 వ రాసి తాలూకు అదనపు విలువలో నించి కొన్ని వస్తువులు, 2 వ రాసి తాలూకు వర్తకం పనుల కోసం 'వర్తక పెట్టుబడి'గా ఖర్చవుతాయి. (అంతే గాక, మరి కొన్ని వస్తువులు, ఆ వర్తక పెట్టుబడికి లాభంగా వుంటాయి. ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 'వర్తక లాభం' సంగతి వదిలేద్దాం.)

1 వ రాసి S లో నించి కొంత భాగం, 2 వ రాసి వర్తకం పనుల కోసం ఖర్చవుతూ, అలా ఖర్చయిన వస్తువులన్నీ 2 వ రాసి S లో నించి వెనక్కి వస్తాయి.

2 వ రాసి S లో నించి వెనక్కి వచ్చిన భాగం, 3 వ రాసికి వర్తకం పనుల కోసం ఖర్చయి పోతుంది. మళ్ళీ ఆ భాగం, 3 వ రాసి S లో నించి వెనక్కి వస్తుంది.

3 వ రాసి S లో నించి వెనక్కి వచ్చిన భాగం, 4వ రాసి వర్తకం పనుల కోసం ఖర్చయి పోతుంది. ఆ భాగం మళ్ళీ, 4 వ రాసి S లో నించి వెనక్కి వస్తుంది.

ఇలా ప్రతీ సంవత్సరమూ, ఆ సంవత్సరపు రాసిలో నించి కొంత భాగం, తర్వాత కొత్త రాసి తాలూకు వర్తకం పనుల కోసం ఖర్చయి పోతూ, ఆ భాగం మళ్ళీ ఆ కొత్త రాసిలో నించి వెనక్కి వస్తూ వుంటుంది. మొత్తం మీద, సారాంశం ఏమిటంటే, ప్రతీ రాసిలో నించీ కొంత ఉత్పత్తి, 'వర్తకం పనుల' కోసం ఖర్చయి పోతూ వుండడమే.

మొత్తం సమాజంలో వర్తకం పనులు కోసం జరిగే ఖర్చు అంతా - 'వ్యర్థమైన' ఖర్చే. సమాజంలో, 'అమ్మకాలూ - కొనుగోళ్ళూ' జరగవలసిన పరిస్థితులే లేక పోతే, ఆ పనుల కోసం ఏ వస్తువులూ, ఏ శ్రమలూ ఖర్చు అవనక్కర లేదు. కానీ, 'మారకాలే' తప్పనిసరి అయ్యే పరిస్థితులు గల సమాజంలో (స్వంత ఆస్తీ, శ్రమ దోపిడీ, అసమాన శ్రమ విభజనా - వంటి పరిస్థితులు గల సమాజంలో), మారకాల ఖర్చు కూడా తప్పనిసరి ఖర్చే. అలాంటి సమాజంలో, ఆ పనుల కోసం, ఏటా కొంత ఉత్పత్తుల రాసి, వ్యర్థంగా ఖర్చయి పోతూ వుండవలసిందే. ఆ సమాజానికి, ఆ వ్యర్థత్వమే అత్యవసరం. ఆ అసహజత్వమే ఎంతో సహజత్వం.

ఒక పెట్టుబడికి వచ్చే జనరల్ లాభంలో నించి - వడ్డీ, పన్నులూ, భూమి కౌలూ వగైరా చెల్లింపులన్నీ పోగా చివరికి మిగిలే లాభం - సంస్థ లాభం.

ఉత్పాదక పెట్టుబడికి మిగిలే లాభం పేరు - 'ఉత్పాదక లాభం', వర్తక పెట్టుబడికి మిగిలే లాభం పేరు - 'వర్తక లాభం.' ఒక విడి సరుకు విషయంలో అయినా అంతే; మొత్తం 'సరుకుల రాసి' విషయంలో అయినా అంతే.

ఈ వ్యవహారంలో వుండే నిజాలేవీ పెట్టుబడిదారీ దృష్టికి పట్టవు. 'పెట్టుబడి' అనేది (అది, ఉత్పాదక పెట్టుబడి అయినా, వర్తక పెట్టుబడి అయినా), 'లాభం'తో సహా వెనక్కి వస్తుందనే పై పై విషయం మాత్రమే, దానికి చాలు. ఆ పని ఎలా జరుగుతుందనే పరిశీలన దానికి అనవసరం.

తన వర్తకం పనులు తనే చేయించుకునే ఉత్పాదక పెట్టుబడి దారుడు, ఉత్పత్తి క్రమం మీదే గాక, వర్తక క్రమం మీద కూడా 'పెట్టుబడి' పెట్టాలని చూశాం. కానీ, అంతే కాదు; ఆ 2 క్రమాలతో మాత్రమే సరుకు, వాడకం దారుల దగ్గిరికి చేరదు. ఉత్పత్తి స్థలంలో తయారైన సరుకుని, ఆ స్థలంలో నించి తీసి మొదట స్టోరులో పెట్టి, తర్వాత అక్కడ నించి రవాణాలో బయటికి పంపాలి. ఆ క్రమాల తర్వాతే అమ్మకం పని జరుగుతుంది. కాబట్టి, పెట్టుబడి దారుడు, (1) 'ఉత్పత్తి క్రమం' మీదా. (2) 'వర్తక క్రమం' మీదా మాత్రమే గాక, (3) స్టోరూ - రవాణా క్రమాల మీద కూడా పెట్టుబడులు పెట్టాలి.

ఇందులో, 2 వ, 3 వ క్రమాలు కలిసి 'చలామణీ క్రమం' అనే ఒకే పేరుతో వుంటాయి. అంటే 'చలామణీ క్రమం'లో - వర్తక క్రమమూ, కొన్ని ఉత్పత్తి క్రమాలూ లంకెలు పడి సాగుతాయి.

పెట్టుబడిదారుడు, తన సరుకు కోసం 3 క్రమాలలో పెట్టుబడులు పెడతాడు కాబట్టి, సరుకు తయారైన తర్వాత దానికి 'ధర'ని నిర్ణయించే టప్పుడు, తను ఖర్చు పెట్టిన పెట్టుబడులన్నిటినీ కలిపేసి ప్రతీ పెట్టుబడి మీదా 'లాభం' వేసుకుని, అన్నిటినీ కలపగా వచ్చిన మొత్తాన్నీ, సరుకుకి 'ధర'గా నిర్ణయిస్తాడు.

ఆ 'ధర' సరుకుకి నిజంగా వున్నదే. అయితే, ఆ ధర, సరుకుకి ఎలా ఏర్పడుతుందంటే, ఆ సరుకు కోసం వేరు వేరు క్రమాలలో ఖర్చయిన (1) ఉత్పత్తి సాధనాలూ, (2) సజీవ శ్రమలూ - అనే రెండే రెండు కారణాల వల్ల! అంతే గానీ, పెట్టుబడి దారుడు కలిపిన అంశాలన్నిటి వల్లా కాదు.

అసలైన అంశాలకు, తప్పుడు అంశాల్ని కూడా కలిపి పెట్టుబడిదారుడు నిర్ణయించిన ధర, సరుకుకి నిజం గానే వుంటుంది. పెట్టుబడిదారుడు ధరని అలా లెక్కకట్టి, సరుకుని ఆ ధరకి అమ్మినప్పుడు అందులో నించి, పెట్టుబడులన్నీ వెనక్కి వచ్చి, వాటికి లాభాలు కూడా వస్తాయి. 'పెట్టుబడి'కి రావలసిన లాభం, పెట్టుబడి 'పరిమాణాన్ని' బట్టీ, దాని టర్నోవర్ కాలాన్ని బట్టీ వుంటుందని గతం లోనే చూశాం.

ఇప్పుడు ఒక సరుకు కోసం (100 మీటర్ల బట్ట కోసం) ఖర్చయ్యే పెట్టుబడుల్నీ, వాటి లాభాల్నీ, సరుకు ధరనీ, చూద్దాం. ఈ ఉదాహరణని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే, సరుకు విషయాలన్నీ ఎంతో స్పష్టంగా తెలుస్తాయి.

ఉత్పాదక పెట్టుబడి 100. ఉత్పత్తి కాలం (వర్కింగ్ పిరియడ్) 1 వారం. చలామణీ కాలం 1 వారం. వర్తక పెట్టుబడి 10. స్టోరూ, రవాణాల పెట్టు

బడి 15. జనరల్ లాభం రేటు, 100 పెట్టుబడికి 1 వారానికి 10. ఈ వివరాలతో సరుకు ధర ఎంత? (ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, విలువనీ, ధరనీ ఒకటి గానే అనుకోవచ్చు. లేదా ఇలా జనరల్ లాభం రేటు లెక్కలతో ఏర్పడేది ఉత్పత్తి ధరే గానీ విలువ కాదు - అని తెలుసుకోవచ్చు.)

1. **'ఉత్పత్తి క్రమం'లో:**
ఉత్పాదక పెట్టుబడి 100. ఉత్పత్తి కాలం 1 వారం. చలామణీ కాలం 1 వారం. అంటే, ఉత్పాదక పెట్టుబడి వెనక్కి రావడానికి, 2 వారాలు పడుతుంది. కాబట్టి, 100 ఉత్పాదక పెట్టుబడికి, 2 వారాల లాభం రావాలి. 100 పెట్టుబడికి, 1 వారానికి 10 లాభం లెక్కన, 2 వారాలకు 20 లాభం రావాలి.

2. **'వర్తక క్రమం'లో:** ఇది సరుకు అమ్మకాలు జరిగే క్రమం. నిజానికి ఈ క్రమం ద్వారా సరుకుకి చేరేది ఏమీ వుండదు. కానీ, వర్తక క్రమం కోసం అయ్యే ఖర్చు 'అదనపు విలువ'లో భాగమే కాబట్టి, ఇది కూడా 'ధర'లో భాగమే. ఈ క్రమం కోసం, 'అదనపు విలువలో నించి ఎంత పోతున్నదో' లెక్క కట్టాలంటే, ఈ పెట్టుబడినీ, దాని లాభాన్నీ కూడా కలిపి చూడాలి. - వర్తక పెట్టుబడి 10. చలామణీ కాలం 1 వారమే. వారం చివరికే ఇది వెనక్కి వచ్చేస్తుంది. కాబట్టి ఈ పెట్టుబడి మీద 1 వారం లాభమే రావాలి. 100 పెట్టుబడికి 1 వారానికి 10 లాభం లెక్కన, 10 పెట్టుబడికి 1 వారానికి లాభం 1. ఈ పెట్టుబడీ, దాని లాభమూ కలిసి 11. ఇది 'వర్తక క్రమం' ద్వారా ఉత్పత్తి అయినది కాదు. అయినా, ఇలా చూస్తేనే ఈ క్రమం కోసం అదనపు విలువలో నించి 11 పోతున్నదని తెలు స్తుంది. ఈ 11, 'అదనపు విలువ లోదే' కాబట్టి, ఇది కూడా సరుకు విలువలో భాగమే.

3. **స్టోరేజీ, రవాణా క్రమాలలో:** ఈ పెట్టుబడి 15. చలామణీ కాలమే ఈ పెట్టుబడి పని చేసే కాలం. అంటే 1 వారం. 100 పెట్టుబడికి 1 వారానికి 10 లాభం లెక్కన, 15 పెట్టుబడికి 1 వారానికి లాభం 1
ఈ క్రమాల ద్వారా సరుకుకి చేరేది 15 + 1 = 16 .

ఇప్పుడు 3 క్రమాల్నీ కలిపితే, అది సరుకుకి ఉత్పత్తి ధర. ఎందుకంటే, పెట్టుబడుల మీద లాభాలు జనరల్ రేటు ప్రకారం కలిశాయి కాబట్టి. కానీ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, దాన్ని విలువ అనుకోవాలి.

ఉత్పత్తి పెట్టుబడి 100 + లాభం 20 = 120
వర్తక పెట్టుబడి 10 + లాభం 1 = 11
స్టోరేజీ..ల పెట్టుబడి 15 + లాభం 1 = 16 .
సరుకు ధర =147

పెట్టుబడి దారుడు సరుకుని 147 కి అమ్మితే, ఆ ధరలో నించి పెట్టుబడులన్నీ వెనక్కి వచ్చి, అన్నిటికీ ఒకే రేటున లాభాలు వస్తాయి.

ఈ ఉదాహరణలో, ఉత్పత్తి క్రమం నించి బట్ట బయటపడే సమయానికి (బట్ట మీద ఇంకా స్టోరేజీ, రవాణా క్రమాలూ, వర్తక క్రమమూ జరగక ముందు), బట్ట ధర ఎంత? - అప్పటికి, ఉత్పత్తి క్రమం ఒక్కటే జరిగింది కాబట్టి, అప్పటికి బట్ట ధర 120 మాత్రమేనా? - కాదు. 'వర్తక క్రమానికి' సంబంధించిన 11 కూడా ఉత్పత్తి క్రమంలో ఉత్పత్తి అయినదే కాబట్టి, ఆ 11 ని, కూడా 120 కి కలపాలి. మొత్తం 131. ఇప్పటికి 'వర్తక క్రమం' ఇంకా జరగకపోయినా, ఇప్పటికి బట్టకి వున్న ధర 131. అంతే గానీ, 120 మాత్రమే కాదు. ఈ 131లో, ఉత్పాదక పెట్టుబడి 100. మిగిలిన 31, ఉత్పాదక పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయి వున్న అదనపు విలువ. ఇలా, 131 ధరతో తయారై వున్న బట్ట మీద, తర్వాత స్టోరేజీ - రవాణా వంటి ఇతర ఉత్పత్తి క్రమాలు కూడా తప్పనిసరిగా జరిగి, బట్ట ధర ఇంకా పెరుగుతుంది. అందుకే, ఈ ఉదాహరణలో, అమ్మకం సమయానికి బట్ట ధర 147½ అయింది.

బట్ట పెట్టుబడిదారుడు, ఉత్పత్తి క్రమం లోనూ, వర్తక క్రమం లోనూ మొత్తం ఎంత పెట్టుబడితో పని చేస్తూ వుంటాడు? - ఉత్పత్తి క్రమంలో 100 పెట్టుబడీ, వర్తక క్రమంలో 10 పెట్టుబడీ, మొత్తం 110 పెట్టుబడితో పని చేస్తాడు. (స్టోరేజీ, రవాణాల్ని ఇక్కడ తీసుకోవటం లేదు.) కానీ, ఉత్పత్తి క్రమం ఆగకుండా సాగాలంటే, ఉత్పత్తి క్రమంలో 2 పెట్టుబడుల తోటీ, (100 + 100), వర్తక క్రమంలో 1 పెట్టుబడి తోటీ (10 మాత్రమే) మొత్తం 210 పెట్టుబడితో పని చేస్తాడు. ఈ 210 పెట్టుబడితో ఉత్పత్తి క్రమమూ, చలామణీ క్రమమూ, ఆగకుండా నడుస్తూ వుంటాయి. ఈ పెట్టుబడి, ఒక వారం సరుకు తర్వాత, ఒక వారం సరుకుని ఉత్పత్తి చేస్తూ, చలామణీ కూడా చేస్తూ వుంటుంది.

ఇక, ఇప్పుడు ఈ విషయం లోకి 'వర్తకుణ్ణి' ప్రవేశ పెట్టుకోవచ్చు.

# 'వర్తకుడి' ప్రవేశం

'సరుకు'కి సంబంధించిన వర్తకం పనుల బాధ్యతనంతా తీసుకునే వాడే 'వర్తకుడు'. ఈ వర్త కుడు ఏం చెయ్యాలంటే, A అనే ఉత్పాదక పెట్టుబడి దారుడి ఉత్పత్తి క్రమానికి కావలసిన ఉత్పత్తి సాధనాల్ని ఇతర చోట్ల నించి కొని (ఇతర ఉత్పాదక పెట్టుబడిదార్ల నించి గానీ, కొన్ని సందర్భాల్లో స్వతంత్ర ఉత్పత్తిదార్ల నించి గానీ, కొని), A పెట్టుబడిదారుడికి అమ్మడమూ, అలాగే, ఆ ఉత్పత్తి సాధనాలతో తయారైన కొత్త సరుకుని, A నించి కొని ఇతర పెట్టుబడి దార్లకు (కొన్ని రకాల సరుకుల్ని స్వతంత్ర ఉత్పత్తి దార్లకూ, కార్మికులకూ కూడా) అమ్మడమూ - చెయ్యాలి. అంటే సరుకుల 'చలామణీ క్రమాన్ని' నిర్వహించడం వర్తకుడి పని.

వర్తకుడు సరుకుల్ని కొనేది, తన స్వంత వాడకం కోసం కాదు. వాటిని మళ్ళీ అమ్మడానికే. ఇది, అమ్మడం కోసమే కొనడం.

చలామణీ క్రమాన్ని వర్తకుడు నిర్వహించాలంటే, ఆ పెట్టుబడులు వర్తకుడే పెట్టాలి. అప్పుడు, ఉత్పాదక పెట్టుబడిదారుడు పెట్టవలసిన పెట్టుబడి తగ్గిపోతుంది.

ఉత్పాదక పెట్టుబడిదారుడూ, వర్తకుడూ కూడా తమ పెట్టుబడుల మీద ఒకే లాభం రేటుని తీసుకుంటారనే 'జనరల్ సూత్రం' తోనే ఈ విషయాలు చూడాలి. (పెట్టుబడులకు 'లాభం' రావలసింది - వాటి పరిమాణాల్నీ, కాలాన్నీ బట్టే గానీ, అవి పని చేసే రంగాల్ని బట్టి కాదు. 'లాభం' కోసం పోటీ అనేది, ఉత్పాదక రంగంలో వేరు వేరు శాఖల మధ్యనే కాదు; ఉత్పాదక రంగానికీ, వర్తక రంగానికీ మధ్యా; వర్తక రంగం లోనే వేరు వేరు శాఖల మధ్యా కూడా వుంటుంది. పెట్టుబడులు, ఎటు నించి ఎటైనా మారుతూ వుంటాయి. అందుకే ఈ పోటీ సూత్రంతో, ఏ పెట్టుబడి కైనా 'ఒకే లాభం' రేటుని చూడాలి.)

బట్ట ఉదాహరణ లోకి, 'వర్తకుడు' ప్రవేసించాడనుకుందాం. ఇప్పుడు, ఏ పెట్టుబడిని ఎవరు పెడతారు? - ఇంతకు ముందు చూసిన ఉదాహరణనే మళ్ళీ చూద్దాం. (వర్తకుణ్ణి కూడా కలుపుకుని చూసేటప్పుడు, అక్కడక్కడా చిన్న చిన్న 'సవరణలు' చేసుకోవలసి వస్తుంది.)

## 1. ఉత్పత్తి క్రమంలో:

ఉత్పాదక పెట్టుబడి 100. ఇది, ఉత్పాదక పెట్టుబడిదారుడు పెడతాడు. ఈ ఉత్పాదక పెట్టుబడి ద్వారా 31 అదనపు విలువ ఉత్పత్తి అవుతుందని గతంలో చూశాం. కానీ ఇప్పుడు దాన్ని 32 అనుకుందాం. (ఎందుకిలా అనుకుంటున్నామో తర్వాత తెలుస్తుంది.) ఉత్పత్తి క్రమంలో నించి బట్ట బయట పడే సమయానికి దాని ధర 132 అన్న మాట. ఈ సమయానికి బట్టకి ఈ ధర వుందని బట్ట పెట్టుబడి దారుడికి తెలుసా - అనే సంగతి సరిగా అర్థం చేసుకోవాలి. ఈ 132 ధర, విలువ కాదు. ఇది, పెట్టుబడుల మీద జనరల్ లాభాలు కలవడం ద్వారా ఏర్పడినది కాబట్టి ఇది విలువ అవదు. విలువ అయితే, 132 కన్నా ఎక్కువో తక్కువో అయి వుంటుంది. అది తెలియదు. అయితే, బట్టకి, 132 ఉత్పత్తి ధర వుందని పెట్టుబడిదారుడికి తెలుసు. కానీ ఆ ధర అంతా తనకు రాదనీ, ఆ సరుకుని వర్తకుడికి ఇచ్చేటప్పుడు ఆ ధరని కొంత తగ్గించే ఇవ్వాలనీ, అది 'వర్తక సాంప్రదాయమ'నీ కూడా పెట్టుబడిదారుడికి తెలుసు.

తన సరుకు ద్వారా ఉత్పాదక పెట్టుబడిదారుడికి రావలసినది - (1) తన ఉత్పాదక పెట్టుబడీ, (2) దాని మీద జనరల్ లాభమూ - ఈ 2 అంశాలూ కలిసి రావాలి. ఈ సరుకు విషయంలో, ఆ 2 అంశాలూ వచ్చే ధర, 132 కన్నా తక్కువే వుంటుంది. తన సరుకుకి 132 ధర వుంటుందని తెలిసినా అందులో నించి తనకు రావలసిన భాగం మీదే బట్ట వాడి దృష్టి వుంటుంది.

ఉత్పత్తి క్రమం ముగిసిన తక్షణమే, ఉత్పత్తి స్థలం లోనే వర్తకుడు ఆ బట్టని కొంటే, ఎంత ధరతో కొంటాడు? 132 ధరనీ చెల్లించి కొంటాడా? - అలా కాదు. కొంత తగ్గింపు ధర తోనే కొంటాడు. బట్ట పెట్టుబడిదారుడు, వర్తకుడికి ఆ బట్టని ఎంతకి ఇస్తాడంటే, తన 100 పెట్టుబడీ, అది వర్తకుడి నించి ఒక వారానికే తిరిగి వస్తోంది కాబట్టి, దాని మీద 1 వారానికి రావల్సిన 10 లాభమూ, ఆ రెంటినీ కలిపి, 110 ధరకి ఇస్తాడు. అంటే, బట్ట పెట్టుబడి దారుడు, 132 ధర గల బట్టని వర్తకుడికి 110 కే ఇచ్చేస్తాడు. ఇంకా

మిగిలిన 22ని తగ్గించి, దాన్ని వర్తకుడికి 'వర్తక కమిషన్'గా వదిలేస్తాడు.

బట్ట పెట్టుబడిదారుడు, వర్తకుడి నించి తీసుకున్న 110 లో నించి తన 100 పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దాని మీద 1 వారానికి రావలసిన 10 జనరల్ లాభాన్ని కూడా తీసుకుంటాడు. వెనక్కి వచ్చిన ఆ 100 పెట్టుబడితో సరుకుని మళ్ళీ ఉత్పత్తి (పునరుత్పత్తి) చెయ్యగలుగుతాడు.

బట్ట పునరుత్పత్తి క్రమం, వర్తకుడు ఇచ్చిన రూపాయి నోట్లతో నడవదు. దాని కోసం కొత్త ఉత్పత్తి సాధనాలు కావాలి. కిందటి వారంలో ఇతర పెట్టుబడిదారుల దగ్గిర ఉత్పత్తి అయిన సాధనాలు, ఇప్పటికి బట్ట వాడి దగ్గిరికి చేరి వున్నాయనీ, వాటితో బట్ట వాడి దగ్గర పునరుత్పత్తి క్రమం జరుగుతుందనీ అర్థం.

వర్తక క్రమాన్ని ఉత్పాదక పెట్టుబడి దారుడు గాక వర్తకుడు నిర్వహించినట్టుగా చూస్తే, వర్తకుడి ద్వారా కొంత ఎక్కువ పెట్టుబడి పని చేసినట్టుగా కనపడుతుంది. అది ఎలా జరుగుతుందో చూడాలి.

వర్తకుడు, బట్ట పెట్టుబడిదారుడి నించి సరుకుని 110తో కొన్నాడంటే, ఆ సరుకు మీద 110 పెట్టుబడి పెట్టాడన్న మాట. 100 ఉత్పాదక పెట్టుబడితో తయారైన సరుకుని కొనడానికి వర్తకుడు కూడా 100 పెట్టుబడే పెట్టడానికి వీలు లేదు. సరుకులో అదనపు విలువ కూడా వుంటుంది కాబట్టి, సరుకు ధర, ఉత్పాదక పెట్టుబడి కన్నా ఎక్కువగా వుంటుంది. కాబట్టి ఈ ఉదాహరణలో వర్తకుడు సరుకు కోసం 100 కాక, 110 పెట్టుబడి పెట్టాడు. ఆ బట్టని అమ్మడానికి పట్టే చలామణీ కాలం 1 వారం. అంటే, బట్ట కోసం పెట్టిన 110 పెట్టుబడి, 1 వారానికి తిరిగి వస్తుంది. ఆ 110 పెట్టుబడికి రావలసిన లాభం 11.

(ఉత్పాదక పెట్టుబడి దారుడే వర్తక క్రమాన్ని కూడా నిర్వహించి నట్టుగా చూస్తే, 100 ఉత్పాదక పెట్టుబడి 2 వారాల తర్వాత వెనక్కి వస్తుంది కాబట్టి మొదటి వారంలో 100 పెట్టుబడి పని చేసినట్టూ, 2 వ వారంలో కూడా 100 పెట్టుబడే పని చేసినట్టూ కనిపిస్తుంది. అప్పుడు 100 ఉత్పాదక పెట్టుబడికి, 2 వారాలకూ కలసి 20 లాభం రావలసినట్టుగా లెక్కకి వస్తుంది. కానీ, వర్తక క్రమాన్ని వర్తకుడు నిర్వహించి నట్టుగా చూస్తే, వర్తకుడు ఆ బట్టని మొదటి వారం చివర 110తో కొంటాడు కాబట్టి, ఆ బట్ట కోసం మొదటి వారంలో బట్ట పెట్టుబడిదారుడి దగ్గిర 100 పెట్టుబడీ, రెండవ వారంలో వర్తకుడి దగ్గిర 110 పెట్టుబడీ, పని చేసినట్టు అవుతుంది. దీని వల్ల, 2 వారాలకూ కలిసి, రావలసిన లాభం 20 కాక, 21 అవుతుంది. అంటే, ఉత్పాదక పెట్టుబడి దారుడి ద్వారా చూసినప్పుడు 20 గా కనపడిన అంశం, వర్తకుణ్ణి కూడా కలిపి చూసినప్పుడు 21 గా అవుతుంది. సరుకు శరీర పరిమాణానికి సంబంధించిన కొలతలైతే, ఎవరి ద్వారా చూసినా తేడాలు రావు. కానీ, 'విలువ కొలతల' విషయంలో, ఆయా ప్రత్యేక సందర్భాల్ని బట్టి చిన్న చిన్న తేడాలు రావచ్చు. కానీ, దీని వల్ల జనరల్ సూత్రా లేవీ మారవు. తీసుకున్న ఉదాహరణని బట్టీ, సందర్భాన్ని బట్టీ, అవసరమైతే వెనకటి విషయాల్లో చిన్న చిన్న సవరణలు అవసరమవుతాయి.)

### 2. వర్తక క్రమం లో:

సరుకుని అమ్మే పనుల కోసం అవసరమయ్యే 10 పెట్టుబడిని వర్తకుడే పెడతాడు. ఈ పెట్టుబడీ, దాని లాభమూ, సరుకు ద్వారా వర్తకుడికే వస్తాయి.

### 3. స్టోరూ, రవాణా - వంటి క్రమాల్లో:

ఈ 15 పెట్టుబడిని కూడా వర్తకుడే పెడతాడు. ఈ పెట్టుబడీ, దాని లాభమూ కూడా సరుకు ద్వారా వర్తకుడికి వస్తాయి.

చివరికి సరుకుని, వర్తకుడు, వాడకందార్లకు అమ్మే ధర ఇలా వుంటుంది:

| | | | | |
|---|---|---|---|---|
| సరుకుని కొన్న పెట్టుబడి | 110 | + లాభం | 11 | =121 |
| వర్తక పెట్టుబడి | 10 | + లాభం | 1 | = 11 |
| స్టోరూ, రవాణాలపెట్టుబడి | 15 | + లాభం | 1 | =16 |
| | | చివరికి, సరుకు ధర | | = 148 |

వర్తకుడు, ఆ చివరి ధరకి సరుకుని అమ్మి, తన పెట్టుబడులు తను వెనక్కి తీసుకుని, వాటి మీద జనరల్ లాభాలు కూడా తీసుకుంటాడు.

ఇక్కడ మనం ఈ విషయాల్ని రక రకాలుగా ప్రశ్నలు వేసుకుని, ఇంకా వివరాలతో అర్థం చేసుకోవాలి.

ఉత్పత్తి క్రమంలో తయారైనప్పుడు, బట్టకి 132 ధర వున్నట్టుగా చెప్పుకున్నాం. ఆ 132 అనేది, ఆ సరుకుకి 'విలువ' అవుతుందా, 'ఉత్పత్తి ధర' అవుతుందా? - ఉత్పత్తి ధరే అవుతుంది. ఎందుకంటే: ఉత్పాదక పెట్టుబడి దారుడైనా, వర్తకుడైనా సరుకు

ధరని నిర్ణయించేటప్పుడు, (1) తన పెట్టుబడినీ, (2) దాని మీద లాభాన్నీ - ఈ 2 అంశాల తోటే ధరని నిర్ణయిస్తారు. అందుకే అది ఉత్పత్తి ధరే గానీ, విలువ అవదు.

ఉత్పత్తి క్రమం నించి బయటపడ్డ సమయంలో సరుకుకి వున్న ధర 1వ, 2వ క్రమాల మొత్తం. అంటే, 121 + 11 = 132. ఇది ఎలా వచ్చిందంటే, 100 ఉత్పాదక పెట్టుబడి, 32 అదనపు విలువని ఇవ్వడం వల్ల వచ్చింది. ఆ రెండూ కలిసి 132 అయింది. 132 ధర గల సరుకుని వర్తకుడు 110తో మాత్రమే, అంటే 22 తగ్గించి (22 కమిషన్‌తో) కొన్నాడు. అంటే, వర్తకుడు కొన్న 110 మీద ఇంకా 22ని చేర్చడానికి అవకాశం వుందన్న మాట. 22 చేర్చి, దాన్ని 132కి అమ్మితే, అది ఉత్పత్తి క్రమం లోనే ఏర్పడిన ధర అవు తుంది.

వర్తకుడు, బట్టని 110తో కొన్న తర్వాత, దానికి ఇంకా 22ని చేర్చడానికి అవకాశం వుంది కదా? ఆ 22ని, వర్తకుడు, ఏ యే అంశాల పేర్లతో చేరుస్తాడు?

వర్తకుడు బట్టని కొనడానికి 110 పెట్టుబడి పెట్ట డమే గాక, 'వర్తకం పనుల' కోసం ఇంకో 10 పెట్టు బడి కూడా పెడతాడు కదా? ఈ 2 పెట్టుబడుల్నీ, వాటి లాభాల్నీ కలిపితే, 110 + 11 + 10 + 1 = 132. ఈ రకంగా, 110తో కొన్న సరుకు మీద వర్తకుడు, ఇంకా 22 ని చేర్చగలుగుతాడు. (స్టోరు, రవాణాల 16 కూడా కలిస్తే, సరుకుని అమ్మే ధర 148 అవు తుంది.)

ఇక్కడ గ్రహించవలసిన విషయం - వర్తకుడికి వచ్చిన 22 కమిషను, ఎన్ని భాగాలు అయింది? - 3 భాగాలు అయింది.

1. ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి సరుకుని కొనడానికి పెట్టిన పెట్టుబడి మీద రావలసిన జన రల్ లాభం. ఇది 11.
2. వర్తక పెట్టుబడి. ఇది 10.
3. వర్తక పెట్టుబడి మీద రావలసిన జనరల్ లాభం. ఇది 1.

ఈ 3 అంశాలూ కలిసి 22. వర్తకుడికి వచ్చిన 'కమిషను', ఈ 3 అంశాల్నీ ఇచ్చింది. అంటే వర్తక కమిషను అనేది, 3 అంశాల్ని ఇచ్చేదిగా వుంటుందన్న మాట!

మళ్ళీ క్లుప్తంగా ధర సంగతి:

ఉత్పత్తి క్రమం నించి బయటపడ్డప్పటి ధర - 132
దాన్ని వర్తకుడు కొన్న ధర - 110
చివరికి వర్తకుడు అమ్మిన ధర - 132

వర్తకుడి దగ్గిర జరిగే స్టోరూ రవాణా క్రమాలు వేరే ఉత్పత్తి క్రమాలు కాబట్టి, వాటిని ఇక్కడ కలపడం లేదు. అవి కూడా కలిస్తే, ధర ఇంకా పెరుగుతుందనీ, అదే వాడకం దార్లకు అమ్మే చివరి ధర అవుతుందనీ, ఇంతకు ముందే చూశాం.

ఇక్కడ ఉత్పాదక పెట్టుబడి దారుడికీ, వర్తకుడికీ వుండే సంబంధాల గురించీ, 'వర్తక కమిషన్' గురించీ మాత్రమే చూస్తున్నాము. అందుకే, 1వ, 2వ క్రమాల వరకే తీసుకుని, ఆ 132 ధరనే వర్తకుడు అమ్మే చివరి ధరగా చెప్పుకున్నాము. ఆ ధరలోకి, 3 వ క్రమాన్ని ఇంకా కలప లేదని అర్థం చేసుకోకపోతే, "132 ధరే వర్తకుడు అమ్మే చివరి ధర ఎలా అవుతుంది?" అనే సందేహం వస్తుంది. దీన్ని సరిగా అర్థం చేసుకుంటే ఆ సందేహానికి అవకాశం వుండదు.

అయితే, 'వర్తక పెట్టుబడి' విషయాన్ని ఎవరైనా తప్పుగా అర్థం చేసుకుని, బట్టకి 132 ధర ఏర్పడిన క్రమాన్ని ఇలా వివరిస్తారనుకుందాం: ఉత్పత్తి క్రమం నించి బయటపడే సమయానికి బట్ట ధర 132 కాదు, 110 మాత్రమే. అప్పటికి దాని పూర్తి ధర అదే. దాన్ని ఉత్పాదక పెట్టుబడి దారుడు వర్తకుడికి పూర్తి ధరకే (110 కి) అమ్ముతాడు. అందులో నించి బట్ట పెట్టు బడి దారుడు 10 లాభం సంపాదిస్తాడు. వర్తకుడు, ఆ బట్టని, ఒక వారంలో, మళ్ళీ అమ్ముతాడు. ఆ పనిలో వర్తకుడు, 10 వర్తక పెట్టుబడి కూడా పెడతాడు. కాబట్టి, వర్తకుడు దాన్ని వాడకం దారులకు అమ్మే ధర = మొదట సరుకుని కొన్న 110 + దాని మీద లాభం 11 + వర్తక పెట్టుబడి 10 + దాని లాభం 1 = 132 అవుతుంది. అంటే, వర్తకుడు అమ్మే 132 ధర, సరు కుకి వర్తక ఖర్చులన్నీ కూడా చేరడం వల్ల ఏర్పడిందే గానీ, ఉత్పత్తి క్రమం లోనే ఏర్పడింది కాదు. కాబట్టి, వర్తక క్రమం, సరుకుకి 'విలువ'ని చేర్చదనీ, బట్టని వర్తకుడు కొనక ముందే దాని ధర 132గా వుందనీ అనడం కరెక్టు కాదు. వర్తకుడు కొన్నప్పుడు సరుకు ధర 110 మాత్రమే గానీ అంతకన్నా ఎక్కువ కాదు" - ఇలా ఎవరైనా వాదిస్తారను కుందాం. ఇది సరైనదేనా?

**జవాబు:** ఆ వాదం సరైనది కాదు. ఉత్పత్తి క్రమం నించి బయటపడే సమయానికి ఆ బట్ట ధర

110 మాత్రమే అయితే, బట్ట పెట్టుబడి దారుడు, ఆ సరుకుని ఆ ధర తోటే వర్తకుడికే గాక వాడకం దార్లకు కూడా ఇస్తాడా? అప్పటికి సరుకు పూర్తి ధర 110 మాత్రమే అయితే, ఆ లెక్క తోటే సరుకుని ఎవరు అడిగితే వాళ్ళకి ఇవ్వాలి కదా? అలా ఇస్తాడా?

"ఆఁ, సరుకు పెట్టుబడి దారుడు, ఆ ధరకే ఎవరి కైనా ఇస్తాడు" అంటారా?

అలాగైతే, ఆ సరుకు, బట్ట వాడి దగ్గిర ఎవరి కైనా 110 కే దొరుకుతుందన్న మాట! అలాంటప్పుడు, దాన్ని వాడకం దార్లు వర్తకుడి దగ్గిర 132 కి ఎందుకు కొనాలి? అదే సరుకు ఉత్పాదక పెట్టుబడి దారుడి దగ్గిర 110 కే దొరుకుతోంటే, దాన్ని వర్తకుడు ఇంకా 22 ఎక్కువతో, 132 కి ఎలా అమ్మగలుగుతాడు? (2 చోట్లా స్టోరూ రవాణాల్ని కూడా కలిపి చూస్తే, అప్పుడు కూడా ఉత్పాదక పెట్టుబడిదారుడి ధర కన్నా, వర్తకుడి ధర 22 ఎక్కువగా వుంటుంది.) ఇంకో చోట తక్కువ ధరతో దొరికే సరుకుని, వర్తకుడి దగ్గర ఎక్కువ ధరతో వాడకందార్లు ఎందుకు కొంటారు?

లేదా, బట్ట పెట్టుబడి దారుడు, సరుకుని 110 ధరతో, వర్తకుడికే గానీ, వాడకం దార్లకు ఇవ్వడను కుందాం. మరి, ఎందుకు ఇవ్వడు? ఆ సరుకుకి పూర్తి ధర అదే అయితే, ఆ ధరని ఎవరు చెల్లిస్తే వాళ్ళకి సరుకుని ఇవ్వవలసిందే కదా? సరుకుని ఉత్పత్తి చేయించేది అమ్మడానికే కదా? మరి ఆ సరుకుని అడిగే వాళ్ళందరికీ ఆ ధర తోటే ఎందుకు ఇవ్వడు?

వాస్తవం ఏమిటంటే, సరుకు వాడు, తన సరుకుని వర్తకుడికి ఏ ధరతో ఇస్తాడో ఆ ధరతో వాడకం దార్లకు ఇవ్వడు. ఎందుకంటే, వర్తకుడు, సరుకుని మళ్ళీ అమ్మాలి. ఆ అమ్మకం పనుల కోసం వర్తకుడికి చాలా ఖర్చులు అవుతాయని సరుకు వాడికి తెలుసు.

ఒక వేళ, సరుకు వాడే వాడకం దార్లకు సరుకుల్ని ఇవ్వాలంటే, అప్పుడు కూడా వర్తకం పనుల కోసం ఆ ఖర్చులన్నీ అవుతాయి. ఆ ఖర్చుల్ని కూడా కలిపి (ఈ ఉదాహరణలో 22 ని కూడా కలిపి), ఆ సరుకుని 132 కి ఇవ్వాలి. వర్తకుడికి ఇచ్చేటప్పుడైతే, అప్పటికి ఇంకా వర్తకం పనులు జరిగి వుండవు కాబట్టీ, ఆ ఖర్చులన్నీ వర్తకుడి దగ్గిరే జరుగుతాయి కాబట్టీ, ఆ సరుకు, వర్తకుడికి 110 కే వస్తుంది. ఆపైన, వర్తకుడు, 22 ని కూడా కలిపి, చివరికి దాన్ని 132 కి అమ్ముతారు. వాడకందార్లు ఆ సరుకుని, సరుకు వాడి దగ్గిరే కొనాలన్నా, లేదా వర్తకుడి దగ్గిర కొనాలన్నా, ఆ 132 తో కొనవలసిందే.

సారాంశం ఏమిటంటే, ఉత్పత్తి క్రమం నించి బయట పడ్డప్పుడు బట్ట ధర, 132 యే గానీ, 110 కాదు. ఆ 132 అంతా ఉత్పత్తి క్రమంలో ఏర్పడ్డదే. అందులో నించే కొంత భాగాన్ని (22 ని), వర్తకం అంశాల కోసం ఖర్చు పెడతారు. ఆ వర్తకం పనులు, సరుకు వాడి ద్వారా జరిగినా, లేదా వర్తకుడి ద్వారా జరిగినా, ఆ సరుకుని అమ్మే ధర 132 గానే వుంటుంది.

సరుకు పెట్టుబడి దారుడు, వర్తకుడికి ఇచ్చిన 110 ధరని, 'ఉత్పాదక పెట్టుబడి దారుడి ఉత్పత్తి ధర' అనవచ్చు. ఎందుకంటే, పెట్టుబడి దారుడు, ఆ సరుకుని మళ్ళీ ఉత్పత్తి చెయ్యాలంటే, ఆ ధర (పెట్టుబడినీ, లాభాన్నీ ఇచ్చే ధర) వుండి తీరాలి. అందుకే అది, పెట్టుబడిదారుడి ఉత్పత్తి ధర. లేదా, పారిశ్రామిక ధర. (ప్రొడక్షన్ ప్రైస్, లేదా, ఇండస్ట్రియల్ ప్రైస్.)

ఆ ఉత్పత్తి ధరకి (110కి), వర్తక కమిషన్‌ని కూడా కలిపితే (22ని కలిపితే), వచ్చే 132 ధర - వర్తకుడు అమ్మే వర్తక ధర (మర్కంటైల్ ప్రైస్, లేదా, మార్కెట్ ప్రైస్.) ఈ వర్తక ధర, సరుకుకి, ఉత్పత్తి క్రమంలో ఏర్పడేదే గానీ, వర్తక క్రమంలో ఏర్పడేది కాదు.

వర్తకుడు అమ్మే ధరని, కొన్ని గుర్తులతో ఇలా చెప్పవచ్చు.

1. వర్తకుడు కొన్న ధర - 110. గుర్తు B.
2. B మీద జనరల్ లాభం - 11. గుర్తు P.
3. వర్తక పెట్టుబడి - 10. గుర్తు K.
4. K మీద జనరల్ లాభం - 1. గుర్తు P.

సరుకు ధర = B + P + K + P

(ఈ గుర్తులు మార్క్సు వాడినవే. ఈ అక్షరాలు, కేవలం పొడి పొడి అక్షరాలు మాత్రమే. ఈ అక్షరాల వెనక 'మాటలు' ఏమీ లేవు.)

చివరికి వర్తకుడు అమ్మే ధర:

B + P + K + P

110 + 11 + 10 + 1 = 132

లేదా, B + K + B, K ల మీద లాభాలు

110 + 10 + 11 + 1 = 132.

రాసుల్ని ఎలా కలిపినా, 'మొత్తం' ఒకటే.

వాడకం దార్లు అందరూ ఒక సరుకుని 132 కి కొంటూ వుండగా, ఏ వాడకం దారుకైనా, ఆ సరుకు,

ఉత్పాదక పెట్టుబడి దారుడి దగ్గిర గానీ, వర్తకుడి దగ్గిరే గానీ, 130 కే దొరికితే, దాని అర్థం ఏమిటి? ఆ వాడకం దారుడికి కూడా కొంత 'కమిషన్' దొరికిందని మాత్రమే. అంతే గానీ, 'సరుకు ధర తగ్గింది' అని అర్థం కాదు.

**అప్పుడు,**
**విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా;**
**ఇప్పుడు, ఉత్పత్తి ధరా - వర్తక ధరా;**
**వీటి సంబంధాలు ఏమిటి?**

ఇక్కడ 'ధర' అనే దాన్ని గురించి గతంలో చూసిన ఒక విషయం గుర్తు చేసుకోవాలి. ఈ సంపుటం లోనే 'పెట్టుబడిదారీ ధర' చాప్టరులో, సరుకుకి వున్న 'అసలు విలువ' జనరల్ లాభం రేటు సూత్రం వల్ల 'ఉత్పత్తి ధర'గా మారుతుందనీ, అది మళ్ళీ సరుకు సప్లై డిమాండ్ల వల్ల 'మార్కెట్ ధర'గా మారుతుందనీ, చూశాం. అంటే అక్కడ, విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా అనే 3 దశల ద్వారా ధరని చూశాం. కానీ ఇప్పుడు 'సరుకుని ఉత్పత్తి చేయించే పెట్టుబడి దారుడికి రావలసిన ఉత్పత్తి ధర' అనీ, (లేదా 'పారిశ్రామిక ధర' అనీ), 'వర్తక ధర' అనీ, ఇలా కొత్త కొత్త మాటలు కూడా చూస్తున్నాం. ఈ విషయాలన్నిటినీ గందరగోళ పడకుండా అర్థం చేసుకోవాలి.

ఎన్ని కొత్త మాటలు చూసినా, అన్నీ కలిసి 'విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా' అనే 3 అంశాలకే సంబంధించి ఉంటాయి. కాబట్టి, ఈ క్రమాన్నే సరిగా అర్థం చేసుకోవాలి.

గతంలో చూసింది ఏమిటంటే:

మొదట, ఉత్పాదక పెట్టుబడిని మాత్రమే తీసుకున్నాం. అప్పటికి ఇంకా 'వర్తక పెట్టుబడి'ని చూడ లేదు. అప్పుడు, సరుకు ధరని, 'విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా' అనే క్రమంలో చూశాం. వీటిలో 'విలువ' అయితే, ఎప్పుడూ కనపడదు. దీన్ని గురించి పెట్టుబడి దారుడికి తెలీదు. వాడికి, 'పెట్టుబడి' మీద కొంత లాభం వేసుకుని నిర్ణయించే 'ఉత్పత్తి ధరే' మొదట కనపడుతుంది. సరుకుని ఆ ఉత్పత్తి ధరతో మార్కెట్‌లో పెట్టిన తర్వాత, అక్కడ సరుకు సప్లై డిమాండ్లని బట్టి, ఆ ధర కొంచెం ఎక్కువో తక్కువో అవుతుంది. అది - మార్కెట్ ధర. చివరికి అమ్ముడు పోయే ధరే - మార్కెట్ ధర. సప్లై డిమాండ్లు సమానంగానే వుంటే, ఉత్పత్తి ధర ఏమీ మారకుండా అదే మార్కెట్ ధరగా వుంటుంది.

ఉదాహరణ ఇలా ఉందనుకుందాం: ఉత్పాదక పెట్టుబడి 100. సరుకుకి అసలు విలువ 134. సరుకులో నిజమైన అదనపు విలువ 34. సరుకు ఉత్పత్తి ధర 132. s d లు సమానంగా ఉండడం వల్ల ఉత్పత్తి ధరే మార్కెట్ ధరగా ఉంది.

ఆ క్రమం ఇలా ఉంటుంది:

విలువ - ఉత్పత్తి ధర - మార్కెట్ ధర
134 - 132 - 132

'విలువ' కనపడదు కాబట్టి, దాన్ని వదిలేద్దాం. 'ఉత్పత్తి ధర' నించే తీసుకుందాం. అది 132. అందులో వున్న అదనపు విలువ 32. గతంలో, ఇంత వరకూ చూశాం.

ఇప్పుడు చూస్తున్నది దాని కొనసాగింపే. ఆ 132 విషయమే. ఇప్పుడు ఉత్పాదక పెట్టుబడీ, వర్తక పెట్టుబడీ - అనే విభజనతో చూస్తున్నాము కాబట్టి, 'సరుకు ధర'ని (132 ని), ఆ పెట్టుబడులకు తగిన విధంగా 2 దశలుగా విభజిస్తున్నాము.

గతంలో 'మార్కెట్ ధర' అని దేన్ని చెప్పుకున్నామో, ఆ ధరే (132) ఇప్పుడు కూడా చివరికి కనపడాలి.

సరుకుకి 134 విలువ వుందనే విషయం ఆ పెట్టుబడి దారుడికి కూడా తెలీదు కాబట్టి, తన లెక్కల ప్రకారం మొదట 132 ఉత్పత్తి ధరని నిర్ణయించి, తర్వాత అందులో నించి తనకు రావలసిన భాగంగా 110ని లెక్క కడతాడు. ఆ తర్వాత సంగతి తెలిసిందే.

'విలువ' నించీ మార్కెట్ ధర వరకూ మొత్తం క్రమం:

1. సరుకు విలువ --------- 134
2. సరుకు వాడు నిర్ణయించిన ఉత్పత్తి ధర ----------- 132
3. సరుకు వాడి దగ్గిర, వర్తకుడు కొనే ధర ------- 110
4. వర్తకుడు అమ్మే మార్కెట్ ధర ------- 132

సరుకు s d లు తేడాగా వుంటే, మార్కెట్ ధర 132గా గాక, కొంచెం ఎక్కువో తక్కువో కావచ్చు.

సరుకు వాడి ధరా, వర్తక ధరా, ఒకటి కావు. మొదటిది - వర్తకుడు కొనే ధర. రెండోది, వాడు అమ్మే ధర. కొనే ధర కన్నా అమ్మే ధర తప్పని సరిగా ఎక్కువగా

వుంటుంది. చివరికి అమ్మే ధరని, 'మార్కెట్ ధర'గా తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.

కానీ, 'ఉత్పత్తి ధర'ని అర్థం చేసుకోవడానికే కొంత గందరగోళంగా ఉంటుంది. సరుకుకి మొట్ట మొదట ఉండే 132 ధరనీ 'ఉత్పత్తి ధర' అంటాం; వర్తకుడికి ఇచ్చే 110 ధరనీ 'ఉత్పత్తి ధర' అంటాం. కాబట్టి, 'ఉత్పత్తి ధర' అన్నప్పుడు, ఏ సందర్భం గురించి చూస్తున్నామో ఆ సందర్భాన్ని బట్టి దాన్ని అర్థం చేసుకోవాలి.

వెనక చాప్టర్లలో చూసిన విషయాల్ని, తర్వాత చాప్టర్లలో చూసే విషయాలతో సమన్వయ పరచుకుంటూ, దానికి తగిన మార్పులు చేసుకుంటూ అర్థం చేసుకుంటూ వుండాలి.

ఒక్క వర్తకుడినే గాక, సమాజంలో వున్న మొత్తం వర్తకులందర్నీ తీసుకుంటే, వర్తకులందరి ద్వారా ఎప్పటికప్పుడు అన్ని శాఖల సరుకులూ అమ్ముడవుతూ వుంటాయి. అంటే, ఉత్పత్తి స్థలాల్లో తయారైన సరుకులు, 'మార్కెట్' ద్వారా వాడకం దార్లకి, (పెట్టుబడి దార్లకీ, కార్మికులకూ కూడా) అందుతూ వుండడమూ, మళ్ళీ ఉత్పత్తి స్థలాల్లోకి కొత్త ఉత్పత్తి సాధనాలు చేరుతూ వుండడమూ, దేని దారిన అవి జరిగి పోతూ వుంటాయి.

# 'వర్తక పెట్టుబడి' అంటే ఏమిటి?

**'చ**లామణీ క్రమాన్ని' నిర్వహించవలసిన వర్తకుడు, మొత్తం 3 క్రమాల మీద (సరుకుని కొనడానికీ, స్టోరేజీ రవాణా క్రమాలకీ, వర్తక క్రమానికీ) పెట్టుబడులు పెట్టవలసి వుంటుందని చూశాం. ఈ 3 పెట్టుబడుల్లో ఏది లేకపోయినా వర్తకుడు పని చెయ్యలేడు. 'వర్తకం' చెయ్యాలంటే, ఈ 3 పెట్టుబడులూ పెట్టవలసిందే.

అయితే, ఈ పెట్టుబడి అంతా 'వర్తక పెట్టుబడి' కాదు. ('అంతా అనుత్పాదక పెట్టుబడి' కాదు.)

మొదటి క్రమంలో పెట్టే పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి దారుడి నించీ సరుకుని కొంటుంది. ఈ సరుకుని కొనడం, 'ఉత్పత్తి క్రమం' కాదు. కానీ, ఈ పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి దారుడికి అందిన తర్వాత, దానితో అక్కడ 'పునరుత్పత్తి క్రమం' నడుస్తుంది. అంటే, ఒక సరుకు తయారవ్వాలంటే, దానికి సంబంధించిన పెట్టుబడిలో కొంత భాగాన్ని, వర్తకుడు కూడా పెట్టుకుంటాడని అర్థం. ఆ ఉత్పత్తి క్రమం, ఆ వర్తకుడి ద్వారా జరగక పోయినా, వర్తకుడికి, ఆ పెట్టుబడి మీద కూడా లాభం వస్తుంది.

సరుకుని కొన్న తర్వాత జరిగే స్టోరేజీ రవాణాల క్రమంలో పెట్టుబడి, 'ఉత్పాదక పెట్టుబడే.' ఈ ఉత్పత్తి క్రమాలు, వర్తకుడి ద్వారానే జరుగుతాయి.

చివరి క్రమంలో (సరుకుని అమ్మే క్రమంలో) పెట్టుబడి మాత్రమే, 'అనుత్పాదక' పెట్టుబడి. ఇది, మారకం పనులు చేసే పెట్టుబడి. ఇదే అసలైన వర్తక పెట్టుబడి. (ప్యూర్ చలామణీ ఖర్చులు.) అయితే, ఈ వర్తక పెట్టుబడి విడిగా పని చెయ్యదు. 'మారకం' అనే అనుత్పాదక క్రమం, స్టోరేజీ - రవాణాల - వంటి ఉత్పాదక క్రమాలతో అల్లుకు పోయి వుంటుంది. అంటే, వర్తకుడి దగ్గిర, అనుత్పాదక క్రమమే గాక, ఉత్పాదక క్రమాలు కూడా జరుగుతాయి.

వర్తక క్రమానికి సంబంధించిన పెట్టుబడి మాత్రమే వర్తక పెట్టుబడి. అయినప్పటికీ, వర్తకుడు 3 క్రమాల మీదా పెట్టే పెట్టుబడి అంతా 'వర్తక పెట్టుబడి' లాగే కనపడుతుంది. ఎందుకంటే, దాన్ని వర్తకుడు పెడతాడు కాబట్టి. కానీ, ఏ పెట్టుబడి ఎలాంటిదో అర్థం చేసుకోవాలంటే, 'దాన్ని ఎవరు పెడుతున్నారు' అని కాదు, 'ఏ పని కోసం పెడుతున్నారు' అనేది చూడాలి. ఉత్పాదక పెట్టుబడి దారుడు కొంత పెట్టుబడిని అమ్మకం పనుల మీద పెట్టవచ్చు. లేదా, వర్తకుడు, కొంత పెట్టుబడిని, ఉత్పాదక పనుల మీద పెట్టవచ్చు. కాబట్టి, ఒక పెట్టుబడి ద్వారా, ఏం పని జరుగుతోందీ అనేది ముఖ్యం.

ఉత్పాదక పెట్టుబడిదారుణ్ణీ, వర్తకుణ్ణీ కలిపి చూస్తే, వాళ్ళు పెట్టే మొత్తం పెట్టుబడుల్లో, అమ్మకం పనుల్లో వుండే పెట్టుబడి తప్ప, మిగిలినదంతా ఉత్పాదక పెట్టుబడే. అయితే, అమ్మడాలూ కొనడాలూ తప్పనిసరి అయ్యే సమాజంలో, ఉత్పాదక పెట్టుబడి ఎంత అవసరమో, వర్తక పెట్టుబడి కూడా అంత అవసరమే.

వర్తక పెట్టుబడి అనే దానికి ఇంగ్లీషులో, చాలా పేర్లు వున్నాయి. మర్చంట్ పెట్టుబడీ, కమర్షియల్ పెట్టుబడీ, ట్రేడింగ్ పెట్టుబడీ, మర్కంటైల్ పెట్టుబడీ - ఇలా. దీన్ని ఏ పేరుతో ప్రస్తావించినా, అమ్మకాలూ

కొనుగోళ్ళూ చేసేదే వర్తక పెట్టుబడి.

పెట్టుబడిదారీ దృష్టిలో - ఉత్పత్తి రంగానికీ, వర్తక రంగానికీ వుండే తేడా ఎలాంటిదంటే, ఉత్పత్తి రంగం లోనే ఒక శాఖకీ, ఇంకో శాఖకీ, వుండే తేడా లాంటిది. బట్ట శాఖా, బొగ్గు శాఖా - వేరు వేరు పనులు చేస్తూ వున్నట్టు గానే, ఉత్పత్తి రంగమూ, వర్తక రంగమూ - వేరు వేరు పనులు చేస్తూ వుంటాయని వాళ్ళ అర్థం. ఏ రంగంలో పని చేసే పెట్టుబడి అయినా లాభాన్ని తేవాలి. ఉత్పాదక, వర్తక రంగాలు రెండూ లాభాల్ని తెస్తాయి కాబట్టి, రెండూ ఒకటే.

'వర్తక పెట్టుబడి' గురించి మార్క్సు మాటలు కొన్ని విందాం:

"వర్తకుడు చేసే పనులు, ఏ సందర్భంలో నైనా ఉత్పత్తి దారుని సరుకును డబ్బుగా మార్చడం కోసం చేసే పనులే తప్ప ఇంకేమీ కావు."

[కాపిటల్ -3, మాస్కో, పే. 270]

"చలామణీ పరిధిలో మాత్రమే పని చేసే పెట్టు బడే మర్చంటు పెట్టుబడి. చలామణీ క్రమం అనేది, మొత్తం పునరుత్పత్తి క్రమంలో ఒక దశ. కానీ, చలా మణీ క్రమంలో ఏ విలువా ఉత్పత్తి కాదు. కాబట్టి అదనపు విలువ కూడా ఉత్పత్తి కాదు."

[కాపిటల్ - 3; 279]

"మర్చంటు పెట్టుబడి, విలువని గానీ, అదనపు విలువని గానీ ఉత్పత్తి చెయ్యదు."

[కాపిటల్ - 3; 280]

"మర్చంటు పెట్టుబడి అదనపు విలువని ఉత్పత్తి చెయ్యదు కాబట్టి, సగటు లాభం రూపంలో అది జేబులో వేసుకునే అదనపు విలువ, మొత్తం ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ లోనే ఒక భాగమై తీరాలి." [కాపిటల్ - 3; 282]

పెట్టుబడి దారీ దృష్టికి, ఉత్పాదక - వర్తక పెట్టు బడుల మధ్య ఈ తేడా లేవీ వుండవు.

## చవకా, ప్రియమూ- అనేవి, వర్తకుడికి వర్తించవు:

'వర్తకం' అనేది, వెనకటి సమాజాల నించీ కూడా వుంది. సమాజంలో, 'పెట్టుబడి' అనేది మొదట - వర్తక పెట్టుబడే. వర్తకుడు సరుకుల్ని మొదట తక్కువ ధరకి 'చవగ్గా' కొంటున్నట్టూ, దాని మీద కొంత లాభం తనే కలుపుకొని, తర్వాత ఆ సరుకుల్ని ఎక్కువ ధరతో 'ప్రియంగా' అమ్ముతున్నట్టు - ఆ రకం గానే లాభం సంపాదిస్తున్నట్టు, పైకి కనపడుతుంది. నిజానికి, వర్తకుడు కొనేది - చవక ధరా కాదు; అమ్మేది ప్రియం ధరా కాదు; లాభంగా వచ్చింది, వూరికే వేసుకున్నదీ కాదు. అదంతా, ఉత్పాదక క్రమానికీ, వర్తక క్రమానికీ మధ్య తప్పనిసరి అయ్యే ఏర్పాటు మాత్రమే.

ఉత్పత్తి క్రమంలో నించి బయటపడే సమయా నికి 132 ధర గల సరుకుని, ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి, ఒక వాడకం దారు 131కి కొంటే, అది 'చవకగా' కొన్నట్టే. కానీ అదే సరుకుని, వర్తకుడు 110కి కొన్నా, అది చవకగా కొన్నట్టు కాదు. అలాగే, తర్వాత మళ్ళీ దాన్ని వర్తకుడు 132కి అమ్మితే అది ప్రియంగా అమ్మినట్టూ కాదు. అది - పెట్టుబడుల్నీ, లాభాల్నీ తీసుకోవడానికి అవసరమయ్యే కార్యక్రమం మాత్రమే. కాబట్టి, 'చవకా, ప్రియమూ' అనే మాటలు వర్తకుడి విషయంలో వర్తించవు.

ఒక వర్తకుడికి సరుకు ఎప్పుడైనా వర్తక కమిషన్ కన్నా కూడా కొంత చవకగా దొరికితే దొరకవచ్చు. ప్రతి సారీ అలాగే జరగదు. ప్రతీ వర్తకుడికీ అలాగే జరగదు.

కానీ, వర్తకుడు - తను 'కొన్న ధర' మీద ఇంకా కొంత కలుపుకుని ఆ సరుకుని కొన్న ధర కన్నా ఎక్కువ ధరకి అమ్మి లాభం తీసుకోవడం, అందరికీ కళ్ళ ఎదట కనపడుతూ వుంటుంది. కాబట్టి, 'లాభం' అనేది, మొదట పెట్టిన పెట్టుబడి మీద కొంత వేసు కోవడం వల్లనే వస్తుంది - అనే అభిప్రాయం సమా జంలో, మొదట వర్తక పెట్టుబడిని చూడడం ద్వారానే ప్రారంభమయింది. అంటే, లాభం అనేది, అమ్మకాల పని జరిగే చలామణీ క్రమం నించే వస్తుంది - అని!

మార్క్సు మాటల్లో: "నిజమైన ఆధునిక ఆర్థిక శాస్త్రం, ఎప్పుడు మాత్రమే ప్రారంభమవుతుందంటే - సిద్ధాంత పరిశీలన అనేది, 'చలామణీ క్రమం' నించి, 'ఉత్పత్తి క్రమానికి' మళ్ళినప్పుడు మాత్రమే" - [కాపి టల్ - 3, పేజీ 337, మాస్కో ఎడిషన్, 1971.]

అంటే లాభ రహస్యం కోసం, ఉత్పత్తి రంగం లోనే వెతకాలని అర్థం. లాభానికి నిజమైన మూలాన్ని గ్రహించినప్పుడే, నిజమైన ఆర్థిక శాస్త్రం ప్రారంభమై నట్టు అవుతుంది - అంటున్నాడు మార్క్సు.

## 'ధర' మారితే?

సరుకుకి ఒక ధర వుంటూ వుండగా, కొన్ని కార ణాల వల్ల ఆ ధర మారవచ్చు. 'ధర'లో మార్పు,

వర్తకుడు సరుకుని ఇంకా కొనక ముందు గానీ, కొన్న తర్వాత గానీ, ఎప్పుడైనా జరగవచ్చు. సరుకుని ఇంకా కొనక ముందే ధర మారితే, ఆ మారిన ధర ప్రకారమే కమిషన్ వుంటుంది కాబట్టి, ఆ ధర మార్పు వల్ల వర్తకుడికి ప్రత్యేక లాభం గానీ, ప్రత్యేక నష్టం గానీ, వుండదు. సరుకుని కొన్న తరవాత ధర మారితే, ఆ మార్పుని బట్టి వర్తకుడి లాభం ఇంకా పెరగడమో, కొంత తగ్గడమో జరుగుతుంది.

సరుకుకి ఏ ధర వుంటుందో ఆ ధరకే అమ్మి నప్పుడు కూడా వర్తకుడికి ఆ ధరలో నించే 'జనరల్ లాభం' వుంటుంది. ఆ పైన కొన్ని 'వర్తక మోసాలు' చెయ్యగలిగితే, ఆ మోసాల ద్వారా సంపాదించేది, వర్త కుడికి 'సెకండరీ లాభం'గా వుంటుంది. మొదటి లాభానికి అవకాశం వుంటేనే, రెండో లాభానికి కూడా అవకాశం వుంటుంది.

అంటే సమాజంలో, ఒక వర్గం, శ్రమ చెయ్య కుండా ఇంకో వర్గాన్ని దోపిడీ చేస్తూ అదనపు విలువని పంచుకోవడం - అనే మొదటి పరిస్తితి ఉన్నప్పుడు, 'సెకండరీ లాభాలు సంపాదించడం' అనే రెండో పరిస్తితి కూడా ఉంటుంది.

'వర్తకం' ఉన్నంత కాలమూ, వర్తక మోసాలు కూడా వుంటాయి.

మొదటి పరిస్తితిని (దోపిడీ పరిస్తితిని) సవ్యంగా అరికట్టగలిగితే, ఆ మొదటి పరిస్తితి మీదే ఆధారపడి సాగే రెండో రకపు మోసాలూ, మూడో రకపు మోసాలూ, ఇక సాగలేవు.

# వర్తకుల్లో, చిన్నా, పెద్దా

వర్తకుల్లో అనేక స్థాయిల వాళ్ళు వుంటారు. వాళ్ళు ప్రధానంగా 3 రకాలు.

### 1. పెద్ద వర్తక పెట్టుబడిదారులు:

వర్తక కార్యకలాపాల్లో ఒక్క పని కూడా స్వయంగా చెయ్యకుండా ఆ పనులన్నీ 'ఉద్యోగు లతో' చేయించే వర్తకులు - పెద్ద వర్తక పెట్టుబడి దారులు. వీళ్ళు అసలు 'పని స్థలం'లో కూడా వుండరు. వీళ్ళ తరపున సూపర్ వైజర్లూ, మేనేజర్లూ, వర్తక కార్మికులతో పనులు చేయిస్తారు. ఈ పెట్టుబడి దారుల్లో కూడా చిన్నా పెద్దా తేడాలు వున్నప్పటికీ, సాధారణంగా పెద్ద వర్తక పెట్టుబడి దారులంతా, పెద్ద పెద్ద పెట్టుబడులతో పని చేస్తారు. వీళ్ళ వ్యాపారాలు ప్రధానంగా ఎక్కువ విలువ గల సరుకులకు సంబం ధించి వుంటాయి.

### 2. చిన్న వర్తక పెట్టుబడి దారులు:

వీళ్ళు పని స్థలం లోనే వుంటారు. వీళ్ళు కూడా ఏదో ఒక పని చేస్తారు. వీళ్ళల్లో కూడా చిన్నా పెద్దా తేడాలు వున్నా, వీళ్ళు సాధారణంగా తక్కువ పెట్టు బడితో పని చేస్తారు.

### 3. స్వతంత్ర వర్తకులు:

చెయ్యవలసిన పనులన్నీ 'కార్మికులు' లేకుండా, స్వయంగా చేసుకొనే వర్తకులు - 'స్వతంత్ర వర్తకులు'. చిన్న దుకాణం పెట్టుకుని, దానికి సంబంధించిన పను లన్నీ స్వయంగా చేసుకునే కుటుంబ వ్యక్తులూ, వీధుల్లో తిరిగి అమ్ముకునే వారూ, ఈ కోవలోకి వస్తారు. వీరిలో కూడా చిన్నా పెద్దా తేడాలు వుంటాయి. దుకాణం పెట్టుకుని అమ్ముకునే వారు కొంత ఎక్కువ పెట్టుబడితో పని చేస్తే, వీధుల్లో తిరిగి అమ్ముకునే వారు చాలా తక్కువ పెట్టుబడితో పని చేస్తారు.

ఈ రకంగా, వర్తకులు, ప్రధానంగా ఈ 3 రకా లుగా వుంటారు.

'వర్తకం' చేసిన దానికి ఫలితంగా మిగిలేది - 'వర్తక లాభం'. అది వర్తక పెట్టుబడి పరిమాణాన్ని బట్టే వుంటుంది. ఎక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభం. తక్కువ పెట్టుబడికి తక్కువ లాభం. కాబట్టి, ఎక్కువ పెట్టుబడులతో పని చేసే పెద్ద వర్తక పెట్టుబడి దారులు సంపాదించే వర్తక లాభం చాలా ఎక్కువ. చిన్న వర్తక పెట్టుబడి దారులు సంపాదించే వర్తక లాభం కొంత తక్కువ. స్వతంత్ర వర్తకులు సంపా దించే వర్తక లాభం, మరీ తక్కువ. అందులోనూ, వీధుల్లో తిరిగి అమ్ముకునే వారి వర్తక లాభం ఊహా తీతమైనంత తక్కువ.

ఒక సరుకుని అమ్మడం ద్వారా వచ్చే వర్తక లాభం, ఆ సరుకుకి సంబంధించిన 'అదనపు విలు

వలో భాగమే'నని చూశాం. వేల, లక్షల పెట్టుబడితో పని చేసే పెద్ద వర్తక పెట్టుబడి దారుడు సంపాదించే వర్తక లాభమైనా, 10 రూపాయల కన్నా తక్కువ పెట్టుబడితో పని చేసే అతి చిన్న స్థాయి స్వతంత్ర వర్తకులు సంపాదించే వర్తక లాభమైనా, వాళ్ళు అమ్మే సరుకు తాలూకు అదనపు విలువలో భాగమే. అయితే, ఆ 'వర్తక లాభాన్ని' సంపాదించడంలో వర్తక పెట్టుబడి దారుడికీ, స్వతంత్ర వర్తకుడికీ తేడా వుంది. అది, శ్రమ చెయ్యడమూ, శ్రమ చెయ్యక పోవడమూ - అనే తేడా.

ఏ వర్తకుడైనా, ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి సరుకుని 'కమిషన్‌తో' తీసుకోగానే, వెంటనే ఆ కమిషను భాగం, డబ్బుగా మారి వర్తకుడి చేతిలో పడిపోదు. సరుకుని అమ్మే పని పూర్తి అయితేనే, కమిషను, చేతికి అందుతుంది. సరుకుని అమ్మాలంటే అనేక రకాల 'వర్తక శ్రమలు' చెయ్యాలి. ఆ శ్రమలన్నీ చేసి, సరుకుని అమ్మితే, వర్తక ఖర్చులన్నీ పోగా, కమిషన్‌లో చివరి భాగం 'వర్తక లాభం'గా, మిగులుతుంది.

ఈ వర్తక లాభం రావడానికి జరగవలసిన శ్రమలన్నిటినీ, వర్తక పెట్టుబడి దారుడైతే కార్మికులతో చేయిస్తాడు. స్వతంత్ర వర్తకుడైతే తనే స్వయంగా చేస్తాడు. అంటే, వర్తక పెట్టుబడి దారుడు, ఏ శ్రమా చెయ్యకుండా 'వర్తక లాభం' సంపాదిస్తే, స్వతంత్ర వర్తకుడు - స్వయంగా శ్రమ చేసిన దానికి బదులుగానే వర్తక లాభం సంపాదిస్తాడు. కాబట్టి, స్వతంత్ర వర్తకుడు, ఇతరుల శ్రమని దోచుకుంటూ గాక, తన శ్రమ తోనే తను జీవిస్తున్నాడని అర్థం.

స్వతంత్ర వర్తకుల్లో, అతి చిన్న దుకాణ దారులూ, వీధుల్లో తిరిగి అమ్ముకునే వారూ, అతి నిరుపేదలుగా వుంటారు.

నిజానికి, స్వతంత్ర వర్తకులకు, వారి 'శ్రమ విలువ'లో కొంత భాగాన్ని లాగి వేసే యజమానులెవరూ వుండరు కాబట్టి, వారు సంపాదించ గలిగే వర్తక లాభం, వారి 'శ్రమ శక్తి విలువ'గా గాక 'శ్రమ విలువ' గానే వుండవచ్చు. కానీ, అలా జరగదు. ఎందుకంటే, (1) అదే సరుకుని అమ్మే దుకాణ దారులతో పోటీ, (2) చిన్న పెట్టుబడులతో పని చేసే వారికి ఖర్చులు ఎక్కువగా అవడమూ - వంటి కారణాల వల్ల. ఈ రకంగా, స్వతంత్ర వర్తకుల శ్రమలో చాలా భాగం వ్యర్థమై పోయి, వారి సంపాదన, 'శ్రమ శక్తి విలువ'గా కూడా వుండదు. వీరి ఆదాయాలతో (వీరికి మిగిలే 'వర్తక లాభం'తో), వీరికి కనీస అవసరాలు కూడా తీరవు.

వీధుల్లో తిరిగి అమ్ముకునే వారు, 'వర్తక శ్రమే' గాక, సరుకుల్ని వాడకం దార్ల ఇళ్ళ దగ్గిరికి తెచ్చే 'రవాణా శ్రమ' కూడా చేస్తున్నారని అర్థం. ఆ రవాణా శ్రమ ఉత్పాదక శ్రమే.

## వర్తకుల వరస:

ఉత్పాదక పెట్టుబడి దారుడి దగ్గిర తయారైన సరుకు, వాడకం దారులకు అందే దాకా ఒక్క వర్తకుడి ద్వారానే నడవక పోవచ్చు. సరుకుని మొదట కొన్న వర్తకుడు, దాన్ని మళ్ళీ ఇంకో వర్తకుడికి అమ్మవచ్చు. ఆ ఇంకో వర్తకుడు కూడా, దాన్ని మళ్ళీ మూడో వర్తకుడికి అమ్మవచ్చు. ఇలా, ఇద్దరు ముగ్గురు వర్తకుల ద్వారా, సరుకు, వాడకం దార్లకు చేరితే, దాని వల్ల విషయం ఏమీ మారదు. 'చలామణీ క్రమం' అంతా ఒక్క వర్తకుడి ద్వారానే జరిగితే, వర్తక కమిషన్ అంతా ఆ ఒక్క వర్తకుడికే అందుతుంది. లేదా, ఆ క్రమం ఎక్కువ మంది వర్తకుల ద్వారా జరిగితే, ఆ కమిషనే ఆ వర్తకులందరి మధ్యా పంపకాలు అవుతుంది. అంతే తేడా. వర్తకులు పెరిగినా కమిషను పెరగదు.

సరుకు చలామణీ కాలం, 1 వారం అనుకుందాం. అంటే సరుకుని 7 రోజుల్లో అమ్మాలి. సరుకుని ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి కొన్న మొదటి వర్తకుడు, దాన్ని 2 రోజుల తర్వాత ఇంకో వర్తకుడికి అమ్మితే, మొదటి వర్తకుడి పెట్టుబడి 2 రోజులకే వెనక్కి వచ్చేస్తుంది. కాబట్టి ఆ పెట్టుబడి మీద 2 రోజుల కమిషను మాత్రమే రావాలి. మొదటి వర్తకుడు, 2 వ వర్తకుడికి, 5 రోజుల కమిషన్‌ని వదిలే విధంగా సరుకుని అమ్ముతాడు. మొదటి వర్తకుడికి రావలసిన దాన్ని 2 వ వర్తకుడు చెల్లించి సరుకుని తీసుకుంటాడు. తర్వాత, 2 వ వర్తకుడు, 3 రోజుల తర్వాత సరుకుని మళ్ళీ 3 వ వర్తకుడికి అమ్మితే, 2 వ వర్తకునికి రావలసిన దాన్ని 3 వ వర్తకుడు చెల్లిం చేస్తాడు. చివరికి, ఆఖరి వర్తకుడు సరుకుని వాడకం దార్లకు 'మార్కెట్ ధర'కి అమ్మి అందులో నించి తను ఖర్చు పెట్టినదంతా వెనక్కి తీసుకుని, తన వర్తక లాభం కూడా తీసుకుంటాడు. ఈ వర్తకులందరి వర్తక కమిషన్‌లూ కలిసి, 'మొత్తం వర్తక కమిషన్'గా వుంటుంది. ప్రతీ వర్తకుడూ, తనకు వచ్చిన 'కమి

షన్‌లో నించే తన వర్తకం ఖర్చుల్ని వెనక్కి తీసుకుని, 'వర్తక లాభం' కూడా తీసుకుంటాడు.

ఉత్పాదక పెట్టుబడి దారుల దగ్గర తయారై వున్న సరుకు లన్నిటినీ మొదట పెద్ద వర్తక పెట్టుబడి దారులే కొంటారు. వీళ్ళు 'హోల్ సేల్' వర్తకులు. వాళ్ళ నించీ తర్వాత చిన్న వర్తక పెట్టుబడి దారులూ, మళ్ళీ వాళ్ళ నించీ ఇంకా చిన్న వర్తక పెట్టుబడి దారులూ, స్వతంత్ర వర్తకులూ, కొంటారు. వీళ్ళు 'చిల్లర' (రిటైల్) వర్తకులు.

కొన్ని రకాల సరుకులు పెద్ద వర్తక పెట్టుబడి దారుల ద్వారా మాత్రమే వాడకం దార్లకి చేరితే, కొన్ని రకాల సరుకులు చిన్న వర్తక పెట్టుబడి దారుల ద్వారానూ, స్వతంత్ర వర్తకుల ద్వారానూ చేరతాయి.

సమాజంలో వున్న 'మొత్తం ఉత్పత్తి రాసి'లో కొంత భాగాన్ని 'వర్తక లాభం'గా అనుకుంటే, అందులో చాలా ఎక్కువ భాగం, పెద్ద వర్తక పెట్టుబడి దారులకే అందుతుంది. చిన్న స్థాయి వర్తకులకు అందే లాభం భాగం అతి తక్కువ గానే వుంటుంది.

# వర్తక కార్మికులు

**వ**ర్తక పెట్టుబడి దారుల దగ్గిర పని చేసే ఉద్యోగులే - వర్తక కార్మికులు (కమర్షియల్ వర్కర్లు, లేదా మర్కంటైల్ వర్కర్లు.) వీరిలో మేనేజర్లూ, డైరెక్టర్లూ లాంటి 'కుర్చీల్లో కూర్చునే శ్రమ మాత్రమే చేసే ఉద్యోగులు' కార్మికుల కోవలోకి రారని వేరే చెప్పనక్కర లేదు. 'సరుకుని' కొని తెచ్చే వారూ, షాపుల్లో వుండి అమ్మే వారూ, బిల్లులు రాసే వారూ, ఉత్తర ప్రత్యుత్తరాల పనులూ - ఇతర 'బుక్ కీపింగ్' పనులూ చేసే గుమస్తాలూ, వర్తకం పనుల మీద ఊళ్ళు తిరిగే ట్రావెలర్లూ, షాపుల్నీ వర్తక సంబంధ మైన ఆఫీసుల్నీ శుభ్రం చేసే వారూ - మొదలైన వారంతా వర్తక కార్మికులే.

ఉత్పాదక కార్మికుల విషయంలో లాగే, వర్తక కార్మికుల విషయంలో కూడా వేరు వేరు రకాల 'శ్రమలు' వుంటాయి. వర్తక కార్మికుల శ్రమలన్నీ ప్రధానంగా 'శారీరక' శ్రమల కోవకే చెందుతాయి.

వర్తక శ్రమలన్నీ - 'అనుత్పాదక' శ్రమలే. కాబట్టి, వర్తక కార్మికులందరూ - అనుత్పాదక కార్మికులే.

'సమాజం' మొత్తం మీద చూసినప్పుడు, వర్తక శ్రమలన్నీ అనుత్పాదక శ్రమలే అయినా, 'వర్తక పెట్టుబడి' కోణం నించి మాత్రమే చూస్తే, దాని కార్యక్రమం దానికి ఉత్పాదక కార్యక్రమమే.' దానికి కావలసిన శ్రమలు చేసే కార్మికులు, దానికి ఉత్పాదక కార్మికులే.

కానీ, అలా అనుకున్నప్పుడు కూడా ఆ కార్మికుల శ్రమ, వర్తక పెట్టుబడి దారులకు 'డబ్బు'గా అందదు. అది 'వర్తక లాభాన్ని' పెంచదు. వర్తక కార్మికుల శ్రమ, వర్తక పెట్టుబడిదారుడికి, ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమలో నించి ఒక భాగం అందేలాగ మాత్రమే చేస్తుంది. అంతే గానీ, వర్తక కార్మికుల శ్రమ మాత్రం డబ్బుగా మారదు.

### మార్క్సు మాటల్లో:

"**పా**రిశ్రామిక పెట్టుబడికి, చలామణీ ఖర్చులు అనుత్పాదక ఖర్చులుగా వుంటాయి. ఎందుకంటే, అవి అలాంటివే కాబట్టి. అయితే, వర్తకుడికేమో, చలామణీ ఖర్చులు, వాటి పరిమాణానికి తగ్గట్టుగా వచ్చే జనరల్ లాభం రేటుకి మూలంగా వుంటాయి. కాబట్టి, చలామణీ కోసం పెట్టే పెట్టుబడి, వర్తకుడికి, 'ఉత్పాదక పెట్టుబడి' గానే వుంటుంది. ఈ కారణం చేతనే, వర్తక పెట్టుబడి ఏ శ్రమనైతే కొంటుందో ఆ వర్తక శ్రమ, దానికి, తక్షణం 'ఉత్పాదక శ్రమ' గానే వుంటుంది." [కాపిటల్ - 3, పేజీ - 301. మాస్కో ఎడిషన్ 1971.]

మార్క్సు మాటల్లో 'పారిశ్రామిక పెట్టుబడి' అనేది, 'ఉత్పాదక పెట్టుబడే.' పారిశ్రామిక పెట్టుబడి అయినా, వ్యవసాయ పెట్టుబడి అయినా, ఉత్పాదక పెట్టుబడులే.

ఉత్పాదక కార్మికులకు జీతాలు ఇవ్వడంలో, పీస్ వేజ్ - టైమ్ వేజ్ లాంటి పద్ధతులు వున్నట్టే, వర్తక కార్మికులకు జీతాలు ఇవ్వడంలో కూడా అనేక పద్ధతులు వుంటాయి. నెలసరి జీతాలు ఇచ్చే పద్ధతీ, అమ్మిన సరుకుని బట్టి ఇచ్చే పర్సంటేజ్ పద్ధతీ, ఎక్కువ సరుకుని అమ్మితే ఇచ్చే బోనస్ పద్ధతీ - వగైరా పద్ధతులు వుంటాయి. కార్మికులకు ఇచ్చే దాన్ని ఏ యే పద్ధతుల్లో ఇచ్చినా, కార్మికుడికి ముట్టేదంతా కలిపే 'జీతం'. అది 'శ్రమ శక్తి విలువ'గా మాత్రమే

వుంటుంది.

వర్తక పెట్టుబడిదారుడికి వచ్చే 'వర్తక లాభం' ఆ 'సరుకు'ని ఉత్పత్తి చేసే ఉత్పాదక కార్మికుల అదనపు విలువలో భాగమే - అని చూశాం. మరి, వర్తక కార్మికుల 'అదనపు శ్రమ' మాటేమిటి? వర్తక పెట్టుబడి దారుడి జేబులోకి చేరే 'వర్తక లాభం'లో, ఉత్పాదక కార్మికుల అదనపు విలువా, వర్తక కార్మికుల అదనపు విలువా కూడా కలిసి వుంటాయా? - అలా కాదు.

'అనుత్పాదక కార్మికుల అదనపు శ్రమ' గురించి, మొదటి సంపుటంలో, ఉత్పాదక శ్రమా - అనుత్పాదక శ్రమా చాప్టరులో చాలా వివరంగానే చూశాం. మారకం పనులన్నీ అనుత్పాదక శ్రమలే కాబట్టి, అనుత్పాదక శ్రమ గురించి చూసిన విషయాలే ఈ వర్తక శ్రమలకు కూడా వర్తిస్తాయి. వర్తక కార్మికులు కూడా, అదనపు శ్రమ చేస్తారు. కానీ అది వర్తక పెట్టుబడి దారుడికి డబ్బుగా అందదు.

'వర్తక కమిషన్' అనేది, 3 అంశాల కోసం ఖర్చవు తుందని చూశాం. కానీ, ఇక్కడ ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, (1) వర్తక పెట్టుబడీ, (2) దాని జనరల్ లాభమూ - అనే 2 అంశాలనే వర్తక కమిషన్‌గా అనుకుందాం,

ఒక వర్తక కమిషన్ 150. అందులో వర్తక పెట్టుబడి 100. దాని లాభం 50.

వర్తక పెట్టుబడిదారుడు, వర్తక పెట్టుబడి 100 ని, 60 C + 40 V గా పనిలో పెట్టాడనుకుందాం. సరుకు అమ్మకం పనుల్లో ఈ పెట్టుబడి ఖర్చయి పోతుంది. ఈ 100లో నించి వర్తక పెట్టుబడిదారుడు తినగలిగే దేమీ ఉండదు. సరుకు అమ్మకం పూర్తయిన తర్వాత దాని ద్వారా 50 జనరల్ లాభం, వర్తక పెట్టుబడి దారుడి జేబులోకి వస్తుంది. (ఈ జనరల్ లాభం - పెట్టుబడి మీద వడ్డీ, వర్తక స్థలానికి కౌలూ, పన్నులూ, చివరికి మిగిలే వర్తక లాభం - అనే భాగాలుగా చీలుతుంది. కానీ, ఆ భాగాల సంగతి ఇక్కడ అనవసరం. జనరల్ లాభాని కంతటికీ. వర్తక పెట్టుబడి దారుడినే ప్రతినిధిగా అనుకుందాం.)

వర్తక పెట్టుబడిదారుడి జేబులో పడే 50 జనరల్ లాభం, ఉత్పాదక కార్మికుల అదనపు విలువే. (వర్తక పెట్టుబడిదారుడు, ఏ సరుకుతో వర్తకం చేస్తాడో ఆ సరుకుని ఉత్పత్తి చేసిన కార్మికుల అదనపు విలువ.) ఇది 50 డబ్బు.

ఇప్పుడు, వర్తక కార్మికుల నించి వచ్చేది ఏమిటో చూద్దాం. ఈ కార్మికుల అదనపు శ్రమ రేటుని 100% అనుకుందాం. 40Vతో పని చేసే వర్తక కార్మికులు, ఇంకో 40 విలువ గల అదనపు శ్రమని ఇస్తారు. అంటే వారు మొత్తం 80 శ్రమ చేస్తారు. కానీ, వారి 'శ్రమ విలువ' సరుకుకి చేరదు. వారు, ఏ సరుకు కోసం వర్తకం పనులు చేస్తారో, ఆ పనుల వల్ల, ఆ సరుకు విలువ పెరగదు.

వర్తక కార్మికుల శ్రమ, సరుకుకి చేరదు కాబట్టి, అది అమ్మకం లోకి వెళ్ళదు. డబ్బుగా మారదు. యజమానికి, డబ్బుగా అందదు. అయితే, వర్తక కార్మికుల ద్వారా పెట్టుబడి దారుడికి అందే లాభం ఏమిటంటే - 40 జీతాల ఖర్చు తోటే, 40 + 40 = 80 విలువ గల వర్తక శ్రమ దొరుకుతుంది. అదంతా 'ఉపయోగపు విలువ' గానే ఖర్చయి పోతుంది. ఆ శ్రమ, మారకం విలువగా (డబ్బుగా) మారదు.

వర్తక పెట్టుబడి దారుడికి, 2 రకాల కార్మికుల నించీ అందే 'లాభాలు' ఇలా వుంటాయి:

ఉత్పాదక కార్మికుల నించి : 50 అదనపు విలువ (డబ్బుగా)

వర్తక కార్మికుల నించి : 40 అదనపు శ్రమ (డబ్బుగా కాదు)

మొత్తం లాభం : 90 విలువ గలది.

వర్తక పెట్టుబడిదారుడికి 2 రకాల కార్మికుల నించీ దొరికిన మొత్తం అదనపు శ్రమ 90 విలువగలది అయినా, అదంతా 'డబ్బు'గా ఉండదు. అందులో 50 మాత్రమే 'డబ్బు'గా ఉంటుంది. మిగిలినది 'వర్తక శ్రమ' రూపం లోనే ఖర్చయిపోతుంది. ఈ పెట్టుబడి దారుడు తన కుటుంబ అవసరాల కోసం 'డబ్బు'తో ఏదైనా సరుకుని కొనాలంటే, 50ని మాత్రమే ఖర్చు పెట్టగలడు గానీ, డబ్బుగా అందని ఇంకో 40తో ఏమీ కొనలేడు.

వర్తక కార్మికుల 40 అదనపు శ్రమ కూడా వర్తక పెట్టుబడిదారుడికి 'డబ్బు' గానే అంది వుంటే, అప్పుడు వాడి దగ్గిర మొత్తం 90 డబ్బు వుండాలి. కానీ, అలా వుండదు. ఉన్నది 50 డబ్బు మాత్రమే.

ఉత్పాదక కార్మికుల నించి డబ్బుగా అందే అదనపు విలువని, 'డైరెక్టు అదనపు విలువ' అన వచ్చు. వర్తక కార్మికుల నించి (అంటే, అనుత్పాదక కార్మికుల నించి), డబ్బుగా గాక ఒక 'ఉపయోగపు' విలువగా అందే అదనపు శ్రమని, 'ఇన్‌డైరెక్టు అదనపు విలువ' అనవచ్చు.

డైరెక్టు అదనపు విలువ, పెట్టుబడి దారుడి డబ్బుని పెంచుతుంది.

ఇన్‌డైరెక్టు అదనపు విలువ, పెట్టుబడిదారుడి డబ్బుని పెంచదు, ఖర్చుని తగ్గిస్తుంది.

**ఒక ప్రశ్న:** వర్తక కార్మికుల అదనపు శ్రమ 40. ఈ 'అదనపు శ్రమ'కి కూడా జీతం చెల్లిస్తే, వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర 10 డబ్బు మాత్రమే మిగిలేది కదా? వర్తక కార్మికుల అదనపు శ్రమకు చెల్లించక పోవడం వల్లనే, వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర 50 డబ్బు వుండగలిగింది కదా? కాబట్టి, వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర వున్న 50 డబ్బులో (50 జనరల్ లాభంలో), 40ని వర్తక కార్మికులకు సంబంధించిన అదనపు విలువగా ఎందుకు భావించకూడదు? - అలా భావించకూడదు. అలా భావిస్తే, ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమని, వర్తక కార్మికుల అదనపు శ్రమగా భావించడం - అనే తప్పు జరుగుతుంది.

వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర వున్న 50 డబ్బు - ఉత్పాదక కార్మికుల అదనపు విలువే. అందులో 40 ని, వర్తక కార్మికుల అదనపు విలువగా భావిస్తే, అది (ఆ 40) మొదట ఉత్పాదక కార్మికులు ఇచ్చినదిగానూ, తర్వాత అదే మళ్ళీ వర్తక కార్మికులు ఇచ్చినదిగానూ కూడా వుండవలసి వుంటుంది. ఒకే 40, మొదట ఒక బృందం ఇచ్చిన 40 గానూ తర్వాత ఇంకో బృందం ఇచ్చిన 40 గానూ, ఎలా వుండగలుగుతుంది?

వర్తక కార్మికులు కూడా 40 అదనపు విలువ ఇచ్చి వుంటే, పెట్టుబడిదారుడి దగ్గిర, మొత్తం 90 డబ్బు కనపడాలి. కానీ, అలా జరగదు.

కాబట్టి, మన లెక్కలో ఏం కనపడాలంటే, మొత్తం 90 డబ్బు గానీ, 'మొత్తం 90 అదనపు శ్రమ' గానీ కనపడాలి. అందులో, 50 డబ్బూ + 40 ఉపయోగపు విలువా - కనపడాలి.

వర్తక కార్మికులు 40 డబ్బు ఇచ్చినట్టుగా భావిస్తే, అప్పుడు, ఉత్పాదక కార్మికులు 10 డబ్బూ + 40 ఉపయోగపు విలువా ఇచ్చారనే అర్థానికి రావలసి వస్తుంది. కానీ, ఇది నిజం కాదు. నిజం ఏమిటంటే - ఉత్పాదక కార్మికులు ఇచ్చినది 50 డబ్బూ, వర్తక కార్మికులు ఇచ్చినది 40 ఉపయోగపు విలువా.

కాబట్టి, ఇక్కడ గ్రహించ వలసిందేమిటంటే, సమాజంలో వుండే 'వర్తక లాభం' అంతా, ఉత్పాదక కార్మికుల అదనపు విలువే. వర్తక కార్మికుల అదనపు శ్రమ, ఆ వర్తక లాభంలో భాగంగా వుండదు.

### మార్క్సు మాటల్లో:

"ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది. వర్తక పెట్టుబడి దారుడు నియమించే వర్తక వేతన కార్మికుల సంగతేమిటి? - అనే ప్రశ్న. ఒక కోణంలో, ఏ ఇతర వేతన కార్మికుడైనా ఎలాంటి వాడో వర్తక కార్మికుడు కూడా అలాంటి వాడే. మొదటి విషయం - వర్తక కార్మికుడి 'శ్రమ శక్తి'ని, వర్తకుడు, తన 'అస్థిర పెట్టుబడి'తోనే కొనడం జరుగుతుంది. తర్వాత విషయం - వర్తక కార్మికుడి 'శ్రమ శక్తి విలువ', అంటే 'జీతం', ఇతర కార్మికుల జీతాల లాగే నిర్ణయమవుతుంది. అంటే, ఆ ప్రత్యేక 'శ్రమ శక్తి' ఉత్పత్తికీ, పునరుత్పత్తికీ అవసరమయ్యే ఖర్చుల చేత. అంతే గానీ, ఆ శ్రమ సృష్టించే దాని చేత కాదు. పారిశ్రామిక పెట్టుబడికీ, వర్తక పెట్టుబడికీ మధ్య వుండే తేడా లాంటి దానినే, పారిశ్రామిక పెట్టుబడి నియమించే వేతన కార్మికులకూ, వర్తక కార్మికులకూ మధ్య కూడా చూడాలి. చలామణీకి ఏజంటుగా వుండే వర్తకుడు, 'విలువ'ని గానీ, 'అదనపు విలువ'ని గానీ ఉత్పత్తి చెయ్యడు కాబట్టి, ఆ విధుల లోనే వాడు నియమించిన వర్తక కార్మికులు, వాడి కోసం 'అదనపు విలువ'ని డైరెక్టుగా ఉత్పత్తి చేయజాలరు. వర్తకుడు, ధనం పొందేది, తన కార్మికులకు 'శ్రమ శక్తి విలువ'గా వుండే జీతాలు ఇవ్వడం ద్వారా కాదు" [కాపిటల్ - 3, పేజీ - 292, మాస్కో ఎడిషన్, 1971.]

"వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర పని చేసే కార్మికుడు (కమర్షియల్ వర్కర్) డైరెక్టుగా ఏ అదనపు విలువనీ ఉత్పత్తి చెయ్యడు. కానీ, అతని 'శ్రమ ధర' మాత్రం 'శ్రమ శక్తి విలువ' చేతనే నిర్ణయమవుతుంది. అంటే, దాని ఉత్పత్తి ఖర్చుల చేత. కార్మికుడి 'జీతం' కోసం పెట్టుబడి దారుడికి ఖర్చయ్యేదీ, కార్మికుడి నించి పెట్టుబడి దారుడికి తిరిగి వచ్చేదీ - ఈ రెండూ వేరు వేరు విషయాలు. ఈ కార్మికుడు 'డైరెక్టు అదనపు విలువ'ని సృష్టించడు"- [కాపిటల్ - 3, పేజీ - 300. మాస్కో ఎడిషన్, 1971.]

"జ్ఞానహీనుడైన (వల్గర్) ఆర్థిక వేత్తకి వున్న దురవగాహనని మరి రెండు ఆధారాలతో వివరించ వచ్చును. మొదటిది: వర్తక లాభానికి వున్న ప్రత్యేక స్వభావాన్ని వివరించడంలో అతని అశక్తత. రెండవది:

'సరుకు పెట్టుబడి'నీ, 'డబ్బు పెట్టుబడి'నీ; తర్వాత 'వర్తక పెట్టుబడి'నీ, 'మనీ డీలింగ్ పెట్టుబడి'నీ, వీటిని, 'ఉత్పత్తి విధానం' అనే దాని నించే తప్పని సరిగా పుట్టుకు వచ్చే అంశాలుగా గ్రహించకుండా తప్పించుకోవడానికి అతడు చేసే దొంగ యత్నాలు. ఈ పెట్టుబడులన్నీ నిజానికి, ' పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానానికి' వున్న ప్రత్యేక రూపం నించి - ఏదైతే సరుకు చలామణీని తన పునాదిగా కలిగి వుంటుందో, ఆ రూపం నించి, తలెత్తుతాయి." [కాపిటల్ - 3, పేజీ 323, మాస్కో, 1971.]

ఇక్కడ ఇంకా కొన్ని సందేహాలకు జవాబులు చూడాలి.

**ఒక ప్రశ్న:** వర్తక కార్మికుల శ్రమ, 'డబ్బు'గా మారనప్పుడు, ఆ కార్మికులు ఎంత విలువ గల 'అదనపు శ్రమ' ఇస్తారో, తమ శ్రమలో ఎంత భాగాన్ని పోగొట్టుకుంటారో, ఎలా లెక్క కట్టగలం?

**జవాబు:** ఎలాగంటే, సమాజంలో వున్న 'పెట్టుబడి' వివరాలన్నీ తీసుకుంటే, మొదట, ఉత్పాదక కార్మికుల 'అదనపు విలువ' రేటుని తేలిక గానే లెక్క కట్టవచ్చు. (అది 100% అనుకుందాం.) వర్తక కార్మికుల జీతాలు కూడా 'శ్రమ శక్తి విలువే' కాబట్టి, ఈ కార్మికులు కూడా అదే రేటున (100% రేటున) 'అదనపు శ్రమ' ఇస్తున్నట్టుగా లెక్క కట్టవచ్చు. అంటే, ఉత్పాదక శ్రామికుల అదనపు విలువ రేటే, అనుత్పాదక కార్మికుల అదనపు శ్రమ రేటుగా ఉంటుంది.

**ఇంకో ప్రశ్న:** సమాజంలో, ఒక సంవత్సరంలో అన్ని శాఖల్లోనూ కలిసి మొత్తం 100 వర్తక పెట్టుబడి ఖర్చయిందనుకుందాం. సమాజానికి అవసరమైన వర్తక కార్యకలాపాలన్నీ 100 పెట్టుబడి తోనే జరిగాయని అర్థమా?

**జవాబు:** కాదు. వర్తక కార్మికుల 'అదనపు శ్రమ' కూడా వర్తకం - పనుల కోసమే ఖర్చవుతుంది. కాబట్టి, వర్తకం పనుల కోసం ఖర్చయ్యేది, వర్తకం లెక్కల్లో వర్తక కార్మికుల జీతాలుగా కనపడేది మాత్రమే కాదు. లెక్కల్లో కనపడని వర్తక కార్మికుల అదనపు శ్రమ కూడా. వర్తక పెట్టుబడీ, దాని అదనపు శ్రమా, ఈ రెండూ కలిసిన మొత్తం ఖర్చు తోనే వర్తకం పనులు జరుగుతాయి.

**మూడో ప్రశ్న:** ఉత్పాదక పెట్టుబడి దారుడు, ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమని మాత్రమే తింటూ వుంటే, వర్తక పెట్టుబడి దారుడు, ఒక వేపు - ఉత్పాదక కార్మికుల అదనపు శ్రమనీ; ఇంకో వేపు - వర్తక కార్మికుల అదనపు శ్రమనీ కూడా తింటూ, ఉత్పాదక పెట్టుబడి దారుడి కన్నా ఎక్కువ లాభం సంపాదిస్తాడని అర్థమా?

**జవాబు:** కాదు. ఉత్పాదక, వర్తక పెట్టుబడి దారులు, లాభాలుగా పంచుకోగలిగేది, 'డబ్బు' రూపంలో అందే ఉత్పాదక కార్మికుల అదనపు విలువని. అలాగే, వర్తక కార్మికుల అదనపు శ్రమని కూడా.

వర్తక కార్మికుల అదనపు శ్రమ ఖర్చయ్యేది, కేవలం వర్తక పెట్టుబడిదారుడి కోసమే కాదు, ఉత్పాదక పెట్టుబడి దారుడి కోసం కూడా.

ఒకే 'సరుకు', ఉత్పాదక పెట్టుబడిదారుడికీ, వర్తక పెట్టుబడిదారుడికీ కూడా, చెరి కొంత లాభాన్నీ ఇవ్వాలంటే, ఉత్పాదక కార్మికులూ వర్తక కార్మికులూ కూడా శ్రమలు చెయ్యాలి. ఉత్పాదక కార్మికులు లేక పోతే, 'ఉత్పత్తి క్రమమే' వుండదు. సరుకే వుండదు. వర్తక కార్మికులు లేకపోతే, 'చలామణీ క్రమం' వుండదు. సరుకు - డబ్బుగా మారడం వుండదు. ఉత్పాదక కార్మికులు, 'అదనపు విలువ'ని ఉత్పత్తి చేస్తే, వర్తక కార్మికులు ఆ అదనపు విలువని పెట్టుబడిదార్లకు అందేలాగ చేస్తారు. ఈ 2 రకాల శ్రమలూ జరిగితేనే, పెట్టుబడి దార్లకు 'లాభాలు' అందుతాయి.

ఉత్పాదక కార్మికులు, ఉత్పాదక పెట్టుబడి దారుడి దగ్గిర మాత్రమే పని చేస్తే; వర్తక కార్మికులు, వర్తక పెట్టుబడి దారుడి దగ్గిర మాత్రమే పని చేస్తారు. అయినప్పటికీ, ఏ రంగంలో పెట్టుబడి దారుడికి ఆ రంగంలో కార్మికుల శ్రమతో మాత్రమే సంబంధం వుంటుందని అర్థం కాదు. 2 రంగాల కార్మికులూ కలిసే, ఉత్పత్తి క్రమాన్నీ చలామణీ క్రమాన్నీ పూర్తి చేస్తారు కాబట్టి, 2 రంగాల కార్మికుల శ్రమలూ, 2 రంగాల పెట్టుబడి దారులకూ ఉపయోగ పడతాయి. అంటే, వర్తక పెట్టుబడి దారులు, ఉత్పాదక కార్మికుల శ్రమ ఫలితాన్ని తింటున్నట్టే; ఉత్పాదక పెట్టుబడి దారులు కూడా, వర్తక కార్మికుల శ్రమ ఫలితాన్ని తింటున్నారని అర్థం.

ఉత్పాదక పెట్టుబడిదారుల కన్నా, వర్తక పెట్టుబడిదారులే ఎక్కువ లాభాల్ని తింటారని అర్థం కాదు. అలా జరిగితే, ఏ పెట్టుబడి అయినా, వర్తక పెట్టుబడి గానే పని చేస్తుంది గానీ ఉత్పాదక పెట్టుబడిగా పని చెయ్యదు.

# వర్తక పెట్టుబడి టర్నోవరూ, దాని ప్రత్యేకతా

**ఉ**త్పాదక పెట్టుబడి నిర్వహించే కార్యక్రమంలో, 'ఉత్పత్తి క్రమం' వుంటుంది. ఈ క్రమం, ఉత్పత్తి సాధనాలుగా వున్న సరుకుల్ని ఖర్చు చేస్తూ, 'కొత్త సరుకు'ని ఉత్పత్తి చేస్తుంది. కానీ, వర్తక పెట్టుబడి నిర్వహించే కార్యక్రమంలో, 'ఉత్పత్తి క్రమం' వుండదు. ఈ పెట్టుబడి, ఒక సరుకుని కొని, దాన్ని ఏమీ మార్చకుండా, ఆ సరుకునే తిరిగి అమ్ముతుంది. అంటే, ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుని, వర్తక పెట్టుబడి అమ్ముతుంది.

ఉత్పాదక పెట్టుబడి కార్యక్రమం లాగే వర్తక పెట్టుబడి కార్యక్రమం కూడా, మొదట 'డబ్బు'తో ప్రారంభమై, చివరికి 'డబ్బు' తోటే ముగుస్తుంది. మొదటి డబ్బు కన్నా చివరి డబ్బు, ఎక్కువగా వుంటుంది.

పెట్టుబడి తిరిగి రావడం (లాభంతో సహా) - పెట్టుబడి టర్నోవరు.

ఉత్పాదక పెట్టుబడి తిరిగి రావడం, - ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు.

వర్తక పెట్టుబడి తిరిగి రావడం, - వర్తక పెట్టుబడి టర్నోవరు.

ఉత్పాదక పెట్టుబడి తిరిగి రావడం అంటే - 'సరుకు'ని వర్తకుడికి అమ్మి, వర్తకుడి నించి డబ్బు తీసుకోగానే ఉత్పాదక పెట్టుబడి తిరిగి వచ్చినట్టు కాదు. సరుకుని వర్తకుడు తీసుకోగానే అది నిజంగా అమ్ముడైనట్టూ, నిజంగా 'డబ్బు'గా మారినట్టూ కాదు. అది, సరుకుకి యజమాని మారడం మాత్రమే. సరుకు, ఉత్పాదక పెట్టుబడి దారుడి దగ్గిర వుండడం ఎలాంటిదో, వర్తకుడి దగ్గిర వుండడం కూడా అలాంటిదే. సరుకు, వర్తకుడి దగ్గిర నించి కూడా వాడకం దారుల దగ్గిరికి చేరి, వర్తకుడి డబ్బు కూడా వెనక్కి వచ్చినప్పుడే, సరుకు నిజంగా అమ్ముడైనట్టు అర్థం. అప్పుడే ఉత్పాదక పెట్టుబడి, నిజంగా తిరిగి వచ్చినట్టు అర్థం.

వర్తకుడు అమ్మే ఉత్పత్తే, మళ్ళీ ఇంకో ఉత్పత్తి క్రమానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు గానూ, కార్మికుల జీవితావసర వస్తువులు గానూ అందుతుంది. అంతేగాక, ఆ ఉత్పత్తిలో నించే 'అదనపు విలువ' భాగం, ఎవరెవరికి అందాలో వాళ్ళకి అందుతుంది. ఈ పని జరిగే వరకూ సరుకుకి 'చలామణీ క్రమం' పూర్తి అయినట్టు కాదు.

వర్తకుడు లేకుండా, 'చలామణీ క్రమాన్ని' కూడా ఉత్పాదక పెట్టుబడి దారుడే నిర్వహిస్తే, 'సరుకు'ని వాడకం దార్లకు అమ్మినప్పుడే, దాని ఉత్పాదక పెట్టుబడీ, వర్తక పెట్టుబడీ కలిసి వెనక్కి వస్తాయి. వర్తకుడు వున్నప్పుడు కూడా అదే జరుగుతుంది. సరుకు అమ్మకం పూర్తి అయినప్పుడే, 2 పెట్టుబడులూ కలిసి ఒకే సారి వెనక్కి వస్తాయి. ఉత్పాదక పెట్టుబడి వెనక్కి రావడం అంటే వర్తక పెట్టుబడి కూడా వెనక్కి రావడమే. 'చలామణీ క్రమం' పూర్తి అయినప్పుడే అది జరుగుతుంది.

ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు:
ఉత్పత్తికాలమూ + చలామణీ కాలమూ
వర్తక పెట్టుబడి టర్నోవరు:
0 + చలామణీ కాలం మాత్రమే.

అంటే, వర్తక పెట్టుబడి టర్నోవరు కాలం, ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు కాలంలో భాగమే. వర్తక పెట్టుబడి టర్నోవరు పూర్తి అయితేనే, ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు పూర్తి అవుతుంది.

ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు క్రమం:

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| డబ్బు | - | సరుకు | - | ఉత్పత్తి క్రమం | - | కొత్త సరుకు | - | పెరిగిన డబ్బు |
| M | - | C | - | P | - | $C^1$ | - | $M^1$ |

ఈ 'ఉత్పాదక టర్నోవరు క్రమం'లో, వర్తకుడి స్థానం ఎక్కడ? - $C^1$ - $M^1$ దగ్గిర. వర్తకుడు, ఈ దశనే నిర్వహిస్తాడు. వర్తకుడు, 'బట్టని అమ్మడం' అంటే, బట్ట పెట్టుబడి దారుడి $C^1$ ని, $M^1$ గా మార్చడమే. ఆ పనినే ఇంకో వేపు నించి చూస్తే, బట్టని కొన్న వాళ్ళ M, C గా మారుతుంది. వర్తకుడు, బట్ట పెట్టుబడి దారుడికి 'దారాన్ని' సప్లై చెయ్యాలంటే, మొదట దాన్ని కొని, దాన్ని తెచ్చి బట్ట వాడికి అమ్మాలి. అంటే, ఇది, దారం వాడి $C^1$ ని, $M^1$ గా మార్చడమే.

సమాజంలో జరిగే మొత్తం వర్తకాన్నంతా కలిపి చూస్తే, దాని సారాంశం అంతా, 'సరుకు'ని 'డబ్బు'గా మార్చడమే. అమ్మడమే. ఒకరి 'సరుకు'ని 'డబ్బు'గా మారిస్తే, ఇంకొకరి 'డబ్బు'ని 'సరుకు'గా మార్చినట్టే. దారం పెట్టుబడిదారుడి సరుకుని (దారాన్ని), డబ్బుగా మార్చడం అంటే, బట్ట పెట్టుబడిదారుడి డబ్బుని, సరుకుగా మార్చడమే. కాబట్టి, 'వర్తక పెట్టుబడి, సరుకుని అమ్మే పని చేస్తుంది' - అంటే చాలు. 'కొనే పని కూడా చేస్తుంది' అని ప్రత్యేకంగా అన నక్కర లేదు. అంటే, చలామణీ కాలాన్ని, సరుకుని అమ్మ డానికి పట్టే కాలంగా చూస్తే చాలు.

వర్తకుడు, ఏ ఉత్పాదక పెట్టుబడి దారుడి సరుకుని అమ్మాలన్నా, దాన్ని మొదట డబ్బుతో కొనాలి. దాని కోసం కొంత పెట్టుబడి పెట్టాలి. అంటే వర్తకుడి కార్యక్రమం కూడా డబ్బు తోటే ప్రారంభమవుతుంది. కానీ, ఆ డబ్బుతో సరుకుని కొన్నప్పుడు, ఆ డబ్బు కన్నా ఎక్కువ విలువ గల సరుకు వస్తుంది. 110 డబ్బుకి, 132 విలువ గల సరుకు వచ్చినట్టు. అంటే, వర్తకుడి M, మొదటే $C^1$గా మారుతుంది. ఆ M కన్నా ఎక్కువ విలువ గల సరుకుగా. తర్వాత ఆ $C^1$ ని అమ్మి, దానితో సమాన విలువ గల $M^1$ ని తీసుకుంటాడు. ఆ $M^1$ లో నించి, మొదటి M ని తీసేస్తే అది - జనరల్ లాభం. ఈ మొత్తం వర్తక కార్య క్రమంలో, 'ఉత్పత్తి క్రమం' ఉండదు. వర్తక పెట్టుబడి అయిన M, మొదట $C^1$ గానూ, తర్వాత $M^1$ గానూ మారడమే జరుగుతుంది.

వర్తక పెట్టుబడి టర్నోవరు ఇలా ఉంటుంది:

| మొదటి డబ్బు | - | ఎక్కువ విలువ గల సరుకు | - | ఎక్కువ డబ్బు. |
|---|---|---|---|---|
| M | - | $C^1$ | - | $M^1$ |

'వర్తక పెట్టుబడి' చేసే పనిలో 'ఉత్పత్తి క్రమం' వుండదు కాబట్టి, దాని వల్ల 'వర్తక పెట్టుబడి టర్నోవరు'కి ఒక ప్రత్యేక లక్షణం ఏర్పడుతుంది. అదేమిటంటే, చిన్న చిన్న టర్నోవర్లుగా పని చెయ్యగలిగే లక్షణం. దీన్ని కొంచెం వివరంగా చూడాలి.

'బట్ట' ఉత్పత్తి కాలం 1 వారం. ఉత్పాదక పెట్టుబడి 100. దాని మీద లాభం 10 - అనుకుందాం, ఆ బట్టని 'కొనడానికి' వర్తకుడు సరుకు వాడి చేతిలో ఒకే సారి 110 పెట్టి, ఆ సరుకునంతా ఒకే సారి తీసుకోవలిసిందేనా? - అవసరం లేదు. అంత కన్నా తక్కువ పెట్టుబడి తోటే పని చెయ్యవచ్చు. ఎలాగంటే: బట్టకి ఉత్పత్తి కాలం 1 వారం అయితే, 'చలామణీ కాలం' కూడా 1 వారమే (ఏడు రోజులు) అవుతుంది. అంటే, మళ్ళీ కొత్త బట్ట రావడానికి 7 రోజులు పడుతుంది. కొత్త బట్ట వచ్చే దాకా మొదటి బట్టని అమ్మడానికి సమయం వుంటుంది. కాబట్టి, అమ్మవలసిన సరుకు నంతా వర్తకుడు ఒకే సారి కొని తెచ్చుకోనక్కర లేదు. ఒక వేళ, సరుకు నంతా ఒకే సారి కొన్నా, దాన్ని అమ్మ డానికి తప్పనిసరిగా 7 రోజులూ పడుతుంది గానీ, అది 1, 2 రోజుల్లోనే అమ్ముడై పోదు. కాబట్టి, వర్త కుడు ఆ సరుకునంతా ఒకే సారి కొనకుండా మొదట 30 పెట్టుబడి తోనో, 40 పెట్టుబడి తోనో కొంత సరుకుని మాత్రమే కొని, దాన్ని 2 రోజుల్లో అమ్మేస్తాడనుకుందాం. (ఆ పెట్టుబడి 2 రోజులకే వెనక్కి వస్తుంది కాబట్టి, దాని మీద 2 రోజుల జనరల్ లాభమే కలుస్తుందని అర్థం.) 2 రోజుల్లో, ఆ పెట్టుబడి, లాభంతో సహా తిరిగి రాగానే (అప్పటికి ఆ చిన్న పెట్టుబడి '1 టర్నోవరు' చేసిందని అర్థం), మళ్ళీ ఆ పెట్టుబడి తోటే ఇంకా కొంత సరుకుని కొని దాన్ని కూడా 2 రోజుల్లో అమ్మెయ్య వచ్చు. ఆ పెట్టుబడి కూడా తిరిగి రాగానే (ఆ పెట్టుబడి, ఇంకో టర్నోవరు చేసిందని అర్థం), మళ్ళీ ఆ పెట్టుబడి తోటే .... ఇలా వారం రోజులు పూర్తి అయ్యే సరికి మొత్తం అమ్మవలసిన సరుకు నంతా అమ్మేయ వచ్చు. అప్పటికి మళ్ళీ కొత్త ఉత్పత్తి క్రమం ముగిసి, 'కొత్త సరుకు' వస్తుంది. అప్పుడు కూడా మళ్ళీ అలాగే జరుగుతుంది.

'ఉత్పాదక పెట్టుబడి' విషయంలో అయితే 'ఉత్పత్తి క్రమం' వుంటుంది కాబట్టి, ఆ క్రమం లోకి ఎంత పెట్టుబడి కావాలో అదంతా ఒకే సారి పెట్టకుండా పని చెయ్యడం సాధ్యం కాదు. కానీ, వర్తక పెట్టుబడి విషయం అలా కాదు. దీని పని - కొన్న సరుకుని ఏమీ మార్చకుండా తిరిగి అమ్మడం. కాబట్టి, కొనడానికీ, అమ్మడానికీ మధ్య ఎక్కువ విరామం వుండ నక్కరలేదు. కొన్న స్థలానికీ అమ్మే స్థలానికీ మధ్య రవాణా కోసం ఎంత కాలం పడుతుందో అంత విరామం వుంటే చాలు. సరుకుని కొనడమూ అమ్మడమూ వెంట వెంటనే చెయ్యడం సాధ్యమే కాబట్టి, మొత్తం చలామణీ కాలంలో ఆ పనులు అనేక సార్లు చెయ్యవచ్చు. మొత్తం సరుకునంతా ఒకే సారి కొన నక్కర లేదు కాబట్టి, వర్తకుడు ఆ సరుకుకి కావలసిన

మొత్తం పెట్టుబడిని ఒకే సారి పెట్టనక్కర లేదు. 'రవాణా' ఖర్చులు లాంటివి కలిసి రావాలంటే ప్రతీ సారీ కనీసం ఎంత సరుకుని కొనడం అవసరమో అంత సరుకుని కొంటూ వుంటే చాలు. తక్కువ సరుకుని కొనడానికి తక్కువ పెట్టుబడే సరిపోతుంది కాబట్టి, వర్తక పెట్టుబడి, 'తక్కువ పరిమాణం' తోటే త్వర త్వరగా టర్నోవర్లు చేస్తూ, పని చెయ్యగలుగు తుంది.

వర్తక పెట్టుబడి చేసే చిన్న చిన్న టర్నోవర్లలో ఆఖరి టర్నోవరు కూడా ముగిసి, ఒక ఉత్పత్తి క్రమా నికి సంబంధించిన సరుకు అంతా అమ్ముడై పోయి నప్పుడే, 'ఉత్పాదక పెట్టుబడి టర్నోవరు' పూర్తి అయి నట్టు అర్థం. ఉత్పాదక పెట్టుబడి అంతా వెనక్కి వచ్చినట్టు అర్థం.

అయితే, వర్తక పెట్టుబడి చిన్న చిన్న టర్నోవర్లు చెయ్యడం వల్ల దాని 'లాభం రేటు' విషయం ఏమైనా మారుతుందా? - ఏమీ మారదు.

100 పెట్టుబడికి, వారానికి
1 టర్నోవరు ద్వారా 10 లాభం అన్నా,
50 పెట్టుబడికి, వారానికి
2 టర్నోవర్ల ద్వారా 10 లాభం అన్నా,
25 పెట్టుబడికి, వారానికి
4 టర్నోవర్ల ద్వారా 10 లాభం అన్నా,
అన్నిటికీ 'లాభం రేటు' ఒకటే.

100 పెట్టుబడితో, వారానికి 1 టర్నోవరు చేసి సంపాదించ గలిగే లాభాన్ని, 50 పెట్టుబడి తోనే వారానికి 2 టర్నోవర్లు చేసి సంపాదించ వచ్చు. తక్కువ పెట్టుబడితో జరిగే పని కోసం వర్తకుడు ఎక్కువ పెట్టుబడిని ఉపయోగించడు. అంటే, దీని అర్థం '100 ఉత్పాదక పెట్టుబడి'తో ఉత్పత్తి అయిన సరుకుని కొని అమ్మడంలో, 100 వర్తక పెట్టుబడి పని చెయ్యదు. అంత కన్నా తక్కువ పెట్టుబడి, ఎక్కువ టర్నోవర్లు చేస్తూ పని చేస్తుంది. అయినా, ఉత్పాదక పెట్టుబడితో సమానం గానే లాభం రేటుని తీసుకుంటూ వుంటుంది. ఇదే వర్తక పెట్టుబడి టర్నో వరు ప్రత్యేకత.

ఏ పెట్టుబడి అయినా - సంవత్సరానికి ఒక టర్నో వరు చేస్తే అది 'సంవత్సర టర్నోవరు'. నెలకి ఒక టర్నోవరు చేస్తే అది 'నెల టర్నోవరు'. నెల టర్నోవర్లు 12 కలిసి - సంవత్సర టర్నోవరు.

ఏ రకం సరుకుని అమ్మడానికైనా ఆ సరుకు ప్రత్యేకతని బట్టి ఒక 'సగటు టర్నోవరు' కాలం వుంటుంది. ఆ ప్రకారం అమ్మగలిగితేనే వర్తక పెట్టు బడి, 'జనరల్ లాభం రేటు'ని సంపాదించగలుగు తుంది. సగటు కన్నా ఎక్కువ కాలం తీసుకుంటే, ఖర్చులు పెరిగి, వర్తక లాభం తగ్గుతుంది.

ఒక వర్తకుడు, ఉదా: 'బట్ట'ని అమ్మే వర్తకుడు, ఒక్క పెట్టుబడి దారుడి సరుకుని మాత్రమే గాక, అనేక మంది బట్ట పెట్టుబడి దారుల సరుకుల్ని అమ్ము తాడు. వర్తకుడు, తన షాపులో అనేక రకాల బట్టల్ని అమ్మకానికి పెడతాడు. ఆ షాపు ఖర్చులు, ఆ రక రకాల సరుకులన్నిటికీ సంబంధించిన అమ్మకాల ఖర్చులు అవుతాయి. ఒక వర్తక పెట్టుబడి టర్నోవరు, అనేక ఉత్పాదక పెట్టుబడుల టర్నోవరుతో లంకెలు పడి సాగుతూ ఉంటుంది. అంటే, ఒక వర్తక పెట్టు బడి, తన లాభం కోసం, అనేక ఉత్పాదక పెట్టు బడులు ఉత్పత్తి చేసే అదనపు విలువల నించీ భాగాల్ని పంచుకుంటుంది.

# ఉత్పత్తి శక్తికీ, వర్తక ధరకీ, సంబంధం

**ఉ**త్పత్తి శక్తి మారితే, సరుకు ధర ఎలా మారు తుందో గతం లోనే చూశాం. ఉత్పత్తి శక్తి తగ్గితే, ఒక యూనిట్ సరుకుకి పట్టే శ్రమ కాలం పెరిగి, సరుకు ధర పెరుగుతుంది. అలాగే, ఉత్పత్తి శక్తి పెరిగితే, ఒక సరుకుకి పట్టే శ్రమ కాలం తగ్గి, ధర తగ్గుతుంది. ఈ విషయానికి, 'వర్తక అంశాల్ని' కలిపి చూసినా, ధరలో మార్పులు అదే పద్ధతిలో వుంటాయి. అది ఎలా జరు గుతుందో ఇప్పుడు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

ఇక్కడ సరుకు - పంచదార. వర్తకుడు ప్రతీ సారీ 100 కిలోలు కొని, దాన్ని 1 వారంలో అమ్మేస్తాడను కుందాం. ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి వర్త కుడు కొనే ధర, కిలోకి 1 రూపాయి అనుకుందాం. (ఈ రూపాయి లోనే ఉత్పాదక పెట్టుబడి దారుడి పెట్టుబడీ, జనరల్ లాభమూ వున్నాయని అర్థం.) వర్తక పెట్టుబడి 20. జనరల్ లాభం 100 పెట్టుబడికి 1 వారానికి 10. (స్టోరూ-రవాణాల్ని తీసుకోవడం లేదు)

ఈ వివరాలతో వర్తకుడు 100 కిలోల పంచదారని అమ్మే ధర ఇలా వుంటుంది:

| కొన్న ధర | + దాని లాభం | + వర్తక పెట్టుబడి | + దాని లాభం | = వర్తక ధర |
|---|---|---|---|---|
| B + | P + | K + | P = | $C^1$ |
| 100 + | 10 + | 20 + | 2 = | 132 |

100 కిలోల ధర - 132 రూపాయలు అయితే,
1 కిలో - 1.32

అంటే, వర్తకుడు కిలోని 1 రూపాయితో కొని, 1.32కి అమ్మి, తన పెట్టుబడిని వెనక్కి తీసుకుని, దాని మీద లాభం కూడా తీసుకుంటాడు.

ఇప్పుడు, పంచదార 'ఉత్పత్తి శక్తి', రెట్టింపు అయింది - అనుకుందాం. గతంలో కిలో ఉత్పత్తి అయిన కాలం లోనే ఇప్పుడు 2 కిలోలు ఉత్పత్తి అవుతుంది. వర్తకుడు కొనే ధర, సగానికి తగ్గింది. అంటే, ఇప్పుడు వర్తకుడు కొనే ధర, 1 కిలోకి, అర్ధ రూపాయి - అనుకుందాం. అయితే గతంలో 100 కిలోలు అమ్మిన కాలం లోనే (1 వారం లోనే), ఇప్పుడు 200 కిలోలు అమ్మాలి. ఇప్పుడు వర్తకుడు 100 రూపాయలతో 200 కిలోలు కొంటాడు. ఇప్పుడు కూడా జనరల్ లాభం రేటు గతంలో లాగే 10% అనుకుందాం. గతంలో 100 కిలోలకు మారకం ఖర్చులు 20 అయితే, ఇప్పుడు 200 కిలోలకు ఆ ఖర్చులు 40 అవుతాయి.

చివరకి 200 కిలోల్ని వర్తకుడు అమ్మే ధర ఇలా వుంటుంది:

B + P + K + P = $C^1$
100 + 10 + 40 + 4 = 154
200 కిలోల ధర -154 రూపాయలు అయితే,

1 కిలో ధర - —— = 0.77 పైసలు

అంటే, ఉత్పాదక శక్తి పెరగడం వల్ల ఏం జరిగింది? సరుకు ధర తగ్గింది. గతంలో 1.32గా వుండే ధర, ఇప్పుడు 77 పైసలు అయింది.

ధర ఇలా తగ్గడం వల్ల వర్తకుడు నష్టపోతాడా? - అలా జరగదు. ఎందుకంటే, సరుకుని కొనే సమయానికి దానికి ఏ ధర వుంటే ఆ ధర తోనే వర్తకుడు కొంటాడు. ఆ కొనే ధర కన్నా, తర్వాత అమ్మే ధర ఎప్పుడూ ఎక్కువ గానే ఉంటుంది. ఇప్పుడూ అలాగే ఉంది. ఈ ఉదాహరణలో, వర్తకుడు, 1 కిలోని అర్ధ రూపాయితో కొని, 77 పైసలతో అమ్ముతాడు. కాబట్టి ఆ సరుకుకి గతంలో వుండే ధర తగ్గడం వల్ల వర్తకుడు నష్టపోయేదేమీ ఉండదు.

ఉత్పత్తి శక్తి తక్కువగా వున్నప్పుడు:
కిలోకి వర్తకుడు కొన్న ధర - 1 రూపాయి
అమ్మిన ధర - 1.32 పైసలు

ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు:
వర్తకుడు కొన్న ధర - 50 పైసలు
అమ్మిన ధర - 77 పైసలు

ఉత్పత్తి శక్తి ఎలా వున్నా, వర్తకుడు కొనే ధర కన్నా అమ్మే ధర ఎక్కువగా వుంటుంది.

ఈ ఉదాహరణలో, వర్తక టర్నోవరు కాలం 1 వారం కన్నా ఎక్కువగా వుండడం అందరి దగ్గరా జరిగితే, K + P లు (వర్తకం ఖర్చులు) పెరుగుతాయి. సరుకు ధర పెరుగుతుంది. దానికి వ్యతిరేకంగా జరిగితే, ధర తగ్గుతుంది. నిజానికి, వర్తక కార్యకలాపాలు సరుకుకి ఏ విలువనీ చేర్చవు. అయినా, వర్తక టర్నోవరు కాలాన్ని బట్టి, సరుకు ధర ఎందుకు వుంటుందంటే, కేవలం 'జనరల్ లాభం రేటు' సూత్రం వల్ల! 'వర్తక పెట్టుబడి'కి కూడా, అది పని చేసే కాలాన్ని బట్టి లాభం రావాలి కాబట్టి (ఎక్కువ కాలం పని చేస్తే ఎక్కువ లాభం, తక్కువ కాలం పని చేస్తే తక్కువ లాభం రావాలి కాబట్టి), సరుకు ధరని లెక్క కట్టడంలో, 'వర్తక టర్నోవరు' పాత్రని కూడా లెక్కలోకి తీసుకోవలసి వుంటుంది. వర్తక టర్నోవరు అంటే, సరుకుని అమ్మే కాలమే కాబట్టి, ఏ సరుకు అమ్మకానికైనా ఫలానా కొంత లెక్క వుంటుంది. సంవత్సరానికి ఒక్క సారే ధాన్యాన్ని అమ్మడానికి, సంవత్సర కాలమే గానీ అంత కన్నా ఎక్కువ గడువు వుండదు. వర్తక పెట్టుబడి, ఎన్ని టర్నోవర్లు చేసినా, ఆ టర్నోవర్లన్నీ 1 సంవత్సరానికి దాటి వుండవు. ఆ సరుకుని అమ్మడానికి సంవత్సరం కన్నా ఎక్కువ కాలాన్ని తీసుకుంటే, ఆ ఎక్కువ కాలం కోసం ఎక్కువ లాభం వుండదు. ఏ సరుకు అమ్మకానికైనా, దానికి తగిన కాలమే దానికి వుంటుంది.

ఒక్క శాఖనే గాక, మొత్తం సమాజాన్నంతా తీసుకున్నా, విషయాలన్నీ ఇలాగే వుంటాయి. ఒక్క శాఖలో గానీ, మొత్తం సమాజంలో గానీ, ఉత్పాదక పెట్టుబడి కన్నా, 'వర్తక పెట్టుబడి' తక్కువగా వుంటుంది. ఉత్పాదక పెట్టుబడి దారుల సంఖ్య కన్నా వర్తక పెట్టుబడి దారుల సంఖ్య తక్కువ. ఉత్పాదక కార్మికుల సంఖ్య కన్నా, వర్తక కార్మికుల సంఖ్య తక్కువ.

ఉత్పాదక పెట్టుబడి దారుల్లో కొందరికి వర్తక కంపెనీలు కూడా వుంటాయి. అప్పుడు వాళ్ళు, ఉత్పాదక పెట్టుబడిదారులే గాక, వర్తక పెట్టుబడి దారులు కూడా అవుతారు.

వర్తక పెట్టుబడిదారుల్లో కొందరికి ఉత్పాదక కంపెనీలు కూడా వుంటాయి. అప్పుడు వాళ్ళు, వర్తక పెట్టుబడిదారులే గాక, ఉత్పాదక పెట్టుబడి దారులు కూడా అవుతారు.

పెట్టుబడి దారులందరికీ స్వంత స్టోరు ఏర్పాట్లు వుంటాయి. చాలా మందికి స్వంత రవాణా ఏర్పాట్లు కూడా వుంటాయి.

సమాజం మొత్తం మీద - ఉత్పాదక పెట్టుబడి దారులు ఉత్పత్తి చేసే 'సరుకుల రాసి'ని, వర్తక పెట్టుబడిదారులు అమ్ముతారు. దీని నిజమైన అర్థం - ఉత్పాదక కార్మికులు ఉత్పత్తి చేసే సరుకుల రాసిని, 'వర్తక కార్మికులు' అమ్ముతారు.

# 'శ్రమ విభజన'లో వర్తక కార్మికులు

'ఎల్లకాలమూ ఒకే శ్రమ చెయ్యడం' అనే పరిస్థితి, వర్తక కార్మికుల విషయంలో కూడా ఉంటుంది. వర్తక కార్మికులు షాపుల్లో వుండి గానీ, వీధుల్లో తిరుగుతూ గానీ, ఎల్లకాలమూ 'అమ్మకానికి' సంబంధమైన పనులే చేస్తూ వుంటారు.

ఉత్పాదక కార్మికులు 'పని'లో వున్నప్పుడు, ఇతర కార్మికులతో మాత్రమే సంబంధంలో వుంటే, వర్తక కార్మికులు 'పని'లో వున్నప్పుడు ఇతర కార్మికుల తోనే గాక, సరుకుని కొనడానికి వచ్చే 'కొనుగోలు దార్ల'తో కూడా సంబంధంలో వుంటారు.

షాపులో నిలబడి సరుకుని అమ్మే కార్మికుల్ని చూద్దాం: వీరు ఎప్పుడూ సరుకు దగ్గిర వుంటారు. కొనే మనిషి రాగానే సరుకునంతా పరిచి పెట్టి, కొంత సరుకుని అమ్మి, మిగిలిన సరుకుని సర్ది పెడతారు. మళ్ళీ ఇంకో మనిషి రాగానే మళ్ళీ సరుకు నంతా పరిచి పెట్టి, తర్వాత సర్ది పెడతారు. మూడో మనిషి రాగానే మళ్ళీ ....! రోజు మొత్తం మీద అనేక డజన్ల సార్లు అదే పని! ప్రతీ గంటా, ప్రతీ రోజూ, ప్రతీ వారమూ, ప్రతీ నెలా, అదే పని! 'ఉద్యోగం' మారకుండా వుంటే జీవితమంతా అదే పని!

ఎప్పుడూ ఒకే పనిలో వున్నప్పుడు ఏ మనిషి అయినా, ఆ పనికి సంబంధించిన మాటలకూ, చేతలకూ, బాగా అలవాటు పడిపోతాడు. ఈ అల వాటు, వర్తక కార్మికుల విషయంలో చాలా ఎక్కువగా వుంటుంది. వర్తక కార్మికుల పని - సరుకుని కొనుగోలు దార్లకు చూపించి వారికి ఇష్టమైతే సరుకుని ఇచ్చి డబ్బు తీసుకోవడం మాత్రమే కాదు. వచ్చిన వాళ్ళు ఎలాగైనా సరుకుని 'కొనేలాగ చెయ్యడం' కూడా వర్తక కార్మికుల పనే. అది, వారి 'ఉద్యోగ ధర్మం.'

ఒకే రకం సరుకు (ఉదా: బట్ట) వేరు వేరు వర్తకుల షాపుల్లో వుంటుంది కాబట్టి, సరుకుని అమ్మడంలో విపరీతమైన పోటీ వుంటుంది. ఒక షాపు లోకి కొనడానికి వచ్చిన మనిషి, ఆ షాపులో కొనకుండా తిరిగి పోతే, ఆ వ్యక్తి ఇంకో షాపులో కొనేసే 'ప్రమాదం' వుంటుంది కాబట్టి, ఒక షాపు లోకి ఒక మనిషి రాగానే ఆ మనిషి ఆ షాపు లోనే తప్పని సరిగా కొనే లాగ చెయ్యడానికి కావలసిన జిత్తులన్నీ వర్తక కార్మికులు ప్రయోగించాలి. కొనుగోలుదార్ల ముందు సరుకుని పరిచి పెట్టి దాని 'ఉత్తమత్వాన్ని' కొన్ని వ్యాపార పదాలతో కీర్తిస్తూ. నిజాల కన్నా అబద్ధాలే ఎక్కువగా చెప్పాలి. అవసరమైతే పూర్తిగా బూటకాలే చెప్పాలి. కొనుగోలు దార్లకు నచ్చచెప్పడమూ, మొహమాట పెట్టడమూ, ఒత్తిడి చెయ్యడమూ - వంటి పనులన్నీ, ఆ జిత్తుల్లో భాగాలే. ఈ ఉద్యోగులు, 'పని స్థలం'లో వున్నంత సేపూ, కొనడానికి వచ్చే వాళ్ళతో మాట్లాడుతూనే వుండాలి.

భూమిని దున్నడమూ, దారం వడకడమూ, బట్టలు నెయ్యడమూ, చెప్పులు కుట్టడమూ - లాంటి 'ఉత్పాదక శ్రమల్లో' అయితే, ఈ జిత్తులూ, ఈ ఎత్తులూ అవసరం వుండవు. కానీ, 'సరుకుల్ని అమ్మే వర్తక వృత్తి, జిత్తులమారి తనం'తో నిండిపోయి వుంటుంది. వర్తక కార్మికులు, పెట్టుబడి దారుల లాభాల కోసం తమ 'శ్రమ'ని ఇవ్వడమే గాక, జిత్తుల మారి తనాలు కూడా అలవరుచు కోవాలి.

సమాజం మొత్తం మీద సరుకుని అమ్మే పనిలో,

కొందరు ఉద్యోగులు ఎప్పుడూ షాపుల్లో పడి వుంటూ జీవితాలు వెళ్ళిస్తూ వుంటే, మరి కొందరు ఉద్యోగులు ఆర్డర్లు సంపాదించడం కోసం ఊళ్ళ మీద పడి తిరుగుతూ వుంటారు. వీళ్ళ పని ఎప్పుడూ ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి పెట్టి బస్సుల్లోనూ, రైళ్ళల్లోనూ పడి ప్రయాణాలు చేస్తూ వుండడమే. వీరు ఎక్కడ బడితే అక్కడ ఆగుతారు. ఎక్కడ బడితే అక్కడ తింటారు. వీరికి, తిండికీ నిద్రకీ 'క్రమశిక్షణ గల అలవాట్లు' ఏర్పర్చుకోవడం సాధ్యం కాదు. బిడ్డల్ని పెంచుకోవడంలో బాధ్యత వహించడం సాధ్యం కాదు. వీరు ఎప్పుడూ ప్రశాంతమైన కుటుంబ జీవితాలు గడపలేరు.

కొన్ని రకాల సరుకుల అమ్మకాల్లో అయితే, అమ్మకం ఉద్యోగులు కొనుగోలు దార్లకి కేవలం 'సరుకు'ని అందిస్తే చాలదు. తమ శారీరకమైన 'షోకులు' కూడా అందించాలి. మందులు అమ్మే 'మెడికల్ రిప్రజెంటేటివ్‌లు' అట్టహాసాల అలంకరణలతో వెళ్ళి, డాక్టర్ల చుట్టూ తిరగాలి. సేల్సు గరల్స్, అందాలు చిందిస్తూ షాపుల్లో నిలబడడమో, ఇళ్ళ వెంట తిరగడమో, చెయ్యాలి. విమాన ప్రయాణాల్లో 'కస్టమర్ల'ని అలరించడం కోసం, ఎయిర్ హోస్టెస్‌లుగా 'యవ్వనం సడలని' యువతులే వుండాలి! ఇలాగే, ఇంకా అనేక రకాల శాఖల్లో! అంటే, సరుకుల అమ్మకంలో, ఉద్యోగులు, తమ 'శ్రమ'ని మామూలుగా ఇస్తే చాలదు. వ్యాపారపు టక్కులూ, వ్యభిచారపు జిత్తులూ కలిసిన హావ భావాలతో ఇవ్వాలి! వర్తక ఉద్యోగులు, ఈ రకపు హావ భావాలు ప్రదర్శించాలని వర్తక పెట్టుబడిదారులు తమ ఉద్యోగులకు నిర్భయంగా షరతులు పెడతారు! వర్తక ఉద్యోగులు, 'బతుకు దెరువు' కోసం ఇన్ని రకాల అసహజమైన ప్రవర్తనలకు అంగీకరించాలి.

వీధుల్లో తిరిగి అమ్ముకునే నిరుపేద వర్తకుల విషయం చూస్తే, వీరి పరిస్థితి అతి దుర్భరమైనది. పొద్దు పొడవక ముందు నించీ పొద్దు గూకే వరకూ, వీరు ఎప్పుడూ అరుస్తూ సరుకు అమ్మకం మీదే ప్రాణాలు పెట్టుకుని తిరుగుతూ వుంటారు. శ్రమ చెయ్యగల వయసులో వున్న స్త్రీ పురుషులే గాక, అరవై డెభై ఏళ్ళు దాటిన వృద్ధులూ, ఏడెనిమిది సంవత్సరాలు కూడా దాటని పిల్లలూ, పసి పిల్లల తల్లులూ కూడా - ఈ పనుల్లో తిరుగుతూ వుంటారు. వీరు ఎప్పుడూ వీధుల్లో తిరుగుతూ అమ్ముతారు కాబట్టి, తమ కేకలు వీధుల్లో ఎక్కువ దూరం వినపడడం కోసం కంఠాలు కీచు గానో, బొంగురు గానో మార్చి అసహజంగా అరుస్తూ, క్రమంగా, అరిచే యంత్రాల్లాగ అయిపోతారు. సరుకు అమ్మకాల కోసం, కొందరు మనుషులు తప్పని సరిగా ఇలా అయిపోతూ వుండాలన్న మాట! క్రమ శిక్షణ గల దిన చర్యా, చదువులూ వుంటే, ఎన్నెన్నో స్వతంత్ర శక్తులు ప్రదర్శించగల మనుషులెందరో, వీధుల్లో చిల్లర మల్లర సరుకులు అమ్ముకుంటూ జీవితాలకు జీవితాలే గడిపేస్తున్నారు! తరాలకు తరాలే ఈ మార్గంలో వెళ్ళి పోతున్నాయి!

పెట్టుబడిదారీ సమాజంలో సరుకుల 'రకాలు' పెరిగి పోతూ వుంటాయి కాబట్టి, సరుకుల్ని అమ్మే పనుల్లో కూడా 'స్పెషలైజేషన్' పెరుగుతూ వుంటుంది. వర్తక కార్యకలాపాలు నిర్వహించడానికి కొన్ని రకాల శిక్షణలూ, పరిజ్ఞానమూ, వేరు వేరు భాషలూ, తప్పని సరి అవుతాయి.

పెట్టుబడిదారీ సమాజంలో ప్రారంభమైన 'పబ్లిక్ విద్యా విధానం'లో, ప్రకృతి శాస్త్రాలూ, చరిత్రలూ, తత్వశాస్త్రాలూ వంటి చదువుల కన్నా కూడా వర్తక కార్యకలాపాలకు సంబంధించిన చదువులే ప్రధానమైన భాగంగా వుంటాయి.

ఉత్పాదక కార్మికుల విషయంలో లాగే, వర్తక కార్మికుల విషయంలో కూడా నిరుద్యోగమూ, కార్మికుల మధ్య పోటీ - అన్నీ మామూలే.

# 'స్పెక్యులేషన్' వ్యాపారం

స్పెక్యులేషన్ అంటే, 'ఊహించి అంచనా కట్టడం.' ఈ ఊహలూ, అంచనాలూ, సరుకుల 'ధరల్లో' హెచ్చు తగ్గుల గురించి! ఫలానా సరుకుకి కొన్నాళ్ళ తర్వాత ఎక్కువ డిమాండ్ ఏర్పడ వచ్చుననీ, అందువల్ల దాని ధర పెరగవచ్చుననీ, 'మార్కెట్ జ్ఞానం'తో ఊహించి అంచనా కట్టీ, ఆ సరుకుని కొని నిల్వ చేసి, తర్వాత అమ్మే వ్యాపారం - స్పెక్యులేషన్ వ్యాపారం.

సరైన ప్లాను లేని సమాజంలో, సరుకుల సప్లై డిమాండ్లు అస్త వ్యస్తంగా మారుతూ, దాని వల్ల వాటి ధరలు ఎగుడు దిగుళ్ళవుతూ వుండడం సహజమే. ఈ పరిస్థితే స్పెక్యులేషన్ వ్యాపారానికి అవకాశం కలిగిస్తుంది. మామూలు వ్యాపారంలో అయితే, సరుకు ధర, తర్వాత కాలంలో పెరగబోతోందా తరగబోతుందా - అనే దానితో వర్తకుడికి సంబంధం వుండదు. ఎప్పుడు ఏ ధర వుంటే ఆ ధర ప్రకారమే సరుకుని కొని, అమ్మి, ఆ ధరలో నించే తన లాభం తను తీసుకుంటాడు. కానీ, స్పెక్యులేషన్ వ్యాపారం అలా కాదు. ఫలానా సరుకు ధర భవిష్యత్తులో పెరగబోతోందని వూహించి నప్పుడే వర్తకుడు ఆ సరుకుని కొంటాడు. వర్తకుడి అంచనా నిజమైతే, ఆ సరుకు ద్వారా ఆ వర్తకుడు 'జనరల్ లాభం' కన్నా ఎక్కువ లాభం సంపాదిస్తాడు. కానీ, అన్ని సార్లూ వర్తకుడు ఊహించినట్టే జరగదు. మార్కెట్‌ని 'పాలించే' అన్ని రకాల శక్తుల్నీ వర్తకుడు ఊహించలేడు. కాబట్టి, కొన్ని సార్లు వర్తకుడనుకున్నట్టు సరుకు ధర పెరగక పోగా తగ్గవచ్చు కూడా. అలాంటప్పుడు స్పెక్యులేషన్ వర్తకుడు, పెట్టుబడి కూడా తిరిగి రాక నష్టపోవచ్చు.

# విదేశీ వర్తకం

'స్వదేశీ' వర్తకం - అంటే, సరుకుల్ని స్వదేశంలోనే ఒక చోట కొని, ఇంకో చోట అమ్మడం. 'విదేశీ' వర్తకం - అంటే, సరుకుల్ని స్వదేశంలో కొని విదేశాల్లో అమ్మడం గానీ, విదేశాల్లో కొని స్వదేశంలో అమ్మడం గానీ. 'ఎగుమతులు' చెయ్యడం గానీ, 'దిగుమతులు' చేసుకోవడం గానీ.

స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, వర్తకుడికి వచ్చే 'కమిషను', ఆ వర్తకం ఏ సరుకుతో జరుగుతుందో ఆ సరుకులో వుండే 'అదనపు విలువ'లో భాగమే. స్వదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, స్వదేశీ కార్మికుల అదనపు విలువ అయితే, విదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, విదేశీ కార్మికుల అదనపు విలువ. స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, 'విలువ'కు సంబంధించిన విషయాలేవీ మారవు.

ఇక్కడ 'వర్తకుడు' అంటే, వర్తక పెట్టుబడిదారుడే.

స్వతంత్ర వర్తకుడు, విదేశీ వర్తకం చెయ్యడు.

దేశం - అంటే, ఒక రాజ్యాంగం ఆధీనంలో వున్న పరిపాలనా ప్రాంతం. దేశాల మధ్య ఎగుమతులూ దిగుమతులూ జరగడమే, ఆ దేశాల మధ్య విదేశీ వర్తకం.

ఈ విషయాలకు సంబంధించి ఈ సంపుటంలోనే, 'పెట్టుబడిదారీ ధర' చాప్టరులో, కొన్ని విషయాలు చూశాం.

'స్వదేశీ' వర్తకంలో, 'సరుకు'కి బదులుగా ఏ డబ్బుని చెల్లించాలనే సమస్య వుండదు. చెల్లింపులన్నీ స్వదేశీ కాయితం డబ్బు తోటే జరుగుతాయి. కానీ, 'విదేశీ' వర్తకంలో, ఒక దేశపు కాయితం డబ్బు, ఇంకో దేశంలో చలామణీకి పనికి రాదు. కాబట్టి, ఏ దేశానికి ఆ దేశపు డబ్బునే చెల్లించాలనే నిబంధన అవసరమవుతుంది.

2 దేశాల్ని తీసుకుందాం.

ఒకటి రూపాయి దేశం, ఒకటి డాలరు దేశం.

రూపాయి - డాలరు మారకం రేటు:

10 రూపాయలు = 1 డాలరు.

2 దేశాల ప్రభుత్వాలూ ఒకే సమయంలో ఒకరి సరుకులు ఒకరు కొన్నారనుకుందాం. రూపాయి దేశం, డాలరు దేశానికి 8 డాలర్లు ఇవ్వవలసి వుంటే; డాలరు దేశం, రూపాయి దేశానికి 80 రూపాయలు ఇవ్వాలనుకుందాం.

రూపాయి దేశం సంగతి:

దీనికి ఎగుమతుల ద్వారా, 80 రూ. లు రావాలి.

దిగుమతుల కోసం, 8 డాలర్లు పోవాలి.

80 రూపాయలు = 8 డాలర్లు.

రెంటికీ సరిపోతుంది.

దీని అర్థం - ఈ దేశం, తన సరుకులు ఇచ్చి, ఎదటి దేశపు సరుకుల్ని తను తీసుకున్నట్టు మాత్రమే.

డాలరు దేశం సంగతి:

దీనికి, ఎగుమతుల ద్వారా, 8 డాలర్లు రావాలి.

దిగుమతుల కోసం, 80 రూ. లు పోవాలి.

8 డాలర్లు = 80 రూపాయలు.

రెంటికీ సరిపోతుంది.

దీని అర్థం, ఈ దేశం, తన సరుకుల్ని ఇచ్చి, ఎదటి దేశపు సరుకుల్ని తను తీసుకున్నట్టు మాత్రమే. ఈ 2 దేశాల్లో, ఏ దేశం వేపు నించి చూసినా, అది, ఎంత విలువ గల ఎగుమతులు చేసిందో, అంత

విలువ గల దిగుమతులు కూడా చేసుకుంది. రూపాయి దేశం, 80 రూపాయల ఎగుమతులు చేసింది కాబట్టి, ఆ విలువతో, 8 డాలర్ల దిగుమతులకు చెల్లించగలిగే శక్తిని సంపాదించింది. అంటే, రూపాయి దేశం, 80 రూపాయల ఎగుమతులు చేసినప్పుడు, ఆ విలువతో, 8 డాలర్ల సరుకుల్ని కొనగలదు. కాబట్టి, దానికి '8 డాలర్ల విదేశీ డబ్బు' వచ్చినట్టు అర్థం.

అలాగే, రెండో దేశం కూడా.

ఈ 2 దేశాల్లో ఏ దేశాన్ని చూసినా 'ఎగుమతుల' ద్వారా సంపాదించే విదేశీ మారకం, 'దిగుమతుల' కోసం చెల్లించడానికి సరిపోతుంది. 2 దేశాల మధ్యా లావాదేవీలు 'ఎక్కౌంటు డబ్బు'గా కాయితం మీద లెక్కల తోనే (ఎవరూ ఎవరికీ నిజం డబ్బు ఇవ్వనక్కర లేకుండానే) చెల్లిపోతాయి.

రూపాయి దేశం, 80 రూపాయల ఎగుమతులు చేసి, దానికి బదులుగా 8 డాలర్లు గాక 9 డాలర్ల దిగుమతులు చేసుకుందనుకుందాం. అప్పుడు రూపాయి దేశం చెల్లించవలసిన 9 డాలర్లలో, 8 డాలర్ల వరకే ఎక్కౌంటు డబ్బుగా సరిపోయి, ఇంకా 1 డాలరు చెల్లించ వలసి వస్తుంది. అంటే, రూపాయి దేశానికి 9 డాలర్ల విదేశీ మారకం కావలసి వుండగా, ఆ దేశం తన ఎగుమతుల ద్వారా 8 డాలర్లని మాత్రమే సంపాదించిందన్న మాట. దానికి కావలసిన విదేశీ మారకంలో 1 డాలరు 'లోటు' ఏర్పడింది. ఈ లోటుకి ఇంకో పేరు - 'వర్తక శేషం'. లేదా, 'చెల్లింపుల శేషం'.

ఇప్పుడు డాలరు దేశం సంగతి చూస్తే - దానికి ఎగుమతుల ద్వారా వచ్చిన విదేశీ మారకం 90 రూపాయలు. దిగుమతుల కోసం అది చెల్లించవలసింది 80 రూపాయలు. దీనికి ఇంకా 10 రూపాయల విదేశీ మారకం 'మిగులు'గా వుంది. ఆ 'మిగులు'తో అది రూపాయి దేశం నించీ ఇంకా 10 రూపాయల విలువ గల సరుకుని దిగుమతి చేసుకోగలుగుతుంది.

2 దేశాల మధ్యా ఎగుమతుల విలువకీ, దిగుమతుల విలువకీ, సరిపోతూ వుంటే, ఏ దేశానికీ 'విదేశీ మారకం'లో, 'లోటు' గానీ, 'మిగులు' గానీ, వుండవు. అలా సరిపోనప్పుడే, ఒక దేశానికి లోటూ, రెండో దేశానికి మిగులూ ఏర్పడతాయి.

రూపాయి దేశానికి '1 డాలరు లోటు' వున్నప్పుడు, ఆ దేశం, డాలరు దేశానికి, 10 కాయితం రూపాయిలు ఇస్తే పనికి రాదు. ఏ దేశమైనా విదేశాలకు చెల్లించవలసిన విలువని తన 'కాయితం డబ్బు'తో గాక, తన 'ఉత్పత్తులతో' మాత్రమే చెల్లించాలి. కాబట్టి రూపాయి దేశం, డాలరు దేశానికి, 10 రూపాయల విలువ గల ఏవైనా సరుకులనే ఇంకా ఎగుమతి చెయ్యాలి. అలా చేస్తే, అప్పుడు, 2 దేశాల మధ్యా ఎగుమతులకూ దిగుమతులకూ సరిపోతుంది. అప్పుడు, 'విదేశీ మారకం'తో ఒక దేశానికి లోటూ, ఒక దేశానికి మిగులూ వుండవు. (అప్పుడు మళ్ళీ కొత్త ఎగుమతులూ, కొత్త దిగుమతులూ ప్రారంభమవుతాయి. అది వేరే లెక్క.)

డాలరు దేశం, తనకు రావలసిన డాలరు కోసం "ఇతర సరుకు లేవీ వద్దు, డబ్బే కావాలి" అని అడిగితే, 'బంగారమే ఇవ్వ'మని అడుగుతోందన్న మాట! అప్పుడు రూపాయి దేశం, బంగారమే పంపిందనుకుందాం. అంటే, ఇక్కడ జరిగిందేమిటి? 'బంగారం' కూడా ఒక 'ఉత్పత్తే'. బంగారాన్ని పంపడం అంటే, అది కూడా కొంత ఉత్పత్తిని ఎగుమతి చెయ్యడమే. ఈ రకంగా 'వర్తక శేషం' గల దేశం, తను చెల్లించవలసిన దాని కోసం, ఇతర ఉత్పత్తుల్ని గానీ, బంగారాన్ని గానీ, మొత్తం మీద ఏదో ఒక 'ఉత్పత్తి'ని, ఎగుమతి చేసినప్పుడే తన విదేశీ మారకం లోటుని తీర్చుకోగలుగుతుంది.

ఒక దేశం, తను చెల్లించవలసిన దానికి బదులుగా ఏ ఉత్పత్తినీ పంపకపోతే, ఆ మొత్తానికి 'అప్పు' పడి వుంటుంది. 'అప్పు' ప్రారంభమవడం అంటే, ఆ క్షణం నించీ దాని మీద 'వడ్డీ' లెక్కలు కూడా ప్రారంభమవుతాయి. తర్వాత కాలంలో అయినా ఆ 'అప్పు'ని తీర్చాలంటే, 'అప్పు'కీ, దాని 'వడ్డీ'కీ సరిపోయే ఉత్పత్తుల్ని ఇవ్వవలిసిందే.

విదేశీ వర్తకంలో చెల్లింపుల సమస్యలు - 'ఎగుమతులూ, దిగుమతులూ సమానం అవడం' అనే పద్ధతిలో మాత్రమే పరిష్కారమవుతాయి. అది గాక, ఇంకో పద్ధతి ఏదీ వుండదు. ఈ విషయాలేవీ తెలియనివారు ఎలా అనుకుంటారంటే, పెద్ద పెద్ద పెట్టుబడిదారీ దేశాలు ఎప్పుడూ ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తూ వుంటాయే గానీ ఇతర దేశాల నించి దిగుమతులు చేసుకోవనీ, దిగుమతులు చేసుకోవలసిన అవసరం వాటికి వుండదనీ, అనుకుంటారు. కానీ ఎంత పెద్ద దేశం అయినా, తన సరుకుల్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసినప్పుడు, ఆ ఇతర దేశాల సరుకుల్ని తను దిగుమతి చేసుకోకపోతే, తన విలువని

వెనక్కి తీసుకునే మార్గమే వుండదు.

ఒక దేశ ప్రభుత్వమూ, దాని ప్రైవేటు పెట్టుబడి దారులూ చేసే ఎగుమతులన్నీ కలిసి, ఆ దేశపు ఎగుమతులు. అలాగే, వాళ్ళు చేసుకొనే దిగుమతులన్నీ కలిసి, ఆ దేశపు దిగుమతులు. ఎగుమతుల ద్వారా వచ్చే 'విదేశీ మారకం' (విదేశీ డబ్బు), దిగుమతుల కోసం ఖర్చవుతూ వుంటుంది. లేదా, వేరే మాటల్లో చెప్తే, 'దిగుమతుల' కోసం చెల్లించవలసిన 'విదేశీ మారకం', ఎగుమతుల ద్వారా అందుతూ వుంటుంది. అంటే, ఒక దేశం నించి సంపాదించే డబ్బు తోనే ఆ దేశానికి చెల్లించవలసి వుంటుంది.

'విదేశీ వర్తకం' అనగానే ఎగుమతులూ - దిగుమతులూ; రెండేసి దేశాల డబ్బు యూనిట్ల మారకం రేట్లూ; అన్ని దేశాల లోనూ విదేశీ మారకం బ్యాంకులూ, వాటి కమిషన్లూ - వగైరా విషయాలెన్నో రంగం లోకి వస్తాయి. దేశాల మధ్య 'ఎగుమతులకూ దిగుమతులకూ సరిపోవడం' సమస్య, 2 దేశాల కన్నా ఎక్కువ దేశాల ఎక్కౌంట్లని కలిపి చూస్తే తేలిగ్గా పరిష్కారమవడానికి అవకాశం వుంటుంది. ఎలాగంటే: 3 దేశాల్ని తీసుకుందాం, A, B, C దేశాల్ని. (ముగ్గురు వ్యక్తుల ఎక్కౌంట్లని కలిపి చూసినట్టే, 3 దేశాల ఎక్కౌంట్లని కలిపి చూడవచ్చు.) ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, వేరు వేరు డబ్బు యూనిట్ల పేర్లు తీసుకోవద్దు.

A దేశం - B కి 2 విలువ గల ఎగుమతులూ, C కి 2 విలువ గల ఎగుమతులూ చేసి, B నించి 4 విలువ గల దిగుమతులు చేసుకుంది. అంటే, A దేశం, B కి, 2 ఇవ్వాలి. దానికి C నించి 2 రావాలి.

B దేశం - A కి 4 విలువ గల ఎగుమతులు చేసి, A నించి 2 దిగుమతులూ, C నించి 2 దిగుమతులూ చేసుకుంది. అంటే, B దేశం, C కి 2 ఇవ్వాలి. దానికి A నించి 2 రావాలి.

C దేశం - A నించి 2 దిగుమతులు చేసుకుని, B కి 2 ఎగుమతులు చేసింది. అంటే, C దేశం, A కి 2 ఇవ్వాలి. దానికి B నించి 2 రావాలి.

ఈ ఉదాహరణలో ప్రతీ దేశానికీ ఎగుమతులూ, దిగుమతులూ సమానం గానే వున్నాయి, కానీ ఏ 2 దేశాల్ని తీసుకున్నా (A B ల్ని కానీ, B C ల్ని గానీ, C A ల్ని గానీ, ఎలా తీసుకున్నా), వాటి మధ్య ఎగుమతులూ దిగుమతులూ సమానంగా లేవు. కాబట్టి, ఆ రెండేసి దేశాలు మాత్రమే లెక్కలు చూసుకుంటే, వాటికి రావలసిన దానికీ, పోవలసిన దానికీ సరిపోదు. ఇలాంటి పరిస్థితుల్లో 3 దేశాలూ కలిసి లెక్కలు చూసుకుంటే, 3 దేశాల లావాదేవీలూ ఎక్కౌంటు డబ్బుగా చెల్లిపోతాయి. ఏ దేశానికీ చెల్లింపుల శేషం వుండదు.

3 దేశాలే గాక, ఇంకా ఎక్కువ దేశాలు కలిసి లెక్కలు చూసుకుంటే, చెల్లింపుల సమస్యలు ఇంకా తేలిగ్గా పరిష్కారమయ్యే అవకాశం వుంటుంది. అయితే, చెల్లింపుల సమస్యలు పరిష్కారమవడానికి ప్రధాన కారణం - 'కలిసి లెక్కలు చూసుకోవడం' మాత్రమే కాదు.

మొదట, ప్రతి దేశానికీ ఎగుమతుల మొత్తమూ, దిగుమతుల మొత్తమూ సమానంగా వుండాలి - ఆ ఎగుమతులూ దిగుమతులూ ఒకే దేశంతో కాక పోయినా. A, B, C దేశాల ఉదాహరణలో, ప్రతీ దేశానికీ, ఎగుమతుల మొత్తానికి తగిన దిగుమతులూ (లేదా, దిగుమతుల మొత్తానికి తగిన ఎగుమతులు) వుండడం వల్లనే, ఆ ఎక్కౌంట్లని కలిపి చూసినప్పుడు అవన్నీ ఒక దానికొకటి చెల్లిపోయాయి. అందులో ఏ దేశానికయినా ఎగుమతుల మొత్తమూ దిగుమతుల మొత్తమూ సమానంగా లేకపోతే, ఆ దేశాలు, తమ లెక్కలు కలిసి చూసుకున్నా ప్రయోజనం వుండదు. ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువగా వున్న దేశానికి, ఎంతో కొంత 'చెల్లింపు శేషం' వుండి పోతుంది. కాబట్టి, 'విదేశీ మారకం' సమస్య తీరడానికి మార్గం, ఎగుమతులూ దిగుమతులూ సరిపోవడం మాత్రమే.

దేశాల మధ్య డబ్బు లెక్కలు, సరుకుల ఎగుమతులకూ దిగుమతులకూ సంబంధించి మాత్రమే గాక, ఇంకా అనేక అంశాలకు కూడా సంబంధించి వుంటాయి. ఉదా॥ డాలరు దేశపు వ్యక్తి ఒకడు, రూపాయి దేశంలో పర్యటనకు వస్తాడు. ఆ వ్యక్తి, కొన్ని డాలర్లని, తన దేశపు బ్యాంకు ద్వారా గానీ, రూపాయి దేశపు బ్యాంకు ద్వారా గానీ, రూపాయలుగా మార్చుకుని, ఆ రూపాయల్ని తన పర్యటనా కాలంలో వాడుకోవాలి. ఆ విదేశీ వ్యక్తి, రూపాయి దేశంలో పర్యటించే కాలంలో, అనేక సరుకుల కోసం ఆ డబ్బుని చెల్లిస్తాడు. ఇది, రూపాయి దేశం, కొన్ని ఎగుమతులు చేసిన దానితో సమానం. డాలరు దేశపు వ్యక్తి చేతికి రూపాయలు వెళ్ళినట్టయితే, అతను చెల్లించే డాలర్లు రూపాయి దేశానికి చెందుతాయి. అంటే, డాలరు దేశపు వ్యక్తి రూపాయి దేశానికి

రావడం వల్ల, రూపాయి దేశానికి కొంత విదేశీ మారకం దొరుకుతుంది. దాన్ని తర్వాత విదేశీ సరుకులకు చెల్లించడానికి వీలవుతుంది. ఈ రకంగా, విదేశీ మారకాన్ని తీసుకు రాగలిగేవీ, అలాగే దాన్ని ఖర్చు పెట్టగలిగేవీ ఇటూ అటూ అనేక అంశాలు వుంటాయి. కానీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, అన్ని అంశాల్నీ కలిపి 'ఎగుమతులూ - దిగుమతులూ' పేరుతో చూస్తున్నాము. వాటి విలువలు పరస్పరం సరి పోతూ వుండాలి.

అనేక రకాల సరుకుల్ని ఉత్పత్తి చెయ్యగలిగే A అనే దేశం వుందనుకుందాం. అది తన సరుకుల్ని అనేక విదేశాలకు ఎగుమతులు చేస్తుందనుకుందాం. ఆ ఎగుమతులకు బదులుగా, దానికి బంగారమే ఇవ్వాలని షరతు పెడుతుందనుకుందాం. ఇతర దేశాలు ఆ 'షరతు'కి అంగీకరిస్తేనే A దేశం తన సరుకుల్ని ఎగుమతులు చెయ్యగల్గుతుంది. ఇతర దేశాలు బంగారం ఇవ్వగలిగే పరిస్థితుల్లో లేకపోతే, A దేశం తన సరుకుల్ని అమ్ముకోవడానికి అవకాశమే వుండదు. కాబట్టి, ఎంత 'గొప్ప' దేశమైనా తన ఎగుమతులకు బదులుగా విదేశాలు ఇవ్వగలిగే సరుకుల్ని తీసుకోడానికి అంగీకరిస్తేనే అది తన సరుకుల్ని అమ్ముకోగల్గుతుంది. అలాగాక, ఏ దేశమైనా తన ఎగుమతులకు బదులుగా బంగారమే తీసుకోవాలనుకున్నా లేదా ఎగుమతులు ఎక్కువ గానూ దిగుమతులు తక్కువ గానూ చేస్తూ, తన ఎక్కౌంటులో ఎప్పుడూ విదేశీ డబ్బుని కూడబెట్టాలనుకున్నా - ఆ దేశమూ, దానితో వర్తకం చేసే దేశాలూ కూడా సమస్యల్లో చిక్కుకుంటాయి. వాటి మధ్య వ్యాపారమే సాధ్యం కాదు.

సాధారణంగా, విదేశీ మారకం సమస్య గురించి పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఎలాంటి పరిష్కారం చెబుతారో 'పెట్టుబడిదారీ ధర' చాప్టరులో చూశాం. ఆ వేత్తలు, 'ఎప్పుడూ, ఎగుమతులు ఎక్కువ గానూ, దిగుమతులు తక్కువ గానూ చేస్తూ వుండాలి' అని చెపుతారు. ఏ దేశపు వేత్తలు ఆ దేశానికి అలాగే చెపుతారు.

A దేశం, B కి, ఎగుమతులే ఎక్కువగా చేసిందనుకుందాం. దానికి విదేశీ డబ్బు కొంత ఎక్కువగా రావలసి ఉంటుంది. ఆ డబ్బుకి బదులుగా అది B నించి ఇంకా కొన్ని సరుకుల్ని తీసుకోవలసిందే కదా? B నించి కాకపోతే, ఇంకో దేశం నించైనా సరుకులు తీసుకోవలసిందే కదా? అంటే, ఆ రకంగానైనా తన ఎగుమతులతో సమానమైన దిగుమతులు చేసుకోవలిసిందే కదా? మరి, ఎగుమతులు ఎక్కువా, దిగుమతులు తక్కువా సూత్రం వల్ల ఏమిటి ప్రయోజనం?

ఈ ఆర్థిక వేత్తలు చెప్పేది ఏమిటంటే, ఒక దేశం, దిగుమతుల కన్నా ఎగుమతులే ఎక్కువగా చేసి, రావలసిన శేషానికి బదులుగా బంగారాన్ని సంపాదించాలి - అని! - అది అసలే సాధ్యం కాదు.

విదేశీ మారకం సమస్యకి సరైన పరిష్కారం - ఎగుమతులకు తగిన దిగుమతులు చేసుకు తీరాలనే షరతుల మీద 'విదేశీ వర్తకం' నడవడమే. అంతకు మించిన పరిష్కారం ఏదీ వుండదు. 'విదేశీ వర్తకం' అంటే, కేవలం 'డబ్బు లెక్కల సమస్య' మాత్రమే కాదు. అంతకన్నా ప్రధానమైన విషయం, ఇరు పక్షాలూ విదేశాల నించి అవసరమైన సరుకులు మాత్రమే కొనుక్కోవాలి - అనేది.

A దేశం ఉత్పత్తి చేసుకునే పంచదార ఆ దేశానికి మాత్రమే సరిపోతుందనుకుందాం. కానీ దానికి, B దేశం నించి కొన్ని మందులు కావాలి. B దేశం, A ని పంచదార అడిగింది, A కి మందులు అవసరం. B కి పంచదార అవసరం. రెండూ నిజమైన అవసరాలే. కాబట్టి A దేశం, తన పంచదార వాడకాన్ని కొంత తగ్గించుకునైనా దాన్ని B కి ఇవ్వాలి. కానీ ఇలాంటి సరైన అవసరానికి గాక, A దేశం, B నించి మత్తు మందులూ విలాస వస్తువులూ దిగుమతి చేసుకుని, దానికి బదులుగా B కి పంచదారని ఎగుమతి చేస్తే, అది చెయ్యకూడని వ్యాపారం. A దేశంలో, విలాస వస్తువుల్నీ, మత్తు మందుల్నీ వాడే వాళ్ళు పంచదారని కూడా కావలసినంత వాడగలరు. కానీ, A దేశంలో పంచదార తగ్గితే, అది, కార్మిక జనాభాకి దొరకకుండా పోతుంది. ఆ జనాల్లో పంచదార వాడకం చాలా తగ్గిపోతుంది. అలాగే, ఏ అత్యవసర ఉత్పత్తుల్ని దేశం నుంచి ఎగుమతి చేసినా, ఆ లోటుని అనుభవించేది కార్మిక జనాభాయే.

కాబట్టి, విదేశీ వర్తకం అనేది, కేవలం డబ్బు లెక్కల వ్యవహారం కాదు. ఎలాంటి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయీ, ఎలాంటి ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయీ - అనే ప్రధానమైన సమస్య, అందులో ఇమిడి వుంటుంది.

పెట్టుబడి దారీ దేశాల మధ్య వ్యాపారం అంతా, పెట్టుబడి దారీ దృష్టి తోనే వుంటుంది. ప్రతి దేశమూ,

విదేశీ మారకాన్ని, కార్మిక జనాభాకి ఏ మాత్రమూ ఉపకరించని ఉత్పత్తుల మీదా, అంశాల మీదా, పెద్ద ఎత్తున ఖర్చు చేస్తూ వుంటుంది.

ఏదైనా ఒక దేశం, నిత్య జీవితావసరాలుగా వాడే ప్రధానమైన ఉత్పత్తుల కోసం, విదేశీ దిగుమతుల మీదే ఆధారపడి ఉంటుందనుకుందాం. అలాంటి పరిస్థితుల్లో ఆ దేశం విదేశాలు పెట్టే షరతులకూ, వాటి అదుపాజ్ఞలకూ, లోబడాల్సి వస్తుంది. కాబట్టి, ఏ దేశమైనా మొదట తప్పని సరిగా నిత్య జీవితావసరాల్ని తీర్చే ప్రధానమైన సరుకుల్ని స్వయం గానే ఉత్పత్తి చేసుకోవడానికి ప్రయత్నించాలి. తమ దగ్గిరే ఉత్పత్తి చేసుకోవడానికి ప్రకృతి సహజంగా సాధ్యం కాని వాటినీ, నిత్యావసరమైన వాటినీ మాత్రమే దిగుమతి చేసుకోవాలి. కానీ, 'లాభాల' కోసమే ఉత్పత్తి చెయ్యడమూ, అమ్మడమూ చేసే విధానంలో విదేశాల మీద ఆధారపడని స్వతంత్రతా, స్వయం పోషకత్వమూ - వంటి విషయాల ప్రసక్తే వుండదు.

## దొంగ వర్తకం (స్మగులింగ్):

ఎగుమతులూ, దిగుమతులూ జరిగేటప్పుడు, ప్రభుత్వాలకు చెల్లించవలసిన 'సుంకాల్ని' (టాక్సుల్ని) ఎగ్గొట్టడం కోసం రహస్య పద్ధతుల్లో చేసే వర్తకమే 'దొంగ వర్తకం'. ఇది వేరు వేరు దేశాల మధ్యా జరగవచ్చు; ఒక దేశం లోనే వేరు వేరు రాష్ట్రాల మధ్యా జరగవచ్చు. ఇలాంటి వర్తకంలో ప్రభుత్వాలకు చెల్లించకుండా మిగుల్చుకున్న పన్నులు, ఆ వర్తక పెట్టుబడి దారులకు అదనపు లాభాలుగా వుంటాయి.

'వర్తకం' అనేది - స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తక మైనా; అది చట్టబద్ధ వర్తకమైనా, దొంగ వర్తకమైనా - మొత్తం అన్ని దేశాల వర్తకాల్నీ కలిపి చూస్తే, 'ప్రపంచ వర్తక లాభాలన్నీ', ప్రపంచ ఉత్పాదక కార్మికుల అదనపు విలువలలో భాగమే.

'ప్రపంచ వర్తకం' అంతా, ప్రపంచ వర్తక కార్మికుల శ్రమతో జరిగేదే.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **'సరుకు'ని ఇచ్చి 'డబ్బు' తీసుకుంటే, ఆ పని పేరేమిటి? 'డబ్బు'ని ఇచ్చి 'సరుకు'ని తీసుకుంటే?**

**జ:** మొదటి పని, సరుకుని అమ్మడం, రెండో పని సరుకుని కొనడం.

2. **'అమ్మడం' లోనూ, 'కొనడం' లోనూ మారకాలు జరుగుతాయా?**

**జ:** ఆ రెండు పనుల్లోనూ జరిగేవి, సరుకుకీ డబ్బుకీ మారకాలే.

3. **వర్తకం - అంటే ఏమిటి?**

**జ:** సరుకుల్ని కొని, వాటిని స్వంతానికి వాడుకో కుండా తిరిగి అమ్మడం. ఈ కొనడం అమ్మడం కోసమే.

4. **'కేవల చలామణీ ఖర్చులు' అంటే, ఏ యే పనుల కోసం జరిగే ఖర్చులు?**

**జ:** సరుకుని 'కొనడం అనే పని' కోసమూ, 'అమ్మడం అనే పని' కోసమూ జరిగే ఖర్చులే కేవల చలామణీ ఖర్చులు.

5. **'ఉత్పాదక పెట్టుబడి' ద్వారా 2 పనులు జరుగు తాయి. అవి ఏమిటి?**

**జ:** 'పెట్టుబడి' వున్న చోట 'లాభాన్ని' కూడా దృష్టి లోకి తీసుకోవాలి. ఉత్పాదక పెట్టుబడి ద్వారా,

1) పెట్టుబడి ఖర్చు అంతా పునరుత్పత్తి అవ డమూ,
2) అదనపు విలువ కొత్తగా ఉత్పత్తి అవడమూ - ఈ 2 పనులూ జరుగుతాయి.

6. **'వర్తక పెట్టుబడి' అంటే ఏమిటి?**

**జ:** వర్తకుడు, ఏ యే పనుల కోసం పెట్టుబడి పెడ తాడో అదంతా కలిసి వర్తక పెట్టుబడి. అందులో స్టోరూ, రవాణా వంటి ఉత్పత్తి క్రమాలు కూడా వుంటాయి. ఆ క్రమాల ఖర్చుల్ని తీసివెయ్యగా, కేవలం అమ్మకం పనుల ఖర్చులే, అసలైన వర్తక పెట్టుబడి.

7. వర్తక పెట్టుబడి, లాభాన్ని ఉత్పత్తి చెయ్యదు. కానీ లాభాన్ని సంపాదిస్తుంది ఏ విధంగా?

జ: ఉత్పాదక పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన అదనపు విలువని పంచుకోవడం ద్వారా.

8. 'రవాణా' వల్ల ఏ సరుకూ ఉత్పత్తి కాదు, అయినా, రవాణా ఖర్చు, అది ఏ సరుకుని రవాణా చేస్తుందో, ఆ సరుకు విలువ లోకి చేరుతుంది. 'వర్తకం' వల్ల కూడా ఏ సరుకూ ఉత్పత్తి కాదు. అయినా వర్తకం ఖర్చు, అది ఏ సరుకుతో వర్తకం చేస్తుందో ఆ సరుకు విలువకి చేరదు. ఎందుచేత?

జ: రవాణా అనేది సహజమైన అవసరం. అది లేక పోతే ఉత్పత్తులు, ఒక చోట నించి ఇంకో చోటకి కదలవు. కానీ, వర్తకం (అమ్మకం) అలాంటి సహజ అవసరం కాదు. అందుకే, ఆ ఖర్చు ఉత్పత్తికి చేరదు.

9. 'పంచదార' వ్యాపారం చేసే వర్తక పెట్టుబడి దారుడు, పంచదారని ఉత్పత్తి చేసే కార్మికుల్ని దోపిడీ చేస్తున్నాడా, 'తన దగ్గర' వర్తక శ్రమలు చేసే కార్మికుల్ని దోపిడీ చేస్తున్నాడా?

జ: రెండు రకాల కార్మికుల్నీ దోపిడీ చేస్తాడు. ఉత్పాదక కార్మికుల ద్వారా 'అదనపు విలువ'నీ (వర్తక లాభంగా కొంత డబ్బుని), వర్తక కార్మికుల ద్వారా 'అదనపు శ్రమ'నీ (డబ్బుగా మారని శ్రమని) దోపిడీ చేస్తాడు.

10. ఒక స్త్రీ, బజారుకి రిక్షాలో వెళ్ళింది. రిక్షా ఖర్చు 2 రూ. లు. బజారులో 'ఒక కుర్చీ' కొన్నది. కుర్చీ ధర 50 రూ. లు. కుర్చీని బండి మీద ఇంటికి తెచ్చింది. బండి ఖర్చు 3 రూ. లు. రిక్షా ఖర్చూ, బండి ఖర్చూ కుర్చీ విలువకి చేరతాయా?

జ: షాపులో వున్నప్పుడు, కుర్చీ విలువ 50. దాన్ని, ఇంటికి తెచ్చిన రవాణా ఖర్చు 3. ఇంటికి చేరిన కుర్చీ విలువ 50 + 3 = 53. ఆ స్త్రీ, రిక్షాలో షాపు దగ్గిరికి వెళ్ళిన ఖర్చు కుర్చీకి సంబంధించిన ఖర్చు కాదు. ఒక వస్తువుని ఒక చోటు నించి ఇంకో చోటుకి జరిపేదే, ఆ వస్తువుకి సంబంధించిన ఖర్చు. ఆమె షాపుకి వెళ్ళిన ఖర్చుతో, ఆ వస్తువుకి సంబంధం లేదు.

11. కార్మికులు బియ్యం కొనడానికి దుకాణానికి వెళ్తారు. అలా 'వెళ్ళడం' అనే శ్రమ విలువ, 'బియ్యం విలువ' కి చేరుతుందా?

జ: చేరదు. అది, బియ్యం తయారవడానికో, ఆ బియ్యం రవాణా అవడానికో జరిగిన ఖర్చు కాదు.

12. వర్తకుడికి, సరుకు 120 కి వచ్చింది. కమిషన్ 24. సరుకు ధర ఎంత?

జ: వర్తకుడు కొన్న ధర 120 + కమిషన్ 24 = 144. ఇదే వర్తకుడు అమ్మే ధర.

13. జనరల్ లాభం రేటు 50%, ఏ శాఖ లోనూ ఉత్పత్తి శక్తులు మారలేదు. కానీ, పని చేసే ఉత్పాదక పెట్టుబడి పెరిగింది. 'జనరల్ లాభం రేటు' మారుతుందా? 'లాభం రాసి' మారుతుందా?

జ: పెట్టుబడి పెరిగింది కాబట్టి, లాభం రాసి పెరుగుతుంది. ఉత్పాదక శక్తి మారలేదు కాబట్టి, లాభం రేటు మారదు.

14. సమాజంలో మొత్తం ఉత్పాదక పెట్టుబడి 300. వర్తక కమిషన్ 100. జనరల్ లాభం రేటు 50%. ఈ లెక్క చేయగా వచ్చేది సరుకుకి విలువ అవుతుందా, ఉత్పత్తి ధర అవుతుందా? అందులో 'అదనపు విలువ' ఎంత? ఆ అదనపు విలువ ఎంత పెట్టుబడి ద్వారా వచ్చింది?

జ: జనరల్ లాభం రేటు 50% కాబట్టి, 300 ఉత్పాదక పెట్టుబడికి లాభం = — × 300 = 150. వర్తక కమిషన్ అయిన 100 కూడా అదనపు విలువలో భాగమే కాబట్టి, మొత్తం S = 150 + 100 = 250. ఇది, ఉత్పాదక పెట్టుబడి అయిన 300 ద్వారానే ఉత్పత్తి అయింది. సరుకు విలువ = ఉత్పాదక పెట్టుబడి 300 + అదనపు విలువ 250 = 550. ఇది, ఒక్క శాఖలో సరుకు విషయం కాక, మొత్తం సమాజంలో వున్న సరుకుల రాసి విషయం కాబట్టి, 'విలువ' అయినా అదే, ఉత్పత్తి ధర అయినా అదే.

15. సరుకు విలువ, పెట్టుబడిదారీ లెక్కలో అయినా, సరైన లెక్కలో అయినా ఒకే పరిమాణంతో

**వుంటుంది. అయితే పెట్టుబడిదారీ లెక్కకీ, సరైన లెక్కకీ తేడా ఏ విషయంలో?**

**జ:** 'అదనపు విలువ'ని అంగీకరించే విషయంలో. సరైన లెక్క ప్రకారం సరుకులో, పెట్టుబడీ + అదనపు విలువా, ఈ రెండే వుంటాయి. కానీ, పెట్టుబడిదారీ లెక్క ప్రకారం, పెట్టుబడీ + కౌలూ, వడ్డీ, లాభమూ వుంటాయి. విలువ పరిమాణం, ఏ అవగాహన ప్రకారం అయినా ఒకటే. కానీ, 'విలువ' గురించిన అవగాహనల్లోనే పూర్తిగా తేడా.

16.**ఒక సరుకు ధర కిలో 10 రూ. లు. వర్తకుడు, ఆ సరుకుని 7 రూ. లతో కొన్నాడు. ఆ సరుకుని అమ్మడానికి వర్తకం ఖర్చు 1 రూ. ఆ సరుకుని ఒక కార్మిక స్త్రీకి అమ్మేటప్పుడు, వర్తకుడు, సరుకుని తూచడంలో మోసం చేసి, 1 కిలోకి బదులుగా 3 పావులు మాత్రమే ఇచ్చి 10 రూ. లు తీసుకున్నాడు. వర్తకుడికి వచ్చిన జనరల్ లాభం ఎంత? సెకండరీ లాభం ఎంత?**

**జ:** వర్తకుడు, 10 రూ. ల సరుకుని, 7తో కొన్నాడంటే, వర్తక కమిషన్ - 3. అందులో అమ్మకం ఖర్చుగా 1 రూపాయి పోతే, మిగిలే లాభం 2 రూ. లు. ఇది జనరల్‌గా వచ్చే లాభం. ఆ సరుకుని అమ్మేటప్పుడు వర్తకుడు, 4వ వంతు సరుకుని ఇవ్వలేదు. 10 రూ. లు తీసుకుని, 7  కి సరిపోయే సరుకునే ఇచ్చాడు. 2  సరుకుని ఇవ్వలేదు. ఇది సెకండరీ లాభం.

17.**రామయ్య బజారులో బియ్యమూ, కూరగాయలూ కొన్నాడు. బియ్యం మూట ఒక పిల్లవాడి నెత్తిన పెట్టి, కూరగాయల సంచి తనే పట్టుకుని ఇంటికి వచ్చాడు. పిల్లవాడు చేసిన శ్రమ ఏమిటి? రామయ్య చేసిన శ్రమ ఏమిటి?**

**జ:** ఇద్దరు చేసిందీ ఉత్పత్తుల్ని ఒక చోటు నించి ఇంకో చోటుకి తేవడమే. అది రవాణా శ్రమ. వాళ్ళు బండి మీద కాకుండా నడిచే వచ్చారు కాబట్టి, అక్కడ శ్రమ పరికరం ఏదీ లేదు.

18.**రామయ్య ఆ ఉత్పత్తుల్ని ఒక సైకిల్ మీద పెట్టి ఇంటికి తెచ్చాడనుకుందాం. అది ఏం శ్రమ?**

**జ:** అప్పుడు కూడా అది రవాణా శ్రమే. అప్పుడు, ఆ సైకిలు, శ్రమ పరికరం. సైకిల్‌ని నడిపిన వ్యక్తే, ఆ శ్రమ చేసిన వ్యక్తి.

19.**రామయ్య ఆ సైకిల్ మీద, ఇంకో వ్యక్తిని కూర్చో బెట్టుకున్నాడు. ఆ రెండో వ్యక్తి కూడా రవాణా శ్రమ చేసినట్టేనా?**

**జ:** కాదు. ఆ వ్యక్తి, రామయ్య చేసిన రవాణా శ్రమని వాడుకున్నట్టు అర్థం.

20.**ఒక సరుకు ధర బజారులో 2 రూ. లు. అదే సరుకుని, వీధుల్లో తిరిగి అమ్మే వ్యక్తి కూడా మన గుమ్మం దగ్గిరికి తెచ్చి 2 రూ. లకే ఇస్తాడు. అంత కన్నా ఎక్కువ ధర చెప్తే, "బజార్లో 2 రూ. లే కదా" అంటాం. సరుకుని గుమ్మం దాకా తెచ్చిన రవాణా శ్రమకి చెల్లిస్తున్నామా?**

**జ:** వీధుల్లో తిరుగుతూ సరుకుల్ని అమ్మే వారు నిరుపేద వర్తకులు. బజారులో వున్న ధరలకే, మన గుమ్మం ముందు కూడా సరుకుల్ని ఇవ్వడం అంటే, ఆ వర్తకులు రవాణా శ్రమకి రావలసిన దాన్ని పోగొట్టుకుంటున్నాడని అర్థం. ఆ వస్తువులు, మన దగ్గిరికి రాకపోతే, మనమే ఆ వస్తువుల దగ్గిరికి వెళ్ళే శ్రమ చేసుకోవాలి.

21.**ఒక సరుకు, ఉత్పత్తి స్థలంలో తయారై వుంది. దాని ఉత్పాదక పెట్టుబడి 200. జనరల్ లాభం రేటు 15%. ఆ సరుకు 'విలువ'ని గ్రహించడానికి ఈ వివరాలు చాలా? ఇంకా ఏమైనా వివరాలు కావాలా? ఏ వివరాలు కావాలి?**

**జ:** ఉత్పాదక పెట్టుబడి 200. 15% లాభం రేటు లెక్కన దాని లాభం — × 200 = 30. ఆ పెట్టుబడీ, దాని లాభమూ కలిసి, 200 + 30 = 230. ఇది ఉత్పాదక పెట్టుబడిదారుడికి రావలసిన ధర. ఇదే ఆ సరుకు విలువ కాదు. ఇంకా వర్తక కమిషన్ కూడా దానికి కలవాలి.

22.**సమాజంలో దోపిడీ విధానం లేదు. ఉత్పత్తిదారులందరూ పూర్తిగా స్వతంత్ర ఉత్పత్తిదారులే. అలాం**

**టప్పుడు, మారకాలూ, ఆ ఖర్చులూ వుంటాయా?**

**జ:** ఉంటాయి. ఎందుకంటే, స్వతంత్ర ఉత్పత్తి దారులు కూడా తమ సరుకుల్ని ఒకరితో ఒకరు మార కాలు చేసుకోవలిసిందే. వాటి ఖర్చులన్నీ జరగవలి సిందే. ఉత్పత్తిదారులు ఎవరి స్వంత ఆస్తితో వారు విడి విడిగా ఉత్పత్తి క్రమాలు చేసుకోవడం కాకుండా, ఉత్పత్తి సాధనాల్ని సమిష్టిగా పెట్టుకుని, సమిష్టిగా ఉత్పత్తి చేసుకోవాలి. ఆ తర్వాత కూడా చాలా మార్పులు జరగాలి. అప్పుడే మారకాలతో అవసరం వుండదు.

23.**A దేశపు వర్తకుడు ఒకడు, B దేశపు వర్తకుడికి, 10 విలువ గల సరుకుని అమ్మాడు. మళ్ళీ B దేశపు వర్తకుడి నించి 10 విలువ గల ఇంకో సరుకు కొన్నాడు. ఈ లావాదేవీల్లో ఈ వర్తకులకు వచ్చిన లాభాలు ఎవరి అదనపు విలువలు?**

**జ:** A దేశపు వర్తకుడు అమ్మిన సరుకు A దేశంలో తయారైనదే. దాని ద్వారా వచ్చిన లాభం, A దేశపు కార్మికులది. అలాగే, B దేశపు వర్తకుడి లాభం, B దేశపు కార్మికులది.

24.**సమాజం మొత్తం మీద, 'వర్తకం ఖర్చు' గతంలో కన్నా తగ్గితే, జనరల్ లాభం రేటు గతంలో కన్నా పెరుగుతుంది. ఎందుచేత?**

**జ:** వర్తకం ఖర్చులు తగ్గితే, S లో నించి వృధాగా పోయే ఖర్చులు తగ్గి, ఆ భాగాన్ని కూడా లాభంగా పంచుకోవడానికి వీలవుతుంది. ఆ రకంగా లాభం రేటు పెరుగుతుంది.

25.**ప్రపంచ వ్యాప్తంగా కిందటి సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఎక్కువ విదేశీ వర్తకం జరిగింది - అంటే అర్థం ఏమిటి?**

**జ:** దేశాల మధ్య ఎక్కువ ఎగుమతులూ, ఎక్కువ దిగుమతులూ జరిగాయి - అని.

26.**మీరు ఉత్పాదక కార్మికులా, వర్తక కార్మికులా? రెండూ కాదా? మరి మీరేమిటి?**

**జ:** రెండూ కాను. ఏ పత్రిక లోనూ ఉద్యోగి కాని రచ యితలు, స్వతంత్ర ఉత్పత్తిదారులే అవుతారు.

27.**ఒక పుస్తకాల ప్రచురణ కర్త, రచయితల నించి పుస్తకాలు తీసుకుని, వాటిని ప్రెస్‌లో అచ్చు వేయించి, వాటిని ఒక వర్తకుడికి అమ్మడానికి ఇస్తాడు. ఒక పుస్తకం వివరాలు ఇలా వున్నాయి: ప్రెస్‌కి చెల్లించి నది 10. అది $4_c + 3_v + 3_s$ గా వుంది. ఈ 10లో వున్న $3_s$ ప్రెస్ కార్మికులది. ఇది ప్రెస్ యజమానికి అందుతుంది. ఆ ప్రచురణ కర్త, ఆ పుస్తక రచయితకి రాయల్టీగా 5 ఇస్తాడు, ఇప్పటి వరకూ ప్రచురణ కర్తకు అయిన ఖర్చు 10 + 5 = 15. ఇది, ఆ పుస్తకానికి కాస్ట్ ప్రైసు. దీని మీద ప్రచురణ కర్తకు లాభం రావాలి. అంతే గాక, వర్తక కమిషన్‌ని కూడా కలపాలి. ఈ 2 అంశాల కోసం ఇంకో 5 కలిసింది. చివరికి పుస్తకాన్ని అమ్మే ధర 15 + 5 = 20. అయితే, ఈ ధరలో, కాస్టు ప్రైసు పైన వున్న 5, ఎవరి అదనపు విలువ?**

**జ:** ఏ సరుకు విషయంలో అయినా, అందులో వున్న S, ఆ సరుకుని ఉత్పత్తి చేసిన వారిదే. ఈ 'పుస్తకం' అనే సరుకుని ఉత్పత్తి చేసింది.

(1) ఒక రచయితా,

(2) ప్రెస్ కార్మికులూనూ.

ఆ సరుకు ద్వారా వచ్చే S, ఆ ఉత్పత్తిదారులదే అవుతుంది.

ఇక్కడ S ని తీసు కునే వాళ్ళు, (1) ప్రెస్ యజమానీ, (2) పుస్తక ప్రచురణ కర్తా, (3) పుస్తకాన్ని అమ్మే వర్తక పెట్టుబడిదారుడూ. అంటే, ప్రెస్ కార్మి కుల అదనపు విలువ, ప్రెస్ యజమానికి అందిన 3 మాత్రమే కాదు. ప్రచురణ కర్తకీ, వర్తకుడికీ అందిన లాభాలలో కూడా ప్రెస్ కార్మికుల S వుంటుంది.

ఒక రచయిత, తన పుస్తకాలకు తనే ప్రచురణ కర్తగా వుంటే, ఆ పుస్తకాల ద్వారా వచ్చే లాభంలో, ప్రెస్ కార్మికుల S కూడా కొంత వుంటుంది. ఆ రచ యిత, ఆ పుస్తకం ధరని తన రాయల్టీ తప్ప, 'లాభం రాని విధంగా' పెడితే, అప్పుడు ఆ లాభం (ప్రెస్ కార్మికుల S), ఆ పుస్తకాన్ని చవక ధరతో కొనే పాఠకులకు పోతుంది. ఆ రచయిత, ఆ పుస్తకం ద్వారా తన రాయల్టీని కూడా తీసుకోక పోతే, దాని ధర ఇంకా తగ్గి, పాఠకులు దాన్ని ఇంకా చవకగా కొనగలుగు తారు. ★

# 2. వడ్డీ పెట్టుబడి

వడ్డీ - అనేది, అదనపు విలువలో భాగమే - అని మనకు తెలుసు. దీనికి సంబంధించి ఇంకా కొన్ని విషయాలు ఇప్పుడు చూస్తాం.

వడ్డీ వుందంటే, మొదట అప్పు వుందని అర్థం. 'అప్పు' వుంటేనే కదా 'వడ్డీ?'

'అప్పు'ని బార్టరు కాలం నించీ కూడా ఊహించ వచ్చు. ఎలాగంటే, ఒక 'వస్తువు'ని తీసుకుని, దానికి బదులుగా ఇవ్వవలిసిన రెండో వస్తువుని వెంటనే ఇవ్వకపోతే, మొదటి వస్తువుని 'అప్పు పద్ధతి' మీద తీసుకున్నట్టు అర్థం. రెండో వస్తువుని, ఇచ్చినప్పుడే అప్పు తీరుతుంది.

సమాజంలో 'డబ్బు' ప్రారంభమైన తర్వాత, ఒక 'వస్తువు'ని కొని, వెంటనే 'డబ్బు' ఇవ్వకపోతే, ఆ వస్తువుని అప్పు పద్ధతి మీద తీసుకున్నట్టు అర్థం. తర్వాత 'డబ్బు' ఇచ్చేసినప్పుడు అప్పు తీరుతుంది.

'అప్పు' అంటే - 'సరుకు అప్పు' గానీ, 'డబ్బు అప్పు' గానీ.

'అప్పు'కి సంబంధించిన మిగతా విషయాలు చూసే ముందు, మొట్ట మొదట అర్థం చేసుకోవలిసింది - 'స్వంత ఆస్తి సంబంధాలు గల సమాజంలో, అప్పుతో అవసరం ఎప్పుడూ వుంటుంది' అని. ఎందుకంటే, 'మొత్తం సామాజిక ఉత్పత్తి సాధనాల్లో' కొంత భాగం, 'వడ్డీ పెట్టుబడిదార్ల' ఆధీనంలో కూడా వుంటుంది కాబట్టి, సామాజిక ఉత్పత్తి క్రమానికి ఆ భాగం కూడా అవసరం.

పెట్టుబడిదారీ సమాజాన్ని తీసుకుందాం. 'పెట్టుబడి' అంటే, 'ఉత్పత్తి సాధనాలు.' (C + Vల్ని 'ఉత్పత్తి సాధనాలు'గా చూస్తున్నాము.)

ఒక ఉత్పాదక పెట్టుబడిదారుడికి '100 పెట్టుబడి' కావాలంటే, దాని అర్థం - '100 విలువ గల ఉత్పత్తి సాధనాలు' కావాలి అని. వాడి దగ్గిర 60 పెట్టుబడే వుందనీ, ఇంకో 40 పెట్టుబడిని అప్పు తీసుకోవాలనీ, అనుకుందాం. అంటే, వాడి దగ్గిర, కొన్ని ఉత్పత్తి సాధనాలే వున్నాయనీ, మిగిలినవి వడ్డీ పెట్టుబడిదారుడి దగ్గిర వున్నాయనీ, అర్థం. మొత్తం 100 విలువ గల ఉత్పత్తి సాధనాలన్నీ ఒక చోట కలిస్తే గానీ, ఆ 'ఉత్పత్తి క్రమం' సాధ్యం కాదు. అందుకే ఆ పెట్టుబడిదారుడు, 'అప్పు' తీసుకోవడం తప్పని సరి. మొత్తం సమాజానికి కూడా అదే వర్తిస్తుంది.

'డబ్బు అప్పు' తీసుకోవడం అంటే, 'ఉత్పత్తి సాధనాల్ని' అప్పు తీసుకోవడమే.

సమాజంలో వున్న మొత్తం ఉత్పత్తి సాధనాలన్నీ ('మొత్తం పెట్టుబడి' అంతా), ఉత్పాదక పెట్టుబడిదారుల ఆస్తిగా మాత్రమే వుండవు. అందులో కొంత భాగం - వడ్డీ పెట్టుబడిదారుల ఆస్తి గానూ, కొంత భాగం - వర్తక పెట్టుబడిదారుల ఆస్తి గానూ కూడా వుంటాయి. ఆ ఉత్పత్తి సాధనాలన్నీ కలిస్తేనే ఉత్పత్తి క్రమమూ, పునరుత్పత్తి క్రమమూ, జరుగుతాయి.

వడ్డీ పెట్టుబడిదార్ల సెక్షను, తన పెట్టుబడిని అప్పుగా ఇవ్వడం అంటే, తన ఉత్పత్తి సాధనాలతో తనే స్వయంగా 'ఉత్పత్తి క్రమం' నడపకుండా, వాటిని ఉపయోగించే అవకాశం ఇంకో సెక్షనుకి ఇస్తోందన్న మాట. అందుకు ప్రతిఫలంగా 'వడ్డీ' పేరుతో 'అదనపు ఉత్పత్తి'లో కొంత భాగాన్ని తీసుకుంటుంది.

ఒక ఉత్పత్తి క్రమం ముగిసి, అదనపు ఉత్పత్తి అందినప్పుడు, 'పెట్టుబడి దారీ వర్గం'లో అన్ని సెక్షన్ల పెట్టుబడులూ (అన్ని సెక్షన్ల ఉత్పత్తి సాధనాలూ) పెరుగుతాయి. ఆ పెరిగిన ఉత్పత్తి సాధనాలతో పునరుత్పత్తి క్రమం విస్తృత స్థాయిలో జరుగుతుంది. ('పెట్టుబడిదారీ విధానంలో ఒక సంవత్సరపు ఉత్పత్తి క్రమం కన్నా తర్వాత సంవత్సరపు ఉత్పత్తి క్రమం విస్తృత స్థాయిలో వుంటుందనే సంగతి గతం లోనే చూశాం.)

ఉత్పాదక, వర్తక పెట్టుబడిదార్ల సెక్షన్లు, ఎన్ని లాభాలు సంపాదిస్తోన్నా, వాళ్ళ పెట్టుబడులు ఎంత పెరుగుతోన్నా, వాళ్ళు, వడ్డీ పెట్టుబడి దార్ల పెట్టుబడిని కూడా ఉపయోగించడం తప్పనిసరి. ఉత్పత్తి సాధనాలు వేరు వేరు సెక్షన్ల చేతుల్లో, వాళ్ళ స్వంత ఆస్తులుగా పోగుపడే సమాజంలో, 'ఉత్పత్తి క్రమాన్ని' నిర్వహించే సెక్షను, ఇంకో సెక్షను నించి 'అప్పులు' తీసుకోవడం తప్పనిసరి అవుతూనే వుంటుంది.

ఉత్పాదక పెట్టుబడిదారుల్లో ఒకడి దగ్గర, కావలసినంత స్వంత పెట్టుబడి వుండడం వల్ల, వాడికి అప్పు అవసరం లేకపోవచ్చు. ఇంకో పెట్టుబడి దారుడికి, కొంత అప్పు అవసరం కావచ్చు. మూడో వాడికి పూర్తిగా అవసరం కావచ్చు. ఇలా, విడి విడి ఉదాహరణలు రక రకాలుగా వుంటాయి. కానీ, సమాజం మొత్తాన్ని చూసినప్పుడు, 'సామాజిక ఉత్పత్తి క్రమం' కోసం, వడ్డీ పెట్టుబడిదార్ల సెక్షను దగ్గర వున్న పెట్టుబడిని కూడా ఉపయోగించడం ('అప్పు' తీసుకోవడం ద్వారా) తప్పనిసరి అవుతుంది.

'అప్పు' అనేది, వెనకటి కాలం నించీ కూడా వుంది. 'అప్పు' తర్వాతే 'వడ్డీ' పుట్టింది.

అప్పూ, వడ్డీ - అనేవి, వెనకటి కాలం నించీ వున్నప్పటికీ, సరుకుల అమ్మకాలన్నీ అప్పు పద్ధతి మీదే నడిచేటంతగా అప్పు విధానం అభివృద్ధి చెందడం, పెట్టుబడిదారీ సమాజం లోనే ప్రారంభమయింది.

# డబ్బు అప్పు

'**డ**బ్బు' లేని, (లేదా, చాలని) ఉత్పాదక పెట్టుబడిదారుడు, డబ్బు వున్న పెట్టుబడి దారుడి నించీ అప్పు తీసుకుంటాడు. ఆ అప్పుని తిరిగి చెల్లించే లోగా 'వడ్డీ' చెల్లిస్తూ వుంటాడు. (ఆ డబ్బు తనదే అయితే, ఆ 'వడ్డీ'ని తనే వుంచుకుంటాడు.)

'వడ్డీ' అంటే ఏమిటో, ఉత్పాదక పెట్టుబడి దారుడు దాన్ని ఎలా చెల్లిస్తాడో, గతం లోనే చూశాం. 'వస్తువు' ఉత్పత్తి కోసం, ఉత్పత్తి సాధనాలూ, శ్రమా - అనే 2 విషయాలు తప్ప, ఇంకే విషయమూ అక్కర లేదు. 'వడ్డీ' అనేది, ఈ 2 విషయాల్లో దేని లోకీ రాదు. 'ఉత్పత్తి సాధనాల' భాగం లోకి గానీ, 'శ్రమ' భాగం లోకి గానీ, రాదు. కాబట్టి, 'వడ్డీ' కోసం చెల్లించే ఖర్చు, వస్తువు కోసం సహజంగా అవసరమయ్యే ఖర్చు కాదు. అది, 'ఉత్పత్తి క్రమం'తో సంబంధం లేకుండా, దాని బయట జరిగే ఖర్చు. ఉత్పత్తి కోసం సహజంగా అవసరం అవని ఏ ఖర్చూ, దాని 'విలువ' లోకి చేరదు; 'విలువ'ని పెంచదు. కాబట్టి, వడ్డీ - అనుత్పాదకమైన ఖర్చు.

అయినా, 'డబ్బు'ని అప్పు తెచ్చుకున్న ఉత్పాదక పెట్టుబడిదారుడు, 'వడ్డీ'ని, సరుకులో నించే తీసి చెల్లించాలి. అంత కన్నా వేరే మార్గం వుండదు. అంటే, సరుకు 'విలువ' లోకి చేరని ఖర్చు, సరుకు 'విలువ'లో నించే బయటికి రావాలన్న మాట! ఈ 'వింత' ఎలా సాధ్యమో విసుగెత్తేటన్ని సార్లు చూశాం. దాన్ని మళ్ళీ చెప్పుకోనక్కర లేదు. 'డబ్బు'ని అప్పు ఇస్తే, కొన్నాళ్ళకి అది వెనక్కి వస్తూ, 'వడ్డీ' పేరుతో కొంత ఎక్కువ డబ్బుని కూడా తెస్తుంది కదా? ఆ వడ్డీ, ఎక్కడ తయారవుతుందో, దాని క్రమం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

డబ్బు - ని అప్పు ఇచ్చే వాడు, వడ్డీ పెట్టుబడి దారుడు. డబ్బు - ని అప్పు తీసుకునే వాడు ఉత్పాదక పెట్టుబడిదారుడైనా కావచ్చు, వర్తక పెట్టుబడిదారుడైనా కావచ్చు. ఇక్కడ, ఉత్పాదక పెట్టుబడిదారుడినే తీసుకుందాం.

'అప్పు'గా వెళ్ళే డబ్బు- వడ్డీ పెట్టుబడి. అది- M. అది, మొదట వడ్డీ పెట్టుబడిదారుడి చేతిలో వుంటుంది. తర్వాత, సరుకుని తయారు చేయించే వాడి చేతిలోకి అప్పుగా వెళ్తుంది. అది, వడ్డీ వాడి చేతిలో నించి, 'సరుకు వాడి' చేతి లోకి మారగానే దాని సైజు పెరగదు. అక్కడ కూడా మొదటి సైజు లోనే వుంటుంది.

తర్వాత, సరుకు వాడు, ఆ M తో, ఉత్పత్తి సాధనాలు కొంటాడు. అంటే, సరుకు వాడి దగ్గిర, ఆ M, C గా మారుతుంది. (ఉత్పత్తి సాధనాలు గానూ, సరుకుని తయారు చెయ్యబోయే కార్మికుల పోషణ ఉత్పత్తులు గానూ.) అలా మారినప్పుడు, M విలువ కన్నా, C విలువ ఎక్కువగా వుండదు. ఈ C, ఉత్పాదక పెట్టుబడి.

తర్వాత, 'ఉత్పత్తి క్రమం' జరుగుతుంది. అది P. కొత్త సరుకు తయారవుతుంది. ఇది, $C^1$. దీనికి, మొదటి C కన్నా ఎక్కువ విలువ వుంటుంది. $C^1$ కి, ఈ ఎక్కువ విలువ, ఉత్పత్తి క్రమం లోనే చేరుతుంది.

$C^1$ ని అమ్మితే, $M^1$ వస్తుంది. ఇది, మొదటి డబ్బు కన్నా ఎక్కువ డబ్బు. మొదటి విలువ కన్నా ఎక్కువ విలువ.

$M^1$ లో నించి, M ని తీసివేస్తే మిగిలేది - 'జనరల్ లాభం.' (ఇది, ఆ సరుకుని ఉత్పత్తి చేసిన కార్మికుల అదనపు విలువ.)

M ని అప్పు తీసుకున్న సరుకు వాడు, కొత్త సరుకు అమ్మగా, M, వెనక్కి వచ్చేస్తుంది కాబట్టి,

దాన్ని, వడ్డీ పెట్టుబడి దారుడికి ఇచ్చేస్తాడు. సమస్య, M గురించి కాదు. దాని మీద వడ్డీని కూడా ఇవ్వాలి. దాన్ని ఎందులోంచి తీసి ఇస్తాడు? సరుకు ద్వారా జనరల్ లాభం వచ్చి వుంటుంది కాబట్టి, అందులోంచి తీసి ఇస్తాడు. కానీ, సరుకు కోసం మొదట ఖర్చు పెట్ట వలసిన డబ్బు, సరుకు వాడి స్వంత డబ్బే అయితే, వడ్డీని ఎవరికీ చెల్లించవలసిన అవసరం వుండదు.

సరుకుని ఇంకా అమ్మక ముందే వడ్డీని చెల్లించినా, దాన్ని వెనక్కి తీసుకునేది మాత్రం సరుకు అమ్మిన తర్వాత వచ్చే 'జనరల్ లాభం'లో నించే. అంటే, వడ్డీ అనేది - సరుకుని ఉత్పత్తి చేసిన కార్మికుల 'అదనపు విలువ'లో భాగం.

తయారై వున్న కొత్త సరుకుని, వర్తక పెట్టుబడి దారుడు, తన కార్మికులతో అమ్మిస్తాడు కదా? వాడికి కూడా, మొదట ఆ సరుకుని కొనడానికి కొంత డబ్బు అప్పు తీసుకుంటాడనుకుందాం. అది వర్తక పెట్టుబడి M. దానితో $C^1$ని కొంటాడు. దాన్ని అమ్మితే $M^1$ వస్తుంది. అందులో నించి వాడి పెట్టుబడికి తగినట్టుగా 'జనరల్ లాభం' వస్తుంది. ఆ లాభంలో నించే వాడు వడ్డీ చెల్లిస్తాడు. — ఈ రకంగా, ఒక సరుకుకి సంబంధించిన ఉత్పాదక, వర్తక పెట్టుబడి దారులు చెల్లించే (లేదా, వాళ్ళే వుంచుకునే) వడ్డీ అంతా, ఆ సరుకు తాలూకు 'అదనపు విలువ' లోది.

సరుకు తయారైన తర్వాత, దాని మీద ఇంకా స్టోరూ, రవాణా వంటి 'ఉత్పత్తి క్రమాలు' జరుగుతాయి. ఆ 'పెట్టుబడులు' కూడా, వడ్డీలు చెల్లిస్తాయి. 'స్టోరు పెట్టుబడి' చెల్లించే వడ్డీ - ఆ పెట్టుబడికి సంబంధించిన జనరల్ లాభంలోది. అంటే, 'స్టోరు కార్మికుల' అదనపు విలువ లోది. అలాగే, 'రవాణా పెట్టుబడి' చెల్లించే వడ్డీ, రవాణా కార్మికుల అదనపు విలువలోది.

ఒక విడి సరుకు విషయంలో జరిగేదే, మొత్తం 'సరుకుల రాసి' కంతటికీ జరుగుతుంది. ఉత్పాదక, వర్తక రంగాల్లో వున్న వడ్డీలన్నిటినీ కలిపితే, (వాటిని బయటికి చెల్లించినా, వాళ్ళే వుంచుకున్నా), ఆ 'వడ్డీల రాసి', ఆ దేశపు ఉత్పాదక కార్మికుల 'అదనపు విలువ'లో భాగం. ప్రపంచ వడ్డీల రాసి - ప్రపంచ కార్మికుల అదనపు విలువలో భాగం.

'వడ్డీ' అంటే - శ్రమ చెయ్యకుండా తీసుకునే డబ్బు. 'డబ్బు' అంటే 'ఉత్పత్తి'. వడ్డీ - డబ్బుని సంపాదించే వ్యక్తులు, ఆ డబ్బుతో, కొంత 'ఉత్పత్తి'ని కొనగలరు కాబట్టి, వడ్డీ అంటే, శ్రమ చెయ్యకుండా సంపాదించే 'ఉత్పత్తి.'

ఉత్పత్తులన్నీ, 'శ్రమ' తోనే తయారవుతాయి. కానీ, వడ్డీ పెట్టుబడిదారుడు, ఏ శ్రమా చెయ్యకుండానే 'ఉత్పత్తి రాసి'లో నించి కొంత భాగాన్ని లాగ గలుగుతాడు. ఏటా తమకు వచ్చే వడ్డీలలో నించి కొంత భాగాన్ని తన పెట్టుబడికి చేరుస్తూ, తన 'వడ్డీ పెట్టుబడి'ని పెంచుకుంటూ, మరింత ఎక్కువ వడ్డీలు సంపాదిస్తూ వుంటాడు.

"వడ్డీ అంటే ఏమిటి?" అనే ప్రశ్నకి, వడ్డీని సమర్థించే ఆర్థిక వేత్తలు, "వడ్డీ అంటే అప్పుగా ఇచ్చే డబ్బుకి - ధర" అని చెపుతారు. ఆ 'ధర', దేని ఆధారంతో నిర్ణయమవుతుందో చెప్పరు. చెప్పడానికి వాళ్ళకి ఆధారం వుండదు.

> **"వ**డ్డీని, 'పెట్టుబడికి ధర'గా చెప్పడం మొదటి నించీ పూర్తిగా హేతు విరుద్ధమైన వ్యక్తీకరణ (ఇర్రేషనల్ ఎక్స్‌ప్రెషన్)" - మార్క్స్ - [కాపిటల్ - 3, పేజీ 354, మాస్కో 1971.]

'సరుకు'ని అమ్మగా వచ్చే జనరల్ లాభం, అనేక అంశాలుగా పంపకం అవుతుందని మనకు తెలుసు. అయితే, ఇప్పుడు మిగతా అంశాలన్నిటినీ వదిలేసి, 'వడ్డీ'నీ, ఉత్పాదక పెట్టుబడికి మిగిలే 'సంస్థ లాభాన్నీ' మాత్రమే (ఈ 2 అంశాల్ని మాత్రమే) తీసుకుని, వీటి సంబంధాలు ఎలా వుంటాయో చూస్తాం.

ఒక సరుకులో మొత్తం '50 జనరల్ లాభం' వుందనుకుందాం. అందులో వడ్డీ 5, సంస్థ లాభం 15, మిగిలిన అంశాలన్నీ కలిసి 30 - అనుకుందాం. ఇప్పుడు మిగిలిన అంశాలకు సంబంధించిన 30ని వదిలేసి - వడ్డీ, సంస్థ లాభమూ కలిసిన మొత్తాన్ని మాత్రమే (20 ని మాత్రమే) 'జనరల్ లాభం'గా అనుకుందాం. కాబట్టి, ఇక్కడ 'జనరల్ లాభం' అన్నప్పుడల్లా ఈ 2 అంశాలకూ సంబంధించిన మొత్తం గురించి మాత్రమే మాట్లాడు తున్నామని అనుకోవాలి.

'సరుకు'లో, 20 జనరల్ లాభం వుంటే:
వడ్డీ 5 అయితే, సంస్థ లాభం 15
వడ్డీ 6 అయితే, సంస్థ లాభం 14
వడ్డీ 4 అయితే, సంస్థ లాభం 16
వడ్డీ 3 అయితే, సంస్థ లాభం 17

అంటే, 'జనరల్ లాభం'లో నించి మొదట వడ్డీని తీసి వెయ్యగా మిగిలేది సంస్థ లాభం. అంతే గానీ, మొదట సంస్థ లాభాన్ని తీసి వెయ్యగా మిగిలేది వడ్డీ కాదు. వడ్డీ పెరిగితే, మిగిలే లాభం తగ్గుతుంది. వడ్డీ తగ్గితే, మిగిలే లాభం పెరుగుతుంది. ఇదీ - వడ్డీకీ, సంస్థ లాభానికీ వుండే సంబంధం.

పెట్టుబడిదారుడు చెల్లించే వడ్డీ, కార్మికుల అదనపు విలువే అయినా, వడ్డీ అనేది పైకి ఎలా కనపడుతుందంటే, పెట్టుబడిదారుడి 'ఆదాయానికి సంబంధించిన విషయం లాగ' కనపడుతుంది. ఎందుకంటే, వడ్డీ ఎక్కువ చెల్లిస్తే, పెట్టుబడి దారుడికి మిగిలేది తగ్గుతుంది; తక్కువ చెల్లిస్తే, మిగిలేది పెరుగుతుంది. అసలు వడ్డీయే చెల్లించ నక్కర లేకపోతే అదంతా పెట్టుబడిదారుడికే వుండి పోతుంది. అంతే గాక, తన వ్యాపారం కోసం డబ్బుని అప్పు తెచ్చుకోవలసిన అవసరం - పెట్టుబడి దారుడికే వుంటుంది గానీ, కార్మికులకు వుండదు. ఈ కారణాలన్నిటి వల్లా, ఈ వడ్డీల వ్యవహారం అంతా, పెట్టుబడి దారుడి స్వంత వ్యవహారం అయినట్టూ, వాడు తన 'ఆదాయంలో నించే' వడ్డీలు కట్టుకుంటున్నట్టూ, వడ్డీలు కట్టవలసినప్పుడల్లా వాడు తన ఆదాయాన్నే పోగొట్టు కుంటున్నట్టూ - ఈ రకంగా కనబడుతుంది. అలా కనపడేది, పెట్టుబడిదారుడికే కాదు, కార్మికులకు కూడా! అసలు, పెట్టుబడి దారుడి 'ఆదాయం' గురించే ('లాభం' గురించి) 'సరైన అవగాహన' ఎవరికీ వుండదు. కాబట్టి, ఆ ఆదాయంలో నించి చెల్లించే వడ్డీ గురించి కూడా సరైన అవగాహన వుండదు.

## 'వడ్డీ రేటు'కి సహజ కారణం వుంటుందా?

జనరల్ లాభం అనేది - వడ్డీ గానూ, సంస్థ లాభం గానూ పంపకం అవ్వాలంటే, ఏది ఎంత భాగంగా వుండాలో ఏ సూత్రాల వల్ల నిర్ణయమవుతుంది?

ఒక సరుకులో - జనరల్ లాభం 20. (ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, జనరల్ లాభమూ, అదనపు విలువా, ఒకే సైజు అనుకుందాం.) అందులో వడ్డీ 5, సంస్థ లాభం 15 - అనుకుందాం. ఈ 3 అంశాలూ ఇలా వుండడానికి కారణాలేమిటి?

మొదట, జనరల్ లాభం - '20గా' వుండడానికి కారణం ఏమిటంటే - ఆ సరుకు కోసం కార్మికులు ఇచ్చిన 'అదనపు శ్రమ' అంత వుండడమే. కార్మికులు ఇచ్చిన 'శ్రమ విలువ'లో నించి వారి 'జీతాల్ని' తీసి వెయ్యగా ఇంకా మిగిలినది, ఈ ఉదాహరణలో 20 అన్న మాట. అంటే, కార్మికుల శ్రమ విలువ = జీతాలు + 20. 'జీతాల' కన్నా అదనంగా ఎంత వుందో అదే 'జనరల్ లాభం'. అది 20. జనరల్ లాభం, ఖచ్చితంగా 20 అనే పరిమాణంతో వుండడానికి కారణం ఇదే.

తర్వాత, సంస్థ లాభం - 15 గా వుండడానికి కూడా ఖచ్చితమైన కారణం వుంది. వడ్డీ 5 గా వుండడమే, ఆ కారణం. అందుకే సంస్థ లాభం 15గా వుంది.

ఇక తేల వలసింది, వడ్డీ విషయం. అది '5గా' ఎందుకు వుంది? దీనికేమైనా 'సహజ కారణం' వుందా? - అలాంటి కారణం ఏదీ లేదు. అది 5 కావచ్చు, 6 కావచ్చు, 11 కావచ్చు, 3 కావచ్చు. ఎంతైనా కావచ్చు. అది అలా వుండడానికి సహజ కారణం ఏదీ లేదు. ఈ ఉదాహరణలో అది 5గా వుంది, అంతే.

'శ్రమల' వల్ల ఏర్పడే అంశాలకైతే, వాటి కోసం ఖర్చయిన శ్రమల పరిమాణాన్ని బట్టి, వాటి విలువలు అలాగే వుండడానికి 'కారణాలు' వుంటాయి. కానీ, 'వడ్డీ' గానీ, 'లాభం' గానీ, అలాంటి అంశాలు కావు. అవి 'శ్రమల'తో తయారైనవీ కావు, 'శ్రమ'ని ఇచ్చేవీ కావు. (ఉత్పత్తి సాధనాలూ కావు, శ్రామికులూ కావు.) అవి 'శ్రమ'ని ఇవ్వకుండా, 'శ్రమ'ని లాక్కునే అంశాలు. అలా, శ్రమని లాక్కునేటప్పుడు, అందులో ఏ అంశానికి ఎంత భాగం రావాలీ - అనే దాన్ని నిర్ణయించడానికి 'సరైన కారణం' ఏదీ వుండదు.

శ్రామికుల నించి లాగిన 'జనరల్ లాభం' అనే కొంత శ్రమ మొత్తాన్ని, వడ్డీ, సంస్థ లాభమూ - అనే 2 అంశాలూ పంచుకోవాలంటే, ఆ పంపకం ''ఏదో ఒక రకం'గా ('ఆర్బిట్రరీ'గా) జరగవలసిందే. ఏదో ఒక రకంగా పంచుకోవడమే అక్కడ వున్న సూత్రం అంతా. అంత కన్నా 'హేతుబద్ధమైన' సూత్రం ఏదీ అక్కడ వుండదు. '20 జనరల్ లాభం'లో, వడ్డీ 5 అయితే, అది జనరల్ లాభంలో 4 వ భాగంగా వున్నట్టు అర్థం.

ఇలా వుందంటే, ఇది వెనకటి నించీ వస్తూ వున్న 'సాంప్రదాయం' మాత్రమే. ఈ సాంప్రదాయానికి 'కారణం' ఏదీ లేదు.

కొంత కాలం నించీ ఒక 'వడ్డీ రేటు' అమలులో వుందనుకుందాం. అప్పుడు 'వడ్డీ పెట్టుబడి'కి సంబంధించిన సప్లై డిమాండ్లు మారితే, అప్పటి వరకూ వున్న 'వడ్డీ రేటు' కొంచెం ఇటో అటో మారుతుంది.

సమాజంలో - అప్పుగా వెళ్ళడానికి సిద్ధంగా వున్న డబ్బు అంతా కలిసి, వడ్డీ పెట్టుబడి - సప్లై. అప్పు తీసుకునే వాళ్ళ అవసరాల మొత్తం అంతా కలిసి - వడ్డీ పెట్టుబడి కోసం డిమాండ్. డిమాండ్ కన్నా సప్లై ఎక్కువగా వుంటే, అప్పటి వరకూ అమలులో వున్న 'వడ్డీ రేటు' తగ్గుతుంది. సప్లై కన్నా డిమాండ్ ఎక్కువగా వుంటే, వడ్డీ రేటు పెరుగుతుంది. సప్లై డిమాండ్లు సమానంగా వుంటే, పాత వడ్డీ రేటే మారకుండా వుంటుంది.

వడ్డీ పెట్టుబడికి సప్లై డిమాండ్లు సమానంగా వున్నప్పుడు వుండే వడ్డీ రేటుని 'సగటు వడ్డీ రేటు' అనుకుంటే, ఆ 'సగటు రేటు'కి కూడా కారణం ఏదీ వుండదు. సరుకు 'ధర' విషయంలో అయితే, సరుకు సప్లై - డిమాండ్లు సమానంగా వుంటే, మార్కెట్ ధర, ఉత్పత్తి ధరతో సమానంగా వుంటుంది. అలాగే, కార్మికుల 'జీతం' విషయంలో, కార్మికుల సప్లై - డిమాండ్లు సమానంగా వుంటే, 'జీతం' అనేది, 'శ్రమ శక్తి విలువ'తో సమానంగా వుంటుంది. కానీ, 'వడ్డీ రేటు' విషయంలో, వడ్డీ పెట్టుబడి సప్లై - డిమాండ్లు సమానంగా వుంటే, అప్పుడు వుండే వడ్డీ రేటు దేనితో సమానం? అది 'ఫలానా దానితో సమానం' అని చెప్పడానికి ఏం వుంది? - ఏదీ లేదు. వడ్డీ యే అసహజమైంది కాబట్టి, ('శ్రమ'తో సంబంధం లేనిదీ, ఉత్పత్తి క్రమానికి అవసరం లేనిదీ కాబట్టి), వడ్డీ రేటుకి సహజ కారణం వుండదు. సగటు - వడ్డీ రేటు కూడా సహజ రేటు కాదు. అది 'ఆర్బిట్రరీగా' ఏర్పడే రేటు మాత్రమే.

ఒక వడ్డీ రేటు వుంటూ వుండగా, వడ్డీ పెట్టుబడి సప్లై డిమాండ్లలో మార్పుల్ని బట్టి వడ్డీ రేటు మారుతుంది- అని గ్రహించడం సరైనదే. కానీ, అదే చాలదు. అది చాలా ప్రాథమికమైన విషయం. వడ్డీ పెట్టుబడి సప్లై డిమాండ్లు మారతాయి - అని గ్రహించడమే కాదు. ఆ సప్లై డిమాండ్లు ఎందుకు మారతాయి? దేన్ని బట్టి మారతాయి? - అనే విషయం కూడా గ్రహించాలి. సరుకు అమ్మ కాలు ఎప్పటికప్పుడు సవ్యంగా జరుగుతున్నాయా లేదా, పెట్టుబడి ఎప్పటి కప్పుడు సకాలంలో వెనక్కి వస్తోందా లేదా - అనే పరిస్థితుల మీద, వడ్డీ పెట్టుబడి సప్లై డిమాండ్లు ఆధారపడి వుంటాయి. పెట్టుబడి సప్లై డిమాండ్లని బట్టే, వడ్డీ రేటు. అంటే, సరుకు అమ్మకాల పరిస్థితుల్ని బట్టే, వడ్డీ రేటు!

వడ్డీ పెట్టుబడికి డిమాండ్ పెరిగి, వడ్డీ రేటు, ఎంత ఎక్కువ స్థాయికి పెరిగినా, జనరల్ లాభాన్నంతా తీసేసుకోగలిగే స్థాయికి మాత్రం పెరగదు. జనరల్ లాభాన్నంతా వడ్డీకే చెల్లించవలసి వస్తే, 'అప్పు' తీసుకున్న పెట్టుబడిదారుడికి, మిగిలేదేమీ వుండదు. లాభమే మిగలనంత వడ్డీ రేటు వుంటే, ఉత్పాదక పెట్టుబడిదారుడు ఉత్పత్తే చెయ్యడు; అప్పే తీసుకోడు. కాబట్టి, వడ్డీ రేటు చాలా ఎక్కువగా వున్న సందర్భాల్లో కూడా అది, జనరల్ లాభం రేటులో ఎంతో కొంత భాగంగా మాత్రమే వుంటుంది.

# 'వడ్డీ రేటు'లో రకాలు:

**వ**డ్డీని లెక్క కట్టడంలో, బారు వడ్డీ, చక్ర వడ్డీ - అనేవి ప్రధానమైన పద్ధతులు. 'బారు వడ్డీ' అంటే, అప్పు నడిచిన కాలాన్నంతటినీ వరసగా తీసుకుని దాని మీద వడ్డీని లెక్క కట్టడం. 'చక్ర వడ్డీ' అంటే, కొంత కాలానికోసారి వడ్డీ, 'అసలు'కి కలుస్తూ వుంటుంది. ప్రతీ నెల గానీ, 3 నెలలకోసారి గానీ వడ్డీ కూడా కలిసి, అసలు పెరుగుతూ వుంటుంది.

వడ్డీ రేటు 10% అనుకుంటే, ఈ రేటుతో బారు వడ్డీ పద్ధతిలో కన్నా, చక్ర వడ్డీ పద్ధతిలో 'వడ్డీ మొత్తం' చాలా ఎక్కువగా వుంటుంది.

వడ్డీ రేటు - అన్నప్పుడు అన్ని సందర్భాలకూ ఒకే వడ్డీ రేటు వుండదు. అప్పు తీసుకునే డబ్బు పరిమాణాల్ని బట్టీ, కాల పరిమాణాల్ని బట్టీ, వడ్డీ రేట్లు తేడాగా వుంటాయి. సందర్భాల్లో తేడాల్ని బట్టే గాక, అప్పులు ఇచ్చే - తీసుకునే వ్యక్తుల్ని బట్టీ, సంస్థల్ని బట్టీ కూడా వడ్డీ రేట్లు కొంత కొంత తేడాలుగా వుంటాయి.

ఇలా, వడ్డీ రేట్లలో ఎన్ని తేడాలు వున్నా వడ్డీ

రేటుకి వర్తించే విషయాలన్నీ, అన్ని రకాల వడ్డీ రేట్లకూ వర్తిస్తాయి. కాబట్టి, 'వడ్డీ రేటు' అన్నప్పుడు, అందులో వుండే తేడాల సంగతి అనవసరం.

వేరు వేరు శాఖల్లో లాభం రేట్లు, 'జనరల్ లాభం రేటు'కి కొంచెం ఇటూ అటూగా కొంత కొంత తేడాలతో వుంటాయని గతంలో చూశాం. ఆ అంశానికి ఇప్పుడు, 'వడ్డీ రేటు' అనే అంశాన్ని కూడా కలిపి చూస్తే, అప్పుడు కూడా విషయం ఏమీ మారదు. 'లాభం రేట్లు' తేడాగా వుండి, వడ్డీ రేటు ఒకే రకంగా వుంటే, వడ్డీని తీసి వెయ్యగా మిగిలే సంస్థ లాభాలు ఎలా వుంటాయి? తేడా గానే వుంటాయి. ఈ రకంగా, వేరు వేరు శాఖల లాభం రేట్లూ, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడుల లాభం రేట్లూ, కొంత కొంత తేడాలు గానే వుంటాయి. ఈ విషయం, వడ్డీ రేటు వల్ల, ఏమీ మారదు.

వడ్డీ రేటులో మార్పు జరిగితే (తగ్గినా, పెరిగినా), ఆ మార్పు, పెట్టుబడి దార్లందరికీ ఒకే రకంగా వర్తిస్తుంది. అప్పులు తీసుకునేది - ఉత్పాదక పెట్టుబడిదారులూ, వర్తక పెట్టుబడిదారులూ, మాత్రమే కాదు. స్వతంత్ర ఉత్పత్తిదారులూ, స్వతంత్ర వర్తకులూ కూడా అప్పులు తీసుకుంటూ వుంటారు. వీరంతా తమ 'వ్యాపార' అవసరాలకే కాదు, వ్యక్తిగత (కుటుంబ) అవసరాల కోసం కూడా అప్పులు తీసుకుంటూ వుంటారు.

కార్మికులు కూడా కుటుంబ అవసరాల కోసం అప్పులు తీసుకుంటూ వుంటారు.

తీసుకున్న అప్పుని, ఏ అవసరాల కోసం ఉపయోగించారూ - అనే దాన్ని బట్టి, ఆ అప్పు కోసం చెల్లించే వడ్డీ, 'అదనపు విలువ'లో నించి ఇచ్చేది గానో, 'జీతం'లో నించి ఇచ్చేది గానో వుంటుంది.

# వడ్డీ అంటే ఏమిటి?

| | అప్పు తీసుకున్నది ఎవరు? | ఏ అవసరం కోసం? | 'వడ్డీ', దేనిలో నించి వచ్చింది? | వడ్డీ ఏమిటి? |
|---|---|---|---|---|
| 1. | ఉత్పాదక పెట్టుబడిదారుడు | (1) ఉత్పాదక అవసరం కోసం. (2) కుటుంబ అవసరం కోసం. | (1) 'జనరల్ లాభం'లో నించి. (2) చివరకు మిగిలే 'సంస్థ లాభం'లో నించి. | (1) ఉత్పాదక కార్మికుల అదనపు విలువ. (2) ఉత్పాదక కార్మికుల అదనపు విలువ. |
| 2. | వర్తక పెట్టుబడి దారుడు | (1) వర్తక అవసరం. (2) కుటుంబ అవసరం. | (1) 'జనరల్ లాభం'లో నించి. (2) చివరకు మిగిలే 'వర్తక లాభం'లో నించి. | (1) ఉత్పాదక కార్మికుల అదనపు విలువ. (2) ఉత్పాదక కార్మికుల అదనపు విలువ |
| 3. | స్వతంత్ర ఉత్పత్తి దారుడు | (1) ఉత్పాదక అవసరం 2) కుటుంబ అవసరం | (1) 'జనరల్ లాభం'లో నించి. (2) 'ఉత్పాదక లాభం'లో నించి. | (1) స్వంత అదనపు విలువ (2) 'స్వంత అదనపు విలువ'గానీ, 'శ్రమ శక్తి విలువ' గానీ |
| 4. | స్వతంత్ర వర్తకుడు | (1) వర్తక అవసరం (2) కుటుంబ అవసరం | (1) 'జనరల్ లాభం'లో నించి. (2) చివరకు మిగిలే 'వర్తక లాభం'లో నించి. | (1) స్వంత అదనపు విలువ. (2) 'స్వంత అదనపు విలువ'గానీ, 'శ్రమ శక్తి విలువ' గానీ. |
| 5. | కార్మికుడు | (1) కుటుంబ అవసరం | (1) 'జీతం'లో నించి. | (1) 'శ్రమ శక్తి విలువ'లో భాగం |

ఇందులో, ఉత్పాదక - వర్తక పెట్టుబడిదారులు వడ్డీలు చెల్లించడం అంటే, వాళ్ళు 'దోచుకున్న' దాంట్లోంచి

కొంత భాగం చెల్లించడమే కాబట్టి, వడ్డీల వల్ల వాళ్ళు నష్టపోయేదేమీ వుండదు. కానీ, స్వయంగా శ్రమ చేసే స్వతంత్ర ఉత్పత్తిదారులూ, స్వతంత్ర వర్తకులూ, కార్మికులూ - వడ్డీలు చెల్లించడం అంటే, వీళ్ళంతా తమ 'కష్టార్జితం'లో నించి కొంత భాగాన్ని పోగొట్టుకుంటు న్నారన్న మాట. (వాళ్ళు వాడుకోవలసిన ఉత్పత్తుల్ని, వడ్డీల కోసం అప్పజెపుతున్నారన్న మాట!)

స్వతంత్ర ఉత్పత్తి దారుల, స్వతంత్ర వర్తకుల ఉదాహరణల్లో, ఒక విషయం సరిగా అర్థం చేసుకోవాలి. వీరి ఉత్పత్తి శక్తులూ, వ్యాపారాలూ, పెట్టుబడిదారుల స్థాయిల్లో వుండవు. కాబట్టి, వీరు ఎంత శ్రమ చేసినా, ఆ శ్రమ, తక్కువ ఉత్పత్తినే ఇస్తుంది. పెట్టుబడిదారీ సరుకులతో 'పోటీ' వల్ల, వీరి 'ఆదాయం', చాలా తక్కువ గానే వుంటుంది. ఆ ఆదాయంలో 'శ్రమ శక్తి విలువ'ని మించి వుండే భాగం ('స్వంత అదనపు విలువ' అనదగ్గది), అతి తక్కువగా వుండడమో, అసలే లేకపోవడమో జరుగుతుంది. అందుకే 'అప్పులు' తెచ్చి వ్యాపారాలు చేసే స్వతంత్ర ఉత్పత్తి దారులూ స్వతంత్ర వర్తకులూ, తమ ఆదాయం అంతా వడ్డీలకే చెల్లిస్తూ, అతి దుర్భర జీవితాలు గడుపుతూ వుంటారు.

## కార్మికులే అప్పులు ఇస్తే:

ఒక కార్మికుడే ఇంకో కార్మికుడికి 'అప్పు' ఇచ్చి, వడ్డీ సంపాదించా డనుకుందాం. ఆ వడ్డీ, అప్పు ఇచ్చిన కార్మికుడి శ్రమ ఫలితం కాదు. అప్పు తీసుకున్న కార్మికుడి శ్రమ ఫలితం. అతని జీతంలో భాగం. మొదటి కార్మికుడు, ఒక పెట్టుబడి దారుడికి అప్పు ఇచ్చి వడ్డీ సంపాదిస్తే, ఆ వడ్డీ, ఆ పెట్టుబడి దారుడి దగ్గిర పని చేసే కార్మికుల అదనపు విలువలో భాగం. అంటే, 'వడ్డీలు' సంపాదించే కార్మికుడు, ఇతర కార్మికుల శ్రమని తింటాడన్న మాట.

అయితే, అప్పు ఇచ్చిన కార్మికుడు కూడా, తను పని చేసే చోట తన శ్రమలో ఎంతో భాగాన్ని నిత్యమూ పోగొట్టుకుంటూ వుంటాడు కాబట్టి, అందులో కొంత భాగాన్ని ఇలా వడ్డీల రూపంలో వెనక్కి తీసుకోగలుగుతున్నాడు - అనుకోవచ్చునా? - అది అడ్డ దారి! తప్పుడు దారి! కార్మికులు, తాము పోగొట్టుకునే శ్రమని, పోగొట్టుకోకుండా చేసుకునే మార్గం ఇది కాదు. కార్మికుడు - వడ్డీలు సంపాదించడం అనే ఉదాహరణలో, 'అది సరైనదే' అని సమర్థించ గలిగేదేమీ వుండదు. 'అప్పులు' ఇచ్చి, 'వడ్డీలు' సంపాదించే కార్మికులు, నూటికి ఒకరో ఇద్దరో వుంటారు. వీరు సంపాదించే 'వడ్డీల మొత్తం' చాలా తక్కువగా వుంటుంది. కాబట్టి, 'వడ్డీ పెట్టుబడి' గురించీ, 'వడ్డీల రాసి' గురించీ మాట్లాడేటప్పుడు, కార్మికుల్లో కొందరు సంపాదించే వడ్డీల విషయం, లెక్క లోకి తీసుకోవలసిన విషయం కాదు.

# 'వడ్డీ పెట్టుబడి' చలనం

100 పెట్టుబడికి నెలకి, 1 వడ్డీ అయితే, ఈ 'వడ్డీ - పెట్టుబడి' చలనం ఇలా వుంటుంది:

M - M[1]

100 - 101

అంటే,100 డబ్బు, 101 గా పెరిగింది.

M కీ, M[1] కీ మధ్య ఏం జరిగింది? 100 డబ్బు, 101 గా ఎలా పెరిగింది? ఈ విషయం పైకి ఏ మాత్రమూ కనపడదు.

'ఉత్పాదక పెట్టుబడి' చలనంలో అయితే, ఉత్పత్తి క్రమం కనపడుతుంది.

'వర్తక పెట్టుబడి' చలనంలో అయితే, చలామణీ క్రమం కనపడుతుంది.

కానీ, 'వడ్డీ పెట్టుబడి' చలనంలో, ఏ క్రమమూ వుండదు. ఏ క్రమమూ లేకుండానే డబ్బు పెరిగిపోయి కనపడుతుంది.

ఉత్పాదక, వర్తక పెట్టుబడుల చలనాల్లో కూడా అసలు నిజం (పెట్టుబడి ఎలా పెరుగుతుందీ - అనే నిజం) పైకి కనపడక పోయినా, వాటి కన్నా కూడా వడ్డీ పెట్టుబడి చలనం మరింత 'మర్మం'గా వుంటుంది. 'పెట్టుబడి అనేది, దానికై అదే పెరుగుతుంది' అనే 'భ్రమ', వడ్డీ పెట్టుబడిని చూస్తే మరింత గట్టి పడుతుంది.

వడ్డీకి, 'కాలం' తోటే సంబంధం! కాలం, ఎంత విరామం లేకుండా సాగుతూ వుంటుందో, వడ్డీ అంత

విరామం లేకుండా పెరుగుతూ వుంటుంది! ఎండా, వానా? రాత్రా, పగలా? నిద్రా, మెలకువా? ఇంటా, బయటా? - ఈ లక్షణాలతో దానికి, సంబంధం వుండదు. ప్రకృతి లక్షణాలన్నిటికీ అతీతం అది. వడ్డీ పెట్టుబడికి - ప్రతి దినమూ, శుభ దినమే. ప్రతి క్షణమూ, శుభ క్షణమే.

పత్తీ, ధాన్యం, ఇల్లూ - లాంటి వస్తువులైతే, కొంత కాలానికి నాశనమై పోయి, వాటి విలువ కూడా నాశనమై పోతుంది. కానీ, ‘వడ్డీ పెట్టుబడి’కి, అలాంటి నాశనం వుండదు. ‘డబ్బు’ని ఒక్కసారి ‘వడ్డీ పెట్టుబడి’గా మారిస్తే, (వడ్డీకి పడేస్తే), ఇక అది సూర్య చంద్రులు అంతమయ్యే దాకా వడ్డీని తెస్తూనే వుంటుంది.

మార్క్స్ మాటల్లో:

> “ పెట్టుబడిని, ‘వడ్డీ పెట్టుబడి’ పాత్రతో చూసినప్పుడు, అది సమస్త సంపదపైనా యజమాన్యాన్ని ప్రకటిస్తుంది. ఇప్పటి దాకా అది పొందినదంతా, సమస్తాన్నీ కబళించి వేసే దాని ఆకలికి, ఒక వాయిదా మాత్రమే. దాని అంతర్గత సూత్రాల వల్ల, మానవ జాతి ఎప్పటికీ చేసే సమస్త అదనపు శ్రమా దానికే చెందుతుంది. మొలక్!”
>
> -[కాపిటల్ - 3 పేజీ 397, మాస్కో.]

‘మొలక్’ అంటే - పిల్లల్ని బలికోరే దేవత. ఇది మత సంబంధమైన కథల్లో మాట. పెట్టుబడిని అంతటినీ వడ్డీ పెట్టుబడిగా చూస్తూ అలాంటి పెట్టుబడిని ‘బలి కోరే దేవత’తో పోల్చాడు మార్క్స్. ‘పెట్టుబడి’ అనేది ఇప్పటి లాగే సమాజంలో ఎప్పటికీ వుండిపోతే, ‘కార్మిక వర్గం’ చేసే అదనపు శ్రమ అంతా దానికి అర్పణ అవుతూ వుండవలసిందే. అదనపు శ్రమే, పెట్టుబడి దేవత కు కావలసిన ‘బలి’!

వడ్డీ పెట్టుబడి దారుడి కార్యకలాపం - ఒక ‘వ్యాపారమే.’ వడ్డీ వ్యాపారం! దీనికి సంబంధించిన వ్యాపారపు ఖర్చులన్నీ పెట్టుబడి దారుడికి వచ్చే వడ్డీలలో నించే ఖర్చు పెట్టాలి. ఇదంతా ‘అనుత్పాదక మైన’ ఖర్చు. వడ్డీ వ్యాపారంలో పని చేసే కార్మికులు - ‘అనుత్పాదక’ కార్మికులు’.

ఉత్పాదక, వర్తక, వడ్డీ రంగాల్లో,
ఉత్పాదక - అనుత్పాదక కార్మికులు రక రకాల శ్రమలు చేస్తూ,
ఉత్పాదక కార్మికులేమో ‘అదనపు విలువలూ’, అనుత్పాదక కార్మికులేమో ‘అదనపు శ్రమలూ’, ఇస్తూ,
ఉత్పాదక, వర్తక, వడ్డీ - పెట్టుబడి దార్లకు
లాభాలూ, వడ్డీలూ - అందిస్తూ వుంటారు!

# సరుకు అప్పు

‘**బట్ట**’ పెట్టుబడిదారుడు, ‘డబ్బు’ని అప్పు తీసుకుని, దానితో ‘దారం’ కొంటాడనుకుందాం. దారం కోసం డబ్బుని అప్పు తీసుకోవడం కంటే, దారాన్నే అప్పు తీసుకోవచ్చు కదా? - తీసుకోవచ్చు. అలా తీసుకుంటే, అదే ‘సరుకు అప్పు’ అవుతుంది. అలా కూడా చేస్తారు పెట్టుబడిదారులు. కొన్ని ‘ఉత్పత్తి సాధనాల్నీ’ అప్పు తీసుకుంటారు; కొంత ‘డబ్బు’నీ అప్పు తీసుకుంటారు.

అంటే మొత్తం సమాజంలో, వేరు వేరు శాఖల పెట్టుబడిదారుల మధ్య, సరుకు - అప్పులూ, డబ్బు - అప్పులూ అన్నీ నడుస్తూ వుంటాయి.

డబ్బు అప్పు - మనీ క్రెడిట్.
సరుకు అప్పు - కమర్షియల్ క్రెడిట్.

‘డబ్బు’ని అప్పు ఇచ్చేవాడు - వడ్డీ పెట్టుబడిదారుడు.
‘సరుకు’ని అప్పు ఇచ్చేవాడు - ఇంకో ఉత్పాదక పెట్టుబడిదారుడు గానీ, వర్తక పెట్టుబడిదారుడు గానీ.

సరుకుని కొన్న వెంటనే డబ్బు చెల్లిస్తే, ఆ ధర - క్యాష్ ధర. కొన్న వెంటనే డబ్బు చెల్లించకపోతే, ఆ ధర - క్రెడిట్ ధర. క్యాష్ ధర కన్నా క్రెడిట్ ధర, కొంత ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే, ‘అప్పు’ అనేది ఏ రూపంలో వున్నా, అది వసూలయ్యే వరకూ దాని మీద ‘వడ్డీ’ వుంటుంది గనక. క్యాష్ ధరా + వడ్డీ = క్రెడిట్ ధర. అందుకే అది క్యాష్ ధర కన్నా ఎక్కువ.

అయితే, ‘సరుకు’ని అప్పు మీద కొన్నప్పుడు, సగటు చలామణీ కాలం ప్రకారమే డబ్బుని చెల్లించే ఒప్పందాల్లో, సాధారణంగా క్యాష్ ధరే గానీ, క్రెడిట్

ధర వుండదు. అప్పు చెల్లించడానికి సగటు కాలం కన్నా ఎక్కువ కాలం తీసుకునే సందర్భాల్లో మాత్రమే క్రెడిట్ ధర వుంటుంది.

యంత్రాలూ, ఇళ్ళూ - వంటి వస్తువుల్ని అప్పు పద్ధతి మీద అమ్మితే, వాటి ధరలు క్రెడిట్ ధరలు గానే వుంటాయి.

(ఈ వస్తువుల్ని 'అద్దె'కు ఇస్తే, ఆ 'అద్దె' ఎలా ఏర్పడుతుందంటే, - ఆ వస్తువు 'ధర'లో, అద్దెకి తీసుకున్న కాలానికి సంబంధించిన భాగమూ, దాని మీద జనరల్ లాభమూ - కలిసిన మొత్తం, అద్దెగా వుంటుంది. ఆ పైన, అద్దెకు దొరకడంలో ఆ వస్తువు సప్లై డిమాండ్లు కూడా పని చేస్తాయి. ఈ విషయాలు, మొదటి సంపుటంలో, రెండవ భాగంలో, "స్థిర పెట్టుబడీ - అస్థిర పెట్టుబడీ ..." చాప్టరులో 'ఫిక్సెడ్ సాధనాల అద్దె' అనే చోట వివరంగా చూశాం.)

ఒక సరుకు ధర 100. అందులో వడ్డీ 5 - అనుకుందాం. ఆ సరుకుని క్యాష్ ధరకే అమ్మినా, ఆ సరుకు ద్వారా 5 వడ్డీ వస్తుంది. లేదా, ఆ సరుకుని క్రెడిట్ ధరకి అమ్మితే, ఆ సరుకుని కొన్న వ్యక్తి, ఆ డబ్బు చెల్లించేటప్పుడు, 3 వడ్డీ చెల్లించాలనుకుందాం. అంటే, ఆ సరుకుని క్రెడిట్ పద్ధతి మీద అమ్మినప్పుడు, ఆ సరుకు ద్వారా మొత్తం వడ్డీ 5 + 3 = 8 వస్తుందన్న మాట!

ఈ రకంగా, పెట్టుబడి దారులు, తమ సరుకుల్లో ఎంతో కొంత భాగాన్ని క్రెడిట్ పద్ధతి మీద అమ్ముతూనే వుంటారు కాబట్టి, వాళ్ళు ఈ రకం క్రెడిట్ అమ్మకాల ద్వారా కూడా కొన్ని వడ్డీలు సంపాదిస్తారని భావించవచ్చా? - ఇది అన్ని సందర్భాల లోనూ జరగదు. పెట్టుబడిదారులు, క్రెడిట్ పద్ధతి మీద కార్మికులకు అమ్మే సందర్భాలలో మాత్రమే, ఆ ధరల ద్వారా కూడా వడ్డీలు సంపాదిస్తారు. కార్మికులకు గాక, ఇతర పెట్టుబడి దారులకు అమ్మినప్పుడు, అది క్రెడిట్ పద్ధతే అయినా, ఆ రకంగా వడ్డీలు సంపాదించలేరు. ఎందుకంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ అమ్మే వాడిగానే గాక, కొనే వాడిగా కూడా వుంటాడు కాబట్టి. ప్రతీ వాడికీ, తను అమ్మే సరుకుల ద్వారా వచ్చే ఆ క్రెడిట్ వడ్డీలు, తను కొనే సరుకుల ద్వారా పోతాయి కదా?

కాబట్టి, 'వడ్డీలు సంపాదించడం' (వడ్డీ వ్యాపారం) అన్నప్పుడు, 'సరుకు అప్పు' ద్వారా (క్రెడిట్ ధరల ద్వారా) సంపాదించే వడ్డీల విషయం గాక, 'డబ్బు - అప్పు' ద్వారా సంపాదించే వడ్డీల విషయాన్నే ప్రధానంగా తీసుకోవాలి.

అన్ని శాఖల పెట్టుబడి దారుల మధ్యా 'సరుకు అప్పులు' నడుస్తూ వున్నా, ప్రతీ పెట్టుబడి దారుడి దగ్గిరా కొంత 'డబ్బు' కూడా (క్యాష్) వుండాలి. కార్మికులకు 'జీతాలు' ఇవ్వడానికీ, ప్రభుత్వానికి 'పన్నులు' కట్టడానికీ, 'రవాణా' వంటి తక్షణ అవసరాలకూ - డబ్బు, తప్పనిసరిగా వుండాలి.

ఒక ఉత్పత్తి క్రమం కోసం మొత్తం '100 పెట్టుబడి' కావాలనుకుందాం. స్వంత పెట్టుబడి వున్న వాడు 'సరుకు అప్పు' గానీ, 'డబ్బు అప్పు' గానీ తీసుకోడు. పెట్టుబడి లేని వాడు, 40 సరుకు అప్పు తీసుకుంటే, 60 డబ్బు అప్పు తీసుకోవాలి. 'డబ్బు అప్పు' మీద వడ్డీ చెల్లిస్తాడు.

# 'అప్పు విధానం' అభివృద్ధి

పెట్టుబడిదారీ సమాజం కన్నా వెనకటి సమాజాల్లో - 'ఉత్పత్తి'లో అత్యధిక భాగం, 'అమ్మకాల' లోకి పోకుండానే వాడకం అవుతూ వుండేది. కాబట్టి, అక్కడ అమ్మకాల లోకి పోయే వుత్పత్తి చాలా తక్కువ. అమ్మకాలే తక్కువగా వుండే సమాజాల్లో, 'అప్పు విధానం అభివృద్ధి చెందే' అవకాశాలు కూడా తక్కువే.

కానీ, పెట్టుబడిదారీ సమాజంలో, 'మొత్తం ఉత్పత్తి' అంతా అమ్మకాలలో నించి నడవ వలసిందే. ఏ శాఖలో పెట్టుబడిదారుడైనా తన 'కుటుంబ అవసరాల' కోసం గాక, కేవలం 'అమ్మకాల' కోసమే సరుకుని ఉత్పత్తి చేయిస్తాడు. ఈ విషయం గతంలో చూసిందే. అయినప్పటికీ, దాన్ని ఇక్కడ ఒక సారి గుర్తు చేసుకుందాం.

పైను బట్ట పెట్టుబడి దారుడు, రోజూ 100 మీటర్ల బట్టని, అంటే సంవత్సరానికి 365 × 100 = 36,500 మీటర్ల బట్టని, ఉత్పత్తి చేయిస్తాడు అనుకుందాం. అందులో నించి తన కుటుంబ అవసరాల కోసం ఎంత బట్టని వాడతాడు? ఒక్క మీటరు

కూడా ఆ కుటుంబం వాడక పోవచ్చు. లేదా, వాడితే సంవత్సరానికి 10, 15 మీటర్లు మాత్రం వాడవచ్చు. కుటుంబంలో ఎంత వాడతారో అంత బట్టకి మాత్రమే అమ్మకం వుండదు. మిగతా వేల వేల మీటర్ల బట్ట నంతా అమ్మవలసిందే.

'దిన పత్రిక' పెట్టుబడిదారుడు, రోజూ 'లక్ష' కాపీలు ఉత్పత్తి చేయిస్తాడు అనుకుంటే, స్వంతానికి వాడే 1, 2 కాపీలకు మాత్రమే అమ్మకం వుండదు. అవి తప్ప, లక్ష కాపీలూ రోజూ అమ్మవలసిందే.

'చెప్పుల' పెట్టుబడిదారుడి కుటుంబం, నెలకి, ఎన్ని జతల చెప్పులు వాడుతుంది? 'సబ్బుల' వాడి కుటుంబం, నెలకి ఎన్ని సబ్బులు వాడుతుంది? 'పెన్నుల'వాడి కుటుంబం, నెలకి ఎన్నిపెన్నులు వాడుతుంది? 'కుర్చీల' వాడి కుటుంబం, ఎన్ని కుర్చీలు వాడుతుంది? 'సిమ్మెంటు' వాడి కుటుంబం, ఎంత సిమ్మెంటు వాడుతుంది? 'బొగ్గు' వాడి కుటుంబం, ఎంత బొగ్గు వాడుతుంది? 'రేడియోల' వాడి కుటుంబం, ఎన్ని రేడియోలు వాడుతుంది?

ఇలాగే, ఏ సరుకు నైనా తీసుకోండి. అందులో, అమ్మకానికి పోకుండా పెట్టుబడి దారుడి కుటుంబం కోసం ఖర్చయ్యే భాగం, ఊహాతీతమైనంత తక్కువ. కొన్ని రకాల సరుకుల విషయంలో అయితే, ఆ మాత్రం వాడకం కూడా వుండదు. అంటే, ప్రతీ పెట్టుబడిదారుడూ తన సరుకు నంతా 'అమ్మేసుకోవాలి'! తన 'ఉత్పాదక' అవసరాలకూ, 'కుటుంబ' అవసరాలకూ కావలసిన సరుకులన్నింటినీ, ఇతర పెట్టుబడి దారుల నించి 'కొనుక్కోవాలి!' ఈ రకంగా, సమాజంలో ఉత్పత్తి అయ్యే మొత్తం 'సరుకుల రాసి' అంతా 'అమ్మకాల ఘట్టంలో నించి నడవ వలసిందే. అందుకే, 'పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానం' అంటేనే, 'సరుకు ఉత్పత్తి విధానం'. 'అమ్మకాల ఉత్పత్తి విధానం'.

అయితే, అమ్మకాల విధానం క్రమంగా, 'అప్పు విధానం'గా మారుతుంది.

ప్రతీ పెట్టుబడి దారుడూ, తనకు కావలసిన 'ఉత్పత్తి సాధనాల్ని' కొంత వరకైనా అప్పు పద్ధతి మీద కొంటూ, తన సరుకుని కూడా అప్పు పద్ధతి మీదే అమ్ముతూ వుంటాడు. 'దారం' పెట్టుబడి దారుడు, తనకు కావలసిన 'పత్తి'ని అప్పు పద్ధతి మీద కొని, దానితో తయారైన తన దారాన్ని, బట్ట - పెట్టుబడి దారుడికి అప్పు పద్ధతి మీదే అమ్ముతాడనుకుందాం. చివరికి, ఆ దారంతో బట్ట తయారై, అమ్ముడై, 'డబ్బు' వచ్చినప్పుడు,

బట్ట వాడు - దారానికి చెల్లిస్తాడు.
దారం వాడు - పత్తికి చెల్లిస్తాడు.
పత్తి వాడు - తన అప్పులకు చెల్లిస్తాడు.

ఈ రకంగా, ప్రతీ పెట్టుబడి దారుడూ - ఒక వేపు, తను సరుకు అప్పులు తీసుకుంటూ, ఇంకో వేపు, తనూ తన సరుకుని అప్పులు ఇస్తూ వుంటాడు. ఒక వేపు, పాత అప్పులకు చెల్లించి వేస్తూ, ఇంకో వేపు కొత్త అప్పులు తీసుకుంటూ వుంటాడు.

'సామాజిక ఉత్పత్తి రాసి'లో ప్రధాన భాగం - వేరు వేరు శాఖల ఉత్పాదక పెట్టుబడి దారుల మధ్యా; ఉత్పాదక పెట్టుబడి దారులకూ, వర్తక పెట్టుబడి దారులకూ మధ్యా; 'సరుకు అప్పుల' పద్ధతిలో అమ్మకాలవుతూ వుంటుంది.

'సరుకు' కోసం వెంటనే డబ్బు చెల్లించే సందర్భాల్లో, కొందరు పెట్టుబడి దారులు, స్వంత డబ్బుతో కొంటే, కొందరు అప్పు తీసుకున్న డబ్బుతో కొంటారు. - ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తీ - చలామణీ క్రమాలు నడవడానికి, ఒక వేపు సరుకు అప్పు పద్ధతులూ, ఇంకో వేపు డబ్బు అప్పు పద్ధతులూ, వెనకటి సమాజాల్లో లేని విధంగా, అభివృద్ధి చెందుతూ వుంటాయి.

# 'డబ్బు అప్పు'కి మారుపేరు 'బ్యాంకు!'

పెట్టుబడిదారీ విధానంలో 'బ్యాంకు' లేకుండా 'డబ్బు అప్పు'ని ఊహించడం సాధ్యం కాదు.

'బ్యాంకులు' లేని కాలంలో, 'డబ్బు' వున్న వాళ్ళు (భూస్వాములూ, వర్తకులూ వంటి వాళ్ళు) ఎవరి డబ్బు వాళ్ళ దగ్గిరే దాచుకునే వారు. వడ్డీ వ్యాపారాలు చేసే వాళ్ళు, ఎవరి వ్యాపారం వాళ్ళే చేసుకునే వాళ్ళు. క్రమంగా డబ్బు వున్న వాళ్ళకి 'సేవలు చెయ్యడం కోసం,' బ్యాంకులు అవతరించాయి. ఆ 'సేవల' ద్వారా అవి కూడా 'లాభ' పడతాయనుకోండీ. లాభం లేని సేవల్ని ఏ పెట్టుబడి దారుడూ చెయ్యలేడు కదా?

'బ్యాంకు' కూడా - ఒక పెట్టుబడిదారీ కంపెనీయే. అన్ని వ్యాపారాల లాగానే బ్యాంకుని నడపడం కూడా ఒక వ్యాపారమే. అది, తన 'పెట్టుబడి'తో లాభాలూ వడ్డీలూ సంపాదించే లక్ష్యం తోటే పని చేస్తుంది. 'బ్యాంకు' గురించి మొట్ట మొదట ఈ ప్రాథమికమైన విషయం అర్థం చేసుకుంటేనే దాన్ని గురించి తర్వాత చూసే విషయాలు సరిగా అర్థమవుతాయి.

ఉత్పాదక, వర్తక పెట్టుబడి దారుల్లో కొంత మంది దగ్గిర, 'దాచుకోవలసినంత' డబ్బు వుంటూ వుంటుంది. అలాంటి డబ్బుని వాళ్ళు 'బ్యాంకుల్లో' పెడతారు.

పెట్టుబడిదారులందరి దగ్గిరా, వ్యాపార అవసరాల్లో ఎప్పటి కప్పుడు వాడుకోవడానికి, ఎప్పుడూ కొంత డబ్బు వుంటూ వుంటుంది. అలాంటి డబ్బుని కూడా బ్యాంకుల్లోనే పెట్టి, కావలసినప్పుడల్లా తీసుకుంటూ వుంటారు.

'కార్మిక వర్గం'లో ఉన్నత మేధా శ్రమల సెక్షన్ల కార్మికులు, తమ 'జీతాల్లో' కొంత భాగాన్ని 'పొదుపు' చేస్తూ వుంటారు. అలాంటి 'పొదుపుల్ని' కూడా బ్యాంకుల్లో పెడతారు.

ఈ రకంగా - ' పెట్టుబడిదారీ వర్గం'లో అన్ని సెక్షన్లకీ సంబంధించిన ఆదాయాలూ, వ్యాపారాల కోసం అవసరమయ్యే రిజర్వ్‌లూ, వ్యాపారాల్లో తాత్కాలికంగా ఖాళీగా వుండే భాగాలూ, ప్రభుత్వ నిధుల్లో ఖాళీగా వుండే భాగాలూ, 'కార్మిక వర్గం'లో కొన్ని సెక్షన్ల ఆదాయాల్లో తాత్కాలికంగా ఖాళీగా వుండే భాగాలూ, పొదుపులూ - వగైరాలన్నీ బ్యాంకుల్లోకి చేరతాయి.

'బ్యాంకు'లో పెట్టే డబ్బు, బ్యాంకు - డిపాజిట్టు.
డబ్బు పెట్టే వాళ్ళంతా - డిపాజిటర్లు.

'డిపాజిటర్ల'లో అధిక భాగం రక రకాల పెట్టుబడి దారులే. వ్యక్తులూ, కంపెనీలూ కూడా. 'డిపాజిట్ల మొత్తం'లో అత్యధిక భాగం, పెట్టుబడిదార్లు పెట్టేదే.

'బ్యాంకు' అనేది 2 రకాల పనులు చేస్తుంది.
(1) మనీ డీలింగూ, (2) వడ్డీ వ్యాపారం.

## 1. మనీ డీలింగు :

ఇది, 'డబ్బు'కి సంబంధించిన వ్యవహారాలు చూడడం. డిపాజిటర్ల డబ్బుని దాచిపెట్టి, దాన్ని మళ్ళీ వారికి కావలసినప్పుడు ఇవ్వడమూ; డిపాజిటర్ల మధ్య ఇచ్చి పుచ్చుకోవడాలు సెటిల్ చెయ్యడమూ; డిపాజిటర్లు కాని వ్యక్తుల డబ్బుని కూడా వారు పంపమన్న స్థలా నికి పంపడమూ - వంటి, 'డబ్బు'కి సంబంధించిన లావాదేవీలన్నీ మనీ డీలింగు కిందకి వస్తాయి. ఈ పనులకు సంబంధించినంత వరకూ, బ్యాంకు, పెట్టు బడిదార్లకు 'బుక్ కీపర్' గానూ, 'క్యాషియర్' గానూ వుంటుంది.

బ్యాంకులో, ఈ పనులన్నీ జరగడానికి, ఆఫీసులూ కార్మికులూ (C + Vలు) కావాలి. ఈ ఖర్చు అంతా - మనీ డీలింగ్ పెట్టుబడి. బ్యాంకుని నడిపే పెట్టుబడిదారుడు, ఈ పెట్టుబడి పెడతాడు. ఈ పనుల్లో ప్రతీ దానికీ బ్యాంకు కొంత ఛార్జీని (కొంత 'ధర'ని) వసూలు చేస్తుంది. ఆ 'ఛార్జీ'లో నించి, ఆ పని జరగడానికి అయిన 'పెట్టుబడి'ని తీసివేస్తే, మిగిలేది - 'లాభం'. ఈ బ్యాంకు పనులన్నీ, ఛార్జీల్ని వసూలు చేసే 'సరుకులు'గా వుంటాయి కాబట్టి, ఈ పెట్టుబడి, 'ఉత్పాదక పెట్టుబడి'.

బ్యాంకు చేసే 'మనీ డీలింగ్' పనుల్లో, 'డిపాజిటర్ల మధ్య ఇచ్చి పుచ్చుకోవడాల్ని ఎక్కౌంట్ల ద్వారా సెటిల్ చెయ్యడం' అనేది, బ్యాంకు ద్వారా మాత్రమే సాధ్యమయ్యే సౌకర్యం. ఎలాగంటే, - A, B, C అనే ముగ్గురు డిపాజిటర్ల ఎక్కౌంట్లు ఒకే బ్యాంకులో గానీ, వేరు వేరు బ్యాంకుల్లో గానీ, వున్నాయి అనుకుందాం.

A, B కి 100 రూపాయలు ఇవ్వాలి.
B, C కి 90 రూపాయలు ఇవ్వాలి.
C, A కి 120 రూపాయలు ఇవ్వాలి.

ఈ లావాదేవీలు బ్యాంకుతో సంబంధం లేకుండా సెటిల్ కావాలంటే, A, 100 రూపాయలు పట్టుకెళ్ళి B కి ఇచ్చి, C నించి 120 రూపాయలు తెచ్చుకోవాలి. B, C దగ్గిరికి వెళ్ళి 90 రూపాయలు ఇవ్వాలి. ఈ రకంగా, మొత్తం డబ్బంతా ప్రత్యక్షంగా వాళ్ళ చేతుల్లో వుండాలి. కానీ, ఇవే లావాదేవీలు బ్యాంకు ద్వారా సెటిల్ అవ్వాలంటే, ఈ ముగ్గురి ఎక్కౌంట్లనీ ఒక చోట పెట్టి, లెక్కలు చూసి, C ఎక్కౌంటులో నించి 30 రూపాయలు తగ్గించి, A ఎక్కౌంటులో 20నీ, B ఎక్కౌంటులో 10నీ పెంచితే, ముగ్గురి లావాదేవీలూ 'నిజం డబ్బు' లేకుండా, ఎక్కౌంట్లలో మార్పుల తోనే సెటిలై పోతాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరికైతే డబ్బు రావాలో వాళ్ళ డబ్బు ఎక్కడికీ

పోదు. డబ్బు చెల్లించవలసిన వ్యక్తి ఎక్కౌంటులో రాసి తగ్గి, డబ్బు తీసుకోవలసిన వ్యక్తి ఎక్కౌంటులో రాసి పెరుగుతుంది. ఈ రకంగా, ఎక్కౌంట్లలో మార్పుల ద్వారా జరిగే 'క్లియరెన్స్ పద్ధతి' బ్యాంకు విధానంలో మాత్రమే సాధ్యమవుతుంది.

అయితే, డబ్బు లావాదేవీల్ని ఎక్కౌంట్ల ద్వారా సెటిల్ చెయ్యడంలో కూడా అనుకూల, వ్యతిరేక ఫలితాలు వున్నాయి.

**అనుకూల ఫలితం:** పెట్టుబడిదార్ల మధ్య చాలా లావాదేవీల్ని ఎక్కౌంట్ల ద్వారానే సెటిల్ చెయ్యడం సాధ్యమవుతుంది. కాబట్టి, సమాజంలో తిరగడానికి చాలా తక్కువ డబ్బు రాసి తోటే, సరిపోతుంది. 'డబ్బుని తయారు చేసుకోవడం' వంటి పనుల కోసం, సమాజం, ఎక్కువ సాధనాల్నీ శ్రమల్నీ ఖర్చు పెట్టనక్కరలేదు.

**వ్యతిరేక ఫలితం:** చలామణీలో తిరగడానికి తక్కువ డబ్బే సరిపోవడం - అనే పరిస్థితే. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, డబ్బు చాలక, 'డబ్బు సంక్షోభం' అనదగ్గ పరిస్థితికి దారి తీస్తుంది. (దీన్ని ఈ సంపుటం లోనే, **"సంక్షోభాలు"** చాప్టరులో చూస్తాము.)

బ్యాంకు విధానం, చాలా 'అభివృద్ధి' చెందిందనుకుందాం. అంటే, పెట్టుబడిదారుల మధ్య అమ్మకాలూ కొనుగోళ్ళూ 'సరుకు అప్పు'ల ద్వారానూ, 'డబ్బు అప్పుల' ద్వారానూ జరిగిపోతూ; వాళ్ళ డబ్బు లెక్కలు బ్యాంకు ఎక్కౌంట్ల ద్వారా సెటిలవుతూ; కార్మికులకు ఇచ్చే జీతాల్ని బ్యాంకు చెక్కుల ద్వారానే ఇస్తూ; ఆ కార్మికులు కూడా దుకాణాల్లో సరుకుల్ని కొన్నప్పుడు బ్యాంకు చెక్కులే ఇస్తూ; ఈ రకంగా, డబ్బు లావాదేవీలన్నీ అప్పుల ద్వారానూ, బ్యాంకు చెక్కుల ద్వారానూ, ఎక్కౌంట్లలో మార్పుల ద్వారానూ, జరిగిపోతూ వుంటాయి - అనుకుందాం. ఇలాగే జరుగుతూ వుంటే, ఇది సమాజం నించి 'డబ్బునే తీసివేసినట్టు' అర్థమా? - కాదు. ఇది డబ్బు రూపాన్ని మార్చడం మాత్రమే.

ఒక 'కరెన్సీ నోటు'ని ఇవ్వడానికి బదులు 'బ్యాంకు చెక్కు'ని ఇవ్వడం అంటే, అది డబ్బు రూపాన్ని మార్చడమే గానీ, 'డబ్బు' నే తీసివెయ్యడం కాదు.

డబ్బు అనేది 'కరెన్సీ నోటు' గా వున్నా, 'బ్యాంకు చెక్కు'గా వున్నా, 'విలువ'కి సంబంధించిన ఏ టోకెన్‌గా వున్నా - అది డబ్బే. అది డబ్బు వుండడమే. అది, 'డబ్బుకి ఇంకో రూపం' మాత్రమే. రూపం మారడమే, విషయం మారడం కాదు. డబ్బు రూపాన్ని మార్చడమే, డబ్బుని తీసివెయ్యడం కాదు.

బ్యాంకు విధానం - ఎంత అభివృద్ధి చెందినా, అది చలామణీలో తిరిగే డబ్బు పరిమాణాన్ని తగ్గించగలదే గానీ, డబ్బునే తీసివెయ్యలేదు. అది, బ్యాంకు విధానం ద్వారా సాధ్యమయ్యే విషయం కాదు.

'డబ్బు పరిమాణాన్ని తగ్గించడం' అనే దాన్ని కూడా బ్యాంకు విధానం, కొంత వరకే సాధించగలదు. 'నిజం డబ్బు' (కరెన్సీ నోట్లు) అనేదే లేకుండా, అంతా బ్యాంకుల ద్వారానూ, ఎక్కౌంట్ల ద్వారానూ నడపడం, బ్యాంకు విధానానికి కూడా సాధ్యం కాదు.

## 2. వడ్డీ వ్యాపారం :

ఇది బ్యాంకు చేసే రెండో పని.

ఈ వ్యాపారం చెయ్యడానికి బ్యాంకుకి కావలసిన డబ్బు, ప్రధానంగా 'డిపాజిట్ల' డబ్బే. (ఈ వ్యాపారంలో, 'బ్యాంకుని పెట్టిన పెట్టుబడి దారుడి స్వంత డబ్బు' కూడా కొంత ఉంటే వుండవచ్చు. దాని వల్ల విషయాలేవీ మారవు.)

డిపాజిటర్లలో కొంత మంది, తమ డబ్బుని కొన్ని సంవత్సరాల వరకూ వెనక్కి తీసుకోని పద్ధతిలో ఫిక్సెడ్ డిపాజిట్లుగా పెడతారు. వీటికి 'టైమ్ డిపాజిట్లు' అని కూడా ఇంకో పేరు. మరి కొంత మంది, డబ్బుని ఎప్పటి కప్పుడు వెనక్కి తీసుకునే 'డిమాండ్ డిపాజిట్లు'గా పెడతారు. ఈ డిమాండ్ డిపాజిట్లలో కూడా అందరూ తమ డబ్బుని ఒకే సారి వెనక్కి తీసుకోరు. కొందరు కొంత డబ్బుని 'తీసుకుంటూ' వుంటే, అదే సమయంలో కొందరు కొంత డబ్బుని 'వేస్తూ' వుంటారు. కాబట్టి, డిమాండ్ డిపాజిట్లలో కూడా కొంత డబ్బు ఎప్పుడూ బ్యాంకు లోనే వుంటూ వుంటుంది. ఫిక్సెడ్ డిపాజిట్లు పూర్తి గానూ, డిమాండ్ డిపాజిట్లలో కొంత భాగమూ కలిసి, బ్యాంకుకి, వడ్డీ వ్యాపారం చేయడానికి కావలసిన పెట్టుబడిగా వుంటాయి.

బ్యాంకు, మొత్తం డిపాజిట్లలో కొంత భాగాన్ని 'నిల్వ'గా వుంచి, (డిపాజిట్లని వెనక్కి అడిగే వాళ్ళకి ఇవ్వడం కోసం), మిగిలిన డబ్బుతో, 'అప్పులు' ఇస్తూ,

వడ్డీ వ్యాపారం చేస్తూ వుంటుంది.

స్వంత పెట్టుబడి చాలని వాళ్ళూ, అసలు స్వంత పెట్టుబడే లేని వాళ్ళూ, బ్యాంకు నించి అప్పులు తీసుకుంటారు. ఆ 'పెట్టుబడి'తో వ్యాపారాలు చేసి, (ఉత్పాదక, వర్తక - వ్యాపారాలు చేసి), వ్యాపారంలో వచ్చిన 'జనరల్ లాభం'లో నించి కొంత భాగాన్ని బ్యాంకుకి వడ్డీగా చెల్లిస్తారు. ఆ 'వడ్డీ'లో నించే బ్యాంకు, తన డిపాజిటర్లకు కొంత తక్కువ వడ్డీ చెల్లిస్తుంది. ఇంకా మిగిలిన దాంట్లోంచి, తన 'వడ్డీ - వ్యాపారం ఖర్చులు' పోగా, చివరకి తను కొంత లాభం మిగుల్చుకుంటుంది.

అంటే, డిపాజిటర్లకి బ్యాంకు చెల్లించే వడ్డీ రేటు కన్నా, బ్యాంకు దగ్గిర అప్పులు తీసుకున్న వాళ్ళ నించీ బ్యాంకు వసూలు చేసే వడ్డీ రేటు ఎక్కువగా వుంటుంది. ఆ తేడా వల్లనే, బ్యాంకు, తన వడ్డీ వ్యాపారం చెయ్యగలుగుతుంది. ఉదా: బ్యాంకు నించి అప్పు తీసుకున్న పెట్టుబడి దారుడికి, 100 పెట్టుబడికి 60 జనరల్ లాభం వస్తుంది. వాడు, బ్యాంకుకి చెల్లించే వడ్డీ 25. బ్యాంకు, తన డిపాజిటర్లకి చెల్లించేది 12. ఇంకా బ్యాంకుకి మిగిలేది 13. ఆ 13 లో నించి బ్యాంకుకి వడ్డీ వ్యాపారం ఖర్చు 5. చివరికి బ్యాంకుకి మిగిలేది 8. అంటే, పెట్టుబడి దారుడి నించి బ్యాంకుకి వచ్చిన 25 వడ్డీని, ఎవరెవరు తిన్నారు? - బ్యాంకు పెట్టుబడి దారుడూ, బ్యాంకు డిపాజిటర్లూ కలిసి తిన్నారు, ఆ వ్యాపారపు ఖర్చులుగా కొంత పోగా.

'డబ్బు' వున్న పెట్టుబడి దారుడు, తన డబ్బుని, బ్యాంకులో పెట్టకుండా దానితో తనే స్వయంగా వడ్డీ వ్యాపారం చేస్తే, అప్పుడు తనకు బ్యాంకు ఇచ్చే వడ్డీ కన్నా ఎక్కువ వడ్డీ సంపాదించగలడు. అయితే, అప్పుడు ఆ వ్యాపారం ఖర్చులు, బ్యాంకు ద్వారా జరిగే ఖర్చుల కన్నా ఎక్కువ స్థాయిలో వుంటాయి. డబ్బుని బ్యాంకు లోనే పెడితే, (బ్యాంకుకి అప్పుగా ఇస్తే), ఆ వ్యక్తికి వ్యాపారం ఖర్చులేవీ వుండవు. కానీ, 'వడ్డీ' తగ్గుతుంది.

బ్యాంకు అనేది, డిపాజిటర్ల కోసం, వడ్డీ వ్యాపారం చేసి పెడుతుందన్న మాట - తను కూడా ఆ వడ్డీలో కొంత వాటా తీసుకుంటూ. అయితే, బ్యాంకు చేసే వడ్డీ వ్యాపారం గురించి వివరించేటప్పుడు, "బ్యాంకు అప్పులు ఇస్తుంది" అని మామూలుగా చెప్తే చాలదు. 'అప్పులు ఇచ్చే పని' ఏ వడ్డీ పెట్టుబడిదారుడైనా చేస్తాడు. అందులో బ్యాంకు ప్రత్యేకత ఏమీ లేదు. ఈ విషయంలో బ్యాంకు ప్రత్యేకత ఏమిటంటే - 'ఒకే మొత్తం డబ్బుతో' అనేక సార్లు అప్పులు ఇవ్వగలగడం! ఇది బ్యాంకుకి మాత్రమే సాధ్యమయ్యే పని. ఎలాగంటే:

అన్ని బ్యాంకులనూ కలిపి, ఒకే బ్యాంకుగా అనుకుందాం. ఆ 'బ్యాంకు'లో అన్ని రకాల డిపాజిట్లూ కలిసి, మొదట 100 రూపాయలు వున్నాయి అనుకుందాం. అందులో కొంత భాగాన్ని 'రిజర్వ్'లో వుంచి, (డబ్బుని వెనక్కి అడిగే డిపాజిటర్లకు చెల్లించడానికి), మిగిలిన భాగంతో అప్పులు ఇవ్వవచ్చు. 'డిపాజిట్ల'లో 4వ వంతుని రిజర్వ్‌గా వుంచాలనుకుంటే, 25ని, రిజర్వ్‌లో వుంచి, మిగిలిన 75తో అప్పులు ఇవ్వవచ్చు. 75 మీద వసూలు చేసే వడ్డీలో నించే, 100 డిపాజిట్టుకి వడ్డీని చెల్లించాలి. అయినా కూడా బ్యాంకుకి కొంత లాభం మిగులుతుంది.

బ్యాంకు నించి 75 ని అప్పులు తీసుకున్న ఉత్పాదక, వర్తక పెట్టుబడి దారులు, ఆ డబ్బుతో ఏం చేస్తారు? తమ వ్యాపారాలకు సంబంధించిన సరుకులు కొనడమో, లేదా గతంలో కొన్న సరుకుల కోసం అప్పులు తీర్చడమో, చేస్తారు. ఎలా జరిగినా ఆ 75 డబ్బు, వాళ్ళ చేతుల్లో నించి ఇతర పెట్టుబడి దారుల చేతుల్లోకి వెళ్ళిపోతుంది. ఆ ఇతర పెట్టుబడి దారులు కూడా ఏవైనా సరుకులు కొంటే, ఆ డబ్బు మళ్ళీ ఇతరుల చేతుల్లోకి వెళ్తుంది. అలా ఆ డబ్బు ఎన్ని చేతుల్లో తిరిగినా, కొన్ని రోజులకు దాన్ని బ్యాంకులో దాస్తారు. అంటే, అది మళ్ళీ బ్యాంకుకే తిరిగి వస్తుంది. ఈ సారి అది వేరే పెట్టుబడి దార్ల పేర్లతో, కొత్తగా డిపాజిట్టు అవుతుంది. ఇది 2 వ సారి డిపాజిట్టు. ఈ 75 డబ్బు బ్యాంకుకి వచ్చిందంటే, దానితో అంతకు ముందు ఇచ్చిన అప్పులన్నీ వసూలయ్యాయనీ, అందుకే అది బ్యాంకుకి వచ్చిందనీ అర్థం కాదు. మొదట ఇచ్చిన అప్పులు అలా వుంటూ వుండగానే, ఆ డబ్బు మళ్ళీ కొత్త వాళ్ళ ద్వారా (లేదా, పాత వాళ్ళ ద్వారానే కొత్త డిపాజిట్టుగా), బ్యాంకుకి వచ్చిందని అర్థం. అందుకే అది 2 వ డిపాజిట్టు.

ఈ 2 వ డిపాజిట్టుతో కూడా బ్యాంకు మళ్ళీ అప్పులు ఇవ్వవచ్చు. అయితే ఇప్పుడు కూడా మళ్ళీ అందులో 4 వ భాగాన్ని రిజర్వ్‌లో వుంచాలి. 75 లో

4 వ భాగం - 19. మిగిలింది 56. ఈ 56 తో అప్పులు ఇస్తే, ఇది 2 వ డిపాజిట్టుతో ఇచ్చే అప్పు. ఈ 56 అప్పు మీద వసూలు చేసే వడ్డీలో నించి, 75 డిపాజిట్టు కోసం వడ్డీ చెల్లించగా, బ్యాంకుకి కొంత మిగులుతుంది.

తర్వాత మళ్ళీ కొన్ని రోజులకు ఆ 56 డబ్బు కూడా కొత్త డిపాజిట్టుగా బ్యాంకుకి వచ్చేస్తుంది. ఇది 3 వ సారి డిపాజిట్టు. ఇందులో నించి మళ్ళీ 4 వ భాగాన్ని రిజర్వ్‌లో వుంచాలి. 56 లో 4 వ భాగం - 14. మిగిలినది 42. ఈ 42 తో మళ్ళీ అప్పులు ఇస్తే, ఇది 3 వ డిపాజిట్టుతో ఇచ్చే అప్పు. ఈ 42 మీద బ్యాంకుకి వచ్చే వడ్డీలో నించి, 56 డిపాజిట్టుకి వడ్డీ చెల్లించగా, బ్యాంకుకి కొంత మిగులుతుంది.

తర్వాత మళ్ళీ ఈ 42 డబ్బు కూడా బ్యాంకుకి వచ్చేస్తుంది. ఇది 4 వ సారి డిపాజిట్టు.

ఈ రకంగా, చాలా సార్లు జరుగుతుంది.

3 సార్లు వరకూ చూస్తే వాటి వివరాలు ఇలా వుంటాయి:

| | డిపాజిట్టు | రిజర్వ్ నిధి | అప్పుగా ఇచ్చినది |
|---|---|---|---|
| 1. | 100 | 25 | 75 |
| 2. | 75 | 19 | 56 |
| 3. | 56 | 14 | 42 |
| **మొత్తం** | 231 | 58 | 173 |

అప్పుల్నీ, రిజర్వుల్నీ కలిపితే (173 + 58 = 231), డిపాజిట్ల మొత్తానికి సరిపోతుంది.

231 డిపాజిట్లకి మూలం - 100 రూపాయలే. బ్యాంకు నించి అప్పుగా బయటికి వెళ్ళిన డబ్బే మళ్ళీ మళ్ళీ బ్యాంకుకి తిరిగి రావడం వల్ల, డిపాజిట్ల మొత్తం ఎక్కువ అయింది. (ఎప్పుడైనా బ్యాంకు ఈ 1వ, 2వ, 3వ డిపాజిట్లన్నిటినీ డిపాజిటర్లకి ఇచ్చెయ్యాలంటే, బ్యాంకుకి రావలసిన అప్పులన్నీ పూర్తిగా వసూలు అవవలసి వుంటుంది. అప్పులన్నీ వెనక్కి రాకపోతే, డిపాజిటర్లకి చెల్లించడం సాధ్యం కాదు.)

'రిజర్వ్ నిధి'గా వున్న డబ్బు కూడా కదలకుండా అలాగే వుండదు. దానిలో కూడా, 'తొందరగా వెనక్కి వచ్చే' (షార్ట్ టెర్మ్) అప్పులు ఇస్తూ వుంటారు. - ఈ రకంగా, బ్యాంకులన్నిటినీ కలిపి చూస్తే, 'రిజర్వ్ నిధి' అనేది వీలైనంత కనీస స్థాయికి తగ్గి, డిపాజిట్లలో ఎక్కువ భాగం, బ్యాంకులకు బయటే వుంటుంది. (అప్పులు తీసుకొన్న పెట్టుబడిదార్ల చేతుల్లో.)

ఒక వ్యక్తి, ఇంకో వ్యక్తికి కొంత డబ్బు ఇవ్వవలసినప్పుడు, రూపాయి నోట్లు ఇస్తే, అది - 'ప్రభుత్వ ధనం'. ఒక 'చెక్కు' గానీ, 'డ్రాఫ్టు' గానీ ఇస్తే - అది 'బ్యాంకు ధనం'. 'బ్యాంకు విధానం' ప్రారంభమైన తర్వాత నించీ, డబ్బు చలామణీ, 'బ్యాంకు ధనం' ద్వారా కూడా జరుగుతూ వుంది. బ్యాంకులన్నీ కలిసి, 100 కరెన్సీ నోట్లతో, '500 అప్పు' ఇవ్వగలిగాయి అనుకుందాం. అందులో, 100 కరెన్సీ నోట్లు - ప్రభుత్వ ధనం. మిగిలిన 400 - బ్యాంకు ధనం. బ్యాంకు చెక్కుల్నీ, డ్రాఫ్టుల్నీ ఒకరికి ఒకరు ఇచ్చుకోవడం ద్వారా 400 విలువ, చలామణీ అయిందని అర్థం.

పెట్టుబడిదారీ దేశాల్లో, పెట్టుబడి దారులూ కార్మికులూ కూడా తమ డబ్బు వ్యవహారాల్ని బ్యాంకు ఎక్కౌంట్ల ద్వారా నడుపుకోవడం ఎక్కువైన కొద్దీ, డబ్బు చలామణీ అవసరాల్ని తీర్చడానికి ప్రభుత్వ ధనం కన్నా బ్యాంకు ధనమే ఎక్కువగా పని చేస్తూ వుంటుంది. తక్కువ కరెన్సీ నోట్లతోనే పని జరుగుతుంది.

ఒక పెట్టుబడిదారీ దేశంలో, ప్రభుత్వ ధనం 40%, బ్యాంకు ధనం 60% వుండవచ్చు; లేదా, మొదటిది 20%, రెండోది 80% వుండవచ్చు. ఇలా, రెండూ కలిసి, చలామణీ అవసరాల కోసం పని చేస్తాయి. బ్యాంకు విధానం అభివృద్ధి చెందని దేశాల్లో, ప్రభుత్వ ధనమే ఎక్కువగా వుంటుంది.

100 కరెన్సీ నోట్ల తోనే, అనేక వందల అప్పులు ఇవ్వగలగడమూ, 100 కరెన్సీ నోట్ల తోనే అనేక వందల విలువ గల బ్యాంకు చెక్కుల్ని చలామణీ చెయ్యగలగడమూ - బ్యాంకు విధానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. వ్యక్తిగతంగా ఎవరి వడ్డీ వ్యాపారాలు వాళ్ళే చేసుకొనే వెనకటి కాలంలో, ఇది సాధ్యం కాదు. "బ్యాంకులు అప్పులు ఇస్తూ వడ్డీ వ్యాపారం చేస్తాయి" అన్నప్పుడు, సమాజంలో వున్న తక్కువ డబ్బునే (ప్రభుత్వ ధనాన్ని) మళ్ళీ మళ్ళీ ఉపయోగిస్తూ, ఎక్కువ అవసరాలకు వాడడం - అనే 'బ్యాంకు విధానం'లో వుండే 'సాంకేతికత'ని అర్థం చేసుకోవాలి.

# 'అప్పులు' ఎందు కోసం?

**బ్యాం**కులు - తమ డిపాజిట్ల డబ్బుతో అప్పులు ఇచ్చేటప్పుడు, ఎటువంటి అవసరాల కోసం ఎక్కువ అప్పులు ఇస్తాయి? - పెట్టుబడిదారీ దేశాల్లో బ్యాంకులు ప్రధానంగా 'మారకం బిల్లుల్ని డిస్కౌంట్ చేయడానికే' డిపాజిట్లలో ఎక్కువ భాగాల్ని ఉపయోగిస్తాయి.

**'మారకం బిల్లు' అంటే:** ఒక మారకం జరిగినప్పుడు రాసుకున్న బిల్లు. పెట్టుబడి దారుడు సరుకుని కొన్న వెంటనే 'డబ్బు' చెల్లించకుండా, ఫలానా తారీఖు నాటికి చెల్లిస్తానని రాసి ఇచ్చే అప్పు పత్రమే 'మారకం బిల్లు' (ఎక్చేంజి బిల్లు). దీన్నే 'వాణిజ్య బిల్లు' (కమర్షియల్ బిల్లు) - అని కూడా అంటారు.

A అనే వాడు, B కి సరుకు అమ్మాడు. వెంటనే డబ్బు చెల్లించడానికి B అంగీకరిస్తే, ఆ వ్యవహారం ఇంకో రకం బిల్లు ద్వారా జరుగుతుంది. B, డబ్బు చెల్లించేసి సరుకు తీసేసుకుంటాడు.

కానీ, B, వెంటనే డబ్బు చెల్లించకుండా 3 నెలల తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తానని రాసి ఇచ్చాడనుకుందాం. A చేతిలో ఆ 'మారకం బిల్లు' వుంటుంది. B చేతిలోకి సరుకు వెళ్తుంది. A, ఆ మారకం బిల్లుని తన దగ్గిరే 3 నెలల వరకూ దాచుకుంటే, వాడికి రావలసినదంతా వడ్డీతో సహా B నించీ అప్పటికి వస్తుంది. కానీ, A, ఆ బిల్లుని వెంటనే డబ్బుగా మార్చుకోవాలనుకుంటాడనుకుందాం. ఒక బ్యాంకుకి బైల్దేరతాడు. ఆ బ్యాంకులో ఆ బిల్లుని తాకట్టు పెట్టి, దాని మీద అప్పు తీసుకోవచ్చు. B నించి డబ్బు రాగానే బ్యాంకుకి చెల్లిస్తాడు, వడ్డీతో సహా. లేదా, ఆ బిల్లుని బ్యాంకుకి అమ్మెయ్య వచ్చు కూడా. బ్యాంకు, ఆ బిల్లుని కొంత తక్కువ ధరకి (డిస్కౌంట్‌తో) కొని, Aకి డబ్బు ఇచ్చేస్తుంది. తర్వాత 3 నెలలు గడిచేటప్పటికి బిల్లు 'మెచ్యూర్' అవుతుంది. అప్పటికి, B, సరుకుని అమ్మేస్తాడు. తను చెల్లించవలసిన బిల్లుకి గడువు సమీపించిందని Bకి తెలుసు. ఆ బిల్లుని తన చేతిలో వుంచుకున్న బ్యాంకు, B నించి రావలసినదంతా వడ్డీతో సహా వసూలు చేసుకుంటుంది. ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు చేసిన పని, 'మారకం బిల్లుని డిస్కౌంట్ చేయడం'గా వుంటుంది. 'డిస్కౌంట్ రేటు' అంటే 'వడ్డీ రేటే.' అమలులో వున్న వడ్డీ రేటు ప్రకారమే బిల్లుని బ్యాంకు డిస్కౌంట్ చేస్తుంది. ఆ పని కోసం బ్యాంకు ఖర్చు చేసే డబ్బు, డిపాజిట్ల డబ్బే. అంటే, డిపాజిట్ల డబ్బుతో బిల్లుని కొనడమో, తాకట్టు పట్టడమో చేసి, చివరికి దాని ద్వారా, బ్యాంకు, వడ్డీ సంపాదిస్తుంది. ఆ వడ్డీలో కొంత శాతాన్ని బ్యాంకులో డబ్బు దాచిన డిపాజిటర్లకి చెల్లిస్తే, మిగిలింది బ్యాంకుకి.

మారకం బిల్లుల్ని డిస్కౌంట్ చేయడానికి, బ్యాంకులే గాక, ప్రత్యేకంగా 'డిస్కౌంటింగ్ బ్రోకరు కంపెనీ'లు కూడా వుంటాయి. ఈ కంపెనీలు చేసే పని అంతా, బిల్లుల డిస్కౌంటింగ్ వ్యాపారమే. ఈ కంపెనీల్లో 'డిపాజిట్లు' (పెట్టుబడులు) పెట్టే వాళ్ళంతా ఈ కంపెనీలకు డిపాజిటర్లు.

A తన బిల్లుని ఒక బ్యాంకులో గాక, ఒక 'బ్రోకరు కంపెనీ' లోనే డిస్కౌంట్ చేయించుకుంటాడనుకుందాం. ఆ బిల్లు మీద బ్రోకరే Aకి డబ్బు ఇచ్చి, బిల్లుని తీసుకుంటాడు. ఆ బిల్లుని బ్రోకరే 3 నెలల పాటు వుంచుకుంటే, దాని మీద వడ్డీ అంతా వాడికే వస్తుంది. కానీ, 1 నెల లోనే ఆ బ్రోకరుకి డబ్బు కావలసి వస్తే, బిల్లుని, ఒక బ్యాంకులో 'రీ డిస్కౌంట్' చేయించు కుంటాడు. అంటే, బిల్లుని బ్యాంకుకి కొంత డిస్కౌంట్‌తో ఇచ్చేసి, తనకు రావలసిన డబ్బు తీసుకుంటాడు. బిల్లు, బ్యాంకు చేతిలో వుంటుంది. చివరికి బిల్లు, మెచ్యూర్ అయినప్పుడు, దాని కోసం B చెల్లించవలసిన డబ్బు, బ్యాంకుకి అందుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో 'బిల్లు డిస్కౌంటింగ్' ద్వారా వచ్చిన వడ్డీ, బ్రోకర్‌కీ, బ్యాంకుకీ, డిపాజిటర్లకీ మధ్య పంపకం అయిందని అర్థం.

ఒక బ్రోకరు కంపెనీ చేసినట్టే, ఒక బ్యాంకు కూడా, తన బిల్లుల్ని ఇంకో బ్యాంకు దగ్గిర 'రీ డిస్కౌంట్' చేయించుకో వచ్చు.

ఒక సరుకు, నలుగురైదుగురు వర్తకుల చేతుల మీదుగా వాడకందారుకి అందినప్పుడు, ఆ సరుకు ద్వారా వచ్చే 'వర్తక కమిషను' ఆ వర్తకులందరికీ కొంత కొంత అందుతుందని గతంలో చూశాం. అలాగే, 'బిల్లు డిస్కౌంటింగ్' విషయంలో కూడా జరుగు

తుంది. బిల్లుని మొదటగా డిస్కౌంట్ చేసిన బ్రోకరే (బ్యాంకు కూడా ఒక బ్రోకరే) దాన్ని మెచ్యూర్ కాలం వరకూ వుంచుకుంటే, దాని ద్వారా వచ్చే వడ్డీ అంతా వాడికే అందుతుంది. లేదా, ఆ బిల్లు నలుగురైదు గురు బ్రోకర్ల చేతుల్లో నించీ 'రీ డిస్కౌంట్' అవుతూ పోతే, దాని మీద వడ్డీ ఆ బ్రోకర్లందరికీ (డిపాజిటర్లకి కూడా) పంపకాలు అవుతుంది.

ఒక బ్రోకరు - కంపెనీకి, దాని డిపాజిటర్ల ద్వారా సమకూడిన స్వంత పెట్టుబడి కూడా కొంత వున్నప్పటికీ, సాధారణంగా బ్రోకరు కంపెనీలు, బ్యాంకుల నించి తీసుకున్న అప్పుల తోటే ప్రధానంగా తమ వ్యాపారం చేస్తాయి.

ఒక బ్యాంకు, తనే డైరెక్టుగా బిల్లుల మీద డబ్బు ఇచ్చినా; లేదా, బ్యాంకు నించి అప్పు తీసుకున్న డబ్బుతో ఒక బ్రోకరే బిల్లుల మీద డబ్బు ఇచ్చినా - సారాంశం ఒకటే. ఈ ఉదాహరణల్లో, బిల్లుల్ని డిస్కౌంట్ చేసిన డబ్బు, బ్యాంకు డిపాజిటర్ల డబ్బే.

బిల్లుల్ని, అప్పులు తీర్చడానికి కూడా ఉపయోగించవచ్చు. A, C కి కొంత డబ్బు ఇవ్వాలి. A చేతిలో, B ఇచ్చిన బిల్లు వుంది. ఆ బిల్లుని A, C కి 'ఎండార్స్' చెయ్యవచ్చు. అప్పుడు Cయే దాన్ని డిస్కౌంట్ చేయించుకుంటాడు. ఆ బిల్లు ద్వారా A అప్పు పూర్తిగా తీరకపోతే కొంత బ్యాలెన్స్ మిగులు తుంది.

ఒక పెట్టుబడిదారుడు, తన మారకం బిల్లుని డిస్కౌంట్ చేయించుకుని బ్యాంకు నించి డబ్బు తీసుకోగానే, ఆ డబ్బుతో మళ్ళీ 'కొత్త ఉత్పత్తి క్రమం' ప్రారంభిస్తాడు. అంటే, బ్యాంకులు బిల్లుల్ని డిస్కౌంట్ చేయడం ద్వారా ఎప్పటి కప్పుడు తమ డిపాజిట్ల డబ్బుని, పెట్టు బడిదార్లకు అప్పులుగా అందిస్తాయన్న మాట.

పెట్టుబడిదారీ దేశాల్లో, పెట్టుబడి దారుల మధ్య అమ్మకాలన్నీ ఎక్కువగా మారకం బిల్లుల ద్వారానే జరుగుతాయి. దానివల్ల అక్కడ 'బిల్ మార్కెట్' ఎక్కువగా వుంటుంది. అంటే, 'బిల్ డిస్కౌంటింగ్' వ్యాపారానికి ఎక్కువ అవకాశాలు వుంటాయి. 'స్వదేశీ వ్యాపారం' నించి స్వదేశీ బిల్లులు పుట్టుకొచ్చినట్టుగానే, 'విదేశీ వ్యాపారం' నించి విదేశీ బిల్లులు పుట్టుకొస్తాయి. విదేశీ బిల్లుల్ని డిస్కౌంట్ చేసే వ్యాపారం - విదేశీ బ్యాంకులూ, స్వదేశీ బ్యాంకుల విదేశీ మారక విభాగాలూ, చేస్తాయి.

A దేశపు ఎగుమతిదారుడి చేతిలో, B దేశపు బిల్లు వుందనుకుందాం. ఆ బిల్లు, A కి, B దేశపు డబ్బుని ఇస్తుంది. (B దేశపు దిగుమతి దారుడు, ఆ బిల్లుని తన డబ్బు పేరు తోటే ఇస్తాడు.) ఆ బిల్లుని A, ఒక బ్యాంకుకి ఇచ్చి, తనకు రావలసిన లెక్క ప్రకారం, స్వదేశీ డబ్బు తీసుకుంటాడు.

A దేశపు బిల్లే B చేతిలో వుంటే, B కూడా A చేసినట్టే చేసి, తన స్వదేశీ డబ్బు తీసుకుంటాడు.

A దేశపు బిల్లుల వల్ల B దేశానికి, A దేశపు డబ్బూ; B దేశపు బిల్లుల వల్ల, A దేశానికి, B దేశపు డబ్బూ వస్తాయి.

2 దేశాల బ్యాంకులూ కొంత కాలానికి ఒక సారి సమాన విలువలు గల బిల్లుల్ని కాన్సిల్ చేసుకుంటూ వుంటాయి. ప్రతి సారీ ఏదో ఒక దేశానికి కొంత బ్యాలెన్స్ మిగులుతూ వుంటుంది.

ఈ బిల్లుల 'డిస్కౌంటింగ్' వ్యాపారంలో, బ్యాంకులకు, కొన్ని రకాల మోసాలు కూడా ఎదురవుతూ వుంటాయి. బ్యాంకుకి వచ్చిన బిల్లుని 'మంచి బిల్లే' అని నమ్మి బ్యాంకరు దాని మీద డబ్బు ఇస్తాడు. కానీ అది 'ఫోర్జరీ బిల్లు' (దొంగ సంతకంతో వున్న బిల్లు.) కావచ్చు. దాన్ని నిజంగా అసలు వ్యక్తి ఇవ్వలేదన్న మాట. దాన్ని డిస్కౌంట్ చేసి దాని మీద డబ్బు ఇస్తే రేపు, బ్యాంకుకి, ఆ డబ్బు తిరిగి రాదు.

లేదా, బిల్లు మీద సంతకాలు సరైనవే అయినా, అది అసలు సరుకు అమ్మకం జరగకుండానే సృష్టించిన 'అబద్ధపు బిల్లు' కావచ్చు. A కి డబ్బు కావాలనుకుందాం. B తో గూడుపుఠాణీ చేసి, B కి సరుకు అమ్మకుండానే అమ్మినట్టు, B సంతకంతో బిల్లుని సృష్టించి, దాన్ని బ్యాంకుకి తీసుకు రావచ్చు. అది అబద్ధపు బిల్లు అని బ్యాంకరు గ్రహించడం సాధ్యం కాదు. నిజం బిల్లు అయినా అలాగే వుంటుంది. కాబట్టి, దాని మీద బ్యాంకరు డబ్బు ఇచ్చేస్తాడు. తర్వాత, బిల్లు మెచ్యూర్ అయినప్పుడు, బ్యాంకుకి డబ్బు చెల్లించవలసిన బాధ్యత B ది. అప్పటికి A, B కి డబ్బు ఇచ్చేస్తే, దాన్ని B, బ్యాంకుకి కట్టేస్తాడు. అబద్ధపు బిల్లు రహస్యం రహస్యం గానే వుండి

పోతుంది. లేదా, A, B లు ఇద్దరూ కలిసి, బ్యాంకు డబ్బు ఎగ్గొట్టారనుకుందాం. కోర్టులో కేసు నడిస్తే నడుస్తుంది. మరీ తప్పనిసరి అయినప్పుడు డబ్బు కడతారు. 'అబద్ధపు బిల్లు' టెక్నిక్‌తో, వాళ్ళకి కావలసినప్పుడైతే డబ్బు దొరుకుతుంది కదా?

కొన్ని సార్లు అబద్ధపు బిల్లుల్ని బ్యాంకరు (ఆ ఫలానా శాఖకు సంబంధించిన బ్యాంకు అధికారి), తెలిసే అంగీకరించే సందర్భాలు కూడా వుంటాయి. అంటే, ఆ అధికారి కూడా ఆ గూడు పుఠాణీలో భాగస్తుడుగా వుంటాడన్న మాట! ఆ అధికారి అంత ధైర్యం ఎందుకు చేస్తాడంటే, అబద్ధపు బిల్లుని తాకట్టు పెట్టిన బ్రోకరు (లేదా, మరొకరు), బిల్లు మెచ్యూర్ అయినప్పుడు దాన్ని తప్పకుండా విడిపించుకుంటాడనే నమ్మకంతో! సాధారణంగా అలాంటి బిల్లుల్ని బ్రోకర్లు విడిపించుకుంటూనే వుంటారు. లేకపోతే, అలాంటి పద్ధతుల్లో బ్యాంకుల నించి మళ్ళీ అప్పులు దొరకవు కాబట్టి. బ్యాంకుకి డబ్బు కట్టేసి, ఆ బిల్లుని తీసివేస్తే, అది ఎంత ఫ్రాడ్ బిల్లు అయినా, ఫోర్జరీ బిల్లు అయినా, ఆ రహస్యం బయటికి రానే రాదు. అంతా సవ్యంగా జరిగి పోతుందనే నమ్మకం తోనే బ్యాంకు అధికారి ఆ పనికి సహకరిస్తాడు. ఆ సహకారానికి గానూ, బ్రోకరు నించి ఆ అధికారికి ఏదో ఒక రూపంలో తప్పనిసరిగా 'ప్రతిఫలం' అందుతుంది.

ఇంకా ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలు గానూ అబద్ధపు బిల్లులు పుట్టుకు రావచ్చు. బ్యాంకులు - లాభాల రంధిలో పడి, మంచి బిల్లులతో పాటు అబద్ధపు బిల్లుల మీద కూడా అప్పులు ఇచ్చే ప్రమాదంలో పడుతూనే వుంటాయి.

మారకం బిల్లుల మీద గాక, అప్పులు ఇచ్చే ఇతర సందర్భాలలో అయితే బ్యాంకులు ఏదో ఒక ఆస్తిని తాకట్టు పెట్టుకుంటాయి. వెండి బంగారాలూ, ఇళ్ళూ, భూములూ, కొన్ని రకాల సరుకులూ - వంటి ఆస్తుల్ని తాకట్టు పెట్టుకుని (ష్యూరిటీగా వుంచుకుని) అప్పులు ఇస్తాయి. కొన్ని రకాల ప్రభుత్వ పథకాల్లో, తాకట్టు లేకుండా కూడా బ్యాంకులు అప్పులు ఇస్తాయి.

బ్యాంకుల ద్వారా జరిగే ఈ 'అప్పులు ఇచ్చే పనికి' కూడా అనుకూల, వ్యతిరేక ఫలితాలు వుంటాయి.

**అనుకూల ఫలితం:** 'డబ్బు పెట్టుబడి' కావలసిన పెట్టుబడిదార్లకు, పెట్టుబడి దొరకడం తేలిక అవుతుంది. సమాజంలో, ఉత్పత్తి సాధనాలు సిద్ధంగా వుండి, డబ్బు పెట్టుబడి దొరకడం కూడా తేలిక అయినప్పుడు, ఉత్పత్తి సాధనాల్ని ఉపయోగించడం తేలిక అవుతుంది. దాని వల్ల ఉత్పత్తి క్రమాలు నిరాటంకంగా సాగుతాయి. సరుకు అప్పూ, డబ్బు అప్పూ దొరికే మార్గాలు సులభం అవుతూన్న కొద్దీ, అంత వరకూ లేని కొత్త కొత్త శాఖలు పుట్టుకొస్తాయి. ప్రధానమైన శాఖల్లో పోటీ ఏర్పడి, శాఖల లాభం రేట్లలో మితి మీరిన తేడాలు లేకుండా 'జనరల్ లాభం రేటు'కి దారితీసే పరిస్థితి అభివృద్ధి చెందుతుంది.

**వ్యతిరేక ఫలితం:** బ్యాంకుల వ్యాపారం 'ద్రవ్యోల్బణానికి' దారి తీయవచ్చు. ఎలాగంటే - 'అప్పులు' ఇవ్వడం ద్వారా బ్యాంకులు, డబ్బు - పెట్టుబడిని సప్లై చేసే సంస్థలుగా వుంటాయి. 'డబ్బు సప్లై' అంటే, 'ప్రభుత్వ ధనం' మాత్రమే కాదు; బ్యాంకు ధనం కూడా. ఒక వారంలో బ్యాంకులు ఇచ్చిన అప్పులతో కూడా కలిసినదే, ఆ వారపు డబ్బు సప్లై. డబ్బు సప్లైలో ఎక్కువ తక్కువల్ని బట్టే చలామణీ లోకి ఎక్కువ డబ్బు రావడం గానీ, తక్కువ డబ్బు రావడం గానీ, వుంటుంది. ఈ రకంగా, బ్యాంకుల వ్యాపారానికీ, డబ్బు సప్లైకీ సంబంధం వుంటుంది. బ్యాంకులు చేసేది కూడా వ్యాపారమే కాబట్టి, అవి కూడా లాభ దృష్టి తోటే పోటీలు పడుతూ వ్యాపారం చేస్తాయి. ఎక్కువ అప్పులు ఇస్తే ఎక్కువ వడ్డీలు సంపాదించగలవు కాబట్టి, వీలైనన్ని ఎక్కువ అప్పులు ఇవ్వడానికే ప్రతీ బ్యాంకూ ప్రయత్నిస్తుంది. సమాజానికి నిజంగా ఎంత 'డబ్బు చలామణీ'తో అవసరం వుంది - అనే విషయంతో సంబంధం లేకుండా, బ్యాంకులు, అప్పులు ఇస్తాయి. అప్పులు తీసుకునే పెట్టుబడిదారుల్లో ప్రతీ ఒక్కడూ తన అవసరం కోసమే అప్పు తీసుకున్నప్పటికీ, ఈ పరిస్థితి - సమాజంలో వున్న 'ఉత్పత్తుల విలువ'ని మించిన డబ్బుని చలామణీ లోకి తెచ్చే అవకాశం కలిగిస్తుంది.

కొంత కాలాన్ని ఉదాహరణగా తీసుకుంటే, ఆ కాలంలో 'ఉత్పత్తుల రాసి' పెరగకుండానే, చలామణీ లోకి వచ్చే డబ్బు పరిమాణం పెరిగిందనుకుందాం. ఆ కాలంలో, బ్యాంకులు ఇచ్చిన అప్పుల ద్వారా వచ్చిన డబ్బు పరిమాణం, చలామణీ అవసరాన్ని మించినదిగా వుందనుకుందాం. ఆ అప్పులు సంపా

దించిన పెట్టుబడిదారులు, మార్కెట్లో అప్పుడు వున్న ఉత్పత్తులనే కొనడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి, సరుకుల ధరలు పెరుగుతాయి. 'జీతాలు' పెరగకుండానే, సరుకుల ధరలు పెరిగే ఈ పరిస్థితి, జీతాల వర్గానికి, చాలా హాని చేస్తుంది.

అంతే గాక - బ్యాంకులు, పెట్టుబడి దార్లకు అప్పులు అందించడంలో - ఏ శాఖకి ఎక్కువ పెట్టు బడి అవసరమో, ఏ యే శాఖల్ని అభివృద్ధి పరచాలో - వంటి విషయాల్ని పరిశీలించే దృష్టితో వుండవు. ఎందుకంటే, అది బ్యాంకుల పని కాదు. వాటి పని అంతా, వాటి వ్యాపారాలు అవి 'లాభదాయకంగా' చేసుకోవడమే. కాబట్టి, ఎక్కువ లాభాలు ఏ పద్ధతిలో వస్తే, ఆ పద్ధతిలోనే ఎక్కువ అప్పులు ఇవ్వడానికి అవి ప్రయత్నిస్తాయి.

'అప్పు విధానం' విస్తరించడం ద్వారా పుట్టుకొచ్చే ఇంకో వ్యతిరేక ఫలితం, 'అమితోత్పత్తి'. అంటే, ఖర్చు పెట్టలేనంత ఉత్పత్తి తయారవడం. సరుకు అప్పూ, డబ్బు అప్పూ పద్ధతులు అభివృద్ధి చెందుతోన్న కొద్దీ 'ఉత్పత్తి క్రమాలు' తేలిగ్గా జరుగుతూ వుంటాయని చూశాం. కొత్త ఉత్పత్తి క్రమం జరుగుతోందంటే, దాని కోసం అప్పటికే సిద్ధంగా వున్న ఉత్పత్తి సాధనాలు ఖర్చయి పోతున్నాయని అర్థమే. అయినా, ఇంకా కొంత ఉత్పత్తి, ఖర్చు కాకుండా మిగిలి పోయే పరిస్థితి కూడా ఏర్పడుతూ వుంటుంది. ఎందుకంటే, పెట్టుబడి దారీ విధానంలో, ప్రతీ పునరుత్పత్తి క్రమమూ విస్తృత పునరుత్పత్తి క్రమమే కాబట్టి, ప్రతీ పునరుత్పత్తి క్రమమూ గతంలో కన్నా విస్తృత స్థాయిలో జరుగుతూ, గతంలో కన్నా ఎక్కువ ఉత్పత్తి రాసిని ఇస్తూ వుంటుంది. దీనికి తోడు, 'ఉత్పాదక శక్తుల' పెరుగు దల కూడా కలిసి, 'ఉత్పత్తుల రాసి' పెరిగిపోతూ వుంటుంది. క్రమంగా ఇది 'అమితోత్పత్తి'కి దారి తీస్తుంది. (దీన్ని ఈ సంపుటం లోనే "సంక్షోభాలు" చాప్టరులో వివరంగా చూస్తాము.)

సమాజంలో నిజమైన పెట్టుబడి (ఉత్పాదక పెట్టుబడి) ఎప్పుడూ పెరుగుతూనే వుంటుంది కాబట్టి, దానికి తగిన పాళ్ళల్లో డబ్బు చలామణీని కూడా పెంచవలసి వుంటుంది. అయితే, 'నిజ పెట్టుబడి' విస్తరణకీ, 'డబ్బు సప్లై' విస్తరణకీ, 'వడ్డీ పెట్టుబడి' విస్తరణకీ, సమన్వయాలు వుండాలి. కానీ, ఇది బ్యాంకుల వ్యాపారం వల్ల అసాధ్యమవుతుంది. బ్యాంకు వ్యాపారాన్ని 'అదుపులో పెట్టే' చట్టాలు ఎన్ని వున్నా, ఆచరణలో అవన్నీ నిరర్థకాలవుతాయి.

బ్యాంకుల్లో ప్రైవేటు బ్యాంకులే గాక, ప్రభుత్వ బ్యాంకులు కూడా వుంటాయి. కానీ, బ్యాంకు అనేది ఎవరి ఆధీనంలో నడిచినా, అది చెయ్యవలసింది 'వడ్డీ వ్యాపారమే.' వడ్డీ పెట్టుబడి, తన వ్యాపారాల ద్వారా వడ్డీలూ లాభాలూ సంపాదించ వలసిందే కాబట్టి, పెట్టుబడిదారీ విధానంలో ప్రభుత్వ బ్యాంకులు కూడా ప్రైవేటు బ్యాంకుల లాగానే లాభ దృష్టి తోనే పని చేస్తాయి.

బ్యాంకుల్లో రక రకాల 'స్పెషలైజేషన్' గల బ్యాంకులు వుంటాయి. సేవింగ్స్ బ్యాంకులూ, కమర్షియల్ బ్యాంకులూ, క్రెడిట్ బ్యాంకులూ, తనఖా బ్యాంకులూ, సహకార బ్యాంకులూ - వగైరా పేర్లతో. ప్రతీ బ్యాంకూ 'డిపాజిట్లు' తీసుకుంటుంది. 'అప్పులు' ఇస్తుంది. ఆ అప్పులు ఇవ్వడం లోనే కొన్ని రకాల తేడాలు వుంటాయి.

# బ్యాంకులే గాక ఇతర 'డబ్బు' సంస్థలు

కొందరు పెట్టుబడి దార్లకు - రక రకాల ఉత్పాదక కంపెనీలూ, వర్తక కంపెనీలూ వున్నట్టే, వడ్డీ వ్యాపారం చేసే 'డబ్బు సంస్థలు' (ఫైనాన్స్ కంపెనీలు) కూడా వుంటాయి. ఇవి, బ్యాంకులు చేసే పనులన్నీ చెయ్యవు. కేవలం 'వడ్డీ వ్యాపారం' మాత్రమే చేస్తాయి. ఇవి 'డబ్బు' ఇచ్చే వాళ్ళ నించి 'అప్పులు' తీసుకుని, ఆ డబ్బుతో మళ్ళీ అప్పులు ఇచ్చి, వడ్డీలు సంపాది స్తాయి.

'చిట్ ఫండ్' కంపెనీలు కూడా ఇదే రకం పని చేస్తూ 'లాభాలు' సంపాదిస్తాయి.

'ఇన్సూరెన్స్ కంపెనీలు' కూడా 'డబ్బు'ని సేక రించి, దానితో అప్పులు ఇచ్చి, వడ్డీలు సంపాదిస్తాయి. ఆ వడ్డీలలో నించే పాలసీదార్ల యాక్సిడెంట్లకు చెల్లిం చడమూ, పాలసీలు మెచ్యూర్ అయినప్పుడు వాటి మీద వడ్డీలు చెల్లించడమూ చేస్తాయి. కంపెనీ ఖర్చు లన్నీ పోగా చివరికి కొంత 'లాభం' సంపాదిస్తాయి.

'ప్రావిడెంట్ ఫండ్' కంపెనీలు కూడా ఇదే పని చేస్తాయి. ఇవి, కార్మికుల జీతాల్లో నించి ప్రతీ నెలా కొంత భాగాన్ని మినహాయించి, ఆ మొత్తాన్ని కార్మికుల ఉద్యోగ విరమణ తర్వాత కొంత వడ్డీతో చెల్లిస్తారు. అప్పటి వరకూ ఆ ఫండ్‌తో వడ్డీ వ్యాపారమే జరుగుతుంది.

ఈ రకంగా బ్యాంకులూ, బ్యాంకులు కాని రక రకాల ఫైనాన్స్ కంపెనీలూ అన్నీ, వడ్డీ వ్యాపారం చేసే పెట్టుబడిదారీ సంస్థలే.

డబ్బు సంస్థలన్నీ కలిసే 'డబ్బు మార్కెట్'. ఈ డబ్బు మార్కెట్ సంపాదించే వడ్డీలూ లాభాలూ 'సామాజిక అదనపు విలువ'లో భాగమే.

# ఉసురీ

'ఉసురీ' అంటే కూడా 'వడ్డీ'యే. కానీ ఇది పెట్టుబడిదారీ విధానం కన్నా వెనకటి కాలంలో వుండే వడ్డీ.

వెనకటి కాలం నించీ కూడా 'వర్తకం' వున్నట్టుగానే, 'వడ్డీ వ్యాపారం' కూడా వుంది.

వెనకటి కాలంలో - బానిసలూ, బానిస యజమానులూ, వర్తకులూ, స్వతంత్ర ఉత్పత్తి దారులూ వున్నారనుకుందాం. బానిస యజమానుల్లోనూ, వర్తకుల్లోనూ, 'డబ్బు' కూడబెట్టి వడ్డీ వ్యాపారాలు చేసే వాళ్ళు, 'వడ్డీ పెట్టుబడి దారులు'గా కూడా అవుతారు. ఇతర బానిస యజమానులూ, ఇతర వర్తకులూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ, 'అప్పులు' తీసుకునే వారిగా వుండవచ్చు.

'ఉసురీ' అనేది, ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో వుండే 'బ్యాంకు వడ్డీ' లాంటిది కాదు. అంత కన్నా చాలా ఎక్కువ స్థాయి వడ్డీ అది. పెట్టుబడిదారీ విధానంలో, పెట్టుబడి దారుడికి 'సంస్థ లాభం'గా మిగిలే భాగంలో నించి కూడా చాలా వరకూ ఉసురీగానే వుండేటంత ఎక్కువ స్థాయి వడ్డీ అది. కొన్ని దేశాల్లో, కొన్ని సందర్భాల్లో, ఉసురీ రేటు సంవత్సరానికి 100%నీ, 200%నీ కూడా మించిపోయి వుండేది. ఇంత స్థాయిలో వుండే ఉసురీ, చిన్న తరహా ఉత్పత్తిదారుల ఆస్తులనే గాక, కొన్ని సందర్భాల్లో 'భూస్వాముల' ఆస్తుల్ని కూడా 'స్వాహా' చెయ్యగలిగేది. అందుకే ఉసురీ అంటే ప్రాచీన ప్రపంచంలో విపరీతమైన భయమూ, ద్వేషమూ వుండేవి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రారంభం కానంత వరకే 'ఉసురీ' ఆ స్థాయిలో వుండగలిగింది. పెట్టుబడిదారీ విధానంలో కూడా వడ్డీ రేటు గత స్థాయిలోనే వుంటే, ఉత్పాదక, వర్తక పెట్టుబడులకు మిగిలే లాభాలు అతి తక్కువగా వుంటాయి. అందుకే పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన కాలం నించీ, ఉత్పాదక - వర్తక పెట్టుబడిదార్ల నించి 'ఉసురీ రేటుని తగ్గించాల'నే కేకలు ప్రారంభమయ్యాయి. పెట్టుబడిదారీ విధానం, తమ 'అభివృద్ధి' చెందుతూ వున్న కొద్దీ, 'ఉసురీ రేటు'ని అణచడం కోసం ప్రభుత్వాల ద్వారా లీగల్ పోరాటాలూ, 'బ్యాంకు విధానాన్ని ఏర్పర్చుకోవడం' ద్వారా సాంఘిక పోరాటాలూ, సాగించింది. పెట్టుబడిదారీ విధానపు మాన్యుఫ్యాక్చర్ దశలో, సరుకు - అప్పూ, వర్తకమూ, మనీ డీలింగూ (డబ్బుతో వ్యవహరించడం), అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, వడ్డీ పెట్టుబడి, ఉత్పాదక - వర్తక పెట్టుబడులకు లోబడి పోతూ వచ్చింది. అంటే, పాత కాలపు ఉసురీ రేటు తగ్గిపోతూ వచ్చింది.

వెనకటి కాలంలో 'ఉసురర్'ని ద్వేషించినట్టుగా, పెట్టుబడిదారీ ప్రపంచంలో 'బ్యాంకర్'ని ద్వేషించరు. ఎందుకంటే, వెనకటి కాలంలో అప్పులు తీసుకొనే వాళ్ళు 'ఉసురీ' వల్ల నాశనమైనట్టుగా, బ్యాంకుల నించి అప్పులు తీసుకునే పెట్టుబడి దారులు, 'బ్యాంకు వడ్డీ' వల్ల నాశనం కారు. పైగా, పెట్టుబడిదారీ విధానానికి బ్యాంకు అనేది ఎన్నో విధాలుగా 'సహాయకారి' గానే వుంటుంది- తన వ్యాపారం ద్వారా అది తన లాభం తను సంపాదించినప్పటికీ.

బ్యాంకు విధానం ద్వారా పెట్టుబడి దారులకు అప్పులు దొరికే మార్గం ఏర్పడినప్పటికీ, 'బ్యాంకు - అప్పు' కావాలంటే, మంచి గ్యారంటీ చూపించాలి. బ్యాంకు అప్పులు, పెద్ద పెట్టుబడి దారులకు దొరికినంత తేలికగా చిన్న వాళ్ళకు దొరకవు. చిన్న స్థాయి పెట్టుబడిదారులూ, స్వతంత్ర ఉత్పత్తిదారులూ, స్వతంత్ర వర్తకులూ, ప్రైవేటు వడ్డీ పెట్టుబడి దారుల నించి ఎక్కువ వడ్డీ రేట్ల తోటే అప్పులు తెచ్చుకోవలసి వుంటుంది. నిరుపేద కార్మికులు తెచ్చుకునే అప్పుల విషయంలో అయితే, ఈ నాటికీ దాదాపుగా 'ఉసురీ రేటు' వున్నట్టే లెక్క.

# విదేశీ అప్పు

**వే**రు వేరు దేశాల మధ్య వర్తకం వుంటుంది కాబట్టి, దానితో పాటే ఆ దేశాల మధ్య, సరుకు - అప్పులూ, డబ్బు - అప్పులూ కూడా వుంటాయి. అప్పులతో పాటే వడ్డీ లెక్కలు కూడా.

రూపాయి దేశం, డాలరు దేశం నించి '100 డాలర్ల సరుకు'ని అప్పు పద్ధతి మీద కొన్నదనుకుందాం. ఆ అప్పుని తీర్చాలంటే రూపాయి దేశం, డాలరు దేశానికి, ఆ 'విలువ'కి సరిపోయే తన సరుకుల్ని ఎగుమతి చెయ్యాలి. అప్పుని తీర్చడానికి అంత కన్నా వేరే మార్గం వుండదు.

అయితే, ఆ అప్పు, 'సరుకు అప్పు' గాక, '100 డాలర్ల డబ్బు అప్పు' అనుకుందాం. ఆ 'డబ్బు అప్పు'ని ఎలా తీర్చవలసి వుంటుంది? అప్పుడు కూడా 'అప్పు'ని మొదటి పద్ధతి లోనే తీర్చవలసి వుంటుంది. రూపాయి దేశం, ఆ 'డబ్బు అప్పు' తీసుకున్న తర్వాత ఏం జరుగుతుందంటే, ఆ 100 డాలర్లు, డాలరు దేశం లోనే ఒక బ్యాంకులో, రూపాయి దేశానికి సంబంధించిన 'విదేశీ మారకం ఎక్కౌంటు'లో (రూపాయి దేశపు ఆధీనం లోనే) వుంటాయి. అప్పుడు రూపాయి దేశానికి అంత విదేశీ డబ్బు వున్నట్టు అర్థం. తర్వాత, రూపాయి దేశం, ఆ డాలర్లని వాడాలంటే, వాటితో డాలరు దేశం నించే (డాలరు దేశపు కంపెనీల నించి) సరుకులు కొనాలి. ఆ సరుకుల కోసం, రూపాయి దేశం, ఆ డాలర్లని చెల్లించి వెయ్యగలదు. ఇప్పుడు రూపాయి దేశానికి 'సరుకు' వచ్చింది. ఇక తర్వాత, ఆ డబ్బు - అప్పుని తీర్చాలంటే, ఆ విలువకి సరిపోయే (వడ్డీ'తో సహా) తన సరుకుల్ని డాలరు దేశానికి ఎగుమతి చెయ్యాలి. ఎలా చూసినా విషయం ఒకటే. మొదటే సరుకు అప్పుని తీసుకున్నా; లేదా, మొదట డబ్బు - అప్పు తీసుకుని, దానితో 'సరుకు'ని కొన్నా - ఎలా జరిగినా ఒకటే. 'డబ్బు' అనేది, 'సరుకు'కి ఇంకో రూపం మాత్రమే. అందులో దేనిని అప్పుగా తీసుకున్నా, అది, కొంత 'విలువ'ని అప్పుగా తీసుకోవడమే. కాబట్టి, 'సరుకు అప్పు'ని తీర్చడానికి ఏం చెయ్యాలో, 'డబ్బు అప్పు'ని తీర్చడానికి కూడా అదే చెయ్యాలి. ఏ అప్పుని తీర్చడానికైనా తన సరుకుల్ని ఇవ్వడమే మార్గం.

ఉదాహరణని ఇంకో రకంగా చూద్దాం. రూపాయి దేశం, డాలరు దేశం నించి తీసుకున్న డాలర్లతో, డాలరు దేశం నించి కొనకుండా, డాలర్లు తీసుకోడానికి అంగీకరించే K అనే ఇంకో దేశం నించి సరుకుల్ని కొన్నదనుకుందాం. అప్పుడు డాలర్లు, K దేశపు 'విదేశీ మారకం ఎక్కౌంటు' లోకి వెళ్తాయి. ఆ డాలర్లని ఖర్చు పెట్టాలంటే, K దేశమైనా, డాలరు దేశం నించి సరుకుల్ని కొనవలసిందే. అంటే K దేశం, తన స్వంత సరుకుల్ని రూపాయి దేశానికి అమ్మి, తను - డాలరు దేశం నించి కొంటుందని అర్థం. ఒకవేళ, K దేశం కూడా డాలరు దేశం నించి కొనకుండా, తన చేతి లోకి వచ్చిన డాలర్లని P దేశానికి ఇచ్చి సరుకుల్ని కొంటే, ఆ డాలర్లు P దేశపు ఎక్కౌంటు లోకి వెళ్తాయి. అప్పుడు P దేశమయినా ఆ డాలర్లతో డాలరు దేశం నించి కొంటుంది. అంటే, డాలరు దేశం రూపాయి దేశానికి ఇచ్చిన 'డబ్బు అప్పు'తో, రూపాయి దేశమే డాలరు దేశం నించి కొనకపోయినా, ఏదో ఒక దేశం డాలరు దేశం నించి కొనాలి. ఎలా జరిగినా సారాంశం ఒకటే. 'డబ్బు అప్పు' ఇచ్చిన డాలరు దేశం, ఆ విలువకి తగినట్టుగా తన కంపెనీల సరుకుల్ని అమ్మగలుగుతుంది.

ఒక దేశం, ఇంకో దేశానికి అప్పు ఇచ్చిందంటే (అది సరుకు - అప్పు అయినా, డబ్బు - అప్పు అయినా), ఆ దేశం విదేశానికి ఏదో 'మేలు' చేస్తున్నట్టు అర్థం కాదు. అది తన సరుకుల్ని అమ్ముకుంటున్నదని మాత్రమే అర్థం.

అయితే, అప్పు ఇవ్వడం ద్వారా ఒక దేశం తన సరుకుల్ని అమ్ముతోందంటే, తర్వాత ఆ అప్పు తీసుకున్న దేశం కూడా, ఆ అప్పుని తీర్చేటప్పుడు తన సరుకుల్ని ఇంకో దేశానికి అమ్మవలసిందే. ఈ వ్యవహారంలో రెండు దేశాలూ ఒకదాని కొకటి అమ్ముకుంటాయి. ఆ రకం గానే, అప్పు ఇచ్చిన దేశానికి, దాని విలువ దానికి అందుతుంది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో, అప్పు ఇచ్చిన దేశానికి వచ్చే లాభం ఏమిటంటే, అది రెండో దేశం నించి కొంత వడ్డీ సంపాదించ గలుగుతుంది. ('వడ్డీ' పేరుతో కొంత 'విలువ'ని, అంటే కొంత 'ఉత్పత్తి'ని, సంపాదిస్తుంది.)

అయితే, ఇది పైకి ఎలా కనపడుతుందంటే, అప్పు ఇచ్చే దేశం, వడ్డీ సంపాదిస్తుందనే విషయం ప్రధాన విషయంగా కనపడకుండా, ఆ దేశం రెండో దేశానికి చాలా 'సహాయం' చేస్తున్నట్టు కనపడుతుంది.

సరుకుల్ని కొన్న వెంటనే డబ్బు చెల్లించి వేస్తే ఆ సంబంధం ఇరు పక్షాల మధ్యా వెంటనే ముగిసి పోతుంది. కానీ, 'అప్పు' నడిస్తే, ఆ సంబంధం, ఆ అప్పు తీరే వరకూ దీర్ఘ సంబంధంగా వుంటుంది.

# విదేశీ పెట్టుబడి

పెట్టుబడి - అంటే, 'డబ్బు పెట్టుబడి' అయినా కావచ్చు, 'ఉత్పాదక పెట్టుబడి' అయినా కావచ్చు.

డాలరు దేశం, రూపాయి దేశానికి '100 డాలర్ల డబ్బు - పెట్టుబడి' ఇచ్చిందంటే, 'డబ్బు - అప్పు' ఇచ్చిందని అర్థం. అప్పు ఇచ్చిన దేశం, అప్పు ద్వారా వడ్డీ సంపాదిస్తుందని చూశాం.

లేదా, డాలరు దేశం, 100 డాలర్ల విలువ గల 'ఉత్పత్తి సాధనాల్ని' (యంత్రాలూ వగైరాల్ని), రూపాయి దేశానికి తీసుకు వెళ్ళి అక్కడ తన యాజ మాన్యం కిందే ఒక ఫ్యాక్టరీని స్థాపించి, 'సరుకుని ఉత్పత్తి' చెయ్యడం ప్రారంభిస్తుందనుకుందాం. రూపాయి దేశానికి తీసుకు వెళ్ళిన ఆ ఉత్పత్తి సాధ నాలు, రూపాయి దేశానికి అమ్మిన ఎగుమతులూ కావు; రూపాయి దేశానికి ఇచ్చిన 'సరుకు - అప్పూ' కాదు.

డాలరు దేశం, రూపాయి దేశంలో స్థాపించిన తన ఫ్యాక్టరీ కోసం 'ముడి పదార్థాల్ని' రూపాయి దేశం లోనే కొన్నదంటే, అవి, రూపాయి దేశం, డాలరు దేశానికి అమ్మిన ఎగుమతులే.

డాలరు దేశం పెట్టిన ఆ ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులు, రూపాయి దేశపు కార్మికులే. వారికి జీతాలు రూపాయిల్లోనే ఇవ్వాలి.

చివరికి, ఆ ఫ్యాక్టరీలో తయారైన సరుకు, విదేశీ పెట్టుబడి దారుడిదే. ఆ సరుకు 'ధర', రూపాయిల్లోనే వుంటుంది. అయినా అది రూపాయి దేశపు సరుకు కాదు. ఆ సరుకుని రూపాయి దేశంలో అమ్మినా, డాలరు దేశంలో అమ్మినా, ఇంకే దేశంలో అమ్మినా, ఆ 'సరుకు' ద్వారా వచ్చే 'జనరల్ లాభం', డాలరు దేశపు పెట్టుబడి దారుడిదే. ఆ పెట్టుబడి దారుడు, ఆ సరుకుని అమ్మడం ద్వారా దాని కోసం ఖర్చయిన పెట్టుబడిని వెనక్కి తీసుకుని, రూపాయి దేశపు కార్మి కుల 'అదనపు విలువ'ని స్వంతం చేసుకుంటాడన్న మాట.

కార్మికుల వేపు నించి చూస్తే, వారి అదనపు విలు వని స్వదేశీ పెట్టుబడిదారుడు కాక, విదేశీ పెట్టుబడి దారుడు తింటాడు. డాలరు దేశం, రూపాయి దేశంలో 'డబ్బు - పెట్టుబడి' పెడితే, ('డబ్బు అప్పు' ఇస్తే), దాని ద్వారా 'వడ్డీ' మాత్రమే సంపాదిస్తుంది. 'ఉత్పా దక పెట్టుబడి' పెడితే, దాని ద్వారా 'వడ్డీ + సంస్థ లాభం' సంపాదిస్తుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **వడ్డీ - అంటే ఏమిటి?**

**జ:** శ్రమ చెయ్యకుండా వచ్చే డబ్బు.

2. **కౌలూ, వడ్డీ, లాభం - ఈ మూడూ శ్రమ చెయ్య కుండానే వస్తాయి. అయినా వీటికి వేరు వేరు పేర్లు ఎందుకు వున్నాయి?**

**జ:** వేరు వేరు సంబంధాల్ని బట్టీ, వేరు వేరు ఆస్తి హక్కుల్ని బట్టీ, ఈ వేరు వేరు పేర్లు. భూమి ఆస్తి ద్వారా వచ్చేది - కౌలు. డబ్బు ఆస్తి ద్వారా వచ్చేది - వడ్డీ. ఉత్పత్తి సాధనాల ఆస్తి ద్వారా వచ్చేది - లాభం. అన్నిటికీ కలిపి ఒకే పేరు - 'అదనపు విలువ.'

3. **డబ్బుని పెట్లోనే దాస్తే, దాని పరిమాణం పెరగదు. ఇతర్లకి అప్పు ఇస్తే పెరుగుతుంది. ఎందుచేత? 'అప్పు' ఇచ్చినప్పుడు, డబ్బు పెరగడానికి బయట ఏం జరుగుతుంది?**

**జ:** డబ్బుని అప్పుగా తీసుకున్న వ్యక్తి, ఆ డబ్బుని C + V లుగా వుపయోగించి ఏదో ఒక వ్యాపారం

చేసి, లాభం సంపాదించి, అందులో నించి కొంత భాగాన్ని 'వడ్డీ'గా చెల్లిస్తాడు. అప్పుగా తీసుకున్న 'అసలు' ని కూడా తిరిగి ఇస్తాడు. ఆ డబ్బు బయటికి అప్పుగా వెళ్ళడం వల్ల జరిగేది ఇదే.

**4. వడ్డీ, సరుకు విలువ లోకి చేరదు. ఎందుచేత?**

**జ:** అది, సరుకు తయారవడానికి అవసరమైన అంశం కాదు గనక.

**5. జనరల్ లాభం లో నించి సంస్థ లాభాన్ని తీసివేశాక మిగిలేది వడ్డీ. ఈ వివరణ సరైనదేనా?**

**జ:** కాదు. జనరల్ లాభంలో నించి వడ్డీని తీసివేశాక మిగిలేది సంస్థ లాభం. వడ్డీని చెల్లించే పనే ముందు జరగాలి.

**6. ఒక గ్రామంలో ఒక షావుకారు, కూలి వారికి 1 బస్తా ధాన్యం అప్పు ఇచ్చి, సంవత్సరం తర్వాత ఆ ధాన్యాన్ని తిరిగి తీసు కునే టప్పుడు, 2 బస్తాల ధాన్యం తీసుకుంటాడు. ఇది ఎంత వడ్డీ రేటు అవుతుంది?**

**జ:** 1 బస్తా ఇచ్చి 2 బస్తాలు తీసుకోవడం అంటే, అది సంవత్సరానికి నూరు శాతం వడ్డీ రేటు.

**7. సంస్థని మేనేజ్ చేసే శ్రమ కోసం తీసుకునేది లాభమా, జీతమా?**

**జ:** జీతమే. శ్రమ అనేది ఏ శ్రమ అయినా, 'శ్రమ' కి బదులుగా వచ్చేది - జీతమే. శ్రమ లేకుండా వచ్చేదే - లాభం.

**8. ఉత్పాదక, వర్తక పెట్టుబడిదారులు ప్రతి ఏటా 'అదనపు విలువ'ని సంపాదిస్తూ వుంటారు కదా? వాళ్ళ పెట్టుబడులు పెరుగుతూనే వుంటాయి కదా? కొంత కాలానికి ఆ పెట్టుబడిదారులు, అప్పులు తీసుకో వలసిన అవసరం లేకుండా పోతుందా?**

**జ:** అలా జరగదు. డబ్బు రాసి వున్న వాళ్ళ చేతుల్లో కూడా కొన్ని ఉత్పత్తి సాధనాలు వున్నాయని అర్థం. అవి కూడా కలిస్తేనే ఉత్పత్తి క్రమాలు సాధ్యం. అవి కలవాలంటే, వాటిని (ఆ డబ్బుని) అప్పు తీసు కోవలిసిందే. ఉత్పత్తి సాధనాలు, విడి విడి వ్యక్తుల ఆస్తులుగా వున్నప్పుడు, అప్పులు లేకుండా, ఉత్పత్తి క్రమాలు జరగవు. ఉత్పత్తి సాధనాలు సమిష్టిగా వుంటే, అప్పుల ప్రసక్తి వుండదు.

**9. A, B కి, వడ్డీ లేని అప్పు ఇచ్చాడు. B, ఒక పరిశ్రమ నడిపి లాభం సంపాదించాడు. A ఇచ్చిన డబ్బు, A చేతిలో గానీ, B చేతిలో గానీ 'వడ్డీ పెట్టుబడి' గా పని చేసిందా, లేదా?**

**జ:** B అమ్మే సరుకు ధర, వడ్డీతో కలిసిన పరిమాణం తోనే వుంటుంది. B కి, వడ్డీ లేని అప్పు దొరికింది కదా అని, అతని సరుకు, తక్కువ ధరతో వుండదు. వడ్డీని, A కి చెల్లించ నక్కర లేకపోతే, దాన్ని B యే వుంచు కుంటాడు. అంటే, ఆ డబ్బు, B చేతిలో వడ్డీ పెట్టుబడిగా పని చేసినట్టే అర్థం. సమాజంలో, వడ్డీ లెక్కలు లేకుండా పోతేనే, డబ్బు అనేది, వడ్డీ పెట్టుబడిగా పని చెయ్యడం ఆగుతుంది.

**10. బ్యాంకు నించి డబ్బు అప్పు తీసుకుని, ఆ డబ్బునే ఆ బ్యాంకు లోనే 'ఫిక్సెడ్ డిపాజిట్'గా పెట్టి, వడ్డీ సంపాదించడం సాధ్యమేనా? ఏ రకంగా?**

**జ:** సాధ్యం కాదు. బ్యాంకు నించి తీసుకున్న అప్పు మీద చెల్లించ వలసిన వడ్డీ రేటు ఎక్కువ గానూ, బ్యాంకులో పెట్టిన ఫిక్సెడ్ డిపాజిట్టు మీద వచ్చే వడ్డీ రేటు తక్కువ గానూ వుంటాయి. బ్యాంకు నించి సంపాదించే వడ్డీ కన్నా, బ్యాంకుకి చెల్లించవలిసిన వడ్డీ యే ఎక్కువగా వుంటుంది. కాబట్టి ఆ వ్యవహారం సాధ్యం కాదు.

**11. పెట్టుబడిదారుల్లో ఎవ్వరూ ఉత్పాదక పెట్టుబడి దారులుగా వుండకుండా, అందరూ వడ్డీ పెట్టుబడి దారులు గానే వుంటూ వడ్డీలు సంపాదించడం సాధ్య మేనా?**

**జ:** సాధ్యం కాదు. అప్పుడు వడ్డీలు ఎక్కడి నించి వస్తాయి? ఉత్పాదక కార్యక్రమాలు వుంటేనే, ఆ శ్రమలో నించే అదనపు విలువా, అందులో నించి వడ్డీ వస్తాయి. అందరూ అప్పులు ఇచ్చే వాళ్ళే అయితే, ఎవరికి ఇస్తారు? అప్పులు తీసుకొనే వాళ్ళు ఎవరు?

ఉత్పాదక క్రమాలు లేకపోతే అప్పులు దేనికోసం తీసుకుంటారు?

12. **A, B - ఇద్దరూ స్నేహితులు. ఇద్దరూ ఒకే చోట ఒకే రకమైన, చిన్న చిన్న ఇళ్ళు కట్టుకున్నారు. (ఇళ్ళ అడుగున వున్న భూమి సంగతి ఇక్కడ తీసుకోవడం లేదు.) A కి స్వంత డబ్బు వుంది. అదే ఖర్చు పెట్టాడు. B కి డబ్బు లేక, అప్పు తెచ్చాడు. కూలీల్ని వాళ్ళే కుదుర్చుకున్నారు. మేస్త్రీతో సంబంధం లేదు. కూలీలకు మేస్త్రీ అయితే ఎంత కూలి ఇస్తాడో అలాగే వీళ్ళు ఇచ్చారు. A, ఇంటి ఉత్పత్తి సాధనాల కోసం వెయ్యి, కూలీల కోసం 800, ఖర్చు పెట్టాడు. B కూడా అలాగే చేశాడు. కానీ B, వడ్డీ కోసం మొత్తం 100 చెల్లించాడు. A, తన ఇంటి కోసం, "మొత్తం 1800 ఖర్చయింది. దాని విలువ అది" అన్నాడు. B, తనకు ఇంకో 100 ఎక్కువగా అయింది కాబట్టి "నా ఇంటి విలువ 1900" అన్నాడు. ఇందులో ఏది సరైనది?**

**జ:** రెండూ తప్పే. ఆ ఇళ్ళు కట్టింది - కూలీలు. ఆ కూలీలు మేస్త్రీ ద్వారా వచ్చినట్టయితే, ఆ శ్రమ విలువ అంతా (V + S లు) మేస్త్రీకి ఇవ్వాలి. వాడు అందులో నించి V ని కూలీలకు ఇచ్చి, తను S ని మిగుల్చుకుంటాడు. కానీ, ఆ కూలీల్ని A, B లే కుదుర్చుకున్నారు కాబట్టి, వాళ్ళకి చెల్లించింది శ్రమ శక్తి విలువే. అంటే, V మాత్రమే. ఆ ఇళ్ళు తయారవడానికి రెండు చోట్లా అదనపు శ్రమలు కూడా ఖర్చవుతాయి. దాన్ని ఇంకో 800 అనుకుంటే, A ఇల్లు విలువ = 1000 C + 800 V + 800 S = 2600. కానీ A కి, ఆ ఇల్లు 1800కే తయారైంది. ఇంకో 800 ఖర్చు అవకుండానే, 2600 విలువ గల ఇల్లు వచ్చింది. B కి కూడా అదే జరిగింది. B ఇల్లు విలువ కూడా 2600. అందులో అదనపు విలువ 800. అయితే B, వడ్డీగా 100 ని చెల్లించాడు కాబట్టి, B కి, 1900 ఖర్చుతో 2600 ఇల్లు వచ్చింది. A, B లిద్దరూ ఆ ఇళ్ళని అమ్మేస్తే, A కి 800 లాభం. B కి 700. ఆ కూలీలు, మేస్త్రీల ద్వారా వచ్చి వుంటే, లెక్కలు ఎలా వుండేవో ఆలోచించండి.

13. **ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ, బ్యాంకుల నించీ అప్పులు సంపాదించి, ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం చేసి, వడ్డీలు సంపాదించడం సాధ్యమేనా?**

**జ:** సాధ్యమే. ఆ ఫైనాన్స్ కంపెనీ, బ్యాంకుకి చెల్లించే వడ్డీ రేటు కన్నా, తను ఇచ్చే అప్పుల మీద వసూలు చేసే వడ్డీ రేటు ఎక్కువగా వుంటుంది. కాబట్టి, బ్యాంకుకి వడ్డీ చెల్లించినా, ఆ కంపెనీకి ఇంకా కొంత వడ్డీ మిగులుతుంది.

14. **కార్మికులు తమ జీతాల్లో పొదుపుల్ని బ్యాంకుల్లో డిపాజిట్లుగా పెడతారు. ఆ డిపాజిట్ల మీద కూడా వడ్డీలు వస్తాయి. అది, వడ్డీలు తినడం కాదా?**

**జ:** తినడమే. కానీ, జీతాల్లో పొదుపుల్ని రక్షణగా వుంచుకునే మార్గం, బ్యాంకుల్లో పెట్టుకోవడం తప్ప ఇంకేమీ వుండదు. బ్యాంకుల్లో వుండే మొత్తం డిపాజిట్లలో, కార్మికుల డిపాజిట్లు అతి తక్కువ. తక్కువ డిపాజిట్ల మీద వచ్చే వడ్డీలు కూడా తక్కువే. కార్మికులకు వడ్డీ పేరుతో అందే ఆ భాగం కూడా కార్మికుల 'అదనపు విలువ'లో భాగమే. అది కార్మికుల శ్రమే. డబ్బుని పొదుపు చేసుకోవలసిన అవసరం సమాజంలో లేకపోతే, ఈ పరిస్థితే వుండదు.

15. **ఖాళీలను పూరించండి!**

1) వడ్డీ, ................. లో భాగం.
2) ప్రపంచ వడ్డీల రాసి, ................ లో భాగం
3) బ్యాంకు కూడా ................ సంస్థే.
4) 'ఉసురీ' అంటే ....................
5) 'పెట్టుబడి' మీద అధికారం అంటే, ........... మీదా, ......... మీదా, అధికారం.
6) వేరు వేరు కంపెనీలు సంపాదించే లాభాలు, వాటి ........ బట్టీ, .......... బట్టీ వుంటాయి.

**జ:** (ఈ కింద ఇచ్చే మాటల్ని వరసగా ఆ 6 ప్రశ్నల లోని ఖాళీల్లో పెట్టి, ఆ వాక్యాల్ని మళ్ళీ చదవండి)

(1) అదనపు విలువ (2) ప్రపంచ అదనపు విలువ (3) పెట్టుబడిదారీ (4) వెనకటి కాలపు వడ్డీ, (5) ఉత్పత్తి సాధనాల; శ్రామికుల, (6) పెట్టుబడుల్ని ఉత్పాదక శక్తుల్ని ★

# 3. వాటాలు (షేర్లు)

ఒక కంపెనీకి కావలసిన పెట్టుబడి అంతా ఒక్క పెట్టుబడి దారుడే పెడితే, ఆ పెట్టుబడి ద్వారా వచ్చే 'లాభం' అంతా ఆ ఒక్కడే తీసుకుంటాడు. ఆ పెట్టు బడినే ఇద్దరో ముగ్గురో కలిసి పెడితే, ఆ లాభాన్నే ఆ ఇద్దరో ముగ్గురో పంచుకుంటారు. ఇద్దరో ముగ్గురో గాక, వందల వేల మంది వాటాదార్లు వుంటే, లాభాన్ని ఆ వాటాదారులందరూ పంచుకుంటారు. 'ప్రతీ వాటా'కీ కొంత లాభం వస్తుంది.

వందల వేల మంది వాటాదార్లు వుండే కంపెనీ - 'జాయింట్ స్టాక్ కంపెనీ'. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతోన్న కొద్దీ ఒకే పెట్టుబడి దారుడు యజమానిగా వుండే కంపెనీలకు బదులు, అనేక వందల, వేల మంది వాటాదార్లు సభ్యులుగా వుండే జాయింట్ స్టాక్ కంపెనీలు ఏర్పడడం ప్రారంభమైంది.

పెట్టుబడి సంపాదించే లాభాలూ వడ్డీలూ శ్రమ చెయ్యకుండా సంపాదించేవే - అనే విషయం, ఈ వాటా - పెట్టుబడిని పరిశీలించడం ద్వారా గతంలో కన్నా కూడా, స్పష్టంగా కనపడుతుంది. 'పెట్టుబడి' అనేది, ఎలాంటి 'కల్పిత రూపం' లోకి మారుతుందో కూడా 'వాటా పెట్టుబడి'ని పరిశీలించడం ద్వారా కన పడుతుంది. ఇంకా, 'ఉత్పత్తి సాధనాల మీద గుత్తాధి కారం' ఎలా ప్రారంభమవుతుందో కూడా జాయింట్ స్టాక్ కంపెనీ ద్వారా కనపడుతుంది. ఈ అంశాలన్ని టినీ వాటా - పెట్టుబడి గురించి చూడడం ద్వారానే అర్థం చేసుకోగలుగుతాము.

## జాయింట్ స్టాక్ కంపెనీ:

ఒక పెట్టుబడి దారుడు ఒక 'లక్ష' పెట్టుబడితో ఒక 'ఉత్పాదక' కంపెనీ ప్రారంభించాడు. కంపెనీ నడుస్తూ వుంది. దాన్ని వాడు 'జాయింట్ కంపెనీ'గా మార్చదలిచాడు. మొత్తం పెట్టుబడిని ('లక్ష'ని) వాటా లుగా విభజించి, కొన్ని వాటాలు తను వుంచుకుని, మిగిలిన వాటాలు బయటి పెట్టుబడిదార్లకి అమ్మాడు. ఈ రకంగా, మొదటి కంపెనీ, 'జాయింట్ కంపెనీ'గా మారింది.

లేదా, మొదటే కొంత మంది పెట్టుబడి దారులు కలిసి, 'జాయింట్ కంపెనీ'ని స్థాపించదలిచారు. మొత్తం ఎంత పెట్టుబడి కావాలో లెక్క కట్టి, దాన్ని వాటాలుగా విభజించారు. ఆ వాటాల్లో కొంత భాగం తాము వుంచుకుని, మిగిలిన వాటిని బయటి వాళ్ళకి అమ్మారు. - ఇలా, ఏ విధంగా అయినా 'జాయింట్ కంపెనీ' ఏర్పడవచ్చు.

'లక్ష' పెట్టుబడిని కొన్ని వాటాలుగా విభజిస్తారు. ఒక్కో వాటా 100 చొప్పున అయితే, వెయ్యి వాటాలూ; ఒక్కో వాటా 10 చొప్పున అయితే, మొత్తం 10 వేల వాటాలూ, అవుతాయి. ఈ కంపెనీలో, 10 రూపా యల వాటాలే, అంటే 10 వేల వాటాలు, చేశారను కుందాం.

కంపెనీని ప్రారంభించిన పెట్టుబడి దారులు, 6 వేల వాటాల్ని తమ కుటుంబాల సభ్యుల పేర వుంచుకుని, 4 వేల వాటాల్ని బయటికి అమ్మడానికి నిర్ణయిం చారు. బయటికి ఇచ్చే వాటా పెట్టుబడి - 'జారీ చేసే పెట్టుబడి' (ఇష్యూడ్ కాపిటల్).

ఆ వాటాల్ని కొనే వాళ్ళు ఒక్కొక్కరూ 50 వాటాలో, 100 వాటాలో, 200 వాటాలో, అలా కొన్నేసి వాటాల చొప్పున కొంటారు. ఆ రకంగా, ఆ 4 వేల వాటాల్నీ బయటి వాళ్ళు కొనేస్తే, అది 'చెల్లిం చిన పెట్టుబడి' (పెయిడప్ కాపిటల్). అప్పుడు కంపెనీలో 60,000 పెట్టుబడిని కంపెనీ పెట్టిన వాళ్ళూ , మిగిలిన 40,000 పెట్టుబడిని బయటి వాళ్ళూ పెట్టినట్టు అవుతుంది. అప్పటి నించీ ఆ కంపెనీ, 'వాటాదారులందరికీ' సంబంధించిన 'ఉమ్మడి కంపెనీ' (జాయింట్ స్టాక్ కంపెనీ) అవు తుంది. మొత్తం వాటా దారులందరూ ఆ కంపెనీలో సభ్యులు. అంటే, ఆ కంపెనీకి యజమానులు.

వాటా = షేరు, లేదా స్టాక్

వాటాదార్లు = షేరు హోల్డర్లు, లేదా స్టాక్ హోల్డర్లు

వాటాల్లో అనేక తరగతుల వాటాలు వుంటాయి. సాధారణ వాటాలూ (కామన్ షేర్లూ, లేదా ఈక్విటీ షేర్లూ), ప్రత్యేక వాటాలూ (ప్రిఫర్డ్ షేర్లూ, స్పెసిఫైడ్ షేర్లూ, ఎ - క్లాస్ షేర్లూ) - లాంటి పేర్లతో. వాటాల్లో తేడాల్ని బట్టి, వాటాదార్ల హక్కుల్లో కూడా తేడాలు వుంటాయి.

'స్టాకు' - అంటే, వాటాలన్నిటికీ జనరల్ పేరు.

ప్రత్యేక తరగతి వాటాలన్నిటినీ దాదాపుగా కంపె నీని స్థాపించిన వాళ్ళే వుంచుకుంటారు. లేదా, వాటిలో చాలా తక్కువ వాటాలు బయటికి కూడా అమ్మవచ్చు.

సాధారణ వాటాలు మాత్రమే ఎక్కువగా బయటికి అందుతాయి.

ఒక కంపెనీకి వందల, వేల మంది వాటాదార్లు వుంటే, వాళ్ళందరూ ఎక్కడెక్కడో అనేక వూళ్ళల్లో చెల్లా చెదురుగా ఒకరితో ఒకరికి సంబంధాలు లేకుండా వుంటారు. ఆ వాటాదార్లందరూ కలిసి కంపెనీని నిర్వహించడం సాధ్యం కాదు. కాబట్టి, కంపెనీ వ్యవహారాలు నడపడం కోసం 'డైరెక్టర్ల బోర్డు' అవసరమవుతుంది. వాటాదార్లందరూ ఒక చోట సమావేశమై (అది 'సర్వసభ్య సమావేశం. జనరల్ బాడీ), వాటాదారుల్లో నించే 'డైరెక్టర్లని' ఎన్నుకుంటారు.

వాటా దార్లందరికీ 'ఓటు హక్కు' వుంటుంది. (విదేశీ వాటాదార్లకి ఓటు హక్కు వుంటుందా లేదా అనేది ఆ కంపెనీ షరతుల్ని బట్టి వుంటుంది.)

ఎక్కువ వాటాలు వున్న వాళ్ళకే ఎక్కువ వోట్లు వుంటాయి కాబట్టి, ఎక్కువ వాటాలు వున్న వాళ్ళే 'డైరెక్టర్లు' అవుతారు. సాధారణంగా మామూలు వాటాదారులెవ్వరూ సర్వ సభ్య సమావేశాలకు వెళ్ళరు. సమావేశాలకు హాజరయ్యే వాటాదార్లు చాలా తక్కువ మందే వుంటారు. హాజరయిన వాటాదార్ల ఓట్లలో మెజారిటీ ఓట్లు వస్తే చాలు - డైరెక్టర్లు అవడానికి. ఆ రకంగా, కంపెనీని ప్రారంభించిన పెట్టుబడిదార్లూ, వాళ్ళ కుటుంబ సభ్యులూ, తప్పనిసరిగా డైరెక్టర్లు అవుతారు. ఇతర వాటా దారుల్లో కూడా కొంచెం ఎక్కువ వాటాలు వున్నవాళ్ళు కూడా డైరెక్టర్లు అయితే కావచ్చు.

కంపెనీని ప్రారంభించిన పెట్టుబడి దారులు, మొదటి నించీ వాళ్ళని వాళ్ళే డైరెక్టర్లుగా ప్రకటించుకోవడం కూడా జరగవచ్చు. తర్వాత, వాటా దార్లందరి అంగీకారం తోటీ ఆ పదవులు స్థిరపడవచ్చు.

డైరెక్టర్లందరూ కలిసిందే - 'డైరెక్టర్ల బోర్డు'. కంపెనీకి సంబంధించిన సమస్త నిర్ణయాలూ ఈ 'డైరెక్టర్ల బోర్డే' చేస్తూ వుంటుంది.

కంపెనీలో రోజు వారీ కార్యక్రమాలు 'మేనేజర్లు' చూస్తూ వుంటారు. మేనేజర్లకి కూడా ఆ కంపెనీలో 'వాటాలు' వుంటాయి. అంటే, మేనేజర్లు కూడా కంపెనీలో వాటాదారులే. డైరెక్టర్ల బోర్డే మేనేజర్లని నియమిస్తుంది. కంపెనీని 'మేనేజ్' చెయ్యడమే మేనేజర్ల పని.

ఈ 'మేనేజ్ చెయ్యడం' అనేది, 'దోపిడీ ఉత్పత్తి విధానానికి' సంబంధించిందే కాబట్టి, ఈ మేనేజిమెంటులో కూడా నిర్వహణ శ్రమా, పెత్తనం శ్రమా వుంటాయి.

నిర్వహణ శ్రమ - ఉత్పాదక శ్రమ.
పెత్తనం శ్రమ - అనుత్పాదక శ్రమ.

నిర్వహణ శ్రమని, సూపర్‌వైజర్లు లాంటి కింది స్థాయి ఉద్యోగులే చాలా వరకూ చేస్తారు.

డైరెక్టర్లూ మేనేజర్లూ చేసే శ్రమ ఏమైనా వుంటే, ఇతర కంపెనీలతో ఎలా పోటీ పడాలీ, సరుకుని ఎక్కడ అమ్మాలీ, ఆర్డర్లు ఎలా సంపాదించాలీ, కార్మికుల నించీ ఇంకా ఎక్కువ శ్రమని లాగడానికి ఎలాంటి టెక్నిక్కులు ప్రవేశ పెట్టాలీ - లాంటి విషయాలు ఆలోచించడమే. ఇదంతా ఏ 'శ్రమ' కిందకీ రాదు. అంటే, 'అనుత్పాదక శ్రమ'గా కూడా రాదు. ఎందుకంటే, కార్మికుల మీద 'పెత్తనం శ్రమ' చెయ్యాలన్నా, అలా చేసే వాళ్ళు, పని స్తలం లోనే వుండాలి. కానీ డైరెక్టర్లూ, మేనేజర్లూ, పని స్థలంలో వుండరు. ఒక వేళ, వారు చేసే దాంట్లో, ఏదైనా కొంచెం 'శ్రమ' అనేది వుంటే, అది, 'అనుత్పాదక శ్రమ' మాత్రమే.

అదే గాక, డైరెక్టర్లూ చేసే ఇంకో 'గొప్ప' శ్రమ - 'వాటా పత్రాల' మీద సంతకాలు పెట్టే శ్రమ! ఈ శ్రమలకే వీరికి - అత్యున్నత జీతాలు!

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - వీరి జీతాల్ని వీరే 'స్వయంగా' నిర్ణయించు కుంటారు! అన్ని నిర్ణయాలూ చేసేది డైరెక్టర్ల బోర్డే కాబట్టి, డైరెక్టర్ల జీతాల్ని నిర్ణయించేది డైరెక్టర్లే.

డైరెక్టర్లకీ, మేనేజర్లకీ, అత్యున్నత జీతాలూ, రకరకాల ప్రత్యేక సౌకర్యాలూ (ప్రివిలేజెస్) కాకుండానే, వీరికి వున్న 'వాటాల' మీద 'లాభాలు' కూడా వస్తాయి. ఆ లాభాలన్నీ వేరే 'ఆదాయం!'

'జీతం' అనేది, వీరు 'చేసే శ్రమ'కి అయితే, మరి వీరికి వచ్చే 'లాభం' అనేది దేనికి? 'చెయ్యని శ్రమ'కి అన్న మాట!

## ఇది, కంపెనీ 'రూపం'లోనే మార్పు; 'స్వభావం'లో కాదు:

'జాయింట్ స్టాక్ కంపెనీ' అనేది ఏ ఒక్కరికో సంబంధించిన స్వంత కంపెనీ కానట్టూ, అందరికీ సంబంధించిన 'సమిష్టి కంపెనీ' అయినట్టూ, కనపడుతుంది. అంటే, ఈ కంపెనీ మీద, ఏ ఒక్కరి యాజమాన్యమో గాక, 'సమిష్టి యాజమాన్యం' వున్నట్టు

కనబడుతుంది. కానీ, ఈ ‘సమిష్టితనం,’ ఆ కంపెనీలో వాటాలు వున్న వాళ్ళ వరకూ సంబంధించింది మాత్రమే. ఇది, లాభాల్ని దోచుకోవడానికి సంబంధించిన సమిష్టితనం. ఇది, ‘యాజమాన్యపు రూపం’లో మార్పే గానీ, ‘స్వభావం’లో మార్పు కాదు.

ఈ ‘రూపంలో మార్పు’ కూడా పూర్తిగా నిజమైన మార్పు కాదు. జాయింటు కంపెనీ, వాటాదారుల సమిష్టి కంపెనీ లాగ పైకి కనబడినా, నిజానికి దాని మీద వాటాదారులందరి అధికారమూ వుండదు. కంపెనీ మీద నిజమైన అధికారం అంతా, ఎక్కువ వాటాలు గల కొన్ని ‘కుటుంబాల’ చేతుల్లోనే వుంటుంది. ఆ కుటుంబాల సభ్యులే కంపెనీలో ప్రధానమైన పదవుల్లో వుంటారు. అంటే, ‘జాయింట్ స్టాక్ కంపెనీ’ కూడా, ఒక పెట్టుబడిదారీ కుటుంబపు స్వంత కంపెనీ లాంటిది మాత్రమే. కాకపోతే, ఇది ఒకే కుటుంబానికి గాక, రెండు మూడు కుటుంబాలకో, నాలుగైదు కుటుంబాలకో చెంది వుంటుంది! అంతే తేడా!

# ‘వాటా’కి, ‘లాభం’ ఎలా వస్తుంది?

**వా**టా - అంటే కొంత పెట్టుబడే కదా? పెట్టుబడికి లాభం ఎలా వస్తుందో మనకు తెలుసు కదా? మళ్ళీ ‘వాటాకి లాభం ఎలా వస్తుంది’ అనే ప్రశ్న ఏమిటి? ఏ పెట్టుబడికైనా లాభం ఎలా వస్తుందో, వాటా పెట్టుబడికీ అలాగే వస్తుంది.

కంపెనీ, ఏదో ఒక ‘సరుకు’ని ఉత్పత్తి చేస్తుంది. కార్మికుల ద్వారా, C + V ల ఖర్చుతో, ‘సరుకు’ తయారవుతుంది. దాన్ని అమ్మితే, ‘జనరల్ లాభం’ వస్తుంది. ఇంత వరకూ తెలిసిందే.

ఇక తర్వాత జరిగేది, ఆ ‘లాభాన్ని’ వాటాదారులందరూ పంచుకోవడమే.

కంపెనీకి వచ్చే ‘జనరల్ లాభం’లో నించి మొదట ప్రభుత్వానికి ‘ఆదాయం పన్ను’ (ఇన్‌కం టాక్స్) చెల్లిస్తారు. (తప్పనిసరిగా దొంగ లెక్కలు చూపిస్తూ టాక్సుల్లో చాలా భాగం ఎగ్గొడతారు. ఎగ్గొట్టిందంతా కంపెనీకే మిగులుతుంది.)

‘పెట్టుబడి’లో కొంత భాగం ‘అప్పు’ తెచ్చినది వుంటే, (‘వాటాల’ పెట్టుబడి కాకుండా) దాని మీద ‘వడ్డీ’ చెల్లిస్తారు. తర్వాత, ‘పెట్టుబడి విస్తరణ’ కోసం, ‘లాభం’లో కొంత భాగాన్ని ప్రత్యేకంగా తీసి వుంచుతారు. ఈ తీసివేతలన్నీ అయిన తరవాత, ఇంకా మిగిలిన లాభాన్ని ‘వాటాదార్ల’కి పంచుతారు.

వాటాకి వచ్చే లాభాన్ని, ‘డివిడెండు’ అంటారు. ఈ డివిడెండు, ‘వాటా పెట్టుబడి’ మీద రావలసిన వడ్డీ + సంస్థ లాభాల మొత్తంగా వుంటుంది. వాటాదారుడు, తన ‘స్వంత పెట్టుబడి’ తోటే ‘వాటా’ని కొని వుంటే, మొత్తం డివిడెండు అంతా వాడికే వుంటుంది. లేదా, ఆ పెట్టుబడి, ‘అప్పు’ తెచ్చినది అయితే, ‘డివిడెండు’లో కొంత భాగం ‘వడ్డీ’గా పోయి, రెండో భాగమే వాడికి వుంటుంది.

వాటాల మీద డివిడెండ్లని 6 నెలలకి ఒక సారి గానీ, సంవత్సరానికి ఒక సారి గానీ (ఒక్కో కంపెనీ ఒక్కో రకంగా), పంచుతారు. బ్యాంకు చెక్కుల ద్వారా డివిడెండ్లు వాటాదార్లందరికీ పోస్టులో అందుతూ వుంటాయి.

ఒక వ్యక్తి దగ్గిర 5 వందలో, వెయ్యో డబ్బు వుంటే, ఆ వ్యక్తి ఆ డబ్బు తోటే ఒక స్వంత కంపెనీ స్థాపించలేడు. 5 వేలో, 10 వేలో వున్నా కూడా స్వయంగా కంపెనీ స్థాపించలేడు. కానీ, ఆ డబ్బుతో ఏదైనా ఒక కంపెనీలో వాటాలు (షేర్లు) కొంటే, అంత తక్కువ డబ్బుతో కూడా ఆ వ్యక్తి ఒక కంపెనీలో ‘వాటాదారుడు’ కాగలడు. ఆ రకంగా, వాడు తన డబ్బుని ‘పెట్టుబడి’గా మార్చగలడు. వాడూ పెట్టుబడిదారుడు అవగలడు.

‘జాయింట్ స్టాక్ కంపెనీ’లో వాటాలు కొన్న వ్యక్తి, ఆ కంపెనీలో కొంత ‘పెట్టుబడి’ పెట్టాడన్న మాట! అయితే, ఆ వాటాదారుల్లో అనేక మందికి ఆ కంపెనీ ఎక్కడ వుందో, ఏం సరుకుని ఉత్పత్తి చేస్తుందో కూడా తెలీదు. కానీ వాళ్ళు ఆ కంపెనీ నించి ఏటా ‘డివిడెండ్లు’ మాత్రం అందుకుంటూ వుంటారు. అంటే, ఆ కంపెనీలో పని చేసే కార్మికుల ‘అదనపు విలువ’ని.

ఒక దేశపు కంపెనీలో, విదేశీ పెట్టుబడిదార్లు కూడా వాటాలు కొంటారు. అంటే, వాటాదారుడు ఒక దేశంలో వుంటే, కంపెనీ ఇంకో దేశంలో! ఇంకో దేశం నించి ‘డివిడెండు’ వచ్చి వాటాదారుడి చేతిలో పడుతూ వుంటుంది.

వాటాదారులందరూ కలిసి కంపెనీ ఆస్తికి ‘యజమానులు’! ఎప్పుడైనా కంపెనీని మూసివేసి, ఆస్తుల్ని

అమ్మివేస్తే, కంపెనీ చెల్లించవలసిన అప్పులూ, పన్నులూ వంటి వాటిని చెల్లించి వెయ్యగా మిగిలినది వాటాదారు లందరికీ చెందుతుంది.

## 'లాభం' అనేది, మేనేజిమెంటు శ్రమ ఫలితమా?

'లాభం' అంటే ఏమిటో ఈ నాడు పెట్టుబడి దార్లకు పూర్తిగా తెలుసు, పైకి అంగీకరించక పోయినా. కానీ, 'జాయింట్ స్టాక్ కంపెనీ విధానం' ప్రారంభం కాని కాలంలో, అంటే ఒకే వ్యక్తి యాజమాన్యం గల కంపెనీలు మాత్రమే వుండే కాలంలో, 'లాభం - అనేది, పెట్టుబడిదారుడు కంపెనీని మేనేజ్ చేసే శ్రమకు వచ్చే ఫలితం'గా అనుకునే వారు. ఈ 'భ్రమ'ని తార్కికంగా తిరస్కరించగలిగే అవకాశం 'జాయింట్ స్టాక్ కంపెనీ విధానం' లోనే ఏర్పడుతుంది.

**ఎలాగంటే:** మొదట ఒకే పెట్టుబడి దారుడి కంపెనీని తీసుకుందాం. అది చిన్న కంపెనీ. దాని 'మేనేజిమెంటు' శ్రమ అంతా పెట్టుబడి దారుడే స్వయంగా చేస్తాడనుకుందాం. అలా పని చేస్తే, పెట్టుబడిదారుడు కూడా తన శ్రమకి, 'జీతం' తీసుకోవచ్చు. ఆ జీతం కాకుండానే, చివరికి 'లాభం' వేరుగా వుంటుంది. (ఈ విషయం, మొదటి సంపుటంలో 'లాభం' చాప్టరులో, కొంత వరకూ చూశాం. ఇంకా కొంత విషయం ఇప్పుడు.)

ఒకే వ్యక్తి కంపెనీలో ఇతర వాటాదారులెవ్వరూ వుండరు కాబట్టి, ఆ పెట్టుబడి దారుడు, తన కంపెనీ లోనే తను, 'జీతం' పేరుతో ప్రత్యేకంగా తీసుకోడు. జీతం తీసుకోకపోయినా ఆ భాగం ఎక్కడికీ పోదు. అది కూడా 'లాభం' తోనే కలిసి, చివరికి మిగిలే మొత్తం, ఎక్కువగా వుంటుంది.

పెట్టుబడిదారుడు కూడా సరుకు కోసం ఏదో ఒక పని చేసి, 'జీతం' తీసుకోకపోతే, చివరికి మిగిలే మొత్తంలో ఈ భాగాలు వుంటాయి:

1. పెట్టుబడిదారుడి 'శ్రమ శక్తి విలువ' (జీతం).
2. పెట్టుబడిదారుడి 'అదనపు విలువ'.
3. కార్మికులందరి 'అదనపు విలువ'.

ఈ 3 భాగాలూ కలిసి చివరికి పెట్టుబడి దారుడికే అందుతాయి. అందులో కార్మికుల 'అదనపు విలువ' కూడా వుందనే సంగతి కనపడదు. పెట్టుబడి దారుడు 'జీతం' తీసుకోకుండా శ్రమ చేశాడు కాబట్టి, చివరికి ఎంత మిగిలితే అంతా వాడి శ్రమ ఫలితం గానే కనపడుతుంది.

ఈ 'భ్రమ' తొలిగే అవకాశం ఎప్పుడు ప్రారంభ మవుతుందంటే, ఆ పెట్టుబడిదారుడు చేసే శ్రమ, ఒక 'ఉద్యోగి' ద్వారా జరగడం ప్రారంభమై నప్పుడు!

ఆ పెట్టుబడిదారుడు 'మేనేజిమెంటు శ్రమ' మానేశాడనుకుందాం. ఆ పని అంతా ఒక ఉద్యోగి (మేనేజర్) చేస్తున్నాడు. ఆ ఉద్యోగికి, ఆ పని కోసం 'జీతం' చెల్లిస్తారు. ఆ జీతం చెల్లించగా కూడా చివరికి లాభం మిగులుతుంది. ఆ లాభం, ఏ శ్రమా చెయ్యని పెట్టుబడిదారుడికి అందుతుంది. అంటే, 'సంస్థ లాభం' అనేది, మేనేజిమెంటు శ్రమతో సంబంధం లేకుండానే వుండే భాగం అన్నమాట! పెట్టుబడి దారుడు, మేనేజిమెంటు శ్రమ కూడా మానుకున్న ప్పుడు, ఈ విషయం ఖచ్చితంగా రుజువవుతుంది.

ఈ విషయం, 'జాయింట్ స్టాక్ కంపెనీ విధానం'లో అయితే, మరింత స్పష్టం అవుతుంది. ఇక్కడ మేనేజిమెంటు అంతా తప్పని సరిగా ఉద్యో గుల ద్వారానే జరుగుతుంది. వాళ్ళకి జీతాలు చెల్లిం చగా కూడా 'లాభం' ప్రత్యేకంగా వుంటుంది. కాబట్టి, 'లాభం అనేది పెట్టుబడి దారుడు కంపెనీని మేనేజ్ చేసుకున్నందుకు వచ్చేదే' అని గత కాలం నించీ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చేస్తూ వచ్చిన వాదన, ఇప్పుడు అర్థం లేనిదై పోతుంది.

'లాభం' అనేది - సంస్థని మేనేజ్ చేసే శ్రమ ఫలి తమే అయితే, ఆ శ్రమకి (ఆ శ్రమ చేసే ఉద్యోగు లకు) అత్యున్నత జీతాలు చెల్లించగా కూడా ఇంకా 'లాభం' ఎలా వుండగలుగుతుంది? 'లాభం' అనేది, శ్రమ చేసినందుకే వచ్చేది అయితే, 'జాయింటు కంపెనీ'లో వాటాదార్లు, ఎక్కడెక్కడో ఇతర వూళ్ళ ల్లోనూ, ఇతర దేశాల్లోనూ వుండి, అందుకునే లాభాలు, ఏ శ్రమలకు బదులుగా వస్తాయి? - ఈ రకం ప్రశ్నలకు పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల దగ్గిర సరైన జవాబులు వుండవు, 'దాటవేతలు' తప్ప!

కానీ, వాళ్ళ దగ్గిర ఒక్క వాదనే కాదు, ఒక దాని కొకటి పొసగని అనేక రకాల వాదనలు వుంటాయి. "పెట్టుబడిదారుడు ఎంతో శ్రమ చేస్తాడు గనక, ఆ శ్రమ కోసమే లాభం తీసుకుంటాడు" అని ఒక వేపూ, " పెట్టుబడిదారుడు శ్రమ చేస్తాడా, లేదా - అనేది అనవసరం. అసలు పెట్టుబడి దారులు శ్రమ చెయ్యా వలసిన అవసరం లేదు. 'పెట్టుబడి' పెట్టాడంటేనే

దానికి లాభం రావాలి. 'లాభం' రాకపోతే పెట్టుబడి ఎందుకు పెడతాడు?'' అని ఇంకో వేపూ, రక రకాలుగా వాదిస్తారు. ఈ 2 వాదాలూ వాళ్ళవే. మొదటిదీ వాళ్ళదే; రెండోదీ వాళ్ళదే. వాళ్ళ అవక తవకల ద్వారా వాళ్ళ తప్పుల్ని వాళ్ళే బైట పెట్టుకుంటారు. ఈ రకంగా వాళ్ళు ఎంత అవక తవక వాదనలు చేస్తే కార్మికులకు అంత మంచిదే.

ఒక ఉదాహరణ: ఒక పెట్టుబడి దారుడి దగ్గిర 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. పెట్టుబడి దారుడే 'నిర్వహణ శ్రమ' చేస్తున్నాడు. ''పెట్టుబడి దారుడితో కూడా కలిపి, మొత్తం పని చేసే వారు 51 మంది. అదనపు విలువ 100. అది మొత్తం 51 మందికి సంబంధించినది. అందులో పెట్టుబడి దారుడి భాగం 5 అనుకుందాం. 50 మంది కార్మికుల భాగం 95.

అదనపు విలువలో అత్యధిక భాగం కార్మికులదే. పెట్టుబడి దారుడి భాగం 5 మాత్రమే. అయినప్పటికీ, 100 అదనపు విలువలో పెట్టుబడి దారుడి శ్రమ కూడా ఎంతో కొంత వుంది కాబట్టి, ఆ అదనపు విలువని, 'సమిష్టి అదనపు విలువ' అనవచ్చు. అలాగే, మొత్తం అదనపు విలువని పెట్టుబడిదారుడు స్వాధీనం చేసుకోవడం గురించి 'సమిష్టి ఉత్పత్తి, వ్యక్తి స్వాధీనం' అనవచ్చు. ఇలా అనడం, మహా 'పరి మిత అర్థంలో' మాత్రమే సరిపోతుంది.

అయితే, పెట్టుబడిదారుడు 'నిర్వహణ శ్రమ' కూడా మానివేసి నప్పుడు, ఇక 'సమిష్టి ఉత్పత్తి' అనే మాటే వుండదు. 'నిర్వహణ శ్రమ' ఒక ఉద్యోగి చేస్తున్నాడనుకుందాం. ఆ ఉద్యోగి కూడా కార్మికుడే. ఈ కార్మికుడితో కూడా కలిసి మొత్తం కార్మికులు 51 మంది. అప్పుడు కూడా అదనపు విలువ 100. అంటే, అది గతంలో లాగే 51 మంది అదనపు విలువ. దాన్నంతా, పెట్టుబడిదారుడు స్వాధీనపర్చు కుంటాడు. ఇప్పుడు అందులో, పెట్టుబడిదారుడి శ్రమ ఏ మాత్రమూ వుండదు. కాబట్టి, ఇక్కడ 'సమిష్టి ఉత్పత్తి, వ్యక్తి స్వాధీనం' అనే మాటలకు, గతంలో వుండే పాటి పరిమితమైన అర్థం కూడా వుండదు. ఇది, పూర్తిగా ఇతరుల ఉత్పత్తి ని స్వాధీనం చేసుకోవడమే.

'జాయింటు స్టాక్ కంపెనీ' విధానంలో అదే జరుగుతుంది. అక్కడ, సమిష్టి ఉత్పత్తి అనే మాట ఇక వర్తించదు. 'శ్రమ'తో ఏ మాత్రమూ సంబంధం లేని వాటాదార్లు డివిడెండ్లు పొందే విధానంలో, సమిష్టి ఉత్పత్తి వ్యక్తి స్వాధీనం - అనే మాటలు పూర్తిగా అర్థ రహితమై పోతాయి.

జాయింట్ స్టాక్ కంపెనీ విధానం ప్రారంభమైన తర్వాత, 'పెట్టుబడి' అనేది 'వాటాల' రూపం లోనే వుంటుంది కాబట్టి, వాటా - పెట్టుబడికీ, జాయింట్ స్టాక్ కంపెనీకీ సంబంధించి, ఇంకా అనేక విషయాలు చూడాలి.

## 'వాటాల' విడుదల:

ఒక కంపెనీ, బయటి వాటాదారుల నించి ('పబ్లిక్' నించి) పెట్టుబడులు తీసుకోదల్చినప్పుడు, ఆ సంగతి పత్రికల ద్వారా ప్రకటిస్తుంది. ఆ కంపెనీలో వాటాలు కొనదల్చుకున్న (ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టదల్చుకున్న) పెట్టుబడిదారులు, కంపెనీ చెప్పిన బ్యాంకులో డబ్బు కడతారు. కొంత కాలానికి 'వాటా పత్రాలు' (షేర్ సర్టిఫికెట్లు) వాళ్ళ చేతికి వస్తాయి. అడిగినన్ని వాటాలు దొరక్క పోతే మిగిలిన డబ్బు వెనక్కి వస్తుంది. ఆ రకంగా, కంపెనీ విడుదల చేసే 'వాటా పత్రాల్ని' కొనడమే, ఆ కంపెనీలో 'పెట్టుబడి' పెట్టడం. వాటా పత్రాల్ని కొన్న వాళ్ళు, ఆ కంపెనీలో వాటా దారులు (షేర్ హోల్డర్లు) అవుతారు.

'వాటా పత్రాల' మీద, వాటా అసలు విలువా, వాటాదారుడి పేరూ వగైరా వివరాలన్నీ వుంటాయి. ఆ పత్రం, పెట్టుబడి పెట్టినట్టు రుజువుగా వుండే పత్రం కాబట్టి, దాన్ని 'సెక్యూరిటీ' అని కూడా అంటారు. వాటాల్ని అమ్మే పనిని, కంపెనీ, తన ఆఫీసు ద్వారా స్వయం గానూ చేస్తుంది; బ్రోకర్ల ద్వారానూ చేస్తుంది, బ్యాంకుల ద్వారానూ చేస్తుంది.

'వాటా' అనేది - 'సరుకు' కాకపోయినప్పటికీ, ఇతర సరుకుల్ని అమ్మడానికి రక రకాల వర్తకులు వున్నట్టే, కంపెనీల వాటాల్ని అమ్మడానికి కూడా 'వాటా బ్రోకర్లు' (షేర్ - బ్రోకర్లు) అనే వర్తకులు వుంటారు. వీళ్ళు - 'వాటా ధర'ని బట్టి 'కమిషన్' తీసుకుంటారు. బ్రోకర్లు, ఇతర పెట్టుబడి దారులకు వాటాలు కొని పెట్టడమే గాక, తమ స్వంతానికి కూడా వాటాలు కొనుక్కుంటారు.

ఒక పెట్టుబడిదారుడికి, ఒక కంపెనీలో కొన్ని వాటాలు వున్నాయి అనుకుందాం. 'ఆ వాటా సర్టిఫికెట్లు' వాడి దగ్గిరే వుంటాయి. అవి వాడి ఆస్తి. ఆ వాటాదారుడు ఎప్పుడైనా తన పెట్టుబడిని ఆ కంపెనీ నించి వెనక్కి తీసుకోదల్చుకుంటే, ''నా పెట్టుబడిని

నాకు ఇచ్చెయ్యండి" అని కంపెనీని అడగడానికి వీలు వుండదు. 'వాటా పెట్టుబడి'ని, కంపెనీ, వెనక్కి ఇవ్వదు. అప్పుడు వాటాదారుడు ఏం చెయ్యగల డంటే, తన వాటాల్ని ఎవరికైనా అమ్మేసి, తన పెట్టు బడిని, ఆ కంపెనీ నించి వెనక్కి తీసుకోగలడు. వాటాల్ని అలా అమ్ముకోవచ్చు. అది, ఎవరి ఆస్తిని వాళ్ళు అమ్ముకోవడం లాంటిదే. ఆ వాటాల్ని అమ్మేస్తే, వాటిని కొన్న వ్యక్తే, ఆ వాటాలకు కొత్త యజమాని. ఆ కొత్త వ్యక్తే, ఆ కంపెనీలో వాటాదారుడు. తర్వాత వచ్చే డివిడెండ్లు, ఆ కొత్త వాటాదారుడికే అందుతూ వుంటాయి.

## వాటా 'ధర':

ఒక వాటా అసలు విలువ 100 రూపాయలు. దాన్ని ఒక వాటా దారుడు, కంపెనీ నించి అసలు విలువకే కొన్నాడు. తర్వాత, దాన్ని అమ్మదల్చు కున్నప్పుడు, అమ్మే వ్యక్తి, కొనే వ్యక్తి నించి 100 రూపా యలే (ఎక్కువో తక్కువో కాకుండా) తీసుకోవాలి కదా? కానీ, వాటాని 'అమ్మే ధర', అలా వుండదు. అది, విచిత్రమైన వడ్డీ లెక్కల తర్కం మీద ఆధారపడి వుంటుంది.

**ఎలాగంటే:** ఉదాహరణ ఇలా వుందనుకుందాం. వాటా విలువ 100 రూపాయలు. దానికి సంవత్స రానికి వచ్చే డివిడెండు 20 రూపాయలు. అప్పుడు అమలులో వున్న బ్యాంకు వడ్డీ రేటు సంవత్సరానికి 10%. అంటే, 100 పెట్టుబడిని బ్యాంకులో పెట్టిన వాళ్ళకి 10 ఆదాయం వస్తే, 100 తో ఆ ఫలానా కంపెనీ వాటాని కొన్న వాళ్ళకి, రెట్టింపు ఆదాయం (20) వస్తుంది. ఆ కంపెనీ ఇచ్చే 'డివిడెండు'ని చూసి, ఆ వాటాలు కొనాలని (ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టాలని) ఎవరైనా అనుకున్నారనుకుందాం. కానీ ఆ కంపెనీ, తన వాటాలన్నింటినీ అప్పటికే అమ్మేసిందను కుందాం. అప్పుడు ఆ కంపెనీ వాటాలు కావాలంటే ఏం చెయ్యాలి? ఆ వాటాల్ని అమ్మేవాళ్ళు ఎవరైనా వుంటే, వాళ్ళ దగ్గిర్నించి ఆ వాటాలు కొనుక్కోవాలి.

ఆ వాటాల ద్వారా, బ్యాంకు - వడ్డీ కన్నా ఎక్కువ ఆదాయం సంపాదించే అవకాశం వుంది కాబట్టి, ఆ వాటాల్ని అమ్మేవాడు, వాటాని 'అసలు విలువ'కి ఇవ్వకుండా కొంత ఎక్కువ ధర చెబుతాడు. కొనే వాడు కూడా ఆ ఎక్కువ ధర ఇవ్వడానికి అంగీక రిస్తాడు.

'ఎక్కువ' అంటే ఎంత ఎక్కువ? ఆ 'ధర' ఎలా ఏర్పడుతుంది? (1) ఆ 'వాటా'కి వచ్చే డివిడెండూ, (2) బ్యాంకు వడ్డీ రేటూ, (3) ఆ వాటాల సప్లై డిమాండ్లూ - ఈ 3 కారణాల తోటీ వాటా 'ధర' ఏర్పడు తుంది.

ఆ వాటా ద్వారా సంవత్సరానికి 20 డివిడెండు సంపాదించే అవకాశం వుంది కాబట్టి, 20 ఆదాయం రావాలంటే ఎంత మొత్తాన్ని బ్యాంకులో పెట్టవలసి వుంటుందో (బ్యాంకు రేటు 10% అయినప్పుడు) అంత మొత్తానికి దగ్గరగా 'వాటా ధర' వుంటుంది.

10 వడ్డీ రావాలంటే - బ్యాంకులో 100 పెట్టాలి.

20 రావాలంటే? —× 20 = 200 పెట్టాలి.

దీనికి సూత్రం: $\frac{\text{డివిడెండు (20)}}{\text{బ్యాంకు రేటు (10)}} \times 100 = 200$

ఇక్కడ అసలు 100 విలువ గల వాటాకి, మార్కెట్ ధర 200 వరకూ వుండవచ్చు. అయితే, పూర్తిగా 200 గాక, దాని కన్నా కొంత తక్కువగా వుంటుంది. ఎందుకంటే, కంపెనీ ఇచ్చే డివిడెండు ప్రతీ సంవత్సరమూ ఒకే రకంగా వుండక పోవచ్చు. అది ఒక్కోసారి కొంత తగ్గినా తగ్గవచ్చు. అంటే, 200 పెట్టి ఆ వాటాని కొంటే, దానికి 20 డివిడెండు గ్యారంటీగా వస్తుందని నమ్మడానికి వీలు లేదు. 200 ని బ్యాంకులో పెడితే, దానికి 20 వడ్డీ గ్యారం టీగా వస్తుంది. కాబట్టి, ఆ వాటాని కొనే వ్యక్తి, దాని కోసం పూర్తిగా 200 ధర పెట్టడానికి అంగీకరించడు. అంతకన్నా కొంత తక్కువ ధర వుండాలని భావిస్తాడు. కాబట్టి, ఈ ఉదాహరణలో వాటా ధర, 100 కన్నా ఎక్కువ గానూ, 200 కన్నా తక్కువ గానూ, ఆ 2 హద్దులకూ మధ్యలో ఏదో ఒక రకంగా వుంటుంది.

ఆ వాటాని 150 తో కొంటే, కొన్నవాడికి అది 'లాభ సాటి' బేరమే. ఎందుకంటే, 150 ని బ్యాంకులో పెడితే, దానికి 20 వడ్డీ రాదు. కానీ 150 తో ఆ వాటాని కొంటే, దానికి 20 డివిడెండు వస్తుంది. కాబట్టి, 'పెట్టుబడి' పెట్టే వ్యక్తి, ఆ పెట్టుబడిని బ్యాంకులో పెడితే ఎక్కువ వస్తుందా, వాటాలు కొంటే ఎక్కువ వస్తుందా - అని లెక్కలు వేసుకుని, ఎటు వేపైతే 'ఒక్క పైసా' ఎక్కువ వస్తుందో అటు వేపే మొగ్గుతాడు.

ఇక తర్వాత, ఈ విషయంలో వాటాల 'సప్లై డిమాండ్లు' కూడా ప్రభావం చూపుతాయి. ఆ కంపెనీ వాటాలు కావాలని ఆశిస్తున్న వాళ్ళు ఎక్కువ గానూ, ఆ వాటాల్ని అమ్ముకుంటున్న వాళ్ళు తక్కువ గానూ వున్నారనుకుందాం. అంటే, ఆ వాటాల కోసం

డిమాండ్ ఎక్కువగా వుందన్న మాట. అలాంటి పరిస్థితిలో ఆ వాటా ధర 200 దాకా కూడా వుండ వచ్చు.

ఆ కంపెనీ ఇచ్చే డివిడెండు, తర్వాత సంవత్సరం నించీ ఇంకా పెరగబోతోందనో, ఆ కంపెనీకి ఏదో పెద్ద ఆర్డరు దొరికిందనో, ఆ కంపెనీ త్వరలో పాత వాటా దార్లకి మళ్ళీ కొత్త వాటాలు (రైట్స్) అసలు విలువకే ఇవ్వబోతోందనో, త్వరలో వాటాదార్లకి బోనస్ వాటాలు (ఉచితంగా ఇచ్చే వాటాలు) ఇవ్వబోతోం దనో; ఆ కంపెనీ త్వరలో ఇంకో కంపెనీని ప్రారం భించ బోతోందనో; ఇంకో కంపెనీతో కలవ బోతోం దనో - ఇలా, 'లాభాలు' పెరగడానికి అనుకూలమైన దేదో ఆ కంపెనీలో జరగబోతోందని, 'పెట్టుబడి మార్కెట్లో' ఊహాగానాలు ప్రచారమవుతున్నాయి - అనుకుందాం. దాని వల్ల, 'ఆ కంపెనీ వాటాలు దొరి కితే చాలని' ఎగబడే వాళ్ళ సంఖ్య ఎక్కువగా వుండొచ్చు. అప్పుడు వాటా ధర, 200 కన్నా కూడా పెరగవచ్చు. ఈ రకంగా, డివిడెండూ, వడ్డీ రేటూ, సప్లై డిమాండ్లూ - అనే 3 అంశాల మీద ఆధారపడి, వాటా మార్కెట్ ధర, 'అసలు విలువ' కన్నా తేడాగా ఏర్పడుతూ వుంటుంది.

'వడ్డీ రేటు' మారకుండా, డివిడెండు పెరిగితే, వాటా ధర ఇంకా పెరుగుతుంది; డివిడెండు తగ్గితే వాటా ధర తగ్గుతుంది. డివిడెండు బాగా తగ్గిపోతే, అలాంటి వాటాల్ని కొనడానికి ఎవ్వరూ ఇష్టపడరు. ఆ వాటా ధర 'అసలు విలువ' కన్నా కూడా తగ్గిపోవచ్చు.

డివిడెండు మారకుండా వడ్డీ రేటు పెరిగితే, వాటా ధర తగ్గుతుంది; వడ్డీ రేటు తగ్గితే వాటా ధర పెరుగుతుంది. (బ్యాంకు వడ్డీ రేటు కనీసం 6 నెలలకి ఒక సారి మారుతూ వుంటుంది.)

నిజానికి డివిడెండూ, వడ్డీ రేటూ, తరచుగా మారుతూ వుండవు. కానీ, 'వాటా ధర' తరచుగా మారుతూ వుంటుంది. కారణం - వాటాల సప్లై డిమాండ్లు మారడమే.

ఒక కంపెనీ వాటా ధర, పొద్దున్న ఒక రకంగా వుంటే, మధ్యాహ్నం ఇంకో రకంగా వుండవచ్చు, పొద్దున్న పరిస్థితి అదీ; మధ్యాహ్నం పరిస్థితి ఇదీ!

ఒక కంపెనీలో 'సమ్మె' జరుగుతోందంటే, ఆ కంపెనీ వాటాదార్లు భయపడిపోతారు. ఆ కంపెనీ లాభాలు పడిపోతున్నాయనీ, ఆ వాటాల్ని వదిలించు కోవడం మంచిదనీ, వాటాదార్లు అనుకోవడం ప్రారం భించారంటే ఇక ఆ వాటాల్ని అమ్మేసుకోవడం ప్రారం భిస్తారు. ఆ వాటాల్ని అమ్మే వాళ్ళు ఎక్కువై, కొనే వాళ్ళు తక్కువైతే, అప్పటి వరకూ వున్న వాటా ధర తగ్గిపోతుంది. వాటాదార్లు భయపడుతూ వున్న కాలం లోనే సమ్మె ఆగిపోయిందంటే, వాటా ధర ఎప్పటి లాగే నిలబడవచ్చు. ఇంకా పెరగవచ్చు కూడా!

కంపెనీని 'సమర్ధవంతంగా' నడుపుతున్నాడని పేరు పొందిన డైరెక్టరో, మేనేజరో జబ్బు పడ్డాడని తెలిస్తే, వాటా ధర తగ్గిపోవచ్చు. ఆ 'సమర్థుడి'కి జబ్బు మళ్ళిందని తెలిస్తే, వాటా ధర నిలబడవచ్చు. ఒక కంపెనీకి అనుకూలుడైన వ్యక్తి మినిస్టరుగా కొత్తగా పదవి లోకి వచ్చాడంటే, ఆ మినిస్టరు ద్వారా ఆ కంపెనీకి చాలా 'రాయితీలు' దొరికి, లాభాలు పెరిగే అవకాశం వుంటుంది కాబట్టి, ఆ వాటా ధర పెరగ వచ్చు. ఆ మినిస్టరు, పదవిలో నించి పోతే, ఆ వాటా ధర తగ్గిపోవచ్చు. ఈ విధంగా లాభాలు పెరగడానికి అనుకూలమైన ఏ అంశం జరిగినా వాటా ధర పెర గడమూ, లాభాలకు వ్యతిరేకమైనది జరిగితే వాటా ధర తగ్గడమూ, జరుగుతూ వుంటాయి. ఈ రకంగా, వాటాల 'సప్లై డిమాండ్లు' తరచుగా మారుతూ, వాటాల ధరలు తరచుగా మారుతూ వుంటాయి.

## ఆ 'ఎక్కువ' ఎక్కడిది?

వాటా ధర, 'అసలు విలువ' కన్నా ఎక్కువగా వుంటే, ఆ ఎక్కువగా వున్న భాగం ఎక్కడిది?

అసలు 100 విలువ గల వాటాని, A అనే వాటాదారుడు B కి 150 కి (అసలు కన్నా 50 ఎక్కువకి) అమ్మాడనుకుందాం. ఆ వాటాని కొన్న B, అంతకు ముందే ఏ 'వడ్డీల' ద్వారానో, 'లాభాల' ద్వారానో సంపాదించిన 'ఆదాయం'లో నించి 150 పెట్టి, ఆ వాటాని కొన్నాడనుకుందాం.

A వేపు నించి చూస్తే: అప్పటి వరకూ A పేర్న కంపెనీలో పెట్టిన 100 పెట్టుబడి, A కి తిరిగి వచ్చేసి, ఆ పైన B నించి ఇంకో 50 కూడా వస్తుంది. ఆ 50, B ఆదాయంలో నించి A లాగగలిగిన భాగం. A కి వాటా లేకుండా పోతుంది.

B వేపు నించి చూస్తే: B ఖర్చు పెట్టిన 150లో నించి 100 పెట్టుబడి ఆ కంపెనీ లోకి పోయి, మిగిలిన 50 పెట్టుబడి, A చేతుల్లోకి పోతుంది. B కి వాటా వస్తుంది.

కంపెనీ వేపు నించి చూస్తే: వాటా ధర బయట

ఎలా వున్నా, కంపెనీలో వుండే వాటా పెట్టుబడి ఏమీ మారదు. అది ఎప్పటిలా 100 గానే వుంటుంది. కంపెనీలో వాటాదారుడి పేరు మాత్రమే మారుతుంది.

ఈ మొత్తం వ్యవహారంలో, B ఆదాయంలో నించి 50, A కి మారింది. A వాటా, B కి మారింది. కంపెనీలో పెట్టుబడి ఎప్పటి లాగే వుంది. ఏమీ మారలేదు. అంటే, ఒక వాటాదారుడు, తన వాటాని, 'కొన్న ధర' కన్నా ఎక్కువ ధరకి అమ్మినప్పుడు, ఆ 'ఎక్కువ' ఎక్కడిదంటే, ఆ వాటాని కొన్న వ్యక్తి 'ఆదాయం'లోది.

వాటాని ఎక్కువ ధరకి అమ్మడం వల్ల, కొన్న వ్యక్తి నించి 'ఎక్కువ' డబ్బు, అమ్మిన వ్యక్తికే వస్తుంది గానీ, అది 'పరిశ్రమ' లోకి కొత్త పెట్టుబడిగా పోయేదేమీ వుండదు.

ఇక, తను 100తో కొన్న వాటాని అమ్మి 150 సంపాదించిన A, ఆ 150తో ఏం చేస్తాడు? తక్షణమే గానీ, తర్వాత గానీ, ఇంకో కంపెనీ వాటా (పాతదో, కొత్తదో) కొంటాడు.

A, తన వాటాని 150 కి అమ్మేసుకుని, ఆ తర్వాత C నించి 140 కి ఒక పాత వాటాని (100 విలువ గల దాన్ని) కొన్నాడనుకుందాం. అప్పుడేం జరిగిందని అర్థం?

C వాటా, A కి మారింది.

A, గతంలో, B నించి సంపాదించిన 50 లో నించి 40 C కి వెళ్తుంది. మిగిలిన 10 A కే వుంటుంది. A, C నించి ఏ కంపెనీ వాటాని కొన్నాడో ఆ కంపెనీలో పెట్టుబడి ఏమీ మారదు.

అంటే, పాత వాటాలనే ఇటూ అటూ మళ్ళీ మళ్ళీ అమ్మడాల వల్ల వాటిని ఎంత ఎక్కువ ధరలకు అమ్మినా, పరిశ్రమల్లో పెట్టుబడులు ఏమీ మారవు; పెరగవు; తగ్గవు. పాత కంపెనీలు, కొత్త వాటాల్ని విడుదల చేసినప్పుడూ, కొత్త కంపెనీలు ప్రారంభమైనప్పుడూ - మాత్రమే 'పరిశ్రమ'లో పెట్టుబడి పెరుగుతుంది.

వాటాని 'అసలు విలవ' కన్నా ఎక్కువ ధరతో ఎన్ని సార్లు అమ్మే అవకాశం వుంటుందో ఇప్పుడు చూద్దాం: ఒక కంపెనీ వాటా అసలు విలువ 100. దాని డివిడెండూ, బ్యాంకు వడ్డీ రేటూ వగైరాల్ని బట్టి, దాని ధర 200 దాకా పెరిగే అవకాశం వుందనుకుందాం.

ఆ వాటాలు వున్న పెట్టుబడిదారులు, ఏటా డివిడెండ్లు సంపాదించదల్చుకుంటే, వాటాల్ని మళ్ళీ అమ్మే ప్రసక్తే లేకుండా వాటిని వాళ్ళే వుంచుకుంటారు. కానీ, వాటాల్ని కొన్నది మళ్ళీ అమ్మడం కోసమే అయితే, వాటా ధర కొంచెం పెరగగానే వాటాదరుడు వాటిని అమ్మేస్తాడు. వాటా ధర పెరగడం అంటే, ఆ వాటాల్ని ఎక్కువ ధరతో కొనడానికి ఎవరో ఒకరు అంగీకరించడమే.

'వాటా'ని కంపెనీ నించి 'అసలు విలువ'కే (100కే) కొన్న A, దాన్ని కొంత కాలానికి, B కి, 150కి అమ్మాడనుకుందాం. అంటే A, తన 100 వెనక్కి తీసుకుంటూ దాని మీద '50 ఎక్కువ' సంపాదించాడు.

మళ్ళీ కొంత కాలానికి B, దాన్ని C కి, 170 కి అమ్మాడనుకుందాం. B కూడా తన 150 ని వెనక్కి తీసుకుంటూ దాని మీద '20 ఎక్కువ' సంపాదించాడు.

మళ్ళీ C కూడా దాన్ని D కి 200 కి అమ్మాడనుకుందాం. C కూడా తన 170 ని వెనక్కి తీసుకుంటూ, దాని మీద '30 ఎక్కువ' సంపాదించాడు.

ఇక్కడ ఆగి, ఇప్పటి వరకూ జరిగింది చూస్తే,

'వాటా'ని మొదట 100తో కొన్నవాడు - A

చివరికి, 200తో కొన్న వాడు - D

D ఖర్చు పెట్టిన 200, ఎక్కడెక్కడికి వెళ్ళింది?

ఒక 100, 'అసలు విలువ'కి సంబంధించిందే.

ఇంకో 100, A - B - C ల జేబుల్లోకి వెళ్ళింది.

A కి 50 + B కి 20 + C కి 30 = 100.

A, B, C, D లు నలుగురూ, కంపెనీల్లో వాటాల్ని కొనడమూ అమ్మడమూ చేసే పెట్టుబడి దారులే.

D, ఆ వాటాని 200తో కొన్నప్పుడు, D కి వాటా రావడమూ; D జేబులో నించి ఒక 100, A, B, C ల జేబుల్లోకి మారడమూ, జరిగాయి. ఆ 100, అలా మారకపోతే అది D జేబు లోనే వుండేది.

అంటే, ఒక వాటాని 'అసలు విలువ' కన్నా 100 ఎక్కువకి అమ్మడం ద్వారా ఒక పెట్టుబడిదారుడి డబ్బుని, ముగ్గురు పెట్టుబడిదారులు లాక్కోగలిగారు. అదే ఇక్కడ జరిగింది. ఇక తర్వాత, ఆ వాటా ధర 100 కన్నా పెరగడానికి మంచి అవకాశాలు లేవనుకుందాం. అంటే, ధర ఇంకా పెరిగితే ఆ పెట్టుబడి మీద వచ్చే డివిడెండు, బ్యాంకు వడ్డీని కూడా ఇవ్వదనుకుందాం. డివిడెండూ, వడ్డీ రేటూ, సప్లై డిమాండ్లూ మారకుండా ఎప్పటి లాగే వుంటే, వాటా

ధర ఇక పెరగదు.

అయినా ఆ 200 ధరే స్థిరంగా వుండిపోతుందని చెప్పడానికి వీలు లేదు. ఆ కంపెనీలో ఏదో మార్పులు (మంచివి గానీ, చెడ్డవి గానీ) జరగవచ్చు. మార్కెట్ లోకి కొత్త కంపెనీల వాటాలు రావచ్చు. కొత్త వాటాలు 'అసలు విలువ'కే దొరుకుతాయి కాబట్టి, వాటిని కొనడం కోసం, పాత వాటాల వాళ్ళు కొన్ని పాత వాటాల్ని అమ్మేసుకోవచ్చు. అప్పుడు పాత వాటాల ధరలు కొంత తగ్గవచ్చు. ఈ రకంగా, ఏవో మార్పుల వల్ల, అప్పటికే 'మాగ్జిమమ్'కి చేరిన వాటా ధర, కొంత తగ్గవచ్చు. లేదా, తక్కువ ధరతో అమ్మడానికి వాటా దారుడు ఇష్టపడకపోతే, వాటాని అమ్మడు. డివిడెండ్లు తింటూ వుంటాడు.

### 'వాటా పెట్టుబడి' ఎక్కడిది? వాటాని అమ్మగా వచ్చే 'లాభం' ఎక్కడిది? వాటా 'డివిడెండు' ఎక్కడిది?

A అనే వాడు, 100 తో ఒక వాటాని కొంటే, అది A పెట్టిన 'పెట్టుబడి'. అది A 'స్వంత పెట్టుబడి' అయినా, 'అప్పు తెచ్చినది' అయినా, ఆ పెట్టుబడి, వెనకటి ఉత్పత్తి క్రమాల నించి వచ్చిన 'అదనపు విలువ'లో భాగం.

ఆ వాటాని A, 150 తో B కి అమ్మి '50 లాభం' సంపాదిస్తే, ఆ 'లాభం' కూడా అప్పటికే B జేబులో వున్న పాత 'అదనపు విలువ'. దాన్ని A లాగ గలిగాడు.

ఆ వాటా మీద B కి 20 డివిడెండు వస్తే, ఆ డివిడెండు - 'కొత్త ఉత్పత్తి క్రమం'లో నించి వచ్చిన 'అదనపు విలువ'.

అంటే, వాటాల్ని కొనడానికి పెట్టే పెట్టుబడులూ, వాటిని మళ్ళీ మళ్ళీ అమ్మడాల ద్వారా సంపాదించే లాభాలూ - 'పాత అదనపు విలువ' లోవి అయితే; వాటాలకు వచ్చే 'డివిడెండ్లు' - కొత్త అదనపు విలువ లోవి.

మొత్తం మీద - వాటాల పెట్టుబడులూ, వాటా వ్యాపారంలో వచ్చే లాభాలూ, వాటాల డివిడెండ్లూ అన్నీ, కార్మిక వర్గానివే.

## 'నిజమైన' పెట్టుబడీ, 'కల్పిత' పెట్టుబడీ

**వా**టాకి - అసలు విలువా, మార్కెట్ ధరా, తేడాగా వుంటాయని చూశాం. అయితే, వాటాకి వచ్చే 'డివిడెండు,' ఏ పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అవుతుంది?

వాటా అసలు విలువ 100. మార్కెట్ ధర 180. డివిడెండు 20 - అనుకుందాం. ఈ 'డివిడెండు', 100 పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అవుతుందా; 180 ద్వారా ఉత్పత్తి అవుతుందా? - 100 పెట్టుబడి ద్వారానే. 180 ద్వారా కాదు.

ఇక్కడ గ్రహించవలసిన విషయాలు:

1. ఆ వాటాకి సంబంధించి 'ఉత్పత్తి క్రమం'లో వున్న పెట్టుబడి 100 మాత్రమే. ఇదే, 'పని చేసే పెట్టుబడి' కాబట్టి, ఇదే నిజమైన పెట్టుబడి. ఆ వాటాని 180కి అమ్మితే అది ఉత్పత్తి క్రమానికి బయట జరిగే వ్యవహారం. 'అసలు విలువ' కన్నా పైన వున్న 80, వాటాని అమ్మిన వ్యక్తి చేతుల్లో మాత్రమే వుంటుంది గానీ ఉత్పత్తి క్రమంలో వుండదు. కాబట్టి ఆ 80, 'పని చెయ్యని పెట్టుబడి'. ఇది, కేవలం డబ్బు రూపంలో మాత్రమే వుండే పెట్టుబడి. అందుకే ఇది - 'కల్పిత పెట్టుబడి'. అంటే ఇది 'పెట్టుబడి'గా వున్నట్టు కనపడుతుంది గానీ పెట్టుబడిగా పని చెయ్యదు. (దీన్ని మార్క్సు, 'ఫిక్టీషియస్ కాపిటల్' అన్నాడు.)

2. డివిడెండు, 20 గా కనపడుతోన్నా, '100 పెట్టుబడి' ద్వారా ఉత్పత్తి అయ్యే లాభం 20 మాత్రమే కాదు. ఇంకా ఎక్కువే. ఈ సంగతి ఎలా చెప్పవచ్చంటే, 'లాభం'లో నించి ఎన్నో అంశాల్ని మినహాయించిన తర్వాతే డివిడెండ్లు పంచుతారు. కాబట్టి, ఒక ఉదాహరణలో ఎంత డివిడెండు కనపడుతుందో అదే అసలు లాభం కాదు. లాభం ఇంకా చాలా ఎక్కువగా వుంటుంది.

3. డివిడెండు - ఉత్పత్తి అయ్యేది, పని చేసే పెట్టుబడి లోని అన్ని భాగాల ద్వారా కాదు. 'జీతాల' భాగం ద్వారా మాత్రమే. అంటే, ఈ ఉదాహరణలో, '100 పెట్టుబడి' లోని V భాగం, 20 కన్నా ఎక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తుందన్న మాట.

## 'డివిడెండ్' అంటే, 'వడ్డీ' కాదు:

వాటా అసలు విలువ 100. మార్కెట్ ధర 180. డివిడెండు 20.

డివిడెండు ని (20ని), అసలు పెట్టుబడి ద్వారా (100 ద్వారా) వచ్చినట్టుగా చూస్తే, ఆ డివిడెండు, వడ్డీ + సంస్థ లాభాల మొత్తంగా సరిగానే కనపడుతుంది. ఎందుకంటే, అదంతా వడ్డీ యే అవదు కాబట్టి. కానీ, అదే డివిడెండు ని (20 ని), అసలు కన్నా ఎక్కువ పెట్టుబడి ద్వారా (180 ద్వారా) వచ్చినట్టుగా చూస్తే, అప్పుడు డివిడెండు - కేవలం 'వడ్డీ' లాగ మాత్రమే కనపడుతుంది. కాకపోతే 'బ్యాంకు రేటు' కన్నా కొంచెం మెరుగైన వడ్డీ లాగ.

వాటా అసలు విలువ 100. డివిడెండు 20.

అప్పుడు, డివిడెండు = వడ్డీ + సంస్థ లాభం.

వాటా మార్కెట్ ధర 180. డివిడెండు 20.

అప్పుడు డివిడెండు = వడ్డీ మాత్రమే.

వాటాని కొన్న వ్యక్తి, దాని కోసం 180 పెట్టుబడి పెట్టి, దాని ద్వారా 20 డివిడెండుని సంపాదిస్తాడు కాబట్టి, ఈ పై పై వ్యవహారాల్ని చూస్తే, ఇది ఎలాంటి తప్పు అభిప్రాయాలు కలిగిస్తుందంటే:

ఒక 'వాటా'గా, 'ఉత్పత్తి క్రమం'లో తక్కువ పెట్టుబడి పని చేస్తోంటే, ఎక్కువ పెట్టుబడి పని చేస్తున్నట్టూ; - 'డివిడెండు'ని ఆ ఎక్కువ పెట్టుబడే ఇస్తున్నట్టూ; - 'డివిడెండు' అనేది, వడ్డీ మాత్రమే అయినట్టూ - ఇలాంటి తప్పు అభిప్రాయాలెన్నో కలిగిస్తుంది.

ఒక వాటా విషయంలో చూసిందే అన్ని వాటాలకూ వర్తిస్తుంది కాబట్టి, సమాజంలో వున్న మొత్తం వాటాల్ని కలిపి చూస్తే :

సమాజంలో నిజంగా పని చేసే పెట్టుబడి కన్నా ఎక్కువ పెట్టుబడి పని చేస్తున్నట్టూ; - డివిడెండ్ల మొత్తాన్ని ఆ ఎక్కువ పెట్టుబడే ఇస్తున్నట్టూ; - డివిడెండ్లన్నీ వడ్డీలే అయినట్టూ - కనపడుతుంది.

మన నిత్య జీవితంలో వాటాల ధరల్ని పత్రికల్లో చూసినప్పుడు, వాటాల అసలు విలువలు కనపడవు. మార్కెట్ ధరలే కనపడతాయి. ఎందుకంటే, వాటాల్ని కొనే వాళ్ళకి, వాటా కోసం ఎంత పెట్టుబడి పెట్టాలీ, దాని వల్ల ఎంత డివిడెండు వస్తుందీ - అనే విషయాలే ముఖ్యం గానీ, వాటా 'అసలు విలువ' సంగతి అవసరం లేదు. కాబట్టి, వాటాని కొనే వ్యక్తి కి, 'అసలు విలువ ఎంత' అనే ప్రశ్నే వుండదు.

వాటిల్ని మళ్ళీ అమ్ముకోకుండా 'డివిడెండ్ల' కోసమే వుంచుకున్న వాటా దార్లకి కూడా 'డివిడెండు' అనేది వడ్డీ లాగ మాత్రమే కనపడుతుంది. ఎలాగంటే: ఒకడి దగ్గర 100 విలువ గల వాటా వుందనుకుందాం. దాని మార్కెట్ ధర 180. డివిడెండు 20. వాడు తన వాటాని అమ్ముకోకపోయినా, దాని మార్కెట్ ధరని బట్టే తన వాటా విలువని లెక్క కట్టుకుంటాడు. "దీని ధర 180 కదా? ఈ వాటా వుండాలంటే, 180 పెట్టవలిసిందే కదా?" అనుకుంటాడు. అంటే, తను 100 పెట్టుబడి పెట్టినట్టు గాక, 180 పెట్టుబడి పెట్టినట్టు అనుకుంటాడు. తన వాటా పెట్టుబడిని 180గా భావించడం వల్ల, దాని మీద వచ్చే 20 డివిడెండు, వాడికి, 'వడ్డీ'గా మాత్రమే కనబడుతుంది.

'వాటాల' విధానం ప్రారంభమైన తర్వాత - అసలు పని చేసే పెట్టుబడీ, దాని జనరల్ లాభం రేటూ - అనే విషయాలు మరుగున పడిపోయి, వాటా మార్కెట్ ధరా, డివిడెండూ, వడ్డీ రేటూ - అనే మాటలే ప్రధానంగా చలామణీ అవుతూ వుంటాయి.

# వాటా 'ధర' ఎంత పెరిగితే, 'వడ్డీ పెట్టుబడి'కి అంత లాభం!

3 రకాల వుదాహరణలు చూద్దాం.

**1)** A దగ్గిర స్వంత పెట్టుబడి లేదు. వాడికి 100 పెట్టుబడి 'అప్పు'గా కావాలి. వడ్డీ రేటు 8%. జనరల్ లాభం రేటు 20%. ఇది, A వ్యక్తిగత కంపెనీ. బ్యాంకు నించి, 100 డబ్బుని, A అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకున్న 100 పెట్టుబడి ద్వారా 20 జనరల్ లాభం సంపాదించి, అందులో నించి 8 ని వడ్డీగా చెల్లిస్తే, సంస్థ లాభం 12.

**2)** ఇప్పుడు ఆ 100 పెట్టుబడినే, 'వాటా పెట్టుబడి'గా చూద్దాం. వాటాకి అసలు విలువా, మార్కెట్ ధరా, ఒకే రకంగా వున్నాయి అనుకుందాం. జనరల్ లాభాన్ని, 'డివిడెండు'గా అనుకుందాం. A కి,

'వాటా'ని కొనడానికి స్వంత పెట్టుబడి లేదు. వాటా ధర, అసలు విలువతో సమానమే కాబట్టి, ఇంకో వాటా దారుడి నించి వాటాని కొనడానికి కూడా A కి 100 పెట్టుబడే సరిపోతుంది. A, 100ని అప్పు తెచ్చి వాటాని కొన్నాడు. అంటే A, ఒక కంపెనీలో 100 పెట్టుబడి పెట్టాడు. డివిడెండు 20 వచ్చింది. అందులో నించి 8ని వడ్డీగా చెల్లిస్తే, 12 మిగిలింది. అంతా, మొదటి వుదాహరణలో లాగే. ఎందుకంటే, 2 చోట్లా అప్పు తీసుకున్న పెట్టుబడి సైజు ఒకటే కాబట్టి.

**3)** ఇప్పుడు వాటాకి అసలు విలువ కన్నా మార్కెట్ ధర ఎక్కువగా వున్నట్టు చూద్దాం. వాటాకి మార్కెట్ ధర ఎక్కువగా వుంటే, వాటాని కొనడానికి అప్పు తీసుకోవలసింది కూడా ఎక్కువగా వుంటుంది. మిగతా అంశాలేవీ మారవు. - వాటా అసలు విలువ 100. మార్కెట్ ధర 150. A, 150ని అప్పు తెచ్చి వాటాని కొన్నాడు. దాని మీద 20 డివిడెండు వచ్చింది. 8% వడ్డీ రేటు లెక్కన 150 మీద 12 వడ్డీ చెల్లిస్తే, Aకి మిగిలేది 8.

ఈ 3వ ఉదాహరణలో, ఎక్కువ అప్పు ఇవ్వడానికి వడ్డీ పెట్టుబడిదారుడికి అవకాశం కలిగింది. ఎక్కువ అప్పు, ఎక్కువ వడ్డీని సంపాదించగలిగింది. 'వడ్డీ రేటు' గానీ, 'జనరల్ లాభం రేటు' గానీ మారకుండానే, 'ఎక్కువ వడ్డీ పెట్టుబడి' పని చేసి, ఎక్కువ వడ్డీని తీసుకుంది. కానీ ఇక్కడ అప్పుగా వెళ్ళే పెట్టుబడి పెరిగిందంటే, ఆ పెరిగిన భాగం 'ఉత్పత్తి క్రమం'లో పని చెయ్యదు.

వాటా ధర 150 కన్నా కూడా పెరిగితే, ఆ వాటాని కొనడానికి ఇంకా ఎక్కువ అప్పు తీసుకోవాలి. ఎక్కువ అప్పు కోసం ఎక్కువ వడ్డీ వస్తుంది. ఇంకా పెరిగిన అప్పు భాగం కూడా ఉత్పత్తి క్రమం లోకి వెళ్ళదు.

> "**వ**డ్డీ పెట్టుబడి లోని ప్రతీ పెరుగుదలా, నిజమైన పెట్టుబడి కూడికను గానీ, లేదా 'పునరుత్పత్తి క్రమపు విస్తరణను' గానీ, సూచించదు." - మార్క్స్ [కాపిటల్ - 3, పేజీ 485, మాస్కో.]

వాటా ధరలు ఎక్కువగా పెరగడం వల్ల, డబ్బుని అప్పులు ఇచ్చే సంస్థలు, ఎక్కువ అప్పులు ఇచ్చి ఎక్కువ వడ్డీలు సంపాదిస్తాయి. అప్పు తీసుకున్న వాడికి, మిగిలే లాభం తగ్గి, వడ్డీ భాగం పెరుగుతుంది. కాబట్టి, వాటాల ధరలు పెరగడం వడ్డీ పెట్టుబడికి చాలా మంచిది. ఎక్కువ అప్పులు ఇచ్చే అవకాశాలు దానికి వస్తాయి, 'జనరల్ లాభం' అనే రాసిలో నించి అది ఎక్కువ భాగం లాక్కోగలుగుతుంది.

# కంపెనీల 'ప్రమోటర్ లాభం'

**వా**టాల్ని విడుదల చేసే కంపెనీలు, 'ప్రమోటర్ లాభం' అనే ఒక ప్రత్యేక లాభాన్ని ఎలా సంపాదిస్తాయో ఇప్పుడు చూద్దాం.

ఒక కంపెనీ, ఒక సారి వాటాల్ని విడుదల చేసి (వాటా విలువ 100 రూపాయలు), అమ్మేసిందనుకుందాం. తర్వాత ఆ వాటాకి మార్కెట్ ధర 200 దాకా పెరిగింది. ఆ వాటాలకు ఇంకా డిమాండ్ వుందనుకుందాం. అంటే, ఆ వాటాల్ని 200 కన్నా ఎక్కువ ధరతో కొనడానికి వాటాదార్లు సిద్ధంగా వున్నారనుకుందాం. అలాంటప్పుడు, ఆ కంపెనీ, మళ్ళీ కొత్త వాటాల్ని విడుదల చేస్తే, వాటిని ఈ సారి 'అసలు విలువ'తో ఇవ్వదు. 'అసలు' కన్నా కొంత ఎక్కువ ధర పెడుతుంది. ఉదా॥ 120. ఆ కంపెనీ ఏమంటుందంటే - "మా వాటాకి మార్కెట్లో 200 దాకా ధర వుంది. కానీ, మేము మా కొత్త వాటాల్ని 100 అసలూ + 20 ప్రీమియమ్ = 120తో అందిస్తున్నాము. ఎంత చౌక! త్వరపడండి!" అంటుంది. అంటే, ఆ వాటాని మళ్ళీ మళ్ళీ అమ్మడం ద్వారా వచ్చే లాభంలో కొంత భాగాన్ని కంపెనీయే సంపాదించాలనుకుందన్న మాట. అందుకే కొత్త వాటాలకు ఎక్కువ ధర చెబుతుంది. బయట 200 ధర గల వాటా, కంపెనీలో 120కే దొరకడం 'చౌకే' కాబట్టి, ఆ వాటాల కోసం పెట్టుబడి దారులు ఎగబడతారు.

ప్రీమియమ్‌గా వుండే 20 భాగం, పరిశ్రమ లోకి వెళ్ళదు. అసలు పని చేసేది 100 మాత్రమే. 120 కాదు.

కొత్త వాటాలు, 'కొత్త పెట్టుబడి'గా పనిజేసి, కొత్త డివిడెండ్లని ఇస్తాయి.

కొత్త వాటాల ద్వారా వచ్చిన 'ప్రీమియమ్' ఆ కంపెనీని ప్రారంభించిన పెట్టుబడి దార్లకు - 'వ్యక్తిగత లాభం'. (వీరు ఇప్పుడు కంపెనీ డైరెక్టర్లు.) వీరికి ఈ 'లాభం' ఎందుకంటే, వీరు చాలా 'కష్టించీ శ్రమించీ'

ఆ కంపెనీని స్థాపించారు గనకా, దాన్ని ఇంత 'వృద్ధి' లోకి తెచ్చారు గనకానూ! అంటే, కంపెనీని స్థాపించిన 'ప్రమోటర్లు' కూడా ఇతర వాటాదారుల లాగే 'డివిడెండ్లు' మాత్రమే తీసుకోవడం కాకుండా, వాళ్ళకి 'ప్రత్యేక లాభం' వుండాలన్న మాట! అదే 'ప్రమోటర్' లాభం! ఆ లాభాన్ని వాళ్ళు, ఇతర వాటాదారులతో సంబంధం లేని విధంగా ఉపయోగించవచ్చు.

వాటాలకు డిమాండ్ వుంటే, మొట్ట మొదటి సారి కూడా 'ప్రీమియమ్' తోనే అమ్ముతారు. 20 ప్రీమియమ్‌తో విడుదల చేసినవి 1 లక్ష వాటాలు అయితే, అవన్నీ అమ్ముడు పోతే, ఆ వాటాల ద్వారా వచ్చే ప్రమోటర్ లాభం, 20 లక్షలు! 'వాటా' మీద ప్రీమియమ్, 20 కన్నా ఎక్కువ అయితే, ప్రమోటర్ లాభం కుప్పతెప్పలు! అది, ఆ వాటాల్ని కొనే వాళ్ళ ఆదాయాల నించి కంపెనీ నిర్మాతలకు అందే ప్రత్యేక లాభం!

ఆ వాటాల్ని ప్రీమియమ్‌తో గాక 'అసలు విలువ'కే ఇచ్చి వుంటే, ఆ వాటాల్ని బైటికి అమ్ముకున్నప్పుడు ఆ లాభం వాటాదార్లకే అందుతుంది. లేదా వాటాదార్లకి అందకపోతే అది నిర్మాతలకు అందుతుంది. వాళ్ళకి కాకపోతే వీళ్ళకీ, వీళ్ళకి కాకపోతే వాళ్ళకీ! అంతే తేడా!

## 'ప్రమోటర్ లాభానికి' ఇంకో మార్గం:

వాటాదార్లకు నిజంగా ఇవ్వగలిగినంత డివిడెండుని ఇవ్వకపోవడమే ఈ మార్గం. కంపెనీకి వచ్చే లాభాల్ని బట్టి, 30% డివిడెండ్ ఇవ్వడానికి సాధ్యమైనా, 25% మాత్రమే ఇస్తారనుకుందాం. లేదా, డివిడెండుని పెంచేటప్పుడు 10% పెంచడానికి అవకాశం వుండగా, 5% మాత్రమే పెంచుతారనుకుందాం. ఈ రకంగా, 'డివిడెండు'ని సరిగా ఇవ్వకుండా మిగిల్చినదంతా 'ప్రమోటర్ లాభం' కావచ్చు. ఇది కొంత వరకూ వాటాదార్లకు తెలిసే విధంగానే జరగవచ్చు. కానీ చాలా సందర్భాల్లో కంపెనీలో వ్యవహారాలన్నీ వాటాదార్లకు తెలీవు. ఖచ్చితమైన లెక్కలు వాళ్ళకి అందవు. - ఈ రకంగా, 'డైరెక్టర్ల బోర్డు' చేసే 'శ్రమల్లో' ఒక శ్రమ ఏమిటంటే - వాటాదార్లని మోసం చేసే రకరకాల మార్గాలు అన్వేషించడం!

కార్మికుల్ని మోసం చేసే ప్రధానమైన శ్రమతో పాటు, డైరెక్టర్లకి ఇదో 'అదనపు శ్రమ'!

కార్మికులకు అందకుండా పోయిన భాగం, వాటాదార్లకు అందితే ఏమిటీ, డైరెక్టర్లకి అందితే ఏమిటీ! దాన్ని ఎవరు తిన్నా కార్మికులకు ఒకటే.

ఒక్కో కంపెనీ ఇచ్చే డివిడెండు ఒక్కో రకంగా వుంటుంది. ఎందుకంటే, కంపెనీల లాభాలు కొంత కొంత తేడాలుగా వుంటాయి కాబట్టి. లేదా, మోసాలు చెయ్యడంలో తేడాలు వుంటాయి కాబట్టి.

కొన్ని కంపెనీలు వాటాల్ని, 'అసలు విలువ'కే (ఎట్ పార్) అమ్ముతాయి. ఇవి, డివిడెండ్లని 'సగటు' స్థాయిలో మాత్రమే ఇస్తాయి.

కొన్ని కంపెనీలు - వాటాల్ని అసలు కన్నా ఎక్కువ ధరతో ('ప్రీమియమ్'తో) అమ్ముతాయి. ఇవి, కొంత ఎక్కువ డివిడెండ్లని ఇస్తాయి. కొన్ని కంపెనీలు - వాటాల్ని అసలు కన్నా తక్కువ ధరతో ('డిస్కౌంట్'తో) అమ్ముతాయి. ఇవి తక్కువ డివిడెండ్లని ఇస్తాయి.

వేరు వేరు కంపెనీలు ఇచ్చే డివిడెండ్లలో మరీ ఎక్కువ తేడాలు గనక వుంటే, వాటాదార్లు ఎక్కువ డివిడెండ్లు వచ్చే వాటాల్ని కొనడానికే ప్రయత్నిస్తారు. తక్కువ డివిడెండ్లు ఇచ్చే కంపెనీలకు కొత్త పెట్టుబడి రావడం తగ్గుతుంది. కాబట్టి, కంపెనీల మధ్య పోటీల వల్ల, కంపెనీలన్నీ దాదాపుగా వాటా ధరలకు తగిన డివిడెండ్లని ఇవ్వడానికే ప్రయత్నిస్తాయి.

ఎక్కువ డివిడెండ్‌ని తెచ్చే వాటాకి, ధర ఎక్కువగా వుంటే, తక్కువ డివిడెండ్‌ని తెచ్చే వాటాకి, ధర తక్కువగా వుంటుంది. దీని వల్ల, 'వాటా పెట్టుబడి' సంపాదించే లాభం రేటు, అన్ని చోట్లా దాదాపుగా ఒకే రకంగా వుంటుంది.

# స్టాక్ ఎక్స్చేంజీ, స్టాక్ బ్రోకరు కంపెనీలూ

'షేరు' అన్నా 'స్టాకు' అన్నా, ఒకటే. వాటాల్ని, కొన్ని దేశాల్లో 'షేర్లు' అంటే, కొన్ని దేశాల్లో 'స్టాకులు' అంటారు.

ఒక కంపెనీ, తన వాటాల్ని అమ్మాలన్నా; తనే ఇతర కంపెనీల వాటాలు కొనాలన్నా; ఏ వాటాలూ లేని వ్యక్తులు, ఏదో ఒక కంపెనీలో వాటాలు కొనాలన్నా; అప్పటికే తమకు వున్న వాటాల్ని అమ్మి, ఇంకో కంపెనీ వాటాలు కొనాలన్నా - ఈ పనులన్నిటినీ

'వాటాల బ్రోకర్ల'కి అప్పజెపుతారు. బ్రోకర్లు, ఆ వాటాల్ని అమ్మడమో, కొనడమో చేసి పెట్టి 'బ్రోకరేజి' (కమిషన్) తీసుకుంటారు.

ప్రతీ వాటాదారుడూ ఏదో ఒక 'బ్రోకరు - కంపెనీ'లో 'క్లయింటు'గా వుంటాడు. వాటాదారులు అంటే - వ్యక్తులే కాదు. కంపెనీలూ, ఇతర సంస్థలూ కూడా.

ఉత్పాదక కంపెనీలూ, వర్తక కంపెనీలూ, బ్యాంకులూ, బ్యాంకులు కాని ఫైనాన్స్ కంపెనీలూ, ఇన్సూరెన్స్ కంపెనీలూ, ప్రావిడెంట్ ఫండ్ కంపెనీలూ - వగైరా కంపెనీలన్నీ కూడా వాటాలు కొంటాయి. ఒక కంపెనీ, ఇంకో కంపెనీలో వాటాలు కొన్నదంటే, మొదటి కంపెనీ, ఇంకో కంపెనీలో కూడా పెట్టుబడి పెట్టిందని అర్థం.

బ్రోకరు కంపెనీలన్నీ, క్లయింట్ల కోసం వాటాల్ని అమ్మే - కొనే 'మార్కెట్ స్థలాలు'. బ్రోకరు కంపెనీలే గాక, స్టాక్ - ఎక్స్ఛేంజి అనేది కూడా వాటాల్ని అమ్మే - కొనే మార్కెట్ స్థలం.

ఒక కంపెనీ - తన 'కొత్త వాటాల్ని' అమ్మడం, 'ప్రైమరీ మార్కెట్' వ్యవహారం. కొత్త వాటాలు - కంపెనీ దగ్గిరా, కంపెనీ బ్రోకరు దగ్గిరా, కంపెనీ అంగీకరించే బ్యాంకు దగ్గిరా కూడా దొరుకుతాయి.

వాటాదారులు ఒక సారి కొనుక్కున్న వాటాల్ని మళ్ళీ మళ్ళీ అమ్మడం - 'సెకండరీ మార్కెట్' వ్యవహారం. ఈ సెంకడరీ అమ్మకాలు బ్రోకర్ల ఆఫీసుల్లోనూ, 'స్టాక్ ఎక్ఛేంజి' ల్లోనూ జరుగుతాయి.

'స్టాక్ ఎక్ఛేంజి'లో జరిగేదంతా సెకండరీ మార్కెట్ వ్యవహారమే. ఇక్కడ కొత్త వాటాల అమ్మకం జరగదు. 'స్టాక్ ఎక్ఛేంజి' అనేది - వాటాల బ్రోకర్లు సభ్యులుగా వుండే మార్కెట్ సంస్థ. అంటే బ్రోకర్ల సంస్థ.

స్టాక్ ఎక్ఛేంజీల్లో - ప్రభుత్వం గుర్తించినవీ, గుర్తించనివీ కూడా వుంటాయి. ప్రభుత్వ గుర్తింపు లేని స్టాక్ ఎక్ఛేంజీల్లో కూడా వాటాల బ్రోకర్లు పని చేస్తూ వుంటారు.

ప్రభుత్వం గుర్తించిన 'స్టాక్ ఎక్ఛేంజి' గురించి చూద్దాం. ఇందులో ప్రతీ బ్రోకరుకీ సభ్యత్వం (లైసెన్స్) దొరకదు. సభ్యత్వం లేని బ్రోకర్లు గానీ, వాటా దారులే స్వయంగా గానీ, ఈ 'స్టాక్ ఎక్ఛేంజి'లో బేరాలు నడుపుకోవడానికి అనుమతి వుండదు.

'స్టాక్ ఎక్ఛేంజి' సభ్యులు (అంటే, బ్రోకర్లు), రహస్య ఓటింగు ద్వారా బ్రోకర్లలో నించే 'కౌన్సిల్'ని ఎన్నుకుంటారు. కౌన్సిల్ సభ్యులు, చైర్మన్‌నీ, వైస్ చైర్మన్‌నీ ఎన్నుకుంటారు. (ఈ పదవుల పేర్లు - ఒక్కో దేశపు ఎక్ఛేంజీల్లో ఒక్కో రకంగా వుండవచ్చు.) ప్రభుత్వం 'అధికారికంగా' నియమించే 'ప్రభుత్వ బ్రోకరు' కూడా 'ఎక్ఛేంజి'లో వుంటాడు. ఈ అధికార మండలి అంతా కలిసి ఎక్ఛేంజి వ్యవహారాలు చూస్తుంది.

పెద్ద స్థాయి ఎక్ఛేంజీల్లో వేల కొద్దీ ఉద్యోగులు అనేక సెక్షన్లలో పని చేస్తూ వుంటారు.

'స్టాక్ ఎక్ఛేంజి'లో సభ్యత్వం కోసం, బ్రోకర్లు, వేల కొద్దీ డిపాజిట్లు కట్టాలి. కొన్ని మహా నగరాల ఎక్ఛేంజీల్లో 50 లక్షలూ, అంత కన్న ఎక్కువా కూడా డిపాజిట్లు కట్టాలి. అదే గాక, ఏటా 'ఎక్ఛేంజి'కి కొంత ఫీజు చెల్లిస్తూ వుండాలి. రెగ్యులర్‌గా సంపాదించే 'కమిషన్ల'లో నించి కూడా ఎక్ఛేంజికి కొంత భాగం వెళ్తుంది. ఇవన్నీ ఎక్ఛేంజికి 'ఆదాయం'గా వుంటాయి. ఈ ఆదాయంలో నించి ఎక్ఛేంజి ఖర్చుల్ని తీసివేస్తే మిగిలేది ఎక్ఛేంజికి 'లాభం'. ఈ లాభం, ఆ సభ్యులకే పంపకం అవుతుంది. ఈ లాభం కోసం సభ్యులు, ఆ సభ్యత్వానికి ఎంతెంత డిపాజిట్టయినా కడతారు.

వాటాల బ్రోకర్లు, ఎక్ఛేంజికి చెల్లించేవే గాక, తమ స్వంత ఆఫీసుల్లో ఉద్యోగుల జీతాలూ, ఆఫీసు ఖర్చులూ, అన్నీ భరించాలి. అంటే, మొత్తం ఈ ఖర్చంతా బ్రోకర్లు సంపాదించే 'కమిషన్ల'లో నించే రావాలి.

బ్రోకర్లు తమ క్లయింట్లతో తమ ఆఫీసుల్లోనే మాట్లాడుకుని (స్వయంగా గానీ, ఫోన్ల ద్వారా గానీ) 'ఆర్డర్లు' తీసుకుంటారు. తర్వాత ఆ ఆర్డర్లని బట్టి, వాటాలు అమ్మడమో, కొనడమో చేసి పెడతారు. 'ఎక్ఛేంజి'లో సభ్యత్వం లేని బ్రోకరు, తన వ్యాపారం అంతా తన ఆఫీసులో మాత్రమే చేస్తాడు. లేదా, ప్రభుత్వ గుర్తింపు లేని ఇతర ఎక్ఛేంజీల్లో కూడా చేస్తాడు.

(లాయరు - తన ఆఫీసు లోనే క్లయింట్లతో మాట్లాడుకుని కేసులు తీసుకుని, 'కోర్టు'కి వెళ్ళి కేసులు చేసి పెడతాడు కదా? అలాగే వాటాల బ్రోకరు, తన ఆఫీసు లోనే క్లయింట్లతో మాట్లాడుకుని ఆర్డర్లు తీసుకుని, స్టాక్ ఎక్ఛేంజికి వెళ్ళి ఆ ఆర్డరు ప్రకారం చేసి పెడతాడు. వీలైతే స్టాక్ ఎక్ఛేంజి బయట కూడా చేసి పెడతాడు.)

ఒక కంపెనీ వాటాల 'సెకండరీ' అమ్మకాలు,

'ఎక్స్ఛేంజి'లో ప్రారంభం కావాలంటే, ఆ కంపెనీ, ఎక్స్ఛేంజిలో 'లిస్టై' (నమోదై) వుండాలి. ఎక్స్ఛేంజి, ప్రతి కంపెనీ నీ 'లిస్టు' చేసుకోదు. ఎక్స్ఛేంజి షరతుల ప్రకారం సమాచారం ఇచ్చిన కంపెనీలనే లిస్టు చేసు కుంటుంది.

కంపెనీ, ఒక సారి వాటాల్ని విడుదల చేసిన తర్వాతే ఎక్స్ఛేంజిలో లిస్టవుతుంది. అప్పటి నించి ఆ కంపెనీ వాటాల అమ్మకాలకు, ఎక్స్ఛేంజిలో అనుమతి దొరుకుతుంది.

ఒక కంపెనీ, అనేక స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టవవచ్చు. ఆ కంపెనీ వాటా ధర, వేరు వేరు ఎక్స్ఛేంజీల్లో కొంత కొంత తేడాలుగా వుంటుంది. ఎక్కడి సప్లై డిమాండ్లు అక్కడివి.

ఒక దేశపు కంపెనీలు, విదేశాల ఎక్స్ఛేంజీల్లో కూడా లిస్టవవచ్చు. ఒక దేశపు కంపెనీల వాటాల్ని విదేశాల పెట్టుబడి దారులు కూడా కొంటారు.

స్టాక్ ఎక్స్ఛేంజిలో నమోదవని కంపెనీలు అనేకం వుంటాయి. అవి కూడా వాటాల్ని అమ్ముతూనే వుంటాయి.

'జాయింట్ స్టాక్ కంపెనీ' విధానం ప్రారంభమైన తర్వాత, కంపెనీల్లో పెట్టుబడి పెట్టడం అనేది, ఆ కంపెనీల వాటాల్ని కొనడం ద్వారానే జరుగుతుంది. పెట్టుబడి పెట్టదల్చుకున్న వ్యక్తులైనా, సంస్థలైనా, బ్రోకర్ల ద్వారా ప్రైమరీ మార్కెట్లోనో, సెకండరీ మార్కె ట్లోనో వాటాలు కొనవలసిందే. పెట్టుబడి పెట్టడానికి అదే మార్గం.

బ్రోకరు అనే వాడు, మొదట తన క్లయింట్లకి (వాళ్ళు వ్యక్తులయినా, కంపెనీలయినా), ఏ కంపె నీలు వాటాలు కొనవచ్చో, ఎంత ధరతో కొనవచ్చో, లేదా, తమ వాటాలు ఎంత ధరతో అమ్మవచ్చో - వగైరా సలహాలన్నీ ఇస్తాడు. క్లయింట్లకి సలహాలు ఇవ్వాలంటే, బ్రోకరుకి అన్ని కంపెనీల గురించీ తెలిసి వుండాలి కాబట్టి, ఆ సమాచారం ఎప్పటికప్పుడు సేకరించడానికి బ్రోకరు దగ్గిర, ఉద్యోగులు పని చేస్తూ వుంటారు.

వేరు వేరు కంపెనీల డివిడెండ్లూ, వాటాల ధరల్లో మార్పులూ, ఏ కంపెనీ ఎక్కడెక్కడ 'లిస్టు' అయిందీ, కంపెనీల అభివృద్ధులూ, దివాళాలూ - వంటి సమా చారాన్ని, కంపెనీల ఆర్థిక విషయాలు ప్రచురించే పత్రికల ద్వారానూ, ఇతర 'పరిశోధనల' ద్వారానూ, బ్రోకరు కంపెనీలు సేకరిస్తూ వుంటాయి.

క్లయింట్లలో కొంత మంది, తమ స్వంత మార్కెట్ పరిజ్ఞానం తోటే ఫలానా కంపెనీ వాటాల్ని ఫలానా ధరతో కొనాలని (లేదా, తమ వాటాల్ని ఫలానా ధరతో అమ్మాలని) నిర్ణయించుకుని, ఆ ప్రకారమే చేసి పెట్ట మని బ్రోకరుకి ఆర్డరు ఇస్తారు. మరి కొంత మంది క్లయింట్లు, అంతా బ్రోకరుకే విడిచి పెడతారు.

'స్టాక్ ఎక్స్ఛేంజి'లో కొన్ని కొన్ని కంపెనీల వాటాల అమ్మకాలు ఒక్కో స్థలంలో జరుగుతాయి. (విదేశీ కంపెనీల వాటాల అమ్మకాలు కూడా ప్రత్యేక స్థలాల్లో జరుగుతాయి.)

మన బ్రోకరు, తన క్లయింటు ఇచ్చిన ఆర్డరు ప్రకారం, తనకు కావలసిన స్థలం దగ్గిరికి వెళ్తాడు. "ఫలానా కంపెనీ .... ఎంత?" అంటాడు క్లుప్తంగా. మాటలు అంతే. వాటా ధర సంగతి అడుగుతున్నాడని ఇతర బ్రోకర్లకు తెలుసు. ఆ కంపెనీ వాటాల్ని, చిట్ట చివరకు 2 నిముషాల కిందట అమ్మిన ధర 150 రూపాయలు అనుకుందాం. అక్కడ ఆ కంపెనీ వాటాల్ని అమ్మదల్చుకున్న ఎవరో ఒక బ్రోకరు, "150 - 150.25" అంటాడనుకుందాం. అంటే, దాని అర్థం - "ఈ వాటా, చిట్ట చివరగా 150 కి అమ్ముడ యింది. కానీ ఇప్పుడయితే ఆ ధరకి నేను ఇవ్వను. 150.25కి అయితేనే ఇస్తాను" అని అర్థం. ఆ అమ్మే బ్రోకరు, తన స్వంత వాటాల్ని అమ్మాలన్నా, క్లయింట్ల వాటాల్ని అమ్మాలన్నా, మొదట ఎక్కువ ధర రాబట్టడానికే ప్రయత్నిస్తాడు. అందుకే 2 నిమిషాల కిందట వున్న ధర కన్నా, 25 పైసలు పెంచి చెప్పాడు. అయితే ఆ వాటాల్ని కొనే బ్రోకరు, వాటిని తన కోసం కొనాలన్నా, క్లయింట్ల కోసం కోనాలన్నా, వీలైనంత తక్కువ ధరకే కొనాలని చూస్తాడు. "25 కాదు, 12 " అంటాడు. అంటే, "25 పైసలు కాదు, 12 పైసలే ఇస్తాను" అని! అమ్మే బ్రోకరు, "సరే" అంటే, ఆ వాటాల అమ్మకం జరిగిపోయినట్టే. కొత్త ధర, 150 రూపాయల 12 పైసలు.

బేరాలు ఇంకో రకంగా కూడా జరగవచ్చు. A బ్రోకరు, ఒక స్థలం దగ్గిరికి వెళ్ళి, "ఫలానా కంపెనీ .... ఎంత?" అన్నప్పుడు, వాడు ఆ కంపెనీ వాటాల్ని కొంటాడో అమ్ముతాడో తెలీదు. అయినా ఆ కంపెనీ వాటాల్ని కొనడానికీ అమ్మడానికీ కూడా సిద్ధంగా వున్న B బ్రోకరు, "120 - 121" అంటాడనుకుందాం. అంటే - "ఆ కంపెనీ వాటాల్ని నువ్వు అమ్మితే 120 కి కొంటా. నువ్వు కొంటే, 121కి అమ్ముతా" అని అర్థం.

ఒకే కంపెనీ వాటాకి, 2 రకాల ధరలు! ఆ వాటాల్ని B బ్రోకరే కొంటే, 120 కి కొంటాడట! వాడే అమ్మితే, 121 కి అమ్ముతాడట! అది అంతే! వాడి బేరం అది! అది వాడి ఇష్టం!

A బ్రోకరు, వాటాల్ని అమ్మెయ్య దల్చుకుంటే 120 కే ఒప్పుకోవచ్చు. లేదా, ఆ వాటాల్ని కొనదల్చు కుంటే 121 కి ఒప్పుకోవచ్చు. ఏ ధరా నచ్చకపోతే దేనికీ ఒప్పుకోక పోవచ్చు. అంతే గానీ, "ఒకే కంపెనీ వాటాల్ని నువ్వు కొంటే తక్కువకి కొంటావా? నేను కొంటే ఎక్కువకి కొనాలా? బుద్ధి వుందా లేదా?" అని అడగడు. వీడి దగ్గిరికి ఇంకోడు వచ్చినప్పుడు వీడైనా అలాగే అంటాడు కదా? అది అంతే! బుద్ధి లేని వాళ్ళ వ్యాపారం కదా అదంతా?

ఆ బేరాల కౌంటర్ దగ్గిర, అమ్మే వాళ్ళకీ - కొనే వాళ్ళకీ మధ్య 'వేలం పాట' లాంటిదే జరుగుతుంది. ఒకడి కన్నా ఎక్కువ ధర ఇవ్వడానికి ఇంకోడు ఒప్పుకుంటే, ఆ బేరం ఆ ఇంకోడి వేపు పోతుంది.

ఒకే ధరకి ఎక్కువ మంది బ్రోకర్లు సిద్ధపడి నప్పుడు, ఆ బేరం ఎవరికి రావాలో తేల్చుకోవడానికి 'రూపాయి బిళ్ళని ఎగరెయ్యడం' ద్వారా తేల్చు కుంటారు.

చివరికి బేరం కుదుర్చుకున్న బ్రోకర్లిద్దరూ ఒక పక్కకి చేరి, వివరాలు రాసుకుని, సంతకాలు చేసి, ఆ చీటీ ముక్కల్ని ఎక్చేంజి ఆఫీసులో 'ఫలానా చోటుకి' అందిస్తారు.

వాటా - ఏ ధర కి అమ్ముడవుతుందో అది - వాటా 'కొటేషన్'. 2 నిమిషాల ముందు 150గా వున్న కొటేషన్, ఇప్పుడు మారిపోవచ్చు.

వాటాల అమ్మకం జరిగిన వెంటనే డబ్బు చెల్లిం చడం వుండదు. దానికి కనీసం 10, 15 రోజులు టైము వుంటుంది. బ్రోకర్ల మధ్య లావాదేవీలు, 'ఎక్చేంజి'లో బ్రోకర్ల ఎక్కౌంట్ల ద్వారా సెటిలవుతాయి.

బేరం కుదిరిన తర్వాత, డబ్బు వెంటనే చెల్లించక పోయినా, వాటాల మీద 'యాజమాన్యం' మాత్రం మారిపోయినట్టే.

ఫలానా కంపెనీ వాటా '150.12 కి అమ్ముడ యిందనే వార్త (అంటే, ఆ వాటా ధర 12 పైసలు పెరిగిందనే వార్త), ఎక్చేంజిలో వున్న 'యంత్రాంగం' ద్వారా, 'కొటేషన్ రూము'కీ, దేశ విదేశాల్లో వున్న ఇతర ఎక్చేంజిలకూ తక్షణం అందిపోతుంది. (దేశంలో వున్న 'ఆధునిక సమాచార యంత్రాంగం' చేసే పని ఇదన్న మాట!).

డబ్బు చెల్లింపులు జరిగిన తర్వాత, 'వాటా సర్టి ఫికెట్లు' బదిలీ చేసుకుంటారు. దానితో పాటే బ్రోకరుకి కమిషనూ, అందులో నించి 'ఎక్చేంజి'కి కొంత భాగమూ అందుతాయి.

వాటా 'ధర' ఎలా మారినా వాటా సర్టిఫికెట్ మీద 'అసలు విలువే' వుంటుంది. వాటాదారుడి పేరు మారుతుంది.

ఆ బేరం జరిగినప్పుడు ఆ వాటా ధర పెరగడం గాక తగ్గితే (ఆ వాటాల్ని కొనే బ్రోకరు 150 కన్నా తక్కువకి అడుగుతాడనుకుందాం. అమ్మే బ్రోకరు అందుకు అంగీకరిస్తాడను కుందాం), అప్పుడు ఆ వార్తే అన్ని ఎక్చేంజిలకూ అందుతుంది.

ధరలో 12 పైసలు తేడాతో ఒక్క అమ్మకం జరిగినా, వాటా ధర మారిపోయినట్టే.

A బ్రోకరు నించి 100 వాటాల్ని ఒక ధరతో B బ్రోకరు కొన్నట్టుగా 10 గంటలకు ఒప్పందం జరి గిందనుకుందాం. ఆ వాటాలు అప్పుడే B చేతికి రాక పోయినా అవి B వే కాబట్టి, వాటిని మళ్ళీ ఏ క్షణంలో నైనా అమ్ముకోడానికి B కి హక్కు వుంటుంది. ఇంకో అర గంట సేపటికి ఆ వాటాల్ని కొంత ఎక్కువ ధరతో C అడిగితే, వాటిని B అమ్మెయ్యవచ్చు. అవి C చేతికి రాకపోయినా, C కూడా ఇంకో 10 నిముషాల్లో వాటిని D కి అమ్మెయ్యవచ్చు. ఈ డబ్బు లావాదేవీలన్నీ తర్వాత సెటిలవుతాయి. వాటాలు, చివరి వాడికి అందుతాయి.

అమ్ముడవుతోన్న వాటాల ధరల్ని, స్టాక్ ఎక్చేంజి, ప్రతీ గంటా ప్రకటిస్తూ వుంటుంది. 'ధర' పెరుగుతోంటే ఆ వాటాలకు డిమాండ్ పెరుగుతోందనీ, ధర తగ్గు తోంటే డిమాండ్ తగ్గుతోందనీ అర్థం కాబట్టి, వేరు వేరు కంపెనీల వాటాల డిమాండ్లు ప్రతీ గంటా తెలుస్తూ వుంటాయి. ఈ రకంగా, కంపెనీల పరిస్థితులు వాటాల ధరల్లో, కొంత వరకూ ప్రతిబింబిస్తూ వుంటాయి.

ఒక కంపెనీ కొన్ని వాటాల్ని విడుదల చేసి అమ్మేసిన తర్వాత ఆ వాటా ధర ఎలా మారినా (హెచ్చినా, తగ్గినా), అదంతా కంపెనీ బయట జరిగే వ్యవహారం. దాని వల్ల కంపెనీకి లాభ నష్టాలేమీ వుండవు. 100 విలువ గల వాటా ధర, బయట 150 అయితే, ఆ పెరిగిన 50 పెట్టుబడి కంపెనీ లోకి రాదు. అలాగే, వాటా ధర 50 తగ్గినా, ఆ తగ్గిన

పెట్టుబడి కంపెనీలో నించి పోదు. వాటా ధర, కంపెనీ బయట ఎలా మారినా, కంపెనీలో వున్న పెట్టుబడిలో మార్పు లేమీ జరగవు.

అయినప్పటికీ వాటా ధరలో బయట జరిగే మార్పులు, కంపెనీకి లాభ నష్టాల్ని కలిగిస్తాయి. ఎలాగంటే, ఆ కంపెనీ 'కొత్త పెట్టుబడి'ని సంపాదించే విషయంలో! ఒక కంపెనీ వాటా ధర - బాగా పెరుగుతోందంటే (ఆ వాటాల్ని ఎక్కువ ధరతో కొంటున్నారంటే), ఆ కంపెనీలో ఇంకా 'పెట్టుబడి' పెట్టడానికి వాటాదారులు ఎక్కువ ఆసక్తితో వున్నారన్న మాట! ఆ కంపెనీ గనక మళ్ళీ 'కొత్త వాటాల్ని' విడుదల చేస్తే, వాటిని తేలిగ్గా అమ్మి, కొత్త పెట్టుబడిని తేలిగ్గా సంపాదించగలదన్న మాట! వాటా ధర తగినంతగా పెరగక పోయినా, లేదా తగ్గి పోతోన్నా, ఆ కంపెనీ, కొత్త వాటాల్ని అమ్మలేదు; కొత్త పెట్టుబడిని సంపాదించలేదు. ఈ విధంగా, వాటా ధరలో మార్పులు, 'కొత్త పెట్టుబడి'ని సంపాదించే విషయంలో ప్రభావం చూపుతాయి.

# వాటా 'లాభాల' ఉన్మాదం!

**వా**టా 'ధర' పెరగడానికి కొన్ని నియమాలు వుంటాయనీ, ధర అనంతంగా పెరుగుతూ వుండదనీ, చాలా మంది వాటాదార్లకూ బ్రోకర్లకూ కూడా తెలీదు. అసలు విలువతో కొన్న కొత్త వాటాకి, 'ధర' కొంత వరకూ పెరుగుతుంది కాబట్టి, ఆ ధర ఇంకా అలా అలా పెరుగుతూనే వుంటుంది అనుకుంటారు వాళ్ళు.

వాటా అసలు విలువ 100. దాన్ని కంపెనీ నించి A, అసలు విలువ తోటే కొన్నాడనుకుందాం. వాటా, మొట్ట మొదట A చేతిలో వుంది.

ఆ వాటాకి వచ్చే 'డివిడెండు'ని బట్టి, దాని ధర 180 కన్నా పెరగడానికి 'నిజమైన' అవకాశాలు లేవనుకుందాం. (అంటే, ధర అంతకన్నా పెరిగితే, ఆ 'పెట్టుబడి' మీద వచ్చే డివిడెండు ద్వారా బ్యాంకు వడ్డీ కూడా రాదని అర్థం.) కానీ, ఆ వాటాని అమ్మడానికి A, 200 ధర చెపుతున్నాడనుకుందాం.

వాటా ధర ఎప్పుడూ పెరుగుతూనే వుంటుందని నమ్మే B, "ఈ వాటాని ఇప్పుడు నేను 200 తో కొంటే, దీని ధర తర్వాత ఇంకా పెరుగుతుంది కదా? 210 దాకా పెరిగినప్పుడు అమ్మేసి 'లాభం' సంపాదిస్తాను" అనుకుని ఆ వాటాని A నించి, 200తో కొన్నాడను కుందాం.

ఆ వాటా ద్వారా A కి, 100 లాభం.

తర్వాత B కి కూడా లాభం రావాలంటే, ఆ వాటాని నిజంగానే 200 కన్నా ఎక్కువతో కొనే వాళ్ళు వుండాలి. 'కొన్న ధర' కన్నా, 'అమ్మే ధర' ఎక్కువగా వుంటేనే కదా 'లాభం?' B, ఆ వాటాని అమ్మడానికి 210 ధర చెపుతున్నాడనుకుందాం.

B లాగే C కూడా - "ఇప్పుడు నేను దీన్ని 210తో కొంటే, దీని ధర ఇంకా పెరుగుతుంది. అప్పుడు అమ్మేస్తే నాకు లాభం వస్తుంది" అని ఆలోచించి, ఆ వాటాని 210తో కొన్నాడనుకుందాం. అంటే B ఊహించినట్టే వాటా ధర 200 కన్నా పెరిగిందన్న మాట!

B ఊహించినట్టే ఎలా జరిగింది? B లాగే ఆలోచించే C వున్నాడు గనక! ఆ వాటాని 210 తో కొనడానికి సంకోచించని C వల్ల, B కూడా లాభపడతాడు. B కి, 10 లాభం.

అయితే, ఆ వాటాని B అప్పుడే ఎందుకు అమ్మేస్తాడు? ధర 210 కన్నా ఇంకా పెరుగుతుందని B కి నమ్మకం వుండదా? - తను ఆశించిన ధర వచ్చింది కాబట్టి B, తన వాటాని అమ్మేస్తే అమ్మెయ్యవచ్చు, లేదా, ఇంకా ఎక్కువ ధర కోసం చూస్తే చూడనూ వచ్చు. B ఆ వాటాని కొన్నది మళ్ళీ అమ్మడానికే కదా? కాబట్టి దాన్ని ఎప్పుడో అప్పుడు అమ్మవలసిందే. ఆ అమ్మే ధరనే 210 అనుకుంటున్నాం. అంటే, B, 210తో అమ్మేస్తాడు.

B వాటాని 210 తో C కొంటే, B కూడా లాభపడతాడు.

C వాటాని మళ్ళీ ఎక్కువతో D కొంటే, C కూడా లాభపడతాడు.

D వాటాని ఇంకా ఎక్కువతో E కొంటే, D కూడా లాభ పడతాడు.

E కూడా అలాగే! ఇంకోడు కూడా అలాగే!

ప్రస్తుతానికి D ని, చివరి వాడిగా అనుకుందాం.

B అజ్ఞానం - A కి లాభం!

C అజ్ఞానం - B కి లాభం!

D అజ్ఞానం - C కి లాభం!

ఇప్పుడు D కూడా లాభపడాలంటే, ఇంకో 'అజ్ఞాని' కావాలి! వీళ్ళందరూ వున్నట్టే, వాడూ వుంటాడు, వీళ్ళ పక్కనే.

ఒకప్పటికి, K అనే వాడు (వీడు 11 వ వాడు), J నించి (10 వ వాడి నించి), ఆ వాటాని, 400తో కొన్నాడంటే, అందులో ఆశ్చర్యం ఏమీ వుండదు. తను మళ్ళీ 420 తోనో, 430 తోనో అమ్మగలుగుతాననే నమ్మకం తోటే వాడు అలా కొంటాడు.

K చెల్లించిన 400 ధరలో, వాటా అసలు విలువ 100. అదనం 300. ఈ 300 అదనం ఎవరికి అందింది? ఆ వాటాని K కి J అమ్మాడు కాబట్టి, ఆ 300 లాభం J కే అందిందా? - కాదు.

గతంలో ఆ వాటాని కొని అమ్మిన 10 మందికీ కలిసి (A నించీ J వరకూ వున్న 10 మందికీ) ఆ 300 లాభం అందింది.

వాటా ఇప్పుడు K చేతిలో వుంది. K కూడా లాభ పడాలంటే ? వాటాని 400 కన్నా ఎక్కువతో కొనేవాడు వుండాలి. ఎవరైనా ఎక్కువతో కొంటేనే కదా అమ్మే వాడికి లాభం?

'వాటాల వ్యాపారం'లో అమ్మే వాడికి లాభం, కొనే వాడి నించే వస్తూ వుండాలి! అదే బట్టా, పంచదారా లాంటి 'ఉత్పత్తుల' విషయంలో అయితే, వాటిని అమ్మేటప్పుడు, అమ్మే వ్యక్తికి, కొనే వ్యక్తి నించి 'లాభం' గానీ, 'నష్టం' గానీ, రాదు. 'సరుకు'కి బదులుగా దానికి సమానమైన 'విలువ' మాత్రమే వస్తుంది. ఆ 'విలువ' లోనే 'అదనపు విలువ' వుంటుంది. ఆ 'అదనపు విలువ', సరుకుని కొనే వ్యక్తిది కాదు. అంటే ఉత్పత్తుల విషయంలో, 'లాభం' అనేది, కొనే వ్యక్తి నించి రాదు.

కానీ 'వాటాల' వ్యాపారం అలాంటిది కాదు. ఇది 'కొంత విలువని ఇచ్చి దానికి బదులుగా అంతే విలువని తీసుకోవడం' అనే సూత్రం మీద నడవదు. ఇక్కడ 'లాభం' రావాలంటే, ఇచ్చే విలువ కన్నా తీసుకునే విలువ ఎక్కువగా వుండాలి. వాటాని 'కొనే ధర' కన్నా, 'అమ్మే ధర' ఎక్కువగా వుండాలి.

అంటే, వాటాని అమ్మే వ్యక్తికి 'లాభం' రావాలంటే, దాన్ని ఇంకో వ్యక్తి ఎక్కువ ధరతో కొని, తన ఆదాయాన్నే అమ్మే వ్యక్తికి లాభంగా ఇవ్వాలి. లేకపోతే, వాటా ద్వారా లాభం వచ్చే అవకాశమే వుండదు.

అంటే, వాటా వ్యాపారం జరుగుతూ వుండాలంటే, వాటా 'ధర' పెరుగుతూనే వుండాలి! కానీ, ఈ రకంగా, వాటా ధర పెరుగుతూనే వుండడం, ఎంత వరకూ సాధ్యం?

K చేతిలో, 400 తో కొన్న వాటా వుంది!

K కి లాభం రావాలంటే, వాటాని ఇంకా ఎక్కువతో ఎవరైనా కొనాలి!

సరే, K వాటాని ఇంకా ఎక్కువతో L కొన్నాడనుకుందాం. మరి, L కి కూడా లాభం రావాలంటే?

మళ్ళీ ఇంకోడు కూడా ఎక్కువతో కొనాలి. సరే, ఇంకోడు కొన్నాడు.

ఆ 'ఇంకోడి'కి కూడా లాభం రావాలంటే?

వాటాని ఒకడు అమ్ముతున్నాడంటే, ఇంకోడు కొంటున్నాడని అర్థమే కదా? ఒకడు, లాభంతో బైట పడ్డాడంటే, వాటా ఇంకోడి పాలబడిందని అర్థమే కదా?

ఎవణ్ణో ఒకణ్ణి చివరి వాడిగా తీసుకుంటే, మరి ఆ చివరి వాడు, తర్వాత ఏమౌతాడు? వాడికి 'లాభం' ఎలా రావాలి?

అమ్మేవాడికి, కొనే వాడి నించే లాభం రావలసిన ఇలాంటి కృత్రిమ వ్యాపారంలో, 'అసంబద్ధత' ఏమిటో పెట్టుబడిదారీ తర్క హీనత్వానికి పట్టదు. వాటాల వ్యాపారాన్ని, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, అందులోనూ 'స్టాక్ మార్కెట్ నిపుణులు', గొప్ప 'సైన్సు' స్థాయిలో చూపించడానికి ప్రయత్నిస్తారు. వాటాదారులు, తమ వ్యాపారాన్ని గొప్ప మేధావితనంతో నిర్వహించుకోవాలని, ఈ నిపుణులు బోధిస్తూ వుంటారు. ఆ మేధావితనం ఏమిటంటే - వాటాల్ని, ధర తగ్గినప్పుడే కొనాలి; పెరిగినప్పుడే అమ్మాలి - అని.

కొనే వాడి ఎదురుగానే అమ్మేవాడు వుంటాడు కదా? ధర తగ్గినప్పుడే కొనాలని, కొనేవాడికి సలహా! ధర పెరిగినప్పుడే అమ్మాలని, అమ్మే వాడికి సలహా!

ఇవతలి వాడి కోసం, ధర తగ్గాలి!

అవతలి వాడికోసం, ధర పెరగాలి!

ఇంత పొంతన లేని తుక్కు మేధావితనాన్నే 'నిపుణులు' మార్చి మార్చి బోధిస్తూ వుంటారు. వాటాకి 'మంచి ధర' వచ్చినప్పుడు అమ్మేసుకోవాలంటారు. 'ధర' అంతకన్నా పెరుగుతుందని పేరాశ పడరాదంటారు. అలా 'తెలివిగా, చాతుర్యంతో వ్యాపారం చేసుకుంటూ' లాభాలు సంపాదించాలంటారు.

ఏ ధర దగ్గిరైతే ఆ వాటాని అమ్మెయ్యడం అవసరమో, ఏ ధర దగ్గిరైతే ధర ఇంకా పెరుగుతుందని ఆశించడం తెలివి తక్కువ తనమో, ఆ ధర దగ్గిర, ఆ వాటాని ఇంకొకడు మాత్రం ఎందుకు కొనాలి? ఆ ధర 'ఇంకా పెరగకపోతే' ఆ కొన్న వాడికి 'లాభం' ఎలా రావాలి?

ఒక ధర దగ్గిర వాటాని అమ్మేసుకున్న A తెలివైన వాడైతే, ఆ ధర దగ్గిర ఆ వాటాని కొన్న B, తెలివి తక్కువ వాడు కాదా?

A తెలివైన తనంగా కనపడేది, B తెలివి మాలిన తనం కాదా?

అంటే, ఈ వ్యాపారంలో వున్నదంతా వాటాని ఎలాగైనా ఇంకోడికి అంటగట్టెయ్యాలనే మోసమే. మోసాలు చెయ్యడంలో తెలివి తేటలూ, చాతుర్యాలూ ప్రదర్శించాలన్నదే, నిపుణుల బోధన అంతా!

వాటాని అమ్మడంలో ఎంత చాతుర్యం ప్రదర్శించినా, ధర సమస్య పరిష్కారం అవదు. ఆ సమస్య, ఒకణ్ణి వదిలితే, ఒకణ్ణి పట్టుకుంటుంది!

'ధర', 'అసలు విలువ' నించి ఎంత వరకూ అయితే 'వడ్డీ లెక్కల తర్కం' మీద ఆధారపడి పెరుగుతుందో, అప్పటి వరకూ ఆ వాటా - 'ధర పెరిగే దశలో వున్న' వాటా (గ్రోత్ షేర్). ఆ దశ దాటిన తర్వాత కూడా ఆ వాటా ధర ఇంకా పెరుగుతూ వుంటే, అది, కనీసపు తర్కం కూడా లేకుండా పూర్తిగా 'స్పెక్యులేషన్' మీదే ఆధారపడుతూ ధర పెరుగుతోన్న 'చట్టా వాటా' (స్పెక్యులేటివ్ షేర్).

ఎంత తప్పుడు వ్యాపారంలో అయినా, ధర అనంతంగా పెరుగుతూ వుండదు. వాటాని ఇక ఎక్కువకి అమ్మలేని పరిస్థితి ఎప్పుడో అప్పుడు వచ్చి తీరుతుంది.

ఆ పరిస్థితి, K దగ్గిరే వచ్చిందనుకుందాం.

K, తన వాటాని ఎంత కాలం చూసినా 400 కన్నా ఎక్కువకి అమ్మలేక పోయాడనుకుందాం. అంతే కాదు; కనీసం 'కొన్న ధర' కైనా అమ్మలేక పోయాడనుకుందాం. ఆ వాటాని వదిలించుకుంటే చాలని, L కి, 350 కే అమ్మేశాడనుకుందాం.

K కి లాభం రాలేదు సరిగదా, నష్టం 50.

ఒక సారి ధర తగ్గిన వాటా మీద, ఇక వాటాదారుల్లో అనుమానాలు ప్రారంభమవుతాయి. L కూడా దాన్ని 350 కన్నా ఎక్కువకి అమ్మలేక తక్కువకే అమ్మేశాడనుకుందాం. అలాగే వాటా ధర తగ్గిపోతూ 250 దాకా వచ్చి, P చేతి లోకి చేరిందనుకుందాం.

A నించీ P దాకా వున్న వాళ్ళందర్నీ (16 మందిని) తీసుకుంటే, ఆ వాటాతో చేసిన వ్యాపారంలో, కొందరు లాభపడితే, కొందరు నష్టపోయారు.

లాభం మొత్తమూ, నష్టం మొత్తమూ సమానంగా వుంటాయి. లాభపడ్డ వాళ్ళకి ఆ 'లాభం' ఎక్కడి నించి వచ్చిందీ - అని లెక్కలు చూస్తే, నష్ట పోయిన వాళ్ళ డబ్బే లాభ పడ్డ వాళ్ళకి అందినట్టు తేలుతుంది. ఎవరెవరి నష్టాలు, ఎవరెవరికి లాభాలయ్యాయో తెలుస్తుంది.

అంటే, దీని అర్థం, వాటాల వ్యాపారంలో కొందరు వాటాదారులు లాభ పడ్డారంటే, ఇంకొందరు వాటాదారులు అంత ఆదాయం పోగొట్టుకున్నారని అర్థం.

వాటాల్ని అమ్మే వాళ్ళూ, కొనే వాళ్ళూ కూడా, లాభ పడే మార్గం ఏదీ వుండదు. ఒకడి నష్టమే, ఇంకోడి లాభం. లేదా, ఒకడి లాభమే, ఇంకోడి నష్టం. ఈ వ్యాపారంలో జరిగేదంతా ఒకడి దగ్గిర చేరిన అదనపు విలువని, ఇంకోడు లాక్కోవడమే.

ఇది, 'వ్యాపారం' పేరుతో జరిగే 'జూదం'! ఏ జూదంలో నైనా జరిగేదంతా ఒకళ్ళ డబ్బుని ఒకళ్ళు లాక్కోవడమే. సరిగ్గా ఇక్కడ జరిగేది కూడా అదే.

ఏ జూదానికైనా ఎంత 'మార్కెట్ భాష' వుంటుందో, ఈ 'షేర్ల జూదానికి' కూడా అంత మార్కెట్ భాషా వుంటుంది. 'బుల్' అనీ, 'బేర్' అనీ, బుల్ వాల్యూ, ఈ.పీ.ఎస్సూ, ఈ రేషియో, ఆ రేషియో - అంటూ బోలెడు మాటలు వుంటాయి. అంతా గొప్ప 'సైన్సు' అయినట్టే దాన్ని నిపుణులు బోధిస్తూ వుంటారు. నిజానికి అందులో వున్న 'హేతు విరుద్ధత' అర్థమైతే, అదంతా ఉత్త 'జూదగొండి పద జాలం' తప్ప ఇంకేమీ కాదని గ్రహించడం ఎంతో తేలిక.

# స్టాక్ ఎక్స్చేంజి ఒక జూద శాల!

**వా**టాల్ని కొన్న తర్వాత (అవి కొత్త వాటాలైనా, పాత వాటాలైనా), వాటిని అమ్మకుండా వుంచుకునే వాళ్ళు సగం మంది కూడా వుండరు. చాలా మంది మళ్ళీ అమ్మడం కోసమే వాటాలు కొంటారు.

మామూలు ఉత్పత్తుల విషయంలో అయితే, ఒకటి రెండు అమ్మకాల తోటే ఆ ఉత్పత్తి, 'వాడకం' లోకి వెళ్ళిపోతుంది. కానీ, వాటాల విషయంలో, వ్యాపారం లోకి దిగిన వాటా, ఎప్పుడూ అమ్మకాల లోనే వుంటుంది. మొదట్లో కొన్నిసార్లు ఎక్కువకీ, తర్వాత తక్కువకీ, మళ్ళీ ఎక్కువకీ, కొంచెం తక్కువకీ,

ఇంకా తక్కువకీ, ఎక్కువకీ - మళ్ళీ మళ్ళీ మళ్ళీ అమ్మకమే! దీనికి అంతం వుండదు.

అమ్మడం కోసమే కొనడం - అనే పెట్టుబడిదారీ వ్యాపార లక్షణం, వాటాల వ్యాపారంలో ఎలాంటి ముసుగులూ లేని నగ్న రూపంలో వుంటుంది.

'డివిడెండ్ల' కోసం గాక, వాటాల్ని మళ్ళీ అమ్మడం కోసమే కొనేవాళ్ళంతా వాటాల స్పెక్యులేటర్లు. బ్రోకర్లే గాక, ఈ రకం క్లయింట్లు కూడా వాటాల స్పెక్యులేటర్లే.

స్పెక్యులేటర్లు వాటాల్ని కొనేది డివిడెండ్ల కోసం కాకపోయినా, వాటా ధర డివిడెండు మీదే ఆధారపడి వుంటుంది.

వాటాని అమ్మినప్పుడల్లా, వాటా దారుడికి లాభం వచ్చిందా నష్టం వచ్చిందా అనే దానితో సంబంధం లేకుండా బ్రోకరుకి, 'కమిషను' వస్తుంది. ఒక వాటాని నెలకి 10 సార్లు అమ్మితే, 10 సార్లూ బ్రోకరుకి కమిషన్లు వస్తాయి. అందుకే బ్రోకర్లు, వాటాల్ని చాలా తరచుగా అమ్మడాన్ని ప్రోత్సహిస్తారు. వాటాల్ని కొనే వాళ్ళు డివిడెండ్ల కోసమే వుంచుకునే టట్టయితే, సెకండరీ మార్కెట్లో రోజూ వేల, లక్షల వాటాల అమ్మకాలు వుండవు. అమ్మకాలు లేకపోతే కమిషన్లూ వుండవు.

'జాయింట్ స్టాక్ కంపెనీ విధానం' ప్రారంభమైన తర్వాతే, వాటాలూ వాటాల వ్యాపారమూ ప్రారంభమై, కమిషన్లు తినే 'బ్రోకర్ల దండు' ప్రారంభమైంది.

ఈ రకపు వ్యాపారం, వెనకటి సమాజాల్లో లేదు.

వాటాల వ్యాపారంలో, బ్రోకర్లే క్లయింట్లకి కొంత డబ్బు అప్పు కూడా ఇచ్చి (బ్యాంకుల నించి తెచ్చి) క్లయింట్లతో వాటాలు కొనిపిస్తూ వుంటారు. దాని వల్ల తమకు కమిషన్లు వస్తాయి కాబట్టి.

100 ధరతో వాటాని కొనాలంటే, క్లయింటు 20 పెడితే, బ్రోకరు 80 పెడతాడనుకుందాం. వాటా పత్రం బ్రోకరు ఆధీనం లోనే వుంటుంది.

తర్వాత వాటా ధర 120 అయినప్పుడు అమ్మారనుకుందాం. క్లయింటు బ్రోకరు అప్పునీ; బ్రోకరు బ్యాంకు అప్పునీ కూడా తీర్చేస్తాడు. బ్యాంకుకి 'వడ్డీ'! బ్రోకరుకి 'కమీషను!' క్లయింటుకి 'లాభం!' అందరూ సురక్షితంగా బయట పడతారు.

ఎల్లెడలా ఆనందోత్సాహాలు!

కానీ ఆ వాటా ధర, 'కొన్న ధర' కన్నా తగ్గితే? 70 అయితే? - ఆ వాటాని 100 తో కొనడానికి, బ్రోకరు 80 పెట్టాడు కాబట్టి, ఇప్పుడు వాటాని 70 కి అమ్మితే, ముందు బ్రోకరుకి నష్టం. వాటాని అమ్మగా వచ్చిన 70 కి, తన జేబుతో నించి ఇంకో 10 తీసి, మొత్తం 80 ని, బ్యాంకుకి కట్టేస్తాడు. (వడ్డీ గాక).

క్లయింటు, తన 20ని నష్టపోవడమే గాక, ఇంకా బ్రోకరుకి 10 చెల్లించాలి. బ్యాంకుకి వడ్డీ చెల్లించాలి. మొత్తం మీద క్లయింటుకి 30 కన్నా ఎక్కువ నష్టం.

వాటా ధర 70 కన్నా ఇంకా తగ్గితే? క్లయింటు, బ్రోకరుకీ ఇవ్వలేడు; బ్రోకరు బ్యాంకుకీ ఇవ్వలేడు. వరసగా అందరూ మునుగుతారు, బ్యాంకుతో సహా!

ఈ వాటాల వ్యాపారానికి ప్రధాన కూడలి అయిన 'స్టాక్ ఎక్చేంజీల' వల్ల, పరిశ్రమకి 'కొత్త పెట్టుబడి' అందేదేమీ ఉండదు. 'స్టాక్ ఎక్చేంజీ' ద్వారా తన పాత వాటాల్ని అమ్ముకున్న వాడు, ఆ డబ్బుతో, బయట కొత్త వాటాల్ని కొంటేనే పరిశ్రమ లోకి కొత్త పెట్టుబడి వెళ్తుందని ఇంతకు ముందే చూశాం. అయితే, ఆ పని జరగడానికి ('పరిశ్రమ' లోకి కొత్త పెట్టుబడి వెళ్ళడానికి), ఒకడు తన పాత వాటాని అమ్మనక్కర లేదు. A తన పాత వాటాని B కి అమ్మకపోతే, B డబ్బు B దగ్గిరే వుంటుంది. Bయే నేరుగా కొత్త వాటాని కొనగలడు. B ద్వారానే ఆ డబ్బు పరిశ్రమ లోకి వెళ్ళగలదు. ఈ పని కోసం B డబ్బు, A దగ్గిరికి రానక్కర లేదు. సెకండరీ మార్కెట్ లేకపోయినా, 'పరిశ్రమ' లోకి పెట్టుబడి అందే పని ఆగదు. దానికి రుజువు, వాటాల విధానం లేని పెట్టుబడిదారీ కాలమే. ఆ కాలంలో, పెట్టుబడి దారులు, పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టకుండా ఆగలేదు. సెకండరీ మార్కెట్ లేకపోయినా, 'పెట్టుబడి' అనేది, 'లాభం' కోసం కంపెనీల్ని వెతుక్కుంటూ వెళ్ళకుండా ఆగదు.

వాటాల విషయంలో సెకండరీ మార్కెట్ అంతా ప్రధానంగా దేని కోసం అంటే, కేవలం బ్రోకర్ల దండు కమిషన్లు తినడానికీ, స్పెక్యులేటర్లు లాభ నష్టాల జూదం ఆడడానికీ మాత్రమే.

అనేక అంతస్తుల బ్రహ్మాండమైన భవనాల్లో, అత్యాధునిక సమాచార యంత్రాంగంతో, కార్మికుల నించి లాగిన కోట్ల కోట్ల కోట్ల ధనరాసుల ఖర్చుతో, స్టాక్ ఎక్చేంజీల్లో జరిగే 'దేశ సేవ' అంతా, జూదమూ, మోసమూ మాత్రమే!

స్టాక్ బ్రోకరు కంపెనీలూ, స్టాక్ ఎక్చేంజీలూ, సమాజంలో వుండే పనికి మాలిన స్థలాల్లో కల్లా పనికి మాలిన స్థలాలు!

# వాటాల వ్యాపారంలో మోసాలు

ఏ వ్యాపారంలో అయినా 'వ్యాపార మోసాలు' వున్నట్టే, వాటాల వ్యాపారంలో కూడా దీని ప్రత్యేకతకు తగ్గట్టు, దీని మోసాలు దీనికీ వుంటాయి - ప్రైస్ రిగ్గింగూ, ఇన్ సైడ్ ట్రేడింగూ - లాంటి షోకైన మాటలతో!

'సరుకుల్ని' దాచేసి అబద్ధపు కొరత సృష్టించి, తర్వాత ధరల్ని పెంచి సరుకుల్ని అమ్మినట్టుగా, వాటాల వ్యాపారంలో కూడా చెయ్యగలుగుతారు.

ఒక బడా బ్రోకరు, A కంపెనీ వాటాల్ని సెకండరీ మార్కెట్లో, వాటాదారుల నించి 'ఎక్కువ ధరలతో' కొనడం మొదలు పెడతాడనుకుందాం. ఆ వాటాలు వున్న వాళ్ళు చాలా మంది, 'ఎక్కువ ధర వస్తోంది' కాబట్టి, తమ వాటాల్ని అమ్మేస్తారు. బ్రోకరు, చాలా వాటాలు (ఉదా: 1 లక్ష వాటాలు) కొనేసి కొన్నాళ్ళు నిల్వ చేస్తాడు - (దీనికి కావలసిన డబ్బుని బ్యాంకుల నించి 'అప్పు' తెచ్చి). ఆ లోగా కొన్ని పత్రికల్లో 'నిపుణుల' చేత ఇలా రాయిస్తాడు - "A కంపెనీ వాటాలు ఇప్పుడు దొరకడమే లేదు. బంగారంతో సమానంగా వున్నాయి. బంగారం అయినా ఎంత కావాలంటే అంత దొరుకుతోంది గానీ, ఈ వాటాలు మాత్రం కంటికి కనబడటం లేదు. ఈ వాటాలు ఎంత ధరకి దొరికినా వెనకా ముందూ చూడకుండా కొనెయ్యడం తెలివైన పని. తర్వాత చాలా తేలిగ్గా ఎంత ధరకైనా వాటిని అమ్ముకోవచ్చు. ఇప్పుడు ఆ వాటాలకు వున్న డిమాండ్ ఇంతా అంతా కాదు." - ఈ రకంగా.

ఇక ఆ వాటాల కోసం తొక్కిసలాట ప్రారంభమవుతుంది. మన వాడు ఇప్పుడు వాటిని బయటికి తీస్తాడు - ఎక్కువ ధరతో! సాయంత్రాని కల్లా అయిపోతాయి. వాటా ధరని 20 పెంచగలిగితే, లక్ష వాటాలకీ 20 లక్షలు లాభం! ఇంకా పెంచగలిగితే ఇంకా లాభం! ఆ వాటాల్ని కొన్న వాళ్ళు కూడా ఆ సందడిలో ఇంకా ఎక్కువకి అమ్ముకోగలుగుతారు. అలాగే, ఇంకా కొంత మంది కూడా, ఇలా కొని అలా అమ్మేస్తూ లాభాలు సంపాదిస్తారు. కొంత దూరం పోయాక ఏం జరుగుతుందో చెప్పక్కరలేదు.

ఈ నాటకాన్ని ఇంకా ఉన్నత స్థాయిలో నిర్వహించ గలిగితే ఇంకా అద్భుతం!

**ఇంకో నాటకం చూద్దాం:**

A, B, C, D - అనే 4 గురు బ్రోకర్లని తీసుకుందాం. వీళ్ళూ, వీళ్ళ క్లయింట్లూ, ఈ లాభాల నాటకంలో ముఖ్య పాత్ర ధారులు - అనుకుందాం. (వీళ్ళందరూ పెద్ద పెద్ద కంపెనీల పెట్టుబడి దారులే.)

నాటకం ఇలా ప్రారంభమవు తుంది:

A అమ్మే వాటాలన్నిటినీ (అవి ఏ కంపెనీలవి అయినా), ఎక్కువ ధరలతో, B కొనేస్తాడు, తన క్లయింట్ల కోసం. A చేసిన అమ్మకాల వల్ల A క్లయింట్లకి మంచి లాభాలు వచ్చేస్తాయి.

తర్వాత B అమ్మే వాటాలన్నిటినీ, ఇంకా ఎక్కువ ధరలతో, C కొనేస్తాడు. B క్లయింట్లకి చాలా మంచి లాభాలు!

C అమ్మే వాటాలన్నిటినీ మరింత ఎక్కువ ధరలతో, D కొనేస్తాడు. C క్లయింట్లకి కూడా లాభాలే లాభాలు!

D అమ్మే వాటాల్ని కూడా మళ్ళీ A, B, C లు కొనేస్తారు. మళ్ళీ మళ్ళీ లాభాలు!

ఈ 4 గురు బ్రోకర్లూ ఒకర్నించీ ఒకరు ఎగబడి ఎక్కువ ధరలతో కొనేస్తూ, వాళ్ళల్లో వాళ్ళే ఇంకా ఎక్కువ ధరలతో అమ్మేస్తూ, క్లయింట్లకు బోలెడు లాభాలు పోసేస్తూ వుంటారు.

ఇదంతా, ఈ 'నాటకం'లో లేని బయటి వాళ్ళందరికీ ఒక భ్రమ కలిగిస్తుంది. వాటాల్ని ఎంత ఎక్కువ ధరలతో కొన్నా అంత కన్నా ఎక్కువ ధరలతో అమ్మెయ్యగలమనే భ్రమని! అలా ఎక్కువ ధరలతో కొనేస్తోన్న వాళ్ళనీ, వెంటనే వాటిని ఇంకా ఎక్కువ ధరలతో అమ్మేస్తోన్న వాళ్ళనీ, వాళ్ళు సంపాదించే లాభాల రాసుల్నీ, వీళ్ళు చూస్తోనే వున్నారయ్యే!

ఇక, ఆ లాభాల వేట లోకి మొత్తం పెట్టుబడిదారీ జనాభా అంతా దిగిపోతారు. దొరికిన వాటాలన్నిటినీ ఎంతెంత ధరలతో నైనా కొనెయ్యడం మొదలు పెడతారు. ఎంత ధరతో కొనడానికైనా ప్రతీ వాడూ సిద్ధమే కాబట్టి, కిందటి వారం కొన్న వాళ్ళ వాటాలు ఈ వారానికల్లా ఎక్కువ ధరలతో అమ్ముడై పోతాయి. గ్యారంటీగా లాభాలు వచ్చేస్తూ వుంటాయి.

వాటాల ధరలు పెరిగిపోతూ వుంటాయి.

'వాటా'ని ఒక ధరతో అమ్మి, లాభం సంపాదించిన తర్వాత ఇక ఆ వ్యక్తి ఆ వాటా సంగతి వదిలేస్తాడని అర్థం కాదు. ఒక కంపెనీ వాటాని 100 తో కొని, 110 తో అమ్మి, లాభం సంపాదించిన తర్వాత, మళ్ళీ వారం రోజుల్లో అదే కంపెనీ వాటాని 120 తో కొని, 130 తో అమ్మితే, మళ్ళీ లాభం! దాన్నే మళ్ళీ 140 తో కొని, 150 తో అమ్మితే, మళ్ళీ కూడా లాభం!

ప్రతీ వాడూ ఎక్కువ ధరలతో కొనడానికి సిద్ధంగా వుంటాడు కాబట్టి, ఇదంతా సునాయాసంగా సాగిపోతూ వుంటుంది.

10 అసలు విలువ గల వాటా ధర 500 అయిందంటే (50 రెట్లు), ఆ ధరల పెరుగుదల 'స్పెక్యులేషన్' మైకంలో, జరుగుతోందని స్టాక్ ఎక్చేంజి నిపుణులు గ్రహించగలరు. కానీ, వాళ్ళు అసలు నిజం బైటకి చెప్పరు. "వాటాల్ని ఇంతింత ధరలతో కొనకండి, ఇందులో ఏదో నాటకం వుండి వుంటుంది" అని వాళ్ళు ప్రకటించవచ్చు. కానీ, ప్రకటించరు. స్టాక్ ఎక్చేంజికి ప్రతీ బేరం మీదా 'కమిషన్' వస్తుంది కాబట్టి. దాని లాభం దానిదీ!

ఒక వేళ, ఏ ఉత్తముడైనా, "ఇంతింత ధరలతో, వాటాల్ని కొనడం తెలిని మాలినతనం. తర్వాత చాలా నష్టపోతారు సుమా!" అని పత్రికల్లో హెచ్చరించినా, ఆ లాభాల మత్తులో పెట్టుబడిదారీ జనం ఆ నీతి సూక్తులేవీ చెవిన బెట్టరు.

ఒక పథకం ప్రకారం వాటా ధరల్ని పెంచే ఈ నాటకం పేరే 'ప్రైస్ రిగ్గింగ్!'. ఈ రిగ్గింగు, కొన్ని వారాలూ నెలలూ సాగుతూ వుండగా, 'నాటకాన్ని' ప్రారంభించిన వాళ్ళు, తాము కొని పెట్టుకున్న వాటాల లాట్లన్నిటినీ మితి మీరిన ధరలతో అమ్మేసి, ఊహాతీతమైన లాభాలు లాగేసి, ఇక కొంత కాలం పాటు ఆ నాటకం జోలికి పోకుండా వుంటారు.

మొత్తం మీద 'నాటకం' ప్రారంభించిన మేధావులు, వాళ్ళనుకున్నట్టే అంతా సవ్యంగా జరిగితే, అద్భుతంగా లాభాలు సంపాదిస్తారు. వాళ్ళే కాదు, ఆ నాటకంలో లేని వాళ్ళు కూడా కొందరు, ఆ ప్రవాహ వేగంలో 'కొన్న ధర కన్నా ఎక్కువకి అమ్మగలిగి', లాభాలు పోసుకుంటారు.

ఇక అప్పుడు 'క్లయిమాక్స్' సీను ప్రారంభమవుతుంది! 'నాటకం'లో లేని వాటాదార్ల చేతుల్లో విపరీతమైన ధరలతో కొనేసిన వాటాల లాట్లు చేరి పోయి వుంటాయి. వాటి ధరలు అప్పటికే ఊహాతీతమైన స్థాయిలో ఆకాశాన్ని అంటుతూ వుంటాయి!

అసలు 10 విలువ గల వాటా ధర, అనేక చేతుల మీదుగా పెరుగుతూ 900 అయితే (90 రెట్లు) ఆ వాటాని ఆ ధరతో కూడా కొన్న M, దాన్ని ఇంకా ఎక్కువకి అమ్మగలనని (గతంలో వాళ్ళంతా చేసినట్టే తనూ చేస్తానని) గాఢంగా నమ్ముతూ వుంటాడు.

ఈ జూదం ఎక్కడో అక్కడ ఆగాలి కాబట్టి, ఇక్కడే ఆగిందనుకుందాం. ఇక ఆ వాటాని ఇంకా ఎక్కువకి కొనే వాడెవ్వడూ లేని 'ఇక్కడ!'

10 వాటాని 900తో కొన్న M వ్యాపార సాహసం, ప్రశ్నార్థకంగా తయారవుతుంది. ఈ సాహసవంతుడు, ఇంకో సాహసవంతుడి కోసం చూసీ చూసీ బేజారెత్తి పోతూ వుంటాడు. ఇంత సాహసవంతుడు తను తప్ప ఇంకెవ్వడూ లేడని గ్రహించి ఎంతో సంతోషించడానికి బదులు, కుమలడం ప్రారంభిస్తాడు. అయితే కుమలడాల వల్ల వాటా ధరలు పెరగవని కొన్నాళ్ళకి గ్రహించి, చివరికి వాటాని తక్కువ ధరకి అమ్మెయ్యడానికే తెగిస్తాడు. 'తక్కువ' అంటే ఎంత తక్కువకి అమ్మాడో, M ఎంత నష్టపోయాడో ఊహించలేము. "అయ్యో! M నష్ట పోయాడే!" అని మనం M కోసం కన్నీరు కార్చనక్కర లేదు. M సాహసం ఫలించి, వాడు నష్టపోకుండా లాభపడి వుంటే, అప్పుడు M ఆనందం ఇంకోడికైనా విషాదంగా మారవలసిందే. అది ఎక్కడో అక్కడ జరగవలసిందే. అప్పుడు వాడి కోసమూ కన్నీరు కార్చనక్కర లేదు.

M నించి వాటాని తక్కువకి కొన్న వివేకవంతుడు కూడా దాన్ని మళ్ళీ ఎక్కువకి అమ్మలేడు. ఇంకా తక్కువకి అమ్మి దాన్ని వదిలించుకోవలసిందే.

మళ్ళీ ఏదో నాటకం జరిగే దాకా ఆ వాటా ధర తగ్గుతూనే పోతుంది.

బ్రోకర్లు 'ప్రైస్ రిగ్గింగ్' లాంటి మోసాలు చెయ్యగలగాలంటే, వాళ్ళకి అవసరమైనప్పుడల్లా 'డబ్బు రాసులు' అందుతూ వుండాలి. 1 లక్ష వాటాల్ని కొంత ఎక్కువ ధరతో కొని 'నిల్వ' చెయ్యాలంటే, అనేక లక్షల డబ్బు కావాలి. 10 లక్షల వాటాల్ని కొనాలంటే, కొన్ని కోట్ల డబ్బు కావాలి.

ఆ డబ్బంతా బ్రోకర్లకి బ్యాంకులే అందిస్తాయి. బ్యాంకులు, ఇతర వ్యాపారాలకు అప్పులు ఇచ్చినట్టే, 'వాటాల వ్యాపారానికి' కూడా అప్పులు ఇస్తాయి. ఇంకా సరిగా చెప్పాలంటే, 'వాటాల' వ్యాపారానికే ఎక్కువ అప్పులు ఇస్తాయి. ఎందుకంటే, వాటాల

వ్యాపారానికి 'అర్జంటు' అప్పులు అవసరమవుతాయి కాబట్టి, అలాంటి అప్పులు ఇస్తే ఎక్కువ వడ్డీ రేటుని వసూలు చెయ్యడానికి అవకాశం వుంటుంది. బ్యాంకులు చేసేది కూడా 'వ్యాపారమే' కాబట్టి, వడ్డీ వ్యాపారం చేసే పెట్టుబడి, తక్కువ వడ్డీ వేపు కన్నా ఎక్కువ వడ్డీ వేపే ఉత్సాహంగా పరుగులు తీస్తుంది కదా? కాబట్టి, బ్యాంకులు, వాటాల బ్రోకర్లకే ఎక్కువ పెట్టుబడి అందిస్తూ వుంటాయి. ఆ బ్రోకర్లు ఆ డబ్బు తోటే తమ క్లయింట్లకి అప్పులు ఇచ్చి వాళ్ళతో వాటాలు కొనిపిస్తూ వుంటారు.

బ్యాంకులు ఇచ్చే అప్పుల్లో, 'మారకం బిల్లు బ్రోకర్ల'కీ, 'వాటాల బ్రోకర్ల'కీ ఇచ్చే అప్పులే అత్యధిక భాగంగా వుంటాయి.

**'ప్రైస్ రిగ్గింగ్'కి ఇంకో వుదాహరణ:**

ఒక కంపెనీ వాటా 'ధర' తగ్గిపోతోందనుకుందాం. దాని వల్ల, ఆ కంపెనీలో వున్న 'వాటా పెట్టుబడి' తగ్గిపోయేదేమీ వుండదు. కానీ, దాని వల్ల ఆ కంపెనీకి కొత్త పెట్టుబడి దొరకని సమస్య ఏర్పడవచ్చు. కాబట్టి, ఆ కంపెనీ డైరెక్టర్ల బోర్డు, తమ వాటా ధరని తగ్గి పోకుండా ఆపడానికీ, సాధ్యమైతే ఇంకా పెంచడానికీ ఉపాయాలు ఆలోచిస్తుంది.

కొందరు బ్రోకర్లు రంగం లోకి దిగి, ఆ కంపెనీ వాటాల్ని ఎక్కువ ధరలతో కొనడం ప్రారంభిస్తారు. దానికి కావలసిన డబ్బుని, ఆ కంపెనీయే 'రహస్యంగా' అందిస్తుంది. తన వాటాల ధరల్ని పెంచే పని కంపెనీయే చేయడం, చట్ట విరుద్ధం. అందుకే ఆ రహస్యం. అప్పటి దాకా ఆ కంపెనీ వాటాల్ని అమ్మేసుకోవాలని కంగారు పడుతూ వున్న వాళ్ళు, ఆ వాటా ధర పెరగడం చూసి, తమ ప్రయత్నాలు విరమిస్తారు. కొత్త వాళ్ళు కూడా ఆ వాటాలు కొనడానికి ముందు కొస్తారు. ఆ రకంగా, తగ్గిపోతోన్న ఆ వాటా ధర నిలబడుతుంది, కొంత కాలం వరకూ. తర్వాత సంగతి తర్వాత!

ధరల్ని కుత్రిమంగా పెంచదల్చుకున్నప్పుడు బ్రోకర్లు కొన్నిసార్లు నాటకంగా, తమ వాటాల్ని బంధువులకూ, స్నేహితులకూ ఎక్కువ ధరలతో అమ్ముతారు. 'ధర' పెరిగినట్టుగా కనపడి ఆ వాటాలకు డిమాండ్ ప్రారంభం కాగానే, ఆ వాటాలు వున్న వాళ్ళు వాటిని ఎక్కువ ధరలతో అమ్మి 'లాభం' చేసుకుంటారు.

'ఆదాయం పన్ను' తగ్గించుకోవడానికి, వాటాల్ని తక్కువ ధరలకు అమ్మే 'ఉపాయం' కూడా వుంది. ఆదాయం 'ఫలానా స్థాయి'ని దాటినప్పుడు ఎక్కువ శాతం పన్నులు కట్టవలసిన 'ప్రమాదం' వుంటుంది. ఆదాయం ఆ స్థాయికి చేరనట్టుగా చూపిస్తే, ఆ ప్రమాదం తప్పుతుంది. దాని కోసం వాటాల్ని తక్కువ ధరలతో అమ్మడం ఒక మార్గం. అయితే, ఆ తక్కువ ధరలతో అమ్మేది, బయటి వాళ్ళకి కాదు; కుటుంబ సభ్యులకే! భార్యా భర్తల్లో కూడా ఎవరి ఆదాయం లెక్కలు వాళ్ళవే కాబట్టి, భర్త తన వాటాల్ని భార్యకే తక్కువ ధరకి అమ్మేస్తాడనుకుందాం. భర్తకి ఆదాయం తగ్గి, పన్ను కూడా తగ్గుతుంది. వాటాలా? ఎక్కడికీ పోవు. వాటిని మళ్ళీ తర్వాత కొత్త టెక్నిక్‌తో ఎక్కువకి అమ్ముకోవచ్చు. అయితే, అప్పుడైనా ఆదాయం పెరుగుతుంది. అది ఇంకో సంవత్సరానికి సంబంధించిన లెక్కకావచ్చు. ఇంకేదో కావచ్చు. అది వేరే సంగతి.

**ఇన్‌సైడ్ ట్రేడింగ్:** అంటే, కంపెనీలో జరగబోయే మార్పుల సమాచారాన్ని ముందే సంపాదించి, దాన్ని బట్టి 'వాటాల వ్యాపారం' చెయ్యడం. A కంపెనీకి ఏదన్నా 'నష్టం' జరగబోతోందనుకుందాం. ఆ సమాచారం బైటికి రాక ముందే, బ్రోకరు తన దగ్గిర వున్న A కంపెనీ వాటాల్ని అమ్మేస్తే, తర్వాత జరగబోయే 'నష్టం' నించి బయట పడవచ్చు. లేదా, ఆ కంపెనీకి ఏదన్నా 'లాభం' జరగబోతోందంటే, ఆ వాటాల్ని కొని పెట్టేస్తే, ఆ మార్పేదో జరిగి వాటా ధర పెరిగినప్పుడు బోలెడు 'లాభం' సంపాదించవచ్చు.

కంపెనీ లోపల జరగబోయే మార్పులన్నీ చాలా 'రహస్యం'గా వుంటాయి. కానీ ఆ రహస్యాలు కంపెనీ డైరెక్టర్లకీ, మేనేజర్లకీ, ఆఫీసు ఉద్యోగులకూ, కంపెనీ డబ్బు వ్యవహారాలు చూసే బ్యాంకులకూ తెలిసే రహస్యాలే. ఆ సమాచారం, కంపెనీ బ్రోకర్లకు కూడా అందుతుంది. ఆ సమాచారానికి తగ్గట్టుగా బ్రోకరు, వ్యాపారంలో 'లాభం' సంపాదిస్తాడు. ఆ లోపలి సమాచారాన్ని బ్రోకరుకి అందించిన వారికి ఆ 'లాభంలో కొంత వాటా!'

కంపెనీల డబ్బు వ్యవహారాలు చూసే బ్యాంకులకు కూడా కంపెనీలో సమాచారం ముందే తెలుస్తుంది కాబట్టి, అవి కూడా ఆ కంపెనీ వాటాల్ని ముందే కొనెయ్యడమో, లేదా ముందే అమ్మెయ్యడమో చేసి సమయానుకూలంగా లాభపడతాయి.

# ఇంకా ఇతర విషయాలు కొన్ని

ఒక కంపెనీ డైరెక్టర్లకి, ఆ కంపెనీలో కొన్ని వాటాలు ఎప్పుడూ తప్పనిసరిగా వుండి తీరాలి. అంటే, వాళ్ళ పెట్టుబడి కూడా కొంత కంపెనీలో వుండాలి. వాళ్ళ స్వంత పెట్టుబడి లేకుండా, అంతా 'పబ్లిక్' పెట్టుబడి మీదే కంపెనీని నడపడానికి వీలు లేదు. కంపెనీని ప్రారంభించినప్పుడైతే ప్రమోటర్లందరికీ, వుండవలసినన్ని వాటాలూ, ఇంకా ఎక్కువ వాటాలూ కూడా వుంటాయి. కానీ, క్రమంగా ఆ వాటా ధర బాగా పెరిగిన తర్వాత, ప్రమోటర్లు, తమ కోటా - వాటాల్ని కూడా చాలా వరకూ అమ్మేసి లాభాలు సంపాదించడం ప్రారంభిస్తారు. వాళ్ళు అప్పటికే ఆ కంపెనీకి 'డైరెక్టర్లు'గా స్థిరపడి వుంటారు కాబట్టి, 'కోటా' ప్రకారం వాళ్ళకి ఎన్ని వాటాలు వుండాలో అన్ని లేక పోయినా, తాము డైరెక్టర్లు గానే వుండగలమనే ధీమాతో అలా చేస్తారు. వాళ్ళని తీసి వేసే ప్రయత్నం 'జనరల్ బాడీ' చెయ్యదు. డైరెక్టర్లు, కోటా వాటాల్ని అమ్మేసుకోవడమూ, వాటిని ఇతరులు కొనడమూ కూడా, చట్ట వ్యతిరేకాలే. కానీ, జనరల్ బాడీ సభ్యులు డైరెక్టర్లకి ఎదురు తిరిగితే, 'చట్టం' వాళ్ళకి సహాయం చెయ్యగలదు గానీ, జనరల్ బాడీయే వూరుకున్నప్పుడు చట్టం ఏమీ చెయ్యదు. డైరెక్టర్లు తమ వాటాల్ని అమ్మేసుకోగా వచ్చిన డబ్బుతో ఇంకో కంపెనీలో వాటాలు కొంటారు. క్రమంగా అక్కడ కూడా స్థానం సంపాదిస్తారు. ఈ రకం చట్ట వ్యతిరేకాలన్నీ జరిగి పోతూనే వుంటాయి.

1. ఒక ప్రైవేటు కంపెనీ, తన వాటాల్ని విడుదల చేసినప్పుడు, ఆ వాటాలన్నీ సునాయాసంగా అమ్ముడై పోవు. పత్రికల్లో ఎన్ని ప్రకటనలు చేసినా, అలాంటి ప్రకటనలు అన్ని కంపెనీలూ చేస్తూనే వుంటాయి కాబట్టి, వాటాల్ని అమ్ముకునే పోటీలో ఏ కంపెనీ అయినా, ఎవరి రహస్య ప్రయత్నాలు వాళ్ళు చేసుకోవలిసిందే. అలాంటి ప్రయత్నాల్లో ఒకటి - ప్రభుత్వ రంగ సంస్థల అధికారుల్ని పట్టుకోవడం, అంటే ఆ అధికారుల ద్వారా తమ వాటాల్ని కొనిపించడం. ప్రభుత్వ రంగ కంపెనీలూ, ప్రభుత్వ రంగ బ్యాంకులూ, ప్రైవేటు సంస్థల్లో పెట్టుబడులు పెట్ట కూడదనీ, పెట్టినా ఫలానా స్థాయిని దాటి పెట్ట కూడదనీ, 'రూలు' వుందనుకుందాం. కానీ, చాలా మంది అధికారులు, ఏ రూలునీ పాటించరు. వాళ్ళ స్వంత లాభమే వాళ్ళ రూలు. వాళ్ళ మీదకి విచారణలూ అవీ, ఏ వెయ్యి సంవత్సరాలకో ఒకసారి గానీ రావు కాబట్టి వాళ్ళకా ధైర్యం. రూలుకి విరుద్ధంగా, ఆ ప్రభుత్వ సంస్థ కోసం, ప్రైవేటు కంపెనీల వాటాల్ని రహస్యంగా కొని, ఆ కంపెనీలకు తోడ్పడతారు. క్రమంగా ఆ వాటాలకు డిమాండ్ ఏర్పడినప్పుడు వాటిని అమ్మేస్తే, రూల్ని అతిక్రమించిన సంగతే బయటికి రాదు. 'డబ్బు'కి సంబంధించిన లెక్కలన్నీ ఎలా చూపిస్తారంటే, ఎలా కావాలంటే అలా చూపిస్తారు. లెక్కలు చూపించడంలో టెక్నిక్కులన్నీ అందుకే. ఎక్కౌంటింగూ, ప్రభుత్వ ఆడిటింగూ అనేదంతా పెద్ద భ్రమ!

2. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీల వాటాల్ని కొనవచ్చనే రూలు వుందనుకుందాం. సెకండరీ మార్కెట్లో ఆ వాటాల్ని కొనేటప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, తమకు కావలసిన బ్రోకర్లకు లాభాలు పెరిగే విధంగా, ఎక్కువ ధరలతో ఆ వాటాల్ని కొంటారు. అధికారులు ఖర్చు పెట్టేది ప్రభుత్వ ఫండ్సే కాబట్టి వారు ఉత్సాహం గానే ధరలు పెంచగలుగుతారు. తర్వాత ఆ వాటాల్ని అమ్మినప్పుడు నష్టం వస్తే, వ్యాపారంలో లాభ నష్టాలు సహజమే కాబట్టి, నష్టాల్ని కూడా ధైర్యం గానే చూపించగలుగుతారు. ఈ రకంగా ప్రభుత్వాధికారులు ప్రైవేటు కంపెనీల కోసం తమకు సాధ్యమైన సహాయాలన్నీ చేస్తే, రేపు వీరు రిటైర్ అయినప్పుడు గానీ, అంతకు ముందే గానీ, ఆ ప్రైవేటు కంపెనీలకు డైరెక్టర్లో మరోటో అవుతారు.

3. ప్రైవేటు కంపెనీలు, ప్రభుత్వ కంపెనీల నించీ ఉత్పత్తులు కొంటూ, తమ ఉత్పత్తుల్ని వాటికి అమ్ముతూ వుంటాయి కదా? ఆ బేరాలన్నీ ఎప్పుడూ ప్రైవేటు కంపెనీలకే అనుకూలమైన ధరలతో సాగుతాయి. అంటే, ప్రైవేటు కంపెనీ కొనేటప్పుడు కొంత చౌక ధరలూ, అదే తన ఉత్పత్తిని అమ్మేటప్పుడు ప్రియం ధరలూ! ఇదంతా ప్రభుత్వ కంపెనీల అధికారుల సహకారం తోటే జరుగుతుంది. ఆ సహకారానికి బదులుగా ఆ అధికార్లకి ఆ ప్రైవేటు కంపెనీ వాటాలు చాలా తక్కువ ధరలతో అందవచ్చు.

4. కొన్ని సందర్భల్లో ప్రైవేటు కంపెనీల నించీ కొందరు జడ్జీలకు కూడా వాటాలు కారు చౌక ధరలతో అందవచ్చు. ఎందుకంటే, ఆ కంపెనీ కేసు ఏదో కోర్టులో నడుస్తూ వుంటుంది. ఆస్తి తగాదాల కేసో, ఇతర కంపెనీలతో పోటీ తగాదాల కేసో, కార్మికుల మీద కేసో! ఆ కేసులో తీర్పు చెప్పబోయే జడ్జీకి, 10 లక్షల ఖరీదు చేసే వాటాలు పడేస్తే, కేసులో కావలసినంత 'విజయం'!

5. 'వాటాల' మోసాల్లో ఒక 'చక్కని' పద్ధతి: అసలు, కంపెనీ లేకుండానే ఏదో బోగస్ కంపెనీ పేరుతో వాటాల్ని అమ్మేసి డబ్బు లాగెయ్యడం. వాటాలు కొన్న వాళ్ళకి వాటా సర్టిఫికెట్లు భద్రం గానే అందుతాయి. కానీ, ఎన్నాళ్ళు చూసినా డివిడెండ్లు రావు. వాటాదారులు గగ్గోలెత్తగా విచారణ ప్రారంభిస్తే, అసలు ఆ కంపెనీయే లేదని తేలుతుంది! ఇది మరీ అద్భుతం!

'వాటాల వ్యాపారం'లో మోసాలు, ఇంకా ఇంకా అనేక రకాలుగా వుండవచ్చు. పెట్టుబడిదారీ టక్కరితనం ఎన్ని రకాల మోసాల్ని కనిపెట్టగలదో అన్ని రకాలుగా!

### మార్క్సు మాటల్లో:

"ఇక్కడ (స్టాక్ కంపెనీ విధానంలో) 'ఆస్తి అనేది, స్టాకుల రూపంలో వుంటుంది కాబట్టి, దాని చలనమూ, బదిలీ కూడా, స్టాక్ ఎక్స్ఛేంజీలో జరిగే జూదాల పర్యవసానంగా అయిపోతుంది - ఎక్కడైతే, చిన్న చేపల్ని తిమింగలాలూ, మేకల్ని తోడేళ్ళూ కబళిస్తాయో అక్కడ జరిగే జూదాల పర్యవసానంగా"- [కాపిటల్ 3, పేజీ 440, మాస్కో.]

వాటాదారుల్లో చిన్న స్థాయి వాళ్ళని 'చిన్న చేపల' తోటీ, 'మేకల' తోటీ, పోలుస్తున్నాడు - మార్క్సు. 'లాభాల' కోసం కలలుగనే ఏ వాటాదారులూ నిజానికి 'మేకలు' కారు. వాళ్ళే కాస్త ఎదిగితే వాళ్ళూ తిమింగిలాలూ, తోడేళ్ళూ అయిపోతారు. అయినప్పటికీ, ఆ వాటాదారుల్లోనే మోసాలు చెయ్యడానికి అవకాశాలు గల వాళ్ళతో పోలిస్తే, ఆ అవకాశాలు లేని వాళ్ళు 'మేకల' లాంటి వాళ్ళన్న మాట!

అప్పుడప్పుడూ ఈ మోసాల మీద కూడా తనిఖీలు జరుగుతూ వుంటాయి. తనిఖీల అనంతరం - "స్టాక్ ఎక్స్ఛేంజీ కార్యక్రమాల్లో చాలా నీతి లేని పనులు జరిగాయి" అని రిపోర్టులు ప్రకటిస్తారు.

'నీతి లేని పనులు' అంటే - బ్రోకర్లు, ఆదాయం పన్నులు కట్టక పోవడమూ, పన్నులు ఎగవెయ్యడానికి రక రకాల చట్ట విరుద్ధ మార్గాలు తొక్కడమూ, స్టాక్ ఎక్స్ఛేంజీ నిధుల్ని అధికారులు దుర్వినియోగం చెయ్యడమూ; కొన్ని కంపెనీలూ, కొందరు బ్రోకర్లూ, ప్రభుత్వాధికార్లకూ, జడ్జీలకూ వాటాల్ని, అతి తక్కువ ధరలతో సమర్పించడమూ, కంపెనీల సమాచారాన్ని ముందే సంపాదించి, దానికి తగ్గట్టుగా వ్యాపారం చెయ్యడమూ - వగైరా పనులు!

ఇవే 'నీతి లేని పనులు' అయితే, ఇవి స్టాక్ బ్రోకర్ల ద్వారానే కాదు, ఇతర పెట్టుబడిదారీ రంగాలన్నిటిలోనూ జరుగుతూనే వుంటాయి. అందరూ పన్నులు ఎగవేస్తారు. అందరూ లంచాలు తీసుకుంటారు. అందరూ నిధుల్ని దుర్వినియోగం చేస్తారు. అందరూ లాభాల కోసం ఎగబడతారు. కాబట్టి, 'నీతి లేనితనం' స్టాక్ బ్రోకర్లకూ, స్టాక్ ఎక్స్ఛేంజీలకూ పరిమితం కాదు. మొత్తం సమాజాన్నే 'నీతి లేని సమాజం'గా ప్రకటించడమే నీతి గల పని.

## మ్యూచువల్ ఫండ్ కంపెనీలు:

'వాటాల వ్యాపారం' అనే కీకారణ్యంలో ఎటు పోవాలో తోచక వాటాదారులు 'బాధలు' పడిపోతూ వుంటారు కాబట్టి, అలాంటి బాధితులందరికీ 'చేయూత' నివ్వడానికి 'మ్యూచువల్ ఫండ్ కంపెనీలు' పుట్టుకొచ్చాయి.

బ్యాంకులు, డిపాజిటర్ల కోసం వడ్డీవ్యాపారం చేసి పెట్టినట్టే, మ్యూచువల్ ఫండ్ కంపెనీలు, వాటాదార్ల కోసం 'వాటాల వ్యాపారం' చేసి పెడతాయి. స్వంతంగా గానీ, బ్రోకర్ల ద్వారా గానీ వాటాల వ్యాపారం చేసుకోలేని పెట్టుబడిదారులు, 'మ్యూచువల్ ఫండ్ కంపెనీ'లో వాటాలు కొనాలి. అంతే వాళ్ళు చెయ్యవలసింది. ఆ కంపెనీ, వాటాదార్ల డబ్బుతో, రక రకాల ఇతర కంపెనీల్లో వాటాలు కొని అమ్ముతూ, చాలా 'తెలివిగా' వ్యాపారం చేస్తూ లాభాలు సంపాదించి, వాటాదార్లకి 'డివిడెండ్లు' ఇస్తుంది. వాటాదార్లే స్వయంగా బాధలు పడక్కర లేకుండా, మ్యూచువల్ కంపెనీయే ఆ బాధలు పడుతూ వాటాదార్లకు 'సేవ' చేస్తూ, లాభాలు సంపాదిస్తుంది.

# బాండ్లూ, డిబెంచర్లూ

ఈ 2 రకాల్నీ కలిపి 'బాండ్లు' అనవచ్చు. ఇవి, 'డబ్బు అప్పు పత్రాలు'. ఒక కంపెనీకి 'డబ్బు అప్పు' కావలసి వచ్చినప్పుడు, ఈ పత్రాల్ని విడుదల చేస్తుంది. వడ్డీ రేటూ, అప్పు కాల పరిమితీ - వంటి వివరాలన్నీ ఆ పత్రాల మీద వుంటాయి. ఆ కంపెనీకి అప్పు ఇవ్వ డానికి సిద్ధపడే వాళ్ళు (వ్యక్తులూ, కంపెనీలూ, బ్యాంకులూ కూడా), ఆ పత్రాలు కొంటారు. ఆ డబ్బు, కంపెనీకి అందుతుంది. ఆ పత్రాల్ని కొనడమే ఆ కంపెనీకి అప్పు ఇవ్వడం. కంపెనీ, ఆ అప్పు మీద వడ్డీలు చెల్లిస్తూ, గడువు ముగిసి నప్పుడు అసలు కూడా చెల్లిస్తుంది.

కంపెనీ ఇచ్చే వడ్డీ రేటు, బ్యాంకు రేటు కన్నా కొంత ఎక్కువ గానే వుంటుంది. (అలా లేకపోతే, అప్పులు ఇచ్చే వాళ్ళు తమ డబ్బుని బ్యాంకు లోనే పెట్టుకుంటారు.) కొన్ని కంపెనీలు, బాండ్ల ని కొనే వాళ్ళకి కొన్ని ఆశలు కూడా చూపిస్తాయి. కొంత కాలం తర్వాత ఆ బాండ్లని 'వాటాలు'గా మారుస్తామని ప్రకటిస్తాయి. ఆ కంపెనీ - వాటాల కోసం చూస్తున్న వాళ్ళు మొదట ఈ బాండ్లని కొంటారు.

కంపెనీ లాభ నష్టాలతో బాండ్లకి సంబంధం వుండదు. కంపెనీకి లాభం వచ్చినా, నష్టం వచ్చినా; లాభం తక్కువగా వచ్చినా, ఎక్కువగా వచ్చినా - బాండ్ల మీద ఆదాయం మారదు. అది, బాండు మీద వున్న వడ్డీ రేటుని బట్టే వుంటుంది కాబట్టి, బాండు మీద వడ్డీ ఆదాయం ఎప్పుడూ ఒకే రకంగా స్థిరంగా వుంటుంది.

బాండ్ల విషయంలో కూడా 'సెకండరీ మార్కెట్టు' వుంటుంది. అంటే, బాండ్లని కూడా మళ్ళీ మళ్ళీ అమ్ముతారు. స్టాక్ ఎక్స్ఛేంజీల్లోనూ, బయటా కూడా. బాండు మీద వడ్డీ రేటు, బయట బ్యాంకు వడ్డీ రేటు కన్నా ఎక్కువగా వుంటుంది కాబట్టి, (అలా వున్నప్పుడు మాత్రమే), బాండు ధర పెరిగే అవకాశం వుంటుంది. అయితే ఆ ధర, బాండుకి వుండే 'అసలు విలువ' కన్నా మరీ ఎక్కువగా పెరగదు. ఎందుకంటే, బ్యాంకు వడ్డీ రేటు కన్నా, బాండు మీద వడ్డీ రేటు కొంచెమే ఎక్కువగా వుంటుంది కాబట్టి.

బ్యాంకు ఇచ్చే వడ్డీ 12%; బాండు మీద వడ్డీ 14% - అనుకుందాం. తేడా 2% మాత్రమే. ఇదే, 'వాటాల' విషయంలో అయితే, బ్యాంకు ఇచ్చే వడ్డీ 12% అయితే, 'వాటా'కి వచ్చే డివిడెండ్లు 30%, 40% వరకూ కూడా వుండవచ్చు. కాబట్టి, వాటాల మార్కెట్ ధరలు వాటి అసలు విలువ కన్నా కొన్ని రెట్లు ఎక్కు వగా ఏర్పడతాయి. కానీ, బాండ్ల విషయంలో మార్కెట్ ధర, అంత ఎక్కువగా ఏర్పడడానికి అవకాశం వుండదు. బాండు ధర కొంచెంగా మాత్రమే పెరుగు తుంది కాబట్టి, బాండ్లని అనేక సార్లు ఎక్కువ ధరలలో అమ్మడానికి అవకాశం వుండదు.

బాండ్ల మీద వడ్డీ రేటు స్థిరంగా వుంటుంది కాబట్టి, బయట బ్యాంకు వడ్డీ రేటు మారితే, దాన్ని బట్టి బాండ్ల ధరలు మారవచ్చు.

బాండ్లు కూడా సెక్యూరిటీలే. పెట్టిన పెట్టుబడు లకు 'సెక్యూరిటీ'గా వుండే పత్రాలు అవి.

## ప్రభుత్వ బాండ్లు :

ప్రభుత్వమూ, ప్రభుత్వ రంగ సంస్థలూ కూడా 'డబ్బు అప్పుల' కోసం, రక రకాల పేర్లతో 'బాండ్ల'ని (సెక్యూరిటీల్ని) విడుదల చేస్తాయి. కేంద్ర ప్రభు త్వమూ, కేంద్ర ప్రభుత్వ కంపెనీలూ, బ్యాంకులూ, రాష్ట్ర ప్రభుత్వాలూ, రాష్ట్ర ప్రభుత్వ కంపెనీలూ, ప్రభు త్వానికి సంబంధించిన ఇతర సంస్థలూ కూడా, అప్పుల కోసం 'బాండ్ల'ని విడుదల చేస్తాయి.

ట్రెజరీ బిల్లులూ, ట్రెజరీ నోట్లూ, సేవింగ్ సర్టి ఫికెట్లూ, రైల్వే బాండ్లూ, ఉక్కు బాండ్లూ, పవర్ బాండ్లూ, పోస్టల్ బాండ్లూ - వంటి అనేక పేర్లతో వుంటాయి, ప్రభుత్వ బాండ్లు. ఇంకా వేరు వేరు 'పథకాల' పేర్ల తోటీ, 'నాయకుల' పేర్ల తోటీ కూడా కొన్ని రకాల బాండ్లు వుంటాయి.

'ట్రెజరీ బిల్లుల' లాంటి బాండ్ల కాల పరిమితి సంవత్సరం లోపు అయితే, కొన్ని రకాల ప్రభుత్వ బాండ్ల కాల పరిమితి 20 సంవత్సరాల వరకూ కూడా, ఇంకా ఎక్కువగా కూడా, వుండవచ్చు. కాల పరిమితిని బట్టీ, అప్పు మొత్తాన్ని బట్టీ కూడా వడ్డీ రేట్లు తేడాగా వుంటాయి.

ఈ బాండ్లని కొనడమే ప్రభుత్వానికీ, ప్రభుత్వ కంపెనీలకూ, అప్పులు ఇవ్వడం.

ప్రైవేటు బాండ్ల మీద వడ్డీ రేటు కన్నా ప్రభుత్వ బాండ్ల మీద వడ్డీ రేటు కొంత తక్కువగా వుంటుంది.

ప్రభుత్వ వడ్డీ రేటు తక్కువే అయినా, ప్రభుత్వ ద్రవ్య సంస్థలన్నీ, తమ డిపాజిట్ల డబ్బులో కొంత శాతాన్ని ప్రభుత్వానికి తప్పనిసరిగా 'అప్పు' ఇవ్వాలి. అంటే, ప్రభుత్వ బ్యాంకులూ, ఇన్సూరెన్స్ కంపెనీలూ, ప్రావిడెంట్ ఫండ్ కంపెనీలూ, ఇతర ద్రవ్య సంస్థలూ, కొన్ని రకాల ప్రైవేటు బ్యాంకులూ కూడా, ప్రభుత్వ బాండ్లని కొనాలి. ఇది చట్టరీత్యా తప్పనిసరి కాబట్టి, ద్రవ్య సంస్థలన్నీ ప్రభుత్వ బాండ్లని కొంటాయి.

కొన్ని రకాల ప్రభుత్వ బాండ్లని కొంటే, 'ఆదాయం పన్ను'లో కొంత శాతం మినహాయింపు వుంటుంది. కాబట్టి, 'ఆదాయం పన్ను' చెల్లించవలసిన ప్రైవేటు కంపెనీలూ, వ్యక్తులూ కూడా, ప్రభుత్వ బాండ్లు కొంటారు.

ప్రైవేటు కంపెనీలకు అప్పులు ఇవ్వడానికి భయపడే వాళ్ళు కూడా, ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రేటు తక్కువ అయినా ప్రభుత్వ బాండ్లనే కొంటారు. ఈ రకంగా ప్రభుత్వం, దేశంలో అనేక మార్గాల నించీ అప్పులు తీసుకుంటుంది. (ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ కూడా ప్రభుత్వంలో భాగం గానే అనుకోవాలి.) ఇదంతా ప్రభుత్వానికి 'స్వదేశీ అప్పు'.

ఇదే గాక, ప్రభుత్వం 'విదేశీ అప్పులు' కూడా తీసుకుంటుంది. ('విదేశీ అప్పు' గురించి వేరే చోట ఇంతకు ముందే చూశాం.)

ఈ స్వదేశీ, విదేశీ అప్పులన్నీ కలిసి ప్రభుత్వానికి ఏటా కొన్ని వందల, వేల కోట్ల అప్పు వుంటుంది. ఈ అప్పులన్నిటి మీదా ప్రభుత్వం ఏటా వడ్డీలు చెల్లించాలి. మెచ్యూర్ అయిన అప్పుల్ని కూడా ఏటా తీరుస్తూ వుండాలి.

'ఉత్పాదక' అవసరాల కోసం తీసుకున్న అప్పుల మీద వడ్డీల్ని ఆ పెట్టుబడి ద్వారా వచ్చే జనరల్ 'లాభం'లో నించే చెల్లించవచ్చు 'అనుత్పాదక' అవసరాల కోసం తీసుకున్న 'అసలు'నీ, వడ్డీల్నీ, 'పన్నుల' ద్వారా వచ్చే ఆదాయంలో నించే చెల్లించాలి. ఇంకా కొన్ని అప్పులు మిగిలి వుంటే, వాటిని మళ్ళీ 'కొత్త అప్పులు' తీసుకోవడం ద్వారా చెల్లిస్తారు.

ప్రభుత్వ బాండ్లని, మొదట ప్రభుత్వ బ్యాంకుల ద్వారానూ, పోస్టాఫీసుల ద్వారానూ, గుర్తింపు పొందిన ఇతర బ్రోకర్ల ద్వారానూ కొనవచ్చు.

ప్రభుత్వ బాండ్ల సెకండరీ మార్కెట్ కోసం, ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ సంస్థ వుంటుంది. పెద్ద స్టాక్ ఎక్చేంజీల్లో కూడా ప్రభుత్వ బాండ్లని అమ్ముతారు.

కొన్ని రకాల బాండ్ల మీద స్పష్టమైన వడ్డీ రేటు వుంటుంది. కానీ కొన్ని రకాల బాండ్లు ఇంకో రకంగా వుంటాయి. ఎలాగంటే: బాండు కాల పరిమితి 6 సంవత్సరాలు. అది మెచ్యూర్ అయినప్పుడు దాని విలువ 1,000. దాన్ని మొదట్లో 500తో కొనాలి. అంటే మొదట 500 పెట్టుబడి పెడితే, 6 సంవత్సరాలకు ఇంకో 500 వస్తుంది. ఇది ఎంత వడ్డీ రేటు అవుతుందో లెక్క కట్టుకోవచ్చు.

ఈ బాండుని కొని పెట్టుకున్న తర్వాత, కొంత కాలానికి బాండుని కొన్న వ్యక్తికి డబ్బు కావలసి వస్తే, దాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి, తర్వాత విడిపించుకోవచ్చు. లేదా, బాండుని పూర్తిగా అమ్మెయ్య వచ్చు.

బాండుని కొన్న తర్వాత 2 సంవత్సరాలకు, దాన్ని అమ్మితే, దాని ధర ఎలా వుంటుందంటే - 500 అసలూ + దాని మీద 2 సంవత్సరాల వడ్డీ = బాండు ధర. ఆ ధరని 650 అనుకుందాం. ఆ ధరతో బాండుని కొన్న వ్యక్తి, దాన్ని తన దగ్గిర 4 సంవత్సరాలు వుంచుకుంటే, అప్పటికి బాండు మెచ్యూరై, 1,000 వస్తుంది. ఈ రకంగా, బాండ్లని, మధ్య కాలం లోనే అమ్మడమూ, వాటిని కొన్న వాళ్ళు మెచ్యూర్ కాలం వరకూ వుంచుకోవడమూ జరుగుతూ వుంటాయి.

కొన్ని రకాల బాండ్ల అమ్మకాల్లో 'వేలం పాట' పద్ధతి వుంటుంది. ఎలాగంటే: బాండు కాల పరిమితి 1 సంవత్సరం. మెచ్యూర్ అయినప్పుడు బాండు విలువ 1,000 అనుకుందాం. ఆ బాండుని కొనేటప్పుడు ఎంతకి కొనాలో ఆ ప్రారంభ ధర, వేలం పాటలో నిర్ణయమవుతుంది. ఆ వేలం పాట 'టెండర్లు వెయ్యడం' ద్వారా జరుగుతుంది. ఒక సంవత్సరంలో 'వెయ్యి'ని ఇవ్వగలిగే బాండుని ఇప్పుడు ఎంతకి కొంటారో టెండర్ల ద్వారా చెప్పాలి. కొనే వాళ్ళల్లో ఒకడు 800 అంటే, ఇంకోడు 810 అనవచ్చు. ఇంకోడు 850 అనవచ్చు. ఎక్కువకి టెండరు వేసిన వాడికే ఆ బాండ్ల లాటు దొరుకుతుంది. 850 తో కొన్న బాండు ద్వారా వెయ్యి రావడం అంటే, 850 మీద సంవత్సరానికి 150 వడ్డీ. ఆ బాండుని 850 కి గాక 800 లకే కొనగలిగితే, అప్పుడు 800 మీద సంవత్సరానికి 200 వడ్డీ వస్తుంది. వేలంలో బాండ్లని

కొంచెం తక్కువ ధరకే కొనగలిగితే, ఎక్కువ వడ్డీ రేటూ, కొంచెం ఎక్కువ ధరకి కొంటే, తక్కువ వడ్డీ రేటూ గిడతాయి.

బాండుని కొన్న తర్వాత 3 నెలలకే అమ్మాలంటే, కొన్న ధరా + 3 నెలలు వడ్డీ = బాండు ధరగా వుంటుంది.

ప్రభుత్వం, బాండ్లని అమ్మినప్పుడల్లా, కొన్ని వందల కోట్ల విలువ చేసే బాండ్ల లాట్లని అమ్ముతూ వుంటుంది.

ఒక బ్యాంకు, 200 కోట్లతో బాండ్లని కొన్నదను కుందాం. అంత డబ్బుని 'అప్పు'గా ఇవ్వడానికి వీలైన బ్రహ్మాండమైన 'ఆర్డరు' దానికి దొరికిందన్న మాట! అది ప్రభుత్వానికి ఇచ్చే అప్పు కాబట్టి, అప్పు వసూలవుతుందో లేదో అనే సమస్య వుండదు. వడ్డీ రేటు తక్కువ అయినా, ఎక్కువ డబ్బుని అప్పుగా ఇవ్వడం వల్ల, వడ్డీ మొత్తం ఎక్కువ గానే వుంటుంది.

ప్రతీ ప్రభుత్వ బ్యాంకూ, (L.I.C. వంటి ఇతర ప్రభుత్వ ఫైనాన్స్ కంపెనీలు కూడా) తమ డిపాజిట్లలో కొంత భాగంతో ప్రభుత్వ బాండ్లు తప్పనిసరిగా కొనాలని చూశాం. బ్యాంకుల్లో, డిపాజిట్లు తరచుగా మారుతూ వుంటాయి. ఒక్కోసారి డిపాజిట్లు తగ్గుతాయి; ఒక్కోసారి పెరుగుతాయి. దానికి అనుగుణంగానే బాండ్ల మొత్తాన్ని మార్చవలసి వుంటుంది. బ్యాంకులో ఆ డిపాజిట్లు పెరిగితే, అందులో కొంత భాగంతో మళ్ళీ ప్రభుత్వ బాండ్లు కొనాలి. బ్యాంకుకి, 1 లక్ష కొత్త డిపాజిట్టు వచ్చిందంటే, అందులో కొంత భాగంతో, బ్యాంకు, ప్రభుత్వ బాండ్లని కొంటుంది. లేదా, డిపాజిట్లు తగ్గిపోయినప్పుడు, కొన్ని బాండ్లని అమ్ముతుంది. లేదా, బ్యాంకు దగ్గిర కొంత డిపాజిట్ల డబ్బు ఖాళీగా పడి వుంటే, డబ్బుని అలా ఖాళీగా వుంచడం కన్నా ఏ రకం బాండ్లు కొన్నా ఎంతో కొంత వడ్డీ వస్తుంది కాబట్టి, ఏ బాండ్లు దొరికితే ఆ బాండ్లు కొంటుంది.

బ్యాంకు వ్యాపారం (ఇతర ద్రవ్య సంస్థల వ్యాపారం కూడా) ప్రధానంగా - 'వడ్డీ వ్యాపారం'. అది కూడా ఇతరుల డబ్బుతో చేసే వ్యాపారం. ఇతరుల 'డిపాజిట్ల' మీద వడ్డీ చెల్లించాలి కాబట్టి, డిపాజిట్ల డబ్బులో ఏ భాగాన్నీ ఖాళీగా వుంచకుండా దానితో వీలైనన్ని ఎక్కువ అప్పులు ఇచ్చి, ఎక్కువ వడ్డీలు సంపాదించడం చెయ్యాలి. ఇంకో వేపు, డిపాజిటర్లు డబ్బుని వెనక్కి అడిగితే తక్షణం ఇవ్వడానికి వీలుగా, డబ్బు రెడీగా వుండే లాగానూ చూసుకోవాలి. ఈ 2 షరతుల్నీ నెరవేర్చగలిగేది, ప్రభుత్వ బాండ్ల మీద పెట్టుబడి పెట్టడమే. ఆ బాండ్లని కొంటే వడ్డీ రావడమూ వుంటుంది; అవసరమైనప్పుడు ఆ బాండ్లని ఇతర బ్యాంకుల్లో 'రీ డిస్కౌంట్' చేయించి డబ్బుగా మార్చుకోవడమూ తేలిగ్గా సాధ్యమవుతుంది. కాబట్టి, ప్రభుత్వ బాండ్లని కొనడం - 'నగదు నిల్వ' వుంచుకోవడంతో సమానంగా బ్యాంకులు భావిస్తాయి.

అంతే గాక, బ్యాంకులు బిల్ బ్రోకర్లకీ, స్టాక్ బ్రోకర్లకీ అర్జంటు అప్పులు కూడా ఇస్తూ వుంటాయి. ఇలాంటి అప్పులు ఇవ్వడమూ, అవి వెనక్కి రావడమూ కొన్ని గంటల్లో (ఒక వారం లోగా) జరిగిపోతూ వుంటుంది. ఇవి, 'పిలవ గానే' వెనక్కి వచ్చే అప్పులు కాబట్టి, ఇవి 'కాల్ మనీ' అప్పులు. ఇలాంటి అప్పుల మీద ఎక్కువ వడ్డీ రేటు వస్తుంది. ఈ అప్పుల వల్ల, వడ్డీ సంపాదించడమూ సాధ్యమవుతుంది; అవసరమైనప్పుడు తక్షణం డబ్బు అందడమూ జరుగుతుంది. కాబట్టి, బ్యాంకులు ఇలాంటి అప్పులు కూడా ఎక్కువగా ఇస్తూ వుంటాయి.

## సెక్యూరిటీ పత్రాలు :

వాటాలూ బాండ్లూ డిబెంచర్లూ వగైరా పత్రాలన్నీ - 'సెక్యూరిటీ పత్రాలు'. పెట్టిన పెట్టుబడులకు 'సెక్యూరిటీ'గా వుండే పత్రాలు అవి. 'మారకం బిల్లులు' కూడా ఒక రకపు సెక్యూరి టీలే.

సెక్యూరిటీలు అన్నప్పుడు, అవి, వాటాలైనా కావచ్చు, బాండ్లయినా కావచ్చు, బిల్లులైనా కావచ్చు. అవి, ప్రభుత్వ కంపెనీల వైనా కావచ్చు. ప్రైవేటు కంపెనీల వైనా కావచ్చు. స్వదేశీ పత్రాలైనా కావచ్చు, విదేశీ పత్రాలైనా కావచ్చు. ఆ పత్రాలన్నీ సెక్యూరిటీలే.

బ్యాంకులూ, ఇతర ఫైనాన్స్ సంస్థలూ, ఈ సెక్యూరిటీల్ని కొంటూ; వాటి డబ్బు అవసరాల్ని బట్టీ, ఇతర వ్యాపార అవసరాల్ని బట్టీ మధ్య లోనే వాటిని అమ్మివేస్తూ; కావలసినప్పుడు మళ్ళీ కొత్త సెక్యూరిటీల్ని కొంటూ - ఈ రకంగా, వడ్డీ వ్యాపారాలు సాగిస్తూ వుంటాయి. ఈ వ్యాపారం ద్వారా బ్రోకర్లు విపరీతంగా లాభ పడతారు

# స్టాక్ బ్రోకర్లతో బ్యాంకుల కుమ్మక్కు

**'బిల్లు బ్రోకర్ల'**తో బ్యాంకు అధికార్ల కుమ్మక్కుల గురించి ఇంతకు ముందు చూశాం. ఇప్పుడు, 'స్టాక్ బ్రోకర్ల'తో వారి కుమ్మక్కులు చూద్దాం.

బ్యాంకులకు (ఇతర ఫైనాన్స్ సంస్థలకు కూడా) వాటాలూ బాండ్లూ వంటి సెక్యూరిటీల్ని కొనిపెట్టే, అమ్మి పెట్టే పనులు, స్టాక్ బ్రోకర్ల ద్వారా జరుగుతాయని చూశాం. బ్రోకర్లు, ఈ లావాదేవీల్లో, బ్యాంకు డబ్బుని తమ స్వంత వ్యాపారానికి కూడా యథేచ్ఛగా వాడుకో గలుగుతారు. ఎలాగంటే:

ఒక బ్యాంకు, ఏవో సెక్యూరిటీలు కొనిపెట్టమని బ్రోకరుకి కొంత డబ్బు ఇచ్చిందనుకుందాం. బ్రోకరు ఆ డబ్బుతో కొంత కాలం పాటు తన స్వంత వ్యాపారం చేసుకుంటాడు. అంటే, తన కోసం వాటాల్ని కొనడమూ అమ్మడమూ కొన్నిసార్లు చేసుకుని, అప్పుడు నెమ్మదిగా ఆ డబ్బుతో బ్యాంకుకి కొనిపెడతాడు. ఈ వ్యవహారంతో బ్యాంకు అధికారులు కూడా సహకరిస్తేనే అది జరుగుతుంది. వాళ్ళు ఎందుకు సహకరిస్తారంటే, వేరే చెప్పాలా? - దాని వల్ల వాళ్ళ స్వంతానికి ఒక 'లాభం' ఏదో రూపంలో దొరకవచ్చు. వారు కోరే ఫలానా కంపెనీ వాటాలు మార్కెట్ ధర కన్నా తక్కువతో దొరకవచ్చు. లేదా వారి కుటుంబ సభ్యుల కెవరికైనా ఏ విదేశీ బ్యాంకుల్లోనో, పెద్ద కంపెనీల్లోనో గొప్ప ఉద్యోగాలు దొరకవచ్చు. లేదా, డైరెక్టుగా కొంత డబ్బు మూటే దొరకవచ్చు. లేదా ఇంకేదో! లాభ మార్గాలకేం తక్కువ?

A, B అనే ఇద్దరు పెట్టుబడిదారులు, ఒకరి సరుకుల్ని ఒకరు కొనాలనుకుందాం. A సరుకుని B, ఫలానా ధరతో ఇప్పుడే కొంటాడు. B సరుకుని A, ఫలానా ధరతో 3 నెలల తర్వాత కొంటాడు. B సరుకు ధర, 3 నెలల నాటికి ఇంకా పెరిగినా, తగ్గినా, ఇప్పుడు నిర్ణయించుకున్న ధర ప్రకారమే ఆ సరుకుని ఇవ్వాలి. ధరల గురించి ఇలాంటి ఒప్పందాన్ని 'రెడీ ఫార్వర్డ్ డీలింగ్' అంటారు.

ఇలాటి వ్యవహారాలు, బ్యాంకుకీ బ్రోకరుకీ మధ్య నిజం గానూ జరగవచ్చు, అబద్ధం గానూ జరగవచ్చు.

**నిజంగా జరిగితే:** బ్రోకరు, బ్యాంకుకి ఇప్పుడు ఫలానా ధరతో కొన్న షేర్లు కొనిపెడతాడు. బ్యాంకు, బ్రోకరుకి డబ్బు ఇచ్చేస్తుంది. ఆ డబ్బుని బ్రోకరు, షేర్లని అమ్మిన వాళ్ళకి ఇచ్చేస్తాడు. 3 నెలల తర్వాత, ఆ బ్రోకరే, బ్యాంకు నించీ ఆ షేర్లనే కొంత ఎక్కువ ధరతో తిరిగి కొనాలని మొదటే నిర్ణయం వుంటుంది. ఆ ప్రకారమే బ్రోకరు మళ్ళీ ఆ షేర్లని కొంటాడు. బ్యాంకుకి కొంత లాభంతో సహా డబ్బు తిరిగి వస్తుంది. బ్రోకరుకి కమిషన్లు వస్తాయి.

**ఈ వ్యవహారం అబద్ధంగా జరిగితే:** బ్రోకరు బ్యాంకుకి ఏవో సెక్యూరిటీలు కొనిపెట్టినట్టూ, అవి బ్యాంకుకి అందినట్టూ, రాసుకుంటారు. నిజానికి, బ్రోకరు ఏమీ కొనిపెట్టడు. ఆ సెక్యూరిటీలు బ్యాంకులో వుండవు. కానీ, బ్రోకరుకి బ్యాంకు, డబ్బు ఇచ్చేస్తుంది. ఆ డబ్బుతో బ్రోకరు, కొంతకాలం (ఉదా: 3 నెలలు) స్వంత వ్యాపారం చేసుకుంటాడు. ఆ 3 నెలల కాలంలో, బ్యాంకులో తనిఖీ గనక జరిగితే, బ్యాంకు అధికారులు చేసిన మోసం బయట పడవచ్చు. కానీ, అలాంటి తనిఖీలు జరగవు. తనిఖీలు చేసే అధికారులు కూడా నీతి చంద్రులు కారు గదా? వాళ్ళూ లంచాలు తింటారు కాబట్టి, నిజం బైటికి రాదు. తర్వాత, 3 నెలలకు బ్రోకరు డబ్బు పట్టుకుని బ్యాంకు దగ్గిరికి వచ్చి "3 నెలల కిందట చేసుకున్న ఒప్పందం ప్రకారం, ఆ సెక్యూరిటీల్ని ఇప్పుడు నేను ఎక్కువ ధరతో కొంటాను" అంటాడు. బ్యాంకు, ఆ సెక్యూరిటీల్ని ఎక్కువ ధరతో అమ్మి వేసినట్టూ, అవి బ్యాంకు నించి వెళ్ళి పోయినట్టూ, డబ్బు వెనక్కి వచ్చేసినట్టూ, మళ్ళీ రాసుకుంటారు. బ్రోకరు, డబ్బు ఇచ్చేస్తాడు.

బ్యాంకు వేపు నించి చూస్తే - సెక్యూరిటీల్ని తక్కువ ధరకి కొని, కొంచెం ఎక్కువ ధరకి అమ్మినట్టూ, దాని ద్వారా బ్యాంకు కొంత లాభం సంపాదించినట్టూ వుంటుంది.

బ్రోకరు వేపు నించి చూస్తే - బ్యాంకు నించి తీసుకున్న మొత్తం కన్నా కొంత ఎక్కువ డబ్బే బ్యాంకుకి చెల్లిస్తాడు. ఇది, బ్యాంకు నించి తీసుకున్న డబ్బుకి 'వడ్డీ' చెల్లించినట్టుగా మాత్రమే అవుతుంది. దాని వల్ల బ్రోకరు కేమీ నష్టం వుండదు. పైగా, బ్రోకరుకి 2 సార్లూ కమిషన్లు వస్తాయి.

అయితే, బ్రోకరు ఆ డబ్బుని బ్యాంకు నించి 'అప్పు' గానే ఎందుకు తీసుకోడు? ఈ అడ్డ దారులన్నీ ఎందుకు పడతాడు? - అప్పుగా ఎందుకు తీసుకోడంటే, స్టాక్ బ్రోకర్లకి ఎక్కువ అప్పులు ఇవ్వరాదనీ, ఇచ్చినా ఫలానా షరతుల తోటే ఇవ్వాలనీ, చాలా నిబంధనలు వుంటాయి. అదీ గాక, అప్పు తీసుకోవాలంటే, ఆస్తుల్ని ష్యూరిటీగా చూపించాలి. కొన్నిసార్లు - అప్పులు గానూ తీసుకుంటారు. బ్రోకర్లు ఎప్పుడూ అప్పులు తీసుకోరని కాదు. కానీ, ప్రతీసారీ అప్పుగా తీసుకోవాలంటే, దానికి చాలా నిబంధనలు వుంటాయి. కాబట్టి, ఆ తతంగాలన్నీ లేకుండా, బ్యాంకుకి సెక్యూరిటీల్ని కొనిపెట్టడానికే డబ్బు తీసుకున్నట్టుగా అయితే, బ్యాంకు నించి డబ్బు తీసుకోవడం చాలా తేలిక. బ్యాంకుకి ఆ సెక్యూరిటీల్ని నిజంగా కొని పెడితే, ఆ డబ్బుని సెక్యూరిటీల్ని అమ్మిన వాళ్ళకి చెల్లించి వెయ్యాలి. ఆ డబ్బుని బ్రోకరే వాడుకోవడానికి వీలు వుండదు. కాబట్టి, సెక్యూరిటీల్ని కొనకుండా వుంటేనే ఆ డబ్బుని బ్రోకరు కొన్ని నెలల వరకూ వాడుకోవచ్చు.

డబ్బు తీసుకు పోయిన బ్రోకరు, బయట వ్యాపారంలో ఘోరంగా నష్ట పోతాడనుకుందాం. బ్యాంకుకి డబ్బు తిరిగి ఇవ్వలేడు. బ్యాంకు దగ్గిరేమో సెక్యూరిటీలు వుండవు. అప్పుడేమవుతుంది? - ఏమీ అవదు. బ్రోకరు ఆ సెక్యూరిటీల్ని బ్యాంకు నించి కొని డబ్బు ఇచ్చేశాడనీ, తర్వాత మళ్ళీ ఇంకో రకం సెక్యూరిటీల్ని కొనిపెట్టి ఈ మధ్యనే డబ్బు మళ్ళీ తీసుకున్నాడనీ రాసుకుంటే, సరిపోతుంది. ఈ కొత్త సెక్యూరిటీలు బ్యాంకు దగ్గిర వున్నాయా - అనే తణిఖీ ఎలాగూ జరగదు. డబ్బు చెల్లించడానికి బ్రోకరుకి ఇంకా కొన్ని నెలల కాలం దొరుకుతుంది. అప్పటికి బ్రోకరు మళ్ళీ వ్యాపారం చేసి ఆ డబ్బు చెల్లించెయ్యవచ్చు. అప్పటికీ చెల్లించలేకపోతే, ఇంకా అనేక రకాల ఉపాయాలు ఎలాగూ వుంటాయి. లేదా, ఏ ఉపాయమూ పని చెయ్యకపోతే, బ్యాంకు మునుగుతుంది. అంతే!

**ఇంకో ఉదాహరణ:** బ్యాంకు నించి బ్రోకరు 5 లక్షలో 10 లక్షలో 'అప్పు' గానే తీసుకుంటాడనుకుందాం. ష్యూరిటీగా కొన్ని సెక్యూరిటీ పత్రాలు కూడా పెడతాడు. కానీ, అవి 'ఫోర్జరీ పత్రాలు'! అంటే, బ్రోకరు గనక ఆ అప్పు తీర్చకపోతే ఆ పత్రాలు బ్యాంకుకి ఎందుకూ పనికి రావన్న మాట! అవి 'దొంగ పత్రాలని' బ్యాంకు అధికారికి తెలిసే అంగీకరించవచ్చు. బ్రోకరు ఆ అప్పు తీర్చేసినప్పుడు, ఆ పత్రాల్ని వెనక్కి తీసేసుకుంటాడు కాబట్టి, అసలు సంగతి బయటికి రాకుండా మాఫీ అయిపోతుంది. ఆ దొంగ పత్రాలు బ్యాంకులో వుండగానే బ్యాంకు మీద తనిఖీ జరగదని బ్యాంకు అధికారికి ధీమా! ఒక వేళ అలాంటి సమయం లోనే తనిఖీ జరిగితే, ఆ పత్రాలు ఫోర్జరీ పత్రాలనే సంగతి తను గమనించలేక పోయాననీ, గమనించ లేకపోవడం వల్లనే ఆ పొరపాటు జరిగిందనీ, ఆ లంచగొండి అధికారి వాదించుకోగలడు. అయినా, తనిఖీ చేసే అధికారి కూడా లంచగొండి కాకూడదా? అప్పుడు సమస్యే తలెత్తదు కదా?

**ఇంకో ఉదాహరణ:** తన దగ్గిర వున్న వాటాలకు ధరలు తగ్గబోతున్నాయని ఒక బ్రోకరు, ముందే గ్రహించాడనుకుందాం. వెంటనే ఆ వాటాల కట్టలన్నీ ఒక బ్యాంకుకి అమ్మేస్తాడు. ఆ బేరం, ఆటంకాలు లేకుండా జరగాలంటే, బ్యాంకు అధికారి సహకారం వుండవలసిందే. బ్యాంకుకి వాటాల్ని అమ్మేసి బ్రోకరు సురక్షితంగా బయట పడతాడు. వాటాలు బ్యాంకు పాలబడతాయి. తర్వాత ఏం జరిగినా లాభ నష్టాలు బ్యాంకువే!

బ్యాంకులు ఎప్పుడూ సెక్యూరిటీల్ని కొంటూ అమ్ముతూ వుంటాయి. తక్కువ ధరతో కొన్నా ఎక్కువ ధరతో కొన్నట్టూ; ఎక్కువ ధరతో అమ్మినా, తక్కువ ధరతో అమ్మినట్టూ లెక్కల్లో చూపడం సాధ్యమే. ఈ పనిలో అధికార్లకు బ్రోకర్ల సహకారం కావాలి. లెక్కల్లో చూపకుండా మాయం చేసిన లాభాలు, అంత చాతుర్యం ప్రదర్శించిన అధికార్లకూ, బ్రోకర్లకూ!

**ఇంకో ఉదాహరణ:** ప్రభుత్వ బ్యాంకు గానీ, L.I.C గానీ, ప్రభుత్వ ఫైనాన్స్ కార్పొరేషన్ గానీ - ప్రైవేటు కంపెనీలకు అప్పులు ఇవ్వరాదనీ, ఇచ్చినా ఫలానా మొత్తాన్ని మించి ఇవ్వరాదనీ - ఏవో నిబంధనలు వున్నాయి - అనుకుందాం. కానీ, ఒక ప్రైవేటు కంపెనీకి, ఒక ప్రభుత్వ బ్యాంకు నించే పెద్ద అప్పు కావాలి. ప్రభుత్వం చెప్పే నిబంధనలతో సంబంధం లేకుండా కావాలి. ఎలాగ? - ఏదో ఒక మార్గం వుండక పోతుందా? ప్రభుత్వ బ్యాంకు నించో, ఇంకో ప్రభుత్వ సంస్థ నించో, ఒక విదేశీ బ్యాంకు, అప్పు తీసుకుని, దాన్ని ఆ ప్రైవేటు కంపెనీకి ఇవ్వవచ్చు. ఒక విదేశీ బ్యాంకు, A అనే ప్రభుత్వ ఫైనాన్స్ కార్పొరేషన్ నించి అప్పు తీసుకుని, దాన్ని ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిందనుకుందాం. ఈ అప్పుని ప్రైవేటు కంపెనీలకు,

ప్రభుత్వ ఫైనాన్స్ కార్పొరేషనే డైరెక్టుగా ఇవ్వలేదు కాబట్టి, దాని 'నేరం' కనపడదు. కానీ, మొత్తం మీద జరిగింది ఏమిటంటే - ఒక ప్రభుత్వ కార్పొరేషన్ నించి ప్రైవేటు కంపెనీలకు అప్పు అందడం! నిబంధనలన్నిటినీ దాటి!

**ఇంకో ఉదాహరణ:** ఒక ప్రభుత్వ కార్పొ రేషను, ఇంకో ప్రభుత్వ కార్పొరేషన్‌కి డైరెక్టు గానే అప్పు ఇవ్వగలదు. ఆ పని డైరెక్టు గానే జరిగితే, ఆ అప్పు మీద వచ్చే వడ్డీ అప్పు ఇచ్చిన బ్యాంకుకే వస్తుంది. కానీ ఎక్కడ వీలైతే అక్కడ ఏదో ఒక మోసానికి తల పెడితే అధికార్లకు బోలెడు డబ్బు! A అనే ప్రభుత్వ కార్పొరేషన్ నించి, ఒక విదేశీ బ్యాంకు, 50 కోట్లు అప్పు తీసుకుని, దాన్ని B అనే ప్రభుత్వ కార్పొరేషన్‌కి ఇచ్చిందనుకుందాం. దీని వల్ల, ఆ అప్పు మీద వచ్చే వడ్డీలో కొంత భాగాన్ని విదేశీ బ్యాంకు సంపాదిస్తుంది. ఈ వ్యవహారాన్నంతటినీ నిర్వహించిన బ్రోకర్లకు కమిషన్లూ, అధికార్లకు లాభాలూ!

ఇలాంటి మోసాలు బ్యాంకులకూ బ్రోకర్లకూ మధ్యా, బ్యాంకులకూ ప్రైవేటు కంపెనీలకూ మధ్యా - ఇంకా ఎన్ని రకాలుగా నైనా జరగవచ్చు. దాని సారాంశం అంత ఒకటే. బ్యాంకుల డబ్బుని - బ్రోకర్లూ, ప్రైవేటు కంపెనీలూ, అడ్డ దారుల్లో వాడుకోగలగడం.

పెద్ద స్థాయి బ్రోకర్లూ, కంపెనీల డైరెక్టర్లూ, బ్యాంకు అధికారులూ కలిసే ఈ నాటకాలన్నీ ఆడతారు.

**మార్క్స్ మాటల్లో:**

"క్రెడిట్ విధానం అభివృద్ధి చెందడంతో పాటు, భారీగా కేంద్రీకృతమైన లండన్ మార్కెట్ వంటి డబ్బు మార్కెట్లు - ఏవైతే సెక్యూరిటీ పేపర్‌తో జరిగే వర్తకానికి ప్రధాన కేంద్రాలుగా వుంటాయో అలాంటి డబ్బు మార్కెట్లు - ఉత్పన్నమవుతాయి. బ్యాంకర్లు, 'పబ్లిక్'కి సంబంధించిన 'డబ్బు పెట్టుబడి'ని పెద్ద పెద్ద మొత్తాలలో ఈ అభ్యంతరకర డీలర్ల గుంపు చేతిలో వుంచుతారు. ఈ విధంగా, ఈ జూదగాళ్ళ సంతతి (బ్రూడ్ ఆఫ్ గాంబ్లర్స్) అనేక రెట్లు పెరుగుతుంది" [కాపిటల్ - 3, పేజీ 511, - 12, మాస్కో 1917.]

# పాత, కొత్త 'అదనపు విలువల' కొత్త పంపకాలు

**ఉ**త్పాదక పెట్టుబడి దారుడికి, వడ్డీ పెట్టుబడి దారుడే డైరెక్టుగా అప్పు ఇచ్చే కాలాన్ని చూస్తే, 'సరుకు' ద్వారా వచ్చే వడ్డీ + సంస్థ లాభాల మొత్తం, ఆ ఇద్దరి మధ్యనే పంపకం అయ్యేది. కానీ, బ్యాంకులూ జాయింట్ స్టాక్ కంపెనీ విధానమూ, వాటాల వ్యాపారమూ ప్రారంభమైన తర్వాత, ఈ అప్పు వ్యవహారంలోకి అనేక మంది పాత్రధారులు ప్రవేశిస్తారు.

ఆ పాత్రధారులు:

1. బ్యాంకు డిపాజిటరు
2. బ్యాంకు
3. వాటాల్ని (లేదా, బాండ్లని) విడుదల చేసే కంపెనీ
4. కంపెనీ ప్రమోటర్లు
5. వాటాల్ని కొనే క్లయింటు
6. వాటా బ్రోకరు
7. స్టాక్ ఎక్ఛేంజీ

ఇంత మంది తయారవుతారు!

ఇందులో ఎవరు 'పాత అదనపు విలువ'ని తింటారో, ఎవరు 'కొత్త అదనపు విలువ'ని తింటారో, ఆయా సందర్భాన్ని బట్టి వుంటుంది.

1. వాటాల్నీ, బాండ్లనీ, మళ్ళీ అమ్మకుండా వుంచుకునే వాళ్ళు, డివిడెండ్లనీ, వడ్డీల్నీ తింటారు. ఇది, కొత్త అదనపు విలువ.

2. వాటాలతో వ్యాపారం చేసే స్పెక్యులేటర్లు, లాభాలూ నష్టాలూ తింటారు. ఇది, పాత అదనపు విలువ.

3. బ్యాంకులు, బ్రోకర్లకూ, క్లయింట్లకూ అప్పులు ఇచ్చి, వడ్డీలు తింటాయి. ఈ వడ్డీని - వాటాల

వ్యాపార లాభంలో నించి (లేదా, 'నష్టం'లో నించి) చెల్లిస్తే అది, పాత అదనపు విలువ. 'డివిడెండు'లో నించి చెల్లిస్తే, కొత్త అదనపు విలువ. 'బాండ్ల' ద్వారా వచ్చే 'వడ్డీ'లో నించి చెల్లిస్తే, కొత్త అదనపు విలువ.

4. బ్రోకర్లు 'కమిషన్లు' తింటారు. ఇవి కూడా ఏ సందర్భం నించి చెల్లించారూ - అనే దాన్ని బట్టి, పాత అదనపు విలువ గానో, కొత్త అదనపు విలువ గానో వుంటాయి.

5. కంపెనీ, వాటాల్ని ప్రీమియమ్‌తో అమ్మడం ద్వారా సంపాదించే 'ప్రమోటర్ లాభం', పాత అదనపు విలువ. 'డివిడెండ్ల'ని తగ్గించి పంచడం ద్వారా సంపాదించే ప్రమోటర్ లాభం - కొత్త అదనపు విలువ. కంపెనీ, 'అప్పు'ల మీద చెల్లించే వడ్డీలూ, పన్నులూ, 'రిజర్వ్ నిధి'కి చేర్చే భాగమూ, కొత్త అదనపు విలువ.

6. 'బాండ్ల' మీద, ప్రభుత్వం, 'పన్నుల'లో నించి చెల్లించే వడ్డీలు, కొత్త అదనపు విలువ.

7. బాండ్ల మీద, ప్రభుత్వ ఉత్పాదక కంపెనీలూ, ప్రైవేటు ఉత్పాదక కంపెనీలూ 'జనరల్ లాభం'లో నించి చెల్లించే వడ్డీలు, కొత్త అదనపు విలువ.

8. స్టాక్ ఎక్చేంజీ, కంపెనీల్ని 'లిస్టు' చేసుకునే టప్పుడు తీసుకుంతే ఫీజులు - పాత అదనపు విలువ. కంపెనీల నించి ఏటా తీసుకునే ఫీజులు, కొత్త అదనపు విలువ. బ్రోకర్లకి, 'సభ్యత్వం' ఇచ్చేటప్పుడు తీసుకునే ఫీజులు, పాత అదనపు విలువ. స్టాక్ ఎక్చేంజి బ్రోకర్ల రెగ్యులర్ కమిషన్ల నించి తీసుకొనే భాగాలు కొన్ని సార్లు పాత అదనపు విలువ నించీ, కొన్నిసార్లు కొత్త అదనపు విలువ నించీ, వుంటాయి.

ఈ విషయాలే ఒక పట్టిక ద్వారా కూడా చూద్దాం.

ఈ రకంగా 'పెట్టుబడిదారీ జనాభా', రక రకాల వ్యాపారాలు సృష్టిస్తూ, పాత కొత్త అదనపు విలువల్ని ఒకరి నించీ ఒకరు లాక్కుంటూ వుంటారు!

## పాత, కొత్త అదనపు విలువల కొత్త పంపకాలు

| ఎవరు? | ఏం చేశారు? | 'ఆదాయం' ఏ పేరుతో వుంది? | నిజానికి ఆ 'ఆదాయం' ఏమిటి? |
|---|---|---|---|
| వాటాదారులు | వాటాలూ బాండ్లూ కొని స్వంతానికి వుంచుకున్నారు | డివిడెండ్లూ, వడ్డీలూ | కొత్త అదనపు విలువ |
| వాటాల వ్యాపారం చేసే స్పెక్యులేటర్లు | వాటాలు కొని, అమ్మారు | వ్యాపార లాభం, లేదా నష్టం | పాత అదనపు విలువ |
| బ్యాంకు | వాటాలూ, బాండ్లూ కొనే బ్రోకర్లకీ, క్లయింట్లకీ అప్పులు ఇచ్చింది. | వడ్డీ | కొన్నిసార్లు పాత అదనపు విలువా, కొన్నిసార్లు కొత్త అదనపు విలువా |
| బ్రోకరు | క్లయింట్లకి వాటాలు కొని పెట్టాడు. | కమిషను | ” |
| కంపెనీ ప్రమోటర్లు | వాటాల్ని 'ప్రీమియమ్'తో అమ్మారు. | ప్రమోటర్ లాభం | పాత అదనపు విలువ |
| | 'డివిడెండ్ల'ని తగ్గించి పంచి, 'ప్రీమియమ్' తీసుకున్నారు | ప్రమోటర్ లాభం | కొత్త అదనపు విలువ |

➔

| ఎవరు? | ఏం చేశారు? | 'ఆదాయం' ఏ పేరుతో వుంది? | నిజానికి ఆ 'ఆదాయం' ఏమిటి? |
|---|---|---|---|
| బాండ్లు కొన్న వాళ్ళు | ప్రభుత్వ బాండ్లు కొన్నారు | వడ్డీ (పన్నుల నించి) | కొత్త అదనపు విలువ |
| | ప్రభుత్వ ఉత్పాదక కంపెనీల బాండ్లు కొన్నారు | వడ్డీ (కంపెనీల 'జనరల్ లాభం' నించి) | కొత్త అదనపు విలువ |
| | ప్రభుత్వ అనుత్పాదక కంపెనీల బాండ్లు కొన్నారు | వడ్డీ (పన్నుల నించి) | కొత్త అదనపు విలువ |
| స్టాక్ ఎక్స్చేంజి | 'కంపెనీ'ని లిస్టు చేసుకుంది | ఫీజు | పాత అదనపు విలువ |
| | బ్రోకరుకి లైసెన్స్ ఇచ్చింది | ఫీజు | పాత అదనపు విలువ |
| | బ్రోకర్ల ద్వారా వాటాల వ్యాపారం | 'కమిషన్'లో భాగం | కొన్ని సార్లు పాత అదనపు విలువా; కొన్ని సార్లు కొత్త అదనపు విలువా |
| కార్మికుల్లో ఎవరైనా | వాటాలు కొన్నారు | డివిడెండు | కొత్త అదనపు విలువ |

ఈ రకంగా 'పెట్టుబడిదారీ జనాభా', రక రకాల వ్యాపారాలు సృష్టిస్తూ, పాత కొత్త అదనపు విలువల్ని ఒకరి నించీ ఒకరు లాక్కుంటూ వుంటారు!

# వాటా ధర, డబ్బు పెట్టుబడి 'సప్లై - డిమాండ్ల'ని ఎలా ప్రభావితం చేస్తుంది?

"నిజమైన పెట్టుబడీ వేరూ, కల్పిత పెట్టుబడీ వేరూ" అనీ, "వాటా ధర ఎంత పెరిగితే వడ్డీ పెట్టుబడికి అంత లాభం" అనీ- ఇంతకు ముందు చూశాం. అదే అంశానికి సంబంధించిన మరో కోణం ఇప్పుడు చూస్తాం.

వాటా అసలు విలువ 10. ధర 40 - అనుకుందాం. ఈ వాటాని కొనే వాడికి బ్యాంకు, 40 అప్పు ఇచ్చిందనుకుందాం. ఈ 40 అప్పుని, బ్యాంకు, 'ఉత్పత్తి క్రమం' కోసం ఇచ్చినట్టేనా? - కాదు. 40 అప్పులో 10 ని, వాటాకి సంబంధించిన 'అసలు విలువ' కోసమూ, 30 ని 'స్పెక్యులేషన్' కోసమూ ఇచ్చినట్టు అర్థం. అంటే, 'ఉత్పత్తి క్రమం' కోసం ఇచ్చింది 10 మాత్రమే; 40 కాదు.

సమాజం మొత్తం మీద వాటాల వ్యాపారానికి బ్యాంకులు ఇచ్చే అప్పునంతటినీ కలిపి చూస్తే, అందులో అధిక భాగం 'ఉత్పత్తి క్రమం' కోసం గాక, 'స్పెక్యులేషన్' కోసమే వుంటుంది.

వాటాలు కొనడం - అంటే, పరిశ్రమలకు పెట్టుబడిని అందించడమే అయినట్టూ, వాటాల వ్యాపారానికి బ్యాంకులు ఇచ్చే అప్పు అంతా పరిశ్రమల కోసమే పని చేస్తున్నట్టూ, కనపడుతుంది. నిజానికి అందులో కొంత వరకూ మాత్రమే 'పరిశ్రమ'లోకి వెళ్ళే పెట్టుబడి. ఎంత వరకూ అంటే, వాటా 'అసలు విలువ' వరకూ! ఇంకా ఆ పైన వున్నది, స్పెక్యులేటర్ల చేతుల్లో ఒకరి నించీ ఒకరికి తిరుగుతూ వుంటుంది. ఇది నిజం పెట్టుబడిగా పనిచెయ్యకుండా కేవలం 'డబ్బు' లెక్కల్లో మాత్రమే వుండే 'కృత్రిమ పెట్టుబడి'.

జాయింట్ స్టాక్ కంపెనీ విధానమూ, వాటాల వ్యాపారమూ లేని కాలంలో, ఉత్పాదక రంగంలో పని చేసే పెట్టుబడీ, దాని కోసం అప్పుతెచ్చే పెట్టుబడీ, సమానంగా వుంటాయి. వాటాల విధానం ప్రారంభమైన తర్వాత, 'డబ్బు పెట్టుబడి' పెరిగిపోతుంది.

ఒక ఉత్పత్తి క్రమం కోసం 100 పెట్టుబడి కావాలనుకుందాం. ఆ పెట్టుబడి దారుడి దగ్గిర డబ్బు లేదు. '100 పెట్టుబడి'ని అప్పుతెచ్చాడు. ఇక్కడ, అసలు పెట్టుబడీ, అప్పు పెట్టుబడీ, సమానం. ఆ డబ్బు, అప్పు తెచ్చినది అయినా, కాకపోయినా, 'ఉత్పాదక పెట్టుబడీ', దాని కోసం అవసరమయ్యే 'డబ్బు పెట్టుబడీ', సమానం.

వాటా అసలు విలువా, ధరా సమానం గానే వుంటే, అప్పుడు కూడా ఉత్పాదక పెట్టుబడీ, డబ్బు పెట్టుబడీ సమానం గానే వుంటాయి. ఎలాగంటే:

ఒక వాటా అసలు విలువ 100. A, 100 డబ్బుని అప్పు తెచ్చి, ఆ వాటాని అసలు విలువ తోటే కొన్నాడు. B కూడా అప్పు తెచ్చి A నించి వాటాని 100 తోటే కొన్నాడు. ఈ వ్యవహారంలో A వాటా, B కి మారింది. A 100 అప్పు కూడా B కి మారింది, అంతే. ఇక్కడ, వాటాని కొనడానికి, 'డబ్బు పెట్టుబడి' ఎక్కువ అయ్యే అవసరం కలగలేదు. ఈ వ్యవహారం, 'డబ్బు పెట్టుబడి సప్లై డిమాండ్ల'ని గతంలో కన్నా మార్చదు. గతంలో పరిస్తితే వుంటుంది. కానీ, వాటా ధర పెరిగితే, డబ్బు పెట్టుబడి కూడా పెరగాలి. ఎలా గంటే:

వాటా అసలు విలువ 100. A, అప్పు తెచ్చి దాన్ని కొన్నాడు. తర్వాత, దాన్ని, B కి 180 తో అమ్మాడు.

B, 180 అప్పు తెచ్చి ఆ వాటాని కొన్నాడు.

A, తన 100 అప్పుని, బ్యాంకుకి చెల్లించి వేశాడు. బ్యాంకుకి, A నించి 100 అప్పు వచ్చేసింది గానీ, B కోసం 180 అప్పు వెళ్ళింది. అంటే, అదే వాటా కోసం, బ్యాంకు ఇంకా 80 అప్పు ఎక్కువగా ఇవ్వడానికి అవకాశం కలిగింది. 'డబ్బు పెట్టుబడి'కి డిమాండ్ పెరిగింది. ఆ వాటాని B, 200 కి అమ్మితే, బ్యాంకు అప్పుకి డిమాండ్ ఇంకా పెరుగుతుంది.

సమాజం మొత్తం మీద చూసినప్పుడు, వాటాల వ్యాపారం, అప్పుగా దొరికే డబ్బు పెట్టుబడి సప్లై డిమాండ్లని తరచుగా ప్రభావితం చేస్తూ వుంటుంది.

'డబ్బు - సప్లై డిమాండ్లని' ప్రభావితం చేసే అంశాలు ఇంకా అనేకం వుండవచ్చు. అందులో వాటాల వ్యాపారం (ఇతర సెక్యూరిటీల వ్యాపారం కూడా) చాలా ప్రధానమైనది.

# కార్మికులు కూడా వాటాలు కొంటే?

**'మే**ధా శ్రమల' సెక్షన్లలో కొందరు కార్మికులు, వాటాలూ బాండ్లూ కొనగలిగే స్థితిలో వుంటారు. కార్మికులు కూడా సెక్యూరిటీలు కొంటే, కార్మికులు కూడా 'పెట్టుబడి' పెట్టినట్టే. అలాంటి కార్మికులు కూడా, 'వాటాల' మీద డివిడెండ్లూ, 'బాండ్ల' మీద వడ్డీలూ అందుకుంటూ వుంటారు. 'వాటాల' వ్యాపారం చేస్తే - లాభ నష్టాలూ అందుకుంటారు.

అలాంటి కార్మికుడు, తను పని చేసే చోట తన 'శ్రమ'లో ఎంతో భాగాన్ని పోగొట్టుకుంటూ, ఈ 'డివిడెండ్ల' వంటి వాటి ద్వారా, ఇతర కార్మికుల శ్రమలో భాగాన్ని లాక్కుంటున్నాడన్న మాట! ఇది అడ్డ దారి! తప్పుడు దారి! కార్మికులు చెయ్యవలసింది ఇది కాదు.

'కార్మిక వర్గం'లో వున్న ప్రతీ ఒక్క కార్మికుడూ వాటాలు కొని డివిడెండ్లు సంపాదిస్తున్నాడనుకుందాం. అలా జరిగినా కూడా, ఆ వర్గం పోగొట్టుకునే 'అదనపు విలువ' అంతా ఆ వర్గానికి తిరిగి రాదు. ఎందుకంటే, పెట్టుబడిదారీ వర్గం కూడా 'వాటాలు' కొంటుంది గనక. పెట్టుబడిదారీ వర్గానికి వెళ్ళే డివిడెండ్లూ, వడ్డీలూ, కౌళ్ళూ అన్నీ కార్మిక వర్గం ఇచ్చే 'అదనపు విలువ'లో నించే వెళ్ళాలి. కాబట్టి, కార్మికులు వాటాలు కొన్నప్పటికీ, పెట్టుబడిదారీ వర్గం కూడా వాటాలు కొని డివిడెండ్లు తినగలుగుతోందంటే, కార్మికులు, డివిడెండ్ల ద్వారా వెనక్కి తీసుకునే అదనపు విలువ అతి తక్కువ. 'అదనపు విలువ'లో ఎంతో భాగం పెట్టుబడిదారీ వర్గానికే అందుతూ వుంటుంది.

కార్మికులకు డివిడెండ్లు వస్తే, అవి వాళ్ళ శ్రమలో భాగమే. పెట్టుబడి దార్లకు డివిడెండ్లు వస్తే, అవి వాళ్ళ శ్రమ కాదు; అది కార్మికుల శ్రమ. వేరు వేరు వర్గాలకు డివిడెండ్లు రావడంలో ఇంత తేడా వుంది. కాబట్టి, కార్మికులకు కూడా కొన్ని డివిడెండ్లు అందుతున్నంత మాత్రాన, వారి శ్రమ అంతా వారికి అందుతున్నట్టూ, దోపిడీ ఆగిపోయినట్టూ, అర్థం కాదు.

ఎంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో అయినా, వాటాలు కొనే కార్మికులు 'నూటికి' నలుగురో ఐదుగురో మాత్రమే వుంటారు. మహా అయితే 10 మంది. అది కూడా మేధాశ్రమల సెక్షన్లలో మాత్రమే. మిగిలిన 90% మంది మాటేమిటి? శారీరక శ్రమల కార్మికుల్లో దాదాపు ఎవ్వరూ వాటాల్లో పెట్టు

బడులు పెట్టరు. 'డివిడెండ్లు' తినే పరిస్థితిలో వుండరు.

వాటాల్ని కొనే ఈ 'నూటికి నలుగురైదుగురు' కార్మికుల్ని చూసి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు - కార్మికులు కూడా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేస్తున్నారనీ, కార్మికులు కూడా పెట్టుబడి దారులుగా మారిపోతున్నారనీ, పెట్టుబడి దారులకూ కార్మికులకూ తేడా నశించి పోతోందనీ, వాదిస్తారు. ఇందులో 'వింత' ఏమిటంటే - వాటాలు కొని, 'పెట్టుబడిదారులుగా మారిపోయిన' కార్మికులు, ఇంకా ఎక్కడో అక్కడ 'శ్రమ చేస్తూనే' వుంటారు! శ్రమ చేస్తూనే డివిడెండ్లు తీసుకుంటారు. కానీ, వాటాలు కొనే పెట్టుబడిదారులు మాత్రం, ఎక్కడా శ్రమ చెయ్యరు! ఏ శ్రమా చెయ్యకుండానే ఎక్కడెక్కడో వుండి 'డివిడెండ్లు' అందుకుంటారు! ఇదన్న మాట - కార్మికులకూ పెట్టుబడి దార్లకూ తేడా నశించి పోవడం! చెప్పే వాడికి చాదస్తం అయినా, వినే వాడికి వివేకం వుండాలి! కార్మికులు, వివేకం లేని తెలివి మాలిన వాళ్ళుగా వుంటే, దోపిడీని మరిగిన వాళ్ళు ఎన్ని సిద్ధాంతాలైనా చెపుతారు. ఎన్ని వంకర టింకర వాదనలైనా చేస్తారు.

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల ఇంకో వాదన:

"జాయింట్ స్టాక్ కంపెనీలో 'మేనేజిమెంటు' అంతా మేనేజర్ల ద్వారానే జరుగుతుంది కదా? మేనేజర్లు 'జీతాల'తో పని చేస్తారు కదా? 'జీతాలు' తీసుకునే వాళ్ళంతా కార్మికులే కదా? కాబట్టి, జాయింట్ స్టాక్ కంపెనీ విధానం ప్రారంభమైందంటే, మేనేజిమెంటు అంతా కార్మికుల చేతుల్లోకి వచ్చేసినట్టే. ఇక పెట్టుబడి దారుల ఆధిపత్యం పోయినట్టే" - ఇదీ వాదన!

పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలూ, మేధావులూ మహా చౌకబారు స్థాయిలో కూడా వాదనలు చెయ్యగలుగుతున్నారంటే, కార్మికులు ఆ చౌకబారు వాదనలకు కూడా జవాబులు చెప్పలేని స్థితిలో వున్నారన్న మాట! వినే వాళ్ళు అంత తెలివి మాలిన వాళ్ళుగా వున్నారన్న ధైర్యం తోటే, చెప్పే వాళ్ళు అలాంటి వాదనలు చెయ్యగలుగుతారు.

'జీతాల'తో పని చేసే వాళ్ళంతా కార్మికులేనా? కంపెనీ డైరెక్టర్లు కూడా 'జీతాలు' తీసుకుంటారు. వాళ్ళు కూడా కార్మికులేనా? జీతాల్ని - శ్రమ చేసే వాళ్ళూ తీసుకుంటారు; శ్రమ చెయ్యని వాళ్ళూ తీసుకుంటారు. జీతాలు - అతి తక్కువ గానూ వుంటాయి; అనేక వందల రెట్లు ఎక్కువ గానూ వుంటాయి. కాబట్టి 'జీతాలు' తీసుకునే వాళ్ళంతా కార్మికులు కారు. 'శ్రమ' చేస్తూ, 'శ్రమ'లో కొంత భాగాన్ని పోగొట్టుకునే వాళ్ళు మాత్రమే కార్మికులు. కాబట్టి, డైరెక్టర్లూ మేనేజర్లూ, కార్మికులు కారు.

మేనేజర్లందరికీ భారీ వాటాల కట్టలు వుంటాయి. అంటే, వాళ్ళు మొదట 'పెట్టుబడిదారులు', తర్వాతే మేనేజర్లు. వాళ్ళు, తమ 'శ్రమ'లో కొంత భాగాన్ని పోగొట్టుకునేదేమీ వుండదు. కార్మికుల శ్రమని ('అదనపు విలువ'ని) లాగే వర్గంలో, మేనేజర్లు కూడా ఒక భాగం.

మేనేజర్లు చేసే 'మేనేజిమెంటు' దేని కోసం? 'పెట్టుబడి'కి లాభం సంపాదించడం కోసం! మేనేజర్లు, డైరెక్టర్ల బోర్డుకి లోబడి వుంటారు. లాభాలు సంపాదించే విధానం తోనే కంపెనీల్ని మేనేజ్ చేస్తారు.

మేనేజిమెంటు స్వభావం, ఉత్పత్తి సాధనాల మీద వుండే 'యాజమాన్యపు స్వభావాన్ని' బట్టే వుంటుంది. యాజమాన్యం - దోపిడీ స్వంతాస్తికి సంబంధించినది అయితే, మేనేజిమెంటు కూడా దానికి తగినట్టు గానే వుంటుంది. అంతే గానీ, దానికి వ్యతిరేకంగా కార్మిక స్వభావంతో వుండదు. కాబట్టి, 'జీతాలు తీసుకునే' మేనేజర్లు మేనేజ్ చెయ్యడమే 'కార్మిక మేనేజ్‌మెంటు' అవదు. ఒక పెట్టుబడి దారుడి కంపెనీ, అనేక మంది పెట్టుబడి దారుల కంపెనీగా మారడమే, 'కార్మికుల సంస్థ'గా మారడం కాదు. అది ఇంకా పెట్టుబడిదారీ సంస్థే. అది ఇంకా పెట్టుబడిదారీ యాజమాన్యమే.

కాబట్టి, 'జాయింట్ స్టాక్ కంపెనీయే', కార్మిక వర్గానికి విముక్తి మార్గం కాదు. దాని డైరెక్టర్లనీ, మేనేజర్లనీ, ఎక్కడెక్కడో ఉండి డివిడెండ్లూ వడ్డీలూ అందుకునే వాళ్ళనీ, స్టాక్ బ్రోకర్లనీ, స్టాక్ ఎక్చేంజీ అధికారుల్నీ - ఇలా 'శ్రమ చెయ్యని దండు సంతతినీ' శ్రమలోకి దించడమే కార్మిక వర్గానికి విముక్తి మార్గం. అంతే గానీ, కార్మికులు చెయ్యవలసింది, తాము కూడా వాటాలు కొంటూ, లాభాల కోసం ఎగబడుతూ, తాము పెట్టుబడిదారీ వర్గం కోసం పోగొట్టుకునే శ్రమ రాసిలో ఒక ముక్కని అడ్డ దారుల్లో సంపాదించడం కాదు.

తాము కూడా దోపిడీదార్ల జూదాలూ, వాళ్ళ టక్కరితనాలూ, వాళ్ళ వ్యాపార మోసాలూ - నేర్చుకోవడం కాదు, కార్మికులు చెయ్యవలసింది!

## కార్మికులు, బ్యాంకుల్లో డబ్బు పెడితే?

'ఆదాయాల్ని' జాగ్రత్త చేసుకోవడం తప్పనిసరి. ఆ ఆదాయం డబ్బు రూపంలో వున్నప్పుడు, దాన్ని దాచుకోవలసి వస్తే, బ్యాంకుల్లో దాచుకోక తప్పదు. అంతకన్నా వేరే మార్గం వుండదు. 'వడ్డీలు' సంపాదించాలనే దృష్టితో గాక, 'రక్షణ' కోసమూ, 'భవిష్యత్ ప్లాను' కోసమూ, కార్మికులు కూడా బ్యాంకుల్లో డబ్బుని దాచుకోవడం అవసరమే.

నిజానికి, బ్యాంకుల్లో దాచుకోవలసినంత డబ్బు వుండే కార్మికులు చాలా తక్కువ మందే వుంటారు. అది కూడా మేధాశ్రమల సెక్షన్ల లోనే. శారీరక శ్రమల కార్మికుల్లో, డబ్బుని బ్యాంకుల్లో డిపాజిట్ చేసే వాళ్ళు నూటికి ఒక్కరు కూడా వుండరు.

# ప్రశ్నలూ - జవాబులూ

**1. బ్యాంకు నించి డబ్బు అప్పు తీసుకుని, దానితో 'వాటాలు' కొని, వాటి ద్వారా 'లాభం' సంపాదించడం సాధ్యమేనా? ఏ రకంగా?**

**జ:** సాధ్యమే. ఆ వాటాల ద్వారా వచ్చే లాభం కన్నా బ్యాంకుకి చెల్లించవలిసిన వడ్డీ తక్కువ గానే వుంటుంది. కానీ, వాటా ధరలు పడిపోతే, బ్యాంకుకి వడ్డీనే కాదు, అసలుని ఇవ్వడం కూడా సాధ్యం కాదు.

**2. ఒక శాఖలో A, B అనే 2 కంపెనీలు వున్నాయి. రెంటికీ ఒకే సైజు పెట్టుబడీ, ఒకే సైజు లాభం రేటూ, ఒకే సైజు వడ్డీ రేటూ - అనుకుందాం. A కి 'అప్పు' పెట్టుబడి ఎక్కువా, 'వాటా' పెట్టుబడి తక్కువా. B కి - 'అప్పు' పెట్టుబడి తక్కువా, 'వాటా' పెట్టుబడి ఎక్కువా. ఏ కంపెనీ ఎక్కువ 'డివిడెండు'ని ఇవ్వగలదు?**

**జ:** రెండు కంపెనీలకూ ఒకే సైజు పెట్టుబడీ, ఒకే సైజు లాభం రేటూ కాబట్టి, వాటి లాభాలు కూడా ఒకే సైజులో వుంటాయి. ఆ లాభాల్లో నించి మొదట వడ్డీల్ని చెల్లించి మిగిలిన లాభాలనే వాటాదార్లకు పంచాలి. అప్పు ఎక్కువగా వున్న A కంపెనీ, తన లాభంలో నించి వడ్డీగా చెల్లించవలిసింది ఎక్కువ. అప్పు తక్కువగా వున్న B కంపెనీ, వడ్డీ గా చెల్లించవలసింది తక్కువ. కాబట్టి B కంపెనీయే ఎక్కువ డివిడెంటుని ఇవ్వగలుగుతుంది.

**3. "వాటాదారులకూ డిబెంచరుదారులకూ బ్యాంకుల నించీ రుణ పథకం కలదు" అని, వాటాలు విడుదల చేసే సమయంలో ఒక కంపెనీ ప్రకటించింది. దీని అర్థం ఏమిటి?**

**జ:** అంటే, ఆ కంపెనీలో వాటాలూ, డిబెంచర్లూ కొనే వాళ్ళకి, బ్యాంకులు తప్పని సరిగా అప్పులు ఇస్తాయని అర్థం. "అప్పులు తీసుకుని, మా వాటాలు కొనండి. మా వాటాల్ని కొనడానికైతే బ్యాంకులు తప్పకుండా అప్పులు ఇస్తాయి. డబ్బు లేదని భయం లేదు" అని చెపుతోంది ఆ కంపెనీ.

**4. 10% స్వంత పెట్టుబడి వుంటే, బ్యాంకు 90% అప్పు ఇస్తుందనుకుందాం. A అనేవాడు, 10 వేలు స్వంత పెట్టుబడీ, 90 వేలు బ్యాంకు పెట్టుబడీ కలిపి, మొత్తం 'లక్ష'తో, వాటా 1కి 100 చొప్పున, వెయ్యి వాటాలు కొన్నాడు. బ్యాంకుకి చెల్లించవలిసిన వడ్డీ రేటు సంవత్సరానికి 12%. ఒక సంవత్సరానికి, వాటాని, 200కి అమ్మాడు. ఈ వ్యవహారంలో A సంపాదించిన లాభం ఎంత?**

**జ:** వాటాలు కొనడానికి A పెట్టిన పెట్టుబడి 1 లక్ష. (1,00,000). వాటాల్ని అమ్మడం ద్వారా వచ్చేది, 2 లక్షలు. అందులో నించి బ్యాంకుకి చెల్లించవలసిన అసలు 90 వేలు. తన చేతి పెట్టుబడి 10 వేలు. ఈ రెంటినీ వెనక్కి తీసుకుంటే, ఇంకా వున్నది 1 లక్ష. అందులో నించి బ్యాంకుకి వడ్డీ చెల్లించాలి. 12% వడ్డీ రేటు చొప్పున, 90 వేల మీద చెల్లించవలసిన వడ్డీ = — × 90,000 = 9,800. ఈ వడ్డీని లక్షలో నించి తీసేస్తే మిగిలేది, ఆ వాటాల వ్యాపారం ద్వారా A కి లాభం.

**5. ఒక కంపెనీ ఎడ్వర్టయిజ్‌మెంటులో కొంత భాగం ఇది: "4 సం. లలో అమ్మకాలు 4 రెట్లూ, మరియూ నికర లాభం 22 రెట్లూ పెరిగి, విశేష రీతిలో అభివృద్ధి చెందుతున్న కంపెనీ మాది. 1991లో టర్నోవరు**

**26 కోట్లు కాగా, 1992లో 48 కోట్లకు పెరిగినది. 1991లో నికర లాభం 2 కోట్లు కాగా, 1992లో 31 కోట్లు" - ఇలాంటి ప్రకటనలు చూశారా? ఇలాంటివి చూస్తే మీకేమనిపిస్తుంది?**

**జ:** కొన్ని సార్లు చూశాం. ఇది వరకైతే, 'వాళ్ళు అంత తెలివిగా పరిశ్రమని నడుపుకున్నారు కాబోలు' అని పించేది. ఇప్పుడైతే అంతా తెలుసు. కార్మికుల నించి అన్ని కోట్లని లాగేస్తూ, అదంతా తమ ప్రతిభ లాగ చెప్పుకుంటున్నారని ఇప్పుడు తెలుసు కాబట్టి చాలా ఆగ్రహంగా వుంటుంది.

6. **A అనే ఎలక్ట్రికల్ కంపెనీకి, 200 కంపెనీల్లో షేర్లు వున్నాయి. A కంపెనీ వాటాదార్లు అందు కునే డివిడెంట్లు, A కంపెనీ కార్మికుల అదనపు విలువేనా?**

**జ:** కాదు. అది 200 కంపెనీల కార్మికుల అదనపు విలువ.

7. **జాయింట్ స్టాక్ విధానం ప్రారంభమయ్యాక, ప్రధా నంగా 3 విషయాలు జరుగుతాయి. అవి ఏమిటి?**

**జ:**
1. ఎంత తక్కువ డబ్బుని అయినా వాటాలు కొనడం ద్వారా పెట్టుబడిగా మార్చడం ప్రారంభ మవుతుంది.
2. వాటాలతో వ్యాపారం ప్రారంభమవుతుంది.
3. ఇతరులు పెట్టే పెట్టుబడి అంతటి మీదా, జాయింట్ కంపెనీ పెట్టిన వాళ్ళ అధికారమే ప్రారంభ మవుతుంది.

8. **ఒక ట్రెజరీ బిల్లుని 9 వేలకి కొన్నారు. మెచ్యూర్ అయ్యే కాలం 6 నెలలు. అప్పుడు 10 వేలు వస్తుంది. ఆ లాభం ఎక్కడిది?**

**జ:** బిల్లుని 9 వేలకి కొని, 10 వేలకి అమ్మితే, 1 వెయ్యి లాభం. ట్రెజరీ బిల్లుని కొనడం అంటే, ప్రభు త్వానికి అప్పు ఇవ్వడం. ప్రభుత్వానికి ఆదాయం - పన్నులు. ఆ బిల్లు మీద చెల్లించే వడ్డీ - పన్నుల లోదే. ఆ పన్నులు కార్మిక వర్గం అదనపు విలువ.

9. **A, ఒక కంపెనీ వాటాని 100 తో అసలు విలువకే కొన్నాడు, తర్వాత B కి 165 కి అమ్మాడు. B, C కి 180 కి. C, D కి 175 కి. D, E కి 165 కి. ఇంత వరకూ జరిగిన దాంట్లో ఎవరి డబ్బు ఎవరికి అందింది?**

**జ:** ఆ వాటా అసలు విలువ 100. A నించీ, E వరకూ చూస్తే, E కొన్న ధర 165. A, ఆ వాటాని 100 కి కొని, B కి, 165 తో అమ్మాడు కాబట్టి, A కి 65 లాభం. B కూడా 165 తో కొన్న దాన్ని C కి, 180 తో అమ్మాడు కాబట్టి, B కి కూడా 15 లాభం. తర్వాత C, 180 తో కొన్నదాన్ని D కి 175 తో అమ్మాడు కాబట్టి, 5 నష్టం. తర్వాత D, 175 తో కొన్న దాన్ని E కి 165 తో అమ్మాడు కాబట్టి, D కి 10 నష్టం.

A లాభం 65 + B లాభం 15 = 80.

C నష్టం 5 + D నష్టం 10 = 15.

A కీ, B కీ కలిసి లాభంగా వచ్చిన 80 ఎక్కడిదంటే, E నించి 65 + C నించి 5 + D నించి 10 = 80. ముగ్గురు నష్టపోయి, ఇద్దరు లాభ పడ్డారు.

10. **1992 లో భారత దేశంలో జరిగిన షేర్ల కుంభ కోణంలో 'డైరెక్టర్ల వాటాల కోటా' నించీ వాటాలు కొన్నాడనే ఆరోపణ వల్ల, ఒక కేంద్ర మంత్రి రాజీ నామా చేశాడు. ఆ మంత్రి ఎవరు?**

**జ:** ఆ పేరు అప్పట్లో తెలుసు గానీ ఇప్పుడు గుర్తు లేదు. 'పేరు' ఏదైతే ఏమిటి? ప్రతీ మంత్రీ అలాంటి వాడే.

11. **1887 లో, A దేశంలో, హవే మేయరు అనే వాడు. 60 లక్షల పెట్టుబడి గల 12 చిన్న పంచదార కంపెనీల్ని కలిపి ఒక 'ట్రస్టు'గా చేశాడు. కానీ, ట్రస్టు పెట్టు బడిని '7 కోట్లు' అని అబద్ధంగా ప్రకటించాడు. వాటా దార్లకు 10% డివిడెండు ఇస్తూ, ఆ లెక్కన 7 కోట్ల మీద డివిడెండు ఇచ్చినట్టుగా ప్రకటించాడు. నిజానికి, ఆ డివిడెండు మొత్తాన్ని 60 లక్షల మీద మాత్రమే ఇచ్చి వుంటే, డివిడెండ్ ఎంత శాతం వుండేది?**

**జ:** 7 కోట్ల మీద, 10% చొప్పున డివిడెండు ఇచ్చాడు.

ఆ డివిడెంట్ల మొత్తం = —— × 7,00,00,000 = 70 లక్షలు. ఈ 70 లక్షల డివిడెండ్ల మొత్తాన్ని, 60 లక్షల పెట్టుబడి మీదే పంచి వుంటే, అప్పుడు డివి డెండు శాతం ఇలా వుంటుంది: 60 లక్షల పెట్టు బడికి, 70 లక్షల డివిడెండు అయితే, 100 కి ....... ?

$$\frac{70 \text{ లక్షలు}}{60 \text{ లక్షలు}} \times 100 = 116\ \%$$

అంత డివిడెండు ఇవ్వవలసి వుండగా, వాటా దారుల్ని 'మోసం' చేసి 10% చొప్పున మాత్రమే ఇచ్చాడన్న మాట! ★

# 4. 'సహజ' ఆర్థిక విధానమూ (నేచురల్ ఎకానమీ), 'డబ్బు' ఆర్థిక విధానమూ (మనీ ఎకానమీ), 'అప్పు' ఆర్థిక విధానమూ (క్రెడిట్ ఎకానమీ)

ఉత్పత్తి విధానానికి, 'ఆర్థిక విధానం' అని ఇంకో పేరు పెడితే, 'బార్టరు' కాలం నించీ 'పెట్టుబడిదారీ' కాలం వరకూ వున్న ఆర్థిక విధానాల్ని ప్రధానంగా 2 రకాలుగా వర్గీకరించవచ్చు.

1. 'సహజ' ఆర్థిక విధానమూ,
2. 'డబ్బు' ఆర్థిక విధానమూ.

**1. 'సహజ ఆర్థిక విధానం'లో:**

ఉత్పత్తి చెయ్యడం, 'అమ్మకాల' కోసం జరగదు. అమ్మకాల దృష్టితో జరగదు. 'సహజ అవసరాల' కోసమే జరుగుతుంది. ఉత్పత్తి తయారైన తర్వాత, దాన్ని, వెంటనే వాడుకోవడానికి ఏ ఆటంకమూ వుండదు.

ఒక 'స్వతంత్ర ఉత్పత్తిదారుల' కుటుంబం, కొన్ని ఉత్పత్తుల్ని భూమి ద్వారా పండించుకుంటుంది. కొన్ని ఉత్పత్తుల్ని చేతి పనుల ద్వారా చేసుకుంటుంది. ఏ ఉత్పత్తినీ 'అమ్మకాల' దృష్టితో చెయ్యదు. తన అవసరాల కోసం చేసుకున్న ఉత్పత్తిలో నించే కొంత భాగంతో కొన్ని మారకాలు చేసుకుంటుంది. ఆ మారకాలు చాలా తక్కువగా మాత్రమే జరుగుతాయి. ఆ మారకాల ద్వారా వచ్చే సరుకులు కూడా అవసరాల కోసమే.

'బార్టరు' కాలం అంతా, 'సహజ ఆర్థిక విధానం' కిందకే వస్తుంది. బానిస, భూస్వామ్య సమాజాలు కూడా - 'సహజ ఆర్థిక విధానం' కిందకే వస్తాయి. ఈ సమాజాల్లో కూడా, ఉత్పత్తి, అమ్మకాల దృష్టితో జరగదు. ఇక్కడ కూడా, ఉత్పత్తి తయారైన వెంటనే దాన్ని వాడుకోవడానికి ఆటంకం వుండదు. ఈ సమాజాల్లో కూడా దోపిడీ వున్నా, ఇక్కడ చూడవలసిన విషయం - 'దోపిడీ వుందా, లేదా' అనేది కాదు. 'ఉత్పత్తి, స్వంత అవసరాల కోసం జరుగుతోందా, అమ్మకాల కోసం జరుగుతోందా' అనేది. కాబట్టి, ఈ సమాజాల్లో దోపిడీ వున్నా, కొన్ని అమ్మకాలు కూడా వున్నా, ఈ సమాజాలు కూడా 'సహజ ఆర్థిక విధానం' కిందకే వస్తాయి.

**2. 'డబ్బు ఆర్థిక విధానం'లో:**

ఉత్పత్తి అంతా 'అమ్మకాల కోసమే' జరుగుతుంది. 'పెట్టుబడిదారీ విధానం' కన్నా పూర్వమే 'డబ్బు'తో మారకాలు ప్రారంభమైనా, అమ్మకాలు ఎక్కువ స్థాయిలో జరగడం ప్రారంభమైంది మాత్రం పెట్టుబడిదారీ విధానం లోనే. పెట్టుబడిదారీ విధానపు ప్రారంభాన్నే 'డబ్బు ఆర్థిక విధానపు' ప్రారంభంగా చెప్పవచ్చు.

'శ్రమ శక్తి'ని కూడా అమ్ముకోవడం ('శ్రమ శక్తి' కూడా 'సరుకు'గా మారడం), దీని ముఖ్య లక్షణం. 'వ్యాపారం విస్తరించడం', దీని ఇంకో ముఖ్య లక్షణం. ఈ విధానంలో - 'ఉత్పత్తి' తయారై సిద్ధంగా వున్నా, సమాజానికి దానితో ఎంత అవసరం వున్నా, దాన్ని వాడడం సాధ్యం కాదు. దానికి 'అమ్మకం' జరిగితేనే దాన్ని ఉపయోగించడం సాధ్యం.

ప్రతీ పెట్టుబడి దారుడూ, తన సరుకు నంతా - అమ్ముకోవాలి! కావలసినదంతా - కొనుక్కోవాలి! ప్రతీ కార్మికుడూ తన 'శ్రమ శక్తి'ని, అమ్ముకోవాలి! జీవితావసర ఉత్పత్తులు, కొనుక్కోవాలి! ప్రతీ ఉత్పత్తీ 'అమ్మకాల' ఘట్టం లోనించి నడిచి తీరాలి! కాబట్టి, ఇక్కడ మొత్తం సంబంధాలన్నీ 'డబ్బు సంబంధాలు' గానే వుంటాయి.

ఇక్కడ, 'అప్పు ఆర్థిక విధానం' గురించి కూడా చూడాలి.

అప్పు ఆర్థిక విధానం, డబ్బు ఆర్థిక విధానానికి మరో రూపం మాత్రమే. 'డబ్బు ఆర్థిక విధానం'లో పుట్టుకు వచ్చే అమ్మకాల సమస్య నించి తప్పుకోవడానికే 'అప్పు ఆర్థిక విధానం' ప్రారంభమైంది. కానీ, 'అప్పు' అనేది 'డబ్బు'కి మరో రూపమే కాబట్టి, అమ్మకాల సమస్యని అప్పు విధానం కూడా ఏ మాత్రమూ పరిష్కరించదు. అది, సమస్యని, కొంత దూరానికి నెట్టడం మాత్రమే చెయ్యగలుగుతుంది.

" '**డ**బ్బు' విధానం, కేథలిక్కు.
'అప్పు' విధానం, ప్రొటస్టెంటు.
....... కేథలిక్కు విధానపు పునాదుల నించి, ప్రొటస్టెంటు విధానం ఎలాగైతే విముక్తి చెందలేదో, అలాగే 'డబ్బు విధానపు' పునాది నించి అప్పు విధానం విముక్తి చెంద జాలదు." - మార్క్స్ [కాపిటల్ - 3, పేజీ 592]

[ కేథలిక్, ప్రొటస్టెంట్ - అనే మాటలు క్రిస్టియన్ మత విధానాలకు సంబంధించినవి. "డబ్బు విధానం - కేథలిక్కూ, అప్పు విధానం - ప్రొటస్టెంటూ" అనడం అంటే, రెండూ మతమే, రెండూ ఒకటే - అని చెప్ప డమే. 'డబ్బు విధానపు సమస్యల్ని అప్పు విధానం ఏమీ పరిష్కరించదు, రెండూ ఒకటే' అని చెప్పడమే. దీన్ని ఇంకా వివరంగా, ఈ సంపుటం లోనే 'సంక్షోభాలు' చాప్టర్లో చూస్తాము.]

# అప్పు డబ్బు (క్రెడిట్ మనీ)

'**స**రుకు'ని గానీ, 'డబ్బు'ని గానీ, అప్పుగా ఇచ్చినప్పుడు, దానికి సంబంధించి 'అప్పు పత్రం' రాసుకోవడం వెనకటి కాలం నించీ కూడా వుంది. ఉదా॥ ప్రామిసరీ నోటు. 'అప్పు'ని వడ్డీతో సహా కొంత కాలం తర్వాత చెల్లిస్తాన'ని రాసి ఇచ్చే పత్రం ఇది. 'అప్పే' లేకపోతే, ఈ పత్రం వుండేది కాదు. 'అప్పు' వల్లనే ఈ పత్రం పుట్టుకొచ్చింది.

ఈ అప్పు పత్రమే, డైరెక్టుగా డబ్బు కాదు. 100 రూపాయల కోసం రాసిన అప్పు పత్రం, 100 రూపాయల కరెన్సీ నోటు లాగ చలామణీ అవదు. కానీ, అది కూడా డబ్బుతో సమానమైన విలువ గల పత్రమే. ఈ పత్రం వుంటే, 100 రూపా యలు వున్నట్టే. కానీ, ఈ డబ్బు, 'అప్పు రూపంలో' వున్న డబ్బు (క్రెడిట్ మనీ).

'సరుకు'ని అమ్మి 'మారకం బిల్లు'ని తీసుకోవడం అంటే, సరుకుని 'నిజం డబ్బు'గా గాక, 'అప్పు డబ్బు'గా మార్చడం. దాన్ని ఇంకా తర్వాత 'నిజం డబ్బు'గా మార్చాలి. కాబట్టి, 'మారకం బిల్లు' కూడా క్రెడిట్ మనీ. అలాగే, 'వాటా' పత్రాలూ, 'బాండ్ల' పత్రాలూ కూడా డైరెక్టుగా డబ్బు కాదు. కానీ డబ్బుతో సమాన మైనవే. అయితే, వీటి విలువ అనేక పరిస్థితుల్లో తగ్గిపోవచ్చు.

'నిజం డబ్బు' కాని పత్రాలన్నీ, 'అప్పు విధానం' వల్ల పుట్టుకొచ్చే పత్రాలే.

ప్రభుత్వ ధనం = కరెన్సీ నోట్లూ, నాణాలూ.
బ్యాంకు ధనం = చెక్కులూ, డ్రాఫ్టులూ వంటివి.
అప్పు ధనం = మారకం బిల్లులూ, ప్రామిసరీ నోట్లూ, ఇతర కమర్షియల్ పత్రాలూ. ఇవన్నీ సెక్యూరిటీలే.

బ్యాంకు విధానమూ, జాయింట్ స్టాక్ కంపెనీ విధానమూ, అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, వెనకటి సమాజాలలో లేని అనేక రకాల కొత్త కొత్త 'అప్పు పత్రాలు' పుట్టుకొచ్చాయి. దానితో పాటే, వాటిని బదిలీ చేసుకోవడమూ, తాకట్లు పెట్టడమూ, అమ్మ డమూ వంటి కార్యక్రమాలు కూడా పుట్టుకొచ్చాయి. (వాటితో పాటే రక రకాల మోసాలు కూడా!)

'అప్పు సంబంధాలు' అనేవి, వెనకటి సమాజాల్లో ఇద్దరేసి మధ్యనో, ముగ్గురేసి మధ్యనో మాత్రమే విడి విడిగా ఏర్పడేవి. 'అప్పు విధానం' అభివృద్ధి చెందడం అంటే, అప్పు సంబంధాలు అనేక దిక్కుల్లోకి విస్తరిస్తూ, అన్ని దిక్కుల మధ్యా అల్లుకు పోవటమే. పెట్టుబడి దారీ విధానం అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, అప్పు సంబంధాలు అనేక శాఖల మధ్య అల్లుకు పోతూ వుంటాయి.

# కేంద్ర బ్యాంకు

'**అ**ప్పు విధానం' గురించీ, 'బ్యాంకుల' గురించీ చూసేటప్పుడు, 'కరెన్సీ నోట్లని జారీ చేసే హక్కు' గల 'కేంద్ర బ్యాంకు' గురించి తప్పని సరిగా చూడాలి. అప్పు పత్రాలూ, సెక్యూరిటీలూ - అనే విషయాల గురించి తెలుసుకున్న తర్వాత మాత్రమే 'నోట్ల జారీ'ని అర్థం చేసుకోవడం సాధ్యం. కాబట్టి, ఈ విషయం ఇప్పుడు చూస్తున్నాము.

ఏ దేశపు 'కేంద్ర బ్యాంకు'కి, ఆ దేశం పెట్టుకున్న పేరు వుంటుంది. (ఉదా॥ ఇండియాలో 'కేంద్ర బ్యాంకు' పేరు, 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' - R.B.I.)

కేంద్ర బ్యాంకు - కేంద్ర ప్రభుత్వ బ్యాంకు.

'డబ్బు'కి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్వహించ వలసిన బాధ్యతలన్నింటినీ ప్రభుత్వం తరఫున కేంద్ర బ్యాంకు నిర్వహిస్తుంది. ఈ బ్యాంకు చేసే పనులు, ప్రభుత్వం చేసే పనులతో సమానమే. అయితే, కేంద్ర బ్యాంకుకి, 'ప్రభుత్వం' నించి కొంత 'స్వతంత్రత' కూడా వుంటుంది.

చలామణీ కోసం కావలసిన 'కరెన్సీ నోట్ల'ని ప్రింటు చేసి, విడుదల చేసే అధికారం కేంద్ర బ్యాంకుకి మాత్రమే వుంటుంది. ఏ ఇతర బ్యాంకులకూ వుండదు.

కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకింగ్ పనులు చేసి పెట్టడమూ; ప్రభుత్వానికి కావలసిన స్వదేశీ, విదేశీ అప్పుల వ్యవహారాలు చూడడమూ; బ్యాంకులన్నిటినీ అజమాయిషీ చెయ్యడమూ - వంటి పనులన్నీ కూడా 'కేంద్ర బ్యాంకే' నిర్వహిస్తుంది.

ఇక్కడ మనం 'కరెన్సీ నోట్ల జారీ' విషయం మాత్రమే, అది కూడా చాలా క్లుప్తంగా మాత్రమే, చూస్తాము. అవసరాన్ని మించినంత డబ్బు, చలామణీ లోకి వస్తే, 'ద్రవ్యోల్బణ' పరిస్థితులు ఏర్పడతాయి. అలాగే, అవసరానికి కావలసినంత డబ్బు చలామణీలో లేకపోతే, ఇంకో రకం సమస్యలు ఏర్పడతాయి. కాబట్టి, చలామణీలో వుండే డబ్బు ఎక్కువో, తక్కువో కాకుండా దాన్ని 'తగిన విధంగా' నిర్వహించే బాధ్యత కేంద్ర బ్యాంకుది. ఈ బాధ్యతని కేంద్ర బ్యాంకు నిజం గానే సరిగా నిర్వహిస్తుందా - అనేది, వేరే సంగతి. నిర్వహించ వలసిన బాధ్యత అయితే అదీ!

కేంద్ర బ్యాంకులో - కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వాలూ కూడా 'డిపాజిటర్లే'. అంటే, కేంద్ర బ్యాంకులో - కేంద్ర ప్రభుత్వపు ఎక్కౌంటూ, రాష్ట్ర ప్రభుత్వాల ఎక్కౌంట్లూ, ఇతర ప్రభుత్వ బ్యాంకుల ఎక్కౌంట్లూ, ఇతర ప్రభుత్వ ద్రవ్య సంస్థల ఎక్కౌంట్లూ, ప్రైవేటు బ్యాంకుల ఎక్కౌంట్లూ, వగైరాలన్నీ వుంటాయి.

కేంద్ర ప్రభుత్వానికి - అనేక రకాల 'పన్నుల' ద్వారానూ, దాని ఉత్పాదక సంస్థల ద్వారానూ వచ్చేదంతా - ఆదాయం. అందులో నించి తీసేదంతా - ఖర్చు. కేంద్ర ప్రభుత్వ ఆదాయం అంతా కేంద్ర బ్యాంకులో 'డిపాజిట్'గా వుంటుంది. అయితే, ఆ డిపాజిట్ మీద, కేంద్ర బ్యాంకు, కేంద్ర ప్రభుత్వానికి వడ్డీ ఇవ్వదు.

రాష్ట్ర ప్రభుత్వాలూ, ఆ ప్రభుత్వ సంస్థలూ, వాటి బ్యాంకులూ వంటివన్నీ, తమ డిపాజిట్లలో కొంత శాతాన్ని కేంద్ర బ్యాంకులో వుంచాలి. ఆ డిపాజిట్ల మీద కూడా కేంద్ర బ్యాంకు, వడ్డీ ఇవ్వదు. ఆ 'లెవెల్'ని దాటి కూడా డిపాజిట్లు వుంటే, వాటి మీద మాత్రమే వడ్డీ ఇస్తుంది. ఆ వడ్డీ రేటు కూడా చాలా తక్కువగా వుంటుంది.

రాష్ట్ర ప్రభుత్వాలూ, వాటి బ్యాంకులూ, వాటి ఫైనాన్స్ సంస్థలూ పెట్టే డిపాజిట్లతో, కేంద్ర బ్యాంకులో, 'సమిష్టి రిజర్వ్ నిధి' ఏర్పడుతుంది. అంతేగాక, కేంద్ర ప్రభుత్వ ఆదాయం అంతా, కేంద్ర బ్యాంకు లోనే వుంటుంది. కేంద్ర ప్రభుత్వ ఎక్కౌంటులో, ఎప్పుడూ కొంత డబ్బు వుండి తీరాలనే నిబంధన వుంటుంది (ఉదా॥ 50 కోట్లు). అంత కన్నా ఎక్కువ కూడా వుండ వచ్చు. అంత కన్నా తక్కువ మాత్రం వుండరాదు.

ఈ రకంగా, కేంద్ర బ్యాంకులో ఎప్పుడూ కొన్ని 'డిపాజిట్లు' వుంటాయి. వాటితో అది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకూ, బ్యాంకులకూ, ఫైనాన్స్ సంస్థలకూ అవసరమైనప్పుడల్లా అప్పులు ఇస్తూ, వాటి మీద 'వడ్డీలు' సంపాదిస్తూ వుంటుంది. ఆ వడ్డీలలో నించి ఆఫీసు ఖర్చులకూ, ఉద్యోగుల జీతాలకూ (C + Vలకు) కొంత పోగా, కేంద్ర బ్యాంకు, కొంత 'లాభం' కూడా సంపాదిస్తుంది.

ప్రతీ బ్యాంకూ- తన 'డిపాజిట్ల'లో కొంత భాగాన్ని తన దగ్గిరే 'రిజర్వ్'గా వుంచుకుంటుందని చూశాం. డిపాజిటర్లు, డబ్బుని వెనక్కు అడిగినప్పుడల్లా ఆ 'రిజర్వ్' నించే చెల్లిస్తుంది. రిజర్వ్ నిధి చాలనప్పుడు, ఇతర బ్యాంకుల నించి గానీ, కేంద్ర బ్యాంకు నించి గానీ, అప్పు తీసుకుంటుంది.

అలాగే, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 'కేంద్ర బ్యాంకు' నించి అప్పులు తీసుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్నుల్లో కొన్ని భాగాలు రాష్ట్రాలకు కూడా రావలసి వుంటుంది. కాబట్టి, రాష్ట్రాలు, కేంద్ర బ్యాంకు నించి 'అడ్వాన్సులు' తీసుకుంటూ వుంటాయి. కేంద్ర బ్యాంకు నించి రాష్ట్రాలకు రావలసిన మొత్తాల కన్నా, రాష్ట్రాలు తీసుకున్న మొత్తాలే ఎక్కువగా వుంటే, ఆ 'ఎక్కువ' మీద కాల పరిమితుల్ని బట్టి రక రకాల వడ్డీ రేట్లు వుంటాయి.

కేంద్ర ప్రభుత్వానికి, 'ఆదాయాన్ని' మించి 'ఖర్చు' వున్నప్పుడు, కేంద్ర బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం తరుపున, ట్రెజరీ బిల్లులూ, ప్రామిసరీ నోట్లూ వంటి 'బాండ్ల'ని విడుదల చేసి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బుని (పబ్లిక్ నించి అప్పులు తీసుకున్న డబ్బుని), కేంద్ర ప్రభుత్వ ఎక్కౌంటుకి చేరుస్తుంది. బాండ్లు మెచ్యూర్ అయినప్పుడు ప్రభుత్వ ఎక్కౌంటులో నించే వాటికి చెల్లిస్తుంది. డబ్బు అవసరమైతే మళ్ళీ కొత్త బాండ్లు అమ్ముతుంది. అంటే కొత్త అప్పులు.

'చలామణీ' లోకి అవసరమైనప్పుడు ఇంకా కొన్ని నోట్లని విడుదల చేసే పనీ, అవసరం లేనప్పుడు కొన్ని నోట్లని వెనక్కి తీసే పనీ, 'కేంద్ర బ్యాంకు'లో ఇష్యూ శాఖా, బ్యాంకింగ్ శాఖా - అనే 2 శాఖల ద్వారా జరుగుతాయి. ఆ 2 శాఖల్లోనూ కొంత కొంత డబ్బు వుంటుంది (నోట్లు).

'ఇష్యూ శాఖ'లో డబ్బు - చలామణీలో లేనిది.

'బ్యాంకింగ్ శాఖ'లో డబ్బు-చలామణీలో వున్నది.

'బ్యాంకింగ్ శాఖ' లోనూ, ఇతర బ్యాంకుల్లోనూ, ఫైనాన్స్ సంస్థల్లోనూ, బయట జనాల చేతుల్లోనూ వున్నదంతా కలిసి, చలామణీలో వున్న డబ్బు.

కేంద్ర బ్యాంకుకి - బయటి నించి డబ్బు వచ్చినప్పుడు, 'బ్యాంకింగ్ శాఖ' లోకే వస్తుంది. అలాగే, కేంద్ర బ్యాంకు నించి బయటికి డబ్బు వెళ్ళేటప్పుడు, 'బ్యాంకింగ్ శాఖ' నించే వెళ్తుంది.

సమాజ అవసరాల్ని బట్టి, చలామణీలో వుండే డబ్బుని ఒక స్థాయి కన్నా తగ్గకుండానూ, ఒక స్థాయి కన్నా పెరగకుండానూ నిర్వహించేది, బ్యాంకింగ్ శాఖ. ఈ శాఖ లోకి వచ్చిన డబ్బు, ఆ శాఖలో వుండవలసిన స్థాయి కన్నా ఎక్కువగా వుంటే, ఆ 'ఎక్కువ'ని, ఇష్యూ శాఖ లోకి బదిలీ చేస్తారు. 'ఇష్యూ శాఖ' లోకి పోయిన నోట్లు చలామణీలో లేకుండా పోయినట్టు అర్థం. అలాగే, 'బ్యాంకింగ్ శాఖ' నించీ చాలా డబ్బు జనాల లోకి పోయి ఆ శాఖలో డబ్బు కనీస స్థాయికి తగ్గిపోతే, 'ఇష్యూ శాఖ' నించి కొన్ని నోట్లు బైటికి తీస్తారు. ఆ డబ్బు మళ్ళీ చలామణీ లోకి అవసరమైందని అర్థం.

అయితే, 'ఇష్యూ శాఖ' నించి కొన్ని నోట్లని తీసుకునేటప్పుడు, ఆ నోట్లని 'ఊరికే' తీసుకోడానికి వీలు లేదు. తీసుకునే నోట్ల విలువతో సమానమైన విలువ గల బంగారాన్ని గానీ, ప్రభుత్వ సెక్యూరిటీ పత్రాల్ని గానీ, ఆ శాఖలో పెట్టి, దానికి బదులు గానే నోట్లని తియ్యాలి.

ఈ 'నిబంధన' వెనకవున్న చరిత్ర ఏమిటంటే:

వెనకటి కాలంలో, బంగారం డబ్బే (బంగారం నాణాలే) 'చలామణీ'లో తిరిగేవి. తర్వాత ఆ పద్ధతి పోయి, 'కాయితం డబ్బు' పద్ధతి వచ్చింది. జనాలు తమ బంగారం నాణాల్ని ప్రభుత్వానికి అప్పజెప్పి, వాటికి బదులుగా కాయితం రూపాయిల్ని తీసుకుంటారు. కాయితం డబ్బు తోనే మారకాలు చేసుకుంటారు. అయితే, 'కాయితం డబ్బు' ప్రారంభమైన కాలంలో, దాని మీద జనాలకు నమ్మకం కలగడం కోసం, జనాలు, కాయితం డబ్బుని ఎప్పుడు కావాలంటే అప్పుడు బంగారం డబ్బుగా మార్చుకోగలిగే ఏర్పాటు ప్రభుత్వం చెయ్యవలసి వచ్చింది. అంటే, 'కాయితం డబ్బు'ని ఖజానాలో ఇచ్చి, తమ బంగారం నాణాలు వెనక్కి తీసుకోవడం సాధ్యమైతే, జనాలకు, 'కాయితం డబ్బు' మీద నమ్మకం ఏర్పడుతుంది. ఈ ఏర్పాటు కోసం ప్రభుత్వం, జనాల బంగారాన్ని ఖజానాలో సిద్ధంగా వుంచవలసి వచ్చింది. ఎంత బంగారాన్ని అంటే, చలామణీలో ఎన్ని నోట్లు వున్నాయో అంత బంగారాన్ని. ఆ రకంగా, కాయితం డబ్బుకి వెనక సపోర్టుగా బంగారాన్ని ఖజానాలో నిల్వ చేసి వుంచడం, గత కాలంలో ప్రారంభమైంది. క్రమంగా, జనాలకు 'కాయితం డబ్బు' అలవాటైన తర్వాత, కాయితం డబ్బుని బంగారం లోకి మార్చుకునే పద్ధతిని పూర్తిగా రద్దు చేశారు. అయినప్పటికీ, 'కొంత బంగారాన్ని' ఖజానాలో నిల్వ చేసే సాంప్రదాయం అలాగే వుండిపోయింది.

ఇది, కేవలం సాంప్రదాయమే కాదు, ఒక అవసరం కూడా.

విదేశాలతో వ్యాపారం జరిగినప్పుడు, ఎగుమతుల కన్నా దిగుమతులు ఎక్కువై, విదేశానికి ఒక 'బ్యాలెన్స్'ని చెల్లించవలసి వస్తే, బంగారాన్నే చెల్లించాలి కాబట్టి, ఖజానాలో నిల్వ వుంచిన బంగారం, అందుకు ఉపయోగపడుతుంది. (A దేశం, B దేశానికి కొంత బ్యాలెన్స్ చెల్లించవలసి వుంటే, ఆ డబ్బు చెల్లించవలసిన బాధ్యత, A దేశపు దిగుమతిదారులది. వాళ్ళు, తమ స్వదేశపు డబ్బునే, తమ ప్రభుత్వానికి చెల్లిస్తే, ప్రభుత్వం, ఆ డబ్బుని తన ఖజానాలో పెట్టి, కొంత బంగారాన్ని విదేశానికి పంపవచ్చు. అంటే, విదేశానికి బ్యాలెన్స్‌ని చెల్లించేది A దేశపు దిగుమతిదారులే. ప్రభుత్వం కాదు.)

ప్రభుత్వ బ్యాంకుల్లో బంగారం నిల్వలు వుంటేనే

ఎగుమతులూ దిగుమతులూ జరిగేటప్పుడు వేరు వేరు దేశాల ప్రభుత్వాలకు పరస్పరం నమ్మకాలు కలుగుతాయి!

బంగారం లాగే 'విదేశీ సెక్యూరిటీ'ల సంగతి కూడా.

A దేశం, B దేశపు ప్రభుత్వ బాండ్లని కొన్నదను కుందాం. అంటే A దేశం, B దేశానికి కొంత డబ్బుని అప్పు ఇచ్చిందని అర్థం. ఆ బాండ్లు A దేశపు ఖజానాలో వుంటాయి. అవి మెచ్యూర్ అయినప్పుడు, B దేశం నించి A దేశానికి వడ్డీతో సహా డబ్బు వస్తుంది.

A దేశపు ఖజానాలో, B దేశపు బాండ్లు వున్నాయి అనుకుందాం. A, B దేశాల మధ్య, 'వర్తకం' జరిగి, A దేశమే కొంత అప్పు పడిందనుకుందాం. ఆ అప్పుకి బదులుగా, A దేశం, తన దగ్గిర వున్న B దేశపు బాండ్లని ఇచ్చెయ్యవచ్చు. అంటే, ఆ బాండ్ల డబ్బుని A దేశం ఇక వసూలు చెయ్యకుండా వదిలేస్తుంది. ఈ రకంగా, విదేశీ సెక్యూరిటీలు వుపయోగపడతాయి.

విదేశాలకు నమ్మకం కలిగించడం కోసమే, ప్రతీ దేశమూ తన ఖజానాలో కొంత బంగారాన్నీ, కొన్ని విదేశీ సెక్యూరిటీల్నీ వుంచడం, ఒక 'అవసరమైన సాంప్రదాయం'గా పాటిస్తోంది.

క్రమంగా ప్రతీ దేశం లోనూ కేంద్ర బ్యాంకులు ప్రారంభమై, అందులో '2 శాఖల' విధానం ప్రారంభమైన తర్వాత, బంగారాన్నీ, విదేశీ సెక్యూరిటీల్నీ 'ఇష్యూ శాఖ'లో వుంచడం ప్రారంభమైంది. ఒక్కోసారి విదేశీ సెక్యూరిటీలు వుండకపోవచ్చు. కొంత బంగారం మాత్రం తప్పని సరిగా వుంటుంది. కొన్ని 'స్వదేశీ సెక్యూరిటీలు' కూడా వుంటాయి. (స్వదేశీ సెక్యూరిటీలు అంటే, కేంద్ర ప్రభుత్వ ట్రెజరీ బిల్లులూ, ప్రభుత్వ ప్రామిసరీ నోట్లూ, ఇంకా ఇతర 'అనుమతి గల' పత్రాలూ వంటివి).

'ఇష్యూ శాఖ' నించి నోట్లని తీసేటప్పుడు, ఏదో ఒక సెక్యూరిటీని పెట్టడంలో అర్థం ఏమిటంటే - వేరే రూపంలో వున్న విలువని ఇచ్చి, దానికి బదులుగా నోట్ల రూపంలో వున్న విలువని తీసుకోవాలనే నిబంధన వుండడం. అలాంటి నిబంధన లేకపోతే, హద్దు లేకుండా ఎన్ని నోట్లనయినా తీసే పరిస్థితి ఏర్పడుతుందనేదే అందులో వుద్దేశ్యం.

'ఇష్యూ శాఖ' నించీ 5 రూపాయల నోట్లని రెంటిని తీసి, ఆ విలువకి బదులుగా ఒక 10 రూపాయల నోటుని పెట్టవచ్చు. అంటే, ఇది కేవలం 10 రూ.ల నోటుకి చిల్లర తీసుకోవడం లాంటిదే.

అలాగే, 'చలామణీ'లో తిరుగుతూ పాడైపోయిన నోట్లని ఒక చోటకి చేర్చి, కొంత కాలానికి ఒకసారి తగలబెట్టేసి, ఆ విలువకి తగిన నోట్లని 'ఇష్యూ శాఖ' నించి 'ఊరికే' తియ్యవచ్చు. గతంలో జారీ అయిన నోట్లకి బదులుగా కొత్త నోట్లని తీసుకోవడమే అది.

కానీ, ఈ 2 సందర్భాలూ కాకుండా ఇష్యూ శాఖ నించి నోట్లని తీసేటప్పుడు, ఆ విలువకి తగిన 'ప్రభుత్వ సెక్యూరిటీల్ని' ఇష్యూ శాఖలో వుంచుతారు. వీటిని 'ఎస్సెట్లు' అని కూడా అంటారు. అలాగే, బ్యాంకింగ్ శాఖ లోకి డబ్బు ఎక్కువగా చేరి, అందులో కొంత భాగాన్ని 'ఇష్యూ శాఖ' లోకి మార్చినప్పుడు, ఆ విలువతో సమానమైన 'ఎస్సెట్ల'ని ఇష్యూ శాఖ నించి బయటికి తీసెయ్యవచ్చు. అవి, బ్యాంకింగ్ శాఖ లోకి మారతాయి.

ఇతర బ్యాంకులకు హఠాత్తుగా కొంత డబ్బు అవసరమైనప్పుడు, అవి కేంద్ర బ్యాంకు నించి అప్పు తీసుకోవడానికి వీలుగా, కేంద్ర బ్యాంకు తాలూకు 'చెస్టులు', బ్యాంకుల్లో వుంటాయి. ('చెస్టు' అంటే, 'ఇనప్పెట్టె' లాంటి గది.)

ఆ 'చెస్టులు' ఇష్యూ శాఖకి సంబంధించినవి. అంటే, చెస్టుల్లో వున్న డబ్బు 'చలామణీలో లేనిది.' ఈ చెస్టులు అన్ని బ్యాంకుల్లోనూ వుండవు. కొన్ని పెద్ద బ్యాంకుల్లోనే వుంటాయి.

A బ్యాంకులో ఒక చెస్టు వుందనుకుందాం. A బ్యాంకుకి ఒక రోజున, దాని రిజర్వ్ చాలక, ఇంకా 'కొంత డబ్బు కావలసి వచ్చిందనుకుందాం. వెంటనే అది, 'చెస్టు' నించి, కావలసిన డబ్బుని (నోట్లని) తీసుకుంటుంది. (ఆ నోట్లకి బదులుగా 'ఎస్సెట్లు' పెట్టే పని ఈ బ్యాంకుల స్థాయిలో జరగదు. ఎన్ని నోట్లు తీశారో ఎక్కౌంటు రాస్తారు.) 'చెస్టు' నించి డబ్బు తీసుకోవడం అంటే, కేంద్ర బ్యాంకు' నించి అప్పు తీసుకున్నట్టు అర్థం. ఆ అప్పు మీద ఒక్క రోజు కోసం అయినా కేంద్ర బ్యాంకుకి వడ్డీ చెల్లించాలి.

ఆ మర్నాడు, A బ్యాంకు దగ్గిర ఎక్కువ డబ్బు చేరిందనుకుందాం. అందులో, రిజర్వ్‌గా వుంచవలసిన లెవెల్ ని తీసివెయ్యగా ఇంకా అదనంగా డబ్బు వుంటే, దాన్ని 'చెస్టు'లో పెట్టేస్తే, కిందటి రోజు తీసుకున్న 'అప్పు'ని తీర్చేసినట్టే. అప్పుని తీర్చగా కూడా A దగ్గిర ఇంకా కొంత డబ్బు అదనంగా వుంటే, దాన్ని

కూడా తప్పనిసరిగా 'చెస్టు'లో పెట్టెయ్యాలి. దాన్ని కేంద్ర బ్యాంకుకి అప్పుగా ఇచ్చినట్టు అర్థం. అంతే గాక, A బ్యాంకుకి అవసరం లేని నోట్లని 'చెస్టు'లో పెట్టె య్యడం వల్ల, ఆ నోట్లని అవసరమైతే ఇంకో 'చెస్టు' వాళ్ళు తీసుకోవడానికి వీలవుతుంది. ఎలాగంటే:

చెస్టులు, ప్రతీ బ్యాంకు లోనూ వుండవని చూశాం. A బ్యాంకులో చెస్టు వుంది. B బ్యాంకులో లేదు. B కి కొంత డబ్బు కావాలంటే, A దగ్గిరికి వచ్చి అప్పు అడుగుతుంది. A దగ్గిర డబ్బు లేకపోతే, చెస్టు నించి తీసి అప్పు ఇస్తుంది. B చెల్లించే వడ్డీ కేంద్ర బ్యాంకుకే వెళ్తుంది. A బ్యాంకుకి చుట్టు పట్ల, చెస్టులు లేని బ్యాంకులన్నీ అప్పుల కోసం A దగ్గిరికి వస్తాయి. చెస్టులో నించి తీసినా, వేసినా ఆ లెక్కలు చెప్పవల సిన బాధ్యతంతా Aదే.

A ప్రాంతంలో ఒక చెస్టూ, B ప్రాంతంలో ఒక చెస్టూ వున్నాయి అనుకుందాం. ఒక రోజున A చెస్టులో కొంత డబ్బు వుంది. B చెస్టులో అస్సలు లేదు. వెంటనే B చెస్టులోకి కొంత డబ్బు కావలసి వచ్చింది. A చెస్టులో డబ్బుని, B తీసుకునే ఏర్పాటు వుంటుంది. అంటే, ఒక చోట 'అనవసరంగా' వున్న నోట్లని, ఇంకో అవసరమైన చోట ఉపయోగించే ఏర్పాటు ఇది. ఒక చెస్టులో వున్న నోట్లని ఆ చెస్టు లోనే వుంచి, ఇంకో చెస్టుకి మళ్ళీ కొత్త నోట్లని జారీ చెయ్యడం కాకుండా, అన్ని చెస్టుల్లోనూ వున్న నోట్లని, ఏ చెస్టుకి అవరమైతే ఆ చెస్టుకి పంపే ఏర్పాటు వుంటుంది. ఒక చెస్టు వున్న బ్యాంకు, తనకి అవసరం లేని నోట్లని చెస్టులో పెట్టెయ్యడం వల్ల, అవసరమైతే ఆ నోట్లని ఇంకో చెస్టు గల బ్యాంకు వాడుకోవడానికి వీలవుతుంది. అంటే, కరెన్సీని 'పొదుపుగా' వాడడానికి అవసరమయ్యే ఏర్పాటు ఇది.

ప్రతీ చెస్టూ తన లెక్కలన్నీ ప్రతీ రోజూ కేంద్ర బ్యాంకుకి పంపుతుంది. అక్కడ బ్యాంకింగ్ శాఖ, చెస్టుల పరిస్థితిని చూసి, చెస్టులకు ఇంకా నోట్లని సప్లై చేయవలసి వుంటే, 'బ్యాంకింగ్ శాఖ' నించి నోట్లని పంపుతుంది. బ్యాంకింగ్ శాఖలో కూడా కావలసిన మొత్తం లేకపోతే, 'ఇష్యూ శాఖ'లో ఎస్సెట్లు పెట్టి, నోట్లని తీసి, చెస్టులకు సప్లై చేస్తుంది. ఇష్యూ శాఖలో 'ఎస్సెట్లు' పెట్టడం అనేది, ఈ స్థాయిలో మాత్రమే జరుగుతుంది.

ప్రతీ సంవత్సరమూ, చలామణీ లోకి అవసర మయ్యే కరెన్సీ స్థాయి పెరగవలసి వుంటుంది. ఎందు కంటే, 'పెట్టుబడిదారీ విధానం'లో ప్రతీ సంవత్సరమూ 'ఉత్పత్తి క్రమం' స్థాయి, గతం కన్నా పెరుగుతూ వుంటుంది. గత సంవత్సరంలో వచ్చిన 'అదనపు విలువ'లో కొంత భాగం తప్పని సరిగా 'కొత్త పెట్టు బడి'గా మారుతుంది. దాని వల్ల, తర్వాత జరిగే ఉత్పత్తి క్రమం, 'విస్తృత పునరుత్పత్తి' క్రమంగా వుంటుంది. ఆ విస్తృత పునరుత్పత్తి క్రమం ముగిసేటప్పటికి, గత 'అదనపు విలువ' కన్నా ఎక్కువ అదనపు విలువ వస్తుంది. చలామణీ అవవలసిన విలువ పెరుగు తుంది కాబట్టి, చలామణీలో తిరగడానికి అవసర మయ్యే 'కరెన్సీ రాసి' కూడా పెరగవలసి వుంటుంది. అలా పెరగకపోతే కరెన్సీ చాలని పరిస్థితి ఏర్పడు తుంది.

పునరుత్పత్తి క్రమం, ఎప్పుడూ విస్తృత పునరుత్పత్తి క్రమంగానే వుండడం వల్ల, ఏటా కొంత కొత్త కరెన్సీ చలామణీ లోకి రావలసి వుంటుంది.

అంతే గాక, 'జాయింట్ స్టాక్ విధానం' ప్రారంభ మైన తర్వాత, 'వాటాల' వ్యాపారం ప్రారంభమై, వాటాల ధరలు అసలు విలువల కన్నా పెరుగుతాయి కాబట్టి, ఆ వ్యాపారం కోసం కూడా ఎక్కువ కరెన్సీ అవసర మవుతుంది.

పెట్టుబడులు కావలసిన పెట్టుబడి దారులు, ఎప్పుడూ బ్యాంకుల్ని అప్పులు అడుగుతూ వుంటారు. బ్యాంకులు - తమ డిపాజిట్లనీ, అప్పటికి ఇవ్వవలసిన అప్పుల్నీ అంచనా వేసుకుని, "రాబోయే 6 నెలల్లో మాకు ఇంకా కొంత ఎక్కువ డబ్బు కావాలి" అని 'కేంద్ర బ్యాంకు'ని అప్పు అడుగుతాయి.

బ్యాంకుల నించి వచ్చిన అలాంటి 'ఇండెంట్స్' అన్నిటినీ పరిశీలించి, ఎంత కొత్త కరెన్సీని జారీ చెయ్య వలసి వుంటుందో కేంద్ర బ్యాంకు ఒక అంచనాకి వచ్చి, అన్ని కొత్త నోట్లని ప్రింటు చేస్తుంది.

ఆ కొత్త డబ్బు, ప్రెస్ నించి మొదట 'ఇష్యూ శాఖ' లోకీ, తర్వాత 'బ్యాంకింగ్ శాఖ' లోకీ, అక్కడి నించీ 'చెస్టు' ల్లోకీ, తర్వాత బ్యాంకు ల్లోకీ, తర్వాత పెట్టుబడి దారుల చేతుల్లోకీ, వస్తుంది. ఈ రకంగా, కేంద్ర బ్యాంకు, కొంత కాలానికి ఒక సారి చెస్టులకు కొత్త కరెన్సీని సప్లై చేస్తూ వుంటుంది.

K అనే పెట్టుబడి దారుడు, కొన్ని యంత్రాలు కొనడానికో, లేదా 'పరిశ్రమ' కోసం కావలసిన బిల్డింగు కట్టడానికో, A బ్యాంకుని అప్పు అడిగాడనుకుందాం. ఆ అప్పుకి ష్యూరిటీ ఏమిటంటే - ఆ యంత్రాలే; లేదా

ఆ బిల్లింగే. ఆ ష్యూరిటీ పత్రాలు A బ్యాంకు లోనే వుంటాయి. K కి అప్పు దొరుకుతుంది.

వాటా పత్రాల్నీ, ఇతర సెక్యూరిటీల్నీ, బంగారాన్నీ, ఇతర ఆస్తుల్నీ కూడా, ష్యూరిటీలుగా పెట్టవచ్చు. వీటికీ, 'ఇష్యూ శాఖ'లో వుండే సెక్యూరిటీలకీ, సంబంధం లేదు.

కేంద్ర ప్రభుత్వానికి, 'ఆదాయం' కన్నా 'ఖర్చు' ఎక్కువగా వుండి డబ్బు అవసరమైనప్పుడు, అది 'పబ్లిక్' నించి అప్పులు తీసుకుంటుందని గతంలో చూశాం. ఈ అప్పుల కోసం, కేంద్ర బ్యాంకే, ప్రభుత్వం తరుపున రక రకాల బాండ్లని విడుదల చేస్తుంది. వాటిని బ్యాంకులూ, ఫైనాన్స్ కంపెనీలూ, ఇతర కంపెనీలూ, వ్యక్తులూ కొనడం ద్వారా ప్రభుత్వానికి డబ్బు వస్తుంది. అది ప్రభుత్వానికి అప్పు ఇవ్వడమే.

ప్రభుత్వం విడుదల చేసిన బాండ్లన్నీ అమ్ముడు కాలేదనుకుందాం. అంటే, ప్రభుత్వానికి కావలసినంత డబ్బు పబ్లిక్ నించి అందలేదనుకుందాం. అలాంటప్పుడు, ఆ మిగిలిన బాండ్లని కేంద్ర బ్యాంకే కొని, ప్రభుత్వానికి కావలసిన డబ్బంతా అందేలాగ చేస్తుంది. ప్రభుత్వ బాండ్లని కేంద్ర బ్యాంకు కొనడం అంటే, కేంద్ర బ్యాంకే, ప్రభుత్వానికి అప్పు ఇచ్చిందన్న మాట. తను కొని వుంచిన బాండ్లని, తర్వాత కొనుక్కనే వాళ్ళకి అమ్ముతుంది. ఎవ్వరూ కొనకపోతే, ఆ బాండ్ల ద్వారా వచ్చే వడ్డీ కేంద్ర బ్యాంకుకే వుంటుంది.

కేంద్ర బ్యాంకులో, కేంద్ర ప్రభుత్వ ఎక్కౌంటు ఎప్పుడూ ఒక లెవెల్ కన్నా తగ్గకుండా (ఉదా॥ 50 కోట్లు కన్నా తగ్గకుండా), వుండాలనుకుందాం. కానీ, ఒక సమయంలో, ఆ లెవెల్ 10 కోట్లు తగ్గిందనుకుందాం. తక్షణమే పబ్లిక్ నించి 'అప్పు' తీసుకోవడం సాధ్యం కాదు కాబట్టి, అప్పుడు 'బ్యాంకింగ్ శాఖ' లోనే అంత డబ్బు వుంటే, దాన్ని కేంద్ర బ్యాంకు, కేంద్ర ప్రభుత్వ ఎక్కౌంటులో జమ చేస్తుంది. లేదా, బ్యాంకింగ్ శాఖలో అంత డబ్బు లేకపోతే, తను ప్రభుత్వం నించి కొని వుంచిన బాండ్లని 'ఇష్యూ శాఖ'లో పెట్టి డబ్బు తీసి, దానితో ప్రభుత్వానికి అప్పు ఇస్తుంది. లేదా, కేంద్ర బ్యాంకు దగ్గిర ప్రభుత్వ బాండ్లు లేకపోతే, కేంద్ర ప్రభుత్వం, కొత్త బాండ్లని కేంద్ర బ్యాంకుకి అమ్ముతుంది. కేంద్ర బ్యాంకు, ఆ బాండ్లని ఇష్యూ శాఖలో పెట్టి, డబ్బు తీసి, ప్రభుత్వ ఎక్కౌంటులో జమ చేస్తుంది. ఆ మర్నాడే ప్రభుత్వానికి ఏ పన్నుల బాపతో 20 కోట్ల ఆదాయం వచ్చిందనుకుందాం. తక్షణమే 'ఖర్చు' కోసం అంత డబ్బు అవసరం లేకపోతే, అందులో నించి 10 కోట్లని ఇష్యూ శాఖకి బదిలీ చేసి, బాండ్లని బయటికి తియ్యవచ్చు. అప్పు తీసుకున్న 10 కోట్ల మీద ప్రభుత్వం, ఒక్క రోజు వడ్డీ మాత్రమే కేంద్ర బ్యాంకుకి చెల్లించవలసి వుంటుంది.

లేదా, ఇష్యూ శాఖలో వుండగానే అక్కడ పెట్టిన బిల్లులు మెచ్యూర్ అయ్యాయి అనుకుందాం. మెచ్యూర్ అయిన బిల్లులకు డబ్బు చెల్లించవలసింది ప్రభుత్వమే. ప్రభుత్వ ఎకౌంటులో డబ్బు వుండి, ఆ బిల్లులకు చెల్లించ గలిగే పరిస్థితి వుంటే, ఇష్యూ శాఖ లోకి డబ్బు వెళ్ళి, మెచ్యూర్ అయిన బిల్లులు బయటికి వస్తాయి. వాటి ద్వారా వచ్చే వడ్డీ 'కేంద్ర బ్యాంకు'కి అందుతుంది. కానీ, ఇష్యూ శాఖలో బిల్లులు మెచ్యూర్ అయినా, వాటికి డబ్బు చెల్లించే పరిస్థితి లేకపోతే, ఆ బిల్లుల్ని తీసేసి, వాటి బదులు కొత్త బిల్లులు పెడతారు. అంటే, పాత అప్పు తీరి, కొత్త అప్పు ప్రారంభ మవుతుంది. - ఈ రకంగా, కేంద్ర ప్రభుత్వానికి డబ్బు కావలసినా, లేదా కేంద్ర బ్యాంకు నిర్వహించే కార్య క్రమాలకు డబ్బు కావలసినా, ఇష్యూ శాఖలో సెక్యూ రిటీలు పెట్టి డబ్బు తీస్తారు. అలా తీసిన డబ్బు, దాన్ని ఏ అవసరాల కోసం తీశారో, ఆ పనుల కోసం వెళ్తుంది.

'ఇష్యూ శాఖ' నించి బయటికి వచ్చే నోట్లలో చాలా భాగం, ఇక ఇష్యూ శాఖ లోకి వెళ్ళడం అనేది వుండదు. అవి, ఎప్పుడూ చలామణీ లోనే తిరుగుతూ వుండవలసి వుంటుంది. (అవి చిరిగి పోయినప్పుడల్లా వాటికి బదులుగా కొత్త నోట్లు వస్తూ వుంటాయి. అది వేరే సంగతి.) ఈ నోట్లు 'చలామణీ'ని వదిలి ఇష్యూ శాఖ లోకి ఎప్పుడూ వెళ్ళవు కాబట్టి, ఈ నోట్ల జారీ సమయంలో ఇష్యూ శాఖ లోకి వెళ్ళిన సెక్యూరిటీలు కూడా ఇష్యూ శాఖని వదిలి ఎప్పుడూ బయటికి రావు. అయితే, అవి మెచ్యూర్ అయినప్పుడల్లా వాటిని తీసేసి, కొత్త సెక్యూరిటీలు పెట్టవలసి వుంటుంది. మెచ్యూర్ అయిన సెక్యూరిటీల మీద వచ్చే 'వడ్డీ', కేంద్ర ప్రభుత్వ ఎక్కౌంటు నించీ కేంద్ర బ్యాంకుకి అందుతూ వుంటుంది. 'కేంద్ర బ్యాంకు'కి వచ్చే ఆదాయంలో ఇది (ఈ వడ్డీ), ఎప్పుడూ అందుతూ వుండే భాగం.

క్రమంగా, ప్రతి ఏటా చలామణీ లోకి కొత్త నోట్లు వస్తూ, చలామణీలో వుండి పోయే 'నోట్ల పరిమాణం'

పెరుగుతూనే వుంటుంది.

ఏ రోజున చూసినా, 'చలామణీ'లో తిరిగే నోట్ల విలువకి సమానమైన 'ఎస్సెట్లు' ఇష్యూ శాఖలో వుంటాయి. అందులో కొంత భాగం బంగారమూ, కొంత భాగం స్వదేశీ విదేశీ సెక్యూరిటీలూ వుండ వచ్చు. అన్నిటి విలువా కలిసి జారీ అయిన నోట్ల విలువతో సమానంగా వుంటుంది.

**భారతదేశపు కేంద్ర బ్యాంకులో,**
**1982 ఏప్రిల్ 23న - 'ఇష్యూ శాఖ'లో ఎస్సెట్లు:**

| | |
|---|---|
| బంగారం .................. | 225,58,28,000 రూ. లు |
| విదేశీ సెక్యూరిటీలు | 1564,05,75,000 |
| ఒక రూపాయి నోట్లూ, నాణాలు | 34,74,16,000 |
| ప్రభుత్వ రుపీ సెక్యూరిటీలు | 13,779,90,17,000 |
| (స్వదేశీ మారకం బిల్లులు గానీ, ఇతర కమర్షియల్ పత్రాలు గానీ, లేవు) | |
| మొత్తం ఎస్సెట్లు - | 15,604,28,36,000 |

**అదే రోజున 'ఇష్యూ శాఖ' నించి జారీ అయివున్న నోట్లు (లయబిలిటీస్):**

| | |
|---|---|
| 'బ్యాంకింగ్ శాఖ'లో వున్న నోట్లు | 33,91,74,000 |
| బయట చలామణీలో నోట్లు | 15,570,36,62,000 |
| మొత్తం చలామణీలో నోట్లు | 15,704,28,36,000 |

(రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఫంక్షన్స్ అండ్ వర్కింగ్స్, 1984, పేజీ 315)

['ఇష్యూ శాఖ'లో - ఒక్క రూపాయి నోట్లూ నాణాలూ 'ఎస్సెట్లు'గా ఎందుకు వున్నాయంటే, భారత దేశంలో ఒక్క రూపాయి నోట్లనీ నాణాల్నీ కేంద్ర ప్రభుత్వమే విడుదల చేస్తుంది. కేంద్ర బ్యాంకు కాదు, కాబట్టి, వాటిని 'ఎస్సెట్లు'గా పెట్టడానికి అనుమతి వుంటుంది. ఈ ఉదాహరణని బట్టి తెలుస్తూ వున్నది - చలామణీలో వున్న డబ్బుకి తగిన ఎస్సెట్లు ఇష్యూ శాఖలో వున్నాయి - అని!]

కేంద్ర బ్యాంకు లోని 'బ్యాంకింగ్ శాఖ' లోనూ, ఇతర బ్యాంకు ల్లోనూ, ఫైనాన్స్ సంస్థ ల్లోనూ, జనాల దగ్గిరా వుండే నోట్లన్నీ కలిసి, చలామణీలో వున్న నోట్లు అని చూశాం. ఇదే, నోట్ల సప్లై (కరెన్సీ సప్లై).

అయితే, నోట్ల సప్లయ్యే 'డబ్బు సప్లై' కాదు. వేరే మాటల్లో చెప్తే, 'డబ్బు సప్లై' అంటే, 'నోట్ల సప్లై' మాత్రమే కాదు. ఆ నోట్ల తోనే, బ్యాంకులన్నీ కలిసి అనేక సార్లు అప్పులు ఇస్తాయి కాబట్టి, ఆ అప్పులన్నీ కలిసినదే 'డబ్బు సప్లై.'

> " ...... '**అ**ప్పు'గా వుండే డబ్బు పెట్టుబడి పరిమాణం, చలామణీ అయ్యే డబ్బు పరిమాణం నించి వేరు గానూ, స్వతంత్రం గానూ, వుంటుంది"- మార్క్స్ [కాపిటల్ -3, పేజీ 499.]

అప్పుగా వెళ్ళే డబ్బు పెట్టుబడి పరిమాణమూ, చలామణీలో తిరిగే డబ్బు పరిమాణమూ, వేరు వేరు విషయాలు. 'చలామణీలో తిరిగే డబ్బు పరిమాణం' అంటే, కరెన్సీ నోట్ల పరిమాణం. నోట్ల పరిమాణమే, అప్పుల పరిమాణం కాదు.

కాబట్టి, 'నోట్ల సప్లై'ని తగ్గిస్తే, అనేక రెట్ల డబ్బు సప్లైని తగ్గించవచ్చు. అలాగే, నోట్ల సప్లైని పెంచితే, అనేక రెట్ల 'డబ్బు సప్లై'ని పెంచవచ్చు.

అలాగే, ఇతర బ్యాంకులు, కేంద్ర బ్యాంకులో పెట్టవలసిన డిపాజిట్ల స్థాయిని మార్చడం ద్వారా కూడా 'డబ్బు సప్లై'ని మార్చవచ్చు.

ఇలాంటివే డబ్బు సప్లైకి అనేక మార్గాలు వున్నాయి.

సాధారణంగా, ఎక్కువ నోట్లని జారీ చెయ్య కూడదనేది కేంద్ర బ్యాంకు పాటించవలసిన నిబంధన. కానీ, 'ఎక్కువ' అనే దానికి ఒక హద్దు ఏమీ వుండదు. ప్రభుత్వ అవసరాల్ని బట్టీ, బ్యాంకులు అడిగే మొత్తాల్ని బట్టీ, కేంద్ర బ్యాంకు, నోట్లని జారీ చెయ్యక తప్పదు.

పెట్టుబడిదారీ విధానంలో, ఏ రంగం లోనూ, ఏ స్థాయిలోనూ కరక్టయిన లెక్కలు వుండవు. చలామణీ లోకి పోయిన డబ్బులో ఎంతో భాగం లెక్కల్లో కన పడదు. బోలెడు డబ్బు 'బ్లాక్ మనీ'గా తిరుగుతూ వుంటుంది.

కేంద్ర బ్యాంకు ఎన్ని నిబంధనలు పాటిస్తోన్నా, ఒక దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడుతూనే, ఇంకా పెరిగి పోతూనే వున్నాయి. అంటే, దేశంలో వున్న 'ఉత్పత్తుల విలువ'కీ, 'డబ్బు సప్లై'కీ పొంతన కుద రడం లేదని అర్థం. దాన్ని సాధించాలంటే, శాఖల మధ్య ఖచ్చితమైన ప్లానింగూ, నిజమైన డబ్బు లెక్కలూ, కావాలి. అంటే, పెట్టుబడిదారీ విధానంలో ఏదైతే అసంభవమో అది కావాలన్న మాట!

జాయింట్ స్టాక్ విధానం విస్తరిస్తోన్న కొద్దీ,

బ్యాంకులు ఇచ్చే అప్పుల్లో అధిక భాగం, 'వాటాలూ, బాండ్లూ' వంటి రక రకాల సెక్యూరిటీల వ్యాపారం కోసమే వుంటుంది. బ్యాంకులు, తమ స్వంతానికి సెక్యూరిటీలు కొనడానికీ; స్టాక్ బ్రోకర్లకూ, క్లయింట్లకూ అప్పులు ఇవ్వడానికీ - డిపాజిట్లలో అధిక భాగాన్ని ఉపయోగిస్తాయి.

**మార్క్సు మాటల్లో:**

"భౌతిక సంపద పెరుగుదలతో పాటు 'డబ్బు పెట్టుబడి దారుల వర్గం' పెరుగుతుంది. ఒక వైపు - రిటైర్డ్ పెట్టుబడిదారుల, కౌళ్ళు పొందే వాళ్ళ (రిటైర్డ్ కాపిటలిస్ట్సు అండ్ రెంటీయర్స్) సంఖ్యా, సంపదా, పెరుగుతాయి. ఇంకో వైపు - క్రెడిట్ విధానాభివృద్ధికి ప్రోత్సాహం పెరిగి, తద్వారా బ్యాంకర్లూ, మనీ లెండర్లూ, ఫైనాన్షియర్లూ - మొదలైన వాళ్ళ సంఖ్య, పెరుగుతుంది. అందుబాటు లోకి వచ్చే 'డబ్బు పెట్టుబడి' అభివృద్ధితో పాటు, వడ్డీ తెచ్చే పేపరూ, గవర్నమెంటు సెక్యూరిటీలూ, స్టాకులూ మొదలైన పత్రాల పరిమాణం కూడా పెరుగుతుంది. అయితే, దానితో పాటు అందుబాటులో వున్న డబ్బు పెట్టుబడికై డిమాండు కూడా పెరుగుతుంది. ఈ పేపర్‌తో స్పెక్యులేట్ చేసే జాబర్లు, డబ్బు మార్కెట్లో ముఖ్య పాత్ర వహిస్తారు". [కాపిటల్ - 3, పేజి 510, మాస్కో 1971.]

ఎక్కువ అప్పులు ఇవ్వడానికే బ్యాంకులు పోటీ పడతాయి. ఏ వ్యాపారం మీదైనా 'అదుపు' అవసరమైనట్టే బ్యాంకు వ్యాపారం మీద కూడా అదుపు అవసరం. ఇది 'డబ్బు సప్లై'తో ముడిపడి వున్న వ్యాపారం కాబట్టి, దీని మీద మరిన్ని నిబంధనలు అవసరం. కానీ, ఏ వ్యాపారం మీదైనా నిబంధనలు విధించవలసిన ప్రభుత్వమే పెట్టుబడిదార్ల, బ్యాంకర్ల ప్రభుత్వం అయినప్పుడు, వ్యాపారాల మీద అదుపులూ నిబంధనలూ అర్థ రహితమైన మాటలై పోతాయి. చట్టాల్లో ఎన్ని నిబంధనలు వున్నా, ఆచరణలో అవన్నీ నిరర్థకాలై పోయి, 'లాభ దృష్టే' జయించి, అది, ప్రతీ చోటా తనకు సహజమైన సమస్యల్ని ఉత్పత్తి చేస్తూనే వుంటుంది.

# 'పెట్టుబడి' మీద, 'అధికార' కేంద్రీకరణ

'పెట్టుబడి' మీద అధికారం - అంటే, 'ఉత్పత్తి సాధనాల' మీదా, 'శ్రమ శక్తి' మీదా, అధికారం. (C + Vల మీద). 'ఉత్పత్తి క్రమం' మీదా, 'చలామణీ క్రమం' మీదా అధికారం. ఆ రకంగా, మొత్తం 'సమాజం' మీద అధికారం!

'జాయింట్ స్టాక్ కంపెనీ' విధానం కన్నా పూర్వం, చిన్న స్థాయి పెట్టుబడులు వేరు వేరుగా పని చేసే కాలంలో, ఎవరి పెట్టుబడి మీద అధికారం వాళ్ళకే వుండేది. ఆ అధికారంలో, 'పెట్టుబడి' మీద చట్టపరమైన హక్కూ, పెట్టుబడిని 'నిర్వహించగలిగే' పరిస్థితీ కలిసి వుండేవి. ఒక పెట్టుబడిదారుడికి, 'వెయ్యి' పెట్టుబడితో పని చేసే కంపెనీ వుండేదనుకుందాం. ఆ చిన్న పెట్టుబడి మీద అధికారం ఆ ఒక్క వ్యక్తిదే. దాన్ని ఎలా నిర్వహించుకోవాలో నిర్ణయించుకునేది ఆ ఒక్క వ్యక్తే. అలాగే, ఎవరి పెట్టుబడి మీద హక్కులు వాళ్ళవే. అప్పుడు ప్రతీ పెట్టుబడీ, 'తక్కువ పరిమాణం'తో, 'తక్కువ ఉత్పత్తి శక్తి'తో, పని చేసేది.

కానీ, చిన్న చిన్న పెట్టుబడులన్నీ 'వాటాల' రూపంలో ఒకే చోటుకి (జాయింట్ స్టాక్ కంపెనీ లోకి) చేరే విధానంలో, 'పెట్టుబడి' మీద నిజమైన అధికారం, తక్కువ మంది పెట్టుబడి దారుల చేతుల్లో 'కేంద్రీకృతమవడం' ప్రారంభమైంది.

ఒక 'జాయింటు కంపెనీ'లో - మొత్తం పెట్టుబడి 1 లక్ష. మొత్తం వాటాదారులు 100 మంది. కంపెనీకి డైరెక్టర్లు 5 మంది - అనుకుందాం. కంపెనీలో వున్న పెట్టుబడి అంతా డైరెక్టర్లదే కాదు. కానీ, ఆ 'మొత్తం పెట్టుబడి' మీద అధికారం (ఆ పెట్టుబడిని నిర్వహించే నిజమైన అధికారం) డైరెక్టర్లకు మాత్రమే వుంటుంది.

మొత్తం వాటాదారులందరూ పెట్టుబడి దారులే. అయినా, ఇప్పుడు ఎవరి పెట్టుబడి మీద అధికారం వాళ్ళ చేతుల్లో వుండదు. 'ఉత్పత్తీ, చలామణీ క్రమాలకు' సంబంధించిన నిర్ణయాల్లో, ఈ వాటాదారుల పాత్ర ఏమీ వుండదు. డైరెక్టర్లు తప్ప, మిగిలిన వాళ్ళందరూ 'డివిడెంట్లు' అందుకునే వాళ్ళుగా మాత్రమే వుంటారు. ఈ ఉదాహరణలో, మొత్తం 100 మంది

పెట్టుబడి దారుల్లో 95 మందికి, పెట్టుబడిని నిర్వ హించే అధికారం పోయి, మొత్తం అందరి పెట్టుబడి మీదా అధికారం, 5 మంది చేతుల్లోకి చేరింది. ఇదే, పెట్టుబడి మీద అధికారం 'కేంద్రీకృతమవడం.'

'లక్ష' పెట్టుబడి మీద అధికారం 5 మంది డైరెక్టర్ల చేతుల్లో వుండడం అంటే, ప్రతీ డైరెక్టరూ 20 వేల పెట్టుబడి మీద (20% పెట్టుబడి మీద), అధికారం కలిగి వున్నాడని అర్థం.

తర్వాత కొంత కాలానికి, కంపెనీ పెట్టుబడి, 2 లక్షలు అయిందనుకుందాం. వాటాదారుల్లో ఇంకో 80 మందీ, డైరెక్టర్లు కూడా ఇంకో ముగ్గురూ, పెరిగా రనుకుందాం. ఇప్పుడు 2 లక్షల మీద అధికారం '8 మంది చేతుల్లో' వుంటుంది. గతంతో పోలిస్తే, ఇప్పుడు 'లక్ష' మీద అధికారం 4 గురి చేతుల్లో మాత్రమే వున్నట్టు అర్థం. ఇప్పుడు ఒక్కో డైరెక్టరూ, 25 వేల పెట్టుబడి మీద (25% పెట్టుబడి మీద), అధికారం కలిగి వుంటాడు. ఇది, గతంలో కన్నా ఎక్కువ 'అధికార కేంద్రీకరణ'. ఈ విధంగా, జాయింట్ స్టాక్ కంపెనీల్లో పెట్టుబడి పెరుగుతోన్న కొద్దీ, దాని మీద అధికారం నిర్వహించే హక్కు, గతంలో కన్నా తక్కువ మంది చేతుల్లో కేంద్రీకృత మవుతూ వుంటుంది.

అసలు, 'ఉత్పత్తి సాధనాల' మీదా, 'ఉత్పత్తీ - చలామణీ క్రమాల' మీదా అధికారం వుండవలసింది - ఆ క్రమాల్లో 'స్వయంగా శ్రమ చేసే' శ్రామికులకు. కానీ, ఆ పరిస్థితి, దోపిడీ సమాజాల్లో ఎలాగూ వుండదు. అధికారం అంతా 'ఉత్పత్తి సాధనాల యజ మానులకే' వుంటుంది. అయితే, ఇప్పుడు ఆ యజ మానుల అధికారం కూడా అనేక మంది నించీ 'కొంత మందికి మాత్రమే' పరిమితమవుతూ వుంటుంది.

ఒక 'జాయింట్ కంపెనీ'లో జరిగినట్టే, ప్రతీ 'జాయింట్ కంపెనీ' లోనూ జరుగుతుంది కాబట్టి, మొత్తం సమాజాన్ని తీసుకుంటే, సమాజంలో వున్న 'మొత్తం పెట్టుబడి' మీద అధికారం (మొత్తం 'ఉత్పత్తీ - చలామణీ క్రమాల' మీద అధికారం), అతి తక్కువ మంది పెట్టుబడి దారుల (డైరెక్టర్ల) చేతుల్లో మాత్రమే వుంటుంది.

సాధారణంగా, ఇక కంపెనీ 'డైరెక్టర్ల బోర్డు' లోకి చేరగలిగే వాళ్ళు - ఎక్కువ వాటాలు గల ఉత్పాదక పెట్టుబడి దారులూ, వర్తక పెట్టుబడి దారులూ, భూస్వాములూ, బ్యాంకు పెట్టుబడి దారులూ, మిల టరీ అధికారులూ, ప్రభుత్వ అధికారులూ - వంటి వాళ్ళే. ఒక కంపెనీ 'డైరెక్టర్ల బోర్డు' ఇలా వుంటే, అన్ని కంపెనీల డైరెక్టర్ల బోర్డులన్నీ కలిపి చూస్తే, ఈ 'దోపిడీ అగ్రగణ్యుల బృందమే' సామాజిక పెట్టుబడిని (మొత్తం సమాజాన్ని) నడుపుతూ వుంటుందన్న మాట!

ఒక దేశంలో 10 కోట్ల జనాభా వున్నారను కుందాం. అందులో పెట్టుబడిదారులు, 10 లక్షల మందీ, మిగిలిన వాళ్ళు శ్రామికులూ అనుకుందాం. పెట్టుబడి దారుల్లో 1 వెయ్యి మంది 'డైరెక్టర్లు' అను కుందాం. ఆ డైరెక్టర్లలో 200 మంది అత్యధిక వాటాలు గల వాళ్ళనుకుందాం. మొత్తం దేశానికి సంబంధించిన నిర్ణయాలన్నీ ఆ 200 మంది డైరెక్టర్ల చేష్టలుగా వుంటాయన్న మాట. మొత్తం '10 కోట్ల' జనాభాకి, ఆ డైరెక్టర్లే అధిపతులు! పెట్టుబడి కేంద్రీ కరణకు ప్రధాన రూపం - జాయింట్ స్టాక్ కంపెనీ.

> " ... 'స్టాక్ కంపెనీ' అనేది - పెట్టుబడి దారీ ఆస్తి విధానంతో ఇంకా లంకె పడి వున్న పునరుత్పత్తి క్రమపు అన్ని విధులూ, అస్సోసి యేటెడ్ ఉత్పత్తి దారుల విధులుగా, అంటే సామాజిక విధులుగా, మారడానికి - 'పరి వర్తనా దశ'గా ('ట్రాన్సిషన్'గా) వుంటుంది."
> -మార్క్స్ [కాపిటల్- 3, పేజీ 437, మాస్కో.]

ఈ విషయం సరిగా అర్థం చేసుకోకపోతే, ఇది, 'విపరీతమైన అపార్థాలకు' దారితీస్తుంది. - కార్మిక వర్గానికి, శ్రమ దోపిడీ గురించి ఏ కాలంలో తెలు స్తుందో అప్పుడు, ఉత్పత్తి సాధనాలు ఏ దోపిడీ యాజమాన్యం కింద వుంటే, ఆ యాజమాన్యం నించి స్వాధీనపర్చుకోవడమే కార్మిక వర్గం చేయవలసిన పని. ఒక దేశంలో, ఉత్పత్తి సాధనాలు భారీ జాయింట్ స్టాక్ కంపెనీల్లో కేంద్రీకృతమై పోయి వున్నప్పుడు, ఆ కంపెనీల్ని స్వాధీనపర్చుకోవడమే ఆ కంపెనీల కార్మి కులు చేయవలసింది. అలా జరిగినప్పుడు, పెట్టుబడి దారీ విధానం, సమిష్టి ఉత్పత్తిదారుల విధానంగా మారడానికి, జాయింట్ స్టాక్ కంపెనీ విధానం 'పరి వర్తనా దశ'గా వున్నట్టే అవుతుంది. అక్కడ వున్న పరి స్థితుల్ని బట్టి జరిగే మార్పు అదే.

అయితే, ప్రతీ దేశం లోనూ అలాగే జరగాలని అర్థం కాదు. ఒక దేశంలో జాయింట్ స్టాక్ విధానం ఇంకా అభివృద్ధి చెంది లేదనుకుందాం. 'జాయింట్

స్టాక్ విధానం పరివర్తనా దశగా వుంటుంది' అని మార్క్సు అన్నాడు కాబట్టి, అక్కడ ఆ విధానం అభివృద్ధి చెందే దాకా ఆగాలనీ, దాన్ని అలా అభివృద్ధి చెంద నివ్వాలనీ, అది అభివృద్ధి చెందడానికి కూడా దోహదం చెయ్యాలనీ, అంత వరకూ కార్మిక వర్గం అధికారం తీసుకోవడం కోసం ఏమీ చెయ్యరాదనీ, అర్థం కాదు. శ్రమ దోపిడీ నించి తెలిసినప్పటి నించీ దాని నించి బయట పడే ప్రయత్నాలలోనే వుండాలి. ఈ విషయాలు జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

'పెట్టుబడి కేంద్రీకరణ' ఏటా పెరుగుతూనే వుంటుంది. ఈ కేంద్రీకరణ, ఒకే కంపెనీ పరిమితుల్లో ఆగదు. జాయింట్ స్టాక్ కంపెనీ విధానం, క్రమంగా, అనేక జాయింట్ స్టాక్ కంపెనీలు కేంద్రీకృత మవడానికి దారి తీస్తుంది. ఒక శాఖలో, భారీ పెట్టుబడితో పని చేసే ఒక జాయింట్ కంపెనీ, అదే శాఖలో గానీ, దాని సంబంధిత శాఖల్లో గానీ, కొన్ని తక్కువ స్థాయి జాయింట్ కంపెనీల్ని తన అనుబంధ కంపెనీలుగా చేసుకోగలుగుతుంది. ఎలాగంటే: వాటితో అనేక రకాల సంబంధాల ద్వారా! కొన్ని అనుబంధ కంపెనీల్ని తనే స్థాపించి, వాటిలో మెజారిటీ వాటాల్ని తన ఆధీనంలో వుంచుకోవచ్చు. ఏదైనా ఇంకో కంపెనీ, వాటాల్ని విడుదల చేసినప్పుడు, అందులో వీలైనన్ని ఎక్కువ వాటాలు సంపాదించడానికి, అనేక మారు పేర్లతో ప్రయత్నించి ఆ వాటాలు సంపాదించవచ్చు. కొన్ని కంపెనీలతో, తన 'సాంకేతిక' సహకారాలూ, 'ఆర్థిక' సహకారాలూ అందించే రకపు సంబంధాలూ; కొన్ని కంపెనీలతో, వాటి సరుకుని తను తీసుకునే 'వ్యాపార' సంబంధాలూ - ఏర్పర్చుకోవచ్చు. తన డైరెక్టర్లలో కొంత మంది, ఆ అనుబంధ కంపెనీలకు కూడా డైరెక్టర్లుగా వుండవచ్చు. ఈ రకం గానూ, ఇంకా సాధ్యమైనన్ని రకాలు గానూ, ఒక భారీ కంపెనీ, అనేక చిన్న కంపెనీలతో, అవి తన మీద ఆధారపడి వుండే సంబంధాలతో, వాటిని తన అనుబంధ సంస్థలుగా చేసుకోగలుగుతుంది.

A కంపెనీకి, B కంపెనీ అనుబంధ సంస్థగా వుందనుకుందాం. అప్పుడు B కంపెనీకి సంబంధించిన నిర్ణయాలన్నిటి లోనూ, A కంపెనీకి సంబంధం వుంటుంది. B కంపెనీకి ప్రత్యేక డైరెక్టర్ల బోర్డు వున్నప్పటికీ, ఆ బోర్డు, పూర్తి స్వతంత్రంతో గాక, దాదాపుగా A కంపెనీ ఆధిపత్యం కింద వుంటుంది. (ఈ ఆధిపత్యం 'చట్ట పరంగా' వుండే హక్కు కాదు.) ఇది 'అధికార కేంద్రీకరణ'ని మరింత పెంచుతుంది.

B కంపెనీకి కూడా C అనే అనుబంధ కంపెనీ వుంటే, అప్పుడు సంబంధాలు ఇలా వుంటాయి:

C మీద ..... B ఆధిపత్యం.

B మీద ..... A ఆధిపత్యం.

అంటే, A ఆధిపత్యం...B మీదే కాదు, C మీద కూడా!

3 కంపెనీల పెట్టుబడి అంతా Aదే కాక పోయినా, మొత్తం పెట్టుబడి మీద A కంపెనీయే అధికారం నడపగలుగుతుంది. ఈ రకంగా, ఒక భారీ కంపెనీకి, ఎన్ని 2 వ స్థాయి, 3 వ స్థాయి కంపెనీలతోనైనా సంబంధాలు ఏర్పడ్డానికి అవకాశం వుంటుంది. అంటే, అనేక అనుబంధ కంపెనీల పెట్టుబడి మీద అధికారం, ఒక భారీ కంపెనీ చేతిలో కేంద్రీకృతమవుతుంది.

ఒక భారీ జాయింట్ స్టాక్ కంపెనీ, చిన్న జాయింట్ స్టాక్ కంపెనీల్ని తనలో పూర్తిగా కలిపి వేసుకునే కార్యక్రమాలు కూడా జరుగుతూ వుంటాయి. 2 వ కంపెనీని మొదటి కంపెనీతో కలిపి వెయ్యాలని, 2 వ కంపెనీ డైరెక్టర్ల బోర్డు నిర్ణయించడంతో ఆ పని జరిగిపోతుంది. ఆ డైరెక్టర్ల బోర్డు, తమ వాటాదార్లకు ఇలా చెపుతుంది - 'ఈ కంపెనీని ఫలానా గొప్ప కంపెనీలో కలిపి వెయ్యడానికి డైరెక్టర్ల బోర్డు నిర్ణయించింది. దాని వల్ల ఈ కంపెనీ లాభాలు అనేక రెట్లు పెరుగుతాయి. ఈ కలయికని అంగీకరించని వాటాదార్లు, వాటా విలువని తీసుకుని వెళ్ళి పోవచ్చు' - అని ప్రకటిస్తుంది. లాభాలు పెరుగుతాయంటే వ్యతిరేకించే వాటాదారులెవ్వరూ వుండరు కాబట్టి, ఆ కంపెనీల కలయిక జరిగిపోతుంది. ఆ రకంగా, 2 వ కంపెనీ పెట్టుబడి కూడా మొదటి కంపెనీ డైరెక్టర్ల అధికారం కిందకి వస్తుంది.

భారీ స్థాయి కంపెనీ డైరెక్టర్లలో ప్రతీ ఒక్కరూ, తమ అనుబంధ కంపెనీలలో కూడా డైరెక్టర్లుగా వుంటారు. ప్రతీ డైరెక్టరుకీ, ఆ కంపెనీల వాటాల్లో కూడా తప్పనిసరిగా కొంత శాతం వాటాలు వుండాలి. కానీ, డైరెక్టర్లు, వుంచుకోవలసినన్ని వాటాలు వుంచుకోకుండా తర్వాత కాలంలో చాలా వాటాలు అమ్మేస్తారనీ, ఆ డబ్బుతో ఇంకో కంపెనీలో వాటాలు కొంటారనీ, ఇంతకు ముందే చూశాం. ఇంకో

కంపెనీలో వాటాలు కొని, అక్కడ కూడా డైరెక్టరు అయిన తర్వాత, ఆ వాటాల్ని కూడా అమ్మేసి, మళ్ళీ మూడో కంపెనీలో వాటాలు కొంటారు. ఈ రకంగా, ఒక పెట్టుబడి దారుడు, ఏ కంపెనీ లోనూ వుండ వలసినన్ని వాటాలు లేకుండానే, అనేక కంపెనీలకు డైరెక్టరు గా వుంటాడు. అంటే, తన 'స్వంత పెట్టుబడి' తగినంత లేకుండానే, ఇతర వాటాదార్లకి సంబంధిం చిన భారీ పెట్టుబడుల మీద అధికారం నెరపగలుగు తాడు.

ఒక డైరెక్టరు, 20 కంపెనీలకు డైరెక్టరుగా వున్నాడంటే, అది ఆశ్చర్యకరమైన విషయం కాదు. "ఒక వ్యక్తి, 20 కంపెనీల వరకూ డైరెక్టరుగా వుండవచ్చు" అనో, "30 కంపెనీల వరకూ డైరెక్టరుగా వుండవచ్చు" అనో, 'కంపెనీ చట్టం' లోనే అనుమతి వుంటుంది. ఒక పెట్టుబడి దారుడు, 20 కంపెనీలకు డైరెక్టరుగా వున్నాడంటే, 20 కంపెనీల లోనూ వాడి పెట్టుబడి వుండదు. కానీ, 20 కంపెనీల మీదా అధికారం చెయ్యగలుగుతాడు.

ఇక, ప్రతీ కంపెనీ లోనూ ఒక జీతం చొప్పున, 20 కంపెనీల నించి 20 జీతాలు తీసుకుంటాడు. జీతాలే గాక, అనేక రకాల 'అలవెన్సు'లు కూడా తీసుకుంటాడు. 'డైరెక్టరు' అనే వాడు ఎంత కష్ట జీవి అయినా, వాడికి కూడా, రోజుకి 24 గంటలే! అందులో, డైరెక్టరు గారి తిండీ, నిద్రా వగైరా స్వంత అవసరాల కోసం కనీసం 16, 18 గంటల కాలాన్ని తీసివేస్తే మిగిలిన కాలం లోనే ఆ 'కష్ట జీవి', 20 కంపెనీలకూ తన 'సేవలు' అందించి 20 జీతాలు తీసుకోగలుగుతాడు! ఒక్కో జీతానికీ ఒక్కో పావు గంట కాలం ఖర్చు పెడతాడన్న మాట!

కార్మికులు మాత్రం రోజుకి కనీసం 8 గంటలు పని చెయ్యాలి. అనేక శాఖల్లో కార్మికులు రోజుకి 14 గంటలు కూడా పని చేస్తారు. వాళ్ళు, ఇళ్ళ నించి పని స్థలానికి రావాలంటే, డైరెక్టర్ల లాగ 'కార్ల' మీద రారు. బస్సుల మీదో, సైకిళ్ళ మీదో, వస్తారు. అంటే, కార్మికులు ఇళ్ళ దగ్గిర ఇంకో గంట ముందో, 2 గంటల ముందో బైల్దేరాలి. ఇన్ని గంటల కాలం కార్మికులు ఖర్చు పెడితే, దానికి - ఒక్క జీతం!

3 గంటలు కూడా పని చెయ్యని డైరెక్టరుకి, 20 జీతాలు! ఆపైన అలవెన్సులూ, ఆపైన ప్రత్యేక సౌకర్యాలూ, ఆ పైన ... ఆ పైన ... ఆ పైన ...!!

"పెట్టుబడిదారీ పునాదిపై, స్టాక్ కంపె నీల్లో, 'మేనేజిమెంటు జీతాల' విషయంలో, ఒక కొత్త మోసం (స్విండ్లింగ్) తలెత్తుతుంది ... అనేక మంది మేనేజర్లు, లేదా డైరెక్టర్ల బోర్డులు వుంటాయి. సూపర్ విజనూ, మేనేజిమెంటూ అనేవి, వాళ్ళకి, వాటా దారుల్ని కొల్లగొట్టి సంపదని కూడగట్టుకోవ డానికి సాకులుగా ఉపయోగపడ తాయి."

- మార్క్స్ [కాపిటల్ - 3, పేజీ 389.]

ఇక్కడ మార్క్సు, కొన్ని పుస్తకాల నించి కొటేషన్లు ఇచ్చాడు. డైరెక్టర్లు అనేక కంపెనీలకు డైరెక్టర్లుగా వుంటూ 'జీతాల' పేరుతో విపరీతమైన మొత్తాలు స్వాహా చేస్తారనే సంగతి ఇక్కడ చెప్పాడు. దివాళా తీసిన కొన్ని కంపెనీల బ్యాలెన్స్ షీట్ల ప్రకారం ఆ సంగతి తేలిందట. ఆ బ్యాలెన్స్ షీట్లలో, సూపర్ విజనూ, దాని జీతాలూ, 'తల్లకిందుల పాళ్ళల్లో' ఉన్నాయట! అంటే, ఆ 'శ్రమ'లో ఎక్కువ భాగం చేసే వాళ్ళకి తక్కువ జీతాలూ, తక్కువ భాగం చేసే వాళ్ళకి ఎక్కువ జీతాలూ, అసలు బొత్తిగా చెయ్యని డైరెక్టర్ల కేమో ఊహాతీతమైన జీతాలూ, వున్నాయట! వాటా దార్లకి పంచవలసిన లాభాల్ని డైరెక్టర్లు ఎన్నో పేర్లతో కాజేసినట్టుగా, ఆ లెక్కలు తెలుపుతున్నాయని మార్క్సు వివరణ. 'స్టాక్ కంపెనీ విధానం' ద్వారా తలెత్తే అనేక రకాల మోసాల్లో, డైరెక్టర్ల జీతాలు కూడా ఒక పెద్ద మోసం (స్విండ్లింగ్).

'స్టాక్ కంపెనీ' ద్వారా తలెత్తే మోసాల మీద ఇంకా చూడండి, మార్క్సు నించీ:

".... అది (జాయింట్ స్టాక్ విధానం) - ప్రమోటర్ల రూపం లోనూ స్పెక్యులేటర్ల రూపం లోనూ, నామ మాత్రపు డైరెక్టర్ల రూపం లోనూ వుండే ఒక కొత్త రకపు ఆర్థిక ప్రభు వర్గాన్ని ('ఏ న్యూ ఫైనాన్షియల్ అరిస్టో క్రసీ' - ని), అనగా, కొత్త రూపపు పరాన్న భుక్కులను, కార్పొరేషన్ ప్రమోషన్ల ద్వారానూ, స్టాకుల జారీ ద్వారానూ, స్టాకుల స్పెక్యులేషన్ ద్వారానూ, దగాలూ మోసాలూ జరిగే (స్విండ్లింగ్ అండ్ చీటింగ్ - జరిగే) నూతన విధానాన్ని - పునరుత్పత్తి చేస్తుంది"

- [కాపిటల్ -3, పేజీ 438.]

# 'గుత్త' కంపెనీ

ఒక జాయింట్ స్టాక్ కంపెనీతో పాటు దాని ఆధిపత్యం కింద వున్న కంపెనీలన్నీ కలిసి ఒక 'గుత్త కంపెనీ' (మోనోపలీ కంపెనీ) అవుతాయి.

లేదా, ఒక శాఖ లోని కొన్ని వేరు వేరు జాయింటు స్టాక్ కంపెనీలు, కొన్ని ఒప్పందాలు చేసుకున్నప్పుడు కూడా అవన్నీ కలిసి ఒక 'గుత్త కంపెనీ' అవుతాయి.

ఒక 'గుత్త కంపెనీ'లో, వేరు వేరు కంపెనీలు సభ్యులుగా వుంటాయి. ఆ వేరు వేరు కంపెనీల డైరెక్టర్లలో నించి 'గుత్త కంపెనీ'కి డైరెక్టర్ల బోర్డు ఏర్పడుతుంది. 'గుత్త కంపెనీ'లకు ఒక్కో దేశంలో ఒక్కో రకం పేరు వుండవచ్చు. లేదా, గుత్త కంపెనీ స్థాయిని బట్టి కూడా పేర్లు తేడాగా వుండవచ్చు. కార్టెల్, సిండికేట్, ట్రస్ట్, కన్‌సర్న్, కార్పొరేషన్ - లాంటి పేర్లు.

ఏ పెట్టుబడిదారీ దేశాన్ని తీసుకున్నా, అక్కడ గుత్త కంపెనీలు ఏర్పడ్డ క్రమం దశల వారీగా వుంటుంది. మొదటి దశలో, గుత్త కంపెనీలో సభ్యులుగా వున్న కంపెనీల మధ్య 'ధరలకు' సంబంధించిన (ఆ కంపెనీలు అమ్మే సరుకుల ధరల్ని ఎలా వుంచాలో) ఒప్పందాలు మాత్రమే వుండవచ్చు. తర్వాత దశల్లో - ఉత్పత్తి కోటాలూ (ఏ కంపెనీ ఎంత ఉత్పత్తి చెయ్యాలో), మార్కెట్ ప్రదేశాలూ (ఏ కంపెనీ, ఏ మార్కెట్లలో అమ్ముకోవాలో), కార్మిక నిబంధనలూ - వగైరా అంశాలన్నీ కూడా చేరతాయి. ఈ రకమైన ఒప్పందాలతో 'గుత్త కంపెనీ'గా ఏర్పడిన వేరు వేరు కంపెనీలు, తమ మధ్య 'పోటీ' లేకుండా చేసుకోడానికి ప్రయత్నిస్తాయి. గుత్త కంపెనీకి - ఇతర దేశాల్లో కూడా శాఖలూ, అనుబంధ కంపెనీలూ, స్వంత బ్యాంకులూ - వగైరాలన్నీ వుంటాయి. ఈ కంపెనీలు విడి విడిగా వున్నప్పటి కన్నా, కొన్ని ఒప్పందాల ద్వారా కలిసినప్పుడు, ఆ కంపెనీల మొత్తం పెట్టుబడి ఎక్కువ 'ఉత్పాదక శక్తి'తో పని చేస్తుంది. కాబట్టి గుత్త కంపెనీ, ఎక్కువ శక్తి కలదిగా వుంటుంది.

అయితే, గుత్త కంపెనీల ఏర్పాటుతో సమాజంలో 'పోటీ' నశిస్తుందా? - అలా జరగదు. ఒక గుత్త కంపెనీ వల్ల, అందులోకి చేరే కంపెనీల మధ్య మాత్రమే పోటీ ఆగుతుంది. అప్పుడు పోటీ, వేరు వేరు గుత్త కంపెనీల మధ్య వుంటుంది. అంటే, ఒక గుత్త కంపెనీకీ, ఇంకో గుత్త కంపెనీకీ మధ్య. ఈ పోటీ, చిన్న స్థాయి పెట్టుబడుల మధ్య గాక, భారీ స్థాయి పెట్టుబడుల మధ్యా; విడి విడి పెట్టుబడి దారుల మధ్యా గాక, పెట్టుబడి దారుల భారీ బృందాల మధ్యా - వుంటుంది. ఈ రకంగా, ఇప్పుడు పోటీకి 'రూపం' మారుతుందే గానీ, పోటీయే లేకుండా పోయే పరిస్థితి ఏర్పడదు.

కొన్ని కంపెనీలు కలిసి ఒక 'ఒప్పందం' చేసుకోవడం ఎందుకంటే - 'పోటీ చెడ్డద'నీ, 'ఐక్యతే ఉత్తమమైనద'నీ కాదు. ఆ ఒప్పందంలో వున్న ప్రతీ కంపెనీ దృష్టీ ఏమిటంటే, తన కన్నా ఎక్కువ లాభాలు ఇతర కంపెనీలకు పోకుండా చెయ్యాలనేదే. ఆ ఒప్పందం లోకి రాకపోతే, అందులో కొన్ని కంపెనీలు, ఎక్కువ 'లాభం రేటు'ని తీసుకునే అవకాశం వుండొచ్చు. వాటికి ఆ అవకాశం లేకుండా చెయ్యాలంటే, కొన్ని షరతులతో అన్ని కంపెనీలూ కలిసి ఒక ఒప్పందం లోకి రావాలి. లాభాల్ని పంచుకునే పోరాటానికి మరో రూపమే, ఈ ఒప్పందం. ఈ దృష్టి తోటే కంపెనీలు ఒప్పందాల లోకి వస్తాయి. ఇది పోటీకి ఇంకో రూపం మాత్రమే. 'లాభం' కోసం, సాధ్యమైతే - 'పోటీ'; సాధ్యం కాకపోతే - 'ఒప్పందం!' అదీ, ఇదీ కూడా 'లాభం కోసమే!'

ఒక 'గుత్త కంపెనీ'లో పోటీ లేనట్టుగా కనపడేటప్పుడు కూడా, అందులో 'సభ్యులు'గా వుండే కంపెనీల మధ్య, 'అంతర్గత కలహాలు' వుంటూనే వుంటాయి. మంచి మార్కెట్ ప్రదేశాల కోసమూ, ఉత్పత్తి కోటాల కోసమూ, కంట్రోలింగ్ పవర్‌ని ఇచ్చే నాయకత్వ పదవుల కోసమూ - వగైరా అనేక అంశాల కోసం, రహస్య విభేదాలూ, కుమ్ములాటలూ, గ్రూపిజాలూ - అనేకం వుంటాయి. ఎవరి అనుకూలతని బట్టి వాళ్ళు వాటిని ఉపయోగించుకుంటారు.

వేరు వేరు దేశాల గుత్త కంపెనీలు కలిసి ఒప్పందాలు చేసుకుంటే, అవి, 'అంతర్జాతీయ గుత్త కంపెనీలు'. లేదా, 'బహుళ జాతి గుత్త కంపెనీలు'. (మల్టీ నేషనల్ కంపెనీస్). వాటికి తగిన స్థాయిలో పెట్టుబడి మీద అధికార కేంద్రీకరణ వుంటుంది. అప్పుడు కూడా 'పోటీ' నశించదు. ఆ పోటీ, వేరు వేరు అంతర్జాతీయ కంపెనీల మధ్య వుంటుంది.

'పోటీ' అనేది, 'ఎక్కువ లాభం కోసమే' కాబట్టి, లాభ దృష్టి గల ఉత్పత్తి విధానంలో పోటీ ఎన్నడూ నశించదు. లాభాల వేట, పోటీని ఏదో ఒక రూపంలో ఎప్పుడూ తప్పనిసరి చేస్తూనే వుంటుంది.

ఒక పెట్టుబడిదారీ దేశంలో, ప్రధానమైన శాఖలన్నిటి లోనూ గుత్త కంపెనీలు ఏర్పడిపోయి వున్న దశలో కూడా, ఒకే కుటుంబానికి సంబంధించిన కుటుంబ కంపెనీలూ, చిన్న స్థాయి జాయింట్ కంపెనీలూ కూడా కొన్ని వుంటాయి. అలాంటి చిన్న కంపెనీల్ని, భారీ కంపెనీలు తమ గ్రూపులో చేర్చుకోవడానికి రక రకాల మార్గాల్లో ప్రయత్నిస్తాయి. ఆ చిన్న కంపెనీల డైరెక్టర్లకి లంచాలివ్వడమూ, బెదిరించడమూ, ఆ కంపెనీలకు బ్యాంకు అప్పులు అందనివ్వకుండా చెయ్యడమూ, వాటి సరుకుల్ని అమ్ముకోడానికి మార్కెట్లు అందనివ్వకుండా చెయ్యడమూ, ఆ కంపెనీల మీద తప్పుడు ప్రచారాలు చేసి వాటి వాటాల ధరలు పడిపోయే లాగ చెయ్యడమూ - వంటి అనేక మార్గాల్లో ఆ ప్రయత్నాలు జరుగుతాయి. అలాంటి ప్రయత్నాలు ఎన్ని జరిగినా, గుత్త కంపెనీల సరసన, ఇంకా కొన్ని చిన్న స్థాయి కంపెనీలు వుంటూనే వుంటాయి. అయితే, ఆ శాఖకి సంబంధించిన 'మొత్తం ఉత్పత్తి'లో, చిన్న కంపెనీల ఉత్పత్తి అతి తక్కువగా వుంటుంది. చిన్న కంపెనీల ఉత్పాదక శక్తి కూడా అతి తక్కువగానే వుంటుంది కాబట్టి, వాటికి ఎక్కువ లాభాలు ఉండవు.

## గుత్త కంపెనీకి 'గుత్త లాభాలు':

గుత్త కంపెనీలుగా ఏర్పడడం వల్ల పెట్టుబడిదారీ బృందాలకు కలిగే ప్రయోజనం ఏమిటంటే, - 'జనరల్ లాభాల' కన్నా ఎక్కువ లాభాలు సంపాదించే అవకాశాలు ఏర్పడడం. ('రెలిటివ్ అదనపు విలువ'ని సంపాదించే సూత్రమే ఇది. దీన్ని మొదటి సంపుటంలో, 'పని దినం' చాప్టరులో చూశాం. ఆ విషయమే ఇక్కడ ఒక సారి గుర్తు చేసుకోవాలి.)

'సరుకు'ని గతంలో కన్నా తక్కువ 'కాస్ట్ ప్రైస్'తో (తక్కువ ఖర్చుతో) ఉత్పత్తి చేస్తూ, 'ఎప్పటి ధర'కే అమ్మగలిగితే, గతంలో కన్నా ఎక్కువ లాభం సంపాదించడం సాధ్యమవుతుంది. గుత్త కంపెనీల్లో, సాంకేతికమైన మెరుగుదలల కోసం నిత్య పరిశోధనలు జరుగుతూ, ఉత్పత్తి శక్తులు పెరుగుతూ, కాస్ట్ ప్రైస్‌లు తగ్గుతూ వుంటాయి.

ఒక శాఖలో, కొన్ని చిన్న కంపెనీలు గాక, ఒకే ఒక్క గుత్త కంపెనీ వుందనుకుందాం. ఆ గుత్త కంపెనీయే, ఆ శాఖలో ఎక్కువ సరుకుని ఉత్పత్తి చేస్తూ వుంటే, అది, తన సరుకు ధరని 'నిష్కారణం'గా పెంచగలుగుతుంది. (ధరని నిష్కారణంగా పెంచడం అంటే, 'కాస్ట్ ప్రైస్' పెరగకుండానే 'ధర'ని పెంచడం.) లేదా, ఒక శాఖలో, ఒకటి కన్నా ఎక్కువ గుత్త కంపెనీలు వున్నాయి అనుకుందాం. అవన్నీ కలిసి 'ఒప్పందం' చేసుకున్నాయి. అప్పుడు కూడా ధరని నిష్కారణంగా పెంచగలుగుతాయి.

A శాఖ సరుకు, B, C, D శాఖలకు, ఉత్పాదకంగా అవసరం - అనుకుందాం.

A శాఖలో - తగ్గిన కాస్ట్ ప్రైసూ, కానీ ఎప్పటి ధరా - అనుకుందాం.

ఎప్పటి ధర తోటే ఆ సరుకుని కొనే B, C, D శాఖల్లో తయారయ్యే కొత్త సరుకులకు, ఎప్పటి కాస్ట్ ప్రైసూ, ఎప్పటి ధరా - వుంటాయి.

అంటే, ఏ శాఖలోనూ ధరలు మారలేదు. ఎప్పటి ధరలే వున్నాయి. అయినా, A శాఖని, B - C - D శాఖలతో పోల్చి చూస్తే, A శాఖ లాభం రేటు, మిగతా శాఖల్లో కన్నా ఎక్కువగా వుంటుంది. కారణం A శాఖలో కాస్ట్‌ప్రైస్ తగ్గినా ఎప్పటి ధరే వుండడం. ('ఎప్పటి ధర'లో నించి, 'తగ్గిన కాస్ట్ ప్రైస్'ని తీసివేస్తే, మిగిలే లాభం గతంలో కన్నా ఎక్కువగా వుంటుంది.)

ఒక శాఖ - సగటు కన్నా ఎక్కువ లాభం సంపాదించగలిగినప్పుడు, ఆ లాభాన్ని, ఇతర శాఖల లాభాలతో పోలిస్తే, ఇతర శాఖల లాభాలు 'సగటు' కన్నా

తక్కువగా వుంటాయి. అంటే, 'ఎక్కువ' లాభం సంపాదించగలిగిన శాఖ, ఇతర శాఖలకు పోవలసిన సగటు లాభాలలో నించే కొంత కొంత భాగాల్ని లాక్కోగలిగిందని అర్థం. ఒక శాఖ, ఎక్కువ లాభం సంపాదించడంలో ఇంత కన్నా రహస్యం ఏమీ వుండదు.

A శాఖలో - తగ్గిన కాస్ట్ ప్రైసూ, ఎప్పటి కంటే కూడా ఎక్కువ ధరా - అనుకుందాం. ఇలా ధరని 'పెంచి' అమ్మగలిగితే, A శాఖకి, మొదటి ఉదాహరణలో కన్నా కూడా ఎక్కువ లాభం వస్తుంది. అయితే, ఇతర శాఖలు కూడా అదే పని చేస్తే (అవి కూడా తమ ధరల్ని పెంచితే) ఏ శాఖకీ 'ఎక్కువ' లాభం వుండదు.

ఒక ఉదాహరణ:

జనరల్ లాభం రేటు 10%. A శాఖ, తన సరుకు ధరని నిష్కారణంగా పెంచి, 20% లాభం సంపాదిస్తోందనుకుందాం. A శాఖ సరుకుని, ఆ ఎక్కువ ధరతో కొనే B - C - D శాఖల్లో కాస్ట్‌ప్రైస్ పెరుగుతుంది. అప్పుడు, B - C - D శాఖలు, ఆ పెరిగిన కాస్ట్ ప్రైస్‌నీ, ఆ పైన, A శాఖలాగే 20% లాభాన్నీ, తీసుకోవడానికి తగిన విధంగా తమ ధరల్ని కూడా పెంచుతాయనుకుందాం. అప్పుడే మవుతుంది? అన్ని శాఖల ధరలూ ఒకే స్థాయిలో పెరిగి, అన్ని శాఖలకూ లాభం రేటు 20% అవుతుంది. అయితే, అన్ని శాఖలకూ ఇప్పటి 20% లాభం రేటు, గతంలో 10% లాభం రేటు తోటే సమానం అవుతుంది. అన్ని శాఖలూ ఒకే స్థాయిలో ధరల్ని పెంచగలిగితే, ఏ శాఖకీ ఎక్కువ లాభం రేటు వుండదు.

ఇంకో ఉదాహరణ:

A శాఖ మాత్రమే తన ధరని పెంచింది. B, C, D శాఖలు తమ కాస్ట్ ప్రైసులు పెరిగినప్పటికీ ధరల్ని పెంచలేదు. లేదా, పెంచినా A శాఖ పెంచిన స్థాయిలో పెంచలేదు. ఆ శాఖల్లో లాభం తగ్గుతుంది. ఆ తగ్గిన లాభం, A శాఖకి అందుతుంది. ఎలాగంటే, A శాఖ సరుకు కోసం B, C, D శాఖలు తక్కువ ధరే చెల్లించి వుంటే, అప్పుడేమవుతుంది? ఆ శాఖలకు ఖర్చు తగ్గి లాభం పెరుగుతుంది. కానీ, ఇప్పుడు ఆ శాఖలు, A కి, నిష్కారణంగా ఎక్కువ ధర చెల్లించడం వల్ల, ఆ లాభం, A కి పోతుంది.

వేరు వేరు శాఖలు సంపాదించగలిగే లాభాలు - (1) వాటి కాస్ట్ ప్రైసుల్ని బట్టీ, (2) వాటి ధరల్ని బట్టీ - వుంటాయి.

కాబట్టి, శాఖల లాభాల్ని ఎక్కువో తక్కువో చేసే పరిస్థితులు ఇలా వుంటాయి:

K = కాస్టు ప్రైస్

| | | |
|---|---|---|
| ఎప్పటి, K, ఎప్పటి ధరా | = | ఎప్పటి లాభం. |
| తగ్గిన, K, ఎప్పటి ధరా | = | ఎప్పటి కన్నా. ఎక్కువ లాభం. |
| తగ్గిన, K, పెరిగిన ధరా | = | ఇంకా ఎక్కువ లాభం. |
| ఎప్పటి, K, పెరిగిన ధరా | = | ఎక్కువ లాభం. |
| పెరిగిన K, ఎప్పటి ధరా | = | ఎప్పటికన్నా తక్కువ లాభం. |
| పెరిగిన K, పెరిగిన ధరా | = | ఎప్పటి లాభం. |

అన్ని శాఖల్లోనూ గుత్త కంపెనీలు ఏర్పడినా, వాటి శక్తి సామర్థ్యాల్లో తేడాల్ని బట్టి, వాటి లాభాల్లో తేడాలు వుంటాయి. నిష్కారణంగా పెంచిన గుత్త ధరలతో అమ్మగలిగే గుత్త కంపెనీలు, గుత్త లాభాలు సంపాదిస్తాయి. అయితే, ఒక గుత్త కంపెనీ, తన సరుకు ధరని నిష్కారణంగా పెంచాలంటే, ఆ ధరకి కూడా ఒక హద్దు వుంటుంది. ఏ హద్దూ లేకుండా ధరని ఎంతకైనా పెంచగలిగే స్వేచ్ఛ గుత్త కంపెనీకి కూడా వుండదు. ఎందుకంటే, గుత్త కంపెనీ అమ్మే సరుకుని ఇతర శాఖలు కొనాలి గనకా, ఆ ఇతర శాఖలకు కూడా కనీసపు లాభాలైనా రావాలి గనకా.

అన్ని శాఖల లాభాలకూ మూలం అయిన 'సామాజిక అదనపు విలువ రాసి' ఎంతో కొంత పరిమాణంలో మాత్రమే వుంటుంది. అది 'అనంతంగా' వుండదు. ఆ 'ఉన్న రాసి'నే అన్ని శాఖల పెట్టుబడులూ పంచుకోవాలి. 'లాభాల్ని' లాక్కోగలిగే పని, శాఖల్లో వుండే 'ధరల' ద్వారానే జరగాలి. గుత్త కంపెనీ అమ్మే సరుకుకి విపరీతమైన ధర వుంటే, అంత ధర గల సరుకుని కొనడానికి ఇతర శాఖలు అంగీకరించవు. ఇతర శాఖలు కొనకపోతే, ఏ శాఖా - తన సరుకుని అమ్మలేదు. శాఖల మధ్య వుండే ఈ తప్పనిసరి సంబంధాల వల్ల, గుత్త కంపెనీ కూడా తన ధరని

విపరీతమైన స్థాయికి పెంచడం సాధ్యం కాదు.

మన నిత్య జీవితంలో కనపడే ఒక గుత్త కంపెనీ (ఉదా: 'పెట్రోలు'ని ఉత్పత్తి చేసే కంపెనీ), 'అపార మైన లాభాలు' సంపాదిస్తున్నట్టుగా కనపడితే, అందులో 'భ్రమ' ఏమీ లేదు. అది సత్యమే. ఆ గుత్త కంపెనీ, తన సరుకుని ఎన్ని శాఖల కైతే అమ్ము తుందో, ఆ అన్ని శాఖల నించీ కొంత కొంత లాభాల్ని అదనంగా లాక్కోగలిగితే చాలు. ఆ గుత్త కంపెనీకి 'లాభం రాసి' అపారంగా పెరుగుతుంది. అయితే, అంత మాత్రాన ఆ ఇతర శాఖలకు లాభాలే లేకుండా పోతాయని అర్థం కాదు. వాటి లాభాలు కొంత తగ్గుతాయి; అంతే.

ఏ శాఖలో ధర ఎలా వున్నా, అన్ని శాఖల ధరలూ కలిసిన మొత్తమే - సరుకుల రాసి కి విలువ. కాబట్టి, ఆ 'విలువ'లో నించి కాస్టు ప్రైసుల మొత్తాన్ని (పెట్టుబడుల మొత్తాన్ని) తీసివేస్తే, మిగిలేది - "సామాజిక అదనపు విలువ". ఆ 'అదనపు విలువ'ని, వేరు వేరు శాఖలు, తమ 'ధరల' ద్వారా, తక్కువ గానో, ఎక్కువ గానో, మరీ ఎక్కువ గానో, లాక్కో గలుగుతాయి.

# 'పెట్టుబడి' కి బ్యాంకుల 'సేవ'!

**డ**బ్బు చలామణీ, అప్పూ - వెనకటి సమాజాల నించీ కూడా వున్నవే. కానీ, అవి పెట్టుబడిదారీ సమాజంలో అయితే, 'బ్యాంకు విధానం' రూపంలో వుంటాయి.

బ్యాంకులు మొట్ట మొదట, 'డబ్బు'ని దాచి పెట్టడమూ, దాన్ని ఇటూ అటూ పంపడమూ - వంటి 'మనీ డీలింగ్' పనులతో, 'పెట్టుబడి' కోసం తమ 'సేవ' ప్రారంభించాయి.

క్రమంగా, 'డిపాజిట్ల' డబ్బుతో 'వడ్డీ వ్యాపారం' ప్రారంభించాయి. 'పెట్టుబడి' లేని (చాలని) పెట్టుబడి దార్లకు 'డబ్బు'ని సప్లై చేసే రెండవ పని అది.

ఇంకా క్రమంగా 'జాయింట్ స్టాక్ కంపెనీ' విధానం ప్రారంభమైన తర్వాత, బ్యాంకులు కూడా, ఉత్పాదక - వర్తక కంపెనీల్లో వాటాలు కొనడం ప్రారం భించాయి. ఇది, బ్యాంకులు కూడా ఉత్పాదక - వర్తక రంగాల్లో పెట్టుబడులు పెట్టే మూడో రకం పని.

అంతే గాక, బ్యాంకులే స్వయంగా జాయింట్ స్టాక్ కంపెనీలుగా ఏర్పడడం కూడా ప్రారంభించాయి.

ఇంకా తర్వాత, 'గుత్త బ్యాంకులు' కూడా ప్రారంభమయ్యాయి.

ఇంకా తర్వాత, 'వాటాదార్ల' కోసం వాటాల వ్యాపారం చేసిపెట్టే 'మ్యూచువల్ ఫండ్ కంపెనీలు'గా పని చేసే వ్యాపారం కూడా బ్యాంకులు ప్రారంభిం చాయి. - ఈ రకంగా, బ్యాంకులు క్రమ క్రమంగా అనేక రకాల వ్యాపారాలు ప్రారంభించాయి.

ఇతర రంగాల్లో లాగే బ్యాంకుల రంగంలో కూడా 'పోటీ' వుంటుంది. బ్యాంకులు ఏ యే వ్యాపారాలు చేస్తాయో, ఆ వ్యాపారాలకు సంబంధించి ఆ పోటీ వుంటుంది. ప్రధానంగా ఆ పోటీ, ఎక్కువ డిపాజిట్లు సంపాదించడానికీ, వాటితో ఎక్కువ అప్పులు ఇచ్చే అవకాశాలు సంపాదించడానికీ సంబంధించి వుంటుంది.

ఇతర రంగాల్లో 'విదేశీ కంపెనీలు' వున్నట్టే, బ్యాంకుల రంగంలో కూడా 'విదేశీ బ్యాంకులు' వుంటాయి.

ఒక 'గుత్త బ్యాంకు'లో, సభ్యులుగా వుండే బ్యాంకులన్నీ, 'వడ్డీ రేట్ల'కు సంబంధించీ, అప్పులు ఇచ్చే కోటాలకు సంబంధించీ, ఇంకా ఇతర వ్యాపార విషయాలకు సంబంధించీ - 'ఒప్పందాలు' చేసుకుం టాయి.

ఒక 'గుత్త బ్యాంకు'లో, అనేక బ్యాంకుల డిపా జిట్లన్నీ 'కేంద్రీకృతమై' వుంటాయి. ఎక్కువ డిపాజిట్లని సంపాదించే బ్యాంకుకే ఎక్కువ వడ్డీలూ, ఎక్కువ లాభాలూ.

గుత్త బ్యాంకులు ప్రధానంగా, ఉత్పాదక - వర్తక రంగాల్లో భారీ కంపెనీలకే పెట్టుబడులు అందిస్తాయి. భారీ కంపెనీలయితే, గుత్త బ్యాంకుల నించి, భారీ మొత్తాల్ని దీర్ఘకాలానికి అప్పులు తీసుకుంటాయి. ఆ

రకంగా, గుత్త కంపెనీల ద్వారా బ్యాంకులకు భారీ ఆర్డర్లు దొరుకుతాయి. ఆ పని చిన్న కంపెనీల ద్వారా జరగదు. ఒక భారీ కంపెనీకి భారీ అప్పుగా ఇచ్చే డబ్బు మొత్తాన్ని అనేక చిన్న కంపెనీలకు ఇవ్వవచ్చు. కానీ, దాని వల్ల బ్యాంకుకి చాలా ఖర్చు పెరుగుతుంది. అంటే, బ్యాంకుల వ్యాపారంలో 'కాస్ట్ ప్రైస్' పెరిగి 'లాభం' తగ్గుతుంది. కాబట్టి, బ్యాంకులు చిన్న చిన్న మొత్తాల్ని అనేక చోట్ల ఇచ్చే దాని కన్నా, పెద్ద మొత్తాల్ని తక్కువ చోట్ల ఇచ్చే పద్ధతినే 'తెలివైన' మార్గంగా అనుసరిస్తాయి. చిన్న కంపెనీలు ఆర్థికంగా ఇబ్బందుల్లో పడ్డప్పుడు, వాటికి అప్పులు దొరికితే, అవి తేరుకోగలుగుతాయి. కానీ, 'డబ్బు అప్పు - అనే బలమైన ఆయుధాన్ని', గుత్త బ్యాంకులు, చిన్న కంపెనీలకు అందించవు. చిన్న కంపెనీల్ని కొనెయ్యడానికి కావాల్సిన మొత్తాల్ని భారీ కంపెనీలకు అందిస్తూ, భారీ బ్యాంకులు, భారీ కంపెనీలకే 'సేవ' చేస్తాయి.

అయితే, ఈ 'సేవ' చేసే బ్యాంకులు, కంపెనీలకు 'డబ్బు పెట్టుబడిని సప్లయి చేసే' పాత్ర నిర్వహిస్తాయి కాబట్టి, అవి, అప్పులు తీసుకునే కంపెనీల మీద, కొన్ని షరతులతో, ' పెత్తనం చేసే అధికారం' కూడా సంపాదిస్తాయి.

జాయింట్ స్టాక్ కంపెనీ విధానం లేని వెనకటి కాలంలో, ఉత్పాదక - వర్తక కంపెనీల మీద, అప్పులు ఇచ్చే వాళ్ళ 'అధికారం' వుండేది కాదు. ఆ అప్పులు ఇచ్చే వాళ్ళు, వ్యక్తులైనా, బ్యాంకులైనా. వాళ్ళు, అప్పులు ఇచ్చి, వడ్డీలు వసూలు చేసుకోడానికి మాత్రమే పరిమితమై వుండే వారు. 'అప్పు' తీసుకున్న కంపెనీ, ఆ అప్పుతో ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో 'ఆజ్ఞాపించే' అధికారం, వాళ్ళకి వుండేది కాదు. కానీ క్రమంగా పెట్టుబడిదార్ల మనీ డీలింగ్ కార్యక్రమాలన్నీ బ్యాంకుల ద్వారా జరగడమూ; 'అప్పు'గా దొరికే పెట్టుబడుల మొత్తాలు సమాజంలో అనేక చోట్ల చెల్లా చెదురుగా లేక బ్యాంకుల్లోకి చేరడమూ, 'డబ్బు పెట్టుబడి'లో అధిక భాగం గుత్త బ్యాంకుల్లో కేంద్రీకృత మవడమూ - ఈ క్రమం ఎక్కువవు తోన్న కొద్దీ, 'అప్పులు ఇచ్చే శక్తి' అంతా గుత్త బ్యాంకుల ఆధీనంలో వుంటుంది. ఈ దశకు చేరిన బ్యాంకులు, కేవలం వాటి వ్యాపారం అవి చేసుకునే సాధారణ సంస్థలు కావు. 'డబ్బు పెట్టుబడి'లో భారీ మొత్తాలు వాటి దగ్గర కేంద్రీకృతమై వున్నందు వల్ల, వాటి 'ఆధికృత' పెరుగుతుంది. అందుకే అవి, అప్పులు తీసుకునే కంపెనీల మీద అనేక షరతులతో పెత్తనం చెయ్యగలుగుతాయి.

'జాయింట్ స్టాక్ విధానం' కన్నా వెనకటి దశలో, ఏ రంగంలో పెట్టుబడి ఆ రంగానికి సంబంధించిన కార్యక్రమం మాత్రమే చేసేది. అంటే, ఉత్పాదక కంపెనీలు ఉత్పత్తి కార్యక్రమాలూ, వర్తక కంపెనీలు వర్తక కార్యక్రమాలూ, బ్యాంకులు వడ్డీ వ్యాపారాలూ మాత్రమే చేస్తూవుండేవి.

ఆ నాడు -

'ఇది, ఉత్పాదక పెట్టుబడి' అనీ,

'ఇది, వర్తక పెట్టుబడి' అనీ,

'ఇది, వడ్డీ పెట్టుబడి' అనీ, పెట్టుబడులు స్పష్టమైన విభజనతో వుండేవి. ఆ పెట్టుబడుల ప్రయోజనాలు కూడా, అంత స్పష్టమైన విభజన తోనూ వుండేవి.

ఆ నాడు - 'వడ్డీ రేటు' పెరిగితే, అది, వడ్డీ పెట్టుబడికి లాభం. మిగిలిన పెట్టుబడులకు నష్టం. అలాగే, 'వర్తక కమిషన్' పెరిగితే, అది 'వర్తక పెట్టుబడి'కి లాభం. మిగిలిన పెట్టుబడులకు నష్టం. ఈ రకంగా, ఆ నాడు ఏ పెట్టుబడి ప్రయోజనాలు ఆ పెట్టుబడికి వేరుగా, స్పష్టంగా వుండేవి.

కానీ, 'జాయింట్ స్టాక్ కంపెనీ' విధానం ప్రారంభమైన తర్వాత, ఈ విభజన చెదిరిపోతుంది. బ్యాంకులు - ఇప్పుడు కూడా 'వడ్డీ వ్యాపారం' చేస్తూనే వున్నా, అవి ఇప్పుడు ఉత్పాదక, వర్తక కంపెనీల్లో కూడా 'వాటాలు' కొంటాయి. అంటే, బ్యాంకు పెట్టుబడి, ఉత్పాదక - వర్తక పెట్టుబడులుగా కూడా పని చేస్తుంది.

ఉత్పాదక కంపెనీలేమో - వర్తక కంపెనీల్లోనూ, బ్యాంకుల్లోనూ 'వాటాలు' కొంటాయి. వర్తక కంపెనీలు కూడా - ఉత్పాదక కంపెనీల్లోనూ, బ్యాంకుల్లోనూ వాటాలు కొంటాయి.

గత కాలంలో, ఒక కంపెనీ యజమాని, ఆ కంపెనీకి మాత్రమే యజమానిగా వుండే వాడు. ఇప్పుడు ఆ యజమానే డైరెక్టరుగా మారి, అనేక కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో వుంటాడు. ఉత్పాదక కంపెనీ డైరెక్టరు, వర్తక - వడ్డీ కంపెనీల్లో కూడా డైరెక్టరుగా వుంటాడు. ఇటు డైరెక్టర్లు అటూ, అటు డైరెక్టర్లు ఇటూ విస్తరించి వుంటారు.

ఈ రకపు పరిణామాల వల్ల, ఈ నాడు, ఒక పెట్టుబడికీ, ఇతర పెట్టుబడులకూ గతంలో వుండిన రకపు తేడాలు నశించి పోతాయి.

ఇప్పుడు 'వడ్డీ రేటు' పెరిగితే, అది బ్యాంకు పెట్టుబడికి ఎంత లాభమో, బ్యాంకుల్లో వాటాలు వున్న ఇతర కంపెనీల పెట్టుబడులకు కూడా అంత లాభమే. అలాగే, ఇప్పుడు 'వర్తక కమిషన్' పెరిగితే, అది, 'వర్తక పెట్టుబడి'కి ఎంత లాభమో, వర్తక కంపెనీల్లో 'వాటాలు' వున్న ఇతర కంపెనీల పెట్టుబడులకు కూడా అంత లాభమే.

ఇప్పుడు, ఒక పెట్టుబడి దారుడికి ఒక శాఖలో వున్న వాటాలు (పెట్టుబడి), ఆ శాఖ లోనే వుండి పోతాయనేదేమీ లేదు. వాడు, ఒక రోజున ఉత్పాదక కంపెనీలో వుండే వాటాల్ని అమ్మేసి, వెంటనే వర్తక కంపెనీ లోనో, వడ్డీ కంపెనీ లోనో వాటాలు కొంటాడు. ఇంకోడు, వడ్డీ కంపెనీలో వాటాలు అమ్మేసి, వెంటనే ఉత్పాదక కంపెనీ లోనో, వర్తక కంపెనీ లోనో వాటాలు కొంటాడు. ఒక శాఖలో వుండే వాటాలు, ఇంకో శాఖ లోకి మారగానే, ఆ వాటా దారుడి ప్రయోజనాలు ఒక్క పూటతో మారిపోయినట్టే.

ఈ పరిస్థితి ఇలా వుండగా, దీనికి విరుద్ధంగా, ఇంకో పరిస్థితి ఏమిటంటే - ఒకే వాటా దారుడికి, ఒకే సమయంలో అనేక రంగాల్లో వాటాలు వుంటాయి. కొన్ని వాటాలు ఉత్పాదక రంగం లోనూ, కొన్ని వాటాలు వర్తక రంగం లోనూ, కొన్ని వాటాలు వడ్డీ రంగం లోనూ! ఎందులో పెట్టుబడి ఎందులోకి మారుతోన్నా, మొత్తం మీద ఆ వాటా దారుడికి అన్ని రంగాల్లోనూ వాటాలు వుంటూనే వుంటాయి. ఈ రకంగా వాడికి, అన్ని రంగాల ప్రయోజనాలూ సమానం అయి పోతాయి.

అయితే, 'జాయింట్ స్టాక్ విధానం'లో కూడా, 'ఉత్పాదక క్రమం'లో పని చేసేదంతా - 'ఉత్పాదక పెట్టుబడి.' 'వర్తక క్రమం'లో పని చేసేదంతా - 'వర్తక పెట్టుబడి.' 'వడ్డీ క్రమం'లో పని చేసేదంతా - 'వడ్డీ పెట్టుబడి.'

పెట్టుబడులు చేసే పనుల్లో ఈ రకమైన విభజన ఈ నాడు లేనే లేదని అర్థం కాదు. ఈ నాడు కూడా ఈ విభజనతో పెట్టుబడుల్ని లెక్కకట్టడం సాధ్యమే. కానీ, ఈ పెట్టుబడులు పెట్టే వాటాదారులు, తమ 'డబ్బు పెట్టుబడి'ని ఏ రంగంలో నించి ఏ రంగంలో కైనా తొందరగా మార్చెయ్యగలరు - అనేదే ఇక్కడ కొత్తగా జరిగిన మార్పు.

సమాజంలో మొత్తం 100 పెట్టుబడి వుందనుకుందాం. ఉత్పాదక రంగంలో 50%, వర్తక రంగంలో 20%, వడ్డీ రంగంలో 30%. దేని పని దానికి వేరుగా వున్నప్పుడు, దేని ప్రయోజనాలు దానికి వేరుగా వుంటాయి. 'జనరల్ లాభం'లో నించీ ఎక్కువ భాగాన్ని లాక్కోవాలని ప్రతీ రంగమూ చూస్తుంది. కానీ ఈ రంగంలో వాళ్ళు, ఆ రంగంలో వాటాలూ; ఆ రంగంలో వాళ్ళు, ఈ రంగంలో వాటాలూ - కొనేస్తూ వున్నప్పుడు, అన్ని రంగాల ప్రయోజనాలూ ఏకం అయి పోతాయి. మొత్తం 100 పెట్టుబడికీ 'ఒకే ప్రయోజనం' అవుతుంది. అది ఏమిటంటే, కార్మికుల నించి ఇంకా ఇంకా ఎక్కువెక్కువ 'అదనపు విలువ'ని లాగడం. అన్ని రంగాలకూ కావలసింది అదే.

ఇప్పుడు బ్యాంకుల్లో వున్న పెట్టుబడిని 'వడ్డీ పెట్టుబడి' అనీ; ఉత్పాదక కంపెనీల్లో వున్న పెట్టుబడిని 'ఉత్పాదక పెట్టుబడి' అనీ; 'వర్తక కంపెనీ'ల్లో వున్న పెట్టుబడిని 'వర్తక పెట్టుబడి' అనీ - స్పష్టమైన విభజనతో చెప్పడానికి వీలులేదు.

ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానం ఈ నాడు క్రమంగా 'అంతర్జాతీయ గుత్త కంపెనీల' స్థాయికి చేరి వుంది.

పెట్టుబడికి సేవ చెయ్యడానికే తల ఎత్తిన బ్యాంకు విధానం, ఈ పెట్టుబడిదారీ మార్గం పొడుగునా పెట్టుబడిదారీ విధానానికి అనుగుణంగా మారుతూ, తన కార్యకలాపాల్ని విస్తరించుకుంటూ, 'లాభాల సేకరణ'తో తన స్వంత సేవ కూడా తను చేసుకుంటూ, 'అభివృద్ధి' చెందుతూ సాగుతోంది!

# ప్రశ్నలూ - జవాబులూ

1. **కేంద్ర బ్యాంకులో వుండే 'ఇష్యూ శాఖ' లోకి డబ్బు ఎలా వస్తుంది? అది ఎంత వుంటుంది?**

**జ:** ప్రెస్‌లో ప్రింటయిన కొత్త కాయితం డబ్బు, మొదట ఇష్యూ శాఖ లోకే వస్తుంది. అది, ఇంకా చలామణీ లోకి రాని డబ్బు. అవసరమైనప్పుడు వెంటనే చలామణీ లోకి వెళ్ళడం కోసం, అది అక్కడ సిద్ధంగా వుంటుంది. అక్కడ వుండే డబ్బు గురించి, అది ఎంత వుండాలో ఖచ్చితమైన లెక్కలు అక్కర లేదు. అందులో నించి బైటికి తీసే భాగానికే లెక్కలు వుండాలి.

2. **ఇష్యూ శాఖలో నించి డబ్బుని బైటికి తియ్యడం ఎప్పుడు జరుగుతుంది?**

**జ:** చలామణీలో వున్న డబ్బు చాలనప్పుడు. ఈ డబ్బు చాలక పోవడం 2 రకాలుగా జరుగుతుంది. (1) దేశంలో వున్న పెట్టుబడిదారులకు గానీ, రాష్ట్రాలకు గానీ, డబ్బు కావలసి వస్తే, బ్యాంకుల్ని అప్పులు అడుగుతారు. బ్యాంకుల్లో, అప్పులు ఇవ్వడానికి తగినంత డిపాజిట్ల డబ్బు లేకపోతే, ఆ బ్యాంకులు కేంద్ర బ్యాంకుని అప్పులు అడుగుతాయి. కేంద్ర బ్యాంకు, తన బ్యాంకింగ్ శాఖలో డబ్బు లేకపోతే, అప్పుడు ఇష్యూ శాఖ నించి డబ్బు తీస్తుంది. అదే, పెట్టుబడిదారులకు అప్పులుగా అందుతుంది. ఆ అప్పులు వసూలైనప్పుడు, వడ్డీలతో సహా, ఇష్యూ శాఖలోకి వెళ్ళిపోతాయి.

(2) కేంద్ర ప్రభుత్వం చెయ్యదల్చుకున్న పనుల కోసమే డబ్బు కావలసి వస్తే, ఆ పనుల కోసం ఆదాయాలు చాలకపోతే, బ్యాంకింగ్ శాఖలో డబ్బు లేకపోతే, అప్పుడు ఇష్యూ శాఖ నించి డబ్బుని అప్పుగానే తీసుకుంటుంది, తన హామీ పత్రాలు పెట్టి. అలా తీసిన డబ్బుతో, ఉత్పాదక క్రమాలేవైనా జరిగితే, ఆ డబ్బూ (ఆ పెట్టుబడీ) - దాని మీద అదనపు విలువా కూడా వస్తాయి. అప్పు తెచ్చిన డబ్బు వడ్డీతో సహా ఇష్యూ శాఖ లోకి వెళ్ళిపోతుంది. లేదా, అలా అప్పు తెచ్చిన డబ్బుతో, అనుత్పాదక కార్యక్రమాలు జరిగితే, ఆ అప్పుని ప్రభుత్వం, తన ఆదాయంలో నించి తీర్చవలసి వస్తుంది. ఇష్యూ శాఖ నించి డబ్బుని తీసే అవసరాలన్నీ ఈ 2 సందర్భాల లోకే వస్తాయి.

3. **'గుత్త కంపెనీ' అంటే? అది, 'జనరల్ లాభం రేటు' కన్నా ఎక్కువ లాభం రేటుని ఎలా సంపాదించ గలుగుతుంది?**

**జ:** ఒక శాఖలో, విడి విడి పెట్టుబడిదారుల కంపెనీలు కొన్ని కలిసి ఒకే కంపెనీగా ఏర్పడితే, అది 'గుత్త కంపెనీ' (మోనోపలీ కంపెనీ). అది, తన సరుకుని తక్కువ కాస్టు ప్రైసుతో ఉత్పత్తి చేసి, ఆ శాఖలో వుండే సాధారణ ధర తోటే అమ్మడం ద్వారా ఎక్కువ లాభం సంపాదించగలుగుతుంది.

4. **"లండన్ కేంద్ర బ్యాంకు, విదేశీ బిల్లుల్ని కూడా డిస్కౌంట్ చేస్తుంది" అంటే అర్థం ఏమిటి?**

**జ:** బిల్లుల్ని డిస్కౌంట్ చెయ్యడం అంటే, బిల్లుల మీద అప్పులు ఇవ్వడం. ఆ బిల్లులు మెచ్యూర్ అయినప్పుడు, అసలునీ, దాని మీద వడ్డీనీ తీసుకుంటారు. ఆ బిల్లు విదేశీ పెట్టుబడిదారుల బిల్లు లయినా, లండన్ బ్యాంకు, వాటి మీద అప్పు లిస్తుందని అర్థం.

5. **'సోషలిస్టు ఉత్పత్తి విధానం' లో వుండే ఆర్థిక విధానం ఎటువంటి ఆర్థిక విధానంగా వుంటుంది? 'సహజ' ఆర్థిక విధానమా, 'డబ్బు' ఆర్థిక విధానమా? అక్కడ కూడా బ్యాంకులో 2 శాఖల విధానం వుంటుందా?**

**జ:** బ్యాంకింగ్ - అనేదీ, డబ్బు చలామణీ అనేదీ వున్నప్పుడు, దాని నిర్మాణం దానికి వుండవలసిందే. అయితే, సోషలిస్టు విధానంలో 'వడ్డీల్ని' తీసివెయ్యడం జరగాలి కాబట్టి, ఎక్కడా వడ్డీ చెల్లింపులు వుండనక్కర లేదు. సోవియట్ రష్యాలో గానీ, జన చైనాలో గానీ, బ్యాంకింగ్ విషయాలు ఎలా జరిగేవో, అందులో వడ్డీల వ్యవహారాలు ఎలా వుండేవో మనకు తెలిసే సమాచారం ఏదీ లేదు.

అందరూ శ్రమ చేసే సమాజంలో వుండే విధానం, సహజ ఆర్థిక విధానం గానే వుంటుంది. కానీ, బానిస, భూస్వామ్య కాలాలలో వున్న సహజ ఆర్థిక విధానంలో 'శ్రమ దోపిడీ' వుండేది. ఆ లక్షణం లేని విధానాన్నే అందరూ శ్రమ చేసే సమాజంలో ఊహించాలి. ★

# 5. భూమి కౌలు

'భూమి కౌలు' అంటే, భూమిని ఉపయోగించుకున్నందుకు చెల్లించే 'అద్దె'. ఇది కూడా - 'అదనపు విలువ'లో భాగమే. ఈ సంగతి గతం లోనే చూశాం. (మొదటి సంపుటంలో, 'లాభం' చాప్టరులో.)

భూమి - ప్రకృతి సహజ పదార్థం. దాన్ని మనుషులు చెయ్యలేదు. ప్రకృతి, ఎలా ఇచ్చిందో అలాగే వున్న 'ముడి భూమి', మానవ శ్రమతో తయారైనది కాదు. అలాంటి భూమిని, 'స్వంత ఆస్తిగా' ఆక్రమించడానికి ఎవరికీ హక్కు వుండదు.

అయితే, మనుషులు 'భూమి'తో సంబంధం లేకుండా జీవించలేరు. భూమి మీదే 'నివాసాలు' కట్టుకోవాలి. భూమి మీదే 'పంటలు' పండించుకోవాలి. భూమి మీదే పరిశ్రమలు నడుపుకోవాలి. ఈ అవసరాల కోసం భూమి మీద 'శ్రమ' చెయ్యాలి. ఆ శ్రమ, స్వయంగా ఎంత భూమి మీద చేస్తారో అంత భూమిని ఆక్రమించడానికి మాత్రమే వారికి హక్కు వుంటుంది. నివాసమూ, వ్యవసాయమూ - వంటి 'సహజ స్వంత అవసరాల' కోసం భూమిని ఉపయోగించుకునే హక్కు, ఎవ్వరికైనా వుంటుంది. భూమిని అలా ఉపయోగించకపోతే, మనుషులు జీవించడమే సాధ్యం కాదు. 'సహజ అవసరాల' కోసం గాక, ఇతరులకు 'అద్దె'కు ఇవ్వడం కోసం భూమిని ఆక్రమించే హక్కు ఎవరికీ వుండదు. 'ప్రకృతి' ఒకరి స్వంతం కాదు - ఇంకొకరికి అద్దెకి ఇవ్వడానికి!

## 'భూగోళానికి' ఎవరూ యజమానులు కారు!

**కానీ**, మానవ చరిత్రలో అదే జరిగింది. 'భూమండలానికి' కూడా 'యజమానులు' తయారయ్యారు! ప్రకృతి సహజంగా మానవులందరూ ఉపయోగించుకోవలసిన భూమిని, కొందరే 'స్వంత ఆస్తి'గా ఆక్రమించగలిగారు. కొందరు మనుషులు, వందల - వేల ఎకరాల భూమికి యజమానులు అయితే, కొందరు మనుషులు చారెడు భూమి కూడా లేని వారిగా అయిపోయారు! 'భూమి అద్దె' గురించి మాట్లాడుతున్నామంటే, అప్పటికే భూమి నంతా కొందరు మనుషులు ఆక్రమించిన చరిత్ర జరిగిపోయిందని అర్థం. అదంతా ఎలా జరిగిందో ఆ చరిత్రని ఇక్కడ చూడలేము. ఇక్కడ చూసేదంతా 'భూమి కౌలు' ఎన్ని రూపాలు మారుతూ వచ్చిందీ, అది 'అదనపు విలువ'లో భాగాన్ని ఎలా లాగుతూ వస్తోందీ - అనే విషయాలే.

శ్రమ చేసే వాళ్ళూ, శ్రమ చెయ్యని వాళ్ళూ - అనే భేదాలు లేని (అందరూ శ్రమ చేసే వాళ్ళే వున్న) ప్రాచీన తెగల సమాజాన్ని మొదట చూద్దాం. అక్కడ, ఒక తెగ 'సాగు చేసుకున్న' భూమిలో వచ్చిన 'ఉత్పత్తి' అంతా, ఆ తెగదే. అప్పుడు 'భూమి కౌలు' అనే మాట లేదు.

తర్వాత, బానిసలూ - బానిస యజమానులూ (శ్రమ చేసే వర్గమూ, శ్రమ చెయ్యని వర్గమూ) - అనే 'శతృ వర్గాలు' ప్రారంభమైన సమాజాన్ని చూద్దాం. ఇక్కడ, బానిసల 'అదనపు ఉత్పత్తి' ప్రారంభమవుతుంది. దీన్ని యజమానులే తింటారు. ఇక్కడ కూడా 'భూమి కౌలు' అనే మాట లేదు. కాని ఇక్కడ, అదనపు ఉత్పత్తే - 'కౌలు'. దీన్ని కొంచెం వివరంగా చూడాలి.

ఒక 'బానిస యజమాని' కుటుంబం ఆధీనంలో - 100 ఎకరాల భూమీ, 10 బానిస కుటుంబాలూ వున్నాయి - అనుకుందాం. (బానిసల్ని అమ్మే, కొనే, చంపే హక్కులన్నీ యజమాని కుటుంబానికి వుంటాయి!)

ఆ బానిస కుటుంబాల స్త్రీ పురుషులు, యజమాని భూమి లోనే నివసిస్తూ, ఆ 100 ఎకరాల భూమిని సాగుచేస్తూ వుంటారు. దానితో పాటు 'బట్టల నేత' లాంటి చేతి పనులూ, యజమాని కుటుంబానికి అవసరమైన 'గృహ సేవలూ' కూడా చేస్తూ వుంటారు.

బానిసలు చేసే శ్రమల్లో 100 ఎకరాల్ని పండించడమే 'ప్రధానమైన' విషయం కాబట్టి, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఈ విషయం మాత్రమే తీసుకుందాం. బానిసలు ఆ భూమిని పండించాలంటే,

దాని కోసం కొన్ని 'ఉత్పత్తి సాధనాలు' ఖర్చవుతాయి. ఆ ఖర్చు, 'పండిన పంట'లో నించే వెనక్కి రావాలి. ఇంకా కొంత పంట, బానిస కుటుంబాల పోషణకు అవసరమవుతుంది. ఈ 2 రకాల ఖర్చులూ పోగా 'పంట'లో మిగిలినదంతా యజమాని కుటుంబానికే పోతుంది. కాబట్టి, బానిసలు పండించే పంటని కూడా 'ఉత్పత్తి సాధనాల భాగమూ, శ్రమ శక్తి విలువ భాగమూ, అదనపు విలువ భాగమూ' - అనే 3 భాగాలుగా చూస్తాము. పెట్టుబడిదారీ సమాజంలో ఏ ఉత్పత్తి అయినా, స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ, అదనపు విలువా (C + V + S) అనే 3 భాగాలుగా వున్నట్టుగా, 'శ్రమ దోపిడీ' ప్రారంభమైన తర్వాత ఏ సమాజంలో ఉత్పత్తి అయినా, 3 భాగాలు గానే వుంటుంది.

బానిసలు పండించే 100 ఎకరాల పంటలో ఆ 3 భాగాలూ ఎలా వుంటాయో చూద్దాం: ఈ పంట అంతా బానిసల శ్రమ ఫలితం అవదు. అందులో నించి 'ఉత్పత్తి సాధనాల ఖర్చు' ని తీసివేశాక, మిగిలినది అంతా బానిసల శ్రమ ఫలితం.

10 ఎకరాల్లో పంటని - 'ఉత్పత్తి సాధనాల ఖర్చు'గా అనుకుందాం. (అంటే, మొత్తం పంటలో 10%, ఉత్పత్తి సాధనాల ఖర్చు.) మిగిలిన 90 ఎకరాల్లో పంట (మొత్తంలో 90%) బానిసల శ్రమ ఫలితం. అయితే, అదంతా బానిసలకు దక్కదు.

యజమాని, 10 బానిస కుటుంబాల 'పోషణ' కోసం ఖర్చు పెట్టే భాగం, '20 ఎకరాల్లో పంట' అనుకుందాం. (ఒక్కో కుటుంబానికీ 2 ఎకరాల్లో పంట.)

ఇంకా మిగిలిన 70 ఎకరాల్లో పంట, యజమాని కుటుంబానికి వెళ్తుంది. ఇది బానిసల 'అదనపు ఉత్పత్తి'. (అదనపు శ్రమ.)

మొత్తం 'పంట'ని ఇలా చూడవచ్చు:

C + V + S

10% + 20% + 70%

ఒక బానిస యజమాని - 'ఉత్పత్తి సాధనాల' కోసం, ఇంకో యజమాని దగ్గిర్నించి కొంత డబ్బు 'అప్పు' తెచ్చాడనుకుందాం. దాని మీద 'వడ్డీ' చెల్లించాలంటే, తన చేతికి వచ్చిన 70 ఎకరాల పంటలో నించే చెల్లిస్తాడు. వడ్డీ చెల్లించవలసిన అవసరం లేకపోతే అది కూడా తనే వుంచుకుంటాడు.

ఇక్కడ ఇంకా 'భూమి కౌలు' అనే మాట లేదు.

'శ్రమ చేసే' 10 కుటుంబాలకు, 20 ఎకరాల పంట! 'శ్రమ చెయ్యని' ఒక్క కుటుంబానికి, 70 ఎకరాల పంట!! ఈ రకంగా, యజమాని కుటుంబం, అదనపు ఉత్పత్తిని తింటూ, 'శ్రమ చెయ్యకుండా', విశ్రాంతుల తోటీ, విలాసాల తోటీ, సుఖ భోగాల తోటీ జీవిస్తూ వుంటుంది.

ఈ 'శ్రమ దోపిడీ' ఎందుకు సాధ్యమవుతుందంటే - బానిసల ఆధీనంలో చారెడు భూమి కూడా లేదు. యజమాని ఆధీనంలో 100 ఎకరాల భూమి వుంది! మొత్తం సమాజాన్ని తీసుకుంటే, భూమి అంతా యజమానుల ఆధీనం లోనే వుంటుంది.

భూమి - 'ఉత్పత్తి సాధనం'. అది వున్న వాళ్ళే 'యజమానులు'. అది లేని వాళ్ళు 'బానిసలు'. ఆ బానిసలు, తమ శ్రమలో అధిక భాగాన్ని యజమానుల కోసం పోగొట్టుకుంటారు.

తర్వాత - 'బానిస సమాజం'లో బానిసల తిరుగుబాట్ల ఫలితంగా, ఆ సమాజం, 'భూస్వాములూ - కౌలు రైతులూ' అనే వర్గాలు గల భూస్వామ్య (ఫ్యూడల్) సమాజంగా మారిందనుకుందాం.

యజమానులు, బానిసల్ని, తమ 'ఆస్తి హక్కుగా' వుంచుకునే విధానం ఇప్పుడు వుండదు. కానీ, భూమిని, తమ ఆస్తిగా వుంచుకునే విధానం, ఇప్పుడు కూడా గతంలో లాగే వుంటుంది.

యజమానులకు, భూమి మీద హక్కుతో పాటు, బానిసల మీద కూడా హక్కు వున్నది - బానిస సమాజం. బానిసల మీద హక్కులు పోయి, భూమి మీద హక్కు మాత్రమే వున్నది - భూస్వామ్య (ఫ్యూడల్) సమాజం.

వెనకటి 'బానిస యజమానుల' వర్గమే, ఇప్పుడు 'భూస్వాముల' (ఫ్యూడల్ ప్రభువుల) వర్గం.

వెనకటి బానిసల వర్గమే ఇప్పుడు 'కౌలు రైతుల' (ఫ్యూడల్ కౌలు రైతుల) వర్గం. వీరికి ఇంకో పేరు - 'అర్ధ బానిసలు'.

ఇప్పుడు కూడా 100 ఎకరాల భూమినే తీసుకుని, వర్గాల సంబంధాలు ఎలా వుంటాయో చూడాలి. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 'ఉత్పత్తి శక్తి' అంతా వెనకటి లాగానే వుందనుకుందాం. ఒక భూస్వామి ఆధీనంలో వున్న భూమి ఇప్పుడు కూడా '100 ఎకరాలు'.

ఇప్పుడు జరిగిన మార్పేమిటంటే: భూస్వామి, ఆ 100 ఎకరాల భూమిలో కొంత భూమిని తన కుటుంబం కోసం వుంచుకుని, మిగిలిన దాన్ని రైతులకు ఇస్తాడు. ఆ ఇవ్వడం, పూర్తి హక్కులతో కాదు. ఆ ఇచ్చిన భూమి మీద కూడా హక్కులన్నీ భూస్వామి కుటుంబానివే. ఆ భూమిని రైతులు తమ కోసం పండించుకుంటూ 'పోషణ' చేసుకోవాలి. భూస్వామి ఆ భూమిని ఇచ్చాడు గనక, భూస్వామి వుంచుకున్న భూమిని కూడా రైతులు పండిస్తూ వుండాలి. ఈ రకంగా, భూస్వామి కుటుంబం ఇప్పుడు కూడా వెనకటి లాగానే, 'శ్రమ చెయ్యకుండానే' జీవిస్తూ వుంటుంది.

ఈ ఉదాహరణని, ఎకరాల లెక్క ద్వారా చూద్దాం. భూస్వామి, 100 ఎకరాల్లో 78 ఎకరాల్ని తన దగ్గిరే వుంచుకుని, 22 ఎకరాల్ని 10 రైతు కుటుంబాల పోషణకు పంచాడనుకుందాం.

ఒక్కో రైతు కుటుంబానికీ 2 ఎకరాల 20 సెంట్ల భూమి వస్తుంది. ప్రతీ రైతు కుటుంబమూ ఆ భూమిని సాగుచేసుకుంటూ వుంటుంది. అందులో - 20 సెంట్ల భూమిలో పంట - 'ఉత్పత్తి సాధనాల ఖర్చు' గానూ, 2 ఎకరాల్లో పంట ఆ కుటుంబానికి 'పోషణ' ఖర్చు గానూ ('శ్రమ శక్తి విలువ'గా) వుంటుంది. ఈ రకంగా రైతు కుటుంబాలన్నీ, ఎవరి భూమిని వారు సాగు చేసుకుంటూ, అందరూ కలిసి భూస్వామి భూమిని కూడా (78 ఎకరాల్ని కూడా) సాగు చేస్తూ వుంటారు.

ఇప్పుడు 78 ఎకరాల సంగతి: ఈ భూమిలో, 8 ఎకరాల్లో పంట 'ఉత్పత్తి సాధనాల' ఖర్చు. మిగిలిన 70 ఎకరాల్లో పంట - భూస్వామి కుటుంబానికి!

అంటే, అంతా వెనకటి లాగానే!

ఇప్పుడు కూడా మొత్తం 100 ఎకరాల్ని సాగు చేసేది - 10 రైతు కుటుంబాలే. ఇప్పుడు కూడా, మొత్తం ఉత్పత్తి సాధనాల ఖర్చు - 10 ఎకరాల్లో పంట. ఇప్పుడు కూడా రైతు కుటుంబాలకు దక్కేది - 20 ఎకరాల్లో పంట. ఇప్పుడు కూడా భూస్వామి కుటుంబం తినేది, 70 ఎకరాల్లో పంట! - అంతా వెనకటి లాగానే!

అయితే, ఇప్పుడు జరిగిన మార్పేమిటంటే; ఇప్పుడు ప్రతీ రైతు కుటుంబానికీ కొంత భూమి వుంటుంది. దాని మీద చట్టపరమైన హక్కు లేకపోయినా, ఆ కుటుంబం, ఆ భూమిలో స్థిరమైన నివాసం ఏర్పర్చుకుని ఆ భూమిని పండించుకుంటూ జీవించవచ్చు. కానీ, 'శ్రమ దోపిడీ' అనేది, ఇప్పుడు కూడా మారలేదు. దాని 'రూపమే' కొంచెం మారింది.

ఇప్పటి నించే 'భూమి కౌలు' అనే మాట ప్రారంభమవుతుంది.

భూమి అంతా (100 ఎకరాలు) భూస్వామి స్వంత ఆస్తి. భూస్వామి ఆస్తిలో, కొంత భాగాన్ని భూమి లేని రైతులు ఉపయోగించుకుంటున్నారు కాబట్టి, వారు, భూస్వామి కోసం కూడా 'శ్రమ' చేసి పెడుతున్నారు. రైతు కుటుంబాలు చేసే 'అదనపు శ్రమ' 70 ఎకరాల్లో పంట. ఈ పంటని కూడా రైతు కుటుంబాలే వాడుకోకుండా భూస్వామి కుటుంబానికి సమర్పిస్తున్నారు. ఇది రైతులు భూస్వామికి చెల్లించే **'శ్రమ కౌలు'.** అంటే, 'శ్రమ రూపంలో' ఇచ్చే కౌలు (రెంట్ ఇన్ లేబర్).

'కౌలు'ని ఇవ్వడంలో ఇంకో పద్ధతి:

భూస్వామి, మొత్తం భూమినంతా (100 ఎకరాల్నీ) 10 రైతు కుటుంబాలకు, 'కౌలు'కి ఇచ్చేస్తాడనుకుందాం. ఒక్కో కుటుంబానికీ 10 ఎకరాలు. ప్రతీ రైతు కుటుంబమూ, భూస్వామికి, 7 ఎకరాల్లో పంటని 'కౌలు'గా చెల్లించాలనేది షరతు.

ప్రతీ రైతు కుటుంబమూ 10 ఎకరాలు సాగు చేస్తుంది. అందులో 1 ఎకరంలో పంట - 'ఉత్పత్తి సాధనాల' ఖర్చుగా వుంటుంది. 7 ఎకరాల్లో పంట భూస్వామికి ఇవ్వాలి. ఇంకా 2 ఎకరాల్లో పంట, రైతు కుటుంబ 'పోషణ' కోసం మిగులుతుంది.

మొత్తం లెక్క చూస్తే, ఇప్పుడు కూడా అంతా గతంలో లాగే వుంటుంది.

10 ఎకరాల్లో పంట - ఉత్పత్తి సాధనాల ఖర్చు.
70 ఎకరాల్లో పంట - భూస్వామి కుటుంబానికి.
20 ఎకరాల్లో పంట - 10 రైతు కుటుంబాలకి.
అంతా వెనకటి లాగానే.

ఇప్పుడు రైతులు భూస్వామికి కౌలుగా ఇచ్చేది, 'పండించిన పంట'నే (తయారైన వస్తువుని). ఇది **'వస్తు కౌలు'.** అంటే, 'వస్తువు రూపంలో' ఇచ్చే కౌలు (రెంట్ ఇన్ కైండ్).

'వస్తు కౌలు' అనేది కేవలం ధాన్యమే కాదు. రైతు కుటుంబాలు చేతి పనుల ద్వారా ఉత్పత్తి చేసే వస్తువుల రకాలన్నీ కూడా కౌలుగా వుండవచ్చు.

'వస్తు కౌలు' అన్నప్పుడు, మొత్తం పంటలో 70% - అనే షరతు కాకుండా, 'ఇన్ని బస్తాలు' అనే షరతు

ఉందనుకుందాం. పంట బాగా పండినప్పుడు కౌలుని చెల్లించగా మిగిలే భాగం గతంలో కన్నా ఎక్కువగా వుంటుంది. లేదా, పంటలు పాడై పోతే, 'కౌలు'ని చెల్లించగా మిగిలే భాగం పోషణకి కూడా చాలనిదిగా వుంటుంది. కొన్ని సందర్భాల్లో కౌలుని చెల్లించటం కూడా అసాధ్యం అవుతుంది.

పండిన పంటతో గాక, 'డబ్బు' తోటే కౌలు చెల్లించాలనుకుందాం. అప్పుడు 70 ఎకరాల్లో పంటని అమ్మి ఆ డబ్బుని కౌలుగా చెల్లించవలసి వుంటుంది. (ఆ 70 ఎకరాల్లో పంటని రైతులు అమ్మినప్పుడు దాన్ని ఎవరు కొంటారంటే, ఆ 'కౌలు'ని ఎవరైతే తింటారో ఆ వర్గంలో వాళ్ళే. అయితే, వాళ్ళు ఏ డబ్బుతో కొంటారు? కిందటి సంవత్సరం తీసుకున్న 'కౌలు డబ్బు'తో ఈ సంవత్సరపు 70 ఎకరాల పంటని కొంటారు. రైతులు, ఆ డబ్బుని, మళ్ళీ కొత్త కౌలుగా చెల్లిస్తారు. అంటే, 'కౌలు డబ్బు' గల వాళ్ళు, ఆ డబ్బుతో, నిత్యం మార్కెట్లో వస్తువులు కొనుక్కొంటూ వుంటారు.) 'డబ్బు రూపంలో' చెల్లించే కౌలు. **'డబ్బు కౌలు'** (రెంట్ ఇన్ మనీ).

'డబ్బు'తో కౌలు చెల్లించాలంటే, ప్రతీ రైతు కుటుంబమూ, తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని అమ్మి తీరాలి. అంటే, 'ఉత్పత్తి క్రమం' ప్రారంభించేటప్పుడు, దాన్ని 'అమ్మకం' దృష్టి తోటే ప్రారంభించాలి. అప్పటి వరకూ ఎక్కువ మార్కెట్ సంబంధాలు లేకుండా వున్న కౌలు రైతు కుటుంబాలు, క్రమంగా మార్కెట్ సంబంధాల లోకి వస్తాయి.

ఈ రకంగా, కౌలు, 'రూపం' మారుతూ వచ్చింది. కానీ, అన్ని రూపాలకూ సారాంశం ఒకటే. ఏ రూపంలో వున్నా, 'కౌలు' అనేది, రైతు కుటుంబాల 'అదనపు శ్రమే'. అది, డబ్బు రూపంలో వుంటే, అదనపు విలువ.

కౌలు రైతులు - భూమి సాగు కోసం, 'అప్పులు' చేసి 'వడ్డీలు' చెల్లించడం కూడా వుంటుంది. 'కౌలు'తో పాటు 'వడ్డీని' కూడా లెక్కలోకి తీసుకుంటే, రెండూ కలిసినదే 'అదనపు విలువ'. 'వడ్డీ'ని తీసివెయ్యగా మిగిలేదే - కౌలు.

ఆ కాలం నాటి వడ్డీ పేరు - ఉసురీ.

అంటే, అది ఫ్యూడల్ వడ్డీ.

ఫ్యూడల్ వడ్డీ + ఫ్యూడల్ కౌలూ = ఫ్యూడల్ రైతుల అదనపు విలువ.

బానిసల అదనపు శ్రమకి, 'భూమి కౌలు' అనే పేరు వుండదు.

శ్రమ చేసే వారి చేతుల్లోకి భూమి వచ్చి, వారు ఏదో రూపంలో కౌలు చెల్లించడం ప్రారంభమైనప్పటి నించే ' కౌలు' అనే మాట ప్రారంభమవుతుంది.

భూస్వామి, తను తీసుకునే 'కౌలు'కి బదులుగా, ఆ రైతులకు తన శ్రమని ఇస్తాడా? దేనినీ ఇవ్వడు. తన శ్రమని ఇవ్వకుండానే రైతుల శ్రమని తీసుకుంటాడు.

> **"భూ**స్వామి, ' కౌలు'ని లాగడానికి, అంటే - ఏమీ 'ఇవ్వకుండా తీసుకోవడానికి' (టు రిసీవ్ సమ్ థింగ్ ఫర్ నథింగ్) ఎల్లప్పుడూ సిద్ధంగా వుంటాడు" - మార్క్స్, [కాపిటల్ - 3, పేజీ - 771, మాస్కో, 1917.]

'భూస్వామ్య' సమాజం తరవాత, ' పెట్టుబడిదారీ' సమాజాన్ని తీసుకుందాం. అంటే, 'వ్యవసాయ రంగం'లో కూడా పెట్టుబడిదారీ విధానాన్ని. వ్యవసాయ రంగంలో అప్పటి వరకూ వున్నది - శ్రమ చెయ్యని భూస్వామీ, శ్రమ చేసే కౌలు రైతులూ!

ఇప్పుడు వీళ్ళ మధ్యకి ' పెట్టుబడిదారుడు' ప్రవేసిస్తాడు! అప్పుడేం జరుగుతుంది?

# పెట్టుబడిదారీ కౌలు రైతు ప్రవేశం

**ఇ**ప్పుడు కూడా 'భూమి మీద హక్కు' భూస్వామిదే. ఆ భూస్వామి, ఇప్పుడు తన భూమిని ఫ్యూడల్ కౌలు రైతుల నించీ లాగేసుకుని, దాన్ని ఒక 'పెట్టుబడి దారుడి'కి 'కౌలు'కి ఇస్తాడు. ఆ పెట్టుబడి దారుడి నించే, కౌలు తీసుకుంటూ వుంటాడు.

భూమిని 'కౌలు'కి తీసుకున్న పెట్టుబడి దారుడు - ' పెట్టుబడిదారీ కౌలు రైతు' అవుతాడు. ఈ పెట్టుబడిదారీ కౌలు రైతు, స్వయంగా శ్రమ చెయ్యడు. 'కూలీలతో' శ్రమ చేయిస్తాడు!

ఈ 'కూలీలు' ఎవరు? - అప్పటి వరకూ ఆ భూమిలో 'కౌలు రైతులు'గా వున్న వాళ్ళే. వీరు, తమ కౌలు భూములు పోగొట్టుకుని, ఆ భూముల్లోనే, 'కూలి' తీసుకుని పని చేసే 'వ్యవసాయ కార్మికులు'గా మారతారు.

అంటే, ఈ శ్రమలు చేసే వారందరూ మొట్ట మొదట - బానిసలు. తర్వాత, కౌలు రైతులు. ఆ తర్వాత ఇప్పుడు, పెట్టుబడిదారీ కూలీలు. అంటే, కార్మికులు. వీరికి పెట్టుబడిదారుడు, కూలి డబ్బులు ఇస్తాడు.

ఈ కొత్త 'కార్యక్రమం' అంతా ఇలా వుంటుంది:

పెట్టుబడిదారీ కౌలు రైతు, భూస్వామి నించి 100 ఎకరాల భూమిని కౌలుకి తీసుకుంటాడు. కొంత పెట్టుబడితో 'సాగు కార్యక్రమం' లోకి దిగుతాడు. ఆ 'పెట్టుబడి'ని, C + V ల కోసం ఖర్చు చేస్తాడు.

వ్యవసాయ కార్మికులు 'శ్రమ' చేసి, ఆ 100 ఎకరాల్నీ పండిస్తారు.

పెట్టుబడిదారుడు, ఆ పంటని అమ్మి, ఆ 'ధర'లో నించి, C + Vలను వెనక్కి తీసుకుంటే, 'అదనపు విలువ' మిగులుతుంది. అందులో నించి కొంత భాగాన్ని 'కౌలు'గా చెల్లిస్తే, మిగిలినది పెట్టుబడి దారుడికి 'లాభం'గా వుంటుంది.

ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, 'ఉత్పాదక శక్తి' ఇప్పుడు కూడా గతంలో లాగే వుందనుకుందాం.

ఉత్పత్తి సాధనాల ఖర్చు, 10 ఎకరాల్లో పంట. (C)
కార్మికుల జీతాలు - - 20 ఎకరాల్లో పంట. (V)
అదనపు విలువ - ---- 70 ఎకరాల్లో పంట. (S)

అయితే, ఇప్పుడు 'అదనపు విలువ' అంతా గతంలో లాగ, 'కౌలు' గానూ, 'వడ్డీ' గానూ మాత్రమే వుండదు. అదనపు విలువ ఇప్పుడు, కౌలూ, వడ్డీలే గాక, పెట్టుబడి దారుడి 'లాభం'గా కూడా వుండాలి. (ఈ మార్పుకి భూస్వామి ఎలా అంగీకరిస్తాడనే ప్రశ్నని తరవాత చూద్దాం.)

**ఫ్యూడల్ కౌలు రైతు:** స్వయంగా శ్రమ చేస్తాడు. తన 'అదనపు విలువ'నే కౌలుగా చెల్లిస్తాడు. 'శ్రమ శక్తి విలువ'తోనే తను జీవిస్తాడు. ఈ రైతు కుటుంబం, 'జీవించడం' కోసమే వ్యవసాయం చేస్తుంది.

**పెట్టుబడిదారీ కౌలు రైతు:** స్వయంగా శ్రమ చెయ్యడు. కార్మికులతో, శ్రమ చేయించి వారి 'అదనపు విలువ'ని లాగుతాడు. అందులో నించి కొంత భాగాన్ని కౌలుగా చెల్లించి, మిగిలిన దాన్ని తనకు 'లాభం'గా మిగుల్చుకుని, ఆ లాభంతో విలాసంగా జీవిస్తాడు. ('ఉత్పత్తి సాధనాల' ఖర్చు, అప్పు తెచ్చింది అయితే, బానిస యజమాని అయినా, భూస్వామి అయినా, ఫ్యూడల్ కౌలు రైతు అయినా, వడ్డీని 'అదనపు విలువ'లో నించి చెల్లించవలసిందే. అలాగే, పెట్టుబడిదారీ కౌలు రైతు కూడా చేస్తాడు.) 'లాభం' లేకపోతే, పెట్టుబడిదారీ రైతు జీవించడానికి మార్గమే వుండదు. కాబట్టి, ఈ రైతు, 'లాభం' కోసమే వ్యవసాయం చేస్తాడు. (చేయిస్తాడు.) నిజానికి, ఈ వ్యక్తి, 'రైతు' కాడు. రైతు చెయ్యవలసిన పనులేవీ ఈ వ్యక్తి చెయ్యడు. కానీ, భూమిని కౌలుకి తీసుకోవడమూ, భూస్వామికి కౌలు చెల్లించడమూ, ఈ వ్యక్తే చేస్తాడు కాబట్టి, ఈ వ్యక్తే కౌలు రైతులా కనపడతాడు. నిజంగా వ్యవసాయ శ్రమ చేసే వాళ్ళు ఇప్పుడు 'రైతులు'గా గాక, 'కూలీలు'గా అవుతారు.

ఇప్పుడు చూడబోయే కొటేషన్‌లో, బ్రాకెట్లలో వివరణలు కూడా మార్క్సువే.

"…. (వ్యవసాయ రంగంలో) పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానానికి లక్షణాలు ఇవీ: పెట్టుబడి దారుడు, నిజంగా భూమిని దున్నే వారిని 'వేతన శ్రామికులు'గా నియమించాలి. ఈ పెట్టుబడి దారుడు, 'పెట్టుబడి'ని పెట్టడానికి ఒక రంగంగా మాత్రమే ఉపకరించే 'వ్యవసాయం'లో నిమగ్నమయ్యే పెట్టుబడిదారీ రైతు. ఈ పెట్టుబడిదారీ రైతు, తను ఉపయోగించే భూమి కోసం, దాని యజమానికి, ఒప్పందం ప్రకారం నిర్ణీతమైన కాలాల్లో (ఉదా: ఏడాదికి ఒకసారి) కొంత డబ్బు చెల్లిస్తాడు. ('డబ్బు పెట్టుబడి'ని అప్పు తీసుకునే వాడు, నిర్ణీతమైన కాలం ప్రకారం వడ్డీ చెల్లించినట్టుగా.) ఈ డబ్బు మొత్తమే - 'భూమి కౌలు' (గ్రౌండ్ రెంట్). ఈ కౌలు చెల్లించేది, వ్యవసాయ భూమికా, భవన సముదాయాల (బిల్డింగ్ లాట్స్) భూమికా, గనులకా, చేపల చెరువులకా, అడవులకా - అనేది అనవసరం …. ఇక్కడ మనకు 3 వర్గాలూ - అంటే, వేతన శ్రామికులూ, ఉత్పాదక పెట్టుబడిదారులూ, భూమి యజమానులూ - పరస్పరాభిముఖంగా, ఆధునిక సమాజపు చట్రంగా, కనపడతారు"
- [కాపిటల్ - 3, పేజీ 618, మాస్కో 1917]

ఇక్కడ మార్క్స '3 వర్గాలు' అని ఎందుకు అన్నాడంటే - ఇది 'భూమి కౌలు'ని చర్చించే సందర్భం కాబట్టి. భూస్వామీ, ఫ్యూడల్ కౌలు రైతూ మాత్రమే వుండే వెనకటి సంబంధం లోకి, ఇప్పుడు, 'పెట్టుబడి

దారుడు' కూడా ప్రవేశిస్తాడు. ఈ 3 పాత్రల్నీ వివరించడానికి ఇక్కడ '3 వర్గాలు' అన్నాడు. కానీ, భూస్వామీ, పెట్టుబడిదారుడూ, ఆ ఇద్దరూ తినేది 'అదనపు విలువే'. కాబట్టి ఆ ఇద్దరూ ఒక్క వర్గమే. ఆ రకంగా చూస్తే మొత్తం 2 వర్గాలే.

ఈ రకంగా, వ్యవసాయ రంగం లోకి 'పెట్టుబడిదారీ కౌలు రైతు' ప్రవేశించడం వల్ల, 'శ్రమ దోపిడీ' అనే సారాంశం ఏ మాత్రమూ మారకుండా, దాని 'రూపంలో' మాత్రం కొన్ని ముఖ్యమైన మార్పులు జరుగుతాయి. ఆ మార్పులు ఇవీ:

1. అప్పటి వరకూ 'కౌలు రైతులు'గా వుండిన వాళ్ళంతా. ఇప్పుడు ఆ భూమి లోనే 'వ్యవసాయ కార్మికులు'గా మారతారు. అప్పటి వరకూ, వ్యవసాయ రంగంలో లేని 'కూలి' (జీతం) అనే మాట ఇప్పుడు ఈ రంగం లోకి కూడా ప్రవేసిస్తుంది. (కూలి - అంటే, రోజు వారీగా లెక్క కట్టేది. 'జీతం' - అంటే, నెల వారీగా లెక్క కట్టేది. లెక్క ఎలా కట్టినా, అది 'శ్రమ శక్తి విలువ' మాత్రమే. 'వేతనం' అనే మాట, 'కూలి'కీ - 'జీతాని'కీ కూడా సరిపోతుంది.) 'శ్రమ' చేసే వారికి ఇప్పుడు భూమి పూర్తిగా 'పరాయిది' అయిపోతుంది! ఆ భూమిలో కొంత భాగం మీద 'నివాసాలు' ఏర్పర్చుకోవడానికైనా వారికి ఇప్పుడు హక్కు వుండదు. వ్యవసాయ శ్రమలు చేసే వారికి ఇప్పుడు, వ్యవసాయానికే కాదు, నివాసాలకు కూడా భూమి లేకుండా పోతుంది. ఇప్పుడు వీరికి భూస్వామితో సూటి సంబంధం పోయి, తమకు వేతనాలు ఇచ్చే 'పెట్టుబడి దారుడి' తోటే సూటి సంబంధం ఏర్పడుతుంది. గతంలో భూస్వామి అధికారం కింద వున్న వాళ్ళు ఇప్పుడు పెట్టుబడి దారుడి అధికారం కిందకి మారతారు. 'కౌలు రైతులు'గా వున్నప్పుడైనా, 'వ్యవసాయ కార్మికులు'గా మారినప్పుడైనా, ఎప్పుడూ శ్రమ చేసేది వీరే.

2. వ్యవసాయ శ్రమలు చేసే జనాభా, 'కౌలు భూమి' పోయి, వ్యవసాయ కార్మికులుగా మారడం వల్ల, వారికి జరిగే ఒక 'మేలు' ఏమిటంటే, వారు కౌలు చెల్లించే బాధ్యతల నించీ విముక్తు లవుతారు. 'కౌలు' చెల్లించలేక పోయినప్పుడు అనుభవించ వలసిన శిక్షలన్నీ తప్పుతాయి. అయితే ఇప్పుడు, 'పని స్థలం'లో యజమాని పెత్తనానికి సంబంధించిన 'హింస' ప్రారంభమవుతుంది.

3. 'వ్యవసాయ రంగం' లోకి ప్రవేసించే పెట్టుబడిదారుడు ఎవరు? వీడు ఎక్కడి నించి వస్తాడు? - పారిశ్రామిక, వర్తక, వడ్డీ-రంగాల్లో అప్పటికే లాభాలూ, వడ్డీలూ సంపాదించిన పెట్టుబడి దారుల్లో కొందరు, వ్యవసాయ రంగం లోకి కూడా దిగవచ్చు. భూస్వాముల్లో కూడా కొందరు, భూమిని కౌలుకి ఇవ్వడం మానేసి, 'స్వంత సాగు' ప్రారంభించవచ్చు (వ్యవసాయ కార్మికులతో శ్రమ చేయిస్తూ). ఒక భూస్వామి, ఇతర భూస్వాముల భూముల్ని కూడా కౌలుకి తీసుకుని, 'లాభం' సంపాదించవచ్చు. ఈ రకంగా, అప్పటికే ఇతర రంగాల్లో పెట్టుబడి దారులుగా వున్న వాళ్ళు గానీ, భూస్వాములు గానీ, పెట్టుబడిదారీ కౌలు రైతులుగా మారవచ్చు.

4. భూస్వామి, తన 100 ఎకరాల్ని గతంలో ఫ్యూడల్ కౌలు రైతులకు ఇచ్చినప్పుడు, ఆ రైతుల ద్వారా వచ్చిన కౌలుని 70% పంటగా అనుకున్నాం. అయితే, ఆ భూమినే పెట్టుబడిదారీ కౌలు రైతుకి ఇచ్చినప్పుడు, భూస్వామి, అంత కౌలుని తీసుకోలేడు. ఎందుకంటే అందులో కొంత భాగం పెట్టుబడిదారీ రైతుకి 'లాభం'గా మిగలవలసి వుంటుంది కాబట్టి. అంటే వ్యవసాయ రంగం లోకి పెట్టుబడిదారీ కౌలు రైతు ప్రవేశం వల్ల, భూస్వామికి వచ్చే కౌలు శాతం తగ్గుతుంది. ఈ మార్పుకి భూస్వామి ఎందుకు అంగీకరిస్తాడు? - ఎందుకంటే, ఈ 'మార్పు' గురించి భూస్వామికి తెలియనే తెలీదు. ఈ మార్పు, ఒకటి రెండు సంవత్సరాల కాలంలో హఠాత్తుగా జరిగిన మార్పు కాదు. ఏ సామాజిక మార్పు అయినా ఎంతో దీర్ఘకాలం పాటు క్రమ క్రమంగా జరుగుతుంది. అలాగే ఇది కూడా ఎంతో కాలం పాటు జరిగిన మార్పు. వెనకటి కాలంలో 'ఉసురీ' పేరుతో వుండిన అత్యధిక వడ్డీ రేటు, క్రమ క్రమంగా పెట్టుబడిదారీ విధానానికి అనుకూలంగా 'బ్యాంకు వడ్డీ రేటు'గా ఎలాగైతే మారిందో, అలాగే ఈ 'కౌలు' విషయంలో కూడా జరిగింది. వెనకటి కాలంలో ఫ్యూడల్ రైతుల అదనపు విలువని ఉసురర్లూ, భూస్వాములూ (ఫ్యూడల్ వడ్డీ + ఫ్యూడల్ కౌలూ) తింటూ వుండే వారు. తర్వాత, సమాజంలో పెట్టుబడిదారీ విధానం ప్రారంభమై, అది 'వ్యవసాయ రంగం' లోకి కూడా ప్రవేసించిన తర్వాత, 'వ్యవసాయ కార్మికుల అదనపు విలువ'లో కొంత వాటా, 'వ్యవసాయ పెట్టుబడి'కి 'లాభం' పేరుతో అందవలసి వచ్చింది. వెనకటి కాలంలో అతిగా వుండే ఫ్యూడల్ కౌలూ, అతిగా వుండే ఫ్యూడల్ వడ్డీ, కొంత కొంత భాగం తగ్గితేనే వ్యవసాయ పెట్టుబడికి లాభం రావడం

సాధ్యం. వర్తక లాభం - అనేది, గత సమాజాలలో కూడా ఉంది. కానీ, 'ఉత్పాదక లాభం' అనేది, కొత్త అంశం. దీని కోసం 'అదనపు విలువ'లో మిగతా భాగాలు తగ్గవలసి వచ్చింది. కాబట్టి, వెనకటి కాలపు కౌలూ, వెనకటి కాలపు వడ్డీ కూడా, 'వ్యవసాయ - పెట్టుబడి'కి 'లాభాన్ని' వదలగలిగే విధంగా తమ రూపాలు మార్చుకున్నాయి.

ఉసురీ - 'బ్యాంకు వడ్డీ'గా మారింది.

ఫ్యూడల్ కౌలు - 'పెట్టుబడిదారీ కౌలు'గా మారింది.

ఇదంతా చాలా తేలికగా, ఘర్షణలు లేకుండా జరిగిపోయిన మార్పు కాదు.

'కౌలు'ని లాగుతూ జీవించే సెక్షను, "వడ్డీలూ, లాభాలూ ఏమిటీ పాడూ, కౌలు - అంటే వేరు గానీ" అంటుంది.

'వడ్డీల' వాళ్ళు - 'కౌలు'నీ, 'లాభాన్నీ' తిట్టి పోస్తూ, "వడ్డీ అంటే వేరూ" అంటారు.

'లాభాల' వాళ్ళు - 'వడ్డీ'నీ, 'కౌలు'నీ తిట్టి, "లాభం అంటే వేరూ" అంటారు.

ఏ సెక్షన్ ఆర్థిక వేత్తలు, ఆ సెక్షన్ సేవకి సిద్ధంగా వుంటారు.

ఒక ఆర్థిక వేత్త కౌలుని సమర్థిస్తే, ఇంకోడు వడ్డీనీ, మరోడు లాభాన్నీ వెనకేసుకు వస్తారు. ఇలాంటి వాదోప వాదాలెన్నో ఆర్థిక వేత్తల మధ్య వున్నాయి.

కానీ, అసలు సంగతి - కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ అన్నీ ఒకటే. అన్నీ 'అదనపు విలువ'లో భాగాలే. ఆ భాగాలకు వేరు వేరు పేర్లు మాత్రమే అవి. అన్నీ కలిసి చేసే పని,'ఇతరుల శ్రమ'ని లాగడమే.

ఫ్యూడల్ కౌలు రైతుల S =
ఫ్యూడల్ వడ్డీ + ఫ్యూడల్ కౌలూ

వ్యవసాయ కార్మికుల S =
పెట్టుబడిదారీ వడ్డీ + కౌలూ + లాభం.

బానిస సమాజం నించీ, పెట్టుబడిదారీ సమాజం వరకూ, ఆయా సమాజ పరిస్థితుల్ని బట్టి 'అదనపు విలువ' ఎలా పంపకం అవ్వాలో అలా అవుతూ, వాటి రూపాలు మారుతూ వచ్చాయి.

ఫ్యూడల్ కౌలూ, పెట్టుబడిదారీ కౌలూ, ఒకే రూపంతో వుండవు.

అలాగే, ఫ్యూడల్ వడ్డీ, పెట్టుబడిదారీ వడ్డీ కూడా, ఒకే రూపంలో వుండవు.

ఈ రకంగా - వడ్డీ, కౌలూ, లాభం - అనే వాటి రూపాలు, సమాజ పరిస్తితుల్ని బట్టి ఏర్పడే రూపాలే. అవి ఇంకా ఏ రూపాలకైనా మారగలవు.

పెట్టుబడిదారీ విధానంలో - లాభమూ, వడ్డీ కలిసి, 'డివిడెండు'గా ఉంటాయి. అంటే, 'జాయింట్ స్టాక్ విధానం' తలెత్తిన పరిస్తితులకు అనుగుణంగా, ఆ అంశాలు, ఆ రూపం లోకి మారాయని అర్థం. 'రూపం'లో మార్పులు ఇంకా ఎన్ని రకాలుగా నైనా వుండవచ్చు.

భూమి కౌలుని అర్థం చేసుకోవడం గురించి మార్క్సు చెప్పే జాగ్రత్తలు:

"**భూ**మి కౌలుని పరిశీలించేటప్పుడు, విషయాలను మరుగు పరిచే 3 రకాల ప్రధానమైన తప్పులు జరగకుండా చూసుకోవాలి.

1. సామాజిక ఉత్పత్తి క్రమాభివృద్ధిలో, వేరు వేరు దశలకు సంబంధించిన వేరు వేరు 'కౌలు రూపాల్ని' గందరగోళ పరచ కూడదు.

2. భూమి కౌలు అంతా కూడా అదనపు విలువే. అంటే, 'అదనపు శ్రమ'కి సంబంధించిన ఉత్పత్తే - అని గ్రహించాలి.

3. భూమి కౌలు మొత్తం ఎంత - అనేది, దానిని పొందే వాడి చర్యల వల్ల గాక, వాడు ఏ సామాజిక శ్రమలో నైతే ఎటువంటి పాత్రా నిర్వహించడో, ఆ సామాజిక శ్రమ చేత నిర్ణయమవుతుంది. మొత్తం సామాజిక శ్రమ ఫలితంగా జరిగే సామాజికాభివృద్ధి వల్ల, భూమి కౌలు మొత్తం నిర్ధారణ అవుతుంది - దానితో పాటే భూమి విలువ కూడా" [కాపిటల్ - 3, పేజీ 633 - 36. మాస్కో 1971.]

ఫ్యూడల్ రైతు చెల్లించే కౌలు - ఆ కుటుంబ సభ్యుల స్వంత శ్రమ. పెట్టుబడిదారీ రైతు చెల్లించే కౌలు - ఆ కుటుంబ సభ్యుల శ్రమ కాదు.

కాబట్టి, ఫ్యూడల్ రైతు, కౌలు చెల్లించడమూ; పెట్టుబడిదారీ రైతు, కౌలు చెల్లించడమూ - ఒకే రకమైన విషయాలు కావు.

అలాగే, ఫ్యూడల్ రైతు వడ్డీ చెల్లించడమూ, పెట్టుబడిదారీ రైతు వడ్డీ చెల్లించడమూ కూడా ఒకే రకమైన విషయాలు కావు.

'స్వంత ఆస్తి' అనే పునాది గల సమాజంలో, 'భూమిని' ఎవరు ఏ అవసరాలకు ఉపయోగించినా దాని మీద 'కౌలు' లెక్కలు వుంటాయి.

పారిశ్రామిక పెట్టుబడిదారుడు, భూమి మీదే 'ఫ్యాక్టరీ' కట్టుకుంటాడు.

వర్తక పెట్టుబడిదారుడు, భూమి మీదే షాపులూ గోడౌన్లూ కట్టుకుంటాడు.

వ్యవసాయ పెట్టుబడి దారుడు - భూమి మీదే 'వ్యవసాయం' చేస్తాడు.

'భూమి' లేకుండా ఎవ్వరూ తమ కార్యక్రమాలు నిర్వహించలేరు.

ఆ భూమి, భూస్వామి నించి 'కౌలు'కి (అద్దెకి) తీసుకున్నది అయితే, 'కౌలు' భాగం భూస్వామికి పోతూ వుంటుంది. లేదా, ఆ భూమి, పెట్టుబడి దారుడి స్వంత భూమే అయితే, (అంటే, పెట్టుబడి దారుడే భూస్వామి కూడా అయితే), 'కౌలు' భాగం ఎక్కడికీ పోకుండా పెట్టుబడిదారుడికే వుండి పోతుంది. అంటే, స్వంత భూమి మీద కూడా కౌలు లెక్కలు వుంటాయి, స్వంత పెట్టుబడి మీద కూడా 'వడ్డీ' లెక్కలు వున్నట్టు!

**'భూమి' కి - కౌలూ,**
**'పెట్టుబడి'కి - వడ్డీ + లాభమూ!**

ఇవీ సమాజంలో శ్రమ దోపిడీ జరిగే ప్రధాన మార్గాలు!

స్వంత భూమీ, స్వంత పెట్టుబడీ వున్న పెట్టుబడి దారుడు, 'అదనపు విలువ'లో దాదాపు అన్ని భాగాలూ తనే తింటాడు.

భూమి, 'అద్దె'కి తీసుకున్నది అయినా కాక పోయినా దానికి 'కౌలు' లెక్కలు వుండవలసిందే. కాబట్టి, భూమి, అద్దెకి తీసుకున్నదా, కాదా - అనే ప్రశ్న అనవసరం.

పారిశ్రామిక కార్యక్రమాల కోసం తీసుకున్న భూమికి చెల్లించే కౌలు - 'పారిశ్రామిక కౌలు'. వ్యవసాయ కార్యక్రమాల కోసం తీసుకున్న భూమికి చెల్లించే కౌలు - 'వ్యవసాయ కౌలు'.

# వ్యవసాయ పెట్టుబడి తన 'కౌలు'ని ఎలా చెల్లిస్తుంది?

**'కౌ**ళ్ళ'కి సంబంధించిన చర్చలో ఇది ప్రధాన మైన ప్రశ్న. మొదట వినగానే ఈ ప్రశ్న చాలా 'అర్థ రహిత మైన' ప్రశ్నలాగ కనపడుతుంది. 'వ్యవసాయ పెట్టుబడి, కౌలుని ఎలా చెల్లిస్తుంది - అనే ప్రశ్న ఏమిటి? కౌలుని, పారిశ్రామిక పెట్టుబడి ఎలా చెల్లిస్తుందో వ్యవసాయ పెట్టుబడీ అలాగే చెల్లిస్తుంది కదా? వ్యవసాయ కౌలు గురించే ప్రత్యేకంగా ప్రశ్న ఎందుకూ?' - అనే ప్రశ్న వస్తుంది. ఇలాంటి ప్రశ్న రావడం మంచిదే గానీ, ఈ ప్రశ్న పూర్తిగా సరైంది కాదు. 'పారిశ్రామిక పెట్టుబడి, కౌలుని ఎలా చెల్లిస్తుందో, వ్యవసాయ పెట్టుబడి కూడా అలాగే చెల్లిస్తుంది' అనే జవాబు, కొంత వరకే సరిపోతుంది గానీ పూర్తిగా సరిపోదు.

ఇక్కడ సమస్య ఏమిటంటే:

ఒక భూస్వామి దగ్గర 100 ఎకరాల భూమి వుంది. అదంతా ఒకే ప్రాంతంలో వుంది. భూస్వామి, ఆ భూమిలో - 95 ఎకరాల్ని పత్తి పండించే వ్యవసాయ పెట్టుబడీ దారుడికీ, 5 ఎకరాల్ని 'బట్ట'ని ఉత్పత్తి చేసే పారిశ్రామిక పెట్టుబడి దారుడికీ ఇచ్చాడు. 1 ఎకరానికి, సంవత్సరానికి, కౌలు 10 రూపాయలు.

పారిశ్రామిక పెట్టుబడి దారుడు, కౌలుకి తీసుకున్న భూమిలో బట్టల మిల్లు పెట్టాడు. 5 ఎకరాల్లో నడిచే ఆ బట్టల మిల్లులో, పత్తి నించి దారాన్నీ, ఆ దారంతో బట్టనీ తయారు చేసే పనులు జరుగుతాయి. ఆ మిల్లు, సంవత్సరం అంతా పని చెయ్యాలంటే, దానికి 'ముడి పదార్థం'గా 95 ఎకరాల్లో పండే పత్తి కావాలనుకుందాం.

ఏ 'పరిశ్రమ' కైనా, అది ఎంత వైశాల్యం గల భూమిలో పని చేస్తుందో అంత భూమి కన్నా, ఆ పరిశ్రమకి ముడి పదార్థాన్ని అందించే వ్యవసాయ భూమి అనేక రెట్లు ఎక్కువగా వుండాలి. మన ఉదాహరణ ప్రకారం, 5 ఎకరాల్లో పని చేసే బట్టల మిల్లుకి, ముడి పదార్థాన్ని అందించడానికి, 95 ఎకరాల వ్యవసాయ భూమి కావాలన్న మాట!

5 ఎకరాల్ని కౌలుకి తీసుకున్న పారిశ్రామిక పెట్టుబడి దారుడు, ఎకరానికి 10 కౌలు చొప్పున, సంవత్సరానికి 50 కౌలు చెల్లిస్తే, 95 ఎకరాల్ని తీసుకున్న వ్యవసాయ పెట్టుబడి దారుడు సంవత్సరానికి 950 కౌలు చెల్లించాలి. కౌలు చెల్లించవలసింది, తీసుకున్న భూమి వైశాల్యాన్ని బట్టే కాబట్టి, తక్కువ భూమికి తక్కువ కౌలూ, ఎక్కువ భూమికి ఎక్కువ కౌలూ చెల్లించడంలో వింత ఏమీ లేదు. ఇద్దరు పెట్టుబడిదారులూ కౌలుని ఒకే షరతుతో చెల్లిస్తున్నారని అర్థం.

అయితే, ఏ పెట్టుబడిదారుడైనా 'కౌలు'ని ఎక్కడి నించి తెచ్చి చెల్లిస్తాడు? - పెట్టుబడి మీద వచ్చే 'జనరల్ లాభం' నించే చెల్లిస్తాడు.

జనరల్ లాభం, దేన్ని బట్టి వుంటుంది?

'పెట్టుబడి పరిమాణాన్ని' బట్టి వుంటుంది.

పారిశ్రామిక పెట్టుబడిదారుడూ, వ్యవసాయ పెట్టుబడిదారుడూ ఎంతెంత పెట్టుబడులు పెట్టారనే వివరాలు ఇక్కడ అవసరం లేదు. ఎవరి పెట్టుబడి ఎంత అయినా, ఆ పెట్టుబడికి తగినట్టు గానే 'జనరల్ లాభం' వుంటుంది. ఇద్దరికీ 'లాభం రేటు' ఒకే రకంగా ఉంటుంది.

అంటే, ఈ ఉదాహరణలో కూడా పారిశ్రామిక పెట్టుబడిదారుడికీ, వ్యవసాయ పెట్టుబడిదారుడికీ 'లాభం రేటు' ఒకే రకంగా వుంటుంది. ఒకే రకంగా వున్న 'లాభం రేటు'లో నించి, పారిశ్రామిక పెట్టుబడి దారుడు 50 కౌలు మాత్రమే చెల్లిస్తే, వ్యవసాయ పెట్టుబడి దారుడేమో 950 కౌలు చెల్లించాలి! అప్పుడేమవుతుంది?- కౌళ్ళని తీసి వెయ్యగా మిగిలే లాభాలు, పెట్టుబడుల పరిమాణాలకు తగినట్టుగా వుండవు. కౌళ్ళని తీసి వేశాక, పారిశ్రామిక పెట్టుబడికి ఎక్కువ లాభం రేటు వుంటే, వ్యవసాయ పెట్టుబడికి చాలా తక్కువ లాభం రేటు వుంటుంది. ఈ రకంగా, కౌళ్ళని తీసి వేశాక వ్యవసాయ పెట్టుబడికి ఎప్పుడూ తక్కువ లాభం రేటే వున్నట్టయితే, ఏ పెట్టుబడి అయినా వ్యవసాయ రంగంలో ఎందుకు పని చేస్తుంది?

ఈ సమస్య ఎందుకు వస్తుందంటే, 'ఫలానా కొంత' భూమిలో పని చేసే ఒక పరిశ్రమ కోసం, ముడి పదార్థాన్ని ఇవ్వడానికి అంతే వైశాల్యం గల వ్యవసాయ భూమి సరిపోదు గనక. 5 ఎకరాల భూమి మీద పని చేసే బట్టల మిల్లు, ఇంకో 5 ఎకరాల్లో పండిన పత్తితోటే సంవత్సరం అంతా పని చెయ్యగలిగితే, ఈ సమస్య రాదు. పారిశ్రామిక పెట్టుబడి చెల్లించవలసిన కౌలూ, వ్యవసాయ పెట్టుబడి చెల్లించవలసిన కౌలూ సమానం గానే వుంటే, ఆ కౌళ్ళని తీసి వెయ్యగా మిగిలే లాభాలు, పెట్టుబడుల పరిమాణాలకు తగినట్టు గానే వుంటాయి. అప్పుడు, వ్యవసాయ పెట్టుబడికి, కౌలుని తీసివెయ్యగా ఎప్పుడూ తక్కువ లాభం రేటే రావడం అనేది వుండదు.

కానీ, ఒక 'పరిశ్రమ'కి సంబంధించిన భూమి కన్నా, దానికి ముడి పదార్థాన్ని అందించే వ్యవసాయ భూమి అనేక రెట్లు ఎక్కువగా వుండి తీరాలి కాబట్టి, 'జనరల్ లాభం'లో నించి, వ్యవసాయ పెట్టుబడి, చాలా 'ఎక్కువ' కౌలుని చెల్లించవలసి వస్తుంది. 'ఎక్కువ' కౌలుని, వ్యవసాయ పెట్టుబడి ఎలా చెల్లిస్తుంది? - ఇదీ సమస్య!

**ఇంకో ఉదాహరణ:** 1 ఎకరం భూమిలో ఒక ధాన్యం మిల్లు వుంది. అది సంవత్సరానికి ఎంత ధాన్యం ఆడుతుంది? ఒక్క ఎకరం భూమిలో పండే ధాన్యాన్ని మాత్రమే ఆడుతుందా? 1 ఎకరంలో 30 బస్తాల ధాన్యం పండుతుందనుకుందాం. ధాన్యం మిల్లు సంవత్సరానికి 30 బస్తాల ధాన్యం మాత్రమే ఆడుతుందా? - కాదు. ఆ మిల్లు, ఎంత తక్కువ ఉత్పత్తి శక్తి గలది అయినా, ప్రతీ రోజూ ఒక ఎకరంలో ధాన్యాన్ని ఆడగలదు. అంటే, సంవత్సరానికి (సెలవు దినాల్ని తీసి వేస్తే) కనీసం 300 ఎకరాల్లో పండే ధాన్యాన్ని ఆడగలదు. అంటే, ఆ ధాన్యం మిల్లుకి, ముడి పదార్థాన్ని సప్లై చెయ్యడానికి, 300 ఎకరాల వ్యవసాయ భూమి కావాలన్న మాట! మిల్లు పెట్టుబడి దారుడూ, ధాన్యం పండించే పెట్టుబడి దారుడూ, తమ 'జనరల్ లాభాల'లో నించే కౌళ్ళు చెల్లించాలంటే, మొదటి వాడు ఒక్క ఎకరానికే కౌలు చెల్లిస్తే, రెండో వాడు 300 ఎకరాలకు కౌలు చెల్లించాలి! - ఇదీ సమస్య!

'కౌలు'ని లెక్క కట్టేది - భూమి వైశాల్యాన్ని బట్టి!

కానీ, దాన్ని చెల్లించవలసింది, పెట్టుబడి వైశాల్యాన్ని బట్టి వచ్చే జనరల్ లాభంలో నించి!

పెట్టుబడికి, దాని పరిమాణాన్ని బట్టే 'జనరల్ లాభం' వుండాలి.

'కౌలు'ని, ఆ జనరల్ లాభంలో నించి చెల్లిస్తే, 'వ్యవసాయ పెట్టుబడి'కి మిగిలే లాభం, ఎప్పుడూ అతి

తక్కువ గానే వుంటుంది. ఇలాగయితే, ఏ పెట్టుబడి అయినా వ్యవసాయ పెట్టుబడిగా పని చెయ్యడానికి ఎందుకు అంగీకరిస్తుంది?

'కౌలు' విషయంలో వచ్చే ఈ సమస్య, వడ్డీ విషయంలో రాదు. ఎందుకంటే - 'వడ్డీ'ని లెక్క కట్టేదీ, చెల్లించేదీ కూడా, పెట్టుబడి సైజుని బట్టే కాబట్టి.

కౌలునీ, వడ్డీనీ కూడా, చెల్లించేది - పెట్టుబడి సైజుని బట్టి వచ్చే 'జనరల్ లాభం'లో నించే. కానీ, 'కౌలు'ని లెక్కకట్టేది, 'భూమి' సైజుని బట్టి అయితే, 'వడ్డీ'ని లెక్క కట్టేది పెట్టుబడి సైజుని బట్టి! అందుకే, కౌలు విషయంలో వచ్చే సమస్య, వడ్డీ విషయంలో రాదు.

'జనరల్ లాభం రేటు'నీ, ఒక 'వడ్డీ రేటు'నీ తీసుకుంటే, వడ్డీని చెల్లించగా మిగిలే లాభం రేటు, 'పారిశ్రామిక పెట్టుబడి'కీ, వ్యవసాయ పెట్టుబడి'కీ కూడా ఒకే రకంగా వుంటుంది. కానీ, 'కౌలు' విషయంలో అలా జరగదు. జనరల్ లాభం రేటునీ, ఎకరానికి కౌలు లెక్కనీ తీసుకుంటే, వ్యవసాయ పెట్టుబడి చెల్లించవలసిన కౌలు ఎక్కువగా వుండి, వ్యవసాయ పెట్టుబడికి లాభం రేటు ఎప్పుడూ తక్కువ గానే వుంటుంది. కాబట్టి కౌళ్ళని చెల్లించగా కూడా, 2 రకాల పెట్టుబడులకూ ఒకే లాభం రేటు వుండాలంటే, కౌళ్ళని చెల్లించవలసింది - జనరల్ లాభం రేటులో నించి కాదు. దాని 'బయటి' నించీ! అంటే, కౌళ్ళని తీసివేశాక మిగిలే లాభాలే సమాన రేటుతో వుండాలన్న మాట!

'జనరల్ లాభం రేటు' అని చెప్పుకునేది, కౌళ్ళని తీసివేయక ముందు వుండే రేటు కాదు, కౌళ్ళని కూడా తీసి వేశాక వుండే రేటే. అప్పుడయితేనే అది పెట్టుబడుల పరిమాణాలకు తగ్గట్టు వుంటుంది.

ఇక్కడ మొట్టమొదట ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. 'ఏ పెట్టుబడికైనా ఒకే లాభం రేటు' అనే షరతు, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన సమాజానికి మాత్రమే వర్తించే విషయం. 'లాభం రేటు' కోసం పారిశ్రామిక, వ్యవసాయ పెట్టుబడిదారులు కనీసంగా నైనా పోటీ పడగలిగే పరిస్థితి వున్నప్పుడే, ఆ రంగాలకు 'సమాన లాభం రేటు' అనే ప్రశ్న తలెత్తుతుంది. అలాంటి పరిస్థితి లేనప్పుడు, లాభం రేట్లు తప్పనిసరిగా తేడా గానే వుంటాయి. కానీ మొదట మనం 'సమాన లాభం రేటు' సూత్రం మీదే 'కౌలు' సమస్యని చర్చిస్తున్నాము.

'సమాజం'లో పని చేసే మొత్తం ఉత్పాదక పెట్టుబడిని - పారిశ్రామిక పెట్టుబడీ, వ్యవసాయ పెట్టుబడీ - అని విభజిస్తే, పారిశ్రామిక పెట్టుబడి ఉపయోగించే భూమి కన్నా, వ్యవసాయ పెట్టుబడి ఉపయోగించే భూమి, అనేక రెట్లు ఎక్కువగా వుంటుంది. కాబట్టి, పారిశ్రామిక పెట్టుబడి చెల్లించవలసిన కౌళ్ళ మొత్తం కన్నా, వ్యవసాయ పెట్టుబడి చెల్లించవలసిన కౌళ్ళ మొత్తం, అనేక రెట్లు ఎక్కువ.

ఒక సంవత్సరానికి - పారిశ్రామిక పెట్టుబడులన్నీ కలిసి చెల్లించవలసిన కౌళ్ళ మొత్తం 10 అనీ, వ్యవసాయ పెట్టుబడులన్నీ కలిసి చెల్లించవలసిన కౌళ్ళ మొత్తం 90 అనీ, అనుకుందాం. అంటే, వ్యవసాయ పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి కన్నా 80 కౌలుని ఎక్కువగా చెల్లించాలన్న మాట!

పారిశ్రామిక పెట్టుబడి 10 కౌలు చెల్లించాలి.
వ్యవసాయ పెట్టుబడి 10 + 80 కౌలు చెల్లించాలి.

10 వరకూ అయితే, 2 రకాల పెట్టుబడులకూ సమానమే. ఈ 10 వరకూ, 2 రకాల పెట్టుబడులూ ఒకే రకంగా, 'జనరల్ లాభం రేటు'లో నించే చెల్లించగలవు. ఆ పైన, వ్యవసాయ పెట్టుబడి, ఇంకా ఎక్కువగా చెల్లించవలసిన 80 గురించే సమస్య. ఆ 'ఎక్కువ'ని, ఆ పెట్టుబడి ఎలా చెల్లించాలి? ఆ పెట్టుబడి, 'ఎక్కువ' కౌలు చెల్లించినా కూడా దానికి 'జనరల్ లాభం రేటు' వుండాలంటే ఏం జరగాలి?

అసలు ఏ శాఖలో పెట్టుబడికైనా 'జనరల్ లాభం' రావడం అనేది, ఎలా జరుగుతుంది? అన్ని శాఖల సరుకుల ధరలూ 'విలువల' నించీ తప్పుకుని 'ఉత్పత్తి ధరలు'గా ఏర్పడడం వల్లనే జరుగుతుందని చూశాం. ఇప్పుడు అందులోకి ఈ 'వ్యవసాయ కౌలు సమస్య'ని కూడా చేర్చుకోవాలి.

పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు రెండూ ఉత్పత్తి చేసే ఉత్పత్తి అంతా కలిసి 'మొత్తం సామాజిక ఉత్పత్తి రాసి'! ఆ 'రాసి'లో - (1) ఆ రాసి కోసం ఖర్చయిన మొత్తం పెట్టుబడీ, (2) ఆ పెట్టుబడి ఉత్పత్తి చేసిన మొత్తం అదనపు విలువా - వుంటాయి. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు రెండూ దేని పెట్టుబడిని అది వెనక్కి తీసుకుంటూ, దానితో పాటే ఆ 'అదనపు విలువ'ని పంచుకోవాలి. అలా అదనపు విలువని పంచుకునేటప్పుడు, వ్యవసాయ రంగం 'ఎక్కువ కౌలు'ని చెల్లించటానికి వీలయ్యే విధంగా దాని భాగానికి ఎక్కువ అదనపు విలువ రావాలి. అంటే,

వ్యవసాయ సరుకు ధర ఎలా ఏర్పడవలసి వుంటుం దంటే, అది ఎక్కువ కౌలుని చెల్లించినా కూడా 'జనరల్ లాభం రేటు'ని తీసుకోగలిగే విధంగా!

అంటే, పారిశ్రామిక సరుకు ధర - 'ఉత్పత్తి ధర'గా మాత్రమే వుంటే; వ్యవసాయ సరుకు ధర - 'ఉత్పత్తి ధర' కన్నా కూడా కొంత ఎక్కువగా వుండాలి. వ్యవ సాయ సరుకు ధర అలా ఏర్పడితేనే, వ్యవసాయ పెట్టుబడి ఎక్కువ కౌలుని చెల్లించినా కూడా 'జనరల్ లాభం' తీసుకోగలుగుతుంది.

ఈ సమస్యని, చిన్న రెండో తరగతి లెక్క ద్వారా పరిష్కరించవచ్చు.

ఈ లెక్క చూడండి: కమలా, విమలా 10 గోళీల్ని పంచుకోవాలి. అయితే, ఒక ఒప్పందం ప్రకారం, కమలకి 2 గోళీలు ఎక్కువగా రావాలి. ఆ పంపకం ఎలా జరగాలి? - ఈ లెక్క 2 వ తరగతి పిల్లలు కూడా చెయ్యగలరు. ఇంత చిన్న లెక్కని చేసే విధానమే కౌలు సమస్యని అర్థం చేసుకునే మార్గం.

మొదట 10 గోళీల్లో నించి 2 తీసి పక్కనపెట్టి, మిగిలిన 8 ని సమానం చెయ్యాలి. ఒక్కో భాగానికీ 4. మొదట తీసి పక్కన పెట్టిన 2 ని, ఒక భాగానికి కలపాలి. కమలకి 6. విమలకి 4. మొత్తం 10. విమల కన్నా కమలకి 2 ఎక్కువ.

ఈ పద్ధతి లోనే 'కౌలు' విషయంలో జరుగు తుంది. వ్యవసాయ పెట్టుబడి, ఎంత 'ఎక్కువ' కౌలుని చెల్లించాలో అంత ఎక్కువ అదనపు విలువ వ్యవసాయ సరుకు ధర లోకి అదనంగా చేరితే, (వ్యవ సాయ సరుకు ధర అలా ఏర్పడితే), సమస్య పరిష్కార మవుతుంది.

ఇప్పుడు మొత్తం సామాజిక పెట్టుబడి ఉదాహర ణని తీసుకుని, వ్యవసాయ పెట్టుబడి ఎక్కువ కౌలుని ఎలా చెల్లించగలదో చూద్దాం:

| | |
|---|---|
| మొత్తం సామాజిక పెట్టుబడి | - 800 |
| పారిశ్రామిక పెట్టుబడి | - 500 |
| వ్యవసాయ పెట్టుబడి | - 300 |

ఈ మొత్తం 800 పెట్టుబడి ద్వారా ఉత్పత్తి అయిన మొత్తం అదనపు విలువ 880 అనుకుందాం.

మొత్తం ఉత్పత్తి రాసి విలువ:

800 పెట్టుబడీ + 880 అ. విలువా = 1680.

500 పారిశ్రామిక పెట్టుబడి చెల్లించవలసిన కౌలు 10 అనీ, 300 వ్యవసాయ పెట్టుబడి చెల్లించ వలసిన కౌలు 90 అనీ - అనుకుందాం. వ్యవసాయ పెట్టుబడి చెల్లించవలసిన 'ఎక్కువ' కౌలు - 80.

ఇప్పుడు 'మొత్తం అదనపు విలువ' అయిన 880లో నించి, 80ని తీసి ఒక పక్కన పెట్టి, మిగిలిన 800 అదనపు విలువని, 800 పెట్టుబడి మొత్తానికి సమానంగా పంచాలి. ప్రతీ 100 పెట్టుబడికీ 100 అదనపు విలువ వస్తుంది. అంటే, జనరల్ లాభం రేటు 100%. 500 పారిశ్రామిక పెట్టుబడికి, 500 అదనపు విలువా; 300 వ్యవసాయ పెట్టుబడికి, 300 అదనపు విలువా - వస్తాయి. ఇప్పుడు, వ్యవసాయ పెట్టుబడికి రావలసిన 300 అదనపు విలువ లోకి, ఒక పక్కన ఉంచిన 80 అదనపు విలువని కూడా చేర్చాలి. ఆ పద్ధతిలో వ్యవసాయ సరుకుల ధరలు ఏర్పడాలి. ధరలు ఇలా ఏర్పడితేనే వ్యవసాయ పెట్టు బడి, 80 కౌలుని ఎక్కువగా చెల్లించగలుగుతుంది.

ఇప్పుడు ఆ ధరలు ఎలా వుంటాయో చూద్దాం:

ఒక రంగంలో వున్న 'సరుకుల రాసి' నంతటినీ ఒకే సరుకుగా అనుకుందాం.

**పారిశ్రామిక సరుకు ధర:**

| | | | |
|---|---|---|---|
| పెట్టుబడీ | + | జనరల్ లాభం | |
| K | + | P | |
| 500 | + | 500 | = 1,000 |

ఈ 'పారిశ్రామిక పెట్టుబడి', తన 10 కౌలుని, తన 'జనరల్ లాభం' అయిన 500లో నించే చెల్లిస్తుందని అర్థం. ఇక్కడ 'కౌలు', వేరుగా లేదు. 'జనరల్ లాభం' తోనే కలిసిపోయి వుంది.

**వ్యవసాయ సరుకు ధర:**

| | | | | |
|---|---|---|---|---|
| పెట్టుబడీ | + | జనరల్ లాభం | + | కౌలూ |
| K | + | P | + | R (రెంట్) |
| 300 | + | 300 | + | 80 = 680 |

పారిశ్రామిక ధర, K + P

వ్యవసాయ ధర, K + P + R

ఈ వ్యవసాయ పెట్టుబడి, తన 90 కౌలులో 10 వరకూ అయితే, పారిశ్రామిక పెట్టుబడి లాగే 'జనరల్ లాభం'లో నించే చెల్లిస్తుంది. ఇంకా ఆ పైన చెల్లించ వలసిన 80 ని, దాని కోసమే ప్రత్యేకంగా వున్న కౌలు భాగంలో నించి చెల్లిస్తుంది. అంటే, ఆ 'ఎక్కువ'ని జనరల్ లాభానికి బయట నించి చెల్లిస్తుంది. (అది కూడా అదనపు విలువే.) ఇప్పుడు, కౌళ్ళని చెల్లించగా కూడా, 2 రంగాల పెట్టుబడులకూ ఒకే లాభం రేటు

ఉంటుంది.

'పారిశ్రామిక ధర'లో కూడా 'కౌలు' భాగం కనపడే లాగ చూడాలంటే అప్పుడు, P తగ్గి, అది R భాగంగా వుంటుంది. అప్పుడు 'వ్యవసాయ ధర'లో కూడా P తగ్గి, R పెరుగుతుంది. ధరలు మాత్రం ఎప్పటి లాగే వుంటాయి.

ఇప్పుడు 2 ధరల్లోనూ R కనపడే లాగ చూద్దాం:

**పారిశ్రామిక సరుకు ధర:**

పెట్టుబడీ + జనరల్ లాభం + కౌలూ

K + P + R

500 + 490 + 10 = 1,000

లాభం రేటు = —× 100 = 98%

వ్యవసాయ సరుకు ధర:

పెట్టుబడీ + జనరల్ లాభం + కౌలూ

300+ 290 + 90 = 680

లాభం రేటు = —× 100 = 97%

ఇప్పుడు కూడా 2 రకాల పెట్టుబడులకూ దాదాపు ఒకే లాభం రేటు వుంది.

2 ధరల్లోనూ 'కౌలు' భాగం విడిగా కనపడే లాగ చూస్తే, 'జనరల్ లాభం రేటు' కొంత తగ్గి కనపడు తుంది. అప్పుడు 'కౌలు' భాగం పూర్తిగా, 'జనరల్ లాభం రేటు'కి బయట వుంటుంది.

లేదా, వ్యవసాయ ధరలో మాత్రమే 'కౌలు' భాగం కనపడే లాగ చూస్తే, అప్పుడు 'జనరల్ లాభం రేటు' కొంత ఎక్కువగా కనపడుతుంది. అప్పుడు, 'కౌలు'లో కొంత భాగం 'జనరల్ లాభం' లోనే కలిసి వుంటుంది.

2 ఉదాహరణల సారాంశమూ ఒకటే. తీసుకున్న ఉదాహరణని బట్టి, దానికి తగ్గట్టుగా అర్థం చేసు కోవాలి.

2 ధరల్లోనూ కౌలు భాగం వుంటుంది. 'పారి శ్రామిక ధర'లో పారిశ్రామిక కౌలూ, 'వ్యవసాయ ధర'లో వ్యవసాయ కౌలూ, వుంటాయి. అయినప్పటికీ, పారిశ్రామిక ధరని K + P గానూ, వ్యవసాయ ధరని K + P + R గానూ ఎందుకు చూస్తామంటే, 'వ్యవ సాయ ధర' లోనే 'ఎక్కువ' కౌలు భాగం అదనంగా వుంటుంది గనక.

పారిశ్రామిక పెట్టుబడి దారుడు, తన ధర లోకి కౌలు పేరుతో 10 చేర్చుకుంటే, వ్యవసాయ పెట్టుబడి దారుడు కౌలు పేరుతో 90 చేర్చుకుంటాడు. ఇద్దరికీ సమానంగా వుండే భాగం వరకూ (10 వరకూ) ఇద్దరూ ఒకే రకంగా 'జనరల్ లాభం'లో నించే చెల్లిస్తారు. వ్యవ సాయ పెట్టుబడి ఇంకా చెల్లించవలసిన 80 భాగం గురించే సమస్య. వ్యవసాయ కౌలు అంటే, 80 మాత్రమే కాదు; 90. కానీ సమస్య 90 గురించి కాదు; 80 గురించే! 'వ్యవసాయ పెట్టుబడి తన కౌలుని ఎలా చెల్లిస్తుంది' అనే ప్రశ్న, దాని మొత్తం కౌలు గురించి కాదు. 'ఎక్కువ'గా చెల్లించవలసిన భాగం గురించే. 'వ్యవసాయ కౌలు' అన్నప్పుడల్లా ఈ ఎక్కువ భాగం గురించి మాట్లాడుతున్నామని అర్థం. 'వ్యవసాయ ధర' లోకి అదనంగా చేరవలసిన భాగమే Rగా, విడిగా వుంటుంది. ఈ R భాగం 'పారిశ్రామిక ధర'లో వుండదు. అందుకే పారిశ్రామిక ధర, K + P అయితే, వ్యవసాయ ధర K + P + R.

వ్యవసాయ ధరలో మాత్రమే R వుందంటే, వ్యవసాయ పెట్టుబడి మాత్రమే కౌలుని చెల్లిస్తుందనీ, పారిశ్రామిక పెట్టుబడి కౌలుని చెల్లించదనీ, అర్థం కాదు. 2 పెట్టుబడులూ కౌళ్ళని చెల్లిస్తాయి. అయితే 'పారిశ్రామిక ధర'లో R కనపడక పోవడం వల్ల, సమాజంలో వుండే 'కౌళ్ళ మొత్తం' కొంత తక్కువగా కనపడుతుంది. ఎలాగంటే, పారిశ్రామిక ధరలో 10 కౌలూ, వ్యవసాయ ధరలో 90 కౌలూ కనపడుతూ వుంటే, (2 ధరల లోనూ 'కౌలు' భాగం వుంటే), 2 రంగాలూ కలిసి చెల్లించే కౌళ్ళ మొత్తం 100 అని స్పష్టంగా తెలుస్తుంది. కానీ, పారిశ్రామిక ధరలో 'కౌలు' కనపడకుండా, వ్యవసాయ ధరలో మాత్రమే 80 కౌలు కనపడితే, సమాజంలో వున్న మొత్తం కౌలు అంతా 80 లాగ మాత్రమే కనపడుతుంది. ఇంకో 20 కౌలు కనపడదు. కానీ, 'వ్యవసాయ ధర'లో కనపడే కౌలు మాత్రమే మొత్తం కౌలు కాదు.

పారిశ్రామిక ధరని K + P గానూ, వ్యవసాయ ధరని K + P + R గానూ చూసినప్పుడు, 20 కౌలు కనపడక పోయినా, అది ఎక్కడికీ పోదు. అప్పుడు అది, 'కౌలు' భాగంలో గాక, 'జనరల్ లాభాల్లో' కలిసి పోయి వుంటుంది. పారిశ్రామిక జనరల్ లాభంలో 10, వ్యవసాయ జనరల్ లాభంలో 10, వుంటుంది.

'జనరల్ లాభం' అనేది - వడ్డీ, కౌలూ, లాభమూ - వగైరా భాగాలుగా పంపకం అవుతుందని గతం నించీ చూస్తున్నాం. ఆ అంశాన్ని ఇప్పుడు ఇంకా సరిగా అర్థం చేసుకోవాలి. పారిశ్రామిక కౌలు అంతా, పారిశ్రామిక జనరల్ లాభం లోనే పూర్తిగా వుంటుంది. వ్యవసాయ కౌలు విషయంలో, మొత్తం కౌలు అంతా

జనరల్ లాభం లోనే వుండదు. చాలా భాగం దాని బయట వుంటుంది. కాబట్టి, 'జనరల్ లాభంలో నించే కౌలు వస్తుంది' అని సూత్రీకరించడం చాలదు. 'మొత్తం సామాజిక అదనపు విలువ'ని లెక్క కట్టా లంటే, అన్ని రంగాల్లోనూ వున్న 'జనరల్ లాభాల్ని' మాత్రమే కలిపితే చాలదు. దానికి, వ్యవసాయ కౌలుని కూడా కలపాలి. అప్పుడే అది - 'మొత్తం సామాజిక అదనపు విలువ' అవుతుంది.

పారిశ్రామిక రంగం లోని ప్రతీ శాఖా, తన సరుకు ధర ద్వారా - తన పెట్టుబడినీ, దానికి జనరల్ లాభాన్నీ తీసుకుని, ఆ జనరల్ లాభంలో నించి చెల్లించవలసిన వడ్డీలూ అవీ చెల్లించి, చివరికి తన 'ఉత్పాదక లాభం' మిగుల్చుకుంటుంది.

అలాగే, వ్యవసాయ రంగంలో ప్రతీ శాఖా, తన సరుకు ధర ద్వారా - తన పెట్టుబడినీ, దానికి తగిన జనరల్ లాభాన్నీ, కౌలు కోసం ఇంకా కొంత ఎక్కువ లాభాన్నీ కూడా తీసుకుని, ఆ లాభాలలో నించి తను చెల్లించవలసినవన్నీ చెల్లించి, చివరికి తన 'ఉత్పాదక లాభం' మిగుల్చుకుంటుంది.

అయితే, పారిశ్రామిక సరుకు ధర - 'ఉత్పత్తి ధర'గా మాత్రమే వుంటే, వ్యవసాయ సరుకు ధర, 'ఉత్పత్తి ధర కన్నా ఎక్కువగా' వుండడం 'విలువ సూత్రానికి' అతిక్రమణ అవుతుందా? - అవదు. ఈ మార్పు, 'సమాన లాభం రేటు' సూత్రానికి అను గుణంగా జరిగే విషయం మాత్రమే.

వ్యవసాయ సరుకు ధర లోకి 'కౌలు' పేరుతో చేరే భాగం కూడా (80 కూడా) సమాజంలో ఉత్పత్తి అయిన అదనపు విలువే. ఒక వేళ ఆ 80ని కూడా 2 రంగాలూ వెనకటి పద్ధతి లోనే (100% లాభం రేటుతో) పంచుకుంటే, అందులో నించి పారిశ్రామిక ధర లోకి 50, వ్యవసాయ ధర లోకి 30 చేరవలసి వుంటుంది. అంటే, అప్పుడు పారిశ్రామిక సరుకు ధర పెరిగి, వ్యవసాయ సరుకు ధర తగ్గుతుంది. 'అదనపు విలువ'లో ఏ భాగమైనా ఒక రంగం లోకి చేరిందంటే, అది ఇంకో రంగంలో తగ్గిందని అర్థం. అది ఒక చోట తగ్గితే, ఇంకో చోట పెరుగుతుంది. మొత్తం 2 రంగాల ధరల్నీ కలిపి చూస్తే, ఆ ధరల మొత్తం - వాటి విలువల మొత్తమే.

ఏ శాఖలో అయినా విలువ, ఉత్పత్తి ధరగా ఎందుకు మారుతుంది? 'జనరల్ లాభం రేటు' సూత్రం వల్ల. ఇప్పుడు వ్యవసాయ ధర, ఉత్పత్తి ధర కన్నా ఎక్కువగా ఏర్పడడం కూడా 'జనరల్ లాభం రేటు సూత్రం' వల్లే. కాబట్టి ఆ ఎక్కువ ధర కూడా 'ఉత్పత్తి ధర' లాంటిదే. పారిశ్రామిక ధర, పారిశ్రామిక పెట్టుబడికి 'జనరల్ లాభం రేటు'ని ఇస్తే, వ్యవ సాయ ధర కూడా వ్యవసాయ పెట్టుబడికి 'జనరల్ లాభం రేటు'నే ఇస్తుంది. కాబట్టి, వ్యవసాయ ధర, ఉత్పత్తి ధర కన్నా ఎక్కువగా వున్నా, అది, 'జనరల్ లాభం రేటు'ని ఇచ్చే ధర మాత్రమే. పారిశ్రామిక ధరనీ, వ్యవసాయ ధరనీ కలిపితే - అదే మొత్తం 'విలువ'. కాబట్టి, ఇక్కడ విలువ సూత్రానికి అతి క్రమణ ఏమీ లేదు.

సరుకుల్ని కొనే వాళ్ళల్లో ఏ వర్గమైనా కేవలం పారిశ్రామిక సరుకులనే కొనడమో, కేవలం వ్యవ సాయ సరుకులనే కొనడమో చెయ్యరు. 2 రకాల సరుకులూ కొంటారు. వ్యవసాయ సరుకుల్లో, 80 అదనపు విలువ ఎక్కువగా వుండడం వల్ల, ఆ సరు కుల్లో ప్రతీ యూనిట్ ధరా కొంత పెరిగి వుంటుంది. అయితే, ఆ కారణం వల్లనే (80 అదనపు విలువ వ్యవసాయ ధర లోకి అదనంగా పోవడం వల్ల), పారి శ్రామిక సరుకుల్లో ప్రతీ యూనిట్ ధరా కొంత తగ్గి ఏర్పడుతుంది. అంటే, సరుకుల్ని కొనే వాడకందార్లు, వ్యవసాయ సరుకుని కొంత ఎక్కువ ధరతో కొన్నా, పారిశ్రామిక సరుకుని కొంత తక్కువ ధరతో కొంటా రని అర్థం. కాబట్టి, వ్యవసాయ సరుకు ధర, ఉత్పత్తి ధర కన్నా కొంత ఎక్కువగా వుండడం వల్ల, దాని ప్రభావం నిత్య జీవితం మీద ఏమీ వుండదు.

వ్యవసాయ సరుకు ధర - ఉత్పత్తి ధర కన్నా ఎక్కువగా వుంటుందనే సూత్రాన్ని, 'కౌలు' గురించి వివరంగా చర్చించేటప్పుడు తప్ప, ఇతర సందర్భాల్లో దృష్టి లోకి తీసుకో నక్కరలేదు. ఇతర సందర్భాల్లో, ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, వ్యవసాయ ధరని కూడా 'ఉత్పత్తి ధర' గానే చూడాలి.

పారిశ్రామిక పెట్టుబడి దారుడు చెల్లించే కౌలు, పారిశ్రామిక కార్మికుల అదనపు విలువలో భాగం. వ్యవసాయ పెట్టుబడిదారుడు చెల్లించే కౌలు, వ్యవ సాయ కార్మికుల అదనపు విలువలో భాగం.

పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో ఒకే 'కౌలు రేటు' వున్నట్టుగా (2 చోట్లా కూడా 1 ఎకరానికి 10 కౌలు వున్నట్టుగా), ఇప్పటి వరకూ చూశాం. కానీ, పారి శ్రామిక రంగంలో ఎక్కువ కౌలు రేటు వుంటే ఏమవు తుంది?

ఒక పారిశ్రామిక శాఖ ఉపయోగించే భూమి, 1 ఎకరం. దానికి కౌలు 200. ఆ పారిశ్రామిక శాఖకి ముడి పదార్థాల్ని ఉత్పత్తి చేసే వ్యవసాయ శాఖ భూమి 90 ఎకరాలు. ఇక్కడ కౌలు 1 ఎకరానికి 10. ఏ శాఖ ఎక్కువ కౌలు చెల్లించాలి? ఎంత ఎక్కువ?

పారిశ్రామిక శాఖ చెల్లించవలసిన కౌలు 200. వ్యవసాయ శాఖ చెల్లించవలసిన కౌలు $90 \times 10 = 900$. 1 ఎకరానికి, వ్యవసాయ శాఖలో 10 కౌలు వుండగా, పారిశ్రామిక శాఖలో 200 కౌలు వుండడం అంటే, 19 రెట్లు ఎక్కువ. పారిశ్రామిక కౌలు అంత ఎక్కువగా వున్నప్పటికీ, వ్యవసాయ శాఖే ఎక్కువ కౌలు (700 ఎక్కువ) చెల్లించాలి. పారిశ్రామిక భూమికి కౌలు ఇంకా ఎక్కువగా వుంటే, 2 రంగాలూ చెల్లించే కౌళ్ళ మధ్య తేడా ఇంకా తగ్గుతుంది. తేడా ఎంత తగ్గినా, వ్యవసాయ రంగం చెల్లించవలసిన కౌలే ఎక్కువగా వుంటుంది.

## ఆ 'ఎక్కువ కౌలు' ఎక్కడిది?

వ్యవసాయ పెట్టుబడి 'ఎక్కువ' కౌలు చెల్లించాలంటే, 'సామాజిక అదనపు విలువ'లో నించి ఆ 'ఎక్కువ' భాగం వ్యవసాయ ధరలోకి చేరాలని చూశాం. అలా వ్యవసాయ ధర లోకి, చేరే ఆ 'ఎక్కువ అదనపు విలువ' ఎక్కడ ఉత్పత్తి అవుతుంది? వ్యవసాయ రంగం లోనా, పారిశ్రామిక రంగం లోనా? - ఈ ప్రశ్నకి జవాబు, సమాజంలో వున్న పారిశ్రామిక, వ్యవసాయ పెట్టుబడుల 'కాంపోజిషన్ల'ని బట్టి వుంటుంది. ('పెట్టుబడి కాంపోజిషన్' గురించి, ఈ సంపుటం లోనే "పెట్టుబడిదారీ ధర" చాప్టరులో వివరం గానే చూశాము.)

'పెట్టుబడి కాంపోజిషన్' అంటే, 'పెట్టుబడి'లో స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ ఏ పాళ్ళల్లో వున్నాయి - అనేది. ఒక దేశపు 'ఉత్పాదక పెట్టుబడి'కి, దాని 'ఉత్పత్తి శక్తి'ని బట్టి ఒక 'సగటు కాంపోజిషన్' వుంటుంది. (అన్ని శాఖల కాంపోజిషన్లనీ సగటు చెయ్యగా వచ్చే కాంపోజిషన్ అది.) అది, 'సామాజిక పెట్టుబడి కాంపోజిషన్'.

ఒక విడి శాఖలో వుండే పెట్టుబడి కాంపోజిషను, 'సామాజిక కాంపోజిషను' కన్నా ఎక్కువగా వుంటే, అది 'హయ్యర్ కాంపోజిషన్'. తక్కువగా వుంటే అది 'లోయర్ కాంపోజిషన్'. (సాధారణంగా, హయ్యర్ కాంపోజిషన్ అంటే, స్థిర పెట్టుబడి చాలా ఎక్కువగా వుండి, అస్థిర పెట్టుబడి చాలా తక్కువగా వుండడం. లోయర్ కాంపోజిషన్ అంటే, 'స్థిర' తక్కువ గానూ, 'అస్థిర' ఎక్కువ గానూ వుండడం గానీ; లేదా, అస్థిర కన్నా స్థిర ఎక్కువగా వున్నా ఆ రెంటికీ మధ్య ఎక్కువ తేడా లేకపోవడం గానీ.) హయ్యర్ కాంపోజిషన్ గల శాఖల్లో 'అదనపు విలువ రేటు' తక్కువగా వుంటే, లోయర్ కాంపోజిషన్ గల శాఖల్లో 'అదనపు విలువ రేటు' ఎక్కువగా ఉంటుంది.

అన్ని శాఖల పెట్టుబడీ కలిసి, అన్ని శాఖల అదనపు విలువనీ సమానంగా పంచుకునే విధంగా ధరలు ఏర్పడాలంటే, లోయర్ కాంపోజిషన్ శాఖల్లో ఉత్పత్తి అయిన అదనపు విలువలో కొంత భాగం, హయ్యర్ కాంపోజిషన్ శాఖల్లోకి పోవలసి ఉంటుంది. - ఇదంతా ఇంతకు ముందే చూశాం.

సాధారణంగా ఏ దేశంలో నైనా (అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో కూడా), పారిశ్రామిక పెట్టుబడి కాంపోజిషను - హయ్యర్ కాంపోజిషను గానూ, వ్యవసాయ పెట్టుబడి కాంపోజిషను - లోయర్ కాంపోజిషను గానూ వుంటాయి. ('వ్యవసాయ రంగం'లో కూడా పశువుల పెంపకం వంటి శాఖల్లో 'అస్థిర' కన్నా 'స్థిర' ఎక్కువగా వుంటుంది. కానీ, ఇది వ్యవసాయ రంగాని కంతటికీ వర్తించే జనరల్ పరిస్థితి కాదు.) వ్యవసాయ పెట్టుబడి కాంపోజిషను, లోయర్ కాంపోజిషనుగా వుండడం వల్ల, వ్యవసాయ రంగం లోనే ఎక్కువ శాతం అదనపు విలువ ఉత్పత్తి అవుతూ వుంటుంది. వ్యవసాయ సరుకుల ధర, 'ఉత్పత్తి ధర' కన్నా కొంత ఎక్కువగా ఏర్పడినా, అలా ఏర్పడ్డ ధర కూడా, ఆ సరుకు 'విలువ' కన్నా చాలా తక్కువ గానే వుంటుంది. ఆ ధర కన్నా ఎక్కువగా వున్న భాగం (ఆ 'ధర'కీ, 'విలువ'కీ మధ్య వున్న తేడా), 'జనరల్ లాభం రేటు' సూత్రంతో, 'పారిశ్రామిక ధర లోకి' చేరుతుంది. అంటే, వ్యవసాయ రంగం నించే కొంత అదనపు విలువ, పారిశ్రామిక రంగం లోకి వెళ్తూ వుంటుందని అర్థం.

అంటే, వ్యవసాయ కౌలునంతా చెల్లించేది - వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువలో నించే. అంటే, వ్యవసాయ కార్మికులు ఇచ్చే అదనపు విలువలో నించే. వ్యవసాయ అదనపు విలువలో ఇంకా మిగిలిన భాగం, పారిశ్రామిక రంగం లోకి పోతూ వుంటుంది. ఇదంతా 'సమాన లాభం రేటు' కోసం పెట్టుబడుల మధ్య 'పోటీ' ద్వారా, అంటే

ధరల ఏర్పాటు ద్వారా, జరుగుతుంది.

ఒక వేళ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల కాంపోజిషన్లు రెండూ ఒకే రకంగా వున్నాయి అనుకుంటే, 2 చోట్లా 'అదనపు విలువ రేటు' ఒకే రకంగా వుంటుంది. అప్పుడు, వ్యవసాయ రంగం ఎక్కువ కౌలుని చెల్లించాలంటే, పారిశ్రామిక రంగంలో నించే కొంత అదనపు విలువ వ్యవసాయ ధర లోకి రావలసి వుంటుంది. అంటే, అప్పుడు, వ్యవసాయ కౌలుని చెల్లించడానికి వ్యవసాయ కార్మికుల అదనపు విలువ మాత్రమే గాక, పారిశ్రామిక కార్మికుల అదనపు విలువలో నించి కూడా కొంత భాగం రావాలి.

కానీ, వ్యవసాయ కాంపోజిషను, 'లోయర్ కాంపోజిషన్'గా వున్నంత కాలమూ, వ్యవసాయ కార్మికుల అదనపు విలువే పారిశ్రామిక రంగం లోకి పోతూ వుంటుంది.

ఒక 'దేశం'లో పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో సమాన లాభం రేటు కోసం పోటీ ఎప్పుడు మాత్రమే సాధ్యమంటే, పారిశ్రామిక - వ్యవసాయ రంగాల్లో - పెట్టుబడిదారీ విధానం తగినంత స్థాయిలో అభివృద్ధి చెంది వున్నప్పుడు మాత్రమే. అప్పుడు, పెట్టుబడులు 'లాభం రేటు' కోసం పోటీ పడుతూ, అదనపు విలువని సమానంగా లాక్కోగలుగుతాయి.

వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం 'అభివృద్ధి చెందని' దేశాల్లో, వ్యవసాయ సరుకుల ధరలు, వ్యవసాయ పెట్టుబడికి జనరల్ లాభాన్ని తేగలిగే స్థాయిలో వుండవు. అంటే, అక్కడ వ్యవసాయ ధరలు తక్కువ స్థాయి లోనే వుంటాయి. కానీ, అలాంటి స్థితిలో కూడా కౌలుని చెల్లించవలసిందే. ఆ 'తక్కువ ధర'లో నించే 'వ్యవసాయ కౌలు'ని చెల్లించగా మిగిలే లాభం, తక్కువ స్థాయి లోనే వుంటుంది.

ఏదైనా ఒక దేశంలో, వ్యవసాయ రంగంలో, స్వయంగా శ్రమ చేసే చిన్న స్థాయి కౌలు రైతులే అధికంగా వున్నారనుకుందాం. అక్కడ వ్యవసాయ ధరలు ఎలా వుంటాయంటే, 'కౌలు'ని చెల్లించగా మిగిలేది - 'శ్రమ శక్తి విలువ'కి సరిపోయే విధంగా మాత్రమే వుంటాయి. ఎందుకంటే, చిన్న స్థాయి కౌలు రైతుల ఉత్పాదక శక్తి, పారిశ్రామిక పెట్టుబడితో సమాన లాభం రేటు కోసం పోటీపడ గల స్థాయిలో వుండదు గనక.

ఒక దేశంలో, వ్యవసాయ రంగంలో, పెట్టుబడిదారీ కౌలు రైతులూ, స్వయంగా శ్రమ చేసే చిన్న స్థాయి కౌలు రైతులూ కూడా వున్నారనుకుందాం. పెట్టుబడిదారీ కౌలు రైతుల దగ్గిర ఉత్పాదక శక్తి కొంత మెరుగుగానే వుంటుంది. వాళ్ళు, పారిశ్రామిక పెట్టుబడితో, సమాన లాభం రేటు కోసం ఎంతో కొంత పోటీపడగలిగితే, వ్యవసాయ ధరలు కొంచెం ఎక్కువ గానే వుంటాయి. (జనరల్ లాభం తేగలిగే విధంగా.) చిన్న స్థాయి కౌలు రైతులకు, అప్పుడు కూడా 'శ్రమ శక్తి విలువ' కన్నా మిగిలేదేమీ వుండదు. కాకపోతే, కొద్దిగా మెరుగైన 'శ్రమ శక్తి విలువ' దొరక వచ్చు.

ఈ కౌలు రైతులతో పాటే, 'స్వతంత్ర రైతులు' కూడా వున్నారనుకుందాం. అంటే, వీరికి చిన్న చిన్న స్వంత భూములు వున్నాయి అని అర్థం. వీరు కౌలు చెల్లించవలసిన అవసరం వుండదు కాబట్టి, ఆ భాగం వీరికే మిగిలి, వీరు కౌలు రైతుల కన్నా మెరుగ్గా వుంటారు.

వ్యవసాయ రంగంలో, చిన్న స్థాయి కౌలు రైతులూ, స్వతంత్ర రైతులూ అధికంగా వున్నప్పుడు, వీరు కనీస పోషణకు సరిపడే శ్రమ శక్తి విలువ దక్కినా, ఉత్పత్తి చెయ్యగలుగుతారు. 'ఎక్కువ లాభం రేటు' రాలేదని వ్యవసాయం మానుకోరు. ఈ పరిస్తితిని, పారిశ్రామిక పెట్టుబడి దారులు ఉపయోగించుకోగలుగుతారు. వాళ్ళు, పారిశ్రామిక సరుకుల్ని ఎక్కువ ధరలతో అమ్మి, వ్యవసాయ సరుకుల్ని తక్కువ ధరలతో కొంటారు. వాళ్ళు, వ్యవసాయ సరుకులకు ఎక్కువ ధరలు పెట్టడానికి నిరాకరిస్తారు. చిన్న స్థాయి రైతులు, తమ సరుకుల్ని ఎంత తక్కువ ధరలకైనా అమ్ముకోకపోతే బతకలేరు. ఈ రకంగా వ్యవసాయ రంగంలో నించే అపారమైన అదనపు విలువ, పారిశ్రామిక రంగానికి పోతూ వుంటుంది.

ఒక దేశంలో, వ్యవసాయ రంగంలో వేతనాల పద్ధతి ప్రారంభం కాగానే, ఇక ఆ దేశం పెట్టుబడిదారీ దేశం అయిపోయిందని అర్థం కాదు. దేశంలో సాగు అవుతోన్న మొత్తం భూమిలో అధిక భాగం ఏ పద్ధతిలో సాగు అవుతోందనేది ముఖ్యం. ఇంకా ఫ్యూడల్ రైతులు అధికంగా వున్నారా, చిన్న స్థాయి స్వతంత్ర రైతులు అధికంగా వున్నారా, పెట్టుబడిదారీ రైతులు అధికంగా వున్నారా - అనే విషయంతో పాటు, వ్యవసాయ కార్మికుల జీతాలూ, పని గంటలూ, హక్కులూ - వంటి 'పని పరిస్తితులు' ఎంత అభివృద్ధి చెంది వున్నాయీ - అనేది కూడా ముఖ్యం.

# వ్యవసాయ కౌలులో తేడాలు

ఇంత వరకూ 'పారిశ్రామిక కౌలు'కీ, 'వ్యవసాయ కౌలు'కీ వుండే తేడాల గురించి చూశాం. ఇప్పుడు 'వ్యవసాయ కౌలు' లోనే వుండే తేడాల గురించి చూస్తాం.

'వ్యవసాయ కౌలు'లో తేడాలు ప్రధానంగా భూముల సారాల్లో తేడాల్ని బట్టి వుంటాయి. 'సారం' అంటే, మొక్కలు పెరగడానికి కావలసిన పోషక పదార్థాలూ లవణాలూ భూమిలో వుండడం. 'సారం' విషయంలో భూమి అంతా ఒకే రకంగా వుండదు. భూమిలో కొన్ని భాగాలు చాలా సారవంతంగా వుంటే, కొన్ని భాగాలు చాలా సార హీనం గానూ, కొన్ని భాగాలు మధ్య రకం గానూ వుంటాయి. ఇలా, భూములు రక రకాల తేడాలతో వుంటాయి.

భూములన్నీ ఒకే రకంగా ఉండవు కాబట్టి, వాటికి కౌళ్ళు కూడా ఒకే రకంగా ఉండవు. తక్కువ సారం గల భూమికి తక్కువ కౌలూ, ఎక్కువ సారం గల భూమికి ఎక్కువ కౌలూ వుంటాయి.

(భూమి - ప్రకృతి సహజ పదార్థం. అందులో సారం తక్కువగా వున్నా ఎక్కువగా వున్నా అది కూడా ప్రకృతిలో భాగం. ఒక భూమి మీద చేసిన 'శ్రమ'తో, ఆ భూమి సహజం గానే సారవంతమైన భూమి అవడం వల్ల, ఎక్కువ పంట పండవచ్చు. అదే శ్రమతో, సార హీనమైన భూమిలో తక్కువ పంట పండవచ్చు. ఎక్కువ పంట పండినా, తక్కువ పంట పండినా, అది ఆ భూమి మీద జరిగిన 'శ్రమ' ఫలితమే. 'ఉత్పత్తి సాధనాల' భాగాన్ని తీసివెయ్యగా మిగిలే పంట అంతా శ్రమ ఫలితమే.)

కౌలుకి సంబంధించిన ప్రశ్నల్లో, 'సారవంతమైన భూమి ఎక్కువ కౌలు ని ఎలా చెల్లిస్తుంది' అనేది ఒక ప్రధానమైన ప్రశ్న. తక్కువ సారం గల భూమి తక్కువ పంటని ఇస్తే, ఎక్కువ సారం గల భూమి ఎక్కువ పంటని ఇస్తుంది. తక్కువ పంటలో నించి తక్కువ కౌలుని చెల్లిస్తే, ఎక్కువ పంటలో నించి ఎక్కువ కౌలుని చెల్లించాలి. చెల్లించడం సాధ్యమే. ఇదంతా నిత్య జీవితంలో కనపడేదే. కానీ, ఈ విషయాలు 'లోక జ్ఞానపు' స్థాయిలో తెలిస్తే చాలదు. దీన్ని, విలువ పరిశీలన స్థాయిలో అర్థం చేసుకోవాలి.

A, B, C అనే 3 రకాల భూముల్ని తీసుకుందాం. A భూమి, నాసి రకం. C భూమి, సారవంతం. B భూమి, మధ్య రకం.

కొన్ని షరతులు: ఉదాహరణలోకి తీసుకుంటున్న అన్ని భూములూ ఒకే సైజు గలవి. అన్ని భూముల్లోనూ ఒకే రకం ధాన్యం పండుతుంది. అన్ని భూముల్నీ పెట్టుబడిదారీ కౌలు రైతులే కౌలుకి తీసుకున్నారు. అన్ని భూములూ ఒకే సైజు పెట్టుబడితో పని చేస్తాయి. (భూమి సైజూ, దాని కోసం ఖర్చయ్యే పెట్టుబడి సైజూ ఒకే రకంగా వుంటూ, పంటలు తేడాగా వుంటేనే, భూముల సారాల్లో తేడాలు వున్నాయనడానికి వీలవుతుంది. నిత్య జీవితంలో భూముల సైజులూ, ఖర్చయ్యే పెట్టుబడులూ, పండే పంటలూ, ఎన్నో తేడాలతో వుంటాయి. అయినప్పటికీ, ఆ తేడాల నించి, అన్ని అంశాల్నీ ఒకే సైజుకి మార్చి, యూనిట్ లెక్కలు తియ్యవచ్చు.)

ధాన్యం పండేది సంవత్సరానికి ఒక సారి. కౌలు చెల్లించేది కూడా సంవత్సరానికి ఒక సారే. అంటే, ప్రతీ పంటలో నించీ ఒక కౌలు వెళ్తుంది.

A భూమి కౌలు అన్నిటి కన్నా తక్కువ. C కి అన్నిటి కన్నా ఎక్కువ. B కి మధ్యరకం.

ఈ కౌళ్ళు ఇలా ఉన్నాయి అనుకుందాం:

A భూమి కి కౌలు - 2
B భూమి కి -- 12
C భూమి కి --- 22

(ఉదాహరణని తేలిగ్గా వివరించడానికే ఈ లెక్కలు ఇలా పెట్టుకోవలసి వచ్చింది. దీని 'సారాంశాన్ని' మాత్రమే తీసుకోవాలి. సారవంతమైన భూమి కౌలుకీ, సారహీనమైన భూమి కౌలుకీ, ఇన్ని రెట్ల తేడా వుండి తీరుతుందని అర్థం కాదు. తేడాలు వుంటాయనేది మాత్రమే సారాంశం.)

A భూమి కౌలే అన్నిటి కన్నా తక్కువ కౌలు కాబట్టి, ఇదే 'సాధారణ' కౌలు. ఇది 2.

B భూమి కూడా సాధారణ కౌలుని చెల్లిస్తూ, కొంత 'అదనపు' కౌలుని కూడా చెల్లించాలి. సాధారణ కౌలు 2. అదనపు కౌలు 10.

C భూమి సాధారణ కౌలు 2. అదనపు కౌలు 20.

సాధారణ కౌలు = ఎబ్సల్యూట్ రెంట్ = A.R
అదనపు కౌలు = డిఫరెన్షియల్ రెంట్ = D.R
మొత్తం కౌలు = రెంటల్ = R
(భూమి ని 'రెంట్' కి ఇవ్వడం అన్నా,
'లీజు' కి ఇవ్వడం అన్నా ఒకటే)

అన్ని భూములూ సాధారణ కౌలు చెల్లించాలి.

B, C భూములు అదనపు కౌలు కూడా చెల్లించాలి.

Bలో కన్నా, Cలో అదనపు కౌలు ఎక్కువ.

వ్యవసాయ పెట్టుబడి, తన కౌలుని ఎలా చెల్లిస్తుందని చూశాం? - వ్యవసాయ సరుకు ధరలో, జనరల్ లాభం కన్నా ఎక్కువగా, కేవలం 'కౌలు' కోసమే వున్న భాగంతో చెల్లిస్తుందని చూశాం. అయితే, 'ధర'లో వున్న ఆ కౌలు భాగం, సాధారణ కౌలుని చెల్లించడానికి మాత్రమే సరిపోయేదిగా వుంటుందా, 'అదనపు కౌలు' కోసం కూడా సరిపోతుందా? అది, 'సాధారణ కౌలు' మాత్రమే. 'ధర'లో వున్న 'కౌలు భాగం'తో, ప్రతీ భూమీ తన సాధారణ కౌలునే చెల్లిస్తుంది. అదనపు కౌలుని కూడా చెల్లించవలసిన భూమి, దాన్ని 'ఇంకో రకం'గా చెల్లిస్తుంది. (అది ఎలాగో తర్వాత చూస్తాం.)

A, B, C భూముల్లో పంటలు ఇలా వున్నాయి అనుకుందాం:

| | | |
|---|---|---|
| A భూమిలో, సంవత్సరానికి | | - 1 బస్తా ధాన్యం |
| B లో | .................... | - 2 బస్తాలు |
| C లో | .................... | - 3 బస్తాలు |
| | మొత్తం | 6 బస్తాలు |

(ఈ 3 భూములూ ఒకే సైజు గల పెట్టుబడులతో పని చేస్తాయి అనుకున్నాం. అయితే, భూమిలో పంట పండే వరకే పెట్టుబడి ఖర్చులు ఒకే రకంగా వుంటాయి. పంటల సైజులు తేడాగా వుంటే, తర్వాత జరిగే ఖర్చులన్నీ తేడా గానే వుంటాయి. కోతల పని దగ్గిర్నించీ, A భూమిలో 1 బస్తా కోసమే ఖర్చు అయితే, Bలో 2 బస్తాలకూ, Cలో 3 బస్తాలకూ ఖర్చులు అవుతాయి. అంటే, ఎక్కువ పంట పండిన భూమిలో కొంత ఎక్కువ ఖర్చు అవుతుంది. అయినప్పటికీ, ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం, అన్ని భూముల్లోనూ ఒకే సైజు పెట్టుబడిని లెక్క లోకి తీసుకుంటాం.)

3 భూముల్లోనూ పండిన పంట అంతా, సమాజ అవసరాలకు కావాలనుకుందాం. అంటే, మార్కెట్టు డిమాండ్ కోసం, నాసిరకం అయిన A భూమిలో కూడా పంట పండాలన్న మాట. 3 భూముల్నీ వరసగా చూడాలి.

**A భూమి సంగతి:** A భూమిని కూడా కౌలుకి తీసుకుని దాంట్లో పంట పండించాలంటే, ఆ భూమికి సంబంధించిన ఉత్పత్తి ఖర్చుల్ని బట్టే ధాన్యం ధర ఏర్పడవలసి వుంటుంది. అంటే, ఆ పెట్టుబడినీ, దాని మీద జనరల్ లాభాన్నీ, ఆ పైన 'సాధారణ కౌలునీ' - ఇవన్నీ తీసుకోడానికి ఆ ధర సరిపోవాలి.

ఖర్చయిన పెట్టుబడి 8 అనుకుందాం. దీని గుర్తు K. 8 పెట్టుబడి మీద జనరల్ లాభం 5 అనుకుందాం. గుర్తు P. సాధారణ కౌలు 2. గుర్తు A.R. ఇవన్నీ కలిసి A భూమిలో పండిన పంటకి ధర ఏర్పడాలి.

A భూమిలో పంట - 1 బస్తా ధాన్యం.

ఈ బస్తా ధర = 8 K + 5 P + 2 A.R. = 15

1 బస్తా ధాన్యానికి 15 ఉత్పత్తి ధర ఏర్పడితేనే, ఏ పెట్టుబడి దారుడైనా A భూమిని కూడా కౌలుకి తీసుకుని సాగు చేయిస్తాడు. ధాన్యం ధర 15 కన్నా తక్కువగా వుంటే, A భూమిని సాగుచెయ్యడం వల్ల 'జనరల్ లాభం రేటు' రావడం సాధ్యం కాదు. కాబట్టి సమాజపు డిమాండ్‌ని తీర్చడానికి నాసిరకం భూమిని కూడా సాగు చెయ్యవలసి వుంటే, ఆ భూమిలో జరిగే ఉత్పత్తి ఖర్చుల్ని బట్టే ధాన్యం ధర ఏర్పడవలసి వుంటుంది.

ఆ ధరే, ఇతర భూముల్లో ధాన్యానికి కూడా వర్తిస్తుంది.

**B భూమి సంగతి:** ఇందులో పంట 2 బస్తాలు. ఇక్కడ కూడా పెట్టుబడి 8. దాని తోనే 2 బస్తాలు వచ్చాయి కాబట్టి, 1 బస్తాకి కాస్ట్ ప్రైస్ 4. (ఇక్కడ ఎక్కువ పంటకి, కొంత ఎక్కువ ఖర్చు అయినట్టుగా చూస్తే, అప్పుడు కూడా ఇక్కడ 1 బస్తా కాస్ట్ ప్రైసు, A భూమిలో కన్నా తక్కువ గానే వుంటుంది.) ఇక్కడ 1 బస్తాకి కాస్ట్ ప్రైస్ తగ్గినా, బస్తా ధర తగ్గదు. ఇక్కడ కూడా బస్తా ధర 15. ఈ పెట్టుబడి దారుడికి 2 బస్తాలకూ 30 వస్తుంది. అందులో నించే 'అదనపు కౌలు'ని చెల్లిస్తాడు. కానీ ఈ 'వివరణ' చాలదు.

ఇక్కడ కూడా A భూమిలో లాగే మొదట ఒక్క బస్తా సంగతే చూద్దాం. మొదటి బస్తా ధర అయిన 15 లో - 8 పెట్టుబడీ, 5 జనరల్ లాభమూ, 2 సాధా

రణ కౌలూ వుంటాయి. ఇక్కడ అదనపు పంట వచ్చే పరిస్థితి లేకపోతే, ఈ 3 అంశాలే వుంటాయి. ‘అదనపు కౌలు’ వుండదు. కానీ, ఇక్కడ భూమి సారంలో తేడా వల్ల, ‘అదనపు పంట’ వుంది. దాని వల్లే ‘అదనపు కౌలు’ వుంటుంది. కాబట్టి ‘అదనపు కౌలు’ని చెల్లించే పని ‘అదనపు పంట’ ద్వారానే జరుగుతుంది. 2 వ బస్తాకి వచ్చే 15 లో నించే ‘అదనపు కౌలు’ని చెల్లించి నట్టుగా చూడాలి. అదనపు పంట కోసం ఎంతో కొంత అదనపు పెట్టుబడి ఖర్చవుతుంది. కాబట్టి, దాన్ని 3 అనుకుందాం. ఆ పెట్టుబడి మీద కూడా ‘లాభం’ రావాలి కాబట్టి దాన్ని 2 అనుకుందాం. అంటే అదనపు పంటని అమ్మగా వచ్చే 15 లో నించి 3 K + 2 P = 5ని తీసివెయ్యగా, ఇంకా 10 వుంటుంది. ఇదే ‘అదనపు కౌలు’. ఒకవేళ ఈ 10 అంతా అదనపు కౌలుగా వుండదనీ, అందులో 7 మాత్రమే అదనపు కౌలుగా వుంటుందనీ అనుకుంటే, మిగిలిన 3, పెట్టుబడి దారుడికి ‘అదనపు లాభం’. ‘అదనపు పంట’ ద్వారా పెట్టుబడి దారుడు కూడా కొంత ‘అదనపు లాభం’ సంపాదించవచ్చు. ‘అదనపు పంట’లో పెట్టుబడి దారుడు తీసుకునే భాగం కూడా కొంత వున్నప్పటికీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, అదనపు పెట్టుబడీ, దాని లాభమూ పోగా మిగిలిన భాగాన్నంతా ‘అదనపు కౌలు’ గానే అనుకుంటాం. అందుకే, B భూమిలో ‘అదనపు కౌలు’ 10.

C **భూమి సంగతి:** ఇక్కడ పంట 3 బస్తాలు. ఇందులో అదనపు పంట 2 బస్తాలు. ఇక్కడ కూడా 8 పెట్టుబడి తోటే 3 బస్తాలు పండడం అంటే, ఇక్కడ 1 బస్తాకి కాస్ట్ ప్రైసు, Bలో కన్నా కూడా తగ్గుతుంది. అయినా ఇక్కడ కూడా బస్తా ధర 15 గానే వుంటుంది.

మొదటి బస్తా ధర అయిన 15లో - 8 పెట్టుబడీ, 5 జనరల్ లాభం, 2 సాధారణ కౌలూ వుంటాయి. ఈ భూమి ఇంకా ‘20 అదనపు కౌలు’ చెల్లించాలి. ఇక్కడ అదనపు పంట 2 బస్తాలు. వీటి ధర 30.

ఈ అదనపు పంట కోసం, అదనంగా 6 పెట్టుబడి ఖర్చవుతుందనుకుందాం. దాని లాభం 4. ఈ 6 K + 4 P = 10 ని, 30 లో నించి తీసివేస్తే, ఇంకా 20 మిగులుతుంది. ఇదే ఈ భూమికి అదనపు కౌలు. - ఈ రకంగా, ‘సారవంతమైన’ భూమిలో తక్కువ పెట్టుబడి తోటే ఎక్కువ పంట పండుతుంది కాబట్టి, ఆ ఎక్కువ పంట ద్వారానే అదనపు కౌలుని చెల్లించడం సాధ్యమవుతుంది.

మొత్తం 3 భూముల్లోనూ కలిసి పండిన పంట 6 బస్తాలు. వాటి ధర, 6 × 15 = 90. ఇందులో కౌళ్ళూ, జనరల్ లాభాలూ కలిసిన భాగం ఎంత? పెట్టుబడులన్నీ కలిసి ఎంత? (‘పెట్టుబడి’లో, ‘స్థిర’ సగమూ, ‘అస్థిర’ సగమూ వున్నాయి అనుకుందాం.)

| భూమి రకం | పెట్టుబడి | జనరల్ లాభం | సాధారణ కౌలు | అదనపు కౌలు |
|---|---|---|---|---|
| A | 8 | 5 | 2 | - |
| B | 8 + 3 | 5 + 2 | 2 | 10 |
| C | 8 + 6 | 5 + 4 | 2 | 20 |
| | = 33 | 21 | 6 | 30 |
| | 17C+16V | | | |

మొత్తం ధాన్యం ధర 90. బస్తాలు 6.
దాని కోసం ఖర్చయిన పెట్టుబడి 33.
అందులో - స్థిర 17, అస్థిర 16.
జనరల్ లాభాలూ, కౌళ్ళూ కలిసి =
21 + 6 + 30 = 57.

‘అదనపు కౌలు’ అయిన 30లో నించి, పెట్టుబడి దారులు ‘అదనపు లాభం’గా కొంత లాక్కోగలిగితే, విషయం ఏమీ మారదు. అప్పుడు అదనపు కౌలు తగ్గి, లాభాల భాగం పెరుగుతుంది, అంతే.

భూస్వాములకు కౌళ్ళ గానూ, పెట్టుబడి దార్లకు లాభాలు గానూ పోయే మొత్తం అంతా కలిసి 57. అంటే, దాదాపు 4 బస్తాలు.

స్థిర పెట్టుబడి 1 బస్తా. జీతాలు 1 బస్తా.

మొత్తం ధాన్యం 6 బస్తాలు అయినా, అందులో నించి స్థిర పెట్టుబడిగా 1 బస్తాని తీసి వేస్తే, మిగిలిన 5 బస్తాలూ వ్యవసాయ కార్మికుల శ్రమే. అంటే, వ్యవసాయ కార్మికుల శ్రమ ఫలితం మొత్తం 5 బస్తాలు. అందులో 1 బస్తా మాత్రమే వాళ్ళకు ‘జీతం’గా దక్కి, మిగిలినదంతా (4 బస్తాలు) కౌళ్ళు గానూ, లాభాలు గానూ పోయింది.

ఇంత వరకూ చూసిన ఉదాహరణలో, ధాన్యం సప్లై 6 బస్తాలు. సమాజానికి వున్న డిమాండ్‌ని తీర్చడానికి ఈ సప్లై అవసరం కాబట్టి, నాసిరకం అయిన A భూమిలో ఉత్పత్తి ఖర్చులే ధాన్యం ధరని నిర్ణయిస్తున్నాయి.

ఒక వేళ సమాజంలో 5 బస్తాల తోటే డిమాండ్ తీరుతూ వుంటుందనుకుందాం. అలాంటి పరిస్థితిలో

B, C భూముల్లో పండే పంట తోటే డిమాండ్ తీరుతూ వుంటుంది. అప్పుడు B భూమిలో ఉత్పత్తి ఖర్చులే ధాన్యం ధరని నిర్ణయిస్తాయి. ఆ ధరే A, C భూములకు కూడా వర్తిస్తుంది.

ఆ ధర ఎలా ఏర్పడుతుందంటే: B భూమిలో పంట 2 బస్తాలు. పెట్టుబడి 8 K + 3 K = 11 K. జనరల్ లాభం 5 P + 2 P = 7 P. సాధారణ కౌలు 2. ఈ అంశాలన్నీ కలిసి 11 K + 7 P + 2 A.R = 20. ఇది 2 బస్తాలకు సంబంధించిన ఉత్పత్తి ఖర్చు. కాబట్టి 1 బస్తా ధర = 10.

A భూమి ద్వారా ధాన్యానికి ధర ఏర్పడడం కన్నా, B భూమి ద్వారా ధర ఏర్పడితే, ఆ ధర ఎలా వుంది? B లో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి (A లో కన్నా ఎక్కువ) వస్తుంది కాబట్టి, ఉత్పత్తి ఖర్చు తగ్గి, ధర తగ్గింది. 2 బస్తాల్ని, 20 కి అమ్మితే, అందులో నించి పెట్టుబడిని వెనక్కి తీసుకుని, సాధారణ కౌలుని చెల్లించి, 'జనరల్ లాభం' తీసుకోవడం సాధ్యమవుతుంది. 'అదనపు కౌలు' అనేది వుండదు. అంటే, అప్పుడు B భూమి, సాధారణ కౌలుని ఇచ్చే భూమిగా మాత్రమే వుంటుంది. అప్పుడు C భూమి మాత్రమే కొంత అదనపు కౌలుని ఇస్తుంది. ఆ కౌలు, గతంలో కన్నా తక్కువగా వుంటుంది.

C భూమిలో 3 బస్తాలు పండుతాయి. కాబట్టి, ఇక్కడ 1 బస్తాకి Bలో కన్నా కాస్ట్ ప్రైస్ తగ్గుతుంది. అయినప్పటికీ, ఈ పంటని కూడా 1 బస్తా ని 10 కి అమ్మితే, పెట్టుబడీ, సాధారణ కౌలూ, జనరల్ లాభమూ పోగా కొంత అదనపు కౌలు చెల్లించడం సాధ్యమవుతుంది.

ఇప్పుడు A భూమి సంగతి చూద్దాం. బస్తా ధర 10 మాత్రమే. Aలో పంట ఒక బస్తాయే. ఇలా వున్నప్పుడు, ఒక పెట్టుబడి దారుడు A భూమిని కౌలుకి తీసుకుని సాగు చేయిస్తే, 10 ధరలో నించి 8 పెట్టుబడీ, 2 కౌలూ మాత్రమే వస్తాయి. లాభం ఏమీ మిగలదు. 'లాభం' తోటే జీవించవలసిన పెట్టుబడిదారీ కౌలు రైతు, A భూమిని కౌలుకి తీసుకోవడం సాధ్యం కాదు. స్వయంగా శ్రమ చేసే రైతు కుటుంబం అయితే, ఇప్పుడు కూడా A భూమిని కౌలుకి తీసుకోవడం సాధ్యమే. 8 పెట్టుబడి లోనే 'శ్రమ శక్తి విలువ' వుంటుంది. కాబట్టి, శ్రమ చేసే రైతు కుటుంబం, A భూమిని కౌలుకి తీసుకుంటే, తను జీవిస్తూ, 2 కౌలుని కూడా చెల్లించగలుగుతుంది. ధాన్యం ధర 10 కన్నా కూడా తగ్గితే, A భూమిని, శ్రమ చేసే కుటుంబం కూడా సాగుచెయ్యడం సాధ్యం కాదు. ఎందుకంటే, అప్పుడు అది 2 కౌలుని చెల్లించ లేదు. అలాంటి పరిస్థితుల్లో ఆ భూమి, సాగులేకుండా వుండిపోతుంది. లేదా, కౌలు తగ్గుతుంది.

'కౌలు' గురించి ఒక ఒప్పందం వుండగా, ధాన్యం ధర తగ్గిందనుకుందాం. అయినా, ఒప్పందంలో వున్న ప్రకారం కౌలుని చెల్లించక తప్పదు. అప్పుడు పెట్టుబడిదారీ రైతుకు లాభం తగ్గుతుంది. ధాన్యం ధరలో తగ్గుదల ఎక్కువ కాలం వుంటే, కౌళ్ళు కూడా తగ్గుతాయి.

భూముల్లో తేడాలు 'భూసారం' వల్లనే కాదు; జలపాతాలూ, సరస్సులూ, గనులూ, వంటి ప్రకృతి సహజ ప్రత్యేకతల వల్ల కూడా ఏర్పడతాయి. వాటి వల్ల కూడా కౌళ్ళు తేడాగా వుంటాయి. ప్రకృతి సహజమైన ప్రత్యేక వనరుల ద్వారా భూస్వాములు అదనపు కౌళ్ళూ, పెట్టుబడిదారులు అదనపు లాభాలూ సంపాదిస్తారు.

'భూమి కౌలు'ని నిర్ణయించడంలో ఇంకో అంశం - ఆ భూమి వున్న 'లొకేషన్' (ప్రాంతం). ఒక భూమి, మంచి లొకేషన్‌లో వుండడం అంటే, నీటి పారుదల ఏర్పాట్లకూ, రహదారులకూ, మార్కెట్లకూ, దగ్గరగా వుండడం. అలాంటి లోకేషన్‌లో వున్నందుకు కూడా అదనపు కౌలు చెల్లించవలసి వస్తుంది. భూమి, మంచి లొకేషన్‌లో వుండడం వల్ల, ఆ భూమిని కౌలుకి తీసుకున్న పెట్టుబడిదారుడికి కొన్ని ఖర్చులు తగ్గి, కాస్ట్ ప్రైస్ తగ్గుతుంది. కానీ, ఆ ధాన్యాన్ని కూడా జనరల్ ధరకే అమ్మడం వల్ల, అందులో నించి అదనపు కౌలుని చెల్లించడం సాధ్యమవుతుంది.

అయితే, నీటి పారుదల ఏర్పాట్లూ, మార్కెట్లూ, రవాణా సౌకర్యాలూ ఎక్కడికక్కడే, స్థానికంగా కూడా ఏర్పడినప్పుడు, లొకేషన్ ప్రత్యేకత తగ్గి, లేదా పూర్తిగా పోయి, దాని అదనపు కౌలు కూడా మాయమవుతుంది.

ఒక భూమి చాలా సారవంతమైనదీ, మంచి లొకేషన్‌లో వున్నదీ కూడా. అలాంటప్పుడు కౌలు చాలా ఎక్కువగా వుంటుంది.

భూమి చాలా సారవంతమైనదే. కానీ, చెడ్డ లొకేషన్. కౌలు మధ్య రకంగా వుండవచ్చు.

భూమి చాలా నాసిరకం. పైగా చెడ్డ లోకేషనూ.

దీన్ని పెట్టుబడిదారుడు కన్నెత్తి కూడా చూడడు. చూడాలంటే కౌలు చాలా తక్కువగా వుండాలి.

పారిశ్రామిక కౌళ్ళ విషయంలో, 'భూమి సారం' ప్రశ్న వుండదు. 'లొకేషన్' ప్రశ్న మాత్రమే వుంటుంది.

పెట్టుబడిదారీ రైతులు, అదనపు లాభాలు సంపాదించడం కోసం, రక రకాల పద్ధతులు అవలంబిస్తారు. ఎక్కువ భూమిని సాగుచేసి, ఖర్చులు తగ్గించడం ఒక పద్ధతి. 1 ఎకరం భూమికి 100 పెట్టుబడి కావాలనుకుంటే, 2 ఎకరాలకు 200 పెట్టుబడి అవసరం వుండదు. 3 ఎకరాలకు 300 పెట్టుబడి అసలే అవసరం వుండదు. ఎకరాల సంఖ్య పెరిగే కొద్దీ, ఖర్చులు తగ్గి, బస్తాకి కాస్ట్ ప్రైస్ తగ్గుతుంది. ఈ రకంగా, ఎక్కువ భూమిని సాగుచేసే పని ప్రతీ పెట్టుబడిదారుడూ చెయ్యలేడు. ఎందుకంటే, 'పెట్టుబడి' సమస్యే కాదు; దాని కన్నా 'భూమి' సమస్యే ముఖ్యం. 'భూమి' పరిమితమైనది. అది ఎంత కావాలంటే అంత దొరకదు. కాబట్టి, ఇంకో మార్గం ఏమిటంటే, తక్కువ భూమి లోనే ఎక్కువ పెట్టుబడిని వుపయోగించి, ఎక్కువ పంట పండించగలిగితే, అలా చేస్తే, ఎక్కువ భూమిని తీసుకుని ఎక్కువ కౌలు చెల్లించే భారం తప్పుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ రైతులు సాధారణంగా తక్కువ భూమి మీదే ఎక్కువ పెట్టుబడిని గుప్పించి, ఎక్కువ పంటని రాబట్టే మార్గాలు అనుసరిస్తారు.

ఒక భూస్వామి తన భూమిని ఏ పెట్టుబడిదారుడికీ కౌలుకి ఇవ్వకుండా, తనే స్వంత సాగు చేయిస్తే, అప్పుడు విషయాలన్నీ ఎలా వుంటాయి? ఏమీ మార్పు వుండదు. అప్పుడు భూస్వామి, భూస్వామే గాక, పెట్టుబడిదారీ రైతు కూడా అవుతాడు. అంతే తేడా! ఇతర విషయాలన్నీ ఇంతకు ముందు చూపినవే. కానీ, అప్పుడు సాగు కోసం భూస్వామే పెట్టుబడి పెట్టాలి. చివరికి, భూమి - హక్కు కోసం కౌలూ, పెట్టుబడి - హక్కు కోసం లాభమూ, ఆ భూస్వామే తీసుకుంటాడు. భూస్వామికి స్వంత సాగు ద్వారా ఆ 2 అంశాలూ రావాలి.

భూస్వామే స్వంత సాగు ప్రారంభించి పెట్టుబడిదారుడిగా మారినా, లేదా పెట్టుబడి దారుడే స్వంత భూమి కొనుక్కుని భూస్వామిగా మారినా, విషయాలేమీ మారవు.

భూస్వామి, తన భూమిని, స్వయంగా శ్రమ చేసే రైతు కుటుంబానికే కౌలుకి ఇచ్చి, పెట్టుబడి అంతా తనే పెడతాడనుకుందాం. 'శ్రమ' అంతా రైతు కుటుంబానిది. అప్పుడు భూస్వామికి వచ్చేది - భూమి కోసం కౌలూ, పెట్టుబడి కోసం లాభమూ! శ్రమ చేసే కుటుంబానికి ఎప్పటి లాగే 'శ్రమ శక్తి విలువ' మాత్రమే.

పెట్టుబడిదారీ కౌలు రైతులు, ప్రైవేటు భూస్వాముల నించే గాక, 'ప్రభుత్వం' నించి ప్రభుత్వ భూములనూ, గనులనూ, అడవులనూ 'లీజు'కి తీసుకునే వుదాహరణలు కూడా కోకొల్లలు. ప్రభుత్వం ఆ పెట్టుబడిదారుల నించి వసూలు చేసే లీజు ధర అసహ్యం కలిగించేటంత తక్కువగా వుంటుంది. ఎకరానికి ఒక్క రూపాయో, 2 రూపాయలో మాత్రమే వుంటుంది. గనుల లీజు ధర కూడా అంత తక్కువ గానే వుంటుంది. లీజు కాలం సాధారణంగా 99 సంవత్సరాలు! ఈ రకంగా ప్రభుత్వం నించి వందలాది ఎకరాల రక రకాల భూముల్ని లీజులకు సంపాదించగలిగిన పెట్టుబడిదారుల కుటుంబాలు, కౌళ్ళు చెల్లించవలసిన బెడద లేకుండా, ఆ కౌళ్ళూ లాభాలూ అన్నీ తామే స్వాహా చేస్తూ తర తరాలూ సుఖ భోగాలనుభవిస్తూ జీవిస్తాయి.

ఒక దేశంలో, వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం ఏర్పడిన తర్వాత కూడా అక్కడక్కడా ఫ్యూడల్ కౌలు విధానం (స్వయంగా శ్రమ చేసే రైతు కుటుంబాలే భూమిని కౌలుకి తీసుకునే విధానం) మిగిలి వుందనుకుందాం. ధాన్యం ధర, జనరల్ లాభాన్నీ - కౌలునీ కూడా ఇచ్చేదిగా వుందనుకుందాం. అలా వున్నా, దాని వల్ల ఫ్యూడల్ రైతు కుటుంబం పొందే ప్రత్యేక ప్రయోజనం ఏమీ వుండదు. ఎందుకంటే, ఫ్యూడల్ రైతులు, స్వంత శ్రమ తోటే సాగు చేస్తారు. కాబట్టి, సాధ్యమైనంత తక్కువ భూమిని మాత్రమే సాగుచేస్తారు. అది కూడా తక్కువ స్థాయి వుత్పత్తి సాధనాల తోటే సాగు చేస్తారు. పెట్టుబడిదారీ రైతు దగ్గిర వున్నంత ఉత్పత్తి శక్తి, ఫ్యూడల్ రైతు దగ్గిర వుండదు. పెట్టుబడిదారీ రైతు ఎంత తక్కువ కాస్ట్ ప్రైస్‌తో ఉత్పత్తి చెయ్యగలుగుతాడో అంత తక్కువ కాస్ట్ ప్రైస్‌తో ఫ్యూడల్‌రైతు సాగు చెయ్యలేడు. కాబట్టి, ఫ్యూడల్ రైతులకు ధాన్యం ధరలో నించి కౌలు చెల్లించగా మిగలే భాగం, ఎక్కువగా వుండదు. అంటే, పెట్టుబడిదారీ రైతు, కౌలు చెల్లించగా కూడా లాభం

పొందినట్టుగా, స్వంత శ్రమ చేసే రైతు, కౌలు చెల్లించాక లాభం మిగుల్చుకునేదేమీ వుండదు. స్వంత అదనపు విలువగా ఏమీ వుండదు. శ్రమ శక్తి విలువతో మాత్రమే జీవించాలి.

స్వంత శ్రమ చేసే ఒక రైతు కుటుంబానికి, కొంత 'స్వంత భూమి' వుందనుకుందాం. ఆ కుటుంబం, కౌలుని చెల్లించనక్కర లేదు. కాబట్టి, ఈ కుటుంబం, కౌలు చెల్లించే రైతు కుటుంబం కన్నా ఎక్కువ ఉత్పత్తులు వాడుకోగలుగుతుంది.

## అదనపు విలువలో కౌలు భాగం ఎంత?

'కౌలు'కి సంబంధించి ఇంకా ఒక ప్రశ్న వుంది. ఏమిటంటే - 'అదనపు విలువలో కౌలు భాగం ఎంత వుండాలో ఎలా నిర్ణయమవుతుంది?' అనే ప్రశ్న.

ఇదే రకం ప్రశ్నని 'వడ్డీ' విషయంలో కూడా చూశాం. 'జనరల్ లాభం'లో వడ్డీ భాగం ఎంత వుండాలో ఎలా నిర్ణయమవుతుంది - అని చూశాం. అప్పుడు చెప్పుకున్న జవాబే ఇప్పుడు 'కౌలు'కి కూడా సరిపోతుంది. 'వడ్డీ రేటు'ని నిర్ణయించడానికి సహజ కారణాలేమీ లేనట్టే, 'కౌలు రేటు'ని నిర్ణయించటానికి కూడా సహజ కారణాలేమీ వుండవు. అవి, కేవలం 'ఆర్బిట్రరీ'గా (ఎంతో కొంతగా) ఏర్పడే భాగాలు.

'కౌలు' గానీ, 'వడ్డీ' గానీ, 'లాభం' గానీ, శ్రమతో తయారయ్యే విషయాలు కావు. కాబట్టి, ఏది ఎంత వుండాలో చెప్పే నియమాలేవీ వాటికి వుండవు. కార్మిక వర్గం నించి దోచుకోగలిగిన అదనపు విలువ మొత్తాన్ని, ఆ 3 పేర్ల తోటీ ఎలాగో ఒక లాగ పంచుకోవడమే అక్కడ వున్న 'గొప్ప' నియమం!

'అదనపు విలువ సైజు'కి సహజ నియమం వుంటుంది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో 'ఉత్పాదక కార్మిక వర్గం' అంతా కలిసి ఇచ్చిన 'శ్రమ' ఎన్నో కొన్ని కోట్ల పని దినాలుగా, ఖచ్చితమైన కొలతతో వుంటుంది. అందులో నించి, ఆ వర్గానికి 'జీతాల' పేరుతో అందే భాగానికి కూడా ఖచ్చితమైన కొలత వుంటుంది. కాబట్టి, చివరకు మిగిలే 'సామాజిక అదనపు విలువ' ఖచ్చితమైన కొలత తోటే వుంటుంది. దాన్ని లాక్కునే వాళ్ళు, ఏ భాగానికి ఏ పేరు పెట్టుకున్నా, ఆ భాగాలు ఎంతెంత ఉండాలో నిర్ణయించే సహజ నియమాలేవీ వుండవు. ఆ భాగాలు వెనకటి సాంప్రదాయాల మీద ఆధార పడుతూ (ఆ సాంప్రదాయాలు కూడా ఆర్బిట్రరీగా ఏర్పడ్డవే), క్రమంగా పెట్టుబడిదారీ విధానానికి అనుగుణంగా మారుతూ వుంటాయి.

బానిస సమాజంలో, అదనపు విలువ అంతా బానిస యజమానిదే. అందులో 'కౌలు' అనే భాగం లేదు. 'వడ్డీ' వుంటే, అది 'అదనపు విలువ'లో ఎంతో కొంత భాగం.

'భూస్వామ్య సమాజం'లో, కౌలూ వడ్డీలు, 'అదనపు విలువ'లో కొంత కొంత భాగాలు.

పెట్టుబడిదారీ సమాజంలో, అదనపు విలువ అంతా, కౌలూ వడ్డీలుగా మాత్రమే గాక, 'లాభం'గా కూడా వుండాలి. కాబట్టి, ఆ పరిస్థితికి తగినట్టుగా కౌలు భాగమూ, వడ్డీ భాగమూ కొంత కొంత మారతాయి. ఈ రకంగా, ఉత్పత్తి విధానానికి తగినట్టుగా 'అదనపు విలువ' ఎలాగో ఒక లాగ పంపకాలవుతుంది.

శ్రామికుల 'శ్రమ కాలం'లో 'అదనపు శ్రమ' భాగం, వెనకటి సమాజాలలో కన్నా పెట్టుబడిదారీ సమాజంలో చాలా ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే, పెట్టుబడిదారీ సమాజంలో 'ఉత్పాదక శక్తి' చాలా ఎక్కువగా వుంటుంది కాబట్టి. ఉత్పాదక శక్తి పెరుగుతోన్న కొద్దీ, శ్రమ చేసే మనిషి ఇచ్చే శ్రమ కాలంలో, 'అవసర శ్రమ భాగం' తగ్గి 'అదనపు శ్రమ భాగం' పెరుగుతూ వుంటుంది.

వెనకటి సమాజాలలో, అదనపు శ్రమ,
'కౌలూ + వడ్డీ'గా మాత్రమే వుండేది.

పెట్టుబడిదారీ సమాజంలో అదనపు శ్రమ, 'కౌలూ + వడ్డీ + లాభం'గా వుంటుంది. (వర్తకం ఖర్చులూ, పన్నులూ - వగైరా భాగాల్ని 2 చోట్లా వదిలివేశాము. ఇవి కూడా అదనపు శ్రమలో భాగాలే.)

వెనకటి కాలంలో గానీ, పెట్టుబడిదారీ కాలంలో గానీ, 'అదనపు విలువ'ని తినే వాళ్ళల్లో ఎవరికి వాళ్ళు, ఎక్కువెక్కువ భాగాన్ని లాక్కోవడానికి ఘర్షణలు పడుతూ, ఎంత ఎక్కువ సాధ్యమైతే అంత ఎక్కువని లాక్కుంటూ వుంటారు. వాళ్ళ ప్రయత్నాల బలాన్ని బట్టే, వాళ్ళు లాక్కోగలిగే భాగాలు ఏర్పడతాయి. అంతే గానీ, ఆ భాగాలకు సహజ నియమాలేవీ వుండవు. ఉన్న నియమం అంతా, 'ఆ భాగాలన్నీ కలిసి అదనపు విలువ అవుతుంది' - అనేదే!

## సగటు కౌలూ, కౌలు రేటూ:

'మొత్తం కౌలు'ని, ఎకరాల సంఖ్యతో భాగిస్తే వచ్చేది - సగటు కౌలు.

మొత్తం కౌలుకీ, మొత్తం ఉత్పాదక పెట్టుబడికీ వుండే శాతం - కౌలు రేటు.

వ్యవసాయ రంగాన్ని మాత్రమే తీసుకుని చూడవచ్చు. లేదా, వ్యవసాయ రంగాన్నీ, పారిశ్రామిక రంగాన్నీ కలిపి చూడవచ్చు. తీసుకునే ఉదాహరణని బట్టి జవాబులు వుంటాయి.

ఒకే కాలంలో వేరు వేరు దేశాల్లో, లేదా ఒకే దేశంలో వేరు వేరు ప్రాంతాల్లో, కౌళ్ళు ఎలా వున్నాయో పోల్చి చూడవచ్చు.

ఒకే దేశంలో, లేదా ఒక ప్రాంతంలో వేరు వేరు కాలాల్లో, కౌళ్ళు ఎలా వున్నాయో పోల్చి చూడవచ్చు.

## భూమి ధర:

శ్రమతో తయారైన వస్తువులకే విలువ వుండడం - విలువ సూత్రం.

భూమి, 'శ్రమ'తో తయారైన వస్తువు కాదు. అది ప్రకృతి సహజ పదార్థం. కాబట్టి, భూమికి విలువా, ధరా ఏమీ వుండకూడదు. కానీ, 'దోపిడీ విధానం'లో, భూమిని 'స్వంత ఆస్తి'గా ఆక్రమించే హక్కుతో పాటే, భూమిని 'కౌలు'కి ఇచ్చే హక్కూ, భూమి మీద 'వార సత్వపు' హక్కూ, భూమిని అమ్మే కొనే హక్కూ - వగైరా హక్కులన్నీ ఏర్పడ్డాయి.

భూమికి 'ధర'ని ఏర్పర్చడంలో - అమలులో వున్న సగటు కౌలూ, వడ్డీ రేటూ ప్రధాన అంశాలుగా వుంటాయి. అమలులో వున్న సగటు కౌలు (ఆ రకం భూముల్లో) ఎకరానికి, సంవత్సరానికి, 200 అను కుందాం. అమలులో వున్న వడ్డీ రేటు, సంవత్సరానికి 10% అను కుందాం. భూమి ధర ఎంత ఉండవచ్చు?

భూస్వామికి, తన భూమి నించి, సంవత్సరానికి 200 ఆదాయం (కౌలు) వస్తుంది కదా? ఆ భూమిని అమ్మి, ఆ డబ్బుని వడ్డీకి ఇస్తే, ఆ డబ్బు ద్వారా కూడా ఏటా 200 ఆదాయం (వడ్డీ) రావాలి. అంటే, ఆ భూమి ధర, 200 వడ్డీని ఇచ్చేదిగా వుండాలి.

10 వడ్డీ రావాలంటే - 100 డబ్బు వుండాలి.

200 వడ్డీ రావాలంటే - ——× 200 = 2,000.

ఇదే భూమి ధర.

1 ఎకరాన్ని, 2 వేలకి అమ్మి, ఆ డబ్బుని 10% రేటుతో వడ్డీకి పడేస్తే, సంవత్సరానికి 200 ఆదాయం వస్తుంది. ఆ భూమి ద్వారా 200 కౌలు వచ్చినా, దాన్ని అమ్మిన డబ్బు ద్వారా 200 వడ్డీ వచ్చినా, రెండూ ఒకటే. కాబట్టి, ఈ ఉదాహరణలో, 1 ఎకరానికి 2 వేల ధర ఏర్పడుతుంది. ఇలా ఏర్పడే ధర మీద 'సప్లై డిమాండ్లు' పని చేస్తాయి. అప్పుడు, ఆ ధర కొంత ఇటో, అటో మారవచ్చు.

సప్లై డిమాండ్లని పట్టించుకోకుండా చూస్తే, పెట్టుబడీకరణ చెందిన కౌలే - భూమి ధర. అంటే, కౌలు ద్వారా వచ్చే ఆదాయాన్ని (200ని), ఎంత పెట్టుబడిని వడ్డీకి ఇవ్వడం ద్వారా సంపాదించడం సాధ్యమో, అంత పెట్టుబడే (2 వేలు) - భూమి ధర.

### మార్క్సు మాటల్లో:

"**భూ**మి కౌలు - అనేది, మన 'గ్రహం' (ప్లానెట్)లో కొంత ముక్కని అద్దెకి ఇవ్వడం ద్వారా, ప్రతీ ఏటా భూస్వామి పొందే డబ్బు రూపాన్ని ధరిస్తుంది. ప్రతీ కొంత డబ్బు మొత్తాన్నీ 'పెట్టుబడిగా' మార్చవచ్చునని చూశాం; అంటే 'ఊహాత్మకమైన పెట్టుబడి' మీద వడ్డీగా భావించి నట్టయితే, ఉదా: సగటు వడ్డీ రేటు 5% అను కుంటే, ఏడాదికి వచ్చే 200 పౌండ్ల భూమి కౌలుని, 4 వేల పౌండ్ల పెట్టుబడి మీద వచ్చే వడ్డీగా భావించ వచ్చును. అలా ఊహాత్మక పెట్టుబడిగా మారిన భూమి కౌలే 'భూమి ధర'గా, లేదా 'విలువ'గా వుంటుంది. కానీ, ఈ 'భూమి ధర' అనేది, 'శ్రమ ధర'లాగే, హేతు విరుద్ధమైనది (ఇర్రేషనల్). ఎందుకంటే, భూమి అనేది, 'శ్రమ'తో తయారైన ఉత్పత్తి కాదు. కనక, దానికి 'విలువ' వుండదు. ఈ హేతు విరుద్ధ రూపం వెనక, 'ఉత్పత్తి విధానం' లోని నిజమైన సంబంధం మరుగున పడుతుంది."

[కాపిటల్ - 3, పేజీ 622-23, మాస్కో]

'భూమి ధర - శ్రమ ధర లాగే హేతు విరుద్ధమైనది' - అనడంలో మార్క్సు అర్థం, 'శ్రమ - ధర కూడా హేతు విరుద్ధమైనది' అని! 'శ్రమ ధర' అంటే 'జీతం'. ఒక మనిషి 8 గంటలు శ్రమ చేస్తే, దానికి బదులుగా రావలసింది, మళ్ళీ 8 గంటల శ్రమే కదా? 'కొంత శ్రమ'కి ప్రతిఫలం మళ్ళీ 'అంత శ్రమే' కదా? ఎంత శ్రమకి, అంత శ్రమే సమానం అవుతుంది. కానీ,

'శ్రమ ధర' పేరుతో ఇచ్చే జీతం, శ్రామికుడు ఇచ్చిన శ్రమతో సమానంగా గాక, ఆ శ్రమ కన్నా తక్కువగా వుంటుంది. అంటే, 'ఎక్కువ శ్రమ'కి ధరగా 'తక్కువ శ్రమ' వుంటుంది. అందుకే 'శ్రమ ధర' అనే మాట అర్థ రహితం. హేతు విరుద్ధం. అలాగే, 'కౌలు' కూడా, - "ఇవ్వకుండా, తీసుకోవడం" (ఈ మాటలు మార్క్సు అనడం గతంలో చూశాం) అనే పద్ధతిలో హేతు విరుద్ధం. అలాగే, భూమికి 'విలువ' వుండడం కూడా హేతు విరుద్ధం.

ఇంకా సాగు చెయ్యని భూమికి కౌలే వుండదు. అయినప్పటికీ, సాగులో వున్న భూముల ధరల్ని బట్టే, సాగులో లేని భూమి ధర కూడా నిర్ణయమవుతుంది. అయితే, 'ముడి భూమి'ని, సాగు భూమిగా తయారు చెయ్యడానికి కొంత శ్రమ ఖర్చయి వుంటుంది కాబట్టి, సాగులో వున్న భూమి ధర కన్నా, ముడి భూమి ధర కొంత తక్కువ గానే వుంటుంది.

ముడి భూమిని, సాగుకి సిద్ధం చెయ్యడానికి కొంత శ్రమ ఖర్చవుతుంది కాబట్టి, సాగు భూమికి ధర చెల్లించడం హేతుబద్ధం గానే, పైకి కనపడుతుంది. కానీ, ఇక్కడ 2 విషయాలు వున్నాయి.

(1) ఒక ముడి భూమి నిండా చెట్లూ చేమలూ, రాళ్ళూ రప్పలూ, గోతులూ గొప్పలూ వున్నాయి అనుకుందాం. ఆ భూమిని సాగుకి సిద్ధం చెయ్యడానికి కొందరు మనుషులు కొన్నాళ్ళ పాటు శ్రమ చేశారనుకుందాం. ఆ పనిలో ఖర్చయిన మొత్తం విలువ (అదనపు విలువతో కూడా కలిపి) 100 రూపాయలు అనుకుందాం. ఆ విలువ మాత్రమే ఆ భూమి కోసం చెల్లించవచ్చు. కానీ, భూమి ధర, అలా వుండదు. భూమిని, సాగు కోసం తయారు చెయ్యడానికి ఎంత ఖర్చవుతుందో, ఆ ఖర్చుని బట్టి మాత్రమే ఆ ధర వుండదు. భూమి ధర 'పెట్టుబడీకరణ చెందే కౌలుని బట్టి' వుంటుంది. అంటే, ఆ భూమి కోసం ఖర్చు అవని దాన్ని కూడా, ఆ భూమి కోసం చెల్లించవలసి వుంటుంది.

(2) ఏదైనా ఒక 'వస్తువు'ని కొంత ధర చెల్లించి కొని, దాన్ని వాడుతూ వుంటే, కొంత కాలానికి ఆ వస్తువు పూర్తిగా పాడయి పోతుంది. కానీ, భూమి విషయంలో అలా జరగదు. భూమికి నాశనం వుండదు. (ఎన్నో కోట్ల సంవత్సరాలకు భూగోళమే నాశనమై పోతే తప్ప.) ఒక వ్యక్తి ఒక్కసారి కొంత ధర చెల్లించి భూమిని కొంటే, ఆ ధరకి తగిన పంటని వెనక్కి తీసుకున్నాక కూడా, ఆ వ్యక్తికి ఆ భూమి మీద హక్కు పోదు. ఒక్క సారి ధర చెల్లించినందుకు, ఇక తర తరాలకూ ఆ భూమి మీద 'యాజమాన్యం' హక్కు ఏర్పడుతుంది. ఇది 'శ్రమ'తో ఏ మాత్రమూ సంబంధం లేని విషయం. కాబట్టి, భూమి మీద స్వయంగా శ్రమ చేసుకోవడానికి మాత్రమే హక్కు వుండాలి. శ్రమతో సంబంధం లేకుండా, కేవలం 'యజమాని తనం'తో, భూమిని 'స్వంత ఆస్తి'గా ఆక్రమించడం ఏ రకం గానూ హేతు బద్ధమైన విషయం అవదు.

'ఆస్తిని సంపాదించే వర్గం' దృష్టిలో, డబ్బు - ఆస్తి కన్నా భూమి ఆస్తి - 'భద్రమైన ఆస్తి'. శాశ్వితమైన ఆస్తి. నిజమైన ఆస్తి (రియల్ ఎస్టేట్). 'డబ్బు' కైతే విలువ తగ్గిపోయే ప్రమాదం వుంది. భూమికి ఆ ప్రమాదం లేదు. కాబట్టి, 'ఆస్తి'ని కూడబెట్టే వర్గం, తప్పని సరిగా భూమి ఆస్తిని కూడబెట్టడానికి పోటీలు పడుతూ వుంటుంది.

ప్రతీ 'సరుకు' తోటీ 'వ్యాపారం' వున్నట్టే, సరుకుగా మారిన భూమితో కూడా నిరంతరం వ్యాపారమూ, స్పెక్యులేషనూ, అన్నీ వుంటాయి.

ఒక మనిషి, 2 వేలు పెట్టి 1 ఎకరం భూమి కొని కౌలుకి ఇచ్చాడనుకుందాం. ఆ భూమిని కొనడానికి, ఆ మనిషి, 2 వేలు ఖర్చు పెట్టాడు కాబట్టి, ఆ భూమి మీద వచ్చే 'కౌలు'ని తినడానికి ఆ మనిషికి న్యాయంగానే హక్కు ఏర్పడినట్టు కన్పిస్తుంది. 'ఆస్తి హక్కు పునాది' మీద నిలబడి చూస్తే, అది 'న్యాయమైన' హక్కే. కానీ, అసలు ప్రశ్న - ఆ 'పునాది' గురించే! ఆ 'పునాదే' అన్యాయమైనది. 'కౌలు' పేరుతో తీసుకునే ప్రతీ ధాన్యం గింజా, ప్రతీ పైసా - ఇతరుల శ్రమే.

అయితే, భూమిని కొన్న మనిషికి, ఆ భూమిని కొనడానికి ఖర్చు పెట్టిన డబ్బు ఏ మార్గంలో వచ్చిందీ - అనే దాన్ని బట్టి, 'కౌలు'ని పొందడానికి వుండే హక్కులో న్యాయం కొంత మారుతుంది.

ఒక భూస్వామి, (భూస్వామి కుటుంబం), స్వయంగా శ్రమ చేసే వారి చేతిలో వున్న భూమిని దౌర్జన్యంతో స్వాధీనం చేసుకుని (ఆ పని ఎలా జరిగిందనేది ఇక్కడ అనవసరం), దాన్ని 'కౌలు'కి ఇచ్చాడనుకుందాం. ఈ ఉదాహరణలో, భూస్వామికి ఒక్క

పైసా కౌలు పొందడానికి కూడా న్యాయమైన హక్కు వుండదు.

లేదా, ఒక వ్యక్తి, 'లాభాల' ద్వారానో, వడ్డీల ద్వారానో వచ్చే ఆదాయంలో నించి కొంత డబ్బుతో భూమిని కొన్నాడనుకుందాం. 'డబ్బు' అంటే శ్రమ. ఆ శ్రమ, ఆ వ్యక్తి స్వంత శ్రమ కాదు. కార్మికుల నించి దోచిన డబ్బుతో భూమిని కొన్నాడన్న మాట. కాబట్టి, ఆ రకంగా భూమిని కొన్న వ్యక్తికి, ఆ భూమి ద్వారా ఒక్క పైసా 'కౌలు'ని పొందడానికి కూడా న్యాయమైన హక్కు వుండదు.

ఒక కార్మిక కుటుంబం, తమ శ్రమల ద్వారా సంపాదించిన జీతాలలో నించి కొంత డబ్బుని మిగిల్చి, 2 వేలతో కొంత భూమిని కొన్నది. దాన్ని, సంవత్సరానికి 200 చొప్పున కౌలుకి ఇచ్చారు. ఆ భూమిని కొన్న డబ్బుని ఆ కుటుంబం, స్వంత శ్రమతో సంపాదించింది. అంటే, ఆ కుటుంబం, 2 వేల విలువ చేసే స్వంత శ్రమని ఇచ్చి భూమిని కొన్నది కాబట్టి, ఆ కుటుంబానికి, ఆ శ్రమని వెనక్కి తీసుకోవడానికి హక్కు వుంటుంది. అంటే, ఆ భూమి ద్వారా 2 వేల డబ్బు తిరిగి వచ్చే దాకా కౌలుని తీసుకునే హక్కు వుంటుంది. ఆ కుటుంబం ఆ భూమి మీద 10 సంవత్సరాల వరకూ కౌలు తీసుకోవచ్చు. అప్పటికి, ఆ కుటుంబం పెట్టిన శ్రమ, ఆ కుటుంబానికి, తిరిగి వచ్చేస్తుంది. ఆ పైన ఆ కుటుంబానికి, కౌలుని తీసుకునే హక్కు వుండదు. ఆ క్షణం నించీ ఆ భూమి, 'కౌలు - రైతు కుటుంబానికి' చెందవలసిందే. ఎందుకంటే, అప్పటికి ఆ రైతు కుటుంబం, ఆ భూమి ధరనంతా చెల్లించేసింది కాబట్టి. ఆ రైతు కుటుంబం, ఎప్పటి లాగే ఆ భూమిని స్వయంగా సాగుచేస్తూ వుంటే, ఆ భూమి ఎంత కాలమైనా ఆ రైతు కుటుంబానికి చెంది వుండవచ్చు. ఎవరికీ కౌలు చెల్లించనక్కర లేదు.

కానీ, 'ఆస్తి హక్కు పునాది' మీద ఈ న్యాయాలేవీ వర్తించవు. భూమిని ఒక సారి ఆక్రమించుకున్న తర్వాత, లేదా ఒక సారి కొనుక్కున్న తర్వాత, దాని మీద హక్కు, కొంత కాలానికి ఆగిపోదు. కౌలుని పొందే హక్కు ఎంత కాలమైనా నడుస్తూనే వుంటుంది. అది 'వారసత్వపు హక్కు'గా కూడా సంక్రమిస్తుంది. అంటే, భూమి నించి కౌలుని తినే హక్కు భూస్వామి కుటుంబంలో ఒక తరం నించి ఇంకో తరానికి అందుతూనే వుంటుంది.

**మార్క్స్ మాటల్లో:**

"సమాజపు ఉన్నత ఆర్థిక రూపం - అనే కోణం నించి చూస్తే, 'భూగోళం' మీద విడి విడి వ్యక్తులు స్వంత యాజమాన్యం (ప్రైవేట్ ఓనర్ షిప్) కలిగి వుండడం, ఎంత హేతు విరుద్ధం అంటే, ఒక మనిషిని ఇంకో మనిషి 'స్వంత ఆస్తిగా' కలిగి వుండడం ఎంత హేతు విరుద్ధమో అంత! మొత్తం సమాజం గానీ, ఒక దేశం గానీ, అన్ని సమాజాలూ కలిసి గానీ, భూగోళానికి యజమానులు కారు. వారు, దానిని కేవలం తమతో 'కలిగి వున్నటువంటి వారు' మాత్రమే. కేవలం దానిని 'ఉపయోగించే వారు' మాత్రమే. మంచి ఇంటి పెద్దలు, ఎలాగైతే భూమిని మెరుగైన స్థితిలో వుంచుతూ తమ తర్వాత తరానికి అందిస్తారో, అలాగే, దానిని ప్రతీ తరం, తర్వాత తరాలకు అందించాలి". [కాపిటల్ - 3, పేజీ 776, మాస్కో, 1971]

"మంచి ఇంటి పెద్దలు" భూమిని తర్వాత తరానికి 'వారసత్వపు హక్కు'గా అందిస్తారు. అది, కుటుంబ వ్యవహారం. కానీ ఇక్కడ, భూమిని అందించవలసింది 'సామాజిక బాధ్యత'తో! భూమి మీదకి మొదట వచ్చిన తరం, దాన్ని ఉపయోగించుకుంటూ దాన్ని జాగ్రత్తగా వుంచాలి. 'భూమి' ఎప్పుడూ వుంటుంది. మనుషుల తరాలు మాత్రం వెళ్ళి పోతూ వుంటాయి! ఏ తరమూ భూమికి 'యజమానులు' కారు. వారు దాన్ని 'ఉపయోగించుకునే వారు' మాత్రమే. భూమిని 'స్వంత ఆస్తి'గా వారసత్వపు హక్కుతో ఆక్రమించడం, దోపిడీ విధానం నించే పుట్టుకొచ్చింది.

భూమిని 'వారసత్వం' ద్వారా పొందిన వ్యక్తి కి, 'కౌలు' అనేది భూమే ఇచ్చే ఆదాయంగా కన్పిస్తే, భూమిని కొంత డబ్బుతో కొన్న వ్యక్తికి 'కౌలు' అనేది, తను ఖర్చు పెట్టిన డబ్బు మీద 'వడ్డీ'గా కన్పిస్తుంది. - రెండూ తప్పే. 'కౌలు'ని భూమీ ఇవ్వదు, భూమిని కొన్న డబ్బూ ఇవ్వదు. 'కౌలు'ని ఇచ్చేది - భూమిని సాగుచేసే 'శ్రమే'! ఆ 'శ్రమ'లో నించి దోచుకోగలిగే భాగంలో ఒక ముక్కే కౌలు.

'భూమిని, విడి విడి వ్యక్తులు స్వంత ఆస్తిగా కలిగి వుండడం ఎంత హేతు విరుద్ధం అంటే, ఒక మనిషిని ఇంకో మనిషి తన స్వంత ఆస్తిగా కలిగి వుండడం ఎంత హేతు విరుద్ధమో అంత!' అంటున్నాడు కదా

మార్క్స్? 'భూమి ధర' గురించి చూసే ఈ సందర్భంలోనే, 'బానిస ధర' గురించి కూడా ఒక సారి చూద్దాం.

**బానిస ధర:**

ఒక బానిస యజమాని, ఒక బానిసని, 100 డబ్బుతో కొన్నాడనుకుందాం. (యజమాని, ఆ డబ్బుని, అంతకు ముందు వడ్డీల ద్వారానో, అదనపు ఉత్పత్తిని అమ్మడాల ద్వారానో, సంపాదించాడను కుందాం.) యజమాని, ఆ బానిసని, తన వ్యవసాయం పనుల్లో పెట్టాడు. బానిస శ్రమ ద్వారా ధాన్యం పండు తుంది. బానిస చేసే శ్రమలో, అతని తక్షణావసరాల కోసం కొంత భాగం పోగా, మిగిలినది బానిస ఇచ్చే అదనపు శ్రమ. లేదా, అదనపు ఉత్పత్తి. దాన్ని అమ్మితే అదే అదనపు విలువ. ఆ బానిస ద్వారా, యజమానికి, ఏటా 50 విలువ గల అదనపు ఉత్పత్తి వస్తుంది అనుకుందాం. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే - యజమాని, బానిసని కొనడానికి పెట్టిన 100 డబ్బుల్ని, ఉత్పత్తి క్రమంలోని ఏ అంశం మీద పెట్టినట్టు అర్థం? 'ఉత్పత్తి సాధనాల' మీదా? 'జీతాల' మీదా? (C మీదా, V మీదా?') ఆ 100 డబ్బు, యజమానికి తిరిగి వస్తుందా? ఏ విధంగా?

**జవాబు:** బానిసని కొనడానికి పెట్టిన డబ్బు, ఉత్పత్తి క్రమంలోని ఏ అంశం కిందకీ రాదు. బానిస, 'ఉత్పత్తి సాధనాల' లోకి రాడు కాబట్టి, ఆ డబ్బు, C లో ఒక అంశం మీద పెట్టినట్టు అవదు. వ్యవ సాయం పనులు జరగడానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలన్నిటినీ యజమాని వేరు గానే కొనాలి. ఉదా: పొలం దున్నే ఎద్దుల కోసం, యజమాని, కొంత డబ్బు పెట్టినట్టయితే, ఆ ఖర్చు, C లోని ఫిక్స్‌డ్ సాధనాల కోసం పెట్టినట్టు అవుతుంది. ఎద్దుల పోషణ ఖర్చులంతా కూడా C లోకే వస్తుంది. కానీ బానిసని కొన్న ఖర్చు అలా C లోకి రాదు.

అంతే కాదు, బానిసని కొన్న ఖర్చు, V లోకి కూడా రాదు. బానిస చేసే శ్రమలో, అతని పోషణ అంతా కలిసి V. అది బానిసదే. బానిసని కొనడానికి పెట్టిన 100 డబ్బుకీ, ఈ V కీ, సంబంధం లేదు.

బానిస ఇచ్చే S ని, ఏడాదికి, 50 అనుకున్నాం. దీన్ని యజమాని తీసుకుంటూ వుంటాడు. బానిసని కొన్న 100 డబ్బుకీ, బానిస ఏటా ఇచ్చే 50 S కీ, ఏమీ సంబంధం లేదు. అవి, పూర్తిగా వేరు వేరు విషయాలు.

ఒక వేళ, యజమాని దీన్నంతా ఇలా అర్థం చేసు కుంటాడనుకుందాం: "నేను బానిసని కొనడానికి 100 డబ్బు పెట్టాను. బానిస ద్వారా నాకు ఏటా 50 మిగులుతోంది. బానిస కోసం పెట్టిన నా డబ్బుని నేను 2 సంవత్సరాల్లో వెనక్కి తీసుకుంటాను". యజమాని ఇలా అనుకున్నట్టయితే, ఈ లెక్క పూర్తిగా తప్పు. ఎందుకంటే, యజమానికి, బానిస ద్వారా ఏటా 50 చొప్పున, ఎన్ని సంవత్సరాల పాటు వచ్చినా, దాని వల్ల, బానిసని కొన్న డబ్బు వెనక్కి వచ్చినట్టు అర్థం కాదు. బానిసని కొనడానికి పెట్టిన 100 డబ్బు, ఎలా వెనక్కి వస్తుందంటే, బానిసని మళ్ళీ అమ్మడం ద్వారానే. బానిస ఒక ఆస్తి. ఆ ఆస్తిని అమ్మినప్పుడే, ఆ డబ్బు వెనక్కి వస్తుంది. భూమి ఆస్తి లాగే ఇది కూడా.

'భూమి ఆస్తి' అన్నప్పుడు, ఏ శ్రమా జరగని ముడి భూమినే దృష్టిలో పెట్టుకోవాలి. అలాంటి భూమి కోసం కొంత డబ్బు చెల్లిస్తే, అది, C +V లలో దేని కిందకీ రాదు.

ఒక భూమి మీద 10 శ్రమ జరిగి వుంటే ఆ భూమి విలువ ఆ 10 మాత్రమే. కానీ, ఆ భూమిని 200తో కొని వుంటే, అందులో 190 విలువ C + V లలో దేనికిందకీ రాదు.

బానిసని కొనడానికి పెట్టిన విలువ, భూమి ఆస్తిలో కొన్ని ప్రత్యేక సందర్భాలకు వర్తించినట్టుగా కూడా వర్తించదు.

## 'ఇంటి అద్దె'లో భూమి అద్దె:

ఇల్లు - ఒక వస్తువు. ఆ వస్తువు, 'భూమి' మీదే వుంటుంది. ఆ భూమికి 'కౌలు' వుంటుంది. కాబట్టి, ఇంటి అద్దెలో కొంత భాగం, 'భూమి అద్దె'గా వుంటుంది. ఇంటి అద్దెని తినే వాళ్ళు, భూమి అద్దెని కూడా తింటున్నారని అర్థం. ఇళ్ళని అద్దెకి ఇచ్చే - అద్దెకి తీసుకునే విధానం, 'స్వంత ఆస్తి' విధానంలో భాగమే.

కార్మికుల్లో కొందరు, పట్టణాల్లో పనులు చేసు కుంటూ, గ్రామాల్లో తమకు వున్న చారడేసి భూముల్ని కౌళ్ళకి ఇచ్చుకుంటూ వుండవచ్చు. అలాగే కార్మికుల్లో కొందరు, తమ ఇళ్ళని కూడా అద్దెలకు ఇచ్చుకుంటూ వుండవచ్చు. ఈ రకంగా, కార్మికుల్లో కూడా కొందరు కొంత 'కౌలు'ని తింటూ వుండవచ్చు.

కానీ, 'సమాజంలో వుండే కౌళ్ళ మొత్తాన్ని' తీసు కుంటే, అందులో కార్మికులకు అందే భాగం ఏమీ లేని దానితో సమానం. అది లెక్కలోదే కాదు. కౌళ్ళని తినేదంతా - భూస్వాములే.

# ఎవరి శ్రమ ఫలితం వారిదే; కానీ ....

A, B అనే 2 స్వతంత్ర రైతు కుటుంబాలు వున్నాయి. వారికి ఒకే వైశాల్యం గల భూములు వున్నాయి. A కుటుంబం భూమి చాలా సారవంతం. చాలా అనుకూలమైన ప్రదేశం. B కుటుంబం భూమి, మహా సారహీనం. వరదలూ వాగులూ అన్నీ దానికే. 2 కుటుంబాల వారూ శ్రమ జీవులే. B భూమిలో పంట ఆ కుటుంబానికి అతి కనాకష్టంగా సరిపోతుంది. Bలో కన్నా, A భూమికి ప్రకృతి ఇచ్చిన ప్రత్యేకత, ఆ ఒక్క కుటుంబానికే దొరుకుతోంది. ఇది 'స్వంత ఆస్తి' విధానానికి అనుగుణంగా వున్న సంకుచితత్వం. దీనికి సరైన పరిష్కారం ఎలా మాత్రమే వుండగలదంటే - 2 భూముల్నీ, 2 కుటుంబాలూ కలిసి సాగు చేసుకుని, పంటని కలిసి తీసుకుంటే, ప్రకృతి వల్ల ఏర్పడ్డ మంచి చెడ్డలు, 2 కుటుంబాలకూ సమానంగా అందుతాయి. కానీ, 'స్వంత ఆస్తి' విధానంలో అది ఊహాతీతం!

# 'కౌలు'ని తీసివేస్తే?

'పెట్టుబడిదారీ విధానం'లో మిగిలిన విషయాలన్నీ అలాగే వుండగా 'కౌలు'ని తీసివేస్తే ('కౌలు'ని చెల్లించకుండా భూమిని వాడుకునే హక్కు పెట్టుబడిదారులకు వుంటే), ఏమవుతుంది? - ఏమీ అవదు. 'కౌలు' పేరుతో భూస్వాములు తినేదంతా అప్పుడు పెట్టుబడి దారులకే మిగులుతుంది. అప్పుడు, కౌలు పేరు కూడా 'లాభమే' అవుతుంది. అప్పుడు భూస్వాములు కూడా పెట్టుబడిదారులుగా మారతారు. కార్మికులు ఎప్పటి లాగే కార్మికులు గానే వుంటారు.

అయినా, కౌలుని చెల్లించకుండా భూమిని వాడుకునే హక్కు - అనేదే వుంటే, అది పెట్టుబడి దారులకే కాదు, కార్మికులకు కూడా వుంటుంది. కౌలుని చెల్లించకుండానే భూమి దొరికితే, వ్యవసాయ కార్మికులు, పెట్టుబడిదారుల దగ్గిర ఎందుకు పని చేస్తారు? స్వతంత్ర రైతులు గానే వుంటారు. అప్పుడు, భూస్వాములూ, పెట్టుబడిదారీ రైతులూ కూడా స్వయంగా శ్రమ చేసుకోవలసి వస్తుంది.

స్వంత ఆస్తి హక్కు పునాది ఎప్పటి లాగే వుండగా, కౌలు హక్కుని తీసివెయ్యడం - సూర్య గమనాన్ని ఆపడమంత అసాధ్యం. 'స్వంత ఆస్తి'కి అసలైన పునాది - భూమి హక్కే.

ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా కూడా 'ఎవ్వరూ ఆక్రమించని భూమి' అనేది లేదు. ఇప్పుడు భూమి అంతా 'వ్యక్తుల' ఆధీనం లోనూ, 'ప్రభుత్వాల' ఆధీనం లోనూ, స్వంత ఆస్తి సూత్రాల మీద ఆధార పడి వున్నదే.

**భూమిలో ప్రతీ ముక్క మీదా యాజమాన్యం, కొందరు వ్యక్తులకు గానీ, ప్రభుత్వాలకు గానీ వున్న దంటే, 'భూగోళం' అంతా 'కొందరి' ఆధీనంలో వుందన్న మాట! 'భూగోళానికి' - అంటే, దాని నేలా, కొండలూ, కోనలూ, నదులూ, జలపాతాలూ, సముద్రాలూ అన్నీ కలిసిన భూగోళానికి - కొందరు మనుషులు 'యజమానులు' అన్న మాట! భూగోళం, కొందరి 'స్వంత ఆస్తి' అన్నమాట! "ఈ నది నాది. ఈ పర్వతం నాది. ఈ సముద్రం నాది" అంటారన్న మాట ఆ యజమానులు! ఎంత విచిత్రమైన విషయం ఇది! ఈ వింత, దోపిడీ - ప్రపంచంలో తప్ప ఇంకెక్కడ ఉండగలుగుతుంది?**

# 'వ్యవసాయ' శ్రమా, 'పారిశ్రామిక' శ్రమా!

భూమిలో పంటలు పండించడమూ, అడవి ఉత్పత్తుల్ని సేకరించడమూ, వేటా, పశువుల పెంపకమూ, కోళ్ళ పెంపకమూ, చేపల పెంపకమూ, అడవుల పెంపకమూ - వంటి శ్రమలన్నీ 'వ్యవసాయ శ్రమలు'గా వుంటాయి. అంటే, ప్రాథమికమైన ముడి పదార్థాల్ని ఇచ్చే శ్రమలన్నీ.

వ్యవసాయ శ్రమలు కానివన్నీ 'పారిశ్రామిక' శ్రమలు.

వ్యవసాయ రంగంలో ప్రతి శాఖా, 'విత్తనాల' రూపంలో, తన ముడి పదార్థాన్ని తనే ఇచ్చు కుంటుంది. అంతే గాక, వ్యవసాయ రంగంలో కొన్ని శాఖలు, పారిశ్రామిక రంగంలో కొన్ని శాఖలకు 'ముడి

పదార్థాల్ని' ఇస్తాయి. మిగిలిన వ్యవసాయ శాఖలు, తక్షణం వాడుకోవడానికి వీలైన ఉత్పత్తులు ఇస్తాయి. (ఉదా: పళ్ళ తోటలు)

పారిశ్రామిక రంగంలో కొన్ని శాఖలు - వ్యవసాయ రంగానికీ, పారిశ్రామిక రంగానికీ కావలసిన 'శ్రమ పరికరాల్నీ, ఆగ్జిలరీ పదార్థాల్నీ' ఇస్తాయి. మిగిలిన శాఖలు, తక్షణం వాడుకోవడానికి వీలైన ఉత్పత్తులు ఇస్తాయి.

విషయం క్లుప్తంగా చూస్తే - వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగానికి 'ముడి పదార్థాల్ని' ఇస్తే; పారిశ్రామిక రంగం, వ్యవసాయ రంగానికి, 'శ్రమ పరికరాల్ని' ఇస్తుంది.

నేతా, కుట్టూ, వడ్రంగమూ - లాంటి పారిశ్రామిక శాఖలు, ఒకప్పుడు, 'చేతి పనుల' పేరుతో వ్యవసాయ శ్రమలతో కలిసి పోయి, ఒకే కుటుంబంలో గానీ, ఒకే గ్రామంలో గానీ, సన్నిహితంగా వుండేవి. పెట్టుబడిదారీ విధానం వల్ల, క్రమంగా చేతి పనులు, 'పరిశ్రమల' పేరుతో వ్యవసాయ శ్రమల నించి, కుటుంబ సంబంధాలూ - గ్రామ సంబంధాలూ లేకుండా విడిపోయాయి.

గతంలో నైనా ఈ నాడైనా ఒక శ్రామిక కుటుంబం వాడే ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే కాదు, పారిశ్రామిక ఉత్పత్తులు కూడా.

వ్యవసాయ రంగంలో ఉత్పత్తులన్నిటినీ కలిపి, 'ధాన్యం'గా అనుకుంటే, ఈ రంగంలో జరిగే అవసర శ్రమా, అదనపు శ్రమా కలిసి, సమాజం మొత్తానికి ధాన్యాన్ని (ఆహార పదార్థాల్ని) ఇస్తూ వుంటుంది.

అలాగే, పారిశ్రామిక రంగంలో ఉత్పత్తులన్నిటినీ కలిపి 'బట్ట'గా అనుకుంటే, ఈ రంగంలో జరిగే అవసర శ్రమా - అదనపు శ్రమా కలిసి సమాజం మొత్తానికి 'బట్ట'ని (ఆహార పదార్థాలు కాని ఇతర ఉత్పత్తులన్నిటినీ) ఇస్తూ వుంటుంది.

రెండు రంగాల లోనూ వున్న మొత్తం 'కార్మిక వర్గాన్ని' తీసుకుంటే, ఆ వర్గం ఉపయోగించే 'అవసర శ్రమ' అనేది, 'వ్యవసాయ శ్రమ' మాత్రమే కాదు. 'పారిశ్రామిక శ్రమ' కూడా.

కానీ, పెట్టుబడిదారీ విధానం తర్వాత, కార్మిక వర్గంలో ఒక భాగం - కేవలం వ్యవసాయ శ్రమలే, ఇంకో భాగం - కేవలం పారిశ్రామిక శ్రమలే చేసే విధంగా 'శ్రమ విభజన' ఏర్పడింది - (అసలు ఏ శ్రమా చెయ్యని వర్గం ఒకటి మొదటి నించీ వుండగా).

చిన్న స్థాయి వ్యవసాయమూ, దానికి అనుబంధంగా వుండే గృహ పరిశ్రమా కలిసి వున్నప్పుడు, ఆ ఉత్పత్తి విధానం, 'స్వయం పోషకం'గా వుంటుంది. భారీ పరిశ్రమ, గృహ పరిశ్రమల్ని నాశనం చేసినప్పుడు, ఇక చిన్న స్థాయి వ్యవసాయం నిలబడదు.

పారిశ్రామిక - సరుకు అయినా, వ్యవసాయ - సరుకు అయినా - స్థిరా, అస్థిరా, అదనపు విలువా (C + V + S) అనే 3 భాగాలుగా వుండవలసిందే. అయితే, 'పారిశ్రామిక' సరుకు విషయంలో, 'ముడి పదార్థం' బరువు కన్నా, దానితో తయారయ్యే 'కొత్త సరుకు' బరువు తక్కువగా వుంటుంది. ఎందుకంటే, సరుకు తయారవడంలో 'రద్దు' పోతుంది కాబట్టి. (కానీ 'కొత్త సరుకు' విలువ మాత్రం, దాని కోసం ఖర్చయ్యే ముడి పదార్థం విలువ కన్నా ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే ముడి పదార్థం విలువకి, కొత్త శ్రమ చేరుతుంది కాబట్టి.)

కానీ, 'వ్యవసాయ' సరుకు విషయంలో - 'ముడి పదార్థం' బరువు కన్నా దానితో తయారయ్యే కొత్త ఉత్పత్తి - అనేక వందల, వేల రెట్లు ఎక్కువగా వుంటుంది. ఒక్క ధాన్యం గింజతో అనేక వేల గింజలూ గడ్డీ వస్తాయి. ఈ మార్పు, 'ప్రకృతి' ద్వారా జరుగుతుంది. వ్యవసాయ సరుకు విషయంలో, ఉత్పత్తి సైజు గతంలో కన్నా ఎక్కువగా వుండడమే కాదు, 'విలువ' కూడా ఎక్కువ గానే వుంటుంది.

'తక్కువ విలువ'తో (C + Vల విలువతో) 'ఎక్కువ విలువ' రావడానికి (C + V + Sలు రావడానికి), పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు రెండూ కారణమే.

కానీ, తక్కువ ఉత్పత్తులతో (C + V లుగా ఖర్చయ్యే ఉత్పత్తులతో), ఎక్కువ ఉత్పత్తులు (C + V + Sగా వుండే ఉత్పత్తులు) రావడానికి, వ్యవసాయ రంగం మాత్రమే కారణం.

ఏ పారిశ్రామిక శాఖలో నైనా కొత్త యంత్రాల ప్రవేశంతో 'ఉత్పత్తి శక్తి' పెరిగినప్పుడు, స్థిర పెట్టుబడి పెరిగి, అస్థిర పెట్టుబడి తగ్గడం ఎలాగైతే జరుగుతుందో, వ్యవసాయ శాఖల్లో కూడా అలాగే జరుగుతుంది. ఉత్పత్తి శక్తి పెరగక ముందు 1 ఎకరం భూమిలో పని చెయ్యడానికి కావలసినంత మంది కార్మికులు, ఉత్పత్తి శక్తి పెరిగిన తర్వాత అవసరం వుండరు. ఉత్పత్తి శక్తి పెరిగినప్పుడు, దానికి తగ్గట్టుగా

కొత్త భూములు సాగులోకి వస్తూ వుండకపోతే, వ్యవసాయ రంగానికి అవసరమయ్యే కార్మిక జానాభా తగ్గిపోతూ వుంటుంది. అప్పటికే భూమి అంతా సాగులో వున్నదని అనుకుంటే, వ్యవసాయ రంగంలో ఉత్పత్తి శక్తి పెరుగుతూ వున్న కొద్దీ, వ్యవసాయ కార్మిక జనాభాలో కొంత కొంత భాగం పరిశ్రమల లోకి తరలడమో, నిరుద్యోగులుగా మారడమో, తప్పని సరి అవుతూ వుంటుంది.

వ్యవసాయ పెట్టుబడిలో కూడా, 'ఎక్యూము లేషన్' (పెట్టుబడి కూడిక) వుంటుంది. సమాజంలో జనాభా పెరుగుదల వుంటుంది. అంత కన్నా ముఖ్యంగా ఎప్పటికప్పుడు కొత్త రకాల ఉపయోగపు విలువల్ని కనిపెట్టి, వాటిని ఉత్పత్తి చెయ్యడం జరుగుతూ వుంటుంది. ఆ కొత్త శాఖలకు ముడి పదార్థాలు అందించడం కోసం ఎక్కువ భూమిని సాగుచెయ్యడం అవసరమవుతూ వుంటుంది. పెరిగే పెట్టుబడితో కొత్త భూముల్ని సాగులోకి తేవడం సాధ్యమే.

అయితే, పెట్టుబడిదారీ విధానంలో, ఏ శాఖ అభివృద్ధి అయినా 'తగినంత లాభం వస్తుందా లేదా' అనే దాని మీదే ఆధారపడి వుంటుంది. కాబట్టి, సమాజంలో 'నిజమైన అవసరాలు' ఎన్ని వున్నా, మార్కెట్లో డిమాండ్ గనక లేకపోతే, కొత్త భూముల్ని సాగులోకి తెచ్చే పని జరగదు!

ఈ నాటికీ కూడా ప్రపంచంలో సాగులో లేని భూమి చాలా ఎక్కువ గానే వుంది. సాధారణంగా ఆ భూమి ప్రభుత్వాల ఆధీనంలో వుంటుంది. ప్రపంచ మంతా ఒక వేపు - ఆహారం కొరతా, గృహాల కొరతా! ఇంకో వేపు - 'ఖాళీగా పడి వున్న' అపారమైన భూమీ! అయితే, ఆ ఖాళీ భూమినంతా సాగుచేసినా, ఆ ఉత్పత్తి క్రమం కూడా దోపిడీ పద్ధతి మీదే సాగుతుంది కాబట్టి, ఆ కొత్త భూముల సాగు వల్ల కూడా కార్మిక వర్గానికి కొరతలు తీరిపోయేదేమీ వుండదు.

# 'హేతుబద్ధత' గల వ్యవసాయం

పెట్టుబడిదారీ వ్యవసాయం, పెట్టిన పెట్టుబడి కన్నా ఎక్కువని (లాభాన్ని) సంపాదించే లక్ష్యం తోటే సాగుతుంది. ఒక సంవత్సరం, 'పొగాకు'కి ఎక్కువ ధర వుండి, దాని ద్వారా ఎక్కువ లాభం కనపడితే, మరుసటి సంవత్సరంలో పొగాకు పంట ఎక్కువవుతుంది. పత్తి ద్వారా ఎక్కువ లాభం వస్తే పత్తీ, వేరుశనగ ద్వారా ఎక్కువ లాభం వస్తే వేరుశనగా! పంటల రకాల్నీ కోటాల్నీ నిర్ణయించేది 'లాభం రేటే'. అంతేగానీ, నిజ అవసరాలు కాదు. ఇలాంటి విధానంలో, వ్యవసాయ ఉత్పత్తుల కోటాల్ని నిర్ణయించే 'ప్లాను'కి అవకాశమే వుండదు.

"ఒక ఎకరానికి ఇంత కౌలు; కౌలు కాలం ఇన్ని సంవత్సరాలు" అని పెట్టుబడి దారుడు భూస్వామితో ఒప్పందం చేసుకున్న తర్వాత, ఇక పెట్టుబడి దారుడు ఆ భూమిలో ఎక్కువెక్కువ పంటని రాబట్టడానికే ప్రయత్నిస్తాడు. ఎక్కువ పంట పండించడం కోసం జరిగే పెట్టుబడిదారీ సాగు పద్ధతుల్లో, వ్యవసాయానికి 'అనుకూలించే' మార్పులే గాక, హాని కలిగించే మార్పులు కూడా అనేకం వుంటాయి.

భూమిని దున్నడమూ వగైరా పనుల కోసం ప్రత్యేక శ్రమ పరికరాల్ని కనిపెడతారు. భూముల రకాల్ని బట్టి ప్రత్యేక ఎరువుల్ని కనిపెడతారు. మెరుగైన విత్తనాల కోసమూ, క్రిమి కీటకాల్ని చంపే మందుల కోసమూ, నూతన ప్రయోగాలు జరుగుతాయి. వ్యవసాయ శాస్త్రాన్నీ, వృక్ష శాస్త్రాన్నీ, రసాయనిక శాస్త్రాన్నీ, అభివృద్ధి పరుస్తారు. భూముల లోకి నీటి పారుదల ఏర్పాట్లూ, మురుగు నీరు పోయే డ్రైనేజీ ఏర్పాట్లూ, జరుగుతాయి. ఇలాంటి మార్పులతో - పెట్టుబడిదారీ సాగు ద్వారా, ఒక వేపు - హేతు బద్ధత గల సాగుకి మార్గం ప్రారంభమవుతుంది. అయితే, ఈ మార్పులన్నీ లాభమూ, పోటీ, అదనపు లాభమూ - అనే దృష్టి తోటే జరుగుతాయి. భూమిలో కృత్రిమమైన మందులు గుప్పిస్తూ, ఎక్కువ పంటల్ని లాగడానికి ప్రయత్నిస్తారు కాబట్టి, పెట్టుబడిదారీ వ్యవసాయం, ఇంకో వేపు - భూమిని విపరీతంగా అలవగొట్టే, దాని 'సహజత్వాన్ని' నాశనం చేసే, హేతు విరుద్ధ వ్యవ సాయంగా కూడా తయారవుతుంది.

పెట్టుబడిదారీ వ్యవసాయం భూమినే గాక 'శ్రామికుల్ని' విపరీత స్థాయిలో దోచడం ద్వారానూ, వారిని భూమి నించి పూర్తిగా దూరం చెయ్యడం ద్వారానూ, వారిని ఆకలి బాధలకూ, నిరుద్యోగానికీ, జబ్బులకూ గురిచేస్తూ - అత్యధిక సంఖ్యాని సర్వ నాశనం చేస్తుంది. భూమి సహజత్వాన్నీ, 'శ్రమ' సహజత్వాన్నీ పరిగణన లోకి తీసుకోకుండా, కేవలం 'లాభ

దృష్టి'తో సాగే పెట్టుబడిదారీ వ్యవసాయం - సంపూర్ణ మైన హేతుబద్ధత గల వ్యవసాయం కాజాలదు.

**మార్క్సు మాటల్లో:**

"పెట్టుబడిదారీ వ్యవసాయంలో సమస్త పురోగతీ, కార్మికుల్ని దోచే కళ లోనే కాదు, భూమిని దోచే కళలో కూడా పురోగతే. ఒక నిర్ణీత కాలం పాటు భూమి సారాన్ని పెంచే పురోగతి అంతా, ఆ సారానికి శాశ్వత మూలాధారాలైన వాటి నాశనం వేపు దారి తీసే పురోగతే.

ఒక దేశం, అమెరికా వంటి దేశం, తన అభివృద్ధిని ఆధునిక పరిశ్రమ పునాది మీద ఎంత ఎక్కువగా నైతే, ఎంత వేగంగా నైతే ప్రారంభి స్తుందో, ఆ విధ్వంస క్రమం కూడా అంత వేగంగా సాగుతుంది. పెట్టుబడి దారీ విధానం, సమస్త సంపదలకూ మూలాలైన భూమినీ, కార్మికుల్నీ సర్వనాశనం చెయ్యడం ద్వారా మాత్రమే, తన సాంకేతిక పరిజ్ఞానాన్నీ సామాజిక ఉత్పత్తి క్రమాల సమ్మేళనాన్నీ, అభివృద్ధి పరుస్తుంది."

[కాపిటల్ - 1, పేజీ 474 - 75, మాస్కో.]

వ్యక్తిగత కుటుంబ స్థాయిలో జరిగే స్వతంత్ర ఉత్పత్తిదారుల వ్యవసాయం కూడా, హేతుబద్ధ వ్యవ సాయం కాజాలదు. ఎందుకంటే, వ్యవసాయ ఉత్పత్తి క్రమం కుటుంబ స్థాయిలో మాత్రమే జరిగినప్పుడు, వ్యవసాయ రంగానికి తోడ్పడే శాస్త్రీయమైన ప్రయో గాలూ, శ్రమని తగ్గించే పద్ధతులూ, సాధ్యం కావు.

కాబట్టి, భూమితో 'శాస్త్రీయంగా' వ్యవహరించ డానికి సాధ్యం కాని చిన్న స్థాయి వ్యవసాయం కానీ, కేవలం 'లాభ దృష్టి'తో సాగే పెట్టుబడిదారీ వ్యవ సాయం కానీ, హేతుబద్ధ వ్యవసాయాలూ కాలేవు.

"జాన్‌స్టన్ వంటి చాలా సంకుచితులైన వ్యవసాయ రసాయన శాస్త్రజ్ఞులు (వెరీ కన్జర్వేటివ్ అగ్రికల్చరల్ కెమిస్ట్స్) కూడా అంగీకరించిందేమి టంటే - నిజంగా హేతుబద్ధమైన వ్యవసాయం (రియల్లీ రేషనల్ అగ్రికల్చర్), ప్రతీ చోటా, 'స్వంత ఆస్తి విధానం' వల్ల తలెత్తే అధిగ మించలేని అడ్డంకుల్ని ఎదుర్కుంటోంది - అని. .... 'డబ్బు' రూపంలో 'తక్షణ లాభం' దిశగా నడిచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి వుండే మొత్తం స్వభావం, హేతుబద్ధ వ్యవసాయంతో వైరుధ్యంలో వుంటుంది" - మార్క్స్

[కాపిటల్ - 3, పేజీ - 617, మాస్కో.]

వ్యవసాయ రంగానికి అనుకూలించే వృక్ష శాస్త్రం, యంత్ర శాస్త్రం, రసాయనిక శాస్త్రం - వంటి అనేక శాస్త్రాల్ని ఉపయోగించుకుంటూ, లాభ దృష్టితో గాక, 'ఉపయోగపు విలువ దృష్టి'తో నిర్వహించే సమిష్టి వ్యవసాయం మాత్రమే, సంపూర్ణమైన హేతు బద్ధత గల వ్యవసాయంగా అభివృద్ధి చెందగలుగుతుంది.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **చారెడు భూమి అయినా లేని వారు కూడా భూమి మీదే నివసిస్తారు. వారికి ఆ భూమి ఎక్కడిది?**

**జ:** భూమి మీద ఆస్తి హక్కులన్నీ యజమానులవే. భూగోళం అంతా యజమానులదే. చారెడు భూమి అయినా లేని వారు శ్రామికులే కాబట్టి, వారు యజ మానుల భూముల్లో నివసిస్తారు.

2. **ఒక 'వ్యవసాయ శ్రమ' (ఉదా॥ ధాన్యం పంట) కోసం అవసరమయ్యే 'ఉత్పత్తి సాధనాలు' ఏమిటి?**

**జ:** మొదటి ఉత్పత్తి సాధనం భూమి. తర్వాత, నాగళ్ళూ, ఎద్దులూ, పారలూ, పలుగులూ వంటివి.

3. **'భూమి కౌలు' పద్ధతి ప్రారంభమైందంటే, చరిత్రలో ఏం జరిగిందని అర్థం?**

**జ:** అప్పటికే భూమి ఆస్తి వున్న వాళ్ళూ, అది లేని వాళ్ళు తయారయ్యారని అర్థం. అంత కన్నా ముందు, శ్రమ చేసే వాళ్ళూ, చెయ్యని వాళ్ళూ తయారయ్యారని అర్థం.

4. **శ్రామికులు - 10 ఎకరాల్లో అన్ని రకాల శ్రమలూ చేసి పత్తి పండించారు. ఆ పత్తి పంట అంతా ఆ శ్రామికుల శ్రమ ఫలితమేనా?**

**జ:** కాదు. ఉత్పత్తి సాధనాల భాగం, ఆ శ్రామికులది కాదు. ఆ పంటలో నించి, ఆ భాగాన్ని (C ని) తీసి వెయ్యగా మిగిలిన పంట అంతా శ్రామికులదే.

5. **300 బస్తాల ధాన్యంలో ఉత్పత్తి సాధనాల భాగం 20%. శ్రామికుల శ్రమ భాగం ఎన్ని బస్తాలు?**

**జ:** ధాన్యం 300 బస్తాలు. అందులో ఉత్పత్తి సాధనాలు 20%. అంటే, ఆ ధాన్యంలో ఉత్పత్తి సాధనాల భాగం = — × 300 = 60 బస్తాలు. ఆ భాగాన్ని తీసివేస్తే మిగిలిన ధాన్యం 240 బస్తాలు. ఇది అంతా శ్రామికుల శ్రమ.

6. **ఒక వ్యవసాయ భూమిలో నీటి పారుదల ఏర్పాట్లు వున్నాయి. గట్లు వున్నాయి. శ్రమ పరికరాలు పెట్టడానికి ఒక పాక వుంది. వీటన్నిటి కోసమూ కొంత ఖర్చు అయింది. ఈ ఖర్చు 'ఫిక్సెడ్ కాపిటల్' గా వుంటుందా? 'ముడి పదార్థం' గా వుంటుందా?**

**జ:** ముడి పదార్థం కాదు. ఫిక్సెడ్ కాపిటల్ కిందకే వస్తుంది.

7. **విత్తనాలు - ముడి పదార్థమా? ఆగ్జిలరీ పదార్థమా? ఎరువులు - ఏ అంశం? 'పంట'కి అవసరమయ్యే నీరు - ఏ అంశం?**

**జ:** భూమిలో పంటలు పండడం అంటే, అది ప్రకృతి సహజంగా జరిగే చర్య. విత్తనాల్నీ, ఎరువుల్నీ , నీటినీ, ముడి పదార్థాలు అనడానికి వీలు వుండదు. ఇవి ఆగ్జిలరీలూ కావు. ఇక్కడ నాగలీ, ట్రాక్టరూ వంటి 'శ్రమ పరికరాలు' వుంటాయి. వాటి కోసం ఆయిలూ, కందెనా లాంటి వాటిని వాడితే, అవి ఆగ్జిలరీ అవుతాయి. 'ముడి పదార్థం' అనే విభజన, వ్యవసాయ శ్రమలో వర్తించదు.

8. **ఒక భూమి 2 ఎకరాలు. పెట్టుబడి 300. పంట 40 బస్తాలు. ఇంకో భూమి 5 ఎకరాలు. పెట్టుబడి 600. పంట 150 బస్తాలు. ఏ భూమి సారవంతమైనది?**

**జ:** మొదటి భూమికి సంబంధించిన లెక్కల ప్రకారం - 1 ఎకరానికి, 150 పెట్టుబడితో, 20 బస్తాలు. రెండో భూమిలో - 1 ఎకరానికి, 120 పెట్టుబడితో, 30 బస్తాలు. మొదటి భూమిలో పెట్టుబడి ఎక్కువా, పంట తక్కువా. రెండో భూమిలో పెట్టుబడి తక్కువా, పంట ఎక్కువా. కాబట్టి, రెండో భూమే సారవంతమైనది.

9. **పారిశ్రామిక ఉత్పత్తుల విషయంలో, ముడి పదార్థాల బరువు కన్నా, వాటితో తయారైన కొత్త ఉత్పత్తి బరువు తక్కువగా వుంటుంది. వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో, మొదట ఖర్చయిన 'విత్తనాల' వంటి వాటి బరువు కన్నా, కొత్త ఉత్పత్తి బరువు ఎక్కువగా వుంటుంది. ఉదాహరణలు చెప్పండి.**

**జ: పారిశ్రామిక ఉత్పత్తి విషయం:** 'చొక్కా'కి ముడి పదార్థాలు - బట్టా, దారమూ, గుండీలూ వంటివి. వీటితో చొక్కా తయారయ్యే టప్పుడు, ముడి పదార్థాలలో నించి కొంత రద్దు పోయి, వాటి బరువు కన్నా చొక్కా బరువు తగ్గుతుంది. ఏ పారిశ్రామిక వస్తువుని తీసుకున్నా ఇదే జరుగుతుంది.

**వ్యవసాయ ఉత్పత్తి విషయం:** 1 బస్తా ధాన్యపు విత్తనాలతో, కనీసం 70, 80 బస్తాల ధాన్యమూ, 2, 3 బళ్ళ గడ్డీ వస్తాయి. ప్రకృతి సహజంగా పెరిగే ఉత్పత్తుల్లో, కొత్త ఉత్పత్తుల పరిమాణం పెరుగుతుంది.

10. **ముడి పదార్థాల బరువు కన్నా తక్కువ బరువుతో తయారయ్యే ఉత్పత్తుల్ని, పారిశ్రామిక ఉత్పత్తులనీ; దానికి వ్యతిరేకంగా వుండే ఉత్పత్తుల్ని వ్యవసాయ ఉత్పత్తులనీ నిర్ధారించగలమా?**

**జ:** తప్పకుండా నిర్ధారించవచ్చు. కనీసం 100 ఉదాహరణలు తీసుకుంటే ఇది తెలుస్తుంది.

11. **పొలంలో 'ధాన్యం' పండింది. అది మిల్లులో 'బియ్యం'గా మారింది. బియ్యం - వ్యవసాయ సరుకా, పారిశ్రామిక సరుకా?**

**జ:** ధాన్యంగా పండినప్పుడు అది వ్యవసాయ సరుకు. ధాన్యాన్ని బియ్యంగా మార్చే మిల్లు పని - ఒక పరిశ్రమ. కాబట్టి, బియ్యం - పారిశ్రామిక సరుకు.

12. **ధాన్యాన్ని ఇంట్లోనే రోకళ్ళతో దంచి, బియ్యంగా చేసుకుంటాం. ధాన్యం బరువు కన్నా బియ్యం బరువు తగ్గుతుంది. ఆ బియ్యం పారిశ్రామిక సరుకు అవుతుందా?**

**జ:** ఇంట్లో జరిగే ఏ పనికీ - అది వ్యవసాయమా, పరిశ్రమా - అనే విభజన వర్తించదు. ఒక పెట్టుబడిదారుడు, పది మంది కూలీల్ని పెట్టి ధాన్యాన్ని రోకళ్ళతోనే దంపిస్తే, అది పరిశ్రమే. ఆ బియ్యం బరువు, ధాన్యం బరువు కన్నా తగ్గుతుంది. ఆ అర్థంతో అది పారిశ్రామిక సరుకే.

13. **ఒక భూస్వామి ఆస్తి 80 ఎకరాలు. దాన్ని 10 కుటుంబాలకు కౌలుకి ఇచ్చాడు. ఆ 80 ఎకరాల్లో ఉత్పత్తి సాధనాల ఖర్చు 25%. కౌలు 50%. ఒక్కో రైతు కుటుంబానికీ, పోషణకు ఎన్ని ఎకరాల్లో పంట?**

**జ:** ఉత్పత్తి సాధనాల ఖర్చు 25% కాబట్టి, 80 ఎకరాల్లో ఆ ఖర్చు, 20 ఎకరాల్లో పంట. కౌలు 50% కాబట్టి, అది 40 ఎకరాల్లో పంట. చివరికి మిగిలింది 20 ఎకరాల్లో పంట. ఇది 10 రైతు కుటుంబాలకు కాబట్టి, ఒక్కొక్క కుటుంబానికీ 2 ఎకరాల్లో పంట. ఆ రైతు, వడ్డీలూ అవీ కట్టవలసి వస్తే, అది కూడా ఆ పంటలో నించి తీసి కట్టాలి. మిగిలినదే ఆ కుటుంబ పోషణకి. భూస్వామి కుటుంబానికి మాత్రం 40 ఎకరాల్లో పంట!

14. **ఫ్యూడల్ రైతుకీ, పెట్టుబడిదారీ రైతుకీ తేడా ఏమిటి?**

**జ:** ఫ్యూడల్ రైతు స్వయంగా శ్రమ చేసే రైతు. తన శ్రమలో నించే కౌలుని చెల్లిస్తాడు. పెట్టుబడిదారీ రైతు, తను ఏ శ్రమా చెయ్యకుండా కూలీలతో శ్రమ చేయించి, అదనపు విలువ సంపాదించి, అందులో నించి కౌలు చెల్లించి, చివరికి తనకు లాభం మిగుల్చుకుంటాడు.

15. **'ఫ్యూడల్ కౌలు' కీ, 'పెట్టుబడిదారీ కౌలు' కీ తేడా?**

**జ:** ఫ్యూడల్ కౌలు అంటే: వ్యవసాయ శ్రమలు చేసే రైతుల 'అదనపు ఉత్పత్తి', (1) 'కౌలు' గానూ, (2) 'వడ్డీ' గానూ - ఈ 2 భాగాలు గానే పంపకాలవుతుంది. అలాంటి సంబంధాలలో - వున్నది ఫ్యూడల్ కౌలు. పెట్టుబడిదారీ కౌలు అంటే: వ్యవసాయ కార్మికుల 'అదనపు విలువ' - (1) 'వడ్డీ' గానూ, (2) 'కౌలు' గానూ, (3) ఉత్పాదక పెట్టుబడికి 'లాభం' గానూ - ఈ 3 భాగాలుగా పంపకాలవుతుంది. ఇలాంటి సంబంధాలలో వున్నది - పెట్టుబడిదారీ కౌలు.

16. **'కూలి' అంటే? 'జీతం' అంటే?**

**జ:** కూలి = రోజుకి ఇచ్చేది.
జీతం = నెలకు ఇచ్చేది.

17. **'కూలీ' అంటే? 'పాలేరు' అంటే?**

**జ:** కూలీ - అంటే, యజమాని కోసం, రోజుల లెక్కన పని చేసే కార్మికుడు. పాలేరు - అంటే, యజమాని కోసం, సంవత్సరం ఒప్పందం మీద పని చేసే కార్మికుడు.

18. **పాలేరు కూడా అదనపు విలువ ని ఇస్తాడా?**

**జ:** యజమాని దగ్గిర పని చేసే శ్రామికుడు, ఏ ఒప్పందాలతో వున్నా, యజమానీ - శ్రామిక సంబంధం వున్న ప్రతీ చోటా దోపిడీ వుంటుంది.

19. **వీటిలో ఏ యే మాటలు సమానార్థాలతో వున్నాయి? వ్యవసాయ కూలీలు, బానిసలు, శ్రామికులు, అర్ధ బానిసలు, కార్మికులు, వ్యవసాయ శ్రామికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు.**

**జ:** బానిసలు = శ్రామికులు
కార్మికులు = శ్రామికులు
రైతులు = అర్ధ బానిసలు
వ్యవసాయ కూలీలు = వ్యవసాయ శ్రామికులు = వ్యవసాయ కార్మికులు

20. **భూస్వామి, తన భూమిని, ఒక పెట్టుబడిదారీ రైతుకి కౌలుకి ఇవ్వడానికీ, తనే స్వంత సాగు చేయించుకోవడానికీ తేడా ఏమిటి?**

**జ:** భూమిని ఇతరులకు కౌలుకి ఇస్తే, ఆ భూమి ద్వారా కౌలు మాత్రమే వస్తుంది. అప్పుడు 'లాభం' అనేది, పెట్టుబడి పెట్టే వాడికి పోతుంది. ఆ పెట్టుబడిని కూడా భూస్వామే పెట్టి, స్వంత సాగు చేయించుకుంటే, 'లాభం' భాగం కూడా భూస్వామికే వస్తుంది.

21. **వ్యవసాయంలో 3 షిఫ్టుల విధానం వుందా, లేదా? లేకపోతే ఎందుకు లేదు?**

**జ:** వ్యవసాయంలో, రాత్రి షిఫ్టు వుండాలంటే, ఆకాశానికి దీపాలు పెట్టాలి. పెట్టుబడిదారులు దాన్ని ఇంకా కనిపెట్టలేదు.

22. **అది సారహీనమైన భూమి. దాన్ని ఏ పెట్టుబడిదారుడూ కౌలుకి తీసుకోవడం లేదు. అప్పటి వరకూ 'స్వతంత్ర రైతులు'గా వున్న ఒక రైతు కుటుంబం, దాన్ని తీసుకుని, కౌలు చెల్లించగలుగుతోంది. ఇది ఎలా సాధ్యం?**

**జ:** అది సారహీనమైన భూమి కాబట్టి, దాని ద్వారా ఎక్కువ పంట రాదు. కానీ ఆ పంటని కూడా బయటి ధర ప్రకారమే అమ్మాలి. దాని ద్వారా వచ్చే S, కౌలుని చెల్లించడానికి మాత్రమే సరిపోతుంది గానీ, 'లాభం'గా ఏమీ మిగలదు. పెట్టుబడి పెట్టే వాడికి, ఆ పెట్టుబడి వెనక్కి రావడం (C + V లు వెనక్కి రావడం) చాలదు. దాని మీద లాభం కూడా రావాలి. లాభం రాని పని కోసం పెట్టుబడి పెట్టడం ఏ పెట్టుబడిదారుడూ చెయ్యడు.

స్వయంగా శ్రమ చేసే ఒక రైతు కుటుంబం ఆ భూమిని కౌలుకి తీసుకుంటే, ఆ పనిలో ఖర్చయిన C + V లు వెనక్కి వచ్చి కౌలుని చెల్లించడానికి కూడా వీలు వుంటే చాలు. వాళ్ళ శ్రమ ద్వారా వచ్చిన S నే, కౌలుగా చెల్లిస్తారు. V తో పోషణ చేసుకుంటారు. 'లాభం' ప్రసక్తి వుండదు. ఈ రైతు కుటుంబం స్వయంగా శ్రమ చేసేదే కాబట్టి, V భాగంతో బతు కుతూ, కౌలుని కూడా చెల్లించగలుగుతుంది.

**23. A, B భూములు రెండూ ఒక్కొక్క ఎకరం. రెండు చోట్లా ఒకే సైజు పెట్టుబడులు. ఒకే సైజు C + V లు. ఒకే సైజు పని దినాలు. కానీ, A భూమిలో పంట 20 బస్తాలూ, B భూమిలో పంట 10 బస్తాలూ. బస్తా ధర, 2 పంటలకూ ఒకే రకంగా వర్తిస్తుంది. పంటల్ని అమ్మగా వచ్చిన మొత్తాల నించి, C + V ఖర్చుల్ని తీసివెయ్యగా, A భూమిలో పంట ద్వారా రెట్టింపు లాభం వచ్చింది. అంటే, A భూమిలో కార్మి కులు ఎక్కువ శ్రమ చేశారా? ఎక్కువ S ని ఇచ్చారా?**

**జ:** భూముల సారాల్లో తేడాలు వుండడం వల్ల, పంటలు ఒక చోట ఎక్కువగా, ఒక చోట తక్కువగా అయ్యాయి. పంటలో నించి ఉత్పత్తి సాధనాల ఖర్చుని తీసి వేస్తే, మిగిలినదంతా శ్రామికుల శ్రమ వల్ల వచ్చినదే కాబట్టి, A పంట, A శ్రామికుల శ్రమ ఫలితమే; B పంట, B శ్రామికుల శ్రమ ఫలితమే. 2 చోట్లా శ్రమలు సమానం గానే జరిగినా, 'భూమి సారం' అనే ప్రకృతి వనరు, A కార్మికులకే అందింది. వారు ఎక్కువ అదనపు విలువని ఇచ్చినట్టు అయింది. కానీ శ్రమల్లో తేడా లేదు.

**24. మొత్తం పంట 40 బస్తాలు. పెట్టుబడి 400. జనరల్ లాభం 700. వ్యవసాయ కౌలు 140. బస్తా ధర ఎంత?**

**జ:** పెట్టుబడీ, లాభమూ కలిసి 400 + 700 = 1100. వ్యవసాయ కౌలు అనేది, జనరల్ లాభం కన్నా అదనంగా వుంటుంది కాబట్టి, దాన్ని కూడా కలిపితే, మొత్తం 1100 + 140 = 1240. ఇది, 40 బస్తాల ధర. 1 బస్తా ధర = —— = 31.

**25. ఒక పంచదార మిల్లు నడవడానికి కనీసం ఒక ఎకరం భూమి కావాలనుకుందాం. దానికి కావలసిన చెరుకుని పండించడానికి కూడా ఎరకం భూమి కావాలా?**

**జ:** ఎకరం కన్నా 20, 30 రెట్లు ఎక్కువ భూమి కావాలి.

**26. ఒక బట్ట పెట్టుబడిదారుడు, తన ఫ్యాక్టరీ స్థలానికి చెల్లించే కౌలు ఎక్కడిది?**

**జ:** ఆ ఫ్యాక్టరీలో పని చేసే ఉత్పాదక కార్మికుల అద నపు విలువలోది.

**27. బట్టని అమ్మే వర్తక పెట్టుబడిదారుడు, తన షాపు వున్న స్థలానికి చెల్లించే కౌలు ఎక్కడిది?**

**జ:** ఆ వర్తకుడు అమ్మే బట్టని ఉత్పత్తి చేసే కార్మి కుల అదనపు విలువ లోది.

**28. కౌలు 150. వడ్డీ రేటు 15%. భూమి ధర కనీసం ఎంత వుండవచ్చు?**

**జ:** పెట్టుబడీకరణ చెందే కౌలే భూమి ధర. 15 వడ్డీని సంపాదించాలంటే, 100 ని అప్పుగా ఇవ్వాలి. 150 కౌలుని సంపాదించాలంటే = —— × 150 = 1000 పెట్టుబడి పెట్టాలి. ఆ వెయ్యిని వడ్డీకి ఇచ్చినా 150 వస్తుంది. వెయ్యితో భూమిని కొని కౌలుకి ఇచ్చినా 150 వస్తుంది. కాబట్టి, ఆ భూమి ధర కనీసం వెయ్యి వుండవచ్చు. ఆపైన, దాని సప్లై, డిమాండ్లు.

**29. పెట్టుబడిదారీ వ్యవసాయం ఎటువంటిది?**

**జ:** 'పెట్టుబడిదారీ' విశేషణం గల ఏ పని అయినా పెట్టుబడిదారీ స్వభావం కలదే. అంటే, లాభాన్నీ, ఎక్కువ లాభాన్నీ, లాగాలని ప్రయత్నించే స్వభావం. పెట్టుబడి దారీ వ్యవసాయానికి, ఉత్పత్తి శక్తుల్ని పెంచే మంచి లక్షణం వుంది. కానీ అది ఆ పనిని - భూమినీ, శ్రామి కుల్నీ, జంతు జాలాల్నీ సర్వనాశనం చేసే మార్గం ద్వారా సాధిస్తుంది.

**30. సక్రమమైన హేతుబద్ధ వ్యవసాయం ఎలాసాధ్యం?**

**జ:** హేతుబద్ధ సమాజం ద్వారానే సాధ్యం. భూమిని, లాభానికి వనరుగా గాక, సుఖ జీవితానికి వనరుగా ఉపయోగించడం ద్వారానే సాధ్యం. శ్రమ దోపిడీని తీసి వేసే, అందరూ శ్రమ చేసే సమాజం ద్వారానే సాధ్యం. ★

# 6. సామ్రాజ్య వాదం

ఒక దేశం, ఇతర దేశాల్ని గానీ, ఇతర దేశాల ప్రాంతాల్ని గానీ, దౌర్జన్యంగా ఆక్రమించి, వాటిని తన 'పెత్తనం' కింద వుంచుకోవడమే - సామ్రాజ్య వాదం.' (ఇంపీరియలిజం).

ఆర్థిక బలమూ, సైనిక బలమూ అధికంగా వున్న దేశాలే, దౌర్జన్యాలు 'విజయ వంతంగా' చేసే సామ్రాజ్య వాద దేశాలుగా ప్రవర్తించగలుగుతాయి. ఆ బలాలు తక్కువగా వున్న దేశాలు, పూర్తి వలసలు గానో, కొంత తక్కువ స్థాయి వలసలు గానో, ఏదో ఒక రకంగా సామ్రాజ్యవాద దేశాలకు లోబడే దేశాలుగా వుంటాయి.

'సామ్రాజ్య వాదం' అనేది (దౌర్జన్యంగా ఇతర ప్రాంతాల్ని ఆక్రమించడం అనేది), వెనకటి కాలం నించీ కూడా వుంది. బానిస సమాజం లోనూ, భూస్వామ్య సమాజం లోనూ కూడా, రాజులూ చక్రవర్తులూ, ఇతర రాజ్యాల్ని ఆక్రమించడం కోసం వాటి మీద దండయాత్రలూ, యుద్ధాలూ చేసే వారు. ఓడిపోయిన రాజ్యాల నించి - వెండి బంగారాలూ, ఇతర విలువైన ఉత్పత్తులూ దోచుకునే వారు. అంతే గాక, ఓడిపోయిన రాజ్యాల్ని 'సామంత రాజ్యాలు'గా ('వలసలు'గా) మార్చి, ఆ రాజ్యాల నించి ఏటా కొంత 'కప్పం' (కొంత ధనమూ, ఇతర ఉత్పత్తులూ) వసూలు చేసే వారు. అలాంటి దండయాత్రల్లో వలస దేశ ప్రజల్ని చంపడమూ, గృహ దహనాలూ, స్త్రీలపై అత్యాచారాలూ, ఆస్తుల దోపిడీలూ, మనుషుల్ని ఎత్తుకుపోయి బానిసలుగా మార్చుకోవడాలూ - వంటి నీచ కార్యాలన్నీ యథావిధిగా చేసే వారు. ఇదంతా 'దౌర్జన్యం' చేసే దేశాల దృష్టిలో 'వీర కార్యం' గానూ, 'శత్రు మూకల్ని అణిచే ధర్మ కార్యం' గానూ వుండేది. ఆ దేశాల కవి పుంగవులు, తమ పాలకుల సామ్రాజ్య వాద దండయాత్రల్ని 'జైత్ర యాత్రలు'గా వర్ణిస్తూ గ్రంథాలు రాసి, పాలకుల్ని ఆనందపరిచి లబ్ధి పొందే వారు.

ఆ సామ్రాజ్య వాదమే, 'సారంశం' ఏమీ మారకుండా, 'రూపం'లో మాత్రమే కొన్ని మార్పులతో, పెట్టుబడిదారీ విధానంలో కూడా కొనసాగింది. ఇంకా కొనసాగుతోంది. ఇక్కడ కూడా 'సామ్రాజ్య వాదం' అంటే, ఇతర దేశాల్ని ఆక్రమించి వలసలుగా మార్చడమే; వలసల్ని దోచడమే; వలసల మీద ఆధిపత్యం నెరపడమే. సామ్రాజ్యవాదం - అంటే, వెనకటి కాలంలో గానీ, పెట్టుబడిదారీ కాలంలో గానీ, ఇంత కన్నా వేరే అర్థం ఏదీ లేదు.

వెనకటి దోపిడీ సమాజాల్లో దోపిడీకి అనుకూలంగా వుండే ప్రతీ లక్షణమూ పెట్టుబడిదారీ సమాజంలో కూడా వున్నట్టే, 'ఇతర దేశాల్ని ఆక్రమించడం' అనే లక్షణం కూడా, పెట్టుబడిదారీ విధానంలో కూడా వుంది. అయితే, దోపిడీ లక్షణాలన్నీ ఇక్కడ 'రూపం మారి' వున్నట్టే, ఈ లక్షణం కూడా ఇక్కడ రూపం మారి, పెట్టుబడిదారీ విధానానికి తగిన రూపంలో వుంటుంది. వెనకటి లాగ డైరెక్టుగా 'కప్పాలు' వసూలు చేసే పద్ధతిలో గాక, ఇక్కడ సామ్రాజ్య వాదం, వలసలతో 'వర్తకం' చేసే పద్ధతి లోనూ, వలసల్లో పెట్టుబడులు పెట్టే పద్ధతి లోనూ, వుంటుంది. ఇప్పుడు వెనకటి సామ్రాజ్య వాదం గురించి గాక, 'పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదం' గురించే చూస్తాము.

## పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదం

**ఒ**క దేశంలో, పెట్టుబడిదారీ విధానం 'అభివృద్ధి' చెందుతోన్న కొద్దీ, (అంటే, ఉత్పత్తి శక్తుల పెరుగుదలా, పోటీ, పెట్టుబడి కేంద్రీకరణా, బ్యాంకు విధానమూ - వంటి విషయాలన్నీ అభివృద్ధి చెందుతోన్న కొద్దీ), అన్ని రంగాల లోనూ - (ఉత్పాదక, వర్తక, వడ్డీ రంగాల్లో), జాయింట్ స్టాక్ కంపెనీలూ, వాటితో ఏర్పడే గుత్త కంపెనీలూ, ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూ, అపారమైన సరుకు రాసుల్ని ఉత్పత్తి చేస్తూ వుంటాయి. ఆ సరుకు రాసుల్ని అమ్మాలంటే, స్వదేశీ మార్కెట్లే గాక విదేశీ మార్కెట్లు కూడా అవసరమవుతాయి.

"..... అదే విధంగా - విదేశీ వర్తక విస్తరణ, పెట్టుబడిదారీ విధానపు స్వంత సృష్టిగా అవుతుంది. పెట్టుబడిదారీ విధానం మరింత పురోగమించిన కొద్దీ, ఆ విధానపు అంతర్గత అవసరం వల్ల, నిరంతరం విస్తరించవలసిన మార్కెట్ల కోసం అవసరం కూడా పెరుగుతుంది" - మార్క్స్ [కాపిటల్ - 3, పేజీ 237, మాస్కో.]

గుత్త - బ్యాంకులకు కూడా, వాటి డబ్బుని అప్పులు ఇచ్చే అవకాశాల కోసం, విదేశీ మార్కెట్లు అవసరం. ఒక పెట్టుబడిదారీ దేశానికి, ఇతర పెట్టుబడిదారీ దేశాలతో పోటీ లేకుండా విదేశీ మార్కెట్లు దొరకాలంటే, దానికి 'తేలికైన' పద్ధతి - ఇంకా పెట్టుబడిదారీ విధానంతో అభివృద్ధి చెందని విదేశాల్ని దౌర్జన్యంతో 'వలసలు'గా ఆక్రమించడమే! ఆ పనే దాదాపు పెట్టుబడిదారీ దేశాలన్నీ చేశాయి. ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే క్రమంలో 'ఆధునిక సామ్రాజ్య వాద దశ' ప్రారంభమైంది.

వలసల్ని ఆక్రమించిన ఒక సామ్రాజ్య వాద దేశం, ఆ వలసల ద్వారా పొందే ప్రయోజనాలు ఈ రకంగా వుంటాయి:

1. తన అపారమైన సరుకు రాసుల్లో కొంత భాగాన్ని, తన వలసల్లో, 'పోటీ లేకుండా' అమ్మగలుగుతుంది.
2. తన పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాల్లో కొంత భాగాన్ని, తన వలసల నించి, పోటీ లేకుండా కొంటుంది.
3. తన భారీ బ్యాంకుల ద్వారా వలసలకు అప్పులు ఇచ్చి, వడ్డీలు సంపాదిస్తుంది.
4. వలసల్లో కూడా పెట్టుబడులు పెట్టి, అక్కడే 'ఉత్పాదక, వర్తక, వడ్డీ కంపెనీలు' స్థాపించి, లాభాలు సంపాదిస్తుంది.
5. ఇతర పెట్టుబడిదారీ దేశాలతో యుద్ధాలు సంభవించినప్పుడు, తన వలసల్ని, 'మిలటరీ స్థావరాలు'గా ఉపయోగిస్తుంది. యుద్ధాలు లేని కాలంలో కూడా రాబోయే యుద్ధాల కోసం ఆ మిలటరీ స్థావరాలను వుపయోగిస్తుంది.
6. సామ్రాజ్యవాద దేశమే, వలసల్ని పరిపాలించే 'రాజకీయాధికారం'తో వుంటుంది.

ఇన్ని రకాలుగా సామ్రాజ్య వాద దేశం వలసల ద్వారా 'ప్రయోజనాలు' పొందుతూ వుంటుంది.

పెట్టుబడిదారీ విధానం పురోగమిస్తూ పోతే, దాన్ని అడ్డుకోకపోతే, అది తప్పనిసరిగా 'సామ్రాజ్య వాదం'గా మారి తీరుతుంది.

సామ్రాజ్య వాదం చేసే చర్యలన్నీ, ఆ దేశపు ఉత్పత్తి సాధనాల యజమానుల వర్గం (ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల యజమానుల వర్గం) చేసే నిర్ణయాలే. ఆ దేశపు ఆధిపత్యానికి కారణం, ఆ వర్గమే. అలాగే, వలస దేశపు లొంగుబాటు తనానికి కారణం, ఆ దేశపు ఉత్పత్తి సాధనాల యజమానుల (ప్రధానంగా భూస్వాముల, పెట్టుబడిదారుల) వర్గమే.

వెనకటి కాలంలో గానీ, పెట్టుబడిదారీ కాలంలో గానీ, ఒక సామ్రాజ్య వాద దేశం, ఇంకో దేశాన్ని వలసగా ఆక్రమించిందంటే, ఆ పనిలో, ఏ దేశపు శ్రామిక వర్గ జోక్యమూ, నిర్ణయాలూ, వుండవు. 'సైనికులు'గా పని చేసే శ్రామికులు, యజమానుల 'బలవంతం' వల్లా, 'బతుకు దెరువు' కోసమూ మాత్రమే ఆ పని చేస్తారు. అందులో వారి నిర్ణయాలేవీ వుండవు.

ఒక సామ్రాజ్య వాద దేశం, ఇంకో దేశాన్ని, తన వలసగా సాధారణంగా ఎప్పుడు ఆక్రమించ గలుగుతుందంటే - రెండో దేశపు 'దోపిడీ వర్గం'లో ఒక విభాగం, సామ్రాజ్యవాద దేశానికి అనుకూలంగానూ, 'దళారులు' గానూ వున్నప్పుడు మాత్రమే.

## 'వలస దేశం' తో వర్తకం:

సాధారణంగా, సామ్రాజ్యవాద దేశపు దోపిడీ, వలస దేశంతో 'వర్తకం' ద్వారా ప్రారంభమవుతుంది. ('సామ్రాజ్య వాద దేశం' అనే మాటల్ని తేలిగ్గా పలకడం కోసం, ఇప్పటి నించీ 'సా. దేశం' అందాము.) సా. దేశం, వలస దేశానికి, తన సరుకుల్ని అమ్ముతుంది; వలస దేశపు సరుకుల్ని తను కొంటుంది. ఇదంతా, ఆ దేశాల మధ్య జరిగే 'విదేశీ వర్తకం' లాగే పైకి కనబడుతుంది. కానీ, ఇది సాధారణ విదేశీ వర్తకం కాదు. ఈ విదేశీ వర్తకంలో 'అసమాన మారకాల' సమస్య ఒకటి వుంటుంది.

కొంత విలువ గల ఉత్పత్తిని ఇచ్చి, దానికి బదులుగా అంతే విలువ గల ఉత్పత్తిని తీసుకుంటే, అది 'సమాన విలువల మారకం'. అలాంటి మారకంలో ఏ పక్షానికీ ప్రత్యేకంగా 'లాభం' గానీ, 'నష్టం' గానీ, వుండదు. తక్కువ విలువ గల ఉత్పత్తిని ఇచ్చి, ఎక్కువ విలువ గల ఉత్పత్తి ని తీసుకుంటే, అది 'అసమాన విలువల మారకం'. ఇలాంటి మారకంలో, ఒక పక్షానికి - లాభం, ఇంకో పక్షానికి - నష్టం.

సా. దేశానికీ, వలస దేశానికీ జరిగే వర్తకంలో,

'అసమాన మారకాల' ద్వారా, సా. దేశం లాభపడడమూ, వలస దేశం నష్టపోవడమూ, జరుగుతూ వుంటుంది. ఎలాగంటే: సా. దేశం అంటే, పెట్టుబడిదారీ విధానంతో అభివృద్ధి చెందిన దేశం. అక్కడ ఉత్పత్తి శక్తులు, వలస దేశంలో కన్నా చాలా పెరిగి వుంటాయి. ఇంకా పెరుగుతూ వుంటాయి. వలస దేశంలో ఉత్పత్తి శక్తులు, ఆ స్థాయిలో ఉండవు.

సా. దేశం అమ్మే ఒక సరుకు విషయంలో, దాని ఉత్పత్తి శక్తి పెరుగుదల వల్ల, దానికి పట్టే 'శ్రమ కాలం' తగ్గి, దాని 'విలువ' తగ్గిందనుకుందాం. (ఈ సంగతి దాని కాస్ట్ ప్రైస్ తగ్గడం ద్వారా కనపడుతుంది.) కాస్ట్ ప్రైస్ తగ్గిన తర్వాత కూడా సా. దేశం, ఆ సరుకు 'ధర'ని తగ్గించకుండా, దాన్ని వెనకటి ఎక్కువ ధర తోటే వలస దేశానికి ఇచ్చి, ఆ ధరకి తగిన సరుకుని వలస దేశం నించి తీసుకుంటుందనుకుందాం. అలా చేస్తే అది, తక్కువ విలువని ఇచ్చి ఎక్కువ విలువని తీసుకున్నట్టు అవుతుంది. అంటే, ఈ మారకం ద్వారా, సా. దేశం, వలస దేశం నించి కొంత ఉత్పత్తిని అదనంగా లాక్కున్నట్టు అవుతుంది. ఇది, 'అసమాన విలువల మారకం'.

సా. దేశంలో సరుకుల విలువలు తగ్గుతూ వుంటాయి. వలస దేశంలో విలువలు, ఆ స్థాయిలో తగ్గవు. ఈ రెండు దేశాలూ ఒకరి సరుకుల్ని ఒకరు కొనుక్కునేటప్పుడు, వాటి ధరలు, వాటి మారే కాస్ట్ ప్రైసులకు అనుగుణంగా మారాలి. కానీ, సా. దేశపు ఆధిపత్యం వల్లా, వలస దేశపు లొంగుబాటు తనం వల్లా, వాటి మధ్య జరిగే వర్తకంలో, సరుకుల ధరల్లో 'సరియైన' మార్పులు జరగవు. సా. దేశం (అంటే, దాని కంపెనీలు), తన ధరల్ని తన ఇష్టానుసారమే నిర్ణయిస్తూ, వలస దేశపు ధరల్ని కూడా తన షరతులకు లోబడి వుండే లాగ చెయ్యగలుగుతుంది. దీని ఫలితంగా, సా. దేశం, వలస దేశానికి '1 గంట శ్రమ గల' సరుకుని ఇచ్చి, దానికి బదులుగా '1 గంట కన్నా ఎక్కువ శ్రమ గల' సరుకుని తీసుకుంటుంది.

దీన్ని, 'ఉత్పత్తుల' రూపంలో క్లుప్తంగా చూద్దాం: సా. దేశం లోనూ, వలస దేశం లోనూ కూడా ఉత్పత్తి అయ్యే ఒకే రకం 'బట్ట'ని తీసుకుందాం. సా. దేశంలో, 1 మీటరు బట్టకి పట్టే మొత్తం శ్రమ కాలం కన్నా, వలస దేశంలో 1 మీటరు బట్టకి పట్టే మొత్తం శ్రమ కాలం రెట్టింపుగా వుందనుకుందాం. అంటే, సా. దేశపు బట్ట విలువ కన్నా, వలస దేశపు బట్ట విలువ, రెట్టింపు. ఈ దేశపు బట్టని ఇచ్చి, ఆ దేశపు బట్టని తీసుకోవాలనుకుందాం. ఒకే రకపు 'ఉపయోగపు విలువల' మధ్య మారకాలు జరగక పోయినా, ఇక్కడ విషయం తేలిగ్గా అర్థం కావడం కోసం, ఈ దేశపు బట్టకీ, ఆ దేశపు బట్టకీ మారకం జరిగిందనుకుందాం. సా. దేశం, వలస దేశం నించి 1 మీటరు బట్టని తీసుకుంటే, దానికి బదులుగా తను 2 మీటర్ల బట్టని ఇవ్వాలి. తక్కువ బట్టకి బదులుగా ఎక్కువ బట్టని ఇవ్వాలనడం చాలా అర్థ రహితమైన విషయంగా కనబడుతుంది. కానీ, ఇది అర్థ రహితం కాదు. 'మారకం' జరిగేది, 'విలువల సమానత్వాన్ని' బట్టే గానీ, 'ఉపయోగపు విలువల సమానత్వాన్ని' బట్టి కాదు. ఇచ్చే విలువా, తీసుకునే విలువా సమానంగా వుంటేనే, ఏ పక్షానికీ నష్టం జరగదు. కాబట్టి ఈ ఉదాహరణలో, సా. దేశం, 2 మీ. బట్టని ఇచ్చి, 1 మీటరు బట్టని తీసుకోవాలి. కానీ, సా. దేశం, 1 మీటరు బట్టనే ఇచ్చి, దానికి బదులుగా 1 మీటరు బట్టని తీసుకుంటే, తక్కువ విలువని ఇచ్చి ఎక్కువ విలువని తీసుకున్నట్టు అర్థం. దీని వల్ల, వలస దేశానికి సగం విలువ నష్టం. అయితే, ఒకే రకపు ఉపయోగపు విలువల మధ్య మారకాలు జరగవు కాబట్టి, సా. దేశానికీ, వలస దేశానికీ జరిగే మారకాలు అసమానంగా జరుగుతాయనే సంగతి పైకి కనపడదు. ఒకే రకపు 'తక్కువ బట్ట'కీ 'ఎక్కువ బట్ట'కీ మారకం జరగవలసిన పరిస్థితిని ఎక్కడా చూడలేము. ఈ ఉదాహరణలో వున్న 'విలువల సారాంశాన్ని' మాత్రమే అర్థం చేసుకోవాలి.

సా. దేశం, '1 గంట శ్రమ కాలం' గల గోధుమలు ఇచ్చి, దానికి బదులుగా 3 గం. శ్రమ కాలం గల పంచదారని తీసుకుంటే, తక్కువ విలువ గల ఉత్పత్తిని ఇచ్చి, ఎక్కువ విలువ గల ఉత్పత్తిని లాగినట్టే అర్థం. సా. దేశం, చేసే పని ఇదే. ఆ 2 దేశాల మధ్యా, ఈ రకపు ధరల పద్ధతి లోనే ఎగుమతులూ దిగుమతులూ జరుగుతూ వుంటే, ఈ వ్యాపారం ద్వారా సా. దేశం, వలస దేశం నించి నిత్యమూ అపారమైన సరుకు రాసుల్ని అక్రమంగా దోచుకుపోతూ వుంటుందని అర్థం.

సా. దేశం, వలస దేశంలో జరిగే అనేక రకాల సరుకుల ఉత్పత్తిని ధ్వంసం చెయ్యడానికి పూనుకుంటుంది. ఎలాగంటే: వలస దేశంలో, వెనకటి కాలం నించీ సాంప్రదాయకంగా సాగుతూ వున్న కొన్ని

రకాల సరుకుల ఉత్పత్తిని నాశనం చెయ్యదలిచినప్పుడు, సా. దేశం, వలస దేశపు సరుకులతో తన సరుకుల్ని పోటీ పెడుతూ, తన ధరల్ని, వలస సరుకుల ధరల కన్నా కూడా తగ్గిస్తుంది. వలస దేశపు జనం తక్కువ ధరతో వచ్చే సా. దేశపు సరుకునే కొంటారు. అదే రకపు స్వదేశీ సరుకు కొంత ఎక్కువ ధరతో వుంటుంది కాబట్టి, దాన్ని కొనరు. సా. దేశం, తన ధరని ఎలా తగ్గించగలుగుతుందంటే, ఆ సరుకుని తన దగ్గిర చాలా తక్కువ కాస్ట్ ప్రైస్‌తో ఉత్పత్తి చేస్తుంది కాబట్టి. తన ధరని ఎంత తగ్గించినా, సా. దేశానికి నష్టం రాదు. అలా తగ్గించిన ధరలు కూడా, సా. దేశానికి జనరల్ లాభం రేటుని తెచ్చే 'ఉత్పత్తి ధరల' కన్నా అధికం గానే వుంటాయి. అంటే, సా. దేశం, తన సరుకు ధరని, వలస దేశపు ధర కన్నా తగ్గించినప్పుడు కూడా ఇంకా 'అసమాన మారకమే' జరుగుతూ వుంటుంది. అసమాన మారకం జరగకుండా వుండాలంటే, సా. దేశపు సరుకు ధర, ఇంకా తక్కువగా వుండాలన్న మాట. కానీ, అలా వుండదు. వలస దేశపు సరుకు ధర కన్నా 'కొంత తక్కువగా' వుండేలాగ మాత్రమే, సా. దేశపు ధర వుంటుంది. ఇలా, ధరని తగ్గించడం వల్ల, సా. దేశానికి వచ్చే అదనపు లాభం, కొంత తగ్గుతుంది. కానీ, లాభం తగ్గినప్పటికీ, దాని వల్ల, సా. దేశం, వలస దేశపు సరుకుల ఉత్పత్తిని చాలా వరకు నాశనం చేసి, ఆ మార్కెట్‌ని దీర్ఘకాలం పాటు తను సంపాదించ గలుగుతుంది. అంటే, ఆ రకం ఉత్పత్తిని, వలస దేశం ఇక తయారు చేసుకోదు. దాన్ని సా. దేశమే ఎప్పుడూ వలస దేశానికి అమ్ముతూ వుంటుంది. ఈ రకంగా సా. దేశం, తర్వాత కాలంలో కావలసినంత లాభం సంపాదిస్తుంది.

వలస దేశ ప్రభుత్వానికీ, సా. దేశానికీ మధ్య, అమ్మకాలూ కొనడాలూ జరిగేటప్పుడు, వలస దేశ ప్రభుత్వాధినేతలూ, ప్రభుత్వాధికారులూ, ఆ యా కంపెనీల డైరెక్టర్లూ, మేనేజర్లూ - రక రకాల స్థాయిల్లో 'లంచాలు' తింటూ, సా. దేశానికి అనుకూలమైన ధరలకూ (అంటే, ఆ దేశానికి మితిమీరిన 'లాభాల్ని' ఇచ్చే ధరలకు) అంగీకరిస్తారు.

సా. దేశం నించి కొనే ఒక సరుకుకి సరైన లెక్కల ప్రకారం అయితే, 50 చెల్లించవచ్చనుకుందాం. కానీ, ఆ సరుకుని వలస దేశపు ప్రభుత్వ అవసరాల కోసం కొనేటప్పుడు, అక్కడి ప్రభుత్వాధినేతలు 500 ధరని చెల్లించినా ఆశ్చర్యం లేదు. అంటే, 10 రెట్లు ఎక్కువ! దీని వల్ల వలస దేశపు ప్రభుత్వ ఖజానాయే లూటీ అవుతుంది. ఆ ధరలో కొంత భాగం 'లంచాలు'గా రక రకాల చోట్లకు అందుతుంది. అలాగే, వలస దేశపు ప్రభుత్వ కంపెనీల సరుకుని అమ్మేటప్పుడు, 50 వసూలు చెయ్యవలసిన సరుకుని 5 కో, 6 కో ఇచ్చెయ్యవచ్చు. దీని వల్ల ఆ సరుకుని ఉత్పత్తి చేసే ప్రభుత్వం కంపెనీకి, కాస్ట్ ప్రైస్ కూడా వెనక్కి రాదు.

ప్రభుత్వ కంపెనీలు, స్వదేశీ ప్రైవేటు పెట్టుబడిదారులతో వర్తకం చేసేటప్పుడు కూడా ఇదే పద్ధతిని అవలంభిస్తాయి. తాము అమ్మే సరుకుని చాలా తక్కువ ధరలతో ఇవ్వడమూ, ప్రైవేటు పెట్టుబడిదారుల నించి తీసుకునే సరుకుని చాలా ఎక్కువ ధరలతో కొనడమూ, చేస్తాయి.

క్రమంగా ప్రభుత్వ కంపెనీలు నష్టాల పాలవుతాయి. నష్టాలకు కారణాలేమిటో పరిశీలించే మేధావులు, "ప్రభుత్వ సంస్థల్లో కార్మికులు బొత్తిగా పని చెయ్యడం లేదు. అందుకే ఈ నష్టాలు" అని 'కని పెడతారు'!

వలస దేశానికి, సా. దేశంతో అసమాన మారకాల ద్వారా జరిగే నష్టమే గాక, వలస దేశం తనకు 'అవసరం లేని' అనేక రకాల సరుకుల్ని కేవలం సా. దేశపు ఒత్తిడికి లోబడి కొంటుంది. అప్పుడు కూడా లంచాలు నడుస్తాయి.

వలస దేశం, ఒక రకం 'మందుల్ని' సా. దేశం నించి దిగుమతి చేసుకుంటుందనుకుందాం. ఆ మందుల్ని వలస దేశం కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. కానీ, వలస దేశపు పెట్టుబడిదారులు, సా. దేశానిక దళారులుగా వుంటూ, ఆ మందుల వ్యాపారంలో 'వర్తక కమిషన్లు' తినడానికి అలవాటుపడి వున్నారనుకుందాం. ఆ సరుకుని తమ దేశం లోనే ఉత్పత్తి చేసుకోవాలనే దృష్టితో వాళ్ళు వుండరు. పెట్టుబడిదారుల్లో ఎవరైనా ఆ ప్రయత్నాలు ప్రారంభిస్తే, దానికి వలస దేశపు ప్రభుత్వం అనుకూలించదు. లేదా, వలస దేశం లోనే ఆ మందుల ఉత్పత్తి ప్రారంభమైనప్పుడు సా. దేశం తన మందుల్ని వలస దేశంలోకి తెచ్చి చవక ధరలతో అమ్మడం మొదలు పెడుతుంది. దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన చర్యలేవీ వలస దేశపు ప్రభుత్వం తీసుకోదు. అది, సా. దేశానికే 'లోబడి' వుంటుంది.

ఈ రకంగా, సా. దేశం, తనకు ఎదురు లేని అనేక

పరిస్తితుల వల్ల, తన సరుకుల్ని వలస దేశాల్లో అక్రమ మైన ధరలతో అమ్మగలుగుతుంది. తను ఉత్పత్తి చేసే పనికిమాలిన సరుకులన్నిటినీ వలస దేశానికి అంట గట్ట గలుగుతుంది.

సా. దేశం, తన వలసల్లోకి ఇతర పెట్టుబడిదారీ దేశాలు వచ్చి అమ్మడానికీ, కొనడానికీ అంగీకరిం చదు. లేదా, అంగీకరిస్తే, పూర్తిగా తనకు అనుకూల మైన షరతుల తోటే అంగీకరిస్తుంది. వలస దేశం మీద ఆధిపత్యం అంతా సా. దేశానికే వుంటుంది కాబట్టి, అది వలసలతో చేసే వర్తకానికి సంబంధించినంత వరకూ ఇతర పెట్టుబడిదారీ దేశాలతో 'పోటీ'ని ఎదు ర్కోదు. ఈ 'పోటీలేని స్తితి' కోసమే వలసల్ని ఆక్ర మించడం!

ఒక దేశంలో వున్న మొత్తం 'సరుకుల రాసి'కి సంబంధించిన పరిస్తితిని చూస్తే: ఏ దేశపు సరుకుల రాసి అయినా C + V + S అనే 3 భాగాలుగా వున్నట్టే, వలస దేశపు సరుకుల రాసి కూడా ఆ భాగాలుగానే వుంటుంది. అందులో C + V భాగాల్ని (ఖర్చయ్యే పెట్టుబడిని, లేదా కాస్ట్ ప్రైస్‌ని) ఏ పెట్టుబడిదారుడూ లాక్కోలేడు. (స్వదేశీ పెట్టుబడి దారుడు గానీ, విదేశీ పెట్టుబడి దారుడు గానీ.) ఎవరు లాక్కున్నా, సరుకులో వున్న S భాగాన్ని లాక్కోవలిసిందే.

సా. దేశం, వలసలతో చేసే 'అసమాన మారకాల వర్తకం' ద్వారా, వలస దేశపు సరుకుల్లో వుండే S భాగంలో నించి తనకు సాధ్యమైనంత ఎక్కువ భాగాన్ని లాక్కోగలుగుతుంది. S లో ఇంకా మిగిలిన భాగమే వలస దేశపు భూస్వాములకూ పెట్టుబడి దారు లకూ అందుతుంది.

వలస దేశపు దోపిడీ వర్గంలో ఒక ప్రధానమైన విభాగం, సా. దేశపు కంపెనీలతో రక రకాల సంబంధా లతో వుండడం వల్ల, ఆ ఇరు పక్షాల ప్రయోజనాలూ ఒకే రకంగా వుంటాయి. ఆ కారణం వల్ల, ఆ విభాగం, సా. దేశానికి అనుకూలంగా వుంటుంది. వలస దేశపు దోపిడీ వర్గం లోని మిగిలిన విభాగం, 'గత్యంతరం లేని' పరిస్తితుల వల్ల సా. దేశానికి లోబడి వుంటుంది. అందులోనే ఒక భాగం, సామ్రాజ్య వాదానికి పూర్తి వ్యతిరేకంగా కూడా వుండవచ్చు.

అసలు 'సరుకుల మారకం' అంటే, 'సమాన విలువల' మధ్య మారకం జరగడమే - జనరల్ సూత్రం. అయితే, 'మారకానికి' ఇటూ అటూ వుండే పక్షాల్ని బట్టి (ఆ పక్షాల మధ్య వున్న సంబంధాల్ని బట్టి), ఆ మారకం సమాన విలువల మారకంగా వుండనూ వచ్చు, వుండక పోనూ వచ్చు. సా. దేశానికీ, వలస దేశానికీ మధ్య 'సమాన విలువల' సూత్రం ఎన్నడూ అమలు జరగదు. అయితే, ఆ వర్తకంలో ధరలు ఎంత అక్రమంగా వున్నా, ఎంత అస్తవ్యస్తంగా వున్నా, ఆ ఇరు పక్షాల ధరల్నీ కలిపితే, ఆ ధరల మొత్తమే - ఆ సరుకుల విలువ. ఆ 'విలువ'లో వున్న 'అదనపు విలువ' భాగాన్నే ఇరు పక్షాల సరుకుల యజమానులూ లాక్కోవాలి. ఆ 'అదనపు విలువ'ని లాక్కోవడం లోనే, రక రకాల మార్పులు జరుగు తాయి. ఈ దేశపు ధరలో గానీ, ఆ దేశపు ధరలో గానీ, ఎంత చిన్న మార్పు జరిగినా, 'అదనపు విలువ' పంపకంలో మార్పులు జరుగుతాయి.

'విదేశీ వర్తకం' గురించి సాధారణంగా వుండే ఒక అభిప్రాయం ఏమిటంటే, ఏ దేశం ఏ సరుకుల్ని బాగా ఉత్పత్తి చెయ్యగలదో ఆ సరుకులనే ఉత్పత్తి చేస్తూ, ఆ సరుకుల్ని, ఆ దేశాలు పరస్పరం మారకాలు చేసు కుంటే, దాని వల్ల ఇరు పక్షాలకూ లాభ దాయకంగా వుంటుంది - అని!

ఉదా: A దేశంలో గోధుమ బాగా పండుతుంది. చెరుకు బాగా పండదు.

B దేశంలో, చెరుకు బాగా పండుతుంది. గోధుమ బాగా పండదు. అంటే, A దేశంలో గోధుమ (1 బస్తా), Bలో కన్నా తక్కువ విలువతో (తక్కువ శ్రమతో) ఉత్పత్తి అవుతుంది. అలాగే, B దేశంలో చెరుకు (1 టన్ను), Aలో కన్నా తక్కువ విలువతో (తక్కువ శ్రమతో) ఉత్పత్తి అవుతుంది.

కాబట్టి, A దేశం ఎక్కువ గోధుమనీ, B దేశం ఎక్కువ చెరుకునీ పండిస్తూ, వాటిని మారకాలు చేసు కుంటే, 2 దేశాలకూ ఆ సరుకులు తక్కువ విలువ లతో (తాము పండించే దాని కన్నా తక్కువ విలువ లతో) వస్తాయి. కాబట్టి, అలా చెయ్యడం 'తెలివైన పని!' - ఇదీ ఆ అభిప్రాయం.

కానీ, ఇందులో తెలివైన తనం కన్నా తెలివి లేని తనమే ఎక్కువ. ఎందుకంటే: ఇది మొదట 'స్వయం పోషకత్వం' కోసం ప్రయత్నమే లేకుండా చేస్తుంది. ప్రతీ ప్రాంతమూ, ప్రతీ దేశమూ స్వయం పోషకత్వం కోసమే మొదట ప్రయత్నించాలి. ఒక సరుకుని ఉత్పత్తి చేసుకోవడం కోసం ఎక్కువ విలువని ఖర్చు పెట్టవలసి వచ్చినా, దాన్ని స్వయం గానే ఉత్పత్తి

చేసుకోవాలి. విలువ లెక్కలకు మొదటి స్థానం ఇవ్వడం గాక, స్వయం పోషకత్వానికే మొదట స్థానం ఇవ్వాలి. A దేశం - గోధుమనీ, B దేశం - చెరుకునీ పండించే స్పెషలైజ్డ్ దేశాలుగా మారితే, ఏ దేశమూ స్వయం పోషకత్వాన్ని సాధించలేదు.

ఆ అభిప్రాయంలో రెండో లోపం:

ఒక దేశం, ఏ సరుకుల్ని బాగా ఉత్పత్తి చెయ్య గలిగితే వాటినే చేస్తూ, వేరు వేరు దేశాలు తమ సరుకుల్ని మారకాలు చేసుకోవడం, ఇరు పక్షాలకూ మంచిది - అనే విషయం, ఆ దేశాలు రెండూ సమాన స్థాయి గల దేశాలు అయినప్పుడే జరుగుతుంది. ఆ విషయం, సా. దేశానికీ వలస దేశానికీ మధ్య వుండే సంబంధానికి వర్తించదు. ఎందుకంటే, సా. దేశం తన సరుకుని ఎంత తక్కువ విలువతో ఉత్పత్తి చేసినా, దాన్ని వలస దేశానికి ఆ తక్కువతో ఇవ్వదు. వలస దేశం నించి మాత్రం తక్కువ తోటే తీసుకుంటుంది. ఆ దేశాల మధ్య 'ఆధిపత్యమూ - లొంగుబాటు తనమూ' అనే సంబంధం వుంటుంది కాబట్టి, అక్కడ వర్తకం, నిజ విలువలతో సాగదు. సా. దేశం, రెండో దేశాన్ని దోచివేస్తూ వుంటుంది. కాబట్టి, 'ఒక దేశం ఏ పంటని బాగా పండించ గలదో ఆ పంటనే పండిం చడం' అనే స్పెషలైజేషన్ విధానం వల్ల, కొన్ని దేశాలు (లోబడి వుండే దేశాలు) ఘోరంగా నష్టపోవడమే జరుగుతుంది.

ఇంకో వుదాహరణ: A దేశం, సామ్రాజ్యవాద దేశం. B దేశం, వలస దేశం. A నించి కొన్ని యంత్రాల్ని, B కొన్నది. యంత్రం విలువ 100. కానీ, దాన్ని A, 150కి ఇచ్చింది. అయితే, Bయే గనక ఆ రకం యంత్రాల్ని స్వయంగా ఉత్పత్తి చేసుకుంటే, 150 కన్నా కూడా ఇంకా ఎక్కువ అవుతుందను కుందాం. B దేశం, A నించి ఆ యంత్రాన్ని, తనే ఉత్పత్తి చేసుకుంటే ఖర్చు పెట్టవలసిన దాని కన్నా తక్కువ తోటే కొన్నది. అంటే, ఈ కొనుగోలులో B కి ఏమీ నష్టం జరగలేదని అర్థమా? - కాదు. ఆ సరుకుని B యే ఉత్పత్తి చేసుకుంటే ఇంకా ఎక్కువ ఖర్చు అవుతుందనేది వేరే విషయం. ప్రస్తుతం జరిగిన కొనుగోలు సంగతి చూస్తే, B దేశం, A నించి 100 విలువని మాత్రమే తీసుకుని, దానికి 150 ని చెల్లించింది. అంటే A దేశం, B కి 100 విలువనే ఇచ్చి, 150ని లాగింది. ఇది B కి నష్టమే. అంతే గానీ B కి ఆ సరుకు చవకగా వచ్చినట్టు అర్థం కాదు. నిజానికి ఆ సరుకు B కి 100 కి వచ్చినా కూడా చవకగా వచ్చినట్టు అర్థం కాదు. 100 కి వస్తే, దాని విలువకే అది వచ్చినట్టు అర్థం. కానీ, సా. దేశం తన సరుకుల్ని ఎంత చవకగా ఉత్పత్తి చేసినా, ఆ ఫలితం, వలస దేశానికి దొరకదు. కాబట్టి, 'ఏ దేశం ఏ సరుకుని బాగా ఉత్పత్తి చెయ్యగలదో ఆ సరుకునే ఉత్పత్తి చేస్తూ, వాటిని మారకాలు చేసుకుంటే, 2 దేశాలకూ ప్రయోజనకరంగా వుంటుంది' అనే వాదం, 'దోపిడీ సంబంధాలలో' పూర్తిగా అర్థరహితమైన సంగతి. అది, ఆధిపత్య దేశాలకు మాత్రమే ప్రయోజనకరంగా వుండే సంగతి.

ఒక ఉదాహరణ కోసం, ఇలా ఊహిద్దాం:

సామ్రాజ్య వాదమూ, వలస విధానమూ అంతా అలా వుండగానే ఆ దేశాల మధ్య వర్తకంలో, 'ధరల' విషయంలో ఒక మార్పు చేశాం అనుకుందాం. ఏమి టంటే, సా. దేశపు సరుకుల ధరల్ని తగ్గించాం. వలస దేశపు సరుకుల ధరల్ని పెంచాం. ఈ రకంగా ధరల్లో సంస్కరణలు చేసి, మారకాల్లో 'అసమానత్వాన్ని' తీసివేసినట్టుగా ఊహిద్దాం. (నిజానికి ఒక దేశం మీద ఇంకో దేశపు 'ఆధిపత్యం' వుంటూ వుండగా, ధరల్లో సంస్కరణలు చెయ్యడం సాధ్యం కాదు. అయి నప్పటికీ ఉదాహరణ కోసమే ఇలా ఊహిద్దాం.) అప్పుడేం జరుగుతుంది? - అప్పటి వరకూ సామ్రాజ్య వాద దేశం, వలస దేశం నించి అక్రమంగా లాక్కుం టున్న 'అదనపు' లాభం, వలస దేశానికే వుండి పోతుంది. అంటే, వలస దేశపు సరుకుల యజమాను లకే! వలస దేశపు సరుకుల యజమానుల్లో 'స్వతంత్ర ఉత్పత్తి దారులు' కూడా కొంత సంఖ్య వున్నప్పటికీ, మొత్తం 'సరుకు రాసి'లో వారు ఉత్పత్తి చేసే భాగం అతి తక్కువ. అది విదేశీ వర్తకం లోకి వెళ్ళదు. 'సరుకు రాసి'లో అధిక భాగానికి యజమానులు - భూస్వా ములూ, పెట్టుబడిదారులే. వీళ్ళే వలస దేశపు దోపిడీ దారులు. ధరల్లో సంస్కరణల వల్ల అంత వరకూ విదేశీ దోపిడీదారులకు పోయే S భాగం, స్వదేశీ దోపిడీదారులకే వుండిపోతుంది. అంటే, ఆ భాగం - అక్కడ అందకపోతే ఇక్కడికీ, ఇక్కడ అందకపోతే అక్కడికీ. అంతే గానీ, ఆ భాగం, వలస దేశపు శ్రామికు లకు అందేదేమీ వుండదు.

ధరల సంస్కరణ జరిగితే, వలస దేశపు స్వతంత్ర ఉత్పత్తి దారులకు తప్పని సరిగా కొంత 'మేలు' జరుగుతుంది. వారు తమ సరుకుల్ని అమ్ముకున్న

ప్పుడు, వాటికి గతంలో కన్నా ఎక్కువ ధరలు వుంటాయి. అలాగే, సా. దేశపు సరుకుల్ని వారు మార్కెట్లో కొన్నప్పుడు వాటికి గతంలో కన్నా తక్కువ ధరలు వుంటాయి. ఈ మార్పుల వల్ల, వలస దేశపు స్వతంత్ర ఉత్పత్తి దారులకు వారి అదనపు విలువలో చాలా భాగం వారికే అందుతుంది. ఈ రకంగా ధరల సంస్కరణ వారికి కొంతైనా ఉపయోగపడుతుంది. కానీ, వలస దేశపు 'శ్రామిక వర్గానికి', దాని వల్ల జరిగే మార్పు ఏమీ వుండదు. వారికి అందేది ఎప్పుడూ 'శ్రమ శక్తి విలువ' మాత్రమే.

### దేశాల మధ్య శ్రమ విభజన:

సామ్రాజ్యవాద దేశం, పెట్టుబడిదారీ విధానంతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశం. వలస దేశం, ఆ రకంగా అభివృద్ధి చెందనిది. వలస దేశం, సా. దేశానికి ప్రధానంగా 'వ్యవసాయ ముడి పదార్థాల్ని' అందిస్తే; సా. దేశం, వలస దేశానికి ప్రధానంగా 'పారిశ్రామిక సరుకుల్ని' అందిస్తుంది. ఈ 'శ్రమ విభజన'ని చూస్తే, 2 దేశాలూ పరస్పరం ఒక దాని మీద ఒకటి ఆధారపడి వున్నట్టు కనపడుతుంది. నిజానికి ఇది, పరస్పరం ఆధారపడి వున్న శ్రమ విభజనే. సా. దేశం కూడా వలస దేశం మీద చాలా ఆధారపడి వున్నట్టే. కానీ, సా. దేశం, వలస దేశం మీద 'ఆధిపత్యం' చేసే పరిస్థితిలో వుంటుంది కాబట్టి (దాని వల్ల, తన సరుకుల్ని ఎక్కువ ధరలతో ఇస్తుంది కాబట్టి), ఈ శ్రమ విభజన, సా. దేశానికే అనుకూలించే మార్గం లోనే వుంటుంది. అంటే ఈ శ్రమ విభజన, వలస దేశమే సా. దేశం మీద ఎక్కువగా ఆధారపడి వుండే లాగ చేసే శ్రమ విభజన మాత్రమే!

## పెట్టుబడుల ఎగుమతి

**సా**మ్రాజ్యవాద దేశం, వలస దేశంతో 'వర్తకం' ద్వారా ప్రారంభించిన దోపిడీని, క్రమంగా 'పెట్టుబడుల ఎగుమతి' ద్వారా అభివృద్ధి పరచుకుంటుంది.

ఒక దేశం (దాని కంపెనీలు), ఇంకో దేశంలో పెట్టుబడులు పెట్టడం గురించి, గత చాప్టర్లలో చూశాం. ఒక దేశం, తన పెట్టుబడిని, ఇంకో దేశంలో ఎందుకు పెడుతుంది? దాన్ని తన దేశం లోనే పెట్టడానికి అవకాశం లేకనా? - కాదు. ఎక్కువ లాభం ఎక్కడ వస్తే అక్కడికే పెట్టుబడి వెళ్తుంది. పెట్టుబడిని ఇంకో దేశంలో పెట్టినప్పుడు, తన దేశంలో పెట్టిన దాని కన్నా ఎక్కువ 'లాభం రేటు'ని తేగలిగే అవకాశం వుండడం వల్లనే (అలా వున్నప్పుడే), పెట్టుబడి, స్వదేశం నించి విదేశాలకు బైల్దేరుతుంది.

సా. దేశం - వలస దేశానికి, 'డబ్బు పెట్టుబడి' ('డబ్బు అప్పు') ఇచ్చినప్పుడు, ఆ 'అప్పు'ని, వలస దేశపు ప్రభుత్వానికైనా ఇవ్వవచ్చు; వలస దేశపు ప్రైవేటు కంపెనీలకైనా ఇవ్వవచ్చు; రెంటికీ ఇవ్వవచ్చు. అలా 'డబ్బు అప్పు' ఇచ్చినప్పుడు, అప్పు ఇచ్చిన దేశం, మొదట తన సరుకుల్ని అమ్ముతుంది - తను నిర్ణయించిన ధరల తోనే. ఆ డబ్బు - అప్పుని తీసుకున్న వాళ్ళు, ఆ డబ్బుతో, ఆ డబ్బు ఇచ్చిన దేశంలో కంపెనీల నించే ఆ సరుకులు కొంటారు. ఆ రకంగా, అప్పు ఇచ్చిన దేశానికి, ఆ అప్పు ఇవ్వడం వల్ల, దాని సరుకులకే బేరం దొరుకుతుంది. తర్వాత, 'అప్పు' ఇచ్చిన దేశం, ఆ అప్పు మీద 'వడ్డీలు' సంపాదిస్తుంది - తను నిర్ణయించే 'వడ్డీ రేటు' తోటే. (అసలుకీ వడ్డీలకీ సరిపోయే సరుకుల్ని, అప్పు ఇచ్చిన సా. దేశం, రెండో దేశం నించి తీసుకుంటుంది.)

'అప్పు' ఇచ్చే దేశం, ఆ అప్పు ద్వారా వడ్డీలు పొందడం మాత్రమే కాదు; తప్పనిసరిగా ఇంకా కొన్ని రకాల ప్రయోజనాలు కూడా పొందుతుంది. అప్పు ఇచ్చే దేశానికి, అప్పు తీసుకునే దేశం, లోబడి వుంటుంది కాబట్టి, మొదటి దాని షరతులకే రెండోది అంగీకరిస్తుంది. అప్పు ఇచ్చే దేశానికి అనుకూలంగా వ్యాపారంలో ఒప్పందాలూ (దానికి వచ్చే వడ్డీల మీద, 'ఆదాయం పన్ను' వుండకూడదు. లేదా, అది అతి తక్కువగా వుండాలి. ఆ ఆదాయాన్ని అప్పు తీసుకున్న దేశం లోనే పెట్టుబడిగా పెట్టాలనే షరతులు వుండకూడదు - వగైరా ఒప్పందాలు), అది కోరిన పరిశ్రమలో కాంట్రాక్టులూ, ఇతర అనుకూల షరతులూ - వగైరాలన్నీ దానికి అందుతాయి.

సామ్రాజ్యవాద దేశం - తన కంపెనీల శాఖల్నీ, బ్యాంకుల శాఖల్నీ, వలస దేశంలో పెడుతుంది. వాటి కోసం కొన్ని ఉత్పత్తి సాధనాల్ని తన దేశం నించే రవాణా చేస్తుంది.

సా. దేశం - వలస దేశపు ఉత్పాదక, వర్తక, వడ్డీ రంగాల్లో, పెట్టుబడులు పెట్టి, తన యాజమాన్యం కింద స్వంత కంపెనీల్నీ స్వంత బ్యాంకుల్నీ స్థాపి

స్తుంది. వలస దేశంలో తన పెట్టుబడుల్ని మొదట రవాణా మార్గాల నిర్మాణమూ, గనుల తవ్వకమూ, నీటి పారుదల ఏర్పాట్లూ - వంటి శాఖల్లో ప్రారంభి స్తుంది.

వలస దేశంలో, ఒక విదేశీ సబ్బుల కంపెనీ ఎలాగైతే 'వ్యాపారం' చేసుకుంటుందో అలాగే, ఒక 'విదేశీ బ్యాంకు' కూడా 'వ్యాపారం' చేసుకుంటుంది.

సా. దేశం, వలస దేశపు కంపెనీల్ని కొనివేసి, వాటిని తన యాజమాన్యం కింద నడుపుతుంది. ఇదంతా, వలస దేశంలో పెట్టుబడులు పెట్టడమే. దీని ఫలితంగా, సా. దేశపు పెట్టుబడిదారులు వలస దేశపు కార్మిక జనాభాకి 'యజమానులు'గా తయారై, ఆ కార్మికుల అదనపు విలువలో నించి లాభాలూ, వడ్డీలూ సంపాదిస్తారు.

### మార్క్స్ నించి 3 కొటేషన్లు:

1. ".... 'విదేశీ వర్తకం'లో పెట్టిన, ప్రత్యే కించి 'వలస వర్తకం'లో పెట్టిన పెట్టుబడులు, .... 'అధిక లాభం రేటు'ని ఇవ్వ గలవు. ఎందుకంటే, పోటీ అనేది, తక్కువ స్థాయి ఉత్పత్తి పరిస్థితులు గల ఇతర దేశాల్లో తయారైన సరుకు లతో వుంటుంది కాబట్టి. ఎక్కువ పురోగమించిన దేశం (మోర్ ఎడ్వాన్స్‌డ్ కంట్రీ), తను పోటీ పడుతున్న దేశాల సరుకుల కంటే తన సరుకులు తక్కువ విలువతో వున్నప్పటికీ, వాటిని వాటి విలువ కన్నా ఎక్కువకి అమ్ముతుంది. పురోగ మించిన దేశం నించి ఏ దేశానికైతే సరుకులు ఎగుమతీ దిగుమతీ అవుతాయో, ఆ దేశం (వలస దేశం), తను పొందే దాని కన్నా ఎక్కువ శ్రమని, తన ఉత్పత్తి రూపేణా ఇస్తుంది. తద్వారా, తను పొందే సరుకుల్ని, తను ఉత్పత్తి చేయగలిగే దాని కన్నా కూడా చవకగా పొందుతుంది ....

వలసలూ వగైరాలలో పెట్టే పెట్టుబడులకు సంబంధించి - ఆ పెట్టుబడులు, అధిక లాభం రేట్లని ఒక సింపుల్ కారణంగా పొందుతాయి. అక్కడ (వలసల్లో) వెనకబడ్డ అభివృద్ధి వల్లా (బాక్‌వర్డ్ డెవలప్‌మెంట్), బానిసల్నీ - కూలీల్నీ (కూలీస్) ఉపయోగించడం వల్లా, అక్కడ లాభం రేటు ఎక్కువగా వుంటుంది" - [కాపిటల్ - 3, పేజీ 238.]

(ఈ కొటేషన్‌లో మార్క్స్, సామ్రాజ్యవాద దేశానికీ వలసలకూ మధ్య, మొదట - 'వర్తకం' ద్వారా జరిగే దాన్నీ; తర్వాత, వలసల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా జరిగే దాన్నీ చెప్పాడు.)

2. "అనుకూల పరిస్థితుల్లో వుండే దేశం (ఫేవర్డ్ కంట్రీ), 'మారకం'లో, 'తక్కువ శ్రమకి, ఎక్కువ శ్రమని తీసుకుంటుంది. ఈ 'అదనం' (ఎక్సెస్), ఆ దేశంలో ఒక వర్గం జేబులో పడినప్పటికీ! .... సాధారణంగా, వలస దేశంలో ఎక్కువ లాభం రేటు వుంటుంది కాబట్టి, ప్రకృతి పరిస్తితులు అను కూలంగా వున్న పక్షంలో, తక్కువ ధరలతో పాటే, ఎక్కువ లాభం రేటు కూడా నడుస్తుంది" - [కాపిటల్ - 3, పేజీ 238 - 9.]

(ఒక సామ్రాజ్యవాద దేశం, ఒక వలస దేశంలో పెట్టుబడి పెట్టి, సరుకుని ఉత్పత్తి చేస్తే, ప్రకృతి అను కూలతల వల్ల, ఆ సరుకులకు తక్కువ ధరలు ఏర్ప డినా ఆ 'తక్కువ ధర'ల నించి కూడా 'ఎక్కువ లాభం' తీసుకోవడం సాధ్యమవుతుందని చివరి మాటల అర్థం.)

3. "ఇదే విదేశీ వర్తకం, స్వదేశంలో (వలస దేశంలో) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని అభి వృద్ధి చేస్తుంది. దీని అర్థం - 'స్థిర పెట్టుబడి'తో పోల్చినప్పుడు 'అస్థిర పెట్టుబడి' తగ్గడం ఒక వైపూ; విదేశీ మార్కెట్లకు సంబంధించి 'అమితో త్పత్తి'కి కారణం ఇంకోవైపూ - జరుగుతాయి." [కాపిటల్ - 3, పేజీ 239, మాస్కో.]

('అమితోత్పత్తి'కి సంబంధించిన విషయాలు ఈ చాప్టరు తర్వాత వచ్చే 'సంక్షోభాలు' చాప్టరులో చూస్తాము.)

ఒక సామ్రాజ్య వాద దేశం, తన వలసల తోనే గాక, ఇతర సామ్రాజ్య వాద దేశాలతో కూడా 'వర్తకం' చేస్తుంది. ఇతర సామ్రాజ్యవాద దేశాలలో కూడా పెట్టు బడులు పెడుతుంది. అయితే, ఆ 2 దేశాల మధ్యా 'సమాన' పరిస్తితులు వుంటే, ఆ వర్తకంలో ధరలూ, ఇతర షరతులూ, సమాన స్థాయి లోనే వుంటాయి. లేదా, ఆ దేశాల పరిస్తితులు కూడా తేడాగా వుంటే (ఒక దేశం, ఇంకో దేశం మీద ఎక్కువ ఆధారపడి వుంటే), అక్కడ కూడా ధరలూ - షరతులూ తేడాగా వుండి, ఆధిపత్య దేశానికి అదనపు లాభం అందుతూ వుంటుంది.

A, B అనే 2 పెట్టుబడిదారీ దేశాల్ని తీసుకుంటే, ఒక దేశపు పెట్టుబడులు ఇంకో దేశంలో వుంటాయి. (A దేశపు కంపెనీలు, B దేశంలో పెట్టుబడులు పెడితే; B దేశపు కంపెనీలు, A దేశంలో పెట్టుబడులు పెడతాయి.)

ఒక పెట్టుబడిదారీ దేశం, ఇంకో పెట్టుబడిదారీ దేశపు కంపెనీల్లో 'వాటాలు' కొంటుంది. విదేశీ ప్రభుత్వపు బాండ్లు కొంటుంది. విదేశీ బ్యాంకుల్లో డిపాజిట్లు పెడుతుంది. విదేశాల్లో తన కంపెనీల శాఖలూ, తన కంపెనీలూ పెడుతుంది. (ఇది చాలా పరిమితంగానే వుండవచ్చు) - ఈ రకంగా, ఒక పెట్టుబడిదారీ దేశంలో కూడా ఇంకో పెట్టుబడిదారీ దేశపు పెట్టుబడులు వుంటాయి.

అయితే, ఒక దేశం - విదేశాల్లో పెట్టిన పెట్టుబడి ఎంత? విదేశాలన్నీ - ఆ దేశంలో పెట్టిన పెట్టుబడి ఎంత? - ఇలా చూస్తే, ఏ దేశం అయితే ఎక్కువ పెట్టుబడులు పెట్టి వుంటుందో ఆ దేశమే ఎక్కువ లాభాలూ, ఎక్కువ వడ్డీలూ సంపాదిస్తూ, ఎక్కువ 'శక్తి గల' (దోపిడీ శక్తి గల) దేశంగా వుంటుంది.

A లో, B పెట్టుబడి 5.

B లో, A పెట్టుబడి 100.

A దేశం, విదేశంలో పెట్టిన పెట్టుబడి కన్నా, B దేశం విదేశంలో పెట్టిన పెట్టుబడి చాలా తక్కువ.

ఇంకా కొన్ని రకాల తేడాలు వుంటాయి.

A దేశం, Bలో, ఉత్పాదక కంపెనీల్లో పెట్టుబడి పెడితే, B దేశం Aలో, ప్రభుత్వ బాండ్లపై పెట్టుబడి పెట్టిందనుకుందాం.

ఉత్పాదక కంపెనీల్లో పెట్టిన పెట్టుబడి, దీర్ఘ కాలికమైనది. ప్రభుత్వ బాండ్లలో పెట్టిన పెట్టుబడి, స్వల్పకాలికమైనది.

విదేశీ ఉత్పాదక కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన A దేశానికి, చాలా కాలం పాటు లాభాలూ వడ్డీలూ ఇవ్వగల మార్కెట్టు దొరికిందన్న మాట!

B దేశానికి ఆ పరిస్థితి లేదు.

A దేశం, B లో, తన యాజమాన్యం కిందే వున్న స్వంత కంపెనీల్లో పెట్టుబడి పెడితే, ఆ పెట్టుబడి మీద నిర్ణయాలన్నీ A దేశం చేతి లోనే వుంటాయి.

B దేశం, A దేశపు కంపెనీల్లో 'వాటాలు' కొనడం ద్వారా పెట్టుబడి పెడితే, ఆ పెట్టుబడి మీద నిర్ణయాలు B దేశం చేతిలో వుండవు.

ఈ రకంగా, 'పెట్టుబడి పెట్టడం'లో అనేక రకాల తేడాలు వుంటాయి. ఒక దేశంలో - విదేశీ పెట్టుబడి చాలా తక్కువగా వున్నప్పుడూ, ఆ పెట్టుబడి స్వల్ప కాలిక అవసరాల కోసం మాత్రమే వున్నప్పుడూ, దాని ప్రభావం, ఆ దేశపు ఆర్థిక పరిస్తితుల మీద ఎక్కువగా వుండదు.

A, B, C, D - అనే 4 పెట్టుబడిదారీ దేశాల్ని తీసుకుంటే, అందులో ఏ దేశం అయితే విదేశాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టి వుంటుందో; ఏ దేశం అయితే ఎక్కువ విస్తీర్ణం గల వలస ప్రాంతాల మీద ఆధిపత్యంతో వుంటుందో - ఆ దేశంలో, (ఆ దేశపు గుత్త కంపెనీల్లో), ఎక్కువ 'డబ్బు పెట్టుబడి' పోగు పడుతూ వుంటుంది.

ఒక మనిషి దగ్గిర 'ఎక్కువ డబ్బు' వుందంటే, ఆ విషయాన్ని తేలిగ్గా అర్థం చేసుకోగలం. ఒక దేశపు కంపెనీల్లో 'ఎక్కువ డబ్బు' వుండడం కూడా అలాంటిదే. లాభాలు ఎక్కువగా లాగగలిగే కంపెనీల్లో ఎక్కువ డబ్బు చేరుతూ వుంటుంది. అంటే, ప్రపంచ వ్యాప్తంగా తయారయ్యే 'ఉత్పత్తుల రాసి' లోని 'అదనపు ఉత్పత్తి' భాగంలో నించి ఎక్కువ రాసి, ఆ ఫలానా దేశంలో పోగుపడుతూ వుంటుంది. ఆ దేశం, ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ 'పెట్టుబడి' మీద పెత్తనం చెయ్యగలుగుతుంది. అంటే ఎక్కువ ఉత్పత్తి సాధనాల మీదా, ఎక్కువ కార్మిక జనాభా మీదా!

బ్రిటనూ, ఫ్రాన్సూ - అన్నిటి కంటే పాత పెట్టుబడిదారీ దేశాలు. అత్యధిక వలసలు, వీటి స్వాధీనం లోనే వుండేవి. బ్రిటను సామ్రాజ్యం, సూర్యుడస్తమించని సామ్రాజ్యంగా వుండేది. అంటే బ్రిటన్‌కి, 'భూగోళం చుట్టూ' వలసలు వుండేవన్న మాట! అమెరికా జర్మనీలు, ఇతర పెట్టుబడిదారీ దేశాల కన్నా తక్కువ కాలంలో అభివృద్ధి చెందిన దేశాలు. ఈ రెండు దేశాల్లోనూ, పారిశ్రామిక రంగంలో గుత్త కంపెనీలు, అత్యధికంగా విస్తరించాయి. ఆ నాడు, ప్రపంచం లోని 'మొత్తం డబ్బు పెట్టుబడి'లో అత్యధిక భాగం, ఈ 4 సామ్రాజ్య వాద దేశాల్లోనే వుండేది. ఈ దేశాలే ఇతర ప్రపంచ దేశాలకు 'అప్పులు' ఇస్తూ, ఇతర దేశాల్లో ఉత్పాదక పెట్టుబడులు పెడుతూ, వుండేవి. ఆ దేశాలకు వుండే చాలా ప్రత్యక్ష వలసలు, క్రమంగా పరోక్ష వలసలుగా మారాయి. అయినప్పటికీ, ఈ నాటికీ, ప్రపంచం లోని మొత్తం 'డబ్బు పెట్టుబడి' లోని అత్యధిక భాగం, పెద్ద పెట్టుబడిదారీ దేశాల గుత్త కంపెనీల ఆధీనం లోనే వుంది. ఈ నాటికీ ఈ దేశాలు, ఇతర

దేశాలకు అప్పులు ఇచ్చి వడ్డీలు సంపాదించడమూ, ఉత్పాదక పెట్టుబడులు పెట్టి లాభాలు సంపాదించడమూ, చేస్తూనే వున్నాయి.

పెట్టుబడులు భారీ స్థాయిలో వున్న ఒకటి రెండు దేశాలే, మొత్తం 'ప్రకృతి'నీ, మొత్తం ప్రపంచ జనాభానీ 'ఏలుతాయి'.

'పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదం' అంటే, (లేదా 'ఆధునిక సామ్రాజ్య వాదం' అంటే), 'పారిశ్రామిక దేశాలు, వ్యవసాయ దేశాల్ని ఆక్రమించడం' అనే అర్థం సరైనదే. కానీ, ఈ అర్థం చాలదు. 'ప్రపంచ పెట్టుబడి'లో అధిక భాగం సామ్రాజ్యవాద దేశాలకు చేరడమూ, ఆ పెట్టుబడి, ప్రపంచాన్ని ఏలడమూ, 'ఆధిపత్యం' కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ సాగుతూ వుండడమూ - వగైరా అంశాలన్నిటినీ కూడా ఈ అర్థం లోకి తీసుకోవాలి.

స్వదేశపు పెట్టుబడిదారుల వల్లా, విదేశపు పెట్టుబడిదారుల వల్లా, ఇంత దోపిడీ జరుగుతూ వున్న ప్రపంచంలో, - వలస దేశపు శ్రామిక వర్గానికి, సామ్రాజ్యవాద దేశం ద్వారా జరిగే 'అసమాన మారకాల' సమస్య ప్రధాన సమస్య కాదు. 'సామ్రాజ్య వాదం' వల్ల పుట్టుకు వచ్చే అనేక సమస్యల్లో అది కూడా ఒకటి మాత్రమే.

శ్రామిక వర్గానికి ప్రధాన సమస్య, ఉత్పత్తి క్రమంలో జరిగే దోపిడీయే. ఆ వర్గానికి వుండే సమస్యలన్నిటికీ పునాది అదే. అది, స్వదేశీ దోపిడీ దారుల ద్వారా జరిగినా, విదేశీ దోపిడీ దారుల ద్వారా జరిగినా సారాంశం ఒకటే.

## కార్మికుల వలసలు:

ఎప్పుడూ 'పనుల' కోసమూ, మెరుగైన 'జీతాల' కోసమూ అన్వేషించే కార్మికులు - స్వంత ప్రాంతాల్లో పనులు దొరకనప్పుడూ, పోషణకు సరిపడే జీతాలు లేనప్పుడూ, ఇతర ప్రాంతాలకూ, ఇతర దేశాలకూ కూడా వలసలు పోతూ వుంటారు. సాధారణంగా కార్మికుల వలసలు - గ్రామాల నించి పట్టణాలకూ, వలస దేశాల నించి సామ్రాజ్యవాద దేశాలకూ, సాగుతాయి. వలస పోయే కార్మిక జనాభాలో, శారీరక శ్రమల కార్మికులూ, మేధాశ్రమల కార్మికులూ, అందులో అన్ని స్థాయిల వారూ కూడా వుంటారు. సామ్రాజ్య వాద దోపిడీ ఎక్కువవుతోన్న కొద్దీ, సామ్రాజ్యవాద దేశాలకు చేరే విదేశీ కార్మిక జనాభా కూడా ఎక్కువవుతూ వుంటుంది.

# సామ్రాజ్య వాదం, ఉన్నత మేధాశ్రమల్ని ఎలా లోబరుచుకుంటుంది?

ఏ దోపిడీ సమాజంలో అయినా (వెనకటి సమాజాలలో కూడా), 'ఉన్నత మేధా శ్రమల' సెక్షన్‌ని లోబరుచుకోవడానికి, అనేక రకాల ప్రత్యేక ఏర్పాట్లు వుంటాయి. ఆ ఏర్పాట్లు, పెట్టుబడిదారీ సమాజంలో మరింత ఎక్కువ స్థాయిలో వుంటాయి.

ఉత్పాదక కంపెనీల్లో, ఉత్పత్తి శక్తుల్ని పెంచడానికి, అనేక రకాల శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు అవసరం. దాని కోసం, ఉన్నత మేధాశ్రమల్ని మరింతగా లోబర్చుకోవలసి వుంటుంది. సామ్రాజ్య వాదంలో ఈ అవసరం మరీ ఎక్కువగా వుంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి శక్తులు పెరుగుతోన్న కొద్దీ 'అదనపు విలువ రేటు' పెరుగుతూ వుంటుందని (కార్మికులు పోగొట్టుకునే 'అదనపు ఉత్పత్తి రాసి' పెరుగుతూ వుంటుందని), మనకు తెలుసు.

సామ్రాజ్య వాద దేశం - ఒక పక్క, స్వంత కార్మిక వర్గం ఇచ్చే అదనపు విలువ గతంలో కన్నా పెరగడం ద్వారానూ; ఇంకో పక్క - వలసల్ని దోచడం ద్వారానూ, 'అపారమైన అదనపు విలువ రాసుల్ని' సంపాదిస్తూ వుంటుంది. ఇంటా బయటా సంపాదించే 'అదనపు విలువ'లో నించి కొంత భాగాన్ని తన దేశపు 'ఉన్నత మేధాశ్రమల సెక్షన్' కోసం, ఖర్చు పెడుతుంది. ఆ సెక్షన్‌కి అధిక జీతాలూ, అధిక సౌకర్యాలూ ఇవ్వడం ద్వారా ఆ పని చేస్తుంది. (అవార్డులూ, బిరుదులూ, సన్మానాలూ వంటివన్నీ కూడా దీని కోసమే. అది వేరే కోణం.) 'అత్యధిక జీతాల' వల్ల మేధాశ్రమల సెక్షను, సామ్రాజ్య వాదానికి అనుకూలంగా తయారై, నూతన శాస్త్ర, సాంకేతిక పరిశోధనలతో, యజమానుల వర్గా

నికి వినయంగా 'సేవ' చేసే సేవక వర్గంగా తయారవుతుంది.

'శ్రమ' చేసే వ్యక్తికి, ఆ శ్రమకు బదులుగా అందేది ఏ యే రూపాలతో అందినా అదంతా కలిసి - 'జీతం'. అది 'శ్రమ శక్తి విలువ'. అందకుండా పోయేది 'అదనపు విలువ'. అయితే ఇక్కడ, ఉన్నత మేధా శ్రమల సెక్షన్ జీతాల గురించి ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ జీతాలు కూడా 'శ్రమ శక్తి విలువేనా' అనే ప్రశ్న.

ఇతర సెక్షన్లలో కన్నా ఉన్నత మేధాశ్రమల సెక్షన్లలో, 'శ్రమ శక్తి'కి ఎక్కువ విలువ వుంటుందనే మాట నిజమే. కానీ, ఆ ఎక్కువ, ఎంత ఎక్కువ ? అది, 'అత్యధికంగా' వుండగలుగుతుందా?

ఉన్నత మేధా శ్రమల సెక్షను, తమ జీతాల్ని, 'సుఖంగా జీవించడానికి' మాత్రమే గాక, అనేక కంపెనీల్లో 'వాటాలు' కొనడానికీ, బ్యాంకుల్లో 'డిపాజిట్లు' పెట్టడానికీ, ఎన్నో ఇతర 'ఆస్తులు' సంపాదించడానికీ కూడా వాడగలుగుతుంది. ఈ సెక్షనుకు ఇంత అత్యధిక విలువ ఏ విధంగా అందుతుంది? (1) ఈ సెక్షను, 'అదనపు విలువ'ని పోగొట్టుకోదా? అంటే, దీని అదనపు విలువ అంతా దీనికే అందుతుందా? (2) 'అదనపు విలువ'ని పోగొట్టుకోక పోవడమే కాక ఈ సెక్షను, ఇంకా ఆ పైన కూడా కొంత విలువని తీసుకోగలుగుతుందా? అంటే, తమ దేశపు కార్మిక వర్గం లోని ఇతర సెక్షన్ల అదనపు విలువలో భాగాన్ని గానీ, వలస దేశాల కార్మిక వర్గం నించి లాక్కునే అదనపు విలువలో భాగాన్ని గానీ, తీసుకుంటుందా?- ఈ 2 విషయాల్లో ఏదో ఒకటి జరగకపోతే, 'శ్రమ శక్తి విలువ'ని మించిన అత్యధిక జీతం ఈ సెక్షన్‌కి ఎలా సాధ్యం?

మొదటి విషయమే జరుగుతోందనుకుందాం. అంటే, ఈ సెక్షను, తన అదనపు విలువని ఏ మాత్రమూ పోగొట్టుకోదు; అందుకే అత్యధిక జీతం తీసుకోగలుగుతుంది - అనుకుందాం. ఇదే జరుగుతూ వుంటే, ఇది మాత్రం ఎలా సాధ్యం? - స్వదేశీ, విదేశీ కార్మిక వర్గం లోని ఇతర సెక్షన్లన్నీ అపారమైన అదనపు విలువని సామ్రాజ్యవాద దేశానికి అప్పగిస్తూ వుండడం వల్లనే ఇది సాధ్యం. ఇతర కార్మిక సెక్షన్లన్నీ ఎంతో అదనపు విలువని పోగొట్టుకొంటూ వుండగా, ఒక సెక్షను మాత్రం ఆ పరిస్థితిలో లేకపోవడం అంటే, అదే ఆ సెక్షన్‌కి దొరికే ప్రత్యేకత. ఆ సెక్షను, పెట్టుబడిదారీ వర్గానికి లోబడి వుండడం కోసమే, దానికి ఆ ప్రత్యేకత దొరుకుతుంది. ఆ రకంగా, దాని 'అదనపు విలువ' అంతా దానికే అందుతుంది. ఈ ప్రత్యేకతని పొందే సెక్షను, సాధారణంగా 'కార్మిక వర్గం'తో గాక, 'యజమానుల వర్గం'తోనే ఐక్యంగా వుంటుంది.

ఉన్నత మేధా శ్రమల కార్మికులు, ఇతర స్థాయిల కార్మికుల నించి 'దూరంగా' వుండడం అన్ని సమాజాల లోనూ జరిగేదే. కానీ, ఈ 'దూరం', సామ్రాజ్య వాదంలో మరింత పెరిగిపోతుంది. సామ్రాజ్య వాదం, ఉన్నత మేధా శ్రమల కార్మికుల్ని తన లాగే 'అవకాశ వాదులు' గానూ, 'స్వలాభ పరులు' గానూ, తయారు చేస్తుంది.

# సామ్రాజ్యవాదానికి, పాత, కొత్త, సరికొత్త రూపాలు!

విదేశాల మీద, సైన్యాలతో దండెత్తి, ఆ దేశాల్ని లోబరుచుకుని ఏటా 'కప్పాలు' వసూలు చెయ్యడం - పాత కాలపు సామ్రాజ్య వాదం అని చూశాం. పెట్టుబడిదారీ కాలపు సామ్రాజ్య వాదం, 'వలసల' నించి లాభాలూ వడ్డీలూ సంపాదిస్తూ, ఆ దోపిడీ సాగడానికి కావలసిన విధంగా వలసల్ని 'పరిపాలిస్తూ' సాగుతుంది.

పాత, కొత్త సామ్రాజ్య వాదాలకు తేడా - 'రూపం'లో మాత్రమే. 'సారం'లో రెండూ ఒకటే. వలసల్ని దోచడమే ఆ సారం (వలస దేశాల శ్రామిక జనాల్ని దోచడం).

కొత్త సామ్రాజ్యవాదం, క్రమంగా మరింత కొత్త కొత్త రూపాల లోకి కూడా మారుతూ వచ్చింది. ఇంకా మారుతూనే వుంది.

ఏ 'దుష్టత్వం' అయినా, దాని మీద ఏ పోరాటమూ లేకపోతే, అది పాత రూపం లోనే వుంటుంది. దాని మీద పోరాటాలు ప్రారంభమైతే, దాని రూపమూ సారమూ కూడా ఎంతో కొంత మారడం మొదలవు

తుంది. కానీ, దాని మీద జరిగే పోరాటం ఎంత సరైన మార్గంలో జరగాలో అలా జరగకపోతే, అది 'రూపం' మాత్రమే మారుస్తుంది. సారాంశం మారదు. సామ్రాజ్య వాదం కూడా అంతే. దాని మీద పోరాటమే లేకపోతే, రూపాలు మార్చే అవసరం కూడా దానికి వుండదు. కానీ దాని మీద ఎంతో కొంత పోరాటం అనేది వుంటుంది కాబట్టే, ఆ పోరాటం ఎంత అస్తవ్యస్తంగా వున్నా, దాని ఒత్తిడికి, సామ్రాజ్యవాదం, పాత రూపాన్ని వదిలి, కొత్త రూపం ఎంచుకుంటుంది. ఆ కొత్త రూపం మీద కూడా పోరాటం తలెత్తినప్పుడు, మరో కొత్త రూపం! 'రూపాల' మీద గాక, అసలు 'స్వభావం' మీదే పోరాటం తలెత్తినప్పుడు, అన్ని రూపాలూ అంతర్ధానమై, 'సామ్రాజ్యవాద ఆధిపత్యం' అనే విషయం కూడా అంతర్ధానమవుతుంది. అప్పటి వరకూ సామ్రాజ్య వాదం ఏదో ఒక రూపంలో వుంటూనే వుంటుంది.

ఒక సామ్రాజ్యవాద దేశం, ఒక వలస దేశాన్ని కొంత కాలం పాటు తనే స్వయంగా పరిపాలించి, తర్వాత తనే పరిపాలించే అధికారాన్ని వదిలి వేసిందనుకుందాం. తర్వాత, ఉదాహరణ అంతా ఇలా వుందనుకుందాం: వలస దేశపు 'దోపిడీ వర్గమే' దేశ పరిపాలన ప్రారంభించింది. వలస దేశం, 'స్వతంత్ర దేశం అయినట్టుగా', ఆ నూతన ప్రభుత్వం, ప్రకటించింది.

అయితే, ఆ వలస దేశంలో ఎప్పటి నించో వున్న సామ్రాజ్యవాద దేశపు పెట్టుబడులన్నీ, ఆ దేశపు యాజమాన్యం తోనే, ఈ 'స్వతంత్ర' దేశంలో వున్నాయి! ఆ పెట్టుబడుల ద్వారా సామ్రాజ్యవాద దేశం, లాభాలూ వడ్డీలూ ఇప్పుడు కూడా తీసుకుపోతూనే వుంది! అంతే కాదు, ఆ దేశాల మధ్య 'వర్తకం'లో ఇప్పుడు కూడా 'అసమాన' మారకాలే జరుగుతున్నాయి! ఇప్పుడు కూడా సామ్రాజ్యవాద దేశపు కొత్త కంపెనీలూ, వాటి శాఖలూ, ఈ స్వతంత్ర దేశంలో ప్రారంభమవుతూనే వున్నాయి! - ఈ పరిస్తితులన్నీ ఇలాగే కొనసాగుతూ, ఈ దేశాల సంబంధాలు గతంలో లాగే నడవడానికి (ఏవో చిన్న చిన్న మార్పులతో), ఈ 'స్వతంత్ర' దేశపు పాలక వర్గం అంగీకరించింది! ఆ ఒప్పందం మీదే సామ్రాజ్యవాద దేశం, ఈ వలసని 'పరిపాలించే పని' వదులుకుని, ఆ పనిని వలస దేశపు దోపిడీ వర్గానికి ఇచ్చింది. అప్పటి నించీ ఈ దేశపు భూస్వాములూ, పెట్టుబడిదారులూ, ఈ దేశపు 'రాజకీయాధికారాన్ని' చేపట్టి, ఈ దేశం 'స్వతంత్ర దేశం'గా మారిందని ప్రకటించారు! 'స్వతంత్రత' అంటే ఏమిటో తెలియని శ్రామిక ప్రజలు, తమ దేశానికి ఏదో 'మంచి' జరిగిందని 'యజమానులు' చెపుతున్నారు కాబట్టి, వినయ విధేయతలతో సంతోషించారు. ఇదంతా ఇలా జరిగితే, ఈ మార్పుకి అర్థమేమిటి? వలస దేశం, నిజంగా 'స్వతంత్ర దేశం' అయి నట్టేనా? - కాదు. ఈ మార్పు అసలు మార్పే కాదు. సామ్రాజ్య వాద దేశానికి కావలసిన లాభాలూ, వడ్డీలూ ఈ 'స్వతంత్ర' దేశం నించి కూడా ఎప్పటి లాగే అందుతున్నాయి. ఈ రకంగా, ఇప్పుడు కూడా సామ్రాజ్యవాద దేశం, రెండో దేశాన్ని దోపిడీ చెయ్యగలుగుతోంటే, దీని వల్ల 2 దేశాల మధ్యా జరిగిన నిజమైన మార్పేమిటి? - ఏమీ లేదు.

ఇప్పుడు 2 దేశాల మధ్యా జరిగిందేమిటంటే - సామ్రాజ్యవాద దేశం, వలస దేశాన్ని గతంలో 'ప్రత్యక్షం'గా పరిపాలిస్తే, ఇప్పుడు 'పరోక్షం'గా పరిపాలిస్తోంది. ఇదే దాని అర్థం. వలస దేశపు దోపిడీ వర్గంలో మెజారిటీ సంఖ్య, ఆ సామ్రాజ్యవాద దేశానికి, ఇప్పుడు కూడా దళారులు గానే వున్నారని కూడా దాని అర్థం. వలస దేశపు పరిపాలనా రంగపు గద్దెల మీదకి, విదేశీయులు మారి, నిలువెల్లా విదేశీ దాస్యంతో నిండిన స్వదేశీయులు రావడం తప్ప, మిగిలిన మార్పులేమీ జరగలేదని దాని అర్థం. - ఈ రకంగా, 'సారాంశం' ఏమీ మారలేదు. అయినా వలస దేశం, 'స్వతంత్ర' దేశంగా మారిపోయినట్టు పైకి కనపడుతూ వుంటుంది. ఇది, 'సామ్రాజ్య - వలస' సంబంధాలకు ఇంకో రూపం మాత్రమే.

ఒక వలస దేశం, ఒక సామ్రాజ్యవాద దేశపు ఆధిపత్యం కింద వుందంటే, ఇతర సామ్రాజ్య వాద దేశాలన్నీ ఆ 'వలస' మీద ఆశలు పూర్తిగా వదులుకుని వూరుకోవు. 'అవకాశాల' కోసం ప్రయత్నిస్తూనే వుంటాయి. వలస దేశపు దోపిడీ వర్గంలో వున్న గ్రూపులన్నీ, ఒకే సామ్రాజ్య వాద దేశానికి దళారులుగా వుండరు. వేరు వేరు గ్రూపులు, వేరు వేరు సామ్రాజ్య వాద దేశాలకు అనుకూలంగా వుంటారు.

ఒక వలస దేశంలో, 'స్వతంత్రత' అనేది, ప్రారంభమైన తర్వాత, అక్కడికి ఇతర సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడులు కూడా ప్రవహించవచ్చు. ఆ రకంగా, ఆ 'స్వతంత్ర' దేశం, వేరు వేరు సామ్రాజ్య వాద దేశాలకు 'పరోక్ష వలస'గా మారవచ్చు. ఇది సామ్రాజ్య వాదానికి మరో రూపం.

A దేశం సామ్రాజ్యవాద దేశం, B దేశం నామ మాత్రపు స్వతంత్రత పొందిన వలస దేశం - అనుకుందాం. ఇప్పుడు A దేశం, B దేశంలో, తన యాజమాన్యం తోనే స్వంత కంపెనీలు స్థాపించడానికి అవకాశం లేకపోతే, B దేశపు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలతో కలిసి 'మిశ్రమ కంపెనీలు' ప్రారంభిస్తుంది.

B దేశం, A దేశం నించి సాంకేతిక విషయాల లైసెన్సులూ, టెక్నిక్కులూ, పేటెంటులూ, ట్రేడ్ మార్కులూ వగైరాల్ని భారీ ధరలు చెల్లించి కొంటుంది. కొన్నిటికి రెగ్యులర్‌గా ఫీజులు చెల్లిస్తూ వుంటుంది. - ఈ రకంగా, A దేశం, B నించి రక రకాల పేర్లతో ఆదాయాలు తీసుకు పోతూ వుంటుంది.

B దేశం, A దేశంతో 'సైనిక ఒప్పందాల'తో కూడా వుండవచ్చు. ఈ ఒప్పందాలన్నీ A దేశానికే అనుకూలంగా వుంటాయి.

A దేశపు కంపెనీలూ, బ్యాంకులూ, B దేశంలో వుంటాయి. ఆ 'విదేశీ పెట్టుబడుల్ని' B దేశం స్వాధీనం చేసుకోకుండా వుండడానికి, ఎలాంటి రాజకీయ ఒప్పందాలూ, సైనిక ఒప్పందాలూ అవసరమో అలాంటి వాటిని A దేశం, B తో చేసుకుంటుంది. B దేశం గనక, ఆ ఒప్పందాల్ని అధిగమిస్తే, B దేశం మీద దండెత్తడానికి, A దేశం సిద్ధంగా వుంటుంది.

వలస దేశపు కార్మిక వర్గం, ఆ వలస దేశంలో వున్న సామ్రాజ్య వాద దేశపు పెట్టుబడుల్ని స్వాధీనం చేసుకునే ప్రమాదం ఎన్నటికీ ఏర్పడదని, సామ్రాజ్య వాదులకు నమ్మకం కలిగించవలసిన బాధ్యత వలస దేశ దళారీ ప్రభుత్వం మీద పడుతుంది. ఆ ప్రభుత్వం, తన కార్మిక వర్గంతో తను ఎంత కఠినంగా వుండగలదో నిరూపించుకునే చర్యలు చేపడుతుంది. తన కార్మిక వర్గాన్ని మరింత అదుపాజ్ఞల్లో పెట్టే, వారి హక్కుల్ని మరింత సంకుచిత పరిచే కొత్త చట్టాలు (సామ్రాజ్య వాదులు కోరిన చట్టాలు) చేసి చూపిస్తుంది.

A దేశం, B దేశపు శ్రామిక జనాభాని మోసం చెయ్యడం కోసం, B దేశానికి, అప్పుడప్పుడూ, దానాలూ - ధర్మాలూ - గ్రాంట్లూ పడేస్తూ వుంటుంది. (B దేశం నించి దోచుకున్న దాంట్లో ఒక ముక్క అది.) ఆ దానాల ద్వారా A దేశం, B దేశం అంటే తన కెంతో ప్రేమ వున్నట్టు, B దేశ ప్రజలకు భ్రమ కల్పిస్తూ వుంటుంది.

A దేశం, తన దగ్గిర అమ్మకాలు లేక, మూలపడి ముక్కిన, కుళ్ళిన, ఏ జొన్న పిండినో, పాల పిండినో, గోధుమ పిండినో, రొట్టె ముక్కలనో, B దేశానికి ధర్మం చేస్తూ, 'B దేశపు మాతా శిశువుల మీద' దయా రసం కురిపిస్తుంది.

A దేశం, B దేశానికి ఇచ్చే డబ్బు అప్పుల్ని, 'B దేశపు అవసరాలకు ఆదుకుంటూ మిత్ర దేశం చేస్తోన్న సహాయంగా' 2 దేశాలూ తమ శ్రామిక జనాభా ముందు చిత్రిస్తాయి.

పెట్టుబడిదారీ దేశాలన్నీ తమ 'డిపాజిట్ల'తో, 'ప్రపంచ బ్యాంకు' అనే అంతర్జాతీయ 'గుత్త బ్యాంకు'ని స్థాపించి, ఆ బ్యాంకు ద్వారా ప్రపంచ దేశాలకు అప్పులు ఇవ్వడం - అంటే, 'అప్పులు' ఇచ్చే మార్కెట్‌ని పెట్టుబడిదారీ దేశాలన్నీ ఆ మార్గంలో పంచుకుంటున్నాయని అర్థం. అందులో విదేశీ సేవలూ, ప్రపంచ సేవలూ, ఏమీ లేవు. ఉన్నదంతా స్వంత పెట్టుబడుల సేవలే.

ఇవన్నీ సామ్రాజ్య వాదానికి కొత్త కొత్త రూపాలే. ఏ రూపం ఎత్తినా, 'పెట్టుబడి' చేసే పని - లాభాలూ వడ్డీలూ సంపాదించడమే.

ఒక దేశం, ఏ కారణాల వల్ల గానీ, ఏ అవసరాల వల్ల గానీ, ఏ ఒప్పందాల వల్ల గానీ, విదేశాలకు లోబడి వున్నదంటే, ఆ దేశం తనని తను ఎంత స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నా, అది నిజమైన స్వతంత్రం కాదు! అది ఇంకా వలస దేశం గానే వున్నట్టు అర్థం. ప్రత్యక్ష వలస కాకపోతే, పరోక్ష వలస! పాత రకం వలస కాకపోతే, కొత్త రకం వలస! ఈ రకంగా, ఒక దేశపు స్వతంత్రత, అనేక రకాల ఆధిపత్యాలకు లోబడి వుండవచ్చు. కాబట్టి, ఒక వలస దేశం మీద, సామ్రాజ్యవాద దేశపు ప్రత్యక్ష పరిపాలన లేనంత మాత్రాన, ఆ దేశం నిజంగా స్వతంత్ర దేశం అయినట్టు అర్థం కాదు.

ఒక దేశం మీద, ఇతర దేశాల ఆధిపత్యాలు ఏ మాత్రమూ లేకుండా, ఆ దేశాన్ని ఆ దేశపు దోపిడీ వర్గమే సంపూర్ణమైన అధికారంతో పరిపాలిస్తున్న దనుకుందాం. ఆ దేశం నించి, ఏ విదేశమూ లాభాలూ వడ్డీలూ దోచుకు పోవడం లేదనుకుందాం. ఆ దేశం 'స్వతంత్ర దేశం' అయినట్టేనా? - కొంత వరకూ అయినట్టే. ఇంకా పూర్తిగా కాదు. విదేశీ దోపిడీ ఆగిపోతే, విదేశాలు దోచుకుపోతున్నదంతా స్వదేశీ దోపిడీ వర్గానికే వుండి పోతుంది. కాబట్టి, ఆ వర్గానికి అది స్వతంత్రతే. కానీ, ఆ దేశపు శ్రామిక వర్గానికి, ఇంకా అది స్వతంత్రత కాదు. దానికి ఇంకా అది దాస్యమే.

# వలసల అభివృద్ధి

ఒక దేశపు 'ఆర్థిక రంగం' మీద, ఇంకో దేశానికి ఆధిపత్యం వున్నప్పుడు, ఆ ఆధిపత్యం ఆర్థిక రంగం మీదే గాక అన్ని రంగాల మీదా వుంటుంది. అయినప్పటికీ, సామ్రాజ్యవాద దేశం వల్ల, వలస దేశానికి జరిగే ఒక రకపు 'మేలు' ఏమిటంటే, అభివృద్ధి చెందిన శాస్త్ర, సాంకేతిక విషయాలతో వలస దేశానికి కనీసంగానైనా సంబంధం ఏర్పడుతుంది.

సామ్రాజ్యవాద దేశం, వలస దేశంలో రైలు మార్గాల నిర్మాణం ప్రారంభించిం దనుకుందాం. ఆ పని కోసం సామ్రాజ్యవాద దేశపు కంపెనీలు తమ ఇనప బద్దీలూ, రైలు ఇంజన్లూ, ఇంకా అనేక ఇతర పరికరాలూ అమ్ముకోగలుగుతాయి. సామ్రాజ్య వాద దేశం, వలస దేశం నించి తన పరిశ్రమలకు అవసర మైన ముడి పదార్థాల్ని ఆ రైలు మార్గాల ద్వారా సముద్ర తీరాలకు తరలించగలుగుతుంది. అక్కడి నించి ఆ ముడి పదార్థాల్ని ఓడల్లో తన దేశానికి తీసుకు పోగలుగుతుంది. ఈ రకంగా, సామ్రాజ్యవాద దేశం వలస దేశంలో రైలు మార్గాల పని ప్రారంభించేది తన ప్రయోజనాల కోసమే గానీ, వలస దేశాన్ని అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కాదు. అయినప్పటికీ, అది, వలస దేశానికి కూడా ఎంతో కొంత అభివృద్ధి గానే వుంటుంది. వలస దేశంలో మనుషుల ప్రయాణాలకూ, సరుకుల రవాణాకీ కూడా రైళ్ళు ఉపయోగ పడతాయి. (ఈ ఉపయోగాలు, వలస దేశపు దోపిడీ వర్గానికి అందిన దాంట్లో వెయ్యో వంతు కూడా శ్రామిక వర్గానికి అందక పోయినప్పటికీ.) 'రైలు' అనే భారీ యంత్రానికి సంబంధించిన శాస్త్ర, సాంకేతిక జ్ఞానాలు వలస దేశపు శ్రామిక వర్గానికి కూడా అందు బాటు లోకి వస్తాయి. ఈ రకంగా, ఇది వలస దేశానికి కూడా అభివృద్ధి గానే వుంటుంది.

అయితే, ఒక దేశానికి ఈ సైన్సు జ్ఞానం అందాలంటే, ఆ దేశం 'వలస దేశం'గా మారనక్కర లేదు. అది వలసగా మారకుండానే, అది ఆ జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు. పెట్టుబడిదారీ దేశాలు ఎన్నడూ వలసలుగా లేకుండానే ఎలాగైతే శాస్త్ర జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకున్నాయో అలాగే, 'ఇతర దేశాల' విషయంలో కూడా జరగవచ్చు. కానీ, పెట్టుబడిదారీ దేశాలు, ఆ ఇతర దేశాల్ని వలసలుగా ఆక్రమించడం వల్ల, ఇక అప్పటి నించి వలస దేశాల అభివృద్ధి అంతా వాటిని ఆక్రమించిన దేశాల ప్రయోజనాలకు లోబడి మాత్రమే సాగుతూ వుంటుంది.

వలస దేశాల్లో పరిశ్రమలు, విదేశీ కంపెనీలకు కావలసిన 'ముడి పదార్థాల్ని' ఉత్పత్తి చేసే పరిశ్రమలు గానూ, విదేశీ కంపెనీల ద్వారా ఉత్పత్తి అయ్యే సరుకులకు మార్కెట్‌ని కల్పించే (ఆ సరుకుల్ని తమ 'ఉత్పత్తి క్రమా'ల్లోకి తీసుకునే) పరిశ్రమలు గానూ మాత్రమే అభివృద్ధి చెందుతాయి.

విదేశీ సిగరెట్ కంపెనీల కోసం వలస దేశపు భూముల్లో పొగాకు పండుతుంది. విదేశీ బట్టల మిల్లుల కోసం, వలస దేశపు భూముల్లో పత్తి పండుతుంది. విదేశీ కంపెనీలు ఉత్పత్తి చేసే ట్రాక్టర్లూ, రసాయనిక ఎరువులూ, క్రిమి సంహారక మందులూ వగైరా సరుకులకు మార్కెట్ ఏర్పడే విధంగా వలస దేశపు వ్యవసాయ రంగం మార్పులు చెందుతుంది. - ఇలాగే, ఇతర విషయాలన్నీ కూడా.

పెట్టుబడిదారీ విధానం, శాస్త్ర సాంకేతిక అంశాల్ని, 'పెట్టుబడి' ప్రయోజనాలకు అనుకూలంగానే రూపొందిస్తుంది. 'యంత్రం' అనే దాన్ని, శ్రమ చేసే మనిషికి 'సౌఖ్యంగా' వుండే విధంగానూ రూపొందించవచ్చు; లేదా, శ్రమ చేసే మనిషి కదలికలు ఎక్కువ వేగంగా జరిగే విధంగానూ రూపొందించవచ్చు. రెండో విధానం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ పని జరుగుతుంది. పెట్టుబడిదారీ 'సాంకేతికత' (టెక్నిక్) ఎప్పుడూ రెండో లక్ష్యం తోటే వుంటుంది. గతంలో కన్నా తక్కువ కాలంలో, గతంలో కన్నా ఎక్కువ శ్రమని లాగే లక్ష్యంతో. ఈ సాంకేతికత, శ్రమ చేసే మనిషి శారీరక, మానసిక ఆరోగ్యాల్ని ధ్వంసం చేస్తుంది. సామ్రాజ్యవాద దేశం నించి ఈ రకం టెక్నిక్కులే వలస దేశాలకు ప్రవహిస్తూ వుంటాయి. - ఈ రకంగా, సామ్రాజ్యవాదం వల్ల వలస దేశపు అభివృద్ధి, స్వతంత్రమైన అభివృద్ధిగా గాక, అనేక సంకెళ్ళలో బందీ అయిపోయిన అభివృద్ధిగా వుంటుంది. సామ్రాజ్యవాద దేశంతో సంబంధాల వల్ల, వలస దేశాలు కూడా 'అభివృద్ధి' చెందుతాయి. కానీ, ఆ అభివృద్ధి సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలకు లోబడి మాత్రమే వుంటుంది.

సామ్రాజ్యవాద దేశానికి కావలసిన వ్యవసాయ ముడి పదార్థాల్లో చాలా భాగం వలస దేశాల నించి అందుతూ వుంటాయి కాబట్టి, సామ్రాజ్య వాద దేశంలో కొత్తగా సాగులోకి వచ్చే భూమి శాతం తగ్గి, పెట్టుబడి దారుల క్రీడలకూ, వేటలకూ, వినోదాలకూ కేటాయించే భూమి శాతం పెరుగుతూ వుంటుంది. ప్రతీ సామ్రాజ్యవాద దేశమూ గుర్రప్పందాలూ, ఎద్దుల పందాలూ, నక్కల వేటలూ, కుక్కల వేటలూ - వంటి క్రూర వినోదాల మీద వందల, వేల ఎకరాల భూమినీ; కోట్ల కోట్ల డబ్బునీ, ఏటా ఖర్చు చేస్తూ వుంటుంది. సామ్రాజ్యవాద దేశంలో, మొత్తం జనాభాలో, 'ఉత్పాదక రంగం'లో వుండే జనాభా శాతం క్రమంగా తగ్గుతూ, విలాసాల తోటీ వినోదాల తోటీ కాలక్షేపం చేసే దోపిడీదార్ల గుంపులు పెరుగుతూ వుంటాయి.

# ప్రపంచ విభజనా, పునర్ విభజనా

'ప్రపంచం' అంతా సామ్రాజ్యవాద దేశాలు గానూ, వాటి వలసలు గానూ - వుందనుకుందాం. అంటే, సామ్రాజ్యవాద దేశాలు కాని భూ భాగాలన్నీ, సామ్రాజ్య వాద దేశాల మధ్య పంపకం అయిపోయి వున్నాయి - అనుకుందాం. ఆ ఆక్రమణల పాళ్ళు అలాగే వుండి పోవు. ప్రతీ సామ్రాజ్య వాద దేశమూ, తన చేతిలో వున్న వలసల్ని స్థిరంగా నిలబెట్టుకోవడానికీ, అంతకన్నా ఇంకా ఎక్కువ వలస భూమిని సంపాదించడానికీ, ప్రయత్నిస్తూనే వుంటుంది. అప్పటికే పంపకం అయి పోయి వున్న ప్రపంచంలో, ఒక సామ్రాజ్యవాద దేశానికి కొత్త వలస భూమి కావాలంటే దానికి మార్గం, ఇతర సామ్రాజ్యవాద దేశాల అధీనంలో వున్న భూమిని లాక్కోవడమే.

ప్రపంచం అంతా ఒక సారి విభజన అయిన తర్వాత ఇక జరగ వలసింది - 'పునర్ విభజన' మాత్రమే. మార్కెట్ల పునర్ విభజన కోసం జరిగే పోరాటాలే ప్రాంతీయ యుద్ధాలకూ, ప్రపంచ యుద్ధాలకూ దారి తీస్తూ వుంటాయి.

అంతర్జాతీయ గుత్త కంపెనీలు, 20 వ శతాబ్దపు ప్రారంభం నాటికి ప్రపంచాన్నంతా మొదటి సారిగా తమలో పంచేసుకున్నాయి! ఎవరికి సాధ్యమైన దాన్ని వాళ్ళు లాగేసుకున్నారు. అప్పటికి, 'భూగోళం' అంతా, (1) సామ్రాజ్యవాద దేశాలూ (2) వాటి వలసలూ - అనే భాగాలుగా అయిపోయింది. ఇదో అదో కాని భూభాగం ఏదీ మిగిలి లేదు.

**'భూ మండలం'లో మొత్తం భూమి వైశాల్యం - 13 కోట్ల, 30 లక్షల చదరపు కిలోమీటర్లు. 20 వ శతాబ్దపు ప్రారంభానికి - 8 కోట్ల, 90 లక్షల చ.కి.మీ. భూమి, వలసలుగా వుంది! మిగిలిన 4 కోట్ల 40 లక్షల చ.కి. మీటర్లు, సామ్రాజ్యవాద దేశాల భూభాగం! అంటే, సామ్రాజ్యవాద దేశాలన్నీ కలిసి తమ వైశాల్యం కన్నా 2 రెట్లు వైశాల్యం గల భూమిని వలసలుగా ఆక్రమించాయన్న మాట!**

అందులో కొన్ని దేశాలు ఎక్కువ భూమినీ, కొన్ని దేశాలు తక్కువ భూమినీ, లాక్కో గలిగాయి. ప్రతీ సామ్రాజ్యవాద దేశమూ, తమ ట్రస్టులూ, కార్టెళ్ళూ వంటి గుత్త కంపెనీలు చేసే వర్తకాల ద్వారానూ, పెట్టుబడుల ఎగుమతుల ద్వారానూ, తన వలసల మీద గుత్తాధిపత్యంతో వుంది.

ఇలా, ఇతర దేశాల్ని వలసలుగా లాక్కోవడం ప్రపంచమంతా అనేక యుద్ధాల ద్వారానే జరిగింది. ఎవరికి దొరికింది వాళ్ళు లాక్కోగలిగిన తర్వాత కూడా - ఆ పరిస్తితి అలాగే ఆగిపోలేదు. వలసల 'పునర్విభజన' కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య ఇంకా అనేక యుద్ధాలు జరిగాయి; జరుగుతున్నాయి.

కొన్ని సామ్రాజ్యవాద దేశాల మధ్య ఒక యుద్ధం తర్వాత ఏం జరిగిందో చూస్తే, గెలిచిన దేశాలు ఓడిన దేశాల నించి అనేకమైన వాటిని లాక్కోవడమే కనపడుతుంది.

గెలిచిన దేశం, ఓడిన దేశం నించి ప్రధానంగా, 'భూమి'ని లాక్కుంటుంది. వెండి బంగారాలతో సహా అనేక ఉత్పత్తుల్ని లాక్కుంటుంది. ఓడిన దేశం మీద అనేక కొత్త షరతులు విధిస్తుంది. యుద్ధ ఖర్చుల్లో ఎక్కువ భాగాన్ని ఓడిన దేశం మీదకి గెంటుతుంది. ఓడిన దేశం, ఆ ఖర్చుని అనేక సంవత్సరాల పాటు చెల్లించవలసి వుంటుంది. మొత్తం మీద ఓడిన దేశం, అనేక విధాలుగా నష్టాల పాలైపోతుంది.

అయితే, ఈ 'ఓడిన' సామ్రాజ్యవాద దేశపు కష్టాలు చూసి ప్రపంచ శ్రామిక జనాలు కన్నీరు కార్చ

నక్కరలేదు. ఈ దేశమే గెలిచి వుంటే, అది కూడా ఇప్పుడు గెలిచిన దేశాలు చేసిన పనే చేస్తుంది. ఇదేమీ వాటి కన్నా 'ఉత్తమురాలు' కాదు. ఇది యుద్ధ నష్టాలన్నీ భరిస్తూ, మళ్ళీ ఇంకో యుద్ధంలో గెలిచే అవ కాశం కోసం ఎదురు తెన్నులు చూస్తూ, దాని కోసం కొత్త శక్తి సంపాదించే ప్రయత్నాలు చేస్తూ వుంటుంది.

[ ఒక యుద్ధం ముగిసిన తర్వాత, ఆ యుద్ధం చేసిన దేశాల మధ్య ఏం జరుగుతుందో, ఈ చాప్టరు తర్వాత 'అనుబంధం' చూడండి!]

ఒక యుద్ధం వల్ల గుత్త కంపెనీల పెట్టుబడులకు జరిగే నష్టాల సంగతి అలా వుంచుదాం. కార్మిక వర్గానికి జరిగే నష్టాలు అపారం. ఆ యుద్ధ స్థాయిని బట్టి ఇరు పక్షాల లోనూ లక్షల, కోట్ల సైనికులు కుంటి వాళ్ళూ, గుడ్డి వాళ్ళూ, రోగిస్టులూ, పిచ్చి వాళ్ళూ, అవుతారు. సైనికులే గాక, సాధారణ శ్రామిక జనాభా కూడా ఆకలి తోటీ, జబ్బుల తోటీ నాశనమవుతారు. ఇరు పక్షాలా, దాడులతో వందల, వేల వూళ్ళూ, ఇళ్ళూ, ఉత్పత్తి స్థలాలూ, రహదారులూ, పంట చేలూ, చెరువులూ, కాలవలూ, వంతెనలూ అన్నీ, సర్వనాశన మవుతాయి. తల్లిదండ్రులు పోయి పిల్లలూ, పిల్లలు పోయి తల్లిదండ్రులూ, వేల లక్షల సంఖ్యలో అనాథ లవుతారు. ప్రతీ యుద్ధమూ, అంగ వికలుల్నీ, రోగి స్టుల్నీ, అనాథల్నీ కుప్పతెప్పలుగా ఉత్పత్తి చేస్తుంది. యుద్ధం ముగిసే నాటికి అంతా బీభత్సంగా తయారవు తుంది. ఈ బీభత్సం నించీ, ఈ హత్యాకాండల నించీ, - 'గెలిచిన' సామ్రాజ్యవాద దేశం సాధించేదేమిటంటే - కొన్ని కొత్త మార్కెట్లు! కొన్ని కొత్త వలస ప్రాంతాలు! కొన్ని కొత్త ఒప్పందాలు!

# ఎంత ఆలశ్యమో!

సమాజంలో 'శ్రమ దోపిడీ జరుగుతోంద'నే సత్యం మార్క్సు ద్వారా (1867లో, 'కాపిటల్' పుస్తకం ద్వారా) బయటపడే నాటికి, దాదాపు పెట్టుబడిదారీ దేశాలన్నీ వలసల్ని ఆక్రమించి వున్నాయి! ఆ 'దశ'లో మాత్రమే మొట్ట మొదటి సారిగా 'దోపిడీ రహస్యం' బయటపడింది! ఎంత ఆలశ్యమో! చెప్పలేనంత ఆలస్యం!

'దోపిడీ' అనేది, బానిస సమాజ కాలం నించీ జరుగుతోనే వున్నా, ఆ నిజాన్ని గ్రహించడానికి కావల సిన భౌతిక పరిస్థితి 'పెట్టుబడిదారీ విధానం' లోనే ఏర్పడిందని ఇంతకు ముందే చూశాం. పెట్టుబడిదారీ విధానం, 'సరుకు' ఉత్పత్తి విధానం. ఈ విధానంలో, సరుకు కోసం ఖర్చయిన అంశాల ధరలూ, వాటితో తయారైన కొత్త సరుకు ధరా - అన్నీ 'డబ్బు లెక్కల' రూపంలో ప్రత్యక్షంగా వుంటాయి. ఆ రకంగా, వెనకటి సమాజాల్లో లేని నూతన పరిస్థితి ఇక్కడ ఏర్పడి వుంటుంది. ఇక అప్పుడు కావలసిందంతా - ఆ అంశా లన్నింటినీ 'తార్కికంగా' పరిశీలించగల మేధస్సూ, ఆ పరిశీలనలో నించి బయటపడే 'సత్యాన్ని' స్వీకరించ గల దృక్పథమూ! అలాంటి పరిశీలన జరిగినప్పుడు, అది, 'విలువ' అంటే ఏమిటో, సరుకుకి 'విలువ' ఎలా ఏర్పడుతుందో అర్థం చేసుకోగలుగుతుంది. ఆ 'తర్కం' చివరికి 'శ్రమ దోపిడీ'ని పట్టుకో గలుగు తుంది.

కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ - ఇవే దోపిడీ జరిగే మార్గాలు! వీటన్నిటికీ మూలం - శ్రామిక వర్గపు 'అదనపు విలువ'!

దీనిని గ్రహించే పనే మార్క్సు ద్వారా జరిగింది!

మానవ సమాజ చరిత్రలో దోపిడీ ప్రారంభమై కొన్ని వేల సంవత్సరాలు గడిచిన తర్వాతే ఆ రహస్యం మానవ మేధస్సుకి అందింది!

> "'విలువ రూపం' అనేది - దేని రూపం అయితే పూర్తిగా అభివృద్ధి చెంది 'డబ్బు రూపం'గా అవుతుందో అది, గ్రహించడానికి చాలా ప్రాథమికమైనదే. అయినప్పటికీ, దాని మూలాన్ని చేరడానికి, మానవ మేధస్సు 2 వేల సంవత్సరాలకు పైగా ప్రయత్నిస్తూ, విఫల మవుతూ వచ్చింది. ఇంకో వైపేమో అది, ఎక్కువ మిశ్రమం గానూ (కాంపోజిట్), క్లిష్టం గానూ (కాంప్లెక్స్) వున్న రూపాల విజయవంతమైన విశ్లేషణ కోసం చేసిన ప్రయత్నంలో కనీసం దరిదాపులకు చేరింది" - మార్క్స్ [కాపిటల్ - 1, పేజీ 19; జూలై 25, 1867లో రాసిన మొదటి ముందు మాట, మాస్కో ఎడిషన్ - 1974]

"డబ్బు అంటే ఏమిటి? సరుకుని అమ్మినప్పుడు, సరుకుకి బదులుగా వచ్చే 'డబ్బు' ఏమిటి? అది దేని కోసం వస్తోంది?" అనే రకం ప్రశ్నలు ప్రారంభించింది మొట్టమొదట ఆరిస్టాటిల్ (క్రీ. పూ. 384 - 322).

'డబ్బు' అంటే, ఏమిటో సంపూర్ణంగా విశ్లేషించింది - 1867లో మార్క్స్. మధ్య కాలంలో, 'డబ్బు' గురించి అనేక మంది అనేక రకాలుగా ఆలోచించారు. డబ్బు అంటే, మారకాలకు మధ్యవర్తిగా వుండే సాధనం (మీడియమ్) అన్నంత వరకే ఆ ఆలోచనలు సాగాయి. కానీ, డబ్బు, 'మారకాల సాధనం'గా పని చేసేది తన 'పేరు'తో కాదు; తన 'గుణం'తో! ఆ గుణం, శ్రమే. డబ్బు కూడా 'శ్రమ'తో తయారైన ఒక వస్తువు. సమాజంలో వున్న సమస్త వస్తువులూ ఏ 'ఏకైక' వస్తువుతో అయితే మారతాయో ఆ వస్తువే 'డబ్బు'. కాబట్టి, 'డబ్బు' అనేది, 'విలువ'కి 'జనరల్ రూపం'. 'విలువ' అంటే, ఏ ప్రత్యేక రూపమూ లేని, 'పరిమాణం' మాత్రమే వున్న 'శ్రమ'. సరుకుకి వున్న విలువ - సరుకుకి వున్న 'శ్రమ మొత్తమే'. మొదట ఈ విషయాలు గ్రహించగలిగినప్పుడే, సరుకు విలువలో వుండే 'అదనపు విలువ' భాగాన్ని పట్టుకోవడం సాధ్యమవుతుంది. 'డబ్బు'ని కేవలం మారకాల సాధనంగా మాత్రమే గ్రహించి, మిగిలిన విషయాలేవీ గ్రహించక పోతే, సమాజంలో జరుగుతోన్న 'శ్రమ దోపిడీ'ని గ్రహించడం సాధ్యం కాదు. 'డబ్బు' అంటే 'శ్రమ' అనీ, 'విలువకి రూపం' అనీ అర్థం చేసుకోవడం వల్లనే, మార్క్సు, దోపిడీ రహస్యాన్ని పట్టుకోగలిగాడు.

'దోపిడీ'ని గ్రహించడం అంటే, దాని నించి విముక్తి చెందే మార్గాన్ని కూడా గ్రహించడమే, దోపిడీ విధానంతో పోరాటమే ఆ విముక్తి మార్గం.

'ప్రపంచం'లో కొన్ని దేశాలు సామ్రాజ్యవాద దేశాలు గానూ, కొన్ని దేశాలు వలస దేశాలు గానూ వున్న కాలంలో, 'దోపిడీ' సంగతి బయటపడింది కాబట్టి, ఇక అప్పటి నించీ శ్రమ చేసే వర్గం ముందు వున్న కర్తవ్యం, ఏమిటంటే:

వలస దేశాల శ్రామిక వర్గం, మొదట సామ్రాజ్య వాద దేశాల 'ఆధిపత్యం' నించి బయటపడడానికీ, తర్వాత స్వదేశీ దోపిడీ వర్గపు ఆధిపత్యం నించి కూడా బయటపడడానికీ, పోరాడవలసి వుంటుంది.

అలాగే, సామ్రాజ్యవాద దేశాల శ్రామిక వర్గం, మొదట తమ ప్రభుత్వాల 'వలస విధానాన్ని' వ్యతిరేకించటానికీ, తర్వాత దోపిడీ నించి కూడా విముక్తి చెందటానికీ, పోరాడవలసి ఉంటుంది.

ఈ పోరాటం అంతా, శ్రామిక వర్గానికి, ఒకే సుదీర్ఘమైన కార్యక్రమంగా వుంటుంది.

విదేశీ దోపిడీ గానీ, స్వదేశీ దోపిడీ గానీ, దానంతట అదే నశించదు. ఏ దుష్టత్వమూ దానంతటకు అదే నశించదు. దాని వల్ల 'బాధ' పడే వాళ్ళు, దాన్ని ఎదు ర్కోవాలి! దానితో పోరాడాలి! పోరాటం ద్వారానే దాన్ని నాశనం చెయ్యాలి!

'సామ్రాజ్య వాదాన్ని' వ్యతిరేకించే చర్యల్లో ప్రధాన మైనవి:

1. విదేశీ పరిపాలకుల్ని తీసి వెయ్యడం.
2. విదేశీ పెట్టుబడుల్ని జాతీయం చెయ్యడం.
3. తర్వాత కాలంలో విదేశీ పెట్టుబడుల్ని అనుమతించకపోవడం.
4. 'అసమాన మారకాల్ని' సాగనివ్వని షరతులతో వర్తక సంబంధాలు ఏర్పర్చడం.
5. విదేశాల మీద ఆధారపడని మార్గంలో స్వదేశీ పరిశ్రమల్ని అభివృద్ధి పరచడం.
6. సామ్రాజ్య వాద దేశాల మీద ఆధారపడే సంబంధాల్ని తీసివేసి, స్వదేశీ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని సమన్వయ పరచడం.

ఇటువంటి మార్పులు చేసుకోగలిగినప్పుడే, అది నిజమైన 'సామ్రాజ్య వాద వ్యతిరేకత'. కానీ, అందులో మొదటి మార్పు మాత్రమే జరిగి, మిగిలిన మార్పులు జరగకపోతే, అది 'రూపం' లోనే మార్పు. 'గుణం'లో మార్పు లేదు. అది సామ్రాజ్యవాద వ్యతిరేకత కాదు.

వలస దేశంలో 'రాజకీయాధికారం' స్వదేశీ దోపిడీ వర్గం చేతిలోకి మారిన తర్వాత, ఆ వర్గం, సామ్రాజ్య వాదం మీద అత్యల్ప చర్యలు తప్ప, తీవ్ర చర్యలేవీ తీసుకోదు.

స్వదేశీ దోపిడీ మీద కూడా పోరాటం జరిగే వరకూ సామ్రాజ్యవాద దేశాల మీద ఆధారపడే సంబంధాల్ని తీసివెయ్యడమూ, స్వదేశీ వ్యవసాయ - పారిశ్రామిక రంగాల్ని సమన్వయ పరచడమూ - వంటి నిజమైన మార్పు లేమీ సాధ్యం కావు.

'దోపిడీ'ని గురించి గ్రహింపూ, 'దోపిడీ' మీద వ్యతిరేకతా లేకుండా జరిగే పోరాటం, సామ్రాజ్య వాదాన్ని నిజమైన అర్థంతో వ్యతిరేకించదు.

# 'సామ్రాజ్య వాద' సమర్ధకులు

వెనకటి కాలంలో, విదేశాల మీద దండెత్తే రాజుల్ని - కవులూ, కళాకారులూ బహు విధాలుగా కీర్తించే వారు. ఆ విధంగానే, పెట్టుబడిదారీ కాలంలో కూడా, వలసల్ని ఆక్రమించడాన్ని, అది ఆ వలసలకే, 'అత్యవ సరమ'నీ, ప్రపంచానికే 'క్షేమదాయకమ'నీ, సిద్ధాంతీకరించే మేధావులూ, ఆర్థిక వేత్తలూ బయల్దే రారు. ఆ సామ్రాజ్యవాద సమర్ధకుల వాదాలు ఎలా వుంటాయో తర్వాత ఇచ్చే కొటేషన్ చూస్తే, తెలు స్తుంది. ఆ మాటలు ఎవరివో ఆ కొటేషన్ చివర్లో చూడండి!

"సామ్రాజ్య వాదమే నిజమైన, వివేకవంతమైన మిత వ్యయంతో కూడిన విధానమని చాంబర్లేన్ సమ ర్ధించాడు. ముఖ్యంగా ప్రపంచ మార్కెట్లో - జర్మనీ, అమెరికా, బెల్జియం దేశాలతో పోటీని బ్రిటను ఎదు ర్కొంటూ వుండడాన్ని గురించి అతడు పేర్కొన్నాడు. పెట్టుబడి దారులు - కార్టెళ్ళూ, సిండికేట్లూ, ట్రస్టులూ స్థాపిస్తూ, గుత్తాధిపత్యమే మోక్ష మార్గమనగా, వెంటనే పెట్టుబడిదారీ రాజకీయ నాయకులు వారికి తాళం వేశారు. ఇంకా విభజించకుండా వున్న ప్రపంచాన్ని కాజేయడానికి హడావిడి పడుతూ గుత్తాధిపత్యమే మోక్ష మార్గమని వారు వంత పలికారు. నెవిన్ రోడ్స్ 1895లో తన సామ్రాజ్యవాద భావాలను ఈ కింద విధంగా వ్యక్తం చేసినట్టు అతని మిత్రుడైన జర్నలిస్టు స్టెడ్ తెలియజేశాడు - 'నిన్న నేను లండన్ లోని ఈస్ట్ ఎండ్‌లో (ఒక కార్మిక పేట) ఒక నిరుద్యోగ సభకు హాజరయ్యాను. 'రొట్టె, రొట్టె' అంటూ ఆవేశంతో కూడిన ఉపన్యాసాలు విన్నాను. ఇంటికి తిరిగి వస్తూ ఆ దృశ్యం గురించే పదే పదే ఆలోచించాను. సామ్రాజ్య వాదం ఎంత ప్రాధాన్యం వహిస్తుందో ఇది వరకెన్నడూ గ్రహించనంతగా నిన్న నేను గ్రహించాను .... నా ప్రియతమమైన కోరిక, ఈ సామాజిక సమస్యని పరిష్కరించడం. అంటే, యునైటెడ్ కింగ్‌డమ్ లోని 4 కోట్ల జనాభాను రక్త పాతంతో కూడిన అంతర్యుద్ధం నించి కాపాడడానికి, వలస విధాన రాజనీతిజ్ఞులమైన మనం, ఒక పథకాన్ని రూపొందించాలి. అదనపు జనాభా నివసించడానికీ; ఫ్యాక్టరీల లోనూ, గనుల లోనూ తయారయ్యే సరుకులకు కొత్త మార్కెట్లను సంపాదించడానికీ, కొత్త ప్రదేశాలను మనం హస్తగతం చేసుకోవాలి. నేను ఎల్లప్పుడూ చెపుతూ వున్నట్టు, సామ్రాజ్య వాదమనేది తిండికి సంబంధించిన సమస్య. మనం అంతర్యుద్ధాన్ని నివారించాలంటే, సామ్రాజ్య వాదులం కావాలి' - ఇవి, నెవిల్ రోడ్స్ 1895లో చెప్పిన మాటలు. ఇతడొక కోటీశ్వరుడు. ధనస్వామ్య చక్రవర్తి. ఆంగ్లో - బోయర్ యుద్ధానికి ప్రధాన కారకుడు ...." - లెనిన్ ['సామ్రాజ్య వాదం', పేజీ 130-31, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1973].

'సామ్రాజ్య వాదం' ఎందుకు అవసరమో బ్రిటిష్ గుత్త పెట్టుబడి దారుడు నిర్లజ్జగా చెపుతున్నాడు. ఫ్యాక్టరీల్లోనూ, గనుల్లోనూ తయారయ్యే సరుకులకు కొత్త మార్కెట్లని సంపాదించడానికట! దేశాన్ని 'అంత ర్యుద్ధం' నించి కాపాడ్డానికట! అంటే, తమ దేశంలో 'అంతర్యుద్ధం' రాకుండా (కార్మికులు తిరగబడ కుండా) చేసుకోవడానికి, 'వలసల్ని' ఆక్రమించాలి! - ఆ రకంగా నిరుద్యోగులకు పనులు కల్పించాలి! మరి, వలసల మీద దండెత్తినప్పుడు, ఆ దేశాల్లో జరిగే యుద్ధాల మాటేమిటి? 'నిరుద్యోగం' అనే సామాజిక సమస్యకి ఈ గుత్త పెట్టుబడిదారుడు చెప్పే పరి ష్కారం - ఇతర దేశాల్ని హస్తగతం చేసుకోవడం! ఎక్కువ సరుకుని అమ్మడానికి కొత్త మార్కెట్లు దొరి కితే, వాటి కోసం ఎక్కువ సరుకుని ఉత్పత్తి చెయ్యాలి కాబట్టి, అప్పుడు ఎక్కువ మంది కార్మికులకు ఉద్యో గాలు ఇవ్వవచ్చు. కార్మికులు తిరగబడకుండా చెయ్య వచ్చు - అని దీని అర్థం.

A దేశం - విదేశానికి ఎక్కువ సరుకుని అమ్మితే, దానికి బదులుగా అది - విదేశం నించి ఎక్కువ సర కుని దిగుమతి చేసుకోవాలి. దాని వల్ల రెండు వేపులా సరుకుల ఉత్పత్తి పెరుగుతుంది; రెండు వేపులా ఉద్యోగాలు పెరుగుతాయి. ఇది ఎలాంటి సంబం ధాల వల్ల సాధ్యమవుతుందంటే, 2 దేశాలూ 'సర్వ స్వతంత్ర' దేశాలుగా వుండాలి. ఆ దేశాల మధ్య 'సమాన విలువల' మారకాలే జరగాలి. అలాంటి సంబంధాలు వున్నప్పుడు, ఎక్కువ ఎగుమతులూ ఎక్కువ దిగుమతులూ జరగడం అంటే, అది సరుకుల ఉత్పత్తి పెరిగినట్టూ, 'విదేశీ వర్తకం' పెరిగినట్టూ,

అర్థం. కానీ సామ్రాజ్యవాద దేశం, ఇంకో దేశాన్ని బల ప్రయోగం ద్వారా పట్టి, దాని మార్కెట్లని సంపాదించి, దానికి తన సరుకుల్ని ఎక్కువ ధరలతో అమ్మి ... ఈ రకంగా జరిగే విదేశీ వర్తకం వల్ల, 'వలసలు' అనేవి ఘోరంగా నష్టపోవడం తప్ప ఇంకేమీ జరగదు. సామ్రాజ్యవాద దేశం, వలసల్ని ఆక్రమించేది కూడా ఈ ప్రయోజనం కోసమే. ప్రపంచంలో ఏ ఒక్క సామ్రాజ్యవాద దేశం లోనూ, 'వలసల్ని ఆక్రమించడం' ద్వారా తన దేశపు నిరుద్యోగ సమస్యని పరిష్కరించడం జరగలేదు. ఒక వేళ, వలసల్ని ఇంకా ఇంకా ఆక్రమిస్తూ ఎక్కువ లాభాలు సంపాదిస్తూ, సామ్రాజ్యవాద దేశం, నిరుద్యోగ సమస్య లేకుండా చేసుకోగలిగితే, అప్పుడు వలసల్లో ఏర్పడే నిరుద్యోగ సమస్య మాటేమిటి? కానీ, ఈ పెట్టుబడిదారుడు, ఇతర దేశాల్ని హస్తగతం చేసుకోవడం, కార్మికుల 'తిండి సమస్య'గా, అంటే 'కార్మికుల క్షేమం కోసమే' పాటించవలసిన విషయంగా, నిర్భయంగా దొంగ వర్ణన చేస్తున్నాడు. సామ్రాజ్యవాదం గురించి ఒక రకం సమర్ధకులు ఇలాంటి కారణం చెప్తే, ఇతర రకాల సమర్ధకులు ఇదే సారాంశాన్ని ఇతర కారణాలతో చెపుతారు.

ఆ సమర్ధకుల వాదాలు ఇలా వుంటాయి:

1. సామ్రాజ్యవాద దేశాలు, వలసలకు పెట్టుబడులు అందిస్తూ వలసల్ని అభివృద్ధి చేస్తాయి. సామ్రాజ్యవాద దేశాల గుత్త కంపెనీలు, సంఘటితంగా ప్లాను చేస్తూ, ఉత్పత్తి రంగంలో 'అరాచకత్వాన్ని' (ప్లాను లేని తనాన్ని) తీసి వేస్తాయి. గుత్త కంపెనీల మధ్య ఒప్పం దాల ద్వారా 'పోటీ' నశించి క్రమంగా 'ప్రపంచ శాంతి' ఏర్పడుతుంది. - ఈ రకంగా, పెట్టుబడిదారీ 'దోపిడీ లాటు'ని తినమరిగిన మత్తులో ఉన్మాదులైన ఆర్థిక వేత్తలు, సామ్రాజ్యవాదం వల్ల అనేక లాభాలు వున్నట్టు చెప్పుకొస్తారు.

అంటే, ఒక సామ్రాజ్యవాద దేశం ఒక వలస దేశాన్ని పట్టినప్పుడు, ఆ వలస దేశ జనాభా చాలా ఆనందిస్తూ, తమ దేశాన్ని పట్టనివ్వాలని దీని అర్థం. అలాగే, వలసలు, 'స్వతంత్ర' దేశాలైన తర్వాత కూడా (అసలు, స్వతంత్ర దేశాలవడం ఎందుకు?) సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడుల్ని ఆ దేశాల లోకి నిరాటంకంగా ప్రవహించ నివ్వాలని కూడా దీని అర్థం. - ఇదంతా ప్రపంచానికే క్షేమకరమని ఈ ఆర్థిక వేత్తలు సామ్రాజ్య వాదానికి నూతన అర్థాలు చెప్పుకొస్తారు.

కానీ, వలస దేశానికి, సామ్రాజ్యవాదం ద్వారా ఎలాంటి అభివృద్ధి జరుగుతుందో ఇంతకు ముందే చూశాం. పెట్టుబడి తక్కువగా వున్న దేశం లోకి 'విదేశీ పెట్టుబడి' వస్తే, అది అనేక 'షరతుల' తోటే దిగుతుంది. అప్పటి వరకూ 'స్వతంత్రంగా' వున్న దేశం కూడా విదేశాల నించి 'రుణ పెట్టుబడి'ని తీసుకున్నప్పుడు, అనేక ఆధిపత్య షరతులకు లోబడవలసి వుంటుంది. ఒక దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో వెనకబడి వున్నప్పుడు, విదేశీ పెట్టుబడులు, ఆ 'వెనకబాటుతనాన్ని' ఇతర రూపాల లోకి మారుస్తాయే గానీ, ఏ మాత్రమూ తగ్గించవు.

అలాగే, సామ్రాజ్యవాదం - 'ఉత్పత్తి రంగం'లో ప్లాను లేనితనాన్ని తీసివేస్తుందనే అంశం కూడా ఎంత అసత్యమో రాబోయే 'సంక్షోభాలు' చాప్టర్లో చూస్తాము.

ఇక చివరి అంశం - సామ్రాజ్యవాదంలో గుత్త కంపెనీల ఒప్పందాల ద్వారా 'ప్రపంచం శాంతి' ఏర్పడుతుందనే విషయం గురించి. వేరు వేరు దేశాల గుత్త కంపెనీల ద్వారా గానీ, అంతర్జాతీయ గుత్త కంపెనీల ద్వారా గానీ, జరిగేదంతా - పోటీపడే కంపెనీల సంఖ్య తగ్గి, పోటీ స్థాయి పెరగడం మాత్రమే. అంతే గానీ, పోటీయే నశించడం కాదు. ఉదాహరణ కోసం, అన్ని పెట్టుబడిదారీ దేశాలూ ఐక్యమై ఒక సారి ఒకే కూటమిగా ఏర్పడ్డాయి - అనుకుంటే, ఆ 'కూటమి' అలాగే వుండిపోదు. ఎందుకంటే, దాని 'లాభ దృష్టి' వల్లనే. ఆ కూటమి ఏర్పడేదే 'లాభాల పంపకాల' కోసం. 'ప్రపంచ శాంతి' కోసం కాదు. ఆ కూటమి లోకి చేరే దేశాలు, ఏ దృష్టితో చేరుతాయంటే, 'లాభం సంపాదించడం'లో తను ఇతర దేశాల కన్నా వెనకబడి పోకూడదు - అనీ, ఇతర దేశాలకు తన కన్నా ఎక్కువ లాభం రేటు వుండకూడదు - అనీ! ఈ రకంగా, ప్రతి దేశమూ లాభాన్ని పంచుకునే లక్ష్యం తోటే, ఆ 'కూటమి'లో చేరుతుంది. అది లాభ దృష్టితో ఏర్పడే ఐక్యతే గానీ, 'శాంతి' దృష్టితో ఏర్పడే ఐక్యత కాదు.

ఒక కూటమిలో దేశాలు, 10 సంవత్సరాల కోసం ఒక ఒప్పందం చేసుకున్నాయి అనుకుందాం. ఆ ఒప్పందం ద్వారా, అవి, ఏ విషయానికి కట్టుబడి వుండాలనుకున్నాయో, ఆ విషయం మీద అవి, 10 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం కట్టుబడదల్చుకోలేదన్న మాట! ఆ విషయాన్ని 'శాశ్వితంగా' పాటించాలనే దృష్టితో అవి లేవన్న మాట! 10 సంవత్సరాల తర్వాత, ఆ ఒప్పందంలో నించి బయటపడడానికి,

అవి, ఒక అవకాశం అలా వుంచుకున్నాయన్న మాట! అంటే, గుత్త కంపెనీల ఐక్యత 'స్థిరమైనదీ' కాదు; 'శాశ్వితమైనదీ' కాదు.

స్థిరం గానూ, శాశ్వితం గానూ వుండగలిగే దానికి ఏ ఒప్పందాలూ వుండవు. ఒప్పందాలూ, వాగ్దానాలూ, షరతులూ లేకుండానే అది స్థిరంగా వుంటుంది. కానీ 'ఒప్పందం' అంటేనే దాని అర్థం 'తాత్కాలికం' అని! అది కొంత కాలం వరకే. ఆ కాలం ముగిసే సరికి, తన పరిస్థితి ఇంకా 'అభివృద్ధి' చెందుతుందని ప్రతి దేశమూ ఆశపడుతూ వుంటుంది! అందుకే అది కొంత కాలం వరకే ఒప్పందం లోకి వస్తుంది.

ప్రపంచంలో అంతర్జాతీయ గుత్త కంపెనీలు తలెత్తిన తర్వాత 'పోటీ' ఇంకా తీవ్రమైందే గానీ నశించ లేదు. ఆ పోటీ వల్లనే పెట్టుబడిదారీ దేశాల మధ్య ఇప్పటికి 2 ప్రపంచ యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాల తర్వాత కూడా ఇంకా పోటీలూ, యుద్ధాలూ ఎప్పటి లాగే నిత్య నూతనం గానే వున్నాయి!

'దోపిడీ' వల్ల పుట్టుకు వచ్చే వైరుధ్యాలూ, యుద్ధాలూ సామ్రాజ్య వాదంలో కూడా వుంటాయి. గతంలో లాగ వుండడం కూడా కాదు; మరింత తీవ్ర స్థాయికి ఎదిగి వుంటాయి. సామ్రాజ్యవాద దేశాల మధ్య జరిగే యుద్ధాలు - అంతర్జాతీయ గుత్త కంపెనీల ద్వారా, యుద్ధ విమానాల తోటీ, రాకెట్ల తోటీ, అణు బాంబుల తోటీ జరిగే ఉన్నత సాంకేతిక స్థాయి యుద్ధాలుగా వుంటాయి. అవి, 'శాంతి' అనే దాన్ని గత కాలాల్లో కన్నా ఉధృతంగా నాశనం చేస్తాయి. కానీ సామ్రాజ్య వాదోపాసకులు, తమ ప్రపంచ శాంతి ఆశలన్నీ సామ్రాజ్య వాదం మీదే పెట్టుకుంటారు. లేత పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్య వాదంగా ముదరడం చూస్తూ వీరు చాలా ఆనందిస్తారు.

ఒక వేళ, ఉదాహరణకి, సామ్రాజ్య వాదం వల్ల, పెట్టుబడిదారీ దేశాల మధ్య పోటీ నశించిందనే అనుకుందాం. పెట్టుబడిదారుల మధ్య యుద్ధాలు ఆగాయనే ఊహిద్దాం. దానితో 'ప్రపంచ శాంతి' ఏర్పడినట్టేనా? మరి పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్య వుండే వైరుధ్యాల (వర్గ వైరుధ్యాల) మాటేమిటి? పెట్టుబడిదారీ వర్గం కోసం కూడా తనే శ్రమ చేస్తూ వున్న కార్మిక వర్గానికి కలగవలసిన 'శాంతి' మాటేమిటి? - ఈ ప్రశ్న, దోపిడీ వర్గ శాంతి వేత్తలకు పట్టదు. వాళ్ళకి కావలసిందంతా - వర్గాలు ఎప్పటి లాగే వుండాలి. దోపిడీ సవ్యంగా సాగిపోతూ వుండాలి. ఆ 'దోపిడీ లాటు'ని పెట్టుబడి దారులందరూ, యుద్ధాల వూబిలోకి దిగకుండా, ఒప్పందాల ఐకమత్యం తోటే పంచుకుని తింటూ, సుఖ భోగాలతో గడపాలి! అదే 'ప్రపంచ శాంతి!' ఈ సిద్ధాంతకారుల ప్రకారం, 'ప్రపంచం' అంటే, పెట్టుబడి దారులే! 'ప్రపంచ శాంతి' అంటే, ఆ పెట్టుబడి దారులకు 'పోటీ' లేకుండా దొరికే శాంతే.

కానీ, ప్రపంచం అంటే పెట్టుబడి దారులే కాదు, కార్మికులు కూడా. అందరికీ శాంతే - ప్రపంచ శాంతి. కార్మికులకు కూడా శాంతి కలిగే మార్గం కావాలి. అంతే గానీ, పెట్టుబడి దారుల శాంతే ప్రపంచ శాంతి కాదు.

ప్రపంచానికి నిజంగా శాంతిని కలిగించే మార్గం - 'దోపిడీ'ని సాగిస్తూ లాభాల రాసిని పంచుకోవడానికి ఒప్పందాలు చేసుకోవడం' కాదు.

దోపిడీనే రద్దు చెయ్యడం!

ఆ మార్గం లోనే పోటీని తీసివెయ్యడం!

దోపిడీయే లేనప్పుడు, 'శాంతి'ని భంగపరిచే అంశమే వుండదు. అందరూ శ్రమ చేసే విధానంలో - ఇంకో వర్గం నించి లాక్కునే లాభాల రాసీ వుండదు; దాన్ని పంచుకోవడం కోసం యుద్ధాలూ వుండవు.

2. సామ్రాజ్యవాదోపాసకుల్లో ఒక రకం వాళ్ళు - సామ్రాజ్య వాదాన్ని, 'బలవంతులు బలహీనుల్ని పాలించే' సిద్ధాంతంగా భావించి ముచ్చటపడతారు. ఇక్కడ 'బలం' అనేది, 'పెట్టుబడి' బలమూ, 'సైనిక' బలమూ మాత్రమే. ఈ బలాలు రెండూ కార్మిక వర్గానివే. పెట్టుబడీ - కార్మికులదే. సైన్యమూ - కార్మికులే. (అనుత్పాదక కార్మికులు.)

3. సామ్రాజ్యవాద దళారులు చేసే ఇంకో వాదం - 'ఏ దేశానికీ స్వావలంబనా, స్వయం పోషకత్వమూ - ఈ నాడు సాధ్యం కావు. ఈ నాడు సైన్సు అభివృద్ధి వల్ల ప్రపంచ దేశాలన్నీ పరస్పర సంబంధాలతో వుండి తీరాలి'. - ఇంకా ఈ రకంగా!

కానీ, 'పరస్పర సంబంధాలు' అనేవి - 'అసమాన' స్థాయి లోనే ఏర్పడనక్కర లేదు. 'సంబంధాలు' వుంటూ, అవి 'సమానం గానే' వుండవచ్చు.

'దేశాల మధ్య సమాన స్థాయి సంబంధాలు వుండాలి' అనే వాళ్ళు, 'దేశాల మధ్య సంబంధాలే వుండకూడదు' అనడం లేదు. 'సంబంధాలు' ఎప్పుడూ వుండాలి. కానీ, అవి 'సమాన స్థాయి'లో వుండాలి.

కానీ, సామ్రాజ్యవాద దళారులు కోరే సంబం

ధాలు - 'అసమాన' సంబంధాలే. అవే వాళ్ళ దృష్టిలో పరస్పర సంబంధాలు. వాళ్ళ ప్రకారం - ఏ దేశాల దగ్గరైతే ఎక్కువ సైన్సు పరిజ్ఞానమూ, సాంకేతికతలూ, భారీ యంత్రాలూ వగైరాలతో కూడిన 'భారీ ఉత్పాద కత' వుంటుందో ఆ దేశాల ఆధిపత్యానికి (అంటే, ఆ దేశాల దోపిడీకి), మిగిలిన దేశాలు లోబడి వుండాలనీ, అలాంటి సంబంధాలే పరస్పర సంబంధాలనీనూ. ఇదే వాళ్ళ సిద్ధాంతం. వాళ్ళ ప్రకారం - సామ్రాజ్యవాద దేశాలు స్వయం నిర్ణయ శక్తి తోటే వుండవచ్చు. ఆ దేశాలకైతే అది సాధ్యమే. వలస దేశాలకు మాత్రమే అది సాధ్యం కాదు. వలస దేశాలు, స్వయం నిర్ణయ శక్తి కోసమూ, స్వయం పోషకత్వం కోసమూ, ప్రయ త్నాలు చెయ్యకూడదు. వలస దేశాలు అలాంటి ప్రయత్నాలు చేస్తే, అది, పరస్పర సంబంధాలు దెబ్బ తినడమే. ఇదే వీరు చెప్పే 'పరస్పర సంబంధాల' శాస్త్రం.

కానీ, ఒక దేశం 'ఆధిపత్య' దేశం గానూ, ఇంకో దేశం 'లోబడి వుండే' దేశం గానూ లేకుండా, 2 దేశాలూ సమానమైన హక్కుల తోటీ, బాధ్యతల తోటీ, స్వతంత్రతల తోటీ వున్నందు వల్ల, వాటి సంబం ధాల కేమీ భంగం కలగదు. అలాంటి సంబంధాలే నిజమైన 'స్నేహ సంబంధాలు'.

సామ్రాజ్యవాద ఆధిపత్యం లేకుండా కూడా దేశాలు పరస్పర సంబంధాలతో వుండవచ్చునని పెట్టు బడిదారీ ఆర్థిక వేత్తలకు కూడా తెలుసు. కానీ, అది వాళ్ళకి 'లాభదాయకం కాదు'. కాబట్టి, వాళ్ళు తమకి కావలసిన రకపు సంబంధాల్ని మాత్రమే సమర్థిస్తారు.

4. పెట్టుబడిదారీ మేధావుల్లో ఇంకో రకం వాళ్ళు వున్నారు. వీరు, సామ్రాజ్య వాదాన్ని తీవ్రంగా నిర సిస్తారు, దూషిస్తారు! వీరిలో కొందరు - 'వలసల' మీద సానుభూతులు కురిపిస్తారు. కానీ, ఆ వలసలు, తమ దేశం పట్టిన వలసలు కాకపోతేనే!

5. మరికొందరు, తమ దేశపు సామ్రాజ్య వాదాన్ని కూడా తీవ్రం గానే దుయ్యబడతారు. విదేశాల్ని ఆక్ర మించడం 'అన్యాయం' అంటారు. 'అక్రమం' అంటారు. ఒక జాతి, వేరొక జాతిపై ఆధిపత్యం నెరప రాదంటారు. సామ్రాజ్యవాదం, తన గుత్త కంపెనీల ఒప్పందాలతో స్వేచ్ఛాయుత పోటీనీ, ప్రజాస్వామ్య సూత్రాల్నీ అరికడుతుందంటారు. ఇంకా ఇంకా చాలా అంటారు. కానీ, ఇదంతా 'పెట్టుబడిదారీ' విధానాన్నీ, దాని దోపిడీనీ పన్నెత్తు మాటైనా అనకుండా! అంటే, వీరికి 'పెట్టుబడిదారీ విధానం' మీద విమర్శేమీ వుండదు. ఆ విధానం వుండడంలో అభ్యంతరం వుండదు. కానీ, అది 'సామ్రాజ్య వాదం'గా మారడం మీదే అభ్యంతరం! గుత్త కంపెనీలూ, అంతర్జాతీయ గుత్త కంపెనీలూ ఏర్పడకూడదు. అంటే, వీరు కోరేది - లేత లేత పెట్టుబడిదారీ విధానాన్ని అన్నమాట! అది ముదరడమే వీరికి ఇష్టం వుండదు. అది ఎప్పుడూ లేతగానే వుండాలి!

కానీ, పెట్టుబడిదారీ విధానం, ఎప్పుడూ 'లేత దశ' లోనే ఆగదు. అది, తన సహజ సూత్రాలతో అభివృద్ధి చెందుతూ పోతే, క్రమ క్రమంగా పెట్టుబడి రాసులు పెరగడమూ, అధిక మార్కెట్ల అవసరమూ, విదేశాల మీద దౌర్జన్యమూ, లేత పెట్టుబడిదారీ కాలపు కనీస స్వేచ్ఛా నినాదాలూ కనీస ప్రజాస్వామ్య సూత్రాలూ ఎగిరిపోవడమూ - వగైరా క్రమాలతో అది తప్పనిసరిగా సామ్రాజ్య వాదంగా మారితీరుతుంది. ఇదంతా ఈ శుష్క శాంతి వాదులకు పట్టదు. బానిస యజమానుల దోపిడీ విధానపు కొనసాగింపే - పెట్టుబడిదారీ విధానం. దాని కొనసాగింపే - సామ్రాజ్య వాదం. కాబట్టి, దోపిడీనీ, పెట్టుబడిదారీ విధానాన్నీ ఏమీ అనకుండా, సామ్రాజ్యవాదం మీద ఎన్ని విమర్శలు గుప్పించినా, ఈ దాటవేతల చాతుర్యాల వల్ల, సామ్రాజ్య వాదానికి మేలే గానీ హాని ఏమీ జరగదు.

'దోపిడీ' మీద పోరాటం జరగనంత కాలమూ పెట్టుబడిదారీ విధానం, 'సామ్రాజ్యవాదం' రూపంలో వుంటూనే వుంటుంది. దానితో పాటే దాని 'యుద్ధాలు' కూడా!★

★ 'సామ్రాజ్యవాదం' గురించి చూసేటప్పుడు, 'ప్రపంచ యుద్ధాల' గురించి కనీసంగా నైనా చూడాలి. దాని వల్ల, 'సామ్రాజ్య వాదం' అంటే ఏమిటో తేలిగ్గా అర్థమవుతుంది. ఒక 'యుద్ధం' ముగిసిన తర్వాత, ఆ యుద్ధం చేసిన దేశాల మధ్య ఏం జరిగిందో చూస్తే, అసలా యుద్ధం ఎందుకు జరిగిందో తెలుస్తుంది. 1వ, 2వ ప్రపంచ యుద్ధాల గురించి, ఈ చాప్టరు తర్వాత వున్న 'అనుబంధం' చూడండి. ★

# ప్రశ్నలూ - జవాబులూ

1. **సామ్రాజ్య వాదం - అంటే ఏమిటి?**

**జ:** 'ఒక దేశం, ఇతర దేశాల మీద దండెత్తి, ఆ దేశపు భూముల్నీ ఇతర ఆస్తుల్నీ ఆక్రమించవచ్చు; ఇతర దేశాల్నీ, ఆ దేశాల ప్రాంతాల్నీ తన అదుపు లోకి తెచ్చుకోవచ్చు'అని భావించే వాదం సామ్రాజ్య వాదం.

2. **సామ్రాజ్య వాదం ఏ నాటి నించి ప్రారంభమైంది?**

**జ:** శ్రమ దోపిడీ ఏ నాడు ప్రారంభమైందో ఆ నాటి నించీ. ఒక ప్రాంతం, ఇంకో ప్రాంతం మీద దాడులు చేసి దాన్ని ఆక్రమించడం ఏ నాడు జరిగినా, అది సామ్రాజ్య వాదమే. అది, బానిస సమాజం నాటి రాజుల కాలం నించీ ప్రారంభమైనదే.

3. **చరిత్ర పాఠాల్లోనూ, మత గ్రంథాల్లోనూ, పురాణ కథల్లోనూ - మహా రాజులూ చక్రవర్తులూ వుంటారు. అలాంటి వాళ్ళంతా ఎవరు?**

**జ:** వాళ్ళు పరిపాలకులు. ఆ నాటి సమాజంలో వున్న వర్గాల్లో, దోపిడీ చేసే వర్గం తరుపున నిలబడ్డ ప్రతినిధులు వాళ్ళు.

4. **భారత దేశాన్ని కొంత కాలం పాటు ఒక సామ్రాజ్య వాద దేశం 'ప్రత్యక్షంగా' పరిపాలించింది. అది ఏ దేశం? దాని పరిపాలన ఎప్పుడు, ఏ రకంగా ప్రారంభ మైందో చెప్పగలరా?**

**జ:** అది బ్రిటను. అది, 18వ దశాబ్దంలో, ఈస్టిండియా కంపెనీ పేరుతో వర్తకం కోసం కలకత్తాకి వచ్చింది. క్రమంగా, భారత దేశాన్ని ఆక్రమించి రాజ్యాధికారం సంపాదించింది.

5. **A దేశం సామ్రాజ్యవాద దేశం. B దేశం వలస దేశం. A దేశం పంచదారనీ, B దేశం పత్తినీ, ఒక దాని కొకటి అమ్ముకుంటాయి. పంచదార ధర కిలో 4 రూ. లు, పత్తి ధర కిలో 2 రూ. లు. కిలో పంచదారకి, 2 కిలోల పత్తి వస్తూ వుంటుంది. ఇలా వుండగా, పంచదార ఉత్పత్తి శక్తి రెట్టింపైంది. పత్తి ఉత్పత్తి శక్తి ఏమీ మారలేదు. ఇప్పుడు A దేశం, 1 కిలో పంచదార ఇచ్చి, ఎంత పత్తిని తీసుకోవాలి? A దేశం, పంచదార ధరని గతం కన్నా కొంత తగ్గించి 3 చేసింది. పంచదార ధరలో తగ్గుదల సరిగానే వుందా?**

**జ:** పంచదార ఉత్పత్తి శక్తి రెట్టింపవడం వల్ల, దాని విలువ సగమే అవుతుంది. అంటే ఇప్పుడు 1 కిలో విలువ 2 రూ. లే. కాబట్టి ఇప్పుడు 1 కిలో పత్తి విలువా, 1 కిలో పంచదార విలువా, సమానం. ఇప్పుడు పంచ దారని 2 రూ. ల తోనే ఇవ్వాలి. కానీ, అలా జరగదు. తన ఉత్పత్తుల్ని తక్కువ శ్రమ కాలంతో తయారు చెయ్యగలిగిన దేశం, దాన్ని ఆ లెక్క ప్రకారమే ఇవ్వదు.

6. **A దేశం, B కి 300 డబ్బు అప్పు ఇచ్చింది. B దేశం, A నించి తీసుకున్న డబ్బుతో, A దేశపు కంపెనీ ల్లోనే సరుకుల్ని కొన్నది. B దేశానికి అప్పు ఇవ్వడం వల్ల, A దేశానికి, ఏ యే ప్రయోజనాలు కలుగుతాయి?**

**జ:** అప్పు ఇచ్చిన A దేశానికి, ఆ అప్పు మీద వడ్డీ వస్తుంది. అది, మొదటి ప్రయోజనం. A దేశపు డబ్బుని, A దేశం లోనే ఖర్చు పెట్టాలి కాబట్టి, ఆ డబ్బుతో ఆ దేశపు కంపెనీల సరుకులనే కొనాలి. A దేశపు కంపెనీలకు గ్యారంటీగా ఆర్డర్లు దొరుకు తాయి. ఇది రెండో ప్రయోజనం. అయితే ఆ అప్పుని తీర్చాలంటే (వడ్డీని కూడా), B దేశం కూడా A దేశానికి తన సరుకులనే ఇవ్వాలి కాబట్టి, B దేశపు కంపెనీలకు కూడా ఆర్డర్లు దొరుకుతాయి. కానీ, ఇటూ అటూ జరిగే మారకాలు సమాన విలువల తోనే జరిగితే, ఆ మారకాల వల్ల ఏ దేశానికీ లాభ నష్టాలేమీ వుండవు. అప్పుడు, B దేశం, A కి వడ్డీలు చెల్లించడం అనే నష్టం ఒకటే వుంటుంది. ఆ దేశాల మధ్య జరిగిన మారకాలు అసమాన మారకాలైతే, దాని వల్ల ఉత్పత్తి శక్తులు ఎక్కువగా వున్న దేశానికి చాలా లాభం.

7. **భారత దేశానికి "స్వాతంత్ర్యం" వచ్చిందా? భారత**

**దేశం విదేశీ పెట్టుబడుల్ని 'జాతీయం' చేసిందా?**

**జ:** భారత దేశంలో వున్న దోపిడీ వర్గానికి, సింహాసనం మీద కూర్చునే స్వాతంత్ర్యం వచ్చింది. అది, ఆ దేశ శ్రామిక వర్గానికి స్వాతంత్ర్యం కాదు. భారత దేశం, తన స్వాతంత్ర్యంతో, విదేశీ పెట్టుబడుల్ని జాతీయం చెయ్యక పోవడమే కాదు, ఇంకా ఎక్కువ విదేశీ పెట్టుబడుల్ని ఆహ్వానించింది. ఇంకా ఆహ్వానిస్తోంది.

8. **A దేశం, B దేశంలో పెట్టుబడులు పెట్టింది. ఆ పెట్టుబడులు ఏ యే రూపాల్లో వుండవచ్చు?**

**జ:** 1) అప్పులు ఇస్తుంది. వాటి మీద వడ్డీలు వస్తాయి. ఆ వడ్డీలు, B దేశపు కార్మికుల Sలో భాగం.

2) B దేశంలో షేర్లు కొంటుంది. వాటి మీద డివిడెండ్లు (లాభాలు) వస్తాయి.

3) B దేశంలో, తన కంపెనీలు పెడుతుంది. వాటి ద్వారా లాభాలు వస్తాయి.

9. **A దేశ ప్రభుత్వ బాండ్లని B దేశపు కంపెనీలు కొంటే, B దేశం A దేశంలో పెట్టుబడి పెట్టి నట్టేనా?**

**జ:** పెట్టినట్టే. బాండ్లని కొనడం అంటే, ఆ దేశానికి అప్పు ఇవ్వడమే. ఆ అప్పు ద్వారా ఆ దేశం నించి వడ్డీ వస్తుంది కాబట్టి, ఆ దేశంలో 'వడ్డీ పెట్టుబడి' పెట్టినట్టే.

10. **భారత దేశపు శాసన సభల్లో (అంటే, 'పార్లమెంటు' లోనూ, 'అసెంబ్లీల' లోనూ) వున్న సభ్యులు (ఎంపీ లూ; ఎంఎల్ఏ లూ) కార్మిక ప్రతినిధులా; భూములూ - ఫ్యాక్టరీలూ వున్న యజమానుల ప్రతి నిధులా?**

**జ:** రెండో రకం ప్రతినిధులే. భారత దేశపు చట్టాలన్నీ, కౌళ్ళనీ, వడ్డీ లాభాల్నీ తీసుకునే ఆస్తి హక్కుల్ని రక్షించే చట్టాలే. అలాంటి ప్రభుత్వం లోకి, ఒక కార్మిక వర్గం మనిషే ఎమ్మెల్యే గానో, ఎం.పీ. గానో వచ్చినా, అతను కూడా ఆ చట్టాల ప్రకారం నడవ వలిసిందే. అంటే, ఆ వ్యక్తి కూడా దోపిడీ వర్గ ప్రయోజనాల్ని రక్షించే పరి పాలనలో ఒక చెయ్యి వెయ్యవలిసిందే.

11. **'యుద్ధం' అంటే ఏమిటి? 'మానవ సమాజం'లో యుద్ధాలు ఎందుకు జరుగుతున్నాయి? 'యుద్ధాలు' లేకుండా జీవించడం సమాజానికి సాధ్యమా, కాదా?**

**జ:** యుద్ధాల్ని మొదట 2 రకాలుగా విభజించు కోవాలి.

1) దోపిడీదారుల మధ్య యుద్ధాలు. ఇలాంటి యుద్ధంలో ఒకరి ఆస్తుల్ని ఒకరు లాక్కునే ప్రయత్నాలు జరుగుతాయి.

2) దోపిడీ వర్గానికీ, శ్రామిక వర్గానికీ మధ్య యుద్ధం. ఇలాంటి యుద్ధంలో, దోపిడీ వర్గం, శ్రామిక వర్గాన్ని అణిచి వుంచడానికి ప్రయత్నిస్తే; శ్రామిక వర్గం, తన ఆత్మరక్షణ కోసమూ, తన విముక్తి కోసమూ ప్రయత్నిస్తుంది. సమాజంలో యుద్ధాలు లేకుండా వుండాలంటే, శ్రమ దోపిడీకి అవకాశాలిచ్చే ఆస్తి హక్కులు లేకుండా వుండాలి. అలాంటి మార్పు జరిగితే, ఏ రకం యుద్ధం తోటీ అవసరం వుండదు.

12. **మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం - బ్రిటనూ ఫ్రాన్సూ. జర్మనీలు విదేశాల్లో పెట్టిన పెట్టుబడి 20 వేల కోట్ల ఫ్రాంకులు (20000,00,00,000). ఈ 'పెట్టు బడి' మీద, వడ్డీగా గానీ, లాభంగా గానీ అందిన ఆదాయం సంవత్సరానికి 100 కి 8 అనుకుందాం. ఈ లెక్కన పెట్టుబడి పెట్టిన దేశాలకు, విదేశాల నించి, ఏటా ఎంత ఆదాయం అంది వుంటుంది?**

**జ:** 100 పెట్టుబడికి, 8 లాభం చొప్పున, ఆ మొత్తం మీద లాభం = — × 200000000000 = 16000000000.

ఆ దేశాలకు వలసల నించీ ఏటా ఇంత లాభం!

13. **"గ్రేట్ బ్రిటను జాతీయాదాయం 1865 - 98 మధ్య దాదాపు రెట్టింపయితే, విదేశాల నించి రాబడి 9 రెట్లు పెరిగింది." - దీని అర్థం ఏమిటి?**

**జ:** బ్రిటను, ఆ కాలంలో, తన దేశపు కార్మిక వర్గాన్ని దోచిన దాని కన్నా అన్ని రెట్లు ఎక్కువగా విదేశాల కార్మికుల్ని దోచిందన్న మాట.

14. **అమెరికా, ఫిలిప్పీన్స్‌నీ; జపాను, కొరియానీ - ఆక్రమించాయనుకుందాం. జపాన్ దేశస్తుడొకడు - అమెరికాని విమర్శించి, జపాను మాట ఎత్తకపోతే అతను దేశ భక్తుడా, అవకాశవాదా?**

**జ:** అవకాశవాదే గానీ, మరీ అంత చిన్న మాటా? ఇంకా ఏదైనా గట్టి మాట వాడాలి. ★

# అనుబంధం
# ప్రపంచ యుద్ధాలు!

[ ప్రపంచ యుద్ధాల గురించి ఇక్కడ ఇచ్చే వివరాలు చాలా క్లుప్తంగా, స్వల్పంగా, అరకొరగా వుంటాయి. కానీ యుద్ధాల 'రహస్యం' గ్రహించడానికి ఇది సరిపోతుంది. ఇంకా ఎక్కువ 'వివరాల' కోసం, ఈ యుద్ధాల సమాచారం ఎక్కడ దొరికితే అక్కడల్లా చదువుకోవాలి.]

# మొదటి ప్రపంచ యుద్ధం

దీని కాలం 1914 -18. ప్రధానంగా బ్రిటనూ, ఫ్రాన్సూ, జపానూ, ఇటలీ, జారిస్టు రష్యా, అమెరికాలు - ఒక కూటమి. దీనికి, 'మిత్ర రాజ్యాల కూటమి' అని ప్రత్యేకమైన పేరు. జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, టర్కీ, బల్గేరియాలు - ఇంకో కూటమి.

ఈ యుద్ధ కాలానికి పూర్వం నించీ కూడా ఈ దేశాలన్నిటికీ వలసలు వున్నాయి. వలసల్ని పట్టిన దేశాలన్నీ సామ్రాజ్యవాద దేశాలు. అయితే ఈ దేశాల్లో కొన్నిటికి ఎక్కువ వలసలూ, కొన్నిటికి తక్కువ వలసలూ వున్నాయి. బ్రిటనుకి - 'భూగోళం' చుట్టూ వలసలు వుంటే, జర్మనీకి - తక్కువ వలసలు వున్నాయి. గత కాలంలో అనేక ముక్కలుగా వుండే జర్మనీ, 'ఏక జర్మనీ'గా ఐక్యమైన తర్వాత నించీ కొత్త శక్తితో త్వర త్వరగా 'అభివృద్ధి' చెందుతోంది. జర్మనీ కంపెనీలు, బ్రిటన్‌తో సరిసమానం గానూ, ఇంకా ఎక్కువ గానూ కూడా ఉత్పత్తి చేస్తూ, అప్పటి వరకూ ఏకఛ్ఛత్రాధిపత్యంగా 'ప్రపంచ మార్కెట్' ని ఏలుతోన్న బ్రిటన్ కంపెనీలతో పోటీ పడుతున్నాయి. (అంటే, జర్మనీ కంపెనీలే తమ సరుకుల్ని ఎక్కువగా అమ్ముకోగలుగుతున్నాయి.)

జర్మనీకి తక్కువ వలసలు వున్నాయి కాబట్టి, దానికి ఇంకా కొత్త వలసలు కావాలి! బ్రిటను నించీ, ఫ్రాన్సు నించీ, రష్యా నించీ కొన్ని ప్రాంతాల్నీ, ఆ దేశాల ఆధీనంలో వున్న వలసల్నీ, లాక్కోవాలని జర్మనీ ఆశ! జర్మనీ పరిశ్రమల్ని పూర్తిగా నాశనం చెయ్యాలని, దాని పోటీదారుల ప్రయత్నం! జర్మనీని నాశనం చేసి దాని వలసల్ని లాక్కోవాలనీ; టర్కీలో ప్రాంతాల్నీ, ఈజిప్టు ప్రాంతాల్నీ, పాలస్తీనానీ ఆక్రమించాలనీ, బ్రిటన్ తహ తహ! జర్మనీ నించి సార్ గనుల ప్రాంతాల్నీ, ఇతర ప్రాంతాల్నీ పట్టాలనీ; గతంలో తన నించి జర్మనీ లాక్కున్న వలస ప్రాంతాల్ని వెనక్కి లాక్కోవాలనీ, ఫ్రాన్స్ కలలు! టర్కీలో భాగాల్నీ, ఆస్ట్రియాలో భాగాల్నీ, నల్ల సముద్రం నించి మధ్యధరా సముద్రానికి పోయే జల సంధినీ ఆక్రమించాలని రష్యా కోరిక! 'యుద్ధం' వస్తే బ్రహ్మాండంగా సరుకులు అమ్ముకోవాలని అమెరికా ఎత్తు! జపాన్‌కి, తూర్పు ప్రాంతాల్లో వున్న జర్మనీ వలసలు కావాలి! రష్యాకి కావలసిన ప్రాంతాలే జర్మనీకీ ఆస్ట్రియాకీ కూడా కావాలి!

ఇంకా ఏ సామ్రాజ్యవాదీ ఆక్రమించని ప్రాంతాలేవీ ప్రపంచంలో మిగిలి లేవు. అన్నిటినీ అన్ని సామ్రాజ్యవాద దేశాలూ ఆక్రమించేసి వున్నాయి. ఇక తర్వాత జరగవలసిందంతా ఒకళ్ళ నించీ ఒకళ్ళు లాక్కోవడమే. ప్రపంచ పునర్విభజనే.

అప్పటికి పదేళ్ళ కిందటే బ్రిటను, ఫ్రాన్సుతో - "నేను ఈజిప్టుని తీసుకుంటాను; నువ్వు మొరాకోని తీసుకో!" అని రహస్య ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం సంగతి తెలిసినప్పుడు జర్మనీ చక్రవర్తి, మొరాకో సుల్తాన్ దగ్గిరికి పోయి, "నీకే, నా మద్దతు" అని చెప్పి వచ్చాడు. కానీ, తర్వాత త్వరలోనే ఫ్రాన్సు మొరాకోని ఆక్రమించినప్పుడు, అది తన చేతిలో అప్పటికే వున్న కాంగోలో కొంత భాగాన్ని జర్మనీకి వదిలింది. దానితో, అప్పటికి జర్మనీ, నోరు మూసుకుంది. ఇది గత సంగతి. క్రమంగా జర్మనీ, ఫ్రాన్సుకి వ్యతిరేకం అయింది. వాటి కూటాలు మారాయి.

కొత్త కూటాలు రెండూ ఎవరి ఆశలతో వాళ్ళు 'యుద్ధానికి' సిద్ధమౌతున్నారు. సైన్యాల్ని పెంచుకుంటున్నారు. ఆయుధాల గుట్టలు సమకూర్చు

కుంటున్నారు. తమ మిత్ర దేశాలతో రహస్య ఒప్పం దాలు చేసుకుంటున్నారు. ఇక యుద్ధం ప్రారంభమవ డమే జరగాలి! దానికి ఏదో ఒక 'సాకు' కావాలి! ఆ 'సాకు' కూడా చక్కగానే దొరికింది.

1914 జూన్ 28 న, ఆస్ట్రియా యువ రాజుని, ఆస్ట్రియాకి వలస అయిన బోస్నియాలో వుండగా, సెర్బియా దేశస్తుడొకడు హత్య చేశాడు. ఒక నెల తర్వాత, జూలై 28న ఆస్ట్రియా, సెర్బియా మీద యుద్ధం ప్రకటించింది. సెర్బియాకి సపోర్టుగా రష్యా కూడా యుద్ధానికి దిగింది. జర్మనీ - రష్యా మీదా, ఫ్రాన్సు మీదా కూడా యుద్ధానికి దిగింది. బ్రిటను - జర్మనీ మీద యుద్ధానికి దిగింది. జపాను కూడా - జర్మనీ మీద యుద్ధానికి దిగింది. టర్కీ, బల్గేరియాలు - జర్మనీ వేపు చేరాయి. గబ గబా అన్ని దేశాలూ యుద్ధ ప్రకటనలు చేసేసి, యుద్ధం లోకి దిగిపోయాయి. ఇటలీ - కొంత కాలం తటస్థంగా వుండి, ఒక సంవ త్సరం తర్వాత, జర్మనీ మీదా, ఆస్ట్రియా మీదా యుద్ధం ప్రకటించింది. సామ్రాజ్య వాద దేశాలన్నీ, తమ వలసల నించి సైన్యాల్నీ, శ్రామికుల్నీ, సరుకుల్నీ తెచ్చి యుద్ధంలో పెట్టాయి.

యుద్ధం లోకి దిగిన ప్రతీ దేశమూ, తన కూటమి లోని ఇతర దేశాలతో, కొత్త వలస ప్రాంతాల కోసం రహస్య ఒప్పందాలు చేసుకుని వున్నదే. పైకి మాత్రం అన్ని దేశాలూ, 'ఆత్మ రక్షణ' కోసమూ, 'స్వేచ్ఛ' కోసమూ, 'ప్రజాస్వామ్య రక్షణ' కోసమూ, పోరాటం లోకి దిగుతున్నట్టుగా ప్రకటించాయి.

అమెరికా - చాలా కాలం వరకూ యుద్ధం లోకి దిగకుండా, తన మిత్ర దేశాలకు - ఆయుధాలూ, ఇతర యుద్ధ పరికరాలూ, బొగ్గూ, ఇనుమూ, నూనె, రొట్టెలూ, బట్టలూ వంటి ఉత్పత్తులన్నీ సరఫరా చేస్తూ గడిపింది. ఆ కాలంలో దాని పరిశ్రమలూ, వ్యవ సాయమూ విపరీతంగా పెరిగాయి. అమెరికా, తన సరుకుల్ని, తన కూటమిలో వున్న యుద్ధ దేశాలకే గాక, వాటి వలసలకు కూడా సప్లై చెయ్యడం ప్రారం భించింది. ఆ కాలంలో దానికి విపరీతమైన మార్కెట్లు దొరికాయి.

జర్మనీ ఆస్ట్రియాలు - రష్యాలో, రుమేనియాలో, ఇటలీలో, సెర్బియాలో ప్రాంతాల్ని, ఆక్రమించు కుంటూ పోతున్నాయి.

తూర్పు ఆసియాలో వున్న జర్మనీ వలసల్ని, జపాన్ ఆక్రమించింది.

ఆఫ్రికాలో వున్న జర్మనీ వలసల్ని, బ్రిటనూ, ఫ్రాన్సూ ఆక్రమించాయి.

ఈ యుద్ధం మొదట యిరోపా ఖండంలో మొదలై అన్ని ఖండాల్నీ ఆక్రమించింది. అందుకే ఇది 'ప్రపంచ యుద్ధం'.

ఈ యుద్ధంలో, గతంలో లేని కొత్త కొత్త మార ణాయుధాలు వాడకం లోకి వచ్చాయి. విమానాల్ని యుద్ధాల్లో వాడడం ఇప్పుడే మొదలైంది. 'పౌరుల' మీద బాంబులు వెయ్యడం కూడా ఈ యుద్ధం లోనే మొదలైంది. వెనకటి యుద్ధాల్లో అయితే, ఇరు పక్షా ల్లోనూ సైనికులు మాత్రమే మరణించే వారు. ఈ యుద్ధంలో, పట్టణాలూ - గ్రామాలూ - అన్నీ, యుద్ధ రంగాలే. గత కాలంలో లేని లిక్విడ్ ఫైర్‌లూ, విష వాయువులూ, టాంకులూ, నౌకల్ని ముంచే సబ్ మెరైన్లూ - వంటి నూతన ఆయుధాల్ని, అన్ని దేశా ల్లోనూ ఇంజనీర్లూ, సైంటిస్టులూ, తమ మేధస్సులు ఉపయోగించి, యుద్ధం కోసం చక చకా తయారు చేశారు.

జర్మనీ, తన సబ్ మెరైన్లతో శత్రు నౌకల్ని ముంచె య్యడం సాగించింది. ఆ నౌకల్లో ఒక సారి అమెరికన్లు కూడా మరణించడంతో అప్పటి వరకూ యుద్ధం లోకి దిగని అమెరికా కూడా, 1917 ఏప్రిల్లో, యుద్ధం లోకి దిగింది. కానీ, అమెరికా, యుద్ధం లోకి దిగడానికి నిజమైన కారణం, దాని స్వలాభమే. అది అప్పటికే తన మిత్ర దేశాలకు విపరీతంగా సరుకుల్ని అప్పు పద్ధతి మీద అమ్మి వుంది. ఇంకా అమ్ముతోంది. ఆ దేశాలన్నీ ఓడిపోయి, జర్మనీ కూటమి గెలిస్తే, అమెరి కాకి తన మిత్ర దేశాల నించి అప్పులు వసూలయ్యే మార్గం వుండదు. అంతే గాక, జర్మనీ గెలిస్తే, అది అమెరికాకి, పెద్ద పోటీదారు అవుతుంది. అందుకే, అమెరికా, యుద్ధం లోకి దిగింది.

యుద్ధ క్రమంలో, తర్వాత జరిగిన అద్భుత సంఘటన - రష్యాలో 'కమ్యూనిస్టు విప్లవ విజయం!'. రష్యాలో కమ్యూనిస్టులు మొదటి నించీ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. "సామ్రాజ్యవాద యుద్ధాన్ని విప్లవ యుద్ధంగా మార్చాలి" అని మొదటి నించీ ప్రజలకు బోధిస్తున్నారు. అప్పటికి రష్యాలో, యుద్ధం వల్ల గాయపడిన వారూ, మరణించిన వారూ, దాదాపు 40 లక్షల దాకా వుంటారని అంచనా. ఇంకా అనేక లక్షల

సైనికులు, యుద్ధ రంగాల్లో మరణించడానికి తరి ఫీదులు పొందుతున్నారు. యుద్ధ రంగాలకు ఉత్ప త్తులు పంపడం కోసం, పని స్థలాల్లో లక్షలాది కార్మి కులు రాత్రింబవళ్ళూ పనులు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో, కమ్యూనిస్టుల బోధన వల్ల, ప్రజల్లో తీవ్రమైన యుద్ధ వ్యతిరేకత ప్రారంభమైంది. వారు, "కమ్యూనిస్టు విప్లవానికి" మద్దతు ఇచ్చారు. కమ్యూ నిస్టు ప్రభుత్వం, 1917 అక్టోబరులో, అధికారం లోకి రాగలిగింది.

కమ్యూనిస్టు ప్రభుత్వం (లెనిన్ నాయకత్వాన) అధికారం లోకి వచ్చిన తక్షణమే 'న్యాయమైన శాంతి కోసం యుద్ధాన్ని విరమించాల'ని యుద్ధ దేశాల ప్రజలకూ, ప్రభుత్వాలకూ, ప్రతిపాదించింది. దాన్ని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు అంగీకరించలేదు. అప్ప టికి జర్మనీ కూటమి, రష్యాలో అనేక భాగాల్ని ఆక్ర మించి వుంది. జర్మనీతో పోరాడే శక్తి, అప్పుడే ప్రారంభ మైన కమ్యూనిస్టు ప్రభుత్వానికి లేదు. కమ్యూనిస్టు ప్రభుత్వం, పాత జారిస్టు ప్రభుత్వానికి అనుకూలంగా వుండే సైన్యాధికారుల మీద ఆధారపడి యుద్ధం కొన సాగిస్తే, ఆ సైన్యాధికారులు, కమ్యూనిస్టు ప్రభుత్వం కోసం పోరాడతారనేది అర్ధ రహితమైన విషయం. ఆ సైన్యాధికారులు తప్పనిసరిగా శతృవులకే అను కూలంగా ప్రవర్తిస్తారు. కాబట్టి, యుద్ధాన్ని ఆపివేసి, కొత్త రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోవడమే కమ్యూనిస్టు ప్రభుత్వానికి తక్షణ కర్తవ్యం అయింది. జర్మనీ విధిం చిన కఠినమైన షరతులకే అంగీకరించి, తన అనేక మైన భూభాగాల్ని జర్మనీకి వదిలి వేసి, నష్ట పరిహారం చెల్లించడానికి కూడా అంగీకరించి, రష్యా కమ్యూనిస్టు ప్రభుత్వం, జర్మనీతో 'నిర్యుద్ధ సంధి' చేసుకుంది.

అప్పటికే, పాత రష్యాకీ, ఇతర మిత్ర దేశాలకూ మధ్య, వలసల పంపకాల గురించి, గతంలో కొన్ని ఒప్పందాలు జరిగి వున్నాయి. యుద్ధంలో గెలిచాక, రష్యాకి, చైనాలో భాగాల్నీ, ఇరాన్‌లో భాగాల్నీ, ఇంకా ఆ భాగాల్నీ ఈ భాగాల్నీ అప్పగిస్తామనే ఒప్పందాలే అవన్నీ. ఆ రకం ఒప్పందాలన్నిటినీ కమ్యూనిస్టు ప్రభుత్వం తిరస్కరించింది. గత ఒప్పందాలన్నీ సామ్రాజ్య వాదుల మధ్య జరిగిన ఒప్పందాలనీ, వాటిని తిరస్కరిస్తున్నామనీ, కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రకటించింది. అంతే గాక, అప్పటి వరకూ రష్యా ఆధీ నంలో వలసలుగా వున్న ఫిన్లాండూ, పర్షియా, ఆర్మే నియా - వగైరా దేశాలను, 'వాటి స్వయం నిర్ణయాధి కారానికే వదిలి వేస్తున్నామ'ని కూడా ప్రకటించింది.

విదేశీ భూభాగాల కోసం యుద్ధోన్మాదంతో ఊగి పోతోన్న సామ్రాజ్య వాద ప్రపంచంలో, కమ్యూనిస్టు రష్యా, తన వలసల్ని వదిలివేసి, యుద్ధ రంగాల నించీ సైనికుల్ని వెనక్కి తీసుకుని, యుద్ధాన్ని ఆపి వేసింది!

నష్ట పరిహారం లేకుండా 'భూమి'నీ, ప్రధాన పరిశ్రమల్నీ జాతీయం చెయ్యడమూ, విదేశీ అప్పుల్ని తీర్చనని రద్దు చెయ్యడమూ, అందరికీ నిర్బంధ శ్రమా, రాజ్యాంగం నించి 'చర్చి'ని విడదియ్యడమూ - వగైరా అనేక 'విప్లవకరమైన' మార్పుల గురించి కూడా 'విప్లవ ప్రభుత్వం' ప్రకటించింది. అదంతా వేరే విషయం!

రష్యా తప్ప, మిగిలిన దేశాలు ఇంకా కొంత కాలం యుద్ధం సాగించాయి. చివరికి, ఆస్ట్రియా, టర్కీ, బల్గేరియాలు లొంగిపోయాయి. జర్మనీ ఓడి పోయింది! జర్మనీ చక్రవర్తి హాలెండుకి పారిపోయాడు. జర్మనీలో, 'రిపబ్లిక్' ప్రభుత్వం (పెట్టుబడిదారీ రిప బ్లిక్) ప్రారంభమై, 1918 చివర్లో యుద్ధాన్ని ముగిం చింది.

4 సంవత్సరాల విధ్వంసంతో యుద్ధం ఆగింది. గెలిచిన బ్రిటనూ, ఫ్రాన్సూ, అమెరికాలు (ఇటలీ, జపాన్లూ కూడా), కొన్ని నెలల పాటు చర్చలు చేసు కున్నాయి. ఆ చర్చల్లో, ఓడిన దేశాలేవీ లేవు. గెలిచిన దేశాల్లో కూడా మొదటి 3 దేశాలూ తప్ప, మిగిలిన దేశాల పాత్ర అంతగా లేదు. నిర్ణయాలన్నీ మొదటి 3 దేశాలవే. ఫ్రాన్స్‌లో, 'వర్సయిల్స్' అనే ప్రాంతంలో, 'శాంతి సంధి షరతులు' తయారు చేశారు. ఆ సంధి పత్రాల మీద సంతకాలు పెట్టడానికి అక్కడికి జర్మనీ ప్రతినిధులు హాజరయ్యారు. వాళ్ళు మొదట ఆ షరతుల్ని వ్యతిరేకించారు. కానీ, ఆ షరతులకు అంగీక రించకపోతే జర్మనీ మీద మళ్ళీ దాడి చేస్తామని బ్రిటన్ కూటమి చేసిన హెచ్చరికలతో జర్మనీ ప్రతినిధులు ఆ పత్రాల మీద సంతకాలు చేశారు.

జర్మనీ మీద విధించిన ఆ షరతులు ఏమిటంటే:

యుద్ధానికి బాధ్యత అంతా, ఆ 'నేరం' అంతా, తన కూటమిదేనని జర్మనీ అంగీకరించాలి! 50 సంవత్సరాల క్రితం ఫ్రాన్సు నించి జర్మనీ ఆక్ర మించిన భూభాగాల్ని ఇప్పుడు ఫ్రాన్సుకే వదిలి వెయ్యాలి. (ఈ షరతుల్ని విధించే దేశాలేవీ తమ 'వలసల్ని' వదల లేదు.) జర్మనీలో సార్ బొగ్గు గనుల

ప్రాంతాల్ని 15 సంవత్సరాల దాకా ఫ్రాన్సుకి వదిలేసి, ఆ తర్వాత 'జన వాక్య సేకరణ' చేసి, అందులో నెగ్గితే ఆ ప్రాంతాల్ని జర్మనీ తీసుకోవాలి. యుద్ధానికి పూర్వం జర్మనీకి వున్న వలసలన్నిటినీ - డెన్మార్కుకీ, పోలెండ్‌కీ, బెల్జియమ్‌కీ, చెకొస్లవేకియాకీ ఇచ్చి వెయ్యాలి! జర్మనీకీ ఫ్రాన్స్‌కీ మధ్య, సరిహద్దు ప్రాంతాల్లో జర్మన్ సైన్యం వుండరాదు. జర్మనీకి మొత్తం సైన్యం, 1 లక్ష కన్నా ఎక్కువ వుండరాదు. మిగిలిన సైన్యాన్ని తీసివెయ్యాలి. జర్మనీకి యుద్ధ నౌకలూ, సబ్ మెరైన్లూ కలిసి పాతిక కన్నా ఎక్కువ ఉండరాదు. జర్మనీకి యుద్ధ విమానాలు ఒక్కటి కూడా వుండరాదు. జర్మనీలో యుద్ధ రక్షణ స్థావరాల్నీ, యుద్ధ పరికరాల్నీ జర్మనీయే పూర్తిగా ధ్వంసం చేసి వెయ్యాలి. జర్మనీ లోని రైన్ ప్రాంతంలో 15 సంవత్సరాల వరకూ మిత్ర దేశాల సైన్యం ఉంటుంది. జర్మన్ నదులూ, కాలవలూ అంతర్జాతీయ కమిషన్ ఆధీనంలో ఉండాలి. జర్మనీ యుద్ధ నౌకల్నీ, వర్తక నౌకల్నీ, ఫ్రాన్స్‌కీ, బ్రిటన్‌కీ ఇచ్చి వెయ్యాలి. యుద్ధంలో మిత్ర రాజ్యాలు నష్టపోయిన నౌకలకు బదులు, జర్మనీ కొత్త నౌకల్ని తయారు చేసి ఇవ్వాలి. విదేశాల్లో వున్న జర్మనీ దేశస్తుల ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవటానికి, మిత్ర రాజ్యాలకు హక్కు వుంటుంది. జర్మనీ జరిపే ఎగుమతుల మీదా, దిగుమతుల మీదా, మిత్ర రాజ్యాల పర్యవేక్షణ వుంటుంది. జర్మనీ - తన బొగ్గునీ, ఇనుమునీ, మిత్ర రాజ్యాలకే ఎక్కువ మొత్తంలో ఎగుమతి చెయ్యాలి. జర్మనీ - 5 వేల ఇంజన్లనీ, 1 లక్షకు పైగా కార్లనీ, మిత్ర దేశాలకు ఇవ్వాలి! - ఇంకా ఇలాంటివే అనేక డజన్ల నిబంధనలు! ఇవన్నీ గాక, ఇంకా చివరి విషయం - జర్మనీ, ఇతర దేశాల్ని 'అక్రమంగా' యుద్ధాల్లోకి లాగినందుకు గాను, ఆ దేశాలకు 'నష్ట పరిహారం' చెల్లించాలి! మొత్తం ఆ పరిహారం అంతా కలిసి, 650,00,00,000 పౌండ్లు. దీన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించాలి.

జర్మనీ కంపెనీల్ని ఇక భవిష్యత్తులో ఎన్నటికీ తలెత్తనివ్వకుండా చెయ్యడానికి, బ్రిటన్ కూటమి పన్నిన పథకమే ఇదంతా.

జర్మనీ వలసలన్నిటినీ, బ్రిటన్ కూటమి, లాగేసుకుంది. ఆఫ్రికాలోని జర్మనీ వలసల్ని, బ్రిటనూ, బెల్జియమూ, పోర్చుగలూ, పంచుకున్నాయి. టోగో కామరూన్‌ని - బ్రిటనూ, ఫ్రాన్సూ పంచుకున్నాయి. పసిఫిక్‌లో వున్న జర్మన్ వలసల్నీ, చైనాలో కొన్ని ప్రాంతాల్నీ, జపాన్‌కి ఇచ్చేశారు.

ఈ యుద్ధ కాలంలో, చైనా, మొదటి నించీ బ్రిటన్ కూటమి తోనే వుంది. వర్సయిల్స్ సమావేశంలో కూడా చైనా పాల్గొంది. కానీ, జర్మనీ ఆధీనంలో వున్న చైనా ప్రాంతాల్ని, జర్మనీ నించి లాక్కున్నప్పుడు, వాటిని చైనాకి అప్పజెప్పకుండా జపాన్‌కి ఇచ్చారు!

ఆస్ట్రియాని, 'ఆస్ట్రియా - హంగరీలు'గా విడదీశారు. హంగరీ స్వాతంత్ర్యాన్ని ఆస్ట్రియా గుర్తించాలనీ; అప్పటి వరకూ ఆస్ట్రియాకి వలసలుగా వున్న చకోస్లవేకియా, యుగోస్లావియా, పోలెండూ, ఇటలీ ప్రాంతాల్ని - ఆస్ట్రియా వదిలి వెయ్యాలనీ ఆజ్ఞాపించారు.

బ్రిటను - పాలస్తీనానీ, మెసపుటోమియానీ (ఇరాక్‌ని) తీసుకుంది. ఫ్రాన్సు - సిరియాని! టర్కీలో చాలా భాగాల్ని గ్రీస్‌కీ, ఇటలీకీ, ఇచ్చారు. ఈ రకంగా, జర్మనీ కూటమి - దేశాల కింద వుండే వలసలన్నీ, బ్రిటన్ కూటమి దేశాల చేతుల్లోకి మారాయి.

నష్ట పరిహారంలో కొంత భాగాన్ని, జర్మనీ, అమెరికా నించి అప్పు తీసుకుని చెల్లించింది. ఆ రకంగా అమెరికాకి పెద్ద 'వడ్డీ బేరం' దొరికింది.

ఓడిన సామ్రాజ్యవాద దేశం గురించి కన్నీరు కార్చనక్కర లేదు గానీ, జర్మనీ పరిస్థితి చాలా 'జాలి కలిగించే' విధం గానే తయారైంది. కానీ, జర్మనీ కూటమే గెలిస్తే అది కూడా బ్రిటన్ కూటమి లాగా చేసేదే.

ఈ యుద్ధం గతంలో ఎన్నడూ లేనంత విధ్వంసంతో జరిగింది. ఈ యుద్ధ కాలంలో యుద్ధ విమానాల బాంబు దాడుల వల్లా, కరువుల వల్లా, అంటురోగాల వల్లా, ప్రతీ దేశం లోనూ లక్షల కొద్దీ జనాలు మరణించారు. వ్యాధుల పాలయ్యారు. అవిటి వాళ్ళయ్యారు.

బాంబరు విమానాలూ, సబ్ మెరైన్లూ, టాంకులూ, యుద్ధ నౌకలూ - వంటి భారీ మారణాయుధాల కోసం కోట్ల కోట్ల ధనం ఖర్చయింది.

గెలిచిన దేశాల బలాబలాల్లో కూడా చాలా మార్పులు జరిగాయి. ఈ యుద్ధ కాలంలో అమెరికా కంపెనీలు, దిగుమతుల కన్నా ఎంతో ఎక్కువగా ఎగుమతులు చేశాయి. ఈ యుద్ధానికి పూర్వం బ్రిటనే ఎక్కువ దేశాలకు అప్పులు ఇస్తూ వుండేది. అమెరికాకి కూడా అప్పులు ఇచ్చేది. బ్రిటను కంపెనీలు, అమెరి

కాలో కూడా వున్నాయి. అలాంటి పరిస్థితులన్నీ యుద్ధం తర్వాత తారుమారయ్యాయి. యుద్ధం ముగిసే నాటికి బ్రిటను, అమెరికాకి చాలా అప్పులు చెల్లించవలసిన పరిస్థితుల్లో పడింది. అందులో కొంత భాగాన్ని, అమెరికాలో వున్న తన కంపెనీల్ని వదిలి వెయ్యడం ద్వారా చెల్లించింది. కొంత భాగానికి, బంగారం చెల్లించింది. ఇంకా కొంత భాగానికి అప్పు పడింది. దాని మీద వడ్డీలు చెల్లించాలి, అప్పు తీరే దాకా.

తనకు రావలసిన 'వర్తక శేషాల' కోసం అమెరికా ఇతర దేశాల నించి చాలా వరకూ బంగారమే తీసుకుంది. ఆ కాలంలో, ప్రపంచంలో వున్న మొత్తం బంగారంలో సగానికి పైగా అమెరికాకే ప్రవహించింది. అప్పటి నించీ అమెరికాయే ఎక్కువ 'డబ్బు పెట్టుబడి' గల దేశం అయింది. ప్రపంచంలో 'ఆకర్షణ కేంద్రం', బ్రిటన్ నించీ అమెరికాకి మారింది.

యుద్ధం ముగిసిన తర్వాత చూస్తే, యుద్ధం చేసిన దేశాల మధ్య ఏం జరిగింది? - ఓడిన దేశాల వలసల్నీ, ఓడిన దేశాల స్వంత ప్రాంతాల్నీ, ఓడిన దేశాల ధనాన్నీ, గెలిచిన దేశాలు లాక్కోవడమే జరిగింది. అంటే, సామ్రాజ్య వాద దేశాల మధ్య, ప్రాంతాల (మార్కెట్ల) పునర్విభజనా, ఆస్తుల పునర్విభజనా, జరిగాయి. కొన్ని వలసల మీద యాజమాన్యాలు, ఒక సామ్రాజ్యవాద దేశం నించీ ఇంకో సామ్రాజ్యవాద దేశానికి మారడం మాత్రమే జరిగింది. ఓడిన దేశాలే గెలిచి వుంటే, అప్పుడు కూడా ఈ విషయాలే జరుగుతాయి.

అయితే, ఈ యుద్ధ కాలంలో జరిగిన అద్భుత సంఘటన 'కమ్యూనిస్టు విప్లవ విజయం' కాబట్టి, దాని ప్రభావం క్రమక్రమంగా సామ్రాజ్యవాద దేశాలకూ, వలస దేశాలకూ కూడా వ్యాపించడం మొదలైంది..

# 2 వ ప్రపంచ యుద్ధం!

**మొ**దటి ప్రపంచ యుద్ధానికి పూర్వం, ఎలక్ట్రికల్ సరుకుల ఉత్పత్తి లోనూ, ఓడల ఉత్పత్తి లోనూ, అమెరికన్ ట్రస్టులకూ జర్మన్ ట్రస్టులకూ మధ్య ఒప్పందాలు వుండేవి. కానీ, ఆ ఒప్పందాలేవీ అలాగే వుండి పోలేదు. ప్రపంచ పునర్విభజన కోసం జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో, ఆ ఒప్పందాలన్నీ చిన్నాభిన్నం అయ్యాయి. యుద్ధం తర్వాత కూడా అనేక దేశాల ఉక్కూ, రాగీ, ఇతర లోహాలూ, బట్టలూ, రేడియోలూ, నూనె, సిమ్మెంటూ వగైరా ఉత్పత్తుల గుత్త కంపెనీలు, మళ్ళీ కొత్త ఒప్పందాలు చేసుకున్నాయి. కానీ, ఆ ఒప్పందాలు కూడా అలాగే వుండి పోలేదు. ఎక్కడి కక్కడ ప్రాంతీయ యుద్ధాలు జరుగుతూనే వున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 20 ఏళ్ళకి, మళ్ళీ 'ప్రపంచ పునర్విభజన' కోసం, పరిస్థితులన్నీ ఇంకో ప్రపంచ యుద్ధానికి దారి తీశాయి.

మొదటి ప్రపంచ యుద్ధం వల్ల తమకు కావలసిన విధంగా వలసలు దొరకలేదనే అసంతృప్తితో ఇటలీ జపాన్లు వున్నాయి. జర్మనీ సంగతి సరేసరి! దాని 'బాధ' గురించి చెప్పనక్కర లేదు. దాని కష్టం, పగ వాళ్ళకి కూడా రాకూడనిది. ఈ దేశాల అసంతృప్తులకు తోడు, అనేక దేశాల్ని, **'కమ్యూనిస్టు భూతం'** ఒకటి కొత్తగా పట్టింది.

'కమ్యూనిస్టు రష్యా' ప్రభావంతో, అన్ని దేశాల లోనూ కమ్యూనిస్టు పార్టీలూ, సోషలిస్టు పార్టీలూ ప్రారంభమై, కార్యకలాపాలు ప్రారంభించాయి. 1919 జనవరిలో, జర్మనీలో, కమ్యూనిస్టు విప్లవకారులు 'తిరుగుబాటు'కి ప్రయత్నించి ఓడిపోయారు. (ఈ సందర్భం లోనే కమ్యూనిస్టులైన రోజా లగ్జంబర్గునీ, కార్ల్ లీబ్‌నెక్ట్‌నీ చంపివేశారు.) హంగరీలో కూడా ఒక విప్లవ ప్రభుత్వం వచ్చి కొద్ది నెలల్లోనే పడిపోయింది. గతంలో రష్యా సామ్రాజ్యంలో భాగంగా వుండిన, బాల్టిక్ రాజ్యాలైన లాట్వియా, ఎస్తోనియా, లిథువేనియా, ఫిన్లాండుల్లో కూడా విప్లవాలు తలెత్తి కొద్ది కాలం లోనే పడిపోయాయి. కానీ, కొంత కాలానికి అవి మళ్ళీ 'సోవియట్ రిపబ్లిక్కులు'గా మారాయి. కొన్ని దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు నిలబడ లేక పోతోన్నా, ప్రతీ దేశం లోనూ కమ్యూనిస్టు కార్యకలాపాలు సాగుతోనే వున్నాయి. గతంలో లేని ట్రేడ్ యూనియన్ల ఏర్పాట్లూ, సమ్మెలూ, పేద రైతులు భూస్వా

ముల భూముల్ని పంచుకునే ప్రయత్నాలూ వంటి తిరగబాటు కార్యకలాపాలన్నీ ప్రారంభమవుతున్నాయి.

బ్రిటన్‌కీ, ఫ్రాన్స్‌కీ వ్యతిరేకంగా - వాటి వలసలైన టర్కీ లోనూ, సిరియా లోనూ, ఇండియా లోనూ, ఇతర వలస దేశాల్లోనూ, స్వతంత్రం కోసం ఉద్యమాలు జరుగుతున్నాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత, కమ్యూనిస్టు ఉద్యమాల్ని 'అణచడమే' పెట్టుబడిదారీ వర్గానికి ప్రధాన కర్తవ్యం అయింది. కమ్యూనిజాన్ని అణచడానికే చాలా పెట్టుబడిదారీ దేశాల్లో 'నియంతృత్వ ప్రభుత్వాలు' అధికారాల్లోకి వచ్చాయి. ఈ ప్రభుత్వాలు, పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యాన్ని కూడా అణిచివేశాయి.

ఇటలీలో - ముస్సోలినీ నాయకత్వాన 'ఫాసిస్టు' పార్టీ, ఇటలీ సామ్రాజ్యాన్ని పాత రోమ్ సామ్రాజ్య స్థాయిలో విస్తరించడమే తన లక్ష్యంగా ప్రకటించింది. "యుద్ధమే మానవుణ్ణి ఉన్నతుణ్ణి చేస్తుంది. స్త్రీకి ప్రసవం ఎలాంటిదో, పురుషుడికి యుద్ధం అలాంటిది. యుద్ధం చెయ్యని దేశం నిలబడజాలదు" అనేవి ముస్సోలినీ భావాలు!

జర్మనీలో - హిట్లర్ నాయకత్వాన 'నాజీ' పార్టీ, వర్సయిల్స్ సంధి షరతుల్ని తోసివేసి, జర్మనీని త్వరితంగా అభివృద్ధి పరచడమూ, జర్మనీ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయడమూ లక్ష్యంగా ప్రకటించింది. యూదుల్ని నాశనం చెయ్యాలనేది హిట్లర్ లక్ష్యాల్లో ఒకటి. ఇటలీ పెట్టుబడిదారీ వర్గం - ముస్సోలినీనీ, జర్మనీ పెట్టుబడిదారీ వర్గం - హిట్లర్‌నీ తమ రక్షకులుగా భావించి, వారి నాయకత్వాలతో నియంతృత్వాలు చేపట్టాయి.

హంగరీ, పోలెండ్, పోర్చుగల్, స్పెయిన్ - మొదలైన యూరప్ దేశాల్లో కూడా, ఫాసిస్టు ఉద్యమాలే జయించాయి.

ఒక యుద్ధం జరిగి, దేశాల మధ్య కొన్ని ఒప్పందాలు జరిగిన తర్వాత, ఇక ఆ ఒప్పందాలు అలాగే వుండిపోవు. ప్రతీ సామ్రాజ్యవాద దేశమూ, ఒప్పందాలు చేసుకున్న తర్వాత కూడా అసంతృప్తి పడుతూనే వుంటుంది. ఆందోళన పడుతూనే వుంటుంది. ఒప్పందాల్ని ఉల్లంఘించడానికి ఎదురు చూస్తూనే వుంటుంది. ఏ ఒప్పందమూ, అది వుండవలసిన కాలంలో కూడా చివరికంటా సాగదు.

1931లో జపాన్, చైనా మీద దండెత్తి, కొన్ని ప్రాంతాల్ని ఆక్రమించింది. ఆ ఆక్రమణలో, తైవాన్‌లో వున్న బ్రిటన్ ఆస్తుల్నీ అమెరికన్ ఆస్తుల్నీ కూడా, జపాను ఆక్రమించింది. అయినప్పటికీ, జపాను, చైనాని పట్టడం, బ్రిటన్ కూటమికి ఆనందమే కలిగించింది. ఎందుకంటే, చైనాలో అప్పుడు అభివృద్ధి చెందుతోన్న కమ్యూనిస్టు ఉద్యమాలు ఏ రకంగా నైనా బలహీన పడడమే దానికి కావాలి.

జర్మనీలో - వర్సయిల్స్ సంధి షరతుల్ని తిరస్కరించే చర్యలన్నీ జరిగిపోతున్నాయి. సైన్యాన్నీ - నేవీనీ పెంచడమూ, నష్ట పరిహారం చెల్లింపులు ఆపివెయ్యడమూ, ఫ్రాన్సు సరిహద్దుల్లో సైన్యాల్ని పెట్టడమూ వంటి చర్యలతో, జర్మనీ, యుద్ధానికి సిద్ధమై పోతోంది.

యూరప్ నంతా ఆక్రమించాలని ఇటలీ జర్మనీల 'ఉమ్మడి కల' అయితే, ఆసియానంతా ఆక్రమించాలని జపాన్ 'స్వంత కల'!

1935లో, ఇటలీ - ఆల్బేనియానీ, తర్వాత ఇథియోపియానీ, అబ్సీనియానీ ఆక్రమిస్తూ పోయింది. దానికి బ్రిటనూ, ఫ్రాన్సూ రహస్య మద్దతు ఇచ్చాయి.

1936లో, స్పెయిన్‌లో 'రిపబ్లిక్'ని నాశనం చెయ్యడానికి ఫ్రాంకో నియంతకి ఇటలీ సహకరించింది. దాన్ని బ్రిటన్ వ్యతిరేకించిందని, ఇటలీ, జర్మనీ వేపు చేరింది.

1938లో, జర్మనీ - ఆస్ట్రియాలో ప్రవేసించింది. తర్వాత చెకొస్లవేకియాని కలిపేసుకుంది.

1939 సెప్టెంబర్ 1 న, జర్మనీ సైన్యాలు పోలెండులో ప్రవేసించడంతో '2 వ ప్రపంచ యుద్ధం' ప్రారంభమైంది.

ఈ యుద్ధంలో కూడా 2 కూటములు వున్నాయి. బ్రిటనూ, ఫ్రాన్సూ, అమెరికాలు ఒక కూటమి. జర్మనీ, ఇటలీ, జపాన్లు ఇంకో కూటమి.

జర్మనీ, పోలెండుని ఆక్రమించడంతో, బ్రిటన్ - ఫ్రాన్సులు, జర్మనీ మీద యుద్ధం ప్రకటించాయి. కానీ, పోలెండుకి ఏమీ తోడ్పడలేక పోయాయి.

జర్మనీ, పోలెండుని ఆక్రమించడానికి పూర్వం రష్యాలో సోవియట్ ప్రభుత్వం ('స్టాలిన్' నాయకత్వంలో), బ్రిటన్ కూటమితో నిర్యుద్ధ సంధి కోసం

ప్రయత్నించింది. కానీ ఆ దేశాలు, రష్యాతో సంధికి అంగీకరించలేదు, సోషలిస్టు దేశాలకు సమర్ధన ఇవ్వ కూడదని. తర్వాత, రష్యా, జర్మనీతో 'నిర్యుద్ధ సంధి' చేసుకుంది. కానీ ఆ సంధి- "నువ్వు నా మీదకి రావద్దు, నేను నీ మీదకి రాను" అన్నంత వరకే గాక, "మనిద్దరం ఇంకోళ్ళ మీదకి పోదాం" అనే అంగీ కారంతో కూడా జరిగిందా - అని సందేహం కలిగించే విధంగా తర్వాత సంఘటనలు జరిగాయి.

జర్మనీ, పోలెండుని ఒక వేపు నించీ ఆక్రమిస్తే, సోవియట్ రష్యా కూడా పోలెండుని ఇంకో వేపు నించీ ఆక్రమించింది. 3 వారాల్లో పోలెండు ఆక్రమణ పూర్తి అయింది! పోలెండుని పంచుకోవడానికి కూడా జర్మనీ రష్యాలు, సెప్టెంబరు 29 న, ఒక ఒప్పందం చేసు కున్నాయి.

తర్వాత జర్మనీ వరసగా - నార్వేనీ, డెన్మార్క్‌నీ, బెల్జియమ్‌నీ, హాలెండునీ, తర్వాత ఫ్రాన్సునీ కూడా ఆక్రమించింది.

జర్మనీ చేసిన యుద్ధాల స్పీడుకి ముచ్చట పడ్డ వాళ్ళు, ఆ యుద్ధాలకు 'మెరుపు యుద్ధం' (లైట్నింగ్ వార్) అని పేరు పెట్టారు.

ఇటలీ, గ్రీస్ మీదకి పోయి ఓడిపోయింది.

జర్మనీ - గ్రీసునీ, యుగొస్లావియానీ, బల్గేరి యానీ, ఇంకా కొన్ని ప్రాంతాల్నీ కూడా పట్టుకోగలి గింది. బ్రిటన్‌ని తప్ప యూరప్‌లో అంతటినీ జర్మనీ జయించింది.

ఆ లోగా సోవియట్ రష్యా, తన సైనిక స్థావరాలు నిర్మించుకోవడం కోసం ఫిన్లాండుని కొంత భూమి అడిగింది. దానికి ఫిన్లాండు తిరస్కరించింది. వెంటనే రష్యా, ఫిన్లాండు మీద యుద్ధ విమానాలతో దాడి చేసి బాంబుల వర్షం కురిపించింది. ఫిన్లాండు ప్రజలు తెగించి పోరాడారు. ప్రారంభంలో రష్యాకి ఘోరమైన నష్టాలు జరిగాయి. రష్యా మరిన్ని బాంబులు కురి పించింది. చివరికి ఫిన్లాండు లొంగిపోయింది. రష్యా కోరిన భూభాగాల్నీ, దీవుల్నీ, నికిల్ గనుల ప్రాంతాన్నీ, వదులుకుంది. పెనిన్సిలా ప్రాంతాన్ని 30 సం.ల పాటు రష్యాకి లీజుకి ఇవ్వడానికి ఫిన్లాండు అంగీక రించక తప్పలేదు. ఫిన్లాండుకీ, స్వీడన్‌కీ మధ్య రైలు రోడ్డు నిర్మించే హక్కు రష్యాకి ఇవ్వడానికి కూడా ఫిన్లాండు అంగీకరించింది. మొత్తం మీద ఈ యుద్ధంలో రష్యా, ఫిన్లాండు నించి 16 వేల చదరపు మైళ్ళ భూభాగాన్ని సంపాదించి, ఆ ప్రాంతాన్ని ఒక రిపబ్లిక్‌గా ఏర్పరిచి, దాన్ని రష్యాలో భాగంగా ప్రకటిం చింది.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో, "సామ్రాజ్య వాద యుద్ధాన్ని విప్లవ యుద్ధంగా మార్చండి" అనే విప్లవ నినాదంతో, సామ్రాజ్య వాదాన్ని నిరసిస్తూ తన వలసలన్నిటినీ 'స్వయం నిర్ణయాధికారాలకు' వదిలి వేసిన కమ్యూనిస్టు రష్యా, 20 ఏళ్ళ కాలం గడిచే నాటికి, తనే ఇతర దేశాల మీద దౌర్జన్యం చేసే దేశంగా మారింది! ఆ 20 ఏళ్ళ కాలంలో, రష్యా, తన ప్రజ లకూ ప్రపంచ ప్రజలకూ కమ్యూనిజాన్ని బోధించ డమూ, తన దేశంలో నిజమైన కమ్యూనిస్టు మార్పులు చూపించడమూ, ప్రజల కమ్యూనిస్టు చైతన్యం మీద ఆధార పడడమూ గాక, పెట్టుబడిదారీ దేశాల పద్ధతి లోనే, సరిహద్దు దేశాల్ని దౌర్జన్యంతో ఆక్రమించి, అక్కడ సైనిక స్థావరాలు నిర్మించి - ఆ మార్గం లోనే 'తన రక్షణ' కోసం ప్రయత్నించింది.

జర్మనీ - బ్రిటన్‌ని తప్ప మిగతా యూరప్ దేశా లన్నిటినీ ఆక్రమించి, అన్ని దేశాల తోటీ 'లొంగి పోయి నట్టు' ఒప్పందాలు చేసుకుని, ఇక రష్యా వేపు తిరిగింది. తనకు రష్యాతో వున్న 'నిర్యుద్ధ సంధి'ని తోసి వేసి, 1941 జూన్ 22 న, రష్యా మీద దాడి చేసింది. 2 నెలల్లో రష్యా ఆక్రమణ పూర్తి చెయ్యగలనను కుంది.

డిసెంబరులో, ఇటలీ, అమెరికా మీద యుద్ధ ప్రకటన చేసింది.

జర్మనీ సైన్యం, రష్యా ప్రాంతాల్ని ఆక్రమిస్తూ ముందుకు పోతోంటే, జర్మనీ విజయాలకు, బ్రిటనూ అమెరికాలు భీతి చెందాయి. రష్యాకి 'మద్దతు' ప్రక టించాయి.

ఇంకో వేపు జపాను, 1941 డిసెంబరులో, అమెరికన్ హార్బర్ మీద బాంబులు వేసింది. 200 నౌకలూ, వేలాది జనమూ, నాశనమయ్యారు. వెంటనే అమెరికా, జపాన్ మీద యుద్ధం ప్రకటించింది.

1942 మధ్య నాటికే జపాను, ఆసియాలో - మలయా, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, సింగ పూర్, థాయ్‌లాండ్, హాంగ్‌కాంగ్ - ఇంకా అనేక ప్రాంతాల్ని ఆక్రమించింది.

బ్రిటనూ, అమెరికా, రష్యా, ఇంకా 26 దేశాలూ కలిసి - ఒక ప్రకటన చేశాయి - ఉమ్మడిగా పోరాడాలనీ, విడి విడి ఒప్పందాలు చేసుకోరాదనీ!

1943లో, బ్రిటన్ అమెరికాలు - మొరాకో, ఉత్తరాఫ్రికా, అల్జీరియాల్ని ఆక్రమించాయి. ఇటలీని కూడా! ముస్సోలినీని అరెస్టు చేశారు. తర్వాత కాలంలో చంపివేశారు.

రష్యన్ సైనికులూ ప్రజలూ ఊహాతీతమైన సాహసాలతో, త్యాగాలతో, జర్మనీ సైన్యంతో పోరాడారు. 1943 ఫిబ్రవరిలో, జర్మన్ సైనికులూ, అధికారులూ 90 వేల మంది, రష్యాకి లొంగిపోయారు. ఆ యుద్ధ కాలంలో రష్యాలో 3 లక్షల మంది జర్మన్‌లు మరణించారు.

హిట్లర్ సైన్యాన్ని ఓడించిన కీర్తి సోవియట్ ప్రజలకే దక్కింది. కానీ, పోలెండ్ మీదా, ఫిన్లాండ్ మీదా అక్రమంగా దాడి చేసిన అప కీర్తి కూడా అంతకన్నా ముందే వారికి దక్కింది.

1944 జూన్ నాటికి, జర్మనీ, 3 వేపుల నించీ శత్రు సైన్యాలతో పోరాడ వలసిన పరిస్తితిలో పడింది.

సోవియట్ సైన్యం - రుమేనియా, చెకొస్లవేకియాల నించీ జర్మన్ సైన్యాల్ని తరిమివేస్తూ, 1945 మే 2 న, జర్మనీ రాజధాని అయిన బెర్లిన్ లోకి ప్రవేశించింది.

హిట్లరూ, గోబెల్సూ - వంటి వాళ్ళు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఇంకా కొంత కాలం ఆసియాలో జపాన్‌కి వ్యతిరేకంగా యుద్ధం నడిచింది.

అమెరికా - భయంకరమైన ఆటంబాంబుల్ని జపాన్‌లో, ఆగస్టు 6 న - హిరోషియా మీదా, 9న - నాగసాకీ మీదా వేసింది. ఆ బాంబుల వల్ల నగరాల విధ్వంసమే గాక, 3 లక్షల 20 వేల మంది జనాభా మరణించారు. ఆగస్టు 14 న, జపాను లొంగింది. దానితో, 2 వ ప్రపంచ యుద్ధం ముగిసింది.

ఈ యుద్ధం తర్వాత, ఏం జరిగిందో చూస్తే, ఇప్పుడు మాత్రం కొత్తగా ఏం జరిగింది? మళ్ళీ 'వలసల పునర్విభజనే' జరిగింది.

2 వ ప్రపంచ యుద్ధంలో జరిగిన మరణాలూ, ఆస్తి నష్టాలూ, హింసలూ, ఘోరాలూ వగైరాలతో పోలిస్తే, మొదటి ప్రపంచ యుద్ధం ఎంతో చిన్న యుద్ధం. చిట్టి యుద్ధం. మొదటి ప్రపంచ యుద్ధం నాటికి లేని ఎన్నో రకాల మారణాయుధాలు, ముఖ్యంగా 'అణు బాంబులు' ఈ యుద్ధంలో అవతరించాయి.

2 వ ప్రపంచ యుద్ధం తర్వాత కూడా ఇంకా ఎక్కడికక్కడ ప్రాంతీయ యుద్ధాలు సాగుతోనే వున్నాయి. గతంలో కన్నా వేలాది రెట్ల శక్తివంతమైన మారణాయుధాల గుట్టలు పెరుగుతూనే వున్నాయి.

ఇప్పుడు ఇంకో ప్రపంచ యుద్ధం గనక వస్తే, భూగోళమే తునాతునకలై పోయే మారణాయుధాలెన్నో సామ్రాజ్యవాద దేశాల దగ్గిర వున్నాయి!

**'భూమండలం'లో మొత్తం భూమి వైశాల్యం - 13 కోట్ల, 30 లక్షల చదరపు కిలోమీటర్లు. 20 వ శతాబ్దపు ప్రారంభానికి - 8 కోట్ల, 90 లక్షల చ.కి.మీ. భూమి, వలసలుగా వుంది! మిగిలిన 4 కోట్ల 40 లక్షల చ.కి. మీటర్లు, సామ్రాజ్యవాద దేశాల భూభాగం! అంటే, సామ్రాజ్యవాద దేశాలన్నీ కలిసి తమ వైశాల్యం కన్నా 2 రెట్లు వైశాల్యం గల భూమిని వలసలుగా ఆక్రమించాయన్న మాట!**

గుత్త కంపెనీలు అభివృద్ధి చెందుతోన్న కొద్దీ వాటి మధ్య ఒప్పందాలు ఏర్పడి, 'పోటీ' నశిస్తుందనీ, యుద్ధాలకు అవకాశమే వుండదనీ చెప్పే సామ్రాజ్యవాదుల వాదనలన్నీ ఎంత అర్ధ రహితమో, ఈ యుద్ధాలు రుజువు చేస్తాయి.

పెట్టుబడిదారీ విధానంలో, పోటీ నశించడం వుండదు. కాబట్టి, యుద్ధాలు నశించడం కూడా వుండదు.

ఒక దేశం, ఒక కాలంలో కమ్యూనిస్టు మార్గాన్ని ప్రారంభిస్తే, అది ఆ మార్గం లోనే స్తిరంగా కొనసాగకుండా క్రమంగా ఆ మార్గాన్ని వదిలి, పెట్టుబడిదారీ 'లాభం రేటు' మార్గం లోకే, పెట్టుబడిదారీ పోటీ లోకే తిరిగితే, ఇక అక్కడ ఏదైనా వుంటుంది గానీ 'కమ్యూనిజం' మాత్రం వుండదు. ఈ సత్యాన్ని రష్యా, చైనా చరిత్రలు చక్కగానే రుజువు చేశాయి. ఈ పరిస్థితులు ఎందుకు తలెత్తాయంటే, ఆ దేశాల్లోనూ, ఇతర ప్రపంచ దేశాల్లోనూ మెజారిటీ కార్మిక ప్రజలకు **మార్క్సిజం** అందకపోవడం వల్ల! సామ్రాజ్యవాదం జయిస్తోందంటే, ప్రపంచ ప్రజలు ఇంకా దాన్ని సహించే స్థాయిలోనే వున్నారని అర్థం. ★

# 7. సంక్షోభాలు

'సరుకు'ని అమ్మగా వచ్చే 'అదనపు విలువ' ఎన్ని రకాలుగా పంపకం అవుతుందో ఇప్పటికి పూర్తిగా చూశాం, సామ్రాజ్యవాదులు లాగే భాగాలతో సహా.

'సరుకు' తయారైన తర్వాత, దాన్ని అమ్మే పని సకాలంలో సవ్యంగా జరుగుతూ వుంటేనే, 'ఖర్చయిన పెట్టుబడి' అంతా వెనక్కి రావడమూ, 'అదనపు విలువ' అంతా ఎవరెవరికి చేరాలో వాళ్ళకి చేరడమూ - ఈ రెండూ సవ్యంగా జరుగుతూ వుంటాయి.

ఇప్పటి వరకూ మనం - 'ఉత్పత్తి క్రమం' అనీ, 'చలామణీ క్రమం' అనీ, 'పునరుత్పత్తి క్రమం' అనీ, చెప్పుకున్నప్పుడల్లా, సమాజంలో అన్ని శాఖల్లోనూ తయారయ్యే సరుకు అంతా ఎప్పటికప్పుడు అమ్ముడై పోతూ వుంటుందనే అర్థం తోటే చెప్పుకున్నాం. సరుకు అంతా ఎప్పటికప్పుడు అమ్ముడై పోతూ, తర్వాత వాడకం అయిపోతూ వుంటే, ఏ శాఖలో నైనా మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి క్రమాలు జరగడంలో సమస్యేమీ వుండదు.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి క్రమాలు, అంత మృదువు గానూ, అంత నిరాటంకం గానూ జరిగిపోతూ వుండవు. ఈ విధానంలో, కొన్ని సంవత్సరాల కొకసారి చాలా శాఖల్లో 'సరుకుల రాసి'లో చాలా భాగం అమ్మకాలు లేకుండా నిలిచి పోయే పరిస్థితి ఏర్పడుతూ వుంటుంది. అలాంటి పరిస్థితే 'సంక్షోభం' (క్రైసిస్).

సరుకు, అమ్ముడు కాకుండా నిలిచిపోతే, తర్వాత జరగవలసిన విషయాలన్నీ కూడా నిలిచి పోతాయి. అంటే, పెట్టుబడి వెనక్కి రావడమూ, లాభాలూ వడ్డీలూ రావడమూ, అన్నీ నిలిచిపోతాయి.

సరుకులు ఎప్పటికప్పుడు ఖర్చవకుండా నిలిచి పోవడం వల్ల, కొన్ని రకాల సరుకులైతే పూర్తిగా పాడై పోతాయి. ఆ సరుకుల మీద లాభం రాకపోవడమే గాక, పెట్టుబడి కూడా వెనక్కి రాకుండా నాశనమై పోతుంది. తొందరగా పాడవని సరుకుల విషయంలో కూడా వాటిని సకాలంలో అమ్మలేకపోతే, స్టోరు ఖర్చులు పెరిగిపోయి, తర్వాత ఎప్పుడో అమ్మినప్పుడు లాభం రేటు తగ్గుతుంది. కొన్ని సార్లు ధరలు బాగా తగ్గి, లాభమే లేకపోవచ్చు కూడా.

ఏ శాఖలో నైనా, తయారవుతూ వున్న సరుకు అంతా ఖర్చయిపోతూ వుంటేనే, మళ్ళీ కొత్త సరుకుని ఉత్పత్తి చేసే పని అవసరం. సరుకులో చాలా భాగం నిలిచిపోతూ వుంటే, అదంతా ఖర్చయ్యే దాకా కొత్త సరుకుని ఉత్పత్తి చెయ్యవలసిన అవసరం వుండదు. అలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి దారులు 'పునరుత్పత్తి క్రమాల్ని' బాగా తగ్గించి వెయ్యడమో, కొంత కాలం పాటు ఆపివెయ్యడమో చేస్తారు.

అలాంటి కాలాల్లో కార్మికుల్లో కొంత భాగాన్నో చాలా భాగాన్నో పనుల్లోంచి తీసివేస్తారు. అప్పటికే పనులు లేకుండా వున్న 'నిరుద్యోగ కార్మిక జనాభా' లోకి ఈ కొత్త నిరుద్యోగులు కూడా చేరతారు.

చాలా మంది కార్మికులకు, ఫుల్ టైమ్ ఉద్యోగాలు, పార్ట్ టైమ్ ఉద్యోగాలుగా మారతాయి. జీతాలు తగ్గిపోతాయి. వీరు కూడా దాదాపు నిరుద్యోగులతో సమానం అవుతారు.

ఫుల్ టైమ్ పనుల్లో వున్న కార్మికులకు కూడా జీతాలు తగ్గించి వేస్తారు. "సరుకు అమ్ముడు పోవడం లేదు కాబట్టి, ఫుల్ జీతాలు ఇవ్వలేం" అంటారు. జీతాలు ఎంత తగ్గించినా కార్మికులు దానికే అంగీకరించవలసిన పరిస్తితి ఏర్పడుతుంది.

'జీతాలు తగ్గని' కార్మికుల కుటుంబాల పరిస్తితులు కూడా గతంలో లాగ ఉండవు. గతంలో ముగ్గురో, నలుగురో పని చేసే ఒక కార్మిక కుటుంబంలో, ఒకరికో ఇద్దరికో పూర్తిగా పనులు పోయి, మిగిలిన వారి జీతాల తోటే అందరూ బతకవలసి వస్తుంది. ఆ జీతాలు పూర్తి జీతాలే అయినా, ఆ కుటుంబం వాడగలిగే ఉత్పత్తులు గతంలో లాగా వుండవు. చాలా తగ్గిపోతాయి.

ఇక, అందరికీ ఉద్యోగాలు పోయిన కార్మిక కుటుంబాన్ని తీసుకుంటే, దాని సంగతి చెప్పడానికేమీ వుండదు - పస్తులూ, జబ్బులూ, బిచ్చమెత్తడాలూ, దొంగతనాలూ, హత్యలూ, ఆత్మ హత్యలూ తప్ప!

ఈ రకంగా, సరుకులు అమ్ముడు గాకుండా నిలిచి పోయే పరిస్తితి, ఒక వేపు - పెట్టుబడిదారులకూ, ఇంకో వేపు- కార్మికులకూ కూడా 'సంక్షోభం'గా తయారవుతుంది. అయితే ఈ సంక్షోభం, పెట్టుబడిదార్ల వర్గానికి - 'లాభం సంపాదించలేని సమస్య'గా వుంటే, కార్మిక వర్గానికి - 'జీవితావసర ఉత్పత్తులు'

సంపాదించ లేని (జీవించడమే సాధ్యం కాని) సమస్యగా వుంటుంది. ఒక వేపు - 'లాభం' సమస్య అయితే, ఇంకో వేపు జీవన్మరణ సమస్య! కాబట్టి, 'సంక్షోభం' అనేది - ఇరు వర్గాలకూ ఒకే అర్థంతో గాక, వేరు వేరు అర్థాలతో వుంటుంది.

ఇప్పటి వరకూ నడిచిన 'పెట్టుబడిదారీ చరిత్ర'లో, మొట్ట మొదటి సంక్షోభం, 1825లో సంభవించింది. అప్పటి నించీ ఇప్పటి వరకూ కొన్ని సంవత్సరాల కొకసారి సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతూనే వున్నాయి. ఇప్పటికి కొన్ని డజన్ల సంక్షోభాలు సంభవించాయి. సరుకులు అమ్ముడు కాకుండా నిలిచి పోతూ వుంటాయి.

'బట్ట' శాఖలో, (ఒక శాఖలో) సరుకు నిలిచి పోయిందంటే, ఒక్క మీటరు బట్ట కూడా అమ్ముడు పోదని అర్థం కాదు. సమాజానికి ఎప్పుడూ ఎంతో కొంత బట్ట అవసరమవుతూనే వుంటుంది. అవసరమైనంత వరకూ అమ్ముడవుతూనే వుంటుంది. అదే 'మార్కెట్ డిమాండ్'. ఆ డిమాండ్‌ని మించి ఉత్పత్తి అయ్యే సరుకే అమ్మకాలు లేకుండా నిలిచిపోతూ వుంటుంది. కొంత కాలానికి, అది, ఉత్పత్తి క్రమాన్ని తగ్గించివేసే, పూర్తిగా ఆపివేసే పరిస్థితిగా కూడా తయారవుతుంది. కాబట్టి, సంక్షోభానికి తక్షణం పైకి కనబడే కారణం 'అమితోత్పత్తి' (ఓవర్ ప్రొడక్షన్).

'అమితోత్పత్తి' అంటే, సమాజంలో వున్న మనుషులందరి అవసరాలూ తీరిపోగా ఇంకా అమితంగా వున్న ఉత్పత్తి - అని అర్థం కాదు. 'మార్కెట్ డిమాండ్ కన్నా అమితంగా వున్న ఉత్పత్తి' అని అర్థం.

ఒక విడి సరుకుని తీసుకున్నా, మొత్తం 'సరుకుల రాసి'ని తీసుకున్నా, అది C + V + S అనే 3 భాగాలుగా వుంటుందని మనకు తెలుసు. ఆ 3 భాగాలూ ఎలా ఖర్చవుతాయో కూడా మనకు తెలుసు.

C భాగం - మళ్ళీ C గా.
V భాగం - మళ్ళీ V గా.
S భాగం - మళ్ళీ S గా.

ఈ రకంగా 'సరుకు' అంతా, C + V + S భాగాలుగా ఖర్చయిపోతూ వుంటుంది.

మరి, ఏ సరుకు అయినా 3 భాగాలుగా ఖర్చయి పోయే మార్గం వున్నప్పుడు, అందులో కొంత భాగం ఖర్చు కాకుండా నిలిచి పోయే పరిస్తితి ఎలా ఏర్పడుతుంది? ఒక 'సరుకుల రాసి'లో వున్న C ని మళ్ళీ C గా వాడవచ్చు. V ని, కార్మికులు వాడేస్తారు. S ని పెట్టుబడిదారులు వాడేస్తారు. అందులో కొంత భాగాన్ని కొత్త పెట్టుబడిగా కూడా మారుస్తారు. ఇక సమస్య ఏమిటి?

సమస్య ఏమిటంటే, సరుకుల రాసి, 3 భాగాలుగా ఖర్చవ్వాలంటే, అలా ఖర్చవడానికి వీలైన పాళ్ళల్లోనే ఆ భాగాలు వుండాలి. సరుకుల రాసిలో ఎంతో భాగం అమ్మకాలు లేకుండా నిలిచి పోతోందంటే, ఆ రాసిలో భాగాలు ఖర్చవడానికి సాధ్యం కాని పాళ్ళల్లో వున్నాయన్న మాట! శాఖల్లో అనేక చోట్ల పరస్పర సంబంధాలు తెగిపోయి, సమన్వయం తప్పి పోయినప్పుడే సమస్య ప్రారంభమవుతుంది. ఈ అంశం అంతా 'సమిష్టి ప్లాను లేకపోవడం' కిందకి వస్తుంది.

'అమితోత్పత్తి'కి నిజమైన కారణం, 'లాభ దృష్టి' గల ఉత్పత్తి విధానమే. అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం.

'అమితోత్పత్తి'కీ, 'సంక్షోభాల'కూ దారి తీసే పరిస్థితుల్ని, కొన్ని అంశాలుగా ఇలా విభజించవచ్చు.

1. 'సమాజం'లో 'సమిష్టి ప్లాను'కి అవకాశం లేకపోవడం.
2. ఎక్కువ లాభం కోసం పోటీ.
3. V ఉత్పత్తుల్ని కార్మికులు కొనలేకపోవడం:
4. 'అదనపు విలువ' గుట్టల్ని, పెట్టుబడిదారీ వర్గం మాత్రమే వాడవలసి వుండడం.

ఈ అంశాలన్నీ గతంలో చూసినవే అయినా, ఇక్కడ ఒక సారి వీటిని క్లుప్తంగా ప్రస్తావించుకోవాలి. నిజానికి, ఈ అంశాలన్నీ ఒక దానితో ఒకటి లంకెలు పడి వుండే విషయాలే.

### 1. 'సమిష్టి ప్లాను'కి అవకాశం లేకపోవడం:

'సమిష్టి ప్లాను' అంటే, 'సమాజం'లో వున్న వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో తయారయ్యే ఉత్పత్తుల పరిమాణాల మధ్య సమన్వయం వుండడం. ఒక శాఖ ఉత్పత్తి, కొన్ని ఇతర శాఖల ఉత్పత్తుల కోసం వాడకం అయ్యేలాగ, ఆ ఉత్పత్తుల పాళ్ళు వుండాలి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, వేరు వేరు శాఖల మధ్య గానీ, ఒకే శాఖలో వేరు వేరు పెట్టుబడుల మధ్య గానీ, 'సమిష్టి ప్లాను'కి అవకాశం వుండదు. ప్రతీ శాఖ లోనూ పెట్టుబడి దారులందరూ 'మార్కెట్ జ్ఞానం' తోటే అంచనాలు వేసుకున్నప్పటికీ, ఎవడి మార్కెట్ జ్ఞానం వాడిదే. ఎవడి అంచనా వాడిదే. ఆ అంచనాలు సరై

నవిగా వుండవు. ఎవరి అంచనాలతో వాళ్ళు ఉత్పత్తి చేస్తారు కాబట్టి, ఒక శాఖలో అందరి ఉత్పత్తీ కలిసి, 'మార్కెట్ డిమాండ్' కన్నా తక్కువగా నైనా వుండ వచ్చు; ఎక్కువగా నైనా వుండవచ్చు.

'సప్లై' తక్కువగా వుంటే, అది అల్పోత్పత్తి (అండర్ ప్రొడక్షన్).

'సప్లై' ఎక్కువగా వుంటే, అది అమితోత్పత్తి (ఓవర్ ప్రొడక్షన్).

ఇందులో ఏ పరిస్థితి అయినా, 'సంక్షోభానికి' దారి తీస్తుంది.

ఒక శాఖలో 'అల్పోత్పత్తి' వుంటే, అమ్మకాలు లేకుండా సరుకు నిలిచిపోయే సమస్య ఆ శాఖలో గాక; ఆ సరుకుతో అవసరం వున్న ఇతర శాఖల్లో ఏర్పడుతుంది. ఎలాగంటే: రోజూ 100 మీటర్ల బట్ట తయారవాలనుకుందాం. దానికి కావలసిన శ్రమ పరిక రాలూ, అగ్జిలరీ పదార్థాలూ తగిన విధంగానే వున్నా, దారం మాత్రం కావలసినంతగా లేదనుకుందాం. 'దారం' శాఖలో అల్పోత్పత్తి వుంది. ఆ తక్కువగా వున్న దారంతో కొంత బట్ట మాత్రమే తయారవుతుంది. శ్రమ పరికరాల లోనూ, అగ్జిలరీ పదార్థాల లోనూ కొంత కొంత భాగాలు మాత్రమే ఖర్చయ్యి, మిగిలిన భాగాలు వాడకం లోకి వెళ్ళకుండా వుండిపోతాయి. వాటికి అమ్మకాలు వుండవు. అవన్నీ డిమాండ్‌ని మించి ఉత్పత్తి అయినవి కాకపోయినా, 'దారం'తో పోలిస్తే అవి అమితోత్పత్తే. (అవి 'అబ్సల్యూట్ అమితో త్పత్తి' గాక, 'రెలెటివ్ అమితోత్పత్తి'). ఆ అమితోత్పత్తి భాగం, అమ్మకాలు లేకుండా నిలిచిపోతుంది.

ఒక శాఖలో కొంత సరుకు నిలిచిపోయినప్పుడు, ఆ శాఖలకు ఉత్పత్తి సాధనాల్ని అందించే శాఖల్లో కూడా కొంత సరుకు నిలిచి పోతుంది. క్రమంగా ఆ పరిస్థితి అనేక శాఖలకు విస్తరిస్తుంది.

'దారం' శాఖలో 'అల్పోత్పత్తి' గాక 'అమితోత్పత్తి' వుంటే, అప్పుడు సరుకు నిలిచి పోయే పరిస్థితి, ఆ శాఖ నించే ప్రారంభమవుతుంది. ఒక శాఖలో, డిమాండ్ కన్నా సప్లై ఎక్కువగా వుంటే, ఆ సరుకుకి 'ధర' తగ్గి, క్రమంగా దాని ఉత్పత్తి తగ్గి, ఆ రకంగా ఆ శాఖలో సప్లై డిమాండ్లు బ్యాలెన్స్ అవుతాయని గతంలో చూశాం. అలా జరిగినంత కాలమూ సమస్య వుండదు. అలా జరగనప్పుడే సమస్య తలెత్తుతుంది. 'సప్లై డిమాండ్లు, పరస్పరం క్రమంగా బ్యాలెన్స్ చేసు కుంటాయి' అంటే, దాని అర్థం, 'పరిస్థితి ఎలా వున్నా బ్యాలెన్స్ చేసుకుంటాయి' అని కాదు. బ్యాలెన్స్ చేసుకోవడానికి కూడా కొన్ని పరిస్థితులు వుండాలి.

పెట్టుబడిదారీ విధానంలో, 'సప్లై డిమాండ్లు పరస్పరం బ్యాలెన్స్ చేసుకోవడం' అనే లక్షణంతో పాటు, 'లాభం కోసం పోటీ' అనే ఇంకో లక్షణం కూడా వుంటుంది. ఆ పోటీ, 'సప్లై'ని పెంచివేస్తూ, 'సప్లై డిమాండ్లు పరస్పరం బ్యాలెన్స్ చేసుకోలేని' పరి స్థితుల్ని సృష్టిస్తూ వుంటుంది. ఈ పరస్పర విరుద్ధ లక్షణాలు దేని దారిన అవి పని చేస్తూ వుంటాయి. దేని ప్రభావం ఎక్కువగా వుంటే, దానికి తగిన పరిస్థితి ఏర్పడుతూ వుంటుంది.

సప్లై పెరిగి, ధర తగ్గినప్పుడు, ఆ తగ్గిన ధరతో, ఆ శాఖలో ఎంత సరుకు వుంటే అంత సరుకూ తప్పని సరిగా అమ్ముడై తీరుతుందని అర్థం కాదు. తగ్గిన ధరతో కూడా సరుకు అంతా అమ్ముడు కాకపోవచ్చు. లేదా, ధర తగ్గకుండా కూడా వుండవచ్చు. కొత్త సరుకు వచ్చేటప్పటికి పాత సరుకు అంతా అమ్ముడవక, కొంత సరుకు స్టోరుల్లో నిలిచి పోతూ వుండవచ్చు.

కొత్త సరుకు వచ్చేటప్పటికి పాత సరుకు అంతా పూర్తిగా అమ్ముడు కాకపోయినా, 'పునరుత్పత్తి క్రమం' సాధ్యమే. ఎలాగంటే, 'పెట్టుబడి'ని వెనక్కి తీసుకోవ డానికీ (అంటే, కొత్త ఉత్పత్తి సాధనాల్ని కొనడానికి), వడ్డీ - కౌలూ - వంటి కొన్ని భాగాల్ని చెల్లించడానికీ వీలయ్యే వరకూ కొంత సరుకుని సకాలంలో అమ్మ గలిగితే, 'పునరుత్పత్తి' క్రమం సాధ్యమే. అయితే ఇది, ఎక్కువ కాలం సాధ్యం కాదు. స్టోరుల్లో నిలిచి పోతోన్న సరుకు ఎక్కువై పోతూ వుంటే, ఇక పునరుత్పత్తి క్రమం సాధ్యమూ కాదు, అవసరమూ కాదు. ఈ రకంగా, వేరు వేరు శాఖల మధ్య 'సమిష్టి ప్లాను' లేకపోవడం వల్ల, అల్పోత్పత్తీ - అమితోత్పత్తీ పరిస్థితులు ఏర్పడతాయి. అయినప్పటికీ కొంత కాలం వరకూ 'పునరుత్పత్తి క్రమాలు' సాగుతూనే వుంటాయి. ఇక సాధ్యం కాని చోట అవి కుంటుపడతాయి. ఈ సమస్య ఒక శాఖ నించీ ఒక శాఖకి పాకిపోతూ వుంటుంది.

## 2. 'ఎక్కువ లాభం' కోసం 'పోటీ':

గతంలో అనేక సార్లు చూసిన విషయమే ఇది. 'కాస్ట్ ప్రైస్'ని తగ్గించి, ఎప్పటి ధరకే అమ్మి, ఆ రకంగా 'ఎక్కువ లాభం' పొందాలనే ప్రయత్నం, 'సప్లై'ని పెంచి వేస్తూ వుంటుంది. పెట్టుబడిదారీ విధానం, 'లాభం కోసమే' జరిగే ఉత్పత్తి విధానం. ప్రతీ యూనిట్ సరుకు నించీ కొంత లాభం వస్తుంది

కాబట్టి, ఎక్కువ లాభం సంపాదించాలంటే, ఎక్కువ యూనిట్ల సరుకుని అమ్మాలి. ఎక్కువ సరుకుని అమ్మాలంటే, యూనిట్ ధరని ఇతర పెట్టుబడిదారుల కన్నా కొంత తగ్గించి ఇవ్వగలగాలి. 'ధర'ని తగ్గించా లంటే, సరుకుని ఉత్పత్తి చేసే ఖర్చుని (కాస్ట్ ప్రైస్‌ని) తగ్గించ గలగాలి. ఉత్పత్తి ఖర్చుని తగ్గించాలంటే, సరుకుని ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చెయ్యాలి.

100 యూనిట్లని ఉత్పత్తి చేసినప్పటి కన్నా, 200 యూనిట్లని ఉత్పత్తి చేసినప్పుడు, చాలా ఖర్చులు కలిసి వచ్చి, ప్రతీ యూనిట్‌కీ ఉత్పత్తి ఖర్చు తగ్గు తుంది. ఒకే సారి 300 యూనిట్లు ఉత్పత్తి చేస్తే, యూనిట్‌కి ఉత్పత్తి ఖర్చు ఇంకా తగ్గుతుంది. ఇలా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసిన సరుకుని, అదే శాఖలో ఇతర పెట్టుబడి దారులు అమ్మే ధరతో గానీ, కొంచెం తగ్గించి గానీ అమ్మితే, 'ఎక్కువ లాభం' వస్తుంది. ఎక్కువ సరుకుని తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చెయ్యాలంటే, ఆ పని ఉత్పత్తి శక్తిని పెంచడం ద్వారానే సాధ్యమవుతుంది (ఇదే పని, ఆ శాఖలో ఎక్కువ మంది పెట్టుబడి దారులు చెయ్యగలిగితే, అందరి దగ్గిరా 'ధర' సహజం గానే తగ్గిపోయి, ఎక్కువ లాభం సంపాదించే అవకాశం ఎవరికీ వుండదు.) అందరూ కలిసి పోటీలు పడుతూ, ఒకరితో సంబంధం లేకుండా ఒకరు, ఉత్పత్తి శక్తుల్ని పెంచి వేస్తూ ఎక్కువ సరుకుని ఉత్పత్తి చేస్తూ వుంటారు. కానీ, ఎక్కువ సరుకుని ఉత్పత్తి చెయ్యగానే సరిపోదు. దాన్నంతా అమ్మాలి! డిమాండ్‌కి తగిన సప్లై మాత్రమే వుంటే, దాన్ని అమ్మడంలో సమస్యేమీ వుండదు. కానీ, ఎక్కువ లాభం కోసం పోటీల వల్ల, డిమాండ్‌ని మించిన సప్లై తయారవుతూ వుంటే, సరుకులో కొంత భాగం అమ్ముడు కాకుండా నిలిచి పోతూ వుంటుంది. 'స్వదేశం'లో అమ్మలేకపోతే విదేశాల్లో అమ్మడానికి కూడా ప్రయత్నిస్తారు. ఎక్కడా అమ్మలేక పోయినప్పుడే సరుకు నిలిచి పోవడం ప్రారంభమవు తుంది.

పెట్టుబడిదారీ విధానం, 'నిజ అవసరాల్ని బట్టి' ఉత్పత్తి చేసే విధానమూ కాదు; 'మార్కెట్ అవసరాల్ని బట్టి' (అమ్మగలిగే డిమాండ్‌ని బట్టి) ఉత్పత్తి చేసే విధానమూ కాదు. పెట్టుబడిదారీ విధానం, డిమాండ్‌ని బట్టి సప్లైని ఇవ్వడం గాక, లాభ దృష్టితో సప్లైని పెంచుతూ, ఆ సప్లైని బట్టి డిమాండ్ కోసం ప్రయత్నిస్తుంది. ఆ రకంగా, అది అమితోత్పత్తికీ, శాఖల మధ్య సమన్వయం లేనితనానికీ, తప్పని సరిగా దారి తీస్తుంది.

### 3. V ఉత్పత్తుల్ని కార్మికులు కొనలేకపోవడం:

కార్మికులు ఒక వారం అంతా పని చేసి, వారం చివర జీతాలు తీసుకుంటారనుకుందాం. ఆ వారంలో కార్మికులు ఏ సరుకు నైతే ఉత్పత్తి చేశారో ఆ సరుకు అప్పుడే మార్కెట్లోకి రాదు. గత వారంలో తయారైన సరుకే మార్కెట్లో వుంటుంది. చేతుల్లోకి వచ్చిన కొత్త జీతాలతో కార్మికులు, అప్పటికే మార్కెట్లో వున్న గత వారపు సరుకుని కొంటారు. కొత్త వారపు సరుకుని ఎప్పుడు కొంటారంటే, ఇంకో వారం చివర జీతాలు వచ్చినప్పుడు! 'ధాన్యం' విషయం తీసుకుంటే ఇది తేలిగ్గా అర్థమవుతుంది. ఒక వారం అంతా పొలం పనులు చేసి, వారం చివర జీతాలు తీసుకున్న కార్మి కులు, ఆ జీతాలతో, పొలంలో తయారవుతూ వున్న, లేదా అప్పుడే తయారై వున్న ధాన్యాన్ని (బియ్యాన్ని) కొనరు. కొంత కాలం కిందట తయారై అప్పటికే మార్కెట్లో వున్న ధాన్యాన్ని కొంటారు.

అంటే, దీన్ని క్లుప్తంగా చూస్తే, కార్మికులు 2 వ వారంలో పని చెయ్యగా వచ్చిన జీతాలతో, మొదటి వారంలో సరుకుని కొంటారు. 3 వ వారంలో పని చెయ్యగా వచ్చిన జీతాలతో, 2 వ వారంలో సరుకుని కొంటారు. తర్వాత కూడా అలాగే.

అయితే, 3 వ వారం పూర్తి అయిన వెంటనే కార్మికులకు ఉద్యోగాలు పోయాయి - అనుకుందాం. 3 వ వారంలో తయారై వున్న సరుకులో V భాగాన్ని ఇక కార్మికులు ఎలా కొనగలరు? దాన్ని కొనాలంటే, కార్మికులు 4 వ వారంలో కూడా పని చేసి జీతాలు తీసుకోవాలి. 4 వ వారపు జీతాలు తీసుకుంటేనే, వాటితో 3 వ వారపు V ని కొనడం సాధ్యం. అంటే, దీని సారాంశం - కార్మికులు, సరుకుల రాసిలో నించి, ఎప్పుడూ తమ V భాగాన్ని కొంటూ వుండాలంటే, వారు ఎప్పుడూ 'పని'లో కొనసాగుతూ వుండాలన్న మాట! 'పని' పోయిందంటే, ఇక ఆ కార్మికులు, మార్కెట్లో వున్న V ఉత్పత్తుల్ని కొనడం సాధ్యం కాదు.

కార్మికులు ఎప్పుడూ కొత్త జీతాలతో, అంతకు ముందు తయారై వున్న సరుకునే కొంటూ వుంటారు. అయినప్పటికీ, ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, ఏ వారపు జీతాలతో ఆ వారపు ఉత్పత్తినే కొంటారు - అని అర్థం చేసుకోవచ్చు. దీని వల్ల విషయంలో తేడా ఏమీ రాదు. గతంలో అంతా ఇలాగే అర్థం చేసు

కుంటూ వచ్చాం. కానీ, సాధారణంగా జరిగే దేమిటంటే, కొత్త జీతాలతో అప్పటికే మార్కెట్లో వున్న గత ఉత్పత్తిని కొనడమే జరుగుతూ వుంటుంది. అందుకే, కార్మికులకు ఉద్యోగాలు పోగానే అప్పటికి తయారై వున్న V ఉత్పత్తులకు అమ్మకాలు ఆగిపోతాయి.

అయితే, కార్మికులకు ఉద్యోగాలు పోతే, ఒక్క వారపు V ఉత్పత్తులు మాత్రమే అమ్మకాలు లేకుండా నిలిచిపోతాయి - అని అర్థమా? - కాదు.

## 4. అదనపు విలువని పెట్టుబడిదారీ వర్గమే వాడవలసి వుండడం:

ఇందులో కొంత భాగం ‘కొత్త పెట్టుబడి’గా మారాలంటే, అది కూడా C + Vలుగా ఖర్చవడానికి సరిపోయే పాళ్ళలో వుండాలి. పాళ్ళు అలా లేకపోతే, అందులో చాలా భాగాన్ని కొత్త పెట్టుబడిగా మార్చడం సాధ్యం కాదు. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, S భాగాన్నంతా పెట్టుబడిదారీ వర్గం స్వంతానికి వాడే భాగం గానే చూద్దాం. ఈ S భాగం నించి ఒక ‘వింత’ సమస్య తలెత్తుతుంది. ఆ వర్గం అంతా కలిసినా వాడలేనంత సరుకుల గుట్ట వాళ్ళ పాలబడడమే ఆ ‘వింత’! పెట్టుబడి దారుల మధ్య పోటీ వల్ల, ‘ఉత్పత్తి శక్తులు పెరుగుతోన్న కొద్దీ, S భాగం పెరిగిపోతూ వుంటుందని గతం లోనే చూశాం. ఒక స్థాయి ఉత్పత్తి శక్తి వున్నప్పుడు, సగటు కార్మికుడు, ఒక పని దినంలో ‘శ్రమ విలువ’గా 20 వస్తువులు ఉత్పత్తి చేస్తే, అందులో 5 వస్తువులు V గానూ, 15 వస్తువులు S గానూ వుండేవనుకుందాం. కొంత కాలానికి ఉత్పత్తి శక్తి రెట్టింపై కార్మికుడు, పని దినంలో, ‘శ్రమ విలువ’గా 40 వస్తు వులు ఉత్పత్తి చేస్తే, అందులో 8 వస్తువులు V గానూ; 32 వస్తువులు S గానూ వున్నాయనుకుందాం. ఉత్పత్తి శక్తి పెరగడం వల్ల జీతం కూడా కొంత పెరిగినా, S భాగం చాలా ఎక్కువగా పెరిగింది. గతంలో 15 వస్తువుల S ని వాడే వర్గం, ఇప్పుడు 32 వస్తువుల S ని వాడాలి. (మొదటి సంపుటంలో, ‘అదనపు విలువ రేటు’ చాప్టరులో ఈ విషయం వివరంగా చూశాం.) ఉత్పత్తి శక్తి పెరుగు తోన్న కొద్దీ S భాగం అనేక రెట్లు పెరిగిపోతూ వుంటుంది.

S భాగం గురించి ఇక్కడ, గతంలో చూసిన ఇంకో విషయం కూడా గుర్తు చేసుకోవాలి. ప్రతీ ఏటా, Sలో కొంత భాగం ‘కొత్త పెట్టుబడి’గా మారుతూ వుంటుంది. కాబట్టి, ప్రతీ పునరుత్పత్తి క్రమమూ ‘విస్తృత పునరుత్పత్తి క్రమం’గానే వుంటుంది. ఒక సంవత్సరపు పెట్టుబడి కన్నా, తర్వాత సంవత్సరపు పెట్టుబడి ఎక్కువగా వుండి, ఎక్కువ పెట్టుబడి, ఎక్కువ S ని ఇస్తుంది. ‘ఉత్పత్తి శక్తి’ ఏమీ మారలేదనుకున్నా, (పెట్టుబడి అంతా పాత ఉత్పత్తి శక్తి తోటే పని చేస్తోంది అనుకున్నా), పెట్టుబడి పెరుగుతూ వుంటుంది కాబట్టి, ఒక సంవత్సరపు S కన్నా తర్వాత సంవత్సరపు S, పెరుగుతూ వుంటుంది. ఇక ‘ఉత్పత్తి శక్తి’ పెరుగుతూ వుంటే, S ఎలా పెరుగుతూ వుంటుందో వేరే చెప్పాలా? ఈ రకంగా, S పెరగడం అనేది, (1) ప్రతీ పునరుత్పత్తి క్రమమూ ‘విస్తృత పునరుత్పత్తి క్రమం’గా వుంటుంది కాబట్టీ; (2) ‘పోటీ’ వల్ల, ఉత్పత్తి శక్తులు పెరుగుతూ, దాని వల్ల, ‘అదనపు విలువ రేటు’ పెరుగుతూ వుంటుంది కాబట్టీ - ఈ కారణాల వల్ల S రాసి ఏటా, గతంలో కన్నా పెరుగు తూనే వుంటుంది.

అలా పెరిగిపోయే S నంతా పెట్టుబడిదారీ వర్గమే వాడాలి!

నిజానికి, S భాగం అంతా కార్మిక వర్గానిదే. ఆ భాగం కూడా కార్మిక వర్గానికే అందితే, ఆ వర్గం దాన్ని వాడలేకపోవడం అనే సమస్య వుండదు. కానీ, ఆ S భాగాన్ని, పెట్టుబడిదారీ వర్గం లాగేస్తుంది కాబట్టి, ఆ భాగాన్నంతా ఆ వర్గమే వాడాలి. అలా వాడగలిగితే, ఆ వర్గానికి సమస్యే వుండదు. కానీ, అలా వాడలేక పోయే సందర్భాలు అనేకం వుంటాయి. S భాగాన్ని వాడడం పెట్టుబడిదారీ వర్గానికి అసాధ్యమైనప్పుడే ‘సంక్షోభం’ సమస్య తలెత్తుతుంది.

“ఎక్కువ ఉత్పత్తుల్ని వాడడంలో అసాధ్యం ఏముంది? ఒక చెప్పుల జతకి బదులు 10 చెప్పుల జతలు వాడవచ్చు. 10 కుర్చీలకు బదులు 20 కుర్చీలు వాడవచ్చు. 20 దుస్తులకు, బదులు 60 దుస్తులు వాడవచ్చు. అందులో అసాధ్యం ఏముంది?” అనే సందేహం కొందరికి కలగవచ్చు. ఎక్కువ ఉత్పత్తుల్ని వాడడంలో అసాధ్యమేమిటో చూడాలంటే, ‘ఒక చెప్పుల జత’ వుదాహరణని కొంచెం వివరంగా చూస్తే చాలు.

పెట్టుబడిదారీ వర్గం వాడే రకపు ‘విలువైన’ చెప్పుల జతనే తీసుకుందాం. ఒక జత 6 నెలలు మన్నుతుందనుకుందాం. పెట్టుబడి దారుడు 2 జతల్ని వాడకానికి పెట్టుకున్నాడనుకుందాం. వాడు ఒకే సారి 2 జతల్లోనూ కాళ్ళు దూర్చి 2 జతల్నీ ఒకే సారి తగి

లించుకుని తిరగడు. ఆ జతల్ని మార్చి మార్చి వాడవల సిందే. 2 జతలూ ఖర్చవడానికి సంవత్సర కాలం పడుతుంది. ఒకే జతని వాడుతూ దాన్ని 6 నెలలకి మార్చినా, 2 జతలు వాడుతూ వాటిని సంవత్సరానికి మార్చినా, రెండూ ఒకటే. అయితే, మన పెట్టుబడిదారుడు, 2 జతల్నీ కూడా 6 నెలలకే తీసి వేస్తాడనుకుందాం. పోనీ, 3 నెలలకే తీసేస్తాడనుకుందాం. ఇంకా పోనీ, 2 నెలలకే. ఆ చెప్పులు, ఇంకా ఉపయోగించడానికి వీలుగానే వుంటాయి. వాటిని మధ్య లోనే తీసివేసిన పెట్టుబడిదారుడు, వాటిని తర్వాత ఏం చేస్తాడు?

1. తగలబెట్టేస్తాడా?
2. ఇంట్లోనే ఓ మూల పడేసి వుంచుతాడా?
3. బయట పారేస్తాడా?
4. కార్మికుల్ని పిలిచి ఉచితంగా ఇచ్చేస్తాడా?
5. సగం ధరకో, పావు ధరకో, అమ్మేస్తాడా?

ఈ పనుల్లో ఏది చేస్తాడు?

ఆ తీసివేసిన చెప్పుల్ని తగలబెట్టేస్తే వాటి సమస్య తీరిపోయినట్టే. కానీ, అలా చేస్తే, అది ఆ చెప్పుల్ని 'పూర్తిగా వాడడం' అవదు. "ఎంత సరుకునైనా వాడవచ్చు. అందులో సమస్యేముంది?" అనే వాళ్ళు, 'వాడడం - అంటే సరుకుల్ని మధ్య లోనే తగలబెట్టేడం' అనే అర్థం చెప్పడానికి వీలు లేదు.

రెండో పద్ధతి కూడా మొదటి పద్ధతి లాంటిదే. మధ్య లోనే తీసివేసిన వస్తువుల్ని ఇంట్లోనే ఓ మూల పడేసి, నాశనం అయిపోయే లాగ చేస్తే, అది కూడా ఉత్పత్తిని వాడడం అవదు.

మూడో పద్ధతి ప్రకారం, ఆ చెప్పుల జతల్ని బయట పారేస్తే, వాటిని కార్మికులు తీసుకు పోయి వాడుకుంటారు. లేదా, నాలుగో పద్ధతి ప్రకారం, కార్మికుల్ని పిలిచి 'ఉచితంగా' ఇచ్చేస్తే, అప్పుడు కూడా వాటిని కార్మికులు వాడుకుంటారు. ఈ 2 పద్ధతుల్లో ఏది జరిగినా, పెట్టుబడిదారీ వర్గం చేతిలోకి పోయే Sలో కొంత భాగాన్ని కార్మికులే వాడుతున్నట్టు అర్థం. కానీ వాస్తవంలో అలా జరగదు. పెట్టుబడిదారీ వర్గం, కొంత కాలం వాడి తీసివేసిన బట్టలూ చెప్పులూ కుర్చీలూ మంచాలూ వాచీలూ రేడియోలూ స్కూటర్లూ కార్లూ ఆభరణాలూ ఇళ్ళూ - వంటి ఏ వస్తువుల్నీ అవతల పారెయ్యడమో, కార్మికుల్ని పిలిచి ఉచితంగా ఇచ్చెయ్యడమో, చెయ్యదు (పాత బట్టల్లాంటి వాటిని తప్ప).

ఇక, చివరి పద్ధతే మిగిలింది. ఇదే జరుగుతుంది, అంటే, కొంత కాలం వాడి తీసివేసిన ఉత్పత్తుల్ని, మళ్ళీ అమ్మడమే చేస్తారు. చెప్పుల్నీ బట్టల్నీ కాక పోవచ్చు. ఇతర ఖరీదైన వస్తువుల విషయంలో కొంత కాలం వాడిన తర్వాత అమ్మడమే చేస్తారు. వాటిలో ఇంకా వుండిపోయిన విలువని వెనక్కి తీసుకుంటారు. ఆ విలువతో ఇంకేదో కొత్త సరుకు కొంటారు. ఆ కొత్త సరుకుని కూడా మధ్య లోనే అమ్మేస్తే, ఆ విలువ కూడా మళ్ళీ పెట్టుబడి దారుడి చేతికే వస్తుంది. ఈ రకంగా, వాడుతూ వున్న వస్తువుల్ని త్వర త్వరగా తీసివేసినా, వాటిల్లో మిగిలి పోయిన విలువని పెట్టుబడిదారీ వర్గమే వెనక్కి తీసుకుంటుంది కాబట్టి, ఆ విలువని ఆ వర్గమే వాడాలి. అందుకే, 'అపరిమితమైన' ఉత్పత్తుల్ని వాడడం పెట్టుబడిదారీ వర్గానికి కూడా సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ వర్గం పూర్తిగా వాడకుండా తీసివేసే సరుకులన్నీ కార్మిక వర్గంలో వివిధ సెక్షన్లలోకి వస్తాయి. ఆ సరుకులన్నీ 'ఉచితం'గా వస్తేనే, కార్మిక వర్గం, ఆ సరుకులన్నిటినీ వాడుతూ కూడా తన Vతో (జీతాలతో) ఎప్పటి లాగే సరుకుల్ని కొనగలుగుతుంది. అప్పుడు Vతో కొనే సరుకులకు డిమాండ్ తగ్గకుండా, ఎప్పటి లాగే డిమాండ్ వుంటుంది. కానీ పెట్టుబడిదారీ వర్గం తీసివేసే సరుకులు కార్మిక వర్గం లోకి ఉచితంగా రావు కాబట్టి, వాటిని కార్మిక వర్గం తన V లోని కొంత భాగంతో కొనాలి. అప్పుడు, Vతో కొనవలసిన కొత్త సరుకులకు డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ వర్గం త్వర త్వరగా సరుకుల్ని మార్చి వెయ్యడం అనేది, మొత్తం డిమాండ్‌ని ఏ రకం గానూ పెంచదు.

'ఎంత సరుకునైనా వాడెయ్యవచ్చు' అనే వాదన ఎంత అర్థరహితమైనదో గ్రహించడానికి, ఇంకా ఒకటి రెండు ఉదాహరణలు చూద్దాం.

పెట్టుబడిదారీ కుటుంబాలు వాడే రకపు సబ్బుల్ని ఉత్పత్తి చేసే ఒక కంపెనీలో, ఒక లక్ష సబ్బులు, అమ్మకాలు లేకుండా నిలిచి పోయాయి అనుకుందాం. సబ్బులు అలా నిలిచిపోవడం అంటే, పెట్టుబడిదార్ల కుటుంబాల్లో సబ్బులే వాడడం లేదని అర్థం కాదు. అప్పటికే అన్ని కుటుంబాల్లోనూ కావలసినన్ని సబ్బులు వుండగా కూడా, ఈ లక్ష సబ్బులు, ఒక కంపెనీలో అదనంగా వున్నాయన్న మాట! వాడలేనంత సరుకుని, పెట్టుబడిదారీ కుటుంబాలు కూడా కొనవు.

అలా నిలిచిపోయి వున్న సబ్బుల గుట్టల్ని ఆ కంపెనీ పెట్టుబడి దారుడి కుటుంబమే వాడేస్తుందా?

సిమ్మెంటు - పెట్టుబడి దారుడి దగ్గిర 10 వేల టన్నుల సిమ్మెంటు నిలిచిపోతే, ఆ సరుకునంతా ఆ పెట్టుబడి దారుడి కుటుంబమే వాడేస్తుందా? లేదా, ఆ సిమ్మెంటుని 'ఉత్పాదకంగా' వాడడానికి కావలసిన ఇతర అంశాలేవో తగిన పాళ్ళల్లో లేవనుకుందాం. అలాంటప్పుడు ఆ సిమ్మెంటు ఏ రకం గానూ ఖర్చవ డానికి అవకాశం వుండదు.

ఏ సరుకు విషయం అయినా ఇంతే.

S భాగంతో సమస్యేమిటంటే - దాని కోసం, కార్మిక వర్గం వేపు నించీ డిమాండ్ వుండదు. దాని కోసం పూర్తిగా పెట్టుబడిదారీ వర్గం వేపు నించే డిమాండ్ ఏర్పడాలి. కాబట్టి, S అంతా పెట్టుబడిదారీ వర్గం పాలబడుతుంది. ఆ వర్గం, S లో చాలా భాగాన్ని 'అనుత్పాదక కార్యకలాపాల మీద' మహా విచ్చల విడిగా ఖర్చు చేస్తూనే వుంటుంది. ఉన్మాద పూరితమైన ఆడంబరాలతో విలాసవంతంగా జీవిస్తూనే వుంటుంది. ఎంతో ఉత్పత్తిని వాడకం లేకుండా వృధాగా పడేసి వుంచుతూనే వుంటుంది. ఎంతో ఉత్పత్తిని నిష్కారణంగా కుళ్ళబెడుతూనే వుంటుంది. దాన ధర్మాల పేరుతో కొంత ఉత్పత్తిని కార్మిక వర్గం లోకి విసురుతూనే వుంటుంది. ఎంత చేసినా, ఎన్ని చేసినా, తరగనంత, పూర్తిగా ఖర్చు పెట్టడం సాధ్యం కానంత, మితి మీరిన S ఉన్నప్పుడు, 'అమితోత్పత్తి' సమస్య తలెత్తుతుంది.

ఇక్కడ 'వర్తక మోసం' అనే సెకండరీ దోపిడీని కూడా లెక్కలోకి తీసుకోవాలి. వర్తక మోసాల్ని కూడా లెక్కలోకి తీసుకుంటే, కార్మిక వర్గం, V ని అయినా పూర్తిగా వాడదని తేలుతుంది. కార్మిక వర్గం తన జీతా లతో, జీవితావసర వస్తువుల్ని పెట్టుబడిదారీ వర్గం నించే కొనాలి. అలా కొనేటప్పుడు, కల్తీలూ తప్పుడు తూకాలూ వంటి మోసాలన్నిటినీ కలిపితే, V కి బదు లుగా ఎంత ఉత్పత్తి రావాలో అంత ఉత్పత్తి అందదు. వర్తక మోసాల ద్వారా మిగుల్చుకున్న ఉత్పత్తి అంతా పెట్టుబడిదారీ వర్గానికే వుండి పోతుంది. (కార్మికులు వాడే రకపు జీవితావసర వస్తువుల్ని అమ్మే వర్తక పెట్టుబడి దారులకే అదంతా మిగులుతుంది.) అంటే, కార్మిక వర్గం జీతాల భాగాన్ని వాడుతున్నట్టు పైకి కనపడినా నిజానికి, ఆ వర్గానికి ఆ భాగం అంతా పూర్తిగా అందదు. పెట్టుబడిదారీ వర్గానికి S భాగాన్ని వాడడమే అసాధ్యంగా వుంటే, దానికి తోడు వర్తక మోసాల ద్వారా మిగిలే V లో భాగం కూడా కలిసి, ఆ వర్గం పని, సరుకు గుట్టల మధ్య కూరుకు పోవడంగా తయారవుతుంది.

ఏ సరుకు అయినా C + V + S భాగాలుగా ఖర్చయి పోయే మార్గం వుండగా, సరుకులో కొంత భాగం అమ్మకాలు లేకుండా ఎందుకు నిలిచి పోతుందీ? - అనే ప్రశ్న ఇంతకు ముందు వేసుకున్నాం. ఆ ప్రశ్నకి జవాబు చూడాలంటే, (1) ఉత్పత్తి శాఖల్లో 'పాళ్ళు' సరిగా లేక పోవడమూ, (2) S భాగం పెట్టు బడిదారీ వర్గం వాడలేనంత అధికంగా వుండడమూ - అనేవే కారణలుగా తేలతాయి.

అన్ని శాఖల్లోనూ సప్లై డిమాండ్లు సమానంగా వున్నాయి - అనుకుందాం. అలాంటి దశని ప్రారంభ దశగా తీసుకుంటే, తర్వాత దాదాపు 10, 15 సంవత్స రాలు గడిచేటప్పటికి, అన్ని శాఖల్లోనూ సప్లై డిమాండ్లు రక రకాలుగా తేడాలై పోయి వుంటాయి. ఆ కొన్ని సంవత్సరాల కాలంలో ఏం జరిగిందీ అని చూస్తే, అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి శక్తులు రక రకాల స్థాయిల్లో పెరిగి వుండడమూ, అన్ని శాఖల్లోనూ ఉత్పత్తి క్రమాలు పోటీలతో నడుస్తూ వుండడమూ, కనపడుతుంది. ఉత్పత్తి స్థాయిని పెంచే ఈ 'పోటీ - పోరాటం'లో, ఒకటి రెండు ప్రధాన శాఖల్లో అమితో త్పత్తి జరిగితే చాలు, క్రమ క్రమంగా అన్ని శాఖల్లోనూ అమ్మకాలు తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. సరు కుకి డిమాండు లేక, అమ్మకాలు తగ్గుతున్న కొద్దీ, ధరలు తగ్గుతాయి.

A శాఖలో ధర 20% తగ్గి, B శాఖలో ధర 30% తగ్గితే, దీని అర్థం ఏమిటి? A శాఖలో ధర అసలు తగ్గలేదనీ, B శాఖలో ధర 10% తగ్గిందనీ అర్థం. ధరలు బాగా తగ్గిన శాఖల్లో పెట్టుబడి దారులు బాగా నష్టపోతారు. 'నష్టపోవడం' అంటే, వెనకటి ధర ద్వారా వస్తూ వున్న లాభం కొంత తగ్గవచ్చు. లేదా, బాగా తగ్గవచ్చు. లేదా, 'పెట్టుబడి' కూడా వెనక్కి రానంతగా తగ్గవచ్చు. అదంతా ఆ పరిస్థితుల్ని బట్టి వుంటుంది. ఆ శాఖల్లో వుండే చిన్న స్థాయి పెట్టుబడి దారుల దగ్గిర అమితోత్పత్తి లేకపోయినా, వాళ్ళకి కూడా ధరలు తగ్గుతాయి కాబట్టి, వాళ్ళు, పెట్టుబడులు కూడా వెనక్కి రాక, పూర్తిగా దివాళాలు తియ్యవచ్చు.

సంక్షోభం లేని కాలంలో అయినా - వున్న

కాలంలో అయినా, సరుకు ధర తగ్గినప్పుడైనా - హెచ్చి నప్పుడైనా, దాని 'ఉపయోగపు విలువ' విషయంలో ఏ మార్పూ జరగదు. ధరలో మార్పు వల్ల 'ఉపయో గపు విలువ' తరగడం గానీ, పెరగడం గానీ జరగదు. ఏ మార్పు అయినా 'విలువ' అందే విషయం లోనే.

సంక్షోభ కాలంలో 10 ధర గల సరుకుని, B, A నించి, 6 కి కొన్నాడు. A కి, 4 నష్టం. B కొన్న తర్వాత ఆ సరుకు ధర కొంచెం పెరిగింది. దాన్ని B, C కి, 7 కి అమ్మాడు. దాన్ని C, తన స్వంతానికే వాడు కున్నాడు. A కి వచ్చిన 4 నష్టం, ఎవరెవరికి లాభం అయింది? - B కి 1 లాభం, 'విలువ'గా ('డబ్బు'గా). C కి, 3 లాభం, 'ఉపయోగపు విలువ'గా. ఒకరు నష్టపోయి నది, ఇంకొకరికి 'విలువ'గా అందకపోతే, ఉపయో గపు విలువగా నైనా అందుతుంది.

'సంక్షోభం' అంటే, 'సరుకునంతా అమ్మలేక పోవడం' అనేదే కాదు. సరుకునంతా అమ్మగలిగినా, 'తగ్గిపోయిన ధర'తో అమ్మితే, అది కూడా సంక్షోభమే. సరుకుని అమ్మడం అంటే, ఏదో ఒక ధరకి ఇచ్చేసి వదిలించుకోవడం కాదు. 'ఖర్చయిన పెట్టుబడి'నీ, దాని మీద అప్పటి వరకూ వస్తూ వున్న 'జనరల్ లాభాన్నీ' తెచ్చే ధరకే అమ్మగలగాలి. 'అమితోత్పత్తి' అంటే, 'ఫలానా ధర' దగ్గిర అమితోత్పత్తి అని అర్థమే గానీ, తగ్గిపోయిన ధర దగ్గిర అమితోత్పత్తి అని అర్థం కాదు. బాగా తగ్గిపోయిన ధర దగ్గిర, అది అమితోత్పత్తి అవదు. 'పెట్టుబడి' కూడా వెనక్కి రానంతగా ధర తగ్గితే, అది 'దివాళా'. అది పెట్టుబడికి చాలా తీవ్రమైన సంక్షోభం. అప్పటి వరకూ సాగుతూ వున్న సాధారణ పరిస్తితుల్ని అసాధ్యం చేసేది ఏదైనా, అది సంక్షోభమే.

## వెనకటి సమాజాలలో సంక్షోభం వుండదు:

ఈ 'సంక్షోభం' సమస్య పెట్టుబడిదారీ విధా నంలో మాత్రమే తలెత్తుతుంది. ఈ సమస్యకి దారితీసే కారణాల్లో ఏదీ కూడా వెనకటి సమాజాలలో వుండదు. వెనకటి సమాజాల్లో కూడా 'దోపిడీ' వున్నా, అక్కడ అమ్మకాల్లోకి వెళ్ళే ఉత్పత్తి చాలా తక్కువ. అది కూడా డిమాండ్ గురించి తెలిసిన తర్వాతే ఉత్పత్తి అవు తుంది. అక్కడ ఉత్పత్తి, 'అమ్మకాల కోసమే' కాదు కాబట్టి, పోటీలు పడుతూ సరుకుని ఉత్పత్తి చెయ్య డమూ, తర్వాత ఆర్డర్ల కోసం వెతుక్కోవడమూ - అనే పరిస్తితి అక్కడ వుండదు. అంతే గాక ఆ సమాజాల్లో ఉత్పత్తి శక్తులు చాలా తక్కువ స్థాయి లోనే వుంటాయి. కాబట్టి, 'అదనపు ఉత్పత్తి'గా దోపిడీ వర్గా నికి అందే భాగం, ఆ వర్గం వాడలేనంత అధిక స్థాయిలో వుండదు. కాబట్టి, వెనకటి సమాజాలలో, అమితోత్పత్తులూ, అమ్మకాలు ఆగిపోవడాలూ, సంక్షో భాలూ లేకుండానే, దోపిడీ విధానాలు నడిచాయి.

పెట్టుబడిదారీ విధానం లోనే, అందులోనూ 'భారీ పరిశ్రమ' ప్రారంభమైన తర్వాతే, 'పోటీ' పెరిగి, సరుకులు నిలిచి పోయే సంక్షోభ పరిస్తితులు ప్రారంభ మయ్యాయి.

## టర్నోవర్ల లంకెలు:

ఒక పెట్టుబడిదారుడి సరుకు, 'డబ్బు'గా మారా లంటే, ఆ సరుకుకీ, అనేక శాఖల పెట్టుబడిదారుల డబ్బుకీ, సంబంధాలు వుంటాయి. ఇతర పెట్టుబడి దారులూ, కార్మికులూ కొంటేనే, ఆ సరుకు, డబ్బుగా మారుతుంది. ఒకరి $C^1$, $M^1$ గా మారడం అంటే, ఇతరుల M, C గా మారడమే. పత్తి వాడి సరుకు, డబ్బుగా మారడం అంటే, దారం వాడి డబ్బు, సరు కుగా మారడమే. ఈ రకంగా, అనేక శాఖల పెట్టు బడుల టర్నోవర్లు ఒక దానితో ఒకటి పెనవేసుకు పోయి వుంటాయి. ఈ మారకాల గొలుసు ఎక్కడ తెగిపోయినా దాని ప్రభావం అనేక దిక్కులకు విస్త రిస్తుంది.

సంక్షోభం అనేది మొదట వర్తక పెట్టుబడి దారుడి దగ్గర సరుకులు నిలిచి పోవడంగా కనపడడం ప్రారంభమవుతుంది. సరుకులు నిలిచి పోవడం ఎక్కు వవుతోన్న కొద్దీ వర్తకుడు దాన్ని గమనించి, ఉత్పాదక పెట్టుబడి దారుడి నించి సరుకుని కొనడం తగ్గించి వెయ్యడమో, పూర్తిగా అపివెయ్యడమో చేస్తాడు. దాని ఫలితంగా సరుకుని తయారు చేయించే ఉత్పాదక పెట్టుబడిదారుడు, 'పునరుత్పత్తి క్రమాన్ని' తగ్గించి వెయ్యడమో, ఆపివెయ్యడమో చేస్తాడు.

సంక్షోభం, 'అంటు వ్యాధి' లాంటిది. ఒక శాఖలో పునరుత్పత్తి క్రమం తగ్గడమో, ఆగడమో జరిగి నప్పుడు, ఆ శాఖకి ఉత్పత్తి సాధనాల్ని అందించే అనేక శాఖల్లో కూడా అదే జరుగుతుంది. అది ఇంకా అనేక శాఖలకు పాకుతూ పోతుంది.

'ఉత్పాదక' శాఖల నించీ, 'వర్తక' శాఖల నించీ కూడా కార్మికులు నిరుద్యోగులవడం సాగుతూ పోతుంది.

దోపిడీ సమాజాల్లో, ఒక వేపు - ఆకలి బాధా, ఇంకో వేపు - సుఖ భోగాలూ, ఎప్పుడూ సాగుతూ వున్నవే. అయినా, ఆ పరిస్థితులు సంక్షోభ కాలాల్లో మరింత తీవ్ర దశకు చేరుకుంటాయి.

సంక్షోభ కాలాల్లో, అనేక శాఖల్లో, ఉత్పాదక - వర్తక పెట్టుబడిదారులందరి స్టోరుల్లోనూ, గోడౌన్ల లోనూ సరుకులు లాట్లుపడి వుంటాయి. వాటిల్లో శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ, ఆగ్జిలరీ పదార్థాలూ, జీవితావసర వస్తువులూ, వగైరాలన్నీ ('పెట్టుబడి'గా పని చేసే ఉత్పత్తులన్నీ) కుప్ప తెప్పలుగా వుంటాయి. కొన్ని సార్లు వాటి పాళ్ళు సమన్వయంతో లేకపోవచ్చు; కొన్ని సార్లు సమన్వయం తోనే వుండ వచ్చు కూడా. కానీ అవన్నీ అమ్మకాలు లేక, వాడకం లోకి రాలేని స్థితిలో పడి వుంటాయి. ఉత్పత్తి సాధనాలన్నీ సిద్ధంగా వున్నా, శ్రమలు చేసే వారందరూ కూడా సిద్ధంగా వున్నా, ఉత్పత్తి క్రమాలు, తగ్గిపోయి, కుంచించుకు పోయి వుంటాయి. పని స్తలాల్లో యంత్రాలన్నీ ఆగిపోయి వుంటాయి. పెట్టుబడిలో ఎంతో భాగం నిరర్థకంగా పడి వుంటుంది. కార్మిక జనాభాలో అత్యధిక భాగం నిరుద్యోగ సమస్యలో చిక్కి వుంటారు. వారికి ఎంతో అత్యవసరంగా తక్షణం కావలసిన ఆహార పదార్థాలూ, బట్టలూ, చెప్పులూ, మందులూ వగైరా ఉత్పత్తులన్నీ పెట్టుబడిదారుల స్టోరుల్లో బందీలై వుంటాయి. అవి కార్మిక జనాభాకి అందే మార్గం వుండదు. ఆ జనాభాలో వ్యాధులూ, మరణాలూ, ఉధృతమవుతూ వుంటాయి.

ఈ సమస్య అంతా, కార్మికులు, ఎక్కువ పదార్థాల్ని ఉత్పత్తి చెయ్యక పోవడం వల్ల కాదు. ఎక్కువ పదార్థాల్ని ఉత్పత్తి చెయ్యడం వల్లనే! వాటిని కుప్ప తెప్పలుగా ఉత్పత్తి చేసి, పెట్టుబడిదారీ వర్గానికి అప్పగించడం వల్ల! "కార్మికులకు ఆహార పదార్థాలు ఎందుకు లేవు?" అనే ప్రశ్నకి, "అవి పెట్టుబడి దారుల దగ్గిర లాట్లు పడి వున్నాయి గనక!" అని జవాబు! - ఇదీ పరిస్థితి! నిరుద్యోగ కార్మిక జనాభా, నిరాశతో పని కోసం వెతుక్కుంటూ పోయే 'వలసలు' ప్రారంభమవుతాయి. (కార్మికుల 'వలసలు' సంక్షోభ కాలాల్లోనే ఉధృతంగా జరిగినట్టు పెట్టుబడిదారీ చరిత్ర చూపిస్తోంది.)

ఒక వేపు కార్మిక జనాభా, ఆకలితో, వ్యాధులతో, చింతలతో నాశనమై పోతూ వుంటే, ఇంకో వేపు - పెట్టుబడిదారీ జనాభా, వాడడానికి సాధ్యం కానంత సరుకు గుట్టల మధ్య కూరుకు పోయి ఉక్కిరి బిక్కిరవుతూ వుంటుంది. పెట్టుబడిదారీ కుటుంబాలు, తమ స్వంత అవసరాల కోసం ఎన్ని ఉత్పత్తులైనా ఆ గుట్టల నించి కొనగలుగుతాయి. సాధారణ కాలాల్లో కూడా విలాస జీవితం గడిపే పెట్టుబడిదారీ జనాభా, ఈ సంక్షోభ కాలాల్లో ఉన్మాద స్థాయితో విలాసాల్లో మునిగి తేలుతూ వుంటుంది.

# డబ్బు - సంక్షోభం; లేదా, ఆర్థిక మాంద్యం

ఏ దేశంలో నైనా, దాని మార్కెట్ అవసరాల్ని బట్టి, 'చలామణీలో తిరగడానికి' కొంత డబ్బు అవసర మవుతుంది. సంక్షోభం లేని కాలంలో చలామణీలో తిరగడానికి సరిపోయే 'డబ్బు పరిమాణం', సంక్షోభం వున్న కాలంలో సరిపోదు. అప్పటి చలామణీ అవసరాలకు డబ్బు చాలక పోవడమే - 'డబ్బు - సంక్షోభం.'

సంక్షోభం లేని కాలంలో, అంటే అన్ని శాఖల్లోనూ అమ్మకాలు నిరాటంకంగా సాగిపోతూ వున్న కాలంలో, సరుకు అప్పులూ - డబ్బు అప్పులూ మృదువుగా నడిచి పోతూ వుంటాయి. ప్రతీ పెట్టుబడి దారుడికీ - సరుకు వెళ్ళి పోయి డబ్బు రావడమూ, దాన్ని అప్పులకు చెల్లించి వెయ్యడమూ- తేలిగ్గా జరిగిపోతూ వుంటాయి.

పెట్టుబడి దారులందరికీ బ్యాంకుల్లో ఎక్కౌంట్లు వుంటాయి. కాబట్టి, వాళ్ళ మధ్య డబ్బు లావాదేవీలన్నీ చాలా వరకు బ్యాంకు లెక్కల ద్వారా, (వాళ్ళ అక్కౌంటు పుస్తకాల్లో మొత్తాలు ఎక్కువో తక్కువో అవడాల ద్వారా) జరుగుతూ వుంటాయి. A కి, B, 10 డబ్బు ఇవ్వాలంటే, దాని కోసం B, డబ్బు నోట్లు తెచ్చి ఇవ్వడు. చెక్కు ఇస్తాడు. దాన్ని A, తన బ్యాంకుకి పంపిస్తాడు. B ఎక్కౌంటులో 10 తగ్గి, A ఎక్కౌంటులో 10 పెరుగుతుంది. C కి A, కొంత డబ్బు ఇవ్వాలన్నా అలాగే జరుగుతుంది. నిజం డబ్బు నోట్లు లేకుండా, బ్యాంకుల ద్వారా జరిగే ఈ 'క్లియరెన్స్ విధానం' వల్ల, చలామణీలో తిరగడానికి అవసర మయ్యే నోట్ల పరిమాణం చాలా తగ్గి వుంటుంది. ఇది, సంక్షోభం లేని కాలం సంగతి. ఆ కాలంలో, చలామణీలో తిరగడానికి, అతి తక్కువ డబ్బు పరిమాణం తోటే సరిపోతూ వుంటుంది.

ఈ అతి తక్కువ పరిమాణాన్ని, 100 అనుకుందాం. బ్యాంకుల రిజర్వుల్లోనూ, బ్యాంకుల బయట వ్యక్తుల చేతుల్లోనూ వున్న డబ్బు రాసులన్నీ కలిసిన మొత్తమే ఈ 100. ఈ 100 డబ్బు మాత్రమే చలామణీ అవసరాల కోసం వుండేలాగ, చలామణీకి సంబంధించిన సాంకేతిక పద్ధతులు చేస్తున్నాయి - అనుకుందాం. ఈ 100 డబ్బే చలామణీలో మళ్ళీ మళ్ళీ తిరుగుతూ, చలామణీ అవసరాల్ని తీరుస్తూ వుంటుంది. ఈ రకంగా '100 డబ్బు పరిమాణం'తో చలామణీ సాగుతూ వుండగా, సంక్షోభం ప్రారంభమైంది. అంటే, చాలా శాఖల్లో అమ్మకాలు తగ్గిపోతూ వున్నాయి. అప్పుడు, పెట్టుబడిదారుల మధ్య వుండే అప్పుల్లో పరస్పరం బ్యాంకు ఎకౌంట్ల ద్వారా చెల్లిపోయే లావాదేవీల సంఖ్య తగ్గిపోతూ వుంటుంది. దాని వల్ల, 'నిజం డబ్బు' ద్వారా చెల్లించవలసిన బ్యాలెన్సుల సంఖ్య పెరుగుతుంది. ఈ డబ్బు అవసరాల్ని తీర్చడానికి అప్పటి వరకూ సరిపోతూ వుండిన '100 డబ్బు పరిమాణం', ఇప్పుడు సరిపోకుండా అవుతుంది. నిజం డబ్బు కోసం అవసరం పెరుగుతుంది. ఇదే 'డబ్బు సంక్షోభం'గా తయారవుతుంది.

A పెట్టుబడి దారుడి సరుకుకి అమ్మకాలు బాగా మందగించాయనుకుందాం. A చేతికి డబ్బు అందడం లేదు. వాడు, అప్పటికే ఇతర పెట్టుబడి దారుల నించి సరుకు అప్పులు తీసుకుని వున్నాడు. ఆ బిల్లులకు చెల్లించాలి. గడువులు సమీపిస్తున్నాయి, ఆ గడువుల నాటికే వాడికి రావలసిన బిల్లులు కూడా కొన్ని వున్నాయి. రావలసిన వాటినీ, పోవలసిన వాటినీ, లెక్క చూస్తే, ఒక 'శేషం' వుంది. దాన్ని వాడు వెంటనే చెల్లించాలి. వాడి సరుకంతా గతంలో లాగే సుఖంగా అమ్ముడయి వుంటే, ఆ శేషం కూడా చెల్లిపోయేది. కానీ, ఇప్పుడు, వాడి సరుకు నిలిచి పోవడం వల్ల, వాడికి రావలసింది చాలా తగ్గింది, వాడు చెల్లించవలసింది ఎక్కువగా వుంది. అలాంటి పరిస్థితిలో వున్న Aకి, తక్షణం కొంత 'డబ్బు అప్పు' కావాలి.

'అప్పు' కోసం, A, బ్యాంకుకి వెళ్తాడు. తన సరుకుని తాకట్టు పెట్టుకునో, మరో విధంగానో, కొంత డబ్బు ఇవ్వమని అడుగుతాడు.

కానీ బ్యాంకు దగ్గిర A లాంటి వాళ్ళు అనేక మంది వున్నారు. వాళ్ళందరి దగ్గిరా సరుకులు లాట్లు పడి వున్నాయి. అవన్నీ సకాలంలో కదిలిపోతూ వుంటే, వాళ్ళల్లో చాలా మందికి ఈ కొత్త అప్పు సమస్య వచ్చేది కాదు. వాళ్ళందరికీ, పోవలసిన బిల్లులే గాక, రావలసిన బిల్లులు కూడా వున్నాయి. కొందరికేమో రావలసిన బిల్లులకు ఇంకా గడువులు రాలేదు. కొందరికేమో తామే ఎదటి వాళ్ళకి ఒక బ్యాలెన్స్ చెల్లించవలసి వచ్చింది. మొత్తం మీద అక్కడ వున్న వాళ్ళందరికీ తక్షణం డబ్బు కావాలి. అందులో కొంత మంది, బ్యాంకులకే పాత అప్పులు చెల్లించాలి. మరి కొంత మంది, ఇతర పెట్టుబడి దార్లకి చెల్లిస్తే, వాళ్ళు కూడా బ్యాంకులకో, ఇతర్లకో, చెల్లించాలి. తక్షణం అప్పులు కావలసిన వాళ్ళే అక్కడికి చేరి ఉన్నారు.

మర్నాడు మళ్ళీ కొంత మందికి అప్పులు కావాలి.

ఇక బ్యాంకులు ఎలా వున్నాయంటే - కొత్త అప్పులు ఇవ్వగలిగే పరిస్థితిలో లేవు. ఇచ్చినా, అంత మందికి అంత మొత్తం ఇవ్వగలిగే స్థితిలో లేవు. ఎందుకంటే, అవి గతంలో ఇచ్చిన అప్పులు వాటికి సకాలంలో వెనక్కి రావడం లేదు. గతంలో అప్పులు తీసుకున్న పెట్టుబడిదారులు, సరుకులు అమ్మలేక, బ్యాంకులకు చెల్లించలేక పోతున్నారు. కొత్త అప్పులు సంపాదించి, పాత అప్పులు తీర్చాలని చూస్తున్నారు.

బ్యాంకులకు ఒక్క సమస్య కాదు. అప్పులు వసూలు కాకపోవడం ఒక సమస్య అయితే, బ్యాంకుల్లో 'డిపాజిట్లు' పెట్టిన వాళ్ళు, తమ డబ్బుతో తమకే అవసరమై డిపాజిట్లని వెనక్కి తీసుకోవడం ప్రారంభిస్తారు. బ్యాంకులు డిపాజిట్లని వెనక్కి ఇవ్వలేని సమస్యలో పడతాయి. దీన్ని పసిగట్టిన డిపాజిటర్లు, డిపాజిట్లని వెనక్కి తీసేసుకునే కార్యక్రమం ఉధృతం చేస్తారు. బ్యాంకులేమో, తమకు చెల్లించవలసిన పెట్టుబడిదారుల మీద ఒత్తిడి తెస్తాయి. ఆ పెట్టుబడిదారులేమో సరుకుల్ని చవగ్గా అమ్మెయ్యడానికో, తాకట్లు పెట్టడానికో, బిల్లుల్ని డిస్కౌంట్ చేయించుకోవడానికో, హెచ్చు వడ్డీలకైనా కొత్త అప్పులు సంపాదించడానికో, మళ్ళీ బ్యాంకుల మీదకే ఎగబడతారు.

ఇదిలా వుండగా, కాస్తో కూస్తో సరుకులు అమ్మడం వల్ల గానీ, పాత అప్పులు వసూలవడం వల్ల గానీ, చేతికి డబ్బు అందిన పెట్టుబడి దారులు, ఆ డబ్బుని బ్యాంకుల్లో తాత్కాలికంగా పెట్టడానికి కూడా సందేహిస్తూ, దాన్ని తమ దగ్గిరే పెట్టుకుంటారు. అంటే, బ్యాంకులకు కొత్త డిపాజిట్లు రావడం మందగిస్తుంది.

'డబ్బు'లో అనేక భాగాలు, బ్యాంకులకు రాకుండా పెట్టుబడి దారుల స్వంత రిజర్వుల్లో ఆగి

వుండడం వల్ల, చలామణీలో మళ్ళీ మళ్ళీ తిరగవల సిన నోట్లలో కొంత మొత్తం హఠాత్తుగా మాయమవు తుంది.

బ్యాంకులకు కొత్త డిపాజిట్లు రావడమూ, పాత అప్పులు వసూలు కావడమూ - ఈ రెండు పనులూ సక్రమంగా జరుగుతూ వుంటేనే, బ్యాంకులు కొత్త అప్పులు ఇవ్వగలుగుతాయి. ఈ 2 పనులూ మంద గించినప్పుడు, కొత్త అప్పులు ఇవ్వడం కూడా మంద గిస్తుంది. లేదా, ఆగిపోతుంది. అంతే గాక, అప్పటికే బ్యాంకుల్లో వున్న డిపాజిట్లని వెనక్కి ఇవ్వడం కూడా అసాధ్యమవుతుంది.

మారకం బిల్లుల్ని డిస్కౌంట్ చేయించుకునే పెట్టుబడి దారులూ, బ్రోకర్లూ, ఫోర్జరీ బిల్లులీ, ఇతర రకాల ఫాల్స్ బిల్లులీ తెచ్చి బ్యాంకుల్ని ఎలా మోసం చెయ్యగలరో గతంలో చూశాం. ('వాటాలు' చాప్ట రులో.) అలాంటి మోసాలన్నీ సంక్షోభ కాలపు ప్రారం భంలో ఉధృతమవుతాయి.

సరుకు అమ్మకాలు మందగిస్తున్నాయని తెలిసి కూడా సరుకుని ఉత్పత్తి చేస్తారు. ఆ సరుకునే బ్యాంకులకు తాకట్టు పెట్టి గానీ, లేదా సరుకుని అమ్మకుండానే అమ్మినట్టుగా దొంగ బిల్లులు తెచ్చి గానీ, బ్యాంకుల నించి గతంలో అప్పులు సంపాదించి వుంటారు. తీరా సంక్షోభం తీవ్రంగా ముంచుకొచ్చి నప్పుడు, బ్యాంకుల్లోకి చేరిన బిల్లుల్లో అనేక బిల్లులు దొంగ బిల్లులే అని తేలవచ్చు. ఆ బిల్లులకు గడువులు సమీపించినా వాటి మీద ఇచ్చిన అప్పులు తిరిగి రావు. అలాంటి మోసపు లావాదేవీలెన్నో సంక్షోభ కాలంలో బయటపడతాయి.

డిపాజిటర్లు అడగగానే డిపాజిట్లని వెనక్కి ఇవ్వకపోతే, ఆ బ్యాంకు 'దివాళా తీసిందని' అర్థం. ఆ బ్యాంకుకి రావలసిన అప్పులు చాలా వుండవచ్చు. కానీ, ప్రస్తుతం మాత్రం ఆ బ్యాంకు, డిపాజిట్లని వెనక్కి ఇవ్వగలిగే పరిస్తితిలో వుండదు.

ఒక బ్యాంకుకి రావలసిన అప్పులు, తర్వాత కాలంలో అయినా వసూలు కానూవచ్చు; కాక పోనూ వచ్చు. అప్పులు చెల్లించని పెట్టుబడి దారుల ఆస్తుల్ని బ్యాంకులు తర్వాత కాలంలో స్వాధీనం చేసుకోవచ్చు. కానీ, చాలా కేసుల్లో, అలా స్వాధీనం చేసుకునే ఆస్తులు, బ్యాంకులు ఇచ్చిన అప్పులకూ వడ్డీలకూ సరిపోయేవిగా వుండక పోవచ్చు. అప్పటికే అనేక మోసాల ద్వారా ఆ ఆస్తులు హరించి పోయి వుంటాయి.

తమ డిపాజిట్లని తిరిగి ఇవ్వలేకపోయిన బ్యాంకు ఆస్తుల్ని, డిపాజిటర్లందరూ కలిసి పంచుకో వచ్చు. కానీ, అలా పంచుకున్నప్పుడు, డిపాజిటర్లకి అందేది చాలా తక్కువగా వుండవచ్చు. బ్యాంకు ఆస్తి కూడా మోసాల ద్వారా హరించి పోయి వుండవచ్చు.

బ్యాంకుల ద్వారా నష్టపోయిన డిపాజిటర్లు, బ్యాంకుల ఆస్తుల్ని పంచుకోవడం గానీ; బ్యాంకులే, తమ అప్పుల్ని ఎగవేసిన పెట్టుబడి దారుల ఆస్తుల్ని పంచుకోవడం గానీ, ఇదంతా తర్వాతెప్పుడో అనేక సంవత్సరాలకు జరిగే విషయాలు. ప్రస్తుతానికైతే, సంక్షోభ కాలంలో, అనేక బ్యాంకులూ, అనేక మంది డిపాజిటర్లూ, సంక్షోభంలో కూరుకు పోయి వుంటారు.

అనేక మందికి తక్షణం డబ్బు కావలసిన సమయం అది. వాళ్ళ సరుకుల్ని కొనే వాళ్ళు వుండరు. బిల్లుల్ని డిస్కౌంటు చేసే వాళ్ళు వుండరు. ఆస్తుల్ని తాకట్టు పెట్టినా అప్పులు ఇచ్చే వాళ్ళు వుండరు. ఏ రకం గానూ డబ్బు దొరకదు. 'డబ్బు'కి అసాధారణ మైన ఒత్తిడి పెరుగుతుంది. 'వడ్డీ రేటు' విపరీత స్థాయిలో వుంటుంది. అయినా కావలసినంత అప్పు దొరకదు.

"డబ్బు లేదు, డబ్బు లేదు" అనే అలజడి ప్రారంభమవుతుంది. ఇది "పెట్టుబడి దొరకడం లేదు" అనే విధంగా కనబడుతుంది. కానీ, ఇప్పుడు డబ్బు కావలసింది, 'కొత్త ఉత్పత్తి క్రమాల' కోసం కాదు; పాత అప్పులకు చెల్లించడానికి మాత్రమే. సంక్షోభ కాలంలో కొరతగా వుండేది 'పెట్టుబడి' కాదు. పెట్టుబడిదారులందరి దగ్గిరా రక రకాల ఉత్పత్తి సాధనాలు లాట్లు పడి వుంటాయి. (వాటి పాళ్ళు సమన్వయంతో వున్నా, లేక పోయినా.) కాబట్టి, 'పెట్టుబడి లేదు' అంటే, 'డబ్బు లేదు' అని అర్థమే గానీ, 'ఉత్పత్తి సాధనాలు లేవు' అని అర్థం కాదు. ఇప్పుడు డబ్బు కావలసింది, కొత్త ఉత్పత్తి సాధనాల్ని కొనడానికి కాదు. ఇప్పుడు కావలసిన డబ్బు, గతంలో కొన్న వాటికి చెల్లించడానికే.

'డబ్బుని చెల్లించడం' అనేది 2 సందర్భాల్లో జరుగుతుంది. గతంలో కొన్న సరుకుల కోసం చెల్లిం చడం గానీ (అప్పులకు చెల్లించే సందర్భాలన్నీ దీని కిందికే వస్తాయి), ఇప్పుడే, కొత్తగా కొన్న సరుకుల కోసం చెల్లించడం గానీ. ఇప్పుడు డబ్బుతో అవసరం - పాత అప్పులకు చెల్లించడానికే. 'చెల్లింపు సాధనం' కోసం డిమాండ్ ఏర్పడడం ఇది.

## వాటాల సంక్షోభం:

సంక్షోభ కాలంలో బ్యాంకులకు వచ్చిపడే అసలైన కష్టం - 'షేర్ల' కోసం ఇచ్చిన అప్పులు వసూలు కాకపోవడం. ఎలాగంటే, సరుకుల సంక్షోభం, చాలా త్వర లోనే 'వాటాల మార్కెట్'లో సంక్షోభానికి కూడా దారి తీస్తుంది. ఒక కంపెనీలో వాటాలు వున్న వాళ్ళు, ఆ కంపెనీ సంక్షోభంలో వున్నట్టు గమనించ గానే, ఆ వాటాలు అమ్మేసుకోవడానికి సిద్ధపడతారు.

నిజానికి, ఆ కంపెనీ, సంక్షోభం నించి ఎక్కువ నష్ట పోకుండా తేరుకోగలిగే పరిస్తితిలో వుండి వుండ వచ్చు. కానీ, అదంతా వాటాదార్లు పట్టించుకోరు. వీలైనంత తొందరగా ఆ వాటాలు అమ్మేసుకుని, ఎక్కువ నష్టపోకుండా డబ్బుని వెనక్కి తీసుకోవాలని ఆత్రపడతారు.

సంక్షోభ కాలంలో నష్టపోయే కంపెనీ, తర్వాత కాలంలో ఆ నష్టాన్ని వాటాదార్లకే పంచిపెడుతుంది. కొంత కాలం పాటు డివిడెండ్లు ఇవ్వకుండా ఆపి వెయ్యవచ్చు; లేదా వాటిని బాగా తగ్గించవచ్చు. లేదా, ఒక వాటా మీద వున్న 'వాటా పెట్టుబడి'ని తగ్గించి రాయవచ్చు. అంటే ఒక వాటాని అర్ధ వాటా గానో, పావు వాటా గానో తగ్గించి, దాని మీదే డివిడెండు ఇవ్వ వచ్చు. (కంపెనీకి ఎక్కువ నష్టం వచ్చినట్టుగా చూపించే అనేక రకాల మోసాలు ఇందులో వుంటాయి.) ఈ రకమైన నష్టాలు జరుగుతాయనే భయంతో, సంక్షోభ కాలంలో వాటాదార్లు, తమ వాటాలు అమ్మేసుకోవడానికే తొందరపడతారు. సంక్షోభ పరిస్తితులన్నీ చక్కబడే దాకా ఆ డబ్బుని దాచి, తర్వాత ఏదైనా మంచి కంపెనీలో మళ్ళీ వాటాలు కొనాలనుకుంటారు. ప్రస్తుత కంపెనీ నించి వీలైనంత తొందరగా బయట పడాలని, 'వాటాల్ని తక్షణం అమ్మెయ్యమని' బ్రోకర్లని తొందర పెడతారు. నష్టానికైనా సరే అమ్మెయ్యమంటారు. దాదాపు అన్ని శాఖల్లోనూ సంక్షోభం వుంటుంది కాబట్టి, వాటాల్ని అమ్మివేసే వాళ్ళు ఎక్కువా, కొనే వాళ్ళు తక్కువా, అవుతారు. వాటాల ధరలన్నీ తగ్గిపోవడం ప్రారంభ మవుతుంది.

బ్యాంకుల నించి భారీ మొత్తాల్లో అప్పులు తెచ్చి, స్పెక్యులేషన్ వ్యాపారం కోసం లాట్ల కొద్దీ వాటాలు కొని పెట్టుకున్న బ్రోకర్లు, వాటాల ధరలు తగ్గిపోయి, బ్యాంకులకు డబ్బు చెల్లించలేకపోతారు.

వాటాల్ని తాకట్టు పెట్టుకుని అప్పులు ఇచ్చే బ్యాంకులు, వాటాల 'మార్కెట్ ధర' మీదే (కొంత మార్జిన్‌ని తీసివేసి) అప్పులు ఇస్తాయి. ఆ మార్కెట్ ధరలు తగ్గిపోయినప్పుడు, వాటాదార్లు అప్పులు చెల్లించలేరు. బ్యాంకులు నష్టపోతాయి.

బ్యాంకుల బీరువాలన్నీ రక రకాల సెక్యూరిటీ కట్టలతో నిండిపోయి వుంటాయి. బ్యాంకుల్లో ఎక్కువ పెట్టుబడి, సెక్యూరిటీల మీదే (ముఖ్యంగా 'షేర్ల' మీద) వుంటుంది. ఆ షేర్లలో కొంత భాగం బ్యాంకులు స్వంతానికి కొన్నవీ, కొంత భాగం తాకట్లు పట్టుకుని అప్పులు ఇచ్చినవీ. మొత్తం మీద 'డిపాజిట్ల' డబ్బు అంతా బ్యాంకుల బయటే రక రకాల బ్రోకర్ల చేతుల్లో వుంటుంది. 'షేర్ల' ధరలు విపరీతంగా తగ్గిపోయే సంక్షోభ కాలంలో, వాటి మీద పెట్టిన పెట్టుబడి వెనక్కి రావడమూ; బ్రోకర్లు, బ్యాంకుల అప్పులు తీర్చడమూ - అనే ప్రశ్నే వుండదు.

అదే అదనుగా బ్యాంకుల డైరెక్టర్లూ, మేనేజర్లూ, ఆ నష్టాల గురించి మరింత దొంగ లెక్కలు చూపించి, బ్యాంకులో పెట్టుబడులు పెట్టిన వాటాదార్లని మోసం చేసి, స్వంతానికి లాభపడతారు. బ్యాంకు, తను కొన్న వాటాల్ని నష్టానికి అమ్మివేసినప్పుడు, 'వాటా'ని 10 నష్టానికి అమ్మితే, 20 నష్టానికి అమ్మినట్టు చూపించవచ్చు. లేదా, ఇంకా ఎన్ని రకాల మోసాలకైనా పాల్పడవచ్చు. - ఈ రకంగా బ్యాంకులు, సంక్షోభ కాలంలో అనేక సమస్యల్లో చిక్కుకుంటాయి.

ఎంత సంక్షోభ పరిస్తితుల్లో అయినా, డబ్బు పుష్కలంగా వున్న పెట్టుబడి దారులు కూడా కొంత మంది వుంటారు. అలాంటి వాళ్ళు అనేక కంపెనీల వాటాల్ని మహా తక్కువ ధరలతో కొని 'నిల్వ' చేస్తారు. తర్వాత కాలంలో వాటిని ఎక్కువకి అమ్ముతారు. అప్పటి వరకూ వాటి మీద 'డివిడెండ్లు' తింటూ వుంటారు. ఆ డివిడెండ్లు ఎంత తక్కువగా వున్నా, ఆ వాటాల్ని కొనడానికి తక్కువ పెట్టుబడే పెట్టారు కాబట్టి, ఆ తక్కువ డివిడెండ్ల వల్ల నష్టం వుండదు. ఆ వాటాల్ని మళ్ళీ అమ్మడానికి భవిష్యత్ కోసం ఎదురు చూస్తూ వుంటారు.

'డబ్బు'కి మహా అవసరం వచ్చిపడ్డప్పుడు, ప్రభుత్వం, 'బ్లాక్ మనీ' వున్న (లెక్కల్లో చూపించకుండా డబ్బు దాచుకున్న) పెట్టుబడిదార్లకు విజ్ఞప్తులు చెయ్యడం ప్రారంభిస్తుంది. "మీ బ్లాక్ మనీని బ్యాంకుల్లో డిపాజిట్ చెయ్యండి. మిమ్మల్ని

ఏమీ అనం. ఆ డబ్బు మీకు ఎలా వచ్చిందని వివ రాలు అడగం. పైగా బ్యాంకులు మీకు వడ్డీ కూడా ఇస్తాయి" అని, వాళ్ళని 'బతిమాలుతూ' ప్రకటనలు చేస్తుంది. ఆ రకంగా కొన్ని డిపాజిట్లు బ్యాంకులకు రావచ్చు. కానీ, మొత్తం 'బ్లాక్ మనీ' అంతా బయటికి రాదు.

పెట్టుబడిదారుల నించి కొత్త డిపాజిట్లు సంపా దించడానికి బ్యాంకులు ఇంకా కొన్ని రకాల మార్గాలు అవలంబించవచ్చు. కానీ, సంక్షోభ కాలంలో అవేవీ అంతగా పని చెయ్యవు.

సంక్షోభం లేని కాలంలో, 'అప్పు పద్ధతి' ద్వారా సరుకులు తేలిగ్గా కదిలిపోతూ వున్నప్పుడు, పెట్టుబడి దారుడికి, 'బ్యాంకు విధానం' మహా అద్భుత విధా నంగా కనపడుతుంది. ఆ కాలంలో వాడు, "డబ్బుతో ఏం పని అసలు? డబ్బే లేకుండా అప్పు విధానంతో బ్యాంకుల ద్వారా లావాదేవీలన్నీ అద్భుతంగా సాగించ వచ్చు" అని మహా ధీమాగా వుంటాడు. కానీ వాడి అజ్ఞానం ఏమిటంటే, "డబ్బుతో ఏం పని?" అని విర్రవీగుతూ వాడు 'బ్యాంకు విధానం' ద్వారా చేసే దంతా, 'డబ్బు రూపాన్ని మార్చడం' మాత్రమే. వాడు 'డబ్బు నోట్ల'కి బదులు, బ్యాంకు చెక్కులూ, డ్రాఫ్టులూ, మారకం బిల్లులూ, ప్రామిసరీ నోట్లూ, ఇతర సెక్యూరిటీలూ - వంటి రక రకాల పత్రాల్ని వాడుతూ వ్యాపార లావాదేవీలు నడుపుతాడు. ఆ పత్రాలన్నీ డబ్బుకి మారు రూపాలే. ఆ పత్రాలతో లావాదేవీలు జరపడం అంటే, అది డబ్బుతో లావా దేవీలు జరపడం లాంటిదే. కానీ, పెట్టుబడి దారుడు ఆ పత్రాల్ని చూసుకునే "డబ్బుతో ఏం పని?" అని డబ్బు వాడకాన్నే తీసివేసినట్టు, బడాయి పోతాడు. అంతా సవ్యంగా సాగిపోతూ వున్నప్పుడు 'మహా అనవసరంగా' కనపడే డబ్బు నోట్ల 'మహా అవసరం' ఏమిటో, సంక్షోభ కాలంలో తెలిసి వస్తుంది. ఆ నోట్ల కోసమే ('క్యాష్' - డబ్బు కోసం) సరుకుల్ని తక్కువ ధరలకు తెగనమ్మడానికైనా సిద్ధపడతారు. ఆ నోట్ల కోసమే, బ్యాంకుల్ని అనేక రకాలుగా మోసాలు చెయ్య డానికి సిద్ధపడతారు.

ఈ పరిస్తితి అంతా కలిసి 'డబ్బు సంక్షోభం' అయితే, ఆ డబ్బు సంక్షోభానికి కారణం - సరుకుల సంక్షోభమే. అంటే సరుకులు కదలక పోవడమే. అంటే సరుకులకు అమ్మకాలు తగ్గిపోవడమే. ఇది 'ఉత్పత్తి విధానంలో నించే' పుట్టుకొచ్చే సమస్య. కానీ, ఈ నిజమైన కారణం మరుగున పడిపోయి, ఇదంతా 'డబ్బు చలామణీ సమస్య' లాగే పైకి కనపడుతుంది.

పెట్టుబడిదార్ల దృష్టిలో - బ్యాంకులు ఎక్కువ అప్పులు ఇవ్వగలిగితే అది 'ఆర్థిక వృద్ధి'. ఎక్కువ అప్పులు ఇవ్వలేకపోతే అది 'ఆర్థిక మాంద్యం'. వాళ్ళ ప్రకారం, ఆ 'వృద్ధి'కీ, 'మాంద్యా'నికీ బ్యాంకులే కారణం. లేదా, 'డబ్బు చలామణీ పద్ధతులే' కారణం. 'బ్యాంకు - విధానం, అన్నిటినీ సాధించగలదు' అనే అభిప్రాయం వుండడం వల్లనే, 'డబ్బు చలామణీ'కి సంబంధించిన ఏ లోపానికైనా బ్యాంకులే కారణంగా కనపడతాయి.

కానీ, బ్యాంకుల చేతిలో వున్నదంతా 'డబ్బు చలామణీ'కి సంబంధించిన 'సాంకేతిక నైపుణ్యం' మాత్రమే. ఆ నైపుణ్యాన్ని ఉపయోగిస్తూ బ్యాంకులు, తమ దగ్గిర వున్న 'డిపాజిట్ల'తో అప్పుల్ని ఎక్కువో తక్కువో ఇవ్వగలిగేలా చెయ్యగలవు. సంక్షోభ కాలంలో ఏదో ఒక రకంగా ఎక్కువ అప్పులు ఇవ్వగలి గితే, 'డబ్బు సంక్షోభం' కొంత తగ్గుతుంది. ఎక్కువ అప్పులు ఇవ్వలేకపోతే సంక్షోభం ఇంకా పెరుగు తుంది. అంటే, డబ్బు సంక్షోభాన్ని కొంత ఎక్కువో తక్కువో అయ్యే లాగ మాత్రమే బ్యాంకులు చెయ్య గలవు గానీ, లేని సంక్షోభాన్ని తెచ్చే లాగానో, ఉన్న సంక్షోభాన్నంతా తీసివేసే లాగానో బ్యాంకులు చెయ్య లేవు. 'బ్యాంకు విధానానికి' అద్భుత శక్తులూ, మహి మలూ వుండవు.

బ్యాంకులు, 'కేంద్ర బ్యాంకు' నించి అప్పు తీసు కుని, అర్జంటుగా అప్పులు ఇవ్వగలిగాయనే అను కుందాం. కేంద్ర బ్యాంకు - 'ఇష్యూ శాఖ' నించి నోట్లు తీసి బ్యాంకులకు అప్పులు ఇస్తే, ఆ బ్యాంకులు పెట్టుబడి దార్లకు అప్పులు ఇస్తాయి - అనుకుందాం. కానీ, నిజానికి బ్యాంకులు 'అప్పులు' ఇవ్వాలంటే, తమ దగ్గిర వున్న డిపాజిట్ల మొత్తం మీదే ఆధార పడాలి. కానీ, గతంలో ఇచ్చిన అప్పులు వెనక్కి రాకుం డానూ, కొత్త డిపాజిట్లు లేకుండానూ, కేవలం 'ఇష్యూ శాఖ' నించి నోట్లు తీసి, వాటితో కొత్త అప్పులు ఇస్తే, అది చలామణీ లోకి వచ్చే నోట్ల మొత్తాన్ని అనవస రంగా పెంచివేస్తుంది. అయినప్పటికీ సంక్షోభ కాలంలో, బ్యాంకులు ఏదో ఒకటి చేసి పెట్టుబడి దారుల్ని 'ఆదుకోవలసి' వుంటుంది కాబట్టి అదే చేస్తాయి.

అయితే, కొత్త అప్పులు దొరికిన పెట్టుబడి

దారులు, వాటిని, పాత అప్పుల్ని తీర్చడానికో మరో అవసరానికో వాడుకుని, తాత్కాలికంగా బయట పడ తారనుకుందాం. తర్వాత ఆ కొత్త అప్పుల్ని తీర్చడాని కైనా వాళ్ళు, సరుకుల్ని అమ్మవలసిందే. సంక్షోభం నించి పూర్తిగా బయటపడే ఏకైక మార్గం - డబ్బు అప్పులు దొరుకుతూ వుండడం కాదు. సరుకులు కదలడమే. ఎంత కాలం వరకూ అయితే అమ్మకాలు లేకుండా సరుకులు పడి వుంటాయో అంత కాలం వరకూ సమస్య సమస్య గానే వుండిపోతుంది. కాబట్టి, బ్యాంకులు ఎన్ని సార్లు కొత్త అప్పులు ఇచ్చినా సంక్షోభం సమస్య పరిష్కారం అవదు. బ్యాంకు విధానం - డబ్బు చలామణీలో కొన్ని నైపుణ్యాలు ప్రదర్శించగలదే గానీ, అంత కన్నా ఏమీ చెయ్యలేదు. అంత కన్నా దానికి ఎక్కువ శక్తి వుండదు.

'డబ్బు కొరత' అన్నప్పుడు, అది, చలామణీలో వుండవలసినంత డబ్బు లేకపోవడం వల్ల ఏర్పడ్డ కొరతైనా కావచ్చు; లేదా, చలామణీలో వుండవలసి నంత డబ్బు వుండి కూడా అది బ్యాంకులకు రాక పోవడం వల్ల ఏర్పడ్డ కొరతైనా కావచ్చు. 'కొరత, ఏ పరిస్థితిలో ఏర్పడింది' అనే దాన్ని బట్టి, దాని పరి ష్కారం వుంటుంది. కానీ, 'డబ్బు కొరత' అనగానే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు దాన్ని ప్రతి సారీ చలా మణీ సమస్య గానే భావిస్తారు. అలా భావిస్తూ దాని పరిష్కారం కోసం 'డబ్బు చలామణీ పరిధి' లోనే వెతుకుతారు. చివరికి డబ్బు సప్లైని పెంచుతారు.

పెట్టుబడిదారీ విధానంలో వుండే అమ్మకాల అగాధాన్ని, 'అప్పు విధానం ద్వారా' సునాయాసంగా దాటగలమనే ధీమాతో వుండే పెట్టుబడి దారుడు, 'సరుకుల గుట్టలు' పేరుకు పోయినప్పుడు, వాటిని డబ్బుగా మార్చడానికి ఏ అప్పు విధానాలూ, ఏ బ్యాంకు విధానాలూ పని చెయ్యకుండా పోవడం కళ్ళారా చూస్తాడు.

సంక్షోభం - అంటు వ్యాధి, ప్రైవేటు కంపెనీలకే కాదు, ప్రభుత్వ కంపెనీలకూ, ప్రభుత్వ బ్యాంకులకూ, అన్నిటికీ సోకుతుంది. అలాగే, ఒక దేశం నించి, దానితో వ్యాపార సంబంధాలు గల ఇతర దేశాలకు కూడా పాకుతుంది. ఒక దేశం, తన సరుకుల్ని విదేశా లకు అమ్మలేకపోతే, విదేశాల సరుకుల్ని తను కూడా కొనలేదు. ఒక దేశం నించి ఎగుమతులు తగ్గితే, దిగు మతులు కూడా తగ్గుతాయి. లేదా, ఎగుమతులు ఆగితే, దిగుమతులు కూడా ఆగుతాయి. ఆ రకంగా ఒక దేశంలో ప్రారంభమైన సంక్షోభం, ఇతర దేశాల ఉత్పాదక కంపెనీలకూ, వర్తక కంపెనీలకూ, బ్యాంకు లకూ కూడా చుట్టుకుంటుంది.

ఒక దేశానికి 'విదేశీ మారకం కొరత' ఏర్పడితే, అది 'డబ్బు సంక్షోభం'గా కనపడినా, అది కూడా 'సరు కుల సంక్షోభమే'. ఒక దేశం నించి సరుకుల అమ్మ కాలు తగ్గడం వల్లనే అక్కడ విదేశీ మారకం సమస్య (విదేశీ డబ్బు సమస్య) తలెత్తుతుంది. అలాంటి పరి స్థితుల్లో ఆ దేశం, ఎగుమతులు పెంచుకోవడం కోసం 'మారకం రేటు'లో తన 'డబ్బు విలువ'ని తగ్గించడాన్ని (డీ వాల్యుయేషన్-ని) ఒక మార్గంగా ఎంచు కుంటుంది. 1 డాలరు = 20 రూపాయల మారకం రేటు వుంటూ వుండగా, 1 డాలరు = 21 రూపా యలుగా రేటుని మార్చితే, రూపాయి విలువ తగ్గి నట్టూ, డాలరు విలువ పెరిగినట్టూ అర్థం. రూపాయి దేశం, తన డబ్బు విలువని తగ్గించి, తన సరుకుల ధరల్ని ఎప్పటి లాగే వుంచితే, అది తన సరుకుల ధరల్ని తగ్గించిన దానితో సమానం.

ఒక దేశం నించి ఎగుమతులు తగ్గిపోతూ వున్న ప్పుడు, ఆ ప్రభుత్వం, తన పెట్టుబడిదారులతో, "మీ సరుకుల ధరలు తగ్గించండి! దాని వల్ల మన ఎగు మతులు పెరగవచ్చు" అని సూటిగానే చెప్పవచ్చు. కానీ అలా చెప్పదు. ఎందుకంటే "మీ సరుకుల ధరలు తగ్గించండి" అని చెప్తే, పెట్టుబడిదారులు వినరు గనక. కాబట్టి, ఆ ప్రభుత్వం, తన చేతిలో వున్న మార్గంగా, విదేశాలతో అప్పటి వరకూ నడుస్తూ వున్న 'మారకం రేటు'లో, తన డబ్బు విలువని తగ్గించుకునే పనే చేస్తుంది.

అది ధరల్ని తగ్గించిన దానితో సమానం కాబట్టి, అలాంటి పరిస్థితుల్లో, కొంత ఎక్కువ సరుకుని అమ్మడం సాధ్యమే. కాబట్టి, తన డబ్బు విలువని తగ్గించిన దేశం (రూపాయి దేశం), కొన్నాళ్ళ పాటు కొత్త ఎగుమతులు చేస్తే చెయ్యవచ్చు. కానీ, అది తాత్కాలికమే. ఎందుకంటే, రూపాయి దేశపు కంపె నీలు, రూపాయి విలువ తగ్గిన తర్వాత కూడా తమ సరుకుల ధరల్ని ఎప్పటి లాగే వుంచవు. తగ్గిన విలువని పూడ్చుకోగలిగే విధంగా, తమ సరుకుల ధరల్ని పెంచుతాయి. ఇది మళ్ళీ ఎప్పటి పరిస్థితికే దారి తీస్తుంది. ఎగుమతుల్ని పెంచడం కోసం 'డబ్బు విలువ'ని తగ్గించే దేశంలో, ఆ మార్పు క్రమంగా సరుకుల ధరల్ని పెంచడానికి మాత్రమే దారి తీస్తుంది.

(ధరల పెరుగుదలతో సమానంగా 'జీతాలు' పెరగవు కాబట్టి, ఇది కార్మిక వర్గానికి అందే ఉత్పత్తుల్ని తగ్గిస్తుంది.)

ఒక దేశపు డబ్బు విలువ తగ్గినప్పుడు, ఆ డబ్బు నిల్వలు వున్న వాళ్ళు, కొంత విలువని నష్టపోతారు. అయితే ఇతర దేశాల డబ్బు నిల్వలు వున్న వాళ్ళు, తమ నిల్వల విలువ పెరిగి, కొంత లాభపడతారు. అంటే, ఒక చోట డబ్బు విలువ తగ్గినప్పుడు, ఆ తగ్గిన విలువ ఎవరికీ అందకుండా మాయమైపోదు. అది ఇంకో చోటకి అందుతుంది. అంటే, ఆ డబ్బు విలువ తగ్గిన దేశంతో వ్యాపారం చేసే విదేశానికి! 'మారకం రేటు'లో మార్పు జరిగినప్పుడల్లా, ఒక దేశపు డబ్బు విలువ తగ్గి, ఇంకో దేశపు డబ్బు విలువ పెరుగుతుంది.

డబ్బు విలువ తగ్గినా, ఆ దేశపు పెట్టుబడి దారుడు, ధరని పెంచకుండా విదేశానికి సరుకుల్ని అమ్మినప్పుడు, ఆ ధరలో నించి, తన 'పెట్టుబడి' నంతా తప్పనిసరిగా వెనక్కి తీసుకుంటాడు. అందులో మార్పు జరగడానికి వీలు లేదు. ఎటొచ్చీ, S ని తీసుకునే చోటే మార్పు జరుగుతుంది. ఈ పెట్టుబడి దారుడికి అందే S భాగం గతం కన్నా తగ్గి, విదేశీ పెట్టుబడిదారుడికి పోయే S భాగం గతం కన్నా పెరుగుతుంది. అంటే, మారకం రేటులో మార్పు వల్ల, S లో భాగాలు ఒక చోట తగ్గి, ఇంకో చోట పెరుగు తాయి.

డబ్బు కొరతా, వాటాల ధరల సంక్షోభమూ, మారకం రేటు సంక్షోభమూ - వగైరా 'డబ్బు' వేపు తలెత్తే సమస్యలకు మూలం - సరుకుల సంక్షోభమే.

'డబ్బు చలామణీ'కీ సంబంధించిన నియమ నిబంధనల్ని సరిగా పాటించనప్పుడు, 'డబ్బు' వేపు నించి కూడా కొన్ని సమస్యలు తలెత్తుతాయి. కానీ, 'నియమ నిబంధనల్ని సరిగా పాటించకపోవడం' అనేది కూడా, లాభ దృష్టి గల ఉత్పత్తి విధానం నించి పుట్టుకొచ్చే విషయమే. కాబట్టి, డబ్బు సమస్యగా కనపడేది ఏదీ డబ్బు సమస్య కాదు.

'సరుకు వేపు నించి' పుట్టుకు వచ్చే సమస్యలన్నిటినీ, 'డబ్బు వేపు నించి' పుట్టుకు వచ్చే సమస్యలుగా భావించే తప్పు, మొదటి నించీ జరుగుతూనే వుంది. ఈ 'డబ్బు సిద్ధాంతం' (కరెన్సీ థీరీ) అనేది - 'దేశంలో వెండి బంగారాల పరిమాణాల్ని బట్టే సరుకుల ధరలు వుంటాయి' అనే తప్పు అవగాహనతో మొదలైంది. 'చలామణీలో నించి డబ్బు నోట్లని తీసివేసి ఏవైనా సర్టిఫికెట్ల లాంటి వాటిని పెట్టుకుంటే డబ్బు సమస్యలు తప్పిపోతాయి' అనే వరకూ ఇది, అనేక రకాల తప్పు అభిప్రాయాలతో సాగింది. ఇలాంటి తప్పు అభిప్రాయాలు గల వాళ్ళు, డబ్బు సమస్యలన్నిటికీ, తప్పు పరిష్కార మార్గాలే సూచిస్తారు. కానీ, 'డబ్బు చలామణీ'లో తలెత్తే ఏ సమస్యకైనా అసలు మూలం - ఉత్పత్తి విధానానికి వుండే స్వభావమే.

# 'సంక్షోభ కాలంలో సరుకుల పరిస్థితి

**అ**మ్మకాలు లేకుండా నిలిచిపోయిన సరుకుల విషయంలో, రక రకాలుగా జరుగుతుంది. త్వరగా పాడైపోయే సరుకుల్ని ధరలు కొంత తగ్గించైనా అమ్మేయ్యడానికే మొదట ప్రయత్నిస్తారు. అది సాధ్యం కానప్పుడు, ఆ సరుకుల్ని పెట్టుబడి దారులే నాశనం చేయించేస్తారు. పొలాల్లో విరగ పండి వున్న పంటల్ని కొయ్యకుండానే తగల బెట్టెయ్యడం, పాలని సముద్రాల్లో పారబొయ్యడం, కూరగాయల్ని ట్రాక్టర్లతో తొక్కించడం, ధాన్యాలకు విషపు మందులు కలపడం - ఇటువంటి అమానుషమైన పనులెన్నో 'సంక్షోభాల చరిత్ర'లో జరిగాయి. ఈ సరుకులన్నిటినీ పెట్టుబడి దారీ వర్గం 'అమ్మలేకనే' అలా చేసింది.

సరుకుల్ని అలా నాశనం చేసే బదులు వాటి ధరలు ఇంకా తగ్గించవచ్చు. లేదా, వాటిని కార్మికులకు ఉచితంగా ఇచ్చెయ్యవచ్చు. కానీ, అలాంటి 'సహజ భావాలకు' పెట్టుబడిదారీ విధానంలో చోటు వుండదు. దోపిడీ విధానం, ప్రతీ విషయం లోనూ సహజ దృష్టికి వ్యతిరేకమైనదే. అలాగే, ఈ విషయంలో కూడా.

ఎక్కువ ఉత్పత్తి వున్నప్పుడు - దాన్నంతా చాలా తక్కువ ధరతో అమ్మితే వచ్చే 'లాభం రేటు' తక్కువ అనీ; ఆ ఉత్పత్తిలో చాలా భాగాన్ని నాశనం చేసేసి, తక్కువ ఉత్పత్తినే ఎక్కువ ధరతో అమ్మితే వచ్చే 'లాభం రేటే' ఎక్కువ అనీ - అనుకుందాం. పెట్టుబడిదారీ విధానం రెండో పద్ధతినే ఎంచుకుంటుంది. ఎక్కువ లాభం రేటు వచ్చే విధంగా సరుకుని అమ్మ గలిగితే అమ్మడం; లేకపోతే, అమ్మలేని సరుకుని వాడకానికి పనికి రాకుండా (కార్మికులకు అందకుండా)

చేసెయ్యడం! - ఈ రెండు పద్ధతులే పెట్టుబడిదారీ విధానానికి తెలుసు.

అనేక సంక్షోభ కాలాల్లో పెట్టుబడి దారులు - ధాన్యాలూ, పళ్ళూ, పాలూ, కూరగాయలూ - వంటి అనేక రకాల టన్నుల టన్నుల ఉత్పత్తుల్ని ఎందుకు నాశనం చేసేశారు? వాటినన్నిటినీ ఉచితం గానో, అతి తక్కువ ధరల తోనో ఎందుకు ఇవ్వలేకపోయారు? లేదా, వాటినన్నిటినీ తమ స్వంత కుటుంబాల కోసం ఎందుకు వాడలేకపోయారు? 'ఎంత సరుకునైనా వాడెయ్యవచ్చు; అందులో అసాధ్యమేముంది?' అనే వాళ్ళకి ఈ వాస్తవాలేవీ పట్టవు.

ఇలా 'సరుకుని నాశనం చేసే పద్ధతి' వెనకటి సమాజాల్లో లేదు. అక్కడ 'అమితోత్పత్తి' సమస్యే లేదు కాబట్టి.

ఇనుమూ, బొగ్గూ వంటి త్వరగా పాడవని సరుకుల విషయంలో 'అమితోత్పత్తి' వున్నప్పుడు, పెట్టుబడిదారులు వీలైనంత వరకూ 'పునరుత్పత్తి' క్రమాన్ని నిలిపివేసి వున్న సరుకుకి ధరలు తగ్గించకుండా వుంచడానికి ప్రయత్నిస్తారు. కానీ, డబ్బు అవసరం తీవ్రంగా వున్న వాళ్ళు సరుకుని తక్షణం అమ్మాలంటే, ధరలు తగ్గించక తప్పదు.

భారీ గుత్త కంపెనీలకు, సంక్షోభ పరిస్తితుల్లో కూడా డబ్బు నిల్వలు వుంటాయి. లేదా, ఆ కంపెనీలు, సంక్షోభ పరిస్తితుల్లో కూడా డబ్బు అప్పులు సంపాదించ గలుగుతాయి. అలాంటి కంపెనీల పెట్టుబడిదారులు, ఇతర పెట్టుబడి దారుల నించి ధరలు తగ్గిన సరుకుల్ని చవగ్గా కొనేసి నిల్వ చేస్తారు. తమ కంపెనీల్లో వాడకానికి కొంతా, మళ్ళీ అమ్మడానికి కొంతా. ఆ సరుకుల్ని అమ్మివేసిన మొదటి పెట్టుబడి దారులు, మళ్ళీ వెంటనే 'పునరుత్పత్తి క్రమాలు' ఎప్పటి స్థాయిలో ప్రారంభించ లేరు. వాళ్ళు అమ్మిన సరుకు అంతా ఖర్చయితేనే గానీ అది సాధ్యం కాదు.

సంక్షోభ కాలంలో, సరుకుల్ని అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చిన కంపెనీలు, తమ పెట్టుబడులు కూడా తిరిగి రాక, నష్టాల పాలవుతాయి. అలాంటి కంపెనీల 'వాటాల్ని' (షేర్లని) వాటాదారులు అమ్మి వెయ్యడం ప్రారంభిస్తారు కాబట్టి. అలాంటి వాటాల్ని పెద్ద కంపెనీలు కొనివేసి, ఆ కంపెనీల్ని స్వాధీనపర్చుకుంటాయి.

ప్రతీ సంక్షోభ కాలం లోనూ చిన్న స్థాయి కంపెనీల సంఖ్య తగ్గడమూ, గుత్త కంపెనీల పెట్టుబడులు పెరగడమూ జరుగుతుంది.

సంక్షోభాన్ని వేరు వేరు కోణాల్లో, వేరు వేరు పేర్లతో చెప్పవచ్చు. పారిశ్రామిక సంక్షోభం, వర్తక సంక్షోభం, క్రెడిట్ సంక్షోభం, డబ్బు సంక్షోభం - వంటి పేర్లతో! అన్నిటి సారాంశమూ ఒకటే.

'పారిశ్రామిక సంక్షోభం' అంటే, పునరుత్పత్తి క్రమానికి ఆటంకాలేర్పడడం. 'వర్తక సంక్షోభం' అంటే, సరుకుల అమ్మకాలకు ఆటంకాలేర్పడడం. 'క్రెడిట్ సంక్షోభం' అంటే, అప్పుల చెల్లింపులకూ, అప్పులు దొరకడానికీ ఆటంకాలేర్పడడం. 'డబ్బు సంక్షోభం' అంటే, డబ్బు చలామణీకి ఆటంకాలేర్పడడం.

ఈ సంక్షోభాలన్నిటినీ కలిపి 'ఆర్థిక సంక్షోభం' అనవచ్చు. వీటన్నిటికీ మూల కారణం ఒకటే. అది 'సరుకుల సంక్షోభం'. దానికి సంబంధించిన వేరు వేరు కోణాలే అవన్నీ.

# 'సంక్షోభం' నించి, 'సంక్షోభానికి'!

**సం**క్షోభ కాలం కొన్ని నెలలూ సంవత్సరాలూ కూడా వుండవచ్చు. నిల్వ సరుకులు తరగటానికి ఎంత కాలం పడుతుందీ - అనే దాన్ని బట్టి వుంటుంది అది. అప్పటి వరకూ పునరుత్పత్తి క్రమాలు, తగ్గిన స్థాయిలోనే వుంటాయి. నిలవలు తరిగి పోతూ వుండగా క్రమంగా ఉత్పత్తి క్రమాలు తేరుకుంటాయి; యధాస్తితికి వస్తాయి. ఒక సంక్షోభం ముగిసేసరికి, ప్రధాన శాఖల్లో కనీసమైన సమన్వయం (బ్యాలెన్స్) ఏర్పడుతుంది. ఉత్పత్తుల్లో హెచ్చు తగ్గులు సర్దుకుంటాయి.

పెట్టుబడిదారులు, సంక్షోభ కాలంలో, లాభాలు కొంత తగ్గిపోయి వుంటాయి కాబట్టి, అప్పుడు అదంతా సంపాదించే కొత్త ప్రయత్నాలకు పూనుకుంటారు. 'ఉత్పత్తి శక్తుల్ని పెంచే పోరాటం' అప్పుడు మళ్ళీ ప్రారంభమవుతుంది.

ఎక్కువ లాభం సంపాదించాలంటే, ఎక్కువ సరుకుని అమ్మాలి. ఎక్కువ సరుకుని అమ్మాలంటే, సరుకుని ఇతర పెట్టుబడి దారుల కన్నా తక్కువ ధరతో ఇవ్వగలగాలి. సరుకుని తక్కువ ధరతో ఇవ్వాలంటే, దాని ఉత్పత్తి ఖర్చుని తగ్గించగలగాలి. ఉత్పత్తి

ఖర్చుని తగ్గించాలంటే, ఉత్పత్తి శక్తిని ఇంకా పెంచాలి. ఈ రకంగా, 'రేషనలైజేషన్' పేరుతో 'ఉత్పత్తి శక్తుల్ని పెంచే పోటీ' మళ్ళీ ప్రారంభమవుతుంది. పెట్టుబడి దారీ విధానంలో 'రేషనలైజేషన్' అంటే, 'టెక్నిక్కుల్ని' మార్చడం! కార్మికుల్ని తగ్గించడం!

నిజానికి పెట్టుబడిదారులు, తమ 'ఉత్పత్తి స్థలాల్లో' సిద్ధంగా వున్న ఉత్పత్తి శక్తుల్ని కూడా గతంలో సంపూర్ణంగా ఉపయోగించ లేకపోయారు. ఆ ఉత్పత్తి శక్తులతో ఉత్పత్తి క్రమాలు నడిస్తేనే 'అమితోత్పత్తి' తయారైంది. ఆ ఉత్పత్తిని అమ్మడానికే మార్గం లేకుండా పోయింది. అలాంటి పరిస్థితుల్లో కూడా పెట్టుబడిదారులు, తమ యంత్రాల్ని మరింత మెరుగు పరిచే పరిశోధనలు చేయిస్తూనే వుంటారు. మేధాశ్రమల కార్మికులు తమ మేధస్సులన్నీ ఉపయో గించి యంత్రాల్ని మరింత శక్తి వంతంగా మారుస్తారు. కొత్త యంత్రాల్ని కనిపెడతారు. ఆ యంత్రాల్ని ఉప యోగించవలసిన కార్మికులు, వాటి మీద మళ్ళీ కొత్త ట్రయినింగులు పొందుతారు.

ఉత్పత్తి శక్తుల పెరుగుదల కోసం అన్ని శాఖల లోనూ నిరంతరం ప్రయత్నాలు జరుగుతూనే వున్నప్ప టికీ, మొదట, ఒకటి రెండు శాఖల్లో, అందులోనూ భారీ పెట్టబడులతో పని చేసే గుత్త కంపెనీల్లో, ఆ పని జరుగుతుంది. ఆ శాఖలకు ఉత్పత్తి సాధనాల్ని అందించే శాఖల్లో కార్మికులకు డిమాండ్ పెరుగు తుంది. 'డిమాండ్' పెరగడం అంటే, గతంలో కన్నా పెరుగుతుందని అర్థమే గానీ, 'నిరుద్యోగాన్నంతా తీసివేసేంతగా' డిమాండ్ పెరుగుతుందని అర్థం కాదు. కార్మికులకు డిమాండ్ పెరిగినప్పుడల్లా నిరు ద్యోగుల్లో కొంత జనాభాకి పనులు దొరుకుతాయి. మిగతా జనాభా ఎప్పటి లాగానే నిరుద్యోగం లోనే వుంటుంది. అంటే, పెట్టుబడిదారీ విధానంలో, కార్మిక జనాభాకంతటికీ పనులు దొరకడం, కార్మికులకు డిమాండ్ పెరిగే కాలాల్లో కూడా జరగదు. నిరుద్యోగ జనాభా తగ్గడమో హెచ్చడమో మాత్రమే జరుగుతూ వుంటుంది.

మళ్ళీ అన్ని శాఖల్లోనూ కొత్త ఉత్పత్తి క్రమాలు నడుస్తూ వుంటాయి. 'వ్యాపార ప్రపంచం' లోకి మళ్ళీ ఉత్సాహం ప్రవేసిస్తుంది. సరుకుల అమ్మకాలు తేలిగ్గా సాగిపోతూ వుంటాయి. పెట్టుబడి దారులందరూ పాత సంక్షోభపు పీడ కలని దాదాపు మరిచేపోతారు.

క్రమంగా, వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి శక్తులు అస్తవ్యస్తంగా విస్తరిస్తాయి. మళ్ళీ ఎక్కడో ఏదో జరుగు తుంది. మళ్ళీ సరుకులు పేరుకు పోతూ వుంటాయి. మళ్ళీ ఒకటి రెండు శాఖల్లో అమ్మకాలు మంద గించడం ప్రారంభమవుతుంది. క్రమంగా అది ఎక్కువ శాఖలకు విస్తరిస్తుంది. ఉత్పత్తి క్రమాలు కుంటు పడడం ప్రారంభమవుతుంది. కార్మికుల్ని పనుల్లోంచి తీసివెయ్యడం అధికమవుతుంది. అంతా మళ్ళీ వెనకటి రకం గానే జరిగిపోతూ వుంటుంది.

మళ్ళీ సంక్షోభం! మళ్ళీ సరుకుల గుట్టలు! మళ్ళీ కార్మికుల బాధలు! అంతా మళ్ళీ వెనకటి లాగానే! అయితే, సంక్షోభం తీవ్రత, ఆ యా పరి స్థితుల్ని బట్టి రక రకాలుగా వుంటుంది.

వ్యాపార ప్రపంచంలో వచ్చే ఈ దశలన్నిటినీ 'పారిశ్రామిక చక్రం' (ఇండస్ట్రియల్ సైకిల్) పేరుతో చెప్పుకోవచ్చు. (ఈ మాట పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా అంటారు.) అన్ని శాఖల లోనూ ఉత్పత్తి క్రమాలు కొంత కాలం పాటు నిరాటంకంగా సాగ డమూ, క్రమంగా కొంత కాలం పాటు మందగించ డమూ - వగైరా దశలలో ఈ 'చక్రం' వుంటుంది. అమ్మకాలు సుఖంగా వున్న దశ 'బూమ్' అయితే, అమ్మకాలు చాలా తగ్గిపోయిన దశ 'స్టాగ్నేషన్' లేదా 'డిప్రెషన్'.

ఒక శాఖలో, ఒక సంక్షోభ కాలంలో వుండే ఉత్పత్తి శక్తి, అంటే, ఒక 'పారిశ్రామిక చక్రానికి ముగింపులో' వుండే ఉత్పత్తి శక్తి, ఇంకో పారిశ్రామిక చక్రానికి ప్రారంభ శక్తిగా వుంటుంది. అది మళ్ళీ పెరుగుతూ, కొత్త సంక్షోభానికి దారి తీస్తుంది.

ఒక సంక్షోభానికీ ఇంకో సంక్షోభానికీ మధ్య వుండే వ్యవధి 10 సంవత్సరాలు కావచ్చు; 15 సంవత్స రాలు కావచ్చు; రక రకాలుగా వుండవచ్చు. సంక్షోభం సాగే వ్యవధి కూడా రక రకాలుగా వుండవచ్చు.

సంక్షోభ సమస్య నించి బయట పడటానికి పెట్టుబడిదారులు 'ఉత్పత్తి శక్తుల్ని పెంచుతూ పోయే మార్గాన్నే' ఎంచుకుంటారు. కానీ, ఆ మార్గం వాళ్ళని ఆ సమస్య నించీ ఏ మాత్రమూ తప్పించదు. పైగా, ఆ మార్గం వాళ్ళని ఒక సంక్షోభం నించి ఇంకో సంక్షో భానికి తీసుకు పోతూ వుంటుంది. పాత సమస్యల్నించీ కొత్త సమస్యలకు!

ఒక 'సరుకు' గురించి గానీ, మొత్తం 'సరుకుల రాసి' గురించి గానీ, గతంలో చెప్పుకున్నప్పుడల్లా ఆ క్రమాన్నంతా ఎలా చెప్పుకున్నాం? 'సరుకు ఉత్పత్తి

క్రమమూ, చలామణీ క్రమమూ ఎప్పటికప్పుడు జరిగి పోతూ వుంటాయి. సరుకు ధరలో నించి C + S భాగాలు పెట్టుబడి దారుడికీ, V భాగం కార్మికులకూ అందుతూ వుంటాయి; ఆ రకంగా పెట్టుబడి, ఎప్పటి కప్పుడు టర్నోవరవుతూ (తిరిగి వస్తూ) వుంటుంది' అని చెప్పుకున్నాం. కానీ, అది అలాగే నిరాటంకంగా జరిగి పోతూ వుంటుందని భావించడం అంటే, పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానాన్ని, ఆటంకాలకు అవకాశం లేని 'ప్లాన్డ్ విధానంగా' చూడడమన్న మాట! కానీ, పెట్టుబడిదారీ విధానానికి లేని లక్షణం అది! అందుకే ఆ విధానం, సంక్షోభాలకు గురి అవుతూనే సాగుతూ వుంటుంది.

పెట్టుబడిదారీ విధానంలో భారీ పరిశ్రమ ప్రారంభమయ్యాకే ఈ 'సంక్షోభాల చరిత్ర' ప్రారంభ మైంది. మొదటి సంక్షోభం 1825లో వచ్చింది. తర్వాత ఒక దాని తర్వాత ఒకటిగా సంక్షోభాలు వచ్చి పోతూనే వున్నాయి. ఏదైనా ఒక సంక్షోభ కాలంలో ఏం జరిగిందో చూస్తే, 'సంక్షోభం' అంటే ఏమిటో కనీసంగా నైనా అర్థమవుతుంది. ఈ చాప్టరు చివర, **'అను బంధం'**లో, 1929 సంక్షోభాన్ని చూస్తారు.

# పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల చిట్కాలు!

1929 సంక్షోభంలో చిక్కుకుని గడగడ లాడిన పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, (ఈ సంక్షోభాన్ని 'అను బంధం'లో చూస్తాము) తమ వాదనలకు కాస్తో కూస్తో మరమ్మతులు చేసుకోవలసి వచ్చింది. అప్పటి నించీ వీరు కూడా వ్యాపారంలో 'ఉధృతీ - మాంద్యమూ' (బూమ్ అండ్ డిప్రెషన్) ఒక దాన్నొకటి వెన్నంటి వస్తూ వుంటాయని మాట్లాడే వరకూ వచ్చారు. అయితే, ఈ ఉధృతులూ మాంద్యాలూ ఒక దాని వెంట ఒకటి 'చక్రం' రూపంలో ఎందుకు వస్తాయి - అనే ప్రశ్నకి వాళ్ళ ధగ్గిర సరైన జవాబు వుండదు. ఎందుకు వుండ దంటే - వాళ్ళు, శ్రమ దోపిడీ, పెట్టుబడిదారీ పోటీ - అనే అంశాలనే గుర్తించరు గనక. పెట్టుబడిదారీ పోటీయే, సరుకు గుట్టలకూ సంక్షోభాలకూ కారణ మవుతుందనే విషయం వివరించడం వాళ్ళకు అంగీ కారంగా వుండదు. కాబట్టి, ఆ విషయాల్ని వేటినీ ప్రస్తా వించకుండా - ''పెట్టుబడిదారులు, 'ఆర్థిక సూత్రాల్ని చక్కగా పాటిస్తే', ఈ ఒడిదుడుకు లేమీ ఏర్పడవు'' అని మాత్రం చెప్పి, సంక్షోభాల గురించి ఇంకేమీ మాట్లాడకుండా దాట వేస్తారు.

'ఆర్థిక సూత్రాల్ని చక్కగా పాటిస్తే ఒడిదుడుకులు ఏర్పడవు' అని కదా వీరు చెప్పేది? పెట్టుబడిదారీ ఆర్థిక సూత్రాల్లో 'పోటీ' అనేది అతి ముఖ్యమైన సూత్రం. 'పోటీ' వుండి తీరాలనీ, అది ఎంతో లాభ దాయకమైనదనీ, ఈ ఆర్థిక వేత్తలే చెపుతారు. కానీ, ఆ సూత్రాన్ని 'చక్కగా పాటించినందు వల్లే' ఈ ఉధృ తులూ, మాంద్యాలూ! 'పోటీ' సూత్రాన్ని ఎంత చక్కగా పాటిస్తే, అంత చక్కని సంక్షోభాలు పుట్టుకొస్తాయి!

మొత్తం మీద పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, సంక్షోభ కారణాల్ని అంగీకరించినా - అంగీకరించక పోయినా, కొంత కాలానికి ఒక సారి సరుకుల అమ్మ కాలు 'మహా గడ్డు సమస్య'గా తయారవుతున్నాయనే సంగతి మాత్రం గ్రహించారు. ఆ సమస్యకి వాళ్ళు ఏదో ఒక మార్గం చెప్పాలి కాబట్టి దీని కోసం వాళ్ళు కొన్ని 'చిట్కాలు' బోధిస్తారు. కార్మికులకు ఎక్కువ సరుకుని వాయిదాల పద్ధతి మీద అమ్మేస్తూ వుండా లనీ, కార్మికులతో 'నిరుద్యోగ బీమా' చేయించాలనీ; బ్యాంకులు, పెట్టుబడిదార్లకు ఎక్కువ అప్పులు ఇవ్వకుండా బ్యాంకుల్ని కంట్రోలు చెయ్యాలనీ, ఉత్పత్తి నిలిచిపోతూ వున్నప్పుడు ప్రభుత్వమే దాన్ని కొనాలనీ - వగైరా వగైరా చిట్కాలు!

ఈ చిట్కాల ఫలితాల్ని క్లుప్తంగా చూద్దాం:

## 1. వాయిదాల పద్ధతి మీద సరుకులు అమ్మడం:

కార్మిక వర్గం ఒక నెలలో, తన జీతాలకు సరిపోయే సరుకుల్ని మాత్రమే గాక, ఇంకా కొంత ఎక్కువ సరుకుని 'వాయిదాల పద్ధతి' మీద కొంటుం దనుకుందాం. సరుకులకు డిమాండ్ ఆ నెలలో పెరిగే మాట నిజమే. అయితే, అప్పుగా కొన్న సరుకుల ధరల్ని కార్మికులు అనేక నెలల వరకూ భవిష్యత్ జీతాలలో నించి చెల్లించాలి. దాని వల్ల భవిష్యత్ జీతాలతో కొనవలసిన రెగ్యులర్ సరుకులకు డిమాండ్ తగ్గిపోతుంది. కార్మిక వర్గం వాడగలిగేది తన 'జీతాల్ని' మాత్రమే. ఆ జీతాలతో, జీతాల విలువకి

మించిన సరుకుని కొనడం సాధ్యం కాదు. 'వాయిదాల పద్ధతి'లో రెగ్యులర్ సరుకు కన్నా ఎక్కువ సరుకుని కొనడం వల్ల, సరుకుల భవిష్యత్ డిమాండు, వర్తమాన కాలానికి మారడం మాత్రమే జరుగుతుంది. మొత్తం మీద డిమాండ్ పెరిగేదేమీ వుండదు.

### 2. నిరుద్యోగ బీమా:

కార్మికులు, పని చేస్తూ వున్న కాలంలో, ప్రతీ నెలా జీతంలో నించి కొంత డబ్బుని ఇన్సూరెన్స్ కంపెనీకి కట్టాలి. తర్వాత ఎప్పుడైనా ఉద్యోగం పోయినప్పుడు, ఇన్సూరెన్స్ కంపెనీ, కార్మికులకు మొదట కట్టిన దాని కన్నా ఎక్కువ డబ్బుని చెల్లిస్తుంది. అప్పుడు కార్మికులు, ఉద్యోగం లేకపోయినా ఆ డబ్బుతో సరుకులు కొనుక్కోవచ్చు. ఇదీ, ఈ చిట్కాకి అర్థం.

దీని వ్యవహారం ఏమిటో చూద్దాం. A అనే కార్మికుడు, కట్టవలసిన ఇన్సూరెన్స్ పాలసీ విలువ 400 అనుకుందాం. ప్రతి నెలా జీతంలో నించి 10 కట్టాలి. అంటే, ఆ కార్మికుడు, ప్రతి నెలా ఆ 10తో సరుకులు కొనడు. ఆ డబ్బు, ఇన్సూరెన్స్ పాలసీ కోసం వెళ్ళిపోతుంది. ఆ కార్మికుడికి ఉద్యోగం పోకుండా వుంటే, 400 వరకూ కట్టడం పూర్తి అయిన తర్వాత, ఆ డబ్బు అంతా వడ్డీతో సహా వెనక్కి వస్తుంది. ఒక వేళ, మధ్యలోనే ఉద్యోగం పోతుందనీ, కార్మికుడు అప్పటికి 100 మాత్రమే కట్టి వున్నాడనీ అనుకుందాం. అయినప్పటికీ, ఉద్యోగం పోయిన వెంటనే, ఆ కార్మికుడికి, ఇన్సూరెన్స్ కంపెనీ నించి 400 రావాలి. అలా వచ్చిందనే అనుకుందాం. ఆ 400 వల్ల, సరుకులకు డిమాండ్ పెరుగుతుందా? - అలా జరగదు. ఎందుకంటే; అందులో, A, కట్టిన డబ్బు 100. మొదట ఈ 100 గురించి చూద్దాం. దీనితో ఆ కార్మికుడు, గతంలో సరుకుల్ని కొనకుండా, ఆ డబ్బుని ఇన్సూరెన్స్ కంపెనీకి ఇచ్చేశాడు. అప్పుడు ఆగిపోయిన డిమాండే ఇప్పుడు ఏర్పడుతుంది. ఆ కార్మికుడు, ఆ 100 తో, ఎక్కువ సరుకుల్ని కొనగలిగినట్టు కాదు.

ఇంకా ఆ పైన వున్న 300 సంగతి:

A కట్టింది 100 మాత్రమే అయినా, అతనికి ఇన్సూరెన్స్ కంపెనీ నించి ఇంకో 300 ఎక్కువగా అందుతుంది. అది ఎక్కడిది? ఆ ఇన్సూరెన్స్ కంపెనీకే ఇతర కార్మికులు కట్టిన మొత్తం లోది. అది కూడా 'జీతాల'లో నించి తీసి కట్టినదే. ఆ 300తో కొనవలసిన సరుకుకి కూడా గతంలో డిమాండ్ తగ్గిందన్న మాట. గతంలో ఇతర కార్మికులు కొందరు తగ్గించుకున్న డిమాండే ఇప్పుడు A ద్వారా ఏర్పడుతుంది. కాబట్టి, ఇన్సూరెన్స్ కంపెనీ నించి, Aకి 400 వచ్చినా, దాని వల్ల సరుకుల కోసం డిమాండ్ పెరిగేదేమీ వుండదు.

అంతే గాక, ఇక్కడ ఇంకో విషయం వుంది. 'నిరుద్యోగ బీమా పాలసీ' తీసుకున్న కార్మికుడికి, ఉద్యోగం పోయినప్పుడు, కట్టిన దాని కన్నా ఎక్కువ డబ్బు రావడం అనేది, సంక్షోభం లేని సాధారణ కాలాల్లో మాత్రమే సాధ్యం. సాధారణ కాలంలో 100 మంది పాలసీదారుల్లో అందరూ ఉద్యోగాల్లో వుండి, రెగ్యులర్‌గా ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియమ్స్ కడుతూ వుంటారు. అందులో ఒకరో ఇద్దరో నిరుద్యోగులైతే, వారికి ఇన్సూరెన్స్ కంపెనీ, ఎక్కువ డబ్బు చెల్లించడం సాధ్యమే. (ఆ ఎక్కువ డబ్బు వల్ల సరుకులకు కొత్త డిమాండ్ ఏర్పడక పోయినా.) కానీ, సంక్షోభ కాలంలో, ఒకరో ఇద్దరో మాత్రమే ఉద్యో గాల్లో వుండి మిగిలిన వాళ్ళంతా నిరుద్యోగులవుతారు. ఆ నిరుద్యోగ జనాభా కందరికీ, అప్పటి వరకూ వారు చెల్లించిన దాని కన్నా కొన్ని రెట్లు ఎక్కువని చెల్లించాలంటే, అది ఇన్సూరెన్స్ పథకానికే అసాధ్యం. సంక్షోభ కాలంలో, ఉద్యోగాల్లో వున్న వాళ్ళు కూడా రెగ్యులర్‌గా ప్రీమియమ్స్ చెల్లించలేరు. సంక్షోభ కాలంలో, బ్యాంకు డిపాజిట్ల లాగే ఇన్సూరెన్స్ పాలసీలన్నీ కూడా ఎగిరిపోతాయి. ఆ తర్వాత కాలంలో అయినా ఆ కంపెనీలు ఏమైనా చెల్లిస్తాయో లేదో అదంతా సంక్షోభ తీవ్రతని బట్టి వుంటుంది. కాబట్టి, 'నిరుద్యోగ బీమా' చిట్కా కూడా సరుకుల డిమాండ్‌ని పెంచడానికి ఏ మాత్రమూ పనికి రాదు.

### 3. బ్యాంకులు ఇచ్చే అప్పుల్ని అదుపులో వుంచడం:

బ్యాంకులు ఎక్కువ అప్పులు ఇస్తే, డబ్బు సప్లై పెరిగి, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి, 'ధరలు' పెరుగుతాయి. ధరలకు తగిన విధంగా 'జీతాలు' పెరగక, కార్మిక వర్గం నించి సరుకులకు డిమాండ్ తగ్గిపోతుంది. కాబట్టి, బ్యాంకుల్ని అదుపులో పెట్టాలనేది పైకి మంచి చిట్కాలాగే కనబడుతుంది. కానీ, బ్యాంకులు కూడా పెట్టుబడిదారీ సంస్థలే. వాటి వ్యాపారం వాటిది. వాటి 'లాభం' వాటిదీ. వాటికి ఏ మార్గంలో ఎక్కువ లాభం వస్తే, ఆ మార్గంలో అవి

నడుస్తాయి. బ్యాంకుల కన్నా మొదట అదుపు వుండ వలసింది ఉత్పాదక కంపెనీల మీద! గుత్త కంపెనీల మీద! పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తి స్థలాల్లో అమితోత్పత్తి వున్నప్పుడు బ్యాంకులు అప్పులు ఇవ్వక పోయినా ఆ ఉత్పత్తులు మాయం కావు. ఉత్పాదక కంపెనీల మీద పని చెయ్యని అదుపులూ కంట్రోళ్ళూ, బ్యాంకుల మీద కూడా పని చెయ్యవు. కాబట్టి, ఈ చిట్కా కూడా పని చెయ్యదు.

**4. పెట్టుబడిదారుల దగ్గిర నిలిచి పోయిన 'అమితోత్పత్తి' నంతా ప్రభుత్వమే కొని, దానితో 'అనుత్పాదక' కార్యక్రమాలు చేపట్టాలనేది:**

అంటే, రోడ్లూ, కాలవలూ, ఆస్పత్రులూ, స్కూళ్ళూ, ప్రాజెక్టులూ వగైరా నిర్మాణాల కోసం, ప్రభుత్వం, పెట్టుబడి దారుల నించి అమితోత్పత్తి నంతా కొనాలి. ఆ ప్రాజెక్టుల వల్ల కార్మికులకు పనులు దొరుకుతాయి. కాబట్టి, సంక్షోభ కాలంలో ప్రభుత్వం 'ప్రజోపయోగ నిర్మాణాలు' చేపట్టాలి! అంటే, ప్రభుత్వం ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టా లంటే, 'సంక్షోభాలు' వస్తూ వుండాలన్న మాట! మామూలు కాలాల్లో అయితే, ప్రభుత్వం ఆ 'అవస రాలు' తీర్చదన్న మాట! పెట్టుబడి దారుల దగ్గిర సరుకు పెరిగి పోయినప్పుడల్లా, దాని వల్ల వాళ్ళు ఇబ్బంది పడకుండా, వాళ్ళ సరుకుల్ని కొనే సంస్థగా మాత్రమే ప్రభుత్వం పని చేస్తూ వుండాలన్న మాట! పెట్టుబడి దారుల కోసం ప్రభుత్వం ఎలా పని చెయ్యాలో పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు దాపరికం లేకుండా చక్కగానే చెప్పారు. అయితే, ప్రభుత్వం ఆ అమితోత్పత్తి నంతా ఏ డబ్బుతో కొనాలి? ప్రభుత్వానికి వుండే ఆదాయం - పన్నులే. ఆ పన్నులు, ఏ సరుకుల భాగాల నించి వచ్చాయో, ఆ భాగాల్ని మాత్రమే ఆ పన్నులతో కొనడం సాధ్యం. అంత కన్నా ఎక్కువ సరుకుని ఆ పన్నులతో కొనడం సాధ్యం కాదు. పన్ను లతో, పరిపాలనకు సంబంధించిన రెగ్యులర్ కార్య క్రమాలు కొనసాగిస్తూనే అమితోత్పత్తిని కూడా కొనడం ప్రభుత్వానికి సాధ్యం కాదు.

ప్రభుత్వం, పెట్టుబడి దారుల నించి సరుకుల్ని తన పన్నుల తోనే కొనాలంటే, ఆదాయం తక్కువా, ఖర్చు ఎక్కువా అవుతుంది. ఈ బడ్జెట్‌లో లోటుని పూడ్చడం కోసం, కొత్త డబ్బుని ప్రింటు చేసి, దానితో సరుకుల్ని కొనాలని ఆర్థిక వేత్తలు సూచిస్తారు. సమాజంలో వున్న 'ఉత్పత్తి'ని చలామణీ చెయ్యడానికి కావలసినంత డబ్బు - సప్లై, సమాజంలో వుందా లేదా అనే దానితో సంబంధం లేకుండా, కొత్త డబ్బుని విడుదల చేస్తే, అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుందని అందరికీ తెలుసు. అయినప్పటికీ ఆర్థిక వేత్తలు అదే బోధిస్తారు. అంటే, 'ఆర్థిక సూత్రాల్ని చక్కగా పాటిం చాల'ని బోధించే ఆర్థిక వేత్తలు, ఈ రకంగా వాటిని 'చక్కగా' పాటిస్తారన్న మాట!

ఈ రకంగా, 'అమితోత్పత్తి సమస్య తలెత్త కుండా', ఆ సరుకు కంతటికీ డిమాండుని పెంచ డానికి ఆర్థిక వేత్తలు, సూచించే చిట్కాలు ఇంత చక్కగా వుంటాయి!

ఆర్థిక సమస్యల గురించి ప్రభుత్వం ఎప్పుడే పని చెయ్యాలో పరిపాలకులకు ఏమీ తెలీదు. ఏదైనా సమస్య వచ్చినప్పుడల్లా పరిపాలకులు దాన్ని బ్యాంక ర్లకూ, ఆర్థిక వేత్తలకూ అప్పజెపుతారు. అయితే, ఆ బ్యాంకర్లకూ, ఆర్థిక వేత్తలకూ, అంతకన్నా తెలీదు. వాళ్ళు హడావిడిగా విమానాల్లో ఇటూ అటూ పోయి, వాళ్ళు తిరగదల్చుకున్న నగరాల్లో, సెమినార్లూ - మీటింగులూ అవీ పెడతారు. మీటింగుల చివరి రోజుకైనా ఏదో ఒకటి తేల్చాలి కాబట్టి, 'డబ్బు సప్లైని తగ్గిద్దాం' అని ఒకరంటే, 'ఎక్కిద్దాం' అని ఒకరంటారు. అలాగే ఇంకో సమస్య మీద, 'ఇలా చేద్దాం' అని ఒక రంటే, 'కాదు, అలా చేద్దాం' అని ఒకరంటారు. చివ రికి, రూపాయి బిళ్ళని ఎగరేసి 'బొమ్మ' పడితే ఒక లాగా, 'బొరుసు' పడితే ఒక లాగా చేసుకుంటారు. రూపాయి బిళ్ళ, అంచు మీద నించుంటే, ఆ 2 రకాలూ గాక, మూడో రకంగా చేసుకోవలసిందే. ఆఖ రికి ఆర్థిక వేత్తల మీటింగుల సారాంశం అంతా రూపాయి బిళ్ళ, 'పైనించి కిందపడ్డం' మీద ఆధార పడి వుంటుంది!

కాబట్టి, అమితోత్పత్తిని అమ్మడానికి పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తలు చెప్పే చిట్కాలేవీ ఆ సమస్యని నిజమైన అర్థంతో పరిష్కరించవు. కొంత ఉపయోగ పడే సూచన ఏదైనా అందులో వుంటే అది తాత్కాలి కంగా సమస్య తీవ్రతని తగ్గించవచ్చు గానీ, సమస్య కారణాన్ని తీసివెయ్యదు. సమస్యని కొంత దూరానికి గెంటడం మాత్రమే చేస్తుంది.

పెట్టుబడిదారీ విధానం సృష్టించే అనర్థాలకు పరిష్కారం ఒక్కటే. <u>అది, పెట్టుబడిదారీ విధానాన్నే</u>

రద్దు చెయ్యడం! అంటే, దోపిడీని రద్దు చెయ్యడం! కానీ, దాన్ని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఎలాగూ సూచించరు.

పెట్టుబడిదారీ విధానం, సంక్షోభాలు లేకుండా సాగగలదనేది అర్ధ రహితమైన ఊహ! అలా జరిగితే అది పెట్టుబడిదారీ విధానమే అవదు. అయినప్పటికీ కాస్సేపు ఉదాహరణ కోసం, పెట్టుబడిదారీ విధానంలో కూడా 'అమితోత్పత్తి' సమస్య తలెత్తకుండా ప్లాను చెయ్యగలుగుతారనుకుందాం. అంటే, ఇక సంక్షోభాలు వుండవు, వాటి వల్ల వచ్చే సమస్యలు వుండవు - అనుకుందాం.

అలా జరిగితే కార్మికులకు చాలా? - చాలదు. 'సంక్షోభాలు' లేకపోయినా 'శ్రమ దోపిడీ' సమస్య ఎప్పటి లాగే వుంటుంది. సమాజ సమస్యలన్నీ ఎప్పటి లాగే వుంటాయి. కాబట్టి, 'సంక్షోభాలు' అనేవే కార్మికులకు ప్రధాన సమస్యలు కావు. 'శ్రమ దోపిడీ సమస్యే' ప్రధాన సమస్య. పరిష్కారం కావలసింది 'సంక్షోభాలకు' కాదు! 'దోపిడీ'కే!

## 'సంక్షోభాలకు' సంబంధించి మార్క్సు ఎంగెల్సుల నించి కొన్ని మాటలు విందాం:

1. "పునరుత్పత్తి క్రమంలో ఆటంకానికీ, అవరోధానికీ సంబంధించిన దశే సంక్షోభం". [ కాపిటల్ - 4: థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ - 2; పేజీ 50.]

2. "సంక్షోభం - అన్ని శాఖలకూ చెందిన జనరల్ సంక్షోభం కావడానికి, ప్రధానమైన వ్యాపార సరుకుల్ని ప్రభావితం చేస్తే చాలు" [కాపిటల్ -4, పేజీ 505.]

3. "సంక్షోభాన్ని ఎలా మాత్రమే వివరించగలమంటే - ఆర్థిక వ్యవస్థలోని వివిధ శాఖల ఉత్పత్తిలో డిస్ ప్రపోర్షన్ (ఉత్పత్తులు, తగిన పాళ్ళలో లేక పోవడం) వల్ల వచ్చే ఫలితం గానూ; పెట్టుబడి దారుల స్వంత వినియోగానికీ, పెట్టుబడి కూడికకూ మధ్య డిస్ ప్రపోర్షన్ ఫలితం గానూ మాత్రమే, వివరించగలం. ఉత్పత్తిలో పెట్టిన పెట్టుబడిని వెనక్కి రాబట్టడమనేది, చాలా వరకూ, ఉత్పత్తిలో పాల్గొనని వర్గాల వినియోగ శక్తి మీద ఆధారపడి వుంటుంది. కార్మికుల వినియోగ శక్తేమో కొంత వరకూ 'జీతాల' సూత్రాల చేతా; కొంత వరకూ 'పెట్టుబడిదారీ వర్గం కార్మికుల్ని లాభదాయకంగా వినియోగించగలిగినంత వరకే ఉపయోగించుకుంటుంది' అనే వాస్తవం చేతా, పరిమితమై వుంటుంది. అన్ని నిజమైన సంక్షోభాలకూ అసలైన కారణంగా ఏది వుంటుందంటే, జనాల (మాసెస్) దారిద్ర్యమూ, వారి పరిమిత వినియోగమూనూ".

[కాపిటల్ - 3, పేజీ - 484, మాస్కో, 1971].

4. "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లోని ప్రాథమిక అంశాలను - అంటే, వస్తువు సరుకుగా వుండడమూ; సరుకు - 'సరుకు గానూ, డబ్బు గానూ' వుండడమూ; సరుకుల మారకంలో సరుకూ - డబ్బూ వేరు పడే చర్య జరగడమూ; డబ్బుకీ - వేతన శ్రమకీ, లేదా సరుకులకూ - వేతన శ్రమకీ వున్న సంబంధమూ - వగైరా అంశాలను, లక్ష్య పెట్టక పోవడం ద్వారానూ; లేదా, తిరస్కరించడం ద్వారానూ; సంక్షోభాలనే వాటిని 'ఉనికి' లోనే లేనట్టుగా, ఉనికిలో నించి తీసివేస్తారు."

[కాపిటల్ -4, పేజీ 502].

5. "సంక్షోభాలనేవి, ఉనికిలో వున్న వైరుధ్యాలకు తాత్కాలిక, బలవంతపు పరిష్కారాలు తప్ప ఇంకేమీ కావు. చెదిరిపోయిన సమ తౌల్యాన్ని మళ్ళీ కొంత కాలం పాటు తిరిగి స్థాపించే తీవ్రమైన పేలుళ్ళు అవి." [కాపిటల్ - 3, పేజీ - 249, మాస్కో, 1971].

6. "కాటన్ బట్టతో నిండిపోయి వున్న మార్కెట్లో స్తబ్దత (స్టాగ్నేషన్), నేత పెట్టుబడి దారుడి పునరుత్పత్తి క్రమాన్ని ఆటంకపరుస్తుంది. ఈ ఆటంకం, మొదట ఆ పెట్టుబడిదారుడి కార్మికుల విషయంలో ప్రభావం చూపుతుంది. ఆ విధంగా వారు (కార్మికులు), ఆ పెట్టుబడిదారుడి సరుకుకీ, అంటే 'బట్ట'కీ, అలాగే వారి వినియోగం లోకి వచ్చే ఇతర సరుకులకూ, కొంత మేరకు మాత్రమే వినియోగదారులుగా వుంటారు. లేదా, అసలు ఏ మేరకూ వినియోగదారులుగా వుండరు. వారికి కాటన్ బట్ట కావాలనేది నిజమే. కానీ, వారు దాన్ని కొనలేరు. ఎందుకంటే, వారికి కొనే సాధనాలు వుండవు. ఎందుకు వుండవంటే, మళ్ళీ ఉత్పత్తి చెయ్యడం కొనసాగించ లేరు గనక. ఎందుకు కొనసాగించ లేరంటే, ఉత్పత్తి చాలా ఎక్కువగా వుంది గనక. అంటే మార్కెట్లో చాలా ఎక్కువ కాటన్ బట్ట అప్పటికే వుంది. కాబట్టి, కార్మికులు ఉత్పత్తిని ఇంకా పెంచాలని గానీ, ఇంకో రకం సరుకేదైనా ఉత్పత్తి చెయ్యాలని గానీ రికార్డ్లో ఇచ్చే సలహా వారికి ఉపయోగపడదు. మార్కెట్టులో కాటన్ బట్ట 'అదనపు ఉత్పత్తి'గా వున్న ఈ సందర్భంలో, ఆ కార్మికులు ఇప్పుడు అదనపు జనాభా'లో భాగంగా వుంటారు" - [కాపిటల్ - 4; పేజీ - 522.].

7. "19 వ శతాబ్దంలో వ్యాపార సంక్షోభాలు - ముఖ్యంగా, 1825 నాటీ, 1836 నాటీ పెద్ద పెద్ద సంక్షోభాలు - ఇవి ఇక ఎంత మాత్రమూ విడి విడిగా వుండే ఆర్థిక విషయాలు కావు ... ప్రపంచ మార్కెట్లో - ఎక్కడైతే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లోని అన్ని అంశాల మధ్యా వుండే ఘర్షణలు బయట పడతాయో ఆ ప్రపంచ మార్కెట్లో, ఇవి (సంక్షోభాలు) తీవ్రమైన తుఫాన్లు. వీటి మూలాన్నీ, చికిత్సనూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో మహా పై పైన వుండేటటువంటీ, అనిర్దిష్టమైనటు వంటీ (యాబ్‌స్ట్రాక్ట్) రంగంలో, అంటే 'డబ్బు చలామణీ రంగం'లో, వెతకడం చేశారు."

[కాపిటల్ - 3; పేజీ - 547.]

8. "ఆధునిక పరిశ్రమ తిరిగే చక్ర దశలు:

| | |
|---|---|
| ఇన్ యాక్టివ్ దశా- | (నిరుత్సాహంగా సాగే దశ) |
| రివైవల్ - | (తిరిగి పుంజుకోవడం) |
| ప్రాస్పరిటీ - | (అభివృద్ధి) |
| ఓవర్ ప్రొడక్షన్ - | (అమితోత్పత్తి) |
| క్రైసిస్ - | (సంక్షోభం) |
| స్టాగ్నేషన్ - | (స్తంభన) |
| మళ్ళీ ఇన్‌యాక్టివిటీ- | (నిరుత్సాహంగా సాగే దశ) |

ఈ దశల్ని గనక పరిశీలిస్తే, ఏం కనిపిస్తుందంటే - సాధారణంగా ప్రాస్పరిటీ కాలాలకూ, లేదా అధిక లాభాల కాలాలకూ సంబంధించి, తక్కువ వడ్డీ రేటు వుంటుంది. విపరీతమైన, అత్యధిక వడ్డీ రేటు వున్నట్ట యితే, అది సంక్షోభ కాలానికి సంబంధించినదిగా వుంటుంది. 1843 వేసవిలో చెప్పుకోదగిన ప్రాస్పరిటీ కాలం వుండింది. 1842 లో 4 % వుండిన వడ్డీ రేటు, 1843 నాటికి 2% కి తగ్గింది. సెప్టెంబరు నాటికి 1 % కి తగ్గింది. తర్వాత అది 8% కి పెరిగింది. 1847 సంక్షోభ కాలంలో అయితే ఇంకా పెరిగింది'.

[కాపిటల్ - 3, పేజీ 360 - 61.]

9. "గతంలో సాగిన జనరల్ సంక్షోభాల తర్వాత ఒక మార్పు జరిగింది. పారిశ్రామిక చక్ర కాలం (సైకిల్ డ్యూరేషన్) దీర్ఘం కావడమే ఆ మార్పు. ప్రపంచ వ్యాపారపు ప్రారంభ సంవత్సరాల్లో, అంటే 1815 - 47 మధ్య కాలంలో, ఈ చక్రాలు ఐదేసేళ్ళ పాటు వున్నాయని చూపించవచ్చు. 1847 నించీ 67 వరకూ ఈ చక్రాలు, పదేసేళ్ళు వున్నాయి. కిందటి, అంటే 1867 నాటి, జనరల్ సంక్షోభం తర్వాత, చాలా తీవ్ర మైన మార్పులు జరిగాయి. రవాణా, కమ్యూనికేషన్ సాధనాల్లో జరిగిన బ్రహ్మాండమైన విస్తరణ - అంటే, సముద్ర మార్గాలూ, రైలు మార్గాలూ, ఎలక్ట్రిక్ టెలిగ్రాఫీ, సూయజ్ కాలవా - ఇవన్నీ నిజమైన 'ప్రపంచ మార్కెట్'ని ఒక వాస్తవంగా చేశాయి. పరిశ్రమల్లో గతంలో ఇంగ్లండుకి వున్న గుత్తాధిపత్యాన్ని, దానితో పోటీ పడుతోన్న పారి శ్రామిక దేశాలు అనేకం ఛాలెంజ్ చేశాయి. యూరప్ దేశాల 'అదనపు పెట్టుబడి'ని పనిలో పెట్టడానికి, ప్రపంచం లోని అన్ని భాగాల లోనూ అనంతమైన, రక రకాల రంగాలు తెరుచు కున్నాయి. ఏ రకంగా నంటే, ఆ పెట్టుబడి ఎక్కువ విస్తృతంగా డిస్ట్రిబ్యూట్ అయ్యే లాగానూ, స్థానికంగా జరిగే అధిక అంచనాలను (ఓవర్ స్పెక్యులేషన్‌ని) తేలిగ్గా అధిగమించే లాగానూ. ఈ పరిస్థితులన్నిటి వల్లా సంక్షోభాన్ని సృష్టించే పాత పునాదుల్లో అధిక భాగమూ, అవి పెరిగే అవకాశాలూ, చాలా వరకూ తొలగిపోవడమన్నా జరిగింది; తగ్గడమన్నా జరిగింది. ఇంకో వేపునేమో, కార్టెళ్ళూ - ట్రస్టులూ వున్నప్పుడు స్వదేశీ మార్కెట్లో 'పోటీ' తగ్గు ముఖం పడుతుంది. విదేశీ మార్కెట్లో నేమో 'రక్షణ సుంకాల' వల్ల (ప్రొటెక్టివ్ టారిఫ్‌ల వల్ల) పోటీ పరిమిత మౌతుంది. అయితే, ఈ రక్షణ సుంకాలు - అంతిమంగా జరిగే జనరల్ పారి శ్రామిక యుద్ధానికి, అంటే ఏ యుద్ధమైతే ప్రపంచ మార్కెట్లో ఆధిపత్యం ఎవరిదనే దాన్ని నిర్ణయిస్తుందో ఆ యుద్ధా నికి, సన్నాహాలే తప్ప మరేమీ కావు. ఈ విధంగా, పాత సంక్షోభాలు మళ్ళీ మళ్ళీ సంభవించ డానికి వ్యతిరేకంగా పని చేసే ప్రతీ అంశమూ, తనతో పాటు మరింత శక్తివంతమైన భవిష్యత్ సంక్షోభానికి బీజాన్ని మోసుకొస్తుంది" - ఎంగెల్స్. [కాపిటల్ - 3, పేజీ - 489 లో ఫుట్ నోట్; మాస్కో.]

10. "ఒక సారి సంక్షోభం వచ్చిందీ అంటే, ఇక అది చెల్లింపు సాధనం సమస్య గానే వుంటుంది. ప్రతీ వాడూ ఈ చెల్లింపు సాధనాల్ని పొందడానికి ఇంకోడి మీద ఆధారపడి వుంటాడు. చెల్లింపుల గడువు నాటికి ఇంకోడు తనకు చెల్లిస్తాడో లేదో ఎవడికీ తెలీదు. కాబట్టి మార్కెట్టులో దొరికే చెల్లింపు సాధనం కోసం, అంటే బ్యాంకు నోట్ల కోసం, తొక్కిసలాట ప్రారంభ మవుతుంది. ప్రతీ వాడూ తనకి అందినన్ని నోట్లని నిల్వ (హోర్డ్) చేస్తాడు. ఆ విధంగా, ఎంతో అవసరమైన సమయంలో చలామణీలో నించి నోట్లు మాయమవు తాయి. అలాంటి ఆందోళన వుండిన ఒక రోజున, 1847 అక్టోబరులో, దాచిపెట్టేసిన బ్యాంకు నోట్ల

సంఖ్య 40, 50 లక్షల పౌండ్లు వుండవచ్చు - అని శామ్యూల్ గుర్నే అంచనా వేశాడు" - ఎంగెల్స్.

[కాపిటల్ - 3; పేజీ 527; మాస్కో.]

11. "ప్రపంచ మార్కెట్టులో వచ్చే సంక్షోభాలలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వైరుధ్యాలూ శతృత్వాలూ (కాన్‌ట్రడిక్షన్స్ అండ్ యాంటగనిజమ్స్) కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. విపత్తు కాలంలో బయట పడే ఘర్షణా పూరితమైన అంశాల స్వభావాన్ని పరిశోధించడానికి బదులు, పెట్టుబడిదారీ సమర్ధకులు, అసలు విపత్తే లేదని దానిని తిరస్కరించడం ద్వారానూ; తప్పనిసరిగా కొంత కాలానికోసారి విపత్తు తిరిగి తిరిగి సంభవించినప్పుడు, 'పాఠ్య పుస్తకాల ప్రకారం ఉత్పత్తి విధానం సాగించి వుంటే సంక్షోభాలు సంభవించవు' అని నొక్కి చెప్పడం ద్వారానూ - సంతృప్తి పడతారు. ఈ విధంగా ఈ సమర్ధనలు, మహా సింపుల్‌గా వుండే ఆర్థిక సంబంధాలను తప్పుగా చూపించడం గానూ; మరీ ప్రత్యేకంగా, 'వైరుధ్యం' వున్న చోట 'ఐక్యత'ని పట్టుకు వేళ్ళాడ్డం గానూ, వుంటాయి" - మార్క్స్. [కాపిటల్ - 4, పేజీ - 500.]

12. "అవి (సంక్షోభాలు) వచ్చినప్పుడల్లా, అంత కంతకూ మరింత ప్రమాదకరంగా, మొత్తం బూర్జువా (పెట్టుబడి దారీ) సమాజానికే చావు బతుకుల సమస్య తెచ్చి పెడుతున్నాయి. ఈ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఉత్పత్తి అయిన సరుకుల్లోనే గాక, గతంలో సృష్టించ బడిన ఉత్పాదక శక్తుల్లో కూడా పెద్ద భాగం నాశనం చేయబడుతుంది. గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక 'అంటు రోగం', ఈ సంక్షోభ సమయాల్లో చెలరేగుతుంది. 'మితిమీరిన ఉత్పత్తి' అనే అంటు రోగం. హఠాత్తుగా, మానవ సమాజం, తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేసించినట్టుంటుంది; కాటకమో, సర్వ విధ్వంసక ప్రపంచ యుద్ధమో వచ్చి సకల ప్రాణాధార వస్తువుల సరఫరానూ భగ్నం చేసినట్టుంటుంది. పరిశ్రమలూ, వాణిజ్యమూ ధ్వంసమైనట్టుంటుంది. కారణం యేమంటే, మితి మీరిన నాగరికత, మితి మీరిన ప్రాణాధార వస్తు సంపద, మితి మీరిన పరిశ్రమలు, మితి మీరిన వాణిజ్యం! సమాజం చేతిలో వున్న ఉత్పాదక శక్తులు, ఇక ఎంత మాత్రమూ బూర్జువా ఆస్తి వ్యవస్థ అభివృద్ధికి అనుకూలంగా లేవు. తద్విరుద్ధంగా, అవి, తనకు శృంఖలాలుగా తయారైన ఆ ఆస్తి వ్యవస్థ కంటే బాగా బలీయమైనాయి. అవి, ఆ శృంఖలాలను అధిగమించినప్పుడల్లా, వెంటనే మొత్తం బూర్జువా సమాజం లోకి 'అవ్యవస్థ' ప్రవేసిస్తుంది. బూర్జువా ఆస్తి వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుంది. బూర్జువా సమాజపు నియమాలు, తాము సృష్టించిన సంపదను ఇముడ్చుకోవడానికి తామే ఇరుకైనాయి. మరి, ఈ సంక్షోభాలను బూర్జువా వర్గం యే విధంగా అధిగమిస్తుంది?

ఒక వైపున ఉత్పాదక శక్తుల్లో కొంత భాగాన్ని విధి లేక ధ్వంసం చేయడం ద్వారానూ; మరొక వైపున కొత్త మార్కెట్లను జయించడం ద్వారానూ, పాత మార్కెట్లను మరింత కట్టుదిట్టంగా దోచుకోవడం ద్వారానూ. అంటే, మరింత విస్తృతమైన, మరింత విధ్వంసకమైన సంక్షోభాలకు బాట వేయడం ద్వారానూ, సంక్షోభ నివారణావకాశాలను తగ్గించడం ద్వారానూ అన్నమాట!" - [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, మార్క్స్ - ఏంగెల్స్ సంకలిత రచనలు - 1, పేజీలు: 51 - 52, ప్రగతి ప్రచురణాలయం, మాస్కో - 1980.]

ఇంత వరకూ మార్క్స్ - ఎంగెల్స్‌ల నించి సంక్షోభాలకు సంబంధించి కొన్ని మాటలు చూశాము.

# ప్రశ్నలూ - జవాబులూ

1. **సంక్షోభం - అంటే ఏమిటి?**

**జ:** సరుకులకు అమ్మకాలు లేక గుట్టలుగా పడి వుండడం. పెట్టుబడులు వెనక్కి రాకపోవడం.

2. **సంక్షోభం, ఏ వర్గానికి?**

**జ:** రెండు వర్గాలకూ. కానీ, దోపిడీ వర్గానికి - పెట్టుబడి తగ్గే పరిస్థితి మాత్రమే వుంటే, కార్మిక వర్గానికి - జీవించడమే సాధ్యం కాని పరిస్తితి వస్తుంది.

3. **సమాజంలో వున్న సరుకుల రాసి విలువ C + V + S గా వుంటుంది. అందులో ఏ భాగానికి డిమాండ్ ఎవరి ద్వారా వుంటుంది?**

**జ:** C కోసం - పెట్టుబడిదారుల నించీ; V - కోసం కార్మికుల నించీ; S - కోసం పెట్టుబడిదారుల నించీ.

**4. సరుకు రాసిలో వున్న ప్రతీ భాగాన్ని వాడే వాళ్ళు వున్నప్పుడు, సరుకులు అమ్ముడు పోని పరిస్తితి ఎలా వస్తుంది?**

**జ:** సరుకు రాసిలో వున్న ఆ భాగాలు, పరస్పరం సరిపోయే పాళ్ళల్లో వుండాలి. అలా లేనప్పుడే మొదట కొన్ని శాఖల్లోనూ, తర్వాత తర్వాత ఇతర శాఖల్లోనూ అమ్మకాలు తగ్గిపోతాయి. కార్మికులు ఎప్పుడూ, కొత్తగా చేసిన పనికి వచ్చిన కొత్త జీతాలతో, అప్పటికే మార్కెట్లో వున్న గత సరుకుని కొంటూ వుంటారు. ఇవ్వాల్టి జీతం వస్తే తప్ప నిన్నటి సరుకుని కొనలేరు. ఒక దశలో ఉద్యోగాలు పోతే, V కి చాలా డిమాండ్ ఆగిపోతుంది.

అలాగే, పెట్టుబడిదారుల వేపు నించి కూడా. C లో వేరు వేరు రకాలు, సరిపోని పాళ్ళల్లో వుండ వచ్చు. S లో నించి కొత్త పెట్టుబడిగా మారవలసిన రకాలు కూడా సరిపోని పాళ్ళల్లో వుండవచ్చు. సరుకుల రాసిలో పాళ్ళు సరిపోయిన భాగాలతో ఉత్పత్తి క్రమాలు ఒక స్థాయి వరకూ నడుస్తూనే వుంటాయి. కానీ అది చాలా తక్కువ స్థాయిగా వుంటుంది.

**5. 1905 లో, A దేశంలో ఒక ఉత్పాదక శాఖలో రోజుకి 15 యూనిట్లు తయారు చెయ్యగలిగే వాడు. 1930 నాటికి, రోజుకి 120 యూనిట్లు చెయ్యగలిగే విధంగా ఉత్పత్తి శక్తి పెరిగింది. అయితే, అంత ఉత్పత్తి శక్తి వున్నప్పటికీ 1930 లో ఆ శాఖ రోజుకి 12 యూనిట్లని మాత్రమే చేసేది. అప్పుడు ఆ శాఖలో ఉత్పత్తి స్థాయి ఏ కాలానికి సంబంధించినది అవుతుంది?**

**జ:** 1905 కన్నా కూడా వెనకటి కాలానికి.

**6. బ్యాంకు దివాళా తీసింది - అంటే అర్థం ఏమిటి?**

**జ:** బ్యాంకు, తన దగ్గిర డబ్బు దాచుకున్న డిపాజిటర్లకి వాళ్ళు ఎప్పుడు అడిగితే అప్పుడు డబ్బుని ఇచ్చెయ్యాలి. కానీ బ్యాంకు, ఆ డబ్బుని బైటి పెట్టుబడి దార్లకు అప్పులు ఇచ్చి వుంటుంది. ఆ అప్పులు తీసుకున్న వాళ్ళు తమ సరుకుల్ని అమ్మ లేకపోతే, బ్యాంకుల అప్పులు తీర్చలేరు. ఆ డబ్బు, బ్యాంకుకి తిరిగి రాదు. డిపాజిటర్లు, తమ డబ్బు వెనక్కి ఇవ్వమని అడిగితే, బ్యాంకు దగ్గిర డబ్బే వుండదు కాబట్టి డిపాజిటర్లకు ఇవ్వలేదు. అలాంటి పరిస్తితి వస్తే, అదే బ్యాంకు దివాళా తియ్యడం.

**7. భారత దేశం నించి 100 మంది బొగ్గు గని కార్మికుల్ని ఒక బ్రోకరు ఒక విదేశానికి తీసుకు వెళ్ళాడు. ఇది కార్మికులు వలస వెళ్ళడమేనా?**

**జ:** స్వదేశంలో పనులు దొరకకే కదా విదేశాలకు వెళ్ళేది? అక్కడ కొంచెం మంచి జీతాలూ, సదుపాయాలూ వుంటే అక్కడే వుండిపోతారు. అప్పుడప్పుడూ స్వదేశానికి తిరిగి వచ్చినా, అది వలస వెళ్ళడమే.

**8. సంక్షోభ పరిస్థితుల్లో వున్న దేశం, దిగుమతుల మీద ఆంక్షలు విధించీ, ఎక్కువ టాక్సులు విధించీ, ఎగుమతులే ఎక్కువగా చెయ్యడానికి ప్రయత్నిస్తుంది. ఇది ఎలాంటి ఫలితాలకు దారి తియ్యవచ్చు?**

**జ:** విదేశాలు కూడా అలాగే చేస్తాయి. మళ్ళీ ఎప్పటి పరిస్తితే.

**9. A దేశం తన డబ్బు విలువని తగ్గించింది. అందుకు B దేశం సంతోషించింది, ఎందుచేత? కానీ, A దేశం 'మూల్యహీనీకరణ' చేసినందుకు C, D దేశాలు వ్యతిరేకించాయి. ఎందుచేత?**

**జ:** A దేశపు డబ్బు విలువ తగ్గినందుకు B దేశం ఎందుకు సంతోషిస్తుందంటే, A కి B దేశమే ఎక్కువ ఎగుమతులు చేసే దేశం అయి వుంటుంది. A కి B యే ఎక్కువ సరుకుల్ని అమ్ముతుంది కాబట్టి, ఆ సరుకులకు బదులుగా వచ్చే డబ్బు, గతం కన్నా ఎక్కువగా వుంటుంది. C, D దేశాలకు ఆ అవకాశాలు లేకపోయి వుండాలి.

**10. 1861 లో, అమెరికన్ అంతర్యుద్ధ కాలంలో, ప్రపంచ మార్కెట్‌కి అమెరికా నించి పత్తి ఎగుమతులు తగ్గిపోయాయి. ఇండియా నించి పత్తి ఎగు మతులు పెరిగాయి. ఇండియన్ పత్తి కంపెనీలకు లాభాలు పెరిగాయి. షేర్ల ధరలు పెరిగాయి. 10 ధర గల షేరు 60 దాకా కూడా (6 రెట్లు) పెరిగింది. బ్రోకర్లు, బ్యాంకుల నించి క్లయింట్లకి అప్పులు ఇప్పించి షేర్ల వ్యాపారం చేశారు. అమెరికాలో అంతర్యుద్ధం ముగియగానే ఇండియా నుంచి ఎగుమతులు తగ్గి, షేర్ల ధరలు కూడా తగ్గాయి. బ్రోకర్లు అప్పటికే చాలా షేర్లని బ్యాంకులకు అమ్మివేసి బయట పడ్డారు. బ్యాంకులు దివాళా తీశాయి. - ఇలాంటి సమాచారాలు కొన్ని సేకరించండి.**

**జ:** ప్రయత్నిస్తాము. ★

# అనుబంధం-1
# 1929 సంక్షోభం!

ఇప్పటి వరకూ గడిచిన పెట్టుబడిదారీ చరిత్రలో '1929 సంక్షోభాన్ని', 'పెట్టుబడిదారీ దేశాల్ని గడ గడలాడించిన సంక్షోభంగా' పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా వర్ణిస్తారు. అంతకు పూర్వపు సంక్షోభా లన్నీ కొన్ని నెలల్లోనే తగ్గిపోతూ వుండేవి. ఈ సంక్షోభం మాత్రం, 29 నించీ 34 వరకూ, 5, 6 సంవత్సరాల పాటు సాగింది.

'మొదటి ప్రపంచ యుద్ధం' తర్వాత, పెట్టుబడి దారీ దేశాలన్నిటి లోనూ, 'రేషనలైజేషన్' పద్ధతిలో, ఉత్పత్తి క్రమాలు సాగించారు.

1929 కి పూర్వం ప్రపంచ దేశాల మధ్య ఎగు మతుల శాతం పెరిగి, అంతా 'సంతోషం'గా కన పడింది. కానీ, 1929 లో అమెరికా, ఆస్ట్రియా, జర్మనీ దేశాల్లో 'అమితోత్పత్తి' సూచనలు ప్రారంభ మయ్యాయి. అమెరికాలో - కార్లు, టైర్లు, ఇళ్ళు - వగైరా శాఖల్లో ఉత్పత్తి క్రమాలు మందగించడం మొదలైంది. క్రమంగా అది అనేక పారిశ్రామిక శాఖ లకూ, వ్యవసాయ శాఖలకూ కూడా వ్యాపించింది.

అమెరికా, జర్మనీ, ఫ్రాన్సూ, ఇంగ్లండూ, ఆస్ట్రియా, ఇటలీ - వంటి పెట్టుబడిదారీ దేశాలన్నీ దిగుమతుల్ని తగ్గించుకోవడం ప్రారంభించాయి. ఈ దేశాల నించి దిగుమతుల్ని ఇతర దేశాలు కూడా తగ్గించడం ప్రారంభించాయి. కొన్ని నెలల కాలం లోనే 'ప్రపంచ వర్తకం' గతంలో ఎన్నడూ లేనంతగా స్తంభించి పోయింది.

పరిశ్రమల్లో సంక్షోభం, బ్యాంకుల సంక్షోభానికి కూడా దారి తీసింది. మొదట ఆస్ట్రియా దేశంలో, 'క్రెడిట్ అన్‌స్టాల్ట్' బ్యాంకు అప్పుల్ని రాబట్టలేక దివాళా తీసింది. బ్యాంకు నించి డిపాజిట్లు తరలిపోవడం సాగింది.

1931 జూన్‌లో జర్మనీలో, డార్మ్‌స్టాట్ నేషనల్ బ్యాంకూ, డ్రెస్డెన్ బ్యాంకూ దివాళా తీశాయి. జర్మనీ బ్యాంకుల నించి కూడా విదేశీ పెట్టుబడులు (డిపా జిట్లు) తరలి పోవడం ప్రారంభమైంది. ఈ తరలింపుల మీద, జర్మనీ ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధిం చింది. దాని వల్ల ఇంగ్లీషు డిపాజిటర్లు, జర్మనీ బ్యాంకుల నించి తమ డిపాజిట్లని వెనక్కి తీసుకోలేక పోయారు. ఇంకో వేపు - ఇంగ్లీషు బ్యాంకుల నించి విదేశీ డిపాజిట్లు తరలిపోవడం ప్రారంభమైంది. ఫ్రాన్సూ, అమెరికాల బ్యాంకులు, ఇంగ్లండుకి అప్పుల రూపంలో ధన సహాయం చేసినప్పటికీ, ఇంగ్లండు బ్యాంకులు పోగొట్టుకున్న డిపాజిట్ల మొత్తమే అధి కమై, ఇంగ్లండు బ్యాంకులు డబ్బు సంక్షోభంలో పడ్డాయి. 1931 సెప్టెంబరు 21 న, ఇంగ్లండు, స్వర్ణ ప్రమాణాన్ని వదిలివేసి, నోట్ల పరిమాణాన్ని పెంచింది. దాని వల్ల, ఇంగ్లండు పౌండు విలువ గతంలో కన్నా తగ్గింది. (ఇంగ్లండు, తన 'డబ్బు విలువ'ని తగ్గిం చింది.) 'డబ్బు సంక్షోభం' నించి బయటపడడానికీ, ఎగుమతుల్ని పెంచుకోవడానికీ, ఈ చర్య ఉపయోగ పడుతుందని ఇంగ్లండు ఆశించింది.

ఫ్రాన్స్ డబ్బు విలువ కూడా ఎంతో కాలం నిల బడదని గ్రహించిన విదేశీ డిపాజిటర్లు, తమ డిపా జిట్లని ఫ్రాన్సు బ్యాంకుల నించి అమెరికా బ్యాంకు లకు తరలించడం ప్రారంభించారు.

కానీ 1934 జనవరిలో, అమెరికాలో, డాలరు విలువని కూడా 41% తగ్గించారు. పౌండూ, డాలరూ - అనే కరెన్సీలు ఎన్నటికీ విలువ తగ్గని కరెన్సీలని అప్పటి వరకూ వ్యాపార ప్రపంచంలో వుండిన విశ్వా సాలు చెల్లాచెదురయ్యాయి.

జర్మనీ కూడా తన డబ్బు విలువని 66% తగ్గిం చింది. ఈ రకంగా, అన్ని దేశాలూ పోటీలు పడి 'డబ్బు విలువ'ని తగ్గించి, ఎగుమతులు చేసే అవకాశాల కోసం 'కరెన్సీ యుద్ధాలు' చేశాయి. ఈ రకంగా, అన్ని దేశాల కంపెనీలకూ, బ్యాంకులకూ సంక్షోభం చుట్టు కుంది. (ఆ నాడు ఒక్క 'సోవియట్ రష్యా'లో తప్ప!). అనేక వేల కంపెనీలూ, అనేక వేల బ్యాంకుల శాఖలూ, మూతపడ్డాయి.

అమెరికాలో 1932 నాటికి ఉక్కు పరిశ్రమలో

13% మాత్రమేనూ, మోటారు పరిశ్రమలో 11% మాత్రమేనూ, పని చేశాయి.

జర్మనీలో మొత్తం పరిశ్రమల్లో 33% మాత్రమే పని చేశాయి. అలాగే, ఇతర పెట్టుబడిదారీ దేశాల్లో కూడా.

ఈ సంక్షోభ కాలంలో పెట్టుబడిదారీ దేశాల్లో లక్షల ఎకరాల్లో గోధుమా, పత్తీ, మొక్కజొన్నా వగైరా పంటల్ని పొలాల లోనే కాల్చి వేశారు. పాలని సముద్రాల పాలు చేశారు. జర్మనీలో, ధాన్యానికి మందు పూసి మనుషులు తినడానికి వీలు లేకుండా చేశారు. అనేక లక్షల పందుల్ని చంపివేశారు.

ఈ సంక్షోభ కాలంలో, పెట్టుబడిదారీ దేశాలన్నిటి లోనూ, చిన్న స్థాయి, మధ్య స్థాయి కంపెనీలే గాక, అప్పటి వరకూ బ్రహ్మాండమైన పారిశ్రామిక కంపెనీలుగా వున్నవి కూడా నాశనమయ్యాయి.

1932లో, స్వీడన్‌లో, క్రూగర్ అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ, అనేక బ్యాంకులకు అప్పులు పడి, దివాళా తీసింది. క్రూగర్ ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ ఆత్మ హత్య తర్వాత, ఈ పెట్టుబడిదారుడు బ్యాంకు అప్పుల కోసం చేసిన ఫోర్జరీలూ మోసాలూ పెద్ద ఎత్తున బయటపడ్డాయి.

అమెరికాలో, 60 పట్టణాల్లో ఎలక్ట్రిసిటీ, గ్యాసూ, నీరూ - సరఫరాలను కంట్రోలు చేస్తూ ఆ నాడు 50 కోట్ల డాలర్ల పెట్టుబడితో పని చేస్తోన్న ఇన్సిల్ కంపెనీ, 1932లో దివాళా తీసింది.

అమెరికాలో ఫోర్డు కంపెనీల్లో 1929 కన్నా ముందు, 1 లక్షా 20 వేల మంది కార్మికులు పని చేసేవారు. 1932 నాటికి, ఆ కంపెనీల్లో 15 వేల మంది మాత్రమే పనుల్లో మిగిలారు. మిగిలిన లక్షకు పైగా కార్మికులు నిరుద్యోగులయ్యారు. - ఈ రకంగా, ప్రపంచ వ్యాప్తంగా అనేక భారీ కంపెనీలు కూడా నష్టాల పాలయ్యాయి.

అనేక గుత్త కంపెనీలు, తమ 'సభ్యులైన' కంపెనీలకు అమ్మకాల కోటాల గురించి గతంలో విధించిన నిబంధనల్ని సడలించి, ఎవరికి దొరికిన మార్కెట్లలో వాళ్ళు అమ్ముకోవడానికి అంగీకరించడం, తప్పని సరైంది.

అమెరికాలో, చిన్న స్థాయి రైతులు బ్యాంకులకు అప్పులు చెల్లించ లేకపోయారు. బ్యాంకులు, రైతుల భూముల్ని వేలం వెయ్యడానికి సిద్ధ పడ్డప్పుడు, ఎవరినీ ఆ భూములు కొననివ్వకుండా రైతులు చెయ్యగలిగారు. బ్యాంకులు, గడువులు ఇచ్చి వెళ్ళిపోయిన సంఘటనలు అనేకం జరిగాయి.

ప్రతీ పెట్టుబడిదారీ దేశమూ, ఉత్పత్తి స్థాయిని తగ్గించి వేసింది. ఉత్పత్తి సామర్థ్యం అంతా మూల బడింది. అమెరికాలో పత్తి సాగు పూర్తిగా ఆపివేశారు. బ్రిటన్‌లో ఈ సంక్షోభ కాలంలో, ఉక్కు ఉత్పత్తి 25 సంవత్సరాల నాటి స్థాయికీ, బొగ్గు ఉత్పత్తి 35 సంవత్సరాల నాటి స్థాయికీ, ఇనుము ఉత్పత్తి 70 సంవత్సరాల నాటి స్థాయికీ తగ్గాయి. అనేక ఫ్యాక్టరీల్లో తలుపులు తెరిచేదే లేదు. యంత్రాలూ, క్రేన్లూ, స్టోర్లూ, ఇనుము కరిగించే కొలుములూ దుమ్ము కొట్టుకు పోయి వుండేవి. పొలాలు మైళ్ళ కొద్దీ బీళ్ళుగా పడి వుండేవి. ఈ విషాదాన్ని పెట్టుబడిదారీ పత్రికలు కూడా వర్ణించకుండా వుండలేకపోయాయి.

ఈ సంక్షోభ కాలంలో 'వాటాల' (షేర్ల) ధరల పతనం, ఊహాతీతమైన స్థాయిలో సాగింది. కొన్ని కంపెనీల వాటాల్ని 1% ధరకి అమ్మడం కూడా అసాధ్యమయింది. అందరూ, 'అమ్మే' వాళ్ళే గానీ, 'కొనే' వాళ్ళు లేరు. "మా షేర్లని సాయంత్రాని కల్లా అమ్మెయ్యండి! అమ్మెయ్యం డమ్మెయ్యం డమ్మెయ్యండ"ని బ్రోకర్ల మీద ఒకటే ఒత్తిడి! ఒకటే కేకలు! ఒకటే ఫోన్లు! ఏడుపులు! మొత్తుకోళ్ళు! స్పృహలు తప్పడాలు!

బ్రోకర్ల అంచనా ప్రకారం, న్యూయార్కు స్టాక్ ఎక్స్ఛేంజి చరిత్రకి 1929 అక్టోబరు 29 మంగళవారం, "అత్యంత ఘోరమైన దినం". ఆ రోజు ఎన్నడూ లేనన్ని ఎక్కువ షేర్లని, అతి చవక ధరలతో అమ్మేశారు (అమ్మేశారంటే, ఇతరులు కొనేశారని అర్థమే కదా? అమ్మిన వాళ్ళు నష్టపోతే, కొన్న వాళ్ళు లాభ పడతారు. ఇందులో 'అత్యంత ఘోరం' ఏమీ లేదు.) బ్యాంకర్లు కూడా తమ షేర్లని అమ్మేసుకుంటున్నారనే వార్త ప్రచారమై పోయింది. అప్పటి దాకా తటపటాయిస్తూ వున్న వాళ్ళు కూడా షేర్లని వదిలించుకోవడం ప్రారంభించారు. అప్పటి దాకా 100 వున్న షేరు ధర, 2, 3 రోజుల్లో 3గా తగ్గిపోయింది. ఆ షేర్లని అమ్ముకునే వాళ్ళు 3 అయినా వచ్చినందుకు తెగ సంతోషించారు.

అమెరికాలో, ఆ నాటికి బ్యాంకులకు బ్రోకర్లు

చెల్లించవలసివున్న అప్పులు, 6 బిలియన్ల డాలర్లు (600 కోట్ల డాలర్లు). బ్యాంకులకు ఆ అప్పులు తిరిగి వచ్చే పరిస్థితి లేదు. బ్రోకర్లు అనేక అంతస్థులు గల స్టాక్ ఎక్స్చేంజి బిల్డింగ్ కిటికీలలో నించి దూకి ఆత్మ హత్యలు చేసుకుంటున్నారనీ, కొందరు బ్రోకర్లయితే, ఆత్మహత్యల కోసం కిటికీలో పిట్ట గోడలో ఎక్కే ఓపికలు కూడా లేక నిస్సత్తువలతో పడి వున్నారనీ, అనేక వార్తలు కథలు కథలుగా ప్రచారమవుతూ వుండేవి.

ఆ సంక్షోభ కాలంలో అసలైన విషాదం - వివిధ దేశాల కార్మికుల విషయం. అమెరికాలో, ఆ కాలంలో, కార్మిక జనాభాలో దాదాపు సగం సంఖ్య నిరుద్యోగులయ్యారు. ప్రపంచం మొత్తం మీద, నిరుద్యోగ జనాభా, ఆ కాలంలో 4, 5 రెట్లు పెరిగిందని అంచనా. ఇవన్నీ ఎంప్లాయ్‌మెంటు ఆఫీసుల లెక్కలు మాత్రమే. కాబట్టి నిరుద్యోగుల నిజం సంఖ్య ఇంకా ఎక్కువ గానే వుండి వుంటుంది.

అప్పటికి 15 సంవత్సరాల నించీ కార్మికుల జీతాలు, ధరల పెరుగుదల స్థాయికి తగినట్టుగా పెరగటం లేదు. ఆ రకంగా, అప్పటికే అతి తక్కువ స్థాయిలో వున్న జీతాల్ని కూడా సంక్షోభ కాలంలో విపరీతంగా తగ్గించి వేశారు.

1932 నాటికి అమెరికాలో జీతాలు 33% మాత్రమే చెల్లించారు. 67% జీతం తగ్గించి వేశారు. అమెరికాలో ఆ నాడు 'నిరుద్యోగ భృతి' లేదు. జర్మనీలోనూ, ఇంగ్లండు లోనూ ఆ విధానం వుంది. కానీ, ఆ దేశాల్లో కూడా ఆ డబ్బు, నిరుద్యోగులందరికీ అందేది కాదు. అందినా అది చాలా తక్కువగా వుండేది.

కార్మికుల్ని పనుల్లో నించి తీసివేసే ముందు కొన్నాళ్ళు జీతాలు తగ్గించే వారు. ఆ తగ్గించిన జీతం కవరులో పెట్టి ఇస్తూ, దానితో పాటే "నిన్ను పనిలో నించి తీసేశాం" అనే నోటీసు కూడా అందులో పెట్టే వారు. చివరికి ఫ్యాక్టరీ మూసివేసే వారు.

కార్మికుల కుటుంబాల్లో పూట పూటకీ పెద్ద పెద్ద మార్పులు జరిగిపోతూ వుండేవి. మొదట్లో స్నానాలూ ఉతుకులూ సుభ్రాలూ తగ్గించేస్తారు. ఆదివారాల ప్రయాణాలు మానుకుంటారు. వరసగా ఇంట్లో సామాన్లన్నీ హెచ్చు వడ్డీలకు తాకట్టులూ, కార్లు చవకగా అమ్మెయ్యడాలూ సాగిస్తారు. ఇక తర్వాత, 'పని' కోసం ఊళ్ళ వెంట పడతారు. పని కోసం వెతుక్కుంటూ టిక్కెట్లు కొనకుండా రైళ్ళల్లో ప్రయాణాలు చేసేవారు. 'చెకింగ్' ఎదురైనప్పుడు రైళ్ళల్లో నించి దూకి ప్రమాదాల పాలయ్యే వారు. టిక్కెట్లు లేని జనాల్ని 30 లక్షల మందిని రైళ్ళల్లో నించి దింపివేసినట్టు 1932లో ఒక రైల్వే రిపోర్టు! ఎక్కడైనా పని దొరికితే, అసహ్యం వేసేంత తక్కువ జీతాలు! ఉద్యోగాలిప్పిస్తామని ఆశ పెట్టే బోగస్ కంపెనీలు తయారయ్యాయి. కార్మికుల దగ్గిర వున్నది లాక్కుని, వారానికో పది రోజులకో పని ఇప్పించే వారు. ఆ పనుల కోసం కూడా కార్మికులు 'క్యూలు' కట్టేవారు.

కార్మికుల పిల్లల స్కూళ్ళు మూసేశారు. అనేక కార్మికుల కుటుంబాల్లో, పిల్లల్ని అనాథ శరణాలయాల్లో చేర్చేసి, తల్లి దండ్రులు పనుల కోసం ఊళ్ళ వెంట తిరిగే వారు.

మునిసిపల్ చెత్త కుండీల దగ్గిర చేరి, ఆహారం వెతుక్కునే గుంపులు అధికమయ్యాయి. ఆకలి జబ్బులూ, ప్రమాదాలూ, దొంగతనాలూ, బ్రెడ్ లారీల మీద పడి లాక్కోవడాలూ, దుకాణాల్ని బద్దలు కొట్టడాలూ, పిచ్చెత్తడాలూ, హత్యలూ, ఆత్మహత్యలూ - వంటి సమస్త రుగ్మతలూ, నేరాలూ, పెరిగిపోయాయి.

ఇదంతా ఏమిటో, ఎందుకు జరుగుతోందో కార్మికులకు తెలిసేది కాదు.

గవర్నమెంటు అధికార్లు కూడా, నిరుద్యోగులు ఎంత సంఖ్య వున్నారో, ఎలా బతుకుతున్నారో, తెలుసుకో లేకపోయారు.

1932, మార్చి 7 న డెట్రాయిట్‌లో "పని కావాలి! పని కావాలి!" అనే నినాదాలతో కార్మికులు ఊరేగింపులు తీశారు. పోలీసులు టియర్ గ్యాసు వదిలారు. కార్మికులు రాళ్ళు రువ్వారు. పోలీసులు టన్నుల కొద్దీ 'ఐస్ వాటర్' జిమ్మారు. కాల్పులు జరిపారు, ఫోర్డు కంపెనీ ఎదట. కార్మికులు, శవ పేటికల మీద, "బ్రెడ్డు అడిగితే ఫోర్డు బుల్లెట్లు ఇచ్చాడు!" అని రాశారు.

అప్పటి (1932) అమెరికన్ ప్రెసిడెంటు హూవర్ (రిపబ్లికన్), అమెరికన్ కాంగ్రెస్‌కి (అందులో డెమాక్రాట్లు మెజారిటీగా వున్నారు) ఒక రహస్య పత్రం పంపుతూ, "సైనికుల జీతాల్లో కోత వుండరాదు. అలా జరిగితే వాళ్ళు 'విప్లవం'లో చేరిపోతారు. విప్లవాన్ని

అణచడానికి వాళ్ళు చాలా అవసరం" అని రాశాడు.

నిజానికి అక్కడ కార్మికుల్లో "విప్లవం" ఛాయ లేమీ లేవు. కానీ 1917లో రష్యా విప్లవం తర్వాత దోపిడీ దార్లకి ప్రతీ క్షణమూ దాన్ని గురించే భయం!

అమెరికన్ పత్రికలు, కార్మికుల పరిస్తితుల్ని ఏ మాత్రమూ సానుభూతితో సమీక్షించేవి కావు. పత్రికల్ని కార్మికులు, "హూవర్ దుప్పట్లు" అనేవారు.

అమెరికాలో 1932 నాటికి, 1 కోటీ 50 లక్షల మంది నిరుద్యోగులు వున్నారని అంచనా. అందులో అధికంగా బాధలకు గురైన వాళ్ళు - వృద్ధులు. వాళ్ళకి బ్యాంకుల్లో కాస్తో కూస్తో వుండే డిపాజిట్లన్నీ పోయాయి. ఇన్సూరెన్స్ పాలసీలు కూడా పోయాయి. అద్దెలు చెల్లించలేకపోవడం వల్ల ఇళ్ళు పోయాయి! నిలవ నీడ లేక, తిండి లేక, మందులు లేక, రక్షణ లేక, పిల్లల మరణాలూ, వృద్ధుల మరణాలూ, అధిక మయ్యాయి.

'ఉత్పత్తి శక్తులు' పెరుగుతోన్న కొద్దీ, పెట్టుబడి దారీ వర్గం కోసం ఉత్పాదక, అనుత్పాదక శ్రమలు చెయ్యడానికి ఎక్కువ కార్మిక జనాభాతో అవసరం వుండదు. కాబట్టి, ఎంత కార్మిక జనాభా నాశనమై పోతూన్నా పెట్టుబడిదారీ వర్గానికి పట్టదు.

ఇక 'సంఘ సేవల వాళ్ళు' బయల్దేరారు - 'పిల్లల సంక్షేమం, వృద్ధుల సంక్షేమం, ఆ సంక్షేమం, ఈ సంక్షేమం' అంటూ.

'సంక్షోభం' మీద నిరసనగా రక రకాల సిద్ధాం తాలు బైల్దేరాయి. గుత్త కంపెనీలు వుండరాదనీ, చిన్న కంపెనీలనే అనుమతించాలనీ కొందరూ; 'జీతాలు' పెంచాలని కొందరూ; కార్మికులకు ఇళ్ళు ఇవ్వాలనీ, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలనీ కొందరూ - ఇలా, సంఘ సేవల వాళ్ళు చాలా రకాల సూచనలు చేశారు - ప్రభుత్వానికి!

సింక్లేర్ అనే రచయిత - "మూసి వేసిన ఫ్యాక్ట రీల్నీ, పండించటం ఆపివేసిన భూముల్నీ, కార్మికులకు వదిలెయ్యండి! వాళ్ళందరూ కలిసి 'కో ఆపరే టివ్‌లు'గా వాటిని నడుపుకుంటారు" అన్నాడు.

ఆ సంఘ సేవకులంతా పెట్టుబడిదారీ ప్రభుత్వా లకు 'విన్నపాలు' చేశారే గానీ, కార్మికుల్ని 'తిరగ బాటుకి సిద్ధంచేసే సంఘ సేవ'కి మాత్రం ఎవ్వరూ పూనుకోలేదు.

1933 నాటికి అమెరికాలో ట్రేడ్ యూనియన్లలో వున్న కార్మికుల సంఖ్య చాలా తక్కువ. 6% మాత్రమే. అయినప్పటికీ కొన్ని సమ్మెలు జరిగాయి. యూని యన్లలో ఆర్గనైజ్ అయ్యే హక్కు కోసం కార్మికులు డిమాండ్ చేశారు.

1933 నాటికి అమెరికన్ బ్యాంకులు విపరీత మైన వైఫల్యంలో వున్నాయి. అప్పులు రాబట్టలేక, డిపాజిట్లని చెల్లించలేని పరిస్తితుల్లో వున్నాయి. 12 రాష్ట్రాల్లో బ్యాంకులు, 'డిపాజిట్లని చెల్లించం' అని 'మారటోరియం' ప్రకటించాయి.

డిపాజిటర్లలో, బ్యాంకుల మీద ఆగ్రహం పొంగింది. బ్యాంకుల్ని ప్రభుత్వాధీనం లోకి తేవాలని కొందరూ, బ్యాంకుల పనులన్నీ పోస్టాఫీసులకు ఇచ్చె య్యాలని కొందరూ, కరెన్సీని రద్దుచేసి వేరే సిస్టమ్ పెట్టాలని కొందరూ, రక రకాల మార్గాలు సూచిం చారు.

అలాంటి పరిస్తితుల్లో (1933లో) కొత్త ప్రెసి డెంటుగా రూజ్వెల్టు (డెమాక్రాట్) వచ్చాడు. వచ్చీ రాగానే బ్యాంకుల సమస్యని తక్షణ సమస్యగా చేపట్టాడు. 5 రోజులు బ్యాంకుల్ని మూసివేశారు. రాజ కీయ వేత్తలూ, ఆర్థిక వేత్తలూ, రాత్రింబవళ్ళూ సమా వేశాలు చేసి చర్చించారు. ఆ సమావేశాల గురించి ఒక మంత్రి, తర్వాత కాలంలో వివరిస్తూ, "అప్పుడు మేము రిపబ్లికన్లమో, డెమాక్రాట్లమో, ఆ తేడాలే మరిచిపోయాం" అన్నాడు. రిపబ్లికన్లయినా, డెమా క్రాట్లయినా అందరి ప్రయోజనమూ 'లాభమే'. లాభా నికి ఆపద ముంచుకొచ్చిన ఆ కాలంలో, పెట్టుబడి దారులందరూ పార్టీల తేడాలు మరిచిపోయి, ఐక్య మయ్యా రన్నమాట!

వారు చేసిన నిర్ణయాలు ఇవీ: ప్రైవేటు బ్యాంకు లకు ప్రభుత్వం సహాయపడాలి. బంగారం ఎగుమతి మీద ప్రెసిడెంటు పూర్తి కంట్రోలుతో వుండాలి. బంగారం నిల్వదారుల్ని శిక్షించాలి. ఫెడరల్ - రిజర్వ్ బ్యాంకుల ద్వారా కొత్త కరెన్సీని ప్రింటు చేసే అధి కారం ఇవ్వాలి. విఫలం చెందిన బ్యాంకులకు గవర్న మెంటే రిసీవర్‌గా వుండాలి. 'ఖజానా'లో వున్న డబ్బు తోనే బ్యాంకుల్ని పని చేయించే విధానం చూడాలి. 'డిపాజిట్ ఇన్సూరెన్స్' పథకం ప్రవేశ పెట్టాలి. స్టాక్

ఎక్ఛేంజిలో 'నీతి లేని పనుల్ని' అరికట్టాలి! - వగైరా వగైరా 'పవిత్ర' నిర్ణయాలు చేశారు. ప్రెసిడెంటు, రోజూ రేడియోలో మాట్లాడే వాడు. "భయం లేదు. అంతా చక్కబెడతాం" అని పెట్టుబడిదారీ వర్గానికి హామీలు ఇచ్చేవాడు. 5 రోజుల తర్వాత, "ఇంక ఫర్వా లేదు. అంతా చక్కబెట్టేశాం. మీ డబ్బు బ్యాంకుల్లో దాచు కోండి" అని ప్రకటించాడు.

మొదట పెట్టుబడిదార్లకి బాగానే నమ్మకం కలి గింది. బ్యాంకులు తెరవ గానే కొత్త డిపాజిట్లు రావడం ఎక్కువైంది.

కంపెనీలు 'ఎంత మాత్రమే' ఉత్పత్తి చెయ్యాలో నిర్ణయించే "పరిశ్రమల రికవరీ చట్టం" చేశారు. వ్యవ సాయ రంగంలో కూడా సప్లైని తగ్గించి, ధరలు పెంచడానికి నిర్ణయించారు.

ప్రభుత్వం ద్వారా కార్మికులకు పనులు కల్పిం చడం కోసం, 'డబ్బు' అచ్చు వేసి, ఆ డబ్బుతో సరు కుల్ని కొని, డామ్‌లూ, రహదారుల మరమ్మత్తులూ - వంటి కార్యక్రమాలూ, సంక్షేమ పథకాలూ, చేపట్టారు. కార్మికులకు కొంచెం పనులు దొరికినట్టు కనపడింది - అప్పటికీ అనేక లక్షల మంది నిరుద్యోగులు వున్నప్పటికీ. లేబర్ కేంపులూ, సూప్ సెంటర్లూ (గంజి కేంద్రాలు) తెరిచారు. లేబర్ కేంపుల్లో, కొన్ని పనులు చేయించి తిండి పెడతారు. జీతం వుండదు. సూప్ సెంటర్స్‌లో ఉచితంగా బ్రెడ్ 'పడేస్తారు'. క్యూల్లో నిలబడ్డ వాళ్ళల్లో నాలుగో వంతు మందికి కూడా అది సరిపోయేది కాదు. - మొత్తం మీద ఈ పనులన్నీ కలిసి, 'రూజ్వెల్ట్ నూతన పథకం' (న్యూ డీల్ ఆఫ్ రూజ్వెల్ట్) అయింది. ఆ నాటి అయోమయ పరి స్థితుల్లో అది 'ప్రథమ చికిత్స'గా పని చేసింది. ఆ కాలంలో ఆ నూతన పథకాన్ని, 'క్రీస్తు పథకం' (న్యూ డీల్ ఈజ్ క్రైస్ట్ డీల్) అన్నారు.

రూజ్వెల్ట్ సంస్కరణలు, పెద్ద పెట్టుబడి దారు లకు నచ్చలేదు. వాళ్ళకి రూజ్వెల్ట్ 'కార్మిక పక్షం మనిషి' లాగా కనపడ్డాడు. వాళ్ళు, రూజ్వెల్ట్ గురించి, చాలా అయిష్టంగా అతని పేరు కూడా ప్రస్తావించకుండా, 'అతను', 'ఆ మనిషి' అనేవారు. మళ్ళీ ఎన్నికలు సమీ పిస్తోండగా, షాపుల్లో, "మా దగ్గర ఏదో ఒకటి కొనండి. లేకపోతే 'ఆ మనిషి'కి ఓటేస్తా!" అని రాసి పెట్టేవారు.

మళ్ళీ ఎన్నికల్లో కూడా రూజ్వెల్టే వచ్చాడు. "సంక్షోభానికి వ్యతిరేకంగా అతను ఏదో చేస్తాడు" అని కార్మికులకు ఒక ఆశ వుండేది.

కోలుకుంటున్నట్టు కనపడ్డ పరిస్థితి, 1937లో మళ్ళీ విషమించింది. ఉత్పత్తి అన్ని శాఖల్లోనూ 1930లో కన్నా కూడా తగ్గింది. 'క్రీస్తు పథకం' అను కున్నది కూడా పని చెయ్యకుండా పోయింది. 1938 జనవరిలో, 2 లక్షల మంది కార్మికులకు ఉద్యోగాలు పోయి, కొత్తగా నిరుద్యోగులయ్యారు. ఈ పరిస్తితిని 'రూజ్వెల్ట్ రెసిషన్' (రూజ్వెల్ట్ మాంద్యం) అన్నారు.

1938 ఫిబ్రవరిలో, అమెరికన్ కాంగ్రెస్, ఒక వ్యవసాయ బిల్లు ప్రవేశ పెట్టింది. అందులో ఒక వింతైన అంశం ఏమిటంటే - తక్కువ ఎకరాల్ని మాత్రమే సాగుచేసి, తక్కువ పంట పండించే వాళ్ళకి ప్రభుత్వం 'సబ్సిడీలు' (ఉచితంగా డబ్బు) ఇస్తుంది! అంటే, తక్కువ ఎకరాలనే సాగు చెయ్యాలని నిబంధన పెట్టారు.

అయితే పెట్టుబడిదారీ రైతులేనా అంత తెలివి తక్కువ వాళ్ళు? వాళ్ళు తక్కువ ఎకరాల్లోనే ఎక్కువ పంటలు రాబట్టే విధానం అవలంబించే వారు. కానీ, తక్కువ ఎకరాల్లోనే సాగు చేస్తున్నందుకు సబ్సిడీలు కూడా అందుకునే వారు.

"కార్మికులు కష్టించి పని చెయ్యాలి. ఉత్పత్తిని పెంచాలి. ఉత్పత్తి పెరిగితేనే దేశాభివృద్ధి" అని కార్మికు లకు అబద్ధాలు బోధిస్తూ, వారిని పీడిస్తూ పని చేయించే పెట్టుబడిదారీ వర్గం, తీరా నిజంగా ఎక్కువ ఉత్పత్తి పెరిగితే ఏం చేస్తుంది? అమ్మలేకపోతే ఉత్పత్తిని నాశనం చేస్తుంది! 'లాభం రేటు'ని పడిపో నివ్వకుండా చెయ్యడం కోసం ఉత్పత్తిని నాశనం చెయ్యడమే, ఉత్పత్తిని తగ్గించి వెయ్యడమే, అప్పుడు దేశ సేవా, దేశ భక్తీ అవుతాయి! అలాంటి దేశ భక్తులకు సబ్సిడీలూ, బహుమతులూ అందుతాయి!

1939లో కూడా అమెరికాలో 80 లక్షల నిరు ద్యోగులున్నారని అంచనా.

అన్ని దేశాల్లోనూ ఇదే కథ! సంఘటనలూ, సంఖ్యలూ తేడా, అంతే! (పెట్టుబడిదారీ దేశాల్లో ఈ నాటికీ కోట్ల సంఖ్యలో నిరుద్యోగులున్నారు.)

జర్మనీలో హిట్లర్ నియంతృత్వం ప్రారంభ మైంది, ఈ సంక్షోభ కాలం లోనే, (1933లో).

సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి అమెరికా పెట్టుబడిదారీ వర్గం, ఒక మార్గం అనుసరిస్తే, జర్మనీ పెట్టుబడిదారీ వర్గం ఇంకో మార్గం అనుసరించిందన్నమాట. అన్ని మార్గాల సారాంశమూ ఒకటే. మార్కెట్ల కోసం పోటీ! 'లాభం' కోసం పోటీ!

ఒక సంక్షోభాన్ని వివరించడానికి చెప్పిన ఈ వివరాలన్నీ చాలా క్లుప్తంగా చెప్పినవి. చాలా అసమగ్రంగా చెప్పినవి. వాస్తవాలు ఇంకా వివరంగా దొరికితే, అవి ఇంకా అమానుషంగా వుంటాయి. ప్రతీ సంక్షోభ కాలం లోనూ సంఘటనలన్నీ ఒకే రకంగా జరుగుతాయి - ఎక్కువ స్థాయి లోనో, తక్కువ స్థాయి లోనో!

ప్రతీ సంక్షోభ కాలం లోనూ, సరుకుల గుట్టలు పెరగడమూ, ఉత్పత్తి స్థాయి తగ్గడమూ, దేశాల మధ్య వర్తకంలో నిబంధనలు పెరగడమూ, బడ్జెట్ లోట్లూ, నోట్ల ముమ్మరమూ, విదేశీ మారకం లోట్లూ, కరెన్సీ విలువల్ని తగ్గించుకోవడమూ (డీవాల్యుయేషన్), విదేశీ అప్పుల్ని నిలుపు చెయ్యడమూ (మారటోరియమ్), సరుకుల ధరల తగ్గుదలా, షేర్ల ధరల తగ్గుదలా, బ్యాంకుల దివాళాలూ, చిన్న స్థాయి కంపెనీల పతనమూ, గుత్త పెట్టుబడుల కేంద్రీకరణ పెరగడమూ, కార్మిక వర్గానికి బాధలు పెరగడమూ, పెట్టుబడిదారీ వర్గానికి విలాసాలు పెరగడమూ - వగైరా సంఘటనలన్నీ తప్పనిసరిగా వరస క్రమంలో జరుగుతాయి.

ప్రతీ సంక్షోభమూ - పెట్టుబడి కేంద్రీకరణా, పెట్టుబడిపై గుత్తాధిపత్యమూ - ఈ రెండూ మరింత పెరగడానికి దారితీస్తుంది.

సంక్షోభానికి కారణాలేమిటో గ్రహించడం ఇప్పుడు తేలికే. సంక్షోభానికి మూలం పెట్టుబడిదారీ విధానం లోనే వుంది. ఈ విధానంలో ఉత్పత్తి జరిగేది, నిజ అవసరాల్ని బట్టీ కాదు; మార్కెట్ అవసరాల్ని బట్టీ కాదు. 'లాభం కోసం పోటీ'ని బట్టి మాత్రమే. ఈ 'మూలాన్ని' అర్థం చేసుకోకపోతే, సంక్షోభాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

దీన్నంతటినీ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు "వ్యాపార చక్రాలు" (బిజినెస్ సర్కిల్స్) పేరుతో వ్యవహరిస్తారు. "వ్యాపారం అన్న తర్వాత లాభమూ వుంటుంది; నష్టమూ వుంటుంది. ఎల్లకాలమూ ఒకే విధంగా సాగుతుందా?" అంటూ సంక్షోభాన్ని 'వేదాంత ధోరణిలో' వివరించడానికి ప్రయత్నిస్తూ, చివరికి దాన్ని 'వ్యాపారంలో ఒడిదుడుకులు'గా సరిపెట్టేస్తారు.

1929 సంక్షోభానికి పూర్వం, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు, 'అమితోత్పత్తి' అనే మాటని అసలు పట్టించుకోనే లేదు. అప్పటికే సంక్షోభాలు వస్తూ వున్నా, "సప్లై, డిమాండ్లు ఒక దాన్ని ఒకటి తప్పనిసరిగా బ్యాలెన్స్ చేసుకుంటూనే వుంటాయి. అమితోత్పత్తికి అవకాశమే వుండదు. అలాంటి పరిస్థితి ఎప్పుడన్నా ఏర్పడితే యాక్సిడెంటల్‌గా ఏర్పడుతుందే గానీ అది నిత్య సత్యం కాదు" అని భావించే వారు.

అలాగే, 1929 సంక్షోభానికి పూర్వం, 'నిరుద్యోగం' అనే సమస్య ఒకటి వున్నట్టుగా కూడా వాళ్ళు గమనించే వారు కాదు.

గుత్త కంపెనీలు పరస్పర ఒప్పందాలతో ఎంతగా పెనవేసుకు పోతోంటే అంతగా సంతోషిస్తూ ఆర్థిక వేత్తలు, "ఇక అంతా ప్లాన్డ్‌గా నడుస్తుంది. ఇక మీదట సంక్షోభ పరిస్థితులు అప్పుడప్పుడూ కూడా సంభవించవు. ప్రపంచం అంతా 'శాంతి'తో విరాజిల్లుతుంది" అంటూ (వీళ్ళకి నిజంగా 'శాంతి' కావలసి వున్నట్టు!) గుత్త కంపెనీల సామ్రాజ్యవాద చర్యల్ని కూడా 'శాంతి' పేరుతో సమర్థించడం సాగించే వారు.

కానీ ఈ రకం వాదనలన్నిటినీ 1929 సంక్షోభం ఎగరగొట్టింది.

# అనుబంధం - 2
# బ్రిటన్‌లో 31 గనుల మూత

[ ఇప్పుడు చూడబోయే ఈ వార్త, ఈ నాటి ఒక బ్రిటన్ బొగ్గు కంపెనీకి సంబంధించిన సంక్షోభాన్ని చూపుతుంది, ఈ సరికొత్త సమాచారంలో, మళ్ళీ పాత పరిస్థితే కనబడుతుంది. 'ఉత్పాదక శక్తి' పెరుగుదలా,

అమితోత్పత్తి ప్రమాదమూ, ఉత్పత్తిని అమ్మలేని పరిస్థితీ, ఉత్పత్తిని తగ్గించడం కోసం బొగ్గు గనుల్ని మూసివేసే ప్రయత్నమూ, ఈ కంపెనీకి సంబంధించి 30 వేల మంది కార్మికులకు నిరుద్యోగమూ - వగైరా అంశాలన్నీ ఇక్కడ కనపడుతున్నాయి. ఇది, ఒక శాఖలో, ఒక కంపెనీ పరిస్థితి. ఇలాగే, అనేక శాఖల్లో అనేక కంపెనీల పరిస్థితిని ఊహించవచ్చు. వార్త చూడండి!]

**లం**డన్, అక్టోబర్ 17 (1992): బ్రిటన్‌లోని బొగ్గు గని కార్మికులు దాదాపు ముప్పై వేల మంది ఒక్క కలం పోటుతో నిరుద్యోగులయ్యే పరిస్థితి దాపురించింది. దాదాపు 31 బొగ్గు గనులలో బొగ్గు తవ్వకాన్ని పూర్తిగా నిలిపి వేయాలని బ్రిటీష్ బొగ్గు కంపెనీ నిర్ణయం తీసుకోవడంతో బ్రిటీష్ గని కార్మికుల గుండెల్లో రాయిపడింది.

బ్రిటీష్ కోల్ కంపెనీలో పని చేసే కార్మికులలో 70 శాతం మందిని తీసి పారేయాలని కంపెనీ నిర్ణయించింది. కానీ దీన్ని ప్రతిఘటించటానికి గని కార్మికుల జాతీయ సంఘం నిర్ణయించింది. ఇది రాజకీయంగా చేపట్టిన పారిశ్రామిక కక్ష సాధింపు చర్యగా ఈ సంఘం పేర్కొంది. బ్రిటీష్ కోల్ కంపెనీ తీసుకున్న నిర్ణయం పాశవికమనీ, ఈ ఆధునిక యుగంలో ఏ దేశం లోనూ ఇంత దారుణంగా కార్మికులను తొలగించడం జరగలేదనీ, గని కార్మికుల నాయకుడు స్కార్ గిల్ తెలిపారు. 1985 లో బ్రిటన్‌లో బొగ్గు గని కార్మికులు సమ్మె జరిపినందుకు కక్ష సాధింపు చర్యగా ఇప్పుడు అధికారంలో వున్న బ్రిటన్ కన్సర్వేటివ్ ప్రభుత్వం గనులను మూసివేయిస్తున్నదని గని కార్మిక నాయకుడు విమర్శించారు.

1985 లో లక్షా 70 వేల మంది కార్మికులు, 170 గనులలో పని చేశారు. అప్పుడు సమ్మె జరిగింది. 1947లో బొగ్గు గని పరిశ్రమని జాతీయం చేసిన సమయంలో, గని కార్మికుల సంఖ్య 7 లక్షల 18 వేలు వుండేది.

ఈ కార్మికులందరూ ఎప్పుడూ లేబర్ పార్టీకే మద్దతునిచ్చే వారు. ఇప్పుడు 31 గనులలో పని నిలిపి వేసినందువల్ల బ్రిటన్ లోని 18 థర్మల్ విద్యుత్ కేంద్రాలు మూతపడతాయనీ, వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతారనీ, స్కార్‌గిల్ తెలిపారు. బొగ్గుకు బదులుగా గ్యాస్ తో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వ్యయం 30 శాతం అధికమౌతుంది. అణు విద్యుత్‌ను ఉపయోగిస్తే, 350 శాతం ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది. బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటే, 30 శాతం ఖర్చు పెరుగుతుంది. ఏ విధంగా చూసినా, గనులను మూసివేయడం సరైన పద్ధతి కాదు - అని స్కార్‌గిల్ చెప్పారు.

గనులను మూసివేయాలని నిర్ణయించడం ప్రభుత్వం చేస్తున్న పిచ్చి పనిగా కార్మిక నాయకుడు వర్ణిస్తున్నారు. గ్యాస్ ఆధారంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనుకుంటే బ్రిటన్‌లో వున్న గ్యాస్ నిక్షేపాలు 30 సంవత్సరాల వరకే రాగా, బొగ్గు నిక్షేపాలు 300 సంవత్సరాల వరకూ వుంటాయి. ఇలా వుండగా, గని కార్మికులు ఎవరైనా తమ కంపెనీపై పారిశ్రామిక చర్య తీసుకుంటే వారికి రావలసిన బకాయిలూ మొదలైనవి చెల్లించబోమనీ, అందువల్ల మర్యాదగా తప్పుకోవాలనీ, బ్రిటీష్ కోల్ కంపెనీ చైర్మన్ నీల్‌క్లార్క్ బెదిరించారు.

గనులను మూసివేయడం సరైన చర్యేననీ, 27 గనులను మూసివేయగా 4 గనులు పని చేస్తాయనీ, ఈ 4 గనులే మొత్తం గనులు చేసే ఉత్పత్తుల్లో సగానికి పైగా బొగ్గును ఉత్పత్తి చేస్తాయనీ, క్లార్క్ తెలిపారు. గత ఆరు సంవత్సరాల్లో గనులలో 'ఉత్పాదకత' పెరిగిందనీ, విద్యుత్ ఉత్పత్తికి కావలసిన బొగ్గు కోసం, మిగిలిన గనుల నుంచి వచ్చే బొగ్గుతో సరిపెట్టుకోగలమనీ, ఆయన అంటున్నారు. దీనిపై బ్రిటీష్ ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తూ మాట్లాడుతోంది. బ్రిటీష్ కోల్ కంపెనీ, చిరకాలం ఇలాగే బొగ్గుని ఉత్పత్తి చేస్తూ ఆ ఉత్పత్తి 'అమ్ముడు పోకుండా వుంటే' చూస్తూ కూర్చోజాలదనీ, నష్టాలు తగ్గాలంటే గనులు మూతపడక తప్పదనీ, కంపెనీ చైర్మన్ అంటున్నారు.

ది స్టేట్స్‌మేన్

[18-10-1992, 'ఆంధ్ర భూమి' డైలీ]

# 8. వర్గాలు

'వర్గాలు' అంటే ఏమిటి? అవి, ఎందుకు ఏర్పడుతున్నాయి? అవి, ఎన్ని రకాలుగా మారుతూ వచ్చాయి? 'వర్గాల' మధ్య సంబంధాలు, ఎలాంటి స్వభావంతో వున్నాయి? - ఇటువంటి విషయాలు గ్రహించడానికి కావలసిన సమాచారం అంతా ఈ పాటికే చూశాం. మొదటి సంపుటంలో మొదటి పేజీ నించీ గత చాప్టరు వరకూ చూసిన విషయాల సారాంశమే - 'వర్గాలు!' మానవ సమాజం, 'శ్రమ దోపిడీ' అనే కారణం వల్ల, ఏ నాటి నించో 'వర్గాలు'గా విడిపోయి వుంది. ఇదే ఆ సారాంశం.

'వర్గాల్ని' అర్థం చేసుకోవడం, 'విలువ'ని అర్థం చేసుకోవడం మీదే ఆధారపడి వుంటుంది. ఒక ఉత్పత్తికి 'విలువ ఎలా ఏర్పడుతుందో' గ్రహించి నప్పుడు, వర్గాల్నీ, వర్గాల్లో సెక్షన్లనీ గ్రహించడం చాలా తేలిక.

'ఉత్పత్తి' గురించీ, దాని 'విలువ' గురించీ, ఇప్పటికి అనేక సార్లు చూశాం. 'ఉత్పత్తి' కోసం ఖర్చయిన నిర్జీవ, సజీవ శ్రమల మొత్తమే - ఉత్పత్తి 'విలువ.' 'ఉత్పత్తుల రాసి'ని, C + V + S భాగాలుగా (3 సంచులుగా) విభజిస్తే, అందులో C భాగంలో నించి ('ఉత్పత్తి సాధనాల సంచి'లో నించి) ఎవరూ ఏమీ తినడం సాధ్యం కాదు. ఈ భాగం అంతా, 'పునరుత్పత్తి క్రమం'లో మళ్ళీ 'ఉత్పత్తి సాధనాలు'గా పని చెయ్యడం కోసం, అలా వుండవలసిందే. 'ఉత్పత్తుల రాసి'లో ఈ C భాగం వుండడం అంటే, ఆ రాసి కోసం ఖర్చయిన C యే వెనక్కి వచ్చిందని అర్థం. ఈ భాగం ద్వారా, 'అదనంగా' ఏమీ రాదు.

'ఉత్పత్తుల రాసి'లో ఇంకా మిగిలినది 'సజీవ శ్రమ' భాగం. ఇది V + S. సమాజంలో ఎవరు తిన్నా ఈ భాగంలో నించి తినవలసిందే. ఈ భాగం అంతా (ఈ ఉత్పత్తి అంతా) 'శ్రమ' చేసిన మనుషులదే. కాబట్టి, ఈ భాగం అంతా ఆ మనుషులకే అందితే, అప్పుడు 'వర్గాలు' అనే మాటే వుండదు. కానీ, అలా జరగడం లేదు.

శ్రమ చేసే మనుషులకు అందేది, శ్రమ శక్తి విలువే. దాని పేరే జీతాలు (V). వారి శ్రమలో నించి, వారికి అందకుండా పోయేది, అదనపు విలువ (S). ఈ 'అదనపు విలువ' - కౌలూ, వడ్డీ, లాభమూ - వగైరా పేర్లతో 'శ్రమ చెయ్యని' మనుషులకు అందుతుంది.

కాబట్టి, 'శ్రమ చేసే' మనుషులంతా - ఒక వర్గం!

'శ్రమ చెయ్యని' మనుషులంతా - ఇంకో వర్గం!

లేదా, శ్రమ శక్తి విలువ ని (జీతాల్ని) పొందే వాళ్ళంతా ఒక వర్గం! అదనపు విలువని (కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ) - పొందే వాళ్ళంతా ఇంకో వర్గం! మొదటి వర్గపు శ్రమని, రెండో వర్గం దోచడమే - శ్రమ దోపిడీ.

ఈ శ్రమ దోపిడీ ని, రెండో వర్గం, ఎలా చెయ్యగలుగుతుందంటే, 'భూమి'తో సహా ఉత్పత్తి సాధనాలన్నిటి మీదా, దానికి వున్న 'ఆస్తి హక్కుల' ద్వారా! ఉత్పత్తి సాధనాల్ని తన 'స్వంత ఆస్తి'గా వుంచుకోగలగడమే రెండో వర్గానికి వున్న శక్తి.

ఉత్పత్తి సాధనాల్లో ప్రధాన ఉత్పత్తి సాధనమైన 'భూమి', ప్రకృతి సహజమైనది. అది ఎవరి స్వంతమూ కాదు. భూమిని ప్రతీ సారీ 'ఉత్పత్తి క్రమానికి' తగిన విధంగా సిద్ధం చేసేది, శ్రమ చేసే వర్గమే.

ప్రాచీన కాలం నించీ 'శ్రమ దోపిడీ' ప్రారంభమయ్యే వరకూ, ఒక సంవత్సరపు ఉత్పత్తి రాసి నించీ ఇంకో సంవత్సరపు ఉత్పత్తి రాసికి అందుతూ వచ్చిన ఉత్పత్తి సాధనాల విషయం వదిలి వేద్దాం. శ్రమ దోపిడీ ప్రారంభమైన కాలం నించే లెక్క లోకి తీసుకుంటే, సమాజంలో ఇప్పుడు వున్న ఉత్పత్తి సాధనాలన్నీ, శ్రమ చేసే వర్గం తర తరాలుగా ఇచ్చిన 'అదనపు ఉత్పత్తి'లో నించి ఉత్పత్తి సాధనాలుగా మారినవే. ఈ రకంగా, సమాజంలో వున్న ఉత్పత్తి సాధనాలన్నీ శ్రమ చేసే వర్గానివే.

అంటే, శ్రమ చెయ్యని వర్గం - తమ తాతల, తండ్రుల నించి, అందిన ఆస్తిగా చెప్పుకునే ఉత్పత్తి సాధనాలన్నీ, నిజానికి శ్రమ చేసే వర్గపు 'పెద్దల' ఆస్తి! వెనకటి ఉత్పత్తి సాధనాలన్నీ, వెనకటి తరాల శ్రామికుల 'అదనపు ఉత్పత్తి' లోవి. ఆ వెనకటి ఉత్పత్తి సాధనాలకు, ప్రతి ఏటా కొత్త 'అదనపు ఉత్పత్తి'లో నించి కొంత భాగం చేరుతూ, ఉత్పత్తి సాధనాల పరిమాణం పెరుగుతూ వచ్చింది.

కాబట్టి, శ్రమ చెయ్యని వర్గానికి, ఉత్పత్తి సాధ

నాల మీద వుండే 'ఆస్తి హక్కు' అంతా పూర్తిగా అబద్ధమైనదీ, మోసపూరితమైనదీ, హేతు విరుద్ధమైనదీనూ. ఆ ఆస్తి హక్కు, కేవలం 'దోపిడీ పునాది మీద' నిలబడిన హక్కు మాత్రమే.

'వర్గాల' లక్షణాల్ని ఇప్పుడు తేలిగ్గా అర్థం చేసుకోగలం.

**మొదటి వర్గం:** ఇది స్వయంగా శ్రమ చేసే వర్గం. కానీ, దీని శ్రమ అంతా దీనికి దక్కదు. ఇది, తన శ్రమలో నించి ఎంతో భాగాన్ని పోగొట్టుకుంటూ వుంటుంది. ఈ వర్గం, తన శ్రమ తోనే తను జీవిస్తూ, రెండో వర్గం జీవించడానికి కావలసిన శ్రమ కూడా చేస్తూ వుంటుంది. అంటే, ఈ వర్గం, తన పోషణ తను చేసుకుంటూ, రెండో వర్గాన్ని కూడా పోషిస్తూ వుంది. అసలు, ఈ వర్గం వున్నది - రెండో వర్గం కోసం శ్రమ చెయ్యడానికే! ఈ వర్గం, తన శ్రమలో నించి పొందేది 'శ్రమ శక్తి విలువ'ని మాత్రమే - అది 'జీతం' రూపంలో వున్నా, లేకపోయినా.

**రెండో వర్గం:** ఇది 'శ్రమ చెయ్యని' వర్గం. ఇది, మొదటి వర్గంతో 'శ్రమ' చేయించి, ఆ ఉత్పత్తిలో నించీ అతి తక్కువ భాగాన్ని మాత్రమే దానికి వదిలి, మిగిలిన భాగాన్నంతా అనేక పేర్లతో తను లాగేస్తూ వుంటుంది. శ్రమ చేసే వర్గం కోసం ఆ చిన్న భాగాన్ని అయినా ఈ వర్గం ఎందుకు వదులుతుందంటే, తను శ్రమ చెయ్యకుండా జీవించాలంటే, తన కోసం శ్రమ చెయ్యడానికి ఆ వర్గం జీవించి వుండాలి కాబట్టి! అంటే, ఈ రెండో వర్గం, తన కోసం తను శ్రమ చేసుకోకుండా, తన పోషణ తను చేసుకోకుండా, మొదటి వర్గాన్ని దోపిడీ చేస్తూ, సుఖ భోగాలతో జీవిస్తూ వుంటుంది.

శ్రమ చేసే వర్గానికీ, శ్రమ చెయ్యని వర్గానికీ వున్న సంబంధం - 'దోపిడీ సంబంధం.' ఈ దోపిడీ - ఒక వ్యక్తి దగ్గర వున్న 'డబ్బు'నో, 'వస్తువుల'నో ఇంకో వ్యక్తి దొంగతనం చెయ్యడం - లాంటిది కాదు. ఈ దోపిడీ - 'శ్రమ దోపిడీ!' ఇది, శ్రమని దోచడం!

'వర్గాల' మధ్య వుండే సంబంధం, ఉత్పత్తి క్రమంలో నించి ఏర్పడే సంబంధం. ఉత్పత్తి క్రమంలో వుండే సంబంధాలు, 'ఉత్పత్తి సంబంధాలు.' లేదా, 'శ్రమ సంబంధాలు.' సమాజంలో, వర్గాలు వున్నాయి కాబట్టి, ఈ సమాజంలో వుండే ఉత్పత్తి సంబంధాలు, దోపిడీ స్వభావంతో వున్నాయని అర్థం.

శ్రమ దోపిడీ - ఒక వర్గానికి 'హానికరం' అయితే, ఇంకో వర్గానికి 'ప్రయోజనకరం!' ఒక వర్గానికి 'నష్టం' అయితే, ఇంకో వర్గానికి 'లాభం.' ఒక వర్గానికి 'దుఃఖం' అయితే, ఇంకో వర్గానికి 'సౌఖ్యం!' ఈ రకంగా, 'వర్గాల ప్రయోజనాలు' పరస్పర వ్యతిరేకాలు.

'వర్గాల' సంబంధం - 'వైరుధ్యం (విరోధం)' కలిగించే సంబంధం. ఈ వైరుధ్యం శతృ పూరితమైనది. ఈ 'శతృత్వం', వ్యక్తుల మధ్య శతృత్వం లాంటిది కాదు. అంత కన్నా విస్తృత, తీవ్ర లక్షణాలు కలది. ఇది, 'వర్గాల' మధ్య శతృత్వం. ఇది, శ్రమ దోపిడీ వల్ల పుట్టుకు వచ్చే పరిస్తితుల మధ్య శతృత్వం.

<u>వర్గాల మధ్య శతృత్వం పోవాలంటే, వర్గాలే పోవాలి.</u> వర్గాలు ఏ కారణం వల్ల ఏర్పడుతున్నాయో ఆ కారణం పోవాలి.

<u>'వర్గాలు' పోవాలంటే, శ్రమ చెయ్యకుండా జీవిస్తోన్న వర్గం కూడా శ్రమ లోకి దిగాలి!</u> అది, 'తన పోషణ కోసం' తనే శ్రమ చేసుకోవాలి. ఇది, న్యాయమైన పరిష్కారం! అప్పుడేం జరుగుతుందంటే - అంత వరకూ తన శ్రమలో ఎంతో భాగాన్ని పోగొట్టుకుంటూ వున్న వర్గం, తన శ్రమనంతా తనే తీసుకోగలుగుతుంది. లేదా, అంత శ్రమ చెయ్యవలసిన అవసరమే దానికి వుండదు కాబట్టి, దాని శ్రమ కాలం చాలా తగ్గిపోతుంది. 'దోపిడీ' ఆగిపోతుంది.

శ్రమ చెయ్యకుండా దోపిడీతో జీవిస్తోన్న వర్గం కూడా 'శ్రమ' చెయ్యడం అంటే, 'ఉత్పత్తి సాధనాల' మీద అంత వరకూ సాగుతోన్న దాని మోసపూరితమైన 'ఆస్తి హక్కులు' రద్దయి పోవడమే! కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ - వగైరా దోపిడీ ఆదాయ మార్గాలన్నీ రద్దయి పోవడమే!

భూమితో సహా ఉత్పత్తి సాధనాలన్నిటినీ 2 వర్గాలకూ 'సమిష్టి ఆస్తి'గా వుంచుకుని, 2 వర్గాలూ కలిసి శ్రమ చెయ్యడం ప్రారంభించాలి! దోపిడీకి సంబంధించిన లక్షణాలన్నిటినీ క్రమ క్రమంగా మార్చుకుంటూ పోతే, ఆ 'పరిణామ క్రమం', క్రమంగా సమాజంలో వున్న మనుషులందరికీ ఒకే రకమైన జీవన పరిస్తితుల్ని ఏర్పరుస్తుంది. అందరూ శ్రమ చేసే, అందరికీ ఒకే రకమైన జీవన పరిస్తితులు వుండే సమాజం, 'వర్గాలు లేని సమాజం' అవుతుంది.

అయితే, సమాజంలో వున్న 2 వర్గాల లోనూ దోపిడీని తీసి వెయ్యవలసిన వర్గం ఏది? ఆ పని

చెయ్యవలసింది దోపిడీకి గురి అవుతోన్న వర్గమా, దోపిడీ చేస్తూ జీవిస్తోన్న వర్గమా? - మొదటి వర్గమే ఆ పని చెయ్యాలి. ఆ 'అవసరం' దానిదే. దోపిడీ నించి బయట పడవలసిన వర్గం అదే.

దోపిడీతో జీవించే వర్గం, దోపిడీని తీసివెయ్యడానికి సుముఖంగా వుండదు. పైగా అది, దోపిడీని తీసి వేసే ప్రయత్నాలన్నిటినీ అడ్డుకుంటూ, దోపిడీని చెక్కు చెదర నివ్వకుండా నిలపడానికే ప్రయత్నిస్తుంది.

కాబట్టి, దోపిడీ నించి తనని తను విముక్తి చేసుకోవలసిన బాధ్యత అంతా శ్రమ చేసే వర్గానిదే.

# 'చరిత్ర'లో, వర్గాలు

**వె**నకటి కాలం నించీ 'వర్గాలు' ఏ యే రూపాలతో మారుతూ వచ్చాయో మనకు తెలుసు. అయినా ఆ విషయాలు ఒక సారి ఇక్కడ క్లుప్తంగా ప్రస్తావించుకోవాలి.

'శ్రమ దోపిడీ' లేని ఆదిమ కాలంలో, 'వర్గాలు' లేవు. కానీ ఆ నాడు కూడా వేరు వేరు 'తెగల' మధ్య, 'శతృత్వాలు' వున్నాయి. పళ్ళ చెట్లూ, అడవి జంతువులూ, నీళ్ళ మడుగులూ, సురక్షిత ప్రాంతాలూ - వంటి 'ప్రకృతి వనరుల' కోసం, ప్రాచీన తెగల మధ్య కొట్లాటలు వుండేవి. గెలిచిన తెగ మనుషులు, ఓడిపోయి పట్టుబడిన తెగ మనుషుల్ని చంపి వెయ్యడమో, తమ తెగలో చేర్చుకోవడమో చేసే వారు. తర్వాత కాలంలో ఆ రెండు పద్ధతులూ పోయి, ఓడిన తెగ మనుషుల్ని 'బానిసలు'గా చేసుకోవడం ప్రారంభమైంది. ఒక మనిషి, తన శ్రమతో, తను జీవించడం కన్నా కొంత అదనాన్ని ఉత్పత్తి చెయ్యగలిగే విధంగా 'ఉత్పత్తి శక్తులు' అభివృద్ధి చెందిన తర్వాత మాత్రమే 'బానిస విధానం' సాధ్యమవుతుంది. అందుకే, సమాజంలో బానిస విధానం ప్రారంభం కావడానికి కూడా కొంత కాలం పట్టింది. అంతే గానీ, మానవులు ఆటవిక దశలో వున్నప్పటి నించే అది ప్రారంభం కాలేదు.

వేరు వేరు 'తెగలు' వుండడం అంటే, వేరు వేరు 'వర్గాలు' వుండడం కాదు. వర్గాలు లేకుండానే వేరు వేరు తెగల మధ్య శతృ పరిస్థితులు వున్నాయి. ఆ శతృత్వం, 'శ్రమ దోపిడీ' మీద ఆధారపడ్డది కాదు. క్రమంగా, ఆ 'శతృత్వం' అనే 'అంతర్గత పరిస్థితి'కి, ఉత్పత్తి శక్తులు అదనాన్ని ఇవ్వగల స్థాయికి పెరగడం అనే 'బాహ్య పరిస్థితి' కూడా కలిసినప్పుడు, 'శ్రమ దోపిడీ'కి అవకాశమిచ్చే 'బానిస విధానం' ప్రారంభమైంది.

శతృ తెగల మనుషుల్ని చంపివెయ్యడం కన్నా, బతక నివ్వడం, ఆ మరణించవలసిన మనుషులకు 'అభివృద్ధికరమైనదే' కాబట్టి, ఆ అర్థంలో, వెనకటి సమాజం కన్నా బానిస సమాజం అభివృద్ధి కరమైనదే.

# బానిస సమాజంలో వర్గాలు

**బా**నిసలందరూ - 'శ్రమ చేసే' వర్గం
బానిస యజమానులందరూ, 'శ్రమ చెయ్యని' వర్గం.

భూమీ, ఆ నాడు వున్న ఇతర ఉత్పత్తి సాధనాలూ, యజమానుల స్వంత ఆస్తి. అవే కాదు; <u>'శ్రమ చేసే మనుషులు' కూడా యజమానుల ఆస్తే.</u> అందుకే ఈ 'యజమాని' కేవలం భూస్వామి మాత్రమే కాడు. ఈ యజమాని - భూమికీ, బానిసలకూ కూడా యజమాని అయిన - 'బానిస యజమాని.' ఈ యజమాని, 'శ్రమ సాధనాల' మీదా, 'శ్రామికుల' మీదా కూడా హక్కుదారుడు.

యజమాని వర్గానికి, అన్ని రంగాల లోనూ కావలసిన శ్రమలన్నీ చేసేది, బానిసల వర్గమే. ఆ కాలంలో, యజమానుల వర్గం కూడా ఎంతో కొంత శ్రమ చేసినట్టుగా అనుకుంటే, ఆ వర్గానికి తన శ్రమ ఫలితాన్ని తీసుకోవడానికి మాత్రమే హక్కు వుండాలి. కానీ, తన శ్రమ ఫలితాన్ని మించి అనేక రెట్ల 'అదనాన్ని' ఆ వర్గం స్వాధీన పరచుకుంటుంది. ఆ వర్గం, ఏ మాత్రమూ శ్రమ చేసి వుండక పోతే, అది స్వాధీన పర్చుకునేదంతా పూర్తిగా బానిసలదే.

శ్రమ చెయ్యడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలన్నీ యజమానుల ఆస్తిగా వుండడం వల్ల, శ్రమ చేసే వర్గానికి అవి 'పరాయివి'గా వుంటాయి.

'బానిస సమాజం'లో - వర్తకమూ, వడ్డీ వ్యాపారమూ కూడా వున్నాయి.

బానిస వర్గం ఇచ్చే 'అదనపు ఉత్పత్తి' - వర్తక కమిషనూ, వడ్డీ, పన్నులూ, యజమానులు స్వంతానికి తినే భాగమూ - వగైరాలుగా చీలుతుంది.

బానిస వర్గపు 'అదనపు ఉత్పత్తి'ని తినే సెక్షన్లన్నీ కలిసి - 'బానిస యజమానుల వర్గం.' ఈ యజమానుల వర్గాన్ని పోషించేది, బానిసల వర్గమే. కానీ, యజమానులే తమ ఆస్తితో బానిసల్ని పోషిస్తున్నట్టుగా పైకి 2 వర్గాలకూ, కనపడుతుంది.

ఈ 2 వర్గాలూ శత్రు వర్గాలు! తమ మధ్య 'శ్రమ దోపిడీ' జరుగుతోందనే సంగతి 2 వర్గాలకూ ఈ దశలో తెలీదు. "భూమీ, బానిసలూ మా స్వంతం. మా ఆస్తి" అని యజమానుల వర్గం భావిస్తూ వుంటే, "అవును, భూమీ, బానిసలమూ యజమానుల స్వంతమే" అని బానిసల వర్గం కూడా భావిస్తూ వుంటుంది.

2 వర్గాలూ ఒకే 'అసత్యాన్ని' నమ్ముతూ వుంటాయి.

[ 'బానిస సమాజం' లోనే, 'స్వతంత్ర ఉత్పత్తి దారుల' విభాగం కూడా ఒకటి వుండి వుంటే, ఆ ఉత్పత్తిదారులు - బానిసలూ కారు; యజమానులూ కారు. వారి శ్రమ ఫలితం' అంతా వారికే అందుతుంది. 'శ్రమ దోపిడీ' గురించి మాట్లాడేటప్పుడు, ఆ సమాజంలో వుండే శత్రు వర్గాల విషయమే ప్రధానమైనది. అవే అక్కడ ప్రధాన వర్గాలు అవుతాయి.]

బానిస యజమాని వర్గం, బానిస వర్గంతో 'శ్రమ' చేయించాలంటే, మొదట ఆ వర్గాన్ని తన అదుపాజ్ఞల్లో వుంచుకోగలగాలి. ఈ పని కోసం యజమాని వర్గానికి ఒక ప్రత్యేక 'యంత్రాంగం' అవసరమవుతుంది. అదే 'రాజ్యం'. లేదా, 'రాజ్యాంగ యంత్రం' (స్టేట్). ఈ 'రాజ్యాంగ యంత్రం', బానిస వర్గాన్ని అదుపాజ్ఞల్లో వుంచడానికి అవసరమయ్యే శాఖలన్నిటితోటీ ప్రారంభమవుతుంది. ప్రభుత్వమూ, పోలీసూ, సైన్యమూ, న్యాయ స్థానాలూ, జైళ్ళూ - వంటి అనేక శాఖలు 'రాజ్యాంగ యంత్రం'లో భాగాలుగా వుంటాయి. అందులో 'ప్రభుత్వం' (గవర్నమెంట్) అనే ప్రధాన శాఖ ఆధీనంలో, మిగిలిన శాఖలన్నీ వుంటాయి. అన్ని శాఖలూ కలిసినదే 'రాజ్యాంగ యంత్రం.'

ఈ శాఖలన్నీ నడవడానికి కావలసిన 'ఆదాయం', ప్రభుత్వానికి, బానిస - యజమానుల వర్గం చెల్లించే 'పన్నుల' ద్వారా అందుతుంది. ఆ 'పన్నులన్నీ' బానిస వర్గం ఇచ్చే 'అదనపు ఉత్పత్తి'లో భాగమే. అంటే, బానిసల శ్రమతో తయారయ్యే ఉత్పత్తుల తోనే బానిసల్ని అణిచే శాఖలన్నీ పని చేస్తాయన్న మాట!

రాజ్యాంగ యంత్రానికి అధినేత - రాజు. ఈ రాజే స్వయంగా ఒక పెద్ద బానిస - యజమాని. ఈ బానిస యజమాని, వందల - వేల ఎకరాల భూమికీ, వందల - వేల మంది బానిసలకూ, హక్కు దారుడిగా వుంటాడు. బానిస యజమాని అయిన ఈ రాజు, ఇతర బానిస యజమానుల అండదండలతో సమాజాన్ని 'పరిపాలిస్తాడు.'

'పరిపాలన' అంటే - యజమాని వర్గ ప్రయోజనాల్ని అన్ని శాఖల ద్వారానూ కాపాడడం! యజమానుల ఆస్తులకు 'రక్షణ' వుండాలి. బానిసల వల్ల, యజమానుల శాంతి భద్రతలకు భంగం కలగకుండా వుండాలి.

బానిసలు తమ ప్రవర్తనలో యజమాని మీద అవిధేయత ప్రకటిస్తేనూ, యజమాని ఆధీనం నించి పారిపోతేనూ, యజమాని మీద తిరగబడితేనూ - ఇలా, 'బానిస' ఏ రకంగా తల ఎత్తినా, అదంతా - నేరం! అన్యాయం! చట్ట వ్యతిరేకం! ఈ నేరాలకు పాల్పడే బానిసలకు - కొరడా శిక్షలో, ఖైదు శిక్షలో, మరణ శిక్షలో విధించి, న్యాయ స్థానాలు యజమానులకు న్యాయం చెయ్యాలి!

ఈ సమాజంలో 'చట్టాలన్నీ' యజమానుల కోసమే వుండాలి. శాసనాల్నీ న్యాయ సూత్రాల్నీ, యజమాని వర్గం, తన కోసమే తయారు చేసుకుంటుంది. అందులో బానిసల పాత్ర ఏమీ వుండదు.

బానిస వర్గాన్ని అదుపాజ్ఞల్లో వుంచగలిగే పనిని, యజమాని వర్గం, ప్రధానంగా 'బల ప్రయోగం' ద్వారానే చేస్తుంది. బానిసల మీద కొరడాలూ, ఇతర ఆయుధాలూ ప్రయోగిస్తూ, వారిని అణిచే విధులు నిర్వహించే సమూహాలు కూడా - బానిసలే.

'బానిస వర్గం'లో కొన్ని విభాగాలు - యజమాని వర్గం కోసం 'వ్యవసాయ' శ్రమల వంటివి చేస్తూ వుంటే, కొన్ని విభాగాలు - పోలీసు శ్రమలూ, సైనిక శ్రమలూ వంటి శ్రమలు చేస్తూ వుంటాయి. పోలీసూ, జైళ్ళూ - వంటి శాఖలు లేకపోతే, దోపిడీ వర్గం, ఒక్క రోజు కూడా 'ఉత్పత్తి సాధనాల్ని' తన ఆధీనంలో వుంచుకోలేదు. ఒక్క రోజు కూడా తన దోపిడీని సాగించలేదు.

అయితే, బానిస వర్గాన్ని అణిచే కార్యం సాధించడానికి కేవలం ఆయుధ శక్తి - మాత్రమే చాలదు. రక

రకాల ఇతర శక్తులు కూడా కావాలి. ఇతర రంగాలన్నీ - ప్రధానంగా - మత రంగమూ, విద్యా రంగమూ, కళల రంగమూ వంటి 'సాంస్కృతిక' రంగాలన్నీ 'యజమాని వర్గ' ప్రయోజనాలకు అనుగుణమైన స్వభావంతో ఏర్పడతాయి. "యజమానులకు సేవ చెయ్యడమే బానిసల విధి. తనను తను వినయ విధేయతలతో యజమానికి అర్పించుకోవడమే బానిసలకు పుణ్య కార్యం. అదే వారికి నీతి. అదే వారికి ధర్మం" అని, ఆ రంగాలన్నీ బానిసలకు బోధిస్తాయి. ఇటువంటి బోధనలే, ఈ నీతి కథలే, ఈ ధర్మశాస్త్రాలే - బానిసల కోసం పుట్టుకొస్తాయి. కళలన్నీ దీనినే పాడుతూ వుంటాయి. బానిసల వర్గం, అంతరాత్మల్లో నించీ లొంగిపోయే లాగానూ, అణిగి పోయే లాగానూ, చెయ్యడానికే, ఈ రంగాలన్నీ కృషి చేస్తాయి. యజమాని వర్గ మేధావులూ, కళాకారులూ, ఈ కృషి సల్పుతారు.

బానిస సమాజానికి ఆర్థిక పునాది - బానిస వర్గం ద్వారా శ్రమని పొందడం. ఆ 'పునాది'ని స్థిరపరచడమూ; శ్రమ చెయ్యని వర్గం, శ్రమ చేసే వర్గాన్ని అణిచి వుంచడమూ - అనేవే, 'రాజ్య పాలన'.

'రాజ్య పాలన'కు సంబంధించిన విషయాలన్నీ 'రాజకీయాలు.' ఆర్థిక పునాది'ని రక్షించడమే రాజ్య పాలన లక్ష్యం. కాబట్టి, ఆర్థిక విషయాల మారు రూపమే రాజకీయాలు. ఆర్థిక పునాది ఏ స్వభావంతో వుంటుందో, రాజకీయాలూ రాజ్య పాలనా ఆ స్వభావం తోనే వుంటాయి.

'వర్గాలు' వున్న సమాజం - 'వర్గ సమాజం.' వర్గ సమాజంలో వున్న మానవులు, వర్గ మానవులు. అంటే, ప్రతీ మనిషీ, ఏదో ఒక వర్గానికి చెంది వుంటాడు. 'బానిస'గా గానీ, 'యజమాని'గా గానీ!

వర్గ సమాజంలో వుండే ప్రభుత్వం - 'వర్గ ప్రభుత్వం.' బానిస సమాజంలో ప్రభుత్వం, బానిస యజమానుల వర్గ ప్రభుత్వం. బానిస సమాజంలో రాజు - 'బానిస యజమానుల వర్గ' ప్రతినిధి. అంటే, 'దోపిడీ వర్గ ప్రతినిధి.'

రాజు, సమాజంలో అందరినీ (2 వర్గాల్నీ) సమానంగా పాలిస్తున్నట్టుగా పైకి కనపడుతుంది. కానీ, 'పరిపాలన' అనేదంతా బానిస వర్గం మీదనే.

'రాజరికం', వంశ పారంపర్యంగా సంక్రమించే పదవి. అందుకే రాజు నిరంకుశుడు. అయినప్పటికీ, రాజు సర్వస్వతంత్రుడు కాడు. తను, ఏ 'వర్గ ప్రతినిధిగా' వుంటాడో, ఆ వర్గ ప్రయోజనాలకే రాజు బందీ అయి వుంటాడు. ఆ ప్రయోజనాలకు అతీతమైన స్వేచ్ఛని రాజు ప్రదర్శించలేడు.

ఒక వర్గం ఇంకో వర్గాన్ని అణిచే రాజ్యపాలన అనేది - 'వర్గాలు' తలెత్తిన బానిస సమాజం లోనే మొట్ట మొదట ప్రారంభమైంది.

ఈ 'రాజ్య పాలన' ప్రభావం, బానిస వర్గం మీద గాఢం గానే వుంటుంది. అంటే, బానిస వర్గం, యజమాని వర్గం పట్ల వినయ విధేయతల తోనే వుంటుంది. అయినప్పటికీ, నిత్య జీవితంలో యజమాని వర్గం ద్వారా ఘోరమైన హింసా దుఃఖమూ అనుభవించే బానిస వర్గం, ఆ బాధల నించి తప్పుకోవడానికి అనేక మార్గాల్లో ప్రయత్నిస్తూనే వుంటుంది.

యజమాని వర్గం, బానిసల్ని అణచడానికీ; బానిసల వర్గం - ఆ 'అణచివేత' నించి తప్పుకోవడానికీ చేసే ప్రయత్నాలు, ఆ వర్గాల మధ్య 'పోరాటంగా' తయారవుతాయి. అదే - 'వర్గ పోరాటం.'

బానిస వర్గం - తన తక్షణ బాధల నించీ, తక్షణ సమస్యల నించి, బయట పడడానికి చేసే పోరాటం, ఆ వర్గానికి తెలియకుండానే, శ్రమ దోపిడీ నించి విముక్తి చెందే మార్గాన్ని ప్రారంభిస్తుంది.

వర్గాల ప్రారంభమే, ఏదో ఒక స్థాయిలో వర్గ పోరాటాల ప్రారంభం కూడా.

[ ప్రతీ దేశం లోనూ 'ప్రాచీన తెగల' కాలం తర్వాత, 'బానిస సమాజమే' ప్రారంభమైందని చెప్పలేము. కానీ, ప్రతీ దేశం లోనూ 'శ్రమ దోపిడీ' వుంది. అది ఏ కాలంలో, ఏ వర్గాల మధ్య ప్రారంభమైందో, అది ఎలా మారుతూ వచ్చిందో, ఆ వివరాలు ఎవరికి వారు తమ 'దేశ చరిత్ర'ని పరిశీలించి తెలుసుకోవాలి.]

# 'భూస్వామ్య సమాజం'లో వర్గాలు

**బా**నిస పోరాటాల ఫలితమే, భూస్వామ్య సమాజం (ఫ్యూడల్ సమాజం). ఇక్కడ - భూస్వాములూ, కౌలు రైతులూ - శత్రు వర్గాలు.

ఈ యజమానుల వర్గానికి, భూమితో సహా శ్రమ సాధనాలన్నిటి మీదా ఆస్తి హక్కులు గతంలో లాగే వుండి, శ్రామికుల మీద ఆస్తి హక్కులు మాత్రం ఆగి

పోతాయి. అందుకే ఈ యజమానులు, బానిస యజమానులు కాదు, భూమికి యజమానులు అయిన భూస్వాములు మాత్రమే.

ఇక్కడ, శ్రమ చేసే మనుషులు, భూస్వాముల నించి భూమిని కౌలుకి తీసుకుని, కౌలు చెల్లించే కౌలు రైతులుగా మారతారు. వీరు బానిసలు కాకపోయినా, వీరు కూడా భూస్వాముల కోసం సేవ చేసే సేవకులే.

ఈ వర్గాలకు కూడా, తమ మధ్య 'శ్రమ దోపిడీ జరుగుతోందనే సంగతి' ఇంకా తెలీదు. "భూమి అంతా మా స్వంతమే, మా ఆస్తే" అని యజమానుల వర్గం భావిస్తూ వుంటే, "అవును! భూమి అంతా యజమానుల ఆస్తే. ఆ భూమిని, సాగు చెయ్యడం కోసం మనకు ఇచ్చినందుకు, మనం యజమానులకు కౌలు చెల్లించవలసిందే" అని కౌలు రైతుల వర్గం కూడా భావిస్తూ వుంటుంది.

(కౌలు రైతుల వర్గానికి కూడా కొంత స్వంత భూమి వుంటే, అది లెక్కలో విషయం కాదు. ఈ సమాజం లోనే స్వంత భూమి గల 'స్వతంత్ర రైతుల' విభాగం కూడా ఒకటి వుంటే, అది కూడా లెక్కలో విషయం కాదు. ఈ సమాజంలో, భూస్వాములూ, కౌలు రైతులూ అనే శత్రు వర్గాలే ప్రధాన వర్గాలు.)

కౌలు రైతుల వర్గం చేసే శ్రమ తోనే భూస్వాముల వర్గం జీవిస్తూ వుండగా, భూస్వాముల భూమి వల్లనే కౌలు రైతులు జీవిస్తున్నట్టుగా పైకి కనిపిస్తుంది.

'బానిస' కన్నా 'కౌలు రైతు'కి జరిగిన మేలు ఏమిటంటే, కౌలు రైతుని అమ్మడానికీ, కొనడానికీ, చంపడానికీ, యజమానికి 'హక్కు' వుండదు. ఆ రకంగా కౌలు రైతు, బానిస స్తితి నించీ 'అర్ధ బానిస స్తితి'కి మారతాడు.

వెనకటి కాలపు 'రాజ్యాంగ యంత్రమే' కొన్ని మార్పులతో ఈ సమాజానికి కూడా అందుతుంది. ఇక్కడ కూడా ప్రభుత్వాధినేత - రాజే. ఇప్పుడు ఈ రాజు, 'భూస్వామ్య వర్గ' ప్రతినిధి. ఇక్కడ కూడా 'రాజ్య పాలన సారాంశం' అంతా, శ్రమ చెయ్యని వర్గం, శ్రమ చేసే వర్గాన్ని అణచడమే.

ప్రతీ రాజు కాలం లోనూ అనేక వేల మంది కౌలు రైతులు, అనేక నేరాల పేరుతో మరణ శిక్షల పాలై వుంటారు. అందులో ప్రధాన నేరం, భూమి పండక కౌలు చెల్లించ లేకపోవడం!

'బానిసత్వం' కన్నా, అర్ధ - బానిసత్వం అభివృద్ధి కరమైనదే కాబట్టి, ఆ అర్థంలో, బానిస సమాజం కన్నా భూస్వామ్య సమాజం అభివృద్ధి కరమైనది.

ఈ సమాజంలో కూడా 'శ్రమ దోపిడీ' సంగతి వర్గాలకు తెలియక పోయినా, ఆ వర్గాల మధ్య వుండే శత్రు పరిస్తితుల వల్ల, ఇక్కడ కూడా 'వర్గ పోరాటం' వుంటుంది.

# 'పెట్టుబడిదారీ సమాజం'లో వర్గాలు

**దో**పిడీ వర్గంగా 'భూస్వామ్య వర్గం' వుంటూ వుండగానే, 'పెట్టుబడిదారీ వర్గం' కూడా ప్రారంభమైంది. (ఇవి రెండూ, దోపిడీ వర్గంలో భాగాలే. రెండూ, 'అదనపు విలువ'ని తినే సెక్షన్లే. అయినప్పటికీ, ఈ సెక్షన్లు, 'చరిత్ర'లో వేరు వేరు దశల్లో ప్రారంభమయ్యాయి కాబట్టి, ఆ విషయాలు తేలిగ్గా అర్థం చేసుకోవడం కోసం, ఇక్కడ వీటిని వేరు వేరు వర్గాలుగానే మాట్లాడుతున్నాము.)

పెట్టుబడిదారీ విధానం - మొదట 'పారిశ్రామిక' రంగం లోనూ, తర్వాత 'వ్యవసాయ' రంగం లోనూ ప్రవేసించింది.

వెనకటి సమాజాల్లో - 'బానిస'కి గానీ, 'కౌలు రైతు'కి గానీ, శ్రమ శక్తి విలువ, 'జీతం' రూపంతో అందదు. కానీ, పెట్టుబడిదారీ విధానంలో, 'శ్రమ శక్తి' కూడా 'సరుకు'గా మారుతుంది. శ్రమ చేసే మనిషిని, యజమాని, 'జీతం పద్ధతి మీద' నియమిస్తాడు.

జీతం విధానంతో పని చేసే శ్రామికులకు ప్రత్యేకమైన పేరు - 'కార్మికులు.'

వెనకటి సమాజాల్లో శ్రమ పరికరాలుగా వుండే 'చేతి పనిముట్ల' స్థానంలో, క్రమంగా చేతి యంత్రాలూ, భారీ యంత్రాలూ, ప్రవేసించాయి.

ఉత్పత్తి సాధనాలు - భూస్వామ్య వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ సంబంధించిన ఆస్తులు అయ్యాయి. భూమి - భూస్వామ్య వర్గానిది! యంత్రాలూ, ఫ్యాక్టరీలూ - వంటి ఇతర ఉత్పత్తి సాధనాలు - పెట్టుబడిదారీ వర్గానివి. ఉత్పాదక, వర్తక, వడ్డీ పెట్టుబడిదారులందరూ ఈ వర్గంలో వాళ్ళే.

వెనకటి కౌలు రైతుల వర్గం - ఒక వేపు 'వ్యవసాయ' శ్రమలూ, ఇంకో వేపు 'చేతి వృత్తుల' శ్రమలూ కూడా చేస్తూ వుండేది. అలాంటి వర్గం, పెట్టుబడిదారీ

విధానంలో, క్రమంగా, పెట్టుబడిదారీ వర్గం కింద - 'పారిశ్రామిక రంగం' లోనూ, 'వ్యవసాయ రంగం' లోనూ పని చేసే 'కార్మిక వర్గం'గా మారింది.

[ పెట్టుబడిదారీ సమాజంలో, 'స్వతంత్ర రైతులు' కూడా వుంటారు. కానీ, వారి ఆధీనంలో వుండే భూమి అత్యల్పం. అలాగే, 'స్వతంత్ర చేతి ఉత్పత్తు'ల వారి ఆధీనంలో వుండే ఉత్పత్తి సాధనాలు కూడా అత్యల్పం. 'భూమి'లో అధిక భాగం - భూస్వాముల ఆధీనం లోనూ, ఇతర ఉత్పత్తి సాధనాల్లో అధిక భాగం - పెట్టుబడి దారుల ఆధీనం లోనూ వుంటాయి.]

కార్మిక వర్గం ఇచ్చే 'శ్రమ విలువ'లో 'జీతాల' భాగం పోగా మిగిలే 'అదనపు విలువ' - భూస్వామ్య వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య పంపకం అవ్వాలి. ఈ మారిన పరిస్తితులకు అనుగుణం గానే 'అదనపు విలువ' పంపకం అయ్యే మార్పులు జరిగాయి.

### 'భూమి' కి - కౌలూ,
### 'పెట్టుబడి' కి - వడ్డీ + లాభమూ!

ఈ మార్పులు 'చరిత్ర'లో సునాయాసంగా జరిగి పోలేదు. భూస్వామ్య వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ కూడా, పోరాటాలు జరిగాయి. అలాంటి పోరాటాలలో 'శ్రమ చేసే వర్గం' (అప్పుడప్పుడే 'కార్మికులు'గా మారు తోన్న వర్గం), భూస్వామ్య వర్గానికి వ్యతిరేకం గానూ, పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలం గానూ ప్రవర్తిం చింది. ఎందుకంటే, శ్రమ చేసే వర్గానికి, భూస్వాముల కింద కౌలు రైతులుగా వుండడం కన్నా, పెట్టుబడి దారుల కింద కార్మికులుగా వుండడమే అభివృద్ధికర మైన విషయంగా కనపడింది.

శ్రమ చేసే వర్గానికి, భూస్వామ్య వర్గం శత్రువు. ఆ నాడు భూస్వామ్య వర్గానికి, పెట్టుబడిదారీ వర్గం శత్రువు. కాబట్టి, శ్రమ చేసే వర్గం, పెట్టుబడిదారీ వర్గానికే సహకరించడం అంటే, తన శత్రువుకి శత్రువుగా వున్న వర్గానికి సహకరించడం అన్న మాట. ఇదంతా, దోపిడీని గ్రహించిన స్థాయిలో జరగలేదు. కేవలం పై పై అనుభవాల స్థాయి లోనే జరిగింది.

భూస్వామ్య వర్గమూ, పెట్టుబడిదారీ వర్గమూ, ఒకే వర్గంలో విభాగాలే. ఈ విభాగాల మధ్య పోరాటాలు దేని కోసం? - 'అదనపు విలువ' పంపకాల కోసం. 'అదనపు విలువ' దేని ఫలితం? - వర్గ సమాజ ఫలితం. కాబట్టి ఒకే వర్గం లోని వేరు వేరు విభాగాల మధ్య పోరాటాలు కూడా, వర్గ సమాజ ఫలితమే. అంటే, వర్గ పోరాటంలో భాగమే. ఆ చారిత్రక దశలో, ఒకే వర్గం లోని విభాగాలే (భూస్వాములూ, పెట్టుబడి దారులూ) శత్రు వర్గాలుగా వున్నాయి.

పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గ పరిపాలనా విధానం అయిన 'రాజరికం'తో కూడా ఘర్షణ పడింది. 'రాజ్యాధికారం'లో తను కూడా భాగం సంపాదించడం కోసం, పెట్టుబడిదారీ వర్గం, 'వంశ పారంపర్య పాలన'ను ధిక్కరించి 'ప్రజాస్వామ్యం' పేరుతో, ఎన్ని కల విధానాన్నీ, శాసన సభల్నీ, డిమాండ్ చేసింది. ఆ నినాదాలతో పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గంతో పోరాడ గల గొప్ప 'తిరగబాటు శక్తి' గానూ, భూస్వామ్య నిరంకుశ సమాజ లక్షణాల్ని ధ్వంసం చేయగల 'అభ్యుదయ శక్తి' గానూ కనిపించింది.

కానీ, పెట్టుబడిదారీ వర్గం కూడా దోపిడీ మీద బతికేదే కాబట్టి, దాని అభ్యుదయం అంతా అచిర కాలం లోనే అదృశ్యమైంది. భూస్వామ్య వర్గంతో పోరాటాలు చేస్తూ, దాని కోసం కార్మిక వర్గాన్ని కూడా 'పోరాటాల లోకి' దింపడంలో, పెట్టుబడిదారీ వర్గానికి, చాలా 'ప్రమాదం' కనపడింది. కార్మిక వర్గాన్ని పోరా టాల లోకి దించడం కన్నా, భూస్వామ్య వర్గంతో సఖ్యతే తనకు ప్రమాదం లేని విషయంగా అది గ్రహించింది.

పెట్టుబడిదారీ వర్గానికి సంతృప్తి కలిగే విధంగా, భూస్వామ్య వర్గ రాజరికం, 'పెట్టుబడిదారీ ప్రజా స్వామ్య' విధానం లోకి మారింది. ఆ 'ప్రజాస్వామ్యం' - భూస్వామ్య వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గానికీ కూడా 'రాజ్యాధికారం'లో 'వాటాలు' దొరికే విధంగా అవ కాశం ఇచ్చింది.

క్రమంగా - భూస్వామ్య వర్గమూ, పెట్టుబడిదారీ వర్గమూ సహజం గానే పరస్పరం సామరస్యం లోకి వచ్చాయి. ఒక వర్గం 'కౌళ్ళ'నీ, ఇంకో వర్గం 'వడ్డీ - లాభాల్నీ' తినే అవగాహనతో, ఆ వర్గాలు రెండూ రాజీపడి, ఏక వర్గమై, పోరాటాలు చాలించుకున్నాయి. ఈ రకంగా, సమాజంలో 'కౌలు' విధానం వుంటూనే, భూస్వామ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజంగా మారింది.

'పెట్టుబడి దారుడు' అన్నప్పుడు, వాడు -
'పారిశ్రామిక' పెట్టుబడి దారుడైనా కావచ్చు;
'వ్యవసాయ' పెట్టుబడి దారుడైనా కావచ్చు;
'వర్తక' పెట్టుబడి దారుడైనా కావచ్చు;
'వడ్డీ' పెట్టుబడి దారుడైనా కావచ్చు.

'పెట్టుబడి' పెట్టే వాడెవడైనా పెట్టుబడి దారుడే (కాపిటలిస్ట్).

కానీ ఇందులో, 'పారిశ్రామిక' పెట్టుబడి దారుడికి ఇంకో పేరు - 'బూర్జువా'. పెట్టుబడిదారీ (కాపిటలిస్ట్) సమాజానికి, ఇంకో పేరు - 'బూర్జువా సమాజం.'

కొంత 'స్వంత శ్రమ' మీదా, కొంత 'దోపిడీ' మీదా ఆధారపడే 'చిన్న' పెట్టుబడి దారుడు, 'పెటీ బూర్జువా'. ఈ 'చిన్న బూర్జువా' సెక్షను, 'పెద్ద బూర్జువా'గా అవ్వాలని కలలు కంటూ వుంటుంది. అంటే, అంత వరకూ తను చేస్తూ వున్న ఆ మాత్రపు శ్రమ కూడా చెయ్యకుండా, పెద్ద బూర్జువా లాగా శ్రమని పూర్తిగా ఎగ్గొట్టే స్థాయికి చేరాలని ఆ కలలు!

పెట్టుబడిదారీ (బూర్జువా) సమాజంలో పారిశ్రామిక, వ్యవసాయ, వర్తక, వడ్డీ పెట్టుబడి దారుల సెక్షన్లతో, భూస్వాముల సెక్షను కూడా కలిసే 'పెట్టుబడిదారీ వర్గం' అవుతుంది. ' పెట్టుబడిదారీ వర్గం' అన్నప్పుడల్లా, అదనపు విలువని తినే అన్ని సెక్షన్లనీ - భూస్వాముల సెక్షన్‌ని కూడా - కలిపే ప్రస్తావిస్తున్నామని అర్థం.

పెట్టుబడిదారీ సమాజంలో, ఒక యజమాని, కేవలం భూస్వామి గానో, లేదా కేవలం పెట్టుబడి దారుడి గానో వుండడం - అనే విభజన క్రమంగా అంతర్ధానమై పోతుంది. ఎలాగంటే; భూస్వాములు కూడా, తమ భూముల్ని కౌళ్ళకు ఇవ్వకుండా స్వంత సాగుతో గానీ, ఇతర శాఖల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా గానీ, పెట్టుబడిదారులుగా కూడా మారతారు. అలాగే, పెట్టుబడిదారులు కూడా స్వంత భూములు సంపాదించి వాటిని కౌళ్ళకి ఇవ్వడం ద్వారా భూస్వాములుగా కూడా తయారవుతారు. కాబట్టి, వాళ్ళ మధ్య, ఆ విభజనే చెదిరిపోతుంది.

ఒక వ్యక్తికి, స్వంత భూమీ, స్వంత పెట్టుబడీ కూడా వున్నాయి అనుకుంటే, ఆ వ్యక్తి, ఆ 'కౌలు'కి సంబంధించినంత వరకూ భూస్వామి గానూ, వడ్డీ లాభాలకు సంబంధించినంత వరకూ పెట్టుబడి దారుడు గానూ అవుతాడు. ఆ 3 రకాల ఆదాయాల్నీ ఒక్కడే తినవచ్చు. లేదా ఇద్దరో, ముగ్గురో తినవచ్చు. ఆ వివరాలు అనవసరం. 'అదనపు విలువ'లో ఏ భాగాన్ని తిన్నా అది శ్రమ దోపిడీయే.

ఏ సమాజంలో అయినా, శ్రమ చేసే వర్గమూ, శ్రమని దోచే వర్గమూ - అనే 2 వర్గాలే, ప్రధాన శత్రు వర్గాలుగా వుంటాయి. పెట్టుబడిదారీ సమాజంలో, ఈ వర్గీకరణ మరింత స్పష్టంగా వుంటుంది.

కాబట్టి, పెట్టుబడిదారీ సమాజంలో వర్గాలు:

పెట్టుబడిదారీ వర్గమూ × కార్మిక వర్గమూ
(కాపిటలిస్ట్ క్లాస్ × వర్కింగ్ క్లాస్)

'కార్మిక వర్గం' అంటే - పారిశ్రామిక కార్మికులు మాత్రమే కాదు; జీతాలతో యజమానుల దగ్గిర పని చేసే శ్రామికులందరూ కార్మిక వర్గమే. 'పారిశ్రామిక' కార్మికులా, 'వ్యవసాయ' కార్మికులా; 'ఉత్పాదక' కార్మికులా, 'అనుత్పాదక' కార్మికులా'; 'మేధా శ్రమల' కార్మికులా, 'శారీరక శ్రమల' కార్మికులా - ఈ తేడాలతో సంబంధం లేదు. 'శ్రమ' చేస్తూ అందులో కొంత భాగాన్ని పోగొట్టుకునే వారందరూ కార్మిక వర్గమే.

అయితే, కార్మిక వర్గానికి కేంద్రం మాత్రం, 'ఉత్పాదక కార్మికులే.' పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో వుండే ఉత్పాదక కార్మికులే, 'మొత్తం సామాజిక సరుకుల రాసి'ని ఉత్పత్తి చేస్తారు. ఆ 'రాసి' విలువని C + V + S లుగా విభజిస్తే, అందులో V + S లు ఉత్పాదక కార్మికుల శ్రమ విలువే. అందులో V భాగం, ఆ కార్మికులకూ; S భాగం, పెట్టుబడిదారీ వర్గానికీ అందుతుంది.

ఈ S భాగం 3 రకాలుగా ఖర్చవుతుంది.

1. S లో కొంత భాగం - పెట్టుబడిదారీ వర్గ కుటుంబ అవసరాల కోసం C + V లుగా, ఖర్చవుతుంది. ఈ V ని జీతాలుగా తీసుకుని పనులు చేసే కార్మికులు, గృహ సేవలు చేస్తారు. వీరు అనుత్పాదక కార్మికులు.

2. S లో మరి కొంత భాగం - కొత్త పెట్టుబడిగా, కొత్త C + V లుగా, మారుతుంది. ఈ V ని జీతాలుగా తీసుకుని పని చేసే కార్మికులు, 'ఉత్పాదక కార్మికులు.'

3. S లో ఇంకా కొంత భాగం - సమాజానికి సంబంధించిన పోలీసూ, సైన్యమూ వంటి 'అనుత్పాదక' రంగాల కోసం, ఆ రంగాల్లో C + Vలుగా ఖర్చవుతుంది. ఈ Vతో పని చేసే కార్మికులు, 'అనుత్పాదక' కార్మికులు. ఉదా॥ పోలీసు శాఖ చేసే 'శ్రమ' వల్ల, పెట్టుబడిదారీ వర్గానికి, ఏ ఉత్పత్తులూ రావు; ఏ ఆదాయమూ రాదు. కానీ ఈ శాఖ, 'కార్మిక వర్గాన్ని' అణిచే పని చేసి, పెట్టుబడిదారీ వర్గానికి కావలసిన విధంగా 'శాంతి భద్రతలు' కాపాడుతూ వుంటుంది. అంటే, ఈ శాఖ, పెట్టుబడిదారీ వర్గం నిలబడడానికి కావలసిన ఒక అనుత్పాదక శ్రమ చేస్తూ వుంటుంది.

అలాగే ప్రభుత్వ శాఖలూ, కోర్టులూ, జైళ్ళూ, వగైరాలన్నీ 'అనుత్పాదక' శాఖలే. ఈ శాఖలు లేకపోతే 'దోపిడీ వర్గం' ఒక్క రోజు కూడా నిలబడ లేదు. కాబట్టి, ఈ అనుత్పాదక శాఖల కోసం, దోపిడీ వర్గం, తన చేతి లోకి వచ్చే S లో నించి ఎంతో భాగాన్ని ఖర్చు పెడుతుంది.

ఈ రకంగా, అనుత్పాదక శాఖలు నడవడానికి కావలసిన ఉత్పత్తి అంతా, ఉత్పాదక కార్మికులు ఇచ్చే S భాగం లోదే.

అనుత్పాదక కార్మికులు కూడా తాము V గా తీసుకునే దాని కన్నా అదనపు శ్రమ చేస్తారు. దోపిడీకి గురి అవుతారు. కాబట్టి, ఉత్పాదక కార్మికులూ, అనుత్పాదక కార్మికులూ కలిసినదే - 'కార్మిక వర్గం'.

పెట్టుబడిదారీ విధానంలో - ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, రక రకాల భారీ యంత్రాలూ, సాంకేతికతలూ ఒక దాన్ని మించి ఒకటి అమలు లోకి వస్తూ వుంటాయి. ఇది, శ్రమ పరికరాల - రూపం మారడమే. యంత్రం, ఎంత భారీ యంత్రమైనా, ఎంత ఉన్నత సాంకేతికత గల యంత్రమైనా, దాన్ని తయారు చేసే వాళ్ళూ, తర్వాత దాని మీద పని చేసే వాళ్ళూ - కార్మికులే. ఈ కార్మికులు, చేతి పని ముట్లతో పని చేసే వెనకటి కాలపు కార్మికుల రూపంలో వుండరు. 'ఉన్నత సాంకేతిక' జ్ఞానంతో వుంటారు. 'రెండెడ్ల బండి' తోలే మనిషి ఎంత కార్మికుడో, 'రైలు'ని నడిపే మనిషి కూడా అంత కార్మికుడే. అయితే, యంత్ర పరిజ్ఞానం విషయంలో, రైలుని నడిపే కార్మికుడు, ఎడ్ల బండిని తోలే కార్మికుడి స్థాయిలో వుండడు. అయినప్పటికీ, ఇద్దరూ కార్మికులే. పెట్టుబడిదారీ విధానంలో యంత్రాలు అభివృద్ధి చెందుతోన్న కొద్దీ, కార్మికులు అంతర్థానమై టెక్నీషియన్లు బైల్దేరతారనే వాదం అర్థ రహితమైన వాదం. ఆ టెక్నీషియన్లే కార్మికులు. ఇక్కడ జరిగిన మార్పు అంతా 'సాంకేతికత'లో మార్పే.

పెట్టుబడిదారీ విధానంలో, స్వతంత్ర ఉత్పత్తిదారులూ, స్వతంత్ర వర్తకులూ, పెటీ బూర్జువాలలో చాలా చిన్న స్థాయి వారూ - అతి పేదతనం లోనే వుంటారు. వీరంతా కూడా 'శ్రమ చేసే వర్గం' లోకే వస్తారు. ఈ విషయాలన్నీ ఇంతకు ముందే చూశాం.

వెనకటి సమాజాల్లో లాగానే, పెట్టుబడిదారీ సమాజంలో కూడా, పెట్టుబడిదారీ వర్గం, కార్మిక వర్గం నించీ ఉత్పాదక, అనుత్పాదక శ్రమలు పొందుతూ, తను ఏ శ్రమా చెయ్యకుండా, సుఖ భోగాలతో జీవిస్తూ వుంటుంది.

శ్రమ దోపిడీ వల్ల, శ్రమ చేసే వర్గానికి జరిగే హాని - 'తన శ్రమ విలువలో కొంత భాగాన్ని పోగొట్టుకోవడం' అనే 'ఆర్థిక నష్టం' మాత్రమే కాదు. దాని కన్నా నీచమైనది - శ్రమ చేసే వర్గం, యజమాని వర్గం కింద, కేవలం సేవక స్థానంలో పడి వుండడం!

సేవక స్థానంలో పడి వుండేది, వెనకటి కాలపు బానిసలూ, కౌలు రైతులూ మాత్రమే కాదు. పెట్టుబడిదారీ సమాజపు కార్మికులు కూడా అదే స్థితిలో వుంటారు. ఉత్పత్తి సాధనాలన్నీ పెట్టుబడిదారీ వర్గాధీనంలో వున్నవే కాబట్టి, ఆ వర్గం - 'ఉద్యోగాలు ఇచ్చే' స్థానం లోనూ; కార్మిక వర్గం - 'ఉద్యోగాల కోసం పెట్టుబడిదారీ వర్గాన్ని ఆశ్రయించే' స్థానం లోనూ - వుంటాయి. ఉత్పత్తి క్రమానికీ, చలామణీ క్రమానికీ సంబంధించిన నిర్ణయాల్లో, సమస్త శ్రమలూ చేసే కార్మిక వర్గానికి ఎటువంటి పాత్రా వుండదు. ఏ శ్రమా చెయ్యని యజమాని వర్గమే, సమస్త నిర్ణయాలూ చేస్తుంది. కార్మికులు చెయ్యవలసిందంతా - యజమాని చెప్పిన పని చేస్తూ యజమాని ఆజ్ఞల్ని శిరసావహించడమే.

యజమాని,
ధాన్యం పండించమంటే- ధాన్యం,
పుగాకు పండించమంటే- పుగాకు,
సారా చెయ్యమంటే - సారా,
తుపాకులు చెయ్యమంటే - తుపాకులు,
ఏ సరుకు చెయ్యమంటే ఆ సరుకే చెయ్యాలి.
ఆ చేసే పని కూడా ఎప్పుడు చెయ్యమంటే అప్పుడే వచ్చి చెయ్యాలి.

చీకట్నే చెయ్యమంటే - చీకట్నే,
మధ్యాన్నం చెయ్యమంటే - మధ్యాన్నం,
సాయంత్రం చెయ్యమంటే - సాయంత్రం,
అర్ధరాత్రి చెయ్యమంటే - అర్ధరాత్రి!
అంతే కాదు;
ఏ యంత్రంతో చెయ్యమంటే - ఆ యంత్రంతో,
ఏ టెక్నిక్‌తో చెయ్యమంటే - ఆ టెక్నిక్‌తో,
ఏ పద్ధతిలో చెయ్యమంటే - ఆ పద్ధతిలో!

అంటే, సరుకుల రకాలూ, శ్రమ పరికరాల రకాలూ, శ్రమ చేసే సమయాలూ అన్నీ, సమస్తమూ యజమానుల నిర్ణయాలే! కార్మికులు చెయ్యవలసిం

దంతా నోరు మూసుకుని పని చెయ్యడం మాత్రమే.

ఇంకా అంతే కాదు. ప్రతీ శాఖ లోనూ ఉత్పత్తుల రకాల్ని నిర్ణయించేది పెట్టుబడిదారీ వర్గమే కాబట్టి, ఆ వర్గం నిర్ణయించే ఉత్పత్తులనే కార్మిక వర్గం తమ జీవితాల్లో వాడాలి. అంటే, కార్మిక వర్గం, ఎలాంటి ఉత్పత్తులు వాడాలో, ఎలా జీవించాలో నిర్ణయించేది - పెట్టుబడిదారీ వర్గమే.

ఆలోచించే హక్కే కార్మిక వర్గానికి వుండదు. "పుగాకు వద్దు. తుపాకులు వద్దు. నైట్ షిఫ్టులు వద్దు. ఫలానా టెక్నిక్కులు వద్దు. ఈ ఉత్పత్తి అనవసరం; ఆ ఉత్పత్తి అవసరం. ఈ పద్ధతి చెడ్డది; ఆ పద్ధతి మంచిది ..." అంటూ తాము చేసే శ్రమల గురించి ఆలోచించే, వాటి మంచి చెడ్డల్ని నిర్ణయించే, అవ కాశమూ హక్కూ కార్మిక వర్గానికి వుండవు. ఆ నిర్ణయా లన్నీ యజమాని వర్గానివే. ఆ వర్గానికి వున్న బలం అంతా, ఉత్పత్తి సాధనాల మీద దానికి అధికారం వుండడమే.

నిజానికి, ఆ 'ఉత్పత్తి సాధనాలు' కూడా శ్రమ చేసే వర్గానివే. వాటిని, యజమాని వర్గం చేతుల్లో నిల బెట్టేది - 'తుపాకుల శక్తి!' ఆ తుపాకుల్ని ఉత్పత్తి చేసేదీ, తర్వాత వాటిని ఉపయోగిస్తూ యజమాని వర్గానికి రక్షణ ఇచ్చేదీ కూడా - శ్రమ చేసే వర్గమే.

ఈ రకంగా పెట్టుబడిదారీ వర్గం, తన పోషణకూ, తన రక్షణకూ, కార్మిక వర్గం మీదే ఆధారపడి వుంటుంది. కానీ, కార్మిక వర్గానికి ఉద్యోగాలు ఇచ్చే అధికారం పెట్టుబడిదారీ వర్గం చేతుల్లో వుండడం వల్ల, కార్మిక వర్గమే పెట్టుబడిదారీ వర్గానికి లోబడి, దాని ఆదేశాల ప్రకారం నడుస్తూ వుంటుంది. కార్మిక వర్గ జీవిత విధానాన్నంతా పెట్టుబడిదారీ వర్గమే శాసిస్తూ వుంటుంది.

వెనకటి శ్రామిక వర్గాలతో పోలిస్తే, కార్మిక వర్గానికి వుండే ఒక 'స్వేచ్ఛ' - యజమానిని మార్చే స్వేచ్ఛ. కార్మికులు ఒక యజమానిని వదిలి, ఇంకో యజ మాని దగ్గిరికి పోగలరు. కానీ, ఇది యజమానిని మార్చే స్వేచ్ఛే గానీ, యజమానే లేకుండా చేసుకోగలిగే స్వేచ్ఛ కాదు. ఒక యజమానిని మార్చినా ఇంకో యజమానికైనా తల వంచవలసిందే. 'నిరుద్యోగం' అనేది ఒక సహజ లక్షణంగా వుండే పెట్టుబడిదారీ సమాజంలో, కార్మికులు తరుచుగా ఉద్యోగాలు మార్చుకోలేరు. కాబట్టి, యజమానిని మార్చే కనీస స్వేచ్ఛని కూడా నిజంగా ఉపయోగించుకోలేరు. కార్మి కుల్లో, ఉన్నత మేధాశ్రమల కార్మికులు కూడా యజ మానులకు లోబడి వుండవలసిందే.

ఈ రకంగా, కార్మిక వర్గం కూడా వెనకటి శ్రామిక వర్గాల లాగే బానిసత్వం లోనే వుంటుంది. ఇది 'వేతన బానిసత్వం'. కార్మికులు - 'జీతాల బానిసలు!'

వర్గాల స్థితి పెట్టుబడిదారీ విధానంలో కూడా ఏమీ మారదు.

'వర్గ సమాజం'లో, స్త్రీ పురుష జనాభా అంతా, ప్రతీ ఒక్క వ్యక్తీ, ఏదో ఒక వర్గానికి - అందులో ఏదో ఒక సెక్షన్‌కీ - చెంది వుంటారు. పురుష కార్మికుల లాగే, యజమానుల దగ్గిర పని చేసే స్త్రీలందరూ కూడా కార్మికులే.

డాక్టర్లూ, లాయర్లూ, సైంటిస్టులూ, కళాకారులూ, టీచర్లూ - వంటి వాళ్ళందరూ కూడా శ్రమలు చేస్తోన్న వాళ్ళే. కానీ వాళ్ళు, ఎక్కడ పని చేస్తున్నారు - అనే దాన్ని బట్టి, ఉత్పాదక కార్మికులో, అనుత్పాదక కార్మి కులో, స్వతంత్ర శ్రామికులో, పెటీ బూర్జువాలో అవుతారు.

'మధ్య తరగతి' అనే మాట చాలా అస్పష్టమైన మాట. సాధారణంగా, 'మధ్య తరగతి' అని దేన్ని అంటామో, అందులో అధిక సంఖ్య, ప్రభుత్వ ఆఫీసు ల్లోనూ, వర్తక రంగం లోనూ, బ్యాంకుల రంగం లోనూ, ఉత్పాదక కంపెనీల లోనూ, పని చేస్తారు. అంటే, మధ్య తరగతిలో మెజారిటీ సంఖ్య, ఉత్పాదక, అనుత్పాదక శ్రామికులే. మిగిలిన సంఖ్య పెటీ బూర్జు వాలు. సమాజంలో ఏ వ్యక్తిని తీసుకున్నా, ఆ వ్యక్తి స్థానం వర్గాల్లో ఎక్కడో అక్కడ వుంటుంది. కాబట్టి, ఏ వర్గ స్థానాన్నీ చెప్పని 'మధ్య తరగతి' అనే మాట, స్పష్టమైన అర్థాన్ని ఇవ్వదు.

'గృహాలకు' మాత్రమే పరిమితమైన స్త్రీలు, వారి పోషణ ఏ 'ఆదాయం' ద్వారా జరుగుతుందో ఆ ఆదా యానికి మూలమైన వర్గానికి చెంది వుంటారు.

పిల్లలు - తల్లిదండ్రుల వర్గానికి చెంది వుంటారు.

నిరుద్యోగులూ, బిచ్చగాళ్ళూ, వేశ్యలూ, జైళ్ళలో మనుషులూ, అనాథ శరణాలయాల్లో మనుషులూ - వంటి విభాగాలన్నీ ప్రధానంగా కార్మిక వర్గానికే చెంది వుంటాయి.

రౌడీలు, పెట్టుబడిదార్లకు ప్రైవేటు 'రక్షక భటు లు'గా పని చేస్తారు. పెట్టుబడిదారీ వర్గం కోసం, పోలీసు శాఖ, ఎలాంటి పాత్ర నిర్వహిస్తుందో, రౌడీలు

కూడా అలాంటి పాత్రనే రక రకాల స్థాయిల్లో, రక రకాల పద్ధతుల్లో నిర్వహిస్తారు.

ఇక, 'రాజ్యపాలన' విషయానికి వస్తే, 'పెట్టుబడి దారీ సమాజం'లో కూడా 'రాజ్య పాలన' అంటే - శ్రమ చెయ్యని వర్గం, శ్రమ చేసే వర్గాన్ని అణిచే కార్య క్రమమే. పెట్టుబడిదారీ వర్గం మాట్లాడే 'ప్రజా స్వామ్యం' అంతా, తన వర్గంలో వివిధ సెక్షన్ల కోసమే. ఆ వర్గ ప్రతినిధుల కోసమే. ఇక్కడ 'ప్రజలు' అంటే, 'పెట్టుబడిదారీ ప్రజలే.' ఈ 'ప్రజాస్వామ్యం', నిజమైన అర్థంలో, కార్మికులకు కూడా సంబంధించిన ప్రజా స్వామ్యం కాదు. అందుకే ఇది 'పెట్టుబడిదారీ ప్రజా స్వామ్యం' (బూర్జువా డెమాక్రసీ).

అయితే, 'బానిస సమాజం' నించీ వున్న వర్గ పోరా టాల వల్ల, శ్రామికులకు ఉపయోగపడే అంశాలు కూడా కొన్ని, 'చట్టాల లోకి' చేరతాయి. కానీ అవి చట్టాలకే పరిమితం. వాస్తవంలో అవి శ్రామికులకు అందే పరిస్థితుల కన్నా అందని పరిస్థితులే అధికంగా వుంటాయి. ఉదా॥ కనీస వేతన చట్టాలు. 'శ్రామికు లకు ఇచ్చే వేతనాలు ఈ స్థాయి కన్నా తగ్గ రాదు' అని చెప్పే చట్టాలు అవి. కానీ ఆ చట్టాలు, ఎక్కువ చోట్ల అమలు జరగవు. అమలు జరిగే చోట కూడా, 'మేధా' శ్రామికుల విషయంలో అమలు జరిగినట్టుగా, 'శారీ రక' శ్రామికుల సెక్షన్లకు అమలు జరగవు.

అన్ని చట్టాలూ ఇలాగే.

చట్టాలు, అమలు జరగకపోవడం పెట్టుబడి దారులకు లాభం. కార్మికులకు నష్టం. అంటే, పెట్టు బడిదారీ ప్రజాస్వామ్యం, పెట్టుబడి దారుల కోసమే గానీ, కార్మికుల కోసం కాదు.

పెట్టుబడిదారీ చట్టాలు, అందరికీ సమాన న్యాయాన్ని అందించేవిగా వున్నట్టు పైకి కనపడతాయి. కానీ, ఇక్కడ కూడా చట్టాలూ, న్యాయమూ అన్నీ, దోపిడీ వర్గానికి అనుకూలంగా వుండే విధంగా ఏర్పర్చు కున్నవే.

ప్రతీ పెట్టుబడిదారీ దేశం లోనూ ప్రభుత్వం తప్పనిసరిగా 'పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం' గానే వుండి తీరుతుందనే రూలు ఏమీ లేదు. ఒక దేశంలో - 'పెట్టుబడిదారీ నియంతృత్వం' వుండవచ్చు. ఇంకో దేశంలో - 'సైనిక పాలన' వుండవచ్చు. మరో దేశంలో - ఇంకా సింహాసనం మీద రాజూ, రాజు అదుపులో పని చేసే ప్రజాస్వామ్యమూ, వుండవచ్చు. ఇంకో దేశంలో - 'రాజు'కి బదులు ఆ స్థానంలో ప్రెసిడెంటూ, ప్రెసిడెంటు అదుపులో శాసన సభలూ వుండవచ్చు. ఒక విధానానికీ ఇంకో విధానానికీ వుండే తేడాని బట్టి, ఆ యా రాజ్యాంగాల చట్టాల్లో కొన్ని తేడాలు వుంటాయి. ఆ తేడాలన్నీ పెట్టుబడిదారీ విధానానికి లోబడి వుండేవే. ఈ రకంగా పెట్టుబడిదారీ ప్రభుత్వం, కొంత వేరు వేరు రూపాల్లో వుంటుంది.

ఒక దేశపు పెట్టుబడిదారీ వర్గంలో మెజారిటీ సంఖ్య, తమ ప్రయోజనాల కోసం, ఏ అధికార రూపాన్ని ఎంచుకుంటుందో, ఆ రూపంలో ఆ దేశ ప్రభుత్వం వుంటుంది. దోపిడీ ప్రభుత్వం ఏ రూపంలో వున్నా, అన్ని రూపాల సారాంశమూ ఒకటే. దోపిడీ వర్గ ప్రయోజనాల్ని రక్షించడమే ఆ సారాంశం.

'అభివృద్ధి చెందిన' పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఈ నాటికీ ఇంకా సింహాసనాలూ, వాటి మీద రాజులూ, చక్రవర్తులూ, వారి పాదాల చెంతనే శాసన సభలూ వున్నాయి. అంటే, అక్కడ పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ (భూస్వాముల) వర్గంతో అంత రాజీతో వుండి, ఆ రకమైన విధానాన్ని ప్రారంభించిందన్న మాట! 'రాజరికం' అనే ఫ్యూడల్ ప్రభుత్వ రూపంతో, ప్రజా స్వామ్యమూ శాసన సభలూ అనే 'ఆధునిక, అభ్యు దయ' రూపాలు, మిశ్రితం చెందాయన్న మాట!

ఒక పెట్టుబడిదారీ దేశంలో, రాజు లేకుండానే శాసన సభలు వున్నాయి - అనుకుంటే, అక్కడ పెట్టు బడిదారీ వర్గం, ఫ్యూడల్ వర్గంతో ఐక్యంగా లేదనీ, పోరాటంతో వుందనీ, అర్థం కాదు. ఫ్యూడల్, పెట్టుబడి దారీ వర్గాల మధ్య పోరాటం ఏ నాడో అంతరించి పోయింది. అది ఒక నాటి చరిత్రకి సంబంధించిన గత పోరాటం అయిపోయింది.

ఇప్పుడు వున్న పోరాటాలు ప్రధానంగా 2 రకాలు.

1. 'పెట్టుబడిదారీ వర్గం' లోనే వేరు వేరు గ్రూపుల మధ్యా;
2. పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్యా;

ఇప్పటి పోరాటాలన్నీ ఈ 2 రకాల్లోనూ దేనికో ఒక దానికి సంబంధించినవే.

పెట్టుబడిదారీ వర్గం అనేక గ్రూపులుగా విడి పోయి, ఆ గ్రూపులు 'అధిక లాభాల' కోసం పోటీలు పడుతూ వుంటాయని మనకు తెలుసు. ఆ పోటీ యే 'రాజకీయ రంగం' లోకి కూడా ప్రవేసిస్తుంది.

'ప్రభుత్వాధికారాన్ని' సంపాదించగలిగిన గ్రూపుకి, అంతా 'లాభమే.' ప్రభుత్వాధికారం అనేది, ప్రభుత్వా

నికి వచ్చే 'ఆదాయం' మీద (ప్రభుత్వ ఖజానా మీద) 'అధికారాన్ని' ఇస్తుంది. ప్రభుత్వం, అనేక ఉత్పాదక, అనుత్పాదక శాఖలతో నడుస్తుంది కాబట్టి, ఆ శాఖ లన్నిటికీ కావలసిన ఉత్పత్తుల కోసం, ప్రభుత్వం అనేక ప్రైవేటు కంపెనీలకు కాంట్రాక్టులు ఇస్తుంది. (ఆ కంపెనీల సరుకుల్ని కొంటుంది.) ప్రభుత్వం, అనేక బ్యాంకుల నించీ 'అప్పులు' తీసుకుంటుంది. (ఆ బ్యాంకుల వడ్డీ వ్యాపారానికి ప్రభుత్వం ద్వారా, భారీ ఆర్డర్లు దొరుకుతాయి.) పెట్టుబడిదారీ వర్గంలో ఏ గ్రూపు అయితే 'ప్రభుత్వాధికారం' సంపాదించ గలుగుతుందో, ఆ గ్రూపు ఆ అధికారాన్ని అనేక రకాలుగా తనకు అనుకూలంగా ఉపయోగించు కుంటూ, ఇతర గ్రూపుల కన్నా అధిక లాభాలు సంపా దించ గలుగుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ వర్గంలో వేరు వేరు గ్రూపులు, వేరు వేరు 'రాజకీయ పార్టీల' పేర్లతో ప్రభుత్వాధికారం కోసం కొట్లాడుకుంటూ వుంటాయి. ప్రతీ గ్రూపూ 'తన మనుషుల్ని' ప్రభుత్వం లోకి పంపడానికి అనేక మార్గాల్లో ప్రయత్నిస్తుంది.

ప్రభుత్వాధికారంలో వుండే ఏ రాజకీయ ప్రతినిధి అయినా, ఏ పార్టీ మనిషి అయినా, ఏ గ్రూపు మనిషి అయినా, చాలా వరకూ తనే స్వయంగా భూస్వామి గానో, పెట్టుబడిదారుడి గానో, రెండూ గానో వుంటాడు. 99% ప్రతినిధులు - భూములూ, కంపె నీల్లో వాటాలూ, బ్యాంకు డిపాజిట్లూ, ఇతర ఆస్తులూ అపారంగా కలిగి వుంటారు. ఇలాంటి పెట్టుబడిదారీ ప్రతినిధులతో నిండిన ప్రభుత్వం, ఏ 'రూపం'లో వున్నా, అది పెట్టుబడిదారీ ఆస్తిపరుల కీలు బొమ్మ మాత్రమే. ముఖ్య మంత్రులూ, ప్రధాన మంత్రులూ, ప్రెసిడెంట్లూ - వగైరాలంతా గద్దెల మీద కనపడే నామ మాత్రపు విగ్రహాలు మాత్రమే. అసలైన పరిపాలకు రాలు - 'పెట్టుబడే!' దాని ప్రయోజనాలే ప్రభుత్వ శాసనాలు!

అధికారంలో వున్న గ్రూపు, మొదట తన గ్రూపు ప్రయోజనాల్నీ, తర్వాత తన 'వర్గ' ప్రయోజనాల్నీ కాపాడుతూ, ఆ లక్ష్యం కోసమే 'పరిపాలన' సాగిస్తూ వుంటుంది.

మొత్తం మీద పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం కూడా 'దోపిడీ పునాది'కి లోబడే వుంటుంది. పెట్టుబడి దారీ సమాజంలో కూడా 'వర్గాల లక్షణాలు' వెనకటి సమాజాల్లో లాగే వుంటాయని ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు.

కానీ, శ్రామిక వర్గం వేపు నించి చూస్తే, 'కౌలు రైతు' అనుభవించిన అర్ధ బానిసత్వం కన్నా, వేతన బానిసత్వం అభివృద్ధి కరమైనదే కాబట్టి, ఆ అర్థంలో, 'భూస్వామ్య సమాజం' కన్నా 'పెట్టుబడిదారీ సమాజం' అభివృద్ధి కరమైనది.

ఇప్పటి వరకూ వరసగా - బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాల్లో 'వర్గాల' లక్షణాలు చూశాం.

వర్గాలు ఏర్పడడానికి, ఏ అంశం మూల కార ణంగా కనపడింది? - శ్రమ చెయ్యడమూ, శ్రమ చెయ్యక పోవడమూ - అనేదే ఆ కారణం. శ్రమ చెయ్యకుండా మనిషి జీవించాలంటే, ఇతరుల శ్రమని దోచుకోవడం తప్ప ఇంకో మార్గం ఏదీ వుండదు.

శ్రమ దోపిడీ అనేది, ఏ కాలంలో అయినా, మానవ సంబంధాల్ని తల్లకిందులుగా మార్చి వేస్తుంది.

| | | |
|---|---|---|
| శ్రమ చెయ్యని వాళ్ళకే | - | ఉత్పత్తి సాధనాలు! |
| శ్రమ చేసే వాళ్ళకి | - | అవి వుండవు. |
| శ్రమ చెయ్యని వాళ్ళే | - | యజమానులు! |
| శ్రమ చేసే వాళ్ళు | - | సేవకులే. |
| శ్రమ చెయ్యని వాళ్ళే | - | ధనికులు. |
| శ్రమ చేసే వాళ్ళు | - | పేదలే. |
| శ్రమ చెయ్యని వాళ్ళే | - | స్వతంత్రులు. |
| శ్రమ చేసే వాళ్ళు | - | అస్వతంత్రులే. |
| శ్రమ చెయ్యని వాళ్ళే | - | పాలకులు. |
| శ్రమ చేసే వాళ్ళు | - | పాలితులే. |
| శ్రమ చెయ్యని వాళ్ళే | - | అధికులు. |
| శ్రమ చేసే వాళ్ళు | - | అధములే. |

ఈ రకంగా, దోపిడీ విధానం, తప్పుడు లక్షణా లతో, తల్లకిందులుగా నిలబడి వుంటుంది.

సమాజంలో శ్రమ దోపిడీ జరుగుతోందనే సంగతి, పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన కాలంలో కూడా ఇంకా ఏ వర్గానికి తెలీదు.

ఏ నాడో 2 వేల సంవత్సరాల కిందట, అరిస్టాటిల్ నాడు ప్రారంభమైన 'విలువ' మీద ప్రశ్నలు, ఆ నాటి నించీ అలాగే వున్నాయి. పెట్టుబడిదారీ విధానం ప్రారంభ మయ్యాక, 'మాన్యుఫ్యాక్చర్' కాలంలో, 'విలువ' గురించీ, 'లాభం' గురించీ ఆలోచించే 'ఆర్థిక వేత్తలు' ప్రారంభమయ్యారు. కానీ, వాళ్ళు ఆ విష యాల్ని అర్థం చేసుకోవడంలో, 'భూస్వాముల' స్థాయినీ, 'పెట్టుబడిదారుల' స్థాయినీ మించి ఎదగలేదు.

"భూమి - నా అస్తి. నా స్వంతం. నా భూమికి కౌలు రావాలి" అని భూస్వామీ; "పెట్టుబడి - నా ఆస్తి. నా స్వంతం. నా 'పెట్టుబడి'కి వడ్డీ రావాలి; లాభం రావాలి" అని పెట్టుబడి దారుడూ, పలికే పలుకుల్నే ఆ ఆర్థిక వేత్తలు 'గొప్ప సత్యాలు'గా స్వీకరించారు.

"అవును మరి, భూమి భూస్వామిదే కదా? 'కౌలు' ఇవ్వకపోతే భూస్వామి, తన భూమిని రైతుకి ఎందుకు ఇస్తాడు? ఎందుకు ఇవ్వాలి? 'పెట్టుబడి', పెట్టుబడి దారుడిదే కదా? దాని మీద వడ్డీ లాభాలు రాకపోతే ఎవరైనా 'పెట్టుబడి' ఎందుకు పెడతారు? ఎందుకు పెట్టాలి?" - ఇదే ఆర్థిక వేత్తల గ్రహింపు!

భూమి - 'కౌలు'ని తెస్తుంది.

అప్పు - 'వడ్డీ'ని తెస్తుంది.

పెట్టుబడి- 'లాభాన్ని' తెస్తుంది.

సమాజంలో ఇదంతా జరుగుతూనే వుంది కదా?

ఆహా! 'కౌలూ - వడ్డీ - లాభమూ' అనేవి ఎంతెంత నగ్న సత్యాలో! ఆర్థిక వేత్తలు ఈ 'త్రిమూర్తుల్ని' చూసి ముగ్ధులై పోయారు.

ఈ రకం ఆర్థిక వేత్త, తన కళ్ళ ఎదట కొన్ని విషయాలు 'చూస్తున్నాడు.' భూమి - భూస్వామి ఆస్తిగా వుండడం చూస్తున్నాడు. ఆ భూమిని రైతు తీసుకుని, దాని కోసం 'కౌలు' చెల్లించడం కూడా చూస్తున్నాడు. అలాగే, 'పెట్టుబడి'ని పెట్టుబడి దారుడు పెట్టడమూ, దానికి 'వడ్డీ - లాభాలు' రావడమూ కూడా చూస్తున్నాడు. ఈ విషయాలన్నీ జరగడం ఆర్థిక వేత్త 'కళ్ళారా చూస్తున్నాడు' కాబట్టి, దాన్నే 'సత్యం'గా స్వీకరించాడు. సూర్యుడు తూర్పున ఉదయించడం రోజూ చూసే వాళ్ళు, "సూర్యుడు తూర్పున ఉదయించును" అని చెప్పడానికి ఏమీ సందేహించరు కదా? అలాగే మన ఆర్థిక వేత్తలు కూడా తాము చూస్తోన్న విషయాలన్నీ గొప్ప సత్యాలే అనుకున్నారు. వాళ్ళు ఏం చూశారో దాన్నే 'ఆర్థిక సూత్రాలు'గా రాసేశారు.

"భూమికి - కౌలు వచ్చునూ!

పెట్టుబడికి - వడ్డీ - లాభాలు వచ్చునూ!" అని రాసేసి, దానికి "ఆర్థిక శాస్త్రం" అని పేరు పెట్టేశారు!

అవును! అది 'ఆర్థిక శాస్త్రమే!' కానీ, అది ఎవరి ఆర్థిక శాస్త్రం? కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ తినమరిగిన వాళ్ళ ఆర్థిక శాస్త్రం! ఏ శ్రమా చెయ్యకుండా, ఇంటా బయటా, ఉత్పాదక అనుత్పాదక శ్రామికులు సేవలు చేస్తోంటే, సుఖ భోగాలతో జీవితాన్నంతా 'కాలక్షేపం'గా గడిపే వాళ్ళ ఆర్థిక శాస్త్రం!

"భూమికి కౌలు వచ్చునూ,

పెట్టుబడికి వడ్డీ - లాభాలు వచ్చునూ" అనే మాటలు చెప్పడానికి ప్రత్యేకంగా 'ఆర్థిక వేత్తలు' కావాలా? ఆ మాటలు చెప్పే భూస్వాములూ, పెట్టుబడిదారులూ చాలరూ? ఏ నాటి నించో ఇవే మాటలు చెప్పే ప్రతీ భూస్వామీ ఆర్థిక వేత్తే, ప్రతీ పెట్టుబడి దారుడూ ఆర్థిక వేత్తే అవరూ? ఇక్కడ 'ఆర్థిక వేత్త' అనే మేధావి, కొత్తగా వచ్చి చెప్పింది ఏముంది?

ఏ 'శాస్త్ర'మైనా, దాని సూత్రాలన్నీ బహిరంగంగా కళ్ళకి కనపడే స్థాయి లోనే వుండవు. కొన్ని కనపడతాయి. కొన్ని కనపడవు. ఎన్నో సూత్రాల్ని 'తార్కికమైన ఆలోచన'తో కూడా గ్రహించవలసి వుంటుంది. సమాజానికి సంబంధించిన కొన్ని విషయాల్లో, కళ్ళకి కనపడేదంతా సత్యమే కావచ్చు. కానీ, కొన్ని విషయాల్లో కళ్ళకి కనిపించేదంతా, పూర్తిగా, నూటికి నూరుపాళ్ళూ అసత్యం కావచ్చు. అక్కడ 'సత్యం' అనేది, పూర్తిగా మరుగునపడి వుండవచ్చు, అలాంటి ఉదాహరణల్లో 'సత్యాన్ని' గ్రహించాలంటే, కేవలం కళ్ళనే గాక 'తల కాయల్ని' కూడా ఉపయోగించాలి. అంటే, తర్కాన్ని!

కౌళ్ళూ - వడ్డీ లాభాలూ నగ్న సత్యాలుగా పైకి కనపడుతూ వున్నా, నిజానికి, అవి నూటికి నూరు పాళ్ళూ అసత్యాలే!

'కౌలు'ని ఇచ్చేది - భూమి కాదు - శ్రమే.

'వడ్డీ లాభాల్ని' ఇచ్చేది - పెట్టుబడి కాదు - శ్రమే.

వాటిని ఇచ్చేది, శ్రామికుల 'అదనపు శ్రమ' తప్ప ఇంకేమీ కాదు. అంటే, ఇతరుల శ్రమని దోచడమే - అసలు సత్యం! ఈ సత్యాన్ని పట్టుకోవడానికి, కేవలం కళ్ళతో గ్రహించే 'లోక జ్ఞానం' చాలదు. 'తర్కం'తో గ్రహించే 'శాస్త్ర జ్ఞానం' కావాలి!

కానీ, మన ఆర్థిక వేత్తలు, సమాజంలో ఏం చూస్తున్నారో అదే రాసి, దానికి ఆర్థిక శాస్త్రం అని పేరు పెట్టారంటే, భూస్వాములూ, పెట్టుబడి దారులూ పాడే పాటని కేవలం కాయితాల మీదకి ఎక్కించే 'రాత గాళ్ళు'గా మాత్రమే వాళ్ళు వ్యవహరించారన్న మాట! విషయాల్ని ఏ మాత్రమూ తార్కికంగా పరిశోధించకుండా, పెట్టుబడిదారీ దృష్టితో వుండడం వల్లనే, వీరు 'పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు' అవుతారు.

ఈ ఆర్థిక వేత్తలకు, 'విలువ' అంటే ఏమిటో తెలీదు. 'డబ్బు' అంటే తెలీదు. 'ఉత్పత్తి సాధనా'లంటే తెలీదు. 'ముడి పదార్థం' అంటే తెలీదు. 'జీతం' అంటే

తెలీదు. 'సరుకు' కోసం ఖర్చయ్యే ఏ అంశం ఏ పద్ధతిలో విలువని చేరుస్తుందో తెలీదు. 'శ్రమ' అనే మాట, వీరి శాస్త్రంలో లేనే లేదు. 'శ్రమే' లేదు కాబట్టి, అందులో నిర్జీవ శ్రమా, సజీవ శ్రమా - అనే తేడా అసలే లేదు.

ఇక వీరికి తెలిసిందంతా ఏమిటంటే - కళ్ళకి కనపడేదే.

'భూమి' మీద - ఆస్తి హక్కు!
'పెట్టుబడి'మీద - ఆస్తి హక్కు!
భూమి'కి - కౌలు హక్కు!
'పెట్టుబడి'కి - వడ్డీ లాభాల హక్కు!

ఇదే వీరికి తెలిసిందంతా!

ఇదే వీరి 'అర్థిక శాస్త్రం' అంతా!

అయితే, ఒక 'సత్యం' కోసం సాగే అన్వేషణ ఆ 'సత్యం' దొరికే దాకా ఆగదు. అది, అవక తవకల తోటో, తప్పటడుగుల తోటో, ఒడిదుడుకుల తోటో, ఏదో ఒక రకంగా ముందుకు సాగుతూనే వుంటుంది.

మాన్యుఫాక్చర్ కాలం నించీ ఏం జరుగుతోం దంటే - ఆర్థిక విషయాల మీద ఆసక్తి వున్న వాళ్ళంతా సమాజంలో ఎవరికి తోచినట్టు వాళ్ళు ఆలోచిస్తు న్నారు. ఎవరికి తోచినట్టు వాళ్ళు సూత్రీకరిస్తున్నారు. ఎవరికి తోచినట్టు వాళ్ళు రాసి పడేస్తున్నారు. ఒకరు 'డబ్బు' మీద రాస్తే, ఒకరు 'ధర' మీద రాస్తారు. ఒకరు 'వడ్డీ' మీద రాస్తే, ఒకరు 'లాభం' మీద రాస్తారు. ఒకరు "డబ్బుని నిర్వచించడం మహా కష్టం" అంటే, ఒకరు "డబ్బు ఏం పనులు చేస్తుందో ఆ పనులు చేసేదే డబ్బు" అని ఒక 'అతి తెలివి' నిర్వచనం ప్రకటిస్తారు. ఒకరు "సప్లయ్ డిమాండ్లే ధరని నిర్ణయిస్తాయి" అంటే, ఒకరు "డబ్బు పరిమాణమే ధరని నిర్ణ యిస్తుంది" అంటారు. ఎవరు దేని మీద ఎలా మాట్లా డినా, మొత్తం మీద అందరూ 'లాభం' దగ్గిర ఏక మౌతారు. "పెట్టుబడి మీద ఇంకా కొంత 'వేసుకుంటే' లాభం వస్తుంది" అని అందరూ ఏక కంఠంతో ఆలపిస్తారు.

ఈ అస్తవ్యస్తపు పరిశీలనల్లోనే కొంత మంది తమకు తెలీకుండానే ఒక్కో 'మంచి మాట' చెపుతారు. ఒకరు "కౌలు పద్ధతి అనవసరం" అంటే, ఒకరు "వడ్డీ విధానం పనికి మాలినది" అంటారు. "కౌలు లేకుండా భూమి దొరకాలి" అని ఒకరు కలలు కంటే, "వడ్డీ లేకుండా అప్పు దొరకాలి" అని ఇంకొకరు ఊహలు చేస్తారు.

పెట్టుబడిదారీ వర్గం తలెత్తుతోన్న కాలంలో, 'కౌలు' మీద ఆగ్రహ పడే మేధావులు ఒక వేపూ, 'లాభం' మీద కత్తులు దూసే ఆలోచనాపరులు ఇంకో వేపూ, బైల్దేరారు. మొత్తం మీద ఎవరు దేని మీద ఆగ్రహించినా, దేని మీద నిప్పులు కురిసినా, అదంతా తాత్కాలికమై పోతుంది. అందరూ మళ్ళీ ఏకమౌతారు. మళ్ళీ మొదటికొస్తారు. "భూమికి కౌలు వచ్చునూ! పెట్టుబడికి వడ్డీ, లాభాలు వచ్చునూ!"

పెట్టుబడిదారీ విధానం సాగుతోన్న కొద్దీ, దాని వల్ల పుట్టుకొస్తోన్న సమస్యల్ని, అరకొరగా నైనా కొందరు మేధావులు గ్రహిస్తూనే వున్నారు. అలాంటి వాళ్ళు కొందరు "వెనకటి కాలమే మంచిది" అని నిట్టూర్చారు. మరి కొందరు, "మానవుల్లో కొందరు సిరి సంపదలతో తులతూగుతూ వుండగా, అనేక మంది కటిక దారిద్ర్యంతో క్షోభపడుతున్నారు. ఇది చాలా అన్యాయం. మానవుల్లో ఈ తేడాలు వుండ రాదు" అని విచార పడ్డారు. ఇలాంటి 'మంచి వాళ్ళు' (నిజంగా మంచి వాళ్ళు) సమాజాన్ని సంస్కరించాలని ఎంతో ఆశపడ్డారు.

కానీ, "సమాజం బాగా లేదు" అన్న వాళ్ళు, దానికి కారణం ఏమిటో చెప్పలేకపోయారు. "వెనకటి కాలమే మంచిది" అన్న వాళ్ళు, 'వెనకటి కాలం కూడా చెడ్డదే' అనీ, 'మరింత చెడ్డది' అనీ, గ్రహించలేక పోయారు. "మానవుల్లో ధనిక - పేద వ్యత్యాసాలు వుండరాదు" అన్న వాళ్ళు, ఆ వ్యత్యాసాలు ఎందుకు వున్నాయో, ఎలా పోతాయో, అర్థం చేసుకోలేక పోయారు.

ఇదంతా 'విలువ' గురించీ, 'దోపిడీ' గురించీ, తెలియకపోవడం వల్లనే. మానవులందరూ సుఖ శాంతులతో జీవించాలని నిజంగా కాంక్షించిన వారికి కూడా 'అసలు నిజం' అందలేదు. కానీ, ఆ అరకొర జ్ఞానం లోనే, సమాజంలో ప్రతీ విషయాన్నీ 'హేతు బద్ధత'తో అర్థం చేసుకోవాలనే 'తార్కిక' భావాలూ, మానవు లందరూ సమానులుగా జీవించాలనే 'సోష లిస్టు' భావాలూ, సమాజంలో పుట్టి పెరుగుతూనే వున్నాయి.

"భగవంతుడు లేడు" అనే 'భౌతిక వాద' భావా లైతే, చాలా వెనకటి కాలం నించే ప్రారంభమై వున్నాయి - అవి, చాలా అరకొరగా వున్నప్పటికీ. ఒక వేపు - 'ప్రకృతి'కి సంబంధించీ, ఇంకో వేపు - 'సమాజా నికి' సంబంధించీ, మానవ జ్ఞానాన్ని అసలు సత్యా లకు సమీపంగా తీసుకు పోయే ప్రయాణాలు, అన్ని కోణాల లోనూ ప్రారంభమై సాగుతోనే వున్నాయి.

అలాంటి దశలో, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్త

అయిన రికార్డ్డో, ఎదుగూ బొదుగూ లేకుండా వున్న 'ఆర్థిక శాస్త్రం'లో ఒక 'ముందడుగు' వేశాడు.

రికార్డ్డో కన్నా ముందు వుండిన స్మిత్తు అవగాహన మీద రికార్డ్డో ఒక విమర్శ చేశాడు. ఆ విమర్శే, ఆర్థిక శాస్త్రంలో 'విలువ' గురించి ఒక ముందడుగు వేసింది.

విలువ గురించి స్మిత్తు అవగాహన ఇలా సాగింది: 'భూమి హక్కూ, పెట్టుబడి హక్కూ వంటి ఆస్తి హక్కులు లేని కాలంలో అయితే, విలువ అనేది శ్రమ కాలాన్ని బట్టి వుండేదే, కానీ, ఆస్తి హక్కులు ఏర్పడి పోయిన ఆధునిక కాలంలో, 'వడ్డీ - కౌలూ - లాభం' వంటి భాగాలు కూడా సరుకు ద్వారా రావలసినవే. కాబట్టి, శ్రమ కాలం మాత్రమే సరుకుకి విలువగా వుండడం ఇప్పుడు సాధ్యం కాదు. ఆ శ్రమ కాలం మీద, ఈ ఆస్తి హక్కులన్నీ కూడా కలవాలి. వీటన్నిటినీ సరుకు ఇవ్వాలి'. - ఆ అవగాహన అలా సాగింది. ఇది, 'విలువ' గురించి సరైన అవగాహన కాదని, ఇప్పుడు మనకు చాలా తేలిక గానే తెలుస్తుంది. కానీ, ఆ కాలంలో ఇది పెద్ద గందరగోళం.

స్మిత్తు అవగాహనలో తప్పులు రికార్డ్డో చక్కగానే గ్రహించాడు. కానీ, తను మళ్ళీ ఇంకో తప్పులో పడ్డాడు. స్మిత్తు అవగాహనని తిరస్కరిస్తూ, రికార్డ్డో వాదం ఇలా వుంటుంది:

'ప్రాచీన కాలం అయినా, నవీన కాలం అయినా, ఏ కాలం అయినా, విలువ అంతా శ్రమ పరిమాణాన్ని బట్టే వుంటుంది. ఆ సూత్రం ఏ కాలానికైనా వర్తిస్తుంది. 'లాభం' కూడా ఆ శ్రమ పరిమాణంలో నించి వచ్చేదే. ఆ శ్రమ కాలంతో సంబంధం లేకుండా వచ్చేది కాదు. కానీ, లాభం కూడా సరుకు ద్వారా రాక తప్పదు'.

ఈ అవగాహనలో, గొప్ప ముందడుగూ వుంది, ఎప్పటి లాగే వెనకడుగూ వుంది. 'విలువ అంతా శ్రమ పరిమాణాన్ని బట్టే వుంటుంది' అనే అవగాహన - ముందడుగు. 'కానీ, లాభాన్ని కూడా సరుకు ఇవ్వాలి' అనే అవగాహన ఎప్పటి పాటే. అది వెనకడుగే. రికార్డ్డో అవగాహనని ఇంకా వివరంగా చూస్తే, ఇలా తెలుతుంది - "లాభం - అనేది 'సరుకులో నించే' వస్తుంది. ఇంకెక్కడి నించో రావడానికి అవకాశం లేదు. 'సరుకు'ని ఉత్పత్తి చేసే శ్రామికులు, లాభాన్ని కూడా ఉత్పత్తి చేసి 'పెట్టుబడి' కోసం ఇవ్వవలసిందే. లేకపోతే, పెట్టుబడిదారుడు పెట్టుబడి ఎందుకు పెడతాడు? ఎవరూ పెట్టుబడి పెట్టకపోతే, ఉత్పత్తి కార్యం ఎలా జరుగుతుంది? కాబట్టి, శ్రామికులే లాభాన్ని ఇవ్వాలి." ఇదీ రికార్డ్డో అవగాహన.

'పెట్టుబడికి లాభం రావాలి. లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? పెట్టుబడి పెట్టకపోతే ఉత్పత్తి కార్యం ఎలా జరుగుతుంది?' అనే పాత పాటే ఇదంతా. అయితే, ఇందులో కొత్త విషయం ఏమిటంటే - 'లాభం ఎక్కడి నించో వస్తుంది' అనడం గాక, 'లాభం కూడా సరుకు విలువ లోదే' అనడమే ఇందులో కొత్త విషయం.

లాభం కూడా సరుకులో భాగమే - అని మొదట అంగీకరిస్తే, అది సరుకు లోకి ఎలా వస్తుంది - అనేది తర్వాత విషయం. అది, శ్రామికుల ద్వారానే వస్తుందని రికార్డ్డో అంగీకరిస్తున్నాడు. అయితే, 'శ్రామికులు, లాభాన్ని ఇచ్చి తీరాలి' అంటున్నాడు ఆ ఆర్థిక వేత్త.

ఇదంతా చాలా స్పష్టత తోటీ, వివరాల తోటీ, విలువ లెక్కల తోటీ చెప్పింది కాదు. చాలా అస్పష్టతతో చెప్పిందే. అయితే, ఎంత అస్పష్టతలో అయినా, రికార్డ్డో ఎంత దాకా వచ్చేశాడంటే, సత్యం వాకిట్లోకి వచ్చేశాడు! ఆ వాకిలి దాటితే ఇక సత్యాన్ని దర్శించ గలడు!

ఆ సత్యం ఏమిటి? " 'పెట్టుబడి' కోసం లాభాన్ని ఉత్పత్తి చెయ్యవలసిన బాధ్యత శ్రామికులది కాదు. శ్రామికులు చేసే శ్రమ అంతా శ్రామికులదే. అందులో నించి ఒక్క అణువుని తీసుకోవడానికి కూడా పెట్టుబడికి హక్కు వుండదు. శ్రామికుల నించి లాభాన్ని తీసుకోవడం అంటే, అది వారి "శ్రమని దోచడమే" - ఇదీ ఆ సత్యం!

ఈ విషయం కూడా రికార్డ్డో ఎందుకు గ్రహించలేక పోయాడంటే, అతని 'పెట్టుబడిదారీ' దృష్టి వల్ల! పెట్టుబడికి లాభం రాకపోతే పెట్టుబడి ఎవరు పెడతారు? - అనే దృష్టి అది! పెట్టుబడే ఆలోచిస్తే ఎలా ఆలోచిస్తుందో అలాగే ఆ ఆర్థిక వేత్త ఆలోచించాడు. ఆ దృష్టి, ఆ ఆర్థిక వేత్తని అంత కన్నా ముందుకి సాగనివ్వలేదు.

అంత కన్నా ముందుకి పోతే, "ఉత్పత్తి కార్యానికి పెట్టుబడిదారుడే అక్కర లేదు; ఉత్పత్తి సాధనాలూ, శ్రామికులూ చాలు" అని గ్రహించవలసి వుంటుంది. అంతే కాదు, పెట్టుబడిదారుడు కూడా శ్రామికుడిగా మారాలని కూడా గ్రహించవలసి వుంటుంది. - ఇదంతా పెట్టుబడిదారీ దృష్టికి అనూహ్యమైన విషయం. "పెట్టుబడిదారుడు కూడా శ్రమ చేసి తీరాలి" అని, ఏ పెట్టుబడిదారీ మేధావి అనగలడు?

రికార్డ్డో, అక్కడే ఆగాడు. "అంతే, శ్రామికులు లాభాన్ని కూడా ఉత్పత్తి చెయ్యవలసిందే ..." అంటూ

ఇక దాన్నే సత్యంగా ప్రకటించి తన పరిశోధన ముగించాడు.

ఇదంతా పెట్టుబడిదారీ వర్గానికే అనుకూలంగా వున్నప్పటికీ, ఆ వర్గానికి రికార్డో మీద కోపం వచ్చింది. ఎందుకంటే, "లాభం ఎక్కడి నించో వస్తుంది. పైన వేసుకుంటే వస్తుంది" అని, పాత వాళ్ళందరూ చెప్పి నట్టే రికార్డో కూడా చెప్పక పోవడం వల్ల, అది పెట్టు బడిదారీ వర్గానికి ఆగ్రహం కలిగించింది.

అలాంటి దశలో రంగం మీదికి వచ్చాడు **మార్క్సు!** వందల, వేల సంవత్సరాల నించీ మహా రహస్యంగా వుండిపోయిన సత్యాన్ని పట్టుకున్నాడు! అదే - 'శ్రమ దోపిడీ' సత్యం.

శ్రమ దోపిడీ - అనేది, వర్గాలు ఏర్పడడానికీ, వర్గ పోరాటాలకూ, సమస్త సామాజిక రుగ్మతలకూ మూలంగా ఎలా వుందో - మార్క్స్ అర్థం చేసు కున్నాడు. ఇక, ఆ 'మూలం మీద' దండెత్తాడు.

" 'పెట్టుబడి'కి లాభాన్ని ఉత్పత్తి చేసి ఇవ్వవల సిన బాధ్యత శ్రామికులది కాదు. అసలు, పెట్టుబడికి లాభం రావలసిన అవసరమే లేదు. లాభాన్ని ఉత్పత్తి చెయ్యవలసిన బాధ్యతని శ్రామికుల మీద రుద్ది, వారి శ్రమ నించీ లాభాన్ని లాగడం అంటే, అది శ్రామికుల శ్రమని దోచడమే. దీని వల్లనే వర్గాలు ప్రారంభ మయ్యాయి. శ్రమ చెయ్యని వర్గం, 'ఆస్తి హక్కు' పేరుతో, ఉత్పత్తి సాధనాల్ని ఆక్రమించుకుని, దోపిడీ చేస్తూ జీవిస్తోంది. ప్రతీ మనిషీ, తన కోసం తనే శ్రమ చేసుకోవాలి. దోపిడీ వర్గం, తన కోసం తనే శ్రమ చేసే విధంగా దానితో శ్రామిక వర్గం పోరాడాలి. వర్గ పోరా టాల ద్వారానే, శ్రామిక వర్గం, తనని తను విముక్తి చేసుకోవాలి" - ఇదీ మార్క్స్ సారాంశం.

పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం - అనేది, ఆ వర్గ ప్రయోజనాలకూ, ఆ వర్గ అజ్ఞానానికీ పుస్తక రూపమే గనక, ఆ ఆర్థిక శాస్త్రం, ఏ విషయాన్నీ 'తార్కికంగా' వివరించడానికి పూనుకోదు. ఆ 'ఆర్థిక శాస్త్రం' మీద 'విమర్శ'గా మార్క్సు, **"పెట్టుబడి"** అనే పేరుతో 'శ్రమ దోపిడీ'ని వివరించే పుస్తకం రాశాడు. 'పెట్టుబడి' అంటే ఏమిటో, అది ఎలా ప్రారంభమైందో, అది ఏ వర్గానిదో, అది తక్కువ విలువతో ఎక్కువ విలువని ఎలా ఉత్పత్తి చేస్తుందో, అది ఏ యే మార్గాల ద్వారా తన దోపిడీని సాగిస్తుందో - వగైరా విషయాలన్నీ తన విమర్శలో క్షుణ్ణంగా వివరించాడు.

'పెట్టుబడి' పుస్తకాన్ని, 'ఉపయోగపు విలువా, మారకం విలువా' అనే విభజనతో ప్రారంభించి, అక్కడి నించీ ప్రతీ అంశాన్నీ తార్కికంగా వివరిస్తూ అప్పటి వరకూ 'ఆర్థిక శాస్త్రం' పేరుతో చలామణీలో వున్న తప్పుడు అవగాహన లన్నిటినీ ఖండిస్తూ, సరైన అవగాహనలు రూపొందించాడు.

'డబ్బు'ని అర్థం చేసుకోవడం పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు చెప్పినంత కష్టమేమీ కాదు. 'డబ్బు' కూడా సమాజంలో వుండే అనేక సరుకుల్లో ఒక సరుకే. అది, 'జనరల్ ఈక్వివలెంటు'గా వుండే సాధనం. ఒక సరుకుకి బదులుగా వచ్చే డబ్బు, ఆ సరుకు విలువే. ఆ విలువ, ఏ యే కారణాల వల్ల వచ్చిందో పరిశీలించిన మార్క్సు పరిశోధనతో, దోపిడీ రహస్యం బట్టబయలైంది. భూమి - కౌలుని ఇస్తుం దనీ, పెట్టుబడి - వడ్డీ లాభాల్ని ఇస్తుందనీ, అంత కాలమూ దోపిడీ సూత్రాలతో చలామణీ అవుతోన్న పెట్టుబడి దారీ ఆర్థిక శాస్త్రం, పూర్తిగా తప్పుడు ఆర్థిక శాస్త్రమని రుజువైంది.

'శ్రమ దోపిడీ' - ఏ నాడో ప్రారంభమై సాగుతోన్నా, దాన్ని అర్థం చేసుకోవడానికి కావలసిన పరిస్థితి అంతా 'సరుకు ఉత్పత్తి విధానం' అయిన పెట్టుబడిదారీ విధానం లోనే ఏర్పడింది. ఆ పరిస్థితిలో, ఆ సత్యాన్ని గ్రహించడం - దానికి తగిన అధ్యయన కృషీ, తార్కిక శక్తీ, సత్యాన్ని సత్యంగా స్వీకరించే దృష్టీ గల మనిషికే సాధ్యమైంది. అప్పటికే 'భౌతిక వాది' గానూ, అభ్యు దయ భావాలు గల వ్యక్తి గానూ, మేధావి గానూ వున్న మార్క్సు ద్వారా ఆ పని జరిగింది. ఆ లక్షణాల్లో ఏది లోపించినా, ఆ పని ఆ మనిషి ద్వారా కూడా జరిగేది కాదు.

మార్క్సు ద్వారా ఆర్థిక శాస్త్ర రహస్యాలన్నీ బయట పడ్డాయి.

'వర్గాలు' అన్నప్పుడు - ధనిక వర్గమూ, పేద వర్గమూ - అనే విభజనతో కాదు చూడవలసింది. 'శ్రమని' దోచే వాళ్ళే ధనికులవుతారు. శ్రమని పోగొట్టు కునే వాళ్ళు పేదలవుతారు. కాబట్టి శ్రమ చెయ్య డమూ, చెయ్యక పోవడమూ - అనే మూలాన్ని చూడాలి. కాబట్టి, వర్గాల్ని గురించి ఎప్పుడు మాట్లా డినా, శ్రమ చేసే వర్గమూ, శ్రమని దోచే వర్గమూ - అనే అర్థాలతోనే మాట్లాడాలి. ధనికులూ, పేదలూ అనే మాటలు, అసలు రహస్యాన్ని చెప్పలేవు. శ్రమ దోపిడీని స్పష్టపరచలేని మాటలతో గాక, స్పష్టపరిచే మాటల తోటే వర్గాల్ని గ్రహించాలి; వివరించాలి.

# ఉత్పత్తి సంబంధాల ఫలితమే పంపిణీ సంబంధాలు

**'ఉ**త్పత్తి క్రమానికి' సంబంధించిన సంబంధాలు - ఉత్పత్తి సంబంధాలు. లేదా, శ్రమ సంబంధాలు. తయారైన ఉత్పత్తిని పంచుకునే సంబంధాలు - పంపిణీ సంబంధాలు. లేదా, 'ఆదాయ సంబంధాలు.'

శ్రమ దోపిడీ ఇంకా ప్రారంభం కాని కాలాన్ని తీసుకుంటే, అప్పటి ఉత్పత్తి సంబంధాలు, శ్రమ చేసే మనుష్యుల మధ్యనే సూటిగా వుంటాయి. అక్కడ అందరూ శ్రమ చేస్తారు. ఆ 'ఉత్పత్తి'ని అందరూ వాడుకుంటారు. అంటే, **అప్పటి ఉత్పత్తి సంబంధాల్ని బట్టే, అప్పటి పంపిణీ సంబంధాలు.**

'శ్రమ దోపిడీ' ప్రారంభమైన తర్వాత, ఉత్పత్తి సంబంధాలు - శ్రమ చేసే వర్గానికీ, చెయ్యని వర్గానికీ మధ్య ప్రారంభమయ్యాయి. ఆ నాటి నించీ ఈ నాటి వరకూ ఉత్పత్తి సంబంధాలు ఒకే స్వభావంతో (దోపిడీ స్వభావంతో) వున్నాయి. కానీ, ఒకే 'రూపం'తో లేవు. సంబంధాల 'స్వభావం' మారకుండా, వాటి 'రూపం' మారుతూ వచ్చింది. ఈ రూపం, 'చారిత్రక పరిస్థితుల్ని బట్టి' మారిన రూపమే గానీ శాశ్విత రూపం కాదు.

అంటే, ఉత్పత్తి సంబంధాలు - 'చారిత్రక సంబంధాలు.'

ఉత్పత్తి సంబంధాల రూపం- 'చారిత్రక రూపం.'

అలాగే, పంపిణీ సంబంధాల రూపాలు కూడా ఆ నాటి పరిస్తితుల్ని బట్టి ఏర్పడిన చారిత్రక రూపాలే. శాశ్విత రూపాలు కావు. ఎలాగంటే: 'బానిస సమాజం'లో - బానిసల శ్రమలో నించి వారికి అందే భాగం జీతం రూపంలో వుండదు. పోషణ పదార్థాల్ని యజమాని కుటుంబం నించి అందుకునే రూపంలో వుంటుంది.

భూస్వామ్య కాలంలో - కౌలు రైతుకి అందేది, 'కౌలుని చెల్లించగా మిగిలే దాన్ని' పొందే రూపంలో వుంటుంది.

పెట్టుబడిదారీ సమాజంలో - కార్మికుల శ్రమలో నించి వారికి అందే భాగం, 'జీతం' రూపంలో వుంటుంది.

యజమాని వర్గాన్ని తీసుకుంటే, ఆ వర్గానికి అందే దాని 'రూపం' కూడా చారిత్రక దశలకు అనుగుణంగా మారుతూ వచ్చింది. పెట్టుబడిదారుడికి అందేది 'లాభం' రూపంలో (డబ్బు రూపంలో) వుంటే, బానిస యజమానికి అందేది ఆ రూపంలో గాక, అదనపు ఉత్పత్తుల రూపంలో వుంటుంది. యజమాని వర్గానికి అందే ఇతర ఆదాయ రూపాలన్నీ కూడా ఇలాగే తేడాలుగా వుంటాయి.

<u>ఉత్పత్తి సంబంధాల ఫలితమే పంపిణీ సంబంధాలు.</u> అంతే గానీ, పంపిణీ సంబంధాల ఫలితం, ఉత్పత్తి సంబంధాలు కాదు. అంటే, <u>పంపిణీ సంబంధాల్ని మార్చాలంటే, మొదట ఉత్పత్తి సంబంధాల్ని మార్చవలసి వుంటుంది.</u> ఉత్పత్తి సంబంధాల్ని మార్చకుండా పంపిణీ సంబంధాల్ని మార్చడం సాధ్యం కాదు.

సమాజం నించి - కౌలూ, వడ్డీ, లాభాల్ని తీసివెయ్యాలనుకుందాం. లేదా, 'వేతన శ్రమ విధానాన్నే' తీసి వెయ్యాలనుకుందాం. అలా జరగాలంటే, మొదట 'ఉత్పత్తి సంబంధాల్లో' మార్పులతో ప్రారంభించాలి. అంటే, శ్రమ చెయ్యని వర్గాన్ని శ్రమ లోకి తెచ్చే మార్పుతో.

కాస్సేపు ఉదాహరణ కోసం, ఉత్పత్తి సంబంధాల్ని మార్చకుండానే పంపిణీ సంబంధాల్ని మార్చాలనుకుందాం. దాని కోసం ఏం చెయ్యాలి? 'జీతాల' భాగాన్ని పెంచి, 'అదనపు విలువ భాగాన్ని' తగ్గించాలి. ప్రస్తుతం అదనపు విలువ రేటు 100%గా వుందనుకుందాం. జీతాల్ని బాగా పెంచడం ద్వారా అదనపు విలువ రేటుని 25% మాత్రమే వుండే లాగ చేస్తామనుకుందాం.

మొట్ట మొదటి విషయం; అసలు అలా చెయ్యడం సాధ్యం కాదు. ఒక వేళ చెయ్యగలిగితే, 25% అదనపు విలువ రేటుతో, పెట్టుబడిదారీ వర్గం తన దోపిడీ జీవితాన్ని ఈడ్చలేదు. అది - సైన్యమూ, కోర్టులూ, పోలీసూ, జైళ్ళూ, అనుత్పాదక ప్రభుత్వ ఆఫీసులూ - వగైరాలతో కూడిన 'రాజ్యాంగ యంత్రాన్ని' నిర్వహించాలి. అంతే గాక, ఆ వర్గపు స్వంత వాడకానికీ, కొత్త పెట్టుబడిగా మార్చడానికీ,

కొంత భాగం కావాలి. ఈ అవసరాలన్నిటికీ తక్కువ అదనపు విలువ చాలదు. కాబట్టి, జీతాల్ని పెంచి అదనపు విలువని తగ్గించడం - అనే మార్పుని సాధించగలం - అనుకుంటే, అది భ్రమ మాత్రమే.

రెండో విషయం: ఒక వేళ, జీతాల్ని పెంచి, అదనపు విలువ భాగాన్ని తగ్గించినా, దాని వల్ల ఉత్పత్తి సంబంధాల 'స్వభావం' మారినట్టు కాదు. 'శ్రమ విలువ'లో 90% ని శ్రామికులకే ఇచ్చి, 10% ని మాత్రమే పెట్టుబడి దారీ వర్గానికి వదిలితే, అది కూడా దోపిడీయే. అది కూడా పెట్టుబడిదారీ వర్గం కోసం, కార్మిక వర్గం శ్రమ చెయ్యడమే.

కాబట్టి, అసలు జరగవలసింది - ఉత్పత్తి సంబంధాల్ని మార్చడం. శ్రమ చెయ్యని వర్గం కూడా శ్రమ చెయ్యడం. ఆ మార్పు ప్రారంభించకుండా, పంపిణీ సంబంధాల్లో మార్పులు చెయ్యబోతే, అది సాధ్యమూ కాదు; దాని వల్ల శ్రామిక వర్గానికి నిజమైన ప్రయోజనమూ వుండదు.

అయితే, ఉత్పత్తి సంబంధాలు మారక ముందు, జీతాల్లో మార్పుల కోసం ప్రయత్నించ కూడదని దీని అర్థం కాదు. ఆ ప్రయత్నాలన్నీ జరగవలిసిందే.

కార్మిక వర్గం, యజమాని వర్గ ఆదేశాల ప్రకారమే శ్రమ చేస్తూ ఏటా 'ఉత్పత్తుల రాసి'ని పునరుత్పత్తి చేస్తోందంటే, అక్కడ పునరుత్పత్తి అవుతున్నది, 'ఉత్పత్తుల రాసి' మాత్రమే కాదు; ఉత్పత్తి సంబంధాలూ, పంపిణీ సంబంధాలూ కూడా. అంటే, 'వర్గ సంబంధాలన్నీ.'

ఒక 'కొత్త ఉత్పత్తుల రాసి'లో నించి,
కార్మిక వర్గానికి - జీతాలూ,
దోపిడీ వర్గానికి - అదనపు విలువా!
మళ్ళీ అవే పంపకాలు!
మళ్ళీ అవే దోపిడీ సంబంధాలు!

ఒక వర్గం, శ్రమని పోగొట్టుకుంటోందనే రహస్యం ఆ వర్గానికి తెలిసి పోయిన తర్వాత, ఇక ఆ వర్గం ఏం చెయ్యవలసి వుంటుందో, దాని భవిష్యత్ కార్యక్రమం ఏమిటో అంతా నిర్ణయమై పోయినట్టే అర్థం. అది, 'దోపిడీ నించి విముక్తి' చెందాలి! దోపిడీని మరిగిన వర్గం, తనకై తనే దోపిడీని వదులుకోదు కాబట్టి, రెండు వర్గాలకూ 'పోరాటం' తప్పదు.

వర్గాల పోరాటం, ఈ నాడు కొత్తది కాదు. అది గత కాలం లోనే ప్రారంభమై పోయి వుంది. ప్రాచీన తెగల చరిత్రని వదిలేస్తే, తర్వాత చరిత్ర అంతా 'వర్గ పోరాటాల' చరిత్రే. అయితే గతంలో శ్రామిక వర్గం చేసిన పోరాటాలన్నీ 'శ్రమ దోపిడీ గురించి తెలియకుండా చేసిన పోరాటాలే. ఆ పోరాటాలు, శ్రమ దోపిడీ 'రూపాన్ని' మాత్రమే మార్చాయి.

బానిసలు - అర్ధ బానిసలుగానూ,

అర్ధ బానిసలు - వేతన బానిసలు గానూ, మారడమే, ఆ పోరాటాల ద్వారా జరిగింది.

అయితే, ఆ నాటి దశల్లో అది 'అభివృద్ధే'. కానీ, దోపిడీకి గురి అయ్యే వర్గానికి ఆ అభివృద్ధే చాలదు. 'శ్రమ దోపిడీ' సంగతి తెలిసి పోయిన తర్వాత, శ్రామిక వర్గం చెయ్యవలసింది, తన దాస్యాన్ని మళ్ళీ ఇంకో 'కొత్త రూపం' లోకి మార్చుకోవడం కాదు. దాస్యమే లేకుండా చేసుకోవడం. తనపై సాగే 'యజమానితనాన్ని' నిర్మూలించాలి. దాస్యం నించి సంపూర్ణంగా విముక్తి చెందాలి.

ఈ నాడు, ఏ దేశం లోనూ 'బానిస విధానం' లేదు. పూర్తిగా ఫ్యూడల్ కౌలు రైతుల కాలం నాటి భూస్వామ్య విధానం కూడా లేదు. ఈ నాటి దోపిడీ, ప్రధానంగా పెట్టుబడిదారీ రూపం లోనే సాగుతోంది. భూస్వామ్య విధానం కూడా, ఈ పెట్టుబడిదారీ విధానం లోనే ఐక్యమై పోయి వుంది.

కాబట్టి, ఈ నాడు దోపిడీని తీసివెయ్యాలంటే, 'పెట్టుబడిదారీ విధానాన్ని' తీసివెయ్యాలి. 'పెట్టుబడిదారీ విధానాన్ని తీసివెయ్యాలి' అన్నప్పుడు, దాని అర్థం, మళ్ళీ వెనకటి విధానాలనే తెచ్చుకోవాలనీ, అవే మంచివనీ చెపుతున్నట్టు కాదు. ఈ నాటి దోపిడీ, 'పెట్టుబడిదారీ విధానం'గా వుంది కాబట్టి, ఆ విధానాన్ని తీసివెయ్యాలి - అనడం అంటే, 'దోపిడీని తీసివెయ్యాలి' అనడమే.

కార్మిక వర్గం - పెట్టుబడిదారీ వర్గానికి బానిస అయితే, పెట్టుబడిదారీ వర్గం - పెట్టుబడిదారీ సూత్రాలకు బానిస. ఈ రకంగా పెట్టుబడిదారీ వర్గం, తనకు తనే బానిస. ఈ వర్గం, తన కోసం తను శ్రమ చేసుకోకుండా ఇతరుల మీద ఆధారపడే 'నీచ స్తితి'లో వుంది. ఇతరులను దోచే దుర్మార్గపు స్తితిలో వుంది.

ఒక పెట్టుబడిదారీ కుటుంబాన్ని పోషించేది, ఆ పెట్టుబడిదారుడి కార్మికులే! ఏ పెట్టుబడిదారీ కుటుంబాన్ని తీసుకున్నా, ఆ కుటుంబంలో పిల్లలకు తిండి

పెట్టేదీ, గుడ్డలు ఇచ్చేదీ, చదువులు ఇచ్చేదీ, ఆ పిల్లల తల్లిదండ్రులు కాదు; కార్మికులే! ఆ పిల్లల పోషణకు కావలసిన ఉత్పత్తులు, తల్లిదండ్రుల శ్రమ కాదు; కార్మికుల శ్రమే!

కార్మికులు, తమ పిల్లల్ని బికారులు గానూ, రోగిష్టులు గానూ, విద్యాహీనులు గానూ వుంచుకుని, దోపిడీ వర్గాన్నీ, దాని సంతానాన్నీ పోషిస్తున్నారన్న మాట!

ఇలాంటి సమాజంలో కార్మిక వర్గం, పెట్టుబడి దారీ వర్గాన్ని 'శ్రమ లోకి దించే' పోరాటాల ద్వారా, 2 రకాల ఫలితాలు సాధిస్తుంది.

ఒక వేపు - తనని తను విముక్తి చేసుకుంటుంది.

ఇంకో వేపు - పెట్టుబడిదారీ వర్గాన్ని కూడా 'దోపిడీతో బతికే నీచస్థితి నించీ' విముక్తి చేస్తుంది.

అలాగే, ఒక వేపు - తన 'సేవకత్వం' పోగొట్టుకుం టుంది. ఇంకోవేపు - పెట్టుబడిదారీ వర్గానికి, సాటి మానవుల మీద యజమానితనం చేసే నీచ స్థితిని పోగొడుతుంది. ఈ రకంగా - శ్రమ చేసే వర్గం, తన 'విముక్తి' కోసం చేసే పోరాటం, ఇరు వర్గాలకూ విము క్తిని ఇస్తుంది. ఇరు వర్గాలనూ ఏకం చేసి, 'సమానుల్ని' చేస్తుంది.

ఈ రకంగా, దోపిడీ సమాజాన్ని 'సమ సమాజం'గా మార్చడానికి మార్క్సు వివరించిన సిద్ధాంతమే - **'మార్క్సిజం'.** ఈ మార్క్సిజమే - శ్రామిక వర్గానికి శాస్త్రీయమైన విముక్తి మార్గాన్ని స్పష్టం చేసింది.

మార్క్సు ద్వారా శ్రమ దోపిడీ రహస్యం బయట పడినప్పుడు, పెట్టుబడిదారీ వర్గం 'అవాక్కయి' పోయింది! 'ఆర్థిక శాస్త్రం'లో అంత వరకూ అంతు పట్టకుండా అయోమయంగా వున్న విషయాలన్నీ దానికి అప్పుడే అంతుపట్టాయి. "ఇదా సంగతి?" అని, అది నిర్ఘాంత పోయింది. కానీ, ఆ 'అదనపు విలువ' సత్యాన్ని అంగీకరిస్తే, ఆ తర్కం అక్కడి తోటే ఆగదు. ఆ వర్గం, ఆస్తి హక్కులన్నీ వదిలి, శ్రామికుల సరసన నిలబడి, శ్రమ లోకి దిగవలసి వస్తుంది! అది, దోపిడీ వర్గానికి ఊహలో కూడా భరించలేని విషయం.

కాబట్టి, 'మార్క్సిజాన్ని' పూర్తిగా తిరస్కరించడమే దానికి తక్షణ కర్తవ్యం అయింది. "మార్క్సిజం - అర్థ రహితం, ఊహాలోకం, ఆచరణకు అసాధ్యం, సమాజ శాంతిని భంగపరిచే హింసా మార్గం" అంటూ రక రకాల వికృత వాదాలతో దాన్ని కొట్టివేసి, మళ్ళీ ఎప్పటి లాగే, ఏమీ ఎరగనట్టు, ఆ వర్గం - 'కౌలూ, వడ్డీ, లాభాల' సూత్రాల్లో మునిగి పోయింది.

'విలువ' అంటే ఏమిటో అర్థం కాని కాలంలో, అది మహా అయోమయమైన విషయమే. మహా కఠిన మైన, జటిలమైన విషయమే. కానీ, దాని రహస్యం తెలిసి పోయిన తర్వాత ('శ్రమ కాలమే - విలువ' అని తెలిసిన తర్వాత), అంత కన్నా తేలికైన విషయం ఏదీ లేదు.

'విలువ' గురించి తెలియని కాలంలో, వెనకటి ఆర్థిక వేత్తలు, 'కౌలూ - వడ్డీ - లాభం' సూత్రాన్ని వల్లించారంటే దాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, ఆర్థిక సూత్రాలు ఎంతో సమగ్రంగా అభివృద్ధి చెంది, 'శ్రమ దోపిడీ' హేతుబద్ధంగా రుజువైన తర్వాత కూడా, ఇంకా పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు 'కౌలూ - వడ్డీ - లాభం' సూత్రాన్ని పట్టుకు వేళ్ళాడ్డం మానలేదు. అయితే దీన్ని కూడా తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఆ సూత్రాన్ని వదులుకుంటే, వాళ్ళకి బతికే మార్గమే వుండదు కాబట్టి, ఆ వర్గానికి ఆ అబద్ధపు ఆర్థిక శాస్త్రమూ, దాని నీడలో బతికే అబద్ధపు జీవిత విధానమూ తప్పవు - అని.

'వర్గాలు' అనే మాట పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు కూడా అంటారు. కానీ, వాళ్ళ ప్రకారం, వర్గాలు అంటే, 'శ్రమ దోపిడీ సంబంధాల్లో వుండే పరస్పర వ్యతిరేక పక్షాలు' అని కాదు. 'వేరు వేరు రకపు జీవన పరి స్థితులు గల విభాగాలు' అని మాత్రమే.

'వర్గాల' గురించి, వాళ్ళు, ఈ నాటికీ 'పొదు పరులూ, సోమరులూ' కథే చెప్పుకొస్తూ వుంటారు! వాళ్ళ ప్రకారం - వెనకటి కాలంలో పొదుపరులూ, సోమరులూ అని 2 రకాల వాళ్ళు వుండేవారు. సోమ రులందరూ పేదవాళ్ళయి పోయి, పొదుపరులందరూ ఆస్తిపరులయ్యారు. పొదుపరులే భూములూ పెట్టు బడులూ సంపాదించుకున్నారు. అలా ఆస్తులు సంపాదించుకున్న భూస్వాములూ పెట్టుబడిదారులూ - కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ 'న్యాయంగా' తీసు కుంటున్నారు.

కార్మికులేమో పనులు చేసి జీతాలు తీసుకుంటు న్నారు.

ఎవరి ఆదాయం వాళ్ళదీ!

ఎవరి జీవిత విధానం వాళ్ళదీ!

ఇదీ, 'వర్గాల'కు పెట్టుబడిదారీ అర్థం!

పెట్టుబడిదారీ దృష్టిలో - 'వర్గాలు' అనేవి, సమాజంలో తప్పనిసరిగా వుండే విభాగాలు! శాశ్వతంగా వుండే విభాగాలు! అవి, తప్పనిసరిగా ఎప్పుడూ వుండే విభాగాలే కాబట్టి వాటి మధ్య ఐక్యతే గానీ ఘర్షణ వుండదు; వుండకూడదు.

కార్మిక వర్గం - జీతాల తోనూ,

పెట్టుబడిదారీ వర్గం - కౌళ్ళూ, వడ్డీలూ, లాభాల తోనూ జీవిస్తూ, 2 వర్గాలూ ఐకమత్యంతో 'అన్న దమ్ముల వలే', మెలగాలి.

ఇదీ - పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు బోధించే 'వర్గ సామరస్యం'.

వర్గాల మధ్య 'పోరాటాలు' వున్నాయని ఆర్థిక వేత్తలకు కూడా తెలుసు. కానీ, అలా వుండరాదనీ, కార్మికులు తమ అజ్ఞానం వల్లనే యజమానుల మీద పోరాటాలకు దిగుతారనీ, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల అభిప్రాయం.

ఒక ఆర్థిక వేత్తని కార్మికులు ఇలా అడిగారనుకుందాం - "వెనకటి కాలపు 'సోమరుల' సంగతి వదిలేద్దాం. ఈ నాడు, పని చేస్తోన్న కార్మికులెవ్వరూ సోమరులు కారు గదా? మేము ప్రతి రోజూ పని స్థలాల్లో హాజరై పని చేస్తూనే వున్నాం. పొలాలు దున్నుతున్నాం. గనులు తవ్వుతున్నాం. బట్టలు నేస్తున్నాం. మందులు చేస్తున్నాం. బస్సులూ రైళ్ళూ నడుపుతున్నాం. ఇళ్ళూ, వంతెనలూ, సమస్త కట్టడాలూ నిర్మిస్తున్నాం. రోడ్లూ, ఆఫీసులూ, డ్రైనేజీలూ, సమస్త స్థలాలూ శుభ్రం చేస్తున్నాం. మేము చెయ్యని పని అంటూ లేదు. యజమానులు చెప్పే పనులన్నీ చేస్తున్నాం. కానీ, అంతంత పనులు చేస్తున్న వాళ్ళం కూడా పేదలు గానే వున్నామే!" అని అడిగితే, పెట్టుబడిదారీ మేధావుల దగ్గిర రెడీగా ఒక జవాబు వుంటుంది.

"మీరు తాగేస్తారు. పొదుపు లేదు. పిల్లలు ఎక్కువ. ఖర్చు ఎక్కువ" అని!

"తాగని వాళ్ళూ, పిల్లలు లేని వాళ్ళూ కూడా పేదలు గానే వున్నారే! పెట్టుబడిదారులు కూడా విపరీతంగా తాగుతారు. మహా ఖరీదైనవి తాగుతారు. ఎప్పుడూ బారుల్లోనే, క్లబ్బుల్లోనే పడి దొర్లుతూ వుంటారు. వాళ్ళకీ పిల్లలు ఎక్కువ గానే వుంటారు. రోజూ ఊహాతీతమైనంతంత ఖర్చులు చేస్తూ వుంటారు. అయినా వాళ్ళకి పేదతనం రాదు. పైగా పిల్ల పిల్లకీ ఆస్తులు కూడతాయి. వాళ్ళకి పొలాలూ, స్థలాలూ కంపెనీలూ బ్యాంకు ఎక్కౌంట్లూ ఆభరణాలూ కార్లూ మేడలూ పెరిగి పోతూనే వుంటాయి. ఇదంతా యజమానులకే సాధ్యమవుతుంది గానీ కార్మికులకు సాధ్యం కాదు, ఎందుచేతా?"

ఆర్థిక వేత్త నిస్సంకోచంగా, మళ్ళీ వెనక్కి పోయి, యజమానుల తాతలు ఎంత కష్టజీవులో, ఎంత పొదుపరులో, కార్మికుల తాతలైతే ... అబ్బా, ఎంత సోమరులో - ఆ కథంతా మళ్ళీ చెప్పకొస్తాడు. అసలైన సోమరి మందని కష్టజీవులు గానూ, అసలైన కష్టజీవుల్ని సోమరి మంద గానూ తారుమారు చేసే ఆ అబద్ధాల కథ, ఇంకెన్ని సార్లు వింటాం? ఇక దాన్ని వదిలేద్దాం.

"మీ కథల బండారం మాకు తెలుసు. సరే, దాన్ని వదిలేసి 'వర్గాల' సంగతి చూద్దాం. వర్గాలు సామరస్యంగా జీవించాలని మీరు చెపుతున్నారే! మరి వెనకటి సమాజాల్లో వర్గాలు 'సామరస్యం'తో గాక, 'ఘర్షణ'తో ఎందుకు వున్నాయి? బానిసలకూ, బానిస యజమానులకూ మధ్య ఘర్షణలు ఎందుకు జరిగాయి? ఫ్యూడల్ ప్రభువుల మీద కౌలు రైతుల పోరాటాలు ఎందుకు జరిగాయి? - పోనీ అదంతా కూడా వదిలేద్దాం.

ఫ్యూడల్ ప్రభువులతో పెట్టుబడిదార్లు ఎందుకు పోరాటాలు చేశారు? ఒకే వర్గంలో సెక్షన్లే ఎందుకు సామరస్యంతో వుండలేకపోయాయి?

ఒక రాజూ, ఇంకో రాజూ ఎందుకు యుద్ధాలు చేసుకున్నారు?

ఒక పెట్టుబడిదారీ దేశం, ఇంకో పెట్టుబడిదారీ దేశంతో ఎందుకు యుద్ధాలు చేసింది? ఈ నాటికీ ఎందుకు యుద్ధాలు చేస్తోంది?

ప్రతీ దేశమూ - సైనిక బలగాల్నీ, ఆయుధాల గుట్టల్నీ ఎందుకు రక్షణగా పెట్టుకుంటోంది?

ఈ చరిత్ర అంతా ఏం చెపుతోంది?

వర్గాల మధ్య వున్నది సామరస్యమే అయితే, పెట్టుబడిదారుల దగ్గిర ఆయుధాల గుట్టలు ఎందుకు? పెట్టుబడిదారీ అన్నగారు, కార్మిక తమ్ముళ్ళ ముందు నిలబడడానికి, కత్తులూ తుపాకులూ ధరించిన రక్షక భటుల్ని చుట్టూ పెట్టుకుంటాడు, ఎందుకూ? తమ్ముళ్ళ నించా అన్నకి రక్షణ? శాంతి, శాంతి - అంటారే, మీ దగ్గిర 'తుపాకులు' ఎందుకు

వున్నాయి?"

ఇవన్నీ అడిగితే ఆర్థిక వేత్త సమాధానం ఇలా వుంటుంది. - "పెట్టుబడిదారులూ కార్మికులూ సమానం. కార్మికులు ఇప్పుడు బానిసలో, అర్ధ బానిసలో కారు. సర్వ స్వతంత్రులు. ఇష్టమైతేనే పని చెయ్యవచ్చు. లేకపోతే మానెయ్యవచ్చు..."

"మా ప్రశ్న అది కాదు."

"ఇప్పుడు 'రాజరికాలు' లేవు. అంతా ప్రజా స్వామ్యమే. ఇప్పుడు కార్మికులకు కూడా న్యాయ స్థానాల్లో న్యాయం పొందే హక్కు వుంది. ఎన్నికల్లో నిలబడి 'ప్రభుత్వ పరిపాలన'లో పాల్గొనే హక్కు వుంది. ఇప్పుడు సమాజం 'సమానత్వానికి' చేరి పోయింది. కాబట్టి, కార్మికులు చక్కగా కష్టించి పని చేసి, ఉత్పాదకతని పెంచుతూ, జీతాలు తీసుకుంటూ, పెట్టుబడిదారులతో సామరస్యంగా అన్నదమ్ముల వలే ... శాంతిగా ..."

"నీ దాటవేతల చిట్కా చక్కగానే వుంది. సూటిగా జవాబు చెప్పడానికి నీ దగ్గిర మార్గమే లేదు. నువ్వు మాత్రం అంత కన్నా ఏం చేస్తావు? సరే, నువ్వు చెప్పేదాన్ని గురించే చూద్దాం. ఉత్పాదకత పెంచాలంటున్నావే! పెంచితే ఏమిటి ఉపయోగం? సరుకు గుట్టలు పెరిగి పోయినప్పుడు వాటిని నాశనం చెయ్యడానికేనా? అప్పుడు ఉత్పత్తిని తగ్గించడమే దేశ భక్తి అవుతుంది కదా? ఉత్పత్తుల్ని పెంచితే ఏమిటి ప్రయోజనం?"

"ఉత్పత్తిని ఎప్పుడు పెంచాలో - ఎప్పుడు తగ్గించాలో, ఉంచాలో నాశనం చెయ్యాలో, అదంతా పెట్టుబడిదారులు చూసుకుంటారు. అదంతా వాళ్ళకి తెలుసు. వాళ్ళ సరుకు వాళ్ళ ఇష్టం. మీరు పని చేసినంత వరకూ మీ జీతాలు మీకు ఇచ్చేస్తారు కదా? ఇక యజమానులతో ఘర్షణ పడవలసిందేముంది? అందరూ శాంతిగా, ఐకమత్యంతో, అన్నదమ్ముల వలే..."

"యజమానులూ సేవకులూ అన్నదమ్ములెలా అవుతారు?"

"మీకు 'ఆర్థిక శాస్త్రం' తెలిస్తే ఈ వితండ వాదాలు చెయ్యరు. యజమాని లేకపోతే 'పెట్టుబడి' ఎవరు పెడతారు? మీకు పనులు చూపించి బతుకు దెరువు ఎవరు కల్పిస్తారు? ఆ మాత్రం గ్రహించరేం? మీరు 'పని స్థలం'లో వున్నప్పుడు, యజమానులు చెప్పినట్టు వినవలిసిందే. తర్వాత మీరు బయటి కొస్తే అందరూ అన్నదమ్ములే కదా?"

"చాలు. నువ్వు చెప్పింది చాలా విన్నాం. ఇక మేము చెప్పేది నువ్వు విను! పని స్థలంలో కూడా అన్నదమ్ముల వలే వుండే సిద్ధాంతం ఏమిటో మేం చెపుతాం.

భూమి మీదా, కంపెనీల మీదా, మీ ఆస్తి హక్కులన్నీ తీసివేస్తాం.

ఆస్తి చట్టాలన్నీ రద్దు చేస్తాం.

మీరు కూడా మా లాగే పనుల్లోకి దిగాలి!

మీ కోసం మీరే శ్రమ చేసుకోవాలి.

కౌళ్ళూ వడ్డీలూ లాభాలూ రద్దవుతాయి.

'పెట్టుబడి' ఎవ్వరూ పెట్టనక్కర లేదు. ఇక 'పెట్టుబడి' అనే మాటే రద్దవుతుంది. ఇక నించీ, దాని పేరు - 'ఉత్పత్తి సాధనాలు.'

'ఉత్పత్తి సాధనాలు' అందరివీనూ!

వాటితో అందరం కలిసి పని చేస్తాం!

అప్పుడు మనం నిజంగా అన్నదమ్ములమవుతాం! అదీ శాంతికి అసలైన మార్గం!"

"మీ లాంటి మనుషుల మీద తుపాకులు ఉపయోగించక తప్పదు. అంత కన్నా మార్గం లేదు."

"అవును. మేము చెప్పేది కూడా అదే. మన మధ్య వున్నది ఒకే మార్గం! ఘర్షణా మార్గం! పోరాటంతోటే ఇది సాగుతుంది. సామరస్యంతో కాదు. నీ రక్షణకు నిలబడే ఆ తుపాకులు చేసేది మేమే; వాటిని ఉపయోగించేదీ మేమే. మా వర్గం అంతా కళ్ళు తెరిచినప్పుడు, నువ్వు నమ్ముకునే తుపాకులు నీ వేపే తిరుగుతాయి.

మీతో మాకు ఎప్పుడూ ఘర్షణా,

మాతో మాకు ఎప్పుడూ ఐక్యతా!

ఇదే మా సిద్ధాంతం! ఇదే మా లక్ష్యం!"

ఈ సిద్ధాంతం, పెట్టుబడిదారీ మేధావికి 'నిష్కారణ వైరం' గానూ, 'దుండగీతనం' గానూ కనపడుతుంది. వాళ్ళ ప్రకారం - పెట్టుబడిదారీ విధానమే మానవ సమాజానికి 'ఉన్నత దశ'! ఇక సమాజంలో ఏ మార్పులూ అవసరం లేదు.

అంతే కదా? యజమానుల ప్రకారం ఇంకా మారవలసిందేం వుంది? - ఏమీ లేదు. కార్మికులు, చక్కగా ఉత్పాదక - అనుత్పాదక శ్రమలు చేస్తూ వుంటారు. యజమానులేమో విశ్రాంతుల తోటీ,

విలాసాల తోటీ, విహారాల తోటీ, కుక్కల్నీ నక్కల్నీ ముద్దు చేస్తూ, కాలక్షేపంగా జీవించేస్తూ వుంటారు. ఇదంతా 'ఎంతో చక్కగా' వుంది కదా? ఇంకా మార వలసిందేం వుంది?

కాబట్టి, పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఈ నాటికీ 'కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ' సిద్ధాంతాన్నే ఎంతో కరక్టయిన సిద్ధాంతంగా వల్లిస్తూనే వున్నారు! పెట్టుబడి దారీ పాఠశాలలు, ఆ ఆర్థిక శాస్త్రాన్నే బోధిస్తూ వున్నాయి.

ప్రపంచంలో ఏ దేశాన్ని తీసుకున్నా ఇంకా అది 'వర్గ సమాజమే'. 'శ్రమ దోపిడీ' మీద నడుస్తూ వున్న సమాజమే. 'సమాజం' నించి హఠాత్తుగా పెట్టుబడి దారీ వర్గం మాయమై పోతే, సమాజానికేమీ హాని జరగదు. ఎందుకంటే, ఆ వర్గం, శ్రమ చేసే వర్గం కాదు కాబట్టి. అలాంటి వర్గం మాయమైతే, అంతా సౌఖ్యమే! ఉత్పత్తి సాధనాలూ శ్రామికులూ మిగులు తారు. వాళ్ళు హాయిగా, తమ కోసమే శ్రమ చేసు కుంటారు.

'వర్గాలు' ప్రారంభమైన కాలం నించీ, పెట్టుబడి దారీ ఆర్థిక వేత్తలు కూడా కాదనలేని విధంగా చరిత్రలో 'వర్గ పోరాటాలు' నిరంతరంగా సాగుతూనే వున్నాయి - బలం గానో, బలహీనం గానో! పెట్టుబడి దారీ సమాజానికి కూడా ఆ పోరాటం తప్పదు.

ఈ సమాజం ఎంతో తరుచుగా సరుకుల గుట్టల్ని అమ్మలేని సంక్షోభాలకు గురి అవుతోన్నా, దోపిడీ వర్గానికి నష్టం ఏమీ వుండదు. అది ఎలాగో ఒకలాగ సంక్షోభాల నించీ తేరుకుంటూనే వుంటుంది. కొన్ని ఉత్పత్తుల్ని నాశనం చేస్తే మాత్రం దానికి వచ్చే నష్టం ఏముంది? వాటిని అమ్మవలసిన తల నొప్పి తగ్గు తుంది. ఉత్పత్తుల్ని తగలేసే చిట్కాతో అది ఎప్పటి కప్పుడు సంక్షోభాల నించి బయట పడుతూనే వుంటుంది. ఇంకా ఎంత కాలం జరిగినా, ఆ వర్గం, దానికై అది నశించేదేమీ వుండదు - కార్మిక వర్గమే దాన్ని కూల్చకపోతే.

వర్గాలు అనేవి - వర్గాలుగా 'ఉండడం' వేరూ;
వర్గాలుగా వున్నామని 'గ్రహించడం' వేరూ.
మొదటి విషయం - అలా 'ఉండడం'.
రెండో విషయం - అలా ఉన్నామని 'గ్రహించడం'.

వర్గాలు - వెనకటి కాలం నించీ కూడా వున్నాయి. కానీ, వర్గాలుగా వున్నామని తెలియకుండానే, అవి అలా బోలెడు కాలం వున్నాయి.

మనిషికి - తన శరీర నిర్మాణం గురించి 'అనుభవ స్థాయి లోనే' గానీ, 'శాస్త్ర స్థాయిలో' ఏమీ తెలీదు. 'శరీర శాస్త్రాన్ని' ప్రత్యేకంగా నేర్చుకుంటేనే అది తెలుస్తుంది. అలాగే, వర్గాలకు - తమ ఉనికి గురించి అనుభవ స్థాయి లోనే గానీ, 'శాస్త్ర' స్థాయిలో చాలా కాలం వరకూ ఏమీ తెలీదు.

ఒక శ్రామికుడికి, 'నేను ఒక యజమాని దగ్గిర జీతానికి పని చేస్తున్నాను' అన్నంత వరకే తెలుస్తుంది. 'నాకు వచ్చే జీతం, నా శ్రమ విలువ కన్నా ఎంతో తక్కువ. నా అదనపు విలువ యజమానికి పోతోంది. ఈ సంబంధం దోపిడీ సంబంధం. నా లాంటి వాళ్ళం దరూ శ్రమ చేసే వర్గం. యజమానులందరూ శ్రమ చెయ్యని వర్గం. ఈ వర్గాలు వెనకటి కాలం నించీ కూడా వున్నాయి. ప్రభుత్వం అనేది దోపిడీ వర్గ ప్రభుత్వమే. శ్రామిక వర్గం, వర్గ పోరాటం ద్వారా ఈ స్థితి నించి విముక్తి సాధించవలసి వుంటుంది' - ఇదంతా ఈ పద్ధతిలో తెలీదు.

అలాగే, యజమాని వేపు నించి చూస్తే వాడికి కూడా శాస్త్ర విషయాలు తెలీవు. "శ్రామికుల పనికి జీతాలు ఇచ్చేస్తున్నాను. నాకు లాభం ఎక్కడి నించో వస్తోంది" అనుకుంటాడు.

అయితే, వర్గాలకు - వర్గాలుగా వున్నామని తెలి యక పోయినా, ఒక వర్గానికి మితిమీరిన శ్రమా, పేదతనమూ, దాస్యమూ, దుఃఖమూ; ఇంకో వర్గానికి - మితిమీరిన విశ్రాంతీ, సుఖభోగాలూ, యజమాని తనపు అహంకారమూ, సంతోషాలూ, అందుతూనే వుంటాయి. వర్గాలు, గ్రహింపు లేకుండానే, ఆ కష్ట సుఖాల్ని అనుభవిస్తూ వుంటాయి. వాటి మధ్య ఘర్షణలూ పోరాటాలూ సాగుతూనే వుంటాయి. ఆ పోరాటాలు వర్గాల పరిస్థితుల్ని మారుస్తూ కూడా వుంటాయి. ఇదంతా, వర్గాలకు, వర్గాల గురించి స్పష్టత లేని తనం తోనే జరిగిపోతూ వుంటుంది.

వర్గాలు ఇలాంటి స్థితిలో వుండగా, మార్క్సు ద్వారా బయటపడిన 'శ్రమ దోపిడీ సిద్ధాంతం', పెట్టుబడిదారీ వర్గానికి అందినంతగా కార్మిక వర్గానికి అందలేదు. ఈ సిద్ధాంతాన్ని పెట్టుబడిదారీ వర్గం చక్కగానే గ్రహించింది. అప్పటి నించీ ఆ వర్గాని కంతటికీ, తాము దోపిడీ మీదే జీవిస్తున్నామని స్పష్టం

గానే తెలుసు. కానీ, ఆ నిజాన్ని అది పైకి అంగీక రించదు.

ఈ సిద్ధాంతం కార్మిక వర్గంలో అధిక సంఖ్యకి ఈ నాటికీ ఇంకా అందలేదు. అంటే, కార్మిక వర్గానికి వున్న 'వర్గ జ్ఞానం' ఈ నాటికీ 'అనుభవ స్థాయిలో' వున్నదే గానీ, 'శాస్త్ర స్థాయిలో' వున్నది కాదు. కార్మిక వర్గానికి ఇంకా సరియైన 'వర్గ స్పృహ' లేదు. 'వర్గ చైతన్యం' లేదు. అందుకే దాని పోరాటాలు ఇంకా సిద్ధాంత జ్ఞానం లేని, తన గమ్యం గురించి తనకే స్పష్టత లేని, చైతన్య రహిత పోరాటాలు గానే సాగుతున్నాయి. అందుకే పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం ఇంకా చెక్కు చెదరని స్థితి లోనే నిలబడి వుంది.

తన దాస్యానికి కారణాన్నీ, విముక్తికి మార్గాన్నీ వివరించిన మార్క్సిజాన్ని, కార్మిక వర్గం, స్పష్టంగా గ్రహించాలి!

శ్రమ దోపిడీ లేని, వర్గాలు లేని 'నూతన సమాజం' కోసం పోరాడడమే - కార్మిక వర్గ లక్ష్యమూ, గమ్యమూ, ఆదర్శమూ!

ఆ పోరాటం కోసం కార్మిక వర్గానికి ఒక 'రాజకీయ పార్టీ' వుండాలి. అదే - 'కమ్యూనిస్టు పార్టీ!'

మార్క్స్ ఎంగెల్సులు, కార్మిక వర్గ పోరాట మార్గాన్ని "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"లో వివ రించారు. 'ప్రణాళిక'ని, ఈ వాక్యాలతో ముగించారు:

"కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ సాయుధ శక్తితో కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగల వని వారు బహిరంగం గానే ప్రకటిస్తారు.

కమ్యూనిస్టు విప్లవమంటే పాలక వర్గాలను గజగజ వణకనీ!

కార్మికులు పోగొట్టుకునేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప!

వారు పొందవలసింది ఎంతైనా వుంది!

సకల దేశాల కార్మికులారా! ఏకం కండి!"

# శ్రమ సంబంధాలూ - ఆదాయాలూ

**పెట్టుబడిదారీ సమాజంలో మొత్తం జనాభా**

| శ్రామిక వర్గం | స్వతంత్ర ఉత్పత్తిదారులు | కుటుంబ శ్రమల వారు | అలగా శ్రామిక విభాగం | చిన్న పెట్టుబడి దారులు | పెద్ద పెట్టుబడి దారులు |
|---|---|---|---|---|---|
| (V) | (V + S) | x | ? | (V + S; + S) | (S) |

**1. శ్రామిక వర్గం:** ఉత్పాదక, అనుత్పాదక; శారీరక, మేధా శ్రమలు చేసే స్త్రీ పురుషులందరూ ఇందు లోకి వస్తారు. వీరు, యజమానుల కింద సేవకు లుగా వుంటారు. వీరి ఆదాయం - జీతం (V).

**2. స్వతంత్ర ఉత్పత్తిదారులు:** తమకు యజ మానులు లేని, తాము యజమానులుగా లేని స్త్రీ పురుషులందరూ ఈ కోవలోకి వస్తారు. వీరికి, 'వర్గ భేదాలు' వర్తించవు. వీరి ఆదాయం - స్వంత శ్రమ విలువ. వీరు కూడా వర్తక కమిషన్లూ, వడ్డీలూ చెల్లించవలసి వస్తుంది. వీరు చిన్న స్థాయి చేతి వృత్తుల వారి గానూ, చిన్న స్థాయి రైతులు గానూ వుంటారు.

**3. కుటుంబ శ్రమల వారు:** వీరు ప్రధానంగా స్త్రీలే. ఈ శ్రమల్ని స్త్రీలు చేసినా, పురుషులు చేసినా, ఈ శ్రమల్ని, బైటికి అమ్మడం జరగదు కాబట్టి, ఈ శ్రమల ద్వారా ఆదాయాలు రావు. ఈ శ్రమలు చేసే వారి పోషణ, బైట శ్రమలు చేసే కుటుంబ సభ్యుల ఆదాయాల ద్వారా జరగవలసి వుంటుంది. వీరు, పోషణ కోసం ఇతరుల మీద ఆధారపడి వుంటారు కాబట్టి, అది స్వతంత్రతకు ఆస్కారం లేని సంబం ధంగా వుంటుంది. వీరు, కుటుంబ శ్రామికుల్ని నియమించుకోగలిగే వారైతే, ఆ శ్రామికుల మీద యజమానులుగా వుంటారు.

**4. అలగా శ్రామిక విభాగం:** వీరు శ్రామిక వర్గంలో పుట్టి పెరిగే జనాభాయే. వీరు సాధారణ శారీరక శ్రమలు చేయగల శక్తి సామర్థ్యాల తోనే వున్నా శ్రమలు చెయ్యరు. కాబట్టి, శ్రమ చేసే జనాభాగా వుండరు. ప్రధానంగా దోపిడీ వర్గం కోసమూ, తమ స్వంతం కోసమూ, దొంగతనాలూ, హత్యలూ వంటి నేరాలు చేస్తూ వుంటారు. ఈ రకం జనాభా చేసే

పనులు గానీ, వ్యభిచారాల వంటి పనులు గానీ, 'శ్రమల' కోవలోకి చేరవు.

**5. చిన్న పెట్టుబడిదారులు** (పెటీ బూర్జువా): వీరు తమ సరుకు తయారీ కోసం కొంత శ్రమ చేస్తారు. వీరికి యజమానులు వుండరు. వీరే తమ కార్మికుల మీద యజమానులుగా వుంటారు. వీరి ఆదాయం స్వంత శ్రమ విలువా (V + S); కార్మి కుల నించి పొందే అదనపు విలువా (S). వీరు చిన్న స్థాయి పరిశ్రమదారులు గానూ, చేతి వృత్తుల వారి గానూ, చిన్న స్థాయి రైతులు గానూ వుంటారు.

**6. పెద్ద పెట్టుబడిదారులు** (బడా బూర్జువా): సరుకు తయారీకి అవసరమైన శ్రమల్లో వీరు ఏ శ్రమా చెయ్యరు. సరుకు అమ్మకాలకూ, మార్కెట్ల వెతుకు లాటలకూ, ఇతర పెట్టుబడిదారులతో పోటీ లకూ, కార్మికుల్ని అణచడాలకూ - సంబంధించి వీరు చేసే ఆలోచనలూ, ప్రయత్నాలూ, అనుత్పాదక శ్రమల కిందకి కూడా రావు. అయినా వీరు పెద్ద పెద్ద జీతాలూ, సరుకుల ద్వారా వచ్చే 'జనరల్ లాభమూ' తీసుకుంటారు. అందులో నించి కౌళ్ళూ, వడ్డీలూ, వర్తక కమిషన్లూ, పన్నులూ చెల్లిస్తారు. ఈ చెల్లింపు లన్నీ, కార్మికుల S లో భాగాలే.

'వర్తక విభాగాన్ని' తీసుకుంటే, వర్తక శ్రామికులు శ్రామిక వర్గం లోకి వస్తారు. వర్తకుల్లో కూడా స్వంత శ్రమ చేసే స్వతంత్ర వర్తకులూ, పెటీ వర్తకులూ, బడా వర్తకులూ - ఈ తేడాలన్నీ వుంటాయి.

అనాథ శరణాలయాల్లో, మత సంస్థల్లో, జైళ్ళల్లో - ఇలా, ఎక్కడ వున్న జనాభాని గురించి అయినా తేలిగ్గానే వర్గీకరించవచ్చు. సమాజంలో వున్న స్త్రీ పురుషుల్లో ఏ వ్యక్తి అయినా, ఏ విభాగానికి చెందు తారో చూడాలంటే: (1) ఎలాంటి శ్రమ సంబంధంలో వున్నారు? (2) ఆ వ్యక్తి పోషణ ఎటువంటి ఆదాయంతో జరుగుతోంది? - ఈ 2 విషయాల్నీ బట్టి అది వుంటుంది.

# ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!

**వె**నకటి కాలం నించీ ఏ దోపిడీ సమాజాన్ని చూసినా, మనుషులు వేరు వేరు వర్గాలుగా ఏర్పడ డానికి కారణం - శ్రమ దోపిడీయే. అయితే, పెట్టుబడి దారీ సమాజంలో, ఆ కారణంతో పాటు, 'సరుకు విధానం' అభివృద్ధి చెందడమూ, అదనపు విలువ రాసిని దోపిడీ వర్గం 'సమానంగా' పంచుకోవలసి వుండడమూ - అనే కారణం కూడా కలుస్తుంది. అందుకే, శ్రమ చేసే వర్గమూ, శ్రమని దోచే వర్గమూ - అనే 2 వర్గాలూ బానిస సమాజంలో కన్నా, భూస్వామ్య సమాజంలో కన్నా, పెట్టుబడిదారీ సమాజంలో ఎక్కువ కేంద్రీకరించిన రూపాల్లో వుంటాయి. ఎలాగంటే: బానిస సమాజంలో, ఒక బానిస ఇచ్చే అదనపు ఉత్పత్తిని, (లేదా, అదనపు శ్రమని), ఆ బానిసకి యజమాని అయిన వాడు మాత్రమే తింటాడు. (వడ్డీ చెల్లించవలసి వస్తే, అది ఆ అదనంలో నించే.) ఆ 'అదనం'లో ఇతర యజమానులకు వాటాలు వుండవు. అలాగే, కౌలు రైతులు ఇచ్చే అదనపు ఉత్పత్తుల విషయం కూడా. ఆ వెనకటి సమాజాల్లో, ఏ శ్రామికుడి అదనపు శ్రమ, ఆ యజమానికే అందుతుంది. ఒక శ్రామికుడికి, తన స్వంత యజమాని తోటి సంబంధం వుంటుంది.

కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఒక కార్మికుడి అదనపు విలువ, ఆ కార్మికుడి యజమానికే గాక, ఇతర పెట్టుబడిదారులకు కూడా అందుతుంది.లేదా, ఒక యజమానికి, స్వంత కార్మికుల S తో పాటు బయటి కార్మికుల Sకూడా అందుతుంది. ఈ రకంగా ఇక్కడ మొత్తం కార్మికులందరికీ, మొత్తం యజమానులందరి తోటీ సంబంధా లేర్పడతాయి.ఇక్కడ, యజమానీ శ్రామిక సంబంధాలు, ఆ ఇద్దరికే సంబంధించిన విడివిడి సంబంధాలుగా గాక, ఈ వర్గానికీ ఆ వర్గానికీమధ్య ఏర్పడే సంబంధాలుగా వుంటాయి. అంటే, వర్గాలు కేంద్రీకృతమైనట్టు అర్థం.

ఈ విషయం, విడి విడి దేశాలకే గాక ప్రపంచం మొత్తానికి కూడా వర్తిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో దేశాలన్నిటి మధ్యా 'విదేశీ వర్తకం' తప్పనిసరి షరతు. 'ప్రపంచ మార్కెట్టు' లేకపోతే పెట్టుబడిదారీ విధానమే లేదు. ఒక దేశం, ఇంకో దేశానికి సరుకుల్ని అమ్మేటప్పుడు గానీ, కొనేటప్పుడు గానీ, ఒక దేశపు కార్మికుల అదనపు విలువలో కొంత భాగం, ఇంకో దేశపు పెట్టుబడిదారులకు కూడా అందుతుంది.

అంటే, ప్రపంచంలో వున్న మొత్తం పెట్టుబడిదారీ వర్గం, ప్రపంచంలో వున్న మొత్తం కార్మిక వర్గం ఇచ్చే అదనపు విలువని పంచుకుంటుంది. ఈ రకంగా, ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం, ప్రపంచ కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తూ వుంటుంది.

ఒక పెట్టుబడిదారుడు, ఏ దేశంలో ఏ మూల వున్నా, వాడు ప్రపంచ ఉత్పత్తి సంబంధాలలో ఒక విడి వ్యక్తి కాడు. వాడు, ప్రపంచ పెట్టుబడిదారీ వర్గంలో ఒక భాగం. ఒక అణువు.

అలాగే, ఒక కార్మికుడు, ఏ దేశంలో ఏ మూల వున్నా, అతను కూడా ప్రపంచ ఉత్పత్తి సంబంధాలలో ఒక విడి వ్యక్తి కాడు. అతను, ప్రపంచ కార్మిక వర్గంలో ఒక భాగం. ఒక అణువు.

'ప్రపంచ పెట్టుబడి' కి, 'ప్రపంచ శ్రమ శక్తి' - వ్యతిరేకం. ప్రపంచ పెట్టుబడిదారీ వర్గమూ, ప్రపంచ కార్మిక వర్గమూ - పరస్పరం శత్రు వర్గాలు.

పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైన తర్వాత, కార్మిక వర్గానికి గానీ, పెట్టుబడిదారీ వర్గానికి గానీ, 'మాతృ దేశం' అనేది అంతర్ధానమవుతుంది. అది ఎవరికి తగిన అర్థంతో వాళ్ళకు కనపడుతుంది.

పెట్టుబడిదారుడు, ఏ దేశంలో నైనా పెట్టుబడి పెడతాడు. ఏ దేశంలో నైనా ఉత్పత్తి చేయిస్తాడు. ఏ దేశం నించైనా సరుకుల్ని కొంటాడు. ఏ దేశానికైనా సరుకుల్ని అమ్ముతాడు. వాడి దృష్టిలో ఉత్పత్తి రంగమూ, చలామణీ రంగమూ, ఒక దేశానికే పరిమిత మైనవి కావు. ఆ రంగాలు ప్రపంచమంతా విస్తరి స్తాయి. కేవలం ఈ 'లాభ దృష్టి'తో మాత్రమే వాడు 'మాతృ దేశ సంకుచితత్వం' నించి, 'అంతర్జాతీయ విశాలత్వం' లోకి 'ఎదుగుతాడు!'

కానీ, విదేశీ వర్తకానికీ, ప్రపంచంలో ఎక్కడంటే అక్కడ ఉత్పత్తి చేయించడానికీ కావలసినంత పెట్టు బడులూ, సమర్థతలూ ఇంకా సంపాదించని పెట్టుబడి దారుల హృదయాల్ని మాత్రం, ఇంకా 'మాతృ దేశ భక్తి' వదలకుండా వేళ్ళాడుతూ వుంటుంది. వారి హృద యాలు, ఇంకా 'దేశ భక్తి'తో పొంగి పొర్లుతూ వుంటాయి. అలాంటి పెట్టుబడిదారుడికి, తన మాతృ భూమే ప్రపంచంలో కెల్లా 'ఉత్తమ భూమి'! ప్రప చంలో కెల్లా 'పవిత్ర భూమి'! అంతే కాదు, ఆ 'మాతృ దేశ మాత', విదేశ దోపిడీ దుండగీండ్ర పాలబడి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తనని రక్షించమని ఈ పెట్టు బడిదారీ పుత్రుడితో మొరపెట్టుకుంటూ వుంటుంది. అప్పటి నించీ ఈ స్వదేశీ పెట్టుబడిదారీ పుత్రుడు, విదేశీ సరుకుల్ని తమ దేశంలో అమ్మనివ్వకూడదనీ (తమ సరుకుల్ని విదేశాల్లో అమ్మనివ్వవచ్చనీ), విదేశీ పెట్టుబడిదారుల్ని తమ దేశంలో వుండనివ్వకూడదనీ, తన పవిత్ర భూమిని విదేశీ దోపిడీ దుండగీండ్ర బారి నించి రక్షించడానికి తన ప్రాణాలైనా ధార పోస్తాననీ - వగైరా వగైరా ధీరాలాపపు శపథాలు చేస్తాడు. ఈ వీర శూర శపథాల అంతరార్థం ఏమిటంటే, "ఈ దేశ కార్మికుల నుంచి లాగే లాభాలన్నీ నేనే వుంచు కుంటాను, ఇందులో విదేశాల వాళ్ళకి వాటాలివ్వను" అని మాత్రమే. కానీ, ఆ మాట పైకి అంటే బాగుండదు కదా? "ఈ దేశ కార్మికుల్ని నేనే దోచడం కోసం నా ప్రాణాలైనా ఇస్తాను" అనడానికి బదులు, మాటలు కొంచెం మార్చి, "నా మాతృ భూమి రక్షణ కోసం నా ప్రాణాలైనా ఇస్తాను" అంటాడు. 'మాతృ భూమిని రక్షించడం' అన్నప్పుడు, వాడి నిజమైన అర్థం ఏమిటో, వాడికీ మనకీ అందరికీ తెలుసు. ఈ మాతృ భూమిని భక్షించే విదేశీ వాడు చేసేదీ, రక్షించే స్వదేశీ వాడు చేసేదీ, రెండూ ఒకటే కార్యక్రమం. ఆ 'పవిత్ర మాతృ భూమి'లో నివసించే శ్రామిక జనాభాని రాత్రింబవళ్ళూ దోస్తూ, వారిని నిత్య దరిద్రంలో వుంచుతూ, వారి రక్త మాంసాల్నీ సుఖ శాంతుల్నీ లాభాల రాసులుగా మార్చే కార్యక్రమం! ఆ పవిత్ర కర్తవ్యం కోసమే - 'స్వదేశీ .... విదేశీ' మాటల గారడీలతో దోపిడీ దొంగల వీరాలా పాలూ, శపథాలూ, సింహ గర్జనలూ, వగైరాలు అన్నీ!

'మాతృ భూమి' అనే భావాన్ని, సహజ శ్రామిక దృష్టితో చూస్తే, అది, తను పుట్టి పెరిగిన, తన శ్రమకు ఆధారమైన, భూమి మాత్రమే. 'మాతృ దేశాభిమానం' అంటే, తను పుట్టి పెరిగిన, తనకు జీవనాధారమైన ప్రాంతం మీద ఏర్పడే ప్రేమ మాత్రమే.

ప్రతీ మనిషీ, భూమి మీద ఎక్కడో అక్కడ పుట్టి పెరుగుతాడు. పసితనం నించీ చాలా వయసు వరకూ ఒక ప్రాంతానికి అలవాటై పోయి వుంటాడు. అక్కడి మనుషులూ, అక్కడి జంతువులూ, అక్కడి పక్షులూ, అక్కడి చెట్టు చేమలూ, నదులూ, పంటలూ, అక్కడి వాతావరణమూ - వంటి అనేక సహజ విశేషాలతో కూడిన అక్కడి ప్రకృతిలో భాగం అయిపోతాడు. ఆ భూమితో తన శ్రమ సంబంధం ఏర్పర్చుకున్న మనిషికి, ఆ భూమి మీదా, ఆ ప్రకృతి మీదా ఏర్పడే ప్రేమ,

జీవితాంతమూ నిలిచి వుంటుంది.

ఈ దృష్టితో చూసినప్పుడు 'మాతృ భూమి' అనేది, బాల్యం నించీ నివసిస్తూ వుండిన, తనకు తెలిసిన - భూమి మాత్రమే. ఆ ప్రత్యేకత మాత్రమే ఆ భూమికి వుంటుంది. ప్రపంచంలో ప్రతీ మనిషికీ అలాంటి ఆపేక్ష కలిగిన భూమి ఒకటి వుంటుంది. అంత కన్నా ఆ భూమికి, ప్రపంచంలో ఇతర భూములకు లేని గొప్పతనాలేమీ వుండవు. రాజకీయమైన అర్థంతో, కొంత భూమిని 'స్వదేశం'గా బోధించినంత మాత్రాన, ఆ దేశంలో మనుషులకు, ఆ దేశం లోని ప్రతీ ప్రాంతం మీదా ప్రేమ కలగాలని రూలేమీ లేదు. తనకు తెలియనిదీ, తనకు సంబంధం లేనిదీ ఏ భూమి అయినా, అది స్వదేశం లోనే వున్నా, అది 'విదేశం'తో సమానమే.

ఏ మనిషికైనా, 'మాతృభూమి దురహంకారం' లేకుండా 'మాతృ భూమి' వుండవచ్చు - అనేక గృహాల మధ్య తన గృహం తనకు వున్నట్టు. దీనినే వేరే మాటల్లో చెప్తే, 'మాతృ దేశం' వుండవచ్చు; కానీ, 'మాతృ దేశ దురహంకారం' లేకుండా!

ప్రతీ ఒక్క విషయాన్నీ 'సహజ దృష్టితో' గ్రహించ వలసిన కార్మికులకు, ప్రపంచం అంతా ఒకటే. ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం ద్వారా దోపిడీ అవుతోన్న ప్రపంచ కార్మిక వర్గానికి, ఈ కారణం వల్ల కూడా (దోపిడీకి గురి అవడం అనే కారణం వల్ల) ప్రపంచం అంతా ఒకటే. ఈ దృష్టిలో, కార్మికులకు 'స్వదేశం .... విదేశం' అనే మాటలు లేవు; కేవలం ఆ మాటలకు 'మా ఇల్లూ ... మీ ఇల్లూ' అనే రకపు తేడాలు తప్ప.

'దేశం' అంటే సహజమైన అర్థం, 'భూమి మీద ఒక ప్రాంతం' అని మాత్రమే. 'స్వంత ఆస్తి' విధానం లేని ప్రపంచానికి, దేశాల మీద, 'ఆస్తి' హక్కులూ, సరిహద్దుల హక్కులూ, అంతర్ధాన మవుతాయి. కేవలం కొంత జనాభా ఒక ప్రాంతాన్ని నిర్వహించు కోవలసి వుంటుంది - అనే దృష్టితో మాత్రమే, ఒక ప్రాంతానికి సరిహద్దులు అవసరమవుతాయి. అది 'ఆస్తి హక్కు'గా కాదు. కేవలం నిర్వహణ అవసరాల కోసం మాత్రమే. అంటే 'విలువ' దృష్టితో గాక, 'ఉప యోగపు విలువ' దృష్టితో మాత్రమే.

కానీ, ఇక్కడ మనం 'స్వదేశం ... విదేశం' అనే మాటల్ని పెట్టుబడిదారీ అర్థాల తోటే వాడుతున్నాము. అంటే, 'దేశం అంటే రాజకీయంగా ఒక పరిపాలనా ప్రాంతం' అనే అర్థంతో. ఒక దేశం మీద, పెట్టుబడి దారీ వర్గానికీ, దాని ప్రభుత్వానికీ మాత్రమే 'ఆస్తి హక్కు' లాంటి హక్కు వుంటుంది.

మొత్తం ప్రపంచాన్ని చూసేటప్పుడు, మొత్తం ప్రపంచ సరుకుల రాసిని తీసుకోవాలి.

ఈ సంపుటం లోనే, 'పెట్టుబడిదారీ ధర' చాప్టరులో, 'విలువల' గురించీ, 'ధరల' గురించీ, 'జీతాల' గురించీ, చాలా కష్ట భూయిష్టంగా సాగిన అనేక విషయాలు చూశాం. కానీ, చివరికి మొత్తం విషయాన్ని చాలా సింపుల్‌గా చేసుకోవచ్చు. విలువ లెక్కలకు సంబంధించి ఒక సరుకుకి వర్తించే విష యమే 'ప్రపంచ ఉత్పత్తి రాసి'కి కూడా వర్తిస్తుంది. ఒక్క పెట్టుబడిదారుడే యజమానిగా వుండే చిన్న స్థాయి ఉత్పత్తి సంస్థలకు బదులుగా, వేల కొద్దీ పెట్టుబడిదారులు జాయింటుగా పెట్టుబడులు పెట్టే బ్రహ్మాండమైన సంస్థల్లో అయినా విలువ లెక్కల నియమాలేవీ మారవు. ఒక విడి సరుకు విషయంలో గానీ, బ్రహ్మాండమైన సరుకుల రాసి విషయంలో గానీ, మార్కెట్ ధరలో నించి కాస్టుప్రైసుని తీసివెయ్యగా మిగిలేది - 'అదనపు విలువ'. ఈ నియమం, ఎక్కడైనా ఒకటే. ఏ దేశపు ఉత్పాదక శక్తులు ఎలా వున్నా, ఏ దేశపు సరుకుల ధరలు ఎలా వున్నా, ఏ దేశపు వేతనాలు ఎలా వున్నా, ఆ తేడాల సంగతి ఇక్కడ అనవసరం. 'ప్రపంచ ఉత్పత్తి రాసి'కి సంబంధించిన 'మార్కెట్ ధరల మొత్తం'లో నించి, 'కాస్టుప్రైసుల మొత్తం' పోగా, మిగిలేది 'ప్రపంచ అదనపు విలువ'! దీన్ని ప్రపంచ దోపిడీ వర్గం అంతా ఆరగిస్తూ వుంటుంది!

పెట్టుబడిదారీ విధానం 'అభివృద్ధి' చెందుతూ, దేశాల మధ్య వర్తక సంబంధాలూ పెట్టుబడుల సంబంధాలూ అభివృద్ధి చెందుతూ వున్న కొద్దీ, ప్రపంచ కార్మికులు ఏకం కావలసిన అవసరం కూడా పెరు గుతూ వుంటుంది. కార్మికులు ఏకం కావడం అంటే, ఒక దేశపు కార్మికుల పోరాటాలకు, ఇతర దేశాల కార్మికులు సహకరించడమే. ఆ రకం గానే కార్మికులు ఏకం కాగలుగుతారు.

'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' నించి కొన్ని మాటలు:

"కమ్యూనిస్టులు, దేశాలనూ జాతులనూ రద్దు చేయగోరుతున్నారని మరొక నింద కూడా వుంది.

కార్మికులకు దేశం అనేది లేదు. కాబట్టి వాళ్ళకు లేని దాన్ని ఎవరూ లాక్కోలేరు. కార్మిక వర్గం, ప్రప్రథమంగా రాజకీయ ఆధిపత్యం సంపాదించుకొని, తన జాతిలో తను ప్రధాన వర్గంగా అభివృద్ధి చెంది, జాతి అంటే తానే అనే స్థితికి రాక తప్పదు. కనుక, ఆ మేరకు కార్మిక వర్గమే జాతీయమైనది. కానీ, ఈ మాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాదు ... కార్మిక వర్గ విముక్తికి గల ఒక ముఖ్య షరతు యేమంటే, వివిధ దేశాల కార్మికులు సమైక్యంగా కృషి చేయడం ...." ['సంకలిత రచనలు' - 1, మాస్కో ఎడిషన్, పేజీ 65]

"కమ్యూనిస్టు విప్లవమంటే పాలక వర్గాలు గజగజ వణకనీ!

కార్మికులు పోగొట్టుకునేదేమీ లేదు, తమ శృంఖలాలు తప్ప!

వాళ్ళు గెలుచుకోవలసింది ఒక ప్రపంచం వుంది!

సకల దేశ కార్మికులారా, ఏకం కండి!" [పే. 81]

**వర్గాలూ, రాజ్యాంగ యంత్రమూ, కార్మిక వర్గ పోరాటమూ - వంటి విషయాల గురించి, మార్క్సు ఎంగెల్సుల నించి కొన్ని కొటేషన్లు ఇవి!**

1. "సమాజం ఎల్లప్పుడూ వైరుధ్యం అనే చట్రం లోనే పరిణామం చెందుతూ వచ్చింది. ప్రాచీన కాలంలో వైరుధ్యం - స్వేచ్ఛా మానవుడికీ, బానిసకీ మధ్యా; మధ్య యుగాలలో - ప్రభువుకీ, అర్థ బానిసకీ మధ్యా; ఆధునిక కాలంలో - బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్యా" - మార్క్సు

[జర్మన్ ఐడియాలజీ, పేజీ 457, మాస్కో 1976]

2. "ప్రతీ వర్గమూ, తన పైన వున్న వర్గానికి వ్యతిరేకంగా పోరాటం ఒక సారి ప్రారంభించిందీ అంటే, తన కింద వున్న వర్గానికి వ్యతిరేకంగా కూడా పోరాటంలో తగుల్కుంటుంది.

చక్రవర్తిత్వానికి వ్యతిరేకంగా - రాజులూ,

(ప్రిన్సెస్ ఎగెనెస్ట్ ది మొనార్కీ),

రాజ వంశీయులకు వ్యతిరేకంగా - ప్రభుత్వ నిరంకుశాధికారులూ,

(బ్యూరో క్రాట్స్ ఎగెనెస్ట్ ది నొబిలిటీ),

వీళ్ళందరికీ వ్యతిరేకంగా - బూర్జువా వర్గమూ!

బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా - కార్మిక వర్గం, ఇప్పటికే పోరాటం ప్రారంభించింది" - మార్క్సు ఎంగెల్సులు [కలెక్టెడ్ వర్క్సు - 3, పేజీ 185 - 86]

3. "పెట్టుబడికి - లాభమూ (వడ్డీ + లాభమూ)

భూమికి - కౌలూ

శ్రమకు - వేతనాలూ

ఈ సూత్ర త్రయం (ట్రినిటీ ఫార్ములా) 'సామాజిక ఉత్పత్తి క్రమానికి సంబంధించిన సమస్త రహస్యాల్నీ కలిగి వుంది" - మార్క్సు [కాపిటల్ - 3, పేజీ 814]

4. "బూర్జువా సమాజం - ఉత్పత్తి విధానానికి సంబంధించి, అత్యంత అభివృద్ధి అయినటువంటీ (డెవలప్డ్), బహు ముఖాలు కలిగినటువంటీ చారిత్రక నిర్మాణం. దాని సంబంధాలను వ్యక్తం చేసేటటువంటి అవగాహనాంశాలు (కేటగిరీస్), సమాజపు అన్ని పాత రూపాల లోని ఉత్పత్తి సంబంధాలనూ స్వరూపాల్నీ గ్రహించడానికి కావలసిన దృష్టిని సమకూర్చుతాయి. ... 'కౌలు'ని అర్థం చేసుకుంటేనే, కప్పమూ, టితే (చర్చికి, రైతులు చెల్లించే భాగము) వంటి వాటిని అర్థం చేసు కోగలము. అయితే, వాటిని ఒకే విధంగా భావించ కూడదు" - మార్క్సు

[కలెక్టెడ్ వర్క్సు - 28, పేజీ 42]

5. "బూర్జువా ఆర్థిక వ్యవస్థను నేను ఈ వరసలో పరిశీలిస్తాను. పెట్టుబడీ, భూమి ఆస్తీ, వేతన శ్రమా, రాజ్యాంగ యంత్రమూ, విదేశీ వర్తకమూ, ప్రపంచ మార్కెట్టూ! ఆధునిక బూర్జువా సమాజపు 3 పెద్ద వర్గాల ఆర్థిక పరిస్థితులను, మొదటి 3 శీర్షికల కింద విశ్లేషించడం అయింది" - మార్క్సు, [కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ; పేజీ 19, మాస్కో 1970]

6. " ... ఈ పోటీకి మరో పర్యవసానం ఏమిటంటే - 'భూమి ఆస్తి'లో అధిక భాగం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తుంది. ఆ విధంగా, పెట్టుబడిదారులు, భూమి యజమానులు కూడా అవుతారు. అదే విధంగా పెద్ద భూస్వాముల్లో ఒక సెక్షను, పారిశ్రామిక వేత్తలు అవుతారు. దీని పర్యవసానం - పెట్టుబడిదారుడికీ భూస్వామికీ మధ్య తేడా, రద్దవుతుంది. ఆ విధంగా, మొత్తం మీద, జనాభాలో రెండే రెండు వర్గాలు వుంటాయి. కార్మిక వర్గమూ, పెట్టుబడిదారీ వర్గమూ" - మార్క్సు [ఎకనామిక్ అండ్ ఫిలసాఫిక్ మాన్యుస్క్రిప్టు ఆఫ్ 1844; పేజీ 50; మాస్కో, 1974]

7. "ఆధునిక పరిశ్రమ వచ్చిన తర్వాత, పాత కాలపు యజమానులు నడిపే చిన్న కార్ఖానాలు పోయి, వాటి స్థానంలో పారిశ్రామిక పెట్టుబడిదారులు నడిపే బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలు వచ్చినాయి. గుంపులు గుంపులుగా ఫ్యాక్టరీ లోపల చేరిన కార్మిక సమూహాలను సైనిక దళాల మాదిరి వ్యవస్థీకరిస్తారు. 'కార్మిక సైన్యం' లోని ఈ సిపాయీల మీద, అచ్చం సైన్యంలో లాగే, సార్జెంట్లు కమాండర్లూ మొదలైన అధికార్లు, తర తమ శ్రేణుల్లో వుంటారు. ఈ కార్మికులు, కేవలం బూర్జువా వర్గానికీ, బూర్జువా రాజ్యానికీ మాత్రమే బానిసలు కారు; వీళ్ళు ప్రతి రోజూ, ప్రతీ గంటా, యంత్రానికి బానిసలు, తనిఖీ చేసే మేస్త్రీకి బానిసలు, అన్నిటినీ మించి బూర్జువా యజమానికి బానిసలు. ఈ నిరంకుశత్వం, 'లాభమే తన ఏకైక లక్ష్యమ'ని ఎంత బాహాటంగా ప్రకటించుకుంటుందో, అంత నీచం గానూ, అంత ద్వేష పాత్రం గానూ, అంత కసి కలిగించేది గానూ తయారౌతుంది." - మార్క్స్ ఎంగెల్సులు [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, సంకలిత రచనలు - 1వ సంపుటి, పేజీ 53]

8. "అది (బూర్జువా సమాజం) డాక్టర్నీ, లాయర్నీ, మత గురువునీ, కవినీ, శాస్త్రవేత్తనీ, వేతన శ్రామికులుగా మార్చివేసింది" - మార్క్స్, ఎంగెల్సులు. [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, ... పేజీ 36]

9. 'జనాభా'లో వర్గాల ఉనికిని చూడనట్టయితే అప్పుడు 'జనాభా' అనేది అస్పష్ట విషయం (యాబ్‌స్ట్రాక్షన్). అలాగే, వర్గాలనేవి, ఏ అంశాల మీద ఏర్పడతాయో (ఉదా॥ వేతన శ్రమా, పెట్టుబడీ మొదలైనవి) ఆ అంశాలను గ్రహించకపోతే, 'వర్గాలు' అనేవి శుష్క పదాలు" - మార్క్స్ [కలెక్టెడ్ వర్క్స్ - 28, పేజీ 37]

10. "కేంద్రీకృతమైన రాజ్యాధికారం అంటే - స్థిర సైన్యమూ (స్టాండింగ్ ఆర్మీ), పోలీసూ, ప్రభుత్వ నిరంకుశాధికార వర్గమూ (బ్యూరోక్రసీ), మతాధికారులూ (ప్రీస్టు), న్యాయ వ్యవస్థా (జ్యూడికేచర్) - ఈ అన్ని సర్వ వ్యాపిత అంగాల తోనూ కలుపుకుని వున్న అధికారం. (ఈ అంశాలు క్రమబద్ధం గానూ, అంతస్తుల వారీ గానూ వుండే శ్రమ విభజనా పథకంతో నిలిచినవి). ఈ అధికారం, సంపూర్ణ చక్రవర్తిత్వపు రోజుల నించీ పుట్టుకొచ్చినటువంటిది" - మార్క్స్ [సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్, పేజీ 50, మాస్కో 1974]

11. "రాజ్యాంగ యంత్రం అనేది - దోపిడీకి గురయ్యే వర్గాలైన రైతులకూ, కార్మికులకూ వ్యతిరేకంగా వుండే ఆస్తి పర వర్గాలైన భూమి యజమానుల, పెట్టుబడిదారుల సంఘటిత సమిష్టి శక్తి తప్ప ఇంకేమీ కాదు" - ఎంగెల్స్ [ ది హౌసింగ్ క్వొశ్చెన్, పేజీ 67, మాస్కో, 1975]

12. "ఆధునిక రాజ్యంలో 'ప్రభుత్వం' అనేది, మొత్తం బూర్జువా వర్గపు సమిష్టి వ్యవహారాలు చక్క బెట్టే కమిటీ మాత్రమే" - మార్క్స్ ఎంగెల్సులు [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ 48]

13. "అది (పబ్లిక్ పవర్ = ప్రభుత్వాధికారం) కేవలం సైనికంగా మాత్రమే వుండదు. జైళ్ళూ, ఇంకా అన్ని రకాల బలప్రయోగ సంస్థలూ, దానికి తోడుగా వుంటాయి. వర్గ వైరుధ్యాలు అంతగా అభివృద్ధి చెందని సమాజాలలో ఇవి చాలా అప్రధానం గానూ, స్వల్పం గానూ వుండవచ్చును ... అవి బలపడిన కొద్దీ, వాటిని మెయిన్‌టైన్ చేయడానికి పౌరుల నించి విరాళాలు, అంటే పన్నులు, అవసరమవుతాయి. నాగరికత పురోగమించిన కొద్దీ, ఈ పన్నులు సరిపోకుండా అవుతాయి; ప్రభుత్వం పబ్లిక్ నించి అప్పులు చేస్తుంది" - ఎంగెల్స్ [ఆరిజిన్ ఆఫ్ ఫేమిలీ, ప్రైవేట్ ప్రోపర్టీ, అండ్ స్టేట్, పేజీ 167-8]

14. "తను పాలించడం మొదలు పెట్టేవరకూ, బూర్జువా, విప్లవకరం గానే వుంటాడు" - ఎంగెల్స్. [కలెక్టెడ్ వర్క్స్-6, పేజీ 80; మాస్కో 1976]

15. "కార్మిక వర్గానికి అనుకూలంగా వున్న పరిస్థితి కూడా, అంటే పెట్టుబడికి అత్యంత వేగవంతమైన పెరుగుదల సాధ్యమయ్యే అనుకూల పరిస్థితి కూడా ... కార్మికుడి భౌతిక వునికిని గతంలో కన్నా మెరుగు పర్చినప్పటికీ, అది కార్మిక ప్రయోజనాలకూ, బూర్జువా ప్రయోజనాలకూ మధ్య శతృత్వాన్ని తీసివెయ్యదు. అప్పుడు కూడా లాభమూ, జీతాలూ మునుపటి లాగే ఇన్‌వర్స్ పాళ్ళల్లో వుంటాయి. పెట్టుబడి వేగంగా పెరిగినట్టయితే జీతాలు కూడా పెరగవచ్చు; కానీ 'పెట్టుబడి'కి లాభం, జీతంలో పెరుగుదలతో పోల్చడానికి వీలులేనంత ఎక్కువగా పెరుగుతుంది. కార్మికుడి భౌతిక పరిస్థితి మెరుగైంది; కానీ కార్మికుడి సాంఘిక స్థితిని ఫణంగా పెట్టి, అది జరుగుతుంది. పెట్టుబడిదారుడి నించి అతన్ని వేరు పరిచే సామాజిక అగాధం (గల్ఫ్) విస్తృతమైంది" - మార్క్స్. [కలెక్టెడ్ వర్క్స్ - 9, పేజీ 221]

16. " రెలెటివ్ అదనపు జనాభా తాలూకు అట్ట డుగు మడ్డి, బికారితనం (పాపరిజం) పరిధిలో నివ సిస్తుంది. ప్రత్యేకంగా, దేశ దిమ్మరులూ, నేరస్తులూ, వేశ్యలూ, ఒక్క మాటలో చెప్పాలంటే - ఈ 'ప్రమాద కర' వర్గాలు. సమాజం లోని ఈ పొరలో, 3 రకాల వాళ్ళు వున్నారు.

మొదటి రకం - పని చెయ్యగలిగిన వారు. ఇంగ్లండు లోని లెక్కల్ని కేవలం పైపైన మాత్రమే చూసినా కనిపించేదేమిటంటే - ప్రతీ సంక్షోభం లోనూ బికారుల సంఖ్య పెరిగి పోవడమూ, మళ్ళీ వర్తకం తేరుకునే రివైవల్ పీరియడ్‌లో ఆ సంఖ్య కొంత తగ్గడమూ చూడవచ్చు.

రెండో రకం - నిరుపేదలూ, అనాధలూ అయిన పిల్లలు. వీరు పారిశ్రామిక రిజర్వ్ సైన్యానికి భవిష్యత్ అభ్యర్ధులు. వర్తకాభివృద్ధి గల ప్రాస్పరిటీ కాలాల్లో, ఉదా॥ 1860లో లాగా, వీరు, పని చేసే కార్మిక సైన్యంలో జమ అవుతారు.

మూడో రకం - నైతికంగా దెబ్బతిన్న వారూ, అత్యంత బికారులూ (డీమోరలైజ్డ్ అండ్ రాగ్డ్). అంతే గాక ఇంకా - పని చేయలేని వారూ, ముఖ్యంగా 'శ్రమ విభజన' వల్ల కొత్త పరిస్థితులకు తగిన విధంగా మార లేని అసామర్ధ్యానికి బలైన వారూ; వయసు మీరిన వారూ; గనులూ, రసాయన పరిశ్రమలూ మొదలైన వాటిల్లో ప్రమాదకరమైన యంత్రాల వల్ల అంగ వైకల్యం పొందిన వారూ, రోగాల పాలైన వారూ, భర్తలు పోయిన స్త్రీలూ, తదితర 'పారిశ్రామిక' బాధి తులూ - వగైరా జనాలు.

'రెలెటివ్ అదనపు జనాభా' ఉత్పత్తి లోనే, దీని (పాపరిజం = బికారితనం) ఉత్పత్తి కూడా ఇమిడి వుంటుంది. ' అదనపు జనాభా'తో పాటుగా పాపరిజం కూడా, పెట్టుబడిదారీ విధానానికీ, దాని సంపద అభి వృద్ధికీ ఒక తప్పనిసరి షరుతుగా (కండిషన్) వుంటుంది."

మార్క్స్ [కాపిటల్ - 1, పేజీ 602-3]

17. "దేశ దిమ్మరుల్లాగా తిరిగే పరిస్తితి (వేగ బాండేజీ) అనేది, ఖచ్చితంగా ఫ్యూడల్ విధాన పత నంతో ముడిపడి వున్నదనేది స్పష్టం. 13 వ శతాబ్దంలో ఈ రకపు పరిస్తితి అక్కడక్కడా మాత్రమే వుండేది. కానీ, 15 వ శతాబ్దం చివరి నాటికీ, 16 వ శతాబ్దపు ప్రారంభం నాటికీ, దేశ దిమ్మరితనం సర్వసాధార ణమూ, స్థిరమూ అయిపోయింది. ఈ బికారులైన దేశ దిమ్మరులు ఎంత ఎక్కువగా వుండినారంటే, ఉదా: ఇంగ్లండులో రాజు 8 వ హెన్రీ, 72 వేల మంది బికారులను ఉరితీయించినాడు! ... మాన్యుఫాక్చర్ విధానం పెరగడం వల్ల, ముఖ్యంగా ఇంగ్లండులో, క్రమంగా అందర్నీ పనిలో ఇముడ్చుకోవడం సాధ్య మైంది" - మార్క్స్, ఎంగెల్సులు [జర్మనీ ఐడియాలజీ, పేజీ 77]

(తర్వాత కాలంలో 'ఆధునిక భారీ పరిశ్రమ' మళ్ళీ అసంఖ్యాక శ్రామిక జనాల్ని కొత్త బికారులు గానూ, కొత్త దేశ దిమ్మరులు గానూ మార్చేసిందనుకోండీ!)

18. "సమాజం లోని ఇతర పొరలను - రాజు లనూ, రాజోద్యోగులనూ, ప్రభువులనూ, మత గురువు లనూ, పాలక వర్గీయులనూ, పట్టణ వాసులనూ - భరించింది - రైతు. రైతు ఎవరి కింద వుండినా సరే, రాజు కింద, సామ్రాజ్య ప్రభువు కింద, బిషప్ కింద, మఠం కింద, పట్టణం కింద, ఎవరి కింద వుండినా - అతన్ని ఒక వస్తువుగా, పని చేసే పశువుగా, ఇంకా హీనంగా కూడా చూసే వాళ్ళు. అతను ఫ్యూడల్ బానిస అయితే, ఒప్పందంలో నిర్ణయింపబడిన చట్ట బద్ధమైన సుంకాలు అతన్ని నలిపి వేయడానికి సరి పోయేవి; అయినా అవి రోజూ పెంచబడేవి. అతని కుండిన సమయంలో అత్యధిక భాగం, అతను తన ప్రభువు ఎస్టేటులో పని చేయవలసి వుండింది. మిగిలిన కొద్ది గంటలలో అతను సంపాయించుకున్న దాని నుండి అతను ఆదాయపు పన్నులూ, సుంకాలూ, భూమి శిస్తూ, రాజు కోసం పన్నులూ, రోడ్డు (యుద్ధ) పన్నులూ, స్థానిక పన్నులూ, సామ్రాజ్య పన్నులూ, చెల్లించవలసి వుండింది. ప్రభువుకు సుంకం కట్ట కుండా అతను పెండ్లాడనూ లేడు, మరిణించనూ లేడు. శాసన నియమిత శ్రమ కాక, అతను తన ప్రభువు కొరకు చెత్త ఊడ్వడమూ, స్ట్రాబెర్రీలూ, బిల్ బెర్రీలూ యేరడమూ, నత్త గుల్లలు పోగుచేయడమూ, వేటలో జంతువులను తోలడమూ, కట్టెలు చీల్చ డమూ, వగైరా పనులు చేయవలసి వుండింది. చేపలు పట్టడమూ, వేటాడడమూ, యజమాని హక్కు. వన్య మృగాలు తన పైరు నాశనం చేస్తూ వుంటే, రైతు, ప్రశాంతంగా నిలబడి చూస్తూ వుండవలసిందే. రైతుల సమిష్టి పచ్చిక బీళ్ళూ, అడవులూ దాదాపు ప్రతి చోటా ప్రభువు సొంతపరుచుకున్నాడు. ఇక ప్రభువు, రైతు

ఆస్తి మీద రాజ్యం చేసినట్టే, రైతు శరీరం మీదా, అతని భార్య మీదా, కూతుళ్ళ మీదా, యథేచ్ఛగా రాజ్యం చేసేవాడు. ప్రభువుకు, ప్రథమ రాత్రి హక్కు వుండింది. అతను తనకు ఇష్టం వచ్చినప్పుడు రైతును జైలులో నిర్బంధించే వాడు; మన కాలంలో, అరెస్టు అయిన వాళ్ళ కొరకు దర్యాప్తు చేసే అధికారి యెదురు చూసినంత తప్పనిసరిగా, అక్కడ రైతు కొరకు 'చిత్రహింసా యంత్రం' యెదురు చూసేది. తనకు ఇష్టం వచ్చినప్పుడు అతను రైతును కొట్టేవాడు, లేదా తల నరికించే వాడు. "చెవులు కత్తిరించడం", "ముక్కు కోయడం", "కనుగుడ్లు పెరికి వేయడం", "వ్రేళ్ళూ, చేతులూ ఖండించడం", "తల నరకడం", "చక్రాల మీద హింసించడం", "కాల్చడం", "కాలే ఇనుప కడ్డీలతో వాతలు పెట్టడం", "నాలుగు భాగాలుగా నరకడం" - వగైరాలలో, ఐదవ చార్లెస్ రాజు, శాసనం లోని జ్ఞానదాయకమైన ప్రకరణాలలో దయా సముద్రుడూ, ఉపకారీ అయిన ప్రభువు గారు, తన చిత్తం వచ్చినప్పుడు ఉపయోగించనిది ఒక్కటి కూడా లేదు" - ఎంగెల్స్ ['జర్మనీలో రైతు యుద్ధం', పేజీ - 45-6, మాస్కో]

19. "ప్రతీ ఒక్కరూ పని చెయ్యాలి - అన్నట్టయితే, అంటే - మితిమీరిన శ్రమ చేసే వారికీ, ఏ శ్రమా చెయ్యని సోమరులకూ మధ్య వుండే వైరుధ్యం అదృశ్యం కావాలి - అనేటట్టయితే, ఇది, 'పెట్టుబడి' వునికిలో లేకుండా అదృశ్యం అయ్యే దాని పర్యవసానంగా మాత్రమే వుంటుంది .... దీనికి తోడు, పెట్టుబడిదారీ విధానం తెచ్చిన ఉత్పాదక శక్తుల అభివృద్ధిని లెక్కలోకి తీసుకున్నట్టయితే, సమాజం, ఇప్పుడు 12 గంటల్లో ఉత్పత్తి చేసే దాని కన్నా ఎక్కువ గానే అప్పుడు 6 గంటల లోనే ఉత్పత్తి చేస్తుంది. అందరికీ 6 గంటల విరామ కాలం. (డిస్పోజబుల్ టైమ్) దొరుకుతుంది. ఈ టైము, ఉత్పాదక శ్రమలోకి వెళ్ళదు. ఈ టైము, ఎంజాయ్‌మెంటుకీ, విశ్రాంతికీ అందుబాటులో వుంటుంది. ఈ కాలం ఇష్టమైన కార్యక్రమాలకూ, అభివృద్ధికీ అవకాశం ఇస్తుంది. టైము అనేది, మనిషి శక్తుల అభివృద్ధికి వీలునిస్తుంది" - మార్క్స్ [అదనపు విలువ సిద్ధాంతాలు-3, పేజీ 256].

20. "'శ్రమ', విముక్తి చెందినప్పుడు, సమాజంలో ప్రతీ మనిషీ శ్రమ చేసే మనిషే అవుతాడు. అప్పుడు, 'ఉత్పాదక శ్రమ'కు వుండే వర్గ స్వభావం ఆగిపోతుంది" - మార్క్స్ [సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్, పేజీ 57, మాస్కో 1974]

21. "ఆధునిక సమాజంలో వర్గాల ఉనికి గురించి గానీ, వాటి పోరాటం గురించి గానీ కని పెట్టడంలో, నా ప్రత్యేకత లేదు. చాలా కాలం కిందటే, వర్గ పోరాటపు చారిత్రకాభివృద్ధిని బూర్జువా చరిత్ర కారులూ, వర్గాల ఆర్థిక నిర్మాణాన్ని బూర్జువా ఆర్థిక వేత్తలూ, చిత్రించారు. నేను, (వర్గాలకు సంబంధించి) కొత్తగా చేసిందేమిటంటే, ఈ విషయాలు చూపడం:

(1) వర్గాల వునికి, ఉత్పత్తి విధానపు అభివృద్ధి లోని ప్రత్యేక చారిత్రక దశలతో ముడిపడి వుంటుందనీ, (2) 'వర్గ పోరాటం' తప్పనిసరిగా, 'శ్రామిక వర్గ నియంతృత్వానికి దారి తీస్తుందనీ, (3) ఈ నియంతృత్వం - అన్ని వర్గాల రద్దుకీ, అంటే వర్గరహిత సమాజానికి, 'పరివర్తనా దశ'గా మాత్రమే వుంటుందనీనూ" - మార్క్స్ [మార్క్స్, ఎంగెల్స్ సెలెక్టెడ్ కరస్పాండెన్స్, పేజీ 64, మాస్కో, 1975].

22. "....... అది (బూర్జువా వర్గం), తన వర్గపు అదనపు జనాభాకి, కావలసిన పదవుల్ని (పోస్టు) పొంది, లాభమూ - వడ్డీ - కౌలూ - గౌరవ వేతనాలూ (ఆనరోరియమ్స్) - వంటి రూపాల్లో జేబులో వేసుకోలేని దాన్ని, రాజ్యాంగ జీతాల (స్టేట్ శాలరీస్) రూపంలో పొందుతుంది" - మార్క్స్ [ది ఎయిటీన్త్ బ్రూమేర్ ఆఫ్ లూయీ బొనపార్ట్, పేజీ 51, మాస్కో 1972].

23. "పన్నులు అనేవి - ప్రభుత్వ అధికార వర్గానికీ, సైన్యానికీ, మత గురువులకూ, కోర్టులకూ .... క్లుప్తంగా చెప్పాలంటే, నిర్వహణాధికారాన్ని (ఎగ్జిక్యూటివ్ పవర్) నెరిపే మొత్తం యంత్రాంగానికంతటికీ జీవనాధారాలుగా వుంటాయి" - మార్క్స్ [... బ్రూమేర్ ... పేజీ 110]

24. "ఉన్నత శ్రేణి ఉద్యోగులు (హయ్యర్ గ్రేడ్ వర్కర్స్) అనే వాళ్ళల్లో - అంటే, ప్రభుత్వాధికారులూ, మిలటరీ వాళ్ళూ, కళాకారులూ, డాక్టర్లూ, మత గురువులూ, జడ్జీలూ, లాయర్లూ మొదలైన వాళ్ళల్లో కొందరికి - వస్తు రూపంలో వుండని తమ సరుకుల్ని కొంత వరకూ అమ్మడం ద్వారానూ; కొంత వరకూ బలవంతంగా రుద్దడం ద్వారానూ, సమాజపు భౌతిక సంపదలో చాలా భాగాన్ని లాగెయ్యడ మెలాగో బాగా తెలుసు ....... నిజమైన ఉత్పత్తిదారుల మీదబడి బతికే

పరాన్న భుక్కులు వీరు (పేరసైట్స్)" - మార్క్స్. [అదనపు విలువ సిద్ధాంతాలు - 1, పేజీ 174 - 75, మాస్కో, 1975]

25. "పాలక వర్గం, తను పాలించే వర్గం లోని మేధావుల్ని ఎంత ఎక్కువగా నైతే తనలో ఇముడ్చు కుంటుందో, అంత ఎక్కువ స్థిరం గానూ, అంత ఎక్కువ ప్రమాదకరం గానూ, దాని పాలన తయా రవుతంది." - మార్క్స్ [కాపిటల్ - 3, పేజీ 601.]

26. "బూర్జువా వర్గం ఏ ఆయుధాలతో ఫ్యూడ లిజాన్ని నేలకూల్చిందో ఆ ఆయుధాలు ఇప్పుడు బూర్జువా వర్గం మీదకే ఎత్తబడినాయి. కానీ, బూర్జువా వర్గం సృష్టించింది తనని నాశనం చేయగల ఆయు ధాలను మాత్రమే కాదు; ఆ ఆయుధాలను ధరించే మనుషులను కూడా! ఆ మనుషులే - 'ఆధునిక కార్మిక వర్గం'" - మార్క్స్, ఎంగెల్సులు [.... సంకలిత రచనలు - 1, పేజీ 52]

27. "బూర్జువాలలో పోటీలు పెరగడం వల్లా, తత్ఫలితంగా ఏర్పడే వాణిజ్య సంక్షోభాల వల్లా, కార్మికుల వేతనాలు మరింత ఎగుడు దిగుడులకు గురౌతాయి; యంత్రాలలో అంతకంతకూ వేగంగా జరిగే నిరంతరాభివృద్ధి వల్ల, వాళ్ళ జీవనాధారాలు అంతకంతకూ నమ్మలేనివౌతాయి. విడి విడి కార్మికులకూ, విడి విడి బూర్జువాలకూ మధ్య జరిగే ఘర్షణలు, రాను రానూ రెండు వర్గాల మధ్య జరిగే పోరాటాలుగా పరిణమిస్తాయి. అప్పుడు బూర్జువాలకు వ్యతిరేకంగా కార్మికులు ట్రేడ్ యూనియన్ల సమ్మేళ నాలు ఏర్పర్చుకోవడం ప్రారంభిస్తారు. తమ వేతనాల స్థాయిని నిలబెట్టుకోవడానికి అందరూ ఏకమౌతారు. అప్పుడప్పుడూ జరిగే ఈ తిరుగుబాట్లకు ముందుగానే సిద్ధంగా వుండడానికి శాశ్వత సంఘాలు ఏర్పరచు కుంటారు. ఈ పోరాటాలు అక్కడక్కడా కొట్లాటలుగా పరిణమిస్తాయి. అప్పుడప్పుడూ కార్మికులకు విజయం లభిస్తుంది. కానీ, అది తాత్కాలికమే. ఆ యుద్ధాల వల్ల వాళ్ళకు కలిగే నిజమైన లాభం, తక్షణ ఫలితా లలో వుండదు. నిత్యం విస్తరించే కార్మిక వర్గ ఐక్యతే నిజమైన ప్రయోజనం. ..... కార్మికులు ఒక వర్గంగా సంఘటిత పడడమూ, తత్పర్యవసానంగా ఒక 'రాజకీయ పార్టీ'గా సంఘటిత పడడమూ అనేది, కార్మికులకు వాళ్ళలో వాళ్ళకే వున్న పోటీ వల్ల నిరం తరం తల్లక్రిందులవుతూ వుంటుంది. కానీ ఇది మళ్ళీ పైకి లేస్తుంది. మరింత బలం గానూ, మరింత స్థిరం గానూ, మరింత ప్రచండం గానూ ముందుకు సాగు తుంది" - మార్క్స్, ఎంగెల్సులు. [ సంకలిత రచనలు - 1, పేజీ 54, 55]

28. "ఉత్పత్తి విధానంలో వున్న పెట్టుబడిదారీ స్వభావాన్ని, దేనినైతే పెట్టుబడిదారీ వర్గం కొనసాగిస్తూ వుండాలని చూస్తుందో దానిని, తొలగించి వెయ్య డానికి కార్మిక వర్గం అకుంఠిత దీక్షతో పోరాడుతుంది" - మార్క్స్ [గోథా ప్రోగ్రాం, పేజీ 19, మాస్కో 1971]

29. "కార్మికులకు భద్రపరుచుకోవడానికీ, పదిల పరుచుకోవడానికీ ఏమీ లేదు; వాళ్ళ జీవిత లక్ష్యం, సొంత ఆస్తికి గతంలో వున్న సకల భద్రత లనూ, సకల రక్షణలనూ, ధ్వంసం చేయడమే. ....... సమాజంలో అట్టడుగు పొర అయిన కార్మిక వర్గం కదలాలంటే, లేచి నిలబడాలంటే, తన మీద వున్న అధికార సమాజపు పై పొరలన్నిటినీ మొత్తంగా ఆకాశం లోకి ఎగరగొట్టక తప్పదు. బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే వాటిల్లోకెల్లా ముఖ్యమైనదేమంటే, తనకే మారకమైన వాళ్ళు.

బూర్జువా వర్గ పతనమూ అనివార్యమే.
కార్మికవర్గ విజయమూ అనివార్యమే"

- మార్క్స్, ఎంగెల్సులు [ సంకలిత రచనలు - 1, పేజీ 57, 58]

# ప్రశ్నలూ - జవాబులూ

1. **వర్గాలు - అంటే ఏమిటి? వేరు వేరు తరగతులా? పక్షాలా? బృందాలా?**

**జ:** వాటికి ఏ పేరైనా పెట్టవచ్చు. ఆ పేరుకి ఏం అర్థం ఇస్తున్నామనేది ముఖ్యం. 'వర్గాలు' అనే మాటకి మనం ఇచ్చే అర్థం - శ్రమ చేసే వాళ్ళూ, శ్రమ చెయ్యని వాళ్ళు - అని. అర్థం అదే అయితే, 'వర్గాల'నే మాటకు బదులు ఏ మాటైనా పెట్టుకో వచ్చు. 'పక్షాలు' అనవచ్చు, 'బృందాలు' అనవచ్చు, ఏదైనా. కానీ దానికి అదే అర్థం వుండాలి.

2. **ఒక వర్గం, ఇంకో వర్గాన్ని దోపిడీ చేస్తోంటే, రెండో వర్గం ఎందుకు ఒప్పుకుంటుంది?**

**జ:** దోపిడీ ప్రారంభమైనప్పుడు, అది ఏ వర్గానికీ తెలిసి ప్రారంభమైన పని కాదు. ఒప్పుకోకపోవడం అనే దానికి అవకాశమే లేదు. మార్క్సు 'అదనపు విలువ'ని గ్రహించిన తర్వాతే శ్రమ దోపిడీ సంగతి బయట పడింది. ఈ సంగతి ఈ నాడు దోపిడీ వర్గానికి పూర్తిగానే తెలుసు. కానీ కార్మిక వర్గానికి ఇంకా తెలీదు. తెలిసింది కూడా అరకొరగా తప్ప సరిగా తెలీదు. కాబట్టి, ఈ నాడు కూడా కార్మిక వర్గం ఇంకా దానికి 'ఒప్పుకుంటూనే' వుంది.

3. **కార్మికులకు శ్రమ దోపిడీ గురించి తెలిస్తే, దాని నించి బయట పడడం నిజంగా చేస్తారా?**

**జ:** తెలియడం అంటే, ఒకరికో ఇద్దరికో తెలియడం కాదు. ఆ వర్గంలో మెజారిటీకి తెలియాలి. వర్గ పోరాటం ఏ నాడో ప్రారంభమై వుంది. శ్రమ దోపిడీ గురించి తెలిసిన పోరాటం కూడా వుంది. కానీ అది మెజారిటీకి తెలియక పోవడమే అసలు సమస్య. మెజారిటీకి తెలిసినప్పుడే ఆ పోరాటం బలంగా సాగుతుంది. సమస్య ఇంకా వున్నంత కాలమూ పరిష్కారం కోసం ప్రయత్నాలు ఆగిపోవు. సాగుతూనే వుంటాయి.

4. **వర్గాల్ని అర్థం చేసుకోవడం, 'విలువ'ని అర్థం చేసుకోవడం మీదే ఆధారపడి వుంటుంది. ఏ విధంగా?**

**జ:** ఒక ఉత్పత్తి తయారవడానికి, ఉత్పత్తి సాధనాలూ, సజీవ శ్రమా - అనే 2 విషయాలు తప్ప ఇంకే అంశమూ అక్కర లేదని తెలిసిందనుకుందాం. ఆ 2 అంశాల మొత్తం శ్రమే (నిర్జీవ, సజీవ శ్రమల మొత్తం) 'విలువ'గా అవుతుందని తెలిసిందనుకుందాం. నిర్జీవ శ్రమ, తన కోసం అయిన ఖర్చుని తప్ప ఎక్కువ ఖర్చుని సరుకుకి చేర్చదని తెలిసిందనుకుందాం. ఈ విషయాలన్నీ తెలిస్తే, విలువ అంటే ఏమిటో తెలిసి, అందులో వుండే అదనపు విలువ రహస్యం కూడా తెలుస్తుంది. అది తెలిస్తే, కౌళ్ళూ-వడ్డీలూ - లాభాలూ అనేవి శ్రమ లేకుండా అందే ఆదాయాలని తెలుస్తుంది. దానితో, మనుషులు అనే వాళ్ళు, శ్రమ చేసే వాళ్ళూ - శ్రమ చెయ్యని వాళ్ళూ అనే తేడాలతో వున్నారని తెలుస్తుంది. ఆ తేడాలే వర్గాలు. 'విలువ'లో ఏ యే అంశాలు వుంటాయో తెలియకపోతే, అంతా వెనకటి అజ్ఞానమే వుంటుంది. కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ సరైనవే అనే అజ్ఞానం. ఈ రకంగా, వర్గాల గురించి తెలియడం, విలువ గురించి తెలియడం మీదే ఆధారపడి వుంటుంది.

5. **సమాజంలో, అందరూ స్వతంత్ర ఉత్పత్తిదారులుగానే వున్నారనుకుందాం. అప్పుడు వర్గాలు వున్నాట్టా, లేనట్టా?**

**జ:** అందరూ స్వతంత్ర ఉత్పత్తిదారులే అయితే, ప్రతీ వారూ శ్రమ చేస్తారు. ఎవరి శ్రమ వారికే అందుతుంది. ఎవరి శ్రమతో వారు జీవిస్తారు. శ్రమ దోపిడీ లేనప్పుడు, మనుషులు వేరు వేరు వర్గాలుగా అవరు. అందరూ ఒకే రకం. వర్గాలు లేనట్టే.

6. **వర్గాలు పోయి, అందరూ ఒకే రకంగా జీవించాలంటే, స్వతంత్ర ఉత్పత్తిదారుల విధానం సరిపోతుంది కదా? సోషలిజాలూ, కమ్యూనిజాలూ ఎందుకు?**

**జ:** స్వతంత్ర ఉత్పత్తిదారుల విధానంలో శ్రమ దోపిడీ లేకపోయినా, ఆ విధానం వల్ల వచ్చే వేరే రకపు కష్టాలు చాలా వుంటాయి. ఒక ఊళ్ళో, ప్రతీ కుటుంబానికీ 2 ఎకరాల భూమి చొప్పున వుందనుకుందాం. భూముల సారాల్లో రక రకాల తేడాలు వుంటాయి కాబట్టి, ఒకరికి ఎక్కువ పంటా, ఒకరికి తక్కువ పంటా. ఒక సంవత్సరం ఒక ప్రాంతంలో వర్షాలు చక్కగా పడి, ఇంకో ప్రాంతంలో వర్షాలు వుండవు. ఒక చోట ఎక్కువ పంటలూ, ఒక చోట కరువులూ. కరువుల వాళ్ళు, ఇతరుల నించీ అప్పులు చెయ్యడమో, దాన ధర్మాల కోసం అడుక్కోవడమో చెయ్యాలి.

బట్టలు నేసి అమ్ముకునే చేతి వృత్తుల కుటుంబాన్ని తీసుకుంటే, ఒకరి సరుకు బాగా అమ్ముడు కావచ్చు, ఇంకొకరి సరుకు మూలబడి వుండవచ్చు.

స్వతంత్ర ఉత్పత్తిదారుల సమాజం, ఆటవిక కాలం నాటి ఉత్పత్తి శక్తుల తోనే వుండిపోతుంది. పది మందీ కలిసి పని చేసే విధానమే లేనప్పుడు, ఉత్పత్తి శక్తులు పెరిగే ప్రశ్నే వుండదు.

ఉదాహరణ కోసం, ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుల సమాజాన్ని ఊహిస్తే, అది తప్పకుండా, దాని వల్ల

వచ్చే సమస్యల వల్ల, చాలా తక్కువ కాలం లోనే వర్గ సమాజంగా మారిపోతుంది.

ఉత్పత్తి సాధనాల్ని సమిష్టిగా ఉపయోగిస్తూ శ్రమలు చేసుకునే విధానంలో, ఏ రకమైన వైరుధ్యాలకూ ఆస్కారం వుండదు. అక్కడ కొంత భూమి పండి, కొంత భూమి ఎండినా, ఆ కష్ట సుఖాలు అందరివీ అవుతాయి. ఏ సమస్యనీ ఒంటరిగా ఎదుర్కోనక్కర లేదు.

వర్గాలు లేకుండా అందరూ ఒకే రకపు పరిస్తితుల్లోకి రావడం, సమిష్టి ఉత్పత్తి సంబంధాల ద్వారానే సాధ్యమవుతుంది. దీన్ని సరిగా అర్థం చేసుకోవాలి. బూర్జువా వర్గం చేసే వాదాల్లో వుండే తప్పు లేమిటో తెలుసుకోలేని స్థాయిలో వుండకూడదు.

**7. కొందరి ఆదాయాలు 'జీతం' పేరుతో వుంటే, మరి కొందరి ఆదాయాలు 'వడ్డీ - లాభం - కౌలు' వంటి పేర్లతో వుంటాయి. ఈ తేడాలు ఎందుకు?**

**జ:** శ్రమకు బదులుగా వచ్చేది - జీతం. శ్రమ లేకుండా వచ్చేది - ఆ మూడు రకాలూ. ఈ 3 రకాల్లోనే సమాజపు రహస్యం అంతా దాగి వుంది - అన్నాడు మార్క్స్.

**8. ఉత్పత్తి సాధనాలన్నీ శ్రమ చేసే వర్గానివే - అనడం ఎలా సరైనది?**

**జ:** ఉత్పత్తి సాధనాలు - అనేవి (భూమి గాక), శ్రమతో తయారైన ఉత్పత్తులే. 'అదనపు ఉత్పత్తుల్లో కొంత భాగం' కొత్త ఉత్పత్తి సాధనాలుగా మారుతూ, ఉత్పత్తి సాధనాల రాసి పెరుగుతూ వుంటుంది. ఆ అదనపు ఉత్పత్తి అంతా శ్రామిక వర్గానిదే. ఆ రకంగా, ఆ సాధనాలన్నీ ఆ వర్గానివే. భూమిని ఉత్పత్తి సాధనంగా మలిచేది కూడా శ్రామిక వర్గమే.

**9. బానిస యజమానికీ, భూస్వామికీ తేడా ఏమిటి? మొదటి వాడు కూడా భూస్వామి కాడా?**

**జ:** బానిస యజమాని - 'ఉత్పత్తి సాధనాల' మీదే గాక, 'శ్రామికుల' మీద కూడా ఆస్తి హక్కులు గల యజమాని. భూస్వామి అయితే, ఉత్పత్తి సాధనాల మీద ('భూమి' మీద) మాత్రమే యజమాని. మొదటి వాడు కూడా భూస్వామి అయినా, వాడు, భూస్వామి మాత్రమే కాడు. మానవుల మీద స్వామి కూడా. అదే తేడా.

**10. ఒక ఇంట్లో దొంగలు పడి, బంగారమూ వస్తువులూ ఎత్తుకు పోయారు. అది కూడా శ్రమ దోపిడీయేనా?**

**జ:** కాదు. అది, ఇతరుల వస్తువుల్ని ఎత్తుకు పోవడం. దాని వల్ల ఆ దొంగకి కొన్ని ఉత్పత్తులు శ్రమ చెయ్యకుండానే దొరికే మాట నిజమే. అయినా అది 'శ్రమ దోపిడీ' అవదు. 'యజమానీ శ్రామిక' సంబంధం వుంటేనే అది శ్రమ దోపిడీ. అక్కడ సరుకు ఉత్పత్తి వున్నా, లేకపోయినా.

**11. ఒక ప్రయాణంలో, ఒక వ్యక్తి, సంచిని మరిచి పోయి దిగి పోయాడు. తర్వాత ఎవరో ఆ సంచిని తీసుకుని, అందులో వస్తువులు వాడుకున్నారు. అది ఇతరుల శ్రమని దోచడం కాదా?**

**జ:** కాదు. అది దొంగతనం కూడా కాదు. అలాంటి అనుకోని సంఘటన ద్వారా ఇతరుల వస్తువులు దొరకడం, ఎవరికైనా జరగవచ్చు. ఆ సంచి పోగొట్టుకున్న వ్యక్తికే రేపు ఇంకేదో వస్తువు దొరకవచ్చు. అలా దొరికిన వస్తువుని అసలు వ్యక్తికి అప్పగించడానికి వీలవక పోతే, అలా దొరికిన వస్తువుల్ని వాడుకోవడం తప్పు కాదు.

**12. ఒక పేద మనిషి వున్నాడు. సోమరిగా తిరుగుతూ వుంటాడు. ఏ పనీ చెయ్యడు. కుటుంబ సభ్యుల జీతాల ద్వారా బతుకుతూ వుంటాడు. అది శ్రమ దోపిడీ కాదా?**

**జ:** కాదు. ఆ సోమరి, తన శ్రమతో గాక ఇతరుల శ్రమతో బతుకుతున్నాడనేది నిజమే. అది తప్పే. కానీ అది - యజమాని, సేవకుణ్ణి చేసే దోపిడీ లాంటిది కాదు. అది, యజమానీ శ్రామికుల సంబంధం కాదు.

**13. వర్గాల సంబంధంలో వైరుధ్యం వుందని ఎలా చెప్పగలం?**

**జ:** వర్గాలు అలాగే వుండగా ఆ వైరుధ్యం పోదు. వర్గాలు ఒకటి అయిపోతే ఆ వైరుధ్యం వుండదు.

కాబట్టి, ఆ సంబంధం వైరుధ్యంతో వుందని చెప్ప గలం.

**14.భూమి భూస్వామిది కాకపోతే అది భూస్వామి ఆస్తి ఎలా అయింది?**

**జ:** ఆస్తి అయ్యాకే అది భూస్వామిది. మొట్టమొదటే అది భూస్వామిది కాదు. ఆ 'ఆస్తి'గా అవడమే అక్రమం. అది, భూస్వామి ఆస్తిగా ఏ కాలంలో ఎలా అయిందో ఇప్పుడు మనకు తెలీదు. కానీ ఆ చరిత్ర మనకు తెలుసా తెలీదా - అనే దానితో సంబంధం లేదు. భూమి ఒక మనిషికి ఆస్తిగా వుండడమూ, ఆ హక్కు ద్వారా ఆ మనిషి 'కౌలు'ని సంపాదించడమూ అదీ అక్కడ వున్న విషయం. అది, శ్రమ దోపిడీయే - అని మన వాదంతో నిరూపించగలం.

**15.ప్రాచీన కాలంలో వేరు వేరు తెగలు వుండడం అంటే వేరు వేరు వర్గాలు వుండడమేనా?**

**జ:** కాదు. అక్కడ యజమానీ శ్రామిక సంబంధం లేకపోతే, ఆస్తి హక్కులు లేకపోతే, అలాంటి తెగలు, వర్గాలు కావు. కానీ, ఆ తెగల మధ్య, ప్రకృతి వనరుల కోసం కొట్లాటలు వుండేవి. శ్రమ దోపిడీ లేకుండానే శతృత్వాలు వుండేవి.

**16.పొదుపరులూ సోమరులూ కథ తెలుసా మీకు?**

**జ:** తెలుసు. అది శ్రమ దోపిడీ దొంగలు చెప్పే కథ. అసలైన సోమరులు - వాళ్ళే. శ్రమ చెయ్యకుండా బతికే వాళ్ళే - అసలైన సోమరులు. నిజమైన పొదు పరులు శ్రామికులే. తమ జీతాల్లో నించి ఎంతో కొంత పొదుపు చేసుకుంటూ నిరాడంబరంగా బతికే శ్రామి కులే - అసలైన పొదుపరులు. పొదుపుగా వాడుకోక పోతే వాళ్ళకి బతికే మార్గమే వుండదు. ఇదే అసలు నిజమైన కథ. కానీ దోపిడీదారులు చెప్పే ప్రతీదీ తల్లకిందులు గానే వుంటుంది. వాళ్ళు శ్రామికులనే సోమరులు అంటారు.

**17.ఒక వర్గం, యజమానులుగా అవడం ఎలా సాధ్య మవుతోంది?**

**జ:** కేవలం ఆ వర్గానికి వున్న ఆస్తి హక్కుల వల్ల. శ్రమ చెయ్యకుండానే ఆదాయాల్ని పొందే హక్కులు అవి. ఆస్తి వల్లనే ఒక వ్యక్తి భూస్వామిగా గానీ, పెట్టు బడిదారుల్లో ఏదో ఒక రకంగా గానీ, అవుతాడు. ఆస్తి వున్న వాడు, తన దగ్గిర జరగవలసిన పనుల కోసం శ్రామికుల్ని పిలుస్తాడు. శ్రామికులకు ఉద్యోగాలు ఇచ్చే స్థితిలో వాడు వుంటాడు కాబట్టి, వాడు శ్రామి కుల మీద యజమాని అవుతాడు.

**18.స్వతంత్ర ఉత్పత్తిదారులకు కూడా స్వంత ఆస్తులు వుంటాయి. ఆ ఆస్తి హక్కుల వల్ల వారు ఎవరి మీద యజమానులు అవుతున్నారు?**

**జ:** ఆస్తులు 2 రకాలు. (1) తమ పోషణకు కావల సిన శ్రమ అంతా తామే చేసుకునే వారి ఆస్తి. ఇక్కడ యజమానీ శ్రామిక సంబంధం వుండదు. ఈ ఆస్తి యజమాని తనాన్ని ఇవ్వదు. (2) శ్రమ చెయ్యకుండా ఇతరుల శ్రమని దోచే వారి ఆస్తి. ఈ దోచడం, ఈ ఆస్తి హక్కుల ద్వారానే జరుగుతుంది. ఈ ఆస్తి, యజమానితనాన్ని ఇస్తుంది.

**19.ఒక కార్మికుడికి చిన్న భూమి వుంది. కానీ అతను వేరే చోట ఉద్యోగం చేసుకుంటూ, తన చిన్న భూమిని కౌలుకి ఇచ్చాడు. ఆ కార్మికుడు ఎవరి మీద యజమాని?**

**జ:** ఆ కౌలు రైతు మీద. ఆ రైతు, తనకు భూమిని ఇచ్చిన యజమాని పట్ల అణకువతో వుంటాడు.

**20.డాక్టరు, కుట్టు మనిషి, వంట మనిషి, నేత మనిషి, టీచరు - వీరు ఏ వర్గాలకు చెందుతారు?**

**జ:** వీరందరూ ఏదో ఒక శ్రమ చేసే వారే. కానీ వీరు స్వతంత్ర ఉత్పత్తిదారులుగా వున్నారో, యజమానుల దగ్గిర శ్రామికులుగా వున్నారో, లేదా తమ దగ్గిరే తమ పనిలో శ్రామికుల్ని పెట్టుకున్న పెటీ బూర్జువాలుగా వున్నారో, చెప్పలేము. దానికి ఇంకా వివరాలు కావాలి.

**21.కార్మిక విముక్తి, సమాజాన్నంతా విముక్తి చేస్తుంది. ఏ విధంగా?**

**జ:** కార్మిక వర్గ లక్ష్యం, 'సమాజాన్నంతా విముక్తి చెయ్యాలి' అని కాదు. 'తనను తను విముక్తి చేసుకో

వాలి' అని. తన శ్రమని ఇంకో వర్గం దోచకుండా చేసు కోగలిగితే, అప్పుడు ఆ రెండో వర్గం తను బతకడానికి తన శ్రమ తను చేసుకోక తప్పదు. అప్పుడు 2 వర్గాలూ వెనకటి పరిస్థితుల నించి విముక్తి అవుతాయి. ఆ రకంగా, కార్మిక వర్గ విముక్తే, సమాజ విముక్తి.

22.**'పెట్టుబడిదారీ వర్గం, పెట్టుబడిదారీ సూత్రాలకు బానిస' - ఆ సూత్రాలు ఏమిటి?**

**జ:** పెట్టుబడిని పెట్టినప్పుడు దాన్ని మాత్రమే వెనక్కి తీసు కుంటే చాలదు. దానికి లాభం కూడా రావాలి. ఇది మొదటి సూత్రం. ఆ లాభం, కనీసంగా బతక డానికి వస్తే చాలదు. అది చాలా ఎక్కువగా రావాలి. ఇది రెండో సూత్రం. ఆర్డరు వున్నంత వరకే సరుకుని తయారు చెయ్యడం చాలదు. ఆర్డరు లేకపోయినా ఎక్కువ సరుకుని తయారు చేయించి దానికి ఆర్డరు సంపాదించాలి. ఇది మూడో సూత్రం. సరుకుని అమ్మ డానికి స్వదేశీ మార్కెట్టు చాలకపోతే, విదేశాల మీద పడాలి. - ఇది నాలుగో సూత్రం. విదేశాలు లొంగక పోతే వాటితో యుద్ధాలు చెయ్యాలి. వాళ్ళని నాశనం చేసి ఆ భూములు ఆక్రమించాలి. - ఈ రకంగా, దోపిడీ వర్గ సూత్రాలు పెరిగి పోతూనే వుంటాయి.

23.**పిల్లలు ఎక్కువగా వుండడం వల్ల బికారులై పోయిన కోటీశ్వరులు మీకు తెలుసా? పోనీ తాగుడు వల్ల బికారులై పోయిన కోటీశ్వరులూ?**

**జ:** తెలీదు. ఎందుకంటే, అలాంటి వాళ్ళెవరూ వుండరు. ఉండని వాళ్ళెలా తెలుస్తారు?

24.**'నెపోలియన్ -3' అనే వాడు, 1852 నించీ 70 వరకూ ఫ్రాన్స్‌కి చక్రవర్తి. అంటే, పెట్టుబడిదారీ వర్గపు చక్రవర్తి. ఈ రకంగా, పెట్టుబడిదారీ దేశాల్లో ఈ నాడు కూడా రాజులు వున్నారా?**

**జ:** బ్రిటన్‌లో ఎలిజబెత్ రాణీ, 'రాజు' స్థానం లోనే వుంది. జపాన్‌లో కూడా చక్రవర్తి ఎవడో వున్నాడు. నేపాల్‌లో కూడా రాజు వున్నాడు. ఈ రాజులకు, వెన కటి కాలపు హక్కులు లేకపోయినా, 'రాజు' స్థానం లోనే వున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి, ఈ రకపు సంబంధాల మీదా, ఈ సంస్కృతి మీదా, ఏ మాత్రమూ వ్యతిరేకత లేదు. అందరూ దోపిడీ దొంగలే కాబట్టి. కార్మిక వర్గానికైతే, ఇంకా ఆ వర్గానికి వుండవలసినంత చైతన్యమే లేదు. ★

# అనుబంధం-1
# అమెరికా వేపు ఒక చూపు!

[ఈ నాటి 'గొప్ప' పెట్టుబడిదారీ దేశం అమెరికా. అక్కడి పరిస్థితుల్ని గురించి, **'మైకేల్ పెరంటీ'** అనే అమెరికా రచయిత తన "డెమోక్రసీ ఫర్ ది ఫ్యూ" (అతి కొద్ది మందికే ప్రజాస్వామ్యం) అనే పుస్తకంలో చాలా వివరాలు ఇచ్చాడు. అందులో నించి కొన్ని విష యాలు ఇక్కడ చూడాలి. 'కాపిటల్' అంతా చదివి వున్నాం కాబట్టి, ఇది తేలిగ్గానే అర్థమవుతుంది. ఇక్కడ ఇస్తున్న భాగం యధాతథ అనువాదం కాదు; స్వేచ్ఛాను వాదం. 1988లో వచ్చిన 5వ ముద్రణ నించి ఈ అనువాదం..]

"**అ**మెరికాలో, ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే - దేశం లోని స్టాకులూ, బాండ్లూ, సేవింగ్సూ, ఇతర ఆర్థిక వనరులూ - అన్నీ కలిసిన 'మొత్తం ఆస్తి'లో 86% పైగా, 10% ని పై స్థాయి కుటుంబాలే కలిగి వున్నాయి. మళ్ళీ ఆ కుటుంబాల్లో కూడా % కుటుంబాల ఆధీనంలో, ప్రైవేటు సంపద లోని 45% వుంది!

అమెరికా ప్రజలలో 90% మందికి, అత్యంత స్వల్ప ఆస్తులు గానీ, అసలు ఏమీ లేకపోవటం గానీ.

వ్యక్తి సంపదకు మూలం - 'వారసత్వపు ఆస్తి - హక్కు' (ఇన్ హెరిటెన్స్). వేరే మాటల్లో చెప్పాలంటే - మీరు ధనవంతులు కాలేక పోయారంటే, మీరు పుట్టే

టప్పుడు, 'సరైన తల్లిదండ్రుల్ని ఎంచుకునే' ముందు చూపూ, చొరవా మీకు లేకపోయాయన్న మాట!

ఈ మధ్య కాలంలో 'ఆర్థిక అసమానత్వం' అనేది విపరీతంగా పెరిగిపోతోన్న ధోరణిలో వుంది. 1974 నించీ 'జాతీయ ఆదాయం'లో, వేతనాలకూ, జీతాలకూ (వేజస్ అండ్ శాలరీస్) వెళ్ళే భాగం, ద్రవ్యోల్బణ స్తితిలో కూడా కలపగా, 10% తగ్గిపోయింది. వడ్డీలూ, కౌళ్ళూ, డివిడెండ్లూ కలిసిన భాగమేమో రెట్టింపయింది (డబుల్డ్).

అమెరికా ఆర్థిక పరిస్తితి కుంచించుకు పోయిన 1983లో కూడా, అత్యంత ధనికులైన 400 మంది అమెరికన్ పెట్టుబడిదారులకు అందిన లాభం (నెట్‌వర్త్), గతంలో 92 బిలియన్ డాలర్లు వుండేదల్లా, 118 బిలియన్ డాలర్లు అయింది. (1 బిలియన్ = 100 కోట్లు) ఈ పెరుగుదల 28%.

ఈ 400 మంది ధనికుల్లోనూ 116 మంది, మరింత అత్యంత ధనికులు (సూపర్ రిచ్). వాళ్ళ 'ప్రత్యేక అదృష్టం' 50% పెరిగింది.

మొత్తం ఆర్థిక వ్యవస్థలో, భారీ కార్పొరేషన్ల ఆస్తుల్లో 66% ని, 1% కంటే తక్కువ కార్పొరేషన్లు కంట్రోల్ చేస్తున్నాయి.

500 భారీ కార్పోరేషన్లని కంట్రోల్ చేయగలిగినంత స్థాయిలో 49 భారీ బ్యాంకులు వున్నాయి. ఉదా: తమ కంపెనీల పెట్టుబడుల్లో అత్యధిక పెట్టుబడుల్ని పెట్టిన బ్యాంకుల్లో J.P. మోర్గాన్ బ్యాంకు కూడా ఒకటని, I.T.T., సీనియర్స్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్సూ, I.B.M., బ్యాంక్ అమెరికా, సిటీ కార్ప్ - వంటి కంపెనీలన్నీ చెప్పుకుంటాయి. ఆ J. P. మోర్గాన్ బ్యాంకు అనేది, దేశంలో అతి భారీ షేర్ హోల్డరు. ఇది, స్టాక్ మార్కెట్లో 15 బిలియన్ డాలర్ల కన్నా ఎక్కువ పెట్టుబడులు పెట్టింది.

ప్రస్తుత ధోరణి ఎలా వుందంటే - భారీ కంపెనీలను మరింత భారీ కంపెనీలు (జయంట్ కంపెనీలను, సూపర్ జయంట్ కంపెనీలు) లాగేస్తూ, కార్పొరేట్ సంపద అధికారికంగా 'కేంద్రీకృతమయ్యే' ధోరణి వుంది.

మొబిల్ ఆయిల్ కంపెనీ, మాంట్ గోమరీ వార్డ్ కంపెనీని కొనేసింది.

ఫిలిప్ మోరిస్ కంపెనీ, మిల్లర్ బ్రీవింగ్ కంపెనీని, పీల్చేసింది.

కోకా కోలా కంపెనీ, పేరమౌంట్ పిక్చర్స్ కంపెనీని, మింగేసింది.

1984లో, టెక్సాకో కంపెనీ, గెట్ - ఆయిల్ కంపెనీని, 10.1 బిలియన్ డాలర్లకు హరాయించేసుకుంది. ఇప్పటి వరకూ జరిగిన భారీ కంపెనీల విలీనాలలో ఇది అతి భారీ విలీనం.

చరిత్రలో జరిగిన 10 అతి భారీ కంపెనీల విలీనాలలో 9 విలీనాలు, 1981-85 మధ్య కాలం లోనే జరిగాయి. ఈ విలీనాలలో, కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లకూ, భారీ వాటాదారులకూ ఇవ్వడానికి 100 బిలియన్ డాలర్ల క్యాష్ ఖర్చుపెట్టారు. కొత్త ఉద్యోగాల మీదా, ఇతర అవసరాల మీదా, ఖర్చు పెట్టగలిగే దాన్ని ఈ రకంగా ఖర్చు పెట్టారు.

1980 లలో తిరిగి తిరిగి వచ్చిన ఆర్థిక మాంద్యాలూ, అభివృద్ధి పెరుగుదలలో మందగొడితనమూ వున్నప్పటికీ, లాభాలు తగ్గలేదు. డబుల్ అయ్యాయి.

అమెరికా ఆర్థిక వ్యవస్థలో స్వతంత్ర ఉత్పత్తిదారులే అధికంగా వున్నారన్నట్టుగా అమెరికన్ ప్రజలకు బోధిస్తూ వుంటారు. 'బిజినెస్ పీపులే' గాక, 'రైతులు' కూడా వున్నట్టు మాట్లాడుతూ వుంటారు. కాలిఫోర్నియా వ్యవసాయ క్షేత్రాల్లో మల్టీ మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిన బ్యాంక్ ఆఫ్ అమెరికా వుండగానూ; 'చేను' దగ్గర్నించీ సూపర్ మార్కెట్ దాకా ప్రతీ స్థాయి లోనూ, 'కాల్ పాక్ అండ్ సేఫ్ లే' కంపెనీలు పని చేస్తూ వుండగానూ కూడా, ఈ మాటలు మాట్లాడతారు.

అమెరికా లోని సమస్త వ్యవసాయ భూమి లోనూ సగానికి పైగా భూమి మీద, పెద్ద పెద్ద వ్యవసాయ, వాణిజ్య కంపెనీలకే కంట్రోల్ వుంది. ఈ 'వ్యవసాయ పరిశ్రమ' లోని ఆస్తుల్లో 80% ని, ఫుడ్ కార్పొరేషన్ల లోని 1% యే కంట్రోలు చేస్తున్నాయి. లాభాల్లో 90% ని అవే లాగుతున్నాయి.

టెలివిజన్ మీద, ఫుడ్ అడ్వర్టయిజింగ్ మొత్తాన్ని, ఇవే, మోనోపలైజ్ చేస్తున్నాయి.

దేశం లోని పాల ఉత్పత్తుల్లో 60%, 70% ని, కేవలం 3 కంపెనీలు కంట్రోల్ చేస్తున్నాయి.

ప్రపంచ మార్కెట్ లోని ధాన్యం వ్యాపారంలో 90% ని, 6 బహుళ జాతి కంపెనీలే నిర్వహిస్తున్నాయి. ఈ ఆహార పరిశ్రమల కేంద్రీకరణ, అమెరికా లోని భారీ కంపెనీల విజయ గాథని చాటుతుంది.

స్వతంత్ర కుటుంబ వ్యవసాయ క్షేత్రాలు, అప్పుల్లో కుంగిపోవడమో, వ్యవసాయం నించి తప్పు కోవడమో, చేస్తున్నాయి.

భారీ వ్యవసాయ కంపెనీలు ఉపయోగించే రసాయనాల తోటీ, కృత్రిమ ఎరువుల తోటీ, భూమి సారం ధ్వంసమవుతోంది. త్వర త్వరగా లాభాల్ని తెచ్చే వ్యాపార పంటల వల్ల, భూమి అత్యంత తీవ్రంగా శక్తిహీనం అవుతోంది.

అమెరికా లోని 500 టాప్ భారీ కంపెనీల్లో దాదాపు 33% ని, ఇంకా 'ఒకే కుటుంబ పద్ధతి' కంట్రోలు చేస్తోంది. కుటుంబ పెట్టుబడిదారీ విధానం తగ్గిపోతూ వున్నప్పటికీ, వాటాదారులందరూ యజ మానులయ్యే విధానం ఆచరణలో జరగదు.

3 కుటుంబాలకు గతంలో వేరు వేరుగా A, B, C అనే 3 కంపెనీలు వుండేవి అనుకుందాం. ఇప్పుడు, ఆ 3 కుటుంబాలకూ, ఆ 3 కంపెనీల లోనూ షేర్లు వున్నాయి.

ఇప్పటికీ కొన్ని కుటుంబ కంపెనీలు, చాలా భారీ సైజులో వున్నాయి. మెల్లాన్స్, మోర్గాన్, డ్యూపాంట్స్, రాక్ ఫెల్లర్స్, ('ఇంటి పేర్లు' ఇవన్నీ) - వంటి అతి పెద్ద ధనవంతమైన కుటుంబాలలో కొన్ని మాత్రమే అమె రికా ఆర్థిక వ్యవస్థ మీద పెత్తనం చలాయిస్తున్నాయి.

డ్యూపాంట్స్ కుటుంబం, 8 భారీ రక్షణ కాంట్రా క్టులను కంట్రోలు చేస్తోంది. వియత్నాం యుద్ధ కాలంలో వచ్చిన మిలటరీ కాంట్రాక్టులతో 15 బిలి యన్ డాలర్లకు పైగా ఈ కుటుంబం సంపాదించింది.

ఈ కుటంబం - జనరల్ మోటార్స్, కోకాకోలా, యునైటెడ్ బ్రాండ్స్ - వంటి బిలియన్ల డాలర్ల ఆస్తులు కలిగిన 10 భారీ కంపెనీలనూ, ఇంకెన్నో చిన్న కంపెనీ లనూ, కంట్రోలు చేస్తోంది. ఈ కుటుంబీకులు, అనేక డజన్ల కాలేజీలకు ట్రస్టీలుగా వున్నారు. ఒక్క డెలావేర్ అనే చోటే వీళ్ళకి దాదాపు 40 పెద్ద ఎస్టేట్లూ, ప్రైవేటు మ్యూజియమ్‌లూ ఉన్నాయి. వీళ్ళు - పన్ను మినహా యింపులు పొందే 31 ట్రస్టుల్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కుటుంబం, రిపబ్లికన్ పార్టీ తరుపున అధ్యక్ష స్థానానికి నిలబడే వాళ్ళ ప్రచారానికీ, మితవాద కార్మిక వ్యతిరేక ప్రచారానికీ, భారీ చందాలు ఇస్తూ వుంటుంది.

ఇంకో పెద్ద కుటుంబ సంస్థ - రాక్ ఫెల్లర్లది. ఈ కుటుంబానికి ఆస్తులు అమెరికాలో ప్రతీ రాష్ట్రం లోనూ, ప్రతీ పరిశ్రమ లోనూ, అలాగే 'సోషలిస్టు' కాని ప్రతీ దేశం లోనూ, విస్తరించి వున్నాయి.

ప్రపంచం లోని 13 అతి పెద్ద ఆయిల్ కంపెనీల మీదా, 4 పెద్ద బ్యాంకుల మీదా, వీళ్ళకి కంట్రోలు వుంది. ఈ కుటుంబం - యూనివర్శిటీలకూ, చర్చీ లకూ, సాంస్కృతిక కేంద్రాలకూ, యువజన సంస్థ లకూ, 'డబ్బు' పెడుతూ వుంటుంది.

ఈ రాక్ ఫెల్లర్ కుటుంబానికి అతి సన్నిహితులైన వాళ్ళు ప్రభుత్వంలో కీలక పదవుల్లో వుంటూ వస్తు న్నారు - ప్రెసిడెంట్ గానో, వైస్ ప్రెసిడెంట్ గానో, విదే శాంగ మంత్రి గానో, వాణిజ్య మంత్రి గానో, రక్షణ మంత్రి గానో, ఫెడరల్ రిజర్వ్ బోర్డులోనో, రాష్ట్రాల గవర్నర్లు గానో, కేంద్ర గూఢచారి సంస్థ లోనో, అమె రికా పార్లమెంటు లోనో, విదేశీ వ్యవహారాల శాఖ లోనో - ఇలా అనేక మంది, అనేక శాఖల్లో!

కుటుంబాల ఆధీనం లేని కంపెనీల గురించి, అంటే మేనేజర్ల అధీనంలో వున్న వాటి గురించి, స్వంతాస్తులే లేవని చెపుతారు. కానీ, ఆ మేనేజర్లు, భారీ వాటాలు వున్న వాళ్ళే. పెద్ద పెద్ద జీతాలూ, ఇతర అలవెన్సులూ వాళ్ళకి వాళ్ళే ఇచ్చుకుంటారు.

ఆర్థిక మాంద్యాలూ, లే ఆఫ్‌లూ - వున్న కాలాల్లో, కార్మికులకు జీతాలు తగ్గిపోవడమూ, ఉద్యోగాలు పోవడమూ జరుగుతూ వుండగా, కంపెనీల్లో అత్యున్న తాధికార్లకి ఇచ్చే పరిహారం, ప్రతీ సంవత్సరం 13% పెరుగుతోంది.

1986లో భారీ పరిశ్రమల్లో, ప్రధాన అధికార్లకి -

జీతాలూ, బోనస్‌లూ, అలవెన్సులూ, ఉచితంగా ఇచ్చే షేర్లూ, అన్నీ కలుపుకుని సంవత్సరానికి 1, 2 మిలియన్ డాలర్లు వస్తాయి. (మిలియన్ = 10 లక్షలు)

కొందరికి ఇంకా ఎక్కువ. ఉదా: D.W.G. కార్పొరేషన్ ఛైర్మన్ అయిన విక్టర్ పోస్నర్‌కి, 1985లో, 12.7 మిలియన్ డాలర్లు అందింది. క్రిస్లర్ కంపెనీ ఛైర్మన్ అయిన 'పీ' అనే వాడికి, 11.5 మిలియన్ డాలర్లు! ఇంకా అంతకు ముందు - ఫ్రెడరిక్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ ఛైర్మన్ అయిన ఫ్రెడరిక్ స్మిత్ అనే వాడికి - సంవత్సరానికి 54 మిలియన్ డాలర్లు" -

**మైకేల్ పెరంటీ** ["డెమోక్రసీ ఫర్ ది ఫ్యూ", పేజీ 10-14, 5వ ముద్రణ, 1988]. ★

# అనుబంధం -2

**[ ఈ వార్త చూడండి. ప్రభుత్వ బడ్జెట్‌లో జరిగే నిర్ణయాలు పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకే అనుకూలంగా వుంటాయనే సంగతి ఈ వార్తలో స్పష్టంగా కనపడుతుంది. అయితే, ఆ వర్గంలో కూడా అందరి ప్రయోజనాలూ ఒకే రకంగా వుండవు. బడ్జెట్‌లో నిర్ణయాలు ప్రధానంగా ఒకటి రెండు గ్రూపులకే ఎక్కువ అనుకూలంగా వుంటాయి. ఆ గ్రూపుల మనుషులు ప్రభుత్వంలో బలంగా వుంటేనే అది జరుగుతుంది. ఈ వార్తలో విషయం గమనించండి!]**

## అంబానీలకు మన్మోహన్ కానుక!

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఈ ఏడాది కూడా ఆర్థిక మంత్రి మన్‌మోహన్‌సింగ్ బడ్జెట్‌లో కల్పించిన రాయితీలు అంబానీలకు అత్యధికంగా లభించను న్నాయి. ఇందులో మర్మమేదైనా వుందా? గత రెండేళ్ళలో ఎక్సైజ్ సుకం తగ్గింపు కారణంగా రిలయెన్స్ గ్రూపు బాగా లాభపడింది. ఈ ఏడాది - కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడంతో రిలయెన్స్ గ్రూపునకు రెట్టింపు ప్రయోజనం చేకూరింది.

పాలిస్టర్ ఫిలమెంటు నూలుపై ఎక్సైజ్ సుంకాన్ని ప్రతి కిలోకూ 80 రూ. ల నుండి 69 రూ. లకు తగ్గిస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఒక్క దీని వల్లనే అంబానీలు సంవత్సరానికి 80 కోట్ల రూపాయల వరకు లాభపడతారని పరిశ్రమ వర్గాల వారు అంటున్నారు. ఇది గాక పాలిస్టర్ సేపుల్ ఫైబర్ (పి.ఎస్.ఎఫ్) పైన ఎక్సైజ్ సుంకాన్ని కిలోకు ఒక రూపాయి తగ్గించడం, దిగుమతి చేసుకునే పలు ముడి సరుకులపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడం వల్ల అంబానీలకు మరి కొన్ని కోట్ల రూపాయల లాభం రాగలదని వారు పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రిలయెన్స్ గ్రూపునకు 150 కోట్ల రూపాయలు లాభం రాగలదని పరిశ్రమ వర్గాల అంచనా. ఈ లాభాలు ఇంత కన్నా ఎక్కువే వుండగలవని మరి కొన్ని వర్గాల అభిప్రాయం.

(ఆంధ్రప్రభ డైలీ, 1-3-1993, హైదరాబాద్ ఎడిషన్)

ఫలానా ముడి ఉత్పత్తుల మీద సుంకాలు తగ్గడం అంటే, ఆ ముడి పదార్థాల్ని వాడే పెట్టుబడిదారులకు ఖర్చులు తగ్గుతాయి. ఖర్చులు తగ్గితే కొత్త సరుకు ధరని కూడా తగ్గించాలి. కానీ అలా జరగదు. తగ్గించినా, సరైన పాళ్ళల్లో తగ్గించడం జరగదు. చివరికి, ఆ సరుకు ద్వారా మిగిలే లాభం, గతం కన్నా ఎక్కువగా వుంటుంది.

సుంకాలు అన్నీ గవర్నమెంటుకి వెళ్ళేవే. అవి తగ్గడం అంటే, ఆ భాగం పెట్టుబడిదారుడికే వుండిపోవడం.

ప్రభుత్వంలో ముఖ్యులు, పెట్టుబడిదారుల్లో ఏ గ్రూపుకి ఎక్కువ అనుకూలంగా వుంటారో, ఆ గ్రూపుకే ఎక్కువ 'మేళ్ళు' జరుగుతూ వుంటాయి. దోపిడీ సమాజపు ప్రభుత్వం, దోపిడీదారుల బంటు. ★

# 9. కార్మికులకు మార్క్స్ ప్రశ్నలు

[ ఈ 'ప్రశ్నల పత్రం' మొదటి సారి 1880 ఏప్రిల్ 20 న, 'రివ్యూ సోషలిస్ట్' అనే ఫ్రెంచి పత్రికలో వచ్చింది. తర్వాత దీన్ని కర పత్రాలుగా వేసి, కార్మిక సంఘాలకూ, అన్ని తరహాల సోషలిస్టు - డెమోక్రాటిక్ సంఘాలకూ, గ్రూపులకూ, పత్రికలకూ, ఎవరడిగితే వాళ్ళకీ, పంపించారు. - దీన్ని ఇప్పుడు, "కార్ల్ మార్క్స్ సెలెక్టెడ్ రైటింగ్స్ ఇన్ సోషియాలజీ అండ్ సోషల్ ఫిలాసఫీ" నించి ఇస్తున్నాము. పేజీ 210 నించీ 18 వరకూ. సంకలన కర్తలు: టామ్ బోటమ్ మోర్ అండ్ రూబెల్. పెంగ్విన్ ప్రచురణ.]

## 1

1. మీ వృత్తి ఏమిటి?

2. మీరు పని చేస్తోన్న వర్క్‌షాపు ఒకే పెట్టుబడి దారుడికి చెందినదా; జాయింట్ స్టాక్ కంపెనీకి చెందినదా? మీ పెట్టుబడిదారీ యజమాని పేరు గానీ, కంపెనీ డైరెక్టర్ల పేర్లు గానీ, చెప్పండి.

3. అక్కడ ఎంత మంది పని చేస్తున్నారు?

4. వారి వయస్సులూ; స్త్రీలా, పురుషులా, ఆ వివ రాలూ ఇవ్వండి.

5. పిల్లల్ని అయితే - ఆడపిల్లల్ని గానీ, మొగ పిల్లల్ని గానీ, ఏ వయసు నించీ పనుల్లో పెడుతున్నారు?

6. మామూలు కార్మికులు కాకుండా, సూపర్ వైజర్ల వంటి ఉద్యోగులు ఎంత మంది వుంటారు?

7. అప్రెంటిస్‌లు (ట్రయినింగ్‌లో వున్న వారు) వున్నారా? ఎంత మంది?

8. రెగ్యులర్ కార్మికులే కాకుండా, అప్పుడప్పుడూ తాత్కాలికంగా పనుల్లోకి తీసుకునే కార్మికులు కూడా వున్నారా?

9. మీ యజమాని పరిశ్రమ, కేవలం స్థానిక మార్కెట్ కోసమా, కేవలం దేశీయ మార్కెట్ కోసమా, కేవలం విదేశీ ఎగుమతుల కోసమా?

10. మీ వర్క్‌షాపు, గ్రామీణ ప్రాంతంలో వుందా, పట్టణ ప్రాంతంలో వుందా? ఆ స్థలం పేరు తెల్పండి.

11. మీ వర్క్‌షాపు, గ్రామీణ ప్రాంతంలో వుంటే, మీ 'పారిశ్రామిక శ్రమ', (ఆ వర్క్ షాపులో చేసే శ్రమ), మీరు జీవించడానికి సరిపోతోందా; దానితో పాటు మీరు 'వ్యవసాయ శ్రమ' కూడా చేసుకోవలసి వస్తోందా?

12. మీ పని, కేవలం చేతి పనిముట్లతో జరుగు తుందా; యంత్ర సాయం తోనా?

13. మీ పరిశ్రమలో వున్న 'శ్రమ విభజన' వివరాలు ఇవ్వండి.

14. మీ పరిశ్రమలో, నీటి ఆవిరి ని చోదక శక్తిగా వాడతారా?

15. మీ పరిశ్రమ లోని వివిధ శాఖల్లో ఎన్ని వర్క్ షాపులు వున్నాయి? మీరు పని చేసే శాఖ గురించి తెల్పండి. ఆ శాఖ లోని సాంకేతిక అంశాల సమాచారమే గాక, మీ పని వల్ల మీ దేహంలో ఏ యే భాగాలు అలసట పొందు తాయో ఆ వివరాలూ; ఆ పని ప్రభావం కార్మికుల ఆరోగ్యాల మీద ఏ విధంగా వుంటుందో ఆ వివరాలూ కూడా ఇవ్వండి.

16. మీ వర్క్‌షాపులో, శానిటరీ (పరిశుభ్రతకూ,

ఆరోగ్యానికీ సంబంధించిన) పరిస్థితుల్ని వివ రించండి. గదుల సైజూ, ఒక్కొక్క కార్మికుడికీ చోటూ, వెంటిలేషనూ, టెంపరేచరూ, గోడలకు సున్నాలూ, మరుగు దొడ్లూ (లావెట్రీస్), యంత్రాల మోతా, లోహాల ధూళీ (మెటాలిక్ డస్ట్), తేమా - మొదలైన వాటి గురించి వివ రించండి.

17. మీ వర్క్‌షాపులో శానిటరీ పరిస్థితుల మీద, మునిసిపాలిటీ పర్యవేక్షణ గానీ, గవర్నమెంటు పర్యవేక్షణ గానీ, వుందా?

18. మీ పరిశ్రమలో, కార్మికులకు ఏవైనా ప్రత్యేకమైన జబ్బులు కలిగించే ఫ్యూమ్స్ (ఆవిర్లు) వుంటాయా?

19. మీ వర్క్‌షాపు, యంత్రాలతో కిక్కిరిసి వుంటుందా?

20. మీ దగ్గిర, యంత్రాల ట్రాన్స్‌మిషన్ పద్ధతికీ, చోదక శక్తిని సప్లై చేసే యంత్రాలకూ సరైన రక్షణ వుందా, ప్రమాదాల్ని నివారించే లాగా?

21. మీ వ్యక్తిగత అనుభవంలో జరిగిన ప్రమాదాలను వివరించండి.

22. మీరు 'గని'లో పని చేస్తున్నట్టయితే, - అక్కడ తగినంత వెంటిలేషన్ ఖచ్చితంగా వుండే లాగానూ; పేలుళ్ళూ, ఇతర హానికరమైన యాక్సి డెంట్లూ జరగకుండా వుండే లాగానూ - మీ యజమాని తీసుకునే నివారణ చర్యలేమిటో తెల్పండి.

23. మీరు రసాయనాల పరిశ్రమలోనో, లోహ పరిశ్రమలోనో, లేదా ప్రమాదాలకు వీలునిచ్చే ఏ ఇతర పరిశ్రమలోనో, పని చేస్తున్నట్టయితే, మీ యజమాని ప్రవేశ పెట్టిన రక్షణ చర్యలేమిటో వివరించండి.

24. మీ ఫ్యాక్టరీలో, లైట్లు ఎలా వెలుగుతాయి? గ్యాస్ తోనా, పేరాఫిన్ తోనా? దేనితో?

25. మీ దగ్గిర ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగితే బయట పడడానికి కావలసినన్ని అత్యవసర మార్గాలు వున్నాయా?

26. యాక్సిడెంట్లు జరిగినప్పుడు కార్మికులకు, లేదా వారి కుటుంబాలకు, యజమాని నష్ట పరిహారం చెల్లించాలనే చట్టం మీ ప్రాంతంలో వుందా?

27. ఒక వేళ అలాంటి చట్టం లేకపోయినా, 'యజ మానిని ధనవంతుణ్ణి చెయ్యడం కోసం' కార్మి కులు పని చేస్తూ వుండగా, కార్మికులకు ప్రమాదం జరిగితే, వారికి నష్ట పరిహారం చెల్లిం చడం యజమాని ఎప్పుడైనా చేశాడా? ('నష్ట పరిహారం' ఇచ్చినా అది అదనపు విలువలో భాగమే. ఇవ్వకపోతే అది యజమానికే.)

28. మీ వర్క్‌షాపులో 'వైద్య సౌకర్యం' వుందా?

29. మీ పని మీ ఇంటి దగ్గిరే అయితే, మీరు పని చేసే గది పరిస్థితిని వివరించండి. మీరు కేవలం చేతి పని ముట్లనే వాడతారా, చిన్న యంత్రాల్ని కూడా వాడతారా? మీకు సహాయంగా మీ పిల్లలు వుంటారా, ఇతరులు వుంటారా? వాళ్ళు పెద్ద వాళ్ళా, పిల్లలా? స్త్రీలా, పురుషులా? మీరు విడి విడి క్లయింట్ల కోసం పని చేస్తారా; కాంట్రాక్టర్ల కోసం పని చేస్తారా? కాంట్రాక్టర్లతో మీరు డైరెక్టుగా డీల్ చేస్తారా; మధ్యవర్తుల ద్వారానా?

# 2

30. మీ 'రోజు వారీ' పని ఎన్ని గంటలు? మీ దగ్గిర వారానికి ఎన్ని పని దినాలు?

31. మీకు ఏడాదికి ఎన్ని రోజులు సెలవులు?

32. మీ 'పని దినం'లో విరామాలు ఎప్పుడెప్పుడు?

33. మీరు భోజనం చేసేది - రెగ్యులర్ విరామ సమ యాల్లోనేనా? లేకపోతే, ఆ సమయాలు ఇర్రెగ్యు

లర్‌గా వుంటాయా? వర్క్ షాపులోనే భోజనం చేస్తారా, ఎక్కడికైనా వెళ్ళి చేస్తారా?

34. భోజన విరామ సమయాల్లో కూడా పని చేస్తారా?

35. మీ దగ్గిర 'ఆవిరి శక్తి'తో పని జరుగుతూ వుంటే, దాన్ని ఎప్పుడు ఆన్ చేస్తారు? ఎప్పుడు ఆఫ్ చేస్తారు?

36. మీ దగ్గిర 'రాత్రి పని' (నైట్ వర్క్) వుందా?

37. మీ దగ్గిర పిల్లలకూ, 16 సం.లోపు వారికీ, పని గంటలు ఎన్ని?

38. పిల్లల విషయంలో కూడా షిఫ్టులు వున్నాయా?

39. పిల్లల్ని పనిలో పెట్టడానికి సంబంధించి, మునిసిపాలిటీ చట్టాలు గానీ, ప్రభుత్వ చట్టాలు గానీ, ఏమైనా వున్నాయా? యజమాని, వాటిని పాటిస్తాడా?

40. మీ వృత్తిలో పని చేసే పిల్లల కోసమూ, యువతీ యువకుల (యంగ్ పీపుల్) కోసమూ, స్కూళ్ళు వున్నాయా? ఉంటే, స్కూల్లో పని గంటలు ఏమిటి? స్కూలుని ఎవరు నడుపుతారు? అందులో ఏమిటి బోధిస్తారు?

41. పని, పగలూ రాత్రీ కూడా జరుగుతూ వుంటే, షిఫ్టుల్ని ఎలా ఆర్గనైజ్ చేస్తున్నారు? (అంటే - 2 షిఫ్టులా, 3 షిఫ్టులా? వాటి టైములు ఏమిటీ? - వంటి వివరాలు చెప్పమని)

42. పారిశ్రామిక కార్యకలాపాలు బాగా జరిగే కాలాల్లో సాధారణంగా పని గంటలు ఎంత పెరుగుతాయి?

43. మీ దగ్గిర యంత్రాల్ని శుభ్రం చెయ్యడానికి ప్రత్యేకంగా కార్మికులు వున్నారా? లేకపోతే ఆ యంత్రాలతో పని చేసే కార్మికులే వాటిని ఉచితంగా క్లీన్ చేస్తారా?

44. పని లోకి ఆలశ్యంగా వస్తే పెనాల్టీలు విధించడం గానీ, ఇతర నిబంధనలు గానీ, వున్నాయా మీ దగ్గిర? మీ పని దినం ఏ టైములో మొదలవుతుంది? భోజనం తర్వాత మళ్ళీ ఎంత సేపటికి ప్రారంభమౌతుంది?

45. పనికి వెళ్ళడానికీ, పని నించీ ఇంటికి రావడానికీ, మీకు ఎంత టైము పడుతుంది?

# 3

46. పనికి సంబంధించి మీకు యజమానితో ఏ రకమైన ఒప్పందం వుంది? రోజు వారీ గానా, వారం వారీ గానా, నెల వారీ గానా?

47. 'నోటీసు' ఇవ్వడానికి గానీ, తీసుకోవడానికి గానీ, వుండే షరతులేమిటి?

48. ఎప్పుడైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, అందులో యజమాని తప్పే వుంటే, అతని మీద విధించే పెనాల్టీ ఎలా వుంటుంది?

49. కార్మికులదే తప్పయితే, వారి మీద విధించే పెనాల్టీ ఎలా వుంటుంది?

50. మీ దగ్గిర అప్రెంటిస్‌లు గనక వుంటే, వాళ్ళతో ఒప్పందంలో వుండే షరతులు ఏమిటి?

51. మీ పని రెగ్యులరా, ఇరెగ్యులరా?

52. మీ పని, సీజన్‌ని బట్టి వుంటుందా; యాడాదంతా మామూలు గానే వుంటుందా? ఒక వేళ మీ పని సీజన్‌ని బట్టి వుండేదైతే, పని లేని కాలాల్లో ఎలా జీవిస్తున్నారు మీరు?

53. మీకు జీతాలు ఏ పద్ధతిలో ఇస్తారు? టైం రేటా, పీస్ రేటా?

54. టైం రేటు అయితే, 'గంటకి ఇంత' అనే పద్ధతిలో

ఇస్తారా, రోజుకి ఇంత అనే పద్ధతిలోనా?

55. ఓవర్ టైం చేస్తే అదనంగా చెల్లిస్తారా? ఏ పద్ధతిలో?

56. పీసు రేటు ప్రకారం చెల్లించేటట్టయితే, ఆ రేటుని ఎలా నిర్ణయిస్తారు? గనుల్లో లాగా మీ పనిని, పరిమాణాన్ని బట్టో, బరువుని బట్టో కొలుస్తారనుకుందాం. మీ యజమాని గానీ, వాడి ప్రతినిధి గానీ, మీ పని ని కొలిచేటప్పుడు, మిమ్మల్ని మోసగించే విధంగా ఏవైనా ట్రిక్కులు చేస్తారా?

57. పీసు రేటు చెల్లించేటట్టయితే, మీకు వచ్చే జీతాన్ని మోసంగా తగ్గించడానికి, 'వస్తువు నాణ్యత' అనే దాన్ని సాకుగా తీసుకుంటారా?

58. మీకు పీసు రేటు చెల్లించినా, టైము రేటు చెల్లించినా, అసలు మీరు పని చేసిన తర్వాత ఎంత కాలానికి చెల్లిస్తారు? మీరు చేసిన పనికి జీతం పొందే ముందు, మీరు మీ పనిని యజమానికి ఎంత కాలం అప్పు ఇస్తారు? మీకు చెల్లించేది వారం చివర్లోనా, నెల చివర్లోనా?

59. మీకు జీతాలు ఆలస్యంగా చెల్లించడం వల్ల, మీరు తరచుగా తాకట్టు వ్యాపారి దగ్గిరికి వెళ్ళవలసి రావడమూ, ఎక్కువ వడ్డీ రేటు చెల్లించడమూ, అవసరమైన వస్తువుల్ని వదులుకోవడమూ, షాపు యజమానులకు అప్పులు పడి వాళ్ళ దగ్గిర అప్పులు చేసిన వ్యక్తి గానూ బాధితుడి గానూ అవడమూ - ఈ విషయాలు మీకు జరిగాయా? యజమానులు దివాళాలు తియ్యడం వల్ల కార్మికులు జీతాలు కోల్పోయిన సంఘటన లేమైనా మీకు తెలుసా?

60. మీకు వేతనాలు, మీ యజమానే డైరెక్టుగా చెల్లిస్తాడా; లేక, సబ్ కాంట్రాక్టరు వంటి మధ్య దళారీ చెల్లిస్తాడా?

61. సబ్ కాంట్రాక్టరే జీతాల్ని చెల్లించేటట్టయితే, ఆ ఒప్పందంలో షరతులు ఏమిటి?

62. మీకు 'డబ్బు'లో, రోజు వారీగా గానీ, వారానికి గానీ, ఇచ్చే జీతం ఎంత?

63. మీతో పాటే అదే వర్కుషాపులో పని చేసే స్త్రీలకూ, పిల్లలకూ, జీతాలు ఎలా వున్నాయి?

64. మీ వర్కుషాపులో, కిందటి నెలలో వుండిన అత్యధిక దినసరి వేతనం ఎంత?

65. మీ దగ్గిర అత్యధిక పీస్ రేటు ఎంత?

66. అదే కాలంలో మీ జీతం ఎంత? మీకు కుటుంబం వున్నట్టయితే, మీ భార్యాపిల్లల జీతాలు ఎంతెంత?

67. మీ జీతాల్ని పూర్తిగా డబ్బు గానే చెల్లిస్తారా, అందులో కొంత భాగాన్ని ఇతర పద్ధతుల్లో చెల్లిస్తారా?

68. మీరు, మీ యజమాని ఇచ్చే నివాసాల్లోనే అద్దెలకు వున్నట్టయితే, ఆ షరతులు ఏమిటి? అద్దె ని మీ యజమాని మీ వేతనాల్లో నించే మినహాయించుకుంటాడా?

69. మీ దగ్గిర నిత్యావసర వస్తువుల ధరలు ఎలా వున్నాయి?

(1) **ఇంటి అద్దె:** షరతులూ, గదుల సంఖ్యా, నివాసుల సంఖ్యా, రిపేర్ల బాధ్యత ఎవరిదీ, ఇన్సూరెన్సూ, ఫర్నిచర్ కొనుగోలూ, మెయిన్ టెనెన్సూ, హీటింగూ, లైటింగూ, నీటి సప్లై.

(2) **తిండి:** బ్రెడ్డూ, మాంసం, కూర గాయలూ, బంగాళా దుంపలూ, పాలూ, గుడ్లూ, చేపలూ, వెన్నా, నూనె, పంది వారూ, పంచదారా, ఉప్పూ, మసాలాలూ, కాఫీ, చికోరీ, బీరూ, సైడర్ (యాపిల్ జ్యూస్ లాంటిది), వైనూ, పొగాకూ.

(3) **తల్లిదండ్రులకూ పిల్లలకూ:** బట్టలూ, లాండ్రీ, పర్సనల్ లావెట్రీ, స్నానాలూ, సబ్బులూ మొదలైనవి.

(4) **వివిధ రకాల ఖర్చులు:** పోస్టేజి, అప్పులకు చెల్లించడానికీ, పిల్లల స్కూలు

ఫీజులూ, అప్రెంటిస్ ఫీజులూ, పేపర్లకూ - పుస్తకాలకూ, సోదర సంఘాలకూ (ఫ్రెండ్లీ సొసైటీస్), కో ఆప రేటివ్‌లకూ, డిఫెన్సు సంఘాలకూ చెల్లించే చందాలూ.

(5) 'పని'కి సంబంధించిన ఇతర ఖర్చులు ఏవైనా వుంటే,

(6) పన్నులు కట్టడానికి,

70. మీకూ మీ కుటుంబానికీ సంబంధించి, 1 వారానికీ, 1 సంవత్సరానికీ, 'ఆదాయ వ్యయాల - బడ్జెట్'ని తయారు చెయ్యడానికి ప్రయత్నిం చండి.

71. తిండీ, నివాసమూ వంటి జీవితావసర వస్తువుల ధరలలో పెరుగుదల, జీతాలలో పెరుగుదల కంటే ఎక్కువగా వుండడం, మీ వ్యక్తిగత అనుభ వంలో గమనించారా?

72. వేతనాల్లో ఎగుడు దిగుళ్ళ గురించి, మీకు తెలిసిన విషయాలేమైనా వుంటే చెప్పండి.

73. స్తంభనా, ఆర్థిక సంక్షోభమూ వున్న కాలాల్లో, జీతాల్లో తగ్గుదల ఎంతెంత జరిగిందో చెప్పండి.

74. ప్రాస్పరిటీ కాలాల్లో (సరుకుల అమ్మకాలు బాగా సాగే కాలాల్లో), వేతనాల్లో పెరుగుదల వుంటే చెప్పండి.

75. పని పద్ధతుల్లో మార్పుల వల్లనూ, సంక్షోభాల వల్లనూ, పని దొరకడంలో జరిగే ఆటంకాల గురించి చెప్పండి. మీ ప్రమేయం లేని నిరు ద్యోగం (ఇన్‌వాలెంటరీ అనెంప్లాయ్‌మెంట్) గురించి మీ స్వంత అనుభవం వుంటే వివ రించండి.

76. మీరు ఉత్పత్తి చేసే వస్తువు ధర ని, లేదా మీరు చేసే పని ధర ని, మీ జీతంతో పోల్చి చూడండి.

77. యంత్రాల్ని ప్రవేశ పెట్టడం వల్ల గానీ, యంత్రాలలో ఇతర ఇంప్రూవ్‌మెంట్ల వల్ల గానీ, కార్మికులు పనులు కోల్పోయిన సంఘటనలు ఏవైనా తెల్పండి.

78. యంత్రాల అభివృద్ధి వల్లా, ఉత్పాదకత అభి వృద్ధి వల్లా, కార్మికులకు పని తీవ్రతా, పని కాలమూ పెరిగాయా, తరిగాయా?

79. ఉత్పత్తిలో అభివృద్ధి ఫలితంగా జీతాలు పెరిగిన సంఘటన ఏదైనా మీకు తెలుసా?

80. 50 ఏళ్ళ వయస్సు లోనే రిటైరై పోయి, పని చేస్తోన్న కాలం లోనే సంపాదించిన డబ్బుతో జీవి తాంతం బ్రతకగలిగిన సాధారణ కార్మికులెవరైనా మీకు తెలుసా? మీరు చూశారా?

81. సాధారణ ఆరోగ్యం కలిగిన కార్మికుడు, మీ వృత్తిలో అయితే ఎన్ని సంవత్సరాల పాటు కొనసాగవచ్చు?

# 4

82. మీ దగ్గిర, 'హక్కుల పరిరక్షణా సంఘాలు' ఏమైనా వున్నాయా? అవి ఎలా నడుస్తున్నాయి? వాటి నియమ నిబంధనలు ఏమిటి?

83. మీ దగ్గిర, ఇన్నాళ్ళ మీ అనుభవంలో ఎన్ని సమ్మెలు జరిగాయి?

84. ఆ సమ్మెలు ఎంతెంత కాలం నడిచాయి?

85. అవి జనరల్ సమ్మెలా, పాక్షిక సమ్మెలా?

86. ఆ సమ్మెలు జరిగింది - వేతనాల్లో పెరుగుదల కోసమా; వేతనాల్లో తగ్గుదలని ప్రతిఘటించడం కోసమా; పని దినం పొడవుకి సంబంధించా; ఇంకేవైనా కారణాలా?

87. ఆ సమ్మెలు సాధించిన ఫలితాలేమిటి?

88.కార్మికులకూ యజమానులకూ మధ్య వివాదాల్ని పరిష్కరించే 'ఆర్బిట్రేషన్ కమిటీ' చర్యల గురించి మీరేమనుకుంటారు?

89. ఇతర వృత్తులలో వున్న కార్మికులు చేసిన సమ్మెలకు మీ వృత్తి వారు మద్దతు ఇచ్చారా ఎప్పుడైనా?

90. తన వేతన కార్మికులను 'పరిపాలించడం కోసం' మీ యజమాని విధించే పెనాల్టీలనూ, నియమ నిబంధనలనూ చెప్పండి.

91. వేతనాల్ని తగ్గించడానికీ, పని గంటల్ని పెంచడానికీ, సమ్మెల్ని నిరోధించడానికీ, తమ కిష్టమైనట్టే వ్యవహరించడానికీ, యజమానులు ఏకమయ్యే సంఘాల గురించి (కాంబినేషన్స్) మీకేమైనా తెలుసా?

92. యజమానులు, కార్మికులకు వ్యతిరేకంగా నిలబడినప్పుడు, యజమానుల సేవలో ప్రభుత్వం, రాజ్యాంగ యంత్ర బలగాలను దుర్వినియోగం చేసిన సంఘటన లేవైనా మీకు తెలుసా?

93. యజమానులూ, వాళ్ళ కుమ్మక్కులూ (ఇల్లీగల్ కాంబినేషన్స్) చేసే అక్రమాలకు వ్యతిరేకంగా కార్మికులను రక్షించడానికి, ప్రభుత్వం జోక్యం చేసుకున్న సంఘటన లేమైనా మీకు తెలుసా?

94. అమలులో వున్న కార్మిక చట్టాలను, ప్రభుత్వం, యజమానులకు వ్యతిరేకంగా ఉపయోగిస్తుందా? ఇన్స్పెక్టర్లు, తమ డ్యూటీలను చిత్త శుద్ధితో నిర్వహిస్తారా?

95. కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడూ, జబ్బులు చేసినప్పుడూ, చచ్చిపోయినప్పుడూ, తాత్కాలికంగా పని చెయ్యలేక పోయినప్పుడూ, వృద్ధాప్యమూ - వంటి సందర్భాల్లో ఆదుకోవడానికి, మీ వర్క్‌షాపులో గానీ, మీ వృత్తిలో గానీ, ఏవైనా 'సోదర సంఘాలు' వున్నాయా? వాటి నియమ నిబంధనలు ఏమిటి?

96. ఆ సంఘాలలో సభ్యత్వం - ఇష్టా పూర్వకమా, తప్పనిసరా? వాటి నిధుల్ని పూర్తిగా కార్మికులే కంట్రోలు చేస్తారా?

97. ఈ సంఘాలకు చందాలు చెల్లించడం తప్పనిసరి అవడమూ, వాటిని యజమానులు కంట్రోలు చెయ్యడమూ అయితే, ఆ చందాలను జీతాల నించి మినహాయిస్తారు కదా? ఆ చందాల మీద వడ్డీ చెల్లిస్తారా? కార్మికులు ఫ్యాక్టరీ వదిలి వెళ్ళిపోతు న్నప్పుడు గానీ, డిస్మిస్ అయినప్పుడు గానీ, ఆ చందాల్ని తిరిగి చెల్లిస్తారా? యజమానులు కంట్రోలు చేసేవీ, కానీ కార్మికుల వేతనాల నించి వచ్చినవీ అయిన నిధుల వల్ల, కార్మికులు ప్రయో జనం పొందిన సంఘటన లేమైనా తెలుసా?

98. మీ వృత్తిలో 'సహకార సంఘాలే'మైనా వున్నాయా? వాటిని ఎలా నిర్వహిస్తున్నారు? పెట్టుబడిదారుడు చేసినట్టుగా, బయటి నించీ పని వారిని తెచ్చి పెడతారా? వాటి నియమ నిబంధనలు ఏమిటో పంపించండి.

99. కొంత జీతాల రూపంలోనూ, కొంత లాభాలలో భాగం ద్వారానూ ప్రతిఫలం పొందే కార్మికుల వర్క్‌షాప్ ఏదైనా మీ దగ్గిర వుందా? 'కార్మికులకు కూడా లాభాలలో భాగం పంచడం' అనే పద్ధతి లేని చోట కార్మికులు పొందే దానిని, అలాంటి పద్ధతి వున్న చోట కార్మికులు పొందే మొత్తాలతో పోల్చి చూడండి. అలాంటి కార్మికులు (లాభంలో కొంత భాగాన్ని పొందే కార్మికులు) సమ్మెలో పాల్గొనగలరా? లేక, తమ యజమానులకు విధేయులైన సేవకులుగా మాత్రమే వారు వుంటారా?

100. మీ వృత్తిలో వున్న స్త్రీ, పురుష కార్మికుల సాధారణ శారీరక, మేధోపర, నైతిక పరిస్థితులు ఏమిటి?

101. ఇంకా ఏవైనా జనరల్ కామెంట్స్? ★

# ఈ ప్రశ్నలు చూడండి

★ **మార్క్సు, కార్మికుల్ని అడిగిన ప్రశ్నల్లో 98వ ప్రశ్న చూడండి. "మీ వృత్తిలో సహకార సంఘాలేమైనా వున్నాయా? పెట్టుబడిదారుడు చేసినట్టుగా, మీరు పని వారిని బయటి నించి తెచ్చి పెడతారా? మీ నిబంధనలు ఎలా వున్నాయి?" అవి ఆ ప్రశ్న. అందులో అర్థం ఏమిటి?**

**జ:** కొందరు కార్మికులు కలిసి ఉత్పత్తి కోసం 'సహకార సంఘం' పెట్టుకున్నారంటే, అక్కడ పెట్టుబడిదారుడు వుండడు. ఉత్పత్తి సాధనాల్ని కార్మికులే సమకూర్చుకుంటారు. అక్కడ అవసరమయ్యే రక రకాల పనులన్నీ ఆ కార్మికులు చేసి, ఎవరి పనిని బట్టి వారు జీతాలు తీసుకుంటారు. ఆ ఉత్పత్తిని అమ్మగా వచ్చే 'అదనపు విలువ', ఆ కార్మికులదే కాబట్టి, దాన్ని ఆ కార్మికులు తమ జీతాల పాళ్ళని బట్టి తీసుకుంటారు.

ఆ కార్మికులు, ఆ సంఘంలో సభ్యులుగా లేని బైటి కార్మికుల్ని కూడా కొందర్ని పనుల్లోకి తీసుకుంటే, అప్పుడు వచ్చే 'అదనపు విలువ'లో బైటి కార్మికుల పాత్ర కూడా వుంటుంది. కాబట్టి, ఆ అదనపు విలువని బైటి కార్మికులకు కూడా వారి జీతాల పాళ్ళ ప్రకారం పంచాలి. అలా చెయ్యకుండా, ఆ బైటి కార్మికులకు జీతాలు మాత్రమే ఇచ్చి వూరుకుంటే, వారి అదనపు విలువని, సంఘం పెట్టిన కార్మికులు లాక్కున్నట్టు అవుతుంది.

అందుకే మార్క్సు, సంఘం కార్మికుల్ని 'మీరు కూడా పెట్టుబడిదారుడి లాగే చేస్తారా? బయటి కార్మికుల్ని, తీసుకుంటే వారికి అదనపు విలువని కూడా పంచుతారా లేదా?' అనే అర్థంతో అడుగుతున్నాడు.

★ **మార్క్సు అడిగిన 99వ ప్రశ్న కూడా చూడండి. దాని అర్థం ఏమిటి?**

**జ:** 'పెట్టుబడిదారుడు, కార్మికులకు కూడా లాభంలో కొంత భాగాన్ని పంచి పెట్టే వర్క్ షాప్ ఏదైనా వుందా?' అని అడుగుతున్నాడు మార్క్సు. అలా వుంటే, కార్మికులకు అక్కడ వచ్చే ఆదాయాల్నీ, అలా లాభాల్ని పంచని చోట వచ్చే ఆదాయాల్నీ, పోల్చి చూడమంటున్నాడు. అలా చూస్తే, కార్మికులకు కూడా లాభంలో భాగాల్ని ఇచ్చే చోట, అలా ఇవ్వని చోట కన్నా కొంత ఎక్కువ ఆదాయమే వుంటుంది.

కానీ, అసలు సమస్యకి పరిష్కారం అది కాదని కార్మికులు గ్రహించాలని ఆ ప్రశ్న అర్థం. లాభంలో కొంత భాగాన్ని కార్మికులకు పంచినా, మిగిలిన భాగం పెట్టుబడిదారుడికే పోతుంది. 'లాభం' అనే పేరుతో వున్నదంతా కార్మికుల శ్రమే. అందులో నించి కార్మికులకు కొంత భాగమే రావడం కాదు. అది అంతా కూడా కార్మికులకే రావాలి. అందులో నించి ఏ భాగం, పెట్టుబడిదారుడికి పోయినా అది ఇతరుల శ్రమని దోచడమే అవుతుంది. లాభాన్ని తోటి వాటాదారులకు పంచడం లోనే అనేక మోసాలు చేసే పెట్టుబడిదారులు, ఇక కార్మికులకైతే ఎన్ని మోసాలు చెయ్యగలరో ఊహించ నక్కర లేదు.

★ **కార్మికులు, తమ పోరాటాల క్రమంలో, "లాభంలో కొంత భాగాన్ని మాకు పంచాలి" అనే డిమాండు తీసుకోవచ్చా?**

**జ:** దీనికి జవాబు, మార్క్సు అడిగిన 99వ ప్రశ్న లోనే వుంది. "అలాంటి కార్మికులు సమ్మెలో పాల్గొనగలరా? పెట్టుబడిదారులకు విధేయులుగా వుంటారా?" అని అడిగాడు మార్క్సు. అంటే - లాభాల్లో వాటాల్ని పంచుకునే కార్మికులు, దాని తోనే సంతృప్తిపడి పోతారనీ, పెట్టుబడిదారులకు విధేయులు గానే మారతారనీ మార్క్సు అర్థం. ఒక కంపెనీకి వచ్చే లాభం అంతా ఆ కంపెనీ కార్మికులదే కాకపోవచ్చు. అలాంటి లాభాన్ని పంచుకోవడం అంటే ఈ కార్మికులు, ఇతర కార్మికుల లాభాన్ని కూడా తీసుకున్నట్టు అవుతుంది. ఆ రకంగా, ఎక్కువ లాభాలు తినడం చేసే కార్మికులు, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా వుండరు. ఒక వేళ ఎప్పుడైనా సమ్మె చేస్తే, 'లాభాల్ని సరిగా పంచడం లేదు' అనే కారణం మీదే చేస్తారు గానీ, అసలు సమస్య మీద కాదు. శ్రమ దోపిడీని గ్రహించకపోతే, 'అది కాని' ఇతర డిమాండ్లన్నీ కార్మిక వర్గానికి ద్రోహం చేసేవే. ఆ సంగతి గ్రహించాలని ఆ ప్రశ్నలో మార్క్సు అర్థం. ★

# 3వ భాగం
# వర్గ రహిత సమాజం దిశగా
[ఈ భాగంలో, 4 చాప్టర్లు ఉన్నాయి]

# 1. యుగ యుగాల మకిలితో వున్న కార్మిక వర్గం

పెట్టుబడిదారీ సమాజం - ఆటవిక, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాల ద్వారా సంక్రమించి పేరుకు పోయిన సమస్త అవలక్షణాల తోటీ నిండి వుంటుంది. అలాంటి సమాజాన్ని, కార్మిక వర్గం, 'నూతన సమాజం'గా మార్చాలి.

శ్రమ దోపిడీని తీసివేస్తే, అదే నూతన సమాజం. ప్రతి మనిషీ తన కోసం తను శ్రమ చేస్తే, అదే నూతన సమాజం. యుగ యుగాల దోపిడీ సంస్కృతిని మార్చి వేస్తే, అదే నూతన సమాజం.

అలాంటి సమాజం, దానికై అదే తయారై సిద్ధంగా దొరకదు. అది, ఏ వర్గానికి విముక్తి మార్గమో ఆ వర్గమే, కార్మిక వర్గమే, ఆ కార్యం ప్రారంభించాలి. ఆ తర్వాత క్రమంగా, శ్రమ చేసే 2 వర్గాల జనాభా అంతా, 'సమాన శ్రమ సంబంధాల' లక్ష్యంతో నూతన సమాజాన్ని దశల వారీగా నిర్మించుకోవాలి.

కానీ కార్మిక వర్గం అనేది, వెనకటి కాలం నించీ ఈ నాటి వరకూ కూడా, దోపిడీ సమాజాల ద్వారా పుట్టి పెరిగినదే కాబట్టి, ఆ సమాజాల చెడుగులన్నీ ఆ వర్గానికి కూడా సంక్రమించి వుంటాయి. ఆ రకంగా కార్మిక వర్గం కూడా సమస్త అవలక్షణాల తోటీ వుంటుంది. అయినప్పటికీ, కార్మిక వర్గం అనేది, 'శ్రమ చెయ్యడం' అనే ప్రత్యేకత గల వర్గం. అది, తన శ్రమతో తను బతికే వర్గం. అదే దాని సుగుణం. శ్రమ చేస్తూ దోపిడీకి గురి అయ్యే ఈ వర్గం, తనను తను విముక్తి చేసుకోవాలంటే, తన అవలక్షణాలన్నిటి నించీ బయట పడాలి. కాబట్టి కార్మిక వర్గం, తనని తను మార్చుకోకపోతే, 'నూతన సమాజం' అనేది కల్ల!

కార్మిక వర్గాన్ని, మార్క్సు, "యుగ యుగాల మకిలితో వుంది" అన్నాడు.

వర్గాలు - వర్గాలుగా వుండడం వేరు, 'వర్గాలుగా వున్నాము' అని గ్రహించడం వేరు. గ్రహింపు - అన్నప్పుడు, కేవలం లోక జ్ఞానంతో కలిగే గ్రహింపు, అస్పష్టమైనది. దాని వల్ల పై పై విషయాలే గానీ, సత్యం అంతా అందదు. లోక జ్ఞానానికి, 'శాస్త్ర జ్ఞానం' (సైన్సు) తోడైనప్పుడు, లోక జ్ఞానం కూడా కొత్త అర్థాల్ని ఇస్తుంది. 'సత్యం' అంతా అవగత మవుతుంది.

కానీ, 'వర్గాల' రహస్యం బయట పడిన తర్వాత కూడా, ప్రపంచ శ్రామిక వర్గం, ఇంకా లోక జ్ఞానపు స్థాయి లోనే వుంది. 'మార్క్సు, దోపిడీ, కమ్యూనిజమూ' అంటూ కొన్ని పొడి పొడి మాటలు తప్ప, దానికి అంత కన్నా ఎక్కువగా తెలీదు. తర తరాలుగా తమ 'అదనపు శ్రమ' ఫలానా ఫలానా పేర్లతో దోపిడీ వర్గానికి పోతోందనీ, ఆ రకంగా తాము దోపిడీకి గురి అవుతోన్న వర్గంగా వున్నామనీ, ఆ సిద్ధాంతం యేదీ తెలీదు. శ్రామిక వర్గం, ఆ నాటి నించీ ఈ నాటి వరకూ ఇంకా అసలైన జ్ఞానానికి దూరం గానే వుంది.

'ప్రకృతి' గురించీ అజ్ఞానమే;

'సమాజం' గురించీ అజ్ఞానమే.

ఎందుకిలా జరుగుతోందంటే, శ్రామిక వర్గానికి అందే జ్ఞానం అంతా, దాని 'యజమాని వర్గం' నించే అందాలి. యజమాని వర్గం ఏది బోధిస్తుందో అదే. జ్ఞానాన్ని ఇచ్చే సాధనాలన్నీ, ముఖ్యంగా - విద్యా,

కళలూ, ఇతర సాంస్కృతిక విభాగాలూ అన్నీ, యజమాని వర్గాధీనం లోనే, ఆ వర్గ స్వభావం తోనే వున్నాయి. యజమాని వర్గంతో సంబంధం లేకుండా, తన జ్ఞానాన్ని తను పొందే మార్గం, శ్రామిక వర్గానికి లేదు.

> "ప్రతీ యుగం లోనూ, పాలించే భావాలు, ఆ నాటి పాలక వర్గ భావాలే" - మార్క్స్ ఏంగెల్సులు [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ 66]

> "భౌతిక ఉత్పత్తి సాధనాలను తన అదుపులో కలిగి వున్న వర్గమే, దాని ఫలితంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కూడా (మీన్స్ ఆఫ్ మెంటల్ ప్రొడక్షన్) కంట్రోలు చేస్తుంది. ఆ విధంగా బౌద్ధిక ఉత్పత్తి సాధనాలను కలిగి వుండని వారి భావాలు, మొత్తం మీద, కంట్రోలు చేసే వర్గానికి లోబడి వుంటాయి ... పాలక వర్గ భావాలు అనేవి, ప్రబలంగా వున్న భౌతిక సంబంధాలకు ఖచ్చితమైన వ్యక్తీకరణ తప్ప ఇంకేమీ కాదు" - మార్క్స్ ఏంగెల్సులు [జర్మన్ ఐడియాలజీ, పేజీ 67.]

యజమాని వర్గమే పాలించే వర్గం.

పాలించే వర్గ భావాలే, ప్రజల భావాలు.

యజమాని వర్గ భావాలే, శ్రామిక వర్గ భావాలు.

యజమాని వర్గం ద్వారా, శ్రామిక వర్గానికి అందే జ్ఞానం ఏమిటి?

'ప్రకృతి' విషయాల్లో: దేవుడూ; రోజు వారీ జీవితంలో అసహ్యమైన, భయంకరమైన మూఢ నమ్మకాలూ!

'సమాజం' విషయంలో: యజమానుల భూములూ ఆస్తులూ వాళ్ళకి వాళ్ళ పెద్దలు ఇచ్చినవే. అప్పటి నించీ యజమానులు తమ తెలివితో చాలా కష్టించి ఆ ఆస్తుల్ని పెంచుకుంటున్నారు; పేదల కైతే వాళ్ళ పెద్దలు ఏమీ ఇవ్వలేదు - ఇలా.

యజమాని వర్గం అలాగే చెపుతుంది కాబట్టి, అది ఏం చెపుతుందో అదే శ్రామికుల జ్ఞానం. శ్రామిక వర్గానికి, 'ఆస్తి సంబంధాల' గురించి, యజమాని వర్గం ఇచ్చే జ్ఞానం కన్నా వ్యతిరేక జ్ఞానం ఏమీ వుండదు.

"సమాజంలో వుండే భావాలు 2 రకాలు. ఆర్థిక శాస్త్రం 2 రకాలు. తత్వ శాస్త్రం 2 రకాలు. ప్రతీ విషయమూ 2 రకాలు" అని ఇంతకు ముందు చెప్పుకున్నది, కేవలం సిద్ధాంత స్థాయిలో వున్నదే గానీ, ఆ 2 రకాలూ నిత్య జీవితంలో వున్నాయని కాదు. శ్రామిక వర్గ జీవితాల్లో వేరే ఆర్థిక శాస్త్రమూ, వేరే తత్వ శాస్త్రమూ, వేరే ఆలోచనా విధానమూ లేవు. యజమాని వర్గం అందించే జ్ఞానం తప్ప, శ్రామిక వర్గానికి వేరే జ్ఞానం లేదు.

ఆ వేరే జ్ఞానాన్ని శ్రామిక వర్గం కొత్తగా నేర్చుకోవాలి. దాన్ని శ్రామిక వర్గ సిద్ధాంతం అయిన 'మార్క్సిజం'ద్వారా నేర్చుకోవాలి. 'మార్క్సిజం' చెప్పేది, శ్రామిక వర్గంలో అత్యధిక సంఖ్యకి ఇంకా తెలీదు. 'జీతం' అంటే, 'శ్రమ శక్తి విలువే' గానీ 'శ్రమ విలువ' కాదని తెలీదు. యజమాని వర్గానికి పోయే కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ, తమ 'అదనపు విలువే'నని తెలీదు. ఉత్పత్తి సాధనాలన్నీ, తమ గత అదనపు విలువలో భాగమేనని తెలీదు. 'భూమి' అనేది ప్రకృతిలో భాగం కాబట్టి, దాని మీద ఏ వర్గానికీ యాజమాన్యపు హక్కు వుండరాదని, తెలీదు. తమని పాలించే ప్రభుత్వం, దోపిడీని రక్షించే ప్రభుత్వమనీ, అది శ్రామిక వర్గ ప్రయోజనాల్ని రక్షించే ప్రభుత్వం కాదనీ, తెలీదు. తాము యజమాని వర్గం కింద దాస్యంలో పడి వున్నామనీ, తమది స్వతంత్ర జీవితం కాదనీ, తెలీదు. ఒక ఉత్పత్తి స్థలంలో శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ జరుగుతూ వుంటే, మేధా శ్రమలు చేసే కార్మికులకు, "మనం మేధా శ్రమలు చేస్తున్నాం; వేరే శ్రామికులు శారీరక శ్రమలు చేస్తున్నారు. అందరం ఒకే వర్గం" అని తెలీదు. అలాగే, ఆ విషయం, శారీరక శ్రమల వారికి కూడా తెలీదు.

<u>అసలు 'శ్రామిక వర్గం' అంటే, ఏ యే సెక్షన్లు కలిస్తే శ్రామిక వర్గమో కూడా శ్రామిక వర్గానికి తెలీదు.</u>

మేధా శ్రామికులైన ఉపాధ్యాయులూ, డాక్టర్లూ, లాయర్లూ, ఇంజనీర్లూ, సైంటిస్టులూ - వంటి వాళ్ళకి కూడా, తాము కూడా యజమాని వర్గం కింద దాస్యం లోనే వున్నామని తెలీదు. అంత పెద్ద మేధావులకు కూడా 'మార్క్సిజం'లో ఇక్కడో ముక్కా, అక్కడో ముక్కా తప్ప, అంత కన్నా ఎక్కువేమీ తెలీదు. 'మార్క్సిజం' అంటే, అదేదో కమ్యూనిస్టుల సిద్ధాంతం అనే అభిప్రాయమే గానీ, అది మానవ సమాజం గురించి నిజాలు చెప్పే సిద్ధాంతమనీ, తాము కూడా శ్రామిక వర్గంలో భాగమేననీ తెలీదు. మేధా శ్రామికులే

ఇలా వుంటే, ఇక శారీరక శ్రామి కుల విషయం చెప్పనే అక్కర్లేదు.

ఈ రకంగా, ఏ నిజాలూ తెలియకుండా వున్న శ్రామిక వర్గం, 'వర్గ పోరాటం' సాగించడం అంటే, అది నిస్సందేహంగా అపజయాల పరంపరగా మాత్రమే ఉండి తీరుతుంది.

గత కాలంలో కూడా ఇదే రకపు అజ్ఞానంతో వున్న శ్రామిక వర్గం, గత కాలపు వర్గ పోరాటాల్లో ఎందుకు జయించగలిగిందంటే, ఆ పోరాటాలు శ్రామిక వర్గ దాస్య రూపాన్ని మార్చే పోరాటాలే గానీ, దోపిడీనే తీసి వెయ్యడానికి జరిగిన పోరాటాలు కావు. కాబట్టి, అక్కడ 'దోపిడీ' గురించి తెలియక పోయినా, జయించడం సాధ్యం అయింది. దాస్యానికి రూపం మారింది.

కానీ, ఇక్కడ పరిస్తితి అది కాదు. ఇక్కడ దోపిడీనే తీసివెయ్యాలి. శ్రమ చెయ్యని వర్గాన్ని శ్రమ లోకి దించాలి. విప్లవకరమైన మార్పులతో నూతన సమాజాన్ని నిర్మించాలి. ఇదంతా జరగాలంటే, శ్రామిక వర్గానికి, దాని వర్గ సిద్ధాంతం దానికి తెలిసి తీరాలి! దోపిడీని తీసి వెయ్యాలంటే, ఏ యే లక్షణాల్ని తీసి వెయ్యాలో తెలిసి, ఆ జ్ఞానంతో, ఆ లక్షణాల మీద పోరాడాలి!

ఈ పోరాటం కోసం శ్రామిక వర్గం, యజమాని వర్గం మీదకి, కేవలం తుపాకుల బలంతో వెళ్తే చాలదు. అంతకన్నా ప్రధానంగా 'సిద్ధాంత బలం'తో వెళ్ళాలి. తుపాకుల బలంతో వెళ్తే, శ్రామిక వర్గం అధిక సంఖ్య లోనే వుంటుంది కాబట్టి, కేవలం ఒక రాజు ఇంకో రాజుని జయించినట్టుగా, తేలిగ్గానే జయం పొందవచ్చు. కానీ అది మొదటి అడుగు మాత్రమే. జరగవలసిన పోరాటం అంతా ఆ తర్వాతే. 'నూతన సమాజ నిర్మాణమే' అసలు పోరాటం. 'వర్గ సిద్ధాంత జ్ఞానం' లేకపోతే, శ్రామిక వర్గం, నూతన సమాజాన్ని నిర్మిస్తున్నా ననుకుంటూ మళ్ళీ పెట్టుబడిదారీ సమాజాన్నే నిర్మిస్తుంది; మహా అయితే, కొంచెం 'మారిన రూపం'తో! ఆ పోరాటం, శ్రామిక వర్గ జ్ఞానాన్ని ఏ మాత్రమూ అభివృద్ధి పరచదు. అది క్రమంగా, అదును కోసం మారు రూపంతో పొంచి వున్న దోపిడీ వర్గానికే అవకాశాలు పెంచుతూ పోతుంది. ఆ అరకొర నూతన సమాజం, ఒక రోజున మళ్ళీ ఏ ముసుగులూ లేని పాత పెట్టుబడిదారీ సమాజం గానే అవతరిస్తుంది. ఆ నాటి వరకూ శ్రామిక వర్గం, తెలిసో తెలీకో, తెలివి గానో మూర్ఖం గానో చేసిన పోరాటమంతా వృధా అయిపోతుంది.

కాబట్టి, శ్రామిక వర్గం, 'వర్గ పోరాటం'లో జయిస్తూ ముందుకు సాగడానికీ, అది నూతన సమాజాన్ని నిర్విఘ్నంగా నిర్మిస్తూ పోవడానికీ, ప్రధానమైన షరతు - దానికి దోపిడీని వ్యతిరేకించడానికి సంబంధించిన జ్ఞానం అంతా అంది తీరాలి! అంటే, దానికి 'మార్క్సిజం' అంది తీరాలి! పెట్టుబడిదారీ భావాల పరిధి నించి, అది, ప్రతీ పెద్ద విషయం లోనూ, ప్రతీ చిన్న విషయం లోనూ కూడా, ఒక స్పష్టమైన విముఖత తోటీ, గ్రహింపు తోటీ, బయట పడాలి.

శ్రామిక వర్గానికి వున్న సుగుణం - శ్రమ చెయ్యడం. అదే దాని ప్రత్యేకత. ఆ ప్రత్యేకతని తీసి పక్కన పెడితే, ఇక మిగిలిన విషయాల్లో శ్రామిక వర్గం కూడా యజమాని వర్గానికి వున్న దుర్గుణాలన్నిటి తోనూ వుంటుంది. ఎందుకంటే, శ్రామిక వర్గ జీవిత విధానాన్ని నిర్ణయించేది యజమాని వర్గమే గనక. శ్రామిక వర్గం వాడే ఉత్పత్తుల రకాలూ, భావాలూ, కాలక్షేపాలూ అన్నీ, యజమాని వర్గ నిర్ణయాలే. శ్రామిక వర్గానికి, 'తనదీ' అనే ప్రత్యేక విలువలు గల జీవిత విధానం ఏదీ వుండదు. యజమాని వర్గ జీవిత విధానాన్ని 'అనుకరించడమే' శ్రామిక వర్గం చేసే పని.

శ్రామిక వర్గం, శ్రమ చేస్తోందంటే, 'శ్రమ చెయ్యడం మనిషి బాధ్యత' అనే గ్రహింపుతో కాదు. బతకడానికి, వడ్డీలో లాభాలో సంపాదించే ఆస్తులు వుండవు కాబట్టి మాత్రమే. ఏదో ఒక పని చెయ్యక పోతే బతికే మార్గం వుండదు కాబట్టి మాత్రమే అది శ్రమ చేస్తుంది. ఆస్తులు వుండాలనీ, వాటి ద్వారా వచ్చే ఆదాయాలతో, ఏ పనీ చెయ్యకుండా బతకాలనీ, శ్రామికులకు కూడా ఆశే. శ్రామికుల భావాలు కూడా అలా ఎందుకు వుంటాయంటే - మితి మీరిన శ్రమ చెయ్యవలసి రావడం వల్లా, వడ్డీ - లాభాల వంటి ఆదాయాలతో బతకడం అంటే ఇతరుల శ్రమని దోచడం అవుతుందనే నిజం తెలియక పోవడం వల్లానూ. - ఈ పరిస్తితుల వల్లే శ్రామికుల చైతన్యం అంత తప్పు మార్గంలో వుంటుంది.

ఒక వర్గం ప్రభావం ఇంకో వర్గం మీద ఎలా వుంటుందో - చూసినట్టయితే, శ్రామిక వర్గ ప్రభావం వల్ల యజమాని వర్గం పాడయ్యేదేమీ వుండదు. శ్రామిక వర్గ ప్రభావం, యజమాని వర్గం మీద పడితే,

యజమాని వర్గం ఏదో ఒక శ్రమ నేర్చుకుని ఎంతో కొంత బాగుపడుతుంది. ఆ ప్రభావం వల్ల దానికి నష్టం ఏమీ జరగదు.

కానీ యజమాని వర్గం వల్ల, శ్రామిక వర్గానికి అందే ప్రభావం అలాంటిది కాదు. యజమాని వర్గానికి వుండే దుర్గుణాల వల్ల, ఆ వర్గ ప్రభావంతో, శ్రామిక వర్గం తప్పని సరిగా ఆ దుర్గుణాలన్నిటికీ గురి అవుతుంది.

డబ్బు తళ తళలతో మెరిసే యజమాని వర్గ జీవిత విధానాన్ని శ్రామిక వర్గం, ఆశ తోటీ, నిర్విమర్శ తోటీ, విభ్రమ తోటీ చూస్తూ వుంటుంది. యజమాని వర్గ జీవిత విధానంలో వున్న తప్పుడు విలువల్నీ, దురాశల్నీ, దుర్గుణాల్నీ, శ్రామిక వర్గం యథాతథంగా అలవర్చుకుంటుంది.

యజమాని వర్గం, శ్రామిక వర్గం పట్ల ఎలాగైతే అగౌరవంతో ప్రవర్తిస్తుందో అలాగే, శ్రామిక వర్గం లోని ప్రతీ సెక్షనూ, తన కన్నా తక్కువ సెక్షన్ల పట్ల, తనకు సాధ్యమైన రూపంలో అగౌరవం తోనే ప్రవర్తిస్తుంది.

మేధా శ్రమల సెక్షన్లు, శారీరక శ్రమల పట్ల, గౌరవంతో వుండవు.

పురుష శ్రామికులు, స్త్రీ శ్రామికుల పట్ల, గౌరవంతో వుండరు.

స్త్రీ శ్రామికులు కూడా, తమ కన్నా తక్కువ స్థాయి శ్రామికుల పట్లా; గృహ శ్రామికుల్ని నియమించుకునే వాళ్ళయితే, ఆ శ్రామికుల పట్లా, గౌరవంతో వుండరు.

స్త్రీ శ్రామికులూ, పురుష శ్రామికులూ కూడా, పని స్థలాల్లో బాల కార్మికులతో మృదువు గానూ, అప్యాయం గానూ, వుండరు.

శ్రామిక స్త్రీ పురుషులు, వృద్ధులైన తల్లిదండ్రుల తోనూ, ఇతర వృద్ధుల తోనూ, గౌరవంతో వుండరు.

శ్రామికుల్లో ఏ సెక్షనైతే - పై స్థాయి లోనూ, కొన్ని అధిక హక్కుల తోనూ వుంటుందో ఆ సెక్షను, ఆ హక్కుల్నీ, ఆ అధికారాన్నీ వదలడానికి అంగీకరించదు.

ఇదంతా 'యజమాని వర్గం నించి' సంపాదించిన **'మకిలే!'** ఈ మకిలి, ఒక సంవత్సరానిదో, ఒక తరానిదో కాదు. బానిస సమాజ కాలం నించీ పేరుకుంటూ వస్తూ వున్న మకిలి ఇది! యుగయుగాల మకిలి!

శ్రామిక వర్గం - అన్ని కోణాల లోనూ వున్న అజ్ఞానంతో పాటు, యజమాని వర్గపు మోసాలూ, జిత్తులూ, అడుగడుగునా తప్పుడు విలువలూ, సాటి మనుషుల మీద ఎక్కడ వీలైతే అక్కడ అధికారం నెరిపే దృష్టీ, తనకు సాధ్యమైన మార్గాల్లోనే కీర్తి పిచ్చీ, ప్రతీ చోటా 'గుణానికి' గాక 'పరిమాణానికి' విలువ ఇవ్వడమూ, మొరటు తనమూ, మూర్ఖత్వమూ, నిజాయితీ రాహిత్యమూ, వ్యసన దృష్టీ, జంతు జాలాల పట్లా మనుషుల పట్లా కూడా నిర్దయా, కౄరత్వమూ, రక్త పిపాసా - వంటి ఎన్నెన్నో దుర్గుణాలతో ఈదులాడుతూ వుంటుంది.

ప్రతీ ఒక్క వ్యక్తీ ఈ దుర్గుణాలన్నిటి తోనూ వుండి తీరుతాడని దీని అర్థం కాదు. వ్యక్తి వ్యక్తికీ భేదం ఎప్పుడూ వుంటుంది. వర్గాన్ని తీసుకుంటే మాత్రం, అది, ఈ అవగుణాలన్నిటి తోనూ వుంటుంది.

దీని కంతటికీ కారణం - యజమాని వర్గమే కావచ్చు; దోపిడీ సమాజమే కావచ్చు. కానీ ఇక్కడ గ్రహించవలసినది, శ్రామిక వర్గం కూడా 'సుగుణాల రాసి కాదు' అనేదే.

శ్రామిక వర్గానికి, యజమాని వర్గం పట్ల అయిష్టమూ తిరస్కారమూ కొంత స్థాయిలో వుండక పోదు. కానీ ఆ తిరస్కారం ఎంత స్థాయిలో వున్నప్పటికీ, దాన్ని మించి, యజమానుల సిరి సంపదల మీదా, అంతస్తుల మీదా, పటాటోపాల మీదా, భీతీ గౌరవమూ అధికంగా వుంటాయి.

'యజమాని' అనే వాడు శ్రామికుల ముందు ఏ మాత్రమూ సిగ్గూ జంకూ చూపడు. తను మహా తెలివి పరుడి లాగా, గొప్ప సమర్థుడి లాగా, శ్రామిక జనాల్ని పోషిస్తోన్న వాడి లాగా, దర్పంగా నిలబడతాడు.

శ్రామికులు జంకుతూ, వినయం చూపుతూ ప్రవర్తిస్తారు.

యజమాని వర్గానికి సంబంధించిన ప్రతీదీ శ్రామికులకు 'గొప్ప'గా కనపడుతుంది. యజమాని వర్గం మాట్లాడే మార్కెట్ సంగతులూ, ధరలూ, బ్యాంకులూ, ఎగుమతి దిగుమతులూ, స్టాక్ ఎక్స్ఛేంజీలూ, విదేశీ మారకాలూ - అన్నీ శ్రామిక వర్గానికి 'గొప్ప' విషయాలే. ఎందుకంటే, అవన్నీ శ్రామిక వర్గంతో సంబంధం లేకుండానూ, శ్రామిక వర్గానికి అర్థం కాకుండానూ జరుగుతూ వుంటాయి కాబట్టి.

శ్రామికులు, 'విద్యాధికులైన' యజమానుల పట్ల మరింత ఎక్కువ భక్తి శ్రద్ధలు చూపుతారు. 'హార్వర్డ్‌లో

చదివాడు', 'లండన్‌లో చదివాడు', 'న్యూయార్క్‌లో చదివాడు', 'కేంబ్రిడ్జిలో చదివాడు' - ఇలాంటి మాటలు శ్రామికుల్ని చాలా లొంగదీస్తాయి. ఏం చదివాడు అక్కడ? దోపిడీని వుంచాలని చదివాడా, తీసి వెయ్యాలని చదివాడా? ఎలా తీసివెయ్యాలో చదివాడా? అదేమీ కాదు. సరిగ్గా దీనికి విరుద్ధమైంది చదువుతాడు. దోపిడీని అలాగే వుంచాలని చదువుతాడు. అలాగే వుంచడం ఎలాగో చదువుతాడు. శ్రామికుల్ని ఇంకా ఇంకా ఎలా దోచాలో బోధించే మేనేజిమెంటు కోర్సులు చదివి వస్తాడు. 'గొప్ప' చదువుల రహస్యం అంతా ఇదే! ఈ చదువులు చదివిన వాళ్ళనా శ్రామిక వర్గం గౌరవించవలసింది? ఇలాంటి చదువులు ఎన్ని చదివినా, ఎక్కడ చదివినా, డిగ్రీలూ పతకాలూ ఎన్ని ధరించినా, ఆ విద్యాధికుల మీద శ్రామికుల హృదయాల్లో మహా తిరస్కారమే గానీ కించిత్తు కూడా లక్ష్యం వుండకూడదు.

అలాగే, 'ప్రభుత్వ నేతల' విషయంలో కూడా. మంత్రులూ, ముఖ్య మంత్రులూ, ప్రధాన మంత్రులూ, ప్రెసిడెంట్లూ - వంటి వాళ్ళంతా శ్రామికులకు, 'మహా శక్తి మంతుల్లాగ' కనపడతారు. కానీ, వాళ్ళంతా ఎవరు? 'దోపిడీ గాళ్ళు' మాత్రమే! సరుకుల బేరగాళ్ళూ, డబ్బు లెక్కల గాళ్ళూ మాత్రమే! అంతకు మించిన విలువ లేవీ వాళ్ళ దగ్గిర లేవు. వాళ్ళ శక్తిగా కనపడేదంతా వాళ్ళ శక్తి కాదు; 'పెట్టుబడి'ది! 'పెట్టుబడి' శక్తిగా కనపడే దంతా పెట్టుబడి శక్తి కూడా కాదు; అది 'శ్రమ'ది!

మొత్తం మీద 'శక్తి' అంతా - శ్రామికులది! అంత శక్తివంతులైన శ్రామికులు, 'అజ్ఞానం'లో పడి వుండడం వల్ల, వాళ్ళ శక్తి వాళ్ళకి కనపడక పోగా, ఏ శక్తీ లేని వాళ్ళే వాళ్ళకి మహా శక్తి మంతుల్లాగా కనపడతారు.

కాబట్టి, "వారు ధనవంతులు! గొప్పవారు! చదువుకున్న వారు! తెలిసిన వారు! తెలివైన వారు!" - లాంటి మాటలకు శ్రామికులు ఎంత మాత్రమూ విలువ ఇవ్వకూడదు.

నాస్తికుడికి, మత బోధకుణ్ణి చూస్తే ఎంత లక్ష్యం లేనితనం వుండాలో, అలాగే శ్రామికులకు బూర్జువా విద్యల్నీ బూర్జువా మేధావుల్నీ, బూర్జువా నాయకుల్నీ, బూర్జువా సిద్ధాంత కర్తల్నీ చూస్తే, అంత 'లక్ష్యం లేనితనం' వుండాలి! అంతే కాదు. శ్రామిక హృదయంలో 'బూర్జువా తనం' పట్ల ఎప్పుడూ ఒక ఆగ్రహం రగులుతూ వుండాలి! కానీ, శ్రామికుల 'అజ్ఞానం' వారికి అంత శక్తిని ఇవ్వదు.

శ్రామిక వర్గం, తన అజ్ఞానం వల్లనే, తన ట్రేడు యూనియన్లని 'శ్రమ'తో సంబంధం లేని బూర్జువా నాయకుల చేతుల్లో పెడుతుంది. ఎన్నడూ శ్రమ ఎరగని ఆ నాయకులు, 'శ్రమ రత్న, శ్రమ శక్తి' లాంటి బిరుదులు అందుకుంటూ వుంటే చూసి సంతోషిస్తూ వుంటుంది.

అలాగే శ్రామిక వర్గం, బూర్జువా రాజకీయ పార్టీల మీదా, ప్రభుత్వ పథకాల మీదా విపరీతమైన భ్రమలతో వుంటుంది. 'పేదరికం నిర్మూలన' కోసం ప్రభుత్వం 150 కోట్లతో ఫలానా పథకం చేపట్టిందని వినగానే, శ్రామిక వర్గం చాలా సంతోషిస్తుంది. కానీ, ఆ పథకం ఎలాంటిదైనా, దాన్ని శ్రామికుల స్వంత బాధ్యతకే అప్పగించినా, అందులో నిర్ణయించే జీతాలు కూడా 'శ్రమ శక్తి విలువ' మాత్రమేనని శ్రామికులకు తెలీదు. ఏ పథకమూ, 'అదనపు శ్రమ'కి చెల్లించదు. కాబట్టి ఏ పథకమూ పేదరికాన్ని నిర్మూలించదు. ఈ విషయం అర్థం చేసుకోవాలంటే, దోపిడీ గురించి తెలిసి వుండాలి. ఆ జ్ఞానం లేనప్పుడు శ్రామిక వర్గం, సంస్కరణ వాదాలకో, కొత్త రూపాలతో తలలెత్తే కొత్త తప్పుడు విధానాలతో ప్రభావితమై లొంగిపోతూ వుంటుంది.

మార్క్సిజం - పెట్టుబడిదారీ వర్గం కోసం కాదు. ఆ సిద్ధాంతాన్ని పెట్టుబడిదారీ వర్గం తీసుకోదు. అది, 'శ్రామిక వర్గం' కోసమే. ఆ రకంగా, మార్క్సిజం - శ్రామిక వర్గ సిద్ధాంతం.

అయితే, ఆ సిద్ధాంతాన్ని శ్రామిక వర్గం ఎంత సరిగా పాటిస్తుందీ- అనేది ప్రశ్న. అనేక తప్పుడు సిద్ధాంతాల ప్రభావాలతో వున్న శ్రామిక వర్గం, మార్క్సిజాన్ని కొన్ని సార్లు సరిగానూ, కొన్ని సార్లు తప్పు గానూ కూడా పాటించవచ్చు. సరిగా పాటించినప్పుడు - ఆ సిద్ధాంతమూ, ఆచరణా ఒకటే అవుతాయి. తప్పుగా పాటించినప్పుడు - అవి రెండూ వేరవుతాయి.

మార్క్సిజాన్ని శ్రామిక వర్గ సిద్ధాంతం - అనడం అంటే, శ్రామిక వర్గం ఎలా పాటిస్తే అలాగే, అదే మార్క్సిజం అవుతుందని, అదే సిద్ధాంతం అవుతుందని అర్థం కాదు.

శ్రామిక వర్గం తప్పు చేస్తే, అది మార్క్సిజం తప్పు

కాదు. శ్రామిక వర్గం తప్పు చేస్తే, ఆ తప్పే, మార్క్సిజం కాదు.

అలాగే, 'శ్రామిక వర్గ సంఘాలు' గానీ, 'శ్రామిక వర్గ రాజకీయ పార్టీ' గానీ, 'శ్రామిక వర్గ ప్రభుత్వం' గానీ, అవి ఏది చేస్తే అదే మార్క్సిజం కాదు.

మార్క్సిజం హేతుబద్ధమైనది కాబట్టీ, అది 'శ్రామిక వర్గం' తరుపున వాదిస్తుంది కాబట్టీ, మార్క్సిజానికి వున్న సుగుణాలూ, హేతుబద్ధతా అంతా, 'శ్రామిక వర్గానికి కూడా వున్నాయ'ని అర్థం కాదు.

'శ్రామిక వర్గం' అనగానే, అది మార్క్సిజంతో సమానం కాదు. అలాగే 'శ్రామిక వర్గ పార్టీ' గానీ, 'శ్రామిక వర్గ ప్రభుత్వం' గానీ, ఆ పేర్లు పెట్టుకోగానే, అవి మార్క్సిజంతో సమానం కావు. ఆ పేర్లు పెట్టుకోగానే, అవి శ్రామిక వర్గ ప్రయోజనాల్ని కాపాడుకునే సరైన చైతన్యంతో వున్నాయని అర్థం కాదు.

అలాగే 'వర్గ పోరాటం' అంటే, అది కేవలం బూర్జువా వర్గంతో చేసే పోరాటం మాత్రమే కాదు. శ్రామిక వర్గం, తనతో తను చేసుకునే పోరాటం కూడా! అంటే, తనలో వున్న 'బూర్జువా తనం'తో! తనకే హాని కలిగించే తన తప్పుడు చైతన్యంతో!

'నూతన సమాజ నిర్మాణం' అంటే, దాని కోసం మారవలసింది - బూర్జువా వర్గమే కాదు. అంత కన్నా ముందు శ్రామిక వర్గమే మారాలి. ఆ వర్గంలో ప్రతీ విభాగమూ మారాలి. మేధాశ్రామికులూ - శారీరక శ్రామికులూ, స్త్రీలూ - పురుషులూ, పిల్లలూ- పెద్దలూ, అందరూ మారాలి. అందరూ, పాత కాలం నించీ పేరుకుంటూ వస్తూ వున్న, ఎవరి అవ గుణాల్ని వాళ్ళు వదుల్చుకుంటూ ఒక దశ నించీ ఒక దశకి అభివృద్ధి చెందాలి.

శ్రామిక వర్గం, తర తరాలుగా దోపిడీ సంబంధాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూ వస్తోంది కాబట్టి, ఆ లొంగుబాటు తనానికీ, ఆ తప్పుడు అవగాహనలకూ వ్యతిరేకంగా, దోపిడీ వ్యతిరేక నిబంధనలు, శ్రామిక వర్గానికి కూడా అవసరమవుతాయి.

శ్రామిక వర్గం, దోపిడీ వర్గ ప్రభావం వల్ల తనకు పట్టిన యుగ యుగాల 'ఖిలుం'తో పోరాటం చేసుకోవాలి.

ఇదంతా కూడా 'వర్గ పోరాటం'లో భాగమే. ఇదంతా కూడా దోపిడీ వ్యతిరేక పోరాటంలో భాగమే. అలాంటి పోరాటం ద్వారానే శ్రామిక వర్గం, ఎప్పటి కప్పుడు నూతన విప్లవ జీవితానికి తనని తను అర్హురాలిగా చేసుకోవాలి.

"ఈ కమ్యూనిస్టు చైతన్యాన్ని విస్తృత స్థాయిలో పొందడానికీ, 'అసలు ఆశయం'లో విజయం సాధించడానికీ, మనుషులు విస్తృత స్థాయిలో మారడం అవసరం. ఆ మార్పు, ఆచరణాత్మకమైన ఉద్యమం ద్వారానే, విప్లవం ద్వారానే, జరుగుతుంది. కాబట్టి, 'విప్లవం' అనేది ఎందుకు అవసరమంటే, పాలక వర్గాన్ని ఇంకో మార్గాన కూలదొయ్యలేము గనకనూ; కూలదోసే వర్గమేమో విప్లవ పోరాటంలో మాత్రమే తన యుగ యుగాల మకిలినంతటినీ ('మక్' ఆఫ్ ఆల్ ఏజెస్) వదుల్చుకుని, సమాజాన్ని నూతనంగా నిర్మించడానికి అర్హురాలవుతుంది కనకనూ." - మార్క్స్ ఎంగెల్సులు [జర్మన్ ఐడియాలజీ, పేజీ 60]

ఉద్యమ నిర్మాణానికి, 'కాపిటల్ - జ్ఞానమే' ప్రధానమైన షరతు.

'కాపిటల్' చదివిన పాఠకులు, దాన్ని చదవక ముందు సమాజం గురించి ఎలాంటి అభిప్రాయలతో వున్నారో గుర్తు చేసుకుంటే, ఎన్నో తప్పుడు అభిప్రాయాలతో వున్నట్టు తెలుస్తుంది. 'కాపిటల్' చదవకపోతే ఆ తప్పులన్నీ అలాగే వుండిపోతాయి.

అలాగే శ్రామిక వర్గం విషయం కూడా. 'కాపిటల్'లో ఇచ్చిన జ్ఞానాన్ని శ్రామిక వర్గం అందుకోకపోతే, అది సిద్ధాంత పరంగా ఘోరంగా వెనకబడి వుంటుంది. ఇంకా దోపిడీ సిద్ధాంతాల ప్రభావాల లోనే మునిగి వుంటుంది.

1868 సెప్టెంబరులో బ్రస్సెల్స్‌లో 'అంతర్జాతీయ కార్మిక సంస్థ - మహా సభ' జరిగింది. అందులో ఇలా ఒక తీర్మానం చేశారు:

**"అన్ని దేశాల కార్మికులూ మార్క్స్ 'కాపిటల్' చదవాలి. దానికి వివిధ భాషల లోకి అనువాదాలు జరిగేలా ప్రయత్నాలు చేయాలి"** - [కార్ల్ మార్క్స్ బయాగ్రఫీ, పేజీ 370, మాస్కో, 1973].

★

# 2. నూతన సమాజంలో రద్దులు

పెట్టుబడిదారీ సమాజంలో వున్న కార్మిక వర్గం, తనలో తనకే వున్న 'పోటీల' వల్ల ఎంత అనైక్యంగా వున్నప్పటికీ, ఎంత సిద్ధాంత రాహిత్యంతో వున్నప్పటికీ, ఎన్ని బలహీనతల తోటీ అశక్తతల తోటీ వున్నప్పటికీ, అది, 'యజమాని వర్గం'తో పోరాటం లోకి దిగక తప్పదు. పోరాడవలసిన అవసరం లేకుండా, శాంతిగా జీవించే అవకాశాన్ని దాని దుర్భర జీవన పరిస్థితులు దానికి ఇవ్వవు. పోరాడితే తప్ప పరిష్కరించుకోలేని సమస్యలు, దాన్ని ప్రతి విషయం లోనూ యజమాని వర్గంతో పోరాటాలలోకి దించుతూనేవుంటాయి. గత కాలపు శ్రామిక వర్గాలు పోరాడినట్టే, కార్మిక వర్గం కూడా ఎంతో కాలంగా పోరాడుతూనే వుంది.

కార్మిక వర్గం, తను ఒక వర్గంగా 'దోపిడీకి గురి అవుతున్నాన'నే గ్రహింపునీ, వర్గ చైతన్యాన్నీ, 'మార్క్సిజం' ద్వారానే పొందాలి. ఆ సిద్ధాంతాన్నే మార్గదర్శకంగా చేసుకునే 'వృత్తి సంఘాల' ద్వారానూ, తన రాజకీయ పార్టీ అయిన 'కమ్యూనిస్టు పార్టీ' ద్వారానూ అది, తన పోరాటాన్ని కొనసాగించాలి.

కార్మిక వర్గ పోరాటం, ఎన్నో అవకతవకల తోటీ, తప్పటడుగుల తోటీ, మరెన్నో తప్పుడు ప్రభావాల తోటీ సాగుతూ వుండవచ్చు. పోరాటంలో ప్రతీ దశలోనూ ఇదంతా జరిగే అవకాశం వుంది. తప్పులు అధికంగా వున్నంత కాలమూ కార్మిక వర్గానికి, 'జయాలు' గాక, అపజయాలే ఎదురవుతూ వుంటాయి. అయితే, ఎన్ని అపజయాలు ఎదురైనా పోరాటాలు చాలించుకునే స్థితి కార్మిక వర్గానికి వుండదు. అపజయం తర్వాత కూడా మళ్ళీ ఘర్షణ లోకి దిగక తప్పని స్థితి దానిది. పోరాడితే తప్ప జీవితంలో అతి చిన్న మేలుని కూడా సాధించలేని స్థితి, దానిది. కాబట్టి, ఎంతెంత అపజయాలు కూడా కార్మిక వర్గ పోరాటాన్ని ఆపలేవు.

జయాప జయాల్ని దూరంగా పెట్టి, వాటిని పట్టించుకోకుండా ఇక్కడ, నూతన సమాజ నిర్మాణాన్ని 'సిద్ధాంత స్థాయి'లో చూస్తాము. కార్మిక వర్గం, పూర్తిగా సరైన వర్గ చైతన్యం తోటే పోరాటాన్ని సాగిస్తుందనీ, పూర్తిగా మార్క్సిస్టు సిద్ధాంత జ్ఞానమూ, చిత్త శుద్ధి గల నాయకత్వమే దానికి లభిస్తుందనీ, అది ఒక దశ తర్వాత ఒక దశని పూర్తి చేస్తూ ముందుకు సాగుతుందనీ భావిస్తూ, ఆ పోరాటాన్నంతటినీ ఇక్కడ 'స్వచ్ఛ రూపం'లో (ప్యూర్ ఫామ్‌లో) అర్థం చేసుకుంటాము.

'నూతన సమాజం' అనే ఆలోచన ఎంత అస్పష్టంగా వున్నా, ఆ ఆలోచన ప్రారంభమైందంటేనే ఆ ప్రయత్నం ప్రారంభమైందని అర్థం. దోపిడీ వ్యతిరేకతా, ఉపయోగపు విలువ దృష్టీ, సమానత్వమూ - అనే సూత్రాల మార్గదర్శకత్వంతో కార్మిక వర్గం, 'విప్లవకరమైన మార్పులు' ప్రారంభిస్తుంది. ప్రతీ మార్పూ అనేకమైన 'అనుభవాల్ని' ఇస్తూ వుంటుంది. ఆ అనుభవాల నించే తన విముక్తికి సహకరించే సరైన వాటిని గ్రహిస్తూ, సరికాని వాటిని వదిలి వేస్తూ ముందుకు సాగవలసి వుంటుంది.

దోపిడీ వర్గం కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ లాగడానికి కారణమైన దోపిడీ ఆస్తి హక్కుల్ని తీసివేసే అధికారం కార్మిక వర్గానికి వుండాలంటే, ఆ వర్గం మొట్టమొదట సమాజంలో 'రాజకీయాధికారాన్ని' స్వాధీనం చేసుకోవలసి వుంటుంది. పెట్టుబడిదారీ వర్గ ప్రభుత్వాన్ని తోసివేసి, ఆ స్థానం లోకి కార్మిక వర్గ ప్రభుత్వం రావలసి వుంటుంది. ఇది 'సాయుధ పోరాటం' ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఎందుకంటే, శ్రమ చెయ్యకుండా జీవిస్తోన్న దోపిడీ వర్గం, ఆస్తి హక్కుల్ని వదులుకోవడానికీ, 'శ్రమ' లోకి రావడానికీ, స్వచ్ఛందం గానూ, శాంతి మార్గం లోనూ, ఎన్నటికీ అంగీకరించదు. పైగా కార్మిక వర్గం తిరుగుబాట్లు చెయ్యకుండా దాన్ని అణచడానికే ప్రయత్నిస్తూ వుంటుంది. కాబట్టి, ఆ వర్గాన్ని, కార్మిక వర్గం, 'సాయుధ మార్గం' లోనే రాజకీయాధికారం నించి తోసి వెయ్యవలసి వుంటుంది.

కార్మిక వర్గం, సమాజాన్ని పరిపాలించే రాజకీ

యాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత నించీ, 'గమ్యాన్ని' చేరే వరకూ జరిగేదంతా 'దీర్ఘమైన పరిణామ క్రమం'గా వుంటుంది. ఆ కాలమంతా అనేక మార్పులతో సాగే పరివర్తనా దశలతో నిండి వుంటుంది.

కార్మిక వర్గం రాజకీయాధికారం తీసుకోగానే, అది, 'నూతన సమాజం' కాదు. అది ఇంకా పాత సమాజమే. ఆ పాత సమాజాన్నే క్రమంగా నూతన సమాజంగా మార్చాలి.

'దోపిడీ' సమాజాన్ని - దోపిడీ లేని సమాజంగా!
'వర్గాల' సమాజాన్ని - వర్గాలు లేని సమాజంగా!
'అసమానత్వాల' సమాజాన్ని - సమానత్వాల సమాజంగా!

ఈ మార్పులన్నీ జరగక ముందే అది నూతన సమాజం అవదు. కానీ, ఈ మార్పులన్నీ జరగక ముందే దాన్ని 'నూతన సమాజం'గా ఎందుకు అంటామంటే, ఈ మార్పులన్నీ జరగడం కోసమే అది ప్రారంభమౌతుంది గనక! దాని లక్ష్యమే 'నూతనమైనది' గనక!

నూతన సమాజంలో 'దోపిడీ ఆస్తి హక్కుల్ని తీసివేసే' మార్పు ప్రారంభించ గానే వర్గాలు అంతర్ధానమై పోవు. అవి 'పాత స్థితి' నించి చెదిరి పోవడం మాత్రమే ప్రారంభమవుతుంది. అదే, వర్గాల అంతర్ధానం కాదు.

అప్పటి వరకూ శ్రమ చెయ్యకుండా వున్న వర్గం అంతా, శ్రమ చెయ్యడం మొదలు పెట్టాలి. అంతే గాక, మేధాశ్రమలు చేసే సెక్షన్లన్నీ కొన్ని శారీరక శ్రమలూ, శారీరక శ్రమలు చేసే సెక్షన్లన్నీ కొన్ని మేధా శ్రమలూ చెయ్యడానికి వీలైన మార్పులన్నీ ప్రారంభం కావాలి. స్త్రీ, పురుషుల మధ్య కూడా ఇంటా బైటా శ్రమ విభజనలో మార్పులు ప్రారంభం కావాలి.

తన గత ఆస్తి హక్కుల్నీ, అధికారాల్నీ వదులుకోక తప్పని వర్గం, ఈ కొత్త దశలో కూడా, ఏదో ఒక స్థాయిలో, తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికే తంటాలు పడుతూ వుంటుంది. కానీ ఆ ఆధిపత్యం వల్ల సమస్యలు అనుభవించే రెండో వర్గం, ఆ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఘర్షణ పడుతూ వుంటుంది. అది, దోపిడీ లక్షణాలకూ, దాని వ్యతిరేక లక్షణాలకూ జరిగే పోరాటమే. అంటే వర్గ పోరాటమే. పోరాటమే లేకపోతే, ఆ దోపిడీ లక్షణాల్ని మార్చడమే సాధ్యం కాదు.

ఒక మార్పు జరిగేటప్పుడు, ఆ కొత్త స్థితిని బట్టి, ఆ స్థితికి తగిన కొత్త వర్గాలు ఏర్పడుతూ వుంటాయి. అవి, స్వంత ప్రయోజనాల కోసం ఘర్షణ పడుతూ వుంటాయి.

సమాజంలో ఏ మార్పుని తీసుకున్నా, అది జరగడం, అప్పుడు వున్న వర్గాల్లో, ఒక వర్గానికి ప్రయోజనకరం అయితే, అది జరగక పోవడం ఇంకో వర్గానికి ప్రయోజనకరం అవుతుంది. ఆ రకంగా అది 'ఘర్షణ'కు దారి తీస్తుంది. ఒక వేళ, ఏ దశలో నైనా 2 వర్గాలూ ఐక్యతతో ఒక మార్పుని సాధించినా, ఇంకో కొత్త మార్పు దగ్గిర మళ్ళీ కొత్త ఘర్షణ ఎదురవుతుంది. వర్గాల పోరాటం ఒక దశ నించీ ఇంకో దశకి మారుతూ వుంటుంది, అది అంతరించే దాకా.

వర్గాలు సంపూర్ణంగా 'ఐక్యం' కానంత వరకూ, అందరి ప్రయోజనాల్నీ ఒకటిగా చేసే మార్పులన్నీ సంపూర్ణం కానంత వరకూ, ఎవరి ప్రయోజనాలు వాళ్ళవిగా వుండే భిన్న ప్రయోజనాలు ఇంకా సమాజంలో వున్నంత వరకూ, ఆ భిన్న ప్రయోజనాల మధ్య ఘర్షణలు తప్పవు. సమస్యలూ, పోరాటాలూ తప్పవు.

అందుకే, నూతన సమాజ నిర్మాణ కాలం అంతా, దోపిడీ లక్షణాలకూ, దాని వ్యతిరేక లక్షణాలకూ ఘర్షణలు జరిగే వర్గ పోరాట కాలం గానే వుంటుంది.

వర్గ సమాజాన్ని 'వర్గ రహిత సమాజం'గా మార్చడం అనేది - దీర్ఘ రోగంతో కొట్టుమిట్టాడుతోన్న రోగిని, సరైన వైద్యంతో, ఆరోగ్య స్థితికి తేవటం లాంటిదే. 'అనారోగ్యం' నించి 'ఆరోగ్యానికి' రావడం కొన్ని దశలు గల పరిణామ క్రమం. అందులో ఏ దశని తీసుకున్నా అది, 'కొంచెం కోలుకోవడం'గా వుంటుందే గానీ 'పూర్తి ఆరోగ్యం'గా వుండదు. ఏ దశని తీసుకున్నా, అక్కడ, జబ్బు లక్షణాలు ఇంకా కనపడుతూనే వుంటాయి. అలాగే 'మారుతూ వున్న సమాజం'లో, ఏ దశని తీసుకున్నా అక్కడ 'వర్గ లక్షణాలు' ఇంకా కనపడుతూనే వుంటాయి.

వర్గాలు లేకపోవడమే - పోరాటానికి చివరి గమ్యం!

ఈ పోరాట కాలాన్నంతా క్లుప్తంగా ఇలా చూద్దాం.

'ఉత్పత్తి సాధనాలపై దోపిడీ ఆస్తి హక్కులు' రద్దు! 'కౌళ్ళు వడ్డీలూ లాభాలూ' రద్దు! 'యజమాని తనం' రద్దు! 'పెట్టుబడిదారీ శ్రమ విభజన' రద్దు! 'గ్రామానికీ, పట్టణానికీ వైరుధ్యం' రద్దు! 'స్త్రీ పురుషుల

మధ్య అసమానత్వం' రద్దు! 'రాత్రి పని' రద్దు! 'కుల మతాలు' రద్దు! 'వేతన బానిసత్వం' రద్దు! 'వర్తకం' రద్దు! 'రాజ్యాంగ యంత్రం' రద్దు! 'వర్గాలు' రద్దు!

'వర్గాలు' రద్దయ్యే ఆ 'ఉన్నత లక్ష్యం' కోసం ఇంకా ఎన్ని రకాల రద్దులూ, మార్పులూ అవసరమవు తాయో వాటినన్నిటినీ కూడా ఈ పోరాట క్రమం లోకి చేర్చుకోవాలి. ఈ రద్దుల ఫలితమే - నూతన సమాజం!

ఈ మార్పులన్నీ విడి విడి దశలు కావు. ఒకటి పూర్తయ్యాక ఒకటి జరిగే దశలు కావు. ఒక దానితో ఒకటి లంకెలు పడి, ఒక దాన్ని ఒకటి ప్రభావితం చేసుకుంటూ సాగవలసినవే. అయినప్పటికీ, అన్ని మార్పులూ ఒకే కాలంలో ప్రారంభం కావు.

'నూతన సమాజం'లో కూడా, చాలా మార్పులు జరిగే వరకూ, ఉత్పత్తుల 'మారకాలు' వుంటాయి. వాటి ధరల నిర్ణయాలూ, వాటి అమ్మకాలూ అన్నీ వుంటాయి. అయితే అవన్నీ 'పెట్టుబడిదారీ పద్ధతి'లో గాక, దాని నించి మారే స్వభావంతో వుంటాయి, వుండాలి.

నూతన సమాజం ప్రారంభం కాగానే తక్షణం సరుకుల అమ్మకాల్ని తీసివెయ్యాలనీ, 'జీతాల పద్ధతి'ని రద్దు చెయ్యాలనీ, లేదా 'జీతాల్ని సమానం చెయ్యాల'నీ - ఇంకా ఈ రకమైన మార్పులన్నీ ప్రారంభం లోనే చెయ్యాలని భావించకూడదు. ప్రతీ మార్పుకీ ఒక క్రమం అవసరం. ఒక మార్పు చెయ్యా లంటే, మొదట దానికి తగిన పరిస్థితుల్ని ఏర్పరిస్తేనే గానీ ఆ మార్పు సాధ్యం కాదు. దాని కోసం ఒక 'చట్టం' చేసినంత మాత్రాన్నే ఆ మార్పు జరిగిపోదు. ఆ చట్టం, 'నిజ జీవితాల్లోకి' రావాలి. చట్టపరమైన మార్పే సామాజికమైన మార్పు కాదు. సామాజికమైన మార్పులన్నీ జీవిత సంబంధాల్లో జరగాలి.

నూతన సమాజంలో మార్పుల గురించి, గత భాగాల్లో అనేక సందర్భాల్లో చూశాం. నూతన సమా జంలో శ్రమ విభజనా, షిఫ్టు పద్ధతీ, ఉత్పత్తి శక్తులూ, పని దినం, నూతన సమాజపు పునరుత్పత్తీ - ఇంకా అనేక విషయాల గురించి, అనేక సందర్భాల్లో చూశాం. ఆ విషయాల్లో కొన్నిటిని గుర్తు చేసుకుంటూ, ఇంకా కొన్ని కొత్త విషయాల్ని చర్చించడం ఇక్కడ అవసరం.

'రద్దు'లన్నిటినీ ఇక్కడ క్లుప్తంగా చూస్తాం.

# ఉత్పత్తి సాధనాలపై 'యజమానుల ఆస్తి హక్కు' రద్దు

**కా**ర్మిక వర్గం, 'రాజకీయాధికారం' తీసుకునే నాటికి, సమాజం ఏ స్థితిలో వుంటుందో ఆ స్థితి లోనే అది కార్మిక వర్గం చేతుల్లోకి వస్తుంది. ఆ సమాజంలో, 'భూమి' లోనూ, గనులూ ఫ్యాక్టరీలూ వంటి ఇతర ఉత్పత్తి సాధనాల లోనూ, కొంత భాగం, ప్రభుత్వం చేతుల్లో వుంటుంది. చాలా భాగం స్వదేశీ విదేశీ ప్రైవేటు పెట్టుబడిదారుల చేతుల్లోనూ, కొంత భాగం పెటీ బూర్జువాల చేతుల్లోనూ, అతి స్వల్ప భాగం స్వతంత్ర ఉత్పత్తిదారుల చేతుల్లోనూ వుంటుంది.

అలాంటి సమాజం మీద కార్మిక వర్గం అధికారం తీసుకున్నప్పుడు, పాత ప్రభుత్వాధీనంలో వున్న శాఖ లన్నీ, ఆస్తులన్నీ, కార్మిక ప్రభుత్వాధీనం లోకి సహజం గానే వస్తాయి.

భూస్వాముల భూములన్నిటినీ - స్వంత శ్రమ చేసే కౌలు రైతులూ, వ్యవసాయ కార్మికులూ, స్త్రీ పురుష భేదం లేకుండా, పంపకాలు చేసుకోవలసి వుంటుంది. భూస్వాముల కుటుంబాలు కూడా, తమ వంతు భూమిపై, స్వంత శ్రమ చేసుకోవాలి.

పెద్ద ప్రైవేటు పెట్టుబడిదారుల ఫ్యాక్టరీల్ని, కార్మికులు, స్వాధీనం చేసుకుంటారు. ఆ పెట్టుబడి దారులు కూడా శ్రమలు చెయ్యాలి.

పెటీ బూర్జువాలు కొంత కాలం వరకూ తమ ఉత్పత్తి సాధనాల్ని ఎప్పటి లాగే వుంచుకోవచ్చు. కానీ, కార్మికుల జీతాలూ, పని వేళలూ, ఇతర పని పరి స్థితులూ - వంటి విషయాల్లో కొత్త నిబంధనలకు లోబడవలసి వుంటుంది. క్రమంగా ఆ ఉత్పత్తి సాధనాలు కూడా కార్మిక నిర్వహణ కిందికి వస్తాయి.

స్వతంత్ర ఉత్పత్తిదారులూ, భూముల్ని పంచు కున్న వ్యవసాయ కార్మికులూ, కొంత కాలానికి క్రమంగా తమ భూముల్ని కలుపుకుని సమిష్టిగా వ్యవ

సాయం చేసుకుంటూ, 'సమిష్టి సంఘాలు'గా ఏర్ప డడం ప్రారంభమవుతుంది.

ఉత్పత్తి సాధనాలపై సమిష్టి హక్కుల్నీ, సమిష్టి బాధ్యతల్నీ నెలకొల్పే ఈ క్రమం, వైరుధ్యాలు లేని దశ వరకూ అభివృద్ధి చెందవలసి వుంటుంది.

ప్రైవేటు ఆస్తి హక్కు రద్దుతో పాటే 'నిర్బంధ శ్రమ' షరతు కూడా వుంటుంది కాబట్టి, పెట్టుబడిదారీ వర్గం కూడా శ్రమ లోకి దిగుతుందని ఊహిద్దాం. కానీ ఆ వర్గం, తక్షణమే సాధారణ కార్మిక వర్గంగా మారదు. సమాజంలో ఇంకా అనేక మార్పులు జరిగే వరకూ అది జరగదు. అయినప్పటికీ, జనాభా అందరూ శ్రమ చేస్తారు కాబట్టి, అందర్నీ 'ఉత్పత్తిదారులు' అనవలసి వుంటుంది.

సమాజాన్ని మార్చే లక్ష్యం గల వర్గం గురించి ప్రత్యేకంగా చెప్పేటప్పుడు, ఇంకా 'కార్మిక వర్గం' అనక తప్పదు. ఇంకా కొన్ని సందర్భాల్లో వర్గ భేదాలకు సంబంధించిన మాటలే ఉపయోగించవలసి వస్తుంది. ఎందుకంటే, ఇంకా వర్గ భేదాలు వుంటాయి గనక.

# 'కౌలు' రద్దు

**భూ**మిపై ప్రైవేటు హక్కుని తీసివేసినప్పుడు, మొదట 'కౌలు'ని పొందే 'యజమానితనం' రద్దవు తుంది. సరుకు విలువలో నించి కొంత భాగాన్ని 'కౌలు'గా ఎవరికీ చెల్లించవలసిన అవసరం వుండదు. నూతన సమాజంలో, వెంటనే రద్దు చెయ్యగలిగేది మొట్టమొదట - 'కౌలు'నే.

అయితే, నూతన సమాజంలో, 'కౌలు'గా చెల్లించే దేమీ వుండదు కాబట్టి, సరుకు 'ధర'ని నిర్ణయించే టప్పుడు, అందులోకి కౌలు భాగాన్ని చేర్చాలా, అక్కర లేదా? - ఈ ప్రశ్నతో, నూతన సమాజపు ధర సమస్య ప్రారంభమవుతుంది. ఈ సమస్యని అనేక కోణాల నించీ చర్చించాలి.

(ఇక్కడ, ఉదాహరణలు తేలిగ్గా వుండడం కోసం, విలువా, ఉత్పత్తి ధరా, మార్కెట్ ధరా - అనే తేడాల్ని వదిలేసి, విలువా - ధరా ఒకటే అనుకుంటాము.)

కౌలు - అనేదే లేనప్పుడు, కౌలు భాగాన్ని ధర లోకి చేర్చనక్కర లేదు. అయితే, దీని వల్ల తల ఎత్తే సందేహాలకు సరైన జవాబులు కావాలి. కౌలు - అనేది, 'అదనపు విలువ'లో భాగం. నిజానికి కౌలు ద్వారా సరుకుకి ఏ విలువా చేరదు, కానీ, పెట్టుబడి దారీ సమాజంలో, సరుకు 'విలువ'ని లెక్క కట్టాలన్నా, ఆ విలువలో 'అదనపు విలువ' భాగం ఎంత వుందో చూడాలన్నా, కౌలు భాగాన్ని కూడా లెక్కలోకి తీసు కోవాలి. అలా చెయ్యకపోతే, అంటే కౌలుని చేర్చ కుండా విలువని లెక్క కడితే, అప్పుడు, సరుకు విలువా, అందులో వుండే అదనపు విలువా తగ్గిపోయి కనపడతాయి. అవి నిజంగా ఎంతెంత వున్నాయో ఆ సైజులు కనపడవు. కాబట్టి, పెట్టుబడిదారీ సమాజపు సరుకు 'విలువ'లో కౌలు భాగం కూడా వుండ వలసిందే.

కానీ, ఇది నూతన సమాజానికి వర్తించదు. ఇక్కడ కౌలు - అనే మాట లేకుండానే, 'విలువ'ని ('ధర'ని) లెక్క కట్టాలి.

అయితే, దీని మీద ఒక ప్రశ్న. నూతన సమాజపు 'విలువ'లో కూడా 'కౌలు'ని చేర్చినా, ఆ భాగం ఉత్పత్తిదారులకే అందుతుంది కదా? ఎవరి శ్రమ వారికే అందేటప్పుడు, అలా ఎందుకు చెయ్య కూడదు?

**జవాబు:** అలా ఎందుకు చెయ్యకూడదంటే, భూస్వామి తీసుకున్నప్పుడే అది - కౌలు. ఎవరి శ్రమని వారే తీసుకున్నప్పుడు అది కౌలు కాదు. 'కౌలు' పేరుతో కొంత భాగాన్ని తినే హక్కు, శ్రమ చేసే వ్యక్తికి కూడా వుండదు. కౌలుని తీసుకునే హక్కు 'భూమి'కి వుండదు. ఉత్పత్తిదారులు కూడా భూమికి యజ మానులు కారు. వారు, భూమిని ఉపయోగించుకో వలసిన వారు మాత్రమే. కౌలు - అనే పేరు లేక పోయినా, తమ శ్రమనంతా తీసుకునే హక్కు ఉత్పత్తి దారులకు ఎలాగూ వుంటుంది. కాబట్టి, వారు, తమ శ్రమలో కొంత భాగాన్ని కౌలుగా భావించకూడదు. కౌలు - అనే అవగాహనే తప్పు కాబట్టి, ఆ మాట 'నూతన సమాజపు ఆర్థిక శాస్త్రం'లో వినపడకూడదు. పెట్టుబడిదారీ సమాజానికి సంబంధించిన మాటల్లో చాలా మాటలు నూతన సమాజానికి అర్థ రహితమై పోతాయి. కాబట్టి, నూతన సమాజంలో, 'కౌలు'ని, 'ధర' లోకి చేర్చడం అనే ప్రశ్నే వుండదు.

ఇంకో ప్రశ్న: 'కౌలు'ని చేర్చకుండా లెక్క కడితే,

సరుకుకి వుండే నిజమైన విలువ తెలుస్తుందా? విలువ సైజు తగ్గిపోయి కనపడదా?

**జవాబు:** అలా జరగదు. సమాజం అంతా ఒకే పద్ధతిని పాటించినప్పుడు, 'కౌలు'ని ధర లోకి చేర్చడమూ, చేర్చక పోవడమూ, ఒకటే అవుతాయి. ఎలా గంటే: సమాజంలో ప్రతి శాఖ లోనూ కౌలు భాగాన్ని కూడా చేర్చి లెక్క కడితే ప్రతి చోటా ధర, 10% పెరుగుతుందనుకుందాం. ఏ శాఖ లోనూ కౌలు భాగాన్ని చేర్చకపోతే ప్రతి చోటా ధర, 10% తగ్గుతుంది. అన్ని సరుకుల ధరలూ ఒకే రకంగా పెరిగినా, ఒకే రకంగా తగ్గినా, రెండూ ఒకటే. కౌలుని, కొన్ని శాఖల ధరల్లోకి మాత్రమే చేర్చి, కొన్ని శాఖల ధరల్లోకి చేర్చకపోతే, అలా జరిగినప్పుడే సమస్య వస్తుంది. ఏ ధర లోకీ చేర్చకపోతే దాని వల్ల సమస్యేమీ వుండదు.

కౌలుని చేర్చిన ధర కన్నా, చేర్చని ధర తక్కువగానే వుంటుంది. కానీ, అన్ని శాఖల ధరలూ అలాగే తక్కువగా వుంటాయి కాబట్టి, ఆ సమాజంలో ఆ తక్కువ ధరలే, నిజమైన ధరలు. దాని వల్ల 'విలువ'లో నించి కొంత భాగం మాయమై పోయేదేమీ వుండదు. అలాగే, 'ఉత్పత్తి పరిమాణం'లో నించి కూడా కొంత భాగం మాయమై పోయేదేమీ వుండదు. ఉత్పత్తి రాసి అంతా ఎప్పటి లాగే వుంటుంది. దానికి పట్టే 'శ్రమ కాలం' కూడా ఎప్పటి లాగే వుంటుంది. వేరు వేరు శాఖల ఉత్పత్తుల ధరల సంబంధాలన్నీ ఎప్పటి లాగే వుంటాయి. కాబట్టి ఏ శాఖ ధర లోనూ కౌలు భాగాన్ని చేర్చక పోతే దాని వల్ల ఏ సమస్యా రాదు.

అయితే, 'నూతన సమాజం' ఏర్పడుతూ వున్న ఒక దేశం పక్కన కొన్ని పెట్టుబడిదారీ దేశాలు వుంటాయి. ఆ దేశాల్లో ధరలు 'కౌలు'తో కలిసే వుంటాయి కాబట్టి, అవి ఎక్కువ ధరలుగా వుంటాయి. 2 చోట్లా ఒకే రకపు సరుకుని తీసుకుందాం. 2 చోట్లా ఉత్పత్తి శక్తులు సమానం అనుకుందాం. ఒక యూనిట్‌కి, 'కౌలు'తో కలిసిన ధర - 5, కౌలు లేని ధర 4 - అనుకుందాం.

అలాంటి సరుకులకు మారకం జరిగితే, కౌలు లేని ధర - దేశం, నష్టపోతుంది. కాబట్టి, నూతన సమాజం, తన సరుకుల్ని పెట్టుబడిదారీ దేశాలకు ఇచ్చేటప్పుడు, 'తన సమాజ పరిధిలో వుంచుకునే ధరల తోటే' ఇవ్వడానికి వీలు లేదు. అలాంటి సందర్భాల్లో అది తన ధరల్ని పెంచవలసి వుంటుంది. ఎంత పెంచాలంటే, ఒక సగటు రేటుతో కౌలుని కూడా కలిపితే ధర ఎంత పెరుగుతుందో అంత!

అయితే, 'ధర'లో ఆ పెరిగే భాగం 'కౌలు' పేరుతో వుండకూడదు. ఆ భాగం కూడా ఉత్పత్తి కోసం ఖర్చయిన శ్రమ లోదే కాబట్టి, ఆ భాగం, 'జీతాల' లోకి గానీ, 'సోషల్ ఫండ్' లోకి గానీ చేరుతుంది. మొత్తం మీద ఒక నూతన సమాజపు దేశం, పెట్టుబడిదారీ దేశాలతో మారకాలు చేసుకునేటప్పుడు, తన ఉత్పత్తుల్ని తన సమాజపు ధరలతో ఇవ్వనక్కర లేదు.

2 దేశాలూ నూతన సమాజాలే అయితే, 2 చోట్లా కౌలు లేని ధరలే వుంటే, అలాంటి దేశాలు, తమ సమాజ పరిధిలో వుండే ధరల తోనే ఎగుమతులూ దిగుమతులూ చేసుకోవచ్చు.

# 'వడ్డీ' రద్దు

**'కౌ**లు' లాంటిదే 'వడ్డీ' కూడా కదా? 'కౌలు' భాగాన్ని ధరలో నించి తీసివేసినట్టే, 'వడ్డీ' భాగాన్ని కూడా ధరలో నించి తీసివెయ్యాలి.

వడ్డీని కలిపి లెక్క కట్టే ధర ఎక్కువగా వుంటే, వడ్డీని కలపని ధర తక్కువగా వుంటుంది. అయితే, నూతన సమాజంలో, అన్ని శాఖల ధరలూ, వడ్డీలు లేకుండానే వుంటాయి కాబట్టి, ఆ సమాజ పరిధిలో ఆ తక్కువ ధరలే, నిజమైన ధరలు.

నూతన సమాజంలో, అనేక శాఖలు, ప్రభుత్వాధీనం లోనే వుంటాయి. ఆ శాఖలు ఒక దాని ఉత్పత్తిని ఒక దానికి ఇచ్చుకుంటాయి. వాటి ధరల లెక్కల తోనే. బ్యాంకులు కూడా, ప్రభుత్వ బ్యాంకులుగా వుంటాయి.

ఒక ప్రభుత్వ ఉత్పాదక శాఖ, ఇంకో ప్రభుత్వ శాఖ అయిన బ్యాంకు నించీ 'డబ్బు పెట్టుబడి'ని అప్పు తేవడమూ, దానికి వడ్డీలు చెల్లించడమూ, వుండనక్కర లేదు.

ప్రైవేటు వడ్డీ వ్యాపారులూ, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలూ, వాళ్ళ దగ్గిర అప్పులు తేవడాలూ, వుండవు.

**ఒక ప్రశ్న:** ఉత్పత్తిదారులు, తమ 'జీతాల్లో' కొంత భాగాన్ని బ్యాంకుల్లో పెడతారనుకుందాం.

బ్యాంకులు, ఆ 'డిపాజిట్ల' మీద వడ్డీలు చెల్లించాలా? ఉత్పత్తిదారులు, తమ డిపాజిట్ల మీద వడ్డీలు తీసుకోవడం, సరైనదేనా?

**జవాబు:** కాదు. సరైనది కాదు. కౌలు - విషయంలో చూసిందే వడ్డీ - విషయానికి కూడా. వడ్డీ - అనేది, తప్పుడు అవగాహన. ఉత్పత్తిదారులు, బ్యాంకుల్లో తమ ఆదాయాల్ని దాచినా, తక్కువ డబ్బుని దాచి, ఎక్కువ డబ్బుని తీసుకునే హక్కు వుండదు.

బ్యాంకులు, ఉత్పత్తిదారుల డిపాజిట్ల మీద వడ్డీల్ని ఇవ్వాలంటే, వడ్డీల్ని ఎలా తెచ్చి ఇస్తాయి? - ఆ డిపాజిట్లతో రక రకాల వడ్డీ వ్యాపారాలు చేస్తేనే, డిపాజిట్ల మీద వడ్డీలు ఇవ్వగలుగుతాయి. అంటే, ఉత్పత్తిదారులకు వడ్డీలు రావాలంటే, నూతన సమాజంలో బ్యాంకులు కూడా వడ్డీ వ్యాపారాలు చెయ్యాలన్న మాట!

ఉత్పత్తిదారుల శ్రమలో కొంత భాగం, వడ్డీ - పేరుతో లేకపోతే, అది జీతం లోనే కలిసిపోయి వుంటుంది. లేదా, శ్రమలో కొంత భాగం, వడ్డీ - పేరుతో వుండాలంటే, అప్పుడు జీతం తగ్గుతుంది.

ఒక ఉత్పత్తిదారుడు, తన జీతంలో కొంత భాగాన్ని బ్యాంకులో పెడితే, ఆ డిపాజిట్టు మీద కొంత వడ్డీ రావాలంటే, పని స్థలంలో జీతంగా తగ్గిన భాగమే, తర్వాత డిపాజిట్టు మీద వడ్డీగా వస్తుంది. కానీ జీతంలో తగ్గింది 5 అయితే, వడ్డీగా వచ్చేది 5 కన్నా తగ్గుతుంది. ఎందుకంటే, వడ్డీ వ్యవహారాలు జరగాలంటే, దాని కోసం కొన్ని ఖర్చులు అవుతాయి కాబట్టి.

నూతన సమాజంలో అందరూ శ్రమ చేస్తూ 'జీతాలు' తీసుకుంటూ, జీతాల్లో 10% ని అందరూ బ్యాంకుల్లో దాస్తున్నారనుకుందాం. ఆ డిపాజిట్ల మీద బ్యాంకులు అందరికీ ఒకే రకంగా 5% వడ్డీని చెల్లిస్తాయనుకుందాం. దీని అర్థం ఏమిటంటే - ఎవరి శ్రమలో భాగం వాళ్ళకి 'వడ్డీ' పేరుతో అందుతోంది - అని!

కానీ, ఎవరి శ్రమ వారికి అందేటప్పుడు, అది ఏ 'తప్పుడు రూపం' లోనూ వుండకూడదు కాబట్టి, వడ్డీ - రూపంలో కూడా వుండకూడదు. శ్రమ ధరించే ఏ తప్పుడు రూపమైనా శ్రమ చేసే మనిషిని తప్పుడు అవగాహన లోనే వుంచుతుంది. వడ్డీని అందుకునే ఉత్పత్తిదారులు, దాన్ని తమ శ్రమలో భాగంగా గ్రహించలేరు. అది కూడా తమ శ్రమే అని గాక, 'తమ పొదుపు డబ్బే ఆ వడ్డీని సంపాదించింది' - అనే తప్పు అవగాహనతో వుంటారు. శ్రమ చేసే వ్యక్తి, తన శ్రమ గురించి, 'ఇది నా శ్రమ' అని స్పష్టమైన గ్రహింపుతో వుండాలి. శ్రమ చేసే వ్యక్తులు తమ శ్రమని 'కౌలు' పేరుతోనో, 'వడ్డీ' పేరుతోనో తీసుకోవడంలో తప్పు ఏమిటో గ్రహించకపోతే, ఆ ఉత్పత్తిదారులకు 'శ్రమ గురించి' ఇంకా సరైన అవగాహన ఏర్పడలేదని అర్థం. అలాంటి సమాజం, ఇంకా దోపిడీ సమాజపు మార్మిక లక్షణాల తోనే సాగుతోందని అర్థం.

అయితే, ఇక్కడ ఇంకా ఒక ప్రశ్నకి జవాబు కావాలి. నూతన సమాజంలో కూడా 'డబ్బు విలువ' తగ్గిపోతూ వుండదా? సరుకుల ధరలు ఎంతో కొంత పెరుగుతూ వుండవా? బ్యాంకులో దాచిన డబ్బు, ఎంత మొత్తంలో దాచినది అంత మొత్తం లోనే వెనక్కి వస్తే, అప్పుడు దానితో కొనగలిగే ఉత్పత్తులు తగ్గిపోవా? ఆ రకంగా అది, డబ్బుని దాచుకున్న వ్యక్తికి నష్టం కాదా? కాబట్టి, దాని కోసమైనా, దాచుకున్న డబ్బు మొత్తం ఎంతో కొంత పెరగవలసి వుండదా?

**జవాబు:** మొట్ట మొదటి విషయం 'పెట్టుబడిదారీ సమాజం'లో వుండే ద్రవ్యోల్బణమూ, రోజు రోజుకీ డబ్బు విలువ తగ్గిపోతూ వుండడమూ, ఆ కారణం వల్ల ధరలు పెరిగిపోతూ వుండడమూ - ఇటువంటి పరిస్థితులు, నూతన సమాజంలో ఏర్పడవు. అలా ఏర్పడితే, అది, నూతన సమాజం అవదు! నూతన ఉత్పత్తి విధానం అనేది, పెట్టుబడిదారీ విధానంలో పుట్టుకు వచ్చే సమస్యల్ని తన దగ్గిర ఏర్పడకుండా చేసుకున్నప్పుడే అది నూతన విధానం.

ఒక వేళ, నూతన సమాజంలో కూడా, ఇంకా సరైన అనుభవాలు లేకపోవడం వల్ల గానీ, ప్రారంభంలో అది ఇంకా వర్గ సమాజం గానే వుండడం వల్ల గానీ, అలాంటి కారణాల వల్ల, అక్కడ కూడా ద్రవ్యోల్బణ పరిస్థితి కొంత వుంటుందనుకుందాం. దాని వల్ల, డబ్బు విలువ తగ్గి, ఉత్పత్తిదారులు బ్యాంకుల్లో దాచుకున్న డిపాజిట్ల విలువ ఎంతో కొంత తగ్గిందనే అనుకుందాం. అలా జరిగితే, ఆ డబ్బుతో ఉత్పత్తుల్ని కొన్నప్పుడు, వాటి పరిమాణం కొంత తగ్గుతుంది. అయితే, అలా తగ్గినా ఆ ఉత్పత్తులు ఎక్కడికీ పోవు. అవి కూడా, 'సోషల్ ఫండ్' రూపంలో ఆ ఉత్పత్తిదారులకే అందుతాయి. 'జీతాల' ద్వారా అందని ఉత్పత్తులు సోషల్ ఫండ్ ద్వారానూ; సోషల్ ఫండ్

ద్వారా అందని ఉత్పత్తులు జీతాల ద్వారానూ అంద వలసిందే. ఇటూ అటూ కూడా అందకుండా వృధాగా పోయే భాగం ఏదీ వుండదు.

అయినప్పటికీ ఇక్కడ నిల్వల గురించి ఒక విషయం గమనించాలి. ప్రతీ వ్యక్తీ స్వంత శ్రమతో జీవించవలసిన సమాజంలో, జీతంలో కొంత భాగాన్ని నిల్వ చెయ్యడం అర్థరహితమైన విషయం. ఎందు కంటే, ఒక వ్యక్తి చెయ్యగలిగే శ్రమ, 'ఒక శరీరం' ఎంత శ్రమ చెయ్యగలదో అంత శ్రమ గానే వుంటుంది. ఆ శ్రమలో నించే రోజు వారీ అవసరాలన్నీ సుఖంగా తీరే విధంగా వాడుకోవాలి. సుఖంగా జీవించాలంటే, దాదాపు జీతాన్నంతా ఖర్చు పెట్టెయ్యవలసి వస్తుంది. లేదా, రోజు వారీ అవసరాలన్నీ సుఖంగా తీరగా కూడా జీతంలో కొంత భాగాన్ని నిల్వ చెయ్యాలంటే, జీతం ఎక్కువగా వుండాలి. అంటే పని దినం ఎక్కువగా వుండాలి. సమాజంలో జనాభా అంతా పని దినాన్ని పెంచుకుని, రోజూ ఎక్కువ గంటలు పని చేస్తూ, ఎక్కువ జీతాలు తీసుకుంటూ, ఎక్కువ డబ్బుని నిల్వ చేస్తూ వుండాలన్న మాట! ఆ రకంగా డబ్బుని కూడ బెడితే, ఆ నిల్వల్ని తర్వాత కాలంలో ఎప్పుడు ఖర్చు పెడతారు? ఎలా ఖర్చుపెడతారు? ఆ డబ్బుని, 'పెట్టు బడి'గా మార్చడానికి వీలు వుండదు. దానితో, స్వంత భూములో, ఇతర ఆస్తులో సంపాదించడానికి వీలు వుండదు.

అనారోగ్యాల వల్లా, వృద్ధాప్యం వల్లా శ్రమ చెయ్యలేని కాలాల్లో, అవసరాలు తీరాలంటే, ఆ నాడు శ్రమ చేసే జనాభా ఇచ్చే సోషల్ ఫండే, ఆ బాధ్యతల్ని నిర్వహిస్తుంది. (ఇప్పుడు వృద్ధులై వున్న వారు కూడా, ఒకప్పుడు, ఆ బాధ్యతల్ని నిర్వహించినట్టు.) కాబట్టి, ఒక వ్యక్తి, తన జీతంలో నించి నిల్వ చేసిన డబ్బుని ఎప్పుడైనా ఖర్చు పెట్టాలంటే, దాన్ని కూడా పోషణ వస్తువుల కోసమే ఖర్చు పెట్టాలి. కానీ, దాని కోసం ఎప్పటికప్పుడు చేసే కొత్త శ్రమే సరిపోతూ వుంటుంది. ఇక అలాంటప్పుడు, జీతాల్లో నించి నిల్వలు చేసు కోవలసిన అవసరం ఏమిటి?

'నూతన సమాజం' అన్నప్పుడు, దాని స్వభావం ఏమిటంటే - స్వంత శ్రమతో జీవించడం ఒక్కటే కాదు; <u>ఆ జీవితాన్ని 'ఉపయోగపు విలువ దృష్టి'తో నిర్మించుకోవడం కూడా.</u> అంటే, ప్రకృతి సహజం గానూ, సుఖ శాంతుల తోనూ జీవించడానికి అవసర మైనంత శ్రమ చేసుకుంటే చాలు. అంత కన్నా ఎక్కువ శ్రమ చేసి, దాన్ని డబ్బు రూపంలో నిల్వ చేసుకోవల సిన అవసరం వుండదు. అలా చేస్తే అది 'ఆస్తిని కూడబెట్టే' దృష్టి. తర్వాత, ఆ ఆస్తికి వారసత్వ హక్కులు కూడా వుండవలసిందే. ఆ దృష్టికీ, నూతన జీవిత విధానానికీ పొసగదు.

ద్రవ్యోల్బణం - అనేది నూతన సమాజంలో కూడా ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో ఒక వ్యతిరేక లక్షణమే. కాబట్టి నూతన సమాజాన్ని దృష్టిలో పెట్టు కుని చూస్తే, అక్కడ ద్రవ్యోల్బణమూ, బ్యాంకుల్లో నిల్వలకు విలువలు తగ్గడమూ, ఆ తగ్గిన విలువని పూడ్చుకోవడం కోసం వడ్డీలు తీసుకోవడమూ - వంటి విషయాలన్నీ అర్థం లేని విషయాలై పోతాయి.

సమాజంలో ఉత్పత్తి సంబంధాలు నిజంగా 'సరైన దిక్కు'లో మారుతూ వుంటే, 'వడ్డీ'ని తీసి వెయ్యడం, పరిష్కరించలేని సమస్యగా వుండదు. ఆ మార్గాలు సహజం గానే అభివృద్ధి చెందుతాయి.

సమాజంలో ఇంకా వడ్డీ వున్నదంటే, దాని నిజ మైన అర్థం, ఇంకా ఒక వర్గపు శ్రమని ఇంకో వర్గం లాగగలిగే పరిస్థితులేవో వున్నాయనే. <u>వడ్డీల విధానం మారక పోవడం వల్ల లాభపడే వర్గం ఒకటి ఇంకా వుంటేనే వడ్డీ బతికి వుంటుంది.</u> సమాజంలో అందరూ వడ్డీకి వ్యతిరేకమే అయితే, ఇంకా వడ్డీ నిలబడి వుండదు. ఆర్థిక శాస్త్రంలో ఆ పేరు వుండదు.

# 'లాభం' రద్దు

**కౌ**లూ వడ్డీల లాగానే 'లాభం' విషయం కూడా. నూతన సమాజపు 'ధర'లో, 'లాభం పేరు'తో చేరే భాగం కూడా ఏదీ వుండకూడదు. అయితే, నూతన సమాజంలో కూడా జీతం భాగం కన్నా 'అదనంగా' వుండే భాగం ఒకటి వుంటుంది. కానీ అది కూడా శ్రమ చేసే మనిషికి అందే భాగమే కాబట్టి, అది 'లాభం' కాదు.

'పెట్టుబడిదారీ ధర' పద్ధతిలో, 'కౌలు'నీ, 'వడ్డీ'నీ లెక్క కట్టడం చాలా తేలిక. 'కౌలు'గా ఎంత చెల్లిస్తారో, 'వడ్డీ'గా ఎంత చెల్లిస్తారో, ఆ రాసులు స్పష్టంగా

తెలుస్తూ వుంటాయి. కాబట్టి, వాటి లెక్కలు తేలికే. కానీ, చివరికి మిగిలే 'లాభం' లెక్క అలా వుండదు. సరుకు ధర, మార్కెట్లో ఎక్కువో తక్కువో అవుతూ వుంటుంది కాబట్టి 'లాభం' అనేది, మొదటే తెలిసే రాసిగా వుండదు. 'ధర'లో నించి అన్ని ఖర్చులూ పోగా (కౌలూ, వడ్డీ కూడా పోగా), చివరికి మిగిలేదే లాభం అవుతూ వుంటుంది.

పెట్టుబడిదారీ ధరని మన పరిశీలనతో చూస్తే, ఆ ధరలో నించి C + V ల్ని తీసివెయ్యగా మిగిలే దంతా S గా తేలుతుంది.

కానీ, నూతన సమాజంలో 'ధర - పరిస్థితులు' తేడాగా వుంటాయి. ఇక్కడ 'కౌలు' వుండదు. 'వడ్డీ' వుండదు. 'లాభం'వుండదు.ఇక్కడ, పెట్టుబడిదారుడు నిర్ణయించిన 'ధర'ని మనం పరిశీలించడం కాదు. మనమే 'ధర'ని నిర్ణయించాలి. అది ఎలాగ? దీన్ని తర్వాత చూస్తాం - 'నూతన సమాజపు ధర' చాప్టరులో.

# 'యజమానితనం' రద్దు

**ఉ**త్పత్తి సాధనాల మీద ప్రైవేటు ఆస్తి హక్కుని తీసివేసినప్పుడు, కార్మికులు పనుల కోసం ఏ యజ మానినీ యాచించ నక్కర లేదు. అందరికీ పనులు కల్పించవలసిన బాధ్యత సమాజానికే వుంటుంది. ఆ రకంగా, యజమానితనం రద్దు ప్రారంభమవుతుంది. ఆ రద్దు ఎప్పటికి పూర్తి అవుతుందంటే, ప్రైవేటు ఆస్తి హక్కు లేకుండా ఉత్పత్తి సాధనాల్ని కార్మిక వర్గమే నిర్వహించ గలిగినప్పటికీ!

స్వంత ఆస్తి హక్కు లేకపోయినా ప్రతీ పని స్థలం లోనూ 'నిర్వహణ శ్రమ' ఎప్పటి లాగే అవసరమవు తుంది. 'పెత్తనం శ్రమ' మాత్రం అనవసరమవుతుంది. 'పని స్థలం'లో నిర్వహణ శ్రమని కూడా కార్మికులే టీములుగా ఏర్పడి నిర్వహించే పద్ధతులు రూపొం దాలి. ప్రతీ టీమూ, కొన్నాళ్ళు నిర్వహణ శ్రమల్లోకీ, కొన్నాళ్ళు ఇతర శ్రమల లోకీ డ్యూటీలు మారుతూ వుంటుంది. టీములన్నీ స్వంత బాధ్యత తోటీ, స్వంత శ్రమ శిక్షణ తోటీ వుంటూ, 'నిర్వహణ టీము' ఇచ్చే సూచనలకు అనుగుణంగా ప్రవర్తిస్తాయి. ఉత్పత్తి క్రమానికీ, చలామణీ క్రమానికీ సంబంధించిన విషయాలన్నిటినీ చర్చించి నిర్ణయాలు చేస్తాయి. ఈ విధానం, పని స్థలంలో 'యజమానితనాన్ని' రద్దు చేస్తుంది. అంతే కాదు, ఈ విధానం, ఉత్పత్తి సాధనా లకూ శ్రామికులకూ గత సమాజాల్లో వుండే 'పరాయి తనాన్ని' (ఎలిమనేషన్‌ని) కూడా రద్దు చేస్తుంది.

నూతన సమాజంలో కూడా కార్మికుల మీద సూపర్‌వైజర్లూ, మేనేజర్లూ తయారై పెత్తనం చేస్తారను కుందాం. నిర్వహణ శ్రమలో గానీ, నిర్ణయాల్లో గానీ, కార్మికుల పాత్ర ఏమీ వుండదనుకుందాం. కార్మికులు కేవలం పని చేసి, జీతం తీసుకోవడం మాత్రమే చేస్తా రనుకుందాం. అలా మాత్రమే జరుగుతూ వుంటే, నూతన సమాజంలో కూడా 'ఉత్పత్తి సంబంధాలు' ఏమీ మారలేదని అర్థం. అలాంటి పరిస్థితి, యజమాని తనాన్ని గానీ, ఎలియనేషన్‌ని గానీ, రద్దు చెయ్యదు. వాటి రూపాల్ని మాత్రమే మారుస్తుంది.

# 'పెట్టుబడిదారీ శ్రమ విభజన' రద్దు

**ఇ**ది గతంలో చాలా వివరంగా చూసిందే. పెట్టు బడిదారీ శ్రమ విభజన ప్రకారం, ఒక వ్యక్తి ఒక్క శ్రమకే అతుక్కుపోయి వుండాలి.

సమాజానికి శారీరక శ్రమలూ మేధా శ్రమలూ కూడా ఎప్పుడూ అవసరమే. ఆ శ్రమలన్నీ ఎప్పుడూ జరగవలసిందే. అయితే 'శారీరక శ్రమ' చేసే వ్యక్తికి, తక్కువ ఆదాయం వుంటే, 'మేధాశ్రమ' చేసే వ్యక్తికి, ఎక్కువ ఆదాయం వుంటుంది. ఆ శ్రమల 'విలువల' తేడాల వల్లనే అలా జరుగుతుంది.

నూతన సమాజంలో కూడా శ్రమ విభజన అలాగే వుంటే, ఎవరి శ్రమ విలువ వారికే దక్కుతుంది అను కున్నా, అప్పుడు కూడా ఆ వ్యక్తుల మధ్య 'అసమాన త్వమే' వుంటుంది. ఇది 'విలువ'కి సంబంధించిన అసమానత్వం.

'ఉపయోగపు విలువ' దృష్టితో చూస్తే, ఎప్పుడూ శారీరక శ్రమ మాత్రమే చేసే వ్యక్తి స్థితికీ, ఎప్పుడూ మేధా శ్రమ మాత్రమే చేసే వ్యక్తి స్థితికీ మధ్య కూడా, అసమానత్వమే వుంటుంది.

ఈ అసమానత్వాలు పోవడానికి మార్గం - ప్రతీ వ్యక్తీ కొన్ని శారీరక శ్రమలూ, కొన్ని మేధా శ్రమలూ చెయ్యడమే. అప్పుడు, 'విలువ' కోణం లోనూ, 'ఉప యోగపు విలువ' కోణం లోనూ కూడా సమానత్వం ఏర్పడుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో అయితే, ప్రభుత్వ రంగంలో జీతాలు, కనీసం 40, 50 స్థాయిల్లో వుంటాయి. ప్రైవేటు రంగంలో జీతాలు, ఇంకా ఎక్కువ స్థాయిల్లో వుంటాయి. అంటే, సమాజంలో వుండే 'శ్రమల' విలువలు అన్ని తేడాలతో వున్నాయన్న మాట!

వేరు వేరు శ్రమల విలువలు తేడాలుగా ఎందుకు వుంటాయో మనకు గతం లోనే తెలుసు. శ్రమల్ని నేర్చుకోవడానికి అవసరమయ్యే ఖర్చులూ కాలాలూ చాలా తేడాలుగా వుంటాయి కాబట్టి, శ్రమల విలువలు కూడా తేడాలుగా వుంటాయి. శ్రమల విలువలు తేడాగా వుండడానికి హేతుబద్ధమైన కారణం వుంది కాబట్టి, వేరు వేరు శ్రమలు చేసే ఉత్పత్తిదారుల జీతాలు తేడాగా వుండడం సరైనదే. అయితే, అది అలా వుండడం సరైనదే కాబట్టి, 'ఆ తేడాలు ఎంత ఎక్కువగా వున్నా అదంతా సరైనదే' అని అర్థం కాదు.

పెట్టుబడిదారీ వర్గం శ్రామిక వర్గాన్ని అనేక ముక్కలుగా చీల్చడానికే జీతాల్లో అన్ని తేడాలు సృష్టిస్తుంది. కాబట్టి నూతన సమాజం, ఈ తేడాలన్నిటినీ ఇలాగే, ఇన్ని రకాలుగా వుండనివ్వకూడదు. మేధా శ్రమలన్నిటినీ - ఉన్నత స్థాయీ, మధ్య స్థాయీ, కింది స్థాయీ - అని 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అలాగే, శారీరక శ్రమలన్నిటినీ కూడా 3 రకాలుగా. అప్పుడు, సమాజంలో జీతాలు 6 రకాలుగా మాత్రమే వుంటాయి. నూతన సమాజం, ఇప్పుడు వున్న రకం జీతాల్లో తేడాల్ని తగ్గించే మార్పుని సాధ్యమైనంత తక్కువ కాలం లోనే సాధించవచ్చును.

కొంత కాలానికి ఆ తేడాల్ని ఇంకా తగ్గించి 4 రకాలుగా కుదించవచ్చును.

తక్కువ స్థాయి శారీరక శ్రమలన్నీ 1 వ గ్రూపు.
ఎక్కువ స్థాయి శారీరక శ్రమలు 2 వ గ్రూపు.
తక్కువ స్థాయి మేధా శ్రమలు 3 వ గ్రూపు.
ఎక్కువ స్థాయి మేధా శ్రమలు 4 వ గ్రూపు.

ఒక గ్రూపులో శ్రమలన్నిటికీ ఒకే విలువ వుంటుంది.

'సమాజం'లో ప్రతీ మనిషీ (స్త్రీ అయినా, పురుషుడైనా) ప్రతీ గ్రూపు నించీ ఒక శ్రమ చెయ్యాలి. 4 గ్రూపుల నించీ 4 శ్రమలు చెయ్యాలి. ప్రతీ మనిషి చేసే శ్రమల మొత్తానికి, విలువ సమానం అవుతుంది. ఒక మనిషి, అన్ని స్థాయిల శ్రమలూ చెయ్యడం అవుతుంది.

(ఈ విషయాలన్నీ, 'మొదటి సంపుటం'లో, 'శ్రమ శక్తి విలువ' చాప్టరులో, 'అందరూ శ్రమ చేసినా అసమానత్వం సమస్య పరిష్కారం కాదు' అనే అంశం దగ్గిర, చాలా వివరంగా చూశాం. దాన్నీ దీన్నీ కలిపి అర్థం చేసుకోవాలి).

ఈ 'నూతన శ్రమ విభజన'లో మార్పుల్ని ఇంకా ఇంకా అభివృద్ధి పరుచుకోవచ్చు. ఎలాగంటే, ఒక గ్రూపులో నించి ఒక శ్రమచేసే వ్యక్తి కొంత కాలం తరవాత, ఆ శ్రమని వదిలి ఆ గ్రూపులో నించే ఇంకో శ్రమని నేర్చుకోవచ్చు. అది అసాధ్యమైన విషయం అవదు.

శారీరక శ్రమలూ మేధా శ్రమలూ - అనే తేడాలు లేకుండా పోవడం ఎప్పటికీ జరగదు. శ్రమల్లో తేడాలు ఎప్పుడూ వుంటాయి. కానీ, ఆ శ్రమలు చేసే మనుషులు కలిసి పోతారు.

ఒక మనిషి - డాక్టరు పనీ, టీచరు పనీ, టైలరు పనీ, డ్రైవరు పనీ కూడా చేస్తున్నాడనుకుందాం. ఆ మనిషిని, "ఈ వ్యక్తి డాక్టరు" అంటామా? లేదా, "ఈ వ్యక్తి టైలరు" అంటామా? లేదా, ఆ ఇతర పనులతో అంటామా? - ఆ వ్యక్తిని ఏదో ఒక్క పని ద్వారా చెప్పడానికి వీలవదు, అతను డాక్టరు మాత్రమే కాడు; డాక్టరు కూడా. టైలరు మాత్రమే కాడు; టైలరు కూడా. అలాగే ఆ వ్యక్తి టీచరు కూడా, డ్రైవరు కూడా. ఆ వ్యక్తి, ఒక్క పనికే సంబంధించి ఉండడు. డ్యూటీల ప్రకారం ఆ 4 పనులూ వేరు వేరు కాలాల్లో చేస్తాడు.

ఒక వ్యక్తి ఎంత గొప్ప కళాకారుడైనా ఆ వ్యక్తి, 'ఈ కళ ఒక్కటే చేస్తాను' అనడానికి వీలు కాదు. దానితో పాటు ఇతర శ్రమలు కూడా కొన్ని చెయ్యవలసిందే. కాకపోతే ఇతర శ్రమల కాలాలు కొంత తగ్గాలి.

ఒక వ్యక్తి, వేరు వేరు శ్రమలు చెయ్యడం వల్ల. 'పని స్థలంలో' వుండే 'అంతస్థుల భేదం' (హైరార్కీ) అంతర్ధాన మవుతుంది. ప్రతి వ్యక్తీ ప్రతీ అంతస్తు లోనూ వుంటాడు.

ఇది, పెట్టుబడిదారీ శ్రమ విభజనని తీసివేసే

'నూతన శ్రమ విభజన'. ఈ విధానం మాత్రమే మనుషుల్ని 'సమానుల్ని' చేస్తుంది.

'సమానత్వం' అంటే - మనుషుల శారీరక లక్షణాలకూ, బరువులకూ, ఎత్తులకూ సంబంధించింది కాదు. అలాంటి సమానత్వం ఏర్పడాలని ఎవ్వరూ అనరు. ఈ సమానత్వం - సామాజిక హక్కులకూ, బాధ్యతలకూ సంబంధించినది. మనుషులందరికీ సమాన హక్కులూ, సమాన బాధ్యతలూ వుండాలి. ఇలాంటి సమానత్వాన్ని ఏర్పరచుకునే మార్గాన్ని నూతన సమాజం అనుసరించాలి.

మనుషుల తెలివి తేటల్లోనూ, శక్తి సామర్థ్యాల్లోనూ తప్పకుండా కొన్ని తేడాలు వుంటాయి. కానీ, ఆ తేడాలు, 'పాత శ్రమ విభజన'లో వున్నంతగా 'కొత్త శ్రమ విభజన'లో వుండవు.

పాత కాలంలో, A ని - శారీరక శ్రమ చేసే వ్యక్తి అనీ, B ని మేధా శ్రమ చేసే వ్యక్తి అనీ - అనుకుందాం. ఆ ఇద్దరి తెలివితేటల్నీ పోల్చి చూస్తే, వాటి మధ్య పోల్చడానికే వీలులేనంత తేడా వుంటుంది. ఇద్దరికీ ఒక 'లెక్క' ఇచ్చి చెయ్యమంటే, A, అసలు చెయ్యలేక పోవచ్చు. లేదా, B చేసినంత తొందరగా చెయ్యలేక పోవచ్చు. దీన్నిబట్టి A తెలివిలేని వాడనీ, B తెలివైన వాడనీ అర్థమా? - కాదు. B కి ఏ పరిస్థితుల వల్ల ఆ తెలివి వచ్చిందో ఆ పరిస్థితులు A కి లేవు. కాబట్టే, A, తెలివిలేని వాడిగా వున్నాడు. A చేసే శారీరక శ్రమని చెయ్యమంటే, B చెయ్యగలడా? A లాగ చెయ్యగలడా? - అసలు పరిస్తితులే తేడాగా వుంటే, వాటిని పోల్చి, ఎక్కువ తక్కువలు నిర్ణయించడం ఏమిటి? ఇద్దరికీ ఒకే పరిస్తితులు కల్పించి, అప్పుడు పోల్చి చూడాలి.

B కి వున్న పరిస్తితులే చిన్న తనం నించీ A కి కూడా వున్నాయి అనుకుందాం. అప్పుడు ఇద్దరి తెలివి తేటల్నీ పోల్చి చూస్తే, వాళ్ళ మధ్య గత వుదాహరణలో వుండిన తేడా, ఊహాతీతమైన స్థాయిలో తగ్గిపోతుంది. అప్పుడు, ఇద్దరూ సమానులే అని కూడా రుజువు కావచ్చు; లేదా, B కన్నా A యే తెలివి కల వాడని రుజువు కావచ్చు. ఇందులో ఏదైనా జరగవచ్చు.

అంటే దీని అర్థం, పాత శ్రమ విభజనని నూతన శ్రమ విభజనగా మార్చినప్పుడు, మనుషుల తెలివి తేటల మధ్య తేడాలు అపారంగా తగ్గిపోతాయి - అని! అయినప్పటికీ, అప్పుడు కూడా కొన్ని తేడాలు వుంటాయనే అనుకుందాం. 'తేడా' అన్నప్పుడు, పాత మేధా శ్రమల సెక్షనే ఎప్పుడూ తెలివైనదిగా వుంటుందనీ; పాత శారీరక శ్రమల సెక్షను, దాని పరిస్తితులు ఎంత మారినా తెలివి తక్కువ గానే వుంటుందనీ, అర్థం కాదు. అందరికీ సమానమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, A యే B కన్నా తెలివైన వాడు కావచ్చు.

ఒక మనిషికి ఇంకో మనిషి కన్నా ఎక్కువ తెలివి వుంటే వుంటుంది. ఆ తెలివి వల్ల అతనికి ప్రత్యేక హక్కులేమీ రావు. అలాగే, ఆ వ్యక్తి నిర్వహించవలసిన బాధ్యత లేమీ తగ్గవు. ఏ వ్యక్తి అయినా, తన సహజ శక్తుల్ని శ్రమలో వుపయోగించాలి. తెలివి ఎక్కువ వ్యక్తులు కూడా అదే చెయ్యాలి. ఆ 'ఎక్కువ' తెలివికి ప్రతి ఫలంగా ఆ వ్యక్తికి దొరికేది, 'డబ్బు' రూపంలో గాక, ఆ వ్యక్తి 'ప్రతిభని సమాజం గుర్తించడం' రూపంలో వుంటుంది. 'గుర్తించడం' అంటే, అవార్డులూ, బిరుదులూ, సన్మానాలూ, కాదు.

'బూర్జువా శ్రమ విభజన'లో మార్పు జరగకపోతే, మేధా శ్రామికుల పిల్లలు మళ్ళీ మేధా శ్రామికులూ, శారీరక శ్రామికుల పిల్లలు మళ్ళీ శారీరక శ్రామికులూ అవుతూ, పాత శ్రమ విభజన అలాగే 'పునరుత్పత్తి' అవుతూ వుంటుంది.

చిన్న తనం నించీ పిల్లలకు విద్యతో పాటు శారీరక, మేధా శ్రమల్లో శిక్షణ ఇస్తే, వాళ్ళు అన్ని శ్రమలూ ఒకే రకంగా నేర్చుకుంటారు. పెద్ద వాళ్ళకి కూడా సరైన శిక్షణ వుంటే, ఆలస్యంగా నైనా వేరు వేరు శ్రమలు నేర్చుకుంటారు.

ఈ శ్రమ విభజనలో మార్పుని మొదట ఎవరి 'పని స్తలం'లో వాళ్ళు ప్రారంభించాలి. 'పని స్తలం' లోనే అనేక రకాల వేరు వేరు శ్రమలు వుంటాయి. శారీరక శ్రమలు చేసే వాళ్ళు, వెంటనే మేధా శ్రమల లోకి రావడం కన్నా; మేధా శ్రమల వాళ్ళు, శారీరక శ్రమల లోకి రావడం చాలా తేలిక.

వాళ్ళు వీళ్ళకీ, వీళ్ళు వాళ్ళకీ శిక్షణ ఇచ్చుకోవచ్చు.

ఈ రకంగా, నూతన సమాజంలో చాలా తక్కువ కాలం లోనే, వేరు వేరు శ్రమలు చేయగల 'నూతన శ్రామికులు' తయారవుతారు. కాబట్టి, నూతన సమాజాన్ని నిర్మించేటప్పుడు - శ్రమ చెయ్యని వర్గాన్ని శ్రమ లోకి దించడం మొట్టమొదటి మార్పు. శారీరక శ్రమల మనుషుల్ని మేధా శ్రమల్లోకి కూడానూ, మేధా శ్రమల మనుషుల్ని శారీరక శ్రమల్లోకి కూడానూ మార్చడం,

రెండో మార్పు.

శ్రమ చెయ్యని వర్గం, శ్రమ లోకి దిగినప్పుడు, మొదటే శారీరక శ్రమల్లోకి రాదు. మొదట మేధా శ్రమ ల్లోకే దిగుతుంది. అక్కడే స్థిర పడాలని చూస్తుంది. కానీ, అక్కణ్ణించి కూడా అది శారీరక శ్రమల్లోకి రావలసి వస్తే తీవ్రమైన వ్యతిరేకతతో వుంటుంది.

అలాగే, ఒక మేధా శ్రామికుణ్ణి తీసుకుంటే, శ్రమ చెయ్యని వర్గాన్ని శ్రమ లోకి దించే పోరాటంలో ఆ వ్యక్తి సరిగానే సహకరిస్తాడు. కానీ, తను శారీరక శ్రమల్లోకి కూడా దిగవలసి వచ్చినప్పుడు, ఆ మార్పుకి తీవ్రంగా మొరాయిస్తాడు. అప్పుడేం జరుగుతుందంటే, శ్రమ లోకి కొత్తగా దిగిన వర్గమూ, గత సమాజాల నించీ మేధాశ్రమలు చేస్తూ వున్న సెక్షన్లూ కలిసి, 'పాత శ్రమ విభజననే' నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తాయి. కానీ పాత శ్రమ విభజన అలాగే వుండి పోతే, శారీరక శ్రమల వర్గం శాశ్వితంగా పాత స్థితిలో వుండిపోవల సిందే. దానికి, విద్యలూ, అభివృద్ధి, మేధావి తనమూ, సమా నత్వమూ - అనే లక్షణాలేవీ వుండవు.

ఆ పరిస్తితుల్లో మళ్ళీ 2 వర్గాలు ఏర్పడ్డాయని అర్థం. పాత శ్రమ విభజనని అలాగే వుంచాలని కోరేది ఒక వర్గమూ, దాన్ని మార్చాలనేది ఇంకో వర్గమూ, అవు తాయి. అప్పుడు పోరాటం ఆ వర్గాల మధ్య వుంటుంది. అప్పుడు, శారీరక శ్రమల వర్గమే 'విప్లవ వర్గం' అవుతుంది. తన విముక్తి కోసం పోరాడేది అదే కాబట్టి.

పెట్టుబడిదారీ శ్రమ విభజనని మార్చడమే జర గకపోతే, అప్పుడు, 'సమ సమాజం' అనే మాటే 'అర్థ రహితం'. ఆ సమాజానికి 'సమానత్వం' ఏర్పడే మార్గమే వుండదు.

ఈ శ్రమ విభజనలో మార్పు గురించి మార్క్సు మాటలు విందాం.

"కమ్యూనిస్టు సమాజం - ఎక్కడైతే ఎవ్వరికీ ఏదో ఒక్క పని మాత్రమే ప్రత్యేకించి వుండదో, అయినా ప్రతీ వారూ తమకు ఇష్టమైన పనిలో ఎక్కువ శక్తిని సాధించవచ్చునో (కెన్ బికమ్ ఎకంప్లిష్డ్), అటువంటి సమాజం, సాధారణ ఉత్పత్తి క్రమాన్ని నియంత్రించి, నేను ఇవ్వాళ ఒక పనీ, రేపు ఇంకో పనీ చేసేలా, అవ కాశం కలిగిస్తుంది. పొద్దున్నే వేటాడ్డానికీ, మధ్యాన్నం చేపలు పట్టడానికీ, సాయంత్రం పశుపోషణకీ (రియర్ ది కాటిల్), రాత్రి భోజనం తర్వాత సాహిత్య విమర్శ చేయడానికీ, ఈ రకంగా చేయడానికి. కానీ, ఎన్నడూ నేను వేటగాణ్ణి మాత్రమేనూ, మత్స్య కారుణ్ణి మాత్రమేనూ, పశువుల కాపరిని మాత్రమేనూ, సాహిత్య విమర్శకుణ్ణి మాత్ర మేనూ కాకుండా." [జర్మన్ ఐడియాలజీ, మాస్కో ఎడిషన్ 1976, పేజీ 53.]

"కమ్యూనిస్టు సమాజంలో, 'పెయింటర్లు' అంటూ వుండరు. కానీ, ఇతర పనులతో పాటు పెంయింటింగ్ పనులు కూడా చేసే మనుషులు వుంటారు" [జర్మన్ ఐడియాలజీ, పేజీ 418]

ఈ మాటల సారాంశం - ఒక మనిషి, జీవిత మంతా ఏదో ఒక్క పని మాత్రమే చేసే గత కాలపు శ్రమ విభజనని కమ్యూనిస్టు సమాజం మార్చాలి - అని. ప్రతీ మనిషీ, శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ కూడా చెయ్యాలనే అర్థం ఈ మాటల్లో వుంది. కానీ ఒక మనిషి ఎన్ని రకాల శ్రమలు చెయ్యాలో, ఆ శ్రమల్ని ఎంత కాలానికి మార్చుకుంటూ వుండాలో, ఆ వివరాలేవీ ఇందులో లేవు. అదంతా కమ్యూనిస్టు సమాజం తన అనుభవాల ద్వారా చూసుకోవాలి.

[ మొదటి కొటేషన్‌లో వున్న మాటల్లో, వేటాడ్డం, చేపల్ని పట్టడం - కూడా వున్నాయి. ఈ ఆహారాలు ఎప్పుడూ వుండవలసిందేనా? ఆ ఆహారాలకు ఇప్పటికే అలవాటై వున్న వారిని తప్పు పట్టడం కుదరదు. చిన్న పిల్లలకు, చిన్న తనం నించీ ఇవి నేర్పకుండా వుండ డమే మంచిది. కమ్యూనిస్టు సమాజంలో, జంతు హింస లేకపోవడమే న్యాయం.]

# 'గ్రామానికీ పట్టణానికీ వైరుధ్యం' రద్దు

'**గ్రా**మం' అంటే వ్యవసాయ ప్రాంతం. 'పట్టణం' అంటే, పరిశ్రమల ప్రాంతం. వ్యవసాయ రంగం నించి అదనపు విలువ, పారిశ్రామిక రంగానికి పోతూ వుంటుంది. వ్యవసాయ ధరల కన్నా పారిశ్రామిక ధరలు అధికంగా వుండడం ద్వారా అది జరుగు తుంది. నిజానికి, వ్యవసాయ పెట్టుబడి, వ్యవసాయ కౌలుని చెల్లించడం కోసం, వ్యవసాయ ధరలు, జన రల్ లాభం రేటుని తెచ్చే దాని కన్నా ఎక్కువ ధరలుగా

వుండాలి. కానీ, వ్యవసాయ పెట్టుబడికీ పారిశ్రామిక పెట్టుబడికీ మధ్య పోటీ లేని, లేదా తగినంత పోటీ లేని దేశాల్లో, పారిశ్రామిక ధరలే వ్యవసాయ శాఖల అదనపు విలువల్లో భాగాల్ని కూడా లాగుకోగలిగే ధరలుగా వుంటాయి. కాబట్టి నూతన సమాజపు ప్రారంభంలో - పారిశ్రామిక ధరల్ని తగ్గించడమూ, వ్యవసాయ ధరల్ని పెంచడమూ - అనే 'ధరల సంస్కరణ' అవసరమవుతుంది.

పరిశ్రమలన్నీ పట్టణాల్లో కేంద్రీకృతమవడం వల్ల, జనాభాలో అధిక భాగం పట్టణాల్లోకి చేరడమూ, అక్కడ ఇళ్ళ సమస్యల్లాంటి అనేక సమస్యలు తలెత్తడమూ జరుగుతాయి. కాబట్టి క్రమంగా వ్యవసాయ ప్రాంతాల సమీపం లోనే పరిశ్రమలు ఏర్పడవలసి వుంటుంది. దాని వల్ల జన సంఖ్య కొన్ని ప్రాంతాల లోకే చేరడం గాక భూమి మీద విశాలంగా ప్రతీ చోటా విస్తరించడానికి వీలవుతుంది. అంతే గాక, ఒక వ్యక్తి, కొంత కాలంపాటు వ్యవసాయ శ్రమా, కొంత కాలం పాటు పారిశ్రామిక శ్రమా చెయ్యడానికి కూడా మార్గం ఏర్పడుతుంది.

(వ్యవసాయ శ్రమలన్నీ శారీరక శ్రమలే.)

(ఈ విషయాలు కొన్ని, మొదటి సంపుటంలో, 'పెట్టుబడి విస్తరణ' చాప్టరులోనూ, ఈ సంపుటం లోనే 'భూమి కౌలు' చాప్టరులోనూ చూశాం. అదీ ఇదీ కలిపి అర్థం చేసుకోవాలి)

'గ్రామం'లో వుండే 'నెగెటివ్' లక్షణాల్ని తీసివేసి, అక్కడ మేధావితనానికీ, అన్ని రకాల శ్రమలకూ అనుకూలించే వసతులు ఏర్పరచాలి. అలాగే 'పట్టణం'లో వుండే నెగెటివ్ లక్షణాల్ని తీసివేసి, గ్రామంలో వుండే పాజిటివ్ అంశాల్ని అక్కడ ఏర్పరచాలి. 'ఇది గ్రామం, అది పట్టణం' అనే తేడాల్ని తీసివెయ్యగలిగే విధంగా వాటి స్వభావాల్నీ రూపాల్నీ సమానం చెయ్యాలి.

# 'స్త్రీ పురుషుల మధ్య అసమానత్వం' రద్దు

ప్రాచీన కాలంలో మనుషులందరూ సమానులే కాబట్టి, అప్పుడు స్త్రీ పురుషులు కూడా సమానులే. 'దోపిడీ ఆస్తి విధానం' వల్లనే సమాజంలో 'పురుషాధిక్యత' ప్రారంభమైంది. (ఆ చరిత్రనంతా ఇక్కడ చూడలేము.)

దోపిడీ సమాజంలో, 'కుటుంబం' మీద, 'పితృస్వామ్యమే' (తండ్రి యాజమాన్యమే) స్థిరపడింది. 'కుటుంబం'లో స్త్రీల మీదా, పిల్లల మీదా, పురుషుడే యజమానీ, అధికారీ. అంటే, భార్యాభర్తల సంబంధం - 'యజమానీ సేవకుల' సంబంధం. పెట్టుబడిదారీ సమాజంలో కూడా స్త్రీ పురుషుల మధ్య సమాన పరిస్థితులు లేవు. చాలా విషయాల్లో సమాన హక్కులు లేవు. స్త్రీని ఫలానా పురుషుడి భార్య గానే తప్ప, స్వతంత్ర వ్యక్తిగా గుర్తించే పరిస్థితి చట్టాల్లో వుండదు. పిల్లల మీద, తల్లికి కూడా, తండ్రితో పాటు సమాన హక్కులు వుండవు.

2 వర్గాల స్త్రీ పురుషుల్లోనూ ఇదే పరిస్థితి.

స్త్రీ పురుషులు - శ్రమ సంబంధాల్లో వుండే రకపు వర్గాల - వంటి వర్గాలు కారు. అంటే, స్త్రీలు ఒక వర్గమూ, పురుషులు ఇంకో వర్గమూ - అనే విభజన కాదు ఇక్కడ వున్నది. 'వర్గం' అనేది - 'పని' ఇచ్చే యజమానికీ, పని చేసే శ్రామికులకూ మధ్య వుండే సంబంధం. అది, 'శ్రమ దోపిడీ' జరిగే సంబంధం. స్త్రీ పురుషుల సంబంధం అలాంటి 'వర్గ - సంబంధం' కాదు. ఇది, వర్గ సంబంధం కాని సాంఘిక సంబంధం. లేదా, కుటుంబ సంబంధం.

స్త్రీ పురుషుల మధ్య ఈ 'అసమాన' సంబంధం, సమాజంలో 'వర్గాలు ఏర్పడడం' వల్ల కలిగిన ఫలితమే. అనేక ఫలితాల్లో ఇది కూడా ఒకటి. కాబట్టి, ఈ అసమానత్వం పోవడం అనేది, సమాజంలో దోపిడీ సంబంధాలు పోవడంతో ముడిపడి వుంటుంది. ఈ అసమానత్వం రద్దవడానికి, ప్రారంభ దశ - స్త్రీలందరూ బయటి శ్రమల్లోకి రావడం. ఇప్పటికే బయట శ్రమల్లో వున్న స్త్రీల విషయం గాక, ఇంకా గృహాలకు అంకితమై వుండి పోయిన స్త్రీలు కూడా బయటి శ్రమల్లోకి రావలసి వుంటుంది. ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు హక్కుని తీసివేసి, వ్యవసాయ జనాభాకి భూముల్ని పంచడమూ, ఫ్యాక్టరీలలో కొత్త పనులు కల్పించడమూ జరిగినప్పుడే స్త్రీలందరూ బయటి శ్రమల్లోకి రావడం సాధ్యమవుతుంది. దాని వల్ల స్త్రీలకు ఆదాయాలు ప్రారంభమై 'స్వంత పోషణ శక్తి' ఏర్పడుతుంది. 'పోషణ'కి పురుషుడి మీద ఆధారపడే స్థితి తప్పుతుంది.

(ఈ విషయాలన్నీ, 'మొదటి సంపుటం'లో

'ఉత్పాదక శ్రమా, అనుత్పాదక శ్రమ' చాప్టరులో, 'కుటుంబ శ్రమలు' అనే అంశం గురించి చర్చించిన చోట చాలా వివరంగా చూశాము. దాన్నీ దీన్నీ కలిపి అర్థం చేసుకోవాలి).

నిరుపేదతనం వల్ల వ్యభిచార వృత్తిలో జీవించే స్త్రీలకు కూడా పనులు దొరకడమే, విముక్తికి ప్రారంభ దశగా వుంటుంది.

పెట్టుబడిదారీ వర్గం సంగతి తీసుకుంటే, ఆ వర్గ పురుషులు, శ్రమల్లోకి వచ్చినట్టే, ఆ వర్గ స్త్రీలు కూడా శ్రమల్లోకి వస్తారు. ఆ సంగతి వేరే చెప్పనక్కర లేదు.

స్త్రీలు కూడా బయటికి వచ్చి పనులు చెయ్యాలంటే, ముఖ్యంగా 'పిల్లల్ని సంరక్షించే' సామాజిక సంస్థలు ప్రారంభం కావాలి.

తర్వాత దశ - స్త్రీ పురుషుల మధ్య 'పాత కాలపు శ్రమ విభజన' మారడం. బయటి ఉత్పత్తి క్రమాల్లో, పురుషులు చేసే ఏ పనుల్లో నైనా స్త్రీలకు సమాన అవకాశాలు వుండాలి. ఇంటి దగ్గిర - ఇంటికి సంబంధించిన పనులన్నీ స్త్రీ పురుషులకు సమాన బాధ్యతలుగా వుండాలి. వంట పనీ, పిల్లల పనీ, వృద్ధుల పనీ, ఇంటి శుభ్రతా వంటి పనులన్నీ స్త్రీ పురుషులు సమాన బాధ్యతతో నిర్వహించాలి.

ఇంట్లో గానీ, బయట గానీ, 'ఆడ పనీ - మొగ పనీ' అనే మాటలు అంతర్ధానమై పోవాలి.

చట్టాల్లో సమాన హక్కులూ, సమాన బాధ్యతలూ వుండాలి.

స్త్రీ పురుషుల సమాన హక్కుల్లో ఒక ప్రత్యేక అంశం ఏమిటంటే - పిల్లల్ని 'గుర్తించే విషయంలో' సమాన హక్కు. ఒక మనిషిని 'గుర్తించడం' అనేది, 'స్వంత పేరూ - ఇంటి పేరూ' అనే 2 అంశాలు కలిసిన పూర్తి పేరు ద్వారా జరుగుతుంది. దోపిడీ సమాజాల్లో, పిల్లలకు ఇంటి పేరు, తండ్రి ద్వారానే వస్తుంది. అంటే, బిడ్డని గుర్తించడం తండ్రి ద్వారానే జరుగుతుంది. ఈ విషయంలో తల్లికి స్థానమే వుండదు. బిడ్డ జన్మకి తల్లిదండ్రులిద్దరూ కారణం కాబట్టి, తల్లి దండ్రులిద్దరికీ స్థానం వుండే విధంగా, ఆ ఇద్దరి గుర్తులూ పిల్లల పేర్లలోకి చేరాలి. దాని కోసం ఏది సరైన మార్గం అయితే దాన్ని ఏర్పర్చుకోవాలి. - ఈ రకంగా స్త్రీ పురుష సంబంధాల్లో దోపిడీ సమాజాల వల్ల ఏర్పడిన లక్షణాలన్నీ మారాలి.

స్త్రీ పురుషులిద్దరికీ స్వయం పోషణ శక్తీ, ఇద్దరికీ బిడ్డల్ని పోషించే శక్తీ ఏర్పడినప్పుడు, ఆ సహ జీవనం పాత కాలపు సహ జీవనం లాంటిది కాదు. అది సమాన శ్రమ సంబంధాల మీద ఆధారపడిన సహ జీవనం అవుతుంది. అది, స్వతంత్రులూ, సమానులూ అయిన స్త్రీ పురుషుల సహ జీవనం. అది 'కుటుంబ వ్యవస్థ'కు వుండే పాత కాలపు స్వభావాన్ని మారుస్తుంది. అంటే, నూతన సమాజంలో కూడా 'కుటుంబం' స్థిరం గానే వుంటూ, దాని స్వభావం, ఉన్నతంగా మారుతుంది. దానితో పాటే స్త్రీ పురుషుల పాత జీవిత విధానానికి సంబంధించిన పద జాలం అంతా కూడా మారుతుంది.

అయితే, ఈ పరిణామ దశలో, స్త్రీ పురుషుల సమానత్వం అన్నప్పుడు, పురుషుడు కొన్ని మార్పుల వరకే సహకరిస్తాడు. 'యజమాని'తో తన సమానత్వాన్ని కోరే కార్మిక పురుషుడు, 'కుటుంబం'లో తన 'యజమాని తనాన్ని' వదలడానికి మొదట విముఖంగా వుంటాడు. భార్యతో సమానత్వం కోసం, తన పురుషాధిక్యతని సంపూర్ణంగా త్యజించడానికి మొరాయిస్తాడు.

నూతన సమాజ లక్షణాల్ని త్వరగా గ్రహించిన పురుషులు, త్వరగా కళ్ళు తెరుస్తారు. ఆధిక్యతా పీఠం నించి త్వరగా తప్పుకుంటారు. కానీ ఆ పీఠాల్ని వదల లేని వాళ్ళు ఇంకా ఇంకా వాటి అంచులు పట్టుకుని వేళ్ళాడుతూనే వుంటారు.

శ్రమ చెయ్యని వర్గాన్ని శ్రమలోకి దించడానికి ఎంత పోరాటం అవసరమో; అలాగే, మేధా శ్రమల వర్గాన్ని శారీరక శ్రమల్లోకి దించడానికి కూడా ఎంత పోరాటం అవసరమో; అలాగే పురుషుల్ని స్త్రీల పనుల్లోకి దించడానికీ, పురుషాధిక్యతని వదిలించడానికీ కూడా అంత పోరాటమూ అవసరమవుతుంది.

పురుషాధిక్య లక్షణం ఎక్కడ కనబడితే అక్కడ, ఎప్పుడు కనపడితే అప్పుడు, దాని మీద పోరాటం చేసే ఆత్మ గౌరవం స్త్రీలకు అలవడినప్పుడు మాత్రమే వాళ్ళు పురుష దాస్యం నించి విముక్తులవుతారు.

ఏ సమస్యకైనా అనేక తప్పుడు పరిష్కారాలు ఎదురైనట్టే, 'పురుషాధిక్యత' సమస్యకి కూడా రకరకాల తప్పుడు పరిష్కారాలు ఎదురవుతాయి. అవన్నీ బూర్జువా పరిష్కారాలు.

గృహానికే అంకితమై జీవించే స్త్రీల కోసం ఒక పరిష్కారం ఇలా చెపుతుంది: "భార్య ఇంటి పనులన్నీ చేస్తుంది కాబట్టి, భార్యకి భర్త 'జీతం' ఇవ్వాలి. వంట పనికీ, పిల్లల పనికీ, ఇంకా ప్రతీ పనికీ లెక్కలు కట్టి, జీతం ఇవ్వాలి. లేదా, గృహిణులకు ప్రభుత్వం అయినా జీతాలు ఇవ్వాలి" - ఇవి, బూర్జువా స్త్రీ వాదులు కనిపెట్టిన పరిష్కార మార్గాలు.

ఈ తప్పుడు వాదాలకు జవాబు లేమిటో ఇంతకు ముందే చూశాం.

కుటుంబ బాధ్యత భార్యాభర్త లిద్దరిదీనూ. 'కుటుంబం' కోసం స్త్రీ చేసే పనుల్లో 'సగ భాగం' ఎలాగూ స్త్రీ బాధ్యతే. అంతే గాక, తన పోషణ కోసం పూర్తి గానూ, బిడ్డల పోషణలో సగ భాగమూ, స్త్రీ బాధ్యతే. కానీ, ఆ బాధ్యతని స్త్రీ నిర్వహించలేని చోట పురుషుడే నిర్వహిస్తాడు. అంటే, స్త్రీని పోషించే ఖర్చూ, బిడ్డల పోషణలో తల్లి నిర్వహించవలసిన ఖర్చూ, పురుషుడి ఆదాయం నించే వస్తాయి. (ఆ శ్రమ, పురుషుడు బయట చేస్తాడు.) 'పోషణ' విషయంలో స్త్రీ నిర్వహించవలసిన బాధ్యతని కూడా పురుషుడే నిర్వహిస్తున్నాడు కాబట్టి, 'ఇంటి పని' విషయంలో పురుషుడు నిర్వహించవలసిన బాధ్యతని కూడా స్త్రీ యే నిర్వహించవలసి వస్తుంది. అంటే, ఇది, 'స్త్రీకి ఇంటి పనీ, పురుషుడికి బయటి పనీ' అనే శ్రమ విభజన. దీనికి పరిష్కారం - ఇద్దరికీ ఇంటి పనీ, ఇద్దరికీ బయటి పనీ! అప్పుడు - పోషణ బాధ్యతా, ఇంటి పని బాధ్యతా కూడా, ఇద్దరూ వహిస్తారు.

చిన్న తనం నించీ స్త్రీ పురుషులిద్దరికీ చదువుల్లోనూ, శ్రమ శక్తులు అలవర్చుకోవడం లోనూ సమానమైన పరిస్థితులు వుంటే, పురుషుడికి లాగే స్త్రీకి కూడా 'స్వంత పోషణ' శక్తి ఏర్పడుతుంది.

ఇద్దరు పురుషుల మధ్య ఏది పరిష్కారమో, స్త్రీ పురుషుల మధ్య కూడా అదే పరిష్కారం. ఇలాంటి పరిష్కారం బూర్జువా దృష్టికి ఎందుకు కనపడదంటే, ఆ దృష్టికి ఇద్దరు పురుషుల మధ్య కూడా 'సమానత్వం' అనేది పరిష్కారంగా కనపడదు గనక.

గృహిణులకు జీతాలు ఇవ్వడం - అనే పరిష్కార మార్గం, ఎలా అర్థ రహితమో, గతం లోనే చూశాం. 'గృహిణికి జీతం' - అంటే, స్త్రీలను ఇంటి పనికే పరిమితం చేసి వుంచడం అన్నమాట! పురుషుల్ని ఇంటి పని లోకి దిగ వలసిన అవసరం లేకుండా కాపాడడం అన్నమాట! దీని అర్థం - గృహిణి గృహిణిగా వుండిపోవడమే. స్త్రీకి ఎప్పుడూ ఇంటి పనీ, పురుషుడికి ఎప్పుడూ బయటి పనీ! ఎప్పటికీ ఇద్దరూ సమానులు కాకుండా వుండడమే!

'పురుషాధిక్యత' మీద బూర్జువా పోరాట వాదుల 'తిరస్కారం', ఇంకా ఎలాంటి మార్గాల్లో వుంటుందంటే - స్త్రీలకు పురుషులతో 'సహ జీవనం' వుండరాదు! కానీ 'శారీరక సంబంధాలు' వుండవచ్చు!! ఏ పురుషుడితో అయితే కలిసి జీవించడం అభ్యంతరకరమో, అలాంటి పురుషుడి తోటే శృంగార సంబంధం వుండవచ్చు! 'సహ జీవనం లేని తాత్కాలిక శారీరక సంబంధాలు' అంటే, దాని అర్థం ఏమిటో వేరే చెప్పనక్కర లేదు.

పురుషుల వైపు నించి చూస్తే, పాత సమాజాల నించీ ఈ నాటి వరకూ కూడా, పురుషులకు, స్త్రీలతో సంబంధాల విషయంలో, ఏ నిబంధనలూ లేవు. స్త్రీలలో మాత్రం - సంసారులూ, వేశ్యలూ అనే విభజన వుంది. పురుషులకు ఏ నిబంధనలూ లేని జీవిత విధానం సాగాలంటే, స్త్రీలలో వేశ్యల విభాగం ఒకటి వుండి తీరాలి. ఇది బూర్జువా సమాజంలో మరింత పతనం లోకి మారింది.

దీనికి సరైన పరిష్కారం - స్త్రీ పురుషుల మధ్య 'ప్రేమ' ద్వారానే సహ జీవనం ఏర్పడడమూ, ఆ సంబంధం 'ఒక స్త్రీ - ఒక పురుషుడూ' అనే సంబంధంగా స్థిరపడడమూ, ఈ మార్పుని పురుషుడు కూడా స్వచ్ఛందంగా స్వీకరించడమూ, స్త్రీలలో వేశ్యా వృత్తి అంతర్ధానమవడమూ. వంటి అంశాలతో కూడి వుంటుంది.

(ఈ విషయాలన్నీ కూడా ఇంతకు ముందే చర్చించాం.)

బూర్జువా పురుషులు గానీ, బూర్జువా స్త్రీలు గానీ, స్త్రీ పురుషుల 'నిజమైన సమానత్వాన్ని' కోరరు. ఎందుకంటే, వాళ్ళకి జీవితంలో ప్రతీ కోణం లోనూ బూర్జువా జీవిత విధానమే కావాలి.

కాబట్టి, నూతన సమాజం, 'స్త్రీ పురుష సంబంధాల' విషయంలో, ప్రతీ చోటా బూర్జువా దృష్టితో తల ఎత్తే జంతు స్థాయి పరిష్కారాల విషయంలో వివేకంతో వుండాలి! ప్రతీ సమస్య లోనూ, మానవ సంబంధాలకు తగిన హేతు బద్ధ దృష్టితో వ్యవహరించాలి!

# 'రాత్రి పని' రద్దు

**దీ**న్ని గురించి ఇంతకు ముందు, మొదటి సంపుటంలో, 'పని దినం' చాప్టరులో. వివరం గానే చూశాం. సమాజంలో అందరూ శ్రమ చేస్తున్నారనీ, 'నూతన శ్రమ విభజన' ప్రకారమే ప్రతీ ఒక్కరూ శారీరక, మేధాశ్రమలు చేస్తున్నారనీ, అనుకుందాం. కానీ, 'నైట్ షిఫ్టు'ని అలాగే వుంచారనుకుందాం. అంటే, నూతన సమాజం ఇంకా పెట్టుబడిదారీ అసహజత్వం లోనే వుండి పోయిందని అర్థం.

పని 'రాత్రి' చేసే వ్యక్తి, 'పగలు' చెయ్యడు. పగళ్ళు నిద్రపోయి, రాత్రుళ్ళు పని చెయ్యడం - మానవ జీవితానికి తల్లకిందుల వ్యవహారం.

ఈ తల్లకిందుల వ్యవహారాన్ని, పగళ్ళు పని చేసి రాత్రుళ్ళు నిద్రపోయే సహజ వ్యవహారంగా మార్చాలి! అలా చేస్తే, చాలా కాలం నించి పెట్టుబడిదారీ లాభ దృష్టితో సాగుతోన్న ఒక వికృతత్వాన్ని సమాజం నించీ తీసివేసినట్టు అవుతుంది.

కొన్ని రకాల పక్షులూ, జంతువులూ రాత్రుళ్ళు వేట కోసం తిరిగి, పగళ్ళు నిద్ర పోతాయి. అది వాటికి సహజం. మానవ జీవితానికి అది అసహజం; అనారోగ్యం. రాత్రి అనేది మానవులకు విశ్రాంతికీ, నిద్రకీ, కుటుంబ జీవితానికీ, అత్యవసరం.

'రాత్రి పనిని ఎలా తీసివెయ్యాలీ, దాన్ని ఏ యే శాఖల నించి ప్రారంభించాలీ' అనేదే చర్చనీయాంశం గానీ, 'రాత్రి పనిని తీసి వెయ్యాలా లేదా' అనేది చర్చనీయాంశం కాదు. మానవ జీవితం నించి ఆ అసహజత్వాన్ని తీసివేసి తీరాలి!

'నూతన సమాజం' ప్రారంభం కాగానే, మొట్టమొదట, పెట్టుబడిదార్ల ఇళ్ళ ముందూ - ఫ్యాక్టరీల ముందూ రాత్రుళ్ళు కాపలాలు కాసే 'వాచ్ మెన్ పద్ధతి'ని తీసివెయ్యాలి. దానికి ప్రత్యేకంగా చట్టం వుండాలి. నూతన సమాజంలో కూడా ఇంకా 'దొంగల' భయంతో తల్లడిల్లే ధనికులు వుంటే, కావాలంటే, వాళ్ళ ఇళ్ళని వాళ్ళే కాపలాలు కాచుకుంటారు. ధనికుల ఇళ్ళ ముందు కాపలా శ్రామికులు పడి వుండే పద్ధతిని నూతన సమాజం ఒక్క రోజు కూడా సహించకూడదు. కాపలా శ్రామికులందరికీ వేరే పనులు కల్పించాలి, 'వాచ్ మెన్ పద్ధతి' రద్దుతో ప్రారంభించి 'రాత్రి పని' రద్దుని క్రమంగా ఇంకా విస్తరించాలి.

'ఆస్పత్రుల' వంటి అత్యవసర శాఖల్లో తప్ప మిగతా శాఖల్లో రాత్రి పనిని రద్దు చేస్తూ పోవాలి.

రాత్రి పనిని తీసివెయ్యకపోతే, ఆ సమాజం ఇంకా నూతన జీవితాన్నిచ్చే సమాజం కాదు. అది ఇంకా, 'రాత్రుళ్ళు నిద్ర పోవాలి' అనే ప్రకృతి సహజ ధర్మం మీద ఆధారపడిన సమాజం కాదు. అది ఇంకా 'ఉపయోగపు విలువ' దృష్టి గల సమాజం కాదు. ఆ రకంగా అది ఇంకా 'నూతన సమాజం' కాదు.

# 'కుల మతాలు' రద్దు

'**మ**తం' అనేది, 'దేవుడి' మీద నమ్మకాలకు సంబంధించిన విషయం. దేవుడే 'అశాస్త్రీయం' అయినప్పుడు, 'మతం' కూడా అశాస్త్రీయమే.

దోపిడీ సమాజాలన్నీ, శ్రామిక వర్గాల్ని అజ్ఞానంలో వుంచడానికే మతాన్ని ఉపయోగించుకున్నాయి. ఇంకా ఉపయోగించుకుంటున్నాయి.

బూర్జువా సమాజంలో, మత మూఢత్వాన్ని నిలిపి వుంచడానికి ప్రభుత్వంలో ప్రత్యేకంగా ఒక శాఖ వుంటుంది. ఎంతో భూమి, దేవాలయాల ఆస్తిగా కొందరి చేతుల్లో వుంటుంది. భూమి మీద ఎక్కడంటే అక్కడల్లా దేవాలయాలు నిర్మించడానికీ, మత సంస్థలు నడపడానికీ, మనుషులే 'భగవంతుడి'గా వేషాలు ధరించి జనాల్ని మోసాలు చేస్తూ ఆస్తులు సంపాదించడానికీ, బూర్జువా చట్టాలు అనుమతిస్తాయి.

'మతం' పేరుతో జరిగే ఈ కార్యక్రమాలన్నిటినీ నూతన సమాజం రద్దు చెయ్యాలి. దోపిడీని తీసివేసే సమాజం, శ్రామిక వర్గాన్ని మత అజ్ఞానం నించి కూడా విముక్తి చెయ్యాలి. దోపిడీ సంబంధాల్ని తీసివెయ్యడం ఎంత సరైన మార్గంలో జరుగుతూ వుంటుందో దాని మీదే, మత అజ్ఞానం నించి విముక్తి చెందడం కూడా ఆధారపడి వుంటుంది.

'మత' నమ్మకాలు వ్యక్తిగత నమ్మకాలుగా మాత్రమే వుండాలి. మతాన్ని పాటించడం - వ్యక్తి

స్వేచ్ఛలో భాగం. ఆ 'స్వేచ్ఛ' మీద ఆజ్ఞలూ ఆంక్షలూ వుండనక్కర లేదు. కానీ, ఆ వ్యక్తే ఎవరి బలవంతమూ లేకుండానే మతాన్ని వదిలి వెయ్యగలగాలి. మత అజ్ఞానం నించి బయటపడ గలగాలి.

'వ్యక్తి'ని ఆ రకంగా అభివృద్ధి పరిచే, అటువంటి జ్ఞానం ఇచ్చే మార్గాన్ని నూతన సమాజం అనుసరించాలి.

## 'కులం' విషయం:

'చిన్న' కులాలకు ఉత్పత్తి సాధనాలు వుండవు. 'పెద్ద' కులాలకే అవి వుంటాయి. అందులో కూడా తక్కువ సంఖ్యకే అవి వుంటాయి.

చిన్న కులాల్లో మెజారిటీ సంఖ్య, కింది స్థాయి శారీరక శ్రమల్లోనే వుంటారు. పెద్ద కులాల్లో, 'శ్రమ' చేసే సంఖ్యలో మెజారిటీ సంఖ్య, పై స్థాయి శారీరక శ్రమల్లోనూ, మేధాశ్రమల్లోనూ వుంటారు.

కాబట్టి, ఇలాంటి సమాజంలో 'కులాల' సమస్య ఎలా పరిష్కారం కావలసి వుంటుందంటే - 'ఉత్పత్తి సాధనాల' మీద పెద్ద కులాలకు వుండే ప్రైవేటు హక్కు రద్దవడమూ, 'పాత శ్రమ విభజన' మారడమూ - అనే మార్పుల ద్వారానే!

'ఉత్పత్తి సాధనాల' మీద ప్రైవేటు హక్కు రద్దవడం వల్ల, పెద్ద కులాలు చిన్న కులాల మీద యజమానులుగా వుండే స్థితి రద్దవుతుంది. శ్రమ చెయ్యని పెద్ద కులాల జనాభా కూడా శ్రమ లోకి దిగుతుంది.

తర్వాత, 'పాత శ్రమ విభజన' రద్దవడం వల్ల, పెద్ద కులాలు శారీరక శ్రమల్లోకి కూడా రావడమూ, అలాగే చిన్న కులాలు మేధా శ్రమల్లోకి కూడా రావడమూ, జరుగుతాయి.

ఈ మార్పుల్లో దేన్ని తీసుకున్నా అది వర్గ పోరాటమే.

భూమి లేని చిన్న కులాలకు భూమి కావాలంటే - అది వర్గ పోరాటం. ఎప్పుడూ శారీరక శ్రమలే చేసే చిన్న కులాలు మేధా శ్రమల్లోకి రావాలంటే - అది కూడా వర్గ పోరాటం.

కుల భేదాలకు పునాది, వర్గ భేదాలే. కాబట్టి, వర్గ పోరాటం మీదే కులాల అంతర్ధానం ఆధారపడి వుంటుంది.

శారీరక శ్రమలు చేసే చిన్న కులాలే, మేధా శ్రమలు చేసే పెద్ద కులాల కన్నా విప్లవకరమైన శ్రామిక సెక్షన్లు. ఆ జనాభా వర్గ పోరాటాన్నే గ్రహించక పోతే, కులాల్ని తీసి వెయ్యగలిగే కార్యక్రమం ఏదీ సమాజంలో వుండదు. వర్గ పోరాటమే లేకపోతే, చిన్న కులాలు ఎప్పుడూ, ఉత్పత్తి సాధనాలు గల యజమానులకు సేవకులు గానూ, ఎప్పుడూ శారీరక శ్రమల్లోనూ, వుండిపోవలసిందే.

# 'దోపిడీ సంస్కృతి' రద్దు

**దో**పిడీ వర్గం, శ్రమ చెయ్యదు. ఇంటా బయటా ఎక్కడా శ్రమ చెయ్యదు. ఆఖరికి స్వంత పిల్లల్ని 'ఎత్తుకునే' పని కూడా గృహసేవకుల మీదకే తోస్తుంది.

కానీ, శ్రమ చెయ్యని వర్గానికి కూడా కాలం గడవాలి. దానికి కూడా రోజుకి 24 గంటలూ వుంటాయి. శ్రమ చెయ్యకుండా రోజూ 24 గంటలు గడపాలంటే, ఆ మనుషులు ఎప్పుడూ కుర్చీల మీద కూర్చోడమో, మంచాల మీద పడుకోడమో చెయ్యలేరు. 'శ్రమ' లేకుండా కాలక్షేపం జరగాలంటే, దాని కోసం తప్పని సరిగా 'విలాస మార్గాలు' వుండి తీరాలి. జూదలూ, వ్యసనాలూ, వేటలూ, విహారాలూ, మత్తు పదార్థాలతో కాలక్షేపాలూ, కుక్కల తోటీ నక్కల తోటీ కాలక్షేపాలూ, (తమ స్వంత పిల్లల్ని గృహ సేవకుల మీద వదిలి, వీళ్ళు కుక్కల్ని మోస్తూ, ముద్దులాడుతూ వుంటారు), జంతువులతో పందాలూ, మనుషులతో పందాలూ, పువ్వుల పోటీలూ, శిశువుల పోటీలూ, అందాల పోటీలూ, కూరగాయల పోటీలూ, దుస్తులతో ప్రదర్శనలూ, దుస్తులు లేకుండా ప్రదర్శనలూ, 'ఆధ్యాత్మికత' పేరుతో 'జీవాత్మా పరమాత్మల' గురించి పోసుకోలు చర్చలూ, ఎప్పటి కప్పుడు నూతన దేవాలయాలతో కాలక్షేపాలూ, మత ఉత్సవాలతో కాలక్షేపాలూ - ఈ రకంగా, శ్రమ చెయ్యని వర్గం - తన కోసం నిరర్థకమైన, వికృతమైన కాలక్షేపాలన్నీ సృష్టించుకుంటుంది. దీని కోసం, కార్మిక వర్గం నించీ దోచిన 'అదనపు విలువ రాసిని' విచ్చల విడిగా ఖర్చు పెడుతుంది. 'భూమి' మీద అత్యధిక స్థలాన్ని జూద శాలలకూ, పోటీల రంగస్థలాలకూ, విలాస మందిరాలకూ, విహార స్థావరాలకూ, ఆక్రమిస్తుంది.

ఈ కాలక్షేపాలన్నీ, ఇంకో వేపున బ్రహ్మాండమైన వ్యాపారాలుగా కూడా వుంటాయి.

గత సమాజాల్లో కన్నా పెట్టుబడిదారీ సమాజంలో ఈ నీచత్వమంతా అనేక రెట్లు పెరిగి పోతూ వుంటుంది. ఎందుకంటే, పెట్టుబడిదారీ వర్గానికి అందే అదనపు విలువ రాసి గత సమాజాల్లో కన్నా విపరీత స్థాయిలో వుంటుంది.

స్వయంగా శ్రమ చేసే మనిషి, విలాసాల కోసం, విపరీతమైన ఉత్పత్తిని ఖర్చు పెట్టలేడు. ఎందుకంటే, స్వయంగా శ్రమ చేసే మనిషి రోజుకి ఎంత శ్రమ మాత్రమే చెయ్యగలడంటే, ఒక్క శరీరంతో ఎంత శ్రమ చెయ్యడం సాధ్యమో అంత శ్రమ మాత్రమే చెయ్య గలడు. ఆ 'శ్రమ'లో నించి సహజ అవసరాలన్నీ పోగా విలాస కాలక్షేపాలకు మిగిలే భాగం మితిమీరిన స్థాయిలో వుండదు. ప్రతీ వ్యక్తికీ ఇదే వర్తిస్తుంది కాబట్టి, శ్రమ చేసే మనుషులకు మితిమీరిన విలాస జీవితానికి అవకాశం వుండదు. ఇతరుల శ్రమని దోచే మనిషికైతే, ఈ పరిమితులేవీ వుండవు - సామాజిక అదనపు విలువలో నించి ఆ వ్యక్తి ఎంత భాగాన్ని లాగగలిగాడూ అనే పరిమితి తప్ప! అందుకే సమాజం మొత్తాన్ని తీసుకుంటే, దోపిడీ వర్గం విలాసాల మీద ఖర్చు పెట్టేది, ఊహాతీతమైన స్థాయిలో వుంటుంది.

దోపిడీ వర్గ జీవిత విధానమే - దోపిడీ వర్గ సంస్కృతి. అది, అసహజత్వాల తోటీ, వ్యసనాల తోటీ, నిండి వుంటుంది.

శ్రామిక వర్గాన్ని మత అజ్ఞానంలో వుంచినట్టే, రక రకాల వ్యసనాల్లో వుంచడం కూడా దోపిడీ వర్గాలకు అవసరం. శ్రామికులు వ్యసనాల్లో లేకపోతే, ఆ రకం సరుకుల్ని కొనే వాళ్ళు వుండరు. అందు కోసం కూడా దోపిడీ సమాజం రక రకాల వ్యసనాలు సృష్టిస్తూ వుంటుంది. ఈ వ్యసనాలన్నీ దోపిడీ సంస్కృతిలో భాగం.

దోపిడీ వర్గాన్ని శ్రమలోకి దించినప్పుడే, దాని 'సంస్కృతి రద్దు' ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అన్ని రద్దుల లాగే అది కూడా తర్వాత జరిగే మార్పుల ద్వారా కాలాన్ని హేతుబద్ధంగా వుపయోగించే అంశంగా మారుతుంది.

నూతన సమాజంలో, దోపిడీ సంస్కృతి మీద చేసే పోరటంలో, కొన్ని విషయాల్ని తక్షణం తీసి వెయ్యవలసి వుంటుంది. కొన్నిటిని సవరించవలసి వుంటుంది. కొన్నిటిని తీసివెయ్యడానికి కొంత ఎక్కువ వ్యవధి అవసరమవుతుంది. ఉదా॥ గుర్రప్పందాలూ, ఆటల పోటీలూ, ఇతర పోటీలూ, సెక్సూ క్రైమ్ పత్రికలూ, అదే రకపు సినిమాలూ, పుగాకూ, మత్తు మందులూ - వంటి, జూదాలకూ, వ్యసనాలకూ సంబందించిన ఉత్పత్తుల్నీ కార్యక్రమాల్నీ తీసివెయ్యడానికి ఎక్కువ కాలం అవసరం లేదు.

రేడియో, టీవీ, సినిమా, విద్యా - లాంటి వాటిని, దోపిడీ వ్యాపార సంస్కృతీ మార్గం నించి మళ్ళించి, నిజమైన 'సామాజిక జ్ఞానాన్ని' ఇవ్వగల మార్గంలో ఉపయోగించవలసి వుంటుంది.

తుపాకుల వంటి ఆయుధాల్ని తీసివెయ్యడానికి కొంత ఎక్కువ కాలం పడుతుంది. కార్మిక వర్గం, తన ఆత్మ రక్షణని మరిచి వుండకూడదు కాబట్టి.

ఈ రకంగా క్రమ క్రమంగా దోపిడీ సంస్కృతి హరించి పోవలసి వుంటుంది.

కానీ, 'నూతన సమాజం' కూడా గుర్రప్పందాల వంటి పాత కాలపు జూదాల్నీ విలాసాల్నీ కొనసాగిస్తూ వుందనుకుందాం. అంటే, ఆ సమాజం తన 'శ్రమ'ని, సహజ అవసరాల కోసం మాత్రమే గాక, దోపిడీ సమాజాల నించీ నేర్చుకున్న 'తప్పుడు అవసరాల కోసం' వృధా చేస్తోందన్న మాట! జూదాల ద్వారా డబ్బుని సంపాదించే అదృష్ట దురదృష్టాల దృష్టితో కాలం గడుపుతోందన్న మాట!

కాబట్టి, నూతన సమాజం, తన విశ్రాంతి కాలాన్ని గడపడం కోసం ఎటువంటి మార్గాలు ఎంచుకోవాలంటే, ప్రకృతి సహజమూ, హేతుబద్ధమూ, కళాత్మకమూ అయిన మార్గాలు! నూతన సమాజంలో దోపిడీ సంస్కృతి క్రమ క్రమంగా హరించి పోతూ, నూతన సంస్కృతి అభివృద్ధి చెందాలి.

# 'వర్తకం' రద్దు

'**ఉ**త్పత్తి సాధనాల మీద ప్రైవేటు హక్కుని తీసివెయ్యడం' తోనే, వర్తకం రద్దులో మొదటి దశ ప్రారంభమవుతుంది. ఉత్పత్తి సంబంధాలు సమిష్టి స్వభావం లోకి మారడం అభివృద్ధి చెందుతోన్న కొద్దీ,

వర్తకం రద్దు కూడా అభివృద్ధి చెందుతూ వుంటుంది.

ఉత్పత్తిని, రేషన్ పద్ధతిలో పంపిణీ చేసే పద్ధతి (వాటి ధరల తోటే) అభివృద్ధి చెందితే, బేర సారాలన్నీ మూలబడతాయి.

'జీతాల' పద్ధతిని కూడా రద్దు చెయ్యగలిగి నప్పుడు, ఇక డబ్బుతో కొనడాలూ, అమ్మడాలూ కూడా రద్దవుతాయి.

వర్తకాన్ని పూర్తిగా రద్దు చెయ్యడం అనేది, ఇంతకు ముందు వరకూ చూసిన ప్రధానమైన మార్పుల మీదే (పాత శ్రమ విభజనని మార్చడం మీద) ఆధారపడి వుంటుంది. నూతన సమాజంగా వున్న దేశం పక్కన పెట్టు బడిదారీ దేశాలు వున్నప్పుడు, నూతన సమాజ దేశానికీ పెట్టుబడిదారీ దేశానికీ మధ్య 'ఉపయోగపు విలువ దృష్టి గల సంబంధాలు' సాధ్యం కావు. అలాంటి దశలో, ఇంకా విదేశీ సంబంధాల్లో, డబ్బు లెక్కలు వుంటాయి.

నూతన సమాజపు ప్రారంభం నించీ, పెట్టుబడిదారీ రకపు వర్తక ప్రకటనల్ని రద్దు చెయ్యాలి. సరుకుల్ని అమ్మడం కోసం లాటరీ పద్ధతుల్నీ, బహుమతుల పద్ధతుల్నీ ఉపయోగించే నీచ మార్గాలన్నిటినీ రద్దు చెయ్యాలి.

అనేక మార్పుల మీదుగా చివరికి వర్తకమే రద్దయ్యే దశ ప్రారంభమవుతుంది. వర్తకం రద్దవడం అంటే - షాపుల అరల్లో ఫోటోల్లో మాదిరిగా ఎప్పుడూ వుండే ఉత్పత్తి రాసులన్నీ ఉపయోగంలోకి రావడమే. వర్తకం రద్దవడం అంటే - వర్తక మోసాలన్నీ, ఉత్పత్తుల్లో కల్తీలన్నీ రద్దవడమే. వర్తకం రద్దవడం అంటే - సరుకుల అమ్మకాల కోసం వర్తక కార్మికులు ప్రదర్శించ వలసిన జిత్తులన్నీ, సిగ్గుమాలిన చర్యలన్నీ, రద్దవడమే. వర్తకం రద్దవడం అంటే - ఉత్పత్తిలోనూ, శ్రమ శక్తి లోనూ జరిగే ఘోరమైన వృధాలన్నీ రద్దవడమే. వర్తకం రద్దవడం అంటే - రోడ్ల నిండా సందుల నిండా, కిక్కిరిసిన షాపులూ, బేరసారాలూ, డబ్బు గల గలలూ, రద్దవడమే.

బాటలన్నీ పచ్చని చెట్లతో, చల్లదనంతో, పక్షుల కూతలతో అలరారడమే.

# 'వేతన బానిసత్వం' రద్దు; 'జీతాల పద్ధతి' రద్దు

**'ఉ**త్పత్తి సాధనాల మీద ప్రైవేటు హక్కుని తీసివెయ్యడం' ద్వారా యజమానితనం రద్దు ప్రారంభమైనప్పుడే వేతన బానిసత్వం రద్దు కూడా ప్రారంభమవుతుంది. ఇది ఎప్పటికి పూర్తి అవుతుందంటే, మిగిలిన మార్పుల తర్వాత!

సమాజంలో అందరూ 'శ్రమ' చేస్తున్నారనీ, అందరూ 'కొత్త శ్రమ విభజన' ప్రకారమే శారీరక శ్రమలూ మేధా శ్రమలూ చేస్తున్నారనీ - అనుకుందాం.

అప్పుడు ప్రతీ వ్యక్తి శ్రమా ఒకే విలువతో వుంటుంది.

ప్రతీ వ్యక్తి శ్రమా 100 విలువ గలది అనుకుందాం. అందులో జీతం 75. సమాజ నిధి 25.

అందరి శ్రమలూ సమానం. వాటి విలువలు సమానం - అనుకుందాం. అప్పుడు, 'జీతాలు' - సమానం. 'సమాజ నిధులు' - సమానం.

'జీతాలు సమానం అవడం' అంటే, ఇక అవి రద్దవడమే. అవి వున్నా లేకపోయినా ఒకటే. ఇక అప్పుడు, జీతాల పద్ధతిని రద్దు చేసే దశ సమీపించినట్టే. అప్పటి నించీ జీతాల పద్ధతి లేకుండానే అందరూ ఉత్పత్తి చెయ్యడమూ, దాన్ని వాడుకోవడమూ, చేస్తారు.

ఇదంతా నూతన సమాజపు ప్రారంభం లోనే సాధ్యం కాదు. అంటే, ఒకరు ఎక్కువ విలువ గల శ్రమా, ఒకరు తక్కువ విలువ గల శ్రమా చేస్తూ వుండగా, ఇద్దరి ఆదాయాలూ సమానం అవడం గానీ, అవి రద్దవడం గానీ సాధ్యం కాదు. ప్రతీ వారూ చేసే శ్రమ, సమానం అయినప్పుడే, జీతాల రద్దు సాధ్యమవుతుంది.

**ఒక ప్రశ్న:** అందరికీ 'జీతాలు' ఒకే రకంగా వున్నాయి - అనుకుందాం. అయినప్పటికీ, జీతాలు

రద్దు అవకుండా, ఎవరి జీతాలు వాళ్ళకే అందితే, వాటిని ఖర్చు పెట్టడంలో ఎవరికి ఇష్టమైనట్టు వాళ్ళు చేసుకోగలరు. ఒక మనిషి, తన జీతాన్నంతా ఖర్చు పెట్టెయ్యవచ్చు; ఇంకో మనిషి, ప్రతి నెలా కొంత భాగాన్ని పొదుపు చెయ్యవచ్చు జీతాల పద్ధతి లేక పోవడం వల్ల, ఈ పొదుపు చేసే మనిషికి ఆ అవకాశం లేకుండా పోతుంది కదా?

అవును, ఈ ప్రశ్న వస్తుంది.

ఉత్పత్తుల్నీ, కాలాన్నీ దుబారా గానూ ఖర్చు చెయ్యకూడదు; పీనాసితనం గానూ వుండకూడదు. అవసరాల్ని బట్టి సుఖంగా ఖర్చు చేసుకోవాలి. ఇది మొట్టమొదటి షరతు. అటువంటి సంస్కృతి ఆ నాటికి అభివృద్ధి చెంది వుంటుందనే షరతు మీదే ఇదంతా చర్చించాలి.

సహజమైన పొదుపు దృష్టి తోటీ, క్రమ శిక్షణ తోటీ అందరూ ప్రవర్తిస్తారు. ఎంత పొదుపు చెయ్యాలో అంత కన్నా ఎక్కువ పొదుపు చేసి, తన జీతాన్ని కూడ బెట్టే వ్యక్తి ఆ పొదుపుని తర్వాత ఎలా వాడగలుగు తాడు? ఆ పొదుపు మీద 'వార సత్వపు హక్కు' వుండదు. దాన్ని పిల్లలకే అప్పగించడం గానీ, దేవా లయాలు నిర్మించడం గానీ, దాన ధర్మాలు చెయ్యడం గానీ, జరగదు. జీవిత మంతా పొదుపు చేసిన దాన్ని చివరికి సమాజానికే విడిచిపెట్టాలి.

కాబట్టి, ప్రతీ వ్యక్తీ ఎక్కడా వృధా చెయ్యకుండా స్వంత బాధ్యతతో ప్రవర్తించినప్పుడు, 'జీతం'లో కొంత భాగాన్ని కూడా పొదుపు చెయ్యవలసిన అవసరం వుండదు. దాని వల్ల ఆ వ్యక్తికి ప్రత్యేక ప్రయోజనం ఏమీ వుండదు. జీతం అంతా తప్పని సరిగా ఖర్చు పెట్టవలసినది గానే వుంటుంది. కాబట్టి, జీతాల పద్ధతి ఉన్నా లేకపోయినా ఏమీ సమస్య రాదు.

'నూతన సమాజం'లో కూడా ఖచ్చితమైన పని దినమూ (దాని గంటలు ఎంత తగ్గినా), దానికి సంబం ధించిన క్రమ శిక్షణా - తప్పనిసరిగా వుండవలసిందే. 'సమిష్టితనం' అనే దానికి, ఈ ఖచ్చితత్వం మరీ ఎక్కు వగా అవసరమవుతుంది. అయితే, ఎవరికి వారు బలవంతం లేకుండానే 'మతాన్ని' వదిలేసి హేతు వాదులుగా మారే విధంగానే, ఈ సామాజిక క్రమ శిక్షణనీ, స్వంత బాధ్యతనీ అభివృద్ధి చేసుకోవాలి. ప్రతీ వ్యక్తీ 'సమిష్టితనానికి' అనుగుణమైన సమాజ నియ మాల్ని పాటించవలసిందే.

మనుషుల శక్తి సామర్థ్యాల్లో వుండే తేడాల ప్రశ్న, అసలైన అర్థంలో ఇక్కడే ఎదురవుతుంది. 'పని దినం' అందరికీ సమానమే. అందరూ బాధ్యత తోటే పని చేస్తారు. ఎంత బాధ్యతతో చేసినా, ఆ పనుల్లో తేడాలు వుంటాయి. అయితే, ఆ తేడాలకు ఆ వ్యక్తులు బాధ్యులు కారు. శక్తి సామర్థ్యాలలో తేడాలు ప్రకృతి సహజమైనవి.

శ్రమ చెయ్యడంలో శక్తి సామర్థ్యాలు కొంత కొంత తేడాగా వున్నట్టే, ఉత్పత్తుల్ని వాడుకునేటప్పుడు అవసరాల్లో కూడా కొన్ని తేడాలు ఉంటాయి. అవస రాల్లో తేడాలు ఎలా వుంటాయంటే: సన్నని మనిషి చొక్కాకి తక్కువ బట్టపడితే, లావు మనిషి చొక్కాకి ఎక్కువ బట్ట పడుతుంది. తక్కువ బట్టతో అయినా ఒక చొక్కాయే; ఎక్కువ బట్టతో అయినా ఒక చొక్కాయే. ఎక్కువ బట్టని తీసుకున్న లావు మనిషికి, దాని వల్ల, సన్నని మనిషి కన్నా ఎక్కువ ఫలితం వచ్చిం దేమీ వుండదు. కానీ, దీన్నే డబ్బు లెక్కల ప్రకారం చూస్తే, లావు మనిషి తన 'జీతం'లో నించి తన బట్టల కోసం ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టవలసి వస్తుంది. సన్నని మనిషి, ఎక్కువ బట్ట కొనక్కర లేదు కాబట్టి, ఆ రకంగా అతనికి కొంత డబ్బు మిగులుతుంది. నూతన సమాజపు సన్నని మనిషి కూడా పాత దృష్టితో, "లావు మనిషి, నా కన్నా ఎక్కువ బట్ట తీసుకున్నాడు కదా? ఎవరి శ్రమ ఫలితం వాళ్ళకి డబ్బు గానే అంది వుంటే, నేను కొంత డబ్బుని దాచుకోగలిగే వాణ్ణి కదా? డబ్బుగా గాక, ఉత్పత్తులుగా అందడం వల్ల, నా కన్నా లావు మనిషికి ఎక్కువ ఉత్పత్తి అందినట్టు అయింది కదా?" అని వాదించడం సరైనదేనా? - కాదు. ఇలా వాదించడానికి వీలు లేదు. సన్నమూ లావూ అనేవి ప్రకృతి సహజమైన తేడాలు. ఆ తేడాలకు ఆ వ్యక్తులు బాధ్యులు కారు. ఆ వ్యక్తులే బాధ్యులయ్యే విష యాలలో మాత్రమే వాదోప వాదాలకు ఆస్కారం వుంటుంది. ఈ సంగతి గ్రహించకపోతే, 'ప్రకృతి సహ జత్వాన్నే' గ్రహించలేదని అర్థం. సహజమైన తేడాల్ని కూడా డబ్బు దృష్టితో చూడడం అనేది, 'పెట్టుబడిదారీ దృష్టి'. ఇప్పుడు సన్నగా వున్న మనిషే లావుగా వుండి

వుంటే? ఈ వ్యక్తే కొంత కాలం తర్వాత లావు అయితే? అప్పుడు ఈ మనిషికి కూడా ఎక్కువ బట్ట అవసరమవుతుంది కదా? దానికి ఎవ్వరూ అభ్యంతరం చెప్ప కూడదు కదా? అందుకే అతని వాదం తప్పు.

**ఇంకో ఉదాహరణ:** ఆరోగ్యం పాడయిన మనిషి కోసం చాలా మందులూ, వైద్య శ్రమలూ ఖర్చవుతాయి. అంతే గాక, ఆ మనిషి పని చెయ్యకుండా వుండాలి. ఆరోగ్యం పాడవని మనిషి కోసం మందుల ఖర్చులేవీ జరగవు. ఆ మనిషి పని చేస్తూనే వుండాలి.

ఆరోగ్యం పాడయిన మనిషి కోసం జరిగే ఖర్చులన్నిటినీ చూసి, ఆరోగ్యంగా వున్న వాళ్ళు, "ఈ ఖర్చంతా మాకూ ఇవ్వాలి. దాన్ని మేము ఇంకో రకంగా వాడుకుంటాం" అని వాదించడానికి వీలు లేదు. ఇప్పుడు ఆరోగ్యంగా వున్న వాళ్ళకే రేపు ఆరోగ్యం పాడయితే, వీళ్ళ కోసం కూడా ఆ ఖర్చులన్నీ జరగవలసిందే కదా?

ఇక్కడ అన్నిటికీ సంబంధించిన హేతుబద్ధమైన సూత్రం ఏమిటంటే, శక్తి కొద్దీ పనీ, అవసరం కొద్దీ వాడకమూ! ఇది మానవ సంబంధాలకూ, మానవ సంస్కారాలకూ, మానవ చైతన్యానికీ, అత్యున్నత దశ! సమాజ బాధ్యతా, స్వయం శ్రమ శిక్షణా, చిత్త శుద్ధీ - వంటి ఉన్నత లక్షణాలన్నీ ప్రతీ మనిషి లోనూ సంపూర్ణంగా వికసించే దశ అది!

# 'విలువ' రద్దు; 'డబ్బు' రద్దు

**'వి**లువ' అన్నా, 'డబ్బు' అన్నా, ఒకటే.

'విలువ' అంటే, ఉత్పత్తి కోసం అవసరమయ్యే మొత్తం శ్రమ. రూపం లేని శ్రమ. అది, 'రూపం వున్న శ్రమ' కాదు.

'విలువని తీసివెయ్యడం' అంటే - కుట్టూ, నేతా లాంటి రూపం వున్న ప్రత్యేక (కాంక్రీట్) శ్రమల్ని తీసివెయ్యడం కాదు. ప్రత్యేక శ్రమలు లేకుండా ఏ సమాజమూ వుండదు.

విలువని తీసివెయ్యడం - అంటే, ఉత్పత్తికి అవసరమయ్యే మొత్తం శ్రమని లెక్క కట్టే విధానం లేకుండా ఉత్పత్తుల్ని వాడుకోవడం.

విలువ రద్దు - అంటే, మారకాల రద్దు. విలువని లెక్కకట్టే పని మారకాల కోసమే అవసరమవుతుంది కాబట్టి, మారకాలు లేకపోతే, విలువ లెక్కలతో ('మొత్తం శ్రమ' లెక్కలతో) అవసరం వుండదు.

విలువ లెక్కలు లేనప్పుడు, ఏ లెక్కలు వుంటాయి? ఉత్పత్తి క్రమాలూ, పంపిణీ క్రమాలూ, ఏ లెక్కల ఆధారంతో నడుస్తాయి?

'విలువ' లేనప్పుడు, 'ఉపయోగపు విలువ' మాత్రమే వుంటుంది. 'రూపం లేని శ్రమ' లేనప్పుడు, 'రూపం వున్న శ్రమ' మాత్రమే వుంటుంది.

విలువ రద్దు - అంటే, సమాజంలో ప్లానింగ్ అంతా, ఉపయోగపు విలువ లెక్కల తోటే జరగాలని అర్థం. ఒక శాఖ లోకి కావలసిన ఉత్పత్తి సాధనాల రకాలూ, వాటి పరిమాణాలూ; అక్కడ కావలసిన ఉత్పత్తిదారుల సంఖ్యా, వారి అవసరాలూ వంటి లెక్కలతో.

నూతన సమాజపు ప్రారంభంలో ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు హక్కుల్ని తీసి వేసినప్పుడు, డబ్బు చలామణీలో చాలా భాగం రద్దవుతుంది.

ప్రభుత్వ శాఖల్లోనూ, సమిష్టి శాఖల్లోనూ మారకాలన్నీ ఎకౌంట్లలో లెక్కల ద్వారానే సెటిలవుతూ వుంటాయి. కానీ, ఇది 'డబ్బుని తీసివెయ్యడం' కాదు.

విలువని తీసివెయ్యడం అంటే, శ్రమలు చెయ్యకుండా, మానడం కాదు. అందరూ సమాన శ్రమలు చెయ్యడం.

సమాన శ్రమలకు, సమాన విలువలు వుంటాయి.

సమాన విలువల్ని పోల్చినప్పుడు, అవి, లేనిదానితో సమానం అవుతుంది. అందరూ సమాన శ్రమలు చేస్తూ వుంటే, అందరూ ఉత్పత్తుల్ని సమానంగా వాడుకోవచ్చు. కొలతలతో సంబంధం లేకుండా.

అలాంటి పరిస్థితులు ఏర్పర్చుకున్నప్పుడు, వాటి లెక్కలు ఇక అనవసరం.

మనుషులు డబ్బుతో ఏం చేస్తూ వుంటారు? -

ఉత్పత్తుల్ని కొంటూ వుంటారు.

ప్రతీ రోజూ డబ్బుతో ఏ యే ఉత్పత్తులు కొంటామో, ఆ ఉత్పత్తులన్నిటినీ డబ్బు లేకుండానే వాడుకోగలిగితే, డబ్బు ఎందుకు?

సమాజానికి డబ్బు వ్యర్ధమైన ఖర్చు. అయినప్పటికీ, సమాజానికి దాని పాత్ర, కొంత కాలం పాటు చారిత్రకంగా అవసరమే అయింది. కానీ అది సహజ అవసరం కాదు. శాశ్విత అవసరం కాదు.

నూతన సమాజంలో ఇంకా 'డబ్బు' వుండడం ఎలాంటి పరిస్థితిని సూచిస్తుందంటే, ఇంకా డబ్బు లెక్కలు అవసరమవుతోన్న పరిస్థితిని! అంటే, సామాజిక సంబంధాలు ఇంకా 'అసమానంగా' వున్న పరిస్థితిని!

సంబంధాలు సమానంగా వుండడమే నిజమైతే, డబ్బు లెక్కలు అనవసరం. డబ్బు అనవసరం.

నూతన సమాజంలో, ఉత్పత్తిదారులు సమాన శ్రమలు చేసే పరిస్థితులు ప్రారంభమై, క్రమంగా అభివృద్ధి చెంది, అది జీవితాల్లో సహజమై, స్థిరపడిపోవాలి.

# 'రాజ్యాంగ యంత్రం' రద్దు! 'వర్గాలు' రద్దు!

'రాజ్యాంగ యంత్రం' అనేది ఏ అవసరం కోసం ప్రారంభమైంది? దోచే వర్గం, శ్రమ చేసే వర్గాన్ని అణచడం కోసం ప్రారంభమైంది. వర్గాల ప్రారంభమే, రాజ్యాంగ యంత్ర ప్రారంభం. కాబట్టి, వర్గాల అంతమే, రాజ్యాంగ యంత్ర అంతం!

'నూతన సమాజం' ప్రారంభమైనప్పుడు, కార్మిక వర్గ ప్రభుత్వం ప్రారంభమవుతుంది. ప్రభుత్వ అంగాలన్నీ దీనికి కూడా వుంటాయి. ఈ ప్రభుత్వం, 'కార్మిక వర్గ నియంతృత్వం'గా వుంటుంది. ఈ నియంతృత్వం, ఇంకో వర్గాన్ని దోపిడీ చెయ్యడం కోసం వుండే నియంతృత్వం కాదు. ఇది, దోపిడీ నించి తనని విముక్తి చేసుకోవడానికి అవసరమయ్యే నియంతృత్వం.

ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు హక్కుని తీసివెయ్యడానికీ, అప్పటి వరకూ దోపిడీ మీద జీవిస్తోన్న వర్గాన్ని శ్రమ లోకి దించడానికీ, కార్మిక వర్గం చట్టపరంగానూ, సామాజికం గానూ, ఈ నియంతృత్వాన్ని ఉపయోగిస్తుంది.

అంత కాలం వరకూ దోపిడీని మరిగి వున్న వర్గం, ఆస్తి హక్కుల్ని తప్పనిసరై వదిలినా, తప్పని సరై శ్రమ లోకి దిగినా, అది నూతన సమాజాన్ని మళ్ళీ వెనక్కి తిప్పడానికే కాచుకుని వుంటుంది. కార్మిక వర్గం, తన ఆత్మరక్షణ కోసం దోపిడీ వర్గం మీద, (అది శ్రమ లోకి దిగినప్పటికీ), కొన్ని ఆంక్షలు విధించవలసి వుంటుంది. ఉదా॥ 'పెట్టుబడిదారీ స్వంత ఆస్తి విధానాన్ని పునరుద్ధరించాలి' అని ఎవరైనా ఒక సంఘం పెట్టదలిస్తే, ఆ హక్కుని కార్మిక వర్గ ప్రభుత్వం అంగీకరించదు.

ఇలాంటి నిబంధనలన్నీ కలిసి కార్మిక వర్గ నియంతృత్వం గా వుంటుంది. ఇది, దోపిడీ నించి విముక్తి చెందే విప్లవ మార్గంగా వుంటుంది.

నూతన సమాజంలో మార్పులన్నీ, సరియైన విప్లవ చైతన్యంతో సాగుతూ వున్నప్పుడూ; గత కాలపు దోచే వర్గం కూడా శ్రమలో పాల్గొంటూ క్రమంగా శ్రమ చేసే కార్మిక స్వభావాన్ని పొందుతూ వున్నప్పుడూ; ఆ వర్గపు కుట్రలూ, మోసాలూ, విప్లవ వ్యతిరేక చర్యలూ, తగ్గిపోతూ వున్నప్పుడూ - కార్మిక వర్గ నియంతృత్వ ఆంక్షలు కూడా తగ్గిపోతూ వుంటాయి.

క్రమంగా వర్గాల తేడాలే అంతరించి పోతూ వున్నప్పుడు, ఒక వర్గానికి ఆత్మ రక్షణ చేసుకోవలసిన అవసరం కూడా అంతరించి పోతుంది. కోర్టులూ, జైళ్ళూ, పోలీసూ, సైన్యమూ, ప్రభుత్వమూ - క్రమ క్రమంగా అంతరించి పోతాయి, వాటితో అవసరం లేకుండా పోయినప్పుడు!

'రాజ్యాంగ యంత్రం' సహజంగా అంతరించి పోతుంది, దానితో అవసరం లేనప్పుడు.

'విలువ' లెక్కల అంతమే, 'వర్గాల' అంతం!

వర్గాల అంతమే, 'రాజ్యాంగ యంత్ర' అంతం!

ఇక్కడ చూసిన ఈ రద్దులే గాక, ఇంకా అనేక అభివృద్ధి వ్యతిరేక, విప్లవ వ్యతిరేక, సమానత్వ వ్యతిరేక, అంశాలన్నీ రద్దు అవవలసి వుంటుంది. అంటే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నిటి లోనూ

దోపిడీ లక్షణాలు రద్దు కావాలి. అంతరించి పోవాలి.

ఈ రద్దులన్నీ పరస్పర సంబంధాల తోటీ, పరస్పర ప్రభావాల తోటీ ముందుకు సాగుతూ వుంటాయి.

"ఈ రద్దులన్నీ నిజంగా సాధ్యమా?" అనే సందేహం అనవసరం. ఈ రద్దులన్నీ ఒక్క విషయం మీదే ఆధారపడి వుంటాయి. శ్రమ చెయ్యని దోపిడీ వర్గం కూడా శ్రమ చెయ్యడం ప్రారంభించి, దానినే కొనసాగించడం - అనే విషయం మీద. ఆ మార్పు సవ్యంగా జరుగుతూ వుంటే, మిగిలిన రద్దులన్నీ ఒక క్రమంలో జరిగి పోతాయి.

'ప్రారంభ దశ' సరైన మార్గంలో సాగుతూ వుంటే, అది అనేక ఉన్నత దశలకు దారి తీస్తుంది.

## వర్గాల రద్దు తర్వాత ఏమిటి?

'నూతన సమాజం'లో ఉత్పత్తి క్రమమూ, పంపిణీ, క్రమమూ (ఉత్పత్తి సంబంధాలూ, పంపిణీ సంబంధాలూ), 'సమానత్వ దశ'కి చేరాయి అను కుందాం. సమాజ స్వభావం వైరుధ్యాలు లేని విధంగా మారింది అనుకుందాం. ఇక తర్వాత ఏమిటి? ఇంకా తర్వాత ఏం మార్పులు జరగాలి? - ఇక, 'స్వభావం'లో ఏ మార్పులూ జరగనక్కర లేదు. 'సమానత్వం'లో మళ్ళీ మార్పు జరిగితే, అది మళ్ళీ 'అసమానత్వమే' అవుతుంది. కాబట్టి, 'సమానత్వం' ఏర్పడిన తర్వాత, ఇక ఆ 'స్వభావం' అలాగే నిలిచి వుండాలి. అదే కొన సాగుతూ వుండాలి.

'దీర్ఘ రోగి'కి సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధించింది అనుకుందాం. ఇక తర్వాత ఏమిటి? - ఆ ఆరోగ్యాన్ని నిలుపుకోవడమే! మళ్ళీ అనారోగ్య లక్షణాలు ప్రారంభం కాకుండా చూసుకోవడమే.

అలాగే, 'సమానత్వం' ఏర్పడిన సమాజంలో కూడా ఆ సమానత్వానికి ఆవరోధాలు ఏర్పడకుండా చూసుకోవాలి. అప్పుడు అదే 'సామాజిక బాధ్యత' అవు తుంది. వర్గాలూ, వైరుధ్యాలూ, భిన్న ప్రయోజనాలూ అంతరించిన సమాజంలో, మళ్ళీ అసమానత్వ లక్ష ణాలు ఎందుకు ప్రారంభమవుతాయి? - అనే ప్రశ్న వస్తే, దానికి జవాబు - ప్రారంభం కాకపోతే మంచిదే. 'ప్రారంభం కాకూడద'నే అందరూ ఆశించాలి. కానీ, 'నూతన శ్రమ విభజన' అమలు జరగడంలో ఏ మాత్రం వైరుధ్యం ప్రారంభమైనా, అది తప్పని సరిగా కొంత అసమానత్వానికి దారి తీస్తుంది. దాన్ని మళ్ళీ సరిదిద్దుకోవలసి వస్తూ వుంటుంది. 'సమానత్వం'లో ఏ అంశంలో వైరుధ్యం ప్రారంభమైనా, దాన్ని గ్రహించి తక్షణం దాన్ని నిర్మూలించుకోవలసి వుంటుంది. ఇది కూడా ఒక రకపు వర్గ పోరాటమే. ఇది (ఆ దశలో వర్గ పోరాటం) కొన్ని సందర్భాల్లో పూర్తిగా అనవసరం కావచ్చు. కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా అవసరం కావచ్చు.

ఉన్నత స్థాయి గల సమాజాన్నే తీసుకుంటే, అప్పుడు కూడా సమాజం గడ్డ కట్టి వుండదు. మారు తూనే వుంటుంది. అయితే, ఆ మార్పు సమాజ 'స్వభా వాన్ని' మార్చేదిగా వుండదు. 'రూపాన్నే' కొంత మారుస్తూ వుంటుంది.

ఒకే స్వభావం (అది మంచిదైనా, చెడ్డదైనా) వేరు వేరు రూపాల్లో వుండగలదు. అయితే, చెడ్డదాని రూపాలూ, మంచిదాని రూపాలూ ఒకే రకం కావు.

నూతన సమాజాన్ని, దాని ప్రారంభ దశ నించీ పూర్తి సమానత్వం ఏర్పడే ఉన్నత దశ వరకూ తీసు కుంటే, అందులో, 'విలువ రద్దు' అయ్యే దశ వరకూ వుండేది - **'సోషలిస్టు సమాజం'.** ఇది 'పరివర్తనా దశ'.

'విలువ రద్దు' తర్వాత నించీ కొనసాగేది - **'కమ్యూనిస్టు సమాజం'!** ఇది 'పరివర్తన' ముగిసిన తర్వాత దశ! వర్గ రహిత దశ! అత్యున్నత దశ!

కానీ నూతన సమాజాన్ని ప్రారంభం నించే 'సోష లిస్టు సమాజం' అనీ, 'కమ్యూనిస్టు సమాజం' అనీ కూడా అంటూనే వుంటాము. ఎందుకంటే, సోషలిస్టు సమాజాని కైనా, కమ్యూనిస్టు సమాజాని కైనా, ప్రారంభం ఒకటే కాబట్టి.

'సోషలిస్టు సమాజం'లో సోషలిస్టు అర్థిక శాస్త్రమూ, 'కమ్యూనిస్టు సమాజం'లో కమ్యూనిస్టు ఆర్థిక శాస్త్రమూ, వుంటాయి.

'ఆర్థిక శాస్త్రం' అంటే డబ్బు వున్నప్పుడు మాత్రమే వుండే శాస్త్రం కాదు. డబ్బు వున్నప్పుడూ లేనప్పుడూ కూడా ఉత్పత్తీ - పంపిణీ క్రమాలు వుంటాయి. ఆ క్రమాల్ని వివరించే శాస్త్రమే, ఆర్థిక శాస్త్రం. కాబట్టి డబ్బు లెక్కలు లేనప్పుడు కూడా ఆర్థిక శాస్త్రం వుంటుంది.

'సోషలిస్టు ఆర్థిక శాస్త్రం', ఇంకా డబ్బు లెక్కల తోటే వుంటుంది. 'కమ్యూనిస్టు ఆర్థిక శాస్త్రం', ఉత్పత్తీ పంపిణీ క్రమాల్ని నిర్వహిస్తుంది. ఆ నాటికి, ఆ రకమైన ఆర్థిక శాస్త్ర జ్ఞానమూ, దాని సూత్రాలూ అభి వృద్ధి అవుతాయి.

ఇంతవరకూ చూసిన ఈ పరిణామ క్రమాన్నంతా సుదీర్ఘమైన మార్గంగా ఒక చిత్రం గీస్తే, ఆ మార్గంలో ఇప్పుడు మనం ఎక్కడ వున్నామంటే, ఇంకా 'పెట్టుబడిదారీ సమాజం' లోనే వున్నాం.

ఈ సమాజాన్ని, కార్మిక వర్గం మారిస్తేనే మారు తుంది. మార్చకపోతే, ఈ సమాజమే వుండి పోతుంది. ఇలాగే ఈ దోపిడీ సంబంధాల తోనే, ఈ దోపిడీ సంస్కృతి తోనే.

సమాజాన్ని మార్చేటప్పుడు, మొత్తం 10 అంశాల్ని మార్చాలను కుందాం. అందులో 2 అంశాల్ని మాత్రమే కొంత మార్చి, మిగిలిన వాటిని మార్చక పోతే, ఆ మిగిలినవి పాతవే వుండి పోతాయి. మార్పు ప్రారంభ మైన 2 అంశాలు కూడా మళ్ళీ వెనక్కి వస్తాయి. అన్నీ కలిసి, పాత సమాజంలో లాగే ఎప్పటి లాగే వుంటాయి.

ఇప్పటి వరకూ నూతన సమాజాన్ని, సిద్ధాంత స్థాయిలో చూశాము. కేవలం 'సిద్ధాంత స్థాయి'లో! దీన్ని 'ఆచరణ' లోకి తేవాలి! 'వాస్తవం' లోకి తేవాలి! దాని కోసం ఏం జరగాలి? - సుదీర్ఘమైన వర్గ పోరాటం జరగాలి! శ్రామిక వర్గం, దోపిడీ వర్గంతో చేసే పోరాటం. ఆ పోరాటమంతా జరిగి దోపిడీ సంబం ధాలు అంతరిస్తేనే అది నూతన సమాజం అవుతుంది. ఉత్పత్తి సాధనల మీద ప్రైవేటు హక్కుని తీసి వేసినట్టు చట్టాలు చెయ్యగానే అది నూతన సమాజం కాదు.

ప్రైవేటు హక్కులు లేని భూముల మీదా, ఫ్యాక్ట రీల మీదా, వాటి పాత యజమానులే, రూపాలు మారి, కొత్త అధికారులుగా తయారైతే? శ్రమ దోపిడీని తీసివెయ్యడానికి అత్యవసరమైన, 'అందరూ శ్రమ చెయ్యాలి' - అనే ప్రధాన సూత్రాన్ని కొందరు పాటించ కుండా వుంటే? నూతన సమాజంలో కూడా 'సమాజ నిధి భాగం' ఒకటి వుంటుంది కాబట్టి దాన్ని సమాజ అవసరాలకు సరైన విధంగా ఖర్చు పెట్టకుండా, అందులో కొంత భాగాన్ని తమ స్వంతానికి స్వాహా చేసే కొత్త దోపిడీ వర్గం తయారైతే? అది జరగడానికి సాధ్యం కాని పద్ధతుల్ని అభివృద్ధి పరుచుకోకపోతే? 'కార్మిక వర్గ ప్రభుత్వం' లోనూ, 'కార్మిక వర్గ పార్టీ' లోనూ కార్మికుల పాత్రే లేకపోతే? నూతన సమాజం కూడా, పెట్టుబడిదారీ దేశాలతో పోటీ పడుతూ, 'లాభం రేటు' పద్ధతుల్లోనే ఆర్థిక విషయాల్ని నడు పుతూ వుంటే? నూతన సమాజం కూడా గుర్ర ప్పందాలూ, ఆటల పోటీలూ వంటి బూర్జువా వ్యాపార సంస్కృతినే పాటిస్తూ వుంటే? - ఈ రకంగా, ప్రతీ దశ లోనూ పాత సమాజమే, దోపిడీ సంబంధాలే, ప్రత్యక్ష మవడానికి అవకాశాలు వున్నాయి.

ఉత్పత్తి సంబంధాలూ, పంపిణీ సంబంధాలూ చారిత్రకమైనవి. వాటికి ఆయా చారిత్రక దశల్ని బట్టి స్వభావాలు మారకుండానే రూపాలు మారడం సాధ్యమే, ఈ సంగతి గతం లోనే చూశాం. అలాగే నూతన సమాజంలో కూడా ఆ సంబంధాల స్వభావం మారకుండానే ఇంకో రూపం లోకి మారవచ్చు. అంటే, పైకి 'నూతన సమాజం' పేరుతో వుంటూ, అక్కడ కూడా అనేక తప్పులు జరగవచ్చు. దోపిడీకే అను కూలంగా జరగవచ్చు. అ ప్రమాదం ప్రతీ మార్పు లోనూ వుంది.

"నూతన సమాజంలో ఇలా వుంటుంది, అలా వుంటుంది. అక్కడ ఈ మార్పు జరుగుతుంది, ఆ మార్పు జరుగుతుంది" అంటున్నామంటే, ఆ మార్పు లన్నీ వాటికి అవే, రాత్రి తర్వాత పగలు వచ్చినట్టుగా, ఎవరి ప్రయత్నమూ లేకుండా, జరిగిపోతూ వుంటా యని అర్థం కాదు. తగిన వర్గ పోరాటం జరిగితేనే ఆ మార్పులు జరుగుతాయి.

మనుషులందరూ సమాన శ్రమ సంబంధాలతో (సమాన హక్కుల తోటీ, సమాన బాధ్యతల తోటీ) జీవించగల పరిస్థితుల్ని ఏర్పర్చుకుంటే, అది 'సమ సమాజం'.

సమ సమాజం అనేది మంచి వాళ్ళు తమ స్వంత కలలతో, ఆదర్శాల కోసం ఊహించే ఊహ కాదు. అది, విముక్తి కోసం చేసే వర్గ పోరాటాల ఫలితం. పోరాటం అనేది సరైన దృష్టితో సాగుతూ వుంటే,

సమాన శ్రమ సంబంధాలు ఏర్పడి తీరతాయి. వర్గ పోరాటానికి గమ్యం అదే.

అయితే ఆ పోరాటం ఒక దశలో బలహీనపడిం దంటే, అప్పటి వరకూ జరిగిన మార్పులన్నీ బలహీన పడి పోతాయి. పోరాటం ఆగిపోతే మార్పులు కూడా ఆగిపోతాయి. అలా ఆగిపోయిన మార్పులు, కనీసం ఆగిన చోటే వుండవు. వాటిని ఇంకా వెనక్కి లాగటానికి దోపిడీ వర్గం కాచుకుని వుంటుంది. ఆగిన మార్పులు, ఆ దశ నించి ఇంకా వెనక్కి కూడా ప్రయాణం చేస్తాయి. ఎంత వెనక్కి అంటే, వెనక్కి పోవడానికి వ్యతిరేకంగా పోరాటమే లేకపోతే, మళ్ళీ 'బానిస సమాజం' దాకా కూడా! సమాజాన్ని అంత వెనక్కి లాగడానికి దోపిడీ వర్గానికి ఏమీ సంకోచం వుండదు.

నూతన సమాజ నిర్మాతలకు - పోరాట మార్గం పొడుగునా, దోపిడీ వ్యతిరేకతా, ఉపయోగపు విలువ దృష్టీ, సమానత్వ దృష్టీ - అనే సూత్రాలే మార్గదర్శ కాలు! అంటే, 'మార్క్సిజమే' మార్గదర్శక సూత్రం!

## నిజంగా సాధ్యమా!

ఇప్పుడు మనం, మళ్ళీ మళ్ళీ కొత్తగా తలెత్తే పాత సందేహం నించీ ఇంకోసారి బయట పడాలి. మళ్ళీ మళ్ళీ తలెత్తే ఆ పాత సందేహం ఏమిటంటే - డబ్బు లెక్కలు లేని, కేవలం ఉపయోగపు విలువ దృష్టి మాత్రమే కలిగిన, కమ్యూనిస్టు సమాజం నిజంగా సాధ్యమా- అని! అంత సమానత్వం నిజంగా సాధ్యమా - అని!

ఈ సందేహం మళ్ళీ మళ్ళీ ఎందుకు తలెత్తుతుం దంటే, ఆ సమాజాన్ని మనం ఏ మాత్రమూ చూడలేదు గనక. 'సిద్ధాంతం గా' అది ఎంత కరెక్టుగా వున్నా, 'ఆచ రణలో' కూడా అది నిజం అయ్యే వరకూ "ఇది సాధ్యమా?" అనే ప్రశ్న మళ్ళీ మళ్ళీ తలెత్తుతూనే వుంటుంది. ఈ ప్రశ్నకి జవాబుని చారిత్రక జ్ఞానం మాత్రమే ఇవ్వగలుగుతుంది.

'బానిస సమాజం'లో బానిసలు గానీ, యజ మానులు గానీ, "భవిష్యత్తులో బానిసత్వం పోతుంది" అంటే నమ్మగలిగే వారేనా? బానిసలు కొంత కాలానికి కార్మికులుగా మారతారనీ, జీతాలు ఇస్తేనే పని చేస్తా రనీ, 'టైము' ప్రకారం మాత్రమే పని చేస్తారనీ, తమ డిమాండ్ల కోసం పని ఆపేసి సమ్మెలు చేస్తారనీ, ఇదంతా ఆ నాడు ఎవరైనా నమ్మగలిగే వారేనా?

అలాగే, ఒకప్పుడు సింహాసనాల మీద కిరీటాలు ధరించి కూర్చున్న చక్రవర్తులూ, వారిని సేవించే శ్రామిక ప్రజలూ, "కొంత కాలానికి వారసత్వపు రాజ్యాధికార హక్కు పోతుంది" అంటే, నమ్మగలిగే వారేనా? ఆ పాలకులు, సింహాసనాలు దిగి 'ఓట్ల' కోసం ప్రజల ముందు నిలబడతారనీ, ప్రజలు ఎన్ను కుంటేనే వారు పాలకులు కాగలుగుతారనీ, ఆ నాడు ఎవరైనా నమ్మగలిగే వారేనా? ఆ నాడు అదంతా నమ్మశక్యం కానిదే.

అలాగే, ఈ నాడు మనకు కూడా భవిష్యత్ మార్పులు నమ్మశక్యం కానివి గానూ, 'ఊహాలోకం' గానూ, కనపడతాయి.

కానీ 'విలువ' అనేది ఊహ కాదు. అందులో, 'అదనపు విలువ' అనేది ఊహ కాదు. 'శ్రమ దోపిడీ' అనేది ఊహ కాదు. అవన్నీ వాస్తవాలే!

కాబట్టి, శ్రామిక వర్గం కళ్ళు తెరవడం కూడా ఊహ కాదు! 'దోపిడీ'యే నిజమైతే, దాని మీద పోరాటం కూడా నిజమే!

భవిష్యత్తుకి మనం ఎంత వరకూ బాధ్యుల మంటే, మన జీవిత కాలంలో మన బాధ్యతలు మనం నిర్వహించడం వరకూ మాత్రమే. తర్వాత బాధ్యతలు తర్వాత వాళ్ళవి. మన బాధ్యతల్ని మనం నిర్వహిస్తే, వాళ్ళ బాధ్యతల్ని వాళ్ళూ నిర్వహిస్తారు. మనం ఎంత సవ్యమైన మార్గం ప్రారంభిస్తే, తర్వాత వాళ్ళు దాన్ని అంత సవ్యంగా కొనసాగిస్తారు. దీని అర్థం - భవిష్యత్ విషయం, ప్రస్తుతం వాళ్ళకు అనవసరం - అని కాదు. అలా భావించడం, భవిష్యత్ గురించిన ఆలోచననే మూసి వేస్తుంది.

మనం సరైన మార్గాన్ని ప్రారంభిస్తేనే, భవిష్యత్ ప్రజలు దాన్ని కొనసాగిస్తారు. భవిష్యత్తులో జరగవల సిన సరైన మార్పులనే లక్ష్యంగా పెట్టుకుని మన బాధ్యతలు మనం నిర్వహించాలి. అదే భవిష్యత్తుకి దారితీస్తుంది. ఒకప్పటి బానిస సమాజం దగ్గిర ప్రారంభమైన ఈ మార్గం, రేపటి కమ్యూనిస్టు సమాజం దగ్గిర ముగుస్తుంది. ★

# 3. నూతన సమాజపు ధర

నూతన సమాజపు సమస్యల్లో, ధరల నిర్ణయం ఒక ప్రధానమైన సమస్య. లేదా చర్చనీయాంశం.

ఈ విషయం గురించి, వెనకటి భాగాల్లో కనీసం 2 చోట్ల చూశాం. (1) మొదటి సంపుటంలో, 'పని దినం' చాప్టరులో, 'నూతన సమాజంలో పని దినం 2 భాగాలుగా వుంటుందా?' అనే చోట కొన్ని వివరాలూ, (2) మొదటి సంపుటం లోనే, 'పెట్టుబడి - విస్తరణ' చాప్టరులో, 'నూతన సమాజంలో పునరుత్పత్తి' అనే చోట కొన్ని వివరాలూ - చూశాం. ఇప్పుడు ఈ రెండో సంపుటంలో, ఇంకా కొన్ని వివరాలు చూస్తున్నాం. ఈ వివరాలన్నిటినీ కలిపి ఈ 'ధర' విషయం అర్థం చేసుకోవాలి.

'నూతన సమాజపు ధర' గురించి మార్క్సు ప్రత్యేకంగా ఎక్కువ వివరాలతో చర్చించలేదు. కానీ 'నూతన సమాజంలో కూడా పని దినం 2 భాగాలుగా వుండడం' గురించీ, 'నూతన సమాజపు ప్లానింగు' గురించీ, ఇంకా 'నూతన శ్రమ విభజన' - వంటి విషయాల' గురించీ, 'కాపిటల్'లో అక్కడక్కడా క్లుప్తంగా ప్రస్తావించాడు. నూతన సమాజపు పని దినంలో 2 వ భాగాన్ని 'ఉమ్మడి అవసరాల కోసం' అనీ, 'ఉమ్మడి నిధి' అనీ, అన్నాడు. కామన్ నీడ్స్, కామన్ ఫండ్స్, సోషల్ కంజప్షన్ ఫండ్ - అనే మాటలతో.

"పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని తీసివెయ్యడం ద్వారా మాత్రమే పని దినం పొడవుని అవసర శ్రమ కాలానికి తగ్గించగలం. అయితే, ఆ సందర్భంలో కూడా, ఆ అవసర శ్రమ కాలం, గతంలో కన్నా తన పరిధిని విస్తరిస్తుంది. ఎందుకంటే, శ్రమ చేసే మనిషి, గతంలో కన్నా భిన్నమైన జీవన ప్రమాణాన్ని కోరతాడు కాబట్టీ; అంతేగాక, ఇప్పుడు అదనపు శ్రమగా వుండే రెండో భాగం కూడా అప్పుడు అవసర శ్రమగానే అవుతుంది కాబట్టీనూ. ఈ రెండో భాగం గురించి నా ఉద్దేశం, 'రిజర్వ్‌కూ, ఎక్యూమ్‌లేషన్‌కూ నిధిగా వుండే శ్రమ' అని!" [కాపిటల్-1, పేజీ 496.]

మార్క్సు వివరణలో, "పని దినం పొడవుని అవసర కాలానికి తగ్గించగలం" అనే మాటలకు అర్థం: పని దినంలో, దోపిడీదారుల కోసం వదలవలసిన S భాగం లేకపోతే, ఉత్పత్తిదారులకు అవసరమయ్యే కాలమే పని దినం అవుతుంది. అయితే ఆ అవసర కాలం (V అనేది) పెట్టుబడిదారీ విధానంలో లాగ మరీ చిన్నదిగా వుండదు. అది "గతంలో కన్నా తన పరిధిని విస్తరిస్తుంది. శ్రమ చేసే మనిషి, గతంలో కన్నా భిన్నమైన జీవన ప్రమాణాన్ని కోరతాడు." ఇవి మార్క్సు మాటలే. నూతన సమాజపు V, పెట్టుబడిదారీ V కన్నా ఎక్కువ కాలానికి విస్తరిస్తుంది. పెట్టుబడిదారీ S భాగంగా వుండే దాన్ని కూడా, ఉత్పత్తిదారులే వాడుకుంటే, మొత్తం పని దినం అంతా అవసర కాలమే.

ఆ అవసర కాలమే 2 భాగాలుగా వుంటుంది. అందులో రెండో భాగం గురించి మార్క్సు, "ఈ రెండో భాగం గురించి నా ఉద్దేశం, రిజర్వ్‌కూ, ఎక్యూములేషన్‌కూ నిధిగా వుండే శ్రమ - అని" అంటున్నాడు. అంటే, అది కూడా ఆ ఉత్పత్తిదారుల అవసరాల కోసమే - అని. - ఈ రకంగా, నూతన సమాజపు పని దినం గురించి మార్క్సు, అక్కడక్కడా చాలా క్లుప్తంగా మాత్రమే ప్రస్తావించిన వివరాల్ని ఆధారం చేసుకుని, మనం, 'నూతన సమాజపు ధర' గురించి వీలైనన్ని విషయాలు అర్థం చేసుకోవాలి.

'నూతన సమాజం' అన్నప్పుడు, తప్పనిసరిగా కొన్ని షరతులు పెట్టుకుంటాం.

(1) అందరూ శ్రమ చేస్తున్నారు. (2) భూములూ, ఫ్యాక్టరీలూ - వంటి ఉత్పత్తి సాధనాల మీద చాలా వరకూ సమష్టి యాజమాన్యమే వుంది. (3) ఉత్పత్తి శాఖల మధ్య పోటీ లేదు. (4) ఉత్పత్తుల సప్లయ్ డిమాండ్ల మధ్య తేడాలు లేని విధంగా సమాజానికి 'సరియైన ప్లాను' వుంది. (5) డబ్బు రాసి విషయంలో కూడా సరియైన ప్లాను వుంది - ఇలా.

అందరూ శ్రమ చెయ్యడం మాత్రమే గాక, 'దోపిడీ శ్రమ విభజన' మారడం కూడా జరిగితేనే అది నిజమైన నూతన సమాజం. అయితే, ఈ మార్పులన్నీ ఒక నెల లోనో, ఒక సంవత్సరం లోనో పూర్తి అయ్యేవి కావు. ఈ మార్పులు జరిగే కాలాన్ని 'పరివర్తనా దశ' అందాం.

ఈ దశలో ప్రతీ మార్పూ, దోపిడీ సమాజాల దృక్ప థంతో గాక, సమానత్వ సంబంధాలను నిర్మించే దృక్ప థంతో సాగవలసి వుంటుంది.

ఈ మార్పులన్నీ ప్రారంభం నించీ కూడా సరి యైన నూతన స్వభావం తోటే సాగుతున్నాయి - అను కుందాం. ఈ సమాజంలో కూడా, ఉత్పత్తులకు ధరల్ని నిర్ణయించడమూ, అమ్మడమూ జరుగుతున్న కాలాన్నే దృష్టిలో పెట్టుకుందాం.

ఇక్కడ శ్రమ చేసే మనుషుల్ని 'శ్రామికులు' అని గానీ, 'కార్మికులు' అని గానీ, అనకుండా, 'ఉత్పత్తి దారులు' అందాం. సమాజంలో వున్న జనాభా అంతా ఉత్పత్తిదారులే.

ఏ సమాజంలో అయినా, ఉత్పత్తి విలువ, ఆ ఉత్పత్తి కోసం అవసరమయ్యే 'మొత్తం శ్రమే'. ఆ మొత్తం శ్రమని ఇచ్చే అంశాలు రెండే. (1) ఉత్పత్తి సాధనలూ, (2) ఉత్పత్తిదారుల సజీవ శ్రమా. - పెట్టు బడిదారీ విధానంలో అయినా అంతే. నూతన విధా నంలో అయినా అంతే.

'మొత్తం శ్రమని' లెక్క కట్టాలంటే, ఆ 2 అంశాల్నీ కలపడం కన్నా వేరే మార్గం వుండదు. 'ఉత్పత్తి సాధనాల' లెక్కలు (C లెక్కలు) ఏ సమాజంలో అయినా ఒక్కలాగే వుంటాయి. అందులో, శ్రమ పరిక రాలూ ముడి పదార్థాలూ ఆగ్జిలరీ పదార్థాలూ అన్నీ కలిసి వుంటాయి. ఆ ఖర్చులు స్పష్టంగా తెలుస్తూనే వుంటాయి.

'సజీవ శ్రమ' (L) గురించి తెలుసుకోవడమే అసలైన విలువ రహస్యం.

తయారైన ఉత్పత్తికి 'ధర'ని నిర్ణయించేటప్పుడు, పెట్టుబడిదారీ పద్ధతిలో అయితే - 'ఖర్చుల' మీద 'లాభం' కలిపితే, అదే - ధర. కానీ, నూతన సమాజపు ధరలో, 'లాభాన్ని' కలిపే పద్ధతి వుండదు కాబట్టి, ఖర్చులే - ధర. ఆ ఖర్చుల్లోనే 'సమాజ నిధి' భాగం కూడా వుంటుంది. లేదా, ఆ సమాజ నిధి కోసం కొంత 'అదనపు శ్రమ' కూడా అవసరమైతే అలాంటి సంద ర్భాల్లో, ఉత్పత్తి క్రమంలో 'అదనపు శ్రమ' కూడా జరుగుతుంది. దాని వల్ల, ఉత్పత్తి సాధనాలు కూడా కొంత ఎక్కువగా ఖర్చవుతాయి. అదంతా మొదటే ప్లానింగ్‌లో వుంటుంది. అలాంటి సందర్భంలో, ఆ ఖర్చుల మీద 'అదనపు శ్రమ' భాగం కూడా చేరు తుంది. కానీ అది 'లాభం' కాదు. అది కూడా తర్వాత ఉత్పత్తిదారుల అవసరాలకే ఖర్చవుతుంది కాబట్టి.

శ్రమ చెయ్యని వర్గానికి పోయినప్పుడే అది - లాభం. (S నే లాభం అంటున్నాం.) ఎవరి శ్రమ వారికే అందితే, అది - లాభం కాదు.

పెట్టుబడిదారీ పని దినం, (1) జీతమూ, (2) అద నపు విలువా - (V + S) భాగాలుగా వుంటే; నూతన సమాజపు పని దినం - (1) జీతమూ, (2) సమాజ నిధీ - (V + Sf ) భాగాలుగా వుంటుంది. అంటే ఏ సమాజంలో అయినా, పని దినం, 2 భాగాలుగా వుండ వలసిందే. ఆ భాగాల స్వభావాలు ఎలా వున్నాయి అనేదే అసలు విషయం.

'జీతం' విషయం చూస్తే - పెట్టుబడిదారీ జీతం కార్మికుల్ని బికారితనంలో వుంచితే, నూతన సమాజపు జీతం ఉత్పత్తిదారుల్ని, అలాంటి స్థితిలో ఉంచదు. నూతన సమాజంలో, 'శ్రమ విలువ'లో ఎక్కువ భాగం జీతం గానే వుండి, మిగిలినదే 'సమాజ నిధి'గా వెళ్తుంది.

'రెండో భాగాన్ని' చూస్తే - ఇది పెట్టుబడిదారీ సమాజంలో ' కౌలూ - వడ్డీ - లాభాల రాసి'గా వుంటూ శ్రమ చెయ్యని వర్గానికి పోతే, నూతన సమాజంలో ఇది 'సమాజ నిధి'గా వుంటూ, ఇది కూడా శ్రమ చేసే మనిషికే, వేరే అవసరాల కోసం, ఖర్చవుతుంది.

దోపిడీ సమాజంలో అయితే, తమ శ్రమలో కొంత భాగాన్ని 'సమాజ నిధి'గా వదలవలసిన అవసరం శ్రామిక వర్గానికి వుండదు. ఎందుకంటే, ఆ నిధి, ఖర్చయ్యేది శ్రామిక వర్గం కోసం కాదు కాబట్టి. తమ శ్రమని తమ కోసం గాక, ఇంకో వర్గం కోసం వదలవలసిన అవసరం శ్రామిక వర్గానికి వుండదు. కాబట్టి, దోపిడీ సమాజాల్లో 'అదనపు విలువ'గా వుండే భాగమూ, నూతన సమాజంలో 'సమాజ నిధి'గా వుండే భాగమూ, ఒకే స్వభావంతో వుండవు. ఒకే పరి మాణంతో కూడా వుండవు.

ఏ సమాజంలో అయినా, ఒక సరుకు ధరని లెక్క కట్టేటప్పుడు, ఆ సరుకుకి అప్పటి వరకూ వుంటూ వున్న పాత ధరతో సంబంధం లేకుండా ధరని సరి కొత్తగా లెక్క కట్టడం జరగదు. అప్పటి వరకూ అమ లులో వున్న పాత ధర మీదే ఆధారపడుతూ, కొత్త ఖర్చుల్లో మార్పుల్ని బట్టి, కొత్త ధరని లెక్క కట్టడం జరుగుతుంది. నూతన సమాజంలో అయినా అలాగే.

నూతన సమాజపు ధర - అన్నప్పుడు, అందులో పెట్టుబడి ధరలో వుండే అంశాలు గానీ, వాటి పేర్లు గానీ, యథాతథంగా వుండవు. నూతన ధరలో 'సోషల్

ఫండ్' అనే కొత్త మాట ప్రారంభమవుతుందని గతం లోనే చూశాం. ఈ 'సోషల్ ఫండ్'లో, కొన్ని సార్లు 'అదనపు శ్రమ' వుండవచ్చు; కొన్నిసార్లు లేకపోవచ్చు.

'అదనపు శ్రమ' లేకపోతే, ఖర్చులే - ధర.

అది, C + V + $Sf^1$.

'అదనపు శ్రమ' వుంటే, మొదటి ఖర్చుల మీద $Sf^2$ కూడా కలిసి, అది, C + V + $Sf^1$ + $Sf^2$.

'ఖర్చులు' అన్నప్పుడు, పెట్టుబడిదారీ విధానంలో, 'కౌలు'నీ, 'వడ్డీ'నీ, 'పన్నుల్నీ' అన్నిటినీ అందులోకే చేరుస్తారు. ఆ దృష్టిలో, అవన్నీ సరుకు కోసం తప్పనిసరయ్యే ఖర్చులే. కానీ నూతన విధానంలో, 'కౌలూ - వడ్డీ - లాభం' వుండవు. 'పన్నులు' అనేవి, 'సోషల్ ఫండ్' భాగంలో వుంటాయి. ఉత్పత్తిదారులు, తమ సమాజాన్ని నడుపుకోవడానికి, ఆ భాగం కూడా అవసరమే.

నూతన సమాజంలో, ఉత్పత్తి సాధనాల ఖర్చులూ, జీతాల ఖర్చులూ మాత్రమే గాక, 'సోషల్ ఫండ్'తో నిర్వహించే ఖర్చులు కూడా తెలుస్తూనే వుంటాయి. కాబట్టి, ఇక్కడ ధరని నిర్ణయించడానికి, సమాజపు ఖర్చుల్ని కూడా లెక్క కట్టవలసి వుంటుంది.

నూతన సమాజపు పని దినంలో, అదనపు శ్రమ కూడా జరిగి వుంటే, దాన్ని ఎలా తెలుసుకోగలమంటే, అప్పటికే అమలులో వున్న సింపుల్ ఉత్పత్తి ఖర్చులూ, జీతాలూ, పని దినం పొడవూ - వంటి విషయాల ద్వారా తెలుసుకోగలం.

ఇప్పుడు పెట్టుబడిదారీ ధరనీ, నూతన సమాజపు ధరనీ క్లుప్తంగా చూద్దాం. 2 చోట్లా, మొత్తం ఒక సంవత్సరపు ఉత్పత్తుల రాసిని తీసుకుంటాము. విలువా - ఉత్పత్తి ధరా - మార్కెట్ ధరా అనే తేడాల్ని వదిలేసి, విలువా - ధరా ఒకటే అనుకుంటాము. అలాగే, ఉత్పత్తి శక్తుల్నీ, పని దినం పొడవునీ కూడా ఒకే రకంగా అనుకుంటాము. అవి తేడాగా వుంటే, ఆ తేడాల్ని బట్టి, చివరి ఫలితాలు తేడా గానే వుంటాయి. ఆ సంగతి ప్రత్యేకంగా చెప్పుకోనక్కర లేదు.

2 చోట్లా 'ఉత్పత్తి సాధనాల' సంగతి (C సంగతి) అనవసరం. ఆ ఖర్చు ద్వారా, అది ఎంత వుంటుందో అంత విలువే ఉత్పత్తికి చేరుతుంది. అది ఎక్కువో, తక్కువో అవదు. ఈ విషయం ఏ సమాజంలో అయినా ఒకటే. కాబట్టి, దాన్ని లెక్కలోకి తీసుకోనక్కర లేదు. 'సజీవ శ్రమ' విషయమే, అది ఏ సమాజంలో ఎలా వుంటుందో చూడాలి. 2 చోట్లా పని దినం పొడవు ఒకటే అనుకుందాం. అది 8 గం. లే.

### పెట్టుబడిదారీ విధానంలో:

'సజీవ శ్రమ' లో భాగాలు ఇలా వున్నాయి.

| జీతం | + | అదనపు విలువ | | |
|---|---|---|---|---|
| V | + | S | | |
| 10 | + | 10 | = | 20 |
| (4 గం.లు | + | 4 గం.లు | = | 8 గం.) |

8 గం. ల శ్రమ విలువ 20.

1 గంట శ్రమ విలువ 2

ఈ విధానంలో, 'విస్తృత' పునరుత్పత్తి లోనూ, 'సింపుల్' పునరుత్పత్తి లోనూ కూడా S భాగం వుంటుంది.

నూతన సమాజంలో కూడా పని దినాన్ని 8 గం. లు గానే అనుకుంటాం కాబట్టి, 8 గం. ల కాలం విలువ ఇక్కడ కూడా గతంలో లాగే వుంటుంది. కానీ, ఇక్కడ దాని భాగాల సైజులు మారతాయి.

### నూతన సింపుల్ పునరుత్పత్తి లో:

| జీతం | + | సోషల్ ఫండ్ | | |
|---|---|---|---|---|
| V | + | $Sf^1$ | | |
| 15 | + | 5 | = | 20 |
| ( 6 గం. | + | 2 గం. | = | 8 గం.) |

ఇక్కడ కూడా 1 గంట శ్రమ విలువ 2½.

ఈ సింపుల్ పునరుత్పత్తిలో, ఉత్పత్తిదారులు, తమ కోసం ఇంటా బయటా కలిసి ఖర్చు చేసింది, 15 + 5 = 20. మళ్ళీ ఉత్పత్తి చేసింది కూడా 20 నే. ఖర్చయిన విలువని పునరుత్పత్తి చెయ్యడానికి ఎంత శ్రమ అవసరమో అంత శ్రమే జరిగింది. ఇక్కడ అదనపు శ్రమ లేదు. ఇక్కడ ఖర్చులే - ధర. కాస్ట్ ప్రైసే - ధర. ఆ 8 గం. ల శ్రమే 2 భాగాలుగా చీలుతుంది.

V భాగం వ్యక్తి చేతికీ, $Sf^1$ భాగం ప్రభుత్వాధీనం లోకీ వెళ్తాయి. ఈ రెండో భాగం కూడా ఆ వ్యక్తి అవసరాల కోసమే తర్వాత ఖర్చవుతుంది.

ఇక్కడ 'జీతం' అనేది స్పష్టంగా తెలుస్తూ వున్నట్టే, రెండో భాగం కూడా తెలుస్తూ వుంటుంది.

సమాజ అవసరాల కోసం, మొత్తం ఎంత సోషల్ ఫండ్ అవసరమవుతుందో, దాన్ని జనాభా అందరూ ఇవ్వాలి. అందులో ఒక్కొక్క చిన్న భాగాన్ని ప్రతీ వ్యక్తి ఇవ్వాలి.

V, sf - రెండూ కలిసి 'సజీవ శ్రమ' కాబట్టి, దాన్ని ఒకే మాటతో L (లేబర్) అనవచ్చు. అంటే ఉత్పత్తి దారులు ఇంటా బయటా కలిసి Lని వాడుతూ, మళ్ళీ అదే L ని ఇస్తారన్నమాట. సరుకు విలువ, క్లుప్తంగా C + L గా ఉంటుంది.

అయితే, C అంటే - 'స్థిర పెట్టుబడి'కి గుర్తు కదా? నూతన సమాజపు ఉత్పత్తి సాధనాల్ని, 'స్థిర పెట్టుబడి' అని గాక, 'ఉత్పత్తి సాధనాలు' అనే అనాలి. కాబట్టి, ఆ భాగానికి mp (మీన్స్ ఆఫ్ ప్రొడక్షన్) అనే గుర్తుని ఉపయోగించడమే సరైనది.

పెట్టుబడిదారీ సమాజంలో, కౌలూ వడ్డీ లాభమూ - అనే మాటలు, పెట్టుబడిదారీ సంబంధాల్ని వ్యక్త పరుస్తాయి. అవి ఆ సమాజ స్వభావానికే తగినవి. నూతన సమాజంలో, 'కౌలు' అనే సంబంధమే లేక పోతే, ఆ మాట కూడా లేకుండా పోతుంది. అలాగే, వడ్డీ సంగతీ, లాభం సంగతీ కూడా. నూతన సమా జంలో, ఈ రకం మాటలు క్రమంగా అంతర్ధానమై పోవాలి. ఇంకా కొన్ని రకాల మాటలు, నూతన స్వభా వాన్ని వ్యక్త పరిచేవిగా మారాలి. 'స్థిర పెట్టుబడి'ని, 'ఉత్పత్తి సాధనాలు' అన్నట్టుగా, ఇంకా కొన్ని మాటల్ని కూడా మార్చాలి.

నూతన సమాజంలో ఉత్పత్తి విలువ =
ఉత్పత్తి సాధనాలూ + ఉత్పత్తిదారుల శ్రమా
mp + L

అయితే, మనం ఇప్పటి దాకా 'విలువ'ని చూడ డానికి, C + V + S అనే మాటలు వాడడానికే అల వాటుపడి వున్నాం. ఇప్పుడు, ఆ మాటల్ని పూర్తిగా వది లేసి, కొత్త మాటలనే ఉపయోగించాలంటే మొదట్లో అది గందరగోళంగా వుంటుంది. కాబట్టి, కొత్త మాటలు అలవాటయ్యే వరకూ పాత మాటల్నీ కొత్త మాటల్నీ కూడా ఉపయోగిస్తూ, క్రమంగా పాత మాటల్ని పూర్తిగా వదిలెయ్యాలి.

నూతన సమాజపు సింపుల్ పునరుత్పత్తిని, C + V + sf అని గానీ, C + L అని గానీ, mp + L అని గానీ, ఇలా అన్ని రకాలు గానూ అర్థం చేసుకోవాలి.

'సింపుల్ పునరుత్పత్తి' విలువని లెక్క కట్టడం తేలికే. ఎందుకంటే, ఖర్చయిన అంశాలన్నీ తెలుస్తూనే వుంటాయి కాబట్టి. కాస్టుప్రైసే, విలువ కాబట్టి.

'విస్తృత పునరుత్పత్తి'ని లెక్క కట్టడానికే సరైన మార్గం పట్టుకోవాలి.

సమాజంలో జీతాల మొత్తమూ, పని దినం పొడవూ, సోషల్ ఫండ్ మొత్తమూ. - ఈ మూడూ తెలిస్తే, 1 గంట శ్రమ విలువ తెలుస్తుంది.

అదే పని దినంలో (8 గం. ల లోనే) అదనపు శ్రమ కూడా కొంత జరిగితే, సింపుల్ పునరుత్పత్తి లెక్కల మీదే ఆధారపడి, అదనపు శ్రమ కాలాన్ని తెలుసుకోవచ్చు.

అదే పని దినంలో, అదే ఉత్పత్తి శక్తితో, అదనపు శ్రమ కూడా వున్నట్టు అనుకుంటే, $Sf^2$ కూడా కలిసే 8 గం. ల పని దినం అవుతుంది. ఉత్పత్తి సాధనాల విషయం చూస్తే, ఇప్పుడు కూడా 8 గం. ల శ్రమే కాబట్టి, సింపుల్ పునరుత్పత్తిలో, 8 గం. ల కాలంలో ఖర్చయినంత C యే, ఈ విస్తృత పునరుత్పత్తి పని దినంలో కూడా ఖర్చవు తుంది. పని దినం పొడవు గానీ, ఉత్పత్తి శక్తి గానీ పెరిగితేనే, C ఖర్చు పెరుగు తుంది.

## నూతన 'విస్తృత పునరుత్పత్తి'లో:

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| జీతం | + | రెగ్యులర్ సోషల్ ఫండ్ | + | అదనపు సోషల్ ఫండ్ | | |
| V | + | $Sf^1$ | + | $Sf^2$ | | |
| 10 | + | 5 | + | 5 | = | 20 |
| (4 గం | + | 2 గం. | + | 2 గం. | = | 8 గం.) |

ఇందులో, $sf^2$, అదనపు శ్రమ, ఇది, మొదట ఏ ఖర్చూ అవకుండా కొత్తగా జరిగిన శ్రమ. $V + sf^1$లు రెండూ పునరుత్పత్తి అయిన భాగాలే. ఈ పని దినంలో, ఉత్పత్తిదారుల కోసం, ఇంటా బైటా కలిసి $V + sf^1$ లు రెండూ ఖర్చవుతూ, ఆ ఖర్చుతో, ఆ 2 భాగాలే గాక, $sf^2$ కూడా కొత్తగా ఉత్పత్తి అవు తుంది. $sf^2$ కూడా తర్వాత కాలంలో, ఆ ఉత్పత్తి దారుల కోసమే ఖర్చయ్యేది అయినా, ఆ శ్రమ జరిగిన కాలంలో మాత్రం అది 'అదనపు శ్రమే.' ఆ పని దినంలో, $V + Sf^1$ లు రెండూ కలిసి 6 గంటలు. ఉత్పత్తిదారులు, 6 గం.ల శ్రమతో తయారైన ఉత్ప త్తుల్ని వాడుతూ, ఆ కాలంలో 8 గంటల శ్రమ చేశారని అర్థం.

ఇక్కడ అదనపు శ్రమ జరిగిందని ఎలా తెలుసు కోగలం?

సింపుల్ పునరుత్పత్తి లెక్క ప్రకారం 1 గంట శ్రమ విలువ 2 . 8 గంటల విలువ 20. విస్తృత పునరు త్పత్తి కాలం కూడా 8 గంటలే అయితే, అందులో అదనపు శ్రమ వుంటుంది కాబట్టి, $V + sf^1$ లు

రెండూ కలిసి, 8 గం. ల కన్నా కొంత తక్కువ కాలం అవుతుంది.

అంటే, సింపుల్ పునరుత్పత్తిలో వుండే $V + sf^1$ సైజులు కొంత కొంత తగ్గుతాయి. ఒక వ్యక్తి, 8 గం.ల పని దినంలో, చేసిన శ్రమ విలువ 20 అయితే, ఆ వ్యక్తి కోసం $V + sf^1$ లుగా ఖర్చయినది 20 కన్నా తక్కువే అయితే, మిగిలినది అదనపు శ్రమే ($sf^2$). ఈ భాగం, సమాజానికి వుండే కొత్త అవసరాల్ని బట్టి వుంటుంది. కొత్త అవసరాలు లేకపోతే (అన్నీ రెగ్యులర్ అవసరాలే అయితే), ఈ భాగం అక్కర లేదు. అదనపు శ్రమ జరగనక్కర లేదు.

ఈ విస్తృత పునరుత్పత్తిలో,

మొత్తం సజీవ శ్రమ - 20
జీతం - 10
మొత్తం సోషల్ ఫండ్ - 10
అదనపు విలువ - 5

సజీవ శ్రమలో, అదనపు శ్రమ - 25%
జీతంతో పోలిస్తే, అదనపు శ్రమ - 50%
$V + sf^1$ లతో పోలిస్తే అదనపు శ్రమ - 33%

ఒక ఉత్పత్తికి సంబంధించిన వివరాలన్నీ ఇలా వున్నప్పుడు, విస్తృత పునరుత్పత్తిలో, ధరని నిర్ణయించాలంటే, జీతంలో 50 శాతాన్ని అదనపు విలువగా, ధర లోకి కలపవలసి వుంటుంది.

ప్రతి ఉత్పత్తిదారుడూ,

'జీతం'లో 50% ని అదనపు శ్రమగా ఇవ్వాలి.

జీతం 10 అయితే - అదనపు విలువ 5
జీతం 12 అయితే - అదనపు విలువ 6
జీతం 8 అయితే - అదనపు విలువ 4

అందరి శ్రమ కాలానికీ ఒకటే షరతు.

అదనపు శ్రమ, కొన్ని శాఖలలోనే అవసరం కావచ్చు. కొన్ని శాఖల్లో ఎక్కువ ఉత్పత్తి అక్కరలేక, రెగ్యులర్ శ్రమే సరిపోవచ్చు. ఉదాహరణ తేలిగ్గా వుండడం కోసం, అన్ని చోట్లా అదనపు శ్రమ కావాలనీ, ఒకే స్థాయిలో కావాలనీ అనుకుంటే, అదనపు విలువ రేటు ఒకే రకంగా వుంటుంది. రేటు ఒకే రకంగా వున్నా, అదనపు విలువ పరిమాణాలు ఒకే రకంగా వుండవని మనకు గతం లోనే తెలుసు. కాబట్టి, వేరు వేరు శాఖల్లో ధరలు, అక్కడి ఖర్చుల్ని బట్టి తేడా గానే వుంటాయి. (అదనపు శ్రమ రేటు ఒకే రకంగా వున్నా).

'అదనపు విలువ'ని లెక్క కట్టేది ఉత్పత్తి సాధనాల మీద కాదు, 'జీతాల' భాగం మీదే. 'అదనపు విలువ' రావడానికి జీతాల భాగమే కారణం. పెట్టుబడిదారీ విధానంలో - 'లాభం రేటు'ని కేవలం V మీద గాక, C + V లుగా వుండే మొత్తం పెట్టుబడి మీద లెక్క కట్టి, దాన్ని సరుకుకి చేరుస్తారు. పెట్టుబడి కన్నా అదనంగా వచ్చినదంతా (S), V ద్వారా వచ్చి నట్టు గాక, C + V ల ద్వారా వచ్చినట్టు కనపడి, అది, లాభ రహస్యాన్ని మరుగుపరుస్తుంది. కాబట్టి, నూతన సమాజంలో 'అదనపు విలువ'ని, జీతాల భాగం మీదే లెక్క కట్టవలసి వుంటుంది.

ఇక్కడ, (నూతన విధానంలో), ఏ శాఖలో అదనపు విలువ, ఆ శాఖలోకే చేరుతుంది. ఇలా ఏర్పడే ధర, పెట్టుబడిదారీ విధా నంలో వున్నట్టు 'ఉత్పత్తి ధర'గా గాక, 'విలువ' గానే వుంటుంది.

నూతన సమాజంలో 'విద్య' అనే అంశాన్ని తీసుకుందాం. పిల్లల విద్యకి, సంబంధించిన ఖర్చులన్నిటినీ భరించవలసింది తల్లిదండ్రులే. అంటే, ఆ శ్రమ అంతా తల్లిదండ్రులు చెయ్యవలసిందే. అయితే, ఆ అంశాల కోసం జీతాలలో నించే ఖర్చు పెట్టవలసి వుంటే, అప్పుడు జీతాల భాగం ఎక్కువ గానూ, సోషల్ ఫండ్ భాగం తక్కువ గానూ వుంటుంది. లేదా, ఆ అంశాల్ని సోషల్ ఫండ్‌లో నించి ఖర్చు పెట్టవలసి వుంటే, అప్పుడు L లో నించి జీతాల భాగం తక్కువగా వుండి, సోషల్ ఫండ్ భాగం ($sf^1 + sf^2$ లు) ఎక్కువగా వుంటుంది. ఏ భాగం ఎలా వున్నా, ఆ 2 భాగాల్నీ (మొత్తం L ని) ఇచ్చేది పిల్లల తల్లిదండ్రులే.

అలాగే, 'వైద్యానికి' సంబంధించిన ఖర్చులూ, అలాగే రవాణాకి సంబంధించిన ఖర్చులూ, అలాగే ఇంకే ఇతర ఖర్చులు అయినా.

'జీతాల' భాగం ఎక్కువగా వుంటే, ఉత్పత్తిదారులు, తమ జీవితావసరాల్ని ఎవరికి వారు వేరు వేరుగా తమ వ్యక్తిగత స్థాయిలో నెరవేర్చుకోవలసి వుంటుంది. లేదా, 'సోషల్ ఫండ్' భాగం ఎక్కువగా వుంటే, పాఠశాలలూ, ఆసుపత్రులూ, రవాణాలూ - వగైరాల్ని సమిష్టి బాధ్యతతో నిర్వహించుకోవలసి వుంటుంది. ఒక వ్యక్తి చేసే శ్రమలో నించి, 'జీతం' భాగం తక్కువ గానూ, 'సోషల్ ఫండ్' భాగం ఎక్కువ గానూ వుంటే, సమిష్టి జీవిత సంబంధాలు అభివృద్ధి చెందుతూ వుంటాయి. సమిష్టి సంస్థల్ని ఎక్కువగా ఏర్పర్చుకోవడమూ, వాటిని సక్రమమైన పద్ధతిలో నిర్వహించుకోవడమూ జరుగుతూ వున్న కొద్దీ, అది సమిష్టి సంబంధాల్ని స్థిరపరచగలుగుతుంది. కాబట్టి,

నూతన సమాజ నిర్మాణం ఏ దశలో వుందీ అనే దాన్ని బట్టి, Lలో నించి జీతాల భాగం ఎక్కువగా వుందా, సోషల్ ఫండ్ భాగం ఎక్కువగా వుందా - అనేది వుంటుంది.

ఇక్కడ చాలా ప్రత్యేకమైన శ్రద్ధతో గ్రహించవలసిన అంశం ఏమిటంటే, సోషల్ ఫండ్ భాగం ఎక్కువగా వుండడమే, నూతన స్వభావానికి నిజమైన గుర్తు కాదు. ఆ సోషల్ ఫండ్ భాగం, నిజమైన నూతన సంబంధాల నిర్మాణం కోసం, ఎంత సక్రమంగా వినియోగం అవుతోందీ అనే దాన్ని బట్టే - ఆ సమాజపు నూతనత్వం వుంటుంది. సోషల్ ఫండ్‌ని తప్పు తప్పులుగా ఖర్చు చేసే విధానాలు అనేకం వుండవచ్చు. కాబట్టి, సోషల్ ఫండ్ ఎక్కువగా వుండడం మాత్రమే సమిష్టితనానికి గుర్తు కాదు.

'పునరుత్పత్తి' గురించి ఇప్పటి వరకూ చూసింది ఏమిటంటే:

నూతన సమాజపు సింపుల్ పునరుత్పత్తిలో, 'అదనపు విలువ' వుండదు. కాబట్టి, అలాంటి ఉదాహరణలో, కాస్టుప్రైసూ విలువా ఒకటే.

విస్తృత పునరుత్పత్తిలో 'అదనపు విలువ' వుంటుంది. అలాంటి ఉదాహరణలో, 'కాస్టుప్రైసు' కన్నా 'విలువ' ఎక్కువ. అదనపు విలువ అనేది, ఆ ఉత్పత్తి దారుల కోసమే - అనేది మరిచి పోకూడదు.

ఈ రకంగా, నూతన సమాజంలో, ఒక శాఖలో, 'విస్తృత పునరుత్పత్తి' విలువని కూడా లెక్క కట్టగలం.

'పత్తి శాఖ'లో ఉత్పత్తిని 10% పెంచితే, ప్రతీ శాఖలోనూ అలాగే జరగదు. ఇంకో శాఖలో ఉత్పత్తి పెరుగుదల 5%, మూడో శాఖలో 8% - ఇలా వుండవచ్చు. దాన్ని బట్టే, వాటి ఖర్చులూ, వాటి విలువలూ వుంటాయి.

ఇప్పుడు నూతన సమాజంలో s dల ప్రభావాల గురించి కూడా చూడాలి. 'నూతన సమాజం' అన్నప్పుడల్లా, శ్రమ దోపిడీ లేని నూతన విధానం - అనుకోవాలి. ఆ దృష్టి తోటే సమస్యల్ని చూడాలి.

ఒక వస్తువు విలువ 2 రూపాయలు అయితే, నూతన సమాజంలో ఆ విలువ, 'ఉత్పత్తి ధర'గా (విలువ కన్నా ఎక్కువో తక్కువో అయ్యే ధరగా) మారవలసిన అవసరం వుండదు. ఎందుకంటే, ఈ సమాజంలో, 'వేరు వేరు శాఖల పెట్టుబడులకు సమాన లాభాలు రావటం' అనే షరతు వుండదు కాబట్టి.

అలాగే, ఆ విలువ, 'మార్కెట్ ధర'గా (విలువ కన్నా కొంత ఎక్కువో తక్కువో అయ్యే ధరగా) మారవలసిన అవసరం కూడా వుండదు. ఎందుకంటే, అన్ని శాఖల మధ్యా వుండే ప్లాను వల్ల, ఇక్కడ s dలు సమానం గానే వుంటాయి కాబట్టి. లేదా, ఒక సందర్భంలో s dలు సమానంగా లేకపోయినా, మొదటి ధర, పైకో కిందకో పోవలసిన అవసరం వుండదు. ఇక్కడ 'ధర', మార్కెట్ పరిస్థితుల్ని బట్టి మారదు. ఆ మార్కెట్ పరిస్థితులు కూడా, ఇక్కడ 'అరాచకంగా' వుండవు. చివరికి ఇక్కడ విలువే - ధర. 'నూతన సమాజం'లో ధరకి ఇదే - జనరల్ సూత్రం.

అయితే, సమాజానికి కావలసిన ఉత్పత్తుల కోసం ఎంత ఖచ్చితంగా ప్లాన్ చేసినా, వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో, సప్లైలు ఖచ్చితంగా ప్లాన్ ప్రకారం వుండడం జరగదు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్రకృతి మార్పుల మీద ఆధారపడి వుంటాయి కాబట్టి, ఈ ఉత్పత్తులు, ప్లాన్ కన్నా ఎక్కువో తక్కువో అవుతూ వుంటాయి. అలాంటి సందర్భాలలో 1 యూనిట్‌కి పట్టే శ్రమ కాలం తగ్గి, ఆ రకంగా విలువ తగ్గి, ధర తగ్గడమూ; దానికి వ్యతిరేకంగా జరిగితే, విలువ పెరిగి, ధర పెరగడమూ - ఇది ఎక్కడైనా జరిగేదే. నూతన సమాజంలో కూడా అలా జరగవలసిందే. కానీ అలా ఏర్ప డిన ధర, s d ల కారణంతో, ఇంకా పెరగడమో తగ్గ డమో జరగనక్కర లేదు.

ఉత్పత్తి తక్కువగా వుంటే, దాన్ని వాడే వాళ్ళందరూ, తమ వాడకాన్ని కొంత కొంత తగ్గించుకోవాలి. ఆ ఉత్పత్తి, దానికి వుండవలసిన ధర తోనే, అది కావలసిన వాళ్ళందరికీ రేషన్ పద్ధతిలో అందాలి. అంతే గానీ, కొందరు మాత్రమే దాన్ని ఎక్కువ ధరతో కొనెయ్యడమూ, కొందరికి ఆ ఉత్పత్తి అసలే అందకపోవడమూ - అనే పరిస్థితి ఏర్పడకూడదు.

సప్లై ఎక్కువైతే అధికంగా వున్న ఉత్పత్తిని జాగ్రత్తగా నిలువ చేసి వుంచి, రాబోయే ఉత్పత్తి క్రమాన్ని కొంత తగ్గించుకోవచ్చు.

నూతన సమాజంలో, డిమాండ్ అనేది, సహజ అవసరాల మీదే ఆధారపడి వుండాలి గానీ, సప్లైలో హెచ్చు తగ్గుల్ని బట్టి మారేదిగా వుండకూడదు. ఇక్కడ సప్లై ఎక్కువైనా తక్కువైనా, డిమాండు మారడం గానీ; డిమాండుకి తగినట్టుగా ధర మారడం గానీ, జరగనక్కర లేదు. ఉత్పత్తి ఎక్కువైతే కొంత భాగాన్ని నిలవ చెయ్యవచ్చు. తక్కువైతే దాని వాడకాన్ని తగ్గించుకో

వచ్చు. ఈ సహజమైన మార్పుల ద్వారానే ఆ సమస్యలు పరిష్కారమవుతాయి.

ఒక దేశంలో 'నూతన సమాజం' పేరుతో ఒక పరిపాలన ప్రారంభమయిందనుకుందాం. ఆ సమాజంలో ధరల్ని, ఇప్పుడు చూడబోయే విధంగా నిర్ణయిస్తారనుకుందాం. ఏ విధంగా నంటే, సమాజంలో ఏదో ఒక 'జనరల్ లాభం రేటు'ని తీసుకుంటారు. దాన్ని 10% అనుకుందాం. ఉత్పత్తి సాధనాల ఖర్చునీ, జీతాల ఖర్చునీ కలిపి, దాని మీద 'జనరల్ లాభాన్ని' కూడా కలిపి, ఆ మొత్తాన్నే ధరగా నిర్ణయిస్తారు. ఆ ధరతో ఆ సరుకుని అమ్ముతారు. ప్రతీ శాఖ లోనూ ఇలాగే చేస్తారనుకుందాం. నూతన సమాజంలో ధరల్ని నిర్ణయించడంలో ఈ పద్ధతి సరియైన దేనా? - కాదు.

ఎందుకంటే, C + Vల మీద కొంత జనరల్ లాభాన్ని వేసుకుని, అంటే Pని వేసుకుని, C + V + Pల మొత్తాన్ని ధరగా నిర్ణయించడం అంటే, ఆ ధర, 'ఉత్పత్తి ధరే' గానీ 'విలువ' కాదు. అన్ని శాఖలకూ ఇలాగే ఉత్పత్తి ధరల్ని నిర్ణయించినప్పుడు, ఆ ధరలు, విలువల నించీ తేడాగా వున్న ధరలే అవుతాయి. ధరల్ని నిర్ణయించడంలో ఇది 'పెట్టుబడిదారీ పద్ధతే' గానీ నూతన సమాజానికి తగిన పద్ధతి కాదు. అయితే ఈ పద్ధతి ద్వారా నిర్ణయమయ్యే ధరల మొత్తం, విలువల మొత్తానికి సమానంగా వుంటుందనే దానికేమీ సందేహం లేదు. కానీ, ఇక్కడ కావలసిన విషయం అది కాదు. 'విలువ' అనే విషయం గురించి ఇక్కడ స్పష్టమైన అవగాహన వుండాలి. C + V + P అనే పద్ధతిలో ధరని నిర్ణయించడం అంటే, అది, 'అసలు విలువ' అనే వాస్తవాన్నే గ్రహించనివ్వకుండా చేస్తుంది. పైగా, ఏ శాఖలో ధరని నిర్ణయించాలన్నా, కాస్టుప్రైసు మీద కొంత 'జనరల్ లాభాన్ని' వేసుకుని తీరాలనే అర్థాన్ని ఇస్తుంది. నూతన సమాజానికి, 'లాభమూ, జనరల్ లాభం రేటూ' అనే మాటలే అసహ్యకరమైన మాటలు.

'లాభం అనే మాటకు బదులు సోషల్ ఫండ్' అనీ, 'లాభం రేటుని, సోషల్ ఫండ్ రేటు' అనీ, కేవలం పేర్లు మార్చడం కాదు, జరగవలసింది. ఆ పద్ధతిలో నిర్ణయించేది కూడా 'విలువ' అవదు.

కాబట్టి, ఉత్పత్తులకు 'విలువల్ని' నిర్ణయించడంలో, నూతన సమాజం, ఇంత వరకూ గత చరిత్రలో లేని సరైన విధానాన్ని 'విలువ సూత్రం' అనే అవగాహనతో, ప్రారంభించాలి. ఇక్కడ చర్చించిన పద్ధతులు ఇంకా పూర్తిగా సరిపోక పోవచ్చు. అనుభవాల ద్వారా తగిన పద్ధతుల్ని అభివృద్ధి పరచుకోవాలి.

ఇప్పటి వరకూ, నూతన సమాజంలో కూడా ధరల నిర్ణయాలూ, అమ్మకాలూ వుండే దశ గురించే చూశాం.

తర్వాత కాలంలో, అమ్మకాల విధానాన్నే వదిలి వెయ్యాలంటే, విలువ లెక్కలు వుండవు. అప్పుడు సమాజపు ప్లానింగ్ ఎలా వుంటుంది?

## విలువ లేనప్పుడు ప్లానింగ్:

'విలువ' లేనప్పుడు, 'ఉపయోగపు విలువ' మాత్రమే వుంటుంది. 'రూపం లేని శ్రమ - లెక్కలు' లేనప్పుడు, 'రూపం వున్న శ్రమ - లెక్కలు' మాత్రమే వుంటాయి.

విలువ లెక్కల్ని తీసివేసే దశ నించీ నూతన సమాజపు ప్లానింగు, 'ఉపయోగపు విలువ' సూత్రం మీదే ఆధారపడాలి.

విలువ = C + V + S

ఉపయోగపు విలువ =

ఉత్పత్తి సాధనాలు + రూపం వున్న శ్రమలు

MP L

(నిర్జీవ శ్రమ + సజీవ శ్రమ)

కుట్టూ, నేతా - లాంటి ఏ రూపం వున్న శ్రమ అయినా, టైము లెక్కల తోటే వుంటుంది. ఏ శాఖ లోకి, ఎటువంటి ప్రత్యేక శ్రమ ఎంత చొప్పున కావాలో; అంత పని చెయ్యడానికి ఆ శాఖ లోకి ఎందరు ఉత్పత్తిదారులు కావాలో, ఆ లెక్కల ప్రకారం అక్కడ ఆ శ్రమని ఏర్పర్చుకోవాలి.

### విలువ లెక్కల్ని తీసివేసిన తర్వాత జరగవలసిన ప్లానింగ్ గురించి, మార్క్స్ అక్కడక్కడా చెప్పిన మాటలు కొన్ని:

"విలువ మీద ఆధారపడిన ఉత్పత్తి విధానం గల దేశాన్ని, అంటే పెట్టుబడిదారీ పద్ధతిలో సాగే నిర్మాణాన్ని, దేశీయ అవసరాల్ని తీర్చుకోవడానికి మాత్రమే పని చేసే నిర్మాణంగా భావించడం, తప్పుడు భావన. ఇది మొట్టమొదటి విషయం. రెండో విషయం ఏమిటంటే - పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానం రద్దు తర్వాత, సమిష్టి ఉత్పత్తి విధానం సాగుతూ వున్నప్పుడు కూడా, విలువని నిర్ణయించడం అనేది, (డిటర్మినేషన్ ఆఫ్ వాల్యూ), ఒక అర్థంలో కొనసాగుతుంది. ఏ అర్థంలో నంటే, శ్రమ కాలాన్ని నియంత్రించడమూ,

వివిధ ఉత్పత్తి గ్రూపుల మధ్య సామాజిక శ్రమను పంపిణీ చెయ్యడమూ (రెగ్యులేషన్ ఆఫ్ లేబర్ టైమ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ సోషల్ లేబర్) - అనే అర్థంలో. దీని నంతటినీ పరిగణనలోకి తీసుకోవాలి గనక, బుక్ కీపింగు, గతంలో కన్నా కూడా ఎక్కువగా అవసరమవుతుంది." [కాపిటల్ -3, పే. 851].

ఈ కొటేషన్‌లో, "సమిష్టి ఉత్పత్తి విధానంలో కూడా విలువని నిర్ణయించడం అనేది, ఒక అర్థంలో కొనసాగుతుంది" అనే మాటల్ని సరిగా అర్థం చేసుకోకపోతే, 'నూతన సమాజంలో కూడా విలువ లెక్కలు కొనసాగవలసిందే' అని చెపుతున్నాడనే పొరపాటుతో, గందరగోళంలో పడతాం. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఇంకో చోట వున్న మార్క్సు మాటల్ని చూస్తే, ఎక్కువ స్పష్టతతో తెలుస్తుంది.

> **"సమిష్టి ఉత్పత్తి విధానంలో కూడా వుండిపోయే మొదటి ఆర్థిక విషయాలు ఏమిటంటే - టైము పొదుపూ, వర్కింగ్ టైముని వివిధ శాఖల మధ్య ఒక పద్ధతి ప్రకారం పంచడమూనూ, (ఎకానమీ ఆఫ్ వర్కింగ్ టైమ్ అండ్ మెథాడికల్ డిస్ట్రిబ్యూషన్). ఈ నియమం చాలా ప్రాధాన్యత గలది. ఇదంతా, శ్రమ కాలం చేత మారకాల విలువల్ని కొలవడం నించి మౌలికంగా భిన్న మైనది." - మార్క్సు** [గ్రూంగ్రూజా, పేజీ 173, పెంగ్విన్.]

చివరి వాక్యం మీద దృష్టి పెట్టండి. "శ్రమ కాలం చేత మారకాల విలువల్ని కొలవడం నించి ఇదంతా మౌలికంగా భిన్నమైనది." అంటే ప్లానింగ్‌ని పెట్టుబడిదారీ విలువ లెక్కల ప్రకారం చెయ్యడం గాక, (రూపం లేని శ్రమ లెక్కల ప్రకారం చెయ్యడం గాక) దానికి పూర్తిగా వ్యతిరేకమైన పద్ధతిలో చెయ్యాలని చెప్పినట్టు అర్థం.

ఇప్పుడు, మొదటి కొటేషన్‌లో చెప్పిన 'సమిష్టి ఉత్పత్తి విధానంలో కూడా విలువ నిర్ణయం అనేది, ఒక అర్థంలో కొనసాగుతుంది' అనే మాటల్ని సరిగా అర్థం చేసుకోవచ్చు. నూతన సమాజంలో కూడా, శాఖల్లో ప్లానింగు, శ్రమ కాలాల లెక్కల ద్వారానే జరుగుతుంది. కానీ, ఈ శ్రమలు, ప్రత్యేక (కాంక్రీటు) శ్రమలు. ఏ శాఖకి ఏ ప్రత్యేక శ్రమ కావాలో ఆ శ్రమ కాలం లెక్కలు అవి.

మొదటి కొటేషన్‌లో వున్న "డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ సోషల్ లేబర్" అనే మాటల్లో, 'సోషల్ లేబర్' (సామాజిక శ్రమ) అనే దాన్ని కూడా సరిగా అర్థం చేసుకోవాలి. ఏ ప్రత్యేక శ్రమని తీసుకున్నా, ('నేత'నో, 'కుట్టు'నో, మరో దాన్నో, దేన్ని తీసుకున్నా), దాన్ని 10 మంది మనుషులు ఒకే కాలంలో చెయ్యరు. చిన్న చిన్న తేడాలతో, 10 కాలాల్లో చేస్తారు. ఒక వ్యక్తి, 1 గంటలో చేసే పనిని ఇంకో వ్యక్తి 5 నిమిషాలు తక్కువ లోనే చేస్తాడు. ఇంకో వ్యక్తి, 5 నిమిషాలు ఎక్కువలో. ఇలాంటి ఎక్కువ తక్కువల్లో నించి ఒక సగటు వుంటుంది. అదే ఆ శ్రమకు సంబంధించిన సోషల్ టైమ్. ప్రతీ శ్రమకీ ఒక సగటు కాలం వుంటుంది. ఆ దృష్టి తోనే ఆ లెక్కలు వుండాలి. అంటే, ఇక్కడ 'సోషల్ టైమ్' అనే దానికి, కాంక్రీట్ శ్రమలో సగటు కాలం అనే గానీ, ఇది 'రూపం లేని శ్రమ' సంగతి కాదు.

ధాన్యం కావాలంటే, ఫలానా ఫలానా వ్యవసాయ శ్రమలు కావాలి. ఆ శ్రమలు ఎంతెంత కావాలో, దానికి ఎంత మంది మనుషులు కావాలో - ఆ సగటు లెక్కలు లేకపోతే ఒక ప్లాను ప్రకారం సమాజానికి ధాన్యాన్ని ఉత్పత్తి చేసుకోవడం సాధ్యం కాదు. అలాగే, బట్ట కావాలంటే, చెప్పులు కావాలంటే, మందులు కావాలంటే, దేనికోసం ఏ రకం ప్రత్యేక శ్రమ కావాలో, దానికి ఎంత మంది మనుషులు కావాలో, లెక్కలు వుండాలి.

ఏ శాఖ లోకి ఎంత శ్రమ కావాలో, మొత్తం శాఖల్లోకి, మొత్తం జనాభాని సర్దుకోవాలి. ఇది ఒక నియమం. పెట్టుబడిదారీ విధానంలో, విలువ లెక్కలు చూసుకోవడం అనే నియమం వుంటే; సమిష్టి విధానంలో, మొత్తం జనాభాకి కావలసిన ఉత్పత్తుల కోసం, మొత్తం శాఖల్లోకి, మొత్తం జనాభాని సర్దవలసిన నియమం వుంటుంది. అంటే, సమిష్టి సమాజపు ప్లానింగులో కూడా ఒక నియమం వుంటుందని చెప్పడం ఇది. ఆ నియమం ఏమిటంటే, "టైము పొదుపూ, వర్కింగ్ టైమ్‌ని వివిధ శాఖల మధ్య ఒక పద్ధతి ప్రకారం పంచడమూనూ."

మొత్తం జనాభాని, మొత్తం శాఖల పనుల్లో సర్దగలిగే విధంగా (ఎవరూ సోమరులుగా గానీ, నిరుద్యోగులుగా గానీ వుండని విధంగా) ఆ వేరు వేరు శ్రమల్ని సర్దగలగాలి. పెట్టుబడిదారీ విధానంలో అయితే, ఏ పెట్టుబడిదారుడి ప్లానింగు ఆ పెట్టుబడిదారుడు చేసుకుంటాడు. మొత్తం సమాజం సంగతి వాడికి అనవసరం. మొత్తం పెట్టుబడిదారులందరి ప్లానింగుల్ని కలిపినా, అది సమాజ ప్లానింగు అవదు. పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగులు కుప్పలు తెప్పలుగా

వుంటారు. ఏ పెట్టుబడిదారుడి ప్లానింగుకీ, దానితో సంబంధం వుండదు. కానీ, సమిష్టి విధానంలో అది పనికి రాదు. ఆ ప్లానింగు విధానమే వేరు.

100 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని సాగు చెయ్యాలనుకుందాం. దానికేం కావాలి? ఉత్పత్తి సాధనాలూ, ఆ శ్రమలు చేసే మనుషులూ, కావాలి. ఏ విధానంలో అయినా ఈ రెండూ కావాలి.

### 'విలువ' లెక్కల ద్వారా:

ఎన్ని విత్తనాలు? ఎన్ని ఎరువులు? ఎన్ని నాగళ్ళు? ఎన్ని మందులు? - వీటన్నిటి కోసం ఎంత 'డబ్బు' కావాలో లెక్క కట్టాలి. అలాగే, మనుషుల జీతాల కోసం ఎంత డబ్బు కావాలో లెక్క కట్టాలి, ఆ 2 అంశాలూ కలిసిన మొత్తం 'వెయ్యి' అనుకుందాం. 100 ఎకరాల సాగుకి, వెయ్యి పెట్టుబడి కావాలి - అని లెక్క తేలుతుంది.

### 'ఉపయోగపు విలువ' లెక్కల ద్వారా:

ఇక్కడ ఎంత డబ్బు కావాలనే ప్రశ్నా, ఆ లెక్కలూ వుండవు. ఉత్పత్తి సాధనాలుగా ఏమేమి కావాలో, వాటి పరిమాణాల లెక్కలే వుంటాయి. 2 ట్రాక్టర్లు కావాలంటే, '2 ట్రాక్టర్లు' అనే లెక్కే గాని, 'ఇంత డబ్బు కావాలి' అనే లెక్క వుండదు.

ట్రాక్టర్లని తయారు చేసే శాఖ నించి ఆ 2 ట్రాక్టర్లు వస్తాయి. ఎరువుల శాఖ నించి ఎరువులూ, మందుల శాఖ నించి మందులూ. ఏ ఉత్పత్తినీ డబ్బుతో కొనవలసిన పని వుండదు.

ఇక, ఆ సాగు కోసం పనులు చేసే ఉత్పత్తిదారులు, డ్యూటీలు మారుతూ ఆ వ్యవసాయ శ్రమల్లో ఏ శ్రమ అయినా చెయ్యగలగాలి. వారికి జీతాలు ఇవ్వడం వుండదు. వారికి కావలసిన పోషణ ఉత్పత్తులన్నీ వారి ఇళ్ళకే చేరతాయి. బయట జరిగే విద్యా, వైద్యం, రవాణా వంటి అవసరాలన్నీ ఉచితం గానే అందు తాయి. ఎక్కడా డబ్బు చెల్లింపుల అవసరం వుండదు.

'ఉచితంగా' అంటే, వాటిని ఎవరో ఇస్తారని అర్థం కాదు. ఆ ఉత్పత్తులన్నీ ఆ ఉత్పత్తిదారుల శ్రమలతో తయారైనవే. వాళ్ళ శ్రమలనే వాళ్ళు వాడుకుంటారని అర్థం. కాకపోతే, ఎప్పటికప్పుడు డబ్బు లెక్కలు వుండవు.

ఆ సాగు కోసం కావలసిన జనం సంగతి:

'పని దినం' ఎన్ని గంటలు? 100 ఎకరాల సాగు కోసం ఎన్ని పని దినాలు? ఎంత జనాభా అవసరం? సెలవు దినాలూ, అనారోగ్యాలూ, అన్నిటినీ దృష్టిలోకి తీసుకుని, ఈ వ్యవసాయం కోసం అవసరమయ్యే సజీవ శ్రమ కాలాన్ని లెక్క కట్టవచ్చు.

100 ఎకరాల్లో పంట కోసం (1) ఫలానా ఫలానా ఉత్పత్తి సాధనాలూ, (2) ఫలానా ఇన్ని పని దినాలూ - ఖర్చయినట్టు అర్థం. 'ఈ 2 అంశాలూ కలిసిన మొత్తం శ్రమ (విలువ) ఎంత' అనే లెక్క అవసరం లేదు.

ప్రతీ పని స్థలం లోనూ, ప్రతీ శాఖ లోనూ, మొత్తం సమాజంలో (1) ఉత్పత్తి సాధనాల లెక్కలూ, (2) రూపం వున్న శ్రమల (కాంక్రీట్ శ్రమల) లెక్కలూ - కావాలి.

ఉపయోగపు విలువ ప్లానింగుని (విలువ లెక్కలు లేని ప్లానింగ్‌ని) ఊహించాలంటే, దాని కన్నా ముందు (1) ప్రతీ వ్యక్తీ శ్రమ చెయ్యడం, (2) ప్రతీ వ్యక్తీ శారీరక, మేధా శ్రమలు చెయ్యడం. ఈ 2 అంశాలూ అమలు జరుగుతూ వుండాలి. ఇది సరిగా ఏర్పడే దాకా విలువ లెక్కలే అవసరమవుతూ వుంటాయి.

A, B - అనే ఇద్దరు వ్యక్తుల్ని తీసుకుందాం.

ఇంకా అది, విలువ లెక్కలు వున్న కాలమే అనుకుందాం.

A - శారీరక శ్రమలు మాత్రమే చేస్తాడు. రోజూ 6 గంటలు. 1 గంట శ్రమ - 2 రూపాయలు. 6 గంటలకు, 12 రూపాయలు.

B - మేధా శ్రమలు మాత్రమే చేస్తారు. రోజూ 4 గంటలు. 1 గంట శ్రమ 3 రూ. లు. 4 గంటలకు, 12 రూ. లు.

శ్రమల విలువలు సమానంగా వుండడం - అంటే ఇదేనా? - కాదు.

A - 6 గంటలు పని చేస్తే, B - 4 గంటలే చేస్తున్నాడు. లేదా, B కూడా 6 గం. లు చేస్తే, అప్పుడు అతని ఆదాయం ఎక్కువ అవుతుంది. ఇది ఒక తేడా.

A - ఎప్పుడూ శారీరక శ్రమలే చేస్తే, B ఎప్పుడూ మేధా శ్రమలే చేస్తున్నాడు. ఇది ఇంకో తేడా.

ఇద్దరు మనుషులు, సమానంగా శ్రమలు చెయ్యడం - అన్నా, వారి శ్రమల విలువలు సమానంగా వుండడం- అన్నా, ఈ A, Bల రకంగా కాదు.

ఇద్దరూ శారీరక శ్రమలు చెయ్యాలి.

ఇద్దరూ మేధా శ్రమలు కూడా చెయ్యాలి.

A, B ల ఉదాహరణలో, 6 గంటల శారీరక

శ్రమల్ని ఇద్దరూ చెరి సగం చేస్తారనుకుందాం. అలాగే 4 గం. ల మేధా శ్రమల్ని కూడా ఇద్దరూ చెరి సగం చేస్తారు. అప్పుడు ఎలా వుంటుంది?

A సంగతి:

| | | |
|---|---|---|
| శారీరక శ్రమ | - | 3 గం. లు. విలువ 6 రూ. |
| మేధా శ్రమ | - | 2 గం. లు. విలువ 6 రూ. |
| శ్రమ కాలం మొత్తం | | 5 గం. లు. విలువ 12 రూ. |

B సంగతి:

| | | |
|---|---|---|
| శారీరక శ్రమ | - | 3 గం.లు. విలువ 6 రూ.లు |
| మేధా శ్రమ | - | 2 గం.లు. విలువ 6 రూ.లు |
| శ్రమ కాలం మొత్తం | | 5 గం. లు. విలువ 12 రూ. లు. |

ఈ రకంగా ఆ ఇద్దరు వ్యక్తులూ శారీరక శ్రమలూ, మేధా శ్రమలూ కూడా చేస్తే, ఇద్దరి శ్రమలూ, ఆ శ్రమ విలువలూ, సమానంగా వుంటాయి. ఇద్దరి శ్రమ శక్తుల మధ్యా, ఇద్దరి జీవన పరిస్తితుల మధ్యా, తేడాలు పోతాయి. చిన్న చిన్న తేడాలు గానీ, ప్రకృతి సహజంగా ఏర్పడే తేడాలు గానీ, లెక్కలోకి రావు. ఆ రకంగా ఇద్దరూ సమానం అవుతారు. అప్పుడు, వ్యక్తులు తమ శ్రమల్ని అమ్మడమూ, జీతాలు తీసుకోవడమూ, ఆ జీతాలతో ఉత్పత్తులు కొనుక్కోవడమూ - ఇవేవీ అక్కర లేదు. జీతాలూ, అమ్మడాలూ, కొనడాలూ లేకుండానే, ఉత్ప త్తుల్ని ఇద్దరూ ఒకే రకంగా వాడుకోవచ్చు. అలాంటి పరిస్తితులు ఏర్పడిన తర్వాత మాత్రమే మారకాల్నీ డబ్బు లెక్కల్నీ వదిలి వెయ్యడం సాధ్యమవుతుంది.

ఒక వ్యక్తి - కొన్ని శారీరక శ్రమలూ కొన్ని మేధా శ్రమలూ చెయ్యడం - అనేది, సమాజంలో ఎప్పటికీ ఏర్పడక పోతే, విలువ లెక్కల్ని తీసివెయ్యడం ఎప్పటికీ జరగదు. ప్లానింగు అంతా విలువ లెక్కల ద్వారానే జరగవలసి వుంటుంది. జనాభాలో, కొందరు - శారీరక శ్రమలు చేసే వారి గానూ, కొందరు - మేధా శ్రమలు చేసే వారి గానూ వుండి పోతారు. దాన్ని బట్టి ఏర్పడే ఎక్కువ తక్కువలు వుండి పోతాయి. శ్రమ కాలాల్లోనూ, ఆదాయాల్లోనూ తేడాలు వుండి పోతాయి.

అయినప్పటికీ, అది దోపిడీ అవదు. శారీరక శ్రమకి తక్కువ విలువా, మేధా శ్రమకి ఎక్కువ విలువా వుండడం - సరైనదే. ఏ శ్రమ చేసే వారికి ఆ విలువే రావడం సరైనదే. అక్కడ శారీరక శ్రమల వారి అదనపు విలువని, మేధా శ్రమల వారు తినడం - లాంటిదేదీ జరగదు.

కానీ, విలువ లెక్కల ప్రకారం అది సరైనదే అయినా, ఉపయోగపు విలువ దృష్టితో, అది సరైనది కాదు. ఒక మనిషి ఎప్పుడూ మేధా శ్రమలే, ఇంకో మనిషి ఎప్పుడూ శారీరక శ్రమలే చేస్తూ జీవితాలు గడిపితే, అది శారీరక శ్రమల మనుషుల పట్ల చాలా అన్యాయం. అక్రమం. ఆ రకంగా అది, దోపిడీ సంస్కృతి లక్షణాన్ని నిలబెట్టి వుంచడమే అవుతుంది. కాబట్టి, నిజమైన సమానత్వానికీ, న్యాయానికీ, విముక్తికీ, దోపిడీ శ్రమ విభజనలో మార్పే అత్యంత కీలకం.

నూతన సమాజంలో, కొంత కాలానికి మారకాల పద్ధతే ఆగిపోయిందనుకుందాం. విలువ లెక్కలే లేని దశలో కూడా పని దినం, 2 భాగాలుగా వుంటుందా? - అవును. అప్పుడు కూడా అలాగే వుంటుంది. మొదటి భాగానికి 'జీతం' అనే పేరు లేకపోయినా, ఒక కుటుంబానికి అందే ఉత్పత్తులన్నీ మొదటి భాగమే. బయటి అవసరాలన్నీ రెండో భాగం.

పాఠశాలలూ, ఆసుపత్రులూ, రవాణాలూ, ఇతర ఉత్పత్తి క్రమాలూ - బైట జరుగుతాయి. వాటి కోసం బోలెడు ఉత్పత్తులు ఖర్చవుతాయి. అవన్నీ కూడా ఉత్పత్తిదారుల కోసమే. కానీ ఆ ఉత్పత్తులు, ఉత్పత్తిదారుల చేతుల్లోకి రావు. ఆ రకంగా బయట ఖర్చయ్యేదంతా రెండో భాగం.

అయితే, నూతన సమాజంలో కూడా పని దినం, 2 భాగాలుగా వుంటుందనే విషయం, పైకి ఎలా కనిపిస్తుందంటే, ఇది కూడా పెట్టుబడిదారీ విధానంలో వుండే సంబంధాల లాగే కనిపిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో - ఖర్చుల మీద లాభాన్ని వేసుకోవడం అన్నా; నూతన విధానంలో - ఖర్చుల మీద సోషల్ ఫండ్‌ని వేసుకోవడం అన్నా, పేర్ల తేడాయే గానీ రెండూ ఒకటే అయినట్టు కనిపిస్తుంది. పెట్టుబడిదారీ విధానంలో, అదనపు విలువని పెట్టుబడిదారీ వర్గం తింటే, నూతన విధానంలో సోషల్ ఫండ్‌ని, ప్రభుత్వాధికారులు తినేస్తారు - అన్నట్టు కనపడుతుంది.

కానీ, ఆ భాగాల స్వభావాలు మారకపోతే రెండూ ఒకటే. స్వభావాలు మారితే రెండూ ఒకటి కాదు. 'అందరూ శ్రమ చెయ్యడం' అనే మొట్టమొదటి మార్పుతో, శ్రమ సంబంధాలకు స్వభావం మారడం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత జరిగే మార్పులన్ని

టినీ కూడా దృష్టిలోకి తీసుకోవాలి.

నూతన సమాజాన్ని ప్రారంభించిన శ్రామిక వర్గం, 'సోషల్ ఫండ్' భాగం ఎంత సవ్యంగా ఖర్చవ్వాలో కూడా అర్థం చేసుకోవాలి. ఆ భాగం, దుర్వినియోగం అవకుండా చేసుకోవలసిన అవసరం కూడా ఆ వర్గానిదే.

ఆ మార్పులేవీ జరగకపోతే, అది నూతన సమాజం కాదు. ఆ మార్పులన్నీ ప్రారంభమై జరుగుతూ వుంటే, 'సోషల్ ఫండ్' భాగానికి, ఉత్పత్తి దారుల కోసమే వాడకం అయ్యే స్వభావం ఏర్పడుతుంది.

కానీ, పని దినం గానీ, ధర ఏర్పడే విధానం గానీ, పెట్టుబడిదారీ సమాజం లోనూ, నూతన సమాజం లోనూ ఒకే రకంగా వున్నట్టూ, వాటి మధ్య తేడాలే లేనట్టూ, ఎందుకు కనపడుతుందంటే, 'ధర లోనే వున్న అసహజత్వం' వల్ల! - ఒక 'ఉత్పత్తి'ని తీసుకుంటే, దాని కోసం అవసరమయ్యే 'ఉత్పత్తి సాధనాల' పరిమాణాల్నీ, 'ప్రత్యేక శ్రమల' పరిమాణాల్నీ (MP + L లను) లెక్కకట్టడం సహజంగా అవసరమే. కానీ, ఆ కొత్త 'ఉత్పత్తి' తయారయ్యాక, 'మొత్తం ఎంత శ్రమ' అనే లెక్క అసహజం.

'ధరని లెక్క కట్టడం' లోనే ఆ అసహజత్వం వుంది. 'మొత్తం శ్రమ'ని లెక్క కట్టాలంటే, పెట్టుబడిదారీ విధానంలో 'కొన్ని అంశాల్ని' కలిపినట్టే, నూతన విధానంలో కూడా 'కొన్ని అంశాల్ని' కలపాలి. ఆ అంశాల్లో, 'అదనపు శ్రమ' అనేది, 2 చోట్లా వుంటుంది. ఆ అంశాల స్వభావాలు అక్కడా ఇక్కడా ఎంత తేడాగా వున్నా, ఆ తేడాలు లెక్క లోకి రావు; 'అన్నిటినీ కలపడం' అనే ఆ విధానమే లెక్క లోకి వస్తుంది. కాబట్టి, అక్కడ జరిగేదీ, ఇక్కడ జరిగేదీ, ఒకటే అన్నట్టు కనపడుతుంది.

కానీ, ఏ విషయాన్నీ పై పైన చూడకూడదనీ, నిజ స్వభావాలు గ్రహించాలనీ, అర్థం చేసుకుంటే, 'ధర' ఎంత అసహజమైనది అయినా, 'నూతన సమాజపు ధర'లో వుండే అంశాల స్వభావాలూ, ఆ సంబంధాలూ సరి గానే అర్థమవుతాయి. అప్పుడు, 'రెండూ ఒకటే కదా? వెనకటి సమాజానికీ నూతన సమాజానికీ ఏమిటి తేడా?' అనే ప్రశ్నకి ఆస్కారం వుండదు. రెండూ ఒకటి కాదని తెలుస్తుంది.

అయితే, ఉదాహరణ కోసం, నూతన సమాజంలో కూడా 'ధర'ని నిర్ణయించడం పూర్తిగా పెట్టుబడిదారీ మార్కెట్ పద్ధతి లోనే, అంటే, 'పెట్టుబడి - మీద జనరల్ లాభం రేటుని కలిపే' పద్ధతిలో చేస్తారనుకుందాం. అలా జరిగితే, ఆ నూతన సమాజం, 'విలువ' గురించి, ఇంకా తప్పుడు అవగాహనల్లోనే వుందనీ, అక్కడ కార్మిక వర్గం ఇంకా ఏమీ నేర్చుకోలేదనీ అర్థం. నూతన సమాజం, కనీసం 'పెట్టుబడీ - లాభమూ' అనే మాటలనైనా మార్చలేదంటే, అక్కడ కార్మిక వర్గం, 'పెట్టుబడి' మీదా - 'లాభం' మీదా, ఏమీ ఆగ్రహం లేని స్థితి లోనే వుందని అర్థం.

ఇప్పుడు, పెట్టుబడిదారీ ధరకీ, నూతన సమాజపు ధరకీ సంబంధించిన లక్షణాలు కొన్నిటిని, ఒక పట్టిక రూపంలో చూద్దాం.

**సింపుల్ పునరుత్పత్తిలో, విలువ (లేదా, ధర):**

| పెట్టుబడిదారీ విధానం లో | నూతన విధానం లో |
|---|---|
| 1. కాస్టు ప్రైసు = C + V<br>విలువ = C + V + S<br>తక్కువ ఖర్చుతో, ఎక్కువ విలువ, ఉత్పత్తి అవుతుంది. | 1. కాస్టు ప్రైసు = $C + V + Sf^1$<br>విలువ = $C + V + Sf^1$<br>ఈ $Sf^1$, రెగ్యులర్ సోషల్ ఫండ్.<br>ఇక్కడ ఎంత ఖర్చయితే అంత విలువే ఉత్పత్తి అవుతుంది. |
| 2. కాస్టుప్రైసు కన్నా విలువ ఎక్కువ.<br>ఇక్కడ, 'అదనపు విలువ' ఉంటుంది.<br>అదనపు విలువ, శ్రమ చెయ్యని వర్గానికి. | 2. కాస్టు ప్రైసూ, విలువా సమానం.<br>అదనపు విలువ వుండదు. → |

| | |
|---|---|
| 3. V + S లలో,<br>V = పునరుత్పత్తి అయ్యే శ్రమ.<br>S = కొత్త శ్రమ | 3. V + $Sf^1$ లలో, రెండూ పునరుత్పత్తి అయ్యే శ్రమే. కొత్త శ్రమ ఉండదు. |
| 4. శ్రామికులు, V + S ల్ని ఇచ్చి, తమ కోసం, V ని మాత్రమే వాడతారు. | 4. ఉత్పత్తిదారులు V + $Sf^1$ ల్ని ఇచ్చి, తమ కోసం, ఆ రెంటినీ వాడతారు. V ని, కుటుంబ అవస రాల కోసమూ, $Sf^1$ ని, సమాజ బాధ్యతల కోసమూ. |
| 5. 'ధర'ని నిర్ణయించే విధానం: కాస్టుప్రైసు మీద (C + V ల మీద), 'లాభం వేసుకోవడం' పేరుతో, అదనంగా కొంత విలువ ని (S ని) కలపడం. కాస్టు ప్రైసు కన్నా ధర ఎక్కువ. | 5. 'ధర'ని నిర్ణయించే విధానం: C + V + $Sf^1$ ల కోసం అయిన ఖర్చులన్నిటినీ కలపడం. ఇదే కాస్టు ప్రైసూ, ఇదే ధరా. కాస్టు ప్రైసే ధర. |

విస్తృత పునరుత్పత్తిలో, విలువ (లేదా, ధర):

| **పెట్టుబడిదారీ విధానం లో** | **నూతన విధానం లో** |
|---|---|
| 1. కాస్టు ప్రైసు = C + V<br>విలువ = C + V + S<br>తక్కువ ఖర్చుతో ఎక్కువ విలువ. | 1. కాస్టు ప్రైసు = C + V + $Sf^1$<br>విలువ = C + V + $Sf^1$ + $Sf^2$<br>తక్కువ ఖర్చుతో, ఎక్కువ విలువ. |
| 2. V + S లలో,<br>V = పునరుత్పత్తి అయ్యే శ్రమ.<br>S = కొత్త శ్రమ.<br>ఈ S, యజమాని వర్గానికి. | 2. V + $Sf^1$ + $Sf^2$ లలో,<br>V + $Sf^1$ = పునరుత్పత్తి అయ్యే శ్రమ<br>$Sf^2$ = కొత్త శ్రమ<br>$Sf^1$ = రెగ్యులర్ సోషల్ ఫండ్<br>$Sf^2$ = అదనపు సోషల్ ఫండ్<br>$Sf^1$ లేకపోతే, ఉత్పత్తిదారులు, సామాజిక బాధ్యతలు నిర్వర్తించలేరు. $Sf^2$ లేకపోతే, అవస రమైనప్పుడు, ఉత్పత్తి సాధనాల్ని పెంచుకోలేరు. |
| 3. 'ధర'ని నిర్ణయించే విధానం: కాస్టుప్రైసు మీద (C + V ల మీద), 'లాభం వేసుకోవడం' పేరుతో, అదనంగా కొంత విలువని (S ని) కలపడం. | 3. 'ధర'ని నిర్ణయించే విధానం: కాస్టు ప్రైసు మీద . (C + V + $Sf^1$ ల మీద), అదనపు సోషల్ - ఫండ్‌ని ($Sf^2$) ని కలపడం. |
| 4. పెట్టుబడిదారీ ధర, అన్ని శాఖల పెట్టుబడులకూ సమాన లాభం రేటుని ఇచ్చే 'ఉత్పత్తి ధర'గా ఉంటుంది. ఏ శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ, ఆ శాఖ ధర లోకి చేరదు. | 4. నూతన సమాజపు ధర, 'సమాన లాభం రేటు' దృష్టితో ఏర్పడదు. ఇది, 'ఉత్పత్తి ధర'గా గాక, 'విలువ' గానే ఉంటుంది. ఏ శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ, ఆ శాఖ ధర లోకే చేరుతుంది. |

ఈ రకంగా, ఇలాంటి వివరాల ద్వారా, నూతన సమాజపు ధరని అర్థం చేసుకోవచ్చు.

నూతన సమాజ నిర్మాణం (పెట్టుబడిదారీ సమాజం రద్దు), అనేక దశల ద్వారా జరుగుతుంది. ప్రతీ దశ లోనూ ఆ దశకి సంబంధించిన కొత్త సమస్యలూ, వెనకటి నించీ కొనసాగే పాత సమస్యలూ అన్నీ, అడుగడుగునా ఎదురవుతూనే వుంటాయి. నూతన సమాజం, రెడీ మేడ్‌గా వుండదు. దాన్ని ఎవరో తయారుచేసి మన చేతికి ఇవ్వరు. నూతన సమాజపు ఆర్థిక సూత్రాలు కూడా రెడీ మేడ్‌గా వుండవు. 'విలువ'కి సంబంధించిన విషయాల్ని అర్థం చేసుకుంటూ 'విలువ' సూత్రం మీదే ఆధారపడుతూ, ఆ సూత్రాన్ని దోపిడీ వ్యతిరేక లక్ష్యంతో అన్వయిస్తూ, ఆ క్రమంలో దొరికే అనుభవాల్ని తీసుకుంటూ, ముందుకు సాగుతూ వుంటే, నూతన ఆర్థిక సూత్రాల్ని తప్పనిసరిగా అభివృద్ధి పరుచుకోగలం. ప్రతీ సమస్యలోనూ దోపిడీ లక్షణాల నించీ, పెట్టుబడిదారీ పోటీ నించీ, మార్కెట్ పద్ధతుల నించీ దూరం అవుతోన్న కొద్దీ, నూతన ఆర్థిక సూత్రాలు తప్పనిసరిగా అభివృద్ధి చెందుతాయి.

**ఇక్కడ మార్క్సు ఎంగెల్సుల నించి, 'నూతన సమా జానికి' సంబంధించిన అంశాల్ని వివరించే 22 కొటే షన్లు వున్నాయి. మన సందేహాలన్నిటికీ జవాబులు దొరుకుతాయి.**

1. "శ్రామిక వర్గం - ఆస్తిపర వర్గాల సమిష్టి శక్తికి వ్యతిరేకం గానూ, ఆస్తి పర వర్గాలు ఏర్పర్చుకున్న అన్ని పాత పార్టీలకూ భిన్నం గానూ, ఒక పార్టీని ఏర్పర్చితే తప్ప, అది ఒక వర్గంగా పని చేయజాలదు. ఈ రకంగా, శ్రామికవర్గం ఒక 'రాజకీయ పార్టీ'గా ఏర్పడడం అనేది - సామాజిక విప్లవ విజయమూ, దాని అంతిమ లక్ష్యమూ అయిన 'వర్గాల రద్దు' నిశ్చయం కావడానికి తప్పనిసరి షరతు" - మార్క్సు ఎంగెల్సులు [కలెక్టెడ్ వర్క్సు - 22, పేజీ 427]

2. "సోషలైజ్డ్ ప్రొడక్షన్ విషయంలో, 'డబ్బు పెట్టుబడి' రద్దవుతుంది. సమాజం - శ్రమ శక్తినీ, ఉత్పత్తి సాధనాలనూ, వేరు వేరు శాఖలకు పంపిణీ చేస్తుంది. ఉత్పత్తిదారులు అన్ని విషయాలకూ పేపర్ వోచర్లు పొందుతారు. వారు తమ శ్రమ కాలానికి తగిన పరిమాణంలో, 'వినియోగ వస్తువుల సోషల్ సప్లై'లో నించి తీసుకోవడానికి ఈ వోచర్లు హక్కునిస్తాయి. కానీ ఈ వోచర్లు డబ్బు నోట్లు కావు; డబ్బుగా చలామణీ కావు." [కాపిటల్- 2, పేజీ 362, మాస్కో.]

3. ".... వేతనాలూ, అదనపు విలువా - అంటే, అవసర శ్రమా, అదనపు శ్రమా. ఈ రెంటికీ వుండే పెట్టుబడిదారీ స్వభావాన్ని వూడగొట్టినట్టయితే, అప్పుడు తప్పనిసరిగా వుండేవి ఈ 'రూపాలు' కావు. కేవలం వాటి ప్రాథమిక రూపాలు (రూడిమెంట్స్) మాత్రమే - ఏవైతే అన్ని రకాల సామాజిక ఉత్పత్తి విధానాలకూ ఉమ్మడిగా వుంటాయో అవీ!" [కాపిటల్-3, పేజీ 876, మాస్కో.]

4. ".... పెట్టుబడిదారీ విధానం నించి అసోసియేటెడ్ ఉత్పత్తి విధానానికి మార్పు చెందే పరివర్తనా దశలో, క్రెడిట్ విధానం, శక్తివంతమైన లీవర్‌గా పని చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఉత్పత్తి విధానంలో జరిగే ఇతర పెద్ద ఆర్గానిక్ విప్లవాలతో సంబంధంలో వున్న ఒక అంశంగా మాత్రమే అది వుంటుంది. .... క్రెడిట్టూ బ్యాంకింగుల మహా మహిమాన్విత శక్తిని గురించిన భ్రమలన్నీ, సోషలిస్టు అర్థంలో చెప్తే, పెట్టుబడిదారీ విధానం గురించీ, దాని రూపాల్లో ఒకటైన క్రెడిట్ విధానం గురించీ బొత్తిగా తెలియనితనం వల్లనే పుట్టుకొస్తాయి. <u>ఉత్పత్తి సాధనాలు 'పెట్టుబడి'గా వుండడం ఆగిపోయిన వెంటనే (భూమిపై స్వంతాస్తి రద్దు కూడా దీనితో ఇమిడి వుంది), క్రెడిట్టుకి ఎటువంటి అర్థమూ వుండదు</u> .... పెట్టుబడిదారీ విధానం ఉనికిలో కొనసాగినంత కాలమూ, దాని రూపాల్లో ఒకటిగా క్రెడిట్ విధానం కూడా ఉనికిలో వుంటుంది" [ కాపిటల్ - 3, పేజీ 607.]

(అంటే, సమాజంలో క్రెడిట్ విధానం వున్నంత కాలమూ, పెట్టుబడిదారీ విధానమే ఏదో ఒక రూపంలో కొనసాగుతూ వున్నట్టు అర్థం.)

5. ".... ఇది (ట్రేడ్ యూనియన్) శ్రామిక వర్గపు నిజమైన వర్గ సంస్థ. దీని ద్వారానే శ్రామిక వర్గం 'పెట్టుబడి'తో రోజు వారీ పోరాటాలు సాగిస్తుంది. దీని ద్వారానే శిక్షణ పొందుతుంది." - ఎంగెల్స్ [సెలెక్టెడ్ కరస్పాండెన్స్, పేజీ 275, మాస్కో 1975]

6. " పెట్టుబడిదారీ విధానం గురించి సరైన జ్ఞానం కలిగి వుండడమే ప్రాక్టికల్ సోషలిజం. .... ఈ విషయంలో ఏది ఏమిటో గ్రహించే కార్మిక వర్గం, తను ప్రధానంగా ఎదుర్కోవలసిన సామాజిక సంస్థలు ఏవీ, ఆ ఎదుర్కోవడం ఏ పద్ధతిలో చెయ్యాలీ - అనే విషయాల గురించి సందేహంలో వుండదు" - ఎంగెల్స్ [హౌజింగ్ క్వశ్చెన్, పేజీ 100]

7. ".... రాజకీయ ఆర్థిక శాస్త్రం (పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం) ఒక సైన్సుగా ఎంత కాలం వరకూ

మాత్రమే వుండగలదంటే, 'వర్గ పోరాటం' అనేది, గర్భితంగానూ, విడి విడి గానూ, చెదురు మదురు గానూ వుండే అంశాలుగా ఎంత కాలం వరకూ బహి ర్గత మవుతుందో అంత కాలం వరకూ మాత్రమే"

[కాపిటల్ -1, పేజీ 24, మాస్కో 1974].

('వర్గ పోరాటం' అనేది గర్భితంగా గాక, బహిర్గతం గానూ, విడి విడి సంఘటనలుగా గాక పరస్పర సంబం ధాల తోనూ; చెదురు మదురుగా గాక ధారావాహికం గానూ సాగుతూ వుంటే, 'పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం' ఒక శాస్త్రంగా నిలబడ లేదని అర్థం. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం చెప్పే విషయాలన్నీ తప్పులనీ, అసత్యా లనీ, కార్మిక వర్గం గ్రహించకుండానూ, దాని మీద పోరాడకుండానూ వున్నంతవరకే అది గొప్ప శాస్త్రంగా చలామణీ అవుతూ వుంటుందని అర్థం! కార్మిక వర్గానికి, ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన నిజమైన విష యాలన్నీ తెలిస్తే, పెట్టుబడిదారీ ఆర్థిక సూత్రాల బండారం బయట పడుతుంది.)

8. "**వే**రు వేరు తరహాల శ్రమ శక్తుల్ని ఉత్పత్తి చేసేటందుకు అయ్యే ఖర్చులు వేర్వేరుగా వుంటాయి. అందుచేతనే వేరు వేరు ఉత్పత్తుల్లో ఉండే శ్రమ శక్తుల విలువలు తేడాగా వుంటాయి. కాబట్టి జీతాలు సమానంగా వుండాలనడం పొరపాటు. అది ఎన్నటికీ సాధించలేని పగటి కల .... సమాజంలో 'జీతాల పద్ధతి' అనేది వుండగా, సమాన ప్రతిఫలం రావాలనీ, కనీసం న్యాయమైన ప్రతిఫలం రావాలనీ కోరడ మంటే, బానిస విధానం మీద ఆధారపడుతూ బానిస లకు స్వతంత్రం వుండాలని కోరడమే" [ "జీతాలూ, ధరా, లాభం; కూలి పనీ, పెట్టుబడీ." మార్క్సిస్టు ప్రచురణలు, విజయవాడ, పేజీ 14]

9. ".... **క**మ్యూను (పారిస్ కమ్యూను) 'వర్గ ప్రభుత్వపు కొత్త రూపాన్ని' కనుక్కోలేకపోయింది. ఉనికిలో వున్న అణచివేత పరిస్తితులను నాశనం చేసే టప్పుడు, శ్రమ సాధనాలన్నిటినీ శ్రామికులకు బదలా యించడం ద్వారానూ, శ్రమ చేయగలిగే ప్రతీ వ్యక్తీ శ్రమ లోకి రావడాన్ని తప్పనిసరి చేయడం ద్వారానూ, వర్గ పాలనకూ వర్గ అణిచివేతకూ వున్న 'ఏకైక పునాది' రద్దవుతుంది. అయితే, అలాంటి మార్పు రావడానికి ముందు, 'శ్రామిక నియంతృత్వం' తప్పనిసరి అవు తుంది. దాని కోసమై మొదటి షరతు - శ్రామిక వర్గ సైన్యం! శ్రామిక వర్గాలు (వర్కింగ్ క్లాసెస్) తమని తాము విముక్తి చేసుకునే హక్కుని, యుద్ధ రంగంలో మాత్రమే గెలుచుకోవలసి వుంటుంది. రాబోయే పోరా టానికి, శ్రామిక శక్తులను ఆర్గనైజ్ చేయడమూ, ఏకం చేయడమూ అనేది 'అంతర్జాతీయ శ్రామిక సంస్థ' కర్తవ్యం" - మార్క్సు ఎంగెల్సులు

[ కలెక్టెడ్ వర్క్సు-22, పేజీ 634, మాస్కో 1986]

10. ".... **అ**దే విధంగా గ్రామానికీ పట్టణానికీ వున్న వైరుధ్యం కూడా అదృశ్య మవుతుంది. వ్యవ సాయ శ్రమనీ - పారిశ్రామిక శ్రమనీ, వేరు వేరు సెక్షన్లు చేయడానికి బదులు, ఒకే జనం చెయ్యడం - 'కమ్యూనిస్టు అసోసియేషన్'కి తప్పనిసరి షరతు." - ఎంగెల్సు [ప్రిన్సిపుల్సు ఆఫ్ కమ్యూనిజం,

కలెక్టెడ్ వర్క్స్ - 6, పేజీ 354, మాస్కో, 1976]

11. ".... **ఈ** పారిశ్రామిక విప్లవం మానవ శ్రమ సాధించే ఉత్పాదక శక్తిని ఎంతగా అభివృద్ధి పరిచిందీ అంటే, మానవ చరిత్రలో మొట్టమొదటి సారి ఒక అవకాశం కలిగింది. ఏమిటంటే, అందరి మధ్యా 'హేతుబద్ధమైన శ్రమ విభజన'ను ఏర్పర్చినట్టయితే, సమాజ సభ్యులందరూ కావలసినంత వాడుకోవడా నికీ, సమృద్ధి అయిన రిజర్వ్ ఫండ్‌కీ, ఈ రెంటికీ కావలసినంత ఉత్పత్తి చేసుకోగలగడమే గాక, ప్రతీ వ్యక్తికీ తగినంత విరామం కూడా దొరుకుతుంది. ఎంత విరామం అంటే, చారిత్రకంగా సంక్రమించిన సంస్కృతీ, సైన్సూ, కళలూ వగైరాల్లో నిజంగా నిలుపు కోవలసినంత విలువ గల వాటిని (రియల్లీ వర్త్ ప్రిజ ర్వింగ్) నిలుపుకోవడమే గాక, వాటిని పాలక వర్గ గుత్తాధిపత్యం నించి మొత్తం సమాజపు సంపదగా మార్చడానికీ, మరింత అభివృద్ధి పరచడానికీ వీలు నిచ్చేంత విరామం వుంటుంది" - ఎంగెల్స్

[హౌజింగ్ క్వశ్చెన్, పేజీ 26, మాస్కో.]

12. ".... **మొ**త్తం 'జీతాల వ్యవస్థ'లో వున్న బానిసత్వాన్ని అలా వుంచుదాం. ఈ దైనందిన పోరా టాలు చివరికి ఎలా పరిణమిస్తాయనే విషయంపై కార్మిక వర్గం మరీ అతిశయ భావాలకు పోకూడదు. తాము పోరాడుతున్నది ఫలితాలకు వ్యతిరేకంగా మాత్రమే ననీ, వాటికి గల కారణాలకు వ్యతిరేకంగా కాదనీ, వారు మరిచిపోకూడదు .... తాము పరిస్తితుల్ని దిగ జారకుండా నిరోధిస్తున్నామే గానీ, అసలు మార్గాన్ని మార్చడం లేదనీ, వ్యాధి ఉగ్రతను తగ్గించ డానికి ప్రయత్నిస్తున్నామే గానీ వ్యాధిని నిర్మూ లించడం లేదనీ, వారు గ్రహించాలి. కాబట్టి, పెట్టుబడి దారులు నిరంతరం చేసే దాడుల నుంచీ, లేదా

మార్కెట్టు ఎగుడు దిగుడుల నుంచీ, ఉత్పన్నమయ్యే అనివార్య మైన గెరిల్లా పోరాటాల లోనే వారు పూర్తిగా నిమగ్నులై వుండకూడదు .... 'న్యాయమైన పని దినానికి న్యాయ మైన జీతం' అనే మితవాద నినాదం స్థానే వారు తమ పతాకం మీద 'జీతాల పద్ధతే రద్దు' అనే విప్లవకర నినాదాన్ని చిత్రించుకోవాలి! ...... ట్రేడ్ యూనియన్లు, పెట్టుబడిదారుల దాడుల్ని ప్రతిఘటించే కేంద్రాలుగా పని చేస్తాయి. అవి, తమ శక్తిని సరిగా వినియోగించక పోతే, కొంత వరకూ పరాజయం పొందుతాయి. నేటి ఆర్థిక వ్యవస్థ యొక్క దుష్ఫలితాలకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు సాగించడం తోనే అవి సంతృప్తి చెందితేనూ; ఆ పోరాటాలను నిర్వహిస్తూనే మొత్తం వ్యవస్థను మార్చేందుకు కూడా పోరాడక పోతేనూ; తమ అంతిమ విముక్తిని సాధించేందుకై, అంటే ఉత్త రోత్తరా 'జీతాల వ్యవస్థనే' కూల దోసేందుకై తమ సంఘటిత శక్తిని ఉపయోగించక పోతేనూ - ట్రేడ్ యూనియన్లు, సాధారణంగా పరాజయం పొందు తాయి" - మార్క్స్

[ "జీతాలూ, ధరా, లాభం ..." పేజీ 41 - 42.]

13. ....పెట్టుబడిదారీ సమాజం నుంచి అప్పుడప్పుడే బయటపడిన 'కమ్యూనిస్టు సమాజ ప్రథమ దశ'లో ఈ లోపాలు అనివార్యం. 'హక్కు' అనేది, సమాజ ఆర్థిక వ్యవస్థనూ, అందుమూలంగా నిర్ణయమయ్యే సాంస్కృతిక అభివృద్ధినీ, తలదన్ని మీరిపోజాలదు. వ్యక్తులు, 'శ్రమ విభజన'కు బానిసలై ఎటువంటి పరాధీన స్థితిలో వున్నారో ఆ స్థితి అదృశ్యమవడంతో పాటుగా, మానసిక, శారీరక శ్రమల మధ్య గల వైరుధ్యం కూడా అదృశ్యమై, 'శ్రమ' అనేది వట్టి బ్రతుకుదెరువు గానే గాక, ప్రధాన జీవితావసరంగా పరిణమించి; సర్వతో ముఖమైన వ్యక్తి అభివృద్ధికి తోడుగా, ఉత్పత్తి శక్తులు కూడా పెంపొంది; సహకారాత్మక సంపద సెలయేళ్ళన్నీ మరింత నిండుగా మెండుగా ప్రవహించ గల కమ్యూనిస్టు సమాజ ఉన్నత దశలో మాత్రమే, అప్పుడు మాత్రమే, బూర్జువా హక్కుకి గల సంకుచిత దిజ్మండలాన్ని పూర్తిగా దాటి, 'ఎవరెవరి శక్తుల్ని బట్టి వారి నుంచీ, ఎవరెవరి అవసరాల్ని బట్టి వారికీ' అనే మాటలను, సమాజం, తన మహాధ్వజం మీద లిఖించుకోగలదు" - మార్క్స్, [గోథా కార్యక్రమం, పేజీ 53 - 54, సామ్యవాద సాహితి ప్రచురణ, 1977.]

14. "వ్యక్తి ఏదో ఒక ప్రత్యేక కళకి లోబడి వుండడం, అంటే - కేవలం పెయింటర్ (చిత్రకారుడు) గానో, కేవలం 'శిల్పి' గానో వుండడం, కమ్యూనిస్టు సమాజంలో రద్దవుతుంది. ఈ సమాజంలో కేవలం 'పెయింటర్లు'గా వుండే వారు వుండరు. కానీ, ఇతర పనులతో పాటు పెయింటింగ్ పని కూడా చేసే వారు వుంటారు" - మార్క్స్, ఎంగెల్సులు

[జర్మన్ ఐడియాలజీ, పేజీ 416.]

15. "వర్గ శతృత్వం మీద నిలిచిన ప్రతీ సమాజానికీ ప్రధానమైన షరతు, అణచివేతకు గురి అయ్యే వర్గం వుండడం. ఆ వర్గ విముక్తిలో, 'నూతన సమాజ సృష్టి' అనే అర్థం తప్పనిసరిగా ఇమిడి వుంది. శ్రామిక వర్గ విముక్తికి ఒక షరతు ఏమిటంటే, ప్రతీ వర్గ విముక్తీ! .... శ్రామిక వర్గం, తన అభివృద్ధి క్రమంలో పాత పౌర సమాజం స్థానంలో వర్గాలూ, వాటి శతృత్వాలూ లేని 'అస్సోసియేషన్'ని ఏర్పరుస్తుంది. అక్కడ, 'రాజకీయాధికారం' అనేదేమీ వుండదు. ఎందుకంటే, రాజకీయాధికారం అనేది, సమాజపు శతృత్వాలకు అధికారిక వ్యక్తీకరణే కాబట్టి. 'సామాజిక ఉద్యమం' అనే దాంట్లో, 'రాజకీయ ఉద్యమం' వుండదని అనకండి. 'సామాజికం కాని రాజకీయ ఉద్యమం' ఎన్నడూ వుండదు" - మార్క్స్ [పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, పేజీ 151 - 52, మాస్కో, 1966.]

16. "కమ్యూనిస్టులు స్త్రీలను సమిష్టి ఆస్తిగా చేస్తారో" అని బూర్జువా లందరూ ఒకే గొంతుతో పొలికేకలు పెడుతున్నారు. బూర్జువాకు, తన భార్య, కేవలం ఉత్పత్తి సాధనంగా మాత్రమే కనపడుతుంది. అందుకే, 'కమ్యూనిస్టులు, ఉత్పత్తి సాధనాలను సమిష్టిగా ఉపయోగిస్తారనే' మాట బూర్జువా చెవిన పడగానే, స్త్రీలకు కూడా అదే జరుగుతుందని అతను నిర్ణయించుకుంటాడు .... స్త్రీలు కేవలం ఉత్పత్తి సాధనాలుగా (సంతానోత్పత్తి సాధనాలుగా) వుండే దుస్థితిని రద్దు చేయడమే మా అసలు లక్ష్యమ'ని బూర్జువాకు కించిత్తు అనుమానమైనా రాదు. కమ్యూనిస్టులు బహిరంగం గానూ, శాసన రీత్యానూ, స్త్రీలను 'సమిష్టి ఆస్తి'గా చేస్తారనే మాటని తామే కల్పించి, ఆ కల్పన మీద ధార్మిక పరాయణుల మాదిరి ఆగ్రహోదగ్రులయ్యే ఈ బూర్జువాల ప్రవర్తన కంటే అసహ్యాకరమైనది మరొకటి వుండదు. కమ్యూనిస్టులు, స్త్రీలను సమిష్టి ఆస్తిగా చేయవలసిన అవసరమేమీ కొత్తగా లేదు. అది పాత సమాజాల నించీ వుంటూనే వుంది.

బూర్జువాలు, బజారు వేశ్యల మాట అటుంచి,

తమ చేతి కింది కార్మికుల పెండ్లాలూ కూతుళ్ళూ తమ అభిష్టాను వర్తులయ్యేది చాలక, ఒకరి పెండ్లాలతో ఒకరు ఆనందాలు పొందుతారు. బూర్జువా వివాహ వ్యవస్థే నిజానికి 'సమిష్టి పెండ్లాల' వ్యవస్థ. కాబట్టి కమ్యూనిస్టుల మీద బూర్జువాలు నింద వేయదలుచు కుంటే, మహా అయితే, బూర్జువాలు రహస్యంగా సాగించే కపట నాటకాన్ని కమ్యూనిస్టులు బహి రంగంగా చట్టబద్ధం చెయ్యగోరుతున్నారని మాత్రమే నిందవేయగలరు. కానీ, చెప్పవలసిందేమిటంటే, ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ రద్దు కావడం తోనే, అందులో నుంచి ఉత్పన్నమైన సమిష్టి భార్యా వ్యవస్థ కూడా, అనగా బహిరంగ వేశ్యా వృత్తీ, రహస్య వేశ్యా వృత్తీ - రద్దు అవుతుంది అనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది." మార్క్సు ఎంగెల్సులు [కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ 64 - 65, మాస్కో.]

17. "ఆర్థిక కారణాల నించే 'మోనోగమీ' తల ఎత్తింది కాబట్టి, ఆ కారణాలు అదృశ్యమైనప్పుడు 'మోనోగమీ' కూడా అదృశ్యమవుతుందా? .... అదృశ్య మవడం కాదు, అది సంపూర్ణమైన వాస్తవంగా మారడం ప్రారంభమవుతుంది. ఉత్పత్తి సాధనాలు 'సామాజిక ఆస్తి'గా మారడంతో, 'వేతన శ్రమ' కూడా, అంటే 'కార్మిక వర్గం' కూడా అదృశ్యమవుతుంది. దానితో పాటు కొంత మంది స్త్రీలు డబ్బు కోసం లొంగిపోవాల్సిన అవసరం కూడా అదృశ్యమవుతుంది. వ్యభిచారం అదృశ్యమవుతుంది. 'మోనోగమీ'యేమో క్షీణించడం గాక, చివరికి పురుషుల విషయంలో కూడా వాస్తవం అవుతుంది" - ఏంగెల్స్ [ది ఆరిజన్ ఆఫ్ ది ఫామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ, అండ్ ది స్టేట్, పేజీ 75 - 6, మాస్కో, 1972.]

18. "ఒక వ్యక్తి మీద మరొక వ్యక్తి చేసే దోపిడీ ఏ మేరకు అంతరిస్తుందో ఆ మేరకు, ఒక జాతి మీద మరొక జాతి చేసే దోపిడీ కూడా అంతరిస్తుంది. ఒక జాతి లోని భిన్న వర్గాల మధ్య వైరుధ్యం ఏ మేరకు అంతరిస్తుందో ఆ మేరకు, ఒక జాతికీ, వేరొక జాతికీ మధ్య శతృత్వం కూడా అంతరిస్తుంది" - మార్క్సు ఎంగె ల్సులు [ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, పేజీ 65.]

19. "భారతీయుల లోనూ, ఈజిప్టు వాసుల లోనూ శ్రమ విభజన ఎప్పుడైతే మొరటు రూపంలో కనిపించిందో, ఆ మొరటు రూపం ఎప్పుడైతే వారి రాజ్యాంగ యంత్రం లోనూ మతం లోనూ 'కుల వ్యవస్థను' ముందుకు తెచ్చిందో, అప్పుడు చరిత్ర కారుడు ఏం నమ్మాడంటే, కుల వ్యవస్థే ఆ మొరటు సామాజిక రూపాన్ని సృష్టించిన శక్తి - అని!" - మార్క్సు ఏంగెల్సులు [జర్మన్ ఐడియాలజీ, పేజీ 63.]

(శ్రమ విభజనే కుల వ్యవస్థను తెచ్చిందని గాక, కుల వ్యవస్థే శ్రమ విభజనను తెచ్చిందని చరిత్ర కారులు భావిస్తున్నారనీ, అది తప్పనీ - దీని అర్థం.)

20. "కమ్యూనిజం సూత్రాలలో అత్యంత ప్రధానమైన సూత్రం, ఏదైతే అన్ని రకాల అభివృద్ధి వ్యతిరేక సోషలిజాల నించీ కమ్యూనిజాన్ని వేరుపరచి చూపుతుందో ఆ సూత్రం, మనిషి సహజత్వానికి సంబంధించిన జ్ఞానం మీద ఆధారపడినది. అది ఏమి టంటే - మెదడు లోనూ, మేధా శక్తి లోనూ వుండే తేడాలు, పొట్ట లోనూ శారీరక అవసరాల లోనూ కూడా తేడాలు వున్నట్టు అర్థాన్ని ఇవ్వవు. కాబట్టి, ఉనికిలో వున్న పరిస్తితుల మీద ఆధారపడి ఏర్పడిన 'ఎవరి శక్తి కొద్దీ వారికి' అనే తప్పుడు భావనని 'ఎవరి అవసరం కొద్దీ వారికి' అనే సరైన భావనగా మార్చాలి". - మార్క్సు ఏంగెల్సులు [జర్మన్ ఐడియాలజీ, పేజీ 566.]

21. ".... ఏ పరిస్థితులలో నైతే 'సంబంధాలు' అనేవి, వ్యక్తుల నించీ స్వతంత్రంగా వుంటాయో; ఏ పరిస్తితులలో నైతే 'వ్యక్తిత్వం' అనేది, అవకాశానికి లోబడి వుంటుందో; ఏ పరిస్తితులలో నైతే వ్యక్తుల పరస్పర సంబంధాలు, వర్గ సంబంధాలూ వగైరాలకు జనరల్‌గా లోబడి వుంటాయో - అలాంటి ప్రస్తుత పరిస్తితులు రద్దు కావడమనేది - అంతిమంగా 'శ్రమ విభజన' రద్దు చేత నిర్ణయ మవుతుంది .... 'స్వంత ఆస్తి రద్దూ, శ్రమ విభజన రద్దూ' అనేది - ఆధునిక ఉత్పత్తి శక్తుల చేతా, ప్రపంచ సంబంధాల చేతా ఏర్పడే పునాదిపై నిలిచే వ్యక్తుల సమాఖ్యే. (అసోసి యేషన్ ఆఫ్ ఇండివిడ్యువల్)" - మార్క్సు ఎంగెల్సులు [జర్మన్ ఐడియాలజీ, పేజీ 465, మాస్కో 1976.]

22. "శ్రామిక వర్గాల విముక్తిని శ్రామిక వర్గాలే సాధించుకోవాలి. 'శ్రామిక వర్గాల విముక్తి కోసం పోరాటం' అంటే, అది వర్గ ప్రత్యేక సౌకర్యాల కోసమూ, వర్గ గుత్తాధిపత్యం కోసమూ కాదు. సమాన హక్కులూ - సమాన బాధ్యతల కోసమూ; వర్గ పాలన లకు సంబంధించిన సమస్తాన్నీ రద్దు చెయ్యడం కోసమూ, జరిగే పోరాటం" - మార్క్సు [సెలెక్టెడ్ వర్క్సు - 2, పేజీ 19, మాస్కో, 1973.] ★

# 4. మార్క్సిజం 'ఆర్థిక శాస్త్రమే' కాదు, 'తత్వ శాస్త్రం' కూడా!

'తత్వం' అంటే - సిద్ధాంతం. అవగాహన.
దేన్ని గురించిన సిద్ధాంతం? అవగాహన?
'ప్రకృతి'ని గురించినదీ, 'సమాజాన్ని' గురించి నదీ.

మనుషులు - 'ప్రకృతి' లోనూ, 'సమాజం' లోనూ కూడా జీవిస్తారు. ప్రతీ మనిషికీ, బాల్యం నించీ మరణం వరకూ, 'ప్రకృతి' గురించి అయినా, 'సమాజం' గురించి అయినా, ఏదో ఒక అవగాహన వుంటుంది. ఆ అవగాహన, కుటుంబ పెద్దల ద్వారానూ, సమాజం లోని ఇతర సంబంధాల ద్వారానూ, అందుతుంది.

'ప్రకృతి' గురించీ, 'సమాజం' గురించీ ఏర్పడే అవగాహనే, 'తత్వ శాస్త్రం'గా ('ఫిలాసఫీ'గా) ప్రారంభ మైంది. అంటే, 'తత్వ శాస్త్రం' అనేది, ప్రకృతీ సమాజాల గురించి ఏదో ఒక అవగాహనని ఇచ్చేదిగా వుంటుంది, ఆ విషయాలు బోధించే 'తత్వ వేత్త'కి ఏ అవగాహన వుంటే ఆ అవగాహనని! తత్వ వేత్తల అవగాహనలు వేరు వేరుగా వుంటే, తత్వ శాస్త్రాలు కూడా వేరు వేరుగా వుంటాయి.

'ప్రకృతి' గురించి ప్రధానమైన ప్రశ్న:
సృష్టి కర్త వున్నాడా, లేడా - అనేది.
సృష్టి కర్త లేడు - అనేది భౌతిక వాదం (మెటీరియలిజం).
సృష్టి కర్త వున్నాడు - అనేది భావ వాదం (ఐడియ లిజం).

సృష్టి కర్త వున్నాడో లేడో మనకు అనవసరం - అనేది అజ్ఞేయవాదం (ఎగ్నాస్టిసిజం).

మూడో వాదం, మొదటి వాదానికే దగ్గిరిగా వున్నట్టు అనుకుంటే, అప్పుడు ఆ మూడో వాదం లేనట్టే లెక్క. లేదా, ఆ మూడో వాదం, రెండో వాదానికే దగ్గిరిగా వున్నట్టు అనుకుంటే, అప్పుడు కూడా ఆ వాదం లేనట్టే లెక్క. అంటే, అసలు వివాదం అంతా, 1వ, 2వ వాదాల మధ్యనే వుంటుంది. అంటే, 'సృష్టి కర్త ఉన్నాడా, లేడా' అనే వాదాల మధ్యే. మూడో వాదం ఏదీ లేనట్టే అర్థం.

మొదటి 2 వాదాలూ వేల సంవత్సరాల నించీ కూడా వున్నాయి, దేని ధోరణితో అది సాగుతూ వున్నాయి.

**భౌతిక వాదం:** 'ప్రకృతి'కి భగవంతుడనే సృష్టి కర్త ఎవరూ లేరు. ప్రకృతి భౌతికమైనది. భూతం = పదార్థం = మేటర్. ప్రకృతి, పదార్థ సంబంధమైనది; సహజమైనది. పదార్థం, ఒక రూపం నించి ఇంకో రూపానికీ, ఒక ధర్మం నించి ఇంకో ధర్మానికీ, మారడమే జరుగుతూ వుంటుంది. అంతేగానీ, పదార్థం పూర్తిగా అంతర్థానమై పోవడం గానీ, 'శూన్యం' నించి కొత్త పదార్థం ఉద్భవించడం గానీ, జరగవు. పదార్థానికి పుట్టుకా నాశనమూ వుండవు. ఆదీ, అంతమూ వుండవు. 'పదార్థం మొట్ట మొదట ఎలా వచ్చింది?' అనే ప్రశ్నకి జవాబు - 'మొట్ట మొదట - అనేది లేదు' అని! 'శూన్యం నించి ఏమీ రాదు' అనే తర్కమే సరైనది అయితే, 'పదార్థం, మొట్ట మొదట శూన్యం నించి ఫలానా రకంగా వచ్చింది' అని నిర్ధారించడానికి వీలు వుండదు - కాబట్టి, 'పదార్థం ఎప్పుడూ వుంది' అనేదే సరైన జవాబు. కానీ, రూపాలూ, ధర్మాలూ మారుతూ! భూమి కూడా కొంత కాలానికి తన రూపం నించి మారిపోతుంది. సూర్యుడూ చంద్రుడూ కూడా తమ రూపాల నించి మారిపోతారు. కానీ, మారిన తర్వాత కూడా ఆ పదార్థంలో ఏ అంశమూ అంతర్థానమై పోదు. కొన్ని గ్రహాలు నశించి పోతోంటే, కొన్ని కొత్త గ్రహాలు ఏర్పడుతూ వుంటాయి. కొన్ని నక్షత్రాలు చిన్నా భిన్నమై పోతోంటే, కొన్ని కొత్త నక్షత్రాలు రూపొందుతూ వుంటాయి. ఈ మార్పులు పదార్థ ధర్మాల వల్లనే జరుగుతూ వుంటాయి.

'ఈ ప్రకృతి అంతా భగవంతుడి వల్లనే వచ్చింది' అనేటట్టయితే, అప్పుడు 'భగవంతుడు దేని వల్ల వచ్చాడు?' అనే ప్రశ్న వస్తుంది. 'భగవంతుడు దేని వల్లా రాలేదు. అతడు ఎప్పుడూ వున్నాడు' అనేటట్టయితే, అప్పుడు భగవంతుడు కూడా ప్రకృతే అవ్వాలి.

అది, 'మహిమలు గల భగవంతుడు' అవదు. ఎప్పుడూ ఉన్నది ఏదైనా, 'ప్రకృతే'. ఉనికిలో వున్నది ఏదైనా 'ప్రకృతే'.

'ప్రకృతి'లో ఏ అంశమైనా, రుజువులకు దొరుకుతుంది. ఉనికిలో వున్నది ఏదైనా, రుజువులకు దొరకాలి. భగవంతుడు నిజంగా వున్నట్టయితే, తప్పనిసరిగా రుజువు కావాలి. కానీ, భగవంతుడి గురించి ఏ రుజువులూ వుండవు.

పదార్థానికి, పదార్థ ధర్మాలే గానీ దాని అతీత ధర్మాలు వుండవు. 'భగవంతుడు' అనే భావం, పదార్థ ధర్మాలకు అతీతమైనది. పదార్థ ధర్మాలతో కూడిన ప్రకృతిలో, ఆ ధర్మాలకు అతీతమైనది వుండగలగడమూ, అది 'ప్రకృతి'ని సృష్టించడమూ, అర్ధ రహితాలు. సృష్టి కర్త అనేది అసహజమూ, హేతు విరుద్ధమూనూ.

**భావ వాదం:** 'మొదట ఈ సృష్టి లేదు. భగవంతుడే వున్నాడు. భగవంతుడు ఎలా వచ్చాడనే ప్రశ్నకి అర్థం లేదు. భగవంతుడు మహా మహిమాన్వితుడు. ఆ మహిమాన్వితుడు, మొదట తనని తను సృష్టించుకుని, తర్వాత ఈ ప్రకృతినీ, ఈ జీవ రాసుల్నీ సృష్టించి పాలిస్తున్నాడు. భగవంతుడు ప్రకృతి ధర్మాలకు అతీతుడు' - ఈ రకంగా వుంటుంది ఈ వాదం.

"భగవంతుడికి అతీత శక్తులు ఎందుకు వుంటాయంటే, ఆయన భగవంతుడు కదా?" అంటారు. ఆ జవాబు లోనే కావలసినంత తర్కం వున్నట్టుగా ఈ వాదం భావిస్తుంది.

ఈ వాదానికి సంబంధించిన తత్వవేత్తల్లో కొందరు, 'భగవంతుడి' స్థానం లోకి, క్రమంగా 'భావం, చైతన్యం, ఆత్మ, ఆలోచన' అనే పదాలు తెచ్చిపెట్టారు.

"విశ్వాని కన్నా ముందే 'విశ్వాత్మ' వుంది. 'అఖండ భావం' వుంది. విశ్వ చైతన్యానికి ప్రతి బింబమే ఈ విశ్వం. ఇది, 'ప్రతిబింబమే' గానీ వాస్తవం కాదు" - ఇలాగ.

"ఇది, ప్రతి బింబమే అయితే, ఈ ప్రతి బింబాన్ని ఇచ్చే అసలు వాస్తవం ఎక్కడ వుంది? అది ఎలా వచ్చింది?" అనే ప్రశ్నలకు ఈ వాదంలో జవాబు దొరకదు. అసలు వాస్తవం ఎక్కడ వుందో చెప్పరు. అది కనపడదు. ఎంత సేపూ ప్రతిబింబమే కనపడుతుంది.

"ఈ ప్రపంచాన్ని భగవంతుడే సృష్టించాడు" అని సూటిగా చెప్తే, ఆ వాదంతో ఏకీభవించినా ఏకీభవించక పోయినా, ఆ వాదం ఏం చెపుతోందో అర్థం చేసుకోవడం చాలా తేలిక. ఆ వాదాన్ని వినగానే 'భగవంతుడు అర్ధ రహితం' అనే అర్థానికి తేలిగ్గా రాగలం. కానీ, 'విశ్వాత్మ, అఖండ భావం' లాంటి మాటలతో సాగే వాదాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఇది ఎలాంటి కష్టం అంటే, అర్ధ రహితమైన దాన్ని అర్థం చేసుకోవడానికి కలిగే కష్టం. ఇక్కడ, 'ఇది అర్ధ రహితం' అనే అర్థానికి తేలిగ్గా రాలేం, అది అర్థమే అవదు గనక.

నిజానికి, 'విశ్వాత్మ' అన్నా, 'అఖండ భావం' అన్నా కూడా, భగవంతుడే. కానీ, 'భౌతిక వాదం' అభివృద్ధి అవుతోన్న ప్రపంచంలో, 'భగవంతుడు' అనే మాట, మరీ పురాతనం గానూ, సందేహాస్పదం గానూ తయారవుతోంది కాబట్టి, అంత కన్నా గొప్ప జ్ఞానం కనిపెట్టినట్టుగా ఈ కొత్త మాటలు తెచ్చి పెట్టారు. ఈ మాటలు కనిపెట్టిన వాళ్ళు చేసిందేమిటంటే, భగవంతుడికి మారు పేర్లు పెట్టడమే.

ఈ రకంగా, 'ప్రకృతి'కి సంబంధించిన అవగాహనలు, ప్రాచీన కాలం నించీ కూడా 2 రకాలుగా ప్రారంభమై, ఈ నాటికీ కొనసాగుతూనే వున్నాయి.

భౌతిక వాదం, ఇప్పుడు వున్న అవగాహన నంతా ఒకే సారిగా అలవర్చుకోలేదు. ఒకప్పటి భౌతిక వాదం, ప్రకృతిలో విషయాలు దేనికది సర్వ స్వతంత్రంగా విడి విడిగా వుంటాయనే అవగాహనతో వుండేది. అలాంటి లోపాల నించి భౌతిక వాదం, క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. దానితో పాటే 'తర్కించే విధానం' కూడా అభివృద్ధి చెందింది.

ఏ విషయాన్ని అయినా, ఏ శాస్త్రాన్ని, అయినా సరైన మార్గంలో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే పద్ధతి - 'గతి తార్కిక పద్ధతి' (డైలెక్టికల్ మెథడ్).

'తర్కం' అంటే చర్చించడం. 'గతి తర్కం' కూడా తర్కమే కాబట్టి, అది కూడా చర్చించడమే. అయితే, చర్చించేటప్పుడు, లేదా తర్కించేటప్పుడు, విషయాల పట్ల ఎటువంటి అవగాహనతో వుండాలో 'గతి తర్క పద్ధతి' చెపుతుంది.

**ఆ అవగాహన ప్రకారం:**

★ విషయాలు విడి విడిగా వుండవు. పరస్పర సంబంధాలతో వుంటాయి. పరస్పర ప్రభావాలతో వుంటాయి.

★ ప్రతీ విషయం లోనూ సహజ వైరుధ్యాలు వుంటాయి.
★ సహజ వైరుధ్యాల వల్లనే విషయాలు మారుతూ వుంటాయి. మార్పులు లేకుండా ఏ విషయమూ ఒకే దశలో గడ్డ కట్టి వుండదు.
★ విషయాలు మారేటప్పుడు కొన్ని సార్లు కేవలం రూపంలో మార్పులే జరగవచ్చు; కొన్ని సార్లు 'గుణం'లో కూడా మార్పులు జరగవచ్చు.

ఇటువంటి అవగాహనతో విషయాల్ని అర్థం చేసుకోవడం, 'గతి తార్కికంగా' అర్థం చేసుకోవడం అవుతుంది.

సాధారణంగా, 'తర్కం' అన్నప్పుడు, అది కొంత వరకైనా గతి తార్కిక పద్ధతి లోనే వుంటుంది. లేకపోతే అది తర్కమే అవదు. కానీ, అందులోనే యాంత్రికం గానూ, అరకొర గానూ తర్కించే ధోరణి కూడా వుంటుంది. కాబట్టి 'తర్కం' అనే దాని కోసం, కేవలం లోక జ్ఞానపు స్థాయిలో చూడడం మాత్రమే గాక, సరైన కొన్ని నియమాలు రూపొందించుకో గలిగినప్పుడు, సరైన తర్క విధానమూ, సరైన పరిశీలనా పద్ధతీ, ఏర్పడతాయి.

## 'ప్రకృతి'ని, గతి తార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవాలంటే:

భూమీ, సూర్య చంద్రులూ, ఇతర గ్రహాలూ, నక్షత్రాలూ అన్నీ పరస్పర ప్రభావాలతో వుంటాయనే అవగాహనతో పరిశీలిస్తేనే, విషయాల్ని సరిగా అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. ప్రకృతిలో పదార్థాల్ని విడి విడి విషయాలుగా చూస్తే, నిజం అర్థం కాకుండా పోతుంది.

అలాగే, ప్రకృతిలో ఏ పదార్థాన్ని తీసుకున్నా అది మార్పులు చెందుతూ వుంటుందనీ, ఆ మార్పులకు కారణం దాని అంతర్గత పరిస్థితులేననీ, అర్థం చేసుకోవచ్చు. ఆ మార్పులు కొన్ని సార్లు కేవలం పదార్థ రూపాన్ని మాత్రమే మార్చితే, కొన్ని సార్లు పదార్థ ధర్మాల్ని కూడా మార్చవచ్చు.

ప్రకృతిలో వైరుధ్యాలు (విరుద్ధ పరిస్థితులు), పదార్థ సహజమైనవి. పదార్థం శాశ్వతమైనది కాబట్టి, దానిలో వుండే విరుద్ధ పరిస్థితులు కూడా శాశ్వత మైనవి. పదార్థం అనేది వుంటే, ఆ విరుద్ధతలు నశించి పోవడం ఎప్పటికీ జరగదు.

## 'సమాజాన్ని' గతి తార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవాలంటే:

సమాజంలో విషయాలన్నీ పరస్పర సంబంధాల తోటీ, పరస్పర ప్రభావాల తోటీ వుంటాయి. దేనికది విడి విడిగా వుండవు.

'సమాజం'లో విషయాలు కూడా మార్పులు చెందుతూ వుంటాయి. ఆ మార్పులకు కారణం, అంత ర్గతంగా వుండే వైరుధ్య పరిస్థితులే.

'సమాజం'లో వైరుధ్యాలు 2 రకాలు.

శతృత్వం కలవీ, శతృత్వం లేనివీ.

'వర్గాలు' వున్నంత కాలమూ, ఈ 2 రకాల వైరుధ్యాలూ వుంటాయి. వర్గాలు నశించి పోయినప్పుడు, శతృ వైరుధ్యాలు కూడా నశించి పోయి, శతృ రహిత వైరుధ్యాలు మాత్రం ఎప్పటి లాగే కొనసాగుతాయి.

'వర్గాలు' నశించాయనీ, 'సమానత్వం' ఏర్పడిందనీ అనుకుంటే, అప్పుడు ఇక శతృ పరిస్థితులు వుండవు. 'సమానత్వం' అనే ధర్మం (లేదా, గుణం) మారకుండానే సమాజానికి అవసరమైన మార్పులు జరుగుతూ వుంటాయి. ఆ మార్పులకు, శతృత్వం లేని వైరుధ్యాలే కారణంగా వుంటాయి.

ఈ రకంగా, గతి తార్కిక పద్ధతి - 'ప్రకృతి'నీ, 'సమాజా'న్నీ అర్థం చేసుకోవడానికి సరైన మార్గాన్ని ఇస్తుంది.

గతి తార్కిక పద్ధతిని భౌతిక వాదులే గాక, 'భావ వాదులు' కూడా తమ సిద్ధాంతానికి అన్వయించు కుంటారు. ఎలాగంటే: భగవంతుడూ అతని సృష్టీ వేరు వేరు కావు. అవి పరస్పర సంబంధాలు గలవే. ఈ సృష్టి, మార్పులు లేకుండా జడాత్మకంగా వుండదు. ఎప్పుడూ మార్పులతో నిత్య నూతనంగా వుంటుంది. ఈ మార్పులకు కారణం, దాని అంతర్గత శక్తి అయిన భగవంతుడే - ఈ రకంగా!

ఎవరి సిద్ధాంతానికి వాళ్ళు, 'గతి తార్కిక సూత్రాల్ని' అన్వయించుకోవచ్చు.

వేల సంవత్సరాల నించీ కూడా - భావ వాదమూ, భౌతిక వాదమూ, గతి తార్కిక పద్ధతీ కూడా వున్నాయి. అయితే భౌతిక వాదమూ, గతి తార్కిక పద్ధతీ, అనేక పొరపాటు అవగాహనల నించీ అభివృద్ధి చెందుతూ వచ్చాయి. భౌతిక వాదమూ, ప్రకృతి శాస్త్రాలూ, అనేక మంది మేధావుల పరిశోధనల తోనూ, త్యాగాల తోనూ అభివృద్ధి చెందాయి.

**ఎంగెల్స్ మాటలు:**

"**ఈ** సాధారణ విప్లవ వాతావరణం మధ్యలో ఆ నాడు, సాధారణ విజ్ఞాన శాస్త్రాలు అభివృద్ధి చెందాయి. అవి కూడా సంపూర్ణ విప్లవ స్వభావాన్ని కలిగి వున్నాయి. సాధారణ విజ్ఞాన శాస్త్రం, అస్తిత్వంలో కొనసాగే హక్కును, పోరాటం ద్వారానే సాధించవలసి వచ్చింది. ఆధునిక తత్వ శాస్త్రానికి మూల పురుషులైన ఇటాలియన్ మహా మేధావులతో పాటు, ఆ శాస్త్ర విజ్ఞాన విప్లవం నుంచి, కొరత వేయబడిన మృత వీరులూ, జైలు కటకటాల మధ్య కృశించి పోయిన మేధావులూ కూడా ఉద్భవించారు. ఆశ్చర్యమేమంటే, ప్రకృతిని స్వేచ్ఛగా పరిశీలించిన పరిశోధకులను, క్యాథలిక్కుల కంటే ఎక్కువగా ప్రొటెస్టెంట్లు హింసించారు. రక్త ప్రసరణ సిద్ధాంతాన్ని కనిపెట్టిన సర్వెటస్ ను కొరత వేయించిన వాడు కాల్విన్. నిజానికి, రెండు గంటల పాటు అతన్ని సజీవంగా దహించిన వాడు కాల్విన్. క్యాథలిక్ మత విచారణ కర్తలు, గియార్డనోబ్రూనోను సజీవంగా దహించి వేశారు" - ఎంగెల్స్ ['ప్రకృతి గతితర్కం' వ్యాసం, 'మతాన్ని గురించి' పుస్తకంలో. పేజీ 13, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.]

ఈ రకంగా, భౌతిక వాదం, అనేక మంది శాస్త్ర పరిశోధకుల శక్తుల తోటీ, త్యాగాల తోటీ, అభివృద్ధి చెందింది.

ఇప్పుడు మనం 'మార్క్సిజాన్ని' తీసుకుని, అది 'ప్రకృతి' గురించీ, 'సమాజం' గురించీ ఎటువంటి దృక్పథంతో వుంటుందో చూడాలి.

**'ప్రకృతి' గురించి:**

మార్క్సిజం అనేది - భావ వాదమా, భౌతిక వాదమా? అది, సృష్టి కర్తని అంగీకరిస్తుందా, అంగీకరించదా? - మార్క్సిజం, సృష్టి కర్తనీ, అతీత శక్తుల్నీ, అంగీకరించదు. ఆ రకంగా, మార్క్సిజం భౌతిక వాదమే; భావ వాదం కాదు.

భగవంతుడు అసత్యమే. కానీ అది సమాజంలో సత్యంగా చలామణీ అవుతోంది. దీన్ని గురించి మార్క్సిజం అవగాహన ఏమిటంటే: భగవంతుడి మీద విశ్వాసం మొదట్లో 'అజ్ఞానం' వల్లనే ప్రారంభమైంది. క్రమంగా, 'వర్గ' సమాజం దాన్ని మతాల రూపంలో స్థిరపరిచింది. 'దేవుడి'తో పాటే - పాప పుణ్యాలూ, అదృష్ట దురదృష్టాలూ, ఖర్మలూ, పునర్జన్మలూ, స్వర్గ నరకాలూ - వంటి సమస్త మూఢ నమ్మకాలూ పుట్టుకొచ్చాయి.

శ్రామిక వర్గం మూఢ నమ్మకాల్లో పడి వుండడమే దోపిడీ వర్గానికి కావాలి, దాని వల్ల తను కూడా మూఢత్వం లోనే పడి వున్నప్పటికీ.

'సైన్సు' ఎంత అభివృద్ధి చెందుతోన్నా, 'ప్రకృతి'కి సంబంధించి అది ఎన్ని కొత్త విషయాల్ని కనిపెడుతోన్నా, ఆ సైన్సు సూత్రాలు సరుకుల్ని ఉత్పత్తి చేసే రంగాలకే పరిమిత మవుతున్నాయి గానీ, సైన్సు దృష్టి నిజ జీవితాలలోకి ప్రవేశించడం లేదు. దానికి కారణం, దోపిడీ వర్గం - 'దేవుణ్ణి' తన స్వప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ వుండడమే.

'దేవుడు' అనే వాడు, తను పుట్టిన తర్వాత బాల్యంలో తప్ప, ఇక అక్కడి నించీ నిత్యమూ దోపిడీ వర్గానికి పాద సేవ చేస్తూనే వున్నాడు.

దోపిడీ సంబంధాలతో సాగే నిజ ప్రపంచపు కలిమి లేములూ, అధికారాలూ, దాస్యాలూ, నేరాలూ, శిక్షలూ, రాజరికాలూ, యుద్ధాలూ అన్నీ, మత గ్రంథాలలో కథల రూపంలో వుంటాయి. అవన్నీ నిజ ప్రపంచంలో విషయాలే.

నిజ ప్రపంచపు ప్రతిబింబమే మత ప్రపంచం. కాబట్టి, 'దోపిడీ వర్గాన్ని' కూలదోసినప్పుడు, దాని దేవుడూ, మతమూ అన్నీ దాన్ని వెతుక్కుంటూ పోతాయి. ఇదీ, దేవుడి వునికి గురించి మార్క్సిజం అవగాహన.

ఈ రకంగా మార్క్సిజం, ఎటువంటి మినహాయింపులూ లేని భౌతిక వాదం. అది, విషయాల్ని గతితార్కిక పద్ధతిలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

మార్క్సిజం - దానికై అది ఏ ప్రకృతి అంశాన్నీ వివరించదు. ప్రకృతి గురించి ప్రకృతి శాస్త్రాలు వివరించే సత్యాలే మార్క్సిజానికి కూడా సత్యాలు. ప్రకృతి శాస్త్రాలైన వృక్ష శాస్త్రమూ, జంతు శాస్త్రమూ, జీవ శాస్త్రమూ, భూగోళ శాస్త్రమూ, ఖగోళ శాస్త్రమూ, యంత్ర శాస్త్రమూ, రసాయన శాస్త్రమూ - వంటి శాస్త్రాలు గ్రహించే భౌతిక సత్యాలనే మార్క్సిజం అనుసరిస్తుంది.

మార్క్సిజం, ఏ ప్రకృతి శాస్త్రమూ కాదు. అది, 'సామాజిక శాస్త్రం'. అంటే, 'సమాజం గురించి' చెప్పే శాస్త్రం.

## 'సమాజం' గురించి మార్క్సిజం అవగాహన:

సమాజ చరిత్రకు కూడా ఒక క్రమం వుంది. ప్రాచీన దశ నించీ కమ్యూనిస్టు దశ వరకూ, ఈ దశలన్నీ ఒక క్రమంతో సాగుతున్నవే. ప్రతీ దశా, దాని అంతర్గత కారణాల వల్లనే మారుతోంది.

'వర్గాలు' ప్రారంభమైన తర్వాత, వర్గ పోరాటమే చరిత్ర దశల్ని మార్చే భౌతిక శక్తిగా వుంది. ఈ రకంగా, 'చరిత్ర'ని కూడా, భౌతిక వాద దృక్పథంతో అర్థం చేసుకున్నప్పుడే సరిగా అర్థం చేసుకోగలం.

మార్క్సు కన్నా ముందు, 'సమాజం' గురించి ఈ సరైన అవగాహన లేదు. అప్పుడు సమాజం గురించి ఆలోచించడానికి ఒక వరసా, క్రమమూ లేవు. ఈ సరైన క్రమం. మార్క్సుకి ఎలా సాధ్యమైందంటే, 'దోపిడీ'ని గ్రహించడం ద్వారా. సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే 'వర్గాల్ని' అర్థం చేసుకోవాలి. 'వర్గాల్ని' అర్థం చేసుకోవాలంటే, 'విలువ'నీ, 'అదనపు విలువ'నీ అర్థం చేసుకోవాలి. 'విలువ అంటే శ్రమ కాలం' అని అర్థం చేసుకుంటే, అది 'విలువ'ని 'భౌతిక విషయం'గా అర్థం చేసుకోవడం.

బూర్జువా ఆర్థిక శాస్త్రం, చాలా కాలం వరకూ 'విలువ'ని గ్రహించనే లేదు. కొంత కాలానికి అర కొరగా గ్రహించినప్పుడు కూడా అది, 'శ్రమ' అనే దానికి ప్రథమ స్థానం ఇవ్వకుండా 'సప్లై, డిమాండ్ల'కు ప్రథమ స్థానం ఇచ్చింది. దాని ప్రకారం, సరుకు విలువకి (ధరకి) కారణం, సరుకుకి సంబంధించి వుండదు. ఆ కారణం, సరుకుకి బయట వుంటుంది. సరుకుని కొనే, అమ్మే వాళ్ళ ఇష్టా యిష్టా లకు (వాళ్ళ భావాలకు) సంబంధించి వుంటుంది.

'శ్రమ'కి ప్రాధాన్యత ఇవ్వడం అంటే, శ్రామికులకు ప్రాధాన్యత ఇవ్వడమే కాబట్టి, అది బూర్జువా దృష్టికి అసాధ్యం. అందుకే అది 'శ్రమ'ని పట్టించుకో లేదు. కొనే, అమ్మే వాళ్ళ భావాలనే 'విలువ'కి కారణంగా చెప్పడం అంటే, బూర్జువా ఆర్థిక శాస్త్రం, 'భావ వాదం'గా వుందన్న మాట. ఈ నాటికీ దాని పరిస్థితి అదే.

అలాంటి పరిస్థితిలో, మార్క్సు, 'విలువ'కి సరైన 'భౌతిక' కారణాన్నీ (శ్రమ కాలమే విలువ - అని), 'అదనపు విలువ'నీ, వర్గాల మధ్య శతృ వైరుధ్యాల్నీ గ్రహించడం వల్ల, సమాజ చరిత్రని భౌతిక నియమాలతో గ్రహించగలిగాడు.

బూర్జువా చరిత్ర కారులకు, 'చరిత్ర' అనేది, ఏ కారణమూ ఏ క్రమమూ ఏ నియమమూ లేకుండా సాగే విడి విడి ఘటనల సముదాయం మాత్రమే. ఆ ఘటనలు కూడా ఎందుకు జరుగుతాయంటే, కేవలం మనుషుల ఇష్టాయిష్టాల వల్ల! ఆ ఇష్టాయిష్టాలూ, భావాలూ, ఎలా ఏర్పడతాయి? వాటికి వున్న భౌతిక పునాది ఏమిటి? - ఈ రకం ప్రశ్నలు వాళ్ళకి వుండవు.

ఒక వేళ వాళ్ళు ఆ ప్రశ్నలకు కూడా జవాబులు చెప్తే, 'వర్గ భేదాలు' అనే కారణం తప్ప, ఇంకేవో కారణాలు చెపుతారు.

'అదనపు విలువ'ని గ్రహించే పని మార్క్సు కన్నా ముందు జరగ లేదు కాబట్టి, మానవ చరిత్రని హేతు బద్ధమైన అవగాహనతో అర్థం చేసుకునే పని కూడా మార్క్సు కన్నా ముందు జరగలేదు. మార్క్సిజం, ఆర్థిక విషయాల్ని వివరించడం ద్వారానే ఇతర సామాజిక విషయాల్ని కూడా వివరించింది.

ప్రకృతి గురించి 'సృష్టి కర్త - ప్రశ్న' ఎంత మౌలికమైనదో, సమాజం గురించి 'ధనిక - పేద తేడాల' ప్రశ్న అంత మౌలికమైనది. మనుషుల్లో కొందరు ధనికులు గానూ, కొందరు పేదలు గానూ; కొందరు యజమానులు గానూ, కొందరు సేవకులు గానూ - ఎందుకు వున్నారు? మనుషులు, 'అసమానులు'గా ఎందుకు వున్నారు? - ఈ రకం ప్రశ్నలకు మార్క్సు కన్నా ముందు సరైన సమాధానాలు లేవు. పేదతనాన్నీ, సేవకత్వాన్నీ చూసి నిజంగా బాధపడ్డ మేధావులు కూడా అసలు కారణాన్ని గ్రహించలేదు.

కలిమి లేముల కారణాల్ని ఎప్పుడు బయట పెట్టగలమంటే, ఆర్థిక సూత్రాలు తెలిసినప్పుడే. ఆర్థిక సూత్రాలు తెలిస్తేనే దోపిడీ తెలుస్తుంది. దోపిడీ తెలిస్తేనే, ఒక వేపు - సిరిసంపదలూ, ఇంకో వేపు - నిరుపేద తనమూ ఎందుకు వున్నాయో తెలుస్తుంది. అలాగే, యజమానితనమూ, సేవకత్వమూ ఎందుకు వున్నాయో తెలియాలంటే, అది కూడా 'దోపిడీ' తెలిస్తేనే సాధ్యమవుతుంది.

> "ఉత్పత్తి క్రమంలో శ్రమ చేసే మనుషులకు వున్న దాస్యం లోనే, మానవ దాస్యం అంతా ఇమిడి వుంది. సమాజంలో వున్న అన్ని దాస్య సంబంధాలూ, ఆ శ్రమ దాస్యపు మారు రూపాలే, పర్యవసానాలే" - మార్క్స్ [ఎకనామిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్యు స్క్రిప్టు ఆఫ్ 1844,
> పేజీ 73, మాస్కో]

సమాజంలో ఏ 'అసమాన' సంబంధాన్ని అయినా తీసుకోండి. జాతుల అసమానత్వం, కులాల అసమానత్వం, స్త్రీ పురుషుల అసమానత్వం - అన్నీ, ఉత్పత్తి సంబంధాలలో వున్న అసమానత్వం నించి పుట్టుకొచ్చే ఫలితాలే.

'మానవ సమాజం' గురించి మార్క్సు ఇంకా గ్రహించింది ఏమిటంటే: సమాజం జీవించడానికి మొదట జీవితావసర వస్తువులు కావాలి. వాటిని ఉత్పత్తి చేసుకునే క్రమం లోనే మానవుల మధ్య 'ఉత్పత్తి సంబంధాలు' (శ్రమ సంబంధాలు) ఏర్పడతాయి. సమాజానికి, ఉత్పత్తి సంబంధాలే 'పునాది.' ఆ పునాది మీద, దానికి అనుగుణం గానే 'పై కట్టడం' లేస్తుంది. మనుషుల చైతన్యం (భావాలు, ఆలోచనలు), వారు 'ఉత్పత్తి సంబంధాల'లో ఏ స్తితిలో వున్నారో, ఆ స్తితిని బట్టే ఏర్పడుతుంది. స్తితిని బట్టే చైతన్యం. అంతేగానీ, మొదటే చైతన్యమూ తర్వాత స్తితీ కాదు.

### మార్క్స్ మాటల్లో:

"పరిశోధన ద్వారా నేను సాధించిన ఫలితాన్ని - ఏదైతే తర్వాత నా అధ్యయనానికి మార్గదర్శక సూత్రంగా పని చేసిందో ఆ ఫలితాన్ని - క్లుప్తంగా ఇలా సూత్రీకరించవచ్చు: మానవులు తమ జీవితానికి సంబంధించిన సామజికోత్పత్తిలో నిర్దిష్టమూ, ఆవశ్యకమూ, తమ ఇచ్ఛకు అతీతమూ, భౌతిక ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో ఒకానొక నిర్దిష్ట దశకు అనుగుణమూ అయిన సంబంధాలను కలిగి వుంటారు. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తమే, సమాజ ఆర్థిక నిర్మాణ చట్రం. అదే సమాజపు నిజమైన పునాది. ఆ పునాది మీదనే చట్టబద్ధ, రాజకీయ, ఉపరితల నిర్మాణం లేస్తుంది. సామాజిక చైతన్యానికి సంబంధించిన నిర్దిష్ట రూపాలు, ఆ పునాదికి అనుగుణం గానే వుంటాయి. భౌతిక జీవితానికి సంబంధించిన ఉత్పత్తి విధానమే, మొత్తం మీద, సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవిత క్రమాన్ని నిర్దేశిస్తుంది. మానవుల అస్తిత్వాన్ని నిర్దేశించేది వారి చైతన్యం కాదు. తద్భిన్నంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్దేశిస్తుంది."

[సంకలిత రచనలు - 2, పేజ 11, మాస్కో]

'ఉత్పత్తి క్రమం'లో ఏం జరుగుతుందో అర్థం చేసుకోకపోతే, 'మానవులు ఎలాంటి సంబంధాల్లో వున్నారో' అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అందుకే మానవ సంబంధాల్ని విశదీకరించే పని మార్క్సు కన్నా ముందు ఎవరికీ సాధ్యం కాలేదు. మార్క్సు మాటల్లో వున్న "సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్దేశిస్తుంది" అనే అంశాన్ని, యాంత్రికంగా అర్థం చేసుకునే ప్రమాదంలో పడకూడదు. మనుషులు, శ్రమ సంబంధాల్లో ఎలాంటి స్తితిలో (ఎలాంటి స్థానంలో) వుంటారో, ఆ స్తితిల్ని బట్టి, వారి భావాలు వుంటాయి - అన్నప్పుడు, ఆ భావాలు ఎప్పుడూ ఆ స్తితితో అనుకూలించే భావాలు గానే వుంటాయి అని అర్థం కాదు. ఆ స్తితితో వ్యతిరేకించే భావాలు కూడా ఆ స్తితి నించే పుట్టుకొస్తాయి. ఈ రెండు రకాల భావాలూ ఒకే స్తితి నించీ ఏర్పడతాయి కాబట్టి, దీన్ని అంతటినీ కలిపి 'అస్తిత్వమే చైతన్యాన్ని (భావాల్ని) నిర్దేశిస్తుంది' అనవచ్చు.

(ఈ విషయం అంతా, 'మొదటి సంపుటం'లో 'ఉత్పాదక శ్రమా - అనుత్పాదక శ్రమా' చాప్టరులో 'స్తితిని బట్టి చైతన్యం' గురించి చూసిన చోట వివరం గానే చూశాం.)

ఏ దోపిడీ సమాజంలో అయినా, శ్రమ సంబంధాల్లో మానవులు వుండే స్తితి (అస్తిత్వం), వైరుధ్య పూరితం గానే వుంటుంది. ఆ స్తితి, పరస్పర విరుద్ధ భావాల్ని పుట్టిస్తుంది. ఆ స్తితికి అనుకూలంగా వుండే భావాలూ, వ్యతిరేకంగా వుండే భావాలూ కూడా. ఆ స్తితిని వ్యతిరేకించే భావాలే, ఆ స్తితిని మార్చగలుగుతాయి. అయితే, ఆ వ్యతిరేక భావాలు కూడా శ్రమ దోపిడీని గ్రహించకుండా ఎంత కాలం వరకూ వుంటాయో, అప్పటి దాకా, అవి, ఆ స్తితికి రూపాన్ని మాత్రమే మార్చగలుగుతాయి గానీ, స్వభావాన్ని మార్చలేవు.

శ్రమ దోపిడీని గ్రహించలిగే భావాలు ఒక దశలో మానవ మేధస్సుకి అందాయి అంటే, దానికి తగిన సామాజిక పరిస్తితులు ఆ నాటికి ఏర్పడి వున్నాయి - అని అర్థం. సరుకు ఉత్పత్తి విధానమే (పెట్టుబడిదారీ విధానమే), ఆ సామాజిక స్తితి. అదే, శ్రమ దోపిడీని గ్రహించడానికి (ఆ భావాలకు) అవకాశం ఇచ్చిన స్తితి.

ఏ దోపిడీ సమాజంలో అయినా సామాజిక స్తితి వైరుధ్య పూరితంగా వున్నట్టే, దోపిడీని తీసి వెయ్యడం కోసం మార్పులు జరిగే నూతన సమాజంలో కూడా, ఆ మార్పులు పూర్తి అయ్యే వరకూ, ప్రతీ దశా వైరుధ్య పూరితం గానే వుంటుంది. అక్కడ ఏ దశని తీసుకున్నా, ఆ దశలో, ఆ నాటికి కొంత వరకూ మారిన

కొత్త సంబంధాలే 'ఆ నాటి సామాజిక స్తితి'గా వుంటాయి. ఆ స్తితిని బట్టే, ఆ నాటి భావాలు ఏర్పడ తాయి. 'సమానత్వం' అనే స్తితి స్తిరపడే వరకూ అది అలా సాగుతూనే వుంటుంది.

ఏ సమాజంలో అయినా, ఏ దశలో అయినా, శ్రమ సంబంధాల్ని పునాది గానూ, ఇతర రంగాల్ని ఉపరితలం గానూ అనుకుంటే, పునాది మీద ఉపరి తల ప్రభావం వుండదని అర్థం కాదు. ఏ సామాజిక అంశమైనా ఇంకో దాని చేత ప్రభావిత మవుతూనే వుంటుంది. అలాగే, పునాది కూడా, ఉపరితల రంగాల చేత ప్రభావితమవుతూ వుంటుంది. అయితే, పునాదికీ, ఉపరితల రంగాలకూ మధ్య వుండే పరస్పర ప్రభావాలు (ఇంటరాక్షన్), సమాన శక్తుల మధ్య వుండే ప్రభావాల లాంటివి కావు. ఎందుకంటే, అవి, సమాన శక్తులు కావు గనక.

పునాదిని A అనీ, ఉపరితలాల్ని B అనీ అను కుంటే, A B లు, సమాన శక్తులు కావు. వీటిని సమాన శక్తులుగా అనుకుంటే, అప్పుడేం జరుగుతుందంటే, A ప్రభావం వల్ల B, A గా మారిపోవడమూ; అలాగే, B ప్రభావం వల్ల, A, B గా మారిపోవడమూ జరుగు తాయి. అంటే, A B ల పేర్లు తారుమారవడం మాత్రమే జరుగుతుంది. ఆ 'విషయాలు' ఎప్పటి లాగే వుంటాయి. మళ్ళీ పాత పునాదే, పాత ఉపరితలమే, మారిన పేర్లతో ప్రత్యక్షమవుతాయి. పునాదీ ఉపరి తలమూ పరస్పరం సమాన ప్రభావాలు చూపుకున్నట్ట యితే, సమాజంలో ఏ పరిస్తితీ మారదు. కాబట్టి, విషయాలు మారాలంటే, అది ఎప్పుడు సాధ్యమవు తుందంటే, ఏదో ఒక దాని ప్రభావం, రెండో దాని ప్రభావం కన్నా ఎక్కువగా వున్నప్పుడే.

పునాది నించి ఏర్పడే భావాలలో - అనుకూల భావాలూ, వ్యతిరేక భావాలూ - అనే తేడాని తప్ప ఇంకే రకం విషయాలూ ఇక్కడ చూడలేము. అను కూల భావాల ప్రభావమే బలంగా వున్నప్పుడు, పాత పునాదే కొనసాగుతూ వుంటుంది. లేదా, వ్యతిరేక భావాల ప్రభావం బలంగా వున్నప్పుడు, పాత పునాది కొంత మారుతుంది. రెండు ప్రభావాలూ సమానంగా వున్నప్పుడు, ఏ విషయమూ మారదు.

పునాదే మౌలికమైన బలమైన శక్తి. ఎలాగంటే, పునాదిని మార్చే శక్తి కూడా పునాది నించే ఉద్భ విస్తుంది గనక. ఉపరితలం అనేది పునాది నించి ఏర్పడే ఫలితమే గనక.

పునాదీ, ఉపరితలమూ, దేనికి అది విడి విడిగా వుండే స్వతంత్ర విషయాలు కావు. వాటి మధ్య పరస్పర ప్రభావాలు వున్నప్పటికీ అవి ఒకే సమ యంలో సమాన ప్రభావాలుగా వుండవు.

'మానవ సమాజం' అంటే, కేవలం 'పక్షుల గుంపు' లాగానూ, 'జంతువుల మంద' లాగానూ వుండే 'మనుషుల సమూహం' కాదు. పక్షుల లోనూ, జంతువుల లోనూ, 'శ్రమ సంబంధాలు' వుండవు. ప్రకృతిలో ఏ జీవ రాసుల్లోనూ లేని ఈ అంశం, మను షుల సమూహం లోనే వుంటుంది. 'మానవ సమాజం' అంటే, అది మనుషుల సమూహమే అయినా, అది ఎలాంటి సమూహం అంటే, ప్రతీ దశ లోనూ ఏదో ఒక రకపు 'శ్రమ సంబంధాలు' కలిగిన సమూహం. ఏ శ్రమ సంబంధాలూ లేని మనుషుల సమూహం ఎక్కడా వుండదు. ఏ కాలం లోనూ వుండదు.

'వర్గాల' కన్నా పూర్వపు 'ప్రాచీన సమాజం' - సమాన శ్రమ సంబంధాలు గల ఒక ప్రత్యేక దశ.

బానిస సమాజం - 'అసమాన' శ్రమ సంబంధాలు గల ఒక ప్రత్యేక దశ. భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాలు కూడా అలాంటి ప్రత్యేక దశలే.

'నూతన సమాజ' ప్రారంభం కూడా - అసమాన సంబంధాలలో మార్పులు జరిగే ప్రత్యేక దశ.

కమ్యూనిస్టు సమాజం - సమాన సంబంధాలలో ఒక ప్రత్యేక దశ. దాని కొనసాగింపు కూడా - 'సమాన' సంబంధాల లోనే, ఇంకో ప్రత్యేక దశ అవుతుంది.

కాబట్టి, 'సమాజం' అనేది, కేవలం కొంత జనా భాలో వున్న గుంపు కాదు. ఆ గుంపు, ఫలానా రకపు శ్రమ సంబంధాలూ, ఆర్థిక పునాదీ, దానికి అనుగుణ మైన ఉపరితలమూ - వంటి అంశాలు కలిగిన సమూహం.

> "సమాజం అంటే విడి విడి వ్యక్తులను కలిగి వుండదు. వ్యక్తుల పరస్పర సంబంధాల, పరిస్తితుల మొత్తాన్ని అది వ్యక్తం చేస్తుంది" - మార్క్స్ [కలెక్టడ్ వర్క్స్ - 28, పేజీ 195.]

ఈ రకంగా 'సమాజం అనేది - 'శ్రమ సంబంధాల పునాది మీద ఆధారపడి సాగే మానవ సమూహం' అని గ్రహించే 'తత్వ' దృష్టిని (సిద్ధాంత దృష్టిని) ఇచ్చిన మార్క్సిజం - 'ఆర్థిక శాస్త్రమే' గాక, 'తత్వ శాస్త్రం' కూడా.

తత్వ శాస్త్రమూ, గతి తర్కమూ - అనగానే, మార్క్స్ ఎంగెల్సులు, హెగెల్ నించి ఏదో తీసు

కున్నారని అనేక చోట్ల చదివి వుంటాం కాబట్టి, అదే మిటో తెలుసుకోవాలని చాలా ఆసక్తిగా వుంటుంది. కానీ, 'గతి తార్కిక సూత్రాల' గురించి మార్క్సు అక్క డక్కడా పొడి పొడిగా ప్రస్తావించడం తప్ప, తగినంత వివరంగా ఒక వ్యాసం రూపంలో రాయలేదు. 'టైము దొరికినప్పుడు' ఆ విషయం మీద రాయాలని తనకు చాలా వుందని ఎంగెల్సుకి రాసిన ఒక ఉత్తరంలో అన్నాడు. కానీ, తర్వాత కూడా అలాంటి వ్యాసం రాయలేదు. ఎంగెల్స్ మాత్రం, 'యాంటీ - డూరింగ్' లోనూ, 'డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్' లోనూ కొన్ని గతి తార్కిక సూత్రాల్ని సూచిస్తూ కొంత వివరణ ఇచ్చాడు. అయితే, ఆ వివరణల మీదా, దాని కోసం ఇచ్చిన ఉదాహర ణల మీదా, మార్క్సిస్టుల నించీ కూడా కొన్ని విమ ర్శలు వున్నాయి.

ఎంగెల్స్ ప్రకారం - గతి తర్కం అనేది, ప్రకృతీ - సమాజమూ, ఆలోచనా, అనే వాటి చలనానికీ, మార్పుకీ (మోషన్ అండ్ డెవలప్‌మెంట్) సంబంధిం చిన జనరల్ నియమాల్ని చెప్పే సైన్సు.

[యాంటీ డూరింగ్, పేజీ 162.]

ఉనికికీ - వాస్తవానికీ - అనుభవానికీ సంబంధిం చిన విషయాలు, దేనికి అది విడి విడిగా వుంటాయనే ధోరణితో చెప్పే 'మెటా ఫిజిక్స్'కి భిన్నంగా, ఈ గతి తర్కం, 'పరస్పర సంబంధాలను' (ఇంటర్ కనెక్షన్స్) చెపుతుంది. [ డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్, పేజీ 62.]

గతి తర్క సూత్రాల్ని ఎంగెల్స్ ఇలా చెపుతాడు:

1. పరిమాణం గుణం గానూ (క్వాంటిటీ, క్వాలిటీగా); మళ్ళీ గుణం, కొత్త పరిమాణం గానూ మార్పు చెందడం - అనే సూత్రం.
2. విరుద్ధ అంశాలు కలిసి వుండడం - అనే సూత్రం.
3. నెగేషన్ ఆఫ్ నెగేషన్ సూత్రం. (ఉనికిలో వున్న ఒక విషయం, లేకుండా పోయి, దానికి బదు లుగా ఇంకోటి వస్తుంది. కొత్తది, మొదటి దాని కన్నా అభివృద్ధి కరంగా వుంటుంది. తర్వాత, ఆ కొత్తగా వచ్చింది కూడా పోయి, ఇంకో కొత్తది వస్తుంది అనే సూత్రం ఇది. (దీన్ని "అభావం, అభావం చెందుట" అని అనువాదాల్లో చూస్తాం.)

ఈ 3 సూత్రాల్నీ వివరించడానికి ఎంగెల్స్, 'ప్రకృతి' నించీ, 'చరిత్ర నించీ, ఉదాహరణలు ఇచ్చాడు.

మొదటి సూత్రాన్ని వివరించడానికి, నీరు, ఉష్ణోగ్రత తగ్గితే 'మంచు గడ్డ' గానూ, ఉష్ణోగ్రత పెరి గితే నీటి ఆవిరి గానూ మారుతుందని చెప్పి, ఈ మార్పులనే 'గుణాత్మకమైన మార్పులు'గా చెపుతాడు. ఈ వివరణ మీద విమర్శ వుంది. నీటి ఆవిరి, మళ్ళీ నీరుగా మారుతుంది. అంటే, 'గుణం' మళ్ళీ వెనకటి పరిమాణం గానే మారుతుంది. నీరు, మంచు గడ్డగా కూడా మారగలదు. అంటే, అది ఇంకా వెనకటి పరి మాణం గా! కాబట్టి, గుణాత్మకమైన మార్పు తప్పని సరిగా వెనక్కి వస్తుందనీ, రావచ్చనీ, అది సహజమనీ అనుకోవాలా? - ఇదీ దాని మీద విమర్శ. నీరు, ఆవిరిగా గానీ, మంచు గడ్డగా గానీ మారడం, రూపాల మార్పే. అది, గుణం లో మార్పు అవదు.

3వ సూత్రాన్ని వివరించడానికి, 'బార్లీ గింజ' ఉదాహరణ ఇచ్చాడు. బార్లీ గింజని నేలలో పాతితే, అది మొక్కగా మారి, బార్లీ గింజ లేకుండా పోవడం - ఒక 'నెగేషన్'. తర్వాత, ఆ మొక్క పెద్దదై ఎక్కువ బార్లీ గింజల్ని ఇచ్చి, ఆ మొక్క కూడా లేకుండా పోవడం ఇంకో 'నెగేషన్'. ప్రతీ కొత్త నెగేషనూ 'పరి పక్వత' అనే క్రమాన్ని (ప్రాసెస్ ఆఫ్ పెర్‌ఫెక్షన్ - ని) పెంచుతుందని చెపుతాడు. బార్లీ గింజల జాతిలో నైతే ఈ మార్పు నెమ్మదిగా జరుగుతుంది గానీ, కొన్ని రకాల పుష్ప జాతుల్లో అయితే ఈ మార్పు వేగంగా జరుగుతుందని కూడా చెపుతాడు.

ప్రకృతిలో పదార్థం - 'ఏక కణ జీవి' నించీ, అనేక జ్ఞానేంద్రియాలూ, ఆ జ్ఞానేంద్రియాల్ని కంట్రోలు చేసే మెదడూ - అనే దశ వరకూ మార్పులు చెందిందంటే, ఆ మార్పులు, ఉన్నత దశ వైపు జరిగిన మార్పులు గానే వుంటాయి. కానీ, ఆ మార్పులు మళ్ళీ వెనక్కి పోవు. (ఈ మార్పులు మళ్ళీ పోతాయని ఎంగెల్సు చెప్పినట్టుగా అర్థం తియ్యనక్కర లేదు.)

పరిమాణం గుణంగా మారి, ఆ గుణం ఇంకో పరిమాణంగా మారడం - అనే దాని మీద ఇచ్చిన వివరణ, కొన్ని ప్రశ్నలకు లేదా కనీసం సందేహాలకు, దారి తీస్తుంది.

'ప్రతీ విషయమూ మారుతూనే వుంటుంది' అనడం తార్కికమే. కానీ, దీన్ని వివరించిన విధానం, సామాజిక విషయాల్లో అయితే ఒక ప్రశ్నకు దారి తీస్తుంది. "అయితే రేపు కమ్యూనిజం ఏర్పడిన తర్వాత అది కూడా మారుతుందా? 'సమానత్వం' అనేది కూడా మారుతుందా? అది కూడా మారితే, దాని తర్వాత కూడా జరిగే, 'సమానత్వం' కన్నా ఇంకా ఉన్నతమైన, ఇంకా గుణాత్మకమైన మార్పు ఏమిటి?"

అనే ప్రశ్నకి దారి తీస్తుంది.

ఈ చిక్కులో ఎందుకు పడతామంటే, ప్రకృతినీ, సమాజాన్నీ ప్రతీ విషయం లోనూ ఒకే రకంగా చూడడం వల్ల. 'ప్రకృతి'లో వైరుధ్యాలు సహజమైనవి. అవి ఎప్పుడూ వుంటాయి. కొంత కాలానికి నశించి పోయే వైరుధ్యాలేవీ ప్రకృతిలో వుండవు. కానీ, 'సమాజం' సంగతి అలా కాదు. 'సమాజం'లో (అంటే 'వర్గ సమాజం'లో) 2 రకాల వైరుధ్యాల్ని తీసుకోవాలి. శతృ పూరితమైనవి, కొంత కాలానికి నశించి పోతాయి. శతృ రహితమైనవి, సహజ పరిస్తితులుగా ఎప్పుడూ వుండిపోతాయి.

ఈ రకంగా చూసినప్పుడు, సమాజంలో, 'ఉన్నత మైన మార్పులు' అనంతంగా జరుగుతూ వుండవు. 'సమానత్వం' అనే దశ ఏర్పడిన తర్వాత (ఏర్పడిందని అనుకుంటే), దాని కన్నా 'ఉన్నత దశ' ఏదీ వుండదు. దాన్ని కొనసాగించడమే, ఆ సమాజానికి 'లక్ష్యం' అవుతుంది.

'మార్పుల్ని' కలిగించే సూత్రాలు, ప్రకృతి కైనా సమాజాని కైనా కొంత వరకూ ఒకే రకంగా సరి పోతాయి. కానీ, ప్రకృతికీ సమాజానికీ ఏ తేడా అయితే వుందో, ఆ తేడా వల్ల, ఆ సూత్రాలు, రెండు చోట్లా అన్ని సందర్భాల్లోనూ ఖచ్చితంగా ఒకే రకంగా వుండవు. కాబట్టి, సమాజంలో 'సమానత్వం' కన్నా ఇంకా ఉన్నత మైన మార్పు, వుంటుందనడం అర్థ రహితమూ, హేతు విరుద్ధమూనూ. కాబట్టి, "ఎప్పుడూ 'ఉన్నత మైన' మార్పులు జరుగుతూనే వుంటాయి; ఎప్పుడూ 'గుణాత్మకమైన' మార్పులు జరుగుతూనే వుంటాయి. ప్రతీదీ ఎప్పుడూ మారుతూనే వుంటుంది" అనేది 'సమాజాని'కి వర్తించదు. 'ప్రకృతి' కైనా ఇది ఎలా వర్తి స్తుందో వివరించాలంటే, 'పదార్థానికి' సంబంధించిన అనేక సైన్సులు తెలిసినప్పుడు తప్ప, లేకపోతే 'సరైన ఉదాహరణలతో' వివరించడం సాధ్యం కాదు.

కొత్త విషయాల్ని వివరించేటప్పుడు, అసమగ్ర తలూ, అస్పష్టతలూ, కొన్ని చోట్ల పొరపాట్లూ కూడా వుంటూనే వుంటాయి. ఎంగెల్సు ఉదాహరణల్ని (బార్లీ గింజా, మొక్కా; నీరూ, మంచూ - లాంటి వాటిని) అసమగ్రమైన ఉదాహరణలుగా వదిలి వెయ్యడం గానీ, లేదా ఆ ఉదాహరణల్లో కూడా ఇంకా సరైన అర్థాలేమైనా వున్నాయేమో చర్చించి చివరికి సరైన అర్థానికి రావడం గానీ, మన వంతు.

**మార్క్స్**, గతి తార్కిక పద్ధతి గురించీ, హెగెల్ గురించీ, ప్రస్తావించిన కొన్ని సందర్భాలు ఇప్పుడు చూద్దాం:

1. " ........ **రెం**డవది (పరిశీలనా పద్ధతి) ఏం చేయాలీ అంటే, సమాచారాన్నంతటినీ వివరంగా సేక రించడమూ, దాని మార్పుల భిన్న రూపాల్ని విశ్లేషించ డమూ, వాటి మధ్య వున్న అంతస్సంబంధాల్ని పట్టు కోవడమూ - చెయ్యాలి. ఈ పని జరిగాక మాత్రమే, అసలు క్రమాన్ని తగినంతగా వివరించగలం. .... నా గతి తార్కిక పద్ధతి, హెగెల్ పద్ధతి నించీ భిన్నమైనది మాత్రమే కాదు; పూర్తిగా విరుద్ధమైనది కూడా (ఆపో జిట్).

**హెగెల్ ప్రకారం:** మనిషి మెదడుకి చెందిన జీవన క్రమం, అంటే ఆలోచనా క్రమం, ఏదైతే 'భావం' (ఐడియా) అనే పేరుతో వుంటుందో అది, (దేనినైతే అతడు ఆఖరుకి ఒక స్వతంత్ర విషయంగా మార్చి వేశాడో అది), నిజ ప్రపంచపు మానవాతీత శక్తి. ఈ నిజ ప్రపంచమేమో 'భావానికి' సంబంధించిన అసా ధారణ బాహ్య రూపం మాత్రమే.

**నా ప్రకారం:** 'భావం' అనేది, మనిషి మెదడు ద్వారా ప్రతిబింబించి నటువంటీ, ఆలోచనా రూపం లోకి మారినటువంటీ, భౌతిక ప్రపంచం తప్ప వేరు కాదు. ..... హెగెల్ చేతుల్లో, గతి తర్కం, మార్మికతకు గురైనప్పటికీ, ఆయన, దాని జనరల్ రూపాన్ని స్పష్టమై నటువంటీ, సమగ్రమైనటువంటీ పద్ధతిలో వివరించిన మొట్ట మొదటి వ్యక్తి.

ఆయన దగ్గర అది (గతి తర్కం) తల్లకిందులుగా నిలబడి వుంది. 'మార్మికత' అనే టెంకలో వున్న 'హేతు బద్ధత' అనే గుజ్జుని కనుగొనాలీ అంటే, తల్లకింద లుగా నిలబడి వున్న దాన్ని తిన్నగా తిప్పాలి.

'మార్మిక రూపం'లో వున్న గతి తర్కం, జర్మనీలో ఫేషన్ అయింది. ఎందుకంటే, అది, అమలులో వున్న వ్యవస్థనే రూపం మారే లాగా చేసి, గొప్ప చేస్తుంది కాబట్టి. 'హేతుబద్ధ రూపం'లోనేమో, అది, బూర్జువా తత్వానికీ, దాని సైద్ధాంతిక ప్రొఫెసర్లకీ, చాలా నేరం లాగానూ, అయిష్టమైన విషయం లాగానూ కనిపి స్తుంది. ఎందుకంటే, అమలులో వున్న వ్యవస్థని ఖచ్చి తంగా గుర్తించడమూ, ఆ వ్యవస్థ తప్పనిసరిగా పతనం చెందుతుందనే అంశాన్ని గ్రహించడమూ, చెయ్యా వలసి వస్తుంది కాబట్టి. ఇంకా ఎందుకంటే, అది (హేతుబద్ధ రూపంలో వున్న గతి తర్కం), చారిత్రకంగా పరిణామం చెందిన సామాజిక రూపాన్ని, ఒక చల నంలో వున్న ప్రవాహంగా భావిస్తుంది కాబట్టీ; ఈ

రకంగా దాని (సమాజపు) తాత్కాలిక ఉనికిని మాత్రమే గాక దాని పరివర్తనా స్వభావాన్ని కూడా పరిగణన లోకి తీసుకుంటుంది కాబట్టీ; తనపై దేనినీ రుద్దనివ్వదు కాబట్టీ; ఇక అది సారాంశంలో విమర్శనాత్మకమూ విప్లవకరమూ అయినది కాబట్టీనూ" -

మార్క్స్ [కాపిటల్ - 1, పేజీ 28 - 29]

2. మార్క్స్, హెగెల్ రాసిన 'లాజిక్' పుస్తకాన్ని విమర్శిస్తూనే, ఇష్ట పడుతూ కూడా, ఎంగెల్స్‌కి 14-1-1858 న రాసిన ఉత్తరంలో భాగం ఇది:

"హెగెల్ 'లాజిక్'ని మళ్ళీ కేవలం యాక్సిడెంటల్‌గా ఇంకో సారి చదవడం వల్ల, సమాచారంతో వ్యవహరించవలసిన విధానానికి సంబంధించి నాకు చాలా మేలు జరిగింది. నాకెప్పుడైనా టైము వుంటే, మార్మికతతో కప్పబడి పోయి వున్న హెగెల్ పద్ధతి లోని హేతుబద్ధమైన దాన్ని, సాధారణ మానవ మేధస్సుకి అందుబాటు లోకి తేవాలని ఎంతో కోరికగా వుంది"

మార్క్స్ [సెలెక్టెడ్ కరస్పాండెన్స్, పేజీ 93]

3. మార్క్స్, కుగల్ మన్‌కి, 6-3-1868 న రాసిన ఉత్తరంలో భాగం:

" ...... నేను వివరించే పద్ధతి (మెథడ్ ఆఫ్ ప్రెజెంటేషన్) హెగెల్ పద్ధతి కాదు. ఎందుకంటే, నేను భౌతిక వాదిని. హెగెల్ భావ వాది. హెగెల్ గతి తర్కం, అన్ని రకాల గతి తర్కాలకూ ప్రాథమిక రూపం (బేసిక్ ఫామ్). కానీ, దానిని, దాని మార్మిక రూపం నించి విడగొట్టినప్పుడు మాత్రమే, అప్పుడు మాత్రమే, అది నా పద్ధతిని వేరు పరిచి చూపుతుంది"

- [సెలెక్టెడ్ కరస్పాండెన్స్, పేజీ 187, మాస్కో]

ఈ రకమైన పొడి పొడి మాటల్లో, గతి తర్కం గురించి అర్థమయ్యేది ఏమిటంటే - హెగెల్ వివరించిన గతి తార్కిక సూత్రాలు సరైనవే. కానీ, ఆయన ఆ సూత్రాల్ని భౌతిక వాద దృక్పథంతో గాక, భావ వాద దృక్పథంతో ఉపయోగించాడు. కాబట్టి భౌతిక వాదులైన వాళ్ళు, ఆ గతి తార్కిక సూత్రాల్ని తీసుకుని, వాటిని భౌతిక వాద దృక్పథంతో అన్వయించుకుంటూ, విషయాల్ని అర్థం చేసుకోవాలి. ఇదీ మార్క్సు అర్థం.

'భౌతిక వాదం' అనేది గతంలో చాలా పొరపాట్లతో వుంది కాబట్టి, పరస్పర సంబంధాలూ, చలనమూ - వంటి గతి తార్కిక సూత్రాలతో భౌతిక వాదాన్ని అర్థం చేసుకుంటే, అది - 'గతి తార్కిక భౌతిక వాదం!' ఆ భౌతిక వాద దృక్పథంతో చరిత్రని అర్థం చేసుకుంటే, అది 'చారిత్రక భౌతిక వాదం!'

### ఎంగెల్స్ మాటల్లో:

"చరిత్ర చలనానికి సంబంధించిన ప్రధానమైన సూత్రాన్ని, మొట్ట మొదట కనిపెట్టిన వాడు ఖచ్చితంగా మార్క్సు. ఆ సూత్రం ప్రకారం - అన్ని చారిత్రక పోరాటాలూ - అవి, రాజకీయ, మత, తాత్విక, ఇతర భావాల పరిధిలో ఎక్కడ జరిగినవి అయినా, అవి నిజానికి సామాజిక వర్గాల మధ్య పోరాటాలకు, ఎక్కువ గానో తక్కువ గానో, స్పష్టమైన వ్యక్తీకరణలు మాత్రమే" - ఎంగెల్స్. ['18వ లూయీ బోనపార్ట్'లో ముందు మాట,

3వ జర్మన్ ఎడిషన్]

"ఈ రెండు గొప్ప పరిశీలనలూ (1) చారిత్రక భౌతిక వాద దృక్పథమూ, (2) అదనపు విలువ ద్వారా జరిగే కాపిటలిస్టు దోపిడీ యొక్క రహస్యం వెల్లడి జేయడమూ - పూర్తిగా మార్క్సు వల్లనే జరిగినవి. ఈ రెండు పరిశీలనల వల్లనే సోషలిజం ఒక సైన్సుగా అయింది. ఇక దాని పూర్తి సంబంధాలనూ, వివరాలనూ, అభివృద్ధి చేయటమే కావలసింది" - ఎంగెల్స్ [సోషలిజం: ఊహాజనితమూ, శాస్త్రీయమూ, పేజీ 36, మార్క్సిస్టు ప్రచురణలు, విజయవాడ]

మానవులు జీవించాలంటే, వస్తువులు ఎప్పుడూ వుండవలసిందే. వాటిని ఉత్పత్తి చేసుకోవాలంటే, ఉత్పత్తి సాధనాలతో అందరూ శ్రమలు చేసుకోవడం చాలు. దాని కోసం, పెట్టుబడి పెట్టే యజమానీ, వాడికి లాభమూ - వగైరా లేవీ వుండ నక్కర లేదు.

'మానవులు ఎప్పుడైతే సరుకు సంబంధాల నించీ బయటపడే ప్రయత్నాలు ప్రారంభిస్తారో, ఎప్పుడైతే ఉపయోగపు విలువ దృష్టితో సంబంధాల్ని నిర్మించుకోవడం ప్రారంభిస్తారో అప్పుడు, వస్తువుల్ని అల్లుకున్న 'విలువ' అనే మాయా జాలం విచ్చిపోతుంది. మానవ సమాజం మీద, విలువ కప్పే మాయ తెర తొలగిపోతుంది'. - ఈ జ్ఞానాన్ని ఇచ్చేదే మార్క్సిస్టు తత్వశాస్త్రం.

పెట్టుబడిదారీ అర్థిక వేత్తలకూ, తత్వ వేత్తలకూ, పెట్టుబడిదారీ సమాజమే, శాశ్వత సమాజం. గతంలో జరిగిన మార్పులన్నీ ఇక్కడ ఆగిపోతాయి. ఎందుకంటే - వాళ్ళ ప్రకారం, 'పెట్టుబడి' లేకపోతే 'ఉత్పత్తే' వుండదు. 'ఉత్పత్తి' లేకపోతే సమాజమే వుండదు. కాబట్టి, 'సమాజం' అనేది వుండాలంటే, అది పెట్టు

బడిదారీ సమాజంగా మాత్రమే వుండగలుగుతుంది. అది ఇంకా మారడానికి అవకాశం వుండదు. కాబట్టి, పెట్టుబడిదారీ సమాజం, శాశ్వితమైనది. దాని ధర్మాలన్నీ శాశ్వితమైనవి.

అంటే, పెట్టుబడిదారీ తత్వశాస్త్రం ప్రకారం - కలిమి లేములు శాశ్వితం. యజమాని తనమూ, సేవకత్వమూ శాశ్వితం. అసమానత్వాలన్నీ శాశ్వితం. సంక్షోభాలూ, యుద్ధాలూ అన్నీ శాశ్వితం. పెట్టుబడిదారీ సమాజంలో ఏ యే లక్షణాలు వున్నాయో అవన్నీ శాశ్వితం. ఈ సమాజం ఇక ఎప్పటికీ ఇలా సాగుతూ వుండవలసిందే. మారవలసిందేమీ లేదు.

ఇలాంటి మూఢ ప్రపంచంలో, మార్క్సిజం తన నూతనమైన జ్ఞానంతో ప్రతీ అంశానికీ అర్థాలు మార్చి వేసింది.

మార్క్సిజం శ్రామిక వర్గాన్ని, 'తప్పుడు సామాజిక సంబంధాల్ని మార్చివేసే విప్లవ శక్తిగా' గుర్తించింది. ఏ ఆర్థిక వేత్తా, ఏ తత్వవేత్తా సమర్థించని 'వర్గ పోరాటాన్ని' సమర్థిస్తూ, దానినే 'శ్రామిక వర్గ విముక్తి మార్గం'గా ప్రకటించింది.

'మనుషులందరికీ ఒకే సిద్ధాంతం, ఒకే తత్వశాస్త్రం' అనే తప్పుడు అవగాహన వున్న ప్రపంచంలో, మార్క్సిజం తన ప్రత్యేక విప్లవ స్వభావం వల్ల, 'శ్రామిక వర్గ సిద్ధాంతం'గా, అంటే 'శ్రామిక వర్గ తత్వశాస్త్రం'గా అవతరించింది.

దోపిడీ వర్గ ఆర్థిక శాస్త్రం 'వర్గాల్ని చూడనొల్లదు' కాబట్టి, దాని తత్వ శాస్త్రంలో, మానవులందరూ ఒకటే. అది 'మానవులు, మానవులు' అనే మాటనే పదే పదే వల్లిస్తుంది. కానీ, 'మానవులు' అనేది, ప్రకృతికి సంబంధించిన అర్థం. 'ప్రకృతి'లో క్రిమి కీటకాలూ, పక్షులూ, జంతువులూ - అనే జీవ రాసులకు భిన్నంగా వుండే జీవ రాసి - 'మానవులు.' అంటే 'మానవులు' అన్నప్పుడు, ప్రకృతి సహజమైన విభజనతో మాట్లాడుతున్నామని అర్థం. ఆ విభజన ప్రకారం అయితే - మానవులందరూ ఒకటే. శరీర ధర్మాల ప్రకారం అయితే, మానవులందరూ ఒకటే.

కానీ, ఆ మానవుల్లోనే వుండే సామాజిక తేడాల్ని చూసేటప్పుడు, మానవులందరూ ఒకటి కాదు. ఈ విభజన సామాజికమైనది; 'శ్రమ' సంబంధమైనది; 'వర్గ' సంబంధమైనది. ఈ విభజన ప్రకారం మానవులందరూ, వేరు వేరు వర్గాలకు చెందే వర్గ మానవులు. వర్గ సంబంధం లేకుండా వుండే వర్గాతీతమైన మానవులెవరూ వుండరు.

కాబట్టి, సామాజిక విషయాలు మాట్లాడేటప్పుడు, 'మానవులు, మానవులు' అనడం, వారి మధ్య వున్న 'వర్గ విభజనని' కనపడకుండా చెయ్యడానికే గానీ, ఇంకేమీ కాదు.

'మానవులందరూ ఒకటే' అని చెప్పే దోపిడీ తత్వశాస్త్రం, మళ్ళీ ఆ మానవుల్లోనే కుల భేదాల్నీ, మత భేదాల్నీ, రంగు భేదాల్నీ, తప్పనిసరి భేదాలుగా చూస్తుంది. దానికి ఎక్కడ ఏది అనుకూలమైతే అక్కడ ఆ రకంగా మారుతుంది.

'మానవులందరూ ఒకటే' అని వల్లించే పెట్టుబడిదారీ తత్వశాస్త్రం ప్రకారం - జనాభా అంతా ఒకటే. 'పెట్టుబడి' అంతా జాతీయ పెట్టుబడి! సంపద - జాతీయ సంపద! ఆదాయం - జాతీయ ఆదాయం! - ఆ పెట్టుబడి అందరిదీ అయినట్టూ, ఆ సంపద కోసం అందరూ శ్రమిస్తున్నట్టూ, ఆ ఆదాయం అందరికీ దక్కుతున్నట్టూ!

పెట్టుబడిదారీ లెక్కల ప్రకారం, ఒక సంవత్సరపు సామాజిక ఆదాయాల్ని జనాభా సంఖ్యతో భాగిస్తే వచ్చేది - తలసరి ఆదాయం! గుత్త కంపెనీ డైరెక్టరుకీ అదే ఆదాయం! షేర్ బ్రోకర్‌కీ అదే ఆదాయం. వ్యవసాయ కార్మికుడికీ అదే ఆదాయం! నిరుద్యోగికీ అదే ఆదాయం!- పెట్టుబడిదారీ అవగాహన ప్రతీ విషయంలోనూ ఇంతే.

కానీ, సమాజమే వర్గ సమాజం అయినప్పుడు, అందులో ప్రతీ అంశమూ వర్గ స్వభావం కలదే.

'వర్గ సమాజం'లో ప్రతీదీ 2 రకాలు!

ఆర్థిక శాస్త్రం - 2 రకాలు!

తత్వ శాస్త్రం - 2 రకాలు!

ప్రతీ సిద్ధాంతమూ, ప్రతీ జ్ఞానమూ 2 రకాలు!

'సైన్సు' కూడా 2 రకాలు! దాన్ని ఉపయోగించే పద్ధతీ, దానితో ప్రయోజనం పొందే పద్ధతీ, 2 రకాలు.

విద్యా, వైద్యమూ, నీతీ, సైకాలజీ - అన్నీ రెండేసి రకాలు.

'తత్వ శాస్త్రం' అనేది ఏదో ఒక్క దేశానికే పరిమితం కాదు. ప్రతీ దేశం లోనూ, అన్ని కాలాల లోనూ తత్వ వేత్తలూ, తత్వ శాస్త్రాలూ వుంటూనే వుంటాయి.

ఏ దేశం అయినా వర్గ సమాజమే కాబట్టి, ఏ దేశపు దోపిడీ వర్గ తత్వ శాస్త్రమైనా, భగవంతుడి మీద నమ్మకాలు కలిగించడమూ, కలిమి లేముల్ని సహజ ధర్మాలుగా బోధించడమూ, ఒకే రకంగా చేస్తుంది.

అయితే, ఏ దేశంలో నైనా శ్రామిక వర్గ పోరాటాలు తీవ్రంగా వుంటే, దాని ప్రభావం తమ దేశ

శ్రామిక వర్గం మీద లేకుండా చెయ్యడం కోసం, ప్రతీ దేశమూ, తన దోపిడీ తత్వ శాస్త్రానికి కొత్త ముస్తాబులు ప్రారంభిస్తుంది. శ్రామిక వర్గాన్ని ఏ పద జాలమైతే భ్రమలో ముంచగలదో ఆ పద జాలన్నే అది కూడా వల్లించడం మొదలు పెడుతుంది! దోపిడీ వర్గం ఏ నాడూ నోట బెట్టని 'సోషలిజం, సమ సమాజం' అనే మాటల్ని, ఈ నాడు దాని తత్వ శాస్త్రంలో కూడా చూడ వచ్చు. అయితే, ఆ మాటలకు అది ఇచ్చే అర్థాలన్నీ వేరుగా వుంటాయి. 'శ్రమ' మాట ఎత్తని అర్థాలు అవి.

దోపిడీ తత్వ శాస్త్రానికీ, మార్క్సిస్టు తత్వ శాస్త్రానికీ వుండే తేడా ఎంత పరస్పర విరుద్ధమైనదో కొన్ని ఉదాహరణలతో ఇప్పుడు చూద్దాం.

# పరస్పర విరుద్ధ తత్వ శాస్త్రాలు

| దోపిడీ తత్వ శాస్త్రం.<br>దీని మరో పేరు - 'అసత్యం' | మార్క్సిస్టు తత్వ శాస్త్రం.<br>దీని మరో పేరు - 'సత్యం' |
|---|---|
| 1. 'సమాజం'లో పూర్వం నించీ 2 రకాల వాళ్ళు వున్నారు. సోమరులూ, పాదుపరులూ! సోమరులేమో పేదలయ్యారు. పాదుపరులు ధనికులయ్యారు. | సమాజంలో 2 రకాల వాళ్ళు వున్నారనేది నిజమే. కానీ, వాళ్ళు సోమరులూ, పాదుపరులూ కాదు. దోపిడీదారులూ, శ్రామికులూ! శ్రామికులే పేదలయ్యారు. దోపిడీదారులు ధనికులయ్యారు! దోపిడీదారులే సోమరులు. సోమరులే ధనికులయ్యారు. |
| 2. స్వంతాస్తిని కూడబెట్టుకునే హక్కు ఎవరికైనా వుంటుంది. ఎవరికి 'శక్తి' వుంటే వాళ్ళు ఆస్తి ని కూడబెట్టుకోవచ్చు. | 'శక్తి' అంటే, 'ఉత్పత్తి సాధనాల' మీద దౌర్జన్యంగా సంపాదించిన యాజమాన్యమే. 'స్వంత శ్రమ'తో ఏర్పడే ఆస్తి అయితే, అది జీవితావసరాల్ని తీర్చడానికి మాత్రమే సరిపోతుంది. ఆ స్థాయిని మించిన ఆస్తి కూడితే, అది దోపిడీ ద్వారానే సాధ్యం. దీన్ని కవితాత్మకంగా చెప్తే, 'ఆస్తి చౌర్యమే'. 'ఆస్తి' అంటే - స్వయంగా శ్రమించే వాళ్ళ ఆస్తీ, దోచుకునే వాళ్ళ ఆస్తీ, ఒకటి కాదు.<br>"రాజకీయ ఆర్థిక శాస్త్రం చాలా భిన్నమైన వేరు వేరు రకాల ఆస్తుల్ని గందరగోళ పరుస్తుంది. వాటిలో ఒకటి - ఉత్పత్తిదారుల స్వంత శ్రమ మీద ఆధారపడినది. రెండవది - ఇతరుల శ్రమని నియమించడం మీద ఆధారపడినది." - మార్క్స్ [కాపిటల్ - 1, పేజి 716] |
| 3. వ్యక్తి ఆస్తి లేకపోతే, పని చెయ్యాలనే ఉత్సాహం వుండదు. | బానిసలు పని చేసిందంతా వాళ్ళ వ్యక్తి ఆస్తి కోసమేనా? ఈ నాడు కార్మికులు పని చేస్తున్నది తమ వ్యక్తి ఆస్తుల కోసమేనా? స్వంత ఆస్తులు లేకుండానే వాళ్ళు ఎందుకు పని చేస్తున్నారు? యజమానుల ఆస్తులన్నీ స్వంత ఆస్తులే కదా? మరి, యజమానులు ఎందుకు స్వయంగా పని చెయ్యరు? భూస్వామి ఎందుకు పొలం దున్నడు? పెట్టుబడి దారుడు ఎందుకు యంత్రాల దగ్గర నిలబడడు? స్వయంగా పనులు చెయ్యడానికి, వాళ్ళ ఆస్తే వాళ్ళకి ఎందుకు ఉత్సాహం ఇవ్వడం లేదు? → |

| | |
|---|---|
| 4. రాజ్యాంగ యంత్రం, శాంతి భద్రతలు కాపాడుతుంది. శత్రువుల నించి రక్షిస్తుంది. | నిజమే. దోపిడీ వర్గ రాజ్యాంగ యంత్రం, దోపిడీ వర్గ శాంతి భద్రతలు కాపాడుతుంది. దోపిడీ వర్గాన్ని, శత్రువుల నించి, అంటే ‘శ్రామిక వర్గం’ నించి, రక్షిస్తుంది. అంటే, వర్గ రాజ్యాంగ యంత్రం, ఒక్క వర్గం కోసమే గానీ, 2 వర్గాల కోసమూ పని చెయ్యదు. |
| 5. గత సమాజాల మాట వేరు గానీ, ఇప్పుడు మాత్రం పెట్టుబడిదారులూ, కార్మికులూ సమానమే. | కాదు. ఈ సమాజం కూడా గత సమాజాలకు మారు రూపమే. కొనసాగింపే. ఈ సంబంధం కూడా దోపిడీ సంబంధమే; యజమానీ సేవకుల సంబంధమే. ఇది కూడా తప్పుడు సామాజిక సంబంధమే. [“ఫాల్టీ సోషల్ రెలేషన్”] |
| 6. స్వార్ధం అనేది మానవ స్వభావం లోనే వుంది. | మానవులందర్నీ ఏకం చేసి మాట్లాడడం మొదటి తప్పు. మానవులు, ‘వర్గ’ మానవులే. బానిసకు యజమాని దగ్గిర స్వార్ధం ఏమిటి? శ్రామికులకు స్వార్ధం ఏమిటి? తమ శ్రమలో అత్యధిక భాగాన్ని ఉచితంగా ధారపోస్తూ, యజమాని వర్గానికి, రాత్రింబవళ్ళూ సేవలు చెయ్యడమేనా? ‘స్వార్ధం’ అంతా యజమాని వర్గానిదే. మానవులందరిదీ కాదు. |
| 7. మానవులు సహజం గానే చెడ్డ వాళ్ళు. నేరాలు చేస్తారు. | నేరాలకూ, చెడ్డతనాలకూ మూలం - శ్రమ దోపిడీయే. దోపిడీయే - పెద్ద నేరం. దాని ఆర్ధిక, రాజకీయ ప్రయోజనాల కోసమే నేరాలన్నీ పుట్టుకొచ్చాయి. నేరస్తులంతా దోపిడీ వర్గం వల్ల తయారైన వాళ్ళే. శ్రామిక వర్గం చేసే నేరాల్లో కొన్ని - బతుకు తెరువు కోసమూ, కొన్ని - దోపిడీ వర్గ ప్రభావాల వల్లా, జరుగుతాయి. మనుషులు, పుట్టినప్పుడు మంచి వాళ్ళూ కారు, చెడ్డ వాళ్ళూ కారు. సమాజమే వాళ్ళని మంచి గానో, చెడ్డ గానో తయారు చేస్తుంది. సమాజంలో నేరాలూ, చెడ్డ తనమూ వున్నాయంటే, ఆ సమాజం బ్రహ్మాండమైన తప్పులో వుందన్న మాట! దోపిడీ సమాజమే శాశ్వితమైనదిగా కనపడే వాళ్ళకి, దాని లక్షణాలన్నీ శాశ్వితలక్షణాలు గానే కనపడతాయి. నేరాలు చెయ్యడమూ, చెడ్డతనమూ మనుషుల శాశ్విత, సహజ లక్షణాలుగా కనపడతాయి. |
| 8. ‘జాతీయ ఆదాయం’లో న్యాయమైన పంపిణీ జరగాలి. | ‘శ్రామిక వర్గం నించీ అదనపు విలువని లాగే విధానం’ అలాగే వుండాలి! కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ అన్నీ అలాగే వుండాలి! దోపిడీ అంతా అలాగే వుండాలి! కానీ ‘జాతీయాదాయం’లో ‘న్యాయమైన పంపిణీ!’ ‘న్యాయమైన!’ |
| 9. రాజకీయాల్ని బట్టే, ఆర్ధిక విషయాలు వుంటాయి. | కాదు. దాన్ని తారుమారు చెయ్యాలి, ఆర్ధికాల్ని బట్టే రాజకీయాలు. రాజకీయాలకు ఏదో ఒక ‘లక్ష్యం’ వుంటుంది. ఆర్ధిక పునాదిని నిలబెట్టడమో, నిర్మూలించడమో. ఆ లక్ష్యం కోసమే రాజకీయాలు అవసరం. ఏ అవసరం కోసమూ కాకుండా మొదటే రాజకీయాలు వుండవు. కాబట్టి, ఆర్ధిక విషయాల్ని బట్టే రాజకీయాలు; రాజకీయాల్ని బట్టి ఆర్ధిక విషయాలు కాదు. → |

| | |
|---|---|
| 10.పేదలకు 'న్యాయం జరగాలి! పేదలకు 'సేవ' చెయ్యాలి! | పేదలే 'అన్యాయం!' అన్యాయానికి న్యాయం అంటే, అన్యాయాన్ని అలా వుంచడమే. అంటే, పేదల్ని అలాగే వుంచి, వారికి 'న్యాయం' చేస్తారన్న మాట! పేదల సేవలో - ప్రభుత్వాలూ, పేదల సేవలో - క్లబ్బులూ, పేదల సేవలో - స్వచ్ఛంద సంస్థలూ! అందరూ పేదల సేవ చేసే వాళ్ళే! 'పేదతనం ఎందుకు వుంది?' అనే ప్రశ్న మాత్రం వీళ్ళకి పట్టదు. తర తరాల నించీ పేదలే మీకు సేవలు చేస్తున్నారు. భవిష్యత్తులో పేదలు మీకు ఇంకా ఘనమైన సేవ చేస్తారు. మిమ్మల్ని యజమాని పీఠాల మీద నించి లాగి, నిజమైన మనుషులుగా మార్చే సేవ పేదలే మీకు చేస్తారు. |
| 11. మానవ జీవితాన్ని 'ఆర్థిక పరిధి'లో ఇమడ్చకూడదు. | అవును, మార్క్సిజం చెప్పేది కూడా అదే. 'మానవ సంబంధాలు, డబ్బు సంబంధాలుగా వుండకూడదు' అనే. దాని కోసం మార్క్సిజానికి ఒక సిద్ధాంతమూ, ఒక కార్యక్రమమూ కూడా వున్నాయి. కానీ మీ దగ్గిర అవేమీ లేవు. మీ దగ్గిర వున్నదంతా 'డబ్బుతో డబ్బుని పెంచుతూ పోయే' కార్యక్రమమే. పైగా 'జీవితాల్ని డబ్బు పరిధిలో ఇమడ్చకూడదు' అనే చిలుక పలుకులూ, దొంగ నీతులూ! మీ ప్రకారం, డబ్బు శాశ్వితం! డబ్బు దోపిడీ శాశ్వితం! కానీ, 'డబ్బు'ని నిజంగా తిరస్కరించే సిద్ధాంతం మాదే; అది మార్క్సిజమే! |
| 12. మానవుల స్వేచ్ఛ మీద 'ఆంక్షలు' వుండరాదు. | మానవులు 2 రకాలు. 'స్వేచ్ఛ' కూడా 2 రకాలు. దోపిడీదారులు దోపిడీ చెయ్యడానికి స్వేచ్ఛ కావాలంటారు. స్వేచ్ఛకి అదే వాళ్ళ అర్థం. కానీ, శ్రామికులు, దోపిడీ చేసే స్వేచ్ఛ ఎవరికీ వుండరాదంటారు; ఆ స్వేచ్ఛ తమకు కూడా వుండరాదంటారు. స్వేచ్ఛకి వీళ్ళ అర్థం ఇదీ. కాబట్టి, స్వేచ్ఛ కూడా వర్గ స్వభావం కలదే. 'దోపిడీ' అనేటంత పెద్ద విషయం అయినా, 'గోళ్ళని పెంచుకోవడం' అనేటంత చిన్న విషయం అయినా, ఎవరి స్వేచ్ఛ వాళ్ళది కాదు. సమాజంలో ఇతర మనుషులతో కలిసి జీవిస్తున్నప్పుడు, సమాజానికి ఏ రకంగానూ హాని కలిగించని విధంగా, వ్యక్తి స్వేచ్ఛ పరిమితమై వుండాలి. 'నా గోళ్ళు నా ఇష్టం' అని ఒక మనిషి, బారెడు బారెడు గోళ్ళని పెంచి తిరుగుతూ వుంటే, ఆ మనిషిని పట్టుకుని, ఆ గోళ్ళని కత్తిరించి వెయ్యడానికి అందరికీ స్వేచ్ఛ ఉంటుంది. అది సమాజ ఆరోగ్య రక్షణకీ, ఆత్మ రక్షణకీ అవసరం. అదీ స్వేచ్ఛకి అర్థం. |
| 13.నిమ్న వర్గాలు ఇప్పుడు మారిపోతున్నాయి. ఫలానా దేశంలో ఫలానా నిమ్న వర్గ వ్యక్తిని తీసుకోండి. ఉదా: భారత దేశంలో అంబేద్కర్‌ని తీసు కోండి. ఆయన ఎంత అభివృద్ధి చెందాడు! | ఒక్క వ్యక్తి అభివృద్ధే మొత్తం వర్గ అభివృద్ధి కాదు. అంతే గాక, అంబేద్కర్ అభివృద్ధి, ఆ వ్యక్తికి కూడా నిజమైన అభివృద్ధి కాదు. నిమ్న వర్గం నించి వచ్చిన వాడైన అంబేద్కర్, మార్క్సిజం గురించి తెలిసి కూడా దాన్ని వ్యతిరేకించడం వల్లా, అది పనికి రానిదని తన రచనల్లో ప్రకటించడం వల్లా, శ్రామిక వర్గానికి గాక పెట్టుబడి దారీ వర్గానికే మేలు జరిగింది. "పాలక వర్గం, పాలిత వర్గపు మేధావుల్ని ఎంత ఎక్కువగా నైతే తనలో ఇముడ్చుకుంటుందో, అంత స్థిరం గానూ, అంత ప్రమాదకరం గానూ, దాని పాలన తయారవుతుంది" అంటాడు మార్క్స్ [కాపిటల్ - 3, పేజి 610] → |

| | |
|---|---|
| 14. ఆస్తులకు పెట్టుబడి దారులు ధర్మ కర్తలుగా (ట్రస్టీలుగా) ఉంటారు. కార్మికులు దేశ భక్తులుగా కష్టించి పని చేస్తారు. [భారత దేశపు ఆధునిక తత్వ వేత్త అయిన మహాత్మా గాంధీ గారి ట్రస్టీ షిప్పు సిద్ధాంతం ఇది. "సోషలిజం ఆఫ్ మై కన్‌సెప్షన్" అనే పుస్తక సారాంశం.] | ఏం? ఆస్తులకు కార్మికులే ధర్మ కర్తలుగా వుండి, పెట్టుబడిదారులే కష్టించి పని చేసే దేశ భక్తులుగా ఎందుకు వుండకూడదు మహాత్మా గాంధీ గారూ? |
| 15. "మళ్ళీ జన్మ అంటూ వుంటే పాకీ వాడిగా పుడతాను." -మహాత్మా గాంధీ గారు. | మళ్ళీ జన్మ దాకా ఎందుకూ? చెయ్యదల్చుకున్న సత్కార్యాన్ని మళ్ళీ జన్మ దాకా వాయిదా వేసి, ఈ జన్మని వృధా చెయ్యడం ఎందుకూ? ఆ కార్యం ఈ జన్మలోనే ఎందుకు ప్రారంభించ కూడదూ? |
| 16.'సోషలిజంలో రాజూ రైతూ; ధని కుడూ- పేదా; యజమానీ - ఉద్యోగీ అందరూ సమాన స్థాయిలో వుంటారు" - భారత తత్వవేత్త మహాత్మా గాంధీ గారు. [ సోషలిజం ఆఫ్ మై కన్‌సెప్షన్, పేజీ - 1] | గాంధీ గారి 'సోషలిజం'లో - ఒక వేపు రాజులూ, ధనికులూ, యజ మానులూ; ఇంకో వేపు రైతులూ, పేదలూ, శ్రామికులూ - అందరూ ఎప్పటిలాగే వుంటారు. కానీ అందరూ 'సమాన స్థాయి'లో ఉంటారు! ఈ 'సమాన స్థాయి' ఏ విషయంలో? ఏమో! దాన్ని గాంధీ గారు వివరించలేదు. 'సమాన స్థాయీ, సోషలిజమూ' అనే మాటల్ని మాత్రం గాంధీ గారు కూడా తన తత్వశాస్త్రం లోకి చేర్చు కోక తప్పలేదు. |
| 17. 'భూస్వాములు, తమ మిగులు భూమిని పేద వర్గాల కోసం దానం చెయ్యాలి.' - భూదానోద్యమ తత్వ వేత్త అయిన వినోబాభావే. | 'మిగులు' భూమి! 'మిగులు' అంటే? భూస్వాములు, తమకు ఇష్ట మైనంత తీసుకోగా, దాచుకోగా, ఆ పైది ఎంతో కొంత! భూస్వామి, తన కోసం తీసుకున్న భూమిని భూస్వామి కుటుంబమే స్వంత శ్రమతో పండించుకుంటుందా? దాన్ని కూడా వ్యవసాయ కార్మి కులే పండిస్తే, జీతాలూ, అదనపు విలువా అంతా ఎప్పటి లాగే! ఈ సమస్యని భూదానోద్యమం ఎలా పరిష్కరిస్తుంది? |
| 18. "సమాజం నా కేమిచ్చిందని కాదు. సమాజానికి నేనే మిచ్చానని చూడాలి" - ఇదో గొప్ప సూక్తి! | ఎప్పుడూ 'వ్యక్తి' నించి లాగడమే చేసే సమాజం, ఇలాంటి సూక్తులే చెపుతుంది. 'తీసుకోవడం' వున్న ప్రతీ చోటా 'ఇవ్వడం' కూడా వుండాలి. 'సమాజానికి నేనేమిచ్చాను' అని ప్రశ్నించుకునే వ్యక్తికి, 'సమాజం నాకేమిచ్చింది' అని ప్రశ్నించడానికి కూడా హక్కు వుంటుంది. ఎప్పుడూ తీసుకోవడమే గానీ ఇవ్వడం చెయ్యని సమాజం, వ్యక్తులకు ఏ మేలూ చెయ్యదు. వ్యక్తులు ఎప్పుడూ మొదట 'శిశువులు'గా సమాజంలోకి వస్తారు. ఆ శిశువులకు సమాజం, సరైన పోషణా, విద్యా, ఆరోగ్యం, ఉద్యోగం, అన్నీ కల్పించాలి. సమాజమే మొదట, వ్యక్తులకు అదంతా ఇస్తే, అప్పుడు వ్యక్తులు ఆ సమాజాన్ని నిలబెట్టడానికి చెయ్యవలసిం దంతా చేస్తారు. సరైన విధానం ఏమి టంటే, వ్యక్తికీ, సమాజానికీ వైరుధ్యం వుండరాదు. రెండూ వేరు వేరు కాదు. రెండిటి శ్రేయస్సూ ఒకటి గానే వుండాలి. → |

19. మత గ్రంథాలన్నీ సర్వ జనుల సుఖాన్నే చెప్పాయి. 'గీత'లో చూడండి! 'బైబిల్'లో చదవండి. 'ఖురాన్'లో పరికించండి! 'సర్వే జనా సుఖినోభంతు' అన్నారు మన పెద్దలు!

అన్నారు సరే! ఇప్పుడు సర్వ జనమూ సుఖంగా ఎందుకు లేరో, అధిక జనం దుఃఖంగా ఎందుకు వున్నారో, ఏం కారణం చెప్పాయి మత గ్రంథాలన్నీ? సర్వ జనమూ సుఖంగా ఉండే విధంగా సమాజాన్ని మార్చడానికి మార్గం చెప్పాయా? 'వర్గ పోరాటం' చెప్పాయా? దేవాలయాల్లోనూ, చర్చిల్లోనూ, మసీదుల్లోనూ నిరర్థకంగా మోకరిల్లమనడం తప్ప, నిజ జీవితాల్ని మార్చగలిగే ఒక్క జ్ఞానవంతమైన ఆ మాట అయినా చెప్పాయా? సర్వ జనులూ సుఖంగా వుండే మార్గాన్ని మత గ్రంథాలు చెప్పనందుకు, వాటిని తప్పు పట్టనక్కర లేదు. అవి చాలా పురాతన కాలంలో తయారైన గ్రంథాలు. ఆ నాడు, దోపిడీని గ్రహించడం ఎవరికీ సాధ్యం కాదు కాబట్టి, ఆ మాట చెప్పనందుకు ఆ గ్రంథాల్ని తప్పు పట్టడం న్యాయం కాదు. కానీ, శ్రమ దోపిడీ రహస్యం బైటపడ్డ తర్వాత కూడా, ఆ విషయాల్ని తెలుసుకోకుండా ఇంకా మత గ్రంథాలనే పట్టుకుని వేళ్ళాడం, వాటి లోనే, గొప్ప జ్ఞానం వున్నట్టు నమ్మడం - చేసే వాళ్ళది అసలైన దుర్మార్గం. మంత్రాలకు చింత కాయలు రాలడం ఎంత నిజమో, 'సర్వే జనా సుఖినోభవంతు' మంత్రాలతో సుఖాలు దొరకడం అంత నిజం.

20. వర్గ పోరాటం హింస.

ఆ మాట అనే ముందు దోపిడీ వర్గం తన సమస్త ఆయుధాల్నీ త్యజించాలి. తన పోలీసునీ, కోర్టుల్నీ, జైళ్ళనీ, సైన్యాన్నీ అన్నిటినీ, రద్దు చెయ్యాలి. సమస్త ఆయుధాల్నీ పెట్టుకుని కూర్చున్నది దోపిడీ వర్గమే. యుగ యుగాలుగా ఊహాతీతమైనంత హింస చేస్తున్నది దోపిడీ వర్గమే. శ్రామిక వర్గాన్ని అణచడానికి చేసేదే హింస. ఆ హింస నించి బయట పడడానికి ఎదురు తిరగడం హింస కాదు. అది ఆత్మ రక్షణ కోసం పోరాటం. విముక్తి చెందడం శ్రామిక వర్గం హక్కు. ఆ హక్కుని గ్రహించి, దోపిడీ వర్గం, స్వచ్ఛందం గానే తన దోపిడీని వదులుకుంటే, పోరాటమూ వుండదు, హింసా వుండదు. హింసకి కారణం మొదటి నించీ దోపిడీ వర్గమే.

21. "యజమానులు మేనేజి మెంటు పనిని కూడా మానుకుంటే, 'తత్వ శాస్త్రం' చదువుకోవచ్చు!"
- అరిస్టాటిల్.

మరి, పని వాళ్ళు ఎప్పుడు చదువుకోవాలి తత్వ శాస్త్రం? యజమానులు కూడా పని వాళ్ళతో పాటే పని లోకి దిగితే, అప్పుడు శ్రామికులకు పని కాలం తగ్గుతుంది. అప్పుడు అందరూ సమానులవుతారు. అందరూ తత్వ శాస్త్రం చదువుకోవచ్చు.

ఈ రకంగా, ఎవరి 'తత్వ శాస్త్రం' వాళ్ళ కోసం వాదిస్తుంది. కానీ, 'సత్యం' అనేది 2 రకాలుగా వుండదు. దోపిడీ వర్గం, తన ప్రయోజనాల కోసం సత్యాన్ని ఎన్ని రకాలుగా మార్చినా, 'అసలు సత్యం' ఒకటే. అది శ్రామిక వర్గ సిద్ధాంతమే. అది శ్రామిక వర్గ తత్వ శాస్త్రమే. అంటే మార్క్సిజమే.

"**త**త్వ వేత్తలు ప్రపంచాన్ని రక రకాలుగా వివరించడం మాత్రమే చేశారు. కానీ అసలు విషయం ఏమిటంటే దాన్ని "మార్చడం!" - మార్క్స్ [జర్మన్ ఐడియాలజీ, పేజీ 620] దోపిడీని తీసివెయ్యగలిగే సిద్ధాంతమే, మానవ సమాజంలో నిజమైన, సహజమైన మానవ లక్షణాల్ని వికసింపచేస్తుంది.

"**సం**పూర్ణంగా అభివృద్ధి చెందిన సహజత్వంగా కమ్యూనిజం, 'మానవత్వం'తో సమానం! సంపూర్ణంగా అభివృద్ధి చెందిన మానవత్వం, 'సహజత్వం'తో సమానం. మనిషికీ ప్రకృతికీ; మనిషికీ మనిషికీ వుండే ఘర్షణలకు అదే సరైన పరిష్కారం" - మార్క్స్ [ఎకనామిక్ అండ్ ఫిలసాఫిక్ మాన్యుస్క్రిప్ట్సు ఆఫ్ 1844, పేజీ 90.]

★

# 4 వ భాగం

# కొన్ని విషయాలు

[ఈ భాగంలో 9 చాప్టర్లు ఉన్నాయి]

## 1. మార్క్సిజం మీద కొన్ని విమర్శలు

మార్క్సు రాసిన 'కాపిటల్' పుస్తకం విడుదలై, 'దోపిడీ'ని బయటపెట్టిన తర్వాత, ఆ నాటి నించీ ఈ నాటి వరకూ, పెట్టుబడిదారీ అర్థిక వేత్తలూ, తత్వ వేత్తలూ, రక రకాల వాదాలతో మార్క్సిజాన్ని వ్యతిరే కించడమే చేశారు; చేస్తున్నారు; ఇంకా చేస్తారు.

ఆ విమర్శలన్నీ ఎలాంటివంటే, 'కాపిటల్'లో వివరించిన విషయాల్ని సరిగా అర్థం చేసుకోకుండా చేసే విమర్శలు కొన్నీ, అర్థం చేసుకోవడానికి ఇష్టం లేక చేసే విమర్శలు కొన్నీ!

'శ్రమ శక్తి విలువ అంటే ఏమిటి?' అనే విషయం వివరించేటప్పుడు, మార్క్సు 'పురుష శ్రామికుణ్ణి' ఉదా హరణగా తీసుకుని, కుటుంబాన్ని పోషించే ఖర్చు (భార్య పోషణ ఖర్చు కూడా) అతని 'శ్రమ శక్తి విలువ'లో ఒక అంశంగా వుంటుందని చెపుతాడు. అయితే, ఈ పరిస్తితి 'ఆధునిక యంత్ర పరిశ్రమ' కాలంలో గాక, దాని కన్నా వెనకటి కాలంలో వున్న ట్టుగా చెపుతాడు. 'యంత్ర పరిశ్రమ' ప్రారంభమై నప్పటి నించీ స్త్రీలూ పిల్లలూ కూడా బయటి పనుల్లోకి రావడమూ, ఎవరి శ్రమ శక్తి విలువని వారే సంపా దించుకోవడమూ జరుగుతాయని కూడా చెబుతాడు. కాబట్టి, దాన్ని గురించి వివాదం వుండడానికి అవకాశం లేదు. ఎటొచ్చీ, 'ఆధునిక పరిశ్రమ కన్నా ముందు', శ్రామిక కుటుంబాల్లో, స్త్రీల పోషణ పురుషుడి ద్వారా జరిగిందా - అనేదే ఒక ప్రశ్నగా వుంటుంది. అయితే, ఈ నాటికి కూడా ఏ దేశంలో నైనా స్త్రీ కార్మికుల సంఖ్య, పురుష కార్మికుల సంఖ్యతో సమానంగా లేద నేది వాస్తవం. ఈ పరిస్తితినే 'మాన్యుఫాక్చర్' కాలంలో తీసుకుంటే, ఆ నాడు, పురుష కార్మికుల సంఖ్య కన్నా స్త్రీ కార్మికుల సంఖ్య చాలా తక్కువగా వుండేదనడం వాస్తవ విరుద్ధం అవదు.

స్త్రీ, తన పోషణ ఖర్చునీ, పిల్లల పోషణ ఖర్చులో సగ భాగాన్నీ సంపాదించగలిగితేనే, కుటుంబ పోష ణలో ఆమె బాధ్యత ఆమె నిర్వహిస్తోందని అర్థం. ఈ నాటికీ లేని ఈ పరిస్తితి, ఆ నాడు వుందా? ఆ నాడు, పురుష కార్మికుల కన్నా స్త్రీ కార్మికుల సంఖ్య చాలా తక్కువగా వుండేదనీ; లేదా, స్త్రీలు కూడా కొన్ని శ్రమలు చేసినప్పటికీ, సంవత్సరం మొత్తం మీద, పురుష కార్మికుడి సంపాదన కన్నా స్త్రీ కార్మికురాలి సంపాదన తక్కువగా వుండేదనీ భావించడం వాస్తవ విరుద్ధం అవదు.

ఈ వాస్తవం వల్లనే, మార్క్సు, పురుష కార్మికుణ్ణే జనరల్ ఉదాహరణగా తీసుకున్నాడు. ఇది మార్క్సు, తన ఇష్టా యిష్టాలతో చేసిన నిర్ణయం కాదు. "స్త్రీ పోషణ, పురుషుడి ద్వారానే జరగాలి" అని మార్క్సు నిర్ణయించడం లేదు. సమాజంలో, సంపాదనకు సంబంధించి వున్న వాస్తవాన్ని చెపుతున్నాడు. ఆ వాస్త వాన్ని అలాగే వుంచాలని అతను అనడం లేదు. ఆ వాస్తవాన్ని అతను సమర్థించడం లేదు. అలాంటి సంబంధాల్ని మార్చాలనే చెపుతున్నాడు.

ఒక వేళ, భార్యా భర్తలిద్దరూ, యజమానుల దగ్గిర శ్రమ చేసి జీతాలు తీసుకునే వాళ్ళయితే, అప్పుడు కూడా ప్రతీ జీతమూ 'శ్రమ శక్తి విలువే'. ప్రతీ జీతమూ యజమానికి 'అదనపు విలువ'ని ఇస్తుంది. 2 జీతాలు వచ్చే శ్రామిక కుటుంబం, ఒకే జీతం వచ్చే కుటుంబం కన్నా కొన్ని ఎక్కువ ఉత్పత్తులు వాడ గలుగుతుంది.

మార్క్సు, 'ఆధునిక పరిశ్రమ కాలం' నించీ స్త్రీ పురుషుల పరిస్తితిని ఒకే రకంగా చెప్పాడు. పురుషుల లాగే స్త్రీలు కూడా రక రకాల శ్రమల్లో వున్నప్పుడు, ఆ

స్త్రీలు, ఉత్పాదక శ్రామికులో, అనుత్పాదక శ్రామికులో అవుతారు. గృహాలకే సంబంధించి వుంటే, ఆ స్త్రీలు, 'కుటుంబ శ్రమ' చేసుకునే వాళ్ళవుతారు. లేదా, ఇంట్లోనే కొన్ని సరుకుల్ని చేసి అమ్మే వాళ్ళయితే, స్వతంత్ర ఉత్పత్తిదారులో, స్వతంత్ర వర్తకులో అవుతారు. 'శ్రమ' విషయాలన్నీ పురుషులకు ఎలా వర్తిస్తాయో స్త్రీలకూ అలాగే వర్తిస్తాయి.

మార్క్సిజం - 'మానవ సమానత్వాన్ని' బోధించే సిద్ధాంతం. పురుషుల లాగే స్త్రీలు కూడా మానవులే అయితే, 'మానవ సమానత్వం' అనేది, 'స్త్రీ పురుష సమానత్వం' కూడా. 'శ్రమ సంబంధాల్లో పాత శ్రమ విభజన' మారేటప్పుడు, స్త్రీ పురుషుల మధ్య వుండే పాత శ్రమ విభజన కూడా మారుతుంది.

మార్క్సు, కుటుంబంలో స్త్రీల, పిల్లల దాస్యాన్ని సమర్థించాడో, వ్యతిరేకించాడో చూడండి.

> "......... ఏ రకపు 'ప్రైవేటు ఆస్తి'లో నైనా ఎల్లప్పుడూ కుటుంబ సభ్యుల బానిసత్వం కనీసంగా నైనా ఇమిడి వుంటుంది. ఎందుకంటే, వారిని కుటుంబ పెద్ద ఉపయోగించుకోవడమూ, దోచడమూ చేస్తాడు గనక" - మార్క్స్ [కాపిటల్- 1, పేజీ 1083, పెన్‌గ్విన్ ఎడిషన్]

> "పెట్టుబడిదారీ విధానంలో, పాత కుటుంబ బంధనాలు నాశనం కావడం (డిజల్యూషన్ ఆఫ్ ఫామిలీ టైస్), ఎంత ఘోరం గానూ, అసహ్యకరం గానూ జరిగినప్పటికీ, ఆధునిక పరిశ్రమ, స్త్రీలకూ - యువతీ యువకులకూ - చిన్న పిల్లలకూ - గృహ పరిధికి అవల వున్న (అవుట్ సైడ్ డొమెస్టిక్ స్ఫియర్) ఉత్పత్తి క్రమంలో ఒక ముఖ్య పాత్రను కేటాయించడం ద్వారా, ఒక ఉన్నత కుటుంబ రూపానికీ, స్త్రీ పురుషుల మధ్య (బిట్వీన్ బోత్ సక్సెస్) సంబంధాలలో ఉన్నత రూపానికీ, దారి తీసే ఒక కొత్త ఆర్థిక పునాదిని సృష్టిస్తుంది ... ఆడా మగా, చిన్నా పెద్దా కార్మికులతో కూడిన ఈ నాటి 'సమిష్టి కార్మిక బృందం', సరైన పరిస్తితులతో, తప్పని సరిగా మానవత్వంతో కూడిన అభివృద్ధికి సాధనంగా వుంటుందనేది స్పష్టం. - మార్క్స్ [కాపిటల్ 1, మాస్కో ఎడిషన్ 1974, పేజీ 460]

"ఆధునిక పరిశ్రమ - ఉన్నత కుటుంబ రూపానికీ, స్త్రీ పురుష సంబంధాలలో ఉన్నత రూపానికీ దారి తీసే కొత్త ఆర్థిక పునాదిని సృష్టిస్తుంది" అనే మాటల మీద దృష్టి పెట్టండి! కుటుంబం అనేది ఇప్పుడు ఉన్నత రూపంలో లేదనీ, స్త్రీ పురుష సంబంధాలు ఇప్పుడు ఉన్నత రూపంలో లేవనీ, అవి భవిష్యత్తులో ఉన్నత రూపం లోకి మారవలసి వుందనీ మార్క్సు స్పష్టంగా చెపుతున్నాడు.

ఏ రచన నైనా చదివేటప్పుడు, అందులో ఎక్కడైనా ఎక్కువ వివరణ లేక, విషయాలు సరిగా అర్థం గాక, తాత్కాలికంగా అపార్థాలు కలిగినా, క్రమంగా ఇంకా ముందుకు పోతూ, ఆ రచన స్వభావాన్ని అర్థం చేసుకునే కొద్దీ, అపార్థాల నించి బయటపడి తీరతాము.

కానీ, మార్క్సిజం మీద 'కక్ష'తో వుండే బూర్జువాలు, దాని మీద అపార్థాల్ని తీసివేసుకోవడానికి ప్రయత్నించరు. వాటిని కావాలనే పెంచుకుంటూ, నిలబెట్టుకుంటూ పోతారు.

మార్క్సిజం మీద 'కక్ష'ని ప్రదర్శించే రక రకాల బూర్జువా వాదాల్లో, బూర్జువా - స్త్రీ వాదం కూడా ఒకటి. మార్క్సు స్త్రీల పోషణని పురుషుడికి అప్పజెప్పాడనీ, స్త్రీల పోషణని పురుషుడి శ్రమ శక్తి విలువలో భాగం చేశాడనీ, స్త్రీల 'శ్రమ' గురించి మాట్లాడనే లేదనీ, అంతా పురుషుల శ్రమ గురించే చెప్పాడనీ, కాబట్టి మార్క్సిజం స్త్రీల సమస్యలకు పనికి రాదనీ - ఇలా దాని విమర్శ సాగుతుంది.

కానీ, మార్క్సిజాన్ని మొత్తంగా చూసి దాని ప్రధాన లక్ష్యాన్ని గ్రహించినప్పుడు, అందులో ఎన్ని అస్పష్టతలు వున్నా, అర్థం చేసుకోవడానికి కష్టంగా అనిపించే ఎన్ని అంశాలు వున్నా, ఎవరైనా వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారే గానీ, ఇంత వ్యతిరేకమైన అభిప్రాయాలకు ఎవరూ రారు, శత్రువులు తప్ప!

మార్క్సిజం 'పనికి రాని' చోట, ఇంకేది పని కొస్తుంది? - మార్క్సిజానికి వ్యతిరేకమైనదే! అంటే, దోపిడీ వర్గ సిద్ధాంతమే. బూర్జువాలకు (వాళ్ళు పురుషులైనా, స్త్రీలైనా) కావలసింది అదే. వాళ్ళు ఆ మాట సూటిగా చెప్పరు. 'మార్క్సిజం'లో తప్పు వున్నట్టూ, దాన్ని తాము కనిపెట్టినట్టూ, అందుకే దాన్ని వదిలేసినట్టూ, అంత కన్నా గొప్పదాన్ని తాము చేపట్టినట్టూ,

ప్రకటిస్తారు. ఆ 'గొప్పది' ఇంకేదో కాదు. వాళ్ళకి కావలసిన దోపిడీ సిద్ధాంతమే. ఆ రకంగా వాళ్ళ గూటికే వాళ్ళు చేరతారు.

**సారాంశం ఒకటే:**

మార్క్సిజం మీద విమర్శలన్నీ సారాంశంలో ఒకే రకం. 'మార్క్సిజం పనికి రాదు' అనేదే ఆ సారాంశం.

మార్క్సిజాన్ని తప్పు పట్టే వాళ్ళు, "అసలు అదనపు విలువ సిద్ధాంతమే తప్పు. దోపిడీ అనేది లేనే లేదు" అని వాదించాలి. కానీ, ఆ రకం వాదన జోలికి పోరు. 'దోపిడీ వుందా, లేదా' అనే ప్రశ్నకి దిగితే, అది వుందని రుజువై తీరుతుందని వాళ్ళకి కూడా తెలుసు. అలా రుజువైన తర్వాత, దోపిడీని తీసివెయ్యాలని చెప్పవలసిందే గానీ, అలాగే వుంచాలని చెప్పడం సాధ్యం కాదు కాబట్టి, 'అదనపు విలువ'ని ప్రశ్నించే చర్చకి వాళ్ళు దిగరు. 'దోపిడీ లేనే లేదు' అని గానీ, 'అదనపు విలువ సిద్ధాంతం తప్పు' అని గానీ, వాదించే పుస్తకం ఒక్కటి కూడా దొరకదు. 'దోపిడీ' మాట ఎత్తకుండా విమర్శలన్నీ 'వర్గ పోరాటం' మీద సాగిస్తారు. 'పోరాటం' అనే దాన్ని లేకుండా చేస్తే, 'దోపిడీని తీసివేసే' కార్యక్రమమే వుండదు కాబట్టి, బూర్జువా సిద్ధాంత కర్తలందరూ 'పోరాటం తప్పు' అని చెప్పడానికే తమ శక్తి యుక్తులన్నీ ఉపయోగిస్తారు.

వర్గ పోరాటం 'శాంతి'ని పాడు చేస్తుందట! ఎవరి శాంతినీ? వీళ్ళ దోపిడీ, ఏ శాంతినీ పాడు చెయ్యదు! వీళ్ళ యుద్ధాలు కూడా ఏ శాంతినీ పాడు చెయ్యవు!

వర్గ పోరాటం, శ్రామిక వర్గాన్ని 'తప్పు దారి' పట్టిస్తుందట! అంటే 'రైటు దారి' పట్టిస్తుందన్న మాట! అదే వీళ్ళకి పనికి రాదు.

పెట్టుబడిదారీ మేధావుల వంకర టింకర వాదనలు ఇంకా ఇలా వుంటాయి:

"అసలు ఈ నాడు చట్ట సమ్మతంగా పని చేసే ప్రభుత్వాలున్నాయి. అవి శాంతియుతంగా మార్పులు సాధిస్తాయి."

"అసలు ఇప్పుడు మార్క్సు వర్ణించిన నిరుపేద కార్మికులెక్కడ వున్నారు? పశ్చిమ దేశాల్లో అయితే, కార్మికులకు కూడా కార్లూ, టీ.వీలూ, వాషింగ్ మిషన్లూ, అన్నీ వున్నాయి. కార్మికులు కూడా షేర్లు కొంటున్నారు. కార్మికులకు కూడా లాభాల్లో వాటా ఇస్తున్నారు. ఇంకా కార్మికులకూ, పెట్టుబడిదార్లకూ తేడా ఎక్కడుంది?"

"అసలు ఇప్పుడు కంపెనీలన్నీ మేనేజర్ల ద్వారానే నడుస్తున్నాయి. ఇంకా పెట్టుబడిదారులు ఎక్కడున్నారు?"

"అసలు ఇప్పుడు అసమానత్వం ఎక్కడుంది? కార్మికులు అసమానంగా వున్నామని అనుకొనే అనుకోరు. అది, వాళ్ళనేమీ బాధించదు. వాళ్ళ పద్ధతిలో వాళ్ళు సుఖంగా వుంటే, 'నువ్వు అసమానత్వంలో వున్నావు' అని వాళ్ళని రెచ్చగొట్టడం వల్ల వాళ్ళకి జరిగే మేలు ఏమిటి?"

"అసలు సమానత్వం ఎప్పటికీ సాధ్యం కాదు. మానవుల్లో సహజం గానే అసమానత్వం వుంది."

"అసలు, కార్మికులు ఇప్పుడు ఎంతో మారిపోయారు. యంత్రాలు పెరిగి పోయాయి. ఇప్పుడు టెక్నీషియన్లు తప్ప కార్మికులు ఎక్కడ వున్నారు?"

"కార్మికులు ఇప్పుడు కొత్త మధ్య తరగతిగా తయారయ్యారు. వీళ్ళ గురించి మార్క్సు ఏమీ చెప్పలేదే! అంతా వెనకటి వాళ్ళ గురించే గానీ."

"పశ్చిమ దేశాల్లో చూడండి. కార్మికులకు మార్క్సిజం పట్టనే పట్టదు."

"మార్క్సిజం అంతా ఏక పక్ష సిద్ధాంతం. పక్ష పాత సిద్ధాంతం. అంతా ఉత్త ఆర్థిక వాదం. అందులో ఒక్క ముక్క నిజం వుంటే, బోలెడు అబద్ధం వుంటుంది."

"లాభం లేదు. మార్క్సిజం పనికి రాదు."

ఈ వాదాలన్నీ - బూర్జువా ప్రపంచంలో, తమ పెద్ద పెద్ద గ్రంథాలతో లైబ్రరీల్ని అలంకరించిన ఆర్థిక వేత్తలవీ, తత్వవేత్తలవీ, ఇంకా ఈ వేత్తలవీ, ఆ వేత్తలవీనూ!

ఇక, 'భారత దేశపు వేత్తల' ప్రత్యేక విమర్శ అయితే, "మార్క్సిజం విదేశీ సిద్ధాంతం. కాబట్టి, అది పనికి రాదు ఈ దేశానికి."

ఈ 'తుక్కు' కంతటికీ మార్క్సిజం తెలిసిన కార్మికులు, మహా తేలిగ్గానే జవాబులు చెప్పగలరు. మార్క్సిజం వల్ల 'లాభం' లేదు మరి, బూర్జువాలకి! 'లాభానికి' చాలా 'నష్టమే' మార్క్సిజం వల్ల!

మార్క్సిజం ఏక పక్షమే. అది, 'న్యాయం పక్షం!' దానిది, 'పక్ష' పాతమే. అది 'సత్య పక్ష పాతం!' ఏ సిద్ధాంతమైనా ఒకే పక్షాన వుంటుంది గానీ, 2 పక్షాలా

వుంటుందా? 'న్యాయం' పక్షానా, 'అన్యాయం' పక్షానా కూడా వుంటుందా? 'సత్యం' పక్షానా, 'అసత్యం' పక్షానా కూడా వుంటుందా? అలాంటి సిద్ధాంతం ఏదీ వుండదు. బూర్జువాల సిద్ధాంతం కూడా ఏక పక్షమే. అది దోపిడీ పక్షం. దానిది కూడా పక్ష పాతమే. అది దోపిడీ వర్గ పక్ష పాతం!

పశ్చిమ దేశాల కార్మికుల్లో మార్క్సిజం లేకపోతే, అది మార్క్సిజం తప్పా? రోగికి ఔషధం అందకపోతే అది ఔషధం తప్పా? కార్మికుల్లో మార్క్సిజం లేదంటే, ఆ కార్మికులు, 'దోపిడీ వర్గ భావాల బురద'లో దిగబడి వున్నారని అర్థం. వాళ్ళు తమ విముక్తి సిద్ధాంతం వేపు కళ్ళు తెరవడానికి ఇంకా కాలం పడుతుందని అర్థం. అంతే గానీ, విముక్తి సిద్ధాంతమే తప్పని అర్థం కాదు.

ఎక్కడైతే కౌళ్ళూ - వడ్డీలూ - లాభాలూ ఏదో ఒక రూపంలో నడుస్తూ వున్నాయో, అక్కడ దోపిడీ వుందని అర్థం. అక్కడ, శ్రామిక వర్గ అదనపు విలువ, దోపిడీ వర్గానికి పోతూ వుందని అర్థం. 'దోపిడీ' వున్న చోట, దాని వ్యతిరేక సిద్ధాంతం అత్యవసరమని అర్థం.

'మార్క్సిజం' ఒక దేశ సిద్ధాంతం కాదు. 'మానవ సమాజ సిద్ధాంతం'. 'జబ్బు'ని పోగొట్టే మందుకి, స్వదేశానిదా - విదేశానిదా అనే తేడా వర్తించదు. అలాగే, దోపిడీతో పోరాడే మార్క్సిజానికి, దేశాల తేడాలు వర్తించవు. దోపిడీ ఎక్కడ వుంటే అక్కడ మార్క్సిజం వుంటుంది. భారతదేశంలో దోపిడీ వుందో లేదో తేల్చుకోవాలి.

మార్క్సిజం, శ్రామిక వర్గ విముక్తి మార్గం. కాబట్టి, దానిమీద బూర్జువాలు తప్పుడు ప్రచారాలు చెయ్యడం చాలా సహజమే. వాళ్ళకి అది చాలా అవసరం. ★

# 2. రష్యా చైనాల మాటేమిటి?

'మార్క్సిజం, శ్రామిక వర్గ సిద్ధాంతం' అన్నప్పుడు, 'అయితే రష్యా చైనాల మాటేమిటి?' అనే ప్రశ్న ఈ నాడు తప్పని సరిగా తలెత్తుతుంది. దాన్ని దాట వెయ్యకూడదు.

రష్యా చైనాలు ఒకప్పుడు విప్లవ మార్గం లోనే 'నూతన' సమాజ నిర్మాణాలు ప్రారంభించాయి. కొన్ని అడు గులు నడిచాయి కూడా. క్రమంగా, విప్లవ మార్గాన్ని వదిలి వెనక్కి తిరిగాయి.

ఎందుకిలా జరిగిందని ప్రశ్నించుకోవలసిందే. కారణాల కోసం అన్వేషించవలసిందే. కానీ, అక్కడ అలా జరిగింది కాబట్టి, అది మార్క్సిజం తప్పనే అర్థానికి వస్తామా? ఒక వ్యక్తి గానీ, ఒక సంఘం గానీ, ఒక దేశం గానీ, మార్క్సిజాన్ని అనుసరించాలని ప్రారంభించి, బూర్జువా విధానాన్ని వదిలించుకోకుండా, రెంటి తోనూ సతమత మవుతూ, చివరికి, మార్క్సిజాన్నే వదిలి వేస్తే, అది మార్క్సిజం లోపమా?

ఇక్కడ 3 విషయాలు ప్రధానం. <u>మార్క్సిజమూ, శ్రామిక వర్గమూ, శ్రామిక వర్గ నాయకత్వమూ.</u> లోపం, ఈ 3 విషయాల్లోనే ఎక్కడో అక్కడ వుంటుంది.

'మార్క్సిజం'లో లోపం లేదని గ్రహించడానికి, దాని మీద 'బూర్జువా వర్గ ద్వేషం' అనే రుజువు చాలు. శ్రామికుల కోసం, మార్క్సిజమే గాక, ఇంకా అనేక సిద్ధాంతాలు వున్నాయి. కానీ, బూర్జువా వర్గం, ఆ ఇతర సిద్ధాంతాల్లో దేనినీ పట్టించుకోదు. దాని ద్వేషం అంతా మార్క్సిజం మీదే. మార్క్సిజాన్ని ద్వేషించినంతగా అది ఏ ఇతర సిద్ధాంతాన్నీ ద్వేషించదు. మార్క్సిజం మీద తన అచంచలమైన ద్వేషం ద్వారా బూర్జువా వర్గం ఏం చెపుతోందంటే - 'శ్రామిక వర్గానికి మేలు చెయ్యగలిగే ఏకైక సిద్ధాంతం మార్క్సిజమే' అని చెపుతోంది. కాబట్టి, శతృవు ప్రకటించే ద్వేషాన్నీ భయాన్నీ చూసి అయినా 'మార్క్సిజంలో లోపం లేద'నే అర్థానికి నిస్సందేహంగా రావచ్చు. తిరుగులేని రుజువు ఇది.

ఇంకా 2 విషయాలు మిగులుతాయి.

శ్రామిక వర్గమూ, దాని నాయకత్వమూ.

అందులో, శ్రామిక వర్గాన్ని తప్పు పట్టడం కూడా సాధ్యం కాదు. ఎందుకంటే, శ్రామిక వర్గం ఎంత అధమ స్థాయిలో నైనా వుండవచ్చు. అది, ఏ స్థాయిలో వుంటే ఆ స్థాయిలో నించే దానికి నేర్పడం ప్రారంభించాలి. ఆ స్థాయిలో నించే దాన్ని అభివృద్ధి పరచాలి.

నేర్పే వాళ్ళ పాత్ర ఎంత ప్రధానమో, నేర్చుకునే వాళ్ళ పాత్ర కూడా అంత ప్రధానం - అనేది నిజమే. అయినా ఈ 'వర్గ పోరాటం' అనే విషయంలో, నేర్పే వాళ్ళ పాత్రే అత్యంత ప్రధానమైనది. అంటే, లోపం - 'నాయకత్వం లోనే వుంద'ని తేలుతుంది.

'నాయకత్వం' అంటే, అది, 'మార్క్సిజంతో

సమానం' కాదు. అది మార్క్సిజాన్ని సరిగా గ్రహించనూ వచ్చును; గ్రహించక పోనూ వచ్చును. లేదా, అది, బూర్జువా మత్తుతోనే ఊగుతూ వుండవచ్చును కూడా.

నాయకత్వాన్ని పరిశీలించే శక్తీ, అవసరమైతే విమర్శించే శక్తీ, దాని అనుచరులకు వుండాలి. కానీ, అనుచరులు మహా వెనకబడ్డ స్తితిలో వుంటే, వారు నాయకత్వాన్ని ప్రశ్నించలేరు.

'వర్గం' ఎప్పుడూ, తన నాయకత్వాన్నే అనుసరిస్తుంది. వర్గానికి, తన వర్గ చైతన్యం చాలా తక్కువగా వున్నప్పుడు, నాయకత్వాన్ని విమర్శ లేకుండా అనుసరించే ధోరణి మరీ ఎక్కువగా వుంటుంది.

శ్రామిక వర్గ ట్రేడ్ యూనియన్లు, బూర్జువా వర్గ నాయకుల్ని ఎందుకు అనుసరిస్తున్నాయి? - శ్రామికులకు, వర్గ చైతన్యం లేక.

అలాగే, 'శ్రామిక వర్గ పార్టీల పేరుతో' కమ్యూనిస్టు నేతలు, బూర్జువాల సేవలో మునిగి తేలుతోంటే, శ్రామిక వర్గం ఏ మాత్రమూ ఆగ్రహం లేకుండా నిరాసక్తంగా చూస్తూ వుంటుంది.

అలాగే, 'శ్రామిక వర్గ ప్రభుత్వాలు' ఏర్పడిన దేశాల్లో కూడా, 'పార్టీ' లోనూ 'ప్రభుత్వం' లోనూ బూర్జువా ధోరణులనే శ్రామిక వర్గం సహిస్తూ వుంటుంది.

ఇదంతా, శ్రామిక వర్గానికి, ఏ చైతన్యం వుండాలో ఆ చైతన్యం లేకనే. దానికి ఏది నేర్పాలో అది నేర్పకనే.

వర్గాన్ని, నాయకత్వం, సరైన మార్గంలో నడుపుతూ వుంటే సత్ఫలితాలూ, మార్గం సరైనది కాకపోతే దుష్ఫలితాలూ, వస్తాయి.

కాబట్టి, రష్యా చైనాల్లో దుష్ఫలితాలకు, నాయకత్వాల్ని తప్పు పట్టడం తప్ప, మార్క్సిజానిదే తప్పనో, శ్రామిక వర్గానిదే తప్పనో, తప్పుడు అభిప్రాయాలకు రాకూడదు. అంటే, మార్క్సిజం అనేది, రష్యా చైనాల్లో కూడా శ్రామిక వర్గానికి అందలేదని దీని అర్థం.

> "సిద్ధాంతం, జనాల మీద పట్టు సంపాదించినప్పుడు అది ఒక భౌతిక శక్తి అవుతుంది" - మార్క్స [ఆన్ రెలిజియన్, పేజీ 46.]

> "ప్రత్యేకంగా, నాయకుల కర్తవ్యం ఏమిటంటే - సిద్ధాంత సమస్యలన్నిటిని గురించీ, అంతకంతకూ స్పష్టమైన అవగాహన సంపాదించడమూ; పాత ప్రపంచ దృక్పథం నుంచి సంక్రమించిన సాంప్రదాయిక నుడికారాల ప్రభావం నుంచి అంతకంతకూ విముక్తి చెందడమూ; సోషలిజం ఒక శాస్త్రం అయింది గనుక దానిని శాస్త్రంగా అనుసరించాలని, అనగా అధ్యయనం చేయాలని, అది డిమాండు చేస్తుందనే విషయం నిత్యం మనసులో వుంచుకోవడమూ; అలా గ్రహించినట్టి, అంతకంతకూ స్పష్టమైన అవగాహనను మరింత పట్టుదలతో <u>కార్మిక జనాలలో వ్యాప్తి చేయడమూ;</u> పార్టీ యొక్కా, ట్రేడ్ యూనియన్ల యొక్కా నిర్మాణాన్ని అంతకంతకూ దృఢంగా కట్టుదిట్టం చేయడమూ - ఇదంతా నాయకుల కర్తవ్యంగా వుంటుంది" - ఎంగెల్స్ [జర్మనీలో రైతు యుద్ధం, పేజీ 28]

'వర్గ పోరాట పరిణామాల్ని' పరిశీలించేటప్పుడు, ఈ "విప్లవ పంథా ఈ తప్పు చేసింది" అని గానీ, ఈ "పంథా అసలు విప్లవ పంథాయే కాదు" అని గానీ, నిర్ధారించవలసి వస్తే, అలాంటి నిర్ధారణ చెయ్యడానికి ఏ మాత్రమూ జంకకూడదు. జరిగిన తప్పుల్ని గ్రహించుకోకపోతే, వర్గ పోరాటానికి అభివృద్ధే వుండదు.

'విప్లవం' అనేది ఒక సారి చేసి పడేసే విషయం కాదు. సమాజంలో ఒక మార్పుని ఒక సారి చేసి పడేస్తే అది అలాగే పడి వుండదు. తరాలు మారిపోతూ వుంటాయి. సరైన మార్పుల్ని ఎల్లకాలమూ కొనసాగించే చైతన్యం శ్రామిక వర్గానికి వుండాలి.

ఆధునిక కార్మిక వర్గ పోరాట చరిత్రలో, 'పారిస్ కమ్యూన్' ఓడిపోయింది. తర్వాత 'రష్యా చైనాలు' కూడా కొన్ని మార్పుల తర్వాత ఓటమి పాలయ్యాయి.

ఇంకా ఇక్కడా, అక్కడా అనేక ఓటములు!

కానీ, ఆ పోరాటాలూ, ఆ ఓటములూ ఇచ్చిన అనుభవాలు అపారంగా వున్నాయి. ఒక దాని తర్వాత ఒకటిగా ఎన్ని అపజయాలు వచ్చి పడినా, పోరాటం వదులుకునే స్తితిలో కార్మిక వర్గం వుండదు. పోరాటమే లేకపోతే అది మళ్ళీ బానిస స్తితికి కూడా జారిపోవలసి వస్తుంది. తన స్తితిని దిగజారనివ్వకుండా వుంచుకోవాలన్నా, దాన్ని అభివృద్ధి పరుచుకోవాలన్నా, దానికి పోరాటమే శరణ్యం.

ఆ రకంగా 'వర్గ పోరాటం' ఎప్పుడూ సాగేదే.

రష్యా చైనాల్లో బూర్జువా వర్గం, మళ్ళీ గత వైభవంతో వెలగడానికి, ప్రస్తుతానికి 'కొంత గడువు' సంపాదించిందన్న మాట! ★

# 3. 'మార్క్సిజం' అంటే చాలదా?

**మా**ర్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం - అని, ఇప్పటికి ఈ మూడూ చెప్పుకుం టున్నాం. కానీ, అలా అవసరమా? 'మార్క్సిజం' అంటే చాలదా? 'లెని నిజం' సరైనదే అయితే, అది 'మార్క్సి జంలో భాగం' కాదా? అలాగే 'మావో ఆలోచనా విధానం' సరైనదే అయితే, అది కూడా 'మార్క్సిజంలో భాగం' కాదా?

మార్క్సిజమూ, లెనినిజమూ- వేరు వేరు ఇజాలా? 'రెండు' ఇజాలా? అవి, ఒకే ఇజం కాదా? 'లెనినిజం' పేరుతో దేన్ని మాట్లాడుతున్నామో దాన్ని కూడా నేర్చు కుంటాం. అలా నేర్చుకోవాలంటే, అది 'లెనినిజం' పేరుతో, ఇంకో 'ఇజం'గా విడిగా వుండాలా?

'కార్మిక వర్గ పోరాటాల' గురించి ఏ దేశంలో ఎవరు ఏది సరిగా చెప్పినా, అది, మార్క్సిజాన్ని ఆధారం చేసుకుని, దాని సూత్రాల ప్రకారం చెప్పేదే. అంటే, 'అది మార్క్సిజాన్ని అన్వయించే విషయం మాత్రమే' అవుతుంది. అది మార్క్సిజంలో లేని కొత్త సూత్రాలేవీ తీసుకు రాదు. మార్క్సిజాన్ని అన్వయించే విధానం ఏదైనా మార్క్సిజంలో భాగమే.

'మార్క్సిజం' అనీ, 'లెనినిజం' అనీ, వాటిని వేరు వేరుగా చెప్తే, అవి వేరు వేరు ఇజాలు అవుతాయి. 'రెండూ ఒకటి కాదు' అన్నట్టు అవుతుంది. లేదా, రెంటినీ ఒకటి గానే అనుకున్నా, లెనినిజం అనేది మార్క్సిజంలో భాగంగా గాక, రెండూ సరి సమానమైన ఇజాలుగా అవుతాయి.

'మార్క్సిజం లోనే భాగం' అయిన దాన్ని ఇంకో 'ఇజం'గా తెచ్చి, 'మార్క్సిజం' పక్కన పెట్టవచ్చునా? - అలా అయితే, రేపటి నించీ ఇంకా చాలా ఇజాల్ని మార్క్సిజం పక్కన చేరుస్తూ పోవలసి వస్తుంది. ఎందు కంటే, ప్రతీ దేశం లోనూ వర్గాలు వున్నాయి. వర్గాలతో పాటే వర్గ పోరాటాలూ, వర్గ నాయకత్వాలూ, అన్నీ వుంటాయి. ఏ మంచి నాయకత్వమైనా మార్క్సిజాన్నే అనుసరి స్తుంది. దాన్ని తమ దేశ పరిస్తితులకు అన్వ యిస్తుంది. అలా అన్వయించేటప్పుడు అది తమ పరి స్తితులకు తగిన విధంగా కార్యక్రమం తీసుకుంటుంది. ఆ కార్య క్రమం మార్క్సిజాన్ని ఇంకా వివ రించవచ్చు; ఇంకా విస్తరించవచ్చు. అలా ఒక దేశ విప్లవ నాయ కత్వం సాధించిన దాన్ని, ఒక 'ఇజం'గా (లేదా ఒక 'ఆలోచనా విధానం'గా) చేసి 'మార్క్సిజం' పక్కన చేరుస్తూ పోతే ఇంకా చాలా 'ఇజాలు' అవుతాయి.

భారత దేశంలో, నాలుగైదు వేరు వేరు ప్రాంతాల్లో, సోమయ్యా, వెంకయ్యా, రత్నమ్మా, లక్ష్మమ్మా అనే నాయకులు, మార్క్సిజాన్ని చక్కగా అన్వయిస్తూ, విప్లవ పోరాటాలు నడుపుతారను కుందాం. అప్పుడు, వారి కార్యక్రమాల్ని - సోమయ్య ఇజం, వెంకయ్య ఇజం, రత్నమ్మ ఇజం, లక్ష్మమ్మ ఇజం - అనవలసిందేనా? వాటిని తెచ్చి మార్క్సిజం పక్కన వేరు వేరు పేర్లతో పెట్టవలసిందేనా? అవన్నీ వేరు వేరు ఇజాలు అవుతాయా?

వేరు వేరు దేశాల్లో కార్మిక నాయకుల అవ గాహనలన్నీ మార్క్సిజం ప్రకారమే వున్నట్టయితే, అవన్నీ ఒకే ఇజం. అది, మార్క్సిజం. ఆ సిద్ధాంతాన్ని అనుసరించడమే, అన్వయించడమే ఆ నాయకులు చేసేదంతా. అవి వేరే ఇజాలు అవవు. ఒక మంచి నాయకుడి ఆలోచనా విధానాన్ని ఒక కొత్త ఇజంగా అనుకున్నట్టయితే, అలాంటి ఇజాలు, అన్ని దేశాల లోనూ కలిసి అనేక వందలూ వేలూ తయారవుతాయి. వాటినన్నిటినీ మార్క్సిజం పక్కన వరసగా, విడి విడిగా చేరుస్తూ పోతే ఏమవుతుంది? ఆ ఇజాలన్నీ 'మార్క్సి జంలో భాగం' అవడం పోయి, మార్క్సిజమే ఆ ఇజాలలో భాగం అవుతుంది; ఆ ఇజాలలో ఒకటి అవుతుంది. అంత తప్పు జరుగుతుంది.

'మార్క్సిజం'తో పాటు ఒక్కో దేశం తమ నాయ కుల పేర్లతో ఒక్కో ఇజాన్ని చేరుస్తూ పోతే, ఏ దేశపు సిద్ధాంతం ఆ దేశానికి వేరు వేరుగా వున్నట్టు కనపడి, అది మార్క్సిజం విలువని గ్రహించకుండా చేస్తుంది.

కాబట్టి, శ్రామిక వర్గ సిద్ధాంతాని కంతటికీ 'మార్క్సిజం' అనే మాట చాలు. ఏ పోరాటమైనా అందులో భాగమే.

ప్రతీ 'దశ' లోనూ 'శత్రువు' ఏదో ఒక తప్పు సిద్ధాంతం తెస్తూనే వుంటాడు. దానికి మార్క్సిజం తెలి సిన వాళ్ళు జవాబు లిస్తూనే వుంటారు. అంత మాత్రాన అది వేరే సిద్ధాంతం కాదు. అదంతా మార్క్సిజంలో భాగమే.

ఏ దేశమైనా నూతన సమాజాన్ని సాధించిందంటే, అది మార్క్సిజంలో భాగమే. కమ్యూనిస్టు సమాజం స్థిరపడే వరకే గాక, స్థిరపడిన తర్వాత కూడా, సమాజ శాస్త్రం మార్క్సిజమే. 'మార్క్సిజం ఇక్కడి వరకే' అని గానీ, 'ఈ దేశానికే' అని గానీ, దానికి పరిమితి వుండదు. కాబట్టి, శ్రామిక వర్గ సిద్ధాంతం పేరు మార్క్సిజమే. ప్రపంచ శ్రామిక వర్గం దృష్టి అంతా 'మార్క్సిజం' అనే మాట మీదే వుండాలి. అప్పుడే, అది శ్రామిక వర్గానికంతటికీ సంబంధించిన సిద్ధాంతంగా ప్రపంచం కార్మిక వర్గానికి కనపడుతుంది. ★

# కార్మిక జనాభా 'కాపిటల్'ని ఎలా నేర్చుకోవాలి?
# 4. తరగతి గదిలో మార్క్సిజం

['కాపిటల్'ని, పుస్తకాలు చదవలేని కార్మిక ప్రజలకూ, 9-10 సంవత్సరాల వయస్సుల పిల్లలకూ కూడా చాలా తేలికగా నేర్పవచ్చు. ముఖ్యంగా, చిన్న చిన్న అభినయాల ద్వారా. నేర్చుకోవలసిన విద్యార్థులే ఆ అభినయాలు చేస్తారు. నేర్పే కార్యకర్త, టీచరుగా వుండాలి. కమ్యూనిస్టు పార్టీ లోనూ, కొన్ని ప్రజా సంఘాల లోనూ ఇది తప్పని సరి కార్యక్రమంగా వుండాలి.]

అది తరగతి గది. టీచరు ముందు, చాప నిండా చాలా బొమ్మ - వస్తువులూ, కొన్ని నిజం వస్తువులూ, వున్నాయి. ధాన్యమూ, పిండీ, రొట్టీ, పత్తీ, దారమూ, బట్టా, చొక్కా, చెక్క ముక్కలూ, కుర్చీ, తెల్ల కాయితమూ, పుస్తకమూ, పెన్సిలూ, పెన్నూ, గ్లాసూ, కుండా, చెప్పులూ, చిన్న మగ్గమూ, చిన్న యంత్రమూ, ఒక వెండి బిళ్ళా - ఇలా!

టీచరు, పిల్లలకు ప్రతి వస్తువునీ చూపిస్తూ - "ఇది ఏమిటి? ఇది ఎందుకు? దీనితో ఏం చేస్తాం? దీనితో ఏం అవసరం? ఇది ఎందుకు ఉపయోగపడుతుంది?" అని అడుగుతూ పిల్లలతో జవాబులు చెప్పించాలి.

"ఇవన్నీ వస్తువులు" అని చెప్పి, ఏ వస్తువు ఉపయోగం ఏమిటో చెప్పి, 'ఉపయోగపు విలువ' అంటే ఏమిటో, వివరించాలి. "ఒక వస్తువు, ఏ అవసరానికి ఉపయోగపడుతుందో అదే దాని 'ఉపయోగపు విలువ.' ఉపయోగపడే లక్షణం వస్తువు లోనే సహజంగా వుంటుంది. ఈ రొట్టె, ఎందుకు? - తినడానికి. చొక్కా ఎందుకు? - వేసుకోవడానికి. ఇల్లు ఎందుకు? - ఉండడానికి" - ఇలా, ఏ వస్తువు ఉపయోగం ఏమిటో పిల్లలతో చెప్పించాలి." వస్తువుల లక్షణాల్ని ఉదాహరణలతో చెప్పాలి. పిల్లలే స్వయంగా ఇంకా కొన్ని వస్తువుల పేర్లూ, వాటి ఉపయోగాలూ చెప్పాలి.

## 'మారకాల' దశ:

రవి, కొన్ని కుండలు (లక్క పిడతలు) పెట్టుకుని ఒక చోట కూర్చుని వుంటాడు. అది వాళ్ళ ఇల్లు. అక్కడ అతను కుండలు తయారు చేసే మనిషి.

"ఈ కుండలన్నీ ఎవరు చేశారు రవీ?" - టీచరు ప్రశ్న.

"మా ఇంట్లో అందరం చేశాం." - రవి జవాబు.

కమల, చిన్న బుట్టతో ధాన్యం తీసుకుని అక్కడికి వస్తుంది. "ఈ ధాన్యం మేమే పండించాం. మాకు చిన్న భూమి వుంది" అని చెపుతుంది. "రవీ! ఈ ధాన్యం తీసుకుని ఒక కుండ ఇవ్వవూ?" అని రవిని అడుగుతుంది.

"తీసుకో, ఏ కుండ కావాలో చూసి తీసుకో. నేనూ ధాన్యం కోసమే చూస్తున్నాను" అంటాడు రవి.

కమల తన బుట్టలో ధాన్యం అక్కడ ఒక కుండలో పోసి, తన కోసం ఇంకో కుండని ఎంచి తీసుకుంటుంది.

టీచరు: "ఇప్పుడు ఈ కుండకీ, ధాన్యానికీ మధ్య, ఏం జరిగిందో తెలుసా? 'మారకం' జరిగింది. అంటే, ఈ వస్తువు అటూ, ఆ వస్తువు ఇటూ, మారాయి. ఈ కాస్సేపూ ఈ వస్తువుల్ని 'సరుకులు' అనాలి. రవీ, కమలా, వాళ్ళు తయారు చేసిన సరుకుని ఇచ్చి, వాళ్ళకి కావలసిన సరుకు తీసుకున్నారు. సరే, రవీ! నువ్వు ధాన్యం తీసుకున్నావు కదా? ధాన్యం నీకు ఎందుకు వచ్చింది?"

"కుండ ఇస్తే ధాన్యం వచ్చింది".

"అవును కదా? అంటే, నీ కుండకి బదులుగా

వచ్చిన ధాన్యం ఏమిటో తెలుసా? అది నీ కుండ 'విలువ'. దాని పూర్తి పేరు 'మారకం విలువ'. నీ వస్తువుని ఇంకో వస్తువుతో 'మార్చుకున్నప్పుడు' నీ వస్తువుకి బదులుగా ఏం వచ్చిందో, అది నీ వస్తువుకి 'మారకం విలువ'. మారకం చేసుకోవడం వల్ల వచ్చింది కాబట్టి, దానికి ఆ పేరు. ఆ మాటనే పొట్టిగా 'విలువ' అందాం. ఇప్పుడు, నువ్వు ఇచ్చేసిన కుండ ని నువ్వు వాడుకోగలవా?"

"ఎలా వాడుకుంటాను? అది వెళ్ళి పోయింది. దానికి బదులే ధాన్యం వచ్చింది కదా?"

"పోనీ ధాన్యాన్ని వాడుకోగలవా?"

"ఎందుకు వాడుకోలేను? అది ఇప్పుడు మాదే కదా?"

"అంటే, కుండ వెళ్ళి పోయి, దాని 'విలువ' వచ్చింది. ఒక వస్తువుని మనమే వాడుకుంటే, దాని ఉపయోగపు - విలువ మనకే వుంటుంది. అప్పుడు, దాని మారకం - విలువ ఏమిటో మనకు తెలీదు. మన వస్తువుని ఇంకో వస్తువుతో మారకం చేసుకుంటేనే అది వెళ్ళిపోయి, దాని విలువ వస్తుంది. ఆ విలువనే మనం ఉపయోగించుకుంటాం. ఇప్పుడు కుండ - విలువని, మనం చూడగలుగుతున్నామా లేదా?"

"ధాన్యాన్ని చూస్తున్నాం కదా?"

"అంటే, కుండ - విలువ ఏ రూపంతో వుంది?"

"ధాన్యం రూపంలో."

"కుండని ఇచ్చి, ధాన్యం గాక, 'చెప్పులు' తీసు కుంటావనుకో. అప్పుడు కుండ విలువ ఏమిటి?"

"అప్పుడు, చెప్పులే కుండ విలువ అవుతాయి."

"చక్కగా చెప్పావు. సరే, ఇప్పుడు కమలని అడు గుతాను. కమలా! నీ ధాన్యం నీ దగ్గిరే వుందా?"

"లేదు. రవికి ఇచ్చేసి, కుండ తీసుకున్నాను కదా?"

"కుండ నీకు ఎందుకు వచ్చింది?"

"ధాన్యం ఇచ్చాను గనక, దానికి బదులుగా వచ్చింది."

"అంటే, నీకు వచ్చిన కుండ ఏమిటో తెలుసా?"

"నా ధాన్యం విలువే నాకు వచ్చింది."

"ధాన్యం - విలువ, ఏ రూపంలో వుంది?"

"కుండ రూపంలో."

"ధాన్యం ఇచ్చి, కుండ గాక, 'బెల్లం' తీసుకుంటే ఏమయ్యేది?"

"అప్పుడు, బెల్లమే నా ధాన్యం విలువ అవు తుంది. అప్పుడు నా ధాన్యం విలువ, బెల్లం రూపంలో వుంటుంది."

"నువ్వు కూడా చక్కగా చెప్పావు. ఒక వస్తువుని ఇచ్చి ఇంకో వస్తువుని తీసుకుంటే దీన్ని 'బార్టరు పద్ధతి' అంటారు. పిల్లలూ! నేనడిగే ప్రశ్నలకు ఎవరికి తెలిస్తే వాళ్ళు చెప్పండి".

వేరే పిల్లలతో ఇంకా కొన్ని మారకాలూ, వాటి మీద ప్రశ్నలూ!

'ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసు కున్నప్పుడు, ఆ రెండో వస్తువే మొదటి వస్తువుకి విలువ' - అనే దాన్ని పిల్లలతో పదే పదే చెప్పించాలి, చెప్పాలి. 'ఒక ఉపయోగపు విలువ వెళ్ళి పోతే, దాని విలువ వస్తుంది' అనే దాన్ని ప్రతీ సారీ చెప్పాలి. ఇప్పటికి - వస్తువూ, సరుకూ; ఉపయోగపు విలువా, మారకం విలువా - అనే మాటలు చాలా తేలిగ్గా అర్థ మవుతాయి.

ఇదంతా, 'డబ్బు' అంటే ఏమిటో చెప్పడానికి మార్గం.

## మారకాలు తేలిగ్గా సాగని దశ:

కమల, ధాన్యం బుట్ట తీసుకుని రవి దగ్గరికి వచ్చి, "ఒక కుండ ఇయ్యి రవీ" అంటుంది.

"ధాన్యం తెచ్చావా? ఇప్పుడు మాకు ధాన్యం అక్కర లేదే!" - రవి.

"ధాన్యం అక్కర లేదా? మాకు కుండ కావాలే! నిన్న మా పిల్లలు గంతులేస్తూ కుండ మీద పడి నిక్షేపం లాంటి కుండ బద్దలు గొట్టేశారు. పోనీ నీకేం కావాలో చెప్పు. అది తెచ్చి ఇచ్చి కుండ తీసుకుంటాను."

"బెల్లం కావాలి. ఇంట్లో బెల్లం లేదు."

"ఇప్పుడే తెస్తాను వుండు" అంటూ కమల, ఆ పక్కనే వున్న బెల్లం గోపన్న దగ్గిరికి వెళ్తుంది - "గోపన్నా, ఈ ధాన్యం తీసుకుని బెల్లం ఇయ్యి. దాన్ని రవికి ఇచ్చి కుండ తెచ్చుకోవాలి. పిల్లలు ఆట లాడుతూ కుండ మీద పడ్డారు. నిక్షేపం లాంటి కుండ బద్దలు గొట్టేశారు. రవి కి ధాన్యం అక్కర లేదట. బెల్లం కావాలట."

"మాకూ ధాన్యం వద్దమ్మా ఇప్పుడు."

"నీకూ ధాన్యం వద్దా? బాగానే ఉంది. పోనీ నీకేం కావాలో చెప్పు. అది తెచ్చి ఇచ్చి...."

"చెప్పులు కావాలి."

"చెప్పులా? అదెంత పనీ? ఇప్పుడే తెస్తానుండు"

అని కమల, ఆ పక్కనే వున్న చెప్పుల రాధ దగ్గిరికి వెళుతుంది - "రాధా! ఈ ధాన్యం తీసుకుని చెప్పులు ఇద్దూ! వాటిని గోపన్నకి ఇచ్చి బెల్లం తీసుకోవాలి. దాన్ని రవికి ఇచ్చి కుండ తీసుకోవాలి. నిక్షేపం లాంటి కుండ, పిల్లలు దాని మీద గంతులేసి బద్దలు కొట్టేశారమ్మా! మంచి నీళ్ళు పోసుకోటానికి కూడా లేదు. చాలా పని వుంది, పోవాలి. చెప్పులు ఇయ్యి."

"అయ్యో, మాకూ ధాన్యం వద్దమ్మా కమలా!"

"ఇదేమిటీ? అందరూ ధాన్యం వద్దంటారేమిటీ?"

కమల విచార పడుతూ నిలబడింది.

టీచరు కమల దగ్గిరికి వస్తూ, "కమలా! ఏమిటి సంగతి? అలా ఉన్నావేం?" అన్నాడు.

"కుండ కావాలండీ. ఎవరికీ ధాన్యం అక్కర్లేదట. ఇంకేమివ్వను? కుండ ఎలా వస్తుందో తోచడం లేదు."

"అదా సంగతీ? విచార పడకు. దీనికో పద్ధతి వచ్చిందిలే" అని టీచరు జేబులో నించి చిన్న గుండ్రటి వెండి బిళ్ళ తీశాడు - "ఇది తీసుకో. నాకు ధాన్యం కావాలి లే. నీ ధాన్యం నా కియ్యి. నీ సమస్య తీరి పోతుంది."

"ఇదేమిటి? నాకు కుండ కావాలి గానీ ఈ బిళ్ళ నేనేం చేసుకోను?"

"ఇది ఉత్త బిళ్ళ అనుకుంటున్నావా? డబ్బు బిళ్ళ! రూపాయి బిళ్ళ!"

"డబ్బా? డబ్బేమిటీ? రూపాయేమిటి? ఈ మాట ఎప్పుడూ వినలేదే!"

"ఇప్పుడిప్పుడే ఇది కొత్తగా వస్తోంది."

"ఎందుకూ? దీనితో ఏం చేస్తారూ?"

"ఏం చేస్తారో చూడు. నీ ధాన్యం నా కిచ్చి ఇది తీసుకో. డబ్బు ఇచ్చి, ఒక వస్తువుని తీసుకుంటే, అది ఆ వస్తువుని 'కొనడం' అవుతుంది. వస్తువుని ఇచ్చి 'డబ్బుని తీసుకుంటే, అది ఆ వస్తువుని 'అమ్మడం'. అంటే, నేనేమో నా డబ్బు ఇచ్చి నీ ధాన్యం 'కొంటాను'. నువ్వేమో, డబ్బు కోసం, నీ ధాన్యం 'అమ్ముతావు'. తర్వాత నువ్వు ఈ డబ్బు తీసుకు వెళ్ళి కుండల రవికి ఇస్తే, నీకు కుండ ఇస్తాడు'!

"దీన్ని ఇస్తే రవి కుండ ఇస్తాడా! తనకి బెల్లం కావాలన్నాడే! ఇదెందుకు తీసుకుంటాడు?"

"దీని తోటే అతను తర్వాత బెల్లం తెచ్చు కుంటాడు. దీన్ని బెల్లం గోపన్నకి ఇస్తే, గోపన్న కూడా బెల్లం ఇచ్చేస్తాడు."

"గోపన్న మాత్రం ఇదెందుకు తీసుకుంటాడూ? తనకి చెప్పులు కావాలన్నాడే?"

"గోపన్న దీన్ని రాధకి ఇచ్చి చెప్పులు తెచ్చు కుంటాడు. దీనితో ఏ వస్తువు కావాలంటే అది కొను క్కోవచ్చు. ఇది అన్ని వస్తువుల తోటీ మారుతుంది. దీన్ని తీసుకు వెళ్ళి రవికి ఇచ్చి కుండ తెచ్చుకో!"

"రవి దీన్ని నిజంగా తీసుకుంటాడంటారా? 'ఈ బిళ్ళకే కుండ ఇస్తానా' అని దీన్ని నా మొహాని కేసి కొట్టడు గదా?"

"భలే దానివే! అన్నీ భయాలే నీకు. పోనీ ఒక్కసారి వెళ్ళి చూడరాదూ, ఏం జరుగుతుందో నీకే తెలు స్తుంది?"

"మీరు చెప్తున్నారు కదా? వెళ్తాను, బిళ్ళ ఇవ్వండి."

టీచరు ఆ బిళ్ళ ఇచ్చి, ధాన్యం తీసుకున్నాడు.

"కమలా! ఇప్పుడేం జరిగిందో తెలుసా?"

"ఏం జరిగిందీ?"

"నీ ధాన్యానికీ, నా డబ్బుకీ, 'మారకం' జరిగింది."

" 'మారకం' అంటే రెండు వస్తువుల మధ్యే జరుగుతుంది కదా? దాన్ని బార్టరు మారకం అంటారు కదా?"

"అవును. ఇక్కడ కూడా 2 వస్తువులు వున్నాయి. ఈ బిళ్ళని దేనితో చేశారనుకుంటున్నావు? 'వెండి'తో! వెండి కూడా ఒక వస్తువే కదా? కాబట్టి, ఈ బిళ్ళ కూడా ఒక వస్తువే. కానీ, ఈ బిళ్ళ 'డబ్బు' కాబట్టి, నీ సరుకు కి డబ్బుతో మారకం జరిగినట్టు అర్థం. ఇది, బార్టరు మారకం కాదు."

"అయితే, ఇది కూడా మారకమే నన్న మాట!"

"అంతే. నిన్నటి దాకా నీ ధాన్యం ఇచ్చి కుండని తీసుకోవడం ఎలాంటిదో, ఇప్పుడు ధాన్యం ఇచ్చి, ఈ డబ్బు తీసుకోవడం కూడా అలాంటిదే. నీ సరుకు నాకు ఇచ్చి నా డబ్బు నువ్వు తీసుకున్నావు, అంతే. అయితే, నువ్వీ బిళ్ళని కరిగించేసి గొలుసు చేయిం చుకో కూడదు సుమా! అలా చేస్తే నీకు కుండ తెచ్చుకునే మార్గం వుండదు."

"గొలుసూ వొద్దు, పాడూ వొద్దు. కుండ దొరక్క ఛస్తోంటే, గొలుసు లేమిటి? పిల్లలు ఎగిరెగిరి కుండ మీద పడి చచ్చారు."

"పడితే పడ్డార్లే. పిల్లలు ఆ మాత్రం ఆడుకోరా? నువ్వెప్పుడూ గంతు లెయ్యలేదా చిన్నప్పుడు?"

"నేనెప్పుడూ కుండల మీద గంతులెయ్య లేదు బాబూ!"

"అంత బెంగపడుతున్నా వేమిటి? కొత్త కుండ ఒక్క క్షణంలో దొరుకుతుంది. నీ చేతిలో వున్న రూపాయి బిళ్ళని చూడు. మీ ధాన్యాన్ని అమ్మి, రూపాయి తీసుకున్నావు. ఇప్పుడు, ధాన్యం విలువ ఏమిటి?"

"ధాన్యానికి బదులుగా ఏం వచ్చిందో అదేగా? అంటే, ఈ రూపాయేగా?"

"బాగా గ్రహించావు. ఒక వస్తువుకి బదులుగా వచ్చే డబ్బు, ఆ వస్తువుకి 'ధర'! ఇప్పుడు చెప్పు, నీ ధాన్యం 'ధర' ఎంత?"

"ఒక రూపాయి."

"భలే చెప్పావు. బార్టరు మారకాల్లో అయితే 'ధర' అనే మాట వుండదు. నీ ధాన్యం ఇచ్చి కుండని తీసుకున్నప్పుడు, ఆ కుండని 'ధర' అనకూడదు. డబ్బుతో అయితేనే అది - ధర. సరే, ఇప్పుడు నీ దగ్గిర ఏం వుందో తెలుసా?"

"డబ్బు వుంది. రూపాయి వుంది." - కమల, ఆ బిళ్ళని ఆశ్చర్యంగా చూస్తూ, "అవును గానీ, ఈ బిళ్ళ మీకెలా వచ్చిందండీ?" అంది.

"చదువు చెప్పానని ఒకళ్ళు నాకిచ్చారు."

"అసలు వాళ్ళకి ఎలా వచ్చింది?"

"మన దగ్గిర కొంచెం వెండో, బంగారమో వుంటే, దాన్ని ప్రభుత్వం వారి టంకశాలకు తీసుకు పోయి ఇస్తే, వాళ్ళు దాన్ని కొన్ని రూపాయి బిళ్ళలుగా చేసి ఇస్తారు. ఈ బిళ్ళలు చెయ్యడానికే టంకశాల పెట్టారు. నాకు దీన్ని ఇచ్చిన వాళ్ళు అలాగే వాళ్ళ వెండితో ఈ బిళ్ళలు చేయించుకున్నారు. నేను చదువు చెప్పానని ఒక బిళ్ళ నాకు ఇచ్చారు. మనం ఏదైనా ఒక పని చేసి పెడితే, లేకపోతే ఏదైనా వస్తువుని తయారు చేసి అమ్మితే, అవతలి వాళ్ళు మనకి ఈ డబ్బు బిళ్ళలు ఇస్తారు."

"అలాగా, అలా వస్తుందన్న మాట డబ్బు?"

"మనకి, మన దగ్గిర లేని వస్తువులు కావాలంటే, ఈ డబ్బు బిళ్ళలు ఇచ్చేసి, వాటిని కొనుక్కోవచ్చు. అప్పుడు డబ్బు వెళ్ళిపోతుంది."

"వెళ్ళిపోతే వెళ్ళిపోతుంది. దీన్ని ఇస్తే మనకి కావలసిన వస్తువు నిజంగా వస్తే అంత కన్నా ఏం కావాలి? ఈ బిళ్ళల్ని దాచుకుని ఏం చేసుకుంటాం?"

"కుండ వస్తుందో రాదో అని నీ కింకా అనుమానం గానే వున్నట్టుంది. పద, రవి దగ్గిరికి వెళ్దాం."

ఇద్దరూ రవి దగ్గిరికి వెళ్ళారు.

కమల జంకుతూ, "రవీ! 'డబ్బు' తెచ్చాను .... కుండ ఇస్తావా?"

"డబ్బా? డబ్బు నీకెక్కడిదీ?" - రవి.

"ఎక్కడిదేమిటి? మా ధాన్యం అమ్మాను."

"అలాగా? డబ్బు వచ్చిందని ఈ మధ్య చాలా మంది చెప్పుకుంటున్నారు. నేనింకా చూడలేదు. ఎలా వుంటుంది డబ్బంటే?"

"ఇదిగో చూడూ!"

"ఇదేవిటీ? ఈ బిళ్ళేనా డబ్బంటే?"

"తీసుకోవా ఏవిటీ?"

"ఎందుకు తీసుకోనూ? నీకు కుండ కావాలి, అంతే గదా? ఏది కావాలో చూసి తీసుకో."

"బతికాను దేవుడా!" అంటూ కమల కుండల దగ్గిరికి పోయి చేతికందిన కుండ చంకన పెట్టుకుని, రవి చేతిలో బిళ్ళ పెట్టింది. "ఈ బిళ్ళని చూసి ఎక్కడ తిడతావో అని భయపడి చస్తున్నాను .... దీన్ని తీసుకుంటావన్న మాట! ఏం చేసుకుంటావు దీంతో?"

"దీన్ని ఇచ్చి బెల్లం తెచ్చుకుంటాను. నిన్న ఏమైందో తెలుసా? గోపన్న దగ్గిరకి కుండ పట్టుకెళ్ళి బెల్లం ఇమ్మంటే, కుండ అక్కర్లేదన్నాడు. డబ్బు తెస్తే ఇస్తానన్నాడు. దీన్ని ఇస్తే బెల్లం ఇచ్చేస్తాడు."

"అలాగా? దీన్ని అందరూ తీసుకుంటారన్న మాట! భలేగా ఉందే ఈ బిళ్ళ పనీ."

టీచరు - "ఇప్పటి కన్నా తెలిసిందా? 'బిళ్ళ, బిళ్ళ' అంటావేమిటి? ఇది ఉత్త బిళ్ళ కాదు. డబ్బు బిళ్ళ! రూపాయి బిళ్ళ! నీ ధాన్యాన్ని అమ్మితే నీకు రూపాయి వచ్చింది. ఆ రూపాయితో నువ్వు కుండ కొన్నావు. రూపాయి, రవి దగ్గిరికి వెళ్ళింది. రవి, దాన్ని గోపన్నకి ఇచ్చి బెల్లం కొంటాడు. గోపన్న దాన్ని మళ్ళీ ... అలా అది ఒకళ్ళ దగ్గిర్నించీ ఒకళ్ళకి వెళ్ళిపోతూనే వుంటుంది. ఈ డబ్బు పద్ధతి లేకపోతే, నీకు కుండ దొరికేదా అసలు?"

"బాగా చెప్పారు. ధాన్యం పట్టుకుని పొద్దున్న నించీ తిరుగుతున్నాను కుండ కోసం. ఈ బిళ్ళ పుణ్యమా అని తేలిగ్గా పని జరిగింది. ఎవరు కని పెట్టారో గానీ ఈ పద్ధతీ, మహా బాగుంది."

"డబ్బు - అంటే వస్తువుల మారకాల్ని తేలిగ్గా చేయించే సాధనం. ఇంత వరకూ అయితే బాగానే వుంది. దీనితో ఇంకేం వింతలు జరుగుతాయో ఇప్పుడేం తెలుస్తుంది?"

"అవుననుకోండీ. కానీ, వస్తువుని ఇచ్చి వస్తువుని

తీసుకోవాలంటే, అవతలి వాళ్ళకి మన వస్తువుతో అవసరం వుండాలి కదా? దానితో అవసరం లేకపోతే పాపం వాళ్ళు మాత్రం ఎలా తీసుకుంటారు? మనకి అక్కర్లేని వస్తువుని మనం మాత్రం తీసుకుంటామా? డబ్బు అయితే, ఆ ఇబ్బంది లేకండా పోతుంది కదా? మన వస్తువుల్ని తేలిగ్గా అమ్ముకోవచ్చు. కావలసిన వాటిని తేలిగ్గా కొనుక్కోవచ్చు. ఎంత సుఖంగా వుందో ఇది! దీనితో తర్వాత ఏమన్నా గోలలు వస్తే రానివ్వండి. అప్పుడే చూసుకోవచ్చు. నాకైతే కుండ దొరికింది బాబూ! 'డబ్బు'కి దణ్ణం పెట్టాలి"

టీచరు, విద్యార్థులకు, ఒక్క రూపాయి బిళ్ళనే గాక, 2, 3 బిళ్ళలూ, అర్ధ రూపాయి బిళ్ళలూ కూడా చూపిస్తూ, వాటితో కూడా మారకాలూ, ప్రశ్నలూ వుండాలి.

## 'కాయితం డబ్బు' దశ:

టీచరు, వెండి రూపాయిని చూపించి, కమలతో - "ఈ బిళ్ళ రోజూ బోలెడు మంది చేతుల్లో పడి తిరుగుతూ వుంటుంది కదా? కొన్నాళ్ళకి ఇది కొంచెం అరిగి పోతుందనుకుందాం. అప్పుడు దీన్ని ఎవరైనా తీసుకుంటారా? నువ్వయితే తీసుకుంటావా?" అన్నాడు.

"ఎందుకు తీసుకోకూడదూ? దాని బరువుతో మనకేం పనీ? దాన్ని కరిగించి నగలు చేయించు కుంటామా? అది, కొంచెం అరిగితే మాత్రం యేం పోతుందీ?"

"బాగా చెప్పావు. అరిగిన బిళ్ళని కూడా 'రూపాయి' లాగే అనుకుంటూ దాని తోటే మారకాలు చేసుకోవచ్చు. సరే, మరి అలాగైతే, ఆ అరిగిన బిళ్ళ మాత్రం ఎందుకూ? దాన్ని కూడా తీసేసి, ఒక గట్టి కాయితం ముక్కని 'రూపాయి'గా పెట్టుకోకూడదూ? అందరూ ఆ కాయితాన్నే 'రూపాయి' అనుకుంటూ, దాని తోటే మారకాలు చేసుకోకూడదూ? అప్పుడు 'వెండి డబ్బు'కి బదులు 'కాయితం డబ్బు' వుంటుంది. అంతే కదా? వెండి బిళ్ళల్ని తిప్పుతూ, వెండి అంతా అరగ్గొట్టుకోవడం ఎందుకూ?"

"కాయితం డబ్బా? ఇది మరీ బాగుంది. కాయితం ముక్కని ఇస్తే, ఎవరైనా వాళ్ళ వస్తువు ఇస్తారా?"

"ఎందుకు ఇవ్వకూడదూ? వాళ్ళు, తర్వాత ఆ కాయితం రూపాయిని ఇంకోళ్ళకి ఇస్తే, ఇంకోళ్ళు కూడా దాన్ని తీసుకుంటారు కదా? అందరం కలిసి కాయితం రూపాయల్నే వాడుకుంటే డబ్బుగా వుండ డానికి అది చాలదూ?"

"ఏమో బాబూ! అన్నీ వింతగా చెపుతున్నారు. అందరూ ఒక్క మాటే అనుకుంటే ఏదైనా బాగానే వుంటుందనుకోండీ."

టీచరు, జేబులో నించి ఒక కాయితం రూపాయి నోటు తీసి పిల్లలందరికీ చూపిస్తాడు. "ఇది కాయితం డబ్బు! కాయితం రూపాయి! దీనితో నేను ఇప్పుడు బెల్లం కొంటాను, చూడండి. గోపన్నా! ఈ రూపాయి నోటు తీసుకుని బెల్లం ఇయ్యి. తర్వాత నువ్వు కూడా ఈ నోటుతోనే నీకు కావాలసిన వస్తువు కొనుక్కోవచ్చు. దీన్ని ఎవ్వరైనా తీసుకుంటారు."

గోపన్న నవ్వుతూ కాయితం రూపాయి తీసుకుని బెల్లం ఇచ్చాడు.

టీచరు: "నేను బెల్లం కొన్నాను. గోపన్న బెల్లం అమ్మాడు. బెల్లాన్నీ, కాయితం రూపాయినీ ఇటూ అటూ మార్చుకున్నాం. రెంటికీ మారకం జరిగింది. ఇప్పుడు బెల్లం 'విలువ' ఏమిటి?"

పిల్లలంతా - "కాయితం రూపాయి" అని అరుస్తారు.

"ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని గాక, కాయితం డబ్బుని తీసుకుంటే?"

"అది కూడా ఆ వస్తువు విలువే. అది ధరే."

"అద్భుతంగా చెప్పారు! అద్భుతం!"

## ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ:

ఏదైనా ఒక వస్తువుని తయారు చేయడానికి ఏమేమి కావాలో వివరించాలి.

"రవీ! మీరు కుండలు దేనితో చేస్తారు?"

"మట్టితో. మట్టిలో నీళ్ళు పోసి."

"మట్టి లేకుండా, ఏమీ లేకుండా కుండలు చెయ్యలేమా?"

పిల్లలు నవ్వుతారు - "ఎలా చేస్తాం?"

"అంటే, మట్టీ నీళ్ళూ వుంటేనే, వాటితో కుండని తయారు చెయ్యగలం. అంటే, కుండకి, మట్టీ, నీళ్ళూ, 'ముడి పదార్థాలు' అన్న మాట. ఆ మట్టే కుండగా మారుతుంది. మరి, మట్టిని కుండగా ఎలా చేస్తారు? ఉత్త చేతులతో నేనా, ఇంకేదన్నా వుంటుందా? రవీ, నువ్వు చెప్పు!"

"ఒక చక్రం వుంటుంది" - ఆ వివరాలన్నీ రవి చెపుతాడు.

పిల్లలకు కుమ్మరి చక్రం బొమ్మని చూపించాలి - "ఇది, ఒక పని ముట్టు. కుండలు చెయ్యాలంటే, మట్టే కాకుండా పనిముట్లు కూడా వుండాలి. సరే, ఇవన్నీ వుంటాయి. మట్టినీ, ఈ చక్రాన్నీ, ఒక చోట పెట్టేస్తే కుండ తయారై పోతుందా?"

పిల్లలు మళ్ళీ నవ్వుతారు - "అవదు, చక్రాన్ని మన చేతుల్తో తిప్పుతూ చెయ్యాలి."

"అదీ! అది 'శ్రమ'. ఏ వస్తువు కోసం ఎలాంటి శ్రమలు కావాలో అవన్నీ మనమే చెయ్యాలి. మనం 'శ్రమ' చేస్తేనే వస్తువులు తయారవుతాయి. ముడి పదార్థాలూ పనిముట్లూ లేకపోయినా, వస్తువు తయారవదు; శ్రమ లేకపోయినా వస్తువు తయారవదు. మరి, కుర్చీని తయారు చెయ్యాలంటే, ఏం ముడి పదార్థం కావాలి?"

"చెక్క! చెక్క!"

"భలే చెప్పారే! అంతేకాదు. మేకులు కూడా చెక్కలోకి దిగాలి. అవీ ముడి పదార్థాలే. కుర్చీకి రంగు వేస్తే అదీ ముడి పదార్థమే. మరి, చొక్కాని తయారు చెయ్యాలంటే?"

"బట్ట! బట్ట!"

"అబ్బా! ఎంత బాగా చెప్పేస్తున్నారో! బట్ట ఒక్కటే కాదు. చొక్కాని కుట్టే దారం కూడా ముడి పదార్థమే. ఎందుకంటే, దారం, చొక్కా లోనే వుండిపోతుంది. మరి 'సూది' కూడా ముడి పదార్థమేనా?"

పిల్లలు సందేహిస్తూ వుంటారు.

టీచరు: "సూది - చొక్కాలో వుండి పోదు కదా? కాబట్టి అది ముడి పదార్థం కాదు. అది శ్రమ చెయ్యడానికి కావలసిన పరికరం. పనిముట్టు. అది లేకపోతే శ్రమ జరగదు. కుట్టు మిషను కూడా శ్రమ పరికరమే. కత్తెర కూడా శ్రమ పరికరమే. అలాగే, ఏ వస్తువు తయారవ్వాలన్నా, కొన్ని ముడి పదార్థాలూ, కొన్ని శ్రమ పరికరాలూ, కావాలి. అవన్నీ కలిసి 'శ్రమ సాధనాలు'. వాటికే ఇంకో పేరు 'ఉత్పత్తి సాధనాలు'. ఉత్పత్తులు తయారవ్వాలంటే ఆ సాధనాలు వుండాలి. వాటిని ఉపయోగిస్తూ మనుషులు శ్రమలు చెయ్యాలి."

ఇలా చెప్పి, పిల్లల్ని అనేక ప్రశ్నలు వేస్తూ, వాళ్ళు ఆలోచిస్తూ జవాబులు చెప్పే లాగ చెయ్యాలి.

" 'సూది'ని తయారు చెయ్యాలనుకుందాం. దానికి ముడి పదార్థం ఏమిటి? సూది తయారైన తర్వాత, అది బట్టలు కుట్టడానికి 'శ్రమ పరికరం' అవుతుంది. అలాగే, 'కత్తెర' కి ముడి పదార్థం ఏమిటి? కత్తెర తయారయ్యాక, అది కూడా 'శ్రమ పరికరం' అవుతుంది. అతి చిన్న శ్రమ పరికరంతో జరిగే శ్రమ ఏమిటి? కుండలు చెయ్యాలంటే, పెద్ద చక్రం గిక్రం వుండాలి. కుర్చీ చెయ్యాలంటే, రంపాలూ, సుత్తులూ వుండాలి. అంతంత పెద్ద పనిముట్లు లేకుండా, చిట్టి పనిముట్టుతో జరిగే పని ఏమిటి?"

పిల్లలు ఆలోచనలో పడిపోతారు. చెప్పలేరు.

టీచరే చెప్పాలి - "చేతితో బట్టలు కుట్టాలంటే ఏం కావాలి? 'సూది' చాలు. చిట్టి పరికరం."

"మరి దారం?"

"అది ముడిపదార్థం కదా?"

"గుండీలు?"

"అవి కూడా ముడిపదార్థాలే. అవి దుస్తుల్లో కలిసి వుండిపోతాయి."

"కత్తెర?" అని ఉత్సాహంగా అరిచారు ఒకరు.

"అది కత్తిరించే శ్రమకి కావలసిన పనిముట్టు. 'కత్తిరించే శ్రమ' వేరూ, 'కుట్టే శ్రమ' వేరూ. చేతి కుట్టు పనికి మాత్రం సూది ఒక్కటే చాలు." - ఇలాగ ఇంకా కొన్ని వస్తువుల గురించి ప్రశ్నలు వేస్తూ చెప్పాలి.

"అయితే, కొన్ని శ్రమలతో ఏ వస్తువులూ తయారు కావు. 'బండి తోలే పని' వుందనుకోండీ. ఆ పని వల్ల, ఏ వస్తువు తయారవుతుంది? ఏ వస్తువూ తయారవదు. కానీ, ఆ పని వల్ల, బండిలో ఎక్కిన మనుషులు, ఒక చోటు నించి ఇంకో చోటుకి వెళ్తారు. అలాగే సామాన్లూ వెళ్తాయి. ఈ పనిలో, 'ముడి పదార్థం' వుండదు. శ్రమ పరికరాలే వుంటాయి. బండే ఒక శ్రమ పరికరం. ఎద్దులు కూడా శ్రమ పరికరాలే".

ఇలాగ, బస్సునీ, రైలునీ కూడా తీసుకుని వాటి గురించి ప్రశ్నలు వేసి, జవాబులు చెప్పించాలి.

ఇలాగే, పిల్లలకూ, కార్మికులకూ 'కాపిటల్'లో విషయాలన్నీ చాలా తేలిగ్గా చెప్పగలం. చెప్పవలసిన పాఠానికి కావలసిన వస్తువులన్నీ (బొమ్మలు) సేకరించి పెట్టుకోవాలి. చెప్పవలసిన విషయాన్ని 'సంభాషణ'గా రాసుకోవాలి. అది 'ప్రశ్నలూ - జవాబులూ' రూపం లోనే వుండాలి. టీచరు ఆ ప్రశ్నలు అడుగుతోంటే, పిల్లలు ఆ జవాబులే చెప్పగలిగే విధంగా పిల్లలకు విషయాలు బోధించాలి. సందర్భాన్ని బట్టి, రాసుకున్న దాని కన్నా ఎక్కువ వివరాలు చెపుతూ వుండాలి.

పిల్లల స్థానంలో కార్మికులు వుంటారు. పిల్లలకు చెప్పిన విషయాల తోటే పెద్దలకు కూడా మొదలు పెట్టాలి. ప్రారంభం అయితే అలాగే.

ఆ తర్వాత 'విలువ' గురించి ప్రశ్నలు వేస్తూ వివరించాలి.

ఒక వస్తువుకి (ధాన్యానికి, పత్తికి, బట్టకి, బంగారానికి, బండి తోలడానికి - ఇలా ఏ ఉత్పత్తికి అయినా, ఏ పనికి అయినా) 'విలువ' ఎలా ఏర్పడు తుంది? - దాని కోసం ఖర్చయ్యే మొత్తం శ్రమని బట్టే. అదే దాని విలువ.

## 'మొత్తం శ్రమ' అంటే?

ఒక ఉత్పత్తి తయారవడం కోసం (లేదా, ఒక పని జరగడం కోసం), కొన్ని ఉత్పత్తి సాధనాలు ఖర్చవు తాయి కదా? ఆ ఖర్చుని C అందాం. అదే గాక, ఆ ఉత్పత్తి కోసం మనుషులు కూడా కొన్ని శ్రమలు చెయ్యాలి కదా? ఆ ఖర్చుని L (లేబర్) అందాం. ఏ ఉత్పత్తి తయారవ్వాలన్నా, C + L చాలు. అవి తప్ప ఇంకేదీ అక్కర లేదు.

ఒక చొక్కా కోసం, C భాగం 20 రూ. లూ, L భాగం 15 రూ. లూ, అనుకుందాం. అంటే, చొక్కా విలువ = $20_C + 15_L = 35$.

ఆ వస్తువుని ఇంకో వస్తువుతో మారకం చేసుకోవడం ఎలాంటిదో, డబ్బుతో మారకం కూడా అలాంటిదే. ఆ చొక్కాని ఇచ్చి డబ్బుని తీసుకుంటే (చొక్కాని అమ్మితే) 35 డబ్బు వస్తుంది. ఆ డబ్బు, ఆ వస్తువు కోసం ఖర్చయిన C + L ల కోసం వచ్చేదే.

చొక్కాల తయారీ కోసం, ఒక పెట్టుబడిదారుడు, కొందరు కార్మికుల్ని పెట్టుకున్నాడనుకుందాం. ఒక చొక్కాని అమ్మితే పెట్టుబడిదారుడి చేతికి దాని విలువగా 35 వస్తుంది. అందులో నించి $20_C$ ని వెనక్కి తీసుకోవాలి. దాన్ని కొత్త చొక్కా తయారీకి కావలసిన కొత్త C కోసం వాడవలసి వుంటుంది. ఇంకా ఉన్నది 15 L. ఇది, చొక్కా కోసం కార్మికులు చేసిన శ్రమ. ఇది కార్మికులదే. అయితే, యజమాని, ఆ 15 అంతా కార్మికులకు ఇవ్వడు. అందులో నించి కొంత మాత్రమే జీతంగా ఇచ్చి, మిగిలిన దాన్ని తనే తీసుకుంటాడు. అంటే L అనేది, 2 భాగాలు అవుతుంది.

ఈ ఉదాహరణలో, జీతాలుగా ఇచ్చిన భాగాన్ని 5 అనుకుందాం. దాని పేరు V. ఆ పైన ఇంకా వున్నది 10. దాని పేరు S. అంటే, L అనేది V + S అనే 2 భాగాలుగా అవుతుంది.

చొక్కా విలువని తీసుకుంటే, అది, $20_C + 5_V + 10_S$ అని, 3 భాగాలుగా వుందన్న మాట.

C = ఉత్పత్తి సాధనాల ఖర్చు. V = జీతాల ఖర్చు. S = కార్మికుల శ్రమలో నించి జీతాల భాగం పోగా మిగిలేది.

పెట్టుబడిదారుడు C + V ల కోసం మాత్రమే ఖర్చు పెడతాడు. కానీ, ఆ ఖర్చుల్ని వెనక్కి తీసు కుంటూ, తను ఖర్చు పెట్టని S ని కూడా తీసు కుంటాడు. ఆ S యే పెట్టుబడిదారుడికి - 'లాభం.'

ఈ ఉదాహరణలో, పెట్టుబడిదారుడు, $20_C + 5_V = 25$ పెట్టుబడి పెట్టి, దాని ద్వారా 10 లాభం (S) సంపాదిస్తాడు. కానీ, పాపం ఆ పెట్టుబడిదారుడు ఆ S నంతా తనే వుంచుకోలేడు. తన పరిశ్రమని పెట్టిన భూమి తన స్వంత భూమి కాకపోతే, (కౌలుకి తీసుకున్నది అయితే), దానికి 'కౌలు' చెల్లించాలి.

తన 25 పెట్టుబడి తన స్వంత పెట్టుబడి కాక పోతే, (అప్పు తెచ్చినది అయితే), దాని మీద 'వడ్డీ' చెల్లించాలి. అవి పోగా మిగిలినదే, చివరికి - లాభం.

భూమి వున్న వాడు, దాని మీద వచ్చే కౌళ్ళ తోటీ, డబ్బు వున్న వాడు దాని మీద వచ్చే వడ్డీల తోటీ, సరుకుల్ని ఉత్పత్తి చేయించే వాడు, చివరికి వచ్చే లాభం తోటీ బతుకుతూ వుంటారు. వీళ్ళందరూ బతికేది, ఏ సరుకు కోసమూ శ్రమ చెయ్యకుండానే. శ్రామికులు ఇచ్చే శ్రమని దోచడం ద్వారానే.

ఒక ఉత్పత్తి తయారవడానికి C + L లు తప్ప, కౌళ్ళూ వడ్డీలూ లాభాలూ అక్కర లేదనీ, అవి శ్రమ చెయ్యకుండా సంపాదించే ఆదాయాలనీ కార్మికులకు వివరించాలి.

ఉత్పత్తి విలువ, C + V + S లుగా వుంటుంది - అని వివరించేటప్పుడు, C ఉత్పత్తుల సంచీ, V ఉత్ప త్తుల సంచీ, S ఉత్పత్తుల సంచీ, వుండాలి.

తరగతి లోనే కొంత భాగాన్ని "ఇది ఉత్పత్తి స్థలం" అని విభజించాలి. ఇంకో వేపు భాగాన్ని "ఇది కార్మికుల ఇళ్ళ స్థలం" అని విభజించాలి. C సంచిని పని స్థలం లోనూ, V సంచిని కార్మికుల ఇళ్ళ స్థలం లోనూ పెట్టాలి."V ఉత్పత్తుల వల్ల కార్మికులకు పోషణ జరుగుతుంది. ఆ శక్తితో వారు పని స్థలం లోకి వస్తారు. ఇక్కడ కొత్త సరుకుని తయారు చేస్తారు" అంటూ ఆ స్థలాల్ని చూపించాలి.

"ఉత్పత్తి సాధనాలు, తమ విలువ కన్నా ఎక్కువ విలువని ఇవ్వవు" - అని వివరించాలి. పని స్థలంలో, ఉత్పత్తి క్రమం ముగిసినప్పుడు, అక్కడ ఒక 'పెద్ద సంచి' తయారై వుండాలి. అది కొత్త సరుకు. కొత్త ధాన్యం.

"ఒక భూమిలో కొంత ధాన్యం పండిందను కుందాం" అని చెప్పి, ఒక పెద్ద సంచిని చూపించాలి. దాని మీద 'ధాన్యం' అని రాసి వుంటుంది. దాన్ని విప్పాలి. అందులో నించి 3 సంచులు బైటపడతాయి. ఒక సంచి మీద C (ఉత్పత్తి సాధనాలు) - అనీ, ఒక సంచి మీద V (జీతాలు) - అనీ, మూడో సంచి మీద S (అదనపు విలువ) - అనీ, రాసి వుంటాయి. ఆ పేర్లు కార్మికులకు చూపించి వివరించాలి. "ఈ 3 సంచుల ఖర్చు తోటీ ధాన్యం వచ్చింది. కానీ దీని కోసం పెట్టుబడిదారుడు, C + V సంచుల్ని మాత్రమే ఖర్చు పెట్టాడు. ఆ 2 సంచుల ఖర్చుతో, ఈ 3 సంచులు వచ్చాయి" అని వివరించాలి.

C సంచిని ఒక పక్కన పెట్టెయ్యాలి. అది మళ్ళీ 'కొత్త ఉత్పత్తి సాధనాలు'గా వాడడానికి కావాలి. అందులో నించి ఎవరూ ఏమీ తినలేరు.

V సంచిని శ్రామికుల చేతుల్లో పెట్టెయ్యాలి. అది వారి 'పోషణ కోసం' కావాలి.

ఇక, S సంచి మిగులుతుంది. దాన్ని విప్పితే అందులో మళ్ళీ 3 సంచులు వుంటాయి. వాటి మీద 'కౌలు' అనీ, 'వడ్డీ' అనీ, 'లాభం' అనీ, రాసి వుంటుంది. శ్రామికుల వేషాలతో వుండే శ్రామికులు, ఆ 3 సంచుల్నీ తీసుకుని, కుర్చీల మీద దర్జాగా కూర్చున్న ముగ్గురు పెద్ద మనుషుల చేతుల్లో ఆ సంచులు పెడతారు.

కుర్చీల మీద కూర్చున్న ఆ ముగ్గుర్నీ చూపిస్తూ, టీచరు ఇలా చెప్పాలి - "ఇదుగో, ఇతడు - భూస్వామి. ఇతగాడు ఆ భూమిలో ధాన్యం పండడం కోసం ఏ శ్రమా చెయ్యకుండా 'భూమి కౌలు' తీసుకుంటూ వుంటాడు. ఈ రెండో వ్యక్తి, వడ్డీ పెట్టుబడిదారుడు. ఇతడు, ఏ శ్రమా చెయ్యకుండా 'వడ్డీ' తింటూ వుంటాడు. ఈ మూడో వ్యక్తి, ఉత్పాదక పెట్టుబడి దారుడు. ఇతడు కూడా, ఆ ధాన్యం పండడం కోసం ఏ శ్రమా చెయ్యకుండా 'లాభం' తింటూ వుంటాడు. వీళ్ళు తినే ఈ 3 భాగాలూ శ్రామికుల శ్రమే. ఈ శ్రమ కూడా శ్రామికులకే అందితే, వారు పేదలుగా వుంటారా?" - ఈ రకంగా టీచరు వివరించాలి.

"ఇది, ఒక్క ఉత్పత్తి సంగతి. 'ధాన్యం' సంగతి. మొత్తం సమాజంలో ఉత్పత్తి అయ్యే రక రకాల సరుకుల్ని చూస్తే, అన్ని చోట్లా జరిగేది ఇదే."

మొత్తం సరుకులన్నిటినీ కలిపితే - అది 'సరుకుల రాసి'. ఆ సరుకుల ధరల మొత్తమే, ఆ రాసి 'విలువ'. అందులో నించి C + V లను తీసేస్తే, మిగిలేది S. అది మొత్తం శ్రామికులందరూ ఇచ్చిన అదనపు విలువ.

శ్రామికుడి జీతం - అతని శ్రమలో భాగమే. కానీ దాన్ని పెట్టుబడిదారుడే తన జేబులో నించి ఇస్తు న్నట్టుగా కనిపిస్తుంది. అలాగే, పెట్టుబడిదారుడికి పోయేది శ్రామికులదే. కానీ, అది పెట్టుబడిదారుడి కష్టార్జితం లాగ కనిపిస్తుంది. ఇదంతా 'పెట్టుబడి మర్మం.'

ఈ అంశాలన్నిటినీ వివరించాలి.

మొదట టీచరు బాగా నేర్చుకోవాలి. కొన్ని బొమ్మల వస్తువులు సేకరించి ఒక సంచిలో పెట్టుకోవాలి. నేర్పే పాఠాన్ని బట్టి ఆ వస్తువులు వుండాలి. పెట్టుబడిదారుడు, కార్మికుల్ని ఇంకా ఎక్కువ పని చెయ్యమని అడిగే ఘట్టం, కార్మికులు నిరాకరించడం, పెట్టుబడిదారీ ఆర్థికవేత్త కార్మికుల్ని ఒప్పించడం - అదంతా అభినయాలతో తేలిగ్గా అర్థ మవుతాయి. కొన్ని చోట్ల పాఠం చెప్పినట్టే బోధించాలి. అక్కడక్కడా అభినయాలు.

కార్మిక జనాభాలో నూటికి 90 మందికి చదు వులు వుండవు. ఏ కొంచెమో చదువు వచ్చిన వాళ్ళకి కూడా పుస్తకాలు చదివే అలవాటు వుండదు. కాబట్టి చదువులు లేని కార్మిక జనాభా 'కాపిటల్'ని స్వయంగా చదవడం గురించి ఊహించలేము. ఇక, రెండో మార్గమే మిగిలింది. కాపిటల్‌ని స్వయంగా చదివి, అందులో సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్న మేధాశ్రమల కార్మికులు, స్వయంగా చదువుకో లేని ఇతర కార్మికులకు చదివి వినిపించే బాధ్యతని తమ మీద వేసుకోవాలి. ఇది సంఘాల ద్వారానే జరగాలి.

రోజు వారిగా చేసుకునే ఉద్యోగాలూ, ఇతర కార్యక్రమాలూ, వాటి దారిన అవి జరుగుతూ వుండ వలసిందే. అది కాకుండానే, దీన్ని నేర్చుకుంటూ, నేర్పుతూ వుండాలి.

ఒక అన్యాయానికి గురి అయ్యే వ్యక్తులకు ఆ అన్యాయం గురించి తెలిస్తే, దాని శక్తి దానికి వుంటుంది. ★

# 5. 'కాపిటల్' చదవడం గురించి

'కాపిటల్' రచన, ఒక తార్కికమైన వరసలో వుంటుంది.

రచయిత, మొదట 'ఉపయోగపు విలువ'తో ప్రారంభించి, 'విలువ రూపాన్ని' చెప్పి, క్రమంగా 'డబ్బు అంటే, రూపం లేని శ్రమ' అని వివరిస్తాడు. 'విలువ'ని చెప్పాకే అందులో వున్న 'అదనపు విలువ'ని చెపుతాడు. తర్వాత, 'అదనపు విలువ', ఏ యే పేర్లతో ఎవరెవరికి పోతుందో ఆ భాగాలన్నిటినీ వరసగా వివరిస్తాడు. చివరికి 'జీతాలు' పొందే శ్రామికుల్ని ఒక వర్గం గానూ, 'అదనపు విలువ'ని లాగే దోపిడీదారుల్ని ఇంకో వర్గం గానూ చెప్తూ 'వర్గాల్ని' వివరిస్తాడు. ఈ విషయాలన్నీ ఇలా ఈ వరసలో వుండడం ఎంతో సరైనది.

రచనలో మొదటి చాప్టర్‌నే 'కౌలు' తోనో, 'వడ్డీ' తోనో ప్రారంభించి, "అది, అదనపు విలువలో భాగం" అని చెప్తే, అదేమైనా అర్థమవుతుందా? అప్పటికి ఇంకా విలువా తెలీదు, అదనపు విలువా తెలీదు.

సరుకుని అమ్మగా వచ్చే డబ్బు, ఆ సరుకు విలువే - అని తెలియాలంటే, దాని కన్నా ముందు, 'విలువ' అంటే ఏమిటో, 'డబ్బు' అంటే ఏమిటో, తెలియాలి.

వడ్డీ లాభాలు అదనపు విలువలో భాగాలే - అని తెలియాలంటే, అదనపు విలువ అంటే ఏమిటో, అది ఎలా వస్తుందో, మొదట తెలియాలి. ఈ రకంగా, విషయాల్ని నేర్చుకునేటప్పుడు, ఏది ముందు తెలియాలో, దేన్ని బట్టి ఏది వుంటుందో ఇలా, తెలియడానికి ఒక క్రమం వుంటుంది. 'కాపిటల్' రచన అంతా ఆ క్రమం ప్రకారమే వుంటుంది.

వడ్డీ, కౌలూ - పూర్వం నించీ కూడా వున్నాయి. లాభాలూ, జీతాలూ తర్వాత వచ్చాయి. కాబట్టి, ఈ విషయాలు చరిత్రలో ఏ వరసలో వచ్చాయో ఆ వరస లోనే చెప్పాలంటే, వాటిని అసలు వివరించడమే సాధ్యం కాదు. వడ్డీ, కౌలూ వెనకటి నించీ వున్నా, వాటిని అర్థం చేసుకోవడం, మార్క్సుకి, 'పెట్టుబడి'ని అర్థం చేసుకోవడం ద్వారానే సాధ్యమైంది. కాబట్టి, మొదట 'విలువ'నీ, 'అదనపు విలువ'నీ వివరించిన తర్వాతే, 'అదనపు విలువలో భాగాల్ని' వివరించడం సాధ్యమవుతుంది.

కానీ, కొంత మంది పాఠకులు, 'కాపిటల్' రచనలో వున్న తార్కికమైన వరసని అర్థం చేసుకోకుండా, "అసలు అన్నిటికీ భూమే ప్రధానం కదా? భూమి ఆస్తి గురించే, కౌలు గురించే, మొట్ట మొదట చెప్పాలి కదా?" అనో, "మొదట 'ధర' గురించే చెప్పాలి కదా" అనో - అభిప్రాయ పడతారు. ఇలాంటి అభిప్రాయం, ప్రధానంగా పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల్లో వుంది. ఆర్థిక అంశాల్ని వాళ్ళు వివరించే పద్ధతిని గురించి చర్చిస్తూ మార్క్సు ఇలా అంటాడు:

"... ఉదాహరణకి, 'కౌలు'తో, అంటే 'భూమి ఆస్తి'తో ప్రారంభించడం కన్నా ఎక్కువ సహజంగా ఏదీ కనిపించదు. ఎందుకంటే, అది, భూమితో, అంటే సమస్త ఉత్పత్తికీ, సమస్త జీవితానికీ మూలాధారమైన దానితో, సంబంధించి వుంటుంది కాబట్టి; ...... కానీ, అంతకన్నా పెద్ద తప్పు ఏదీ వుండదు .... 'పెట్టుబడి' లేకుండా 'కౌలు'ని అర్థం చేసుకోలేము. కానీ, 'కౌలు' లేకుండా 'పెట్టుబడి'ని అర్థం చేసుకోగలము. బూర్జువా సమాజంలో ప్రతి దాని మీదా పెత్తనం చేసే ఆర్థిక శక్తి 'పెట్టుబడి'. అది, 'పరిశీలన'లో ప్రారంభాంశం గానూ, ముగింపు అంశం గానూ వుండి తీరాలి. 'భూమి ఆస్తి'ని వివరించడం కన్నా ముందే 'పెట్టుబడి'ని వివరించాలి. పెట్టుబడినీ, భూమి ఆస్తినీ విడి విడిగా చూసిన తర్వాత, వాటి అంతస్సంబంధాన్ని పరిశీలించాలి. చరిత్రలో ప్రధాన పాత్రని నిర్వహించిన ఆర్థిక అంశాలు ఏ వరసలో వున్నాయో, ఆ వరస లోనే వాటిని చూపడం అనుచితమూ, పొరపాటూనూ".

[క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, పేజీ 212]

కాబట్టి, 'కాపిటల్' రచనలో వున్న ప్రధానమైన వరసని, అది అలా ఎందుకు వుందో, ఆ చాప్టర్ల సంబంధాల్ని సరిగా అర్థం చేసుకోవాలి.

'కాపిటల్'లో కొన్ని విషయాలు చాలా వివరాలతో వున్నాయి. కొన్ని విషయాలు తక్కువ వివరాలతో

వున్నాయి. ఏ రచనలో నైనా, 'వివరించడం'లో, ఈ రకమైన ఎక్కువ తక్కువలు వుంటూనే వుంటాయి. ఒక రచనలో ఎక్కువగా వివరించిన వాటి ఆధారంతో ఎక్కువగా వివరించని వాటిని కూడా అర్థం చేసు కోవాలి. 'చెప్పిన' వాటి ఆధారంతో, 'చెప్పని' వాటిని కూడా అర్థం చేసుకోవాలి!

ప్రతీదీ ఆ రచయితే చెప్పాలంటే అది ఏ రచ యితకీ సాధ్యం కాదు. అలాగైతే సమాజంలో తర్వాత వాళ్ళు ఆలోచించ వలసిన పనే వుండదు. అన్నీ మొదటి వాళ్ళే చెప్పాలంటే, తర్వాత వాళ్ళకి తల కాయలు వుండడమే అనవసరమవుతుంది.

'మార్క్స్ - కాపిటల్'ని చదవడం ప్రారంభించి నప్పుడు, దాదాపు 20 ఏళ్ళ కిందట, అది ఎంత గందర గోళంగా అనిపించేదంటే, ఆ బాధ చెప్పడానికి వీలు లేదు. ఎక్కువ సార్లు విసిగెత్తి పోతూ వుండేది. మార్క్సు మీద కోపం కూడా వస్తూ వుండేది. "అబ్బా, ఏమిటిది! ఏం శైలి! ఏం మనిషి! ఆ గడ్డం ఎందుకూ అసలు? అంత గడ్డం పెట్టుకుంటే ఆ చికాకు తోటే సరి పోతుంది. ఏం తేలిగ్గా రాయగలడూ?" అని, ఏమీ తోచక ఆ గడ్డాన్ని కాసేపు తిట్టి, మళ్ళీ ఎలాగో మూలు క్కుంటూ మళ్ళీ చదవడం ప్రారంభించడం! ఎక్కడ దాకా చదివామో కూడా తెలిసేది కాదు. చదివిందీ, చదవందీ అంతా ఒక్కలాగే వుండేది. కానీ, ఎక్కడన్నా ఒక్క వాక్యం అర్థమైతే, అంత బాధా పటాపంచ లయ్యేది. అర్థమైన వాక్యం, అంత అద్భుతంగా వుండేది. "ఇంక ఎప్పుడూ కోపం తెచ్చుకోకూడదు. ఓపిగ్గా చదువుకోవాలి. అంతే మరీ. ఆయనకి బోలెడు సమస్యలూ, ఆర్థిక బాధలూ, అనారోగ్యమూ! పైగా గడ్డమూ! అయినా, ఆ రోజుల్లో శైలి అదీ! ....." అలా చెప్పుకుని పాత కోపం అంతా వదిలించుకోవడం! కానీ, ఒక్క పేజీ నడిచేటప్పటికే మళ్ళీ ... మహా గందరగోళం!

సముద్రానికో గుణం వుంటుంది. ఒడ్డున నించున్న వాళ్ళ మీద పడి ఒక కెరటం లోపలికి లాగే స్తుంది. నీళ్ళల్లో పడి కళ్ళు తేలేసి ఇక మునగడానికి సిద్ధంగా వున్నప్పుడు ఇంకో కెరటం బైటికి తోసేస్తుంది. 'బతికాం రా దేవుడా' అని ప్రాణాలు అరిచేత పట్టుకుని లేవబోతోంటే, మూడో కెరటం మళ్ళీ తనతో తీసుకు పోతుంది. అలాగే, 'కాపిటల్'తో పేజీ పేజీకీ, జీవ న్మరణ సమస్య అయిపోతూ వుంటుంది.

భాష తెలియని గానం అది! పెద్ద గడ్డంతో, తంబూరా వాయిస్తూ, ఒక బాటసారి ఏదో భాషలో మృదువుగా శ్రావ్యంగా పాడుతున్నట్టుగా వుంటుంది. కరుణతో, కోపంతో, శౌర్యంతో, దుఃఖంతో, బాధతో, ప్రేమతో - పాడుతున్నాడని తెలుస్తూ వుంటుంది. కానీ భాష తెలీదు. ఏమంటున్నాడో తెలీదు. ఎవరి మీదో ఆగ్రహ పడుతున్నాడని తెలుస్తుంది. ఎవరి మీదో ప్రేమ కురిపిస్తున్నాడని తెలుస్తుంది. ఎందుకో ఏమిటో తెలీదు. కానీ, ఆయనేం చెయ్యగలడు? ఆయన భాష అదీ! ఆయన శాస్త్రం అదీ! దాన్నే మనం నేర్చుకోవాలి! వినీ వినీ నేర్చు కోవాలి! మనకి భాష రాకపోతే ఆయనేం చెయ్య గలడు? ఆ తప్పు మనదీ.

మార్క్సు మనల్ని చాలా ప్రేమగా, పక్షి తన పిల్లల్ని రెక్కల కిందకి లాక్కున్నట్టుగా వెంటబెట్టుకుని తీసుకు వెళ్తూ వుంటాడు. ఏవిటేమిటో చెప్తూ వుంటాడు. కాస్సేపు బాగానే వుంటుంది. హఠాత్తుగా ఏదో అవు తుంది. పిల్లల్ని వదిలేసి, డేగ వెంటబడి తరుముతూ పోయే పక్షి లాగ పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తల వెంటబడి వాళ్ళని తరుముతూ పోతాడు. హఠాత్తుగా ఒంటరి అయిపోతాం. చిన్న పిల్లలు అడవిలో తప్పిపోయినట్టు అయిపోతాం. డేగల్ని తరిమి, ఎప్పటికో వెనక్కి వస్తాడు - "వీళ్ళు ఎక్కడ కనపడ్డా తరిమెయ్యాలి సుమా!" అంటాడు, ఆగ్రహంగా.

"అమ్మా! వాళ్ళతో ఎందుకు పోట్లాడావో మాకు అర్థమే కాలేదే" అంటాం బిక్క మొహాలేసి, మార్క్సుతో.

"అర్థమే కాలేదా? ... అలాగా? వాళ్ళు చాలా చెడ్డ వాళ్ళమ్మా! మిమ్మల్ని మోసం చేస్తున్నారు. మీరు తెలివి నేర్చుకోవాలి. లేకపోతే ఎలా బతుకుతారు? కొంచెం పెద్ద వాళ్ళయితే అన్నీ అర్థమవుతాయి. ఫర్వాలేదు" అని మళ్ళీ మనల్ని వెంట పెట్టుకుని నడుస్తాడు.

నిజం గానే, ఆ మొదటి రోజులతో పోల్చుకుంటే ఇప్పుడు 'కాపిటల్'ని అర్థం చేసుకోవడం చాలా తేలిక. ఇప్పుడు మళ్ళీ మళ్ళీ చదువుతోంటే చెప్పలేనంత ఆశ్చర్యంగా వుంటుంది. "ఇంత తేలిగ్గా వుందే! దీన్నేనా అప్పుడు అంత విసుక్కున్నదీ!" అని నమ్మలేనంత ఆశ్చర్యంగా వుంటుంది! ★

# 6. మార్క్స్ 'కాపిటల్'లో చాప్టర్లు

మార్క్స్ 'కాపిటల్' మొత్తం **6** పుస్తకాలు (4 సంపుటాలు).
వాటిలో వున్న మొత్తం చాప్టర్ల పేర్లు ఇవి.

## 1వ సంపుటం
## పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం

1. సరుకులు.
2. మారకం.
3. డబ్బూ, లేదా సరుకుల చలామణీ.
4. 'పెట్టుబడి' కి సాధారణ సూత్రం.
5. 'పెట్టుబడి - దాని సాధారణ సూత్రంలో వున్న వైరుధ్యాలు.
6. శ్రమ శక్తి ని కొనడమూ, అమ్మడమూ.
7. శ్రమ క్రమమూ, అదనపు విలువ ఉత్పత్తి క్రమమూ.
8. స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ.
9. అదనపు విలువ రేటు.
10. పని దినం.
11. అదనపు విలువ రేటూ, రాసీ.
12. రెలెటివ్ అదనపు విలువ - అనే అవగాహన.
13. సహకారం (కో ఆపరేషన్)
14. శ్రమ విభజనా, మాన్యుఫాక్చరూ.
15. యంత్రాలూ, భారీ పరిశ్రమా.
16. ఎబ్సల్యూట్ అదనపు విలువా, రెలెటివ్ అద నపు విలువా.
17. 'శ్రమ శక్తి - ధర' పరిమాణంలోనూ, 'అదనపు విలువ' పరిమాణం లోనూ, మార్పులు.
18. 'అదనపు విలువ రేటు'కి సంబంధించిన వివిధ సూత్రాలు.
19. శ్రమ శక్తి విలువ (అదే విధంగా దాని ధర) జీతాలుగా మారడం.
20. టైమ్ వేజెస్.
21. పీస్ వేజెస్.
22. జీతాల్లో, జాతీయంగా (దేశాల వారీగా), తేడాలు.
23. సింపుల్ పునరుత్పత్తి.
24. 'అదనపు విలువ' పెట్టుబడిగా మారడం.
25. పెట్టుబడిదారీ కూడిక - సాధారణ నియమం.
26. ఆదిమ పెట్టుబడి కూడిక రహస్యం.
27. భూమి నించి వ్యవసాయ జనాభాను వెళ్ళ గొట్టడం.
28. భూమిని కోల్పోయిన వారికి వ్యతిరేకంగా 15వ శతాబ్దం చివరి నించీ వుండిన దారుణ మైన శాసనాలు. 'పార్లమెంటు శాసనాల' ద్వారా జీతాల్ని తగ్గించడం.
29. పెట్టుబడిదారీ రైతు పుట్టుక.
30. పరిశ్రమ మీద వ్యవసాయ విప్లవ ప్రభావం. పారిశ్రామిక పెట్టుబడికి, స్వదేశీ మార్కెట్టుని సృష్టించడం.
31. పారిశ్రామిక పెట్టుబడిదారుడి పుట్టుక.
32. 'పెట్టుబడిదారీ కూడిక'లో చారిత్రక ధోరణి.
33. వలసలు ఏర్పడడం గురించిన ఆధునిక సిద్ధాంతం.

### 1వ సంపుటానికి అనుబంధం:

'కాపిటల్'కి సంబంధించి, మార్క్సు అప్పట్లోనే రాసిన కొన్ని రాత ప్రతులు తర్వాత కాలంలో దొరి కాయి. వాటిని, మొట్ట మొదటి సారి "తక్షణ ఉత్పత్తి క్రమం - ఫలితాలు" అనే పేరుతో రష్యన్, జర్మన్ భాషలలో 1933లో ప్రచురించారు. వాటినే ఇంగ్లీ షులో 1976లో 1వ సంపుటానికి అనుబంధంగా 'పెన్‌గ్విన్' వారు ప్రచురించారు. ఆ అనుబంధం లోని విషయాలు ఇవి:

1. పెట్టుబడిదారీ ఉత్పత్తిగా సరుకులు.
2. 'అదనపు విలువ' ఉత్పత్తిగా పెట్టుబడిదారీ ఉత్పత్తి.
3. పెట్టుబడిదారీ ఉత్పత్తి, ప్రత్యేకించి - పెట్టు బడిదారీ సంబంధాల ఉత్పత్తీ, పునరుత్పత్తీ.
4. విడి విడి విషయాలు.

# 2వ సంపుటం
# పెట్టుబడిదారీ చలామణీ క్రమం


1. 'డబ్బు - పెట్టుబడి' సర్క్యూటు.
2. 'ఉత్పాదక పెట్టుబడి' సర్క్యూటు.
3. 'సరుకు పెట్టుబడి' సర్క్యూటు.
4. సర్క్యూటుకి వున్న మూడు సూత్రాలు.
5. చలామణీ కాలం.
6. చలామణీ ఖర్చులు.
7. టర్నోవరు కాలమూ, టర్నోవరు సంఖ్యా.
8. ఫిక్సెడ్ పెట్టుబడీ, చలామణీ పెట్టుబడి.
9. పెట్టుబడి చేసే మొత్తం టర్నోవరు; టర్నోవరు చక్రాలు.
10. ఫిక్సెడ్ పెట్టుబడికీ, చలామణీ పెట్టుబడికీ సంబంధించిన సిద్ధాంతాలు: ఫిజియోక్రాట్లూ, యాడం స్మిత్తూ.
11. ఫిక్సెడ్ పెట్టుబడికీ, చలామణీ పెట్టుబడికీ సంబంధించిన సిద్ధాంతాలు: రికార్డో.
12. వర్కింగ్ పిరియడ్.
13. ఉత్పత్తి కాలం.
14. చలామణీ కాలం.
15. పెట్టుబడి పరిమాణం మీద, టర్నోవరు కాలం ప్రభావం.
16. అస్థిర పెట్టుబడి టర్నోవరు.
17. అదనపు విలువ చలామణీ.
18. మొత్తం సామాజిక పెట్టుబడి పునరుత్పత్తీ, చలామణీ (పరిచయం).
19. ఈ విషయం గురించి ఇంతకు పూర్వపు వాళ్ళు చెప్పినది.
20. సింపుల్ పునరుత్పత్తి.
21. విస్తృత స్థాయిలో పెట్టుబడి కూడికా, పునరుత్పత్తీ.


# 3వ సంపుటం
# పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం మొత్తంగా


1. కాస్టు ప్రైసూ, లాభమూ.
2. లాభం రేటు.
3. లాభం రేటుకి, అదనపు విలువ రేటుతో సంబంధం.
4. లాభం రేటు మీద టర్నోవరు ప్రభావం.
5. స్థిర పెట్టుబడిని ఉపయోగించడంలో పొదుపు.
6. ధరల ఎగుడు దిగుళ్ళ ప్రభావం.
7. అనుబంధ వ్యాఖ్యలు.
8. వేర్వేరు ఉత్పత్తి శాఖలలో, వేర్వేరు పెట్టుబడుల కాంపోజిషన్లూ; వాటి పర్యవసానంగా లాభం రేట్లలో వచ్చే తేడాలూ.
9. జనరల్ లాభం రేటు (సగటు లాభం రేటు) ఏర్పడడం.
10. పోటీ ద్వారా జనరల్ లాభం రేటు సమానం కావడం. మార్కెట్ ధరలూ; మార్కెట్ విలువలూ. అదనపు లాభం.
11. ఉత్పత్తి ధరల మీద, జీతాలలో వచ్చే సాధారణ ఎగుడు దిగుళ్ళ ప్రభావం.
12. అనుబంధ వ్యాఖ్యలు.
13. లాభం రేటు పడిపోయే ధోరణికి సంబంధించిన సూత్రం.
14. ఆ సూత్రానికి వ్యతిరేకంగా పని చేసే ప్రభావాలు.
15. ఆ సూత్రం లోని అంతర్గత వైరుధ్యాల వివరణ.
16. వర్తక పెట్టుబడి.
17. వర్తక లాభం.
18. 'వర్తక పెట్టుబడి' టర్నోవరు. ధరలు.
19. మనీ - డీలింగు పెట్టుబడి.

20. వర్తకుడి పెట్టుబడికి సంబంధించిన చారిత్రక వాస్తవాలు.
21. వడ్డీ పెట్టుబడి.
22. లాభాన్ని విభజించడం. వడ్డీ రేటూ, సహజమైన వడ్డీ రేటూ.
23. వడ్డీ, సంస్థ లాభమూ.
24. వడ్డీ పెట్టుబడి రూపంలో, పెట్టుబడి సంబంధాలు బయటపడడం.
25. అప్పూ, కాల్పనిక పెట్టుబడీ.
26. 'డబ్బు - పెట్టుబడి' కూడిక; వడ్డీ రేటు మీద దాని ప్రభావం.
27. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అప్పు పాత్ర.
28. చలామణీ మీడియమూ, పెట్టుబడీ; టూకే, ఫులార్టన్ల అభిప్రాయాలు.
29. 'బ్యాంకు పెట్టుబడి' లోని భాగాలు.
30. డబ్బు - పెట్టుబడీ, నిజమైన పెట్టుబడీ - 1.
31. డబ్బు - పెట్టుబడీ, నిజమైన పెట్టుబడీ - 2.
32. డబ్బు - పెట్టుబడీ, నిజమైన పెట్టుబడీ - 3.
33. అప్పు విధానంలో చలామణీ మీడియం.
34. కరెన్సీ సూత్రమూ, 1844 నాటి ఇంగ్లీషు బ్యాంకుల శాసనమూ.
35. విలువైన లోహమూ, మారకం రేటూ.
36. పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు.
37. అదనపు లాభం, భూమి కౌలుగా మారడం (పరిచయం).
38. డిఫరెన్షియల్ కౌలు: జనరల్ వ్యాఖ్యలు.
39. డిఫరెన్షియల్ కౌలు - మొదటి రూపం (డిఫరెన్షియల్ కౌలు - 1)
40. డిఫరెన్షియల్ కౌలు - రెండో రూపం (డిఫరెన్షియల్ కౌలు - 2)
41. డిఫరెన్షియల్ కౌలు- 2, మొదటి ఉదాహరణ: స్థిరమైన ఉత్పత్తి ధర.
42. డిఫరెన్షియల్ కౌలు -2, రెండో ఉదాహరణ: ఉత్పత్తి ధర పడిపోవడం.
43. డిఫరెన్షియల్ కౌలు -2, మూడో ఉదాహరణ: ఉత్పత్తి ధర పెరగడం.
44. నాసి రకం భూమి మీద కూడా డిఫరెన్షియల్ కౌలు.
45. ఎబ్సల్యూట్ భూమి కౌలు.
46. బిల్డింగు వున్న స్థలం కౌలు. గనుల్లో కౌలు. భూమి ధర.
47. పెట్టుబడిదారీ భూమి కౌలు పుట్టుక.
48. సూత్ర త్రయం.
49. ఉత్పత్తి క్రమం విశ్లేషణ గురించి.
50. పోటీ సృష్టించే భ్రమలు.
51. పంపిణీ సంబంధాలూ, ఉత్పత్తి సంబంధాలూ.
52. వర్గాలు.
★ 'కాపిటల్' - 3 వ సంపుటానికి అనుబంధం (ఎంగెల్స్)


# 4వ సంపుటం (3 భాగాలు)
# అదనపు విలువ సిద్ధాంతాలు


1. సర్ జేమ్స్ స్టువర్ట్.
2. ఫిజియో క్రాట్లు.
3. యాడం స్మిత్.
4. ఉత్పాదక, అనుత్పాదక సిద్ధాంతాలు.
5. నెక్కర్.
6. క్వెస్నే రచన - 'టేబుల్ ఎకనామిక్'.
7. లింగ్యెట్.
★ చేర్పులు
8. రాడ్ బర్టస్.
9. 'కౌలుని గురించి రికార్డో సూత్రం' అనే దాన్ని కనుక్కోవడాన్ని గురించిన చరిత్ర మీద నోట్సు.
10. కాస్ట్ ప్రైస్ని గురించి రికార్డో, యాడం స్మిత్తుల సిద్ధాంతం.
11. కౌలుని గురించి రికార్డో సిద్ధాంతం.
12. డిఫరెన్షియల్ కౌలు గురించి పట్టికలూ, వ్యాఖ్యానమూ.
13. 'కౌలు'ని గురించి రికార్డో సిద్ధాంతం (ముగింపు).
14. కౌలుని గురించిన యాడం స్మిత్ సిద్ధాంతం.

15. 'అదనపు విలువ' గురించి రికార్డో సిద్ధాంతం.
16. 'లాభం' గురించి రికార్డో సిద్ధాంతం.
17. 'పెట్టుబడి కూడిక' గురించి రికార్డో సిద్ధాంతమూ, దానిపై విమర్శా ('పెట్టుబడి'కి వున్న అసలు స్వభావమే సంక్షోభాలకు దారి తీస్తుంది.)
18. రికార్డో రాసిన ఇతర విషయాలు - జాన్ బార్టన్.
★ చేర్పులు
19. థామస్ రాబర్ట్ మాల్తూస్.
20. రికార్డో అనుచరుల పతనం.
21. ఆర్థిక వేత్తల పట్ల వ్యతిరేకత (రికార్డో సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని).
22. రామ్సే.
23. చెర్బులియజ్.
24. రిచర్డ్ జోన్స్.
★ చేర్పులు:
ఆదాయమూ - దాని మూలాలూ;
తప్పుడు రాజకీయ ఆర్థిక శాస్త్రమూ. ★

# 7. మార్క్సు పూర్వపు అర్థశాస్త్రం

**'కాపిటల్'** చదవడం పూర్తి చేసిన తర్వాత వెంటనే చదవవలసిన పుస్తకం ఇది. **ఎ.వి.అనీకిన్** అనే రష్యన్ రచయిత, 1976 లో, **"అర్థశాస్త్ర క్రమ పరిణామం"** అనే పేరుతో రాసిన పుస్తకం ఇది. దీని ఉప శీర్షిక, **"మార్క్సు పూర్వపు అర్థశాస్త్రం."** 1983 లో, సోవియట్ యూనియన్‌లో 'ప్రగతి ప్రచురణాలయం' ద్వారా వెలువడింది. దీని ఇంగ్లీషు అనువాదం పేరు - 'ఎ సైన్స్ ఇన్ ఇట్స్ యూత్.' ఇంగ్లీషు అనువాదకుడి పేరు ఇవ్వలేదు. ఇంగ్లీషు నించి తెలుగు అనువాదం: **నిడమర్తి ఉమారాజేశ్వరరావు.**

ఈ పుస్తకం ప్రత్యేకత ఏమిటో, పుస్తకం పేరు లోనే వుంది. మార్క్సు 'శ్రమ దోపిడీ'ని కనిపెట్ట గలిగాడంటే, దాని వెనక అనేక మంది ఆర్థిక వేత్తల కృషి వుంది. మార్క్సు 'అదనపు విలువ'ని అర్థం చేసుకోవడానికి కావలసిన పునాది అంతా అప్పటికే పడి వుంది.

ఆ పునాదికి ఒక్కొక్క రాయినీ చేర్చిన ఆర్థిక వేత్తల్ని తెలుసుకోకపోతే, మార్క్సుని కూడా తెలుసుకున్నట్టు కాదు. మార్క్సు ఏం చేశాడో తెలియాలంటే, వెనకటి వాళ్ళు ఏం చెయ్యలేదో తెలియాలి. ఎందుకు చెయ్యలేకపోయారో, వారి పరిమితులేమిటో, తెలియాలి.

'శ్రమ దోపిడీ'ని చెప్పగలిగినందుకు మార్క్సుని ఎంత ప్రేమిస్తామో, అంత ప్రేమించదగ్గ ఆర్థిక రచయితలు వెనకటి కాలంలో కూడా వున్నారు.

ఈ వెనకటి కాలపు రచయితలు, దోపిడీకి సమర్థకులు కారు. అసలు దోపిడీ గురించే తెలియని వారు. ఒక్క రికార్డోకి మాత్రమే ఆ అవకాశం వుంది. అయినా ఆయన కూడా దోపిడీని గ్రహించలేకపోయాడు.

'శ్రమ దోపిడీ' సంగతి బయటపడి పోయాక కూడా, ఇంకా 'వడ్డీ - లాభాల్ని' సమర్థిస్తూ రాసే రచయిత లందరూ దొంగలు! పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించక పోవడం వల్లనే ఈ దొంగలకు, దోపిడీ వర్గం, పెద్ద పెద్ద అవార్డులు కట్టబెడుతూ వుంటుంది.

మార్క్సు తర్వాత వున్న దొంగ ఆర్థిక వేత్తల్నీ, మార్క్సు కన్నా వెనకటి 'అమాయకపు' ఆర్థిక వేత్తల్నీ ఒకే గాటిన కట్టకూడదు.

మార్క్సు, 'నా సిద్ధాంతం స్మిత్తూ-రికార్డోల పర్యవసానమే' అంటాడు. అలాగే, ఆ స్మిత్తూ రికార్డోలు కూడా ఇంకా వెనకటి రచయితల పర్యవసానాలే.

ఏ సైన్సు అయినా, ఎంతో దీర్ఘకాలం పాటు అంచె లంచెలుగా అభివృద్ధి చెందుతూ వస్తుంది. అది, ఒక గమ్యానికి చేరే లోపల, ఏ పరిశోధకుడైనా తనకు తెలిసినంత వరకే చెప్పగలుగుతాడు. అందులో, ఒప్పులూ తప్పులూ అన్నీ వుంటాయి. తర్వాత - పరిశోధకులు, ఆ ఒప్పుల్ని తీసుకుని, ఆ తప్పుల్ని తిరస్కరిస్తారు. కానీ ఆ తర్వాత - పరిశోధకులు కూడా మళ్ళీ కొత్త ఒప్పులూ, కొత్త తప్పులూ చేస్తారు. ఆ పరిణామం అలా సాగి సాగి, ఒక నాటికి 'పూర్తిగా సరైన దాన్ని' పట్టుకోగలుగుతుంది.

రెండు వేల సంవత్సరాల నాడు అరిస్టాటిల్‌తో ప్రారంభమైన ఆర్థిక విషయాల పరిశీలన, మార్క్సు దగ్గిర 'శ్రమ దోపిడీ'ని తెలుసుకోగలిగింది. వర్గ పోరాటాన్నే శ్రామిక వర్గ కార్యక్రమంగా చెప్పగలిగింది.

'ఆర్థిక శాస్త్రం'లో మార్క్సు కన్నా వెనక, అనేక డజన్ల ప్రశ్నలు పరిష్కారాలు దొరకకుండా పడి

వున్నాయి. మార్క్సుతో బయటపడ్డ 'అదనపు విలువ' రహస్యమే వెనకటి ప్రశ్నలన్నిటికీ జవాబులు ఇవ్వ గలిగింది.

'లాభం' అనే అగాధాన్ని దాటగలిగితే, మార్క్సు చేసిన పని రికార్డోయే చేసి వుండే వాడు. కానీ, 'పెట్టు బడికి లాభం రాక తప్పదు కదా?' అనే, ఆయన బూర్జువాతనం, ఆయనకే తెలియకుండా, ఆయన మేధావితనానికి అడ్డు పడింది.

మరుగున పడి వున్న అనేక మంది గత రచ యితల మేధావి తనాల్ని మార్క్సే గ్రహించి, ఎవరి ప్రత్యేకత యేమిటో, తన 'కాపిటల్'లో, 'అదనపు విలువ సిద్ధాంతాల' భాగంలో వివరించాడు.

మార్క్సు పూర్వపు అర్థ శాస్త్రాన్ని చెప్పగలిగిన ఈ పుస్తకం ఎంతో విలువైనది. చదవడానికి ఎంతో ఆసక్తి కలిగించే పరిశోధనలతో నిండినది.

ఇందులో, కేవలం ఆర్థిక పరిశోధనల గురించే గాక, ప్రకృతి శాస్త్రాలకూ, చరిత్రకూ, రాజరికాలకూ సంబంధించిన సమాచారం కూడా కొంత దొరుకు తుంది. ఆర్థిక వేత్తలందరికీ సంబంధించిన వ్యక్తి త్వాలూ, ఆదర్శాలూ, కష్ట సుఖాలూ - వంటి విషయా లతో కూడిన జీవిత సంఘటనలెన్నో కనపడతాయి.

'అర్థ శాస్త్రం అంటే నిస్సారంగా వుండే విషయం కాదు. ప్రకృతి రహస్యాలు ఎంత ఆకర్షణీయంగా వుంటాయో, సామాజిక విషయాలు అంత కన్నా ఆకర్షణీయంగా వుంటాయి' అంటాడు ఈ రచయిత.

వెనకటి ఆర్థిక రచయితల గురించి చదివే టప్పుడు, వాళ్ళు చెప్పిన విషయాలు చూస్తే, 'అన్నీ వీళ్ళే కనిపెట్టేశారే! ఇక మార్క్సు చేసిందేమిటి?' అని ఆశ్చర్యం కలుగుతుంది కొన్ని చోట్ల.

ఈ పుస్తకం ఇప్పుడు కొనడానికి దొరకదు. దీన్ని రీ ప్రింటు చేయించే అభిప్రాయం మాకు వుంది. కానీ, అప్పటి దాకా ఆగకుండా, ఏ మాత్రం వీలైనా, ఏ లైబ్రరీ లోనో, ఏ మిత్రుల దగ్గిరో సంపాదించి చదువుకోవడం చాలా మంచిది.

### ఈ పుస్తకం మీకు దొరికే దాకా, మీరు చదివే దాకా, అందులో కొన్ని పేరా లైనా ఇక్కడ చదివి సంతోషించండి!

"**ఆ**ర్థిక వ్యవస్థ సిద్ధాంతాన్ని మొట్టమొదట అభి వృద్ధి చేసినది బూర్జువా అర్థశాస్త్ర ప్రామాణిక రచ యితలు. ప్రత్యేకించి, **ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోలు.**' (పేజీ. 8)

"**హే**గెల్, ఫొయెర్ బాఖ్‌లకూ, స్మిత్, రికార్డో లకూ, సెంట్ సైమన్, ఫోరియర్‌లకూ, తాను రుణపడి వున్న ప్రతి దానినీ మార్క్స్ సవివరంగా, గొప్ప విశ్లేష ణాత్మక ప్రగాఢ పరిజ్ఞానంతో వర్ణించాడు. మార్క్స్‌కి గల సుగుణాలలో పండిత యోగ్యమైన అసాధారణ మైన చిత్తశుద్ధి ఒకటి." (పే. 10)

"**మా**ర్క్స్ ప్రధాన శాస్త్రీయ రచన అయిన 'పెట్టు బడి'కి ఉపశీర్షిక 'అర్థ శాస్త్ర విమర్శ'. ఈ రచన యొక్క నాల్గవ సంపుటియైన 'అదనపు విలువ సిద్ధాంతాల'ను అంతకు పూర్వపు అర్థ శాస్త్ర మంతటి విమర్శనాత్మక విశ్లేషణకు వినియోగించాడు. ప్రతి ఒక్క రచయిత లోనూ - పెట్టుబడిదారీ అర్థ శాస్త్ర ప్రధాన కర్తవ్య పరిష్కారానికి తర తమ స్థాయిల్లో తోడ్పడి, పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానపు చలన సూత్రాన్ని వెల్లడి చేసిన శాస్త్రాంశాలను ఎత్తి చూపడమే, దీనిలో మార్క్స్ అవలంబించిన ప్రధానమైన పద్ధతి. దానితో బాటే, గతానికి చెందిన ఈ ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయా లలో వున్న బూర్జువా పరిమితులనూ, అసంగతత్వా లనూ ఆయన నిరూపించాడు." (పే. 10-11)

"**మౌ**లిక ఆర్థిక విషయాలనూ, తన కాలపు సమాజ నియమాలనూ విశ్లేషించిన వాడు **అరిస్టాటిలే**. ఈ వాస్తవం కారణం గానే విజ్ఞాన శాస్త్ర చరిత్రలో ఆయన ప్రప్రథమ ఆర్థిక వేత్త అయాడు" (పే. 22)

"**ఆ**ర్థిక శాస్త్ర చరిత్రలో, మార్క్సిస్టు విలువ సిద్ధాంతానికి పునాది అయిన అనిర్దిష్ట శ్రమ భావానికి బాటవేసిన మొట్ట మొదటి వాడు **పెట్టీ**యే." (పే. 75)

"**మా**ర్క్స్ తన ఈ పుస్తకంలో ('అర్థశాస్త్ర విమ ర్శకు చేర్పు'లో) మొట్టమొదట బ్రిటన్‌లో **విలియం పెట్టీ** తోనూ, ఫ్రాన్సులో **బువా గిల్బేర్** తోనూ మొదలై, బ్రిటన్‌లో **రికార్డో** తోనూ, ఫ్రాన్స్‌లో **సిస్మాండీ** తోనూ అంతమయ్యే సుమారు ఒకటిన్నర శతాబ్దాల కాలపు సాంప్రదాయిక అర్థ శాస్త్రంపై ప్రగాఢమైన అంచనా వేశాడు." (పే. 96)

" '**సం**పద, డబ్బు, పన్నుల స్వభావం గురించి పర్యాలోచన' అన్న తన ప్రధాన సైద్ధాంతిక గ్రంథంలో బువా గిల్బేర్ ఆర్థిక సంక్షోభంలో ఏమి జరుగుతుందో విస్పష్టం గానూ, విపులం గానూ వర్ణించాడు. సరు కుల కొరత మూలం గానే కాకుండా, సరుకుల అతి

సమృద్ధి మూలంగా కూడా జనం చనిపోగలరు - అని వివరించాడు." (పే. 109)

"పెట్టుబడిని, వడ్డీని ఇచ్చే డబ్బు పెట్టుబడి రూపంలో మాత్రమే పరిశీలించాడన్న విషయం నిజమే అయినప్పటికీ, పెట్టుబడిని అర్థం చేసుకోవడంలో **నార్త్** తొలి అడుగులు వేశాడు. ... డబ్బుకి సంబంధించిన సిద్ధాంతాభివృద్ధికి కూడా నార్త్ విశేషంగా కృషి చేశాడు." (పే. 152)

"ఒక రచయిత - ఆయన పేరు ఆకాశ రామన్న, 1738 - అయినందున ఆయన్ని గురించి మనమేమీ చెప్పలేము. శ్రమ విలువ సిద్ధాంతాన్ని అద్భుతమైన కచ్చితత్వంతో రూపొందించాడు." (పే. 153)

"చలామణీలో వున్న డబ్బు మొత్తం పెరుగుదలలో కన్న ధరల పెరుగుదలలో ఆలస్యాలు జరుగుతాయన్న విషయాన్ని **డేవిడ్ హ్యూమ్** మొదట పేర్కొన్నాడు. అన్ని సరుకుల ధరల్లోకీ 'శ్రమ ధర', అంటే కార్మికుల వేతనమే పెరగడంలో చిట్టచివరిదని హ్యూమ్ ప్రత్యేకించి పేర్కొన్నాడు." (పే. 157)

"ఫ్రాంక్లిన్, 'ఆధునిక అర్థ శాస్త్రపు మౌలిక నియమాన్ని (అనగా విలువ నియమాన్ని) రూపొందించాడు' - అని మార్క్స్ పేర్కొన్నాడు." (పే. 167)

"వేతనానికి కార్మికులను కుదుర్చుకోవడాన్ని, కార్మికుడిని పెట్టుబడిదారుడు దోచుకోవడంగా **ఫ్రాంక్లిన్** ఎంత మాత్రం పరిగణించ లేదు. వారి మధ్య గల సామాజిక వైరుధ్యాన్ని ఆయన గ్రహించ లేదు." (పే. 171)

"తన 'అదనపు విలువ సిద్ధాంతాలు'లో, ఫిజియోక్రాట్లను గూర్చిన తన అధ్యయనాన్ని మార్క్స్ ఇలా మొదలుపెడతాడు: "బూర్జువా పరిధిలో, పెట్టుబడి విశ్లేషణ అన్నది, ప్రధానంగా **ఫిజియోక్రాట్ల** కృషి. వారిని ఆధునిక అర్థ శాస్త్ర నిజ జనకులను చేసినది వారి ఈ సేవయే." (పే. 190)

"**కెనే** పెట్టుబడి చలామణీ, పునరుత్పత్తుల విశ్లేషణకు పునాదులు వేశాడు. మార్క్సిస్టు అర్థ శాస్త్రంలో ఎంతో ముఖ్యమైన పాత్రను వహించే పునరుత్పత్తి అన్న పదాన్ని మొట్ట మొదట ప్రయోగించినది కెనే యే." (పే. 191)

"పరిశ్రమల్లోని, వ్యవసాయం లోని కార్మికులనూ, పెట్టుబడిదారులనూ ఇద్దర్నీ కెనే ఒకే వర్గంలో చేర్చాడని చెప్తే చాలు. ఈ అవక తవక పొరపాటును **ట్యూర్గో** కొంత మేరకు సరిదిద్దగా, స్మిత్ దాన్ని పూర్తిగా ఖండించాడు." (పే. 191-192)

"1776, **ఆడమ్ స్మిత్** 'జాతుల సంపద' ప్రచురింపబడిన సంవత్సరం. తదుపరి తరానికి చెందిన ఫ్రెంచి అర్థ శాస్త్ర వేత్తలు - **సిస్మాండీ, సేయ్** ప్రభృతులు - ఫిజియో క్రాట్ల దిశగా కాకుండా, స్మిత్ వేపు తిరిగారు." (పే. 196)

"కెనే అవగాహనలో లాభానికి తావు లేదు; ఆయన - పెట్టుబడిదారుడు, ఒక విధంగా, 'వేతనం తీసు కుని యాజమాన్యం వహిస్తాడు', పోతే, ఏ నియమాలు ఈ 'వేతనాన్ని' నిర్ణయిస్తాయో కెనే పరిశీలించ లేదు. ఈ విషయంలో ట్యూర్గో ఓ పెద్ద ముందడుగు వేశాడు." (పే. 205)

"పెంపొందుతున్న పారిశ్రామిక బూర్జువా వర్గపు ప్రయోజనాలనే వ్యక్తీకరించినప్పటికీ, **స్మిత్** ఆ వర్గాన్ని షరతుల్లేకుండా సమర్థించ లేదు." (పే. 215)

"బూర్జువా సమాజపు ఆంతరిక అంగ నిర్మాణంలోకి స్మిత్ మరింత లోతుగా చొచ్చుకు వెళ్ళాడు. ఇంగ్లీషు సంప్రదాయాన్ని అనుసరించి, ఆయన తన ఆర్థిక సిద్ధాంతానికి శ్రమ విలువ సిద్ధాంతాన్ని ప్రాతిపదికను చేసుకున్నాడు. కాగా, ఫిజియో క్రాట్లకు వాస్తవానికి విలువ సిద్ధాంతమంటూ ఏదీ లేనే లేదు. దీని మూలంగా, ఫిజియో క్రాట్లతో పోల్చినప్పుడు, స్మిత్ ఒక ముఖ్యమైన అడుగు ముందుకు వెళ్ళగలిగాడు. ఒక్క వ్యావసాయిక శ్రమ మాత్రమే కాకుండా, సమస్త ఉత్పాదక శ్రమా విలువను సృష్టిస్తుందని ఆయన రుజువు చేశాడు." (పే. 225)

"ప్రతి వ్యక్తీ, తన పెట్టుబడిని .. దాని ఉత్పాదితానికి అత్యధికమైన విలువ వుండేలా - ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తాడు. మామూలుగా అలా చేసేటప్పుడు, అతను ప్రజల మేలును గురించి గాని, దాన్ని తను ఏ మేరకు ముందుకు తీసుకు వెళ్తున్నానని గానీ ఆలోచించడు. అతని దృష్టిలో అతని స్వలాభం మాత్రమే వుంటుంది. కాని 'ఒక అదృశ్య హస్తం చేత', ఒక లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళేలా - (అది అతని సంకల్పంలో భాగం కాదు) నడపబడుతాడు."

స్మిత్ మాటల్ని చెప్పి, ఈ పుస్తక రచయిత, ఇలా వ్యాఖ్యానిస్తాడు:

"ఆర్థిక నియమాలే ఆ 'అదృశ్య హస్తం'. ఈ నియమాలు, మానవ ఇచ్ఛకు అతీతం గానూ, తరచూ దానికి భిన్నం గానూ పని చేస్తాయి. అటువంటి రూపంలో ఆర్థిక నియమాల భావనను ఆర్థిక విజ్ఞాన

శాస్త్రంలో ప్రవేశ పెట్టడం ద్వారా స్మిత్ ముఖ్యమైన ఒక ముందడుగు వేశాడు." (పే. 229)

"స్మిత్ లోనూ (రికార్డోలోనూ) పెట్టుబడిదారీ విధానపు చారిత్రక దృష్టి లోపించడమూ; పెట్టుబడికీ, వేతన శ్రమకీ మధ్య సంబంధాలు శాశ్వతమైనవనీ, సాధ్యమైన ఏకైక సంబంధాలనీ, భావించడమే దీనికి గల అంతిమ కారణమని మార్క్స్ భావించాడు."

(పే. 244)

"ఒక సరుకు విలువలో, కార్మికుల వేతనాలూ, పెట్టుబడిదారుడి లాభమూ (కొన్ని శాఖల్లో భూమి కౌలు కూడా), ఇతర ఖర్చులూ, ఇమిడి వుంటాయని స్మిత్ నిర్ణయించాడు." (పే. 246)

"శాస్త్రీయమైన ఆర్థిక పరిశోధనా పద్ధతులను **రికార్డో** విస్తరింపజేశాడు. అదే ఆయన చేసిన గొప్ప సేవ." (పే. 260)

"రికార్డో యొక్క ద్రవ్య సిద్ధాంతంలో ఎన్ని లోపాలున్నప్పటికీ, ఆర్థిక విజ్ఞాన శాస్త్రాభివృద్ధిలో అది ప్రముఖ పాత్రను వహించింది." (పే. 272)

"రికార్డో ఉద్దేశంలో, పరమ విలువ అంటే ఒక సరుకులో ఇమిడి వున్న శ్రమ మొత్తం. మార్క్స్ దీన్నే విలువ సారాంశంగా పరిగణించాడు." (పే. 283)

"శ్రమ విలువ నియమం, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజానికి కూడా వర్తిస్తుందన్న రికార్డో సిద్ధాంతమే, ఆర్థిక విజ్ఞాన శాస్త్రానికి ఆయన చేసిన గొప్ప సేవ." (పే. 285)

"వేతనాలకూ, ధరలకూ, లాభాలకూ మధ్య గల సంబంధాలను గురించిన తన విశ్లేషణలో, మార్క్స్, ప్రత్యేకించి రికార్డో వాదాన్ని ఆధారం చేసుకున్నాడు."

(పే. 285)

"స్మిత్ యొక్కా, ఆయన శిష్యుల యొక్కా అభిప్రాయాలను బట్టి, డబ్బు వేతనాల్లో మార్పు, సరుకుల విలువ లోనూ, ధరల్లోనూ తదను రూపమైన మార్పును కలిగిస్తుంది. కానీ, ఈ మాటను రికార్డో దృఢంగా తోసిపుచ్చాడు. 'ఒక సరుకు విలువ అయినా, లేక అది దేనికైతే మారకం అవుతుందో ఆ మరో సరుకు ప్రమాణమైనా, దాని ఉత్పత్తికి అవసరమైన సాపేక్ష శ్రమ పైన ఆధారపడుతుందే గాని, ఆ శ్రమకు చెల్లింపబడిన ఎక్కువో, తక్కువో పరిహారం పైన ఆధారపడదు' అన్నాడు" (పే. 285)

"వేతనం, లాభం, కౌలులను - సమాజం లోని మూడు ప్రధాన వర్గాల ప్రాథమిక ఆదాయాలు - అన్న స్మిత్ అభిప్రాయాలనే చాలా వరకు రికార్డో అభివృద్ధి చేశాడు. కార్మికుని యొక్కా, అతని కుటుంబం యొక్కా జీవికకు అయ్యే ఖర్చే వేతనం - అన్న నిర్వచనాన్ని, రికార్డో, తన వెనకటి వాళ్ళ నుంచి స్వీకరించాడు. **మాల్తూస్** జనాభా సిద్ధాంతంపై ఆధారపరచడం ద్వారా తను ఈ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేస్తున్నానని రికార్డో భావించాడు. మాల్తూస్ జనాభా సిద్ధాంతం లోని ప్రధాన సూత్రాలను ఆయన ఆమోదించాడు."

(పే. 290)

"రికార్డో - శ్రామిక వర్గం యొక్కా, బూర్జువా వర్గం యొక్కా వర్గ ప్రయోజనాల మూలంలో మౌలికమైన వైరుధ్యం వుంది - అని నిర్ధారించాడు. వేతనాలు పెరిగి లాభం పడిపోయినప్పుడూ, ఇందుకు తారుమారుగా జరిగినప్పుడూ - వేతనాలూ, లాభమూ విలోమ అనుపాతంలో మారగలవని ఆయన అనేక సార్లు రాశాడు." (పే. 291-292)

"వేతనానికీ, లాభానికీ మధ్య వైరుధ్యాన్ని సృష్టించే సంబంధాల స్వభావంతో, పుట్టుకతో, భవితవ్యాలతో, రికార్డోకి సంబంధం లేదు. అందుచేతనే ఆయన, పెట్టుబడిదారుడు కార్మికుడి నుంచి, అతని శ్రమ చేత సృష్టింపబడిన విలువలో కొంత భాగాన్ని పొందుతాడన్న విషయాన్ని గ్రహించడం ద్వారా, ఆ ఆవిష్కరణకు సన్నిహితంగా వచ్చినప్పటికీ, 'అదనపు విలువ రహస్యాన్ని' ఆవిష్కరించలేకపోయాడు."

(పే. 292)

"భూమి కౌలుకి మూలం ప్రకృతి ఔదార్యం కాదనీ, భూమిపై వినియోగింపబడిన శ్రమయేననీ రికార్డో వివరించాడు." (పే. 292)

"మార్క్స్ ఇలా రాశాడు: '... విలువకీ, డబ్బుకీ, పెట్టుబడికీ సంబంధించిన నా సిద్ధాంతం, దాని మూల సూత్రాల్లో ఆడమ్ స్మిత్, రికార్డోల ఉపదేశానికి తప్పని సరి పర్యవసానమే.' - అయితే అదే సమయంలో, ఆయన (మార్క్స్) ఈ ఇద్దరి బ్రిటీష్ ఆర్థిక వేత్తల బోధననూ లోతైన విమర్శకు గురిచేసి, దాని ప్రాతిపదిక పైన <u>నూతన శ్రామిక వర్గ అర్థ శాస్త్రాన్ని</u> సృష్టించాడు."

(పే. 299 - 300)

'రికార్డోకు ఎదురైన రెండు ప్రధాన వైరుధ్యాలను మనం ఒక సారి గుర్తు చేసుకుందాం. మొదటిది: శ్రమకు పెట్టుబడి మారకం (ఇంత కంటే మరింత సరళంగా చెప్పాలంటే, పెట్టుబడిదారుడు కూలికి కార్మికులను కుదుర్చుకోవడం), తన శ్రమ విలువ సిద్ధాం

తంతో ఎలా పొసుగుతుందో ఆయన (రికార్డో) వివరించలేకపోయాడు. కార్మికుడు పూర్తిగా 'తన శ్రమ విలువను' పొందినట్లయితే (ఈ పదబంధం తప్పని మనకు తెలుసు, కానీ రికార్డో దాన్ని ఈ విధం గానే చెప్పాడు), అంటే, అతని వేతనం, అతని శ్రమ చేత సృష్టింపబడిన సరుకు విలువతో సమానం అయినట్లయితే, లాభాన్ని వివరించడం అసాధ్యం. మరి అలా కాకుండా, కార్మికుడు 'తన శ్రమ విలువ' కన్నా తక్కువ పొందితే, సమ తూకాల మారకం మాట, అనగా విలువ నియమం మాట ఏమిటి? రెండవది: శ్రమ విలువను, సమాన పెట్టుబడికి సమాన లాభం - అన్న విషయంతో అతను సరిపెట్టలేకపోయాడు." (పే.317)

"**మా**ర్క్స్ పూర్వపు కాలానికి చెందిన ఆర్థిక వేత్తల్లో, పెట్టుబడిదారీ విధానపు సహజ, శాశ్వతత్వ స్వభావం విషయంలో ప్రచలితంగా వున్న మూఢ విశ్వాసం విషయంలో, అనుమానాన్ని వ్యక్తం చేసిన తొలి ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త **సిస్మోండీ** యే." (పే. 333)

"**ప్రూ**డన్ 'ఆస్తి అంటే చౌర్యమే' అన్న విరోధాభాస కర్తగా సాహిత్యంలో ప్రసిద్ధి చెందాడు. ఇది ఆయన్ని అమరుణ్ణి చేసింది. 'హక్కే శక్తి' అన్న మరో సాహసిక విరోధా భాసంతో ఆయన తన కార్యకలాపాలను ముగించాడు. బూర్జువా సమాజానికి సంబంధించి, ఈ రెండూ కూడా కొంత వరకూ నిజమే." (పే. 353 - 354)

"**మా**ర్క్స్ ఎంగెల్సుల సిద్ధాంత ఆధారాల్లో, ఊహాజనిత సోషలిజం ఒకటి. ప్రముఖ చింతనా పరులైన **సెంట్ సైమన్, ఫోరియర్, రాబర్ట్ ఓవెన్ల** రచనల్లో ఊహాజనిత సోషలిజం తన శిఖర స్థాయిని అందుకుంది." (పే. 405)

"**స్వే**చ్ఛాయుత పోటీ సహజం గానే తనకు తానే వ్యతిరేకిగా మారి, గుత్తాధికారానికి దారి తీస్తుందని **ఫోరియర్** నిరూపించాడు." (పే. 422)

"**ఒ**క రకం శ్రమ నించి మరొక దానికి తరచుగా మార్చడం ద్వారా పెట్టుబడిదారీ శ్రమ విభజనలోని వ్యతిరేక పార్శ్వాలను తొలగించవచ్చునని ఫోరియర్ ఆశించాడు." (పే. 428)

"**శా**రీరక, మానసిక శ్రమలకు మధ్య వ్యత్యాసాన్ని రద్దు చేసే సమస్యను కూడా, ఫోరియర్ లేవదీశాడు." (పే. 432)

"**ఓ**వెన్ అభిప్రాయాలకు ప్రాతిపదిక రికార్డో శ్రమ విలువ సిద్ధాంతం. శ్రమయే విలువ సృష్టి కర్తా, కొలబద్దా. కాగా సరుకుల మారకం శ్రమను బట్టే జరగాలి. అయితే రికార్డో మాదిరిగా కాకుండా, ఓవెన్, పెట్టుబడిదారీ విధానంలో మారకం, శ్రమను బట్టి జరగదని భావిస్తాడు. ఆయన అభిప్రాయంలో, శ్రమను బట్టి మారకం - అన్న దాని అర్థం, కార్మికుడు తను ఉత్పత్తి చేసిన సరుకు పూర్తి విలువను పొందాలి - అన్నది. నిజానికి కార్మికునికి అలాంటిదేమీ ముట్టదు." (పే. 440).

"**ఓ**వెన్ ఊహా స్వర్గాన్ని ఆ కాలపు ఇతర ఊహా స్వర్గాల నుండి వేరు చేసి, దాని కమ్యూనిస్టు స్వభావాన్ని గురించి మార్క్స్ ఎంగెల్స్‌లు వక్కాణించి చెప్పారు. మార్క్స్ ఇలా అంటాడు: 'అర్థశాస్త్రపు రికార్డియన్ దశలో, దాని విరుద్ధ ప్రతిపాదన అయిన కమ్యూనిజం (ఓవెన్), సోషలిజం (ఫోరియర్, సెంట్ సైమన్‌లు) కూడా వస్తాయి (కనిపిస్తాయి)."

**ఎంగెల్స్** ఇలా అంటాడు: "కమ్యూనిజం దిశగా పురోగమనమే ఓవెన్ జీవితం లోని మూలమలుపు." (పే. 442)

ఇలా రాస్తూ పోతే, ఆ పుస్తకం అంతా ఇక్కడ ఎక్కించవలసి వస్తుంది,

ఈ వెనకటి ఆర్థిక వేత్తలందరూ ఎవరికి వారుగా నూతనమైన అంశాల్ని చెప్పగలిగారు కాబట్టే, ఆర్థిక శాస్త్రం ముందడుగులు వేసింది. కానీ, వీరంతా చెయ్యలేకపోయింది ఏమిటంటే, 'శ్రమ దోపిడీ'ని గ్రహించడం. మార్క్సు చెయ్యగలిగింది అదే. దానితో, ఆర్థిక శాస్త్రమే రెండు మార్గాల్లోకి చీలిపోయింది. వర్గ పోరాటాన్ని కొనసాగించడమే కార్మిక వర్గ కర్తవ్యం అయింది.

శ్రమ దోపిడీ రహస్యం బైటపడిన తర్వాత, బూర్జువా వర్గం, దాన్ని అంగీకరించిందా? - లేదు. దాని ఈనాటి ఆర్థిక వేత్తలు, ఇప్పటికీ, **"భూమికి - కౌలూ; పెట్టుబడికి - వడ్డీ లాభాలూ"** పాఠాల్ని స్కూళ్ళ నిండా విద్యార్థులకు బోధిస్తూనే వున్నారు! ★

# 8. ఊహా చిత్రం!

అది 'విముక్త' ప్రాంతం! 'కమ్యూనిస్టు నూతన సమాజ' నిర్మాణం ప్రారంభమైంది. కార్మికులు - ఆడా మగా, పిల్లా పెద్దా, అడుగడుగునా క్రమ శిక్షణతో ప్రవర్తించడం నేర్చుకుంటున్నారు.

★ మన సమాజాన్ని మనం నిర్మించుకుందాం!
★ వాళ్ళ సమాజాన్ని, వదిలివేద్దాం!
★ సమాజం, నీదీ నాదీ మనదీ!
★ భూమి ఎవరిదీ కాదు! మనది కూడా కాదు!
★ భూమి 'ప్రకృతి'లోది. దాన్ని ఉపయోగించు కుందాం!
★ మనం సేవకులం కావద్దు!
యజమానులమూ కావద్దు!
★ శ్రమే, ఆత్మ పోషణ! ఆత్మ రక్షణ! ఆత్మ గౌరవం!

అటువంటి నినాదాలు పని స్థలాల లోనూ, శ్రామికుల ఇళ్ళల్లోనూ, వీధుల్లోనూ, విస్తరించి వున్నాయి.

ఆ ప్రాంత కార్మిక సంఘం, 'పెట్టుబడిదారీ కుటుంబాల స్త్రీ పురుషులందరూ శ్రమ లోకి రావాల'ని డిమాండ్ చేస్తూ, ఒక 'ప్రకటన' జారీ చేసింది, ఈ విధంగా:

"వేల తరాల నించీ శ్రామిక జనాల జీవిత కాలాన్నంతా శ్రమ కాలంగా మార్చివేసి, మీ జీవిత కాలాన్నంతా విశ్రాంతి కాలంగా చేసుకున్నారు. మీ ప్రకారం - కొందరికి ఎప్పుడూ శ్రమా, కొందరికి ఎప్పుడూ విశ్రాంతీ! కానీ, మా ప్రకారం - అందరికీ శ్రమా, అందరికీ విశ్రాంతీ! మీ యుగ యుగాల విశ్రాంతులు ఇక కట్టిపెట్టండి! మీకై మీరే కదిలి 'శ్రమ' లోకి రండి!

శ్రమ చెయ్యని మనిషికి 'శ్రమ'తో నిర్మితమైన 'మానవ సమాజం'లో నిలబడే అర్హతా, హక్కూ, ఉండవు. 'శ్రమ'కి వ్యతిరేకులైన వాళ్ళంతా, ఈ సమాజం నించి శ్రమ స్పర్శ లేని నిర్జన ప్రాంతాలకు వెళ్ళి పోవచ్చు.

ఈ 'ప్రకృతి' అంతా మా స్వంతం కాదు. మా శ్రమతో సంబంధం లేని కొండల్లోకో, కోనల్లోకో, సముద్రాల్లోకో, ఆకాశం లోకో, ఎక్కడికైనా సరే మీరు వెళ్ళి పోవచ్చు. మాకు అభ్యంతరం లేదు. మా అభ్యంతర మంతా, శ్రమ చెయ్యని సోమరి మందని పోషించ డానికే! ఆ పని తర తరాలుగా చేశాం. కానీ, ఈ నాడు కళ్ళు తెరిచాం! శ్రమ చెయ్యని మానవుల్ని మా సమాజం ఒక్కరోజు కూడా సహించదు. ఒక్కరోజు కూడా భరించదు. ఆలోచించుకోండి! త్వరగా నిర్ణయించుకోండి!"

అదీ ప్రకటన!

సోమరి బృందాల్లో కదలిక బైల్దేరింది. ఆలోచించ డానికి బద్ధకించని వాళ్ళు, 'శ్రమ'కే సుముఖుల య్యారు. ముఖ్యంగా ఆ కుటుంబాల స్త్రీలూ పిల్లలూ ఇంకో దారి లేదని సరిగానే గ్రహించుకున్నారు.

ఆలోచించడానికి కూడా బద్ధకించిన బూర్జువా పురుషులు, నూతన సమాజాన్ని తిరస్కరించి అడవుల్లోకి బయల్దేరారు. కొన్నాళ్ళ పాటు వాళ్ళకి భోజనాలూ, ఉతికిన బట్టలూ, భార్యా బిడ్డలే చేరవేశారు. అదంతా కార్మికులకు తెలిసినా వూరుకున్నారు.

కార్మిక సంఘం, 'మార్క్స్ - కాపిటల్'ని బోధించే కార్యక్రమం. పెద్ద ఎత్తున ప్రారంభించింది. పనుల్లో వున్నప్పుడు తప్ప మిగిలిన కాలం అంతా, కొన్నిసార్లు పని సమయాల్లో కూడా, ఆడా మగా, పిల్లా జెల్లా అందరూ, 'కాపిటల్ పాఠాల' గురించి తప్ప రెండో మాట మాట్లాడడం లేదు.

'డబ్బు కూడా ఒక వస్తువే'.

'డబ్బు అంటే విలువ. విలువ అంటే శ్రమ. అంటే, డబ్బు అంటే శ్రమ'.

'సరుకుకి బదులుగా వచ్చే డబ్బు సరుకు కోసం ఖర్చయిన శ్రమే.'

'శ్రమ సాధనాలు, అదనపు విలువని ఇవ్వవు.
శ్రమ శక్తే, అదనపు విలువని ఇస్తుంది.'

'కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ - అదనపు విలువే.'

'పెట్టుబడిదారీ వర్గాన్ని పోషిస్తున్నది కార్మిక వర్గమే.'

'భూమి - ప్రకృతి లోది. అది మనుషుల ఆస్తి కాదు.

'మనుషులందరూ సమానులు. వారు - సేవకులూ కారు, యజమానులూ కారు.'

'శ్రమ సంబంధాల్లో వుండే బానిసత్వమే, అన్ని

రకాల బానిసత్వాలకూ మూలం.'

ఆ విషయాల మీద పని స్థలాల్లో, ఇళ్ళల్లో, వీధుల్లో, ఎక్కడ బడితే అక్కడ చర్చలు జరుగుతున్నాయి.

అడవుల్లో కూర్చుని పూట పూటా భోజనాలు అందుకుంటూ, తత్వశాస్త్రాలు వల్లె వేసుకుంటోన్న వాళ్ళకి, ఒక రోజున వాళ్ళ పిల్లలే చెప్పేశారు - "రేపటి నించీ ఇక మీకు ఉచితంగా భోజనాలు తెచ్చేది లేదు. ఈ మాట చెప్పడానికే ఇవ్వాళ కూడా వచ్చాం" అని ప్రకటించారు.

తండ్రులు నిర్ఘాంత పోతోంటే, మిగిలింది కూడా పూర్తి చేశారు పిల్లలు. - "సమాజం అంటే అనేకానేక శ్రమ శక్తుల మయం. శ్రమ లేని మానవ జీవితం జంతు ప్రాయం. మార్క్స్ రాసిన కాపిటల్ చదువుతున్నాం కాబట్టి ఇప్పుడు మాకు ఎంతో తెలుస్తోంది. సమాజం, ఒక్క పూట సజీవంగా వుండాలన్నా అనేక శ్రమలు జరగాలి. వ్యవసాయం జరగాలి. పరిశ్రమలు జరగాలి. రవాణా జరగాలి. ఎన్నెన్నో ఉత్పాదక అనుత్పాదక శ్రమలు జరగాలి.

'ఎవరి కోసం వాళ్ళే శ్రమ చేసుకోవాలి' అనేది ఎంత సరైన, న్యాయమైన సూత్రమో! ఇన్నాళ్ళూ మన కుటుంబాలన్నీ తప్పు దారి లోనే వున్నాయి. మమ్మల్ని పోషించిందీ, చదివించిందీ అంతా, మీరే అనుకున్నాం. కానీ కార్మికుల శ్రమ తోనే మేము తిండి తిన్నామనీ, ఇంత వాళ్ళం అయ్యామనీ, 'కాపిటల్' చదివితే అర్ధమైంది. ఇప్పటికైనా తప్పు దిద్దుకోలేరా మీరు? సరే, ఇక రేపటి నించీ రాము. మీ తప్పుకి మేము వంత పాడం" అని చెప్పేసి వాళ్ళు వెళ్ళి పోయారు.

అప్పటి నించీ అడవిలో తత్వశాస్త్ర చర్చలు మరీ ఎక్కువయ్యాయి.

అందులో సోమయ్య మొదటి నించీ, "ఊళ్ళోకా, అడవి లోకా?" అనే సందిగ్ధంలో వున్న వాడే. "చెప్పాలంటే, కమ్యూనిస్టులు చాలా మంచి వాళ్ళు కాబట్టే మన దారిన మనల్ని వదిలేశారు. అదే మనం అయితే, ఈ పాటికి వాళ్ళని వేటాడి ఉరులు తీయించే వాళ్ళం" అని అతను మొదటి నించీ కమ్యూనిస్టుల్ని మెచ్చుకుంటూనే వున్నాడు. "ఊళ్ళోకి పోవడమే మంచిది. ఎన్నాళ్ళు ఇలా అడవుల్లో పడి వుంటాం?" అని మిగతా వాళ్ళని సతాయిస్తూనే వున్నాడు. ఎప్పటికప్పుడు పిల్లల ద్వారా కార్మికులు చేస్తోన్న మార్పుల గురించి విని ఆశ్చర్య పోతూనే వున్నాడు.

కానీ, సోమయ్యతో పాటే వున్న రామయ్య, తన ఆశలన్నీ, 'నూతన సమాజం కుప్పకూలడం' మీదే పెట్టుకున్నాడు. అది కుప్పకూలగానే లేచి ఊళ్ళోకి బైల్దేరాలని పూట పూటా ఎదురు చూస్తున్నాడు. "వాళ్ళ మొహం! వాళ్ళదీ ఒక పరిపాలనేనా? చూద్దాం! ఇంకెన్నాళ్ళు? ఈ పాటికి వాళ్ళల్లోనూ పదవుల కోసం గ్రూపులూ, కుమ్ములాటలూ, మొదలై వుంటాయి. మహా అయితే ఇంకో పది రోజులు. నాస్తిక వెధవలు. వాళ్ళ దుర్మార్గాలు దేవుడు కనిపెడుతూనే వుంటాడు. 'పాపం' పండాలి దేనికైనా. తొందరపడితే లాభం లేదు. అసలు మనల్ని అంటారు గానీ, కమ్యూనిస్టులే వడ్డీ వ్యాపారాలు చేస్తారు; పొగాకు వ్యాపారాలు చేస్తారు; భూస్వాములతో చెట్టాపట్టా లేసుకుని తిరుగుతారు. నేటి కమ్యూనిస్టులే రేపటి బూర్జువాలు, తెలుసా? మన సాంప్రదాయాల కన్నా వీళ్ళ దగ్గిర ఏం ఏడిసింది? గుళ్ళూ గోపురాలూ కట్టినంతంత ఎత్తు స్థూపాలూ వాళ్ళూ, వాళ్ళ మొహం! వాళ్ళు ఇంకో వారం రోజుల కన్నా ఎక్కువ కాలం నిలబడతారేమో చూడండి" అంటూనే వున్నాడు.

రామయ్య చేసే ఆ తత్వశాస్త్ర బోధనలు వింటూ వున్నా, సోమయ్య పూట పూటా నిట్టూరుస్తాడు - "ఆ ఆశ తోటే ఇక్కడికొచ్చి పడ్డాం. కానీ, తర్వాత జరుగుతున్న సంగతులు మీరు పట్టించుకోవడం లేదు. మీరు చెప్పే రకం దగాకోరు కమ్యూనిస్టులు కొంత మంది వెనకటి రోజుల్లో వుండొచ్చు గానీ, ఇప్పుడు వడ్డీ వ్యాపారాలేమిటీ, భూస్వాములేమిటీ? భూములు పంచేశారు. విదేశీ, స్వదేశీ అప్పులేవీ తీర్చం పొమ్మన్నారు. ఈ 'నాయకత్వం' సంగతి తెలీక మీరలా అనుకుంటున్నారు. ప్రతీ మార్పూ 'పని స్థలాల్లో' ఆడా మగా, పిల్లా పెద్దా అందరూ చర్చించి చర్చించి నిర్ణయాలు చేస్తున్నారట. నిన్నటి దాకా పిల్లలు రోజూ చెప్పే వారు కాదూ? నోట్లో అక్షరం ముక్క లేని వాళ్ళందరూ మీటింగుల్లో కూర్చుని 'ఇది అలా చేద్దాం, అది ఇలా చేద్దాం' అని మాట్లాడుతున్నారంటే, దీన్ని మనం అసలు అర్థం చేసుకోగలమా? వీళ్ళ అధికారం వచ్చాక ఒక్క రోజులో స్టాక్ ఎక్స్చేంజీలు మూసేశారు. దీన్ని కలలోనైనా ఊహించగలమా? షేర్ల అమ్మకాలు లేక

పోయినా సమాజం నడుస్తుందంటే మనం నమ్మే వాళ్ళమా? రాత్రి కాపలాలన్నీ తీసేశారు. అయినా ఒక్క దొంగతనం అయినా లేదు. మనం అయితే దొంగ తనాలు లేకుండా ఒక్క పూటైనా పరిపాలించగలిగామా? గృహ సేవకులందరూ వ్యవసాయం పనుల్లోకి వెళుతున్నారు. మన ఇళ్ళల్లో ఎవరి పనులు వాళ్ళు చచ్చినట్టు చేసుకుంటున్నారు. మన పిల్లలు, ఏ నాడన్నా 8 గంటల లోపల నిద్రలు లేచారా? మంచం మీద కాళ్ళు చెప్పుల్లో పెట్టడం తప్ప వాళ్ళెప్పుడన్నా నేల మీద నడిచారా? 60, 70 ఏళ్ళ వృద్ధ నౌకర్లు మన పిల్లల చుట్టూ తిరుగుతూ చాకిరీలు చేస్తోంటే, మన కెప్పుడైనా 'ఇది న్యాయమా' అనిపించిందా? ఇవ్వాళ వాళ్ళ ఆత్మ గౌరవం వాళ్ళు కాపాడుకున్నారు. ఎప్పుడూ నేల మీద కాలు మోపని మన పిల్లలు, ఇవ్వాళ చాలా సంతోషంగా పొలాల్లోకీ, ఫ్యాక్టరీల్లోకీ పోయి పనులు చేస్తున్నారు. అది తమ బాధ్యత అనుకుంటున్నారు. ఏ నాడూ మన మందలింపులకు లొంగని మన పిల్లలు, ఇవ్వాళ సిగరెట్లూ, షికార్లూ కట్టిపెట్టేశారు. పొగాకు పంట ఇక పండించ కూడదని వీళ్ళంతా కలిసి తీర్మానం చేశారట! బేరన్లన్నీ కూలగొట్టేశారట!"

ఆ మాటలు వినలేని రామయ్య తల ఝాడిస్తూ, దిక్కులు చూస్తోన్నా, దాన్ని పట్టించు కోకుండానే సోమయ్య చెప్పుకు పోతున్నాడు - "మన ఆడవాళ్ళ సంగతి చూడండి! పని వాళ్ళు లేకుండా ఏ నాడన్నా వాళ్ళకీ మనకీ గడిచిందా? ఏ నాడన్నా వాళ్ళు ఒంటి మీద నగలు గాక బట్టలు కట్టారా? సగం ఒంటిని రంగులకో నగలకో అప్పజెప్పేసి ఫేషన్ షోలనీ, కుక్కల షోలనీ, ఇదనీ అదనీ, కారుల్లో బడి క్లబ్బుల వెంట హడావుడిగా తిరిగే వాళ్ళు, ఇవ్వాళ్ళేం చేస్తున్నారు? కార్మిక యూనిఫారాలు వేసుకుని స్నోలూ, లిప్ స్టిక్‌లూ అవతల పారేసి, పనుల్లోకి పోతున్నారు. నిజంగా వాళ్ళ పాపాలన్నీ పొగొట్టుకుంటున్నారు.

ఇదంతా మనకి తెలిగ్గా అర్థమవుతుందా? తర తరాలుగా శ్రామిక వర్గాన్ని దోచామనేది సత్యం కాదా? ఆ సత్యాన్ని అర్థం చేసుకోవడానికే మనం ప్రయత్నించాలి. భూమి మీద భోగభాగ్యాలు చాలక స్వర్గంలో కూడా భాగ్యాలు సృష్టించుకున్నాం. భూమిని స్వర్గం చేసుకోలేని వాళ్ళకే కదా ఊహా స్వర్గాలు? కమ్యూనిస్టులు, భూమినే స్వర్గంగా మారుస్తున్నారు. వాళ్ళకి దేవుళ్ళతో ఏం పని? స్వర్గాలతో ఏం పని? వాళ్ళ ప్రపంచంలో దేవుడు కూడా తన శ్రమ తను చేసుకోవలిసిందే!

అసలు రహస్యాలు వాళ్ళు నిజంగానే గ్రహించుకున్నారు. వాళ్ళు స్థిరపడతారనడంలో సందేహం ఏమిటి? వాళ్ళు ఓడిపోతే మళ్ళీ వుండేది మన పెట్టుబడిదారీ ప్రపంచమే కదా? మన బేరాలూ, మన ఆర్డర్లూ, మన పోటీలూ, మన యుద్ధాలూ, అంతా అవే కదా?

ఎప్పటి నించో ఇక్కడ పడి వున్నాం. ఇక్కడ మనకి తిండి లేదు, బట్ట లేదు, ఇల్లూ వాకిలీ లేవు. ఎందుకు లేవు? ఇక్కడ మన స్వంత శ్రమా లేదు, కార్మికుల శ్రమా లేదు. ఏ వస్తువు కావాలన్నా 'శ్రమ' వుండాలి కదా? 'శ్రమ'తో ఇంత అవసరమా - అని ఇప్పుడు ఆశ్చర్యంగా వుంది. 'శ్రమ' లేకపోతే, మనిషి మనిషిగా జీవించే మార్గమే వుండదని ఇప్పుడర్థమవుతోంది. కార్మికుల శ్రమ వుంది కాబట్టే ఇన్నాళ్ళూ జీవించాం. కానీ, ఇక మీదట ఏమిటి?

ఆలోచించండి! మనం కూడా ఏదో ఒక పని చెయ్యడం న్యాయం కాదూ? మన పోషణ మనల్నే చేసుకోమంటున్నారు. అంతకన్నా వాళ్ళేం అడుగుతున్నారు? మనం కూడా శ్రమ చేస్తే, అసలు వాళ్ళకీ, మనకీ ఈ కలహాలెందుకు? 'మేం ఏ పనీ చెయ్యం, అన్నీ మీరే చెయ్యండి' అనడానికి మనకి బుద్ధి వుండొద్దూ? ఆలోచించండి!" అంటూ దీర్ఘంగా మాట్లాడాడు సోమయ్య.

"ఏం మాట్లాడుతున్నారు మీరు?" అని ఒక్కసారి విరుచుకు పడ్డాడు రామయ్య. "నాకు 63 కంపెనీల్లో షేర్లు వున్నాయి. 18 కార్లు వున్నాయి. 2 స్వంత విమానాలు వున్నాయి. ఇంట్లో ఎప్పుడూ 16 మంది పని వాళ్ళు వుండే వాళ్ళు. 4 గురు మనుషులు ప్రత్యేకంగా కుక్కల పనే చేసే వారు. మీరు అంత భోగ భాగ్యాలు ఎరగరేమో. లేకపోతే ఇంత తేలిగ్గా ఇలాంటి మాటలు చెప్పలేరు" అని సోమయ్యని చాలా ఈసడించుకున్నాడు.

సోమయ్య కొంచెం నవ్వాడు - "నిజమేనేమో! అంత ఆస్థి వుంటే నేనూ మీ లాగే వుండే వాడినేమో! అది లేకపోవడం వల్లే ఈ మాత్రం ఆలోచిస్తున్నానేమో! మీ ఆస్థి అంతా మీ కష్టార్జితమే అని నమ్ముతున్నారా

ఇప్పటికీ?"

"ఏం, కాక? కష్టార్జితం కాక రాత్రుళ్ళు వెళ్ళి దొంగ తనాలు చేశామా వాళ్ళ ఇళ్ళల్లో?"

"పగలే దోచే మార్గం వుంటే రాత్రుళ్ళు దాకా ఎందుకు లెండి. ఇన్నాళ్ళూ నేనూ అనుకున్నాను, నా ఆస్తి నా కష్టార్జితమే అని! యజమానులుగా వుండడం మన హక్కు అని! అందంతా శ్రామికులు కళ్ళు తెరవ నంత వరకే అయింది. మన ఆస్తి మనది కాదని మార్క్సు తేల్చేశాడు. అది శ్రామికులకు అర్థమై పోయింది. దాన్ని మనం కూడా అర్థం చేసుకుంటేనే మనకీ బాధ తప్పుతుంది. ఊళ్ళోకి పోయి హాయిగా బతకొచ్చు. మనమేం తెలివి లేని వాళ్ళమా, శక్తి లేని వాళ్ళమా? ఏ పనీ చెయ్యలేమా? సత్య మార్గంలో నడవ లేమా? మన కోసం మనం పని చేసుకుందాం. నా మాట వినండి."

"సోమయ్య గారూ! మీరు చాలా భయపడి పోతున్నట్టున్నారు. వీళ్ళు ఎంతో కాలం వుండలేరండీ! మహా అయితే ఇంకో నాలుగు రోజులు."

"సరే, మీరు ఆ ఆశ తోటే వుండండి! నేను మాత్రం ఊళ్ళోకి పోవాలనే అనుకుంటున్నాను. 'శ్రమ'ని తప్పించుకోవాలని ఇలా అడివి జంతువులా తిరగడం కన్నా సాటి మనుషులతో కలిసి, కష్ట సుఖాలు పంచుకుంటూ జీవించడం ఎంతో గొప్ప సంగతి! ఇప్పటికే జీవితంలో చాలా తప్పులు చేశాం .... కార్మికుల్ని క్షమాపణ కోరకపోతే నేనిక వుండలేను .... వెళుతున్నాను" - అంటూ లేచాడు సోమయ్య పట్టుదలగా.

కోపంగా అరిచాడు రామయ్య, "అయితే, ఇక నించీ మీరు కూడా నాకు శతృవే!"

"అవును, చాలా బాగా గ్రహించారు" అని సోమయ్య చిరునవ్వు నవ్వి బైల్దేరాడు.

★ ★ ★

ఊళ్ళో సాయంకాల ప్రదర్శన కోసం జనం చేరుతున్నారు. ఏ బృందమైనా పాటలూ, నాటకాలూ, ఏది చేతనైతే అది, ప్రదర్శించవచ్చు. ఏ ప్రదర్శన అయినా రోడ్ల పక్కనే. బజార్లలోనే. ఎక్కడంటే అక్కడే. చాలా రోజుల నించీ ఆ ప్రదర్శనలు జరుగుతు న్నాయి. 'బానిస సమాజం' నాటి కథలలో చిన్న చిన్న నాటకాలు వేశారు కొందరు. 'నాస్తికత్వం' మీద వేశారు కొందరు. ప్రదర్శన ముగిసిన తర్వాత, అందులో ఏమైనా తప్పులు వుంటే, అక్కడే విమర్శలూ ఖండ నలూ జరిగి పోతాయి. సాధారణంగా అందరికీ పొగ డ్తలే దొరుకుతూ వుంటాయి.

ఆ సాయంత్రం ఒక నాటకం ప్రారంభమైంది. 'పెట్టుబడిదారుడు, పని లోకి దిగడానికి మొరా యించే ఘట్టాన్ని' ఆ రోజు ఒక బృందం ప్రదర్శిస్తోంది.

దూర దూరంగా వున్న వాళ్ళందరూ ప్రదర్శన చుట్టూ చేరారు.

"నాకు ఎన్ని దేశాల్లో ఎంతెంత పెట్టుబడులు న్నాయో తెలుసా?" అన్నాడు గర్జిస్తూ పెట్టుబడి దారుడు.

"తెలుసు. నీ పెట్టుబడికి ఇక్కడ జరిగిందే అన్ని దేశాల్లోనూ జరగబోతోంది. నీకు పట్టిన గతే అన్ని దేశాల పెట్టుబడిదారులకూ పట్టబోతోంది. శ్రామిక వర్గం, దేశాల ఎల్లలనే రద్దు చెయ్యబోతోంది. ఒక్కటే ప్రపంచం! సహజ నిర్మల ప్రపంచం! శ్రమా, సుఖమూ, జ్ఞానమూ! ఆ ఘట్టాలన్నీ నూతన చరిత్ర ప్రదర్శించ బోతోంది."

"వొద్దు వొద్దు! అదంతా వొద్దు" అని అరిచాడు పెట్టుబడిదారుడు. "పెట్టుబడీ, పెట్టుబడిదారుడూ వుండొద్దా? పెట్టుబడిదారుడు చారిత్రక పాత్ర నిర్వ హించాడని మార్క్సు చెప్పలేదా?"

"అంత వరకే చెప్పి వూరుకున్నాడా మార్క్సు? పెట్టుబడిదారుడి పాత్ర ముగిసిపోయిన తర్వాత ఆ పాత్ర ఇక రంగం మీద వుండకూడదని కూడా మార్క్సు చెప్పలేదా? చరిత్రలో నీ ఘట్టం అయిపోయింది. చరిత్ర ఇంకా ముందుకు సాగిపోతోంది. ఇప్పుడు నూతన చరిత్రలో శ్రామికులకు తప్ప, పాత వర్గాలకు స్థానం లేదు. నువ్వు ఇంకా చరిత్రలో వుండదల్చు కుంటే నువ్వు కూడా 'శ్రామికుడి'గా మారు! ఇదిగో, పార పట్టుకో!"

"నేనా! పారా! పట్టుకోనా! మీరు లేరూ పారలూ పలుగులూ పట్టుకోడానికీ? అదంతా మీరు చేసే పని. 'పెట్టుబడి'ని మేనేజ్ చెయ్యడమే నా పని. అది ఎంత 'తల నెప్పి' పనో మీకేం తెలుసు? రాత్రింబవళ్ళూ తల నెప్పే దాంతో."

"అంత తల నెప్పి అయితే, దాన్నెందుకు వది లించుకోవూ? అదే కావాలంటావెందుకూ? మాతో

పాటే నువ్వూ తల నెప్పి లేకుండా వుండరాదూ? అప్పుడు ప్రపంచమే మారిపోతుంది."

"మీరు మార్చేస్తేనే మారిపోతుందా ప్రపంచం? ఇన్నాళ్ళూ జరిగిందంతా మరిచిపోయారా? కొత్త చరిత్రలూ, కొత్త పాత్రలూ అంటే, అవన్నీ కొత్త తల నెప్పులు! ఇప్పటి వరకూ నడిచిన చరిత్రలో ఘట్టాలు ఎంత బాగున్నాయి! మళ్ళీ మళ్ళీ అదే చరిత్ర నడవాలి. నేను 'పెట్టుబడి' పెడతానంటా, మీరు పనులు చేస్తారంటా. మీకు జీతాలూ, నాకు లాభాలూ! ఎవరికి రావలసింది వాళ్ళకి! అదంతా మరిచిపోయి మీరిలా తిరుగుబాట్లు అవీ చేస్తే నేనొప్పుకోను. కావాలంటే, 'జీతాలు' పెంచమనండి! పని స్తలంలో, 'మంచి నీళ్ళ ఏర్పాటు' కావాలనండి. ఆలోచిస్తాను. 3 నెలల లోగానే జవాబు మీ యూనియన్ నాయకులకు అందిస్తాను. కావాలంటే, బోనస్ అడగండి."

"చాలు! ఇక కట్టిపెట్టు! అధికారం ఇంకా నీ చేతుల్లోనే వుందనుకుంటున్నావు. మతి భ్రమించింది నీకు. మాతో పాటే పని లోకి దిగుతావా, లేకపోతే అడవుల్లోకి వెళ్ళిపోతావా?"

"పోలీస్! పోలీస్! తొందరగా రా! వీళ్ళని అరెస్టు చెయ్యి!"

కార్మిక దుస్తుల్లో వున్న పోలీసు ప్రత్యక్షమయ్యాడు - "ఇప్పుడు నీ 'పెట్టుబడి' తరుపున నిలబడే పోలీసులు లేరు. నేను శ్రామిక వర్గ పోలీసుని. నేను కూడా శ్రామికుణ్ణే. ఇప్పటి దాకా నేను కూడా పొలంలో పని చేశాను. నువ్వు కూడా పని లోకి దిగితే సరే. లేకపోతే నిన్నే అరెస్టు చేసి, నిర్బంధంగా పని చేయించవలసి వస్తుంది."

"ఇది నియంతృత్వం!"

"అవును, నియంతృత్వమే. నీకై నువ్వే కదిలితే ఏ నియంతృత్వమూ వుండదు. కదలక పోతే నియంతృత్వం తప్పదు. నీకు స్వేచ్ఛ కావాలో, నియంతృత్వం కావాలో నిర్ణయించే వాళ్ళం మేము కాదు. నువ్వే నిర్ణయించుకో!"

"అదంతా నాకనసరం. నేను పెట్టుబడి పెడతానంటా, మీరు పనులు చేస్తారంటా ...."

"అప్పుడు మేము నిన్ను తన్ని తోసేస్తాం అంటా ...." అంటూ కార్మికులందరూ పెట్టుబడిదారుణ్ణి 'ఫో, ఫో' అని వెంటపడి తరుముతారు.

పెట్టుబడిదారుడు కిందపడి వెంటనే లేస్తాడు. కార్మికులు మళ్ళీ పడగొడతారు. విశ్వప్రయత్నం మీద మళ్ళీ లేస్తాడు.

'లాభం' పోయే ప్రమాదం వచ్చిపడితే, యజమానికి ఉరి శిక్ష పడ్డా పెట్టుబడి వెనక్కి జంకదు. 'పెట్టుబడికే రూపధారణ' అయిన పెట్టుబడిదారుడు, తన స్థానం కోసం రంగస్తలం మీద చాలా సేపు పెనుగు లాడాడు. చివరికి కార్మికులందరూ చుట్టు ముట్టి పట్టుకున్నారు.

ప్రేక్షకులంతా చప్పట్లతో నవ్వులతో లేచి పెట్టుబడిదారుడి చుట్టూ చేరారు - "భలే చేశావోయ్ కామ్రేడ్! అచ్చం పెట్టుబడిదారుడి లాగే చేశావు. పెట్టుబడిదారుడి లక్షణాలున్నాయి నీ మనసులో" అని అతన్ని ఆట పట్టించారు.

ఆ నవ్వుల్లో ఎవ్వరూ ఆ పక్కనే నించున్న మనిషిని చూసుకోలేదు. అందరూ ప్రదర్శనలో లీనమై వున్నప్పుడే ఆ వ్యక్తి అక్కడికి వచ్చాడు. మాసిన బట్టలతో, పెరిగిన గడ్డంతో, బక్కచిక్కిపోయి.

దూరంగా మౌనంగా నించున్న అతని మీద అందరి దృష్టి అప్పుడు పడింది. అతన్ని కొంత మంది గుర్తించారు కూడా - సోమయ్య అని!

"ఎవరు మీరు?" - ఒక స్త్రీ అడిగింది.

"సాధారణ మానవుణ్ణి."

"మా సిద్ధాంతంలో సాధారణ మానవులు లేరు, వర్గ మానవులే గానీ. మీరు ఏ వర్గ మానవుడు?"

"క్షమించండి. నన్ను మీలో చేర్చుకోండి! నన్ను కూడా శ్రామిక వర్గ మానవుడిగా వుండనివ్వండి! నన్ను నా పాత వర్గం నించి విముక్తి చెయ్యండి!" - అతని కళ్ళు చెమర్చాయి.

అందరూ నిశ్శబ్దంగా విన్నారు.

కొంతసేపటికి ఇంకో స్త్రీ అంది - "మంచిది. అందరం ఇళ్ళకి వెళ్తున్నాం. మీరు కూడా మీ ఇంటికి వెళ్ళండి. రెండు రోజులు విశ్రాంతి తీసుకోండి!"

"నన్ను క్షమించామని చెప్పండి!"

".... అప్పుడే చెప్పలేము. మీరు కూడా ఏదో ఒక పనికి దిగాలి."

"సంతోషంగా చేస్తాను. అదే నాకు విముక్తి."

★ ★ ★

**ఇంకా** అడవిలో వున్న పెట్టుబడిదారీ

రామయ్య బట్టలు చిరిగిపోయి, గడ్డాలు పెరిగిపోయి, చిక్కిశల్యమై, చెట్లూ - పుట్టలూ పట్టుకు తిరుగుతున్నాడు. ఎప్పుడన్నా అడవిలో ఎవరైనా కనపడితే, "ఊళ్ళో ఏం చేస్తున్నారూ?" అని అడుగుతూ వుంటాడు. ఆ పూట కూడా దూరంగా చెట్ల దగ్గిర ఆకులు తెంపుతుంటూ కనపడ్డ మనిషి దగ్గిరికి పరిగెత్తాడు - "ఊళ్ళో ఏమీ జరగడం లేదా?" అన్నాడు ఆతృతగా - ఏదో మంచి వార్త వినాలని!

"ఎందుకు జరగడం లేదూ? బోలెడు జరిగిపోతోంది. 'నైట్ షిఫ్టులు తీసెయ్యడం' గురించి వారం రోజుల నించీ చర్చిస్తున్నాం."

"నైట్ షిఫ్టులు తీసేస్తారా? మిషన్లు ఖాళీగా పడి వుండవూ?"

"పడి వుంటాయి. మనుషుల కోసం మిషన్లుగానీ, మిషన్ల కోసం మనుషులు కాదు రామయ్యా!"

"ఇదంతా ఎవరు బోధిస్తున్నారు మీకు?"

"మనుషులు రాత్రుళ్ళు నిద్రపోవాలని ఎవరో బోధించాలా? సరే, మార్క్సు బోధించాడు."

"నీకు కూడా మార్క్సు తెలుసా?"

"మార్క్సే కాదు, మార్క్సిజం కూడా తెలుసు. నాకే కాదు, పాలు తాగే పిల్లలకు కూడా తెలుసు. వాళ్ళతో మాట్లాడి చూడు, ఏం చెపుతారో!"

"ఏం చెపుతారు?"

"వాళ్ళనే అడుగు ఊళ్ళోకొచ్చి."

"అసలు మీ నాయకుడు ఎవరు?"

"నాయకుడంటే?"

"మార్క్సిజం బాగా తెలిసిన వాడు."

"అలాగైతే అందరం నాయకులమే. మార్క్సిజం అంటే ఏముంది? అందరూ శ్రమ చెయ్యాలి. ఎవరి శ్రమతో వాళ్ళు బతకాలి. శ్రమ చెయ్యకుండా బతికితే అది ఇతర్ల శ్రమని దోచడమే. అదే మార్క్సిజం. నువ్వు శ్రమని తప్పించుకోడానికే కదా ఇలా అడవి లోకి వచ్చావు? అది తెలుసు కోవడమే మార్క్సిజం."

"మీలో ఎవరు బాగా ఉపన్యాసాలిస్తారు?"

"అందరం ఇస్తాం, అవసరమైతే."

"ఎవరు చాలా మౌనంగా, గంభీరంగా వుంటారు?"

"అందరం వుంటాం, అవసరమైతే."

"లాభం లేదు నీతో."

"అవును, 'లాభం' వుండదు మాతో నీకు. పోతాను, కావలసిన ఆకులన్నీ దొరికాయి. అడివి రాజా! పోతున్నాను. అన్నట్టు నీ షేర్లన్నీ ఏమయ్యాయి? డివిడెండ్లు బాగా అందుతున్నాయా?" అని బుట్ట నెత్తిన పెట్టుకుని శ్రామికుడు వెళ్ళిపోయాడు.

63 కంపెనీల్లో షేర్లు వున్న అడివి రామయ్య, ఒక చెట్టు కింద కూలబడ్డాడు. చాలా సేపు దీర్ఘాలోచనలో మునిగాడు. కాస్సేపటికి లేచాడు - "అంతే, ఇక్కడ కూర్చోడం తెలివి తక్కువ. అక్కడే వుండి దెబ్బకొట్టాలి. వాళ్ళ తోటే వుండి వాళ్ళలో వాళ్ళకి తగువులు పెట్టాలి. వాళ్ళ అంతు చూస్తాను. సమయం రాకపోదు" - కొత్త శక్తితో అంగలేస్తూ ఊరు దారి పట్టాడు.

★ ★ ★

**ఊళ్ళో** సాయంకాల ప్రదర్శన ప్రారంభమైంది. 16, 17 సంవత్సరాల రాజన్న 'కమ్యూనిస్టు ప్రణాళిక' నించీ ఎత్తి రాసుకున్న కాయితాలు చేత్తో పట్టుకుని అక్కడక్కడా తన స్వంత మాటలు చేరుస్తూ, 'ఏక పాత్రాభినయం' చేస్తున్నాడు.

"సమాజాన్ని ఒక భూతం ఆవరించింది! కమ్యూనిజం అనే భూతం! బూర్జువా వర్గం ఏ ఆయుధాలతో నైతే ఫ్యూడలిజాన్ని నేలకూల్చిందో, ఆ ఆయుధాలు ఇప్పుడు దాని మీదకే లేచినాయి. బూర్జువా వర్గం సృష్టించింది - తనని నాశనం చేయగల ఆయుధాలను మాత్రమే కాదు; ఆ ఆయుధాలను ధరించే మనుషులను కూడా! ఆ మనుషులే కార్మికులు! ఆ మనుషులే మనం!

కార్మికులకు భద్రపరచుకోవడానికీ, పదిలపరుచుకోవడానికీ ఏమీ లేదు. వాళ్ళ జీవిత లక్ష్యం, స్వంత ఆస్తికి గతంలో వున్న సకల భద్రతలనూ, సకల రక్షణలనూ, ధ్వంసం చేయడమే.

సమాజంలో అట్టడుగు పొర అయిన కార్మిక వర్గం కదలాలంటే, లేచి నిలబడాలంటే, తన మీద వున్న అధికార సమాజపు పై పొరలన్నింటినీ మొత్తంగా ఆకాశం లోకి ఎగర గొట్టక తప్పదు ...."

ప్రేక్షకుల్లో కలకలం బైల్దేరింది. అందరూ దూరం నించీ వచ్చే మనిషినే చూస్తున్నారు. "అడవి రాజు, అడివి రాజు" అని ఒకళ్ళకొకళ్ళు చెప్పుకున్నారు.

అడవి రాజు చీలికలూ, పీలికలూ అయిన బట్టలతో, జుట్టూ గడ్డాలూ పెరిగి పోయి చిక్కి శల్యమై వున్నాడు.

కానీ, ఆ మనిషి మీద ఎవ్వరికీ దయ కలగ లేదు.

దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు.

అందరూ మౌనం వహించారు.

ఎవ్వరూ తనని పలకరించరని అతనికి నిర్ధారణ అయిపోయింది.

"ఏదన్నా పని ఇవ్వండి" అన్నాడు, కొంత సేపటికి.

"ఆహా! పెట్టుబడిదారుడు మనల్ని పని అడుగు తున్నాడు!" అంది ఒక అమ్మాయి.

"పనా? పని చేస్తావా నువ్వు?" అంది ఇంకో అమ్మాయి.

అడవి రాజు మాట్లాడ లేదు.

"ఏం పని చెయ్యగలవు?"

"....................................."

"దున్నడం వచ్చా?"

"రాదు."

"తవ్వడం?"

"రాదు."

"చెక్కడం?"

"రాదు."

"వండడం?"

"రాదు."

"దంచడం?"

"రాదు."

"కుట్టటం?"

"రాదు."

ఒక కార్మికుడు అసహనంగా, "నీకు రాని వాటి లిస్టు ఎందుకు గానీ, వచ్చిన వేమిటో చెప్పు" అన్నాడు.

"మింగడం ఒకటే వచ్చు" అంది ఒక పెద్ద వయసు స్త్రీ.

అడవి రాజు ఏడుపు మొహం పెట్టి, "ఏ పనీ రాదు. నేనేం చెయ్యను?" అన్నాడు.

"మళ్ళీ అక్కడికే పోయి తపస్సు చేసుకో. ఏ పనీ చెయ్యకుండా దేవుడే పోషిస్తాడేమో చూడు" అని ఒకరూ,

"తపస్సు చేస్తే ఈశ్వరుడు వచ్చి ఏం కావాలీ - అంటాడు. 'అమృత కలశం' అడుగు. అందులో అన్నీ వస్తాయి, మీ కవులు చెప్పిన కథలే కదా అవన్నీ" అని ఇంకొకరూ,

"ఏ పనీ రాకుండా ఇంత కాలం ఎలా జీవించావు?" అని మరొకరూ!

"నా పెట్టుబడులు తెచ్చే లాభాలే నన్ను పోషించాయి" అన్నాడు అడివి రాజు బింకంగా.

"నీ పెట్టుబడులకు లాభాలు ఎలా వచ్చేవి?"

"ఎలా వచ్చేవి ఏమిటి? పెట్టుబడి మీద, 'లాభం' వేసుకుంటే రాదా?"

"తప్పు" అని అరిచాడు, పన్నెండేళ్ళ పిల్లవాడొకడు. అడివి రాజు మీదకి వురికినట్టుగా ముందుకి దూకి, "లాభం నువ్వు వేసుకున్నా, అది 'విలువ'లో భాగమే. లాభాలూ వడ్డీలూ అన్నీ 'విలువ' లోవే. అదంతా శ్రామికుల శ్రమే. 'కాపిటల్' చదువుకో, తెలుస్తుంది" అన్నాడు కోపంగా.

అడివి రాజు కొయ్యబారి పోయాడు, ఆ పిల్లాణ్ణే చూస్తూ.

జనాలు అడివి రాజుని వదిలి ప్రదర్శన వేపు కదలబోయారు.

"చెప్పండి, నన్నేం పని చెయ్యమంటారు?"

"నీకేం పని వచ్చో చెప్పలేదు కదా?"

"ఏ పనీ రాదు. ఏ పనీ చెయ్యలేదు ఇన్నాళ్ళూ."

"మరి ఇప్పుడు ఎలా చేస్తావు?"

"నేర్చుకుంటాను."

"నీకు చాలా కార్లు వుండేవిగా? కారు నడపడం వచ్చా? అదీ డ్రైవర్లే చేశారా?"

"వచ్చు."

"సరే, ఏదన్నా బండి నడపవలసి వుంటుంది .... ప్రస్తుతానికైతే నీ ఆరోగ్యం బాగా లేనట్టుంది. రెండు వారాలు రెస్టు తీసుకున్న తర్వాత నీ సంగతి చర్చించుదాం. పోస్టుమేన్ పని చెయ్యవచ్చు. లేకపోతే వీధులు వూడ్చే పని కూడా చెయ్యవచ్చు. ఈ పనులన్నీ నీకొక్కడికే అనుకోకు, డ్యూటీల ప్రకారం, అందరమూ చేస్తాం."

'అందరమూ చేస్తాం' అనే చివరి మాటలు రామయ్య చెవుల్లో దూరలేదు. 'రోడ్లు వూడ్చే పని' ఒక్కటే దూరింది. నిర్ఘాంత పోయాడు. '63 కంపెనీల్లో షేర్లూ, 2 విమానాలూ, 18 కార్లూ వున్న నాకు రోడ్లు వూడ్చే పనా?' అని మనసులో ఆక్రందిస్తూ గుండెలు బాదుకున్నాడు. ఆ ఆక్రందన అంతా రామయ్య మొహం మీద అచ్చువేసినట్టు కనపడుతోన్నా కార్మికులు దాన్ని పట్టించుకోలేదు.

అడివి రాజు తల వాల్చేసి ఒక చోట చతికిల పడ్డాడు.

జనాలంతా మళ్ళీ ప్రదర్శన వేపు తిరిగారు.

ఒక అమ్మాయి, ఒక కాయితం చదవబోతోంటే, ఒక్క సారిగా అంతా నిశ్శబ్దం అయిపోయింది. "కామ్రేడ్స్! రేపు సాయంత్రం, 12 మంది కామ్రేడ్సు, సోమయ్య గారు రాసిన 'పెట్టుబడిదారుడు లేని ప్రపంచం' అనే చిన్న నాటిక ప్రదర్శిస్తారు. దాని తర్వాత, ఇంటి పనుల్లోకి దిగడానికి మొరాయించే పురుష పుంగవుల మీద సావిత్రి రాసిన 'వంటింట్లో కామ్రేడ్లు' అనే పెద్ద నాటకం వుంటుంది. ఇప్పుడు మళ్ళీ 'ఏక పాత్రాభినయం'లో మిగిలిపోయిన భాగం చూడండి!" అని చదివి, ఆ అమ్మాయి వెనక్కి వెళ్ళి పోయింది.

ఏక పాత్రాభినయం మళ్ళీ ప్రారంభమైంది.

"కష్టపడి సంపాదించిన ఆస్తి అట! స్వయంగా సంపాదించిన ఆస్తి అట! మీరనేది ఆధునిక బూర్జువా స్వంత ఆస్తిని గురించేనా?

బూర్జువా సమజంలో పెట్టుబడికే వ్యక్తిత్వమూ, స్వాతంత్ర్యమూ వుంటాయి గానీ, ప్రాణం గల కార్మికు లకు వ్యక్తిత్వమూ, స్వాతంత్ర్యమూ వుండవు.

ఈ స్థితినే మేము రద్దు చేయాలనేది. దీన్ని రద్దు చేయడమంటే, స్వేచ్ఛనే రద్దు చేయడమని బూర్జు వాలు అంటారు. నిజమే మరి! నిస్సందేహంగా మా లక్ష్యం - బూర్జువా స్వేచ్ఛనీ, బూర్జువా వ్యక్తిత్వాన్నీ, రద్దు చేయడమే!

సొంత ఆస్తిని రద్దు చేయాలనడం మీకు ఎంతో భయోత్పాతం పుట్టిస్తున్నది. కానీ ఇప్పుడున్న మీ సమా జంలో నూటికి తొంభై మందికి సొంత ఆస్తి ఇప్పటికే రద్దయి పోయింది. నూటికి తొంభై మందికి లేదు గనకనే అది తక్కిన కొద్ది మందికి వుండగలుగు తున్నది. అనగా, సమాజంలో అత్యధిక సంఖ్యాకులకు ఏ విధమైన ఆస్తీ లేనప్పుడు మాత్రమే బతక గల ఆస్తి వ్యవస్థను మేము రద్దు చేయదలుచుకున్నందుకు మీరు మమ్మల్ని నిందిస్తున్నా రన్నమాట!

ఒక్క మాటలో చెప్పాలంటే, మీ ఆస్తిని రద్దు చేయదలుచుకున్నామని మమ్మల్ని మీరు నిందిస్తు న్నారు. ఔను, సరిగ్గా అదే మేము చేయదలుచు కున్నది!

కార్మిక శ్రమని పెట్టుబడి గానూ, డబ్బు గానూ, కౌలు గానూ, మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో; కార్మిక శ్రమని గుత్తగా కొనగల సామాజిక శక్తిగా మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో; అనగా వ్యక్తిగత ఆస్తిని బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా, మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో - అప్పుడు, ఆ క్షణం నుంచే, వ్యక్తుల వ్యక్తిత్వం అదృశ్యమౌతుందని మీ వాదన.

అనగా, మీ అవగాహనలో 'వ్యక్తి' అంటే బూర్జువా వ్యక్తే నన్న మాట! .... బూర్జువా ఆస్తిపరుడు తప్ప మరెవ్వరూ కాదన్న మాట! అయితే, ఆ వ్యక్తిని తప్పక ఈడ్చి పారేయవలసిందే! ఆ వ్యక్తి వుండడానికే వీలులేకుండా చేయవలసిందే!

కమ్యూనిస్టు విప్లవం అంటే, సాంప్రదాయక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం! కనక, 'కమ్యూనిస్టు విప్లవాభివృద్ధి'లో, సాంప్రదాయిక భావాలతో, అత్యంత మౌలికంగా తెగ తెంపులు చేసుకోవడం ఇమిడి వుంది. ఇందులో ఆశ్చర్యపడవలసిన దేమీ లేదు.

వర్గాలూ, వర్గ విభేదాలూ గల పాత బూర్జువా సమాజానికి బదులు, మన కొక 'నూతన సమాజం' లభిస్తుంది! ప్రతీ ఒక్క వ్యక్తీ స్వేచ్ఛగా అభివృద్ధి చెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగల సమాజం అది!

కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం! సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలప్రయోగంతో కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగల వని వాళ్ళు బహిరంగం గానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలక వర్గాలు గజగజ వణకనీ! కార్మి కులు పోగొట్టుకునే దేమీ లేదు, తమ శృంఖలాలు తప్ప! వాళ్ళు పొందవలసింది ఎంతైనా వుంది!

సకల దేశ కార్మికులారా, ఏకం కండి! ఏకం అవుదాం!"

ప్రేక్షకుల్లో ఒక ఉత్తేజపు వెల్లువ పొంగింది. అందరూ, రామయ్య తప్ప, సోమయ్య కూడా, ఏక కంఠంగా అనేక సార్లు నినాదాలిచ్చారు.

"సకల దేశ కార్మికులారా, ఏకం కండి! ఏకం అవుదాం!

మనకు పోయేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప!<br>
............ పోయేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప!!<br>
......................................... సంకెళ్ళు తప్ప!!"

రామయ్య, నిర్ఘాంతపోతూ కొయ్యబారి పోవడం ఎవరూ పట్టించుకోలేదు. ★

# 9. మీరు మార్క్సిస్టు అయ్యారా?

పాఠకులకు, ఒక చివరి ప్రశ్న!

'కాపిటల్ పరిచయం' చదివారు కదా? ఊరికే చదవడమేనా, 'మార్క్సిస్టు' కూడా అయ్యారా?

సమాజంలో 'ధనిక - పేద' తేడాల గురించి, 'కాపిటల్' చదవక ముందు మీకు ఎలాంటి అభిప్రాయాలు వుండేవి? 'కాపిటల్' చదవడం వల్ల ఆ అభిప్రాయాల్లో ఏమైనా మార్పు వచ్చిందా, లేదా?

పెట్టుబడిదారీ సమాజమే సరైనదనీ, శాశ్వితమైనదనీ, అదే తప్పనిసరి అనీ, ఇప్పటికీ భావిస్తున్నారా? లేక, ఆ వాదాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్నారా?

"మార్క్సిజం మంచిదే, కానీ సాధ్యమా?" అనే సందేహంలో వున్నారా?

మార్క్సిజం, 'ఆచరణలో సాధ్యమా కాదా'- అనేది కాదు, అసలు ప్రశ్న! ఆ సిద్ధాంతం, కరక్టా కాదా - అనేదే అసలు ప్రశ్న! - మార్క్సిజం కరక్టా కాదా? కరక్టే అయితే, అది 'ఆచరణ'లో కూడా సాధ్యమే. సరైనది ఏదైనా, ఆచరణకు సాధ్యమే.

దాని కోసం 'కృషి' అవసరం. 'పోరాటం' అవసరం. 'కృషి' లేకపోతే, సరైన సిద్ధాంతం కూడా సరైనదని రుజువు కాదు. సరైన సిద్ధాంతమూ, సరైన ఆచరణా కలిసినప్పుడే - సరైన ఫలితం!

మార్క్సిస్టు సిద్ధాంతమూ, మార్క్సిస్టు ఆచరణా కలిసినప్పుడే - మార్క్సిస్టు సమాజం!

'నూతన సమాజమే' లేకపోతే, అప్పుడేమవుతుంది? - ఇప్పుడున్న ఈ పెట్టుబడిదారీ సమాజమే వుండిపోతుంది. ఎంత కాలమైనా, ఇదే, తన తప్పుడు లక్షణాలన్నిటి తోనూ కొనసాగుతూ వుంటుంది. దోపిడీ వర్గం, ఇప్పటి లాగే 'అదనపు విలువ'ని తింటూ వుంటుంది. కార్మిక వర్గం, ఇప్పటి లాగే, యజమానుల కోసం ఇంటా బయటా రాత్రింబవళ్ళూ పసి బిడ్డలతో సహా ఊడిగాలు చేస్తూ, తన రక్త మాంసాలూ సుఖ శాంతులూ ధారపోస్తూ, నాశనమై పోతూ వుంటుంది.

దేశాలన్నీ, ఇప్పటి లాగే, ఆధిపత్య దేశాలు గానూ, లోబడి వుండే దేశాలు గానూ కొనసాగుతూ వుంటాయి.

ఆధిపత్య దేశాలన్నీ, ఇప్పటి లాగే మార్కెట్ల కోసం, సాధ్యమైతే - ఒప్పందాలూ, లేనప్పుడు - యుద్ధాలూ చేసుకుంటూ, శ్రామిక వర్గాన్నీ, శ్రమ రాసుల్నీ, సర్వ నాశనం చేస్తూ వుంటాయి.

'ఆకలి'ని మహా చిన్న సమస్య లాగ అనిపింపజేసే, ఆకలిని మించిన నీచ, క్రూర, వికృత సమస్యలెన్నిటినో సమాజం నిత్యమూ ఉత్పత్తి చేస్తూ వుంటుంది.

ఇక, 'మానవ సమాజం' అంటే ఇదే!

శ్రామిక వర్గం, నూతన సమాజాన్ని సాధించలేకపోతే, ఇక ప్రకృతిలో మానవుల ఉనికి వున్నంత కాలమూ పెట్టుబడిదారీ సమాజాన్ని భరించవలసిందే.

శ్రామిక వర్గం 'నూతన సమాజాన్ని' నిర్మించుకోలేకపోతే, ఎన్ని వేల తరాలకైనా ఆ వర్గం దుఃఖం లోనూ, దాస్యం లోనూ పడి వుండవలసిందే.

నూతన సమాజమే అస్థిరమూ, అసత్యమూ అయితే, పెట్టుబడిదారీ సమాజమే స్థిరమూ, సత్యమూ, శాశ్వితమూ కావలసిందే!

దోపిడీ సమాజం గానీ, నూతన సమాజం గానీ, ఏదో ఒక్కటే సాధ్యం! 'దోపిడీ' గానీ, 'విముక్తి' గానీ; ఏదో ఒక్కటే! మూడో మార్గం లేదు!

మొదట శ్రామిక వర్గమూ, ఆ తర్వాత దోపిడీ వర్గమూ కూడా మార్క్సిస్టులుగా మారితే, వర్గ - మానవుల సమాజం, 'మానవుల సమాజం'గా మారుతుంది. మానవ జాతి ప్రకృతిలో వున్నంత కాలమూ అదే కొనసాగుతుంది.

## 'కాపిటల్' పరిచయం
## 2 సంపుటాలూ పూర్తి అయ్యాయి.

★

# పద సూచిక (ఇండెక్స్ )

## అ


అజ్ఞేయ వాదం 476
అడ్వర్టయిజుమెంట్ విధానం 18-22
అడ్వర్టయిజుమెంట్ ఖర్చులు 13
అదనపు కౌలు 309
అదనపు విలువ: డైరెక్టూ,
ఇండైరెక్టూ 198
అప్పు డబ్బు 275
అప్పులు: వాటిని ఎందుకోసం ఇస్తాయి
బ్యాంకులు 229
అమితోత్పత్తి 358
అమ్మకాలు 7, 8
అల్పోత్పత్తి 358


## ఆ


ఆర్థిక మాంద్యం 364
ఆస్తి హక్కు రద్దు 438


## ఇ


ఇంటి అద్దె 317
ఇన్ సైడ్ ట్రేడింగ్ 259
ఇష్యూ శాఖ 277


## ఉ


ఉత్పత్తి కాలం 60
ఉత్పత్తి క్రమం 3
ఉత్పత్తి ధర 57
ఉత్పత్తి ధరలు
మార్కెట్ ధరలుగా మారడం 73
ఉత్పత్తి శక్తుల పెరుగుదల 172-175
ఉత్పత్తి శక్తి: దానితో
వర్తక ధరకి సంబంధం 203
ఉన్నత మేధా శ్రమలు: వాటిని
సామ్రాజ్య వాదం ఎలా
లోబరుచుకుంటుంది? 334
ఉత్పత్తి సంబంధాలు: వాటి
చారిత్రక స్వభావం 403
ఉత్పాదక శక్తి: జీతాలమీద
దాని ప్రభావం 122
ఉసురీ 233
ఊహాచిత్రం: నూతన సమాజం
గురించి 513


## క


కమ్యూనిస్టు సమాజం 457
కరెన్సీ: అన్ని దేశాలకూ
ఒకే కరెన్సీ సాధ్యమేనా? 163

కరెన్సీల మారకం 159
కల్పిత పెట్టుబడి 246
కాగితం డబ్బు పరిమాణం 129
కాపిటల్: అది చదవడంలో
వున్న ఇబ్బందులు, దానికి వున్న
వరస 506
కార్మిక వర్గం 394,
దానికి పట్టిన యుగయుగాల
మకిలి 430
కార్మికుల మధ్య పోటీ 117
కాస్ట్ ప్రైస్ 57
కుల మతాల రద్దు 450
కేంద్ర బ్యాంకు 275
కేవల చలామణీ ఖర్చులు 180
కౌలు రద్దు 439
కౌలు రైతులు 391
కౌలు రేటు 314
కౌలు: అదనపు విలువలో దాని భాగం
ఎంత? 313
క్రీస్తు పథకం 384

## గ

గతి తార్కిక పద్ధతి 477
గుత్త కంపెనీ 286
గుత్త లాభాలు 287
గ్రామానికీ, పట్టణానికీ వైరుధ్యం
రద్దు 446

## చ

చైనా: అది వెనక్కి మళ్ళడానికి కారణం
మార్క్సు సిద్ధాంతమా? 495
చలామణీ క్రమం 1
చలామణీ ఖర్చులు 1
చలామణీ కాలం 61

## జ

జనరల్ లాభం రేటు 46, 50
జనరల్ లాభం రేటు: అది
తగ్గుతూ పోయే ధోరణి 167,
ఆ తగ్గుదలని తగ్గించే ధోరణి 175
జాయింటు స్టాక్ కంపెనీ 238
జీతాలు: వీటి విషయంలో సప్లయ్
డిమాండ్లు ఎలా వుంటాయి? 114,
వీటి గురించి పెట్టుబడిదారీ
అర్థికవేత్తల అవగాహన 117, ఇవి
మారితే సరుకుల విలువలు
మారతాయా? 120, అదనపు విలువ
రేటు మారుతుందా? 120, అసలు
జీతాలలో మార్పులు ఎందుకు
జరుగుతాయి? 121, జీతాలమీద
ఉత్పాదక శక్తి ప్రభావం 122, డబ్బు
విలువ ప్రభావం 123, డబ్బు
పరిమాణం ప్రభావం 128, జీతం
విషయంలో మూఢ నమ్మకాలు 138,

ధరలు పెరిగితే జీతాలు
పెరుగుతాయా?140,
జీతాలు పెరిగితే ధరలు
పెరుగుతాయా? 140
జీతాల పద్ధతి రద్దు 453

## ట

టర్నోవరు కాలం 62

## డ

డబ్బు అప్పు 216
డబ్బు ఆర్థిక విధానం 274
డబ్బు కొరత 369
డబ్బు ఖర్చు 25
డబ్బు పరిమాణం: జీతాలమీద దాని
ప్రభావం 128
డబ్బు రద్దు 455
డబ్బు విలువ: జీతాలమీద దాని
ప్రభావం 123
డబ్బు సంక్షోభం 364
డబ్బు సంస్థలు 232
డబ్బు: దానికి ధర వుంటుందా? 124,
వేరు వేరు దేశాల్లో
ఎలా వుంటుంది? 152
డిబెంచర్లు 262
డిమాండు 74
డివిడెండు 240, 250

## త

తత్వ శాస్త్రాలు: వాటి
పరస్పర విరుద్ధతలు 487

## ద

దోపిడీ సంస్కృతి రద్దు 451
ద్రవ్యోల్బణం 136
ధర 39, నూతన సమాజంలో
అదిఎలా వుంటుంది? 460
విలువ లేకుండానే
ధర ఎలా వుంటుంది? 103
వెనకటి సమాజాలలో
ఎలా వుండేది? 55
ధరల పెరుగుదల 149
ధరలు: ఇవి పెరిగితే
జీతాలు పెరుగుతాయా, జీతాలు
పెరిగితే ఇవి పెరుగుతాయా? 140

## న

నిజమైన పెట్టుబడి 246
నిరుద్యోగ బీమా 374
నూతన సమాజం 436
న్యూ డీల్ 384

# ప


పంపిణీ సంబంధాలు 403
పరిపాలన 390
పరువు ప్రతిష్ఠలకు ధర 103
పారిశ్రామిక సరుకు ధర 304
పారిశ్రామిక సంక్షోభం: దాని నివారణకు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల చిట్కాలు 373
పారిశ్రామిక శ్రమ 318
పాలక వర్గ భావాలు 431
పాలించే భావాలు 431
పెట్టుబడి కాంపోజిషన్ 42
పెట్టుబడి కేంద్రీకరణ 284
పెట్టుబడిదారీ కౌలు రైతు 276
పెట్టుబడిదారీ ధర 39,
దానితో కార్మికులకు వుండే సంబంధం 54
పెట్టుబడిదారీ నియంతృత్వం 397
పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం 397
పెట్టుబడిదారీ వర్గం 394
పెట్టుబడిదారీ విధానం:
వ్యవసాయంలో 297
పెట్టుబడిదారీ సామ్రాజ్య వాదం 325
పెట్టుబడిదారీ శ్రమ విభజన రద్దు 443
పెట్టుబడుల ఎగుమతి 331
పేకింగ్ 2
పోటీ: ఎక్కువ లాభం కోసం 358
ప్యూర్ చలామణీ ఖర్చులు 180
ప్రపంచ కార్మికులారా ఏకంకండి: ఈ నినాదం అర్థం 414
ప్రపంచ పునర్ విభజన 339
ప్రపంచ విభజన 339
ప్రభుత్వ బాండ్లు 262
ప్రమోటర్ లాభం 248
ప్రైమరీ మార్కెట్టు 250
ప్రైస్ రిగ్గింగ్ 259
ప్లానింగ్: విలువ లేనప్పుడు అది ఎలా వుంటుంది? 466
ఫ్యూడల్ కౌలు రైతు 297


# బ


బంగారం డబ్బు పరిమాణం 129
బల ప్రయోగం 390
బహుళ జాతి గుత్త కంపెనీలు 287
బాండ్లు 262
బానిస ధర 317
బానిస యజమానుల వర్గం 390
బానిస వర్గం 390
బుక్ కీపింగ్ ఖర్చులు 4
బూర్జువా 394
బూర్జువా సమాజం 394
బ్యాంకింగ్ శాఖ 277
బ్యాంక్ 224
బ్యాంకుల దివాళా 366
భావ వాదం 476
భూమి అద్దె 317
భూమి కౌలు 293
భూమి ధర 314

భూస్వాములు 391
భౌతిక వాదం 476

# మ

మనీ డీలింగ్ 225
మార్కెట్ ధర 57
మారకం బిల్లు 229
మాతృ దేశ దురభిమానం 415
మాతృ దేశాభిమానం 415
మాతృ భూమి 415
మారకం ఖర్చులు 27
మారకం బిల్లులు: వాటి
డిస్కౌంటింగూ,
రీ డిస్కౌంటింగూ 229
మార్క్సిజం: తత్వ శాస్త్రంగా 476
మార్క్సిజం: దాన్ని తరగతి
గదిలో నేర్పడం ఎలా? 498
మార్క్స్: అతని సిద్ధాంతం మీద కొన్ని
విమర్శలు 492
మావో ఆలోచనా విధానం: దీన్ని కూడా
మార్క్సిజం అనే మాట పక్కన
చేర్చాలా? 497
మొదటి ప్రపంచ యుద్ధం 348
మ్యూచువల్ ఫండ్ కంపెనీలు 261

# య

యజమానితనం రద్దు 443

# ర

రవాణా క్రమం 11, 12
రవాణా ఖర్చులు 11
రష్యా: అది వెనక్కి మళ్ళడానికి కారణం
మార్క్స్ సిద్ధాంతమా? 495
రాజకీయాలు 391
రాజరికం 391
రాజ్యాంగ యంత్రం రద్దు 458
రాత్రి పని రద్దు 450
రికార్డో: విలువ గురించి
అతని అవగాహన 401
రూజ్వెల్ట్ మాంద్యం 384
రెండో ప్రపంచ యుద్ధం 352

# ల

లాభం రద్దు 442
లాభం రేట్లు: వేరు వేరు శాఖల్లో
ఎలా వుంటాయి? 90
లాభం: అది మేనేజిమెంటు
శ్రమ ఫలితమా? 241
లెనినిజం: దీన్ని కూడా మార్క్సిజం
అనే మాట పక్కన చేర్చాలా? 497
లోరియా: మార్క్స్‌పై అతను చేసిన
విమర్శకు ఎంగెల్సు జవాబు 178

# వ

వడ్డీ పెట్టుబడీ: దాని చలనం 221
వడ్డీ రద్దు 440
వడ్డీ రేటు: దానికి సహజ కారణం
ఉంటుందా? 218,
దానిలో రకాలు 219
వడ్డీ వ్యాపారం 226,
దాన్ని కార్మికులే చేస్తే 221
వర్గ పోరాటం 391
వర్గ ప్రభుత్వం 391
వర్గ మానవులు 391
వర్గ సమాజం 391
వర్గ సిద్ధాంత జ్ఞానం 432
వర్గాల రద్దు 456
వర్గాల రద్దు తర్వాత 457
వర్గాలు 387, బానిస సమాజంలో 389,
భూస్వామ్య సమాజంలో 391,
పెట్టుబడిదారీ సమాజంలో 392
వర్తక కార్మికులు 197, శమ విభజనలో
వాళ్ళ స్థానం 204
వర్తక ధర: ఉత్పత్తి శక్తితో
దాని సంబంధం 203
వర్తక పెట్టుబడి 180, 193
వర్తక పెట్టుబడి టర్నోవరు 201
వర్తకం రద్దు 452
వర్తకం: వలస దేశంతో 326
వర్తకులు: చిన్నా, పెద్దా 195
వలసల అభివృద్ధి 338
వాటా ధర 243: అది డబ్బు పెట్టుబడి
సప్లయ్ డిమాండ్లని ఎలా
ప్రభావితం చేస్తుంది? 269
వాటా: దానికి లాభం
ఎలా వస్తుంది? 240
వాటాల వ్యాపారం: కార్మికులు కూడా
వాటాలు కొంటే? 270
వాటాల వ్యాపారం:
దానిలో మోసాలు 257
వాటాల సంక్షోభం 367
వాటాలు 238, వాటి విడుదల 242
వాడకందార్లు 1
వాణిజ్య బిల్లు 229
విదేశీ అప్పు 234
విదేశీ పెట్టుబడి 235
విదేశీ వర్తకం 207
విలువ 59
విలువ నిర్ధారణ: సమిష్టి
ఉత్పత్తి విధానంలో 467
విలువ రద్దు 455
విలువలు ఉత్పత్తి ధరలుగా
మారడం 67
విస్తృత పునరుత్పత్తి:
నూతన సమాజంలో 463
వేతన బానిసత్వం రద్దు 453
వ్యవసాయ కౌలు:
దానిలో తేడాలు 308
వ్యవసాయ పెట్టుబడి: అది తన
కౌలుని ఎలా చెల్లిస్తుంది? 300
వ్యవసాయ సరుకు 305
వ్యవసాయ శ్రమ 318
వ్యాపార చక్రాలు 385

# శ

శ్రమ కాలం 60
శ్రమ విభజన: దానిలో
వర్తక కార్మికుల స్థానం 205,
దేశాల మధ్య ఎలా వుంటుంది? 331
శ్రామిక వర్గ భావాలు 431

# స

సంక్షోభం: వెనకటి సమాజాలలో
అది వుంటుందా? 363,
1929 నాటి సంక్షోభం 380
సంక్షోభాలు 356
సగటు కౌలు 314
సప్లయ్ 74
సప్లయ్ డిమాండ్లు 74
సమానత్వం 445
సమిష్టి ప్లాను 357
సరుకు అప్పు 223
సహజ ఆర్థిక విధానం 274
సామ్రాజ్య వాదం 325,
దాని సమర్థకులు 342,
పాత, కొత్త, సరికొత్త రూపాలు 335
సాధారణ కౌలు 309
సార్టింగ్ 2
సింపుల్ పునరుత్పత్తి:
నూతన సమాజంలో 462
సెకండరీ మార్కెట్టు 251
సెక్యూరిటీ పత్రాలు 264
సోషలిస్టు సమాజం 457
స్టాకు: వాటాలకు ఇంకో పేరు 238
స్టాక్ ఎక్స్ఛేంజీ 249
స్టాక్ బ్రోకర్ కంపెనీలు 249
స్టోరు ఖర్చులు 5
స్త్రీ పురుషుల మధ్య వైరుధ్యం
రద్దు 447
స్పెక్యులేటివ్ షేర్ 255
స్పెక్యులేషన్ 255
స్పెక్యులేషన్ వ్యాపారం 206
స్మగ్లింగ్ 211
స్మిత్: విలువ గురించి అతని
అవగాహన 401
స్వతంత్ర వర్తకులు 195
స్వతంత్ర ఉత్పత్తిదారుల సరుకులు:
పెట్టుబడిదారీ సమాజంలో అవి ఎలా
వుంటాయి? 108

# హ

హెగెల్: అతని గతి తార్కిక
పద్ధతి గురించి మర్క్స్ 484

★